ఆలోచనలు విరియాలి.. ఆవిష్కరణలు మెరవాలి..!

ఈనాడు

ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. పాఠశాల స్థాయిలోనే సృజనాత్మకత వెలికితీసేందుకు 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' నిర్వహిస్తోంది. వినూత్న ఆలోచనలతో ప్రయోగాలు చేసేలా ప్రోత్సహిస్తోంది. **ఇందులో భాగంగా 'డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ హాల్, బుల్లయ్య కాలేజ్ పక్కన, రామా టాకీస్ దరి, విశాఖపట్నం'లో ఫిబ్రవరి 24వ తేదీన మెగా సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తోంది.**

GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P.
Call: 994 999 3483 | www.ggu.edu.in

నిబంధనలు.. ● 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు మాత్రమే. ● ప్రాజెక్టును ముందుగా నమోదు చేసుకోవాలి. ● ఒక ప్రాజెక్టుకి ఇద్దరు విద్యార్థులకు అనుమతి. ● పాఠశాల/ బ్రాంచ్‌కి ఒక ప్రాజెక్టుకు మాత్రమే అనుమతి. ● మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులు ఉంటాయి. ● పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం. **రిజిస్ట్రేషన్ చివరి తేదీ : ఫిబ్రవరి 20**

నమోదు కొరకు: 8639814432
సమయం: ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గం॥ల వరకు..

వైటీసీలో జాబ్ మేళా 28న

సీలేరు, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈనెల 28న చింతపల్లి వైటీసీలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు గూడెంకొత్తవీధి ఎంపీడీఓ బి. హెచ్. వి. రమణబాబు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు.

నౌకల పండగ.. అంబరాన్నంటగా..!

నౌకల నుంచి అబ్బురపరిచిన లేజర్ షో

ఈనాడు, విశాఖపట్నం : విశాఖ తీరంలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ యుద్ధ నౌకల సమీక్ష (ఐఎఫ్ఆర్) నావికాదళం సత్తా చాటింది. 66 భారత యుద్ధ నౌకలు, 19 విదేశీ నౌకలు..60కిపైగా విమానాలు.. 3 జలాంతర్గాములు.. మొత్తం 74 దేశాల భాగస్వామ్యమయ్యాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఐఎన్ఎస్ సుమేధలో ప్రయాణిస్తూ యుద్ధ నౌకల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. సుమారు మూడు గంటల పాటు సాగిన ఈ కార్యక్రమం ఆద్యంతం విశేషంగా ఆకట్టుకుంది. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి ప్రయాణించే నౌక ముందూ వెనుక హెలికాప్టర్ల విన్యాసాలు

విన్యాసాలను తిలకిస్తున్న నౌకాదళ అధికారులు, కుటుంబ సభ్యులు

రాష్ట్రపతికి జ్ఞాపిక అందిస్తున్న నౌకాదళ ప్రధానాధికారి అడ్మిరల్ దినేష్ కుమార్ త్రిపాఠి. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు

ఫ్లీట్ రివ్యూలో సతీసమేతంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

కనువిందు చేసిన జలాంతర్గామి

ఆకట్టుకున్న కళాకారుల నృత్య ప్రదర్శన

★ ఐఎన్ఎస్ సుమేధలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సమీక్ష
★ మూడు గంటల పాటు సాగిన ఐఎఫ్ఆర్
★ హాజరైన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

అంతర్జాతీయ యుద్ధ సమీక్షలో భాగంగా రాష్ట్రపతి ప్రయాణిస్తున్న ఐఎన్ఎస్ సుమేధ నౌక

కట్టిపడేసిన విన్యాసాలు...

ఆర్కే బీచ్‌లో అలరించిన తుది రిహార్సల్స్

ఈనాడు, విశాఖపట్నం: ఐఎఫ్ఆర్‌లో భాగంగా బుధవారం ఆర్కే బీచ్‌లో ఫైనల్ రిహార్సల్స్ అంగరంగ వైభవంగా నిర్వహించారు. మార్కోస్ (అత్యున్నత శిక్షణ పొందిన మెరైన్ కమాండోలు) హెలికాప్టర్ల నుంచి సముద్రంలోకి దిగడం తదితర విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఆయిల్ రిగ్ పేల్చివేత, యుద్ధ విమానాల నుంచి శత్రువులపైకి బాంబులు జారవిడిచే ప్రదర్శనలు వీక్షకులను కట్టిపడేశాయి. యుద్ధనౌకల నుంచి హెలికాప్టర్లు, ఫైటర్ జెట్లు ఎగరడం, కచ్చితంగా ల్యాండ్ అవ్వడం వంటివి 'హెలో ల్యాండింగ్ డెమో' పేరుతో నిర్వహించారు. తీరంలో మోహరించిన యుద్ధ నౌకలు, 19 విదేశీ నౌకలు విద్యుద్దీపాల వెలుగులతో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ★ సిటీ పరేడ్ రిహార్సల్స్‌లో భాగంగా వివిధ దేశాల నావికా దళ సిబ్బంది వారి సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా బ్యాండ్లతో బీచ్ రోడ్డులో కవాతు నిర్వహించారు. ప్రధాన వేదిక వద్ద రైఫిల్స్‌తో కంటిన్యూటీ డ్రిల్, ఎన్‌సీసీ క్యాడెట్లు నృత్యం ప్రదర్శించారు. అనంతరం మిరుమిట్లు గొలిపే బాణసంచా పేలుళ్లు, లేజర్ షో, డ్రోన్ షోలు తీరాన్ని వర్ణరంజితం చేశాయి.

సమీక్షలో యుద్ధ నౌకలు

పరేడ్‌లో 150 ఏళ్ల వందేమాతరం శకటం

కవాతులో తుపాకులతో ప్రదర్శన

డ్రోన్లతో భారతదేశ ఆకృతి

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

పాడేరు, న్యూస్‌టుడే: ఈనెల 23 నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారి ఎస్. భీమశంకరరావు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ అధికారులు, స్క్వాడ్ సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించారు. డీఐఓ మాట్లాడుతూ.. ప్రశ్నపత్రాలను పోలీస్‌స్టేషన్లలో భద్రపరచాలని ఆదేశించారు. కేంద్రాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. మాస్ కాపీయింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు. 163 సెక్షన్ పటిష్ఠంగా అమలు చేయాలని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కల్వర్టు.. పట్టించుకుంటే ఒట్టు!

పెదబయలు మండలం అడుగులపుట్టు పాత ఊరు నుంచి కాలనీ మార్గమధ్యలో కల్వర్టు సగం భాగం కూలిపోయింది. గత అయిదేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకునేవారు కరవయ్యారు. ఇక్కడ ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన కల్వర్టు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

– పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే

గిరి పల్లెల్లో 'అక్షర' వెలుగు

నిరక్షరాస్య మహిళల్లో పెరుగుతున్న చైతన్యం

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే

విద్యతోనే నేటి ఆధునిక యుగమంతా ముడిపడి ఉంది. దీనిని తెలుసుకున్న నేటి తరం యువత చదువుకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రగతికి దూరంగా ఉంటున్న గిరి పల్లెల్లోనూ నేడు బాగా చదువుకుని యువత ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారు. కానీ ఇప్పటికీ కొంతమంది మహిళలు విద్యాసుగంధానికి దూరంగానే ఉన్నారు. అప్పట్లో సరైన విద్యా సదుపాయాలు, ఇంట్లో ప్రతికూల పరిస్థితుల కారణంగా అక్షరం దిద్దలేకపోయారు. వేలిముద్రలతో కాలం వెళ్లదీస్తున్న వారంతా జీవితంలో పైకెదగాలంటే ఎంతో కొంత చదువు వచ్చి ఉండటం తప్పనిసరి. ముఖ్యంగా మహిళలను అక్షరాస్యులను చేసి వారి జీవితాల్లో వెలుగు నింపాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం 'అక్షర కేంద్రాలు' ఏర్పాటు చేసింది.

రాత్రి బడికి వచ్చిన మహిళలకు సూచనలిస్తున్న నోడల్ అధికారి కుమార్

గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులైన మహిళలు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన లేక మోసపోతున్నారు. సంతకం పెట్టే చదువు కూడా లేకపోవడంతో ఇంట్లో, దైనందిన జీవితంలో విజయవంతంగా నెగ్గుకు రాలేపోతున్నారు. ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల్లో మహిళలు రాయితీ రుణాలు, బ్యాంకు లింకేజీ తీసుకోవడానికి ఉపాధి హామీ పనులు చేసిన కూలీలు వేతనాలు పొందడానికి సంతకం అవసరం పడుతోంది. వేలిముద్రలపై ఆధార పడుతుండడంతో పలు మోసాలకు గురవుతున్నారు. పూర్తిస్థాయి ఫలాలు అందుకోలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో అక్షరాలు రాకపోవడం వల్ల జరిగే నష్టాలను వారికి వివరించి వారికి విద్యాబుద్ధులు నేర్పించేందుకు అక్షర కేంద్రాలను ఏర్పాటు చేశారు. రోజంతా వారి సొంత పనులు చూసుకుని రాత్రి సమయంలో కొద్దిగా సమయం కేటాయిస్తే వారికి కనీసం సంతకం పెట్టేంతవరకు చదువు నేర్పించాలన్నది ప్రభుత్వం లక్ష్యమని గ్రామ స్వర్ణ వార్డు శాఖ జిల్లా నోడల్ అధికారి పి. ఎస్. కుమార్ పేర్కొన్నారు.

జిల్లాలో జనాభా:	5.6 లక్షలు
మహిళలు :	2.35 లక్షల వరకు
అక్షరాస్యత :	55 శాతం
మహిళా అక్షరాస్యత :	49 శాతం

కష్టాల మేట.. కన్నీటి ఊట!

పశువులు దాహార్తిని తీర్చుకునే కలుషిత నీరే తమకూ దిక్కవుతోందని అనంతగిరి మండలంలోని మారుమూల గూడెం, దబ్బలపాడు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల ప్రజలు బుధవారం ఊటల వద్ద ఖాళీ బిందెలు నెత్తిన మోసుకుని, చేతులు జోడిస్తూ నిరసన తెలిపారు. రెండు గ్రామాలకు జల్‌జీవన్ మిషన్ పనులు మంజూరయ్యాయని, పనులు ప్రారంభించి నిలిపివేశారని పేర్కొన్నారు. కలుషిత నీరు తాగి అనారోగ్యానికి గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. గూడెం గ్రామానికి గతంలో వచ్చిన ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌కు తమ ఇబ్బందులు తెలియజేశామని, సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా నేటికీ నెరవేర్చలేదన్నారు. ఎన్ఆర్‌పురం పంచాయతీ పరిధిలోని రాయిపాడు గ్రామానికి ఇంటింటి కుళాయి ఉన్నప్పటికీ.. మోటారు పనిచేయకపోవడంతో తాగునీరు అందడం లేదని రొంపల్లి పంచాయతీ వార్డు సభ్యులు అప్పలరాజు తెలిపారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. – అనంతగిరి/గ్రామీణం, న్యూస్‌టుడే

తాగునీటి కోసం కొండల్లో నడిచి వెళ్తున్న మహిళలు

ఇద్దరు మావోయిస్టుల లొంగుబాటు

పాడేరు, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లోని మాడ్ డివిజనల్ కమిటీకి చెందిన ఇద్దరు మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోయినట్లు ఎస్పీ అమిత్ బర్దార్ పేర్కొన్నారు. పాడేరులోని పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. డీసీఎం క్యాడర్‌కు చెందిన కడితి హిడ్మే అలియాస్ అంజు, కరుణ, ఏరియా కమిటీ సభ్యురాలు బడ్సే బీమా అలియాస్ మనీష్ తమ ముందు లొంగిపోయారని పేర్కొన్నారు. వీరు పలు ఘటనల్లో పాల్గొన్నారని పేర్కొన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 54 మంది మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోయారని వివరించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలీసుల ఆపరేషన్లు తీవ్రం కావడం, కొత్త పోలీసు శిబిరాలు ఏర్పాటు వల్ల కదలికలు పరిమితమయ్యాయని, ప్రాణభయ పరిస్థితులు ఏర్పడ్డాయని చెప్పారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో మావోయిస్టులకు ప్రజల మద్దతు పూర్తిగా తగ్గిపోయిందన్నారు. లొంగిపోయినవారికి అన్ని ప్రయోజనాలు వెంటనే అందజేస్తామని హామీ ఇచ్చారు. స్పెషల్ బ్రాంచ్ సీఐ అప్పలనాయుడు, పాడేరు సీఐ దీనబంధు, పోలీసులు పాల్గొన్నారు.

లొంగిపోయిన మావోయిస్టులతో ఎస్పీ అమిత్ బర్దార్

చూచిరాత లేకుండా.. కొత్త పంథా

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థలో అనేక సంస్కరణలు చేస్తోంది. ఇందులో భాగంగా పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని వందరోజుల ప్రణాళిక అమలు చేస్తోంది. మరోపక్క పరీక్షల నిర్వహణకు ఇన్విజిలేటర్ల నియామకాల్లో నూతన పద్ధతి పాటించనున్నారు. ఇంతవరకు జిల్లాస్థాయిలోనే ఇన్విజిలేటర్లను నియమించేవారు. ఇక నుంచి రాష్ట్ర విద్యాశాఖ అధికారులే నియమించనున్నారు. పరీక్షలు పక్కాగా, పారదర్శకంగా, చూచిరాతలకు ఆస్కారం లేకుండా నిర్వహించాలనే ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నారు. గతంలో ఇన్విజిలేటర్లను నియమిస్తే కొంతమంది ఉపాధ్యాయులు ఏవో సాకులు చెబుతూ విధులను రద్దు చేసుకునేవారు. ఇకనుంచి ఆ పరిస్థితి ఉండకుండా చర్యలు తీసుకోనున్నారు.

✦ అల్లూరి జిల్లాలో 264 పాఠశాలల్లో 11,988 మంది విద్యార్థులు పది పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నారు. 72 కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఎవరికి మినహాయింపు అంటే.. 60 ఏళ్లు నిండిన ఉపాధ్యాయులు, దీర్ఘకాల వ్యాధులతో బాధపడే వారికి విధుల నుంచి మినహాయింపు ఇస్తారు. తెలుగు, హిందీ, ఆంగ్లం పరీక్షలకు.. సైన్సు, సోషల్, గణితం ఉపాధ్యాయులను ఇన్విజిలేషన్ విధులకు నియమిస్తారు. గణితం, సైన్సు, సాంఘిక శాస్త్రం పరీక్షకు భాషోపాధ్యాయులను నియమిస్తారు.

పది పరీక్షలకు సిద్ధమవుతున్న చింతపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

నిర్వహణకు సన్నద్ధం ... పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాల సాధనకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం. ఈఏడాది కొత్తగా ఇన్విజిలేటర్ల నియామకాలు రాష్ట్ర విద్యాశాఖ చేపట్టనుంది. ఎవరు ఎక్కడ అన్నది వారే నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేస్తారు. పరీక్షల నిర్వహణకు సన్నద్ధమవుతున్నాం. – **డాక్టర్ రామకృష్ణారావు, డీఈవో**

షెడ్యూల్ సవరణ: మార్చి 16 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి. రంజాన్ పండగ నేపథ్యంలో మొదట ప్రకటించిన పరీక్షల షెడ్యూల్‌ను సవరించారు. ఆ పండగ 20 లేదా 21వ తేదీల్లో జరగనుంది. పండగ రోజు పరీక్ష ఉండదు.

90వ జయంతి ఉత్సవాలు



రక్తదానం చేయండి.. నిండు ప్రాణాన్ని కాపాడండి
మన అభిమాన నాయకులు, మన అందరికీ మార్గదర్శి, ప్రజల హృదయాలలో సుస్థిర స్థానం పొందిన ప్రజానేత కీ॥శే॥ పెతకంశెట్టి అప్పల నరసింహం Ex. MP గారి ఆత్మీయులు, శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా మనవి.

తేది & సమయం : 19-02-2026 (గురువారం) ఉ.గం. 7.30 ని॥లకు
వేదిక : డైమండ్ పార్క్‌లోని కీ॥శే॥ అప్పలనరసింహం గారి కాంస్య విగ్రహం వద్ద నివాళులు అర్పించుట.

తేది. 19-02-2026 (గురువారం) ఉ.గం. 9.00 ని॥లకు
గౌ॥ శ్రీ పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) ప్రభుత్వ విప్ & పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు మెయిన్ రోడ్, గోపాలపట్నం వారి ఇంటి వద్ద కాంస్య విగ్రహానికి నివాళులు అర్పించుట.
రక్తదాన శిబిరం ఉ॥ 7.00 నుంచి సా॥ 6.00 గం॥ల వరకు జరుగును.

మరియు అనకాపల్లి, మునగపాక మండలం, నాగులాపల్లి గ్రామం వద్ద ఉదయం 9:30 గం॥లకు వారి విగ్రహానికి నివాళులు అర్పించుట.

ఇట్లు... ఆహ్వాన సంఘం

ఆక్వాకు ఆసరా.. నాణ్యతకు భరోసా!

రైతులకు అందుబాటులో ప్రయోగశాలలు

నక్కపల్లి, న్యూస్‌టుడే

రొయ్యలు, చేపలు.. మాంసాహార ప్రియులకు ఎంతో ప్రత్యేకం. వీటి సాగు ద్వారా జిల్లాలో రూ.వందల కోట్ల వ్యాపారం జరుగుతుండగా, సాగులో వివిధ పరీక్షలుచేసే ప్రయోగశాలలు మత్స్య రైతులకు అందుబాటులోకి వచ్చాయి. తద్వారా నాణ్యమైన మత్స్యసంపద ఉత్పత్తికి ఇవి ఉపయోగపడనున్నాయి.

పరీక్షలు చేస్తున్న ఉద్యోగులు

జిల్లాలోని ఆరు మండలాల పరిధిలో తీరప్రాంతాన్ని ఆనుకుని రొయ్యలు, చేపల పెంపకం చేస్తుంటారు. దీంతోపాటు చీడికాడ, దేవరాపల్లి, మాడుగుల మండలాల్లో 1,862 చెరువుల పరిధిలో 2,847 ఎకరాల్లో ఆక్వాకల్చర్ ఉంది. ఇందులో మూడొంతుల విస్తీర్ణంలో రొయ్యలు పెంచుతున్నారు. ఆక్వా రైతులు సాగు విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోకుంటే నష్టాలు తప్పవు. వీటిని పెంచడానికి ముందే మట్టి, నీటి స్వభావంతోపాటు, పెంపకానికి తెచ్చే సీడ్ (విత్తనం) నాణ్యతను పరీక్షించుకోవాలి. ఇవన్నీ చేయించుకోవాలంటే కాకినాడలోని మత్స్య ప్రయోగశాలకు తీసుకెళ్లేవారు. దీంతో జిల్లాలోని రైతులకు ఇది ఇబ్బందిగా ఉండేది. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పాయకరావుపేట, ఎలమంచిలిలో ఆక్వా కల్చర్ ప్రయోగశాలలు నిర్మించారు. ఒక్కోదానికి రూ. 82 లక్షలు వెచ్చించారు. గత ప్రభుత్వం వీటిని పట్టించుకోకపోవడంతో ఇక్కడ ఎలాంటి ప్రయోగాలు జరగలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రయోగశాలలను పట్టాలెక్కించింది. ఈ మేరకు అవసరమైన రసాయనాలను కాకినాడ నుంచి రప్పించి గతేడాది నుంచి వీటిని మనుగడలోకి తెచ్చారు. ఈ మేరకు మత్స్యశాఖ ఉద్యోగులు ప్రత్యేకంగా శిక్షణ పొందారు. పరీక్షల నిమిత్తం రైతులు నిర్దేశిత రుసుం ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది.

పరీక్షల ఫీజు వివరాలిలా...
నీటి పూర్తిస్థాయి విశ్లేషణకు: రూ. 700,
మట్టి పరీక్షలకు: రూ. 200,
రొయ్య/చేప సీడ్ పరీక్ష: రైతులకు ఉచితం, హేచరీలకు రూ. 50లు,
చెరువులో రొయ్య/చేప తెగుళ్లు గుర్తించడానికి: ఉచితం,
తెగులుకి సంబంధించి బ్యాక్టీరియా/ వైరస్/పారాసైట్ గుర్తించడానికి: రూ.100.

గడువులోగా పనుల పూర్తి

పాడేరు, న్యూస్‌టుడే: 'మన బడి - మన భవిష్యత్తు' కింద మంజూరైన పాఠశాలల అభివృద్ధి పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తిచేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ, ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పనుల పురోగతిపై ఆరా తీశారు. నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ విభాగం అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ప్రదర్శించినా, పనుల పూర్తిలో అలసత్వం వహించినా సహాయ ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డీఈఓ రామకృష్ణారావు, ఏపీసీ స్వామినాయుడు, డీఈలు, ఏఈలు, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

★ పది, ఇంటర్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. 8 సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా ఉంటుందన్నారు. విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరాలని చెప్పారు. అల్లూరి, పోలవరం జిల్లాల్లో 72 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు జరుగుతాయన్నారు. సహాయ కలెక్టర్ సాహిత్, డీఎస్పీ అభిషేక్, జిల్లా రెవెన్యూ అధికారి అంబేడ్కర్, జిల్లా విద్యా శాఖాధికారి రామకృష్ణారావు, ఏపీసీ స్వామినాయుడు, తపాలాశాఖ అధికారి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్.. చిత్రంలో ఎస్పీ అమిత్ బర్దార్, డీఈఓ రామకృష్ణారావు

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

(c) eenadu

భవన నిర్మాణ రంగ కార్మికులకు ఊరట

పథకాల అమలుకు కూటమి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

పాయకరావుపేట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ రంగ కార్మికులకు ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. వీరికి సంబంధించిన అన్ని పథకాలను యథావిధిగా అమలు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో తాపీమేస్త్రిలు, కార్మికుల్లో ఆనందం వెల్లువెత్తుతోంది.

సభ్యత్వాలు నమోదు చేసుకుంటున్న కార్మికులు

■ గత తెదేపా ప్రభుత్వ పాలనలో 2014 నుంచి 19 వరకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఆధ్వర్యంలో 11 సంక్షేమ పథకాలను అమలు చేశారు. వైకాపా పాలనలో ఈ పథకాలను పక్కన పెట్టారు. బోర్డును ఉత్సవ విగ్రహంగా మార్చేశారు. అప్పటివరకు తాపీమేస్త్రిల కుటుంబంలో అమ్మాయిల వివాహానికి రూ. 20 వేలు ఆర్థిక సాయం అందించేవారు. కార్మికుడు సహజ మరణం పొందితే రూ.2 లక్షలు, అంగవైకల్యం శాతానికి అనుగుణంగా రూ.లక్ష నుంచి 2 లక్షలు సాయం చేసేవారు. ప్రమాదవశాత్తు చనిపోతే 5 లక్షలు వచ్చేది. ఆసుపత్రిలో ఉంటే వైద్య ఖర్చులు కింద రోజుకు రూ. 500 ఇచ్చేవారు. ప్రసూతి సాయం రూ. 20 వేలు అందించేవారు. ప్రస్తుతం ఈ పథకాలన్నీ బోర్డు ద్వారా అందించేందుకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. జిల్లా వ్యాప్తంగా నిర్మాణ రంగంలో సుమారు 60 వేల మంది కార్మికులు ఉన్నారు. తాజా నిర్ణయంతో కార్మికుల సభ్యత్వాల నమోదు, పాతవి రెన్యువల్‌కు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

■ **అవగాహన కల్పిస్తున్నాం...:** బోర్డులో సభ్యత్వాల నమోదుపై అవగాహన కల్పిస్తున్నాం. సంక్షేమ పథకాలకు దరఖాస్తులు స్వీకరించనున్నాం. భవన నిర్మాణ రంగ కార్మికుల్లో జిల్లావ్యాప్తంగా సగంమంది మాత్రమే రెన్యువల్ చేయించుకున్నారు. – సుజాత, కార్మికశాఖ అధికారి

పక్కాగా.. పడిగాపులు లేకుండా!

జిల్లా ఆసుపత్రికి ఫోరెన్సిక్ నిపుణులు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

హత్య, అత్యాచారం కేసులతో పాటు ఇతర నేరాల్లో నిందితుడికి కఠిన శిక్ష పడాలంటే పోస్టుమార్టం నివేదికే కీలకం. ఇందులో ఏ తేడా వచ్చినా తప్పు చేసిన వారు తప్పించుకునే అవకాశం ఉంది. పోస్టుమార్టం రిపోర్టును పక్కాగా ఉండేలా కేంద్రప్రభుత్వం మెడికో లీగల్ ఎగ్జామినేషన్, పోస్టుమార్టం రిపోర్టింగ్ సిస్టం ప్రవేశపెట్టింది. దీన్ని జిల్లాలో జనవరి నుంచి అమలు చేస్తున్నారు.

జిల్లా, ఏరియా, సామాజిక ఆసుపత్రుల పరిధిలో పనిచేస్తున్న వైద్య సిబ్బందికి, పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలకు ఐడీ నంబరు ఇస్తారు. ప్రమాదాలు జరిగే సమయాల్లో మృతిచెందడం, గాయపడడం, సహజ, అసహజ మరణాలను పోలీసులు ఐడీ నంబరులో నమోదు చేస్తారు. వైద్యులకు ఇచ్చే ఐడీ నంబర్‌లో ఆసుపత్రి వచ్చే వివరాలను నమోదు చేస్తారు. సంఘటనల ఆధారంగా వైద్యులు వెంటనే నివేదికను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తారు.

జిల్లా ఆసుపత్రి సముదాయంలో భవన నిర్మాణ పనులు

ఈ ఏడాది నమోదైన వివరాలు

కేసులు	నివేదిక	విచారణలో ఉన్నవి
121	82	39

ఆలస్యం లేకుండా.. : పోస్టుమార్టం నివేదిక అలస్యం కాకుండా నిర్దేశించిన సమయంలో వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనివల్ల నివేదిక పక్కాగా రావడంతో పాటు సమయానికి వచ్చేలా ఏర్పాట్లు చేశారు. జిల్లా ఆసుపత్రికి ఫోరెన్సిక్ వైద్య నిపుణుడి పోస్టును భర్తీ చేశారు. ఈయన పర్యవేక్షణలో క్లిష్టమైన కేసులకు సంబంధించిన పోస్టుమార్టంలు చేయిస్తున్నారు. జిల్లా ఆసుపత్రిలో పోస్టుమార్టం భవనాన్ని ఆధునికీకరిస్తున్నారు. కార్పొరేట్ సామాజిక సేవా నిధులతో పనులు జరుగుతున్నాయి. కొత్తగా నాలుగు ఫ్రీజర్‌లను కొనుగోలు చేశారు.

వైద్య సిబ్బందికి శిక్షణ: కొత్త విధానంపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలోని 120 మంది వైద్యులకు ఐడీ నంబర్లు ఇచ్చాం. అన్ని ఆసుపత్రుల పరిధిలో కేసులను ఐడీలో నమోదు చేయాలి. దీన్ని బట్టి మరణానికి సంబంధించి నివేదికను వైద్యులు నిర్ధారిస్తారు. సహజ, అసహజ మరణాలను గుర్తించి అవసరమైన వాటిని పోస్టుమార్టం నిర్వహించి అన్ని ఆధారాలతో పక్కాగా నివేదిక తయారవుతుంది. మారిన కొత్త చట్టాలకు అనుగుణంగా నేరం చేసిన వారికి కఠిన శిక్షణ పడేందుకు ఈ రిపోర్టు దోహదపడుతుంది. – డాక్టర్ మిరియాల రాకేష్, ఫోరెన్సిక్ నిపుణులు, జిల్లా ఆసుపత్రి

రెవెన్యూ క్లినిక్ అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ

కలెక్టరేట్, న్యూస్‌టుడే: రెవెన్యూ క్లినిక్ అర్జీలను క్షేత్రస్థాయిలో విచారణ చేసి తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం రెవెన్యూ, సర్వే, భూ రికార్డులు, పౌరసరఫరాల శాఖలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సేవల్లో సమయపాలన, పారదర్శకత పెంచాలన్నారు. అధికారులు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి రెవెన్యూ సేవల్లో ఆలస్యం లేకుండా ప్రజలకు సేవలు అందించాలన్నారు. జిల్లాలో వివాదరహిత భూరికార్డులు, బాధ్యతాయుత రెవెన్యూ పాలన కోసం అధికారులు మరింత చురుగ్గా పనిచేయాలని సూచించారు. ఆన్‌లైన్ సేవలు, భూ మ్యాపింగ్, రికార్డుల అప్‌డేషన్, మ్యుటేషన్ వంటి దరఖాస్తులు వంటి వాటిపై కార్యాచరణ ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. తక్షణమే లోపాలను సవరించాలన్నారు. నిర్ణీత సమయంలో నివేదికలు సమర్పించాలన్నారు. మండల స్థాయిలో తరచూ క్షేత్ర స్థాయి పర్యటనకు తహసీల్దార్లు వెళ్లాలన్నారు. పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌లో వచ్చే అర్జీలను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. నీటి తీరువా పన్నుల వసూళ్లకు ప్రతి మండల, గ్రామ స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సంయుక్త కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, ఆర్డీఓ సత్యనారాయణ, ప్రత్యేక ఉప కలెక్టర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

మత్తు పదార్థాలకు బానిసైతే జీవితం దుర్భరం

మాకవరపాలెం, న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం దుర్భరంగా మారుతుందని నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం మత్తు పదార్థాల వినియోగ వల్ల అనర్థాలు, రవాణా, రహదారి భద్రతపై ఎస్.ఎఫ్.ఐ.విభాగం, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. మోహనరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడడం, ర్యాష్ డ్రైవింగ్ భవిష్యత్తును నాశనం చేస్తాయన్నారు. విద్యతో పాటు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకునేందుకు విద్యార్థులు నిరంతరం కష్టపడాలని ప్రిన్సిపాల్ మోహనరావు అన్నారు. ఎస్సై దామోదరనాయుడు, ఏట లోహిత్ విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

సదస్సుకు హాజరైన విద్యార్థులు

పరిశ్రమలో ప్రమాదం.. కెమిస్ట్ దుర్మరణం

రాంబిల్లి, న్యూస్‌టుడే: చదువు పూర్తిచేసి.. ఉద్యోగంలో చేరి.. జీవితంపై ఎన్నో కలలు కన్న యువకుడి బతుకు పయనం అర్ధాంతరంగా ముగిసిపోయింది. అచ్యుతాపురం నాన్‌సెజ్‌లోని ఇన్నోవేర్ ల్యాబ్స్‌లో మంగళవారం రాత్రి అమ్మోనియా గ్యాస్‌ను సిలెండర్ నుంచి రియాక్టర్‌కు పంపించే క్రమంలో జరిగిన ప్రమాదంలో కెమిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.రాయవరం మండలం పెదగుమ్ములూరుకు చెందిన బొడ్డ అజయ్‌కుమార్ (21) దుర్మరణం చెందాడు. షిఫ్ట్ ఇన్‌ఛార్జిగా విధుల్లో ఉన్న గుంటూరుకు చెందిన జెర్రిపోతుల పోతురాజు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో బి షిఫ్ట్ విధుల్లో 19 మంది ఉన్నారు. ఈ సమయంలో రియాక్టర్‌కు నష్టం జరగకపోవడంతో ప్రమాద తీవ్రత తగ్గిందని ఉద్యోగులు చెబుతున్నారు.

ఇన్నోవేర్ ల్యాబ్స్‌లో ప్రమాదం జరిగిన ప్రాంతం

అజయ్‌కుమార్ (పాత చిత్రం)

అజయ్‌కుమార్ తండ్రి 15 ఏళ్ల క్రితం ఒక ప్రమాదంలో మృతి చెందాడు. తల్లి మంగ కష్టపడి కుమారుడిని చదివించింది. కూతురుకు వివాహం చేశారు. తన కలలు సాకారం చేసుకోవడం కోసం ఆ యువకుడు 17 నెలల క్రితం ఇన్నోవేర్ ల్యాబ్స్‌లో కెమిస్ట్‌గా చేరాడు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో తల్లి మంగ గుండెలవిసేలా రోదిస్తోంది. బాధిత కుటుంబాన్ని కంపెనీ యాజమాన్యం ఆదుకోవాలని బంధువులు కోరారు. మృతదేహానికి అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రిలో బుధవారం పోస్టుమార్టం పూర్తయిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామని సీఐ నరసింగరావు చెప్పారు. తల్లి మంగ ఫిర్యాదు మేరకు ఇన్నోవేర్ ల్యాబ్స్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. గాయపడిన పోతురాజును అచ్యుతాపురంలో ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించి అక్కడ చికిత్స అందిస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

రూ. కోటి పరిహారం ఇవ్వాలి: ఇన్నోవేర్ ల్యాబ్స్‌లో మంగళవారం రాత్రి అమ్మోనియా గ్యాస్ సిలిండర్ పేలిన ప్రమాదంలో దుర్మరణం చెందిన బొడ్డ అజయ్‌కుమార్ (21) కుటుంబానికి యాజమాన్యం రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండు చేశారు. బుధవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శులు ఆర్.రాము, జి.దేవుడునాయుడు, అచ్యుతాపురం మండల కన్వీనరు కె.సోమునాయుడు ఆందోళన చేపట్టారు.

కొత్తూరు (అనకాపల్లి): ఇన్నోవేర్ ల్యాబ్స్‌లో ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, గౌరవాధ్యక్షులు సత్యనారాయణ డిమాండ్ చేశారు. అనకాపల్లి సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాయకులు గంటా శ్రీరామ్, కె.ఈశ్వరరావు తదితరులతో కలిసి మాట్లాడారు. నిత్యం ఫార్మా పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

కనీస వేతనం అమలు చేయాలని ఆందోళన

కలెక్టరేట్, న్యూస్‌టుడే: వీఆర్‌ఏలకు పేస్కేల్‌తో కనీస వేతనం అమలు చేయాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడు రవికుమార్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో వీఆర్‌ఏలు కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా కేవలం రూ. 10,500 వేతనం మాత్రమే ఇస్తున్నారని, స్పష్టమైన సర్వీస్ నిబంధనలు లేకపోవడంతో పదోన్నతుల విషయంలో ఇబ్బందులు పడుతున్నామన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతికుమారి మాట్లాడుతూ అర్హత ఉన్న వీఆర్‌ఏలను ఖాళీగా ఉన్న వీఆర్‌ఏ పోస్టులో తక్షణమే భర్తీ చేయాలన్నారు. ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి సదుపాయాలు కల్పించాలని కోరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు మాట్లాడుతూ జిల్లాలో ఖాళీగా ఉన్న 180కి పైగా వీఆర్‌ఏ పోస్టులను భర్తీ చేయాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

వృత్తి పనివారలకు తోడ్పాటు

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం గ్రామోద్యోగ్ వికాస్ యోజన ద్వారా అందజేస్తున్న నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని నోడల్ అధికారి దేవరకొండ సుబ్రహ్మణ్యం కోరారు. వేములపూడి స్వరాజ్‌సంఘ్, నర్సీపట్నం దాలయ్యనాయుడు ఆధ్యాత్మిక కేంద్రాల్లో నలభైమందికి ఏర్పాటైన టైలరింగ్ నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పదిహేను రోజుల శిక్షణ అనంతరం రూ. 25 వేల విలువ చేసే కుట్టు మిషన్ ఉచితంగా అందజేస్తామని వివరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా లంబసింగిలో గిరిజనులకు 400 తేనె పెట్టెలు అందజేశామన్నారు. కుండల తయారీలో శిక్షణ ఇచ్చి అనకాపల్లి జిల్లాలో 80 మందికి, తూర్పు గోదావరి జిల్లాలో 40 మందికి రూ.20 వేల విలువచేసే విద్యుత్తుతో నడిచే కుండల తయారీ చక్రాలు ఉచితంగా అందజేశామన్నారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లా రాజాంలో 20 మందికి చెప్పుల ఫ్యాక్టరీకి రూ. 10 వేల విలువ చేసే పరికరాలు ఇచ్చామన్నారు. పొందూరు ఖాదీకి జీఐ గుర్తింపు రావడంతో ఆన్‌లైన్‌లో ఖాదీ విక్రయాలు పెరిగాయని వెల్లడించారు. వేములపూడి స్వరాజ్ సంఘ్ అధ్యక్షుడు ఇందల వెంకటరమణ పాల్గొన్నారు.

సూచనలు ఇస్తున్న నోడల్ అధికారి సుబ్రహ్మణ్యం

తాగునీటి చెరువులో వ్యర్థాలు

రాంబిల్లి, న్యూస్‌టుడే: నావికాస్థావరం ప్రాజెక్టుకు సమీపంగా ఉన్న నాలుగు పంచాయతీల్లో ఆయా గ్రామాల ప్రజలతో పాటుగా వలస కార్మికులు అధిక సంఖ్యలో ఉంటున్నారు. ఇదే స్థాయిలో వ్యాపార దుకాణాలు వెలిశాయి. సంపద కేంద్రాలున్నా చెత్తను తెచ్చి సమీపంలో ఉన్న మంచినీటి చెరువుల్లో పడేస్తున్నారు. గోవిందపాలెం, కొత్తపేట గ్రామాలకు సర్వేనంబరు-170లో 9.70 ఎకరాల విస్తీర్ణంలో రెండు చెరువులున్నాయి. చెరువుల్లోకి నీరు వచ్చే కాలువలు కబ్జాకు గురవడంతో అవి బోసిపోతున్నాయి. దీని పక్కనే మూడు అంతస్తుల భవనం నుంచి ప్రధాన రహదారిని తవ్వేసి చెరువులోకి పైపులు నిర్మించారు. ఆ భవనం నుంచి వచ్చే వ్యర్థజలాలను చెరువులోకి విడిచిపెడుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి కె.హరీశ్ వద్ద ప్రస్తావించగా చెరువులోకి వ్యర్థజలాలు వెళ్లకుండా కట్టడి చేసేలా ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. వ్యర్థ జలాల గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు కార్యదర్శి తెలిపారు.

గోవిందపాలెం చెరువులో వ్యర్థాలు

అప్పన్న హుండీ ఆదాయం రూ. 1.49 కోట్లు

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామి వారి హుండీ ఆదాయం లెక్కింపు బుధవారం సింహగిరిపై పరకామణి కేంద్రంలో జరిగింది. ఈవో జె. వెంకటరావు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది హుండీలు తెరిచి లెక్కించారు. భక్తులు కానుకల రూపంలో సమర్పించిన నగదు రూ.1.49 కోట్లు పైగా లభించినట్లు ఈవో వెంకటరావు తెలిపారు. దీంతో పాటు 187.180 గ్రాముల బంగారం, 5.775 కిలోల వెండి, 13 దేశాలకు చెందిన విదేశీ నగదు లభ్యమైనట్లు వివరించారు. ఈ మొత్తం ఆదాయం 21 రోజులకు సంబంధించినదిగా తెలియజేశారు.

హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, సేవా కార్యకర్తలు

సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.లక్ష్మణరావు, జి.రమణ, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం అనకాపల్లిలో ర్యాలీ నిర్వహించి, కూడళ్లలో నిరసన ప్రదర్శనలు చేశారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 తరువాత విధుల్లో చేరిన ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా శ్రీరామ్, నాయకులు వై.లక్ష్మణరావు, లోవరాజు, జగన్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ వద్ద ధర్నా చేస్తున్న పీఏసీఎస్ ఉద్యోగులు

అల్లూరి జిల్లా రిజిస్ట్రార్‌గా నరసింహమూర్తి

నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లి సబ్ రిజిస్ట్రార్ **సీహెచ్ నరసింహమూర్తి**కి జిల్లా రిజిస్ట్రార్ (డీఆర్)గా పదోన్నతి లభించింది. పదోన్నతిలో భాగంగా ఈయన్ని అల్లూరి సీతారామరాజు జిల్లాకు కేటాయించారు.

జానకీరాంపురం సీఈఓ విధుల నుంచి తొలగింపు

రోలుగుంట: జానకీరాంపురం పీఏసీఎస్ సీఈఓ రామకృష్ణను విధుల నుంచి తొలగించారు. ఈ సొసైటీలో జరిగిన నిధుల దుర్వినియోగం, అవినీతికి సంబంధించి వచ్చిన ఆరోపణలు నిరూపణ కావడంతో ఆయనను విధుల నుంచి తొలగిస్తూ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారని ఉద్యోగ వర్గాలు తెలిపాయి.

దశల వారీగా ఉన్నత పాఠశాలల్లో స్కౌట్ యూనిట్లు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: జిల్లాలో అన్ని ఉన్నత పాఠశాలల్లోనూ దశల వారీగా స్కౌట్స్, గైడ్స్ యూనిట్లను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామని జిల్ల విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు తెలిపారు. అనకాపల్లి ఏఎంఏఎల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే జిల్లాలో 50 ఉన్నత పాఠశాలల్లో స్కౌట్ యూనిట్లు ఉన్నాయన్నారు. ఇప్పుడు రెండో దశలో 90 యూనిట్లను ఏర్పాటు చేశామన్నారు. దీంతో 140 కేంద్రాలు జిల్లాలో పని చేస్తాయన్నారు. వారందరికీ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు మంచి ప్రవర్తన, క్రమశిక్షణ, అంకితభావం, చిత్తశుద్ధితోపాటు శారీరక దారుఢ్యం అవసరమన్నారు. ముందుగా యూనిట్ల బాధ్యులకు శిక్షణ ఇస్తామని, వారి ద్వారా విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులంతా కృషి చేయాలని కోరారు. విద్యాశాఖ సహాయ సంచాలకుడు హుస్సేన్, శిక్షణ కన్వీనర్ స్వామినాయుడు, ఏఎంఏఎల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోరిబిల్లి లావణ్య, సంతోష్, సూరిశెట్టి అనసూర్య, మనోహర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఈఓ గిడ్డి అప్పారావు నాయుడు

140 మంది జర్నలిస్టులకు అక్రెడిటేషన్ల జారీకి ఆమోదం

పాడేరు, న్యూస్‌టుడే: అల్లూరి జిల్లాలో అర్హులైన ప్రతిఒక్కరికీ అక్రెడిటేషన్ మంజూరు చేస్తామని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. మొత్తం 169 దరఖాస్తులు అందగా.. జిల్లా కమిటీ పరిశీలన చేసి అర్హులైన 140 మందికి అక్రెడిటేషన్ల జారీకి ఆమోదించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి రెండో విడత సమావేశంలో మంజూరు చేస్తామని పేర్కొన్నారు. త్వరలోనే కార్డులు పంపిణీ చేస్తామన్నారు. సమాజాభివృద్ధి, జిల్లా ప్రగతి కోసం పాత్రికేయుల నిబద్ధతతో పనిచేయాలని కోరారు. డీపీఆర్ఓ కె. బాలమాన్‌సింగ్ వర్చువల్‌గా హాజరయ్యారు. పి.ఆర్.ఓ. కె.వెంకట్రావు, జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు, జూనియర్ అసిస్టెంట్ సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో కలెక్టర్ దినేష్‌కుమార్, కమిటీ సభ్యులు

క్రీడలతో మానసికోల్లాసం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని తాజంగి క్రికెట్ కమిటీ సభ్యులు రొబ్బా శ్రీనివాస్, సాగర్ పేర్కొన్నారు. తాజంగి గ్రామంలో బుధవారం క్రికెట్ పోటీలు ప్రారంభించారు. మారుమూల గ్రామాల్లోని క్రీడాకారుల ప్రతిభ గుర్తించడానికి ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.5 వేలు, షీల్డులు అందించనున్నట్లు పేర్కొన్నారు. వంజరి వీఆర్వో చిరంజీవి, ఉపాధ్యాయుడు సతీష్, పెసా కమిటీ ఉపాధ్యక్షుడు గోపాలకృష్ణ, ఉగ్రంగి లక్ష్మణరావు, పలాసి కృష్ణారావు సహకారంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. బాబి, నూకరాజు, నాగరాజు, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తాజంగిలో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న నిర్వాహకులు

వైద్యాధికారుల వివాదంపై విచారణ

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: గూడెంకొత్తవీధి మండలం ఆర్‌వీ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారుల వివాదంపై లోకల్ కంప్లైంట్స్ కమిటీ విచారణ నివేదికను కలెక్టర్ దినేష్‌కుమార్‌కు సమర్పించినట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ కృష్ణమూర్తినాయక్ పేర్కొన్నారు. జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశానుసారం వైద్యాధికారుల వివాదంపై బుధవారం పాడేరులో ఉన్నత స్థాయి విచారణ చేపట్టారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ఆర్వీనగర్ పీహెచ్‌సీలో గతంలో పనిచేసి ఇప్పుడు అనంతపురంలో జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ రాజా రవీంద్రనాథ్ చౌదరి తనను లైంగికంగా వేధించారని జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిటీకి, జిల్లా కలెక్టర్‌కు ఓ వైద్యాధికారిణి ఫిర్యాదు చేశారన్నారు. ఈ ఘటనపై కమిటీ వివరాలు సేకరించిందన్నారు. ఐసీడీఎస్ పీడీ ఝాన్సీరాంపడాల్, తహసీల్దార్ పాల్గొన్నారు.

JOBS
హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ:18-20K ✆ 96404 68899, 96402 58899

ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలి

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: ఏపీఎండీసీ బాక్సైట్‌పై ఇచ్చిన నివేదికపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్ పడాల్ ఆధ్వర్యంలో బుధవారం పాడేరులో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. స్థానిక గిరిజనులకు శతశాతం రిజర్వేషన్ల బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని పేర్కొన్నారు. బాక్సైట్ తవ్వకాలను వ్యతిరేకిస్తూ గిరిజన సలహా మండలి(టీఏసీ)లో తీర్మానం చేయాలన్నారు. గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధాకృష్ణ, సాగిన సత్యనారాయణ, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సైకిల్ మెకానిక్‌పై పెట్రోలు పోసి నిప్పు

తుని, న్యూస్‌టుడే: పంక్చర్లు వేసే సామగ్రిని సకాలంలో తిరిగి ఇవ్వలేదనే కోపంతో ఓ బైక్ మెకానిక్, పక్కనే ఉన్న సైకిల్ మెకానిక్‌పై పెట్రోలు పోసి నిప్పు అంటించిన ఘటన బుధవారం కాకినాడ జిల్లా తుని పట్టణంలో చోటుచేసుకుంది. శ్రీరామా థియేటర్ సమీపంలో కె.నానాజీకి సైకిల్ మరమ్మతులు చేసే దుకాణం ఉంది. దీనిపక్కనే బి.రాజు ద్విచక్రవాహనాల రిపేరు షాపు ఉంది. తరచూ నానాజీ కొన్ని రకాల పరికరాలు రాజు నుంచి తీసుకువెళ్లి తిరిగి ఇవ్వకపోవడంతో వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో బుధవారం వివాదం చెలరేగగా కోపోద్రిక్తుడైన రాజు అక్కడున్న పెట్రోలును నానాజీపై వేసి నిప్పు పెట్టాడు. దీంతో దుస్తులకు నిప్పు అంటుకుని 50 శాతం కాలింది. వెంటనే స్థానికులు అతడ్ని తుని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై జె.విజయబాబు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్షతగాత్రుడికి చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించాలని కుటుంబసభ్యులకు సూచించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తీవ్రంగా గాయపడ్డ నానాజీ అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం శ్రీరాంపురానికి చెందినవాడు కాగా, రాజు పక్క గ్రామం రామభద్రపురానికి చెందినవాడు. వీరిద్దరూ తునిలోనే దుకాణాలు నడుపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి..

నక్కపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని కాగిత వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యాచకుడు మృతిచెందినట్లు సీఐ జె.మురళీ బుధవారం తెలిపారు. కాగిత వద్ద కొన్నాళ్లగా మతిస్థిమితంలేని బిచ్చగాడు సంచరిస్తున్నాడన్నారు. ఈ క్రమంలోనే ఇతడిని జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఢీకొట్టిందని, దీంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు పేర్కొన్నారు. వీఆర్వో ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని, మృతుడి వయసు 50 ఏళ్లు ఉంటుందన్నారు.

చికిత్స పొందుతూ ఖాజీపాలెంవాసి..

అచ్యుతాపురం: ఖాజీపాలేనికి చెందిన కె.కృష్ణ (50) ఈనెల 4న మదుంపై కూర్చొని వెనక్కిపడి గాయపడ్డారు. తలకు గాయంకావడంతో కుటుంబసభ్యులు కేజీహెచ్‌కి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ బుధవారం ఆసుపత్రిలో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చంద్రశేఖరరావు, ఎస్సై వెంకటరావు తెలిపారు.

ఏయూలో విద్యార్థుల నిరసన

ఏయూ పరిపాలనా భవనం వద్ద నిరసన తెలుపుతున్న ఏబీవీపీ విద్యార్థులు, ఆర్ఎస్ఎస్ వాలంటీర్లు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఇటీవల ఏయూలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆర్.ఎస్.ఎస్. వాలంటీర్లు, ఏబీవీపీ విద్యార్థులు బుధవారం ఏయూ పరిపాలనా భవనం వద్ద నిరసన చేపట్టారు. ఆర్ఎస్ఎస్ విభాగ కార్యకలాపాలు శాంతియుతంగా చేపడుతుండగా దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఉపకులపతికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏసీపీలు లక్ష్మణమూర్తి, నరసింహమూర్తి, అప్పలరాజు తమ సిబ్బందితో హుటాహుటిన చేరుకొని నిరసన చేపట్టిన వారిని బయటకు పంపే ప్రయత్నం చేశారు. అదే సమయంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థులు వీసీని కలిసేందుకు వచ్చారు. ఈ క్రమంలో ఏబీవీపీ విద్యార్థులు, ఆర్ఎస్ఎస్ వాలంటీర్లు భారత మాతాకి జై అంటూ నినాదాలు చేయగా.. పోలీసులు వారిని బలవంతంగా బయటకు పంపించారు. ఏబీవీపీ విద్యార్థులు బయటకు వెళుతూనే తమపై నీళ్ల సీసాలు విసిరారని ఎస్ఎఫ్ఐ విద్యార్థులు ఆరోపించారు.

★ మరోవైపు ఎస్.ఎఫ్.ఐ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థులు ఏయూ రెక్టార్ ఆచార్య పి.కింగ్, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య హరనాథ్‌లతో చర్చలు జరిపారు. మంగళవారం చోటుచేసుకున్న ఘటనకు కారకులైన వారిని అరెస్టు చేయాలని, వర్సిటీలోకి ఇతరులకు ప్రవేశం కల్పించరాదని, మతపరమైన జెండాలు ఎగురవేయరాదని కోరారు. ★ ఈ నేపథ్యంలో ఇతరులకు ఏయూలో ప్రవేశం లేదని రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు ఓ ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయ ప్రాంగణం, మైదానంలో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నా అనుమతి పొందాలన్నారు. వర్సిటీ ప్రశాంతతకు, విద్యా సంబంధ వాతావరణానికి భంగం కలిగించే కార్యక్రమాలు చేపట్టినా చర్యలు తప్పవన్నారు. ఈ క్రమంలో నాన్ బోర్డర్లకు ఎవరైనా వర్సిటీలో ఆశ్రయం కల్పిస్తే సంబంధిత విద్యార్థుల వసతి సదుపాయాన్ని రద్దు చేస్తామని స్పష్టం చేశారు.

నిరసనకారులను బలవంతంగా బయటకు పంపిస్తున్న పోలీసులు

చక్రం తీసిన ప్రాణం

ఎల్లమ్మాజీ (పాతచిత్రం)

విశాఖపట్నం, న్యూస్‌టుడే : కార్ల చక్రాలు ఊడిపోయి ప్రమాదాలు జరగడం చూస్తుంటాం. కానీ ద్విచక్ర వాహనం చక్రం ఊడి ఓ మహిళ మృతిచెందిన సంఘటన షీలానగర్ పోర్టు రోడ్డులో జరిగింది. దీనికి సంబంధించి గాజువాక పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని ఏవీఎన్ కళాశాల సమీప ప్రాంతానికి చెందిన దాసరి ఎల్లమ్మాజీ(34) స్కూటీపై బుధవారం ఉదయం షీలానగర్ వచ్చారు. తన తమ్ముడిని ఐయాన్ డిజిటల్ పరీక్షా కేంద్రంలో దించి ఆమె తిరిగి ద్విచక్ర వాహనంపై పోర్టు రోడ్డులో వెళ్తుండగా.. శిక్షణ కానిస్టేబుల్ గంటా గౌరీనాయుడు (31) షీలానగర్ వద్ద ఆమెను లిఫ్ట్ అడిగారు. వీరి వాహనం షీలానగర్ టోల్‌గేటు సమీపంలోకి వచ్చేసరికి వెనుక చక్రం ఊడిపోయింది. ఇద్దరూ ఒక్కసారిగా కిందపడిపోయారు. ఈ సంఘటనలో ఆమె తల రోడ్డుకి తగలడంతో తీవ్ర రక్తస్రావమై సంఘటన స్థలంలోనే మృతిచెందారు. గౌరీనాయుడు స్వల్పగాయాలతో బయటపడ్డారు. సమాచారం తెలుసుకున్న గాజువాక ట్రాఫిక్ పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆమెను కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	120	115
లైవ్	147	135
డ్రెస్డ్	213	240
స్కిన్‌లెస్	243	250

(c) eenadu

కొయ్యూరు, న్యూస్‌టుడే: బూదరాళ్ల పంచాయతీ పోకలపాలెం సమీపంలో కొండవాగు ఉన్నప్పటికీ సాగు భూములకు నీరందడం లేదు. చెక్‌డ్యాం నిర్మిస్తే సాగునీటికి ఇబ్బందులు ఉండవు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి. – నారాయణ, పోకలపాలెం, ✓: చెక్‌డ్యాం నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదిస్తాం. – రామకృష్ణ, ఎస్‌ఎంఐ ఏఈ

మేమున్నాం.. మీకు తోడుగా

పాడేరు 89853 66570 | అరకులోయ: 63034 86346 | చింతపల్లి: 94404 07658

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: మాకవరం నుంచి జోలాపుట్టు వెళ్లే రహదారిలో వంతెనకు రక్షణ గోడ నిర్మించలేదు. ప్రమాదాలు జరగకుండా స్థానికులు వెదురుతో కంచె ఏర్పాటు చేశారు. రక్షణగోడ నిర్మించాలి. – నర్సింగరావు, స్థానికుడు, ✓: రక్షణగోడ నిర్మాణానికి నిధులు కేటాయించాలని ప్రతిపాదనలు పంపిస్తాం. నిధులు విడుదలైతే పనులు చేపడతాం. – మురళీకృష్ణ, మండల ఇంజినీరు, ముంచంగిపుట్టు

గిరిజనులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

నాటాసారాతో కుటుంబాలు చిన్నాభిన్నం

కొయ్యూరు, న్యూస్‌టుడే: సమాజ భద్రతకు పోలీసులకు సహకరించాలని కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు కోరారు. చింతలపూడిలో ప్రజలతో బుధవారం సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. మహిళలపై నేరాలు- చట్టపరమైన రక్షణ, మత్తు పదార్థాలతో దుష్పరిణామాలు వివరించారు. నాటుసారా తాగడం వల్ల ఆరోగ్యం పాడవుతుందని, కుటుంబాలు చిన్నాభిన్నమైపోతాయన్నారు. ఎస్సై కిశోర్‌వర్మ, గిరిజనులు పాల్గొన్నారు.

పండే చోటా మండుతున్నాయ్!

మన్యంలోనూ చుక్కలనంటుతున్న కాయగూరల ధరలు

చింతపల్లి, న్యూస్‌టుడే

సాధారణంగా ఏటా వేసవిలో, లేదా కార్తిక మాసంలో కాయగూరల ధరలు పెరుగుతుంటాయి. నీటి సదుపాయం తక్కువగా ఉండటం వల్ల వేసవిలో, కార్తిక మాసంలో చాలామంది మాంసాహారానికి దూరంగా ఉండటం వల్ల సహజంగానే వీటికి డిమాండ్ పెరుగుతుంది. ప్రస్తుతం చలికాలంలో ముగింపు దశలో ఉండగానే ధరలు సామాన్యులను బెంబేలెత్తిస్తున్నాయి. ప్రధానంగా కాయగూరలను పండించే మన్యంలోనూ వీటి ధరలు పెరగడం సామాన్యులను కలవరపెడుతోంది. వారపు సంతకు వెళ్లి ఏం కొనాలన్నా ఆలోచించే పరిస్థితి ఏర్పడింది.

సంతల్లో ధరల మోత

మన్యంలో చాలావరకు కాయగూరలను మాలీ రైతులు పండిస్తున్నారు. వాటిలో ప్రధానంగా క్యాబేజీ, కాలీఫ్లవర్, వంకాయలు, బీట్‌రూట్, క్యారెట్, నూల్‌కోల్, బీన్స్, బెండకాయలు, పచ్చిమిరప, తోటకూర వంటివి ఉంటాయి. టమాటా, దొండకాయలు వంటివి ఎక్కువగా మైదానప్రాంతాల నుంచి తీసుకొచ్చి అమ్ముతున్నారు. టమాటాను ఇక్కడ రైతులు పరిమితంగానే సాగుచేస్తున్నారు. మాలీ రైతులు సైతం టమాటాను మైదాన ప్రాంతాల నుంచి తీసుకొచ్చి వాటిని

వారపుసంతలో కూరగాయల అమ్మకాలు

ఇక్కడ మిగిలిన కూరగాయలతోపాటు అమ్ముతున్నారు. గత కొద్దిరోజులుగా కాయగూరల ధరల్లో భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. కొనుగోలుదారులు వారపు సంతల్లో ధరలు చూసి జంకుతున్నారు. సాధారణంగా మే నెలలో ఎండల తీవ్రత అధికంగా ఉంటుంది. వేసవిలో నీటి ఎద్దడి కారణంగా దిగుబడులు అంతంతమాత్రంగానే ఉంటాయి. ఎండల తీవ్రత కారణంగా చాలామంది మాంసాహారం వైపు వెళ్లకుండా కూరగాయలు, ఆకుకూరల వినియోగానికే మొగ్గుచూపుతారు. అటువంటిది ప్రస్తుత చలికాలంలో కాయగూరల ధరలు అమాంతం పెరగడంపై సామాన్య, మధ్యతరగతి ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇప్పుడే ధరలు ఇలా ఉంటే రాబోయే వేసవిలో వీటి ధరలు మరింత చుక్కలనంటుతాయన్న ఆందోళన సామాన్య, మధ్యతరగతివర్గాల్లో వ్యక్తమవుతోంది. దిగుబడులు తక్కువగా ఉండటంతోపాటు రవాణా ఛార్జీలు పెరగడం వంటి కారణాలతో ధరలు పెరిగాయని వ్యాపారులు అంటున్నారు. సంతల్లో బీరకాయలు కిలో రూ. కిలో రూ.వంద వరకూ అమ్ముతున్నారు. ఇతరత్రా కూరగాయలన్నీ కిలో రూ.50 నుంచి రూ.80 వరకు పలుకుతున్నాయి.

నేడు రక్తదానశిబిరం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఈ నెల 19న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో సీతామహలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్‌క్రాస్ సౌజన్యంతో ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నామని, రక్తదాతలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

పోషకాహారం లోపం నివారణకు చర్యలు

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతంలో పోషకాహార లోపం నివారణకు చర్యలు చేపట్టాలని ఆర్‌వైఎస్‌ఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ బాబూరావునాయుడు పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం ఆరోగ్య సబ్ కమిటీ సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బాబూరావు నాయుడు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ మురళి హాజరయ్యారు. పాడేరుతోపాటు డుంబ్రిగుడ మండలాల సభ్యులు పాల్గొన్నారు. ఫుడ్ బాస్కెట్ ప్రాధాన్యం, న్యూట్రీగార్డెన్ పెంపకం తదితరాలపై అవగాహన కల్పించారు. డీపీఎంలు భాస్కరరావు, మార్టిన్, ఆరోగ్యశాఖ ప్రతినిధి మధుబాబు, ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ విజయలక్ష్మి, సిబ్బంది మనీషా, రాజేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

శిథిల డిపోలో భయంభయం

జి.మాడుగుల మండలంలోని బొయితిలి డీఆర్‌డిపో భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇక్కడ నిత్యావసర సరకులు భద్రపరచుకునేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాకాలంలో గదిలోకి నీరు చేరడంతో అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఏ సమయంలో కూలుతుందోనని సిబ్బంది భయంభయంతో విధులు నిర్వర్తిస్తున్నారు. నూతన భవనం మంజూరు చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. – జి.మాడుగుల, న్యూస్‌టుడే

రబీ సాగు.. బాగు

పాడేరు శివారులో కళకళలాడుతున్న వరి పొలాలు

పాడేరు ఏజెన్సీలో రబీ సాగు జోరుగా సాగుతోంది. ఖరీఫ్‌లో జిల్లావ్యాప్తంగా 1.28 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వివిధ పంటలు పండిస్తుంటారు. ఇందులో రబీ సాగు నాలుగోవంతు ఉంటుంది. గెడ్డలు, కాలువలు ఉన్న చోట్ల రబీ పంటలతో పొలాలు కళకళలాడుతున్నాయి. పాడేరు మండలం గుర్రగరువు, సంగోడి, మినుములూరు, కందమామిడి పరిసరాల్లో రబీ సాగు ముమ్మరంగా జరుగుతోంది. ప్రభుత్వం బోర్లు రాయితీపై అందించగలిగితే ఖరీఫ్, రబీ పంటలు పుష్కలంగా నీరు అందించేందుకు ఆస్కారం ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. – పాడేరు పట్టణం, న్యూస్‌టుడే

రహదారి.. బాగుపడదా మరి?

మన్యంలోని పలు రహదారులు ఛిద్రమై రాకపోకలకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పెదబయలు మండలం పర్రెడ పంచాయతీ కుర్తాడు సమీపంలో రోడ్డు పెచ్చులూడింది. ఈ రహదారిలో నిత్యం గ్రామస్థులు, ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు. – పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే

సచివాలయం ప్రారంభమెప్పుడో?

ఎంపీడీవో కార్యాలయానికి సుమారు వంద మీటర్ల దూరంలోని రాజేంద్రపాలెం గ్రామ సచివాలయ భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు. గత ప్రభుత్వ హయాంలో రూ.45 లక్షలతో ఈ భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. చిన్నచిన్న పనులు మినహా అన్నీ ఆరుమాసాల క్రితమే పూర్తయ్యాయి. దీన్ని ప్రారంభించకపోవడంతో ఇరుకు భవనంలో సచివాలయ సిబ్బంది ఇబ్బందులు పడుతూ విధులు నిర్వహిస్తున్నారు. ఈ భవనాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.– కొయ్యూరు, న్యూస్‌టుడే

భవనమెక్కిన వృక్షం

డుంబ్రిగుడ మండలం అరకులో 40 ఏళ్ల క్రితం పాఠశాల నడిచేది. ఒకటి నుంచి ఏడో తరగతి విద్యార్థులకు వసతితో కూడిన విద్యను అందించేవారు అప్పట్లో పాఠశాలల క్రమబద్ధీకరణతో దీన్ని ఎత్తివేశారు. భవనం నిరుపయోగంగా మారింది. పూర్తిగా శిథిలావస్థకు చేరి.. చుట్టూ పొదలు, పెద్దపెద్ద వృక్షాలు దర్శనమిస్తున్నాయి. ఓ రావి చెట్టు పాడుబడ్డ భవనం గోడకు అతుక్కుని వృక్షంగా ఎదిగింది. – డుంబ్రిగుడ, న్యూస్‌టుడే

బాక్సైట్ తవ్వితే సహించం

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతంలో బాక్సైట్ తవ్వకాలు చేపడితే సహించేది లేదని గిరిజన సంఘం మండల అధ్యక్షులు శ్రీను అన్నారు. సంఘ నాయకులతో ముంచంగిపుట్టులో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు, అనంతగిరి మండలాల్లో నిక్షిప్తమై ఉన్న ఖనిజ సంపదను వెలికితీసేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రశాంతంగా ఉన్న గిరిజన గ్రామాల్లో బాక్సైట్ తవ్వకాల పేరుతో అలజడి సృష్టించవద్దన్నారు. గాసిరాందొర, నర్సింగరావుపడాల్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీలేరు, న్యూస్‌టుడే: బాక్సైట్‌పై గనుల శాఖ నివేదికపై కూటమి ప్రభుత్వం ఆదివాసీలకు సమాధానం చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు బోనంగి చిన్నయ్యపడాల్ డిమాండ్ చేశారు. జెర్రిల పంచాయతీ రాళ్లగెడ్డలో బాక్సైట్ ప్రభావిత ప్రాంతాలైన 12 గ్రామాల గిరిజనులతో సమావేశమయ్యారు. గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు ఎ.బుజ్జిబాబు మాట్లాడుతూ.. మండల పరిషత్‌లో బాక్సైట్ వ్యతిరేక తీర్మానం చేయిస్తామని, అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. ఈనెల 20న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం జర్రెల పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. కోండ్రుపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఉప సర్పంచి ముర్ల చంటిబాబు, జి.సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోండ్రుపల్లిలో గిరిజనుల ర్యాలీ

రహదారుల నిర్మాణానికి వినతి

కొయ్యూరు, న్యూస్‌టుడే: రావణాపల్లి సమీపంలో జాతీయ రహదారి నుంచి రేవడివీధి మీదుగా కొప్పుకొండ, కొప్పుకొండ నుంచి మంగళపాలెం, బంగారంపేట నుంచి కొత్తబంగారంపేట, ముసలి నుంచి దోమలగొంది గ్రామాలకు తారురోడ్లు నిర్మించాలని రావణాపల్లి ఎంపీటీసీ సభ్యురాలు ఐ.సత్యవేణి కోరారు. జిల్లా కలెక్టర్‌ని కలిసి వినతిపత్రం అందించినట్లు చెప్పారు. పరదేశిపాకలు గ్రామంలో నిలిచిపోయిన అంగన్‌వాడీ భవన నిర్మాణం పూర్తి చేయాలన్నారు.

అస్తవ్యస్తంగా అరకులోయ

అరకులోయ, న్యూస్‌టుడే: పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నచందంగా మారింది అరకులోయ పరిస్థితి. ఆంధ్రా ఊటీగా పేరొందిన అరకులోయ సమస్యలతో అస్తవ్యస్తంగా మారింది. ఇక్కడి ప్రజలకు కనీస సౌకర్యాలు సైతం సమకూరని పరిస్థితి. తాగునీరు, డ్రైనేజీలు, సీసీ రోడ్లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అరకులోయ పర్యాటకంగా దినదినాభివృద్ధి చెందుతోంది. ఇక్కడ నివాసం ఉండే ప్రజల సంఖ్య పెరుగుతున్నా సౌకర్యాల కల్పనలో మాత్రం అధికారులు విఫలమవుతున్నారు.

తాగునీటి కష్టాలు

అరకులోయలో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు పంచాయతీ ఆధ్వర్యంలో రూ.లక్షలాది నిధులను వెచ్చిస్తున్నారు. ఇక్కడి ప్రజల అవసరాలకు తగినంతగా తాగునీటిని అందించని పరిస్థితి నెలకొంది. సుమారు ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన పథకానికి సంబంధించి పైప్‌లైన్‌ను పొడిగించని పరిస్థితి. పట్టణంలో రెండు రోజులకోసారి తాగునీటి సరఫరా జరుగుతోంది. అన్ని వీధులకు సరఫరా కాకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

రహదారిపై పారుతున్న మురుగు

దారుణంగా డ్రైనేజీ వ్యవస్థ

పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా ఉంది. కాలువల్లో పూడికతీత జరగడం లేదు. ఎక్కడపడితే అక్కడ మురుగునీరు స్తంభిస్తుంది. నూతనంగా కాలువల నిర్మాణం సైతం జరగని పరిస్థితి. పట్టణవాసులు దోమలతో నిత్యం సహవాసం చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

అంతంతమాత్రంగా రహదారులు

అరకులోయలోని ప్రధాన వీధుల్లో ఎప్పుడో 20 ఏళ్ల క్రితం నిర్మించిన సీసీ రోడ్లే కనిపిస్తున్నాయి. సీసీ రోడ్లు రాళ్లు తేలినా వాటి స్థానంలో కొత్త రోడ్లు నిర్మించలేదు. ఆయా రోడ్లలో పట్టణవాసులు అవస్థలకు గురవుతూ రాకపోకలు సాగిస్తున్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణింపు

జి.మాడుగుల, న్యూస్‌టుడే: యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజు పిలుపునిచ్చారు. సొలభం పంచాయతీ గొందిపాడులో మార్చి 13 నుంచి నిర్వహించనున్న మావుళ్లమ్మ జాతరను పురస్కరించుకొని ఏర్పాటుచేసిన వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. గ్రామ దేవత పండగను సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలన్నారు. సర్పంచి హనుమంతరావు, వైకాపా నాయకులు మత్స్యకొండంనాయుడు, కోటిబాబు, అనిల్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మై టీడీపీ యాప్‌లో అన్ని కార్యక్రమాలు

అరకులోయ, న్యూస్‌టుడే: తెదేపా నాయకులు, కార్యకర్తలు మై టీడీపీ యాప్‌ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ ప్రాంతీయ ఛైర్మన్ దొన్నుదొర కోరారు. అరకులోయలో మై టీడీపీ యాప్ ఫ్లెక్సీలను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జరిగే ప్రతి కార్యక్రమాన్ని ఈ యాప్‌లో వీక్షించే అవకాశం కలుగుతుందన్నారు. పార్టీ బలోపేతం ఇతర అంశాలన్నింటినీ క్రోడీకరించారన్నారు. తెదేపా నాయకులు దాసుబాబు, మహదేవ్, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

యాప్ ఫ్లెక్సీలు ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ ప్రాంతీయ ఛైర్మన్ దొన్నుదొర తదితరులు

అతివేగంతో అనర్థాలు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చర్యలు చేపట్టారు. ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు ఎస్సై నాని ఆధ్వర్యంలో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. బుధవారం పోలీసు స్టేషన్, నాలుగు రోడ్ల కూడలి వద్ద బ్యానర్లు అతికించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. వాహనచోదకులు అతివేగంతో వాహనాలు నడపటం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు.

ముంచంగిపుట్టులో రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై నాని

ఫ్లెక్సీల ఏర్పాటు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: రోడ్డు భద్రత నియమాలు పాటించి.. ప్రమాదాలకు దూరంగా ఉండాలని పోలీసు శాఖ ఆధ్వర్యాన జాతీయ రహదారికి ఆనుకుని చాపరాయి, జైపూర్ కూడలిలో ఫ్లెకీలు ఏర్పాటు చేశారు. ఎస్సై సురేష్ మాట్లాడుతూ.. పత్రాలు లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. 18 ఏళ్ల లోపు పిల్లలు వాహనాలు నడిపితే తల్లిదండ్రులే బాధ్యులవుతారని పేర్కొన్నారు.

వ్యక్తిగత శుభ్రతపై దృష్టి

కొయ్యూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి సుదూరంలోని మఠంభీమవరం గ్రామంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. అక్కడి వసతిగృహ విద్యార్థులు, స్థానికులకు యు.చీడిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి హేమంత్ చౌదరి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రతిఒక్కరూ దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వాసుపత్రి ద్వారా రోగులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న వైద్య సేవలను వివరించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరు, న్యూస్‌టుడే: గుమ్మిరేవుల పంచాయతీ బొరుకులగొందిలో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. కాకినాడకు చెందిన జాన్ క్రిస్టోఫర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 200 మందికి సేవలందించినట్లు మత బోధకుడు ఆర్.బాబూరావు తెలిపారు.

మఠం భీమవరంలో విద్యార్థులను పరీక్షిస్తున్న సిబ్బంది

హిందూ సమ్మేళనం విజయవంతం చేయండి

అరకులోయ/పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయలో ఈనెల 24న నిర్వహించనున్న హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కమిటీ ప్రతినిధులు కోరారు. హిందూ సమ్మేళన కరపత్రాలను స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ అనుబంధంగా ఉన్న హిందూ సమ్మేళన కమిటీ.. హిందూ సంస్కృతిని పరిరక్షించేందుకు కృషి చేస్తోందన్నారు. ఈనెల 24న వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సమ్మేళనం సందర్భంగా కోలాటం, భజన కార్యక్రమం, థింసా, గుమ్మలాట తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కమిటీ ప్రతినిధులు కొల్లా రమేష్, వెంకటేశ్వరరావు, అప్పలరామ్, చందు పాల్గొన్నారు.

అరకులోయలో కరపత్రాలు విడుదల చేస్తున్న కమిటీ ప్రతినిధులు

మైనింగ్‌తో జీడిమామిడితోటలకు నష్టం

కొయ్యూరు, న్యూస్‌టుడే: బకులూరులో మైనింగ్‌పై ఆర్డీవో ఎంవీఎస్ లోకేశ్వరరావు బుధవారం విచారణ చేశారు. బకులూరు సమీప కొండపై రంగురాళ్ల తవ్వకాలకు పి.సత్యనారాయణ ప్రభుత్వం నుంచి అనుమతులు తెచ్చుకున్నారు. లీజుదారుడు వాహనాలతో కొండపైకి వెళ్తుండగా.. ఇటీవల స్థానికులు అడ్డుకున్నారు. ఈ విషయమై ఆర్డీవో స్థానిక ప్రజలు, లీజుదారుడు సత్యనారాయణతో సమావేశం నిర్వహించారు. కొండపై జీడిమామిడి తోటలు ఉన్నాయని, అవి పాడైపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ అవసరాలు తీర్చాలని వారంతా కోరారు. మైనింగ్ చేయకుండా అన్నీ చేయాలంటే ఎలా చేస్తామని లీజుదారుడు ప్రశ్నించారు. అనుమతుల్లేకుండా ఎవరైనా తవ్వకాలకు పాల్పడితే చర్యలు తీసుకోవాలని సీఐ శ్రీనివాసరావును ఆదేశించారు. సర్పంచి శ్రీనివాస్, తహసీల్దార్ మురళీబాబు, ఎస్సై కిశోర్‌వర్మ, ఆర్ఐ రాజన్నదొర పాల్గొన్నారు.

విచారణ చేపడుతున్న ఆర్డీవో లోకేశ్వరరావు

మెనూ అమలు చేయాల్సిందే

చింతపల్లి గ్రామీణం: చింతపల్లిలోని బీసీ సంక్షేమ వసతిగృహంలో విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని మండల విద్యాశాఖ అధికారి పనసల ప్రసాద్ పేర్కొన్నారు. కుక్‌ల తీరుపై విద్యార్థినులు, ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి అధికారులకు ఫిర్యాదు చేశారు. నిల్వ ఆహారం పెడుతున్నారన్నారు. ఈ మేరకు కుక్‌లను ఎంఈవో విచారించారు. హెచ్ఎం వరలక్ష్మి, డిప్యూటీ వార్డెన్ శకుంతల పాల్గొన్నారు.

సిబ్బందిని విచారిస్తున్న ఎంఈవో ప్రసాద్

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి మధుసూదనరావు పేర్కొన్నారు. అంజలి శనివారం పంచాయతీ తామరాపల్లి గ్రామ గిరిజన రైతులతో బుధవారం సమావేశమై ఫార్మర్ రిజిస్ట్రేషన్ పరిశీలించారు. రైతులందరూ ఈనెల 28లోపు తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. చింతపల్లి మండలంలో 16127 మంది రైతులకు గాను 9 వేల మంది మాత్రమే నమోదు పూర్తి చేసుకున్నారని చెప్పారు. వీహెచ్ఏ రవి పాల్గొన్నారు.

తామరాపల్లిలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ పరిశీలిస్తున్న ఏవో

కలెక్టరేట్ వద్ద వీఆర్‌వోలు, వీఆర్ఏల ఆందోళన

పదోన్నతులు కల్పించండి

పాడేరు, న్యూస్‌టుడే: వీఆర్ఏలు, వీఆర్‌వోలకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో పాడేరులో బుధవారం వారంతా ఆందోళన చేపట్టారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా చేరుకున్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. గత కొంతకాలంగా అర్హులకు పదోన్నతులు కల్పించాలని ఉన్నతాధికారులకు విన్నవించినా కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం వేతనాలు పెంచకుండా నిర్లక్ష్యం చేసిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 19 నెలలైనా తమ సమస్యలు పరిష్కరించలేదని పేర్కొన్నారు. వీఆర్ఓల సంఘ జిల్లా అధ్యక్షులు కొండబాబు మాట్లాడుతూ.. వీఆర్ఏలకు టైంస్కేల్ ఇవ్వాలని, రాత్రిపూట డ్యూటీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వేతనాలు పెంచాలన్నారు. అనంతరం కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వీఆర్ఓల సంఘం నాయకులు శేఖర్, త్రినాథ్, కళ్యాణ్, అప్పారావు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

సీలేరు, న్యూస్‌టుడే: రైతులు పండించిన కాఫీకి జీసీసీ గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి, గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు బుజ్జిబాబు డిమాండ్ చేశారు. జెర్రిల పంచాయతీ రాళ్లగెడ్డ, కోండ్రుపల్లి, చింతలవాడ, కొండపల్లి, అస్పంపల్లి, గిల్లగొంది, రాశకోట, కొత్తూరు గ్రామాలకు చెందిన రైతులతో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీసీసీ గత ఏడాది ఆర్గానిక్ కాఫీ కేజీ రూ.330కు కొనుగోలు చేసిందని, ఈ ఏడాది ముందుగానే కేజీ రూ.270 ప్రకటించారన్నారు. దీన్ని ఆసరాగా తీసుకున్న దళారులు ధర తగ్గిందంటూ తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారన్నారు. సీపీఎం నాయకులు పరమేశ్వరరావు, రైతులు చిన్నయ్య, రామారావు, బోడయ్య పడాల్ తదితరులు పాల్గొన్నారు.

రైతులతో కలిసి మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ముక్కంటికి పుష్పయాగం

చోడవరం, న్యూస్‌టుడే: చోడవరంలో స్వయంభువు గౌరీశ్వర ఆలయంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న మహాశివరాత్రి కల్యాణ మహోత్సవాలు బుధవారం రాత్రితో ముగిశాయి. ముక్కంటి కల్యాణ మహోత్సవంలో భాగంగా పుష్పాంజలి సేవను అర్చకులు నిర్వహించారు. పూలతో అందంగా అలంకరణ చేశారు. గర్భగుడిలో పవళింపు సేవ నిర్వహించారు.

డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ

కొయ్యూరు, న్యూస్‌టుడే: మర్రిపాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పీఎం ఉషా పథకంలో భాగంగా డ్రోన్ టెక్నాలజీపై బుధవారం శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన కేదర్ హరి హేమ ఆక్సిజన్ డ్రోన్ టెక్నాలజీస్ సొల్యూషన్స్ సీఈవో వి.శివ కార్తికేయ మాట్లాడుతూ.. డ్రోన్ టెక్నాలజీలో విభిన్న అవకాశాలు వివరించారు. మిలటరీలో వినియోగించే డ్రోన్‌లు, వాటి ప్రాధాన్యతపై మాట్లాడారు. ఆధునిక రంగాల్లో మహిళలు డ్రోన్ టెక్నాలజీని వినియోగించాలన్నారు. ప్రిన్సిపల్ కె.సుధ, వైస్ ప్రిన్సిపల్ మహాలక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీఈవో శివ కార్తికేయ

బాల్య వివాహాలను ప్రోత్సహించొద్దు

కె.కోడాపల్లిలో అవగాహన కల్పిస్తున్న సీడ్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు

జి.మాడుగుల, న్యూస్‌టుడే: బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని సీడ్ ఆర్గనైజేషన్ సమన్వయకర్త నాగమణి పేర్కొన్నారు. కె.కోడాపల్లి, నిట్టమామిడి, బందవీధి, జన్నేరు, గాంధీనగర్‌లో బుధవారం అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిరోధానికి గ్రామపెద్దలు, మహిళా సంఘాలు, యువత కలిసికట్టుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజలకు కరపత్రాలు అందజేశారు. ఆర్గనైజేషన్ సీఎస్‌డబ్ల్యూవోలు ఈశ్వరి, రావణకుమారి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: బాల్య వివాహాలు అనారోగ్య సమస్యలకు దారితీస్తాయని సీడీపీవో ఎస్తేరురాణి అన్నారు. కించుమండ పంచాయతీ సుక్రపుట్టు గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కిశోర బాలికలతో ర్యాలీ చేపట్టారు. చిన్న వయసులో వివాహాలు చేయకుండా.. బాగా చదివించాలన్నారు. కిశోర బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సుక్రపుట్టులో మాట్లాడుతున్న సీడీపీవో ఎస్తేరురాణి

(c) eenadu

తాగునీరు ఇక గాజు సీసాల్లోనే..!

మంగళగిరి, తాడేపల్లి నగరపాలిక అధికారుల చొరవ

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరిలో ప్లాస్టిక్ నిషేధంపై ప్రచారం చేయడమే కాకుండా అక్షరాల నగరపాలక అధికారులు ఆచరిస్తున్నారు. కార్యాలయానికి వచ్చే అతిథులకు గాజు సీసాలో నింపిన శుద్ధి నీటిని సీసాతో అందిస్తున్నారు. దీనిపై తయారైన తేదీతో పాటు నీటి గడువు తేదీని ముద్రించారు. ఎప్పుడు ప్లాస్టిక్ బాటిళ్లలో వివిధ కంపెనీలకు చెందిన నీటిని ఇచ్చే అధికారులు మంగళగిరిలో ప్లాస్టిక్ నిషేధం అమల్లో భాగంగా గాజుసీసాలో నీటిని ఇస్తున్నారు. ఇదే విధానాన్ని ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయ ప్రాంగణాల్లో కూడా అమలు చేస్తే మరికొన్ని ఫలితాలు వస్తాయని నగరవాసులు చెబుతున్నారు.

ఏమరుపాటు.. కారాదు గ్రహపాటు

ప్రమాదం ఎప్పుడు ఎలా విరుచుకుపడుతుందో చెప్పలేం. ఒక్క క్షణం చాలు... జీవితం తల్లకిందులవడానికి. ఈ చిత్రంలో చూడండి. . ఎవరిష్టమొచ్చినట్టు వారు రైలు పట్టాలు దాటుతున్నారు. ఒక మ్మాయి అయితే సెల్‌ఫోన్ చూసుకుంటూ అడుగులేస్తోంది. గుంటూరు నగరంలో శంకర్‌విలాస్ పైవంతెన పనుల కారణంగా పట్టాలకు ఇరువైపులా ఉన్న గోడలను అక్కడక్కడా తొలగించారు. దీంతో అరండల్‌పేట నుంచి జీజీహెచ్, కోర్టు, హిందూ కళాశాల, వైద్య కళాశాల వైపు వెళ్లేవారు ప్రమాదకరంగా పట్టాలు దాటుతున్నారు. అనుకోకుండా రైళ్లు వాయు వేగంతో వస్తే పరిస్థితి ఏమిటన్నది ప్రశ్న. ఇక్కడ రాకపోకలను నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. **- ఈనాడు, అమరావతి**

అడ్డగోలు ప్రయాణం... ఆపదకు ఆహ్వానం

ఈనాడు – అమరావతి

కొంతమంది నిర్లక్ష్యం.. ఎంతోమంది ప్రాణాలకు పరీక్ష పెడుతోంది. కనీస అవగాహన లేకుండా.. నిబంధనలను, సూచిక బోర్డులను పట్టించుకోకుండా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారి వెంబడి అనేకచోట్ల ప్రమాదకర ప్రయాణాలు కనిపిస్తున్నాయి. సర్వీసు రోడ్లు ఉన్నా.. వాటిని కాదని ఎన్‌హెచ్‌పైకి వచ్చేస్తున్నారు. గుంటూరు నగరం, పెదకాకాని, మంగళగిరి, పొత్తూరు, చౌడవరం, యడ్లపాడు, చిలకలూరిపేట తదితర ప్రాంతాల్లో ఎన్‌హెచ్ నిష్క్రమణ, ప్రవేశ మార్గాల్లో వ్యతిరేక దిశల్లో వస్తూ వాహనాలను ఢీకొడుతున్నారు.

మంగళగిరి నుంచి మార్టూరు వరకు జాతీయ రహదారిపై 'ఈనాడు' పరిశీలనలో నిబంధనల ఉల్లంఘనలు కొట్టొచ్చినట్టు కనిపించాయి. ద్విచక్రవాహనదారులు, ఆటోవాలాలతో 'ఈనాడు' మాట్లాడగా వారు చెప్పిన విషయాలు..

"వేగ నిరోధకాలు ఉండవు. వేగంగా గమ్యాన్ని చేరుకోవచ్చు. సర్వీసు రోడ్లలో అయితే పలుచోట్ల వేగ నిరోధకాలు ఉన్నాయి. ఎదురుగా వాహనాలు వస్తుండడం వల్ల వేగంగా వెళ్లలేకపోతున్నాం."

"రెండు కిలోమీటర్ల దూరం వెళితే నేగానీ ఎన్‌హెచ్ పైకి వెళ్లలేం. అందుకే నిష్క్రమణ మార్గంలో వ్యతిరేక దిశలో ఎన్‌హెచ్ పైకి వెళ్తున్నాం."

■ జాతీయరహదారిపై ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనదారుల్లో శిరస్త్రాణం ధరిస్తున్నవారు కేవలం 20 శాతమే. ■ ఒకే వాహనంపై ముగ్గురు ప్రయాణించడమే కాదు... చరవాణి మాట్లాడుతూ వెళ్తున్న వారెందరో. ■ ఎన్‌హెచ్‌పై వంద కిలోమీటర్ల వేగంతో వాహనాలు వెళ్తుంటాయి. అయినా పట్టించుకోకుండా ఎక్కడబడితే అక్కడ అడ్డంగా దిగిపోవడంతో వీరిని భారీ వాహనాలు ఢీకొంటున్నాయి.

ఎన్‌హెచ్‌పై ప్రమాదాలకు కారణాలెన్నో

ఎక్కడెక్కడంటే...

★ ప్రత్తిపాడు వద్ద ఎన్‌హెచ్ నుంచి గుంటూరులోకి వెళ్లే ఎగ్జిట్ వద్ద వ్యతిరేక దిశలో వెళ్తున్నారు.

★ **తెనాలి రోడ్డులోకి** వెళ్లేందుకు ఎన్‌హెచ్ నుంచి నిష్క్రమణ మార్గంలో గుంటూరు నుంచి వచ్చేవారు అపసవ్య దిశలో ప్రవేశిస్తున్నారు.

★ **ఆటోనగర్ వద్ద** ఉన్న ఎగ్జిట్ మార్గంలోనూ ఇంతే.

★ **పెదకాకాని దాటాక** చెరువు వద్ద ఎన్‌హెచ్‌పైకి ప్రవేశం.. కొంత దూరంలోనే ఎగ్జిట్ మార్గాలున్నాయి. ఇక్కడ తరచూ వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి.

★ **కాజ టోల్‌గేట్ సమీపంలో** సర్వీసు రోడ్డు నుంచి ఎన్‌హెచ్‌పైకి వాహనాలు వెళ్లే ప్రాంతంలో ద్విచక్రవాహనదారులు యూటర్న్ తీసుకుని వ్యతిరేక దిశలో సర్వీసు రోడ్డులోకి ప్రవేశిస్తున్నారు.

★ **నంబూరు వద్ద** ఎన్‌హెచ్ నుంచి ఎగ్జిట్ అయ్యే మార్గం వద్ద ఏఎన్‌యూ, పరిసర గ్రామాల నుంచి వస్తున్న ద్విచక్రవాహనదారులు ప్రవేశిస్తున్నారు.

★ **ఎన్‌హెచ్ నుంచి పెదకాకాని వెళ్లే** వారికి ఉన్న ఎగ్జిట్ పాయింట్ వద్ద వ్యతిరేక దిశలో ప్రయాణిస్తున్నారు.

★ **తక్కెళ్లపాడు వద్ద** ఎన్‌హెచ్ నుంచి నిష్క్రమించి సర్వీసు రోడ్డులోకి వెళ్లే చోట... ప్రత్తిపాడు రోడ్డు.. పొత్తూరు ఎగ్జిట్, మురుగన్ హోటల్ ఎగ్జిట్ వద్ద కూడా ఇదే పరిస్థితి.

★ **కొండ్రుపాడు ఎగ్జిట్,** దాసరిపాలెం దాటాక, విశ్వనగర్ ప్రవేశ మార్గాల్లోనూ అపసవ్య ప్రయాణాలే.

★ ఎన్‌హెచ్‌పై ఆటోలు నడపకూడదన్న ఆదేశాలు అమలు కావడం లేదు.

పెదకాకాని ఎన్‌హెచ్ ప్రవేశమార్గం వద్ద బైక్‌పై ముగ్గురు ప్రయాణం. హెల్మెట్ లేదు.. ఆపై ఫోన్ మాట్లాడుతూ..

కాజా టోల్ గేట్ ఎంట్రన్స్ వద్ద..

ప్రత్యేక దృష్టి పెడతాం... – వకుల్ జిందల్, ఎస్పీ

సర్వీసు రోడ్లు ఉన్నా.. నిబంధనలకు విరుద్ధంగా జాతీయరహదారిపైకి వస్తున్న ఆటోవాలాలు, ద్విచక్రవాహనదారులపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. కొన్ని ఎంపిక చేసుకున్న ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉన్న సమయాల్లో సిబ్బందిని పెడతాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానా విధిస్తాం. ద్విచక్రవాహనాలు, ఆటోలు ఎన్‌హెచ్‌పైకి రాకుండా అడ్డుకుంటాం.

సేవలు నచ్చేలా.. పౌరులు మెచ్చేలా...

అందుబాటులో ఏపీసీఆర్డీఏ పరిష్కారం 2.0
సంతృప్తి స్థాయిపై ఆడిట్

ఈనాడు – అమరావతి

సీఆర్డీఏ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి యంత్రాంగం ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తోంది. ఏపీసీఆర్డీఏ పరిష్కారం 2.0 ద్వారా రైతులు కాలు కదపనవసరం లేకుండానే అర్జీ చేసుకునే వెసులుబాటు కల్పించారు. పరిష్కారం ఏ దశలో.. ఏ అధికారి వద్ద ఉందో తెలుసుకునేలా వెబ్‌సైట్ నిర్వహిస్తోంది. అర్జీ స్థితిపై కారణాలు తెలియజేస్తూ సమగ్ర వివరాలు తెలుసుకునే అవకాశం కల్పించింది.

గత సెప్టెంబరు నుంచి వచ్చిన అర్జీలు, పరిష్కరించిన విధానం ఇలా...

- మొత్తం అర్జీలు : 2,693
- పరిష్కారమైనవి : 2,313
- పెండింగ్ : 309
- రీఓపెన్ చేసినవి : 71

వివిధ మార్గాల్లో అర్జీల స్వీకరణ

- రాయపూడిలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో ప్రజల నుంచి ప్రతి శనివారం అర్జీలు, ప్రతిరోజూ వినతులు స్వీకరిస్తున్నారు.
- కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రామదర్శిని, గ్రామసభల్లో, ఆయా కార్యాలయాలు వస్తున్న వినతులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.
- రాజధాని గ్రామాల్లోని యూనిట్ కార్యాలయాలు, జిల్లా ప్రజా ఫిర్యాదుల విభాగాలకు అందుతున్న రాజధాని ప్రాంత అర్జీలను కూడా స్వీకరిస్తున్నారు.
- రాజధాని పనులు జరుగుతున్న ప్రాంతంలో ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేశారు.
- సీఆర్డీఏ పరిష్కారం 2.0 వెబ్‌సైట్‌లో వాట్సప్ ద్వారా అర్జీలు అప్‌లోడ్ చేయొచ్చు. ఇందుకు చరవాణి, ఆధార్‌కార్డు నంబర్ల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఏఐ సాయం తీసుకునే వెసులుబాటు కల్పించారు. తెలుగు లేదా ఆంగ్లం ఎంచుకోవచ్చు.

పరిష్కారం ఇలా..

- ఫిర్యాదు/అర్జీ నమోదు అనంతరం పరిష్కరించాల్సిన అధికారి, దరఖాస్తుదారుడికి సంక్షిప్త సందేశం వెళ్తుంది.
- సంబంధిత అధికారి సమస్యను పరిష్కరించి అర్జీదారుడికి ఎండార్స్‌మెంట్ ఇస్తారు. సంతృప్తి లేఖను తీసుకోవాలి.
- పరిష్కారం అనంతరం సీఆర్డీఏ కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఫోన్ చేసి అర్జీదారులు సంతృప్తిగా ఉన్నారా? లేదా? సమాచారం సేకరిస్తారు. అసంతృప్తి వ్యక్తం చేసినవారి వివరాలు ఆడిట్ అధికారుల బృందానికి వెళ్తాయి. ఆయా విభాగాల ఉన్నతాధికారులు అర్జీ పరిష్కరించిన విధానాన్ని పరిశీలించి సంతృప్తి చెందితే పిటిషన్‌ను మూసేస్తారు. లేదంటే రీఓపెన్ చేసి తొలిదశ నుంచి మళ్లీ పరిశీలిస్తారు.
- అధికారుల స్థాయిలో పరిష్కరించలేని అర్జీలను కమిషనర్, సీఆర్డీఏ అథారిటీ, అవసరమైతే ప్రభుత్వస్థాయిలోని ఉన్నతాధికారులకు పంపిస్తారు.
- వెబ్‌సైట్‌లోని వివరాల ఆధారంగా కమిషనర్ ప్రతి శనివారం అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు.

పెండింగ్‌లో ఉన్న 309 అర్జీల వివరాలు	
పురోగతిలో	163
అదనపు సమాచారం కోసం ఆగినవి	2
ఉన్నతాధికారులకు పంపినవి	144

రీఓపెన్ చేసిన 71 అర్జీల వివరాలు	
పురోగతిలో ఉన్నవి	31
ఉన్నతాధికారులకు పంపినవి	40
పరిష్కారమైనవాటిలో అసంతృప్తి వ్యక్తం చేసినవారు	277

రైతులకు ప్లాట్ల కేటాయింపు

ప్రొవిజనల్ సర్టిఫికెట్ అందిస్తున్న అధికారులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి ల్యాండ్ పూలింగ్ విధానంలో భూములు ఇచ్చిన రైతులకు బుధవారం రాయపూడి సమీపంలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో ఈ-లాటరీ ద్వారా రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించారు. ఈ-లాటరీ విధానంలో అర్హులైన 77 మంది రైతులకు మొత్తం 151 ప్లాట్లు కేటాయించి ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందించారు. అందులో 80 నివాసం, 71 వాణిజ్య ప్లాట్లు ఉన్నాయి.

★ మెట్ట భూములకు సంబంధించిన 35 మంది రైతులకు 53 ప్లాట్లు కేటాయించారు. ఇందులో 31 నివాసం, 22 వాణిజ్య ప్లాట్లు ఉన్నాయి. జరీబు భూములకు సంబంధించి 42 మంది రైతులకు 98 ప్లాట్లు కేటాయించగా.. అందులో 49 నివాసం మరో 49 వాణిజ్య ప్లాట్లు ఉన్నాయి.

★ ప్లాట్లు పొందిన వారిలో ఉండవల్లి, పెనుమాక, లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెం, రాయపూడి, వెంకటపాలెం, మందడం గ్రామాల రైతులున్నారు. ప్లాట్లను వెంటనే రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని సీఆర్డీఏ డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ వసంతరాయుడు సూచించారు. ఆయా స్థలాలు ఉన్న ప్రాంతాలను సర్వేయర్ల సహాయంతో తెలుసుకోవచ్చన్నారు.

రాజధానిలో వన్‌స్టాప్ కేంద్రం

మార్చి 8న ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

జిల్లాపరిషత్తు, న్యూస్‌టుడే: మహిళలపై లైంగిక దాడుల నివారణ, బాల్య వివాహాల నియంత్రణ, ఆపదలో ఉన్న మహిళలు, బాలికల సంరక్షణ లక్ష్యంగా రాజధాని ప్రాంతం తుళ్లూరులో వన్‌స్టాప్ కేంద్రం (ఓఎస్‌సీ)ను రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంజూరు చేసింది. ఇప్పటికే జిల్లా మహిళా ప్రగతి ప్రాంగణంలో వన్‌స్టాప్ కేంద్రం పని చేస్తోంది. రాజధాని ప్రాంతం సీఆర్డీఏ దృష్టిలో ఉంచుకుని అదనంగా మరో కేంద్రాన్ని మంజూరు చేస్తూ రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సంచాలకుడు ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఈ నెల 17న ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దీనిని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. ఆ మేరకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, ఆ శాఖ జిల్లా అధికారులకు జారీ చేసిన ఉత్తర్వుల్లో సూచించారు.

★ కేంద్ర ప్రభుత్వం మిషన్ శక్తి పథకంలో మహిళా సాధికారత, భద్రత అంశాలకు ప్రాధాన్యం ఇస్తోంది. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ కార్యక్రమాలు చేయనున్నారు. తుళ్లూరులో ప్రస్తుతానికి అద్దె భవనంలో వన్‌స్టాప్ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. కనీసం ఐదు గదులు ఉండేలా భవనాన్ని ఎంపిక చేయాలని సూచించారు. ఈ కేంద్రంలో ఉద్యోగులు ఒప్పంద విధానంలో పనిచేసేలా 13 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్, పారా లీగల్ పర్సనల్/న్యాయవాది, పారా మెడికల్ పర్సనల్, సైకో-సోషల్ కౌన్సెలర్, కార్యాలయ సహాయకుడు పోస్టులు ఒకటి చొప్పున.. కేస్ వర్కర్ పోస్టులు-2, మల్టీపర్పస్ స్టాఫ్, సెక్యూరిటీ గార్డు/నైట్ గార్డ్ పోస్టులు 3 చొప్పున మంజూరయ్యాయి. వీటికి దరఖాస్తులు ఆహ్వానించి అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు.

పల్నాడు జిల్లాలోనూ మరో కేంద్రం

పల్నాడు జిల్లాలో వన్‌స్టాప్ కేంద్రం ఉండగా.. అదనంగా మరో కేంద్రాన్ని మంజూరు చేశారు. దీనిని మాచర్లలో ఏర్పాటు చేయనున్నారు. వెనుకబడిన ప్రాంతం కావడం, అక్షరాస్యత శాతం తక్కువగా ఉండడం, బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతుండడంతో కేటాయించారు. ఒక్కో కేంద్రానికి రూ.58 లక్షలు ప్రభుత్వం విడుదల చేయనుంది.

జనన, మరణాల నమోదు 21 రోజుల్లోగా ఉచితం

ఆపై అనుమతులు, అపరాధ రుసుం తప్పనిసరి

★ జనన, మరణాల నమోదు 21 రోజుల్లోగా ఉచితంగా చేయించుకోవచ్చని జీఎంసీ కమిషనర్ మయూర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. జనన, మరణ రిజిస్ట్రేషన్లకు సంబంధించి ప్రభుత్వం జీవో నంబరు 28 ద్వారా కొత్త మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. ★ 21 నుంచి 30 రోజుల్లోగా రిజిస్ట్రేషన్ చేయిస్తే చెల్లించాల్సిన అపరాధ రుసుం రూ.25. ★ ఏడాదిలోపు అయితే జిల్లా జనన, మరణ రిజిస్ట్రార్ అనుమతి తప్పనిసరి. చెల్లించాల్సిన అపరాధ రుసుం రూ.250. ★ ఏడాది తరువాత రిజిస్ట్రేషన్ చేయించాలంటే జిల్లా మెజిస్ట్రేట్/ఆర్డీవో నుంచి రాతపూర్వక అనుమతి తీసుకోవాలి. రూ.500 అపరాధ రుసుం చెల్లించాలి. ★ బిడ్డ పుట్టిన రోజు నుంచి ఏడాదిలోపు పేరు ఉచితంగా నమోదు చేయించుకోవచ్చు. ఏడాది తరువాతైతే రూ.250 అపరాధ రుసుం చెల్లించాలి.

- న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ

ఇబ్బందిగా సిబ్బంది లేమి

మందకొడిగా రెండో విడత భూసమీకరణ

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – అమరావతి

రాజధాని అమరావతి మహానగర విస్తరణకు రెండో విడత చేపట్టిన భూసమీకరణ ప్రక్రియకు సిబ్బంది కొరత అడ్డంకిగా మారింది. ఇప్పటికే ఏడు గ్రామాల పరిధిలో 8 సీఆర్డీఏ కాంపిటెంట్ అథారిటీ యూనిట్ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. కర్లపూడి, యండ్రాయి, పెదమద్దూరు, వడ్డమాను గ్రామాల్లో భూసమీకరణ ప్రకటన ఇచ్చిన అధికారులు.. రైతుల నుంచి భూములు సమీకరిస్తున్నారు. వైకుంఠపురం, పెదపరిమి, హరిశ్చంద్రపురం గ్రామాల్లో ప్రకటన ఇవ్వాల్సి ఉంది.

తాజా స్థితి ఇలా..

★ ఒక్కో కాంపిటెంట్ అథారిటీ యూనిట్ కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్ సహా తహసీల్దారు, ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్లు, ఇద్దరు వీఆర్వోలు, ఇద్దరు గ్రామ సర్వేయర్లు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, ఒక ఫెసిలిటేటర్, ఇద్దరు కార్యాలయ సహాయకులు మొత్తం 12 మంది ఉండాలి. ఒక్క చోటా పూర్తిస్థాయిలో లేరు.

★ జనవరి 7న వడ్డమానులో భూసమీకరణ ప్రారంభించి.. ఇప్పటికి 934 ఎకరాలే సమీకరించగలిగారు. కారణం సిబ్బంది లేమి.

★ వైకుంఠపురం, కర్లపూడి, పెదమద్దూరు, యండ్రాయి యూనిట్లకు ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లను కేటాయించారు.

★ పెదమద్దూరులో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్‌తో కార్యాలయాన్ని నడిపిస్తున్నారు.

★ వైకుంఠపురంలో భూసమీకరణ ప్రారంభం కాకపోవడంతో ఇక్కడి విశ్రాంత డిప్యూటీ కలెక్టర్‌ను కర్లపూడి రెవెన్యూ పరిధి లెమల్లెలో ఉపయోగించుకుంటున్నారు.

★ హరిశ్చంద్రపురం, వడ్డమాను, పెదపరిమిలోనూ ఇదే పరిస్థితి.

యండ్రాయి యూనిట్ సీఆర్డీఏ కాంపిటెంట్ అథారిటీ కార్యాలయం

- రెండో దశలో భూసమీకరణ: 20,494 ఎకరాలు
- ఇందులో పట్టా భూమి: 16,562.56 ఎకరాలు
- అసైన్డ్: 104.1 ఎకరాలు

★ 8 మంది డిప్యూటీ కలెక్టర్లకుగాను ముగ్గురు, 8 మంది తహసీల్దార్లకుగాను ముగ్గురు, 16 మంది డిప్యూటీ తహసీల్దార్లకుగాను ఇద్దరే ఉన్నారు. యూనిట్‌కు ఒక్క వీఆర్వోనే ఇచ్చారు.

ఈ నెల 13 వరకు భూసమీకరణ ఇలా...

గ్రామం	రైతులు	ఎకరాల్లో
యండ్రాయి	325	372.5753
కర్లపూడి	195	307.9257
పెదమద్దూరు	155	211.42
వడ్డమాను	42	42.903
మొత్తం	717	934.824

ఊపందుకోని ప్రక్రియ

■ భూసమీకరణపై రైతులకు అవగాహన కలిగించి, వారి సందేహాలు నివృత్తి చేయడానికి డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, రెవెన్యూ యంత్రాంగం చొరవ చూపాలి. వీరు పూర్తిస్థాయిలో లేక ఉన్న అధికారులపై ఒత్తిడి పెరుగుతోంది.

■ రైతులిచ్చిన పత్రాల తనిఖీ తప్పనిసరి. తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు చేయాల్సిన పని డిప్యూటీ కలెక్టర్లు చేయాల్సి వస్తోంది. ఫలితంగా జాప్యం అనివార్యమవుతోంది.

■ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సమయం కేటాయించలేని పరిస్థితి.

■ సీఆర్డీఏ యూనిట్లకు వస్తామని పలువురు రెవెన్యూ అధికారులు సీసీఎల్ఏ కార్యాలయానికి దరఖాస్తు చేసినా.. ఇక్కడి నుంచి ఉత్తర్వులు రాలేదు.

విక్రయాల జోరు.. ధరలు బేజారు..

మిర్చియార్డు, న్యూస్‌టుడే



మిర్చియార్డుకు వచ్చిన సరకు

మిర్చి క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మరోసారి లక్షకు పైగా బస్తాలు మిర్చియార్డుకు రాగా.. అదే స్థాయిలో విక్రయాలు జరిగాయి. ఈ ఏడాది సీజన్ ప్రారంభమయ్యాక లక్షకు పైగా బస్తాలు రావడం, విక్రయాలు జరగడం ఇది మూడోసారి. ఈనెల 10, 11 తేదీల్లోనూ లక్షకు పైగానే టిక్కీలు రైతులు యార్డుకు తరలించారు. మహాశివరాత్రి తిరునాళ్లలో రైతులు నిమగ్నమై ఉండడంతో ఈనెల 12, 13 తేదీల్లో అంత కంటే తక్కువగా యార్డుకు సరకు వచ్చింది. శని, ఆదివారాలు సెలవులు. సోమ, మంగళవారాల్లోనూ ఆ స్థాయిలో బస్తాలు రాలేదు. మహాశివరాత్రి హడావుడి తగ్గడంతో బుధవారం లక్షకు పైగా బస్తాలు వచ్చాయి. ధరలు కొంత మేరకు తగ్గుతుండడం రైతులను కలవరపాటుకు గురి చేస్తోంది. అన్ని రకాల ధరలు తగ్గాయి. కొన్ని రకాల ధరలు రూ.1,000, మరికొన్ని రకాలు రూ.1,500 పైగానే పతనమయ్యాయి. యార్డుకు వచ్చే సరకు పెరుగుతుండగా.. విక్రయాలు సైతం దాదాపు అంతే స్థాయిలో జరుగుతుండడంతో నిల్వలు కూడా 20 వేల బస్తాలకు పైగానే ఉంటున్నాయి. వ్యాపారులు ధరల్లో కోత పెట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతన్నలు విజ్ఞప్తి చేస్తున్నారు.

యార్డులో సరకు క్రయవిక్రయాలిలా...

తేదీ	బస్తాలు	విక్రయాలు	నిల్వలు
10	1,02,248	98,826	21,721
11	1,09,852	1,05,937	25,636
18	1,06,635	1,02,831	24,592

మెప్మా రుణాల బాగోతంపై కేసు

నిందితుల్లో పొన్నూరు వైకాపా మహిళా అధ్యక్షురాలు

పొన్నూరు, న్యూస్‌టుడే: పొన్నూరు పట్టణంలోని 8వ వార్డులో శ్రీవీరాంజనేయ బినామీ పొదుపు సంఘం పేరుతో రుణాల సొమ్ము స్వాహా చేశారంటూ కేసు నమోదు చేసినట్టు సీఐ వీరనాయక్ బుధవారం రాత్రి వెల్లడించారు. ఆ సంఘ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పొన్నూరు పట్టణ వైకాపా మహిళా అధ్యక్షురాలు మూకిరి అనీలకుమారి, పూర్వపు సీఎంఎం మానుకొండ మేరీజ్యోత్స్న, సీవో విప్పడపు ఉషారాణి, 27వ వార్డు ఆర్పీ రిజ్వానా, 8వ వార్డు ఆర్పీగా పని చేసిన నిమ్మకాయల నాగసంధ్య, దళారిగా వ్యవహరించిన వెంకట సుబ్బయ్యలను నిందితులుగా చేర్చామని వివరించారు.

8వ వార్డు క్యాబిన్‌పేటకు చెందిన పదిమంది సభ్యులకు సంబంధం లేకుండా నిమ్మకాయల నాగసంధ్య తదితరులు కలిసి శ్రీవీరాంజనేయ బినామీ గ్రూపుతోపాటు ఇతర సంఘాలను ఏర్పాటు చేసి ఓ బ్యాంకు నుంచి రూ.46 లక్షల రుణం తీసుకున్నారు. బకాయి చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు ఇటీవల సభ్యులకు ఫోన్ చేశారు. బ్యాంకులో ఖాతాలే లేనప్పుడు రుణాలు ఎలా ఇచ్చారని వారు అధికారులను ప్రశ్నించారు. కొంతమంది సభ్యులు పొన్నూరు అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో రుణాల బాగోతంలో భాగస్వాములైన వైకాపా మహిళా నాయకురాళ్లు, అప్పటి మెప్మా అధికారులు, ఆర్పీలపై విచారణ చేశారు. అనంతరం కేసు నమోదు చేశారు.

మెప్మా ద్వారా నిరుపేద మహిళలకు చెందాల్సిన బ్యాంకు రుణాలను వైకాపా మహిళా నాయకురాళ్లు, అప్పటి మెప్మా అధికారులు, ఆర్పీలు కొల్లగొట్టిన ఉదంతాన్ని 'ఈనాడు' వెలుగులోకి తీసుకొచ్చింది. స్పందించిన కలెక్టర్ విచారణకు రెండు రోజుల క్రితం ప్రత్యేక కమిటీని నియమించిన సంగతి తెలిసిందే.

శనగ రైతుకు మద్దతు

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు

ఈనాడు – అమరావతి

రబీలో సాగైన శనగ పంటను మద్దతు ధరకు కొనుగోలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్లో తక్కువగా ఉండడంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలవైపు చూస్తున్నారు. ప్రభుత్వం వీటిని తెరిస్తే బహిరంగమార్కెట్ ధరల్లో పెరుగుదల వచ్చే అవకాశం ఉంది. పంట నూర్పిళ్లు మరో పది రోజుల్లో ప్రారంభమవుతాయి. కొనుగోలు కేంద్రాలను ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలి? ఎన్ని కేంద్రాలు తెరవాలో మార్క్‌ఫెడ్, వ్యవసాయ శాఖ, కొనుగోలు ఏజెన్సీ సంయుక్తంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నాయి.

వందశాతంపైగా పెరిగిన సాగు

జిల్లాలో రబీలో శనగ సాధారణ సాగు విస్తీర్ణం 7 వేల హెక్టార్లు. గతేడాది కూడా సాధారణ విస్తీర్ణంలోనే సాగైంది. ఈ ఏడాది అనూహ్యంగా 15,783 హెక్టార్లలో రైతులు పంట వేశారు. నల్లబర్లీ పొగాకు సాగుపై ప్రభుత్వ నిషేధం ఉండడంతో ప్రత్యామ్నాయంగా రైతులు ఇటువైపు మళ్లారు. ఈసారి వాతావరణం అనుకూలంగా ఉండడం, చీడపీడలు లేకపోవడంతో సగటున 10 క్వింటాళ్లకుపైగా దిగుబడులొస్తాయని అంచనా.

శనగ మద్దతు ధర
క్వింటాలుకు: రూ.5,875
బహిరంగ మార్కెట్లో: రూ.4,800 – రూ.5000

రెండేళ్లుగా గోదాముల్లో నిల్వలు

2023, 2024 రబీ సీజన్లలో మద్దతు ధరతో పోలిస్తే బహిరంగ మార్కెట్లో ధరలు సమానంగా, కొన్నిసార్లు కొంత మెరుగ్గా ఉండడంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పెద్దగా కొనుగోలు చేయలేదు. 2022 రబీలో పండిన శనగలను 2023లో ప్రభుత్వం పెద్దఎత్తున కొనుగోలు చేసింది. ధరలు పెరుగుతాయన్న ఉద్దేశంతో కొంతమంది శీతల గోదాముల్లో నిల్వ చేశారు. కొన్నాళ్లుగా ధరలు పెరగకపోవడంతో విక్రయించలేదు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్ ధరలు తక్కువగా ఉండడంతో ప్రభుత్వం కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. గతేడాది క్వింటాకు మద్దతు ధర రూ.5,650 ఉండగా... ఈసారి రూ.225 పెరిగింది.

3న దుర్గమ్మ ఆలయం మూసివేత

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా మార్చి 3న దుర్గగుడిని మూసి వేస్తున్నట్లు వైదిక కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3న ఉదయం 10 గంటలకు కవాట బంధనం (మూసివేయడం) చేసి తిరిగి 4న వేకువజామున 3 గంటలకు కవాట ఉద్ఘాటన (తలుపులు తెరవడం) చేస్తారని తెలిపారు.

రంజాన్ వేళలు



ఇఫ్తార్: (గురువారం) సాయంత్రం: 6.17
సహరి: (శుక్రవారం) ఉదయం: 5.14

బెయిల్‌పై వచ్చి.. చోరీకి పాల్పడి

- ఎమ్మెల్యే ధూళిపాళ్ల తల్లి నివాసంలో చోరీ కేసు ఛేదించిన పోలీసులు
- వైకాపా సర్పంచి ఇంట్లో కొంత సొత్తు

ఈనాడు ఏలూరు, పొన్నూరు, న్యూస్‌టుడే: పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర తల్లి ఇంట్లో చోరీ చేసిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. రెండు రోజుల కిందట చింతలపూడిలోని ధూళిపాళ్ల ప్రమీలాదేవి ఇంట్లో రూ.70 లక్షలకు పైగా విలువైన బంగారం, వెండి ఆభరణాలు చోరీ అయిన విషయం తెలిసిందే. ఆ కేసులో ఏలూరు జిల్లా పెదపాడుకు చెందిన రాజేష్‌ను ప్రధాన నిందితుడిగా పోలీసులు గుర్తించారు. అతనిపై పెదపాడు పోలీసుస్టేషన్‌లో పలు కేసులున్నాయి. ఓ కేసులో నాలుగు రోజులు కిందటే జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చి ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. రాజేష్ కొందరితో కలిసి ఒంగోలులో వాలీబాల్ ఆడేందుకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఈ చోరీకి పాల్పడినట్లు సమాచారం. పొన్నూరు గ్రామీణ సీఐ కృష్ణయ్య మంగళవారం ఏలూరు పోలీసుల సహకారంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. 10 కేజీల వెండిని స్వాధీనం చేసుకోగా, కొంత బంగారాన్ని విక్రయించినట్లు సమాచారం. మిగతా ఆభరణాలను ఏలూరులోని ఓ వైకాపా సర్పంచి ఇంట్లో పెట్టినట్లు సమాచారం. సదరు వైకాపా సర్పంచిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

పట్టుదలతో చదివితే మీరే విజేతలు

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్

కలెక్టరేట్, న్యూస్‌టుడే: వసతిగృహాల్లో చదువుకుంటున్న ఇంటర్మీడియట్ విద్యార్థులతో కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా బుధవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ నెల 23 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. జిల్లాలో 87 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, 68,898 మంది హాజరవుతున్నారని తెలిపారు. అందరిలోనూ సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు టాపర్స్‌గా నిలవాలని పిలుపునిచ్చారు. ఎటువంటి భయాందోళనలకు గురికావద్దని, ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. బాగా తెలిసిన జవాబులను ముందుగా రాయడం వల్ల విశ్వాసం పెరుగుతుందన్నారు. ఈ పరీక్షలు ఉన్నత స్థాయి విద్య, ఉద్యోగ అవకాశాలకు పునాది వంటివని గ్రహించాలని చెప్పారు. వసతి గృహాల్లో చదువుకున్న అనేకమంది విద్యార్థులు ప్రస్తుతం ఉన్నత పదవుల్లో ఉన్నారని, మీరు ఎవరికీ తీసిపోరన్నారు. ప్రతి విద్యార్థి కృషి, పట్టుదలతో చదివితే విజేతలుగా నిలుస్తారన్నారు. వీసీలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య, గిరిజన సంక్షేమ శాఖ అధికారి పి.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ సందర్భంగా ముస్లిం ఉద్యోగులకు ప్రత్యేక అనుమతి

జడ్పీ సీఈవో జ్యోతిబసును కలిసిన ముస్లిం ఉద్యోగులు

జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: రంజాన్ సందర్భంగా ముస్లిం ఉద్యోగులు ఉపవాస దీక్షలు చేసేందుకు వీలుగా ఒక గంట ముందుగా కార్యాలయం నుంచి వెళ్లేందుకు అనుమతి ఇస్తూ జిల్లా పరిషత్తు సీఈవో వి.జ్యోతిబసు ఉత్తర్వులు జారీ చేశారు. జీవోకు అనుగుణంగా ముస్లిం ఉద్యోగులు బుధవారం సీఈవోను కలిసి అనుమతి కోరుతూ లేఖలు అందజేశారు.

(c) eenadu

విద్యుత్తు చౌర్యం.. రూ.5.46 లక్షల జరిమానా

సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా నరసరావుపేటలో విద్యుత్తు అక్రమ వినియోగంపై కేసులు నమోదు చేసి రూ.5.46 లక్షల అపరాధ రుసుం విధించామని విద్యుత్తు శాఖ విజిలెన్స్ అధికారులు తెలిపారు. విద్యుత్తు భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా ఆపరేషన్ విభాగ పర్యవేక్షక ఇంజినీరు విజయకుమార్ ఆధ్వర్యంలో 53 మంది అధికారులు, 159 మంది సిబ్బంది 53 బృందాలుగా విడిపోయి 3,263 సర్వీసులు తనిఖీ చేశారు. అనుమతించిన కేటగిరీ బదులుగా ఇతర కేటగిరీలో విద్యుత్తు వాడుతున్న బదులుగా, అనుమతించిన లోడు కంటే అదనంగా వాడుతున్న 86 మందిపై కేసులు నమోదు చేశారు. భారత విద్యుత్తు చట్టం సెక్షన్ 135 ప్రకారం పని చేయని మీటరు నుంచి విద్యుత్తు వాడుతున్నారు. మీటర్ మార్పిడి చౌర్యం కింద పరిగణిస్తామని అధికారులు చెప్పారు. విద్యుత్తు అక్రమ వినియోగంపై 94408 12262, 86397 41050 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వొచ్చని, లేదా వాట్సప్ ద్వారా తెలియజేయవచ్చని సూచించారు. తనిఖీల్లో ప్రసాదరావు, శ్రీనివాసరావు, మల్లికార్జున ప్రసాద్, రవికుమార్, రఫీ, కోటేశ్వరరావు, శివశంకర్, సతీష్‌కుమార్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మునిరాజా వేధింపులపై లోతైన దర్యాప్తు

నిందితుడి మొబైల్‌ను సీజ్ చేసి, ఎఫ్ఎస్ఎల్‌కు పంపిన పోలీసులు

ఈనాడు - అమరావతి: ఒంటరి మహిళ, ఆమె కుమార్తెను అసెంబ్లీ కార్యాలయం ఏఎస్‌వో మునిరాజా లైంగికంగా వేధించిన కేసులో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిపై మహిళ ఇటీవల రెండోసారి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేశారు. అతని వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? అన్న కోణంలో విచారిస్తున్నారు. ఫిర్యాదులో నిందితుడి సహోద్యోగులు రవిపాల్, హరిబాబు, జుబేదా పేర్లను ప్రస్తావించింది. తన ఇంటిని అక్రమంగా విక్రయించేందుకు వీరు నిందితుడికి సాయం చేసినట్లు ఆమె పేర్కొంది. దీంతో వీరి పాత్ర ఎంత వరకు ఉందన్న దానిపై అన్ని కోణాలను పరిశీలిస్తున్నారు. ఫిర్యాదు, ఆమె కుమార్తెకు సంబంధించిన రాజా రహస్యంగా వీడియోలు, ఫొటోలు తీశారా? అన్న కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు. అరెస్టు సమయంలో నిందితుడి మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీనిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు విశ్లేషణ నిమిత్తం పంపించారు. ఎఫ్ఎస్ఎల్ నుంచి వచ్చే నివేదిక ఆధారంగా పోలీసులు ముందుకు సాగనున్నారు. మహిళకు నిందితుడి, అతని సహోద్యోగుల నుంచి ఏమైనా కాల్స్ వాచ్చాయా? అన్న అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. వీరి సీడీఆర్‌లను తెప్పించి పరిశీలించనున్నారు. ఈ కేసులో పోలీసులు సాక్షుల స్టేట్‌మెంట్లను కోర్టులో రికార్డు చేయించనున్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank
భారత ప్రభుత్వ రంగ సంస్థ A Government of India Undertaking

ప్రాంతీయ కార్యాలయం : గుంటూరు
రికవరీ సెక్షన్, జె.కె.సి. కాలేజ్ రోడ్డు, 5వ లైను, విజయపురి, గుంటూరు-6. ఫోన్: 9492758257, 8019308696

స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతికంగా స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది 12.03.2026 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు & హామీదారులకు తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది: 12-03-2026, మ॥ 02:00 గం.ల నుండి సా॥ 04:00 గం.ల వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములుకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 12.03.2026, మ॥ 12.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

కెనరా బ్యాంక్, గుంటూరు ఎసి కాలేజ్ బ్రాంచ్ (13279), ఫోన్: 94409 05165

1\. ఋణగ్రహీత(లు): శ్రీ కూనం శ్రీనివాస రెడ్డి, తండ్రి: కె. ధనుంజయ రెడ్డి మరియు హామీదారు: శ్రీ కూనం ధనుంజయ రెడ్డి, తండ్రి: సుబ్బారెడ్డి. బకాయి మొత్తం: తేది 31.01.2026 నాటికి రూ.24,22,083.02/- + తదుపరి వడ్డీ, వ్యయాలు & ఇతర ఛార్జీలు.
బ్యాంకుకు తెలిసిన సమాచారం ప్రకారం ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్‌లు లేని స్థిరాస్తి వివరములు:
గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్ జిల్లా, పెదపలకలూరు గ్రామం, ప్రస్తుతం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, డి.నెం.లు. 384,384/2,384/4,385 మరియు 386 లో పెదపలకలూరు గ్రామంలో మొత్తం విస్తీర్ణం ఎ. 3.81 సెంట్లులలో 2874.57 చ॥గ॥లలో "హిల్ వ్యూ టవర్స్" అపార్ట్‌మెంట్ నందు "నాగార్జున బ్లాక్". హద్దులు: తూర్పు: అమరావతి బ్లాక్ అపార్ట్‌మెంట్, దక్షిణం: రోబో ధరణి టౌన్‌షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్, పడమర: చేబ్రోలు గాంధీ చౌదరికి చెందిన ఆస్తి, ఉత్తరం: 30 అ॥ల వెడల్పు రోడ్డు. ఈ హద్దులలో 2874.57 చ॥గ॥ లేదా 2403.51 చ॥మీ॥ల స్థలం మరియు ఉమ్మడి హక్కులు కలదు.
షెడ్యూలు-బి: మొత్తం విస్తీర్ణం 2874.57 చ॥గ॥ లేదా 2403.51 చ॥మీ॥ స్థలంలో అవిభాజ్యపు మరియు అనిర్దేశ్యపు 1/60వ వాటా స్థలం 47.90 చ॥గ॥ లేదా 40.05 చ॥మీ॥ల విస్తీర్ణంతో "హిల్ వ్యూ టవర్స్" అపార్ట్‌మెంట్‌లోని "నాగార్జున బ్లాక్" లో మొదటి అంతస్తులో 1100 చ॥అ॥ (సాధారణ ప్రాంతాలతో సహా) + 150 చ॥అ॥ కార్ పార్కింగ్ ఏరియాతో 2 బెడ్‌రూమ్ ఫ్లాట్ నెం. 105. హద్దులు: తూర్పు: ఉమ్మడి వరండా, దక్షిణం: ఈ ఫ్లాట్ మరియు ఫ్లాట్ నెం.106 మధ్య శూన్యాకాశం, పడమర: ఉమ్మడి వరండా, ఉత్తరం: బహిరంగ ప్రాంతం. ఈ హద్దుల్లో "నాగార్జున బ్లాక్" "హిల్ వ్యూ టవర్స్" లోని మొదటి అంతస్తు నందు ఫ్లాట్ నెం. 105.

రిజర్వు ధర: రూ. 17,25,000/- | ధరావత్తు సొమ్ము: రూ. 1,72,500/-

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.bank.in లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్ సంబంధిత బ్రాంచ్ మేనేజర్ గారిని లేదా కెనరా బ్యాంక్, గుంటూరు ప్రాంతీయ కార్యాలయం, అధీకృత అధికారి గారిని బ్యాంకు పనివేళలలో సంప్రదించగలరు.
ఇ-వేలం విధానం, నియమ నిబంధనల కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ (baanknet), వెబ్‌పోర్టల్ http://baanknet.com హెల్ప్‌డెస్క్: 8291220220, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది: 16-02-2026, ప్రదేశం: గుంటూరు — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

తూడు తొలగదు..నీరు అందదు..

గుంటూరు వాహిని పరిధిలో ఇదీ పరిస్థితి

కాట్రపాడు - గారపాడు మధ్య అల్లుకున్న గుర్రపు డెక్క

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు, పొన్నూరు, మంగళగిరి నియోజకవర్గాలలో విస్తరించిన గుంటూరు వాహినిలో గుర్రపు డెక్క, తూడు పేరుకుపోయాయి. 47 కిలోమీటర్ల పొడవున విస్తరించిన వాహిని సుమారు 27 వేల ఎకరాలకు సాగునీరు, అనేక గ్రామాలకు తాగునీటికి ఇదే ప్రధాన వనరు. వాహిని పొడవునా ఉన్న వంతెనల వద్ద గుర్రపుడెక్క, ఆకులు అల్లుకుపోయాయి. ఇదే పరిస్థితి కొనసాగితే సాగునీరు పూర్తిస్థాయిలో అందని పరిస్థితి నెలకొంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి పారుదలశాఖ అధికారులు త్వరితగతిన స్పందించి ప్రక్షాళన చేయించాలని వారు కోరుతున్నారు.

కీలక దశలో పంటలు.. గుంటూరు వాహిని ఆయకట్టులో రబీ పంటలుగా మిర్చి, మొక్కజొన్న వంటి పైర్లు సాగవుతున్నాయి. ఇవి వచ్చే ఏప్రిల్ మొదటి వారానికి కాపు దశకు వస్తాయి. అప్పటి వరకు సాగునీటిని అందించడం అత్యంత కీలకం. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లోని మంచి నీటి చెరువులను పూర్తి స్థాయిలో నింపాల్సి ఉంది. మరోవైపు వారం రోజులుగా వాహినికి నీటి ప్రవాహం తగ్గడంతో వస్తోందని, దాన్ని తక్షణం పెంచాలని రైతులు కోరుతున్నారు.

కమనీయం.. మల్లేశ్వరస్వామి తెప్పోత్సవం

పెదకాకాని చెరువులో హంస వాహనంపై.. ప్రత్యేక అలంకరణలో భ్రమరాంబ అమ్మవారు

పెదకాకాని, న్యూస్‌టుడే: పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని బుధవారం రాత్రి హంస వాహనంపై శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి తెప్పోత్సవం నిర్వహించినట్లు ఆలయ ఛైర్మన్ కొమెరి పూర్ణచంద్రరావు, ఈవో గోగినేని లీలాకుమార్ తెలిపారు. ఈ వేడుకను చూసేందుకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ప్రత్యేక పూజలు జరిపారు. తెల్లవారుజామున సుప్రభాత సేవ, మహాశాంతులు, వసంతోత్సవం, త్రిశూల స్నానం వంటి పూజలు నిర్వహించారు. ఉదయం భ్రమరాంబ అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. రాత్రి 10 గంటలకు శైవాగమన క్రతువులను ఆలయ స్థానాచార్యులు సాంబశివరావు, ప్రధాన అర్చకులు లక్ష్మీనారాయణ వరప్రసాద్ నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పాలక మండలి సభ్యులు, పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు బందోబస్తు నిర్వహించారు.

'డీప్ టెక్' స్టార్టప్‌లకు ప్రోత్సాహం అవసరం

విద్యార్థులతో ప్రొ.సౌమిత్రదత్తా, ఎన్ఐఎం, ఇన్నోవేషన్ హబ్ ప్రతినిధులు

మంగళగిరి, న్యూస్‌టుడే: విద్యా సంస్థలు, పరిశోధన సంస్థల డీప్ టెక్ స్టార్టప్‌లను ప్రోత్సహించడం అవసరమని గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్ లీడర్, ప్రముఖ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ సౌమిత్ర దత్తా అన్నారు. మంగళగిరిలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో 'కృత్రిమ మేధ వ్యూహాత్మక ఆవిష్కరణల వ్యవస్థాపకత భారతదేశ తదుపరి వృద్ధి సరిహద్దు' అనే అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ సహకారంతో ఆ సంస్థ ఇన్నోవేషన్ డైరెక్టర్ డాక్టర్ తిరుమలయ్ నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఐను ఎలా ఉపయోగించాలనే అంశంపై స్టార్టప్‌లు, విద్యార్థులు, ఆవిష్కరణకర్తలతో ఆయన ముచ్చటించారు. వారి ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఏఐను సాధనంగా కాకుండా ప్రాథమిక వ్యూహాత్మక అంశంగా చూడాలన్నారు. విద్యార్థులు తమ పరిశోధనలకు ఆధునికత జోడించడంతో పాటు వాణిజ్యపరంగా కూడా విజయవంతమయ్యేలా చూసుకోవాలని పిలుపునిచ్చారు. విజయవాడ రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈవో కృష్ణన్, ఏపీఐఎస్ నుంచి కిషోర్, ప్రోగ్రాం అసోసియేట్ ప్రతినిధి విష్ణుప్రియ, సౌమ్య, శ్రీవిద్య పాల్గొన్నారు.

ఆయిల్ ట్యాంకర్లకు అనుమతి తప్పనిసరి

మాట్లాడుతున్న జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలోని పెట్రోల్ బంకుల యజమానులు.. ఆయిల్ ట్యాంకర్లకు కచ్చితంగా నిబంధనల మేరకు అనుమతులు పొందాలని జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో ఐవోసీ, హెచ్‌పీసీ, బీపీసీ, తదితర సేల్స్ అధికారులు, పెట్రోల్ బంకుల అసోసియేషన్ నాయకులతో బుధవారం సమావేశమయ్యారు. జేసీ మాట్లాడుతూ ఆయిల్ ట్యాంకర్ల అనుమతులకు ఫారం-ఎఫ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. బంకుల్లో వినియోగదారులకు కనీస సదుపాయాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సమావేశంలో డీఎస్‌వో కోమలి పద్మ, సేల్స్ అధికారులు, పెట్రోల్ బంకుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రావి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు గడువులోపు పూర్తి చేయాలి

మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: ఒప్పందం ప్రకారం ప్రభుత్వ లేఔట్లలోని పేదల ఇళ్ల నిర్మాణ పనులు చేయని వారిని ఉపేక్షించేది లేదని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని మురుగునీటి శుద్ధి ప్లాంటు, కంపోస్టుయార్డు, బుర్రిపాలెం లేఔట్, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా బిల్లులు చెల్లించాలని గుత్తేదారు నాగిరెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. మీరు చేయాల్సిన పనులు సకాలంలో చేసి ఉంటే సకాలంలో చెల్లింపులు చేసే వారని బదులిచ్చారు. చేయని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పునరుద్ధరించిన పులె కాలనీ టిడ్కో గృహ నిర్మాణ పనులు ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు పూర్తిచేయాలని ఆదేశించారు. చినరావూరులోని టిడ్కో గృహాల పెండింగ్ పనులు వెంటనే పూర్తిచేయాలన్నారు. కంపోస్టుయార్డులో బయోమైనింగ్, కొబ్బరి బొండాలతో పీచు, వ్యర్థాలతో ఎరువు తయారీ గురించి వాకబు చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం విద్యార్థుల ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్, ప్రజారోగ్యశాఖ ఎస్ఈ, హౌసింగ్ పీడీ, తహసీల్దార్, కమిషనర్, హౌసింగ్ ఈఈ, ఏఈ, ఎంఈ, ఆర్వో, మేనేజర్, ప్రజారోగ్యశాఖ డీఈ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆగదు

సహకార సంఘాల ఉద్యోగుల నిరసన

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లోని ఉద్యోగుల సమ్మె కొనసాగుతోంది. ఈ నెల 16 నుంచి సమ్మెలోకి వెళ్లిన ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. గుంటూరు బ్రాడీపేటలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కార్యాలయం వద్ద బుధవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సహకార సంఘాల ఉద్యోగుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మొవ్వా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై దృష్టి సారించాలని కోరారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని, అవసరమైతే ఆమరణ దీక్ష చేపడతామని పేర్కొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

తాడికొండ: మహిళలు సమాజంలో ఆర్థికంగా ఎదిగి సమాన హక్కులు పొందాలని 'నయా చేతన్ 4.0' ప్రోగ్రాం డైరెక్టర్ ఇషా పేర్కొన్నారు. తాడికొండ మండల పరిషత్ కార్యాలయంలోని వెలుగు భవనంలో ఏపీఎం సాంబశివరావు ఆధ్వర్యంలో బుధవారం ఈ ప్రోగ్రాంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం స్థానిక మహిళలతో ముఖాముఖి మాట్లాడారు. ఇందులో భాగంగా ప్రోగ్రాం డైరెక్టర్ ఇషా తాడికొండ, పొన్నెకల్లు గ్రామాల్లోని మహిళలతో సమావేశమయ్యారు. నయా చేతన్ పనితీరు దాని ఉపయోగాలపై స్వయం సహాయ సంఘాలకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం మహిళలకు బ్యాంకుల ద్వారా అందిస్తున్న రుణాలను తెలియజేశారు. సెర్ప్ డైరెక్టర్ సుధాకర్, డీఆర్‌డీఏ కార్యాలయం ప్రతినిధి జీవన్, ఏపీఎం సాంబశివరావు, సీడీపీవోలు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

గుంటూరు పశ్చిమ, ప్రత్తిపాడు తహసీల్దార్ల మార్పు

కలెక్టరేట్(గుంటూరు): పరిపాలన సౌలభ్యం కోసం జిల్లాలోని తహసీల్దార్లను ఇతర మండలాలకు మారుస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్తిపాడు తహసీల్దార్ సుజాతను గుంటూరు కలెక్టరేట్‌లో నియమించారు. గుంటూరు పశ్చిమ తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావును డిప్యుటేషన్‌పై ప్రత్తిపాడు మండలానికి నియమించారు. గుంటూరు పశ్చిమ మండల బాధ్యతలను గుంటూరు తూర్పు తహసీల్దార్ సుభానీకి ఇన్‌ఛార్జిగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

BIRTHDAY GREETINGS

పుట్టిన రోజు శుభాకాంక్షలు

మా ఇంటి బంగారం చిరంజీవి
పెట్టిముడుసు
డినేష్ కార్తీక్ కు
పుట్టిన రోజు శుభాకాంక్షలు.
ఇటువంటి వేడుకలు
మరెన్నో జరుపుకోవాలని
మనసారా కోరుకుంటూ..
మేనమామ: అత్త
జి.కాటమ రాజు-సుభాషిణి
మరదళ్ళు: బిందుశ్రీ, శరణ్య
అమ్మమ్మ-తాత:
రాములమ్మ-వెంకట నారాయణ
(గుంటూరు)
సెల్ నెం: 9963339230

EENADU Classifieds

TO LET

పాతపట్టాభిపురం 1వ లైనులో ఉన్న కుందన అపార్ట్‌మెంట్స్ 2BHK అపార్ట్‌మెంట్ No: 402 అద్దెకు ఇవ్వబడును. AC, లిఫ్ట్, జనరేటర్, సం॥ 9248494407.

JOBS

Wanted Hostel Wardens (Male / Female) & Floor Incharge in SIMS Group of Institutions Hostels, Contact No. 9701666645 & 6304777593.

We are Hiring - USA Counselor (OR) Tele caller only. Ladies, any Graduation. Contact: 77807 81382. Lakshmipuram, Guntur.

నిడమర్రు, మంగళగిరిటౌన్ ఓపెన్ ప్లాట్స్ సేల్స్ చేయుటకు సీనియర్ మార్కెటింగ్ మేనేజర్స్ కావలెను. మంత్లీ మెయింటెన్స్ & కమీషన్. ✆ 99899 99057.

ప్రముఖ కలెక్షన్ ఏజెన్సీలో పని చేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ మరియు టెలికాలర్స్ అనుభవంగల వారు కావలెను. జీతము: 15k to 20k. కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. DRA సర్టిఫికెట్ ఉన్నారికి ప్రాధాన్యత కలదు. జీతము: 20k, సంప్రదించగలరు. ఫోన్ నెంబర్స్: 89190 80894, 83091 32382.

హరేకృష్ణ హోం కేర్‌లో వృద్ధులను/పేషంట్స్ను / పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం జీ:18-20K ✆ 96404 68899, 96402 58899

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజీలో ఉద్యోగ ఖాళీలు: Senior బ్యాచ్ ఇన్‌ఛార్జీలు Gender: పురుషులు మాత్రమే. విద్యార్హత: ఇంటర్ నుండి డిగ్రీ వరకు. వయస్సు: 25 సంవత్సరాల నుండి 45 సంవత్సరాల మధ్య ఉండవలెను. నెలకు జీతము: 16,000/- వరకు ఇవ్వబడును. సంప్ర॥ ఫోన్: 9248722246.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు క్లాసు ఇన్‌ఛార్జీస్ మరియు క్యాంపస్ ఇన్‌ఛార్జీస్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము: 14,000/- నుండి 21,000/- వరకు ఇవ్వబడును. అర్హతలు: ఇంటర్ నుండి పి.జి. వరకు. వయస్సు: 22 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి. సంప్ర॥ ఫోన్ నెం. 8978480435.

గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పని చేయుటకు విశ్రాంత ఉద్యోగులు, హౌస్‌వైఫ్ 10th పాస్, 50 సం॥పై వయస్సు వారు కావలెను. 7036761665.

బిజినెస్ మేనేజర్స్ / బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రీ ఫ్రెషర్స్, మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్న 30 సం॥ల లోపు వారు రెజ్యూములను kamathamjob@gmail.comకు పంపగలరు.

గుంటూరు సిటీ RTC బస్టాండ్ దగ్గరలో ప్రముఖ బిర్యాని హోటల్ నందు పనిచేయుటకు సప్లయర్ కావలెను. లోకల్ వారికి ప్రాధాన్యత. ✆ 96668 41537.

ప్రముఖ దంత వైద్యశాల నందు పని చేయుటకు అసిస్టెంట్ మరియు రిసెప్షనిస్ట్ స్టాఫ్ కావలెను. సంప్ర॥ 78420 31133.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు Senior Civil Engineersగా పని చేయుటకు పురుషులు కావలెను. జీతం: 50000/- నుండి 60000/- వరకు ఇవ్వబడును. విద్యార్హతలు: Civil Engineering, వయస్సు: 30 సంవత్సరముల పైన ఉండవలెను. వివరాల కొరకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 89784 80429.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్, హాస్టల్ ఇన్‌ఛార్జీస్‌గా పనిచేయుటకు స్త్రీలు కావలెను. జీతం: 10000/- నుండి 13000/- వరకు ఇవ్వబడును (ఉచిత భోజన వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సం॥ల పైన ఉండవలెను. వివరాలకు సంప్రదించగలరు. ఫోన్ నెం: 92487 33340.

పాలషాప్ నందు పనిచేయుటకు సేల్స్ Boys కావలెను. ఫుల్ టైం జీతం: 12000/-, అడ్రస్: Opp. మెట్రో, కాకాని రోడ్, గుంటూరు. సెల్ 98857 94435.

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

BUSINESS OFFER

Running 30 Bedded Hospital Lease@ MiryalagudaTown, Nalgonda. For Obstetrics, Urology, Pediatrics, Ortho Physician. 9848231654

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

Commercial plot 1373 sq.yds Inner Ring road, Guntur, with 1.25 lakhs Rent and bank loan for immediate sale. Call: 9573454266.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

అన్ని ప్రాంతాలకు సమ ప్రాధాన్యం

మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీనివాస్

గుంటూరు నగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని రంగాలకు, ప్రాంతాలకు ప్రాధాన్యం ఇచ్చారని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్ అన్నారు. బ్రాడీపేటలోని భాజపా కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బడ్జెట్‌తో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు, రైతులకు ఉచిత విద్యుత్తుకు, పాఠశాల విద్య, వైద్య ఆరోగ్య శాఖకు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రూ.వేల కోట్లు కేటాయించారన్నారు. ఎన్డీఏ పాలనలో రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు బడ్జెట్‌లో న్యాయం చేశారన్నారు. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం రాష్ట్రానికి అన్ని విధాలుగా సహకరిస్తుందన్నారు. 2019-24 మధ్య కాలంలో రాష్ట్రంలో దోపిడీ పాలన సాగిందని దుయ్యబట్టారు. జగన్ ముఖమంత్రిగా ఉన్న సమయంలో రోడ్లు, కాలువలను గాలికొదిలేశారని, రైతుల ప్రయోజనాలు విస్మరించారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మేలు చేస్తుంటే.. వైకాపా నేతలు అసత్య ఆరోపణలు చేస్తూ.. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. జగన్ హయాంలో దోపిడీదారులకు పంచిపెట్టారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి పనుల గురించి భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పిలుపు మేరకు.. పార్టీ నాయకులు... అన్ని ప్రాంతాల్లో తిరిగి ప్రజలకు వివరిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బ్రహ్మయ్య, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కుమార్‌గౌడ్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి పావని, రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, నాయకులు రవికుమార్, సుబ్బారావు, రామకృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి యార్డు సమాచారం (నిన్నటి ధరలు)

వచ్చిన బస్తాలు:	1,06,635
అమ్మకాలు:	1,02,831
నిల్వలు:	24,592

నాన్ ఏసీ కామన్ వెరైటీ (క్వింటా రూ..ల్లో)

334	13,500-20,000
నంబర్ 5	13,500-22,000
273	14,000-23,000
341	14,000-23,000

నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	13,000-17,500
బాడిగ	14,000-24,000
దేవనూరు డీలక్స్	15,500-24,500
ఆర్మూర్	13,000-16,500

ఏసీ కామన్ వెరైటీ

334	13,500-19,500
నంబర్ 5	13,000-20,500
341	14,000-22,500
సూపర్ 10	13,500-22,500

ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	13,000-17,000
బాడిగ	14,000-23,000
తాలు	7,500-11,500

- న్యూస్‌టుడే, మిర్చియార్డు

సముద్ర మొక్కల పెంపకం లాభదాయకం

చినగంజాం, చీరాల అర్బన్: సముద్ర మొక్కల పెంపకం లాభదాయకమని సీఎస్ఐఆర్, సీఎస్ఎంసీఆర్ఐ శాస్త్రవేత్త లక్కాకుల సతీష్ పేర్కొన్నారు. ఆ మొక్కలు పెంపకం ఉన్న చినగంజాం మండలం పెదగంజాం పంచాయతీ పరిధిలోని ఏటిమెగ సముద్ర తీరాన్ని శాస్త్రవేత్త బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ... సముద్ర మొక్కలు వ్యవసాయానికి అవసరమైన రసాయనాల తయారీకి, కోళ్ల రంగానికి, మందుల తయారీకి, మాంసాన్ని నిల్వ చేయడానికి బాగా ఉపయోగపడతాయన్నారు. సీఎస్ఎంసీఆర్ఐ సాంకేతిక సలహాలు, సూచనలు, సెర్ప్ నుంచి జీసీఎఫ్, మత్స్యశాఖ నుంచి పీఎంపీఎంఎస్‌వై పథకాల ద్వారా 90 శాతం ఆర్థిక సాయాన్ని మొక్కల పెంపకందారులకు అందిస్తాయన్నారు. చినగంజాం మండలంలోని ఏటిమొగ, చీరాల మండలంలోని వాడరేవుల్లో 400 మందికి అవగాహన కల్పించి సముద్ర మొక్కల పెంపకంపై ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. బాపట్ల డీఆర్‌డీఏ పీడీ బి. సింగయ్య, డీపీఎం రవీంద్రబాబు, ఏడీ కృష్ణకిశోర్, చినగంజాం, చీరాల ఏపీఎంలు జి.పెదసుబ్బారావు, మధు, బాలస్వామి, మనీషా, సీసీ శ్రీలక్ష్మి, మాధవి, వెంకటస్వామి, వీవోఏలు పాల్గొన్నారు. చినగంజాం పర్యటన అనంతరం చీరాలలో నిర్వహించిన సమావేశంలో శాస్త్రవేత్త లక్కాకుల సతీష్ పాల్గొని మాట్లాడారు.

గ్రంథాలయ సంస్థ బడ్జెట్ రూ.53.98 కోట్లు

మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ వందనాదేవి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ 2026-27 సంవత్సరానికి సంబంధించి రూ.53.98 కోట్ల బడ్జెట్‌కు సర్వసభ్య సమావేశంలో ఆమోదం లభించింది. సంస్థ ఛైర్‌పర్సన్ భీమినేని వందనాదేవి అధ్యక్షతన అరండల్‌పేటలోని గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వందనాదేవి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, దాతల సహకారంతో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. మంచి భవనాలు ఏర్పాటు చేయడంతో పాటు పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. ప్రస్తుతమున్న సాంకేతిక సేవలను మరింత విస్తరించేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థతో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు గ్రంథాలయాల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా సంస్థ పరిధిలోని వాణిజ్య సముదాయాలను అద్దెలకు టెండర్ల ప్రాతిపదికన ఇచ్చేందుకు ఆమోదం తెలిపినట్లు వివరించారు. సమావేశంలో సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ, డీఈవో షేక్ సలీంబాషా, వయోజన విద్యా శాఖ ఉప సంచాలకుడు కె.ఆంజనేయులు, సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకుడు లోచర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 120, రిటైల్ ధర - 147, చికెన్ విత్‌స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్ - 243.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213 చికెన్ స్కిన్‌లెస్ - 243.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 132, 142 చికెన్ విత్ స్కిన్ - 230 చికెన్ స్కిన్‌లెస్ - 240.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

మార్టూరు, న్యూస్‌టుడే: పలు చోరీ కేసుల్లో నిందితుడ్ని బుధవారం మార్టూరు పోలీసులు అరెస్ట్ చేశారు. మార్టూరు పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో బాపట్ల ఇన్‌ఛార్జి డీఎస్పీ జగదీష్ నాయక్ వివరాలు వెల్లడించారు. యద్దనపూడి మండలం చింతపల్లిపాడు గ్రామానికి చెందిన పాలపర్తి నాగరాజు 8వ తరగతి వరకు చదువుకుని లారీ డ్రైవర్, క్లీనర్‌గా పనిచేస్తూ వ్యసనాలకు బానిసయ్యాడని తెలిపారు. 2008 నుంచి బైక్‌లు, సెల్‌ఫోన్లు చోరీకి పాల్పడటాన్ని వృత్తిగా మార్చుకున్నాడన్నారు. గతంలోనూ బాపట్ల, యద్దనపూడి, మార్టూరు, అద్దంకి, సంతమాగులూరు, పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట, చిలకలూరిపేట గ్రామీణ, గుంటూరు జిల్లాలోని తుళ్లూరు, మంగళగిరి, విజయవాడ నగరం కృష్ణలంక పోలీస్‌స్టేషన్లలో నాగరాజుపై చోరీల కేసులు నమోదయ్యాయన్నారు. 2025లో బైక్, సెల్‌ఫోను దొంగతనం కేసుల్లో యద్దనపూడి పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారని తెలిపారు. అదే ఏడాది డిసెంబర్‌లో జైలు నుంచి వచ్చిన నాగరాజు దొంగతనాలు చేస్తూ మార్టూరు మండలంలోని సూర్యడాబా వద్ద, తాడేపల్లి పట్టణం ఉండవల్లి, విజయవాడలోని ఆటోనగర్ ప్రాంతాల్లో మూడు బైక్‌లు, కొమ్మాలపాడు, నరసరావుపేట ప్రాంతాల్లో మూడు సెల్‌ఫోన్లు చోరీకి పాల్పడటంతో కేసులు నమోదయ్యాయన్నారు. మార్టూరు ఎస్సై సైదాకు వచ్చిన సమాచారం మేరకు నాగరాజును మార్టూరు మండలం రాజుపాలెం గ్రామ శివారులో యలవర్తి కోల్డ్ స్టోరేజీ వద్ద సాయంత్రం అరెస్ట్ చేసి, మూడు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ జగదీష్‌నాయక్ వివరించారు.

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

(c) eenadu

తెనాలి

• తెనాలి • పొన్నూరు



కాంతులీనుతున్న మసీదులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: నెలవంక దర్శనం ఇవ్వడంతో పవిత్ర రంజాన్ నెల బుధవారం సాయంత్రం నుంచి ప్రారంభమైంది. ఖురాన్ పఠనంతో కూడిన ప్రత్యేక తరావీ నమాజులు మొదలయ్యాయి. ఈ మేరకు తెనాలి నియోజకవర్గంలోని 60కు పైగా మసీదుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పలు మసీదులను విద్యుత్తు దీపాలతో అలంకరించారు. గురువారం తొలి ఉపవాస రోజు కానుంది.

పురస్కారానికి ఎంపికపై హర్షం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: గ్లోబల్ ఇండి ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా, దాశరథి థియేటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 20న హైదరాబాద్‌లో సినీ రంగంలో ప్రతిభ చూపుతున్న వారికి పురస్కారాలను అందించనున్నారు. ఈ పురస్కారాలకు తెనాలికి చెందిన ఈదర వెంకటపూర్ణచంద్, కనపర్తి రత్నాకర్ ఎంపికయ్యారు. తమ ఎంపికపై వారు బుధవారం సంతోషం వ్యక్తం చేశారు.

తెనాలి మార్కెట్ యార్డులో..

నిమ్మకాయల ధరలు రూ.. (క్వింటా)

అత్యధికం:	8,600
అత్యల్పం:	7,000
సగటు:	8,000

– న్యూస్‌టుడే, తెనాలి టౌన్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

స్పందన: ❖ పట్టణ పరిధి 7వ వార్డులోని మురుగు నీటి కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను కార్మికులు తొలగించారు.
❖ 23వ వార్డులో పాడైపోయిన వీధి దీపాన్ని బాగు చేశారు.
? పొన్నూరు పట్టణ పరిధిలోని 2వ వార్డులో వంతెన అడుగు భాగం పగుళ్లిచ్చింది. మరమ్మతులు చేసే విధంగా చూడాలి. **- పి.కాశీనాథ్, 2వ వార్డు**
✔ వంతెనకు మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. **- షేక్ హసీనా, సహాయ ఇంజినీరు**
? పొన్నూరు పట్టణ పరిధిలోని నిడుబ్రోలు పార్కు రోడ్డులో చెత్త పేరుకుంది. **- కె.రాఘవరావు, నిడుబ్రోలు**
✔ చెత్తను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. **- పోతురాజు, ప్రజారోగ్యశాఖాధికారి** – న్యూస్‌టుడే, పొన్నూరు

సేవల మెరుగుతో పెరిగిన ప్రయాణికులు

తెనాలి ఆర్టీసీ సేవలపై 98 శాతం మంది సంతృప్తి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే

మహా శివరాత్రికి ఆర్టీసీ మెరుగైన సేవలు అందించిందని డిపో మేనేజర్ రాజశేఖర్ న్యూస్‌టుడేతో తెలిపారు. 15 రోజుల ముందు నుంచి తగిన ప్రణాళిక, ప్రయాణికుల రద్దీ పెరుగుతుందనే అంచనాలతో బస్సులను ఆ మేరకు సిద్ధం చేయడం, మహిళలకు ఉచిత ప్రయాణ అవకాశాన్ని కల్పించే స్త్రీ శక్తి పథకం వినియోగించుకోవచ్చని ప్రచారం వంటి కార్యక్రమాలతో అనుకున్న మేరకు సేవలు అందించామని ఆయన చెప్పారు.

అధికారులు.. సిబ్బంది సమన్వయంతో..

గతేడాది (2025) మహా శివరాత్రి సందర్భంగా తెనాలి నుంచి వడ్లమూడి క్వారీ క్షేత్రానికి 23,096 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించగా.. ఈ ఏడాది 26,450 మంది ప్రయాణించారు. అంటే 3,354 మంది ప్రయాణికులు పెరిగారు. అదే విధంగా గోవాడకు గతేడాది 14,673 మంది రాకపోకలు సాగిస్తే.. ఈ ఏడాది 17,203 మంది ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకున్నారు. 2,530 మంది ప్రయాణికులు పెరిగారు. మొత్తం మీద గతేడాది కంటే ఈసారి 5,884 మంది ప్రయాణికులు అధికంగా శైవ క్షేత్రాలను సందర్శించారు. ఈ మేరకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో భక్తుల రద్దీకి అనుగుణంగా సేవలు అందించామన్నారు.

లోపాలను గుర్తించేందుకు సర్వే...

తమ సేవల తీరుపై ఎప్పటికప్పుడు ప్రయాణికుల అభిప్రాయాలు తెలుసుకోవడానికి, లోపాలను గుర్తించి సరి చేసుకోవడానికి ఆర్టీసీ ఫీడ్‌బ్యాక్ సర్వే నిర్వహిస్తుంది. ఈ మేరకు ప్రతి డిపోలోనూ ప్రత్యేకించిన క్యూ ఆర్ కోడ్‌ను ప్రయాణికులకు అందుబాటులో ఉంచారు. కోడ్ స్కాన్ చేసిన ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల సేవలు, నిర్వహణ, పర్యవేక్షణ, శుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు వంటి అంశాలపై తమ అభిప్రాయాలను నమోదు చేస్తారు. ఈ విధానం ద్వారా గత మూడు నెలల వ్యవధిలో తెనాలి డిపో పరిధిలో మొత్తం 11,986 మంది ప్రయాణికులు తమ అభిప్రాయాలు తెలిపారు. అందులో 98 శాతానికి మించి ప్రయాణికుల సంతృప్తి శాతం నమోదైంది. అందరి కృషి వల్లే ఇది సాధ్యమైందని, ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి తమ వంతు ప్రయత్నం కొనసాగిస్తామని డిపో మేనేజర్ రాజశేఖర్ వివరించారు.

వివరాలు తెలుపుతున్న డిపో మేనేజర్ రాజశేఖర్

ప్రవేశాలు పారదర్శకంగా నిర్వహిస్తాం

ఎన్‌యూ, న్యూస్‌టుడే: వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్, సమర్థ్ ఈ గవర్నెన్స్ ద్వారా పారదర్శకంగా ప్రవేశాలు నిర్వహిస్తామని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి చెప్పారు. 'వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్, సమర్థ్ ఈ గవర్నెన్స్'పై ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బుధవారం ఒకరోజు కార్యశాల నిర్వహించారు. దీనికి రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఓఎన్‌ఓఎస్‌లో భాగంగా ఇన్‌ఫ్లిబ్‌నెట్ సేవలను విశ్వవిద్యాలయాలు, కళాశాలలు ఉపయోగించుకోవాలని సూచించారు. జాతీయ స్థాయిలో ఉన్నత విద్యలో సంస్కరణల్లో భాగంగా ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. విద్యాపరమైన అంశాలు, ఉద్యోగులు, విద్యార్థుల వివరాలు, మూల్యాంకనం, ఖాతాలు, ఆర్థిక సంబంధమైన అంశాలను ఈ సేవల ద్వారా పొందవచ్చని చెప్పారు. వైస్ ఛైర్మన్ ఆచార్య రత్నశీలామణి మాట్లాడుతూ.. సమర్థ్ ద్వారా నాణ్యత ప్రమాణాలు, డిజిటల్ పారదర్శకత సాధ్యమవుతుందని తెలిపారు. కార్యదర్శి ఆచార్య తిరుపతిరావు మాట్లాడుతూ.. ఓఎన్‌ఓఎస్ ద్వారా నాణ్యమైన పరిశోధనలు, బోధనా పద్ధతులు మెరుగవుతాయని చెప్పారు. ఏఎన్‌యూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ మాట్లాడుతూ.. అన్ని విద్యాసంస్థలు డిజిటలైజేషన్‌లో భాగంగా సమర్థ్‌ను తీసుకొచ్చారని పేర్కొన్నారు. అనంతరం ఓఎన్‌ఓఎస్ అమలుపై ఉన్నత విద్యామండలి, ఇన్‌ఫ్లిబ్‌నెట్, రాష్ట్ర విశ్వవిద్యాలయాల మధ్య అవగాహన ఒప్పందం చేసుకున్నారు. సమర్థ్ అధికారులు సాహిల్ దత్, ఏయూ ఆచార్యులు భాస్కర్, ఇన్‌ఫ్లిబ్‌నెట్ అధికారులు అభిషేక్ కుమార్, ఆచార్య దేవిక, అకడమిక్ అధికారి రాజేందర్, డాక్టర్ అనిల్‌కుమార్, ఆచార్య రోశయ్య, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగించి కార్యశాలను ప్రారంభిస్తున్న ఆచార్య మధుమూర్తి తదితరులు

తెలుగులో తీర్పు వెలువరించిన న్యాయమూర్తి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: మాతృభాష దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా తెనాలి రెండవ అదనపు పౌర న్యాయమూర్తి (కనిష్ఠ విభాగం) పల్లగాని రాజశేఖర్ బుధవారం తెలుగులో తీర్పు వెలువరించినట్లు ఆయన కార్యాలయ సిబ్బంది తెలిపారు. కొల్లిపర పోలీస్ స్టేషన్లో నమోదైన క్రిమినల్ కేసుకు సంబంధించి తీర్పును తెలుగులో వెలువరించారు. మాతృభాషలో తీర్పు ఉంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించిన వారికి తాము ఎందుకు ఓడిపోయాం, గెలిచామో తెలుస్తుందని దేశ సర్వోన్నత న్యాయస్థానం సూచనలతో, మాతృ భాష వారోత్సవాల నేపథ్యంలో తెలుగులో తీర్పు ఇచ్చినట్లు న్యాయమూర్తి రాజశేఖర్ చెప్పారు.

న్యాయమూర్తి పి.రాజశేఖర్

ప్రశాంతంగా ప్రారంభమైన పీజీ పరీక్షలు

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలోని పీజీ కళాశాలల్లో బుధవారం మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఆర్ట్స్, సైన్స్ కళాశాలల్లోని పరీక్ష కేంద్రాలను పీజీ పరీక్షల విభాగం సమన్వయకర్త ఆచార్య సుబ్బారావు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. మొత్తం 19 కేంద్రాల్లో పరీక్షలు సజావుగా ప్రారంభమయ్యాయని చెప్పారు. పరీక్ష రాసే విద్యార్థులకు ఏమాత్రం అసౌకర్యం కలిగినా తమకు సమాచారం ఇవ్వాలని పరిశీలకులను ఆదేశించారు. చూచిరాతకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థిని తనిఖీ చేస్తున్న ఆచార్య సుబ్బారావు

ప్రకృతి వ్యవసాయంలో ఏపీ ఆదర్శం

కొల్లిపర, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయంలో ఏపీ ఆదర్శంగా నిలుస్తోందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి రాజకుమారి అన్నారు. బుధవారం కొల్లిపర మండల పరిధిలోని అన్నవరాన్ని ఫ్రెంచ్ శాస్త్రవేత్తలు బ్రూనోడోరిన్, క్లేర్‌లేపాటులతో కలిసి పర్యటించారు. ప్రకృతి సాగులో అనుసరిస్తున్న పద్ధతులను వారికి వివరించారు. సేంద్రియ ఎరువుల వినియోగం, చీడపీడల నివారణలో అనుసరిస్తున్న విధానాల గురించి తెలిపారు. పర్యటనలో రైతుసాధికార సంస్థ ప్రతినిధి యశస్వి, క్షేత్ర స్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెంచ్ శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న రాజకుమారి

విద్యార్థులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఏయూలో మత విద్వేషాలు రెచ్చగొట్టి విద్యార్థులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ బుధవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శివ నాగరాజు మాట్లాడుతూ.. విద్యార్థుల భద్రతపై కమిటీతో విచారణ చేయించాలని కోరారు. అనుమతులు లేకుండా క్యాంపస్‌లోకి ప్రవేశించే సంస్థలపై నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు యశ్వంత్ రఘువీర్, జాన్ సైదా, వెంకటేశ్వర్లు, డేవిడ్, ఖాసీం, ప్రణీత్, ప్రసాద్, ఖాజా, అమర్, నరసింహ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

నేటి నుంచి కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణ బాలాజీరావుపేట అయ్యప్ప దేవాలయంలో గురువారం నుంచి ఈ నెల 27 వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు హరిబాబు తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ.. పవిత్ర అభిషేకాలు, మహిళల ప్రత్యేక పూజలు, పురవీధుల్లో స్వామివార్ల ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అనంతరం కార్యక్రమ కరపత్రాలు ఆవిష్కరించారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న హరిబాబు తదితరులు

అలకపాన్పుపై నాగేశ్వరుడు

చేబ్రోలు: చేబ్రోలులోని గంగాపార్వతీ సమేత నాగేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దీంట్లో భాగంగా బుధవారం స్వామివారిని అలకపాన్పు శంభుదేవర మఠానికి తీసుకువెళ్లారు. అక్కడ స్వామివారికి అలక పాన్పు ఉత్సవం నిర్వహించి గంగా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి వారిని ఆలయం వద్దకు తీసుకువెళ్లారు. గురువారం జరిగే పవళింపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయని అర్చక స్వామి సత్యనారాయణ తెలిపారు.

ఇళ్ల పట్టాలు ఇచ్చి ఆదుకోండి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: దాదాపు రెండు దశాబ్దాలుగా మున్సిపాలిటీ స్థలంలో తాత్కాలిక గృహాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్నామని.. పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని పూలే కాలనీ వాసులు కలెక్టర్ తమీమ్ అన్సారియాను కోరారు. బుధవారం పూలే కాలనీలోని టిడ్కో గృహాలను సందర్శించడానికి వచ్చిన ఆమెను ఆ కాలనీ వాసులు కలిశారు. పూర్తిస్థాయిలో మౌలిక వసతులు లేక ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. రేషన్, ఆధార్‌కార్డులు ఉన్నాయా అని ఆమె వారిని ప్రశ్నించారు.. ఉన్నాయని బదులిచ్చారు. వారి సమగ్ర వివరాలు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ గోపాలకృష్ణ, కమిషనర్ రామ అప్పలనాయుడుకు సూచించారు.

కలెక్టర్‌కు తమ సమస్యలు చెబుతున్న స్థానికులు

బ్యాంకింగ్ రంగంలో అపార అవకాశాలు

పెదకాకాని, న్యూస్‌టుడే: ఏఐతో కూడిన బీబీఏ, ఎంబీఏ కోర్సులు చదివిన విద్యార్థులకు బ్యాంకింగ్ నియామకాల్లో ప్రాధాన్యత ఉందని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు(హైదరాబాద్) డిప్యూటీ వైస్ ప్రెసిడెంటు వడ్లమూడి ప్రకాష్ తెలిపారు. నంబూరు వీవీఐటీయూలోని అప్పా స్కూల్ ఆఫ్ బిజినెస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు బ్యాంకింగ్ కార్యకలాపాలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'డిపాజిట్ల నుంచి డిజిటల్ చెల్లింపుల వరకూ-ఎండ్ టు ఎండ్ బ్యాంకింగ్ కార్యకలాపాలు' అనే అంశంపై వివరించారు. ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం బ్యాంకింగ్ రంగం వేగంగా డిజిటలైజేషన్ వైపు అడుగులు వేస్తుందన్నారు. తక్షణ చెల్లింపులు, లావాదేవీలు త్వరితగతిన పరిష్కరించడం కోసం సరికొత్త వ్యవస్థలను అమలు చేస్తున్నాయని తెలిపారు. డిజిటల్ మోసాలను అరికట్టేందుకు, అనుమానాస్పద లావాదేవీలను గుర్తించేందుకు బ్యాంకులు 'ఏఐ'ని విస్తృతంగా వినియోగిస్తున్నాయని చెప్పారు. బ్యాంకులు ప్రజాధనంతో ముడిపడి ఉన్నందున కఠినమైన నియంత్రణలు, పటిష్టమైన చట్టాలు అమలులో ఉంటాయని.. వాటిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, అప్పా స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ డాక్టర్ సీహెచ్ ఉదయ్‌కుమార్, విభాగాధిపతి డాక్టర్ శివకోటిరెడ్డి, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ ఎ.వెంకటేష్, వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ప్రకాష్, మల్లికార్జునరెడ్డి తదితరులు

ఇంజినీరింగ్ కళాశాల పేరు మార్చండి

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల పేరు మార్చాలని తెలుగునాడు విద్యార్థి సమాఖ్య నాయకులు ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్‌కు వినతిపత్రం ఇచ్చారు. విశ్వవిద్యాలయంలో పనిచేయని గుత్తేదారులను వెనక్కి పంపించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. గత వీసీ హయాంలో పనిచేసిన గుత్తేదారులు ఇప్పటికీ పనిచేయడం వల్ల నాణ్యత లోపంతో పనిచేస్తున్నారని తెలిపారు. డ్రైనేజీ పనులను నాసిరకంగా చేయడం వల్ల వసతి గృహాల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు హేమంత్ చెప్పారు. టీఎన్ఎస్ఎఫ్ నాయకులు యశ్వంత్, శిరీష్‌మోహన్, రాకేష్, విజయ్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్‌కు వినతిపత్రం ఇస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

ఆర్కిటెక్చర్.. ఎంఈడీ ఫలితాల విడుదల

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఆర్కిటెక్చర్, వ్యాయామ కళాశాలలో గతేడాది నవంబరులో నిర్వహించిన పరీక్షల ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాద్ బుధవారం విడుదల చేశారు. ఆర్కిటెక్చర్ మూడో ఏడాది మొదటి సెమిస్టర్‌లో 22 మంది పరీక్ష రాయగా 18 మంది, రెండో సెమిస్టర్‌లో 9 మంది పరీక్ష రాయగా నలుగురు, నాలుగో ఏడాది రెండో సెమిస్టర్‌లో పరీక్ష రాసిన ఇద్దరు, ఎంఈడీ రెండో ఏడాది మూడో సెమిస్టర్‌లో 193 మంది పరీక్ష రాయగా 146 మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ఆర్కిటెక్చర్ జవాబు పత్రాల పునఃమూల్యాంకన కోసం ఈ నెల 26లోపు ఒక్కో పత్రానికి రూ.2070, ఎంఈడీ జవాబు పత్రాలకు రూ.1860 చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలోని 3, 5, 6 ఎన్ఎస్ఎస్ యూనిట్ల వాలంటీర్లు మంగళగిరి మండలం కాజాలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్ ఐ, మెడెక్స్, ఐశ్వర్య దంత ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ప్రజలకు బీపీ, షుగర్, దంత, కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారని ఎన్ఎస్ఎస్ అధికారులు పేర్కొన్నారు.

మసీదుల పరిసరాలు శుభ్రం చేయించండి

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: రంజాన్ నెల ప్రారంభం సందర్భంగా పట్టణ పరిధిలోని అన్ని మసీదుల వద్ద పరిసరాలు శుభ్రం చేయించాలని 33వ వార్డు కౌన్సిలర్ మొగల్ అహమ్మద్ బుధవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధికను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఛైర్‌పర్సన్ రాధికకు వినతిపత్రం ఇస్తున్న అహమ్మద్

డ్రగ్స్ వద్దు.. భవిత ముద్దు

తెనాలి టౌన్: మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని తెలంగాణ రాష్ట్ర జీఎస్టీ జాయింట్ కమిషనర్ యడ్ల శ్రీలీల పిలుపునిచ్చారు. శ్రీభరత్ ఫౌండేషన్, ఎక్సైజ్ శాఖ, ఈగల్ బృందం సంయుక్త ఆధ్వర్యంలో తెనాలి మండలం కొలకలూరులో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. నేడు సమాజాన్ని పీడిస్తున్న ప్రధాన సమస్యల్లో ఒకటిగా డ్రగ్స్, గంజాయి మారాయని, అందరం కలిసికట్టుగా ఉండి వాటిని పారదోలలన్నారు. ఎలాంటి సమాచారం ఉన్నా అధికారులకు తెలియజేయాలని, ఎవరు సమాచారం ఇచ్చారో బయటకు రాకుండా చూస్తామని ఎక్సైజ్ విభాగ అధికారులు అరుణకుమారి, మారయ్యబాబు, వెంకటాచలం ప్రజలకు తెలిపారు. తొలుత ప్రజలు, విద్యార్థులతో కలిసి ప్రదర్శన నిర్వహించారు. డ్రగ్స్ వద్దు.. భవిత ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఈఎస్‌టీఎఫ్ నయనతార, ఎస్సై సునీల్, చక్రవర్తి, డాక్టర్ శ్రీనివాసులు, కవిత, శ్రీధర్, చంద్రం, అజయ్, వరప్రసాద్, సుబ్బారావు, చిన్నారి స్నేహం ప్రతినిధులు పాల్గొన్నారు.

అవగాహన ప్రదర్శనలో యడ్ల శ్రీలీల, ఎక్సైజ్ అధికారులు, గ్రామస్థులు

ఆన్‌లైన్‌లో ఆస్తిపన్ను చెల్లింపులను సద్వినియోగం చేసుకోండి

తెనాలి(కొత్త పేట), న్యూస్‌టుడే: ఆస్తిపన్ను చెల్లించేందుకు పురపాలక కార్యాలయానికి రాకుండా ఆన్‌లైన్‌లో చెల్లించే విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. చరవాణి మీ చేతిలో ఉంటే దానిని వినియోగించి బకాయిలు సులభంగా చెల్లించవచ్చు. ఆస్తిపన్ను సకాలంలో చెల్లించడం ద్వారా సమయం ఆదా, నగదు రహిత సేవలు వంటి ప్రయోజనాలు పొందొచ్చు.

చరవాణిలో సులభంగా.. పురపాలక శాఖ పోర్టల్ డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.సీడీఎంఏ.ఆంధ్రప్రదేశ్ జీవోవీ.ఇన్‌లో ప్రాపర్టీ ట్యాక్స్ ఐడెంటిఫికేషన్ నంబరు నమోదు చేయగానే ఆస్తి పన్ను ఎంత బకాయి ఉందో వివరాలు కనిపిస్తాయి. అంతేకాకుండా జిల్లా పేరు, మున్సిపాలిటీ ఎంచుకుని ఇంటి నంబరు ఆధారంగా కూడా బకాయిలు తెలుసుకోవచ్చు. ఆ తరవాత చెల్లించాల్సిన నగదుపై నొక్కగానే చరవాణి సంఖ్య నమోదు చేయాలని సూచిస్తుంది. ఆస్తిపన్ను అంతా క్రెడిట్ లేదా డెబిట్ కార్డు ఆధారంగా కట్టవచ్చు. యూపీఐతోనూ చెల్లించవచ్చు. క్యూ ఆర్ కోడ్‌ను స్మార్ట్‌ఫోన్‌తో స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో ఫోన్ పే లేదా గూగుల్ పే ఆధారంగా పన్నులు చెల్లించు సౌలభ్యం ఉంది.

రూ.8 కోట్లు బకాయి..

ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి మార్చి 31వ తేదీ వరకు ఆర్థిక సంవత్సరం కింద పరిగణిస్తారు. బిల్డింగ్ యజమానులు ఆర్థిక సంవత్సరంలో రెండు సార్లు పన్నులు చెల్లించే వెసులుబాటు ఉంది. తొలి ఆర్నెల్లలో ఎవరూ చెల్లించడానికి ఆసక్తి చూపించడం లేదు. చివరలో చెల్లించడానికి ఎక్కువ మంది ముందుకు వస్తున్నారు. ఈ సారి ఇప్పటి వరకు రూ.14 కోట్లు ఆస్తిపన్ను వచ్చింది. ఇంకా రూ.8 కోట్ల వరకు బకాయిలు వసూలు కావాల్సి ఉంది.

ముఖ్యమంత్రి సహాయ నిధితో భరోసా

తెనాలికి చెందిన షఫీవుల్లా, కరీంలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.37 లక్షల విలువైన చెక్కులను సంబంధితుల కుటుంబ సభ్యులకు స్థానిక తెదేపా కార్యాలయంలో బుధవారం అందించారు. నాయకులు వసంతం అశోక్‌వర్ధన్, కేసన కోటేశ్వరరావు, మల్లవరపు విజయ్, బి.వి.చౌదరి పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

వ్యక్తి మృతదేహం గుర్తింపు

పెదకాకాని: రామచంద్రపాలెం గ్రామ శివారులోని గొట్టాల రోడ్డులో బుధవారం మృతదేహం గుర్తించినట్లు ఎస్సై మిరాజ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. పాటిబండ్లకు చెందిన షేక్ మీరావలి (45) గుంటూరులోని కింగ్ హోటల్ సమీపంలో నివాసం ఉంటున్నారు. మూర్ఛ వ్యాధితో పాటు మానసికంగా ఆయన బాధపడుతున్నారు. వ్యక్తిగత పనుల నిమిత్తం గొట్టాల వెళ్లిన సమయంలో మూర్ఛ వచ్చి మృతి చెంది ఉంటారని.. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అభివృద్ధి పనుల్లో పురోగతి కనిపించాలి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: జిల్లా స్థాయిలో అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించుకునే నాటికల్లా తెనాలి నియోజకవర్గంలో చేపట్టాల్సిన పనుల్లో పురోగతి కనిపించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలో 'నియోజకవర్గంలోని అభివృద్ధి పనులపై' నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సమీక్ష ముగిసింది కదా అని పట్టనట్టు ఉంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆర్వో ప్లాంట్లు, మరుగుదొడ్ల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రహరీలు, ఆటస్థలాలు, శ్మశాన వాటికలు, సామాజిక భవనాలు తదితర నిర్మాణాలకు అంచనాలు తయారు చేయని వారు చేయాలని, చేసిన వారు నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఐటీఐ కళాశాలలో అంతర్గత రోడ్లు తదితరాలకు నిధులు మంజూరుకు తగు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. నందివెలుగు మీదుగా తెనాలి గుంటూరు మార్గంలోని ఆర్అండ్‌బీ రోడ్డులో ప్రమాదకర వంతెన సమస్య పరిష్కార పనుల పురోగతి గురించి వాకబు చేశారు.

ఆదర్శనీయులు పండా కోటేశ్వరరావు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: విలువలతో కూడిన వ్యక్తిత్వంతో న్యాయాన్ని గెలిపించడమే లక్ష్యంగా, పేదలకు అండగా నిలబడిన న్యాయవాది పండా కోటేశ్వరరావు జీవితం ఆదర్శనీయమని వక్తలు కొనియాడారు. ఆయన శత జయంతి సందర్భంగా తెనాలిలో కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో స్నేహితుడు కాట్రగడ్డ నారాయణరావు, న్యాయవాదులు శ్రీరామమూర్తి, బ్రహ్మానందరెడ్డి, రాంప్రసాద్ తదితరులు మాట్లాడారు. కుటుంబ సభ్యులు సీతారాణి, పి.అనురాధ, పి.మేఘనసుధ, ఎంఎస్ఏ.ప్రసాద్, ఎంవీ.రమణారావు తదితరులు పర్యవేక్షించారు.

కోటేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

పోలీసుల అదుపులో నిందితుడు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పెళ్లి చేసుకుంటానని మహిళను మోసం చేసిన కేసులో నిందితుడైన వంశీని త్రీ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. గతంలోనూ ఇదే తరహా వ్యవహార శైలి నేపథ్యంలో పూర్తి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

ఉపాధి హామీ పథకం రద్దు కుట్రపూరిత చర్య

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: జాతిపిత గాంధీ సిద్ధాంతాలు అహింస, శాంతిని ప్రపంచదేశాలు ఆచరిస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి పేర్కొన్నారు. ఆయన బుధవారం తెనాలిలో మాట్లాడారు. 20 ఏళ్ల కిందట ఏడాదిలో 8 నెలలు పని లేక ఆకలితో అలమటిస్తున్న పేద రైతులు, కూలీలకు ఉపాధి కల్పించేందుకు గాంధీ పేరుతో తీసుకొచ్చిన చట్టాన్ని రద్దు చేయడం కుట్రపూరితమైన చర్యని విమర్శించారు. కేంద్రం తెచ్చిన నూతన చట్టంతో పేదలు ఉపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో భాగంగా 20న తెనాలి వస్తున్నారని తెలిపారు.

అంగలకుదురు చెరువుకు మహర్దశ

తెనాలి టౌన్: గ్రామీణ ప్రాంతాల్లో సహజంగా ఉన్న చెరువులను సుందరీకరించి వీలైనంత ఎక్కువ మందికి ఆహ్లాదం, ఆనందం పంచేలా తీర్చిదిద్దడానికి రంగం సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి చేయడానికి తొలి దశలో 106 చెరువులను ఎంపిక చేయగా వాటిల్లో గుంటూరు జిల్లాలో పది ఉన్నాయి. ఎంపికైన ఒక్కో చెరువు ప్రగతి కోసం రూ.50 లక్షల వంతున ఖర్చు చేయనున్నారు. కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనలో భాగంగా సుందరీకరణకు ఎంపికైన తెనాలి నియోజకవర్గం అంగలకుదురులోని చెరువును బుధవారం డ్వామా పీడీ శంకర్, జిల్లా పంచాయతీ అధికారి నాగసాయికుమార్ పరిశీలించారు. తెనాలి-గుంటూరు ప్రధాన మార్గంలో రోడ్డు వెంబడి సుమారు నాలుగు ఎకరాల్లో విస్తరించి ఉన్న చెరువు వద్ద చేపట్టాల్సిన పనులపై డిప్యూటీ ఎంపీడీవో వైవీడీ ప్రసాద్, ఇతర అధికారులతో చర్చించారు.

చెరువును పరిశీలిస్తున్న డ్వామా పీడీ శంకర్, జిల్లా పంచాయతీ అధికారి నాగసాయికుమార్

మా అమ్మగారైన

తోడేటి రాజేశ్వరి గారు

(భర్త: తోడేటి వెంకటేశ్వర్లు గారు)

ది. 09-02-2026 సోమవారం స్వర్గస్థులైనారు.

ది. 19-02-2026 గురువారం గుంటూరు జిల్లా, హనుమాన్‌పాలెంలోని మా స్వగృహమునందు జరుపబడును. కావున తెలియపరచడమైనది.

కీ॥శే॥ తోడేటి రాజేశ్వరి గారు
జననం: 01-01-1967
మరణం: 09-02-2026

ఇట్లు
తోడేటి సురేష్, తోడేటి రమేష్
సెల్: 9550702536

(c) eenadu

మంగళగిరి
• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

నదీమ తల్లి సేవలో విద్యార్థులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: పవిత్ర కృష్ణా నదిలో చేరిన చెత్తను వీవీఐటీ విద్యార్థులు బుధవారం తొలగించారు. సీతానగరం పుష్కర ఘాట్ ప్రాంతంలో పేరుకున్న 300 కిలోల చెత్తను సుమారు 100 మంది విద్యార్థులు శుభ్రపరిచారు. నగరపాలక డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, ఎన్ఎస్ఎస్ యూనిట్ కోఆర్డినేటర్ సుధాకర్, నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

మల్లేశ్వరా.. పాహిమాం

కేళి గుర్రంపై స్వామివారు

మంగళగిరి, మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి (శివాలయం) బ్రహ్మోత్సవాల్లో భాగంగా వసంతోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. సాయంత్రం స్వామివారిని కేళి గుర్రంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. 19వ తేదీ పుష్పయాగోత్సవం, 21వ తేదీ పవళింపు సేవ ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

స్పందన: వట్టిచెరుకూరు: అనంతవరప్పాడు, చేబ్రోలు మండలం గుండారం మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయని స్థానికులు 'మేమున్నాం..మీకు తోడుగా' ద్వారా ఏఈ అబ్బాస్‌కిడీ దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన గుంతలు పూడ్చించారు.

పెదనందిపాడు: వరగాని పడమర వైపు వీధిలో మురుగు కాలువ పూడిక తీసి నీరు నిలిచిపోతుందని స్థానికులు గ్రామ కార్యదర్శి అవుధర్తుల కుమారికి చెప్పారు.. స్పందించి పూడిక తీయించారు. ✦ పెదనందిపాడు పడమటి వీధిలోని ప్రధాన వీధిలో మురుగు కాలువ పూడిపోగా స్థానికులు సమస్యను గ్రామ కార్యదర్శి శ్వేత దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె పూడిక తీయించారు.

ప్రత్తిపాడు: యనమదల గ్రామ పంచాయతీ కార్యాలయం రోడ్డులో కాల్వలు పూడిపోగా.. స్థానికుల విజ్ఞప్తి మేరకు డిప్యూటీ ఎంపీడీవో చేక్ ఆరిఫ్ వలీ కార్మికులతో శుభ్రం చేయించారు.

మంగళగిరి గ్రామీణం: బేతపూడి గ్రామ బీసీ కాలనీ సమీపంలో డ్రైనేజీ స్తంభించిందని స్థానికులు 'మేమున్నాం..మీకు తోడుగా' ద్వారా శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఇంది దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె కార్మికులతో శుభ్రం చేయించారు. ✦ కాజ గ్రామ చెరువుల్లో గడ్డి పది పెరిగి నీరు చేరి దుర్వాసన వస్తుందని స్థానికులు నగరపాలక అసిస్టెంట్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన స్ప్రే ద్వారా దోమల మందు పిచికారీ చేయించారు.

దుగ్గిరాల: ఈమని ప్రధాన కూడలిలో కన్యకాపరమేశ్వరి సత్రం వెనుక ఓ ఇల్లు పడేశారు. దీని కారణంగా కాల్వ పూడుకుపోయి ప్లాస్టిక్ పేరుకుపోయింది. బుధవారం 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా స్థానికుడు గ్రామ కార్యదర్శి మహేష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. కార్మికులతో పూడిక తీయించి బ్లీచింగ్ చల్లించారు.

తుళ్లూరు: తుళ్లూరులో గుంపులు గుంపులుగా వానరాలు తిరుగుతూ ఇబ్బంది పెడుతున్నాయని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన గ్రామ కార్యదర్శి ఆర్.రమణ కోతుల పట్టుకునే వ్యక్తులను తెప్పించి గ్రామం నుంచి కోతులను బయటకు పంపేలా చర్యలు తీసుకున్నారు.

పందులను రోడ్లపైకి వదిలితే చర్యలు

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: నగర పరిధిలోని రోడ్లపై పందుల స్వైర విహారంపై ఈ నెల 18న 'ఈనాడు'లో ప్రచురితమైన 'వరాహ విహారం' శీర్షిక ప్రచురితమైన కథనానికి నగరపాలక అసిస్టెంట్ కమిషనర్ శకుంతల స్పందించారు. బుధవారం కార్యాలయంలో పందుల పెంపకం దారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పందులను నివాస ప్రాంతాల నుంచి మూడు నుంచి ఐదు కి.మీ. దూరంలో ఉంచాలని ఆదేశించారు. రోడ్లపైకి వదిలితే కఠిన చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

తీగల తొలగింపు.. ఫిరంగిపురం, న్యూస్‌టుడే: పొనుగుపాడు గ్రామంలో విద్యుత్తు స్తంభానికి పిచ్చి తీగలు అల్లుకుని నిరుపయోగంగా ఉంటున్నాయని ప్రమాదాలు ఏర్పడుతుందని 'ఈనాడు'లో ఈ నెల 17న 'చుట్టేసి.. సరదా ఆపేసి..' శీర్షిక కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్ శాఖ ఏఈ దుర్గాప్రసాద్ పిచ్చి మొక్కలను తొలగింపజేశారు.

కొలిక్కి రాకపోయినా.. ఉలిక్కి పడరు

పూర్తికాని ఏకీకృత కుటుంబ సర్వే ✦ ఈ నెల 28వ తేదీతో ముగియనున్న గడువు

న్యూస్‌టుడే, మేడికొండూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏకీకృత కుటుంబ సర్వే (యూనిఫైడ్) చేపట్టింది. ప్రణాళిక శాఖ ద్వారా దీన్ని అమలు చేస్తున్నారు. గ్రామ సచివాలయ సిబ్బందికి ఆయా బాధ్యతలు అప్పగించారు. గడిచిన డిసెంబర్ 14వ తేదీ నుంచి సర్వే కార్యక్రమం ప్రారంభమైంది. సిబ్బంది తమ పరిధిలో గల ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. మొత్తం 20 రకాల ప్రశ్నల ద్వారా వివరాలు నమోదు చేసుకుంటున్నారు. కుటుంబ సభ్యుల పేర్లు, పిల్లలు, చదువు, ఉద్యోగం, ఆదాయం, కుటుంబ నేపథ్యం, ఆస్తి వివరాలు, ఆధార్, రేషన్ నంబరు, వాహనాల సంఖ్య, గ్యాస్ కనెక్షన్ వంటివి తెలుసుకుని ఒకే చోట యాప్‌లో పొందుపరుస్తున్నారు. దీని ఆధారంగా చేసుకుని ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయడానికి ఇది ఉపయోగకరంగా ఉంటుంది. మరో పక్క ఏదైనా కార్యక్రమం అమలు చేయడానికి ఆయా వివరాలు దోహదపడతాయని అధికారులు చెబుతున్నారు. ఈ నెల 28వ తేదీతో సర్వే గడువు ముగియనుంది. సిబ్బంది అలసత్వం కారణంగా ప్రక్రియ ఇంకా కొలిక్కి రాలేదు. తక్షణమే ఉన్నతాధికారులు ఈ లక్ష్యాలను చేరుకునేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

✦ జిల్లా పరిధిలో ఆయా మండలాలకు సంబంధించి మొత్తం 7,22,079 కుటుంబాలు ఉన్నాయి. వాటిల్లో బుధవారం ఉదయానికి 5,12,022 గృహాలకు సంబంధించి సర్వే పూర్తి అయ్యింది. దీంతో 70.91 శాతం నమోదు కాగా 29.09 శాతం పెండింగ్‌లో ఉన్నట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి.

మండలాల వారీగా పరిశీలిస్తే..

చేబ్రోలు 73.70 శాతం, దుగ్గిరాల 79.44, గుంటూరు రూరల్ 73.33, గుంటూరు 73.44, కాకుమాను 54.76, కొల్లిపర 75.65, మంగళగిరి 55.31, మేడికొండూరు 69.23, పెదకాకాని 68.00, పెదనందిపాడు 72.42, ఫిరంగిపురం 71.43, పొన్నూరు రూరల్ 68.77, పొన్నూరు అర్బన్ 82.89, ప్రత్తిపాడు 57.55, తాడేపల్లి, మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్ 77.46, తాడేపల్లి రూరల్ 49.92, తాడికొండ 63.49, తెనాలి రూరల్ 69.37 తెనాలి అర్బన్ 77.65, తుళ్లూరు 70.69, వట్టిచెరుకూరు 50.83 శాతం మాత్రమే పూర్తయ్యింది. సర్వే పూర్తయిన ప్రతి కుటుంబానికి క్యూఆర్ కోడ్‌తో కూడిన ఫ్యామిలీ బెనిఫిట్ కార్డు అందుతుందని, గడువులోగా సర్వే పూర్తికి చర్యలు చేపట్టామని అధికారులు చెబుతున్నారు.

చిన్నారుల ఆరోగ్యానికి భరోసా

అంగన్‌వాడీ కేంద్రాలకు వైద్య కిట్లు

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. మంగళగిరి పరిధిలో 109, తాడేపల్లి 71, దుగ్గిరాల 58 చొప్పున కేంద్రాలు ఉన్నాయి. ఇటీవల నీరుకొండ నిడమర్రు కురగల్లు, బేతపూడి, కురగల్లు, నీరుకొండ గ్రామాల్లో నిర్మించిన కేంద్రాలను ప్రారంభించారు. గత వైకాపా హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రస్తుతం వసతులు మెరుగుపరుస్తున్నారు. మంత్రి నారా లోకేశ్ చొరవతో సీఎస్ఆర్ నిధుల కింద ఫ్యాన్లు, లైట్లు, టేబుళ్లు, కుర్చీలు, మ్యాట్లు వంటివి అందించారు. ప్రస్తుతం కేంద్రాలకు ప్రథమ చికిత్స ఉపయోగించేలా ఆరోగ్య కిట్లు అందించారు. సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం కింద 11 రకాల మందులను వాటిలో అందుబాటులో ఉంచారు. జ్వరమునకు (పారాసిటమాల్ సిరప్ 60 మి.లీ), తెగిన గాయాలకు నియోమైసిన్ ఆయింట్‌మెంట్ 100 గ్రా, ఆయోడిన్ 500 మి.లీ, కట్లు కట్టేందుకు కావాల్సిన దూది, కళ్ల ఎర్రబడుట, చెవిపోటు సమస్యలకు చుక్కల మందు, దగ్గు, జలుబు, విరేచనాలకు సిరప్‌లు, చేతులు శుభ్రపరుచుకునే ద్రావణం తదితరాలు ఉన్నాయి.

అవగాహన కల్పించాం.. మంగళగిరి సీడీపీవో సరిత మాట్లాడుతూ.. ఆరోగ్య కిట్ల ఉపయోగంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించాం. వయసు ఆధారంగా ఎంత మోతాదులో మందులు వేయాలో వివరించామని చెప్పారు.

ప్రచార ప్రతులు ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

భావనారుషి కల్యాణోత్సవం 21న

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి నాంచారమ్మ చెరువు ప్రాంగణంలోని భావనారుషి స్వామి ఆలయంలో ఈ నెల 21న భద్రావతి సమేత భావనారుషి స్వామి వార్ల దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు గుత్తికొండ ధనుంజయరావు తెలిపారు. ఆ సంఘం ప్రతినిధులతో కలిసి బుధవారం ప్రచారప్రతులను ఆవిష్కరించారు. 19న గణపతి పూజ, మండపారాధన, 20న పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా అలంకరణ, హోమం, 21న ఉదయం 11:45 గంటలకు కల్యాణం ఉంటుందని వివరించారు. ఆ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐల ఉదారత

రేవేంద్రపాడు (దుగ్గిరాల), న్యూస్‌టుడే: రేవేంద్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎన్ఆర్ఐ సీవీఎల్ ద్వారా అమెరికాలో స్థిరపడిన ఎస్‌వీమూర్తి, డాక్టర్ జీవన్ ఐదు కంప్యూటర్లు వితరణగా అందించారు. వీటిని పాఠశాలలో కంప్యూటర్ టీచర్లు పని చేస్తున్న పద్మప్రియ జ్యోతి ప్రధానోపాధ్యాయులు కృష్ణారావుకు అందజేశారు. దాతలకు హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు.

దాతల తరఫున కంప్యూటర్లను హెచ్ఎంకు అందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రమాణ స్వీకారోత్సవానికి తరలిరావాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: గుంటూరులో ఈ నెల 20న నిర్వహించే మిర్చియార్డు పాలకవర్గ ప్రమాణస్వీకార మహోత్సవానికి కూటమి పార్టీల శ్రేణులు తరలిరావాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు పిలుపునిచ్చారు. విద్యానగర్‌లోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో బుధవారం ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. తెదేపా, జనసేన, భాజపా నేతలు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు

ఉత్సాహంగా పూటీ లాగుడు పోటీలు

నందిగామ (గ్రామీణం), న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి మహా శివరాత్రి తిరునాళ్లను పురస్కరించుకుని బుధవారం రాత్రి తెలుగు రాష్ట్రాల స్థాయి జూనియర్ విభాగం ఎడ్ల పూటీలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. కాకుమాను మండలం గార్లపాడుకు చెందిన రామినేని శ్రీనివాసరావు ఎడ్ల జత 4521 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచాయి.

'వార్డెన్లనూ కాంట్రాక్ట్ విధానంలోకి తీసుకురావాలి'

ఈనాడు-అమరావతి: శాసనసభలో బుధవారం జీరో అవర్(శూన్యగంట)లో ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడారు. మోడల్ స్కూళ్లలో గతంలో మహిళా వార్డెన్లు, పీఈటీలు, కంప్యూటర్ ఆపరేటర్లను ఒకేసారి నియమించారు, వీరిలో పీఈటీలు, కంప్యూటర్ ఆపరేటర్లను మాత్రమే కాంట్రాక్ట్ విధానంలోకి తీసుకున్నారన్నారు. మహిళా వార్డెన్లను ఇంకా అవుట్‌సోర్సింగ్‌లోనే ఉంచారు. వీరిని కూడా కాంట్రాక్ట్ విధానంలో తీసుకోవాలని కోరారు.

రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలి

ఫిరంగిపురం, న్యూస్‌టుడే: రైతులు తమ వివరాలు రైతు సేవా కేంద్రాల్లో ఈ నెల 28 లోపు నమోదు చేయించుకుని విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని వ్యవసాయ శాఖ ఏడీఏ ఎన్.మోహన్‌రావు సూచించారు. వేములూరిపాడులో బుధవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. విశిష్ట సంఖ్య ఉంటేనే అన్నదాత సుఖీభవ, ఇతర సంక్షేమ పథకాలు వర్తిస్తాయని వివరించారు.

పాలపర్రులో నమాజ్ చేస్తున్న ముస్లింలు

ఉపాధి పనుల్లో అవకతవకలు సహించం

పెదనందిపాడు, న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకం పనుల్లో కూలీలకు దొంగ మస్తర్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆ పథకం జిల్లా విజిలెన్స్ అధికారి హనుమంతరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన క్షేత్ర సహాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఏపీడీ శ్యామలాదేవి, ఏపీవో సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.

హిందూ సమ్మేళనం నేడు

తుళ్లూరు, న్యూస్‌టుడే: మందడంలో గ్రామంలో గురువారం సాయంత్రం 5.30 గంటలకు హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు భాజపా నేత కె. హేమసుందర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తలుగా విశ్వహిందూ పరిషత్, భాగ్యనర్ క్షేత్ర కార్యదర్శి తనికెళ్ళ రవికుమార్, శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి హాజరు కానున్నారని ఓ ప్రకటనలో తెలిపారు.

రంజాన్ ప్రార్థనలు ప్రారంభం

పెదనందిపాడు, న్యూస్‌టుడే: రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా బుధవారం ముస్లింలు ఉపవాసం ఉండి మసీదుల్లో ప్రార్థనలు చేశారు. నెల రోజుల పాటు ఈ దీక్షలు కొనసాగనున్నాయి.

ఇదెక్కడి తీరు..!

కాకుమాను మండల పరిషత్ కార్యాలయంలోని శౌచాలయం అధ్వానంగా మారింది. దీంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే వారు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో స్వచ్ఛతను పర్యవేక్షించే అధికారులు ఉండే ప్రాంతంలో ఇదేం పరిస్థితి అని పలువురు ప్రశ్నిస్తున్నారు. - న్యూస్‌టుడే, కాకుమాను

సంపద సృష్టి ఉత్తిమాటే..!

వల్లూరులోని చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం అలంకార ప్రాయంగా మారింది. రూ. లక్షల ప్రజాధనంతో ఏర్పాటు చేసిన దీని నిర్వహణ అధ్వానంగా ఉంది. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా.. మందుబాబులకు అడ్డాగా మారింది. - న్యూస్‌టుడే, వల్లూరు (కాకుమాను)

తూటాకు తొలగించరూ...

బేజాత్పురం తాగునీటి చెరువులో తూటుకాడ పెరిగింది. పంపింగ్ చేసే ప్రాంతం పాచిపట్టి నీరు కలుషితమవుతుంది. అధికారులు స్పందించి శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తాడికొండ

తీసేందుకు తీరిక లేదేమో..!

తుళ్లూరులోని సీఆర్డీఏ కార్యాలయం ఎదుట నిల్వ చేసిన పార్కింగ్ టైల్స్ ఏళ్లుగా నిరుపయోగంగా పడి ఉన్నాయి. గతంలో సీఆర్డీఏ స్కిల్ హబ్ భవనంలో వినియోగించటానికి తీసుకువచ్చిన వీటిని కార్యాలయం ఎదుట గుంటూరు రహదారిపై నిల్వ చేసి ఉంచారు. ఇతర పనులను వీటిని వినియోగిస్తే పాడవకుండా ఉంటాయి. - న్యూస్‌టుడే, తుళ్లూరు

గోతులతో ఇక్కట్లు

తుళ్లూరులోని లైబ్రరీ సెంటర్ ప్రధాన కూడలిలో రోడ్డు మధ్యలో గోతులు పడ్డాయి. భారీ వాహనాలు వచ్చిన సమయంలో తప్పుకొనే ఖాళీ లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తుళ్లూరు

వసతుల్లేవని వదిలేశారిలా..

తిక్కిరెడ్డిపాలెంలో గత వైకాపా ప్రభుత్వ హయాంలో పేదల కోసం మంజూరు చేసిన లేఔట్ ముళ్లపొదలతో నిండిపోయింది. వసతులు కల్పించకపోవడం, బిల్లులు చెల్లింపు చేయకపోవడంతో నిర్మాణాలు పునాది దశ దాటలేదు.

- న్యూస్‌టుడే, తిక్కిరెడ్డిపాలెం (ప్రత్తిపాడు)

గండాలు దాటితేనే సన్నిధికి చేరేది..!

రోడ్డును కమ్మేసిన పిచ్చిమొక్కలు

న్యూస్‌టుడే, మంగళగిరి గ్రామీణం

ప్రతి అమావాస్యకు మంగళగిరి నృసింహస్వామి కొండపై కొలువుదీరిన గండాలయ్య సన్నిధికి వందల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఇక్కడ దీపారాధన చేస్తే తమ గండాలు గట్టెక్కుతాయని వారి విశ్వాసం. అయితే కొండపై నుంచి ఈ ఆలయానికి చేరుకునే ఘాట్ రోడ్డుకు ఇరువైపులా ముళ్ల చెట్లు కమ్ముకున్నాయి. దీనికి తోడు రోడ్డు సైతం అధ్వానంగా మారింది. మలుపుల్లో సూచిక బోర్డులు, మిర్రర్లు ఏర్పాటు చేయకపోవడంతో జనం అవస్థలు పడుతున్నారు. ముళ్ల కంపలు కళ్లకు తగులుతున్నాయని పలువురు ద్విచక్రవాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు నిలిపేందుకు సరైన పార్కింగ్, మరుగుదొడ్ల వసతి లేకపోవడం గమనార్హం.

'ప్లాస్టిక్' ఆగలేదు.. మరోవైపు పర్యావరణ పరిరక్షణలో భాగంగా కొండపైకి ప్లాస్టిక్ కవర్లు, తాగునీటి బాటిళ్లు, నూనె డబ్బాలు అనుమతించేది లేదని ఆలయ అధికారులు భక్తులకు సూచిస్తున్నారు. కానీ చాలా మంది ఇప్పటికీ ప్లాస్టిక్ సామగ్రిని కొండపైనే పారవేస్తున్నారు. అధికారులు కేవలం సూచనలు చేసి వదిలివేయకుండా ప్లాస్టిక్ నిషేధం అమలుపై దృష్టిసారించాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

అవీ ఇవీ

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

చిలువూరు(దుగ్గిరాల): విద్యుత్తు లైన్ల నిర్వహణ నిమిత్తం చిలువూరులో గురువారం సరఫరా ఉండదని మంగళగిరి గ్రామీణ డీఈఈ అనిల్‌బాబు ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

ఫిరంగిపురం: అమీనాబాద్, వేములూరిపాడు గ్రామాలలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని ఆ శాఖ ఏఈ దుర్గాప్రసాద్ తెలిపారు.

మలేరియా ప్రయోగశాల పరిశీలన

దుగ్గిరాల: స్థానిక పీహెచ్‌సీలోని మలేరియా ప్రయోగశాలను ఇన్‌ఛార్జి సబ్ యూనిట్ అధికారి బాలచంద్రమౌళి బుధవారం పరిశీలించారు. ప్రజల్లో కీటక జనిత వ్యాధుల తీవ్రత, క్షేత్రస్థాయిలో మలేరియా రక్తపూతల సేకరణ తదితర అంశాలపై సిబ్బందిని ఆరా తీశారు.

సేంద్రియ సాగుతో ఆరోగ్య పరిరక్షణ

పెదపాలెం(దుగ్గిరాల): సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులతోనే ఆరోగ్య పరిరక్షణ సాధ్యమని కేఎల్‌యూ ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి డాక్టర్ సీహెచ్ నాగమణి అన్నారు. బుధవారం పెదపాలెంలో ఆమె రైతులతో మాట్లాడారు. పోషక విలువలు అధికంగా ఉన్న సామలు, అరికెలు, కొర్రలు వంటి సాగుతో లాభాలు పొందవచ్చన్నారు. సర్పంచి కృష్ణప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు సాయికృష్ణ పాల్గొన్నారు.

22న ప్రతిష్ఠా మహోత్సవాలు

తుళ్లూరు: పెదపరిమిలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయంలో 22న ఉదయం 11.54 గంటలకు స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠలు నిర్వహించనున్నారు. ప్రత్యేక హోమాలు, గ్రామోత్సవం ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

ప్రాంగణ ఎంపికల్లో సత్తా

మేడికొండూరు: మండలంలోని ఎన్ఆర్ఐటీ కళాశాల విద్యార్థులు ప్రాంగణ ఎంపికల్లో మరోసారి ప్రతిభ చూపారు. కళాశాలలో బుధవారం ఐటీ విభాగానికి హెచ్‌సీఎల్ - స్మార్ట్ బ్రెయిన్స్ సంస్థ ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. మొత్తం 12 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రిన్సిపల్ సంజయ్, అకడమిక్ డైరెక్టర్ కోటా శ్రీనివాస్, సంస్థ ప్రతినిధి బినీత్‌కుమార్ అభినందించారు.

జాతీయ స్థాయి సైన్స్ పోటీల్లో ప్రతిభ

ఫిరంగిపురం: వేములూరిపాడు ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు జ్యోతిర్మయి, అనుశ్రీ, గైడ్ టీచర్ వీఎస్ రామాంజనేయులు ఈ నెల 17, 18 తేదీల్లో పుణెలో జరిగిన జాతీయస్థాయి సైన్స్ పోటీల్లో సత్తా చాటారు. అతిథుల చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. వారిని కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఈవో సలీం బాషా అభినందించారు.

రామకృష్ణ పరమహంస జయంతి

గుంటూరు రూరల్: ఏటుకూరు గ్రంథాలయంలో ఆధ్యాత్మిక గురువు రామకృష్ణ పరమహంస జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. ఆయన బోధనలు యువతకు ఆదర్శనీయమని వక్తలు పేర్కొన్నారు. గ్రంథాలయాధికారి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి ట్రాక్టర్ల పట్టివేత

పెదనందిపాడు: నాగులపాడు సమీపంలో నల్లమడ వాగులో మట్టి తవ్వి ట్రాక్టర్లతో చేరవేస్తున్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులు ఆ ట్రాక్టర్లను పట్టుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. విచారణలో ఆ మట్టిని ప్రభుత్వ పథకం కింద గోకులాలకు ఉపయోగిస్తారని తేలినందున ఆ ట్రాక్టర్లను పంపివేసినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

పల్లె దారులకు మెరుగులు

గుంతలు పూడ్చి బాగుచేసిన రోడ్డు

న్యూస్‌టుడే, మంగళగిరి గ్రామీణం

గత వైకాపా ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాలలోని డొంక రోడ్లను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. గోతుల్లో కనీసం తట్ట మట్టి వేసిన పాపాన పోలేదు. దీంతో రైతులు, జనం పడి ఇక్కట్లు అన్నీఇన్నీకావు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ పరిస్థితి మారింది. మంగళగిరి, తాడేపల్లి పరిధిలోని రోడ్లకు మెరుగులు దిద్దుతున్నారు. ✦ నూతక్కి శ్మశానవాటిక నుంచి మూలరాయి వరకు (గుండిమెడ, చిరావూరు గ్రామానిక వెళ్లే రహదారి) రోడ్లను కార్పొరేషన్ నిధులు రూ. 19 లక్షలతో బాగు చేయించారు. మల్లెంపూడి, గుండిమెడ గ్రామానికి వెళ్లే రహదారి పనుల రూ.21 లక్షలతో చేపట్టారు. ప్రస్తుతం మరమ్మతులు పూర్తికాగా డస్ట్‌పోసే పనులు కొనసాగుతున్నాయి. ఎరువులు, ఉత్పత్తులు తరలించేందుకు ఈ రోడ్లు తమకు ఉపయోగపడతాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఫిరంగిపురం, న్యూస్‌టుడే: ఎన్నో ఏళ్లగా నుంచి దారుణంగా మారిన ఫిరంగిపురం- సొలస రహదారి బాగుపడింది. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధుల చొరవతో రాకపోకలకు కష్టాలు తీరడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సృజనాత్మకత పెంపునకు బడి బాట

విద్యార్థులకు సూచలిస్తున్న అధ్యాపకులు

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల ఎస్‌టీపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో ఆలోచన, సృజనాత్మకత పెంపొందించాలన్న లక్ష్యంతో బడిబాట కార్యక్రమం చేపట్టినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తెలిపారు. బుధవారం నూజెండ్లలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఇన్నోవేషన్ డిజైన్ థింకింగ్ అంశంపై కళాశాల సిబ్బంది శోభ తదితరులు విద్యార్థులకు అవగాహన కల్పించారని తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రుణం సొమ్ము ఇవ్వకుండా మోసం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: తన పేరుమీద బ్యాంకులో లోన్ తీసుకుని డబ్బు తనకు ఇవ్వకుండా మోసం చేశారని ఓ మహిళ పోలీసులను ఆశ్రయించిన ఘటన ఇది. స్థానిక పోలీసుల వివరాల మేరకు.. ప్రత్తిపాడు బంధన్ బ్యాంకులో రికవరీ ఏజెంట్‌గా పనిచేసే శివ తన పేరుపై గతేడాది అక్టోబర్ 21న ఓ ప్రైవేటు బ్యాంకులో గ్రూప్ రుణం కింద రూ. 70 వేలు తీసుకున్నాడని, తనకు మాత్రం అసలు రుణం మంజూరు కాలేదని నమ్మబలికాడని ప్రత్తిపాడు మండలం బోయపాలానికి చెందిన షేక్ అల్లాబీ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాంకు వారిని సంప్రదించగా.. శివ వద్ద నుంచి వసూలు చేసి ఇస్తామని చెప్పారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తపస్సు కాల ప్రార్థనలు ప్రారంభం

మేడికొండూరు: ప్రార్థనలో ఫాదర్ తుమ్మ కరుణాకర్ రెడ్డి

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: మండలంలోని గ్రామాలలో క్రైస్తవ సోదరుల తపస్సుకాల ప్రార్థనలు బుధవారం (వీబూది) ప్రారంభం అయ్యాయి. 41 రోజులు జరిగే ప్రార్థనలను క్రైస్తవ మత గురువులు 17 గ్రామాలలోని చర్చిలలో నిర్వహించారు. ముట్లూరు పునీతశౌరి వారి చర్చిలల్లో ప్రత్యేక ప్రార్థనలను ఫాదర్ మార్నేని దిలీప్ కుమార్ ప్రారంభించారు. ఈస్టర్ పండగ వరకు ఈ ప్రార్థనలు కొనసాగుతాయని ఆయన వెల్లడించారు.

ఫిరంగిపురం, న్యూస్‌టుడే: తపస్సు కాలం ప్రారంభ సూచికగా విభూది బుధవారం సందర్భంగా రెవ.ఫాదర్ తుమ్మ కరుణాకర్ రెడ్డి దివ్య పూజాబలి నిర్వహించారు. వాక్యోపదేశం చేశారు. వచ్చే 40 రోజుల పాటు ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయని విచారణ గురువులు రెవ. మాలపాటి ఫాతిమా మర్రెడ్డి తెలియజేశారు.

విద్యుదాఘాతంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి

మేడికొండూరు, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనపై బుధవారం కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని పేరచర్లలో సిమెంట్ రాళ్లు (బ్రిక్స్) తయారు చేసే కంపెనీ కొన్నాళులగా సక్రమంగా పని చేయడం లేదు. బుధవారం ఉదయం ఆ ప్రాంతంలో విద్యుదాఘాతంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. మృతుడి ఒంటిపై చొక్కా లేదు ప్యాంట్ ధరించి ఉన్నాడు. అతడి పక్కన ఓ సంచి పడి ఉంది. దాంట్లో కరెంట్ తీగలు ఉన్నాయి. ఏదైనా వస్తువులు ఎత్తుకెళ్లడానికి అతడు వచ్చి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి వయస్సు 30 నుంచి 35 ఏళ్లు ఉంటుందని భావిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కంపెనీ లీజుదారుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైతులు అపోహలు విడనాడాలి

మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసరావు

పెదనందిపాడు, న్యూస్‌టుడే: వరగాని గ్రామంలో గతంలో జరిగిన రీ సర్వేలో తప్పులు జరిగాయని, వాటిని సరిచేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశారని ఆర్డీవో శ్రీనివాసరావు అన్నారు. వరగాని సచివాలయం ప్రాంగణంలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు అపోహలు విడనాడి సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. భూ కొలతల్లో తప్పులు సరిచేసేందుకు రెండు బృందాలను నియమించామన్నారు. సర్వే సిబ్బంది ప్రతి రైతుకు నోటీసులు ఇచ్చి వారిని పొలాల వద్దకు రప్పించి వారి సమక్షంలోనే సర్వే నంబర్ ప్రకారం కొలతలు తీస్తారన్నారు. సర్వే శాఖ ఏడీ పవన్ కుమార్, జీడీ జాక్షువారావు, తహసీల్దార్ హేనాప్రియ, ఐవోఎస్ కిశోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. పుసులూరులో తహసీల్దార్ పర్యవేక్షణలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు.

(c) eenadu

గుంటూరు తూర్పు

ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలి

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలో భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. బుధవారం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హైమారావు ఆధ్వర్యంలో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును మంగళగిరి పార్టీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో 1,305 మంది ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు.

ధర వరలు

ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 14, వంగ 28, బెండ 25, పచ్చిమిర్చి 46, కాకర 42, క్యారెట్ 24, క్యాబేజీ 18, బీర 40, దొండ 45, బంగాళదుంప 20, ఉల్లిపాయలు 24, గోరుచిక్కుడు 35, దోస 34, పొట్ల 25, చామ 23, గోంగూర 10, తోటకూర 15, చుక్కకూర 15, మెంతికూర 5, కొత్తిమీర 20, బీట్‌రూట్ 25, కీర 42, క్యాప్సికం 65, అల్లం 75, ఫ్రెంచి బీన్స్ 60, సొర 10, అరటి 8. - న్యూస్‌టుడే, పట్నంబజారు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

94406 38515, 80085 73097

స్పందన: ★ ఎల్‌బీ నగర్ ప్రధానరోడ్డులో చెత్తకుప్పలు తీయకపోవడంతో వీధి అపరిశుభ్రంగా మారిందని స్థానికుడు అంజనేయులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్‌కు తెలియజేయడంతో చెత్త కుప్పలు తీయించి తరలించారు.

★ తారకరామనగర్ రెండోలైన్ పైపుకాలువల్లో పూడికలు చేరి మురుగునీటి పారుదలకు ఆటంకంగా ఉందని స్థానికుడు శేఖర్‌బాబు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను ప్రజారోగ్య అధికారులకు తెలియజేయడంతో పూడికలు తీయించారు. - న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ

? పాతగుంటూరు అంకమ్మగుడి సెంటర్‌లో ఆవులు గుంపులుగా చేరుతున్నాయి. రోడ్లపై వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. - అమర్, బస్టాండు సెంటర్ ✔ సమస్యను అధికారులకు వివరించి పరిష్కరిస్తాం. - రత్నం, శానిటరీ ఇన్‌స్పెక్టర్

? నందివెలుగురోడ్డు గాంధీ బొమ్మ సెంటర్‌లో నిత్యం గంటల కొద్దీ ట్రాఫిక్ స్తంభిస్తోంది. రోడ్డుకిరువైపులా ఆక్రమణలు పెరిగాయి. - జశ్వంత్, జెండాచెట్టు సెంటర్. ✔ ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం. - అశోక్‌కుమార్, ట్రాఫిక్ సీఐ

? పొన్నూరురోడ్డులోని పలు చికెన్ షాపుల నిర్వాహకులు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. -సుభానీ, ఆనందపేట ✔ తనిఖీలు చేసి కాటాలు సీజ్ చేస్తాం. -సునీల్‌రాజు, తూనికలు, కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్ - న్యూస్‌టుడే, పట్నంబజారు

శునకాల కట్టడికి సిద్ధం

జీఎంసీ చర్యలు

న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ

నగరంలో ఏళ్లుగా పట్టి పీడిస్తున్న వీధి కుక్కల సమస్యను పరిష్కరించేందుకు జీఎంసీ ప్రజారోగ్య అధికారులు చర్యలు చేపట్టారు. నిలిచిపోయిన శస్త్రచికిత్సలను పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పొన్నూరు రోడ్డులోని ఎంటీఎఫ్ కేంద్రం పక్కన ఉన్న స్థలంలో యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కేంద్రాన్ని సిద్ధం చేస్తున్నారు. గతంలో ఏటుకూరు బైపాస్ ట్రాన్సిట్ పాయింట్ వద్ద ఈ కేంద్రం ఉండేది. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, కు.ని. శస్త్రచికిత్సలు విఫలమవుతున్నాయని, కొన్ని శునకాలు మృత్యువాత పడుతున్నాయని కొంతమంది జంతు ప్రేమికులు కేంద్ర జంతు సంరక్షణ బోర్డుకు ఫిర్యాదులు చేయడంతో నాటి నుంచి ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఇప్పటికైనా శస్త్రచికిత్సలు ప్రారంభించకపోతే నగరంలో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందని ఏబీసీ కేంద్రాన్ని వేగంగా పూర్తి చేయిస్తున్నారు. ఇటీవల కమిషనర్ మయూర్ అశోక్ ఈ కేంద్రాన్ని సందర్శించి పనులు వేగవంతం చేయాలని ఆదేశాలిచ్చారు.

పొన్నూరు రోడ్డులో సిద్ధమవుతున్న ఏబీసీ కేంద్రం

ప్రస్తుతం నగర పరిధిలో 30 వేలకుపైగా కుక్కలున్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. కొవిడ్ లాక్‌డౌన్‌కు ముందు నుంచే ఏబీసీ కేంద్రం పని చేయడం లేదు.

పకడ్బందీగా చేస్తేనే ఉపయోగం..

శునకాల కట్టడికి గతంలో 'స్నేహ్ యానిమల్ వెల్ఫేర్ సొసైటీ' అనే సంస్థ ద్వారా కు.ని. శస్త్రచికిత్సలు చేయించారు. అవి మొక్కుబడిగా జరగడంతో సమస్య పరిష్కారం కాలేదు. కానీ లెక్కల్లో మాత్రం 3,500కుపైగా వీధికుక్కలకు చికిత్సలు చేసి వ్యాక్సినేషన్ ఇచ్చినట్లు గణాంకాలు చూపించి రూ.40 లక్షలకు పైగానే వ్యయం చేశారు. గతేడాది స్వర్ణభారతినగర్‌లో వీధికుక్కలు ఒక బాలుడిపై దాడి చేయడంతో మృత్యువాత పడ్డాడు. పలు ప్రాంతాల్లో శునకాలు దాడులు చేయడంతో అనేకమంది గాయాలతో ఆసుపత్రుల పాలయ్యారు. ఏబీసీ కేంద్రం అందుబాటులోకి వచ్చాక నిత్యం 50-100 కుక్కలకు శస్త్రచికిత్సలు జరిగేలా అధికారులు దృష్టి సారించాల్సి ఉంది. పశుసంవర్ధకశాఖ నుంచి వెటర్నరీ వైద్యుల నియామకంతోపాటు ఏబీసీ కేంద్రానికి అవసరమైన సిబ్బందిని పెంపొందించే అవసరం ఉంది. శునకాలను పట్టుకుని తరలించేందుకు ప్రస్తుతం ఒక వాహనం ఉండగా మరో వాహనం సమకూర్చాలి.

శాస్త్రీయ విధానంలో కుక్కలకు కు.ని. శస్త్రచికిత్సలు చేసి జంతుప్రేమికులు, సంఘాల సూచనలు పరిగణనలోకి తీసుకుని ప్రక్రియ పూర్తి చేస్తే విమర్శలకు తావుండదు.

మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

మాట్లాడుతున్న కమిషనర్ మయూర్ అశోక్

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: రంజాన్ సందర్భంగా మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా పక్కాగా ఏర్పాట్లు చేయాలని కమిషనర్ మయూర్ అశోక్ ఆదేశించారు. బుధవారం కమిషనర్ ఛాంబర్‌లో ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, వ్యర్థాల సేకరణకు అదనపు సిబ్బందిని కేటాయించాలని చెప్పారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. హలీం సెంటర్లకు తాత్కాలిక ట్రేడ్ లైసెన్సులు జారీ చేయాలని, అదే సమయంలో ఆహార నాణ్యత విషయంలో రాజీపడకుండా ఎస్ఎస్‌ఐలు పర్యవేక్షించాలన్నారు. మసీదులకు వెళ్లే మార్గాల్లో వీధిదీపాలు వెలిగేలా చూడాలన్నారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా, అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో సీఎంవోహెచ్ డాక్టర్ శాంతికళ, ఎస్ఈ వెంకటేశ్వరరావు, వీవీఎస్ డాక్టర్ నాగేశ్వరరావు, బయాలజిస్ట్ శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

జీఎంసీ బయాలజిస్ట్‌గా దొర శేషయ్య

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ బయాలజిస్ట్‌గా దొర శేషయ్య బాధ్యతలు స్వీకరించారు. ఆయన విజయవాడ వెటర్నరీ బయలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో సీనియర్ ఎంటమాలజిస్ట్‌గా చేస్తూ డిప్యుటేషన్‌పై ఇక్కడికి వచ్చారు. ఇంతవరకు ఇక్కడ బయాలజిస్ట్‌గా పనిచేసిన రాజునాయక్ ఎన్టీఆర్ జిల్లా మలేరియా విభాగ అధికారిగా బదిలీపై వెళ్తున్నారు. నగరంలో యాంటీ లార్వా ఆపరేషన్స్ నిర్వహించేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పని చేస్తామని శేషయ్య చెప్పారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయులను ఒత్తిడికి గురి చేయొద్దు

డీఈవో సలీంబాషాకు వినతిపత్రం ఇస్తున్న టీఎన్‌యూఎస్ నాయకులు

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: ఎయిడెడ్ పాఠశాలల గుర్తింపు విషయమై కరస్పాండెంట్‌లకు నోటీసులు ఇచ్చే క్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులను ఎంఈవోలు ఒత్తిడికి గురి చేస్తున్నారని టీఎన్‌యూఎస్ నాయకులు తెలిపారు. బుధవారం సంఘం నాయకులు డీఈవో సలీంబాషాను కలిసి వినతిపత్రం సమర్పించారు. నాయకులు మాట్లాడుతూ జీవో నంబరు 90 ప్రకారం మూడేళ్ల గుర్తింపు గడువు పూర్తయిన తర్వాత ఎనిమిదేళ్లకు పొడిగించాల్సి ఉంటుందన్నారు. గుర్తింపు లేని పాఠశాలల సిబ్బందికి జీతాలు వెంటనే నిలిపేయడం జరగదని డీఈవో తెలిపారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎన్‌యూఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎన్వీ జగదీష్‌కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పసల బాలస్వామి, పాలేటి జగదీష్‌బాబు పాల్గొన్నారు.

సమ్మెకాలం జీతం చెల్లించాలి

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెకాలం జీతం చెల్లించాలని, బదిలీ కార్మికులకు నెల మొత్తం పని కల్పించాలని కోరుతూ జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు పూనేపల్లి శ్రీనివాసరావు, నగర ప్రధాన కార్యదర్శి ముత్యాలరావు కోరారు. బుధవారం కమిషనర్ మయూర్ అశోక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఆర్టీసీ గ్యారేజీని కాపాడుకుందాం

రిలే దీక్షలో వివిధ సంఘాల నాయకులు

పట్నంబజారు, న్యూస్‌టుడే: ఆర్టీసీ గ్యారేజీని ప్రైవేటు సంస్థలకు అప్పగించే విధానాన్ని విరమించుకోవాలని ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ నాయకులు కేవీ నరసింహారావు విజ్ఞప్తి చేశారు. గుంటూరు-2 డిపోలోని గ్యారేజీని విద్యుత్తు బస్సుల నిర్వహణ కోసం ప్రైవేటు సంస్థకు అప్పగించటాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో రెండో రోజు బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి టీవీజీ రవిశంకర్ మాట్లాడుతూ విశాఖ స్టీలు పరిశ్రమ తరహాలో యాజమాన్యం ఆర్టీసీలో గ్యారేజీలను ప్రైవేటు సంస్థకు అప్పగించే ప్రయత్నం చేస్తోందన్నారు. జేఏసీ ఛైర్మన్ పి.అమర్నాథ్ మాట్లాడుతూ ఉద్యోగులంతా ఐక్యంగా డిపోను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో త్రిలోచ్చిన దత్తు, ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోండి

మాట్లాడుతున్న సత్యనారాయణ. పక్కన అంజిబాబు, హనుమంతరావు, రామారావు, మరియదాసు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ప్రారంభించాలని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే అందులోని కొన్ని పథకాలనే తిరిగి ప్రారంభిస్తామనడం సరికాదని రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ అన్నారు. బుధవారం కొత్తపేటలోని కార్యాలయంలో జిల్లా నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్మికుల పిల్లల వివాహానికి రూ. లక్ష, భార్య లేదా కుమార్తెల ప్రసవానికి రూ. లక్ష, సహజ మరణానికి రూ. 5 లక్షలు, ప్రమాద బీమా పథకం కింద రూ. 5 లక్షలు, 50 ఏళ్లు నిండిన ప్రతి కార్మికుడికి పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. నగర అధ్యక్షుడు అంజిబాబు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 23న కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో హనుమంతురావు, రామారావు, మరియదాసు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పన్ను బకాయి చెల్లించకపోతే ఆస్తుల జప్తు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: జీఎంసీకి పన్ను బకాయిలు చెల్లించని వారిపై, పెద్ద మొత్తాల్లో బకాయి ఉన్నవారి కుళాయి కనెక్షన్ల తొలగింపునకు, ఆస్తుల సీజ్‌కు చర్యలు తీసుకోవాలని కమిషనర్ మయూర్ అశోక్ ఆదేశించారు. బుధవారం పన్ను వసూళ్లపై రెవెన్యూ విభాగ అధికారులతో సమీక్షించారు. పురోగతి లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్దేశిత లక్ష్యం మేరకు వసూలు చేయని సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పన్ను చెల్లింపుదారులకు వీలుగా జీఎంసీ ప్రధాన, సర్కిల్ కార్యాలయాలతోపాటు భారత్‌పేట 140, ఎల్ఆర్‌కాలనీ మెయిన్‌రోడ్డు 53, వసంతరాయపురం 148, గోరంట్ల వినాయకుడి గుడి వద్ద 183, గుజ్జనగుండ్ల 106, సుద్దపల్లి డొంక 26 స్వర్ణ వార్డు సచివాలయాల్లో నగదు కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డీసీలు శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, జి.సాంబశివరావు, ఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

కర్పూరి ఠాకూర్‌కు నివాళి

ఠాకూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న శ్రీనివాసులు, రమణయ్య తదితరులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: భారతరత్న కర్పూరి ఠాకూర్ ఆదర్శనీయులని బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం బీసీఇఎఫ్ కార్యాలయంలో ఠాకూర్ సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పీవీ రమణయ్య, వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంవీ ప్రసాద్, సుబ్బారావు, శ్రీనివాస్, సాంబయ్య, బాలతాతయ్య పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెల 23 నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో నిబంధనల మేరకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆర్జేడీ పద్మ ఆదేశించారు. బుధవారం ప్రభుత్వ మహిళా కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షల సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఇంటర్‌బోర్డు కార్యదర్శి రంజిత్‌బాషా జూమ్ సమావేశంలో మాట్లాడి చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, కస్టోడియన్లకు సూచనలు ఇచ్చారు. ఆర్జేడీ మాట్లాడుతూ ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ఆర్ఐవో జి.సునీత, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జ్యోత్స్న కుమారి, డీఈసీ సభ్యులు సుచరిత, సిరిల్‌పాల్, రామారావు పాల్గొన్నారు.

పేరుకుపోతున్న వ్యర్థాలు.. పట్టించుకోని అధికారులు

పాతగుంటూరు నుంచి మణిపురం బ్రిడ్జి సెంటర్‌కు వచ్చే దారిలో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దాదాపు వారం రోజుల నుంచి రోడ్ల వెంబడి పేరుకుపోయిన వ్యర్థాల్ని తొలగించకపోవటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటి నుంచి వెలువడుతున్న దుర్వాసన కారణంగా ఇళ్లల్లో నివాసం ఉండలేకపోతున్నామని ఆ ప్రాంతవాసులు తెలిపారు. - న్యూస్‌టుడే, పట్నంబజారు

రహదారిపై మురుగునీటి ప్రవాహం

నెహ్రూనగర్ ప్రధాన రహదారిపై మురుగునీరు ప్రవహిస్తోంది. సైడు కాలువల్లో అడ్డుపడిన వ్యర్థాలు తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. నీరు ముందుకెళ్లే పరిస్థితి లేక పైకి పొంగుతోంది. వాహనాలు వెళ్లేప్పుడు చింది మీద పడుతోందని స్థానికులు వాపోతున్నారు. - న్యూస్‌టుడే, నెహ్రూనగర్

రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు

సైడు కాలువలు నిర్మించరూ...

సుద్దపల్లి డొంకరోడ్డులోని శ్మశాన వాటిక ఎదురు సైడు కాలువలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు పదేళ్ల నుంచి వాటిని నిర్మించలేదు. వ్యర్థాలు పేరుకుపోయి ఇళ్ల ముందు మురుగునీరు చేరుతోందని ఆ ప్రాంతవాసులు తెలిపారు. - న్యూస్‌టుడే, పట్నంబజారు

ఉపయోగపడని చేతిపంపులు

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు పలు ప్రాంతాల్లో వేసిన చేతి పంపులు నిరుపయోగంగా మారాయి. చాలా రోజుల క్రితమే మరమ్మతులకు గురైనా వాటిని బాగు చేయించలేదు. కొన్ని చోట్ల చిరువ్యాపారులు బండ్లు అడ్డుగా పెట్టటంతో అవి ప్రజలకు ఉపయోగపడటం లేదు.

- న్యూస్‌టుడే, గుంటూరు నగరం

మసీదుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలి

కమిషనర్ మయూర్ అశోక్‌కు వినతి పత్రం అందజేస్తున్న షేక్ సజీల

పట్నంబజారు, న్యూస్‌టుడే: రంజాన్ మాసంలో మసీదుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని డిప్యూటీ మేయర్ షేక్ సజీల కోరారు. ఈ మేరకు బుధవారం నగర కమిషనర్ మయూర్ అశోక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురువారం నుంచి రంజాన్ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో మసీదుల వద్ద వీధి దీపాలు, తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని, అపరిశుభ్ర వాతావరణం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వీధుల్లో కుక్కల కట్టడికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ముస్లిం సోదరులు ఇబ్బందులు పడకుండా మసీదుల వద్ద ఏర్పాట్లు చేస్తామని నగర కమిషనర్ మయూర్ అశోక్ స్పష్టం చేశారు.

ప్రజల నుంచి ఫిర్యాదులొస్తున్నాయ్.. పట్టించుకోండి

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కమిషనర్ మయూర్ అశోక్ ఆదేశించారు. బుధవారం జీఎంసీ కౌన్సిల్ హాల్‌లో ఇంజినీరింగ్ అధికారులు, గుత్తేదారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ గుత్తేదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. డివిజన్ల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. కొందరు పనులను అసంపూర్తిగా చేస్తున్నారని, నిర్మాణ సామగ్రిని రోడ్లపై వేయడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. పూర్తయిన పనులకు బిల్లులను నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడంపై జీఎంసీ అకౌంట్స్, ఆడిట్, ఇంజినీరింగ్ అధికారులకు శిక్షణ ఇప్పించామన్నారు. అత్యవసర పనులు మినహా అగ్రిమెంట్ వర్క్ ఆర్డర్ లేకుండా చేపట్టవద్దని స్పష్టం చేశారు. నిర్మాణ పనులకు జీఎంసీ నుంచి శుద్ధ జలం అందించడం సాధ్యం కాదని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అసంపూర్తి పనులు.. తప్పని అవస్థలు

న్యూస్‌టుడే, గుంటూరు నగరం

సుద్దపల్లి డొంకరోడ్డులో అసంపూర్తిగా డ్రెయిన్

తూర్పు నియోజకవర్గం పరిధిలోని పాత గుంటూరులో అసంపూర్తి పనులతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. రెండు కిలోమీటర్ల మేర ఉన్న సుద్దపల్లి డొంక రోడ్డును సగం వరకే నిర్మించి వదిలేశారు. దీనికి ఇరువైపులా మురుగు కాలువలు నిర్మించలేదు. ఫలితంగా మురుగు ఎక్కడబడితే అక్కడ నిలిచిపోతోంది. దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయి. పైగా మురుగు నుంచి వెలువడుతున్న దుర్వాసన ప్రజలను నిలబడనీయడం లేదు.

★ సుద్దపల్లి డొంకరోడ్డు విస్తరణ, కాలువల నిర్మాణానికి గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిధులు కేటాయించినప్పటికి పనులు చేయకుండా గాలికొదిలేశారు. వర్షం పడితే ప్రగతినగర్, బాలాజీనగర్ తదితర ప్రాంతాల ప్రజలు రోడ్డుపై అడుగు పెట్టలేని పరిస్థితి ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు చేపట్టినా గుత్తేదారు సగం వరకే నిర్మించారు.

నేతల హామీల అమలేదీ?

సుద్దపల్లి డొంక రోడ్డును పూర్తిస్థాయిలో విస్తరించి మురుగు కాలువలు నిర్మిస్తామని 2014 ఎన్నికల సమయంలో అభ్యర్థులందరూ హామీలిచ్చారు. అప్పట్లో గెలిచిన వైకాపా ఎమ్మెల్యే హామీని తుంగలో తొక్కారు. 2019 ఎన్నికల్లో మళ్లీ అదే వ్యక్తి వైకాపా ఎమ్మెల్యేగా గెలిచినా.. హామీని పట్టించుకోలేదు. 2024 ఎన్నికల్లో రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఈ రోడ్డును అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో గెలిచిన తెదేపా ఎమ్మెల్యే రహదారి నిర్మాణం కొంతమేర పూర్తి చేయించారు. మిగిలిన భాగాన్ని పూర్తి చేసి.. మురుగు కాలువలు నిర్మించి తమ కష్టాలు తీర్చాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

క్రీడాకారుల విజయాలు జిల్లాకు గర్వకారణం

క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే మాధవి

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో క్రీడాకారులు విజయాలు సాధించడం జిల్లాకు గర్వకారణమని ఎమ్మెల్యే గల్లా మాధవి పేర్కొన్నారు. ఇటీవల కర్నూలులో జరిగిన రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను బుధవారం అభినందించారు. నాగజ్యోతి (76 కేజీల విభాగం), రిహాన్ ఖాన్ (53 కేజీలు), వినోద్‌కుమార్ (74 కేజీలు) బంగారు పతకాలు సాధించారు. సింగరాయకొండలో జరిగిన రోల్‌బాల్ లీగ్ పోటీల్లో కైవల్యశ్రీ, మనస్విని, అమూల్య, హృతిక, యశోద, లేహశ్రుతి బృందం ద్వితీయ స్థానంలో నిలిచింది. ఉత్తరాఖండ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నాగజ్యోతి, స్వాతి పసిడి పతకాలు సాధించారు. వీరిని ఎమ్మెల్యే మాధవి అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

స్వార్థం వీడమని చెప్పడమే లక్ష్యం

మాట్లాడుతున్న సువీరానంద స్వామి

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్వార్థం వీడి, త్యాగబుద్ధితో నడుచుకుంటూ జ్ఞానంతో అమరత్వాన్ని పొందాలని ఈశావాస్యోపనిషత్తు చెపుతోందని చిన్మయమిషన్ సువీరానంద స్వామి అన్నారు. బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వర స్వామి దేవాలయంలోని అన్నమయ్య కళావేదికపై జరుగుల బంగారుబాబు, శివకుమారి దంపతుల సౌజన్యంతో ఈశావాస్యోపనిషత్తుపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈశావాస్యోపనిషత్తు ఆత్మజ్ఞానం, కర్మజ్ఞానాల సమన్వయాన్ని, భగవంతుడి ఆరాధన ప్రాముఖ్యతను తెలుపుతుందన్నారు.

20న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల రాక

పట్నంబజారు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం పేరు మార్చడం సరికాదని డీసీసీ అధ్యక్షుడు యన్నం సుధీర్‌బాబు అన్నారు. రాజీవ్‌గాంధీభవన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో భాగంగా ఈ నెల 20న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తెనాలిలోని మున్సిపల్ మార్కెట్ కూడలిలో నిర్వహించనున్న సమావేశంలో పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల పాల్గొంటారని తెలిపారు. విలేకర్ల సమావేశంలో లింగంశెట్టి ఈశ్వరరావు, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం దహనంపై దర్యాప్తు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంపాలెం పోలీసుస్టేషన్ పరిధిలో ఇటీవల ఓ ఇంటి ముందు ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు కాల్చివేసిన ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సదరు వాహనం యజమాని ఓ వృద్ధురాలిపై అనుమానం వ్యక్తం చేస్తూ నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఘటనాస్థలానికి సమీపంలో సీసీ కెమెరాల్లోని దృశ్యాలను సేకరించి, పలువురు అనుమానితులను విచారించారు. ఈ కేసులో తనను ఇరికించడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారంటూ ఓ వృద్ధురాలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. తన ఫొటోలు సెల్‌ఫోన్‌లో తీసి మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారని వారిపై చర్యలు తీసుకోవాలని అందులో పేర్కొన్నారు.

మిర్చియార్డు డైరెక్టర్లకు సన్మానం

డైరెక్టర్లను సన్మానిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: గుంటూరు మిర్చియార్డు డైరెక్టర్లుగా నియమితులైన నక్కల వంశీకృష్ణ, చంద్రగిరి బాబు, జాన్ సైదాలను చుట్టుగుంటలోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు క్రాంతికుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ మల్లెల ఈశ్వర్, వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, బీసీ సంఘ కార్యదర్శి కోలా అశోక్, వైఈపీపీ గౌరవ అధ్యక్షుడు శివకుమార్, అఖిల భారత యాదవ సంఘ అధ్యక్షుడు ఉప్పుటూరి పేరయ్య యాదవ్, కోటప్పకొండ యాదవ భవన అధ్యక్షుడు మద్దుల కోటయ్య యాదవ్, బీసీ సంఘ రాష్ట్ర నాయకులు రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

క్రీడాకారులు, కోచ్‌ను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయుడు ఖాజావలి

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: ఏటీ అగ్రహారం ఎస్‌కేబీఎం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని, పవర్‌లిఫ్టింగ్ క్రీడాకారిణి జి.స్వాతిని ప్రధానోపాధ్యాయుడు ఖాజావలి బుధవారం సన్మానించారు. హరిద్వార్ భారత్ సేవ ఆశ్రమంలో జరిగిన జాతీయ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్-2026, అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిందన్నారు. అదే స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న పి.వినోద్‌కుమార్ బంగారు పతకం సాధించాడు. ఈసందర్భంగా పాఠశాలలో స్వాతి, వినోద్‌కుమార్, కోచ్ కమరుద్దీన్, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్‌లను బుధవారం అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో సీతామహాలక్ష్మి, జైభీమ్, ఇందిరా, ఝాన్సీ, ఝాన్సీలక్ష్మి, సుబ్బారావు, మంగరావు, శీలం శ్రీనివాసరావు, మల్లికార్జునరావు, రవి, జవహర్‌బాబు, ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కారు అమ్ముతానని మోసం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: కారు అమ్ముతానని మోసం చేసిన వ్యక్తిపై పట్టాభిపురం ఠాణాలో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. వేజండ్లకు చెందిన బషీద్‌కు కారు ఉంది. ఆయనకు హైదరాబాద్‌లోని అలీఖాన్‌తో ఆన్‌లైన్‌లో పరిచయం ఏర్పడింది. కారు విక్రయించే వ్యవహారంపై లక్ష్మీపురంలోని అన్నపూర్ణ హోటల్‌లో చర్చలు సాగాయి. డిసెంబరు 6న కారు తీసుకెళ్లి ఇప్పటి వరకు విక్రయించి డబ్బు ఇవ్వలేదు. మోసపోయానని గ్రహించిన బషీద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సృజనాత్మకత పెంపునకు 'బడి బాట'

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల ఎస్టీపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో ఆవిష్కరణాత్మక ఆలోచన, సృజనాత్మకత పెంపొందించాలన్న లక్ష్యంతో బడిబాట కార్యక్రమం చేపట్టినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తెలిపారు. బుధవారం నూజెండ్లలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఇన్నోవేషన్ డిజైన్ థింకింగ్ అంశంపై కళాశాల సిబ్బంది శోభ తదితరులు విద్యార్థులకు అవగాహన కల్పించారని తెలిపారు.

గంజాయి కేసులో మహిళ అరెస్టు

పట్నంబజారు, న్యూస్‌టుడే: గంజాయి కేసులో వీర్లంకమ్మ అనే మహిళను బుధవారం లాలాపేట పోలీసులు అరెస్టు చేశారు. ఎస్బీ సీఐ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ, లాలాపేట పోలీసులు ఐపీడీ కాలనీలోని వీర్లంకమ్మ ఇంట్లో తనిఖీ చేసి 120 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆమె మేనల్లుడు గుండి సాంబిరెడ్డి చెడు వ్యసనాలకు బానిసై డబ్బుల కోసం అరకు నుంచి గంజాయి తెచ్చి యువకులకు విక్రయిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. సాంబిరెడ్డి పరారీలో ఉన్నాడు. మహిళను అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు.

(c) eenadu

గుంటూరు పశ్చిమ

పన్ను బకాయి చెల్లించకపోతే ఆస్తుల జప్తు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: జీఎంసీకి పన్ను బకాయిలు చెల్లించని వారిపై, పెద్ద మొత్తంలో బకాయిలున్నవారి కుళాయి కనెక్షన్లు తొలగించనున్నట్లు, ఆస్తుల సీజ్‌కు చర్యలు తీసుకోవాలని కమిషనర్ మయూర్ అశోక్ ఆదేశించారు. బుధవారం పన్ను వసూళ్లపై రెవెన్యూ విభాగ అధికారులతో సమీక్షించారు. పురోగతి లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్దేశిత లక్ష్యం మేరకు వసూలు చేయని సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పన్ను చెల్లింపుదారుల వీలుగా జీఎంసీ ప్రధాన, సర్కిల్ కార్యాలయాలతోపాటు భారత్‌పేట 140, ఎల్ఆర్‌కాలనీ మెయిన్‌రోడ్డు 53, వసంతరాయపురం 148, గోరంట్ల వినాయకుడి గుడి వద్ద 183, గుజ్జనగుండ్ల 106, సుద్దపల్లి డొంక 26 సచివాలయాల్లో నగదు కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డీసీలు శ్రీనివాసరావు, సీహెచ్. శ్రీనివాస్, జి.సాంబశివరావు, ఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెల 23 నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో నిబంధనల మేరకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆర్జేడీ పద్మ ఆదేశించారు. బుధవారం ప్రభుత్వ మహిళా కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షల సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఇంటర్‌బోర్డు కార్యదర్శి రంజిత్‌బాషా జూమ్ సమావేశంలో మాట్లాడి చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, కస్టోడియన్లకు సూచనలు ఇచ్చారు. ఆర్జేడీ మాట్లాడుతూ ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ఆర్ఐవో జి.సునీత, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఝాన్సీలక్ష్మి, డీఈసీ సభ్యులు సుచరిత, సిరిపోపల్, రామారావు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

80086 22566, 97042 53525, 80085 74897

? శాంతినగర్ 5వ లైన్‌లో నాలుగు రోజుల నుంచి పూడిక తీయడం లేదు. దీంతో వ్యర్థాలు దుర్వాసన వెదజల్లుతోంది. - స్థానికులు

✓ పారిశుద్ధ్య సిబ్బందితో పూడిక తీయిస్తాం. - అంగడి వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

? స్థానిక కాలేజ్ నగర్ ప్రధాన డ్రెయిన్‌లో వ్యర్థాలు ఉండటంతో దోమలు వ్యాపిస్తున్నాయి.

✓ డ్రెయిన్‌లోని వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - అంగడి రాజేష్, శానిటరీ సూపర్‌వైజర్ - న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం

ధర వరలు

కృష్ణనగర్ రైతుబజార్‌లో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో): టమాట 14, వంగ 27, బెండ 25, పచ్చిమిర్చి 46, కాకర 40, బీర 34, క్యాలిఫ్లవర్ 26, క్యాబేజి 18, క్యారెట్ 26, దొండ 42, బంగాళదుంప 20, ఉల్లిపాయలు 23, గోరుచిక్కుళ్లు 32, దోస 25, సొర 15, పొట్లకాయ 24, అరటికాయ 8, పెద్ద చిక్కుళ్లు 48, చామదుంప 22, బీట్‌రూట్ 28, ముల్లంగి 15, కీర దోసకాయ 40, బీన్స్ 68, క్యాప్సికం 64, కొత్తిమీర 20, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 55, అల్లం 75, వెల్లుల్లి 155, పండు మిర్చి 60. - న్యూస్‌టుడే, పట్టాభిపురం

శునకాల కట్టడికి సిద్ధం

జీఎంసీ చర్యలు

న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ

నగరంలో ఏళ్లుగా పట్టి పీడిస్తున్న వీధి కుక్కల సమస్యను పరిష్కరించేందుకు జీఎంసీ ప్రజారోగ్య అధికారులు చర్యలు చేపట్టారు. నిలిచిపోయిన శస్త్రచికిత్సలను పునరుద్ధరించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. పొన్నూరు రోడ్డులోని ఎంఆర్ఎఫ్ కేంద్రం పక్కనే ఉన్న స్థలంలో యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కేంద్రాన్ని సిద్ధం చేస్తున్నారు. గతంలో ఏటుకూరు ట్రాన్సిట్ పాయింట్ వద్ద ఈ కేంద్రం ఉండేది. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం, కు.ని. శస్త్రచికిత్సలు విఫలమవుతున్నాయని, కొన్ని శునకాలు మృత్యువాత పడుతున్నాయని కొంతమంది జంతు ప్రేమికులు కేంద్ర జంతు సంరక్షణ బోర్డుకు ఫిర్యాదులు చేయడంతో నాటి నుంచి ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఇప్పటికైనా శస్త్ర చికిత్సలు ప్రారంభించకపోతే నగరంలో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందని ఏబీసీ కేంద్రాన్ని వేగంగా పూర్తి చేయిస్తున్నారు. జీవీఎంసీ కమిషనర్ మయూర్ అశోక్ ఆ కేంద్రాన్ని సందర్శించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

పొన్నూరు రోడ్డులో సిద్ధమవుతున్న ఏబీసీ కేంద్రం

ప్రస్తుతం నగర పరిధిలో 30 వేలకుపైగా కుక్కలున్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. కోవిడ్ లాక్‌డౌన్‌కు ముందు నుంచే ఏబీసీ కేంద్రం పని చేయడం లేదు.

పకడ్బందీగా చేస్తేనే ఉపయోగం..

శునకాల కట్టడికి గతంలో స్నేహ యానిమల్ వెల్ఫేర్ సొసైటీ అనే సంస్థ ద్వారా కు.ని. శస్త్రచికిత్సలు చేయించారు. ఇదంతా మొక్కుబడిగా జరగడంతో సమస్య పరిష్కారం కాలేదు. కానీ లెక్కల్లో మాత్రం 3,500కుపైగా వీధికుక్కలకు చికిత్సలు చేసి వ్యాక్సినేషన్ ఇచ్చినట్లు గణాంకాలు చూపారు. రూ.40 లక్షలకుపైగానే వ్యయం చేశారు. గతేడాది స్వర్ణభారతినగర్‌లో వీధికుక్కలు ఒక బాలుడిపై దాడి చేయడంతో మృత్యువాత పడ్డాడు. పలు ప్రాంతాల్లో శునకాలు దాడులు చేయడంతో అనేకమంది గాయాలతో ఆసుపత్రుల పాలయ్యారు. ఏబీసీ కేంద్రం అందుబాటులోకి వస్తే నిత్యం 50-100 కుక్కలకు శస్త్రచికిత్సలు జరిగేలా అధికారులు దృష్టి సారించాల్సి ఉంది. పశుసంవర్ధకశాఖ నుంచి వెటర్నరీ వైద్యుల నియామకంతోపాటు ఏబీసీ కేంద్రానికి అవసరమైన సిబ్బందిని పెంచాల్సిన అవసరం ఉంది. శునకాలను పట్టుకుని తరలించేందుకు ప్రస్తుతం ఒక వాహనం ఉండగా మరోవాహనం సమకూర్చాలి.

శస్త్రచికిత్స విధానంలో కుక్కలకు కు.ని. శస్త్రచికిత్సలు చేసి జంతుప్రేమికులు, సంఘాల సూచనలు పరిగణనలోకి తీసుకుని ప్రక్రియ పూర్తి చేస్తే విమర్శలకు తావుండదు.

స్వార్థం వీడమని చెప్పడమే లక్ష్యం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్వార్థం వీడి, త్యాగబుద్ధితో నడుచుకుంటూ జనంతో అమరత్వాన్ని పొందాలని ఈశావాస్యోపనిషత్తు చెప్తుందని చిన్మయ మిషన్ సువీరానంద స్వామి అన్నారు. బృందావన గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయంలోని అన్నమయ్య కళావేదికపై బుధవారం జరుగుతున్న బంగారుబాబు, శివకుమారి దంపతుల సౌజన్యంతో ఈశావాస్యోపనిషత్తుపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈశావాస్యోపనిషత్తు ఆత్మజ్ఞానం, కర్మజ్ఞానాల సమన్వయాన్ని, భగవంతుడి ఆరాధన ప్రాముఖ్యతను తెలుపుతుందన్నారు.

మాట్లాడుతున్న సువీరానంద స్వామి

అప్రమత్తతతోనే సైబర్ నేరాల నివారణ

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం చెప్పకూడదని, ఫోన్లలో ఎలాంటి వివరాలు తెలియజేయకుండా అప్రమత్తతతో ఉన్నప్పుడే సైబర్ నేరాలు నివారించవచ్చని జిల్లా యువజన సేవలు, సెట్ విభాగం మేనేజర్ బి.రాధిక తెలిపారు. నగరంలోని హిందూ కళాశాలలో సెట్ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీపై అవగాహన కార్యక్రమం ప్రిన్సిపల్ విశ్వం అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. రాధిక మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక మాధ్యమాల్లో ఫోన్ నంబర్లు, ఫొటోలు ఎవరికీ పంపొద్దన్నారు. జిల్లా పోలీస్ శాఖ సైబర్ క్రైం విభాగం ప్రతినిధులు.. సైబర్ నేరాలు ఎలా జరుగుతాయి, ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో హిందూ కళాశాల అధ్యాపకులు అప్పర్ల, జిల్లా యువజన సేవలు, సెట్ విభాగం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సెట్ విభాగం మేనేజర్ రాధిక

మహిళా సాధికారత సంకల్పంతో వేడుకలు

కలెక్టరేట్(గుంటూరు): ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మార్చి 7న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరగనున్న మహిళా దినోత్సవ కార్యక్రమ కరపత్రాలను కలెక్టరేట్ సమీపంలోని సంఘ కార్యాలయం వద్ద బుధవారం ఆవిష్కరించారు. కరపత్రాలను సంఘ జిల్లా అధ్యక్షుడు టి.వి.రామిరెడ్డి ఆవిష్కరించి ప్రసంగించారు. మహిళా సాధికారత సాధించాలనే సంకల్పంతో రాష్ట్ర నాయకత్వం ఈ వేడుకలకు శ్రీకారం చుట్టిందన్నారు. అనంతరం రాష్ట్ర మహిళా కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన హేమలత, జిల్లా మహిళా కార్యవర్గం అధ్యక్షురాలిగా ఎన్నికైన షేక్ షబానా సుల్తానా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, కోశాధికారి పెద్ద దత్తయ్య, నగర శాఖ అధ్యక్షుడు కరీముల్లా షా ఖాదరి, మహిళా విభాగం జిల్లా కార్యదర్శి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏపీ జీఈఏ జిల్లా అధ్యక్షుడు రామిరెడ్డి, ఇతర నాయకులు

మిర్చియార్డు డైరెక్టర్లకు సన్మానం

ఏటీ అగ్రహారం: గుంటూరు మిర్చి యార్డు డైరెక్టర్లుగా నియమితులైన నక్కల వంశీకృష్ణ, చంద్రగిరి బాబు, జాన్ సైదాలను చుట్టుగుంటలోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు క్రాంతికుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ మల్లెల ఈశ్వర్, వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, బీసీ సంఘ కార్యదర్శి కోలా అశోక్, వైకాపా గౌరవ అధ్యక్షుడు శివకుమార్, అఖిల భారత యాదవ సంఘ అధ్యక్షుడు ఉప్పుటూరి పేరయ్య యాదవ్, కోటప్పకొండ యాదవ భవన అధ్యక్షుడు మద్దుల కోటయ్య యాదవ్, బీసీ సంఘ రాష్ట్ర నాయకులు రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

డైరెక్టర్లను సన్మానిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

తీగ తగిలితే ప్రమాదమే..

అరండల్‌పేట మూడో లైను ఐదో అడ్డరోడ్డులోని విద్యుత్తు స్తంభం నుంచి ఇంటికి విద్యుత్తు సరఫరా అయ్యే తీగ కిందకు జారిపోయి ప్రమాదకరంగా మారింది. వాహనచోదకులు రాకపోకల సమయంలో చేతికి అందేంత ఎత్తులో వేలాడుతోంది. స్థానికులు ప్రమాదం జరగకుండా తీగకు ఎర్రని వస్త్రం కట్టారు. అధికారులు తీగను సరి చేయాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గోరంట్ల

మలుపులో రోడ్డు మెరుగుపర్చరూ..!

కంకరగుంట అండర్ బ్రిడ్జి నుంచి కలెక్టర్ కార్యాలయం వైపు వచ్చే రోడ్డులో ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. బ్రాడీపేట, లక్ష్మీపురం, అశోక్‌నగర్, పండరీపురం కృష్ణనగర్ తదితర ప్రాంతాల ప్రజలు మలుపులో గుంతలు తప్పించే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతలు పూడ్చించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గుంటూరు నగరం

మురుగు నీటితో వెతలు

రహదారి విస్తరణ పనుల జాప్యంతో కాలువల్లో ప్రవహించాల్సిన మురుగు రోడ్డెక్కుతోంది. లక్ష్మీపురం నుంచి హనుమయ్య కంపెనీ వరకు చేపట్టిన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా గతంలో ఉన్న కాలువలు తవ్వేశారు. కొత్తగా కొంతమేర నిర్మించినా.. కొన్నిచోట్ల అడ్డంకులు ఉండడంతో పనులు ప్రారంభించలేదు. రాజేంద్రనగర్ సమీపంలో కాలువకు అడ్డుగా కంకర పోయడంతో మురుగు రోడ్డుపైకి చేరింది. - న్యూస్‌టుడే, గుంటూరు నగరం

సృజనాత్మకత పెంపునకు ‘బడి బాట’

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల ఎన్టీపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో ఆలోచన, సృజనాత్మకత పెంపొందించాలన్న లక్ష్యంతో బడి బాట కార్యక్రమం చేపట్టినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తెలిపారు. బుధవారం నూజెండ్లలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఇన్నోవేషన్ డిజైన్ థింకింగ్ అంశంపై కళాశాల సిబ్బంది శోభ తదితరులు విద్యార్థులకు అవగాహన కల్పించారని తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు సూచనలిస్తున్న అధ్యాపకులు

వెనుకబడిన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

గుంటూరు పశ్చిమ: వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ మల్లెల ఈశ్వరరావు తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో రూ.51 వేల కోట్లు బీసీలకు కేటాయించడం ఆనందంగా ఉందని చెప్పారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి భారీగా నిధులు కేటాయించారని వివరించారు. గుంటూరులోని వడ్డెర కార్పొరేషన్ సంఘ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వెనుకబడిన తరగతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలనే చిత్తశుద్ధితో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పని చేస్తున్నారని పేర్కొన్నారు. బడ్జెట్‌లో బీసీలకు అధిక నిధులు సాధించడంలో ఆ శాఖ మంత్రి సవిత పాత్ర ఎంతో ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అసెంబ్లీ సమావేశాలు జరగనున్న తరుణంలో వైకాపా ఎమ్మెల్యేలు సభలో చర్చకు వెళ్లకుండా ఆందోళనలు చేయడం సరైన పద్ధతి కాదని చెప్పారు. కార్యక్రమంలో తెదేపా బీసీ నేతలు సూర్యనారాయణ, మణికుమారి, బాబు పాల్గొన్నారు.

పచ్చదనంపై గొడ్డలి వేటు!

పట్టాభిపురం, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ మొక్కల్ని నాటి సంరక్షించడం సంగతి అటుంచితే. . ఎన్నో సంవత్సరాలుగా ఉన్న వృక్షాలను ఎవరికి వారు ఇష్టారాజ్యంగా నరికేస్తున్నా పట్టించుకోవడం లేదు. మొక్కలు నాటి పెంచాలని ప్రభుత్వం ఊదరగొడుతున్నా.. పర్యావరణ ప్రేమికులు నెత్తీనోరు మొత్తుకుంటున్నా.. ఆ పని చేయకపోగా నీడనిస్తున్న వృక్షాలను కొట్టిపడేస్తున్నారు. ఏటా వన మహోత్సవం రోజున లక్షలాది మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, నగరాన్ని గ్రీన్ గుంటూరుగా తీర్చిదిద్దుతామని చెబుతున్నారే తప్ప.. ఆ దిశగా అడుగులే పడడం లేదు. భారీ వృక్షాలు సైతం నరుక్కుంటూ వెళ్తుంటే.. కాంక్రీట్ జంగిల్‌లా తయారయ్యే ప్రమాదం ఉందని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇలా నరికేస్తే ఎలా..: ● చంద్రమౌళీనగర్‌లో సైడు కాలువల నిర్మాణానికి అడ్డుగా ఉన్నాయన్న వంకతో వట వృక్షాలను నరికేసి మోడులుగా చేసేశారు. అసలు వీటిని ఎందుకు నరికారో అర్థం కావడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. చెట్లను ఎందుకు నరికివేస్తున్నారని ఆ ప్రాంతవాసులు పలువురు ప్రశ్నిస్తే పొంతన లేకుండా సమాధానాలు చెప్పారంటున్నారు. ఒకటో, రెండో కాదు.. ఎన్నో వృక్షాలను పూర్తిగా నరికేసి మోడుల్లా మార్చారు. ● ఇప్పటికే ఎవరికి వారు ఇళ్లకు అడ్డుగా వచ్చాయని, అపార్ట్‌మెంట్ల ఎలివేషన్ కనిపించడం లేదని పచ్చదనంపై వేటు వేస్తూనే ఉన్నారు. సుమారు 30, 40 సంవత్సరాలుగా ఉన్న వేప, గానుగ చెట్లు కూల్చివేశారు. అవసరం లేని ప్రాంతంలో కూడా చెట్లను నరికేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండు, మూడు రోజులుగా పచ్చని చెట్లను ఇష్టం వచ్చిన విధంగా నరికేస్తుంటే అధికారులు ఎవ్వరూ అటువైపు తొంగి చూడడంలేదని పర్యావరణ ప్రేమికులు విమర్శిస్తున్నారు. సైడు కాలువలు నిర్మిస్తున్న రహదారిలో కాకుండా పక్క రహదారిలో కూడా చెట్లను నరికేస్తుండడం గమనార్హం. ఇకపై చెట్లను నరకకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వృక్షాలను ఈవిధంగా నరికి పడేశారిలా...

టెలికంనగర్‌లో సమస్యల తిష్ఠ

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరు నగరపాలక సంస్థలో అంతర్భాగమైనప్పటికీ టెలికంనగర్‌లో నివాసం ఉంటున్న వారు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. టెలికంనగర్ 7వ లైన్‌లో మురుగు పారేందుకు కచ్చా డ్రెయిన్ కావడంతో నీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తోంది. కాలువ రెండు వైపులా గడ్డి, పిచ్చి మొక్కలు పెరగడంతో దోమల ఉత్పత్తి కేంద్రంగా మారడంతో పాటు విష కీటకాలు వృద్ధి చెంది గృహాల్లోకి వస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. కల్వర్టు వద్ద చెత్త నిల్వ కోసం జీఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన డంపర్ బిన్ నిండి వ్యర్థాలు కింద పడి రోజులవుతున్నా పారిశుద్ధ్య సిబ్బంది తీసుకెళ్లకపోవడంతో పారిశుద్ధ్యం క్షీణించి దుర్వాసన వస్తోంది. చుట్టూ అపార్ట్‌మెంట్లలో 500 కుటుంబాలు ఉండడంతో వ్యాధులు ప్రబలుతాయేమోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి డ్రెయిన్‌ని నిర్మించడంతో పాటు రోజూ చెత్త, వ్యర్థాలు తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కాలువలో నిల్వ ఉన్న మురుగు నీరు

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారని కక్ష సాధింపులు

కలెక్టరేట్: ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారని కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మాజీ మంత్రి నారాయణస్వామి అన్నారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబ సభ్యులను గుంటూరు సిద్ధార్థనగర్‌లోని నివాసంలో బుధవారం ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్టీ పిలుపులో భాగంగా కార్యక్రమానికి వెళ్లి వస్తున్న సమయంలో అంబటిని రెచ్చగొట్టారన్నారు. పోలీసులను అడ్డు పెట్టుకుని కార్యాలయం, ఇంటిపై దాడి చేశారని మండిపడ్డారు. ఇటువంటి ప్రభుత్వాన్ని ఎన్నడూ చూడలేదని, ముఖ్యమంత్రి చంద్రబాబు.. పోలీసులను ఆయుధంగా వాడుతున్నారన్నారు. ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, మాజీ మంత్రి నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి, పలువురు నాయకులు అంబటి రాంబాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

దాత కృష్ణమూర్తి దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి గుంటూరు జిల్లా గోరంట్ల నివాసి ఎం.కృష్ణమూర్తి దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారు. దాత కుటుంబాలకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ వారికి విరాళం రసీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

విద్యార్థులకు అభినందన

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: ఏటీ అగ్రహారం ఎస్‌కేబీఎం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని, పవర్‌లిఫ్టింగ్ క్రీడాకారిణి జి.స్వాతిని ప్రధానోపాధ్యాయుడు ఖాజావలి బుధవారం సన్మానించారు. హరిద్వార్ భారత్ సేవ ఆశ్రమంలో జరిగిన జాతీయ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్-2026, అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిందన్నారు. అదే స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న పి.వినోద్‌కుమార్ బంగారు పతకం సాధించాడు. ఈసందర్భంగా పాఠశాలలో స్వాతి, వినోద్‌కుమార్, కోచ్ కమరుద్దీన్, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్‌లను బుధవారం అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో సీతామహాలక్ష్మి, జైబీమ్, ఇందిరా, ఝాన్సీ, ఝాన్సీలక్ష్మి, సుబ్బారావు, మంగరావు, శీలం శ్రీనివాసరావు, మల్లికార్జునరావు, రవి, జవహర్‌బాబు, ప్రేమ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు, కోచ్‌లతో ప్రధానోపాధ్యాయుడు ఖాజావలి

క్రీడాకారుల విజయాలు జిల్లాకు గర్వకారణం

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో క్రీడాకారులు విజయాలు సాధించడం జిల్లాకు గర్వకారణమని ఎమ్మెల్యే గల్లా మాధవి పేర్కొన్నారు. ఇటీవల కర్నూలులో జరిగిన రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను బుధవారం అభినందించారు. నాగజ్యోతి (76 కేజీల విభాగం), రీహాన్ ఖాన్ (53 కేజీలు), వినోద్‌కుమార్ (74 కేజీలు) బంగారు పతకాలు సాధించారు. సింగరాయకొండలో జరిగిన రోల్‌బాల్ లీగ్ పోటీల్లో కైవల్యశ్రీ, మనస్విని, అమూల్య, హృతిక, యశోద, లేహశ్రుతి బృందం ద్వితీయ స్థానంలో నిలిచింది. ఉత్తరాఖండ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నాగజ్యోతి, స్వాతి పసిడి పతకాలు సాధించారు. వీరిని ఎమ్మెల్యే మాధవి అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ప్రతిభ కనబర్చిన క్రీడాకారులతో ఎమ్మెల్యే మాధవి తదితరులు

ప్రాంగణ ఎంపికల్లో 64 మంది విజయం

గోరంట్లలోని సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. కళాశాలలో బుధవారం జరిగిన ప్రాంగణ ఎంపికల్లో 64 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపల్ సంధ్య.టి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థినులను అభినందించారు. - న్యూస్‌టుడే, గోరంట్ల

20న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల రాక

పట్నంబజారు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం పేరు మార్చడం సరికాదని డీసీసీ అధ్యక్షుడు యన్నం సుధీర్‌బాబు అన్నారు. రాజీవ్‌గాంధీభవన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో భాగంగా ఈ నెల 20న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తెనాలిలోని మున్సిపల్ మార్కెట్ కూడలిలో నిర్వహించనున్న సమావేశంలో పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల పాల్గొంటారని తెలిపారు. విలేకర్ల సమావేశంలో లింగంశెట్టి ఈశ్వరరావు, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి ఫిర్యాదులొస్తున్నాయ్.. పట్టించుకోండి

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కమిషనర్ మయూర్ అశోక్ ఆదేశించారు. బుధవారం జీఎంసీ కౌన్సిల్ హాల్‌లో ఇంజినీరింగ్ అధికారులు, గుత్తేదారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ గుత్తేదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. డివిజన్ల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. కొందరు పనులను అసంపూర్తిగా చేస్తున్నారని, నిర్మాణ సామగ్రిని రోడ్లపై వేయడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. పూర్తయిన పనులకు బిల్లులను నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడంపై జీఎంసీ అకౌంట్స్, ఆడిట్, ఇంజినీరింగ్ అధికారులకు శిక్షణ ఇప్పించామన్నారు. అత్యవసర పనులు మినహా అగ్రిమెంట్ వర్క్ ఆర్డర్ లేకుండా చేపట్టవద్దని స్పష్టం చేశారు. నిర్మాణ పనులకు జీఎంసీ నుంచి శుద్ధ జలం అందించడం సాధ్యం కాదని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కారు అమ్ముతానని మోసం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: కారు అమ్ముతానని మోసం చేసిన వ్యక్తిపై పట్టాభిపురం ఠాణాలో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. వేజండ్లకు చెందిన బషీద్‌కు కారు ఉంది. ఆయనకు హైదరాబాద్‌లోని అలీఖాన్‌తో ఆన్‌లైన్‌లో పరిచయం ఏర్పడింది. కారు విక్రయించే వ్యవహారంపై లక్ష్మీపురంలోని అన్నపూర్ణ హోటల్‌లో చర్చలు సాగాయి. డిసెంబరు 6న కారు తీసుకెళ్లి ఇప్పటి వరకు విక్రయించి డబ్బు ఇవ్వలేదు. అప్పటి నుంచి అడుగుతుంటే రోజులు వెళ్లబుచ్చుతూ వస్తున్నాడు. మోసపోయానని గ్రహించిన బషీద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: రంజాన్ సందర్భంగా మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా పక్కాగా ఏర్పాట్లు చేయాలని కమిషనర్ మయూర్ అశోక్ ఆదేశించారు. బుధవారం కమిషనర్ ఛాంబర్‌లో ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, వ్యర్థాల సేకరణకు అదనపు సిబ్బందిని కేటాయించాలని చెప్పారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. హలీం సెంటర్లకు తాత్కాలిక ట్రేడ్ లైసెన్సులు జారీ చేయాలన్నారు. మసీదులకు వెళ్లే మార్గాల్లో వీధి దీపాలు వెలిగేలా చూడాలన్నారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా, అవసరమైనచోట్ల ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో సీఎంవోహెచ్ డాక్టర్ శాంతికళ, ఎస్ఈ వెంకటేశ్వరరావు, వీఏఎస్ డాక్టర్ నాగేశ్వరరావు, బయాలజిస్ట్ శేషయ్య పాల్గొన్నారు.

మల్లికార్జునరావు మృతికి నివాళి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గుంటూరు రూరల్ మండలం మాజీ ఎంపీపీ తోట లక్ష్మీకుమారి భర్త తోట శివమల్లికార్జునరావు గుండెపోటుతో మృతి చెందారు. లాలుపురంలోని స్వగృహంలో ఆయన మృతదేహానికి ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు నివాళులర్పించారు. కుటుంబ సభ్యుల్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఆటలతో మానసిక వికాసం

ఎస్వీఎన్‌కాలనీ(గుంటూరు), న్యూస్‌టుడే: నిరంతరం బోధనలో నిమగ్నమయ్యే అధ్యాపకులకు ఆటలతో శారీరక, మానసిక వికాసం చేకూరుతుందని నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. కళాశాల అధ్యాపకుల కోసం జేకేసీ కళాశాల ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే చందూస్ సిల్వర్ కప్ క్రికెట్ టోర్నమెంట్ బుధవారం మొదలైంది. నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకులైన జాగర్లమూడి చంద్రమౌళి, ఆయన మనవడు మాస్టర్ చంద్రమౌళి పేరున 29 ఏళ్ల నుంచి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ పాలక మండలి కార్యవర్గం పూలమాలలతో నివాళులర్పించింది.

తొలిరోజు పోటీలు: జేకేసీ కళాశాలలో జరిగిన పోటీల్లో ఏఎన్‌యూపై బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల విజయం సాధించగా, జేకేసీ వాకోవర్ ఇవ్వడంతో కేఎల్‌యూ జట్టు విజయం సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. ● ఆర్వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరిగిన పోటీల్లో ఏజీఎస్‌జీ(ఉయ్యూరు) జట్టుపై చిప్స్ 175 పరుగుల తేడాతో గెలుపొందగా, మరో పోటీలో ఎస్ఆర్ఎం-బి జట్టుపై ఈశ్వర్(నరసరావుపేట) జట్టు 8 వికెట్లతో ఘన విజయం సాధించింది. ● పేరేచర్లలోని జాగర్లమూడి నరేంద్రనాథ్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో చలపతి లాంపై ఎస్ఆర్‌కేఆర్-బి(భీమవరం) విజయం సాధించగా, వీవీఐటీయూ(నంబూరు)పై విట్ (అమరావతి) గెలుపొందింది. ● వడ్లమూడి విజ్ఞాన్ విశ్వవిద్యాలయ మైదానంలో కిట్స్ అక్షర్‌పై మలినేని ఇంజినీరింగ్ ఒక్క పరుగు తేడాతో గెలుపొందగా, యూనివర్సల్ జట్టుపై కిట్స్ ఇంజినీరింగ్ జట్టు జయకేతనం ఎగురవేసింది. ● మోతడకలోని చలపతి గ్రౌండ్స్‌లో పీవీపీ సిద్ధార్థ (విజయవాడ)పై ఆర్కే ఇంజినీరింగ్(విజయవాడ) విజయం సాధించగా, ఏఎం రెడ్డి(నరసరావుపేట) వాకోవర్ ఇవ్వడంతో చలపతి జట్టును విజేతగా ప్రకటించారు.

అధ్యాపకులతో రాయపాటి శ్రీనివాస్, తదితరులు

ద్విచక్రవాహనం దహనంపై దర్యాప్తు

గుంటూరు నేరవార్తలు: నగరంపాలెం పోలీసుస్టేషన్ పరిధిలో ఇటీవల ఓ ఇంటి ముందు ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు కాల్చివేసిన ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సదరు వాహనం యజమాని ఓ వృద్ధురాలిపై అనుమానం వ్యక్తం చేస్తూ నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఘటనాస్థలానికి సమీపంలో సీసీ కెమెరాల్లోని దృశ్యాలను సేకరించి, పలువురు అనుమానితులను విచారించారు. ఈ కేసులో తనను ఇరికించడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారంటూ ఓ వృద్ధురాలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. తన ఫొటోలు సెల్‌ఫోన్‌లో తీసి మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారని వారిపై చర్యలు తీసుకోవాలని అందులో పేర్కొన్నారు.

(c) eenadu

మాదకద్రవ్యాలు.. బెట్టింగ్స్.. రుణయాప్‌ల జోలికి వెళ్లొద్దు బ్రో..

'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో అవగాహన సదస్సు రేపు

కళాశాలల్లో మాదకద్రవ్యాల వినియోగం పెరిగిపోవడంతో అనేకమంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారుతోంది. బాగా చదువుకునే విద్యార్థులకు సైతం మత్తును అలవాటు చేసి.. వారి జీవితాలతో మాదకద్రవ్యాల విక్రేతలు చెలగాటం ఆడుతున్నారు. ఒకసారి మత్తుకు అలవాటుపడితే.. దానిలోనుంచి బయటకురాలేనంతగా యువత బానిసలుగా మారిపోతున్నారు. మరోవైపు బెట్టింగ్ ముఠాల చేతుల్లోనూ విద్యార్థులు పావులుగా మారుతున్నారు. మాదక ద్రవ్యాలు, బెట్టింగ్ కోసం.. రుణ యాప్‌లను ఆశ్రయిస్తున్నారు. దీంతో విద్యార్థులతో పాటు వారి కుటుంబాలు సైతం తీవ్రమైన ఆర్థిక సమస్యల్లో చిక్కుకుంటున్నారు. తిరిగి కోలుకోలేనంతగా కుటుంబాలు చితికిపోతున్నాయి. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, బెట్టింగ్, రుణ యాప్‌లలో విద్యార్థులు ఎలా చిక్కుకుంటున్నారనే దానిపై అవగాహన కల్పించేందుకు 'ఈనాడు, ఈటీవీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సదస్సు జరగనుంది. ఆయా రంగాల్లోని నిపుణులు హాజరై విద్యార్థులకు వాస్తవ పరిస్థితిపై అవగాహన కల్పిస్తారు. - ఈనాడు, అమరావతి

వేదిక: కృష్ణవేణి డిగ్రీ కళాశాల, తాతినేనినగర్, 100 అడుగుల రోడ్డు, తాడిగడప | 20.02.26 (శుక్రవారం) | ఉదయం 10.30 గంటలకు

స్వర్ణోత్సవ శోభ



భవానీద్వీపంలో బుధవారం ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ 50 ఏళ్ల వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. - భవానీపురం, న్యూస్‌టుడే

దూసుకొస్తూ.. ప్రాణాలు హరిస్తూ..!

- ద్విచక్ర వాహనాలతో మైనర్ల స్వైర విహారం
- రహదారి ప్రమాదాల్లో అమాయకుల బలి

★ సయ్యద్ **అబూబకర్ సిద్ధిఖ్...** చల్లపల్లి మండలం లక్ష్మీపురంలో పలావ్ సెంటర్ నడిపి జీవనం సాగిస్తున్నాడు. 2024 మార్చిలో తన దుకాణం వద్ద రోడ్డు దాటుతుండగా పదో తరగతి విద్యార్థి (మైనర్) ద్విచక్ర వాహనంపై దూసుకొచ్చి ఢీకొట్టాడు. సిద్ధిఖ్ రెండు కాళ్లు విరిగిపోయాయి. తలకు బలమైన గాయమై కోమాలోకి వెళ్లి.. బయటకొచ్చాడు. ఇప్పటికీ నాలుగు అడుగులు వేయలేని దుస్థితి.

★ కానూరులో **శ్రీహర్ష వర్ధన్** అనే పదోతరగతి విద్యార్థిని బలి తీసుకున్నది కూడా మైనర్లే. పదో తరగతి విద్యార్థులు ముగ్గురు బైక్‌పై వేగంగా దూసుకొచ్చి రోడ్డు దాటుతున్న హర్షను ఢీకొట్టారు. మైనర్‌కు వాహనం ఇచ్చినందుకు బాలుడి తండ్రిపై కేసు నమోదైంది. ★ ఉయ్యూరులో ఓ బాలుడు (17) బైక్‌పై దూసుకెళ్లి రోడ్డు దాటుతున్న పాదచారిని ఢీకొట్టి.. అతని చావుకు కారణమయ్యాడు.

★ కోడూరుకు చెందిన బాలుడు (16) మితిమీరిన వేగంతో బైక్ నడుపుతూ వెళ్లి ప్రమాదానికి గురై చనిపోయాడు.
★ చల్లపల్లిలో రెండు బైక్‌లను పోటీపోటీగా నడుపుతున్న ఇద్దరు మైనర్లను వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టడంతో మృత్యువాతపడ్డారు.
★ విజయవాడ భానూనగర్‌వాసి పెదపూడి రాజారావు.. బీఆర్టీఎస్ రోడ్డు దాటుతుండగా.. మధురానగర్‌కు చెందిన ఓ బాలుడు ద్విచక్రవాహనంతో దూసుకొచ్చి ఢీకొట్టాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాజారావు మృతి చెందాడు. బాలుడి తండ్రిపై కేసు నమోదైంది.

– ఈనాడు, అమరావతి

ద్విచక్ర వాహనాలతో మైనర్లు రహదారులపైకి దూసుకొస్తుండడంతో.. ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. మానసిక పరిపక్వత లేని వయసులో బైక్‌లను వారికి ఇచ్చి.. రహదారులపైకి వదులుతున్న తల్లిదండ్రులే అసలు దోషులని.. పోలీసులు హెచ్చరిస్తున్నారు. అందుకే.. చట్టపరంగా వారే కేసులను ఎదుర్కొంటున్నారు. అవగాహన తరగతులను నిర్వహిస్తున్నా తల్లిదండ్రుల్లో మార్పు రావడం లేదు. పిల్లలు అడిగిన వెంటనే. . బండి తాళాలు వారి చేతిలో పెడుతున్నారు.

తీవ్ర విషాదానికి కారకులవుతూ..

కానూరులో పది చదివే విద్యార్థులు చేసిన ప్రమాదాన్ని ప్రత్యక్షంగా చూసినోళ్లంతా.. ఆ ఘటనను మరచిపోలేకపోతున్నారు. కామయ్యతోపు ఆర్చి దగ్గర నుంచి ముగ్గురూ వాహనంపై దూసుకొచ్చారు. మధ్యలో మరి కొందరిని కూడా ఢీకొట్టేవారే. చివరికి.. శ్రీహర్ష ప్రాణాలను హరించారు. సయ్యద్ అబూబకర్ సిద్ధిఖ్‌ను ఢీకొట్టింది కూడా ఓ పాఠశాల విద్యార్థే. తన కుటుంబానికి ఆధారంగా ఉన్న.. సిద్ధిఖ్ ఇప్పుడు వారికి భారంగా మారాడు.

జరిమానా రూ.లక్షల్లో

☛ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఏటా.. కనీసం వెయ్యి మంది మైనర్లు ద్విచక్ర వాహనాలు నడుపుతూ దొరుకుతున్నారు. వీరికి వేస్తున్న జరిమానా రూ.లక్షల్లో ఉంటోంది.

అదుపులేని వేగంతో..

మైనర్లు ద్విచక్ర వాహనాలను.. అదుపు చేయలేనంత వేగంగా దూసుకెళుతున్న సంఘటనలు పెరిగిపోతున్నాయి. దానికితోడు వాహనం స్టాండ్‌లను కొద్దిగా తెరిచి.. రహదారికి తాకిస్తూ.. నిప్పులు కురిపిస్తూ వెళ్లడం, చిత్రవిచిత్ర శబ్దాలతో.. ముగ్గురేసి ఒకే వాహనంపై వెళ్లడమూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఖాళీగా రోడ్డు కనిపిస్తే చాలు. . 15-20 ఏళ్ల లోపు వాళ్లు. . స్కిడ్‌లు.. స్టంట్‌లు చేస్తూ.. తోటి ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. టైర్లు గాలిలోకి లేపి విన్యాసాలు చేయడం.. అకస్మాత్తుగా రోడ్డుపై ఎవరైనా అడ్డొస్తే.. అదుపు చేయలేక ఢీకొడుతున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయి.



రంజాన్ వేళలు

ఇఫ్తార్: (గురువారం) సాయంత్రం: 6.16
సహరి: (శుక్రవారం) ఉదయం: 5.11

జనన.. మరణాల నమోదు

21 రోజుల్లోగా ఉచితం

జనన, మరణాల నమోదు 21 రోజుల్లోగా ఉచితంగా చేయించుకోవచ్చని నగరపాలక సంస్థ అధికారులు తెలిపారు. జనన, మరణ రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం జీవో నంబరు 28 ద్వారా కొత్త మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. ★ 21 నుంచి 30 రోజుల్లోగా రిజిస్ట్రేషన్ చేయిస్తే చెల్లించాల్సిన అపరాధ రుసుం రూ. 25. ★ ఏడాదిలోపు అయితే జిల్లా జనన, మరణ రిజిస్ట్రార్ అనుమతి తప్పనిసరి. చెల్లించాల్సిన అపరాధ రుసుం రూ. 250. ★ ఏడాది తరువాత రిజిస్ట్రేషన్ చేయించాలంటే జిల్లా మెజిస్ట్రేట్/ఆర్డీవో నుంచి రాతపూర్వక అనుమతి తీసుకోవాలి. రూ. 500 అపరాధ రుసుం చెల్లించాలి. ★ బిడ్డ పుట్టిన రోజు నుంచి ఏడాదిలోపు పేరు ఉచితంగా నమోదు చేయించుకోవచ్చు. - నగరపాలక సంస్థ

కూలకముందే కదలండి!

కనకదుర్గ వంతెన విభాగినిపై విద్యుత్తు స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా మారుతున్నాయి. ఈ వంతెనపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పూర్తిగా కూలిపోయి ప్రమాదం జరగకముందే వాటిని సరిచేయాల్సి ఉంది.
- ఈనాడు, అమరావతి

చూస్తే మీరు.. ఆశ్చర్యపోతారు

ఇదీ ఇన్‌ఫ్రారెడ్ రోడ్ రిపేరింగ్ మొబైల్ మిషన్ (రోడ్ డాక్టర్). దీని సాయంతో రోడ్డుపై గుంతలను తక్కువ సమయంలో సులువుగా పూడ్చవచ్చు. నగరపాలక సంస్థ దీనిని అందుబాటులోకి తీసుకొచ్చింది. సంప్రదాయ పద్ధతుల్లో తారును అధిక ఉష్ణోగ్రతలో కాల్చాలి. ఈ యంత్రంతో కాలుష్య రహితంగా పాత తారును అదే ఉష్ణోగ్రతలో రీసైక్లింగ్ చేసి కొత్త తారులా ఉపయోగించుకోవచ్చు.
-ఈనాడు, అమరావతి

దాచుకున్నారు.. తీసుకోరేమనీ..!

రూ.258.96 కోట్లు ఆర్‌బీఐకి బదిలీ ★ ఉమ్మడి జిల్లాలో అన్‌క్లెయిమ్డ్ ఖాతాలు 11,10,456

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి కొంతకాలం లావాదేవీలు నిర్వహించిన తరవాత ఏళ్ల పాటు వాటిని పట్టించుకోకుండా వదిలేశారు. వ్యక్తిగత, ప్రభుత్వ, ప్రైవేటు వ్యాపార సంస్థలకు చెందిన ఖాతాల్లో పదేళ్లకు పైగా లావాదేవీలు జరపకపోవడంతో వాటిని అన్‌క్లెయిమ్డ్ ఖాతాలుగా గుర్తించారు. ఇందులోని మొత్తాలను తీసుకునేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆ నిల్వలను అధికారులు ఆర్బీఐకి బదిలీ చేశారు. ఇలా ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, వ్యక్తిగత, ప్రైవేటు సంస్థల అన్‌క్లెయిమ్డ్ ఖాతాలు 11,10,456 ఉండగా అందులో రూ. 258. 96 కోట్లు తలిపోయాయి.

అవగాహన లేక.. మరచిపోయి..

ప్రైవేటు వ్యక్తులకు అవగాహన లేకపోవడం, ఖాతాల విషయం మరచిపోవడంతో ముందుకు రావట్లేదు. ఇటీవల రాష్ట్ర సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్షించిన సీఎం చంద్రబాబు.. ప్రభుత్వ ఖాతాల్లో అన్‌క్లెయిమ్డ్‌గా ఉన్న సొమ్ము వెంటనే తిరిగి తెచ్చుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని 10,383 ప్రభుత్వ ఖాతాల్లో ఉన్న రూ. 12. 72కోట్లు వెనక్కి తీసుకునేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.
✪ ఇప్పటివరకు ఉమ్మడి కృష్ణాలో అన్ని రకాల అన్‌క్లెయిమ్డ్ ఖాతాల నుంచి రూ. 10. 16 కోట్లు క్లెయిమ్ చేసుకున్నారు.
✪ ప్రతి ఒక్కరికి బ్యాంకు ఖాతా ఉండాలన్న ఉద్దేశంతో 2015-16లో కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున జన్‌ధన్ ఖాతాలను తెరిపించింది. వీటి ద్వారా లావాదేవీలు నిర్వహించక పదేళ్లు దాటిపోయింది. దీంతో అవన్నీ అన్‌క్లెయిమ్డ్ ఖాతాల జాబితాల్లోకి చేరాయి.

సొమ్ము తిరిగి పొందాలంటే..

✪ అన్‌క్లెయిమ్డ్ ఖాతాల్లోని సొమ్ము తిరిగి తీసుకునేందుకు ఆర్‌బీఐ వెసులుబాటు కల్పించింది. ఖాతాదారులు వారికి సంబంధించి లావాదేవీలు నిలిపేసిన ఖాతాల వివరాలు తెలుసుకోవడానికి యూడీజీఎం వెబ్‌సైట్లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఆధార్‌కార్డు, పాన్‌కార్డు ద్వారా వివరాలు తెలుసుకోవచ్చు. ✪ సంబంధిత పత్రాలు అప్‌లోడ్ చేయాలి. బ్యాంకులో కొత్తగా కేవైసీ చేసుకొని ఆ సొమ్ము తిరిగి పొందవచ్చు.
✪ అన్‌క్లెయిమ్డ్ ఖాతాలకు సంబంధించి ఏమైనా సందేహాలున్నా.. సొమ్ము తిరిగి తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురైనా ఖాతా కలిగిన బ్యాంకు, లేదా లీడ్ బ్యాంకు కార్యాలయాలను సంప్రదించాలని ఉమ్మడి జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్లు రవీంద్రరెడ్డి, కె. ప్రియాంక తెలిపారు.

ఉద్యోగ మేళా నేడు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : దుర్గామల్లేశ్వర సిద్ధార్థ కళాశాల, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ లబ్బీపేటలోని సిద్ధార్థ మహిళా కళాశాలలో గురువారం ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ వి.వి. సుబ్రహ్మణ్యకుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే మేళాకు ఐటీ, బ్యాంకింగ్, ఫైనాన్స్, మార్కెటింగ్, ఫార్మా, హెల్త్‌కేర్ తదితర రంగాలకు చెందిన ప్రముఖ సంస్థల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ, బీటెక్, ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు తాజా బయోడేటా, విద్యార్హత ధ్రువపత్రాలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్, పాన్ కార్డులు తీసుకురావాలని సూచించారు. ఎంపికైన వారికి వెంటనే ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తారని తెలిపారు.

రాజధాని రైతులకు ప్లాట్లు

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని నిర్మాణానికి ల్యాండ్ పూలింగ్ విధానంలో భూములు ఇచ్చిన రైతులకు బుధవారం రాయపూడి సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించారు. ఈ- లాటరీ విధానంలో అర్హులైన 77 మంది రైతులకు మొత్తం 151 ప్లాట్లు కేటాయించి ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందించారు. అందులో 80 నివాసం, 71 వాణిజ్య ప్లాట్లు ఉన్నాయి. ★ మెట్ట భూములకు సంబంధించిన 35 మంది రైతులకు 53 ప్లాట్లు కేటాయింపులు చేశారు. అందులో 31 నివాసం, 22 వాణిజ్య ప్లాట్లు ఉన్నాయి. జరీబు భూములకు సంబంధించి 42 మంది రైతులకు 98 ప్లాట్లు కేటాయించగా.. అందులో 49 నివాసం మరో 49 వాణిజ్య ప్లాట్లు ఉన్నాయి. ★ ప్లాట్లు పొందిన వారిలో ఉండవల్లి, పెనుమాక, లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెం, రాయపూడి, వెంకటపాలెం, మందడం గ్రామాలకు చెందిన రైతులు ఉన్నారు. ప్లాట్లను వెంటనే రిజిస్ట్రేషన్‌లు చేయించుకోవాలని సీఆర్డీఏ డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ వసంతరాయుడు సూచించారు. ఆయా స్థలాలు ఉన్న ప్రాంతాలను సర్వేయర్‌ల సహాయంతో తెలుసుకోవచ్చన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ప్లాటు కేటాయించిన వారికి ప్రొవిజనల్ సర్టిఫికెట్ ఇస్తూ..

మోగనున్న పెళ్లిబాజాలు..

శుభకార్యాలకు వేళయ్యింది. ఈనెల 19వ తేదీ నుంచి పెళ్లి బాజాలు మోగనున్నాయి. వివాహాలతోపాటు నూతన గృహప్రవేశాలు, వ్యాపార ప్రారంభోత్సవాలు, నిశ్చితార్థాలు, శంకుస్థాపనలు ఇలా ఒక్కటేమిటి అన్నింటా వేడుకలు జరగనున్నాయి. మంచి ముహూర్తాలు ఉండడంతో ఇప్పటికే కల్యాణ మండపాలను ఖరారు చేసుకుంటున్నారు. అత్యధిక సంఖ్యలో శుభ ముహూర్తాలు ఉండడంతో పెద్ద సంఖ్యలో జంటలు ఏకం కానున్నాయి. దీంతో అంతటా సందడి నెలకొననుంది. ఆగస్టు నుంచి అక్టోబరు వరకు చాతుర్మాసం, శూన్యమాసం వల్ల ముహూర్తాలు లేవు. తిరిగి నవంబరు, డిసెంబరు నెలలో మళ్లీ ముహూర్తాలు రానున్నాయి.

- **ఫిబ్రవరి:** 19, 20, 21, 24, 25, 26
- **మార్చి:** 1, 3, 4, 7, 8, 9, 11, 12
- **ఏప్రిల్:** 15, 20, 21, 25, 26, 27, 28, 29
- **మే:** 1, 3, 5, 6, 7, 8, 13, 14 వరకు

చేతినిండా పని.. ఈ నాలుగు నెలలు శుభకార్యాల్లో వివిధ వృత్తుల వారికి చేతినిండా పని దొరకనుంది. పురోహితులు, మేళతాళాలు, వంటమేస్త్రీలు, క్యాటరింగ్, విద్యుత్తు, వేదిక అలంకరణ, బ్యూటీషియన్లు, దర్జీలు, మైక్ సెట్లు, షామియానా, బంగారం, వెండి, ఆభరణాల తయారీ తదితర రంగాల వారికి గిరాకీ ఏర్పడనుంది.
– మోపిదేవి–అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే

సేవలు నచ్చేలా.. పౌరులు మెచ్చేలా...

- అందుబాటులో ఏపీసీఆర్డీఏ పరిష్కారం 2.0
- సంతృప్తి స్థాయులపై ఆడిట్

ఈనాడు, అమరావతి

సీఆర్డీఏ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి యంత్రాంగం ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తోంది. ఏపీ సీఆర్డీఏ పరిష్కారం 2.0 ద్వారా రైతులు కాలు కదపనవసరం లేకుండానే అర్జీ చేసుకునే వెసులుబాటు కల్పించింది. పరిష్కారం ఏ దశలో.. ఏ అధికారి వద్ద ఉందో తెలుసుకునేలా వెబ్‌సైట్ నిర్వహిస్తోంది. అర్జీ స్థితిపై కారణాలు తెలియజేస్తూ సమగ్ర వివరాలు తెలుసుకునే అవకాశం కల్పించింది.

గత సెప్టెంబరు నుంచి ఇప్పటివరకు...

- ✪ మొత్తం అర్జీలు: 2,693
- ✪ పరిష్కారమైనవి: 2,313
- ✪ పెండింగ్: 309
- ✪ రీఓపెన్ చేసినవి: 71

అసంతృప్తి వ్యక్తం చేసినవారు : 277

వివిధ మార్గాల్లో అర్జీల స్వీకరణ

★ రాయపూడిలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో ప్రజల నుంచి ప్రతి శనివారం అర్జీలు, ప్రతి రోజూ వినతులు స్వీకరిస్తున్నారు. ★ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రామదర్శిని; గ్రామసభల్లో, ఆయా కార్యాలయాలకు వస్తున్న వినతులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ★ రాజధాని గ్రామాల్లోని యూనిట్ కార్యాలయాలు, జిల్లా ప్రజా ఫిర్యాదుల విభాగానికి అందుతున్న రాజధాని ప్రాంత అర్జీలను కూడా స్వీకరిస్తున్నారు. ★ రాజధాని పనులు జరుగుతున్న ప్రాంతంలో ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేశారు. ★ సీఆర్డీఏ పరిష్కారం 2.0 వెబ్‌సైట్‌లో వాట్సప్ ద్వారా అర్జీలు అప్‌లోడ్ చేయొచ్చు. ఇందుకు చరవాణి, ఆధార్‌కార్డు నంబర్ల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఏఐ సాయం తీసుకునే వెసులుబాటు కల్పించారు. తెలుగు లేదా ఆంగ్లం ఎంచుకోవచ్చు.

పరిష్కారం చూపిస్తారు..

★ ఫిర్యాదు/అర్జీ నమోదు అనంతరం పరిష్కరించాల్సిన అధికారి, దరఖాస్తుదారుడికి సంక్షిప్త సందేశం వెళ్తుంది. ★ సంబంధిత అధికారి సమస్యను పరిష్కరించి అర్జీదారుడికి ఎండార్స్‌మెంట్ ఇస్తారు. సంతృప్తి లేఖను తీసుకోవాలి. ★ పరిష్కారం అనంతరం సీఆర్డీఏ కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఫోన్ చేసి అర్జీదారులు సంతృప్తిగా ఉన్నారా? లేదా? సమాచారం సేకరిస్తారు. అసంతృప్తి వ్యక్తం చేసినవారి వివరాలు ఆడిట్ అధికారుల బృందానికి వెళ్తాయి. ఆయా విభాగాల ఉన్నతాధికారులు అర్జీ పరిష్కరించిన విధానాన్ని పరిశీలించి సంతృప్తి చెందితే పిటిషన్‌ను మూసేస్తారు. లేదంటే రీఓపెన్ చేసి తొలిదశ నుంచి మళ్లీ పరిశీలిస్తారు. ★ అధికారుల స్థాయిలో పరిష్కరించలేని అర్జీలను కమిషనర్, సీఆర్డీఏ అథారిటీ, అవసరమైతే ప్రభుత్వస్థాయిలోని ఉన్నతాధికారులకు పంపిస్తారు. ★ వెబ్‌సైట్‌లోని వివరాల ఆధారంగా కమిషనర్ ప్రతి శనివారం అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు.

పెండింగ్‌లో ఇలా...

పురోగతిలో	163
అదనపు సమాచారం కోసం	2
ఉన్నతాధికారులకు పంపినవి	144

రీఓపెన్ చేసిన 71 అర్జీలు..

పురోగతిలో ఉన్నవి	31
ఉన్నతాధికారులకు పంపినవి	40

3న కనకదుర్గమ్మ ఆలయం మూసివేత

ఇంద్రకీలాద్రి: పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా మార్చి 3న దుర్గగుడిని మూసి వేస్తున్నట్లు వైదిక కమిటీ సభ్యులు పేర్కొన్నారు. 3న ఉదయం 10 గంటలకు కవాట బంధనం (మూసివేయడం) చేసి తిరిగి 4న వేకువజామున 3 గంటలకు కవాట ఉద్ఘాటన(తలుపులు తెరవడం) చేస్తారని తెలిపారు. పౌర్ణమి సందర్భంగా నిర్వహించే గిరిప్రదక్షిణతోపాటు శాంతి కల్యాణం, చండీ హోమం వంటి ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. 4న వేకువజామున 3 గంటలకు అమ్మవారి ప్రధాన ఆలయంతోపాటు ఉపాలయాలు తెరవడంతోపాటు దేవతామూర్తులకు సుప్రభాత సేవ, స్నపనాభిషేకం, ప్రాతఃకాలార్చన, నివేదన, హారతి నిర్వహిస్తారని చెప్పారు. ఉదయం 8 గంటలకు భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారని తెలిపారు. తెల్లవారుజామున నిర్వహించే ఆర్జిత సేవలను నిలిపివేసినట్లు పేర్కొన్నారు. చండీహోమం, లక్ష కుంకుమార్చన సేవలను ఉదయం 8:30 గంటలకు నిర్వహిస్తారని తెలిపారు.

21న చాగంటికి పురస్కారం ప్రదానం

అవనిగడ్డ: రాష్ట్ర ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు, ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఈనెల 21న సాయంత్రం 4 గంటలకు అవనిగడ్డ గాంధీక్షేత్రానికి వస్తున్నట్లు కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా ఆయనకు మండలి వెంకటకృష్ణారావు తెలుగు వైభవ పురస్కారం ప్రదానం చేస్తారని, అనంతరం ప్రవచనం ఉంటుందని వెల్లడించింది.

నిబంధనలు అతిక్రమించి చెరువులు తవ్వితే చర్యలు

కోడూరు, న్యూస్‌టుడే: కృష్ణానది వెంట నిబంధనలకు వ్యతిరేకంగా చేపల, రొయ్యల చెరువులను తవ్వితే చట్టపరమైన చర్యలు తప్పవని బందరు ఇన్‌ఛార్జి ఆర్డీవో పోతురాజు హెచ్చరించారు. కోడూరు మండలం విశ్వనాథపల్లి గ్రామంలో కృష్ణానది వెంట కొంతమంది అక్రమంగా చెరువులు తవ్వుతున్నారంటూ ఆ గ్రామానికి చెందిన ముప్పిరిశెట్టి నాంచారయ్య కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ ఆదేశాలతో ఇన్‌ఛార్జి ఆర్డీవో విశ్వనాథపల్లిలో ఫిర్యాదు అందిన ప్రాంతంలోని చెరువుల తవ్వకాలను కోడూరు తహసీల్దార్ జె. సౌజన్యకిరణ్మయి, సిబ్బందితో కలిసి పరిశీలించారు. చెరువుల తవ్వకాలు జరుగుతున్న ప్రాంతంలోనే గ్రామానికి సరఫరా అయ్యే రక్షిత మంచినీటి పథకం ఉండడం, కృష్ణానదికి ఆనుకునే చెరువుల గట్లు ఉండడాన్ని పరిశీలనలో ఇన్‌ఛార్జి ఆర్డీవో గుర్తించారు. సదరు చెరువు తవ్వకానికి, సాగుకు ఎలాంటి అనుమతులు లేవని, తవ్వకందారులు తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోరాదని ఇన్‌ఛార్జి ఆర్డీవో ఆదేశించారు.

ఇంటర్ పరీక్షలు.. చకచకా ఏర్పాట్లు

న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

ప్రతి విద్యార్థి జీవితంలో ఇంటర్ పరీక్షలు అత్యంత కీలకం. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి విద్యార్థులు ఎవరికి వారే పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. పరీక్షలను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఈ నెల 23 నుంచి మార్చి 24 వరకు జరగనున్న వార్షిక పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లన్నీ ఇప్పటికే దాదాపు పూర్తయ్యాయి.

జిల్లాలో పరీక్షా కేంద్రాలు: 63
ఇంటర్ విద్యార్థులు: 49,579
కంట్రోల్‌రూం నంబరు: 81066 28910

ప్రతి కేంద్రంపై నిఘా: పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతతో పాటు ప్రత్యేక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నారు. కేంద్రంలోని అన్ని గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఇప్పటికే పలుచోట్ల పనులు జరుగుతున్నాయి. అన్ని సీసీ కెమెరాలను ఇంటర్ బోర్డు ప్రధాన కార్యాలయానికి అనుసంధానం చేస్తున్నారు. ఎక్కడైనా మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే ప్రధాన కార్యాలయం నుంచి నిఘా వ్యవస్థ ద్వారా పరిశీలించి కేంద్రం వద్ద ఉన్న అధికారులను అప్రమత్తం చేస్తారు.

సబ్జెక్టులకు 32పేజీల బుక్‌లెట్: ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మారిన సిలబస్‌కు అనుగుణంగా జవాబు పత్రాల్లోనూ మార్పు చేశారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, హిస్టరీ, ఎకనామిక్స్, సివిక్స్, కామర్స్ లాంటి గ్రూప్ సబ్జెక్టులకు ఇంతకు ముందు 24పేజీల జవాబు పత్రాన్ని ఇచ్చేవారు. ఈసారి 32 పేజీల బుక్‌లెట్ అందించనున్నారు. బయాలజీ, జువాలజీలకు 24 పేజీల బుక్‌లెట్ చొప్పున అందిస్తారు. ప్రశ్నపత్రాలు నిల్వ చేసేందుకు జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్ల వారీగా మొత్తం 18 కేంద్రాలు ఏర్పాటు చేశారు.

పరీక్షల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు శిక్షణ ఇస్తున్న సరళకుమారి

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఎలాంటి అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవు. పరీక్షా కేంద్రాల బాధ్యత చీఫ్ సూపరింటెండెంట్లకు కేటాయించాం. ప్రతి కేంద్రంలో మంచినీరు, మరుగుదొడ్లు, ఫ్యాన్లతో పాటు అన్ని మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకున్నాం. సమస్యలపై కంట్రోల్‌రూం నంబరుకు ఫోన్‌చేస్తే వెంటనే పరిష్కరిస్తాం. పరీక్షల విధులు కేటాయించిన ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి అన్ని అంశాలపై అవగాహన కల్పించాం.
- సరళకుమారి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి

వెబ్ డెవలపర్ కోర్సులో ఉచిత శిక్షణ

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో డిప్లొమా, ఇంటర్, డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులకు వెబ్ డెవలపర్ కోర్సులో శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం. విజయసారథి, జిల్లా నైపుణ్యాధికారి శ్రీనివాసరావు తెలిపారు. మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కోర్సు పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన నుంచి ధ్రువపత్రం అందజేస్తామని వెల్లడించారు. అభ్యర్థులు తమ ఆధార్ కార్డు, ఫోన్ నంబరుతో వెళ్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోగా సంప్రదించాలని, మరిన్ని వివరాలకు 99857-59304, 63050-04318 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

చెన్నైలో నిందితుల కోసం అన్వేషణ

■ త్రుటిలో తప్పించుకున్న సుబ్రమణి రాజావెంకట్

ఈనాడు, అమరావతి: ఇటీవల యనమలకుదురులో వెలుగుచూసిన అద్దె ఖాతాల కేసులో ఇప్పుడు సీన్ చెన్నైకి మారింది. ఈ కేసులో అసలు సూత్రధారుల కోసం సైబర్ పోలీసు ప్రత్యేక బృందం చెన్నైలో మకాం వేసింది. ఇప్పటికే అరెస్టు అయిన సోదరులు రవికుమార్, స్టీవెన్ ఇచ్చిన సమాచారం ఆధారంగా సుబ్రమణి రాజా వెంకట్ కోసం ప్రత్యేక బృందం వేట సాగిస్తోంది. విజయవాడలో అమాయకులతో తెరిపించిన ఖాతాలను చెన్నైలో వీరి బంధువైన వెంకట్‌కు పంపించేవారు. అక్కడి నుంచి వచ్చే ఆదేశాల మేరకు ఓటీపీలు చెప్పడం, నగదును ఇతర ఖాతాలకు బదిలీ చేసేవారు. ✪ చెన్నైలో వెంకట్‌తో పాటు ఇంకా ఎవరైనా ఉన్నారా? అన్న కోణంలో బృందం విచారిస్తోంది. అతని చిరునామా కనుక్కొని రాజా వెంకట్ ఉంటున్న అద్దె ఇంటికి వెళ్లినా ఫలితం లేకపోయింది. అప్పటికే అతను పరారయ్యాడు. నగరంలోని పలు ప్రాంతాలు, అతని స్నేహితుల నుంచి వాకబు చేస్తున్నారు. మరో నిందితుడు ఆకాశ్ ఆచూకీ ఇంతవరకు తెలియలేదు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేస్తున్నానని అందరినీ నమ్మిస్తూ అద్దె ఖాతాల ద్వారా చట్టవిరుద్ధ లావాదేవీలు చేస్తున్నట్లు తేలింది. నిందితుడి ఫోన్ స్విచాఫ్‌లో ఉండడంతో అతని స్నేహితుల నంబర్లపై నిఘా పెట్టారు. అతని కుటుంబ సభ్యులను విచారించినా పెద్దగా సమాచారం రాలేదని తెలిసింది.

(c) eenadu

నమ్మించి.. నిలువునా ముంచేసి..

రైల్వే ఉద్యోగాల పేరుతో రూ.లక్షల్లో దోపిడీ

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే

ఉద్యోగాల పేరుతో దగాపు రెండేళ్లుగా రాష్ట్రం లోని వివిధ ప్రాంతాల్లో సాగుతున్న దందాలో చిక్కుకున్న బాధితుల పరిస్థితి నేడు అగమ్యగోచరంగా మారింది. మోసాన్ని గుర్తించి ప్రశ్నించిన వారిపైనే ఎదురు కేసులు పెడుతున్న నేపథ్యంలో తమకు ఆత్మహత్యలే శరణ్యమంటూ బాధితులు వాపోతున్నారు.

రైల్వేలో చిరుద్యోగిగా పనిచేస్తున్న ఎం. కిషోర్.. మచిలీపట్నం రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. సహచరుడు శ్రీముల్లా, షఫీ, అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకుడు చిన్న తదితరుల సహకారంతో పలువురిలో పరిచయాలు పెంచుకున్నారు. ఈ క్రమంలో కిషోర్.. రైల్వేలో టీసీ, క్లర్క్ తదితర పోస్టుల పేరుతో కనిష్ఠంగా రూ.5 లక్షలు చొప్పున పలువురి వద్ద నుంచి నగదు, ఖాళీ చెక్కులు వసూలు చేశారు. అనంతరం వారికి పీఎఫ్ ఖాతా నంబర్లు, రైల్వే స్టాంపులతో కూడిన ఫేక్ నియామక పత్రాలు, ఐడీ కార్డులు పంపుతూ సాంకేతిక కారణాల వల్ల ఉద్యోగంలో చేర్చేందుకు కాస్త ఆలస్యం అవుతుందంటూ నమ్మబలికారు. ఆలస్యంపై ఎవరైనా నిలదీస్తే విజయవాడ, ఇతర ప్రాంతాలలో మాట్లాడదామంటూ పిలిచి యూనియన్ నాయకుల పేరుతో కొందరిని పరిచయం చేసి త్వరలోనే ఉద్యోగం వస్తుందని ఆశలు కల్పించేవారు. ఇదే తరహాలో మచిలీపట్నం పరిసర ప్రాంతాలకు చెందిన పలువురి వద్ద నుంచి నగదు దోచేసి వారిని మధ్యపెడుతూ వస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం పల్లిపాలెంగొడవాని జిల్లా కాళ్ల మండలం జక్కరం గ్రామానికి చెందిన నాగపద్మ తనకు వచ్చిన నియామక పత్రాన్ని రైల్వే ఉద్యోగులకు చూపించి అది నకిలీదని నిర్ధారించుకోవడంతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది.

కిషోర్ ఇంటి వద్ద నకిలీ నియామక పత్రాలు చూపిస్తున్న బాధితులు

అడిగినందుకు ఎదురు కేసు: బాధితురాలు నాగపద్మతో పాటు మచిలీపట్టణానికి చెందిన గంగాభవాని ఈ నెల 7న మచిలీపట్నంలోని కిషోర్ నివాసానికి వచ్చారు. కిషోర్, అతనికి అండగా నిలిచిన చిన్న కలిసి 'అల్లరి చేస్తే వద్దు.. మీకు ఉద్యోగాలు ఖాయం..' రేపు రండంటూ వారిని పంపేశారు. మరుసటి రోజు కిషోర్ ఇంటికి వెళ్లగా ఎవరూ ఆచూకీ లేకపోవడంతో బాధితులు చిలకలపూడి స్టేషన్ వెళ్లి జరిగిన మోసాన్ని పోలీసులకు వివరించారు. అనంతరం బాధితులు తిరిగి కిషోర్ ఇంటికి వెళ్లి అతని కోసం నిరీక్షించారు. ఈలోగా పోలీసులు అక్కడకు వచ్చి గ్రాత్రి మీరే కిషోర్‌పై దాడి చేశారంటూ అతడు ఫిర్యాదు ఇచ్చాడని, ఈ కేసులో నిందితులుగా ఉన్నారంటూ నాగపద్మ, గంగాభవానిలను స్టేషన్ తీసుకువెళ్లడం గమనార్హం. ఇదిలా ఉండగా.. ఈ నెల 14న కాళ్ల పోలీస్ స్టేషన్‌లో ఇదే అంశంపై తాను ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకుండా తనను వెనక్కి పంపేశారని నాగపద్మ వాపోయింది.

యూనిఫాం పేరుతోనూ దండుకున్నారు

ఉద్యోగం పేరుతో రూ.3.50 లక్షలు వివిధ రూపాల్లో తీసుకున్నారు. ఎప్పుడు విధుల్లో చేరాలని ప్రశ్నించగా త్వరలోనే అని చెబుతూ మీకు రైల్వే యూనిఫాం వచ్చిందని, దాని కోసం రూ.5,000 ఇవ్వాలంటూ అడగాని దండుకున్నారు. - గంగాభవాని

రూ.60 లక్షలకు ష్యూరిటీ అంటూ నోటీసు

డబ్బులు పోగొట్టుకుని ఉద్యోగం రాకపోగా.. సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ నుంచి రూ.60 లక్షల రుణానికి మీరు ష్యూరిటీగా ఉన్నారంటూ మెసేజ్ వచ్చింది. దీన్ని బట్టి నా వద్ద నుంచి తీసుకున్న చెక్కులను అడ్డు పెట్టుకుని కిషోర్ మరో రుణమోసానికి పాల్పడ్డాడన్న భయం వెంటాడుతోంది. - నాగపద్మ

నాయకులు మాట్లాడే భాషకు సెన్సార్ అవసరం

మండలి వెంకట కృష్ణారావు శతజయంతి సభలో మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: సినిమాల్లాగే రాజకీయ నాయకులు ప్రయోగిస్తున్న భాషకూ సెన్సార్ ఉండాల్సిన అవసరం ఏర్పడిందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆదరణ (హైదరాబాద్) సంస్థ ఆధ్వర్యంలో మండలి వెంకటకృష్ణారావు శతజయంతి సభ ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ మాజీ సలహాదారు డా.కె.వి.రమణాచారి అధ్యక్షత జరిగిన సభలో కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మండలి వెంకట కృష్ణారావు నిరంతరం బడుగుల గొంతుకయ్యారని, ప్రజాసేవకు మారుపేరుగా కొనియాడారు. ఒకప్పుడు నాయకులంటే సమాజంలో ఎంతో గుర్తింపు, గౌరవం ఉండేదని, ప్రస్తుత రాజకీయాల్లో విలువలు దిగజారుతున్నాయని పేర్కొన్నారు. దక్షిణాదిలో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ప్రజాప్రతినిధులు, నేతలు ప్రత్యర్థులను ఉద్దేశించి ప్రయోగించే భాష వల్ల రాజకీయ పరిస్థితి నెలకొంటున్నారు. రాజకీయాల్లో డబ్బు ప్రవాహం పెరిగి ప్రజాప్రతినిధులు, ప్రజల మధ్య ఉండే సత్సంబంధాలు తగ్గిపోయాయన్నారు. నీతి, నిజాయతీ ఉన్నవాళ్లు రాజకీయాల్లో కొనసాగే పరిస్థితి లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తన తండ్రి మండలి వెంకట కృష్ణారావు అడుగుజాడల్లో నడుస్తున్న మండలి బుద్ధప్రసాద్ ఎన్నికల్లో గెలవటం గొప్ప విషయమన్నారు. రాజకీయాల్లో డబ్బు ప్రాధాన్యం తగ్గించకపోతే ప్రజాస్వామ్యం మరింతగా దిగజారుతాయని పేర్కొన్నారు. ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ.. మండలి వెంకట కృష్ణారావు ఆదర్శ నాయకుడన్నారు. ఈ సందర్భంగా 'మహాపురుషుడు మండలి' నాటిక రచయిత దీర్ఘాసి విజయభాస్కర్‌ను సత్కరించారు. సభలో ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గ్రంధి భవానీ ప్రసాద్, నటుడు తనికెళ్ల భరణి, మాజీ మంత్రి జలగం ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. తర్వాత మండలి వెంకట కృష్ణారావు జీవితాధారంగా గంగోత్రి సాయి దర్శకత్వంలో తాడేపల్లికి చెందిన అరవింద ఆర్ట్స్ కళాకారులు 'మహాపురుషుడు మండలి' నాటకాన్ని ప్రదర్శించారు.

జ్యోతి వెలిగిస్తున్న కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రసాదరావు, చిత్రంలో జస్టిస్ భవానీప్రసాద్, రమణాచారి, కొలకలూరి ఇనాక్, బుద్ధప్రసాద్ తదితరులు

23న భాషా పండగ పోటీలు

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా స్థాయిలో ఈ నెల 23వ తేదీన భాషా పండగ పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో యూవీ సుబ్బారావు తెలిపారు. ఒకటో తరగతి నుంచి అయిదో తరగతి వరకు ఒక విభాగం, ఆరు నుంచి పదో తరగతి వరకు రెండో విభాగంగా పోటీలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. తెలుగు, ఆంగ్లం, ఉర్దూ, సంస్కృతం, హిందీ భాషల్లో పాఠశాల స్థాయిలో పోటీలు నిర్వహించాలని చెప్పారు. అనంతరం మండల స్థాయిలో పోటీలు నిర్వహించాలని వివరించారు. మండల స్థాయిలో విజేతలకు జిల్లా స్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. పద్యాలు రాయడం, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించాలన్నారు.

ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా ఏపీ

విజయవాడ(భవానీపురం), న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఏపీ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ) 50 ఏళ్ల వేడుకను విజయవాడలోని భవానీద్వీపంలో బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పర్యాటక రంగంలో గణనీయమైన అభివృద్ధి జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో రూ.20 వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయని, 1.22 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యమన్నారు. పీపీపీ విధానంలో పెట్టుబడులే లక్ష్యంగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను పెంపొందించేందుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రోడ్ షోలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ.. ఏపీని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనకు అనుగుణంగా టూరిజం పాలసీ రూపొందించినట్లు తెలిపారు. వైకాపా ప్రభుత్వ హయాంలో పర్యాటక రంగం నిర్లక్ష్యానికి గురైందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా హోటళ్లు, కాటేజీలు, రెస్టారెంట్ల నిర్మాణం పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఏపీటీడీసీ స్పెషల్ సీఎస్ అజయ్‌జైన్, ఎండీ ఆమ్రపాలి, ఈడీలు పద్మావతి, ఎం.శేషగిరి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బెలూన్లు ఎగురవేస్తున్న మంత్రి దుర్గేష్, ఏపీటీడీసీ ఛైర్మన్ బాలాజీ, స్పెషల్ సీఎస్ అజయ్‌జైన్, ఎండీ ఆమ్రపాలి

కల్యాణమూర్తులకు ప్రదక్షిణలు నిర్వహిస్తున్న దుర్గగుడి పాలక మండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్

వైభవంగా ద్వాదశ ప్రదక్షిణలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై మహాశివరాత్రి కల్యాణ మహోత్సవాల ముగింపు సందర్భంగా శ్రీదుర్గ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో వైభవంగా ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహించారు. గంగా, పార్వతి సమేత దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల ఉత్సవ మూర్తులను అలంకరించిన పల్లకిలో ఉంచి మంగళ వాయిద్యాలతో ద్వాదశ ప్రదక్షిణలు చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణమూర్తులకు ప్రత్యేక పూజలు, శాస్త్రోక్తంగా పవళింపు సేవను అర్చకులు నిర్వహించారు. కార్యక్రమంలో దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్, సభ్యులు శ్రీనివాసరావు, పద్మావతి ఠాకూర్, సరోజనిదేవి, సరిత తదితరులు పాల్గొన్నారు.

వలీని, కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న మంత్రి రవీంద్ర

వలీ ఘటన బాధాకరం: కొల్లు

భాస్కరపురం(మచిలీపట్నం), న్యూస్‌టుడే: మేడారం జాతరలో చిరువ్యాపారం చేసుకుంటున్న వలీ విషయంలో సోషల్ మీడియాలో అమానవీయంగా వ్యవహరించడం తీవ్రంగా కలచి వేసిందని మంత్రి కొల్లు రవీంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఉర్దూ అకాడమీ ఛైర్మన్ షఫీతో కలిసి వలీ వారి కుటుంబ సభ్యులు బుధవారం మంత్రి రవీంద్రను విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. మంత్రి రవీంద్ర వలీ తయారు చేసిన కోవాబన్‌ను తిన్నారు. వలీ కుటుంబానికి ఆర్థిక సాయం చేయడంతో పాటు వారిని సన్మానించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదని, సమాజంలో పరస్పర గౌరవం, మానవత్వం నిలిచేలా అందరు ప్రవర్తించాలని హితవు పలికారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

ఘంటసాల, న్యూస్‌టుడే: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఏలూరు రేంజ్ ఐజీ జి.వి.జి.అశోక్‌కుమార్ తెలిపారు. బుధవారం ఘంటసాల పోలీస్‌స్టేషన్ వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనకు జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, ఎస్సై వేమన చందన స్వాగతం పలికారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరిగిన 54 బ్లాక్ స్పాట్లు గుర్తించినట్లు తెలిపారు. జాతీయ రహదారిపై మండలం పరిధిలోని లంకపల్లి, జీలగలగండి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని.. నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చిన్నపిల్లలు, యువత భద్రతకు పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. చిన్నారులను ఇబ్బందులు పెట్టే ముద్దాయిలకు శిక్షలు పడేలా పోలీసు శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో మచిలీపట్నం డీఎస్పీ సీహెచ్ రాజా, అవనిగడ్డ, చల్లపల్లి సీఐలు యువకుమార్, కె.ఈశ్వరరావు, ఎస్సై గౌతమ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐజీ అశోక్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న ఎస్సై వేమన చందన, చిత్రంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తదితరులు

విద్యాంజలిపై శిక్షణ నేడు

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లాలోని ఉపాధ్యాయులకు విద్యాంజలిపై శిక్షణ కార్యక్రమం మచిలీపట్నంలోని నోబుల్ కళాశాలలో గురువారం నిర్వహించనున్నట్లు ఎస్ఎస్ ఎఎంవో ఆర్.శ్యాంసుందరరావు బుధవారం తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డీకే బాలాజీ, డీఈవో యూవీ సుబ్బారావు పాల్గొంటారని వివరించారు.

HCG The Specialist in Cancer Care
సిటీ క్యాన్సర్ సెంటర్
చలసాని వెంకట కృష్ణయ్య వీధి, సూర్యారావుపేట, విజయవాడ-2
ఫోన్: 0866-2436661, 2432180, 9885260759
ఈవినింగ్ క్లినిక్స్
ప్రతి రోజు 5 to 7 PM అపాయింట్‌మెంట్స్ కొరకు
డా॥ ఎం. గోపీచంద్ M.S., M.Ch., DNB., Surgical Oncologist
డా. కె. లక్ష్మీప్రియదర్శిని MD., DM., Medical Oncologist
డా. వి.ఎస్.ఎన్. రావు DCP, DMRT., MD (RT)., Radiation Oncologist
నవ్యాంధ్రప్రదేశ్‌లో అత్యంత అనుభవజ్ఞులైన అతిపెద్ద క్యాన్సర్ వైద్య బృందం గల హాస్పిటల్

నెట్‌బాల్ పోటీల విజేత సావిత్రిబాయి ఫులె వర్సిటీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక మారిస్ స్టెల్లా కళాశాల మైదానంలో కృష్ణా వర్సిటీ ఆధ్వర్యంలో 5 రోజుల పాటు జరిగిన అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా నెట్‌బాల్ పోటీల్లో సావిత్రిబాయి ఫులె వర్సిటీ (మహారాష్ట్ర) జట్టు విజేతగా నిలిచింది. కాలికట్ (కేరళ), కృష్ణా, (ఏపీ), హేమచంద్ యాదవ్ వర్సిటీ (దుర్గ్) జట్లు వరుసగా తర్వాత స్థానాలు కైవసం చేసుకున్నాయి. బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో కృష్ణా, హేమచంద్ యాదవ్ వర్సిటీ జట్ల పోటీ ఉత్కంఠగా సాగింది. కృష్ణా వర్సిటీ గెలిచి తృతీయ బహుమతి సాధించింది. చివరి లీగ్ పోటీలో సావిత్రిబాయి ఫులె, కాలికట్ వర్సిటీ జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఒక్క పాయింట్ తేడాతో సావిత్రిబాయి ఫులె జట్టు విజేతగా నిలిచింది. శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, కృష్ణా వర్సిటీ ఉపకులపతి కూన రాంజీ విజేతలకు ట్రోఫీలు బహూకరించారు. అనిమిని మాట్లాడుతూ... పాఠశాల స్థాయి నుంచి క్రీడలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో శాప్ లీగ్స్ ప్రారంభించామని చెప్పారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా శాప్ వార్షిక క్రీడా క్యాలెండర్ విడుదల చేశామని తెలిపారు. ప్రతిభగల క్రీడాకారులను గుర్తించి శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తామని చెప్పారు. శాప్ నగదు ప్రోత్సాహకాలు అందుకున్న వారిలో 70 శాతం మహిళా క్రీడాకారిణులే ఉన్నారని గుర్తు చేశారు. పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి జె.నవీన లావణ్యలత పోటీల నివేదిక ప్రకటించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వీసీ మాట్లాడుతూ.. పోటీలను విజయవంతం చేసేందుకు సహకరించిన స్టెల్లా కళాశాల యాజమాన్యం... తదితరులందరికీ ధన్యవాదాలు తెలిపారు. రెక్టార్ ఎంవీ బసవేశ్వరరావు ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచిన సావిత్రిబాయి పులె, కృష్ణా వర్సిటీ జట్లకు రూ.10,116 చొప్పున తన సొంత నిధులు అందజేశారు. రిజిస్ట్రార్ ఎన్.ఉష, జేఎన్‌యూకే స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ జి.శ్యామ్‌కుమార్, ఏఐయూ పరిశీలకుడు విష్ణు చౌదరి, టోర్నీ చీఫ్ రిఫరీ ఆకాష్ బత్రా, ప్రిన్సిపల్ సిస్టర్ జి.ఇన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

శాప్ ఛైర్మన్ రవినాయుడు, వీసీ రాంజీ నుంచి విన్నర్ ట్రోఫీ అందుకుంటున్న సావిత్రిబాయి ఫులె జట్టు

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

గుడివాడ, న్యూస్‌టుడే: నేపాల్‌లో జనవరి 29 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు జరిగిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గుడివాడ అక్కినేని నాగేశ్వరరావు కళాశాల విద్యార్థి దుర్గా సత్యన్నారాయణ 66 కేజీల విభాగంలో బెంచ్ లిఫ్ట్, డెడ్ లిఫ్ట్, స్క్వాడ్ కేటగిరీల్లో మొత్తం 610 కేజీల బరువు ఎత్తి ప్రథమ స్థానం కైవసం చేసుకోవడం కళాశాలకు గర్వకారణం అని ప్రిన్సిపల్ డాక్టర్ పీజేఎస్ కుమార్ పేర్కొన్నారు. విజేత సత్యన్నారాయణను బుధవారం కళాశాల పాలకవర్గ కార్యదర్శి, కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, అధ్యక్షుడు ఎల్ఆర్‌కే ప్రసాద్, కోశాధికారి పర్వతనేని కృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ పద్మజ, వ్యాయామ అధ్యాపకుడు వీర్ల గోపి తదితరులు అభినందించారు.

విజేతను అభినందిస్తున్న కళాశాల పాలకవర్గ ప్రతినిధులు

పట్టణ ఆరోగ్య కేంద్రాలకు నిధులివ్వండి

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ ఏరియా ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో బుధవారం ఆయన మాట్లాడుతూ గుడివాడ పట్టణంలో ఐదు పట్టణ ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, వీటిలో కేవలం బాపూజీనగర్ కేంద్ర భవనం ఒక్కటే పూర్తయ్యిందని, బేతవోలు ఆరోగ్య కేంద్రం పురపాలక సంఘ నిధులతో అభివృద్ధి చేశామన్నారు. దనియాలపేట, స్లేటర్‌పేటల్లో ఇంకా నిర్మాణాలు పూర్తి కాలేదని, వాటి చిత్రాలను అసెంబ్లీలో ప్రదర్శించారు. గత ప్రభుత్వం విడుదల చేసిన రూ.80 లక్షల నిధులు నిర్మాణాలకు సరిపోలేదన్నారు. గుడివాడలో వీటి నిర్మాణాలకు రూ.1.46 కోట్లు అవసరమని.. వాటిని విడుదల చేయాలని కోరారు. రుద్రపాకలో 30 పడకల ఆసుపత్రిని వైకాపా పాలకులు సర్వనాశనం చేశారని, దీనికి కావాల్సిన నిధులిచ్చి పూర్వ వైభవం తీసుకు రావాలన్నారు. రామాపురంలో 40 ఏళ్ల కిందట నిర్మించిన భవనం పాడైందని, మోటూరులో పీహెచ్‌సీ భవనంలోకి పాములు వస్తున్నాయన్నారు. రామాపురం, మోటూరు, కౌతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు దారుణంగా పాడయ్యాయని, పేద ప్రజల ఆరోగ్యం దృష్ట్యా వెంటనే వాటిని అభివృద్ధి చేసి మెరుగైన సేవలు అందించాలన్నారు. దీనికి స్పందించిన ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ గుడివాడలో పీహెచ్‌సీల అభివృద్ధికి పలుమార్లు టెండర్లు పిలిచినా ఎవరూ రాలేదన్నారు. గుడివాడలో రెండు బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్లను ఒక్కొక్కటి రూ.50 లక్షలతో ఏర్పాటు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నామన్నారు.

దనియాలపేట హెల్త్ సెంటర్ చిత్రాన్ని చూపుతున్న ఎమ్మెల్యే రాము

సీసీఎస్ పోలీసుస్టేషన్‌లో అగ్నిప్రమాదం

అగ్నిమాపక సిబ్బంది తక్షణ స్పందనతో తప్పిన పెనుముప్పు

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ సీసీఎస్ పోలీసు స్టేషన్‌లో బుధవారం అగ్నిప్రమాదం జరిగింది. 2000 సంవత్సరం నాటి తాలూకా పోలీసుస్టేషన్ రికార్డులు, కొన్ని పేపర్లు కాలిపోయాయి. స్టేషన్‌లో బుధవారం ఉదయం ఒక్కసారిగా పొగలు రావడంతో అగ్నిమాపక సిబ్బందికి వెంటనే సమాచారం ఇచ్చారు. అదే ప్రాంతంలో పోలీసులు సీజ్ చేసిన దీపావళి సామగ్రి, చెత్త ఉన్నాయి. మరో పక్క సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. ఈ స్టేషన్‌కు అనుకుని తహసీల్దారు, ఖజానా కార్యాలయాలు, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఉన్నాయి. అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన ప్రాంతానికి వచ్చి మంటలు పక్క ప్రాంతాలకు వ్యాపించకుండా చర్యలు తీసుకోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ప్రమాదానికి కారణాలు తెలియలేదని అగ్నిమాపక సిబ్బంది చెబుతున్నారు. సంఘటనా స్థలానికి డీఎస్పీ వి.ధీరజ్‌వినీల్ వచ్చి ప్రమాదం వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కాలిపోయిన కాగితాలు, వ్యర్థాలు

ఎలాంటి నష్టం జరగలేదు: సీసీఎస్ సీఐ రమణమ్మ

ఈ అగ్ని ప్రమాదంలో ఎలాంటి ఆస్తి నష్టం జరగలేదు. పొగలు రాగానే గుర్తించి అగ్నిమాపక సిబ్బందికి తెలిపాం. వారు వెంటనే వచ్చి మంటలు అదుపు చేశారు. విద్యుత్తు షార్టు సర్క్యూట్‌తో ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నాం. చెత్త తప్ప విలువైనవి ఏవీ కాలిపోలేదు.

పాత తగాదాలతో పరస్పర దాడులు

కోడూరు: పాత తగాదాలను పురస్కరించుకుని పరస్పర దాడులు చేసుకున్న సంఘటన కోడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై కె.చాణక్య తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లింగారెడ్డిపాలెం శివారు జరుగువానిపాలెం గ్రామానికి చెందిన జరుగు సురేష్ అలియాస్ ఏసుకు, అదే గ్రామానికి చెందిన జరుగు నాగనాంచారయ్యలకు పాత తగాదాలున్నాయి. వీటిని పురస్కరించుకుని మంగళవారం కోడూరులోని శ్రీగంగానమ్మ అమ్మవారి వంతెన కూడలి వద్ద ఇద్దరూ ఘర్షణ పడ్డారు. మద్యం తాగిన మత్తులో పరస్పరం ఇనుపరాడ్లతో దాడులు చేసుకున్నారు. గాయాలైన వారిని వెంటనే అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం బందరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్సై చెప్పారు. ఇద్దరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పరస్పర కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. వీరికి దాడిలో సహకరించిన ఏసు బంధువు ముళ్లపూడి మహేష్, నాగనాంచారయ్య బంధువు అప్పికట్ల తాతారావుపై కేసు నమోదు చేశామన్నారు.

సీసీ డ్రెయిన్ నిర్మించాలని దీక్ష

అవనిగడ్డ, న్యూస్‌టుడే: కృష్ణాజిల్లా అవనిగడ్డ ఒకటో వార్డు పరిధిలోని కోటగిరిలంకకు మంజూరైన సీసీ డ్రెయిన్ వెంటనే నిర్మించాలని కాంట్రాక్టర్‌ను కోరుతూ ఆప్రాంతానికి చెందిన కంచర్ల కోటేశ్వరరావు నిరసన తెలిపారు. బుధవారం ఉదయం ఆయన అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల నిరసన దీక్షలో కూర్చున్నారు. కోటగిరిలంకలో వర్షం పడితే నీరు బయటకు పోయే అవకాశం లేని నేపథ్యంలో డ్రెయిన్ పనులు వెంటనే ప్రారంభించాలని, సీతాయిలంకకు మంజూరైన ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణం వెంటనే మొదలు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సాయంత్రం ఆయన నిరసన దీక్ష విరమించారు.

దీక్షకు కూర్చున్న కోటేశ్వరరావు

బ్రాయిలర్ ధరలు (కిలో / కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213 చికెన్ స్కిన్‌లెస్ - 243.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 244 చికెన్ స్కిన్‌లెస్ - 254.

మహిళా ఉద్యోగుల సమావేశానికి తరలిరావాలి

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 7న విజయవాడలో ఆంధ్రప్రదేశ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే మహిళా ఉద్యోగుల సమావేశానికి అందరూ తరలి రావాలని సంఘ జిల్లా అధ్యక్షుడు పి.రాము, మహిళా విభాగ అధ్యక్షురాలు పి.శైలజలు పిలుపునిచ్చారు. బుధవారం మచిలీపట్నంలోని డీఈవో కార్యాలయ ప్రాంగణంలో సంఘ నాయకులు మహిళా ఉద్యోగులతో సమావేశ కరపత్రాలు ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ ఆదేశాల మేరకు ఈ సమావేశం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మహిళా సాధికారత, మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో చర్చించడం జరుగుతుందని అన్నారు. జిల్లా నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలని, ఆ దిశగా నాయకులు అందరూ కృషి చేయాలన్నారు. సంఘ జిల్లా కార్యదర్శి తోట వరప్రసాద్, మహిళా విభాగ కార్యదర్శి ఎం.కల్పన నాయకులు విజయశ్రీ, విద్యాలత, కె.విజయకుమారి, టి.రమ్య, ఎం.స్వాతి, శ్రీనివాసరావు, లోకేష్, పవన్‌కుమార్, సముద్రేశ్వరరావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు, ఉద్యోగులు

91.9FM Vijayawada
91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU eClassifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతరప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్‌క్యాష్ ✆ 81422 92071

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166

FINANCIAL SERVICES

Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు EMI వాయిదా పద్ధతిలో పర్సనల్ ఫైనాన్స్, అన్ని తరగతుల వారికి స్థిరాస్తులపై ఫైనాన్స్ ఇవ్వబడును. Cell: 73862 01191.

REAL ESTATE

FLAT FOR SALE

Flat for Sale Vignesh Apartment D/No. 56-4-23/B, Block 2 G1, Ground Floor N.R. Rythubazar Patamata Vijayawada. ✆ 77024 44575.

PLOT FOR SALE

రాజధాని అమరావతి, ఔటర్‌రింగ్ రోడ్డు, కొత్త రైల్వేలైన్, ఇళ్ల ప్రక్కన సెంటు కేవలం 2,49,999/- కొద్ది ప్లాట్స్, స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ 84989 73586

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గజం11,999/- బందర్‌రోడ్‌లో 80ఎకరాల గేటెడ్ కమ్యూనిటీ స్పోర్ట్స్, స్విమ్మింగ్ పూల్, హౌసింగ్ 46L గవర్నమెంట్ ఆఫీసులకు దగ్గరల్లో ✆ 99495 05050

JOBS

ప్రైవేట్ ప్రీమియం సెలబ్రేషన్ కంపెనీలో సర్వీస్ సపోర్ట్ అసోసియేట్స్ కావలెను. వయస్సు: 20-28. ఇంటర్, పైచదువు పూర్తిచేసిన వారు అప్లై చేయవచ్చు. ఈవెంట్ సెటప్; క్లయింట్ హ్యాండ్లింగ్, టీమ్‌తో సమన్వయం చేయగలగాలి. మాసిక వేతనం ₹12000+ పనితీరు ఆధారిత బోనస్, గ్రోత్. ✆: 97050 54262.

విజయవాడ సిటీ, తాడేపల్లి ఏరియాలో సెక్యూరిటీ ఫీల్డ్ ఆఫీసర్స్. జీతం: 35,000/- PF & ESI ✆ 79933 22229

ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్‌లో 3సం॥ అనుభవంతో టెలీకాలర్ & కంప్యూటర్ ఆపరేటర్ (M) హిందీ, ఇంగ్లీష్ వచ్చి ఆటోనగర్ ఏరియా వారు కావలెను. టైం: 9.30AM-7.30PM. ✆ 94914 81499.

మ్యారేజి సంస్థలో పని చేయుటకు కంప్యూటర్ నాలెడ్జ్ గల ఇన్‌చార్జ్ (F). జీ: 20K, రిసెప్షనిస్ట్ (F) జీ: 15K. ఏదైనా డిగ్రీ. VJA-7. ✆ 87905 99799

Teaching Staff for Hotel Management College, Vijayawada FO, HK, Service, Kitchen Department, Salary Depend On Experience. Accommodation Available. ✆ 72888 85598.

Wanted Accountant With Tally Experience for a Reputed firm- Female Preferred. Contact: 98489 12544.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ:18-20K ✆ 96404 68899, 96402 58899

విజయవాడ నందు ఆటోమొబైల్ & ఇండస్ట్రియల్ -సేల్స్ నందు పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్-1 శాలరీ 18,000/- వ. 18-30సం॥లు, వేర్‌హౌస్ నందు పనిచేయుటకు హెల్పింగ్ బాయ్స్-3 శాలరీ 14,000/- వ.18-30సం॥గల పురుషులు కావలెను. ఆదివారం శెలవు. ✆ 91602 22389

SSS కంపెనీలో పనిచేయుటకు లేడీస్ & జెంట్స్ కావలెను. మంచి జీతం మరియు అలవెన్సు. టెన్త్ క్లాస్ & above, VJA. ✆ 93985 53721.

B.Sc కెమిస్ట్రీ B.Com, ITI అర్హత గల స్టాఫ్ (M/F) కావలెను. వయస్సు:25, విజయవాడ లోకల్స్ మాత్రమే. Resume What's app ✆63033 76816.

VJA, బందరురోడ్డులో ప్రముఖ 3స్టార్‌హోటల్‌లో పనిచేయుటకు అనుభవం ఉన్న ★ ఫ్రంట్‌ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ ★ కిచెన్ సూపర్‌వైజర్స్ ★ కంప్యూటర్ బిల్లింగ్ ★ రెస్టారెంట్ వెయిటర్స్ ★ బెల్ బాయస్ కావలెను. ✆ 99515 19777

Govt ఆఫీసులలో అవుట్‌సోర్సింగ్ బేసిస్‌పై డేటాఎంట్రీ కం.ఆపరేటర్, అకౌంటెంట్ కావలెను. జీ: 22,000/- to 30,000/- PF, ESI. ✆ 95058 38531

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

వాల్వ్‌పిట్‌పై మూత ఏర్పాటు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలోని ఈడేపల్లి ప్రసన్నాంజనేయస్వామి ఆలయ సమీపంలోని రహదారి పక్కన ఉన్న పైపులైన్ వాల్వ్‌పిట్‌పై ఉన్న మూత పగిలిపోయి ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. నిత్యం రాకపోకలతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో గొయ్యి సమస్యగా మారిందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో ఇటీవల చిత్ర కథనం ప్రచురించారు. దీంతో అధికారులు స్పందించి గొయ్యిని రోడ్డుపై వరకు అదనంగా సిమెంట్ వరలు ఏర్పాటు చేసి మూత వేశారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు, ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు.

ధర వరలు

టమాట 15, వంగ 22, బెండ 24, పచ్చిమిర్చి 46, కాకర 32, క్యాబేజీ 16, క్యారెట్ 26, దొండ 42, బంగాళదుంప 22, ఉల్లిపాయలు 22, గోరు చిక్కుడు 28, దోస 26, సొర 10, అరటికాయ 7/6, చిక్కుళ్లు 26, బీర 28, చామ దుంప 24, మునగ 08/10, కంద 40, బీట్‌రూట్ 24, క్యాప్సికం 42, బీన్స్ 54, క్యాలీఫ్లవర్ 30, అల్లం 28, చిలకడదుంప 30, కొత్తిమీర 12/06, పుదీన 15/05 గురువారం ఉదయం 7 గంటల వరకు ఈ ధరలే వర్తిస్తాయి. ఏవైనా ఫిర్యాదులు ఉంటే ఎస్టేట్ అధికారి బాలచంద్రవర్ధని ఫోన్ నంబరు: 91823 61295లో సంప్రదించవచ్చు. - న్యూస్‌టుడే, మచిలీపట్నం(గొడుగుపేట)

సినిమాలు

రేవతి : కపుల్ ఫ్రెండ్లీ
మినీరేవతి : సీతాపయనం
సిరికృష్ణ : మన శంకరవరప్రసాద్
సిరివెంకట్ : పంకే

మురుగు పారదు.. వెతలు తీరవు

మండల కేంద్రంలోని బీసీఎస్ఆర్ కాలనీలో మురుగు పారుదల వ్యవస్థ లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ ఏర్పడి సుమారు 20 ఏళ్లు పూర్తి అవుతున్నా నేటికీ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పడలేదు. దీంతో వరుసగా ఇంటి వద్ద వరలు ఏర్పాటు చేసుకొని వాటిలోకి వాడుక నీరు వదులుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, బంటుమిల్లి**

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

స్పందన: నగరంలోని వలందపాలెం నుంచి మాచవరంలో ఏఎంసీ కార్యాలయానికి వెళ్లే ప్రాంతంలో రహదారి పక్కన వేసిన చెత్తతో ఇబ్బందిపడుతున్నామని స్థానికులు సంబంధిత అధికారికి ఫిర్యాదు చేయగా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. - మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

అర్చకుల భూములకు గుర్తింపు కార్డులివ్వాలి

అవనిగడ్డ గ్రామీణం: ఆలయ భూములు అనుభవిస్తున్న అర్చకులకు కూడా విశిష్ట గుర్తింపు కార్డులు జారీ చేయాలని రాష్ట్ర వైఖానస సంఘం నాయకులు మేడూరి శ్రీనివాసమూర్తి బుధవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రైతులకు అందే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్చకులకు కూడా అందించాల్సిన అవసరం ఉందన్నారు.

కదలని ప్రతిపాదన.. అందాకా అలంకారమేనా?

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

నగరం విస్తరిస్తుండడంతో వివిధ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించేవారి సంఖ్య పెరుగుతోంది. దీంతో నగరంలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. సమస్యను పరిష్కరించేందుకు వివిధ ప్రాంతాల్లో పోలీసు సిబ్బందిని కేటాయిస్తున్నా గాని అందుబాటులో ఉన్న సిగ్నల్ లైట్లను వినియోగంలోకి తీసుకురాకపోవడంతో నగరవాసులు, ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

తెదేపా హయాంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థ ఏర్పాటు చేయగా కొన్నేళ్లు సక్రమంగా వినియోగించారు. కొంత కాలానికి అవి పాడైపోవడంతో వైకాపా ప్రభుత్వంలో మళ్లీ నూతన వ్యవస్థను ఏర్పాటు చేశారు. వీటికి సోలార్ ప్యానెల్స్, బ్యాటరీ బాక్సులకు అనుసంధానించారు కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇలా ఏళ్ల తరబడి వదిలేయడంతో

రేవతి కూడలిలో పనిచేయని సిగ్నల్‌లైట్లు

పాడైపోయిన బ్యాటరీలు

పాడైపోయాయి. మూడు స్తంభాల కూడలి, లక్ష్మీటాకీస్, జిల్లా కోర్టు, బస్టాండ్, రేవతి సెంటర్‌లో అధ్వానంగా తయారయ్యాయి.

❖ **దిబ్బ తింటున్న ప్యానెల్స్..** వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన సిగ్నల్ లైట్లు ఎక్కువకాలం ఉండిపోవడం వల్ల సోలార్ ప్యానెల్స్ నుంచి వచ్చే విద్యుత్తు సరఫరా అయ్యే బ్యాటరీలు పాడైపోతున్నాయి. మూడు స్తంభాల కూడలి, రేవతి సెంటర్‌లో బ్యాటరీ బాక్సులు ఊడిపోయాయి. రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన పరికరాలు పాడైపోతున్నాయి. కూటమి ప్రభుత్వం సమస్యను పరిష్కరించి సిగ్నల్ వ్యవస్థను వినియోగంలోకి తేవాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాలతో ట్రాఫిక్ పోలీసు అధికారులు నూతన బ్యాటరీలు, వివిధ పరికరాల కొనుగోలుకు ప్రతిపాదనలు చేశారు. ఇది జరిగి కూడా ఏడాదిన్నర కావస్తోంది. ఇప్పటి వరకు ఎలాంటి కదలిక లేదు. దీంతో వివిధ ప్రాంతాల్లో రహదారులపై ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. సిగ్నల్ వ్యవస్థ అందుబాటులోకి తీసుకొస్తే ట్రాఫిక్ నియంత్రణకు దోహదపడుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పరికరాలు సమకూర్చి త్వరితగతిన ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

గురుకులంలో ప్రవేశాలకు తుది గడువు నేడే

పెడన, న్యూస్‌టుడే : పెడన మండలం బల్లిపర్రులోని డా.అంబేడ్కర్ బాలికల గురుకులంలో ప్రవేశానికి ఈ నెల 19తో పూర్తి అప్లికేషన్ దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ఎన్.రూతమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి నుంచి జూనియర్ ఇంటర్(ఎంపీసీ, సీఈసీ)లో బాలికలకు 2026- 27 సంవత్సరానికి ప్రవేశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలో నాలుగు, పదో తరగతి చదువుతున్న బాలికలు దరఖాస్తు చేసేందుకు అర్హులన్నారు. దరఖాస్తులను https://apbragcet.apcfss.in వెబ్‌సైట్ ద్వారా పంపించాలన్నారు. పూర్తి వివరాలకు చరవాణి నం.97045 50068లో సంప్రదించాలని ఆమె సూచించారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి సాయం

పోతేపల్లి (మచిలీపట్నం గ్రామీణం), న్యూస్‌టుడే: పోతేపల్లిలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కటికల సుబ్బారావు కుటుంబానికి నిత్యావసర వస్తువులు, వంట సామగ్రి, దుస్తులను వలంటిశెట్టి ఛారిటబుల్ ట్రస్ట్ బుధవారం సాయమందించింది. ట్రస్ట్ మేనేజర్ పాండురంగారావు మాట్లాడుతూ.. అగ్నిప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రాజేశ్ కుమార్, కమ్మిలి మధు, శ్రీవిద్ చంద్రబాబు, వాసు తదితరులు పాల్గొన్నారు.

క్షేమంగా ఇంటికి చేరాలి

బంటుమిల్లి, న్యూస్‌టుడే : వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా క్షేమంగా ఇంటికి చేరతారని బంటుమిల్లి ఎస్సై గణేష్ కుమార్ అన్నారు. ముల్లపుడు చెక్‌పోస్టు వద్ద ఆయన బుధవారం వాహనాలను తనిఖీ చేయడంతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 22 వాహనాలకు రూ.7,860 జరిమానా విధించారు.

'బ్రాహ్మణుల పేరెత్తే అర్హత వైకాపాకు లేదు'

మచిలీపట్నం(కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: బ్రాహ్మణ వర్గాల సంక్షేమాన్ని విస్మరించిన వైకాపా నాయకులకు వారి పేరెత్తే అర్హత లేదని బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పీవీ ఫణికుమార్ అన్నారు. మచిలీపట్నంలో బుధవారం ఆయన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ వైకాపా నాయకుడు, దేవాదాయ శాఖ మాజీ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురపు శ్రీకాంత్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఏ ప్రభుత్వ హయాంలో బ్రాహ్మణులకు మేలు జరిగిందనే అంశంపై చర్చకు రావాలంటూ సవాల్ విసిరారు. బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబునాయుడిదైతే అధికారం చేపట్టిన వెంటనే కార్పొరేషన్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసిన ఘనత జగన్‌రెడ్డిది అని విమర్శించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో దేవాలయాల్లో విధ్వంసకర చర్యలు, అర్చకులపై దాడులు, తిరుమల లడ్డూ కల్తీ తదితరాలు యథేచ్ఛగా సాగుతుంటే దేవాదాయ శాఖ సలహాదారుగా ప్రశ్నించని శ్రీకాంత్ ఇప్పుడు మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోడవరపు లక్ష్మీప్రసన్న, బ్రాహ్మణ సంఘ నాయకులు కానుకొలను పణికిరణ్‌శర్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఫణికుమార్

ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: పది విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని డీఈవో యూవీ సుబ్బారావు అన్నారు. బుధవారం ఆయన నగరంతో పాటు బందరు మండలం తాళ్లపాలెం, కానూరు తదితర ప్రాంతాల్లోని పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులు పాఠాలు చదివించి వారి పఠనాసక్తిని పరిశీలించారు. ఉత్తమ ఫలితాల సాధనలో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు, మధ్యాహ్న భోజన నిర్వహణ తీరును పరిశీలించారు. సందేహాలు ఉంటే వెంటనే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో, పక్కన ఉపాధ్యాయులు

ఇంటర్ పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించాలి

మచిలీపట్నం కార్పొరేషన్: ఇంటర్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి పరసా మురళి అన్నారు. బుధవారం నగరంలోని లేడీయాంప్తిల్ కళాశాలలో పరీక్ష విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఉద్యోగులు అందరూ ఎవరికి వారు తమకు కేటాయించిన విధులను నిబద్ధతతో నిర్వహించాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. ప్రిన్సిపల్ మీఎస్‌జీఎస్ లక్ష్మీ, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు సత్యనారాయణ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పరసా మురళి, వేదికపై కమిటీ సభ్యులు

అన్నిచోట్లా కోతులు.. ప్రజల గగ్గోలు

గూడూరు, పెడన మండలాల్లోని వివిధ గ్రామాల్లో కోతులు సంచారం ఎక్కువగా ఉండడంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఇళ్లలోకి వచ్చి సామగ్రిని పాడు చేయడం, తినుబండారాలను ఎత్తుకెళ్లడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇవి రహదారులపై కూడా చేరడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **- న్యూస్‌టుడే, గూడూరు**

తొలగించి.. పక్కనే వదిలేసి..

నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో పార్కు ఎదురుగా ఉన్న రహదారి మధ్యలో కల్వర్టు దిమ్మెలు పగిలిపోయి ప్రమాదకరంగా మారాయి. వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని ప్రాంతవాసులు అధికారులకు మొరపెట్టగా.. వారు స్పందించి కొత్త కల్వర్టును నిర్మించారు. అక్కడ తొలగించిన పాత దిమ్మెలను ఆ చోటనే గుట్టగా వేసి వదిలేశారు. దీంతో స్థానికుల, ప్రయాణికులకు రాకపోకలకు అసౌకర్యానికి గురవుతున్నారు. **- న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)**

ఆర్వో ప్లాంట్ ఉండి ఏం ప్రయోజనం?

నగరంలోని లేడియాంప్తిల్ కళాశాలలో విద్యార్థుల తాగు నీటి అవసరాలకు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ ఉన్నా.. ఉపయోగం లేకుండా తయారయ్యింది. కళాశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గతంలో రెండు చోట్ల ప్లాంట్‌లు ఏర్పాటు చేశారు. అవి మరమ్మతులకు గురై ఏళ్ల తరబడి అలంకారంగా ఉండిపోయాయి. ఇటీవల ఒక ప్లాంట్‌ను వినియోగంలోకి తెచ్చి.. మరొకటి అలాగే వదిలేయడంతో తాగునీటికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

- న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

పట్టించుకోరేం..

నగరంలోని రామానాయుడుపేట సెంటరు నుంచి సర్కసునుపు తోటకి వెళ్లే దారిలో డ్రైనేజీ మురుగు పొంగి రోడ్డుపై చేరింది. లేడియాంప్తిల్ కళాశాల ఎదురుగా కొంతకాలంగా ఇలాగే ఉంటున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. మురుగుతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. డ్రైన్ మేట వేసుకుపోవడం కారణంగా మురుగు పారే దారిలేక ఇలా రోడ్డుపై చేరుతుంది. మురుగులో దోమలు చేరుతున్నాయని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. అధికారులు వీటిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్**

అసంపూర్తి దారి.. ప్రమాదంగా మారి..

మండలంలోని అర్తమూరు వద్ద జాతీయ రహదారి- 216 నిర్మాణం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. నరసాపురం నుంచి ఒంగోలు వరకు ఉన్న ఈ మార్గంలో ముంజులూరు, పలుచోట్ల టోల్‌ప్లాజాల ఏర్పాటు చేసి కొన్నేళ్లుగా టోల్ వసూలు చేస్తున్నారు. కానీ ప్రమాదకరంగా అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను మాత్రం పూర్తి చేయడం లేదు. అర్తమూరు పరిధిలో సగం రోడ్డు నిర్మించి సగం వదిలేశారు. గ్రామంలోకి వచ్చే సర్వీసు రోడ్డు కూడా ఇదే పరిస్థితి.

- న్యూస్‌టుడే, బంటుమిల్లి

పెడన స్కిల్ హబ్‌లో కొత్త కోర్సులు

పెడన: స్థానిక నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ప్రభుత్వ స్కిల్ హబ్‌లో అప్లికేషన్ డెవలపర్ వెబ్ అండ్ మొబైల్ కోర్సును మార్చి నుంచి ప్రారంభిస్తున్నట్లు సెంటర్ కోఆర్డినేటర్ వంగా బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన వెబ్, మొబైల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్‌లో నైపుణ్యాలు ఈ కోర్సులో ఉంటాయని చెప్పారు. పూర్తి వివరాలకు 88977 72488 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

సచివాలయ ఉద్యోగులకు స్థానచలనం

పెడన, న్యూస్‌టుడే : పెడనలోని వివిధ సచివాలయాల్లో బాధ్యతలు నిర్వర్తిస్తున్న నలుగురు ఉద్యోగులకు స్థానచలనం కల్పిస్తూ సచివాలయాల రాష్ట్ర డైరెక్టర్ శివప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్లానింగ్ కార్యదర్శి కాగిత నాగప్రదీప్ కుమార్‌ను మచిలీపట్నం స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు జూనియర్ అసిస్టెంట్‌గా నియమించారు. 6వ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శి పామర్తి జితేంద్ర, 7వ సచివాలయ అమినిటీ కార్యదర్శి పృథ్వీ రవికుమార్‌లను పెడనలో స్వర్ణ వార్డు జూనియర్ అసిస్టెంట్లుగా నియమించారు. 5వ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శి రాజులపాటి జయ కిరణ్ రాజ్ పెడన మండల స్వర్ణ వార్డు జూనియర్ అసిస్టెంట్‌గా నియమితులయ్యారు. ఈ నలుగురు తమ బాధ్యతల నుంచి రిలీవై నూతన పోస్టుల్లోకి బుధవారం వెళ్లారు.

82 శాతం పన్ను వసూళ్లు పూర్తి

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో 82 శాతం పన్ను వసూళ్లు పూర్తి అయినట్లు డిప్యూటీ ఎంపీడీవో హేమప్రకాష్ తెలిపారు. రూ.58 లక్షల లక్ష్యానికి గానూ రూ.47 లక్షల పన్ను వసూళ్లు పూర్తి చేసినట్లు ఆయన చెప్పారు. 14 గ్రామాల్లో నూరు శాతం పన్ను వసూళ్లు సాధించినట్లు వివరించారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే 95 శాతం పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు.

మండలంలోని పాఠశాలల పరిశీలన

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రాథమిక స్థాయి విద్యార్థులు కనీస విద్యా సామర్థ్యాలు సాధించాలని ఎంఈవో- 2 వైవీ హరనాథ్ తెలిపారు. మండలంలోని వివిధ పాఠశాలలను ఆయన బుధవారం పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని రుచి చూశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు రమాదేవి, రజని తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ.. అస్వస్థతకు గురై మృతి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ అస్వస్థతకు గురై ప్రయాణికుడు మృతి చెందిన ఘటన పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. మచిలీపట్నానికి చెందిన లారీ డ్రైవర్ బాలకృష్ణ(40) సొంత పనిపై మాచర్లకు వెళ్లాడు. తిరిగి విజయవాడకు ఆర్టీసీ బస్సులో వెళ్తుండగా పట్టణంలోకి రాగానే అస్వస్థతకు గురయ్యాడు. తోటి ప్రయాణికులు గమనించి బస్సును నిలుపుదల చేయించడంతో డ్రైవర్ వెంటనే 108కి సమాచారం అందించారు. 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించగా బాలకృష్ణ మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

దండిగా నిధులు.. జోరుగా పనులు

పెడన, న్యూస్‌టుడే

రూ.3.13 కోట్లతో భవన నిర్మాణాలు

పెడన మండలంలో దీర్ఘకాలంగా అభివృద్ధికి నోచని గ్రామాలు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రగతి బాట పయనిస్తున్నాయి. మౌలిక సదుపాయాలు లేక గ్రామీణులు అవస్థలు పడుతున్నట్లు గుర్తించిన కూటమి ప్రభుత్వం మండలానికి ఒకేసారి రూ.3.13 కోట్ల నిధులు విడుదల చేసింది. ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ భవనాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను ఈ నిధులతో చేపట్టారు.

గురివిందగుంటలో కమ్యూనిటీ హాలు

☛ **నాలుగు ఆరోగ్య కేంద్రాలు :** మేజర్ పంచాయతీ గ్రామం చెన్నూరు, కొంకేపూడి, కమలాపురం, ఉరివి గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాల(వెల్‌నెస్) భవన నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయి. ఒక్కో భవనాన్ని రూ.36లక్షలతో నిర్మిస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ నిర్మాణాలను చేపట్టారు. చెన్నూరు జనాభా దాదాపు 5 వేల వరకు ఉన్నా ఇప్పటి వరకు ఆరోగ్య కేంద్రానికి భవనం లేక ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రైవేటు భవనాల అరుగులపై వైద్య శిబిరాలను నిర్వహించిన పరిస్థితులు ఉండగా తాజాగా నిర్మిస్తున్న భవనంతో దీర్ఘకాల సమస్య పరిష్కారమైంది. మిగిలిన మూడు గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ☛ **రూ.49లక్షలతో అంగన్‌వాడీలు:** ముడా నిధులు రూ.49 లక్షలతో చోడవరం, బల్లిపర్రు, ఈదుమూడి, కొంకేపూడి, మడక, గాయంపాడుల్లో ఆరు అంగన్‌వాడీ భవనాల్ని నిర్మిస్తున్నారు. మడకలో పదేళ్ల క్రితం చేపట్టిన భవనం అసంపూర్తిగా నిలవగా ఆ భవనాన్ని పూర్తిచేసేందుకు రూ.8లక్షలు కేటాయించారు. గాయంపాడు తప్ప మిగిలిన గ్రామాల్లోనూ అసంపూర్తిగా ఉన్న భవనాలను తాజా నిధులతో పూర్తిచేస్తున్నారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణంతో ప్రధాన సమస్య పరిష్కారం కానుంది ☛ **కమ్యూనిటీ భవనాలు:** పంచాయతీల్లో సామాజిక కార్యక్రమాల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు గుర్తించిన ప్రభుత్వం రూ.1.20 కోట్ల జిల్లా పరిషత్తు నిధులతో ఐదు చోట్ల కమ్యూనిటీ భవనాలకు శ్రీకారం చుట్టింది. చోడవరం, గురివిందగుంట, కొంకేపూడి, కూడూరు, కృష్ణాపురం గ్రామాల్లో ఈ భవనాలు రూపుదిద్దుకుంటున్నాయి. కృష్ణాపురంలో రూ.20 లక్షలు, మిగిలిన నాలుగింటిని ఒక్కొక్కటీ రూ.25లక్షలతో చేపట్టారు. ☛ ఈ మూడు భవన నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయని నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణం చేయిస్తున్నామని మండల పరిషత్తు ఏఈ యడ్లపల్లి ధర్మయ్య చెప్పారు.



బల్లిపర్రులో అంగన్‌వాడీ కేంద్రం

నేటి నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభం

పెడన, న్యూస్‌టుడే : ఆకాశంలో నెలవంక కన్పించడంతో ముస్లింలు గురువారం నుంచి రంజాన్ ఉపవాస దీక్షలను ప్రారంభించనున్నారు. ఉదయం సహరి ప్రత్యేక ప్రార్థనలతో ప్రారంభించి సాయంత్రం ఇఫ్తార్‌తో ఆ రోజును ముగిస్తారు. ఇలా నెల రోజులు కఠోర ఉపవాసం చేసిన అనంతరం రంజాన్ పర్వదినాన్ని నిర్వహించుకుంటారు. ఈ మేరకు పట్టణంలోని తొమ్మిది మసీదులను విద్యుత్తు దీపాలతో అలంకరించారు. ఈ మాసాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తామని స్థానిక గుడివాడ రోడ్డులోని జామియా మసీదు ఇమాం మహఫూజ్ ఆలం తెలిపారు.

విద్యుత్తు దీపాలంకరణలో మసీదు

జాతీయ స్థాయి ఒలింపియాడ్‌లో ప్రతిభ

పతకాలు సాధించిన వారితో కిషోర్

బంటుమిల్లి : స్థానిక కొమ్మారెడ్డి హైస్కూల్ విద్యార్థులు ఇటీవల జరిగిన జాతీయ స్థాయి కలాం సైన్స్, శ్రీనివాస్ రామానుజన్ మ్యాథ్స్ ఒలింపియాడ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారు. ఇందులో దివిజ, గీతిక ప్రియ, జాహ్నవి, రత్నాకర్, గీతిక, మహిధర్‌లకు బంగారు పతకాలు, వెంకట పావని, పృథ్వి తేజ, ఫాతిమా, అక్షయ నాగసింధు, మోజెస్ ఫిన్ని, రవళి, నందిని, కావ్యశ్రీ, కార్తికేయలు రజత పతకాలు సాధించారు. వీరిని పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్, కరస్పాండెంట్ శోభ, ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ చైతన్య, వైస్ ప్రిన్సిపల్ హరణి, హెచ్‌ఎం శ్రీనివాసరావు తదితరులు బుధవారం అభినందించారు.

అన్ని రంగాలపై అవగాహన అవసరం

బంటుమిల్లి: నేటి యువతకు ప్రతి రంగంపై అవగాహన ఉండాలని, అందులో భాగంగానే వ్యాపార రంగంలో ఎటువంటి అవకాశాలు ఉన్నాయి, వాటిని ఎలా అందిపుచ్చుకోవాలని తదితర అంశాలపై విద్యార్థులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జగన్మోహనరావు తెలిపారు. శిక్షణ ముగింపు సందర్భంగా బుధవారం విద్యార్థులకు ఆయన ధ్రువపత్రాలు అందించారు. వైస్ ప్రిన్సిపల్ దేవజయరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శిక్షణ పొందిన విద్యార్థులతో ప్రిన్సిపల్ జగన్మోహనరావు, అధ్యాపకులు

మౌలిక వసతుల కల్పనకు ముందడుగు

పెడన, న్యూస్‌టుడే : పెడనలోని అన్న క్యాంటీన్‌కు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పూర్వ విద్యార్థులు, పుర ప్రముఖులు ముందుకొచ్చారు. తెదేపా రాష్ట్ర నేత బొడ్డు వేణుగోపాలరావు ఆధ్వర్యంలో బుధవారం వారు క్యాంటీన్‌ను సందర్శించి రూ.60 వేలతో భవనానికి రెండు వైపులా రేకులతో షెడ్డు నిర్మించాలని నిర్ణయించారు. అన్న క్యాంటీన్‌కు ఆదరణ పెరుగుతున్నందున మౌలిక వసతులు పూర్తి స్థాయిలో లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యను గుర్తించి 1975-76 బ్యాచ్ పూర్వ విద్యార్థులు, కొంతమంది పుర ప్రముఖులు ముందుకొచ్చారని వేణుగోపాల్ తెలిపారు.

అన్నక్యాంటీన్ వద్ద వేణుగోపాల్, పూర్వ విద్యార్థులు

ముగిసిన మహా శివరాత్రి ఉత్సవాలు

గుడిదిబ్బ (కృత్తివెన్ను): కృత్తివెన్ను గుడిదిబ్బలోని శ్రీదుర్గా పార్వతి సమేత నాగేశ్వర స్వామి మహాశివరాత్రి మహోత్సవాలు బుధవారం ముగిశాయి. ఆలయ ఛైర్మన్ చేకూరి వెంకట్రావు- ప్రమీలారాణి దంపతుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కృత్తివెన్ను దేవస్థానం నుంచి పల్లెపాలెం వరకు స్వామి వారిని పల్లకీలో ఊరేగించారు. ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు, అర్చకుడు కోట మురళీకృష్ణశర్మ, ట్రస్టు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

స్వామివారిని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

సర్వే పద్ధతి ప్రకారం చేయాలి

గుడివాడ, న్యూస్‌టుడే: రీ సర్వేను భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పద్ధతి ప్రకారం చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. ఆర్డీవో కార్యాలయంలో బుధవారం రీసర్వే సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. డివిజన్‌లో రీసర్వే జరుగుతున్న 4 గ్రామాల్లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ క్లినిక్‌లో ప్రజల నుంచి వస్తున్న అర్జీల గురించి సమీక్షించారు. అనంతరం పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. నాణ్యతతో పనులు చేసి భవిష్యత్తులో ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

పీఎం స్వనిధి.. మహిళలకు పెన్నిధి

పెడన, న్యూస్‌టుడే

మహిళా వీధి వ్యాపారులకు సత్వర ఆర్థిక సాయం అందించాలన్న లక్ష్యంగా రూపుదిద్దుకున్న పీఎం స్వనిధి పథకం మహిళలకు ఆర్థిక భరోసా ఇస్తోంది. ఈ నేపథ్యంలో పెడన పట్టణంలోని మహిళా సంఘాల సభ్యులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారు. బ్యాంకర్ల నుంచి తక్కువ వడ్డీకి రుణాలు పొందుతున్న మహిళా వీధి వ్యాపారులు ఆ మొత్తంతో తమ వర్తక కార్యకలాపాలను విస్తృతం చేస్తున్నారు.

రుణం పొందిన మహిళా వీధి వ్యాపారి

స్వల్ప వడ్డీతో.. మహిళలకు మూడు విభాగాల్లో రుణాలను అందజేస్తున్నారు. మొదటి విడతగా రూ.15 వేలు, ఆ తర్వాత రూ.25 వేలు, రూ.50 వేల వరకు అందజేస్తున్నారు. ఎలాంటి హామీ లేకుండా తీసుకున్న రుణాలను షెడ్యూల్ ప్రకారం తిరిగి చెల్లిస్తున్న మహిళలకు దశల వారీగా రూ.50 వేల వరకు కూడా ఇస్తున్నారు. పట్టణంలో మొదటి విడత రుణాలను ఇప్పటి వరకు 270 మందికి అందజేశారు. రెండో విడతలో 40 మంది, మూడో విడతలో రూ.50 వేల వంతున 15 మందికి రుణాలు మంజూరు చేశారు. దీనిపై స్వల్ప వడ్డీ మాత్రమే ఉంటుందని మెప్మా టౌన్ మిషన్ మేనేజర్ ఆనంద్ తెలిపారు.

క్రెడిట్ కార్డులు.. వీధి వ్యాపారులకు బ్యాంకర్లు స్వనిధి కింద క్రెడిట్ కార్డులు కూడా అందజేస్తున్నారు. ఇప్పటి వరకు నలుగురికి వీటిని అందజేశారు. సాధారణ క్రెడిట్ కార్డు నిబంధనలు వర్తిస్తాయని 30 రోజుల వరకు వడ్డీ వసూలు చేయరని మేనేజర్ ఆనంద్ తెలిపారు. దశల వారీగా ఈ పథకాన్ని విస్తరిస్తున్నామని, దరఖాస్తు చేసిన ప్రతి మహిళకు బ్యాంకర్ల ద్వారా రుణాలు అందజేస్తామని ఆనంద్ చెప్పారు.

పెన్నమ్మతల్లికి కుంకుమ పూజలు

మాట్లం-పెన్నమ్మదిబ్బ (కృత్తివెన్ను) : మండలంలోని మాట్లం-పెన్నమ్మదిబ్బలో జరుగుతున్న శ్రీపెన్నమ్మ అమ్మవారి పంచరాత్రి మహోత్సవాలు చివరి దశకు చేరుకున్నాయి. రేవు దానామూర్తి- నాగమణి దంపతుల ఆధ్వర్యంలో నిత్య పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆలయ పురోహితుడు వ్యాస్ సమక్షంలో బుధవారం ఉదయం, సాయంత్రం కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం తాళం భజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం అన్నసమారాధనకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

(c) eenadu

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల అందజేత

పెనమలూరు, న్యూస్‌టుడే : అనారోగ్యంతో బాధపడుతున్న 35 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.17.54 లక్షల చెక్కులను ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పోరంకి ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 1400 మందికి సహాయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రామవరప్పాడు, న్యూస్‌టుడే : పేద రోగులకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా నిలుస్తుందని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామానికి చెందిన కొల్లి గంగరాజుకు రూ.75 వేలు, గన్నవరం మండలం సూరంపల్లికి చెందిన బి.పుణ్యవతికి రూ.2 లక్షలు చొప్పున సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన ఎల్వోసీ పత్రాలు బుధవారం పటమటలోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఆయన అందజేశారు. పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

స్పందన: ◆ కానూరు తులసీనగర్ 2వ రోడ్డులో కొన్ని రోజులుగా మురుగు కాల్వలో పూడిక తీత పనులు చేయక ఇబ్బంది పడుతున్నామని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన కమిషనర్ నజీర్ సిబ్బందిని పంపి పూడిక తీయించారు. ◆ కానూరు వినాయకనగర్, మురళీనగర్ ప్రాంతాల్లో కొన్ని రోజులుగా చెత్త తీయడం లేదని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన కమిషనర్ నజీర్ సిబ్బందిని పంపి చెత్త తీయించారు. - న్యూస్‌టుడే, కానూరు

శాసనసభ ప్రాంగణంలో సభాపతి అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యే యార్లగడ్డతో విద్యార్థులు

శాసనసభ సమావేశాలు తిలకించిన విద్యార్థినులు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: బాపులపాడు మండలానికి చెందిన పలువురు విద్యార్థినులు బుధవారం శాసనసభ సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించారు. బాపులపాడు, కానుమోలు, వేలేరు జడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన 23 మంది, హనుమాన్‌జంక్షన్ విశ్వకవి పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థినులను డీవైఈవో కె.రవికుమార్, ఎంఈవో-2 కొమ్మా విజయ్ నేతృత్వంలో శాసనసభకు తీసుకెళ్లారు. అరగంటకు పైగా సమావేశాలను తిలకించిన విద్యార్థినులు కాసేపు ఆవరణలో సరదాగా గడిపారు. సభాపతి అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వారితో ఆత్మీయంగా ముచ్చటించి, ఫొటోలు దిగారు.

ఎట్టకేలకు రీసర్వే తప్పిదాల దిద్దుబాటు

గత ప్రభుత్వ హయాంలో దారుణాలు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

రీసర్వే :	2023 మార్చి
మొత్తం విస్తీర్ణం:	3,019 ఎకరాలు
ఎల్పీఎంలు:	1,600
రైతులు:	800 మంది

వైకాపా హయాంలో చేపట్టిన రీసర్వే ప్రక్రియ రాష్ట్ర వ్యాప్తంగా తప్పులతడకగా సాగింది. దీని వల్ల అనేక గ్రామాల్లో చోటుచేసుకున్న తప్పులకు భూ యజమానులు ఇప్పటికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సోమవారం నిర్వహించే 'మీ కోసం' కార్యక్రమంతో పాటు, అర్జీల స్వీకరణకు గ్రామసభలు నిర్వహించినా అధిక శాతం ఫిర్యాదులు రీసర్వే లోపాల గురించే కావడం గమనార్హం. బాపులపాడు మండలం రేమల్లె గ్రామం లోపాలకు నిలయంగా మారింది. సాంకేతిక కారణాలతో ఇప్పటివరకు అధికారులు ఈ తప్పులను సరి చేయలేకపోయారు. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం వీటిని చక్కదిద్దే వెసులుబాటు కల్పించడంతో రైతులకు ఊరట లభించనుంది.

దరఖాస్తులు పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

రద్దు కోరేలా తప్పులు: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ గ్రామం నుంచి రీసర్వే తప్పిదాలు సరిచేయాలంటూ వస్తున్న అర్జీలతో రెవెన్యూ యంత్రాంగం బెంబేలెత్తిపోయింది. చివరకు గతంలో చేసిన రీసర్వేను రద్దు చేసి, మరోసారి పారదర్శకంగా నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలంటూ ఏకంగా సీసీఎల్ఏకు అధికారులు మొర పెట్టుకునే స్థాయిలో తప్పులు జరిగాయి.

సమాచారం లేకుండానే...: రైతులకు ముందస్తు సమాచారం లేకుండా, కనీసం రైతులను పొలాల్లోకి పిలవకుండానే రీసర్వే ముగించేశారు. ఏ దశలోనూ రైతులను భాగస్వాములను చేయలేదు. భూహక్కు పత్రాలు చేతికొచ్చిన తర్వాత గానీ తప్పుల చిట్టా బయటపడలేదు. ఒకరి భూములు మరొకరి పేర్లతో నమోదు చేయడం, విస్తీర్ణం గణనీయంగా తగ్గించడం, ఒకే సర్వే నంబరులో వేర్వేరుగా ఉన్న వారికి సంయుక్త ఎల్పీఎం నంబర్లు కేటాయించడం వంటి తప్పులు అనేకం దర్శనమిచ్చాయి. ఏడాది వ్యవధిలో మూడు సార్లు గ్రామసభలు నిర్వహించినా పరిష్కారం చూపించలేకపోయారు.

కార్యాచరణ మొదలు: రీసర్వే లోపాలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడం, రేమల్లె వ్యవహారం రాష్ట్ర స్థాయిలో చర్చనీయాంశంగా మారడంతో ఇటీవలే నిబంధనలను సులభతరం చేస్తూ ఆర్డీవో, తహసీల్దార్లకు అధికారాలు అప్పగించారు. అన్ని ధ్రువపత్రాలను పరిశీలించి, క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, రైతుల అభ్యంతరాలకు అనుగుణంగా రికార్డుల్లో మార్పు చేర్పులకు అవకాశం కల్పించారు. దీంతో తహసీల్దార్ మురళీకృష్ణ నేతృత్వంలో రీసర్వే డీటీ రాజేంద్ర, మండల సర్వేయరు ఫణి కుమార్, వీఆర్వో కిరణ్, గ్రామ సర్వేయరు సంతోష్ ఆధ్వర్యంలోని బృంద సభ్యులు గత కొన్ని రోజులుగా కార్యాచరణ ప్రారంభించారు.

44 సంవత్సరాలుగా ✆ 81252 65651 ✆ 0866 2471617, 2477470
✪ ఆటలు ✪ పాటలు ✪ రోబోటిక్స్ ✪ క్రియేటివ్ లెర్నింగ్ ✪ డ్రోన్ తయారీ ✪ 3డి ప్రింటింగ్ ✪ LKG to 10th
డాన్ బాస్కో స్కూల్
Affiliated to CBSE
గురునానక్ రోడ్, ఆటోనగర్ కాలని ఎదురుగా, విజయవాడ-7.

హుండీ ఆదాయం లెక్కింపు

యనమలకుదురు: స్థానిక రామలింగేశ్వర స్వామి హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం ఆలయ ప్రాంగణంలో చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ కొండలరావు, ఆలయ అభివృద్ధి దాత సంగా నరసింహారావు నేతృత్వంలో నిర్వహించారు. 2025 నవంబరు 26 నుంచి 2026 ఫిబ్రవరి 18 వరకు (82 రోజులకు) హుండీ ఆదాయం రూ. 23,40,500 నగదు వచ్చిందని తెలిపారు. దుర్గా శివసాయి సంఘం సభ్యులు, పోలీసు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారని ఈవో భవానీ పేర్కొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్

పెనమలూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి పెనమలూరు నియోజకవర్గంలో రూ. కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తెలిపారు. పోరంకిలోని తన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. . మంజూరైన రూ.200 కోట్లలో రూ.100 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు ఇప్పటికే పూర్తి అయినట్లు పేర్కొన్నారు. అధిక భాగం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేదలు నివసించే ప్రాంతాల్లోనే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రధానంగా యనమలకుదురు వంతెన, సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ఫ్లైఓవర్ సమస్యలను పరిష్కరించామన్నారు. మద్దూరు- ఉప్పులూరు రహదారి, కుందేరు వంతెన నిర్మాణాలు తుది దశలో ఉన్నాయన్నారు. కుందేరు వంతెన నిర్మాణాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

బెంజిసర్కిల్- గంగూరు ఫ్లైఓవర్ ఏర్పాటుకు కృషి

బందరు రోడ్డులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. దీనిలో భాగంగా బెంజిసర్కిల్ నుంచి గంగూరు వరకూ ఫ్లైఓవర్‌ను నిర్మించాల్సి ఉందన్నారు. ఈ ప్రతిపాదనను ఆయన ఇప్పటికే ఎన్‌హెచ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. సమావేశంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

20, 21 తేదీల్లో జాతీయ స్థాయి టెక్నో ఫెస్ట్

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏవీ రత్నప్రసాద్, మల్లికార్జున, రంగారావు తదితరులు

కానూరు, న్యూస్‌టుడే : ఈనెల 20, 21 తేదీల్లో జాతీయ స్థాయి టెక్నో ఫెస్ట్ సుప్రజ్ఞ- 2026 నిర్వహిస్తున్నామని సిద్ధార్థ డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రొవైస్ ఛాన్సలర్ ఏవీ రత్నప్రసాద్ అన్నారు. బుధవారం విశ్వవిద్యాలయంలో కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మొత్తం 50 ఈవెంట్లలో పోటీలు నిర్వహించి విజేతలకు రూ.10 లక్షల బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో 3 వేల విద్యార్థులు వస్తారని చెప్పారు. ముఖ్య అతిథిగా గ్వాలియర్ ఐఐటీఎం మాజీ డైరెక్టర్ దేశ్‌ముఖ్ హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో బావినేని పాండురంగారావు, రవిచంద్, రాజేశ్వరరావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి నిధులివ్వండి

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి నిధులు కేటాయించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో బుధవారం యార్లగడ్డ మాట్లాడారు. తాను కోల్ ఇండియా, హెచ్‌సీఎల్ సంస్థల సీఎస్ఆర్ నిధులు రూ.3.90 కోట్లు సేకరించినట్లు సభకు వివరించారు. ఆసుపత్రి అభివృద్ధితో పాటు ట్రామా సెంటర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. నియోజకవర్గంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని.. ప్రాథమిక చికిత్సకు వీలుగా 30 పడకల ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని కోరారు. విమానాశ్రయానికి సమీపంలో ఆసుపత్రి ఉండటంతో.. విమాన ప్రయాణికులకు అత్యవసర చికిత్సకు వీలుగా సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

గన్నవరం గ్రామీణం: విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా ఉంగుటూరు మండలం నందమూరు సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం పలుచోట్ల సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఆ శాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మానికొండ, నందమూరు పంచాయతీల పరిధిలో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు.

జీవిత లక్ష్యంపై స్పష్టత అవసరం

మాట్లాడుతున్న బాలలత

ఈడుపుగల్లు (కంకిపాడు), న్యూస్‌టుడే : ఎంచుకున్న రంగంలో రాణించాలంటే లక్ష్యంపై స్పష్టత అవసరమని విద్యావేత్త మల్లవరపు బాలలత పేర్కొన్నారు. ఈడుపుగల్లు పరిధిలోని విద్యాలయ హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులకు 'కెరీర్ గైడెన్స్'పై అవగాహన కల్పించారు. దేశ పురోగతిలో బాలల పాత్ర కీలకమన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తూ..విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ధనిక్ భారత్ డైరెక్టర్ విక్రమ్ అజయ్, విద్యాలయ వ్యవస్థాపకురాలు పర్వతనేని వాణి, ప్రిన్సిపల్ శిరీష, కరస్పాండెంట్ యార్లగడ్డ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేలం ప్రకటన

IN THE COURT OF THE HON'BLE VII ADDITIONAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT VIJAYAWADA
E.P. No. 55/2025 in O.S.No.463/2017
Between:
Avula Narasaiah ... D.H.R
AND
Dudala Satyanarayana ... J.D.R

[illegible]
డి.హెచ్.ఆర్. విలువ - రూ. 12,00,000/-
అమీనా విలువ - రూ. 50,00,000/-
[illegible]

/// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ///
వేలం వాయిదా తేది: 16-03-2026
తదుపరి విచారణ తేది: 23-03-2026

జి.ఆర్.కె.ఎస్. బాలాజీ, న్యాయవాది
డి.నెం.29-25-63, కేసరివారి వీధి,
సూర్యారావుపేట, విజయవాడ-520 002
సెల్: 9866113789

అండర్‌పాస్ లేక అగచాట్లు

వేలేరు ఆలయ కూడలి వద్ద ఎడాపెడా వాహనాల రాకపోకలు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించిన క్రమంలో బాపులపాడు మండలం వేలేరు వద్ద అండర్‌పాస్ నిర్మించలేదు. బాపులపాడు, వేలేరు గ్రామాలను జాతీయ రహదారితో సులభంగా అనుసంధానం చేసేలా ఇది కీలకమైన, బైపాస్ మార్గం నిర్మాణం భూసేకరణలో నెలకొన్న ఇబ్బందుల వల్ల జాప్యం జరిగింది. దీంతో ఈ ప్రాంతంలో రాకపోకలు ప్రమాదకరంగా తయారయ్యాయి. ప్రతిపక్ష నేత హోదాలో నాలుగేళ్ల కిందట హనుమాన్‌జంక్షన్ వచ్చిన చంద్రబాబు కచ్చితంగా అండర్‌పాస్ నిర్మించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆ దిశగా కార్యాచరణ చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బస్టాండ్‌కు 'దారేది'

కంకిపాడు బస్టాండ్ తూర్పు మార్గం మూసుకుపోయి ఎటూ దారిలేదు. ప్రవేశ ద్వారానికి అడ్డుగా మురుగు కాల్వపై తొలగించిన నాపరాళ్లు, ఇతర వ్యర్థాలను అక్కడే కుమ్మరించారు. దీంతో రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. సమస్య పరిష్కరించి పనులు త్వరగా చేపట్టి దారి మార్చాలని ప్రయాణికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కంకిపాడు

వంతెనలపై ప్రయాణం.. ప్రయాణికులకు భయం..

మండలంలోని పలు వంతెనలపై ప్రయాణం చేయాలంటే భయపడాల్సిన పరిస్థితి. ప్రధానంగా కుందేరు డ్రెయిన్ బ్రిడ్జి, గొడవర్రు పరిధిలోని ఏనుగుల కోడు పైవంతెన, ఉప్పులూరు పరిధిలోని రైవస్ కాలువ, బుడమేరు వంతెనలు పూర్తిగా శిథిలావస్థలో ఉన్నాయి. వంతెనలకు ఇరువైపులా రక్షణ కంచె పాడైనా సంబంధిత అధికారులు వాటిని పట్టించుకోవడం లేదు. రేడియం స్టిక్కర్‌లు అంటిస్తే కొంతమేరకైనా ప్రమాదాలను నివారించే వీలుంటుందని ప్రయాణికులు చెబుతున్నారు.
- న్యూస్‌టుడే, కంకిపాడు గ్రామీణం

ఉత్సాహంగా 'పది' విద్యార్థుల వీడ్కోలు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: రేమల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. త్వరలో పబ్లిక్ పరీక్షలు రాయబోతున్న 10వ తరగతి విద్యార్థులకు జూనియర్లు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు లూథర్‌పాల్‌ను సత్కరించారు. పరీక్షలు బాగా రాసి, మంచి ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో పలువురు విద్యార్థులు అలరించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాల ప్రారంభం

ప్రొద్దుటూరు (కంకిపాడు) : ప్రొద్దుటూరు పరిధిలో దావులూరు టోల్ ప్లాజా సమీపంలో నూతనంగా నిర్మించిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రతిష్ఠాపనోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విష్వక్సేన, క్షీరాభిషేకాలను నిర్వహించారు. గ్రామానికి చెందిన భీమవరపు చంద్రశేఖరరెడ్డి జ్ఞాపకార్థం ఆలయాన్ని నిర్మించినట్లు నిర్మాణ కర్త శేషమ్మ తెలిపారు. ఈ నెల 21 ఉదయం 10.44గంటలకు దేవత విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నారని పేర్కొన్నారు.

త్వరలో వేలేరు ఆర్‌యూబీ పనులు

హనుమాన్‌జంక్షన్: విజయవాడ-విశాఖ రైల్వే మార్గంలో వేలేరు పరిధిలో 334 లెవెల్ క్రాసింగ్ వద్ద ఆర్‌యూబీ నిర్మాణానికి వీలుగా త్వరలోనే పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. బుధవారం లెవెల్ క్రాసింగ్ ప్రాంతాన్ని రైల్వే ఇంజినీరింగ్ విభాగం, పంచాయతీ, రెవెన్యూ అధికారులు సందర్శించారు. వేలేరులో ఆర్వోబీ నిర్మాణం తర్వాత గేటును మూసివేయడంతో ఎస్సీ కాలనీకి, గ్రామానికి పదేళ్లుగా అనుసంధానం తెగిపోయింది. పైగా హైస్కూల్‌కు వెళ్లే విద్యార్థులు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఇక్కడ ఆర్‌యూబీ నిర్మించాలని గతంలోనే స్థానికులు విజ్ఞప్తి చేశారు. ఆర్‌యూబీ మంజూరు చేసినట్లుగా అధికారులు చెబుతున్నా, పనులేవీ ప్రారంభం కాలేదు. దీంతో మాజీ సర్పంచి, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు చొరవ తీసుకుని సమస్యను రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో పాటు కలెక్టర్‌కు సమస్యను నివేదించారు. ఎట్టకేలకు స్పందించిన అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలనకు బుధవారం వేలేరు వచ్చారు. త్వరలోనే ఆర్‌యూబీ పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.

ప్రకటన

[illegible] వారిని విచారించినా దొరకలేదు. కావున ఈ క్రింద తెలిపిన ఒరిజినల్ దస్తావేజులు ఎవరికైనను దొరికినచో వాటిని నాకు గానీ, నా క్లయింటుకు గానీ అందజేసిన వారికి తగిన బహుమతి ఇవ్వబడును. అలా కాకుండా సదరు ఒరిజనల్ దస్తావేజులను ఉపయోగించి ఏదైనా లావాదేవీలు జరిపిన అవి ఏమియు నా క్లయింటును బైండు చేయజాలవు మరియు చెల్లనేరవు. ఈ దస్తావేజులను దుర్వినియోగము చేసినవారిపై చట్ట ప్రకారము చర్యలు తీసుకొనబడునని తెలియచేయటమైనది.
పోయిన ఒరిజనల్ దస్తావేజుల వివరాలు: కృష్ణాజిల్లా, కంకిపాడు సబ్ రిజిస్టర్ వారి ఆఫీసులో నా క్లయింటు పేరుతో డి.28-01-2011న రిజిస్టరు కాబడిన ఒరిజనల్ దస్తావేజు నెం.265/2011 ఆస్తి వివరము పునాదిపాడు గ్రామము నందు గల ఆర్.ఎస్. నెం. 35/1ఎ నందలి ప్లాట్ నెం.7గా యున్నది.
మైలా కేశవరావు, ఎం.ఏ., బి.ఎల్., అడ్వకేట్
డి.నెం.29-2-3, రామమందిరం రోడ్డు, గవర్నరుపేట, విజయవాడ
సెల్: 9849205767

కథోలికులకు తపస్సు కాలం ఓ వరం

ప్రార్థనలు చేస్తున్న కథోలిక మతగురువు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: చేసిన తప్పులు సరిదిద్దుకొనేందుకు అద్భుతమైన అవకాశమే తపస్సు కాలం అని ఫాదర్ పసల థామస్, ఫాదర్ కిశోర్‌లు పేర్కొన్నారు. బాలయేసు దేవాలయం, ఉంగుటూరు మండలం పెద్దఅవుటపల్లి బ్రదర్ జోసఫ్ తంబి పుణ్యక్షేత్రం, కేసరపల్లి, అజ్జంపూడి, తేలప్రోలు, కొండపావులూరు ఇతర ఆర్సీఎం చర్చిల్లో బుధవారంతో తపస్సు కాలాన్ని ప్రారంభించారు. ఎంతో భక్తిశ్రద్ధలతో విశ్వాసులు ఉపవాస, జపమాల, శిలువ మార్గాలను ఆయా చర్చిల్లో నిర్వహించారు. కథోలికులకు తపస్సుకాలం ఓ వరమంటూ విశ్వాసులకు వివరించిన విచారణకర్తలు, పలువురికి దీక్ష అందజేశారు.

ప్రత్యేక ప్రార్థనల ప్రారంభం

దీక్ష తీసుకుంటున్న క్రైస్తవులు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: క్రైస్తవుల తపస్సు కాలం మొదలైన నేపథ్యంలో హనుమాన్ జంక్షన్ జ్యోతి నగర్ ఆర్సీఎం చర్చి పరిధిలో బుధవారం తపోదీక్ష ధారణ కార్యక్రమం ప్రారంభించారు. సంఘ విచారణకర్త చేబ్రోలు జోసెఫ్ తంబి ఆధ్వర్యంలో దాదాపు 200 మంది శ్రమదినాలు పాటించేలా దీక్ష తీసుకున్నారు. 40 రోజుల పాటు అన్ని నియమాలు పాటిస్తూ, ఏసుక్రీస్తుని మరింత భక్తితో ప్రార్థించాలని ఆయన సూచించారు. మత గురువులు బడుగు ఫ్రాన్సిస్, సాగర్, సిస్టర్లు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో సత్తా చాటాలి

నాయకులతో మాట్లాడుతున్న శివరామ్‌ప్రసాద్‌గౌడ్

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సత్తా చాటాలని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ సొంటి శివరామ్‌ప్రసాద్‌గౌడ్ పేర్కొన్నారు. పార్టీ ఆదేశాల మేరకు బాపులపాడు మండలం దంటగుంట్ల, కాకులపాడు పోలింగ్ కేంద్రాలను బుధవారం సందర్శించి నాయకులతో సమావేశమయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో రెండు పోలింగ్ కేంద్రాల్లోనూ కూటమి ప్రభుత్వానికి భారీ మెజారీ రావడంపై ఆరా తీశారు. మూడు పార్టీల నాయకులు సమష్టిగా కలిసి ముందుకెళ్లడంతో మంచి ఫలితాలు వచ్చాయని, నాయకుల పనితీరును అభినందించారు. ఇదే స్ఫూర్తి స్థానిక ఎన్నికల్లో కనబర్చాలని కోరారు. రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ దయాల రాజేశ్వరరావు, డీసీ అధ్యక్షుడు కొమ్మారెడ్డి రాజేష్, సర్పంచి యజ్జవరపు రంగారావు, నాయకులు జాస్తి భూపతి, చెన్నుబోయిన బీరయ్య, కాలి రమేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఐ కార్యాలయం ప్రారంభానికి సిద్ధం

నిర్మించిన శాశ్వత భవనం

హనుమాన్‌జంక్షన్: దాదాపు మూడు దశాబ్దాలుగా అద్దె భవనంలో.. అరకొర వసతులతో కొనసాగుతున్న హనుమాన్‌జంక్షన్ పోలీసు సర్కిల్ కార్యాలయానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. రెండేళ్ల కిందటే శాశ్వత భవనం సమకూరినా, వివిధ కారణాలతో ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. గత ప్రభుత్వ హయాంలో పూర్తిగా దాతల తోడ్పాటుతోనే ఈ భవనం సాకారమైంది. హనుమాన్‌నగర్ రాజుల కాలనీలో 10 సెంట్ల సామాజిక స్థలంలో సీఐ కార్యాలయ శాశ్వత భవనం నిర్మించారు. 2024, జనవరి నాటికే ఇది పూర్తయినా.. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలు ఫిర్యాదులు రావడం తదితర కారణాలతో ఈ వ్యవహారం మరుగున పడిపోయింది. దాదాపు రూ. 60 లక్షల ప్రజా విరాళాలతో ఆరు నెలల వ్యవధిలోనే అధునాతన హంగులతో రెండంతస్తుల్లో ఈ భవనాన్ని నిర్మించారు. ఈ నెల 20న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో దీనిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

బీసీ సింహగర్జన విజయవంతం చేయాలి

పెనమలూరు, న్యూస్‌టుడే: భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో 22న ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని అంబేడ్కర్ ప్రాంగణంలో నిర్వహించనున్న బీసీ సింహ గర్జనను విజయవంతం చేయాలని ఆ పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త తోకల రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ హాజరై పలు సమస్యలపై మాట్లాడతారని ఆయన పేర్కొన్నారు. వీర్లప్రసాద్, గోగం వెంకటేశ్వర్లు, తాడిబోయిన రవిశంకర్, పిన్నిబోయిన గోపి పాల్గొన్నారు.

తాడిగడపలో 21న మెగా జాబ్ మేళా

పెనమలూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 21న తాడిగడప 100 అడుగుల రోడ్డులోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ కార్యాలయ ప్రతినిధులు బుధవారం ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి నుంచి పీజీ చదివిన వారు అర్హులని చెప్పారు. 18 నుంచి 35 ఏళ్ల లోపు ఈ జాబ్ ఫెయిర్‌లో పాల్గొనవచ్చని ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు ధ్రువపత్రాలు, ఆధార్, పాన్, రెండు పాస్‌పోర్టు ఫొటోలు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

ఉంగుటూరులో చోరీ

గన్నవరం గ్రామీణం: ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు చోరీకి పాల్పడిన ఘటన ఉంగుటూరులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మినుముల వ్యాపారి కాజా సత్యనారాయణ ఈనెల 11వ తేదీన ఆరోగ్యం బాగోలేదని చిన్నఅవుటపల్లి డా.పిన్నమనేని ఆసుపత్రికి భార్యతో కలిసి వెళ్లారు. చికిత్స అనంతరం తిరిగి బుధవారం సాయంత్రం ఇంటికి వచ్చారు. ఆ సమయంలో ఇంట్లో సామగ్రి చెల్లాచెదురుగా పడి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బీరువాలోని ఐదు కాసుల బంగారపు తాడు, రెండు గ్రాముల జత పోగులు, రూ.లక్ష నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జూదరుల అరెస్టు

ముదునూరు (ఉయ్యూరుగ్రామీణం): ముదునూరులో జూదం ఆడుతున్న వారిపై ఉయ్యూరు రూరల్ ఎస్సై సుభాషిణి మంగళవారం రాత్రి దాడి చేశారు. పది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని రూ.17 వేల నగదు, పది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఖాతాదారులకు సత్వర సేవలు

హనుమాన్‌జంక్షన్: ఖాతాదారులకు రుణాలు మంజూరు చేయడంతో పాటు, సత్వర సేవలందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ అధికారి శర్మ, బ్రాంచి మేనేజర్ సుధాకర్ పేర్కొన్నారు. బ్రాంచి తరఫున ఖాతాదారుల ఆత్మీయ సమావేశం బుధవారం నిర్వహించారు. అతి తక్కువ వడ్డీతో అన్ని రకాల రుణాలను మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని జోనల్ అధికారి శర్మ తెలిపారు. బ్యాంకు కరస్పాండెంట్ వేగిరెడ్డి బాలాజీ పాల్గొన్నారు.

అంతిమయాత్ర
మా తల్లిగారైన శ్రీమతి వీరమాచనేని హేమలత గారు ది.18-02-2026 బుధవారం సాయంత్రం 6 గంటలకు స్వర్గస్తులైనారని తెలియజేయుటకు చింతిస్తున్నాము.

శ్రీమతి వీరమాచనేని హేమలత గారు
W/o (లేట్) వీరమాచనేని చంద్రశేఖరరావు గారు
గురునానక్ కాలనీ, విజయవాడ.
అంతిమయాత్ర ది. 19-02-2026 గురువారం ఉదయం 9 గంటలకు విజయవాడ గురునానక్ కాలనీలో మా స్వగృహము నుండి బయలుదేరును. కావున తెలియపరచడమైనది.
కుమారులు: వీరమాచనేని భవానీ శంకరరావు
వీరమాచనేని అచ్యుతరావు (అచ్చియ్య)

(c) eenadu

నమ్మించి.. నిలువునా ముంచేసి..

రైల్వే ఉద్యోగాల పేరుతో రూ.లక్షల్లో దోపిడీ

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే

ఉద్యోగాల పేరుతో దాదాపు రెండేళ్లుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సాగుతున్న దందాలో చిక్కుకున్న బాధితుల పరిస్థితి నేడు అగమ్యగోచరంగా మారింది. మోసాన్ని గుర్తించి ప్రశ్నించిన వారిపైనే ఎదురు కేసులు పెడుతున్న నేపథ్యంలో తమకు ఆత్మహత్యలే శరణ్యమంటూ బాధితులు వాపోతున్నారు.

రైల్వేలో చిరుద్యోగిగా పనిచేస్తున్న ఎం. కిషోర్.. మచిలీపట్నం రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. సహచరులు కరీముల్లా, షఫి, అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకుడు చిన్నా తదితరుల సహకారంతో పలువురితో పరిచయాలు పెంచుకున్నారు. ఈ క్రమంలో కిషోర్.. రైల్వేలో టీసీ, క్లర్క్ తదితర పోస్టుల పేరుతో కనిష్ఠంగా రూ.5 లక్షల చొప్పున పలువురి వద్ద నుంచి నగదు, ఖాళీ చెక్కులు వసూలు చేశాడు. అనంతరం వారికి పీఎఫ్ ఖాతా నంబర్లు, రైల్వే స్టాంపులతో కూడిన ఫేక్ నియామక పత్రాలు, ఐడీ కార్డులు పంపుతూ సాంకేతిక కారణాల వల్ల ఉద్యోగంలో చేరేందుకు కాస్త ఆలస్యం అవుతుందంటూ నమ్మబలికాడు. ఆలస్యంపై ఎవరైనా నిలదీస్తే విజయవాడ, ఇతర ప్రాంతాలకు మాట్లాడదామంటూ పిలిచి యూనియన్ నాయకుల పేరుతో కొందరిని పరిచయం చేసి త్వరలోనే ఉద్యోగం వస్తుందని ఆశలు కల్పించేవాడు. ఇదే తరహాలో మచిలీపట్నం పరిసర ప్రాంతాలకు చెందిన పలువురి వద్ద నుంచి నగదు దోచేసి వారిని మభ్యపెడుతూ వస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం జక్కరం గ్రామానికి చెందిన నాగపద్మ తనకు వచ్చిన నియామక పత్రాన్ని రైల్వే ఉద్యోగులకు చూపించి అది నకిలీదని నిర్ధారించుకోవడంతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది.

కిషోర్ ఇంటి వద్ద నకిలీ నియామక పత్రాలు చూపిస్తున్న బాధితులు

అడిగినందుకు ఎదురు కేసు: బాధితురాలు నాగపద్మతో పాటు మచిలీపట్టణానికి చెందిన గంగాభవాని ఈ నెల 7న మచిలీపట్నంలోని కిషోర్ నివాసానికి వచ్చారు. కిషోర్, అతనికి అండగా నిలిచిన చిన్నా కలిసి 'అల్లరి చేసుకోవద్దు.. మీకు ఉద్యోగాలు ఖాయం.. రేపు రండంటూ వారిని పంపేశారు. మరుసటి రోజు కిషోర్ ఇంటికి వెళ్లగా ఎవరూ ఆచూకీ లేకపోవడంతో బాధితులు చిలకలపూడి స్టేషన్‌కు వెళ్లి జరిగిన మోసాన్ని పోలీసులకు వివరించారు. అనంతరం బాధితులు తిరిగి కిషోర్ ఇంటికి వెళ్లి అతని కోసం నిరీక్షించారు. ఈలోగా పోలీసులు అక్కడకు వచ్చి రాత్రి మీరే కిషోర్‌పై దాడి చేశారంటూ అతడు ఫిర్యాదు ఇచ్చాడని, ఈ కేసులో నిందితులుగా ఉన్నారంటూ నాగపద్మ, గంగాభవానిలను స్టేషన్‌కు తీసుకువెళ్లడం గమనార్హం. ఇదిలా ఉండగా.. ఈ నెల 14న కాళ్ల పోలీస్ స్టేషన్‌లో ఇదే అంశంపై తాను ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకుండా తనను వెనక్కి పంపేశారని నాగపద్మ వాపోతోంది.

యూనిఫారం పేరుతోనూ దండుకున్నారు

ఉద్యోగం పేరుతో రూ.3.50 లక్షలు వివిధ రూపాల్లో తీసుకున్నారు. ఎప్పుడు విధుల్లో చేరాలని ప్రశ్నించగా త్వరలోనే అని చెబుతూ మీకు రైల్వే యూనిఫాం వచ్చిందని, దాని కోసం రూ.5,000 ఇవ్వాలంటూ అదనంగా దండుకున్నారు. - గంగాభవానీ

రూ.60 లక్షలకు ష్యూరిటీ అంటూ నోటీసు

డబ్బులు పోగొట్టుకుని ఉద్యోగం రాకపోగా.. సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ నుంచి రూ.60 లక్షల రుణానికి మీరు ష్యూరిటీగా ఉన్నారంటూ మెసేజ్ వచ్చింది. దీన్నిబట్టి నా వద్ద నుంచి తీసుకున్న చెక్కులను అడ్డుపెట్టుకుని కిషోర్ మరో రుణమోసానికి పాల్పడ్డాడన్న భయం వెంటాడుతోంది. - నాగపద్మ

నాయకులు మాట్లాడే భాషకు సెన్సార్ అవసరం

మండలి వెంకట కృష్ణారావు శతజయంతి సభలో మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే : సినిమాల్లాగే రాజకీయ నాయకులు ప్రయోగిస్తున్న భాషకూ సెన్సార్ ఉండాల్సిన అవసరం ఏర్పడిందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో రసరంజని (హైదరాబాద్) సంస్థ ఆధ్వర్యంలో మండలి వెంకటకృష్ణారావు శతజయంతి సభ ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ మాజీ సలహాదారు డా. కె.వి.రమణాచారి అధ్యక్షతన జరిగిన సభలో కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మండలి వెంకట కృష్ణారావు నిరాడంబరుడైన గాంధేయవాదని, ప్రజాసేవకు మారుపేరని కొనియాడారు. ఒకప్పుడు నాయకులంటే సమాజంలో ఎంతో గుర్తింపు, గౌరవం ఉండేదని, ప్రస్తుత రాజకీయాల్లో విపరీత ధోరణులు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. దక్షిణాదిలో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ప్రజాప్రతినిధులు, నేతలు ప్రత్యర్థులను ఉద్దేశించి ప్రయోగించే భాష వల్ల టీవీలు కట్టేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రాజకీయాల్లో డబ్బు ప్రభావం పెరిగాకే ప్రజాప్రతినిధులు, ప్రజల మధ్య ఉండే సత్సంబంధాలు తగ్గిపోయాయన్నారు. నీతి, నిజాయతీ ఉన్నవాళ్లు రాజకీయాల్లో కొనసాగే పరిస్థితి లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తన తండ్రి మండలి వెంకట కృష్ణారావు అడుగుజాడల్లో నడుస్తున్న మండలి బుద్ధప్రసాద్ ఎన్నికల్లో గెలవటం గొప్ప విషయమన్నారు. రాజకీయాల్లో డబ్బు ప్రాధాన్యం తగ్గించకపోతే పరిస్థితులు మరింతగా దిగజారుతాయని పేర్కొన్నారు. ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ.. మండలి వెంకట కృష్ణారావు ఆదర్శ నాయకుడన్నారు. ఈ సందర్భంగా 'మహాపురుషుడు మండలి' నాటక రచయిత దీర్ఘాసి విజయభాస్కర్‌ను సత్కరించారు. సభలో ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గ్రంధి భవానీ ప్రసాద్, నటుడు తనికెళ్ల భరణి, మాజీ మంత్రి జలగం ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. తర్వాత మండలి వెంకట కృష్ణారావు జీవితాదర్శాలపై గంగోత్రి సాయి దర్శకత్వంలో తాడేపల్లికి చెందిన అరవింద ఆర్ట్స్ కళాకారులు 'మహాపురుషుడు మండలి' నాటకాన్ని ప్రదర్శించారు.

జ్యోతి వెలిగిస్తున్న కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రసాదరావు, చిత్రంలో జస్టిస్ భవానీప్రసాద్, రమణాచారి, కొలకలూరి ఇనాక్, బుద్ధప్రసాద్ తదితరులు

23న భాషా పండగ పోటీలు

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లా స్థాయిలో ఈ నెల 23వ తేదీన భాషా పండగ పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో యూవీ సుబ్బారావు తెలిపారు. ఒకటో తరగతి నుంచి అయిదో తరగతి వరకు ఒక విభాగం, ఆరు నుంచి పదో తరగతి వరకు రెండో విభాగంగా పోటీలు నిర్వహించాలని ఆయన హెచ్ఎంలకు సూచించారు. తొలుత తెలుగు, ఆంగ్లం, ఉర్దూ, సంస్కృతం, హిందీ భాషల్లో పాఠశాల స్థాయిలో పోటీలు నిర్వహించాలని చెప్పారు. అనంతరం మండల స్థాయిలో పోటీలు నిర్వహించాలని వివరించారు. మండల స్థాయిలో విజేతలకు జిల్లా స్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. పద్యాలు రాయడం, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించాలన్నారు.

ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా ఏపీ

విజయవాడ(భవానీపురం), న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఏపీ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ) 50 ఏళ్ల వేడుకను విజయవాడలోని భవానీద్వీపంలో బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పర్యాటక రంగంలో గణనీయమైన అభివృద్ధి జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో రూ.20 వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయని, 1.22 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యమన్నారు. పీపీపీ విధానంలో పెట్టుబడులే లక్ష్యంగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను పెంపొందించేందుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రోడ్ షోలను నిర్వహిస్తామని వెల్లడించారు. ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ.. ఏపీని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనకు అనుగుణంగా టూరిజం పాలసీ రూపొందించామని తెలిపారు. వైకాపా ప్రభుత్వ హయాంలో పర్యాటక రంగం నిర్వీర్యానికి గురైందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా హోటళ్లు, కాటేజీలు, రెస్టారెంట్ల నిర్మాణం పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఏపీటీడీసీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్, ఎండీ ఆమ్రపాలి, ఈడీలు పద్మావతి, ఎం.శేషగిరి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బెలూన్లు ఎగురవేస్తున్న మంత్రి దుర్గేష్, ఏపీటీడీసీ ఛైర్మన్ బాలాజీ, స్పెషల్ సీఎస్ అజయ్‌జైన్, ఎండీ ఆమ్రపాలి

అసెంబ్లీ వద్ద ఎమ్మెల్యేతో విద్యార్థులు

అసెంబ్లీలో గుడివాడ విద్యార్థుల సందడి

గుడివాడ, న్యూస్‌టుడే: రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలను ప్రత్యక్షంగా తిలకించేందుకు గుడివాడ మాంటిస్సోరి ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం వెళ్లారు. సభావిరామ సమయంలో విద్యార్థులు స్పీకర్ అయ్యన్నపాత్రుడిని కలిసి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో పెద్దలను ఆదర్శంగా తీసుకోవాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచించారు. విద్యార్థులతో పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఫొటోలు దిగారు.

వలీ, కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న మంత్రి రవీంద్ర

వలీ ఘటన బాధాకరం: కొల్లు

భాస్కరపురం(మచిలీపట్నం), న్యూస్‌టుడే: మేడారం జాతరలో చిరువ్యాపారం చేసుకుంటున్న వలీ విషయంలో సోషల్ మీడియాలో అమానవీయంగా వ్యవహరించడం తీవ్రంగా కలచివేసిందని మంత్రి కొల్లు రవీంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఉర్దూ అకాడమీ ఛైర్మన్ షబ్బీర్‌తో కలిసి వలీ వారి కుటుంబ సభ్యులు బుధవారం మంత్రి రవీంద్రను విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. మంత్రి రవీంద్ర వలీ తయారు చేసిన కోవాలను తిన్నారు. వలీ కుటుంబానికి అన్ని విధాల సాయం చేయడంతో పాటు వారిని సన్మానించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదని, సమాజంలో పరస్పర గౌరవం, మానవత్వం నిలిచేలా అందరు ప్రవర్తించాలని హితవు పలికారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

ఘంటసాల, న్యూస్‌టుడే: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఏలూరు రేంజ్ ఐజీ జి.వి.జి.అశోక్‌కుమార్ తెలిపారు. బుధవారం ఘంటసాల పోలీస్‌స్టేషన్ వార్షిక తనిఖీలో భాగంగా ఆయన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనకు జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, ఎస్సై వేమన చందన స్వాగతం పలికారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరిగిన 54 బ్లాక్ స్పాట్లు గుర్తించినట్లు తెలిపారు. జాతీయ రహదారిపై ఘంటసాల మండలం పరిధిలోని లంకపల్లి, జీల గలగండి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని.. నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చిన్నపిల్లలు, యువతను భద్రతకు పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులను ఇబ్బందులు పెట్టే ముఠాలను శిక్షించేలా పోలీసు శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో మచిలీపట్నం డీఎస్పీ సీహెచ్ రాజా, అవనిగడ్డ, చల్లపల్లి సీఐలు యువకుమార్, కె.ఈశ్వరరావు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఐజీ అశోక్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న ఎస్సై వేమన చందన, చిత్రంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తదితరులు

విద్యాంజలిపై శిక్షణ నేడు

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లాలోని ఉపాధ్యాయులకు విద్యాంజలిపై శిక్షణ కార్యక్రమం మచిలీపట్నంలోని నోబుల్ కళాశాలలో గురువారం నిర్వహించనున్నట్లు ఎస్ఎస్ ఏపీవో శ్యాంసుందరరావు బుధవారం తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డీకే బాలాజీ, డీఈవో యూవీ సుబ్బారావు పాల్గొంటారని వివరించారు.

HCG The Specialists in Cancer Care

సిటీ క్యాన్సర్ సెంటర్

చలసాని వెంకట కృష్ణయ్య వీధి, సూర్యారావుపేట, విజయవాడ-2

ఫోన్: 0866-2436661, 2432180, 9885260759

ఈవినింగ్ క్లినిక్స్

ప్రతి రోజు 5 to 7 PM అపాయింట్‌మెంట్స్ కొరకు

డా॥ ఎం. గోపిచంద్ M.S., M.Ch., DNB., Surgical Oncologist

డా. కె. లక్ష్మీప్రియదర్శిని MD., DM., Medical Oncologist

డా.. వి.ఎస్.ఎన్. రావు DCP, DMRT., MD (RT)., Radiation Oncologist

నవ్యాంధ్రప్రదేశ్‌లో అత్యంత అనుభవజ్ఞులైన అతిపెద్ద క్యాన్సర్ వైద్య బృందం గల హాస్పిటల్

నెట్‌బాల్ పోటీల విజేత సావిత్రిబాయి పులే వర్సిటీ

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే: స్థానిక మారిస్ స్టెల్లా కళాశాల మైదానంలో కృష్ణా వర్సిటీ ఆధ్వర్యంలో 5 రోజుల పాటు జరిగిన అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా నెట్‌బాల్ పోటీల్లో సావిత్రిబాయి పులె వర్సిటీ (మహారాష్ట్ర) జట్టు విజేతగా నిలిచింది. కాలికట్ (కేరళ), కృష్ణా (ఏపీ), హేమచంద్ యాదవ్ వర్సిటీ (దుర్గ్) జట్లు వరుసగా తర్వాత స్థానాలు కైవసం చేసుకున్నాయి. బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో కృష్ణా, హేమచంద్ యాదవ్ వర్సిటీ జట్ల పోటీ ఉత్కంఠంగా సాగింది. కృష్ణా వర్సిటీ గెలిచి తృతీయ బహుమతి సాధించింది. చివరి లీగ్ పోటీలో సావిత్రిబాయి పులె, కాలికట్ వర్సిటీ జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఒక్క పాయింట్ తేడాతో సావిత్రిబాయి పులె జట్టు విజేతగా నిలిచింది. శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, కృష్ణా వర్సిటీ ఉపకులపతి కూన రాంజీ విజేతలకు ట్రోఫీలు బహూకరించారు. అనిమిని మాట్లాడుతూ... పాఠశాల స్థాయి నుంచి క్రీడలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో శాప్ లీగ్స్ ప్రారంభించామని చెప్పారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా శాప్ వార్షిక క్రీడా క్యాలెండర్ విడుదల చేశామని తెలిపారు. ప్రతిభగల క్రీడాకారులను గుర్తించి శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తామని చెప్పారు. శాప్ నగదు ప్రోత్సాహకాలు అందుకున్న వారిలో 70 శాతం మహిళా క్రీడాకారిణులే ఉన్నారని గుర్తు చేశారు. పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి జి.నవీన లావణ్యలత పోటీల నివేదిక ప్రకటించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వీసీ మాట్లాడుతూ... పోటీలను విజయవంతం చేసేందుకు సహకరించిన స్టెల్లా కళాశాల యాజమాన్యం... తదితరులందరికి ధన్యవాదాలు తెలిపారు. రెక్టార్ ఎంవీ బసవేశ్వరరావు ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచిన సావిత్రిబాయి పులె, కృష్ణా వర్సిటీ జట్లకు రూ.10,116 చొప్పున తన సొంత నిధులు అందజేశారు. రిజిస్ట్రార్ ఎన్.ఉష, జేఎన్‌యూకే స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ జి.శ్యామ్‌కుమార్, ఏఐయూ పరిశీలకుడు విష్ణు చౌదరి, టోర్నీ చీఫ్ రిఫరీ ఆకాష్ బత్రా, ప్రిన్సిపల్ సిస్టర్ జి.ఇన్నాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను చెల్లించండి

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు గ్రామ పంచాయతీలో పాత బకాయిలు రూ.16,33,600, ఈ ఏడాది పన్నులు రూ.17,69,400 కలిపి మొత్తం రూ.34,03,000 ఇంటి పన్నులు వసూలు కావాల్సి ఉందని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఇందులో ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు రూ.10,80,750 ఉన్నాయన్నారు. అవి పోను మిగతా బకాయిలు రూ.23,22,250 ఉన్నాయని తెలిపారు. వీటిలో బుధవారం వరకు రూ.10,78,750 వసూలు చేశామని తెలిపారు. ఫిబ్రవరి నెలాఖరుకు వందశాతం పన్నులు వసూలు చేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని వెల్లడించారు. గ్రామస్థులు సహకరించి చెల్లించాలని కోరారు.

పదేళ్లుగా పన్ను కట్టని ఎంపీడీవో కార్యాలయం: తోట్లవల్లూరు మండల పరిషత్తు కార్యాలయం పదేళ్ల కాలం నుంచి రూ.6,40,700 చెల్లించాల్సి ఉందని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం రూ.85,216, మండల పరిషత్తు కార్యాలయం పరిధిలోని షాపింగ్ క్లాంప్లెక్స్ పెండింగ్ పన్ను రూ.1,23,794, పోలీస్‌స్టేషన్ రూ.1,28,842, శ్రీవేణు గోపాలస్వామి, శివాలయం ఆలయాల పెండింగ్ పన్ను రూ.91,800 గ్రామ పంచాయతీకి చెల్లించాల్సి ఉందని కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

గుడివాడ, న్యూస్‌టుడే: నేపాల్‌లో జనవరి 29 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు జరిగిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గుడివాడ అక్కినేని నాగేశ్వరరావు కళాశాల విద్యార్థి దుర్గా సత్యన్నారాయణ 66 కేజీల విభాగంలో బెంచ్ లిఫ్ట్, డెడ్ లిఫ్ట్, స్క్వాడ్ కేటగిరీల్లో మొత్తం 610 కేజీల బరువు ఎత్తి ప్రథమ స్థానం కైవసం చేసుకోవడం కళాశాలకు గర్వకారణం అని ప్రిన్సిపల్ డాక్టర్ పీజేఎస్ కుమార్ పేర్కొన్నారు. విజేత సత్యన్నారాయణను బుధవారం కళాశాల పాలకవర్గ కార్యదర్శి, కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, అధ్యక్షుడు ఎల్ఆర్‌కే ప్రసాద్, కోశాధికారి పర్వతనేని కృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ పద్మజ, వ్యాయామ అధ్యాపకుడు వీర్ల గోపి తదితరులు అభినందించారు.



విజేతను అభినందిస్తున్న కళాశాల పాలకవర్గ ప్రతినిధులు

పట్టణ ఆరోగ్య కేంద్రాలకు నిధులివ్వండి

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ ఏరియా ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో బుధవారం ఆయన మాట్లాడుతూ గుడివాడ పట్టణంలో ఐదు పట్టణ ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, వీటిలో కేవలం బాపూజీనగర్ కేంద్ర భవనం ఒక్కటే పూర్తయ్యిందని, బేతవోలు ఆరోగ్య కేంద్రం పురపాలక సంఘ నిధులతో అభివృద్ధి చేశామన్నారు. దనియాలపేట, స్లేటర్‌పేటల్లో ఇంకా నిర్మాణాలు పూర్తి కాలేదని, వాటి చిత్రాలను అసెంబ్లీలో ప్రదర్శించారు. గత ప్రభుత్వం విడుదల చేసిన రూ.80 లక్షల నిధులు నిర్మాణాలకు సరిపోలేదన్నారు. గుడివాడలో వీటి నిర్మాణాలకు రూ.1.46 కోట్లు అవసరమని.. వాటిని విడుదల చేయాలని కోరారు. రుద్రపాకలో 30 పడకల ఆసుపత్రిని వైకాపా పాలకులు సర్వనాశనం చేశారని, దీనికి కావాల్సిన నిధులిచ్చి పూర్వ వైభవం తీసుకు రావాలన్నారు. రామాపురంలో 40 ఏళ్ల కిందట నిర్మించిన భవనం పాడైందని, మోటూరులో పీహెచ్‌సీ భవనంలోకి పాములు వస్తున్నాయన్నారు. రామాపురం, మోటూరు, కౌతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు దారుణంగా పాడయ్యాయని, పేద ప్రజల ఆరోగ్యం దృష్ట్యా వెంటనే వాటిని అభివృద్ధి చేసి మెరుగైన సేవలు అందించాలన్నారు. దీనికి స్పందించిన ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ గుడివాడలో పీహెచ్‌సీల అభివృద్ధికి పలుమార్లు టెండర్లు పిలిచినా ఎవరూ రాలేదన్నారు. గుడివాడలో రెండు బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్లను ఒక్కొక్కటి రూ.50 లక్షలతో ఏర్పాటు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నామన్నారు.

దనియాలపేట హెల్త్ సెంటర్ చిత్రాన్ని చూపుతున్న ఎమ్మెల్యే రాము

సీసీ డ్రెయిన్ నిర్మించాలని దీక్ష

అవనిగడ్డ, న్యూస్‌టుడే: కృష్ణాజిల్లా అవనిగడ్డ ఒకటో వార్డు పరిధిలోని కోటగిరిలంకకు మంజూరైన సీసీ డ్రెయిన్ వెంటనే నిర్మించాలని కాంట్రాక్టర్‌ను కోరుతూ ఆప్రాంతానికి చెందిన కంచర్ల కోటేశ్వరరావు నిరసన తెలిపారు. బుధవారం ఉదయం ఆయన అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల నిరసన దీక్షలో కూర్చున్నారు. కోటగిరిలంకలో వర్షం పడితే నీరు బయటకు పోయే అవకాశం లేని నేపథ్యంలో డ్రెయిన్ పనులు వెంటనే ప్రారంభించాలని, సీతాయిలంకకు మంజూరైన ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణం వెంటనే మొదలు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సాయంత్రం ఆయన నిరసన దీక్ష విరమించారు.



దీక్షకు కూర్చున్న కోటేశ్వరరావు

బ్రాయిలర్ ధరలు (కిలో ₹కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213 చికెన్ స్కిన్‌లెస్ - 243.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 244 చికెన్ స్కిన్‌లెస్ - 254.

సీసీఎస్ పోలీసుస్టేషన్‌లో అగ్నిప్రమాదం

అగ్నిమాపక సిబ్బంది తక్షణ స్పందనతో తప్పిన పెనుముప్పు

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ సీసీఎస్ పోలీసు స్టేషన్‌లో బుధవారం అగ్నిప్రమాదం జరిగింది. 2000 సంవత్సరం నాటి తాలూకా పోలీసుస్టేషన్ రికార్డులు, కొన్ని పేపర్లు కాలిపోయాయి. స్టేషన్‌లో బుధవారం ఉదయం ఒక్కసారిగా పొగలు రావడంతో అగ్నిమాపక సిబ్బందికి వెంటనే సమాచారం ఇచ్చారు. అదే ప్రాంతంలో పోలీసులు సీజ్ చేసిన దీపావళి సామగ్రి, చెత్త ఉన్నాయి. మరో పక్క సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. ఈ స్టేషన్‌కు ఆనుకుని తహసీల్దారు, ఖజానా కార్యాలయాలు, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఉన్నాయి. అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన ప్రాంతానికి వచ్చి మంటలు పక్క ప్రాంతాలకు వ్యాపించకుండా చర్యలు తీసుకోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ప్రమాదానికి కారణాలు తెలియలేదని అగ్నిమాపక సిబ్బంది చెబుతున్నారు. సంఘటనా స్థలానికి డీఎస్పీ వి.ధీరజ్‌వినీల్ వచ్చి ప్రమాదం వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కాలిపోయిన కాగితాలు, వ్యర్థాలు

ఎలాంటి నష్టం జరగలేదు: సీసీఎస్ సీఐ రమణమ్మ

ఈ అగ్ని ప్రమాదంలో ఎలాంటి ఆస్తి నష్టం జరగలేదు. పొగలు రాగానే గుర్తించి అగ్నిమాపక సిబ్బందికి తెలిపాం. వారు వెంటనే వచ్చి మంటలు అదుపు చేశారు. విద్యుత్తు షార్టు సర్క్యూట్‌తో ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నాం. చెత్త తప్ప విలువైనవి ఏవీ కాలిపోలేదు.

పాత తగాదాలతో పరస్పర దాడులు

కోడూరు: పాత తగాదాలను పురస్కరించుకుని పరస్పర దాడులు చేసుకున్న సంఘటన కోడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై కె.చాణక్య తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లింగారెడ్డిపాలెం శివారు జరుగువానిపాలెం గ్రామానికి చెందిన జరుగు సురేష్ అలియాస్ ఏసుకు, అదే గ్రామానికి చెందిన జరుగు నాగనాంచారయ్యలకు పాత తగాదాలు న్నాయి. వీటిని పురస్కరించుకుని మంగళవారం కోడూరులోని శ్రీగంగానమ్మ అమ్మవారి వంతెన కూడలి వద్ద ఇద్దరూ ఘర్షణ పడ్డారు. మద్యం తాగిన మత్తులో పరస్పరం ఇనుపరాడ్లతో దాడులు చేసుకున్నారు. గాయాలైన వారిని వెంటనే అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం బందరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్సై చెప్పారు. ఇద్దరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పరస్పర కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. వీరికి దాడిలో సహకరించిన ఏసు బంధువు ముళ్లపూడి మహేష్, నాగనాంచారయ్య బంధువు అప్పికట్ల తాతారావుపై కేసు నమోదు చేశామన్నారు.

మహిళా ఉద్యోగుల సమావేశానికి తరలిరావాలి

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 7న విజయవాడలో ఆంధ్రప్రదేశ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే మహిళా ఉద్యోగుల సమావేశానికి అందరూ తరలి రావాలని సంఘ జిల్లా అధ్యక్షుడు పి.రాము, మహిళా విభాగ అధ్యక్షురాలు పి.శైలజలు పిలుపునిచ్చారు. బుధవారం మచిలీపట్నంలోని డీఈవో కార్యాలయ ప్రాంగణంలో సంఘ నాయకులు మహిళా ఉద్యోగులతో సమావేశ కరపత్రాలు ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ ఆదేశాల మేరకు ఈ సమావేశం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మహిళా సాధికారత, మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో చర్చించడం జరుగుతుందని అన్నారు. జిల్లా నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలని, ఆ దిశగా నాయకులు అందరూ కృషి చేయాలన్నారు. సంఘ జిల్లా కార్యదర్శి తోట వరప్రసాద్, మహిళా విభాగ కార్యదర్శి ఎం.కల్పన నాయకులు విజయశ్రీ, విద్యాలత, కె.విజయకుమారి, టి.రమ్య, ఎం.స్వాతి, శ్రీనివాసరావు, లోకేష్, పవన్‌కుమార్, సముద్రేశ్వరరావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు, ఉద్యోగులు

91.9 FM Vijayawada 91.9 Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతరప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్‌క్యాష్ ✆ 81422 92071

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166

FINANCIAL SERVICES

Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు EMI వాయిదా పద్ధతిలో పర్సనల్ ఫైనాన్స్, అన్ని తరగతుల వారికి స్థిరాస్తులపై ఫైనాన్స్ ఇవ్వబడును. Cell: 73862 01191.

REAL ESTATE

FLAT FOR SALE

Flat for Sale Vignesh Apartment D/No. 56-4-23/B, Block 2 G1, Ground Floor N.R. Rythubazar Patamata Vijayawada. ✆ 77024 44575.

PLOT FOR SALE

రాజధాని అమరావతి, ఔటర్‌రింగ్ రోడ్డు, కొత్త రైల్వేలైన్, ఇళ్ల ప్రక్కన సెంటు కేవలం 2,49,999/- కొద్ది ప్లాట్స్, స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ 84989 73586

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గజం11,999/- బందర్‌రోడ్‌లో 80ఎకరాల గేటెడ్ కమ్యూనిటీ స్పోర్ట్స్ స్విమ్మింగ్ పూల్, హౌసింగ్ 46L గవర్నమెంట్ ఆఫీసులకు దగ్గరలో ✆ 99495 05050

JOBS

ప్రైవేట్ ప్రీమియం సెలబ్రేషన్ కంపెనీలో సర్వీస్ సపోర్ట్ అసోసియేట్స్ కావలెను. వయస్సు 20-28. ఇంటర్, పైచదువు పూర్తిచేసిన వారు అప్లై చేయవచ్చు. ఈవెంట్ సెటప్; క్లయింట్ హ్యాండ్లింగ్, టీమ్‌తో సమన్వయం చేయగలగాలి. మాసిక వేతనం ₹12000+ పనితీరు ఆధారిత బోనస్, గ్రోత్. ✆: 97050 54262.

విజయవాడ సిటీ, తాడేపల్లి ఏరియాలో సెక్యూరిటీ ఫీల్డ్ ఆఫీసర్స్. జీతం: 35,000/- PF & ESI ✆ 79933 22229

ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్‌లో 3సం॥ అనుభవంతో టెలీకాలర్ & కంప్యూటర్ ఆపరేటర్ (M) హిందీ, ఇంగ్లీష్ వచ్చి ఆటోనగర్ ఏరియా వారు కావలెను. టైం: 9.30AM-7.30PM. ✆ 94914 81499.

మ్యారేజి సంస్థలో పని చేయుటకు కంప్యూటర్ నాలెడ్జ్ గల ఇన్‌ఛార్జ్ (F). జీ: 20K, రిసెప్షనిస్ట్ (F) జీ: 15K. ఏదైనా డిగ్రీ. VJA-7. ✆ 87905 99799

Teaching Staff for Hotel Management College, Vijayawada FO, HK, Service, Kitchen Department, Salary Depend On Experience. Accommodation Available. ✆ 72888 85598.

Wanted Accountant With Tally Experience for a Reputed firm- Female Preferred. Contact: 98489 12544.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ:18-20K ✆ 96404 68899, 96402 58899

విజయవాడ నందు ఆటోమొబైల్ & ఇండస్ట్రియల్ -సేల్స్ నందు పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్-1 శాలరీ 18,000/- వ. 18-30సం॥లు, వేర్‌హౌస్ నందు పనిచేయుటకు హెల్పింగ్ బాయ్స్-3 శాలరీ 14,000/- వ.18-30సం॥గల పురుషులు కావలెను. ఆదివారం శెలవు. ✆ 91602 22389

SSS కంపెనీలో పనిచేయుటకు లేడీస్ & జెంట్స్ కావలెను. మంచి జీతం మరియు అలవెన్సు. టెన్త్ క్లాస్ & above, VJA. ✆ 93985 53721.

B.Sc కెమిస్ట్రీ, B.Com, ITI అర్హత గల స్టాఫ్ (M/F) కావలెను. వయస్సు:25, విజయవాడ లోకల్స్ మాత్రమే. Resume What's app ✆63033 76816.

VJA, బందరురోడ్డులో ప్రముఖ 3స్టార్‌హోటల్‌లో పనిచేయుటకు అనుభవం ఉన్న ★ ఫ్రంట్‌ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ ★ కిచెన్ సూపర్‌వైజర్స్ ★ కంప్యూటర్ బిల్లింగ్ ★ రెస్టారెంట్ వెయిటర్స్ ★ బెల్ బాయ్స్ కావలెను. ✆ 99515 19777

Govt ఆఫీసులలో అవుట్‌సోర్సింగ్ బేసిస్‌పై డేటాఎంట్రీ కం.ఆపరేటర్, అకౌంటెంట్ కావలెను. జీ: 22,000/- to 30,000/- PF, ESI. ✆ 95058 38531

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గుడివాడ

• గుడివాడ • పామర్రు • అవనిగడ్డ

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక మార్కెట్ ప్రాంగణం సమీపంలో నిర్మించిన వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి పూజా కార్యక్రమాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్మాణ పనులు చివరిదశలో ఉండడంతో పూజా కార్యక్రమాలను పక్కన ఉన్న ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించారు. 22వ తేదీన ఉదయం 11.52 గంటలకు అమ్మవారి విగ్రహప్రతిష్ఠ మహోత్సవం జరగనుంది.

28వ తేదీలోగా ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోండి

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ పురపాలక సంఘ పరిధిలో దుకాణాలు నిర్వహించే వారు, వ్యాపారాలు చేసే వారు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని, వాటిని ఈనెల 28లోగా రెన్యువల్ చేసుకోవాలని పురపాలక కమిషనర్ సింహాద్రి మనోహర్ సూచించారు. స్థానిక పురపాలక సంఘ కౌన్సిల్ హాలులో ప్రజారోగ్య, పారిశుద్ధ్య సిబ్బందితో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా దోమల నివారణ కార్యక్రమాల గురించి చర్చించారు.

అర్చకుల భూములకు గుర్తింపు కార్డులివ్వాలి

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆలయ భూములు అనుభవిస్తున్న అర్చకులకు కూడా విశిష్ట గుర్తింపు కార్డులు జారీ చేయాలని రాష్ట్ర వైఖానస సంఘం నాయకులు మేడూరి శ్రీనివాసమూర్తి బుధవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రైతులకు అందే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్చకులకు కూడా అందించాల్సిన అవసరం ఉందన్నారు.

మంజూరు 77.. పూర్తయినవి 15

నియోజకవర్గంలో ఆర్‌బీకే భవన నిర్మాణాల దుస్థితి

అవనిగడ్డ, న్యూస్‌టుడే

రామకృష్ణాపురంలో పునాది దశలోనే రైతు భరోసా కేంద్రం నిర్మాణం

గత ప్రభుత్వం నియోజకవర్గంలోని ప్రతి సచివాలయం పరిధిలో ఒకటి చొప్పున రైతు భరోసా కేంద్రాలను కూడా మంజూరు చేసింది. అయితే నిధుల కొరతతో వాటి నిర్మాణాలు అయిదేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా కదలిక లేదు. దీంతో నియోజకవర్గంలో 77 రైతు భరోసా కేంద్రాలు మంజూరు కాగా ఇప్పటికి పూర్తయినవి 15 మాత్రమే. మరో 36 భవనాలు నిర్మాణ దశలో నిలిచిపోయాయి. 26 భవనాలు ప్రారంభానికి కూడా నోచుకోలేదు. వీటిలో కొన్ని బేస్‌మెంట్ స్థాయి దాటక పోవడంతో వాటిని గత ప్రభుత్వం నిలిపేసి, రెండో ఫేజ్‌లో తిరిగి ప్రారంభిస్తామని ప్రకటించింది. దీంతో వాటిపై చేసిన ఖర్చులు అప్పట్లో ఇచ్చిన వాటితో సరిపెట్టినట్లు తెలిసింది. ఆ మిగిలిన పనులకు రెండో దశలో అంచనాలు వేసి మళ్లీ టెండర్లు పిలుస్తారని ఆశించారు. ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాలు పూర్తికాని గ్రామాల్లో కొన్ని సచివాలయాల్లో, మరికొన్ని అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఇటీవల రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి నిల్వ చేసే అవకాశం లేక పోవడంతో మిల్లర్లకు అప్పగించారు. భవన నిర్మాణాలు పూర్తికాకపోవడంతోనే ఈ అవస్థలు ఏర్పడుతున్నాయి.

అసంపూర్తి నిర్మాణాలను ఇప్పటికైనా పూర్తి చేసి, రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. నిర్మాణాలు ప్రారంభం కాని వాటిని రెండో దశలో చేపట్టాలని కోరుతున్నారు.

రైతు భరోసా కేంద్రాల పరిస్థితి ఇలా....

మండలం	మంజూరు	పూర్తి	నిర్మాణంలో..	మొదలు కానివి
అవనిగడ్డ	10	03	05	02
చల్లపల్లి	15	02	07	06
ఘంటసాల	13	02	06	05
కోడూరు	11	03	05	03
మోపిదేవి	12	01	05	06
నాగాయలంక	16	04	08	04
మొత్తం	77	15	36	26

సర్వే పద్ధతి ప్రకారం చేయాలి

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

గుడివాడ, న్యూస్‌టుడే: రీసర్వేను భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పద్ధతి ప్రకారం చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. ఆర్డీవో కార్యాలయంలో బుధవారం రీసర్వే సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. డివిజన్‌లో రీసర్వే జరుగుతున్న 4 గ్రామాల్లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ క్లినిక్‌లో ప్రజల నుంచి వస్తున్న అర్జీల గురించి సమీక్షించారు. అనంతరం పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. నాణ్యతతో పనులు చేసి భవిష్యత్తులో ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గుడివాడ ఆర్డీవో జి.బాల సుబ్రహ్మణ్యం, తహసీల్దారు కిరణ్ సిబ్బంది పాల్గొన్నారు.

తాడంకి (పమిడిముక్కల), న్యూస్‌టుడే: రైతుల భాగస్వామ్యంతో రీసర్వే ప్రక్రియ సజావుగా జరపాలని కలెక్టర్ డీకే బాలాజీ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం తాడంకిలో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం రీసర్వే చిత్రాలు, దస్త్రాల్లోని సమస్యలను సర్వేయర్లను అడిగి తెలుసుకున్నారు. విస్తీర్ణం విషయమై సమస్యలొస్తే ఆచరించాల్సిన పరిష్కార విధానాలను వారికి సూచించారు.

అమృతమూర్తికి అశ్రుతాంజలి

మంచితనం, దయాగుణం, మానవత్వం, ఉన్నతమైన వ్యక్తిత్వ విలువలతో మా అందరి హృదయాలలో చెరగని ముద్రవేసి మా ఉన్నతికై అహర్నిశలు శ్రమించిన మీ మరణం మాకు తీరని లోటు. మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

శ్రీ మెరుగుమాల రామకృష్ణ గారు
ప్రొ॥ రామకృష్ణ లారీ సప్లై ఆఫీసు, గుడివాడ.
జననం: 16-04-1961 - మరణం: 05-02-2026

కుమారుడు: మెరుగుమాల దివాకర్ - భవాని
మనుమరాలు: అరవింద ఆరోహి
కుమార్తె: డొక్కు క్రాంతిశ్రీ - వెంకట సాంబశివచలం
మనుమరాలు: విద్యా సరణి
అక్క: G.సరస్వతి - చంద్రమౌళి
అన్నయ్య: నెరుసు వెంకటప్పయ్య
తమ్ముడు: నెరుసు వెంకటేశ్వరరావు (చిన్ని)
కుమారుడు: G.T. కృష్ణ
బావమరుదులు: కొలుసు తిరుపతయ్య, రామాంజయ, పరమేశ్వరరావు, రాణి, శ్రీనివాసరావు

పెద్దకర్మ: ది. 19-02-2026 గురువారం నాడు గుడివాడ పెద్ద వీధిలో చినమసీదు దగ్గర, మా స్వగృహమునందు జరుగును.

సహకార సంఘాల ఉద్యోగుల దీక్షలు

నాగాయలంక కేడీసీసీ బ్యాంకు కార్యాలయం ఎదుట నిరసన

మొవ్వ శాఖ వద్ద..

న్యూస్‌టుడే బృందం: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం బుధవారం కేడీసీసీ బ్రాంచిల వద్ద రిలే దీక్షలు నిర్వహించారు. వీరు సోమవారం నుంచి సొసైటీలకు తాళాలు వేసి సమ్మె చేస్తున్నారు. యూనియన్ పిలుపు మేరకు గురువారం నుంచి నిరసన మరింత ఉద్ధృతం చేయనున్నట్లు నాయకులు వెల్లడించారు.

నాంచారమ్మ గ్రామోత్సవం ప్రారంభం

కోడూరు, న్యూస్‌టుడే: విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చిన్న అమ్మవారిని ఆలయం నుంచి పల్లకిలో బయటకు తీసి ఘనంగా గ్రామోత్సవం ప్రారంభించారు. తొలుత రామినీడు(పోతురాజు) ఉత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షులు సూర్యనార సింహారావు, సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. ప్రధాన గుడి సంబరం మార్చి 2, 3 తేదీల్లో జరుగనుందని చెప్పారు.

పెదప్రోలులో అమ్మవారి గ్రామోత్సవం

మోపిదేవి: పెదప్రోలు శక్తిపీఠ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి వార్షిక సంబరాలను పురస్కరించుకుని బుధవారం ఆలయం నుంచి బయటకు తీశారు. పంచాయతీ పరిధిలోని శివరామపురంలో ఇంటింటికీ తిరిగి పూజలు చేస్తున్నారు. మార్చి 4న దేవాలయం వద్ద సంబర మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

సంపటాలమ్మ అమ్మవారి ఉత్సవాలు

అమ్మవారికి పూజలు చేస్తున్న పూజారి

చల్లపల్లి: చల్లపల్లి గ్రామదేవత శ్రీ సంపటాలమ్మ అమ్మవారి ఆలయ 27వ వార్షికోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం విఘ్నేశ్వరపూజ, గోపూజ, అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ పెద్దలు లంకా కొండలు-మనుదాదేవి దంపతులు, అమ్మవారి పుట్టింటివారైన పత్తిపాటి వంశీయులు, భక్తులు పాల్గొని పూజలు చేశారు.

విశ్వనాథపల్లి నాంచారమ్మను దర్శించుకున్న కృష్ణ కుటుంబ సభ్యులు

కోడూరు: విశ్వనాథపల్లి శ్రీఅద్దంకి నాంచారమ్మ అమ్మవారిని సినీహీరో కృష్ణ కుటుంబ సభ్యులు బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఘట్టమనేని కృష్ణ కుమార్తెలు పద్మావతి, ప్రియదర్శిని, సోదరి లక్ష్మీతులసి, కోడలు మృదులతోపాటు సినీ నిర్మాత హనుమంతరావు సోదరి పార్వతి, కుమార్తె జయప్రద, శిరీష, అల్లుడు అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఏటా అమ్మవారి దర్శనానికి వస్తున్నట్లు, మొక్కుబడులు తీర్చుకున్నట్లు చెప్పారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి సత్కరించారు. హైదరాబాద్ జీఎస్టీ జాయింట్ కమిషనర్ మహేంద్రకుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు.

సంపద సృష్టి కేంద్రం పరిశీలన

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: తోట్లవల్లూరులో సంపద సృష్టి కేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు సిబ్బందితో శుభ్రం చేయించారు. 'నిర్లక్ష్యం ముంచెత్త..సంపద సృష్టి ఎట్లా?' శీర్షికన బుధవారం 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై పంచాయతీ స్పందించి గ్రామంలో ఉన్న కేంద్రాన్ని పారిశుద్ధ్య కార్మికులతో బుధవారం శుభ్రం చేయించారు.

ప్రజలకు తక్షణ సేవలు అందించాలి

సిబ్బందితో మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్

గుడివాడ, న్యూస్‌టుడే: సమస్యలతో పోలీసుస్టేషన్‌కు వచ్చిన ప్రజలకు తక్షణ సంతృప్తికర సేవలు అందించి వారి మన్ననలు పొందాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ సూచించారు. గుడివాడ రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించి నేరాలు అదుపు చేయడానికి శ్రమించాలన్నారు. మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సీసీ కెమెరాల ద్వారా అవసరమైన ప్రాంతాల్లో నిఘా పెంచాలన్నారు. ఈ తనిఖీల్లో పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, డీఎస్పీ వి.ధీరజ్‌వినీల్, సీఐ ఎస్ఐ ఆర్ సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రథశాల నిర్మాణం

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి గతనెలలో టేకు రథాన్ని ఆట్లూరి నారాయణ రావు బహూకరించారు. దానిని భద్రపరిచేందుకు ఆలయ ఆధీనంలో ఉన్న తిరుమల తిరుపతి దేవస్థాన కల్యాణ మండపంలో 20 అడుగుల ఎత్తుతో రథశాల నిర్మిస్తున్నారు. దీన్ని దాత నారాయణరావు, ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు పరిశీలించారు.

శిరస్త్రాణం ధరించండి

వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న సీఐ ఈశ్వరకుమార్

మోపిదేవి: శిరస్త్రాణం లేకుండా రహదారులపై జరిగే ప్రమాదాలను ఊహించలేమని చల్లపల్లి సీఐ ఈశ్వరకుమార్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి 216 జాతీయ రహదారి కాసానగర్ మూడు రోడ్ల కూడలిలో వాహనచోదకులకు అవగాహన కల్పించారు. శిరస్త్రాణం లేకుండా ప్రయాణిస్తే జరిగే నష్టాన్ని వివరించారు. తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

గుడివాడ: 89775 35999 పామర్రు: 80085 74684 అవనిగడ్డ: 80085 74679

? పెదప్రోలు తూర్పు బజారులోని 4, 5 వార్డుల్లో వీధి దీపాలు నెల రోజులుగా వెలగడం లేదు. అధికారులకు సమస్య తెలిపాం. సమస్యల పుస్తకంలో నమోదు చేశాం. పరిష్కారం కాలేదు. -యద్ది శ్రీనివాసరావు, వై.వెంకటేశ్వరరావు, రమేష్

✔ మీటర్లు ఒకటి రెండు రోజుల్లో వేయిస్తాం. -వెంకటేశ్వరరావు, పెదప్రోలు పంచాయతీ కార్యదర్శి.

? పెదప్రోలు సహకార సంఘం వద్ద ఉన్న పంచాయతీ చెరువు మొత్తం గుర్రపుడెక్కతో నిండింది. దోమలతో ఇబ్బంది పడుతున్నాం. పశువులు కడగాలన్నా, అవి నీరు తాగాలన్నా ఇబ్బందిగా ఉంది. -గ్రామస్థులు

✔ గుర్రపుడెక్క నివారణకు మందు పిచికారీ చేయిస్తాం. -వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి -న్యూస్‌టుడే, మోపిదేవి

రూ.7 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు

పామర్రు(గ్రామీణం), న్యూస్‌టుడే: పసుమర్రులో రూ.7 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో కె.జ్యోతి అన్నారు. బుధవారం పనులను పరిశీలించి మాట్లాడారు. కాజ సీతారామయ్య ఇంటి వద్ద నుంచి వంజరపు సూర్యనారాయణ ఇంటి వరకు 15వ ఆర్థిక సంఘం నిధులు కింద రోడ్డు నిర్మాణం చేపట్టామని తెలిపారు. పీఆర్ ఏఈ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

గుడివాడ, న్యూస్‌టుడే: వివాహిత అనుమానాస్పద మృతిపై గుడివాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సేకరించిన వివరాల ప్రకారం పట్టణంలోని పెద్దవీధికి చెందిన పులపా సింహాచలం భార్య మాధురి(30) గుడివాడ పట్టణంలోని పార్కు ఎదురుగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో రిసెప్షనిస్టుగా పని చేస్తున్నారు. ఎమైందో ఏమో కాని బుధవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె సీలింగ్ ఫ్యానుకు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికులు ఆమె తల్లి గట్టా దుర్గకు ఫోన్ చేసి చెప్పారు. దీంతో ఆమె వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా..వారు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇలా ఉండగా మాధురి గత కొంతకాలంగా మానసికంగా అనారోగ్యంగా ఉందని, ఇటీవల ఒక సారి ఆత్మహత్యకు యత్నించిందని..అప్పుడు వారించామని చెప్పారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

పామర్రు(గ్రామీణం), న్యూస్‌టుడే: జుఝువరంలో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పామర్రు ఎస్సై- 2 విజయభాస్కర్ పాల్గొని మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల బారిన పడతారని తెలిపారు.

అశ్రునివాళి

మాకు అత్యంత ఆప్తులు, మా శ్రేయోభిలాషి, అసోసియేషన్ అభివృద్ధికి ఎనలేని సేవలందించిన మా బావగారైన శ్రీ మెరుగుమాల రామకృష్ణ గారి మరణానికి చింతిస్తూ.. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ... వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

శ్రీ మెరుగుమాల రామకృష్ణ గారు
ప్రొ॥ రామకృష్ణ లారీ సప్లై ఆఫీసు, గుడివాడ.

మీ బావమరుదులు
సుంకర రాంబాబు
మోగంటి రమేష్

అశ్రునివాళి

లారీ ఓనర్స్ అసోసియేషన్ అభివృద్ధికి ఎనలేని కృషి సల్పిన మాజీ సెక్రటరీ, మాకు అత్యంత ఆత్మీయులు శ్రీ మెరుగుమాల రామకృష్ణ గారి మరణానికి చింతిస్తూ.. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ... వారి కుటుంబసభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం.

శ్రీ మెరుగుమాల రామకృష్ణ గారు
ప్రొ॥ రామకృష్ణ లారీ సప్లై ఆఫీసు, గుడివాడ.

ది గుడివాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ - గుడివాడ
గుత్తా శివరామకృష్ణ (చంటి) | రాయపురెడ్డి బాబూ రాజేంద్రప్రసాద్ (RBR)
డొక్కు రామచంద్రరావు (రాంబాబు) | షేక్ నూరుల్లా
గుమ్మడి వెంకట శివరామప్రసాద్ | భోగాదుల కల్యాణ్‌రావు
నాగిరెడ్డి నాగేశ్వరరావు (బుజ్జి) | లారీ యజమానులు

అమృతమూర్తికి అశ్రుతాంజలి

మాతృమూర్తిగా మంచితనంతో... మీరు వేసిన ప్రతి అడుగు మాకు ఆదర్శం, ప్రేమానురాగాలతో మా హృదయాలలో సుస్థిర స్థానాన్ని పొంది విశ్రమించిన కీ॥శే॥ ఆరేపల్లి జయ ప్రభావతి గారి మరణం తీరని లోటు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని సదా భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారులు / కోడళ్ళు
ఆరేపల్లి నాగరమేష్ (Ex. ZPTC) - రోజారాణి
మనుమడు: ఆరేపల్లి నాగరూపేష్‌కుమార్
ఆరేపల్లి రవికాంత్ - పావని
మనుమరాళ్ళు: హాసిష, మనీషా
ఆరేపల్లి కరుణ్‌కుమార్ - లక్ష్మీ పావని
మనుమరాలు: నైనిషా
మనుమరాలు: మేకల ప్రత్యూష - నరేంద్ర
ముని మనుమడు, ముని మనుమరాలు: జయగగన్, దియ
మరియు కుటుంబ సభ్యులు

కీ॥శే॥ ఆరేపల్లి జయ ప్రభావతి గారు
W/o. కీ॥శే॥ పెదవెంకటేశ్వరరావు గారు
Rtd. Dy.E.E. పంచాయతీరాజ్ శాఖ
జననం: 01-01-1947 మరణం: 03-02-2026
పామర్రు

పెద్దకర్మ: ది. 19-02-2026 గురువారం పామర్రు శ్రీ ఆరేపల్లి ప్రభావతి వెంకటేశ్వర కల్యాణమండపం నందు జరుగును. కావున తెలియజేయడమైనది.

ఆత్మీయ నేతకు అశ్రునివాళి

రామకృష్ణ లారీ ఆఫీసు అధినేత మాకు అత్యంత ఆప్తులు, మా శ్రేయోభిలాషి శ్రీ మెరుగుమాల రామకృష్ణ గారి మరణానికి చింతిస్తూ.. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ..

శ్రీ మెరుగుమాల రామకృష్ణ గారు
మాజీ సెక్రటరీ, ప్రొ॥ రామకృష్ణ లారీ సప్లై ఆఫీసు, గుడివాడ

మోగంటి రమేష్
సుంకర రాంబాబు | బెజవాడ వెంకటరామప్రసాద్ | కుందూరు చలమారెడ్డి
యలమంచిలి వెంకట సుధాకర్ | పెద్దిబోయిన సత్యనారాయణ (MAP) | చిటేట్టి రామకిషోర్
అబ్దుల్ సమద్ బ్రదర్స్ | B. శివరామకృష్ణ | M. శ్రీనివాసరావు
రియాజ్‌బేగ్ | పరిటాల శివరామప్రసాద్ | మహ్మద్ ఇస్మాయిల్ బ్రదర్స్
దేవబత్తుల నాగరాజు | మహ్మద్ ఖాసిమ్ | కూరాకుల నాగేశ్వరరావు (బాబి)
సుంకర సీతామోహన్ | ప్రత్తిపాటి నవీన్ | బత్తుల వెంకటేశ్వరరావు (శెట్టి)
పెద్దిబోయిన బాబు | ఓబులశెట్టి బ్రదర్స్ | మెండా కరుణకుమార్

అమృతమూర్తికి అశ్రుతాంజలి

జననం 08-05-1933
మరణం 17-02-2026

కీ॥శే॥ కావూరి హైమవతమ్మ గారు
W/o. కీ॥శే॥ కావూరి చలపతిరావు గారు
చినముత్తేవి, మొవ్వ మండలం, కృష్ణా జిల్లా

మంచికి మారుపేరుగా, ఆత్మీయులుగా, అందరి మనసుల్లో నిలిచి, మా హృదయాల్లో చెరగని ముద్రవేసి, దైవ సన్నిధికి చేరిన మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని సదా భగవంతుని ప్రార్థిస్తూ..

కుమారులు / కోడళ్ళు
కావూరి సూర్యప్రకాశరావు (98497 70362) - శ్రీలక్ష్మి
కావూరి సుబ్బరామయ్య - విజయలక్ష్మి
మనుమలు: శ్రావణ్‌కుమార్ - లలిత, వెంకట్ - శృతి
మనుమరాండ్రు: అనూరాధ - మను, హైమ
మునిమనుమలు: నిశాంత్ కృష్ణ, ఆదర్శ్‌కుమార్, కైరవ్

అంతిమయాత్ర: ది. 19-02-2026 గురువారం మధ్యాహ్నం 2 గంటలకు మొవ్వ మండలం, చినముత్తేవి గ్రామంలోని మా స్వగృహము నుండి బయలుదేరును. కావున తెలియజేయడమైనది.

(c) eenadu

మాదకద్రవ్యాలు.. బెట్టింగ్స్.. రుణయాప్‌ల జోలికి వెళ్లొద్దు బ్రో..

'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో అవగాహన సదస్సు రేపు

కళాశాలల్లో మాదకద్రవ్యాల వినియోగం పెరిగిపోవడంతో అనేకమంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారుతోంది. బాగా చదువుకునే విద్యార్థులు సైతం మత్తుకు అలవాటు చేసి.. వారి జీవితాలతో మాదకద్రవ్యాల విక్రేతలు చెలగాటం ఆడుతున్నారు. ఒకసారి మత్తుకు అలవాటుపడితే.. దానిలోనుంచి బయటకురాలేనంతగా యువత బానిసలుగా మారిపోతున్నారు. మరోవైపు బెట్టింగ్ మాయలో విద్యార్థులు పావులుగా మారుతున్నారు. మాదక ద్రవ్యాలు, బెట్టింగ్ కోసం.. రుణ యాప్‌లను ఆశ్రయిస్తున్నారు. దీంతో విద్యార్థులతో పాటు వారి కుటుంబాలు సైతం తీవ్రమైన ఆర్థిక సమస్యల్లో చిక్కుకుంటున్నారు. తిరిగి కోలుకోలేనంతగా కుటుంబాలు చితికిపోతున్నాయి. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, బెట్టింగ్, రుణ యాప్‌లలో విద్యార్థులు ఎలా చిక్కుకుంటున్నారు? వంటి అంశాలపై అవగాహన కల్పించేందుకు 'ఈనాడు, ఈటీవీ ఆంధ్రప్రదేశ్' ఆధ్వర్యంలో ప్రత్యేక సదస్సు జరగనుంది. ఆయా రంగాల్లోని నిపుణులు హాజరై విద్యార్థులకు వాస్తవ పరిస్థితిపై అవగాహన కల్పిస్తారు. - ఈనాడు, అమరావతి

వేదిక: కృష్ణవేణి డిగ్రీ కళాశాల, తాతినేనినగర్, 100 అడుగుల రోడ్డు, తాడిగడప | 20.02.26 (శుక్రవారం) | ఉదయం 10.30 గంటలకు



భవానీపురంలో బుధవారం ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ 50 ఏళ్ల వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. - భవానీపురం, న్యూస్‌టుడే

దూసుకొస్తూ.. ప్రాణాలు హరిస్తూ..!

- ☛ ద్విచక్ర వాహనాలతో మైనర్ల స్వైర విహారం
- ☛ రహదారి ప్రమాదాల్లో అమాయకుల బలి

★ సయ్యద్ **అబూబకర్ సిద్ధిఖ్...** చల్లపల్లి మండలం లక్ష్మీపురంలో పలావ్ సెంటర్ నడిపి జీవనం సాగిస్తున్నాడు. 2024 మార్చిలో తన దుకాణం వద్ద రోడ్డు దాటుతుండగా పదో తరగతి విద్యార్థి (మైనర్) ద్విచక్ర వాహనంపై దూసుకొచ్చి ఢీకొట్టాడు. సిద్ధిఖ్ రెండు కాళ్లు విరిగిపోయాయి. తలకు బలమైన గాయమై కోమాలోకి వెళ్లి.. బయటకొచ్చాడు. ఇప్పటికీ నాలుగు అడుగులు వేయలేని దుస్థితి.

★ కానూరులో **శ్రీహర్ష వర్ధన్** అనే పదోతరగతి విద్యార్థిని బలి తీసుకున్నది కూడా మైనర్లే. పదో తరగతి విద్యార్థులు ముగ్గురు బైక్‌పై వేగంగా దూసుకొచ్చి రోడ్డు దాటుతున్న హర్షను ఢీకొట్టారు. మైనర్‌కు వాహనం ఇచ్చినందుకు బాలుడి తండ్రిపై కేసు నమోదైంది. ★ ఉయ్యూరులో ఓ బాలుడు (17) బైక్‌పై దూసుకెళ్లి రోడ్డు దాటుతున్న పాదచారిని ఢీకొట్టి.. అతని చావుకు కారణమయ్యాడు.

– ఈనాడు, అమరావతి

★ కోడూరుకు చెందిన బాలుడు (16) మితిమీరిన వేగంతో బైక్ నడుపుతూ వెళ్లి ప్రమాదానికి గురై చనిపోయాడు.
★ చల్లపల్లిలో రెండు బైక్‌లను పోటీపోటీగా నడుపుతున్న ఇద్దరు మైనర్లను వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టడంతో మృత్యువాతపడ్డారు.
★ విజయవాడ భానూనగర్‌వాసి పెదపూడి రాజారావు.. బీఆర్టీఎస్ రోడ్డు దాటుతుండగా.. మధురానగర్‌కు చెందిన ఓ బాలుడు ద్విచక్రవాహనంతో దూసుకొచ్చి ఢీకొట్టాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాజారావు మృతి చెందాడు. బాలుడి తండ్రిపై కేసు నమోదైంది.

ద్విచక్ర వాహనాలతో మైనర్లు రహదారులపైకి దూసుకొస్తుండడంతో.. ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. మానసిక పరిపక్వత లేని వయసులో బైక్‌లను వారికి ఇచ్చి.. రహదారులపైకి వదులుతున్న తల్లిదండ్రులే అసలు దోషులని.. పోలీసులు హెచ్చరిస్తున్నారు. అందుకే.. చట్టపరంగా వారే కేసులను ఎదుర్కొంటున్నారు. అవగాహన తరగతులను నిర్వహిస్తున్నా తల్లిదండ్రుల్లో మార్పు రావడం లేదు. పిల్లలు అడిగిన వెంటనే. . బండి తాళాలు వారి చేతిలో పెడుతున్నారు.

తీవ్ర విషాదానికి కారకులవుతూ..

కానూరులో పది చదివే విద్యార్థులు చేసిన ప్రమాదాన్ని ప్రత్యక్షంగా చూసినోళ్లంతా.. ఆ ఘటన మరచిపోలేకపోతున్నారు. కామయ్యతోపు ఆర్చి దగ్గర నుంచి ముగ్గురూ వాహనంపై దూసుకొచ్చారు. మధ్యలో మరి కొందరిని కూడా ఢీకొట్టేవారే. చివరికి.. శ్రీహర్ష ప్రాణాలను హరించారు. సయ్యద్ అబూబకర్ సిద్ధిఖ్‌ను ఢీకొట్టింది కూడా ఓ పాఠశాల విద్యార్థే. తన కుటుంబానికి ఆధారంగా ఉన్న.. సిద్ధిఖ్ ఇప్పుడు వారికి భారంగా మారాడు.

జరిమానా రూ.లక్షల్లో

☛ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఏటా.. కనీసం వెయ్యి మంది మైనర్లు ద్విచక్ర వాహనాలు నడుపుతూ దొరుకుతున్నారు. వీరికి వేస్తున్న జరిమానా రూ.లక్షల్లో ఉంటోంది.

అదుపులేని వేగంతో..

మైనర్లు ద్విచక్ర వాహనాలను.. అదుపు చేయలేనంత వేగంగా దూసుకెళుతున్న సంఘటనలు పెరిగిపోతున్నాయి. దానికితోడు వాహనం స్టాండ్‌ను కొద్దిగా తెరిచి.. రహదారికి తాకిస్తూ.. నిప్పులు కురిపిస్తూ వెళ్లడం, చిత్రవిచిత్ర శబ్దాలతో.. ముగ్గురేసి ఒకే వాహనంపై వెళ్లడమూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఖాళీగా రోడ్డు కనిపిస్తే చాలు.. 15-20 ఏళ్ల లోపు వాళ్లు.. స్పీడ్‌లు.. స్టంట్‌లు చేస్తూ.. తోటి ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. బైక్‌లు గాలిలోకి లేపి విన్యాసాలు చేయడం.. అకస్మాత్తుగా రోడ్డుపై ఎవరైనా అడ్డొస్తే.. అదుపు చేయలేక ఢీకొడుతున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయి.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: (గురువారం) సాయంత్రం: 6.16
సహర్: (శుక్రవారం) ఉదయం: 5.13

జనన.. మరణాల నమోదు

21 రోజుల్లోగా ఉచితం

జనన, మరణాల నమోదు 21 రోజుల్లోగా ఉచితంగా చేయించుకోవచ్చని నగరపాలక సంస్థ అధికారులు తెలిపారు. జనన, మరణ రిజిస్ట్రేషన్ల ప్రభుత్వం జీవో నంబరు 28 ద్వారా కొత్త మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. ★ 21 నుంచి 30 రోజుల్లోగా రిజిస్ట్రేషన్ చేయిస్తే చెల్లించాల్సిన అపరాధ రుసుం రూ.25. ★ ఏడాదిలోపు అయితే జిల్లా జనన, మరణ రిజిస్ట్రార్ అనుమతి తప్పనిసరి. చెల్లించాల్సిన అపరాధ రుసుం రూ.250. ★ ఏడాది తరువాత రిజిస్ట్రేషన్ చేయించాలంటే జిల్లా మెజిస్ట్రేట్/ఆర్డీవో నుంచి రాతపూర్వక అనుమతి తీసుకోవాలి. రూ.500 అపరాధ రుసుం చెల్లించాలి. ★ బిడ్డ పుట్టిన రోజు నుంచి ఏడాదిలోపు పేరు ఉచితంగా నమోదు చేయించుకోవచ్చు. **- నగరపాలక సంస్థ**

చూస్తే మీరు.. ఆశ్చర్యపోతారు

ఇదీ ఇన్‌ఫ్రారెడ్ రోడ్ రిపేరింగ్ మొబైల్ మిషన్ (రోడ్ డాక్టర్). దీని సాయంతో రోడ్డుపై గుంతలను తక్కువ సమయంలో సులువుగా పూడ్చవచ్చు. నగరపాలక సంస్థ దీనిని అందుబాటులోకి తీసుకొచ్చింది. సంప్రదాయ పద్ధతుల్లో తారును అధిక ఉష్ణోగ్రతలో కాల్చాలి. ఈ యంత్రంతో కాలుష్య రహితంగా పాత తారును అదే ఉష్ణోగ్రతలో రీసైక్లింగ్ చేసి కొత్త తారులా ఉపయోగించుకోవచ్చు.

-ఈనాడు, అమరావతి

దాచుకున్నారు.. తీసుకోరేమనీ..!

రూ.258.96 కోట్లు ఆర్‌బీఐకి బదిలీ ★ ఉమ్మడి జిల్లాలో అన్‌క్లెయిమ్డ్ ఖాతాలు 11,10,456

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి కొంతకాలం లావాదేవీలు నిర్వహించిన తరవాత ఏళ్ల పాటు వాటిని పట్టించుకోకుండా వదిలేశారు. వ్యక్తిగత, ప్రభుత్వ, ప్రైవేటు వ్యాపార సంస్థలకు చెందిన ఖాతాల్లో పదేళ్లకు పైగా లావాదేవీలు జరపకపోవడంతో వాటిని అన్‌క్లెయిమ్డ్ ఖాతాలుగా గుర్తించారు. ఇందులోని మొత్తాలను తీసుకునేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆ నిల్వలను అధికారులు ఆర్బీఐకి బదిలీ చేశారు. ఇలా ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, వ్యక్తిగత, ప్రైవేటు సంస్థల అన్‌క్లెయిమ్డ్ ఖాతాలు 11,10,456 ఉండగా అందులో రూ.258.96 కోట్లు తలిపోయాయి.

అవగాహన లేక.. మరచిపోయి..

ప్రైవేటు వ్యక్తులకు అవగాహన లేకపోవడం, ఖాతాల విషయం మరచిపోవడంతో ముందుకు రావట్లేదు. ఇటీవల రాష్ట్ర సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్షించిన సీఎం చంద్రబాబు.. ప్రభుత్వ ఖాతాల్లో అన్‌క్లెయిమ్డ్‌గా ఉన్న సొమ్ము వెంటనే తిరిగి తెచ్చుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని 10,383 ప్రభుత్వ ఖాతాల్లో ఉన్న రూ.12.72కోట్లు వెనక్కి తీసుకునేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.
✪ ఇప్పటివరకు ఉమ్మడి కృష్ణాలో అన్ని రకాల అన్‌క్లెయిమ్డ్ ఖాతాల నుంచి రూ.10.16 కోట్లు క్లెయిమ్ చేసుకున్నారు.
✪ ప్రతి ఒక్కరికి బ్యాంకు ఖాతా ఉండాలన్న ఉద్దేశంతో 2015-16లో కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున జన్‌ధన్ ఖాతాలను తెరిపించింది. వీటి ద్వారా లావాదేవీలు నిర్వహించక పదేళ్లు దాటిపోయింది. దీంతో అవన్నీ అన్‌క్లెయిమ్డ్ ఖాతాల జాబితాల్లోకి చేరాయి.

సొమ్ము తిరిగి పొందాలంటే..

✪ అన్‌క్లెయిమ్డ్ ఖాతాల్లోని సొమ్ము తిరిగి తీసుకునేందుకు ఆర్‌బీఐ వెసులుబాటు కల్పించింది. ఖాతాదారులు వారికి సంబంధించి లావాదేవీలు నిలిపేసిన ఖాతాల వివరాలు తెలుసుకోవడానికి యూడీజీఎం వెబ్‌సైట్లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఆధార్‌కార్డు, పాన్‌కార్డు ద్వారా వివరాలు తెలుసుకోవచ్చు. ✪ సంబంధిత పత్రాలు అప్‌లోడ్ చేయాలి. బ్యాంకులో కొత్తగా కేవైసీ చేసుకొని ఆ సొమ్ము తిరిగి పొందవచ్చు.
✪ అన్‌క్లెయిమ్డ్ ఖాతాలకు సంబంధించి ఏమైనా సందేహాలున్నా.. సొమ్ము తిరిగి తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురైనా ఖాతా కలిగిన బ్యాంకు, లేదా లీడ్ బ్యాంకు కార్యాలయాలను సంప్రదించాలని ఉమ్మడి జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్లు రవీంద్రరెడ్డి, కె.ప్రియాంక తెలిపారు.

ఉద్యోగ మేళా నేడు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : దుర్గామల్లేశ్వర సిద్ధార్థ కళాశాల, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ లబ్బీపేటలోని సిద్ధార్థ మహిళా కళాశాలలో గురువారం ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ వి.వి.సుబ్రహ్మణ్యకుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే మేళాకు ఐటీ, బ్యాంకింగ్, ఫైనాన్స్, మార్కెటింగ్, ఫార్మా, హెల్త్‌కేర్ తదితర రంగాలకు చెందిన ప్రముఖ సంస్థల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ, బీటెక్, ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు తాజా బయోడేటా, విద్యార్హత ధ్రువపత్రాలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్, పాన్ కార్డులు తీసుకురావాలని సూచించారు. ఎంపికైన వారికి వెంటనే ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తారని తెలిపారు.

కూలకముందే కదలండి!

కనకదుర్గ వంతెన విభాగినిపై విద్యుత్తు స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా మారుతున్నాయి. ఈ వంతెనపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పూర్తిగా కూలిపోయి ప్రమాదం జరగకముందే వాటిని సరిచేయాల్సి ఉంది.

- ఈనాడు, అమరావతి

రాజధాని రైతులకు ప్లాట్లు


ప్లాటు కేటాయించిన వారికి ప్రొవిజనల్ సర్టిఫికెట్ ఇస్తూ..

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని నిర్మాణానికి ల్యాండ్ పూలింగ్ విధానంలో భూములు ఇచ్చిన రైతులకు బుధవారం రాయపూడి సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించారు. ఈ- లాటరీ విధానంలో అర్హులైన 77 మంది రైతులకు మొత్తం 151 ప్లాట్లు కేటాయించి ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందించారు. అందులో 80 నివాసం, 71 వాణిజ్య ప్లాట్లు ఉన్నాయి. ★ మెట్ట భూములకు సంబంధించిన 35 మంది రైతులకు 53 ప్లాట్లు కేటాయింపులు చేశారు. అందులో 31 నివాసం, 22 వాణిజ్య ప్లాట్లు ఉన్నాయి. జరీబు భూములకు సంబంధించి 42 మంది రైతులకు 98 ప్లాట్లు కేటాయించగా.. అందులో 49 నివాసం మరో 49 వాణిజ్య ప్లాట్లు ఉన్నాయి. ★ ప్లాట్లు పొందిన వారిలో ఉండవల్లి, పెనుమాక, లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెం, రాయపూడి, వెంకటపాలెం, మందడం గ్రామాలకు చెందిన రైతులు ఉన్నారు. ప్లాట్లను వెంటనే రిజిస్ట్రేషన్‌లు చేయించుకోవాలని సీఆర్డీఏ డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ వసంతరాయుడు సూచించారు. ఆయా స్థలాలు ఉన్న ప్రాంతాలను సర్వేయర్‌ల సహాయంతో తెలుసుకోవచ్చన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సూక్ష్మ సేద్యంతో బహుళ ప్రయోజనాలు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : సూక్ష్మ సేద్యంతో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు పండించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని కలెక్టర్ లక్ష్మీశ రైతులకు సూచించారు. మండల పరిధిలోని రేపూడి గ్రామాన్ని ఆయన బుధవారం సందర్శించారు. రైతు జి.విష్ణువర్ధన్ రెడ్డి సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. సాగునీటి వనరుల సద్వినియోగంలో బిందు, తుంపర సేద్యం చాలా కీలకమైందని చెప్పారు. రాయితీపై బిందు, తుంపర సేద్య పరికరాలు అందించాలనే లక్ష్యంతో జిల్లాలో ఏపీ మైక్రో ఇరిగేషన్ పథకం ద్వారా అన్నదాతలకు పరికరాలు అందజేస్తామని తెలిపారు. తిరువూరు ఆర్డీవో కె.మాధురి, ఏపీ ఎంఐపీ పీడీ ఎం.సుభాని, ఉద్యాన శాఖ అధికారి నరేంద్ర కుమార్, వ్యవసాయ శాఖ ఏడీ రంగారావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

సేవలు నచ్చేలా.. పౌరులు మెచ్చేలా...

- ◆ అందుబాటులో ఏపీసీఆర్డీఏ పరిష్కారం 2.0
- ◆ సంతృప్తి స్థాయులపై ఆడిట్

ఈనాడు, అమరావతి

సీఆర్డీఏ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి యంత్రాంగం ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తోంది. ఏపీ సీఆర్డీఏ పరిష్కారం 2.0 ద్వారా రైతులు కాలు కదపనవసరం లేకుండానే అర్జీ చేసుకునే వెసులుబాటు కల్పించింది. పరిష్కారం ఏ దశలో.. ఏ అధికారి వద్ద ఉందో తెలుసుకునేలా వెబ్‌సైట్ నిర్వహిస్తోంది. అర్జీ స్థితిపై కారణాలు తెలియజేస్తూ సమగ్ర వివరాలు తెలుసుకునే అవకాశం కల్పించింది.

వివిధ మార్గాల్లో అర్జీల స్వీకరణ

★ రాయపూడిలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో ప్రజల నుంచి ప్రతి శనివారం అర్జీలు, ప్రతి రోజూ వినతులు స్వీకరిస్తున్నారు. ★ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రామదర్శిని; గ్రామసభల్లో, ఆయా కార్యాలయాలకు వస్తున్న వినతులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ★ రాజధాని గ్రామాల్లోని యూనిట్ కార్యాలయాలు, జిల్లా ప్రజా ఫిర్యాదుల విభాగానికి అందుతున్న రాజధాని ప్రాంత అర్జీలను కూడా స్వీకరిస్తున్నారు. ★ రాజధాని పనులు జరుగుతున్న ప్రాంతంలో ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేశారు. ★ సీఆర్డీఏ పరిష్కారం 2.0 వెబ్‌సైట్‌లో వాట్సప్ ద్వారా అర్జీలు అప్‌లోడ్ చేయొచ్చు. ఇందుకు చరవాణి, ఆధార్‌కార్డు నంబర్ల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఏఐ సాయం తీసుకునే వెసులుబాటు కల్పించారు. తెలుగు లేదా ఆంగ్లం ఎంచుకోవచ్చు.

గత సెప్టెంబరు నుంచి ఇప్పటివరకు...

- ✪ మొత్తం అర్జీలు: 2,693
- ✪ పరిష్కారమైనవి: 2,313
- ✪ పెండింగ్: 309
- ✪ రీఓపెన్ చేసినవి: 71

అసంతృప్తి వ్యక్తం చేసినవారు : **277**

పరిష్కారం చూపిస్తారు..

★ ఫిర్యాదు/అర్జీ నమోదు అనంతరం పరిష్కరించాల్సిన అధికారి, దరఖాస్తుదారుడికి సంక్షిప్త సందేశం వెళ్తుంది.
★ సంబంధిత అధికారి సమస్యను పరిష్కరించి అర్జీదారుడికి ఎండార్స్‌మెంట్ ఇస్తారు. సంతృప్తి లేఖను తీసుకోవాలి. ★ పరిష్కారం అనంతరం సీఆర్డీఏ కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఫోన్ చేసి అర్జీదారులు సంతృప్తిగా ఉన్నారా? లేదా? సమాచారం సేకరిస్తారు. అసంతృప్తి వ్యక్తం చేసినవారి వివరాలు ఆడిట్ అధికారుల బృందానికి వెళ్తాయి. ఆయా విభాగాల ఉన్నతాధికారులు అర్జీ పరిష్కరించిన విధానాన్ని పరిశీలించి సంతృప్తి చెందితే పిటిషన్‌ను మూసేస్తారు. లేదంటే రీఓపెన్ చేసి తొలిదశ నుంచి మళ్లీ పరిశీలిస్తారు. ★ అధికారుల స్థాయిలో పరిష్కరించలేని అర్జీలను కమిషనర్, సీఆర్డీఏ అథారిటీ, అవసరమైతే ప్రభుత్వస్థాయిలోని ఉన్నతాధికారులకు పంపిస్తారు. ★ వెబ్‌సైట్‌లోని వివరాల ఆధారంగా కమిషనర్ ప్రతి శనివారం అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు.

పెండింగ్‌లో ఇలా...

పురోగతిలో	163
అదనపు సమాచారం కోసం	2
ఉన్నతాధికారులకు పంపినవి	144

రీఓపెన్ చేసిన 71 అర్జీలు..

పురోగతిలో ఉన్నవి	31
ఉన్నతాధికారులకు పంపినవి	40

3న కనకదుర్గమ్మ ఆలయం మూసివేత

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా మార్చి 3న దుర్గగుడిని మూసి వేస్తున్నట్లు వైదిక కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3న ఉదయం 10 గంటలకు కవాట బంధనం (మూసివేయడం) చేసి తిరిగి 4న వేకువజామున 3 గంటలకు కవాట ఉద్ఘాటన(తలుపులు తెరవడం) చేస్తారని తెలిపారు. పౌర్ణమి సందర్భంగా ప్రతి నెల నిర్వహించే గిరిప్రదక్షిణతోపాటు శాంతి కల్యాణం, చండీహోమం, పంచహారతులు, పల్లకీ సేవ వంటి ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. 4న వేకువజామున 3 గంటలకు అమ్మవారి ప్రధాన ఆలయంతోపాటు ఉపాలయాలు తెరవడంతోపాటు దేవతామూర్తులకు సుప్రభాత సేవ, స్నపనాభిషేకం, ప్రాతఃకాలార్చన, నివేదన, హారతి నిర్వహిస్తారని చెప్పారు. ఉదయం 8 గంటలకు భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారని తెలిపారు. తెల్లవారుజామున నిర్వహించే వస్త్ర సేవ, ఖడ్గమాలార్చన, నవగ్రహ శాంతి హోమం, గణపతి హోమం వంటి ఆర్జిత సేవలను నిలిపివేసినట్లు పేర్కొన్నారు. చండీహోమం, లక్ష కుంకుమార్చన సేవలను ఉదయం 8:30 గంటలకు నిర్వహిస్తారని తెలిపారు.

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో
డైరెక్ట్ వీవర్స్ ప్రదర్శన మరియు అమ్మకం
ఉగాది & వెడ్డింగ్ ప్రత్యేకం
ఈరోజే చివరి రోజు
శ్రీ శేషసాయి కళ్యాణ వేదిక, బందర్ రోడ్డు, విజయవాడ
భారతదేశం నలుమూలల గల 150+ సిల్క్ వీవర్స్ & బెస్ట్ డిజైనర్స్ నుండి
భారతదేశం నలుమూలలా ప్రామాణికమైన & నమ్మకమైన సిల్క్ & కాటన్ చీరలు వీవర్స్ ధరకు మాత్రమే
అన్నీ లేటెస్ట్ వెరైటీలు & కొత్త డిజైన్‌లు
సిల్క్ & కాటన్ శారీ | డిజైనర్ వేర్ | ఎథ్నిక్ వేర్ | కుర్తీ & డ్రెస్సెస్ | ఫ్యాషన్ జ్యూయలరీ | హ్యాండ్ క్రాఫ్టెడ్ టెక్స్‌టైల్స్

M: 9441987009 | Entry Free | All UPI Online / Debit & Credit Cards Accepted

ఎంఎస్‌ఎంఈ పార్కులకు.. స్థలాలు సిద్ధం

వాంబేకాలనీలో సేకరించిన ఐదెకరాల స్థలం

జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోనూ ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు స్థలాల ఎంపిక పూర్తయింది. ఇప్పటికే విజయవాడ మధ్య, జగ్గయ్యపేట, మైలవరంలో స్థలాల గ్రౌండింగ్ పనులు ఆరంభించారు. తాజాగా విజయవాడ తూర్పు, పశ్చిమ, జగ్గయ్యపేట, తిరువూరు, నందిగామలోనూ స్థలాల ఎంపిక పూర్తి చేసి గ్రౌండింగ్‌కు సిద్ధం చేస్తున్నారు. ఒక్కో నియోజకవర్గంలో ఐదు ఎకరాల నుంచి 50 ఎకరాల వరకూ స్థలాలు సేకరించారు. ఇక్కడ ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు రూ.42కోట్లు కేటాయించారు.
విజయవాడ తూర్పు నియోజకవర్గ పరిధిలో పాలిటెక్నిక్ కళాశాల, లిడ్‌క్యాప్‌కు సంబంధించిన ఖాళీ స్థలాలు పరిశీలించారు. ఈ రెండింటిలో ఒకచోట ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోనూ ఖాళీగా ఉన్న స్థలాన్ని ఎంపిక చేసి లేఔట్ వేసేందుకు సిద్ధం చేస్తున్నారు. తిరువూరులోని చీమలపాడులో ఇటీవల వివాదాల్లో ఉన్న 50 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని సర్వే చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ మొత్తం స్థలాన్ని ఎంఎస్ఎంఈ పార్కుగా మార్చనున్నారు. ఇప్పటికే ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. నందిగామలోని పెద్దవరంలో స్థలం ఎంపిక పూర్తయింది.

పురోగతిలో మూడు నియోజకవర్గాలు..

జిల్లాలో తొలిదశలో భాగంగా జగ్గయ్యపేట, విజయవాడ మధ్య, మైలవరం నియోజకవర్గాల్లో ఇప్పటికే స్థలాల్లో పనులు ఆరంభమయ్యాయి. లేఔట్ పనులు తుది దశకు చేరాయి. జగ్గయ్యపేటలో పది ఎకరాల్లో లేఔట్ సిద్ధమవుతోంది. ఇక్కడ ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు స్థలాలు కేటాయించనున్నారు. విజయవాడ మధ్య, మైలవరంలో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేసి ఎంఎస్ఎంఈలకు కేటాయిస్తారు. ఇక్కడా గ్రౌండింగ్ పనులు తుది దశకు చేరాయి. మధ్య నియోజకవర్గం వాంబేకాలనీలోని ఎక్సెల్ ప్లాంట్‌కు చెందిన ఐదు ఎకరాలు, మైలవరంలో చెరువు పక్కన ఆరు ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు రాబోతున్నాయి.

స్థానికంగానే ఉద్యోగ, ఉపాధి కల్పన..

ప్రతి నియోజకవర్గంలో ఉండే యువతకు స్థానికంగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. భారీ పరిశ్రమల కంటే ఎక్కడికక్కడ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలతోనే ఎక్కువ మందికి ఉపాధి కల్పించాలనేది లక్ష్యం. నగర నియోజకవర్గాల్లో స్థలాభావం వల్ల ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లు, గ్రామీణ ప్రాంతాల్లో స్థలాలను ఎంఎస్ఎంఈలకు కేటాయించేలా సన్నాహాలు చేస్తున్నారు.

– ఈనాడు, అమరావతి

వెబ్ డెవలపర్ కోర్సులో ఉచిత శిక్షణ

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో డిప్లొమా, ఇంటర్, డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులకు వెబ్ డెవలపర్ కోర్సులో శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.విజయసారథి, జిల్లా నైపుణ్యాధికారి శ్రీనివాసరావు తెలిపారు. మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కోర్సు పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన నుంచి ధ్రువపత్రం అందజేస్తామని వెల్లడించారు. అభ్యర్థులు తమ ఆధార్ కార్డు, ఫోన్ నంబరుతో వెళ్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోగా సంప్రదించాలని, మరిన్ని వివరాలకు 99857-59304, 63050-04318 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

చెన్నైలో నిందితుల కోసం అన్వేషణ

■ త్రుటిలో తప్పించుకున్న సుబ్రమణి రాజావెంకట్

ఈనాడు, అమరావతి: ఇటీవల యనమలకుదురులో వెలుగుచూసిన అద్దె ఖాతాల కేసులో ఇప్పుడు సీన్ చెన్నైకి మారింది. ఈ కేసులో అసలు సూత్రధారుల కోసం సైబర్ పోలీసు ప్రత్యేక బృందం చెన్నైలో మకాం వేసింది. ఇప్పటికే అరెస్టు అయిన సోదరులు రవికుమార్, స్టీవెన్ ఇచ్చిన సమాచారం ఆధారంగా సుబ్రమణి రాజా వెంకట్ కోసం ప్రత్యేక బృందం వేట సాగిస్తోంది. విజయవాడలో అమాయకులతో తెరిపించిన ఖాతాలను చెన్నైలో వీరి బంధువైన వెంకట్‌కు పంపించేవారు. అక్కడి నుంచి వచ్చే ఆదేశాల మేరకు ఓటీపీలు చెప్పడం, నగదును ఇతర ఖాతాలకు బదిలీ చేసేవారు. ✪ చెన్నైలో వెంకట్‌తో పాటు ఇంకా ఎవరైనా ఉన్నారా? అన్న కోణంలో బృందం విచారిస్తోంది. అతని చిరునామా కనుక్కొని రాజా వెంకట్ ఉంటున్న అద్దె ఇంటికి వెళ్లినా ఫలితం లేకపోయింది. అప్పటికే అతను పరారయ్యాడు. నగరంలోని పలు ప్రాంతాలు, అతని స్నేహితుల నుంచి వాకబు చేస్తున్నారు. మరో నిందితుడు ఆకాశ్ ఆచూకీ ఇంతవరకు తెలియలేదు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేస్తున్నానని అందరినీ నమ్మిస్తూ అద్దె ఖాతాల ద్వారా చట్టవిరుద్ధ లావాదేవీలు చేస్తున్నట్లు తేలింది. నిందితుడి ఫోన్ స్విచాఫ్‌లో ఉండడంతో అతని స్నేహితుల నంబర్లపై నిఘా పెట్టారు. అతని కుటుంబ సభ్యులను విచారించినా పెద్దగా సమాచారం రాలేదని తెలిసింది.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 98496 97616

(c) eenadu

నమ్మించి.. నిలువునా ముంచేసి..

రైల్వే ఉద్యోగాల పేరుతో రూ. లక్షల్లో దోపిడీ

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే

ఉద్యోగాల పేరుతో దాదాపు రెండేళ్లుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సాగుతున్న దందాలో చిక్కుకున్న బాధితుల పరిస్థితి నేడు అగమ్యగోచరంగా మారింది. మోసాన్ని గుర్తించి ప్రశ్నించిన వారిపైనే ఎదురు కేసులు పెడుతున్న నేపథ్యంలో తమకు ఆత్మహత్యలే శరణ్యమంటూ బాధితులు వాపోతున్నారు.

రైల్వేలో చిరుద్యోగిగా పనిచేస్తున్న ఎం. కిషోర్.. మచిలీపట్నం రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. సహచరులు కరీముల్లా, షఫి, అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకుడు చిన్నా తదితరుల సహకారంతో పలువురితో పరిచయాలు పెంచుకున్నారు. ఈ క్రమంలో కిషోర్.. రైల్వేలో టీసీ, క్లర్క్ తదితర పోస్టుల పేరుతో కనిష్ఠంగా రూ.5 లక్షల చొప్పున పలువురి వద్ద నుంచి నగదు, ఖాళీ చెక్కులు వసూలు చేశాడు. అనంతరం వారికి పీఎఫ్ ఖాతా నంబర్లు, రైల్వే స్టాంపులతో కూడిన ఫేక్ నియామక పత్రాలు, ఐడీ కార్డులు పంపుతూ సాంకేతిక కారణాల వల్ల ఉద్యోగంలో చేరేందుకు కాస్త ఆలస్యం అవుతుందంటూ నమ్మబలికాడు. ఆలస్యంపై ఎవరైనా నిలదీస్తే విజయవాడ, ఇతర ప్రాంతాలకు మాట్లాడదామంటూ పిలిచి యూనియన్ నాయకుల పేరుతో కొందరిని పరిచయం చేసి త్వరలోనే ఉద్యోగం వస్తుందని ఆశలు కల్పించేవాడు. ఇదే తరహాలో మచిలీపట్నం పరిసర ప్రాంతాలకు చెందిన పలువురి వద్ద నుంచి నగదు దోచేసి వారిని మభ్యపెడుతూ వస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం జక్కరం గ్రామానికి చెందిన నాగపద్మ తనకు వచ్చిన నియామక పత్రాన్ని రైల్వే ఉద్యోగులకు చూపించి అది నకిలీదని నిర్ధారించుకోవడంతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది.

కిషోర్ ఇంటి వద్ద నకిలీ నియామక పత్రాలు చూపిస్తున్న బాధితులు

అడిగినందుకు ఎదురు కేసు: బాధితురాలు నాగపద్మతో పాటు మచిలీపట్టణానికి చెందిన గంగాభవాని ఈ నెల 7న మచిలీపట్నంలోని కిషోర్ నివాసానికి వచ్చారు. కిషోర్, అతనికి అండగా నిలిచిన చిన్నా కలిసి 'అల్లరి చేసుకోవద్దు.. మీకు ఉద్యోగాలు ఖాయం.. రేపు రండంటూ వారిని పంపేశారు. మరుసటి రోజు కిషోర్ ఇంటికి వెళ్లగా ఎవరూ ఆచూకీ లేకపోవడంతో బాధితులు చిలకలపూడి స్టేషన్‌కు వెళ్లి జరిగిన మోసాన్ని పోలీసులకు వివరించారు. అనంతరం బాధితులు తిరిగి కిషోర్ ఇంటికి వెళ్లి అతని కోసం నిరీక్షించారు. ఈలోగా పోలీసులు అక్కడకు వచ్చి రాత్రి మీరే కిషోర్‌పై దాడి చేశారంటూ అతడు ఫిర్యాదు ఇచ్చాడని, ఈ కేసులో నిందితులుగా ఉన్నారంటూ నాగపద్మ, గంగాభవానిలను స్టేషన్‌కు తీసుకువెళ్లడం గమనార్హం. ఇదిలా ఉండగా.. ఈ నెల 14న కాళ్ల పోలీస్ స్టేషన్‌లో ఇదే అంశంపై తాను ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకుండా తనను వెనక్కి పంపేశారని నాగపద్మ వాపోతోంది.

యూనిఫాం పేరుతోనూ దండుకున్నారు

ఉద్యోగం పేరుతో రూ. 3.50 లక్షలు వివిధ రూపాల్లో తీసుకున్నారు. ఎప్పుడు విధుల్లో చేరాలని ప్రశ్నించగా త్వరలోనే అని చెబుతూ మీకు రైల్వే యూనిఫాం వచ్చిందని, దాని కోసం రూ. 5,000 ఇవ్వాలంటూ అదనంగా దండుకున్నారు. - గంగాభవానీ

రూ.60 లక్షలకు ష్యూరిటీ అంటూ నోటీసు

డబ్బులు పోగొట్టుకుని ఉద్యోగం రాకపోగా.. సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ నుంచి రూ. 60 లక్షల రుణానికి మీరు ష్యూరిటీగా ఉన్నారంటూ మెసేజ్ వచ్చింది. దీన్ని బట్టి నా వద్ద నుంచి తీసుకున్న చెక్కులను అడ్డుపెట్టుకుని కిషోర్ మరో రుణమోసానికి పాల్పడ్డాడన్న భయం వెంటాడుతోంది. - నాగపద్మ

'వాలిడేషన్ యాక్టు పింఛను నిబంధనలకు విరుద్ధం'

పటమట, న్యూస్‌టుడే: పింఛను సవరణను వేతన సవరణతో అనుసంధానం చేయడం వల్ల అనేక సమస్యలు ఎదురవుతున్నాయని ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పింఛనుదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు డి. గోపాలకృష్ణన్ అన్నారు. బుధవారం పటమట సెంటర్‌లోని రఘురామ కల్యాణ వేదికలో ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పింఛనుదారుల సంక్షేమ సంఘం ఏపీ సర్కిల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గోపాలకృష్ణన్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పింఛను సవరణ మంజూరు చేయాలని దిల్లీ హైకోర్టు ఆదేశించిందని, కానీ ప్రభుత్వం అప్పీల్‌కు వెళ్లడం వల్ల పెండింగ్‌లో ఉందని తెలిపారు. విలీన ఉద్యోగులందరూ త్వరలో ఉద్యోగ విరమణ చేయనున్న నేపథ్యంలో పీబీ, సీఏటీ తీర్పును మార్గదర్శకంగా తీసుకుని 2017 నుంచి పింఛను సవరణ అమలు చేయాలని కోరుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన వాలిడేషన్ యాక్టును తీవ్రంగా ఖండిస్తున్నామని, అది పింఛను నిబంధనలకు విరుద్ధమని అన్నారు. ఆ చట్టం గత, ప్రస్తుత పింఛనుదారుల మధ్య సమానత్వాన్ని దెబ్బతీస్తుందని వివరించారు. సంఘం ప్రధాన కార్యదర్శి వి. వరప్రసాద్ మాట్లాడుతూ... 8వ సెంట్రల్ పే కమిషన్‌లో పెన్షన్ రివిజన్ అంశం చేర్చలేదని గుర్తు చేశారు. పైగా అమలు తేదీపై స్పష్టత లేక 2026కు ముందు ఉద్యోగ విరమణ చేసిన వారికి అన్యాయం జరిగే అవకాశం ఉందని అన్నారు. వాలిడేషన్ యాక్ట్‌కు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా పింఛనుదారుల సంఘాలు ఏకమై నిరసన తెలుపుతున్నాయని, సుప్రీం కోర్టులో మూడు రిట్ పిటిషన్లు కూడా దాఖలయ్యాయని తెలిపారు. సర్కిల్ కార్యదర్శి డి. వెంకటేశ్వరరావు, సభ్యులు కె.ఎస్. కోటేశ్వరరావు, ప్రకాశరావు, భాస్కరరావు, డి.ఎం. దుర్గారావు, కె.వి. సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు గోపాలకృష్ణన్

వంకాయలు-24/22, టమాటా-14, బెండ-24, పచ్చిమిర్చి-46, కాకర-32, బీర-30/28, క్యాలీ ఫ్లవర్-15/20, క్యాబేజి-14, క్యారెట్-30, దొండ-40, బంగాళదుంప-21, ఉల్లిపాయలు-22, గోరుచిక్కుళ్లు-30, దోస-16/26, సొర-8/10, పొట్ల-30, అరటికాయ-7/6, చామదుంప-24, అల్లం-72, మునగ-10/8, ఆకు కూరలు (కట్ట)-2.50, కంద-40, బీట్ రూట్-28, కీరదోస-42, బీన్స్-58/64, క్యాప్సికమ్-60, చింతకాయలు-65, నిమ్మ (డజను)-36/40, కొత్తిమీర-5/10, పుదీనా-5/15, ముల్లంగి-8, పచ్చిమామిడి-20/25 **(నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. - న్యూస్‌టుడే, విజయవాడ రైతుబజారు**

ఎమ్మెల్సీ రఘురామ్‌కు పితృవియోగం

గొల్లపూడి, న్యూస్‌టుడే : వైకాపా ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ తండ్రి చంద్రశేఖర్‌రావు(88) బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైకాపా అధ్యక్షుడు జగన్ గొల్లపూడిలోని రఘురామ్ నివాసానికి వచ్చి చంద్రశేఖర్‌రావు భౌతికకాయానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ మంత్రులు విడదల రజని, పేర్ని నాని, జోగి రమేష్, కురసాల కన్నబాబు, వెలంపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ నందిగం సురేష్ తదితరులు నివాళులర్పించారు.

చంద్రశేఖర్‌రావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న జగన్

కల్యాణమూర్తులకు ప్రదక్షిణలు నిర్వహిస్తున్న దుర్గగుడి పాలక మండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్

వైభవంగా ద్వాదశ ప్రదక్షిణలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై మహాశివరాత్రి కల్యాణ మహోత్సవాల ముగింపు సందర్భంగా శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో వైభవంగా ద్వాదశ ప్రదక్షిణలు బుధవారం నిర్వహించారు. గంగా, పార్వతీ సమేత దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల ఉత్సవమూర్తులను అలంకరించిన పల్లకీలో ఉంచి మంగళ వాయిద్యాలతో ద్వాదశ ప్రదక్షిణలు చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణమూర్తులకు ప్రత్యేక పూజలు, శాస్త్రోక్తంగా పవళింపు సేవను అర్చకులు నిర్వహించారు. కార్యక్రమంలో దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్, సభ్యులు శ్రీనివాసరావు, పద్మావతి ఠాకూర్, సరోజనిదేవి, సరిత తదితరులు పాల్గొన్నారు.

21న కృష్ణాయపాలెంలో సేంద్రియ మేళా

మామిడి తోటలో జిల్లా స్థాయి కార్యక్రమం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఎ.కొండూరు మండలం కృష్ణాయపాలెం మామిడి తోటలో ఈ నెల 21వ తేదీన జిల్లా స్థాయిలో భారీ సేంద్రియ మేళా నిర్వహించనున్నట్టు కలెక్టర్ జి.లక్ష్మీశ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పంటల సాగులో ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి, పొలంలో సేంద్రియ కర్బనాన్ని పెంచుకోవాల్సిన అంశంపై రైతులకు అవగాహన కల్పిస్తారు. సేంద్రియ ఉత్పత్తులపై ప్రజల్లో చైతన్యం కలిగించడం, సాగుపై రైతులకు సామర్థ్య అభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడమే లక్ష్యంగా జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో ఈ మేళా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. రైతులు, వినియోగదారులు, వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ సంస్థలు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సేంద్రియ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయ స్టాళ్లు ఉంటాయన్నారు. సాగుకు అవసరమైన ఉత్పాదితాలనూ ప్రదర్శించనున్నట్టు తెలిపారు. రైతులు-నిపుణుల పరస్పర చర్చా వేదిక ద్వారా సందేహాల నివృత్తితో పాటు, మేధో మథనానికి అవకాశం ఉంటుందని వివరించారు. ఆదర్శ రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్.పి.ఒ.ఎస్.లు), ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న వారిని సత్కరిస్తారు.

22న విజయవాడలో...: ఈ నెల 22వ తేదీన విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ప్రకృతి వ్యవసాయ మేళా నిర్వహించనున్నట్టు కలెక్టర్ తెలిపారు. ప్రకృతి వ్యవసాయ రైతులు, వినియోగదారులు, సంస్థలను ఒకే వేదికపైకి తీసుకొచ్చే లక్ష్యంతో ఈ మేళా నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఉత్పత్తులకు మంచి మార్కెటింగ్ సౌకర్యం కల్పన, మార్కెటింగ్ లింకేజీలు ఏర్పాటు చేయడం, ఎంవోయూలపై అవగాహనతో పాటు, అవకాశాలు కల్పించనున్నట్టు పేర్కొన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు తీసుకుంటారు. ఈ-కామర్స్ సంస్థలు, బిగ్ బాస్కెట్ వంటి సంస్థలు పాల్గొంటాయని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా సేంద్రియ వ్యవసాయాన్ని మరింత ప్రోత్సహించి, రైతుల ఆదాయాభివృద్ధికి తోడ్పడేలా ఈ వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ వివరించారు.

వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ లక్ష్మీశ

త్వరలో సీబీజీ ప్లాంట్ ప్రారంభం: కలెక్టర్

హాజరుకానున్న సీఎం చంద్రబాబు

పరిటాల(కంచికచర్ల), న్యూస్‌టుడే: వ్యవసాయ, మున్సిపల్ వ్యర్థాలతో పర్యావరణ హిత గ్యాస్ తయారు చేసే లక్ష్యంతో సీబీజీ ప్లాంటును ఏర్పాటు చేయడం మంచి పరిణామమని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. పరిటాల సమీపంలో రిలయన్స్ న్యూఎనర్జీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న కంప్రెస్డ్ బయో గ్యాస్(సీబీజీ) ప్లాంట్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. రోజుకు 22 టన్నుల సీబీజీ ఉత్పత్తి లక్ష్యంగా ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కంపెనీ ప్రతినిధులు కలెక్టర్‌కు వివరించారు. ప్లాంట్ పనితీరు, గ్యాస్ ఉత్పత్తి అయ్యే విధానాన్ని వివరించారు. 30 ఎకరాల విస్తీర్ణంలో నెలకొల్పుతున్న ఈ ప్లాంట్‌ను త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారని కలెక్టర్ లక్ష్మీశ మీడియాకు తెలిపారు. ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు రైతులకు ఆదాయ మార్గం ఉండే ఇటువంటి ప్లాంట్‌ల ఏర్పాటును ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని అన్నారు. నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, సంస్థ డీజీఎం శ్రీకాంత్, మేనేజర్ శ్రీచరణ్, అసిస్టెంట్ మేనేజర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా ఏపీ

విజయవాడ(భవానీపురం), న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఏపీ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ) 50 ఏళ్ల వేడుకను విజయవాడలోని భవానీద్వీపంలో బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పర్యాటక రంగంలో గణనీయమైన అభివృద్ధి జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో రూ. 20 వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయని, 1.22 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యమన్నారు. పీపీపీ విధానంలో పెట్టుబడులే లక్ష్యంగా కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను పెంపొందించేందుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రోడ్ షోలను నిర్వహిస్తామని వెల్లడించారు. ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ.. ఏపీని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనకు అనుగుణంగా టూరిజం పాలసీ రూపొందించినట్లు తెలిపారు. వైకాపా ప్రభుత్వ హయాంలో పర్యాటక రంగం నిర్లక్ష్యానికి గురైందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా హోటళ్లు, కాటేజీలు, రెస్టారెంట్‌ల నిర్మాణం పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఏపీటీడీసీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్, ఎండీ ఆమ్రపాలి, ఈడీలు పద్మావతి, ఎం.శేషగిరి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బెలూన్‌లు ఎగురవేస్తున్న మంత్రి దుర్గేష్, ఏపీటీడీసీ ఛైర్మన్ బాలాజీ, స్పెషల్ సీఎస్ అజయ్‌జైన్, ఎండీ ఆమ్రపాలి

మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ అన్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం గాంధీనగర్ ఎన్జీవో కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా మార్చి 4, 5, 6 తేదీల్లో మహిళా ఉద్యోగులకు ఆటలు, నృత్య, సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 4న ఇందిరాగాంధీ స్టేడియంలో క్రీడా పోటీలు, 5న దండమూడి రాజగోపాల్ స్టేడియంలో క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. 9న మహిళలను సన్మానించడంతో పాటు విజేతలకు బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి. రమణ, పి. మాధవి, కె. శివలీల, కె. సరస్వతి, ఎస్. దీప్తి, బి. శాంతి, పి. సురేఖ, తులసీరత్నం, నాగమల్లేశ్వరి, బి. విజయశ్రీ, శ్రీదేవి, బి. శ్వేత తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న విద్యాసాగర్, రమణ తదితరులు

మునిరాజా వేధింపులపై లోతైన దర్యాప్తు

మొబైల్ సీజ్ చేసి, ఎఫ్ఎస్ఎల్‌కు పంపిన పోలీసులు

ఈనాడు - అమరావతి: ఒంటరి మహిళ, ఆమె కుమార్తెను అసెంబ్లీ కార్యాలయం ఏఎస్‌వో మునిరాజా లైంగికంగా వేధించిన కేసులో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిపై మహిళ ఇటీవల రెండోసారి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేశారు. అతని వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? అన్న కోణంలో విచారిస్తున్నారు. ఫిర్యాదులో నిందితుడి సహోద్యోగులు రవిపాల్, హరిబాబు, జుబేదా పేర్లను ప్రస్తావించింది. తన ఇంటిని అక్రమంగా విక్రయించేందుకు వీరు నిందితుడికి సాయం చేసినట్లు ఆమె పేర్కొంది. దీంతో వీరి పాత్ర ఎంత వరకు ఉందన్న దానిపై అన్ని కోణాలను పరిశీలిస్తున్నారు. ఫిర్యాది, ఆమె కుమార్తెకు సంబంధించి మునిరాజా రహస్యంగా వీడియోలు, ఫొటోలు తీశాడా? అన్న కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు. అరెస్టు సమయంలో నిందితుడి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీనిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు విశ్లేషణ నిమిత్తం పంపించారు. ఎఫ్ఎస్ఎల్ నుంచి వచ్చే నివేదిక ఆధారంగా పోలీసులు ముందుకు సాగనున్నారు. మహిళకు నిందితుడి, అతని సహోద్యోగుల నుంచి ఏమైనా కాల్స్ వచ్చాయా? అన్న అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. వీరి సీడీఆర్‌లను తెప్పించి పరిశీలించనున్నారు. ఈ కేసులో పోలీసులు సాక్షుల స్టేట్‌మెంట్లను కోర్టులో రికార్డు చేయించనున్నారు.

ట్రాక్టర్ ట్రక్కు పల్టీ.. ఒకరి మృతి

వత్సవాయి, పెనుగంచిప్రోలు: సుబాబుల్ లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ట్రక్కు పల్టీ కొట్టడంతో కూలీ దుర్మరణం చెందారు. వత్సవాయి మండలం కొత్త వేమవరం-వత్సవాయి గ్రామాల మధ్య రైల్వే అండర్ పాస్ సమీపంలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ట్రాక్టర్ నుంచి ట్రక్కు విడిపోవడంతో పల్టీ కొట్టింది. ట్రక్కుపై ఉన్న నందిగామ మండలం రుద్రవరానికి చెందిన ముప్పాళ్ల పండు కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాజ్ కెసిరెడ్డి పిటిషన్లపై ముగిసిన వాదనలు

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం కేసుకు సంబంధించి హైదరాబాద్‌లోని ఫాంహౌస్‌లో సీజ్ చేసిన నగదు, సీసీ ఫుటేజీ భద్రపరచాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై విజయవాడ ఏసీబీ కోర్టులో బుధవారం విచారణ జరిగింది. మద్యం ముడుపుల కేసు దర్యాప్తులో భాగంగా సిట్ అధికారులు రూ. 11కోట్లు నగదు సీజ్ చేశారు. రాజ్ కెసిరెడ్డి ఆదేశాలతోనే నగదు దాచినట్లు తమ విచారణలో తేలిందని సిట్ అధికారులు పేర్కొన్నారు. దీనిపై నిందితుడి తరపు న్యాయవాది కౌంటర్ దాఖలు చేశారు. ప్రభుత్వం తరపు న్యాయవాది శరత్‌చంద్ర, పిటిషనర్ తరపున న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. ఉత్తర్వులిచ్చేందుకు ఈనెల 27వ తేదీకి వాయిదా వేసింది.

బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

బ్రాయిలర్ ధరలు (కిలో ౹కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213 చికెన్ స్కిన్‌లెస్ - 243. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 244 చికెన్ స్కిన్‌లెస్ - 254.

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం కేసులో నిందితుడు తాండ్ర రమేష్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. విజయవాడలోని ఎక్సైజ్ కోర్టులో ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. దీనిపై వాదనలు ప్రారంభం కావాల్సి ఉండగా.. నిందితుడి తరపు న్యాయవాది వినతి మేరకు వాయిదా వేశారు. ఈనెల 23వ తేదీకి న్యాయాధికారి లెనిన్‌బాబు వాయిదా వేశారు.

నెట్‌బాల్ పోటీల విజేత సావిత్రిబాయి ఫులె వర్సిటీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక మారిస్ స్టెల్లా కళాశాల మైదానంలో కృష్ణా వర్సిటీ ఆధ్వర్యంలో 5 రోజుల పాటు జరిగిన అఖిల భారత అంతర్ విశ్వ విద్యాలయాల మహిళా నెట్‌బాల్ పోటీల్లో సావిత్రి బాయి ఫులె వర్సిటీ (మహారాష్ట్ర) జట్టు విజేతగా నిలిచింది. కాలికట్ (కేరళ), కృష్ణా (ఏపీ), హేమచంద్ యాదవ్ వర్సిటీ (దుర్గ్) జట్లు వరుసగా తర్వాత స్థానాలు కైవసం చేసుకున్నాయి. బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో కృష్ణా, హేమచంద్ యాదవ్ వర్సిటీ జట్ల మధ్య పోటీ ఉత్కంఠగా సాగింది. కృష్ణా వర్సిటీ గెలిచి తృతీయ బహుమతి సాధించింది. చివరి లీగ్ పోటీలో సావిత్రిబాయి ఫులె, కాలికట్ వర్సిటీ జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఒక్క పాయింట్ తేడాతో సావిత్రిబాయి ఫులె జట్టు విజేతగా నిలిచింది. శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, కృష్ణా వర్సిటీ ఉపకులపతి కూన రాంజీ విజేతలకు ట్రోఫీలు బహూకరించారు. అనిమిని మాట్లాడుతూ... పాఠశాల స్థాయి నుంచి క్రీడలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో శాప్ లీగ్స్ ప్రారంభించామని చెప్పారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా శాప్ వార్షిక క్రీడా క్యాలెండర్ విడుదల చేశామని తెలిపారు. ప్రతిభగల క్రీడాకారులను గుర్తించి శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తామని చెప్పారు. శాప్ నగదు ప్రోత్సాహకాలు అందుకున్న వారిలో 70 శాతం మహిళా క్రీడాకారిణులే ఉన్నారని గుర్తు చేశారు. పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి జె. నవీన లావణ్యలత పోటీల నివేదిక ప్రకటించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వీసీ మాట్లాడుతూ.. పోటీలను విజయవంతం చేసేందుకు సహకరించిన స్టెల్లా కళాశాల యాజమాన్యం... తదితరులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచిన సావిత్రిబాయి ఫులె, కృష్ణా వర్సిటీ జట్లకు రెక్టార్ ఎంవీ బసవేశ్వరరావు రూ. 10,116 చొప్పున తన సొంత నిధులు అందజేశారు. రిజిస్ట్రార్ ఎన్. ఉష, జేఎన్‌యూకే స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ జి. శ్యామ్‌కుమార్, ఏయూ పరిశీలకుడు విష్ణు చౌదరి, టోర్నీ చీఫ్ రిఫరీ ఆకాష్ బత్రా, ప్రిన్సిపల్ సిస్టర్ జి. ఇన్నాసమ్మ తదితరులు పాల్గొన్నారు.



శాప్ ఛైర్మన్ రవినాయుడు, వీసీ రాంజీ నుంచి విన్నర్ ట్రోఫీ అందుకుంటున్న సావిత్రిబాయి ఫులె జట్టు

'కూటమి నిర్ణయంతో ఆయుష్ వైద్యాభివృద్ధి'

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : రాష్ట్రంలో ఆయుష్ క్లినిక్స్, ఆసుపత్రుల రిజిస్ట్రేషన్, నిర్వహణకు ఏపీ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 2002 సవరణల బిల్లు శాసనసభలో ఆమోదం పొందడంపై ది ఇండియన్ మెడికల్ ప్రాక్టీషనర్స్ కోఆపరేటివ్ ఫార్మసీ అండ్ స్టోర్స్ డైరెక్టర్ డాక్టర్ వేములు భానుప్రకాశ్ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గత 15 సంవత్సరాలుగా రాష్ట్రంలోని ఆయుర్వేద వైద్యుల సంఘాలు ఆయుష్ వైద్యానికి ప్రత్యేక క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం కావాలని కోరుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఆయుష్ క్లినిక్స్, ఆసుపత్రుల రిజిస్ట్రేషన్‌కు చట్టబద్ధమైన విధానాన్ని ఏర్పాటు చేయడం చారిత్రాత్మక నిర్ణయమని కొనియాడారు. దీనివల్ల అధికారిక గుర్తింపు వస్తుందని తెలిపారు. ప్రభుత్వ పథకాల అనుసంధానం, భవిష్యత్తులో ప్రభుత్వ ఆరోగ్య పథకాలతో ఆయుష్ ఆసుపత్రులను చేర్చేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. రాష్ట్రంలోని ఆయుష్ వైద్య అభివృద్ధికి ఇది మైలురాయిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

91.9FM Vijayawada 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008003297

EENADU eClassifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతరప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్‌క్యాష్ ✆ 81422 92071

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166

FINANCIAL SERVICES

Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు EMI వాయిదా పద్ధతిలో పర్సనల్ ఫైనాన్స్, అన్ని తరగతుల వారికి స్థిరాస్తులపై ఫైనాన్స్ ఇవ్వబడును. Cell: 73862 01191.

REAL ESTATE

FLAT FOR SALE

Flat for Sale Vignesh Apartment D/No. 56-4-23/B, Block 2 G1, Ground Floor N.R. Rythubazar Patamata Vijayawada. ✆ 77024 44575.

PLOT FOR SALE

రాజధాని అమరావతి, ఔటర్‌రింగ్ రోడ్డు, కొత్త రైల్వేలైన్, ఇళ్ల ప్రక్కన సెంటు కేవలం 2,49,999/- కొద్ది ప్లాట్స్, స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ 84989 73586

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గజం11,999/- బందర్‌రోడ్‌లో 80ఎకరాల గేటెడ్ కమ్యూనిటీ స్పోర్ట్స్, స్విమ్మింగ్ పూల్, హౌసింగ్ 46L గవర్నమెంట్ ఆఫీసులకు దగ్గరల్లో ✆ 99495 05050

JOBS

ప్రైవేట్ ప్రీమియం సెలబ్రేషన్ కంపెనీలో సర్వీస్ సపోర్ట్ అసోసియేట్స్ కావలెను. వయస్సు: 20-28. ఇంటర్, పైచదువు పూర్తిచేసిన వారు అప్లై చేయవచ్చు. ఈవెంట్ సెటప్; క్లయింట్ హ్యాండ్లింగ్, టీమ్‌తో సమన్వయం చేయగలగాలి. మాసిక వేతనం ₹12000+ పనితీరు ఆధారిత బోనస్, గ్రోత్. ✆: 97050 54262.

విజయవాడ సిటీ, తాడేపల్లి ఏరియాలో సెక్యూరిటీ ఫీల్డ్ ఆఫీసర్స్. జీతం: 35,000/- PF & ESI ✆ 79933 22229

ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్‌లో 3సం॥ అనుభవంతో టెలీకాలర్ & కంప్యూటర్ ఆపరేటర్ (M) హిందీ, ఇంగ్లీష్ వచ్చి ఆటోనగర్ ఏరియా వారు కావలెను. టైం: 9.30AM-7.30PM. ✆ 94914 81499.

మ్యారేజి సంస్థలో పని చేయుటకు కంప్యూటర్ నాలెడ్జ్ గల ఇన్‌ఛార్జ్ (F). జీ: 20K, రిసెప్షనిస్ట్ (F) జీ: 15K. ఏదైనా డిగ్రీ. VJA-7. ✆ 87905 99799

Teaching Staff for Hotel Management College, Vijayawada FO, HK, Service, Kitchen Department, Salary Depend On Experience. Accommodation Available. ✆ 72888 85598.

Wanted Accountant With Tally Experience for a Reputed firm-Female Preferred. Contact: 98489 12544.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ:18-20K ✆ 96404 68899, 96402 58899

విజయవాడ నందు ఆటోమొబైల్ & ఇండస్ట్రియల్ -సేల్స్ నందు పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్-1 శాలరీ 18,000/- వ. 18-30సం॥లు, వేర్‌హౌస్ నందు పనిచేయుటకు హెల్పింగ్ బాయ్స్-3 శాలరీ 14,000/- వ.18-30సం॥గల పురుషులు కావలెను. ఆదివారం శెలవు. ✆ 91602 22389

SSS కంపెనీలో పనిచేయుటకు లేడీస్ & జెంట్స్ కావలెను. మంచి జీతం మరియు అలవెన్సు. టెన్త్ క్లాస్ & above, VJA. ✆ 93985 53721.

B.Sc కెమిస్ట్రీ B.Com, ITI అర్హత గల స్టాఫ్ (M/F) కావలెను. వయస్సు:25, విజయవాడ లోకల్స్ మాత్రమే. Resume What's app ✆63033 76816.

VJA, బందరురోడ్డులో ప్రముఖ 3స్టార్‌హోటల్‌లో పనిచేయుటకు అనుభవం ఉన్న ★ ఫ్రంట్‌ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ ★ కిచెన్ సూపర్‌వైజర్స్ ★ కంప్యూటర్ బిల్లింగ్ ★ రెస్టారెంట్ వెయిటర్స్ ★ బెల్ బాయ్‌లో కావలెను. ✆ 99515 19777

Govt ఆఫీసులలో అవుట్‌సోర్సింగ్ బేసిస్‌పై డేటాఎంట్రీ కం.ఆపరేటర్, అకౌంటెంట్ కావలెను. జీ: 22,000/- to 30,000/- PF, ESI. ✆ 95058 38531

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఆయుష్ వైద్యశాలకు స్థల పరిశీలన

అధికారులతో చర్చిస్తున్న ఆయుష్ జిల్లా వైద్యాధికారి రత్నప్రియదర్శిని

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామలో 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ వైద్యశాల ఏర్పాటుకు ఆయుష్ శాఖ జిల్లా వైద్యాధికారి రత్నప్రియదర్శిని స్థలాన్ని పరిశీలించారు. స్థానిక టిడ్కో గృహాల ప్రాంగణం వద్ద వైద్యశాలకు 3.08 ఎకరాలు కేటాయించారు. కేంద్ర ప్రభుత్వం నందిగామకు వైద్యశాల మంజూరు చేసిన నేపథ్యంలో బుధవారం ఆయుష్ పూర్వ వైద్యాధికారి కపా జానప్రసాద్‌తో కలిసి వైద్యశాల భవన నిర్మాణానికి స్థలాన్ని ఆమె పరిశీలించారు. స్థలంలో పిచ్చిమొక్కలు, కంప చెట్లు ఉండడంతో శుభ్రం చేయించాలని కోరారు. త్వరలో శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మున్సిపల్ వైస్‌ఛైర్మన్ మండవ కృష్ణకుమారి, మున్సిపల్ కమిషనర్ లోవరాజు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు వాసిరెడ్డి ప్రసాద్, ఏఈ ఎం.శ్రీనివాసరావు, డీసీ ఛైర్మన్ రాటకొండ చంద్రశేఖర్‌రావు, దారి కార్పొరేషన్ డైరెక్టర్ మనబోతు శ్రీరామ్, తెదేపా పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు దారెల్లి బుజ్జి, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందన: ◆ తిరువూరు పట్టణం 2వ వార్డులోని డ్రెయిన్లలో చెత్త పేరుకుందని స్థానికుడు జయరామ్ సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన శానిటరీ అధికారి విజయ్ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి చెత్తను తీయించి బ్లీచింగ్ చల్లించారు.

◆ తిరువూరు పట్టణం 6వ వార్డులోని డ్రెయిన్లు వ్యర్థాలతో నిండి మురుగు పారడం లేదని స్థానికుడు మోహన్‌రావు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి విజయ్ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి పూడిక తీయించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు**

హైదరాబాద్‌కు ఇంద్ర ఏసీ బస్సు సౌకర్యం

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు ఆర్టీసీ డిపో నుంచి హైదరాబాద్(ఎంజీబీఎస్)కు నూతన ఇంద్ర ఏసీ బస్సును బుధవారం రాత్రి నుంచి నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ బస్సు ప్రతి రోజు రాత్రి 8.45 గంటలకు బయలుదేరి ఉదయం 5 గంటలకు హైదరాబాద్‌కు చేరుకుంటుందని చెప్పారు.

వికాస్ విద్యార్థికి అభినందన

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్థానిక వికాస్ కళాశాలలో చదువుతున్న గుంజి ముత్యయ్య అనే విద్యార్థి జేఈఈ మెయిన్స్‌లో 87.34 పర్సంటైల్ సాధించి ప్రతిభ చాటినట్లు కళాశాల ప్రిన్సిపల్ డి.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. మండలంలోని ఓబులాపురం గ్రామానికి చెందిన ముత్యయ్య పేద కుటుంబంలో జన్మించినప్పటికీ జాతీయ స్థాయి సాంకేతిక విద్యా సంస్థల్లో సీటు సాధించాలనే లక్ష్యంతో పగలు కళాశాలలో తరగతులకు హాజరు అవుతూ రాత్రి సమయంలో ఆన్‌లైన్‌లో వేదాంత యాప్ ద్వారా క్లాసులకు హాజరై కష్టపడి చదవడం ద్వారానే ఈ ఫలితాన్ని సాధించినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని వికాస్ విద్యాసంస్థల అధినేత ఎన్.నర్సిరెడ్డి, పలువురు అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

అతివల ఇంట.. అక్షర వెలుగులు

'ఉల్లాస్'తో పెరిగిన అక్షరాస్యత

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే

ఒకప్పుడు వయోజన విద్య.. ఇప్పుడు అక్షర ఆంధ్ర(ఉల్లాస్).. రెండింటి లక్ష్యం సమాజంలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే. కూటమి ప్రభుత్వం 2025 జనవరి నుంచి ఈ కార్యక్రమాన్ని అమలు చేసింది. ముందుగా స్వయం సహాయక సంఘాల్లో నిరక్షరాస్యులైన మహిళలను గుర్తించారు. దశల వారీగా వారిని అక్షరాస్యులుగా మార్చే కార్యాచరణ రూపొందించారు. తిరువూరు నియోజకవర్గంలో 172 గ్రామైక్య సంఘాల పరిధిలో 75 వేల మంది ఎస్‌హెచ్‌జీ మహిళలున్నారు. వీరిలో 15,151 మంది నిరక్షరాస్యులుగా గుర్తించారు. 2025లో తొలి విడతగా 1720 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దారు. 2026లో అంతే సంఖ్యలో ఎంపిక చేసి చదువు నేర్పుతున్నారు. ఇది కూడా వంద రోజుల కార్యక్రమం. మార్చి నెలాఖరుకు రాయడం, చదవడం నేర్పిస్తారు.

గంపలగూడెం మండలంలో చదువుకుంటున్న మహిళలు

మండలం	వీవోలు	నిరక్షరాస్యులు	వాలంటీర్లు
గంపలగూడెం	44	5,035	501
తిరువూరు	37	3,142	330
ఎ.కొండూరు	40	3,509	374
విస్సన్నపేట	51	3,465	350

పది మందికి ఒక వాలంటీర్

తిరువూరు, విస్సన్నపేట, ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లో ప్రతి పది మంది మహిళలకు స్వచ్ఛందంగా విద్యా బోధన చేసేందుకు ఒక కార్యకర్తను ఎంపిక చేశారు. నియమితులైన వాలంటీర్లకు శిక్షణ ఇచ్చి బోధనకు అవసరమైన పుస్తకాలు అందజేశారు. మూడు నెలలు పాటు రోజూ సాయంత్రం రెండు గంటలు వాలంటీర్ విద్యా బోధన చేయాల్సి ఉంది. మహిళల్లో సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యంగా పథకం అమలవుతోంది.

ఇందులో నేర్చుకునే అంశాలు

చదవడం, రాయడం, చరవాణి వినియోగంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తారు. పరిసరాల శుభ్రత, ఆరోగ్యం, ఆహారం, ఇరుగు పొరుగు, ఆధార వ్యవహారాలు, పిల్లల పెంపకం తదితర వాటిని వివరిస్తారు. సొంత వ్యాపార నిర్వహణ తీరు, చట్టాలను తెలియజేస్తారు. డిజిటల్ నగదు ఉపయోగం, గడియారంలో సమయం చూడడం, సంక్షిప్త సందేశాలు పంపడం, ఈ-మెయిల్, సామాజిక మాధ్యమాలు వాడకం, బ్యాంకు లావాదేవీలు, యూపీఐ చెల్లింపు వంటి వాటిపై టీపీఎస్ సంస్థ సాంకేతిక సాయం అందించనుంది.

అందరూ విద్యావంతులు కావాలి

ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావడమే ఉల్లాస్ లక్ష్యం. గ్రామంలో నిరక్షరాస్యులైన ప్రతి పది మంది మహిళలకు ఒక టీచర్‌ను(వాలంటీర్) నియమించాం. 2025 జనవరిలో ఈ కార్యక్రమం ప్రారంభించగా దశల వారీగా అమలు చేస్తున్నాం. ఎస్‌హెచ్‌జీల్లో చదువుకున్న వారిని విద్యా వాలంటీర్‌గా ఎంపిక చేసి శిక్షణ ఇచ్చాం. **- ఎన్.గురవయ్య, వెలుగు ఏపీఎం, గంపలగూడెం మండలం**

లెదర్ పార్కు ఏర్పాటుతో ప్రజలకు ఉపాధి

ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

గంపలగూడెం, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు తిరువూరు నియోజకవర్గంలో తోళ్ల పరిశ్రమ(లెదర్ పార్కు) ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కోరారు. శాసనసభ సమావేశంలో ఆయన బుధవారం మాట్లాడారు. భూసేకరణ పూర్తయితే లెదర్ పార్కు ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని చెప్పారు. అదే విధంగా తిరువూరు మండలం రామన్నపాలెంలో జమీందారీ వ్యవస్థ రద్దు కావడంతో వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న వేలాది ఎకరాల భూమిని సర్వే చేసి పేదలకు నివాస స్థలాలుగా కేటాయించాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో నివాస గృహాల స్థలాలను 22ఎలో కలిపారని, ఆ సమస్యకు విముక్తి కల్పించి పేదలకు మేలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

తెదేపా కార్యకర్తలకు అండగా లోకేశ్

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న మైలవరం శాసన సభ్యుడు వసంత కృష్ణప్రసాద్, నాయకులు

గొల్లపూడి, న్యూస్‌టుడే : తెదేపా కార్యకర్తలకు అండగా మంత్రి లోకేశ్ ఉంటారని మైలవరం శాసన సభ్యుడు వసంత కృష్ణప్రసాద్ తెలిపారు. మై టీడీపీ యాప్‌కు సంబంధించిన గోడప్రతుల ఆవిష్కరణ కార్యక్రమం గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మంత్రి నారా లోకేశ్ ఆలోచనకు అనుగుణంగా ప్రతి తెదేపా కార్యకర్తకు ఉపయోగపడేలా ఈ యాప్‌ను రూపొందించినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వ పథకాలు, పనులకు సంబంధించిన వివరాలు ఇందులో తెలుస్తాయని చెప్పారు. రాష్ట్ర స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. పార్టీ, ప్రభుత్వానికి సంబంధించిన పూర్తి వివరాలు ఈ యాప్‌లో ఉంటాయని పేర్కొన్నారు. పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన రవాణా సేవలే లక్ష్యం

రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు- రాజవరం ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి.శ్రీనివాసరావు బుధవారం శంకుస్థాపన చేశారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ఈ పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి బీసీ.జనార్దన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని నెమలిలో విద్యుత్తు ఉప కేంద్రం నిర్మాణానికి ఎమ్మెల్యే శ్రీనివాసరావు భూమిపూజ చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసే 33/11 కేవీ విద్యుత్తు ఉప కేంద్రంతో నెమలి, ఉమ్మడి దేవరపల్లి, కొణిజెర్ల గ్రామాల ప్రజలకు విద్యుత్తు సరఫరా మెరుగు పరిచేందుకు ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. డిస్కం ఈఈ ఎ.సత్యనారాయణ, డీఈఈ పి.రామకృష్ణ, ఏఈ సీహెచ్.శ్రీనివాసరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంగ్ల భాషా దినోత్సవం

జి.కొండూరు, న్యూస్‌టుడే : షేక్‌స్పియర్ విలియం జయంతిని పురస్కరించుకుని బుధవారం చెవుటూరు ప్రాథమిక పాఠశాలలో ఆంగ్ల భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయులు వాసు, కిరణ్, నాగరాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. చెవుటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు.

షేక్ స్పియర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చిన్నారులు, ఉపాధ్యాయులు

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన తప్పదు

జి.కొండూరులో నిరసన తెలుపుతున్న సహకార సంఘాల ఉద్యోగులు

జి.కొండూరు, న్యూస్‌టుడే : దీర్ఘకాలికంగా పరిష్కారం కాని తమ న్యాయమైన డిమాండ్లకు సత్వరమే న్యాయం చేయాలని కేడీసీసీబీ ఉద్యోగ సంఘాలు కోరాయి. స్థానిక కేడీసీసీ బ్యాంకు ఆవరణలో మైలవరం నియోజకవర్గం పరిధిలోని 24 సహకార సంఘాల ఉద్యోగులు బుధవారం నిరసన తెలిపారు. జీవో నం.36 అమలు, 2019 తర్వాత విధుల్లో చేరిన వారిని రెగ్యులర్ చేయడం, 2014, 2019 వేతన సవరణ చట్టం తమకు వర్తింపజేయాలన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే సంఘాల్లో సేవలు నిలిపివేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ నాయకులు బొల్లినేని రఘురాం, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గూడూరు గోపిరెడ్డి, జి.కొండూరు బ్రాంచి ఆర్గనైజర్ సీహెచ్ కిషోర్ బాబు, మైలవరం, ఇబ్రహీంపట్నం ఆర్గనైజర్లు సాంబశివరావు, సతీష్ పాల్గొన్నారు.

రోడ్డా.. డంపింగ్ యార్డా?

మండల పరిధిలోని కంభంపాడులో కొందరు రోడ్డు పక్కన చెత్త వేసి డంపింగ్ యార్డులా మారుస్తున్నారు. దీంతో అక్కడకు కోతులు, పందులు, శునకాలు చేరుతున్నాయి. అటుగా వెళ్లే పాదచారులు, ద్విచక్ర వాహనదారులపై దాడులు చేస్తున్నాయి. ఆ సమయంలో పలువురు భయాందోళనకు గురై ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్కడ చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఎ.కొండూరు**

రంగాపురం కేజీబీవీలో 687 కిలోల బియ్యం స్వాధీనం

బస్తాలు పరిశీలిస్తున్న సుశీలాదేవి, శివనాగరాజు, రమేష్‌బాబు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : రంగాపురం కస్తూర్బా గాంధీ విద్యాలయం(కేజీబీవీ)లో అధికారులు బుధవారం రాత్రి తనిఖీ చేసి అధికంగా ఉన్న 687 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాల మేరకు విస్సన్నపేట పీడీఎస్ డీటీ శివనాగరాజు, ఎంఈవో పి.రమేష్ బాబులతో కలిసి కేజీబీవీలో నిల్వ చేసిన బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, స్థానిక రేషన్ డీలర్ కోటేశ్వరరావుకు అప్పగించినట్లు తహసీల్దార్ జె.సుశీలాదేవి తెలిపారు. కేజీబీవీ ఎస్వో శ్యామలపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఇటీవల ఏ.కొండూరు మండలం కేజీబీవీ ఘటనలో ఆమెను విధుల నుంచి తప్పించారు. పిల్లలకు పెట్టాల్సిన బియ్యం పక్కదారి పట్టించేందుకు ఒక గదిలో నిల్వ చేసి ఉంచినట్లు తెలుస్తోంది.

నివేదిక తప్పుల తడక.. ఆదాయం లేక..

కొండపల్లి, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే

నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలతో సమీపంలోని నివాసితులు ఇబ్బందులు పడుతుంటే ఆదాయం రాక పురపాలిక మీనమేషాలు లెక్కిస్తోంది. మేజర్ పంచాయతీలుగా ఉన్న కొండపల్లి, ఇబ్రహీంపట్నంలు అయిదేళ్ల కిందట కొండపల్లి పురపాలిక సంఘంగా మారింది. ఆ సమయంలో ఆయా ప్రాంతాలకు పన్నుల రూపంలో వచ్చే ఆదాయ వివరాలను అధికారులు పురపాలిక శాఖకు సమర్పించాల్సి ఉంది. అయితే అప్పటి అధికారుల నిర్లక్ష్యంతో పాటు సిబ్బంది కొరతగా ఉండటంతో పురపాలిక పరిధిలోని పన్నుల ఆదాయ నివేదికను తప్పుల తడకగా శాఖకు ఇచ్చారు. దీంతో పురపాలికలోని ఖాళీ స్థలాల వివరాలు అసంపూర్తిగానే నమోదయ్యాయి. వెంచర్ల రూపంలో ఉన్నవి, సాధారణంగా ఉన్న స్థలాలకు సంబంధించిన ఆదాయం పురపాలికకు చేరుకోవడం లేదు. ఇదిలా ఉంటే ఈ ఖాళీ స్థలాలతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. వాటిల్లో జమ్ము, ముళ్ల కంపలు, మురుగు నీరు చేరి అపరిశుభ్రతకు వేదికగా మారాయి. వీటి వల్ల దోమలు విపరీతమై కాలాలతో సంబంధం లేకుండా ఆయా ప్రాంతాల వారి రక్తాన్ని పీల్చుకు తాగేస్తున్నాయి. అంతే కాకుండా ఆయా ప్రాంతాల్లో విష సర్పాల భయం అందరిని వేధిస్తోంది.

ఫెర్రీ ప్రాంతంలో నివాసాల మధ్య ఖాళీ స్థలం

హద్దులు ఏర్పాటు చేసుకొని..

పదేళ్లలో ఇబ్రహీంపట్నం, కొండపల్లి శివారు ప్రాంతాలు విపరీతంగా విస్తరించాయి. ఎక్కడికక్కడ నిర్మాణాలు పెరిగిపోయాయి. కొందరు కొండ ప్రాంతాలను ఆక్రమించుకొని ప్లాట్లు వేసి విక్రయించారు. గతంలో ఎందుకూ పనికి రాని స్థలాలు, డాక్యుమెంట్లు లేని స్థలాలు సైతం నేడు రూ.లక్షలు పలుకుతున్నాయి. అదే సమయంలో విజయవాడ తదితర ప్రాంతాల్లో ఉన్న సంపన్నులు స్థలాలు కొనుగోలు చేసి వాటికి హద్దులు ఏర్పాటు చేసుకొని వదిలేశారు. ఈ క్రమంలోనే ఫెర్రీకి వెళ్లే ప్రాంతంలో అనేక కాలనీలు వెలిశాయి. వందల సంఖ్యలో ఖాళీ ప్లాట్లు, వాటి పక్కనే అపార్టుమెంట్లు నిర్మాణమయ్యాయి. దీంతో ఖాళీ స్థలాల పారిశుద్ధ్య సమస్య కూడా అధికంగా ఇక్కడే మొదలైంది.

పారిశుద్ధ్యం నిర్వహిస్తున్నాం

కొండపల్లి పురపాలిక పరిధిలో అనేక ఖాళీ స్థలాలు ఉన్నాయి. కొన్నింటికి పన్నులు వసూలు చేస్తూనే ఉన్నాం. మరి కొన్నింటిని గుర్తించి పత్రాలు ఉన్న స్థలాలకు పన్నులు విధిస్తున్నాం. ఖాళీ స్థలాల యాజమానుల వివరాలు లేని వాటి సంఖ్య ఇప్పటికే గుర్తించాం. త్వరలో వాటిపై కూడా చర్యలు తీసుకుంటాం. దీంతో పాటు ఖాళీ స్థలాల ప్రాంతాల్లో అవసరం మేరకు పారిశుద్ధ్యం నిర్వహిస్తూనే ఉన్నాం. **- వెంకటరత్నం, మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్, కొండపల్లి**

యువత మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దు

ప్రమాణం చేస్తున్న మహిళా పోలీసులు, డీసీపీ లక్ష్మీనారాయణ, అధికారులు

గంపలగూడెం, న్యూస్‌టుడే : యువతపై మాదక ద్రవ్యాల ప్రభావం అధికంగా ఉందని, మత్తు పదార్థాలకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని విజయవాడ గ్రామీణ డీసీపీ లక్ష్మీనారాయణ సూచించారు. వీటిని తీసుకుంటే ఆ దుష్ప్రభావం ఆ వ్యక్తి కుటుంబం, సమాజంపై ఉంటుందన్నారు. 'డ్రగ్స్‌పై దండయాత్ర'లో భాగంగా మహిళా పోలీసులు నిర్వహిస్తున్న సైకిల్ యాత్ర బుధవారం గంపలగూడెంలో ప్రారంభం కాగా తోటమూల వరకు 'మత్తు పదార్థాలు వద్దు.. బంగారు భవిష్యత్తు ముద్దు' నినాదంతో ప్రదర్శన చేశారు. అనంతరం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన అవగాహన సదస్సులో డీసీపీ లక్ష్మీనారాయణ మాట్లాడారు. సైకిల్ యాత్ర నిర్వహిస్తున్న మహిళా పోలీసులతో కలిసి మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రమాణం చేశారు. స్థానిక పోలీసు అధికారులు పాల్గొన్నారు.

వంద రోజుల ప్రణాళికతో మెరుగైన ఫలితాలు

మైలవరం : విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

మైలవరం, న్యూస్‌టుడే : పది విద్యార్థులకు నిర్దేశించిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళికకు అనుగుణంగా సిలబస్‌ను పూర్తి చేసేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ సూచించారు. స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆమె బుధవారం సందర్శించారు. పది విద్యార్థులతో మాట్లాడి వారికి పలు సూచనలు చేశారు. ఎంఈవో బి.రాజు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే : వెలగలేరు గ్రామంలోని చనుమోలు ఫకీర్రాయుడు జడ్పీ ఉన్నత పాఠశాలను డీఈవో చంద్రకళ బుధవారం సందర్శించారు. పదో తరగతిలో షైనింగ్ స్టార్లు, రైజింగ్ స్టార్లుగా గుర్తించిన విద్యార్థుల వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చెగిరెడ్డిపాడు ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. వెలగలేరు హెచ్‌ఎం కె.పద్మ, చెగిరెడ్డిపాడు హెచ్‌ఎం పి.విజయ్ పాల్గొన్నారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండల పరిధిలోని రంగాపురం కేజీబీవీ, డాక్టర్.బీఆర్.అంబేడ్కర్ బాలికల గురుకులం, రెడ్డిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలను డీఈవో చంద్రకళ బుధవారం తనిఖీ చేశారు. పది విద్యార్థులకు వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. ఎంఈవో పి.రమేష్ బాబు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘానికి వితరణ

కార్యక్రమంలో నాగ సుబ్రహ్మణ్యం కుమార్తెలు, కుటుంబ సభ్యులు

విస్సన్నపేట : మండల పరిధి నరసాపురానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, ఆర్యవైశ్య నాయకుడు గంధం వెంకట నాగ సుబ్రహ్మణ్యం (దత్తుడు) ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు బుధవారం ఆయన దశదినకర్మ నేపథ్యంలో నలుగురు కుమార్తెలు, అల్లుళ్లు కలిసి మృతుడి జ్ఞాపకార్థంగా విస్సన్నపేట ఆర్యవైశ్య సంఘం వారికి ఫ్రీజర్ బాక్సును వితరణ చేశారు. అలాగే నరసాపురం స్వర్ణ గ్రామ పంచాయతీకి వాటర్ కూలర్‌ను ఇచ్చారు.

తెదేపా నాయకుడి మృతి పార్టీకి తీరని లోటు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని పాతనాగులూరుకు చెందిన మాజీ ఉప సర్పంచి, తెదేపా నాయకుడు బల్లి డేవిడ్ రాజు(50) మృతి పార్టీకి తీరని లోటు అని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కె.విజయబాబు అన్నారు. డేవిడ్ రాజు అయిదు రోజులుగా గుంటూరులోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఈ మేరకు పలువురు తెదేపా నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

నేటి నుంచి రంజాన్ దీక్షలు ప్రారంభం

గంపలగూడెం, న్యూస్‌టుడే : పవిత్ర రంజాన్ మాసం గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో మండలంలోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు ముస్లింలు ఏర్పాటు పూర్తి చేశారు.

కొండపల్లి, న్యూస్‌టుడే : కొండపల్లి పురపాలిక, ఇబ్రహీంపట్నం మండలంలోని మసీదుల్లో నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేయాలని మత పెద్దలు ప్రకటించారు.

విద్యుత్తు వెలుగుల్లో ఊటుకూరులోని మసీద్

భక్తిశ్రద్ధలతో తపస్సుకాల ప్రార్థనలు

విభూదితో అభ్యంగనం చేస్తున్న ఫాదర్ అనిల్

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక ఆర్సీఎం దేవాలయంలో తపస్సుకాల ఉపవాస ప్రార్థనలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ అనిల్ ఆధ్వర్యంలో విభూదితో అభ్యంగనం, దీక్షలు ఇచ్చారు. కార్యక్రమంలో లిటిల్ ఫ్లవర్ సిస్టర్స్, ఉపదేశకులు, 16 సంఘాల విశ్వాసులు పాల్గొన్నారు.

కొండపల్లి, న్యూస్‌టుడే : కొండపల్లి, గుంటుపల్లి, ఇబ్రహీంపట్నంలోని చర్చిల్లో ఫాదర్లు 40 రోజుల ఉపవాస ప్రార్థనలను బుధవారం ప్రారంభించారు. మాలాధారణ చేసిన భక్తులు నిష్ఠతో వాటిని పూర్తి చేయాలని ఫాదర్లు సూచించారు.

హుండీ ఆదాయం లెక్కింపు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : కొండపర్వలోని శ్రీభ్రమరాంబిక మల్లేశ్వర స్వామి వారి కల్యాణ ఉత్సవాలు, గట్టు తిరునాళ్ల సందర్భంగా భక్తులు ఆలయ హుండీలో వేసిన కానుకలను ఉత్సవ కమిటీ సభ్యులు, సిబ్బంది బుధవారం లెక్కించారు. మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా హుండీ ఆదాయం రూ. 4,00,000 వచ్చినట్లు ఉత్సవ కమిటీ ఛైర్మన్ మట్టా వేణుగోపాలరావు, ట్రస్ట్ సభ్యులు బుక్కి వెంకట రామలక్ష్మి నరసింహారావు, సర్పంచి రమేష్ తెలిపారు. వైస్ ఎంపీపీ గాజుల శ్రీనివాసరావు, అక్కిరెడ్డి ఉమా మహేశ్వరరావు, సామాజిక కార్యకర్త శివ పాల్గొన్నారు.

21న తిరుపతమ్మ తిరునాళ్లపై సమీక్షా సమావేశం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: తిరుపతమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాల నిర్వహణపై అన్ని శాఖల అధికారులతో ఈ నెల 21న ఆర్డీవో కె.బాలకృష్ణ సమీక్షా సమావేశం నిర్వహించనున్నారని ఈవో మహేశ్వరరెడ్డి తెలిపారు. మార్చి 4 నుంచి 8వ తేదీ వరకు తిరునాళ్లు జరగనున్నాయి. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రభుత్వ శాఖల నుంచి చేయాల్సిన పనులపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు. ఆలయం సత్రాలు వద్ద మధ్యాహ్నం మూడు గంటలకు జరిగే సమావేశానికి అధికారులంతా హాజరుకావాలని కోరారు.

మినీ గోకులం షెడ్లతో పాల ఉత్పత్తిదారులకు మేలు

రిబ్బను కత్తిరిస్తున్న తెదేపా నాయకులు, అధికారులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మినీ గోకులం షెడ్లతో పాల ఉత్పత్తిదారులకు మేలు జరుగుతుందని తెదేపా నాయకుడు ఎం.నాగేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం అన్నేరావుపేట పంచాయతీ పరిధిలోని సీతారాంపురంలో మినీ గోకులం షెడ్డును అధికారులు, ఆ పార్టీ నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో ప్రభాకరరావు, బి.రమేష్, సీహెచ్.చందా, ఎం.పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే : కర్లపాటి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తహీనతలో బాధపడుతున్న చిన్నారులు, నిరుపేదలకు రూ.10 వేలు విలువైన పౌష్టికాహారాన్ని ట్రస్ట్ వ్యవస్థాపకులు వెంకటశ్రీనివాసరావు అందించారు. ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పీ-4 కార్యక్రమంలో భాగంగా సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

క్షణికావేశంలో వివాహిత బలవన్మరణం

కొండపల్లి: క్షణికావేశంలో వివాహిత బలవన్మరణం చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన మనస్మోహపత్ర, బెబినా మొహబత్రా దంపతులు కొండపల్లి పారిశ్రామిక వాడలో పనులు చేసుకుంటూ పుట్టలమ్మ గట్టు ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో సోమవారం భార్యాభర్తలకు చిన్నపాటి వివాదం జరిగింది. అనంతరం మనస్మోహపత్ర ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాత్రికి ఇంటికి వచ్చే సమయానికి బెబినా మొహబత్రా ఇంట్లోని ఫ్యానుకు ఉరేసుకొని ఉంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులతో వైకాపా కార్యకర్తల వాగ్వాదం

గొల్లపూడి, న్యూస్‌టుడే : గొల్లపూడిలో పోలీసు సిబ్బంది, వైకాపా కార్యకర్తలకు మధ్య బుధవారం మధ్యాహ్నం వాగ్వాదం చోటు చేసుకుంది. గొల్లపూడిలోని ఎమ్మెల్సీ తలశిల రఘురాం నివాసానికి మాజీ సీఎం జగన్ వస్తున్న నేపథ్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఆ సమయంలో మార్గంలోని వైకాపా కార్యకర్తలను లోపలకు వెళ్లాలంటూ పోలీసు కానిస్టేబుల్ ఒకరు సూచించారు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. వెంటనే మాజీ మంత్రి పేర్ని నాని అక్కడకు వచ్చి సర్ది చెప్పగా వివాదం సద్దుమణిగింది.

తిరువూరు సంత మార్కెట్‌లో అగ్నిప్రమాదం

కాలిపోతున్న హోటల్

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు సంత మార్కెట్‌లో బుధవారం ఉదయం చోటు చేసుకున్న అగ్నిప్రమాదంలో తాటాకు హోటల్ పూర్తి కాలిపోయింది. వంట గ్యాస్ పైపు లీకై హోటల్ నిర్వాహకురాలు నెక్కడపు.విజయకు చెందిన తాటాకు హోటల్‌లో మంటలు చెలరేగాయి. వెంటనే సంత నిర్వాహకులు పామర్తి.చంటి, కృష్ణా రెడ్డి అప్రమత్తమై అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారి రాంబాబు తమ సిబ్బందితో వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు, ప్రాణ నష్టం జరగక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. హోటల్లోని సామగ్రి, కొంత నగదు పూర్తిగా కాలిపోయినట్లు విజయ వాపోయారు.

శ్రద్ధాంజలి

శ్రీ గద్దె సాంబశివరావు గారు AAE(Retd.)/APGENCO

శ్రీ గద్దె సాంబశివరావు గారు ది.08-02-2026 ఆదివారం నాడు స్వర్గస్థులైనారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ...

ది రిటైర్డ్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్, విజయవాడ-10.

(c) eenadu

విజయవాడ తూర్పు

'త్వరలో నగరానికి వైకాపా పీడ వదులుతుంది'

పటమట, న్యూస్‌టుడే: ఐదేళ్లుగా నగర అభివృద్ధిని అడ్డుకుంటున్న నగరపాలక సంస్థ పాలకవర్గం (వైకాపా) పదవీ కాలం త్వరలో ముగుస్తుందని, నగరానికి పట్టిన పీడ వదులుతుందని ఎంపీ శివనాథ్ అన్నారు. గురునానక్ కాలనీలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. నగర అభివృద్ధికి సంబంధించి తాము చేసిన ఎన్నో ప్రతిపాదనలను కౌన్సిల్‌లో వైకాపా సభ్యులు అడ్డుకున్నారని ఆరోపించారు. ప్రజలకు ఉపయోగపడే పనులు రాజకీయ కారణాలతో నిలిచిపోవడం బాధాకరమని అన్నారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.600 కోట్ల నిధులు కేటాయిస్తే. . ఆ ప్రతిపాదనను కూడా వైకాపా కౌన్సిల్ తిప్పికొట్టిందని అన్నారు. రాబోయే కొత్త కౌన్సిల్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నగరాన్ని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

బలహీన వర్గాల అభ్యున్నతికి వెంకయ్య కృషి

విద్యాధరపురం, న్యూస్‌టుడే: బలహీన వర్గాల అభ్యున్నతికి మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య కృషి చేశారని కళాభారతి సంస్థ అధ్యక్షుడు శింగంశెట్టి చంద్రశేఖర్ తెలిపారు. గాంధీనగర్‌లోని కౌతా కళావేదికలో కళా, సాహితీ సంస్థల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఐలాపురం వెంకయ్య సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. తెలుగు కళావాహిని సంస్థ అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, సావిత్రి కళాపీఠం అధ్యక్షురాలు పరుచూరి విజయలక్ష్మి, అంబేడ్కర్ సాంస్కృతిక సమితి అధ్యక్షుడు డేవిడ్‌రాజు, ఎక్స్‌రే సంస్థ కార్యదర్శి ఆంజనేయ రాజు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్లున్నా... ప్రయోజలమేదీ?

విద్యార్థులకు బోరు నీరే గతి

విజయవాడ సిటీ, పటమట, కరెన్సీనగర్ న్యూస్‌టుడే

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శుద్ధి చేసిన జలం అందడం లేదు. గత ప్రభుత్వ హయాంలో 'నాడు-నాడు' కింద ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ల నిర్వహణకు నిధులు కేటాయించలేదు. ఫలితంగా అవి కొన్ని చోట్ల పని చేయడం లేదు. మరికొన్నింటిని అసలు బిగించలేదు. రూ.లక్షలు వెచ్చించినా విద్యార్థులకు చుక్క ప్రయోజనం లేకుండాపోయింది. చేసేది లేక పిల్లలు బోరు నీటినే తాగుతున్నారు.

పెరుగుతున్న ఎండ తీవ్రత

● నియోజకవర్గంలో ప్రాథమిక పాఠశాలలు 16, ఉన్నత పాఠశాలలు 6, హైస్కూల్ ప్లస్ ఒకటి ఉన్నాయి. 'నాడు-నేడు' కింద ఆరు పాఠశాలలకు మినహాయించి మిగిలిన బడులకు ఆర్వో ప్లాంట్లు మంజూరు చేశారు. ● రెండు పాఠశాలల్లో యంత్రాలు మొరాయించాయి. రెండు చోట్ల ఇంకా బిగించ లేదు. వేసవి నేపథ్యంలో ప్రస్తుతం ఎండ తీవ్రత పెరుగుతోంది. దాహం వేస్తున్నందున విద్యార్థులకు తాగునీటి అవసరం పెరుగుతోంది. వాటిని వినియోగంలోకి తేవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు విద్యాశాఖ అధికారులను కోరుతున్నారు.

రేగుల అనూరాధ ప్రాథమిక పాఠశాలలో అలంకారంగా యంత్రం

కొన్ని చోట్ల పరిస్థితి ఇదీ..

● మాచవరం టీఎంఆర్‌సీ ఉన్నత పాఠశాలలో సుమారు 600 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఐదికి ఇక్కడ జల యంత్రం మంజూరైంది. పాఠశాలకు వెళ్లే మార్గం ఇరుకు కావడంతో యంత్రం తీసుకెళ్లడం కష్టమైంది. చేసేది లేక దానిని గుణదల దాసరి గిరిధర్ అవంతి ప్రాథమిక పాఠశాలలో ఉంచారు. ఫలితంగా టీఎంఆర్‌సీలో చదివే విద్యార్థులకు మూడేళ్ల నుంచి శుద్ధి జలం అందడం లేదు. బోరు నీటినే తాగుతున్నారు. ● పటమట దర్శిపేట ప్రాథమిక పాఠశాలలో 90 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ యంత్రం వినియోగంలో లేదు. బోరు నీరే గతి. ● ఏపీఎస్ కాలనీలోని రేగుల అనూరాధ ప్రాథమిక పాఠశాలలో 250 మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. యంత్రం వచ్చినా.. గుత్తేదారు సిబ్బంది బిగించలేదు. యంత్రం నిరుపయోగంగా ఉంది. విద్యార్థులు పాఠశాలలోని బోరు నీటినే తాగుతున్నారు. ● జేడీ నగర్‌లోని పాత 37వ డివిజన్ ప్రాథమిక పాఠశాలకు ఆర్వో ప్లాంట్ మంజూరైనా.. బిగించలేదు. అలంకారప్రాయంగా మారింది. ఇక్కడ 20 మంది విద్యార్థులు చదువుతున్నారు.

44 సంవత్సరాలుగా ✆ 81252 65651 ✆ 0866 2471617, 2477470
✪ ఆటలు ✪ పాటలు ✪ రోబోటిక్స్ ✪ క్రియేటివ్ లెర్నింగ్ ✪ డ్రోన్ తయారీ ✪ 3డి ప్రింటింగ్ ✪ LKG to 10th
డాన్ బాస్కో స్కూల్
Affiliated to CBSE
గురునానక్ రోడ్, ఆటోనగర్ కాలని ఎదురుగా, విజయవాడ-7.

ముందు జాగ్రత్తతో అగ్ని ప్రమాదాలు దూరం

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ముందు జాగ్రత్తతో అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని నగరపాలక సంస్థ అగ్నిమాపక విభాగం అధికారి మాల్యాద్రి పేర్కొన్నారు. సూర్యారావుపేట, ఎంజీ రోడ్డులోని ఆసుపత్రులను అగ్నిమాపక విభాగం అధికారులు బుధవారం పరిశీలించారు. మాల్యాద్రి మాట్లాడుతూ... మంటలు ఆర్పే పరికరాలను దుకాణాలు, పోరాలు, ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచాలని తెలిపారు. అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. మంటలు ఆర్పే పరికరాలను వినియోగించే తీరును తెలియజేశారు. అగ్నిమాపక విభాగం అధికారి నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులా? అధికారి దృష్టికి తీసుకురండి

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామారావుతో ఫోన్‌ఇన్ రేపు

తూర్పు నియోజకవర్గ పరిధిలో ట్రాఫిక్ ఇబ్బందులు ఉంటే పుట్టున్నాయా? మీ ప్రాంతంలో రోడ్లపై ఆక్రమణలు వాహనాల రాకపోకలకు అడ్డుగా ఉన్నాయా? యూటర్న్‌ల వరంగా సమస్యలున్నాయా? ట్రాఫిక్ సిగ్నల్స్ వెలగడం లేదా? రోడ్లపై భారీ వాహనాలను ఆపి ఇబ్బంది పెడుతున్నారా? ఇలాంటి ఏ ఇతర ఇబ్బందులున్నా.. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామారావుతో మాట్లాడే అవకాశం 'ఈనాడు-ఈటీవీ' కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా కింద ఇచ్చే సెల్ నంబర్‌కు ఫోన్ చేయడమే. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.

91778 36200 | 20.02.26 శుక్రవారం | ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కరెన్సీనగర్ : 80085 74652

❖ 5వ డివిజన్ గుణదల గంగిరెద్దుల దిబ్బ ప్రాంతంలో తాగునీటి పైపు లీకేజీ అవుతోందని స్థానిక నివాసి శివాజీ రావు మేమున్నాం...మీకు తోడుగా ద్వారా డీఈ రామారావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో మరమ్మతులు చేయించారు. ❖ 3వ డివిజన్ గుణదల సెంటర్‌లో దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానిక నివాసి విజయలక్ష్మి మేమున్నాం...మీకు తోడుగా ద్వారా మలేరియా అధికారి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో దోమల మందు చల్లించారు. ❖ 3వ డివిజన్ నాగార్జున నగర్ 9వ రోడ్డు 3-9/133 విద్యుత్తు స్తంభానికి ఉన్న వీధి దీపం వెలగడం లేదని స్థానిక నివాసి సూర్య ప్రకాశరావు మేమున్నాం...మీకు తోడుగా ద్వారా ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు. - న్యూస్‌టుడే, కరెన్సీనగర్

ప్రభుత్వ సహకారంతో నగరాభివృద్ధి: ఎంపీ

పటమట, న్యూస్‌టుడే: రోడ్లపై గుంతలను నిమిషాల్లో పూడ్చే ఇన్‌ఫ్రారెడ్ రోడ్ రిపేరింగ్ మొబైల్ యంత్రాన్ని నగర పాలక సంస్థ అందుబాటులోకి తీసుకొచ్చింది. కేంద్ర ఆర్థిక సంఘం నిధులు రూ.1.48 కోట్లతో కొనుగోలు చేసిన యంత్రాన్ని బుధవారం గురునానక్ కాలనీలో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రారంభించారు. యంత్రం పనితీరును పరిశీలించారు. ఎంపీ మాట్లాడుతూ.. ఎన్‌క్యాప్ (నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం) ద్వారా మంజూరైన యంత్రాన్ని రోడ్ల అభివృద్ధి, కాలుష్య నియంత్రణకు వినియోగించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రోడ్లు, మురుగు, వర్షం నీటి కాలువలను అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. ఈ యంత్రంతో 98 శాతం కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయని చెప్పారు. త్వరలోనే రూ.32 కోట్ల నిధులకు సరిపడా యంత్ర సామగ్రి వీఎంసీకి అందజేయనున్నట్లు ఎన్‌క్యాప్ అధికారులు హామీ ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు. ఎమ్మెల్యే రామ్మోహన్ మాట్లాడుతూ.. గుంత పడిన 15 నిమిషాల్లోనే పూడ్చేలా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్పొరేటర్లు దేవినేని అపర్ణ, చెన్నుపాటి ఉషారాణి, ముమ్మనేని ప్రసాద్, అడిషనల్ కమిషనర్ డి.చంద్రశేఖర్, ఇన్‌ఛార్జి చీఫ్ ఇంజినీర్ పి.సత్యకుమారి, ఎస్ఈ వి.చంద్రశేఖర్, ఈఈ జి.సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

యంత్రం పనితీరు పరిశీలిస్తున్న శివనాథ్, రామ్మోహన్ తదితరులు

డ్రైనేజీ వ్యవస్థ మెరుగుకు చర్యలు

అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: కాలువల్లో పూడిక తొలగించి డ్రైనేజీ వ్యవస్థ మెరుగుకు చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. కొత్త రాజరాజేశ్వరిపేట, మధురానగర్, దేవీనగర్, బీఆర్‌టీఎస్ రోడ్డు, సింగ్‌నగర్ తదితర ప్రాంతాల్లో కమిషనర్ బుధవారం పర్యటించారు. మధురానగర్‌లోని ఆర్‌యూబీ వద్ద పరిశుభ్రత పనులు పరిశీలించారు. అజిత్‌సింగ్‌నగర్ అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. జోనల్ కమిషనర్ ఎ.ప్రభాదాస్, ఈఈ ఎ.శ్రీనివాసరెడ్డి, అధికారులు పాల్గొన్నారు. ❖ పన్ను వసూళ్లపై అధికారులు దృష్టి పెట్టాలని కమిషనర్ పేర్కొన్నారు. విద్యాధరపురంలోని సర్కిల్-1 కార్యాలయంలో బుధవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. పన్ను వసూళ్లలో పురోగతి ఉండాలని, ముఖ్యంగా ఖాళీ స్థలాల పన్ను వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. అదనపు కమిషనర్ జి.సృజన, జోనల్ కమిషనర్ రమ్యకీర్తన తదితరులు పాల్గొన్నారు. ❖ డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన 31 మంది సచివాలయ ఉద్యోగులకు రిలీవ్ ఉత్తర్వులు జారీ చేసినందుకు, మార్చి 4, 5 తేదీల్లో ఉద్యోగుల ఆటల పోటీలకు అనుమతి ఇచ్చినందుకు ఎన్‌జీవో నాయకులు కమిషనర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

మార్టూరు, న్యూస్‌టుడే: పలు చోరీ కేసుల్లో నిందితుడ్ని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. మార్టూరు పోలీస్‌స్టేషన్‌లో బాపట్ల ఇన్‌ఛార్జి డీసీపీ జగదీష్ నాయక్ వివరాలు వెల్లడించారు. యడ్లపాడు మండలం చింతలపాలెంకు చెందిన పాలపర్తి నాగరాజు లారీ డ్రైవర్, క్లీనర్‌గా పనిచేస్తూ వ్యసనాలకు బానిసయ్యాడని తెలిపారు. 2008 నుంచి బైక్‌లు, సెల్‌ఫోన్లు చోరీకి పాల్పడుతున్నట్లు గుర్తించామన్నారు. గతంలోనూ బాపట్ల, యడ్లపాడు, మార్టూరు, విజయవాడ కృష్ణలంక పోలీస్‌స్టేషన్లలో నాగరాజుపై చోరీ కేసులు నమోదయ్యాయన్నారు. 2025లో బైక్, సెల్‌ఫోన్లు దొంగతనం కేసుల్లో యడ్లపాడు పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారని తెలిపారు. జైలు నుంచి వచ్చిన నాగరాజు దొంగతనాలు చేస్తూ మార్టూరు మండలంలోని సూర్యడాబా వద్ద, తాడేపల్లి పట్టణం ఉండవల్లి, విజయవాడ ఆటోనగర్ ప్రాంతాల్లో మూడు బైక్‌లు చోరీకి పాల్పడటంతో కేసులు నమోదయ్యాయన్నారు. రాజుపాలెం గ్రామ శివారులో అతన్ని అరెస్ట్ చేసి, 3 బైక్‌లు, 3 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ వివరించారు.

పుణ్యక్షేత్రానికెళ్తూ.. అనంత లోకాలకు!

పెదపాడు, న్యూస్‌టుడే: ఆ కుటుంబం సంతోషంగా కారులో పుణ్యక్షేత్రానికి బయల్దేరింది. మార్గం మధ్యలో కాపుకాసిన మృత్యువు.. ఒకరిని బలి తీసుకుంది. చిన్నారికి తల్లిని దూరం చేసింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. విజయవాడ నగరం గుణదలకు చెందిన పోలవరపు వెంకట శివరామకృష్ణ ప్రసాద్ తన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం తెల్లవారుజామున ద్వారకా తిరుమలకు కారులో బయల్దేరారు. మార్గం మధ్యలోని ఏలూరు జిల్లా పెదపాడు మండలం తాళ్లమూడి పైవంతెన వద్దకొచ్చే సరికి ముందు వెళ్తున్న లారీని అధిగమించబోయి.. దాన్నే వెనుక నుంచి ఢీకొన్నారు. ఈ ఘటనలో వెంకట శివరామకృష్ణ ప్రసాద్‌తోపాటు కుమార్తె పోలవరపు కీర్తి(27), ఆమె తల్లి సుజాత, భర్త యతేంద్ర, చిన్నాన్న శోభన్‌బాబు గాయపడ్డారు. మూడేళ్ల కుమారుడు క్షేమంగా బయటపడ్డారు. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో హనుమాన్ జంక్షన్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ కీర్తిని పరీక్షించిన వైద్యులు. . అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మిగతా వారిని మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు తీసుకెళ్లారు. కీర్తి మృతదేహాన్ని ఏలూరు సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆర్.శ్రీను తెలిపారు.

స్వల్ప అగ్ని ప్రమాదం

పటమట, న్యూస్‌టుడే: మొగల్రాజపురంలో స్వల్ప అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మొగల్రాజపురం మధుల గార్డెన్ సమీపంలోని ఓ భవనంలో ఆధునికీకరణ పనుల్లో భాగంగా వెల్డింగ్ చేస్తున్నారు. ఆ ప్రాంతంలో పెయింటింగ్‌లో వాడే టింకర్ డబ్బాలు ఉన్నాయి. బుధవారం రాత్రి 9 గంటల సమయంలో వెల్డింగ్ చేస్తుండగా. . ఆ డబ్బాలపై నిప్పు రవ్వలు పడ్డాయి. వెంటనే అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. భవనంలో పని చేస్తున్న కార్మికులు అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. భవనంలో ఉన్న నీటితోనే మంటలు అదుపు చేశారు. సుమారు రూ.లక్ష విలువ చేసే పెయింటింగ్ డబ్బాలు కాలిపోయాయి.

డివైడర్‌ని ఢీకొట్టిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

కృష్ణలంక, న్యూస్‌టుడే: ప్రైవేటు ట్రావెల్స్ బస్సు డివైడర్‌ని ఢీకొట్టిన ఘటన బుధవారం రాత్రి కృష్ణలంక వద్ద జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గుంటూరు నుంచి విశాఖపట్నం వెళ్తున్న బస్సు కనకదుర్గమ్మ వారధి దాటిన అనంతరం బస్‌స్టేషన్ వద్ద ప్రయాణికులను ఎక్కించుకునేందుకు కృష్ణలంక జాతీయ రహదారిపైకి చేరుకుంది. బస్సు సబ్‌వే దాటి అంబేడ్కర్ పార్క్ వద్దకు వెళ్లే సరికి ఎదురుగా కారు వచ్చింది. బస్సు అదుపు తప్పి డివైడర్‌ని ఢీకొంది. ప్రమాదం సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు ఉన్నారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఘటనా స్థలానికి చేరుకున్న కృష్ణలంక పోలీసులు క్రేన్‌తో బస్సును పక్కకు తీసి ట్రాఫిక్ పునరుద్ధరించారు.

చెత్త తీయక.. మురుగు వెళ్లక

నాలుగో డివిజన్ లయోల కళాశాల ప్రహరీ చివర పుల్లేటికట్ట డ్రెయిన్‌లో వ్యర్థాలు నిలిచి మురుగు పారుదలకు అడ్డుపడుతున్నాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే వ్యర్థాలన్నీ ఒకే చోట చేరుతున్నాయి. దుర్వాసన వెదజల్లుతోంది. పూడిక తీయించాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. **- కరెన్సీనగర్, న్యూస్‌టుడే**

విరిగిన దిమ్మె... రాకపోకలకు ఇబ్బంది

లబ్బీపేట పైడయ్య వీధిలోని ఓ అంతర్గత రహదారికి వెళ్లే డ్రెయిన్‌పై కల్వర్టు నిర్మించారు. అందులో ఓ దిమ్మె విరిగింది. రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు కొత్త దిమ్మె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. **- విజయవాడ సిటీ, న్యూస్‌టుడే**

అనధికార వేగ నిరోధకాలతో ఇక్కట్లు

లయోల కళాశాల రోడ్డు నుంచి ఈఎస్ఐ ఆసుపత్రికి వెళ్లే మార్గంలో అనధికార వేగ నిరోధకం వల్ల వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అది రోడ్డు సగానికే ఉంది. వాహనాలు మిగిలిన సగ భాగం నుంచి వెళ్తున్నాయి. దానిని తొలగించాలని కోరుతున్నారు. **- గుణదల (పటమట), న్యూస్‌టుడే**

ప్రమాదకరంగా రహదారి

పంట కాలువ రోడ్డు నుంచి ఇన్‌కం ట్యాక్స్ కాలనీకి వెళ్లే మార్గంలో రహదారి ప్రమాదకరంగా మారింది. రోడ్డు కంటే చప్టా పల్లంగా ఉంది. కారు బంపర్లు దెబ్బతింటున్నాయి. ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పుతున్నారు. అధికారులు సమస్య పరిష్కరించాలి. **- పటమట, న్యూస్‌టుడే**

చెట్ల కొమ్మలు తొలగించండి

కృష్ణలంక 22వ డివిజన్ గంగానమ్మ గుడి వీధిలో విద్యుత్తు సిబ్బంది తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి అక్కడే పడేశారు. వారం రోజులు గడుస్తున్నా పారిశుద్ధ్య సిబ్బంది వాటిని తరలించడం లేదు. స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. **- కృష్ణలంక, న్యూస్‌టుడే**

ప్రకటన

నా క్లయింటు విజయవాడ, న్యూ ఆర్.టి.సి. కాలనీ వాస్తవ్యులు (లేటు) జువ్వా సుబ్బారావు గారి కుమారుడు జువ్వా సురేష్‌బాబు గారి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియచేయునది ఏమనగా..
నా క్లయింటు దిగువ తెలిపిన షెడ్యూలు ఆస్తిని పాతూరి సత్యరవికిరణ్ గారి యొక్క ఒరిజినల్ పవర్ ఆఫ్ అటార్నీ ఏజంటు అయిన పాతూరి రామచంద్రమూర్తి గారి నుండి క్రయం పొందుటకు విక్రయ ఖరారు అగ్రిమెంటు పొందియున్నారు. సదరు షెడ్యూలు ఆస్తిని కొల్లిపర ఉమామహేశ్వరరావు గారు రిజిస్టరు క్రయ దస్తావేజు నెం. 1081/1980 SRO విజయవాడ ద్వారా కొడాలి సరస్వతమ్మ గారి నుండి క్రయం పొందియున్నారని, దరిమిలా సదరు షెడ్యూలు ఆస్తిని పాతూరి సత్యరవికిరణ్ గారు కొల్లిపర ఉమామహేశ్వరరావు గారి నుండి రిజిస్టరు క్రయ దస్తావేజు నెం. 240/2003 SRO విజయవాడ ద్వారా క్రయం పొంది వారు షెడ్యూలు ఆస్తిని స్వాధీన హక్కుభుక్తములలో ఉండియున్నారని తెలిపియున్నారు. సదరు పాతూరి సత్యరవికిరణ్ గారు, వారి ఒరిజినల్ లింకు దస్తావేజు అయిన డాక్యుమెంటు నెం. 1081/1980 పోయినదని పోలీసు కంప్లైంట్ ఇచ్చియున్నారని, దరిమిలా పోలీసు వారు సదరు ఒరిజినల్ లింకు దస్తావేజు కనిపించలేదని 13-6-2025వ తేదీన సర్టిఫికేట్ ఇచ్చియున్నారని తెలిపియున్నారు. కావున నా క్లయింటు ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని క్రయం పొంది రిజిస్టరు క్రయ దస్తావేజు పొందుటలో ఎవరికైననూ ఎటువంటి అభ్యంతరములుగానీ, క్లయిములుగానీ, కోర్టు జప్తులు గానీ మరియు ఏ ఇతర లావాదేవీలు ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన 7 రోజుల లోపల స్పీడు పోస్టు విత్ అకనాలెడ్జ్‌మెంటు ద్వారా తెలియపరచగలరు. లేని యెడల తదుపరి వచ్చు క్లయిములు నా క్లయింటును బైండు చేయజాలవని ఇందుమూలముగా తెలియపరచడమైనది.
షెడ్యూలు: యన్.టి.ఆర్. జిల్లా (లోగడ కృష్ణా జిల్లా) గుణదల సబ్ రిజిస్ట్రారు గారి యిలాకా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన విజయవాడ, గుణదల మహానాడు రోడు, నాగార్జుననగర్‌లో గల ఆస్తికి గుణదల రీ. సర్వే నెం. 324/3A, L.P. No 89/80గా అప్రూవల్ కాబడిన ప్లాన్ దాఖలా 475 చ॥గ॥ లేక 377.15 చ॥మీ॥ స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలమునకు **హద్దులు: తూర్పు:** లావు రమేష్ గారి ఆస్తి - అ 45.0లు, **దక్షిణం:** మున్సిపల్ పార్కు - అ. 95.0లు, **పడమర:** కార్పొరేషన్ వారి రోడ్డు - అ. 45.0లు, **ఉత్తరం:** కిలారు జగదీశ్వరిదేవి గారి ఆస్తి - అ. 95.0లు.
V.Raja Suresh, M.com,. LLB
Advocate, # 41-18-53, Tirumala Rao Street, Krishnalanka, Vijayawada-520 013. Cell: 93462 21022

ఆగిన విస్తరణ.. వాహనదారుల అవస్థ

కరెన్సీనగర్, న్యూస్‌టుడే

రూ.కోట్లు వెచ్చించి రోడ్డు విస్తరించినా.. ప్రజలకు పూర్తి స్థాయిలో ఉపయోగ పడడం లేదు. ఎన్నో అడ్డంకులు అధిగమించి రహదారిని అభివృద్ధి చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఒక చోట మాత్రం చేతులు ఎత్తేశారు. దారి ఇరుకుగా మారడంతో రాకపోకలు సాగించడానికి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ● జాతీయ రహదారిపై బెంజి సర్కిల్ నుంచి నోవోటెల్ వరకు పైవంతెన నిర్మించారు. సర్వీస్ రోడ్డు విస్తరణకు అడ్డంకులు ఎదురయ్యాయి. ● ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే రామ్మోహన్ చొరవ తీసుకున్నారు. సుమారు 25 మంది ప్రైవేటు స్థలాల యజమానులతో మాట్లాడి ఒప్పించారు. నోవోటెల్ నుంచి రమేష్ ఆస్పత్రి జంక్షన్ వరకు 28 అడుగుల మేర రోడ్డు విస్తరించి అభివృద్ధి చేశారు. ● ఫలితంగా భారతీనగర్, శ్రీనివాసనగర్ బ్యాంకు కాలనీ, మహానాడు రోడ్డు వైపు నుంచి రమేష్ ఆస్పత్రి జంక్షన్‌కు వెళ్లే మార్గం సుగమమైంది. మధ్యలో ఓ చోట మాత్రం విస్తరణ ఆగిపోయింది. అక్కడ ఎదురెదురు వాహనాలు తప్పించుకోలేని పరిస్థితి నెలకొంది. దీనిపై హైవే అథారిటీ ఇంజినీర్ యశ్వంత్ వివరణ కోరగా.. 'నోవోటెల్ వద్ద విస్తరించాలి. ప్రస్తుతం కలెక్టర్ దృష్టిలో విషయం ఉంది. ఆదేశాలు వచ్చాక చర్యలు తీసుకుంటాం' అని తెలిపారు.

రోడ్డు పనులు ఆగిన ప్రాంతమిదే..

రాకపోకలకు అడ్డుగా స్తంభం

● రమేష్ ఆస్పత్రి జంక్షన్ వద్ద రహదారి మధ్యలో విద్యుత్తు స్తంభాన్ని తొలగించకుండా ఆ శాఖ అధికారులు జాప్యం చేస్తున్నారు. అది వాహనాల రాకపోకలకు అడ్డుగా ఉంది. ● స్తంభాన్ని రోడ్డు మార్జిన్‌లో ఏర్పాటు చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులు సూచించినా.. ఒత్తిళ్లకు తలొగ్గి విద్యుత్తు అధికారులు మార్చడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ● స్తంభం వల్ల నోవోటెల్ వైపు నుంచి వచ్చే వాహనాలు జాతీయ రహదారి, గురునానక్ కాలనీ రోడ్డుకు వెళ్లడం కష్టం అవుతోంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

లయోలలో సమీక్ష-2కే26 సదస్సు

ప్రకాశరావును సత్కరించిన కళాశాల యాజమాన్యం

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఆంధ్రా లయోల కళాశాల ఎంసీఏ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సాంకేతిక సదస్సు 'సమీక్ష-2కే26' బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఐటీ క్లౌడ్ ఆపరేషన్స్ గవర్నెన్స్ డైరెక్టర్ కె.వి.ఎస్.ప్రకాశరావు హాజరై క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఐటీ గవర్నెన్స్‌కు పెరుగుతున్న ప్రాముఖ్యతను వివరించారు. సాంకేతిక నైపుణ్యాన్ని నిరంతర అభ్యాసంతో మిళితం చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ సింఫొనైజ్ ఎంటర్‌ప్రైజెస్ సేల్స్ కన్సల్టెంట్ వెంకట సత్య శివ దండపాణి పరాస మాట్లాడుతూ. . భావవ్యక్తీకరణ, విశ్లేషణ, సమస్య పరిష్కార నైపుణ్యాల వృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. కోడింగ్, డీబగ్గింగ్, టెక్నికల్ క్విజ్, పోస్టర్, పేపర్ ప్రజెంటేషన్ పోటీలు జరిగాయి. ప్రిన్సిపల్ ఫాదర్ మిల్కీయోర్, కరస్పాండెంట్ ఫాదర్ రెక్స్ ఏంజిలో, రెక్టార్ జో సెబాస్టియన్ సదస్సు ప్రారంభించారు. ఎంసీఐ విభాగాధిపతి మంజులారాణి, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి

శ్రీ గద్దె సాంబశివరావు గారు
AAE(Retd.)/APGENCO

శ్రీ గద్దె సాంబశివరావు గారు ది.08-02-2026 ఆదివారం నాడు స్వర్గస్తులైనారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ...
ది రిటైర్డ్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్, విజయవాడ-10.

పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యం

జెండా ఊపి ప్రదర్శన ప్రారంభిస్తున్న ఛైర్మన్ బాలాజీ

పున్నమ్మతోట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం పర్యాటక రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, ఫలితంగా రాష్ట్రానికి ఆదాయం సమకూరడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ అన్నారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీటీడీసీ) 50 ఏళ్ల వేడుక సందర్భంగా బుధవారం ఎంజీ రోడ్డులోని పర్యాటక డివిజనల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ద్విచక్ర వాహనాల ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. పర్యాటక శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

పరిశ్రమల స్థాపకులకు ప్రభుత్వాల సహకారం

మాట్లాడుతున్న మనీషా, వేదికపై రవికుమార్, పూర్ణిమ

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : పరిశ్రమలు స్థాపించాలనుకునే వారు పెట్టుబడి లేదని ఆలోచించవద్దని... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల ద్వారా రుణాలు అందించి ప్రోత్సహిస్తున్నాయని పరిశ్రమల అభివృద్ధి అధికారులు పి.మనీషా, ఆర్.రవికుమార్ అన్నారు. జన శిక్షణ సంస్థాన్, జిల్లా పరిశ్రమల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై మొగల్రాజపురంలోని జనశిక్షణ సంస్థాన్ కార్యాలయంలో బుధవారం కార్యశాల నిర్వహించారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకానికి ఎలా దరఖాస్తు చేసుకోవాలో వివరించారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న రుణాలను నిరుద్యోగులు, మహిళలు సద్వినియోగం చేసుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కోరారు.

ప్రణాళికతో ముందుకు సాగితే విజయం

విజేతలతో అతిథులు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా ఎదగాలంటే ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లాలని, అప్పుడే విజయం సొంతం అవుతుందని లిగో గ్రూప్ సీఈవో సీహెచ్ లింగేశ్వరరావు అన్నారు. నలంద డిగ్రీ కళాశాలలో 'డేటా విజార్డ్స్ 2కే26' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ అనూరాధ, సాంఖ్యకశాస్త్రం విభాగాధిపతి పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. క్విజ్, ఏపీటీ సుడోకు, డాస్‌బోర్డ్, గాంబ్లర్ లాజిక్, బృంద నృత్య ప్రదర్శనలు, ఫ్రీ ఫైర్, ర్యాపిడ్ ఫైర్ తదితర పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పటమట, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ హసీమ్ బేగ్ రూపొందించిన 2026 సంవత్సర క్యాలెండర్‌ని బుధవారం విజయవాడ గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీ కేశినేని శివనాథ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సుబ్బారావు, ఇర్ఫాన్, అబ్దుల్ హజీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

అంతిమయాత్ర

మా తల్లిగారైన శ్రీమతి వీరమాచనేని హేమలత గారు ది.18-02-2026 బుధవారం సాయంత్రం 6 గంటలకు స్వర్గస్తులైనారని తెలియజేయుటకు చింతిస్తున్నాము.

శ్రీమతి వీరమాచనేని హేమలత గారు
W/o (లేటు) వీరమాచనేని చంద్రశేఖరరావు గారు
గురునానక్ కాలనీ, విజయవాడ.

అంతిమయాత్ర
ది. 19-02-2026 గురువారం ఉదయం 9 గంటలకు విజయవాడ గురునానక్ కాలనీలో మా స్వగృహము నుండి బయలుదేరును. కావున తెలియపరచడమైనది.

కుమారులు: వీరమాచనేని భవానీ శంకరరావు
వీరమాచనేని అచ్యుతరావు (అచ్చియ్య)

నందిగామ

•నందిగామ •జగ్గయ్యపేట

ఆయుష్ వైద్యశాలకు స్థల పరిశీలన

అధికారులతో చర్చిస్తున్న రత్నప్రియదర్శిని

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామలో 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ వైద్యశాల ఏర్పాటుకు ఆ శాఖ జిల్లా వైద్యాధికారి రత్నప్రియదర్శిని స్థలాన్ని పరిశీలించారు. స్థానిక టిడ్కో గృహాల ప్రాంగణం వద్ద వైద్యశాలకు 3.08 ఎకరాలు కేటాయించారు. కేంద్ర ప్రభుత్వం నందిగామకు వైద్యశాల మంజూరు చేసిన నేపథ్యంలో బుధవారం ఆయుష్ పూర్వ వైద్యాధికారి కాపా భాను ప్రసాద్‌తో కలిసి వైద్యశాల భవన నిర్మాణానికి స్థలాన్ని ఆమె పరిశీలించారు. స్థలంలో పిచ్చిమొక్కలు, కంప మొక్కలు ఉండడంతో శుభ్రం చేయించాలని కోరారు. త్వరలో శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, కమిషనర్ లోవరాజు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు వాసిరెడ్డి ప్రసాద్, ఏఈ ఫణిశ్రీనివాసరావు, డీసీ ఛైర్మన్ రాటకొండ చంద్రశేఖర్‌రావు, దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ మనబోతుల శ్రీరామ్, తెదేపా పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు దారెల్లి బుజ్జి, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందనలు : ✤ పట్టణంలోని తొర్రగుంటపాలెంలో వీధిలైట్లు సరిగా వెలగడం లేదని అందిన ఫిర్యాదు మేరకు మున్సిపల్ కమిషనర్ వెంకటకృష్ణారావు స్పందించారు. సిబ్బందితో మరమ్మతులు చేయించారు. ✤ పట్టణంలోని డాంగేనగర్‌లో డ్రెయిన్లు నిండి ఇబ్బందులు పడుతున్నామని స్థానికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు మున్సిపల్ కమిషనర్ స్పందించారు. వెంటనే కార్మికులతో పూడిక తీయించారు. - **న్యూస్‌టుడే, జగ్గయ్యపేట గ్రామీణం**

మహిళలకు గ్యాస్ స్టవ్‌ల పంపిణీ

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కేతవీరునిపాడులో బుధవారం ఉజ్వల పథకం ద్వారా పది మంది మహిళలకు ఉచితంగా గ్యాస్ స్టవ్‌లు, సిలిండర్లు పంపిణీ చేశారు. కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టరు నెలకుదిటి నాగేశ్వరరావు వీటిని అందజేశారు. స్థానిక తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి పరిష్కారానికి 'క్రాష్'

✤ నిర్వహణ లోపాల గుర్తింపునకు చర్యలు

నందిగామ గ్రామీణం, చందర్లపాడు, న్యూస్‌టుడే

వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు క్రాష్ కార్యక్రమం అమలు చేస్తున్నారు. ఫిబ్రవరి ఒకటి నుంచి మార్చి 15 వరకు బోర్లు, పంచాయతీ, సామూహిక రక్షితనీటి పథకాల నిర్వహణలో లోపాలను గుర్తించి మరమ్మతులకు చర్యలు తీసుకుంటారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో మండలపరిషత్తు ఆధ్వర్యంలో మెకానిక్‌లు బోర్లకు మరమ్మతులు చేస్తారు.

నందిగామ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 2154 బోర్లు ఉన్నాయి. గ్రామాల్లో ప్రజలకు దాహార్తి తీర్చడానికి ఇవి ఉపయోగపడుతున్నాయి. ప్రభుత్వం ఏటా తాగునీటి పథకాల నిర్వహణకు 15వ ఆర్థికసంఘం నిధులు విడుదల చేస్తోంది. ఒక్కో బోరు మరమ్మతుకు రూ.వెయ్యి వంతున కేటాయిస్తారు. నందిగామ మండలంలో 361 ప్రభుత్వ బోర్లు, 306 ప్రైవేట్ బోర్లు ఉన్నాయి. ప్రభుత్వ నిధులతో ఏర్పాటుచేసిన బోర్లకు మరమ్మతులు చేస్తారు. వీటికి ఏడాదికి మూడు విడతలుగా మంజూరు చేస్తారు. నందిగామ మండలానికి రూ.3.65 లక్షలు 15వ ఆర్థికసంఘం నిధులు కేటాయించారు. వీటిలో ఇద్దరు బోరు మెకానిక్‌లు ఉన్నారు. ఒక్కో బోరు మరమ్మతుకు రూ.865 వీరికి కేటాయిస్తారు. నెలవారీ ఎన్ని బోర్లకు మరమ్మతులకు చేస్తే ఈ ప్రాతిపదికన వీరికి వేతనాలు చెల్లిస్తున్నారు. వచ్చే వేసవిలో తాగునీటి ఇబ్బందులు ఏర్పడకుండా బోర్లకు మరమ్మతులు చేయిస్తున్నారు. పంచాయతీల ఆధ్వర్యంలో నడిచే తాగునీటి పథకాలు, సామూహిక రక్షిత నీటిపథకాల్లో మోటార్లు మరమ్మతులు, పైపులైన్ల లీకులకు మరమ్మతులు, నీటి కుళాయిల ఏర్పాటు వంటి పనులు ఈ 'క్రాష్' కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్, మండలపరిషత్తు అధికారుల పర్యవేక్షణలో నిర్వహిస్తారు. వీటికి అవసరమైన సామగ్రి కొనుగోలుచేసి అందుబాటులో ఉంచుతారు.

మండలం	మొత్తం బోర్లు
నందిగామ	361
చందర్లపాడు	619
కంచికచర్ల	576
వీరులపాడు	598

బోరుకు మరమ్మతులు చేస్తున్న మెకానిక్‌లు

తాగునీటి పథకాల తనిఖీ

దీనిపై నందిగామ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఎంవీవీఎస్ శాస్త్రిని వివరణ కోరగా క్రాష్ కార్యక్రమంలో భాగంగా తాగునీటి పథకాలను తనిఖీ చేస్తున్నాం. అవసరమైతే మోటార్లకు మరమ్మతులు చేయిస్తున్నాం. ఎంపీడీవో ప్రసాదరావు మాట్లాడుతూ బోర్ల మరమ్మతులకు 15వ ఆర్థికసంఘం నిధులతో సామగ్రి తెప్పించి అందుబాటులో ఉంచామని, పంచాయతీల్లో అవసరమైనచోట బోర్లకు మరమ్మతులు చేయిస్తున్నామని వివరించారు.

21న తిరుపతమ్మ తిరునాళ్లపై సమీక్ష

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: తిరుపతమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాల నిర్వహణపై అన్ని శాఖల అధికారులతో ఈ నెల 21న ఆర్డీవో కె.బాలకృష్ణ సమీక్షా సమావేశం నిర్వహించనున్నారని ఈవో మహేశ్వరరెడ్డి తెలిపారు. మార్చి 4 నుంచి 8వ తేదీ వరకు తిరునాళ్లు జరుగనున్నాయి. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రభుత్వ శాఖల నుంచి చేయాల్సిన పనులపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు. ఆలయం సత్రాలు వద్ద మధ్యాహ్నం మూడు గంటలకు జరిగే సమావేశానికి అధికారులంతా హాజరుకావాలని కోరారు.

సంగమేశ్వరస్వామి సేవలో ఎమ్మెల్యే తాతయ్య

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: దాములూరు శివారు కూడలి పార్వతీ సమేత సంగమేశ్వరస్వామిని బుధవారం రాత్రి జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఛైర్మన్ గింజుపల్లి శ్రీనివాసరావు, తెదేపా మండల ప్రధాన కార్యదర్శి తోట నాగమల్లేశ్వరరావు, మన్నేపల్లి వినయ్ తదితరులు స్వాగతం పలికారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట మున్సిపల్ పరిధిలోని ధనంబోర్డు ప్రాంతంలో గురువారం మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రమీల తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు సరఫరా ఉండదని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉత్సాహంగా ఫూటీ లాగుడు పోటీలు

✤ సత్తా చాటిన నెల్లూరు జిల్లా తూర్పుగోగులపల్లి ఎడ్ల జత

పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి మహా శివరాత్రి తిరునాళ్లను పురస్కరించుకుని బుధవారం రాత్రి తెలుగు రాష్ట్రాల స్థాయి జూనియర్ విభాగం ఎడ్ల పూటీలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. క్వింటాళ్ల బరువును పది నిమిషాల్లో లాగేలా పోటీలు నిర్వహించారు. పోటీలను జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ప్రారంభించారు. ఈ పోటీల్లో నెల్లూరు జిల్లా అల్లూరు మండలం తూర్పుగోగులపల్లి గ్రామానికి చెందిన పల్లెబోయిన రాజారెడ్డి ఎడ్లజత 4921 అడుగుల దూరం లాగి ప్రథమ, గుంటూరు జిల్లా కాకుమాను మండలం గార్లపాడుకు చెందిన రామినేని శ్రీనివాసరావు ఎడ్ల జత 4521 అడుగుల దూరం లాగి ద్వితీయ, నెల్లూరు జిల్లా అల్లూరు మండలం తూర్పుగోగులపల్లికి చెందిన పల్లెబోయిన కృష్ణతేజరెడ్డి ఎడ్ల జత 4327 అడుగుల దూరం లాగి తృతీయ స్థానంలో నిలిచాయి. పోటీల్లో 13 జతల ఎడ్లు పాల్గొన్నాయి. విజేతలకు వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేల వంతున నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపికలను అందజేశారు. దేవాలయ ఛైర్మన్ గింజుపల్లి శ్రీనివాసరావు, సర్పంచి గాదెల వెంకటేశ్వరరావు, రైతు కమిటీ సభ్యులు తోట నాగమల్లేశ్వరరావు, మన్నేపల్లి వినయ్, చల్లా తులసీరావు, జవ్వాజి భాస్కరరావు, చంద్రమౌళి, మండా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే విజయవంతానికి సమన్వయంతో కృషి

మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ కృష్ణకుమారి, పక్కన కమిషనర్ లోవరాజు

నందిగామ, న్యూస్‌టుడే: స్వచ్ఛ సర్వేక్షణ సర్వే విజయవంతం చేసేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి కోరారు. స్థానిక బాబు జగ్జీవన్‌రామ్ ఫంక్షన్ హాలులో బుధవారం స్వచ్ఛ సర్వేక్షణ సర్వేలో సామర్థ్య వికాస, శిక్షణ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ స్వచ్ఛ నందిగామకు తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సర్వేలో రాష్ట్ర స్థాయిలో నందిగామ ముందుండేలా కష్టపడి పని చేయాలని చెప్పారు. రిసోర్స్ పర్సన్‌గా జయమాధురిమ, హరీష్‌లు వ్యవహరించారు. మున్సిపల్ కమిషనర్ లోవరాజు, ఏఈ ఫణిశ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, పట్టణ తెదేపా అధ్యక్షుడు యేచూరి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కాసర్ల లక్ష్మీనారాయణ, ఎన్జీవో అధ్యక్షుడు ఆర్.శ్రీధర్, నోడల్ అధికారి డి. శ్రీనివాసరావు, జిల్లా కో-ఆర్డినేటర్లు గోపీకృష్ణ, శ్రీకాంత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'స్పెషల్ గ్రేడ్‌తో పన్నులు పెరగవు'

మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట పురపాలక సంఘం స్పెషల్ గ్రేడ్ కావడం వలన ఎలాంటి పన్నులు పెరగవని, మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందని మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. గురువారం మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో నిర్వహించిన అత్యవసర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న సిబ్బంది, ఉద్యోగుల సంఖ్య 1991 జనాభా లెక్కల ప్రకారం ఉందని, ప్రస్తుతం జనాభా 80 వేలకు చేరిందని సేవలు ఆ స్థాయిలో పెరగాల్సి ఉందన్నారు. అందులో స్పెషల్ గ్రేడ్ ఒక్కటే పరిష్కారమని తెలిపారు. చిల్లకల్లు రోడ్డులో ఉలిపేరుచెరువు వద్ద టూరిజం శాఖకు ఇచ్చిన స్థలం ఆక్రమణలకు గురికాకుండా బందోబస్తు చేయడం జరిగిందని, దాంట్లో ఎలాంటి అపోహలకు తావులేదని స్పష్టం చేశారు. వైస్ ఛైర్మన్ తుమ్మల ప్రభాకర్ మాట్లాడుతూ.. 31, 10 వార్డుల్లో చేస్తున్న పార్క్ అభివృద్ధి పనుల్లో నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కౌన్సిలర్ వట్టెం మనోహర్ మాట్లాడుతూ.. అత్యవసర సమావేశంలో పేర్కొన్న అంశాల్లో టెండర్ల ఆమోదం చేయడానికి అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారుల పర్యవేక్షణ దారుణంగా ఉందని, గతంలో జరిగిన పనులపై విచారణ చేయాలని మున్సిపల్ కమిషనర్ వెంకటకృష్ణారావు ద్వారా జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. వేపలవాగులో ఆక్రమణలపై కౌన్సిలర్ మనోహర్ చేసిన విమర్శలకు తెదేపా కౌన్సిలర్ వెంకట్ సమాధానమిస్తూ.. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారని ప్రశ్నించారు.

శాస్త్రీయ పద్ధతులతో దూడల పెంపకంపై దృష్టి

బహుమతి అందజేస్తున్న జేడీ హనుమంతురావు, అధికారులు

చెవిటికల్లు(కంచికచర్ల), న్యూస్‌టుడే: శాస్త్రీయ పద్ధతుల్లో దూడలను పెంచడం ద్వారా దూడలలో మెరుగైన ఎదుగుదల, ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందని పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డా. హనుమంతురావు అన్నారు. చెవిటికల్లులో బుధవారం నిర్వహించిన లేగ దూడల అందాల ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. దూడల పోషణ, సంరక్షణ, యాజమాన్యం, వ్యాధుల నియంత్రణపై అవగాహన కల్పించారు. యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా ఆరోగ్యవంతమైన దూడలను పెంచగలమని అన్నారు. పోటీల్లో పాల్గొన్న 40 దూడల్లో అత్యుత్తమ లక్షణాలున్న దూడలను ఎంపిక చేసి వాటి యజమానులకు బహుమతులు అందజేశారు. దూడలకు అవసరమైన ఖనిజ లవణ మిశ్రమం, విటమిన్ సప్లిమెంట్లు, నట్టల నివారణ మందులను రైతులకు ఉచితంగా అందజేశారు. డిప్యూటీ డైరెక్టర్ డా. మోసెస్ వెస్లీ, అసిస్టెంట్ డైరెక్టర్ డా. వెంగళరావు, పశు వైద్యాధికారి డా. విజయ్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఒరిజినల్ దస్తావేజులు మిస్సింగ్

[illegible] జిరాక్స్ తీయుంచుటకు జిరాక్స్ సెంటర్‌కు వెళ్ళుచుండగా పోయినవి. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది వారికి అందచేయగలరు. మరియు సదరు విషయముపై ఏమైనా అభ్యంతరములు వున్నచో 7 రోజులలో ఈ క్రింది చిరునామాదారుకు వ్రాతపూర్వకముగా తెలియపరచగలరు.

రాయపూడి శ్రీనివాసరావు, న్యాయవాది- నోటరి
జగ్గయ్యపేట, ఎన్.టి.ఆర్. జిల్లా, A.P. సెల్ నెం. 98484 12620

జిల్లా అదనపు న్యాయమూర్తి కోర్టు ఏజీపీగా రామకృష్ణ

విప్ సౌమ్యను సత్కరిస్తున్న న్యాయవాదులు

నందిగామ, న్యూస్‌టుడే: స్థానిక 16వ జిల్లా అదనపు న్యాయమూర్తి కోర్టు అడిషనల్ ప్రభుత్వ న్యాయమూర్తిగా సీనియర్ న్యాయవాది బొందలపాటి రామకృష్ణ నియమితులయ్యారు. మూడేళ్ల పాటు ఆయన ఏజీపీగా బాధ్యతలు నిర్వహిస్తారు. ఈ మేరకు గవర్నర్ అనుమతితో ప్రభుత్వ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. నందిగామలో బుధవారం ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్యను ఏజీపీ రామకృష్ణ, న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు నియామక ఉత్తర్వులు చూపించి సత్కరించారు. న్యాయవాదులు షేక్ కరీముల్లా, మన్నెం నారాయణరావు, చాపల రామకృష్ణ, తెదేపా నాయకులు యేచూరి రామకృష్ణ, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలపై కసరత్తు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: వచ్చే పంచాయతీ ఎన్నికలపై క్షేత్ర స్థాయిలో కసరత్తు మొదలైంది. మండలంలోని 23 పంచాయతీల కార్యదర్శులు బుధవారం అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వారీగా ఉన్న ఓటర్ల జాబితాలను సరిచూశారు. 01.01.2025 నాటి ఈ జాబితాల్లో తాజాగా ఓటర్ల చేర్పులు, మార్పులు, తొలగింపులు ఉన్నాయి. వీటి ప్రకారం డేటా ఇన్‌పుట్ షీట్లు తయారు చేశారు. ఈ జాబితాను డీఎల్‌పీవో కార్యాలయంలో పరిశీలిస్తారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటర్ల విభజన చేస్తారు. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాలతో ఓటర్ల జాబితాల పరిశీలన చేపట్టారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ ఆవిర్భావ దినోత్సవం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని జగ్గయ్యపేటలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జగ్గయ్యపేట లైమ్ స్టోన్ మైన్‌లో ఇన్‌ఛార్జి కిరణ్‌కుమార్ జెండా ఆవిష్కరించి, అక్కడి కార్మికులకు, అధికారులకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సంస్థ అభివృద్ధిలో ప్రతి ఉద్యోగి పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.

సర్వే త్వరితగతిన పూర్తి చేయండి

జమ్మవరం(వీరులపాడు), న్యూస్‌టుడే : యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే(యూఎఫ్ఎస్)లో కుటుంబాల సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ వివరాలను త్వరితగతిన నమోదు చేయాలని ఎంపీడీవో రూపవతి. సచివాలయ సిబ్బందికి సూచించారు. యాప్‌లో సమాచారాన్ని సేకరించే ప్రక్రియలో వెనుకబడిన సచివాలయాలు బోడవాడ, వెల్లంకి, కొణతాలపల్లి, పెద్దాపురం, అల్లూరు, జుజ్జూరు సచివాలయాలను ఆమె బుధవారం సందర్శించారు. సచివాలయాల్లో పీ-4 బంగారు కుటుంబాలను పరిశీలించడం జరిగినట్లు తెలిపారు. జీఎస్‌డబ్ల్యూఎస్ మండల అధికారి రామారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

ఉద్యానవనం.. నిర్వహణ అధ్వానం

తుప్పుపట్టిన జారుడు బల్ల

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామ పురపాలక సంఘం పరిధిలో మినీ ఉద్యానం నిర్వహణ, అభివృద్ధిని పాలకులు గాలికొదిలేశారు. తుప్పుపట్టి ఆట పరికరాలు మూలకుచేరాయి. వీటిపై పిల్లలు ఆడడానికి వెళితే శరీరానికి రక్తగాయాలవుతున్నాయి. దీంతో పట్టణ ప్రజలు, విద్యార్థులు కొద్దిసేపు హాయిగా సేదతీరాలనుకున్నా సరైన వేదిక లేకుండాపోయింది.

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గత తెదేపా ప్రభుత్వంలో మినీ ఉద్యానం ఏర్పాటు చేశారు. దీనికి జిల్లా పరిషత్ నుంచి రూ.ఐదు లక్షలు, మున్సిపాలిటీ నుంచి రూ.ఐదు లక్షలు కేటాయించారు. ఈ నిధులతో పిల్లలు ఆడుకునేందుకు వీలుగా కొన్ని ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. గార్డెన్, క్రోటన్ మొక్కలు వేసి అందులో బుద్ధుడి విగ్రహాన్ని పెట్టి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. అప్పట్లో నిర్వహణకు ఒక కార్మికుడ్ని నియమించారు. పట్టణంలో 55 వేల జనాభా నివసిస్తున్నారు. గతంలో రోజూ ఉదయం, సాయంత్రం వేళ ఎక్కువ మంది పిల్లలు ఇక్కడకు వచ్చి ఆడుకునేవారు. ఆ సమయంలో వారితో తల్లిదండ్రులు కూడా వచ్చి కొద్ది సేపు గడిపి వెళ్లేవారు. అనంతరం వైకాపా ప్రభుత్వం వచ్చాక పార్కు నిర్వహణను పూర్తిగా విస్మరించింది. దీని అభివృద్ధికి పైసా కూడా వెచ్చించలేదు. దీంతో పార్కు అధ్వానంగా తయారైంది. అనంతరం కూటమి ప్రభుత్వం వచ్చినా దీని అభివృద్ధి గురించి పాలకులు పట్టించుకోవడం లేదు. కనీసం మొక్కలకు నీళ్లు పెట్టేవారు లేరు. పిల్లలు ఆడుకునే ఇనుప జారుడు బల్లలు, ఉయ్యాలలు, ఇతర ఆట పరికరాలు తప్పుపట్టి దెబ్బతిన్నాయి. దీనివల్ల ఆడుకోవడానికి ప్రయత్నించిన పిల్లల చేతులకు రేకులు గుచ్చుకుని గాయాలవుతున్నాయి. కొన్ని పరికరాలు ఊడిపోవడంతో పక్కన పడేశారు. అయినప్పటికీ గత ఐదేళ్లుగా కన్నెత్తి చూడలేదు. ఈ పరిస్థితుల్లోనూ జడ్పీ పాఠశాల పిల్లలు వచ్చి కొద్దిసేపు ఆడుకుంటున్నారు. ఈ పార్కులో విద్యార్థులు ఆడుకునేందుకు వీలుగా కొత్త ఆట పరికరాలు ఏర్పాటు చేయాలని, నిర్వహణకు కార్మికుడ్ని నియమించాలని, రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో శుభ్రం చేసేలా అధికారుల చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రక్షణ చట్టం అమలు చేయాలి

నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: తెలంగాణ న్యాయవాదులు ఖాదిర్, స్వప్నల హత్య దారుణమని జగ్గయ్యపేట న్యాయవాదులు మండిపడ్డారు. ఈ నేపథ్యంలో బుధవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు మాట్లాడుతూ.. న్యాయవాదుల రక్షణ చట్టం వెంటనే అమలు చేయాలన్నారు.

రహదారి విస్తరణ పనులకు శ్రీకారం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కేతవీరునిపాడు గ్రామంలో రూ.5 లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించే సిమెంటు రహదారి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామంలోని ప్రధాన సెంటరులో 55 మీటర్ల పొడవున సిమెంటు రహదారి నిర్మించడానికి తవ్వకం చేశారు. గ్రామం నుంచి తుర్లపాడువైపు రాకపోకలకు సాగించడానికి ఈ దారి సౌకర్యంగా ఉంటుందని స్థానికులు చెప్పారు.

పౌష్టికాహారం పంపిణీ

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: కర్లపాటి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తహీనతలో బాధపడుతున్న చిన్నారులు, నిరుపేదలకు రూ.10 వేలు విలువైన పౌష్టికాహారాన్ని ట్రస్ట్ వ్యవస్థాపకులు వెంకటశ్రీనివాసరావు అందించారు. ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పీ-4 కార్యక్రమంలో భాగంగా సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

చందర్లపాడు, న్యూస్‌టుడే: స్థానిక ఉన్నత పాఠశాల వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆరు నుంచి పదో తరగతి వరకు వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు, జ్ఞాపికలను అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దాతల విరాళాలతో పాఠశాల నూతన శోభను సంతరించుకుంది. యార్లగడ్డ సుబ్బారావు, పుల్లమ్మల జ్ఞాపకార్థం కుమారులు 170 మెమెంటోలను, రూ.20 వేల నగదు, 100 కిలోల బియ్యం అందజేశారు. పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి సహకరించారు. ఇన్‌ఛార్జి డీవైఈవో గురునాథం, ఎంఈవో-2 శ్యాంబాబు, ప్రధానోపాధ్యాయిని ఎన్.శ్రీలత, స్టాఫ్ కార్యదర్శి కె.శివనాగేశ్వరరావు, గిరివరప్రసాద్, యార్లగడ్డ చంటి, మేకల సుధాకర్, మండాది వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉద్ధృతం

ధర్నా చేస్తున్న సహకార సంఘాల ఉద్యోగులు

కంచికచర్ల, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల రైతులకు అండగా ఉంటూ వారి అభివృద్ధికి తోడ్పాటు అందించే సహకార సంఘాల ఉద్యోగులపై ప్రభుత్వానికి చిన్నచూపు తగదని సహకార సంఘాల ఉద్యోగులు అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ కంచికచర్ల కేడీసీసీ బ్యాంకు కార్యాలయం ఎదుట నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలోని సహకార సంఘాల ఉద్యోగులు బుధవారం ధర్నా నిర్వహించారు. 2019 నుంచి పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. జీవో నంబరు 36 అమలు చేయాలని, పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కో-ఆపరేటివ్ నిబంధనలతో సంబంధం లేకుండా జీతాలు చెల్లించాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని అన్నారు.

SBI భారతీయ స్టేట్ బ్యాంక్
SME పటమటలంక బ్రాంచ్ (63641), విజయవాడ, NTR జిల్లా

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)
(అనుబంధం - IV చట్టంలోని రూల్ 8(1) క్రింద)

ఇందుమూలముగా, భారతీయ స్టేట్ బ్యాంక్, SME పటమటలంక బ్రాంచ్, విజయవాడ, NTR జిల్లా వారి అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం-2002 ప్రకారం మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 (నెం.54 ఆఫ్ 2002) యొక్క రూల్ 3తో చదువుకొనవలసిన సెక్షన్ 13(12) క్రింద లభించిన అధికారాలను వినియోగించుకొంటూ జారీచేసిన నోటీసులో తెలిపిన ఋణం మొత్తం తేది.01.12.2025 నాటికి ABL OD లోన్ ఖాతా నెం.41626495373 బకాయి రూ.5,94,91,074/- (అక్షరాలా ఐదు కోట్ల తొంభై నాలుగు లక్షల తొంభై ఒక్క వేల డెబ్భై నాలుగు రూపాయలు మాత్రమే) + తేది.02.12.2025 నుండి భవిష్య వడ్డీ, ఖర్చులతో సహా తిరిగి చెల్లించవలసినదిగా ఋణగ్రహీత : మెస్సర్స్ పరిటాల కోల్ట్ స్టోరేజ్, రిజిష్టరు ఆఫీస్ : డి.నెం. 11-568, కంచికచెర్ల, యన్‌టిఆర్ జిల్లా-521180. మేనేజింగ్ పార్ట్‌నర్ : శ్రీ సజ్జ నితిన్ చక్రవర్తి, తండ్రి : సురేష్, ఫ్లాట్ నం.4, శర్మ అపార్ట్‌మెంట్స్, మెథోడిస్ట్ కాలనీ, బేగంపేట్, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం-500016. పార్ట్‌నర్ : శ్రీమతి సజ్జ పద్మావతి, భర్త : సురేష్, డి.నెం.11-568, ఫ్లాట్ నం.4, శర్మ అపార్ట్‌మెంట్స్, మెథోడిస్ట్ కాలనీ, బేగంపేట్, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం-500016. హామీదారులు : 1. శ్రీమతి సజ్జ పద్మావతి, భర్త : సురేష్, ఫ్లాట్ నెం.4, శర్మ అపార్ట్‌మెంట్స్, మెథోడిస్ట్ కాలనీ, బేగంపేట్, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం-500016. 2. శ్రీ సజ్జ నితిన్ చక్రవర్తి, తండ్రి: సురేష్, డి.నెం. 11-568, కంచికచెర్ల, యన్‌టిఆర్ జిల్లా-521180. వారిని కోరుతూ తేది.01.12.2025 న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది. సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజుల లోపుల్లో సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించవలసినదిగా సదరు నోటీసు ద్వారా కోరియున్నారు.

ఋణగ్రహీత బకాయి సొమ్మును చెల్లించుటలో విఫలమైనందున సదరు రూల్స్ యొక్క రూల్ "8" తో చదువుకొనవలసిన సదరు చట్టం ద్వారా సెక్షన్ 13(4) క్రింద తనకు లభించిన అధికారాలను వినియోగించుకొంటూ దిగువ వివరించిన ఆస్తి ఋణగ్రహీతలకు చెందిన ఆస్తిని తేది.12.02.2026 న దిగువ సంతకందారు స్వాధీనత తీసుకొన్నారని ఋణగ్రహీతలు/హామీదారులు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

ఋణగ్రహీతలు/హామీదారులు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా, సదరు ఆస్తితో ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు సదరు ఆస్తితో జరిపే ఏ లావాదేవీలైననూ ప్రస్తుత బకాయి మొత్తం తేది.11.02.2026 నాటికి ABL OD లోన్ ఖాతా నెం.41626495373 బకాయి రూ.6,07,15,945/- (అక్షరాలా ఆరు కోట్ల ఏడు లక్షల పదిహేను వేల తొమ్మిది వందల నలభై ఐదు రూపాయలు మాత్రమే) మరియు తేది.12.02.2026 నుండి వడ్డీ + ఖర్చులు మొ॥నవి కలిపి భారతీయ స్టేట్ బ్యాంక్, SME పటమటలంక బ్రాంచ్, విజయవాడ, NTR జిల్లా వారి ఛార్జికి లోబడి ఉంటాయి.

ఋణగ్రహీత'లు సెక్యూర్డు ఆస్తులు విడిపించుకొనుటకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13, సబ్ సెక్షన్ 8 లోని నిబంధనలు గమనించగలరు.

ఆస్థి షెడ్యూల్

మెస్సర్స్ పరిటాల కోల్డ్ స్టోరేజ్, మేనేజింగ్ పార్ట్‌నర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న 1) శ్రీ సజ్జ నితిన్ చక్రవర్తి, తండ్రి : శ్రీ సజ్జ సురేష్ మరియు పార్ట్‌నర్ : శ్రీమతి సజ్జ పద్మావతి గార్ల పేరున గల ఆస్థి : కంచికచెర్ల యస్ఆర్ఓ. సందలి అమ్మకం దస్తావేజు నెం.150/2011, తేది.25-01-2011 ప్రకారం ఆంధ్రప్రదేశ్, యన్‌టిఆర్ జిల్లా, కంచికచెర్ల గ్రామం మరియు గ్రామ పంచాయితీ ఏరియా, ఆర్.యస్.నెం.417/4 లోని, డి.నెం.11568, అసెస్‌మెంట్ నెం.4632లతో గల 11,567.60 చ.గ.లు విస్తీర్ణం గల స్థలము అందలి జి+3 అంతస్తులతో గల ఆర్‌సిసి కోల్డ్ స్టోరేజ్ ఇండస్ట్రియల్ భవనము ఆస్థినకు హద్దులు : తూర్పు : డొంక, దక్షిణం : మాగంటి వీరభద్రరావు గారి ఆస్థి, ఉత్తరం : పెన్నా యజ్ఞ నారాయణ మరియు ఇతరుల ఆస్థి, పడమర : రమణారావు గారి ఆస్థి.

తేది : 12.02.2026
ప్రదేశం : విజయవాడ
సం/-అధీకృత అధికారి, భారతీయ స్టేట్ బ్యాంక్

ది. పరిటాల ప్రాథమిక వ్యవసాయ సహకార పరిమితి సంఘం లి॥, పరిటాల
No - H1921, పరిటాల, కంచికచర్ల మండలం,
ఎన్.టి.ఆర్. జిల్లా. ఫోన్: 91002 58881

నోటీసు

ఎన్.టి.ఆర్. జిల్లా, పరిటాల, కంచికచర్ల మండలంలో నివసించుచున్నట్టిన్నీ, పరిటాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘములో బకాయిదారైనట్టిన్నీ ఈ క్రింది స్థిరాస్తిని సంఘములో తనఖా పెట్టి అప్పులు పొంది చెల్లించనందున వాయిదా మీరి ఉన్నవి. సదరు అప్పుదారు సంఘములో తనఖా పెట్టిన స్థిరాస్తిని అప్పులు చెల్లించకుండా ఇతరులకు బదిలీ చేయుట సహకార చట్టము 1964 ప్రకారము చట్టవిరుద్ధము. ఈ స్థిరాస్తిని తనఖా పెట్టిన తరువాత హక్కులు సహకార చట్ట ప్రకారము సంఘము వారికి ప్రథమ ఛార్జిగా సంక్రమించినవి. కనుక సంఘమునకు తనఖా పెట్టిన స్థిరాస్తిని అప్పులు చెల్లించకుండా అమ్మినా లేదా కొనుగోలు చేసినా సహకార చట్టరీత్యా నేరముగా పరిగణించబడును. దీనిపై సహకార చట్ట ప్రకారము సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకొనబడును. ఈ నోటీసు ఈ క్రింది స్థిరాస్తి అమ్మిన వారికి, కొనుగోలుదారుకు పత్రికాముఖముగా తెలియపరచుచూ ఈ నోటీసు ముట్టినట్లుగానే భావించబడును. ఈ క్రింది స్థిరాస్తిపై ఉన్న అప్పులు మొత్తం ది. 25-02-2026 లోగా చెల్లించవలెను. ఇట్లు చెల్లించని యెడల తదుపరి లీగల్ చర్యలు చేపట్టి అప్పు ఖాతాకు జమ చేయబడును.

షెడ్యూలు ఆస్తి వివరములు

నెం.	సర్వే నంబరు (స్థిరాస్తి వివరములు)	విస్తీర్ణము	హద్దులు	స్థిరాస్తిని అమ్మినవారు	సదరు స్థిరాస్తి కొనుగోలుదారు
1.	పరిటాల 25/1	య. 1.05 సెంట్లు	తూ: మాగంటి పూర్ణయ్య ద: ఉమ్మడి భాస్కరరావు ప: మాగంటి సత్యనారాయణ ఉ: జిక్కుల సింహాద్రిరాజు	మాగంటి లతారాణి, W/o. వినయ్ భూషణరావు	పోలు మల్లేశ్వరి
2.	పరిటాల 367/A	య. 2.03 సెంట్లు	తూ: చింతా నరసింహారావు ద: చింతా శివప్రసాద్ ప: కిలారు వెంకటేశ్వరరావు ఉ: చింతా శ్రీనివాసరావు	చింతా రవీంద్రనాథ్, S/o. వెంకటేశ్వరరావు	చింతా దివ్య
3.	పరిటాల 367/C	య. 2.04 సెంట్లు	తూ: చింతా నరసింహారావు ద: చింతా శివప్రసాద్ ప: కిలారు వెంకటేశ్వరరావు ఉ: చింతా శ్రీనివాసరావు	చింతా శ్రీనివాసరావు, S/o. వెంకటేశ్వరరావు	చింతా దివ్య

ది: 18-02-2026
పరిటాల
పైవారు సంఘ ముఖ్య కార్యదర్శిని సంప్రదించగలరు.
సం/- ముఖ్య కార్యనిర్వహణాధికారి, పరిటాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘము

(c) eenadu

విజయవాడ పశ్చిమ

రంజాన్.. ముస్లింలకు పవిత్రమాసం

హలీమ్ రుచిచూస్తున్న ఎంపీ శివనాథ్ తదితరులు

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: రంజాన్ మాసం.. ముస్లింలకు పవిత్రమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. బుధవారం పాతబస్తీలోని పంజాసెంటర్‌లో ఏర్పాటైన రంజాన్ స్టాల్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. పలు స్టాల్స్‌ను ఆయన సందర్శించి ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర మైనార్టీ విభాగ ప్రధాన కార్యదర్శి ఎండీ ఫతావుల్లా, మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్, ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ ఛైర్మన్ ఎంఎస్ బేగ్, ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

స్పందన: ★ కేఎల్ రావు నగర్ కర్మెల్ చర్చి ఎదురు వీధిలోని మురుగు కాలువలో పూడిక పేరుకుందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనికి స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో పూడిక తీయించారు. ★ ఎర్రకట్ట పైవంతెన సీఎస్ఐ చర్చి ఎదురు పబ్లిక్ మరుగుదొడ్ల ఆవరణలో చెత్త పేరుకుందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనికి స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో చెత్త తీయించారు.
- న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

? సామారంగం చౌకీ కాకరపర్తి భావన్నారాయణ వీధిలో జ్యూస్ దుకాణం పక్కనే రోడ్డుపై చెత్త తీయడం లేదు. **- షర్మిళ, స్థానికురాలు** ✔ చెత్త తరలించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. **- యోగేంద్ర, స్థానిక శానిటరీ అధికారి**

? భవానీపురం ఐరన్ యార్డు గేటు వద్ద రాత్రుళ్లు మందుబాబుల హంగామా అధికంగా ఉంది. **- రవిరెడ్డి, స్థానికుడు** ✔ నిఘా ఏర్పాటు చేస్తాం. **- ఉమామహేశ్వరరావు, సీఐ, భవానీపురం**

- న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

21న దుర్గగుడి హుండీ లెక్కింపు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఈనెల 21న దుర్గగుడి హుండీ ఆదాయాన్ని మల్లికార్జున మహా మండపం ఆరో అంతస్తులో లెక్కిస్తున్నట్లు ఈవో శీనానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు కానుకల లెక్కింపును ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కానుకల లెక్కింపులో పాల్గొనే దేవస్థానం ఉద్యోగులు, సేవాసంస్థల సభ్యులు నిర్ణీత సమయానికి హాజరు కావాలని కోరారు.

ఇళ్లు కట్టారు.. వసతులు మరిచారు..

జక్కంపూడి కాలనీ ప్రజల అవస్థలు

భవానీపురం, న్యూస్‌టుడే

జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీ

విజయవాడ నగరానికి సమీపంలోని జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీలో నిత్యం సమస్యలు ఉంటున్నాయి. అటు గ్రామ పంచాయతీ, నగరపాలక సంస్థ అధికారుల మధ్య కాలనీ వాసులు సతమతమవుతున్నారు. జేఎన్ఎన్‌యూఆర్ఎం నిధులతో విజయవాడ గ్రామీణ మండలం పరిధిలోని గొల్లపూడి, జక్కంపూడి గ్రామాల పరిధిలో కాలనీ నిర్మాణం చేపట్టారు. విజయవాడ నగర పరిధిలోని కాల్వగట్లు, కరకట్ట, రహదారులను ఆక్రమించుకుని నివాసముంటున్న గృహాలు కేటాయించారు.

గృహాలు: 8 వేలు
జనాభా: సుమారు 22 వేలు
ఓటర్లు: 15 వేల పైనే..
సమస్యలు: మంచినీటి ట్యాంకు లేకపోవడం, పారిశుద్ధ్య నిర్వహణ, అధ్వానంగా రహదారులు

ఏళ్ల తరబడి వీడని సమస్యలు...: జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీ నిర్మాణం దగ్గర నుంచి ఇప్పటి వరకు విజయవాడ నగరపాలక సంస్థ అధికారులే బాధ్యత తీసుకుని సదుపాయాలు కల్పిస్తున్నారు. గతంలో ఈ కాలనీ మొత్తాన్ని విజయవాడ నగరపాలక సంస్థలో విలీనం చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఏడేళ్ల కిందట కాలనీలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు కాలనీ విలీనం చేస్తామని ప్రకటించారు. ఆ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. కాలనీలో నిర్మించిన ఏకైక ట్యాంకు ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. నీటి ఎద్దడి ఏర్పడిన సమయంలో ట్యాంకులతో నీటిని సరఫరా చేస్తున్నారు. అదనంగా మరో ట్యాంకు నిర్మాణానికి కొన్నేళ్ల కిందట శంకుస్థాపన జరిగినా అభివృద్ధికి నోచుకోని పరిస్థితి.

★ పారిశుద్ధ్య బాధ్యతలను స్థానిక జక్కంపూడి గ్రామ పంచాయతీ వారికి అప్పగించాలనే ప్రతిపాదనలను గతంలో నగరపాలక సంస్థ అధికారులు సిద్ధం చేశారు. ఆ తర్వాత ఆ ప్రతిపాదనపై వెనక్కి తగ్గారు. నేటికీ కాలనీలో సౌకర్యాలను కల్పించడంపై నగరపాలక సంస్థ అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి పెట్టడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. దీనికి తోడు సక్రమంగా డ్రెయినేజీలు లేకపోవడంతో కాలనీలోని వీధుల్లో మురుగు నీరు పొంగి పొర్లుతుంది.

★ **కోల్పోతున్న ఆదాయం..** కాలనీ నిర్మాణం చేపట్టి దాదాపు రెండు దశాబ్దాలు దాటుతున్నా నేటికీ అక్కడి గృహాలకు పన్నులు వేయలేదు. దీంతో ఆ భారం అంతా నగరపాలక సంస్థ పైనే పడుతుంది. పన్నులు వేయడంపై కూడా అధికారులు శ్రద్ధ పెట్టని పరిస్థితి ఏర్పడిందని ప్రజలు చెబుతున్నారు.

ప్రయాణికురాలి హ్యాండ్ బ్యాగు అప్పగింత

బాధితురాలికి వస్తువులు ఇస్తున్న సీఐ రమణ

విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: రైలు ప్రయాణంలో పోగొట్టుకున్న ఓ ప్రయాణికురాలి హ్యాండ్ బ్యాగును విజయవాడ రైల్వే పోలీసులు తిరిగి అప్పగించిన సంఘటన బుధవారం విజయవాడ రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్‌కు చెందిన జయలక్ష్మి భర్తతో కలిసి సాయంత్రం హైదరాబాద్ నుంచి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడకు చేరుకున్నారు. వారితో పాటు తెచ్చుకున్న లగేజీని 6వ నంబరు ప్లాట్‌ఫాంపై ఉంచారు. హ్యాండ్ బ్యాగు మర్చిపోయి రైల్వేస్టేషన్ బయటకు వెళ్లిపోయారు. రైల్వేస్టేషన్‌లో తనిఖీల్లో భాగంగా జీఆర్పీ సీఐ జె.వి.రమణ, సిబ్బంది 6వ నంబరు ప్లాట్‌ఫాంపై తనిఖీలు చేస్తుండగా ప్రయాణికురాలి హ్యాండ్ బ్యాగు లభించింది. అందులో ఉన్న ఆధార్ కార్డు, ఫోన్ నంబరు ఆధారంగా బాధితురాలికి ఫోన్ చేసి సమాచారం అందించారు. వారు వెంటనే విజయవాడ వచ్చి జీఆర్పీ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. పోగొట్టుకున్న హ్యాండ్ బ్యాగును సీఐ రమణ ప్రయాణికురాలికి అప్పగించారు. అందులో రూ.26 వేల నగదు, రూ.10 లక్షల విలువ చేసే 65 గ్రాముల బంగారం నగలు ఉన్నాయి. సొత్తు చోరీ కాకుండా సకాలంలో స్పందించిన రైల్వే సీఐ రమణ, సిబ్బందికి ప్రయాణికురాలు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే సుజనాచౌదరికి అభినందన

ఎమ్మెల్యే సుజనా చౌదరికి పూలమొక్క ఇస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు నూకాలమ్మ యాదవ్, శ్రీనివాసరావు తదితరులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పశ్చిమ నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ఎమ్మెల్యే సుజనాచౌదరిని బీసీ సంక్షేమ సంఘం నాయకులు బుధవారం అభినందించారు. కానూరులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సుజనాచౌదరిని కలిసి పూల మొక్క అందజేశారు. నియోజకవర్గ అభివృద్ధితోపాటు బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్న వైనాన్ని ప్రశంసించారు. రానున్న కాలంలో బీసీ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు నూకాలమ్మ యాదవ్, ప్రధాన కార్యదర్శి పిళ్లా శ్రీనివాసరావు ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కృష్ణ దుర్గారావు, బీరంకి శ్రీనివాసరావు, కొనిశెట్టి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

దాతలు కృష్ణమూర్తి, వి.పి.ఎన్.కుమార్ కుటుంబ సభ్యులకు విరాళం రసీదు, అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్, సూపరింటెండెంట్ సత్యనారాయణ

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

ఇంద్రకీలాద్రి: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు దాతలు రూ.2 లక్షలు విరాళాన్ని బుధవారం అందజేశారు. గుంటూరు జిల్లా గోరంట్ల నివాసి ఎం.కృష్ణమూర్తి దంపతులు రూ.లక్ష, సింగపూర్‌లో నివాసముంటున్న ఎన్నారై వి.పి.ఎన్.కుమార్ రూ.లక్ష విరాళాలను వేర్వేరుగా అందజేశారు. దాతల కుటుంబాలకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం సూపరింటెండెంట్ సత్యనారాయణ, ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ వారికి విరాళం రసీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

బలహీన వర్గాల అభ్యున్నతికి వెంకయ్య కృషి

వెంకయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళా, సాహితీ సంస్థల నిర్వాహకులు చంద్రశేఖర్, చిట్టిబాబు తదితరులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: బలహీన వర్గాల అభ్యున్నతికి మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య కృషి చేశారని కళాభారతి సంస్థ అధ్యక్షుడు శింగంశెట్టి చంద్రశేఖర్ తెలిపారు. గాంధీనగర్‌లోని కౌతా కళావేదికలో కళా, సాహితీ సంస్థల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఐలాపురం వెంకయ్య సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. వ్యాపార రంగంలో ఉన్నత స్థాయికి చేరినప్పటికీ వెంకయ్య పేద, బలహీన వర్గాలకు అండగా నిలిచారన్నారు. రాజకీయాలకు అతీతంగా సేవాకార్యక్రమాలు నిర్వహించిన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో తెలుగు కళావాహిని సంస్థ అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, సావిత్రి కళాపీఠం అధ్యక్షురాలు పరుచూరి విజయలక్ష్మి, అంబేడ్కర్ సాంస్కృతిక సమితి అధ్యక్షుడు డేవిడ్‌రాజు, ఎక్స్‌రే సంస్థ కార్యదర్శి ఆంజనేయ రాజు తదితరులు పాల్గొన్నారు.

వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ లక్ష్మీనారాయణ

పెజ్జోనిపేట, న్యూస్‌టుడే: మహిళలపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సత్యనారాయణపురం సీఐ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. రెండు రోజుల కిందట 'ఈనాడు'లో ప్రచురితమైన 'ఆకతాయిలకు అడ్డేది' కథనానికి ఆయన స్పందించారు. ఈ సందర్భంగా బుధవారం రాత్రి 35వ డివిజన్‌లోని పూర్ణానందం పేట, పెజ్జోనిపేట, హార్టుపేట, రైల్వేస్టేషన్ ప్రాంతం, జోసెఫ్ వీధి, ఆర్సీఎం చర్చి సెంటర్ ఇందిరాగాంధీ బొమ్మ, బాప్టిస్ట్‌పాలెం, కరుణా హోటల్ సెంటర్ ప్రాంతాల్లో ఆకతాయిల కోసం జల్లెడ పట్టారు. పలువురు యువకులను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. రహదారులపై గుంపులుగా తిరిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రాత్రి సమయాల్లోనూ నిఘా పెడతామని చెప్పారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా నేరుగా 100కి ఫోన్ చేస్తే వెంటనే స్పందిస్తామని ఆయన తెలిపారు.

వన్‌వేను నిలువరిస్తాం: ఏసీపీ

దుకాణదారులతో మాట్లాడుతున్న ఏసీపీ రామచంద్రరావు, పక్కన ట్రాఫిక్ సీఐ, ఎస్సై తదితరులు

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: పశ్చిమ నియోజకవర్గంలోని పాతబస్తీ పరిధిలోని పలు కూడళ్లలో ఏసీపీ రామచంద్రరావు సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలు తిరిగి దుకాణదారులతో మాట్లాడారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా వ్యాపారాలు చేయాలని సూచించారు. 'దారంతా ఆక్రమణలు- అడ్డదిడ్డంగా వాహనాలు' శీర్షికన ఈనెల 18న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. వన్‌వేను నిలువరించేలా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్సై ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలతో అగ్నిప్రమాదాల నివారణ

ఆస్పత్రి సిబ్బందికి మంటలు ఆర్పే విధానం చూపిస్తున్న అధికారులు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ముందు జాగ్రత్తలతో అగ్ని ప్రమాదాలు నివారించవచ్చని నగరపాలక సంస్థ అగ్నిమాపక విభాగం అధికారి మాల్యాద్రి పేర్కొన్నారు. సూర్యారావుపేట, ఎంజీ రోడ్డులోని ఆసుపత్రులను అగ్నిమాపక విభాగం అధికారులు బుధవారం పరిశీలించారు. మాల్యాద్రి మాట్లాడుతూ... మంటలు ఆర్పే పరికరాలను దుకాణాలు, షోరూంలు, ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచాలని తెలిపారు. అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. మంటలు ఆర్పే పరికరాలను వినియోగించే తీరును తెలియజేశారు. అగ్నిమాపక విభాగం అధికారి నరేష్ పాల్గొన్నారు.

రేషన్ దందా.. ఆపేదుందా..!

విజయవాడ (చిట్టినగర్), న్యూస్‌టుడే

రేషన్ దుకాణాలు: 93
ప్రతి డిపోనకు సరఫరా: 10 టన్నులు
పశ్చిమలో సరఫరా బియ్యం: 930 టన్నులు
ప్రజలకు సరఫరా అయ్యేది : సుమారు 500 టన్నులు
బయట మార్కెట్‌కు: 430 టన్నులు
డీలర్లు, జనం వద్ద కొనేది: రూ.16
కొనేందుకు అయ్యే ఖర్చు: సుమారు 69 లక్షలు
ట్రాన్స్‌పోర్టుకు: సుమారు 5 లక్షలు
రేషన్ మాఫియా సంపాదన (నెలకు): సమారు 15 లక్షలకు పైనే

పేదలకు అందాల్సిన బియ్యాన్ని బహిరంగ మార్కెట్లో విక్రయిస్తూ రేషన్ మాఫియా రూ.లక్షలు సంపాదిస్తున్నారు. నియంత్రించాల్సిన అధికారులు ముడుపుల మత్తులో ఊగుతున్నారు. పశ్చిమ నియోజకవర్గంలో చందాలు చెల్లవని ఇప్పటికే ఎమ్మెల్యే సుజనాచౌదరి హెచ్చరికలు జారీ చేశారు. ఆ హెచ్చరికలను సైతం ఓ మాజీ రౌడీషీటర్, ఓ పార్టీ నాయకుడు బేఖాతరు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నెలకు రూ.5 లక్షలు చొప్పున వసూలు చేస్తూ రేషన్ మాఫియాకు అండగా నిలుస్తున్నాడని విమర్శలు వస్తున్నాయి.

మాకే బియ్యం ఇవ్వాలని హుకుం.: పశ్చిమ నియోజకవర్గంలో చౌక దుకాణం డీలర్లు అందరూ తాను చెప్పిన వారికే బియ్యం ఇవ్వాలని ఇప్పటికే పలు మార్లు తన కార్యాలయానికి, ఇంటికి పిలిపించి హెచ్చరించాడు. త్వరలో ఈ జిల్లాకి అధ్యక్షుడిని అవుతున్నట్లు ప్రచారం చేసుకుంటూ.. సరకు ఇవ్వకపోతే చర్యలు ఉంటాయని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. మంత్రి మా పార్టీనే. మీరు ఎలా వ్యాపారాలు చేస్తారంటూ డీలర్లపై ఒత్తిడి తీసుకున్నట్లు సమాచారం. నా బంటు రాముడికే బియ్యం ఇవ్వాలని లేదంటే బడిత పూజ ఖాయమని డీలర్లను హెచ్చరిస్తున్నాడు.

నెలకు రూ.5 లక్షల ముడుపులు : రేషన్ మాఫియా బంటు మాజీ రౌడీషీటర్ అండతో ఏకంగా పశ్చిమ నియోజకవర్గంలో పాగా వేశాడు. రేషన్ దందా సాగిస్తున్నాడు. అందుకు మాజీ రౌడీషీటర్‌కు ప్రతి నెల రూ.5 లక్షలు ఇచ్చే విధంగా సయోధ్య కుదిరింది. ఫిబ్రవరిలో రామబంటుడే డీలర్లు, ఇతరుల నుంచి బియ్యం పోగేశాడు. ఈ మాఫియా ముందర చందా.. దందాల హెచ్చరిక చిన్నబోయింది.

కాలువలో పూడిక తొలగింపు

డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పరిచేందుకు నగరపాలక సంస్థ అధికారులు చర్యలు చేపడుతున్నారు. భవానీపురం పరిధిలోని జాతీయ రహదారి వెంట ఉన్న అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లో పేరుకున్న పూడికను నగరపాలక సంస్థ అధికారులు తీయించారు. కాలువలో పూడిక పేరుకుపోవడంతో మురుగు నీరు స్తంభిస్తోంది. మురుగు నీరు సజావుగా వెళ్లేలా కార్మికులతో తీయిస్తున్నారు. **- న్యూస్‌టుడే, భవానీపురం**

దుర్వాసనతో ఇబ్బందులు

స్థానిక 35వ డివిజన్ గుర్రాల వారి వీధి అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పొంగిపొర్లడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతుంది. కొన్ని రోజులుగా ఈ సమస్య ఉన్నా సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. రాకపోకల సమయంలో దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. **- న్యూస్‌టుడే, పెజ్జోనిపేట**

పచ్చదనం పెంపునకు చర్యలు

భవానీపురం ఆర్టీసీ వర్క్ షాపురోడ్డులోని అమృత్ ఉద్యానంలో పచ్చదనం పెంపునకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. గతంలో పలుమార్లు ఉద్యానంలో మొక్కలు లేవని కథనాలు ప్రచురితమయ్యాయి. ఉద్యానంలో వివిధ రకాల మొక్కలను కార్మికులతో నాటిస్తున్నారు. ప్రస్తుతం మొక్కలు నాటే పనులు చురుగ్గా సాగుతున్నాయి
.**- న్యూస్‌టుడే భవానీపురం**

క్రైస్తవుల ఉపవాస దీక్షలు ప్రారంభం

ప్రారంభిస్తున్న ఫాదర్ బాలరాజు

పెజ్జోనిపేట, న్యూస్‌టుడే: క్రైస్తవులు ఏటా భక్తి శ్రద్ధలతో నిర్వహించే 40 రోజుల ఉపవాస దీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా 35వ డివిజన్ ఆర్సీఎం చర్చిలో విచారణ గురువు బాలరాజు క్రైస్తవులకు కండువా వేసి దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీక్షలో ఉండి నిత్యం దేవుడిని స్మరించుకోవాలని చెప్పారు. దానధర్మాలు చేస్తూ సన్మార్గంలో నడవాలని సూచించారు. దీక్షలో భాగంగా ప్రతి రోజూ ప్రత్యేక ప్రార్థనలతో పాటు ప్రతి శుక్రవారం సాయంత్రం 6 గంటలకు శిలువ మార్గం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సహాయ గురువులు శౌరిల్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

మరదలిపై దాడి.. 4 ఏళ్ల జైలు శిక్ష

చిట్టినగర్, న్యూస్‌టుడే: తమ్ముడి భార్యపై దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 4 ఏళ్ల కారాగార శిక్ష, రూ.15 వేలు జరిమానా విధిస్తూ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి బి.రాధారాణి బుధవారం తీర్పు వెల్లడించినట్లు కొత్తపేట సీఐ చిన కొండలరావు తెలిపారు. విజయవాడ గ్రామీణ ప్రాంతమైన అంబాపురం గ్రామంలో కొక్కిలిగడ్డ జీవరత్నం(76) నివాసం ఉంటున్నాడు. స్థలం వివాదం నేపథ్యంలో 2019లో అన్నదమ్ములు గొడవ పడ్డారు. అనంతరం పెద్దల సమక్షంలో రాజీ పడ్డారు. అయినా పాత గొడవలను మనస్సులో పెట్టుకొని 2019 అక్టోబరు 10వ తేదీన తమ్ముడి భార్య కొక్కిలిగడ్డ మార్తమ్మపై జీవరత్నం కర్రతో దాడి చేసి గాయపరిచాడు. కొత్తపేట పోలీసులు అదే నెల 12న నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఆరుగురు సాక్షులను విచారించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితుడికి శిక్ష విధించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

మోతీ మసీదు.. షాదీఖానా దుకాణాల సీజ్

చిట్టినగర్, న్యూస్‌టుడే: ఎంతో ప్రసిద్ధిగాంచిన చిట్టినగర్‌లోని మోతీ మసీదుకు చెందిన షాదీఖానా, 9 దుకాణాలకు నగరపాలక సంస్థ అధికారులు బుధవారం సీలు వేశారు. పన్ను బకాయి ఉండడంతో పలుమార్లు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో సీలు వేశామని నగరపాలక సంస్థ ఆర్.ఐ.శివరామకృష్ణ తెలిపారు. 9 దుకాణాలకు 2022 నుంచి 2026 వరకు రూ.1,30,716, షాదీఖానాకు 2019 నుంచి ఇప్పటి వరకు రూ.6.15,343, ఉర్దూ పాఠశాల భవనం పన్ను 2018 నుంచి ఇప్పటి వరకు రూ.78,725.. మొత్తం రూ. 8,24,786 పన్ను బకాయి చెల్లించాల్సి ఉందని ఆయన వివరించారు. దీని విషయమై మసీదు కమిటీ సభ్యులు మాత్రం దుకాణాల అద్దెదారులు కొంతమంది అద్దె బకాయిలు ఉండడం వల్ల పన్ను చెల్లించడంలో జాప్యం జరిగిందని వివరించారు.

వీఎంసీ బకాయి సుమారు రూ.3 లక్షలు: చిట్టినగర్ ఈద్గా వెనుకభాగంలో ఉన్న మోతీ మసీదుకు చెందిన భవనంలో వీఎంసీ ఉర్దూ పాఠశాల నిర్వహిస్తుందని, అందుకు నెలకు రూ.7 వేలు చొప్పున మసీదు కమిటీకి అద్దె చెల్లిస్తుందని కమిటీ సభ్యులు చెప్పారు. ఇప్పటి వరకు సుమారుగా రూ.3 లక్షల వరకు వీఎంసీ అద్దె బకాయి ఉందని వివరించారు. బకాయి విషయమై నగరపాలక సంస్థ అధికారుల దృష్టిలో పెట్టామని చెప్పారు.

సీలు వేసిన మోతీ మసీదు దుకాణాలు

షాదీఖానాకు సీలు

33 మందికి ఉద్యోగాలు

ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ కృష్ణవేణి, కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: ప్రముఖ కంపెనీలు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో తమ కళాశాలకు చెందిన 33 మంది విద్యార్థులు రూ.3 లక్షల వార్షిక వేతనంతో ఎంపికైనట్లు కేబీఎన్ కళాశాల ప్రిన్సిపల్ జి.కృష్ణవేణి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాలలో అభినందన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు చెందిన హెటిరో డ్రగ్స్ సంస్థ నిర్వహించిన ఎంపికల్లో ఎంఎస్సీ (కెమిస్ట్రీ)విద్యార్థులు 21 మంది, హైదరాబాద్, విశాఖపట్నం కేంద్రాలుగా పని చేసే నోవోపార్ ల్యాబొరేటరీ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన పరీక్షల్లో ఎంఎస్సీ విద్యార్థులు 12 మంది ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల కార్యదర్శి టి.శ్రీనివాస్, ఏవో వి.నారాయణరావు, ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాసరెడ్డి అభినందించారు.

తాగునీటి పైపులైను నిర్మాణానికి శంకుస్థాపన

శంకుస్థాపనలో పాల్గొన్న నాయకులు

భవానీపురం: భవానీపురం 40వ డివిజన్‌లోని బాలభాస్కర్‌నగర్‌లో తాగునీటి పైపులైను నిర్మాణానికి ఏఈ జనార్ధన్, తెదేపా డివిజన్ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య బుధవారం శంకుస్థాపన చేశారు. డివిజన్ ప్రజలు తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పనులు చేపడుతున్నారు. రూ.8.27 లక్షలతో పైపులైను నిర్మాణ పనులను చేపట్టనున్నారు. కార్యక్రమంలో నాయకులు గణేష్, నారాయణరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

విద్యార్థినికి వస్తువులు అందజేస్తున్న సుబ్బారావు, వినయ్‌కుమార్ తదితరులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: పేద విద్యార్థులకు సాయం చేయడం అభినందనీయమని బాలాజీ స్వీట్స్ నిర్వాహకులు సుబ్బారావు పేర్కొన్నారు. పాతబస్తీ భావన్నారాయణ వీధిలో బుధవారం న్యూజనరేషన్ యూనిటీ ఆర్గనైజేషన్ నిర్వాహకులు సాయి వినయ్‌కుమార్ తండ్రి జి.నారాయణరావు జయంతి సందర్భంగా పదో తరగతి చదువుతున్న 80 విద్యార్థులకు ఉచితంగా అట్టలు, బ్యాగులు, పెన్నులు, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ.. ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు విద్యాదానంతోపాటు సేవా కార్యక్రమాలను నిర్వహించడం స్ఫూర్తిదాయకమని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు సాయి వినయ్‌కుమార్, ఉపాధ్యాయురాలు జయలక్ష్మి గౌతం తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

ఛంకీ, ఓం శాంతి శాంతి శాంతి: జీ-3(రాజ్-యువరాజ్), ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), సాయిరామ్, సౌమ్య(వన్‌టౌన్), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు), ఏబీఆర్ సినిమాస్(కానూరు). **అమరావతికి ఆహ్వానం, నిలవే, సీతా పయనం, యుఫోరియా:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), రామ్ సినిమాస్(గుణదల), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట). **సై:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు). **యుఫోరియా, సీతా పయనం:** పవర్ వన్ మాల్(కానూరు), ఏబీఆర్ సినిమాస్(కానూరు). కపుల్ ఫ్రెండ్లీ: శైలజ(గాంధీనగర్). ఛంకీ: అప్సర.
- న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుకు చర్యలు

అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: కాలువల్లో పూడిక తొలగించి డ్రైనేజీ వ్యవస్థ మెరుగుకు చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. కొత్త రాజరాజేశ్వరిపేట, మధురానగర్, దేవీ నగర్, బీఆర్టీఎస్ రోడ్డు, సింగ్‌నగర్ తదితర ప్రాంతాల్లో కమిషనర్ బుధవారం పర్యటించారు. మధురానగర్‌లోని ఆర్‌యూబీ వద్ద పరిశుభ్రత పనులు పరిశీలించారు. అజిత్‌సింగ్‌నగర్ అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. జోనల్ కమిషనర్ కె.ప్రభుదాస్, ఈఈ ఎ.శ్రీనివాసరెడ్డి, అధికారులు పాల్గొన్నారు. ★ పన్ను వసూళ్లపై అధికారులు దృష్టి పెట్టాలని కమిషనర్ పేర్కొన్నారు. చిట్టినగర్‌లోని సర్కిల్-1 కార్యాలయంలో బుధవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. పన్ను వసూళ్లలో పురోగతి ఉండాలని, ముఖ్యంగా ఖాళీ స్థలాల పన్నుపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. డిప్యూటీ కమిషనర్ జి.సృజన, జోనల్ కమిషనర్ రమ్యకీర్తన తదితరులు పాల్గొన్నారు. ★ డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన 31 మంది సచివాలయ ఉద్యోగులకు రిలీవ్ ఉత్తర్వులు జారీ చేసినందుకు, మార్చి 4, 5 తేదీల్లో ఉద్యోగుల ఆటల పోటీలకు అనుమతి ఇచ్చినందుకు ఎన్జీవో నాయకులు కమిషనర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

(c) eenadu

విజయవాడ మధ్య

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సీతారాంపురం–63036 11232, పాయకాపురం– 90631 44761

స్పందన: వాంబేకాలనీ హెచ్ బ్లాక్ వద్ద వార్డు సచివాలయం మార్గంలో రాత్రి పలువురు యువకులు గంజాయి తాగుతున్నారు. దీనిపై స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా'కు సమాచారం ఇవ్వగా సోమవారం 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. నున్న పోలీసులు స్పందించి నిఘా ఏర్పాటు చేశారు. ❖ తోటవారి వీధి పదో లైన్‌లో మురుగు పొంగి పొర్లుతోంది. దీనిపై ప్రచురితమైన వార్తకు పారిశుద్ధ్య అధికారులు స్పందించారు. కార్మికులతో పూడిక తీయించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

? రాధానగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద డ్రెయిన్‌లో పూడిక పేరుకుపోయింది. - **నాగిరెడ్డి, స్థానికుడు**

✔ పరిశీలించి పూడిక తీయించేలా చర్యలు తీసుకుంటా. - **రాంబాబు, శానిటరీ అధికారి**

? ప్రశాంతినగర్ అయిదో లైన్‌లో చెత్త తరలించడం లేదు. - **ప్రశాంత్‌కుమార్, స్థానికుడు**

✔ కార్మికులతో చెత్తను తరలింపజేస్తాం. - **రాజ్‌కుమార్, శానిటరీ అధికారి** – న్యూస్‌టుడే, పాయకాపురం

ప్రభుత్వ సహకారంతో నగరాభివృద్ధి: ఎంపీ

పటమట: రోడ్లపై గుంతలను నిమిషాల్లో పూడ్చే ఇన్‌ఫ్రారెడ్ రోడ్ రిపేరింగ్ మొబైల్ యంత్రాన్ని నగర పాలక సంస్థ అందుబాటులోకి తీసుకొచ్చింది. కేంద్ర ఆర్థిక సంఘం నిధులు రూ.1.48 కోట్లతో కొనుగోలు చేసిన యంత్రాన్ని బుధవారం గురునానక్ కాలనీలో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రారంభించారు. యంత్రం పనితీరును పరిశీలించారు. ఎంపీ మాట్లాడుతూ.. ఎన్‌క్యాప్ (నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం) ద్వారా మంజూరైన యంత్రాన్ని రోడ్ల అభివృద్ధి, కాలుష్య నియంత్రణకు వినియోగించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రోడ్లు, మురుగు, వర్షం నీటి కాలువలను అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.

క్రైస్తవుల ఉపవాస దీక్షలు ప్రారంభం

పెజ్జోనిపేట, న్యూస్‌టుడే: క్రైస్తవులు ఏటా భక్తి శ్రద్ధలతో నిర్వహించే 40 రోజుల ఉపవాస దీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా 35వ డివిజన్ ఆర్సీఎం చర్చిలో విచారణ గురువు బాలరాజు క్రైస్తవులకు కండువా వేసి దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీక్షలో ఉండి నిత్యం దేవుడిని స్మరించుకోవాలని చెప్పారు. దానధర్మాలు చేస్తూ సన్మార్గంలో నడవాలని సూచించారు. దీక్షలో భాగంగా ప్రతి రోజూ ప్రత్యేక ప్రార్థనలతో పాటు ప్రతి శుక్రవారం సాయంత్రం 6 గంటలకు శిలువ మార్గం ఉంటుందని చెప్పారు.

పార్కులపై నిర్లక్ష్యమేలా?

మధురానగర్, సీతారాంపురం, న్యూస్‌టుడే

నాలుగు ఊయలలకు రెండు మాత్రమే మిగిలాయి

ప్రజలకు ఆహ్లాదం పంచే పార్కుల అభివృద్ధిపై అధికారులు దృష్టిసారించడం లేదు. పచ్చదనం కొరవడి.. సరైన క్రీడాపరికరాలు లేక కళావిహీనంగా మారుతున్నాయి. మధురానగర్ లెక్చరర్స్‌కాలనీలోని ముత్తవరపు శ్రీనివాసరావు నగరాజకుమారి పార్కు ఆట పరికరాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. ఒకప్పుడు పిల్లలతో కళకళలాడింది. ఇప్పుడు వెలవెలబోతోంది. ఉపకరణాలు పనికి రాకుండా పోయాయి. ఊయలలు రెండు మాత్రమే ఉన్నాయి. మరో రెండు విరిగిపోగా.. అవి కనిపించకుండా పోయాయి. తూగుడు బల్ల విరిగిపోగా.. మూలన పడేశారు. రంగుల రాట్నం ఉన్నా అది సరిగా తిరగడం లేదు.

పరిశీలన

గతంలో సందడే సందడి..

గతంలో ప్రతి రోజూ సాయంత్రం వేళల్లో. . సందర్శకులతో పార్కు సందడిగా ఉండేది. ఉపకరణాలు, క్రీడా పరికరాలు పనిచేయకపోవడంతో చిన్నారుల రాక తగ్గింది. ఉపకరణాలకు మరమ్మతులు చేసి పూర్తిగా అందుబాటులోకి తెస్తే. . ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అధికారులు మరమ్మతులు చేసేందుకు చొరవ చూపడం లేదని చెబుతున్నారు. సాయంత్రం మహిళలు పెద్ద సంఖ్యలో వాకింగ్ వస్తుంటారు. అలాగే వారి పిల్లలు ఇక్కడ ఆడుకునేవారు. పెద్దలు సైతం సందర్శిస్తుంటారు. ఈ క్రమంలో అధికారులు దృష్టిసారించి, పార్కును అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

తప్పని ఎదురుచూపులు..

సీతారాంపురం రైవస్ కాలువ గట్టున కేటాయించిన స్థలంలో పార్కు నిర్మాణం కోసం స్థానికులు ఎదురు చూస్తున్నారు. సంవత్సరాలు గడిచినా పనులు ముందుకు సాగడం లేదు. కొత్తవంతెన నుంచి అల్లూరి సీతారామరాజు వంతెన వరకు కాలువ గట్టున పార్కు ఏర్పాటుకు నిర్ణయించారు. చెట్లను, అనధికార గృహాలు.. షెడ్లను తొలగించారు. 650మీ. పొడవు, 9 మీటర్ల వెడల్పుతో ఉన్న స్థలంలో.. మొక్కలు, పచ్చిక మైదానం, వాకింగ్ ట్రాక్, చిన్నారులు ఆడుకునేందుకు వీలుగా పలు రకాల ఆటల పరికరాలు ఏర్పాటు చేసేందుకు పనులు ప్రారంభమయ్యాయి. స్థల సేకరణ చేసి అయిదేళ్లు గడిచినా. . ప్రయోజనం లేకుండా పోయింది. మళ్లీ పిచ్చి మొక్కలు మొలిచి.. విష సర్పాలకు నిలయంగా మారక ముందే త్వరితగతిన పనులు ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆధునిక వసతులతో ఐవీ ప్యాలెస్

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఐవీ ప్యాలెస్‌ను ఆధునికీకరించి బుధవారం ఉదయం పునఃప్రారంభించారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో ఈ ఫంక్షన్ హాలును రూ.40 లక్షలతో అభివృద్ధి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఉమా సహకారంతో ఐవీ ప్యాలెస్‌ను అతి తక్కువ సమయంలో ఆధునికీకరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈ రామకృష్ణ, ఏఈ భవానీ, డివిజన్ నాయకులు చింతా దుర్గారావు, కోటి, సూర్య, రత్న తదితరులు పాల్గొన్నారు.

రిబ్బను కత్తిరిస్తున్న ఎమ్మెల్యే ఉమామహేశ్వరరావు, పక్కన కార్పొరేటర్ బాలస్వామి తదితరులు

డ్రైనేజీ వ్యవస్థ మెరుగుకు చర్యలు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: కాలువల్లో పూడిక తొలగించి డ్రైనేజీ వ్యవస్థ మెరుగుకు చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. కొత్త రాజరాజేశ్వరిపేట, మధురానగర్, దేవీ నగర్, బీఆర్‌టీఎస్ రోడ్డు, సింగ్‌నగర్ తదితర ప్రాంతాల్లో కమిషనర్ బుధవారం పర్యటించారు. మధురానగర్‌లోని ఆర్‌యూబీ వద్ద పరిశుభ్రత పనులు పరిశీలించారు. అజిత్‌సింగ్‌నగర్ అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. జోనల్ కమిషనర్ కె.ప్రభుదాస్, ఈఈ ఎ.శ్రీనివాసరెడ్డి, అధికారులు పాల్గొన్నారు. ❖ పన్ను వసూళ్లపై అధికారులు దృష్టి పెట్టాలని కమిషనర్ పేర్కొన్నారు. చిట్టినగర్‌లోని సర్కిల్-1 కార్యాలయంలో బుధవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. పన్ను వసూళ్లలో పురోగతి ఉండాలని, ముఖ్యంగా ఖాళీ స్థలాల పన్నుపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. డిప్యూటీ కమిషనర్ జి.సృజన, జోనల్ కమిషనర్ రమ్యకీర్తన తదితరులు పాల్గొన్నారు. ❖ డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన 31 మంది సచివాలయ ఉద్యోగులకు రిలీవ్ ఉత్తర్వులు జారీ చేసేందుకు, మార్చి 4, 5 తేదీల్లో ఉద్యోగుల ఆటల పోటీలకు అనుమతి ఇచ్చినందుకు ఎన్జీవో నాయకులు కమిషనర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

అధికారులతో చర్చిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

'వాస్తవ దూరంగా రాష్ట్ర బడ్జెట్'

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : ప్రజా సంక్షేమం, అభివృద్ధిని విస్మరించేలా.. వాస్తవాలకు దూరంగా రాష్ట్ర బడ్జెట్ ఉందని

మాట్లాడుతున్న రమేష్, వేదికపై లక్ష్మణరావు, విజయ్‌కుమార్ తదితరులు

రాష్ట్ర ప్రభుత్వ పూర్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ పి.వి.రమేష్ అన్నారు. జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం దాసరి భవన్‌లో బడ్జెట్‌పై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్ కేటాయింపులు.. వాస్తవ వ్యయాలకు పొంతన లేకుండా ఉన్నాయని విమర్శించారు. గత పదేళ్లుగా ఐదు శాతం మాత్రమే రాష్ట్ర ఆదాయం పెరుగుతూ.. రూ.88వేల కోట్లకు చేరిందన్నారు. కానీ రూ.1.25 లక్షల కోట్లకు ఎలా చేరుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వం అప్పుల ఊబిలో ఉందని.. ఈ ఏడాది మరో రూ.లక్ష కోట్ల రుణాలు పొందాలని పేర్కొనడం సమంజసం కాదన్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 3 శాతానికి మించి అప్పులు చేయరాదని 16వ ఫైనాన్స్ కమిషన్ స్పష్టం చేసిందని పేర్కొన్నారు. మాజీ ఐఏఎస్ అధికారి జి.ఎస్.ఆర్.కె.ఆర్.విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. నిరుద్యోగ భృతి, 50ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వృద్ధాప్య పింఛను అందిస్తామని.. బడ్జెట్‌లో ఒక్క రూపాయి కేటాయించలేదని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే జల్లి విల్సన్ మాట్లాడుతూ.. ఫీజురీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిలు వేల కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నా.. నిధులు కేటాయించలేదని విమర్శించారు.

కేటాయింపులు ఏవీ?

జన చైతన్య వేదిక అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు గణనీయంగా పడిపోయాయని నేస్తున్నారు. ధరల స్థిరీకరణ నిధికి రూ.500 కోట్లు మాత్రమే కేటాయించడం బాధాకరమన్నారు. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ.. కౌలు రైతుల సంక్షేమానికి నిధులు ఇవ్వలేదని విచారం వ్యక్తం చేశారు. మాజీ ఐఆర్ఎస్ అధికారి ఉప్పులేటి దేవీ ప్రసాద్ మాట్లాడుతూ.. ఎస్సీ ఎస్టీ ఉప ప్రణాళికకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంభూపాల్ మాట్లాడుతూ.. రాయలసీమలో నీటి పారుదల ప్రాజెక్టులకు సరైన కేటాయింపులు లేవన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, కొరివి వినయ్‌కుమార్, టి.ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన అవసరం

హాజరైన విద్యార్థులు

మాట్లాడుతున్న బలరామ్

మాచవరం, న్యూస్‌టుడే : నేటి పోటీ ప్రపంచంలో డిజిటల్ అక్షరాస్యత, స్మార్ట్ టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలని కాంటినెంటల్ కాఫీ సంస్థ ప్రతినిధి ఎం.బలరామ్ కోరారు. స్థానిక ఎస్సారార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్రం, ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం 'తెలివైన జీవనశైలి డిజిటల్ సాధికారత' సదస్సు నిర్వహించారు. దీనికి హాజరై ప్రసంగించారు. 150 దేశాల్లో చేస్తున్న వ్యాపారం వివరాలను తెలియజేశారు. ప్రపంచ స్వభావం పెరుగుతున్న సాంకేతికత గురించి తెలియజేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఏపీడీ వెలగా జోషి మాట్లాడుతూ.. సాంకేతిక పురోగతి, విద్య, సమాజంపై వాటి ప్రభావాలను వివరించారు. ప్రిన్సిపల్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులను అత్యాధునిక డిజిటల్ నైపుణ్యాలతో సన్నద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఫైనాన్ ప్రోగ్రామింగ్ స్మార్ట్ పని పద్ధతులను కార్పొరేట్ శిక్షకుడు పి.కరుణాకర్ నాయుడు వివరించారు. భౌతికశాస్త్రం, ఎలక్ట్రానిక్స్ విభాగం ఇన్‌ఛార్జ్ పి.శైలజ, ఐక్యూఏసీ సమన్వయకర్త జి.నాగేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయండి

అజిత్‌సింగ్‌నగర్: నియోజకవర్గంలోని ప్రతి బూత్ కమిటీ సభ్యులు సమన్వయంతో పని చేయాలని తెదేపా నాయకుడు బొండా సిద్ధార్థ సూచించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి, వారి సమస్యలు తెలుసుకొని మై-టీడీపీ యాప్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. బుధవారం 58వ డివిజన్ పైపుల రోడ్డు, పరిసర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి సంబంధించిన ప్రచార పత్రాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. యాప్‌ను కేవలం సాంకేతిక సాధనంగానే కాకుండా.. పార్టీ శక్తిని ఏకీకృతం చేసే వేదికగా ఉపయోగించుకోవాలని చెప్పారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు, పార్టీ కార్యక్రమాలు ప్రతి ఒక్కరికీ చేరువయ్యేలా చూడాలని పేర్కొన్నారు. సభ్యత్వ నమోదు, ఫొటోలు.. వీడియోలు అప్‌లోడ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి ఘంటా కృష్ణమోహన్, 58వ డివిజన్ ఇన్‌ఛార్జి పిరియా సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యాప్ ప్రచార పత్రాలు ఆవిష్కరిస్తున్న సిద్ధార్థ తదితరులు

21న దుర్గగుడి హుండీ ఆదాయం లెక్కింపు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఈనెల 21న దుర్గగుడి హుండీ ఆదాయాన్ని మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తులో లెక్కిస్తున్నట్లు ఈవో శీనానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు కానుకల లెక్కింపును ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కానుకల లెక్కింపులో పాల్గొనే దేవస్థానం ఉద్యోగులు, సేవాసంస్థల సభ్యులు నిర్ణీత సమయానికి హాజరు కావాలని కోరారు.

ఈ నీటిని మీరైతే తాగుతారా..?

విజయవాడ నగర శివారు లోని రాజీవ్‌నగర్, డాక్టర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో వారంలో కనీసం ఐదు రోజులు రంగుమారి, తీవ్ర దుర్వాసన కలిగిన మంచినీరు సరఫరా అవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు సమస్య చెప్పినా పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. నీటిని తాగలేకపోతున్నామని.. శుద్ధినీరు సరఫరా చేయాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, పాయకాపురం

పూడిక తీశారు.. దిమ్మెలు మరిచారు

మధురానగర్ విద్యుత్తు ఉప కేంద్రం పక్కనే ఓపెన్ డ్రెయిన్‌లో ఇటీవల పూడిక తీశారు. ఆ సమయంలో డ్రెయిన్‌పై ఉన్న దిమ్మెల్లో కొన్నింటిని పక్కన పెట్టారు. తర్వాత వాటిని సరి చేయకుండా వదిలేశారు. దీనివల్ల రోడ్డు మలుపులో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. రాత్రి వేళ ద్విచక్ర వాహనాల చోదకులు డ్రెయిన్‌లో పడిపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి దిమ్మెలను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, మధురానగర్**

చెట్ల కొమ్మలు తొలగించరూ..

వాంబేకాలనీ.. జేఎన్ఎన్‌యూఆర్ఎం బ్లాకుల వద్ద రహదారిలో చెట్ల కొమ్మలు వేశారు. రోజులు గడుస్తున్నా వాటిని తరలించడం లేదు. ఫలితంగా కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు చొరవచూపి కొమ్మలను తరలించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. - **న్యూస్‌టుడే, అజిత్‌సింగ్‌నగర్**

గుంతల దారిలో ఇక్కట్లు

రాధానగర్, వాంబేకాలనీ యర్రం రామిరెడ్డి వారి వీధి అంతా గోతులే ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టి రోడ్డుగా మారిపోయిందని వాపోతున్నారు. కార్పొరేషన్ అధికారులకు పలుమార్లు సమాచారం ఇచ్చినా.. పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిని బాగుచేయాలని వారు అభ్యర్థిస్తున్నారు. - **న్యూస్‌టుడే, పాయకాపురం**

శుభ్రంగా ఆర్‌యూబీ

వాహనాల తాకిడికి నిరంతరం రోడ్లపై దుమ్ము పేరుకుంటుంది. అంచుల్లో పెద్ద ఎత్తున ధూళి చేరుతుంది. మహాత్మాగాంధీ రోడ్డు తదితర ముఖ్యమైన ప్రాంతాల్లోని దారులను నిరంతరం శుభ్రం చేస్తుంటారు. కానీ అన్ని చోట్ల ఇలా చేయరు. తాజాగా విజయవాడ నగరపాలక సంస్థ సిబ్బంది.. మధురానగర్ ఆర్‌యూబీలో వాహనం ద్వారా నీటిని వెదజల్లుతూ.. శుభ్రం చేస్తున్నారు. దుమ్ము లేకుండా.. రాకపోకలకు సౌకర్యవంతంగా ఉండేలా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - **న్యూస్‌టుడే, మధురానగర్**

బలహీన వర్గాల అభ్యున్నతికి వెంకయ్య కృషి

వెంకయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళా, సాహితీ సంస్థల నిర్వాహకులు చంద్రశేఖర్, చిట్టిబాబు తదితరులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: బలహీన వర్గాల అభ్యున్నతికి మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య కృషి చేశారని కళాభారతి సంస్థ అధ్యక్షుడు శింగంశెట్టి చంద్రశేఖర్ తెలిపారు. గాంధీనగర్‌లోని కొత్తా కళావేదికలో కళా, సాహితీ సంస్థల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఐలాపురం వెంకయ్య సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. వ్యాపార రంగంలో ఉన్నత స్థాయికి చేరినప్పటికీ వెంకయ్య పేద, బలహీన వర్గాలకు అండగా నిలిచారన్నారు. రాజకీయాలకు అతీతంగా సేవాకార్యక్రమాలు నిర్వహించిన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో తెలుగు కళావాహిని సంస్థ అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, సావిత్రి కళాపీఠం అధ్యక్షురాలు పరుచూరి విజయలక్ష్మి, అంబేడ్కర్ సాంస్కృతిక సమితి అధ్యక్షుడు డేవిడ్‌రాజు, ఎక్స్‌రే సంస్థ కార్యదర్శి ఆంజనేయ రాజు తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉండండి

చరవాణుల్లో ఈగల్ యాప్ చూపుతున్న విద్యార్థులు

మాచవరం, న్యూస్‌టుడే : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఈగల్ సీఐ రవీంద్ర, ఎస్సై వీరాంజనేయులు సూచించారు. బుధవారం స్థానిక ఎస్సారార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ అబ్యూస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సామాజిక మాధ్యమాల్లో ఈగల్ సేవలు, యాప్ గురించి వివరించారు. మత్తు పదార్థాలకు బానిసలైన వారి వివరాలను 1972కు తెలియజేయాలని కోరారు. ప్రిన్సిపల్ కె.భాగ్యలక్ష్మి, అధ్యాపకుడు బాలసుబ్రహ్మణ్యం, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త కె.రమేష్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి నాటిక పోటీలు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : శ్రీకృష్ణ తెలుగు థియేటర్ ఆర్ట్స్ 26వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 19వ తేదీ నుంచి మూడు రోజుల పాటు తెలుగు సామాజిక నాటికల పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు రంగనాథం తెలిపారు. బుధవారం గాంధీనగర్‌లోని కార్యాలయంలో కార్యక్రమాల ప్రచార పత్రాలు ఆవిష్కరించారు. హనుమంతరాయ గ్రంథాలయంలో మొత్తం ఎనిమిది సామాజిక నాటికలు ప్రదర్శించనున్నట్లు ఉపాధ్యక్షుడు పోతుల కిరణ్ కుమార్ తెలిపారు. గతంలోనూ పలు నగరాల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించామని కోశాధికారి డి.వెంకట చంద్రశేఖర్ చెప్పారు. నాటిక ప్రియులు హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.



ప్రచార పత్రాలు ఆవిష్కరిస్తున్న రంగనాథం, కిరణ్ కుమార్, చంద్రశేఖర్

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

ఇంద్రకీలాద్రి: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు దాతలు రూ.2 లక్షలు విరాళాన్ని బుధవారం అందజేశారు. గుంటూరు జిల్లా గోరంట్ల నివాసి ఎం.కృష్ణమూర్తి దంపతులు రూ.లక్ష, సింగపూర్‌లో నివాసముంటున్న ఎన్నారై వి.పి.ఎన్. కుమార్ రూ.లక్ష విరాళాలను వేర్వేరుగా అందజేశారు. దాతల కుటుంబాలకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం సూపరింటెండెంట్ సత్యనారాయణ, ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ వారికి విరాళం రసీదుతో పాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

దాతలు కృష్ణమూర్తి, వి.పి.ఎన్.కుమార్ కుటుంబ సభ్యులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న రమేష్, సత్యనారాయణ

రమేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రసంగిస్తున్న వెంకటేశ్వరరావు మాదిగ

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : కర్నూలు జిల్లాలో కులాంతర వివాహం చేసిన రమేష్ మాదిగపై దాడి చేసి, చంపడం దారుణమని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళతానని పేర్కొన్నారు. బుధవారం ధర్నా చౌక్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాయలసీమలో ఇటీవల మాదిగలపై దాడులు, హత్యలు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. దోషులపై కేసులు నమోదు చేసి.. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా సత్వర న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తెదేపా ప్రభుత్వం మాదిగలకు అండగా నిలవాలని పేర్కొన్నారు. త్వరలోనే మాదిగ ఐకాస ఏర్పాటు చేస్తామని నాయకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ, దాసరి సువర్ణరాజు, బి.సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు మేనేజర్ల హక్కుల సాధనకు పోరాటం

వేడుకల్లో పాల్గొన్న ఏఐజీసీ సభ్యులు తదితరులు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : రాబోయే 8వ వేతన సంఘంలో రైల్వే ట్రైన్ మేనేజర్లకు మెరుగైన ప్రయోజనాలు లభించేలా ఆలిండియా గార్డ్స్ కౌన్సిల్ కృషి చేస్తుందని ఏఐజీసీ మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.సింగ్ అన్నారు. దక్షిణ మధ్య రైల్వే ఆలిండియా గార్డ్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో బుధవారం హనుమంతరాయ గ్రంథాలయంలో 61వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రైన్ మేనేజర్ల సమస్యలు, హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. ఉద్యోగులంతా ఐక్యంగా ఉంటూ పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విజయవాడ డివిజనల్ కార్యదర్శి కె.మోహన్‌దాస్, కె.శ్రీకాంత్, రాజేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలతో అగ్ని ప్రమాదాలు దూరం

నగరపాలక సంస్థ: ముందు జాగ్రత్తలతో అగ్ని ప్రమాదాలు నివారించవచ్చని నగరపాలక సంస్థ అగ్నిమాపక విభాగం అధికారి మాల్యాద్రి పేర్కొన్నారు. సూర్యారావుపేట, ఎంజీ రోడ్డులోని ఆసుపత్రులను అగ్నిమాపక విభాగం అధికారులు బుధవారం పరిశీలించారు. మాల్యాద్రి మాట్లాడుతూ... మంటలు ఆర్పే పరికరాలను దుకాణాలు, షోరూంలు, ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచాలని తెలిపారు. అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. మంటలు ఆర్పే పరికరాలను వినియోగించే తీరును తెలియజేశారు. అగ్నిమాపక విభాగం అధికారి నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

పాయకాపురం, న్యూస్‌టుడే : అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి వాంబేకాలనీలో చోటుచేసుకుంది. నున్న పోలీసుల వివరాల మేరకు.. పాయకాపురానికి చెందిన పళ్ళ రమ్య(27), సమీప బంధువు అయిన పోలిశెట్టి రాంబాబును పదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వాంబేకాలనీలో నివాసం ఉంటున్నారు. రమ్య.. సత్యనారాయణపురంలో ఓ బ్యాంకులోని ఆధార్ సెంటర్‌లో పని చేస్తున్నారు. నెల రోజుల నుంచి విధులకు వెళ్లడం లేదు. తన ఐడీతో వేరే వ్యక్తికి శిక్షణ ఇస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం ఆమె తన తండ్రి కనకరాజుకు ఫోన్ చేయగా.. లిఫ్ట్ చేయలేదు. రాత్రి తమ అల్లుడు ఫోన్ చేసి త్వరగా ఇంటికి రావాలని చెప్పగా. . అక్కడికి వెళ్లామని రమ్య తల్లి కాసులు తెలిపారు. ఇంట్లో ఫ్యాన్‌కి ఉరేసుకుని తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. భర్త వేధింపులతో ఆమె చనిపోయిందని ఆరోపిస్తున్నారు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

పాయకాపురం: ఇంటి నుంచి వెళ్లిన తన భర్త ఇంకా తిరిగి రాలేదని పాయకాపురానికి చెందిన సాయిదుర్గ నున్న పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు. పాయకాపురం, రామాపురానికి చెందిన తిరుపతిరావు, సాయిదుర్గాలు భార్యాభర్తలు. వీరికి ఒక బాబు సంతానం. భర్త క్యాటరింగ్ పనులకు వెళుతుంటారు. గత ఏడాది ఆగస్టు 2న పనికి వెళ్లారు. తిరిగి రాకపోవడంతో సాయంత్రం ఫోన్ చేస్తే.. స్విచ్ఛాఫ్ వచ్చింది. మూడు రోజుల తర్వాత ఫోన్ చేస్తే.. ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లో ఫోన్ తాకట్టు పెట్టినట్లు దుకాణం నిర్వాహకుడు తెలిపారు. గతంలో ఒకసారి ఇంటి నుంచి వెళ్లిపోయిన భర్త.. అయిదు నెలల తర్వాత వచ్చారని.. ఈసారి అలానే వస్తారనుకున్నానని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన భర్త ఆచూకీ తెలపాలని కోరగా.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

(c) eenadu

ఆలోచనలు విరియాలి.. ఆవిష్కరణలు మెరవాలి..!

ఈనాడు

ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. పాఠశాల స్థాయిలోనే సృజనాత్మకత వెలికితీసేందుకు 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' నిర్వహిస్తోంది. వినూత్న ఆలోచనలతో ప్రయోగాలు చేసేలా ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా 'డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ హాల్, బుల్లయ్య కాలేజ్ పక్కన, రామా టాకీస్ దరి, విశాఖపట్నం'లో ఫిబ్రవరి 24వ తేదీన మెగా సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తోంది.

GGU
GODAVARI GLOBAL UNIVERSITY
RAJAMAHENDRAVARAM, A.P.
Call: 994 999 3483 | www.ggu.edu.in

నిబంధనలు.. ● 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు మాత్రమే. ● ప్రాజెక్టును ముందుగా నమోదు చేసుకోవాలి. ● ఒక ప్రాజెక్టుకి ఇద్దరు విద్యార్థులకు అనుమతి. ● పాఠశాల/ బ్రాంచ్‌కి ఒక ప్రాజెక్టుకు మాత్రమే అనుమతి. ● మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులు ఉంటాయి. ● పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం. రిజిస్ట్రేషన్ చివరి తేదీ : ఫిబ్రవరి 20

నమోదు కొరకు: 8639814432
సమయం: ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గం॥ల వరకు..

అసౌకర్యాలకు తావులేకుండా ఇంటర్ పరీక్షలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ విద్యార్థులకు ఈనెల 23 నుంచి మార్చి 24 వరకు నిర్వహించనున్న పరీక్షలు సక్రమంగా జరిగేలా చూడాలని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షకులు (ఆర్ఐఓ) పి. మురళీధర్ తెలిపారు. విశాఖపట్నం నగరంలోని బుల్లయ్య కళాశాలలో బుధవారం పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల పక్కాగా జరిగేలా సీఎస్‌లు, డీఓలు చూడాలన్నారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేలా ముందుగానే సంబంధిత కళాశాలల యాజమాన్యాలు ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులు జె. వివేకానందరావు, ఎ. శ్రీనివాసరావు, పి. దుర్గా ప్రసాదరావు, రాంప్రసాద్, పవన్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నౌకల పండగ.. అంబరాన్నంటగా..!

నౌకల నుంచి అబ్బురపరిచిన లేజర్ షో

ఈనాడు, విశాఖపట్నం : విశాఖ తీరంలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ యుద్ధ నౌకల సమీక్ష (ఐఎఫ్ఆర్) నావికాదళం సత్తా చాటింది. 66 భారత యుద్ధ నౌకలు, 19 విదేశీ నౌకలు..60కిపైగా విమానాలు.. 3 జలాంతర్గాములు.. మొత్తం 74 దేశాలు భాగస్వామ్యమయ్యాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఐఎన్ఎస్ సుమేధలో ప్రయాణిస్తూ యుద్ధ నౌకల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. సుమారు మూడు గంటల పాటు సాగిన ఈ కార్యక్రమం ఆద్యంతం విశేషంగా ఆకట్టుకుంది. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి ప్రయాణించే నౌక ముందూ వెనుక హెలికాప్టర్ల విన్యాసాలు

విన్యాసాలను తిలకిస్తున్న నౌకాదళ అధికారులు, కుటుంబ సభ్యులు

రాష్ట్రపతికి జ్ఞాపిక అందిస్తున్న నౌకాదళ ప్రధానాధికారి అడ్మిరల్ దినేష్ కుమార్ త్రిపాఠి. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు

ఫ్లీట్ రివ్యూలో సతీసమేతంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

కనువిందు చేసిన జలాంతర్గామి

ఆకట్టుకున్న కళాకారుల నృత్య ప్రదర్శన

★ ఐఎన్ఎస్ సుమేధలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సమీక్ష
★ మూడు గంటల పాటు సాగిన ఐఎఫ్ఆర్
★ హాజరైన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

అంతర్జాతీయ యుద్ధ సమీక్షలో భాగంగా రాష్ట్రపతి ప్రయాణిస్తున్న ఐఎన్ఎస్ సుమేధ నౌక

కట్టిపడేసిన విన్యాసాలు...

ఆర్కే బీచ్‌లో అలరించిన తుది రిహార్సల్స్

ఈనాడు, విశాఖపట్నం: ఐఎఫ్ఆర్‌లో భాగంగా బుధవారం ఆర్కే బీచ్‌లో ఫైనల్ రిహార్సల్స్ అంగరంగ వైభవంగా నిర్వహించారు. మార్కోస్ (అత్యున్నత శిక్షణ పొందిన మెరైన్ కమాండోలు) హెలికాప్టర్ల నుంచి సముద్రంలోకి దిగడం తదితర విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఆయిల్ రిగ్ పేల్చివేత, యుద్ధ విమానాల నుంచి శత్రువులపైకి బాంబులు జారవిడిచే ప్రదర్శనలు వీక్షకులను కట్టిపడేశాయి. యుద్ధనౌకల నుంచి హెలికాప్టర్లు, ఫైటర్ జెట్లు ఎగరడం, కచ్చితంగా ల్యాండ్ అవ్వడం వంటివి 'హెలో ల్యాండింగ్ డెమో' పేరుతో నిర్వహించారు. తీరంలో మోహరించిన యుద్ధ నౌకలు, 19 విదేశీ నౌకలు విద్యుద్దీపాల వెలుగులతో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ★ సిటీ పరేడ్ రిహార్సల్స్‌లో భాగంగా వివిధ దేశాల నావికా దళ సిబ్బంది వారి సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా బ్యాండ్లతో బీచ్ రోడ్డులో కవాతు నిర్వహించారు. ప్రధాన వేదిక వద్ద రైఫిల్స్‌తో కంటిన్యూటీ డ్రిల్, ఎన్‌సీసీ క్యాడెట్లు నృత్యం ప్రదర్శించారు. అనంతరం మిరుమిట్లు గొలిపే బాణసంచా పేలుళ్లు, లేజర్ షో, డ్రోన్ షోలు తీరాన్ని వర్ణరంజితం చేశాయి.

సమీక్షలో యుద్ధ నౌకలు

పరేడ్‌లో 150 ఏళ్ల వందేమాతరం శకటం

కవాతులో తుపాకులతో ప్రదర్శన

డ్రోన్లతో భారతదేశ ఆకృతి

మేమంతా భారతీయులం

ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ కార్యక్రమాన్ని బుధవారం నాతవరం జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కె.సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. భారత దేశంలోని విభిన్న పరిస్థితులు, ఆచారాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పలు రాష్ట్రాల్లో మాట్లాడే భాషలు, వాటి ప్రత్యేకతలు వివరించారు. ఈ సందర్భంగా దేశంలోని విభిన్న సంస్కృతులకు అద్దంపట్టేలా సంప్రదాయ వస్త్రధారణతో బాలికలు మెప్పించారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు అనూరాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. – నాతవరం, న్యూస్‌టుడే

ఉచిత న్యాయ సహాయం అందిస్తాం

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఎలమంచిలి సబ్ జైలును జిల్లా న్యాయసేవా సంస్థ అధికారి ఆర్.సన్యాసినాయుడు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన జైలులో ఖైదీల కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయం కావాలంటే వారికి వకీలును కేటాయించి బెయిల్ పెట్టిస్తామన్నారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేశారు. ఖైదీల ఆరోగ్యం క్షీణిస్తే వైద్య పరీక్షలు చేయిస్తామని చెప్పారు. అనంతరం కొక్కిరాపల్లి గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో భోజన సదుపాయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవడానికి లక్ష్యం నిర్దేశించుకోవాలని విద్యార్థులకు సూచించారు. సబ్ జైలు హెడ్ వార్డెన్ సుబ్బారావు, న్యాయవాది నూకరాజు పాల్గొన్నారు.

రికార్డులు తనిఖీ చేస్తున్న సన్యాసినాయుడు

ఇక్కడ వంట.. అక్కడ వడ్డన!!

రోలుగుంట, న్యూస్‌టుడే: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకం పక్కాగా అమలు చేయడానికి కసరత్తు కొనసాగుతోంది. కొన్ని చోట్ల మాత్రం అలా కాకుండా సమీపంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలకు చెందిన స్థలాల్లో సిబ్బందితోనే తయారు చేయించి కాలేజీలకు వాహనాలపై తరలించి వడ్డిస్తున్నారు. దీంతో విద్యార్థులు చల్లారిపోయిన ఆహారం తినాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. దీంతోపాటు పదోతరగతి పిల్లలతో సమానంగా అందరికీ రేషన్ కేటాయించడంపైనా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

➤ జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలుండగా వీటిలో మొదటి సంవత్సరం 3,415 మంది, రెండో ఏడాదిలో 2,816 వరకూ చదువుతున్నారు. ప్రభుత్వం రూపొందించిన మెనూ ప్రకారం వీరికి పదోతరగతి పిల్లలతో సమానంగానే రేషన్ కేటాయిస్తున్నారు. ప్రస్తుతం పదోతరగతి విద్యార్థికి 150 గ్రాముల బియ్యం, 30 గ్రాముల పప్పు, 50 గ్రాముల కూరగాయలు, 5 గ్రాముల నూనె చొప్పున కేటాయిస్తున్నారు. అదే నిష్పత్తిలో ఇంటర్ విద్యార్థులకూ అందజేస్తున్నారు.

రోలుగుంట కళాశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

➤ వండిన ఆహారాన్ని వేడిగా ఉన్నప్పుడే విద్యార్థులకు అందించాలనే ఉద్దేశంతో వాహనాల్లో తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కోసారి పదార్థాలు చల్లారిపోవడం, దుమ్మూ, ధూళి వాటిపై పడి పాడవుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు పెదవి విరుస్తున్నారు. కళాశాలల్లో వంటషెడ్లు నిర్మిస్తే ఈ సమస్యలుండవని సూచిస్తున్నారు. ప్రధానంగా శీతాకాలం, వేసవిలో రవాణాలో ఇబ్బంది లేకపోయినా వర్షాకాలంలో రవాణాలో అవస్థలు తప్పవని చెబుతున్నారు.

▶▶ **షెడ్ల ఏర్పాటుకు స్థలాల పరిశీలన:** జిల్లాలో ప్రభుత్వ కాలేజీల్లో చాలా ప్రాంగణాలు ఇరుకుగానే ఉన్నాయి. అయినప్పటికీ వంటషెడ్లను ప్రభుత్వం మంజూరు చేసే అవకాశముంది. దీని కోసం కాలేజీల్లో స్థలాల వివరాలను సేకరిస్తున్నాం. ప్రస్తుతం హైస్కూల్లో వంటలు చేస్తున్నప్పటికీ ఇంటర్ విద్యార్థుల వంటపాత్రలు ప్రత్యేకం. దీనికితోడు రోజూ వడ్డించే ముందు ఆహారాన్ని నాణ్యత పరీక్షించి పెడుతున్నాం. – **వినోద్‌బాబు, ఇంటర్‌బోర్డు అధికారి, అనకాపల్లి**

సహిత విద్యలో సాంకేతిక వెలుగు

దివ్యాంగుల సమగ్ర అభివృద్ధికి 'దృష్టి' ప్రాజెక్టు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: దివ్యాంగుల భవిత మరింత ఉజ్వలం కానుంది. సహిత విద్య ఇప్పుడు సమూల మార్పులతో సరికొత్తగా అందుబాటులోకి వస్తోంది. వీరి సమగ్ర అభివృద్ధికి 'దృష్టి' ప్రాజెక్టు సిద్ధమైంది. ఇన్నాళ్లు చోటు చేసుకున్న తప్పిదాలు, పథకాల దుర్వినియోగం తదితర అన్ని అవకతవకలకు అడ్డుకట్ట పడనుంది. దీని అమలుకు వీలుగా ఇప్పటికే ప్రత్యేక అవసరాల పిల్లలు, వారి తల్లిదండ్రుల సమస్త సమాచారాన్ని ప్రత్యేక ఉపాధ్యాయులు తమ ట్యాబ్‌లలో నమోదు చేస్తున్నారు.

దివ్యాంగ విద్యార్థిని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయుడు

★ రాష్ట్ర సమగ్ర శిక్షా పీడీ శ్రీనివాసరావు చొరవతో 'దృష్టి' ప్రాజెక్టు రూపుదిద్దుకుంది. 'డిజిటల్ హోలిస్టిక్ రిసోర్స్ ఫర్ ఇన్‌క్లూజివ్ సపోర్ట్, హైబ్రిడ్ థెరపీ అండ్ ఇన్వెన్షన్'గా దీనిని పేర్కొంటున్నారు. ఇందులో డిజిటల్ సాంకేతికతతో సహిత విద్యను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లేలా కార్యక్రమాలు రూపొందించారు. దివ్యాంగుల రోజువారీ హాజరు, ఉపాధ్యాయుల బోధన వంటివి రియల్ టైం ట్రాకింగ్ ద్వారా అందరికీ స్పష్టం కానున్నాయి. పూర్తి పారదర్శకతతో పిల్లల సాంకేతిక విద్య పురోగతి, వారికి అన్ని సౌకర్యాలు సమకూరుతున్నదీ, లేనిదీ ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు.

★ అన్నివిధాలా దివ్యాంగ విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రవేశపెట్టిన డిజిటల్ ఉద్యమం ఈ ప్రాజెక్టు అని పర్యవేక్షణ అధికారి **మహాలక్ష్మినాయుడు** తెలిపారు. వారిలో అన్ని రకాల నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు దోహదపడుతుందన్నారు.

★ ఈ ప్రాజెక్టుపై ఇటీవల ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలంలోని తోటపల్లిలో రాష్ట్రంలోని భవిత కేంద్రాలు ప్రత్యేక ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ తరగతులు చేపట్టారు. ఈ ప్రాజెక్టు క్షేత్రస్థాయి పర్యవేక్షణ అధికారులుగా జిల్లాలోని మేడివాడ ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడు, విజయనగరం జిల్లా తెర్లాం ఉపాధ్యాయుడు సునీల్ నియమితులయ్యారు. వీరు ప్రస్తుతం అనకాపల్లి జిల్లా సమగ్ర శిక్షా ఏపీసీ అప్పారావు ఆదేశాలతో జిల్లాలోని భవిత కేంద్రాల్లోని పిల్లలు వారి తల్లిదండ్రుల పూర్తి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్న కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

ఆక్వాకు ఆసరా.. నాణ్యతకు భరోసా!

రైతులకు అందుబాటులో ఆక్వా కల్చర్ ప్రయోగశాలలు

నక్కపల్లి, న్యూస్‌టుడే

రొయ్యలు, చేపలు.. మాంసాహార ప్రియులకు ఎంతో ప్రత్యేకం. వీటి సాగు ద్వారా జిల్లాలో రూ.వందల కోట్ల వ్యాపారం జరుగుతుండగా, సాగులో వివిధ పరీక్షలుచేసే ప్రయోగశాలలు మత్స్య రైతులకు అందుబాటులోకి వచ్చాయి. తద్వారా నాణ్యమైన మత్స్యసంపద ఉత్పత్తికి ఇవి ఉపయోగపడనున్నాయి.

జిల్లాలోని ఆరు మండలాల పరిధిలో తీరప్రాంతాన్ని ఆనుకుని రొయ్యలు, చేపల పెంపకం చేస్తుంటారు. దీంతోపాటు చీడికాడ, దేవరాపల్లి, మాడుగుల మండలాల్లో 1,862 చెరువుల పరిధిలో 2,847 ఎకరాల్లో ఆక్వాకల్చర్ ఉంది. ఇందులో మూడొంతుల విస్తీర్ణంలో రొయ్యలు పెంచుతున్నారు. ఆక్వా రైతులు సాగు విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోకుంటే నష్టాలు తప్పవు. వీటిని పెంచడానికి ముందే మట్టి, నీటి స్వభావంతోపాటు, పెంపకానికి తెచ్చే సీడ్ (విత్తనం) నాణ్యతను పరీక్షించుకోవాలి. ఇవన్నీ చేయించుకోవాలంటే కాకినాడలోని మత్స్య ప్రయోగశాలకు తీసుకెళ్లేవారు. దీంతో జిల్లాలోని రైతులకు ఇది ఇబ్బందిగా ఉండేది. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పాయకరావుపేట, ఎలమంచిలిలో ఆక్వా కల్చర్ ప్రయోగశాలలు నిర్మించారు. ఒక్కోదానికి రూ. 82 లక్షలు వెచ్చించారు. గత ప్రభుత్వం వీటిని పట్టించుకోకపోవడంతో ఇక్కడ ఎలాంటి ప్రయోగాలు జరగలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రయోగశాలలను పట్టాలెక్కించింది. ఈ మేరకు అవసరమైన రసాయనాలను కాకినాడ నుంచి రప్పించి గతేడాది నుంచి వీటిని మనుగడలోకి తెచ్చారు. ఈ మేరకు మత్స్యశాఖ ఉద్యోగులు ప్రత్యేకంగా శిక్షణ పొందారు. పరీక్షల నిమిత్తం రైతులు నిర్దేశిత రుసుం ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది.

పరీక్షలు చేస్తున్న ఉద్యోగులు

పరీక్షల ఫీజు వివరాలిలా

- ➤ నీటి పూర్తిస్థాయి విశ్లేషణకు: **రూ. 700**
- ➤ మట్టి పరీక్షలకు: **రూ. 200**
- ➤ రొయ్య/చేప సీడ్ పరీక్ష: రైతులకు ఉచితం, హేచరీలకు **రూ.50లు**
- ➤ చెరువులో రొయ్య/చేప తెగుళ్లు గుర్తించడానికి: ఉచితం
- ➤ తెగులుకి సంబంధించి బ్యాక్టీరియా/వైరస్/పారాసైట్ గుర్తించడానికి: **రూ.100**

జిల్లాలో ఆక్వాకల్చర్ ఇలా (విస్తీర్ణం ఎకరాల్లో)

మండలం	చెరువులు	విస్తీర్ణం
పరవాడ	119	220
అచ్యుతాపురం	22	42
రాంబిల్లి	493	685
ఎస్.రాయవరం	477	746
నక్కపల్లి	224	291
పాయకరావుపేట	453	686
దేవరాపల్లి	72	150
చీడికాడ	6	4.7
మాడుగుల	6	13

నాణ్యతతోనే ఆదాయం: జిల్లాలో మత్స్య సంపద సాగు ఏటా పెరుగుతోంది. ప్రస్తుతం అమెరికా టారిఫ్‌లు తగ్గడంతో మరింత మంది సాగుకు సిద్ధమవుతున్నారు. ముందుగా అవసరమైన పరీక్షలు చేయించుకుంటే నాణ్యతతో కూడిన దిగుబడులు వస్తాయి. ఇలాంటి రొయ్యలనే వియత్నాం, అమెరికా, సింగపూర్‌తో పాటు యూరప్ దేశాలకు ఎగుమతి చేస్తారు. నాణ్యత ఉంటేనే ఆదాయమూ వస్తుంది. ప్రయోగశాలలను ఆక్వా రైతులంతా సద్వినియోగం చేసుకోవాలి.
– పి.శృతి, మత్స్యశాఖ అధికారి

సంకల్ప కళాగ్రామానికి స్వాగతం

పెందుర్తి, న్యూస్‌టుడే: విశాఖ వేదికగా జరుగుతున్న అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ నగరానికి తలమానికంగా నిలవగా పెందుర్తి మండలానికి కూడా కీలక పాత్ర దక్కింది. ఈ నెల 20వ తేదీన సుమారు 50 దేశాలకు చెందిన వంద మంది నేవీ డెలిగేట్ల బృందం పెందుర్తి మండలం పెదగాడి సమీప సంకల్ప కళాగ్రామాన్ని సందర్శించనుంది. ఆ రోజు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరిగే కార్యక్రమంలో దేశ విదేశాలకు చెందిన నేవీ అధికారులు, సిబ్బంది వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని కళాగ్రామం నిర్వాహకులు ఆకుల చలపతిరావు తెలిపారు. ఈ మేరకు కళాగ్రామాన్ని ముస్తాబు చేస్తున్నారు.

★ నేవీ బృందం కళాగ్రామం సమీప పొలంలో కూరగాయల పెంపకం, కొయ్య బొమ్మల తయారీ, నూలు వస్త్రాల నేత ప్రక్రియ, పూలకుండీల తయారీని పరిశీలిస్తారు.

90వ జయంతి ఉత్సవాలు



రక్తదానం చేయండి.. నిండు ప్రాణాన్ని కాపాడండి
మన అభిమాన నాయకులు, మన అందరికీ మార్గదర్శి, ప్రజల హృదయాలలో సుస్థిర స్థానం పొందిన ప్రజానేత
కీ॥శే॥ పెతకంశెట్టి అప్పల నరసింహం Ex. MP గారి
ఆత్మీయులు, శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా మనవి.

తేది & సమయం : 19-02-2026 (గురువారం) ఉ.గం. 7.30 ని॥లకు
వేదిక : డైమండ్ పార్క్‌లోని కీ॥శే॥ అప్పలనరసింహం గారి కాంస్య విగ్రహం వద్ద నివాళులు అర్పించుట.

తేది. 19-02-2026 (గురువారం) ఉ.గం. 9.00 ని॥లకు
గౌ॥ శ్రీ పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) ప్రభుత్వ విప్ & పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు మెయిన్ రోడ్, గోపాలపట్నం వారి ఇంటి వద్ద కాంస్య విగ్రహానికి నివాళులు అర్పించుట.
రక్తదాన శిబిరం ఉ॥ 7.00 నుంచి సా॥ 6.00 గం॥ల వరకు జరుగును.

మరియు అనకాపల్లి, మునగపాక మండలం, నాగులాపల్లి గ్రామం వద్ద ఉదయం 9:30 గం॥లకు వారి విగ్రహానికి నివాళులు అర్పించుట.

ఇట్లు... ఆహ్వాన సంఘం

విజయవాడకు ఆర్టీసీ శీతల శయన బస్సు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖపట్నం నుంచి విజయవాడకు రోజూ రాత్రి 9.30 గంటలకు ఆర్టీసీ శీతల శయన బస్సు అందుబాటులో ఉంటుందని ప్రాంతీయ మేనేజర్ అప్పలనాయుడు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం బుధవారం నుంచి సీట్ కమ్ స్లీపర్ బస్సు ప్రారంభించామన్నారు. అలాగే ప్రస్తుతం విజయవాడకు నడుస్తున్న శీతల బస్సుల సమయాల్లో మార్పులు చేశామన్నారు. కొత్త సమయాలు ఉదయం 6, 8, 11 గంటలు.. మధ్యాహ్నం 12.30, రాత్రి 9.30 గంటలుగా నిర్ణయించామన్నారు.

'వందేభారత్' రైళ్ల సమయాల మార్పు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: సికింద్రాబాద్-విశాఖపట్నం, దుర్గ్-విశాఖపట్నం నడుమన రాకపోకలు సాగించే వందేభారత్ రైళ్ల సమయాల్లో స్వల్ప మార్పులు జరిగాయని వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. ఈనెల 20 నుంచి సికింద్రాబాద్-విశాఖ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 1.50 గంటలకు, దుర్గ్-విశాఖ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 1.55 గంటలకు విశాఖ చేరుకుంటాయన్నారు.

పగలు ఖాళీ.. రాత్రుళ్లు లూటీ

ఈనాడు డిజిటల్, అనకాపల్లి

జిల్లాలో గ్రావెల్ తవ్వకందారుల దందాకు అడ్డుకట్ట పడటం లేదు. గత ప్రభుత్వ హయాంలో చెలరేగిపోయిన వారు ఇటీవల కాలంలో మళ్లీ విజృంభించారు. రాత్రయితే చాలు.. కొండలను కొల్లగొట్టేస్తూ.. జేబులు నింపుకొంటున్నారు. కూటమి నేతలు ఈ దందాకు అడ్డుకట్ట వేయకపోగా తమవంతు మద్దతు ఇస్తున్నారు. అనకాపల్లి రూరల్, సబ్బవరం, చోడవరం మండలాల్లో తవ్వకాలపై ఫిర్యాదులు వస్తున్నా అధికారులు అడ్డుకట్ట వేసే దిశగా అడుగులు వేయడం లేదు. పగలు ఖాళీగా కనిపిస్తున్న క్వారీలు రాత్రయితే వాహనాలు, యంత్రాలతో నిండిపోతున్నాయి.

★ అనకాపల్లి మండలం సంపతిపురం సర్వే నం. 2లోని కొండవాలులో పేదలకు ఇంటిస్థలాలు కేటాయించారు. ఇక్కడ ప్రతిరోజూ రాత్రి 11 గంటలు దాటిన తర్వాత భారీ యంత్రాలతో తవ్వేస్తూ అనకాపల్లి పరిసర ప్రాంతాల్లోని ఇంటి పునాదులకు, లేఅవుట్ల చదునుకు వేస్తున్నారు. రామాపురం కాలనీ సమీపంలోని బ్రిడ్జిమీదుగా అనకాపల్లి పట్టణం గుండా మట్టిలారీలు రాత్రివేళ రయ్‌రయ్ మంటూ తిరుగుతున్నా.. కనీసం పట్టించుకోవడం లేదు.

అనకాపల్లి గ్రామీణం సంపతిపురం కొండవాలు ప్రాంతంలో తవ్వకాలు

▶▶ సబ్బవరం మండలం గ్రావెల్ దందాకు అడ్డాగా మారింది. నిన్న, మొన్నటివరకు గుట్టుచప్పుడు కాకుండా తవ్వకాలు సాగించిన వారు ఇప్పుడు బరితెగించారు. గంగవరం, వెదుళ్లనరవ, నంగినారపాడు, అసకపల్లి, రాయపుర అగ్రహారం, గాలిభీమవరం గ్రామాలను ఆనుకొని ఉన్న కొండవాలులో తవ్వకాలు చేస్తున్నారు. గతంలో వైకాపాలో చక్రం తిప్పినవారే ఇప్పుడు కూటమి నేతలతో జతకట్టారు. ఇప్పటివరకు ట్రాక్టర్లతో సాగిన దందా.. ఇప్పుడు భారీ లారీల స్థాయికి చేరింది. కొన్నాళ్ల క్రితం గాలిభీమవరం, అసకపల్లి గ్రామాల ప్రజలు దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా.. అడపాదడపా తనిఖీలు చేసి మమ అనిపించేశారు.

▶▶ చోడవరం మండలం వెంకన్నపాలెం, దుడ్డుపాలెం, సేమునాపల్లి గ్రామాల పరిధిలోని కొండలు, చెరువు ప్రాంతాలకు రాత్రి 10 గంటల తర్వాత వాహనాలు వరుస కడుతున్నాయి. ఇక్కడ ఎక్కడా తవ్వకాలకు అనుమతులు లేకపోయినా.. నేతల పేర్లు చెప్పి దందా సాగిస్తున్నారు. దూరాన్ని బట్టి సొమ్ము వసూలు చేస్తున్నారు. మైనింగ్, రెవెన్యూ అధికారులు తెలిసినా.. కనీసం తనిఖీలు చేయడం లేదు.

▶▶ **సహజవనరులను కొల్లగొడితే చర్యలు..:** ప్రభుత్వ నిర్మాణాలకు గ్రావెల్‌ను తరలించుకునేందుకు అనుమతులు ఇచ్చాం. అనధికారికంగా తవ్వడం నేరం. అనుమతులు తప్పనిసరి. అక్రమ గ్రావెల్ తవ్వకాలపై ఫిర్యాదులు అందిన వెంటనే క్షేత్రస్థాయి సిబ్బందిని పంపించి పరిశీలిస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా సహజవనరులను కొల్లగొడితే కఠిన చర్యలు తప్పవు.
- శ్రీనివాస్, మైనింగ్ ఏడీ, అనకాపల్లి

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

భవన నిర్మాణ రంగ కార్మికులకు ఊరట

పథకాల అమలుకు కూటమి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

పాయకరావుపేట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ రంగ కార్మికులకు ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. వీరికి సంబంధించిన అన్ని పథకాలను యథావిధిగా అమలు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో తాపీమేస్త్రిలు, కార్మికుల్లో ఆనందం వెల్లువెత్తుతోంది.

సభ్యత్వాలు నమోదు చేసుకుంటున్న కార్మికులు

■ గత తెదేపా ప్రభుత్వ పాలనలో 2014 నుంచి 19 వరకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఆధ్వర్యంలో 11 సంక్షేమ పథకాలను అమలు చేశారు. వైకాపా పాలనలో ఈ పథకాలను పక్కన పెట్టారు. బోర్డును ఉత్సవ విగ్రహంగా మార్చేశారు. అప్పటివరకు తాపీమేస్త్రిల కుటుంబంలో అమ్మాయిల వివాహానికి రూ. 20 వేలు ఆర్థిక సాయం అందించేవారు. కార్మికుడు సహజ మరణం పొందితే రూ.2 లక్షలు, అంగవైకల్యం శాతానికి అనుగుణంగా రూ.లక్ష నుంచి 2 లక్షలు సాయం చేసేవారు. ప్రమాదవశాత్తు చనిపోతే 5 లక్షలు వచ్చేది. ఆసుపత్రిలో ఉంటే వైద్య ఖర్చులు కింద రోజుకు రూ.500 ఇచ్చేవారు. ప్రసూతి సాయం రూ. 20 వేలు అందించేవారు. ప్రస్తుతం ఈ పథకాలన్నీ బోర్డు ద్వారా అందించేందుకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. జిల్లా వ్యాప్తంగా నిర్మాణ రంగంలో సుమారు 60 వేల మంది కార్మికులు ఉన్నారు. తాజా నిర్ణయంతో కార్మికుల సభ్యత్వాల నమోదు, పాతవి రెన్యువల్‌కు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

■ **అవగాహన కల్పిస్తున్నాం...:** బోర్డులో సభ్యత్వాల నమోదుపై అవగాహన కల్పిస్తున్నాం. సంక్షేమ పథకాలకు దరఖాస్తులు స్వీకరించనున్నాం. భవన నిర్మాణ రంగ కార్మికుల్లో జిల్లావ్యాప్తంగా సగంమంది మాత్రమే రెన్యువల్ చేయించుకున్నారు. **– సుజాత, కార్మికశాఖ అధికారి**

పక్కాగా.. పడిగాపులు లేకుండా!

జిల్లా ఆసుపత్రికి ఫోరెన్సిక్ నిపుణులు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

హత్య, అత్యాచారం కేసులతో పాటు ఇతర నేరాల్లో నిందితుడికి కఠిన శిక్ష పడాలంటే పోస్టుమార్టం నివేదికే కీలకం. ఇందులో ఏ తేడా వచ్చినా తప్పు చేసిన వారు తప్పించుకునే అవకాశం ఉంది. పోస్టుమార్టం రిపోర్టును పక్కాగా ఉండేలా కేంద్రప్రభుత్వం మెడికో లీగల్ ఎగ్జామినేషన్, పోస్టుమార్టం రిపోర్టింగ్ సిస్టం ప్రవేశపెట్టింది. దీన్ని జిల్లాలో జనవరి నుంచి అమలు చేస్తున్నారు.

జిల్లా ఆసుపత్రి సముదాయంలో భవన నిర్మాణ పనులు

ఈ ఏడాది నమోదైన వివరాలు		
కేసులు	నివేదిక	విచారణలో ఉన్నవి
121	82	39

జిల్లా, ఏరియా, సామాజిక ఆసుపత్రుల పరిధిలో పనిచేస్తున్న వైద్య సిబ్బందికి, పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలకు ఐడీ నంబరు ఇస్తారు. ప్రమాదాలు జరిగే సమయాల్లో మృతిచెందడం, గాయపడడం, సహజ, అసహజ మరణాలను పోలీసులు ఐడీ నంబరులో నమోదు చేస్తారు. వైద్యులకు ఇచ్చే ఐడీ నంబర్‌లో ఆసుపత్రి వచ్చే వివరాలను నమోదు చేస్తారు. సంఘటనల ఆధారంగా వైద్యులు వెంటనే నివేదికను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తారు.

ఆలస్యం లేకుండా.. : పోస్టుమార్టం నివేదిక అలస్యం కాకుండా నిర్దేశించిన సమయంలో వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనివల్ల నివేదిక పక్కాగా రావడంతో పాటు సమయానికి వచ్చేలా ఏర్పాట్లు చేశారు. జిల్లా ఆసుపత్రికి ఫోరెన్సిక్ వైద్య నిపుణుడి పోస్టును భర్తీ చేశారు. ఈయన పర్యవేక్షణలో క్లిష్టమైన కేసులకు సంబంధించిన పోస్టుమార్టంలు చేయిస్తున్నారు. జిల్లా ఆసుపత్రిలో పోస్టుమార్టం భవనాన్ని ఆధునికీకరిస్తున్నారు. కార్పొరేట్ సామాజిక సేవా నిధులతో పనులు జరుగుతున్నాయి. కొత్తగా నాలుగు ఫ్రీజర్‌లను కొనుగోలు చేశారు.

వైద్య సిబ్బందికి శిక్షణ: కొత్త విధానంపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలోని 120 మంది వైద్యులకు ఐడీ నంబర్లు ఇచ్చాం. అన్ని ఆసుపత్రుల పరిధిలో కేసులను ఐడీలో నమోదు చేయాలి. దీన్ని బట్టి మరణానికి సంబంధించి నివేదికను వైద్యులు నిర్ధారిస్తారు. సహజ, అసహజ మరణాలను గుర్తించి అవసరమైన వాటిని పోస్టుమార్టం నిర్వహించి అన్ని ఆధారాలతో పక్కాగా నివేదిక తయారవుతుంది. మారిన కొత్త చట్టాలకు అనుగుణంగా నేరం చేసిన వారికి కఠిన శిక్షణ పడేందుకు ఈ రిపోర్టు దోహదపడుతుంది. **– డాక్టర్ మిరియాల రాకేష్, ఫోరెన్సిక్ నిపుణులు, జిల్లా ఆసుపత్రి**

రెవెన్యూ క్లినిక్ అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ

కలెక్టరేట్, న్యూస్‌టుడే: రెవెన్యూ క్లినిక్ అర్జీలను క్షేత్రస్థాయిలో విచారణ చేసి తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం రెవెన్యూ, సర్వే భూ రికార్డులు, పౌరసరఫరాల శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సేవల్లో సమయపాలన, పారదర్శకత పెంచాలన్నారు. అధికారులు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి రెవెన్యూ సేవల్లో ఆలస్యం లేకుండా ప్రజలకు సేవలు అందించాలన్నారు. జిల్లాలో వివాదరహిత భూరికార్డులు, బాధ్యతాయుత రెవెన్యూ పాలన కోసం అధికారులు మరింత చురుగ్గా పనిచేయాలని సూచించారు. ఆన్‌లైన్ సేవలు, భూ మ్యాపింగ్, రికార్డుల అప్‌డేషన్, మ్యుటేషన్ వంటి దరఖాస్తులు వంటి అంశాలపై కార్యాచరణ ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. తక్షణ లోపాలను సవరించాలన్నారు. నిర్దిష్ట సమయంలో నివేదికలు సమర్పించాలన్నారు. మండల స్థాయిలో తరచూ క్షేత్రస్థాయి పర్యటనలు తహసీల్దార్లు వెళ్లాల్సిందేనన్నారు. పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌లో వచ్చే అర్జీలను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. నీటి తీరువా పన్నుల వసూళ్లను ప్రతి మండల, గ్రామ స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సంయుక్త కలెక్టర్ శౌర్య మాన్ పటేల్, ఆర్డీఓ సత్యనారాయణ, ప్రత్యేక ఉప కలెక్టర్లు, ఆర్డీలు, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

కనీస వేతనం అమలు చేయాలని ఆందోళన

కలెక్టరేట్, న్యూస్‌టుడే: వీఆర్‌ఏలకు పేస్కేల్‌తో కనీస వేతనం అమలు చేయాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడు రవికుమార్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో వీఆర్‌ఏలు కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా కేవలం రూ. 10,500 వేతనం మాత్రమే ఇస్తున్నారని, స్పష్టమైన సర్వీస్ నిబంధనలు లేకపోవడంతో భవిష్యత్తుపై విషయంలో ఆందోళన చెందుతున్నామన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతికుమారి మాట్లాడుతూ అర్హత ఉన్న వీఆర్‌ఏలను ఖాళీగా ఉన్న వీఆర్వో పోస్టుల్లో తక్షణమే భర్తీ చేయాలని కోరారు. ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి సదుపాయాలు కల్పించాలని కోరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శంకరరావు మాట్లాడుతూ జిల్లాలో ఖాళీగా ఉన్న 1808 పైగా వీఆర్‌ఏ పోస్టులను భర్తీ చేయాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

మత్తు పదార్థాలకు బానిసైతే జీవితం దుర్భరం

మాకవరపాలెం, న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం దుర్భరంగా మారుతుందని నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం మత్తు పదార్థాల వినియోగ వల్ల అనర్థాలు, రవాణా, రహదారి భద్రతపై ఎన్.ఎస్.ఎస్. విభాగం, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. మోహనరావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ మత్తు పదార్థాల అలవాటు పడటం, ర్యాష్ డ్రైవింగ్ భవిష్యత్తును నాశనం చేస్తాయన్నారు. విద్యతో పాటు సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు నిరంతరం కష్టపడాలని ప్రిన్సిపల్ మోహనరావు అన్నారు. ఎస్సై దామోదరనాయుడు, ఏఓ లోహిత్ విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

సదస్సుకు హాజరైన విద్యార్థులు

వృత్తి పనివారలకు తోడ్పాటు

నర్సీపట్నం (గ్రామీణం), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం గ్రామోద్యోగ్ వికాస్ యోజన ద్వారా అందజేస్తున్న నైపుణ్య శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని నోడల్ అధికారి దేవరకొండ సుబ్రహ్మణ్యం కోరారు. వేములపూడి స్వరాజ్‌సంఘ్, నర్సీపట్నం దాయ్యానాయుడు ఆధ్వర్యంలో కేంద్రంలో నిర్వహిస్తున్న ఎంబ్రాయిడరీ టైలరింగ్ నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పదిహేను రోజుల శిక్షణ అనంతరం రూ. 25 వేల విలువ చేసే కుట్టు మిషన్ ఉచితంగా అందజేస్తామని వివరించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో అదనంగా ఏసీల మరమ్మతుపై శిక్షణ ఇచ్చేందుకు ప్రతిపాదించామన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా లంబసింగిలో గిరిజనులకు 400 తేనె పెట్టెలు అందజేశామన్నారు. కుండల తయారీకి శిక్షణ ఇచ్చి అనకాపల్లి జిల్లాలో 80 మందికి, తూర్పు గోదావరి జిల్లాలో 40 మందికి రూ. 20 వేల విలువ చేసే విద్యుత్తుతో నడిచే కుండల తయారీ చక్రాలను ఉచితంగా అందజేశామన్నారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లా రాజాంలో 20 మంది చొప్పున ఫుంకర్లకు రూ. 10 వేల విలువ చేసే పరికరాల కిట్లు ఇచ్చామన్నారు. పొందూరు ఖాదీ జీవ గుర్తింపు రావడంతో ఆన్‌లైన్‌లో ఖాదీ విక్రయాలు పెరిగాయని వెల్లడించారు. వేములపూడి స్వరాజ్‌సంఘ్ అధ్యక్షుడు ఇందల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సూచనలు ఇస్తున్న నోడల్ అధికారి సుబ్రహ్మణ్యం

పరిశ్రమలో ప్రమాదం.. కెమిస్ట్ దుర్మరణం

రాంబిల్లి, న్యూస్‌టుడే: చదువు పూర్తిచేసి.. ఉద్యోగంలో చేరి.. జీవితంపై ఎన్నో కలలు కన్న యువకుడి బతుకు పయనం అర్ధాంతరంగా ముగిసిపోయింది. అచ్యుతాపురం నాన్‌సెజ్‌లోని ఇన్నోవేర్ ల్యాబ్స్‌లో మంగళవారం రాత్రి అమ్మోనియా గ్యాసును సిలెండర్ నుంచి రియాక్టర్‌కు పంపించే క్రమంలో జరిగిన ప్రమాదంలో కెమిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.రాయవరం మండలం పెదగుమ్ములూరుకు చెందిన బొడ్డ అజయ్‌కుమార్ (21) దుర్మరణం చెందాడు. షిఫ్ట్ ఇన్‌ఛార్జిగా విధుల్లో ఉన్న గుంటూరుకు చెందిన జెర్రిపోతుల పోతురాజు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో బి షిఫ్ట్ విధుల్లో 19 మంది ఉన్నారు. ఈ సమయంలో రియాక్టర్‌కు నష్టం జరగకపోవడంతో ప్రమాద తీవ్రత తగ్గిందని ఉద్యోగులు చెబుతున్నారు.

ఇన్నోవేర్ ల్యాబ్స్‌లో ప్రమాదం జరిగిన ప్రాంతం

అజయ్‌కుమార్ (పాత చిత్రం)

అజయ్‌కుమార్ తండ్రి 15 ఏళ్ల క్రితం ఒక ప్రమాదంలో మృతి చెందాడు. తల్లి మంగ కష్టపడి కుమారుడిని చదివించింది. కూతురుకు వివాహం చేశారు. తన కలలు సాకారం చేసుకోవడం కోసం ఆ యువకుడు 17 నెలల క్రితం ఇన్నోవేర్ ల్యాబ్స్‌లో కెమిస్ట్‌గా చేరాడు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో తల్లి మంగ గుండెలవిసేలా రోదిస్తోంది. బాధిత కుటుంబాన్ని కంపెనీ యాజమాన్యం ఆదుకోవాలని బంధువులు కోరారు. మృతదేహానికి అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రిలో బుధవారం పోస్టుమార్టం పూర్తయిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామని సీఐ నరసింగరావు చెప్పారు. తల్లి మంగ ఫిర్యాదు మేరకు ఇన్నోవేర్ ల్యాబ్స్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. గాయపడిన పోతురాజును అచ్యుతాపురంలో ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించి అక్కడ చికిత్స అందిస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

రూ. కోటి పరిహారం ఇవ్వాలి: ఇన్నోవేర్ ల్యాబ్స్‌లో మంగళవారం రాత్రి అమ్మోనియా గ్యాస్ సిలిండర్ పేలిన ప్రమాదంలో దుర్మరణం చెందిన బొడ్డ అజయ్‌కుమార్ (21) కుటుంబానికి యాజమాన్యం రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండు చేశారు. బుధవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శులు ఆర్.రాము, జి.దేవుడునాయుడు, అచ్యుతాపురం మండల కన్వీనరు కె.సోమునాయుడు ఆందోళన చేపట్టారు.

కొత్తూరు (అనకాపల్లి): ఇన్నోవేర్ ల్యాబ్స్‌లో ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, గౌరవాధ్యక్షులు సత్యనారాయణ డిమాండ్ చేశారు. అనకాపల్లి సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాయకులు గంటా శ్రీరామ్, కె.ఈశ్వరరావు తదితరులతో కలిసి మాట్లాడారు. నిత్యం ఫార్మా పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

తాగునీటి చెరువులో వ్యర్థాలు

రాంబిల్లి, న్యూస్‌టుడే: నావికాస్థావరం ప్రాజెక్టుకు సమీపంగా ఉన్న నాలుగు పంచాయతీల్లో ఆయా గ్రామాల ప్రజలతో పాటుగా వలస కార్మికులు అధిక సంఖ్యలో ఉంటున్నారు. ఇదే స్థాయిలో వ్యాపార దుకాణాలు వెలిశాయి. సంపద కేంద్రాలున్నా చెత్తను తెచ్చి సమీపంగా ఉన్న మంచినీటి చెరువుల్లో పడేస్తున్నారు. గోవిందపాలెం, కొత్తపేట గ్రామాలకు సర్వేనంబరు-170లో 9.70 ఎకరాల విస్తీర్ణంలో రెండు చెరువులున్నాయి. చెరువుల్లోకి నీరు చేరే కాలువలు కప్పేయడంతో అవి బోసిపోతున్నాయి. దీని పక్కనే మూడు అంతస్తుల భవనం నుంచి ప్రధాన రహదారిని తవ్వేసి చెరువులోకి పైపులు నిర్మించారు. ఆ భవనం నుంచి వచ్చే వ్యర్థజలాలను చెరువులోకి విడిచిపెడుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి కె.హరీష్ వద్ద ప్రస్తావించగా చెరువులోకి వ్యర్థజలాలు వెళ్లకుండా కట్టడి చేస్తే కొందరు గ్రామపెద్దలే తనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. వ్యర్థ జలాల గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు కార్యదర్శి తెలిపారు.

గోవిందపాలెం చెరువులో వ్యర్థాలు

అప్పన్న హుండీ ఆదాయం రూ. 1.49 కోట్లు

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామి వారి హుండీ ఆదాయం లెక్కింపు బుధవారం సింహగిరిపై పరకామణి కేంద్రంలో జరిగింది. ఈవో జె.వెంకటరావు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది హుండీలు తెరచి లెక్కించారు. భక్తులు కానుకల రూపంలో సమర్పించిన నగదు రూ.1.49 కోట్లు పైచిలుకు సమకూరినట్లు ఈవో వెంకటరావు తెలిపారు. దీంతో పాటు 187.180 గ్రాముల బంగారం, 5.775 కిలోల వెండి, 13 దేశాలకు చెందిన విదేశీ నగదు లభ్యమైనట్లు వివరించారు. ఈ మొత్తం ఆదాయం 21 రోజులకు సంబంధించినదిగా తెలియజేశారు.

హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, సేవా కార్యకర్తలు

అల్లూరి జిల్లా రిజిస్ట్రార్‌గా నరసింహమూర్తి

నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లి సబ్ రిజిస్ట్రార్ **సీహెచ్ నరసింహమూర్తి**కి జిల్లా రిజిస్ట్రార్ (డీఆర్)గా పదోన్నతి లభించింది. పదోన్నతిలో భాగంగా ఈయన్ని అల్లూరి సీతారామరాజు జిల్లాకు కేటాయించారు.

జానకీరాంపురం సీఈఓ విధుల నుంచి తొలగింపు

రోలుగుంట: జానకీరాంపురం పీఏసీఎస్ సీఈఓ రామకృష్ణను విధుల నుంచి తొలగించారు. ఈ సొసైటీలో జరిగిన నిధుల దుర్వినియోగం, అవినీతికి సంబంధించి వచ్చిన ఆరోపణలు నిరూపణ కావడంతో ఆయనను విధుల నుంచి తొలగిస్తూ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారని ఉద్యోగ వర్గాలు తెలిపాయి.

సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.లక్ష్మణరావు, జి.రమణ, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం అనకాపల్లిలో ర్యాలీ నిర్వహించి, కూడళ్లలో నిరసన ప్రదర్శనలు చేశారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 తరువాత విధుల్లో చేరిన ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా శ్రీరామ్, నాయకులు వై.లక్ష్మణరావు, లోవరాజు, జగన్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ వద్ద ధర్నా చేస్తున్న పీఏసీఎస్ ఉద్యోగులు

దశల వారీగా ఉన్నత పాఠశాలల్లో స్కౌట్ యూనిట్లు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: జిల్లాలో అన్ని ఉన్నత పాఠశాలల్లోనూ దశల వారీగా స్కౌట్స్, గైడ్స్ యూనిట్లను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామని జిల్ల విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు తెలిపారు. అనకాపల్లి ఏఎంఏఎల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే జిల్లాలో 50 ఉన్నత పాఠశాలల్లో స్కౌట్ యూనిట్లు ఉన్నాయన్నారు. ఇప్పుడు రెండో దశలో 90 యూనిట్లను ఏర్పాటు చేశామన్నారు. దీంతో 140 కేంద్రాలు జిల్లాలో పని చేస్తాయన్నారు. వారందరికీ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు మంచి ప్రవర్తన, క్రమశిక్షణ, అంకితభావం, చిత్తశుద్ధితోపాటు శారీరక దారుఢ్యం అవసరమన్నారు. ముందుగా యూనిట్ల బాధ్యులకు శిక్షణ ఇస్తామని, వారి ద్వారా విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులంతా కృషి చేయాలని కోరారు. విద్యాశాఖ సహాయ సంచాలకుడు హుస్సేన్, శిక్షణ కన్వీనర్ స్వామినాయుడు, ఏఎంఏఎల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోరిబిల్లి లావణ్య, సంతోష్, సూరిశెట్టి అనసూర్య, మనోహర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఈఓ గిడ్డి అప్పారావు నాయుడు

EENADU eClassifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

FINANCIAL SERVICES

Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు EMI వాయిదా పద్ధతిలో పర్సనల్ ఫైనాన్స్, అన్నితరగతుల వారికి స్థిరాస్తులపై ఫైనాన్స్ ఇవ్వబడును. Cell: 73862 01191.

HEALTH & CARE

మద్యపానం మానేయడం ఎలా? బరువు పెరుగుట, జాయింట్‌పెయిన్స్‌కు విశాఖపట్నం: హోటల్ దాక్షాయణి, రైల్వేస్టేషన్ రోడ్ చావులమదుం జంక్షన్, ప్రతినెల 5,19 తేదీల్లో మందులు

PILES

పైల్స్, భగందరం, ఫిషర్ స్పెషలిస్ట్: Dr.Prem Kumar, Mrs.Deepti వైజాగ్: సింగ్ హోటల్ జంక్షన్, జడ్జికోర్ట్ దగ్గర & గాజువాక: శ్రీహరిపురం చర్చిడౌన్, సంప్రదించండి: 8309200608, 9866070593.

REAL ESTATE

LAND FOR SALE

BHOGAPURAM

భోగాపురం ఎయిర్‌పోర్ట్ దగ్గర సవరవిల్లి జంక్షన్ 1 KM దూరంలో 60 సెంట్ల Land అమ్మకమునకు కలదు. Cont: 9440643206, 9966546635

GENERAL

పూసపాటిరేగ 'మం' గోవిందాపురం రోడ్డు హైవేకి 1/2KM తారురోడ్డు ఫేసింగ్ 9&4 ఎకరాలు కొబ్బరితోట అమ్మకం & హోటల్ లీజుకు కలదు. ✆ 9440255187.

PLOT FOR SALE

KOTHAVALASA

కొత్తవలసలో రాయ్‌పూర్ హైవేను ఆనుకొని ల్యాండ్ కన్వర్షన్‌తో రెడీగా ఇళ్ల కట్టుకునేందుకు వీలుగా ఇండ్ల స్థలాలు అమ్మకంనకు కలవు. ✆ 9391996295.

LEASE/ RENT

GENERAL

NAD Kotha Road Rent/ Lease 3&4th Floor for Corporate Offices/ Clinics Above SBI 1750Sft Each ✆9985374007, 7989886046.

JOBS

Computer Hardware, Networking CCTV Technicians Freshers and Experienced Can Apply ITI, Diploma or and Degree Location Visakhapatnam. Contact Whatsapp 8333868686 email: info@serviceat365.com Date 21-02-2026 10:00 Am to 5:00 Pm.

@**@ ISO Co. Needs for Vizag Branch. 1. Office Manager (Rtd. / Gulf Return) 2. Admn. Manager: 5 Yrs exp. Good Package. Ph: 9848551846.

Wanted Lady Maths Teacher for Classes VII to IX Part Time/Full Time Cont: M.S.M School. Ph: 2711649, 93915 88015

Wanted Telecaller (F) for a Reputed company. Fluency in English, Telugu is must. Attractive Salary. ✆ 9700570451

Wanted హెల్పర్స్ : వర్క్‌షాప్‌లో పనిచేయుటకు కార్పెంటర్స్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ హెల్పర్స్ కావలెను. చదువుతో ప్రమేయం లేదు @మద్దిలపాలెం. ✆ 8886655592/ 8886655538.

ప్రముఖ కార్పొరేట్ సంస్థకు మేనేజర్స్ కావలెను. M/F హౌస్‌వైఫ్స్, Rtd, VRS టీచర్స్ కావలెను. F/P టైం శాలరీ & ఇన్సెంటివ్స్ కలవు. ✆ 9701719746.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్‌ని/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ప్రీవసతి, భోజనం జీ:18-20K ✆ 96404 68899, 96402 58899

హౌస్‌కీపింగ్స్ కావలెను. జీతం: 10,000/-+4 రోజులు = 11,300/- ASN PVR Inox చిత్రాలయ మాల్, సూర్యాభాగ్, వైజాగ్. ✆ 8978281938, 9440802456

వాచ్‌మెన్ ఫ్యామిలీతో సహా కావలెను. జీతం 23,000/- + ఉచిత వసతి, ఆశానివాస్ 5వ లైన్, ద్వారకానగర్, విశాఖపట్నం. ✆ 9440802452, 9348802456.

కుక్స్- cook for home with kerala food cusines- కేరళ ఆహార వంటకాల అనుభవంతో వంటవారు. కాల్: 8333840153

స్కూల్స్, హాస్పిటల్స్, బ్యాంక్స్ అన్ని అవుట్ సోర్సింగ్ పద్ధతిలో వర్క్‌కి సూపర్‌వైజర్స్, కం॥ ఆపరేటర్స్, సెక్యూరిటీ, ఫీల్డ్ & సేఫ్టీ హెల్పర్స్, అటెండర్స్, హౌస్‌కీపింగ్. 10th- డిగ్రీ. జీ: 18K-28K. 9121044796, 9573635594.

SECURITY GUARDS

వైజాగ్ సిటీలో అన్ని ఏరియాల్లో పనికి సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, గార్డ్స్, హౌస్‌కీపింగ్ స్టాఫ్, ఆఫీస్ బాయ్స్, లేడీస్ & జెంట్స్, రూమ్, భోజనం కలదు. జీతం: 18 వేలు, 36 వేలు. ✆ 6300071128

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

సైకిల్ మెకానిక్‌పై పెట్రోలు పోసి నిప్పు

తుని, న్యూస్‌టుడే: పంక్చర్లు వేసే సామగ్రిని సకాలంలో తిరిగి ఇవ్వలేదనే కోపంతో ఓ బైక్ మెకానిక్, పక్కనే ఉన్న సైకిల్ మెకానిక్‌పై పెట్రోలు పోసి నిప్పు అంటించిన ఘటన బుధవారం కాకినాడ జిల్లా తుని పట్టణంలో చోటుచేసుకుంది. శ్రీరామా థియేటర్ సమీపంలో కె.నానాజీకి సైకిల్ మరమ్మతులు చేసే దుకాణం ఉంది. దీనిపక్కనే బి.రాజు ద్విచక్రవాహనాల రిపేరు షాపు ఉంది. తరచూ నానాజీ కొన్ని రకాల పరికరాలు రాజు నుంచి తీసుకువెళ్లి తిరిగి ఇవ్వకపోవడంతో వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో బుధవారం వివాదం చెలరేగగా కోపోద్రిక్తుడైన రాజు అక్కడున్న పెట్రోలును నానాజీపై వేసి నిప్పు పెట్టాడు. దీంతో దుస్తులకు నిప్పు అంటుకుని 50 శాతం కాలింది. వెంటనే స్థానికులు అతడ్ని తుని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై జె.విజయబాబు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్షతగాత్రుడికి చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించాలని కుటుంబసభ్యులకు సూచించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తీవ్రంగా గాయపడ్డ నానాజీ అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం శ్రీరాంపురానికి చెందినవాడు కాగా, రాజు పక్క గ్రామం రామభద్రపురానికి చెందినవాడు. వీరిద్దరూ తునిలోనే దుకాణాలు నడుపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నక్కపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని కాగిత వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యాచకుడు మృతిచెందినట్లు సీఐ జె.మురళీ బుధవారం తెలిపారు. కాగిత వద్ద కొన్నాళ్లగా మతిస్థిమితంలేని బిచ్చగాడు సంచరిస్తున్నాడన్నారు. ఈ క్రమంలోనే ఇతడిని జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఢీకొట్టిందని, దీంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు పేర్కొన్నారు. వీఆర్వో ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని, మృతుడి వయసు 50 ఏళ్లు ఉంటుందన్నారు. మృతదేహాన్ని నక్కపల్లి శవాగారంలో భద్రపరిచినట్లు సీఐ వెల్లడించారు.

చికిత్స పొందుతూ ఖాజీపాలెం వాసి..

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ఖాజీపాలేనికి చెందిన కె.కృష్ణ (50) ఈనెల 4న మదుంపై కూర్చొని వెనక్కిపడి గాయపడ్డారు. తలకు గాయంకావడంతో కుటుంబసభ్యులు కేజీహెచ్‌కి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ బుధవారం ఆసుపత్రిలో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చంద్రశేఖరరావు, ఎస్సై వెంకటరావు తెలిపారు.

ఏయూలో విద్యార్థుల నిరసన

ఏయూ పరిపాలనా భవనం వద్ద నిరసన తెలుపుతున్న ఏబీవీపీ విద్యార్థులు, ఆర్ఎస్ఎస్ వాలంటీర్లు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఇటీవల ఏయూలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆర్.ఎస్.ఎస్. వాలంటీర్లు, ఏబీవీపీ విద్యార్థులు బుధవారం ఏయూ పరిపాలనా భవనం వద్ద నిరసన చేపట్టారు. ఆర్ఎస్ఎస్ విభాగ కార్యకలాపాలు శాంతియుతంగా చేపడుతుండగా దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఉపకులపతికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏసీపీలు లక్ష్మణమూర్తి, నరసింహమూర్తి, అప్పలరాజు తమ సిబ్బందితో హుటాహుటిన చేరుకొని నిరసన చేపట్టిన వారిని బయటకు పంపే ప్రయత్నం చేశారు. అదే సమయంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థులు వీసీని కలిసేందుకు వచ్చారు. ఈ క్రమంలో ఏబీవీపీ విద్యార్థులు, ఆర్ఎస్ఎస్ వాలంటీర్లు భారత మాతాకి జై అంటూ నినాదాలు చేయగా.. పోలీసులు వారిని బలవంతంగా బయటకు పంపించారు. ఏబీవీపీ విద్యార్థులు బయటకు వెళుతూనే తమపై నీళ్ల సీసాలు విసిరారని ఎస్ఎఫ్ఐ విద్యార్థులు ఆరోపించారు.

★ మరోవైపు ఎస్.ఎఫ్.ఐ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థులు ఏయూ రెక్టార్ ఆచార్య పి.కింగ్, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య హరనాథ్‌లతో చర్చలు జరిపారు. మంగళవారం చోటుచేసుకున్న ఘటనకు కారకులైన వారిని అరెస్టు చేయాలని, వర్సిటీలోకి ఇతరులకు ప్రవేశం కల్పించరాదని, మతపరమైన జెండాలు ఎగురవేయరాదని కోరారు. ★ ఈ నేపథ్యంలో ఇతరులకు ఏయూలో ప్రవేశం లేదని రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు ఓ ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయ ప్రాంగణం, మైదానంలో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నా అనుమతి పొందాలన్నారు. వర్సిటీ ప్రశాంతతకు, విద్యా సంబంధ వాతావరణానికి భంగం కలిగించే కార్యక్రమాలు చేపట్టినా చర్యలు తప్పవన్నారు. ఈ క్రమంలో నాన్ బోర్డర్లకు ఎవరైనా వర్సిటీలో ఆశ్రయం కల్పిస్తే సంబంధిత విద్యార్థుల వసతి సదుపాయాన్ని రద్దు చేస్తామని స్పష్టం చేశారు.

నిరసనకారులను బలవంతంగా బయటకు పంపిస్తున్న పోలీసులు

ప్రాణం తీసిన చక్రం

విశాఖపట్నం, న్యూస్‌టుడే : కార్ల చక్రాలు ఊడిపోయి ప్రమాదాలు జరగడం చూస్తుంటాం. కానీ ద్విచక్ర వాహనం చక్రం ఊడి ఓ మహిళ మృతిచెందిన సంఘటన షీలానగర్ పోర్టు రోడ్డులో జరిగింది. దీనికి సంబంధించి గాజువాక పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని ఏవీఎన్ కళాశాల సమీప ప్రాంతానికి చెందిన దాసరి ఎల్లమ్మాజీ(34) స్కూటీపై బుధవారం ఉదయం షీలానగర్ వచ్చారు. తన తమ్ముడిని ఐయాన్ డిజిటల్ పరీక్షా కేంద్రంలో దించి ఆమె తిరిగి ద్విచక్ర వాహనంపై పోర్టు రోడ్డులో వెళ్తుండగా.. శిక్షణ కానిస్టేబుల్ గంటా గౌరీనాయుడు (31) షీలానగర్ వద్ద ఆమెను లిఫ్ట్ అడిగారు. వీరి వాహనం షీలానగర్ టోల్‌గేటు సమీపంలోకి వచ్చేసరికి వెనుక చక్రం ఊడిపోయింది. ఇద్దరూ ఒక్కసారిగా కిందపడిపోయారు. ఈ సంఘటనలో ఆమె తల రోడ్డుకి తగలడంతో తీవ్ర రక్తస్రావమై సంఘటన స్థలంలోనే మృతి చెందారు. గౌరీనాయుడు స్వల్పగాయాలతో బయటపడ్డారు. సమాచారం తెలుసుకున్న గాజువాక ట్రాఫిక్ పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆమెను కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్లమ్మాజీ (పాతచిత్రం)

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	విన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	120	115
లైవ్	147	135
డ్రెస్‌డ్	213	240
స్కిన్‌లెస్	243	250

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తెరపై ఈనాడు

అనకాపల్లి పట్టణం: రాజా: ఫంకీ రామచంద్ర: **అమరావతికి ఆహ్వానం** వెంకటేశ్వర: **స్వయం, చద్దా వచ్చా** సత్యనారాయణ ప్రీమి-1: **అనగనగా ఒకరాజు**, ప్రీమి-2: **యుఫోరియా** పరమేశ్వర: **మన శంకర వరప్రసాద్‌గారు** షిరిడిసాయి: **వితిల్**

అచ్యుతాపురం: శ్రీబాలాజీ విలేజ్ సినిమా ప్రీమి-1: **కపుల్ ఫ్రెండ్లీ** ప్రీమి-2: **ఫంకీ**

తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న తెదేపా నాయకులు, పక్కన ఆర్డీవో రమణ

నక్కపల్లి తహసీల్దార్‌గా శ్రీను

నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లి తహసీల్దారుగా దరావత్ శ్రీను నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బుధవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. శ్రీను ఇంతవరకు హైకోర్టులో లైజనింగ్ అధికారిగా పనిచేశారు. పదోన్నతిపై ఇక్కడికి బదిలీ అయ్యారు. అనంతరం కార్యాలయంలో ఉన్న ఆర్డీవో వీవీ రమణను ఆయన కలిశారు. తెదేపా మండలశాఖ అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు కురందాసు నూకరాజు తదితరులు తహసీల్దారును కలిసి అభినందించారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత రేపు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: యర్రవరం, మల్లవరం, ఉప్పవరం, నరేంద్రపురం, ఎం.జగన్నాథపురం గ్రామాలకు శుక్రవారం విద్యుత్తు సరఫరా ఉండదని ఈఈ రాజశేఖర్, ఏఈ భానుప్రకాశ్ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

పాయకరావుపేట గ్రామీణం, నక్కపల్లి: పాల్మన్‌పేట, కందిపూడి, కొర్లయ్యపేట, రాజయ్యపేట తదితర గ్రామాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ రాజశేఖర్ తెలిపారు. వ్యవసాయ కనెక్షన్లకు తెల్లవారుజామున నాలుగు నుంచి ఏడు గంటల సరఫరా మారుస్తున్నామన్నారు. నక్కపల్లి, ఉపమాక, వేంపాడు, సీహెచ్‌ఎల్‌పురం, జానకయ్యపేట, రాజయ్యపేట, కాగిత, చందనాడ, బుచ్చిరాజుపేట, పెద్దబొడ్డేపల్లి గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్తును తెల్లవారుజామున నాలుగు నుంచి ఏడు గంటల వరకు, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు.

పాల్మన్‌పేటలో రెవెన్యూ గ్రామసభ

పాయకరావుపేట గ్రామీణం: పాల్మన్‌పేటలో రెవెన్యూ అధికారులు బుధవారం రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు. రీ సర్వేకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఆర్ఐ త్రినాథ్, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

వెంకన్నను దర్శించుకున్న ఎంపీ బాబూరావు

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉపమాక వెంకన్నను రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు బుధవారం దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం చేయించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తన కోటా కింద వచ్చిన రూ.ఐదు కోట్ల నిధులు పేట నియోజకవర్గ అభివృద్ధికి వెచ్చించనున్నట్లు వివరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి శీరం నరసింహమూర్తి, లొడగల చంద్రరావు, గొర్ల నరసింహమూర్తి, గొర్ల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధి

నక్కపల్లి, న్యూస్‌టుడే: కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రమే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వెలగా సుధాకర్ అన్నారు. వివిధ అభివృద్ధి పనులకు ఉపాధి ద్వారా రూ.ఆరు కోట్లు మంత్రి అనిత మంజూరు చేయించడంపై వీరంతా బుధవారం చినదొడ్డిగల్లులో సమావేశమై హర్షం వ్యక్తం చేశారు. జనసేన కోరిన ప్రాంతాల్లో రూ.కోటి వెచ్చించేందుకు మంత్రి అంగీకరించారన్నారు. జనసేన మండల ఉపాధ్యక్షుడు నల్లల రత్నాజీ, తుమ్మల శ్యామ్ కిషోర్, అమలకంటి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్ కాలనీలో ఆక్రమణలు

మునగపాక, న్యూస్‌టుడే: చూచుకొండ శాంతినగర్ కాలనీలో చేతిబోరును ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి పశువుల పాక ఏర్పాటుచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాలనీ వాసి శ్రావణ్‌కుమార్ తదితరులు బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రజా అవసరాలకు ప్రభుత్వ నిధులతో బోరు తవ్వించారని, కాలువను పూడ్చేసి పశువుల పాక ఏర్పాటు చేశారన్నారు.

ప్రహరీ కూల్చివేతపై ఫిర్యాదు

అనకాపల్లి పట్టణం: పట్టణంలోని రఘురాం కాలనీ వాసులు నిర్మించుకున్న ప్రహరీని దౌర్జన్యంగా కూల్చిన వారిపై కాలనీ సంఘ సభ్యులు బుధవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. కాలనీ సరిహద్దులోని ప్రహరీని బుధవారం విల్లూరి గణేష్, దాడి నాని, ఆడారి శంకర్రావు, శరగడం రమేశ్‌తోపాటు మరికొంత మంది దౌర్జన్యంగా కూల్చారన్నారు. దీన్ని అడ్డుకోడానికి ప్రయత్నించగా చంపుతామని బెదిరించారని కాలనీ సంఘ అధ్యక్షులు కాండ్రేగులు పరమేశ్వరరావు. భీమరశెట్టి రామకృష్ణ పట్టణ ఎస్సై శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు.

పన్ను బకాయిలను వసూలు చేయండి

కశింకోట, న్యూస్‌టుడే: పంచాయతీల నుంచి పన్ను బకాయిలు వసూలు చేయాలని జిల్లా గ్రంథాలయసంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజా ఆదేశించారు. తాళ్లపాలెం గ్రంథాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. పాఠకుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రికార్డులు తనిఖీ చేస్తున్న కార్యదర్శి కుమార్‌రాజా

పైపులైను ఏర్పాటుకు సన్నాహాలు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని పెదరెడ్డి సన్యాసిరాజుకాలనీలో తాగునీటి పైపులైన్ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని హోంమంత్రి వంగలపూడి అనిత ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పైపులైను పనులకు శ్రీకారం చుట్టారు. కుళాయిలు ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాలను బుధవారం పరిశీలించారు. తెదేపా పట్టణ శాఖ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు, వంకా శ్రీను పాల్గొన్నారు.

పల్లె దారులకు మహర్దశ

పాయకరావుపేటలో రోడ్డు పనులు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పల్లెల్లో రహదారులకు మహర్దశ పడుతోంది. ఇప్పటికే తొలివిడతలో పల్లెపండగలో భాగంగా నియోజకవర్గంలో 100కు పైగా రహదారులకు కొత్తరూపు వచ్చింది. తాజాగా పల్లెపండగ 2.0లో భాగంగా మరోసారి నిధులు కేటాయించారు. దీంతో గ్రామాలు సీసీ రోడ్లతో తళుకు సంతరించుకోనున్నాయి. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాల నుంచి గ్రామాల వారీగా ఉపాధి అధికారులు రోడ్లకు సంబంధించిన ప్రతిపాదనలు తీసుకున్నారు. నాలుగు మండలాల పరిధిలో 328 పనులకు ఆమోదముద్ర వేశారు. దీనికోసం రూ.17.50 కోట్ల ఉపాధి హామీ పథకం నిధులు వెచ్చించనున్నారు. అన్ని గ్రామాల్లోనూ పనులు శ్రీకారం చుడుతున్నారు. పాయకరావుపేట, నామవరం తదితర చోట్ల సీసీ రోడ్ల పనులు ఆరంభించారు. మేజర్ పంచాయతీ పాయకరావుపేటలో వీధిరోడ్లు లేకపోవడంతో జనం ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలంలో బురద పేరుకుపోతుంది. కొత్త కాలనీలు, శివారు ప్రాంతాల్లో మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. వర్షాల సమయంలో రాకపోకలకు నానాపాట్లు పడుతున్నారు. వాహనచోదకుల పరిస్థితి మరీ ఘోరం. గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి. బీటలు వచ్చిన రోడ్లపై ఇప్పటికీ ప్రయాణం తప్పడం లేదు. ఈ తరుణంలో కూటమి ప్రభుత్వం రహదారుల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించడంతో గ్రామాల్లో కష్టాలు తీరబోతున్నాయి. పనులు సత్వరమే పూర్తి చేసేందుకు అన్ని చర్యలు చేపట్టనున్నామని పంచాయతీరాజ్‌శాఖ డీఈ హరి చెప్పారు.

క్రీడల్లో మెరిసి.. విజేతలుగా నిలిచి..

నాగులాపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

అనకాపల్లి పట్టణం, మునగపాక, న్యూస్‌టుడే: చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు ప్రతిభ చూపుతున్నారు. క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించేలా కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఫలితాలను ఇస్తున్నాయి. నాగులాపల్లి జడ్పీ పాఠశాల విద్యార్థుల సాధన పతకాలు సాధించేలా చేసింది. బాల్‌బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ పోటీల్లో ఈ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించారు. మరింత గుర్తింపు పొందడానికి సాధన చేస్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. ఈ విద్యార్థులను హెచ్ఎం కె.శంకరరావు, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ పోలమరశెట్టి మురళి, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఖోఖోలో రాణించేలా..

చిన్నప్పటి నుంచి ఖోఖో అంటే చాలా ఇష్టం. పాఠశాలలో సాధన చేస్తూ ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యాం. ఇది మాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఆడపిల్లలకు క్రీడలు ఎందుకు అన్న భావన గ్రామీణ ప్రాంతాల్లో ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కుటుంబ సభ్యులతోపాటు ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తున్నారు – ఈ.భవ్యశ్రీ, జి.భార్గవి

బ్యాడ్మింటన్‌లో మెరిశారు

బ్యాడ్మింటన్ నేర్చుకోవాలని ఉండేది. అవకాశం ఉండేది కాదు. వ్యాయామ ఉపాధ్యాయులు చెబితే పాఠశాలలో నేర్చుకున్నాం. మండల, జిల్లా స్థాయిల్లో నిర్వహించే పోటీల్లో రాణించి రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా పాల్గొన్నాం. మంచి క్రీడాకారిణులుగా గుర్తింపు పొందాలనే లక్ష్యంతో సాధన చేస్తున్నాం. – ఎం.పూజిత, జి.వర్షిత, ఎం.స్నేహాంజలి

వాలీబాల్‌లో ప్రతిభ

వాలీబాల్ నేర్చుకోవడంతో పాటు పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది. రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యాను. క్రీడాకారుడిగా గ్రామానికి పేరుతేవాలనేదే లక్ష్యం. – పూర్ణ చంద్రశేఖర్

దెబ్బతిన్న పైపులైన్.. వృధాగా తాగునీరు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: పట్టణంలోని కొత్తపేటలో మున్సిపల్ కుళాయి పైపులైన్ దెబ్బతింది. దీంతో తాగునీరంతా వృధాగా రోడ్డు పాలైంది. స్థానికులు దెబ్బతిన్న పైపులైన్‌పై రాయిని పెట్టి కొంత అరికట్టినా నీటిలీకేజీ ఆగలేదు. కాలం చెల్లిన పైపులైన్లు తరచూ ఇలా మరమ్మతులకు గురవుతున్నాయని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లీకవుతున్న పైపులైన్లకు మరమ్మతులు కాలంచెల్లిన వాటిని మార్చాలని వీరు కోరుతున్నారు.

కొత్తపేటలో దెబ్బతిన్న పైపులైన్‌తో వృధాగా పోతున్న తాగునీరు

వీధి దీపాలను ఆర్పరా...?

చిన్నబొడ్డేపల్లిలో పగలు వెలుగుతున్న వీధి దీపం

చిన్నబొడ్డేపల్లి పంచాయతీలో వీధి దీపాలు రోజంతా వెలుగుతునే ఉంటున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా, నిరంతరం వీధి దీపాలు వెలుగుతున్నాయని అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ పాలకులు పట్టించుకుని, పగలు వీధి దీపాలు వెలగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోటవురట్ల

తీర మార్గం.. గుంతలమయం

వెంకటనగరం నుంచి అద్దరిపేట వెళ్లే తీర మార్గం గుంతలతో నిండి ఉంది. ఈ మార్గంలో ప్రయాణించాలంటే వాహనచోదకులు నరకం చూస్తున్నారు. కొన్నేళ్లుగా ఈ దారి అభివృద్ధి చేయకపోవడంతో ఎక్కడపడితే అక్కడ భారీగా గుంతలు, అంచులు కోతకు గురయ్యాయి. వాహనాలు గుంతలు తప్పించే క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొన్నిచోట్ల జీడి చెట్ల కొమ్మలు పెరిగిపోవడంతో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. తుని నుంచి కాకినాడ, ఉప్పాడ, తమ్మయ్యపేట, తొండగి ప్రాంతాలకు దగ్గర దారి కావడంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారి అభివృద్ధి చేయాలని సమీప గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పాయకరావుపేట గ్రామీణం

చెత్త తీశారు.. కంపు మిగిల్చారు

తొలగించని చెత్తకుప్పలతో అధ్వానంగా రహదారి

కాలువల్లో చెత్తను పారిశుద్ధ్య కార్మికులతో తీయించి మళ్లీ రోడ్డుపక్కనే కుప్పలుగా పోశారు. తోటాడలో ప్రధాన రహదారి వ్యర్థాలతో పూడిక పోయింది. పారిశుద్య కార్మికులతో కాలువల్లో చెత్తను తొలగించి రహదారి పక్కనే వేశారు. ఆ తరవాత దీనిని పట్టించుకోలేదు. చెత్త కుప్పలు ఎండిపోయి రహదారి అంతా చిందరగా మారింది. వ్యర్థాలు మళ్లీ కాలువల్లో పడ్డాయి. తక్షణమే చెత్త కుప్పలు తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మునగపాక

తీరిన పుర ప్రజల కష్టాలు

ఎలమంచిలి-సైతారుపేట రోడ్డును రూ.50 లక్షలతో పూర్తి చేశారు. దీంతో పురప్రజల కష్టాలు తీరాయి. పట్టణంలోని ఈరోడ్డు అంతా గోతులు పడి పూర్తిగా దెబ్బతింది. ఈ మార్గంలో ప్రయాణం అంటేనే నరకప్రాయంగా మారేది. సైతారుపేట, ఎస్.రాయవరం వైపు వెళ్లే వాహనాలన్నీ ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తాయి. చాలా సంవత్సరాలుగా కొత్తగా రోడ్డు వేయాలని ప్రజలు వాహన చోదకులు కోరుతున్నారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌కు పలుమార్లు ఇక్కడి పరిస్థితిని వివరించారు. ఆయన ఆదేశాలమేరకు రోడ్లు భవనాల శాఖ అధికారులు రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. నిధులు రావడంతో పనులు చేపట్టారు. ఈ రోడ్డుపై వాహనాలు రయ్‌మంటూ దూసుకుపోతున్నాయి. – న్యూస్‌టుడే, ఎలమంచిలి

ఎలమంచిలి-సైతారుపేట రోడ్డు

సేవా కార్యక్రమాల్లో కూటమి నేతలు

అనకాపల్లి పట్టణం, నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఎంపీ సీఎం రమేశ్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అనకాపల్లిలోని ఎంపీ కార్యాలయంలో కూటమి నాయకులు కేక్ కోశారు. రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో పేదలకు పండ్లు పంపిణీ చేశారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షులు గేదెల స్వరూప్ అధ్వర్యంలో 100 కేజీల కేక్‌ను కోశారు. 61 మందికి ఉచిత హెల్త్‌పాలసీ అందజేశారు. భాజపా జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, గవర సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, తెదేపా పట్టణ అధ్యక్షుడు డాక్టర్ నారాయణరావు పాల్గొన్నారు. భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు పలకా రవి ఆధ్వర్యంలో లెప్రసీ కాలనీలో మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం గర్భిణులు, రోగులు, నిరుపేదలకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేపట్టారు. తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు బాబీ ఆధ్వర్యంలో నాయకులు వీటిని అందించారు

కశింకోట: కశింకోటలో జిల్లా భాజపా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ఆధ్వర్యంలో సత్యసాయి మందిరంలో పేదలకు అన్నదానం, వస్త్రదానం చేశారు. తాళ్లపాలెంలో భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొన్నగంటి అప్పారావు, సోమవరంలో తెదేపా మండల అధ్యక్షులు గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు.

నక్కపల్లి: భాజపా కార్యాలయం వద్ద మండలశాఖ అధ్యక్షుడు పోలినాటి నానాజీ ఆధ్వర్యంలో కేకు కోశారు. ఉపమాక వెంకన్న ఆలయంలో ఎంపీ పేరిట పూజలు చేయించారు.

మునగపాక, ఎలమంచిలి గ్రామీణం: మునగపాకలో భాజపా జాతీయ కౌన్సిల్ మాజీ మెంబరు బద్దెం సూర్యనారాయణ కేక్ కట్ చేశారు. పీహెచ్‌సీలో రోగులకు భాజపా జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు రొట్టెలు పంపిణీ చేశారు. కూటమి నాయకులు, మళ్ల కాళేశ్వరరావు, పెంటకోట విజయ్, దాడి ముసిలినాయుడు, ఆడారి మంజు, కాశి పాల్గొన్నారు. కొక్కిరాపల్లి ప్రధాన రహదారికి ఇరువైపులా గ్రామజ్యోతి యువకులు మొక్కలు నాటారు. కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ యువకులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో కేక్ కోస్తున్న కూటమి పార్టీల నాయకులు

అభ్యసన సామర్థ్యం మెరుగుపర్చేలా బోధన

పాయకరావుపేట/ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు పూర్తిస్థాయి అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చాలని అకడమిక్ జిల్లా సమన్వయకర్త బృందం సభ్యులు ఎస్.కె.అల్లాఉద్దీన్, స్వామి, వెంకటరమణ సూచించారు. పట్టణంలోని బృందావనంలోని ప్రాథమిక, నామవరం ప్రభుత్వ పాఠశాలలను బుధవారం వీరు పరిశీలించారు. విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. హ్యాండ్‌బుక్, రికార్డులు, జీఎఫ్‌ఎల్‌ఎన్ అమలు తనిఖీ చేశారు. ఒకటి నుంచి అయిదో తరగతి విద్యార్థులకు అక్షరాలు, అంకెలు, పదాలు తప్పనిసరిగా నేర్పించాలని సూచించారు. తరగతి గదిలో విద్యార్థులకు బోధన అర్థమయ్యేలా సాగించాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు నూకరాజు, అనురాధ, కె.ఎస్.ఆర్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలిస్తున్న జిల్లా సమన్వయకర్త అల్లాఉద్దీన్

గ్రామసింహాలకు కు.ని. శస్త్రచికిత్స కేంద్రం

పాయకరావుపేట, న్యూస్‌టుడే: గ్రామాల్లో కుక్కల బెడద నియంత్రణకు అధికార యంత్రాంగం నడుంబిగించింది. వీటి దాడిలో గాయపడి నిత్యం ఆసుపత్రులకు వెళ్తున్న వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. ఈ తరుణంలో మండలంలోని 24 పంచాయతీల్లోని కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయనున్నారు. దీనికోసం అంబేడ్కర్ పార్కులో ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామాల్లోని కుక్కలను ఇక్కడికి తీసుకువచ్చి శస్త్రచికిత్సలు చేయనున్నారు. పార్కు ఆవరణలో ఉన్న భవనాన్ని ఇందుకు సిద్ధం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టామని ఇన్‌ఛార్జి డిప్యూటీ ఎంపీడీఓ వై.సత్యనారాయణ తెలిపారు.

రైతు బజారు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

లక్ష్మీదేవిపేట(అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంలో రైతు బజారు ఏర్పాటుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆమ్ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ హరనాథ్‌బాబు వ్యవసాయశాఖ మార్కెటింగ్ అధికారి అశోక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రైతు బజారు ఏర్పాటు చేయాలని గతంలో 28 రోజుల నిరాహార దీక్ష చేపట్టామన్నారు. జనవరి 30 నాటికి రైతు బజారు ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ ఇచ్చి విస్మరించారన్నారు. ఈనెలలో ఏర్పాటు చేయకపోతే మార్చి మొదటి వారంలో మళ్లీ నిరాహార దీక్ష ప్రారంభిస్తామన్నారు.

కమ్మేసిన పొగమంచు

పట్టణంలోని రింగురోడ్డు, గవరపాలెం, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో బుధవారం దట్టంగా పొగమంచు కమ్మేసింది. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచే పొగమంచు కురుస్తుండడంతో పరిసర ప్రాంతాలు కనిపించలేదు. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. – న్యూస్‌టుడే, కలెక్టరేట్

రింగురోడ్డు రహదారిలో కురుస్తున్న పొగ మంచు

ఉపాధి హామీ పనులపై నేటి నుంచి సామాజిక తనిఖీలు

కశింకోట, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో 2024-25లో జరిగిన రూ.18 కోట్ల పనులపై గురువారం నుంచి సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర రిసోర్సు పర్సన్ రామచంద్ర తెలిపారు. ఎంపీడీవో చంద్రశేఖరరావు అధ్యక్షతన బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్, క్షేత్ర సహాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో జరిగిన పనులపై సామాజిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఏపీవో ఎం.శ్రీనివాసరావు, సాంకేతిక సహాయకులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించాలన్నారు.

ఆయుర్వేద వైద్యంతో సాంత్వన

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఆయుర్వేద వైద్యంతో రోగులకు సాంత్వన చేకూరుతుందని తెదేపా నాయకులు దాడి రత్నాకర్ పేర్కొన్నారు. పట్టణంలో గవరపాలెం వీవీ రమణ రైతుభారతి భవనంలో బుధవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం జరిగింది. జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో 200 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ప్రభుత్వ ఆయుష్ విభాగం ద్వారా కల్పిస్తున్న సౌకర్యాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సంఘం సభ్యులు వైద్యులను సత్కరించారు. ఆయుష్ వైద్యులు లావణ్య, గణేష్, వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షులు అప్పారావు, కార్యదర్శి కాండ్రేగుల దుర్గాప్రసాద్, భీశెట్టి కృష్ణా అప్పారావు, కొణతాల త్రినాథ్ పాల్గొన్నారు.

రోగులకు పరీక్షలు చేస్తున్న ఆయుష్ వైద్యులు లావణ్య

రోడ్డు పనుల పరిశీలన

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ఆవసోమవరంలో సీసీ రోడ్డు నిర్మించడానికి ఎట్టకేలకు నిధులు మంజూరు అయ్యాయి. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, రహదార్ల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు చొరవ తీసుకొని సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేశారని కూటమి నాయకులు కోలా నాగేశ్వరరావు తెలిపారు. యర్రవరం పంచాయతీ పరిధిలో తాగునీటి పనులు పూర్తిచేయడానికి మరో రూ.5 లక్షలు మంజూరు అయ్యాయి. జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర తన అభివృద్ధి నిధుల నుంచి వీటిని కేటాయించారు. ఇప్పటికే జడ్పీటీసీ సభ్యులు నర్మాలకుమార్ ఈ పంచాయతీకి పైపులైను నిమిత్తం రూ.10 లక్షల మంజూరు చేయగా వీటితో పనులు పూర్తికాకపోవడంతో మరో రూ.5 లక్షలు మంజూరు చేయించారని సర్పంచి లక్ష్మి తెలిపారు.

రోడ్డు పనులను పరిశీలిస్తున్న నాయకులు

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722 | ఎలమంచిలి- 80085 74726 | పాయకరావుపేట- 80085 74750

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పూడిమడక రోడ్డులోని వరుణ్‌బజాజ్ షోరూం వెనక మురుగు కాలువ నుంచి నీరు పారక ఇళ్లలోకి వస్తోంది. సమస్యను పరిష్కరించగలరు. – **బత్తిన సత్యవతి, అనకాపల్లి**

✔: సమస్యను పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.– **రవికుమార్, జీవీఎంసీ శానిటరీ సూపర్‌వైజర్, అనకాపల్లి**

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని లింగాలతోట కాలనీ పక్కన చెక్కల మిల్లుల వెనుక రెండో వీధిలో వీధి దీపాలు వెలగడం లేదు. స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. – **జె.శ్రీనుబాబు, స్థానికుడు** ✔: పాడైన విద్యుద్దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తాం. – **వై.సత్యనారాయణ, పంచాయతీ ఈవో**

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: అరట్లకోట ఎస్సీ కాలనీలో కాలువలు లేవు. దీంతో ఇళ్లలో వాడిన నీరు రహదారులపైకి వస్తోంది. – **కాలనీవాసులు.** ✔: ప్రతిపాదనలు సిద్ధం చేశాం. నిధులు మంజూరైన వెంటనే కాలువలు నిర్మిస్తాం. – **వై.సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో**

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: మోసయ్యపేట గ్రామం మధ్య నుంచి ఉన్న రోడ్డు చాలా ఇరుకుగా ఉంది. ఒక వాహనం వస్తే మరొకటి తప్పుకోవడానికి వీలుకావడం లేదు. – **శ్రీనివాసరావు, మోసయ్యపేట.** ✔: సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి సూచనలతో పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటాం. – **చిన్నారావు, ఎంపీడీఓ, అచ్యుతాపురం**

ఎలమంచిలి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో అన్ని వీధులకు మురికి కాలువలు లేక ఇబ్బంది పడుతున్నారు. దోమలు పెరిగిపోయాయి. సమస్య తీవ్రంగా ఉంది. – **ఎం.రాము ఎలమంచిలి.** ✔: అన్ని వీధుల్లో కాలువలు నిర్మించడానికి ప్రతిపాదనలు పంపిస్తాం. దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం. – **ప్రసాదరాజు కమిషనర్ ఎలమంచిలి**

ఎలమంచిలి, న్యూస్‌టుడే: పట్టణంలోని రాంనగర్‌లో వీధికుక్కలు పెరిగిపోయాయి. పిచ్చికుక్కలు దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. – **ఆర్.సునీత ఎలమంచిలి.**

✔: వీధికుక్కలకు ఆపరేషన్లు చేయిస్తాం. పిచ్చి కుక్కలను పట్టించి సమస్య పరిష్కరిస్తాం.– **ప్రసాదరాజు కమిషనర్ ఎలమంచిలి**

నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లిలోని ఉపమాక రోడ్డు మార్గంలో తాగునీటి పైపు నుంచి నీరు వృథాగా పోతోంది. – **అప్పారావు** ✔: ఇక్కడ పైపునకు మరమ్మతు చేసి, శాశ్వత పరిష్కారం చూపుతాం. – **పీవీపీ రాజశేఖర్, కార్యదర్శి**

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: పూడిమడక శివారు పల్లిపేటలో రోడ్డుపై వేసిన చెత్తను పక్షంరోజులుగా తొలగించలేదు. – **కోదండరావు, పూడిమడక**

✔: చెత్తను తొలగించడానికి చర్యలు తీసుకుంటాం.

– **సరస్వతీ, పంచాయతీ కార్యదర్శి**

ఆరోగ్య సేవలపై తనిఖీ

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: పూడిమడక ఆరోగ్య ఉపకేంద్రాన్ని బుధవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలు, బాలికలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వం అన్ని సేవలను సకాలంలో ప్రజలకు అందివ్వాలని వైద్యాధికారిణి ప్రశాంతికి సూచించారు.

రికార్డులను తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ బృంద సభ్యులు

సోముదేవుపల్లి వద్ద వరాహకు రక్షణ గోడ

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ఎస్.రాయవరం మండలం సోముదేవుపల్లి వద్ద వరాహ నది గట్టును జల వనరుల శాఖ పర్యవేక్షక ఇంజినీర్ (ఎస్ఈ) పి.అప్పలనాయుడు బుధవారం పరిశీలించారు. ఈ గట్టు వద్ద రక్షణ గోడ నిర్మాణానికి హోం మంత్రి వంగలపూడి అనిత ఇటీవల రూ. 10 కోట్లు మంజూరు చేయించారు. టెండర్లు పిలిచే క్రమంలో పరిశీలనకు ఎస్ఈ ఇక్కడకు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. త్వరలోనే టెండర్లు ప్రక్రియ పూర్తికానుందని వివరించారు. అనంతరం మూలపొలం గ్రోయిన్‌ను కూడా ఎస్ఈ పరిశీలించారు. ఈఈ వి.బాలసూర్యం, డీఈ ఎంవీ సురేష్‌కుమార్, ఏఈ అమీనాభాను, తెదేపా మండలశాఖ అధ్యక్షుడు అమలకంటి అబద్ధం తదితరులు పాల్గొన్నారు.

గట్టును పరిశీలిస్తున్న ఎస్ఈ అప్పలనాయుడు

(c) eenadu

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

విద్యుత్తు సరఫరా నిలుపుదల రేపు

చీడికాడ, న్యూస్‌టుడే: మండలంలోని అప్పలరాజుపురం, ఖండివరం, కోనాం విద్యుత్తు ఫీడర్ల పరిధిలోని శుక్రవారం విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ రామకృష్ణ, ఏఈ వెంకటరావు చెప్పారు. దీంతో పాటు చీడికాడ-జి.కొత్తపల్లిలో లైన్‌లో కొమ్మలు తొలగించనున్నట్లు చెప్పారు.

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: రాజాం సబ్‌స్టేషన్ పరిధిలో గ్రామాలకు ఈనెల 20న విద్యుత్తు సరఫరా ఉండదని ఏఈ వెంకటరమణ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో 33కె.వి లింక్ మార్పు చెయ్యడంతో పాటు విద్యుత్తు తీగలకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగింపు పనుల కారణంగా సరఫరా నిలిపివేస్తామన్నారు.

దేవరాపల్లి, న్యూస్‌టుడే: బోయిలకింతాడ విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలోని బోయిలకింతాడ, వేచలం, కొత్తపెంట, గవరవరం, ముకలాపల్లి, జగన్నాథపురం, ఎం.అలమండ గ్రామాలకు ఈ నెల 20న సరఫరా ఉండదని ఈఈ తెలిపారు.

నర్సీపట్నం: తెరపై ఈనాడు
శ్రీకన్య ఆడి1: 100 జేస్ లవ్ స్టోరీ, ఒన్ ప్లస్ ఒన్ ఆఫర్, సైన్స్, అమరావతికి ఆహ్వానం, ఆడి2: యుఫోరియా, ఆడి3: వనీక్, ఆడి4: ఓ రోమియో, రైల్ 101. **చోడవరం:** సాయిలక్ష్మి: వనీక్, శ్రీసాయిలక్ష్మి: పిటీ-14, పూర్ణా: మన శంకర వరప్రసాద్ గారు

ట్రాఫిక్ చిక్కుల్లో చోద్యం కూడలి

గొలుగొండ, న్యూస్‌టుడే: ఇటు మైదాన అటు మన్యం ప్రాంతాలకు అనుసంధానంగా ఉండే చోద్యం కూడలిలో ట్రాఫిక్ ఇబ్బందులు నెలకొన్నాయి. నిత్యం అధిక సంఖ్యలో ప్రయాణికుల వాహనాలతో రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక్కడి రోడ్డు ఆక్రమణలకు గురికావడంతో ఇరుకుగా మారింది. దీంతో నిత్యం గంటల తరబడి వాహనాలు రోడ్డు మధ్యలో నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

మధ్యవర్తిత్వం కేసులకు ప్రాధాన్యమివ్వండి..

చోడవరం, న్యూస్‌టుడే: మధ్యవర్తిత్వంతో కక్షిదారుల మధ్య రాజీ కుదిరే కేసులు అధిక సంఖ్యలో ఉండేలా పోలీసు అధికారులు, న్యాయవాదులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని స్థానిక తొమ్మిదో అదనపు జిల్లా జడ్జి హరినారాయణ అన్నారు. కోర్టు ఆవరణలో బుధవారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహణపై పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. హరినారాయణ మాట్లాడుతూ మార్చి 14న లోక్‌అదాలత్‌ను జరుగుతున్నట్లు తెలిపారు. అన్ని పోలీసుస్టేషన్ల నుంచి రాజీ పడే కేసులు లోక్‌అదాలత్‌లో వచ్చేలా చూడాలన్నారు. సీనియర్ సివిల్ జడ్జి గౌరీశంకరరావు, ప్రధాన జూనియర్ జిల్లా జడ్జి స్వర్ణ మాట్లాడారు. ఏపీపీ చీపురుపల్లి సూర్యనారాయణ పాల్గొన్నారు.

సూచనలు ఇస్తున్న న్యాయమూర్తులు

దారమల్లేశ్వరుని జాతర ఆదాయం రూ. 3 లక్షలు

గొలుగొండ, న్యూస్‌టుడే: మూడు రోజులపాటు దారమఠంలో జరిగిన శివరాత్రి ఉత్సవాలకు దారమల్లేశ్వరస్వామి ఆలయానికి వచ్చిన ఆదాయ లెక్కింపు మంగళవారం రాత్రికి పూర్తయినట్లు దేవాదాయశాఖ అధికారులు తెలిపారు. దుకాణాలు వేలంపాట, టికెట్లు అమ్మకం, హుండీలో వేసిన కానుకల లెక్కించగా వచ్చిన ఆదాయం రూ.3 లక్షలకు పైగా వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి సాంబశివరావు చెప్పారు.

శరవేగంగా నిర్మాణం.. సాఫీగా ప్రయాణం

దేవరాపల్లి, న్యూస్‌టుడే: కృష్ణారాయుడిపేట కల్వర్టు పనులు తుదిదశకు చేరుకున్నాయి. దేవరాపల్లి-విశాఖపట్నం కొత్తవలస మీదుగా రాకపోకలు సాగించే ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయి. రైవాడ జలాశయం నుంచి మహా నగరపాలక సంస్థకు తాగునీటిని సరఫరా చేసే కాలువపై కొన్నేళ్ల కిందట కృష్ణనాయుడిపేట జంక్షన్ వద్ద కల్వర్టు నిర్మించారు. పరిమితికి మించిన భారీలోడుతో వాహనాలు ఎక్కువగా తిరుగుతుండటంతో కుంగిపోయింది. దీంతో ఈమార్గం ద్వారా బస్సులు తిరిగే అవకాశం లేక వాటిని నిలిపివేశారు.

★ కల్వర్టు పరిస్థితి పైన, ప్రయాణికుల కష్టాలు 'ఈనాడు' కథనాల ద్వారా వెలుగులోకి రావడంతో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి స్పందించారు. నగర మేయర్ పీలా శ్రీను, కమిషనర్ కేతన్‌గార్గ్‌తో మాట్లాడి కల్వర్టు నిర్మాణానికి అవసరమైన రూ.91 లక్షలను మంజూరు చేయించారు. నవంబరు 25న నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. పనులు ప్రారంభించి కొద్ది కాలంలోనే నిర్మాణాన్ని పూర్తి చేశారు. కల్వర్టుకి ఇరువైపుల అప్రోచ్ రోడ్లు నిర్మిస్తున్నారు. మరో పదిరోజుల్లో ఈ కల్వర్టుపై నుంచి వాహనాలు అనుమతించే దిశగా జీవీఎంసీ ఇంజినీరింగ్ సిబ్బంది శ్రమిస్తున్నారు. ఈ పనులు ప్రారంభించే ముందు బస్సులు, లారీలు మినహా మిగతా వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గాన్ని చూపించడమే కాకుండా విశాఖకు తాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా నిర్మాణ పనుల్ని ఇంజినీరింగ్ అధికారులు చేపట్టడంతో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

కొత్తగా నిర్మించిన కల్వర్టు

శిథిలావస్థలో రక్షిత తాగునీటి పథకం

దేవరాపల్లి, న్యూస్‌టుడే: దేవరాపల్లి నడిబొడ్డున నిర్మించిన రక్షిత తాగునీటి పథకం శిథిలావస్థకు చేరుకుంది. అప్పుడప్పుడూ పెచ్చులూడి పడుతూ ఆందోళన కలిగిస్తోంది. దీనికితోడు బలహీన పడిన పిల్లర్లు ట్యాంకు ఆఖరి రోజులను తలపునకు తెస్తున్నాయి.

★ జనావాసాలతో పాటు ఆర్టీసీ బస్టాండ్, నాలుగురోడ్ల ప్రధాన కూడలికి ఆనుకుని ఈ రక్షిత తాగునీటి పథకం ఉంది. సుమారు 20వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఈ ట్యాంకును దాదాపు 26 సంవత్సరాల కిందట నిర్మించారు. జలజీవన్ పథకం అందుబాటులోకి వచ్చిన తర్వాత ట్యాంకుకు నీటి సరఫరాను నిలిపివేశారు. స్థానికులకు ఎలాంటి నష్టం కలగకుండా కూల్చివేయాలని కోరుతున్నారు.

కూలడానికి సిద్ధంగా ఉన్న రక్షిత మంచినీటి పథకం

తొలగించడానికి చర్యలు తీసుకుంటున్నాం: శిథిలావస్థలో ఉన్న రక్షిత మంచి నీటి పథకాన్ని తొలగించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. ఆంధ్రవిశ్వవిద్యాలయానికి చెందిన ఇంజినీరింగ్ నిపుణుల బృందాన్ని తీసుకొచ్చి చూపించాం. కూల్చడానికి అవసరమైన అంచనాలు తయారు రూపొందించడానికి డీడీ చెప్పారు. ఆ తరువాత నిపుణుల పర్యవేక్షణలో పథకాన్ని తొలగిస్తాం. – వి. అనంత ఉమాదేవి, పంచాయతీ అభివృద్ధి అధికారిణి

ముక్కంటికి పుష్పయాగం

చోడవరం, న్యూస్‌టుడే: చోడవరంలో స్వయంభూ గౌరీశ్వర ఆలయంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న మహాశివరాత్రి కల్యాణ మహోత్సవాలు బుధవారం రాత్రితో ముగిశాయి. ముక్కంటి కల్యాణ మహోత్సవంలో భాగంగా పుష్పయాగం సేవను అర్చకులు నిర్వహించారు. పూలతో అందంగా అలంకరణ చేశారు. గర్భగుడిలో పవళింపు సేవ నిర్వహించారు.

డిప్యూటీ డీఎంహెచ్ఓ బదిలీ

నర్సీపట్నం, న్యూస్‌టుడే: డిప్యూటీ డీఎంహెచ్ఓ వీరజ్యోతి విశాఖపట్నానికి బదిలీ అయ్యారు. అయిదేళ్లుగా ఈ ప్రాంతంలో ఆమె సేవలందిస్తున్నారు. అందరి మన్ననలు అందుకున్నారు. విశాఖలోని కేంద్ర కారాగారంలోని ఆసుపత్రి డిప్యూటీ సివిల్ సర్జన్‌గా నియమించారు. ఈమెస్థానంలో నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రిలోని టీబీ క్లినిక్ డాక్టర్ ప్రసన్నను ఇన్‌ఛార్జిగా నియమించారు.

ఈవోపీఆర్డీకి ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు

రావికమతం, న్యూస్‌టుడే: రావికమతం ఎంపీడీవోగా ఈవోపీఆర్డీ శ్రీనివాసరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎంపీడీవో మహేష్ వ్యక్తిగత పనులపై నెలరోజుల పాటు సెలవులో వెళ్లడంతో ఆయన స్థానంలో ఇదే కార్యాలయంలోనే ఈవోపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావుకు బాధ్యతలు అప్పగించారు. బుధవారం ఆయన ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు.

బాల్యవివాహాలను అరికడదాం

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: బుచ్చెయ్యపేటలో బాల్యవివాహాల నిర్మూలన కోసం బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజరు నిర్మలా దేవి మాట్లాడుతూ బాల్యవివాహాల రహిత సమాజం కోసం వంద రోజుల కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండకుండా వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే 1098 టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ

చోడవరం, న్యూస్‌టుడే: కూలీలకు వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటితో పాటు మజ్జిగ సరఫరా చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎంపీడీఓ సీతారామస్వామి ఆదేశించారు. బుధవారం మండలంలోని దుడ్డుపాలెం గ్రామంలో ఏనుగు బంద చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. అక్కడ కూలీలతో మాట్లాడుతూ వేసవిలో ఆరు గంటలకే పనులకు రావాలన్నారు. ఏపీఓ చంద్రకళ, ఫీల్డ్ అసిస్టెంట్ సత్తిబాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చెత్తసంపద కేంద్రాన్ని పూర్తి చేస్తాం

దేవరాపల్లి, న్యూస్‌టుడే: ముషిడిపల్లిలో అసంపూర్తిగా నిలిచిపోయిన చెత్తసంపద కేంద్రాన్ని పూర్తి చేయడానికి కృషి చేస్తానని ఎంపీడీఓ సువర్ణరాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య పనుల్ని పరిశీలించారు. సచివాలయానికి వెళ్లారు పంచాయతీ అభివృద్ధి అధికారి సురేష్‌తో పాటు సిబ్బందితో మాట్లాడారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ సర్పంచి గోవింద, స్వచ్ఛ భారత్ మండల సమన్వయ కార్యదర్శి త్రినాథ్ తదితరులున్నారు.

నూతన పద్ధతిలో విద్యాబోధన

మాకవరపాలెం: విద్యార్థులకు పాఠాలు సులువుగా అర్థమయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా తూటిపాల ఉపాధ్యాయుడు రాము నూతన పద్ధతిని అమలు చేస్తున్నారు. తెలుగు, ఆంగ్లం, గణితం రాయడం, అర్థం చేసుకోవాలనే ఉద్దేశంతో పిల్లలను ఆకట్టుకునే రంగుల కాగితాలపై టీఎల్ఎంలు తయారు చేసి బోధిస్తున్నట్లు రాము తెలిపారు. విద్యార్థులు ఇష్టపడి చదువుతున్నట్లు చెప్పారు.

టీఎల్ఎంను ప్రదర్శిస్తూ బోధిస్తున్న ఉపాధ్యాయుడు రాము

కమ్ముకున్న పొగమంచు

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ మండల వ్యాప్తంగా బుధవారం ఉదయం పొగమంచు దట్టంగా కమ్ముకుంది. ఉదయాన్నే పల్లెలు మంచుతో కప్పుకొన్నాయి. ఎటువైపు చూసినా మంచు తెరలు అలుముకున్నాయి. జాతీయ రహదారిపై ఇంతలా పొగమంచు చూడలేదని గ్రామీణ ప్రాంత ప్రజలు చెబుతున్నారు.

చోడవరం, న్యూస్‌టుడే: చోడవరంతో పాటు గ్రామాల్లోనూ బుధవారం ఉదయం దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఉదయం 7.25 గంటల వరకు మంచు తెరలు తొలగలేదు. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనిపించట్లేదు. ఎదురుగా వచ్చే మనుషులు, వాహనాలు కనిపించలేని మాదిరిగా మంచు కురిసింది. ఈ మంచును చూసి మామిడి రైతులు దిగులు చెందుతున్నారు.

చీడికాడలో కురుస్తున్న పొగమంచు

జడ్పీ నిధులతో అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: జడ్పీ నిధులతో అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు తెలిపారు. అయితంపూడి గ్రామంలో రూ.7 లక్షల వ్యయంతో ఆధునీకరించిన అంగన్‌వాడీ భవనాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే చాలా గ్రామాల్లో జడ్పీ నిధులతో పనులు చేపట్టామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. మిగిలిన గ్రామాల్లోనూ అవసరమైన చోట పనులు చేయించడానికి ప్రతిపాదనలు ఇస్తే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. సర్పంచి పెద్దాడ నాయుడు, ఉప ఎంపీపీ గొంపా చిన బాబు, ముచ్చకర్ల వెంకట్రావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరించిన రాంబాబు

జేఈఈ మెయిన్‌లో సత్తా

దేవరాపల్లి, న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్‌లో దేవరాపల్లికి చెందిన పోలవరపు భవదీష్ సత్తా చాటాడు. 2026 జేఈఈ మెయిన్ సెషన్-1 ఫలితాల్లో 99.65 పర్సంటైల్ సాధించాడు. పదో తరగతి ఫలితాల్లో 586 మార్కులు సాధించిన భవదీష్ తండ్రి సెల్‌ఫోన్ దుకాణాన్ని నిర్వహిస్తుండగా, తల్లి చిన్మయి గృహిణి. త్వరలో జరగనున్న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో మంచి మార్కులతో ఐఐటీ సీటు సాధించాలన్న లక్ష్యంతో ముందస్తు ప్రణాళికతో సన్నద్ధమవుతున్నట్లు భవదీష్ తెలిపారు.

భవదీష్‌ని పుష్పగుచ్ఛంతో అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శరవేగంతో పట్టణ రహదారుల అభివృద్ధి

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే : నర్సీపట్నం పురపాలికలో రహదారుల అభివృద్ధికి చర్యలు మొదలయ్యాయి. జోగునాథునిపాలెం మార్గంలో కూలిపోయిన కల్వర్టు స్థానంలో కొత్తదాన్ని నిర్మించారు. కొద్దిరోజుల్లో డైవర్షన్ రోడ్డుని తొలగించి కొత్త కల్వర్టు మీదుగా వాహనాల రాకపోకలను అనుమతిస్తారు. ఈ రోడ్డులో ప్రమాదకర మలుపుని తొలగించి నేరుగా రోడ్డు నిర్మించేందుకు రూ.60 లక్షలు అవసరమని ప్రతిపాదించారు. నిధులు విడుదల కాగానే పనులు మొదలు పెట్టారు. పట్టణంలోని ప్రధానరహదారిపై ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఈ మార్గాన్ని ప్రత్యామ్నాయంగా ఉపయోగిస్తున్నారు. పెదబొడ్డేపల్లి కూడలి నుంచి తునివైపు వెళ్లే భారీ వాహనాలను ఇటువైపే మళ్లిస్తుంటారు. ప్రధాన రహదారిలో పెదబొడ్డేపల్లి ఆర్డీవో బంగ్లా వద్ద కల్వర్టు ఎత్తు తక్కువగా ఉండడంతో సాగునీటి కాలువ నుంచి నీటి ప్రవాహం సాఫీగా సాగడం లేదు. కల్వర్టు అర మీటరు ఎత్తు చేయడానికి 38 లక్షలు మంజూరయ్యాయి. టెండరు ఖరారు కావడంతో వారంరోజుల్లో మొదలు పెట్టాలని అధికారులు ఆలోచిస్తున్నారు.

జోగునాథునిపాలెం రోడ్లో నిర్మించిన కల్వర్టు

అభ్యంతరాలుంటే ఫిర్యాదు చేయాలి

రావికమతం, న్యూస్‌టుడే: భూముల రీసర్వేపై అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయాలని డిప్యూటీ తహసీల్దారు అప్పలనాయుడు తెలిపారు. మేడివాడ, గొంప రెవెన్యూ గ్రామాల్లో రీసర్వేపై బుధవారం గ్రామసభలు నిర్వహించారు. రెండో విడత సర్వేలో భాగంగా గొంప, మేడివాడల్లో భూముల సర్వే నిర్వహించారు. దీనికి సంబంధించిన వివరాలను సచివాలయం వద్ద అందుబాటులో ఉంచారు. సర్వేలో పేర్కొన్న విస్తీర్ణం, ఆధార్‌నెంబరు తదితర తప్పులుంటే లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. వీఆర్వో బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న అప్పలనాయుడు తదితరులు

కౌన్సెలింగ్‌తో ఏకమైన యువ దంపతులు

చోడవరం, న్యూస్‌టుడే: వివాహం చేసుకుని ఆరు నెలలు పూర్తయింది. కొద్దికాలంలో వారిమధ్య మనస్పర్ధలు ఏర్పడ్డాయి. దీంతో విడాకులు తీసుకోడానికి కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో కోర్టులో కౌన్సిలింగ్‌కు వచ్చిన వారికి న్యాయాధికారులు, న్యాయవాది, గ్రామ పెద్దలు బుధవారం నచ్చజెప్పడం మళ్లీ కలిసి జీవనం సాగించేందుకు సమ్మతించారు.

★ లక్ష్మీపురానికి చెందిన ఉగ్గిన దొరతో గాజువాకకు చెందిన సింధూకు వివాహమైంది. కొద్దికాలానికే వారిమధ్య పొరపొచ్చాలేర్పడ్డాయి. కుటుంబ పెద్దలు చర్చలు జరిపినా ఫలితం లేకపోయింది. చివరికి ఇద్దరూ తమ అభీష్టం మేరకు విడాకులు తీసుకునేందుకు తీర్మానించుకున్నారు. చోడవరం కోర్టులో దరఖాస్తు చేశారు.

★ దొర, సింధూల మధ్య రాజీ కుదిర్చేందుకు ఏపీపీ చీపురుపల్లి సూర్యనారాయణ ప్రయత్నించి విజయవంతమయ్యారు. కలిసి జీవనం సాగించేందుకు కోర్టు ఆవరణలో ముందుకొచ్చిన దంపతులను అభినందించారు. యువ దంపతులను తొమ్మిదో అదనపు జిల్లా జడ్జి హరినారాయణ, సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ జడ్జి) గౌరీశంకరరావు, ప్రధాన జిల్లా జూనియర్ జడ్జి (జూనియర్ జడ్జి) స్వర్ణ అభినందించారు. ఏపీపీ సూర్యనారాయణను ప్రశంసించారు. క్షణికమైన ఆవేశాలకు నూతన దంపతులు గురికావద్దని న్యాయాధికారులు హితవు పలికారు. లక్ష్మీపురం పెద్దలు శిరిసోళ్ల సత్యారావు, భూతనాథుని నానికుమార్‌లు పాల్గొన్నారు.

దంపతులను అభినందిస్తున్న తొమ్మిదవ అదనపు జిల్లా జడ్జి హరినారాయణ, న్యాయాధికారులు

20న నూకాంబికా విగ్రహ ప్రతిష్ఠ

దేవరాపల్లి, న్యూస్‌టుడే : కాశీపురంలో నూతనంగా నిర్మించిన నూకాంబికా అమ్మవారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఈనెల 20న జరుగుతుంది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి సంబంధించి ముందుగా పూజాది కార్యక్రమాలు గురువారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈమేరకు ఆలయ ప్రాంగణంలో అభివృద్ధి కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

నూతనంగా నిర్మించిన ఆలయం

ప్రణాళికతో చదివితే ప్రథమశ్రేణి ఖాయం

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికతో చదివితే ప్రథమ శ్రేణి సాధించగలుగుతారని ఎంజేపీ బీసీ గురుకులం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.దేవరాజ్ అన్నారు. పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని బుధవారం రాత్రి సందడిగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మార్చి 16 నుంచి పరీక్షలు మొదలవుతున్నందున సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ చదువుకోవాలని సూచించారు. తొమ్మిదో తరగతి విద్యార్థులంతా పదో తరగతి విద్యార్థులను వీడ్కోలు సభకు ఘన స్వాగతంతో తీసుకువచ్చారు. విశ్రాంత ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

100 మందికి కంటి పరీక్షలు

గొలుగొండ: జిల్లా అంధత్వ నివారణ శాఖ సౌజన్యంతో విశాఖపట్నం శంకర్ నేత్రాలయ వారి ఆధ్వర్యంలో బుధవారం కృష్ణదేవిపేటలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. దాదాపు 100 మంది రోగుల కళ్లను వైద్యులు పరిశీలించారు. ఇందులో 35 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. వీరిని వేపగుంట సమీపంలో ఉన్న ఆసుపత్రికి తమ సంస్థ బస్సుల్లో తరలించి శస్త్రచికిత్సలు చేయిస్తామని శిబిర నిర్వాహకులు తెలిపారు.

డ్వాక్రా సంఘాలకు ప్రోత్సాహం

మాకవరపాలెం, న్యూస్‌టుడే : వెలుగు పథకం ఆధ్వర్యంలో మంజూరైన ఎగ్‌కార్ట్ వాహనాన్ని శెట్టిపాలెం సర్పంచి రామునాయుడు బుధవారం ప్రారంభించారు. చిరువ్యాపారాలు చేసుకునే డ్వాక్రా సంఘ సభ్యులు ఆర్థికంగా బలపడేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఏపీఎం మంగ తెలిపారు. స్వయం ఉపాధి ద్వారా మహిళలు అభివృద్ధికి రూ.50వేల విలువైన సామగ్రి కలిగిన ఎగ్‌కార్ట్ వాహనాన్ని ఉచితంగా అందజేశామన్నారు. చిన్నమ్మలు, రమణ, ఈశ్వరరావు, నూకరాజు పాల్గొన్నారు.

ఎగ్ కార్ట్ వాహనం ప్రారంభించిన రామునాయుడు

ఆక్రమణలు తొలగించాలని వ్యాపారులకు నోటీసులు

రావికమతం, న్యూస్‌టుడే: మండల పరిషత్‌కు చెందిన స్థలంలోని ఆక్రమణలు, అనధికార నిర్మాణాలు తొలగించాలని మండల పరిషత్ కార్యాలయం ఉద్యోగులు బుధవారం నోటీసులు అందజేశారు. రావికమతంలో ఆర్‌ఈసీ రోడ్డును ఆనుకొని సర్వే నంబరు. 103-2లో మండల పరిషత్‌కు చెందిన రూ.లక్షల విలువైన భూమి ఉంది. దీన్ని కొందరు ఆక్రమించి అనధికార నిర్మాణాలు చేపట్టి దుకాణాలు అద్దెకు ఇచ్చుకున్నారు. దీనిపై ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదు మేరకు ఈనెల 10 జిల్లా పరిషత్ సీఈవో నారాయణ మూర్తి రావికమతం వచ్చి మండల పరిషత్ స్థలం ఆక్రమణలను పరిశీలించారు. ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి ఖాళీ చేయించాలని మండల పరిషత్ అధికారులను ఆదేశించారు. దీంతో 10 మందికి నోటీసులు అందజేశారు. మరో ఐదుగురు అందుబాటులో లేరు.

ఆక్రమణదారులకు నోటీసులు అందజేస్తున్న మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు

ప్రత్యేక ఆధార్ శిబిరానికి స్పందన

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ మండలం సిరిజాం గ్రామ సచివాలయం వద్ద బుధవారం నిర్వహించిన ప్రత్యేక ఆధార్ శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఆధార్‌కార్డులోని మార్పులు, చేర్పులు, కొత్తకార్డుల నమోదుకు తరలివచ్చారు. ఆపరేటర్ వినోద్‌కుమార్, కార్యదర్శి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

★ చీడికాడ మండలం కోనాం సచివాలయం వద్ద గురువారం ప్రత్యేక ఆధార్ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ హేమసుందరరావు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం వరకు ఆధార్ శిబిరం జరుగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వివరాలను అప్‌లోడ్ చేస్తున్న ఆపరేటర్ వినోద్‌కుమార్

స్నేహితుడి కుటుంబానికి చేయూత

చోడవరం, న్యూస్‌టుడే: మండలంలోని గౌరీపట్నం గ్రామానికి చెందిన బాడిదిబోయిన పరదేశినాయుడు కుటుంబానికి స్థానిక యువకులు రూ.37వేలు పోగుచేసి ఆర్థికసాయంగా అందించారు. మృతిచెందిన పరదేశీనాయుడు తల్లికి ఈనగదును చోడవరం ఎస్సై జోగారావు చేతులు మీదుగా బుధవారం అందజేశారు. ప్రస్తుతం ఆమె ఒంటరి కావడంతో యువకులు చొరవ తీసుకుని ఆర్థికసాయం అందించారు.

109 పీఎం సూర్యఘర్ యూనిట్ల ఏర్పాటు

మాకవరపాలెం: పీఎం సూర్యఘర్ యోజనలో మండలంలో 109 యూనిట్లు అమర్చామని ఏఈ బాలకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఒక కేవీకి రూ. 30 వేల రాయితీ కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. సోలార్ యూనిట్లతో ఆర్థిక లాభం సమకూరుతుందని తెలిపారు.

మలుపుల్లో రోడ్డు శిథిలం.. గుండెల్లో భయం

చీడికాడ-చోడవరం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి అడవి అగ్రహారం కూడలి మీదుగా బైలపూడికి వెళ్లే మార్గం ప్రమాదకరంగా ఉంది. రోడ్డంతా బాగానే ఉన్నా.. మలుపుల్లో మాత్రం పూర్తిగా గుంతలుపడి రాళ్లుతేలి అధ్వానంగా ఉండటంతో చోదకులు భయాందోళన చెందుతున్నారు. ఈ రోడ్డులోని అడవి అగ్రహారం కూడలిలోనూ.. బైలపూడి సమీపంలోని మరో మూడు చోట్ల అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఎందరో గాయాలపాలవుతున్నారు. అధికారులు పట్టించుకొని సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – చీడికాడ, న్యూస్‌టుడే

మలుపులో అధ్వానంగా ఉన్న రోడ్డు

ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు అందజేత



చీడికాడలో..

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ఎంపీ సి.ఎం.రమేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఓబీసీ జిల్లా విభాగం నాయకుడు కిల్లాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రాంతీయ ఆసుపత్రిలోని పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. పట్టణ కమిటీ అధ్యక్షుడు బోళెం దొరబాబు, గ్రామీణ అధ్యక్షుడు నిద్దర శ్రీను పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట, మాడుగుల: వడ్డాది వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. మసీదులోనూ ప్రార్థనలు చేశారు. మండల భాజపా అధ్యక్షుడు సీతా నాగరాజు, షేక్ బాబాజీ పాల్గొన్నారు. మాడుగులలో ఉత్తరాంధ్ర జిల్లాల మహిళామోర్చా ఇన్‌ఛార్జి సుబ్బలక్ష్మి కేక్ కోసి శుభాకాంక్షలు తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు మెలిపాక స్వామి పాల్గొన్నారు.

దేవరాపల్లి, చీడికాడ: చీడికాడలో భాజపా ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు యర్రా వెంకటరావు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. భాజపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈశ్వరప్రసాదు, మండలాధ్యక్షుడు బాలకృష్ణ పాల్గొన్నారు. దేవరాపల్లి మండల భాజపా అధ్యక్షురాలు అప్పగడ్డ సత్యవేణి ఆధ్వర్యంలో కేక్ కోశారు

పండ్లు అందజేస్తున్న డా. సత్యనారాయణ

బుచ్చెయ్యపేటలో ప్రార్థనలు

మేమున్నాం.. మీకు తోడుగా

రావికమతం, న్యూస్‌టుడే: దాసరయ్యపాలెంలో సోలార్ మినీవాటర్ ట్యాంకు పనిచేయట్లేదు. కుళాయిలు ద్వారా తాగు నీటి సరఫరా జరగట్లేదు.
– ఎస్.రామునాయుడు, దాసరయ్యపాలెం.

✔: సోలార్ ట్యాంకు పనిచేయని విషయం కాంట్రాక్టరు దృష్టికి తీసుకెళ్లాం. సాంకేతిక లోపాన్ని సరిచేయించి సరఫరా పునరుద్ధరిస్తాం. – భగవంత్ రావు, ఏఈ, ఆర్‌డబ్ల్యుఎస్, రావికమతం

దేవరాపల్లి, న్యూస్‌టుడే : మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద మరుగుదొడ్లు లేక విద్యాశాఖ అధికారులతో పాటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. – దేవరాపల్లి మండల ఉపాధ్యాయులు, ✔: మరుగుదొడ్ల సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాం. సమగ్ర శిక్ష ద్వారా బ్లాక్ రీసోర్సు సెంటర్ (బీఆర్‌సీ) పథకం ద్వారా నిధులు మంజూరయ్యాయి.
– ఉమ, మండల విద్యాశాఖాధికారిణి

మేమున్నాం.. మీకు తోడుగా	
నర్సీపట్నం - 80085 74743	చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74740	చీడికాడ - 80085 74742

పొగబాధ తప్పింది

స్పందనకు వందనం

గొలుగొండ, న్యూస్‌టుడే: ఊర్లో ఊడ్చిన చెత్తంతా చోద్యం జడ్పీ పాఠశాల పాఠశాల రోడ్డు పక్కన పోసేవారు. నాలుగు రోజులకు ఓసారి పోగుపడిన చెత్తకు నిప్పు పెట్టడంతో వాహన చోదకులతోపాటు విద్యార్థులు పొగతో ఇబ్బందులు ఎదుర్కొనేవారు. దీనిపై ఈ నెల 11న 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో చిత్రవార్త ప్రచురితమైంది. స్పందించిన సచివాలయ ఉద్యోగులు చెత్త పోగుపడకుండా చర్యలు చేపట్టారు.

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు

లక్ష్మీకాంత్ స్క్రీన్-1: వంశీ
స్క్రీన్-2: మన శంకర వరప్రసాద్ గారు

21న ఆలయ వార్షికోత్సవం

లంకెలపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: పరవాడ మండలం కన్నూరు పంచాయతీ మడకపాలెంలో ఈనెల 21వ తేదీన శ్రీజువ్వమాంబ ఆలయ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆరోజు ఉదయం నుంచి అమ్మవారి దర్శనాలు, ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయని అన్నారు. భక్తులకు ప్రసాదం, మజ్జిగ పంపిణీ చేస్తామని, సాయంత్రం పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని అన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ.10 నుంచి మ.ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: 94వ వార్డు కృష్ణరాయపురం ఎస్సీ కాలనీలోని 3/52/4 వీధిదీపం నెల రోజులుగా వెలగడం లేదు. -చెంకవెంకటేశ్వరరావు, రామారావు, స్థానికులు ✓: వెంటనే వీధిదీపానికి మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తాం. -శ్రావణ్‌రాజు, ఏఈ, వీధిదీపాల నిర్వహణ విభాగం

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ మండలం గొర్లెవానిపాలెంలో కుక్కల బెడద అధికంగా ఉంది. -శ్రీను, పరవాడ ✓: మీ ప్రాంతంలో కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. -మల్లికార్జునరావు, డిప్యూటీ ఎంపీడీవో, పరవాడ

సబ్బవరం న్యూస్‌టుడే: ?: సబ్బవరం గంగిరెడ్డి కాలనీకి వెళ్లే దారిలో వ్యర్థాలు పేరుకుపోయాయి. -బి.రాంబాబు, సబ్బవరం ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. -పి.ఆనందరావు, గ్రామ కార్యదర్శి, సబ్బవరం

?: సబ్బవరం జోడుగుళ్ల వద్ద వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. -ఎం.కనకరాజు, జోడుగుళ్లు ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. -డి.ప్రసాద రావు, సర్పంచి, సబ్బవరం

స్పందనకు వందనం

ఎట్టకేలకు వ్యర్థాల తొలగింపు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం ప్రాథమిక పాఠశాల వద్ద వ్యర్థాలు పేరుకుపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో వెలువడిన వార్తాంశానికి పంచాయతీ అధికారులు స్పందించి బుధవారం పారిశుద్ధ్య సిబ్బందితో వ్యర్థాలు తీయించి సమస్య పరిష్కరించారు.

ముత్యాలమ్మపాలెం జెట్టీ నిర్మాణంలో ముందడుగు

మత్స్యకారుల్లో చిగురించిన ఆశలు

బోటును కర్రలతో భుజాలపై మోసుకొస్తున్న మత్స్యకారులు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం తీరం పరిధిలోని మత్స్యకారులకు మంచి రోజులు రానున్నాయి. ఈ తీరం వద్ద జెట్టీ నిర్మాణానికి అడుగులు పడుతుండడంతో గంగ పుత్రుల ఆశలు చిగురించాయి. ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెంతో పాటు శివారు గ్రామాలైన దిబ్బపాలెం, జాలరిపేట తదితర గ్రామాలకు చెందిన మత్స్యకారులు చేపలవేట నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ జెట్టీ నిర్మాణం జరగక కొన్నేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వీరి అవస్థలను ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో సర్వత్రా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

■ గత వైకాపా ప్రభుత్వం జెట్టీ నిర్మిస్తామని.. పదేపదే హామీలు గుప్పించినా అమలుకు నోచుకోలేదు. తీరంలో జెట్టీ లేకపోవడంతో వేటకు వెళ్లి, తిరిగి వచ్చే సమయంలో బోటును కర్రలతో భుజాలపై మోసుకోవాల్సి వస్తోంది. తుపాను సమయంలో బోట్లు, వలలు కొట్టుకుపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు.

■ ఈ పరిస్థితిలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఈ విషయం శాసనసభ దృష్టికి తీసుకెళ్లారు. ఏడాదిన్నర క్రితం ఇక్కడ జెట్టీ నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం చేసినా కార్యరూపం దాల్చనందున, వెంటనే దానిని ఆమోదించి త్వరితగతిన జెట్టీ నిర్మాణం జరిగేలా చూడాలని కోరారు. దానికి మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టమైన అనుకూల ప్రకటన చేయడంతో మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

"■ కూటమి ప్రభుత్వంలో జెట్టీ నిర్మాణానికి అడుగులు పడడం సంతోషకరం. గత వైకాపా ప్రభుత్వం ముత్యాలమ్మపాలెం తీరంలో జెట్టీ నిర్మిస్తామని హామీ ఇచ్చినా అమలు కాలేదు. ఇటీవల ఎమ్మెల్యే రమేశ్‌బాబు ఈ విషయం అసెంబ్లీలో ప్రస్తావించడంతో మత్స్యకారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం వేట నిషేధ పరిహారాన్ని రూ.10వేల నుంచి రూ.20వేలకు పెంచి మత్స్యకారులకు అండగా నిలిచింది. అలాగే ఇక్కడ జెట్టీ నిర్మాణం జరిగితే ఎంతో మేలు జరుగుతుంది. -చింతకాయల సుజాత, సర్పంచి, ముత్యాలమ్మపాలెం

22 నుంచి పరదేశిమాంబ ఉత్సవాలు

తానాం(పరవాడ), న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన తానాం ప్రజల ఆరాధ్య దేవత శ్రీపరదేశిమాంబ వేడుకలను ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పురవీధులతో పాటు ప్రధాన రహదారుల వెంబడి ప్రత్యేక విద్యుత్తు దీపాలంకరణ చేస్తున్నారు. ఈనెల 22న రాత్రి 8 గంటల నుంచి గ్రామ ప్రధాన కూడళ్లలో 7 భారీ వేదికలపై వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. 24వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 4 గంటల నుంచి అమ్మవారి దర్శనాలు, ప్రత్యేకపూజలు ప్రారంభమవుతాయి. ఆలయం వద్ద భక్తులకు ప్రసాదాలు, మజ్జిగ వితరణ ఉంటుంది. ప్రజలు ఈ వేడుకలను విజయవంతం చేయాలని సర్పంచి కన్నూరు దేవి కోరారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం పరదేశిమాంబ పండగ ఈనెల 24వ తేదీన జరుగుతుందని నిర్వాహకులు బొకం శ్రీనివాస్ తదితరులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాల కోసం 91219 22902, 76800 27147 నంబర్లకు ఫోనులో సంప్రదించాలని కోరారు. ఈ వేడుకల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, భారీ బాణసంచా కాల్పులు ఉంటాయన్నారు.

సెక్యూరిటీ ఎనలిస్ట్ కోర్సులో శిక్షణకు ఆహ్వానం

భీమునిపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో సెక్యూరిటీ ఎనలిస్ట్ కోర్సులో మూడు నెలల ఉచిత శిక్షణ గురువారం నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. 18-35 ఏళ్ల వయసున్న వారు అర్హులు. డిగ్రీ లేక డిప్లొమా కోర్సుల్లో ఉత్తీర్ణులై ఉండాలి. ఆసక్తి గల అభ్యర్థులు 9014758949 నంబర్‌లో సంప్రదించాలని పాలిటెక్నిక్ కళాశాల ప్రధానాచార్యులు డా.సి.హెచ్.మురళీకృష్ణ సూచించారు.

వేంకటాద్రిపై ఫాల్గుణ పక్షోత్సవాలకు శ్రీకారం

మహాలక్ష్మి అమ్మవారు

పెందుర్తి, న్యూస్‌టుడే: మహాలక్ష్మీ అమ్మవారి తిరునక్షత్రం వేడుకల సందర్భంగా వేంకటాద్రిపై శ్రీనివాసుడి సన్నిధిలో ఫాల్గుణ పక్షోత్సవాలకు అర్చకులు బుధవారం సంప్రదాయబద్ధంగా శ్రీకారం చుట్టారు. ఆలయ ప్రధానార్చకులు మహర్షి రామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు ఆలయ ప్రాంగణంలోని మహాలక్ష్మి అమ్మవారిని పట్టు పీతాంబరాలతో అలంకరించారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం ప్రక్రియ చేశారు. శ్రీవారికి పూజలు చేసి ఉత్సవాంగ్కారం తీసుకున్నారు. శ్రీసూక్త సహితంగా సాగర తనయవ విశిష్ట కుంకుమార్చన జరిపారు. భక్తులు పాల్గొని అమ్మవారి సన్నిధిలో అష్టలక్ష్మి స్తోత్ర పారాయణం చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

విశాఖ డెయిరీ పాల ధరలు తగ్గించాలి

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: లాభాల్లో నడుస్తున్న విశాఖ డెయిరీ.. పాల ఉత్పత్తుల ధరలు పెంచడం అన్యాయమని సీపీఎం గోపాలపట్నం జోన్ నాయకులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం సుజాతనగర్ కూడలి వద్ద నిరసన చేపట్టారు. గోపాలపట్నం జోన్ కార్యదర్శి బి. జగన్ మాట్లాడుతూ పెంచిన ధరలు వినియోగదారులకు భారం కానున్నందున తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కూటమి నేతలు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యురాలు బి.రమణి, నాయకులు శంకర్, అప్పలనాయుడు, ప్రమదేవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుజాతనగర్ కూడలిలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

ఘనంగా పది విద్యార్థుల వీడ్కోలు వేడుక

ఇస్లాంపేట(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డు పరిధి ఇస్లాంపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలోని పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం ప్రమీల మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థులంతా పరీక్షలు బాగా రాసి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ సందర్భంగా గొన్నా కళాకారుల కార్యదర్శి హేమచంద్రనాయుడు రూ.12వేలు, పార్కా నిర్మాణ సంస్థ నాయకుడు ఉత్తమ దేశెట్టి రూ.5వేలు వెచ్చించి పాఠశాలకు టెంట్ అందించారు. పదోతరగతి విద్యార్థులు రూ.25వేలు వెచ్చించి 40 కుర్చీలు సమకూర్చారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి సహకరించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. పీఎంసీ ప్రతినిధులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీలు అందజేసిన పదోతరగతి విద్యార్థుల బృందం

రామాయణంపై ప్రవచనం

ప్రసంగిస్తున్న రమణమూర్తి

నాయుడుతోట (వేపగుంట), న్యూస్‌టుడే: నాయుడుతోట సమీప రవినగర్‌లోని బాలత్రిపురేశ్వరి పీఠంలో 41రోజులపాటు జరిగే శ్రీమద్రామాయణ ప్రవచన కార్యక్రమాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు బ్రహ్మశ్రీ పీసపాటి రమణమూర్తి ప్రవచనం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శతాబ్ది ఉత్సవాల నిర్వహణపై ప్రత్యేక సమావేశం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలు ఎలా నిర్వహించాలన్న విషయమై బోధనా సిబ్బందితో బుధవారం వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో సమావేశం జరిగింది. ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ సిబ్బంది అభిప్రాయాలు తెలుసుకున్నారు.

రూ.50 లక్షలతో నీటి సరఫరా పనులకు శ్రీకారం

వీరానగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ శానాపతి వసంత, తదితరులు

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు పరిధిలోని వీరానగర్, ఎంఈఎస్ లేఅవుట్, చంద్రన్ననగర్ కాలనీల్లో నీటి సరఫరా పనులకు వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కాలనీల్లో రూ.50లక్షలతో తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకరరావు, కిశోర్, చక్రి, వెంకటరమణమూర్తి, శ్రీనివాసరావు, మధుసూదనరావు, తిరుపతిరావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాధారం నేలపాలు

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్ సీ-2 జోన్‌లో పది రోజులుగా మంచి నీరు వృథాగా పోతోందని కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీలోని వార్డు సచివాలయం పరిధి తూర్పు రోడ్డులోని జీవీఎంసీ పైపులైనుకు లీకులు ఏర్పడి ప్రతిరోజు పెద్దఎత్తున నీరంతా రోడ్డు పాలవుతోందని ఆవేదన చెందుతున్నారు. సిబ్బందికి ఫిర్యాదు చేసినా ఫలితం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి నీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

సుజాతనగర్ సీ-2 జోన్‌లో..

పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలి

మాట్లాడుతున్న సబ్బవరం ఎంపీడీవో పద్మజ

సబ్బవరం, న్యూస్‌టుడే: పంచాయతీలలో పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని సబ్బవరం ఎంపీడీవో పి.పద్మజ అన్నారు. మండల స్థాయి అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామ సచివాలయ కార్యదర్శులతో కూడా మాట్లాడారు. కుటుంబ సర్వే వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఏవో త్రినాథ్, మండల వార్డు, సచివాలయాధికారి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వితరణ

పరవాడ, సబ్బవరం, న్యూస్‌టుడే: అనకాపల్లి పార్లమెంట్ సభ్యుడు సీఎం రమేశ్ పుట్టినరోజు సందర్భంగా భాజపా నాయకుడు కూండ్రపు సోము నాయుడు ఆధ్వర్యంలో బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పరవాడ సీహెచ్‌సీలోని 75 మంది రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కొండకర్ల ఇచ్ఛా ఫౌండేషన్‌లోని దివ్యాంగులకు మధ్యాహ్న భోజనం సమకూర్చారు. ఈకార్యక్రమంలో బండారు రాజశేఖర్, రాజు, అజయ్, గోపి, రాజేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

★ ఈ మేరకు భాజపా నాయకులు చొక్కాకుల వెంకట్రావు తదితరుల ఆధ్వర్యంలో బుధవారం సబ్బవరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గొంప నర్సింగరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర నేత కామినేని సురేంద్రమోహన్, ఈర్లె శ్రీరామమూర్తి మాట్లాడారు. అనకాపల్లి అభివృద్ధికి ఎంపీ సీఎం రమేష్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ద్వారంపూడి పరమేశ్వరరావు, పీవీఎస్ఎన్ రాజు, శరగడం శంకరరావు, గొర్లె రామునాయుడు తదితరులు కూడా మాట్లాడారు. అనంతరం పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. గొట్టివాడ సామ్రాట కుమార్, ముమ్మన దేముడు, ఇందల రమణ, చొక్కాకుల గోవింద్, కర్రి కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న భాజపా నాయకులు

దుప్పట్లు పంపిణీ చేస్తున్న గొర్లె రామునాయుడు, తదితరులు

లయోలా వృద్ధాశ్రమంలో..

పెందుర్తి, న్యూస్‌టుడే: భాజపా పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో స్థానిక లయోలా వృద్ధాశ్రమంలో నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం తాండ్ర పాపారాయుడు కల్యాణ మండపంలో కేకు కోసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎం రమేశ్ కార్యాలయం ఇన్‌ఛార్జి విజయ్, నాయకులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, రెడ్డి నారాయణరావు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు. పెందుర్తి తెదేపా కార్యాలయంలో వంశీదీప్ ఆధ్వర్యంలో ఎంపీ పుట్టినరోజు వేడుకలు జరిగాయి.

23న ప్రాంగణ ఎంపికలు

పెందుర్తి, న్యూస్‌టుడే: ఈ నెల 23వ తేదీన స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఎన్.ఈ.ఫ్లోరా ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9.30 గంటల నుంచి కళాశాల ఆవరణలో జరిగే మేళాలో వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొని ప్రాంగణ ఎంపికలు చేపడతారన్నారు. 2015 నుంచి 2026 మధ్య డిగ్రీ చేసిన, ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న డిగ్రీ, బీటెక్ అభ్యర్థులు పాల్గొనవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం 93917 52833 నంబరుకు ఫోనులో సంప్రదించాలని సూచించారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

ప్రహ్లాదపురం(వేపగుంట), న్యూస్‌టుడే: ప్రహ్లాదపురం శిరిడి సాయిబాబా ఆలయ ప్రాంగణంలో సాయిశివాలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఈనెల 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు మూడురోజులపాటు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది. 20న మహాగణపతి పూజతో వేడుకలు ప్రారంభమై యాగాలు, మండపారాధనలు, అగ్నిప్రతిష్ఠాపనలు, సాయంత్రం 5 గంటల నుంచి తిరువీధి, 21న ప్రత్యేక హోమాలు, 22న శ్రీసాయి ఈశ్వరాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన, మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన ఉంటుందని కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.

విద్యార్థులకు నైపుణ్య శిక్షణ తరగతులు

నరవ(వేపగుంట), న్యూస్‌టుడే: నరవ బెహరా ఇంజినీరింగు కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈఎస్‌డీపీ, ఎంఎస్ఎంఈ, విజయనగరం జేఎన్‌టీయూ గురజాడ సంస్థల సంయుక్త సారథ్యంలో ఈ తరగతులు ప్రారంభమయ్యాయి. 20 రోజులపాటు జరిగే ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులకు ఉపాధి అవకాశాలు చూపడంలో సంబంధిత సంస్థలు సహకరిస్తాయని ప్రిన్సిపల్ శ్రీధర్ పట్నాయక్ తెలిపారు. సాయితేజ, నారాయణ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి ప్రాంతానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపారు. ఆ వివరాలిలా.. పెందుర్తి కూడలి సమీప పెద్దిరెడ్డి కాలనీకి చెందిన ఆడారి రామకృష్ణ ఒడిశాకు చెందిన మధుస్మిత శెట్టి(25)ని ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం సాయంత్రం ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చరవాణి వదిలి వెళ్లిపోవడంతో పలుచోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

రాష్ట్రపతి పర్యటన సాగిందిలా..

సింధియా, న్యూస్‌టుడే:
★ ఉదయం 9.55 గంటలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చోళా బస కేంద్రం నుంచి బయల్దేరారు.
★ ఉదయం 9.57కు గౌరవ వందనం స్వీకరించి పరేడ్‌ను పరిశీలించారు. ★ ఉదయం 10.04కి నేవల్ జెట్టీలో ప్రత్యేకించి ఏర్పాటు చేసిన ఐఎన్ఎస్ సుమేధ నౌకపై ఎక్కారు. ★ 10.08కు గౌరవ వందనం స్వీకరించారు.
★ 10.12కు నౌకలో ప్రయాణించారు
★ 10.33 నుంచి 10.52 వరకు నౌకపై నుంచే సముద్రంలో నౌకలను సమీక్షించారు ★ 10.53 నుంచి 10.57 వరకు యుద్ధనౌకల సెయిలింగ్ పరేడ్‌ను వీక్షించారు.
★ 11.19 నుంచి 11.24 వరకు నమూనా ప్రదర్శనలను తిలకించారు.
★ 11.45 నుంచి 11.48 వరకు ప్రత్యేక దళాలు తమ విన్యాసాలను ప్రదర్శించాయి. ★ 11.54 నుంచి 12.06 వరకు వాయుసేన విమానాల విన్యాసాలు జరిగాయి.
★ 12.07 నుంచి జలాంతర్గాముల గౌరవ వందనం స్వీకరించారు.
★ 12.09కి రాష్ట్రపతికి జ్ఞాపికను అందజేశారు. ★ 12.10 నుంచి రాష్ట్రపతి ప్రసంగించారు. ★ 12.36కి తిరిగి గౌరవ వందనం స్వీకరించారు. ★ 12.41కు సుమేధ నౌక తిరిగి జెట్టీవైపు బయల్దేరింది.
★ 12.50కు రాష్ట్రపతి జెట్టీ దిగి ప్రత్యేక వాహనంలో బయల్దేరారు.

కనులపండువగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి నిత్య కల్యాణోత్సవం బుధవారం సింహగిరిపై కనులపండువగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు జరిపారు. దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయ వేడుకను జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

స్వామి, అమ్మవార్లు, నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు

నేనూ అడివివరంలోనే చదువుకున్నా..

ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

విద్యార్థులకు సూచనలిస్తున్న వీసీ రాజశేఖర్

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: 'నేనూ మీలాగే అడివివరం పాఠశాలలోనే తెలుగు మాధ్యమంలో చదువుకుని ఈ స్థాయికి ఎదిగాను. సాధించాలనే పట్టుదల, లక్ష్యంపై చిత్తశుద్ధి ఉంటే ఉన్నత స్థాయికి తప్పక ఎదుగుతార'ని ఆంధ్రా విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ అన్నారు. ఆయన బుధవారం అడివివరం జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఇష్టంతో కష్టపడి చదివితే భవిష్యత్తు బాగుంటుందన్నారు. అందుబాటులో ఉన్న సాంకేతికతను కొత్త విషయాలు తెలుసుకోవడానికి ఉపయోగించాలన్నారు. స్వయం పోర్టల్ ద్వారా ఐఐటీ ఆచార్యులు ప్రాథమిక స్థాయి తరగతులకు కూడా పాఠాలు బోధిస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్ మాట్లాడుతూ అడివివరం పాఠశాలలో చదివి ఏయూ వీసీగా రాజశేఖర్ ఎదిగిన తీరును విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీసీని ఘనంగా సత్కరించారు.

యుద్ధప్రాతిపదికన తారురోడ్డు నిర్మాణం

కళాగ్రామం రహదారి సిద్ధం చేశారిలా..

పెందుర్తి, న్యూస్‌టుడే: అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ నేపథ్యంలో వివిధ దేశాలకు చెందిన నేవీ అధికారుల బృందం పెందుర్తి మండలం పెదగాడి సమీప సంకల్ప కళాగ్రామాన్ని సందర్శించనున్న నేపథ్యంలో జీవీఎంసీ అధికారులు యుద్ధప్రాతిపదికన రహదారి నిర్మాణం పనులు చేపట్టారు. వేపగుంట-పినగాడి రోడ్డులోని చింతలగ్రహారం మేహాద్రి వంతెనపై తారురోడ్డు నిర్మించారు. వంతెన పైనుంచి కళాగ్రామానికి వెళ్లే వరకు నూతన బీటీ రహదారి నిర్మించారు. లక్ష్మీపురం రైలు వంతెన నుంచి చింతలగ్రహారం వంతెన వరకు రహదారిలో పరిశుభ్రత పనులు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు, తుప్పలు తొలగించి పారిశుద్ధ్యం మెరుగుపరిచారు. సంబంధిత మార్గంలో పలుచోట్ల గుంతలు పూడ్చే పనులు చేపట్టారు. వాటిని పెందుర్తి జోనల్ కమిషనర్ శంకరరావు బుధవారం పరిశీలించారు.

డిజిటల్ యుగంలో సోషల్ మీడియా కీలకం

సమావేశంలో పోస్టుమాస్టర్ జనరల్ వి.ఎస్.జయశంకర్, సాఫ్ట్‌స్కిల్స్ నిపుణుడు చల్లా కృష్ణవీర్ అభిషేక్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: డిజిటల్ కమ్యూనికేషన్ యుగంలో సోషల్ మీడియా కీలకపాత్ర పోషిస్తోందని విశాఖ పోస్టుమాస్టర్ జనరల్ వి.ఎస్.జయశంకర్ అన్నారు. ఎంవీపీ కాలనీ పోస్టల్ శాఖలో బుధవారం సోషల్ మీడియా కార్యశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమకాలీన డిజిటల్ కమ్యూనికేషన్ నైపుణ్యాలు పోస్టల్ అధికారులకు అందించడం, ప్రజలతో అనుసంధానం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. సాఫ్ట్ స్కిల్స్ నిపుణుడు చల్లా కృష్ణవీర్ అభిషేక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రభుత్వం తమ సేవలను సమర్థవంతంగా చేరవేయాలంటే కథనం, విజువల్ కంటెంట్ విలువ ఆధారిత వినియోగం ఎంతో ముఖ్యమన్నారు. పోస్టల్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్లు కె.వి.డి.సాగర్, ఆర్.నవీన్‌కుమార్, సోషల్ మీడియా ప్రతినిధి సుష్మిత, పోస్టల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

● సాహిత్య సేవలో 'సహృదయ సాహితి'

సీతంపేట, న్యూస్‌టుడే: సహృదయ సాహితి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో బుధవారం సాహిత్య సభ నిర్వహించారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ సహృదయ సాహితి 46వ వార్షికోత్సవం ఈనెల 20న సాయంత్రం 6 గంటలకు విశాఖ పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్నామన్నారు. ఇప్పటివరకు 3543 సదస్సులు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సీహెచ్ చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణమూర్తి, అయ్యల సోమయాజుల ప్రసాద్, పరమేశ్వరరావు, కొత్తూరు రమణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

ప్రత్యేక రైళ్ల గడువు పొడిగింపు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పలు ప్రత్యేక రైళ్ల గడువు పొడిగించనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. ★ మార్చి 2 నుంచి 30 వరకు చర్లపల్లి- భువనేశ్వర్ న్యూ(07165), మార్చి 3 నుంచి మార్చి 31 వరకు భువనేశ్వర్ న్యూ- చర్లపల్లి(07166), ఈనెల 28 నుంచి మార్చి 14 వరకు ప్రతి శనివారం చెన్నై ఎగ్మోర్- సంత్రాగచ్చి (06077), మార్చి 2 నుంచి 16 వరకు ప్రతి సోమవారం సంత్రాగచ్చి- చెన్నై ఎగ్మోర్ (06078), ఈనెల 22 నుంచి మార్చి 8 వరకు ఎంజీఆర్ చెన్నై సెంట్రల్- బరౌని (06039), ఈనెల 25 నుంచి మార్చి 11 వరకు బరౌని- ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (06040), ఈనెల 27న సికింద్రాబాద్-నెహర్లగన్ (07046), మార్చి 2న నెహర్లగన్- సికింద్రాబాద్ (07046) ప్రత్యేక రైళ్లు అందుబాటులో ఉంటాయన్నారు.

ఐసీఏఐ నూతన కార్యవర్గం ఎన్నిక

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) విశాఖపట్నం బ్రాంచి 2026-27 సంబంధించి నూతన కార్యవర్గాన్ని బుధవారం పిఠాపురంకాలనీలో ఐసీఏఐ భవన్‌లో ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా పట్నాల లోకేశ్, వైస్‌ఛైర్మన్‌గా నెమ్మది రామునాయుడు, కార్యదర్శిగా ఎంఎల్‌డీ ఉజ్వల, కోశాధికారిగా మొగలపల్లి పి.గురుమూర్తి, విద్యార్థుల సమాఖ్య అధ్యక్షుడిగా కె.రాంబాబు, సంపాదకుడిగా డి.లీలావరప్రసాద్, కార్యవర్గ సభ్యుడిగా శ్రీధర్ అందవరపు, ఎక్స్‌అఫిషియో కార్యవర్గ సభ్యుడిగా డి.ప్రసన్నకుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ సంతోష్ మాట్లాడుతూ సీఏల వృత్తి అభివృద్ధి కోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు పలువురు సీఏలు పాల్గొని అభినందనలు తెలిపారు.

నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

పేదల ఇళ్ల నిర్మాణాలకు అనుమతించాలి

వేపగుంట, న్యూస్‌టుడే: రెవెన్యూ స్థలాల్లో పేదలకు మంజూరైన ఇళ్ల నిర్మాణాలకు దేవస్థానం అధికారులు సహకరించాలని కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు కోరారు. వెంకటసాయినగర్, అప్పలనర్సయ్యకాలనీ మధ్య క్వారీ స్థలంలో పేదలకు ఇళ్లు మంజూరయ్యాయి. ఆ మేరకు లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు సిద్ధమవుతుండగా ఎస్‌డీసీ గీతాంజలి, ఏఈవో పిల్లా శ్రీను నిలుపుదల చేశారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్... సంబంధిత స్థలం రెవెన్యూకు చెందినదని గతంలో అధికారులు సర్వే చేసి అప్పగించారని వివరించారు. దీనిపై మరోసారి సర్వే చేపడతామని అంతవరకు పనులు నిలపాలని ఎస్డీసీ చెప్పడంతో ఆమేరకు లబ్ధిదారులు పనులు నిలిపివేశారు.

NOTICE

IN THE COURT OF SUBORDINATE JUDGE AT ALANDUR

H.M.O.P.No. 891 of 2024

Mrs. Archana ....Petitioner
Vs
Mr. Mani kumar Yerupalli ....Respondent

To:
Mr. Manikumar Yerupalli, S/o Baburao Yerupalli, 7-41, Savitri Nagar, Visakhapatnam., Andhra Pradesh - 531 173

Sir, Kindly take notice that the petitioner above named filed an application for Divorce in **HMOP No.891 of 2024** as against you, the case is stand posted for your appearance. Hence be present on **12.03.2026** at 10.00 am before the above court either in person or through your advocate, failing which the matter will be decided in your absence.

M.Sushma B.C.S., LL.M, Advocate MS 219/2017
Counsel for Petitioner,
Plot No.5, Rathi Street, Ganga Kaveri Cross Street, Ramakrishna Nagar Extn. Porur, Chennai - 600 116. **M- 98844 50091**

ఈనాడు అనంతపురం
గురువారం ఫిబ్రవరి 19, 2026

‘ఉద్యాన ఉత్పత్తులను పెంచడానికి ఏం చేయాలన్న దానిపై కార్యాచరణ సిద్ధం చేయాలి. ప్రస్తుత రబీలో ఈ-పంట నమోదు 86 శాతం పూర్తయింది. వందశాతం నమోదు అయ్యేలా పని చేయాలి. కిసాన్ డ్రోన్ల కోసం జిల్లాలో 4,256 మంది రైతులు నమోదు చేసుకున్నారు. మార్క్‌ఫెడ్ పరిధిలో 10 వేల మెట్రిక్ టన్నుల కందులను కొన్నారు. సెనగల కొనుగోలుకు రైతుల రిజిస్ట్రేషన్ త్వరగా చేయాలి. - కలెక్టర్’

ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని పెంచాలి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలో ఉద్యాన పంటల సాగు వైపు వెళ్లేలా రైతులను మరింత ప్రోత్సహించాలి. ఇప్పుడున్న విస్తీర్ణాన్ని రెట్టింపు స్థాయిలో పెంచాల్సిన అవసరం ఉందని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. అరటి, దానిమ్మ, మిరప.. వంటి పంటల సాగుపై తగిన అవగాహన కల్పించాలని సూచించారు. బుధవారం తన కార్యాలయంలో వ్యవసాయం, దాని అనుబంధశాఖల జిల్లా అధికారుల సమీక్ష జరిగింది. సమావేశంలో జేడీఏ రవి, డీసీఓ అరుణ కుమారి, ఉద్యాన అధికారిణి ఉమాదేవి, ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి, పశు సంవర్ధక జేడీ ప్రేమ్‌చంద్, మార్కెటింగ్ ఏడీ రాఘవేంద్ర కుమార్, ఆత్మా పీడీ పద్మలత, ఎల్డీఎం నరేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

21న ఉద్యోగ మేళా

రుద్రంపేట, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా నిరుద్యోగ యువతీ, యువకులకు ఈనెల 21న కోర్టు రోడ్డు సమీపంలోని ఉపాధి కల్పన కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి పల్లవి తెలిపారు. ఫ్లిప్‌కార్ట్ సంస్థలో డెలివరీ బాయ్స్, గర్ల్స్ ఉద్యోగాలకు ఎంపిక నిర్వహించనున్నట్లు ఆమె చెప్పారు. పదో తరగతి నుంచి ఆపై చదివి 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయసున్న నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

ఆవాలు.. బంగారు పూలు..

జిల్లాలో ఆవాలసాగు పెరుగుతోంది. కణేకల్లు మండలం గనిగెరలో పలువురు రైతులు సాగుచేసిన ఆవాలు పంట పూత పసుపు వర్ణంతో చూపరులను ఆకట్టుకుంటోంది. ఔషధాలు, ఇతర నూనె తయారీలో వినియోగించే ఆవాలు పంట స్థానికంగా 100 ఎకరాల్లో సాగుచేశారు. పూత దశలో ఉండటంతో పచ్చదనంతో చూపరులను ఆకట్టుకుంటోంది.

“ఇది అతి తక్కువ పెట్టుబడితో సాగయ్యే స్వల్పకాలిక పంట కావడంతో రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు.”

వరి కోతలయ్యాక ఒక తడి నీరు పెట్టి విత్తనాలు చల్లితే మొలకెత్తి 45 రోజుల్లో పూతకు వచ్చి 90 రోజుల్లోనే పంట చేతికందుతోంది. తక్కువ శ్రమతో ఎక్కువ ఆదాయం వస్తుండటంతో రైతులు రెండో పంటగా ఆవాలు సాగుపై ఆసక్తి చూపుతున్నారు. - న్యూస్‌టుడే, కణేకల్లు

పింఛన్ల పంపిణీలో.. చేతివాటం!

ఆర్‌బీఐఎస్‌ను దుర్వినియోగం చేస్తున్న సిబ్బంది

“ఉరవకొండ మండలం వై.రామాపురం గ్రామానికి చెందిన పింఛనుదారు ఎర్రిస్వామి 2022, ఆగస్టులో మృతి చెందారు. అతని భార్య ఇటీవల పింఛను కోసం పీజీఆర్‌ఎస్‌లో దరఖాస్తు చేసుకుంది. డీఆర్‌డీఏ అధికారులు పరిశీలించగా ఆమె భర్త బతికేఉన్నట్లు.. నెల నెలా పింఛను తీసుకున్నట్లు ఆన్‌లైన్‌లో గుర్తించారు. సమగ్రంగా విచారించాక బ్రహ్మసముద్రం మండలం భైరవానితిప్ప సచివాలయంలో పనిచేస్తున్న సంక్షేమ సహాయకుడు ఆర్‌బీఐఎస్‌ను దుర్వినియోగం చేస్తూ ఎర్రిస్వామి పేరిట ప్రతినెలా పింఛను డ్రా చేస్తున్నట్లు గుర్తించారు. ఇప్పటివరకు రూ.1.80 లక్షలు తీసుకున్నట్లు తెలుస్తోంది.”

ఈనాడు, అనంతపురం: గ్రామ సచివాలయ ఉద్యోగుల్లో కొందరు పింఛన్ల పంపిణీలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. యాప్‌లోని సాంకేతిక లోపాలను ఆసరాగా చేసుకుని మృతుల పింఛన్లు డ్రా చేసుకుంటూ జేబులు నింపుకొంటున్నారు. వయోవృద్ధులు, మంచానికి పరిమితమైన పింఛనుదారుల సౌకర్యార్థం అమలు చేస్తున్న ఆర్‌బీఐఎస్ (రియల్‌టైమ్ బెనిఫిషరీ ఐడెంటిఫికేషన్ సిస్టమ్)ను దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఎలా చేస్తున్నారు?

పింఛన్ల పంపిణీలో వయోభారం కారణంగా కొందరి వేలిముద్రలు, ఐరిస్ తీసుకోవడం కష్టంగా మారుతోంది. ఐదుసార్లు బయోమెట్రిక్, ఐరిస్ విఫలమైన వారికి ఆర్‌బీఐఎస్ ద్వారా పింఛను సొమ్ము అందజేస్తారు. సంక్షేమ సహాయకుడు లబ్ధిదారుడిని రియల్‌టైమ్‌లో వీడియో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇందుకు ఎంపీడీవో ఆమోదం తప్పనిసరి. ఇక్కడే కొందరు సిబ్బంది అక్రమాలకు తెరతీస్తున్నారు. పింఛనుదారు చనిపోవడానికి ముందు ఉద్దేశపూర్వకంగానే వారి ముఖ కవళికలను వీడియో తీసి ఫోన్‌లో భద్రపరచుకుంటున్నారు. సదరు వ్యక్తి చనిపోయిన తర్వాత పాత వీడియోలను ఒక ఫోన్‌లో ప్లే చేసి మరో ఫోన్ ద్వారా యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఎంపీడీవోలు పరిశీలించకుండానే వాటికి ఆమోదం తెలుపుతుండటంతో అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

పింఛన్ల బదిలీల్లో నిర్లక్ష్యం

లబ్ధిదారుల సౌకర్యార్థం పింఛన్లను ఒక చోటు నుంచి మరో చోటుకు మార్చుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. దీన్ని కూడా కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. లబ్ధిదారు దరఖాస్తు చేసుకుంటేనే పింఛను బదిలీ చేయడానికి వీలవుతుంది. ఈ నేపథ్యంలో వై.రామాపురానికి చెందిన ఎర్రిస్వామి పింఛన్‌ను సదరు సంక్షేమ సహాయకుడు బ్రహ్మసముద్రం మండలానికి ఎలా బదిలీ చేశారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఫోర్జరీ సంతకాలు, నకిలీ వేలిముద్రలతోనే సాధ్యమవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

విచారణ జరుపుతున్నాం

పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన ఫిర్యాదు మేరకు బ్రహ్మసముద్రం ఎంపీడీవో ద్వారా విచారిస్తున్నాం. చనిపోయిన వ్యక్తి పింఛన్‌ను 40 నెలలుగా అక్రమంగా డ్రా చేసినట్లు ప్రాథమికంగా గుర్తించాం. విచారణ పూర్తయిన వెంటనే బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటాం. - శైలజ, డీఆర్‌డీఏ పీడీ

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సా॥)	సహర్ (ఉ॥)
అనంతపురం	6.26	5.25
గుంతకల్లు	6.30	5.22

అనుమతులు లేకుండా వేసిన షెడ్లు

దర్గాగా.. కబ్జా!

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే: గుత్తిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. ఇక్కడ ఎవరి అనుమతులు లేకుండానే పుట్టగొడుగుల్లా షెడ్లు వెలుస్తున్నాయి. షెడ్లు వేసుకున్న స్థలం మొత్తం రెవెన్యూ కార్యాలయానికి సంబంధించినది కావడం గమనార్హం. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఆరు నెలల కిందట అప్పటి తహసీల్దార్ ఓబులేసు షెడ్లు తొలగించాలని నోటీసులు ఇచ్చినా ఇప్పటి వరకు అతీగతీ లేదు. మరోవైపు ఆయా షెడ్ల నిర్వహణలో భాగంగా అక్రమంగా విద్యుత్తును సైతం వినియోగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. స్థలాల క్రయ విక్రయాల్లో భాగంగా రిజిస్ట్రేషన్లు చేయించి ప్రజలు వద్ద నుంచి ఎక్కువ మొత్తం వసూలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. రెవెన్యూ అధికారులు స్పందించి షెడ్లను తొలగించి స్థలాలను స్వాధీనం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆనందాలు నిండుగా..

ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులతో లోకేశ్ విందు

ఈనాడు, అనంతపురం: సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా మంత్రి లోకేశ్ ఉమ్మడి అనంతపురం ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, వారి కుటుంబ సభ్యులతో భేటీ అయ్యారు. బుధవారం ఉండవల్లిలోని నివాసంలో జరిగిన విందుకు మంత్రి లోకేశ్ స్వయంగా ప్రతి ఒక్కరికీ ఆహ్వానం పలికారు. ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యుల్లో ఒకరిగా కలిసిపోయారు. ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా పలకరించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. పిల్లలతో మమేకమై సరదాగా గడిపారు. మహిళలకు మంగళగిరి పట్టుచీరలను బహుమతిగా అందించారు. ప్రజాప్రతినిధులు గతంలో అందించిన అర్జీల్లో ఎన్ని పరిష్కారం అయ్యాయి? ఎన్ని కాలేదు? అనే వివరాలతో కూడిన నివేదికను అందించి బాధ్యతను చాటుకున్నారు. మంత్రులు పయ్యావుల కేశవ్, సవిత, సత్యకుమార్, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, పార్థసారథి, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత, గుమ్మనూరు జయరాం, జేసీ అస్మిత్‌రెడ్డి, బండారు శ్రావణి, దగ్గుపాటి ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, పల్లె సింధూరారెడ్డి, ఎంఎస్‌రాజు, కందికుంట వెంకటప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ హాజరయ్యారు.

మరమ్మతుకు నోచుకోని హంద్రీనీవా గట్టు

పొలంలో నిలిచిన నీరు

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ మండలం ఇంద్రావతి గ్రామ సమీపంలో హంద్రీనీవా ఉప కాలువ కొన్ని నెలల కిందట కోతకు గురైంది.! దానికి సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు నేటికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించ లేదు. పైగా కాలువలో గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగాయి. నీరు ముందుకు సాగక కోతకు గురైన ప్రదేశం నుంచి పొలాల్లోకి వెళ్తున్నాయి. రైతుల క్షేత్రాల్లో పనులకు ఆటంకం కలుగుతోంది. పంట దిగుబడులను ఇళ్లకు తరలించుకోవాలన్నా..కష్టంగా మారిందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వరికోతలు కోశారు. గడ్డిని ఇళ్లకు తరలించడానికి అవకాశం లేని తీరులో పొలాల్లో నీరు నిలిచింది. నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదనకు గురవుతున్నారు. హంద్రీనీవా ఈఈ శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

సదరం నో స్లాట్!

➤ దరఖాస్తుకు తప్పని నిరీక్షణ
➤ విభిన్న ప్రతిభావంతులకు తప్పని కష్టాలు

పరిశీలనకు వైద్యుల వద్ద నిరీక్షిస్తున్న పింఛనుదారులు

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: పుట్టపర్తి మండలానికి చెందిన గంగాధర్ వెన్నెముక సర్జరీ చేశారు. ఏ పనిచేయలేని పరిస్థితి. సదరం కేంద్రానికి దరఖాస్తు చేసుకోవాలని చేయని ప్రయత్నం లేదు. పలుమార్లు సచివాలయం, మీసేవ కేంద్రాల వద్దకు వెళ్లిన చెబుతున్నారు. అక్కడికి వెళ్లగా నిర్ణీత కాలంలో స్లాట్ బుక్ చేసుకునే సమయం అయిపోయిందని చెబుతున్నారు. 4 నెలలుగా తిరుగుతున్నా కనీస వివరాలేవీ తెలపడం లేదని అతను ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

★ ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకూ సదరంకు దరఖాస్తు చేసుకునే పరిస్థితి లేదు. ప్రయత్నిస్తున్న లబ్ధిదారులకు నిరాశ ఎదురవుతోంది. ప్రభుత్వం స్లాట్ బుకింగ్ ఇవ్వక అర్హులైన లబ్ధిదారులు ఎదురుచూడాల్సిన దుస్థితి. ఎక్కువ పింఛన్లను పొందాలంటే వైద్యుల ధ్రువపత్రం తప్పనిసరి. వైద్యులు పరీక్షించిన తరువాత లోపాలను బట్టి దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతులను గుర్తించి వారికి పర్సంటేజీ వేస్తారు. నలభై శాతం ఉంటే పింఛన్ పొందేందుకు అర్హులు.

లాగిన్ క్లోజ్: ★ వైద్యుల వద్దకు వెళ్లేందుకు ప్రతినెల ఆన్‌లైన్‌లో విడుదల చేసే స్లాట్ ప్రకటనను సమయం (బుక్) చేసుకోవాలి. స్లాట్ బుకింగ్ సచివాలయం, మీసేవ కేంద్రాల్లో చేసుకోవాలని చెబుతున్నారు. అక్కడ అవకాశం లేక లబ్ధిదారులు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. స్లాట్ తేదీ వచ్చిన సమయంలో బుక్ చేసుకునేందుకు సదరు కేంద్రాల వద్దకు వెళితే కొంతసేపటికే లాగిన్ క్లోజ్ అయిపోతోంది. దీంతో దరఖాస్తు చేసుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖరారు అయినా..

స్లాట్ బుక్కైన లబ్ధిదారులకు నిరీక్షణ తప్పటం లేదు. కొన్ని నెలల తరువాత వారికి వైద్యుల వద్దకు వెళ్లేందుకు తేదీలు నిర్ణయిస్తుండటంతో ఎదురుచూడాల్సిన పరిస్థితి. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిదినాల్లో ప్రతి మంగళవారం 20మంది చొప్పున ఆర్థో, ఈఎన్‌టీ, కంటి, చెవుడు, మానసిక వైకల్యానికి సంబంధించి ధ్రువపత్రాలను వైద్యులు జారీ చేస్తారు. ఈ లెక్కన ఒక్కో విభాగం 60 ధ్రువపత్రాలను జారీ చేసే అవకాశం ఉంది. ★ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏరియా ఆసుపత్రుల్లో ధ్రువపత్రాలను జారీ చేస్తారు. లబ్ధిదారుడు స్లాట్ బుక్ చేసుకునే సమయంలో ఏ ఆసుపత్రిని ఎంపిక చేసుకుంటే వారిచ్చే తేదీని బట్టి సదరు వైద్యశాలకు వెళ్లి వైద్యుడుతో చూపించుకోవాలి. తరువాత అర్హులైతే ధ్రువపత్రం జారీ చేస్తారు. ఈ లెక్కన ధ్రువపత్రం పొందాలంటే కొంతమంది ఏడాది, రెండేళ్లు కూడా వెయిట్ చేయాల్సిన పరిస్థితి. సర్వజన వైద్యశాలలోని ఈఎన్‌టీ విభాగంలో సుమారు 600 మంది వరకూ స్లాట్ బుక్ చేసుకోవడం గమనార్హం.

పదోన్నతుల తర్వాతే బదిలీలు

ఖాళీల గుర్తింపు : 1,001
పదోన్నతుల ద్వారా భర్తీ : 70 శాతం
డీఎస్సీ ద్వారా : 30 శాతం

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల పదోన్నతులకు విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టం (టిస్)లో ఉపాధ్యాయులు అప్‌లోడ్ చేసిన వివరాల ఆధారంగా సీనియారిటీ జాబితా సిద్ధం చేస్తున్నారు. పాఠశాల విద్య సంచాలకులు ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాపై సర్క్యులర్ జారీ చేశారు. సీనియారిటీ రూపొందించడానికి జిల్లాస్థాయి కమిటీ నియమించారు. ఈ కమిటీ డీఈవో ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఏడీ కన్వీనర్‌గా, శ్రీసత్యసాయి జిల్లా ఏడీ, పర్యవేక్షకులు సభ్యులుగా ఉన్నారు. ఏఎస్ఓ, ఏపీఓ సహాయకులుగా వ్యవహరిస్తున్నారు. ఈనెల 25న ప్రాథమిక సీనియారిటీ జాబితా విడుదల చేస్తారు. అభ్యంతరాలు స్వీకరించిన తరువాత 5న రెండోసారి జాబితా వెల్లడిస్తారు. రెండో జాబితాపై కూడా అభ్యంతరాలు స్వీకరించి మార్చి 15న మూడో జాబితా ప్రచురిస్తారు. తుది సీనియారిటీ జాబితా మార్చి 30న వెల్లడిస్తారు. ఆ తరువాత కౌన్సెలింగ్‌తో పదోన్నతులు కల్పిస్తారు. ఉమ్మడి జిల్లా సీనియారిటీ ప్రాతిపదికన పదోన్నతులు కల్పిస్తారు. ★ గ్రేడ్-2 హెచ్.ఎం పోస్టులు 28, పీఎస్‌హెచ్‌ఎం కన్నడ 1, పీఎస్‌హెచ్‌ఎం తెలుగు 68, పీఎస్‌హెచ్‌ఎం ఉర్దూ 6 పోస్టులు పదోన్నతుల ప్రకారం భర్తీ చేయాలని నిర్ణయించారు. పదోన్నతుల ప్రక్రియ ముగిసిన వెంటనే బదిలీలు నిర్వహిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. “ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా రూపొందించాలని ఆదేశాలు వచ్చాయి. షెడ్యూల్ జారీ చేశారు. జాబితా నిర్ణీత తేదీల్లో విడుదల చేస్తాం. - ప్రసాద్‌బాబు, డీఈవో, అనంతపురం

బ్రహ్మోత్సవం.. బ్రహ్మాండం

వసంతోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

లేపాక్షి, న్యూస్‌టుడే: లేపాక్షిలో ఐదు రోజుల పాటు ఘనంగా నిర్వహించిన శివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిసినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందన్, కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి తెలిపారు. చివరి రోజు ఆలయంలో అభిషేకార్చనలు, పూజలు జరిపారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా పూర్ణాహుతి, అనంతరం వసంతోత్సవం, ధ్వజ అవరోహణం, శయనోత్సవం నిర్వహించారు. ఉత్సవాలు విజయవంతం చేయడంలో సహకరించిన అన్ని శాఖల అధికారులకు, సహకరించిన దాతలకు కమిటీ ఛైర్మన్, ఈవో కృతజ్ఞతలు తెలిపారు.

కుడికాలువపై 16 తూములే సమస్యాత్మకం

రంగంలోకి అనంత, ధర్మవరం ఆర్డీఓలు

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: పీఏబీఆర్ కుడి కాలువ నీటి ప్రవాహం తీరుపై అనంత, శ్రీసత్యసాయి జిల్లాల అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఎలాంటి సమస్య తలెత్తకుండా నిత్యం పర్యవేక్షణ చేపట్టాలని నిర్ణయించారు. ఇదే అంశంపై రెండు జిల్లాల కలెక్టర్లు, అనంత ఎస్పీ, హెచ్చెల్సీ ఎస్ఈ, అనంతపురం, ధర్మవరం ఆర్డీఓలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో పర్యవేక్షణ బాధ్యతలను అనంత, ధర్మవరం ఆర్డీఓలకు అప్పగించారు. సత్వరమే ఆయా ప్రాంతాల పరిధిలో పోలీసులకు సమాచారం పంపారు. ఎక్కడైనా నీటి చౌర్యానికి పాల్పడినా, గండ్లు పెట్టినా, అక్రమంగా తూములు ఎత్తినా కేసులు నమోదు చేసేలా కలెక్టర్ల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

40 చెరువులే లక్ష్యం

అనంతపురం జిల్లా పరిధిలో ఉరవకొండ, శింగనమల, అనంత అర్బన్, రాప్తాడు, శ్రీసత్యసాయి జిల్లాలోని ధర్మవరం నియోజకవర్గం పరిధిలో కుడికాలువ పొడవు 112 కి.మీ. ఉంది. 78 కి.మీ వద్ద ధర్మవరం ఉపకాలువ, 98 కి.మీ వద్ద బి.పప్పూరు ఉపకాలువ వెళ్తాయి. ఈ మూడింటి కింద 40 చెరువులు ఉన్నాయి. ఇప్పటికే హంద్రీనీవా జలాలతో 9 చెరువులను నింపారు. కుడి కాలువకు 1.5 టీఎంసీలకుపైగా నీరు ఇచ్చినా ఆశించిన మేర చెరువులకు ఇవ్వలేదు. ఇప్పటి నుంచైనా ప్రణాళిక ప్రకారం నీరు ఇవ్వాలని సంకల్పించారు.

నిరంతరం నిఘా

కుడికాలువ పరిధిలో 16 సమస్యాత్మక తూములు ఉన్నట్లు గుర్తించారు. ఈ ప్రాంతాల్లోనే తరచూ నీటి చౌర్యం తెలుస్తోంది. ఇప్పటికే మన్నీల, అరవకూరు వద్ద గట్లకే గండ్లు పెట్టారు. నిరంతర నిఘా ఉంచారు. వాటి పరిధిలో కూడేరు మండలం మరుట్ల, పొట్టిచెరువు, అరవకూరు, గార్లదిన్నె మండలం పెనకచెర్ల, ముకుందాపురం, రాప్తాడు మండలం డీబీసీ రెగ్యులేటర్, హంపాపురం, అనంత గ్రామీణ మండలం మన్నీల, కందుకూరు, జంగాలపల్లి, చింతపల్లి, నార్పల మండలం దుర్గం, బత్తలపల్లి మండలం సంజీవపురం, బత్తలపల్లి, మాల్యవంతం, తాడిమర్రి మండలం పుల్లంపల్లి చెరువులు ఉన్నాయి.

ప్రయత్నం.. సఫలీకృతం

◆ మహిళా మార్టుల నిర్వహణకు గట్టి పునాది

నార్పల, శింగనమల, న్యూస్‌టుడే: మహిళా మార్ట్‌లకు బలమైన పునాది పడింది. నార్పల కేంద్రంలో 8,818 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులతో బలమైన వ్యవస్థగా అభివృద్ధి చెందడం ఎన్నో సంఘాలకు ఆదర్శంగా నిలుస్తోంది. 17 గ్రామ పంచాయితీలు, 46 వీవోలు, 883 స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో మహిళలు సమష్టిగా ఈ మార్ట్‌ను విజయవంతంగా నడుపుతున్నారు. ఐక్యత, నిర్వహణ, నైపుణ్యం ఈ మార్ట్ విజయానికి ప్రధాన కారణం.

అమ్మకాల ద్వారా..

మొత్తం ఆదాయంలో రూ.35.72 లక్షల అమ్మకాల ద్వారానే సమకూరాయి. స్థానికంగా తయారయ్యే ఉత్పత్తులు, దినసరి అవసరాల వస్తువులకు వినియోగదారుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. మహిళల సమష్టి కృషి, కస్టమర్ విశ్వాసం మార్ట్‌కు బలమైన వనరుగా మారింది

రూ.11.95 లక్షల లాభం

2022 నవంబరు 2న ప్రారంభమైన ఈ మార్ట్ మూడు సంవత్సరాల వ్యవధిలో గణనీయ పురోగతి సాధించింది. ఇప్పటి వరకు రూ.39.73 లక్షల ఆదాయం నమోదు కాగా, రూ.27.78 లక్షల వ్యయం జరిగింది. మొత్తం రూ.11.95 లక్షల లాభం ఆర్జించడం విశేషం. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆధ్వర్యంలో నడుస్తున్న వ్యాపారం లాభాల్లో కొనసాగడం ఆదర్శంగా నిలుస్తోంది.

ఆర్థికబలం

ప్రస్తుతం మార్ట్ వద్ద రూ.13.89 లక్షల విలువైన స్టాక్ నిల్వ ఉంది. అదనంగా రూ.5 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్, రూ.3.82 లక్షల బ్యాంక్ బ్యాలన్స్ ఉండటం ఆర్థిక స్థిరత్వాన్ని సూచిస్తోంది. ప్రస్తుతం ఆరుగురు సిబ్బంది పనిచేస్తున్నారు. మేనేజర్, అకౌంటెంట్, కంప్యూటర్ ఆపరేటర్లు, హెల్పర్, ఇతర సిబ్బంది కలిసి నిర్వహణ కొనసాగిస్తున్నారు. ★ వెలుగు మహిళా మార్ట్ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఆధారంగా మారింది. మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా ఆదర్శ నమూనాగా నిలుస్తోంది. అమ్మకాలు మరింత పెరిగితే లాభాలు రెట్టింపు అయ్యే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మహిళా సభ్యులతో ఏర్పాటు చేసిన మార్ట్

వైద్య విద్యార్థి మృతిపై నివేదిక పంపండి

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: అనంత నగరంలోని ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న తొమ్మిది మంది విద్యార్థులు కళాశాలకు హాజరు కాకుండా గార్లదిన్నె సమీపంలోని ఈత కొలనుకు వెళ్లారు. ఈతకు వెళ్లిన మోహన్ (19)అనే విద్యార్థి మంగళవారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయంపై విచారణ చేపట్టి నివేదికను ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించడంతో అధికారుల్లో చలనం వచ్చింది. సంఘటనపై విచారణ చేపట్టి పూర్తిస్థాయి నివేదికను పంపాలని డీఎంఈ రఘునందనరావు సదరు వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయశ్రీని ఆదేశించారు. దీనిపై వైద్యుల కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ వెల్లడించారు.

కోర్టులకు బాంబు బెదిరింపు

అనంతపురం (మూడోరోడ్డు), న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలోని పలు కోర్టులకు మళ్లీ బాంబు బెదిరింపు లేఖలు వచ్చాయి. గతంలో ఇలాంటి బెదిరింపు లేఖలు రాష్ట్రంలోని పలు కోర్టులకు వచ్చిన విషయం విదితమే. తాజా బుధవారం రెండోసారి బాంబులు పెట్టినట్లు బెదిరింపు లేఖలు వచ్చాయి. కోర్టు సిబ్బంది సమాచారాన్ని పోలీసులకు చేరవేశారు. పోలీసులు కోర్టుకు చేరుకొని తనిఖీలు చేశారు. జిల్లా కేంద్రంలోని 16 కోర్టులను క్షుణ్ణంగా పరిశీలించారు. లేఖలు జిల్లా కోర్టు ఈ-మెయిల్‌కు వచ్చాయి. జిల్లా కోర్టు పరిపాలనాధికారిణి పోలీసులకు సమాచారం అందజేశారు.

★ అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలలోని అన్ని కోర్టుల్లోనూ తనిఖీలు చేశారు. ఉరవకొండ, ధర్మవరం, గుత్తి, గుంతకల్లు, కదిరి, పుట్టపర్తి, మడకశిర, హిందూపురంలలో పరిశీలించారు. ఇలాంటి బాంబు బెదిరింపు లేఖలు గతంలో రావడంతో కోర్టులో రాత్రి వేళల్లో పార్క్ చేస్తున్న కార్లను తొలగించాలని న్యాయమూర్తి తెలిపారు. రాత్రి వేళల్లో చాలా వాహనాలను కోర్టు ఆవరణంలో న్యాయవాదులు, ఇతరులు ఉంచుతున్నారు. ఇలాంటి వాటిని తొలగించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బార్ అసోసియేషన్‌కు లేఖను పంపారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు కోర్టులలో ఉంచుతున్నారు. వాటిని కూడా పోలీసు స్టేషన్‌లోనే ఉంచుకోవాలని గతంలో సూచించారు.

కోర్టులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

(c) eenadu

EENADU Classifieds

PERSONAL CLASSIFIEDS

BIRTHDAY GREETINGS

P.THRIAKSH PREMADITHYA
First Model Colony, Hindupur

P.THRIAKSH PREMADITHYA
First Model Colony, Hindupur

BUSINESS SERVICES

BUSINESS OFFER

JOBS

Job Vacancy: We Hiring Open Positions Himayat Grand Luxury Hotel in Anantapur Contact: 6300123535. Requirements : 1-2 Years Experience in Hotel Industry Good Communication Skills Excellent Computer Skill.

గమనిక

ఈనాడు క్లాసిఫైడ్స్ రూ. 395/-

వివరాలకు: 8008709784

నేటి నుంచి కోర్టు ఉద్యోగాలకు రాత పరీక్షలు

అనంతపురం(మూడోరోడ్డు), న్యూస్‌టుడే: కోర్టు ఉద్యోగాల కోసం నేటి నుంచి రాత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ.భీమారావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) పరిధిలోని ఈ ఉద్యోగాలకు రుద్రంపేట సమీపంలోని పీవీకేకే కళాశాలలో ఈనెల 19న పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్లు తీసుకొని గంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఫ్రంటు ఆఫీసు సమన్వయకర్త పరీక్ష కోసం 12.30 గంటల నుంచి రాత పరీక్ష మొదలవుతుందని చెప్పారు. రికార్డు అసిస్టెంట్ రాత పరీక్ష 3.30 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు.

కదిరి ఆలయ సమాచారం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం నేటి (గురువారం) ఉదయం 6 నుంచి 6.45 గంటల వరకు ఉంటుంది. ఖాద్రీశునికి 7 నుంచి 9 గంటల మధ్య అభిషేక, స్వర్ణ కవచ సేవలు. తర్వాత 9 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, తిరిగి సాయంత్రం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు భక్తులకు స్వామివారి సర్వదర్శనం ఉంటుంది. రాత్రి 7.30 గంటలకు స్వామివారికి వెండి రథ ప్రాకారోత్సవం ఉంటుంది.

రక్షణ వాహనం సిద్ధం

అటవీశాఖ రక్షణ వాహనం

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: గ్రామాలు, పొలాల్లోకి వచ్చే వన్యప్రాణులను సురక్షితంగా రక్షించి, తిరిగి అడవిలోకి వదలడంతోపాటు పులులు, చిరుతలు, ఏనుగులు, వంటి పెద్ద జంతువులకు గన్‌తో మత్తు సూది వేసి పట్టుకోవడం, గాయపడిన జంతువులకు చికిత్సలు అందించడం, గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని, వేగవంతమైన సహాయక/రక్షణ వాహనం ప్రధాన ఉద్దేశం. అటవీశాఖ అనంతపురం సర్కిల్ పరిధిలోని అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు జిల్లాలకు ఒక్కో వాహనం చొప్పున కేటాయించారని ఇటీవల జరిగిన సర్కిల్ సమావేశంలో సీసీఎఫ్ యశోదబాయి తెలిపారు. ఈ వాహనం అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ పరిధిలో ఉంటుంది. ఐదుగురితో కూడిన బృందం ఉంటుంది. వాహనంలో పరికరాలు, చికిత్సలకు మందులు వంటివి సిద్ధంగా ఉంటాయి. ఇటీవల అనంతపురం సర్కిల్ పరిధి వాలంటీర్లకు, అటవీ శాఖ అధికారులకు శిక్షణ కూడా ఇచ్చారు.

వాహనంలో అటవీ జంతువుల సంరక్షణకు తుపాకీ, వలలు, బోన్లు, మందులు

బృందాల విధులిలా..

- **వన్యప్రాణుల రక్షణ :** జనవాసాల్లోకి వచ్చిన పులులు, చిరుతలు, ఏనుగులు, పాములు వంటి వాటిని సురక్షితంగా బంధించి అడవిలో వదలడం.
- **ప్రమాదాల నివారణ :** అటవీ ప్రాంతాలు, పంట పొలాల్లో గుంతల్లో పడిపోయిన, గాయపడిన, కంపల్లో చిక్కుకున్న జంతువులను రక్షించి చికిత్స చేయడం.
- **అత్యవసర చర్యలు:** ఘటనా స్థలానికి వేగవంతంగా చేరుకోవడం, పరిస్థితిని అంచనా వేయడం, ఆపరేషన్ చేపట్టడం.
- **మానవ-వన్యప్రాణి సంఘర్షణ నివారణ :** ప్రజలు ఆస్తులు, పంట పొలాలకు నష్టం ప్రాణాలను కాపాడుకునేందుకు అడవి జంతువులను నియంత్రించడం, ఆవాసాల వద్ద భయాందోళనలు తగ్గించడం. పంట, ఇతర నష్టాలు జరిగితే పరిహారం అంచనా వేయడం.
- **అవగాహన :** వన్యప్రాణుల రక్షణ, పర్యావరణ పరిరక్షణ, జంతువుల కనిపిస్తే జాగ్రత్తలపై ప్రజలకు తెలియజెప్పటం.

అశ్వవాహనంపై బుగ్గ రామలింగేశ్వరుడు

ఊరేగుతున్న స్వామి వారు

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలోని పెన్నానది ఒడ్డున ఉన్న బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం యథావిధిగా సాగాయి. స్వామిని, రాజరాజేశ్వరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం బుగ్గరామలింగేశ్వరుడిని అశ్వవాహనంపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఫారిన్ లాంగ్వేజెస్ పరీక్ష ఫలితాలు విడుదల

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు సంయుక్తంగా నిర్వహించిన పోస్ట్‌గ్రాడ్యుయేట్ ఇన్ ఫారిన్ లాంగ్వేజెస్-2025 పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి.

ఫలితాలు విడుదల చేస్తున్న ఎస్కేయూ ఇన్‌ఛార్జి ఉపకులపతి అనిత తదితరులు

ఎస్కేయూలోని పరిపాలన భవనంలో ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య అనిత ఫలితాలు విడుదల చేశారు. ఫ్రెంచ్ భాషలో 23 మంది, జర్మన్‌లో 45, పోర్చుగీసులో 23 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ లోకేష్, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య జీవీ రమణ, పరీక్షల నియంత్రణ అధికారి శ్రీరాములునాయక్, ఆర్డీటీ ప్రిన్సిపల్ గీతాంజలి, పర్యవేక్షకులు గీతాంజలి, లక్ష్మణరావు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు హోంమంత్రి సత్కారం

తపోవనం (అనంత గ్రామీణం): మాజీ సైనికుల సంక్షేమం కోసం విశిష్ట సేవలు అందించిన జిల్లా మాజీ సైనికులకు హోంమంత్రి వంగలపూడి అనిత సన్మానించారు. రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో మాజీ సైనికులను సత్కరించారు. భారత సైన్యంలో పనిచేసి 75 ఏళ్లు నిండిన మాజీ సైనికులను హోంమంత్రి అభినందించారు. జిల్లా మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కెప్టెన్ డి. షేకన్న, ప్రధాన కార్యదర్శి పట్నం ఉమామహేశ్వరరావు, కోశాధికారి తిమ్మారెడ్డి, కెప్టెన్ నంజిరెడ్డి, గంగన్న, వెంకటరంగారెడ్డిలను సత్కరించారు.

జ్ఞాపికలు అందుకున్న మాజీ సైనికులు

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆర్ఐవో, పరీక్షల నిర్వహణ కన్వీనర్ వెంకటరమణ నాయక్ ఆదేశించారు. పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులకు శిక్షణ కార్యక్రమం స్థానిక ఒకేషనల్ జూనియర్ కళాశాలలో బుధవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణ ప్రమాణాలు, నిబంధనల ప్రకారం జరగాలన్నారు. కేంద్రాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. ప్రధాన పర్యవేక్షకులు, శాఖాధికారులతో సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రతి కేంద్రం వద్ద కళాశాల పేరు, పరీక్ష కేంద్రం నంబరు కనిపించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. నో సెల్‌ఫోన్ జోన్ అని విద్యార్థులకు అర్థమయ్యేలా బోర్డు ఉండాలని చెప్పారు. ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి రంజిత్‌బాషా వర్చువల్ విధానంలో మాట్లాడారు. కార్యక్రమంలో డీవీఈవో గురవయ్యశెట్టి, కమిటీ సభ్యులు నాగరత్న, కృష్ణమూర్తి, వెంకటస్వామి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ వెంకటరమణ నాయక్

పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో తిరుపతిలో ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను డీఎస్‌డీఓ ఎస్ఎం మంజుల ప్రకటించారు. ఈ నెల 17న డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో చూపిన ప్రతిభ ఆధారంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జిల్లాస్థాయి పోటీల్లో మొత్తం 124 మంది క్రీడాకారులు పాల్గొనగా అందులో 12 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారి వివరాలు ఇలా మొత్తం మూడు విభాగాల్లో క్రీడాకారులను ఎంపిక చేపట్టారు. చెస్ పోటీలకు బాలికల విభాగంలో జి.షారన్ బ్లెస్సీ, ఎ.యశస్విని, ఎం.దీక్షిత, వై.లాలిత్య, కె.భువకృతిలు, బాలుర విభాగంలో డి.రిషిక్, ఎం.ఫణికుమార్ సహృద్, ఎస్.శామ్యూల్ స్టీఫెన్ నోబుల్, కె.వెంకట శ్రీచేతనరెడ్డి, ఎస్.వెంకటకృష్ణ సుధీంద్ర, మొయిన్ అహ్మద్, కె.భరత్ భూషణ్‌లు ఎంపికయ్యారు.

ఉపాధి కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో అప్లికేషన్ డెవలపర్(వెబ్, మొబైల్), కస్టమర్ ఎక్స్‌క్యూటివ్(వాయిస్, నాన్ వాయిస్) కోర్సులను ఉచితంగా నేర్పిస్తున్నట్లు ప్రిన్సిపల్ సురేష్‌బాబు తెలిపారు. అర్హులైన వారు ఫిబ్రవరి 27లోపు దరఖాస్తు చేసుకున్న వారికి మార్చి 2నుంచి కోర్సులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కళాశాల్లో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన, ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9182288465 చరవాణి నంబరును సంప్రదించాలన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థుల డిబార్

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఎస్కేయూ పరిధిలో డిగ్రీ ప్రథమ సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. నగరంలోని శ్రీనివాస్ డిగ్రీ కళాశాలలో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు విద్యార్థులను డిబార్ చేసినట్లు పరీక్షల విభాగం సంచాలకులు జీవీ రమణ తెలిపారు.

వేళకు బస్సులు నడపాలని విద్యార్థుల ధర్నా

కణేకల్లు, న్యూస్‌టుడే: పాఠశాల సమయానికి బస్సు నడపకుంటే రాయదుర్గం ఆర్టీసీ డిపోను ముట్టడించి ఆందోళన ఉద్ధృతం చేస్తామని నాగేపల్లి విద్యార్థులు, తల్లిదండ్రులు హెచ్చరించారు. ఆరు నెలలుగా విన్నవిస్తున్నా.. సమయానుకూలంగా బస్సు సర్వీసులు నడపని డిపో మేనేజరు తీరును నిరసిస్తూ బుధవారం విద్యార్థులతోపాటు పలువురు రోడ్డుపై బైఠాయించారు. డిపో అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థులు 12 కి.మీ. కాలినడకన రాకపోకలు సాగించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

సెంట్రల్ వర్సిటీలో వక్తృత్వ పోటీలు

బుక్కరాయసముద్రం: గొప్ప వ్యక్తులను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని వర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు గరికపాటి గురజాడ తెలిపారు. బుధవారం ప్రముఖ రచయిత పద్మశ్రీ ఆశావాది ప్రకాశ్‌రావు వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన శ్రేయ, లహరి, అలేఖ్యకు బహుమతులు అందించారు. ఆచార్యులు రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ఇస్తున్న ఆచార్య గురజాడ

‘రంజాన్’లో గంట సడలింపు ఇవ్వండి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ‘రంజాన్’ మాసంలో విధి నిర్వహణలో ఉండే ప్రభుత్వ, పొరుగు, ఒప్పంద ఉద్యోగులకు నమాజ్ చేసుకోవడానికి ఒక గంట సడలింపు ఇవ్వాలని ముస్లిం మైనార్టీ ఉద్యోగుల సంఘం (అల్ మేవా) నాయకులు కోరారు. బుధవారం ఆ సంఘం అధ్యక్షుడు షేక్షావలి, రాష్ట్ర సహాధ్యక్షుడు ఫక్రుద్దీన్, ప్రచార కార్యదర్శి అక్రమ్, ఆర్థిక కార్యదర్శి దౌలా, సలహాదారుడు మహబూబ్‌బాషా, జిలాన్, దూద్‌పీర్, తదితరులు కలెక్టర్ ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్ష, నమాజు ప్రార్థన చేయడానికి గంట సడలింపు ఇచ్చేలా అన్ని శాఖల అధికారులకు తగిన ఉత్తర్వు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తప్పక అవకాశం కల్పిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టర్‌ను వారు శాలువాతో సత్కరించారు.

కలెక్టర్ ఆనంద్‌ను సత్కరిస్తున్న ముస్లిం ఉద్యోగులు

జడ్పీ సీఈఓలుగా పలువురికి పదోన్నతులు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: పంచాయతీరాజ్‌లో పదోన్నతుల పరంపర కొనసాగుతోంది. తాజాగా జడ్పీ సీఈఓలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో డీపీఓ నాగరాజునాయుడు, కళ్యాణదుర్గం, గుంతకల్లు డీడీఓలు నాగేశ్వరరావు, విజయలక్ష్మి, శ్రీ సత్యసాయి జిల్లా డీడీఓలు శ్రీలక్ష్మి, సుధాకర్‌రెడ్డి, డ్వామాలో పనిచేస్తున్న సుధాకర్‌రెడ్డిలకు పదోన్నతులు పొందారు. పదోన్నతులతో నాగరాజునాయుడు, జడ్పీ సీఈఓ శివశంకర్‌లకు స్థానచలనం కలగనుంది. అలాగే జడ్పీ సీఈఓ పోస్టుకు విజయలక్ష్మి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. త్వరలో వీరికి జిల్లాలు కేటాయించనున్నారు. బుధవారం రాత్రి ప్రభుత్వం పదోన్నతుల ఉత్తర్వులు జారీ చేసింది. జడ్పీ సీఈఓలు, డ్వామా పీడీలు, డీఆర్‌డీఏ పీడీలుగా వీరు బాధ్యతలు స్వీకరిస్తారు.

సీమ ప్రయోజనాలు కాపాడేందుకు ఉద్యమం: వైకాపా

అనంత నగరపాలక: రాయలసీమ ఎత్తిపోతల పథకం పూర్తి చేయడం, హంద్రీనీవా సామర్థ్యం పెంచితేనే రాయలసీమకు ప్రయోజనాలు ఒనగూరుతాయని వైకాపా జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వైకాపా జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పలు నియోజకవర్గాల సమన్వయకర్తలతో కలిసి ఆయన మాట్లాడారు. రాయలసీమ ప్రయోజనాలు కాపాడేందుకు ఉద్యమానికి శ్రీకారం చుట్టబోతున్నట్లు ప్రకటించారు. రాయలసీమలోని ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెచ్చి సీమ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

జంతుజాలాన్ని కాపాడుకుందాం

సావనీర్లను ఆవిష్కరిస్తున్న ఆచార్యులు తదితరులు

గుంతకల్లు, న్యూస్‌టుడే : మానవుని వికృత చేష్టలతో ఎన్నో జంతువులు, జీవరాసులు కనుమరుగయ్యాయని ఎస్కే యూనివర్సిటీ వృక్షశాస్త్ర ప్రొఫెసర్ రవిప్రకాశ్‌రావ్ అన్నారు. స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం రెండు రోజులపాటు జరిగే జీవవైవిధ్య పరిరక్షణ సదస్సు ప్రారంభమయింది. సదస్సులో అతనితోపాటు ఉన్నత విద్యా ప్రాంతీయ సంచాలకుడు జ్ఞానేశ్వర్, ఎస్వీ యూనివర్సిటీ జంతుశాస్త్రం ప్రొఫెసర్ రాజశేఖర్, ధార్వాడ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కోట్రేశ్, కళాశాల ప్రధానాచార్యుడు లక్ష్మయ్య మాట్లాడారు. జీవవైవిధ్యం గురించి పెద్దఎత్తున చర్చ జరగాలన్నారు. ప్రకృతిలోని జీవరాసులు అంతరించిపోతే తరువాత మానవుడి వంతు వస్తుందని హెచ్చరించారు. అనంతరం సదస్సుకు చెందిన సావనీర్లను ఆవిష్కరించారు. అధ్యాపకులు రవిశంకర్ శర్మ, ఎల్.ఎన్. ప్రసాద్, భీమలింగయ్య, జమీలాబీబీ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అపహరణ.. అత్యాచారం

వైకాపా కార్యకర్తపై పోక్సో కేసు నమోదు

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం గ్రామీణ మండలానికి చెందిన వైకాపా కార్యకర్త గోవర్ధన్‌పై పోక్సో కేసు నమోదైంది. గ్రామీణ సీఐ ఆంజనేయులు తెలిపిన మేరకు మూడు రోజుల క్రితం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(14)ను గోవర్ధన్ అపహరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. తన కుమార్తె కనిపించకపోవటంతో ఆందోళనకు గురైన తల్లి ఫిర్యాదు చేసిందన్నారు. నిందితుడి కోసం గాలించగా గ్రామ సమీపంలో ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నాం.. విచారించి పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

బైపాస్ రోడ్డు.. పట్టించుకునే దిక్కులేదు!

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలోకి భారీ వాహనాలు వస్తే ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని గతంలో పెన్నానది మీదుగా అవుటర్ బైపాస్ రోడ్డు ఏర్పాటు చేశారు. అప్పట్లో సుమారు రూ.3కోట్లతో మూడు కి.మీ.ల మేర దారి వేశారు. గత వైకాపా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడంతో గుంతలు పడ్డాయి. ఈకారణంగా భారీ వాహనాలు పట్టణం మీదుగా వెళ్తున్నాయి. బైపాస్ మార్గం గుండా బుగ్గ, కడప, నంద్యాల వైపు నుంచి వచ్చే సిమెంట్, నాపరాళ్ల, గ్రానైట్ లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. అనంతపురం వైపు నుంచి కూడా నిత్యం వందల వాహనాలు వెళ్తుంటాయి. అయితే నంద్యాల రోడ్డు నుంచి బైపాస్ వైపు తిరిగే మలుపులో భారీగా గుంతలు పడ్డాయి. పలుమార్లు ద్విచక్రవాహనదారులు ప్రమాదానికి గురై గాయాలపాలయ్యారు. అధికారులు స్పందించి దారిని బాగు చేయాల్సిన అవసరం ఉంది.

ప్రమాదకరంగా బైపాస్ రోడ్డు మలుపు

ఇబ్బంది లేకుండా చూస్తాం

పెన్నానది అవుటర్ బైపాస్‌లో ఉన్న గుంతలను పూడుస్తున్నాం. ప్రస్తుతం వాహనదారులకు ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకుంటాం. రహదారి సమస్యపై ఇదివరకే ఉన్నతాధికారులకు కూడా తెలియజేశాం. వారి ఆదేశాల మేరకు రోడ్డు వేసి శాశ్వత పరిష్కారం చూపుతాం. **-తేజ, మున్సిపల్ ఏఈ తాడిపత్రి**

హత్యకేసు నిందితుల అరెస్టు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలోని కోవూరునగర్‌లో సోమవారం రాత్రి జరిగిన గౌసియా బేగం హత్యకేసును నాలుగో పట్టణ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నిందితులైన ఫక్రున్నీసా బేగం, మహమ్మద్ రఫీ, ఇంతియాజ్, మహమ్మద్ గౌస్, షేక్షావలి, రెహానాలను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు మల్కి జాఫర్ పరారీలో ఉండగా అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ మీడియాకు వెల్లడించారు. ప్రధాన నిందితుడు మల్కిజాఫర్ తన భార్యతో హత్యకు గురైన గౌసియా బేగం కుమారుడు ఇమ్రాన్‌ఖాన్ సన్నిహితంగా ఉన్నాడనే అనుమానంతో కుట్ర పన్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 16న రాత్రి తన బంధువులను బాధితురాలి ఇంటికి పంపించాడు. నిందితులు ఇమ్రాన్‌ను కట్టెలతో కొట్టి హత్య చేయాలనే ఉద్దేశంతో దాడి చేశారు. అదే సమయంలో అడ్డుగా వచ్చిన గౌసియా బేగంను కూడా కట్టెలతో కొట్టి, కాలితో తన్నడంతో ఆమె స్పృహ కోల్పోయింది. వెంటనే ఆమెను నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనలో మృతురాలి కోడలు కూడా గాయపడ్డారు. వారిచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన నాలుగో పట్టణ పోలీసులు బుధవారం స్థానిక బళ్లారి బైపాస్ రోడ్డులోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వాణిజ్య పన్నుల శాఖ
బహిరంగ వేలం ప్రకటన

డి.ఆర్.సి-17 రెఫరెన్స్ నెం. ZD370924000457B, Dt. 02-09-2024 వాణిజ్య పన్నులశాఖ వారికి శ్రీ యల్లా రామాంజినేయులు, ప్రొప్రయిటర్ ఆఫ్ శ్రీ యల్లా రామాంజినేయులు, GST No. 37DYMPR3683H1Z0, ఇంటి నెం. 10-88, గరసగడ్డ వీధి, వజ్రకరూరు గ్రామము & మండలము, అనంతపురము జిల్లా - 515832 వారు చెల్లించవలసిన బకాయిలు మొత్తము రూ॥ 1,05,20,640/- (అక్షరాల ఒక కోటి ఐదు లక్షల ఇరవైవేల ఆరు వందల నలభై రూపాయలు) వసూలు చేయుటకు సదరు వ్యక్తుల కింద ఆస్థి వేలం ద్వారా అమ్మకానికి ఉంచుతున్నాము.

ఆస్థి వివరములు: సర్వే నెం. 829ఎ మరియు ఖాతా నెం. 1485, వజ్రకరూరు, అనంతపురము జిల్లాలో ఎ॥లు 4.41 భూమి. సబ్-రిజిస్ట్రార్ వారి కార్యాలయము వారి ప్రకారము మార్కెట్ విలువ రూ॥ 13,23,000/- లు. వేలం తేది: 28-02-2026 (శనివారము) సమయము: ఉదయం: 11.00 గం॥లకు, వేదిక: వజ్రకరూరు, అనంతపురము జిల్లా.

మరిన్ని వివరముల కోసం ఈ క్రింద తెలిపిన అధికారిని సంప్రదించవచ్చును.

డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్-II, (ఎస్టీ), అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయము (ఎస్టీ), గుంతకల్లు సర్కిల్,
మొబైల్ నెం: 89857 51947

మైనింగ్ పనులతో.. రైతులకు నష్టాలు

గాండ్లపెంట, న్యూస్‌టుడే : కుమ్మరవాండ్లపల్లి సమీపంలో 1005 సర్వేనంబర్‌లో మెస్సర్స్, వరసిద్ధి వినాయక మినరల్స్‌కు అనుమతించడంపై జిల్లా పర్యావరణశాఖ ఈఈ శశికళ, ఆర్డీవో వీవీఎస్ శర్మ, తహసీల్దార్ బాబురావు బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. 8.69 ఎకరాల్లో ఒకటి, 10 ఎకరాల్లో మరో ప్రాజెక్టు పనులకు సంబంధించి రైతులు, గ్రామస్థులను అభిప్రాయాలను అడగ్గా.. మైనింగ్ పనులతో చిన్న సన్నకారు రైతులకు ఇబ్బందులు తప్పవని, పంటలు నష్టపోతామని పలువురు రైతులు తెలిపారు. పర్యావరణానికి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్జీవోలు సూచించారు. గ్రామానికి ఆర్వో ప్లాంట్, వైద్య సదుపాయాలతో పాటు యువకులకు ఉద్యోగ, ఉపాధి కల్పించాలని కోరారు. అనంతరం ప్రజల నుంచి సంతకాలు సేకరించిన నివేదికలను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఆర్డీవో తెలిపారు. ప్రజాభిప్రాయం మేరకే అనుమతులు మంజూరు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

అధికారులకు తమ సమస్యను తెలుపుతున్న రైతు

హుండీలు ఎత్తుకెళ్లి.. నగదు దోచుకెళ్లి

రొద్దం: మండలంలోని కలిపి పంచాయతీ శేషారపుం గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి ఆలయాల్లో దొంగలు హల్‌చల్ చేశారు. గ్రామంలో పక్కపక్కనే ఉన్న ఆదినారాయణస్వామి, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాల తలుపులు పగలగొట్టి, హుండీలను సమీప చెరువు వద్దకు తీసుకెళ్లి... ధ్వంసం చేసి బీభత్సం సృష్టించారు. వాటిలో దాదాపు రూ. 50 వేల వరకు నగదును ఎత్తుకెళ్లారని ఆలయ కమిటీ సభ్యులు వాపోయారు. బుధవారం సమాచారం అందుకున్న పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప, సీఐ రాఘవన్ గ్రామానికి చేరుకుని ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్థులతో ఆరా తీశారు. చోరీకి గురైన ఆలయాలను పరిశీలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు రొద్దం ఎస్సై వీరాంజనేయులు తెలిపారు.

పగలగొట్టిన హుండీని పరిశీలిస్తున్న డీఎస్పీ నరసింగప్ప తదితరులు

గుట్కా అక్రమ రవాణాపై అపరాధ రుసుం వసూలు

అరవిందనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: గుట్కా పొట్లాలను ఈ-వేబిల్లు లేకుండా అక్రమంగా రవాణా, విక్రయిస్తున్న శ్రీ ఈశ్వర్ ఎంటర్‌ప్రైజెస్ (స్థానిక గుత్తిరోడ్డు) డీలరు నుంచి రూ.4.21 లక్షల అపరాధ రుసుము వసూలు చేసినట్లు వాణిజ్య పన్నుల శాఖ గుంతకల్లు సర్కిల్ డీసీటీఓ సంజీవరెడ్డి తెలిపారు. ఈ నెల 5న గుత్తిరోడ్డులో వాహన తనిఖీ చేస్తున్న సమయంలో వేబిల్లు లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్న గుట్కా సంచులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దీని విలువ రూ.5.27 లక్షలు కాగా అపరాధ రుసుము రూ.4.21 లక్షలు డీలరు నుంచి వసూలు చేశారు.

ఏడోసారి వేలంలోనూ నిరాశే

రాయదుర్గం: పట్టణ నడిబొడ్డున ఉన్న మున్సిపల్ వ్యాపార సముదాయంపై మొదటి అంతస్తు నిర్మించి రెండేళ్లవుతున్నా... అద్దెకు తీసుకోవడానికి ఎవరూ రాకపోవడం గమనార్హం. ఏడోసారి అద్దెకూ బుధవారం వేలంపాట నిర్వహించగా వ్యాపారులు విముఖత వ్యక్తం చేశారు. బజారులో గదుల వేలంపాట నిర్వహించగా వ్యాపారులు బహిష్కరించారు. ఒక్కో గదికి రూ.1.50 లక్షల గుడ్‌విల్, ప్రతినెల రూ.3500ల అద్దె, జీఎస్టీని నిర్ణయించినప్పటికీ ఆదరణ లేకపోయింది. దీనివల్ల ప్రతి నెల మున్సిపాల్టీ సుమారు రూ.2 లక్షల అద్దె రూపంలో నష్టపోతోంది. ఇకనైనా మున్సిపల్ అధికారులు గుడ్‌విల్, అద్దెను తగ్గించి వేలం పాట వేయాలని వ్యాపారులు కోరుతున్నారు. ఈ విషయంపై కమిషనర్ దివాకర్‌రెడ్డి 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ కౌన్సిల్ అనుమతి తీసుకుని అద్దె, గుడ్‌విల్ తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రాయదుర్గం

• రాయదుర్గం • కళ్యాణదుర్గం • ఉరవకొండ

రీసర్వే పనుల పరిశీలన

శెట్టూరు: శెట్టూరు మండలం చింతర్లపల్లిలో భూముల రీ సర్వే పనులను ఆర్డీవో వసంత బాబు బుధవారం పరిశీలించారు. ఆర్డీవో సర్వే బృందంతో భూమి విస్తీర్ణం, ఏపీ రకాల భూములు ఉన్నాయా?, రైతుల సంఖ్య తదితర విషయాల గురించి ఆరా తీశారు. తహసీల్దారు ఈశ్వరమ్మ, ఉప తహసీల్దారు అనిల్‌కుమార్ రెడ్డి, వీఆర్వో తిప్పేస్వామి పాల్గొన్నారు.

సర్వే బృందంతో మాట్లాడుతున్న ఆర్డీవో వసంతబాబు

కనులపండువగా మద్దానేశ్వరస్వామి రథోత్సవం

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: 74ఉడేగోళం గ్రామ సమీపంలో మద్దనేశ్వరస్వామి రథోత్సవం బుధవారం వేలాది మంది భక్త జనసందోహం నడుమ వైభవంగా సాగింది. వివిధ రకాల పుష్పాలతో విశేష అలంకరణ, మహామంగళ హారతి తదితర పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నసంతర్పణ కార్యక్రమాలు చేపట్టారు. ఈఓ కె.నరసింహారెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు బసవరాజు, సభ్యులు, సర్పంచి దురుగమ్మ పాల్గొన్నారు.

మద్దానేశ్వరస్వామి రథోత్సవంలో భక్తులు

మారెమ్మ ఆలయంలో పూజలు

కణేకల్లు: కణేకల్లులో నూతనంగా నిర్మించిన మారెమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా గంగపూజ, గోపూజ, పుణ్యాహవచనం తదితర పూజలు నిర్వహించి ప్రతిష్ఠా విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. 19న హోమాలు, 20న అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. తెదేపా నాయకులు లాలెప్ప, సంజీవరాయుడు, సుదర్శన పాల్గొన్నారు.

కణేకల్లులో విగ్రహాల ఊరేగింపు

కంపోస్టు యార్డులో కాలుతున్న చెత్త

న్యూస్‌టుడే, రాయదుర్గం: రాయదుర్గం పట్టణ నడిబొడ్డున ఉన్న 'సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రం'లో చెత్త పేరుకుపోయినప్పటి నుంచి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెడుతుండటంతో దట్టమైన పొగతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. నీటి ట్యాంకులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలార్పే ప్రయత్నం చేసినా... చెత్త కాలేవరకు మంటలు, పొగ వస్తూనే ఉంటోంది. దీంతో యార్డు పరిసరాల్లో సిద్ధేశ్వర కాలనీ, శాంతినగర్, వాల్మీకినగర్, నేసేపేట తదితర ప్రాంతాల ప్రజలు పొగతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇళ్లలోని ఆహార పదార్థాలు, దుస్తులపై నల్లటి బూడిద పాతుకోవడం పలువురు వాపోతున్నారు.

చెత్తకు నిప్పు... ప్రజారోగ్యానికి ముప్పు

కుప్పలుగా పేరుకుపోతున్న వైనం

నిర్వహణ అస్తవ్యస్తం

రాయదుర్గంలోని కంపోస్టు యార్డులో 80 వేల మెట్రిక్ టన్నుల మేర చెత్త పేరుకుపోతోంది. అంతకుముందు రెండుమార్లు రెండు కంపెనీలు 13 వేల టన్నుల చెత్తను శుభ్రం చేశాయి. గతంలో చెత్త నిర్వహణ పనులను సదరు కంపెనీలు అస్తవ్యస్తంగా చేపట్టాయి. దీంతో ఏడెకరాల స్థలంలో చెత్త గుట్టలుగా పేరుకుపోయింది.

దుర్వాసనతో ఇక్కట్లు

కంపోస్టు యార్డులో తడి, పొడిచెత్తను కలిపి వేస్తున్నారు. చెత్తకుళ్లి భరించలేని వాసన వస్తుంది. ఫలితంగా ప్రజలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. పొగలో కార్బన్ మోనాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్, నైట్రిక్ యాసిడ్‌లు ఉండటంతో ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తాయి. దగ్గు, శ్వాస తీసుకోవటం కష్టమవటం, అస్తమా, క్షయ, ఊపిరితిత్తుల క్యాన్సర్, అలర్జీ, చర్మ సంబంధిత వ్యాధులు సోకుతాయి. ఎక్కువ పొగ ఉంటే ప్రజలు తప్పని సరిగా బయటికి వెళ్లేటపుడు మాస్కులు ధరించాలని బూడిద పడకుండా శరీరాన్ని నిండుగా కప్పే దుస్తులు వేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఆర్పేందుకు చర్యలు

కంపోస్టు యార్డులో అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్, జేసీబీలతో మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తున్నాం. మంటలు పూర్తిగా నివారిస్తాం. 74.ఉడేగోళంలో కొత్త కంపోస్టు యార్డు ఏర్పాటు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. - దివాకర్‌రెడ్డి, కమిషనర్

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: బసాపురం ఎస్సీ కాలనీలో తీవ్రంగా ఉన్న తాగునీటి సమస్య పరిష్కరించాలి. - వెంకటేశులు, కాలనీవాసి

సమాధానం: ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి తాగునీటి సమస్య లేకుండా చేస్తాం. -శ్రీనివాసులు, ఏఈ

సమస్య: కొల్లారట్లలో ఎస్సీ కాలనీ రోడ్డు నిర్మాణం పూర్తి చేయించండి. -లోకేష్, యువకుడు

సమాధానం: కొత్తగా ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరవగానే నిర్మాణం పూర్తిచేయిస్తాం. - కార్యదర్శి, మలయనూరు.

సమస్య: అద్దెగానంగా మాదిగ బోయిల్లాజి పల్లి- తమ్మయ్యదొడ్డి రోడ్డుకు మరమ్మతులు చేయించాలి. - రమేష్, యువకుడు

సమాధానం: త్వరలో రోడ్డు మరమ్మతులు పూర్తి చేయిస్తాం. -లక్ష్మీశంకర్, ఎంపీడీఓ

- న్యూస్‌టుడే, కుందుర్పి

పది టాపర్లకు ప్రతిభా పురస్కారాలు

అనంతపురం (శ్రీనివాసనగర్), న్యూస్‌టుడే: ప్రస్తుత విద్యా సంవత్సరంలో జరిగే పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు తెచ్చుకునే టాపర్లకు 'ప్రతిభా పురస్కారా'లను అందించాలన్న నిర్ణయం అభినందనీయమని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఇన్నిరిటి చారిటబుల్ ట్రస్టు (ఐసీటీ) వ్యవస్థాపకుడు బద్దేనాయక్ సారథ్యంలో పురస్కారాల ప్రచార పత్రాలను ఆవిష్కరించారు. ప్రతిభ పురస్కారాలను అందించాలని భావించడం మంచి నిర్ణయమని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వం నుంచి సహకారం అందిస్తామన్నారు. బద్దేనాయక్ మాట్లాడుతూ. . కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలో 5 మండలాల్లో ప్రభుత్వ బడుల్లో చదివే వారికి వరుసగా మూడు పురస్కారాలిస్తాం. ప్రతి మండలంలోనూ మూడు.., తొలి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతిగా రూ.7 వేలు, తృతీయ బహుమతి కింద రూ.5 వేలు నగదు అందిస్తాం. ఇక డివిజన్ స్థాయిలోనూ తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారికి పైన పేర్కొన్న ప్రకారం నగదును అందజేస్తామన్నారు. మొత్తం 18మంది ప్రతిభావంతులను శ్రీహరికోట లేదా బెంగళూరులోని ఇస్రో కేంద్రానికి విజ్ఞాన యాత్రకు తీసుకెళ్తామన్నారు. ప్రచార పత్రాల ఆవిష్కరణలో డీఈఓ ప్రసాద్‌బాబు, ఏపీసీ శైలజ పాల్గొన్నారు.

ప్రతిభ పురస్కార ప్రచార పత్రాలు విడుదల చేస్తున్న కలెక్టర్ ఆనంద్, డీఈఓ ప్రసాద్‌బాబు తదితరులు

వేడుకగా రాతిదూలం లాగు పోటీలు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: గోవిందవాడలో యల్లేరంగస్వామి రథోత్సవంలో తెదేపా నాయకులు సోమనాథ్ గౌడ్, కటింగ్ సుంకన్న, ఎస్.జి.వన్నూరుస్వామి ఆధ్వర్యంలో బుధవారం రాతిదూలం లాగు పోటీలు నిర్వహించారు. సింగిల్‌విండో ఛైర్మన్ కొత్తపలి మల్లికార్జున, తెదేపా సీనియర్ నాయకులు తిమ్మరాజు ఈ పోటీలు ప్రారంభించారు. గోవిందవాడకు చెందిన తిప్పేస్వామి, గురుస్వామి, నరసింహులు వృషభాలు ప్రథమ, మూడు, నాలుగు స్థానాల్లో, లింగదహాళ్ గ్రామానికి చెందిన ఎర్రిస్వామి వృషభాలు ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు తెదేపా నాయకులు బహుమతులు అందజేశారు.

విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న తెదేపా నాయకులు

యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడులు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: కూలీల కొరతను అధిగమిస్తూ సాంకేతిక పరిజ్ఞానంతో రైతులు యాజమాన్య పద్ధతులు అవలంబించాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు ముకుందరావు పేర్కొన్నారు. బుధవారం కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త చంద్రాయుడు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వర్చువల్ మండలి సహ పరిశోధన సంచాలకులు జాన్సన్, ఎన్‌ఆర్‌ఎల్‌బీల గార్డెన్స్ డైరెక్టర్ పీపీ రావు, రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం సమన్వయకర్త విజయశంకర్ బాబు, కదిరి పరిశోధన స్థానం విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

ఉరవకొండ పట్టణం సీవీవీ నగర్‌లో లత్తవరం దారిలోని సైడ్ కాలువలో వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు ముందుకు సాగడం లేదు. వ్యర్థాలు కుళ్లి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయించకపోవడంతో ఈ సమస్య ఎక్కువవుతోంది. ఎంపీడీవో రవిప్రసాద్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ మురుగు కాలువను శుభ్రం చేయించేలా పంచాయతీ అధికారులను ఆదేశిస్తామని పేర్కొన్నారు.

- న్యూస్‌టుడే, ఉరవకొండ

పది రోజులైనా పట్టింపు శూన్యం!

కళ్యాణదుర్గం పట్టణంలోని పలు కాలనీలకు తాగునీటిని సరఫరా చేసే 'శ్రీరామిరెడ్డి నీటి పథకం' పైపులకు అనంతపురం మార్గంలోని జూనియర్ కళాశాల వద్ద పది రోజుల కిందట లీకేజీలు ఏర్పడ్డాయి. అప్పటి నుంచి నీరు వృథాగా మురుగు కాలువలోకి వెళ్తున్నా... నివారణ చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం అయ్యారు. దీంతో సాయిబాబా ఆలయ వీధి, టీచర్స్ కాలనీ, జూనియర్ కళాశాల రోడ్డు ప్రాంతాల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే లీకేజీలు అరికట్టి తాగునీటి వృథాను నివారించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం

సీసీ దారులు నిర్మించరూ!

డి.హీరేహాళ్ మండలం ఓబుళాపురం ఇందిరమ్మ కాలనీలో పలు వీధుల్లో సీసీ దారులు లేకపోవడంతో పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో ఈ దారుల్లో వృద్ధులు, చిన్నారులు రాకపోకలు సాగించలేక పోతున్నారు. అంతేకాకుండా పలు వీధుల్లో విద్యుత్తు స్తంభాలు, దీపాలు కూడా లేకపోవడంతో ప్రజలు అంధకారంలోనే మగ్గుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సీసీ రోడ్ల నిర్మాణంతోపాటు దీపాలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, డి.హీరేహాళ్

ప్రమాదకరంగా కొమ్మ

కణేకల్లు మండలం కేంద్రం నుంచి 43ఉడేగోళం వెళ్లే దారిలో మారెంపల్లి గేటు దాటాక మలుపు సమీపంలో చెట్టు కొమ్మలు విరిగి రోడ్డు పైకి వచ్చాయి. ప్రమాదకంగా వేలాడుతుతన్న కొమ్మలు వాహనదారులు, పాదచారులపై పడే ప్రమాదం ఉంది. ర.భ.అధికారులు వెంటనే స్పందించి వేలాడుతున్న చెట్టుకొమ్మలు తొలగించేలా తగు చర్యలు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కణేకల్లు

రోడ్డంతా మురుగే...

గుమ్మఘట్ట మండలం నేత్రపల్లి గ్రామంలోని ప్రధాన రోడ్డు పక్కన కాలువ లేకపోవటంతో ఇళ్ల నుంచి వస్తున్న వ్యర్థపు నీరు దారిలోనే పారుతోంది. ఈ మురుగు నుంచే నిత్యం రాకపోకలు సాగించాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. సంబంధించిన అధికారులు ఈ సమస్యను గుర్తించి పరిష్కరించేలా చూడాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో జయరాములు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలించి మురుగు నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

- న్యూస్‌టుడే, గుమ్మఘట్ట

పంచాయతీలు ఆదాయాలు పెంచుకోవాలి

కుందుర్పి, శెట్టూరు, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల స్వయం సంవృద్ధికి 'చెత్త సంపద తయారీ కేంద్రాలు' దోహదం చేస్తాయని జడ్పీ సీఈవో శివశంకర్ పేర్కొన్నారు. బుధవారం కుందుర్పి, అపిలేపల్లి గ్రామాల్లోని 'చెత్త సంపద తయారీ కేంద్రాల'ను డీఎల్‌డీఓ నాగేశ్వరరావుతో కలసి తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. అధికారులు, సిబ్బంది బాధ్యతగా నడుచుకోవాలన్నారు. ఎంపీడీఓ లక్ష్మీశంకర్, డిప్యూటీ ఎంపీడీఓ నరసయ్య, కార్యదర్శి ఎల్లక్క, ఎమ్మార్వీ నాగేంద్ర పాల్గొన్నారు. ● రెండు రోజుల్లో కుటుంబ సర్వేను పూర్తి చేయించాలని సీఈవో ఆదేశించారు. చెర్లోపల్లిలో బుధవారం 'చెత్తతో సంపద తయారీ కేంద్రాల'ను పరిశీలించి అనంతరం మాట్లాడారు. డీఎల్‌డీవో నాగేశ్వర్‌రావు, ఎంపీడీవో జిలాన్‌బాషా, ఈవోఆర్డీ రఘురామ్‌రావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ తదితరులు

పార్కు అభివృద్ధికి రూ.15 లక్షలు

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాయదుర్గం పట్టణం శాంతినగర్‌లోని 'చంద్రబాబు నాయుడు పార్కు' అభివృద్ధికి రూ.15 లక్షల నిధులు కేటాయించినట్లు కమిషనర్ దివాకర్‌రెడ్డి బుధవారం పేర్కొన్నారు. కూలిన ప్రహరీ నిర్మాణం, పచ్చదనం పెంపునకు ఈ నిధులు ఖర్చు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

వజ్రకరూరు: కొనకొండ్లలోని జ్యోతిబా పులె బీసీ గురుకులంలో 'మత్తు పదార్థాల వాడకం, పరిణామాల'పై బుధవారం పిన్సిపల్ ఝాన్సీరాణి విద్యార్థులకు అవగాహన కల్పించారు. డాక్టర్ తేజస్వీ, ఎడ్యుకేషన్ ఆఫీసర్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ జయప్రసాద్, పీఈటీ శర్మాస్‌వలీ పాల్గొన్నారు.

'హత్యాయత్నం దారుణం!'

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: గుత్తి బేతాపల్లిలో నాగరాజు అనే దళితుడిపై హత్యాయత్నానికి పాల్పడిని వారిని శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా కట్టడి చేయాలని ఎస్సీ, ఎస్టీ సంఘం తాలూకా అధ్యక్షుడు చెలిమప్ప పేర్కొన్నారు. బుధవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టిన సందర్భంగా ఆయన మాట్లాడారు.

చెరువు మట్టి తరలింపు

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: నాగిరెడ్డిపల్లి చెరువులోని మట్టిని బుధవారం కణేకల్లు మండలం పుల్లంపల్లి గ్రామానికి చెందిన కొందరు అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా తరలించడానికి చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు అడ్డుకున్నట్లు తెలిసింది. దీంతో వారు జేసీబీని చెరువులోనే వదలి వెళ్లారు. మరికొందరు చెరువులో బోరు బావులు తవ్వుకుని సమీప ప్రాంతాలకు పైపులైన్ల ద్వారా నీరు తీసుకెళ్తున్నట్లు ఆరోపించారు. మట్టి తరలింపుపై తహసీల్దార్, నీటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామ సర్పంచితోపాటు ప్రజలు పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

కళ్యాణదుర్గం గ్రామీణం: కళ్యాణదుర్గం రెవెన్యూ కాలనీలో కిరాణా దుకాణం నిర్వహించే శ్రీనివాసులు 15 రోజులుగా కనిపించడం లేదని ఆయన కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హరినాథ్ తెలియజేశారు.

చెత్త సేకరణ రిక్షాల పంపిణీ

విడపనకల్లు, న్యూస్‌టుడే: ఇంటింటికి చెత్త సేకరించే నిమిత్తం విడపనకల్లు మండలంలో 26 చెత్త రిక్షాలు, బుట్టలు పారిశుద్ధ్య కార్మికులకు ఎంపీడీఓ రాధాకృష్ణ, ఈఓఆర్డీ సత్యబాబు, ఏఓ భాస్కర్ బాబు అందజేశారు. ఈ కార్యదర్శులు మహేష్, మున్నాఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి హాని

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: పర్యావరణానికి హాని చేసే ప్లాస్టిక్‌ను ఇంటి నుంచే నిషేధించేలా కృషి చేస్తున్నట్లు శ్రీసరస్వతి విద్యా మందిరం హెచ్‌ఎం కరణం తిరుమలరావు పేర్కొన్నారు. విద్యార్థులు ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్ల వాడకం తగ్గించి పర్యావరణానికి మేలు చేయాలని కోరారు. విద్యార్థులకు అవగాహన కోసం ప్రాజెక్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పీఏసీఎస్ పాలక మండలి ఏర్పాటు

విడపనకల్లు, న్యూస్‌టుడే: విడపనకల్లు మండలం పెద్ద కొట్టాలపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్మన్‌గా బావికాటి లక్ష్మీనారాయణ, సభ్యులుగా హావళిగి జింకల రామాంజినేయులు, డోనేకల్లు ఎర్రగుడి ధనలక్ష్మీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు గొర్తి శ్రీరాములు, గొర్తి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

అ వీ.. ఇ వీ.. అ న్నీ..

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

విడపనకల్లు, న్యూస్‌టుడే: విడపనకల్లు మండలంలోని రైతులంతా 'ఫార్మర్ రిజిస్ట్రేషన్'ను తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో పెన్నయ్య పేర్కొన్నారు. దీనివల్ల వ్యవసాయానికి సంబధించిన పథకాలు వర్తిస్తాయని అన్నారు. ఫార్మర్ ఐడీ ద్వారా రైతులు వేసిన పంటలు అమ్ముకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

21న మండల సభ

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: ఎంపీపీ విద్యావతి అధ్యక్షతన ఈనెల 21న మండల సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కొండన్న తెలిపారు. ప్రజాప్రతినిధులు, సర్పంచులు, అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

జూదరుల అరెస్టు

కళ్యాణదుర్గం గ్రామీణం, కుందుర్పి, న్యూస్‌టుడే: తిమ్మసముద్రంలోని ఓ ఇంట్లో జూదం ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నట్లు గ్రామీణ సీఐ గణేష్ బుధవారం తెలిపారు. వారి నుంచి రూ.10,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ● కుందుర్పి మండలంలోని కరిగానిపల్లిలో మట్కా నిర్వహిస్తుండగా దాడులు చేసి పలువురిని అదుపులోకి తీసుకోవడంతోపాటు రూ.23350 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మహేష్ పేర్కొన్నారు.

బాల్య వివాహాలు ప్రోత్సహిస్తే చర్యలు

ఉరవకొండ, వేపులపర్తి(బ్రహ్మసముద్రం), న్యూస్‌టుడే: బాల్య వివాహాల వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతాయని పెద్ద ముష్టూరు సర్పంచి సరస్వతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి పేర్కొన్నారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో వీఆర్వో అరుణ, పంచాయతీ అభివృద్ధి అధికారి ఆశీర్వాద్‌బాబు పాల్గొన్నారు. ● బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ పర్యవేక్షురాలు రామాంజినమ్మ వేపులపర్తిలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పేర్కొన్నారు. కార్యదర్శి వరలక్ష్మి, ఏఎన్ఎమ్ దేవేంద్రమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు లక్ష్మి, శృతి, నాయకులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, స్థానికులు

పీఏబీఆర్ కార్యాలయం శిథిలం

■ చెట్లకిందే విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

కూడేరు(ఉరవకొండ), న్యూస్‌టుడే: కూడేరు మండలం పీఏబీఆర్ వద్ద జలవనరుల కార్యాలయం పూర్తిగా శిథిలమైంది. అక్కడ అధికారులు, ఉద్యోగులు విధుల నిర్వహణకు అవకాశం లేని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రస్తుతం అది నిరుపయోగంగా మారింది. పీఏబీఆర్ పర్యవేక్షణకు ఒక ఈఈ, డీఈఈ, నలుగురు ఏఈఈలు, కార్యాలయ సిబ్బంది ఉంటారు. వీరు నిత్యం అక్కడే విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. వారు తమ విధులకు వస్తున్నా కూర్చోవడానికి కార్యాలయం లేదు. శిథిల భవనంలో ఉండడం సాధ్యం కావడం లేదు. చాలాకాలంగా దీనికి మరమ్మతులు చేయడం లేదు. దీంతో సిబ్బంది పరిసరాల్లో చెట్ల కిందనో, సత్యసాయి తాగునీటి పథకం కార్యాలయం వద్దనో విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. ఎవరైనా ఆ శాఖ ఉన్నతాధికారులు వచ్చినా కనీసం సమీక్షించడానికి వీల్లేని పరిస్థితి. జిల్లా ఉన్నతాధికారులు గుర్తించి ఈ కార్యాలయ మరమ్మతులకు తగిన నిధులు మంజూరు చేసే దిశగా చొరవ చూపాల్సిన అవసరం ఉంది. ఎంతో ప్రాధాన్యం కలిగిన జలాశయం వద్ద జలవనరుల కార్యాలయం శిథిలమై మూతపడటం తీరు స్థానిక అధికారులు నిర్లక్ష్యం వైఖరిని ఎత్తిచూపుతోంది.

జలవనరుల కార్యాలయం దుస్థితి

స్వల్పంగా తగ్గిన చింతపండు రాక

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: రాయదుర్గం వ్యవసాయ మార్కెట్ యార్డుకు బుధవారం 232.5 క్వింటాళ్ల చింతపండు దిగుబడులు వచ్చినట్లు ఆర్ఎంసీ కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. కిందటి వారంతో పోల్చితే ధరల్లోనూ స్వల్ప తేడా వచ్చింది. ఫ్లవర్ రకం చింతపండు క్వింటాలు రూ.5,500ల నుంచి రూ.10,200లు, కరిపులి రకం చింతపండు క్వింటాలు రూ.13,000 నుంచి రూ.16,300లు ధర పలికింది. వ్యాపారులు వేలం ద్వారా కొనుగోలు చేసిన చింతపండును లారీల్లో హైదరాబాదు, గుంటూరు, విజయవాడ నగరాలకు ఎగుమతి చేశారు. రాయదుర్గం మార్కెట్‌కు స్థానిక రైతులతోపాటు కర్ణాటకలోని మొలకాల్మూరు, బీజీకెర, రాంపురం, కొండ్లపల్లి, రామదుర్గ, హానగల్ తదితర ప్రాంతాల నుంచి చింతపండు తీసుకొచ్చారు.

చింతపండు వేలాన్ని పరిశీలిస్తున్న ఆర్ఎంసీ కార్యదర్శి శ్రీనివాసులు, వ్యాపారులు

కొత్త గేటు వాల్వ్‌ల బిగింపు

విడపనకల్లు: విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామ సర్పంచి బ్యాలా రాణి ఆధ్వర్యంలో బుధవారం పైపుల పాత గేట్ వాల్వ్‌లను తొలగించి కొత్తవి బిగించారు. ఇలా తాగునీరు పైపుల వద్ద నీరు వృథా కాకుండా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి ఏఈఈ ముజముల్, గ్రామస్థులు రాజశేఖర్ చెన్నయ్య, శీన పాల్గొన్నారు.

కొనసాగుతున్న పనులు

కోర్టులో స్తంభించిన కార్యకలాపాలు

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ కోర్టులో బాంబు పెట్టామని ఉగ్రవాదుల పేరుతో మెయిల్ రావడంతో అధికార యంత్రాంగం బుధవారం అప్రమత్తమైంది. జూనియర్ సివిల్ జడ్జి దుర్గా కళ్యాణితో పాటు సిబ్బంది, న్యాయవాదులు భవనం నుంచి బయటకు వెళ్లిపోయారు. దీంతో ఆ పరిసరాల్లో హడావుడి కనిపించింది. సీఐ మహానంది, ఎస్సై జనార్దన్ నాయుడు పరిసరాలు పరిశీలించారు.

ఉరవకొండ కోర్టు వెలుపల న్యాయవాదులు, ఉద్యోగులు

(c) eenadu

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

ఎస్పీ పి.జగదీశ్‌కు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో, వేదపండితులు

అంజన్న సన్నిధిలో జిల్లా ఎస్పీ

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయాన్ని బుధవారం జిల్లా ఎస్పీ పి.జగదీశ్ సందర్శించారు. ఎస్పీ రాగానే ఆలయ ఈవో విజయరాజు, అర్చకులు స్వాగతం పలికారు. స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం అర్చకులు స్వామివారి శేషవస్త్రం, అంజన్న చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు.

బీజేవైఎం రాష్ట్ర కన్వీనర్‌గా తేజశ్విని

నార్పల, న్యూస్‌టుడే : నార్పల మండలానికి చెందిన కాలసముద్రం తేజశ్విని భారతీయ జనతా యువమోర్చా(బీజేవైఎం) పాలసీ రీసెర్చ్, ట్రైనింగ్ సెల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఇటీవల బీజేవైఎం రాష్ట్ర నూతన కమిటీ నియామకంలో భాగంగా రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి సమక్షంలో ఈ నియామకం జరిగింది. ఈ సందర్భంగా తేజశ్విని మాట్లాడుతూ రాష్ట్ర యువతలో భాజపా విధానాలను విస్తరించడమే తన ధ్యేయమన్నారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ తదితర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 8008612342

సమస్య: పాత గుంతకల్లులో పాత విద్యారణ్య స్కూల్ దగ్గర మాంటిస్సోరి స్కూల్‌కు వెళ్లే దారిలో మురుగు రోడ్డుపై నిల్వ ఉంటోంది. -రఘు

సమాధానం: రోడ్డుపై మురుగు తొలగించి శుభ్రం చేయిస్తాం.- **ముస్తాక్ అహ్మద్, ఇన్‌ఛార్జి, 4వ డివిజన్**

సమస్య: గుంతకల్లులోని హనుమేశ్ నగర్‌లో పబ్లిక్ హెల్త్ కార్యాలయం దగ్గర, ప్రహరీ పక్కన చెత్త, వ్యర్థాలు రోడ్డుపై పడి అపరిశుభ్రంగా ఉంది. - నాగేంద్ర

సమాధానం: చెత్తకుప్పలను తొలగించి శుభ్రం చేయిస్తాం. - **రవికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, గుంతకల్లు పురపాలక సంఘం**

- న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

విద్యుత్తు దీపాల నిర్వహణ అస్తవ్యస్తం

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తి పురపాలికలో వీధి దీపాల నిర్వహణ అధ్వానంగా తయారైంది. చాలా చోట్ల దీపాలకు ఆఫ్అండ్ఆన్ స్విచ్‌లు లేవు. అలాగే మూడోతీగలు పలు కాలనీల్లో ఏర్పాటు చేయలేదు. విద్యుత్తు బిల్లులను తగ్గించుకోవాలన్న ఉద్దేశంతో అధికారులు ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేశారు.

పురపాలిక	గుత్తి
వీధి దీపాలు	3,600
పెండింగ్ బిల్లులు	రూ.40లక్షలు(సుమారు)

బిల్లులు తడిసిమోపెడు!

చెర్లోపల్లికాలనీ, చెట్నేపల్లి, కోట, అనంతపురం, పత్తికొండరోడ్డు, గాంధీనగర్, బీసీకాలనీలల్లో దీపాలు పగలురాత్రి వెలుగుతున్నాయి. ఈకారణంగా విద్యుత్తు పొదుపు ఉద్దేశం నీరుగారిపోతోంది. ప్రతి నెల విద్యుత్తు బిల్లులు తడిసిమోపెడవుతున్నాయి.

● గుత్తి, గుత్తిఆర్.ఎస్, చెట్నేపల్లి, సూరశింగపల్లిలో వీధిదీపాలు ఉన్నాయి. గతేడాది వరకు ఈఈఎస్ఎల్ కంపెనీ దీపాలను నిర్వహించేది. కాల పరిమితి ముగియడంతో కంపెనీ తప్పుకొంది. ప్రభుత్వం తిరిగి ఆ కంపెనీకి బాధ్యతలు అప్పగించే విషయంలో జాప్యం జరుగుతోంది. కంపెనీ నిర్వహణలో ఇద్దరు ఎలక్ట్రీషియన్లు ఉండేవారు. వీరికి పురపాలికకు చెందిన ఆరుగురు సహాయంగా ఉండేవారు. కంపెనీ తప్పుకొన్నప్పటి నుంచి వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది.

రూ.2లక్షలతో ప్రతిపాదనలు

పురపాలికలోని వార్డుల్లో వీధిదీపాల నిర్వహణకు విడిభాగాలు లేవు. దీపాలు పలువార్డుల్లో వెలగడం లేదు. కొన్ని కాలనీల్లో పగలే వెలుతుండగా మరికొన్ని ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో చీకటి ఉంటోంది. ఈకారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. పురపాలిక అధికారులు విడిభాగాల కొనుగోలుకు రూ.2లక్షలతో ప్రతిపాదించారు.

● గుత్తి-గుత్తిఆర్.ఎస్, మధ్య ఉన్న దీపాలు సక్రమంగా వెలగడం లేదు. అనంతపురం రోడ్డులో చీకటి పడితే ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. బీసీకాలనీతోపాటు మాతృశ్రీకాలనీ, ఆర్టీసీకాలనీల్లో పరిస్థితి దారుణంగా ఉంది.



గుత్తిలోని ఓ కాలనీలో పగలే వెలుగుతున్న వీధిదీపం

సమస్యను పరిశీలిస్తాం

గతంలో ఈఈఎస్ఎల్ సంస్థకు దీపాల నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. ఇప్పుడు కూడా సదరు సంస్థకే ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి అవసరం ఉంది. ప్రస్తుతం సమస్య ఉన్న చోట పరిశీలిస్తాం.

-జబ్బార్ మియా, కమిషనర్

14వ బెటాలియన్ సమస్యలు పరిష్కరించండి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బుక్కరాయసముద్రం మండలం జంతులూరు వద్ద ఏర్పాటైన 14వ బెటాలియన్‌లోని సమస్యలు పరిష్కరించాలంటూ ఎమ్మెల్యే శ్రావణిశ్రీ శాసనసభలో గళం విప్పారు. ఆమె మాట్లాడుతూ జీవో నంబరు 329 అమలు చేసి పోలీసు ఉద్యోగుల సమస్యలు తీర్చాలన్నారు. వైకాపా ప్రభుత్వం గత ఐదేళ్లు జీవో అమలు చేయకపోవడంతో పోలీసులు సివిల్ పోలీస్‌గా మారడానికి అర్హత కోల్పోయారన్నారు. 12 నుంచి 18 ఏళ్లు సర్వీస్ ఉన్నా పదోన్నతులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనికితోడు 6, 12, 18 ఏళ్లకు ఇచ్చే ఇంక్రిమెంట్లు కోల్పోయారని సభ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సంబంధిత మంత్రి పరిష్కరించేలా చూడాలని ఉపసభాపతిని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.

భక్తిశ్రద్ధలతో చౌడమ్మ జ్యోతుల ఉత్సవం

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి మండల పరిధిలోని గన్నెవారిపల్లి కాలనీలో బుధవారం చౌడమ్మ జ్యోతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చౌడమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి జ్యోతులను మేళతాళాల మధ్య వీధుల్లో ఊరేగించారు.

కాలనీలో జ్యోతులను ఊరేగిస్తున్న భక్తులు

సరకులు ఇస్తున్న దిశ పోలీస్ డీఎస్పీ మహబూబ్‌బాషా తదితరులు

పేదలకు నిత్యావసర సరకుల అందజేత

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిలోని పేదలకు బుధవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. అనంతపురం దిశ పోలీసు డీఎస్పీ మహబూబ్‌బాషా, గుత్తి విద్యుత్తుశాఖ ఏఈ మధుసూదన్‌లు 180 మందికి సరకులను అందజేశారు. ఒక్కొక్కరికి రూ.3వేలు విలువైన బియ్యం, బేడలు, చక్కెర తదితర వాటిని అనంతపురం రోడ్డులోని మదరసాలో పంపిణీ చేశారు. ఏటా ముస్లింలు రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పేద ముస్లింలకు సరకులు ఇస్తూ వస్తున్నారు. పేదలు సరకులతో పండగను జరుపుకోవాలని దాతలు ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో మదరసా వ్యవస్థాపకులు మహ్మద్ అబ్దుల్‌హక్, ఇమ్రాన్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : రబీలో రైతులు సాగుచేసిన పంటలకు ఈ-పంట నమోదు కచ్చితంగా చేయాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. బుధవారం ఆయన కొర్రపాడులో వ్యవసాయ, ఉద్యానపంటల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. సూపర్ చెక్ యాప్ ద్వారా పంట నమోదు రికార్డులు తనిఖీ చేశారు. పంట నమోదు చేస్తేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు రైతులకు అందుతాయన్నారు. మండల పరిధిలో రబీలో వేరుసెనగ, మొక్కజొన్న, వరి, పంటలు ఎక్కువగా సాగు చేశారని వ్యవసాయ అధికారి శ్యాంసుందర్‌రెడ్డి జేసీకి తెలిపారు. వ్యవసాయ అధికారులు రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ పంటలకు సంబంధించిన సలహాలు, సూచనలు రైతులకు అందించాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దారు నాగరాజు, ఆర్ఐ ప్రశాంత్ రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నమోదు వివరాలు తెలుసుకుంటున్న జేసీ

21, 22న బండలాగు పోటీలు

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కల్లూరు గ్రామ సమీపంలో క్షేత్రపాల శింగరప్ప కొండపై వెలసిన లక్ష్మీ చెన్నకేశవ, శింగరప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో ఈనెల 21, 22వ తేదీల్లో బండలాగు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21న న్యూ కేటగిరి వృషభాల యజమానులకు మొదటి బహుమతి రూ.50వేలు, రెండో బహుమతి రూ.40వేలు, మూడో బహుమతి రూ.30వేలు, నాలుగో బహుమతి రూ.20వేలు, ఐదో బహుమతి రూ.15వేలు, ఆరో బహుమతి రూ.10వేలు, ఏడో బహుమతి రూ.8వేలు, ఎనిమిదో బహుమతి రూ.6వేలు, తొమ్మిదో బహుమతి రూ.5వేలు చొప్పున దాతల చేతుల మీదుగా అందిస్తామన్నారు.

● 22న సీనియర్ కేటగిరి విభాగంలో మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.80వేలు, మూడో బహుమతి రూ.60వేలు, నాలుగో బహుమతి రూ.40వేలు, ఐదో బహుమతి రూ.30వేలు, ఆరో బహుమతి రూ.20వేలు, ఏడో బహుమతి రూ.15వేలు, ఎనిమిదో బహుమతి రూ.12వేలు, తొమ్మిదో బహుమతి రూ.10వేలు దాతల చేతుల మీదుగా అందించనున్నారు. ఆసక్తి గల వృషభాల యజమానులు పోటీల్లో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

'ఎస్సీ, ఎస్టీలను వేధిస్తే కేసులు తప్పవు'

మాట్లాడుతున్న డీఎస్పీ, ఆర్డీవో తదితరులు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : ఎస్సీ, ఎస్టీలను వేధిస్తే అట్రాసిటీ కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం గుంతకల్లులో ఎంపీడీవో కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈకార్యక్రమానికి ఆర్డీవో శ్రీనివాసులు, డీఎస్పీ, ఎంపీడీవో దేవదాసు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు హరిప్రసాద్ యాదవ్ హాజరయ్యారు. ఆర్డీవో చట్టాలపై అవగాహన కల్పించారు. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ పేద ప్రజలకు అధికారులు అండగా నిలిచి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎనిమిది మండలాలు ఎస్సైలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

20న రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం

శింగనమల : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యలయంలో ఈ నెల 20న ఉదయం 11 గంటలకు నియోజకవర్గంలోని అన్ని పార్టీ నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు శింగనమల మండల డిప్యూటీ ఎన్నికల అధికారులైన హబీబా కుహును శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్ని పార్టీల రాజకీయ నాయకులు హాజరుకావాలని కోరారు.

ప్రమాదాలు జరిగితేనే స్పందిస్తారా?

పామిడిలోని జాతీయ రహదారి పక్కన వై-జంక్షన్‌కు సమీపంలోని ఓ పెట్రోల్ బంకు వద్ద తాగునీటి పైపులైన్ కొన్ని నెలలుగా లీకేజీ అవుతోంది. ప్రధాన బీటీ రోడ్డుపై నిత్యం బస్సులు, భారీ వాహనాలు, ద్విచక్ర వాహనాల రాకపోకలతో నిత్యం సందడిగా ఉంటుంది. లీకేజీ నీరు రోడ్డుపై చేరడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి లీకేజీని సరిచేసి ప్రమాదాలను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, పామిడి

నియంత్రిక.. ప్రమాద హెచ్చరిక!

గుత్తిలోని విద్యుత్తు నియంత్రికల దిమ్మెలు శిథిలావస్థకు చేరాయి. నాసిరకంగా నిర్మించడంతో ఇలాంటి పరిస్థితి నెలకొంది. కోటలో ఓ నియంత్రిక దిమ్మె బీటలువారింది. కూలేందుకు సిద్ధంగా ఉంది. ప్రమాదకరంగా ఉన్న దిమ్మెతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద కూడా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

-న్యూస్‌టుడే, గుత్తి

పాఠశాలలకు ప్రహరీ ఏదీ!

యర్రగుంట్లలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు ప్రహరీ లేక పోవడంతో పశువులు, విషపురుగులు తిరుగుతున్నాయి. వీటి వల్ల ఇబ్బంది పడుతున్నామని విద్యార్థులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు. దీనిపై ఎంఈవో తారా చంద్రానాయక్ స్పందిస్తూ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. అనుమతులు వచ్చిన వెంటనే పనులు చేపడతామన్నారు.

-న్యూస్‌టుడే, గార్లదిన్నె గ్రామీణం

రక్షణ గోడలు నిర్మించరూ!

గుంతకల్లు - కర్నూలు ఆర్అండ్‌బీ రహదారిలో కసాపురం గ్రామానికి సమీపంలో హింద్రీనీవా కాలువకు అనుబంధంగా ఉన్న పాతకొత్తచెరువు, వైటీచెరువు, గుత్తిచెరువులకు నీటిని సరఫరా చేయడానికి తూములను ఏర్పాటు చేశారు. ఆయా తూముల గుండా నీరు ప్రవహిస్తోంది. వీటి వద్ద రోడ్డుకు ఇరువైపులా రక్షణ గోడలను అధికారులు నిర్మించలేదు. ఫలితంగా వాహనాలు అదుపుతప్పి కాలువలోకి వెళ్లి ప్రమాదానికి గురయ్యే అవకాశముంది. అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. **-న్యూస్‌టుడే, గుంతకల్లు**

వివాహిత ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని మర్తాడు గ్రామానికి చెందిన ఉమాదేవి బుధవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో కంది పంటకు పిచికారీ చేసే పురుగుమందును తాగడంతో గమనించిన కుటుంబసభ్యులు 108వాహనానికి సమాచారం అందజేశారు. చికిత్స కోసం వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు 108సిబ్బంది తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

రైల్వే ఉద్యోగి ఇంట్లో చోరీ

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిఆర్.ఎస్.లోని రైల్వే ఉద్యోగి శ్రీనివాస్ ఇంట్లో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. శ్రీనివాస్ స్థానిక డీజిల్‌షెడ్డులో సీనియర్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నారు. ఆయన తన కుటుంబసభ్యులతో నిద్రిస్తుండగా గుర్తు తెలియని దుండగులు చాకచక్యంగా తలుపులు తెరిచి బీరువాలో దాచిన ఏడు తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రేరణ ఉత్సవ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఎస్కేయూ సమీపంలోని కేంద్రీయ విద్యాలయంలో బుధవారం ప్రేరణ ఉత్సవ్ పోటీలు నిర్వహించారు. పీఎం కేంద్రీయ విద్యాలయం, సమగ్రశిక్షా సంయుక్తంగా పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వ, చిత్రకళ, కథ, కవిత, పాటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కేంద్రీయ విద్యాలయానికి చెందిన విద్యార్థులు లక్ష్య, జితేంద్ర గుజరాత్‌లో జరిగే 7 రోజుల శిక్షణ కార్యక్రమానికి ఎంపికయ్యారు.

రెవెన్యూ అర్జీలకు పరిష్కారం చూపండి

బుక్కరాయసముద్రం: రెవెన్యూ సంబంధిత సమస్యలకు అధికారులు, సిబ్బంది సత్వరమే పరిష్కారం చూపించాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ ఆదేశించారు. బుధవారం ఆయన బుక్కరాయసముద్రం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇచ్చిన వినతులకు నిర్ణీత సమయంలోగా పరిష్కారం చూపాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వైకాపా మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు పండించిన మొక్కజొన్న పంటకు మద్దతు ధర కల్పించాలని విష్ణుచరణ్‌కు వినతపత్రం ఇచ్చారు. ఈ విషయంపై మార్క్‌ఫెడ్ అధికారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు నాగరాజు, ఎంపీడీవో సాల్మన్‌రాజు ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సెలూన్లు తొలగించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : గుంతకల్లులో బుధవారం సీఐటీయూ కార్యాలయంలో క్షౌర వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈకార్యక్రమానికి సంఘం కోశాధికారి బ్రహ్మ అధ్యక్షత వహించగా, జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ దుకాణాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో క్షౌర వృత్తితో జీవనం చేస్తున్న కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందని ఆరోపించారు. ప్రజా ప్రతినిధుల నుంచి స్పందన లేదన్నారు. కార్పొరేట్ సెలూన్లు తొలగించాలని డిమాండు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తి-పత్తికొండరోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. గుత్తిఆర్.ఎస్. నుంచి గుత్తికి ద్విచక్ర వాహనంలో వెళుతున్న సల్మా, నసీమ్‌లను ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈఘటనలో సల్మా, నసీమ్‌లతోపాటు ఢీకొట్టిన వాహన యజమాని అరుణ్ గాయపడ్డాడు. క్షతగాత్రులను స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ మృతి

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తికి చెందిన లయన్స్‌క్లబ్ జిల్లా ఛైర్మన్ సంబంధమూర్తి(90) బుధవారం మరణించారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. మృతికి గుత్తి క్లబ్ ప్రతినిధులు విరూపాక్షరెడ్డి, బాషా తదితరులు అంజలి ఘటించారు.

బాంబు బెదిరింపులతో కలవరం

కోర్టు పరిసరాల్లో డాగ్‌స్క్వాడ్‌తో పోలీసుల తనిఖీలు

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లులోని జ్యుడీషియల్ మొదటి తరగతి న్యాయస్థానంలో బాంబులు పెట్టినట్లు సమాచారం రావడంతో బుధవారం న్యాయమూర్తి మంజుల అందరినీ అప్రమత్తం చేశారు. న్యాయవాదులు, కక్షిదారులు కోర్టు నుంచి బయటకు వచ్చారు. పోలీసులు చేరుకుని ఎవరినీ కోర్టులోకి ప్రవేశించకుండా చేశారు. రైల్వే రక్షణదళానికి చెందిన డాగ్‌స్క్వాడ్, మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు చేశారు. ఎలాంటి బాంబులు లేవని తేలడంతో కోర్టు సిబ్బంది, న్యాయవాదులు ఊపిరి పీల్చుకున్నారు. పట్టణ సీఐ మనోహర్, కసాపురం ఎస్ఐ వెంకటస్వామి, ఆర్పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వాహన రాకపోకలకు అంతరాయం

గుంతకల్లు, న్యూస్‌టుడే : జాతీయ రహదారిపై గుంతల కారణంగా ఓ లారీకి చెందిన ఇరుసు విరగడంతో రోడ్డుపై ఆగిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ ఘటన పట్టణ శివారులో బుధవారం నెల్లూరు - అకోల జాతీయ రహదారిలో జరిగింది. తిమ్మాపురం నుంచి గుంతకల్లు శివారు వరకు రోడ్డులో వందల సంఖ్యలో గుంతలున్నాయి. గుంతల కారణంగా తమ లారీ పాడైపోయిందని లారీ చోదకుడు చెప్పారు. ఈకారణంగా వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి.

సమస్యలకు పరిష్కారం

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని పుట్లూరు రోడ్డు, జయనగర్ కాలనీలోని వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు తీవ్ర అవస్థ పడుతున్నారని ఈ నెల 18న 'ఈనాడులో' 'సారూ దీపాలు వెలిగించరూ' అనే శీర్షిక కథనం రావడంతో అధికారులు స్పందించారు. దీనికి మున్సిపల్ అధికారులు స్పందించి ఆయా కాలనీల్లో వీధి దీపాలను ఏర్పాటు చేశారు.

గుంతకల్లు, న్యూస్‌టుడే : చెత్త నుంచి సంపదను సృష్టించే సంపదకేంద్రంలో చెత్తను నిల్వ ఉంచే తొట్టె పాడైపోగా, పంచాయతీ కార్యదర్శి రమేశ్ బుధవారం మరమ్మతులు చేయించారు. 'ఈనాడు'లో గత మంగళవారం 'తిమ్మాపురం.. సమస్యలతో సతమతం' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. దీనికి స్పందించిన కార్యదర్శి వెంటనే తొట్టెలకు మరమ్మతులు చేయించారు.

పట్టుబడిన వాహనాల వేలం

పెద్దవడుగూరు : పెద్దవడుగూరు పోలీసుస్టేషన్‌లో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు బుధవారం ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. పట్టుబడిన నాలుగు వాహనాలను రూ.29,382 నగదుకి వేలం పాటలో కొన్నారు. యాడికి స్టేషన్ పరిధిలోని ఇతర వాహనాలకు ఇక్కడే వేలంపాట నిర్వహించగా మూడు వాహనాలు ఇతరులు కొన్నారని, ఒక వాహనం మిగిలిందని ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

యాడికి : మండలంలోని గుడిపాడు సమీపంలోని సాగర్ సిమెంట్ పరిశ్రమ ఆధ్వర్యంలో పి.వెంగన్నపల్లి ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేశారు. సీఎస్ఆర్ నిధుల్లో భాగంగా వివిధ గ్రామాల నుంచి పాఠశాలకు వస్తున్న 20 మంది విద్యార్థినులకు ఎంఈవో కాసెప్ప సైకిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఆక్రమణలు.. ఇరుకు వీధులు!

గుత్తిలోని ఓ వీధి పరిస్థితి ఇలా..

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిలోని పలువార్డుల్లోని రహదారులు ఆక్రమణలతో ఇరుకుగా మారాయి. 30-40 అడుగుల వెడల్పుతో ఉన్న రోడ్లు చిన్నవిగా మారాయి. ప్రధానంగా మెయిన్ బజార్‌లో ఒక వాహనం వస్తే మరొకటి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రెండు ఆటోలు కూడా వెళ్లడానికి ఇబ్బందిపడాల్సిన పరిస్థితి ఉంది. కటిక బజార్‌లో కేవలం ఒక ఆటో ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్లేందుకు స్థలం ఉంది. ఒకప్పుడు లారీలు తిరిగే వీధిలో పరిస్థితి దారుణంగా ఉంది. వాసవీబజార్‌తోపాటు కటిక బజార్ ఆక్రమణలకు గురైంది. కమాంటంగేరి, కురవగేరి, కోటలోని పలు కాలనీల్లో రోడ్లు సైతం ఇబ్బందికరంగానే ఉన్నాయి. అధికారులు ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు రెడ్డిపల్లిలో మేలుజాతి పెయ్యదూడల ప్రదర్శన

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: రెడ్డిపల్లి పశుసంవర్ధశాఖ శిక్షణ కేంద్రంలో మేలురకం పెయ్యదూడల ప్రదర్శన నిర్వహిస్తామని ఏడీఏ రత్నకుమార్ తెలిపారు. జిల్లాలో పాడిరైతులు పెంచుకుంటున్న పెయ్య దూడలను ప్రదర్శనకు తీసుకురావాలని తెలిపారు. ఆరోగ్యకరంగా ఉంటూ, పోషకవిలువలు పాటించిన దూడలకు ప్రోత్సాహక బహుమతులు ఇస్తామన్నారు. పెయ్యదూడల యాజమాన్య పద్ధతులు, పోషకవిలువలపై పాడిరైతులకు అవగాహన కల్పించడానికే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. పాడిపశువులు అధిక పాలదిగుబడి సాధించే పద్ధతులను వివరిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ప్రేమ్‌చంద్, ఉపసంచాలకులు రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు.

గుత్తి- గుంతకల్లు రోడ్డు

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తి- గుంతకల్లు రోడ్డు అధ్వానంగా తయారైంది. గుత్తి నుంచి నాగసముద్రం రోడ్డు మలుపు వరకు రోడ్డు గోతులమయమైంది. ఓవర్ బ్రిడ్జి మొదలు చెరువు మరువ వరకు రహదారి శిథిలమైంది.

దుమ్మురేగుతున్నా పట్టదు

గుత్తి- నెల్లూరు రహదారి నుంచి నిత్యం బళ్లారికి వాహనాలు వెళ్తుంటాయి. ప్రతిరోజు సుమారు 40 వేల వరకు వాహనాలు తిరుగుతుంటాయి. రోడ్డు గోతులతో ఉండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. దీంతో గంటల తరబడి వాహనాలు నిలిచిపోతున్నాయి. గుత్తిలోని గాంధీచౌక్ నుంచి రైల్వే వంతెన వరకు సిమెంట్ రోడ్డు వేశారు. కొన్ని నెలల పాటు వన్-వేలోనే రాకపోకలు సాగాయి. ఇటీవల రోడ్డును రెండు వైపులా అభివృద్ధి చేశారు. వంతెన నుంచి నాగసముద్రం మలుపు వరకు రహదారి గోతులతో ఉంది. హైవే అధికారులు గోతుల్లో సిమెంట్ కంకరను కలిపి వేయడంతో రాకపోకల సమయంలో దుమ్మురేగుతోంది. ప్రజలు దుమ్మూ, ధూళితో అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

(c) eenadu

అనంతపురం

•అనంతపురం •రాప్తాడు

టమాటా కిలో రూ.14

అనంతపురం(వ్యవసాయం): కక్కలపల్లి మార్కెట్‌లో మంగళవారం 750 టన్నుల టమాటాల విక్రయాలు జరిగాయి. కిలో గరిష్ఠం రూ.14, మధ్యస్థం రూ.10, కనిష్ఠం రూ.6 చొప్పున ధరలు పలికాయి. 15 కిలోల బుట్ట ధర గరిష్ఠం రూ.210, మధ్యస్థం 150, కనిష్ఠం రూ.90 చొప్పున ధరలు పలికాయని మార్కెట్ ఇన్‌ఛార్జి రూప్‌కుమార్ తెలియజేశారు.

చీనీ టన్ను రూ.25,800

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని సంతకు మంగళవారం 353 టన్నుల చీనీకాయలను రైతులు తీసుకొచ్చి విక్రయించారు. టన్ను గరిష్ఠ ధర రూ.25,800, మధ్యస్థం రూ.17 వేలు, కనిష్ఠం రూ.8 వేల చొప్పున ధరలు పలికాయని యార్డు ఎంపికశ్రేణి ఇన్‌ఛార్జి కార్యదర్శి, ఏడీఎం రాఘవేంద్రకుమార్ తెలియజేశారు.

కేంద్ర గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

పుస్తకాలు అందజేస్తున్న సత్యనారాయణ

అనంత సంక్షేమం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్ర గ్రంథాలయానికి సాంఘిక సంక్షేమ విశ్రాంత సంచాలకులు సత్యనారాయణ పుస్తకాలు వితరణ చేశారు. బుధవారం గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్‌కు అందజేశారు. ఆయన స్వయంగా రచించిన అక్షర విన్యాసములు, గేయాలు-పాటలు, నిరుద్యోగి అనే పుస్తకాలు అందజేశారు. పుస్తకాలు నిరుద్యోగులకు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. నగరంలో గ్రంథాలయాల అభివృద్ధికి నగర పాలక సంస్థ నుంచి సహాయ సహకారాలు అందివ్వాలని కోరారు.

స్వామి సన్నిధిలో...

ఆదిమూర్తి నగర్ సాయినాథాలయంలో

ఉదయం 5.30కు కాగడా హారతి ● 6.00కు అభిషేకం, క్షీరాభిషేకం ● 6.30కు విష్ణు సహస్ర నామ పారాయణం ● 7.00కు లక్ష్మీ అష్టోత్తరం, సాయిబాబా స్తోత్రం ● 7.30కు మహా మంగళ హారతులు ● మధ్యాహ్నం 12.00కు మధ్యాహ్న హారతి ● సా. 6.00కు ధూప హారతి ● రాత్రి 9.00కు సేజ్ హారతి, ● 9.30కు పవళింపు సేవ

మంత్రాలయ రాఘవేంద్ర మఠంలో

ఉదయం 7.00కు సుప్రభాతం ● 7.30కు పంచామృత సమేత స్తోత్ర పారాయణం ● 9.00కు స్వామివారి పట్టాభిషేకం ● 10.00కు కనక మహా పూజ ● 11.00 వెండి రథోత్సవం ● 11.30 ప్రవచనం ●12.00కు మహా నివేదన ● 12.30కు తీర్థప్రసాద వితరణ

మూడో రోడ్డులోని శిర్డీ సాయిబాబా ఆలయంలో

ఉదయం 5.15కు కాగడా హారతి ● 6.00కు నిర్మాల్య అభిషేకం ● 6.30కు వినాయక అభిషేకం ● 7.00కు దత్తుడికి అభిషేకం ● 7.30కు బాబాకు అభిషేకం ● 8.45కు మహామంగళ హారతులు ● 12.30కు నారాయణ సేవ ● సాయంత్రం 6.00కు ధూప హారతి ● రాత్రి 8.45కు సేజ్ హారతి

దేవాంగ రామలింగ చౌడేశ్వరీ దేవి ఆలయంలో..

ఉదయం 6.00కు సర్వ దర్శనం ప్రారంభం ● 7.00 అలంకరణ సేవ ● 8.00కు అర్చన, సర్వదర్శనం ● 9.30కు మహామంగళ హారతులు ● 12 వరకు రాహుకేతు పూజలు ● రాత్రి 8.00 వరకు సర్వ దర్శనం ● 8.30కు మహా మంగళ హారతులు

వేణుగోపాల్‌నగర్ సద్గురు సాయినాథ మందిరంలో..

ఉదయం 5.15కు సుప్రభాత సేవ ● 5.30కు కాగడ హారతి ● 6.30కు క్షీరాభిషేకం ● 7.15కు పంచామృతాభిషేకం ● 7.45కు అష్టోత్తర పూజ ● 8.00కు మంత్ర పుష్పం ● సా. 6.00కు ధూప హారతి ● 6.30కు సాయి భజన కీర్తనలు ● 8.30కు సేజ్ హారతి (పాన్పు సేవ) - న్యూస్‌టుడే, అనంత సాంస్కృతికం

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో

● ఉదయం 6గంటలకు సర్వ దర్శనం ● 8 గంటలకు ప్రాతఃకాల పూజ ● 9 గంటలకు పంచామృతాభిషేకం ● 10కి స్వామివారి అలంకరణ ● 12కు మధ్యాహ్నకాల పూజ ● 12.30కు మహామంగళ హారతి ● సాయంత్రం 4 నుంచి సర్వదర్శనం ● 6 గంటలకు ప్రదోషకాల పూజ ● రాత్రి 7.30 గంటల వరకూ సర్వదర్శనం - న్యూస్‌టుడే, ఆత్మకూరు

మేమున్నాం.. మీకు తోడుగా

అశోక్‌నగర్ : 8008573011
రాంనగర్: 8008573001
కమలానగర్: 7032975446

సమస్య: నగరంలోని పెన్నార్‌భవన్ పక్కన ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే దారిలో జిల్లా పట్టుపరిశ్రమ కార్యాలయం ప్రహరీ పొడవునా పెద్ద మురుగు కాలువ ఉంది. ఇందులోకి చెట్టు కొమ్మలు పడేయడంతో మురుగు నిలిచిపోతోంది. - **శ్రీనివాసులు**

సమస్య: పాతూరులోని నీరుగంటివీధిలో ఇంటి నంబరు 18/971 సమీపంలోని మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదు - **వెంకటేశులు**

సమస్య: రామ్‌నగర్‌లోని సీసీ రహదారులు, మురుగు కాలువల పనులు నెలరోజులుగా సాగుతున్నా పూర్తి చేయలేదు. దీంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. - **నాగభూషణం**

సమస్య: కళ్యాణదుర్గం జాతీయ రహదారిలో డివైడర్లకు వివిధ పార్టీల జెండాలను పెద్ద కట్టెలతో కట్టడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. - **నారాయణస్వామి**

సమస్య: ఆర్ట్స్ కళాశాల ముందు భాగంలో ఎన్టీఆర్ కూడలి నుంచి శ్రీకంఠం వెళ్లే దారిలో మెకానిక్ దుకాణాల ముందున్న కాలువలో మురుగు నిండిపోయి బయట పారుతోంది. - **నీలకంఠారెడ్డి**

సమాధానాలు: తక్షణమే సిబ్బందిని పంపి సమస్యలను పరిష్కరిస్తాం. - **నరసింహా, నగర పాలక సంస్థ ఇన్‌ఛార్జి ప్రజారోగ్య అధికారి**

- **న్యూస్‌టుడే, రాంనగర్(అనంతపురం)**

రహదారికి రాలేక.. కంకరపై నడవలేక

హౌసింగ్‌బోర్డు కాలనీలోని రామ్‌నరేష్ ఫంక్షన్ హాల్ పక్కనున్న రహదారిలో నాలుగు నెలల క్రితం రోడ్డు పనులు ప్రారంభించారు. కంకర, డస్ట్ వేసి వదిలేయడంతో అవస్థలు తప్పడం లేదు. పనులు పూర్తి కాకపోవడంతో కంకరపై నడవడానికి స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. వాహనదారులు సైతం ఈ మార్గంలో రావడానికి జంకుతున్నారు. ఇదే రహదారి మధ్యలో డివైడర్లు నిర్మించారు. పనులన్నీ అర్ధాంతరంగా ఆగిపోయాయి. రోడ్డంతా కంకర వేశారు. మధ్యలో డివైడర్లతో ప్రయాణం నరక ప్రాయమైందని స్థానికులు వాపోతున్నారు.

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: హౌసింగ్‌బోర్డు కాలనీలో రామ్‌నరేష్ ఫంక్షన్ హాల్ పక్కన ఉన్న రహదారిలో ప్రయాణం నరకంగా మారింది. ఇక్కడ రోడ్డు పనులు నాలుగు నెలల క్రితం ప్రారంభించారు. ఇప్పటికీ పూర్తి చేయలేదు. కంకర వేసి వదిలేశారు. కంకర రోడ్డులో ద్విచక్ర వాహనాలు వెళ్లడం ఉంది. రోడ్డు అంచుల వరకూ తవ్వడంతో నడవడానికి వీలుకాని పరిస్థితి. ఆటోలు, కార్లు, బైక్‌ల టైర్లు పాడవుతున్నాయని చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు ఒక కిలో మీటరుకు పైగా రహదారి దారుణంగా ఉంది. పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం, ప్రైవేటు పాఠశాలలు ఈ మార్గంలోనే ఉండటంతో నిత్యం జనసంచారం ఎక్కువగా ఉంటుంది. రద్దీగా ఉండే మార్గంలో రహదారి పనులు పూర్తి చేయకపోవడం శోచనీయం. వాహనదారుల అవస్థలను దృష్టిలో ఉంచుకొని రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామీణ రోడ్లకు మోక్షం

భూమిపూజ చేస్తున్న తెదేపా నాయకులు

రాప్తాడు, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో రోడ్ల నిర్మాణాల చేపట్టకపోవడంతో ఏ గ్రామానికి వెళ్లాలన్నా నరకం కనిపించేది. కూటమి ప్రభుత్వం రాకతో రోడ్లకు మహర్దశ పట్టింది. రాప్తాడు మండల వ్యాప్తంగా గ్రామాల్లో ఐదేళ్లుగా మరుగున పడిన సీసీ రోడ్లకు కూటమి ప్రభుత్వం మోక్షం కలిగిస్తోంది. హంపాపురం నుంచి కందుకూరు మీదుగా ధర్మవరానికి మట్టిదారిలో వెళ్లడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. బుధవారం హంపాపురం నుంచి కందుకూరు రోడ్డుకు 1.5 కిలోమీటర్ల బీటీరహదారికి, హంపాపురంలోని ఆంజనేయస్వామి గుడికి, శ్మశానానికి 600 మీటర్ల సీసీ రోడ్డుకు రూ.1 కోటి 32 లక్షల నిధులతో మండల తెదేపా ఇన్‌ఛార్జి ధర్మవరపు మురళి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు.

మొత్తంగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.4 కోట్ల 63 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తిచేశారు. హంపాపురం, అయ్యవారిపల్లి, ప్రసన్నాయపల్లి, కళాకారుల కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నట్లు ఆయన వివరించారు.

జోరుగా నిర్మాణం...

ప్రాంతం	నిర్మాణ వ్యయం (రూ.లక్షల్లో)
రాప్తాడు పంచాయతీ	147
బండమీదపల్లి	78
ప్రసన్నాయపల్లి	51
హంపాపురం	47
మరూరు	27
బుక్కచెర్ల	24
గొందిరెడ్డిపల్లి	24
పుల్లలరేవు	20
చెర్లోపల్లి	18
యర్రగుంట	11
కొత్తపల్లి	7
పాలచెర్ల	5

పది టాపర్లకు ప్రతిభా పురస్కారాలు

ప్రతిభ పురస్కారాల పత్రాలను విడుదల చేస్తున్న కలెక్టర్ ఆనంద్, డీఈఓ ప్రసాద్‌బాబు తదితరులు

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: ప్రస్తుత విద్యా సంవత్సరంలో జరిగే పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు తెచ్చుకునే టాపర్లకు 'ప్రతిభా పురస్కారాల'ను అందించాలన్న నిర్ణయం అభినందనీయమని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఇన్నిబెట్ చారిటబుల్ ట్రస్ట్ (ఐసీటీ) వ్యవస్థాపకుడు బద్దేనాయక్ సారథ్యంలో పురస్కారాల ప్రచారపత్రాలను ఆవిష్కరించారు. ప్రతిభ పురస్కారాలను అందించాలని భావించడం మంచి నిర్ణయమని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వం నుంచి సహకారం అందిస్తామన్నారు. బద్దేనాయక్ మాట్లాడుతూ.. కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలో 5 మండలాల్లో ప్రభుత్వ బడుల్లో చదివే వారికి వరుసగా మూడు పురస్కారాలిస్తాం. ప్రతి మండలంలోనూ మూడు.., తొలి బహుమతిగా రూ.10 వేలు, రెండో బహుమతిగా రూ.7 వేలు, తృతీయ బహుమతి కింద రూ.5 వేలు నగదు అందిస్తాం. ఇక డివిజన్ స్థాయిలోనూ తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారికి పైన పేర్కొన్న ప్రకారం నగదును అందజేస్తామన్నారు. మొత్తం 18మంది ప్రతిభావంతులను శ్రీహరికోట లేదా బెంగళూరులోని ఇస్రో కేంద్రానికి విజ్ఞానయాత్రకు తీసుకెళ్తామన్నారు. ప్రచార పత్రాల ఆవిష్కరణలో డీఈఓ ప్రసాద్‌బాబు, ఏపీసీ శైలజ పాల్గొన్నారు.

పోటీ ప్రపంచంలో రాణించాలి

రుద్రంపేట: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పీవీకేకే కళాశాల ఛైర్మన్ పల్లె కృష్ణకిశోర్ రెడ్డి పేర్కొన్నారు. పీవీకేకే ఐటీ కళాశాలలో కార్పొరేట్ రెడీనెస్ శిక్షణ సెల్, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ సంస్థ సంయుక్తంగా 'అన్విస్, హైరైజ్‌మెంట్' పై రెండు రోజులు నిర్వహించిన సాంకేతిక సదస్సు బుధవారం ముగిసింది.

తారకరత్నకు ఘన నివాళి

రాంనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: అనంతపురం అర్బన్‌లోని 27, 29 డివిజన్లలోని తెదేపా కార్యాలయాల్లో రాష్ట్ర కార్యదర్శి బుగయ్య చౌదరి, మాజీ కార్పొరేటర్ సరిపూటి రమణ ఆధ్వర్యంలో నందమూరి తారకరత్న వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా తారకరత్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేత్రపర్వంగా లయకారుడి శయనోత్సవం

శయనోత్సవంలో స్వామివారు

అనంత సాంస్కృతికం: నగరంలోని శ్రీకాశీ విశ్వేశ్వర కోదండ రామాలయంలోని శారదాదేవి ఉపాలయంలో బుధవారం రాత్రి స్వామివారి శయనోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఆలయంలో 11 రోజులపాటు జరిగిన బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆఖరి ఘట్టమైన శయనోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిగీతాలు ఆలపించారు. తాడిపత్రి మండలం బ్రాహ్మణపల్లి చెన్నకేశవస్వామి కళాకారులు చేసిన కోలాట నృత్య ప్రదర్శనలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. ఈవో నాగేంద్రుడు, ధర్మకర్తలు రాజు, చరణ్, విష్ణు, ఆదిశేషయ్య, అనంతకుమారి, రాధ, రమణమ్మ, శ్రీదేవి, ఎక్స్ అఫీషియో సభ్యుడు కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

శోభాయమానం ... వసంతోత్సవం

అనంత సాంస్కృతికం: నగరంలోని మొదటి రోడ్డు శివాలయంలో జరుగుతున్న త్రయోదశమ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. శివపార్వతుల ఉత్సవమూర్తులకు చక్రస్నానం చేయించి, వసంతోత్సవం జరిపారు. అనంతరం కలశ ఉద్వాసన నిర్వహించారు. తర్వాత నందీశ్వర ధ్వజ అవరోహణ చేసి, ఉద్వాసనోత్సవ కార్యక్రమాన్ని జరిపారు.

తెరపై ఈనాడు

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే: గౌరి : **లవ్‌స్టోరీ**, గాయత్రి : **చఢా పచ్చ**, గౌతమి : **విత్ లవ్**, నీలిమ : **మనసంతానువ్వే**, త్రివేణి : **సీతా పయనం**, తేజశ్విని : **నిలవె, అమరావతికి ఆహ్వానం**, ఎస్వీ సినిమా, శాంతి, తరంగిణి : **కపుల్ ఫ్రెండ్లీ ఫంకీ**, సుధా : **మన శంకర వరప్రసాద్.**

నగరంలో నేడు

కమలానగర్, న్యూస్‌టుడే : జర్నలిస్ట్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అర్హులైన పాత్రికేయులకు ప్రెస్‌క్లబ్‌లో ఉచితంగా హెల్మెట్ల పంపిణీ

కాయగూరల ధరలు

(అనంతపురం పాతూరు మార్కెట్లో ధరలు కిలో రూ.లలో) టమాటాలు 20, రెండోరకం 10, ఉల్లిగడ్డలు 35, రెండోరకం 25, బంగాళాదుంపలు 35, మిరపకాయలు 60, రెండోరకం40, బెండకాయలు 25, వంకాయలు 25, ముల్లంగి 20, బీట్‌రూట్ 40, బీరకాయలు 40, కాకరకాయలు 40, చౌళికాయలు 30, క్యాప్సికమ్ 35, చిక్కుడుకాయలు 35, అనపకాయలు 40, క్యారెట్ 30, బీన్స్ 40, క్యాబేజీ 40, మునగకాయలు 150, నిమ్మకాయలు (వంద)250, అల్లం 75. - **న్యూస్‌టుడే, అనంతపురం (అరవిందనగర్)**

దారికి అడ్డంగా వాహనాల నిలిపివేత

అనంతపురం-బెంగళూరు వెళ్లే 44వ జాతీయ రహదారి మరూరు టోల్‌గేట్ వద్ద ద్విచక్ర వాహనాలు వెళ్లే దారిలో అడ్డంగా వాహనాలను పార్కింగ్ చేశారు. టోల్‌గేట్‌కు ఇరువైపులా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతరత్రా చిన్నవాహనాలు వెళ్లడానికి చిన్నదారి ఏర్పాటు చేశారు. కానీ ఇక్కడ మాత్రం ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేసి దారికి అడ్డంగా నిలిపారు. దీంతో చిన్న వాహనాలు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - **న్యూస్‌టుడే, రాప్తాడు**

స్తంభించి.. దుర్వాసన దరిచేరి

నగరంలోని గుల్జార్‌పేట కాలనీలో మురుగు కాలువలు అధ్వానంగా ఉన్నాయి. కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగు ముందుకు సాగడం లేదు. దీంతో దుర్వాసనతో పాటు దోమలు వృద్ధి చెంది రోగాలు వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. వారం రోజులుగా కాలువలు శుభ్రం చేయకపోవటంతో ఈ దుస్థితి ఏర్పడిందని వారు ఆరోపిస్తున్నారు. కాలువలు శుభ్రం చేసి, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, కమలానగర్**

వెలుగుతున్న నిర్లక్ష్యం

ఎన్టీఆర్ మార్గ్‌లో హైమాస్ట్ లైట్లు వెలిగే తీరు దారుణంగా తయారైంది. కొన్ని ఒక వైపు వెలిగితే ఇంకొక వైపు వెలగడం లేదు. తరచూ సమస్య ఉన్నా నగరపాలక అధికార యంత్రాంగం శాశ్వత పరిష్కారం చూపడం లేదు. రద్దీగా ఉండే ప్రదేశాల్లో చీకట్లు ఉంటున్నాయి. స్తంభానికి చుట్టిన రోప్‌లైటు విడిపోయి రోడ్డు మీద పడి వెలుగుతున్నాయి. విద్యుత్తు సరఫరా అయితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. చిన్న పిల్లలు రోప్‌ను తాకితే షాక్ కొడితే దానికి బాధ్యులు ఎవరన్నది ప్రశ్నార్థకంగా మారింది. - **న్యూస్‌టుడే, అనంత నగరపాలక**

నిర్మాణ పనుల్లో వేగం పెరగాలి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అమలు చేస్తున్న పలు రకాల ఇంజినీరింగ్ నిర్మాణాలను మార్చి ఆఖరులోపు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆనంద్ చెప్పారు. బుధవారం కలెక్టరేట్‌లో ఇంజినీరింగ్ శాఖల అధికారుల సమీక్ష జరిగింది. రహదారులు, వంతెనలు, గ్రామ ఆరోగ్య క్లినిక్.. వంటి క్షేత్ర నిర్మాణ భవనాలను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఎంపీల్యాండ్ నిధులతో చేపట్టిన పలు రకాల నిర్మాణ, అభివృద్ధి పనులపై మరింత శ్రద్ధ పెట్టాలన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ఎస్‌ఈ శేషాద్రి శేఖర్ సూచించారు. స్థానిక విద్యుత్తు ఉపకేంద్రంలో సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. వ్యవసాయ, గృహాలకు అందించే విద్యుత్తు సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గృహాలకు నిరంతరం 3 ఫేజ్ విద్యుత్తుని అందించేందుకు అన్ని గ్రామాలకు ప్రత్యేక లైన్ ఏర్పాటు చేశామన్నారు.

విశ్వవిద్యాలయాల్లో పోస్టులు భర్తీ చేయాలి

ఎస్కేయూ, న్యూస్‌టుడే: విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన ఉద్యోగాలు భర్తీ చేయాలని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు పోతుల నాగరాజు కోరారు. ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్‌కు ఆయన బుధవారం వినతిపత్రం సమర్పించారు. 15 సంవత్సరాలుగా బోధన ఉద్యోగాలు భర్తీ చేయలేదన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్‌పూర్తి చేసిన అభ్యర్థులు తీవ్ర నిరాశతో ఉన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. బోధన సక్రమంగా లేక వర్సిటీలు వెలవెలబోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరారు.

ప్రేరణ ఉత్సవ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఎస్కేయూ సమీపంలోని కేంద్రీయ విద్యాలయంలో బుధవారం ప్రేరణ ఉత్సవ్ పోటీలు నిర్వహించారు. పీఎం కేంద్రీయ విద్యాలయం, సమగ్ర శిక్షా సంయుక్తంగా పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వ, చిత్రకళ, కథ, కవిత, పాటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కేంద్రీయ విద్యాలయానికి చెందిన విద్యార్థులు లక్ష్య, జితేంద్ర గుజరాత్‌లో జరిగే 7 రోజుల శిక్షణ కార్యక్రమానికి ఎంపికయ్యారు.

లీప్ త్రోబాల్ విజేత జట్టుకు కలెక్టర్ అభినందన

అనంతపురం క్రీడలు: ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి లీప్ త్రోబాల్ పోటీల్లో విజేతగా నిలిచిన జట్టును కలెక్టర్ ఓ.ఆనంద్ అభినందించారు. పీఈటీలకు ప్రత్యేకంగా వివిధ క్రీడాంశాల్లో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. 8 నుంచి 10 వరకు పోటీలు జరిగాయి. జిల్లా జట్టు ఏలూరు జిల్లా జట్టుపై 2-1తో విజయం సాధించి ట్రోఫీ అందుకుంది. బుధవారం మహిళల జట్టును కలెక్టర్ అభినందించారు.

తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం

నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ జశ్వంత్‌రావు

అనంత నగరపాలక: నగరంలో తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోమని కమిషనర్ జశ్వంత్‌రావు హెచ్చరించారు. బుధవారం నగర పాలకకు తాగునీరు సరఫరా చేసే పీఏబీఆర్‌ను, ముద్దలాపురం వద్ద ఉన్న తాగునీటి శుద్ధి కేంద్రాన్ని ఎస్‌ఈ రాజశేఖర్, ఇంజినీర్లతో కలిసి ఆయన పరిశీలించారు. వేసవి వస్తుండటంతో అందుకు అనుగుణంగా మోటార్లను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. శుద్ధి కేంద్రంలో ఆలం, క్లోరినేషన్ ప్రక్రియ తగు మోతాదులో ఉండాలన్నారు. వేసవిలో ఎక్కడా తాగునీటి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు పైపు లైను లీకేజీలు గుర్తించి మరమ్మతులు చేయాలని ఆదేశించారు.

బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ 23న నిరసనలు

ఆజాద్‌నగర్ (అనంతపురం): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో అన్నదాతలకు ఎలాంటి ఉపయోగం లేదని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి చిరుతల మల్లికార్జున పేర్కొన్నారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 1న కేంద్రం, 14న రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతుల ఆశలపై నీళ్లు చల్లిందన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసి, రైతులను అప్పుల బారిన పడేలా చేసే విధానాలు అవలంబిస్తున్నారని ఆరోపించారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 23న జిల్లావ్యాప్తంగా మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు.

నేటి నుంచి రంజాన్ ఉపవాసదీక్షలు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: రంజాన్ మాసం ఆరంభమైంది. గురువారం నుంచి ఉపదీక్షలు ప్రారంభమయ్యాయి. బుధవారం సాయంత్రం నెలవంక దర్శనమివ్వడంతో రాత్రి మసీదుల్లో తరావే నమాజ్ చేశారు. ముస్లిం సోదరులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఉమ్మడి అనంత జిల్లాలో రంజాన్ మాసం ప్రారంభమైంది. ముస్లింలు నెలరోజుల పాటు ఉపవాసాలు ఆచరించడానికి పలు మసీదుల్లో ఇఫ్తార్, సహరీల ఏర్పాట్లకు సన్నద్ధమయ్యారు.

వినియోగంలోకి మరుగుదొడ్లు

అనంతపురం (మూడోరోడ్డు), న్యూస్‌టుడే: సాధారణ ప్రయాణికులు వెయిటింగ్ హాలులో ఉన్న మరుగుదొడ్లను వినియోగించుకోవచ్చని రైల్వేస్టేషన్ మేనేజర్ అశోక్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. నాలుగో ప్లాట్‌ఫాం వైపు భవన నిర్మాణ పనులు సాగుతుండటంతో మరుగుదొడ్ల కొరత ఏర్పడవచ్చన్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సాధారణ టికెట్లు కొనుగోలు చేసిన వారు కూడా వెయిటింగ్ హాలులో ఉన్న మరుగుదొడ్లను ఉపయోగించుకోవచ్చన్నారు.

వారు రారు.. వీరు తీసుకెళ్లలేరు

పాడిరైతులకు అందని ద్రాక్షలా పశువైద్య సేవలు

మధ్యాహ్నానికే మూసివేసిన ఆత్మకూరు పశువైద్యశాల

ఆత్మకూరు: పశుపోషణ ద్వారా ప్రజలకు జీవనోపాధిని గుర్తించి ప్రభుత్వం ప్రత్యేక పథకాలను ప్రారంభించి వారికి అండగా నిలుస్తోంది. ప్రభుత్వం నుంచి వస్తున్న అనేక పథకాలు, మందుల వివరాలు రైతులకు తెలియజేయడంలో కొంతమంది పశువైద్యులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. మండలంలో కొంతమంది పశువైద్యులు ఉదయాన్నే కార్యాలయానికి వచ్చి హాజరు వేసి తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. జీవాల ఆరోగ్య సమస్యలపై రైతులు వైద్యశాలలకు వెళ్లి వైద్యులు లేక వెనుదిరుగుతున్న సందర్భాలు ఇటీవల కాలంలో పెరుగుతున్నాయి. ఆత్మకూరు మండల వ్యాప్తంగా ఆత్మకూరు, పంపనూరు, తోపుదుర్తి గ్రామాల్లో పశువైద్యశాలలు ఉన్నాయి. కాలాన్ని బట్టి పశువులకు వ్యాధులు వ్యాపిస్తుండటంతో పలు సమయాల్లో జీవాలను ఆసుపత్రి వరకు తీసుకువెళ్లలేరు. కావున వైద్యులే పశువుల వద్దకు వెళ్లి చికిత్సలు చేయించాల్సి ఉంటుంది. గొర్రెల కాపర్లు అధికారులకు సమస్యను విన్నవిస్తే వైద్యులు వెళ్లకుండా కిందిస్థాయి సిబ్బందికి మందులు ఇచ్చి పంపుతున్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన మందులను పాడి రైతులకు ఉచితంగా అందించాల్సి ఉండగా వారి నుంచి వసూళ్లకు తెరలేపుతున్నారు.

అందుబాటులో ఉండని సిబ్బంది

మండల కేంద్రంలోని పశువైద్యశాలలో సిబ్బంది ఉండటం లేదని రైతులు వాపోతున్నారు. ఉదయం 11 గంటలకే వైద్యశాలకు తాళం వేసి వ్యక్తిగత పనుల నిమిత్తం వెళ్తున్నారు. పశువుల చికిత్స కోసం క్షేత్రస్థాయికి వెళ్లే కనీసం కిందిస్థాయి సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. పాడి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం 85% బీమాను భరిస్తూ కేవలం 15% నగదును చెల్లించేలా ఏర్పాటు చేసింది. 3 సంవత్సరాలకు రూ.280 చెల్లిస్తే రూ.30 వేల బీమా రైతులకు అందుతుంది. వాతావరణ మార్పులకు జెర్సీ ఆవులు ఎక్కువగా మృతి చెందుతుంటాయి. మేలుజాతి జెర్సీ ఆవు ఒక్కొక్కటి రూ.80 వేల దాకా వెచ్చించి రైతులు కొనుగోలు చేస్తారు. అవి మృతి చెందితే బీమా నగదు రైతులు పూర్తిగా కోల్పోకుండా ప్రభుత్వం ఆదుకుంటుంది. నేటికైనా పశువైద్యులు స్పందించి ఆసుపత్రిలో అందుబాటులో ఉండటమే కాకుండా ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని పథకాలు గ్రామాల్లో దండోరా వేసి తెలపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మున్సిపల్ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఎంపిక

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: మున్సిపల్ విశ్రాంత ఉద్యోగుల సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కృష్ణమూర్తి, కార్యదర్శిగా కిష్టప్ప, కోశాధికారిగా బాలయ్యలను ఏకగ్రీవంగా ఎంపిక చేసుకున్నారు.

వేతనం ఇవ్వాలని వినతి

అనంత నగరపాలక: ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు కార్మికులకు సమ్మెకాల వేతనం అందివ్వాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు కమిషనరు జశ్వంత్‌రావుకు విన్నవించారు. జులైలో సమ్మెకు వెళ్లడంతో ఏడు రోజుల వేతనం ఇవ్వడానికి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు.

మోసగించిన కేసులో వ్యక్తి అరెస్టు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: ఏసీబీ అధికారుల పేరుతో వ్యాపారిని బెదిరించి డబ్బులు లాక్కుని మోసగించిన వ్యక్తిని అనంతపురం రూరల్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వివరాల మేరకు గ్రామీణంలోని ఉర్దూ పాఠశాల సమీపంలో నివాసముంటున్న శివరామ్‌కు వ్యాపారం ఉంది. ఆయనకు 4న చిత్తూరు జిల్లా చెర్లోపల్లికి చెందిన మాణిక్యం అలియాస్ మహేశ్ ఫోన్ చేశాడు. తాను ఏసీబీ ఇన్‌స్పెక్టర్ హమీద్‌ఖాన్ మనిషని పరిచయం చేసుకున్నాడు. 'ముందస్తు అనుమతి లేకుండా లక్కీ డ్రా ఆఫర్లు ఇస్తున్నారు. ఇది నేరం. అందుకు గాను మీరు ప్రభుత్వానికి రూ.4,500లు జరిమానా కట్టాలి' అని బెదిరించాడు. దీంతో భయపడిన బాధితుడు నిందితుడు అడిగిన డబ్బులను ఫోన్ పే చేశాడు. మూడు రోజుల తర్వాత బాధితుడికి అనుమానం వచ్చి విచారించగా, అది నకిలీ కాల్ అని తెలిసింది. వెంటనే అనంత గ్రామీణం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించింది.

వైకాపా కార్యాలయంలో సామగ్రి అపహరణ

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: నిర్మాణంలో ఉన్న వైకాపా కార్యాలయంలో రూ.30 లక్షల విలువైన సామగ్రిని అపహరించారని వైకాపా జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం హెచ్‌ఎల్‌సీ కాలనీలో నిర్మాణంలో ఉన్న వైకాపా కార్యాలయాన్ని వైకాపా నేతలు పరిశీలించారు. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన నిర్మాణ సామగ్రిని పరిశీలించారు.

'భూమి హక్కుదారులు మేమే'

రుద్రంపేట: రుద్రంపేట పంచాయతీ పరిధిలో విలువైన స్థలం ఆక్రమణలకు గురైందన్న వార్త తమను కలచివేసిందని భూమి హక్కుదారులు లక్ష్మన్న, గోపాల్, వెంకటేష్, నాగ, శ్రీనివాసులు, రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం విలేకర్లతో వారు మాట్లాడారు. 40 సెంట్ల స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి కలకలం రేపుతోందన్న అవాస్తవాన్ని తీవ్రంగా ఖండించారు. హక్కుదారులతో కాకుండా సంబంధం లేని వ్యక్తులకు అమ్మడం ఆవేదన కలిగించిందని వారు వాపోయారు.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE: ANANTHAPURAMU
S.O.P.No. 18/2025

Between:-
1) KHOKALAY UJWAL KUMAR, S/o Late K.V. Murthy Rao.
2) KHOKALAY VAISHNAVI D/o Late K.V.Murthy Rao, Both are R/at D.No.2/64, Vidya Nagar, Opp. J.N.T.U. College, Ananthapuramu Rural, Ananthapuramu District ... **Petitioners**
AND
NIL ... **Respondents**

ప్రకటన
ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా పై నెంబరు కేసులో K.V.మూర్తి రావు మరియు P.శోభలు చనిపోయినందు వలన K.V. Murthy Rao కు అనంతపురం బ్రాంచ్ పోస్టాఫీస్ లో రావలసిన డిపాజిట్ మొత్తమును తీసుకొనుటకు పై కోర్టులో అర్జీదారులు వారసత్వపు సర్టిఫికేట్ కొరకు అర్జీదాఖలు చేసియున్నారు. సదరి కేసు 26-02-2026వ తేది ఉదయం 10-30 గంటలకు వాయిదా వేసినారు. కావున ఆ రోజు ఎవరికైనా ఆక్షేపణలున్న యెడల పై కోర్టులో స్వతహాగా గానీ, లేక వకీలు ద్వారా గానీ హాజరై తెలుపుకొనవలెను లేని యెడల పై అర్జీదారులకు పై కోర్టువారు వారసత్వపు సర్టిఫికేట్ మంజూరు చేయుదురని తెలియజేయడమైనది.

షెడ్యూలు
Particulars of the Amount: Amount in P.P.F. No. 0679922162 in Post Office, Ananthapuramu. Rs: 21,65,950-00
"కోర్టు వారి ఉత్తర్వుల మేరకు"

D.Rajasekhar Gowd Advocate, Ananthapuramu Cell No: 9440430570

చూడరు తవ్వేయ్.. అడగరు అమ్మేయ్!

☛ సంబేపల్లెలో తోడు దొంగలు

సంబేపల్లె, న్యూస్‌టుడే: 'కాదేదీ దోపిడీకి అనర్హం' అన్నట్లు గత వైకాపా పాలనలో గుట్టలకు కూడా మంచి గిరాకీ వచ్చింది. మట్టి మాఫియాకు వారు బీజం పోస్తే నేటికీ అది కొనసాగుతోంది. 'తోడు' దొంగలుగా ఏమైపై కోసిపించి గుట్టలన్నింటినీ 'గుట్ట'కాయ స్వాహా చేసేస్తున్నారు. అక్రమార్కులు దర్జాగా తవ్వేసి జేబులు నింపుకొంటున్నారు. వీరి దాటికి ప్రకృతిలో సహజ సిద్ధంగా ఏర్పడిన కొండలు, గుట్టలు, కనుమరుగవుతున్నాయి.. అనుమతి తీసుకోకుండా ఇష్టారాజ్యంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నా, సహజ వనరులను నాశనం చేస్తున్నా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

బుడ్డారెడ్డిగారిపల్లె వద్ద తవ్వేసిన గుట్ట

సార్లు.. ఇటుకేసి చూడరు!

• సంబేపల్లె మండలం బుడ్డారెడ్డిగారిపల్లె, దేవపట్ల మిట్ట, నారాయణ రెడ్డిపల్లె ప్రాంతాల్లో మట్టి గుట్టలను యంత్రాలతో తవ్వేస్తున్నారు. ఎర్రమట్టిని ట్రాక్టర్లలో తరలిస్తూ అక్రమార్కులు రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. • సంబేపల్లె, దేవపట్ల, గుట్టపల్లె గ్రామాల పరిధిలో స్థిరాస్తి వ్యాపారం ఊపందుకోవడంతో లేఅవుట్ల నిర్మాణం కోసం సమీపంలోని గుట్టలు, కొండలలోని మట్టిని యంత్రాలను ఉపయోగించి తవ్వేసి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. దూరాన్ని బట్టి ధర నిర్ణయించారు. ఇదంతా బహిరంగ రహస్యమే అయినా.. అధికారులు చోద్యం చూస్తున్నారు.

పర్యావరణ హననం

అక్రమ మట్టి తవ్వకాలతో వాతావరణ సమతుల్యం దెబ్బతిని క్షామ పీడితంగా మారడానికి దారులు వేస్తున్నారు. ఎర్రమట్టి గుట్టలను విచ్ఛిన్నం చేయడం వల్ల పెద్దపెద్ద గుంతలు ఏర్పడి అవి నీటితో నిండి పొంగి పొర్లి నేల కోతకు గురవుతోంది. ఇలా ఎర్ర మట్టి కోసం కొండలు, గుట్టలను పరిసరాల్లోని వృక్ష సంపదను అడ్డగోలుగా తొలగిస్తూ పర్యావరణ హననానికి పాల్పడుతున్నారు.

అనంత వైభవం.. గంగమ్మకు బోనం!

ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

రాయలసీమకే తొలి జాతరగా పేరొందిన అనంతపురం గంగమ్మ నిండు జాతర.. లక్కిరెడ్డిపల్లి మండలంలోని అనంతపురం గ్రామంలో బుధవారం కనులపండువగా సాగింది. అన్నమయ్య, కడప, చిత్తూరు, కర్నూలు సహా పొరుగు రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చిన అశేష భక్తజన వాహినితో ఆ ప్రాంతం జనసంద్రమైంది. గంగమ్మా.. కరుణించవమ్మా అంటూ సంతానం కోసం మహిళలు పెద్దఎత్తున వరపడ్డారు. విద్యుద్దీపాల వెలుగులో తరలివచ్చిన చాందినీబండ్లతో జాతర కోలాహలంగా సాగింది. - న్యూస్‌టుడే, లక్కిరెడ్డిపల్లి

సంతానం కోసం వరపడిన మహిళలు

కీచకులున్నారు జాగ్రత్త!

☛ పోలీసు శాఖపైనే భద్రత బాధ్యత

☛ నాడు మహమ్మద్ రఫీ, నేడు కులవర్దన్

ఏమీ ఎరుగని కలువల్లారా.. అయిదారేడుల పాపల్లారా.. దారుణ ముళ్లున్నట్లే.. కబళించే కట్లుంటాయ్!
ఎదురింట్లో.. పక్కింట్లో.. వీధి చివర.. బడి పరిసరాల్లో.. ఎక్కడికెళ్లినా.. ఏం చేస్తున్నా.. మృగాళ్లుంటారు జాగ్రత్త
మాటలు చెబుతారు.. మాయలు చేస్తారు.. మిఠాయిలిస్తారు.. మొగ్గ దశలోనే చిదిమేస్తారు
కీచకులున్నారు పారా హుషార్

మహమ్మద్ రఫీ (పాత చిత్రం)

కులవర్దన్ (పాత చిత్రం)

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో చిన్నారులకు రక్షణ లేకుండా పోయింది. ఓ ఘటన మరవకముందే మరో దుర్ఘటన చోటు చేసుకోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చిన్న బిడ్డ అన్న ఆలోచన కూడా లేకుండా హత్యాచారాలకు తెగబడుతున్నారు. కళ్లముందే కన్నబిడ్డలు విగత జీవులవడం చూసి తల్లిదండ్రులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఆడబిడ్డలను ఎలా కాపాడుకోవాలో దిక్కుతోచని స్థితిలో తల్లిదండ్రులు పోతున్నారు. అల్లారుముద్దుగా పెంచుకున్న అభం శుభం తెలియని చిన్నారులు కామాంధుల కబంధ హస్తాలకు చిక్కి బలైపోతున్నారు. ఓ వైపు శిక్షలు పడుతున్నా.. మద్యం, గంజాయి మత్తు యువతను పెడదారి పట్టిస్తోంది. ఇటీవల కాలంలో చిన్నారులపై జరిగిన లైంగిక దాడులు.. ఆపై హత్య సంఘటనలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి.

ఉలిక్కిపడిన అంగళ్లు

2019 నవంబరులో బి.కొత్తకోట మండలంలోని ఓ గ్రామానికి చెందిన కుటుంబం తమ అయిదేళ్ల కుమార్తెతో కలిసి కురబలకోట మండలం చేనేత నగర్‌లోని ఓ కల్యాణ మండపంలో జరుగుతున్న వివాహానికి వచ్చారు. రాత్రి పెళ్లిలో ఆడుకుంటున్న చిన్నారి ఒక్కసారిగా మాయమైంది. ఆమెకై దొరక్క ముదివేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉదయాన్నే అయిదేళ్ల చిన్నారి మృతదేహం కల్యాణమండపం గోడ పక్కన గుర్తించారు. చిన్నారిపై అత్యాచారం చేసి చంపినట్లు నిర్ధారణ అయింది. పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించి అంగళ్లకు చెందిన లారీ క్లీనర్ మహమ్మద్ రఫీనే నిందితుడని గుర్తించి అరెస్టు చేశారు. ఇతనికి చిత్తూరు కోర్టు మరణ శిక్ష విధించింది. హైకోర్టులో అప్పీల్ చేయడంతో మరణశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా సవరించింది. ఇతను ఇప్పటికి జైలులో ఉన్నాడు.

నాటి ఘటన మరవక ముందే

అంగళ్లలో జరిగిన ఘటన మరవక ముందే మదనపల్లెలో మరో చిన్నారిపై ఎదురింట్లో ఉండే కులవర్దన్ (30) అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆపై ఇంట్లోనే ఉన్న నీటి డ్రమ్ములో ముంచి చంపేయడం అంతటా ఆందోళన రేకెత్తించింది. పోలీసులు అనుమానంతో రాత్రే అతని ఇంటి పరిశీలనకు వచ్చినా నిద్రిస్తున్నాడని వెళ్లిపోయారు. రాత్రే పోలీసులు తలుపులు తీయించి తనిఖీ చేసి ఉంటే చిన్నారి విషయం ముందుగానే వెలుగులోకి వచ్చేది. గతంలో కూడా నాలుగు ఘటనలు జరిగితే పోలీసులు అతనిపై చిన్న దాడి కేసు నమోదు చేసి వదిలేయడంతో చిన్నారిని హత్య చేసే వరకు తెగించాడు. • జిల్లాలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు మరింత అప్రమత్తంగా వ్యవహరించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదు చేయాల్సిన నంబర్లు : 112, 1098

లక్ష్యానికి మించి.. జల సవ్వడులు పెంచి

☛ పంట కుంటలతో కూలీలకు ఉపాధి ☛ అదనంగా తొమ్మిది వేల తవ్వకం

- న్యూస్‌టుడే, చిన్నమండెం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రైతులకు మేలు చేకూరే విధంగా వారి భూముల్లో పంట కుంటల తవ్వకం ముమ్మరం చేస్తున్నారు.. ఫలితంగా రైతుల భూముల్లో ఉండే బోరు బావుల్లో భూగర్భ జలాలు పెరగడం, పంట కుంటల్లో నీరు నిలవడంతో కాయగూరలు, మామిడి తోటలు సాగు చేస్తూ అన్నదాతలు ఆదాయం పొందుతున్నారు.

పంట కుంట తవ్వకంలో కూలీలు

మొదటి విడతలో ..

పల్లె పండుగలో ప్రారంభించిన పంట కుంటల తవ్వకంలో జిల్లా లక్ష్యం సాధించింది. రైతుల పొలాల్లో, తోటల్లోని కుంటల్లో చాలాచోట్ల నీరు ఉందని రైతులు చెబుతున్నారు. జిల్లా మొత్తానికి 11,044 కుంటలను తవ్వాలని లక్ష్యం కాగా 2025 డిసెంబరు 26 నాటికి 10,728 తవ్వినట్లు అధికారులు చెబుతున్నారు. తాజాగా పల్లె పండగ 2.0లో మరో 9 వేల కుంటలను ఉపాధిలో తవ్వాలని లక్ష్యం నిర్దేశించారు. ఇప్పటి వరకు 640 పూర్తి చేయగా 1,027 వివిధ దశల్లో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా రోజుకు 20 వేల మంది వరకు కూలీలు పనులకు వస్తున్నారు.

జూన్‌లోగా పూర్తి

ప్రస్తుత లక్ష్యం తొమ్మిది వేల కుంటలను జూన్‌లోగా పూర్తి చేయాలి. ఈ మేరకు ఉన్నతాధికారులు ప్రణాళిక రూపొందించారు. ఆ ప్రణాళికలతో నాలుగు నెలల్లో లక్ష్యాన్ని పూర్తి చేస్తాం. ప్రస్తుతం 20 వేల మంది కూలీలు పనులకు వస్తున్నారు. మార్చి నుంచి కూలీల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

- మధుబాబు, ఏపీడీ, రాయచోటి

నేల తల్లి బాగుంటే.. దిగుబడులు వెన్నంటే!

☛ భూసార పరీక్షలకు వేళాయె

మట్టి నమూనాలు సేకరిస్తున్న ప్రకృతి వ్యవసాయ శిక్షకురాలు సుధారాణి

సరైన మోతాదులో ఎరువులు ఉపయోగించాలంటే భూసార పరీక్షల నిర్వహణ తప్పనిసరి. ఈ పరీక్షలు లేకుండా రైతులు విరివిగా ఎరువులు ఉపయోగిస్తున్నా ఆశించిన దిగుబడి రావడం లేదు.. సాగు ఖర్చులు అధికమవుతున్నాయి.. ఈ నేపథ్యంలో ప్రభుత్వం భూసార పరీక్షలు నిర్వహించి వాటి ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేయాలని ప్రభుత్వం తలచింది.. తదనుగుణంగా గ్రామాల్లో మట్టి నమూనాలు సేకరిస్తున్నారు.

- న్యూస్‌టుడే, కంభంవారిపల్లి

జిల్లాలో ఇలా..

జిల్లాలో 18,030 మట్టి నమూనాలను సేకరించి, భూసార పరీక్షలకు పంపనున్నారు. ఇప్పటి వరకు 8,300 నమూనాలు సేకరించారు. సంబంధిత రైతు సేవా కేంద్రాలకు చేరుస్తున్నారు. ఫలితాలు వచ్చిన తరవాత అవసరమైన మోతాదులో ఎరువులు వేసి, పంటలు సాగు చేయనున్నారు.

ఏం చేస్తారంటే..

పొలాల్లో ఉదజని, లవణ సాంద్రత, సేంద్రియ కర్బనం, నత్రజని, భాస్వరం, పొటాష్ ఏ మేరకు ఉందో భూసార పరీక్ష కేంద్రాల్లో పరిశీలిస్తారు. సూక్ష్మ పోషకాలు, సల్ఫర్, జింక్, బోరాన్, ఇనుము, మెగ్నీషియం, రాగి లభ్యతపై పరీక్షలు నిర్వహిస్తారు. రానున్న సీజన్‌లో ఏ పంట సాగు చేస్తారో తదనుగుణంగా పోషకాలను సిఫార్సు చేస్తారు. మట్టి నమూనాలు పరీక్షా కేంద్రానికి పంపి, ఫలితాలు వచ్చాక భూమిలో పోషకాల లభ్యత, రైతులు సాగు చేయనున్న పంటను అనుసరించి ఎరువులు సిఫార్సు చేస్తామని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొన్నారు.

శత శాతం ఫలితాలకు యత్నం

గురుకులాల్లో ప్రత్యేక తరగతులు

రాయచోటి, మదనపల్లి విద్య, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ ఏడాది పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకొంటున్నారు. ఇప్పటికే ఉన్నత పాఠశాలల్లో రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో అదనంగా గంట సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. కాలమాన పట్టిక ప్రకారం సబ్జెక్టు నిపుణులు రోజు ఈ తరగతులకు హాజరవుతున్నారు. తరగతిలో ఉన్న విద్యార్థుల్లో చదువులో వెనుకబడిన వారిని గుర్తించారు.

మదనపల్లె ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న డీఈవో సుబ్రహ్మణ్యం

ప్రత్యేక కేంద్రాలు ఇవే

జిల్లాలో గుర్తించిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహణకు జిల్లాలో పది కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. బాలికలు ఆయా మండలాల్లోని కేజీబీవీ పాఠశాలల్లోనే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. బాలురకు ఏపీ రెసిడెన్సియల్ స్కూల్ రాయచోటి, పీలేరు, మదనపల్లిలోని ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలు, సోషియల్ వెల్ఫేర్ స్కూల్ (సంజీవనగర్) ఓబులవారిపల్లిలోని పాఠశాలల్లో ఈ తరగతులు నిర్వహిస్తారు. హాజరయ్యే విద్యార్థులకు భోజన, ఇతర వసతులు కల్పిస్తున్నారు. ఈ నెల 8వ తేదీ నుంచే ఈ తరగతులు ప్రారంభించారు. ఈ ఏడాది వంద శాతం ఫలితాల సాధనకు ముందస్తు ప్రణాళికలో భాగంగా ఈ తరగతులు నిర్వహించడం జరుగుతుందని డీఈవో సుబ్రహ్మణ్యం తెలిపారు.

• జిల్లావ్యాప్తంగా తొలుత 182 మంది విద్యార్థులను గుర్తించారు. వీరిలో బాల, బాలికలు ఉన్నారు. వీరిలో డీ గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులు, తరగతులకు సక్రమంగా హాజరు కాని విద్యార్థులు ఉన్నారు. 35 రోజుల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించి పరీక్షలకు సంసిద్ధులను చేయనున్నారు.

బాల కోహ్లీలు..

బుల్లి క్రికెట్ సారథి

వాల్మీకిపురం క్రికెట్ సబ్ సెంటర్‌లో గత నాలుగేళ్లుగా క్రికెట్‌లో శిక్షణ పొందుతున్నా... బ్యాటింగ్ అంటే ఇష్టం.. అందులో రాణిస్తుండడంతో అండర్-12, అండర్-14 జోనల్ స్థాయి పోటీల్లో రాణించా. ఇటీవల ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికయ్యా. నా ప్రతిభ ఆధారంగా జట్టు సారథిగా ఎంపికయ్యా. వైఎస్సార్ కడపలో జరుగుతున్న సౌత్‌జోన్ అంతర్ జిల్లా క్రికెట్ పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ జట్టుకు సారథ్యం వహించి ఆడుతున్నా.- **భువన సాయి, బ్యాట్స్‌మెన్, వాల్మీకిపురం**

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : వాల్మీకిపురం క్రికెట్ సబ్ సెంటర్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో నడుస్తుంది. ఈ సబ్‌సెంటర్ తరఫున క్రికెట్ కోచ్‌ను సైతం నియమించి గ్రామీణ క్రీడాకారులకు క్రికెట్‌లో అత్యుత్తమ శిక్షణ ఇస్తోంది. జిల్లాలోని పశ్చిమ మండలాలైన పుంగనూరు, మదనపల్లె, వాల్మీకిపురం, పీలేరు, కలకడ, కలికిరి, గుర్రంకొండ, తంబళ్లపల్లె తదితర మండలాల నుంచి క్రీడాకారులు ఇక్కడ శిక్షణ పొంది మంచి క్రీడాకారులుగా తయారౌతున్నారు. నాలుగేళ్లుగా వాల్మీకిపురంలో క్రికెట్ సబ్ సెంటర్‌లో శిక్షణ పొందిన పలువురు చిన్నారులు అటు బ్యాటింగ్, ఇటు భౌలింగ్‌లో రాణిస్తూ సత్తా చాటుతున్నారు. వైఎస్సార్ కడప జిల్లాలో ఈ నెల 16 నుంచి 22 వరకు జరగనున్న సౌత్‌జోన్ అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో ఆడేందుకు సిద్ధమవుతున్నారు.

భవిష్యత్ పంత్‌లు

ఆల్‌రౌండ్ ప్రతిభ అదరహో

వాల్మీకిపురం క్రికెట్ సబ్ సెంటర్‌లో నాలుగేళ్లుగా క్రికెట్‌లో శిక్షణ పొందుతున్నా.. . ఇక్కడి కోచ్ సునీల్ సహకారంతో వికెట్ కీపింగ్‌పై దృష్టి సారించా. వికెట్ కీపింగ్‌లో విశేష ప్రతిభ చూపడం, బ్యాటింగ్‌లో విశేషంగా రాణిస్తుండడంతో అండర్-12, అండర్-14 జిల్లా టీంలకు స్టాండ్ బైగా ఉంటూ ప్రస్తుతం అండర్-12 జిల్లా క్రికెట్ జట్టు కీపర్‌గా ఎంపికయ్యా, తాజాగా ఈ నెల 16 నుంచి 22 వరకు జరగనున్న సౌత్‌జోన్ అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో స్టాండ్‌బైగా ఉంటున్న. ఆల్‌రౌండర్‌గా రాణించాలన్నది నా లక్ష్యం.

- **కె.హేమంత్ కుమార్, వికెట్ కీపర్, వాల్మీకిపురం**

దారి పక్కనే గండం.. అధికారులకో దండం!

రాయచోటి పట్టణానికి నీటిని సరఫరా రోళ్ల మడుగు తాగునీటి పథకం గొట్టాలు మరమ్మతుకు గురయ్యాయి. సద్ది కూళ్ల వంక వద్ద రోడ్డుకు ఆనుకుని వంకపై వేసిన సిమెంట్ రోడ్డును మూడడుగులకు పైగా తవ్వారు. పనులు పూర్తయినా గుంత పూడ్చలేదు. నిత్యం ఈ రహదారిపై రాజంపేట, శిబ్యాల, సుండుపల్లె మండలాలకు వందలాది వాహనాలు వెళ్తుంటాయి. అనుకోని ప్రమాదం జరిగితే మూల్యం చెల్లించుకోవాల్సిందే. అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని జనం విజ్ఞప్తి చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, రాయచోటి పట్టణం

ముఖాముఖి: రాయితీ పట్టుకో.. ఆదాయం పెంచుకో!

• పట్టు పరిశ్రమల శాఖ డీడీ శ్రీవాణి

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: రైతులు మల్బరీ సాగుపై దృష్టి సారిస్తే మేలైన ఆదాయం సాధించవచ్చని పట్టుపరిశ్రమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీవాణి పేర్కొన్నారు. ప్రస్తుతం కిలో పట్టు గూళ్లు రూ.800 పలుకుతున్నాయన్నారు. మల్బరీ సాగుపై ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, లాభాల గురించి 'న్యూస్‌టుడే'కు తెలియజేశారు.

2,500 ఎకరాల్లో సాగు

జిల్లాలో సుమారు 2 వేల ఎకరాల్లో రైతులు మల్బరీ సాగు చేస్తున్నారు. 2025-26 ఏడాదిగాను అదనంగా 650 ఎకరాల్లో మల్బరీ సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాం. సుమారు 500 ఎకరాల్లో చేయించాం. మరో 150 ఎకరాల్లో మార్చిలోపు పూర్తి చేయిస్తాం.

జిల్లాలో ఒకప్పుడు 60 శాతానికి పైగా రైతులు మల్బరీని సాగు చేసేవారు. ప్రస్తుతం ఎక్కువ మంది టమాట పంటపై ఆసక్తి చూపుతున్నారు. సీజన్‌లో లాభాలు రావడంతో అటువైపు మొగ్గు చూపుతున్నారు. రసాయనాలతో మల్బరీ పంట పాడవుతోంది.

ఇవీ ప్రోత్సాహకాలు

పట్టు పురుగుల రేరింగ్ షెడ్లు ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం రాయితీతో రూ.45 వేలు చెల్లిస్తే రూ.4,50,000 యూనిట్‌ను మంజూరు చేస్తాం. జనరల్ క్యాటగిరీ కింద రూ.75 వేల రాయితీతో రూ.4,50,000 యూనిట్‌ను మంజూరు చేయనున్నాం. • కొత్తగా మల్బరీ సాగు చేసే రైతులకు ఎకరాకు రూ.30 వేలు ఇస్తాం, రైతు వాటా కింద రూ.7,500 (25 శాతం) చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీలు రూ.3 వేలు చెల్లిస్తే రూ.30 వేలు పొందవచ్చు.

ప్రకృతి సాగు చేసేలా..

మల్బరీ సాగు చేసే వారు తక్కువ అవుతున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంత సచివాలయాల్లో పనిచేస్తున్న సెరికల్చర్ సహాయకుల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ఒక మండలాన్ని ఎంపిక చేసి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ద్వారా సాగు చేసేలా కార్యక్రమాలు రూపొందించింది. రసాయన ఎరువులు, మందులు వినియోగించకుండా ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రోత్సహిస్తున్నాం.

జడ్పీ సీఈవో సమీక్ష

మదనపల్లె గ్రామీణ: కేటాయించిన లక్ష్యాలు వెంటనే పూర్తి చేయాలని మండల అధికారులను జడ్పీ సీఈవో రవికుమార్ ఆదేశించారు. మదనపల్లెలో పలు అభివృద్ధి పనులపై ఆయన బుధవారం సమీక్షించారు. ఇటీవల జరిగిన పనుల దస్త్రాలు తనిఖీ చేశారు. అనంతరం స్వచ్ఛ రథాల తయారీ షెడ్లు పరిశీలించి, త్వరితగతిన వాహనాలు రూపొందించి పంచాయతీల్లో అందుబాటులోకి తేవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యదర్శులను ఇష్టానుసారం మారుస్తున్నారనే ఆరోపణలపై ఈ విచారణ చేపట్టినట్లు తెలిసింది.

జగత్కల్యాణం.. భూ కైలాసం!

గజ వాహనంపై సోమస్కందమూర్తి, సింహ వాహనంపై జ్ఞానాంబిక విహారం

జగద్రక్షకుడు.. కైలాసవాసి.. శ్రీకాళహస్తీశ్వరుడి కల్యాణం ఆద్యంతం రమణీయంగా సాగింది. మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో స్కందరాత్రిని పురస్కరించుకుని మంగళవారం అర్ధరాత్రి, బుధవారం వేకువజామున కల్యాణోత్సవ క్రతువును ఆగమోక్తంగా జరిపారు. ఈ విశేషోత్సవాన్ని పురస్కరించుకుని సోమస్కందమూర్తి గజ వాహనాన్ని, జ్ఞానాంబిక సింహ వాహనాన్ని అధిరోహించారు. అనంతరం ఉత్సవర్లను పురవీధుల్లో ఊరేగించారు.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌కు పురస్కారం

పుంగనూరు గ్రామీణం: మండలంలోని పీహెచ్‌సీ పరిధిలో ఉన్న 8 పంచాయతీల్లోని ఆరోగ్య ఆయుష్మాన్ మందిర్‌ల పనితీరును మెచ్చి కేంద్ర ప్రభుత్వం ఎన్‌క్యూఏఎస్ అవార్డు ఇచ్చిందని వైద్యాధికారిణి సృజన తెలిపారు. బుధవారం చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్ చేతుల మీదుగా సిబ్బంది పురస్కారాన్ని అందుకున్నట్లు చెప్పారు. మండలంలోని పాలెంపల్లె, మోదుగులపల్లె ఎంసీ పల్లె, మాగాండ్లపల్లె, సుగాలిమిట్ట, నేతిగుట్లపల్లె, సింగిరిగుంట, కపాడిమిట్టపల్లె గ్రామాల్లోని ఆయుష్మాన్ కేంద్రాల్లోని సిబ్బంది పనితీరు, మందులు, పరికరాల ఆధారంగా పురస్కారం అందజేసినట్లు తెలిపారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురువారం (సా)	సహర్ శుక్రవారం (ఉ)
మదనపల్లె	6.27	5.16
రాయచోటి	6.26	5.15

మంగళూరు టు రాయచోటి!

☛ పదేళ్లుగా ఇక్కడే నక్కిన నిందితుడు

☛ రెండు రాష్ట్రాల పోలీసులు 20 రోజుల రెక్కీ

రాయచోటి, న్యూస్‌టుడే: పూర్వ జిల్లా కేంద్రమైన రాయచోటి నేరగాళ్లు, తీవ్ర వాదులకు అడ్డాగా మారుతోంది. ప్రశాంత వాతావరణంలో ఉన్న పట్టణం ఏడాదిగా జరిగిన వరుస ఘటనలతో ఉలిక్కి పడింది. గతేడాది అక్టోబరులో పట్టణంలోని కొత్తపల్లిలో పట్టుబడిన అంతర్జాతీయ తీవ్రవాదుల ఘటన మరువక ముందే కర్ణాటక రాష్ట్రంలో అనేక నేరాలకు పాల్పడి అక్కడి నుంచి తప్పించుకునేందుకు పారిపోయి వచ్చిన ఓ మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ రాయచోటిని స్థావరంగా చేసుకుని పదేళ్లుగా పోలీసుల కళ్లుగప్పిన ఘటన మంగళవారం బయటకు రావడంతో ఆ ప్రాంత వాసులు మరోసారి ఉలిక్కిపడ్డారు. తరచూ నేరగాళ్లకు స్థావరంగా ఉంటున్న ఈ ప్రాంతాలపై పోలీసులు నిఘా పెంచడంతో వరుస ఘటనలు వెలుగు చూడటం విశేషం.

గుట్టుచప్పుడు కాకుండా..

కర్ణాటక రాష్ట్రం మంగళూరుకు చెందిన నేరస్థుడు యు.ఎం.నసీర్ (40).. అక్కడ చేయని నేరం లేదు. చిన్న వయస్సులోనే హత్యలు చేయడం, అత్యాచారాలకు పాల్పడటం, బెదిరించడం, నేరస్థులతో చేతులు కలిపి వరుస నేరాలకు పాల్పడ్డాడు. అతడిపై 26 కేసులు నమోదవగా వాటిలో రెండు కేసుల్లో జీవిత ఖైదు అనుభవించాడు. మరో నాలుగు హత్య కేసుల్లో కోర్టుల్లో విచారణ సాగుతోంది. ఈ నేరాల నుంచి తప్పించుకునేందుకు అక్కడి నుంచి పారిపోయి రాయచోటికి వచ్చిన నసీర్ కొత్తపల్లి ప్రాంతంలో నివాసం ఏర్పరచుకున్నాడు. స్థానిక మహిళనే వివాహం చేసుకుని పలు దుకాణాల్లో పనిచేశాడు. కొద్దికాలం తర్వాత దుబాయ్‌కి వెళ్లి.. నెల కిందటనే తిరిగి రాయచోటికి వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. అప్పటికే నసీర్ కోసం గాలిస్తున్న కర్ణాటక పోలీసులు.. రాయచోటిలో ఉన్నాడనే విషయం తెలుసుకుని అతడి ఆచూకీ కోసం ఎస్పీ ధీరజ్ కునుబిల్లిని సంప్రదించారు. ఎస్పీని కలిసి సమాచారం ఇవ్వడంతో కర్ణాటక, స్థానిక పోలీసులు పది రోజులుగా నసీర్ కోసం రెక్కీ నిర్వహించి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు.

నసీర్

మరో ఇద్దరి కోసం గాలింపు

నసీర్‌కు సన్నిహితంగా ఉన్న మరో ఇద్దరి కోసం కర్ణాటక పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం. పరారీలో ఉన్న ఇద్దరిలో ఒకరు సౌదీ అరేబియాకు వెళ్లినట్లు గుర్తించారు. మరొకరి వివరాలు నసీర్ ద్వారా రాబట్టేందుకు యత్నిస్తున్నారు. పదేళ్లుగా ఒకేచోట ఉన్న నేరస్థులతో స్థానికంగా ఎవరెవరికి సంబంధాలు ఉన్నాయి.. వారికి స్థావరం కల్పించింది ఎవరు? వివాహానికి సహకరించడం, ఉపాధి కల్పించిన వ్యక్తులపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఓ పార్టీకి చెందిన మైనార్టీ నేతతో సన్నిహితంగా ఉన్నాడనే విషయాన్ని పోలీసులు గుర్తించారు. కర్ణాటకలోనే కాక రాయచోటిలో జరిగిన ఘటనల్లోనూ సంబంధాలు ఉన్నాయా, దుబాయ్ వెళ్లడానికి పాస్‌పోర్టు ఎలా వచ్చింది.

(c) eenadu

పుష్కరిణి.. ప్రాభవంతో ప్రసిద్ధి

'ముక్కంటి' ఆలయానికి అనుబంధంగా మూడు పుష్కరిణులు

కైలాసగిరి పర్వత శ్రేణుల్లో ఉన్న భరద్వాజతీర్థం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పంచభూత లింగాల్లో వాయులింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తిలో పురాణ ప్రాభవానికి సంబంధించి ఎన్నో ఆనవాళ్లు కన్పిస్తుంటాయి. అందులో భాగంగా ఇక్కడి క్షేత్రానికి అనుసంధానంగా పురాతన కాలం నుంచి వస్తున్న పుష్కరిణులు నేడు ఆధ్యాత్మిక ప్రాభవానికి చిహ్నలుగా విరాజిల్లుతున్నాయి. **భరద్వాజపుష్కరిణి:** కైలాసగిరుల్లో సహజ సిద్ధంగా ఏర్పాటైన పుష్కరిణి. దీన్నే దేవతా పుష్కరిణి అని కూడా పిలుస్తుంటారు. శ్రీకాళహస్తి క్షేత్ర ప్రాభవాన్ని రోమశ మహర్షి ద్వారా తెలుసుకున్న భరద్వాజుడు ఇక్కడి కైలాసగిరుల్లో శివలింగాన్ని ప్రతిష్ఠించాడు. ఇక్కడ ఉన్న నీటితో లింగానికి అభిషేకాలు చేశాడు. దేవతాభిషేకాలకు ఏర్పాటు చేసిన పుష్కరిణి కావడంతో ఇది భరద్వాజ పుష్కరిణిగా ఖ్యాతి గడిస్తోంది. తైలమావాస్య సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి ఉత్సవమూర్తులను ఇక్కడకు తీసుకువచ్చి విశేష అభిషేకాలు చేపట్టాక మళ్లీ ఆలయానికి తీసుకెళ్లడం సంప్రదాయంగా సాగుతోంది.

నారద పుష్కరిణి..: ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాభవాన్ని పొందిన పుష్కరిణి ఇది. పట్టణ నడిబొడ్డున బాబుఅగ్రహారం వద్ద ఉంది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో సోమస్కందమూర్తికి, జ్ఞానప్రసూనాంబికలకు ఇక్కడ తెప్పోత్సవం జరుపుతుంటారు. ఆడికృత్తిక వార్షిక బ్రహ్మోత్సవాల్లో శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి తెప్పోత్సవం నిర్వహిస్తుంటారు.

వైష్ణవ పుష్కరిణి..: శివ, కేశవులకు మధ్య భేదం లేదన్న భావనతో ఇక్కడి జయరామారావు వీధిలో వైష్ణవ పుష్కరిణిని ఏర్పాటు చేశారు. తైలమావాస్య రోజున సోమస్కందమూర్తి, జ్ఞానాంబికలు భరద్వాజతీర్థం వద్దకు వెళ్లి పూజలందుకుంటే.. ముక్కంటి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వరదరాజస్వామికి ఈ పుష్కరిణిలో తెప్పోత్సవం జరపడం సంప్రదాయంగా వస్తోంది. శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి వార్షికోత్సవాల్లో కంకణధారులైన భక్తులు ఇక్కడి పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేసి అగ్నిగుండ మహోత్సవంలో పాల్గొంటారు.

నేడు కైలాసగిరి ప్రదక్షిణోత్సవం



మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన పరివార దేవతా సమూహం, యక్షులు, కిన్నెరులు, కింపురుషులతో పాటు కైలాసగిరుల్లో తపస్సు చేసుకునే రుషిపుంగవులకు వీడ్కోలు పలికేందుకు నవదంపతులైన శ్రీసోమస్కందమూర్తి, జ్ఞానప్రసూనాంబిక అమ్మవార్లు కైలాసగిరి ప్రదక్షిణోత్సవానికి బయలుదేరనున్నారు. దాదాపు 23 కిలోమీటర్ల పొడవున ఈ విశేషోత్సవం జరగనుంది.

ఉభయదాతలు: బియ్యపు కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి **రాత్రి:** స్వామివారు అశ్వవాహనంపైన, జ్ఞానాంబిక సింహవాహనంపై ఊరేగనున్నారు.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

'అభిషేకం'.. ఆదిదేవునికి ప్రీతిపథం

ముక్కంటి ఆలయంలోని సహస్రలింగేశ్వరునిసన్నిధి వద్ద మహన్యాస అభిషేక నిర్వహణకు సంకల్పపూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శివుడు అభిషేక ప్రియుడు. అందుకే శివాలయాల్లో అభిషేకాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. శ్రీకాళహస్తీశ్వరాలయంలో శ్రీజ్ఞానప్రసూనాంబికతో పాటు శ్రీకాళహస్తీశ్వరునికి నిత్యం నిర్వహించే అభిషేకాలు ఎంతో ప్రాభవాన్ని పొందాయి. ప్రతి రోజూ నాలుగు సమయాల్లో అభిషేకాలు జరుపుతుంటారు. అందులో మూడు ఉదయం జరిగితే సాయంత్రం ప్రదోష కాల సమయంలో మరో అభిషేకం జరుగుతుంది. ఉదయం నిర్వహించే అభిషేకాలను రుద్రాభిషేకాలుగా, సాయంత్రం నిర్వహించే అభిషేకాన్ని మహన్యాస పూర్వక రుద్రాభిషేకంగా పిలుస్తారు. ఇందులో పాల్గొన్న భక్తులకు పంచామృతంతో పాటు ప్రసాదాలు అందజేస్తారు.

పూజలు.. ఫలాలు

అభిషేకం: రుద్రాభిషేకం, **టికెట్:** 1000 **ప్రవేశం:** ఇద్దరికి **నిర్వహణ:** ఉదయం 5, 6, 9 గంటలకు **ఫలం:** ఆరోగ్యసిద్ధి, కోర్కెలు ఫలించడం, మానసిక ఆనందం, కుటుంబ శ్రేయస్సు, వ్యాపారాభివృద్ధి

అభిషేకం: మహన్యాస పూర్వక రుద్రాభిషేకం **టికెట్:** 1500, **ప్రవేశం:** ఇద్దరికి **నిర్వహణ:** సాయంత్రం 4 గంటలకు **ఫలం:** కాలసర్పదోషం నివృతి, ఉద్యోగోన్నతులు, వివాహాది శుభ కార్యాక్రమాలకు అడ్డంకులు తొలగడం, ఆరోగ్యసిద్ధి **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

గంగమ్మా.. అనుగ్రహించమ్మా

జాతరకు తరలివచ్చిన భక్త సందోహం

ఊరేగింపుగా వస్తున్న చాందినీ బండ్లు

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: అనంతపురం గంగమ్మ జాతర భక్తజన సంద్రంగా సాగింది. బుధవారం పలు రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. రంగురంగుల పూలతో ఆలయం నూతన శోభ సంతరించుకుంది. కుర్నూతల పంచాయతీ చాగలగుట్టపల్లె నుంచి ఉదయం గంగమ్మ విగ్రహాన్ని ఆలయానికి తెచ్చారు. చాగలగుట్టపల్లె నుంచి జాతర స్థలం వరకు బోనాలు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. చాందినీ బండ్లు జాతరకు పెద్దఎత్తున చేరుకున్నాయి. అమ్మవారికి మంత్రి సోదరుడు, లక్ష్మీప్రసాద్‌రెడ్డి, తెదేపా మండల అధ్యక్షుడు యనమల మదన్‌మోహన్ ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు సమర్పించారు. ఈవో శ్రీనివాసులు, అర్చకులు రెడ్డిశేఖర్, ఉత్సవ కమిటీ ఛైర్మన్ వెంకటేశ్వర్లు, కడప సూర్య ఆసుపత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. పులివెందుల డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ద్వారకానాథరెడ్డి, మంత్రి మేనల్లుడు మౌర్యారెడ్డి, కడప మాజీ మేయర్ సురేష్‌బాబు గంగమ్మ తల్లిని దర్శించుకున్నారు.

బండ లాగుడు పోటీల విజేత ఓవలంపల్లి ఎద్దు

విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె: జాతర సందర్భంగా నిర్వహించిన బండలాగుడు పోటీల్లో ఉమ్మడి జిల్లాల నుంచి 13 జతల ఎద్లు పాల్గొన్నాయి. వైఎస్ఆర్ కడప జిల్లా చెన్నూరు మండలం ఓవలంపల్లికు చెందిన సతీష్‌కుమార్‌రెడ్డి ఎద్దులు మొదటి స్థానంలో, పెండ్లిమర్రి మండలం బాలయ్యగారిపల్లెకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి ఎద్లు ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు నియోజకవర్గ తెదేపా నాయకుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి బహుమతులు అందజేశారు.

వరాల వసంతం.. రంజాన్ మాసం

నేటి నుంచి ఉపవాస దీక్షలు

మదనపల్లె జామియా మసీదు

మదనపల్లె (గ్రామీణ), పుంగనూరు, న్యూస్‌టుడే: సమతా మమతలకు స్ఫూర్తినిచ్చే రంజాన్ మాసం బుధవారం సాయంత్రం నుంచి ప్రారంభమైంది. ముస్లిం సోదరులకు పవిత్రమైన ఈ మాసం ఇస్లామ్ కాలమాన పట్టిక ప్రకారం షాబాన్ నెల పూర్తికాగానే కనిపించే నెలవంకతో ప్రారంభమవుతుంది. సాయంత్రం నెలవంకను చూసి ముస్లిం సోదరులు ఇషా నమాజ్ తరువాత సామూహికంగా తరావీ నమాజ్ ఆచరించి ఉపవాస దీక్షలు ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా బుధవారం రాత్రి ఇషా నమాజ్ అనంతరం అన్ని మసీదుల్లో తరావీ నమాజ్‌లు ప్రారంభమయ్యాయి. జిల్లాలో 550 మసీదులు ఉన్నాయి. ముఖ్యంగా మదనపల్లె పట్టణంలోని ప్రధాన మసీదులతోపాటు రాయచోటి, పుంగనూరు, పీలేరు తదితర ప్రాంతాల్లోని పలు మసీదుల్లో సహరీ ఏర్పాట్లు చేస్తున్నారు. చాలా ప్రాంతాల్లో నిరుపేదలు, విద్య, ఉపాధి, ఉద్యోగాలు, వ్యాపారాల నిమిత్తం అత్యవసర ప్రయాణాలు చేస్తుంటారు. ముస్లిం మైనార్టీలు ఉపవాసాలు ఉండేందుకు వెసులుబాటు కల్పిస్తున్నారు. ఇందుకు జిల్లాలోని ముఖ్యమైన ప్రాంతాలైన మదనపల్లెలోని బెంగళూరు బస్టాండ్‌లోని జామియా మసీదు, ఎన్నీఆర్ వీధిలోని మోతీమసీదు, ఉస్మాన్‌గంజ్ మసీదు, ఎస్టేట్‌లోని మదీనా మసీదు, పుంగనూరులోని పాతబస్టాండ్ వద్ద మక్కామసీదు, పోస్టాఫీసు సమీపంలోని మర్కజ్ మసీదు, తాజ్‌మహల్ థియేటర్ సమీపంలోని మదీనా మసీదు, పీలేరులో మసీదేఖ్వాజా (ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో), రాయచోటిలో జామియా మసీదు, బిలాల్ మసీదు, బుఖ్బార్ మసీదు, అంగళ్లులోని జామియామసీదుల్లో వేకువజామున సహరీ కోసం అల్పాహార ఏర్పాట్లను ఆయా మసీదు కమిటీ, నౌజవాన్ కమిటీ సభ్యులు సిద్ధం చేస్తున్నారు. వాల్మీకిపురం, గుర్రంకొండ, కలికిరి, బి.కొత్తకోటల్లో ప్రధాన మసీదుల్లో ఈ ఏర్పాట్లు చేశారు.

పేదలకు సహరీ

పీలేరు, న్యూస్‌టుడే: రంజాన్ మాసం మొత్తం పీలేరు పరిసరాల్లోని పేదలకు అక్కా మసీదులో ఉచితంగా ఉదయం, సాయంత్రం సహరీ (భోజనం) ఏర్పాటు చేస్తామని నిర్వాహకుడు అతీక్ షఫీ తెలిపారు. బుధవారం షఫీ మాట్లాడుతూ వసతి గృహ విద్యార్థులు, ఒంటరి ఉద్యోగులు, నిరుద్యోగులు, గృహిణులు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారు వినియోగించుకోవాలని చెప్పారు. రైల్లో వెళ్లేవారు పీలేరు స్టేషన్ చేరుకునే ముందుగా నిర్వాహకుల చరవాణికి సమాచారం ఇస్తే స్టేషన్ వద్దకు సైతం పంపుతామన్నారు. సహరీ డోర్ డెలివరీ కోసం 97050 27363, 96421 31331, 93476 00456కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. పవిత్ర పీలేరులో సహరీ ఏర్పాటుకు సహకరిస్తున్న భగవంతుడికి షఫీ కృతజ్ఞతలు తెలిపారు.

గురుకులాలకు భవనాలు నిర్మించాలి

శాసనసభలో ఎమ్మెల్యే నల్లారి

కలకడ, న్యూస్‌టుడే: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో పీలేరు నియోజకవర్గంలోని కలకడ, గుర్రంకొండ, పీలేరు మండలాలకు మంజూరైన బాలికల గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి బుధవారం శాసనసభ సమావేశాల్లో విన్నవించారు. 2012లోనే గురుకుల పాఠశాలలు మంజూరైనా అప్పటి నుంచి అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయన్నారు. కలకడ పాఠశాలకు బొజ్జ గుంటపల్లెకు చెందిన రైతు ఉచితంగా స్థలాన్ని పాఠశాలకు రాసి ఇచ్చారని, అయినా నిధులు మంజూరు కాలేదన్నారు. ఇప్పటివరకు మండలంలోని బాటవారిపల్లె పంచాయతీలోని గరపప్పగారిపల్లెలో అద్దె భవనంలో నడిచేదని, ప్రస్తుతం కలకడ నుంచి రాయచోటికి మార్చారని పేర్కొన్నారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లల దగ్గరికి వెళ్లి రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పరిశీలించాలని కోరారు. గుర్రంకొండ, పీలేరులో కూడా సొంత భవనాలు లేక అసౌకర్యాల నడుమ పాఠశాలలు నడుస్తున్నాయన్నారు.

26 నుంచి జనసేన సభ్యత్వ నమోదు

మదనపల్లె (గ్రామీణ, పట్టణం): ఈ నెల 26 నుంచి జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మహేశ్ పేర్కొన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు మహాయజ్ఞం గోడపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అధినేత పవన్‌కల్యాణ్ ఆశయాలు ముందుకు తీసుకెళ్లేందుకు, ఆయన ఆదేశాల మేరకు రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు అమర్‌నారాయణ, తంబళ్లపల్లె నాయకులు హరినాథ్, సీనియర్ నాయకులు సందీప్‌రెడ్డి, జయభవ్య, మనోజ్, నగీనా పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు: డీఐఆర్వో

రాయచోటి, న్యూస్‌టుడే: ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్ బోర్డు జిల్లా అధికారి ఎస్.రవి ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిమిషం ఆలస్యమైనా విద్యార్థులకు అనుమతి లేదన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని, వసతుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బోర్డు అధికారులు ఇచ్చిన చరవాణులను అందజేశారు. సభ్యులు అమరేంద్ర, కమలాకర్, అజంతుల్లా, దస్తగిరి పాల్గొన్నారు.

వరకట్న వేధింపులు.. డాక్టర్‌కి ఆరు నెలలు జైలుశిక్ష

తిరుపతి (లీగల్), న్యూస్‌టుడే: తిరుపతి మహిళా పోలీసు స్టేషన్‌లో నమోదైన వరకట్న వేధింపుల కేసులో భర్తకి ఆరునెలల జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తిరుపతి నాల్గో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి గ్రంథి శ్రీనివాస్ బుధవారం తీర్పు వెలువరించినట్లు ఏపీపీ సుజాత, కోర్టు లైజన్ అధికారులు తెలిపారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా, మదనపల్లి అవెన్యూవీధికి చెందిన ఫిజియోథెరపీ డాక్టర్ ఎంఎస్ఎం.ఇంతియాజ్ బాషాకి.. తిరుపతి ఎల్ఎస్ నగర్‌కి చెందిన దంత వైద్యురాలు షేక్ హసీనాతాజ్‌తో 2013 మే 26న వివాహం జరిగింది. వివాహానంతరం వేధింపులు పెరగటంతో బాధితురాలు 2018లో తిరుపతి మహిళా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి ఛార్జిషీటు దాఖలు చేశారు. భర్తపై కేసు సాక్ష్యాధారాలతో నిరూపితమైంది. న్యాయమూర్తి భర్తకి జైలుశిక్ష, జరిమానా విధించారు.

అభివృద్ధి పనుల లక్ష్యాలు సాధించాలి: జేసీ

మదనపల్లె గ్రామీణ: అభివృద్ధి పనుల లక్ష్యాలు త్వరగా పూర్తిచేయాలని అధికారులను జేసీ శివనారాయణశర్మ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. హైవేలు, ఎంఎస్ఎంఈ పార్కు, పర్యటక కేంద్రాల్లోని పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులు పూర్తిచేయాలన్నారు.

వేడుకగా త్రిశూల స్నానం.. తిరుణాల

కోనేరులో త్రిశూల స్నానం చేయిస్తున్న అర్చకులు, భక్తులు

కలకడ, న్యూస్‌టుడే: శ్రీకామాక్షీ సమేత సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం త్రిశూల స్నానం, వసంతోత్సవం నిర్వహించారు. ఆలయం వద్ద స్వామివారి త్రిశూలానికి అభిషేకం నిర్వహించి ఆపై కోనేరులో పుణ్యస్నానం చేయించారు. ఉత్సవమూర్తులతో ఊరేగింపు నిర్వహించి వసంతోత్సవం చేశారు. ప్రజలు ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

చిన్నారికి కన్నీటి వీడ్కోలు



నివాళులర్పిస్తున్న తెదేపా పార్లమెంట్ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్, పక్కన చమర్తి జగన్మోహన్‌రాజు, నాయకులు

వీరబల్లి, మదనపల్లె నేరవార్తలు, పట్టణం, గ్రామీణ, న్యూస్‌టుడే : మదనపల్లె హత్యాచార ఘటనలో మృతి చెందిన చిన్నారి అంత్యక్రియలు తల్లిదండ్రులు, బంధువుల రోదనల మధ్య బుధవారం వైఎస్సార్ కడప జిల్లా వీరబల్లి మండలంలో జరిగాయి. బాలిక మృతదేహాన్ని తెదేపా రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్‌బాబు, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం చిన్నారి తల్లిదండ్రులను పరామర్శించారు. ఇలాంటి దుస్థితి మరొకరికి రాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని బాలిక తల్లిదండ్రులు వారిని కోరారు. బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉండి ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు అందిస్తామని నాయకులు తెలిపారు.

అందర్నీ అభ్యర్థించా.. ఎవరూ స్పందించలేదు



మా తమ్ముడు రాజశేఖర్ గతంలో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అతనికి అడ్డుగా కులవర్ధన్ నిలబడ్డాడు. పక్కకు జరగమంటే మద్యం మత్తులో దాడి చేశాడు. నేను, మా అన్న ఆదినారాయణ వెళ్లి ప్రశ్నించగా మాపై కూడా కొడవలితో దాడి చేశాడు. ఒకటోపట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేశారు. అతని దుశ్చర్యలపై ఫిర్యాదు చేయాలని అందరినీ అభ్యర్థించినా స్పందించకపోవడంతో లోక్‌అదాలత్‌లో రాజీ కావాల్సి వచ్చింది. అప్పట్లోనే కులవర్ధన్‌కు కఠినశిక్ష పడి ఉంటే అతని చేతిలో చిన్నారి హత్యాచారానికి గురయ్యేది కాదు.

- రామాంజులు, కులవర్ధన్ బాధితుడు, నీరుగట్టువారిపల్లె

మహిళల సమస్యలకు పరిష్కార వేదిక

సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ నాగేశ్వరరావు

కురబలకోట, ములకలచెరువు, న్యూస్‌టుడే: మహిళల వెతలు తీర్చేందుకు జెండర్ రిసోర్స్ సెంటర్ ఓ పరిష్కార వేదిక కానుందని డీఆర్డీఏ పీడీ నాగేశ్వరరావు సూచించారు. ఆయన బుధవారం తంబళ్లపల్లె ఐకేపీ కార్యాలయంలో జెండర్ రిసోర్స్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం గోపిదిన్నె వద్ద క్షేత్రస్థాయిలో మహిళా సంఘాలకు ఇన్కమ్ జనరేషన్ ప్రొఫైల్ యాప్‌పై పలు సూచనలు చేశారు. జెండర్ రీసోర్స్ సెంటర్.. మహిళల సమస్యలతో పాటు బాల్య వివాహాల నియంత్రణ, బాలికల విద్యాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఆయన వెంట డీపీఎం ధర్మరాజు, ఏపీఎం గంగాధర్, శ్రీనిధి మేనేజర్ అమరావతి, సీసీలు నరసింహులు, ఆదిలక్ష్మి, రమణ ఉన్నారు.

కాలిపోతున్న అటవీ ప్రాంతం

సూరపువారిపల్లె అటవీ ప్రాంతంలో మంటలు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: వేసవి రాక ముందే అడవుల్లో అగ్ని ప్రమాదాలు ప్రారంభమయ్యాయి. బి.కొత్తకోట మండలం చలిమామిడి బీట్ పరిధిలోని సూరపువారిపల్లె వద్ద అటవీ ప్రాంతంలో బుధవారం మంటలు చెలరేగాయి. ఇదే ప్రాంతంలోని గుట్టకు ఎవరో నిప్పు పెట్టడంతో మంటలు శరవేగంగా విస్తరిస్తున్నాయి. సూరపువారిపల్లె, దయ్యాలవారిపల్లె, బద్దిపల్లె, డేగానిపల్లెలకు సమీపంలోని అటవీ సంపద అగ్నికి ఆహుతమవుతోంది. అటవీశాఖ సిబ్బంది స్థానికులతో కలిసి మంటలను ఆర్పేందుకు రంగంలోకి దిగారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

కల్లూరు, న్యూస్‌టుడే: కల్లూరు బస్టాండు సమీపంలో నిర్మాణంలో ఉన్న భవనంలో మంగళవారం రాత్రి ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందారు. కల్లూరు పరిసర ప్రాంతాల్లో విచారించగా అనకాపల్లి సమీపంలోని లక్ష్మీదేవిపేటకు చెందిన రాము(46)గా వెల్లడైందని కల్లూరు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు, మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం చరవాణిలో తెలియజేశామన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక..

ములకలచెరువు, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందిన ఘటన ములకలచెరువు మండలంలో చోటుచేసుకుంది. స్థానిక కదిరి రోడ్డులోని షాదీమహల్ సమీపంలో మంగళవారం రాత్రి రోడ్డు దాటుతున్న జింకను గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జింక అక్కడికక్కడే మృతి చెందింది. మేత కోసం వచ్చిన జింక రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగింది. రాత్రి వేళల్లో జింకలు పీటీఎం రోడ్డు, నాయునిచెరువుపల్లి, గాలేటివారిపల్లి ప్రాంతాల్లో ఎక్కువగా సంచరిస్తుంటాయి. నీటి కోసం వచ్చి జింకలు ఇలా మృత్యువాత పడుతున్నాయి. జింక కళేబరాన్ని అటవీశాఖ సిబ్బంది సమీప పొలాల్లో ఖననం నిర్వహించారు.

పీలేరులో బంగారం, వెండి చోరీ

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక రాజీవ్‌నగర్‌కాలనీకి చెందిన వాసిఉద్దీన్ ప్రైవేటు ఉద్యోగి. అతడు శిక్షణ నిమిత్తం బెంగళూరుకు వెళ్లేటప్పుడు.. భార్య సల్మాను తిరుపతిలోని పుట్టింట్లో వదిలి వెళ్లాడు. ఇంటికి తాళం వేసి ఉండటంతో దొంగలు చోరీకి పాల్పడ్డారు. బుధవారం సల్మా ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరిచి బీరువా ధ్వంసం చేసి ఉండటాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇంటిని పరిశీలించి బాధితురాలి ఫిర్యాదు మేరకు 30 గ్రాముల బంగారు ఆభరణాలు, 250 గ్రాముల బరువున్న రెండు జతల వెండి కాళ్ల పట్టీలు చోరీకి గురైనట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ రహదారి దిగ్బంధంపై నాలుగు కేసులు

మదనపల్లె నేరవార్తలు: హత్యాచార ఘటన నేపథ్యంలో ముంబయి-చెన్నై హైవేపై అనుమతి లేకుండా ఆందోళన చేసి.. ప్రజా రావాణాకు అంతరాయం కలిగించిన పలువురిపై ఎస్పీ ధీరజ్ ఆదేశానుసారం బుధవారం నాలుగు కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ మహేంద్ర తెలిపారు. మదనపల్లె ఒకటో, రెండో పట్టణ స్టేషన్లలో రెండు చొప్పున కేసులు నమోదు చేశామన్నారు. ఈ కేసుల్లో భాగంగా పలు పార్టీల నాయకులతో పాటు హైవేపై రెచ్చగొట్టేలా మాట్లాడిన 50 మందిని గుర్తించామన్నారు. ఆందోళన చేస్తున్న సమయంలో డ్రోన్ సాయంతో కొందరిని గుర్తించామని, ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

మభ్యపెట్టి డబ్బు కాజేసే నిందితుడి ఆటకట్టు

మదనపల్లె నేరవార్తలు: ఏటీఎంలు, బ్యాంకులు, బంగారు దుకాణాల వద్ద మభ్యపెట్టి డబ్బు, బంగారు కాజేసే నేరస్థుడిని కర్ణాటక పోలీసులు బుధవారం పట్టణంలో అదుపులోకి తీసుకున్నారు. మదనపల్లె మండలం కొత్తఇండ్లకు చెందిన ఫతేలి.. తన భార్య కులుసుమ్‌ను ప్రసవం కోసం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చాడు. అప్పటికే మాటువేసిన కర్ణాటక రాష్ట్రం చిక్‌బళ్లాపూర్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకోగా వారిని అడ్డుకుని ఎందుకు తీసుకెళ్తున్నారని అత్త సాబిదా ప్రశ్నించినా.. వారు సమాధానం చెప్పకుండా వెళ్లిపోయారు. నిందితుడు ఫతేలి, మరో యువకుడు కలిసి బ్యాంకులు, బంగారు దుకాణాలు, ఏటీఎంల వద్ద వ్యక్తులను మభ్యపెట్టి వారివద్ద ఉన్న నగలతో ఉడాయిస్తారని, అందుకే అతడిని అదుపులోకి తీసుకున్నామని మహిళా ఎస్ఐ తెలిపారు. తన అల్లుడికేమీ తెలియదని ఆసుపత్రిలో కాన్పు కోసం భార్యతో కలిసి రాగా పట్టుకెళ్లిపోయారని సాబిదా కన్నీటి పర్యంతమయ్యారు.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్
(ప్రభుత్వ రంగ షెడ్యూల్డు బ్యాంకు) రీజనల్ ఆఫీసు : మదనపల్లె.

లీజు ప్రాతిపదికన ఆవరణ కావలెను

బ్యాంకు ఆవరణ కొరకు లీజుపై ఇవ్వగల ఆసక్తి గల పార్టీల నుంచి బిడ్లు ఆహ్వానించడమైనది. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, పుంగనూరు పట్టణమందు ప్రస్తుతం ఉన్నటువంటి బ్యాంకు కొరకు 1400 నుంచి 1600 చ॥ అడుగులు కార్పెట్ ఏరియా (స్ట్రాంగ్ రూమ్ 200 చ॥ అడుగులు కలుపుకొని) విస్తీర్ణంతో గ్రౌండ్ ఫ్లోర్‌లో భవనం ఉండి తగినంత పార్కింగ్ ఏరియా మరియు మంచినీటి వసతి కలిగి ఉండవలెను. వాణిజ్య వినియోగమునకు తగిన అనుమతి కలిగి ఉండవలెను. అన్ని పన్నులు కలుపుకొని వాస్తవ కార్పెట్ ఏరియాకు అద్దె చెల్లించబడును. ఆసక్తి గల వారు పుంగనూరు బ్యాంక్ శాఖ నందు ఇతర వివరములు మరియు నిర్ణీత టెండరు ఫారములు పొందగలరు. వాటిని టెక్నికల్ బిడ్ మరియు ప్రైస్ బిడ్ అని వ్రాసి రెండింటిని వేరు వేరు సీల్డ్ కవర్ నందు ఉంచి ఈ రెండింటిని ఒక సీల్డ్ కవర్‌లో ఉంచి ది 11.03.2026 సా॥ 5.00 గం॥లలోపు రీజనల్ ఆఫీస్, మదనపల్లె నందు సమర్పించవలెను. బ్రోకర్లు లేదా మధ్యవర్తులు అనుమతించబడరు.

గమనిక : ఎటువంటి కారణములు చూపకుండానే ఏదైనా లేదా అన్ని బిడ్‌లను తిరస్కరించేహక్కు బ్యాంకుకు కలదు.

తేదీ : 19.02.2026
స్థలం : మదనపల్లె

సం/- రీజినల్ మేనేజర్
ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు, D.No.IV-261, మొగిలి కాంప్లెక్స్, అవెన్యూ రోడ్డు, మదనపల్లె.

17వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
17 years Anniversary
సాయినారాయణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్
మా అభ్యున్నతికి సహకరించిన మిత్రులకు, శ్రేయోభిలాషులకు, మా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు
24/7 EMERGENCY SERVICE
డా॥ కె.నిరంజన్ బాబు M.D., (Med), D.M.(Neuro) మెదడు & నరాల వైద్యనిపుణులు
డా॥ జి.అన్నపూర్ణ M.S. (OBG), స్త్రీల వైద్య నిపుణులు
అందుబాటులోని సేవలు: న్యూరాలజీ, న్యూరోసర్జరీ, గైనకాలజీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, జనరల్ సర్జరీ, డయాబెటాలజీ, ఐ.సి.యు. కేర్, క్రిటికల్ కేర్ & ఎమర్జెన్సీ, డెంగ్యూ, మలేరియా, విషజ్వరాలకు చికిత్స
డిబిఆర్ హాస్పిటల్ వెనుక, కొర్లగుంట, మారుతీనగర్, తిరుపతి.
0877-2225550, 9494403825

EENADU Classifieds

REAL ESTATE
FLAT FOR SALE

తిరుపతి, గెస్ట్‌లైన్ హోటల్‌కి ఆనుకొని మాస్టర్ ప్లాన్ 80 feet రోడ్డు ప్రక్కన AB AAVAS Phoenix Tower Smart Homesలో 2, 3 BHK Flats సేల్స్‌కు కలవు. RERA Project. 9505502346

GENERAL

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం జీ: 18-20K ✆ 96404 68899, 96402 58899

JOBS

తిరుపతిలోని ప్రముఖ కంపెనీకి బిజినెస్ పర్సన్స్, రిటైర్డ్ పర్సన్స్, వివాహితులు కావలెను. Age: 30 to 65, Qua: Inter- PG పాన్‌కార్డు తప్పనిసరి ✆ 76750 95860.

మార్కెటింగ్ Reps/Officers (తిరుపతి టౌన్‌లో పనిచేయుటకు) కావలెను. Qly: MBA/B.Com/ B.Sc, గూడ్స్ ఆటో డ్రైవర్-1 అనుభవం, లైసెన్స్, బ్యాడ్జి కలిగి ఉండవలెను. ✆9703402722

తిరుపతి, NGO's కాలనీ, D.No: 6-8-1113లోని కల్పవృక్ష లగ్జరీ హోమ్‌స్టే నందు పనిచేయుటకు రిసెప్షన్ కమ్ సూపర్‌వైజర్, స్వీపర్లు కావలెను. Cont: గాయత్రి హాస్పిటల్స్, వి.వి.మహల్ రోడ్డు, లలిత జ్యూవెలరీ ప్రక్కన, తిరుపతి. ✆ 98497 55595.

THE EENADU CLASSIFIEDS WAY
B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/- Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే
తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు... 80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600 Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

రాయచోటి
• రాయచోటి • పీలేరు

నేడు, రేపు విద్యుత్తు సరఫరా నిలిపివేత

పీలేరు, న్యూస్‌టుడే: స్థానిక అజంతా మిట్ట నుంచి మదనపల్లె మలుపు వరకు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గురు, శుక్రవారాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నామని ఎస్పీడీసీఎల్ ఏఈ ఖాదర్ ఇలాహీ బుధవారం తెలిపారు. బండ్లవీధి, ప్రకాశం వీధి, ఇందిరానగర్, పెద్ద మసీదు వీధి, అజంతామిట్టకు సరఫరా ఉండదని వివరించారు.

డీఈవో తనిఖీ

గుర్రంకొండ, న్యూస్‌టుడే: స్థానిక మండల వనరుల కేంద్రాన్ని డీఈవో సుబ్రహ్మణ్యం బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి దస్త్రాలు పరిశీలించారు. పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించడానికి పక్కాగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆపై స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలను తనిఖీ చేశారు. ఎంఈవో సురేంద్రబాబు, ఎంఈవో-2 సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మామిడి కవర్లతో ప్రయోజనం

పీలేరు గ్రామీణ: మామిడి కాయలకు కట్టే కవర్లతో రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుందని ఉద్యానశాఖ అధికారి సుకుమార్‌రెడ్డి తెలిపారు. పీలేరులో రైతులకు బుధవారం ఆయన మామిడి కవర్లు అందజేశారు. రూ.2 ధర ఉన్న కవరును.. 50 శాతం రాయితీపై ఇస్తామన్నారు. మొత్తం 15 వేలు అందజేస్తామని పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
రాయచోటి : 9703622242
పీలేరు : 8008574958
చిన్నమండెం: 9440170752

న్యూస్‌టుడే, కంభంవారిపల్లి: సమస్య: గర్నిమిట్టలో అక్కడక్కడ వీధి దీపాలు రాత్రింబవళ్లు వెలుగుతూనే ఉన్నాయి. **-రమణ, స్థానికుడు**

సమాధానం: పగలు వెలుగుతున్న వీధి దీపాలు గుర్తించి, స్విచ్‌లు ఏర్పాటు చేస్తాం. **-వరప్రసాద్ ఏఈ, ట్రాన్స్‌కో**

న్యూస్‌టుడే, గాలివీడు: సమస్య: వెలిగల్లు పునరావాస కాలనీలోని చివరి వీధులకు మంచినీటి సరఫరా చేయాలి. **-బాషా, స్థానికుడు**

సమాధానం: నీటి సమస్య పరిష్కరిస్తాం. **-వలి, ఇన్‌ఛార్జి కార్యదర్శి, వెలిగల్లు పంచాయతీ**

సమ్మె కాలానికి వేతనం చెల్లించాలి

జీవో ప్రతిని కమిషనర్ రవికి అందజేస్తున్న యూనియన్ నాయకులు

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలని గతేడాది జులై 13 నుంచి 22 వరకు కార్మికులు సమ్మె చేపట్టారని, ఈ సమ్మె కాల వేతనాన్ని వెంటనే చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) జిల్లా గౌరవాధ్యక్షుడు రామాంజులు డిమాండ్ చేశారు. సమ్మె కాల వేతనాలు కార్మికులకు చెల్లించాలని ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రతిని బుధవారం యూనియన్ నాయకులు కమిషనర్ జి.రవికి అందజేశారు. వారు మాట్లాడుతూ పురపాలికలో రోజువారీ వేతనానికి పనిచేసే కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. నాణ్యమైన పరికరాలు అందజేయాలని కోరారు. యూనియన్ నాయకులు రమణ, రాంబాబు, చెన్నయ్య, శంకరయ్య, అక్బర్ తదితరులు కమిషనర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

ప్రసాద్‌బాబును సత్కరిస్తున్న శ్రీసత్యసాయి జిల్లా తెదేపా నేతలు

పట్ర కులస్థుల సామాజిక, ఆర్థికాభివృద్ధికి కృషి

రాయచోటి, న్యూస్‌టుడే: పట్ర కులస్థుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెదేపా రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్‌బాబు తెలిపారు. పట్టణంలోని గాలివీడు రోడ్డులో ఉన్న తెదేపా కార్యాలయంలో బుధవారం శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన తెదేపా నాయకులు ఆయన్ను కలిసి సత్కరించారు. పట్ర కులస్థులను సామాజిక, ఆర్థిక, విద్య, వైద్య రంగాల్లో ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు వారి అభివృద్ధికి చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. పార్టీ, ప్రభుత్వ పరంగా సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు. బీసీసెల్ సత్యసాయి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాయుడు, తెదేపా సీనియర్ నాయకులు జిల్లా బయప్ప, ఎస్సీ సెల్ మండలి సభ్యులు సోములనాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యులు నారాయణ, రామచంద్ర, మస్తాన్‌నాయుడు, ధర్మానందం నాయుడు పాల్గొన్నారు.

21న సామాజిక తనిఖీ బహిరంగ సభ

కలికిరి, న్యూస్‌టుడే: మండలంలో 2024 ఏప్రిల్ ఒకటి నుంచి గతేడాది మార్చి నెలాఖరు వరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 14 గ్రామ పంచాయతీల్లో (గ్రామస్థాయిలో) జరిగిన అన్ని పనులకు సామాజిక తనిఖీ బృందం.. తనిఖీ నిర్వహించి గ్రామసభలు పూర్తిచేసిందని ఎంపీడీవో భానుమూర్తిరావు తెలిపారు. గ్రామ స్థాయి నివేదికలను ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారుల సమక్షంలో శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక తెలుగు పాఠశాల ఆవరణలో సామాజిక బహిరంగ సభ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఆగని ఇసుక అక్రమాలు

- దర్జాగా అనధికార వాహనాల్లో తరలింపు
- మాండవ్య నదిలో అక్రమ రవాణా
- అడ్డుకుంటే దాడులకు దిగుతున్న అక్రమార్కులు

యలకచెట్టుపల్లి వద్ద మాండవ్య నదిలో ఒట్టిపోయిన ఫిల్టర్ బావి

నంబరు ప్లేట్ లేని ట్రాక్టరులో రాయచోటికి తరలిస్తున్న ఇసుక

న్యూస్‌టుడే, రాయచోటి

నదులలో ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. . మాండవ్య నది నుంచి సుదూర ప్రాంతాలకు అనుమతి లేకుండా ఇష్టారీతిన తవ్వేసి తరలించేస్తున్నారు.. ఫలితంగా నదీ జలాలు అడుగంటుతున్నాయి.. ఉచిత పంపిణీని ఆసరాగా చేసుకుని కొందరు నదులలోని ఇసుకను భారీగా తవ్వేసి పట్టణాలకు తరలించి బహిరంగంగా విక్రయిస్తున్నారు.. నదీ పరివాహక ప్రాంతాల రైతులు అడ్డగిస్తే.. వారిపై అక్రమార్కులు దాడులకు దిగుతుండటంతో చేసేదేమీ లేక మిన్నకుంటున్నారు.. ఫలితంగా లక్షలాది రూపాయల విలువైన ఇసుక నిత్యం తరలిపోతోంది.

నియోజకవర్గాలు: రాయచోటి, పీలేరు
✦ విస్తరించిన నదులు: మాండవ్య, పింఛ, బాహుదా, పాపఘ్ని
✦ నదుల నుంచి రోజు తరలిపోతున్న ఇసుక: వేల టన్నులు
✦ తలెత్తుతున్న సమస్య: నదుల్లో అడుగంటిన భూగర్భజలాలు
✦ అక్రమ రవాణా అడ్డగింత చర్యలు: అంతంతమాత్రంగా రెవెన్యూ, మైనింగ్, రవాణా, పోలీసు అధికారులు సమన్వయంతో ఆకస్మిక దాడులు

అడిగేదెవరు..

సాధారణంగా జిల్లాలోని నదుల్లో 10-18 అడుగులకు మించి ఇసుక లోతు ఉండటం లేదు. నదీ పరివాహక ప్రాంతాలలో భూములు కలిగిన రైతులు నదుల్లో సాగునీటి కోసం ఫిల్టర్లు ఏర్పాటు చేసుకున్నారు. నదులకు ఇరువైపులా ఉన్న గ్రామాలకు తాగునీరు అందించేందుకు ప్రభుత్వం ఫిల్టర్ల ఆధారంగా తాగునీటి పథకాలు ఏర్పాటు చేసింది. నదుల్లో దర్జాగా ఇసుక తోడేయడంతో నేడు ఆ పథకాల పైపులైన్లు, ఫిల్టర్లు బయటపడి నీరు దొరకట్లేదు. దీంతో తాగు, సాగు నీటికి ఇబ్బంది తప్పడం లేదు. ఇక అక్రమార్కులు తమకున్న పలుకుబడితో నంబర్లు లేని వాహనాల్లో కళ్లెదుటే తరలిస్తున్నా అడిగే నాథుడే లేడు.

అడుగంటుతున్న జలాలు..

వేసవి సమీపిస్తుండటంతో ఎండల తీవ్రత పెరిగింది. జిల్లాలోని కరవు పీడిత ప్రాంతాలైన రాయచోటి, పీలేరు నియోజకవర్గాల్లో 80 శాతం మంది బోరు బావులపై ఆధారపడి జీవిస్తున్నారు. మాండవ్య, బాహుదా, పింఛ, పెద్దూరు నదులు ఈ ప్రాంతాల్లో విస్తరించాయి. ఎండ తీవ్రత పెరిగేకొద్దీ భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఇప్పటికే రాయచోటి ప్రాంతంలోని మాండవ్య నది విస్తరించిన రాయచోటి-వీరబల్లి మార్గంలోని యలకచెట్టుపల్లి, మట్లి, అబ్బవరం, రాయచోటి, గొర్లముదివీడు, చిన్నమండెం మండలంలోని వండాడి, మల్లూరు, కేశాపురం ప్రాంతాల్లో నదుల నుంచి ఇసుక రోజు వందలాది ట్రాక్టర్లు తరలిపోతోంది. దీంతో ఈ ప్రాంతాల్లోని ఫిల్టర్లలో నీరు అడుగంటి తాగునీటి ఎద్దడి మొదలైంది. ఇప్పటికే రాయచోటి నియోజకవర్గంలో రూ.5 కోట్లు పైబడి వెచ్చించి తాగునీటి బోర్లు వేయాల్సి వచ్చింది. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న మార్చి, ఏప్రిల్ నెలల్లో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు తప్పవని నదీ పరివాహక ప్రాంత ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇసుక అక్రమ రవాణాను నిలువరిస్తే నదుల్లో నీటి నిల్వకు అవకాశం ఉంటుందని, ఉన్నతాధికారులు ఈ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భవన ఆవరణ శుభ్రం

ఈనాడు కథనానికి స్పందన

కలిబండలోని గోపాలమిత్ర భవన ఆవరణ శుభ్రమైంది. 'ఈనాడు'లో ఈ నెల 17న 'భవనం వినియోగంలోకి వచ్చేదెన్నడో' శీర్షికన వార్త ప్రచురితమైంది. పశు సంవర్ధకశాఖ జేడీ గుణశేఖరపిళ్లై, స్థానిక వైద్యుడు భాస్కర్ ఆదేశాలతో బోడిరెడ్డిగారిపల్లె రైతు సేవా కేంద్ర పశువైద్య సహాయకులు భార్గవి.. ఈ భవన ఆవరణను శుభ్రం చేయించారు.
-న్యూస్‌టుడే, చిన్నమండెం

స్పందనకు వందనం

కాలువల్లో పూడిక తొలగింపు

కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులు కూరగాయల వ్యర్థాలను మురుగు కాలువల్లో నిర్లక్ష్యంగా పారబోస్తున్న సమస్యపై అధికారులు స్పందించారు. వాటిని తొలగింపజేశారు.
-న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ

చెత్త తరలింపు.. పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలో నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో చెత్త నిల్వలు పేరుకుపోయి దుర్వాసన వస్తున్న సమస్యపై అధికారులు స్పందించారు. ఖాళీస్థలాల్లో పేరుకుపోయిన చెత్త నిల్వలు తొలగింపజేశారు. **-న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ**

మాట్లాడుతున్న ఎన్టీఏ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరాజు

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

సంబేపల్లె, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలతో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని నేషనల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు కోరారు. శెట్టిపల్లె గ్రామ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. పట్టుదలతో చదివి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు తన సొంత నిధులతో పాఠశాలలో అభివృద్ధి పనులు చేపట్టడం హర్షణీయమన్నారు. పాఠశాల సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఎన్టీఏ జిల్లా అధ్యక్షులు నల్లమల రామాంజులు, ఎస్టీయు జిల్లా అధ్యక్షులు శివారెడ్డి, ఆర్జేయూపీ జిల్లా అధ్యక్షులు సిద్ధయ్య, ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, సీతారామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రతినిధులు

బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యం

రాయచోటి పట్టణం, న్యూస్‌టుడే: బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యంగా రెడ్స్ స్వచ్ఛంద సంస్థ నేతృత్వంలో యాక్సెస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్ కార్యక్రమాన్ని నిర్వహించాం. వంద రోజుల ప్రచార కార్యక్రమాన్ని స్వచ్ఛంద సంస్థ కడప, అన్నమయ్య, శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో నిర్వహిస్తోంది. బుధవారం చెన్నముక్కపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో సంస్థ ప్రతినిధులు విద్యార్థినులతో ముచ్చటించారు. బాల్య వివాహాలు చేయడం వల్ల ఆడపిల్లలు ఎదుర్కొనే అనారోగ్య సమస్యలు, ఇతర దుష్పరిణామాలు తెలియజేశారు. బాల్య వివాహాలు చేస్తే ఎదుర్కోవాల్సిన చట్టపర నిబంధనలపై అవగాహన కల్పించారు. హెచ్ఎం వెంకటేశ్వర్లు, సైన్సు ఉపాధ్యాయులు రవిప్రతాప్, స్వచ్ఛంద సంస్థ కౌన్సిలర్లు వాణి, భారతి, మల్లిక, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శేష వాహనంపై విహరిస్తున్న భద్రకాళీ సమేత వీరభద్రస్వామి

శేష వాహనంపై వీరభద్రుడి విహారం

వీరభద్రుడికి పూలంగి సేవ

రాయచోటి, న్యూస్‌టుడే: స్థానిక భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో బుధవారం బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాల్లో పూజలు చేపట్టారు. ప్రధాన ఆలయంలోని వీరభద్రుడు, భద్రకాళీదేవి అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు చేశారు. వేద పండితులు ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన హోమానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉదయం స్వామి, అమ్మవారు శేష వాహనంపై పురవీధుల్లో విహరించారు. మార్కెట్ వీధి, గాంధీబజార్, కంసలవీధి, బ్రాహ్మణవీధుల్లో ఊరేగింపు సాగింది. ఆలయ కమిటీ ఛైర్మన్ మనోజ్‌కుమార్, ఆలయ ఈవో వెంకటరమణారెడ్డి, స్థానిక, కన్నడ భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి పట్టువస్త్రాలు తెస్తున్న మంత్రి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి

గంగమ్మా.. మాయమ్మా..

తరలివచ్చిన చాందినీ బండ్లు.. దేదీప్యమానమైన విద్యుద్దీపాల వెలుగులు.. భక్తుల బోనాలు.. మొక్కులు తీర్చుకున్న మహిళలు.. వెరసి మండలంలోని అనంతపురం గంగమ్మ నిండు జాతర బుధవారం కనుల పండువగా సాగింది.. సమీప జిల్లాలు సహా పొరుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులతో జాతర ప్రదేశం కిటకిటలాడింది. ఎటుచూసినా జనసందోహమే. **-న్యూస్‌టుడే, రాయచోటి, లక్కిరెడ్డిపల్లి**

కేరళ వాయిద్యాల సందడి

అమ్మవారికి కల్లు సాంగ్యం తెచ్చిన భక్తులు

గృహ నిర్మాణాలు పూర్తిచేయాలి

కలికిరి, న్యూస్‌టుడే: మండలంలో నిర్దేశించిన ఇళ్ల లక్ష్యాలు పూర్తిచేయాలని ఎంపీడీవో భానుమూర్తిరావు ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఇళ్ల ప్రగతిపై బుధవారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. రెండు నెలల కిందట.. ఉగాది వరకు 396 ఇళ్ల ప్రగతి పూర్తిచేయాలని నిర్దేశించామన్నారు. అయితే 13 లేఅవుట్లలో 298 బీఎల్, 34 ఎల్ఎల్, 168 ఆర్సీ స్థాయిలో ఇళ్ల నిర్మాణాలు ఉన్నాయని.. వీటిని పూర్తిచేయాలని పలుమార్లు ఆదేశించినా లక్ష్యాన్ని పూర్తి చేయడంలో జాప్యం జరుగుతోందన్నారు. లక్ష్యాన్ని పూర్తిచేయని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. డిప్యూటీ ఎంపీడీవో వినయ్‌కుమార్, నవాజ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతోనే ఆత్మసంతృప్తి

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: సేవా కార్యక్రమాలను చేపట్టడం ద్వారా ఆత్మసంతృప్తి సాధ్యమని మొర్రం రెడ్డిరాంకుమార్‌రెడ్డి అన్నారు. సీతారాం సంస్థల అధినేత మొర్రంరెడ్డి కుమార్‌రెడ్డి వర్ధంతి పురస్కరించుకుని స్థానిక శ్రీ షిరిడీ సాయి నారాయణ సేవ అన్నదాన కేంద్రంలో బుధవారం పేదలు, వృద్ధులకు అన్నదానం చేశారు. పాలు, పండ్లు పంపిణీ చేశారు. మానవతా సంస్థ జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి, ఉపసర్పంచి కేశవరెడ్డి, శ్రీలక్ష్మీకామేశ్వరస్వామి, ఆలయ ధర్మకర్త శంకరాచారి, హబీబ్‌బాషా, గంగాభవాని అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకులు జనార్ధనస్వామి పాల్గొన్నారు.

నేడు ఛత్రపతి శివాజీ జయంతి

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు స్థానికంగా గురువారం నిర్వహించనున్నామని స్థానిక శివాజీ ఉత్సవ కమిటీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. స్థానిక నల్లవీర గంగాభవాని అమ్మవారి ఆలయం వద్ద పూజలు, తదుపరి భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. స్థానికులతో పాటు పెద్దఎత్తున యువత పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ పిలుపునిచ్చింది.

భాషలపై అవగాహన పెంచుకోవాలి

కంభంవారిపల్లి (న్యూస్‌టుడే): ప్రతి విద్యార్థి మాతృభాషతో పాటు ఇతర భాషలపై అవగాహన పెంచుకుని ప్రావీణ్యం పెంపొందించుకోవాలని ఎంఈవో రెడ్డిబాషా కోరారు. బుధవారం మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో భాషోత్సవాలు నిర్వహించారు. తిమ్మాపురం పంచాయతీ చిన్నకమ్మపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయన పాల్గొని, భాషల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. మొదటి రోజున ఆంగ్లభాషలో చిన్నచిన్న కథలను విద్యార్థులచే చెప్పించడం, క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రహంతుల్లా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువ కర్షకులు..

- అటు చదువు.. ఇటు సాగు
- ప్రత్యేక శిక్షణలో పట్టభద్రులు

కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన శిక్షణలో విద్యార్థులు

న్యూస్‌టుడే, పీలేరు గ్రామీణ

వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఎన్నో రకాలుగా చేయూత ఇస్తోంది.. విద్యార్థి స్థాయి నుంచే వారిని పంటల సాగుకు సమాయత్తం చేస్తోంది.. డిగ్రీ బీఎస్సీ(బీజడ్‌సీ) విద్యార్థులకు వ్యవసాయ రంగంలో పలు అనుబంధ విభాగాలు ఉంటాయి.. విద్యాభ్యాసం సమయానే విలువ ఆధారిత పంటల సాగు విధానం, చీడపీడల నివారణ చర్యలు, నీటి యాజమాన్యం తదితర విభాగాల్లో శిక్షణ ఇస్తున్నారు.. కలికిరి కృషి విజ్ఞాన కేంద్రంలో విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ తీసుకున్న సీఎస్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులపై కథనం.

ఉత్పత్తి పెంచడంపై అవగాహన..

సాగు చేసిన పంటల్లో ఉత్పత్తి పెంచడం, పంట నూర్పిడి పనులు, ప్రాసెసింగ్ తదితర అంశాలపై ఈ శిక్షణ కార్యక్రమంలో అవగాహన పెంచుకున్నాం. ఈ విధానంలో సుస్థిర ఆదాయ మార్గాలను ఎంచుకోవడంపై మరిన్ని మెలకువలు తెలుసుకున్నా. 30 రకాల చిరుధాన్యాలతో పొడిని తయారుచేసే విధానంపై అవగాహన పెంచుకున్నాం. తద్వారా భవిష్యత్తులో సాగుకు సునాయాసంగా సమాయత్తం కావొచ్చు. **- జబీన్‌తాజ్**

పోషకాలపై అవగాహన..

పంటలకు అత్యంత పోషకాలు అందించే సేంద్రియ ఎరువుల తయారీ, పుట్టగొడుగుల పెంపకం, సాంకేతిక పద్ధతుల్లో జపనీయులు అవలంబించే సాగు, పంట నూర్పిడి పద్ధతులపై అవగాహన పెంచుకున్నా. బిందు సేద్యం, కోళ్ల ఫారాల్లో లభించే వ్యర్థాలు సేంద్రియ ఎరువులుగా వినియోగించుకోవడంపై మెలకువలు తెలియజేశారు. **-అఫ్రీన్**

విభిన్న మొక్కల పెంపకంపై దృష్టి..

వ్యవసాయ రంగంలో గ్రీన్‌హౌస్, పాలీహౌస్‌ల ద్వారా వివిధ మొక్కల పెంపకంపై మెలకువలు తెలుసుకున్నాం. జట్రోపాట్, ఎర్రచందనం, పసుపు, చీనీ, నిమ్మ, డ్రాగన్, మామిడిలో అంటు కట్టే విధానం గురించి శిక్షకులు తెలియజేశారు. తద్వారా వాటిపై అవగాహన కలిగింది. సాంకేతిక విధానాలతో పంటలు సాగు చేస్తే మేలు. **-భార్గవి**

ప్రాసెసింగ్ చేయడం తెలిసింది..

రైతులు పండించిన పంటను లాభదాయకంగా మార్చుకునే విధానంలో ప్రాసెసింగ్ అత్యంత కీలకం. దీన్ని ఎలా చేయాలనేది శిక్షకుల నుంచి నేర్చుకున్నా. ఎంతో కష్టపడి పండించిన పంటకు నష్టాలు రాకుండా రైతులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ఇందుకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఉత్పత్తులను విక్రయించే విధానంపై అవగాహన పెంచుకున్నా. **-నిజియా**

దూడల సంరక్షణలో జాగ్రత్తలు తీసుకోవాలి: జేడీ

చిన్నమండెం : సంకర జాతి పాడి పశువుల దూడల సంరక్షణలో జాగ్రత్తలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ జేడీ కె.గుణశేఖరపిళ్లై సూచించారు. మండల పరిధిలోని దిగువగొట్టివీడు గ్రామం ముండ్లవారిపల్లెలో లేగ దూడల ప్రదర్శనను జేడీ ప్రారంభించి మాట్లాడారు. దూడలు పుట్టినప్పటి నుంచి ఆరోగ్యంగా ఎదిగేందుకు తీసుకోవాల్సిన మెలకువలు తెలిపారు. అనంతరం నిర్వహించిన ప్రదర్శనలో 60 దూడలు పాల్గొన్నాయి. వీటిలో ఆరోగ్యంగా ఎదిగిన మూడింటిని గుర్తించి మొదటి మూడు బహుమతులు పెంపకందారులకు జేడీ, డీడీ మాలకొండయ్యతో కలిసి అందజేశారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి రాజ తిమ్మారెడ్డి, చిన్నమండెం, మోటకట్ల పశువైద్యులు టి.భాస్కర్, ప్రసాద్‌నాయక్, చిన్నమండెం పశువైద్య సహాయకులు సిద్ధార్థ్ బాబు, స్థానిక నాయకులు నాగేశ్వరయ్య, రెడ్డిరామయ్య, పశు వైద్య సహాయకులు పాల్గొన్నారు.

రోడ్డుపై మట్టి.. చోదకులకు ఇబ్బంది

కలకడ నుంచి గుర్రంకొండ వెళ్లే మార్గంలో టమాటా మార్కెట్ వద్ద రోడ్డుపై మట్టి చేరడంతో వాహనచోదకులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ లోపల నుంచి రోడ్డుపైకి వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో అక్కడున్న మట్టికాస్తా రోడ్డుపైకి చేరింది. రెండు వరసల రోడ్డులో సగం రోడ్డుపై ఇలానే ఉంది. దీంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే మట్టిలోనే రాకపోకలు సాగించాలి. గుంతలు ఉండటంతో వాహన చోదకులు తిప్పలు పడుతున్నారు. **-న్యూస్‌టుడే, కలకడ**

మా ఇష్టం.. అడిగేదెవరు..?

గాలివీడులో నాలుగు వరుసల రహదారిలో డివైడర్ నిర్మించి రాకపోకలు క్రమబద్ధీకరించారు. అయితే దుకాణాలకు సరకులు మాత్రం ఇష్టారీతిన వేళాపాళా లేకుండా రోడ్డుపై వాహనాలు నిలిపివేసి సరఫరా చేస్తున్నారు. ఫలితంగా కదిరి, రాయచోటి మార్గాల్లో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. బుధ, గురువారాల్లో వారపు సంతల రోజుల్లో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. రాకపోకలకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, గాలివీడు**

ఈ అడ్డు.. తొలగించరేమీ..!

టి.పసలవాండ్లపల్లె పంచాయతీ గుట్టకిందపల్లెలో నడివీధిలో అడ్డంగా విద్యుత్తు స్తంభం ఉంది. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇతర వాహనాలు, కనీసం 108 వాహనం గ్రామంలోకి వచ్చి.. ఆపై తిరిగి వెళ్లాంటే చాలా అవస్థ పడాలి. లేదంటే ఊరు బయటనే వాహనాలు నిలిపి రోగులను చేతులపై మోసుకెళ్లాలి. రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్తు స్తంభాన్ని తొలిగించి మరోచోట ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, గుర్రంకొండ**



దాతల సహకారం.. ప్రహరీ నిర్మాణం

గుండ్లూరు తెలుగు ప్రాథమిక పాఠశాలకు ఒకవైపు ప్రహరీ లేక ఆకతాయిల బెడద ఎక్కువైంది. దీంతో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చాముండేశ్వరయ్య, గ్రామానికి చెందిన దాతలు, సహ ఉపాధ్యాయులను సంప్రదించారు. వారి సహకారంతో రూ.65 వేలు అంచనాతో పెండింగ్‌లో ఉన్న 65 అడుగుల ప్రహరీ నిర్మాణం చేపట్టారు. పనులు పూర్తికావొచ్చాయి.
- న్యూస్‌టుడే, కలికిరి

బాబోయ్.. ముక్కులు అదురుతున్నాయ్

గాలివీడు బస్టాండు సమీప పోలీస్ పెట్రోల్ బంకు నుంచి వెలువడే వృథా నీటితో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. కదిరి రోడ్డు ప్రధాన కాలువకు మురుగు నీటిని మళ్లించారు. కాలువపై బండలు ఏర్పాటు చేయకపోవడంతో వాసన వస్తోందని పాదచారులు వాపోతున్నారు. ఈ దారిలో పంచాయతీ, ఎస్బీఐ, తపాలా శాఖ కార్యాలయాలతో పాటు సలాదిమాలపల్లి, పక్కీరారెడ్డిగారిపల్లి వాసులు రాకపోకలు సాగిస్తున్నారు. పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, గాలివీడు**

(c) eenadu

మదనపల్లె
• మదనపల్లె • తంబళ్లపల్లె • పుంగనూరు

శివారు.. సమస్యలు కనరు

పుంగనూరు: రోడ్లు, కాలువలు లేని శాంతినగర్

పుంగనూరు, మదనపల్లె పట్టణం, బి.కొత్తకోట, న్యూస్‌టుడే: పంచాయతీల నుంచి పురపాలికలుగా ఎదిగినా.. పట్టణాలు విస్తరిస్తున్నా ఆ స్థాయి అభివృద్ధి పనుల విషయంలో ప్రభుత్వాలు స్పందించడం లేదనే విమర్శలున్నాయి. పురపాలికల్లో విలీనమైన గ్రామాలు, కాలనీలు, విస్తరిస్తున్న శివారు ప్రాంతాల్లో తాగునీరు, రోడ్లు, కాలువలు లేక పారిశుద్ధ్యం మెరుగుపడక ప్రజల అవస్థలు వర్ణనాతీతం. ఐదేళ్ల వైకాపా ప్రభుత్వం ఈ విస్తరణ ప్రాంతాల్లో మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించలేదు. నూతనంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ సమస్యలపై దృష్టి సారిస్తోందని ఏడాదిన్నరగా ప్రజలు ఎదురు చూస్తున్నారు.

రోడ్లు.. కాలువలు లేవు: పుంగనూరు పురపాలికలో విస్తరించిన శాంతినగర్, మంగళం కాలనీ, సూర్యానగర్, నక్కబండ, హిదాయత్ నగర్, డిగ్రీ కళాశాల వెనుక, ఎన్జీవో కాలనీ, ఆర్‌ఆర్ కాలనీలో పలు వీధులు.. రోడ్లు, కాలువలకు నోచుకోలేదు. కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు నెలకొన్నాయి. పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు ఇళ్లు నిర్మించుకుని నివాసాలు ఏర్పరచుకుంటున్నారు. పురపాలికల్లో నిధుల కొరత, విస్తరణ ప్రాంతాల్లో పన్నుల చెల్లింపులు సక్రమంగా లేకపోవడంతో మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించడం లేదు.

మదనపల్లెలో..

మదనపల్లె పట్టణ పరిధిలోని వాల్మీకినగర్, మంజునాథకాలనీ, జండామాను ప్రాంతం, జగనన్న కాలనీ తదితర విస్తరణ ప్రాంతాల్లో తాగునీరు, రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

బి.కొత్తకోటలో ఎన్నికలు నిర్వహించక..

బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలో రోడ్లు, కాలువలు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఇక్కడ ఎన్నికలు నిర్వహించకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులు ఆపేయగా, అమృత్ పథకం అమలులోనూ జాప్యం జరుగుతోంది. విస్తరణ ప్రాంతాలే కాదు ప్రధాన వీధుల్లోనూ రోడ్లు, కాలువలు నిర్మించాలి.

సమగ్రాభివృద్ధికి ప్రతిపాదనలు

పట్టణంలో విస్తరించిన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు చేపడతాం.

- మధుసూదనరెడ్డి, ప్రమీల, రమాదేవి, కమిషనర్లు, పుంగనూరు, మదనపల్లె, బి.కొత్తకోట

కంకర పరిచారు.. తారు మరిచారు

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: తుమ్మరకుంట పంచాయతీలోని టి.సదుం రోడ్డు నుంచి రామలింగేశ్వర ఆలయం వరకు రోడ్డుపై కంకర పరిచి, తారు వేయడాన్ని మరచి వదిలేశారు. గత వైకాపా ప్రభుత్వం 1.25 కిలోమీటర్ల రోడ్డును మంజూరు చేసింది. రూ.కోటి వ్యయంతో గుత్తేదారు ఏడాది క్రితం రోడ్డుకు కంకర పరచి తారు వేయకుండా వదిలేశారు. సమస్యను ఇన్‌ఛార్జి ఏఈ రాజేంద్ర దృష్టికి తీసుకెళ్లగా, కొత్తగా నిల్చిపోయిన పనుల మరమ్మతుకు రూ.1.40 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదన పంపామని తెలిపారు.

సూచిక.. కనపడక..

పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని మేలుపట్ల బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన సూచిక బోర్డు ఒరిగిపోయింది. వాహన చోదకులు ఇక్కడ ప్రమాదకర పరిస్థితిని గుర్తించేలా దీన్ని ఏర్పాటు చేశారు. నిర్వహణ లోపంతో బోర్డు ఒరిగిపోవడంతో పాటు ముళ్లపొదలు అల్లుకోవడంతో వాహనదారులకు ప్రయోజనం చేకూరడం లేదు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక

విద్యార్థి సుశాంత్‌తో ఉపాధ్యాయులు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగరాజు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు మదనపల్లె ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి సుశాంత్ ఎంపికైనట్లు పాఠశాల ఛైర్‌పర్సన్ అమృత, శ్రీదేవి తెలిపారు. ఈ నెల 17న స్థానిక విజయభారతి పాఠశాలలో జరిగిన అండర్-15 విభాగ పోటీల్లో పాఠశాల విద్యార్థి ప్రథమ స్థానంలో నిలిచినట్లు వెల్లడించారు. ఈ నెల 21, 22 తేదీల్లో తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థిని ప్రిన్సిపల్ షహనాజ్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగరాజు అభినందించారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే

మంత్రి లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: అసెంబ్లీ సమావేశాలకు హాజరైన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మంత్రి లోకేశ్‌ను కలిశారు. మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛమిచ్చి మదనపల్లెలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వెంట ఆయన తనయుడు జునేద్‌అక్బరీ ఉన్నారు.

చెక్ బుక్ దారిపోయింది

పుంగనూరు పట్టణంలో జ్ఞానేంద్ర కుమార్ అను నేను ఉంటున్నాను. నాకు ఎస్.బి.ఐ బ్యాంకులో 32034755604 నెంబర్ గల అకౌంట్ ఉంది. ఈ నెంబర్‌కు 352606 నెంబర్ నుండి 352629 వరకు చెక్ బుక్ ఉంది. నా చెక్ బుక్ బ్యాంకు పరిసర ప్రాంతాలలో దారిపోయింది. ఈ చెక్ బుక్ ఎవరికైనా దొరికిన యెడల ఎస్.బి.ఐ బ్యాంక్ పుంగనూరు శాఖ వారికి ఇవ్వవలసిందిగా కోరుతున్నాను.

జ్ఞానేంద్ర కుమార్, పుంగనూరు.
9966407143

మేమున్నాం.. మీకు తోడుగా.. మదనపల్లె పట్టణం: 80085 74611 తంబళ్లపల్లె: 94416 29636 పుంగనూరు: 80085 74622 (10 AM TO 1 PM)

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: ? విసనకర్రవాండ్లపల్లె మసీదు వీధిలో దీపాలు వెలగడం లేదు. **- మురళి, స్థానికుడు** ● రెండు రోజుల్లో దీపాలు బాగుచేస్తాం. **- రంగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి**

? పీటీఎం కోటవీధిలో మురుగు కాలువలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. **- సురేష్, కోటవీధి** ● చర్యలు చేపడతాం. **- నరేష్, పంచాయతీ కార్యదర్శి**

పుంగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ? మంగళం గ్రామంలోని వీధుల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. **- స్వామి, మంగళం** ● మురుగు కాలువలను శుభ్రం చేసి సమస్య పరిష్కరిస్తాం. **- మహేష్, పంచాయతీ కార్యదర్శి**

పుంగనూరు, న్యూస్‌టుడే: ? భగత్‌సింగ్ కాలనీ విస్తరణ ప్రాంతంలో నాలుగు చోట్ల వీధిదీపాలు వెలగడం లేదు. వృద్ధులు, పిల్లలు చీకట్లో ఇబ్బంది పడుతున్నారు. **- రహ్మత్, భగత్‌సింగ్ కాలనీ** ● దీపాలు బాగు చేయిస్తాం. **- మహేష్, డీఈఈ**

పైప్‌లైన్లకు మరమ్మతులు

స్పందనకు వందనం

సోమల, న్యూస్‌టుడే: పొదలకుంటపల్లె పంచాయతీ తుగడంవారిపల్లె ప్రాథమిక పాఠశాల సమీపంలో మరమ్మతుకు గురైన పైప్‌లైన్‌ను బాగు చేశారు. దీనిపై ఈ నెల 12న 'ఈనాడు'లో కథనం ప్రచురితం కావడంతో పంచాయతీ కార్యదర్శి ఫయాజ్ స్పందించారు. ● 81.ఉప్పరపల్లె పంచాయతీ గురికానివారిపల్లెలో ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి జయశంకర్ కొత్త పైపులైన్ వేసేందుకు చొరవ తీసుకున్నారు.

వైభవంగా తిరునాళ్ల

పుంగనూరు, న్యూస్‌టుడే: నెక్కొంది పంచాయతీలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయ తిరునాళ్లలో భాగంగా బుధవారం దోపోత్సవం వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ప్రసన్న పార్వతీదేవి, అగస్త్యేశ్వరస్వామి దోపోత్సవంలో నియోజకవర్గ తెదేపా నాయకుడు మధుసూదననాయుడు, నాయకులు మధురాయల్, శ్రీనివాసులనాయుడు (ఏఎంసీ ఛైర్మన్), సుబ్రమణ్యంరాజు, లక్ష్మణరాజు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

ఆస్తుల పరిరక్షణ అధికారుల బాధ్యత

చౌడేపల్లె: పంచాయతీ ఆస్తుల పరిరక్షణ రెవెన్యూ, పంచాయతీ అధికారుల బాధ్యత అని ఎంపీడీవో లీలామాధవి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ ఆస్తుల పరిరక్షణపై అధికారులతో సమీక్షించారు.

ప్రభుత్వ భూమిలోకి ప్రవేశించొద్దు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: కాటిపేరి రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్లు 1, 2, 3, 40, 67లో 198.89 ఎకరాల ప్రభుత్వ భూమిలోకి ఎవరూ ప్రవేశించరాదని రెవెన్యూ అధికారులు బుధవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. గతంలో ఈ స్థలం సీజేఎఫ్ భూములనే విషయాన్ని రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

మట్టి తవ్వుతున్న యంత్రం

గట్టుక్కు..!

యంత్రాలతో అక్రమంగా మట్టి తరలింపు

సోమల, న్యూస్‌టుడే: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ మేటిమంద సమీపంలోని తేనిరాతిగట్టును అక్రమంగా యంత్రాలతో తవ్వి మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. 20 ఏళ్ల కిందట నీటిపారుదలశాఖ నిధులతో ఏర్పాటు చేసిన కొత్తకుంటను గట్టు నుంచి మట్టిని ఓ రైతు తరలించి పూడ్చుకుంటూ వస్తున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. గట్టు అవతలివైపు వెళ్లేందుకు దారిలేకుండా చేయడంతో పంటలు సాగుచేయలేక వదిలేశామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యంత్రాలు సీజ్ చేస్తాం: విషయం తెలిసి ఆర్ఐ సుబుక్తుల్లా, వీఆర్వో శ్రీనివాసులును ఘటన స్థలానికి పంపాం. మట్టి తవ్వే యంత్రాలను సీజ్ చేసి రైతుపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. **- మధుసూదన్, తహసీల్దార్, సోమల**

పొలాలపై ఒంటరి ఏనుగు దాడి

కల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని పాళెం పంచాయతీ జూపల్లెవారిపల్లె, కోటపల్లెకు చెందిన వెంకట్రామయ్య, బాబునాయుడు, జైపాల్, రవి, మోహన్ రైతుల మామిడి తోటల్లో మామిడి కొమ్మలను ఒంటరి ఏనుగు విరిచేసి నానాబీభత్సం చేసింది.

కృత్రిమ మేధపై అవగాహన పెంచుకోవాలి

మదనపల్లె విద్య: విద్యార్థులు కృత్రిమ మేధస్సుపై అవగాహన పెంచుకోవాలని బెంగళూరుకు చెందిన ఎల్‌అండ్‌టీఐ కంపెనీ ప్రాజెక్టు లీడ్ బావాజీ దొరగింటి అన్నారు. బుధవారం మిట్స్ డీమ్డ్ టుబీ విశ్వవిద్యాలయంలో నూతన ఆవిష్కరణల మోడల్స్‌పై నిర్వహించిన ప్రోటోథాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.

వ్యవస్థాపకతపై..

మదనపల్లె విద్య: వ్యవస్థాపకతపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి, హైదరాబాద్‌కు చెందిన సీఐటీడీ సభ్యులు కేవీఎస్ కల్యాణ్ కుమార్, బెంగళూరుకు చెందిన క్యాంబియర్ ఇంక్యుబేటర్స్ మేనేజర్ అరుణ్‌సింగ్ తెలిపారు. బుధవారం కళాశాలలో వ్యవస్థాపకతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు.

వెండి దొంగల అరెస్టు

నంద్యాల నేరవిభాగం: నంద్యాల పట్టణంలో ఈనెల 12న స్థానిక బంగారు దుకాణంలో వెండి పట్టీలను చోరీ చేసిన ఇద్దరు మహిళలను అరెస్టు చేసి వారి వద్ద ఉన్న 17 తులాల వెండిని స్వాధీనం చేసుకున్నట్లు ఒకటో పట్టణ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లా బోయపల్లికి చెందిన వేముల జ్యోతి, వేముల నరసమ్మ అనే మహిళలు వెండి పట్టీలు కొనేందుకు వచ్చి అపహరించుకెళ్లినట్లు సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. ఆర్టీసీ బస్టాండ్ దగ్గర అనుమానాస్పదంగా తిరుగుతున్న వేముల జ్యోతి, నరసమ్మలను అదుపులోకి తీసుకోగా వారి వద్ద ఉన్న వెండిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. వీరిపై గతంలో నెల్లూరు, తిరుపతి ప్రాంతాల్లో కేసులు నమోదైనట్లు తెలిపారు.

ప్రభుత్వ లక్ష్యాలు పూర్తి చేయండి

ములకలచెరువు, న్యూస్‌టుడే: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలతో పాటు సర్వేలు త్వరితగతిన పూర్తి చేయాలని డ్వామా పీడీ వెంకటరత్నం సూచించారు. బుధవారం ములకలచెరువు సీఎల్‌ఆర్సీ భవనంలో తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల అధికారులతో వెనుకబడిన శాఖలపై సమీక్షించారు. కార్యక్రమంలో నియోజకవర్గ యంగ్ ప్రొఫెషనల్ రెడ్డెప్ప, ఎంఈవో వెంకటరమణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అందుబాటులో 4,412 టన్నుల యూరియా

మదనపల్లె పట్టణం: రబీ సాగుకు అవసరమయ్యే 4,412 టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉందని జిల్లా వ్యవసాయాధికారి శివన్నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. రాబోయే 21 రోజులకు 3,006 టన్నులు అవసరం కాగా.. కొరత రాకుండా ముందుజాగ్రత్తలు తీసుకున్నామన్నారు. యూరియాను కోఆపరేటివ్ సొసైటీలు, ఆర్ఎస్‌కేలు, మార్క్‌ఫెడ్ గోదాముల్లో నిల్వ ఉంచినట్లు తెలిపారు.

తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న గ్రామ రెవెన్యూ ఉద్యోగులు

పని ఒత్తిడి తగ్గించండి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: పని ఒత్తిడి తగ్గించాలని ఏపీ వీఆర్వోల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు నారాయణ డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ఏపీ వీఆర్వోల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ, సర్వే అధికారులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ఒత్తిడితో అనారోగ్యానికి గురవుతున్నారని, రెవెన్యూతోపాటు పలు సర్వేలు, అదనపు విధులు కేటాయిస్తుండటంతో సర్వర్ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దారు కిషోర్‌కుమార్‌కు అర్జీ సమర్పించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి ప్రవీణ్, ఉపాధ్యక్షుడు మహేశ్, నాయకులు సంధ్య, సౌజన్య, కల్యాణి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు

తంబళ్లపల్లె, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: తంబళ్లపల్లె మండలంలో తాగునీటి సమస్యల పరిష్కారానికి నిధుల సమస్య లేదని జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు తెలిపారు. బుధవారం ఆయన తంబళ్లపల్లె మండల కార్యాలయంలో డీఎల్‌డీవో అమరనాథ్‌రెడ్డితో కలిసి అధికారులతో సమీక్షించారు. * బి.కొత్తకోట, పీటీఎం మండల కార్యాలయాలను జడ్పీ సీఈవో రవికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బూర్లపల్లి, కందుకూరులో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. పట్టెంవాండ్లపల్లి, తుమ్మరకుంట పంచాయతీల్లో చెత్త ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కందుకూరు, పీటీఎం పంచాయతీలకు అప్పజెప్పాలన్నారు. బూర్లపల్లి పంచాయతీలో తొమ్మిది నెలలుగా పింఛను మిగులు సొమ్ము రూ.2 లక్షల వరకు పంచాయతీ కార్యదర్శి జమ చేయకుండా ఉపాధ్యాయ ఉద్యోగం రావడంతో వెళ్లిపోయారని సీఈవో దృష్టికి తీసుకెళ్లారు.

హత్యాచారాలు అరికట్టాలి

కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న సీపీఎం, అనుబంధ ప్రజాసంఘాల నాయకులు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: చిన్నారులు, మహిళలపై జరుగుతున్న హత్యాచారాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట హత్యాచారానికి గురైన బాలికకు కొవ్వొత్తులు ప్రదర్శించి నివాళి అర్పించారు. ప్రజాసంఘాల నాయకులు హరేంద్రశర్మ, భాస్కర్, మధురవాణి, గంగా, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నెలఖారులోగా పన్నుల వసూలుకు కృషి

ములకలచెరువు, న్యూస్‌టుడే: నెలఖారులోగా ఇంటి పన్నులతో పాటు ఇతర పన్నులు వసూలు చేయాలని డివిజనల్ డెవలప్‌మెంట్ అభివృద్ధి అధికారి (డీఎల్‌డీవో) అమరనాథ్‌రెడ్డి సూచించారు. బుధవారం ములకలచెరువు ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. డివిజన్‌లో రూ.6.30 కోట్లకు రూ.3.56 కోట్ల పన్నులు మాత్రమే వసూలు చేశారన్నారు. ఏకీకృత కుటుంబ సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రోజూ 13,691 కుటుంబాలను సర్వే చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో హరినారాయణ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై విచారణ

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: బి.కొత్తకోట శివార్లలోని దేవాదాయశాఖకు చెందిన భూమి నుంచి గతంలో ఇసుక అక్రమంగా తరలించిన వ్యవహారంపై తహసీల్దారు ఎ.బావాజాన్ బుధవారం విచారణ చేపట్టారు. ఇసుక తరలింపుతో గోతులమయమైన దేవాదాయశాఖ భూమిని పరిరక్షించాలని తెదేపా నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు సురేంద్రబాబు సీఎం చంద్రబాబుకు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో తహసీల్దారు ఆలేరువాగుతో పాటు దేవాదాయశాఖ భూమిని పరిశీలించారు.

కార్యకర్తల కష్టసుఖాల్లో తెదేపా అండ

నివాళి అర్పిస్తున్న చినబాబు తదితరులు

రామసముద్రం, న్యూస్‌టుడే: తెదేపా కార్యకర్తల కష్టసుఖాల్లో భాగస్వాములుగా ఉంటామని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు అన్నారు. రామసముద్రం మండలం పూలకుంట్లపల్లెలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎలకపల్లె తెదేపా బూత్‌కన్వీనర్ శ్రీనివాసులు చిత్రపటానికి బుధవారం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. శ్రీనివాసులు జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ప్రారంభించారు. తెదేపా మండల నాయకులు చలపతినాయుడు, కదిరప్ప, వెంకటరమణనాయుడు పాల్గొన్నారు.

గొర్రెల కాపరి ఆత్మహత్యాయత్నం

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: కాట్నగల్లు పంచాయతీ కాకిమారిపల్లికి చెందిన గొర్రెల కాపరి శ్రీనివాసులు(40) గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. బుధవారం గొర్రెలు మేపడానికి వెళ్లగా మందలోని కొన్ని జీవాలు తప్పిపోవడంతో శ్రీనివాసులు మనస్తాపం చెందాడు. ఈ నేపథ్యంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. బాధితుడిని బి.కొత్తకోట ఆసుపత్రికి తరలించారు.



వేమూరు రైల్వేస్టేషన్లో గూడ్స్ ప్లాట్‌ఫాం

నిర్మాణ పనులకు రూ.10.4 కోట్లు మంజూరు

వేమూరు రైల్వే స్థలంలో సర్వే చేస్తున్న సిబ్బంది

న్యూస్‌టుడే, చుండూరు (వేమూరు)

వేమూరు రైల్వే స్టేషన్‌లో గూడ్స్ ప్లాట్‌ఫాం నిర్మాణానికి ఎట్టకేలకు ముందడుగు పడుతోంది. ఈ ప్రాంత రైతులు ధాన్యం, మొక్కజొన్న, తెల్లజొన్న తదితర పంటల్ని తెనాలి, గుంటూరు ప్రాంతాలకు తరలించి వ్యాపారులకు విక్రయించాల్సి వస్తోంది. ఈ కారణంగా రవాణా ఖర్చులతోపాటు భారీ వాహనాలు అందుబాటులో లేక అవస్థలు పడుతున్నారు. వేమూరులో గూడ్స్ ప్లాట్‌ఫాం ఉంటే వ్యయప్రయాసలు తగ్గుతాయని రైతులు, వ్యాపారులు రైల్వే శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

టెండర్ ప్రక్రియ పూర్తి .. గూడ్స్ ప్లాట్‌ఫాం నిర్మాణానికి రైల్వే శాఖ రూ.10.4 కోట్లు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తయింది. పనులు ప్రారంభించడానికి ప్రస్తుతం భూ సర్వే చేస్తున్నారు. ప్లాట్‌ఫాంపై భారీ వాహనాలు తిరగడానికి, లోడింగ్, అన్‌లోడింగ్ చేసుకోవడానికి అనువుగా నిర్మాణం చేపట్టనున్నారు.

రైతులకు మేలు.. వేమూరు నియోజకవర్గంలో 94 వేల ఎకరాల సాగు భూమి ఉంది. ఖరీఫ్‌లో వరి, రబీలో మొక్కజొన్న, తెల్లజొన్న, మినుము, పెసర పంటలు పండిస్తారు. స్థానికంగా గూడ్స్ ప్లాట్‌ఫాం లేనందున పండించిన పంటలను అమ్ముకోవడానికి పట్టణాలకు తరలించాల్సి వస్తోంది. అంతేకాదు ఎరువుల దిగుమతులకు అవకాశం లేనందున వాటిని పట్టణ ప్రాంతాల్లో అన్‌లోడ్ చేసి లారీల ద్వారా ఇక్కడికి పంపుతున్నారు. ప్లాట్‌ఫాం పనులు పూర్తయితే రైతులకు సౌకర్యంగా ఉంటుంది.

ఏసీబీ వలలో ఎనర్జీ అసిస్టెంట్

పట్టుబడిన నాగేంద్రబాబు (టీషర్టు ధరించిన వ్యక్తి)

నకరికల్లు, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖలో ఎనర్జీ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నక్కబోయిన నాగేంద్రబాబు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఓ రైతు నుంచి సొమ్ము తీసుకుంటుండగా అధికారులు మాటువేసి పట్టుకున్నారు. వివరాలిలా.. నకరికల్లు మండలం చేజర్ల గ్రామంలో నాగేంద్రబాబు ఎనర్జీ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన రైతు గుండాల యోహాన్ తన పొలంలోని బోరుకు విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు చేయాలని కోరగా.. ఈఏ రూ.70 వేలు లంచం డిమాండు చేశారు. అలాగే అతని తీరుతో రైతు విసిగిపోయారు. చివరికి విజయవాడ ఏసీబీ అధికారులను సంప్రదించగా వారు నిఘా పెట్టారు. ఈ క్రమంలో రైతు బుధవారం మధ్యాహ్నం ఎనర్జీ అసిస్టెంట్‌కు రూ.70 వేలు ఇచ్చేందుకు వెళ్లారు. డబ్బు తన తండ్రికి ఇవ్వాలని అతను కోరగా రైతు అప్పగించారు. అప్పటికే మాటు వేసిన ఏసీబీ అధికారులు మెరుపుదాడి చేసి పట్టుకున్నారు. దాడిలో ఏసీబీ ఎస్పీ మత్తె మహీంద్ర తదితరులు పాల్గొన్నారు.

వరి.. ధరల సిరి

75 కిలోల బస్తా వెల రూ.1900

అన్నదాతల మోముల్లో ఆనందం

మార్కెట్లో వరి ధాన్యం ధర పెరిగింది. డెల్టాలో ఇంకా లక్ష ఎకరాల్లో పండించిన వరి కుప్పలున్నాయి. ఇప్పటికే నూర్పి ధాన్యాన్ని గోదాముల్లో నిల్వ చేసిన రైతులు ధర పెరగడంతో విక్రయిస్తున్నారు. పాత ధాన్యం ధరల్లోనూ కదలిక వచ్చింది.

న్యూస్‌టుడే, బాపట్ల

ప్రభుత్వం పౌరసరఫరాల సంస్థ ద్వారా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతుల నుంచి 1.63 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. ఇప్పటి వరకు 25,600 మందికి రూ.377 కోట్లు చెల్లించింది. ఆర్ఎస్‌కేల్లో ధాన్యం విక్రయించిన 8 గంటల్లో అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశారు. నూర్పిడుల ఆరంభంలో గత డిసెంబర్లో మార్కెట్లో 75 కిలోల బస్తాకు రూ.1450 నుంచి రూ.1550 మాత్రమే లభించింది. కనీస మద్దతు ధర కన్నా రూ.200 - 300 తక్కువకు వ్యాపారులు కొనుగోలు చేస్తుండటంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించారు. సంక్రాంతి తర్వాత నుంచి మార్కెట్లో క్రమేపీ ధాన్యం ధర పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం ఎంఎస్‌పీని దాటేసింది. వ్యాపారులు బస్తాకు రూ.1850 నుంచి రూ.1900 వరకు చెల్లించి కొత్త ధాన్యం కొంటున్నారు.

'ఏ' గ్రేడ్ ధాన్యం బస్తా కనీస మద్దతు ధర: రూ.1792

సాధారణ రకం.. : రూ.1775

ఆర్ఎస్‌కేల్లో తగ్గిన విక్రయాలు .. ప్రైవేటు వ్యాపారులు ఎక్కువ ధర చెల్లిస్తుండటంతో రైతులు వారికే ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు నడుపుతున్న ఆర్ఎస్‌కేల్లో ధాన్యం విక్రయాలు తగ్గిపోయాయి. ప్రస్తుతం సేకరణ నెమ్మదించింది. జిల్లాలో రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. దీన్ని చేరుకోవడానికి రైతుల నుంచి ఇంకా 37 వేల మెట్రిక్ టన్నులు సేకరించాల్సి ఉంది. ప్రభుత్వం పెద్దఎత్తున సేకరించడం, వ్యాపారులు పోటీపడి కొనడంతో ధాన్యం ధరలు పెరిగాయని మార్కెటింగ్ నిపుణులు అంటున్నారు.

మార్చి ఆఖరు వరకు కొనుగోళ్లు

అపరాలు సాగు చేసిన రైతులు వరి కుప్పలు నూర్చలేదు. మార్చి మొదటి వారం నుంచి అపరాల నూర్పిళ్లు ప్రారంభిస్తారు. ఆ తర్వాత వరి కుప్పలు నూర్పిడి చేయనున్నారు. అప్పటిలోగా మార్కెట్లో బస్తా ధర రూ.2 వేలకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. రెండు నెలల కిందట పాత ధాన్యం బస్తా ధర రూ.1800కు పడిపోయింది. ప్రస్తుతం రూ.2200 పలుకుతోంది. రానున్న రోజుల్లో ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లు మార్చి నెలాఖరు వరకు చేపట్టనుంది. రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యాన్ని చేరుకుంటామని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి తెలిపారు.

పంట పండినా.. తరలించేదెలా?

న్యూస్‌టుడే, బాపట్ల

అప్పికట్లలో పొలాలకు వెళ్లే రోడ్డు ఇలా..

పంట భూములకు వెళ్లే లింకు రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. పంట పండించడం.. పొలాల నుంచి ధాన్యం బస్తాలను ట్రాక్టర్లలో రైస్‌మిల్లులు, కొనుగోలు కేంద్రాలకు తరలించడానికి అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులు రబీలో సాగు చేసిన అపరాలు, వరి, మొక్కజొన్న, జొన్న, శనగ తదితర పంట నూర్పిడులు మరో నెల రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో అధ్వానంగా ఉన్న లింకు రహదారులకు ఉపాధి హామీ, మార్కెటింగ్ శాఖ నిధులు కలిపి అత్యవసరంగా మరమ్మతులు చేయాలని సాగుదారులు కోరుతున్నారు.

రైతులు పండించిన ధాన్యానికి సెస్ రూపంలో ఒక శాతం వ్యవసాయ మార్కెట్ కమిటీలు వసూలు చేస్తున్నాయి. మార్కెటింగ్ శాఖకు సెస్ ద్వారా ఏటా రూ.30 కోట్ల ఆదాయం వస్తోంది. ఈ నిధులను వ్యవసాయ రంగం, రైతు సంక్షేమానికి వినియోగించటం లేదు. పంట భూములకు వెళ్లే వందల లింకురోడ్లు అధ్వానంగా ఉన్నాయి. కొన్నిచోట్ల కోతకు గురై గోతులు పడి కుంగిపోయాయి. ఆటోలు, ట్రాక్టర్లలో ఎరువులను పొలాలకు తరలించడానికి సాగుదారులు అవస్థలు పడ్డారు. రూ.కోట్ల ఆదాయం వచ్చినా లింకు రహదారుల నిర్మాణానికి వినియోగించడంలేదు. కనీసం మరమ్మతులు చేయడం లేదు.

రైతుల ఇబ్బందులు.. ప్రధానంగా కృష్ణా పశ్చిమ డెల్టాలో నల్లరేగడి నేలలున్న వేమూరు, రేపల్లె, బాపట్ల, చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లో లింకు రోడ్లు దారుణంగా ఉన్నాయి. పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. వర్షం కురిస్తే ట్రాక్టర్లు వెళ్లలేని దుస్థితి. లారీలు, ట్రాక్టర్లలో పంట, ఆక్వా ఉత్పత్తులు రవాణా చేయడానికి లింకు రహదారులు ఏ మాత్రం అనుకూలంగా లేవు. ట్రాక్టర్లు వెళ్తే గోతుల్లో కూరుకుపోయే పరిస్థితి ఉంది. రైతులు వాటాలు వేసుకుని కొన్నిచోట్ల తాత్కాలికంగా మరమ్మతులు చేయించుకుంటున్నారు.

అత్యవసర మరమ్మతులు చేపడితేనే..

మార్కెట్ సెస్, ఉపాధి నిధులు కలిపి లింకు రోడ్లకు అత్యవసర మరమ్మతులు చేపట్టాలని.. గ్రావెల్, మెటల్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఎంపీ, ఎమ్మెల్యేలను రైతులు కోరుతున్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మార్కెటింగ్ శాఖ నుంచి నిధులు కేటాయించేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మార్కెటింగ్ శాఖ ఏడీ రమేష్‌బాబు మాట్లాడుతూ లింకు రోడ్ల నిర్మాణం, మరమ్మతులపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే ప్రతిపాదనలు రూపొందించి పంపిస్తామని తెలిపారు.

భక్తి మార్గం.. సేవా పథం

నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: మానవ సేవకు ప్రేరణనిచ్చే పవిత్ర మాసం రంజాన్. మిగిలిన పండగలతో పోల్చితే రంజాన్‌కు విశిష్టత ఉంది. గురువారం నుంచి రంజాన్ మాసం ప్రారంభమవుతుంది. తెల్లవారుజామునే ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలు చేపట్టనున్నారు. రంజాన్‌ను అరబ్బీలో రమ్జ్ అంటారు. రమ్జ్ అంటే కాల్చడం అని అర్థం. నెల రోజుల ఉపవాస దీక్షలో శరీరాన్ని శుష్కింపజేయడం ద్వారా ఆత్మ ప్రక్షాళన అవుతుందని నమ్మకం. రోజులో సుమారు 14.30 గంటలపాటు కనీసం గుక్కెడు నీళ్లు కూడా తాగకుండా నెల రోజులు కఠోర ఉపవాస దీక్ష చేపడతారు.

వీరికి మినహాయింపు.. బాలింతలు, నెలసరి మహిళలు, గర్భిణులు, మానసిక దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడేవారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఉపవాసం నుంచి మినహాయింపు ఉంది.

జకాత్, ఫిత్రా.. దానం చేయదగిన స్థితిలో ఉన్న ప్రతి ముస్లిం తన సంపాదనలో 2.5 శాతం పేదవారికి తప్పనిసరిగా పంచడాన్ని జకాత్ అంటారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి పండు వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ తమ పేరిట 1,750 గ్రాముల గోధుమలు లేదా దానికి సరిపడా నగదు ఫిత్రాగా దానం చేయాలి. ఉపవాసం ఉన్న వారికి ఒక గ్లాసు మంచి నీరు తాగించినా ఎంతో పుణ్యమని ముహమ్మద్ ప్రవక్త(సఅస) హదీసుల్లో పేర్కొన్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

22 నుంచి పురపాలికల్లో 'ఆనంద లహరి' అమలు

న్యూస్‌టుడే, బాపట్ల, రేపల్లె అర్బన్

గత తెదేపా ప్రభుత్వ పాలనలో నగర, పట్టణ ప్రాంత ప్రజలకు ఆరోగ్యం, ఆహ్లాదం పంచడానికి 'ఆనంద లహరి' అమలు చేశారు. అప్పట్లో ఈ కార్యక్రమానికి బాపట్ల, చీరాల, రేపల్లె పుర ప్రజల నుంచి మంచి ఆదరణ లభించింది. 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆనంద లహరిని నిలిపేసింది. తాజాగా కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని పునరుద్ధరిస్తూ ఈ నెల 22 నుంచి నగర, పురపాలక సంఘాల్లో ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రతినెలా రెండు, నాలుగో ఆదివారాల్లో ఉదయం 6 నుంచి 10 గంటల వరకు నిర్వహించనున్నారు.

జిల్లా కేంద్రం బాపట్లలో గత రెండు నెలల నుంచే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు చిన్నారులు, కళాకారులతో సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటుచేస్తున్నారు. ఇక నుంచి అన్ని పురపాలికల్లో ప్రారంభిస్తున్నారు. కార్యక్రమ సమయాన్ని మార్చారు. ఎక్కువ మంది భాగస్వామ్యం ఉండేలా ఉదయం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఒత్తిడి లేని జీవనశైలి.. హ్యాపీ సండేలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. తదనుగుణంగా అధికారులు అనువైన ప్రాంతాల్ని ఎంపిక చేస్తున్నారు. పట్టణ ప్రజల ఆనందం, జీవన ప్రమాణాలు, ఒత్తిడిలేని జీవనశైలి పెంపొందించేందుకు కార్యక్రమం దోహదపడనుంది. ఎక్కువ మంది పిల్లలు, యువత, మహిళలు, వృద్ధులు పాలుపంచుకునేలా రూపొందిస్తున్నారు.

వివిధ రకాల పోటీలు.. ఆనంద ఆదివారాల్లో సంగీతం, నృత్యం, కళాప్రదర్శనలు, తేలికపాటి వ్యాయామాలు చేసేలా ప్రోత్సహించనున్నారు. యోగా, ధ్యానం, నడక, సైక్లింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. విద్యార్థులకు ఆటలు, చిత్రలేఖనం, కథలు, వివిధ రకాల పోటీలు ఏర్పాటు చేస్తారు. రోడ్ల పక్కన కాలనీల్లోని రిజర్వుడ్ స్థలాల్లో మొక్కలు నాటడం, పరిసరాల శుభ్రత, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం సహకారంతో హ్యాపీ సండేను విజయవంతం చేస్తామని, కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ప్రత్యేక అధికారుల్ని నియమించామని బాపట్ల, రేపల్లె మున్సిపల్ కమిషనర్లు రఘునాథరెడ్డి, సాంబశివరావు తెలిపారు.

కనీస మద్దతు ధరకు అపరాల కొనుగోలు



మాట్లాడుతున్న జేసీ భావన

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లా రైతులు రబీ సీజన్‌లో పండించిన అపరాల పంటల్ని మార్క్‌ఫెడ్ ద్వారా కనీస మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని జేసీ భావన తెలిపారు. కలెక్టరేట్లో బుధవారం ఆమె మాట్లాడుతూ ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నామన్నారు. క్వింటా శనగలకు రూ.5,875, మినుములకు రూ.7800, పెసలకు రూ.8,768 చొప్పున కనీస మద్దతు ధర చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ-క్రాప్‌లో ఇప్పటికే పంట నమోదు చేసుకున్న రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అపరాలు విక్రయించడానికి సమీపంలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి సీఎం యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

సిబ్బంది లేక ఇబ్బంది

మందకొడిగా రెండో విడత భూసమీకరణ

రాజధాని అమరావతి మహానగర విస్తరణకు రెండో విడత చేపట్టిన భూసమీకరణకు ప్రక్రియకు సిబ్బంది కొరత అడ్డంకిగా మారింది. ఇప్పటికే ఏడు గ్రామాల పరిధిలో 8 సీఆర్డీఏ కాంపిటెంట్ అథారిటీ యూనిట్ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. కర్లపూడి, యండ్రాయి, పెదమద్దూరు, వడ్డమాను గ్రామాల్లో భూసమీకరణ ప్రకటన ఇచ్చిన అధికారులు.. రైతుల నుంచి భూములు సమీకరిస్తున్నారు. వైకుంఠపురం, పెదపరిమి, హరిశ్చంద్రపురం గ్రామాల్లో ప్రకటన ఇవ్వాల్సి ఉంది.

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - అమరావతి

ఒక్కో కాంపిటెంట్ అథారిటీ యూనిట్ కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్ సహా తహసీల్దారు, ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్లు, ఇద్దరు వీఆర్వోలు, ఇద్దరు గ్రామ సర్వేయర్లు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, ఒక ఫెసిలిటేటర్, ఇద్దరు కార్యాలయ సహాయకులు మొత్తం 12 మంది ఉండాలి. ఒక్కచోటా పూర్తిస్థాయిలో లేరు. ✦ జనవరి 7న వడ్డమానులో భూసమీకరణ ప్రారంభించి.. ఇప్పటికి 934 ఎకరాలే సమీకరించగలిగారు. కారణం సిబ్బంది లేమి. ✦ వైకుంఠపురం, కర్లపూడి, పెదమద్దూరు, యండ్రాయి యూనిట్లకు ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లను కేటాయించారు. ✦ పెదమద్దూరులో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్‌తో కార్యాలయాన్ని నడిపిస్తున్నారు. ✦ వైకుంఠపురంలో భూసమీకరణ ప్రారంభం కాకపోవడంతో ఇక్కడి విశ్రాంత డిప్యూటీ కలెక్టర్‌ను కర్లపూడి రెవెన్యూ పరిధి లెమల్లెలో ఉపయోగించుకుంటున్నారు. ✦ హరిశ్చంద్రపురం, వడ్డమాను, పెదపరిమిలోనూ ఇదే పరిస్థితి.

రెండో దశలో సమీకరించేది: **20,494** ఎకరాలు

ఇందులో పట్టా భూమి: **16,562.56** ఎకరాలు

అసైన్డ్: **104.1** ఎకరాలు

ఈ నెల 13 వరకు ఇలా..

గ్రామం	రైతులు	ఎకరాల్లో
యండ్రాయి	325	372.5753
కర్లపూడి	195	307.9257
పెదమద్దూరు	155	211.42
వడ్డమాను	42	42.903
మొత్తం	717	934.824

❖ 8 మంది డిప్యూటీ కలెక్టర్లకుగాను ముగ్గురు, 8 మంది తహసీల్దార్లకుగాను ముగ్గురు, 16 మంది డిప్యూటీ తహసీల్దార్లకుగాను ఇద్దరే ఉన్నారు. యూనిట్‌కు ఒక్క వీఆర్వోనే ఇచ్చారు.

ఊపందుకోని ప్రక్రియ

❖ భూసమీకరణపై రైతులకు అవగాహన కల్పించి, వారి సందేహాలు నివృత్తి చేయడానికి డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, రెవెన్యూ యంత్రాంగం చొరవ చూపాలి. వీరు పూర్తిస్థాయిలో లేక ఉన్న అధికారులపై ఒత్తిడి పెరుగుతోంది. ❖ రైతులిచ్చిన పత్రాల తనిఖీ తప్పనిసరి. తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు చేయాల్సిన పని డిప్యూటీ కలెక్టర్లు చేయాల్సి వస్తోంది. ఫలితంగా జాప్యం అనివార్యమవుతోంది. ❖ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సమయం కేటాయించలేని పరిస్థితి. ❖ సీఆర్డీఏ యూనిట్లకు వస్తామని పలువురు రెవెన్యూ అధికారులు సీసీఎల్ఏ కార్యాలయానికి దరఖాస్తు చేసినా.. ఇక్కడి నుంచి ఉత్తర్వులు రాలేదు.

ఆక్వా చెరువుల తవ్వకాల జోరు

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం ప్రాంతంలో కొత్త ఆక్వా చెరువుల తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఇక్కడ గతంలో వనామీ రొయ్యల సాగు ఎక్కువగా ఉండేది. వాతావరణం అనుకూలించకపోవడం, లాభాలు తక్కువగా ఉండటం తదితర కారణాలతో ఆ సాగు తగ్గింది. కాస్త వ్యయం ఎక్కువైనా రైతులు టైగర్ రొయ్యల సాగు చేపట్టారు. మొన్నటి సీజన్లో టైగర్ రొయ్యల సాగు చేపట్టిన రైతులు మంచి లాభాలు ఆర్జించారు. దీంతో అందరి దృష్టి ఆ సాగు వైపు మళ్లింది. ఫలితంగా రానున్న వేసవి పంటకు సాగు విస్తీర్ణం బాగా పెరగనుంది.

రొయ్యల ధరలు పెరగడంతో..

మూడు నాలుగు నెలల కిందటి వరకు మత్స్యశాఖ లెక్కల ప్రకారం చినగంజాం మండల పరిధిలో ఆరు వేల ఎకరాల్లో ఆక్వా సాగు ఉంది. రొయ్యల ధరలు పెరగడంతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ఉప్పు వ్యాపారులు, వివిధ ప్రభుత్వ శాఖల వారు, ప్రవాసాంధ్రులు దీనిపై దృష్టి పెట్టారు. ఖర్చుకు వెనుకాడకుండా చెరువుల తవ్వకాలు చేపడుతున్నారు. ఫలితంగా బీడు భూములూ ఆక్వా చెరువులుగా మారుతున్నాయి. కొత్తగా సాగులోకి వచ్చేవారు ఎకరానికి రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకు లీజు చెల్లిస్తున్నారు. ప్రస్తుతం ఎకరా విస్తీర్ణంలో చెరువు తవ్వాలంటే.. సుమారు 1.50 లక్షలు ఖర్చవుతుంది. తవ్వించి మూడేళ్లపాటు లీజులో నుంచి ఈ డబ్బును మినహాయించుకుంటారు. ప్రస్తుతం అయిదారు వందల ఎకరాల్లో కొత్తగా చెరువులు తవ్వుతున్నారు.

గ్రంథాలయ సంస్థ బడ్జెట్ రూ.53.98 కోట్లు

మాట్లాడుతున్న వందనాదేవి

గుంటూరు, న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ 2026-27 సంవత్సరానికి సంబంధించి రూ.53.98 కోట్ల బడ్జెట్‌కు సర్వసభ్య సమావేశంలో ఆమోదం లభించింది. సంస్థ ఛైర్‌పర్సన్ భీమినేని వందనాదేవి అధ్యక్షతన అరండల్‌పేటలోని గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వందనాదేవి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, దాతల సహకారంతో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. మంచి భవనాలు ఏర్పాటు చేయడంతో పాటు పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. ప్రస్తుతమున్న సాంకేతిక సేవలను మరింత విస్తరించేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థతో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు గ్రంథాలయాల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా సంస్థ పరిధిలోని వాణిజ్య సముదాయాలను అద్దెలకు టెండర్ల ప్రాతిపదికన ఇచ్చేందుకు ఆమోదం తెలిపినట్లు వివరించారు. సమావేశంలో సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ, డీఈవో షేక్ సలీం బాషా, వయోజన విద్యా శాఖ ఉప సంచాలకుడు కె.ఆంజనేయులు, సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకుడు లోచర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులకు అక్షర జ్ఞానం

పకడ్బందీగా వయోజన విద్య తరగతులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

రాజుపాలెంలో అక్షరాలు నేర్చుకుంటున్న అతివలు

అందరికీ విద్య.. అందరి బాధ్యత.. ఎప్పటి నుంచో ఆచరణలో ఉన్న నినాదమిది. రాష్ట్రంలోని ప్రతి 100 మందిలో 67 మంది అక్షరాస్యులుగా ఉన్నారు. పల్నాడు జిల్లాలో 63 శాతం మందికే అక్షర జ్ఞానం ఉంది. జాతీయ సగటుతో పోల్చుకుంటే అతి తక్కువగా జిల్లాలో మహిళా అక్షరాస్యత శాతం 58గా నమోదైంది. ఇలాంటి పరిస్థితుల్లో అక్షర ఆంధ్రప్రదేశ్‌తో జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యత సాధనపై కలెక్టర్ కృతికా శుక్లా ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. నిరక్షరాస్యులుగా గుర్తించిన అందరికీ అక్షరాలు చేరువ చేస్తున్నారు.

■ అక్షర ఆంధ్రప్రదేశ్‌లో ఎనిమిది పాఠాలున్నాయి. ఒక్కో పాఠానికి నాలుగు వర్క్‌షీట్లు చొప్పున 32 రూపొందించారు. వంద గంటల కార్యక్రమంతో నిరక్షరాస్యులను అక్షరాస్యుల్ని చేయాలన్నది లక్ష్యం. నెల రోజులుగా విస్తృతంగా వయోజన విద్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వచ్చేనెల 29న జాతీయ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో పబ్లిక్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నెలాఖరులో నమూనా పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

■ జిల్లాలో 1,27,565 మందిని నిరక్షరాస్యులుగా గుర్తించారు. ప్రతి 10 మంది నిరక్షరాస్యులకు ఒక వాలంటీర్ (డ్వాక్రా మహిళలు, క్షేత్ర సహాయకులు, స్వచ్ఛంద సేవకులు) చొప్పున 12,757 మంది అక్షరాలు నేర్పిస్తున్నారు. నిరక్షరాస్యుల్లో 80 నుంచి 90 వేల మంది రోజూ పాఠాలకు హాజరవుతున్నారు. అందరి వద్దకు వాలంటీర్లు వెళ్లి వయోజన విద్యలో పాల్గొనేలా చైతన్యం పెంపొందిస్తున్నారు. నిరక్షరాస్యుల్లో పురుషులకు కూడా అక్షరాలు నేర్పిస్తున్నారు. మొత్తం నిరక్షరాస్యుల్లో 90 శాతం మంది మహిళలు ఉన్నారు.

గోవా వెళ్లిన కలెక్టర్ బృందం

బాపట్ల, న్యూస్‌టుడే: గోవాలో పర్యాటకరంగ అభివృద్ధిపై అధ్యయనం చేయడానికి కలెక్టర్ వినోద్‌కుమార్ నేతృత్వంలో జిల్లా అధికారుల బృందం బుధవారం రాత్రి ఇక్కడి నుంచి తరలివెళ్లింది. ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు గోవాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను సందర్శించి అక్కడి అధికారులతో సమావేశమవుతారు. పర్యాటకుల్ని ఆకర్షిస్తూ వారి కోసం అమలు చేస్తున్న నూతన విధానాలు, బీచ్‌ల సుందరీకరణ, వసతులు, ఆతిథ్యం తదితర వివరాలు సేకరించనున్నారు. ఈ నెల 23న కలెక్టర్, అధికారులు తిరిగి బాపట్ల వస్తారు. జిల్లాలో పర్యాటక ప్రగతికి చేపట్టాల్సిన చర్యలు, కార్యాచరణ ప్రణాళికపై సమగ్ర నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందజేయనున్నారు.

రాజధానిలో వన్‌స్టాప్ కేంద్రం మంజూరు

మార్చి 8న ప్రారంభించనున్న సీఎం చంద్రబాబునాయుడు

గుంటూరు, న్యూస్‌టుడే

మహిళలపై లైంగిక దాడుల నివారణ, బాల్య వివాహాల నియంత్రణ, ఆపదలో ఉన్న మహిళలు, బాలికల సంరక్షణ లక్ష్యంగా రాష్ట్ర రాజధాని ప్రాంతం తుళ్లూరులో వన్‌స్టాప్ కేంద్రం (ఓఎస్‌సీ)ను రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంజూరు చేసింది. ఇప్పటికే గుంటూరులోని జిల్లా మహిళా ప్రగతి ప్రాంగణంలో వన్‌స్టాప్ కేంద్రం పని చేస్తుంది. రాజధాని ప్రాంతం సీఆర్‌డీఏని దృష్టిలో ఉంచుకుని అదనంగా మరో కేంద్రాన్ని మంజూరు చేస్తూ రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సంచాలకుడు ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఈ నెల 17న ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దీనిని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. ఆ మేరకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, ఆ శాఖ జిల్లా అధికారులకు జారీ చేసిన ఉత్తర్వుల్లో సూచించారు.

❖ కేంద్ర ప్రభుత్వం మిషన్ శక్తి పథకంలో మహిళా సాధికారత, భద్రత అంశాలకు ప్రాధాన్యం ఇస్తుంది. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ కార్యక్రమాలు చేయనున్నారు. తుళ్లూరులో ప్రస్తుతానికి అద్దె భవనంలో వన్‌స్టాప్ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. కనీసం ఐదు గదులు ఉండేలా భవనాన్ని ఎంపిక చేయాలని సూచించారు. ఈ కేంద్రంలో ఉద్యోగులు ఒప్పంద విధానంలో పనిచేసేలా 13 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్, పారాలీగల్ పర్సనల్/న్యాయవాది, పారా మెడికల్ పర్సనల్, సైకో-సోషల్ కౌన్సిలర్, కార్యాలయ సహాయకుడు పోస్టులు ఒకటి చొప్పున.. కేస్ వర్కర్ పోస్టులు-2, మల్టీపర్పస్ స్టాఫ్, సెక్యూరిటీ గార్డు/నైట్ గార్డ్ పోస్టులు 3 చొప్పున మంజూరయ్యాయి. వీటికి దరఖాస్తులు ఆహ్వానించి అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు.

పల్నాడు జిల్లాలోనూ మరో కేంద్రం

పల్నాడు జిల్లాలో వన్‌స్టాప్ కేంద్రం ఉండగా.. అదనంగా మరో కేంద్రాన్ని మంజూరు చేశారు. దీనిని మాచర్లలో ఏర్పాటు చేయనున్నారు. వెనుకబడిన ప్రాంతం కావడం, అక్షరాస్యత శాతం తక్కువగా ఉండటం, బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతుండటంతో వన్‌స్టాప్ కేంద్రాన్ని కేటాయించారు. ఇక్కడా 13 పోస్టులు మంజూరయ్యాయి. అదనంగా ఏర్పాటు చేయనున్న ఒక్కో కేంద్రానికి ప్రభుత్వం రూ.58 లక్షలు విడుదల చేయనుంది.

22న తెదేపా కార్యాలయానికి శంకుస్థాపన

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ, రాజశేఖరబాబు

బాపట్ల, న్యూస్‌టుడే: తెదేపా బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయ భవన నిర్మాణానికి ఈ నెల 22న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి, మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ శంకుస్థాపన చేస్తారని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. తెదేపా పార్లమెంట్ అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబుతో కలిసి బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెదుళ్లపల్లి బధిరుల ఆశ్రమ పాఠశాల సమీపంలో రెండెకరాల భూమిని కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిందన్నారు. అన్ని అనుమతులు తీసుకుని కార్యాలయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. సలగల రాజశేఖరబాబు మాట్లాడుతూ తెదేపా బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఈ నెల 22న సూర్యలంక బైపాస్ ఫ్లైఓవర్ సమీపంలోని ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. తెదేపా నేతలు షేక్ ఫరీద్ మస్తాన్, ఊట్ల రామారావు, నిజామ్ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

రబీ పంటలకు సరిపడా యూరియా: కలెక్టర్

మాట్లాడుతున్న వినోద్‌కుమార్

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో రబీ సీజన్‌కు సరిపడా యూరియా ఉందని రైతులు ఆందోళన చెందనవసరం లేదని కలెక్టర్ వినోద్‌కుమార్ బుధవారం తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో 1345 మెట్రిక్ టన్నులు, రైతు సేవా కేంద్రాల్లో 705, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలో 136, ప్రైవేటు రిటైల్ వ్యాపారుల దగ్గర 2245, మార్క్‌ఫెడ్ గోదాముల్లో 2718, టోకు వ్యాపారుల దగ్గర 204, కంపెనీ గోదాముల్లో 29 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు.

తెలుగులో తీర్పు వెలువరించిన న్యాయమూర్తి

చీరాల, న్యూస్‌టుడే: ఒక మనోవర్తి కేసులో తెలుగులో తీర్పు ఇచ్చిన న్యాయమూర్తిని మాతృభాష అభిమానులు అభినందించారు. బాపట్ల జిల్లా చీరాల మండలం వాడరేవుకు చెందిన చేపల ప్రసన్న అనే మహిళ తన భర్త నుంచి తనకు మనోవర్తి ఇప్పించాలని కోరుతూ 2017లో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన అనంతరం బుధవారం అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.కాత్యాయని తెలుగులో తీర్పు వెలువరించారు. ఈనెల 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం జరుపుకోనున్న సమయంలో న్యాయమూర్తి తెలుగులో తీర్పు ఇవ్వడం హర్షణీయమని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జి.రమేష్ బాబు, కార్యదర్శి రవికుమార్, న్యాయవాదులు పేర్కొన్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank భారత ప్రభుత్వ రంగ సంస్థ A Government of India Undertaking

ప్రాంతీయ కార్యాలయం : గుంటూరు రికవరీ సెక్షన్, జె.కె.సి. కాలేజ్ రోడ్డు, 5వ లైను, విజయపురి, గుంటూరు-6. ఫోన్: 9492758257, 8019308696

స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని రూలు 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **కెనరా బ్యాంక్** వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతికంగా స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది **12.03.2026** న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు & హామీదారులకు తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది: 12-03-2026, మ॥ 02:00 గం.ల నుండి సా॥ 04:00 గం.ల వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములుకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 12.03.2026, మ॥ 12.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

కెనరా బ్యాంక్, చీరాల-II బ్రాంచ్ (13660), ఫోన్: 94409 05249

1. ఋణగ్రహీత : శ్రీమతి చెరుకూరి పద్మజ. బకాయి మొత్తం: తేది 31.01.2026 నాటికి రూ.19,47,880.38/- + తదుపరి వడ్డీ, వ్యయాలు & ఇతర ఛార్జీలు.
బ్యాంకుకు తెలిసిన సమాచారం ప్రకారం ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్‌లు లేని స్థిరాస్తి వివరములు :
ప్రకాశం జిల్లా, చీరాల సబ్ జిల్లా, వేటపాలెం మండలం, పందిళ్లపల్లి పంచాయితీ, పందిళ్లపల్లి గ్రామం, ఎస్. నెం. 89/4, ఎస్. నెం. 89/5, బ్లాక్ నెం.6, సమీప డోర్ నెం: 6-36 కలిగిన **2156.8 చ॥గ॥ లేదా 2114.12 చ॥మీ॥ స్థలం యావత్తు. హద్దులు: తూర్పు:** గంగిశెట్టి హరిబాబు స్థలం, **దక్షిణం:** చెరుకూరి సాయి ప్రకాష్ నాయుడు స్థలం, **పడమర:** యడల కనకయ్య స్థలం, **ఉత్తరం:** సర్కార్ డొంక, రోండా సత్యనారాయణ రెడ్డి, సుంకర అంజి రెడ్డి, రోండా వెంకా రెడ్డి స్థలం.

రిజర్వు ధర: రూ. 47,85,000/-	ధరావత్తు సొమ్ము: రూ. 4,78,500/-

కెనరా బ్యాంక్, రేపల్లె బ్రాంచ్, ఫోన్: 3310 19148

2. ఋణగ్రహీత: M/s. హితేష్ డ్రై ఫిష్ ఏజన్సీస్, ప్రొప్రయిటర్: పి. రాంబాబు
బకాయి మొత్తం: తేది 31.01.2026 నాటికి రూ.30,44,032.70/- + తదుపరి వడ్డీ, వ్యయాలు & ఇతర ఛార్జీలు.
బ్యాంకుకు తెలిసిన సమాచారం ప్రకారం ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్‌లు లేని స్థిరాస్తి వివరములు:
గుంటూరు జిల్లా, తెనాలి రిజిస్ట్రేషన్ జిల్లా, రేపల్లె మున్సిపాలిటీ, దూరపు డోర్ నెం. 3-6-179, సర్వే నెం. 58/3, మొత్తం ఎ. 1-70 సెంట్లులో **146.50 చ॥గ॥ ఇంటి ఖాళీ స్థలం. హద్దులు: తూర్పు:** ఆకృతి శంకర్ రావు మరియు ఇతరుల స్థలం, **దక్షిణం:** స్వామి రాంప్రసాద్ భూమి, **పడమర:** 30 అ॥ రోడ్డు, **ఉత్తరం:** అబ్దుల్ మజీద్ భూమి.

రిజర్వు ధర: రూ. 9,50,000/-	ధరావత్తు సొమ్ము: రూ. 95,000/-

3. ఋణగ్రహీత : M/s శ్రీ శ్రీనివాస టింబర్ డిపో, ప్రొప్రయిటర్ రమణి తాతయ్య.
బకాయి మొత్తం: తేది 31.01.2026 నాటికి రూ.21,69,614.66/- + తదుపరి వడ్డీ, వ్యయాలు & ఇతర ఛార్జీలు.
బ్యాంకుకు తెలిసిన సమాచారం ప్రకారం ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్‌లు లేని స్థిరాస్తి వివరములు :
ఐటమ్ నెం-1: ప్రకాశం జిల్లా, చీరాల సబ్-జిల్లా, చీరాల మున్సిపల్, పేరాల గ్రామం, చీరాల పాత మున్సిపల్, పాత 6వ వార్డు, కొత్త 8వ వార్డు, కుందేరుఒడ్డు ప్రాంతం, బ్లాక్ నెం.5, సమీప డోర్ నెం. 8-16-19, టి.యస్.నెం. 244/9, సర్వే నెం. 282/9లో ఎ.1-72 సెంట్లు, యస్.నెం.283/13లో ఎ. 0-64 సెంట్లు. **హద్దులు: తూర్పు:** కొణిజేటి నాగేశ్వరరావు, విస్సర్ల విజ్ఞాన్ కుమార్ యొక్క స్థలం, **దక్షిణం:** గోరంట్ల సుబ్బారావు యొక్క స్థలం, **పడమర:** కొక్కిలిగడ్డ రామచంద్రరావు యొక్క స్థలం, **ఉత్తరం:** 2వ ఐటమ్ - 12 అ॥ల వెడల్పు దారి. పై హద్దులులోని **386.71 చ॥గ॥ లేదా 323.29 చ॥మీ॥ల విస్తీర్ణంలోని ఖాళీ ఇంటి స్థలం.**
ఐటమ్ నెం-2: ప్రకాశం జిల్లా, చీరాల సబ్-జిల్లా, చీరాల మున్సిపల్, పేరాల గ్రామం, చీరాల పాత మున్సిపల్, పాత 6వ వార్డు, కొత్త 8వ వార్డు, బ్లాక్ నెం.5, కుందేరుఒడ్డు ప్రాంతం, సమీప డోర్ నెం. 8-16-19, టి.యస్.నెం. 244/9 లోని సర్వే నెం. 282/9లో **ఎ.1-72 సెంట్లు,** సర్వే నెం.283/13 లోని ఎ. **0-64 సెంట్లు, హద్దులు:** తూర్పు: కుందేరుఒడ్డు రోడ్డు, దక్షిణం: చేబ్రోలు శరత్‌బాబు యొక్క కొంత స్థలం, అమ్మకందారుల యొక్క కొంత స్థలం, 1వ ఐటమ్ యొక్క కొంత స్థలం, పడమర: జజ్జర్ల వాయమ్మ తదితరుల యొక్క స్థలం, ఉత్తరం: 3వ ఐటమ్ యొక్క ఆస్తి. పై హద్దులు విస్తీర్ణం 496.1 చ॥గ॥ లేదా 414.73 చ॥మీ॥ రహదారి స్థలం, అవిభాజ్యపు వాటా **83.24 చ॥గ॥ లేదా 69.59 చ॥మీ॥** దారి స్థలం.
ఐటమ్ నెం-3: ప్రకాశం జిల్లా, చీరాల సబ్-జిల్లా, చీరాల మున్సిపల్, పేరాల గ్రామం, చీరాల పాత మున్సిపల్, పాత 6వ వార్డు, కొత్త 8వ వార్డు, బ్లాక్ నెం.5, కుందేరుఒడ్డు ప్రాంతం, సమీప డోర్ నెం. 8-16-19, టి.యస్.నెం. 244/9, సర్వే నెం. 282/9 లోని **ఎ.1-72 సెంట్లు,** యస్.నెం.283/13లో ఎ. **0-64 సెంట్లు, హద్దులు: తూర్పు:** లేదు. **దక్షిణం:** 2వ ఐటమ్ - 12 అ॥ల వెడల్పు రహదారి, **పడమర:** జజ్జర్ల విజయమ్మ తదితరుల యొక్క స్థలం, **ఉత్తరం:** మేకలజయేలు తదితరుల యొక్క స్థలం. పై హద్దులు విస్తీర్ణం 229.9 చ॥గ॥ లేదా 192.19 చ॥మీ॥ రహదారి స్థలం, అవిభాజ్యపు వాటా **38.23 చ॥గ॥ లేదా 31.96 చ॥మీ॥** రహదారి స్థలం. **3 ఐటమ్‌లు కలిపి మొత్తం విస్తీర్ణం ఎ.0-10 ½ సెంట్లు లేదా 508.2 చ॥గ॥ స్థలం.**

రిజర్వు ధర: రూ. 25,10,000/-	ధరావత్తు సొమ్ము: రూ. 2,51,000/-

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.bank.in లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్ సంబంధిత బ్రాంచ్ మేనేజర్ గారిని లేదా కెనరా బ్యాంక్, గుంటూరు ప్రాంతీయ కార్యాలయం, అధీకృత అధికారి గారిని బ్యాంకు పనివేళలలో సంప్రదించగలరు. ఇ-వేలం విధానం, నియమ నిబంధనల కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ (baanknet), వెబ్‌పోర్టల్ http://baanknet.com హెల్ప్‌డెస్క్: 8291220220, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది: 16-02-2026, ప్రదేశం: గుంటూరు సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

చదరంగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

చీరాల గ్రామీణం: అండర్ - 17 రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు చీరాల మండలం ఈపూరుపాలెం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని మునగపాటి తేజశ్రీ ఎంపికైంది. బాపట్ల పురపాలక ఇండోర్ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో మొదటి స్థానం సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం హనోరా తెలిపారు. ఈనెల 21, 22 తేదీల్లో తిరుపతిలో శాప్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. బడిలో బుధవారం నిర్వహించిన అభినందన సభలో ఫిజికల్ డైరెక్టర్లు శ్రీనివాసులు, లావణ్య, ఇతర ఉపాధ్యాయులు బాలికకు శుభాకాంక్షలు తెలిపారు.

మేము సైతం.. క్వాంటమ్ నిపుణులుగా..

న్యూస్‌టుడే, బాపట్ల

- టెక్నాలజీ అందిపుచ్చుకుంటున్న ఇంజినీరింగ్ విద్యార్థులు
- బీటెక్ ఈసీఈ కోర్సులో ఓ సబ్జెక్టుగా బోధన

ఇంజినీరింగ్ విద్యార్థులకు బోధిస్తున్న ఆచార్యుడు సునీల్

భవిష్యత్తు సాంకేతిక పరిజ్ఞానం క్వాంటమ్ టెక్నాలజీలో ఇంజినీరింగ్ విద్యార్థులు నిపుణులుగా ఎదిగేందుకు అడుగులు పడుతున్నాయి. కేంద్రం అమలు చేస్తున్న జాతీయ క్వాంటమ్ మిషన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఈసీఈ బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు రెండో సెమిస్టర్‌లో క్వాంటమ్ కంప్యూటర్స్‌ను ఓ సబ్జెక్టుగా ఈ ఏడాది నుంచి ప్రవేశపెట్టారు. విద్యార్థులు ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు.

అమరావతి కేంద్రంగా క్వాంటమ్ వ్యాలీ నిర్మాణానికి ఇటీవలే సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి జితేంద్రసింగ్ శంకుస్థాపన చేశారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి ఏపీలో తొలి క్వాంటమ్ కంప్యూటర్‌ను అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. 2030 నాటికి 2.50 లక్షల మంది క్వాంటమ్ నిపుణులు అవసరమని పరిశ్రమ వర్గాలు అంచనా వేశాయి. క్వాంటమ్ కంప్యూటింగ్‌ను అందిపుచ్చుకుంటే విద్యార్థులు భవిష్యత్తులో రాణించి పోటీ ప్రపంచంలో నిలదొక్కుకుని ఉపాధి అవకాశాలు పొందుతారని నిపుణులు సూచిస్తున్నారు.

కొత్త సాంకేతికతపై ప్రత్యేక శిక్షణ

బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల, ఆర్వీఆర్‌అండ్‌జేసీ, వీవీఐటీ కళాశాలల్లో ఈసీఈ బీటెక్ కోర్సు రెండో సంవత్సరంలో క్వాంటమ్ టెక్నాలజీని ఓ సబ్జెక్టుగా చేర్చారు. నూతన టెక్నాలజీపై అధ్యాపకులు, ఆచార్యులకు ముందుగానే ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఇటీవల ప్రారంభమైన ద్వితీయ సంవత్సర విద్యార్థులకు రెండో సెమిస్టర్‌లో క్వాంటమ్ టెక్నాలజీస్‌పై ఆచార్యులు బోధన చేస్తున్నారు. భౌతికశాస్త్రం నుంచి క్వాంటమ్ ఎలా రూపాంతరం చెందింది, భవిష్యత్తు తరాలకు క్వాంటమ్ కంప్యూటింగ్, అల్గారిథమ్స్ ఎలా ఉంటాయి. క్వాంటమ్ కమ్యూనికేషన్ టెక్నాలజీలు ఎలా ఉపయోగపడతాయి తదితర అంశాలపై అవగాహన కల్పిస్తూ శిక్షణ ఇస్తున్నారు.

కళాశాలల్లో కార్యశాలలు

ఐఐటీ నుంచి పరిశోధకులను పిలిపించి క్వాంటమ్ టెక్నాలజీపై మార్చి నుంచి కళాశాలల్లో విద్యార్థులకు కార్యశాలలు, హ్యాకథాన్ల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించారు. విద్యార్థులను నిపుణులుగా తీర్చిదిద్దటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహంతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నారు. అమరావతిలో త్వరలో ప్రారంభమవుతున్న క్వాంటమ్ వ్యాలీతో రానున్న రెండేళ్లలో ఈ రంగంలో పరిశోధనలు చేసే విద్యార్థులకు మంచి మద్దతు లభించనుంది. పోస్ట్ క్వాంటమ్ క్రిప్టోగ్రఫీ ద్వారా సైబర్ నేరాలను సైతం నిరోధించగలమని నిపుణులు పేర్కొంటున్నారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ ఆచార్యుడు సునీల్ మాట్లాడుతూ క్వాంటమ్ టెక్నాలజీ రానున్న ఐదేళ్లలో సరికొత్త విప్లవాన్ని, ఆవిష్కరణలు తెచ్చి లక్షల కొత్త ఉద్యోగాలు సృష్టిస్తుందని తెలిపారు. అవకాశాలు అందిపుచ్చుకోవటానికి మన ఇంజినీరింగ్ విద్యార్థులను సిద్ధంగా ఉంచటానికి ఈ పరిజ్ఞానంపై కొత్త కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు పేర్కొన్నారు. క్వాంటమ్ టెక్నాలజీపైన త్వరలో బీటెక్ కోర్సులు రానున్నాయన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు ప్రాథమిక అవగాహన కల్పిస్తున్నామని, వచ్చే మూడేళ్లలో నిపుణులుగా ఎదిగేలా కార్యశాలలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

సముద్ర మొక్కల పెంపకం లాభదాయకం

చినగంజాం, చీరాల అర్బన్: సముద్ర మొక్కల పెంపకం లాభదాయకమని సీఎస్ఐఆర్, సీఎస్ఎంసీఆర్ఐ శాస్త్రవేత్త లక్కాకుల సతీష్ పేర్కొన్నారు. ఆ మొక్కలు పెంపకం ఉన్న చినగంజాం మండలం పెదగంజాం పంచాయతీ పరిధిలోని ఏటిమెగ సముద్ర తీరాన్ని శాస్త్రవేత్త బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ... సముద్ర మొక్కలు వ్యవసాయానికి అవసరమైన రసాయనాల తయారీకి, కోళ్ల రంగానికి, మందుల తయారీకి, మాంసాన్ని నిల్వ చేయడానికి బాగా ఉపయోగపడతాయన్నారు. సీఎస్ఎంసీఆర్ఐ సాంకేతిక సలహాలు, సూచనలు, సెర్ప్ నుంచి జీసీఎఫ్, మత్స్యశాఖ నుంచి పీఎంపీఎంఎస్‌వై పథకాల ద్వారా 90 శాతం ఆర్థిక సాయాన్ని మొక్కల పెంపకందారులకు అందిస్తాయన్నారు. చినగంజాం మండలంలోని ఏటిమొగ, చీరాల మండలంలోని వాడరేవుల్లో 400 మందికి అవగాహన కల్పించి సముద్ర మొక్కల పెంపకంపై ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. బాపట్ల డీఆర్‌డీఏ పీడీ బి.సింగయ్య, డీపీఎం రవీంద్ర బాబు, ఏడీ కృష్ణకిశోర్, చినగంజాం, చీరాల ఏపీఎంలు జి.పెదసుబ్బారావు, మధు, బాలస్వామి, మనీషా, సీసీ శ్రీలక్ష్మి, మాధవి, వెంకటస్వామి, వీఏవోలు పాల్గొన్నారు. చినగంజాం పర్యటన అనంతరం చీరాలలో నిర్వహించిన సమావేశంలో శాస్త్రవేత్త లక్కాకుల సతీష్ పాల్గొని మాట్లాడారు.

బండ్లమ్మ సన్నిధిలో ప్రముఖుల పూజలు

అధికారులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో నరసింహమూర్తి

చందోలు(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: చందోలు బండ్లమ్మ అమ్మవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీసు అధికారి లక్ష్మీనారాయణ దంపతులు అమ్మవారికి పూలదండలు, చీర సమర్పించి పూజలు చేశారు. విజయవాడ ఆదాయపన్ను విభాగం అధికారులు సునీత బిల్లా, సుప్రియ రావు, బాపట్ల ఆదాయం విభాగం అధికారి నంబూరు శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా రిజిస్ట్రార్ శైలజ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ఈవో నరసింహమూర్తి అమ్మవారి చిత్రపటం అందజేశారు.

ఊరూరా 'పసుపు' ఉపాధి!

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్‌కు చెందిన జహంగీర్ అనే వ్యక్తి ఆటోలో మరను పెట్టుకుని, కళ్ల ముందే పసుపు ఆడించి ఇస్తానని చీరాల చుట్టు పక్కల ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతున్నారు. ఎటువంటి కల్తీ లేకుండా మీరు తెచ్చుకున్న పసుపు కొమ్ములతో గానీ, తన వద్ద ఉన్న వాటితో గానీ ఆడించి ఇస్తానని చెబుతూ ఉపాధి పొందుతున్నారు. ఇదేదో కొత్తగా ఉండటంతో పలు పుర మహిళలు ఇలా పసుపు తయారీకి ముందుకొస్తున్నారు. పసుపు కొమ్ములు ఇస్తే మర పట్టించి ఇచ్చేందుకు రూ.100(కేజీకి), అదే అతని దగ్గర కొంటే కేజీ పసుపునకు రూ.400 తీసుకుంటున్నారు.

నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

బాపట్ల వెస్ట్, న్యూస్‌టుడే: రంజాన్ మాస ఉపవాస దీక్షలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని అంజుమన్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రహీమ్ జానీ తెలిపారు. అంజుమన్ మసీదు ప్రాంగణంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పవిత్ర రంజాన్ దీక్షలకు పట్టణంలోని 17 మసీదుల్లో అన్ని సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ముస్లిం సోదరులు ఉపవాస దీక్షల్లో పాల్గొని దైవ దీవెనలు పొందాలని సూచించారు. కమిటీ కార్యదర్శి అబ్దుల్ కరీం, ఉప ప్రెసిడెంట్ బాజీబాబ్, సభ్యులు అబ్దుల్ మజీద్ మతపెద్దలు పాల్గొన్నారు.

రైలెక్కిన టిప్పరు వాహనాలు

ప్రముఖ కంపెనీకి చెందిన టిప్పరు వాహనాలను గూడ్స్ రైలు ద్వారా చెన్నై నుంచి విజయవాడ తరలిస్తోంది. మార్గం మధ్యలో బాపట్ల రైల్వేస్టేషన్‌లో బుధవారం ఉదయం ఆగింది. గూడ్స్ రైలు బోగీలపై వరుసగా ఉంచిన టిప్పర్లను అందరూ ఆసక్తిగా తిలకించారు. - బాపట్ల, న్యూస్‌టుడే

ఆర్వో ప్లాంట్ల నీరెంత మిన్న?

చీరాల అర్బన్, వేటపాలెం, న్యూస్‌టుడే

ఆర్వో ప్లాంట్ నిర్వహించాలంటే పంచాయతీ, పురపాలక సంఘం నుంచి విధిగా అనుమతులు తీసుకోవాలి. అధికారులూ అన్ని నిబంధనలు సరిగ్గా ఉన్నాయా లేదా అనేది స్వయంగా పరిశీలించిన తరువాతే వీటికి లైసెన్సులు మంజూరు చేయాలి. కానీ క్షేత్రస్థాయిలో ఇది జరగడంలేదు. ఎవరు ఇష్టమొచ్చినట్లు వారు వీటిని ఏర్పాటు చేసుకుని నేరుగా నీటిని విక్రయిస్తున్నారు. ఫలితంగా వ్యాధులు వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయాన్ని నిపుణులు వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో చీరాల, బాపట్ల, రేపల్లె పట్టణాలతో పాటు పలు పంచాయతీల్లో దాదాపు వెయ్యికిపైగా ఆర్వో ప్లాంట్లు ఉన్నాయి. వీటిల్లో మూడొంతుల వాటికి అనుమతుల్లేవు. ఈ ప్లాంట్లలో చాలా వరకు ప్లాస్టిక్ ట్యాంకులు వినియోగిస్తున్నారు. స్టీల్‌వి వాడాల్సి ఉండగా ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రతి రెండు వారాలకొకసారి వీటిని శుభ్రం చేయాలి. ఎప్పుడు శుభ్రపరిచారో ఆ వివరాలు దానిపై రాయాలి. ప్లాంట్ పరిసర ప్రాంతాల్లో మురుగు కాలువలు ఉండకూడదు. ఇక నీటి విక్రయానికి వినియోగించే డబ్బాలను మూడు దశల్లో శుభ్రం చేయాల్సి ఉండగా అది జరగడం లేదు. ఆరు నెలలకొకసారి వీటిని మార్చు చేయాల్సి ఉండగా అది ఎక్కడ అమలు కావడంలేదు. ఏళ్ల తరబడి వాటినే వాడుతున్నారు. లోపల పాచిపట్టినా పెద్దగా పట్టించుకోవడంలేదు.

పరీక్షలు జరగకుండా..

మనం తాగే నీటిలో పీహెచ్ విలువ 6.5 నుంచి 8.5 మధ్య ఉండాలి. ఎక్కువ, తక్కువ ఉన్నా నీటి రుచి మారుతుంది. అలాగే ఆరోగ్య సమస్యలు రావచ్చు. ఇక టీడీఎస్ (నీటిలో కరిగిన మొత్తం ఘన పదార్థాల మొత్తం) 50 నుంచి 150 పీపీఎం మధ్య ఉంటే బాగా ఉన్నట్లు లెక్క. ఒక రకంగా చెప్పాలంటే నీరు ఎంత శుద్ధంగా ఉందో అది చెబుతుంది. అలాగే నీటిలో ఏమైనా బ్యాక్టీరియా, ఫంగస్, వైరస్ లాంటివి ఉన్నాయా అనేది పరిశీలించేందుకు తప్పనిసరిగా పరీక్షలు చేయించాలి. కానీ ఇవేమీ జరగడంలేదు. నేరుగా క్యాన్లలో నింపి విక్రయిస్తున్నారు. కొందరైతే నీటిని లీటరు, అరలీటరు సీసాల్లో నింపి రంగు రంగుల లేబుల్స్ వేసి, బహిరంగ మార్కెట్‌కి తరలించేస్తున్నారు. ఇలా సీల్ వేయాలంటే కచ్చితంగా ఐఎస్ఐ అనుమతి తప్పనిసరి. అది లేకుండా అక్రమ వ్యాపారం చేస్తున్నారు. ఈ ప్లాంట్లలో అమ్మేది మినరల్ నీరు అనే అపోహలో చాలా మంది ఉంటున్నారు. వీటికి బదులుగా మున్సిపల్ నీటినే కాచి చల్లార్చి వినియోగిస్తే మేలని వైద్యులు చెబుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఆర్వో ప్లాంట్లను పరిశీలించి ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అనే విషయాన్ని చూస్తే వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంది.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన

విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలిస్తున్న డీఈవో శ్రీనివాస్

స్వర్ణ (కారంచేడు): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన సాగుతోందని, విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించే దిశగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతారని జిల్లా విద్యాధికారి డి.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని స్వర్ణ ఉన్నత పాఠశాలను బుధవారం డీఈవో ఆకస్మిక పరిశీలన జరిపారు. ఈసందర్భంగా 10వ తరగతి విద్యార్థుల పురోగతిని పరిశీలించారు. చదువులో వెనుకబడిన బాలలకు రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ఇవ్వాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను చూశారు. అనంతరం ఉపాధ్యాయులతో విద్యబోధనపై మాట్లాడారు. నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా బోధన అందించాలన్నారు. ఎంఈవో వెంకటేశ్వర్లు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

హైడ్రోపోనిక్స్ విధానంలో సాగుతో మేలు

మాట్లాడుతున్న శారదా జయలక్ష్మి

బాపట్ల, న్యూస్‌టుడే: హైడ్రోపోనిక్స్ విధానంలో మట్టిలేని సాగువల్ల తక్కువ నీటితో పంట పండించవచ్చని ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ఛాన్సలర్ శారదా జయలక్ష్మీ అన్నారు. బాపట్ల ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. హైడ్రోపోనిక్స్ విధానంతో రైతులకు అధిక ఆదాయ లభిస్తుందన్నారు. యూనివర్సిటీ కింద ఉన్న 18 కళాశాలలు 33 రీసెర్చ్ స్టేషన్లలో ఈ విధానం అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో గౌరవ అతిథి డీన్ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ డాక్టర్ ఎ.ముని, స్థానిక కళాశాల అసోసియేట్ డీన్ పి.ప్రసన్నరాణి, డీడీ స్మిత్, కళాశాల బృందం జి.శివనారాయణ, కె.కృపావతి, తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాలు నిబంధనలు పాటించాలి

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: స్కానింగ్ కేంద్రాలు పీసీపీ ఎన్‌డీటీ నిబంధనలు పాటించాలని, దీనికి వ్యతిరేకంగా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు హెచ్చరించారు. రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేటివ్ అథారిటీ, సబ్ డిస్ట్రిక్ లెవల్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్జీవో, వైద్య సిబ్బంది సంయుక్తంగా.. చిన్నతనంలో గర్భం దాల్చడంతో కలిగే అనర్థాలను యుక్తవయసులో ఉన్న యువతులకు వివరించాలని ఆదేశించారు. కమిటీ సభ్యులు డాక్టర్లు సీహెచ్ రత్నమన్మోహన్, సుహాసిని, సునీత, బ్రహ్మం, సుభాషిణి, డీఐవో డాక్టరు యాకోబ్, ఎస్జీవో రాజ సువిసాల్మన్, డిప్యూటీ డెమో బి.మరియమ్మ, డిప్యూటీ హెచ్ఈ మాధవి, ఒకటో పట్టణ సీఐ సుబ్బారావు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

మార్టూరు, న్యూస్‌టుడే: పలు చోరీ కేసుల్లో నిందితుడ్ని బుధవారం మార్టూరు పోలీసులు అరెస్ట్ చేశారు. మార్టూరు పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో బాపట్ల ఇన్‌ఛార్జి డీఎస్పీ జగదీష్ నాయక్ వివరాలు వెల్లడించారు. యద్దనపూడి మండలం చింతపల్లిపాడు గ్రామానికి చెందిన పాలపర్తి నాగరాజు 8వ తరగతి వరకు చదువుకుని లారీ డ్రైవర్, క్లీనర్‌గా పనిచేస్తూ వ్యసనాలకు బానిసయ్యాడని తెలిపారు. 2008 నుంచి బైక్‌లు, సెల్‌ఫోన్లు చోరీకి పాల్పడటాన్ని వృత్తిగా మార్చుకున్నాడన్నారు. గతంలోనూ బాపట్ల, యద్దనపూడి, మార్టూరు, అద్దంకి, సంతమాగులూరు, పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట, చిలకలూరిపేట గ్రామీణ, గుంటూరు జిల్లాలోని తుళ్లూరు, మంగళగిరి, విజయవాడ నగరం కృష్ణలంక పోలీస్‌స్టేషన్లలో నాగరాజుపై చోరీల కేసులు నమోదయ్యాయన్నారు. 2025లో బైక్, సెల్‌ఫోను దొంగతనం కేసుల్లో యద్దనపూడి పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారని తెలిపారు. అదే ఏడాది డిసెంబర్‌లో జైలు నుంచి వచ్చిన నాగరాజు దొంగతనాలు చేస్తూ మార్టూరు మండలంలోని సూర్యడాబా వద్ద, తాడేపల్లి పట్టణం ఉండవల్లి, విజయవాడలోని ఆటోనగర్ ప్రాంతాల్లో మూడు బైక్‌లు, కొమ్మాలపాడు, నరసరావుపేట ప్రాంతాల్లో మూడు సెల్‌ఫోన్లు చోరీకి పాల్పడటంతో కేసులు నమోదయ్యాయన్నారు. మార్టూరు ఎస్సై సైదాకు వచ్చిన సమాచారం మేరకు నాగరాజును మార్టూరు మండలం రాజుపాలెం గ్రామ శివారులో యలవర్తి కోల్డ్ స్టోరేజీ వద్ద సాయంత్రం అరెస్ట్ చేసి, మూడు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ జగదీష్‌నాయక్ వివరించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 120, రిటైల్ ధర - 147, చికెన్ విత్‌స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్ - 243.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213 చికెన్ స్కిన్‌లెస్ - 243.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 132, 142 చికెన్ విత్ స్కిన్ - 230 చికెన్ స్కిన్‌లెస్ - 240.

91.9 FM Vijayawada ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

BIRTHDAY GREETINGS
పుట్టిన రోజు శుభాకాంక్షలు

సెల్ నెం: 9963339230

EENADU Classifieds

TO LET
పాతఒద్దులూరు 1వ లైనులో ... 2BHK అపార్ట్‌మెంట్ No: 402 అద్దెకు ఇవ్వబడును. AC, లిఫ్ట్, జనరేటర్, సం॥ 9248494407.

JOBS
Wanted Hostel Wardens (Male / Female) & Floor Incharge in SIMS Group of Institutions Hostels, Contact No. 9701666645 & 6304777593.
We are Hiring - USA Counselor (OR) Tele caller only. Ladies, any Graduation. Contact: 77807 81362. Lakshmipuram, Guntur.

BUSINESS SERVICES
BUSINESS OFFER
Running 30 Bedded Hospital Lease@ MiryalagudaTown, Nalgonda. For Obstetrics, Urology, Pediatrics, Ortho Physician. 9848231654

REAL ESTATE
PLOT FOR SALE
GENERAL
Commercial plot 1373 sq.yds Inner Ring road, Guntur, with 1.25 lakhs Rent and bank loan for immediate sale. Call: 9573454266.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడులో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

ఉత్తమ సేవలకు రోటరీ పురస్కారాలు

బాపట్ల, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన ప్రభుత్వ ఉద్యోగులను రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. ఏపీవీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని యద్ద సత్యవతి, బేతనీకాలనీ సచివాలయంలో వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సెక్రటరీగా పనిచేస్తున్న మేక సుబ్బారావు, దగ్గుమళ్లవారిపాలెం ఏఎన్ఎం వెంకటరమణ, పోస్టల్ అసిస్టెంట్ బత్తుల నాగేశ్వరరావు, ఉత్తమ పోస్టు ఉమెన్ నాగజ్యోతిని సత్కరించి రోటరీ సేవా పురస్కారాలు అందించారు. రోటరీ గవర్నర్ డాక్టర్ రాంప్రసాద్, అసిస్టెంట్ గవర్నర్ రాఘవయ్య, క్లబ్ బాపట్ల అధ్యక్షుడు వేజెండ్ల శ్రీనివాసరావు, కార్యదర్శి కొత్త ఆంజనేయ వరప్రసాద్, కోశాధికారి సుబ్బారావు పాల్గొన్నారు.

బాపట్ల

• బాపట్ల • రేపల్లె • వేమూరు

సస్యరక్షణతో పేనుబంక నివారణ

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: మినుము పైరుపై పేనుబంక ఆశించిందని రైతులు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఎండీ ఫారుక్ సూచించారు. ఈ పురుగులు ఆకుల అడుగుభాగంలో గుంపులుగా చేరటంతో తొలిదశలో గుర్తించటం కష్టంగా ఉంటుందని, రైతులు మొక్కల ఆకులను నిశితంగా పరిశీలించి పురుగును గుర్తించాలన్నారు. దీంతో పూత రాలి పోవటం, మొక్క ఎండి పోవటం జరుగుతుందన్నారు. నివారణకు ఇమిడా యేట్ 400 మి.లీ. మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పైరుపై చల్లటం వల్ల పేనుబంక నివారించవచ్చన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73136, వేమూరు: 91107 83738

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే: ? చందోలు పంచాయతీ పరిధి ఎస్సీకాలనీలో తాగునీటి ట్యాంకు వద్ద మురుగు నిలిచి అపరిశుభ్రత నెలకొంది. **-అంకాలు, చందోలు** ✔ పరిశీలించి మురుగు నిల్వకుండా చర్యలు తీసుకుంటాం. **- సుజాత, కార్యదర్శి, చందోలు**

నగరం, న్యూస్‌టుడే: ? వెలమవారిపాలెం రహదారిలో వీధి దీపాలు వెలగడం లేదు. **-రామకృష్ణ** ✔ వెలగని దీపాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయిస్తాం. **-వెంకటేశ్వరరావు, కార్యదర్శి, యేలేటిపాలెం**

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: ? చెరుకుపల్లి కొత్తపేటలో కాలువలు పూడిపోయి మురుగు కదలడం లేదు. **-జగదీష్, కొత్తపేట** ✔ పారిశుద్ధ్య సిబ్బంది కొరతతో సమస్య ఉంది. త్వరలో పరిష్కరిస్తాం. **-కేజేఏ శ్రీనివాసన్, డిప్యూటీ ఎంపీడీవో, చెరుకుపల్లి**

వేమూరు, న్యూస్‌టుడే: ? వలివేరు నుంచి చుండూరు వెళ్లే మార్గం అధ్వానంగా ఉంది. రాకపోకలకు ఇబ్బందులున్నాయి. **-స్థానికులు** ✔ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం. **-అరుణ, ఆర్‌అండ్‌బీ డీఈ**

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: ? రేపల్లె మండలం బేతపూడి పంచాయతీ తురకపాలెంలో పలుచోట్ల వీధిదీపాలు వెలగడం లేదు. **-హుస్సేన్, స్థానికుడు** ✔ వెలగని దీపాలు గుర్తించి కొత్తవి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. **-ఉయ్యూరు నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి**

చేతిపంపులకు మరమ్మతులు

స్పందన: రేపల్లె అర్బన్: రేపల్లె 2వవార్డు గురుకుల పాఠశాల మార్గం, గూనివారిపాలెం రోడ్డులో పలు చేతిపంపులు పని చేయడం లేదు. సమస్యను మేమున్నాం..మీకుతోడుగా శీర్షికన ఈనెల 18న 'ఈనాడు' అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన మున్సిపల్ ఏఈ శామ్యూల్ బుధవారం కార్మికులను పంపి చేతిపంపులకు మరమ్మతులు చేయించారు.

అస్తవ్యస్తంగా వీధిదీపాల నిర్వహణ

న్యూస్‌టుడే, బేతపూడి (రేపల్లె అర్బన్), కేవీపాలెం, అప్పికట్ల (కర్లపాలెం), మోదుకూరు (వేమూరు)

రేపల్లెలో పగలే వెలుగుతున్న దీపం

కొన్ని గ్రామాల్లో వీధిదీపాలు రాత్రి, పగలు తేడా లేకుండా కాంతులు వెదజల్లుతున్నాయి. దీంతో ప్రభుత్వంపై విద్యుత్తు బిల్లుల రూపంలో అదనపు భారం పడుతోంది. వీధిలో స్తంభాలకు ఏర్పాటు చేసిన లైట్లు కొన్నిచోట్ల నిరంతరం వెలుగుతుండగా మరికొన్ని చోట్ల వెలగక అంధకారం అలముకుంటోంది. రాత్రి వేళ రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని స్థానికులు అధికారులకు మొరపెట్టినా ఫలితం ఉండటం లేదు. రేపల్లె, వేమూరు, బాపట్ల నియోజకవర్గాల్లో 12 మండలాల పరిధిలో 234 పంచాయతీలు ఉన్నాయి. కట్టివారి పాలెం, అల్లూరు, పెద గొల్లపాలెం, గాంధీనగర్, కొత్త, పాత నందాయ పాలెం, యాజలి, వరహాపురం, పోతుమర్రు, చాట్రగడ్డ తదితర పంచాయతీల్లో నిరంతరం వీధిదీపాలు వెలుగుతున్నాయి. కొన్నిచోట్ల పూర్తిగా మరమ్మతులకు గురైనా పట్టించుకోవడం లేదు. ఎక్కువ పంచాయతీల్లో ఫ్యూజుబోర్డు ఆపరేటింగ్ సిస్టం లేకపోవడం, స్విచ్‌లు పనిచేయకపోవడమే రాత్రి, పగలు వెలగడానికి కారణమని సిబ్బంది చెబుతున్నారు.

నాణ్యత లేనివి ఏర్పాటుతో...

పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో పంచాయతీల పాలకులు పట్టించుకోవడం లేదు. కొన్ని గ్రామాల్లో ఖర్చు తగ్గించుకునేందుకు నాణ్యత లేని బల్బులు కొని ఏర్పాటు చేయడంతో కొద్దికాలానికే అవి పనిచేయని దుస్థితి నెలకొంది. రోజుకో పంచాయతీని సందర్శించి సమస్యల పరిష్కరించేలా చర్యలు చేపట్టాల్సిన అధికారులు కార్యాలయాలకే పరిమితమవుతున్నారు. గాడితప్పుతున్న వీధిదీపాల నిర్వహణపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలి. 24 గంటలు వెలకుండా చూడటంతోపాటు అంధకారం ఉన్న చోట్ల దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. సమస్యపై రేపల్లె డివిజనల్ అభివృద్ధి అధికారిణి పద్మ మాట్లాడుతూ పంచాయతీల్లోని అన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలిగేలా దృష్టి సారిస్తామని, మరమ్మతులకు గురైన దీపాలు తొలగించి కొత్తవి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

పోటీ ఏదైనా పతకమే లక్ష్యం

చదువుతోపాటు ఆటల్లో రాణిస్తున్న విద్యార్థిని

షూటింగ్‌బాల్ కప్‌తో అనురాధరెడ్డి

న్యూస్‌టుడే, కర్లపాలెం, బాపట్ల

కర్లపాలెం మండలం ఏట్రవారిపాలేనికి చెందిన పిట్టు అనురాధరెడ్డి చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తోంది. ఆమె తల్లిదండ్రులు నాగలక్ష్మి, సుబ్బారెడ్డి. వారిది వ్యవసాయ నేపథ్య కుటుంబం. ఆమె తెనాలిలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. చిన్ననాటి నుంచి క్రీడలంటే ఇష్టం. దిల్లీలో ఇటీవల నిర్వహించిన షూటింగ్ బాల్ మహిళల ప్రపంచకప్ పోటీల్లో భారతజట్టు విజేతగా నిలిచింది. జట్టులో ఏపీ నుంచి అనురాధరెడ్డి ప్రాతినిధ్యం వహించడం విశేషం. అనురాధరెడ్డికి చిన్నప్పటి నుంచి ఆటలంటే ఇష్టం. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో క్రీడల్లో రాణిస్తోంది. 2021లో దిల్లీలో నిర్వహించిన త్రోబాల్ జాతీయస్థాయి పోటీల్లో రజత పతకం సాధించింది. 2023, 2024లో వరుసగా ఝార్ఖండ్‌లో నిర్వహించిన జాతీయస్థాయి సైక్లింగ్ పోటీల్లో బంగారు పతకం కైవసం చేసుకుంది. 2024లో బాపట్ల జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో రజత పతకం సాధించింది. 2022, 2023, 2024, నంద్యాల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు సొంతం చేసుకుంది. 2024లో బాపట్ల జిల్లాలో జరిగిన మల్లఖంబ్ రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించింది. 2023లో కాకినాడలో జరిగిన హాకీ పోటీల్లో రజత పతకం గెలిచింది. 2025లో నేపాల్ జరిగిన ఏషియన్ షూటింగ్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని బంగారు పతకం కైవసం చేసుకుంది. భారత జట్టు షూటింగ్ బాల్‌లో ప్రపంచ కప్ గెలవడం ఆనందంగా ఉందని అనురాధ రెడ్డి చెప్పింది. చదువుతో పాటు క్రీడల్లో రాణించి రక్షణ రంగంలో కొలువు సాధిస్తానంటోంది.

రబీ పంటలపై ఆశలు

పిట్టలవానిపాలెం: రబీలో మినుము, పెసర పంట సాగు చేసిన రైతుల్లో పైరు ఆశలు రేకెత్తిస్తోంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో తుపానుల ప్రభావంతో వరదలు రావటంతో నష్టపోయిన రైతులు రబీ పంటపై ఆశలు పెట్టుకున్నారు. డిసెంబరు మొదటి వారం నుంచి మినుము, పెసర వెదపద్ధతిలో సాగు చేశారు. మండలంలో వెయ్యి ఎకరాల్లో పైరు ఏపుగా పెరిగి ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ముందస్తు గుర్తింపుతో క్యాన్సర్ నివారణ సులువు

శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు

గూడవల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలోని గూడవల్లి కల్యాణ మండపం వద్ద బుధవారం క్యాన్సర్ ఉచిత పరీక్షలు ప్రారంభించారు. హైదరాబాద్ బసవతారకం, ఇండో అమెరికన్ క్యాన్సర్ వైద్యశాల ఆధ్వర్యంలో కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్, గూడూరు ఛారిటబుల్ ట్రస్ట్, గుంటూరు శ్రావణి వైద్యశాల సహకారంతో క్యాన్సర్ అవగాహన, పరీక్షల రెండు రోజుల శిబిరాన్ని వైద్యులు ప్రారంభించారు. ముందస్తుగా గుర్తించడం ద్వారా తగిన చికిత్స అందించే వీలుందన్నారు. పల్లెల్లో ఎక్కువగా ఇలాంటి పరీక్షలను తరచూ నిర్వహించడం ద్వారా ప్రజలకు అవగాహన ఉంటుందన్నారు. మహిళలకు రొమ్ము, గర్భాశయ తదితర క్యాన్సర్ పరీక్షలు నిర్వహించి స్వయంగా మహిళలే వాటిని ఎలా చేసుకోవాలో అవగాహన కల్పించారు. సాధారణ వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. ట్రస్ట్ నిర్వాహకుడు గూడూరు సత్యనారాయణ, వైద్యులు జగదీష్, కృష్ణప్రసాద్, సురేష్, శ్రావణ కుమారి, జ్యోతి, మన్విత, రవిశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలకోటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

అలంకరణలో స్వామి

గోవాడ, (అమృతలూరు), న్యూస్‌టుడే: గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయం వద్దకు బుధవారం భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయ ప్రాంగణం రద్దీగా ఉంది.

సాయిబాబాకు లక్ష తులసి దళార్చన



పూజలందుకున్న సాయిబాబా

బాపట్ల, బాపట్ల వెస్ట్, న్యూస్‌టుడే: పట్టణంలోని కొత్త బస్టాండు వద్ద గల శిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బాబాకు అభిషేకాలు, హారతులు, సాయినామ జపం నిర్వహించారు. బాబాకు లక్ష తులసి దళార్చన చేపట్టారు. సాయిబాబా సేవా సమితి వారు భక్తులకు అన్నదానం చేశారు.

విద్యుత్తు స్తంభం.. కూలేందుకు సిద్ధం

బాపట్లటౌన్, న్యూస్‌టుడే: కర్లపాలెం మండల పరిధి నల్లమోతువారిపాలెం ఎఫ్‌సీఐ గిడ్డంగుల ఎదురుగా జాతీయ రహదారి పక్కన విద్యుత్తు స్తంభం కూలేందుకు సిద్ధంగా ఉంది. స్తంభం పడితే ప్రమాదం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. ఈవిషయమై ఆ శాఖ ఏఈ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ స్తంభానికి వెంటనే మరమ్మతులు నిర్వహించేలా చర్యలు చేపడతామన్నారు.

బండ్లమ్మ ఆలయానికి నీటి శీతలీకరణ యంత్రాలు అందజేత

యంత్రాల వద్ద శ్రీలక్ష్మి, శ్రీలేఖ తదితరులు

చందోలు (పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: చందోలు బండ్లమ్మ అమ్మవారి ఆలయానికి అమెరికాలో ఉంటున్న పాలడుగు రాజగోపాల్-శ్రీలక్ష్మి, శ్రీలేఖ-డానియేల్ దంపతులు నీటి శీతలీకరణ యంత్రాలు బహూకరించారు. రూ.1.10 లక్షల రెండు కూలర్లను అందజేశారు. వారిని ఈవో నరసింహమూర్తి, ఆలయ కమిటీ ఛైర్మన్ చక్రధర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు అభినందించారు.

ఏకీకృత కుటుంబ సర్వే వేగవంతం చేయాలి

చెరుకుపల్లి: ఏకీకృత కుటుంబ సర్వే వేగవంతం చేయాలని ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని సూచించారు. సర్వే పురోగతిపై బుధవారం ఆయన సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 22లోగా సర్వే పూర్తిచేసి మార్చి ఒకటికి గుర్తింపు కార్డులు అందించాల్సిన అవసరం ఉందని కానీ ఇప్పటివరకు కేవలం 65 శాతం మాత్రమే సర్వే పూర్తికావటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా పీ-4 సర్వే, సిటిజన్ ఈకేవైసీ సర్వేలను కూడా పూర్తిచేయాలన్నారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపరిహారం ఇవ్వాలని వినతి

బాపట్ల: రేపల్లె పట్టణంలోని ఓల్డ్‌టౌన్ అరవపల్లి గంగడిపాలెం రోడ్డులో 2022లో రోడ్డు విస్తరణలో భాగంగా అప్పటి ప్రభుత్వం స్థలాలు, బిల్డింగ్‌లు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇవ్వలేదు. బాధితులకు నష్టపరిహారం కింద రూ.1.96 కోట్లు ఆర్‌అండ్‌బీ లేదా మున్సిపాలిటీ వారు ఇవ్వాలని బీజేపీ నేత, బాధితుడు పి.సత్యసాయిబాబు బుధవారం జేసీ భావనకు వినతిపత్రం అందించారు. మోహనకృష్ణ ప్రసాద్, లింగమూర్తి తదితరులున్నారు.

ఉపవాస ప్రార్థనలు ప్రారంభం

ప్రత్యేక ప్రార్థనల్లో యేసుపాదం, విశ్వాసులు

బాపట్ల, బాపట్ల వెస్ట్, న్యూస్‌టుడే: ఏసుక్రీస్తు మానవాళి పాపవిమోచనకు సిలువలో పొందిన శ్రమల జ్ఞాపకంగా క్రైస్తవులు ఆచరించే 40 రోజుల ఉపవాస ప్రార్థనలు పట్టణంలోని రక్షణ సైన్యం దేవాలయం సెంట్రల్ కోర్‌లో బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మేజర్ వి.యేసుపాదం మాట్లాడుతూ ఏసుక్రీస్తు రక్తం చిందించటం ద్వారా మానవులకు పాప క్షమాపణ దొరికిందన్నారు. ప్రతిఒక్కరూ శాంతి, సహనంతో ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. ప్రార్థనలు ఈస్టర్ వరకు జరుగుతాయన్నారు. మేజర్ యోబు, మేజర్ జ్యోతి, వరలక్ష్మి, సామ్రాట్, బెనర్జీ, శరత్ ప్రవీణ్, అబ్రహం, చంటి తదితరులు పాల్గొన్నారు.

చిత్రహింసపై హైకోర్టు ఆగ్రహం

కర్లపాలెం ఎస్సై, కానిస్టేబుళ్ల హాజరుకు ఆదేశం

ఈనాడు, అమరావతి: ఓ వ్యక్తిని పోలీసు స్టేషన్లో అక్రమంగా నిర్బంధించి చిత్రహింసలకు గురిచేశారంటూ దాఖలైన వ్యాజ్యంలో బాపట్ల జిల్లా కర్లపాలెం పోలీసుల తీరుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. బాధితుడికి గాయాలున్న ఫొటోలను పరిశీలించింది. ఈనెల 25న జరిగే విచారణకు హాజరుకావాలని కర్లపాలెం ఎస్సై రవీంద్ర, కానిస్టేబుళ్లు బాలకృష్ణారెడ్డి, తిరుపతయ్యలను ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వై.లక్ష్మణరావు బుధవారం ఈమేరకు ఉత్తర్వులిచ్చారు. ✦ తనను పోలీసులు చిత్రహింసలకు గురిచేశారని పేర్కొంటూ కర్లపాలెం గ్రామానికి చెందిన స్థిరాస్తి వ్యాపారి రేగులగడ్డ విజయబాబు హైకోర్టులో వ్యాజ్యం వేశారు. బాధ్యులైన పోలీసులపై శాఖాపరమైన చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులను ఆదేశించాలని కోరారు. బుధవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరఫు న్యాయవాది సీహెచ్ విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ.. కర్లపాలెం పోలీసులు ఈ ఏడాది జనవరి 2వ తేదీ రాత్రి 8గంటల నుంచి 3 తేదీ రాత్రి 10 గంటల వరకు పిటిషనర్‌ను నిర్బంధించి కర్రలు, బెల్టులతో కొట్టారన్నారు. దీంతో గాయాలయ్యాయన్నారు. బాధితుడి ఒంటిపై గాయాలున్న ఫొటోలను కోర్టు పరిశీలనకు ఇచ్చారు. కర్లపాలెం పోలీసు స్టేషన్లోని సీసీ టీవీ ఫుటేజ్‌ను భద్రపరిచేలా ఆదేశించాలని కోరారు.

తాగునీటికి మూగజీవులు అల్లాడాల్సిందేనా!

న్యూస్‌టుడే, కంకటపాలెం, బేతపూడి (బాపట్లటౌన్)

కొత్తవాడరేవు గ్రామం వెలుపల ఉన్న తాగునీటి తొట్టె

వేసవిలో మూగజీవుల దాహార్తి తీర్చాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పశువులు తాగేందుకు గ్రామాల్లో నీటి తొట్టెల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఉపాధి హామీ కింద వీటిని కొన్నిచోట్ల నిర్మించినా ఇంకొన్నిచోట్ల నిధులు పూర్తిస్థాయిలో మంజూరు కాక అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో ఈ వేసవిలో పశువులకు తాగునీటి ఇబ్బందులు అధికమవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

గత ఏడాది బాపట్ల, చీరాల నియోజకవర్గాలో నీటి తొట్టెలు నిర్మించారు. ఇంతవరకు వాటిల్లో చుక్కనీరు పోయలేదు. నీటి తొట్టెలు గ్రామాలకు వెలుపల, పశువులు ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో నిర్మించారు. అయితే వాటి సమీపంలో చేతిపంపులు ఏర్పాటు చేయలేదు. ఒక్కో నీటి తొట్టెకు రూ.30 వేలకు పైగానే నిధులు కేటాయించారు. నిర్మించిన కొన్నింటికి బిల్లులు ఇంకా రావాల్సి ఉంది. బాపట్ల మండలంలో 4 తొట్టెలు, కర్లపాలెం మండలంలో 2 తొట్టెలు ఏర్పాటు చేశారు. కాని నీటి సౌకర్యం లేదు. చీరాల మండలంలో 9, వేటపాలెం మండలంలో 6 తొట్టెలు ఏర్పాటు చేశారు. వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లో వీటి ఊసేలేదు. ఈ విషయమై ఎన్ఆర్ఈజీఎస్ బాపట్ల ఏపీవో రామ్ కుమార్ మాట్లాడుతూ పొలాలు, గ్రామాల్లో నీటి తొట్టెలు నిర్మించిన కొన్నిచోట్ల బావులు ఉన్నాయి. కొన్నిచోట్ల చేతిపంపులు అవసరం. సమస్యను ఉన్నతాధికారులకు వివరించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

చుక్కనీరు పోయలేదు: గత ఏడాది గ్రామం వెలుపల నీటి తొట్టె నిర్మించారు. అందులో ఇంతవరకు నీరు పోయలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు తొట్టె నిండింది. దానిలోని నీరు పశువులు తాగాయి. తొట్టె నిర్మించిన ప్రాంతంలో చేతి పంపు, బావి వంటివి లేవు. ఇక్కడ చేతిపంపు ఉంటే మేలు. **- కె.సుబ్బారెడ్డి, కొత్తవాడరేవు**

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని వినతి

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దారు శ్రీనివాసరావుకు బుధవారం వినతిపత్రం అందించారు. మండల సంఘ అధ్యక్షుడు కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా వీఆర్‌ఏల జీతాలు పెరగటం లేదని చెప్పారు. తెలంగాణలో అమలు చేసినట్లు రాష్ట్రంలోనూ జీతాలను అమలు చేయాలన్నారు. రీసర్వేలో తాము కీలక బాధ్యత వహించామని చెప్పారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు చంద్రశేఖరరావు, భాగ్యారావు, వీరయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

కొల్లూరు, న్యూస్‌టుడే: కొల్లూరు జగనన్న నివేశన స్థలాల్లో జూదం ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో బుధవారం దాడి చేశారు. పదిమందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.6810 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు హాజరు పరుస్తామని తెలిపారు.

డాక్యుమెంట్స్ పోయినవి

పులిమి మీనా W/o కె.వి.సందీప్ Door No: 13-30, కనగాల గ్రామం చెరుకుపల్లి మండలం అను నాకు బాపట్ల పట్టణం హయ్యర్ నగర్, 32వ వార్డు ఏరియాలో సర్వేనెం: 386/3లో 0.03 సెంట్లు స్థలము దాని డాక్యుమెంట్ నెం: 1332/2021 పోయినది. ఎంత వెతికినా దొరకలేదు. దొరికినవారు సంప్రదించగలరు.

✆ : 99512 40270

నిధులు వ్యయం.. పనులు నాసిరకం

పెదపులివర్రు రహదారి

న్యూస్‌టుడే, పెదపులివర్రు (భట్టిప్రోలు) : భట్టిప్రోలు నుంచి పెదపులివర్రుకు వెళ్లే రహదారి ఏళ్లుగా గుంతలు పడి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పెనుమూడికి వెళ్లే వాహనాలు ఈ మార్గంలోనే ప్రయాణిస్తుంటాయి. ఎట్టకేలకు గత ఏడాది రూ.20 లక్షలతో మరమ్మతులు చేశారు. ప్రస్తుతం రాళ్లు లేచి అక్కడక్కడ గుంతలు పడ్డాయి. పనుల్లో తగిన నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో ఏడాదిలోపే దెబ్బతింటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఈ మార్గంలో లంక గ్రామాల రైతుల వాణిజ్య పంటలు తరలించే వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారికి చేపట్టిన మరమ్మతుల్లో అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో గుత్తేదారుడు మమ అనిపించారు. తారు తగిన పరిమాణంలో వాడకపోవడంతో ఏడాదిలోపే రాళ్లు లేస్తున్నాయి. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ విద్యాసాగర్ మాట్లాడుతూ పొలాల వెంబడి రోడ్డు కావడంతో దెబ్బతిని ఉండవచ్చని తెలిపారు. కొత్తగా తారు రోడ్డుకు అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని చెప్పారు.

దారి మధ్యలో విగ్రహం.. ప్రమాదాలు నిత్యకృత్యం

చెరుకుపల్లి ఐలాండ్ కూడలిలో ఇదీ పరిస్థితి

న్యూస్‌టుడే, చెరుకుపల్లి గ్రామీణ : తీరంలోని ఇతర ప్రాంతాలను అనుసంధానం చేసే చెరుకుపల్లిలో రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ఐలాండ్ కూడలి వద్ద తెనాలి, రేపల్లె, పొన్నూరు, గుంటూరు, బాపట్ల, చీరాల, నిజాంపట్నం ప్రాంతాలకు వెళ్లే వారు ఇక్కడ బస్సులు, ఆటోలు ఎక్కుతుంటారు. వాహనాల రాకపోకలతో కూడలి నిత్యం రద్దీగా ఉంటుంది. 1985 ప్రాంతంలో ఇక్కడి కంకర రోడ్డు ఉండేది. కూడలిలో అప్పట్లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కాలక్రమంలో రోడ్డు జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ అయింది. 2018లో రెండులైన్‌లుగా రోడ్డు విస్తరణ చేపట్టారు. పనులు పూర్తయి మూడేళ్లకు పైనే అవుతోంది. చెరుకుపల్లిలో రోడ్డు పక్కనే ఉన్న గాంధీ, నెహ్రూ, కృష్ణదేవరాయలు ఇతర విగ్రహాలను అప్పట్లో జాతీయ రహదారి అధికారులు తొలగించి పోలీస్‌స్టేషన్ వద్ద ఉంచారు. కూడలిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించే ప్రతిసారి గొడవలు జరగడంతో దాన్ని అలాగే ఉంచి రోడ్డు వేసి గుత్తేదారులు వెళ్లిపోయారు. ఈ విగ్రహం ఒంగోలు-దిగమర్రు లైన్‌లో రోడ్డు మధ్యలోకి వచ్చింది. ఈ మార్గంలో వచ్చే వాహనదారులు ఇక్కడ ప్రమాదాలకు గురవుతున్నారు. కలెక్టర్ స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని వాహనదారులు కోరుతున్నారు.

వివరాలు ఇలా..	
కూడలిలో ఉన్న మార్గాలు: తెనాలి, రేపల్లె, బాపట్ల, పొన్నూరు, నిజాంపట్నం	
నిత్యం రాకపోకలు సాగించే వాహనాల సంఖ్య: సుమారు 19వేలు	
గత ఆరు నెలల్లో జరిగిన ప్రమాదాలు: 65	
మృతులు: ముగ్గురు	క్షతగాత్రులు: 50 మంది

కూడలిలో అంబేడ్కర్ విగ్రహం

ప్రత్యేక పూజలు

బాపట్ల: పట్టణంలోని పిఠాపురం నుంచి శ్రీపాద శ్రీవల్లభ పాదుకలు దేశవ్యాప్త ఊరేగింపు యాత్రంలో భాగంగా బుధవారం బాపట్లకు వచ్చాయి. ఈసందర్భంగా స్థానిక వేద విద్యార్థులతో పాదుకలకు వేద పారాయణం, అభిషేకం, అనంతరం సిద్ధ మంగళ స్తోత్ర పారాయణం జరిగింది. బాబు నాగేంద్ర, భుజంగేంద్ర మౌలి, సీహెచ్ రామశర్మ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ తెనాలి 11వ అదనపు జిల్లా జడ్జీవారి కోర్టులో
ఇ.పి. నెం. 149/2019 ఇన్ ఓ.యస్.నెం. 44/2014
బిట్వీన్:
సోము భాస్కర రెడ్డి ....డి. హెచ్. ఆర్.
మరియు
గొర్రెపాటి ప్రభాకర లక్ష్మీ మరియు 7 ఇతరులు ...జె.డి. ఆర్స్

పైనెంబరు ఇ.పి.వారెంటు పైకము మొత్తము రూ.25,69,250/- బాకీకి గాను ఈ దిగువ షెడ్యూలు దాఖలా జె.డి.ఆర్.తాలుకు స్థిరాస్తిని, పై కోర్టువారి ఎదుట ది.05-03-2026వ తేదీన ఉ.గం.10-30ని.లకు వేలంవేయబడును. కావలసినవారు వేలంలోపాల్గొని పాట పాడుకొనవచ్చును.

షెడ్యూలు:ఐటం-1:గుంటూరు డి॥, చేబ్రోలు సబ్.రి.డి. వేటపాలెం పంచాయితీ & గ్రామం నందు డి.నెం.397/3, యస్.నెం.424/6 య. 0.77 1/2సెంట్ల విస్తీర్ణంగల మెట్టభూమికి హద్దులు. తూర్పు: గొర్రెపాటి కోటి రెడ్డి భూమి, దక్షిణం:గొర్రెపాటి కోటి రెడ్డి భూమి, పడమర: తుంగభద్ర కెనాల్, ఉత్తరం: కొసన కోటేశ్వరరావు భూమి. ఈ హద్దుల మధ్య య.0.77 1/2 శెంట్లు.
డి.హెచ్.ఆర్.విలువ:1,50,000/-
అమీనా విలువ:23,25,000/-

ఐటం-2:గుంటూరు డి॥, తెనాలి సబ్.రి.డి. చుండూరు పంచాయితీ, చుండూరు గ్రామం నందు డి.నెం.55/1బిలో, య.1.50 శెంట్లు విస్తీర్ణం గల మాగాణి భూమికి హద్దులు.తూర్పు: ఉయ్యూరి సీతారామి రెడ్డి, దక్షిణం: గొర్రెపాటి కోటి రెడ్డి భూమి, పడమర: ఐటం నెం.3,ఉత్తరం: కెనాల్.ఈ హద్దుల మధ్య, య.1-50శెంట్లు.
డి.హెచ్.ఆర్.విలువ:3,00,000/-
అమీనా విలువ:45,00,000/-

ఐటం-3:గుంటూరు డి॥, తెనాలి సబ్.రి.డి. చుండూరు పంచాయితీ, చుండూరు గ్రామం నందు డి.నెం.54లో, య.2.68 శెంట్లు విస్తీర్ణం గల మాగాణి భూమికి హద్దులు.తూర్పు:ఐటం నెం.2 మరియు గొర్రెపాటి కోటిరెడ్డిభూమి, దక్షిణం:ఈమని వెంకటరామిరెడ్డిభూమి, పడమర: పదాల దశరధరామయ్యభూమి, ఉత్తరం:కెనాల్. ఈ హద్దులమధ్య,య.2-68శెంట్లు.
డి.హెచ్.ఆర్.విలువ:5,00,000/-
అమీనా విలువ:50,40,000/-
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వేలం తేది:05-03-2026.
ఫరదర్ హియరింగ్ : 11-03-2026
నోట్:ఇ.పి.మరియు ఇతర వివరములు శ్రీ కోర్టు నాజర్‌గారి వద్ద గాని లేదా డి.హెచ్.ఆర్.గారి న్యాయవాది వద్ద గాని తెలుసుకొనవలెను.

పి. రాజారావు, B.Sc., B.L. డి.హెచ్.ఆర్. తరపు అడ్వకేట్, గుంటూరు.సెల్ : 9985569554, 9490187849

భాషలు వేరైనా అంతా భారతీయులమే

జంపని (వేమూరు), న్యూస్‌టుడే: దేశంలో వివిధ ప్రాంతాల్లో వేర్వేరు భాషలు మాట్లాడుతున్నా అంతా భారతీయులమే అని ప్రధానోపాధ్యాయుడు బదరీనారాయణ తెలిపారు. సర్వశిక్ష అభియాన్ ఆదేశాల మేరకు జంపని ఉన్నత పాఠశాలలో బుధవారం ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తమిళనాడు, కర్ణాటక, పంజాబ్, కేరళ తదితర రాష్ట్రాలకు సంబంధించిన వ్యక్తుల వేషధారణ, భాషల గురించి విద్యార్థులకు వివరించారు.

ధర్మరక్షణకు పాటుపడాలి

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: హిందువులు శివాజీ స్ఫూర్తితో ధర్మరక్షణకు పాటుపడాలని జిల్లా ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ అన్నారు. ఛత్రపతి శివాజీ జయంత్యుత్సవాలు పురస్కరించుకుని భట్టిప్రోలులో ఫౌండేషన్ సభ్యుల సమావేశం జరిగింది. హిందువులందరూ ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మహిళా ప్రముఖ్ బూర్లె అరుణకుమారి, ఫౌండేషన్ సభ్యులు జంజనం హేమశంకరరావు, వేల్పూరి శ్రీనివాసరావు, కె.రవితేజ, చింతల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమాజ హితుడు నాగేశ్వరరెడ్డి

నాగేశ్వరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వేగేశన నరేంద్ర వర్మ

బాపట్ల, న్యూస్‌టుడే: సామాజిక స్పృహ కలిగిన కార్యకర్త మున్నం నాగేశ్వరరెడ్డి అకాల మృతి తీరని లోటని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. కొన్ని నెలల క్రితం నాగేశ్వరరెడ్డి మృతిచెందగా ఆయన కుమారుడు ఏడుకొండలరెడ్డి ఆధ్వర్యంలో కొత్త వాడరేవులో ఆయన స్మృతి వనం, విగ్రహాన్ని బుధవారం వేగేశన నరేంద్రవర్మ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నాగేశ్వరరెడ్డి నిత్యం గ్రామానికి, ప్రజలకు ఏదొక మంచి పని చేయాలని తపిస్తారన్నారు. సమాజం మేలుకోరే మంచి వ్యక్తి దూరమవటం బాధాకరమన్నారు. మార్కెట్‌యార్డు ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బంకులున్నాయి.. సౌకర్యాలేవీ!

★ **పిట్టలవానిపాలెం మండలం అల్లూరు గ్రామానికి చెందిన సుబ్బారావు** కుటుంబంతో ద్విచక్ర వాహనంపై బంధువుల ఇంటికి వెళ్తూ మార్గమధ్యలో ఇంధనం కోసం పెట్రోలు బంకు వద్ద ఆగారు. పిల్లాడికి అత్యవసరమైంది. మరుగుదొడ్లపై ఆరా తీస్తే లేవని సిబ్బంది చెప్పారు. దీంతో ఇబ్బంది పడ్డారు.

★ **భట్టిప్రోలుకు చెందిన వెంకటేష్** ద్విచక్ర వాహనంపై చీరాల వెళ్తున్నారు. కొద్ది దూరం వెళ్లాక టైరులో గాలి తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. రోడ్డు పక్కన కనిపించే బంకు వద్దకు వెళ్తే గాలికొట్టే పంపు పనిచేయడం లేదని చెప్పారు.

వీరిద్దరే కాదు. నిత్యం వేలమంది వాహనచోదకుల అవస్థలివి. పలుచోట్ల బంకు నిర్వాహకులు ఆదాయంపై దృష్టి పెడుతున్నారు తప్ప వినియోగదారులకు కనీస వసతులు కల్పించడం లేదు. గాలి మిషన్లు, తాగునీరు, మరుగుదొడ్లు తప్పనిసరిగా ఉండాలి. వీటి విషయం పట్టించుకోవడం లేదు.

ఇదీ పరిస్థితి

మరుగుదొడ్లు: దూరప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు, ప్రయాణికులు వినియోగించుకునేందుకు మరుగుదొడ్లు, శుభ్రత గదులు విధిగా ఉండాలి. చాలాచోట్ల కనిపించడం లేదు. ఉన్న చోట శుభ్రత పాటించడం లేదు. దుర్వాసన వెదజల్లుతున్నాయి.

అగ్ని ప్రమాద నివారణ సామగ్రి : మంటలు చెలరేగితే నియంత్రించేందుకు అవసరమైన పరికరాలు విధిగా అందుబాటులో ఉంచాలి. ఇందుకోసం ఎస్టింగ్విషర్లు, ఇసుక బకెట్లు ఉండాలి. ఎస్టింగ్విషర్లలో రసాయనాలు సరిగా ఉండటం లేదు. అగ్ని మాపక సిబ్బంది అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా కొందరు నిర్వాహకులు పెద్దగా శ్రద్ధ చూపడం లేదు.

కానరాని గాలిపంపులు: వాహనాలకు ఇంధనం కొట్టించే సమయంలో టైర్లలో గాలి తక్కువగా ఉంటే నింపేందుకు వీలుగా గాలిపంపులు ఏర్పాటు చేయాలి. కొన్ని పెట్రోలు బంకుల వద్ద పాడై ఉండగా, మరికొన్ని చోట్ల కానరావడం లేదు.

నీటి సౌకర్యం : ప్రతి పెట్రోలు బంకులో నీటి సౌకర్యం అందుబాటులో ఉండాలి. చాలామంది నిర్వాహకులు చిన్న, చిన్న డబ్బాల్లో నీరు నింపి చేతులు దులిపేసుకుంటున్నారు. మరికొన్నిచోట్ల నీరున్నా తాగేందుకు పనికిరాని పరిస్థితి. సగం బంకుల్లో సౌకర్యాలు ఉండటం లేదు.

–న్యూస్‌టుడే, చందోలు (పిట్టలవానిపాలెం), బేతపూడి (బాపట్ల)

(c) eenadu

చీరాల

• చీరాల • పర్చూరు

రుద్రభూమి స్థలం.. వ్యర్థాలమయం

రోడ్డు పక్కన శ్మశాన స్థలం ఇలా..

కడవకుదురు ఆర్టీసీ బస్‌స్టాండ్‌కు సుమారు 50 మీటర్ల దూరంలో చీరాల, ఒంగోలు పట్టణాలకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు పక్కనే బీసీల రుద్రభూమి సుమారు ఎకరం విస్తీర్ణంలో ఉంది. ఈ ప్రాంతంలో సెంటు భూమి రూ.లక్షల్లో ఉంది. అంత విలువైన భూమిపై... శ్మశాన స్థలంగా భావించి సమీప ఇళ్లకు చెందిన కొందరు కోళ్ల తదితర జంతువుల వ్యర్థాలు, రకరకాల వ్యర్థాలు తెచ్చి రోడ్డు పక్కనే వేసి వెళుతున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీనిపక్క ఈ ప్రాంతానికి సుమారు 20 మీటర్ల దూరంలో ఆర్అండ్‌బీ రోడ్డును ఆనుకుని తూర్పు వైపున ఉన్న గృహాల వారు ఇబ్బంది పడుతున్నారు. ఆ ప్రాంతంలో వ్యర్థాలు వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై గ్రామ కార్యదర్శి వి.శ్రీనివాసరావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఆ ప్రాంతాన్ని పరిశీలించి, వ్యర్థాలు వేయకుండా తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. - న్యూస్‌టుడే, కడవకుదురు (చినగంజాం)

పరీక్షల అట్టల అందజేత

వేటపాలెం: స్థానిక బాలికోన్నత పాఠశాలకు చెందిన 140 మంది పదో తరగతి విద్యార్థినులకు బండ్ల బాపయ్య ఉన్నత పాఠశాలలో 1999-2000 పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో పరీక్షల అట్టలతో పాటు పెన్నులను బుధవారం అందజేశారు.

20లోపు నమోదు చేసుకోవాలి

యద్దనపూడి: రబీలో పంటలు సాగుచేసిన అన్నదాతలు ఈనెల 20లోపు స్థానిక రైతు సేవాకేంద్రాల ద్వారా ఈ-పంట నమోదు చేయించుకోవాలని ఏవో కుమారి కోరారు. ఈ-పంట నమోదైతేనే పంటలను మద్దతు ధరపై విక్రయించుకునే అవకాశం ఉంటుందన్నారు.

కూరగాయల అంగళ్లు.. కనిపించని ప్రగతి మెరుపులు

జాండ్రపేట, ఈపూరుపాలెం, రామకృష్ణాపురం (చీరాల గ్రామీణం), న్యూస్‌టుడే

ఏటా లక్షలు సంపాదించి పెడుతున్నా... కూరగాయల అంగళ్లు అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఆదాయంలో కొంత భాగం వ్యయం చేయాల్సి ఉన్నా, అధికారులు ఆ దిశగా ఆలోచించడంలేదు. ఇదీ చీరాల మండలంలోని పలు గ్రామాల పరిస్థితి. ఒకవైపు సొంత ఆదాయం పక్కదారి పడుతుండగా... మరోవైపు ప్రత్యేక నిధులు మంజూరు కాక దశాబ్దాలుగా కనీస వసతులు సమకూరడం లేదు. ఏటా రూ.2.50 లక్షల ఆదాయం వస్తున్న జాండ్రపేటలో కూరగాయలు, చేపలు, మాంసం మార్కెట్ పంచాయతీ కార్యాలయం సమీపంలో ప్రధాన రహదారిపై నడుస్తోంది. దశాబ్దాలుగా సమస్య వేధిస్తున్నా.. అభివృద్ధి చెందడం లేదు. పైన పాలిన రేకులు, కింద మెరక లేని నేలతో వ్యాపారులతో పాటు వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. దీనికితోడు విద్యుత్తు సౌకర్యం అందరికీ లేకపోవడంతో.. సాయంత్రమైతే వ్యాపారులు ప్రధాన రహదారిపైకి వచ్చి దుకాణాలు పెట్టుకోవాల్సి, విక్రయించాల్సి వస్తోంది. ఫలితంగా కొన్నిసార్లు రాకపోకలకు అవస్థలు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు.

జాండ్రపేటలో రహదారిపైనే విక్రయాలు

ఏటా రూ.5 లక్షల ఆదాయం కలిగిన ఈపూరుపాలెం కూరగాయల అంగడిది మరో పరిస్థితి. 103 మంది విక్రేతలు ఉండగా... 54 దుకాణాలే ఉన్నాయి. దీంతో సగం మంది ఉపాధి కోల్పోయారు. సగం స్థలం ఖాళీగా ఉంది. గతంలో ఇచ్చిన హామీ మేరకు ఐందులోనూ దుకాణాలు నిర్మించాలని కమిటీ ప్రతినిధులు కోరుతున్నారు. రామకృష్ణాపురం గుంట మార్కెట్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. వ్యాపారులు, పాటదారుని మధ్య వివాదం నెలకొంది. అధిక ధరలు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ వదిలి వెళ్లిపోయారు. దీంతో పంచాయతీకి ఆదాయం నిలిచిపోయింది. మాంసం అంగడి ఉన్నా... ఈ ఆదాయమూ సమకూరడం లేదు. స్థానిక శాసనసభ్యుడు అంగళ్ల సమస్యలపై దృష్టి సారించి, ప్రత్యేక నిధులతో అభివృద్ధి చెందేలా చొరవ తీసుకోవాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

పూడిక తీయక.. మురుగు కదలక

బస్‌స్టేషన్ సమీపంలో కాలువ దుస్థితి

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ఇంకొల్లు మేజరు పంచాయతీలో ప్రధాన రహదారుల పక్కన కాలువల్లో మురుగు పేరుకుపోతోంది. పాతచెన్నై రహదారిలోని సినిమా హాళ్ల వద్ద కాలువలు ఆక్రమించి, నిర్మాణాలు చేపట్టడంతో పంచాయతీ కార్మికులు పూడిక తీయడం సాధ్యంకావడంలేదు. బస్‌స్టేషన్ సమీపంలోని కాలువలో మురుగు అయ్యప్ప దేవాలయం వెనుక భాగంలో కలిసేచోట కాలువపై బండలు లేకపోవడంతో సమీప వ్యాపారులు, ఇళ్లలోనివారు వ్యర్థాలు వేస్తున్నందున మురుగు కదలక దుర్వాసన వెదజల్లుతోంది. ఇక గంగానమ్మ రహదారిలోని సచివాలయం-2 పక్కన కాలువ జమ్ము, ఇతర వ్యర్థాలతో నిండి ఉంది. పంచాయతీ అధికారులు తరచూ జేసీబీతో పూడిక తీయిస్తున్నా పరిస్థితిలో మార్పు కనిపించడంలేదు. గ్రామంలో పలువీధుల్లో ఆక్రమణల కారణంగా కాలువలు ఇరుకై, మురుగు దిగువకు వెళ్లక పూడిక ఏర్పడుతోంది. గ్రామంలో విశాలమైన కాలువలు నిర్మించి, మురుగు సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై కార్యదర్శి రామసుబ్బారెడ్డి వివరణ కోరగా కాలువల నిర్మాణానికి అంచనాలు తయారు చేసి పంపామని, నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.

మహిళలు ఆర్థికంగా ఉన్నతికి చేరాలి

మాట్లాడుతున్న ఏపీఎం అనూరాధ

ఇంకొల్లు, న్యూస్‌టుడే: మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే జీవనోపాధులు మెరుగు పరుచుకోవాలని వెలుగు ఏపీఎం అనూరాధ పేర్కొన్నారు. బుధవారం వెలుగు కార్యాలయంలో జీవనోపాధి ప్రణాళికపై శిక్షణ నిర్వహించారు. అనూరాధ మాట్లాడుతూ ఈనారీ, సీఆర్పీలకు జీవనోపాధుల సర్వే కోసం యాప్ అందుబాటులోకి వచ్చిందన్నారు. సంఘాల్లోని ప్రతి సభ్యురాలి వివరాలు యాప్ ద్వారా నమోదు చేయాలని చెప్పారు.

కారంచేడు, న్యూస్‌టుడే: మహిళలు ఆర్థికంగా ఉన్నతికి చేరేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఏపీఎం కె.రామకృష్ణ తెలిపారు. బుధవారం కారంచేడు వెలుగు కార్యాలయంలో సీఆర్పీలకు ఈ-నారీ శిక్షణ ఇచ్చారు. సీసీలు శ్రీనివాస మూర్తి, ప్రభావతి, నరసింహ పాల్గొన్నారు.

ఇసుక టిప్పరు స్వాధీనం

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: ఎటువంటి అనుమతుల్లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ని మూడు రోడ్ల కూడలిలో రెండో పట్టణ పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాంబాబు తెలిపారు.

బడికి మైక్‌సెట్, కుర్చీలు అందజేత

కొమర్నేనివారిపాలెం (పర్చూరు), న్యూస్‌టుడే: మండలంలోని కొమర్నేనివారిపాలెం యూపీ పాఠశాలకు మైక్‌సెట్, కుర్చీలను కొల్లా సాకేత్ ఫౌండేషన్ ద్వారా నాగబడి సుబ్బారావు బుధవారం అందజేశారు. సుమారు రూ.20 వేల విలువైన సామగ్రిని అందించిన సుబ్బారావును పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్, నాగభైరు శ్రీనివాసరావు కొనియాడారు. హెచ్‌ఎం భారతీదేవి, కోమటి ఆంజనేయులు, మున్నంగి వెంకటసుబ్బయ్య, ధూళిపాల సత్యనారాయణ, ఎల్.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాకుంభాభిషేక మహోత్సవాలు

పేరాల, న్యూస్‌టుడే: చీరాల పట్టణం జోసేనగర్‌లోని శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానం పునఃప్రతిష్ఠ జరిగి 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నాలుగురోజుల పాటు నిర్వహించనున్న మహాకుంభాభిషేక మహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆలయ ధర్మకర్త బొలిశెట్టి నరసింహస్వామి మాట్లాడుతూ మహోత్సవాలకు భక్తులు తరలివచ్చి, జయప్రదం చేయాలని కోరారు.



హోమంలో వేదపండితులు

వలపర్ల ఉన్నత పాఠశాల పరిశీలన

వలపర్ల(మార్టూరు), న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సమగ్ర శిక్ష అధికారి చైతన్య, ఇంజినీర్ రాజన్ కోరారు. మండలంలోని వలపర్ల ఉన్నత పాఠశాలను బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పీఎం శ్రీ పథకం అమలుతీరును పరిశీలించారు. కెమిస్ట్రీ ల్యాబ్, క్రీడా మైదానం, కిచెన్ గార్డెన్, వాటర్ హార్వెస్టింగ్ (రెయిన్ వాటర్) ప్లాంట్, ర్యాంప్ రెయిల్స్ వంటి అంశాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వారితో హెచ్‌ఎం కల్యాణి, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ రమేష్, పీఈటీ రవివేదరాజ్ ఉన్నారు.

చెత్తకుప్పలు.. రాకపోకలకు అవస్థలు

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: చీరాల సంగం థియేటర్ ఎదురు సందు నిత్యం ట్రాఫిక్‌తో రద్దీగా ఉంటుంది. గడియార స్తంభం కూడలి, ఏలూరు రోడ్డు, బోస్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి అధికంగా ఈ మార్గం ద్వారానే ఇస్లాంపేట, ఉడ్‌నగర్, యాదవపాలెం వెళుతుంటారు. ఈ రహదారి తరచూ చెత్త కుప్పలతో నిండిపోవడంతో రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. గృహాల నుంచి వస్తున్న చెత్తతో పాటు హోల్‌సేల్ పండ్ల దుకాణాలు చెంతనే ఉండటంతో కుప్పలు దర్శనమిస్తున్నాయి. దీంతో ఆవులు చేరి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయి. దీనికి తోడు ఇరువైపులా మురుగు కాలువలపై సిమెంట్ స్లాబులు అమర్చకపోవడంతో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు అందులో చేరి పరిసరాలను దుర్గంధభరితంగా మారుస్తున్నాయి. పురపాలక శాఖాధికారులు సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సంగం థియేటర్ ఎదురు సందులో...

అసెంబ్లీ సమావేశాలు ప్రత్యక్షంగా తిలకించి..

విద్యార్థులతో ఎమ్మెల్యేలు కొండయ్య, వసంత వెంకట కృష్ణప్రసాద్

వేటపాలెం, న్యూస్‌టుడే: బండ్ల బాపయ్య హిందూ ఉన్నత పాఠశాలలో 8, 9వ తరగతులు చదువుతున్న 30 మంది విద్యార్థులు అమరావతిలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించేందుకు బుధవారం అవకాశం లభించడంతో అక్కడికి వెళ్లారు. వీరిని ఎమ్మెల్యే కొండయ్యతో పాటు మైలవరం శాసన సభ్యుడు వసంత వెంకట కృష్ణప్రసాద్ కలిసి మాట్లాడారు. కొండయ్య మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే రాజకీయ చైతన్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడం ఎంతో అవసరమని, ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టసభలు ఎలా పనిచేస్తాయి, ప్రజా సమస్యలపై చర్చలు ఎలా జరుగుతాయని అనే అంశాలను నేరుగా తెలుసుకోవడం ద్వారా విద్యార్థుల్లో బాధ్యత, ప్రజాసేవా స్ఫూర్తి కలుగుతుందని చెప్పారు.

'రొంపేరు' పునరుద్ధరణకు రూ.26.50 కోట్లు మంజూరు

మార్టూరు, న్యూస్‌టుడే: రొంపేరు వరద కాలువ పునరుద్ధరణ పనులకు ప్రభుత్వం రూ.26.50 కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వెల్లడించారు. ఈ కాలువను అభివృద్ధి చేస్తే నియోజకవర్గంలోని రైతులు వరదల సమయంలో పంటలు కోల్పోకుండా బయట పడతారని అన్నారు. సుమారు 75 వేల ఎకరాలు ముంపు బారి నుంచి బయటపడతాయని చెప్పారు. ఆ మేరకు బుధవారం మంత్రి నిమ్మల రామానాయుడ్ని మంగళగిరిలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. రొంపేరు పరివాహక ప్రాంత రైతులు అధిక వానల సమయంలో పంటలు నీట మునిగి, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, చేతికందే కోట్లాది రూపాయల పంటలు కోల్పోవల్సి వస్తోందని మంత్రి నిమ్మలకు వివరించారు. అంతేకాక మార్క్‌ఫెడ్ ద్వారా శనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి, క్వింటా మద్దతు ధర రూ.5,875 ప్రకటించడంపై ఏలూరి హర్షం వ్యక్తం చేశారు.

మంత్రి నిమ్మలతో ఎమ్మెల్యే ఏలూరి తదితరులు

నాణ్యమైన విద్యుత్తు అందించడమే లక్ష్యం

చీరాల, న్యూస్‌టుడే: నాణ్యమైన విద్యుత్తు అందించడానికి నూతన ఉపకేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య తెలిపారు. పట్టణంలోని ఎఫ్‌సీఐ గోదాముల సమీపంలో దండుబాట రోడ్డు వద్ద నూతనంగా నిర్మిస్తున్న 33/11 కేవీ విద్యుత్తు ఉపకేంద్రానికి బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మున్సిపల్ ఛైర్మన్ ఎం.సాంబశివరావు, ఎస్ఈ ఆంజనేయులు, ఈఈ జాన్ థామస్, డీఈ బి.హరిప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

✦ లింగవిభేదాలు లేకుండా మహిళలను పురుషులతో సమానంగా ప్రోత్సహించినపుడే సమాజం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. దేశాయిపేట వద్ద జెండర్ రీసోర్స్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. 12 స్వయం సహాయ సంఘాలకు రూ.2.40 కోట్ల చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు రెండు కార్లు, రెండు పానీ పూరి బళ్లు అందజేశారు. అనంతరం పందిళ్లపల్లిలోని గౌడపాలెంలో విద్యుత్తు నియంత్రికను ప్రారంభించారు. ఏటీఎం మధుసూదనరావు, ఏపీఎం అంజిబాబు, నాశిక వీరభద్రయ్య పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి కూరగాయల వితరణ

వాహనానికి ప్రత్యేక పూజలు చేస్తున్న లక్ష్మీప్రసాద్ దంపతులు

జొన్నతాళి (మార్టూరు): శ్రీవారి సన్నిధిలో నిర్వహించే నిత్యాన్నదానానికి పారిశ్రామికవేత్త రూ.2 లక్షల విలువైన 11600 కిలోల కూరగాయలను తితిదే ప్రతినిధులు, శ్రీవేంకటేశ్వర స్వామి భక్త సమాజం సహకారంతో వితరణ చాటారు. మండలంలోని జొన్నతాళి కామేపల్లి గ్రానైట్ ప్రాంగణంలో బుధవారం పారిశ్రామికవేత్త కామేపల్లి లక్ష్మీప్రసాద్ సొంత నిధులు వెచ్చించి, వివిధ రకాల కూరగాయలు సేకరించి తిరుమల నుంచి విచ్చేసిన ప్రత్యేక వాహనంలో సరకును లోడుచేసి తరలించారు. శాస్త్రోక్తంగా పూజలు ఆచరించి, శ్రీవారి నామస్మరణ మధ్య వాహనాన్ని పంపించారు. గ్రానైట్ యజమానులు పత్తిపాటి సురేశ్, కంభంపాటి శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

కోలలపూడిలో పోలీస్ పికెట్

మార్టూరు, న్యూస్‌టుడే: మండల పరిధి కోలలపూడిలో ఇటీవల ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇరువర్గాల మధ్య నెలకొన్న గోడ వివాదం ఉద్రిక్తతకు దారి తీసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా పోలీస్ సిబ్బందితో పికెట్ ఏర్పాటు చేసినట్లు ఎస్సై సైదా బుధవారం తెలిపారు. ప్రజలు సామరస్యంగా మెలగాలని ఆయన కోరారు.

అంతర్గత రోడ్డు అధ్వానం

పేరాల, న్యూస్‌టుడే: పట్టణంలోని 25వ వార్డు ప్రకాష్‌నగర్‌లో అంతర్గత రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. దీనికి తోడు డ్రైనేజీ వ్యవస్థ సైతం దెబ్బతింది. వార్డులో సీసీ రోడ్డు, మురుగు కాలువ ప్రారంభంలో పూర్తిగా దెబ్బతినడంతో ఆ వైపు రాకపోకలు సాగించేందుకు ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. మున్సిపల్ అధికారులు అంతర్గత రోడ్లు, డ్రైనేజీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యక్తిగత ఇళ్లపై మక్కువ

న్యూస్‌టుడే, కొత్తపేట (చీరాల అర్బన్)

సొంతిల్లు లేని ఉద్యోగులు, వ్యాపారులు బహుళ అంతస్థులపై మక్కువ చూపేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి మారుతోందని చెప్పొచ్చు. వ్యక్తిగతంగా ఉన్న ఇంటిపైనే ఆసక్తి చూపుతున్నారు. దీంతో బిల్డర్లు సైతం ఇలాంటివి నిర్మించి విక్రయించేందుకు ముందుకొస్తున్నారు. కొత్తపేటతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో గడిచిన అయిదేళ్ల నుంచి స్థిరాస్తి వ్యాపారులు వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా ఇంటిని నిర్మించడమే కాకుండా కప్‌బోర్డులు, సీలింగ్, మార్బుల్ లాంటి వాటితో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. కేవలం మూడు సెంట్ల స్థలంలో ఇటువంటి వాటిని ఏర్పాటు చేస్తున్నారు. నాలుగు సెంట్ల స్థలంలో అయితే ఏకంగా కారు పార్కింగ్ ఉండేలా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం కొత్త ఇల్లు కట్టుకోవాలంటే కనీసం ఆరునెలలు పడుతోంది. ఈ సమయంలో పనివారితో ఇబ్బందులు... భార్యాభర్తలు ఉద్యోగులైతే అసలు తీరిక ఉండదు. దీంతో అన్ని సౌకర్యాలతో నిర్మించి వాటిని కొనుగోలు చేయడానికి ముందుకొస్తున్నారు. లక్ష్మీశ్రీనివాస కాలనీ, బైపాస్ రోడ్డు, టైలర్స్ కాలనీ, దీనమ్మదిబ్బ తదితర ప్రాంతాల్లో ఇటువంటి గృహాల నిర్మాణాలు ఊపందుకున్నాయి.

కొత్తపేట ప్రాంతంలో నిర్మించిన గృహాలు

మారుతున్న కొనుగోలుదారుల అభిరుచులు

ఒకటికి నాలుగుసార్లు

వ్యక్తిగత గృహాలు నిర్మించి, విక్రయించే వారి సంఖ్య ఎక్కువగా ఉన్నా కొనుగోలుదారులు బిల్డర్‌పై ఉండే నమ్మకంతోనే వీటిని కొనుగోలు చేస్తున్నారు. అందుకే ఒకటికి నాలుగుసార్లు అతని గురించి వాకబు చేస్తున్నారు. ఇటువంటి ఇంటిని కొనుగోలు చేయాలనుకునే వారు ముందుగా ఇలా నిర్మాణం చేస్తున్న ప్రాంతాలను గుర్తించి, వాటిని పరిశీలించుకుంటున్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న గృహాల వద్ద తాత్కాలికంగా రోడ్లు వేస్తున్నారు. కొనుగోలుదారులు ఈ స్థలం గురించి పంచాయతీలో ముందుగా విచారించుకోవాలి. వీటికి పంచాయతీ అనుమతి ఉందా... లేదా అనేది తెలుసుకోవాలి. అనుమతి ఉంటే ఎప్పటికైనా రహదారుల నిర్మాణం జరుగుతుంది. లేకపోతే కష్టమనే అభిప్రాయాన్ని సంబంధిత అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల: 9154846713 వేటపాలెం: 8008574099
చీరాల గ్రామీణం: 6309994673 పర్చూరు: 9063144743
మార్టూరు: 8008574106 ఇంకొల్లు: 8008574102
చినగంజాం: 8008574103

స్పందన: వెలిగిన వీధి దీపాలు.. చినగంజాం, న్యూస్‌టుడే: పెద గంజాం పంచాయతీ పరిధిలోని ఏటిమొగలో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు సమస్యను 'మేమున్నాం... మీకు తోడుగా' దృష్టికి తేగా బుధవారం వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఇన్‌ఛార్జి గ్రామ కార్యదర్శి కె.కృపారావు సాయంత్రం పంచాయతీ ఒప్పంద విద్యుత్తు సిబ్బందిని పంపించి, వీధి దీపాలకు మరమ్మతులు చేయించి, సమస్యను పరిష్కరించారు.

పేదల వైద్యానికి నిధుల మంజూరు

ఇసుకదర్శి(మార్టూరు), న్యూస్‌టుడే: పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో సీఎం చంద్రబాబు భారీగా నిధులు వెచ్చించి అండగా నిలుస్తున్నారని తెదేపా సీనియర్ నేత కామేపల్లి హరిబాబు అన్నారు. మండలంలోని ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో బుధవారం కార్పొరేట్ వైద్యసేవల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంజూరైన ఎల్వోసీ పత్రాలు అందజేశారు. ఇసుకదర్శి గ్రామానికి చెందిన కార్తీక్ కుటుంబానికి రూ.4,56,659, ఆదిలక్ష్మికి రూ.61,301 విలువైన పత్రాలను వారి కుటుంబ సభ్యులకు ఇచ్చారు. నాయకులు పెంటేల శ్రీనివాసరావు, పాలెపు రాంబాబు, యహోషువ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతోనే విజయం

ఇంకొల్లు: పదోతరగతి విద్యార్థులతో పాఠశాల పాలకవర్గం

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం జడ్పీ ఉన్నత పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుక బుధవారం సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు బాగా చదువుకొని మంచి మార్కులతో ఉత్తీర్ణులై పాఠశాలకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. దేశభక్తి గీతాలకు విద్యార్థులు వేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎంఈవో-2 కోటేశ్వరరావు, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ ఏసుదాసు పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న బాలికలు

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ఆత్మవిశ్వాసం, మానసిక వికాసంతో ముందుకు నడిస్తే విజయాలు వరిస్తాయని నివేదిత పాఠశాల పూర్వ విద్యార్థిని డాక్టర్ భువన పేర్కొన్నారు. పాఠశాలలో జరిగిన పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు సభలో ఆమె మాట్లాడారు. గత ఏడాది పదో తరగతిలో ప్రతిభ చూపి కలెక్టరు చేత ప్రశంసాపత్రం అందుకున్న విద్యార్థులను సన్మానించారు. అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సభలో డైరెక్టర్ సుబ్బరామిరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ పూసపాటి వేదాద్రి పాల్గొన్నారు.

సర్వే నిష్పక్షపాతంగా చేయాలి

చినగంజాం, న్యూస్‌టుడే: శిక్షణను సద్వినియోగం చేసుకొని ఈనారీలు ఇంటింటికి వెళ్లి సర్వేను నిష్పక్షపాతంగా చేయాలని డీఆర్‌డీఏ పీడీ బి.సింగయ్య సూచించారు. చినగంజాం మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం జరిగిన శిక్షణలో పీడీ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పొదుపు సంఘం నుంచి ముగ్గురిని ఈనారీలుగా సర్వేకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఒక్కో ఈనారీ 100 కుటుంబాలను సర్వే చేయాలని చెప్పారు. అధికారులు రవీంద్రబాబు, కృష్ణకిశోర్, పెద సుబ్బారావు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన గురుకుల బాలిక

శ్యామలను సత్కరిస్తున్న రాజ్యలక్ష్మి సహచర అధ్యాపకులు, సిబ్బంది

యద్దనపూడి, న్యూస్‌టుడే: ఓ పేదింటి విద్యా కుసుమం జేఈఈ మెయిన్స్‌లో మెరిసింది. యద్దనపూడి సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకులంలో సీనియర్ ఇంటర్ విద్యార్థి వరగాని శ్యామల జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 70.3 శాతం సాధించింది. పెదనందిపాడు సమీపంలోని వరగాని గ్రామానికి చెందిన శ్యామల తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, తులసి సాధారణ వ్యవసాయ కూలీలు. ఈసందర్భంగా బుధవారం ప్రిన్సిపల్ జంపని రాజ్యలక్ష్మి, అధ్యాపకులు, సిబ్బంది శ్యామలను శాలువా, పూలతో సత్కరించారు.

వాలీబాల్ పోటీల్లో ప్రతిభ

క్రీడాకారులతో కళాశాల ప్రతినిధులు

వేటపాలెం, న్యూస్‌టుడే: జాతీయ స్థాయిలో వడ్లమూడి విజ్ఞాన విశ్వవిద్యాలయంలో ఇటీవల జరిగిన యూత్ ఫెస్టివల్‌లో భాగంగా నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో సెయింట్ ఆన్స్ క్రీడాకారులు ద్వితీయస్థానం సాధించి, నగదు బహుమతి కైవసం చేసుకున్నారు. బుధవారం కళాశాలలో జరిగిన అభినందన సభలో క్రీడాకారులను కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ వనమా దొర నాగసాయినాథ్, ప్రధానాచార్యుడు డాక్టరు కె.జగదీష్‌బాబు, అక్రిడిటేషన్ డైరెక్టరు డాక్టరు సి.సుబ్బారావు, మేనేజరు ఆర్వీ రమణమూర్తి, పీడీ అన్నం శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చినగంజాం,న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికి పేద కుటుంబాలకు చెందిన పిల్లలకు ఉచితంగా రిజర్వు చేసిన (25 శాతం) సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో-1 బి.అజయ్‌బాబు తెలిపారు. వీరికి ప్రభుత్వమే ఫీజు చెల్లిస్తుందని చెప్పారు.

విద్యుత్తు అధికారుల తనిఖీలు

చింతగుంటపాలెం(పర్చూరు), న్యూస్‌టుడే: మండలంలోని చింతగుంటపాలెంలో బుధవారం విద్యుత్తు అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి పలు ఇళ్లల్లో సర్వీసులు పరిశీలించారు. అధిక లోడు వినియోగిస్తున్న 31 మందిపై రూ.లక్ష జరిమానా విధించినట్లు డీఈ శ్రీనివాసులు తెలిపారు.

అవీ ఇవీ

సకాలంలో రేషన్ సరకులు పంపిణీ చేయాలి

చీరాల గ్రామీణం: రేషన్ డీలర్లు సకాలంలో సరకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ గోపికృష్ణ పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌ఫోర్సుమెంట్ డీటీ ఓంకార్, 97 మంది డీలర్లు పాల్గొన్నారు.

కడుపు నొప్పితో వివాహిత బలవన్మరణం

చీరాల గ్రామీణం: అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్ పరిధి పాపాయిపాలెంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పాపాయిపాలెంలో ఆతిన యామిని (47) కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. దీంతో ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈమెకు భర్త, ఇద్దరు పిల్లలు. బంధువుల సమాచారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

MEMORIES ARE FOR EVER
This self cannot be cut burned, wetted or died, eternal, all pervasive, stable immovable and ever lasting is it,
Bhagawadgita - Chapter II



Born: 19-2-1969
Died: 18-8-1988
Nanduri Sridevi
Daughter of C.A. Saibaburao Nanduri
Inserted by:
Family Members & Friends
212, Mahatma Gandhi Housing Colony, Chirala - 523 155.
Ph:9848152025

(c) eenadu

కోర్టులో పోస్టుల భర్తీకి రేపు రాత పరీక్ష

చిత్తూరు(న్యాయవిభాగం), న్యూస్‌టుడే: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో ఖాళీగా ఉన్న మూడు పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీకి గత నెలలో కోర్టు అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. పోస్టుల భర్తీకి శుక్రవారం స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక తెలిపారు. రికార్డు అసిస్టెంట్ పోస్టుకు ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు.. ఫ్రంట్ ఆఫీస్ కో-ఆర్డినేటర్ పోస్టుకు మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టు భర్తీకి రాత పరీక్ష వాయిదా వేశామని తెలిపారు.

పచ్చని వరి.. తెల్లని సిరి

గంగాధరనెల్లూరు మండలం చిత్తూరు-పుత్తూరు ప్రధాన మార్గం పక్కన కొందరు రైతులు వారి పొలాలను సమీపంలోని గ్రానైట్ పాలిష్ పరిశ్రమలకు లీజుకు ఇస్తున్నారు. ఈ పొలాల్లో గ్రానైట్ పాలిష్ వ్యర్థ పొడిని నిల్వ చేసి.. సిమెంట్ ఇటుకల తయారీదారులకు విక్రయిస్తున్నారు. పాలిష్ పౌడర్.. దాని పక్కనే పచ్చని పైరు ఇలా కనిపిస్తూ కనువిందు చేస్తోంది.

– ఈనాడు, చిత్తూరు; న్యూస్‌టుడే, జీడీనెల్లూరు

కీచకులున్నారు జాగ్రత్త!

పోలీసు శాఖపైనే భద్రత బాధ్యత

నాడు మహమ్మద్ రఫీ, నేడు కులవర్ధన్

ఏమీ ఎరుగని కలువల్లారా..
అయిదారేడుల పాపల్లారా..
దారుణ ముళ్లున్నట్టే..
కాలకింద కల్లులుంటాయి!

ఎదురింట్లో.. పక్కింట్లో..
వీధి చివర.. బడి పరిసరాల్లో..
ఎక్కడికెళ్లినా.. ఏం చేస్తున్నా..
మృగాళ్లుంటారు జాగ్రత్త

మాటలు చెబుతారు..
మాయలు చేస్తారు..
మిఠాయిలిస్తారు..
మొగ్గ దశలోనే చిదిమేస్తారు
కీచకులున్నారు పారా హుషార్

మహమ్మద్ రఫీ (పాత చిత్రం)

కులవర్ధన్ (పాత చిత్రం)

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో చిన్నారులకు రక్షణ లేకుండా పోయింది. ఓ ఘటన మరచిపోక ముందే మరో దుర్ఘటన చోటు చేసుకోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చిన్న బిడ్డ అన్న ఆలోచన కూడా లేకుండా హత్యాచారాలకు తెగబడుతున్నారు. కన్నబిడ్డలు విగత జీవులవడం చూసి తల్లిదండ్రులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఆడబిడ్డలను ఎలా కాపాడుకోవాలో దిక్కుతోచని స్థితిలో తల్లడిల్లిపోతున్నారు. అల్లారుముద్దుగా పెంచుకున్న అభంశుభం తెలియని చిన్నారులు కామాంధుల కబంధ హస్తాలకు చిక్కి బలైపోతున్నారు. ఓ వైపు శిక్షలు పడుతున్నా.. మద్యం, గంజాయి మత్తు యువతను పెడదారి పట్టిస్తోంది. ఇటీవల కాలంలో చిన్నారులపై జరిగిన లైంగిక దాడులు.. ఆపై హత్య సంఘటనలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి.

ఉలిక్కిపడిన అంగళ్లు

2019 నవంబరులో బి.కొత్తకోట మండలంలోని ఓ గ్రామానికి చెందిన కుటుంబం తమ అయిదేళ్ల కుమార్తెతో కలిసి కురబలకోట మండలం చేనేత నగర్‌లోని ఓ కల్యాణ మండపంలో జరుగుతున్న వివాహానికి వచ్చారు. రాత్రి పెళ్లిలో ఆడుకుంటున్న చిన్నారి ఒక్కసారిగా మాయమైంది. ఆచూకీ దొరక్క మరుసటి రోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉదయాన్నే విగతజీవిగా ఉన్న చిన్నారి మృతదేహం కల్యాణమండపం గోడ పక్కన గుర్తించారు. చిన్నారిపై అత్యాచారం చేసి చంపినట్లు నిర్ధారణ అయింది. పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించి అంగళ్లుకు చెందిన లారీ క్లీనర్ మహమ్మద్ రఫీనే నిందితుడని గుర్తించి అరెస్టు చేశారు. ఇతనికి చిత్తూరు కోర్టు మరణ శిక్ష విధించింది. హైకోర్టులో అప్పీల్ చేయడంతో మరణశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా సవరించింది. ఇతను ఇప్పటికి జైలులో ఉన్నాడు.

నాటి ఘటన మరవక ముందే

అంగళ్లులో జరిగిన ఘటన మరవక ముందే మదనపల్లెలో మరో చిన్నారిపై ఎదురింట్లో ఉండే కులవర్ధన్ (30) అత్యాచారానికి పాల్పడటం.. ఆపై ఇంట్లోనే ఉన్న నీటి డ్రమ్ములో ముంచి చంపేయడం అంతటా ఆందోళనలు రేకెత్తించింది. పోలీసులు అనుమానంతో రాత్రే అతని ఇంటి పరిశీలనకు వచ్చినా నిద్రిస్తున్నాడని వెళ్లిపోయారు. రాత్రే పోలీసులు తలుపులు తీయించి తనిఖీ చేసి ఉంటే చిన్నారి విషయం ముందుగానే వెలుగులోకి వచ్చేది. గతంలో కూడా నాలుగు ఘటనలు జరిగితే పోలీసులు అతనిపై చిన్న దాడి కేసు నమోదు చేసి వదిలేయడంతో చిన్నారి హత్య చేసే వరకు తెగించాడు. ● జిల్లాలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు మరింత అప్రమత్తంగా వ్యవహరించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదు చేయాల్సిన నంబర్లు : 112, 1098

పది ఫలితాల్లో తేడాలొస్తే ఉపాధ్యాయులదే బాధ్యత

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: పదో తరగతి ఫలితాల్లో తేడాలు కనిపిస్తే హెచ్ఎంలు, ఉపాధ్యాయులే ప్రధాన బాధ్యత వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేశారు. పదోతరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళికపై విద్యాశాఖ అధికారులతో బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. 'కొన్నేళ్లుగా ఫలితాలు తగ్గిన పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలి. పనితీరు సక్రమంగా లేని 30 శాతం పాఠశాలల్ని గుర్తించి, నిరంతర పర్యవేక్షణ చేపడతాం. ప్రతి పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు రూ.10 లక్షలు అందిస్తాం' అని పేర్కొన్నారు. డీఈవో రాజేంద్రప్రసాద్, సమగ్ర శిక్షా ఏపీసీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కడు రమణీయం

కల్యాణోత్సవ వైభవాన్ని పురస్కరించుకుని యాగపూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: జగద్రక్షకుడైన కైలాసవాసి కల్యాణం ఆద్యంతం రమణీయంగా సాగింది. మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో స్కందరాత్రిని పురస్కరించుకుని మంగళవారం అర్ధరాత్రి,

గజ, సింహ వాహనాలపై ఆలయానికి వెళ్తున్న సోమస్కందమూర్తి, జ్ఞానాంబిక అమ్మవారు

బుధవారం వేకువజామున కల్యాణోత్సవ క్రతువును ఆగమోక్తంగా జరిపారు. ఈ విశేషోత్సవాన్ని పురస్కరించుకుని సోమస్కందమూర్తి గజవాహనాన్ని, జ్ఞానాంబిక సింహ వాహనాన్ని అధిరోహించారు. ఉత్సవర్లను ఊరేగింపుగా వివాహ వేదిక వద్దకు తీసుకువచ్చారు.

స్వామివారికి యజ్ఞోపవీతాన్ని అలంకరిస్తున్న అర్చకులు

సప్తపది.. ఆనందించే మది

చతుర్వేద పారాయణం పూర్తయ్యాక ఆలయ అనువంశిక ప్రధాన దీక్షా గురుకుల్ స్వామినాథన్, వరద, నిరంజన్‌తో పాటు ఆలయ ప్రధాన అర్చకులు సంబంధం, కరుణ నేతృత్వంలో యాగకలశాన్ని ఏర్పాటు చేసి సంకల్ప పూజలు, గౌరీపూజ చేశారు. స్కంద జననం కోసం జరిపే ఈ వివాహ మహోత్సవంలో చండికేశ్వర రాయబార ఘట్టం ఆకట్టుకుంది.

ఒక్కటైన వధూవరులు

కల్యాణోత్సవ క్రతువులో భాగంగా వధూవరులైన సోమస్కందమూర్తికి, జ్ఞానాంబిక అమ్మవార్లకు రక్షాబంధనం, యజ్ఞోపవీతధారణ కార్యక్రమాన్ని జరిపారు. బుధవారం వేకువజామున 4.53 గంటలకు అమ్మవారికి మాంగల్యధారణ చేశారు. ధూప, దీప, నివేదనలు పూర్తయ్యాక ఉత్సవర్లను ఆలయానికి తీసుకెళ్లారు. ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ కొట్టెసాయిప్రసాద్, ఈవో బాపిరెడ్డి, భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆదుకొనే నేస్తమా.. బడి పిలుస్తోంది

'విద్యాంజలి' సాక్షిగా సర్కారు బడుల ఆర్తనాదాలు

ఈనాడు డిజిటల్, తిరుపతి: ప్రభుత్వ పాఠశాలలకు ఎన్ని నిధులు ఇస్తున్నా క్షేత్రస్థాయిలో సమస్యలు మాత్రం తీరడం లేదు. బడి బాగు కోసం.. పిల్లల భవిష్యత్తు కోసం కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన 'విద్యాంజలి' పోర్టల్‌లో ఉపాధ్యాయులు పెడుతున్న అభ్యర్థనలు చూస్తే గుండె బరువెక్కుతోంది. తిరుపతి జిల్లా నుంచి నమోదైన కొన్ని అభ్యర్థనలే ఇందుకు నిదర్శనం.

ఏమిటీ కార్యక్రమం?

కేంద్ర విద్యాశాఖ ప్రారంభించిన అద్భుతమైన వేదిక 'విద్యాంజలి'. 'విద్య', 'అంజలి' (రెండు చేతులు జోడించి సమర్పించడం) అనే రెండు పదాల కలయికే ఈ కార్యక్రమం. ప్రభుత్వ పాఠశాలలను కమ్యూనిటీతో అనుసంధానించి అభివృద్ధి చేయడమే దీని ముఖ్య ఉద్దేశం.

ఎవరు సాయం చేయొచ్చు?

పూర్వ విద్యార్థులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, సైంటిస్టులు, ప్రభుత్వ ఉద్యోగులు, గృహిణులు, యువత, లేదా కార్పొరేట్ కంపెనీలు (సీఎస్ఆర్ కింద).. ఎవరైనా సరే తమకు నచ్చిన ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకోవచ్చు లేదా సాయం చేయొచ్చు.

వచ్చిన అభ్యర్థనలు
- సేవలు: 128
- సామగ్రి: 588
- మొత్తం విన్నపాలు: 716

సహకారం ఇలా అందించండి

సాయం రెండు రకాలుగా అందించొచ్చు:

- **సేవలు / యాక్టివిటీస్ :** సబ్జెక్టులు బోధించడం, యోగా నేర్పించడం, ఆర్ట్, క్రాఫ్ట్, కెరీర్ కౌన్సెలింగ్ ఇవ్వడం, వైద్య శిబిరాల నిర్వహణ, సెల్ఫ్ డిఫెన్స్ నేర్పించడం వంటివి.
- **వస్తువులు /సామగ్రి:** ఫ్యాన్లు, కుర్చీలు, కంప్యూటర్లు, ప్రింటర్లు, క్రీడా సామగ్రి, వాటర్ ప్యూరిఫైయర్లు, ట్యూబ్ లైట్లు, ఇతర అవసరాలను విరాళాలు అందించి తీర్చవచ్చు.

ఆసక్తి ఉన్నవారు vidyanjali.education.gov.in వెబ్‌సైట్‌లో 'వాలంటీర్'గా రిజిస్టర్ చేసుకుని, మీకు దగ్గర్లో ఉన్న పాఠశాల అవసరాలను తీర్చవచ్చు.

బెంచీలు లేవు.. గదులు చాలవు

● వేపూరు జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి వచ్చిన విన్నపం ఆ బడి దుస్థితిని తెలియజేస్తోంది. విద్యార్థులు కూర్చోవడానికి కనీసం 10 బెంచీలు కూడా సరిగ్గా లేవు. తరగతి గదులు చాలడం లేదు. ఉపాధ్యాయులు టాయిలెన్స్ లేక ఇబ్బందులు పడుతున్నారు. రెండు అదనపు తరగతి గదులు, సిబ్బందికి టాయిలెట్లు అవసరమని కోరుతున్నారు.

● గ్రామీణ పాఠశాలల్లో చాలా చోట్ల కంప్యూటర్లు, ప్రింటర్లు లేక డిజిటల్ విద్య అందడం లేదు.

● యోగా నేర్పేవారు లేక, డ్రాయింగ్ టీచర్లు లేక, కనీసం కూర్చోవడానికి బెంచీలు లేక ఎన్నో పాఠశాలలు దాతల కోసం ఎదురుచూస్తున్నాయి.

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల, తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు, రూ.300 ఎస్ఈడీ టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. మంగళవారం శ్రీవారిని 70,509 మంది భక్తులు దర్శించుకున్నారు. ● తిరుపతిలో శ్రీవారి దర్శనానికి సంబంధించి శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద బుధవారం భక్తులకు 12 వేల సర్వదర్శన టోకెన్లు జారీ చేశారు. వీరికి గురువారం వేకువ జామున మూడు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం కానుంది. శ్రీవారి మెట్టు నడకదారి భక్తులకు మరో 2 వేల టోకెన్లు ఇచ్చారు.

28న తితిదే పాలక మండలి సమావేశం

తిరుపతి (తితిదే): తితిదే పాలకమండలి సమావేశం ఈనెల 28వ తేదీన జరగనుంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే పాలకమండలి ఛైర్మన్, సభ్యులు ఎక్స్ అఫిషియో సభ్యులకు అధికారులు సమాచారం చేరవేశారు. వాస్తవానికి ఫిబ్రవరి 3వ తేదీనే పాలకమండలి సమావేశం తిరుమలలో జరగాల్సి ఉంది. అప్పటి ఈవో అనిల్ కుమార్ సింఘాల్ బదిలీ కావడంతో సమావేశం వాయిదా పడింది.

నూతన ఈవో కసరత్తు: సమావేశంలో నూతన ఈవో ముద్దాడ రవిచంద్ర పాల్గొననున్నారు. ఆయన ప్రస్తుతం, గతంలో చర్చించిన అంశాలు, తీర్మానాలపై కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. వాటిపై సమావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలనే దానిపై నలుగురు ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు సమాచారం.

గంజాయి.. వయా తిరుపతి!

ఒడిశా నుంచి చిత్తూరు, మదనపల్లెకు ఇక్కడి నుంచే

ఈనాడు– చిత్తూరు, తిరుపతి: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కొంతమంది యువత గంజాయి మత్తులో జోగుతున్నారు. ఈక్రమంలోనే ఉన్మాదులుగా మారి దోపిడీలు, అత్యాచారాలు, హత్యలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లెలో గంజాయి మత్తులో ఉన్న కులవర్దన్ (30) ఏడేళ్ల బాలికపై అత్యాచారం చేసి ఆపై హత్య చేశాడు. ఈ నేపథ్యంలో గంజాయికి అడ్డుకట్ట వేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. మొత్తంగా మత్తులో తూగేవారు, విక్రయదారుల్లో 70- 80 శాతం 15 ఏళ్లు- 35 ఏళ్లలోపు వారే ఉంటున్నారు.

నంబరు ప్లేట్లు లేకుండా..

తిరుపతి నుంచి మదనపల్లెకు ఆటోలో పెద్దఎత్తున గంజాయి వస్తోంది. మధ్యలో మూడు చెక్‌పోస్టులు ఉన్నా దీన్ని అడ్డుకోలేదు. నంబరు ప్లేటు లేకుండా జాతీయ రహదారిలోనే నేరుగా మదనపల్లెకు సరఫరా చేశారు. తాలూకా స్టేషన్ పరిధిలో తనిఖీ చేయగా రూ.44 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

ఉదాసీనంగా రైల్వేశాఖ

ప్రస్తుతం రాష్ట్రంలో పెద్దగా గంజాయి సాగు లేదు. విశాఖ ఏజెన్సీ ప్రాంతంలోని రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లారు. పొరుగునే ఉన్న ఒడిశాలోనే ఎక్కువగా దీన్ని పండిస్తున్నారు. అక్కడి నుంచి రైళ్ల ద్వారా తిరుపతికి వస్తోంది. మరికొందరు రేణిగుంట, గూడూరు స్టేషన్లలో దిగుతున్నారు. రైల్వే శాఖ అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేస్తుండటం సరఫరాదారులకు కలిసి వస్తోంది. తిరుపతి నుంచి బెంగళూరుకు కూడా తరలుతోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పీలేరు, మదనపల్లెకూ ఇక్కడి నుంచే రవాణా చేస్తున్నారు. పూతలపట్టు మండలంలోని ఓ గ్రామంలోనైతే కొందరు ఇదే వృత్తిగా పెట్టుకున్నారు.

నాయకుడి కుమారుడిపై ఆరోపణలు

మదనపల్లెలో విచ్చలవిడిగా గంజాయి సరఫరా, అమ్మకాలు సాగడం వెనుక ఓ నాయకుడి కుమారుడి హస్తం ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అతని అండతోనే విక్రయదారులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వం సైతం ఈవిషయంలో కఠినంగా ఉన్నందున పోలీసులు ఉపేక్షించకుండా పకడ్బందీగా విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

ఉర్దూ మాధ్యమ పాఠశాలలకు ఒంటిపూట బడులు

చిత్తూరు(విద్య), న్యూస్‌టుడే: రంజాన్ మాసం పురస్కరించుకుని జిల్లాలోని ఉర్దూ మాధ్యమ పాఠశాలలు ఒంటిపూట బడులు నిర్వహించాలని డీఈవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే పాఠశాలలు పనిచేస్తాయని చెప్పారు. ముస్లిం ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పొరుగు సేవలు, ఒప్పంద పద్ధతిలో పనిచేసే ఉద్యోగులు పనివేళల్లో గంట ముందుగానే వెళ్లవచ్చని పేర్కొన్నారు. రంజాన్ మాసం పూర్తయ్యాక యథావిధిగా ఉదయం నుంచి సాయంత్రం వరకు పనిచేయాలని చెప్పారు.

ఓటర్ల జాబితా సిద్ధం చేయండి

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: పంచాయతీ ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని డీపీవో సుధాకర్‌రావు సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో జిల్లాలోని డీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, పీడీవోలతో సమావేశమయ్యారు. నియోజకవర్గాలు, మండలాలు, పంచాయతీల వారీగా తప్పులు లేకుండా ఓటర్ల జాబితాలను మార్చి 9వ తేదీకి ప్రదర్శించాలని ఆయన స్పష్టం చేశారు.

104FM Tirupati
ఈ FM 104 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

విరబూత.. ఆశల కలబోత

బంగారుపాళ్యం నుంచి పలమనేరు వెళ్లే మార్గంలో కనుచూపు మేర ఉన్న మామిడి తోటలు ఇలా పూతతో నిండిపోయాయి. ఆకుపచ్చని రంగులో ఉన్న చెట్లు కాస్త పసుపురంగుతో దర్శనమిస్తున్నాయి. జిల్లాలో 53 వేల హెక్టార్లలో మామిడి సాగవుతుండగా.. ఈ పూతతో పంటపై రైతుల్లో ఆశలు పెరుగుతున్నాయి.

–ఈనాడు, చిత్తూరు

పరిహారం ఇస్తే పనులకు రెక్కలు

- వచ్చే ఏడాది ఆగస్టుకు కుప్పం విమానాశ్రయం పూర్తికి సీఎం సంకల్పం
- ఇప్పటికీ బాధితులకు జమకాని రూ.100 కోట్లు

విమానాశ్రయానికి సేకరించిన భూమి

ఈనాడు– చిత్తూరు: కుప్పం విమానాశ్రయం.. ఏడేళ్లుగా ఉన్న ప్రతిపాదన. గత వైకాపా ప్రభుత్వంలో ఈ ప్రాంతంలో ఎయిర్‌పోర్టు అవసరం లేదంటూ జగన్ సర్కార్ కేంద్రానికి స్పష్టం చేసింది. 2024 జూన్‌లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇక్కడి ప్రజల ఆకాంక్షల మేరకు మళ్లీ ఈ అంశంపై దృష్టిసారించారు. వచ్చే ఆగస్టు నాటికి పూర్తి చేయాలని సంకల్పించారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సమీపంలో ఉన్న కుప్పంలో విమానాశ్రయం ఏర్పాటైతే అక్కడి నుంచి ప్రయాణికులు తరలిరావడంతోపాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలమనేరు, పుంగనూరు, మదనపల్లె, పూతలపట్టు, పీలేరు, చిత్తూరు నియోజకవర్గాల్లోని ఉద్యాన ఉత్పత్తులను ఎగుమతి చేయవచ్చని భావిస్తున్నారు. ఓవైపు అధికారులు వేగంగా భూసేకరణ చేస్తున్నా పరిహారం అందడంలో కొంత జాప్యంతో నిర్మాణ పనులు ఆలస్యమయ్యే అవకాశముంది.

483 ఎకరాల నుంచి.. 1,849 ఎకరాలకు

● ప్రస్తుతం బెంగళూరులోని కెంపేగౌడ విమానాశ్రయం రద్దీగా ఉంది. నిత్యం దేశవిదేశాలకు 25వేల మంది ప్రయాణాలు చేస్తున్నారు. ఏటా కోటిన్నర మంది రాకపోకలు సాగిస్తున్నారు. దాంతో తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో కుప్పం విమానాశ్రయ నిర్మాణం పూర్తయితే కొంతవరకు రద్దీ తగ్గుతుంది.

● బెంగళూరులోని ట్రాఫిక్‌ను తప్పించుకోవడానికి దేశీయంగా ప్రయాణించే వారు ఇక్కడకు వచ్చే అవకాశముందని భావిస్తున్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకునే 2019 జనవరిలో 483 ఎకరాల్లో ఎయిర్‌స్ట్రిప్‌నకు శంకుస్థాపన చేయగా ఇప్పుడు విమానాశ్రయం నిర్మాణానికి ఆలోచన చేశారు.

● కూటమి ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలో 1,200 ఎకరాలు సేకరించాలని నిర్ణయించగా తాజాగా 1,849 ఎకరాల భూమిని తీసుకోవడానికి కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం 1,400 ఎకరాలు సేకరించారు.

రూ.100 కోట్లు పంపినీ: శాంతిపురం, రామకుప్పం మండలాల్లోని రైతులకు రూ.100 కోట్ల పరిహారం ఇచ్చారు. మరో రూ.100 కోట్లకు ప్రతిపాదనలు పంపినా నిధులు జమ కాలేదు. 489 ఎకరాల భూసేకరణ పెండింగ్‌లో ఉంది. మార్చి లేదా ఏప్రిల్ నాటికి దీన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. విమానాశ్రయ నిర్మాణానికి త్వరలో టెండర్లు పిలవాలని అనుకుంటున్నారు.

ఎయిర్‌స్ట్రిప్ కష్టమే: శ్రీసిటీలో ఎయిర్‌స్ట్రిప్ నిర్మించాలని గతంలో ప్రతిపాదించారు. పారిశ్రామికవేత్తల ప్రయాణంతో పాటు ఇక్కడి ఎలక్ట్రానిక్, ఆహారశుద్ధి తదితర వస్తువుల ఎగుమతిలో వేగం ఉంటుందని ఆశిస్తున్నారు. ప్రస్తుతం శ్రీసిటీ విస్తరణకుభూముల సేకరణకే న్యాయపరమైన సమస్యలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఎయిర్‌స్ట్రిప్‌పై కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అంతరాలయ దర్శనం.. మహద్భాగ్యం

కాణిపాకం, న్యూస్‌టుడే: స్వయంభు శ్రీవరసిద్ధి వినాయక స్వామి అంతరాలయ దర్శనానికి భక్తుల నుంచి విశేష స్పందన వస్తోంది. ఈ నెల ఒకటో తేదీ నుంచి సామాన్య భక్తులకు ఈ అవకాశం కల్పిస్తున్నారు. గతంలో ఈ దర్శనం ప్రముఖులు, సిఫార్సులపై వచ్చే భక్తులకు మాత్రమే కల్పించేవారు. సామాన్య భక్తుల నుంచి వినతులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

అంతరాలయ దర్శనం చేసుకున్న భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదం అందిస్తున్న ఈవో పెంచల కిశోర్

- అంతరాలయ వేళలు: ఉదయం 10-11, మధ్యాహ్నం 3-4 గంటల మధ్య
- టికెట్ ధర: రూ.500
- అభిషేక లడ్డూ ఉచితంగా ఇస్తారు
- రోజూ దర్శించుకుంటున్న భక్తులు: 500 మంది పైగా

దర్శన వేళల్లో అవకాశం కల్పించాలి: స్వామివారి అంతరాలయ దర్శనం ప్రస్తుతం కేవలం రెండు గంటలు మాత్రమే సామాన్య భక్తులకు అందుబాటులోకి తెచ్చారు. ఆ సమయంలో ఇతర భక్తులను దర్శనానికి అనుమతించడం లేదు. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతరాలయ దర్శన సమయంలో భక్తులను సైతం దర్శనానికి అనుమతించాలని, ఆలయ దర్శన వేళల్లో రూ.500 టికెట్ కొన్న భక్తులకు అంతరాలయ దర్శనం కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

గణనాథుడి సేవలో విదేశీ భక్తులు

కాణిపాకం: శ్రీవరసిద్ధి వినాయకస్వామిని వివిధ దేశాలకు చెందిన 170 విదేశీ భక్తులు బుధవారం రాత్రి దర్శించుకున్నారు. జర్మనీ దేశానికి చెందిన శ్రీ పీఠనిలయ భక్తిమార్గ్ కేంద్రం నిర్వాహకుడు శ్రీ పరమహంస విశ్వనాథ గురూజీతో పాటు జర్మనీ, రష్యా, ఫ్రాన్స్ దేశాలకు చెందిన బృందం స్వామి దర్శనం చేసుకున్నారు.

స్వామిని దర్శించుకున్న విదేశీ భక్తులు. చిత్రంలో ఛైర్మన్ మణినాయుడు, ఆలయాధికారులు

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి : 80085 13290

(c) eenadu

ఆలయ ప్రదక్షిణలో అర్చకులు

వేదనారాయణుడి ఆలయంలో పరిమళాల జల్లులు

నాగలాపురం, న్యూస్‌టుడే: వేదనారాయణుని ఆలయ మహాసంప్రోక్షణలో భాగంగా బుధవారం దివ్యమైన ఘట్టాన్ని అర్చకులు నిర్విఘ్నంగా పూర్తి చేశారు. ఆలయంలోని మూలవిరాట్‌తో పాటు పరివార దేవగణాల విగ్రహాలు పీఠాలకు కలిసే సంధిప్రాంతంలో పట్టించడానికి సుగంధపరిమళభరిత ద్రవ్యాలతో మిశ్రమాన్ని తయారుచేశారు. సుక్కాదళ్, కరుంకుంకుల్యం, కొంబరక్కు, కాశీకట్టి, కలిపాక్కు, తానిక్కై, కడుంగాయ్, నెల్లిపరుప్పుపొడి, పూంగావిలను అర్చకులు ఆలయ మహామండపంలో రోకలిలో దంచారు. ఈ మిశ్రమాన్ని జల్లించి ఆవువెన్నతో కలిపి ముద్దలా సిద్ధం చేశారు. ప్రాకారోత్సవానంతరం ఆలయంలోని అన్ని విగ్రహాలు, పీఠాల వద్ద ఈ మిశ్రమాన్ని పట్టించారు. 12 సంవత్సరాల పాటు ఈ మిశ్రమంతో విగ్రహాలు దెబ్బతినకుండా ఉంటాయని అర్చకులు తెలిపారు.

గొర్రెల పెంపకందారులకు పశు ఔషధి విక్రయ కేంద్రాలు

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: నాణ్యమైన జనరిక్ పశువైద్య మందులను తక్కువ ధరకే పాడి రైతులకు అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పశు ఔషధి విక్రయ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. పాడి రైతుల ఆర్థిక భారాన్ని తగ్గించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. పశు ఔషధి విక్రయ కేంద్రాల నిర్వహణను గొర్రెల పెంపకందారుల సహకార సంఘాలకు అప్పగించాలని నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్రాలను గొర్రెల పెంపకందారుల సంఘంలోని మహిళా సభ్యులే నిర్వహించాలి. సంఘం ఆర్థిక స్థితి బాగుండాలి.. ఎటువంటి బకాయిలు ఉండరాదు. ఆడిట్ పూర్తయి ఉండాలి. పశువైద్య ఆసుపత్రి ప్రాంగణంలో కనీసం 120 చదరపు అడుగుల స్థలాన్ని జిల్లా ఎంపిక కమిటీ నిర్ణయించిన అద్దె ప్రాతిపదికన కేటాయిస్తారు. మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయనున్నారు. ఈ పథకానికి దరఖాస్తు సమర్పించడం, ఇతర వివరాలకు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిని సంప్రదించాలని ఉత్తర్వులో పేర్కొంది.

కవరు కట్టు.. లాభాలు పట్టు

❖ ఆ కాయలకు నాణ్యత, అధిక ధర ❖ వేగంగా మండలాలకు సరఫరా

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లాలో ప్రధాన వాణిజ్య పంట మామిడి. వాతావరణం అనుకూలించకపోవడం, చీడపీడలు, మార్కెటింగ్ సమస్యలు ఏటా మామిడి రైతాంగాన్ని వెంటాడుతూనే ఉన్నాయి. దిగుబడి సమయంలో నాణ్యతను బట్టే కాయలకు ధర లభిస్తోంది. పిందె దశలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే రైతుకు తీవ్ర నష్టం సంభవిస్తోంది. నాణ్యమైన పంట దిగుబడులతో మంచి ధర లభించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా మామిడి పంటకు పిందె దశ నుంచే కవర్లు తొడిగి సంరక్షించేలా దృష్టి సారించింది. 50శాతం రాయితీతో మామిడి కవర్లు ఇస్తూ రైతులను ఆదుకుంటోంది. గత ఏడాది సుమారు 1.50 కోట్ల కవర్లు అందజేసింది. కవర్లు తొడిగిన రైతులు అధిక ధరతో అమ్మకాలు చేపట్టి లాభాలు పొందారు.

బంగారుపాళ్యం మండలంలో మామిడి కాయలకు తొడిగిన కవర్లు

నాలుగు కోట్లు అందజేయాలని..

జిల్లాలో ఈ ఏడాది రాయితీపై నాలుగు కోట్ల మామిడి కవర్లు అందజేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. కవర్ల సరఫరాకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. మండలాలకు సరఫరా ప్రారంభమైంది. రెండు నుంచి ఐదెకరాల లోపు ఉన్న రైతులకు ఉద్యాన శాఖ 50శాతం రాయితీ సమకూర్చుతోంది. ఒక కవరు ధర రూ.2లు కాగా 50శాతం రాయితీపై రూపాయికే ఇవ్వనున్నారు. కాయలను ఆశించే పురుగులు, తెగుళ్ల నుంచి బయట పడేందుకు ఇది రక్షణ కవచంలా నిలుస్తుంది. కాయల నాణ్యత పెరిగితే మార్కెట్లో సాధారణ కాయలకంటే అధిక ధర పలుకుతుంది. ఒక్కో రైతు గరిష్ఠంగా రెండు హెక్టార్ల(5 ఎకరాలు) వరకు రాయితీ పొందొచ్చు.

జిల్లాలో సాగు
53 వేల హెక్టార్లు
కవరు ధర
రాయితీతో రూపాయికే

ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించాలి

మామిడి కవర్లు కావలసిన రైతులు ఆయా మండలాల్లోని ఉద్యాన శాఖ అధికారులు, రైతు సేవా కేంద్రాల సహాయకులను సంప్రదించాలి. దరఖాస్తు, పట్టాదారు పుస్తకం, ఆధార్ కార్డు అందజేసి.. పేర్లు నమోదు చేసుకోవాలి. నిమ్మకాయ పరిమాణంలో ఉన్నప్పుడు తొడిగితే నాణ్యమైన దిగుబడి సాధించవచ్చు.

- రామాంజనేయులు, డీడీ, ఉద్యాన శాఖ

పారిశ్రామిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం: సీఎండీ

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: పారిశ్రామిక వినియోగదారులు ఎదుర్కొంటున్న విద్యుత్తు సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ లోతేటి చెప్పారు. తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో బుధవారం పారిశ్రామిక విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి మాట్లాడారు. నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి 26 మంది హాజరై పలు సమస్యలు తెలిపినట్లు చెప్పారు. వోల్టేజీలో హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయని, సోలార్ విద్యుత్తు బిల్లింగ్, ట్రూ-అప్, ఎఫ్‌పీపీసీఏలకు సంబంధించి వినతులను అందజేశారని తెలిపారు. వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రతి నెలా మొదటి బుధవారం ఉదయం 10:30 నుంచి 11:30 గంటల వరకు జిల్లాల్లోని సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయాల్లో, మూడో బుధవారం తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో ఈ వేదికలు నిర్వహిస్తున్నామని పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలని కోరారు. సంస్థ డైరెక్టర్లు అయూబ్ ఖాన్, గురవయ్య, రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు రమణాదేవి, పద్మ, ఆదిశేషయ్య, ఉమాపతి, కృష్ణారెడ్డి, రామచంద్రరావు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తతో మాట్లాడుతున్న సీఎండీ శివశంకర్ లోతేటి

చెరకుకు గిట్టుబాటు ధర కల్పించాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే థామస్

పెనుమూరు, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లాలో రైతులు సాగుచేస్తున్న చెరకు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని ఎమ్మెల్యే థామస్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం ఆయన శాసనసభలో మాట్లాడుతూ జిల్లాలో మామిడి పంట తరువాత రైతులు చెరకు పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారని చెప్పారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గం తమిళనాడుకు దగ్గరలో ఉందని, ఇక్కడ 2500 మంది రైతులు 3158 హెక్టార్లలో చెరకు పంట సాగు చేస్తారని వెల్లడించారు. ఇక్కడ ఒకే చక్కెర కర్మాగారం ఉందని, డిసెంబరు నుంచి దాదాపు మార్చి వరకు ఈ కర్మాగారంలో చక్కెర తయారీలో బిజీగా ఉంటుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చెరకు టన్నుకు రూ.3290 ఇస్తున్నారని తెలిపారు. తమిళనాడులో అదనంగా రూ.350 ప్రోత్సాహక ధరగా ఇస్తున్నారని వివరించారు. తిరువళ్లూరు జిల్లాలా కొన్ని చక్కెర కర్మాగారాలు రూ.3,699 ఇస్తున్నాయన్నారు. మరికొన్ని రూ.4,500 వరకు చెల్లిస్తున్నారని చెప్పారు. దీంతో మన రాష్ట్ర రైతులు అసంతృప్తిగా ఉన్నారని తెలిపారు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని మనం కూడా చెరకు రైతులకు తమిళనాడు రాష్ట్రం లాగా గిట్టుబాటు ధర కల్పిస్తే మంచిపేరు వస్తుందని అన్నారు.

జాతీయ ఎన్‌ఎస్‌ఎస్ శిబిరానికి ఎంపిక

షేక్ అల్మాస్

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: స్థానిక సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల బీబీఏ ద్వితీయ సంవత్సర విద్యార్థిని జాతీయ ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సమైక్యతా శిబిరానికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ మనోహర్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ బెంగళూరు వర్సిటీలో జరగనున్న శిబిరంలో షేక్ సల్మాస్.. ఎస్వీ విశ్వవిద్యాలయం బృందం తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థినిని వైస్ ప్రిన్సిపల్ ఉషారాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ షమ్స్ అక్తర్ అభినందించారు.

ప్రత్యేక ఏజీపీగా నియామకం

చిట్టిబాబు

చిత్తూరు(న్యాయవిభాగం), న్యూస్‌టుడే: ప్రధాన జిల్లా సెషన్స్ కోర్టు ప్రత్యేక సహాయ ప్రభుత్వ న్యాయవాదిగా వి. చిట్టిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదవిలో ఆయన మూడేళ్ల పాటు కొనసాగుతారని ఉత్తర్వులో పేర్కొంది.

పుష్కరిణి.. ప్రాభవంతో ప్రసిద్ధి

'ముక్కంటి' ఆలయానికి అనుబంధంగా మూడు పుష్కరిణులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పంచ భూత లింగాల్లో వాయులింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తిలో పురాణ ప్రాభవానికి సంబంధించి ఎన్నో ఆనవాళ్లు కన్పిస్తుంటాయి. అందులో భాగంగా ఇక్కడి క్షేత్రానికి అనుసంధానంగా పురాతన కాలం నుంచి వస్తున్న పుష్కరిణులు నేడు ఆధ్యాత్మిక ప్రాభవానికి చిహ్నంగా విరాజిల్లుతున్నాయి.

● **భరద్వాజపుష్కరిణి:** కైలాసగిరుల్లో సహజ సిద్ధంగా ఏర్పాటైన పుష్కరిణి. దీన్ని దేవతా పుష్కరిణి అని కూడా పిలుస్తుంటారు. శ్రీకాళహస్తి క్షేత్ర ప్రాభవాన్ని రోమశ మహర్షి ద్వారా తెలుసుకున్న భరద్వాజుడు ఇక్కడి కైలాసగిరుల్లో శివలింగాన్ని ప్రతిష్ఠించారు. [illegible] దేవతాభిషేకాలకు ఏర్పాటు చేసిన పుష్కరిణి కావడంతో ఇది భరద్వాజ పుష్కరిణిగా ఖ్యాతి గడిస్తోంది. తైలామావాస్య సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి ఉత్సవమూర్తులను ఇక్కడకు తీసుకువచ్చి విశేష అభిషేకాలు చేపట్టి మళ్లీ ఆలయానికి తీసుకెళ్లడం సంప్రదాయంగా సాగుతోంది.

కైలాసగిరి పర్వత శ్రేణుల్లో భరద్వాజతీర్థం

● **నారదపుష్కరిణి..:** ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాభవాన్ని పొందిన పుష్కరిణి [illegible]

● **వైష్ణవ పుష్కరిణి..:** [illegible]

'అభిషేకం'.. ఆదిదేవునికి ప్రీతిపథం

శివుడు అభిషేక ప్రియుడు. అందుకే శివాలయాల్లో అభిషేకాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. శ్రీకాళహస్తీశ్వరాలయంలో శ్రీజ్ఞానప్రసూనాంబికతో పాటు శ్రీకాళహస్తీశ్వరుడికి నిత్యం నిర్వహించే అభిషేకాలు ఎంతో ప్రాభవాన్ని పొందాయి. ప్రతి రోజూ నాలుగు సమయాల్లో అభిషేకాలు జరుపుతుంటారు. అందులో మూడు ఉదయం జరిగితే సాయంత్రం ప్రదోష కాల సమయంలో మరో అభిషేకం జరుగుతుంది. [illegible] - న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

ముక్కంటి ఆలయంలోని సహస్రలింగేశ్వరుని సన్నిధి వద్ద మహన్యాస అభిషేక నిర్వహణకు సంకల్పపూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సేవల ఫలాలు

● అభిషేకం: రుద్రాభిషేకం ● టికెట్: 1000 ● ప్రవేశం: ఇద్దరికి ● నిర్వహణ: ఉదయం 5, 6, 9 గంటలకు ● ఫలం: ఆరోగ్యసిద్ధి, కోర్కెలు ఫలించడం, మానసిక ఆనందం, కుటుంబ శ్రేయస్సు, వ్యాపారాభివృద్ధి

● మహన్యాస పూర్వక రుద్రాభిషేకం ● 1500 ● ఇద్దరికి ● సాయంత్రం 4 గంటలకు ● కాలసర్పదోష నివృత్తి, ఉద్యోగోన్నతులు, వివాహాది శుభ కార్యాల [illegible] ఆరోగ్యసిద్ధి

నేడు కైలాసగిరి ప్రదక్షిణోత్సవం

మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా [illegible] కైలాసగిరి ప్రదక్షిణోత్సవానికి బయలుదేరనున్నారు. దాదాపు 23 కిలోమీటర్ల పొడవున ఈ విశేషోత్సవం జరగనుంది.

ఉభయదాతలు: బియ్యపు కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రాత్రి: స్వామివారు అశ్వవాహనంపైన, జ్ఞానాంబిక సింహ వాహనంపై ఊరేగనున్నారు. - న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

పాల్గొన్న అతిథులు, అధ్యాపకులు

మహిళా పారిశ్రామికవేత్తల సంఖ్య పెరగాలి

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: మహిళా పారిశ్రామిక వేత్తల సంఖ్య పెరగాలని శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ వీసీ ఆచార్య ఉమ పేర్కొన్నారు. [illegible]

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: రుయా ప్రభుత్వ ఆస్పత్రిలోని [illegible] 8 ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు [illegible] బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. [illegible] అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఏపీఎస్పీడీసీఎల్ ప్రత్యేక అధికారిగా లక్ష్మి

చిత్తూరు(కుటుంబం), న్యూస్‌టుడే: ఏపీఎస్పీడీసీఎల్ ప్రత్యేక అధికారి(కోఆపరేటివ్ బిల్డింగ్)గా డి. లక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామ సచివాలయ, వార్డు సచివాలయ శాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెను ఇంధన శాఖ పరిధిలోని ఏపీఎస్పీడీసీఎల్ ప్రత్యేక అధికారిగా బదిలీ చేసినట్లు ఉత్తర్వులో పేర్కొంది.

మున్సిపల్ మేనేజరుపై కలెక్టర్ ఆగ్రహం

పుత్తూరు, న్యూస్‌టుడే: తిరుపతి జిల్లాలో జరుగుతున్న ఏకీకృత కుటుంబ సర్వేకు సంబంధించి బుధవారం కలెక్టర్ వెంకటేశ్వర్ [illegible] లేరని, ఒకరు సెలవుపై వెళ్లారని, ఈ రోజే విధులకు వచ్చారని, వేగం పెంచుతామని చెప్పారు. దీంతో కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ ఇలాంటివి ఏవైనా ఉంటే పరిశీలించాలని, పక్క సచివాలయం సిబ్బందిని పంపి సర్వే పూర్తి చేయించాలని ఆదేశించారు. పుత్తూరు మున్సిపల్ మేనేజరు బాలాజీ [illegible] ఆయన్ను పుత్తూరు మున్సిపాలిటీకి కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారని, అతనికి జీతానికి సంబంధించి సీఎంఎస్ ఐడీ కూడా క్రియేట్ కాలేదని, మానసిక స్థితి సరిగా లేదని, ఆయనకు ఎలాంటి విధులు కూడా అప్పగించలేదని కలెక్టర్ దృష్టికి తేవడంతో ఆయన శాంతించారు.

శ్రీవారి ప్రసాదాలు ప్రస్తుతం చాలా శ్రేష్ఠం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ప్రసాదాలు ప్రస్తుతం చాలా శ్రేష్ఠంగా, రుచికరంగా ఉన్నాయని బాజపా ఎంపీ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో శ్రీవారి మూలమూర్తిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. [illegible] నిరూపితమైంది. భగవంతుడి దగ్గర ఎవరూ తప్పించుకోలేరు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుమల క్షేత్ర పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. గత తప్పిదాలు పునరావృతం కాకుండా తితిదే జాగ్రత్తలు చేపట్టాలి' అని కోరారు. దేశహితం కోసం ప్రధాని మోదీ చేస్తున్న ప్రతి కార్యక్రమం సఫలీకృతం కావాలని, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆలయం వెలుపల బాజపా ఎంపీ కె.లక్ష్మణ్ కుటుంబం, తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి

WALK-IN-INTERVIEW TVS
TVS ఎలక్ట్రికల్ మరియు CNG ఆటోషోరూం నందు పనిచేయుటకు ఉత్సాహవంతులైన చక్కటి వాక్‌చాతుర్యం కలిగిన అభ్యర్థులు కావలెను.
1) [illegible]
2) సేల్స్ మేనేజర్స్: 3 Posts (మంచి అనుభవం, ఆటో మరియు రియల్ ఎస్టేట్ రంగంలో అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత)
3) సేల్స్ ఎగ్జిక్యూటివ్స్: 6 Posts (అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత)
4) టెక్నీషియన్స్ : 4 Posts (ఎలక్ట్రికల్ ఆటో వర్క్ నందు అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత)
సమయం: ఉదయం : 9.00 AM to 5.00 PM
విజయ ప్రసన్న టివిఎస్ / పూలవానిగుంట, రేణిగుంట రోడ్, తిరుపతి సెల్: 83095 07239, 99855 52979.



పీలేరులో బంగారం, వెండి చోరీ

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక రాజీవ్‌నగర్‌కాలనీకి చెందిన వాసిఉద్దీన్ ప్రైవేటు ఉద్యోగి. అతడు శిక్షణ నిమిత్తం బెంగళూరుకు వెళ్లేటప్పుడు.. భార్య సల్మాను తిరుపతిలోని పుట్టింట్లో వదిలి వెళ్లాడు. ఇంటికి తాళం వేసి ఉండటంతో దొంగలు చోరీకి పాల్పడ్డారు. బుధవారం సల్మా ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరిచి బీరువా ధ్వంసం చేసి ఉండటాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇంటిని పరిశీలించి బాధితురాలి ఫిర్యాదు మేరకు 30 గ్రాముల బంగారు ఆభరణాలు, 250 గ్రాముల బరువున్న రెండు జతల వెండి కాళ్ల పట్టీలు చోరీకి గురైనట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశువైద్య వర్సిటీ ఉద్యోగికి రెండేళ్ల జైలు

తిరుపతి (లీగల్), న్యూస్‌టుడే: నిధులు దుర్వినియోగం చేసిన శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయ ఉద్యోగికి రెండేళ్ల జైలుశిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ తిరుపతి పదో అదనపు జిల్లా సెషన్సు జడ్జి టి.రామచంద్రుడు బుధవారం తీర్పు వెలువరించినట్లు ఏపీపీ గాలి శ్రీనివాసులు తెలిపారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. తిరుపతి, విద్యానగర్ నార్త్‌కి చెందిన వి.రామ మోహన్ తిరుపతి పశువైద్య విశ్వవిద్యాలయంలో రీజనల్ అకౌంట్స్ కార్యాలయంలో సహాయ కంట్రోలర్. తన బయోమెట్రిక్ ద్వారా బిల్లులు పాస్ చేస్తూ ఉండేవారు. అధికార దుర్వినియోగంతో 2018, 2019లో రూ.12,20,671 నగదును ఆయన ఖాతాతో పాటు కుమార్తె ఖాతాకి బదిలీ చేసుకున్నారు. అప్పటి రిజిస్ట్రార్ డి.శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్ స్టేషన్ సీఐ కె.చంద్రశేఖర్ కేసు నమోదు చేసి ఛార్జిషీటు దాఖలు చేశారు. కేసు సాక్ష్యాధారాలతో నిరూపితమైంది. గతంలో కేసు విచారించిన మొదటి అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి సీకేవీ సత్యకాంత్ కుమార్ రెండేళ్ల జైలు, రూ.10వేల జరిమానా విధించారు. నేరస్థుడు అప్పీలు చేసుకున్నారు. ఇక్కడ కూడా కేసు నిరూపితం కావడంతో శిక్ష ఖరారు చేస్తూ అప్పీలు కొట్టివేశారు.

లిఫ్ట్ అడిగి.. మెడలో గొలుసు కాజేసి..

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనదారుడిని లిఫ్ట్ అడిగి బంగారు గొలుసు కాజేసిన ఘటన తిరుపతి రూరల్‌లో చోటుచేసుకుంది. సీఐ చిన్నగోవిందు కథనం మేరకు.. 'పేరూరు గ్రామానికి చెందిన రఘునాథరెడ్డి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. బుధవారం సాయంత్రం 4 గంటలకు ద్విచక్ర వాహనంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీవారి అపార్ట్‌మెంట్ వైపు వెళ్తున్నారు. అక్కడి మద్యం దుకాణం వద్ద ఉన్న వ్యక్తి జూపార్క్ వరకు వస్తానని లిఫ్ట్ అడిగి ఎక్కారు. జూపార్క్ సమీపంలో టాయిలెట్‌కు వెళ్లాలని ద్విచక్ర వాహనాన్ని ఆపించారు. తిరిగి వాహనం ఎక్కే సమయంలో రఘునాథరెడ్డి మెడలోని 18 గ్రాముల బంగారు గొలుసు లాక్కొని రిక్షాకాలనీ వైపు పారిపోయారు. ద్విచక్ర వాహనంతో వెంబడించినా గుర్తించలేకపోయారు. తర్వాత పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తమిళనాడులో రూ.75 కోట్ల ఆస్తుల స్వాధీనం

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తిరుపతి హథీరాంజీ మఠానికి ఆస్తులు, భూములు తమిళనాడులోనూ ఉన్నాయి. అందులోని కొందరి చెరలో ఉన్న విలువైన ఆస్తులను బుధవారం మఠం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కడలూరు జిల్లా విరుదాచలంలో దాదాపు రూ.75 కోట్ల విలువైన 71 సెంట్ల స్థలాన్ని సంబంధిత సూపరింటెండెంట్ కేశవులు, సిబ్బంది 1975 ఏడాది నుంచి బైరాగిమఠం పేరుతో ఆస్తులు అనుభవిస్తున్న వారి చెర నుంచి విడిపించి మఠం పరం చేశారు. అదే విధంగా కడలూరు- చిదంబరం జాతీయ రహదారి పక్కనే ఉన్న ఆరు ఎకరాల భూమిని న్యాయస్థానం ఆదేశాలతో స్వాధీనం చేసుకుని లీజుకు ఇచ్చారు. చెన్నైలోని అతి విలువైన భూములు, భవనాల నుంచి అద్దెలు రాబట్టేందుకు పోరాడుతున్నారు. కూటమి ప్రభుత్వం.. మఠం ఆస్తులు స్వాధీనం చేసుకోవడానికి సహకరిస్తుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. తిరుపతి నగరంలోని ఆక్రమణలను స్వాధీనం చేసుకోవాలని బావాజీ భక్తులు కోరుతున్నారు.

మఠం అధికారులు స్వాధీనం చేసుకున్న భవనం

వరకట్న వేధింపులు.. డాక్టర్‌కి ఆరు నెలల జైలుశిక్ష

తిరుపతి (లీగల్), న్యూస్‌టుడే: తిరుపతి మహిళా పోలీసుస్టేషన్‌లో నమోదైన వరకట్న వేధింపుల కేసులో భర్తకి ఆరునెలల జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తిరుపతి నాల్గో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు వెలువరించినట్లు ఏపీపీ సుజాత, కోర్టు లైజన్ అధికారులు తెలిపారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా, మదనపల్లి అవెన్యూవీధికి చెందిన ఫిజియోథెరపీ డాక్టర్ ఎంఎస్ఎం.ఇంతియాజ్ బాషాకి.. తిరుపతి ఎల్ఎస్ నగర్‌కి చెందిన దంత వైద్యురాలు షేక్ హసీనాతాజ్‌తో 2013 మే 26న వివాహం జరిగింది. వివాహానంతరం వేధింపులు పెరగటంతో బాధితురాలు 2018లో తిరుపతి మహిళా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి ఛార్జిషీటు దాఖలు చేశారు. భర్తపై కేసు సాక్ష్యాధారాలతో నిరూపితమైంది. న్యాయమూర్తి భర్తకి జైలుశిక్ష, జరిమానా విధించారు.

EENADU Classifieds

REAL ESTATE
FLAT FOR SALE
GENERAL

తిరుపతి, గెస్ట్‌లైన్ హోటల్‌కి ఆనుకొని మాస్టర్ ప్లాన్ 80 feet రోడ్డు ప్రక్కన AB AAVAS Phoenix Tower Smart Homesలో 2, 3 BHK Flats సేల్స్‌కు కలవు. RERA Project. 9505502346

JOBS

తిరుపతిలోని ప్రముఖ కంపెనీకి బిజినెస్ పర్సన్స్, రిటైర్డ్ పర్సన్స్, వివాహితులు కావలెను. Age: 30 to 65, Qua: Inter- PG పాన్‌కార్డు తప్పనిసరి ✆ 76750 95860.

మార్కెటింగ్ Reps/Officers (తిరుపతి టౌన్‌లో పనిచేయుటకు) కావలెను. Qly: MBA/B.Com/ B.Sc, గూడ్స్ ఆటో డ్రైవర్-1 అనుభవం, లైసెన్స్, బ్యాడ్జి కలిగి ఉండవలెను. ✆9703402722

తిరుపతి, NGO's కాలనీ, D.No: 6-8-1113లోని కల్పవృక్ష లగ్జరీ హోమ్‌స్టే నందు పనిచేయుటకు రిసెప్షన్ కమ్ సూపర్‌వైజర్, స్వీపర్లు కావలెను. Cont: గాయత్రి హాస్పిటల్స్, వి.వి.మహల్ రోడ్డు, లలిత జ్యూవెలరీ ప్రక్కన, తిరుపతి. ✆ 98497 55595.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం జీ: 18-20K ✆ 96404 68899, 96402 58899

EENADU CLASSIFIEDS THE WAY
B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/- Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే
తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

నందిపై పార్వతీపరమేశ్వరుల ఊరేగింపు

తవణంపల్లె, న్యూస్‌టుడే: స్థానిక శ్రీకాళభైరేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రాత్రి పార్వతీ పరమేశ్వరులు నంది వాహనంపై పురవీధుల్లో ఊరేగారు. మొదలియార్ కులస్థులు ఉదయం శ్రీకాళభైరేశ్వరస్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. నంది వాహనంపై ఊరేగుతున్న స్వామి అమ్మవార్లకు గ్రామస్థులు పూజలు చేసి మంగళ హారతులిచ్చారు.

అనంత పద్మనాభుని సేవలో ఎంపీ

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురం అనంత పద్మనాభస్వామిని బుధవారం ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు దర్శించుకున్నారు. పద్మనాభుని దర్శనం మహాద్భాగ్యంగా భావిస్తున్నట్లు ఎంపీ ఆనందం వ్యక్తం చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నగరి, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా గుర్తించి మొక్కల పెంపకంపై దృష్టి పెట్టాలని ఎంఈవో శ్రీదేవి పేర్కొన్నారు. కేవీపీఆర్‌పేట ఉన్నత పాఠశాలలో బుధవారం ఆమె మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: మొగిలీశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి శివపార్వతుల కల్యాణం జరిగింది. ఉభయదారులుగా చిత్తూరుకు చెందిన న్యాయవాది లోకనాథరెడ్డి వ్యవహరించారు. అంతకుముందు స్వామి అమ్మవార్లు కామధేను వాహనంపై మాడవీధుల్లో విహరించారు.

కమిషనర్‌కు సత్కారం

కమిషనర్‌ను సత్కరిస్తున్న భాజపా నాయకులు

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: నగరాభివృద్ధిలో చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహప్రసాద్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని భాజపా సీనియర్ నాయకులు చిట్టిబాబు అన్నారు. నగర కమిషనర్ స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి పొందిన సందర్భంగా బుధవారం ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్తు సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: విద్యుత్తు సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపరాదని ఆ శాఖ చిత్తూరు అర్బన్ డివిజన్ ఈఈ మునిచంద్ర పేర్కొన్నారు. బుధవారం స్థానిక గాంధీరోడ్డులోని అర్బన్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్తు గ్రీవెన్స్ నిర్వహించారు.

రక్షక్ వాహనం సిద్ధం

అటవీశాఖ రక్షణ వాహనం ● వాహనంలో తుపాకీ, వలలు, బోన్లు, మందులు

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: గ్రామాలు, పొలాల్లోకి వచ్చే వన్యప్రాణులను సురక్షితంగా రక్షించి, తిరిగి అడవిలోకి వదలడంతోపాటు పులులు, చిరుతలు, ఏనుగులు, వంటి పెద్ద జంతువులకు గన్‌తో మత్తు సూది వేసి పట్టుకోవడం, గాయపడిన జంతువులకు చికిత్సలు అందించడం, గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని, వేగవంతమైన సహాయక/రక్షణ వాహనం ప్రధాన ఉద్దేశం. అటవీశాఖ అనంతపురం సర్కిల్ పరిధిలోని అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు జిల్లాలకు ఒక్కో వాహనం చొప్పున కేటాయించారని ఇటీవల జరిగిన సర్కిల్ సమావేశంలో సీసీఎఫ్ యశోదబాయి తెలిపారు. ఈ వాహనం అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ పరిధిలో ఉంటుంది. ఐదుగురితో కూడిన బృందం ఉంటుంది. వాహనంలో పరికరాలు, చికిత్సలకు మందులు వంటివి సిద్ధంగా ఉంటాయి. ఇటీవల అనంతపురం సర్కిల్ పరిధి వాలంటీర్లకు, అటవీ శాఖ అధికారులకు శిక్షణ కూడా ఇచ్చారు.

వాహన బృందాల విధులిలా..

❖ **వన్యప్రాణుల రక్షణ :** జనవాసాల్లోకి వచ్చిన పులులు, చిరుతలు, ఏనుగులు, పాములు వంటి వాటిని సురక్షితంగా బంధించి అడవిలో వదలడం.
❖ **ప్రమాదాల నివారణ :** అటవీ ప్రాంతాలు, పంట పొలాల్లో గుంతల్లో పడిపోయిన, గాయపడిన, కంపల్లో చిక్కుకున్న జంతువులను రక్షించి చికిత్స చేయడం. ❖ **అత్యవసర చర్యలు:** ఘటనా స్థలానికి వేగవంతంగా చేరుకోవడం, పరిస్థితిని అంచనా వేయడం, ఆపరేషన్ చేపట్టడం. ❖ **మానవ-వన్య ప్రాణి సంఘర్షణ నివారణ :** ప్రజలు ఆస్తులు, పంట పొలాలకు నష్టం ప్రాణాలను కాపాడుకునేందుకు అడవి జంతువులను నియంత్రించడం, ఆవాసాల వద్ద భయాందోళనలు తగ్గించడం. పంట, ఇతర నష్టాలు జరిగితే పరిహారం అంచనా వేయడం. ❖ **అవగాహన :** వన్యప్రాణుల రక్షణ, పర్యావరణ పరిరక్షణ, జంతువుల కనిపిస్తే జాగ్రత్తలపై ప్రజలకు తెలియజెప్పటం.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 9866112017
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 9505557466

గంగాధరనెల్లూరు: **సమస్య:** చిత్తూరు-పుత్తూరు ప్రధాన తారుమార్గంలో వేల్కూరు బస్టాపు సమీపంలో రోడ్డు పక్కనే వ్యర్థాలు, పిచ్చిమొక్కలతో రోడ్డు కుంచించుకుపోయింది. ప్రమాదాలు జరుగుతున్నాయి. –బాబు, స్థానికుడు

సమాధానం: పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులతో వ్యర్థాలను, పిచ్చిమొక్కలను తొలగింపజేయిస్తాం. –శివయ్య, డిప్యూటీ ఎంపీడీవో

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: **సమస్య:** స్థానిక గిరింపేటలోని భజనగుడి వీధిలో డ్రైనేజీ కాలువల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. –స్థానికులు

సమాధానం: కాలువలో పూడికతీత పనులు చేపడతాం. –లోకేష్, నగరపాలక ఆరోగ్యాధికారి

పాలసముద్రం, న్యూస్‌టుడే: **సమస్య:** గంగమాంబపురం పంచాయతీ ఆదిఆంధ్రవాడ గ్రామంలోని ప్రధాన వీధుల్లో చెత్తకుప్పలు ఎక్కడ పడితే అక్కడ వేస్తున్నారు. దీంతో అపరిశుభ్రంగా ఉండటంతో పాటు దుర్వాసన వెదజల్లుతోంది. –గ్రామస్థుడు

సమాధానం: చెత్తకుప్పలను వెంటనే తొలగిస్తాం. –సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో

వెలిగిన వీధి దీపాలు

స్పందనకు వందనం

వెదురుకుప్పం: పచ్చికాపల్లంలోని కోనేటి వీధిలో వీధి దీపాలు వెలగడం లేదని ఇటీవల ఈనాడులో వార్త ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ పాలకులు బుధవారం మరమ్మతు చేయించి వెలిగించారు.

నేరస్థుల్లో శిక్ష తప్పదనే భయం

సురేంద్రకుమార్

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ పాలనలో నేరస్థులపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక తెదేపా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆడబిడ్డలు, చిన్న పిల్లలపై నేరాలు జరిగితే రాష్ట్ర ప్రభుత్వం ఉపేక్షించడం లేదని, కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. దీంతో నేరాలు, ఘోరాలు పాల్పడుతున్న వారు శిక్ష తప్పదనే భయంతో వారే ప్రాణాలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. అన్నమయ్య జిల్లాలో చిన్నారిపై దారుణానికి పాల్పడిన వలపర్ల మరుసటి రోజే చెరువులో శవమై తేలడం, పాపను నీటిలో ముంచి చంపిన వాడు నీటిలోనే మునిగి చనిపోయాడని అన్నారు.

ఆలయ మహాకుంభాభిషేకం

గంగాధరనెల్లూరు: కొండేపల్లె పంచాయతీ పద్మాపురంలో వెలసిన సంజీవరాయస్వామి ఆలయ పుష్కర వార్షికోత్సవ మహాకుంభాభిషేకోత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేకపూజలు, అభిషేకాలు, అగ్నిహోమాలు, నూతనంగా శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాల ప్రతిష్ఠ, జీర్ణోద్ధారణ, అన్నదానం, పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం కలశారాధన, మహాపూర్ణాహుతి, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని ధర్మకర్త తాల్లూరి గోపాల్‌నాయుడు తెలిపారు.

స్నేహభావంతో మెలగాలి

పలమనేరు: పట్టణంలో కోటాయాత్ర, రంజాన్ పండుగ సందర్భాల్లో ఇరువర్గాల వారు సంయమనం పాటించాలని సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో సంఘ పెద్దలతో సమావేశాన్ని నిర్వహించారు. అల్లరి మూకలు సమూహాల్లో చేరి అల్లర్లను సృష్టిస్తారు. ఇరుక్కునేది అమాయకులు. అందుకే స్నేహభావంతో జరుపుకోవాలని సూచించారు. ఎస్‌ఐ స్వర్ణతేజ పాల్గొన్నారు.

బిల్‌గేట్స్‌పై వైకాపా విమర్శలు దారుణం

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: ప్రపంచ సాఫ్ట్‌వేర్ దిగ్గజం బిల్‌గేట్స్ తన అమరావతి పర్యటనలో సీఎం చంద్రబాబు పాలనలో సాంకేతికత వినియోగాన్ని చూసి సంభ్రమాశ్చర్యాలకు గురైతే.. వైకాపా నాయకులు సమోసా ఖర్చులు ఎంత? టీ ఖర్చులు ఎంత? అని ప్రశ్నించడం వారి దిగజారుడు తనానికి నిదర్శమని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరిప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో సినీ నటుడు రజినీకాంత్‌ను వైకాపా నాయకులు ఇష్టానుసారం మాట్లాడి తెలుగు వారి పరువును మంట కలిపారని, ఇప్పుడు రాష్ట్రానికి వచ్చిన ప్రముఖ పారిశ్రామికవేత్తను అవహేళన చేయడం దారుణమన్నారు. బిల్‌గేట్స్‌కు నేర చరిత్ర ఉందని ఆరోపించడం వారి పైశాచికత్వానికి నిదర్శనమని, మాజీ సీఎం జగన్ నేర చరిత్రను ఎవరిని అడిగినా చెబుతారని ఆయన విమర్శించారు. సమావేశంలో తెదేపా జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, జిల్లా కార్యదర్శి ధరణీప్రకాష్, నాయకులు యువరాజులునాయుడు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో తెదేపా నాయకులు

విద్యార్థులతో జేసీ రాజేంద్రన్

యోగా వ్యాప్తికి కృషి చేయాలి

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: యోగా వ్యాప్తికి కృషిచేయాలని జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. చిత్తూరులోని పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాలలో డిప్లొమా ఇన్ యోగా సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు బుధవారం ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. ప్రిన్సిపల్ జీవనజ్యోతి, వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, నాక్ కోఆర్డినేటర్ హరిప్రసాద్, అకడమిక్ కోఆర్డినేటర్ భానుప్రకాష్, యోగా సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రయోజనాల కోసమే ఆరోపణలు

గుడిపాల, న్యూస్‌టుడే: ఏపీ బడ్జెట్‌పై వైకాపా నేతలు చేస్తున్న ఆరోపణలు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఎంపీపీ గోళ్ల హరిప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిందని అన్నారు.

లైసెన్సుల ప్రైవేటీకరణ తగదు

నగరి, న్యూస్‌టుడే: రవాణా రంగంలో ఎల్ఎస్, ఎల్ఎల్ఆర్ లైసెన్సుల ప్రైవేటీకరణ చేయడాన్ని మానుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కోదండయ్య డిమాండ్ చేశారు. నగరి ఆర్టీవో కార్యాలయం ఎదుట బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు నిరసన చేపట్టారు. ఆర్టీవో భాను శంకర్‌కి వినతిపత్రం అందజేశారు.

పదిలో వందశాతం ఫలితాలు సాధించాలి

విజలాపురం, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించి జిల్లాలో ఆదర్శంగా నిలవాలని డీవైఈవో ఇందిర తెలిపారు. ముదిగోళం జడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా బుధవారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన వంద రోజుల ప్రణాళికను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్ఎం వి.గిరిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నన్ను వినియోగించరూ!

జీడీనెల్లూరు సహకార గోదాములో రూ.20 లక్షల విలువైన ట్రాక్టర్, మడకలు, చదునుచేసే యంత్రం, వేరుసెనగ విత్తులు విత్తే యంత్రం నిరుపయోగంగా ఉన్నాయి. 15ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ఖరీఫ్‌లో చిన్న, సన్నకారు రైతులకు తక్కువ ధరకు సహకార సంఘం ద్వారా బాడుగకు ఇవ్వాలని అప్పట్లో రూ.పది లక్షల విలువైన ట్రాక్టర్, మడకలు, విత్తులు, చదును చేసే ఆధునిక యంత్రాలను సరఫరా చేసింది. అయితే వీటి గురించి పట్టించుకోకపోవడంతో ఈ ఆధునిక యంత్రాలు నిరుపయోగంగా ఉండి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. దీంతో మార్కెట్‌లో ఏటా ఖరీఫ్‌లో వేరుసెనగ పంట సాగుకు బాడుగ కోసం రైతులు అధిక ధరలు వెచ్చిస్తున్నారు. కనీసం ఈ ఏడాదైనా వీటిని వినియోగంలోకి తేవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. **-న్యూస్‌టుడే, గంగాధరనెల్లూరు**

టెంకాయ కొట్టేదెప్పుడో?

రామభద్రాపురం గ్రామ సచివాలయ భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. వైకాపా ప్రభుత్వ హయాంలో గ్రామ సమీపంలో భవన నిర్మాణాన్ని చేపట్టారు. స్థల వివాదంతో ప్రారంభంలోనే ఆగిపోయింది. భవన వసతి లేక సిబ్బంది ఇబ్బంది పడుతుండడంతో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చొరవ తీసుకుని నూతన భవన నిర్మాణానికి రూ.24 లక్షలు నిధులు కేటాయించి ఇచ్చారు. ప్రస్తుతం భవనం పూర్తయి నెలలు గడుస్తోంది. సచివాలయం ఓ ఇరుకైన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో నడుస్తోంది. భవన ప్రారంభానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, గుడిపాల**

అంధకారంలో బస్టాండ్

నగరి బస్టాండ్ కూడలిలో మూడు రోజులుగా చీకటి రాజ్యమేలుతోంది. ఈ నాలుగు రోడ్ల కూడలిలో వెలుగులు నింపే హైమాస్ లైట్లు సక్రమంగా వెలగకపోవడంతో మరమ్మతుల కోసం కిందకి దింపి మూడు రోజులు గడిచింది. మరమ్మతులు చేయడంలో జాప్యం కారణంగా పూర్తిగా అంధకారంగా మారింది. నిత్యం ప్రయాణికులు, ప్రజలతో రద్దీగా ఉండే ఈ టవర్ క్లాక్ కూడలి చీకటిగా ఉండటంతో దొంగల బెడద పెరిగింది. రాత్రి 8 గంటలకే దుకాణాలు మూసేసే పరిస్థితి నెలకొంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు చీకటిలో ఇబ్బందులు తప్పటం లేదు. ఈ సమస్యపై మున్సిపల్ అధికారులను ప్రశ్నిస్తే, మరమ్మతులకు సంబంధించిన పరికరాలు విజయవాడ నుంచి మెకానిక్ తీసుకురావాలని, సుమారు మరో వారం రోజులు పడుతుందని సమాధానం ఇస్తున్నారు. **-న్యూస్‌టుడే, నగరి**

గ్రామస్థుల చొరవ.. రూపుదిద్దుకున్న ఆలయం

నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయం

పెనుమూరు, న్యూస్‌టుడే: దేవుడిపై ఉన్న నమ్మకం ఆ గ్రామస్థుల్లో చైతన్యం నింపింది. ఎలాగైనా తమ గ్రామంలో నూతన ఆలయం నిర్మాణం చేపట్టాలని భావించారు. అందరు ఏకమై చందాల రూపంలో నగదు సేకరించి నూతనంగా గ్రామంలో శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం చేపట్టారు మండలంలోని కలికిరి పంచాయతీ కె.ఎల్లంపల్లె గ్రామస్థులు. గరుడ కీర్తి ధ్వజంతోపాటు వినాయక స్వామి మూలవిరాట్టునూ నెలకొల్పనున్నారు. ఆలయ నిర్మాణ పనులు పూర్తికావడంతో కుంభాభిషేకం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రూ.కోటితో నిర్మాణం

కె.ఎల్లంపల్లె గ్రామస్థులకు శ్రీవేంకటేశ్వర స్వామి అంటే ఎంతో భక్తి. స్వామిపై ఉన్న భక్తితో ప్రజలు గ్రామంలోనే ఆలయాన్ని ఏర్పాటు చేసుకోవాలని సంకల్పించారు. గతంలో గ్రామంలో ఉన్న ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని తొలగించి నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గ్రామస్థులు అందరు ఏకమై చందాలు వేసుకుని రూ.కోటికి పైగా వ్యయంతో వేంకటేశ్వర స్వామి, వినాయక స్వామి విగ్రహాలు సహా నూతన ఆలయాన్ని నిర్మించారు.

23 నుంచి కుంభాభిషేకం

ఎల్లంపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయం మహాకుంభాభిషేకం ఉత్సవాలు ఈనెల 23వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు జరుగనున్నాయి. ఏర్పాట్లను నిర్వాహకులు చేపడుతున్నారు. ఆలయంలో ప్రతిష్ఠించే విగ్రహాలను సైతం తీసుకువచ్చి ధాన్యాది వాసంలో ఉంచారు.

అవినీతి వెలికితీయడానికే సామాజిక తనిఖీ

సభలో పీడీ రవికుమార్, అధికారులు

శ్రీరంగరాజపురం, న్యూస్‌టుడే: వీబీ జీ రామ్‌జీ(ఉపాధి హామీ పథకం) పనుల్లో జరిగిన అవినీతిని వెలికి తీయడానికే సామాజిక తనిఖీ బహిరంగ సభలు నిర్వహిస్తున్నట్లు డ్వామా పీడీ రవికుమార్ తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో బహిరంగ సభ నిర్వహించారు. అన్ని శాఖల్లో 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనుల్లో రూ.36,661 అవినీతి జరిగిందని, రికవరీ చేసినట్లు చెప్పారు. కాగా.. ఎగువకమ్మకండ్రిగ పంచాయతీలో అవినీతి కళ్లకు కట్టినట్టు చూపినా రికవరీ చేయలేదని, సామాజిక తనిఖీ సిబ్బంది డబ్బులు తీసుకుని వాస్తవాలు వదిలేశారని పీడీ సమక్షంలో పంచాయతీలోని కొందరు ఆరోపించారు. చర్యలు తీసుకోవాలని పీడీని కోరారు. కార్యక్రమంలో అడిషినల్ ప్రాజెక్టు డైరెక్టరు సునీల్‌కుమార్, అంబుడ్స్‌మెన్ వరదరాజులు, ఎంపీడీవో వజన, ఏపీవో లతిత పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయండి

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు భయపడకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని విజ్ఞానసుధ విద్యాసంస్థల ఛైర్మన్ శ్రీధర్ తెలిపారు. నగరంలోని విజ్ఞానసుధ జూనియర్ కళాశాలలో వీడ్కోలు సమావేశం బుధవారం జరిగింది. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ లీలాకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విజ్ఞానసుధ విద్యాసంస్థల ఛైర్మన్ శ్రీధర్

బాధితులకు సకాలంలో పరిహారం అందించాలి

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సకాలంలో నష్ట పరిహారం అందించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ కోరారు. కలెక్టర్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి వివిధ అంశాలపై మాట్లాడారు. మండలాల్లో కమిటీ సమావేశాలు, పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించడం లేదని చెప్పారు.

రోడ్ల నిర్మాణాల నాణ్యతలో రాజీ వద్దు

గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే: సిమెంట్ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత లోపం ఉండరాదని ఎంపీడీవో మనోహర్‌గౌడ్, పంచాయతీరాజ్ డీఈ ఆనందరెడ్డి గుత్తేదారులను ఆదేశించారు. బుధవారం వారు నాశంపల్లె ప్రభుత్వ కాలనీలో రూ.60 లక్షలతో నిర్మాణంలో ఉన్న మురుగు కాలువలు, సిమెంట్ మార్గాల నిర్మాణాన్ని పరిశీలించారు. నిర్మాణం పూర్తయ్యాక తనిఖీల్లో నాణ్యత లోపాలు కనిపిస్తే..గుత్తేదారులకు బిల్లుల్లో కోతతోపాటు కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. వారితోపాటు ఏఈ సుగుణాకర్‌రావు, ఇంజినీరింగ్ సహాయకులు సునీల్, క్షేత్రసహాయకులు నరేష్, గుత్తేదారు రుష్యేంద్రరెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రామీణ యువతను క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి

కార్వేటినగరం, న్యూస్‌టుడే: గ్రామీణ యువతను అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం చేయూతనందించాలని ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పొన్నాయుగంధర్ కోరారు. మండలంలోని కొటార్వేడులో యువతకు వాలీబాల్ పరికరాలకు రూ.7వేలు ఆర్థికసాయాన్ని ఆయన బుధవారం అందజేశారు. జనసేన నాయకులు దేవేంద్రన్, గంగయ్య, నరసింహులు, మణి, అన్నామలై పాల్గొన్నారు.

సైన్స్ ప్రయోగాలపై అవగాహన అవసరం

నగరి, న్యూస్‌టుడే: విద్యార్థులు సైన్స్ ప్రయోగాలపై నైపుణ్యం పెంచుకోవాలని నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.వేణుగోపాల్ పేర్కొన్నారు. కళాశాలలో ప్రత్యేక జువాలజీ ప్రదర్శన బుధవారం నిర్వహించారు. సత్యవేడు కళాశాల నుంచి డా.హరిప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ డా.భాస్కరరాజు, జువాలజీ విభాగం అధ్యక్షురాలు డా.స్వాతి, అధ్యాపకులు అరుణకుమారి, రామానుజులు, సుహాసిని, విద్యార్థులు పాల్గొన్నారు.

సస్యరక్షణతోనే మామిడి దిగుబడి

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: సస్యరక్షణతోనే మామిడి పంటలో దిగుబడి సాధ్యమని జిల్లా ఉద్యాన శాఖాధికారి రామాంజనేయులు తెలిపారు. రాగిమానుపెంటలో బుధవారం మామిడి పంట దిగుబడిపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

తెలుగు తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలి

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం చిత్తూరులో తెలుగు తల్లి విగ్రహం ఏర్పాటుచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు రచయితలు బుధవారం విన్నవించారు. జిల్లా అధికార భాషా సంఘం ఏర్పాటు చేయాలని, పరిపాలనా వ్యవహారాల్లో తెలుగు భాషలో సాగించాలని, దుకాణాల నామ ఫలకాలను తెలుగు భాషలో ఉండేలా చూడాలని వినతిలో పేర్కొన్నారు. వివిధ రచయితల సంఘాల సభ్యులు గిరిధరన్, సహదేవనాయుడు, అరుణకుమారి, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

స్వయం ఉపాధితో భవితకు బాట

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: నగరంలో బ్యాంకు లింకేజీ ద్వారా అందుతున్న రుణాలను సద్వినియోగం చేసుకుంటున్నారు స్వయం సహాయక సంఘాల మహిళలు. పెట్టుబడి, వ్యాపార నిర్వహణ ద్వారా స్వయం ఉపాధి పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

కిరాణా దుకాణంతో..

శ్రీనివాస ఎస్ఎల్ఎఫ్ పరిధిలోని శ్రీ లక్ష్మి మహిళా మండలి సభ్యురాలైన పొన్ని..స్థానిక భరత్‌నగర్‌లో కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. వివాహమైన తర్వాత ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో మెప్మా ద్వారా బ్యాంకు లింకేజీ రుణం రూ.2 లక్షల వరకు తీసుకున్న ఆమె వ్యాపారంపై పెట్టుబడి పెట్టారు. తద్వారా నెలకు రూ.20వేల వరకు సంపాదిస్తున్నట్లు పొన్ని తెలిపారు.

హోటల్ నిర్వహిస్తూ..

స్థానిక రఘురాంనగర్ కాలనీకి చెందిన సెల్వి బాపూజీ మహిళా పొదుపు సంఘంలో సభ్యురాలు. లింకేజీ ద్వారా రూ.2 లక్షల రుణం పొందారు. చిన్నపాటి హోటల్‌ను ప్రారంభించారు. వ్యాపారానికి ఆదరణ బాగుండటంతో మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోందని సెల్వి చెబుతున్నారు. నెలకు రూ.15వేల వరకు ఆదాయాన్ని కళ్ల జూస్తున్నారు. కుటుంబ నిర్వహణకు ఆదాయాన్ని వెచ్చిస్తున్నారు.

రూ.2 లక్షల రుణం పొంది

స్థానిక భరత్‌నగర్‌లో బాలాజీ మహిళా మండలి సభ్యురాలైన శాంతకుమారి.. స్థానికంగానే కిరాణా దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నారు. స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా ఉంటూ.. బ్యాంకు లింకేజీ ద్వారా రూ.2 లక్షల వరకు రుణం తీసుకున్నారు. వ్యాపారం లాభసాటిగా కొనసాగుతోందని.. తద్వారా నెలకు రూ.18వేల వరకు ఆదాయం వస్తోందని చెబుతున్నారు. సొంత వ్యాపారంతో ఆత్మవిశ్వాసం పెరిగిందని అంటున్నారు.

రూ.20 వేల ఆదాయం

దుర్గా మహిళా మండలి సభ్యురాలైన గంగ రఘురాంనగర్ కాలనీలో కిరాణా దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. మెప్మా ద్వారా స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా ఉంటూ.. బ్యాంకు లింకేజీ ద్వారా రూ.2లక్షల వరకు రుణం పొందారు. నిత్యావసర వస్తువులు విక్రయిస్తూ.. నెలకు రూ.20 వేల వరకు ఆదాయం పొందుతున్నట్లు చెబుతున్నారు.

తెదేపా నాయకుడిపై దాడి

శ్రీరంగరాజపురం, న్యూస్‌టుడే: వైకాపాకు చెందిన కొందరు యువకులు బుధవారం తనపై దాడి చేసినట్లు ఏఎంపురం పంచాయతీ తెదేపా బూత్ కన్వీనర్ గజేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఏఎంపురంలో ఓ యువకుడు అనారోగ్యంతో మృతిచెందాడు. గ్రామంలో కొందరికి అమ్మవారు పోసిందని, డప్పు కొట్టకూడదని గ్రామస్థులు చెప్పారు. ఈ క్రమంలో వైకాపా మద్దతుదారులు ముగ్గురు డప్పుకొడుతూనే ఉంటే వద్దని చెప్పినందుకు తనపై దాడి చేశారని గజేంద్ర అన్నారు. తెదేపా నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుండయ్య ప్రమేయంతో ప్రణాళికాబద్ధంగా తనపై దాడి చేశారన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేశానని, తనకు రక్షణ కల్పించాలని బాధితుడు కోరారు.

చిట్టడవిలా రైల్వేస్టేషన్ ప్రాంగణం

పుత్తూరు రైల్వేస్టేషన్‌ను 2022లో దక్షిణ రైల్వే అధికారులు రూ.కోటి వ్యయంతో ఆధునికీకరించారు. ప్లాట్‌ఫాంపై చెత్త కుండీలు, రైల్వే స్టేషన్ ముందు భాగంలో చిన్న పార్కు, రోడ్లు ఏర్పాటు చేశారు. కాగా స్టేషన్ ముందు భాగంలో ఏర్పాటు చేసిన చిన్నపాటి పార్కులో పిచ్చి మొక్కలు పెరిగి ఆ ప్రాంతం అంతా చిట్టడవిని తలపిస్తోంది. సాయంత్రం సమయాల్లో ప్రయాణికులు అక్కడ ఉండాలంటే పిచ్చిమొక్కల కారణంగా దోమలతో ఇబ్బంది పడుతున్నారు. పార్కు ప్రదేశంలో పెరిగిన పిచ్చిమొక్కలు తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, పుత్తూరు**

(c) eenadu

పలమనేరు

•పలమనేరు •కుప్పం

వైభవంగా వసంతోత్సవం

బైరెడ్డిపల్లె : తీర్థం, కోటేపల్లె గ్రామాల మధ్య వెలసిన శ్రీకాళభైరవేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వసంతోత్సవం వైభవంగా జరిగింది. ఆలయంలో ఉదయం అర్చకులు స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణతో పూజలు జరిపారు. అనంతరం ధ్వజావరోహణ పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్త రాజారెడ్డి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉచిత వైద్య పరీక్షలు

పెద్దపంజాణి: మాదనపల్లె పంచాయతీ కత్తారపల్లె గ్రామంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. తిరుపతి రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ వైద్యుడు వెంకటరమణ 70మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. 14మందికి వివిధ రకాల శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు బానుప్రతాప్‌రెడ్డి, కృష్ణప్ప, ఎల్లప్పలు తెలిపారు.

బాల్య వివాహాలపై మార్పు రావాలి

పెద్దపంజాణి: బాల్యవివాహాలపై సమాజంలో మార్పు రావాలని మిషన్ వాత్సల్య చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి శివశంకర్ అన్నారు. బుధవారం శ్రీరామాపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బాల్యవివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. సమాజంలో బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలు, బాల్యవివాహాల కారణంగా ఎదురయ్యే ఆరోగ్య సమస్యలపై వివరించారు. సమావేశంలో ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు లత, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమితోనే బీసీల అభ్యున్నతి

రామకుప్పం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలోనే బీసీలు అభివృద్ధి చెందుతారని తెదేపా అధికార ప్రతినిధి గొనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం తెదేపా మండల కార్యాలయంలో పత్రికా సమావేశం నిర్వహించారు. బడ్జెట్ నిధులు కేటాయింపులో కూటమి ప్రభుత్వం బీసీలకు వెన్నుదన్నుగా నిలిచిందన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

చెక్కుల పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు

రామకుప్పం, న్యూస్‌టుడే: ఆస్పత్రిలో చికిత్సలు పొందిన ముగ్గురికి రూ.2.55 లక్షల విలువగల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బుధవారం స్థానిక తెదేపా నేతలు పంపిణీ చేశారు. ననియాల తండాకు చెందిన శోభకు రూ.2లక్షలు, పార్వతమ్మకు రూ.24వేలు, రామాపురం తండాకు చెందిన శివకుమార్‌కు రూ.31500వేల విలువ గల చెక్కులను అందించారు. ఎవరైనా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ.. సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో కుప్పం తెదేపా పార్టీ కార్యాలయాన్ని సంప్రదిస్తే తప్పకుండా సాయం అందిస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో రెస్కో, డైరెక్టర్ మనోహర్, మండల ప్రధాన కార్యదర్శి కామరాజ నాయక్, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలపై అవగాహన

మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి

రామకుప్పం: ప్రస్తుతం ఉన్న మామిడి పూతకు తేనె మంచుపురుగు, గొంగళి పురుగు వల్ల అపకారం ఉందని శాస్త్రవేత్త డా.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని రాజుపేట వద్ద ఉన్న మామిడి తోటలో నియోజకవర్గ రైతులకు ఉద్యానశాఖ, చెల్లిగానిపల్లె రైతు సంఘం ఆధ్వర్యంలో యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వాతావరణంలో వేడి పెరగడం వల్ల నల్ల తామర పూతలో ఉంది. దీని కోసం పలుచని నీటి తడి ఒకటి ఇచ్చి పసుపు, నీలి రంగు జిగురు అట్టలను తప్పనిసరిగా చెట్టుకి కట్టాలన్నారు. పిందె ఏర్పడిన తర్వాత బుప్రోపెజిన్, అసిటేమ్ను 1 గ్రాము, సిలీంద్రనాశిని సాఫ్ 2 గ్రాములను ఒక లీటరు నీటితో కలిపి స్ప్రేచేయాలన్నారు. శాఖ వారు అందించే మామిడి కవర్లను తప్పనిసరిగా కడితే పండు ఈగ నుంచి కాపాడుకుని నాణ్యమైన కాయలను పొందవచ్చన్నారు. మామిడి కవర్లను 50 శాతం సబ్సిడీతో ఎకరాకు 6,000 కవర్లు, ఐదు ఎకరాలకు గరిష్ఠంగా 30,000 వేల కవర్లను ఇస్తారని తెలిపారు. ఉద్యాన సహాయ సంచాలకులు పల్లవి, తెదేపా మాజీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షుడు చలపతి, ఉద్యాన అధికారి దింపుప్రియ, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా తిరునాళ్లు.. పుంగనూరు, న్యూస్‌టుడే: చెక్కెంది పంచాయతీలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయ తిరునాళ్లలో భాగంగా బుధవారం దోపోత్సవం వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ప్రసన్న పార్వతీదేవి, అగస్త్యేశ్వరస్వామి దోపోత్సవంలో నియోజకవర్గ తెదేపా నాయకుడు మధుసూదననాయుడు, నాయకులు మధు రాయల్, శ్రీనివాసులనాయుడు (ఏఎంసీ ఛైర్మన్), సుబ్రమణ్యంరాజు, లక్ష్మణరాజు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

అక్రమంగా ప్లాట్లు.. కొన్నవారికి పాట్లు!

హద్దుమీరిన స్థిరాస్తి వ్యాపారులు

పలమనేరు, న్యూస్‌టుడే: ఎలాంటి అనుమతులు ఉండవు. ప్లాట్లు వేయడం విక్రయించడం. వాటిని కొన్న వారు బ్యాంకులో రుణాలు రాక అవస్థలు పడటం. ఇది పట్టణానికి అత్యంత సమీపంలోని గంగవరం మండల కేంద్రంలో నెలకొన్న పరిస్థితి. కష్టం పడిండా డోచేస్తాం. తర్వాత లాభం పొందడం ఇంతే మాకు తెలుసు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. కొందరు మమ్మల్ని ఆపేదెవరు అంటూ చెలరేగిపోతున్నారు.

వైకాపా హయాంలో

గత వైకాపా హయాంలో అడ్డు అదుపు లేకుండా రియల్టర్లు దోచుకున్నారు. వ్యవసాయ భూములను కొనుగోలు చేయడం దానికి లేఅవుట్లు ఏర్పాటు చేయడం అనుమతులు లేకుండా విక్రయాలు చేయడం చేపట్టారు. కొందరు వైకాపా నాయకుల సానుభూతిపరులు, పార్టీ నాయకులు నిబంధనలను తుంగలో తొక్కి రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని కొనసాగించారు.

అధికారుల హెచ్చరికలు బేఖాతర్

ప్రభుత్వం మారిన వెంటనే అధికారులు అనుమతులు లేని లేఅవుట్ల వద్ద హెచ్చరిక తెలియచేస్తూ పలుచోట్ల బ్యానర్లు కట్టారు. అయితే కట్టిన మరుసటి రోజు బ్యానర్లు కనిపించలేదు. వ్యాపారులు వాటి గురించి మాకు ఏమీ తెలియదు అన్నట్లు ఉంటున్నారు. అధికారుల హెచ్చరికలను కూడా వారు లెక్కచేయడం లేదు.

గంగవరంలో అతికించిన గోడపత్రం

స్థలాలకు డిమాండ్..

మున్సిపాలిటీ పరిధిలో గంగవరం పంచాయతీ కలిసిపోయింది. పట్టణానికి అనుబంధంగా ఉండే మదనపల్లె రోడ్డు పొడవునా ఈ పంచాయతీ ఉంటుంది. దాంతో స్థలాలకు ఇక్కడ మంచి గిరాకీ ఏర్పడింది. నివాసాలు, దుకాణ సముదాయాలు కూడా ఇక్కడే ఏర్పాటవుతున్నాయి. దీంతో రియల్టర్లు ఇక్కడ అడుగు పెట్టేశారు. పట్టణంలో అయితే మున్సిపల్ అనుమతులు చాలా కష్టం. పలమనేరు పట్టణానికి ఆనుకుని గంగవరం పంచాయతీ పరిధిలో పలుచోట్ల, బైపాస్ సమీపంలో దాదాపు 15 లేఅవుట్లు ఉన్నాయి. ఇందులో నాలుగింటికి మాత్రం అనుమతులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన వాటికి ఎలాంటి అనుమతులు లేవు.

నిబంధనలు గాలికి..

మొదట వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకోవాలి. ఇక ప్రతి లేఅవుట్ విస్తీర్ణంలో 12.5 శాతం భూమిని రిజర్వు ఏరియా కమ్యూనిటీ కోసం వదలాలి. 30 నుంచి 40 అడుగుల వరకు అప్రోచ్ రోడ్డు ఉండాలి. ఇప్పుడు తాజాగా ప్రభుత్వం ఈ నిబంధనను కొంత వరకు సడలించింది. 30 అడుగుల అప్రోచ్ రోడ్డు ఉంటే చాలు. దాంతో పాటు ఇంకా నీటి వసతి, విద్యుదీకరణ, తరువాత గ్రీనరీ ఉండాలి. ఇవేవీ లేకుండా స్థలాలను విక్రయించేస్తున్నారు. మిగిలిన నిబంధనలను గాలికొదిలేశారు. ఇలా అప్రూవల్స్ లేకుండా స్థలాల విక్రయాలు కొనసాగుతున్నాయి.

చర్యలు తీసుకుంటాం..

అనుమతులు పీకేఉడా సంస్థ ఇవ్వాల్సి ఉంటుంది. ప్రభుత్వం తాజాగా కుప్పం నుంచి తంబళ్లపల్లె వరకు పలమనేరు, కుప్పం డెవలప్‌మెంటు అథారిటీ పరిధిలోకి వచ్చేలా ఆదేశాలు జారీ చేసింది. అనుమతుల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే వారు వచ్చి పరిశీలించి అనుమతులు ఇస్తారు. లేఅవుట్లు అప్రూవల్స్ లేనందున గతంలో నోటీసులు పంపించడమే కాకుండా బ్యానర్లు కూడా కట్టాం. ఇక చర్యలు పీకేఉడా వారు తీసుకుంటారు.

- ప్రసాద్, ఈవోఆర్డీ, గంగవరం

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ? పట్టణంలోని ప్యాలెస్ రోడ్డులో చెత్తాచెదారం రోడ్డుపై వేయకుండా పురపాలిక ఆధ్వర్యంలో డబ్బాలను ఏర్పాటు చేశారు. అయినా కొందరు రోడ్డుపై పారబోస్తున్నారు. **- బాబు, స్థానికుడు**

సమాధానం: వేయకుండా చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాసరావు, కమిషనర్, కుప్పం పురపాలిక సంఘం

రామకుప్పం, న్యూస్‌టుడే: ? మిట్టపల్లెలో తాగునీటి ట్యాంకు వద్ద ఉన్న పశువుల నీటి తొట్టి దగ్గర చెత్తాచెదారం పేరుకుపోయింది. దాని ద్వారా దోమలు వ్యాపిస్తున్నాయి.

- రాము, గ్రామస్థుడు

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తాం. **- సోమశేఖర్, ఈవో రామకుప్పం**

తాగునీటి పైపునకు మరమ్మతు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పాత పేట వినాయకస్వామి రోడ్డులో తాగునీటి పైపులైను పగిలి నీరు వృథాగా పోతుండేది. ఈ సమస్యపై 'ఈనాడు' శీర్షిక ద్వారా కథనం ప్రచురితం కావడంతో స్పందించిన పురపాలిక అధికారులు పైపునకు మరమ్మతులు చేయించి, నీటి వృథాను అరికట్టారు.

స్పందనకు వందనం

తెరుచుకున్న ఆర్చి..

పలమనేరు- క్రిష్ణగిరి జాతీయ రహదారిలోని కుప్పం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సమీపంలో కడా ఆధ్వర్యంలో ఆర్చి నిర్మాణం చేపట్టారు. గుంతలమయమైన మట్టి రోడ్డుపై ప్రయాణం కారణంగా తరచూ ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్య నెలకొంటున్నాయి. ఈ విషయమై 'మేమున్నాం.. మీకు తోడుగా' లో ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు.

సాధికార మిత్రల సర్వే

శాంతిపురం, న్యూస్‌టుడే: మండల పరిధి 23 పంచాయతీల్లో ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై తెదేపా సాధికార మిత్రలు ఇంటింటా సర్వే చేస్తున్నారు. కుటుంబాల ఆర్థికాభివృద్ధి, మహిళా సాధికారత, సంక్షేమ పథకాల లబ్ధి వివరాలను సేకరిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పాలన, సమకూరుతున్న సౌకర్యాలతో పాటు భవిష్యత్తు అవసరాలను గుర్తించి నివేదికల రూపంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని నాయకులు తెలిపారు. గిరిధర్, చంద్రశేఖర్, రుద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీఐ మోహన్‌రెడ్డి, పక్కన పోలీసులు

స్నేహభావంతో మెలగాలి

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలో శోభాయాత్ర, రంజాన్ పండుగ సందర్భాల్లో ఇరు వర్గాల వారు సంయమనం పాటించాలని సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో సంఘ పెద్దలతో సమావేశాన్ని నిర్వహించారు. అల్లరి మూకలు సమూహాల్లో చేరి అల్లర్లను సృష్టిస్తారు. ఇరుక్కునేది అమాయకులు. అందుకే స్నేహభావంతో జరుపుకోవాలని సూచించారు. ఎస్ఐ స్వర్ణతేజ పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 124 మంది ఎంపిక

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీవిద్య డిగ్రీ కళాశాలలో బుధవారం ఏపీ స్కిల్ డెవలప్‌మెంటు సంస్థ, కళాశాల సంయుక్తంగా జాబ్‌మేళా నిర్వహించింది. అందులో 124 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 25 కంపెనీల వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా స్కిల్ డెవలప్‌మెంటు అధికారి గుణశేఖర్‌రెడ్డి, కళాశాల ఛైర్మన్ మనోహర్, ఎంపిడీవో భాస్కర్ పాల్గొన్నారు.

లక్ష్యం ఘనం.. ఆచరణ శూన్యం..!

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దవెలగటూరు పంచాయతీ కేంద్రంలోని చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం ఇది. ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. చెత్త నుంచి సంపద సృష్టించుకుని పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేసుకునేందుకు ఇదో మార్గం. తడి, పొడి చెత్తలను వేరుచేసి వర్మీకంపోస్టు తయారుచేసి రైతులకు విక్రయించేందుకు అనుకూలంగా ఇక్కడి కేంద్రంలో సిమెంటు తొట్టెలను నిర్మించారు. లక్ష్య సాధనకు పంచాయతీ పాలకులు కృషి చేయాల్సి ఉంది.



ఆగిన నిర్మాణం.. సేవలకు అవరోధం

గుడుపల్లె మండలం కంచిబందార్లపల్లె పంచాయతీ కేంద్రంలో వైకాపా హయాంలో చేపట్టిన వెల్‌నెస్ కేంద్రం (ఆరోగ్య మందిర్) భవనం నిర్మాణానికి నోచుకోలేదు. పైకప్పు దశలో నిర్మాణం ఆగిపోవడంతో అలంకార ప్రాయంగా మారింది. స్థానికంగా ప్రభుత్వ వైద్య సేవలకు భవన వసతి లేనందున రోగుల తోపాటు సిబ్బందికి అసౌకర్యం ఎదురవుతోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతున్నారు.- **న్యూస్‌టుడే, కుప్పం**

మూలకు చేరిన చెత్తబండి

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో చెత్త సేకరణ బండికి తుప్పు పడుతోంది. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ కోసం గత ప్రభుత్వం పంచాయతీలకు ఎలక్ట్రిక్ బ్యాటరీతో నడిచే మూడుచక్రాల వాహనాలను అందజేసింది. ఈ వాహనాల నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో మరమ్మతుకు గురై పలు చోట్ల మూలకు చేరాయి. తీర్థం గ్రామ పంచాయతీకి కేటాయించిన వాహనం ఐదేళ్లుగా మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలోనే ఉంటోంది. వాహనం ఎండకు ఎండి..వానకు తడిసి తుప్పు పడుతోంది.

లక్షలు వెచ్చించి.. నిర్లక్ష్యంగా వదిలేశారూ..

కుప్పం పట్టణం: కుప్పం అభివృద్ధిలో భాగంగా కడా ఆధ్వర్యంలో స్వర్ణ కుప్పం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అభివృద్ధిని కళ్లకు కట్టే విధంగా చిత్రాలను కార్యాలయ ఆవరణలో చిత్రాలు వేయించారు. కడా ప్రాంగణంలో ఉన్న ఆక్రమణలను తొలగించి రూ. లక్షలు రూపాయలు వెచ్చించి మొక్కలు, చెట్లను నాటారు. వాటికి కంచెను ఏర్పాటు చేశారు. అయితే కంచె ధ్వంసం కావడం పలువురు ఆ ప్రాంతంలో వ్యాపారాలు నిర్వహిస్తుండటం.. మరికొందరు వాహనాలను చెట్ల నీడలో నిలబెడుతూ మొక్కలను ధ్వంసం చేస్తున్నారు. రూ. లక్షలు వెచ్చించి అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారంటూ ప్రజలు వాపోతున్నారు.

మురుగు కాలువలో తాగునీటి పైపు

రామకుప్పం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని మిట్టపల్లిలో మురుగు కాలువలో తాగునీటి పైపు లైను ఏర్పాటు చేయడంతో గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. నీరు కలుషితం అయితే ప్రజలు రోగాల పాలవుతామని వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని మురుగు కాలువలో ఉన్న తాగునీటి పైపును వేరు చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై ఈవో సోమశేఖర్‌ను వివరణ కోరగా.. సిబ్బందిని పంపి తాగునీటి పైపును వేరు చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

ఎమ్మెల్యే సతీమణి సంతాపం

వి.కోట : గుండెపోటుతో మృతిచెందిన కుంభార్లపల్లె తెదేపా సీనియర్ నాయకుడు గణపతి(47) పార్థివదేహానికి ఎమ్మెల్యే సతీమణి రేణుకారెడ్డి సంతాపం తెలిపారు. గణపతి గతంలో కుంభార్లపల్లె మాజీ ఉప సర్పంచ్‌గా, పంచాయతీ అధ్యక్షుడిగా విధులు నిర్వహించారు. ఆయన మరణం పార్టీకి తీరనిలోటని తెదేపా మండల పార్టీ నాయకులు అన్నారు.

తాగునీటి కోసం ధర్నా

వి.కోట, న్యూస్‌టుడే: మండల పరిధిలోని నెర్నిపల్లె గ్రామస్థులు బుధవారం జాతీయ రహదారిపై తాగునీటి కోసం ధర్నా చేశారు. గ్రామంలో తాగునీరు లేక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామంలో మైనార్టీలు అధికంగా ఉండటంతో రంజాన్ మాసం ప్రారంభం కావడం వల్ల నీరు సరిపోవడం లేదు. సమీపంలో ఉన్న బోరు బావిని వినియోగంలోకి తీసుకు రావాలని డిమాండ్ చేశారు.

రూ.13 కోట్లకు వ్యాపారి ఐపీ

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన ఓ వ్యాపారి రూ. 13.14 కోట్లకు ఐపీ పెట్టారు. స్థిరాస్తి వ్యాపారంతో పాటు సీజనల్ వ్యాపారాలు చేసి నష్టాలు రావడంతో కోర్టును ఆశ్రయించారు. ఇతనికి సొమ్ములు ఇచ్చి మోసపోయిన పలు ప్రాంతాలకు చెందిన 71 మంది బాధితులు ఉన్నట్లు సమాచారం.

వార్డు సంఖ్య : 5, జనాభా : 2103, ఓటర్లు : 1524, కాలనీలు : గంటావూరు, ఇందిరమ్మ కాలనీ, గొబ్బిళ్లకోటూరు బీసీకాలనీ

నిత్యం సమస్యలు.. అభివృద్ధి సాగేదెలా?

పలమనేరు, న్యూస్‌టుడే: మున్సిపల్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ వాసులు మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దారులు మొత్తం గుంతలు, అధ్వానంగా ఉంది. కాలనీ ప్రజలు ఎప్పటి నుంచో రోడ్డు వసతి కావాలని కోరుతున్నారు. వైకాపాకు చెందిన పాలకవర్గం కాలనీకి రోడ్డు వసతి కల్పిస్తామని చెప్పి విస్మరించింది. ఇక కాలువలు లేకుండా రోడ్లమీదే మురుగు ప్రవహిస్తుంటుంది. ఎక్కడో ఒకచోట దీపాలు వెలుగుతుంటాయి. చివరి భాగంలో అసలు అవికూడా వెలగవు. మిగిలిన ప్రాంత ప్రజలు చీకట్లో జీవించాల్సి ఉంటుంది. కొన్ని సార్లు పాములు, ఏనుగులు, వన్యప్రాణులు కూడా వస్తుంటాయి.

అధికారుల నిర్లక్ష్యం

సమస్యలపై ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. వారి నుంచి ఎలాంటి స్పందనలేదు. కాలనీకి రావడానికి ప్రధాన రహదారి నుంచి సరైన రోడ్డు లేదు. కాలనీ మొత్తం మట్టితోనే ఉంటున్నాయి. నడవడానికి వీలు లేకుండా ఉంది. కాలువలు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు వాపోతున్నారు.



కాలనీకి వెళ్లే ప్రధాన దారి

ప్రతిపాదనలు సిద్ధం

రోడ్డు పనుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపుతున్నాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

- ఎన్వీరమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్, పలమనేరు

భార్యపై భర్త దాడి

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: పురపాలిక పరిధి దళవాయికొత్తపల్లెలో భార్యపై భర్త కత్తితో దాడి చేసి గాయపరిచిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాలిలా.. దళవాయికొత్తపల్లెకు చెందిన కరుణ్‌తో సత్యకు మూడేళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరి మధ్య బుధవారం ఉదయం ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో కత్తితో భార్య సత్యపై దాడి చేశాడు. గొంతుపై గాయాలు కావడంతో స్థానికులు ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కరుణ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పలమనేరు: మండలంలోని టి.వడ్డూరు గ్రామానికి చెందిన రమణ అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై పలమనేరు నుంచి వస్తుంటే వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ యువకుడిని చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువర్గాల ఘర్షణ: ఆరుగురిపై కేసు నమోదు

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: భూమి విషయమై ఇరువర్గాలు ఘర్షణ పడిన సంఘటన బుధవారం రాజుపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాలిలా.. రాజుపల్లెకు చెందిన నరేంద్రను ఇదే గ్రామానికి చెందిన నరసింహులు, నారాయణమ్మ, మంగమ్మ, ప్రియాంక, మనోజ్, సరస్వతీలు అడ్డుకుని పొలం విషయంలో దౌర్జన్యం చేస్తున్నట్లు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆరు మందిపై కేసునమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో రెడ్డివెంకటేష్ తెలిపారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

పెద్దపంజాణి: కులం పేరుతో దూషించి, దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మండల మాలమహానాడు, ఎరుకుల సంఘం అధ్యక్షులు మంజునాథ్, శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సివిల్ కేసులో పోలీసులు ఎందుకు జోక్యం చేసుకున్నారని ప్రశ్నించారు. బాధితులకు అండగా ఉండాల్సిన పోలీసులే వారిని బెదిరించారని పేర్కొన్నారు. వారికి న్యాయం జరిగేంత వరకు పోరాడుతామన్నారు.

చెరువులో గుర్తుతెలియని మృతదేహం

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: మండలంలోని రాయలపేట సమీపంలోని పూలకుంటలో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాలు.. వ్యక్తి మృతదేహం నీటిలో తేలినట్లు స్థానికులు ఫిర్యాదు చేశారు. మృతుడి వయసు 30-40 ఉండొచ్చు, కుడిచేతికి ఎరుపురంగు దారం, ఎరుపు రంగు షర్టు ధరించి ఉన్నాడు. సుమారు 3,4 రోజుల నుంచి నీటికుంటలో పడి ఉండవచ్చని అనుమానిస్తున్నాం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపంజాణి ఎస్సై మారెప్ప తెలిపారు.

విశ్రాంత ఎస్ఐ మృతికి సంతాపం

పలమనేరు: పట్టణానికి చెందిన విశ్రాంత ఎస్ఐ సుబ్రహ్మణ్యంపిళ్ళై (69) మృతికి పీపీఎస్, ఏపీఎన్జీవో సభ్యులు సంతాపం తెలిపారు. బుధవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందిన ఆయన మృతదేహానికి నివాళులర్పించారు.

అటవీశాఖ రక్షణ వాహనం

రక్షక్ వాహనం సిద్ధం

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: గ్రామాలు, పొలాల్లోకి వచ్చే వన్యప్రాణులను సురక్షితంగా రక్షించి, తిరిగి అడవిలోకి వదలడంతోపాటు పులులు, చిరుతలు, ఏనుగులు, వంటి పెద్ద జంతువులకు గన్‌తో మత్తు సూది వేసి పట్టుకోవడం, గాయపడిన జంతువులకు చికిత్సలు అందించడం, గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని, వేగవంతమైన సహాయక/రక్షణ వాహనం ప్రధాన ఉద్దేశం. అటవీశాఖ అనంతపురం సర్కిల్ పరిధిలోని అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు జిల్లాలకు ఒక్కో వాహనం చొప్పున కేటాయించారని ఇటీవల జరిగిన సర్కిల్ సమావేశంలో సీసీఎఫ్ యశోద బాయి తెలిపారు. ఈ వాహనం అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్ పరిధిలో ఉంటుంది. ఐదుగురితో కూడిన బృందం ఉంటుంది.

వాహనంలో పరికరాలు, చికిత్సలకు మందులు వంటివి సిద్ధంగా ఉంటాయి. ఇటీవల అనంతపురం సర్కిల్ పరిధి వాలంటీర్లకు, అటవీశాఖ అధికారులకు శిక్షణ కూడా ఇచ్చారు.

వాహన బృందాల విధులిలా..

వన్యప్రాణుల రక్షణ : జనవాసాల్లోకి వచ్చిన పులులు, చిరుతలు, ఏనుగులు, పాములు వంటి వాటిని సురక్షితంగా బంధించి అడవిలో వదలడం.

ప్రమాదాల నివారణ : అటవీ ప్రాంతాలు, పంట పొలాల్లో గుంతల్లో పడిపోయిన, గాయపడిన, కంపల్లో చిక్కుకున్న జంతువులను రక్షించి చికిత్స చేయడం.

అత్యవసర చర్యలు: ఘటనా స్థలానికి వేగవంతంగా చేరుకోవడం, పరిస్థితిని అంచనా వేయడం, ఆపరేషన్ చేపట్టడం.

వాహనంలో తుపాకీ, వలలు, బోన్లు, మందులు

మానవ-వన్యప్రాణి సంఘర్షణ నివారణ : ప్రజలు ఆస్తులు, పంట పొలాలకు నష్టం ప్రాణాలను కాపాడుకునేందుకు అడవి జంతువులను నియంత్రించడం, ఆవాసాల వద్ద భయాందోళనలు తగ్గించడం. పంట, ఇతర నష్టాలు జరిగితే పరిహారం అంచనా వేయడం.

అవగాహన : వన్యప్రాణుల రక్షణ, పర్యావరణ పరిరక్షణ, జంతువుల కనిపిస్తే జాగ్రత్తలపై ప్రజలకు తెలియజెప్పటం.

బిల్‌గేట్స్‌పై వైకాపా విమర్శలు దారుణం

విలేకరుల సమావేశంలో తెదేపా నాయకులు

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: ప్రపంచ సాఫ్ట్‌వేర్ దిగ్గజం బిల్‌గేట్స్ తన అమరావతి పర్యటనలో సీఎం చంద్రబాబు పాలనలో సాంకేతికత వినియోగాన్ని చూసి సంభ్రమాశ్చర్యాలకు గురైతే.. వైకాపా నాయకులు సమోసా ఖర్చులు ఎంత? టీ ఖర్చులు ఎంత? అని ప్రశ్నించడం వారి దిగజారుడు తనానికి నిదర్శనమని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరిప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో సినీ నటుడు రజినీకాంత్‌ను వైకాపా నాయకులు ఇష్టానుసారం మాట్లాడి తెలుగు వారి పరువును మంట కలిపారని, ఇప్పుడు రాష్ట్రానికి వచ్చిన ప్రముఖ పారిశ్రామికవేత్తను అవహేళన చేయడం దారుణమన్నారు. బిల్‌గేట్స్‌కు నేర చరిత్ర ఉందని ఆరోపించడం వారి పైశాచికత్వానికి నిదర్శనమని, మాజీ సీఎం జగన్ నేర చరిత్రను ఎవరిని అడిగినా చెబుతారని ఆయన విమర్శించారు. సమావేశంలో తెదేపా జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, జిల్లా కార్యదర్శి ధరణీప్రకాష్, నాయకులు యువరాజులునాయుడు పాల్గొన్నారు.

(c) eenadu

తెప్పోత్సవం.. పులకించిన భక్తజనం

పుష్కరిణిలో తెప్పపై ఊరేగుతున్న స్వామివారు

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరి సమేత ఉమా కుక్కుటేశ్వరస్వామి వార్ల కల్యాణోత్సవాలు ముగిశాయి. బుధవారం రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో పుష్కరిణిలో నిర్వహించిన తెప్పోత్సవం కనుల పండువగా సాగింది. ఈ కార్యక్రమాన్ని తిలకించిన భక్తజనం పులకించిపోయారు. శ్రీపుష్పోత్సవం, ఏకాంత సేవాగానం దేవస్థానం అర్చకులు కోట వీర వెంకట సత్యనారాయణమూర్తి, దత్తాత్రేయ శర్మ, కైతేపల్లి రాజ్ కుమార్ శర్మ, కుక్కుటేశ్వర శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈవో కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్, ఉత్సవాల ప్రత్యేక అధికారి సురేష్ నాయుడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మీసాల వెంకన్న కల్యాణోత్సవాలు

యానాం: యానాం ప్రజల ఆరాధ్య దైవం భూ సమేత వేంకటేశ్వరుడి(మీసాల వెంకన్న) కల్యాణోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. వేంకటేశ్వరుడిని పెండ్లికుమారుడిగా అలంకరించి పూజలు నిర్వహించారు. బుధవారం రాత్రి ఎనిమిది గంటల తర్వాత స్వామి వారిని సర్పవాహనంపై పుర వీధుల్లో ఊరేగించారు. వాహనోత్సవ ప్రారంభ వేడుకలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్, పరిపాలనాధికారి అంకిత్‌కుమార్, ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్. జ్యోతివెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సర్పవాహనంపై శ్రీవారు

రెండు దశల్లో జనగణన

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో రెండు దశల్లో జగన గణన చేపట్టనున్నట్లు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జనగణనకు సంబంధించి ఎన్యుమేటర్లకు శిక్షణపై ఆయన సమీక్ష నిర్వహించారు. మొదటి విడతగా గృహాల గణన జరుగుతుందన్నారు. ఇంటి ప్రస్తుత స్థితి, గదుల సంఖ్య, ఇంటి రకం, శాశ్వత, తాత్కాలిక గృహమా, యజమాని వివరాలు నమోదు చేస్తారన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, గృహోపకరణాల వివరాలను సేకరించాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రక్రియను డిసెంబరు నెలాఖరు వరకు పూర్తి చేయాల్సి ఉంది. 2027 డిజిటల్ యాప్ ద్వారా జనగణన జరుగుతుందన్నారు. కార్యక్రమంలోజేసీ నిశాంతి, సీపీవో మురళీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్తు సేవలు ఎలా ఉన్నాయి?

☛ ఉమ్మడి జిల్లాలో ప్రజాభిప్రాయ సేకరణ
☛ 25 శాతం మేర అసంతృప్తి

ఈనాడు, అమలాపురం: ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్తు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వివిధ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం అందుతున్న సేవలపై ప్రజల సంతృప్తి స్థాయిని తెలుసుకునేందుకు ఇటీవల అభిప్రాయాలు సేకరించింది. రాష్ట్ర వ్యాప్తంగా 77.13 లక్షల మంది అభిప్రాయాలు సేకరించగా 77.7 శాతం సంతృప్తి వ్యక్తంచేయగా 22.3 శాతం మంది ప్రతికూలంగా స్పందించారు. మీకు నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా జరుగుతోందా? నాణ్యమైన విద్యుత్తు ఇస్తున్నారా? సిబ్బంది అందుబాటులో ఉన్నారా? తదితర ప్రశ్నలకు సమాధానాలు రాబట్టారు. సేవలకు సంబంధించి రాష్ట్రంలో తూర్పుగోదావరి జిల్లా ఏడో స్థానంలో ఉండగా కాకినాడ 18, కోనసీమ 21వ స్థానంలో ఉన్నాయి. ఈ రెండు జిల్లాల్లో మరింత మెరుగుపరుచుకోవాల్సి ఉందని స్పష్టం చేశారు.

కొన్ని గ్రామాల్లో ఇలా..

● కాకినాడ జిల్లా తాళ్లరేవు సెక్షన్ పరిధిలో పై మూడు రకాల సేవలపై 747 మందితో మాట్లాడగా 29.89 శాతం, తొండంగి సెక్షన్ పరిధిలో 838 మందిని సంప్రదించగా 29.71, పిఠాపురం సెక్షన్ పరిధిలో 678 మందితో మాట్లాడగా 29.53 శాతం సక్రమంగా లేవని స్పష్టం చేశారు.

● కోనసీమ జిల్లా పి.గన్నవరం సెక్షన్ పరిధిలో 781 మందికిగాను 29.40 శాతం, కాట్రేనికోన సెక్షన్ పరిధిలో 660 మందికి 29.35, ఐనవిల్లి సెక్షన్‌లో 840 మంది అభిప్రాయాలు సేకరించగా 29.20 శాతం అసంతృప్తి వ్యక్తం చేశారు.

● నిడదవోలు పరిధిలోని అనంతపల్లి సెక్షన్‌లో 946 మంది అభిప్రాయాలు సేకరించగా 19 శాతం మంది అసంతృప్తి వ్యక్తంచేశారు.

ప్రజలు వెల్లడించిన అభిప్రాయాలు పరిశీలిస్తే (శాతాల్లో)

జిల్లా	నిరంతర విద్యుత్తు సరఫరా		నాణ్యమైన విద్యుత్తు		సిబ్బంది అందుబాటులో	
	ఇస్తున్నారు	లేదు	అందుతోంది	లేదు	ఉన్నారు	లేరు
తూర్పుగోదావరి	79.8	20.2	78.4	21.6	75.6	24.4
కాకినాడ	78.7	21.3	72.7	27.3	74.1	25.9
కోనసీమ	77.4	22.6	71.3	28.7	74.1	25.9

అధికారులే లేరు.. నియంత్రణ ఎలా..?

ఔషధ నియంత్రణ అధికారి లేని వైనం

న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

జిల్లా ఏర్పడి మూడున్నరేళ్లు పైబడుతున్నా.. ఇప్పటికీ కొన్ని సమస్యలకు పరిష్కారం లభించడం లేదు. కొన్నిశాఖలకు ఉమ్మడి జిల్లాలోనే అధికారులు ఉన్నారు. జిల్లా ఔషధ పరిపాలన అధికారి పోస్టు ఉన్నప్పటికీ నియామకం మాత్రం చేపట్టలేదు. ఒకే ఒక్క ఔషధ నియంత్రణ(డ్రగ్ ఇన్‌స్పెక్టర్) విధులు నిర్వహిస్తున్నారు. మూడు డివిజన్ల పరిధిలో ఈయనే తనిఖీలు చేయాల్సి పరిస్థితి నెలకొంది. మరో ఇద్దరు అవసరం.

జిల్లాలో ఇలా..

జిల్లాలో అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురం డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 800 వరకు ఔషధ దుకాణాలున్నాయి. వీటన్నింటినీ తనిఖీలు చేసేందుకు జిల్లాలో ఒక అధికారి మాత్రమే ఉన్నారు. తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాలకు ముగ్గురు చొప్పున నియమించారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఏడీఏ పోస్టు రాజమహేంద్రవరంలో ఉండటంతో ఏ పని అవసరమైనా అక్కడికే వెళ్లాలి.

భవనం అందుబాటులోకొచ్చినా..

గతంలో ఔషధ నియంత్రణ అధికారి కార్యాలయం అద్దె భవనంలో కొనసాగేది. పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో స్థలం కేటాయించడంతో సొంత భవనంలోకి మార్చారు. ఇద్దరు అటెండర్లు, ఒక గుమాస్తా పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. జిల్లాకు మరో ఇద్దరు ఔషధ నియంత్రణ అధికారులతోపాటు కార్యాలయంలోని పోస్టులను భర్తీ చేస్తే సేవలు మరింత మెరుగ్గా చేపట్టేందుకు అవకాశం ఉంటుంది.

6 నెలలు.. 344 తనిఖీలు

జిల్లాలో 800 ఔషధ దుకాణాలున్నాయి. గతేడాది జులై నెల నుంచి ఈ ఏడాది జనవరి వరకు 344 ఔషధ దుకాణాలను తనిఖీ చేశారు. లోపాలను గుర్తించడంతో పాటు 99 మందిపై కేసులు నమోదు చేశారు. నెలకు 40 నుంచి 50 దుకాణాలను తనిఖీ చేస్తున్నారు. ఒక్కో దుకాణంలో 300 రకాల వరకు మందులుంటాయి. ఎక్కువగా వైద్యుడి చీటీ లేకుండా, ఫార్మసిస్టు లేకుండా అమ్మకాలు జరిపే మందులపై కేసులు నమోదు చేస్తున్నారు.

'శంకరగుప్తం' ఆధునికీకరణకు చర్యలు

ఆక్రమణలు గుర్తించేందుకు కొనసాగుతున్న సర్వే

న్యూస్‌టుడే, పి.గన్నవరం, మలికిపురం

రాజోలు దీవిలోని సముద్ర తీర ప్రాంత కొబ్బరి రైతులకు అపార నష్టాన్ని కలిగిస్తున్న శంకరగుప్తం మేజర్ డ్రెయిన్‌ను ఆధునికీకరించేందుకు పిలిచిన టెండర్లు అతి త్వరలో తెరుచుకోనున్నాయి. ఖరారైన గుత్తేదారుడితో పనులు చేయిస్తారు. ఈ డ్రెయిన్‌నుంచి పోటెత్తుతున్న ఉప్పునీటి ప్రభావంతో అయిదేళ్ల కాలంలో సుమారు రెండు లక్షల కొబ్బరి చెట్లు చనిపోయాయి. స్థానిక శాసనసభ్యుడు దేవ వరప్రసాద్ ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. గత డిసెంబరు 30న ప్రభుత్వం రూ. 20.77 కోట్లు మంజూరు చేసింది. ఇటీవల టెండర్లు పిలిచారు.

శంకరగుప్తం మేజర్ డ్రెయిన్

ప్రస్తుతం ఏం చేస్తున్నారంటే...

కేశవదాసుపాలెం సమీపంలోని మెండుపాలెం నుంచి కరవాక వరకు 30.87 చదరపు మైళ్ల విస్తీర్ణంలో 22.90 కిలోమీటర్ల మేర ఉన్న శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ వెంబడి కేశవదాసుపాలెం, చింతలమోరి, శంకరగుప్తం, పడమటిపాలెం, కేశనపల్లి, తూర్పుపాలెం, అడవిపాలెం, గొల్లపాలెం, కరవాక గ్రామాలు ఉన్నాయి. దీని పొడవునా ఉన్న ఆక్రమణలను గుర్తించి అధికార యంత్రాంగం నోటీసులు జారీ చేస్తోంది. డ్రెయినేజీ విభాగం, సర్వే, వీఆర్వోలు సుమారు 25 మంది ఈ పనిలో నిమగ్నమయ్యారు. ఇంత వరకు 67 మందికి నోటీసులు జారీచేశారు.

కొత్తగా ప్రతిపాదిత పనులు

కేశనపల్లి నుంచి వి.వి. మెరక వరకు 8.5 కి.మీ. నుంచి 16.50 కి.మీ. వరకు 8 కిలోమీటర్ల మేర డ్రెడ్జింగ్ చేసి 5 లక్షల క్యూబిక్ మీటర్లు పూడిక తీస్తారు. కరవాక నుంచి శంకరగుప్తం వరకు ఇరువైపులా 14 కిలోమీటర్ల మేర గట్లు ఏర్పాటు చేస్తారు. మీటరు నుంచి 1.50 మీటర్ల ఎత్తు, 6 మీటర్ల వెడల్పుతో గట్లు నిర్మిస్తారు. గట్ల ఏర్పాటుకు 8.50 కి.మీ. నుంచి 16.50 కి.మీ. వరకు చేసిన డ్రెడ్జింగ్ ద్వారా వచ్చే మట్టిని గట్ల ఏర్పాటుకు వినియోగిస్తారు. ఇలా చేయడం ద్వారా పోటు సమయంలో ఉప్పునీరు కొబ్బరి తోటల్లోకి రాకుండా ఉంటుంది.

23 నాటికి పూర్తి

ఆక్రమణల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఇక్కడ పనులు చేపట్టేందుకు ఇప్పటికే టెండర్లు పిలిచారు. ఆ వెంటనే పనులు చేపట్టే దిశగా ప్రక్రియ చేపట్టాం. ఈ నెల 23 నాటికి ఆక్రమణల గుర్తింపు ప్రక్రియ పూర్తవుతుంది. **- వి.ఆనందకిరణ్, ఏఈఈ, డ్రెయినేజీ విభాగం, రాజోలు సెక్షన్**

అభాగ్యులకు ఆసరా..!

'పద్దు'లో అత్యధిక శాతం పింఛన్ల పంపిణీకే

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం.. పేద వర్గాలకు ఆసరాగా నిలుస్తోంది. జిల్లాలో వృద్ధాప్య, వితంతు, వికలాంగులు, అభయహస్తం, మత్స్యకారులు, చేనేత, కల్లుగీత కార్మికులు తదితరులు 1,96,395 మందికి ప్రతి నెలా.. రూ. 84.25 కోట్లు అందిస్తున్నారు. వృద్ధాప్య, వితంతు పింఛన్లు రూ.4వేలు చొప్పున, వీల్ ఛైర్, మంచానికే పరిమితమైనవారు, ప్రమాదాల్లో శాశ్వత వికలాంగులు 392 మందికి రూ.15 వేలు వంతున అందిస్తున్నారు. 36 మంది తలసేమియా వ్యాధిగ్రస్థులకు నెలకు రూ.11 వేలు, సికిల్ సెల్, మూత్రపిండ వ్యాధులు, డయాలసిస్ పేషెంట్లకు రూ. 10వేలు వంతున ప్రతినెలా పింఛన్లు అందిస్తున్నారు. వీటి ద్వారా ఆ కుటుంబాలకు వైద్యం, ఇతర ఖర్చులకు సాంత్వన కలుగుతోంది.

కొత్తవారికి ఎప్పుడు..?

గత సార్వత్రిక ఎన్నికలకు 8 నెలల ముందు నుంచే కొత్త పింఛన్ల దరఖాస్తులను నిలిపివేశారు. 60 ఏళ్లు పైబడిన వారు పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. వైకాపా హయాంలో కొందరు అనర్హులకు సైతం మంజూరు చేశారు. కూటమి ప్రభుత్వం విచారణ నిర్వహించినా.. అనర్హులను తొలగించలేదు. జిల్లాలో సుమారు 10వేల మందికి పైగా లబ్ధిదారులు వృద్ధాప్య పింఛన్లకు ఎదురుచూస్తున్నట్లు అంచనా. వితంతు పింఛను దరఖాస్తుదారులదీ ఇదే పరిస్థితి. వీటిపై ఇటీవల అసెంబ్లీలోనూ ఎమ్మెల్యేలు మాట్లాడారు. కొత్త పింఛన్లకు త్వరలో దరఖాస్తులు తీసుకుంటామని.. సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రకటించడం కొంత ఊరట కలిగిస్తోంది.

కేటగిరీ వారీగా ఇవి..

వృద్ధాప్య	99,100
వితంతు	45,643
దివ్యాంగులు	25,884
అభయహస్తం	8882
మత్స్యకార	4955
ఒంటరి మహిళ	3214
చేనేత	3891
గీత కార్మికులు	2646
ఇతరులు	2180
మొత్తం	1,96,395

ప్రతి నెల అందించే మొత్తం: రూ.84,25,55,000

ఆపదమిత్ర శిక్షణకు ఆహ్వానం

రామచంద్రపురం: ఆపదమిత్ర శిక్షణకు ఆసక్తిగలవారు వివరాలు నమోదు చేయించుకోవాలని స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి పి.రాంబాబు పిలుపునిచ్చారు. రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఆపదమిత్ర ప్రోగామ్‌పై బుధవారం అవగాహన కల్పించారు. శిక్షణ కోసం రిజిస్టర్ చేసుకున్న వారికి వారం రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. భూకంపాలు, వరదలు, తుపాన్లు వంటి విపత్తుల సమయాల్లో ఆపదమిత్రల సేవలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈనెల 23వ తేదీలోగా గూగుల్ లింక్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

గోదావరి వరదలపై ఇస్రో శాస్త్రవేత్తల పరిశీలన

బొబ్బర్లంక, తోకలంక ప్రాంతాల్లో పర్యటన

రావులపాలెం పట్టణం, ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఏటా గోదావరి వరదల సమయంలో ప్రజలు, పశువులు, ఆస్తులకు సంభవిస్తున్న నష్ట ప్రభావాన్ని తగ్గించేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటే బాగుంటుందో అధ్యయనం చేసేందుకు శాస్త్రవేత్తలు బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక, రావులపాలెం మండలం ఊబలంక శివారు తోకలంక ప్రాంతాల్లో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) శాస్త్రవేత్తలు ఎస్.వి.శివప్రసాద్‌శర్మ, అమన్‌ప్రీత్‌సింగ్ బృందం పర్యటించింది. తహసీల్దార్లు ముక్తేశ్వరరావు, రాంబాబు ఆయా ప్రాంతాల్లో వరద వచ్చిన సమయంలో పరిస్థితిని వారికి మ్యాప్‌లు చూపించి వివరించారు. మొదటి ప్రమాద హెచ్చరిక సమయంలో ఏ ప్రాంతం వరకు వరద వస్తుంది.. రెండు, మూడు, నాలుగు హెచ్చరికలు వస్తే పరిస్థితి ఏమిటి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. వరదల సమయంలో ఆస్తినష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేయనున్నారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తోకలంకలో మ్యాప్‌ను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

తీర ప్రాంతాల పరిస్థితులపై అధ్యయనం

అమలాపురం కలెక్టరేట్: జిల్లాలోని సముద్ర తీర ప్రాంతాల్లో భౌగోళిక పరిస్థితులపై డ్రోన్ ద్వారా అధ్యయనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తీర ప్రాంత మండలాలైన సఖినేటిపల్లి, మామిడికుదురు, అల్లవరం, ఉప్పలగుప్తం, కాట్రేనికోన పరిధిలో సముద్ర తీరం వెంబడి ఈ సర్వే జరుగుతుందన్నారు. ఈ మండలాల పరిధిలో 6 గ్రామాల్లో 1800 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మడ అడవులు, ఇసుక రీచ్‌లు, ఖనిజాల లభ్యత, భౌగోళిక సరిహద్దులను సర్వే చేపట్టనున్నట్లు చెప్పారు. సముద్ర జలాలు ఉద్ధృతి ఏ స్థాయిలో ఉంటుదో పరిశీలిస్తారన్నారు. కార్యక్రమంలో జేసీ నిశాంతి, డీఆర్వో కె.మాధవి, గనుల శాఖ అధికారి అశోక్ కుమార్, ఈటీవీ శాఖ అధికారి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ఇలా కోర్సు పూర్తిచేస్తే.. అలా కొలువు కొట్టొచ్చు

జేఎన్టీయూకేలో అవాంటెల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రత్యేకత

ఈనాడు, కాకినాడ; న్యూస్‌టుడే, గాంధీనగర్: పరిశ్రమ డిమాండ్లను తీర్చగలిగే పాఠ్యాంశాలు (కరిక్యులమ్) రూపొందించినప్పుడే విద్యార్థులు త్వరితగతంగా కొలువులు సాధించొచ్చు. ఇటీవల కాకినాడ జేఎన్టీయూకి వచ్చిన విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఇదే అంశమై మాట్లాడుతూ కంపెనీలు తమ పరిశోధనలకు విశ్వవిద్యాలయాలకు సాయపడాలని సూచించారు. సిగ్నల్, కమ్యూనికేషన్ రంగంలో ప్రసిద్ధిగాంచిన అవాంటెల్ లిమిటెడ్ కంపెనీ.. తాజాగా తమకు అవసరమైన మానవ వనరులను తయారుచేసుకునేందుకు జేఎన్టీయూలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుచేసింది. ఇందులో సీటు పొంది కోర్సు పూర్తిచేసినవారికి కొలువులూ ఇవ్వనుంది. ఈ సెంటర్ స్ఫూర్తితో జేఎన్టీయూకేలో క్వాంటమ్, ఏఐ సబ్జెక్టులకు సంబంధించి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి.

నాడు ఇక్కడ చదువుకుని..

అవాంటెల్ కంపెనీ భారతీయ రక్షణ, నౌకా, విమానయాన, అంతరిక్ష రంగాల్లో కమ్యూనికేషన్ పరికరాలు, సాంకేతిక సేవలందిస్తుంది. ఈ కంపెనీ సీఎండీ ఎ.విద్యాసాగర్ జేఎన్టీయూ పూర్వ విద్యార్థే. తాను చదువుకున్న విద్యాసంస్థలోనే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేశారు. సిగ్నల్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్ కోర్సులో ఎంటెక్ ప్రోగ్రాం తెచ్చారు. ల్యాబ్‌కు అత్యాధునిక కమ్యూనికేషన్ పరికరాలు, నెట్‌వర్క్ ఎనలైజర్లు, కంప్యూటర్లు, సాంకేతిక సిబ్బంది, ఫ్యాకల్టీ మొత్తాన్ని ఆ కంపెనీయే సమకూర్చింది.

కాకినాడ జేఎన్టీయూలో ఏర్పాటుచేసిన అవాంటెల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ల్యాబ్

25 సీట్లతో..

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చేరడానికి ఈసీఈ విద్యార్థులు అర్హులు. బీటెక్ అనంతరం ఎంటెక్‌లో ప్రవేశానికి గేట్ రాసి అర్హత సాధించినవారు సిగ్నల్ ప్రాసెసింగ్, కమ్యూనికేషన్‌లో చేరడానికి మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి. మౌఖిక పరీక్షల ద్వారా ఎంపికచేస్తారు. ముందుగా నోటిఫికేషన్ ఇస్తారు. ప్రస్తుతం 25 సీట్లు ఉన్నాయి. ఏడాదికి రూ.50 వేల ఫీజు.. మొదటి ఏడాది ఇక్కడి ఎక్సలెన్స్‌లో చదువుకుంటారు. రెండో ఏడాది హైదరాబాద్ కేంద్రం అవాంటెల్ కంపెనీలోనే ఇంటర్న్‌షిప్ చేయాలి. అప్పుడు నెలకు రూ.25 వేలు ఉపకారవేతనంగా ఇస్తారు.

ప్రయోగాత్మకంగా ప్రారంభం

కోర్సు పూర్తిచేసినవారిలో ప్రతిభావంతులకు ఏడాదికి రూ.9 లక్షల ప్యాకేజితో అవాంటెల్ కంపెనీ ఉద్యోగాలు ఇస్తుందని **జేఎన్టీయూకే ఈసీఈ విభాగం హెచ్‌వోడీ లీలాకుమారి** చెప్పారు. ఈ ఏడాది ప్రయోగాత్మకంగా కోర్సు ప్రారంభించామని, రానున్న విద్యా సంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో ప్రవేశాలు ఉంటాయన్నారు.

కొబ్బరి చెట్లకు నష్టపరిహారానికి హామీ

ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: ఉప్పునీటి ప్రభావంతో దెబ్బతిన్న కొబ్బరి చెట్లకు నష్టపరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ చెప్పారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బుధవారం తాను అడిగిన ప్రశ్నకు వ్యవసాయశాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అచ్చెన్నాయుడు సమాధానం ఇచ్చారన్నారు. రాజోలు నియోజకవర్గంలోని కేశనపల్లి, శంకరగుప్తం తదితర తీర గ్రామాల్లో ఎండిపోయి దెబ్బతిన్న ఒక్కో కొబ్బరి చెట్టుకు రూ. వెయ్యి చొప్పున పరిహారం ఇవ్వడానికి రూ.10 కోట్లు అవసరం ఉంటుందని, ఈ మేరకు దస్త్రాన్ని ఆర్థిక శాఖకు పంపించినట్లు చెప్పారన్నారు. దెబ్బతిని పనికిరాని చెట్లను తొలగించి వాటి స్థానంలో కొత్తగా పెంచుకోడానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకంలో నిధులు మంజూరుకు హామీ సైతం ఇచ్చారన్నారు. డ్రెయినేజీల శాశ్వత పరిష్కారానికి ప్రత్యేకంగా రూ.15 కోట్లతో లైడర్ సర్వే జరుగుతోందని మంత్రి వివరించారన్నారు.

ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలి

గాంధీనగర్: అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కోర్టు ఏర్పాటుచేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆయన కాకినాడలో మాట్లాడారు.

కోర్టుకు బాంబు బెదిరింపు

రాజమహేంద్రవరంలో ముమ్మర తనిఖీలు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలోని జిల్లా కోర్టుకు బుధవారం బాంబు బెదిరింపులు రావడంతో అంతా ఉలిక్కిపడ్డారు. కోర్టు అధికారిక ఈ-మెయిల్‌కు బెదిరింపులతో కూడిన మెయిల్ రావడంతో అధికారులు పోలీసులకు సమాచారమిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ పర్యవేక్షణలో వెంటనే డాగ్, బాంబు స్క్వాడ్ బృందాలు రంగంలోకి దిగాయి. కోర్టులో న్యాయవాదులు, కక్షిదారులను బయటికి పంపించి సాయంత్రం వరకు ముమ్మర తనిఖీలు చేపట్టారు. బాంబుకు సంబంధించి ఎలాంటి ఆనవాళ్లు కనిపించకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఇది ఆకతాయిల పనిగా పోలీసులు భావిస్తున్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు.

డాగ్ స్క్వాడ్ తనిఖీలు

సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఈ నెల 23 నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు డీఏఈవో కె.చంద్రశేఖరబాబు తెలిపారు. కొంకాపల్లి ఎస్‌కేబీఆర్ కళాశాలలో పరీక్షల నిర్వహణపై బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 23 నుంచి మార్చి 24 వరకు పరీక్షలు జరుగుతాయని మొదటి ఏడాది విద్యార్థులు 13,131, రెండో ఏడాది విద్యార్థులు 12,756 మంది హాజరవుతారని వెల్లడించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తోపాటు సీసీ కెమెరాలతో పర్యవేక్షణ ఉంటుందన్నారు. రాష్ట్ర కంట్రోల్ రూం 18004251531, జిల్లా కంట్రోల్ రూం 9550335191 నంబర్లలో సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చన్నారు. వై.లక్ష్మణరావు, జె.శాంతికుమారి, కె.శ్రీనివాసు, బి.సింహాద్రి, వై.సుబ్బారావు, వి.వి.సుబ్బారావు, గణేష్ పాల్గొన్నారు.

సిబ్బంది కావలెను

శ్రీలలిత ఎంటర్‌ప్రైజెస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, పెద్దాపురం వారికి ఈక్రింది సిబ్బంది కావలెను.
1) రైస్ మిల్ సూపర్‌వైజర్స్
2) హైడ్రా ఆపరేటర్స్
3) అకౌంటెంట్స్
తగిన అనుభవము అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ వివరములతో ఈక్రింది చిరునామా నందు స్వయముగా సంప్రదించవలెను.
లలిత ఎంటర్‌ప్రైజెస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, వాలుతిమ్మాపురం రోడ్, పెద్దాపురం, సెల్:99499 56942

శరవేగంగా వంతెన నిర్మాణం

న్యూస్‌టుడే, పి.గన్నవరం

వశిష్ఠ గోదావరి నదికి మధ్యలో ఉన్న ఊడుమూడిలంక, బూరుగులంక, అరిగెలవారిపేట, జి.పెదపూడిలంక గ్రామాల కోసం జి.పెదపూడిలంక సమీపంలో రూ.71.43 కోట్లతో కొనసాగుతున్న రెండు వరుసల వంతెన నిర్మాణంలో ఇంతవరకు రూ.40 కోట్ల విలువైన పనులు పూర్తయినట్లు పంచాయతీరాజ్ ఈఈ పి.రామకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఒకటి-రెండో నంబరు పునాదుల మధ్య పీఎస్సీ గడ్డర్లు ప్రవేశపెట్టేందుకు వీలుగా ఆటో లాంఛర్‌ను వీటిపైకి తీసుకొచ్చారు. ఈ ప్రక్రియను ఈఈ రామకృష్ణారెడ్డి, డీఈఈ అన్యం రాంబాబు పరిశీలించారు.

చివరి దశలో 7, 8 నంబర్ల పునాదులు

అబెట్మెంట్-1,(ఎ-1), అబెట్మెంట్-2(ఎ-2) పునాదులతో పాటు మరో తొమ్మిది పునాదులు వెరసి11 పునాదులపై వంతెన నిర్మాణం వస్తుంది. ప్రస్తుతం 7, 8 నంబర్ల పునాదుల పనులు చివరి దశకు చేరుకున్నాయి. తొమ్మిదో నంబరు పునాది పనులకు ఏర్పాట్లు చేస్తున్నారని ఈఈ తెలిపారు. గుత్తేదారు సంస్థకు ఇంతవరకు రూ.20.66 కోట్లు బిల్లులు చెల్లించారు.

రైతుల సహకారం అవసరం

జి.పెదపూడిలంక వైపు నిర్మించాల్సిన ఎ-2 పునాది, ఒక బాక్సు కల్వర్టు, 400 మీటర్ల మేర అప్రోచ్ పనులు చేయాల్సి ఉంటుంది. భూసేకరణకు సహకరించిన రైతులకు రూ.2.30 కోట్ల నిధులు నేటికీ చెల్లించలేదు. వారికి జాప్యం లేకుండా డబ్బులు చెల్లించేందుకు చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది. ఈ బిల్లులు సీఎఫ్‌ఎంఎస్‌లో అప్‌లోడ్ అయ్యాయని, త్వరలోనే వారి ఖాతాల్లో జమవుతాయని ఈఈ స్పష్టం చేశారు.

ఒకటి-రెండో నంబరు పునాదుల మధ్య ఉంచిన ఆటో లాంఛర్. వీటి మధ్య 160 టన్నుల బరువుగల పీఎస్సీ గడ్డర్లు అమర్చుతారు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

థైరాయిడ్ సమస్యతో బాధ పడుతున్నారా?
అధునాతన రోబోటిక్ సర్జరీతో మీ థైరాయిడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం

ప్రయోజనాలు: తక్కువ నొప్పి | తక్కువ రక్తస్రావం | త్వరితంగా కోలుకోవడం
APEX HOSPITALS ప్రకాష్ నగర్, రాజమండ్రి
Dr. Nitin Rimmalapudi, M.S. Robotic Surgeon
అపాయింట్‌మెంట్ కొరకు సంప్రదించండి 93 922 922 00 సోమవారం నుండి శనివారం

SHRIRAM Finance
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
(పూర్వపు) శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)
రిజిస్టర్డ్ కార్యాలయం : డి.నెం. 14-ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్ : డి.నెం. 22బి-13-8, 2వ అంతస్తు, వెంకటరామ పవర్‌ప్రెస్ రోడ్డు, సెంట్రల్ బ్యాంక్ ఎదురుగా, పవర్‌పేట, ఏలూరు - 534002

డిమాండ్ ప్రకటన

సెక్యూర్టిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్' గా పిలువబడేది, గౌరవ ఎన్‌సిఎల్‌టి-బెంచ్ 2, చెన్నై, తేది : 9-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్ కంపెనీ అయి ఉన్నాము. మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద రిజిస్టర్డ్ ఆఫీస్ కలిగియున్నది మరియు బ్రాంచి ఆఫీస్ పాలకొల్లు లో నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బ్యాంకింగ్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. (ఇక నుండి మమ్మల్ని కంపెనీ / ఋణదాతగా సూచిస్తారు) ఇందుమూలంగా ఈ క్రింది నోటీసు జారీచేస్తున్నాము.

ఋణగ్రహీతలు / సహ ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూర్టిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 3తో చదువబడు సెక్షన్ 13 (2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్ధక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసీ చట్టం 2002 లోని సెక్షన్ 13 (2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.

చివరిగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందచేయబడక తిరిగి వచ్చినందున సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

క్ర సం.	ఋణగ్రహీత (లు) / సహ-ఋణగ్రహీత (లు) / హామీదారు (లు) పేరు	NPA తేది / ఋణ మొత్తం	డిమాండ్ నోటీసు తేది / బకాయి మొత్తం
1	1) విజయలక్ష్మి యాతం, భర్త : శ్రీనివాసరావు, డి.నెం. 26-3-44/1, ముచ్చర్లవారి తోట, కొండలమ్మ దేవాలయ వీధి, పాలకొల్లు పశ్చిమ గోదావరి జిల్లా-534260, ఆంధ్రప్రదేశ్. 2) యాతం శ్రీనివాసరావు, తండ్రి : స్వామి, డి.నెం. 26-3-44/1, ముచ్చర్లవారి తోట, కొండలమ్మ దేవాలయ వీధి, పాలకొల్లు పశ్చిమ గోదావరి జిల్లా-534260, ఆంధ్రప్రదేశ్. 3) బుద్దిరెడ్డి మౌలిక, భర్త : రాజశేఖర్, డి.నెం. 8-1-96/ఎ, మెయిన్ రోడ్, అమలాపురం మండలం, అమలాపురం, తూర్పు గోదావరి జిల్లా - 533201, ఆంధ్రప్రదేశ్.	31-12-2019 / Rs. 6,00,000/-	20-11-2025 / ది. 20-11-2025 నాటికి మొత్తం రూ. 23,85,065/- (అక్షరాలా ఇరవై మూడు లక్షల ఎనభై ఐదు వేల అరవై ఐదు రూపాయలు మాత్రమే)
	ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం. PALKLTF1901310001		
	షెడ్యూల్ ఆస్తి వివరాలు : తూర్పు గోదావరి జిల్లా, మల్కిపురం సబ్ డిస్ట్రిక్ట్, సఖినేటిపల్లి మండలం, మోరిపోడు గ్రామ పంచాయతీ మోరి గ్రామ అకౌంట్స్, జిరాయితీ డ్రై భూమికి చెందిన ఆర్.ఎస్.నెం. 220 నందు ఎకరా 3.79 సెంట్లు సబ్ డివైడెడ్ ఆర్.ఎస్. నెం. 220/1 వద్ద ఎకరా 1.00 సెంట్లు అందలి 4387 లింకులు లేదా 212.3 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము దానికి సమీప డి.నెం. 1-37. సరిహద్దులు : తూర్పు : 15 అ॥ వెడల్పు కామన్ దారి - 40 అ॥లు, దక్షిణం: అడ్డాల సత్యనారాయణ గారి భూమి 46.6 అ॥లు, పడమర : బల్ల రాము గారి భూమి - 40.3 అ॥లు, ఉత్తరం: విక్రేత యొక్క మిగిలిన భూమి.		

పైన చెప్పబడిన పరిస్థితుల దృష్ట్యా, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతోపాటు పైన తెలిపిన విధంగా బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు మరియు /లేదా వారి హామీదారుల (వర్తించినచోట) కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. లేనిచో, సెక్యూర్టిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా ఋణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీనత చేపట్టడంతో కలుపుకొని సెక్యూర్డ్ అసెట్స్ మీద ఈ నోటీసు తేది నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును.

సదరు చట్టంలోని సెక్షన్ 13 (13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు, వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన అతని సెక్యూర్డ్ అస్సెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని రూపంలో ఏ ఋణగ్రహీత బదిలీ చేయరాదని గమనించగలరు.

ప్రదేశం : పాలకొల్లు అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.

SHRIRAM Finance
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
(పూర్వపు) శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)
రిజిస్టర్డ్ కార్యాలయం : డి.నెం. 14-ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్ : డి.నెం. 22బి-13-8, 2వ అంతస్తు, వెంకటరామ పవర్‌ప్రెస్ రోడ్డు, సెంట్రల్ బ్యాంక్ ఎదురుగా, పవర్‌పేట, ఏలూరు - 534002

డిమాండ్ ప్రకటన

సెక్యూర్టిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్' గా పిలువబడేది, గౌరవ ఎన్‌సిఎల్‌టి-బెంచ్ 2, చెన్నై, తేది : 9-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్ కంపెనీ అయి ఉన్నాము. మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద రిజిస్టర్డ్ ఆఫీస్ కలిగియున్నది మరియు బ్రాంచి ఆఫీస్ నర్సాపురం లో నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బ్యాంకింగ్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. (ఇక నుండి మమ్మల్ని కంపెనీ / ఋణదాతగా సూచిస్తారు) ఇందుమూలంగా ఈ క్రింది నోటీసు జారీచేస్తున్నాము.

ఋణగ్రహీతలు / సహ ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూర్టిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 3తో చదువబడు సెక్షన్ 13 (2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్ధక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసీ చట్టం 2002 లోని సెక్షన్ 13 (2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.

చివరిగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందచేయబడక తిరిగి వచ్చినందున సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

క్ర సం.	ఋణగ్రహీత (లు) / సహ-ఋణగ్రహీత (లు) / హామీదారు (లు) పేరు	NPA తేది / ఋణ మొత్తం	డిమాండ్ నోటీసు తేది / బకాయి మొత్తం
1	1) మద్దాల శివ గంగా ప్రసాద్, తండ్రి : రామారావు మద్దాల, డి.నెం:2-46, డి.నెం : 2-46, మోరిపోడు, వలవలవారి వీధి, సఖినేటిపల్లి, తూర్పు గోదావరి జిల్లా-533251. 2) మద్దాల రామారావు, తండ్రి : వెంకటేశ్వర రావు, డి.నెం : 2-46, మోరిపోడు, వలవలవారి వీధి, సఖినేటిపల్లి, తూర్పుగోదావరి జిల్లా-533251. 3) బందారు వి రామారావు, తండ్రి : బందారు పల్లయ్య నాయుడు, ఉయ్యూరువారి మెరక, అంతర్వేదిపాలెం, సఖినేటిపల్లి, తూర్పుగోదావరి జిల్లా-533251.	31-01-2014 / Rs. 5,00,000/-	20-11-2025 / ది. 20-11-2025 నాటికి మొత్తం రూ. 25,16,893/- (అక్షరాలా ఇరవై ఐదు లక్షల పదహారు వేల ఎనిమిది వందల తొంభై మూడు రూపాయలు మాత్రమే)
	ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం. NRSPRTF1206260005		
	షెడ్యూల్ ఆస్తి వివరాలు : తూర్పు గోదావరి జిల్లా, మల్కిపురం సబ్ రిజిస్టర్ ఆఫీస్, సఖినేటిపల్లి మండలం, ఉయూరి వారి మెరక గ్రామ పంచాయతీ, అంతర్వేది పాలెం గ్రామం ఆర్.ఎస్.నెం. 538/2 నందు ఎకరా 0.05 1/2 సెంట్లు లేదా 266.2 చ॥గ॥ల విస్తీర్ణంలోని స్థలము అందలి గల ఆర్‌సిసి టెర్రస్డ్ బిల్డింగ్ దాని ప్లింత్ ఏరియా 1034 చ॥అ॥లు దానికి చెందిన డి.నెం. 4-9, అసిస్మెంట్ నెం. 547. హద్దులు : తూర్పు: తోట రత్నవేణి గారి భూమి; దక్షిణం: తోట రత్నవేణి మరియు బోసం రాంబాబు గార్ల భూమి; పడమర : రోడ్డు; ఉత్తరం: మద్దాల కనకదుర్గ గారి భూమి.		

పైన చెప్పబడిన పరిస్థితుల దృష్ట్యా, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతోపాటు పైన తెలిపిన విధంగా బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు మరియు /లేదా వారి హామీదారుల (వర్తించినచోట) కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. లేనిచో, సెక్యూర్టిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా ఋణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీనత చేపట్టడంతో కలుపుకొని సెక్యూర్డ్ అసెట్స్ మీద ఈ నోటీసు తేది నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును.

సదరు చట్టంలోని సెక్షన్ 13 (13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు, వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన అతని సెక్యూర్డ్ అస్సెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని రూపంలో ఏ ఋణగ్రహీత బదిలీ చేయరాదని గమనించగలరు.

ప్రదేశం : నర్సాపురం అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.

SHRIRAM Finance
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
(పూర్వపు) శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)
రిజిస్టర్డ్ కార్యాలయం : డి.నెం. 14-ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్ : డి.నెం. 22బి-13-8, 2వ అంతస్తు, వెంకటరామ పవర్‌ప్రెస్ రోడ్డు, సెంట్రల్ బ్యాంక్ ఎదురుగా, పవర్‌పేట, ఏలూరు - 534002

డిమాండ్ ప్రకటన

సెక్యూర్టిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్' గా పిలువబడేది, గౌరవ ఎన్‌సిఎల్‌టి-బెంచ్ 2, చెన్నై, తేది : 9-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్ కంపెనీ అయి ఉన్నాము. మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద రిజిస్టర్డ్ ఆఫీస్ కలిగియున్నది మరియు బ్రాంచి ఆఫీస్ పాలకొల్లు లో నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బ్యాంకింగ్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. (ఇక నుండి మమ్మల్ని కంపెనీ / ఋణదాతగా సూచిస్తారు) ఇందుమూలంగా ఈ క్రింది నోటీసు జారీచేస్తున్నాము.

ఋణగ్రహీతలు / సహ ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూర్టిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 3తో చదువబడు సెక్షన్ 13 (2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్ధక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసీ చట్టం 2002 లోని సెక్షన్ 13 (2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.

చివరిగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందచేయబడక తిరిగి వచ్చినందున సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

క్ర సం.	ఋణగ్రహీత (లు) / సహ-ఋణగ్రహీత (లు) / హామీదారు (లు) పేరు	NPA తేది / ఋణ మొత్తం	డిమాండ్ నోటీసు తేది / బకాయి మొత్తం
1	1) మంచే వెంకట శేషరామ్ ప్రసాద్, తండ్రి : చక్రధరరావు, డి.నెం : 5-74, కొంతేరు, యలమంచిలి మండలం, పశ్చిమ గోదావరి జిల్లా-534260. 2) మంచెం వెంకట నాగమణి, భర్త : వెంకట శేషరామ్ ప్రసాద్, డి.నెం : 5-74, కొంతేరు, యలమంచిలి మండలం, పశ్చిమ గోదావరి జిల్లా-534260. 3) మంచెం చక్రధరరావు, తండ్రి : వెంకటేశ్వరరావు, డి.నెం : 5-74, కొంతేరు, యలమంచిలి మండలం, పశ్చిమ గోదావరి జిల్లా-534260. 4) చవ్వాకుల బుల్లబ్బాయ్య, తండ్రి : వెంకన్న, డి.నెం : 7-13, యం.ఆర్.ఓ. ఆఫీస్ రోడ్, సఖినేటిపల్లి, తూర్పు గోదావరి జిల్లా- 533251.	30-04-2021 / Rs. 15,00,000/-	20-11-2025 / ది. 20-11-2025 నాటికి మొత్తం రూ. 28,60,077/- (అక్షరాలా ఇరవై ఎనిమిది లక్షల అరవై వేల డెబ్బై ఏడు రూపాయలు మాత్రమే)
	ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం. PALKLTF1812280002		
	షెడ్యూల్ ఆస్తి వివరాలు : పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లు సబ్ డిస్ట్రిక్ట్, యలమంచిలి మండలం, కొంతేరు గ్రామ పంచాయతీ మరియు గ్రామ అకౌంట్స్ ఆర్.ఎస్.నెం. 265/3బి వద్ద 677.6 చ॥గ॥లు లేదా 566.41 చ॥మీ॥ల విస్తీర్ణంలోని స్థలము అందలి గల టైల్డ్ హౌస్ మరియు దానికి చెందిన డి.నెం. 5-74/2, అసెస్మెంట్ నెం. 294/2018-19. సరిహద్దులు: తూర్పు : వర్దినీడి చంద్రరావు మరియు మంచెం సత్యనారాయణ గారికి చెందిన భూమి; దక్షిణం: పంచాయతీ రోడ్డు; పడమర : మంచెం సత్యనారాయణ గారికి చెందిన భూమి; ఉత్తరం: మంచెం శారద గారి భూమి.		

పైన చెప్పబడిన పరిస్థితుల దృష్ట్యా, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతోపాటు పైన తెలిపిన విధంగా బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు మరియు /లేదా వారి హామీదారుల (వర్తించినచోట) కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. లేనిచో, సెక్యూర్టిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా ఋణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీనత చేపట్టడంతో కలుపుకొని సెక్యూర్డ్ అసెట్స్ మీద ఈ నోటీసు తేది నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును.

సదరు చట్టంలోని సెక్షన్ 13 (13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు, వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన అతని సెక్యూర్డ్ అస్సెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని రూపంలో ఏ ఋణగ్రహీత బదిలీ చేయరాదని గమనించగలరు.

ప్రదేశం : పాలకొల్లు అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.

ట్యాబ్‌పై బొమ్మ.. ఇంకా ఎందుకమ్మా!



అధునాతన విద్యా బోధనలో భాగంగా ఉపాధ్యాయులకు గత ప్రభుత్వ హయాంలో అందజేసిన ట్యాబ్‌లపై నవరత్నాల పథకాలతో ఉన్న చిత్రాలు ఇప్పటికీ అలానే ఉన్నాయి. పాఠ్యాంశాల బోధనకు వాటినే ఇప్పటికీ వినియోగిస్తున్నారు. వచ్చే పదోతరగతి పరీక్షలకు సంబంధించిన అవసరాలకు గాను ఆయా పాఠశాలల్లో ఉన్న ట్యాబ్‌లను సేకరించగా అన్నింటిపై మాజీ సీఎం జగన్ చిత్రాలు మారని తీరు స్పష్టంగా కనిపించింది. ఎంఈవో-2 మోకా వెంకన్నబాబు వద్ద ప్రస్తావించగా ఈ విషయాన్ని పరిశీలిస్తామన్నారు. - న్యూస్‌టుడే, మామిడికుదురు

బుడతడు.. 35 దేశాల పేర్లు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటకు చెందిన కాసు నాగేంద్ర, గాయత్రి దంపతుల కుమారుడు ఖియాన్ష్ వెంకటరుషికి రెండున్నరేళ్లు. ఈ బుడతడు ఒకటి కాదు.. రెండుకాదు ఏకంగా 35 దేశాల పేర్లు అనర్గళంగా చెప్పేస్తున్నాడు. ఇండియా, పాకిస్థాన్, థాయ్‌లాండ్.. ఇలా మొదలు పెట్టి ఆయా దేశాల పేర్లను జెండాల చిత్రాల ఆధారంగా గుర్తించి చెప్పడంపై అంతా ఆశ్చర్యపోతున్నారు. వివిధ శ్లోకాలు, పద్యాలు సైతం వల్లెవేస్తున్నాడు. పూజ గదిలో తల్లి జపించే శ్లోకాలు, మంత్రాలను విని అదేవిధంగా చెబుతుండటం గమనార్హం. - న్యూస్‌టుడే, అంబాజీపేట

డ్రైవింగ్‌లో శిక్షణతో ఉపాధి

అమలాపురం గ్రామీణం: ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ శిక్షణతో ఎంతో మందికి ఉపాధి లభిస్తోందని డీపీటీవో శ్రీనివాసరావు అన్నారు. అమలాపురం ఆర్టీసీ డిపోలో హెవీ డ్రైవింగ్ శిక్షణలో 12వ బ్యాచ్ పూర్తి చేసుకున్న 16 అభ్యర్థులకు బుధవారం ధ్రువ పత్రాలు అందజేశారు. రహదారి భద్రతా నియమాలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణాలు సాగించాలని శ్రీనివాసరావు సూచించారు. త్వరలోనే 13వ బ్యాచ్ శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. డిపో మేనేజర్ డి.ఎల్.ఎస్.శర్మ, రామచంద్రపురం డిపో మేనేజర్ పి.భాస్కరరావు, అసిస్టెంట్ ఇంజనీర్ జి.ఆర్.ఎల్.దేవి, అసిస్టెంట్ మేనేజర్ ప్రతిమాకుమారి, ఓపీఆర్ఎస్ ఇన్‌ఛార్జి ఎన్.వరహాలబాబు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 19న జాతీయ స్థాయి నాటిక పోటీలు ప్రారంభం

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: అంతరించిపోతున్న కళలను ప్రోత్సహించడానికి జాతీయస్థాయి నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సీఆర్సీ సేవా సంస్థ అధ్యక్షుడు తాడి నాగమోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి వీరాఘవరెడ్డి తెలిపారు. రావులపాలెం సీఆర్సీ సేవా సంస్థలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఉగాది సందర్భంగా మూడు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. 19న హైదరాబాద్, కాకినాడ ప్రాంతాలకు చెందిన కళాకారులతో అమ్మచెక్కిన బొమ్మ, కన్నీటికి విలువెంత, 20న గుంటూరు, విశాఖపట్నానికి చెందిన సహన, చిటికెన వేలు, అసత్యం, 21న కాకినాడ, విశాఖపట్నం వారితో ఆచమనం, దొందూ దొందే నాటికలు ప్రదర్శిస్తారన్నారు. మొదటి బహుమతి రూ.లక్ష, రెండవ బహుమతి రూ.75 వేలు, మూడవ బహుమతి రూ.50 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్సీ రూపశిల్పి గొలుగూరి వెంకటరెడ్డి, కుడుపూడి శ్రీనివాస్, మల్లిడి ఆంజనీకుమార్‌రెడ్డి, త్రిమూర్తులు పాల్గొన్నారు.

పింఛనర్లూ.. పత్రం సమర్పించండి

జిల్లా	పత్రాలు సమర్పించినవి	ఇంకా ఇవ్వాల్సినవి
కోనసీమ	5,600	1,400
కాకినాడ	15,993	3,185
తూర్పుగోదావరి	9,246	1,506

పెద్దాపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ సర్వీస్, ఫ్యామిలీ పింఛన్‌దారులు తమ జీవన ప్రమాణ పత్రాలు(లైఫ్ సర్టిఫికెట్లు) సమర్పించేందుకు గడువు దగ్గర పడుతుంది. ఈనెల 28వ తేదీ వరకు జీవన ప్రమాణ పోర్టల్‌లో లేదా ఖజానా శాఖ కార్యాలయాల్లో సమర్పించాల్సి ఉంటుంది. గతేడాది నవంబరు, డిసెంబరు నెలల్లో సమర్పించినవి చెల్లుబాటు కావు. తాజాగా ఇవ్వకుంటే ఏప్రిల్ 1న ఇచ్చే మార్చి నెల పింఛన్ నిలిపివేస్తారు. పెన్షన్‌దారులు తమ పత్రాలు సమర్పించేందుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పెద్దాపురం, తుని, జగ్గంపేట, ప్రత్తిపాడు, కాకినాడ, పిఠాపురం, రాజమహేంద్రవరం, కోరుకొండ, అనపర్తి, అమలాపురం, కొత్తపేట, రాజోలు, రామచంద్రపురంలోని ఆయా ఉప ఖజానా కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. అనారోగ్యంతో నడవలేని పింఛనుదారులు తమ దృష్టికి తీసుకొస్తే ఖజానా శాఖ సిబ్బందిని ఇంటి వద్దకు పంపిస్తారని జిల్లా ఖజానాశాఖ అధికారి ఏ.గణేష్ తెలిపారు.

ఎవరెస్ట్ బేస్ క్యాంపునకు విద్యార్థుల ఎంపిక

భరద్వాజ

రూపసాయిశ్రీ

సర్పవరం: కాకినాడ జిల్లా నుంచి ప్రత్యేక అవసరాలు కేటగిరికి చెందిన దివ్యాంగ విద్యార్థులు రెడ్డి భరద్వాజ, పితాని రూపసాయిశ్రీ ఎవరెస్ట్ శిఖరం అధిరోహించడానికి శిక్షణ కోసం ఎంపికయ్యారని కాకినాడ సమగ్రశిక్ష కోఆర్డినేటర్ పి.గిరిప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ గ్రామీణం వలసపాకల భవిత కేంద్రంలో శిక్షణ పొందుతున్న రెడ్డి భరద్వాజ ప్రస్తుతం కాకినాడ గ్రామీణం తిమ్మాపురంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి, రూపసాయిశ్రీ కాజులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. వీరికి కోచ్‌గా కాకినాడకు చెందిన ఎంజే ప్రకాష్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. రాష్ట్రం నుంచి 25 మంది ఎంపిక కాగా ఈనెల 23 నుంచి మార్చి 6వ తేదీ వరకు లద్దాఖ్‌లో శిక్షణ ఇచ్చి అనంతరం ఎవరెస్ట్ ఎక్కించడానికి సిద్ధం చేస్తారు.

గింజలు కొనుగోలు చేస్తేనే రైతుకు మనుగడ

- తక్కువ ధర కల్పించడంతో కోకో పంట సాగుదారుల ఆవేదన

- న్యూస్‌టుడే, అంబాజీపేట

కోనసీమలో కోకో పంట

డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కోకోపంటను సాగు చేస్తున్న కర్షకుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. అంతర్జాతీయ మార్కెట్‌లో కోకో గింజలకు మంచి డిమాండు ఉన్నప్పటికీ తమ నుంచి కొనుగోలు సంస్థలు గింజలను కొనుగోలు చేయటంలేదని వారు ఆరోపిస్తున్నారు. ధర విషయంలో ఉద్యోగులను రైతులు ప్రశ్నిస్తే నాణ్యమైన గింజలను ఉత్పత్తి చేయటంలేదని చెప్తున్నారని.. గతంలో ఇలాంటి పరిస్థితి లేదని వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 2,405 ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు. ప్రతి ఏటా వెయ్యి ఎకరాలను అదనంగా సాగు చేసేలా ఇప్పటికే ప్రణాళిక తయారు చేయించారు. 400 మంది రైతులు ఈ సాగుపై ఆధారపడ్డారు.

నాణ్యత లేవంటున్నారు..

గింజల కొనుగోలు చేసే సంస్థల ప్రతినిధులు కుంటిసాకులతో రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో కోకో గింజలు రూ.450 పలుకుతున్నాయి. కానీ సంస్థల ప్రతినిధులు రూ.330లకే కొనుగోలు చేస్తున్నారు. కారణం అడిగితే గింజలు నాణ్యత లేవంటున్నారు. కోకో రైతులకు న్యాయం చేయాలి.

- అయ్యగారి శ్రీనివాసరావు, కోకో రైతు, వ్యాఘ్రేశ్వరం

ఈ సమస్య రాలేదు



గతంలో ధర విషయంలో సంస్థ ప్రతినిధులకు, రైతులకు ఎలాంటి సమస్య తలెత్తలేదు. గింజల నాణ్యత అంశం కూడా రాలేదు. ఇప్పుడు నాణ్యత విషయం చెప్తుంటే ఆశ్చర్యంగా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో కోకో గింజల ధర పతనమైతే.. వెంటనే ఆ మార్కెట్‌కు అనుగుణంగా రైతుల నుంచి కొనుగోలు చేస్తామని ఆ సంస్థలు చెప్పటం విడ్డూరంగా ఉంది.

- కొప్పిశెట్టి ఆనంద వెంకట ప్రసాద్, ఏపీ కోకో రైతు సంఘం సహాయ కార్యదర్శి

పర్యాటక బోటుకు తప్పిన ముప్పు

- పంకా రెక్కలకు వల చుట్టేసి నిలిచిపోయిన వైనం

తాళ్లరేవు, న్యూస్‌టుడే: కోరింగ అభయారణ్యంలోని చొల్లంగి పర్యాటక కేంద్రం నుంచి సముద్ర మొగ వరకు పర్యాటకులు ప్రయాణించే బోటుకు ప్రమాదం తప్పింది. ముమ్మిడివరానికి చెందిన తొమ్మిది మంది న్యాయవాదులు బుధవారం బోటుపై షికారుకు వెళ్లారు. మొగ వరకు వెళ్లి తిరిగి వస్తుండగా గోదావరిలో మత్స్యకారులు చేపల వేటకు ఉపయోగించే వల బోటు కింద ఉండే పంకా రెక్కలకు చుట్టేయడంతో నీటిలో నిలిచిపోయింది. బోటు డ్రైవర్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్.ఎస్.ఆర్. వరప్రసాద్‌కు సమాచారం అందించారు. ఆయన సిబ్బందిని అప్రమత్తం చేసి రెండు స్పీడ్ బోట్లను ఆ ప్రాంతానికి పంపించారు. బోటు డ్రైవర్లు, పర్యాటకులను క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు.

క్రీడాకారులతో ఎంపీ హరీష్‌మాధుర్, తదితరులు

క్రీడాభివృద్ధికి కృషి చేస్తా..

- వాలీబాల్ పోటీల్లో ఎంపీ హరీష్‌మాధుర్

ఉప్పలగుప్తం: జిల్లాలో క్రీడల అభివృద్ధికి మరింత కృషి చేస్తానని అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్ అన్నారు. గొల్లవిల్లిలో జరుగుతున్న జాతీయస్థాయి వాలీబాల్ పోటీలను ఆయన బుధవారం వీక్షించారు. ఏపీ, కేరళ జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. టోర్నీ నిర్వాహక కమిటీ అధ్యక్షుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు. కూటమి నాయకులు నల్లా శ్రీధర్, యాళ్ల దొరబాబు, కల్వకొలను తాతాజీ, ఏడిద శ్రీను, ఆర్డీస్ ప్రసాద్ తదితరులు మ్యాచ్‌లను వీక్షించారు.

ఉత్కంఠగా పోటీలు..: గొల్లవిల్లి జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో అరిగెల రంగయ్య జాతీయస్థాయి వాలీబాల్ పోటీలు నాలుగో రోజు హోరాహోరీగా సాగాయి. పురుషుల విభాగంలో జీఎస్టీ (ముంబయి) జట్టుపై 3-0 స్కోరుతో ఐవోబీ (చెన్నై) విజయం సాధించింది. అనంతరం ఆంధ్రప్రదేశ్, ఎస్ఏఐ (కేరళ) మధ్య మ్యాచ్‌లో 3-0 స్కోరుతో ఆంధ్రప్రదేశ్ విజయం సాధించింది. అనంతరం ఆంధ్రప్రదేశ్, ఇండియన్ బ్యాంక్ జట్లు, మహిళ విభాగంలో సౌత్ సెంట్రల్ రైల్వే, ఎస్ఆర్ఎం జట్లు తలపడ్డాయి. అర్ధరాత్రి వరకు పోటీలు సాగాయి.

చోరీకి పాల్పడిన వ్యక్తికి ఏడాది జైలు

ఆలమూరు, న్యూస్‌టుడే: నాలుగేళ్ల క్రితం దొంగతనానికి పాల్పడిన వ్యక్తికి నేరం రుజువు కావడంతో ఆలమూరు కోర్టు జడ్జి సంవత్సరం కఠిన కారాగార శిక్ష విధించారు. వివరాల్లోకి వెళితే.. 12.01.22న చింతలూరు వేంకటేశ్వర ఆయుర్వేదం గోదాములో ఉన్న పది కేజీల లవంగాలు, 15 కిలోల కొబ్బరినూనె, 250 కిలోల పంచదార, 15 కిలోల నువ్వుల నూనె, 12 కిలోల జీలకర్రను అదే గ్రామానికి చెందిన సంగాడి శ్రీనివాస్ దొంగిలించాడు. దీనిపై అప్పటి ఎస్ఐ సోమన శివప్రసాద్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. వాదనల తరువాత నేరం రుజువు కావడంతో బుధవారం న్యాయమూర్తి ఐ.ప్రవీణ్ కుమార్ ముద్దాయికి ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధించారని రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్, ఎస్సై జి.నరేష్ తెలిపారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	18,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	30,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	30,000
గటగట	29,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	18,000-20,000
కొత్త (పచ్చి) కాయ	15,000-17,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లలో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	147-00
డ్రెస్డ్	213-00
స్కిన్‌లెస్	243-00

భర్తతో గొడవ పడి.. భార్య బలవన్మరణం

- సంగారెడ్డి జిల్లాలో ఘటన..

సంగారెడ్డి (అమీన్‌పూర్), న్యూస్‌టుడే: భర్తతో గొడవపడిన భార్య.. అనంతరం మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై విజయరావు వివరాల ప్రకారం.. కోనసీమ జిల్లాలోని అల్లవరం మండలం కొమరగిరిపట్నానికి చెందిన కందుల వెంకటేశ్వరరావు 25 ఏళ్ల క్రితం అమీన్‌పూర్ వచ్చి నివసిస్తున్నారు. స్థానిక శ్రీరామ్‌నగర్‌లో భార్య దుర్గ(40)తో పాటు ఇద్దరు కుమారులతో కలిసి నివసిస్తున్నారు. భార్యాభర్తలు తరచూ గొడవ పడేవారు. మంగళవారం ఉదయం కూడా వారి మధ్య ఘర్షణ జరగడంతో వెంకటేశ్వర్‌రావు బయటికెళ్లగా.. భార్య ఇంట్లోనే ఉంది. అనంతరం కుమారులు సైతం తమ పనులకు వెళ్లిపోయారు. అదేరోజు రాత్రి 7.30 గంటల ప్రాంతంలో వెంకటేశ్వర్‌రావు ఇంటికి చేరుకోగా.. బెడ్‌రూమ్ లోపలి నుంచి గడియ పెట్టి ఉండటంతో ఎంత పిలిచినా స్పందన లేకపోవడంతో ఇరుగుపొరుగు వారి సాయంతో తలుపులు పగలకొట్టి చూడగా.. ఫ్యానుకు ఉరేసుకొని మృతి చెంది కనిపించింది. అనంతరం ఆమె మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

రాజోలు, న్యూస్‌టుడే: రాజోలు మండలం కడలిలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి దుర్మరణం చెందినట్లు ఎస్సై రాజేశ్‌కుమార్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. మలికిపురం మండలం కేశనపల్లికి చెందిన రాపాక యశ్వంత్(15), మెడ్డ రమేష్ ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఇద్దరికీ తీవ్ర గాయాలవ్వడంతో రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా యశ్వంత్ మృతిచెందాడు. మరొకరిని మెరుగైన వైద్యం కోసం అమలాపురం తరలించారు. మృతుడు కేశనపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్ఎం కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES
JOBS
Wanted Marketing Executives in Rajahmundry, Kakinada Areas. Salary 18,000 to 20,000. Lakshmi Sanjani Garments. Send resume to whatsapp Cell: 95050 66881.
FINANCIAL SERVICES
REAL ESTATE
LAND FOR SALE
JAGGAMPETA
KAKINADA CITY
Properties Bazar's @ Kakinada Touch Your Luck, Buy Plot & Win Plot, Free Lucky Draw with Guaranteed Prizes. Cell: 9154184236

WANTED
Front Office Staff (Female) - 02 no's
Salary - 12 k
08 Hours Duty
SprintOn, JN Road Rajahmahendravaram
99663 57897

కాకినాడలోని భానుగుడి జంక్షన్ నందు బట్టలు షాపులో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. శాలరీ - 15,000/-/ 4 W/o. + ESI +EPFO. సెల్: 9885295999.

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక

స్వామివారి చిత్రపటం అందిస్తున్న దేవస్థానం ఛైర్మన్

వాడపల్లిలో శేఖర్ మాస్టర్ పూజలు

రావులపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: వాడపల్లి వేంకటేశ్వరస్వామిని సినీ నృత్య దర్శకుడు శేఖర్ మాస్టర్ దంపతులు బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను ఆలయ కమిటీ ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు అందించారు.

రాజోలు
• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

ఆలమూరు : ఆలమూరు సబ్‌స్టేషన్ పరిధిలోని పెదపళ్ల, కొత్తూరు, గుమ్మిలేరు, మోదుకూరు, నవాబుపేట, నర్సిపూడి గ్రామాలకు లైన్ మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని రామచంద్రపురం ఏఈ కె.రత్నాలరావు ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు

ఉచిత వైద్యశిబిరాలు

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెం సత్యసాయి సేవా మందిరంలో గురువారం ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ కన్వీనర్ మన్యం సర్వేశ్వరరావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి హోమియో, మధ్యాహ్నం 3 గంటల నుంచి దంత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లక్కవరంలో పోలీసుల 'పల్లె నిద్ర'

మలికిపురం, న్యూస్‌టుడే: ఎస్పీ రాహుల్‌మీనా ఆదేశాల మేరకు బుధవారం లక్కవరంలో పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మలికిపురం ఎస్సై పి.సురేశ్ గ్రామస్థులతో సమావేశమయ్యారు. గ్రామంలోని పరిస్థితులు, అసాంఘిక కార్యకలాపాల సమాచారం తదితర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూతన చట్టాలు, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత నియమాలు, సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకర పోస్టులు, వాటికి శిక్షల తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సమస్యలేమైనా ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. సర్పంచి, పెద్దలు పాల్గొన్నారు.

గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్సై సురేశ్

విద్యార్థులకు అండగా ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం విద్యార్థులకు అండగా నిలిచిందని తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి నక్కా సునీల్‌రాజు అన్నారు. గత ప్రభుత్వం పెట్టిన ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసిన ఘనత విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు దక్కుతుందన్నారు. బుధవారం పి.గన్నవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద విద్యార్థులు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు మంత్రి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అనుమోలు రమేష్, వేమన గంగాధర్, కట్ల ప్రభాకర్ పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, పి.గన్నవరం

కేశవదాసుపాలెంలో కవాతు

సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెంలో రాజోలు సీఐ నరేశ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. బుధవారం నుంచి మూడు రోజుల పాటు పెద్దింట్లమ్మవారి ఉత్సవాలు ప్రారంభమైన నేపథ్యంలో ఏవిధమైన ఘర్షణలు జరగకూడదనే ఉద్దేశంతో 30 పోలీస్ నిబంధనలు తీసుకొచ్చారు. అనుమతులు లేకుండా ఏవిధమైన ర్యాలీలు, ధర్నాలు, సమావేశాలు నిర్వహించవద్దని సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దుర్గాశ్రీనివాస్, సఖినేటిపల్లి, మలికిపురం, రాజోలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, సఖినేటిపల్లి

మంచి మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి

రాజోలు, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికతో చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులవ్వాలని సమగ్రశిక్షా సీఎంవో బోడసు సుబ్రహ్మణ్యం అన్నారు. కడలి, పొన్నమండ, కాట్రేనిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. పదోతరగతి విద్యార్థులకు అమలవుతున్న వంద రోజుల ప్రణాళికను అడిగి తెలుసుకున్నారు. కడలిలో పీఎంశ్రీ దస్త్రాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నల్లి మనోహరం, ప్రధానోపాధ్యాయుడు కడలి వెంకటేశ్వర్లు, విద్యాకమిటీ ఛైర్మన్ పద్మమాడి ప్రభాకరరావు పాల్గొన్నారు.

కడలిలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సీఎంవో సుబ్రహ్మణ్యం

ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా బస్సులు

పి.గన్నవరం, న్యూస్‌టుడే: పి.గన్నవరం డొక్కా సీతమ్మ అక్విడక్ట్ రోడ్డు వంతెనకు ఈ నెల 10 నుంచి మరమ్మతులు చేస్తుండటంతో దీనిపై రాకపోకలు పూర్తిగా నిలుపుదల చేశారు. కాటన్ అక్విడక్ట్ రోడ్డు వంతెనపై నుంచి భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు వెళ్లకుండా ట్రాఫిక్‌ను మళ్లించారు. ఈ నేపథ్యంలో రాజోలు ఆర్టీసీ డిపో నుంచి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ప్రత్యేకంగా బస్సులు తిప్పుతున్నారు. అంతర్వేది పల్లిపాలెం, రాజోలు నుంచి లంకలగన్నవరం వరకు 34 ట్రిప్పులు(వెళ్లిరావడం), పి.గన్నవరం నుంచి అమలాపురం వరకు 24, పి.గన్నవరం నుంచి రాజమహేంద్రవరం వరకు 41 ట్రిప్పులు తిరిగేలా బస్సులు ఏర్పాటు చేశారు. పి.గన్నవరం వద్ద బస్సులు దిగిన ప్రయాణికులు ఇక్కడి నుంచి ఆటోల్లో, కొంతమంది కాలినడకన కాటన్ అక్విడక్ట్ రోడ్డు వంతెన పైనుంచి లంకలగన్నవరం వెళ్లి అక్కడ ఉన్న బస్సులు ఎక్కి రాజోలు వైపు వెళుతున్నారు. లంకలగన్నవరం వైపు దిగిన వారు పి.గన్నవరం వచ్చి అమలాపురం, రాజమహేంద్రవరం వైపు వెళ్లే బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఆయా మార్గాల్లో 20 నుంచి 30 నిమిషాల మధ్య బస్సులు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేశామని రాజోలు డిపో మేనేజర్ జి.జేమ్స్‌కుమార్ తెలిపారు.

రాజోలు నుంచి లంకలగన్నవరం వెళ్లే బస్సు

దోమల విజృంభణ.. కానరాని నిర్మూలన

- న్యూస్‌టుడే, అంబాజీపేట, రాజోలు

గ్రామాల్లో పారిశుద్ధ్య లోపాలు తలెత్తడంతో పాటు మురుగు కాలువ వ్యవస్థలు సక్రమంగా లేకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. ప్రజలు కంటిమీద కునుకు లేకుండా నరకం చూస్తున్నారు. స్థానిక పంచాయతీ పాలకులు దోమల మందును తూతూమంత్రంగా పిచికారీ చేసి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దోమలకు నిలయంగా మాచవరం కాలువ

మందు పంపిణీ చేసినా..

రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లోని గ్రామ పంచాయతీలకు దోమల నిర్మూలనకు అవసరమైన మందును ప్రభుత్వం సరఫరా చేసింది. క్షేత్రస్థాయిలో వీటిని పిచికారీ చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. గతంలో ఎన్నడూలేని విధంగా వీటి ఉద్ధృతి పెరిగిపోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

జిల్లా మలేరియా నిర్మూలన విభాగం నుంచి ఆయా నియోజకవర్గాల్లోని అన్ని గ్రామ పంచాయతీలకు దోమలను లార్వా దశలోనే నిర్మూలించేందుకు ఎబేట్, ఫాగింగ్ చేసేందుకు పైరెత్రిన్, టెక్నికల్ మలాథియాన్ మందును సరఫరా చేశారు. వీటిని కొన్నిచోట్ల నామమాత్రంగా చల్లి చేతులు దులుపుకున్నారు. ఫాగింగ్ యంత్రాలు మూలకు చేరాయి. పంచాయతీ కార్యాలయాల్లో స్టోర్‌రూమ్‌లలో ఉంటున్నాయి.

ఫాగింగ్ యంత్రాలు ఎక్కడ?

రాజోలు, మామిడికుదురు, అయినవిల్లి, మామిడికుదురు, పుల్లేటికుర్రు, కె.పెదపూడి, తాటిపాక శివకోడు, చింతలపల్లి, కడలి, మలికిపురం, సఖినేటిపల్లి ఇలా వివిధ పంచాయతీల పరిధిలోని ప్రజలు దోమల బెడదను ఎదుర్కొంటున్నారు. ఏదైనా సందర్భం వచ్చినప్పుడు మాత్రం అధికారులు క్షేత్రస్థాయిలోకి వచ్చి ప్రజలకు దీనిపై అవగాహన కల్పించడం తప్పితే సరైన చర్యలు చేపట్టడం లేదని వాపోతున్నారు.

చర్యలు తీసుకుంటాం

అన్ని పంచాయతీలకు దోమల నిర్మూలన మందు పంపిణీ చేశాం. ఆరోగ్య సిబ్బంది, కార్యకర్తల ద్వారా దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. దోమల నిర్మూలన మందును పిచికారీ చేసేలా చర్యలు తీసుకుంటాం.

- నక్కా వెంకటేశ్వరరావు, జిల్లా మలేరియా అధికారి

25న మాదిగల విజయోత్సవ సభ

మామిడికుదురు, న్యూస్‌టుడే: ఈ నెల 25న అమలాపురంలో జరగనున్న మాదిగల విజయోత్సవ సభకు అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలివెళ్లేలా కృషి చేయాలని ఐక్య కార్యాచరణ సమితి కన్వీనర్ ఆకుమర్తి ఆశీర్వాదం కోరారు. ఆయన ఆధ్వర్యంలో మామిడికుదురులోని అంబేడ్కర్ సామాజిక భవనంలో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. ఎంఎస్పీ జాతీయ నాయకుడు ముమ్మిడివరపు చినసుబ్బారావు, జిల్లా ఇన్‌ఛార్జి సూరి, మట్టపర్తి కిషోర్, నూతుకుర్తి సత్యనారాయణ, యాగ్గగద్ద సత్తిబాబు, మంద గాంధీ, శెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు విరాళం

పాశర్లపూడిలో నెలకొల్పనున్న అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పెదపట్నానికి చెందిన ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి నేదునూరి రాజేశ్ రూ.60 వేలు విరాళాన్ని సంఘ నాయకుల చేతుల మీదుగా నిర్వాహకులకు అందజేశారు.

డెల్టా ఆధునికీకరణకు నిధులు కేటాయించాలి

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

రావులపాలెం పట్టణం, కొత్తపేట, న్యూస్‌టుడే: గోదావరి డెల్టా ఆధునికీకరణకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అసెంబ్లీలో ప్రస్తావించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్ కొత్త ఆంధ్రుల ఆకాంక్షలకు ప్రతిరూపంగా నిలుస్తోందన్నారు. గోదావరి డెల్టా కాలువలు 15 నెలలు కాలువే ఉందని, ఇప్పటికైనా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు పంటలు దెబ్బతింటున్నాయని, బీమా చేయించుకోవడంపై రైతులకు అవగాహన లేకపోవడంతో నష్టపోతున్నారన్నారు. లొల్ల లాకులు శిథిలమైతే 2 లక్షల ఎకరాలకు నీటి ఇబ్బంది ఎదురవుతుందన్నారు. లొల్ల లాకుల పునర్నిర్మాణానికి నిధులు కేటాయించాలన్నారు. హార్టికల్చర్ హబ్‌గా రాయలసీమను నిలపాలన్న ప్రభుత్వ ఆలోచన బాగుందని, కోనసీమ జిల్లాను సైతం ఇందులో భాగస్వామ్యం చేయాలన్నారు.

అలరించిన జబర్దస్త్ కళాకారుల ప్రదర్శన

కొత్తపేట, న్యూస్‌టుడే: కొత్తపేట మండలం పలివెల గ్రామంలో నిర్వహిస్తున్న ఉమాకొప్పులింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం జబర్దస్త్ కళాకారులు ప్రత్యేక ప్రదర్శన ఇచ్చారు. బుల్లెట్ భాస్కర్, నరేశ్, శాంతిస్వరూప్, జిత్తు తదితరులు తమ హాస్యంతో ఆకట్టుకున్నారు. కొత్తపేట ఎస్సై జి.సురేంద్ర సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రారంభమైన పెద్దింట్లమ్మ జాతర

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: మెండుపాలెం పెద్దింట్లమ్మ జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం గ్రామస్థులు బాజాభజంత్రీలతో ఊరేగింపుగా గరగ నృత్యాలు చేసుకుంటూ ఆలయానికి వచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెల రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ఈ నెల 26న అమ్మవారి ప్రభ ఊరేగింపు, రాత్రి గోకర్ణేశ్వరస్వామి-జలదుర్గల కల్యాణం జరుగుతుంది. మార్చి 18తో ఉత్సవాలు ముగుస్తాయని ఉత్సవ కమిటీ నిర్వాహకులు వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో పుష్పయాగం

ఆలమూరు : ఆలమూరులోని పార్వతీ సమేత భట్టి విశ్వేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం అర్చకులు స్వామి, అమ్మవార్లకు పుష్పయాగం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

దెబ్బతిన్న వంతెన రక్షణ గోడ

వేపచెట్టు మీడియం డ్రెయిన్‌పై వంతెన తూర్పువైపు గోడ దెబ్బతిని పడిపోయింది. అందులోని ఇనుప ఊచలు బయటకు వచ్చి ప్రమాదకరంగా మారాయి. నిత్యం దీనిపై పలు వాహనాలు, పాఠశాల బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. వంతెన పూర్తిగా శిథిల స్థితికి చేరి ఏ క్షణాన్నయినా కూలేలా ఉంది. అధికారులు రక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై జలవనరులశాఖ ఏఈ(డ్రెయినేజీ విభాగం) బి.రేష్మాను వివరణ కోరగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, మలికిపురం

కాలువ దుర్భరం.. రైతుల సతమతం

పెర్లకాలువ దుర్భరంగా మారడంతో రైతులు సతమతమవుతున్నారు. గుర్రపుడెక్క పెరిగిపోయి, ఆక్రమణలతో కుచించుకుపోవడంతో ఆందోళన చెందుతున్నారు. 80 ఎకరాల వరి ఆయకట్టుకు సాగునీరు సక్రమంగా అందడం లేదని వాపోతున్నారు. మొగ వద్ద తూము ఛిద్రం కావడంతో పారుదల నెమ్మదించి శివారు వరకు వెళ్లడం కష్టతరంగా మారడంతో ప్రయాస పడుతున్నారు. ఈ విషయాన్ని ఏఈఈ రమేష్‌బాబు దృష్టికి తీసుకువెళ్లగా చర్యలు చేపడతామన్నారు. - న్యూస్‌టుడే, మామిడికుదురు

మురుగు నిలిచి దుర్వాసన

తొత్తరమూడి పంచాయతీ పరిధి ముక్తేశ్వరంలో దేవాదాయ, సత్రం భూముల వద్ద డ్రెయినేజీలో పూడిక కారణంగా ఎక్కడ మురుగు అక్కడే నిలిచి పోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన, దోమల ఉద్ధృతి ఎక్కువైందని వాపోతున్నారు. మురుగు కాలువను శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి అన్వర్ తెలిపారు. - న్యూస్‌టుడే, అయినవిల్లి



పగలే వెలుగుతున్న వీధి దీపం

లక్కవరం-ఇరుసుమండ రోడ్డు పక్కన ఉన్న వీధి దీపం నిరంతరం వెలుగుతూనే ఉంటోంది. లక్కవరంలో మరికొన్ని చోట్ల కూడా ఇదే పరిస్థితి నెలకొంది. పగలు వెలగకుండా నియంత్రించేలా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి జి.మైథిలిని వివరణ కోరగా సాంకేతిక కారణాలతో నిరంతరాయంగా వెలుగుతున్నాయని, నిపుణుల సూచనలతో చర్యలు తీసుకుంటామని చెప్పారు. - న్యూస్‌టుడే, మలికిపురం

ప్రమాదకరంగా సిమెంట్ పలక

మండల కేంద్రం మలికిపురంలోని పశువుల ఆసుపత్రి పక్క నుంచి మొండికోడు పంటకాలువ గట్టు వరకు ఉన్న డ్రెయినేజీకి సంబంధించిన మ్యాన్‌హోల్‌పై సిమెంట్ పలక ఎత్తుగా ఉండి ద్విచక్ర వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంటోందని స్థానికులు అంటున్నారు. దీన్ని సరిచేయాలని కోరుతున్నారు. పంచాయతీ కార్యదర్శి తాడి ఏసుబాబును వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటానని చెప్పారు. - న్యూస్‌టుడే, మలికిపురం

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ఉ॥ 10 - మ॥ 1
రాజోలు: 80085 74174
పి.గన్నవరం: 80085 74229
కొత్తపేట:90323 93884

పంటబోదెలో పూడికతీత

స్పందనకు వందనం

రావులపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: పొడగట్లపల్లి పంటబోదెలో గుర్రపుడెక్క పెరిగిపోవడంతో సాగునీరు పంటచేలకు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వారి సమస్యను పంచాయతీ కార్యదర్శి సుధాకర్ దృష్టికి తీసుకుని వెళ్లగా ఉపాధి వేతనశ్రామికులతో పూడిక తీయించారు.

సహకార ఉద్యోగుల నిరసన

రాజోలు, అంబాజీపేట, మలికిపురం, ఆత్రేయపురం, న్యూస్‌టుడే: డిమాండ్ల సాధన కోసం సహకార సంఘాల ఉద్యోగులు రాజోలు, తాటిపాక డీసీసీ బ్యాంకుల వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. 2019 తర్వాత చేరిన ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని, జీవో నం.36 వెంటనే అమలు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. సీఈవోలు బండారు భాస్కరరావు, కడలి శ్రీనివాస్, వి.డి.ఎన్.మూర్తి, విజయలక్ష్మి, బి.తాతాజి తదితరులు పాల్గొన్నారు. ● అంబాజీపేట, మలికిపురం, ఆత్రేయపురంలో సైతం ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు.

నినాదాలు చేస్తున్న సొసైటీ సిబ్బంది

రాజోలు డీసీసీ బ్యాంకు వద్ద ..

డిమాండ్లు పరిష్కరించాలని ఆందోళన

అంబాజీపేట, కొత్తపేట, న్యూస్‌టుడే: పని ఒత్తిడితో తీవ్ర ఇబ్బందులు చవిచూస్తున్నామని అంబాజీపేట మండల వీఆర్వోలు, వీఆర్యేలు, సర్వేయర్లు ఆవేదన వ్యక్తం చేశారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. పనిభారం ఎక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. డిమాండ్లు పరిష్కరించాలని కోరారు.

కొత్తపేటలో తహసీల్దార్ రాంబాబుకు వినతిపత్రం ఇస్తున్న వీఆర్వోలు

స్టేట్ రిసోర్స్ పర్సన్‌గా ఎంపిక

ఆలమూరు, న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వం ప్రాథమిక విద్యలో భాగంగా ప్రవేశపెట్టిన గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు అధికారులకు శిక్షణ ఇచ్చే నిమిత్తం ఆలమూరు(ఖండ్రిగ) మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు అద్దరి శ్రీనివాసరావు ఎంపికయ్యారని మండల విద్యాశాఖాధికారులు బి.అప్పాజీ, నేదునూరి రాజు తెలిపారు. జిల్లా నుంచి ఆరుగురికి ఈ అవకాశం దక్కిందన్నారు.

30 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

ఆలమూరు, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆలమూరు పోలీసులు బుధవారం పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎంఎస్‌వో వెంకటేశ్వరరావు, ఎస్సై జి.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ పరిసర ప్రాంతాల్లో కొనుగోలు చేసిన 600 బస్తాల బియ్యాన్ని లారీలో కాకినాడ తరలిస్తుండగా జొన్నాడ ఏటిగట్టు వద్ద గుర్తించారు. వాహనం కాకినాడకు చెందిన కె చంద్రశేఖర్‌ది కాగా చోదకుడు ఎ.శివకృష్ణమణికంఠను అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించి విచారించారు. మొత్తం సరకు విలువ రూ.13.80 లక్షలుగా నిర్ధారించినట్లు ఎంఎస్‌వో తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

రావులపాలెం : ఆత్రేయపురంలోని బాలాత్రిపుర సుందరీ సమేత రాజరాజేశ్వరస్వామి, రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణాలకు దాతలు రూ.5 లక్షలు విరాళం అందించారు. కలిదిండి పాండురంగరాజు, చిలువూరి లక్ష్మీకల్యాణచక్రవర్తి కుటుంబ సభ్యులు రూ.5 లక్షలు విరాళాన్ని వాడపల్లి దేవస్థానం ఛైర్మన్ ముదునూరి వెంకటరాజుకు బుధవారం అందించారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కొత్తపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని తెదేపా మండల శాఖ అధ్యక్షుడు గనిశెట్టి వీరేష్ పిలుపునిచ్చారు. బుధవారం కొత్తపేటలో నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 20 నెలల కాలంలో సాధించిన పురోగతిని ప్రజల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదలపై హర్షం వ్యక్తం చేశారు. పింఛన్లు త్వరితగతిన పంపిణీ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించారు. బడ్జెట్‌లో విభిన్న రంగాలకు సముచిత కేటాయింపులు చేసినందుకు అభినందనలు తెలియజేస్తూ తీర్మానాలు ఆమోదించారు. కడలి భీమేశ్వరరావు, బూసి వెంకటరమణ, చీకట్ల అబ్బు, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చదువే కాదు.. కళల్లోనూ..

- న్యూస్‌టుడే, పి.గన్నవరం

పి.గన్నవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చక్కగా చదువుకోవడంతో పాటు పలు సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొంటూ శభాష్ అనిపించుకుంటున్నారు. జిల్లా స్థాయిలో అమలాపురంలో నిర్వహించే గణతంత్ర దినోత్సవం, ఆగస్టు 15 వేడుకల్లో సుమారు 70 మంది పాల్గొన్నారు. పలు ప్రదర్శనలతో మెప్పించారు.

ఉన్నత పాఠశాల విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

పూర్వ డీఈవో ప్రోత్సాహంతో..

2025 జనవరి 4న ఈ పాఠశాల వేదికగా జిల్లాస్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయినులు పి.లలితాప్రమీలాకుమారి, పి.శిరీష ప్రత్యేక ఆసక్తితో విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శన ఇచ్చేందుకు తర్ఫీదు ఇచ్చారు. అప్పటి డి.ఇ.ఒ. షేక్ సలీంబాషా ప్రోత్సహించారు. అప్పటి నుంచి 2025 జనవరి 26, ఆగస్టు 15, ఈ ఏడాది జనవరి 26.. ఇలా పలు కార్యక్రమాల్లో చక్కగా ప్రదర్శనలు ఇచ్చి కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ నుంచి ప్రశంసలు అందుకున్నారు.

చాలా ఆనందంగా ఉంది

ఉపాధ్యాయినులు మాకు చక్కగా నృత్యం, అభినయం గురించి శిక్షణ ఇచ్చారు. అమలాపురంలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నాను. అంతమంది ఉన్నతాధికారుల ఎదుట ప్రదర్శన ఇవ్వడం ఆనందంగా ఉంది. - కాండ్రేగుల లిఖిత, 9వ తరగతి

ఒత్తిడి లేకుండా ఉంటుంది

చదువుతో పాటు ఇతర రంగాల్లోనూ ప్రవేశం ఉంటే ఒత్తిడి లేకుండా ఉంటుంది. మా పాఠశాలలో నృత్యం, అభినయం గురించి నేర్పించడం ద్వారా సాంస్కృతిక ప్రదర్శన పట్ల అవగాహన కలిగింది. చక్కటి గుర్తింపు వచ్చింది. - గుత్తుల హేమశ్రీహర్షిత, 8వ తరగతి

పరిసరాల శుభ్రతతోనే బోదవ్యాధి దూరం

మామిడికుదురు, పి.గన్నవరం, రాజోలు, న్యూస్‌టుడే: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, దోమల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టడం ద్వారా బోద వ్యాధిని దూరం చేయాలని జిల్లా మలేరియా అధికారి ఎన్.వెంకటేశ్వరరావు కోరారు. మొగలికుదురులో జాతీయ బోదవ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా బుధవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వాటికి సంబంధించిన కిట్లను 23 మంది వ్యాధిగ్రస్తులకు అందజేశారు. సర్పంచి కడి అరుణకుమారి, నగరం ఏఎంసీ ఛైర్మన్ పెనుమాల లక్ష్మి, పీహెచ్‌సీ వైద్యాధికారి జాన్‌లెవీ, రాజోలు ఉపవిభాగం అధికారి వై.ఆదినారాయణ పాల్గొన్నారు. ● మానేపల్లిలో సర్పంచి పితాని చంద్రకళ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బోద వ్యాధిగ్రస్తులకు మందుల కిట్లు పంపిణీ చేశారు. నాగుల్లంక పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ జాసిమ్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి వై.ఆదినారాయణ పాల్గొన్నారు. ● తాటిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి ఫణికిరణ్ అధ్యక్షతన 56 మంది వ్యాధిగ్రస్తులకు మందులు, నిత్యావసర సరకులతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. సర్పంచి కోటిపల్లి రత్నమాల, వై.ఆదినారాయణ, కె.చంద్రకళ, ఎం.శ్రీనివాస్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

డా॥ B.R.అంబేడ్కర్ కోనసీమ జిల్లా, మలికిపురం మండలం, కేశనపల్లి గ్రామం, D.No.2-163కి చెందిన పోతుల శ్రీనుబాబు, S/o సత్యనారాయణ అను నా యొక్క X4488101 నెంబరుగల ఒరిజినల్ పాస్‌పోర్టు జిరాక్స్ నిమిత్తం కేశనపల్లి మా ఇంటి దగ్గర నుండి మలికిపురం సెంటర్‌కి వెళ్ళి వస్తుండగా మార్గమధ్యలో పడిపోయినది. దొరికినవారు ఈ క్రింది సెల్ నెంబరుకు తెలియజేయగలరు.

సెల్: 99856 82970

(c) eenadu

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం • రామచంద్రపురం

ఉపాధి పనుల్లో అవకతవకల గుర్తింపు

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: రామచంద్రపురం మండలంలో 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీ నివేదికను వివరించేందుకు బుధవారం ప్రజావేదికను మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఎంపీపీ అంబటి భవాని అధ్యక్షతన నిర్వహించిన సభలో మస్టర్లలో కొట్టివేతలు గుర్తించి 8 మంది క్షేత్ర సహాయకులకు రూ.3850 అపరాధ రుసుం విధించారు. మొత్తం ఏడాది కాలంలో రూ.7.96 కోట్లు వేతనాల రూపంలో, రూ.4.52 కోట్లు సామగ్రి రూపంలో పనులు జరిగినట్టు వివరించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ మధుసూదన్, ఎంపీడీవో ఎం.శివప్రసాద్, డీడీవో, అంబుడ్స్‌మన్, ఉపాధి పథకం సిబ్బంది పాల్గొన్నారు.

22న రామచంద్రపురంలో ఉద్యోగ మేళా

రామచంద్రపురం, న్యూస్‌టుడే: కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉపాధి భవన్‌లో ఈనెల 22వ తేదీన ఉదయం 10 గంటలకు ఉద్యోగ మేళా నిర్వహిస్తామని మంత్రి కార్యాలయం ద్వారా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 18 నుంచి 27 సంవత్సరాలలోపు వయస్సు, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమా చదివిన అభ్యర్థులకు రూ.16 వేల నుంచి రూ.18 వేల జీతం, షిఫ్ట్ టైంలో భోజన, రవాణా సదుపాయం కల్పించి చెన్నై, బెంగళూరులో పనిచేసేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. టెన్‌కో, యాన్‌మార్, యాంబర్, మితోసి, బీసీ ఎలక్ట్రిక్ కంపెనీలలో ప్రొడక్షన్ విభాగంలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు వివరించారు.

ఎస్పీ రాహుల్‌మీనాకు వినతిపత్రం అందిస్తున్న కోకోఫెడ్ ప్రతినిధులు

రోడ్డు ప్రమాదాల నుంచి కాపాడండి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ రాహుల్‌మీనా తెలిపారు. అమలాపురం ఎస్పీ కార్యాలయంలో కోకోఫెడ్ ఛైర్మన్ అరిగెల బలరామమూర్తి ఆధ్వర్యంలో ప్రతినిధులు ఎస్పీ రాహుల్‌మీనాకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బలరామమూర్తి మాట్లాడుతూ పేరూరు వైజంక్షన్ వద్ద సరైన భద్రతా ఏర్పాట్లు లేకపోవడం వల్ల ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అక్కడ పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని, డీజే సౌండ్లు పెట్టి శబ్దకాలుష్యం చేస్తున్నారని, వీటి నుంచి రక్షణ కల్పించాలని కోరారు. అరిగెల చిన్ని, సత్యనారాయణ, అమరేశ్వరరావు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

'మనసులో మాట'కు ప్రజాదరణ

గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న అయ్యాజీ వేమా, నల్లా పవన్, తదితరులు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: ప్రధాని మోదీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మన్ కీ బాత్ (మనసులో మాట) కార్యక్రమం ప్రజాదరణ పొందిందని భారతీయ జనతా పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు అయ్యాజీ వేమా, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్‌కుమార్ తెలిపారు. అమలాపురం ఎర్రవంతెన వద్ద ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం భాజపా నాయకుల సమావేశం నిర్వహించారు. జిల్లా మన్ కీ బాత్ కన్వీనర్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో భాజపా నాయకులు మనసులో మాట గోడపత్రికలను ఆవిష్కరించారు. యువమోర్చా జోనల్ ఇన్‌ఛార్జి ఈశ్వర్‌గౌడ్, బొంతు శివాజీ, సుంకర శ్రీరామ్, గోకరకొండ గంగన్నస్వామి, శర్మ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కుండలేశ్వరుడి హుండీ ఆదాయం లెక్కింపు

కాట్రేనికోన: కుండలేశ్వరాలయంలో ఏర్పాటు చేసిన హుండీలో ఈ నెల 13 నుంచి నేటి వరకు భక్తులు సమర్పించిన కానుకలను తనిఖీదారులు రామలింగేశ్వరరావు, కుమార్ పర్యవేక్షణలో గ్రామపెద్దల సమక్షంలో లెక్కించారు. రూ. 1,94189 ఆదాయం వచ్చిందని ఈవో వెంకట దుర్గ తెలిపారు.

యర్రపోతవరం రోడ్డు నిర్మాణం

పామర్రు: ద్వారపూడి-యానాం రోడ్డులో వేగాయమ్మపేట నుంచి యర్రపోతవరం వంతెన వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణం చురుగ్గా సాగుతోంది. ఎస్‌హెచ్ ప్రణాళికలో భాగంగా 520 మీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయని డీఈ టీ.వి.సూర్యనారాయణ వెల్లడించారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో రోడ్డు అధ్వానంగా మారడంతో గతంలో ప్రమాదాలు జరిగేవి. ప్రస్తుతం విస్తరణతో పాటు బీటీ నిర్మాణంతో వాహనదారుల కష్టాలు తీరుతాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రోత్సాహం.. క్రీడోత్సాహం

• వాలీబాల్ పోటీల్లో యువతుల ప్రతిభ

న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

గొల్లవిల్లిలో అరిగెల రంగయ్య మెమోరియల్ వాలీబాల్ టోర్నీ క్రీడాకారిణులు ప్రతిభ చూపుతున్నారు. పురుషులతో పాటు మహిళా వాలీబాల్ జట్ల మధ్య పోటీలు ఉత్కంఠ భరితంగా కొనసాగుతున్నాయి. పోటీలను తిలకించేందుకు మహిళలు భారీగా హాజరవుతున్నారు. అడుగడుగునా కేరింతలు, చప్పట్లతో క్రీడాకారిణులు ఉత్సహపరుస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు క్రీడాకారిణిలు తమ అభిప్రాయాలను 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.

క్రీడాకారిణులు ఏంజల్, లావణ్య, స్టెన్సీ

మంచి గుర్తింపు వచ్చింది..

నేను గోవా నుంచి వచ్చా. సౌత్ సెంట్రల్ రెల్వే జట్టులో ఆడుతున్నా. గతంలో థాయ్‌ల్యాండ్‌లో జరిగిన అంతర్జాతీయ జూనియర్ ఇండియా జట్టులో ఆడి అయిదో స్థానంలో నిలిచాం. సీనియర్ నేషనల్ ఇండియా రెల్వే జట్టులో ఆడి బంగారు, వెండి పతకాలు సాధించాం. బెస్ట్ బీచ్‌వాలీబాల్ ప్లేయర్‌గా, వాలీబాల్ కోచ్‌గా పేరు వచ్చింది. గత ఏడాది ఎస్.యానాం బీచ్ వాలీబాల్ పోటీల్లో ఆడా. గొల్లవిల్లిలో టోర్నమెంట్ క్రీడాకారులకు మంచి అతిథ్యంతో పాటు పేరు తెచ్చిపెట్టింది. –స్టెన్సీ, సౌత్ సెంట్రల్ రెల్వే జట్టు క్రీడాకారిణి

అభిమానుల ఆదరణ బాగుంది..

నేను వరంగల్ నుంచి వచ్చా. సౌత్ సెంట్రల్ రెల్వే జట్టులో ఆడుతున్నాను. అంతర్జాతీయ స్థాయిలో కజికిస్థాన్‌లో జరిగిన అండర్-20 ఏషియన్‌గేమ్స్‌.లో పాల్గొన్నా. గతంలో నేను ఆడిన జట్టుకు సీనియర్ నేషనల్ బీచ్‌వాలీబాల్‌లో నాలుగో స్థానం లభించింది. గొల్లవిల్లిలో క్రీడాభిమానుల ఆదరణ బాగుంది. టోర్నమెంట్ కమిటీ సభ్యులు క్రీడాకారులకు ఇబ్బంది లేకుండా మంచి ఏర్పాట్లు చేశారు. –లావణ్య, సౌత్ సెంట్రల్ రెల్వే జట్టు క్రీడాకారిణి

ఇక్కడ ఆడటం ఆనందంగా ఉంది..

నేను కేరళ నుంచి వచ్చా. ఒడిశాలో జరిగిన ఆల్ ఇండియా యూనివర్సిటీ జాతీయస్థాయి పోటీల్లో ఆడా. ఉత్తర్‌ప్రదేశ్ వారణాసిలో జరిగిన పోటీల్లో మా జట్టుకు బంగారు పతకం వచ్చింది. రాయపూర్‌లో ఫ్రీడమ్ కప్ పోటీల్లో మా జట్టుకు మరో బంగారు పతకం లభించింది. గొల్లవిల్లిలో మైదానంలో వాలీబాల్ ఆడటం మంచి ఆనందంగా ఉంది. ఇక్కడ క్రీడలను ప్రోత్సహించడానికి మంచి అవకాశాలు కల్పిస్తున్నారు. – ఏంజల్, సౌత్ సెంట్రల్ రెల్వే జట్టు క్రీడాకారిణి


మహిళాజట్ల హోరాహోరీ పోటీ

నేడు సామూహిక ఎలుకల నివారణ

పామర్రు: మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గురువారం సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వ్యవసాయ శాఖ ఏడీ బి.నాగకుమార్ అన్నారు. మండల ఏవో ఎ.సద్గురుమూర్తి అధ్యక్షతన బుధవారం దంగేరు, కె.గంగవరం గ్రామాల్లో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన మట్లాడారు.

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: రామచంద్రపురం మండలంలోని 19 రైతు సేవా కేంద్రాల పరిధిలో గురువారం సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు మండల వ్యవసాయాధికారి టీవీఆర్ మణిదీప్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి మొత్తం 82 కిలోల బ్రోమోడయోలిన్ మందు కేటాయించారని, ఈ మందును అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఎరతో కలిపి రైతులకు పంపిణీ చేస్తామన్నారు.

తిరుపతికి సైకిల్‌యాత్ర

సైకిల్‌పై తిరుపతి చేరిన రాంబాబు

పామర్రు, న్యూస్‌టుడే: కె.గంగవరం మండలం దంగేరుకు చెందిన మేడిశెట్టి వీర వెంకట సూర్యరామారావు (రాంబాబు) వెంకటేశ్వరస్వామి భక్తుడు. తిరుపతి వెంకన్నను సైకిల్‌యాత్రగా వెళ్లి దర్శించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈనెల 14న సైకిల్‌పై బయలుదేరిన ఆయన బుధవారం ఉదయం తిరుపతి చేరుకున్నారు. స్వామి కరుణతో యాత్ర సాఫీగా సాగిందని ఆయన చరవాణి ద్వారా చెప్పారు.

జేఈఈలో గురుకుల విద్యార్థిని ప్రతిభ

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్‌లో ముమ్మిడివరంలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని లంకే యశోధర రాణి 84.36 పర్సంటైల్ సాధించి ప్రతిభను కనబరిచింది. ఆమెను కళాశాల ప్రిన్సిపల్ పి.శకుంతల, అధ్యాపకులు అభినందించారు. పశ్చిమగోదావరి జిల్లా కట్టుపాలేనికి చెందిన యశోధర రాణి తండ్రి రమేష్, తల్లి శేషారత్నం నిరుపేద కుటుంబానికి చెందిన వారు. ఎన్‌ఐటీలో ఇంజినీరింగ్ చేయాలనేది తన కల అని ఆ విద్యార్థి తెలిపింది.

రాణిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ శకుంతల

పెద్దింట్లమ్మ జాతర

సఖినేటిపల్లి : మెండుపాలెం పెద్దింట్లమ్మ జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఊరేగింపుగా గరగ నృత్యాలు చేసుకుంటూ ఆలయానికి వచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్చి 18తో ఉత్సవాలు ముగుస్తాయని కమిటీ నిర్వాహకులు వెల్లడించారు.

విద్యాసామగ్రి అందజేత

అల్లవరం, న్యూస్‌టుడే: అల్లవరం, గోడిలంక జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు మోసుగంటి గంగయ్య, రుద్రరాజు సీతాపతిరాజు మెమోరియల్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యాసామగ్రిని అందించారు. మోసుగంటి వెంకటేశ్వరరావు, రుద్రరాజు రమేష్‌రాజు, నయినాల వెంకటేశ్వరరావు, బేగం, జ్యోతి కమార్, నకుల రాజు తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: కాట్రేనికోనకు చెందిన కృపా ఫ్లెక్సీ ఆధ్వర్యంలో గచ్చకాయలపోర జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష అట్ట, కంపాస్ బాక్సులు, పెన్నులు అందించారు.

కార్యాలయంలోకి ప్రవేశం ఎలా?



ప్రభుత్వ రహదారి మార్గంలోని పౌర కార్యాలయంలోకి వెళ్లే మార్గంలో వాహనాల్ని ఇష్టానుసారంగా నిలుపుతున్నారు. 18 కార్యాలయాలున్న పౌరకార్యాలయం వద్ద లోనికి వెళ్లే మార్గం లేకుండా పోతోంది. వాహనాలు ఎక్కడి వరకు అనుమతించాలన్న అంశంపై తగిన నియంత్రణ లేదు. దీనితో ఎవరికివారు వాహనాల్ని ప్రవేశమార్గం వద్దే నిలిపి లోనికి వెళ్లడం పరిపాటిగా మారింది. దీనితో వివిధ పనుల నిమిత్తం వెళ్లి వచ్చేవారు అసౌకర్యానికి గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, యానాం

రోడ్డు వేశారు.. అంచులు మరిచారు

ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లి నుంచి నల్లావారిపేటకు వెళ్లే సీసీ రోడ్డుకు బెర్ములు లేక పోవడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అంచుల్లో కంకర వేయక రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పరిశీలించి రూ.లక్షలతో నిర్మించిన రహదారికి బెర్ములు నిర్మించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

పట్టు తప్పిదే ప్రమాదమే..

ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని కాశివారితూము వద్ద ప్రధాన రహదారిలో పరిస్థితి ఇది. రాణేలంక- చింతలమెరక పంట కాలువపై ఉన్న ఈ కల్వర్టు ప్రమాదకరంగా మారింది. రక్షణకు ఏర్పాటు చేసిన గ్రిల్ విరిగిపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్రిల్‌ను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ముమ్మిడివరం

భట్నవిల్లిలో పన్నుపోటు..!

• రూ.3.50 లక్షలు పక్కదారి

న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

సాంకేతికత పెరిగినా.. కొత్త యాప్‌లు.. సాఫ్ట్‌వేర్లు వచ్చినా కొందరు ప్రభుత్వానికొచ్చే ఆదాయాన్ని జేబుల్లో వేసుకునే మార్గాలపైనే అన్వేషిస్తున్నారు. ఏటా జనవరి నుంచి మార్చి వరకు సాగే ఇంటి పన్నుల వసూళ్లపై కన్నేశారు. అలాంటిదే అమలాపురం మండలంలోని ఓ పంచాయతీలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెండేళ్ల క్రితం ఉద్యోగ విరమణ చేసిన ఓ పంచాయతీ కార్యదర్శి అక్రమార్జనకు పాల్పడ్డారు. ఈ వ్యవహారం ఇటీవల పన్నుల వసూళ్లు చేపట్టే సమయాల్లో బయటపడటంతో చక్కదిద్దుకునే పనుల్లో నిమగ్నమయ్యారు.

ఇలా వెలుగులోకి

గతంలో ఇంటిపన్నుల వసూళ్లు పుస్తకాల్లోనే నమోదు చేసేవారు. స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్ రావడం, ఆన్‌లైన్‌లోనే చెల్లింపు చేయడం వంటి విధానాలు రావడంతో భట్నవిల్లి వ్యవహారం బయటకొచ్చింది. భట్నవిల్లిలో 48 ఇంటి పన్నులకు సంబంధించి ప్రభుత్వ పరంగా చెల్లించాల్సింది రూ.1,50,000 ఉంటే.. అదనంగా రూ.2,00,000 వరకు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారం బయటపడకుండా చక్కదిద్దినట్లు తెలుస్తోంది. ఈ పంచాయతీలో 2024 ఆగస్టు 31న ఉద్యోగ విరమణ చేసిన పంచాయతీ కార్యదర్శి కట్టా సత్యబాబ్ పేరుతో ఉన్న స్టాంపును ఉపయోగించి అందులో ఆయన సంతకం లేకుండా ఇంటి పన్నులు వేసినట్లు వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శి పేరుతోనూ స్టాంప్ సిద్ధం చేసేందుకు పంచాయతీలోని కొందరు ఉద్యోగులు సన్నద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై అమలాపురం డిప్యూటీ ఎంపీడీవో శాస్త్రిని వివరణ కోరగా.. భట్నవిల్లిలో ఇంటి పన్నుల వసూళ్లలో అవకతవకలు జరిగిన విషయం తమ దృష్టికి రాలేదని చెప్పారు.

ఇంతకీ ఏం జరిగిందంటే..

అమలాపురం మండలం భట్నవిల్లిలో 962 గృహాలున్నాయి. వీటికి సంబంధించి 2025-26 ఏడాదికి పన్నులు రూ.12.31 లక్షలు చెల్లించాల్సి ఉంది. ఏటా మాదిరి ఈ సంవత్సరం సైతం అధికారులు ఇంటి పన్నుల వసూలులో నిమగ్నమయ్యారు. పన్ను చెల్లించని ఇళ్లను గుర్తిస్తున్న సమయంలో అప్పటి మోసం వెలుగులోకి వచ్చింది. అప్పటికే తమ నుంచి పన్నులు తీసుకున్నారని కొందరు చెప్పడంతో పంచాయతీ సిబ్బంది కంగుతిన్నారు. దీంతో పన్నుల దస్త్రాలను పరిశీలించారు. గతంలో ఇక్కడ పనిచేసిన పంచాయతీ కార్యదర్శి పేరుతో ఉన్న స్టాంపు ఆధారంగా 2024-25లో 48 ఇళ్లకు పన్నులు వేసి వసూలు చేశారు. పంచాయతీలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ చేసినట్లు నిర్ధారించినట్లు తెలిసింది. గ్రామస్థులు ఆయనపై ఫిర్యాదు చేసేందుకు వీలులేకుండా ఈ వ్యవహారానంతటికీ మాఫీ చేసినట్లు సమాచారం.

ఈ-పంట నమోదు ఇక్కట్లు

• సిబ్బంది నిర్లక్ష్యంతో రైతులకు ఇబ్బందులు

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో రబీ సాగుకు సంబంధించి ఈ-పంట నమోదులో తాత్సారంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నగర పంచాయతీ సూరాయిచెరువు వార్డు సచివాలయ పరిధిలో 600 ఎకరాల్లో రైతులు రబీ సాగు చేపట్టారు. ఇప్పటి వరకు ఒక్క ఎకరం సైతం ఈ-పంట నమోదు చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగర పంచాయతీ పరిధిలో సుమారు 1500 ఎకరాల్లో వరి సాగు ఉండగా.. సిబ్బంది కొరత ఏర్పడింది. ఇక్కడ విధులకు ఏఈఓను నియమించగా.. ఆయన ఇటీవల సెలవులో వెళ్లిపోయారు. దీంతో పంట నమోదు చేపట్టలేదు. భవిష్యత్తులో బీమా ప్రీమియం చెల్లించాలన్నా.. ధాన్యం విక్రయించుకోవాలన్నా.. ఈ-పంట నమోదు తప్పనిసరి. ఈ నెల 20 నాటికి గడువు ముగుస్తున్న తరుణంలో తామంతా ఏం చేయాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై మండల వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంత్‌కుమార్‌ను వివరణ కోరగా.. నగర పంచాయతీ పరిధిలోని సూరాయిచెరువు ప్రాంతంలో ఈ-పంట నమోదుకు గేదెల్లంక, అన్నంపల్లి సచివాలయాల నుంచి ఇద్దరు సిబ్బందిని డిప్యుటేషన్‌పై నియమించామన్నారు. వెంటనే నమోదు ప్రక్రియను చేపడతారని తెలిపారు.

సూరాయి చెరువు వద్ద నమోదు చేయని వరిచేలు

ధాన్యం ఎలా విక్రయించుకోవాలి..

పంట చేతికొచ్చాక అమ్ముకోవాలంటే పంట నమోదు లేకపోతే.. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించలేం. ప్రైవేటు వ్యాపారులు అయినకాడికి ఇచ్చేయాలి. ఇప్పటి వరకు పంట నమోదు చేయకపోతే ఎలా..? –సానబోయిన త్రినాథరావు, రైతు

పదిలో విజయంతో ఆత్మవిశ్వాసం

వీడ్కోలు సమావేశంలో విద్యార్థుల బృందం

పామర్రు, న్యూస్‌టుడే: పాఠశాల విద్యలో పదో తరగతి భావి జీవితానికి తొలిమెట్టని.. కష్టపడి చదివి విజయం సాధించడం ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పామర్రు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి.చంద్రశేఖర్ అన్నారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు యర్రా ఈశ్వరుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పరీక్షల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో వచ్చి ఆకట్టుకున్నారు. పలువురు సెల్ఫీలు దిగి. నృత్యాలు చేస్తూ ఆనందంగా గడిపారు. ఉపాధ్యాయులు చీకట్ల గోపాలకృష్ణ, కందుల శ్రీనివాస్, పూలపల్లి విజయకుమార్, చుంద్రు వీవీఎస్ చౌదరి, విద్యా కమిటీ ఛైర్మన్ వై.శ్రీనివాసు, తదితరులు మాట్లాడారు.

డీజిల్ పట్టివేత

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: యానాం నుంచి అక్రమంగా తరలిస్తున్న డీజిల్, పెట్రోల్‌ను ఎదుర్లంక చెక్‌పోస్టు వద్ద బుధవారం పోలీసులు పట్టుకున్నారు. అయినవిల్లి మండలం వీరవెల్లిపాలేనికి చెందిన మేడిశెట్టి నాగేశ్వరరావు, వట్టికూటి రాంబాబు యానాం నుంచి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 790 లీటర్ల డీజిల్, 80 లీటర్ల పెట్రోలును ఎస్సై రవీంద్రబాబు ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. డీజిల్, పెట్రోలు, ఆటోను స్వాధీనం వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాలికల విద్యతోనే దేశానికి భవిష్యత్తు

ప్రతిభచూపిన బాలికకు నగదు బహుమతి అందిస్తున్న సత్యం

రామచంద్రపురం, న్యూస్‌టుడే: బాలికల విద్యతోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్లో బుధవారం నిర్వహించిన విద్యార్థినుల ప్రోత్సాహక నగదు బహుమతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. గత ఏడాది 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వత్తుమిల్లి దీప్తిప్రణవికి రూ.20 వేలు, ఆర్.పూజిత, పి.రోషిని, ఎం.దుర్గా హర్షిత, పి.చరిష్మా కోమలిలకు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున నీలిమ ఐస్‌క్రీమ్స్ అధినేత పితాని సుబ్రహ్మణ్యం సౌజన్యంతో ఆయన అందించారు. ప్రధానోపాధ్యాయురాలు కె.కె.ఎల్.కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: రామచంద్రపురం మండలం వేగాయమ్మపేట గ్రామానికి చెందిన నూతలపాటి అన్నవరం (49) మోటారు సైకిల్‌పై వెళుతూ ప్రమాదవశాత్తు అదుపుతప్పి కింద పడిపోయారు. హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్టు నిర్ధారించారు. పోలీసుల వివరాల ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయలుదేరిన ఆయన మోటారు సైకిల్‌పై యర్రపోతవరం వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారంతో ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

నిరసన తెల్పుతున్న సొసైటీ ఉద్యోగులు

కాట్రేనికోన, న్యూస్‌టుడే: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రసహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ పిలుపు మేరకు కాట్రేనికోన సొసైటీ బ్యాంకు వద్ద ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు వై.రామచంద్రరావు ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన చేశారు.

అమలాపురం పట్టణం: సహకార సంఘ ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని, జీవో 36ను అమలు చేయాలని అమలాపురం బ్రాంచి డైరెక్టర్ తోరం దొరాజీ డిమాండ్ చేశారు. కె.అగ్రహారంలో కళా వెంకట్రావు ప్రాథమిక సహకార సంఘం ఆవరణలో దొరాజీ ఆధ్వర్యంలో ఉద్యోగులు బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు శాఖా కార్యాలయం వద్ద జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి మట్టపర్తి జయరాం ఆధ్వర్యంలో ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. వి.శివప్రసాద్, ఎం.కుమార్, బీవీఎస్ వర్మ, బి.మణికంఠ, ఎస్.రాజ్‌కుమార్, ప్రసాద్, బుల్లిరాజు, నూకరాజు, చంద్రమౌళి, బొంతు రాంబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీఐ మోహన్‌కుమార్

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ముమ్మిడివరం సీఐ మోహన్‌కుమార్ హెచ్చరించారు. ఐ.పోలవరం మండలం గుత్తెనదీవిలో బుధవారం నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో సీఐ పాల్గొని మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, గొడవలు సృష్టించినా.. చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. వివాదాలు తలెత్తితే శాంతియుతంగా పరిష్కరించుకోవడానికి గ్రామస్థులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎస్సై ఎంవీవీ రవీంద్రబాబు పాల్గొన్నారు.

వాడపల్లిలో శేఖర్ మాస్టర్ పూజలు

రావులపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: వాడపల్లి వేంకటేశ్వర స్వామిని సినీ నృత్య దర్శకుడు శేఖర్ మాస్టర్ దంపతులు బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

ప్రణాళికతో ఉత్తమ మార్కులు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: పది పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి ప్రణాళిక ప్రకారం అధ్యాయనం చేయాలని కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు సీవీ సర్వేశ్వరశర్మ సూచించారు. వెత్సావారి అగ్రహారం మహాత్మాగాంధీ మున్సిపల్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఘన సత్యనారాయణ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు 2933వ కోనసీమ సైన్స్ మహాసభ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శర్మ, ఉప విద్యాశాఖాధికారి జి.సూర్యప్రకాశం మాట్లాడారు.

మాట్లాడుతున్న సర్వేశ్వరశర్మ, చిత్రంలో డీఈవైవో సూర్యప్రకాశం, హెచ్‌ఎం సత్యనారాయణ

వీఆర్వోల నిరసన

అల్లవరం: విధినిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని గ్రామ రెవెన్యూ అధికారులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. చిట్టిబాబు, మోహన్‌రావు, రెడ్డి, సత్యనారాయణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాగసాల రాట మూహర్తం

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: భూపయ్యఅగ్రహారంలో 240 ఏళ్ల చరిత్ర ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి నూతన ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమైనాయి. ఆలయంలో యాగశాల నిర్మాణానికి సంబంధించిన రాట మూహర్త కార్యక్రమం బుధవారం భక్తులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ నెల 26న విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ ప్రతిష్ఠ, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. అనంతరం భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొత్తూరు శ్రీనివాస్, విస్సాప్రగడ చిన్న, పేరి కొండబాబు, వాడపల్లి లక్ష్మి నారాయణాచార్యులు, పుత్సా కృష్ణకామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విలసవిల్లిలో వైభవంగా ఆదిత్య కల్యాణం

మహాసౌరయాగానికి పూర్ణాహుతి చేస్తున్న రుత్వికులు, పాల్గొన్న భక్తులు

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: విలసవిల్లిలో రామాలయంలో నెలరోజులుగా నిర్వహిస్తున్న మహాసౌర యాగానికి మున్నంగి రామకృష్ణ శర్మ దంపతుల ఆధ్వర్యంలో రుత్వికుల బృందం బుధవారం వైభవంగా పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం ఆరోగ్యప్రదాత సూర్యదేవుని కల్యాణం అత్యంత రమణీయంగా నిర్వహించారు. పూజానంతరం టి.జ్యోతిశ్వరరెడ్డి, గిరిజ దంపతులు సహకారంతో భక్తులకు భారీ అన్నసమారాధన చేశారు.

బోద వ్యాధిగ్రస్థులకు కిట్ల అందజేత

పామర్రు, న్యూస్‌టుడే: బోద వ్యాధిగ్రస్థులు మందులు వాడుతూ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని పేకేరు వైద్యాధికారులు డా.ఎం.శ్రీలక్ష్మి, డా.రేఖారాణి సూచించారు. పేకేరు పరిసర గ్రామాల్లోని బోద వ్యాధి బాధితులకు బుధవారం వారు కిట్లు అందించారు. ఇందులో ప్లాస్టిక్ తొట్టె, మగ్గు, ఆయింట్‌మెంట్లు, సబ్బులు తదితర సామగ్రి ఉన్నాయి. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వెలిచేటి శ్యామలరావు (బాబ్జి) తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

తెప్పోత్సవం.. పులకించిన భక్తజనం

పుష్కరిణిలో తెప్పపై ఊరేగుతున్న స్వామివారు

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం పాద గయ క్షేత్రంలో రాజరాజేశ్వరి సమేత ఉమా కుక్కుటేశ్వరస్వామి వార్ల కల్యాణోత్సవాలు ముగిశాయి. బుధవారం రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో పుష్కరిణిలో నిర్వహించిన తెప్పోత్సవం కనుల పండువగా సాగింది. ఈ కార్యక్రమాన్ని తిలకించిన భక్తజనం పులకించిపోయారు. శ్రీపుష్పోత్సవం, ఏకాంత సేవాగానం దేవస్థానం అర్చకులు కోట వీర వెంకట సత్యనారాయణమూర్తి, దత్తాత్రేయ శర్మ, కైతేపల్లి రాజ్‌కుమార్ శర్మ, కుక్కుటేశ్వర శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈవో కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్, ఉత్సవాల ప్రత్యేక అధికారి సురేష్ నాయుడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మీసాల వెంకన్న కల్యాణోత్సవాలు

యానాం: యానాం ప్రజల ఆరాధ్య దైవం భూ సమేత వెంకటేశ్వరుడి(మీసాల వెంకన్న) కల్యాణోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. వేంకటేశ్వరుడిని పెండ్లికుమారుడిగా అలంకరించి పూజలు నిర్వహించారు. బుధవారం రాత్రి ఎనిమిది గంటల తర్వాత స్వామి వారిని సర్వ వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. వాహనోత్సవ ప్రారంభ వేడుకలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్, పరిపాలనాధికారి అంకిత్‌కుమార్, ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.జ్యోతివెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పురపాలికల్లో కొత్త బృహత్తర ప్రణాళిక

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

పట్టణీకరణ పేరిట గ్రామాల విస్తరణకు కూటమి ప్రభుత్వం నడుం బిగించింది. అర్బన్ ప్రాంతాలను ఆనుకొని ఉన్న గ్రామాల్లో మౌలిక వసతుల మెరుగుకు చర్యలు చేపడుతోంది. ఇందుకుగాను రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ (రుడా) పరిధిలోని పురపాలికల్లో కొత్త బృహత్తర ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) అమలుకు సన్నాహాలు చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలోనే అమలు చేయాలని తలపెట్టినా అడుగు ముందుకు పడలేదు. తాజాగా జిల్లాలోని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, రామచంద్రపురం, కొవ్వూరు, నిడదవోలు పురపాలికల్లో కసరత్తు పూర్తిచేసి ప్రభుత్వానికి పంపిన నివేదికకు ఆమోద ముద్ర పడింది.

మొదటి దశలో 1000 చ.కి.మీ.

పురపాలికలకు ఆనుకుని ఉన్న గ్రామాల్లోనూ తాగునీటి సరఫరా, రహదారులు, మురుగు పారుదల వ్యవస్థను మెరుగుపర్చడం వంటి సౌకర్యాలు కల్పిస్తారు. పైగా అర్బన్ డెవలప్‌మెంటు హోదాలో పీపీ విధానంలో వనరులను వినియోగించుకొని అభివృద్ధికి అడుగులు వేస్తారు. రుడా పరిధి మొత్తం 3200 చ.కి.మీ విస్తరించి ఉండగా, మొదటి దశలో పురపాలికలను కలుపుకొని 1000 చ.కి.మీ మేర మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేశారు.

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో..

- ప్రస్తుతం నగర విస్తీర్ణం 44.5 చదరపు కి.మీ ఉండగా, కొత్తగా 12 విలీన గ్రామాలను కలిపి 162. చ.కి.మీ విస్తీర్ణంతో మహా రాజమహేంద్రవరంగా విస్తరించనున్నారు.
- కాతేరు, తొర్రేడు, కోలమూరు, గాడాల, పాలచర్ల, లాలాచెరువు, దివాన్‌చెరువు, పిడింగొయ్యి, హుక్కుంపేట, శాటిలైటు సిటీ, బొమ్మూరు, ధవళేశ్వరం పంచాయతీలను మాస్టర్ ప్లాన్‌లోనే పొందుపర్చారు.

నిడదవోలులో..

పురపాలికలో శివారు ప్రాంతాల్లో 14 గ్రామాలను కలిపి 47 చ.కి.మీ విస్తీర్ణంతో ప్లాన్ సిద్ధం చేయగా, ఆమోదం లభించింది.

కొవ్వూరు పురపాలిక పరిధిలో..

- చుట్టుపక్కల తొమ్మిది గ్రామాలను విలీనం చేస్తూ 36.63 చ.కి.మీ విస్తీర్ణంతో నివేదిక అందజేసిన మాస్టర్ ప్లాన్‌కు ఆమోదం లభించింది.

రామచంద్రాపురంలో..

చుట్టుపక్కల 14 పంచాయతీలను కలిపి 43.94 చ.కి.మీ.తో ప్లాన్ సిద్ధం చేసి పట్టణ ప్రణాళికా విభాగానికి నివేదించగా ఆమోద ముద్ర పడింది.

పీపీపీ విధానంలో పనులకు కార్యాచరణ..

ఒక్కొక్క పురపాలికలో రూ.వంద కోట్ల పైబడి పీపీపీ విధానంలో పనులు చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. పర్యాటక విస్తరణతోపాటు, మౌలిక వసతులు కల్పిస్తారు. గ్రూపు నివాసాలు, స్వతంత్ర నిర్మాణాలు దిశగా ప్రోత్సాహం అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

విద్యుత్తు సేవలు ఎలా ఉన్నాయి?

- ఉమ్మడి జిల్లాలో ప్రజాభిప్రాయ సేకరణ
- 25 శాతం మేర అసంతృప్తి

ఈనాడు, రాజమహేంద్రవరం: ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్తు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వివిధ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం అందుతున్న సేవలపై ప్రజల సంతృప్తి స్థాయిని తెలుసుకునేందుకు ఇటీవల అభిప్రాయాలు సేకరించింది. రాష్ట్ర వ్యాప్తంగా 77.13 లక్షల మంది అభిప్రాయాలు సేకరించగా 77.7 శాతం సంతృప్తి వ్యక్తంచేయగా 22.3 శాతం మంది ప్రతికూలంగా స్పందించారు. మీకు నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా జరుగుతోందా? నాణ్యమైన విద్యుత్తు ఇస్తున్నారా? సిబ్బంది అందుబాటులో ఉన్నారా? తదితర ప్రశ్నలకు సమాధానాలు రాబట్టారు. సేవలకు సంబంధించి రాష్ట్రంలో తూర్పుగోదావరి జిల్లా ఏడో స్థానంలో ఉండగా కాకినాడ 18, కోనసీమ 21వ స్థానంలో ఉన్నాయి. ఈ రెండు జిల్లాల్లో మరింత మెరుగుపరుచుకోవాల్సి ఉందని స్పష్టం చేశారు.

కొన్ని గ్రామాల్లో ఇలా..

- కాకినాడ జిల్లా తాళ్లరేవు సెక్షన్ పరిధిలో పై మూడు రకాల సేవలపై 747 మందితో మాట్లాడగా 29.89 శాతం, తొండంగి సెక్షన్ పరిధిలో 838 మందిని సంప్రదించగా 29.71, పిఠాపురం సెక్షన్ పరిధిలో 678 మందితో మాట్లాడగా 29.53 శాతం సక్రమంగా లేవని స్పష్టం చేశారు.
- కోనసీమ జిల్లా పి.గన్నవరం సెక్షన్ పరిధిలో 781 మందికిగాను 29.40 శాతం, కాట్రేనికోన సెక్షన్ పరిధిలో 660 మందికి 29.35, అయినవిల్లి సెక్షన్‌లో 840 మంది అభిప్రాయాలు సేకరించగా 29.20 శాతం అసంతృప్తి వ్యక్తం చేశారు.
- నిడదవోలు పరిధిలోని అనంతపల్లి సెక్షన్‌లో 946 మంది అభిప్రాయాలు సేకరించగా 19 శాతం మంది అసంతృప్తి వ్యక్తంచేశారు.

ప్రజలు వెల్లడించిన అభిప్రాయాలు పరిశీలిస్తే (శాతాల్లో)

జిల్లా	నిరంతర విద్యుత్తు సరఫరా		నాణ్యమైన విద్యుత్తు		సిబ్బంది అందుబాటులో	
	ఇస్తున్నారు	లేదు	అందుతోంది	లేదు	ఉన్నారు	లేరు
తూర్పుగోదావరి	79.8	20.2	78.4	21.6	75.6	24.4
కాకినాడ	78.7	21.3	72.7	27.3	74.1	25.9
కోనసీమ	77.4	22.6	71.3	28.7	74.1	25.9

ఆర్డీవోలకు వెబ్‌ల్యాండ్, అడంగల్ మార్పుల అధికారం

టి.నగర్ : రెవెన్యూ రికార్డుల్లో వెబ్ ల్యాండ్-అడంగల్ మార్పుల అధికారం ఆర్డీవోలకు బదలాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణ నాయక్ తెలిపారు. గతంలో జేసీ స్థాయిలో ఉండేదన్నారు. తాజా ఉత్తర్వుల ప్రకారం వెబ్ ల్యాండ్ అడంగల్‌లో మార్పులు చేర్పులతోపాటు మ్యుటేషన్‌కు సంబంధించినఅధికారాలు ఆర్డీవోలకు వర్తిస్తాయన్నారు.

మన్యం ఎర్రమట్టిపై మాఫియా కన్ను?

న్యూస్‌టుడే - దేవీపట్నం

మన్యంలో ఎర్రమట్టిపై మాఫియా కన్ను పడింది. మైదాన ప్రాంతాలకు రవాణా చేసేందుకు ఇబ్బందిలేని సమీప గిరిజన ప్రాంతంలో ఎర్రమట్టి ఉన్న భూములను సేకరిస్తున్నారు. అమాయక గిరిజనులకు మాయమాటలు చెప్పి మట్టి తీయడానికి తక్కువ లీజుకే భూములను తీసుకుంటున్నారు. ఆ భూముల్లో ఉన్న ఎర్రమట్టిని తూర్పుగోదావరి జిల్లా కడియం, పరిసర ప్రాంతాల్లో నర్సరీలకు తరలించడానికి కొందరు దళారులు ఇప్పటికే ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. ఫజుల్లాబాద్, భీంపల్లి పరిసర ప్రాంతాల్లో వేల రూపాయలు ఖరీదు చేసే ఎర్రమట్టిని మైదాన ప్రాంతాలకు తరలించడానికి వారం రోజులుగా మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. గిరిజనుల నుంచి తీసుకుంటున్న భూములను చదును చేసే పేరుతో మట్టి తవ్వకాలు చేసి రాత్రికి రాత్రే భారీ వాహనాల్లో గట్టుచప్పుడు కాకుండా మట్టిని తరలించేస్తుంటారు.

నర్సరీలు ఉపయోగించే ఎర్రమట్టి

నర్సరీల్లో మొక్కల పెంపకానికి..

మన్యంలో దొరికే ఎర్రమట్టిని నర్సరీల్లో మొక్కలు పెంచడానికి వినియోగిస్తుంటారు. ఒక లారీలో మట్టికి దాదాపు రూ.20 వేల వరకూ ధర పలుకుతుంది. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలంలో అక్రమ ఎర్రమట్టి క్వారీలను గనుల శాఖ అధికారులు నిలిపివేయడంతో దళారుల కన్ను మన్యంపై పడింది. దీనిపై దేవీపట్నం తహసీల్దార్ కె.సత్యనారాయణను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా మన్యంలో మట్టి తవ్వకాలకు ఏవిధమైన అనుమతులు లేవన్నారు. ఇప్పటికే మా దృష్టికి వచ్చిన కొన్నిచోట్ల సిబ్బందితో నిఘా ఏర్పాటు చేశామన్నారు. మట్టి తవ్వకాలు నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలతోపాటు వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు.

నగర వాసులకు నరకం.. వైకాపాదే పాపం

నగరంలోని జైలు రోడ్డు వద్ద నిలిచిపోయిన వాహనాలు

వీఎల్‌పురం, ఏవీఏరోడ్డు, కంబాలచెరువు, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి మాజీ మంత్రి అంబటి రాంబాబు విడుదల సందర్భంగా వైకాపా శ్రేణులు చూపిన అత్యుత్సాహం నగర వాసులకు నరకం చూపింది. వాహనాలు నిలిచిపోయి, సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేక అవస్థలు ఎదుర్కొన్నారు. ఉదయం నుంచి చదువులతో అలసిపోయిన చిన్నారులు సమయానికి ఇళ్లకు చేరుకోలేక ఇబ్బందులు పడ్డారు. బుధవారం సాయంత్రం సెంట్రల్ జైలు నుంచి సానిక ప్రకాష్‌నగర్‌లోని మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నివాసం వరకు భారీ ర్యాలీగా రావడంతో ట్రాఫిక్ స్తంభించి వాహనాలు ముందుకు కదలడం గగనమైంది. ప్రజలు, వాహనచోదకులు అడ్డదారుల్లో ఇళ్లకు చేరుకోవాల్సి వచ్చింది. ముందుస్తుగా ఎటువంటి అనుమతులు తీసుకోకుండా భారీ సంఖ్యలో వైకాపా శ్రేణులు ర్యాలీగా రావడంతో వారిని నియంత్రించడం, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం పోలీసులకు క్లిష్టంగా మారింది.

అనుమతులు లేకుండా కేంద్ర కారాగారం నుంచి వైకాపా శ్రేణుల భారీ ర్యాలీ

జిల్లాలో 52 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు

శ్యామలా సెంటర్ (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: జిల్లాలో 52 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నామని, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డీవీఈవో విజయశ్రీ పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన పునశ్చరణ కార్యక్రమం ఎస్‌కేఆర్ కళాశాలలో బుధవారం నిర్వహించారు. పరీక్షలు సజావుగా జరిగేలా ప్రతి కేంద్రం వద్ద విద్యుత్తు, తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఇప్పటికే పరీక్షలకు సంబంధించిన సామగ్రి అందజేసినట్లు ఆర్ఐవో ఐ.శారద తెలిపారు. తొలుత కమిషనరేట్ నుంచి వెబెక్స్ ద్వారా అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, కస్టోడియన్లు, ఫ్లయింగ్, సిట్టింగ్, స్క్వాడ్, ఏడీవోలు హాజరయ్యారు.

ఇలా కోర్సు పూర్తిచేస్తే.. అలా కొలువు కొట్టొచ్చు

జేఎన్టీయూకేలో అవాంటెల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రత్యేకత

ఈనాడు, కాకినాడ; న్యూస్‌టుడే, గాంధీనగర్: పరిశ్రమ డిమాండ్లను తీర్చగలిగే పాఠ్యాంశాలు (కరిక్యులమ్) రూపొందించినప్పుడే విద్యార్థులు త్వరితగతంగా కొలువులు సాధించొచ్చు. ఇటీవల కాకినాడ జేఎన్టీయూకి వచ్చిన విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఇదే అంశమై మాట్లాడుతూ కంపెనీలు తమ పరిశోధనలకు విశ్వవిద్యాలయాలకు సాయపడాలని సూచించారు. సిగ్నల్, కమ్యూనికేషన్ రంగంలో ప్రసిద్ధిగాంచిన అవాంటెల్ లిమిటెడ్ కంపెనీ.. తాజాగా తమకు అవసరమైన మానవ వనరులను తయారుచేసుకునేందుకు జేఎన్టీయూలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుచేసింది. ఇందులో సీటు పొంది కోర్సు పూర్తిచేసినవారికి కొలువులూ ఇవ్వనుంది. ఈ సెంటర్ స్ఫూర్తితో జేఎన్టీయూకేలో క్వాంటమ్, ఏఐ సబ్జెక్టులకు సంబంధించి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి.

కాకినాడ జేఎన్టీయూలో ఏర్పాటుచేసిన అవాంటెల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ల్యాబ్

నాడు ఇక్కడ చదువుకుని..

అవాంటెల్ కంపెనీ భారతీయ రక్షణ, నౌకా, విమానయాన, అంతరిక్ష రంగాల్లో కమ్యూనికేషన్ పరికరాలు, సాంకేతిక సేవలందిస్తుంది. ఈ కంపెనీ సీఎండీ ఎ.విద్యాసాగర్ జేఎన్టీయూ పూర్వ విద్యార్థి. తాను చదువుకున్న విద్యాసంస్థలోనే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేశారు. సిగ్నల్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్ కోర్సులో ఎంటెక్ ప్రోగ్రాం తెచ్చారు. ల్యాబ్‌కు అత్యాధునిక కమ్యూనికేషన్ పరికరాలు, నెట్‌వర్క్ ఎనలైజర్లు, కంప్యూటర్లు, సాంకేతిక సిబ్బంది, ఫ్యాకల్టీ మొత్తాన్ని ఆ కంపెనీయే సమకూర్చింది.

25 సీట్లతో..

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చేరడానికి ఈసీఈ విద్యార్థులు అర్హులు. బీటెక్ అనంతరం ఎంటెక్‌లో ప్రవేశానికి గేట్ రాసి అర్హత సాధించినవారు సిగ్నల్ ప్రాసెసింగ్, కమ్యూనికేషన్‌లో చేరడానికి మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి. మౌఖిక పరీక్షల ద్వారా ఎంపికచేస్తారు. ముందుగా నోటిఫికేషన్ ఇస్తారు. ప్రస్తుతం 25 సీట్లు ఉన్నాయి. ఏడాదికి రూ.50 వేల ఫీజు.. మొదటి ఏడాది ఇక్కడి ఎక్సలెన్స్‌లో చదువుకుంటారు. రెండో ఏడాది హైదరాబాద్ కేంద్రం అవాంటెల్ కంపెనీలోనే ఇంటర్న్‌షిప్ చేయాలి. అప్పుడు నెలకు రూ.25 వేలు ఉపకారవేతనంగా ఇస్తారు.

ప్రయోగాత్మకంగా ప్రారంభం

కోర్సు పూర్తిచేసినవారిలో ప్రతిభావంతులకు ఏడాదికి రూ.9 లక్షల ప్యాకేజీతో అవాంటెల్ కంపెనీ ఉద్యోగాలు ఇస్తుందని **జేఎన్టీయూకే ఈసీఈ విభాగం హెచ్‌వోడీ లీలాకుమారి** చెప్పారు. ఈ ఏడాది ప్రయోగాత్మకంగా కోర్సు ప్రారంభించామని, రానున్న విద్యా సంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో ప్రవేశాలు ఉంటాయన్నారు.

కోర్టుకు బాంబు బెదిరింపులు

- రాజమహేంద్రవరంలో ముమ్మర తనిఖీలు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలోని జిల్లా కోర్టుకు బుధవారం బాంబు బెదిరింపులు రావడంతో అంతా ఉలిక్కిపడ్డారు. కోర్టు అధికారిక ఈ-మెయిల్‌కు బెదిరింపులతో కూడిన మెయిల్ రావడంతో అధికారులు పోలీసులకు సమాచారమిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ పర్యవేక్షణలో వెంటనే డాగ్, బాంబు స్క్వాడ్ బృందాలు రంగంలోకి దిగాయి. కోర్టులో న్యాయవాదులు, కక్షిదారులను బయటికి పంపించి సాయంత్రం వరకు ముమ్మర తనిఖీలు చేపట్టారు. బాంబుకు సంబంధించి ఎలాంటి ఆనవాళ్లు కనిపించకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఇది ఆకతాయిల పనిగా పోలీసులు భావిస్తున్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు.

డాగ్ స్క్వాడ్ తనిఖీలు

సిబ్బంది కావలెను

శ్రీలలిత ఎంటర్‌ప్రైజెస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్,పెద్దాపురం వారికి ఈక్రింది సిబ్బంది కావలెను.

1) రైస్ మిల్ సూపర్‌వైజర్స్
2) హైడ్రా ఆపరేటర్స్
3) అకౌంటెంట్స్

తగిన అనుభవము అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ వివరములతో ఈక్రింది చిరునామా నందు స్వయముగా సంప్రదించవలెను.

లలిత ఎంటర్‌ప్రైజెస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, వాలుతిమ్మాపురం రోడ్, పెద్దాపురం,సెల్:99499 56942

థైరాయిడ్ సమస్యతో బాధ పడుతున్నారా?

అధునాతన రోబోటిక్ సర్జరీతో మీ థైరాయిడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం

ప్రయోజనాలు: తక్కువ నొప్పి | తక్కువ రక్తస్రావం | త్వరితంగా కోలుకోవడం

APEX HOSPITALS
ప్రకాష్ నగర్, రాజమండ్రి

Dr. Nitin Rimmalapudi, M.S.
Robotic Surgeon

అపాయింటుమెంట్ కొరకు సంప్రదించండి
93 922 922 00
సోమవారం నుండి శనివారం

అగ్రిగోల్డ్ బాధితులకు ప్రత్యేక కోర్టు ఏర్పాటుచేయాలి

గాంధీనగర్, న్యూస్‌టుడే: అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవచూపి వెంటనే విజయవాడలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, సీపీఐ కేంద్ర కమిటీ సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కాకినాడలో బుధవారం అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ మార్చి 2 నుంచి విజయవాడ ధర్నా చౌక్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేపడతామని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనలను ఉద్ధృతం చేస్తామన్నారు. అగ్రిగోల్డ్ సంస్థను మూసేసి ఈ ఏడాది జనవరి నాటికి 12 సంవత్సరాలైందని, ఇప్పటికీ సమస్య అలాగే కొనసాగుతుండటంతో 8 రాష్ట్రాల్లో 32 లక్షల మంది వినియోగదారులు, మన రాష్ట్రంలోని 19 లక్షలకు పైగా బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి అగ్రిగోల్డ్ యాజమాన్యం తమ బినామీల పేర పెట్టిన వేల కోట్ల రూపాయల ఆస్తులను స్వాధీనం చేసుకుని వాటిని వేలం వేసి బాధితులకు సొమ్ములు చెల్లించాలని కోరారు. గత ఎన్నికల్లో తెదేపా మేనిఫెస్టోలో అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెంటనే సమస్య పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఏజెంట్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాసు, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు అర్జునరావు, నారాయణరావు, బాధితులు పాల్గొన్నారు.

గోదావరి తగ్గుతోంది.. సీలేరు ఆదుకుంటోంది

నిడదవోలు, న్యూస్‌టుడే:

ఉభయగోదావరి జిల్లాల పరిధిలోని మూడు డెల్టాల్లో సుమారు 8.96 లక్షల ఎకరాలకు 9,000 క్యూసెక్కుల సాగునీటిని అందిస్తున్నారు. పలు ప్రాంతాల్లో పంట చిరుపొట్ట దశలో ఉంది. ఈ సమయంలో చేలకు నీటి అవసరం చాలా ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం అందిస్తున్న సాగునీరు చాలా వరకు రైతుల అవసరాలను తీరుస్తోంది. అయితే గోదావరి సహజ జలాలు తగ్గుతుండటంతో ప్రస్తుతం వరిపంటను సీలేరు నీరే ఆదుకుంటోంది.

గోదావరిలో తేలుతున్న ఇసుకతిప్పలు

మూడు డెల్టాల పరిధిలో..

జనవరిలో గోదావరి సహజ జలాలు తగ్గడంతో సీలేరు ప్రాజెక్టులో విద్యుత్తు ఉత్పత్తి చేసిన అనంతరం 4,565 , బైపాస్ ద్వారా 2,375 క్యూసెక్కులు కలిపి సీలేరు నుంచి ఈ నెల 10 వరకు మొత్తంగా 6,940 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో గోదావరి నీటిమట్టం కూడా క్రమంగా పెరగడంతో రైతుల అవసరాల మేరకు సాగునీరు అందించగలిగారు.

వంతుల వారీ విధానంతో..

నీటిని విడుదల చేయడంలో వంతులవారీ విధానాన్ని అమలు చేస్తుండటంతో రైతులకు కొంతవరకు సాగునీటి ఇబ్బందులు లేకున్నా.. శివారు ప్రాంతాల్లో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది గోదావరి సహజ జలాలు కొంతవరకు మెరుగ్గానే ఉన్నాయి. ప్రస్తుతం సీలేరు జలాలే చాలా వరకు పంటను గట్టెక్కిస్తున్నాయి. అయినా గోదావరి నీటిమట్టం క్రమంగా తగ్గుతుంది.

తేదీ ఫిబ్రవరి	గోదావరి నీటిమట్టం (మీటర్లలో)	మూడు డెల్టాలకు అందించిన నీరు (క్యూసెక్కులు)	సీలేరు జలాలు (క్యూసెక్కులు)
14	13.72	8,550	3,682
15	13.60	7,200	3,872
16	13.42	7,800	3,711
17	13.29	7,800	3,711
18	13.32	9,000	3,459

వరదలపై ఇస్రో శాస్త్రవేత్తల అధ్యయనం

బొబ్బర్లంక, తోకలంక ప్రాంతాల్లో పర్యటన

రావులపాలెం పట్టణం, ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఏటా గోదావరి వరదల సమయంలో ప్రజలు, పశువులు, ఆస్తులకు సంభవిస్తున్న నష్ట ప్రభావాన్ని తగ్గించేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటే బాగుంటుందో అధ్యయనం చేసేందుకు శాస్త్రవేత్తలు బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక, రావులపాలెం మండలం ఊబలంక శివారు తోకలంక ప్రాంతాల్లో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) శాస్త్రవేత్తలు ఎస్.వి.శివప్రసాద్‌శర్మ, అమన్‌ప్రీత్‌సింగ్ బృందం పర్యటించింది. తహసీల్దార్లు ముక్తేశ్వరరావు, రాంబాబు ఆయా ప్రాంతాల్లో వరద వచ్చిన సమయంలో పరిస్థితిని వారికి మ్యాప్‌లు చూపించి వివరించారు. మొదటి ప్రమాద హెచ్చరిక సమయంలో ఏ ప్రాంతం వరకు వరద వస్తుంది.. రెండు, మూడు, నాలుగు హెచ్చరికలు వస్తే పరిస్థితి ఏమిటి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. వరదల సమయంలో ఆస్తినష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేయనున్నారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తోకలంకలో మ్యాప్ పరిశీలిస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

VIJAYA DIAGNOSTIC CENTRE®

WALK-IN (RAJAHMUNDRY)
19th February, 2026 (Thursday)
Time: 10:00 am - 6:00 pm

- Centre Manager (Exp. 5 to 7 years in Hospital/Diagnostic Centre) - Graduate / MBA / PGDHM
- Front Office Executives (Exp. 1 year & above) - Any Graduate / Post Graduate
- Typists/ Documentation/ Medical Transcriptionists (3 to 5 years Relevant Exp.) - Graduate / Post Graduate
- Internal Audit Executives (Exp. 2 to 4 years) - Graduate / Post Graduate
- Sample Collection [Phlebotomists] (Exp. 2 years & above) - DMLT / MLT / B.Sc-MLT
- Ultrasound Assistants - Female (Fresher or upto 2 years experience) Inter / Graduate
- Attender (Exp. 0 to 2 years in any Hospital / Diagnostic Centre)

Please carry your Photograph, Educational & Experience Certificates.

Vijaya Diagnostic Centre Limited,
Near Narayana Junior College, Manasa Hospital Road,
Danavai Peta, Rajahmundry-533103
Ph: +91 90631 43611, 91000 96499, 87126 30339
Email: careers@vijayadiagnostic.in, ta8@vijayadiagnostic.in

(c) eenadu

ఆపదమిత్ర శిక్షణకు వివరాల నమోదు

రాయవరం, న్యూస్‌టుడే: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ఆపదమిత్ర శిక్షణ పొందడానికి ఆసక్తిగలవారు వివరాలు నమోదు చేసుకోవాలని స్కౌట్స్ అండ్ గైడ్స్ డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి పి.రాంబాబు విద్యార్థులకు సూచించారు. బుధవారం రాయవరంలోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో ఆపదమిత్ర కార్యక్రమంపై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కనీసం 18 ఏళ్ల నుంచి 45 సంవత్సరాల వయసున్న వారు శిక్షణకు అర్హులన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికి ఏడు రోజుల పాటు భూకంపాలు, వరదలు తదితర ప్రకృతి వైపరీత్యాలు, విపత్తుల సమయాల్లో ఎలా అత్యవసర సేవలందించాలో శిక్షణ ఇస్తామన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ విధివిధానాలపై అవగాహన కల్పిస్తామన్నారు. శిక్షణానంతరం ధ్రువీకరణ పత్రం, రూ.10 వేల విలువైన కిట్ అందిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు గూగుల్ లింక్ ద్వారా ఈనెల 23వ తదేఈలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. సమావేశంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లతో విద్యుత్తు బిల్లుల భారం తగ్గించుకోవచ్చు

దేవీచౌక్, న్యూస్‌టుడే: పీక్ టైంలో విద్యుత్తు వాడకం వల్ల యూనిట్‌కు ధర ఎక్కువ పడుతుందని ఏపీఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజరు ఎస్.రాజబాబు తెలిపారు. ఉదయం 6 నుంచి 10 సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల మధ్య పీక్ సమయాల్లో స్మార్ట్ మీటర్ వాడకం ద్వారా పీక్ నుంచి ఆఫ్ పీక్, సాధారణ సమయాలకు మార్చడం ద్వారా వినియోగదారులు తమ బిల్లులను గణనీయంగా తగ్గించుకోవచ్చన్నారు. ఎనర్జీ కాస్ట్ సేవింగ్స్, డిమాండ్ రెస్పాన్స్‌పై ఐఐటీ మద్రాస్ అంకుర సంస్థ ఎలిమెంట్స్ ఎనర్జీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం సర్కిల్ కార్యాలయంలో వాణిజ్య, పరిశ్రమల వినియోగదారులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీజీఎం మాట్లాడుతూ వినియోగదారుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ కార్యక్రమం ద్వారా విద్యుత్తు వినియోగాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఎలిమెంట్స్ ఎనర్జీ వ్యవస్థాపకుడు అన్సన్ సాండో వినియోగదారులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ రియల్ టైం వాడకం తెలిసేలా వెబ్‌సైట్ లాగిన్ ఇస్తూనే చరవాణి ద్వారా సలహాలు సూచనలు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్తు శాఖ అధికారులు, వాణిజ్య, పరిశ్రమల వినియోగదారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏపీఈపీడీసీఎల్ సీజీఎం రాజబాబు. చిత్రంలో ఎస్ఈ తిలక్‌కుమార్ తదితరులు

నన్నయలో అక్రమాలపై విచారణకు మంత్రి హామీ

ఎమ్మెల్యే బత్తుల వెల్లడి

రాజానగరం, న్యూస్‌టుడే: నన్నయ విశ్వవిద్యాలయంలో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ బుధవారం తెలిపారు. మంత్రి లోకేష్‌ను ఆయన కలిసి వినతి పత్రం అందజేశారు. అలానే వర్సిటీలో స్పోర్ట్స్ ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాజానగరంలో అడ్వాన్స్ శిక్షణ కేంద్రాలు, నైపుణ్య అభివృద్ధి కేంద్రాలు, నియోజకవర్గంలో ఐటీఐ కళాశాల, ఎస్‌టీపీఐను ఏర్పాటు చేయాలని కోరారు. తన నియోజకవర్గంలోని రాజానగరం, కోరుకొండ ప్రాంతాలలో డిగ్రీ కళాశాలలు కావాలని మంత్రి లోకేష్‌ను ఎమ్మెల్యే బత్తుల కోరారు. గాదరాడ, శ్రీకృష్ణపట్నం, దివాన్‌చెరువు, రాజానగరం ప్రాంతాలలో ఇంటర్ కళాశాలలను ఏర్పాటు చేయాలని విన్నవించారు. యువకుల కోసం ఒక పాలిటెక్నిక్ కళాశాల అవసరమన్నారు.

'ఉప్పాడ' కోతపై ఉన్నతాధికారులతో సమావేశం నేడు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ దిల్లీలో కీలక సమావేశంలో పాల్గొనేందుకు బుధవారం కాకినాడ నుంచి బయలుదేరి వెళ్లారు. గురువారం కేంద్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఉన్నతాధికారులతో కాకినాడ-ఉప్పాడ మధ్య సముద్ర కోత నివారణకు ప్రతిపాదించిన ప్రాజెక్టుపై చర్చించనున్నట్లు కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. ఈ ప్రాజెక్టుకు రూ.300కోట్లకు పైగా నిధులు మంజూరు చేసే అవకాశం ఉందని పేర్కొన్నాయి.

పరమాత్ముడు ఒక్కడే: చాగంటి

కోరుకొండ, న్యూస్‌టుడే: పరమాత్ముడు ఒక్కడే, రూపాలు వేరని ప్రవచన కర్త చాగంటి కోటేశ్వర రావు అన్నారు. మండలంలోని జంబూపట్నంలో బుధవారం రాత్రి ప్రవచనాలు నిర్వహించారు. శ్రోతలకు ఆధ్యాత్మికత, శివతత్వం బోధించారు. అనంతరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దంపతులు చాగంటిని సన్మానించారు. కార్యక్రమంలో శ్రీరంగం స్థానాచార్యులు ఎస్వీ లక్ష్మీనృసింహభట్టర్‌స్వామి, విశ్వ హిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు, వైకాపా నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చాగంటిని సన్మానించిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దంపతులు

బహిరంగ వేలం

తేది: 20-02-2026 (శుక్రవారం)

Veh. No.	Vehicle Description	Year
AP35AB8220	SWIFT VDI DIESEL 5 SEATER	2014
AP39TK2403	MARUTI DZIRE DIESEL-P	2013
AP05TX7565	AL DOST	2014
AP05TU4583	TATA LPT 407	2009
AP16TG2555	TATA LPT 2518 TURBO FBT	2014
AP39UV5551	TATA LPT 1816 BS6 FBT	2024
AP39JL8880	ERTIGA VDI BSIV	2014

వేలం జరుగు ప్రదేశం

శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా Ltd., NH-16, భారత్ పెట్రోల్ బంక్ ఎదురుగా, రాజానగరం, రాజమండ్రి, E.G.Dt.

శ్రీరామ్ ఫైనాన్స్ Ltd.,
D.No. 54-9-8, A.V.అప్పారావు రోడ్, రాజమండ్రి,
0883-2465088, 98499 81384

భవిష్యత్తు డిజిటల్ ఆవిష్కరణలదే: మెహర్ రమేష్

దేవీచౌక్: వినోదం, డిజిటల్ మీడియా రంగాల్లో సాంకేతికంగా విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని సినీ దర్శకుడు మెహర్ రమేష్ అన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, ఎక్స్‌టెండెడ్ రియాల్టీ(ఏవీజీసీ-ఎక్స్‌ఆర్) సమ్మిట్ 2026 పేరుతో రెండురోజుల బూట్ క్యాంప్ బుధవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మెహర్ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు తమ సృజనాత్మకతకు సాంకేతిక నైపుణ్యాలను జోడించి అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. భవిష్యత్తు అంతా డిజిటల్ ఆవిష్కరణలదేనని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు యువత భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు దోహదపడతాయన్నారు. ఏఐ శిక్షకుడు అరవింద్ చిత్ర నిర్మాణంలో ఆధునిక ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సాధనాల వినియోగాన్ని విద్యార్థులకు వివరించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సహకారంతో నిర్వహించిన కళాశాల ఇన్నోవేషన్ హబ్ సమన్వయకర్త డాక్టర్ బేబి నిర్మల, డాక్టర్ దుర్గాలక్ష్మి, మేఘన, బాలబాలాజీ రుద్ర పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సినీ దర్శకుడు మెహర్ రమేష్

పింఛనర్లూ.. పత్రం సమర్పించండి

జిల్లా	పత్రాలు సమర్పించినవి	ఇంకా ఇవ్వాల్సినవి
కోనసీమ	5,600	1,400
కాకినాడ	15,993	3,185
తూర్పుగోదావరి	9,246	1,506

పెద్దాపురం: రాష్ట్ర ప్రభుత్వ సర్వీస్, ఫ్యామిలీ పింఛన్‌దారులు తమ జీవన ప్రమాణ పత్రాలు(లైఫ్ సర్టిఫికెట్లు) సమర్పించేందుకు గడువు దగ్గర పడుతుంది. ఈనెల 28వ తేదీవరకు జీవన ప్రమాణ పోర్టల్‌లో లేదా ఖజానా శాఖ కార్యాలయాల్లో సమర్పించాల్సి ఉంటుంది. గతేడాది నవంబరు, డిసెంబరు నెలల్లో సమర్పించినవి చెల్లుబాటు కావు. తాజాగా ఇవ్వకుంటే ఏప్రిల్ 1న ఇచ్చే మార్చి నెల పింఛన్ నిలిపివేస్తారు. పెన్షన్‌దారులు తమ పత్రాలు సమర్పించేందుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పెద్దాపురం, తుని, జగ్గంపేట, ప్రత్తిపాడు, కాకినాడ, పిఠాపురం, రాజమహేంద్రవరం, కోరుకొండ, అనపర్తి, అమలాపురం, కొత్తపేట, రాజోలు, రామచంద్రపురంలోని ఆయా ఉప ఖజానా కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. అనారోగ్యంతో నడవలేని పింఛనుదారులు తమ దృష్టికి తీసుకొస్తే ఖజానా శాఖ సిబ్బందిని ఇంటివద్దకు పంపిస్తారని జిల్లా ఖజానాశాఖ అధికారి గణేష్ తెలిపారు.

సీ-కేవైసీతో బహుళ ప్రయోజనాలు

మీ కోసం

న్యూస్‌టుడే - తుని

బ్యాంకు ఖాతాదారుల కోసం రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మరో కొత్త విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. కేవైసీ చేయించక, ఖాతాలను వినియోగించకపోవడంతో ఆయా బ్యాంకుల్లో ఖాతాదారులకు రోజూ పలు రకాల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిపై దృష్టిసారించిన ఆర్‌బీఐ కొత్తగా 14 అంకెల సీ-కేవైసీ ఐడీని జారీ చేస్తుంది. ఇది సులువైన, సురక్షితమైనదని బ్యాంకు అధికారులు పేర్కొంటున్నారు.

ఉపయోగాలివీ..

బ్యాంకుల్లో ఖాతాలు సులువుగా తెరవచ్చు. కేవైసీ అప్‌డేషన్ ఖాతాలు ఉన్న మిగిలిన బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లోను ఆటోమేటిక్‌గా అప్‌డేట్ అవుతాయి. బ్యాంకులో కేవైసీ వివరాలు నమోదు అంటే సదరు ఖాతాదారుడి ఆధార్, ఫోన్, పాన్ నంబర్లు, చిరునామా, ఈమెయిల్ ఐడీని తీసుకుంటారు. తాజా సీ-కేవైసీ విధానంలోనూ ఈ వివరాలే ఉన్నా, సెంట్రల్ కేవైసీ రికార్డుల్లో ఎప్పటికప్పుడు రిజిస్ట్రీ చేయడంతో కొత్త ఐడీ నెంబరు వస్తుంది. భవిష్యత్తులో దీని ఉపయోగం ఎంతో ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

ఐడీ ఎలా పని చేస్తుందంటే..

ఖాతాదారుడు బ్యాంకుకు వెళ్లి కేవైసీ వివరాలు సమర్పించాలి. అనంతరం ఆ వివరాలు సెంట్రల్ కేవైసీ రికార్డుల్లో రిజిస్ట్రీలో అప్‌లోడ్ చేస్తారు. తర్వాత ఆటోమెటిక్‌గా 14 అంకెల సీ-కేవైసీ నంబరు జనరేట్ అవుతుంది. ఈ ఐడీని అన్ని బ్యాంకులు, ఆర్థిక సంస్థల లావాదేవీల్లో వాడొచ్చు.

గింజలు కొనుగోలు చేస్తేనే రైతుకు మనుగడ

- తక్కువ ధర కల్పించడంతో కోకో పంట సాగుదారుల ఆవేదన

– న్యూస్‌టుడే, అంబాజీపేట

డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కోకోపంటను సాగు చేస్తున్న కర్షకుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. అంతర్జాతీయ మార్కెట్‌లో కోకో గింజలకు మంచి డిమాండు ఉన్నప్పటికీ తమ నుంచి కొనుగోలు సంస్థలు గింజలను కొనుగోలు చేయటంలేదని వారు ఆరోపిస్తున్నారు. ధర విషయంలో ఉద్యోగులను రైతులు ప్రశ్నిస్తే నాణ్యమైన గింజలను ఉత్పత్తి చేయటంలేదని చెప్తున్నారని.. గతంలో ఇలాంటి పరిస్థితి లేదని వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 2,405 ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు. ప్రతి ఏటా వెయ్యి ఎకరాలను అదనంగా సాగు చేసేలా ఇప్పటికే ప్రణాళిక తయారు చేయించారు. 400 మంది రైతులు ఈ సాగుపై ఆధారపడ్డారు.

కోనసీమలోని కోకోపంట

నాణ్యత లేవంటున్నారు..



గింజల కొనుగోలు చేసే సంస్థల ప్రతినిధులు కుంటిసాకులతో రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో కోకో గింజలు రూ.450 పలుకుతున్నాయి. కానీ సంస్థల ప్రతినిధులు రూ.330లకే కొనుగోలు చేస్తున్నారు. కారణం అడిగితే గింజలు నాణ్యత లేవంటున్నారు. కోకో రైతులకు న్యాయం చేయాలి.

– అయ్యగారి శ్రీనివాసరావు, కోకోరైతు, వ్యాఘ్రేశ్వరం

ఈ సమస్య రాలేదు

గతంలో ధర విషయంలో సంస్థ ప్రతినిధులకు, రైతులకు ఎలాంటి సమస్య తలెత్తలేదు. గింజల నాణ్యత అంశం కూడా రాలేదు. ఇప్పుడు నాణ్యత విషయం చెప్తుంటే ఆశ్చర్యంగా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో కోకో గింజల ధర పతనమైతే.. వెంటనే ఆ మార్కెట్‌కు అనుగుణంగా రైతుల నుంచి కొనుగోలు చేస్తామని ఆ సంస్థలు చెప్పటం విడ్డూరంగా ఉంది.

– కొప్పిశెట్టి ఆనంద వెంకట ప్రసాద్, ఏపీ కోకోరైతు సంఘం సహాయకార్యదర్శి

సాంకేతికతతో నేరాల నియంత్రణ

మండపేట, అంగర పోలీస్ స్టేషన్లలో ఎస్పీ తనిఖీలు

మండపేట, అంగర, న్యూస్‌టుడే: జిల్లాలో నేరాల నియంత్రణకు పూర్తిస్థాయిలో సాంకేతిక విధానాన్ని అమలు చేస్తున్నామని ఎస్పీ డి.నరసింహ కిషోర్ తెలిపారు. బుధవారం ఆయన మండపేట నియోజకవర్గంలోని పోలీస్‌స్టేషన్లు తనిఖీ చేశారు. జిల్లాలో 5000 సర్వేలెన్స్ కెమెరాలు ఉన్నాయని, వీటి ద్వారా నేర స్థలను గుర్తించేందుకు అవకాశం ఉందన్నారు. సుమారు 20 డ్రోన్‌లతో నిఘా కొనసాగుతోందని, ప్రతి పోలీస్‌స్టేషన్‌కి ఒక డ్రోన్ కేటాయించి తోటల్లో జూదాలు, కళాశాలల్లో ర్యాగింగ్ నియంత్రణ, ఇతరత్రా నేరాల అదుపునకు ఉపయోగిస్తామన్నారు. బాలికలు, మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మండపేటలో 90 కెమెరాలు ఉన్నాయని, వీటి సంఖ్యను 150కి పెంచాలన్నారు. టిడ్కో గృహాల వద్ద ఔట్ పోస్టు ఏర్పాటుచేస్తామని, కపిలేశ్వరపురం పరిధిలోని లంక గ్రామాల్లో ఎస్సై, ముగ్గురు కానిస్టేబుళ్లు విధులు నిర్వహించేలా చూస్తామన్నారు. రంజాన్ మాసం సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిషోర్

సబ్ డివిజన్ ఏర్పాటుకు చర్యలు..

మండపేట, అనపర్తి నియోజకవర్గాలను కలిపి పోలీసు సబ్ డివిజన్ ఏర్పాటుచేసేలా కృషి చేస్తున్నట్లు ఎస్పీ వివరించారు. డీఎస్పీ వారానికి మూడు రోజులు మండపేటలో, మరో మూడు రోజులు అనపర్తిలో అందుబాటులో ఉంటారని చెప్పారు. రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి విద్యతో కలిసి మండపేట, అంగర పోలీసుస్టేషన్లలో రికార్డులు పరిశీలించారు. పట్టణ సీఐ డి.సురేష్, రూరల్ సీఐ దొరరాజు, పట్టణ ఎస్సై రాము, అంగర ఎస్సై హరీష్‌కుమార్ పాల్గొన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	18,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	30,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	30,000
గటగట	29,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	18,000-20,000
కొత్త (పచ్చి) కాయ	15,000-17,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	147-00
డ్రెస్డ్	213-00
స్కిన్‌లెస్	243-00

92.7 FM Rajamahendravaram

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

21న వయోవృద్ధుల కోసం వివిధ కార్యక్రమాలు

కలెక్టరేట్: జిల్లా పరిధిలో వయోవృద్ధుల ఉత్పాదక వృద్ధాప్యం కోసం జాతీయ కార్యాచరణ ప్రణాళిక(ఎన్‌ఏపీఎస్‌ఆర్‌సీ), రాష్ట్ర కార్యాచరణ ప్రణాళిక(ఎస్ఏపీఎస్‌ఆర్‌సీ) పథకాల అమలులో భాగంగా వివిధ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, కార్యశాలలు(వర్క్‌షాపులు), వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 21న స్థానిక గేదెల నూకరాజు కల్యాణ మండపంలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరోజు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు వైద్యశిబిరం, 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే క్రాఫ్ట్ తయారీ, కుండల తయారీ తదితర కార్యకలాపాలపై వర్క్‌షాపులు, పెయింటింగ్, డ్రాయింగ్, సంగీతం, పాటలు, చిన్న కథల రచన, క్యారమ్స్, వాకింగ్ వంటి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటిలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు తమ పేర్లను ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు 95501 60167, 94411 74636 ఫోన్ నంబర్లకు తెలియజేసి నమోదు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు వై.శ్రీనివాస్ తెలిపారు. ఆ రోజు కార్యక్రమాలకు హాజరయ్యే వారు తప్పని సరిగా వయసు నిర్ధారణ గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలని ఆయన తెలిపారు.

మార్చి 8న రాజానగరంలో షర్మిల సభ

రాజానగరం: మార్చి 8న పీసీసీ అధ్యక్షురాలు వై.యస్.షర్మిల రాజానగరం రానున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, జిల్లా అధికార ప్రతినిధి డా.వై.ఎ.వడయార్ తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పేరు మార్పు, విధి విధానాలకు సంబంధించి రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తారని నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ శ్రీనివాస్, పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు టి.కె.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో రాజానగరంలో సమావేశం నిర్వహించారు. నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలేపల్లి మురళీ, జిల్లా అధికార ప్రతినిధి అడుసుమిల్లి రమేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశమైన కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

అస్సెట్ రికవరీ మేనేజ్‌మెంట్ బ్రాంచ్, # 48-14-111, శ్రీ నిత్య కాంప్లెక్స్, విశాఖపట్నం - 530013. ఫోన్: 0891-2567546, Email id: iob2579@iob.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ - వేలం బహిరంగ ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6) & 9(1)లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

...అస్సెట్ రికవరీ మేనేజ్‌మెంట్ బ్రాంచి వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/తనఖాదారులు వారు ...కాస్ట్స్ వసూలు కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, అస్సెట్ రికవరీ ...స్వాధీనత పరుచుకోబడిన బ్యాంక్ తనఖా/అధీనంలో నున్న దిగువ వివరించిన స్థిరాస్తి "ఎక్కడ ... మరియు "అక్కడ ఏది ఉన్నదో అది" పద్ధతి పై తేది.09-03-2026న విక్రయించబడునని ... ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు ఇందుమూలముగా సూచించటమైనది.

...

వేలం తేది మరియు సమయం: తేది.09-03-2026

...

తేది: 12-02-2026, ప్రదేశం: విశాఖపట్నం — సం/- అధీకృత అధికారి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

...ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
...2వ ఫ్లోర్, ఓరుగంటివారి స్ట్రీట్, ఇన్నీస్‌పేట, కోటిపల్లి బస్టాండ్ ఎదురు, (బ్రాంచ్ ఆఫీస్: రాజమండ్రి-1, వెబ్‌సైట్: http://www.shriramfinance.in./auction

మిరియాల సీతామహాలక్ష్మి, (మరణించినారు) కి చెందిన స్థిరాస్తులకు సంబంధించి ఇ-వేలం అమ్మకం ప్రకటన

...

అగ్రిమెంట్ నెం.	అస్తి రిజర్వుధర	EMD మొత్తము	EMD చెల్లింపు విధానం	బిడ్ పెంపుదల మొత్తం	వేలం తేది	EMD చెల్లించవలసిన చివరి తేది	అస్తి తనిఖీ తేది.
RAJA2TF1609270003	రూ.28,00,000/-	రూ.2,80,000/-	డిడి రూపంలో "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్"	రూ. 10,000/-	02-04-2026	01-04-2026	31-03-2026

...

ప్రదేశం: రాజమండ్రి, తేది: 18.02.2026 — సం/- అధీకృత అధికారి

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

FINANCIAL SERVICES

అన్నిరకాల లోన్స్ ★No CIBIL, CIBIL కరెక్షన్ చేయబడును. ఇళ్లు, స్థలాలు, పొలాలు, ఇతర ప్రోపర్టీలపై & రిటైర్డ్ పెన్షనర్లకు ప్రైవేట్ ఫైనాన్స్ ఇప్పిస్తాం. 7671885932

REAL ESTATE

LAND FOR SALE

JAGGAMPETA

రాజమండ్రికి 30 కి.మీ. దూరములో మురారి, గండేపల్లి మధ్య NHకి చేర్చి 100 అ||ల రోడ్డు ఫేసింగ్‌తో 60 సెంట్లుభూమి అమ్మబడును. (నోబ్రోకర్స్) ✆ 9032988265

KAKINADA CITY

Properties Bazar's @ Kakinada Touch Your Luck, Buy Plot & Win Plot, Free Lucky Draw with Guaranteed Prizes. Cell: 9154184236

JOBS

Wanted Marketing Executives in Rajahmundry, Kakinada Areas. Salary 18,000 to 20,000. Lakshmi Sanjani Garments. Send resume to whatsapp Cell: 95050 66887.

లూమిరైస్ కంపెనీకి అభ్యర్థులు కావలెను లైన్ సూపర్వైజర్ - Fresh/Exp., హెచ్ఆర్ మేనేజర్ - Exp.(MBA), అకౌంట్స్ అసిస్టెంట్ - 3 సం|| Exp., అడ్మిన్ అసిస్టెంట్, క్వాలిటీ విభాగం - బీటెక్/ డిప్లొమా(EEE, ECE), పర్చేజ్ అసిస్టెంట్ - Fresh/ Exp. బయోడేటాతో నేరుగా సంప్ర||. ✆ 70328 76262.

WANTED we are Hiring Front Office Staff (Female) - 02 no's Salary - 12 k 08 Hours Duty SprintOn, JN Road Rajamahendravaram ✆ 99663 57897

దేవరపల్లి, శ్రీకన్య లాడ్జిప్రక్కన సాయినాథ్ ఆటో కన్సల్టెన్సీనందు పనిచేయుటకు లేడీ టెలికాలర్, కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ కావలెను. ✆7508027999, 9696226226

కాకినాడలోని భానుగుడి జంక్షన్ నందు బట్టలు షాపులో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను.శాలరీ - 15,000/-/ 4 W/o. + ESI +EPFO. సెల్: 9885295999.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ:18-20K ✆ 96404 68899, 96402 58899

రాజమండ్రిలో ప్రముఖ కన్‌స్ట్రక్షన్ ఆఫీసు నందు పనిచేయుటకు ★ రిసెప్షనిస్ట్ (FEMALE) ★ అనుభవం కలిగిన అకౌంటెంట్ కావలెను. ✆ 8099 19 19 19

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-15 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

రాజమహేంద్రవరం

నిత్యావసర సరకుల పంపిణీ

టి.నగర్, న్యూస్‌టుడే: కాతేరులో విద్యుత్ షార్ట్ సర్క్యూటు కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధితులను తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నవీన్ బుధవారం పరామర్శించి నిత్యావసర సరకులు, గ్యాస్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి పార్టీ ఎప్పుడూ ఆదుకొంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రైతుబజారులో ధరలు(రూ.లో)

దేవీచౌక్, న్యూస్‌టుడే: టమాట-15, వంకాయలు నలుపు-18/గులాబీ-26/తెలుపు-20/దొమ్మేరు-34, బెండ-26, కాకర-38, బీర పందిరి-34, దొండ-38, క్యారెట్-32, బీట్‌రూట్-24, గోరు చిక్కుళ్లు-32, దోస-24, ఆనపకాయ-16/17, చిక్కుళ్లు-30, పచ్చిమిర్చి-48/లావులు-46, బంగాళదుంపలు-18, ఉల్లిపాయలు-19

స్లాబ్‌కు మరమ్మతులు..

ఈనాడు కథనానికి స్పందన

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: నగరంలో నిత్యం రద్దీగా ఉండే లాలాచెరువు పోస్టల్ క్వార్టర్స్ వద్ద రోడ్డు మధ్యలోని మ్యాన్‌హోల్ చుట్టూ దెబ్బతిన్న స్లాబ్‌కు మరమ్మతులు చేశారు. స్లాబ్ దెబ్బతిని ప్రమాదకరంగా మారిన వైనంపై గత నెల 8న 'ఈనాడు'లో 'రోడ్డు మధ్యలో ఇలా.. పట్టించుకోకుంటే ఎలా?' శీర్షికన ప్రచురితమైన చిత్ర కథనంపై అధికారులు స్పందించి ఈ పనులు చేపట్టారు.

పోరాట యోధులు బాలాజీదాస్, నాయుడు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: కార్మిక వర్గానికి సరైన పోరాట పటిమను నిర్దేశించిన యోధులు బాలాజీదాస్, బి.బి.నాయుడు అని వక్తలు కొనియాడారు. స్థానిక పేపరుమిల్లు వద్ద ఉన్న బి.టి.ఆర్.భవన్‌లో బుధవారం జరిగిన బాలాజీదాస్, బి.బి.నాయుడుల వర్ధంతి సభను సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.పవన్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత వారిద్దరి చిత్రపటాలకు మాజీ ఎంపీ మిడియం బాబూరావు, సీనియర్ నాయకులు టి.ఎస్.ప్రకాష్, పోలిన వెంకటేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి అరుణ్ తదితరులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ బాబూరావు మాట్లాడుతూ పోరాట యోధుల స్ఫూర్తితో కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.ఎస్.మూర్తి, కె.ఎస్.వి.రామచంద్రరావు, పూర్ణిమరాజు, సీఐటీయూ నాయకులు రాము, కాంతారావు, తాతారావు, ప్రజాసంఘాల నాయకులు రాంబాబు, బాస్కర్, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న మాజీ ఎంపీ మిడియం బాబూరావు, నాయకులు

సహకార ఉద్యోగుల నిరసన

నిడదవోలు: సహకార సంఘ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం నిడదవోలు డీసీసీబీ బ్రాంచి ఎదుట సిబ్బంది నిరసన చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 36 జీవో అమలు చేయాలని, 2019 నుండి 2024 వరకు పీఆర్సీ ఇవ్వాలని, లేని పక్షంలో 50 శాతం తగ్గకుండా మధ్యంతర భృతి చెల్లించాలని, చట్టప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని, 2019 తరువాత చేరిన వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

ఎంపీకి సత్కారం

టి.నగర్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని బుధవారం రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి, జ్ఞాపికను అందజేశారు. శెట్టిబలిజ, గీత కులాల అభ్యున్నతికి సహకారం అందించాలని కోరారు.

ఎంపీకి జ్ఞాపికను అందజేస్తున్న ఛైర్మన్ కుడిపూడి సత్తిబాబు

వీధి వ్యాపారులకు క్రెడిట్ కార్డులు

డిజిటల్ విధానం ద్వారా అదనపు రుణసాయం

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

నగర వీధుల్లో తోపుడు బండ్లు, సైకిళ్లపై పండ్లు, కూరగాయలు, పువ్వులు, పచ్చళ్లు, బొమ్మలు తదితరాలు విక్రయిస్తూ జీవనం సాగించే చిరువ్యాపారులకు చేయూతను అందిస్తున్నారు. ఆయా బ్యాంకుల నుంచి క్రెడిట్ కార్డులు జారీ చేయడం ద్వారా డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంపొందించేందుకు, ఎటువంటి పూచీకత్తు లేకుండా పొందే స్వనిధి రుణాలతోపాటు అదనపు రుణసాయం అందించేందుకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) కృషి చేస్తోంది. వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లే అవసరం లేకుండా ఇప్పటికే నగర పరిధిలోని చిరువ్యాపారులు(స్ట్రీట్ వెండర్స్) 2,219 మందికి పీఎం స్వనిధి 2.0 పథకం కింద ఎటువంటి పూచీకత్తు లేకుండా వివిధ బ్యాంకుల ద్వారా రూ.5.61 కోట్ల రుణాలు అందించింది. ఇప్పుడు వీరికి డిజిటల్ ఫలాలు చేరువ చేసే ఒరవడికి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా ఇటీవల చిరువ్యాపారులకు క్రెడిట్ కార్డుల జారీ ప్రక్రియను ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. తొలివిడత నగరంలో 250 మంది చిరువ్యాపారులకు క్రెడిట్ కార్డులు అందించాలని మెప్మా అధికారులు నిర్ణయించారు. స్వనిధి రుణాలు పొందిన వారిలో క్రెడిట్ కార్డులు తీసుకునేందుకు ఆసక్తి చూపేవారిని సర్వే ద్వారా గుర్తిస్తున్నారు. కార్డులు ఇచ్చేందుకు ఇప్పటికే 70 మందిని ఎంపిక చేసినట్లు మెప్మా సిటీ మిషన్ మేనేజర్(సీఎంఎం) రామలక్ష్మి తెలిపారు. రూ.50 వేలు స్వనిధి రుణం పొందిన చిరువ్యాపారులు క్రెడిట్ కార్డు ద్వారా అదనం రూ.30 వేల వరకు రుణం పొందే అవకాశం ఉందన్నారు. లక్ష్యం మేరకు వీధి వ్యాపారులకు క్రెడిట్ కార్డులు అందించేందుకు మెప్మా చర్యలు చేపడుతుందన్నారు. ఆసక్తి ఉన్నవారు నగరంలోని మెప్మా కార్యాలయాన్ని సంప్రదించి క్రెడిట్ కార్డులు పొందవచ్చన్నారు.

ప్రయోగాత్మకంగా వీధివ్యాపారులకు క్రెడిట్‌కార్డుల జారీ ప్రక్రియను ప్రారంభిస్తున్న మెప్మా, బ్యాంకు అధికారులు

ప్రయోజనాలు ఇవి..

- చిరువ్యాపారులు వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లకుండా స్వనిధి కింద పొందే పూచీకత్తులేని రుణంతో పాటు క్రెడిట్ కార్డు ద్వారా రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు అదనంగా రుణం పొందవచ్చు.
- అదనంగా పొందిన రుణాన్ని వడ్డీలేకుండా 20 నుంచి 50 రోజుల్లో చెల్లించవచ్చు. తీసుకున్న రుణాన్ని ఈఎంఐకి మార్చుకోవచ్చు.
- నిర్ణీత కాలవ్యవధి దాటిన తర్వాత డిజిటల్ లావాదేవీల ద్వారా రుణం చెల్లించిన వారికి 7 శాతం వడ్డీ రాయితీ లభిస్తుంది.
- డిజిటల్ లావాదేవీలకు క్యాష్‌బ్యాక్ ప్రతి 3 నెలలకు రూ.400 లభిస్తుంది.

భారత రాజ్యాంగంపై జాతీయ సదస్సు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో భారత రాజ్యాంగంపై బుధవారం జాతీయ కార్యశాల జరిగింది. ఎఫ్ఏసీ ప్రిన్సిపల్ ప్రభల శ్రీవల్లి పర్యవేక్షణలో పొలిటికల్ సైన్స్, హిస్టరీ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ సదస్సులో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ ఈ.వెంకటేశు 21వ శతాబ్దంలో భారత రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ సంస్థల బలోపేతం, యువతలో రాజ్యాంగ విలువలపట్ల అవగాహన కల్పించారు. ప్రత్యక్షంగా హాజరైన తిరుపతి వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ బి.వి.మురళీధర్ మాట్లాడుతూ రాజ్యాంగ సవరణలు, సమాఖ్య వ్యవస్థ, న్యాయవ్యవస్థ పాత్ర, సమకాలీన రాజకీయ పరిణామాలపై విశ్లేషణాత్మకంగా వివరించారు. ఆర్ట్సుకళాశాల అధ్యాపకురాలు కె.సీతామహాలక్ష్మి సామాజిక న్యాయం, ప్రాథమిక హక్కుల పరిరక్షణ, డిజిటల్ పరిపాలన తదితర అంశాలను వివరించారు. కళాశాల పొలిటికల్ సైన్స్ ఇన్‌చార్జి బి.లక్ష్మి, ఎం.వెంకాయమ్మ, సి.వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరి రాజ్యలక్ష్మి చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పిస్తున్న సభ్యులు

పాలిటెక్నిక్ ఉద్యోగుల సీపీఎస్ సమస్యను పరిష్కరించాలి

శ్యామలాసెంటర్: ఏపీ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రభుత్వ అధ్యాపకుల కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీఏఎస్) అమలులో గత ఐదు సంవత్సరాలుగా జాప్యం జరుగుతుండటంతో ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సంఘ పాలిటెక్నిక్ ఆల్ లెక్చరర్స్ అసోసియేషన్ (పాల్) ప్రధాన కార్యదర్శి నరసింహారావు పేర్కొన్నారు. దీని వల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 540 మందికి పైగా ఉద్యోగులు తీవ్ర నష్టపోతున్నారని ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు ఆగిపోతున్నాయన్నారు. ఈ సమస్యను చక్కదిద్దేందుకు గత ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. దీనిపై ఇంటర్నల్ స్క్రీనింగ్ కమిటీని నియమించి సమస్యను త్వరితగతిన పరిష్కరించవలసినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై విద్యాశాఖామంత్రి లోకేశ్‌కు వివరించగా ఆయన సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించాలని అధికారులను సూచించినప్పటికీ కిందిస్థాయిలో అధికారిక ఉత్తర్వులు వెలువడకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఈ సమస్యను పరిష్కరించి ఉద్యోగుల వేతన వ్యత్యాసాన్ని సరిచేయాలని కోరుతున్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రాజమహేంద్రవరంలోని జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు సభ్యుడు చుక్కా కొండలరావు కుటుంబ సభ్యులకు ప్రమాద బీమా సొమ్ము బుధవారం అందజేశారు. రూ.లక్ష చెక్కును బ్యాంకు పాలకవర్గ ఛైర్మన్ బొమ్మన జయకుమార్, సీఈవో మద్దాల విజయప్రతాప్ తదితరులు మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు.

చెక్కు అందిస్తున్న బ్యాంకు ఛైర్మన్ బొమ్మన జయకుమార్, తదితరులు

హనుమద్ వాహనంపై స్వామి ఊరేగింపు

రాజమహేంద్రవరం సాంస్కృతికం: శ్రీ రంగధామంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గౌతమఘాట్‌లోని ఆలయంలో బుధవారం ఉదయం యాగశాలలో అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, సామూహిక లక్ష్మీ హయగ్రీవ సేవ, విశేష పూజలు జరిగాయి. శ్రీభూనీళా సమేత వేంకటేశ్వర స్వామి వారిని హనుమద్ వాహనంపై ఊరేగించారు. యాగశాలలో వేదపండితులు హోమం, పూర్ణాహుతి నిర్వహించి భక్తులకు ఆశీస్సులు అందించారు.

వైభవంగా మార్కండేయుని పుష్పోత్సవం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మహారాజమహేంద్రవరం గోదావరిగట్టున ఉన్న శ్రీఉమా మార్కండేయస్వామి ఆలయంలో ఈనెల 14నుంచి 18వ తేదీవరకు స్వామివారి పాంచాహ్నిక దివ్య కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ముగింపు సందర్భంగా బుధవారం రాత్రి స్వామివారి పుష్పోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు పెద్దింటి నీలకంఠశర్మ నిర్వహణలో మార్కండేయస్వామి, పార్వతీదేవిని పట్టువస్త్రాలతో విశేషంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దర్శించుకున్నారు.

విశేష అలంకారంలో పార్వతీదేవి

మార్కండేయ స్వామి..

సమస్యలు లేని నగరమే లక్ష్యం

టి.నగర్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరాన్ని సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పాలన సాగిస్తామని ఫోరమ్ ఫర్ బెటర్ రాజమహేంద్రవరం సంస్థ వ్యవస్థాపకుడు యర్రా వేణుగోపాలరాయుడు తెలిపారు. ఆనం రోటరీ హాల్‌లో ఫోరం సమావేశం బుధవారం జరిగింది. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు సామాన్యులకు చేరువ చేసేందుకు కృషి చేయాల్సి ఉందన్నారు. ఐదుగురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. క్షేత్రస్థాయిలో బృందాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో తవ్వల వీరేంద్రనాథ్, బీవీఎస్ రెడ్డి, రొబ్బి విజయశేఖర్, లక్కోజి వీరభద్రరావు, సూర్యనారాయణ, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలోకి మురుగునీరు

కొంతమూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలోకి పక్క వీధిలోని మురుగు నీరు చేరుతుంది. ఆ ప్రాంతంలో మురుగు కాలువలు లేకపోవటం వల్ల ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. అక్కడ మురుగు నిల్వ ఉండటంతో దోమలు విజృంభిస్తున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కొంతమూరు

మలుపులో జర భద్రం

నగరంలోని లాలాచెరువు చౌడేశ్వరి నగర్ ప్రాంతంలోని ప్రధాన రహదారి మలుపులో ఉన్న మ్యాన్‌హోల్‌పై మూత సరిగా లేక ప్రమాదాలకు ఆస్కారం కలుగుతోంది. ఇది ప్రధాన రహదారికి అనుసంధానమై ఉండడంతో పాఠశాల బస్సులు, ఆటోలతో రద్దీగా ఉంటుంది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మ్యాన్‌హోల్‌పై మూత ఏర్పాటు చేయాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

వీరిది అడ్డదారి

నగరంలోని లాలా చెరువు కూడలి జాతీయ రహదారికి అనుకుని ఉండడంతో వాహనాలు, పాదచారులతో నిత్యం రద్దీగా ఉంటుంది. ట్రాఫిక్ నియంత్రణకు పోలీస్ పోస్టు ఉంది. అయినప్పటికి వారి కళ్లుగప్పి కొంతమంది వాహనదారులు, ఆటో వాలాలు నిబంధనలు అతిక్రమించి జాతీయ రహదారిలో అపసవ్య దిశలో ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇది వారి ప్రాణాలతోపాటు ఎదుటి వారికి కూడా ముప్పుగా మారుతున్నారు. కొందరు చోదకులు చరవాణిలో మాట్లాడుతూ వాహనం నడుపుతూ ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. – న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

రోడ్డుపై ఇలా.. రాకపోకలు ఎలా..?

స్థానిక లాలాచెరువు స్పిన్నింగ్ మిల్లు కాలనీలోని రోడ్డుపై మురుగు చేరి, నాచుపట్టడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఎగువ నుంచే మురుగు ఒకచోట నిలిచిపోయి, పొంగి రోడ్డుపైకి చేరుతోందని వారంటున్నారు. రాత్రి సమయంలో మరీ ఇబ్బందిగా ఉంటోందని వాహనదారులు, పాదచారులు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా జారిపడిపోతున్నారని, వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

పక్కకు వెళితే ప్రమాదమే

ఇసుల లారీల వల్ల జాతీయ రహదారిపై ప్రయాణించాలంటే ప్రజలు భయపడుతున్నారు. బొమ్మూరు జాతీయ రహదారిపై ఉన్న ఇసుక వల్ల వాహనాలు అదుపుతప్పుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు. బాలాజీపేటలో రోడ్డుకు ఒకవైపంతా ఇసుక వ్యాపించి ఉంటోంది. ఈ సమస్యపై అధికారులు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగితే గానీ స్పందించరా అని ప్రశ్నిస్తున్నారు. – న్యూస్‌టుడే, బొమ్మూరు

క్షీరాభిషేకం చేస్తున్న తెలుగు యువత నాయకులు

కూటమి రాకతో విద్యా వ్యవస్థలో మార్పులు

టి.నగర్, న్యూస్‌టుడే: కూటమి అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థలో సమూల మార్పులు వచ్చినట్లు తెలుగునాడు స్టూడెంటు ఫెడరేషన్ (టీఎన్ఎస్ఎఫ్) రాజమహేంద్రవరం పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు ఎస్.సాయిదీపక్ తెలిపారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఫీజు రియంబర్స్ బకాయిలు రూ.1200 కోట్లు విడుదల చేసిన సందర్భంగా పుష్కరాల రేవు వద్ద ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సాయిదీపక్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి విద్యార్థుల కష్టాలను అర్థం చేసుకొని వారికి అండగా నిలిచేందుకు బకాయిలను విడుదల చేయడం జరిగిందన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వానికి విద్యపట్ల ఉన్న నిబద్ధత అన్నారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలను నారా లోకేశ్ ఒక్కొక్కటిగా నెరవేర్చుకొంటూ వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పీఎంఏవై గృహనిర్మాణాలు వేగవంతం

వి.ఎల్.పురం: ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై 2.0) పథకం కింద రాజమహేంద్రవరం నగరంలో మంజూరైన 420 గృహాలను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని హౌసింగ్ పీడీ నాతి బుజ్జి తెలిపారు. బుధవారం నగరంలోని సంజీవయ్యనగర్, సుబ్బారావునగర్ ప్రాంతాల్లోని గృహ లబ్ధిదారును ఆమె కలిసి నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీఎంఏవై 2.0 కింద మంజూరైన గృహాలకు యూనిట్ విలువ రూ.2.50 లక్షలు చొప్పున ప్రభుత్వం అందిస్తుందన్నారు. గృహనిర్మాణాలను నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసుకునే విధంగా అవసరమైన సాంకేతిక మార్గదర్శకాలు, ఆర్థిక వినియోగంపై అవగాహన కల్పించారు. గృహ నిర్మాణ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సంబంధిత అధికారులను సంప్రదించాలని, ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ బుజ్జి

ఆరోగ్య భారతావని సాకారమే లక్ష్యం

కొవ్వూరు పట్టణం: ఆరోగ్య భారతావని సంకల్ప సాకారానికి ప్రధాని మోదీ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని జిల్లా భాజపా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. కొవ్వూరులో బుధవారం ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాద బాధితులకు ఆసుపత్రి చికిత్స భరోసా 'పీఎం రహత్- 2026' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. ప్రమాదాల బారినపడిన క్షతగాత్రులు 'గోల్డెన్ అవర్'లో తక్షణ సాయం పొందేందుకు ప్రభుత్వ, గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో రూ.1.50 లక్షలు విలువైన వైద్యాన్ని ఉచితంగా పొందవచ్చన్నారు. ప్రమాదం జరిగిన వారం రోజులు వరకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. హెల్ప్‌లైన్ ఇండియా 112 నెంబర్‌కు సమాచారం అందించి వైద్య సేవలు పొందేలా.. ప్రజలంతా అవగాహన కలిగి అత్యవసర సందర్భాల్లో సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్ని శాఖల్లో హెచ్‌ఆర్ పాలసీ వర్తింపజేయాలి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రాథమిక సహకార పరపతి సంఘాల ఉద్యోగులకు ప్రత్యేక హెచ్‌ఆర్ పాలసీ విధానం శుభపరిణామమని.. అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేసే పొరుగు సేవల ఉద్యోగులకు ఈ విధానాన్ని వర్తింపజేయాలని రాష్ట్ర అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ ప్రధాన కార్యదర్శి పి.గురునాథ్ అన్నారు. కొవ్వూరులో బుధవారం మాట్లాడుతూ జాబ్‌చార్టు, ఉద్యోగ భద్రత, సరైన సెలవులు లేక పనులు చేస్తున్న సిబ్బందికి హై పవర్ కమిటీని నియమించాలన్నారు. కేవలం వేతనాలు ఇవ్వడమే కాక ఉద్యోగులకు ఇవ్వాల్సిన గౌరవం, పదోన్నతులు, ఆరోగ్య భద్రత, ఉద్యోగ విరమణ వంటి అంశాలను హెచ్‌ఆర్ పాలసీలో పొందుపర్చాలన్నారు.

వైకాపా నాయకుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు బెయిల్‌పై కేంద్ర కారాగారం నుంచి విడుదలై మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నివాసానికి వస్తున్న సందర్భంగా ఆయన ఇంటి వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసు బందోబస్తు. – న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

ఇష్టమైన ఆటల్లో ప్రతిభ కనబరిచేలా ప్రోత్సాహం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: చదువుతో పాటు క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని.. ఇష్టమైన క్రీడల్లో విద్యార్థులు రాణించేలా ప్రోత్సహిస్తోందని వ్యాయామ విద్య రీజనల్ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐపీఎఫ్) బి.జాన్సన్ అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వ్యాయామోపాధ్యాయులతో బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో వ్యాయామ విద్యకు సంబంధించిన దస్త్రాలు, క్రీడల నిర్వహణ, నిబంధనల అమలు, ఖేలో ఇండియా, స్కూల్ గేమ్స్, వ్యాయామ పరికరాల సద్వినియోగం వంటి అంశాలపై ఆరా తీశారు. అనంతరం అల్లూరి నాగరత్నం బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. పీఎంశ్రీ పాఠశాలల్లో క్రీడల ప్రోత్సాహంలో భాగంగా మైదానాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేసిందని, అన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా రూ.30 వేలతో క్రీడా పరికరాలను అందించిందన్నారు. కార్యక్రమంలో డీవైఈవో బి.దిలీప్‌కుమార్, జిల్లా వ్యాయామోపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు నాగరాజు, వ్యాయామోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిందితుడికి ఆరు నెలల జైలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: అజాగ్రత్తగా ఆటో నడిపి ద్విచక్ర వాహన దారుడిని ఢీకొన్న ఘటనకు సంబంధించి కేసులో వ్యక్తికి ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ అయిదో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జి.శ్రీనివాసరెడ్డి బుధవారం తీర్పు చెప్పారు. కొప్పిశెట్టి సుబ్రహ్మణ్యం అనే వ్యక్తిని 2020 ఆగస్టు 25న నగరంలోని అప్సర థియేటర్ సమీపంలో ఆర్యాపురానికి చెందిన మామిడి శ్రీనాథ్ అనే వ్యక్తి ఆటోతో వేగంగా వచ్చి ఢీకొన్నాడు. దీంతో అతని కుడి కాలికి గాయమై ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందారు. బాధితుడి కుమారుడి ఫిర్యాదు మేరకు మూడోపట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. వాదోపవాదాల అనంతరం నిందితుడిపై నేరం రుజువు కావడంతో పైవిధంగా తీర్పుచెబుతూ న్యాయమూర్తి ఉత్తర్వులు ఇచ్చారు.

వారి సేవలు అపూర్వం

చదువుకున్న పాఠశాలకు సేవలు

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

తల్లిదండ్రులు జన్మనిస్తే.. గురువులు భవితకు మార్గదర్శనం చేస్తారు. నడక, నడత నేర్పేది విద్యాలయమే. ఆ అక్షర దేవాలయానికి సేవలు అందిస్తున్నారు రాజమహేంద్రవరం మంగళవారపుపేటలోని ట్రైనింగ్ కళాశాల ఆవరణలోని ప్రభుత్వ బాలుర పాఠశాల పూర్వ విద్యార్థులు. 1972లో ఎస్ఎస్‌సీ చదివిన విద్యార్థులు సంఘంగా ఏర్పడి ఈ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. వారు అందిస్తున్న సేవలు, విద్యార్థుల మనోగతం..

సంఘంగా ఏర్పడి..

ప్రారంభంలో తలా కొంత నగదు వేసుకుని పిల్లలకు అవసరమైన పుస్తకాలు, అల్పాహారం అందించడం, దుస్తులు, ఆట వస్తువులు కొనడం వంటివి చేసేవారు. పూర్తిస్థాయిలో ఓ సంఘంగా ఉండాలని భావించి 2018లో 'గవర్నమెంట్ ట్రైనింగ్ కాలేజ్ ఓల్డ్ బాయ్స్ అసోసియేషన్' పేరుతో రిజిస్ట్రేషన్ చేయించి పాఠశాలకు అవసరమైన వసతుల కల్పనకు కృషి చేస్తున్నారు. సంఘం సభ్యత్వం ద్వారా వచ్చిన రుసుము బ్యాంక్‌లో డిపాజిట్ చేశారు. పాఠశాల అభివృద్ధికి చేస్తున్న పనులకు ఎప్పటికప్పుడు సభ్యుల ద్వారా విరాళాలు సేకరించి సమకూర్చుతున్నారు.

అవసరాలను గుర్తించి..

ఏటా పాఠశాల ప్రారంభంలో పదో తరగతి విద్యార్థులకు అవసరమైన రాత పుస్తకాలు, ఇతర సామగ్రి అందిస్తున్నారు. విద్యార్థులకు అవసరమైన క్రీడా సామగ్రి అందించి పోటీల సమయంలో పౌష్టికాహారం ఏర్పాటు చేస్తున్నారు. తరగతి గదుల్లో అవసరమైన బెంచీలు, నాలుగు కంప్యూటర్లు, రెండు ప్రింటర్లు, రెండు స్కానర్లు, 20 సీలింగ్ ఫ్యాన్లు, సైన్స్ లేబొరేటరీకి అవసరమైన 12పెద్ద బల్లలు అందించారు. విద్యార్థుల ఆరోగ్య రక్షణకు ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేశారు. పదోతరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు సాయంకాలం అల్పాహారం, పరీక్షలకు వెళ్తున్న సమయంలో అవసరమైన అట్టలు, పెన్నులు, ఇతర సామగ్రి అందించడం, పరీక్షల్లో ఉత్తమంగా మార్కులు తెచ్చుకున్న వారికి నగదు బహుమతితో ప్రోత్సహించడం, శిథిలావస్థలో ఉన్న నాలుగు తరగతి గదులను ఆధునీకరించడం వంటివి సేవల్లో ప్రధానం.

రాతపుస్తకాలు పంపిణీ చేస్తున్న పూర్వవిద్యార్థుల సంఘం నాయకులు

బడి రుణం తీర్చుకోవాలని...

మేమంతా ఇక్కడే చదువుకుని దేశవిదేశాల్లో ఉన్నతంగా రాణించాం. ఏడాదికి ఒకసారి కలుసుకునే సందర్భంలో బడిలో వసతులు అంతగా లేవని తెలుసుకుని 2014 నుంచి అవసరమైనవి సమకూర్చేవాళ్లం. పూర్తిస్థాయిలో సేవలందించాలని 2018లో రిజిస్ట్రేషన్ చేయించి శాశ్వత సేవలకు శ్రీకారం చుట్టాం. సంఘంలో జీవితకాల శాశ్వత సభ్యత్వం పొందిన 400 మంది న్యాయవాదులు, విద్యావేత్తలు, శాస్త్రవేత్తలుగా, పోలీసు శాఖలో ఉన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గంలో ఉన్న మంత్రి కందుల దుర్గేష్ సైతం పూర్వవిద్యార్థుల సంఘంలో సభ్యులుగా ఉన్నారు. సభ్యులందరం సేవలకు అవసరమైన డబ్బు వేసుకుని పూర్తి చేస్తున్నాం.

- చింతపెంట ప్రభాకరరావు, సీనియర్ న్యాయవాది, పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు

(c) eenadu

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం

సమస్యలు లేని నగరమే లక్ష్యం

టి.నగర్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరాన్ని సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఫోరమ్ ఫర్ బెటర్ తొలి అడుగులు వేయాలని సంస్థ వ్యవస్థాపకుడు యర్రా వేణుగోపాలరాయుడు తెలిపారు. ఆనం రోటరీ హాల్‌లో ఫోరం సమావేశం బుధవారం జరిగింది. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు సామాన్యులకు చేరువ చేసేందుకు కృషి చేయాల్సి ఉందన్నారు. ఇందుకు సంబంధించి సంస్థను విస్తరించడం జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో తవ్వల వీరేంద్రనాథ్, బీవీఎస్ రెడ్డి, రొబ్బి విజయశేఖర్, లక్కోజి వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీకి సత్కారం

ఎంపీకి జ్ఞాపిక అందజేస్తున్న ఛైర్మన్ సత్తిబాబు

టి.నగర్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని బుధవారం రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి, జ్ఞాపికను అందజేశారు. శెట్టిబలిజ, గీత కులాల అభ్యున్నతికి సహకారం అందించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా

© ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు		
	ధవళేశ్వరం: 91212 29057	కడియం: 91212 29062
	బొమ్మూరు: 91549 78039	మోరంపూడి: 94935 92696
	రాజానగరం: 98492 36167	కోరుకొండ: 80085 74213

నీరు రావడం లేదు

సమస్య: రాజవోలు చర్చి వీధిలో పైపు లైను పగిలి మూడు రోజుల నుంచి నీరు రావడం లేదు. నీరు వృథాగా రోడ్డుపై పారడం వల్ల బురద ఏర్పడింది. – కృష్ణ, స్థానికుడు

సమాధానం: మరమ్మతులు చేసి నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాసరెడ్డి, గ్రామకార్యదర్శి, రాజవోలు – న్యూస్‌టుడే, బొమ్మూరు

పది విద్యార్థులకు నాడు గ్రేడులు.. నేడు స్టార్లు

రాజానగరం, కోరుకొండ, న్యూస్‌టుడే: ఈ ఏడాది సర్కారు పాఠశాలల్లో చదివే విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో వంద రోజుల ప్రణాళిక చేపట్టారు. డిసెంబరు 6 నుంచి మార్చి 15 వరకు ఈ ప్రణాళిక అమలు చేస్తారు. ఈ నెల రోజుల వ్యవధిలో విద్యా శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపట్టారు. అవి మంచి ఫలితాలే ఇస్తున్నాయని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు.

రాజానగరం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రేరణ కోసం స్టార్స్‌గా..

విద్యార్థుల్లో ఇంకా నేర్చుకునే ఉత్సాహం కలిగేలా గ్రేడుల స్థానంలో స్టార్ల విధానం అమలులోకి తెచ్చారు. రైజింగ్ స్టార్ అంటే ఉత్తమంగా ప్రయత్నిస్తూ మెరుగుపడుతున్నవారు. షైనింగ్ స్టార్స్ అంటే ఉత్తమ ఫలితాలు సాధిస్తూ, అదే స్ఫూర్తిని కొనసాగిస్తున్నవారు. గత విద్యా సంవత్సరంలో అత్యధిక మార్కులు తెచ్చుకున్న విద్యార్థుల అనుభవాలను చెప్పించి ప్రేరణ కలిగిస్తున్నారు. ప్రత్యేక తరగతుల కారణంగా ఉదయం నుంచి రాత్రి వరకు పాఠశాలల్లో ఉంటున్న విద్యార్థులు నీరసానికి గురవుతున్నారు. దీంతో దాతల సహకారంతో అల్పాహారం అందిస్తున్నారు.

మండలం	జడ్పీ ఉన్నత పాఠశాలలు	పదో తరగతి విద్యార్థులు (ప్రైవేటు, ప్రభుత్వ)	పరీక్ష కేంద్రాలు
రాజానగరం	17	1722	7
కోరుకొండ	14	1033	7

ప్రతిరోజు పరీక్షలు, ఎస్‌ఏ-1

పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను ఏబీసీడీ గ్రేడులుగా విభజించారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం పరీక్షలు నిర్వహించి విద్యార్థి సాధించిన మార్కులను లీప్ యాప్‌లో నమోదు చేశారు. 20 రోజుల తర్వాత ప్రతిరోజు 20 మార్కులకు పరీక్ష నిర్వహించారు. 1 నుంచి 11 మార్కులు వచ్చిన వారిని రైజింగ్ స్టార్స్‌గా, 12 నుంచి 20 మార్కులు వచ్చిన షైనింగ్ స్టార్స్‌గా పరిగణించారు. వీరు ఎందులో వెనుకబడి ఉన్నారో గుర్తించి ఆ సబ్జెక్టులో మరింత శిక్షణ అందిస్తున్నారు.

ప్రథమ స్థానమే లక్ష్యం

జిల్లా స్థాయిలో రాజానగరం మండలాన్ని ఈ విద్యా సంవత్సరంలో ప్రథమ స్థానంలో నిలపాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. సీనియర్ ఉపాధ్యాయులతో కమిటీని ఏర్పాటు చేశాం. వారి సలహాలు, సూచనలతో ప్రణాళికను మెరుగు పరచుకుంటూ ముందుకు వెళ్తున్నాం. – రామన్నదొర, జ్యోతి ప్రసాద్, ఎమ్ఈవోలు, రాజానగరం

రంగంపేటలో నువ్వులపంట పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నువ్వుల సాగుతో మెట్ట రైతులకు మేలు

రంగంపేట, న్యూస్‌టుడే: రబీ సీజన్‌లో నువ్వులపంట సాగుచేస్తే అధిక, నాణ్యమైన దిగుబడితో నూనె ఉత్పత్తి చేయవచ్చని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు తెలిపారు. రంగంపేటలో సాగులో ఉన్న నువ్వుల పంటను వ్యవసాయ శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. తక్కువ నీటితో, మరింత తక్కువ పెట్టుబడితో సాగయ్యే ఈ పంటపై మెట్ట రైతులు దృష్టి సారించాలని ప్రధాన శాస్త్రవేత్త హనుమకొండ శ్రీనివాస్ సూచించారు. శాస్త్రవేత్త జయలక్ష్మి, ఏవో కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డ్రీమ్స్ ఛైర్మన్‌కు గౌరవ డాక్టరేట్

గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న డ్రీమ్స్ ఛైర్మన్ రమేష్

ధవళేశ్వరం, మోరంపూడి, న్యూస్‌టుడే: విద్యారంగంలో అందిస్తున్న సేవలకుగాను ది అమెరికన్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్‌ను డ్రీమ్స్ విద్యాసంస్థల ఛైర్మన్ అంగర రమేష్ అందుకున్నారు. మంగళవారం చెన్నైలోని టీనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వర్సిటీ ఛాన్స్‌లర్ డాక్టర్ మధు క్రిషన్ ప్రదానం చేశారు. ఆయన 16 ఏళ్లుగా ఈ విద్యాసంస్థల ద్వారా అందిస్తున్న సేవలకు ఎనిమిది జాతీయ, ఐదు రాష్ట్ర స్థాయి అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆయనకు అభినందనలు తెలిపారు.

బకాయిలు చెల్లించాలని వినతి

ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న అప్పస్మా నాయకులు

కోరుకొండ, న్యూస్‌టుడే: విద్యా హక్కు చట్టం కింద గత నాలుగు సంవత్సరాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని మండల ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం కోరారు. ఈ సందర్భంగా ఎంఈవో టి.కుశలవదొరకు బుధవారం వినతిపత్రం అందించారు. ఒకటో తరగతిలో ప్రవేశాల కోసం రిజిస్ట్రేషన్లు చేయాలని ఒత్తిడి చేయడం తగదని, నాలుగేళ్లుగా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్లు రామారావు, అప్పలరాజు, ఈశ్వర్, షణ్ముఖ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాలిచ్చి ఆదుకోండి సారూ..

చైతన్యనగర్‌లో ఆర్డీవో కృష్ణానాయక్‌తో మాట్లాడుతున్న నిర్వాసితులు

కడియం, న్యూస్‌టుడే: కడియం మండలం మాధవరాయుడుపాలెం పరిధి చైతన్యనగర్‌లో రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్ అధికారి కృష్ణానాయక్ పర్యటించారు. ఈ మేరకు ఏళ్ల తరబడి కాలువ సమీపంలో నివాసముంటున్న సుమారు 200 కుటుంబాలకు పట్టాలిప్పించాలని నిర్వాసితులు ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. దాంతో అక్కడ నివాసముంటున్న వారి పూర్తి వివరాల సేకరణకు రెవెన్యూ బృందాలను ఏర్పాటు చేయాలని తహసీల్దార్ సునీల్‌కుమార్‌ను ఆయన ఆదేశించారు. అర్హుల జాబితాను బట్టి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇదే ప్రాంతంలో ప్రభుత్వ భూమిగా ఉన్న సర్వే నంబరు పరిధిలోని 5.58 సెంట్ల స్థలాన్ని సర్పంచి అన్నందేవుల చంటి, ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్‌తో కలిసి ఆర్డీవో పరిశీలించారు. స్థానిక దళితులకు శ్మశాన వాటికతో పాటు నివాస స్థలాలు అందించాలని వారంతా ఆయన్ను కోరారు. తిరుగు వెళ్లే క్రమంలో మాధవరాయుడుపాలెంలో కోర్టు వివాదంతో నిరుపయోగంగా మారిన సుమారు 93 ఎకరాల ప్రభుత్వ భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, రెవన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రిబుల్ రైడింగ్..దానికి తోడు సెల్ఫీ

అసలే జాతీయ రహదారి.. నిత్యం వేలాది వాహనాలు తిరుగుతూ ఉంటాయి. కొంచెం నిర్లక్ష్యంగా ఉన్నా ఎలాంటి ప్రమాదం జరుగుతుంతో చెప్పలేం. ఇవేమీ దృష్టిలో పెట్టుకోకుండా బుధవారం రాజానగరం జాతీయ రహదారిపై ఒకే స్కూటీపై ముగ్గురు యువతులు ప్రయాణించడమే కాకుండా వాహనం నడుపుతూనే స్వీయచిత్రం తీసుకున్నారు. ఇలాంటి ప్రయాణాల వల్ల ముందు, వెనుక వాహనాలకు కూడా ప్రమాదం తప్పదని వాహనచోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, రాజానగరం

కడియంలో నిరసన వ్యక్తం చేస్తున్న సొసైటీల ఉద్యోగులు

చెవిలో పూలతో నిరసన

కడియం, న్యూస్‌టుడే: సహకార సంఘాల్లో దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలంటూ కడియంలో సొసైటీ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర యూనియన్ ఇచ్చిన పిలుపుతో మండల కేంద్రమైన కడియంలో మురమండ, వేమగిరి, కడియపులంక, కడియం సొసైటీల్లోని ఉద్యోగులు బుధవారం ధర్నా నిర్వహించారు. జేసీసీ డైరెక్టర్, సొసైటీ సీఈవో అప్పారావు ఆధ్వర్యంలో చెవిలో పూలు పెట్టుకుని ప్లకార్డులతో డిమాండ్ల సాధనకు నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ వేతన సవరణ, పదోన్నతులు, ఉద్యోగభద్రత, నష్టాలతో సంబంధం లేకుండా జీతభత్యాల చెల్లింపులు ఉండాలన్నారు. గ్రాట్యుటీ యాక్టు అమలును ప్రభుత్వం దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాలుగు సహకార సంఘాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

కాలువలు, పుంత రోడ్లకు నిధులివ్వాలి

శాసనసభలో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, న్యూస్‌టుడే: రాజానగరం నియోజకవర్గంలో కాలువలు, పుంత రోడ్లకు నిధులు కేటాయించాలని శాసనసభ్యుడు బత్తుల బలరామకృష్ణ కోరారు. బుధవారం శాసనసభలో ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డులు లేక పారిశుద్ధ్య సమస్యతో ప్రజలు సతమతం అవుతున్నారన్నారు. సాగునీటి పథకాలను సక్రమంగా అమలు చేసేందుకు, ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు నిధులు కేటాయించాలన్నారు. పురుషోత్తపట్నం రైతులకు తక్షణం రూ.34 కోట్లను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. గత ప్రభుత్వం తూతూ మంత్రంగా ప్రారంభించి వదిలేసిన ఎన్‌డీబీ రహదారుల నిర్మాణాలను పూర్తిచేయాలన్నారు. బడ్జెట్‌లో రూ.650 కోట్లు కేటాయించడం పట్ల బత్తుల హర్షం వ్యక్తం చేశారు. రాజానగరం-గాదరాడ, కాపవరం- ముగ్గళ్ల, చినకొండేపూడి-చీపురుపల్లి రహదారుల నిర్మాణాలను పూర్తిచేయాల్సి ఉందన్నారు. నియోజకవర్గంలో ఉన్న ప్రతి ఇంటికీ గోదావరి జలాలను అందించేందుకు చర్యలు తీసుకోవాలని.. సత్యసాయి మంచినీటి సరఫరా సమస్య పరిష్కరించాలని కోరారు. కోరుకొండ రైతుల ఈనాం భూములు, ఇళ్ల స్థలాలను 22 ఏ నుంచి తొలగించాలన్నారు.

వైభవంగా మార్కండేయుని పుష్పోత్సవం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మహారాజమహేంద్రవరం గోదావరిగట్టున ఉన్న శ్రీఉమా మార్కండేయస్వామి ఆలయంలో ఈనెల 14 నుంచి 18వ తేదీవరకు స్వామివారి పాంచాహ్నిక దివ్య కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ముగింపు సందర్భంగా బుధవారం రాత్రి స్వామివారి పుష్పోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు పెద్దింటి నీలకంఠశర్మ నిర్వహణలో మార్కండేయస్వామి, పార్వతీదేవిని పట్టువస్త్రాలతో విశేషంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దర్శించుకున్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండపేట మండలం ఏడిద ఆదర్శ ప్రాథమిక పాఠశాల పూర్వ విద్యార్థి రిమ్మలపూడి జానికిరామ్ బుధవారం పాఠశాలకు మైక్ సెట్ అందజేశారు. రూ.11 వేల విలువైన మైక్ సెట్ పాఠశాలకు ఎంతో అవసరమని హెచ్ఎం ముత్యాల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సొసైటీ ఛైర్మన్ గొడవర్తి సత్యనారాయణ, బండారు వెంకటరమణ, రామిశెట్టి రాజా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీధి మధ్యలో వ్యర్థాలు..

కడియం మండలం దుళ్లలోని కొన్ని వీధుల్లో ఇళ్లలోని వ్యర్థాలను రోడ్డుపైనే వేస్తున్నారు. దీంతో తీవ్ర దుర్వాసన వస్తోందని ఆయా స్థానికులు వాపోతున్నారు. తడి-పొడి చెత్త వేయడానికి కూడళ్లలో చెత్త కుండీలను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో రమేశ్‌ను వివరణ కోరగా సమస్య పరిష్కారానికి సిబ్బందికి సూచనలు జారీ చేశామన్నారు. – న్యూస్‌టుడే, కడియం

పాఠశాల ఆవరణలో దుర్గంధం

కొంతమూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలోకి పక్క వీధిలోని మురుగు నీరు చేరుతుంది. ఆ ప్రాంతంలో మురుగు కాలువలు లేకపోవటం వల్ల ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. అక్కడ మురుగు నిల్వ ఉండటంతో దోమలు విజృంభిస్తున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కొంతమూరు

మురుగు సమస్య పరిష్కరించండి

హుకుంపేటలో మురుగు సమస్య వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని శ్యామలానగర్ 2వ వీధి కాలనీ వాసులు పంచాయతీ కార్యదర్శి శ్రీదేవికి బుధవారం వినతి పత్రం అందజేశారు. విష్ణు ఎంక్లేవ్, శ్రీసాయి టవర్స్, శ్రీరస్తు రెసిడెన్స్ తదితర సముదాయాలు ఉన్న ప్రాంతంలో సీసీ రోడ్డు, డ్రెయిను సదుపాయం లేదని తెలిపారు. మురగు రోడ్డుపై నిలిచిపోవడం వల్ల రాకపోకలతో పాటు దోమల బెడదతో అవస్థలు పడుతున్నామన్నారు. సమస్యపై కార్యదర్శి స్పందిస్తూ చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, బొమ్మూరు

సేవా కేంద్రం.. ఏదీ వినియోగం

వీరంపాలెం పంచాయతీ కలగొయ్యి గ్రామ శివారులో ఉన్న రైతు సేవా కేంద్రం నిత్యం తాళం వేసి ఉంటోంది. దీంతో ఇది అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ కేంద్రం ఎదుటే మద్యం సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులను పడేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని, ఇప్పటికైనా రైతు సేవా కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మోరంపూడి

రహదారిపై ఇసుకతో ఇబ్బందులు

ఇసుక లారీల వల్ల జాతీయ రహదారిపై ప్రయాణం చేయాలంటే ప్రజలు భయపడుతున్నారు. బొమ్మూరు జాతీయ రహదారిపై ఉన్న ఇసుక వల్ల వాహనాలు అదుపుతప్పుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు. బాలాజీపేటలో అయితే రోడ్డుకు ఒకవైపంతా ఇసుక వ్యాపించి ఉంటోంది. ఈ సమస్యపై అధికారులు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగితే గానీ స్పందించరా అని ప్రశ్నిస్తున్నారు. – న్యూస్‌టుడే, బొమ్మూరు

బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న బాధ్యతా సేవా సంస్థ సభ్యులు

అగ్ని ప్రమాద బాధితులకు అండగా

కొంతమూరు, న్యూస్‌టుడే: కాతేరులోని సుబ్బారావు పేటలో గత మంగళవారం అగ్ని ప్రమాదం సంభవించిన సంగతి తెలిసిందే. ఆ ప్రమాద బాధిత కుటుంబానికి బాధ్యతా సేవా సంస్థ సభ్యులు నిత్యావసర సరకులు, రూ.6 వేల ఆర్థికసాయాన్ని బుధవారం అందించారు. సంస్థ అధ్యక్షుడు గిరజాల బాబు మాట్లాడుతూ పలువురు స్వచ్ఛందంగా వచ్చి బాధితులకు సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆచటం కల్యాణ్, కొత్తపల్లి నాగేశ్వర్రావు, మానుకొండ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రెండు దుకాణాలు దగ్ధం

గోకవరం, న్యూస్‌టుడే: అగ్నిప్రమాదంలో రెండు దుకాణాలు దగ్ధమయ్యాయి. తంటికొండ గ్రామం కోనేటి గట్టును ఆనుకొని ఆకుల సత్యనారాయణ హోటల్ నిర్వహిస్తున్నారు. ఆ పక్కనే జొన్నల వీర్రాజు చిన్నపాటి కూల్ డ్రింక్స్ దుకాణం నడుపుతున్నాడు. బుధవారం వేకువజామున మంటలు వ్యాపించడంతో రెండు దుకాణాలతో పాటు సామగ్రి బూడిదైంది. విద్యుత్తు షార్టుసర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చునని స్థానికులు భావిస్తున్నారు.

ప్రయాణికురాలి బంగారు నెక్లెస్ మాయం

గోకవరం, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలి బంగారు నెక్లెస్ మాయమైంది. వివరాలివీ.. గోకవరం గ్రామానికి చెందిన లక్ష్మీ అనే మహిళ సీతానగరం వెళ్లారు. బుధవారం సాయంత్రం గోకవరం వచ్చేందుకు రాజమహేంద్రవరంలో సింగిల్ స్టాప్ బస్సు ఎక్కారు. బస్సు రాజమహేంద్రవరం దాటుతుండగా బ్యాగు తెరచి ఉండడాన్ని గమనించగా అందులో ఉంచిన రెండు కాసుల బంగారు నెక్లెస్ మాయమైనట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గోకవరం డిపో వద్దకు చేరుకున్న తరువాత ప్రయాణికులను తనిఖీ చేశారు. అయినప్పటికి నెక్లెస్ దొరకకపోవడంతో ఘటన జరిగిన రాజమహేంద్రవరం పరిధిలో ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.

చెక్కు అందిస్తున్న బ్యాంకు ఛైర్మన్ బొమ్మన జయకుమార్, తదితరులు

ప్రమాద బీమా చెక్కు అందజేత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రాజమహేంద్రవరంలోని ది జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు సభ్యుడు చుక్కా కొండలరావు కుటుంబ సభ్యులకు ప్రమాద బీమా సొమ్ము బుధవారం అందజేశారు. రూ.లక్ష చెక్కును బ్యాంకు పాలకవర్గ ఛైర్మన్ బొమ్మన జయకుమార్, సీఈవో మద్దాల విజయప్రతాప్ తదితరులు మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు.

శాస్త్రీయ పద్ధతిలో పుట్టగొడుగుల పెంపకం

నల్లజర్ల: కేవీకే (ఉద్యాన విశ్వవిద్యాలయం, వెంకట్రామన్నగూడెం)లో శాస్త్రీయపద్ధతిలో పుట్టగొడుగుల పెంపకంపై గురువారం శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రధాన శాస్త్రవేత్త విజయలక్ష్మి తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులుంటాయన్నారు. గ్రామీణ యువత, రైతులు, డ్వాక్రా మహిళలు, ఔత్సాహికులు, ఆసక్తి ఉన్నవారు వివరాలు నమోదు చేసుకోవాలని, సమాచారానికి 9490505926లో సంప్రదించాలన్నారు.

కూటమి రాకతో విద్యా వ్యవస్థలో మార్పులు

టి.నగర్, న్యూస్‌టుడే: కూటమి అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థలో సమూల మార్పులు వచ్చాయని తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ (టిఎన్ఎస్ఎఫ్) రాజమహేంద్రవరం పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు ఎస్.సాయిదీపక్ తెలిపారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఫీజు రీయింబర్స్ బకాయిలు రూ. 1200 కోట్లు విడుదల చేసిన సందర్భంగా పుష్కరాల రేవు వద్ద ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సాయిదీపక్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి విద్యార్థుల కష్టాలను అర్థం చేసుకొని వారికి అండగా నిలిచేందుకు బకాయిలను విడుదల చేయడం జరిగిందన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వానికి విద్యపట్ల ఉన్న నిబద్ధత అన్నారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలను నారా లోకేశ్ ఒక్కొక్కటిగా నెరవేర్చుకొంటూ వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం చేస్తున్న తెలుగు యువత నాయకులు

పాలిటెక్నిక్ ఉద్యోగుల సీఏఎస్ సమస్యను పరిష్కరించాలి

శ్యామలాసెంటర్: ఏపీ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రభుత్వ అధ్యాపకుల కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీఏఎస్) అమలులో గత ఐదు సంవత్సరాలుగా జాప్యం జరుగుతుండటంపై ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సంఘ పాలిటెక్నిక్ ఆల్ లెక్చరర్స్ అసోసియేషన్ (పాల్) ప్రధాన కార్యదర్శి నరసింహారావు పేర్కొన్నారు. దీని వల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 540 మందికి పైగా ఉద్యోగులు తీవ్ర నష్టపోతున్నారని ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు ఆగిపోతున్నాయన్నారు. ఈ సమస్యను చక్కదిద్దేందుకు గత ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. దీనిపై ఇంటర్నల్ స్క్రీనింగ్ కమిటీని నియమిస్తే సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయన్నారు. ఈ విషయంపై విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు వివరించగా ఆయన సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించినప్పటికీ కిందిస్థాయిలో అధికారిక ఉత్తర్వులు వెలువడకపోవటం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఈ సమస్యను పరిష్కరించి ఉద్యోగుల వెతలు తీర్చాలని సంఘ సభ్యులు కోరుతున్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ

టి.నగర్, న్యూస్‌టుడే: కాతేరులో విద్యుత్ షార్ట్ సర్క్యూటు కారణంగా జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన బాధితులను తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నవీన్ బుధవారం పరామర్శించి నిత్యావసర సరకులు, గ్యాస్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని పార్టీ ఎప్పుడూ ఆదుకొంటుందన్నారు. పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రాజానగరం ఏడీబీ కూడలి

రాజానగరంలో ఏడీబీ కూడలిలో ట్రాఫిక్ ఇలా..

రాజానగరం, న్యూస్‌టుడే: రాజానగరంలో జాతీయ రహదారిపై కలవచర్ల జంక్షన్, ఏడీబీ రోడ్డు కలిసే కూడలి ప్రమాదకరంగా ఉంది. రాజమహేంద్రవరం నుంచి తుని, ఏలేశ్వరం, విశాఖపట్నం వైపునకు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. అదే కూడలి నుంచి కాకినాడ, రాజానగరం నుంచి కలవచర్ల వైపునకు వెళ్లే వాహనాలతో నిత్యం ట్రాఫిక్ ఏర్పడుతోంది. ఈ రద్దీను నియంత్రించేందుకు ఇక్కడ పోలీసులు లేకపోవడంతో వాహనదారులు ఇష్టానుసారం వెళ్తున్నారు. ఇది వరకు ఈ కూడలి వద్ద జరిగిన ప్రమాదాల్లో కొంతమంది ప్రాణాలు కోల్పోతే, మరి కొందరు క్షతగాత్రులయ్యారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఇక్కడ ఎటువంటి సిగ్నల్ లైట్లు లేక హెడ్‌లైట్ల కాంతిలోనే వాహనాలు తిరుగుతాయి. సంబంధిత అధికారుల స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

ఆశయం ఘనం.. ఆచరణ శూన్యం

పరిశీలన

కడియం, న్యూస్‌టుడే: వ్యవసాయ రైతులకు ఉపయుక్తంగా ఉండేందుకు రూ.లక్షలు ఖర్చు చేసి కియోస్క్‌లను రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆచరణ శూన్యం కావడంతో అవి నిరుపయోగంగా మారి అలంకార ప్రాయమై దర్శనమిస్తున్నాయి. కడియం మండలంలోని 27 సచివాలయాల్లో 16 కియోస్క్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో యంత్రం ఖరీదు రూ.70 వేలుగా ఉంది. ఆరంభం నుంచి వాటి వినియోగించని కారణంతో పదకొండు యంత్రాలు మూలనపడ్డాయి. అందుబాటులో ఉన్న 16 యంత్రాలను ఏ రీతిగా వినియోగించాలో తెలియక పక్కన పెట్టేశారు. రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు, యూరియా, విత్తనాలు, పురుగుమందులు, పంట బీమా వంటి సేవలను నేరుగా రైతులు కియోస్క్‌ల వద్ద పొందడమే ముఖ్య ఉద్దేశంగా వీటిని రూపొందించారు. కాగా వాటిలో కొన్ని మరమ్మతులకు గురికావడం వంటి సమస్యలు ఇబ్బందిగా మారాయి.

ధవళేశ్వరం: ధవళేశ్వరం సచివాలయం-1 రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన కియోస్క్ మరమ్మతులకు గురైంది. దీంతో రైతులకు ఎరువులు, పురుగుమందులు, ఇతర సమాచారం తెలియక ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వీటిని వినియోగంలోకి తీసుకురావాలని అన్నదాతలు కోరుతున్నారు.

కడియం రైతుసేవా కేంద్రంలో నిరుపయోగంగా మారిన కియోస్క్

(c) eenadu

కొవ్వూరు
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఓటరు జాబితా పంచాయతీ కార్యదర్శులకు అందజేత

నల్లజర్ల, న్యూస్‌టుడే: జిల్లా పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని 24 గ్రామాలకు సంబంధించిన ఓటరు జాబితాను పంచాయతీ కార్యదర్శులకు అందించామని డిప్యూటీ ఎంపీడీవో సింహాద్రిరావు బుధవారం తెలిపారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు బీఎల్‌వోల సహకారంతో చనిపోయిన వారి పేర్లను తొలగించి, నూతన ఓటర్లను చేర్చడంతో పాటు వేరే ప్రాంతాలకు వెళ్లిన ఓటర్ల పేర్లను మార్పులు చేస్తారని తదనంతరం పంచాయతీ కార్యదర్శులు అందించిన నూతన ఓటరు లిస్టును ఆయా గ్రామాల సచివాలయం వద్ద ప్రదర్శిస్తారని సింహాద్రిరావు తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నిడదవోలు: సహకార సంఘ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం నిడదవోలు డీసీసీబీ బ్రాంచి ఎదుట సిబ్బంది నిరసన చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 36 జీవో అమలు చేయాలని, 2019 నుంచి 2024 వరకు పీఆర్‌సీ ఇవ్వాలని, లేని పక్షంలో 50 శాతం తగ్గకుండా మధ్యంతర భృతి చెల్లించాలని, చట్టప్రకారం గ్రాడ్యుటీ చెల్లించాలని, 2019 తరువాత చేరిన వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

నల్లజర్ల: కేవీకే (ఉద్యాన విశ్వవిద్యాలయం, వెంకట్రామన్నగూడెం)లో శాస్త్రీయపద్ధతిలో పుట్టగొడుగుల పెంపకంపై గురువారం శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రధాన శాస్త్రవేత్త విజయలక్ష్మి తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులుంటాయన్నారు. గ్రామీణ యువత, రైతులు, డ్వాక్రా మహిళలు, ఔత్సాహికులు, ఆసక్తి ఉన్నవారు వివరాలు నమోదు చేసుకోవాలని, సమాచారానికి 9490505926లో సంప్రదించాలన్నారు.

సీఎం సహాయ నిధితో ఆర్థిక చేయూత

చెక్కు అందజేస్తున్న బూరుగుపల్లి శేషారావు

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: సీఎం సహాయ నిధితో బాధిత కుటుంబాలకు ఆర్థికంగా చేయూత లభిస్తోందని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు అన్నారు. బుధవారం వేలివెన్నులోని ఆయన క్యాంపు కార్యాలయంలో నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాలకు చెందిన 80 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.51 లక్షల విలువ చేసే చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 841 మంది లబ్ధిదారులకు రూ.5.41 కోట్ల సహాయ నిధి అందజేశామన్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తెదేపా మండలశాఖ అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, నియోజకవర్గంలోని నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య భారతావని సాకారమే సంకల్పం

కొవ్వూరు పట్టణం: ఆరోగ్య భారతావని సంకల్ప సాకారానికి ప్రధాని మోదీ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని జిల్లా భాజపా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. కొవ్వూరులో బుధవారం ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాద బాధితులకు ఆసుపత్రి చికిత్స ఖర్చుల కోసం 'పీఎం రాహత్- 2026' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. ప్రమాదాల బారినపడిన క్షతగాత్రులకు 'గోల్డెన్ అవర్'లో తక్షణ సాయం పొందేందుకు ప్రభుత్వ, గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో రూ.1.50 లక్షలు విలువైన వైద్యాన్ని ఉచితంగా పొందవచ్చన్నారు. ప్రమాదం జరిగిన వారం రోజుల వరకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. హెల్ప్‌లైన్ ఇండియా 112 నెంబర్‌కు సమాచారం అందించి వైద్య సేవలు పొందాలని.. ప్రజలంతా అవగాహన కలిగి అత్యవసర సందర్భాల్లో సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పత్రాలను అందుకున్న సిబ్బందితో ఆర్డీవో రాణి సుస్మిత

ప్రజల మన్ననలు పొందాలి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ విధులను నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందాలని ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. కొవ్వూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో వీఆర్‌ఏలుగా పనిచేస్తూ ఉద్యోన్నతి పొందిన సిబ్బందికి స్థానిక కార్యాలయంలో బుధవారం నియామక పత్రాలను ఆమె అందజేశారు. ఆర్డీవో మాట్లాడుతూ.. రోస్టర్ విధానం, సీనియారిటీ, చదువు, ఇతర అర్హతల ఆధారంగా డివిజన్‌లో 21 మంది వీఆర్‌ఏలు, నలుగురు నైట్ వాచ్‌మెన్లకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. చిత్త శుద్ధితో విధులు నిర్వర్తించి డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడంలో భాగస్వామ్యం కావాలన్నారు. వారికి కేటాయించిన ప్రాంతాలను వివరించి విధులకు హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో కార్యాలయ డిప్యూటీ తహసీల్దారు రవి విక్రమ్, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెల్లో ఉంటూ.. క్రీడల్లో రాణిస్తూ..

దేవరపల్లి, న్యూస్‌టుడే: పేదింటి పిల్లలు క్రీడల్లో రాణిస్తూ అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. పల్లెల్లో ఉంటూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ క్రీడల్లో పట్టు సాధిస్తున్నారు. మండలం, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి వైపు అడుగులు వేస్తున్నారు. ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయుల సహాయంతో ఆటల్లో మెలకువలు నేర్చుకొని పతకాలు కైవసం చేసుకుంటున్నారు. గ్రామ పెద్దలు, ఉపాధ్యాయుల మన్ననలు పొందుతూ తోటి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతున్నారు. క్రీడా కోటాలో ప్రభుత్వ శాఖలో కొలువు లక్ష్యమని చెబుతున్నారు.

దుద్దుకూరులో వాలీబాల్ సాధనలో..

ప్రభుత్వ కొలువే లక్ష్యం..

అమ్మానాన్న రోజు వారి కూలి పనికి వెళ్తారు. దేవరపల్లి మండలం దుద్దుకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాను. చిన్నప్పటి నుంచే వాలీబాల్ క్రీడపై ఆసక్తి పెంచుకున్నాను. ప్రధానోపాధ్యాయులు వీర్రాజు సహకారంతో అండర్-14 విభాగంలో బీచ్ వాలీబాల్ క్రీడలో గుంటూరు, నెల్లూరు, అనకాపల్లి జిల్లాలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాను. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో ఈ నెల 24 నుంచి మార్చి 1వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. క్రీడా కోటలో ప్రభుత్వ శాఖలో ఉద్యోగం సాధించాలన్నదే లక్ష్యం
– మద్దాల వెన్నెల, దుద్దుకూరు

ఆర్మీలో చేరుతా..?

నాన్న రెవెన్యూ శాఖలో ఉద్యోగం చేస్తున్నాడు. దుద్దుకూరు జడ్పీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాను. వ్యాయామ ఉపాధ్యాయుల సహకారంతో వాలీబాల్ ఆటలో రాణిస్తున్నాను. గతంలో పలు జిల్లాల్లో జరిగిన బీచ్ వాలీబాల్ పోటీల్లో బంగారు పతకాలు సాధించాను. ఇటీవల అనకాపల్లి జిల్లాలో జరిగిన సబ్ జూనియర్ విభాగంలో పాల్గొని జాతీయ స్థాయికి ఎంపికయ్యాను. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో ఈ నెల 24 నుంచి మార్చి 1వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాను. ఆర్మీలో కొలువు సాధించాలని పట్టుదలతో శ్రమిస్తున్నాను.
– బొంత బాలు మహీధర్, దుద్దుకూరు

రెండుసార్లు జాతీయ స్థాయిలో..

అమ్మానాన్న కూలికి వెళ్తారు. దేవరపల్లి మండలం పల్లంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాను. క్రీడలతో పాటు చదువులోనూ రాణిస్తున్నాను. ఆరో తరగతి చదువుతున్నప్పటి నుంచే ఫుట్‌బాల్ క్రీడపై మక్కువ పెంచుకున్నాను.. ఝార్ఖండ్, బిహార్ రాష్ట్రాల్లో రెండు సార్లు జాతీయ స్థాయిలో అండర్-17 విభాగంలో పాల్గొన్నాను. ప్రధానోపాధ్యాయిని, వ్యాయామ ఉపాధ్యాయుడు నేతృత్వంలో క్రీడల్లో విజయాలు సాధిస్తున్నాను. క్రీడా కోటాలో పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించడమే లక్ష్యం.
– సరిపల్లి జ్ఞానస్వరూప, పల్లంట్ల

ప్రాంతీయ ఆసుపత్రి స్థాయికి పెంచాలి

శాసనసభలో ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: దశాబ్ద కాలంగా కలగా ఉన్న కొవ్వూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రాంతీయ ఆసుపత్రి స్థాయికి పెంచాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం శాసనసభ సమావేశంలో ఈ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి జిల్లా ఆసుపత్రి లేదని, వంద పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు కొవ్వూరులో అన్ని సౌకర్యాలు, భవనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు, పోలవరం, దేవరపల్లి, నిడదవోలు, నల్లజర్ల పరిధిలోని కొన్ని గ్రామాల నుంచి కొవ్వూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి వైద్య సేవలకు వస్తుంటారన్నారు. అవసరమైన వైద్యులు, సిబ్బంది లేనందున ఆయా ప్రాంతాల వారు రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు వెళ్లాల్సి వస్తోందన్నారు. మలకపల్లి పర్యటనకు వచ్చినపుడు సీఎం దృష్టికి ఈ అంశాన్ని తీసుకువెళ్లగా సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చారన్నారు. రానున్న పుష్కరాల నేపథ్యంలో భక్తులు, యాత్రికులకు ఉపయోగపడేలా, ఇక్కడి ప్రజానీకానికి అవసరమైన నేపథ్యంలో సీటీ స్కాన్, ట్రామాకేర్, ఐసీయూ, అత్యవసర వైద్య సేవలు అందించే సౌకర్యం కల్పించేలా శ్రద్ధ చూపించాలని కోరారు.

ఇష్టమైన ఆటల్లో ప్రతిభ కనబరిచేలా ప్రోత్సాహం

విద్యార్థులకు వివరిస్తున్న బి.జాన్సన్

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: చదువుతో పాటు క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని.. ఇష్టమైన క్రీడల్లో విద్యార్థులు రాణించేలా ప్రోత్సహిస్తోందని వ్యాయామ విద్య రీజనల్ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌పీఈఎఫ్) బి.జాన్సన్ అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వ్యాయామోపాధ్యాయులతో బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో వ్యాయామ విద్యకు సంబంధించిన దస్త్రాలు, క్రీడల నిర్వహణ, నిబంధనల అమలు, ఖేలో ఇండియా, స్కూల్ గేమ్స్, వ్యాయామ పరికరాల సద్వినియోగం వంటి అంశాలపై ఆరా తీశారు. అనంతరం అల్లూరి నాగరత్నం బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. పీఎంశ్రీ పాఠశాలల్లో క్రీడల ప్రోత్సాహంలో భాగంగా మైదానాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేసిందని, అన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా రూ.30 వేలతో క్రీడా పరికరాలను అందించిందన్నారు. కార్యక్రమంలో డీవైఈవో బి.దిలీప్‌కుమార్, జిల్లా వ్యాయామోపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు నాగరాజు, వ్యాయామోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడండి

మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణ

నల్లజర్ల: వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీడీవో సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం నల్లజర్ల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బంకా జయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి సోమశేఖరం మాట్లాడుతూ ఖరీఫ్‌లో 16 వేల టన్నుల ధాన్యాన్ని రైతుల వద్ద కొనుగోలు చేసి రూ.36 కోట్ల నగదును వారి ఖాతాల్లో రెండు రోజుల్లోనే జమ చేయడం జరిగిందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించేలా ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలన్నారు. ప్రస్తుతం వరి 5,400 ఎకరాల్లో రైతులు సాగు చేశారని, సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాలు చేపట్టామన్నారు. నల్లజర్ల ప్రభుత్వాసుపత్రి కమ్యూనిటీ హెల్త్ అధికారి శాస్త్రి మాట్లాడుతూ 1 నుంచి 19 ఏళ్ల లోపు బాలబాలికలకు, విద్యార్థులకు 90 శాతం వరకు ఆల్బెండజోలు మాత్రలు పంపిణీ చేశామని మిగిలిన వారికి ఈ నెల 24న మళ్లీ పంపిణీ చేస్తామన్నారు. క్యాన్సర్‌పై సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ప్రకాశరావుపాలెం సర్పంచి విక్టర్‌బాబు మాట్లాడుతూ కుక్కకాటుకు గురైన వారు నల్లజర్ల పీహెచ్‌సీకి వస్తే వ్యాక్సిన్ లేదనడంతో తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి వెళ్లి వ్యాక్సిన్ వేయించుకుంటున్నారని కావున నల్లజర్ల పీహెచ్‌సీలో వ్యాక్సిన్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణ మాట్లాడుతూ జగన్నాథపురం, సుభద్రపాలెం, దూబచర్ల, పోతవరం గ్రామాల్లో నూతన పాఠశాలల భవనాల నిర్మాణాలకు సంబంధిత అధికారులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. డిప్యూటీ ఎంపీడీవో సింహాద్రిరావు మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో రోజు శానిటేషన్ పనులు జరుగుతున్నాయని, రాష్ట్రస్థాయిలో ఉత్తమ పంచాయతీగా చీపురుగూడెం గ్రామం ఐవీఆర్‌ఎస్ కాల్స్ ద్వారా ఎంపికైందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణారావు, ఉప ఎంపీపీ అచ్యుత శివాజీ, ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని శాఖల్లో హెచ్‌ఆర్ పాలసీ వర్తింపజేయాలి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రాథమిక సహకార పరపతి సంఘాల ఉద్యోగులకు ప్రత్యేక హెచ్‌ఆర్ పాలసీ విధానం శుభపరిణామమని.. అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేసే పొరుగు సేవల ఉద్యోగులకు ఈ విధానాన్ని వర్తింపజేయాలని రాష్ట్ర అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ జేఏసీ ప్రధాన కార్యదర్శి పి.గురునాథ్ అన్నారు. కొవ్వూరులో బుధవారం మాట్లాడుతూ జాబ్‌చార్టు, ఉద్యోగ భద్రత, సరైన సెలవులు లేక పనులు చేస్తున్న సిబ్బందికి హై పవర్ కమిటీని నియమించాలన్నారు. కేవలం వేతనాలు ఇవ్వడమే కాక ఉద్యోగులకు ఇవ్వాల్సిన గౌరవం, పదోన్నతులు, ఆరోగ్య భద్రత, ఉద్యోగ విరమణ వంటి అంశాలను హెచ్‌ఆర్ పాలసీలో పొందుపర్చాలన్నారు.

మహారాజశ్రీ కొవ్వూరు 9వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి వారి కోర్టులో
E.P.No.37/2022
AC No.480/2019
Between
M/s. శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ Co-Ltd.
Now శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,కొవ్వూరు బ్రాంచ్
Rep By G.P.A Holder ...DHR
మరియు
పిట్టా ప్రవీణ్ వగైరా .....JDR
1st JDR :
పిట్టా ప్రవీణ్ S/o.రామచంద్రరావు , డోర్‌నెం.4-57, అంబేద్కర్ వీధి, తాడిపూడి గ్రామం,తాళ్లపూడి మండలం.
వేలం తేది :09.03.2026
పై నెంబరుగల డిక్రీ బాకీ కి గాను 1వ JDR తాలుకు E.P. షెడ్యూలు ఆస్తి ది.09.03.2026 తేదిన ఉదయం10.30 ని॥లకు లగాయితు పై కోర్టు వారి ఎదుట వేలం జరుగును, వేలం నందు పాటపాడు కోదలచిన వారు వేలపు షరతులు కోర్టు నజారత్ నందు గాని అడిగి తెలుసు DHR ప్లీడరు గారి ఆఫీసు నందు గాని తెలుపుకోగలరు.
షెడ్యూలు :తూర్పుగోదావరి జిల్లా, పూర్వం పశ్చిమ గోదావరి జిల్లా, తాడిపూడి మండలం, వేగేశ్వరపురం సబ్‌రిజిష్టార్ తాడిపూడి గ్రామము ఆర్.ఎస్.నెం. 132/3, డోర్‌నెం.4-57, House Constructed in Extent of 96 చ॥గజములు స్థలం with all తలుపులు, కిటికీలు, ఎలక్ట్రికల్ ఫిటింగ్స్ మరియు కరెంట్ సర్వీస్ వగైరా ఈజ్‌మెంట్ హక్కులు, నీరు దారి హక్కులతో సహా ఈ హద్దుల మధ్యగల
తూర్పు : రోడ్డు , దక్షిణం : కొడిదల బుజ్జి అగ్రిఫీల్డ్, పడమర : చింతపల్లి రామారావు గారిఇల్లు , ఉత్తరం : కాకర్ల రామారావు గారి ఇల్లు
యీ హద్దుల మధ్య గల 96 చదరపు గజముల స్థలం అందరి గల కట్టుచున్న ఇల్లు.
DHR Value : Rs.1,92,000/-
Amin value: Rs.8,00,000/-
JDR value: NIll
నోట్ :ది.08.11.2017న పిట్టా ప్రవీణ్ గారు(1వ JDR) మహేంద్ర రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ , గోపాలపురం వారికి చేసిన తనఖా బాకీ పరిగణించి వేలం జరగవలెను.
Kovvur 17.02.2026
M.S.S.Chakrapani
Advocate, Kovvur,
Cell : 9347626845

తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు

నిడదవోలు, న్యూస్‌టుడే: చాగల్లుకు చెందిన మహమ్మద్ కరిముల్లా ఈ నెల 15న మద్యం తాగి లారీని నడుపుతూ నిడదవోలు నుంచి యర్నగూడెంకు మధ్య కాటకోటేశ్వరం వద్ద ప్రజలకు ఇబ్బంది కలిగించాడని సమిశ్రగూడెం ఎస్సై బాలాజీ సుందరరావు తెలిపారు. పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి నిడదవోలు సెకండ్ జుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా 7 రోజుల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి అజేయ్‌కుమార్ తీర్పునిచ్చినట్లు తెలిపారు. దీనిపై అతనిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

చాగల్లు: కొవ్వూరు డిపో ఆర్టీసీ బస్సులు ఒకదానికొకటి రాసుకుపోవడంతో స్వల్ప మరమ్మతులకు గురయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం 11 గంటల సమయంలో కొవ్వూరు డిపో నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న బస్సు... మెరకవీధి రౌండు రామాలయం వద్దకు వచ్చే సరికి ఎదురుగా డిపో వద్దకు వస్తున్న మరో బస్సును రాసుకుపోయింది. బస్సు కిటికీ పక్కనే పలువురు చిన్నారులు ఉండడంతో బస్సులో ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. ప్రయాణికులెవ్వరూ చేతులు బయటకు పెట్టకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. రోడ్డు ఇరుకు కారణంతో తరచూ ప్రమాదాలకు నిలయంగా ఈ ప్రదేశం మారిందని పలువురు ప్రయాణికులు వాపోయారు. అధికారులు సంఘటనా స్థలం వద్దకు చేరుకుని ప్రమాదాన్ని పరిశీలించారు.

లారీ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

గోపాలపురం: లారీ, ద్విచక్రవాహనం ఢీకొట్టుకున్న ఘటనలో ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు.. ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం లక్ష్మణవారిగూడెంకి చెందిన సోదేం హరీష్ బుధవారం సాయంత్రం ద్విచక్రవాహనంపై గోపాలపురం వెళ్లి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా గోపాలపురం శివారులో దుర్గమ్మ ఆలయం సమీపంలో హైదరాబాద్ నుంచి కలకత్తా వెళ్తున్న ఉల్లిపాయల లోడు లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో హరీష్‌కు తీవ్ర గాయాలవడంతో గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

నేటి నుంచి రంజాన్ ప్రార్థనలు, ఉపవాసాలు

కొవ్వూరు పట్టణం, నిడదవోలు, న్యూస్‌టుడే: ముస్లింలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించే పవిత్ర రంజాన్ మాస ఉపవాస దీక్షలు ఈనెల 19 నుంచి నెల వంక దర్శనంతో ప్రారంభమవుతాయి. కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాల్లో ప్రసిద్ధి చెందిన మసీదులు రంజాన్ మాసమంతా ప్రార్థనలు, ఇఫ్తార్ విందులతో కళకళలాడుతుంటాయి. ఆయా మసీదుల్లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. సూర్యోదయానికి ముందు నుంచి సూర్యాస్తమయం వరకు (సుమారు 15 గంటల పాటు) పగటి సమయమంతా కఠిన ఉపవాసాన్ని చేసి దీక్షను విరమించే నిర్ణీత వేళలో ఆహారం తీసుకుంటారు. రంజాన్ నెలలోని 27వ రోజు రాత్రి జాగారంతో ఉండి దైవ ప్రార్థనతో గడుపుతారు. నెల రోజుల పాటు చదివిన ఖురాన్ చివరి అంకాన్ని ఈ రాత్రి ముగిస్తారు.

ఆయా ప్రాంతాల్లో..

కొవ్వూరు పట్టణంలో జామియా మసీదు, ఇందిరమ్మ కాలనీలోని మర్కజ్ మసీదులకు ఎంతో పేరుంది. ఔరంగజేబు దండయాత్ర చేసిన సమయంలో 16వ వార్డులో మసీదు నిర్మించి ప్రార్థనలు చేయడంతో ఈ ప్రాంతానికి ఔరంగాబాద్ అని పేరొచ్చింది. దొమ్మేరు, కాపవరం, గోవర్ధనగిరిమెట్ట,



పంగిడి, చాగల్లు, తాళ్లపూడి, నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లో 25, గోపాలపురంలో జామియా, కరిచర్లగూడెం, చిట్యాల, హుకుంపేట, దొండపూడి ప్రాంతాల్లో, నిడదవోలు పట్టణంలో పెద్ద, చిన్న మసీదులు, బస్టాండ్, యర్నగూడెం రహదారి, వైఎస్‌ఆర్‌నగర్ ప్రాంతాల్లోని మసీదులను ప్రత్యేకంగా అలంకరించారు.

పవిత్ర కాలం

రంజాన్ నెలలో సహనం, దయ, పరస్పర సహకారం వంటి సద్గుణాలు పెంపొందుతాయి. పేదలకు జకాత్ అందించడంతో సత్సంబంధాలను బలోపేతమై సమాజంలో ఐక్యతను పెంపొందించేందుకు దోహదపడుతుంది.
– అబ్దుల్ సత్తార్ పర్వేజ్, ముస్లిం పెద్ద, సమిశ్రగూడెం

సన్మార్గ జీవనానికి..

సన్మార్గ జీవనానికి మూలమైన ఖురాన్ బోధనలను అనుసరించడంతో సత్ప్రవర్తన కలుగుతుంది. ఐక్యతకు నిదర్శనంగా వివిధ రకాల నమాజ్‌లను పఠిస్తారు.
– నౌషద్ ఆలీ, జామియా మసీదు ముతావలీ, కొవ్వూరు

ప్రత్యేక ప్రార్థనలకు ప్రాధాన్యం

ప్రతి రోజూ చేసే నమాజ్‌లతో పాటు పర్వ దినాల్లో సామూహికంగా చేసే ప్రత్యేక ప్రార్థనలకు విశేష ప్రాధాన్యం ఉంటుంది.
– అబ్దుల్ జలీల్‌ఖాన్, జామాతే ఇస్లామి హింద్ కన్వీనర్, కొవ్వూరు

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

మూడు రోజులు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: దొమ్మేరు సబ్‌స్టేషను పరిధిలో 11కేవీ కాపవరం ఫీడరులో అభివృద్ధి పనుల నేపథ్యంలో ఈ నెల 19, 20, 21 తేదీలలో విద్యుత్తు సపరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ నారాయణ అప్పారావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. వ్యవసాయానికి తెల్లవారుజాము 4 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా ఉంటుందన్నారు.

నేడు

దేవరపల్లి: కృష్ణంపాలెం విద్యుత్తు ఉప కేంద్రం పరిధి 11 కేవీ లైన్ల కృష్ణంపాలెం, పోలవరం కెనాల్ ఫీడర్ల ఆర్డీఎస్‌ఎస్ పనుల కారణంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని ఈఈ అప్పారావు తెలిపారు

రేపు

తాళ్లపూడి: ప్రక్కిలంక విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో గ్రామాలకు 33-11కేవీ లైన్ల మరమ్మతుల కారణంగా ఈ నెల 20న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ తెలిపారు. వ్యవసాయానికి ఉదయం 3 గంటల నుంచి 8 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుందన్నారు.

గోపాలపురం: సగ్గొండ 132కేవీ విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో వార్షిక మరమ్మతుల కారణంగా గోపాలపురం, జగన్నాధపురం, చిట్యాల, సగ్గొండ 33/11 కేవీ విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలోని అన్ని ఫీడర్లలో ఉదయం 8 గంటల నుంచి 2 గంటల వరకు ఉండదని ఈఈ అప్పారావు తెలిపారు.

ఘనంగా బాపిరాజు జన్మదిన వేడుకలు

నల్లజర్ల: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జడ్పీ మాజీ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం నిర్వహించారు. నల్లజర్ల ఆనంద బాలుర వసతి గృహంలో కేక్ కోసి విద్యార్థులకు పంచారు. తెదేపా మండలశాఖ ఉపాధ్యక్షుడు గుదే వెంకట సుబ్బారావు, గుదే శ్రీనివాసరావు, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ విగ్రహం పరిశీలన

తాళ్లపూడి: మండలంలోని ప్రక్కిలంకలోని మావుళ్లమ్మతల్లి విగ్రహాన్ని కాకినాడ పురావస్తుశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ తిమ్మరాజు బుధవారం పరిశీలించారు. అమ్మవారి విగ్రహం ఏ కాలం నాటిదో తెలియజేయాలని గ్రామస్థులు కోరడంతో పరిశీలించినట్లు ఆయన తెలిపారు. అమ్మవారి విగ్రహం పురాతనమైనదిగా తేలిందని.. పూర్తి నివేదికను గ్రామస్థులకు అందజేస్తామన్నారు.

శాస్త్రోక్తంగా ముగిసిన నక్షత్ర సత్ర యాగం

మహాపూర్ణాహుతి క్రతువులో పండితులు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: యజ్ఞాది హోమాలు, సూర్యారాధనతో ఆరోగ్యం సిద్ధిస్తుందని యనమండ్ర వేణుగోపాలశాస్త్రి అన్నారు. కొవ్వూరు గోష్పద క్షేత్రంలోని ధర్మజ్ఞాన కళావేదిక, సుందరగోవిందుని గోశాలలో నెల రోజుల పాటు నిర్వహించిన మాఘ మాస సూర్యారాధన పూర్వక నక్షత్ర సత్ర యాగం బుధవారంతో శాస్త్రోక్తంగా ముగిసింది. పండితులు ఏలూరిపాటి సుబ్రహ్మణ్యశర్మ పర్యవేక్షణలో చామర్తి విశ్వనాథశర్మ, వెంకట రామసుబ్బలక్ష్మి దంపతులు కల్యాణం చేయించారు. యాగానికి సహాయం అందించిన అవంతి సంస్థల ఛైర్మన్ అల్లూరి ఇంద్ర కుమార్ దీక్షదారుగా పూజా కార్యక్రమాలు చేయించుకున్నారు. పండితులను సన్మానించారు. జయంతి మహేష్‌శర్మ, పట్టణ ప్రముఖులు అనుపిండి చక్రధరరావు, పరిమి హరిచరణ్, పాలకోడేటి సత్యనారాయణమూర్తి, పరిమి రాధాకృష్ణ, గుడివాక శ్రీనివాస్, మన్యం బుల్లిబాబు, సుందరగోవిందుని ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

గురు సన్మానం..

ధర్మజ్ఞాన విజ్ఞాన వేదికపై సువర్ణ పాద కటకాలంకరణ సేవా పూర్వక గురుపూజా మహోత్సవం సందర్భంగా బ్రహ్మశ్రీ యనమండ్ర వేణుగోపాల శాస్త్రిని శిష్యులు, అభిమానులు, ప్రముఖులు సన్మానించారు.

శ్రీపుష్పోత్సవం..

పెరవలి: పెరవలి మండలం ఖండవల్లిలోని శ్రీఉమాశ్రీమార్కేండేయ, శ్రీమృఖండేశ్వరస్వామి ఆలయాల్లో పుష్పోత్సవం నిర్వహించారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

ఉండ్రాజవరం: మహాశివరాత్రి ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని ఉండ్రాజవరం, పాలంగి, మోర్త, దమ్మెన్ను, తాడిపర్రు, వేలివెన్ను, వడ్లూరు, సూర్యారావుపాలెం, కె.సావరం, చిలకపాడు శివాలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని విశేష అలంకరించారు.

దేవరపల్లి: దేవరపల్లి మండలం పల్లంట్లలో కొలువైన రాజరాజేశ్వరి సమేత దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

లక్ష్మీనారాయణస్వామి సన్నిధిలో..

నిడదవోలు: మండలంలోని ముసినిపల్లి లక్ష్మీనారాయణ స్వామి సన్నిధిలో 11 ప్రదక్షిణలు, 7 బుధవారాలు కార్యక్రమంలో భాగంగా బుధవారం స్వామివారిని చామంతి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. విష్ణు సహస్రనామస్తోత్రం, హనుమాన్ చాలీసా పారాయణం, లక్ష్మి అష్టోత్తర శతనామావళి పారాయణం నిర్వహించారు.

(c) eenadu

మండపేట

• మండపేట • అనపర్తి

సమస్యలు లేని నగరమే లక్ష్యం

టి.నగర్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరాన్ని సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఫారమ్ ఫర్ బెటర్ తొలి అడుగులు వేయాలని సంస్థ వ్యవస్థాపకుడు యర్రా వేణుగోపాలరాయుడు తెలిపారు. ఆనం రోటరీ హాల్‌లో ఫారం సమావేశం బుధవారం జరిగింది. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు సామాన్యులకు చేరువ చేసేందుకు కృషి చేయాల్సి ఉందన్నారు. ఇందుకు సంబంధించి సంస్థను విస్తరించడం జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో తన్నీరు వీరేంద్రనాథ్, బీవీఎస్ రెడ్డి, రావ్సీ విజయ శేఖర్, లక్ష్మీజ వీరభద్రరావు, సూర్యనారాయణ, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మార్కండేయుని పుష్పోత్సవం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా రాజమహేంద్రవరం గోదావరి గట్టున ఉన్న శ్రీఉమా మార్కండేయస్వామి ఆలయంలో ఈనెల 14నుంచి 18వ తేదీవరకు స్వామివారి పాంచాహ్నిక దివ్య కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ముగింపు సందర్భంగా బుధవారం రాత్రి స్వామివారి పుష్పోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు పెద్దింటి నీలకంఠశర్మ నిర్వహణలో మార్కండేయస్వామి, పార్వతీదేవిని పట్టువస్త్రాలతో విశేషంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దర్శించుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ. 10 - మ. 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు
మండపేట: 80085 74183 ద్వారపూడి: 98490 93850
అనపర్తి: 95333 66637 అంగర: 97044 16418
రాయవరం: 80085 74185

మురుగు పారుదలకు చర్యలు

సమస్య: మండపేట మండలం మెర్నిపాడు గ్రామం మెయిన్‌రోడ్డు డ్రైనేజీలో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు పారడం లేదు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది.
- డి.సుబ్రహ్మణ్యం, మెర్నిపాడు

పరిష్కారం: సమస్యను పంచాయతీ కార్యదర్శి హరేరామ్ రెడ్డికి తెలియజేయగా వెంటనే స్పందించారు. సిబ్బందిని పంపించి మురుగు పారుదలకు చర్యలు తీసుకున్నారు.
- న్యూస్‌టుడే, ద్వారపూడి

సమస్య: బలభద్రపురం రజకవీధిలో డ్రైన్ అధ్వానంగా మారింది. చెత్త పేరుకుపోయి మురుగు ముందుకు కదలడం లేదు.
- రామారావు, బలభద్రపురం

సమాధానం: కాలువలో పేరుకు పోయిన చెత్తను గురువారం తొలగిస్తాం - అశోక్‌కుమార్, కార్యదర్శి, బలభద్రపురం
- న్యూస్‌టుడే, బిక్కవోలు

ఆక్రమణదారుల గుప్పిట జలవనరులు

• నీరుచేరే దారిలేక కలుషితమవుతున్న చెరువులు

మండపేట, ద్వారపూడి న్యూస్‌టుడే: మండపేట పట్టణం, గ్రామీణ ప్రాంతాలతో పాటు నియోజకవర్గంలోని పలు చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయి. కొందరు వ్యర్థాలతో నింపేస్తున్నారు. మరికొందరు గట్లను ఆక్రమిస్తూ చెరువు విస్తీర్ణం కుంచించుకుపోయేలా చేస్తున్నారు. ఈ వర్షంతో తటాకాలు వాటి ఉనికిని కోల్పోతున్నాయి. వేసవిలో నీటిఎద్దడి ఏర్పడకుండా, భూగర్భ జలాలు తగ్గిపోకుండా ముందుచూపుతో వర్షం నీటిని ఒడిసి పట్టేందుకు గ్రామాలు, పట్టణాల్లో గతంలో చెరువులు తవ్వించారు. ప్రస్తుతం భూగర్భ జలాలను వాడుకుంటున్నా చెరువులు మాత్రం తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. వాటి చుట్టూ ప్రాంతాన్ని ఆక్రమించుకుని నివాసాలు ఏర్పాటు చేసుకోవడంతో వర్షంనీరు చేరే అవకాశం లేకుండా పోయి ఉన్న నీరు ఎటూ కదలక కలుషితమవుతోంది. మండపేట నియోజకవర్గంలోని ప్రధాన చెరువుల పరిస్థితిని పరిశీలిస్తే..

తాపేశ్వరంలో ఆక్రమణకు గురై వ్యర్థాలతో మూసుకుపోతున్న చెరువు

మండపేట నియోజకవర్గంలో..

కపిలేశ్వరపురం మండలం వల్లూరు కోరుమిల్లి గ్రామంలోని రెవెన్యూ అధికారులు ఇటీవల చెరువు గట్టుపై ఆక్రమణలను తొలగించి అక్కడ నివాసం ఉంటున్నవారికి వేరే ప్రాంతంలో స్థలాలు కేటాయించారు. అంగరలో ఊరచెరువు పూర్తిగా ఆక్రమణలో చిక్కుకుని నీరు పూర్తిగా కలుషితమవుతోంది. దీనివల్ల దోమలు విజృంభిస్తున్నాయి. మండపేట పట్టణంలోని ధర్మగుండం చెరువు వెనుక చిన్నచెరువు సగానికి పైగా ఆక్రమణకు గురవడంతో పాటు నీరు పూర్తిగా కలుషితమైంది. రాయవరంలోని చెరువు గట్టుపై పాకలు, దుకాణాలు వేసుకున్నారు. తాపేశ్వరం గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాల వద్ద చెరువు ఆక్రమణకు గురవడంతో పాటు చుట్టూ పందుల పెంపకం సాగుతోంది. దీనివల్ల పరిసరాలు దారుణంగా మారుతున్నాయని స్థానికులు అధికారులకు ఫిర్యాదుచేసినా ఫలితం కనిపించడం లేదు. కేశవరంలో వక్ఫ్ వాయి చెరువు, అర్తమూరులో ఊరచెరువు, ద్వారపూడిలో ముసళ్లచెరువు, వెలగతోడులో రెడ్డమ్మతల్లి చెరువు, ఏడిదలో పెద్దచెరువు, చిన్నచెరువు, ఏడిదసావరం చెరువులు ఆక్రమణ చెరలో చిక్కుకున్నాయి.

అమృత్ పథకంలో..

గ్రామాల్లో చెరువులు అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకాన్ని అమలు చేస్తోంది. దీనివల్ల చెరువులను శుభ్రం చేయడంతో పాటు చుట్టూ మొక్కలు నాటి కాలిబాట, కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేసి ఆహ్లాద వాతావరణం కల్పించాలనేది ఈ పథకం ఉద్దేశం. మండపేట పట్టణంలో రూ.కోటితో రావులచెరువు అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. కొద్దిగా పనులు చేసి అసంపూర్తిగా వదిలేశారు. గ్రామాల్లో అమృత్ పథకంలో ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులతో అభివృద్ధి చేసేలా ప్రణాళిక రూపొందించారు. ఏడిద గ్రామంలోని జిల్లాపరిషత్ పాఠశాల వద్ద చెరువును అమృత్ పథకానికి ఎంపికచేసినా అనువుగా లేదని అభివృద్ధి చేయలేకపోయారు. దీంతో ఇటీవల ఆ గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త నామాల పురుషోత్తమరావు చొరవ తీసుకుని సుమారు రూ.2 కోట్లు వెచ్చించి అభివృద్ధి చేయడంతో గ్రామానికి అది తలమానికంగా మారింది. దీన్ని స్ఫూర్తిగా తీసుకుంటే మిగిలిన గ్రామాల్లో చెరువులకు మహర్దశ పట్టే అవకాశం ఉంది.

నిబంధనల ప్రకారం చర్యలు..

గ్రామాల్లో చెరువులు ఆక్రమించుకున్నవారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం. ముందుగా ఆయా చెరువుల పరిసరాలను సర్వే ద్వారా గుర్తిస్తాం. ఆక్రమణదారుల వివరాలు సేకరించి నోటీసులు జారీ చేస్తాం. ప్రత్యామ్నాయ స్థలాలు చూపించేలా చర్యలు తీసుకుంటాం.
- కొర్ల సత్యనారాయణ, ఎంపీడీవో మండపేట

దొడ్డిగుంటలో ప్రేమాభిషేకం వేడుక

ప్రేమాభిషేకం పోస్టర్ వద్ద అభిమానుల సందడి

రంగంపేట, న్యూస్‌టుడే: అక్కినేని నటించిన ప్రేమాభిషేకం సినిమా విడుదలై 45 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా రంగంపేట మండలం దొడ్డిగుంటలో బుధవారం అభిమానులు సంబరాలు జరుపుకొన్నారు. అక్కినేని నాగేశ్వరరావు అభిమానుల సంఘం నాయకుడు అక్కినేని మరిడయ్య ఆధ్వర్యంలో ఏఎన్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అప్పట్లో ప్రేమాభిషేకం చిత్రం విజయవంతమై చరిత్ర సృష్టించిందని మరిడయ్య గుర్తుచేశారు.

ఇంటి వద్దే ఆస్తి పన్ను వసూలు

మండపేట, న్యూస్‌టుడే: ఆస్తి పన్ను వసూలు చేయడంలో మున్సిపల్ అధికారులు వినూత్న పద్ధతులు అమలు చేస్తున్నారు. ఇప్పటికే సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. పన్ను చెల్లింపుదారుల్లో కొందరికి కార్యాలయానికి వచ్చేంత సమయం లేకపోవడం, ఇతరత్రా కారణాలతో పన్ను చెల్లింపులో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. దీంతో మున్సిపల్ అధికారులు ఇంటి, భవన యజమానులకు మరింత సౌలభ్యం కోసం మొబైల్ వాహనంతో నేరుగా నివాసాలకు వెళ్లి పన్ను వసూలు చేసేలా చర్యలు చేపట్టారు. మున్సిపల్ రెవెన్యూ అధికారి మాచిరాజు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది జీపులో ఆయా వార్డులు, వీధుల్లో తిరుగుతూ మైక్‌లో ప్రచారం చేస్తున్నారు. నగదు చెల్లింపులు, నగదు రహిత పద్ధతుల్లో చెల్లించేవారికి అక్కడికక్కడే రసీదులు అందిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ టి.వి. రంగారావు చెప్పారు. ఇంటి పన్నుతో పాటు నీటి పన్ను, ఇతరత్రా పన్నులు ఇలాగే వసూలు చేస్తున్నామని పేర్కొన్నారు.

మైక్‌లో అభ్యర్థిస్తున్న ఆర్వో మాచిరాజు రవి

సాధనకు క్రీడా మైదానాలు నిర్మించండి

శాసనసభలో ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, న్యూస్‌టుడే: మండపేట నియోజకవర్గంలో ఇంతవరకు క్రీడా సాధనకు ప్రత్యేక స్టేడియం లేదని, ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో స్టేడియాలు నిర్మించాలని ఎస్ఈసీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. బుధవారం శాసనసభలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో గత తెదేపా హయాంలో క్రీడావికాస కేంద్రం నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేస్తే వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రస్తుతం రూ.30 లక్షలు మంజూరుచేసి టెండర్లు పిలిచినట్లు మంత్రి చెప్పారని, ఆ నిధులు ఏ మాత్రమూ సరిపోవన్నారు. కనీసం రూ.3 కోట్లు లేదా రూ.4 కోట్లుంటే 8 ఎకరాల విస్తీర్ణంలోని ఆ మైదానంలో ఇండోర్ స్టేడియంతో పాటు ఔట్‌డోర్ స్టేడియం నిర్మించాల్సి ఉందన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఇండోర్ స్టేడియం నిర్మించాలని, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లో ఇండోర్, ఔట్‌డోర్ స్టేడియాలు నిర్మించాలని కోరారు. అంతకుముందు మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేసినందుకు 3 లక్షల నియోజకవర్గ ప్రజల తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలిపారు.

సమావేశంలో భాజపా జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

భాజపా కార్యకర్త తేతలిపై వేటు

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: అనపర్తి గ్రామానికి చెందిన భాజపా కార్యకర్త తేతలి సత్యనారాయణరెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు భాజపా జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర చెప్పారు. అనపర్తి కూటమి కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, భాజపా నాయకుడు కర్రి బుల్లిరెడ్డితో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. భాజపా కార్యకర్తగా ఉంటూ భాజపా ప్రజాప్రతినిధులు, నాయకులపై సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు, పార్టీ ప్రతిష్ఠతను దిగజార్చేలా ప్రవర్తించినందుకు క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు వివరించారు. గతంలో జిల్లా అధ్యక్షుడిగా ఉన్న బొమ్ముల దత్తు కూడా ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు గుర్తుచేశారు. తన ఇంటిపై వైకాపా జెండా కట్టడమే కాకుండా, ఆ పార్టీ నాయకులు చెప్పినట్టుగా వ్యవహరిస్తున్నారని రాష్ట్ర కమిటీకి ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

ఇప్పనపాడులో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీస్ సిబ్బంది పనిచేస్తున్నారని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ అన్నారు. బుధవారం ఇప్పనపాడు పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. స్టేషన్‌కు వివిధ పనులపై వచ్చేవారితో స్నేహపూర్వకంగా మెలగాలని సిబ్బందికి సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ బి.విద్య, రూరల్ సీఐ పి.దొరరాజు, ఎస్సై వి.కిషోర్, సిబ్బంది ఉన్నారు.

బకాయిలు చెల్లించాలని వినతి

కోరుకొండ, న్యూస్‌టుడే: విద్యా హక్కు చట్టం కింద గత నాలుగు సంవత్సరాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని మండల ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం కోరారు. ఈ సందర్భంగా ఎంఈవో టి.కుశలవదొరకు బుధవారం వినతిపత్రం అందించారు. ఒకటో తరగతిలో ప్రవేశాల కోసం రిజిస్ట్రేషన్లు చేయాలని ఒత్తిడి చేయడం తగదని, నాలుగేళ్లుగా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్లు రామారావు, అప్పలరాజు, ఈశ్వర్, షణ్ముఖ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీకి సత్కారం

టి.నగర్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని బుధవారం రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి, జ్ఞాపికను అందజేశారు. శెట్టిబలిజ, గీత కులాల అభ్యున్నతికి సహకారం అందించాలని కోరారు.

అర్తమూరులో వైభవంగా బ్రహ్మోత్సవాలు

విశేష అలంకరణలో స్వామివారు

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండపేట మండలం అర్తమూరు గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. యజ్ఞాచార్యులు కొండూరి వెంకటరమణాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు, హోమం నిర్వహించారు. సుమారు 300 మంది భక్తులు స్వామివారి మాలధారణతో దీక్షలు స్వీకరించారు. అనంతరం గోవిందనామాల ఆలాపన, విష్ణుసహస్ర నామ పారాయణం, కోలాట నృత్యం తదితర సాంస్కృతిక అంశాలు అలరించాయి. కార్యక్రమంలో సత్తి బులిస్వామిరెడ్డి, కర్రి బాపిరెడ్డి, ఉద్దగిరి ఆంజనేయులు, వెలగల శివారెడ్డి పాల్గొన్నారు.

జూడో శిక్షణ ప్రారంభం

జూడోలో తలపడుతున్న విద్యార్థులు

కపిలేశ్వరపురం, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం సర్వారాయ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వంగా శ్రీనివాస్ చేతుల మీదుగా బుధవారం జూడో శిక్షణను ప్రారంభించారు. శిక్షణ ఇస్తున్న పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు, జూడో జాతీయ క్రీడాకారుడు సుమంత్‌ను ఆయన అభినందించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ జూడో శిక్షకుడు పీవీ తేజ మాట్లాడుతూ శారీరక వ్యాయామంతో పాటు ఆత్మరక్షణకు జూడో ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్తులో విద్య, ఉద్యోగ అవకాశాలకు క్రీడలు బాటలు వేస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఈటీ రవికుమార్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్లజోళ్ల అందజేత

కళ్లజోళ్లు అందిస్తున్న సర్పంచి తదితరులు

అంగర, న్యూస్‌టుడే: జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా అంగర పీహెచ్‌సీ పరిధిలోని దృష్టిలోపాలున్న పలువురు విద్యార్థులకు బుధవారం కళ్లజోళ్లు పంపిణీచేశారు. అంగర వైద్యాధికారి డా.రత్నకుమారి ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలలో 33 మంది, కపిలేశ్వరపురంలో 30 మంది విద్యార్థులకు సర్పంచి సాకా శ్రీనివాస్ చేతుల మీదుగా వీటిని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో మల్లికార్జునుడు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి రామారావు, ఆరోగ్య సందర్శకురాలు మేరీమణి, హెల్త్ సూపర్‌వైజర్ నానిబాబు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

సమీకృత కుటుంబ సర్వే పరిశీలన

కోరుమిల్లిలో సర్వే తీరును పరిశీలిస్తున్న ఎంపీడీవో భానోజీరావు

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండలంలోని 19 గ్రామాల్లో 72 శాతం సమీకృత కుటుంబ సర్వే పూర్తయిందని ఎంపీడీవో హెచ్.భానోజీరావు తెలిపారు. మండలంలోని కోరుమిల్లి, వాకతిప్ప గ్రామాల్లో చేపట్టిన సర్వే తీరును బుధవారం ఆయన పరిశీలించారు. కోరుమిల్లి, టేకి, వాకతిప్ప, కపిలేశ్వరపురం, మాచర గ్రామాల్లో సర్వేలో వేగం పెంచాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. సమీకృత సర్వే ద్వారా పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని, సంక్షేమ పథకాలు పారదర్శకంగా అర్హులకు చేరేలా సర్వే దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో శ్రీరామమూర్తి, వీఆర్వోలు సత్తిబాబు, సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విజయదుర్గా పీఠంలో ప్రత్యేక పూజలు

పీఠాధిపతి గాడ్ ఆశీస్సులందుకుంటున్న అన్నవరం దేవస్థానం ఛైర్మన్

రాయవరం, న్యూస్‌టుడే: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠాన్ని అన్నవరం దేవస్థానం ఛైర్మన్ ఐవీ రోహిత్ బుధవారం సందర్శించారు. పీఠంలోని విజయదుర్గాదేవికి కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్)ను కలిసి ఆశీస్సులందుకున్నారు. ఛైర్మన్ రోహిత్‌ను పీఠం పర్యవేక్షకుడు వీవీ బాపిరాజు, పీఆర్వో బాబీ ఆధ్వర్యంలో సత్కరించారు.

కొనసాగుతున్న సహకార సిబ్బంది సమ్మె

సమ్మెలో పాల్గొన్న సహకార సిబ్బంది

రాయవరం, న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పనిచేస్తున్న సిబ్బందికి జీవో నంబరు 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారం మూడో రోజుకు చేరింది. రాయవరం డీసీసీబీ బ్రాంచి వద్ద నిర్వహిస్తున్న సమ్మెలో ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, మల్లిబాబు మాట్లాడుతూ 2019 తర్వాత విధుల్లో చేరిన సిబ్బంది సేవలను క్రమబద్ధీకరించాలని, పదవీ విరమణ వయస్సు 62కు పొడిగించాలని, గ్రాట్యూటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. సోమేశ్వరం, ఊలపల్లి, పందలపాక, కొంకుదురు, కొమరిపాలెం, వెదురుపాక, పులుగుర్త, మాచవరం సహకార సంఘాల ఉద్యోగులు సమ్మెలో నినాదాలు చేశారు. సంఘం నాయకులు రామకృష్ణారెడ్డి, వెంకన్నదొర, శ్రీనివాస్; పార్వతి, పీఎస్ఎన్ ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

మూడో రోజుకు వీఆర్వోల నిరసన

అంగర, న్యూస్‌టుడే: పని ఒత్తిడి తగ్గించాలని వీఆర్వోలు చేపట్టిన నిరసన కార్యక్రమాలు బుధవారం మూడో రోజుకు చేరాయి. కపిలేశ్వరపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో వీఆర్వోలు నిరసన చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి, పని గంటలు తగ్గించాలని నినాదాలు చేశారు.

'ఎమ్మెల్సీ తోట విమర్శలు అర్థరహితం'

రాయవరం, న్యూస్‌టుడే: చెల్లూరు శివారులో పంటచేల నుంచి అనుమతులు లేకుండా మట్టిని తరలించిన ఘటనలో తెదేపా నాయకులపై ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మంగళవారం చేసిన విమర్శలు అర్థరహితమని కోనసీమ జిల్లా తెదేపా అధికార ప్రతినిధి దేవు వెంకట్రాజు (శ్రీను) వ్యాఖ్యానించారు. బుధవారం గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గ్రామంలోని విద్యుత్తు ఉపకేంద్రం వెనుక రజకుల చెరువు మట్టినే గత ప్రభుత్వ హయాంలో సంబంధిత రైతు చేనుకు తరలించారన్నారు. తిరిగి ఆ మట్టిని బట్టీలకు తరలించే క్రమంలోనే మైనింగ్ అధికారులకు అపరాధ రుసుం చెల్లించిన విషయాన్ని గుర్తుచేశారు. పార్టీ గ్రామాధ్యక్షుడు చుండ్రు వీర్రాజు మాట్లాడుతూ కలెక్టర్, డీఎఫ్‌వో ఆదేశాలతో మార్ని అచ్చిబాబు మకాంలో ప్రభుత్వ నర్సరీగా మొక్కల పెంపకానికే మట్టిని తరలించారన్నారు. మాజీ సర్పంచి మోరంపూడి రాజ్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే వేగుళ్ల సహకారంతో రూ.5.65 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు.

నువ్వుల సాగుతో మెట్ట రైతులకు మేలు

నువ్వులపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

రంగంపేట, న్యూస్‌టుడే: రబీ సీజన్‌లో నువ్వుల పంట సాగుచేస్తే అధిక, నాణ్యమైన దిగుబడితో నూనె ఉత్పత్తి చేయవచ్చని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు తెలిపారు. రంగంపేటలో సాగులో ఉన్న నువ్వుల పంటను వ్యవసాయ శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. తక్కువ నీటితో, మరింత తక్కువ పెట్టుబడితో సాగయ్యే ఈ పంటపై మెట్ట రైతులు దృష్టి సారించాలని ప్రధాన శాస్త్రవేత్త హనుమకొండ శ్రీనివాస్ సూచించారు. శాస్త్రవేత్త జయలక్ష్మి, ఏవో కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు అన్నారు. అనపర్తి జూనియర్ సివిల్ కోర్టులో పోలీసులు, న్యాయవాదులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 14న జరిగే లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకునేలా కక్షిదారులతో మాట్లాడాలన్నారు. కార్యక్రమంలో అనపర్తి జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి రాఘవేంద్రరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షణ్ముఖరెడ్డి, సీఐ సుమంత్, అదనపు ఎస్సై దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు, న్యాయవాదులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి వెంకటేశ్వరరావు

ప్రమాద బీమా చెక్కు అందజేత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రాజమహేంద్రవరంలోని ది జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు సభ్యుడు చుక్కా కొండలరావు కుటుంబ సభ్యులకు ప్రమాద బీమా సొమ్ము బుధవారం అందజేశారు. రూ.లక్ష చెక్కును బ్యాంకు పాలకవర్గ ఛైర్మన్ బొమ్మన జయకుమార్, సీఈవో మద్దాల విజయప్రతాప్ తదితరులు మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు.

పాఠశాలకు వితరణ

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండపేట మండలం ఏడిద ఆదర్శ ప్రాథమిక పాఠశాల పూర్వ విద్యార్థి రిమ్మలపూడి జానికీరామ్ బుధవారం పాఠశాలకు మైక్ సెట్ అందజేశారు. రూ.11 వేల విలువైన మైక్ సెట్ పాఠశాలకు ఎంతో అవసరమని హెచ్ఎం ముత్యాల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సొసైటీ ఛైర్మన్ గొడవర్తి సత్యనారాయణ, బండారు వెంకటరమణ, రామిశెట్టి రాజా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాంతి పరిరక్షణ కమిటీ ఏర్పాటు

మండపేట, న్యూస్‌టుడే: పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలని సీఐ సురేష్ కోరారు. శాంతి పరిరక్షణ కమిటీ ఏర్పాటుచేసిన సందర్భంగా ముస్లిం మతపెద్దలతో ఆయన బుధవారం మాట్లాడారు. రంజాన్‌తో పాటు భవిష్యత్తులో వచ్చే పండుగలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అల్లర్లకు తావులేకుండా చూడాలని కోరారు.

ముస్లిం మతపెద్దలతో మాట్లాడుతున్న సీఐ సురేష్

ప్రయాణికురాలి బంగారు గొలుసు మాయం

గోకవరం, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలి బంగారు నెక్లెస్ మాయమైంది. వివరాలివీ.. గోకవరం గ్రామానికి చెందిన లక్ష్మీ సీతానగరం వెళ్లారు. బుధవారం సాయంత్రం గోకవరం వచ్చేందుకు రాజమహేంద్రవరంలో సింగిల్ స్టాప్ బస్సు ఎక్కారు. రాజమహేంద్రవరం దాటుతుండగా బ్యాగు తెరచి ఉండడాన్ని గమనించగా అందులో ఉంచిన రెండు కాసుల బంగారు నెక్లెస్ మాయమైనట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గోకవరం డిపో వద్దకు చేరుకున్న తరువాత ప్రయాణికులను తనిఖీ చేశారు. అయినప్పటికీ నెక్లెస్ దొరకకపోవడంతో ఘటన జరిగిన రాజమహేంద్రవరం పరిధిలో ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.

కానేడు మార్గం.. అభివృద్ధికి ఊతం

బిక్కవోలు, న్యూస్‌టుడే: గుంతలతో నిండి.. ఎగుడుదిగుడుగా.. అధ్వానంగా మారిన కానేడు రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి రూ.2 కోట్లు మంజూరు చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గం దాదాపు 15 సంవత్సరాలుగా అధ్వానంగా మారింది. బలభద్రపురం నుంచి శివారు గ్రామం కానేడు మీదుగా నల్లమిల్లి రోడ్డు వరకు నాలుగు కిలోమీటర్ల పొడవైన ఈ రోడ్డు ఎక్కువగా రైతులకే ఉపయోగ పడుతోంది. కోళ్ల రైతులతో పాటు, వివిధ పరిశ్రమలు, వరి పొలాలు, పామాయిల్ తోటలు ఉండడంతో ఆయా రైతులు, కార్మికులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు అధ్వానస్థితికి చేరడంతో వాహనాలతో ప్రయాణించడం తీవ్ర ఇబ్బందిగా మారింది. దీనిపై 2021 నవంబర్‌లో ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ అప్పటి ఛైర్మన్ కర్రి వెంకట ముకుందరెడ్డి, బలభద్రపురం సాయిబాబా మందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు పురుషోత్తమరెడ్డి తదితరులు చేయిచేయి కలిపి చందాలు వసూలుచేసి దాదాపు రూ.40 లక్షలతో గ్రావెల్‌తో అభివృద్ధి చేయించారు.

10 నుంచి 16 అడుగులకు విస్తరణ..

అప్పటివరకు 10 అడుగుల వెడల్పుతో ఉన్న రోడ్డును వాహనాల రాకపోకలకు వీలుగా 16 అడుగులకు పెంచారు. అప్పట్లో వర్షపునీరు బయటకు పోయేందుకు వీలుగా కొద్దిమేర డ్రైన్ కూడా ఏర్పాటుచేశారు. తామంతా సమైక్యంగా రూ.40 లక్షలతో అభివృద్ధి చేసుకున్నామని ఇప్పుడు రూ.కోటి ఇస్తే మొత్తం తారురోడ్డుగా మారుతుందని గ్రామపెద్దలు విజ్ఞప్తులు చేశారు. అయితే ఎన్ని విజ్ఞప్తులుచేసినా గత పాలకులు కరుణించలేదు. అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. రైతుల ఇబ్బందులు తొలగించేందుకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నడుం బిగించారు. సాస్కీ నిధుల నుంచి రూ.రెండు కోట్లు మంజూరవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టెండర్లు పిలిచి త్వరలోనే పనులు ప్రారంభిస్తామని డీఈఈ తెలిపారు.

అభివృద్ధి చేయనున్న మార్గం ఇదే..

(c) eenadu

అభయారణ్యంలోకి పులి!

కదలికల పరిశీలనకు రేడియో కాలర్ ఏర్పాటు

పోలవరం, న్యూస్‌టుడే: మూడు వారాల పాటు అభయారణ్యం నుంచి జనారణ్యంలోకి వచ్చి అటవీశాఖ అధికారులు, రైతులు, గ్రామస్థులను పరుగులు పెట్టించిన పెద్ద పులి తిరిగి పాపికొండల అభయారణ్యంలోకి చేరుకుంది. కూర్మాపురం వద్ద పట్టుకున్న పెద్ద పులిని విశాఖ జూ పార్కుకు తరలించి వైద్యుల పర్యవేక్షణలో కొద్ది రోజులు అక్కడే ఉంచారు. పులి ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు నిర్ధారించడంతో తిరిగి పాపికొండల అభయారణ్యంలోకి తీసుకొచ్చి విడిచిపెట్టారు. జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా పులి కదలికలు నిరంతరం పరిశీలించేందుకు వీలుగా రేడియో కాలర్ ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఎప్పటికప్పుడు అటవీశాఖ కార్యాలయం నుంచి పరిశీలించడంతోపాటు క్షేత్రస్థాయిలో రక్షణ కల్పించడం కోసం అభయారణ్యంలోని సిబ్బందితో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. అభయారణ్యంలోని గ్రామాల ప్రజలు పులికి హాని తలపెట్టకూడదని అటవీశాఖాధికారులు సూచించారు. ఏలూరు జిల్లా పరిధిలో 12 రోజులపాటు బుట్టాయగూడెం, కొయ్యలగూడెం, పోలవరం మండలంలో తిరిగిన పులి గత నెల 31వ తేదీన పట్టిసీమ వద్ద గోదావరి దాటి తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలో ప్రవేశించింది. తర్వాత రాజమహేంద్రవరం పట్టణ పరిసరాల్లో తిరగడంతో పట్టుకోవడానికి అటవీశాఖాధికారులు పుణె నుంచి నిపుణులను రప్పించి ఎట్టకేలకు బంధించగలిగారు. 1.05 లక్షల హెక్టార్లలో విస్తరించి ఉన్న పాపికొండల అభయారణ్యంలో 2023 వన్యప్రాణి విభాగం నివేదిక ఆధారంగా పులులు జంట ఉన్నట్లు భావిస్తున్నారు. 2026 పులుల గణన ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో కొత్తగా ఎన్ని ఉన్నాయి.. అన్న విషయం వెల్లడయ్యే అవకాశం ఉంది.

మిగిలింది 2 రోజులే..

ఈ-పంట నమోదుకు 20 వరకు గడువు

జంగారెడ్డిగూడెం, కుక్కునూరు, న్యూస్‌టుడే: రైతులు సాగు చేసిన పంటలను ప్రభుత్వం గుర్తించేందుకు ఈ-పంట నమోదు తప్పనిసరి. బీమా వర్తించాలన్నా, పంట విక్రయించాలన్నా, ఎరువులు కావాలన్నా, సంక్షేమ పథకాలు, రాయితీలు పొందాలన్నా వివరాలు నమోదు అవసరం. ప్రస్తుతం సాగవుతున్న రబీ పంటల వివరాల నమోదు గడువు ఈ నెల 20తో ముగుస్తోంది. జిల్లాలో రబీలో వరితోపాటు మొక్కజొన్న, వేరుశనగ, చెరకు వంటి పంటలు సాగులో ఉన్నాయి.

◆ రైతు సేవాకేంద్రాల ద్వారా గ్రామ వ్యవసాయ సహాయకులు రెండు నెలల నుంచి నమోదు ప్రక్రియ కొనసాగిస్తున్నారు. రైతులు కూడా మొబైల్ యాప్ ద్వారా నేరుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

గత ఖరీఫ్‌లో ఈ-పంట నమోదు ఇలా.. (ఎకరాల్లో)

5,15,263 జిల్లాలో మొత్తం విస్తీర్ణం	
4,90,560	3,84,667
సాగు అంచనా	ఈ-పంట నమోదు

కరెంటు ఇబ్బంది ఉందా.. సిబ్బంది వస్తున్నారా?

☆ ఐవీఆర్ఎస్ కాల్స్‌తో అభిప్రాయ సేకరణ
☆ సంతృప్తి స్థాయిలో ఏలూరు 13, పశ్చిమకు 9వ ర్యాంకులు

ఈనాడు-ఏలూరు: ప్రజలకు నిరంతర విద్యుత్తు సరఫరా ఉంటుందా? ఇంటికి నాణ్యమైన విద్యుత్తు అందుతుందా? సిబ్బంది మీకు అందుబాటులో ఉంటున్నారా అని ప్రభుత్వం ఐవీఆర్ఎస్ కాల్స్ చేసి ప్రజల స్పందన తెలుసుకుంది. ఈ సర్వే ఏడాది మొత్తానికి, అక్టోబర్ కాలానికి, గత జనవరి నెలకు సంబంధించి మొత్తం మూడు విడతలుగా సాగింది. నేరుగా ప్రభుత్వమే వినియోగదారులకు ఫోన్లు చేసి వారి సంతృప్తి స్థాయిలను తెలుసుకుంది. ఏలూరు జిల్లాలో కుక్కునూరు, కొయ్యలగూడెం, ఏలూరు నగరం, పశ్చిమగోదావరి జిల్లాలో తాడేపల్లిగూడెం, తేతలి, పాలకొల్లు, పెనుగొండ పరిధిలోని వినియోగదారులు అభిప్రాయాలు తెలియజేశారు. రెండు జిల్లాల్లో వేర్వేరుగా సాగిన సర్వే ఫలితాలు ఇలా ఉన్నాయి.

వినియోగదారులను అడిగిన ప్రశ్నలు ఇవీ..	జిల్లా	అవును	లేదు
1. మీకు నిరంతర విద్యుత్తు సరఫరా జరుగుతుందా?	ఏలూరు	78.3	21.7
	పశ్చిమ	80.3	19.7
2. మీ ఇంటికి నాణ్యమైన విద్యుత్తు అందుతుందా?		74.6	25.4
		74.3	25.7
3. సిబ్బంది మీకు అందుబాటులో ఉన్నారా?		75.5	24.5
		76.3	23.7
సేవలపై సానుకూలత శాతాల్లో		77.0	78.0
ర్యాంకు రాష్ట్రస్థాయిలో		13	9

పెద్దింట్లమ్మా.. పాహిమాం..

వైభవంగా ప్రారంభమైన జాతర

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కైకలూరు, న్యూస్‌టుడే: భక్తుల కొంగుబంగారం శ్రీ పెద్దింట్లమ్మ విరాజిల్లుతోన్న కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతర బుధవారం ప్రారంభమైంది. వేకువ జామునుంచి పండితులు వేద మంత్రోచ్ఛారణ మంగళ వాయిద్యాలు, సన్నాయి మేళాల నడుమ విఘ్నేశ్వర పూజ, జల దుర్గ సమేత పెద్దింట్లమ్మకు పంచామృతాభిషేకం, శ్రీచక్రార్చన, నూతన వస్త్రాలంకరణ, బాలభోగం, ధూపసేవ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం ఛైర్మన్ జల్లూరి వెంకన్నబాబు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఈవో కె. శ్రీనివాస్, రాష్ట్ర వడ్డి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఘంటసాల వెంకటలక్ష్మి, గ్రామస్థులతో కలిసి ఉదయం 8.54 గంటలకు జాతర ప్రారంభించారు. సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి పంచహారతుల కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలపాడు గ్రామ ప్రారంభం వద్ద దాత వానపల్లి బాబూరావు ఆర్థిక సహకారంతో రూ.35 లక్షలతో నిర్మించే అమ్మవారి ముఖ ద్వారం పనులకు ఎమ్మెల్సీ జయమంగళ, దాతతో కలిసి ఎమ్మెల్యే కామినేని భూమి పూజ నిర్వహించారు.

ఆలయ ముఖద్వారం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కామినేని, ఎమ్మెల్సీ జయమంగళ తదితరులు

సేవాలోపాలు గుర్తిస్తే అధికారులపై చర్యలు : కలెక్టర్

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించాల్సిన బాధ్యత ఆర్టీసీ అధికారులు, సిబ్బందిపై ఉందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. సేవా లోపాలను గుర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బుధవారం నూజివీడు ఆర్టీసీ బస్ స్టాండ్‌లో ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, ఉద్యోగుల ప్రవర్తన తదితరాలను ఆమె పరిశీలించారు. పలువురు ప్రయాణికులతో మాట్లాడి సౌకర్యాలను ఆరా తీశారు. ఇటీవల మంత్రి పార్థసారథి డీఆర్‌సీ సమావేశంలో నూజివీడు బస్ స్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరిన మీదట సౌకర్యాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికుల ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన రెయిలింగ్‌లు ఊడిపోవడం, సరిపడా కుర్చీలు లేకపోవడం, రంగులు వేస్తుండటాన్ని గమనించి.. తాను వస్తున్నానని ఈ ఏర్పాట్లు చేస్తున్నారా అంటూ డీపీటీవో షబ్నమ్‌ను ప్రశ్నించారు. మరుగుదొడ్లను పరిశీలించిన ఆమె పలు సూచనలు చేశారు. ఆవరణలో విద్యుత్తు వైర్లు, పైపులు వేలాడుతున్నాయని, వాటిని క్రమపద్ధతిలో ఉండేలా చూడాలని ఆదేశించారు.

నూజివీడు బస్‌స్టాండ్‌లో రెయిలింగ్ వంగిపోవడంపై ప్రశ్నిస్తున్న వెట్రిసెల్వి

సౌకర్యాలపై అసంతృప్తి.. ఐవీఆర్ఎస్ సర్వేలో ఆర్టీసీ బస్ స్టాండ్‌లో సౌకర్యాలపై అసంతృప్తి వ్యక్తమైన నేపథ్యంలో ఈ తనిఖీ కొనసాగింది. నాన్‌స్టాప్ బస్సుల స్థానంలో పల్లెవెలుగు బస్సులు కేటాయించడం, విజయవాడ వెళ్లాలంటే 308 నంబరు బస్సులపైనే ఆధారపడాల్సి వస్తుందని నూజివీడు డిపో బస్సులు విజయవాడకు లేవని ప్రయాణికులు కలెక్టర్‌కు వివరించారు.

ఏసీలు పనిచేయక.. ఫ్యాన్లు తిరగక

ఏలూరు బోధనాసుపత్రిలో రోగులకు తప్పని అవస్థలు

ఈనాడు-ఏలూరు: రోజు రోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఫ్యాన్, లేదా ఏసీ లేనిదే ఉండలేని పరిస్థితి. ఇక రోగులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఆసుపత్రులకు వచ్చేవారు ఫ్యాన్ కింద బెడ్ దొరికితే చాలనుకుంటున్నారు. కానీ ఏలూరు ప్రభుత్వ బోధనాసుపత్రిలో అత్యవసర వైద్య సేవలు అందించే ట్రామాకేర్ విభాగంలో ఏసీలు పనిచేయక, ఫ్యాన్ గాలికి నోచుకోక రోగులు విలవిల్లాడుతున్నారు. ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లలో కొన్ని ఏసీలు పనిచేయటం లేదు. అయినా ఆసుపత్రి ఉన్నతాధికారులకు పట్టడం లేదు. వాటిని పునరుద్ధరించకుండా చోద్యం చూడటంపై విమర్శలొస్తున్నాయి.

ఏసీలు పనిచేయక రోగులకు ఇబ్బందులు

కనిపించని ఫ్యాన్

కిటికీలు.. ద్వారాలు తెరచి

ట్రామాకేర్, ఐసీయూల్లో 24 గంటలూ ఏసీ ఆన్‌చేసి ఉంచాలి. శస్త్రచికిత్సలు చేశాక కుట్లు అతుక్కోవటానికి, రోగి త్వరగా కోలుకోవటానికి ఈ విభాగంలో ఉంచుతారు. స్వయంగా గాలి పీల్చుకునే పరిస్థితి లేకపోతే ఆక్సిజన్ కాన్సంట్రేటర్ల ద్వారా అది తీసుకోవటానికి ట్రామాకేర్ విభాగం దోహదం చేస్తుంది. ఈ కీలక విభాగంలోని ఏసీలు, ఫ్యాన్లు పనిచేయక రోగులు ఇబ్బందులు పడుతున్నారని గమనించి కిటికీలు, ద్వారాలు తెరిచి ప్రస్తుతం సేవలు అందిస్తున్నారు. అత్యవసర వైద్య విభాగంలో కిటికీలు, ద్వారాలు తెరిస్తే దుమ్ము, ధూళి, క్రిములు చేరతాయని రోగులు ఆందోళన చెందుతున్నారు.

అందుబాటులో ఉండక.. అత్యవసర విభాగంలో ఏసీలు, ఫ్యాన్లు తిరగటం లేదని సాధ్యమైనంత వరకు వైద్యులు ఓపీలోనే గడుపుతున్నారు. అత్యవసర కేసులు వచ్చినప్పుడు వచ్చి చూస్తున్నారు. రహదారి, అగ్ని, ఇతర ప్రమాదాల్లో చిక్కుకున్నవారిని తొలుత తీసుకొచ్చేది ఈ ట్రామాకేర్‌కు. ఇక్కడే ఈ పరిస్థితి నెలకొనడం దారుణం.

మరమ్మతులు చేయిస్తాం : 'ట్రామాకేర్‌లో పని చేయని ఏసీలు, ఫ్యాన్లకు త్వరలో మరమ్మతులు చేయిస్తాం. కిటికీలు, ద్వారాలు తీసి వైద్యం అందిస్తున్న విషయం నా దృష్టికి వచ్చింది. త్వరలోనే సమస్యను అధిగమిస్తాం' అని ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ రవిచంద్ర తెలిపారు.

56 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు: ఆర్ఐవో

మాట్లాడుతున్న యోహాన్

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, ఎక్కడా చూచి రాతకు వీల్లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆర్ఐవో కె.యోహాన్ ఆదేశించారు. ఇంటర్ పరీక్షలు ఈ నెల 23 నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో.. స్థానిక సీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ముఖ్య పర్యవేక్షకులు, విభాగాధికారులు, కస్టోడియన్లకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఐవో మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 56 కేంద్రాలు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. అన్ని చోట్లా ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలుంటాయని స్పష్టం చేశారు. ఇంటర్ విద్యామండలి కార్యదర్శి రంజిత్ బాషా పరీక్షల నిర్వహణపై వర్చువల్ విధానంలో సూచనలిచ్చారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు. జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు జి.కుసుమ, ఎల్.శ్యామ్‌కుమార్, బీవీ శ్రీనివాస్, కె.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాలయాల్లో ఉచిత ప్రవేశాలకు 10 వరకు గడువు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: విద్యా హక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశానికి మార్చి 10లోపు దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిక్షా ఏపీసీ పంకజ్ కుమార్ తెలిపారు. ఈ చట్టం ప్రకారం మొత్తం 25 శాతం సీట్లను పేద పిల్లలకు కేటాయిస్తారన్నారు. ఇందులో ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, ఈడబ్ల్యూఎస్, మైనార్టీలకు 6 శాతం, డిజట్వాంటేజ్ గ్రూపు వారికి 5 శాతం ఇస్తారన్నారు. తల్లిదండ్రులు నిర్ణీత గడువులోపు https:/// cse.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రాధాన్య క్రమంలో ఒకటి కంటే ఎక్కువ పాఠశాలలను ఎంపిక చేసుకునే అవకాశముందని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రతిభ చాటి.. పతకాలు పట్టి
రంజాన్ మాసం.. సద్గుణాల ధామం
6లో

అరటి రైతుకు తీపి కబురు

టన్నుకు రూ.18 వేల వరకు ధర

చింతలపూడి, న్యూస్‌టుడే: ఉగాది, శ్రీరామనవమి పండగలు సమీపిస్తున్న వేళ అరటి ధర అమాంతం పెరిగింది. ప్రస్తుతం టన్ను రూ.16 వేల నుంచి రూ.18 వేలు పలుకుతోంది. తమ కష్టానికి తగిన ఫలితం దక్కిందని అన్నదాతలు ఆనందపడుతున్నారు. గత ఏడాది దీపావళి, దసరా సమయంలో అరటి ధరలు బాగా పడిపోయాయి. ఎంతలా అంటే టన్ను రూ.4 వేలకు కొనేందుకు కూడా ఎవరూ ముందుకు రాలేదు. కూలి కూడా రావట్లేదని చాలా మంది రైతులు గెలలను తోటల్లోనే వదిలేశారు. పెట్టుబడులు కూడా రాకపోవడంతో రూ.లక్షల్లో నష్టపోయారు. ప్రస్తుతం ధర బాగుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో 5 వేల ఎకరాలకు పైబడి ఉన్న సాగు కొద్ది కాలంగా తగ్గిపోవడంతో 3,918 ఎకరాల్లోనే ఉంది. జిల్లాలో అత్యధికంగా ముసునూరులో 816 ఎకరాలు సాగు చేస్తున్నారు. రాబోయే రోజుల్లో టన్ను రూ.20 వేలకు చేరుకుంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. 'గత ఏడాదితో పోలిస్తే భారీగా పెరిగింది. రాబోయే రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉంది' అని ఉద్యానశాఖ ఏడీ సంతోష్ తెలిపారు.

లింగపాలెంలో గెలలను తరలిస్తున్న రైతు

రాయితీ రాలేదు.. రేషన్ అందలేదు!

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: 'వంట గ్యాస్ సిలిండరు రాయితీ సొమ్ము నెలలుగా జమవడం లేదు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. నెలాఖరులో రేషన్ డీలర్లు ఇంటి వద్దే నిత్యావసరాలు అందజేస్తామంటూ వృద్ధుల వేలిముద్రలు తీసుకుంటున్నారు. కానీ, సరకులకు మాత్రం చౌక దుకాణానికి రమ్మంటున్నారు' అని పలువురు ఏకరవు పెట్టారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎస్వోలో పలువురు ఫోన్ చేసి సమస్యలు విన్నవించారు. వాటన్నింటినీ డీఎస్వో విలియమ్స్ విని, కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు.

❓ **సమస్య:** వంట గ్యాస్ సిలిండరు ఇంటికి తీసుకొచ్చేందుకు అదనంగా సొమ్ము వసూలు చేస్తున్నారు. బిల్లు మాత్రం ఇవ్వడం లేదు **- ఎస్.వెంకటేశ్వర్లు, పోలవరం; జి.అప్పయ్య, గురవాయిగూడెం, కలిదిండి మండలం**

» **సమాధానం:** ఆయా గ్యాస్ ఏజెన్సీ సిబ్బందిని విచారించి, తగు చర్యలు తీసుకుంటాం.

❓ మా రేషన్ డీలరు మంచానికే పరిమితమైన వృద్ధుల ఇళ్ల వద్దకెళ్లి వేలిముద్రలు వేయించుకుంటున్నారు. సరకులు మాత్రం ఇవ్వడం లేదు. చౌక దుకాణానికి రమ్మంటున్నారు. **- ఒక యువకుడు, బొమ్మిడి, ఉంగుటూరు మండలం**

» సీఎస్ డీటీని గ్రామానికి పంపి విచారణ చేయిస్తాం. ఆయన నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం.

డయల్ యువర్ డీఎస్వోకు ఫిర్యాదుల వెల్లువ

❓ పెట్రోలు బంకుల్లో గాలి యంత్రాలు పని చేయడం లేదు. **- వై.సత్యనారాయణ, జంగారెడ్డిగూడెం**

» బంకులను తనిఖీ చేస్తాం. యంత్రాలు పని చేయకుంటే మరమ్మతులు చేయిస్తాం.

❓ రేషన్ దుకాణాల్లో కందిపప్పు ఇవ్వడం లేదు. **- వై.బాబ్జీ, చేబ్రోలు, ఉంగుటూరు మండలం**

» ఎక్కువ మంది కార్డుదారులు కందిపప్పు కావాలని అడుగుతున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తాం.

ఫోన్‌లో సమస్యలు వింటూ.. నమోదు చేసుకుంటున్న విలియమ్స్, సిబ్బంది

❓ వంట గ్యాస్ సిలిండర్ రాయితీ సొమ్ము మరొకరి ఖాతాలో జమవుతోంది. **- బి.ప్రకాశ్, ఏలూరు**

» సమస్య పరిష్కారిస్తాం.

❓ మా బంధువొకరు వృద్ధాప్యం కారణంగా మంచానికే పరిమితమయ్యారు. ఆమెకు పింఛను ఇప్పించగలరు. **- ఎం.అన్నపూర్ణ, ఏలూరు**

» వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకోండి. అర్హత ఉంటే ప్రభుత్వం పింఛను మంజూరు చేయిస్తుంది.

తమకు వంట గ్యాస్ సిలిండరు రాయితీ సొమ్ము జమవడం లేదని సుమారు పది మందికి పైగా విన్నవించారు. వారి కంజ్యూమర్ నంబరును తెలుసుకున్న డీఎస్వో.. అక్కడికక్కడే వివరాలు పరిశీలించారు. ఎందుకు నగదు జమవడం లేదో వివరించారు. అర్హులకు సొమ్ము రాకుంటే అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

ఊచలు లేచాయ్ ఊపిరి తీస్తాయ్

నూజివీడు మండలం మర్రిబంధం నుంచి సీతారాంపురం వెళ్లే మార్గంలో పోలవరం కాలువపై ఉన్న వంతెన ఊచలు తేలి ప్రమాదకరంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో వాహనదారులు, పాదచారుల రాకపోకలప్పుడు ఊచలు అడ్డంపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పరిశీలించి వంతెనకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. **- ఈనాడు, నూజివీడు**

పాఠశాలల్లో భాషోత్సవాలు

21న మండల, 23న జిల్లా స్థాయి పోటీలు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం పురస్కరించుకుని విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాలల్లో బుధవారం నుంచి భాషోత్సవాలు ప్రారంభమయ్యాయి. పాఠశాల స్థాయిలో తొలిరోజు 18వ తేదీన 1-10 తరగతులకు ఆంగ్లం భాషకు సంబంధించి వివిధ అంశాల్లో కార్యక్రమాలను నిర్వహించారు. 6-12 తరగతులకు 19న హిందీ, సంస్కృతం, ఉర్దూ, 20న తెలుగు భాషలపై పోటీలు జరుగుతాయి. 21న మండల, 23న జిల్లా స్థాయిలో నిర్వహిస్తారు.

పోటీల్లో అంశాలు: వక్తృత్వం, లఘు నాటికలు, మాతృభాషలో చిట్టి కథల రచన, పద్యపఠనం, పద్యాలాపన, వ్యాకరణం, పాటలు, చర్చాగోష్ఠులు తదితర అంశాలపై పోటీలు ఉంటాయి.

ఎంపిక ఇలా: పాఠశాల స్థాయిలో విజేతలైన విద్యార్థులు మండలస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంది. తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ భాషల పోటీల్లో సెకండరీ స్థాయి నుంచి ఒక్కొక్కరిని, ఆంగ్ల భాష పోటీల్లో 1-5తరగతుల నుంచి ఒకరిని, 6-10తరగతుల నుంచి ఒకరిని ఎంపిక చేస్తారని సమగ్ర శిక్షా ఏఎమ్‌వో రెడ్డి రామారావు తెలిపారు.

బెయిల్‌పై వచ్చి.. చోరీకి పాల్పడి

ఈనాడు ఏలూరు, పొన్నూరు, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే తల్లి ఇంట్లో చోరీ చేసిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. రెండు రోజుల కిందట గుంటూరు జిల్లా పొన్నూరు పరిధి చింతలపూడిలోని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మాతృమూర్తి ప్రమీలాదేవి ఇంట్లో రూ.70 లక్షలకు పైగా విలువైన బంగారం, వెండి ఆభరణాలు చోరీ అయిన విషయం తెలిసిందే. ఆ కేసులో ఏలూరు జిల్లా పెదపాడుకు చెందిన రాజేష్‌ను ప్రధాన నిందితుడిగా పోలీసులు గుర్తించారు. అతనిపై పెదపాడు పోలీసుస్టేషన్‌లో పలు కేసులు ఉన్నాయి. ఓ కేసులో నాలుగు రోజులు కిందటే జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చి ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. రాజేష్ తన సన్నిహితులు కొందరితో కలిసి ఒంగోలులో వాలీబాల్ ఆడేందుకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఈ చోరీకి పాల్పడినట్లు సమాచారం. పొన్నూరు గ్రామీణ సీఐ కృష్ణయ్య తన బృందంతో అతన్ని పట్టుకోవడానికి మంగళవారం ఏలూరుకు వచ్చారు. స్థానిక ఏలూరు పోలీసుల సహకారంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. 10 కేజీల వెండిని స్వాధీనం చేసుకోగా, కొంత బంగారాన్ని విక్రయించినట్లు సమాచారం. మిగతా ఆభరణాలను ఏలూరు పరిధిలోని ఓ వైకాపా సర్పంచి ఇంట్లో పెట్టినట్లు సమాచారం. సదరు వైకాపా సర్పంచిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

జంతికల గణపతి

ఏలూరు సత్రంపాడులోని లక్ష్మీగణపతి ఆలయంలో బుధవారం గణనాథుడికి విశేషాలంకరణ చేశారు. ఉదయం అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు చేసి.. జంతికలతో సుందరంగా తీర్చిదిద్దారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని. . మొక్కులు తీర్చుకున్నారు. **- న్యూస్‌టుడే, ఏలూరు ఆధ్యాత్మికం**

చిన్నారి తల్లులు

▲ అత్యధిక జిల్లాల్లో మనమూ..
▲ పాపులేషన్ మేనేజ్‌మెంట్ సర్వే 2025-26 వెల్లడి

జంగారెడ్డిగూడెం, కుక్కునూరు, న్యూస్‌టుడే

ఇటీవల జరిపిన 'పాపులేషన్ మేనేజ్‌మెంటు సర్వే 2025-26'లో జిల్లా అత్యధిక కౌమార గర్భధారణలు జాబితాలో ఉన్నట్లు తెలింది. తీవ్రత 12-15 శాతం ఉంటే ప్రమాదకరం, 10-12 శాతంగా ఉంటే అత్యంత ఎక్కువ. ఏలూరు జిల్లా 10-12%లో ఉంది.

ఆడపిల్లల వివాహ వయస్సు 18 ఏళ్లు. ఆ సమయంలో పెళ్లి చేస్తే ఏడాది తర్వాత గర్భం దాల్చుతారని అంచనా. అంటే 19 ఏళ్లకు తక్కువ వయస్సులో గర్భం దాల్చటం ప్రమాదకరమని వైద్యఆరోగ్యశాఖ నిర్ణయం. 13-19 ఏళ్ల ప్రాయంలో గర్భం దాలిస్తే అనారోగ్య పరిస్థితులకు దారితీస్తాయని కేంద్ర వైద్యఆరోగ్య మంత్రిత్వ శాఖ హెచ్చరిస్తోంది. ఈ వయసులో ప్రసవం జరిగితే పుట్టే బిడ్డలు బరువు తక్కువగా ఉండటం, తల్లీబిడ్డల్లో రక్తహీనత, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ఒక్కోసారి మరణానికి దారితీయవచ్చని వైద్యనిపుణులు చెబుతున్నారు.

● జీలుగుమిల్లి మండలంలోని ఓ ఆశ్రమ పాఠశాలలో ఇటీవల 10వ తరగతి విద్యార్థిని గర్భం దాల్చింది. కారణాలు పక్కన పెడితే 10వ తరగతి అంటే 15-16 ఏళ్ల వయస్సు. ఇంత చిన్న వయస్సులో గర్భం దాల్చటం అనారోగ్య సమస్యలకు దారితీస్తుంది. ఒక్కో సమయంలో మరణం కూడా సంభవించవచ్చు.

● 2024 డిసెంబరులో ఏలూరులోని ఓ వసతిగృహంలో 17 ఏళ్ల ఇంటర్ విద్యార్థిని బిడ్డకు జన్మనిచ్చింది. మరుగుదొడ్డిలో జరిగిన ప్రసవంతో ఉదంతం వెలుగులోకి వచ్చింది.

● ఇటీవల మన్యంలో గర్భస్రావాలు అధికంగా జరిగినట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. 15 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో 281 గర్భస్రావాలు జరగటం ఆందోళన కలిగించే అంశం. ఇందులోనూ కౌమార గర్భధారణలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కౌమార గర్భధారణ శాతం తగ్గించే దిశగా.. జిల్లాలో కౌమార గర్భధారణ 10-12 శాతం మధ్య ఉండటం ఆందోళన కలిగిస్తున్న అంశం. ఇటీవల జరిగిన మంత్రులు, కార్యదర్శుల సదస్సులో రాష్ట్ర వ్యాప్తంగా ఈ రేటు 8.8శాతం చేరటంపై ఆందోళన వ్యక్తమైంది. అప్రమత్తంగా ఉండాలని సీఎం ఉపదేశించారు. 2025-26లో ఈ రేటు 5కుతగ్గేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని జిల్లాల్లోనూ ఈ పరిమితికి లోబడి రేటు నమోదు కావాలని సూచించారు.

ప్రవాహంలా నిధులు.. పడకేసిన పనులు

కదలిక లేని రహదారుల నిర్మాణం

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యంలోని మారుమూల గ్రామాలకు రహదారులు మంజూరైనా అటవీశాఖ అభ్యంతరాలతో పనులు చేసేందుకు లేక అడుగు ముందుకు పడటం లేదు. దీంతో కొండరెడ్డి తెగ గిరిజనులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. అటవీశాఖ నుంచి అనుమతులు సాధించి పనులు పూర్తి చేయించేందుకు పట్టించుకున్న నాథులు కొరవడటంతో ఈ పరిస్థితి నెలకొంది.

ఏడాదికి పైగా.. ప్రధాన మంత్రి జన్‌మన్ పథకం కింద లంకపాకల నుంచి రేగులపాడుకు 2.8 కి.మీ. మేర రూ.3 కోట్లు, గురుగుమిల్లి నుంచి గొట్టాలరేవుకు 6.3 కి.మీ మేర రూ.2.80 కోట్లు, రెడ్డికోపల్లి నుంచి వీరన్నపాలేనికి 4 కి.మీ మేర రూ.4.08 కోట్లు, వింజరం నుంచి ఉడతపల్లికి 8.8 కి.మీ మేర రూ.8.72 కోట్ల అంచనాతో రహదారులు మంజూరయ్యాయి. పంచాయతీరాజ్ శాఖ ద్వారా పనులు చేపట్టాల్సి ఉన్నా ఏడాదికి పై నుంచి అటవీశాఖ అనుమతుల కోసం ఎదురు తెన్నులతో కాలక్షేపం చేస్తున్నారు. ఈ మార్గాల్లో రహదారులు కొంత మేర అటవీశాఖ పరిధిలో ఉన్నాయి. ఆ శాఖకు పంపుతున్న సర్వే నివేదికలు ఆమోదానికి నోచుకోవడం లేదని పేర్కొంటున్నారు.

దొలుగండి అడ్డరోడ్డు నుంచి రేగులపాడు వెళ్లే మార్గం దుస్థితి

ఉన్నతాధికారులు ఆదేశించినా.. అనుమతులు సాధించి సకాలంలో పనులు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఐటీడీఏ అధికారులకు పలుమార్లు గడువు నిర్దేశించినా కార్యసాధనకు నోచుకోవడం లేదు. ఇటీవల నిర్వహించిన సమీక్షా సమావేశంలో కూడా వీరి తీరుపై జిల్లా ఉన్నతాధికారులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పనులు పూర్తి చేయించాలని ఎన్నిసార్లు ఐటీడీఏ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం ఉండడం లేదని అలివేరు సర్పంచి కారం లక్ష్మి, ఉప సర్పంచి చింతల కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. అటవీశాఖ అనుమతులు సాధించి పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని పంచాయతీరాజ్ శాఖ ఏఈ అంకిరెడ్డి తెలిపారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

జీఎస్‌టీ 5% అదనం
ప్రకటనల కొరకు సంప్రదించండి: 80080 12494

(c) eenadu

కృత్రిమ కాళ్లు అమర్చుకున్న వారితో దాతలు, అతిథులు

దివ్యాంగుల భవితకు భరోసా

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: హీల్ కృత్రిమ అవయవ కేంద్రం ఆధ్వర్యంలో నిక పరిజ్ఞానంతో రూపొందించిన కృత్రిమ కాళ్లు దివ్యాంగుల భవిష్యత్తుకు భరోసానిస్తూ ఆత్మవిశ్వాసం పెంపొందిస్తున్నాయని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ పూర్వపు ఛైర్మన్ కె.వి.చౌదరి తెలిపారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని అనేక మంది సేవా కార్యక్రమాలకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని హీల్ ప్యారడైజ్ కృత్రిమ అవయవ కేంద్రంలో చుండూరు కోటయ్య-రామశేషమ్మ ఫౌండేషన్, నిహారిక ఫౌండేషన్, మాదినేని గ్రాండియర్స్, కోటు శేఖర్, కొడాలి వెంకట శివప్రసాద్, కాకర్ల శంకరరావుల ఆర్థిక సహకారంతో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 25 మందికి కృత్రిమ కాళ్లను అమర్చారు. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ శివకుమార్ గోపాలకృష్ణన్, సెంటర్ హెడ్ శివ ప్రసాద్, హీల్ వ్యవస్థాపకుడు కోనేరు సత్యప్రసాద్, దాతలు వేగే వాసు, చుండూరు మధుసూదనరావు, కాకర్ల నిరుపమ, గౌరా జ్యోతి, హీల్ ఛైర్మన్ పిన్నమనేని ధనప్రకాశ్, డైరెక్టర్లు మలినేని రంగప్రసాద్, యలమంచిలి బాలాజీ, సీఈవో కె.అజయ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రతిభ చాటి.. పతకాలు పట్టి

జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్న విద్యార్థినులు

దెందులూరు, న్యూస్‌టుడే: పట్టుదల.. కఠోర శ్రమతో సాధన చేసిన గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల విద్యార్థులు పలు క్రీడల్లో రాణిస్తున్నారు. వివిధ రాష్ట్రాల్లో జరిగిన జాతీయస్థాయి ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్, బాల్ బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్ క్రీడలు, కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సొంతం చేసుకుంటున్నారు. ఒక వైపు వ్యాయామ విద్య కొనసాగిస్తూ మరో వైపు క్రీడల్లోనూ సత్తా చాటుతున్నారు.

అథ్లెటిక్స్‌లో అదుర్స్

వ్యాయామ కళాశాలలో మొదటి సంవత్సరం బీపీఈడీ చదువుతున్నా. అథ్లెటిక్స్‌లో జాతీయస్థాయిలో సత్తా చాటాను. 2023లో సౌత్‌జోన్ నేషనల్ గేమ్స్‌లో 1500 మీటర్లు, 2022లో క్రాస్ కంట్రీ ఛాంపియన్‌షిప్‌లో 6 కి.మీ., కేరళలో 2021లో సౌత్ జోన్ నేషనల్ గేమ్స్ అండర్ 20 విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో గెలుపొందా. 2017-18లో నేషనల్ స్కూల్‌గేమ్స్ 3 కి.మీ. రాక్‌వాక్‌లో విజయం సాధించా. పోలీసు శాఖలో ఉన్నతోద్యోగం సాధించడమే లక్ష్యం. - ఎ.విజయ

ఆత్మస్థైర్యం పెరిగింది

వ్యాయామ కళాశాలలో బీపీఈడీ చదువుతున్నా. ఢిల్లీలో 2022లో జరిగిన జాతీయస్థాయి జూడో పోటీలో పతకాలు సాధించా. ఆత్మరక్షణ విద్య తనలో ఆత్మస్థైర్యం పెంచింది. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని పట్టుదలతో ఉన్నా. - టి.జగదీశ్వరి

ఖోఖో, కబడ్డీలో సత్తా

తల్లిదండ్రులు, కళాశాల అధ్యాపకుల ప్రోత్సాహంతో ఖోఖో, కబడ్డీ క్రీడల్లో రాణిస్తున్నా. 2019, 2023లో కర్ణాటకలో జరిగిన అండర్ 14, 19 విభాగాల్లో జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించా. గతేడాది మహారాష్ట్రలో కబడ్డీ (జూనియర్) విభాగంలో పాల్గొని విజయం సాధించా. క్రీడా కోటాలో ఉద్యోగం సాధించడమే లక్ష్యం. - ఎ.బి.హరుస్సిసా

మరిన్ని విజయాలే లక్ష్యం

హరియాణాలో 2019లో జరిగిన హ్యాండ్‌బాల్, 2020లో ఢిల్లీలో జరిగిన సీనియర్ ఫుట్‌బాల్ జాతీయస్థాయి పోటీలో రాణించి బహుమతులు అందుకున్నా. వివిధ రాష్ట్రాల్లో జరిగిన పోటీల్లో సత్తా చాటాను. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నా. - జి.భవాని

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో

వ్యాయామ ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో బాల్‌బ్యాడ్మింటన్‌లో జాతీయస్థాయిలో సత్తా చాటుతున్నా. 2023లో చెన్నైలో బాల్ బ్యాడ్మింటన్ పోటీలో విజయం సాధించా. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుని క్రీడా కోటాలో ఉద్యోగం సాధించడమే లక్ష్యం. - పి.లీలారమణి

దివ్యబలి పూజ సమర్పిస్తున్న బిషప్ జయరావు

ఉపవాసాల ఆరాధన ప్రారంభం

జిల్లా వ్యాప్తంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నలభై రోజులపాటు ఆచరించే ఉపవాస ఆరాధనలు బుధవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని చర్చిల్లో ఉదయం ప్రత్యేక ప్రార్థనలు చేసి ఉపవాస దీక్షలు స్వీకరించారు. ఏలూరు ఆర్‌సీఎం, లూథరన్, సీఎస్ఐ, మన్నా తదితర క్రైస్తవ సంఘాలలోని పాస్టర్లు, దైవజనులు క్రీస్తు సందేశమిచ్చారు. జేవియర్ నగర్ అమలోద్భవ కథెడ్రల్ చర్చిలో ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు, ఆలయ విచారణ గురువు ఫాదర్ ఇంజమూరి మైఖేల్, ఇతర గురువులతో కలిసి దివ్యబలి పూజ చేశారు.

రాష్ట్ర స్థాయి హ్యాకథాన్‌కు పాఠశాలల ఎంపిక

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి హ్యాకథాన్‌కు జిల్లా నుంచి మూడు పాఠశాలలు ఎంపికయ్యాయి. అమెజాన్ ఫ్యూచర్ ఇంజినీర్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా మొత్తం 560 మంది ఉపాధ్యాయులకు లీడర్‌షిప్ ఫర్ ఈక్విటీ(ఎల్ఎఫ్ఈ) సంస్థ ఆధ్వర్యంలో కోడింగ్ నైపుణ్యాలు, ఏఐ టూల్స్‌పై ఆన్‌లైన్ శిక్షణ తరగతులు నిర్వహించారు. వీటిలో ప్రతిభ కనబరిచిన 15 మంది ఉపాధ్యాయులకు ఏలూరు సుబ్బమ్మదేవి నగరపాలక ఉన్నత పాఠశాలలో బుధవారం ల్యాప్‌టాప్‌లు అందజేశారు. నూజివీడు జడ్పీ బాలికోన్నత, ఏలూరు మహాత్మా జ్యోతిబా పులే, కైకలూరు మండలం జంగంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలను రాష్ట్ర స్థాయి హ్యాకథాన్‌కు ఎంపిక చేశారు. ఏఎంవో రామారావు, సహిత విద్య సమన్వయకర్త భాస్కరరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు: డీఏవో

రైతుతో మాట్లాడుతున్న హబీబ్‌బాషా

పెదపాడు, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి ఖర్చులు తగ్గించుకొని.. అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్‌బాషా అన్నారు. కొక్కిరపాడులో బుధవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది'లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి రైతు గుర్తింపు నమోదు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. అప్పుడే పంటల బీమా, పెట్టుబడి రాయితీ, విత్తనాలు, ఎరువులు, ఇతర ప్రభుత్వ ఫలాలు పొందేందుకు అర్హులన్నారు. ఈ-పంట నమోదుకు రెండ్రోజులు మాత్రమే సమయం ఉందని.. రైతులంతా ఆర్ఎస్‌కేలకు వెళ్లి వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. అంతకుముందు మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులతో మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏడీఏ అనిల్‌కుమారి, మండల వ్యవసాయాధికారి షేక్ ఇమామ్ ఖాసిం, సిబ్బంది ఉన్నారు.

రంజాన్ మాసం.. సద్గుణాల ధామం

నేటి నుంచి ఉపవాసాలు, పవిత్ర ప్రార్థనలకు ఏర్పాట్లు

నూజివీడు, ఆగిరిపల్లి, నరసాపురం, అత్తిలి (గ్రామీణ), న్యూస్‌టుడే: ముస్లిం సోదరులు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ నెల వచ్చేసింది. హృదయాలలో పవిత్రతను, ఆధ్యాత్మిక భావనను నింపే మాసంగా ఈ నెలను భావిస్తారు. శాంతి, సౌభ్రాతృత్వాన్ని లోకానికి చాటడం ఈ మాసం ప్రత్యేకత.

కఠోర ఉపవాస వ్రతం.. ఈ 30 రోజుల పాటు కఠోర ఉపవాస వ్రతం పాటిస్తారు. ఖురాన్ పారాయణానికి అధిక ప్రాధాన్యం ఇస్తారు. తెల్లవారుజామున సహరి, సూర్యాస్తమయం ఇఫ్తార్ కార్యక్రమాలతో మసీదుల్లో సందడి వాతావరణం నెలకొంటుంది. రంజాన్ అనేది అరబిక్ పదం. అరబిక్‌లో రంజాన్ అంటే దహించి వేయడం అని అర్థం. ఏడాదిలోగా 11 నెలల్లో తెలుసో తెలియక చేసే తప్పులను, పాపాలను రంజాన్ నెలలోని ఉపవాస దీక్షల పుణ్యంతో అల్లా దహించి వేస్తారని మత పెద్దలు చెబుతారు.

ముస్తాబైన మసీదులు.. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అన్ని మసీదుల దగ్గర ఉపవాస దీక్షలు పాటించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నెలవంకతో ప్రారంభం.. ఇస్లామియా క్యాలెండర్ మాసాల్లో తొమ్మిదో నెల రంజాన్. నెలవంక దర్శనమిచ్చినప్పటి నుంచి తిరిగి నెలవంక దర్శనం వరకు నెల రోజుల పాటు ముస్లింలు కఠిన ఉపవాసాలు ఆచరిస్తారు. ఉపవాసం పాటించే వారు ప్రాతఃకాలానికి ముందే లేచి భోజనం చేస్తారు. దీన్ని ఇస్లామిక్ పరిభాషలో సహరి అంటారు. సూర్యోదయం తర్వాత మంచినీళ్లు కూడా ముట్టరు. సూర్యాస్తమయం కాగానే మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలతో ఉపవాసం విరమిస్తారు.

ఓర్పు, సహనం అలవడతాయి..

రంజాన్ మాసంలో పాటించే ఉపవాస దీక్ష వల్ల జీవితంలో ఎదుర్కొనేందుకు అవసరమైన ఓర్పు, సహనం అలవడతాయి. ముస్లింలు తప్పనిసరిగా ఉపవాస దీక్షలతో పాటు ఐదు సార్లు నమాజ్ చేస్తారు. అల్లా ధ్యానంలో గడుపుతారు. - మౌలానా ముఖ్రమ్ హుస్సేన్, ఆగిరిపల్లి

అప్పలస్వామిని సత్కరిస్తున్న పాఠశాల సహచరులు

అథ్లెటిక్స్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడి సత్తా

5 బంగారు పతకాలు కైవసం

ఆటపాక(కైకలూరు), న్యూస్‌టుడే: జాతీయ స్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో కైకలూరు మండలం ఆటపాక నిమ్మగడ్డ నాగభూషణం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సీహెచ్ అప్పలస్వామి సత్తా చాటారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో నిర్వహించిన 45వ ఇండియా మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో 55 సంవత్సరాల విభాగంలో పలు క్రీడా పోటీల్లో ఆయన పాల్గొన్నారు. ఇందులో 100, 400 800 మీటర్ల పరుగు పందెంతో పాటు రిలే 100 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు టి. వినోద, విద్యా కమిటీ ఛైర్మన్ బషీర్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అప్పలస్వామిని సత్కరించి అభినందనలు తెలియజేశారు.

పీహెచ్‌సీలో నవజాత శిశువు మృతి

ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులు

భీమడోలు, న్యూస్‌టుడే: పూళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పుట్టిన కాసేపటికే నవజాత శిశువు మృతి చెందింది. దాంతో బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలంటూ భీమడోలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు.. పూళ్ల పంచాయతీ ఎం.ఎం.పురానికి చెందిన పసుపులేటి మోహన్ తన సోదరి, నిండు గర్భిణి పావని దుర్గకు మంగళవారం సాయంత్రం పురిటి నొప్పులు రావడంతో పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు ప్రసవం చేయగా.. మగ బిడ్డ పుట్టాడు. కొద్దిసేపటికే అస్వస్థతకు గురవడంతో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. బాధిత కుటుంబ సభ్యులు హుటాహుటిన తీసుకెళ్తుండగా.. మార్గం మధ్యలో శిశువు చనిపోయింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ బిడ్డ ప్రాణం పోయిందని కుటుంబ సభ్యులు పీహెచ్‌సీ ఎదుట ఆందోళనకు దిగారు. సమాచారం తెలుసుకున్న సీఐ యు.జె.విల్సన్, ఎస్సై మదీనాబాషా ఘటనా స్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. పసుపులేటి మోహన్ ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

పుణ్యక్షేత్రానికి వెళ్తూ.. అనంతలోకాలకు!

లారీని ఢీకొన్న కారు.. వివాహిత దుర్మరణం

నుజ్జునుజ్జయిన కారు

పెదపాడు, న్యూస్‌టుడే: ఆ కుటుంబం సంతోషంగా కారులో పుణ్యక్షేత్రానికి బయల్దేరింది. మార్గం మధ్యలో కాపుకాసిన మృత్యువు.. ఒకరిని బలి తీసుకుంది. చిన్నారికి తల్లిని దూరం చేసింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. విజయవాడ నగరం గుణదలకు చెందిన పోలవరపు వెంకట శివరామకృష్ణ ప్రసాద్ తన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం తెల్లవారుజామున ద్వారకాతిరుమలకు కారులో బయల్దేరారు. మార్గం మధ్యలోని పెదపాడు మండలం తాళ్లమూడి ఫ్లైఓవర్ వద్దకొచ్చే సరికి ముందు వెళ్తున్న లారీని అధిగమించబోయి.. దాన్నే వెనుక నుంచి ఢీకొన్నారు. ఈ ఘటనలో వెంకట శివరామకృష్ణ ప్రసాద్‌తోపాటు కుమార్తె పోలవరపు కీర్తి(27), ఆమె తల్లి సుజాత, భర్త యతేంద్ర, చిన్నాన్న శోభన్‌బాబు గాయపడ్డారు. మూడేళ్ల కుమారుడు క్షేమంగా బయటపడ్డారు. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో హనుమాన్ జంక్షన్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ కీర్తిని పరీక్షించిన వైద్యులు.. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మిగతా వారిని మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు తీసుకెళ్లారు. కీర్తి మృతదేహాన్ని ఏలూరు సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆర్.శ్రీను తెలిపారు.

పురుగు మందు తాగి విద్యార్థిని ఆత్మహత్య

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని తూర్పు దిగవల్లికి చెందిన మేకపోతుల రుషిత(19) మంగళవారం సాయంత్రం కడుపు నొప్పి భరించలేక పురుగు మందు తాగింది. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. రూరల్ హెచ్‌సీ టి.అజయ్‌బాబు వివరాల ప్రకారం యువతి గత కొద్ది రోజులుగా గ్యాస్ట్రిక్ సంబంధిత సమస్యతో బాధ పడుతోంది. మంగళవారం సాయంత్రం నొప్పి భరించలేక పశువుల పాకలోకి వెళ్లి పురుగు మందు తాగింది. విషయం గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన నూజివీడు, అనంతరం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. యువతి ఆగిరిపల్లి మండలంలోని ఎన్ఆర్ఐ కళాశాలలో బీటెక్ సీఎస్ఈ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. రుషితకు ఇద్దరు సోదరీమణులు ఉన్నారు. తల్లిదండ్రులు లక్ష్మణరావు, వెంకటేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందారు. ఎస్సై వీర ప్రసాద్ కథనం ప్రకారం.. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన పోతునూరి సత్య ఫణికుమార్ (40) స్థానికంగా సెకండ్ హ్యాండ్ ట్రాక్టర్ల క్రయవిక్రయాలు చేసేవారు. ఈ నెల 17న ఉదయం ఇంటి నుంచి దుకాణానికి బయలుదేరి వెళ్లిన సత్య ఫణికుమార్.. కొద్దిసేపటి తర్వాత భార్య సుమలతకు ఐ మిస్ యు అంటూ చరవాణిలో సందేశం పంపించారు. అది చూసిన భార్య భయంతో కుటుంబ సభ్యులతో కలిసి దుకాణం వద్దకు వెళ్లారు. అప్పటికే దుకాణంలో సత్య ఫణికుమార్ పురుగు మందు తాగి ఉన్నట్లు గమనించిన భార్య.. అతడిని జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి.. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ సత్యఫణి కుమార్ చికిత్స పొందుతూ మృతి చెందారు. దీనిపై భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

చెట్లు దూసుకెళ్తున్నాయ్!

పర్యావరణంపై ప్రతిఒక్కరూ దృష్టిసారిస్తున్నారు. గృహాలంకరణ, పార్కులు, ఎస్టేటుల్లో భూ అలంకరణ కోసం అందమైన మొక్కలు, చెట్లను విదేశాల నుంచి తెప్పిస్తున్నారు. అదేవిధంగా కడియం నర్సరీల్లో పెంచుతున్న వివిధ రకాల మొక్కలను ఇతర ప్రాంతాలకు ట్రాలీ లారీలపై ఎగుమతి చేస్తున్నారు. తాడేపల్లిగూడెం జాతీయ రహదారిపై రయ్ రయ్ మంటూ ట్రాలీ లారీల్లో దూసుకుపోతున్న దృశ్యమిది. - ఈనాడు, తాడేపల్లిగూడెం

నేడు కేవీకేలో పుట్ట గొడుగులు పెంపకంపై శిక్షణ

ఉద్యాన విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 19న శాస్త్రీయ పద్ధతుల్లో పుట్ట గొడుగులు పెంపకంపై శిక్షణ ఇవ్వనున్నట్లు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త పి.విజయలక్ష్మి తెలిపారు. ఆసక్తి గల వారు కేవీకేలో గురువారం రూ.500 చెల్లించి తమ పేరును రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం 94905 05926, 73826 33692 నంబర్లను సంప్రదించాలని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పురపాలక సంఘ కార్యాలయము, భీమవరం

ఆర్.ఒ.సి.నెం. ఇ1962101/2026/ఇ2/ఎ1 ది. 18-02-2026

వేలము నోటీసు

భీమవరం పురపాలక సంఘ పరిధిలోని 17వ వార్డు వెహికల్ షెడ్డు ఆవరణలో గల పాడైపోయి ఉపయోగములో లేని వివిధ వాహనములు, పుష్ కార్ట్‌లు, ఐరన్ గ్రిల్స్, AC షీట్స్ మొదలగు మెటీరియల్‌ను ఐరన్ స్క్రాప్‌గా ఆమోదము పొందిన లోకల్ కొటేషన్ విలువ కేజి ఒక్కింటికి రూ. 25/-గా నిర్ణయించినందున పైన తెలిపిన పాడైపోయి ఉపయోగములో లేని ఐటమ్‌లను సంబంధిత DE మరియు AE వారల సమక్షములో తూకము ప్రకారము తరలించుకొని పోవుటకుగాను ది. 26-02-2026వ తేదీన ఉదయం గం. 11.00లకు భీమవరం పురపాలక సంఘ కార్యాలయములో శ్రీయుత కమిషనరు వారిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలము నిర్వహించబడును. సదరు వేలములో పాల్గొనదలచిన వారు రూ. 50,000/-లను డిపాజిట్‌గా చెల్లించి వేలము పాటలో పాల్గొనవలెను.

పూర్తి వివరములను భీమవరం పురపాలక సంఘ కార్యాలయములో సంప్రదించి తెలుసుకొనవలెను.

సం/- **కమిషనరు,** భీమవరం పురపాలక సంఘం

HCG The Specialist in Cancer Care adding life to years
సిటీ క్యాన్సర్ సెంటర్
చలసాని వెంకట కృష్ణయ్య వీధి, సూర్యారావుపేట, విజయవాడ-2
ఫోన్: 0866-2436661, 2432180, 9885260759
ఈవినింగ్ క్లినిక్స్
డా॥ ఎం. గోపిచంద్ M.S., M.Ch., DNB., Surgical Oncologist
డా. కె. లక్ష్మీప్రియదర్శిని MD., DM., Medical Oncologist
డా॥ వి.ఎస్.ఎన్. రావు DCP., DMRT., MD (RT)., Radiation Oncologist
ప్రతి రోజు 5 to 7 PM అపాయింట్‌మెంట్ కొరకు
నవ్యాంధ్రప్రదేశ్‌లో అత్యంత అనుభవజ్ఞులైన అతిపెద్ద క్యాన్సర్ వైద్య బృందం గల హాస్పిటల్

నమ్మించి.. నిలువునా ముంచేసి..

రైల్వే ఉద్యోగాల పేరుతో రూ.లక్షల్లో దోపిడీ

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే: ఉద్యోగాల పేరుతో దాదాపు రెండేళ్లుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సాగుతున్న దందాలో చిక్కుకున్న బాధితుల పరిస్థితి నేడు అగమ్యగోచరంగా మారింది. మోసాన్ని గుర్తించి ప్రశ్నించిన వారిపైనే ఎదురు కేసులు పెడుతున్న నేపథ్యంలో తమకు ఆత్మహత్యలే శరణ్యమంటూ బాధితులు వాపోతున్నారు.

రైల్వేలో చిరుద్యోగిగా పనిచేస్తున్న ఎం.కిషోర్.. మచిలీపట్నం రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. సహచరులు కరీముల్లా, షఫి, అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకుడు చిన్నా తదితరుల సహకారంతో పలువురితో పరిచయాలు పెంచుకున్నారు. ఈ క్రమంలో కిషోర్.. రైల్వేలో టీసీ, క్లర్క్ తదితర పోస్టుల పేరుతో కనిష్ఠంగా రూ.5 లక్షల చొప్పున పలువురి వద్ద నుంచి నగదు, ఖాళీ చెక్కులు వసూలు చేశాడు. అనంతరం వారికి పీఎఫ్ ఖాతా నంబర్లు, రైల్వే స్టాంపులతో కూడిన ఫేక్ నియామక పత్రాలు, ఐడీ కార్డులు పంపుతూ సాంకేతిక కారణాల వల్ల ఉద్యోగంలో చేరేందుకు కాస్త ఆలస్యం అవుతుందంటూ నమ్మబలికాడు. ఆలస్యంపై ఎవరైనా నిలదీస్తే విజయవాడ, ఇతర ప్రాంతాలకు మాట్లాడదామంటూ పిలిచి యూనియన్ నాయకుల పేరుతో కొందరిని పరిచయం చేసి త్వరలోనే ఉద్యోగం వస్తుందని ఆశలు కల్పించేవాడు. ఇదే తరహాలో మచిలీపట్నం పరిసర ప్రాంతాలకు చెందిన పలువురి వద్ద నుంచి నగదు దోచేసి వారిని మభ్యపెడుతూ వస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం జక్కరం గ్రామానికి చెందిన నాగపద్మ తనకు వచ్చిన నియామక పత్రాన్ని రైల్వే ఉద్యోగులకు చూపించి అది నకిలీదని నిర్ధారించుకోవడంతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది.

అడిగినందుకు ఎదురు కేసు

బాధితురాలు నాగపద్మతో పాటు మచిలీపట్టణానికి చెందిన గంగాభవాని ఈ నెల 7న మచిలీపట్నంలోని కిషోర్ నివాసానికి వచ్చారు. కిషోర్, అతనికి అండగా నిలిచిన చిన్నా కలిసి 'అల్లరి చేసుకోవద్దు.. మీకు ఉద్యోగాలు ఖాయం.. రేపు రండంటూ వారిని పంపేశారు. మరుసటి రోజు కిషోర్ ఇంటికి వెళ్లగా ఎవరూ ఆచూకీ లేకపోవడంతో బాధితులు చిలకలపూడి స్టేషన్‌కు వెళ్లి జరిగిన మోసాన్ని పోలీసులకు వివరించారు. అనంతరం బాధితులు తిరిగి కిషోర్ ఇంటికి వెళ్లి అతని కోసం నిరీక్షించారు. ఈలోగా పోలీసులు అక్కడకు వచ్చి రాత్రి మీరే కిషోర్‌పై దాడి చేశారంటూ అతడు ఫిర్యాదు ఇచ్చాడని, ఈ కేసులో నిందితులుగా ఉన్నారంటూ నాగపద్మ, గంగాభవానిలను స్టేషన్‌కు తీసుకువెళ్లడం గమనార్హం. ఇదిలా ఉండగా.. ఈ నెల 14న కాళ్ల పోలీస్ స్టేషన్‌లో ఇదే అంశంపై తాను ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకుండా తనను వెనక్కి పంపేశారని నాగపద్మ వాపోతోంది.

కార్యాలయం ఎదుట ఆందోళకు దిగిన ఖాతాదారులు

తపాలా పొదుపు సొమ్ము స్వాహా

రూ.15 లక్షలు కాజేసిన పోస్టుమాస్టర్

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నరసాపురం మండలం పసలదీవి తపాలా కార్యాలయం పరిధిలో ఖాతాదారుల పొదుపు సొమ్ము పక్కదారి పట్టిన ఉదంతం బుధవారం వెలుగు చూసింది. ఈ కార్యాలయ పోస్టుమాస్టర్ ఆర్ఎన్‌డీవీ ప్రసాద్ ఖాతాదారుల సొమ్ము రూ.15 లక్షల వరకు స్వాహా చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అతడు వందలాది పాసు పుస్తకాలను చాలా కాలం ఉంచి తన వద్దే ఉంచుకున్నాడు. ఖాతాదారులు పొదుపు, ఫిక్స్‌డ్ డిపాజిట్, సుకన్య సమృద్ధి యోజన కోసం చెల్లించిన సొమ్మును జమ చేయకుండా, తపాలా శాఖ రికార్డుల్లో నమోదు చేయకుండా కాజేశాడు. అతడు రెండు రోజులుగా విధులకు గైర్హాజరు కావడంతో అనుమానం వచ్చిన బాధితులు బుధవారం తపాలా కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. తమ సొమ్ము తిరిగి ఇప్పించాలంటూ నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న ఆ శాఖ ఉన్నతాధికారులు ఇక్కడి కార్యాలయానికి వచ్చి రికార్డులను తనిఖీ చేశారు. బాధితుల పాసు పుస్తకాలను సేకరించి ఆన్‌లైన్లో ఉన్న వివరాలతో సరిచూస్తున్నారు. ఈ ఘటనపై విచారణ చేపట్టామని.. బాధ్యుడైన పోస్టుమాస్టర్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని శాఖ అధికారులు ఖాతాదారులకు హామీ ఇచ్చారు.

హవ్వ.. కొవ్వాడ!

దీపాలు లేని స్తంభాలు

గట్టు చెంత ఖాళీ మద్యం సీసాలు

పంట పొలాలకు సాగునీటిని అందించేందుకు నిర్మించిన జలాశయం నిర్వహణ లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. కిలో మీటరు పొడవు ఉన్న జలాశయం గట్లపై ఎక్కడా విద్యుత్తు స్తంభాలు లేవు. ఉన్న స్తంభాలకు లైట్లు లేవు. చీకటి పడితే జలాశయం గట్లపై ఆకతాయిలు కూర్చొని మద్యం తాగి సీసాలను పగలగొట్టి జలాశయంలో పడేస్తున్నారని రైతులు వాపోతున్నారు. - ఈనాడు, పోలవరం

కొల్లేరు సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి: కామినేని

పెద్దింట్లమ్మపై ఆన..

కైకలూరు, న్యూస్‌టుడే: కొల్లేరు ప్రజల ఆరాధ్య దైవం పెద్దింట్లమ్మ మీద ప్రమాణం చేస్తూ కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. బుధవారం సాయంత్రం కొల్లేటికోట అమ్మవారి జాతర ఉత్సవాలకు విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో కొల్లేరు సమస్యను వచ్చే కేబినెట్ సమావేశంలో చర్చించి దీనిపై తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్రప్రభుత్వానికి నివేదించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర పరిధిలో లేని సమస్యను పరిష్కరించి రైతులు, ప్రజలకు న్యాయం చేసేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొల్లేరుకు చేసే మేలేంటనే విషయంలో వచ్చే పది రోజుల్లో ప్రజలకు పూర్తిస్థాయి స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో కొల్లేరుకు మంచిరోజులు వస్తాయని పూర్తి నమ్మకం ఉందని తెలిపారు.

గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: గ్రంథాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఉమ్మడి జిల్లా గ్రంథాలయాల సంస్థ ఛైర్మన్ జుత్తిగ నాగరాజు అన్నారు. బుధవారం బీవీరాజు పార్కు సమీపాన ఉన్న వైఎస్ఆర్ ప్రథమ శ్రేణి గ్రంథాలయాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. భవనంలో మౌలిక సదుపాయాలు పరిశీలించి పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలు, వివిధ రకాల పుస్తకాలకు సంబంధించి దస్త్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని పాఠకులను కలిసి వారికి కావాల్సిన పుస్తకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213 చికెన్ స్కిన్‌లెస్ - 243.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 244 చికెన్ స్కిన్‌లెస్ - 254.

తెరలు వచ్చేనా... దోమల బాధ తప్పేనా?

రెండేళ్లుగా ఎదురుచూపులు

వేలేరుపాడు, న్యూస్‌టుడే: కీటక జనిత వ్యాధుల నివారణలో భాగంగా మలేరియా ప్రభావిత గ్రామాల్లో నాలుగేళ్లకోసారి అందించే రసాయన దోమతెరలు ఆరేళ్లు గడుస్తున్నా.. సరఫరా చేయలేదు. దీంతో మన్యంతోపాటు మెట్ట మండలాల్లో మలేరియా పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతూనే ఉంది. పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖాధికారులు మలేరియా కేసుల నియంత్రణకు ప్రయత్నిస్తున్నా.. ఫలితం లేకుండా పోతోంది.

2.80 లక్షల వరకు అవసరం..

ఉమ్మడి జిల్లాలోని గోపాలపురం, దేవరపల్లి, కొయ్యలగూడెం, చింతలపూడి, టి.నరసాపురం తోపాటు మన్యంలోని పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 175 మలేరియా ప్రభావిత గ్రామాల్లో ఆరేళ్ల కిందట వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో తైవాన్ నుంచి 2.56 లక్షల తైవాన్ రసాయన దోమ తెరలను తెప్పించి పంపిణీ చేశారు. దీంతో మలేరియా కేసుల తీవ్రత తగ్గింది. అనంతరం మళ్లీ ఆయా గ్రామాల్లో 2.80 లక్షల దోమతెరలు పంపిణీ చేయాల్సి ఉన్నప్పటికీ.. కనీసం పట్టించుకున్న దాఖలాలు లేకపోవడంతో దోమలు విజృంభణ మరింత ఎక్కువైంది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో 2024 జనవరి నుంచి డిసెంబరు వరకు 120 కేసులు, 2025లో 320 కేసులు నమోదయ్యాయి. మలేరియా పాజిటివ్ కేసుల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నప్పటికీ ఫలితం లేకుండా పోతోంది.

ప్రభుత్వానికి నివేదించాం..

'ఉమ్మడి జిల్లా పరిధిలోని పది మండలాల్లోని మలేరియా ప్రభావిత గ్రామాల్లో దోమతెరలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వానికి నివేదించాం. వచ్చిన వెంటనే ఆయా గ్రామాల్లోని ప్రతి ఇంటికీ పంపిణీ చేస్తాం.' అని జిల్లా మలేరియా నియంత్రణాధికారి ప్రసాద్ తెలిపారు.

92.7 FM Rajamahendravaram 92.7 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

JOBS

ఏలూరులోని ఫైర్ స్టేషన్ దగ్గరలోని క్లినిక్‌లో పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్స్ కావలెను. శాలరీ 14,000+esi+epfo. సెల్: 98852 95999, 9581251999.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ:18-20K ✆ 96404 68899, 96402 58899

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం CLASSIFIEDS

FACULTY/ TEACHERS

Wanted faculty Urgently Required Maths Faculty for IPE & JEE Mains. Contact: 86390 45758.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.15 పైII
తణుకు ఆఫీసు: 08819-224254

ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

సీఎం సహాయనిధి పత్రాల అందజేత

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: శాంతినగర్‌లోని ఎంపీ విడిది కార్యాలయంలో.. సుమారు 87 మంది లబ్ధిదారులకు రూ.55 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్‌వోసీలు, చెక్కులు పంపిణీ చేశారు. ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ దిల్లీలో ఉన్నందున.. ఆయన ఓఎస్‌డీ వజీరుద్దీన్ పత్రాలు అందజేశారు. ముఖ్యమంత్రి, ఎంపీకి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

క్రికెట్ పోటీల్లో రామచంద్ర జట్టు విజయం

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: కాకినాడ జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం(జేఎన్‌టీయూ) వేదికగా నిర్వహించిన సెంట్రల్ జోన్ క్రికెట్ పోటీల్లో ఏలూరు రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల జట్టు విజయం సాధించింది. కళాశాల విద్యార్థి జయంత్ సాయి విశ్వవిద్యాలయ జట్టుకు ఎంపికయ్యారు. క్రీడాకారులను ప్రధానాచార్యుడు ఎం.మురళీధరరావు, కళాశాల కార్యదర్శి కె.సాయి రోహిత్ బుధవారం అభినందించారు.

ప్రజా శ్రేయస్సే లక్ష్యం: చింతమనేని

దుగ్గిరాల (పెదవేగి), న్యూస్‌టుడే: ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన అందిస్తోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల విడిది కార్యాలయంలో బుధవారం ఉదయం ఆయన్ను పలువురు కలిశారు. తమ సమస్యలు పరిష్కరించాలని అర్జీలు అందజేశారు. వాటిని పరిశీలించిన చింతమనేని.. ప్రాధాన్య క్రమంలో అన్నింటినీ పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్యం మెరుగుకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ప్రతి వీధిలో సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించాలన్నారు. తదనుగుణంగా ప్రతిపాదనలు పంపాలని దిశానిర్దేశం చేశారు.

వృద్ధుడి సమస్య ఆలకిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

పెదవేగి(పెదపాడు), న్యూస్‌టుడే: ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా పెదవేగి మండలం కూచింపూడి విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ కేవీ అంబేడ్కర్ తెలిపారు. ఉపకేంద్రం పరిధిలోని గ్రామాల వినియోగదారులు, రైతులు గమనించి సహకరించాలని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఏలూరు నగరంలోని అగ్నిమాపక కేంద్రం కూడలిలో ప్రధాన డ్రెయిన్‌ను ఆక్రమించి.. సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేసిన దృశ్యమిది. దారి పొడవునా కాలువపై నిర్మాణాలు చేపట్టడంతో.. మురుగు, వర్షపునీరు బయటకెళ్లే మార్గం లేకుండా రోడ్డుపైకి వస్తోంది.

ఏలూరు కొత్త బస్టాండుకు వెళ్లే మార్గంలో.. నడక దారి, డ్రెయిన్‌ను ఆక్రమించి బడ్డీ కొట్లు నిర్మించిన చిత్రమిది. కలెక్టరేట్‌కు వెళ్లే రోడ్డులో జడ్పీ వ్యాపార సముదాయాల వద్ద ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయి.

ఆక్రమిద్దాం.. అమ్మేద్దాం

నగరంలో యథేచ్ఛగా డ్రెయిన్లపై నిర్మాణాలు

పరిశీలన

'పత్తేబాద నుంచి అశోక్‌నగర్ వెళ్లే రోడ్డు, ఒకటో పట్టణంలోని మెయిన్ బజార్, పడమర వీధి, పాలతూము కూడలి, కెనాల్ రోడ్డు, జీఎన్టీ రోడ్డు తదితర ప్రాంతాల్లో డ్రెయిన్లు ఆక్రమించి నిర్మాణాలు. సిమెంటు తూరలతో మూసి దుకాణాలు ఏర్పాటు చేసేశారు. ఫలితంగా డ్రెయిన్లలో పూడిక, వ్యర్థాలు తీసే పరిస్థితులు ఉండటం లేదు.'

ఏలూరు వన్‌టౌన్- న్యూస్‌టుడే: ఏలూరు నగరంలోని 50 డివిజన్లలో సుమారు 3 లక్షల మంది నివసిస్తున్నారు. మొత్తం 420 కి.మీ. మేర ప్రధాన, అంతర్గత డ్రెయిన్లు ఉన్నాయి. ప్రతి రోజు సుమారు 500 మందికి పైగా పారిశుద్ధ్య సిబ్బంది వీటి నిర్వహణను చూస్తున్నారు. నగరంలోని ప్రతి ప్రాంతంలోనూ డ్రెయిన్లపై అనధికారికంగా తూరలు ఏర్పాటు చేసి.. సిమెంటుతో పూత పని చేస్తున్నారు. ఆపై బడ్డీలు పెడుతున్నారు. అల్పాహారం, తేనీరు, శీతల పానీయాల దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. కొన్నాళ్లకు వీటిని అమ్మేసి.. సొమ్ము చేసుకుంటున్నారు.

వానొస్తే మునక.. ఏలూరును సుందర నగరంగా తీర్చిదిద్దుతామని ఓ వైపు పాలకులు హామీలిస్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం అమలవడం లేదు. డ్రెయిన్లను ఆక్రమిస్తుండటంతో.. నెలలుగా శుభ్రం చేయడం లేదు. ఫలితంగా పూడిక పేరుకుపోయి.. చిన్నపాటి వర్షానికే నగరం ముంపునకు గురవుతోంది. ఆక్రమణలు తొలగించాల్సిన నగరపాలక సంస్థ అధికారులు అటువైపు దృష్టి సారించడం లేదు. పారిశుద్ధ్య సిబ్బంది సైతం దుకాణదారులిచ్చే అల్పాహారం తిని.. తేనీరు తాగి వెళ్లిపోతున్నారు. ఇకనైనా నగరపాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నగరంలోని డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగించి, ప్రక్షాళన చేయాలని స్థానికులు కోరుతున్నారు. 'క్షేత్రస్థాయిలో పర్యటించి, డ్రెయిన్లను పరిశీలిస్తాం. ఎక్కడైనా ఆక్రమణలుంటే వాటిని వెంటనే తొలగిస్తాం' అని ఉప కమిషనర్ శివారెడ్డి తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు అర్బన్:	80085 74486	ఏలూరు టూటౌన్:	80085 74487
దెందులూరు:	80085 74535	పెదపాడు, పెదవేగి:	80085 74483
భీమడోలు:	80085 74527	నిడమర్రు గ్రామీణ:	97040 21765
ఉంగుటూరు:	94939 90333	గణపవరం:	99480 66777

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ? హనుమాన్ నగర్ శివాలయం సమీప రహదారి పక్కన చెత్తాచెదారాలు పేరుకుపోయాయి. వాటిని రోజుల తరబడి తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోంది. - నాగరాజు, స్థానికుడు

✔ చెత్త నిల్వలు ఎప్పటికప్పుడు తొలగిస్తాం. దుర్గంధం రాకుండా బ్లీచింగ్ చల్లిస్తాం. - డి.శ్రీనివాసరావు, అదనపు కమిషనర్

దెందులూరు, న్యూస్‌టుడే: ? కొవ్వలి సమీప గోదావరి కాలువలో నీటి మట్టం తగ్గిపోయింది. సాగునీరందక అవస్థలు పడుతున్నాం. సాగుకు ఇబ్బందులేకుండా చూడాలి. - రామకృష్ణ

✔ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. సాగునీటి ఇబ్బందులేకుండా చూస్తాం. - సుబ్రహ్మణ్యం, జలవనరుల శాఖ ఏఈ

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: ? బావాయిపాలెంలోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. ఆన్ ఆఫ్ స్విచ్‌లు సైతం సరిగా పని చేయడం లేదు. రాత్రివేళ వీధుల్లో రాకపోకలు సాగించలేకపోతున్నాం. - లహరి, స్థానికురాలు

✔ పంచాయతీ అధికారులతో మాట్లాడి.. వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. - స్వామి, ఎంపీడీవో

తాగునీటి సమస్యకు పరిష్కారం

స్పందనకు వందనం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక అమీనాపేటలోని ఏటిగట్టు రోడ్డు ఆంజనేయస్వామి గుడి వీధిలో తాగునీటి సమస్యను అధికారులు పరిష్కరించారు. 'మేమున్నాం.. మీకు తోడుగా'లో బుధవారం ప్రచురితమైన వార్తకు నగరపాలక కమిషనర్ భానుప్రతాప్ స్పందించారు. సిబ్బందిని పంపి తాగునీటి పైపులకు మరమ్మతు చేయించారు.

క్షేత్ర సందర్శనతో సత్ఫలితాలు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ కార్యాలయాల్లో విధుల నిర్వహణతోపాటు క్షేత్రస్థాయి సందర్శనలతో సత్ఫలితాలు సాధించవచ్చని జిల్లా శిక్షణ కేంద్రం మేనేజర్ జి.ప్రసంగిరాజు సూచించారు. స్థానిక సామాజిక సేవా శిక్షణ కేంద్రంలో గ్రేడ్-4, 5 పంచాయతీ అభివృద్ధి అధికారులకు బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. అనంతరం వట్లూరులో క్షేత్ర సందర్శన చేపట్టారు. పంచాయతీలో దస్త్రాల నిర్వహణ, ఇంటి, వాణిజ్య పన్నులు, పారిశుద్ధ్యం మెరుగు తదితరాలను అధ్యయనం చేశారు. శిక్షకులు విజయకుమార్, సుంకర వెంకటేశ్, సూర్యకుమార్, శ్యామలరావు, వట్లూరు పంచాయతీ అభివృద్ధి అధికారి మేకా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల భద్రతకు ప్రాధాన్యం

దెందులూరు, న్యూస్‌టుడే: పరిశ్రమల్లో కార్మికుల భద్రతకు యాజమాన్యాలు ప్రాధాన్యమివ్వాలని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కె.కృష్ణమూర్తి సూచించారు. సింగవరంలోని ఓ పరిశ్రమలో రొయ్యల శుద్ధి, పాల శీతలీకరణ యూనిట్లలో పనిచేస్తున్న కార్మికుల ఆరోగ్యం, భద్రతపై బుధవారం కార్యశాల నిర్వహించారు. అమ్మోనియా హ్యాండ్లింగ్ భద్రత, గ్యాస్ సిలిండర్ల నిర్వహణ, ప్రథమ చికిత్స శిక్షణ, వ్యక్తిగత రక్షణ, సురక్షిత నిర్వహణ తదితరాలపై అవగాహన కల్పించారు.

సూచనలిస్తున్న కృష్ణమూర్తి

జిల్లా ప్రగతికి తోడ్పాటు: మంత్రి

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ రంగం ప్రగతికి తమవంతు తోడ్పాటునందిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు భరోసానిచ్చారు. అమరావతిలోని విడిది కార్యాలయంలో జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ దంపతులు బుధవారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో వ్యవసాయ రంగ అభివృద్ధి, సాగునీటి సదుపాయాల విస్తరణ, రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానం, పంటల ఉత్పాదకత పెంపు, ఎరువులు, విత్తనాల సరఫరా తదితరాలపై చర్చించారు.

గణపవరం: ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెదేపా నాయకుడు నాయుడు వీరన్న విజ్ఞప్తి చేశారు. అమరావతిలో మంత్రి అచ్చెన్నాయుడిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.

అచ్చెన్నాయుడితో పద్మశ్రీ దంపతులు

అ'పూర్వ' సమ్మేళనం

దెందులూరు, న్యూస్‌టుడే: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో బుధవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కళాశాల 1982- 1983 బ్యాచ్ విద్యార్థులు పాల్గొని.. రోజంతా ఆనందంగా గడిపారు. మాజీ ఎంపీ చిమట సాంబు, అదనపు ఎస్పీలు కోళ మంజరి, అనిల్ కుమార్ తదితర రంగాల్లో స్థిరపడిన బాల్య మిత్రులంతా హాజరయ్యారు. అప్పటి అధ్యాపకులు కృష్ణంరాజు, సత్యనారాయణ దంపతులను సన్మానించారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనం చేశారు. కళాశాల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. కళాశాల ప్రధానాచార్యుడు నతానియేలు అధ్యక్షత వహించారు. కార్యనిర్వాహక కమిటీ సభ్యులు మచ్చా శ్రీనివాస్, ముక్తేశ్వరరావు, బాపూజీ తదితరులు పర్యవేక్షించారు.

పని ఒత్తిడి తగ్గించాలని ఆందోళన

పెదపాడు, న్యూస్‌టుడే: స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి వీఆర్వోలు మూడో రోజు బుధవారం నిరసన కొనసాగించారు. తమపై పని భారం, ఒత్తిడి తగ్గించాలని నినాదాలు చేశారు. వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు సాయల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. అటు పంచాయతీ, ఇటు రెవెన్యూ శాఖల మధ్య వీఆర్వోలు నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు డీడీవోలుగా తహసీల్దార్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని సమయం అమలు చేయాలని కోరారు.

తపస్సు కాల దీక్షలు ప్రారంభం

పెదవేగి, న్యూస్‌టుడే: మండలంలోని కూచింపూడి, రామశింగవరం, గోవిందవారిగూడెం చర్చిల్లో బుధవారం క్రైస్తవుల తపస్సు కాల దీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దివ్యబలి పూజ నిర్వహించారు. ఫాదర్ బాలస్వామి మాట్లాడుతూ.. తపస్సు కాలం 40 రోజులపాటు ఉంటుందన్నారు. విశ్వాసులు తెలుపు, ముక్కుపొడి రంగు మాల ధరించి ఉపవాసం చేస్తారని ఆయన పేర్కొన్నారు.

మస్టర్లలో కొట్టివేతలపై ఏపీడీల ఆగ్రహం

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో బుధవారం సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథం కింద 324 పనులు చేశారని. . ఇందుకు రూ.10.72 కోట్లు చెల్లించారని జిల్లా విజిలెన్స్ అధికారి అనుపమ తెలిపారు. కూలీల మస్టర్లలో కొట్టివేతలు గుర్తించినట్లు చెప్పడంతో.. జంగారెడ్డిగూడెం, ఏలూరు ఏపీడీలు దామోదరం, విక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 16 పంచాయతీల్లో ఆరుగురు ఎఫ్‌ఏ, టీఏలు చేసిన తప్పిదాలకు రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. రూ.3 వేలు రికవరీ చేయాలని ఆదేశించారు. ఏపీవో పద్మ, డిప్యూటీ ఎంపీడీవో స్వామి పాల్గొన్నారు.

వివరాలు తెలుసుకుంటున్న దామోదరం, విక్టర్

గుంతలు పడి.. భయపడి!

ఏలూరు పంపుల చెరువు నుంచి గులాబీ తోట వైపు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. మార్గం మధ్యలో భారీ గోతులు పడటంతో. . వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గుంతలు పూడ్చించాలని చోదకులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ఏలూరు నగరం

గొయ్యి.. జాగ్రత్తోయీ!

ఏలూరు పత్తేబాద గంగానమ్మ ఆలయ సమీప రోడ్డులో పైపులైను మరమ్మతులకు గొయ్యి తీశారు. దాన్ని పూడ్చకపోవడంతో.. రాత్రివేళ పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. స్థానికులు చొరవ తీసుకొని గొయ్యి చుట్టూ రాళ్లు ఏర్పాటు చేశారు. - న్యూస్‌టుడే, ఏలూరు

దృష్టి పెట్టండి.. దాహం తీర్చండి

గణపవరం మండలం వెలగపల్లిలో రెండెకరాల్లో మంచినీరు, మూడెకరాల్లో పశువుల దాహార్తి తీర్చే చెరువులున్నాయి. ప్రస్తుతం పశువుల చెరువును శుభ్రం చేయకపోవడంతో.. నీరు దుర్వాసన వస్తోంది. మూగజీవాలు జలాలు తాగలేకున్నాయి. చెరువును శుభ్రం చేయాలని రైతులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గణపవరం

కాలువలో చెత్త.. తొలగక చింత

ఏలూరు నగరం ఏఎస్ఆర్ మైదానం వద్దనున్న ప్రధాన డ్రెయిన్‌లో చెత్తాచెదారం పేరుకుపోయింది. దీన్ని నెలలుగా తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోంది. దోమల బెడద ఎక్కువగా ఉండటంతో.. స్థానికులకు రాత్రివేళ కంటిమీద కునుకు కరవైంది.

- న్యూస్‌టుడే, ఏలూరు

స్తంభం వదిలేసి.. తారు వేసి!

భీమడోలులో ర.భ.శా. రహదారిని రూ.2 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. ఆర్సీఎం చర్చి సమీపాన టెలిఫోన్ స్తంభాన్ని తొలగించకుండా.. దాని చుట్టూ తారు వేశారు. రాత్రివేళ వాహనదారులు దారంచున ఏమరుపాటుగా వెళితే.. స్తంభాన్ని ఢీకొనే ప్రమాదముంది. - న్యూస్‌టుడే, భీమడోలు

ఆరోగ్య కార్డుల మంజూరుకు వినతి

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: నగరపాలక పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రాంబాబు, సహాధ్యక్షుడు భూక్యా రాము విజ్ఞప్తి చేశారు. స్థానిక మండల విద్యా శాఖాధికారి కార్యాలయంలో ఎంఈవో-1 రవిప్రకాశ్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లులు చెల్లించాలని సూచించారు. అనారోగ్యంతో బాధపడుతున్న గురువులకు, వారి కుటుంబ సభ్యులకు తగిన వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు.

లక్ష్యం నిర్దేశించి.. సగమే సాధించి!

● 50 శాతం లోపే పన్ను వసూళ్లు ● మార్చి నెలాఖరుతో ముగియనున్న గడువు

కైకరం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: పల్లెల అభివృద్ధికి పన్నులే ప్రధాన ఆదాయ వనరు. గ్రామాభివృద్ధికి ఆర్థిక సంఘ నిధులతోపాటు ఇంటి(ఆస్తి) పన్నులే కీలకం. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఉన్నతాధికారులు వసూలు లక్ష్యం నిర్దేశించగా... ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాల్లో కనీసం 50 శాతం దాటలేదు. మరో 41 రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. పన్ను వసూళ్ల ప్రగతిపై పంచాయతీరాజ్ కమిషనర్, కలెక్టర్ రోజూ సమీక్షిస్తున్నా.. లక్ష్య సాధనలో పంచాయతీ కార్యదర్శులు విఫలమవుతున్నారు.

ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజ్‌మనోజ్

166 పంచాయతీలకు.. ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాల్లో 166 పంచాయతీలున్నాయి. వీటిలో 1,23,463 అసెస్‌మెంట్లు, 96,257 కుళాయిలున్నాయి. ఆస్తి పన్ను మొత్తం లక్ష్యం రూ.2,016.27 లక్షలు. ఇప్పటి వరకు రూ.854.42 లక్షలు వసూలు చేశారు. అందులో కుళాయి పన్ను రూ.766.44 లక్షలకు రూ.208.77 లక్షలు మాత్రమే వసూలైంది. ఏటా ఇంటి పన్నుపై 5 శాతం పెంచుతుండగా.. ఈ ఏడాది 10 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో చేపట్టిన నిర్మాణాలను మళ్లీ కొలిచి పన్ను మదింపు చేశారు. దీంతో విలువ బాగా పెరిగింది. పరిశ్రమల యాజమాన్యాలు పన్ను చెల్లించకుండా అప్పీళ్లకు వెళ్లారు.

డిజిటల్ చెల్లింపులు.. కూటమి ప్రభుత్వం స్వర్ణ పంచాయతీ ద్వారా డిజిటల్ చెల్లింపులకు శ్రీకారం చుట్టింది. యజమానుల ఫోన్లకే వాట్సాప్, ఎస్ఎంఎస్ రూపంలో డిమాండ్ నోటీసులు పంపింది. దాని ఆధారంగా పోర్టల్‌లోకి వెళ్లి డిజిటల్ విధానం ద్వారా పన్నులు చెల్లించవచ్చు. ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ పేమెంట్ల ద్వారా నగదు చెల్లించి రసీదు పీడీఎఫ్ రూపంలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

రెండు నియోజకవర్గాల్లో వసూలు ఇలా(రూ.లక్షల్లో)

మండలం	పంచాయతీలు	లక్ష్యం	వసూలు
ఉంగుటూరు	27	431.62	139.61
భీమడోలు	13	318.66	131.34
నిడమర్రు	16	116.00	73.84
గణపవరం	25	150.27	71.84
ఏలూరు గ్రామీణ	15	133.48	77.67
దెందులూరు	17	203.09	83.11
పెదపాడు	23	415.26	181.23
పెదవేగి	30	247.89	95.78

దంత వైద్య శిబిరానికి స్పందన

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక వైఎంహెచ్ఏ హాలులో హిందూ యువజన సంఘం, దుగ్గిరాల సెయింట్ జోసఫ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యాన బుధవారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు వంద మందికి పైగా ప్రజలకు వైద్యులు పరీక్షలు చేశారు. కళాశాల కరస్పాండెంట్ మోజెస్, వైఎంహెచ్ఏ ప్రతినిధులు అంబికా రాజా, వేణుగోపాల్, సోమలింగేశ్వరరావు పాల్గొన్నారు.

పవరుపేట(ఏలూరు అర్బన్): పవరుపేటలోని బడేటి విడిది కార్యాలయంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నియోజకవర్గంలోని పేదలు శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

ఏలూరు గ్రామీణ: రామకోటి ప్రాంగణంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డీఎస్పీ శ్రావణ్ కుమార్ హాజరై ప్రారంభించారు. 145 మందికి పరీక్షలు చేసి.. 18 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. 32 మందికి రాయితీపై కళ్లద్దాలు పంపిణీ చేశారు.

సీతారావమ్మ మృతికి సంతాపం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: సీపీఐ సీనియర్ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు పూడి అప్పలస్వామి సతీమణి పూడి సీతారావమ్మ(95) బుధవారం మృతి చెందారు. కొత్తపేటలోని నివాసంలో ఆమె మృతదేహానికి సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, జిల్లా సహాయ కార్యదర్శి పి.కిశోర్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించండి

పెదపాడు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు, ప్రయాణికులు, పాదచారులు సహకరించాలని పెదవేగి సీఐ సీహెచ్ రాజశేఖర్ సూచించారు. కలపర్రు టోల్ ప్లాజా సమీపంలో బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. శిరస్త్రాణం ధరించని ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వారితో అప్పటికప్పుడు శిరస్త్రాణం కొనుగోలు చేయించి ధరింపజేశారు. ఆయన మాట్లాడుతూ.. కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్టు, ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం విధిగా పెట్టుకోవాలన్నారు. రహదారి నిబంధనలు పాటించకపోవడం వల్లే ప్రమాదాల్లో ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సై ఆర్.శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

చోదకుడికి కరచాలనం చేస్తున్న సీఐ రాజశేఖర్

ప్రాథమిక దశలోనే గుర్తించండి

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రత్యేకావసరాల పిల్లల్లోని లోపాలను ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా నయం చేయొచ్చని సహాయాచార్యుడు బి.ఆర్.ప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక సర్వజన ఆసుపత్రిలో జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యాన బుధవారం అంతర్జాతీయ ఆస్పెర్గర్ దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆయా లోపాలున్న పిల్లలను వివక్షకు గురిచేయకుండా వెన్నుతట్టి ప్రోత్సహించాలని సూచించారు. డీడీఆర్‌సీ ద్వారా అందుతున్న ఉచిత థెరపీ, కౌన్సెలింగ్ తదితర సేవలపై డీడీఆర్‌సీ సమన్వయకర్త శ్రీనివాస్‌రెడ్డి అవగాహన కల్పించారు.

ద్విచక్ర వాహనాల ఢీ

అయిదుగురికి గాయాలు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక బీడీ కాలనీకి చెందిన ఆనపు అప్పారావు(45) లింగపాలెం మండలం సింగవరం పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. రోజూ ద్విచక్ర వాహనంపై పాఠశాలకెళ్లి వస్తుంటారు. ఎప్పటిలాగే బుధవారం బడికెళ్లి. . సాయంత్రం ఇంటికొస్తుండగా.. నగర శివారులో నలుగురు విద్యార్థులు మరో ద్విచక్ర వాహనం వస్తూ ఢీకొన్నారు. ఈ ఘటనలో అయిదుగురికీ గాయాలయ్యాయి. వారిని ఏలూరు సర్వజన సర్వజన ఆసుపత్రికి తరలించారు. అప్పారావు పరిస్థితి విషమంగా ఉండటంతో.. ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి మృతిపై కేసు

భీమడోలు: చినలింగపాడుకు చెందిన కోయా తాతారావు(70) కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. బుధవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించగా.. ఇంటి సమీపంలోనే అచేతనంగా పడి ఉన్నారు. ఆయన్ను హుటాహుటిన ఆసుపత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య నాగరత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మదీనాబాషా తెలిపారు.

నిడమర్రు: దస్త్రాలు పరిశీలిస్తున్న అనురాధ, శేషగిరిరావు

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుదాం

ఉంగుటూరు, న్యూస్‌టుడే: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని ఎంఈవో-2 సాయిబాబు సూచించారు. స్థానిక ఎమ్మార్సీలో స్కౌట్, గైడ్స్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. స్కౌట్, గైడ్స్ ద్వారా దేశభక్తి, క్రమశిక్షణ పెంపొందించాలని కోరారు. శిక్షకులు రామారావు, నరసమాంబ పాల్గొన్నారు.

నిడమర్రు గ్రామీణం: అడవికొలను ప్రాథమిక పాఠశాలను ఎంఈవో-1, 2 అనురాధ, శేషగిరిరావు బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, దస్త్రాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించాలని నిర్వాహకులను ఆదేశించారు.

భీమడోలు: విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపడేలా కృత్యాధార బోధన చేయాలని ఎంఈవో-1 ఇ.శ్రీనివాసరావు సూచించారు. పోలసానిపల్లి ప్రాథమిక పాఠశాల-1ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా దస్త్రాలు పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలుపై సమీక్షించారు. ప్రధానోపాధ్యాయిని కె.తులసి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఏలూరు సినిమాలు

అంబిక డీలక్స్	కపుల్ ఫ్రెండ్లీ
అంబిక మినీ	శ్రీచిదంబరం గారు
సాయి బాలాజీ	నిలవే
బాలాజీ	అమరావతికి ఆహ్వానం
సత్యనారాయణ 1	సీతా పయనం
సత్యనారాయణ 2	ఫంకీ
సత్యనారాయణ 3	విత్ లవ్
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	మన శంకర వరప్రసాద్ గారు
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	లవ్ స్టోరీ
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	సీతా పయనం
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	ఫంకీ
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	మన శంకర వరప్రసాద్ గారు
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	అనగనగా ఒక రాజు

జ్ఞాపిక.. విజయ మాలిక!

స్కేటింగ్‌లో రాణిస్తున్న బాలిక

పవరుపేట(ఏలూరు నగరం), న్యూస్‌టుడే: ఆ బాలిక స్కేటింగ్‌లో సత్తా చాటుతోంది. కాళ్లకు చక్రాలు కట్టుకుని.. రివ్వున దూసుకెళుతోంది. జాతీయ స్థాయిలో పతకాలు కొల్లగొడుతోంది. పలువురి ప్రశంసలు అందుకుంటోంది. ఆమె.. ఏలూరుకు చెందిన కొల్లి జ్ఞాపిక. నగరానికి చెందిన కొల్లి సురేశ్‌బాబు, రూప కళ దంపతుల కుమార్తె జ్ఞాపిక. విజయవాడలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. సెలవు రోజుల్లో నగరానికొచ్చి.. స్థానిక ఇండోర్ స్టేడియంలోని శాప్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న స్కేటింగ్ కేంద్రంలో శిక్షణ పొందుతోంది. శిక్షకుడు ఖాసిం పర్యవేక్షణలో రోజురోజుకూ రాటుదేలుతోంది.

ఆసక్తిని గమనించి.. జ్ఞాపికకు చిన్నతనం నుంచే స్కేటింగ్ అంటే ఆసక్తి. ఆమె ఇష్టాన్ని గమనించిన తల్లిదండ్రులు.. శిక్షణ కేంద్రంలో చేర్పించారు. సెలవు రోజుల్లో అక్కడ శిక్షణ పొందుతూ చిచ్చరపిడుగులా మారింది. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో సత్తా చాటి పతకాలు సాధించింది. ఇటీవల విశాఖపట్నం వేదికగా నిర్వహించిన జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ పోటీల్లో అద్భుత ప్రదర్శన చేసి రజత పతకం సొంతం చేసుకుంది. 'స్కేటింగ్‌లో అంతర్జాతీయ పతకాలు సాధించడమే లక్ష్యం. తదనుగుణంగా మరింత కఠోర సాధన చేస్తా. పతకాలు సొంతం చేసుకోవడంలో అమ్మానాన్న కృషిని మరువలేను. శిక్షకుడు ఖాసిం మెలకువలు ఎంతో ఉపయోగపడుతున్నాయి' అని జ్ఞాపిక తెలిపింది.

(c) eenadu

చింతలపూడి

•చింతలపూడి •పోలవరం

ఆకట్టుకున్న 'బాలోత్సవ్'

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం ప్రతిభ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో 'బాలోత్సవ్-2026' వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ... ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ...విద్యార్థులకు వివరించారు. ...రచించిన 'బి మినిస్ట్రియస్' పుస్తకాన్ని ఎస్పీ ఆవిష్కరించారు.

సర్వే త్వరగా పూర్తి చేయండి

సర్వే పరిశీలిస్తున్న పీడీ విజయలక్ష్మి

లింగపాలెం(చింతలపూడి), న్యూస్‌టుడే: ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ సర్వే వెంటనే పూర్తి చేయాలని డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి అన్నారు. లింగపాలెం మండలం కల్యాణంపాడులో జరుగుతున్న ఈ సర్వేను పీడీ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యులు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీఎం జ్యోతి వెంకయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి దూరం.. పన్నుల భారం..

మున్సిపల్ ఎన్నికలు జరిగితేనే ప్రజలకు ఊరట

చింతలపూడి, న్యూస్‌టుడే: జిల్లాలోని పురపాలికల్లో ఓటరు జాబితా సవరణతో పాటు పోలో జాబితాలు సిద్ధం చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించడంతో ఈ సారైనా చింతలపూడి నగర పంచాయతీకి ఎన్నికలు నిర్వహిస్తారని ప్రజల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. 2021లో నగర పంచాయతీగా వర్గోన్నతి పొందినా.. ఇప్పటివరకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిపోయింది. దీనికితోడు పన్నుల భారం కూడా పెరిగిందని నగర పంచాయతీ వాసులు వాపోతున్నారు.

గత తప్పిదాలతో.. వైకాపా పాలనకు ముందు పురపాలికల్లో అద్దె విలువపై పన్ను విధించేవారు. ప్రాంతం, పట్టణం, నగరం ఆధారంగా చదరపు మీటరుకు అద్దె లెక్కించేవారు. ఏదైనా అద్దె విలువలో పాతిక శాతం.. 12 నెలల్లో మూడు నెలల అద్దె విలువను పన్ను కింద విధించేవారు. వాణిజ్య సముదాయాలకు మొత్తం అద్దె విలువలో నాలుగు నెలల లెక్క కట్టి పన్ను విధించేవారు.

వైకాపా అధికారంలో ఉన్న సమయంలో అద్దె విలువ కాకుండా.. మూలధన విలువ. అంటే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆస్తి విలువపై పన్ను వేశారు. 2021లో మదింపు చేపట్టి 2022 నుంచి అమలు చేశారు. పలితంగా ఇంటి పన్నులు పెరిగిపోయాయి. మట్టి, మిద్దె, రేకులషెడ్డు అనే తేడా లేకుండా పన్నులు బాదుతున్నారని నగర పంచాయతీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోర్టు కేసే కారణమా?.. చింతలపూడి, ఆకివీడులకు ఒకేసారి నగర పంచాయతీలుగా వర్గోన్నతి కల్పించారు. ఆకివీడుకు ఎన్నికలు నిర్వహించినా.. కోర్టు కేసు వల్ల చింతలపూడి ఎన్నికలు జరపలేదు. దీంతో చింతలపూడిని నగర పంచాయతీకి పాలకవర్గం లేని కారణంగా ఆర్థిక సంఘం నిధులు విడుదల కాక అభివృద్ధి పనుల కోసం పన్నుల ఆదాయంపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఏడాదికి రెండు సార్లు పన్ను విధిస్తుండటంతో ఇదేం బాదుడని నగర పంచాయతీ వాసులు ఆవేదన చెందుతున్నారు.

కోర్టు కేసు వల్ల నగర పంచాయతీకి ఇప్పటివరకు ఎన్నికలు నిర్వహించలేదు. ప్రస్తుతం ఓటర్ల జాబితా రూపకల్పన జరుగుతుంది. త్వరలోనే ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. - అంబటి రాంబాబు, నగర పంచాయతీ కమిషనర్

నగర పంచాయతీ జనాభా 35 వేలు | మొత్తం వార్డులు 20 | అసెస్‌మెంట్లు 7,488 | డిమాండ్ రూ.1.74 కోట్లు

10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా..
జంగారెడ్డిగూడెం: 80085 74478
కొయ్యలగూడెం: 80085 74947
చింతలపూడి: 76759 19086

టి.నరసాపురం, న్యూస్‌టుడే: ? గ్రామంలోని జగనన్న కాలనీలో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. రాత్రుళ్లు ఇళ్ల నుంచి బయటకు రావడానికి ఇబ్బందిగా మారింది. - గోపి, బొర్రంపాలెం.

✔ వెంటనే ఆ కాలనీలో విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తాం. - హరికృష్ణ, పంచాయతీ కార్యదర్శి, బొర్రంపాలెం

చెట్ల కొమ్మల తొలగింపు

స్పందనకు వందనం

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: 'చెట్టు..ప్రమాదం కొని తెచ్చేట్టు' శీర్షికన మంగళవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి విద్యుత్తు శాఖాధికారులు స్పందించారు. సాయిబాలాజీ టౌన్‌షిప్‌కు వెళ్లే మార్గంలో నియంత్రిక చుట్టూ అలుముకున్న చెట్ల కొమ్మలను ఏడీఈ సుబ్బారావు ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించారు.

కల్యాణం.. కమనీయం

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉపాలయమైన అపర్ణ సమేత అనంతేశ్వరస్వామి కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఏటుమినటి ఆశోకూర కలుగుకుంటే ఉత్సవ కమిటీ ఛైర్మన్ ఉప్పునూతల ఫలహారం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముగిసిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

స్వామివారి పవళింపు సేవ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల క్షేత్రపాలకుడైన శ్రీభ్రమరాంబామల్లేశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు ఉదయం స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. రాత్రి స్వామివారి పవళింపు సేవ నేత్రపర్వంగా జరిపించారు.

పట్టిసంలో శేఖర్ మాస్టర్ సందడి

పోలవరం, న్యూస్‌టుడే: పట్టిసీమ వద్ద ఆటంక గోదావరి మధ్యలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయాన్ని కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ సతీసమేతంగా బుధవారం దర్శించారు. స్వామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్త కొచ్చెర్లకోట వీరభద్రరరావు స్వామి వారి విశిష్టత వివరించారు. అనంతరం అర్చకులు వేదాశ్వీరచనం చేసి స్వామి వారి చిత్రపటంతోపాటు తీర్థ ప్రసాదాలు అందజేశారు. శేఖర్‌మాస్టర్ అర్చకులతో ఫొటోలు దిగారు.

మెట్టప్రాంత అభివృద్ధికి కృషి

జంగారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న గన్ని

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి ఎత్తిపోతల పథకానికి రూ.430 కోట్లు కేటాయించి మెట్ట ప్రాంత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మరోసారి రుజువు చేసిందని ఏపీ ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. బుధవారం జంగారెడ్డిగూడెంలోని పలు ప్రైవేటు కార్యక్రమాలకు హాజరైన ఆయన స్థానిక తెదేపా నాయకులు, పలువురు ... ... కూటమి నాయకులతో కొద్ది సేపు ముచ్చటించారు. అనంతరం రాష్ట్ర బడ్జెట్‌పై మీడియాతో మాట్లాడారు. చింతలపూడి ఎత్తిపోతలకు హరిత ట్రిబ్యునల్ అనుమతి వచ్చిన వెంటనే ప్రాజెక్టును శరవేగంగా పూర్తి చేస్తామని చెప్పారు.

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ ఛైర్మన్ షేక్ ముస్తఫా తల్లి షేక్ సుభియా బేగం ఇటీవల మృతిచెందారు. దీంతో జంగారెడ్డిగూడెంలో ముస్తఫాను ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు పరామర్శించారు.

20 నుంచి షటిల్ టోర్నమెంట్

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమలలో ద్వారకా స్పోర్ట్స్ స్టార్స్ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 23 వరకు ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నాన్ మెడలిస్ట్ షటిల్ టోర్నమెంట్ జరగనుంది. ఈ టోర్నమెంట్‌కి సంబంధించిన గోడపత్రాలను గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అమరావతి సచివాలయంలో బుధవారం ఆవిష్కరించారు.

భక్తిశ్రద్ధలతో శివయ్య గ్రామోత్సవం

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా కన్నాపురం దుర్గా రసలింగేశ్వర ఆలయంలో బుధవారం స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం చేశారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల క్షేత్రంలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆర్య వైశ్య కల్యాణ మండపం ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి రూ.1.01లక్షల విరాళం సమకూరింది. అశ్వారావుపేటకు చెందిన గుడివాడ కృష్ణమూర్తి దంపతులు ఈ విరాళాన్ని ట్రస్ట్ ఛైర్మన్ బొండాడ రామమోహన్‌రావుకు అందజేశారు.

అనాలోచిత నిర్ణయాలు తగదు

నిరసన తెలుపుతున్న నాయకులు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: గిరిజన విద్యార్థులను విద్యకు దూరం చేసే విధంగా అనాలోచిత నిర్ణయాలు తీసుకోవడం ఐటీడీఏ అధికారులకు తగదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ ఆవేదన వ్యక్తం చేశారు. బుట్టాయగూడెంలో ఎస్టీ బాలుర కళాశాల వసతిగృహానికి చెందిన స్థలంలో దుకాణ సముదాయ నిర్మాణం చేపట్టిన ప్రదేశంలో ఆయన నేతృత్వంలో బుధవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి శుద్ధి కేంద్రాలు అవసరం

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాస కాలనీల్లో మంచినీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని తూటికుంట కాలనీకి చెందిన గిన్నేపల్లి వెంకటరెడ్డి కోరారు. ఈ మేరకు కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద బుధవారం గిరిజన దర్బార్‌లో పీవో రాములు నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఉపాధి నిమిత్తం తనకు మినీ ట్రాక్టర్‌ను మంజూరు చేయాలని రాజానగరానికి చెందిన వెట్టి రాంబాబు కోరారు. భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మరో ఇద్దరు గిరిజనులు వినతిపత్రాలు అందజేశారు.

వీఆర్వోల ఆందోళన

చింతలపూడి, న్యూస్‌టుడే: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చింతలపూడి, లింగపాలెం మండలాల వీఆర్వోలు ఆయా మండలాల తహసీల్దార్ కార్యాలయాల వద్ద బుధవారం మధ్యాహ్న భోజన సమయంలో నిరసన ప్రదర్శన చేశారు.

జిల్లా ప్రగతికి తోడ్పాటు: మంత్రి

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ రంగం ప్రగతికి తమవంతు తోడ్పాటునందిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు భరోసానిచ్చారు. అమరావతిలోని విడిది కార్యాలయంలో జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ దంపతులు బుధవారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో వ్యవసాయ రంగ అభివృద్ధి, సాగునీటి సదుపాయాల విస్తరణ, రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానం, పంటల ఉత్పాదకత పెంపు, ఎరువులు, విత్తనాల సరఫరా తదితరాలపై చర్చించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించండి

పెదపాడు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు, ప్రయాణికులు, పాదచారులు సహకరించాలని పెదవేగి సీఐ సీహెచ్ రాజశేఖర్ సూచించారు. కలపర్రు టోల్ ప్లాజా సమీపంలో బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. శిరస్త్రాణం ధరించని ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

నీటి వృథా కట్టడికి కర్రే దిక్కు..!

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం ఎస్సీపేటలోని పలు వీధుల్లో మంచినీటి కుళాయిల నిర్వహణ సరిగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ఈ-సేవ కేంద్రానికి వెళ్లే రోడ్డులో ఉన్న కుళాయికి కార్క్ లేకపోవడంతో నీరు వృథాగా పోతోంది. దీంతో స్థానికులే నీటిని పట్టుకున్న అనంతరం గొట్టానికి కర్ర ముక్క అడ్డుగా ఉంచి ప్రవాహాన్ని అదుపు చేస్తున్నారు. అయినా లీకేజీ కావడంతో నీరు వృథాగా పోతోంది. 'పరిశీలించి చర్యలు తీసుకుంటాం.' అని పురపాలక కమిషనర్ కేవీ రమణ తెలిపారు.

అంచులో పొంచి ఉన్న ముప్పు

చింతలపూడి, న్యూస్‌టుడే: చింతలపూడి నుంచి ఏలూరు వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకుని భారీ వృక్షాలు ఉండటంతో వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఎన్‌వీఎన్ కాలనీ, ఆంథోనినగర్, సాయిస్ఫూర్తి ఆసుపత్రి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఫాతిమాపురం, వెలగలపల్లి సమీపంలో అడుగడుగునా భారీ వృక్షాలు రహదారి పక్కనే ఉన్నాయి. వీటి కొమ్మలు బాగా పెరిగి ఎండి విరిగి పడుతున్నాయి. కొమ్మలు విరిగి మీద పడతాయని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు.

'సంఘటిత పోరాటాలతోనే హక్కుల సాధన'

మాట్లాడుతున్న ఝాన్సీ

పోలవరం, న్యూస్‌టుడే: పాలకులు ఐదో షెడ్యుల్‌లో భాగంగా కొన్నింటిని మన్యం ప్రాంతాలుగా ప్రకటించారు తప్ప.. చట్టాలను అమలు చేయడం లేదని రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.ఝాన్సీ విమర్శించారు. మండలంలోని మనుగోపుల గ్రామంలో రెండో రోజు బుధవారం జరిగిన జిల్లా మహాసభలో పాల్గొని ప్రసంగించారు. ఆదివాసి హక్కులు కాలరాస్తున్న పాలకుల విధానాలపై గిరిజన రైతులు, కార్మికులు ఏకమై సంఘటిత పోరాటం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. మన్యం గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు అధ్యక్షతన జరిగిన సభలో 15 మందితో కూడిన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పంచాయతీకి రూ.8 లక్షల ఆదాయం

పోలవరం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని టిక్కెట్ ధర రూ.10 పెంచడం ద్వారా పంచాయతీకి రూ.8 లక్షలు ఆదాయం వచ్చినట్లు పట్టిసీమ పంచాయతీ కార్యదర్శి యు.రాజారావు చెప్పారు. ఈ నెల 14 నుంచి 16 వరకు గోదావరి మధ్యలో జరిగిన ఉత్సవాలను పురస్కరించుకుని భక్తులు కాలినడకన నది దాటేందుకు టిక్కెట్ ధర రూ.30కి గాను రూ.10 కలిపి రూ.40 వసూలు చేశారు. రేవుపాటదారు 80 వేల టిక్కెట్లు అమ్మినట్లు చెప్పడంతో రూ.8 లక్షలు బ్యాంకులో జమ చేసే విధంగా చలానా రాసి అందజేసినట్లు కార్యదర్శి చెప్పారు.

ముక్కరామయ్య మృతి పార్టీకి తీరని లోటు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: సీపీఐ సీనియర్ నాయకుడు కొండపల్లి ముక్కరామయ్య మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా నాయకులు బీఎన్ సాగర్ అన్నారు. మంగళవారం వెంకటాపురంలో ముక్కరామయ్య మృతి చెందారు. ఆ కుటుంబ సభ్యులను పార్టీ నాయకులతో కలిసి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు.

బెల్లపు ఊట ధ్వంసం

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో సారా స్థావరాలపై దాడులు చేసినట్లు సీఐ అశోక్ బుధవారం తెలిపారు. ఈ దాడుల్లో చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెంలో సారా తయారీకి నిల్వ చేసిన 50 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశామన్నారు. టి.నరసాపురం మండలం వెలగపాడుకు చెందిన రమేష్, వెంకటేశ్వరరావు అనే ఇద్దరు పాత ముద్దాయిలను తహసీల్దార్ ఎదుట హాజరుపరచగా వారిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరి

చరవాణిలో నమోదుపై వివరిస్తున్న హబీబ్ బాషా

కొయ్యలగూడెం గ్రామీణ, జంగారెడ్డిగూడెం గ్రామీణ, బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ, పీఎంకిసాన్, పంటల బీమా తదితర సంక్షేమ పథకాల లబ్ధి చేకూరాలంటే రైతులంతా విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్‌బాషా సూచించారు. మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో రైతు సేవాకేంద్రాల సిబ్బందితో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ-పంట నమోదును ఈ నెల 20వ తేదీనాటికి, విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదును నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం పరింపూడిలోని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం, బుట్టాయగూడెం, బూసరాజుపల్లి గ్రామాల్లో ఈ-పంట నమోదు ప్రక్రియపై ఆయన రైతులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట కేఆర్‌పురం సబ్‌డివిజన్ ఏడీఏ పి.జి.బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట

కామవరపుకోట, న్యూస్‌టుడే: అత్యాశ వల్లే చాలా మంది సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుతున్నారని హెల్పేజ్ ఇండియా ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్యామ్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక చిన్న రాజన్న కల్యాణ మండపంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైబర్ క్రైమ్ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఆన్‌లైన్ మోసాల నివారణకు అవసరమైన చిట్కాలు, డిజిటల్ సేవలను వినియోగించే మార్గదర్శకాలపై వివరించారు.

శ్మశానవాటికకు స్థల పరిశీలన

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం రామన్నగూడెం వద్ద పునరావాస కాలనీకి శ్మశానవాటిక కోసం కేటాయించేందుకు గుర్తించిన భూమిని జంగారెడ్డిగూడెం ఇన్‌ఛార్జి ఆర్డీవో కిశోర్ బుధవారం పరిశీలించారు. కాలనీకి సమీపాన కోయరాజమండ్రి రెవెన్యూ పరిధి కె.బొత్తప్పగూడెం వద్ద 2.9 ఎకరాల జిరాయతీ భూమిని గుర్తించినట్లు తహసీల్దారు చలపతిరావు తెలిపారు.

తపస్సుకాల దీక్షలు ప్రారంభం



కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: గవరవరంలోని విచారణ ప్రధాన దేవాలయమైన త్రిత్వైక సర్వేశ్వరుని దేవాలయం వద్ద పలువురు విశ్వాసులు తపస్సు కాల దీక్షలను స్వీకరించారు. విభూది బుధవారం పురస్కరించుకుని ఏర్పాటైన కార్యక్రమంలో విచారణ గురువు దినేష్ ఆధ్వర్యంలో సహాయక గురువు వినయ్‌కుమార్ దీక్షలను అందించారు. ఈ సందర్భంగా విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వీఆర్‌ఏ మోసం చేశాడంటూ ఫిర్యాదు

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏగా పనిచేస్తున్న బి.వెంకటరమణ వద్ద అదే కార్యాలయంలో పనిచేస్తున్న మరో వీఆర్‌ఏ డబ్బులు తీసుకుని మోసం చేశాడని బాధితుని భార్య శ్రావణి ఇన్‌ఛార్జి తహసీల్దార్ ఉదయ భాస్కర్‌కు ఫిర్యాదు చేసింది. తన భర్తకు నైట్ వాచ్‌మెన్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి తమ వద్ద రూ.2 లక్షలు తీసుకున్నాడని ఆధారాలతో సహా ఫిర్యాదులో పేర్కొంది. తమ డబ్బు ఇప్పించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ద్విచక్ర వాహనాలు ఢీ: అయిదుగురికి గాయాలు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక బీడీ కాలనీకి చెందిన ఆనపు అప్పారావు(45) లింగపాలెం మండలం సింగవరం పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. రోజూ ద్విచక్ర వాహనంపై పాఠశాలకెళ్లి వస్తుంటారు. ఎప్పటిలాగే బుధవారం బడికెళ్లి.. సాయంత్రం ఇంటికొస్తుండగా.. నగర శివారులో నలుగురు విద్యార్థులు మరో ద్విచక్ర వాహనం వస్తూ ఢీకొన్నారు. ఈ ఘటనలో అయిదుగురికీ గాయాలయ్యాయి. వారిని ఏలూరు సర్వజన సర్వజన ఆసుపత్రికి తరలించారు. అప్పారావు పరిస్థితి విషమంగా ఉండటంతో.. ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని యువకుడికి..

గోపాలపురం, న్యూస్‌టుడే: లారీ, ద్విచక్రవాహనం ఢీకొట్టుకున్న ఘటనలో ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు.. ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం లక్ష్మణవారిగూడేనికి చెందిన సోదేం హరీష్ బుధవారం సాయంత్రం గోపాలపురం వెళ్లి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా గోపాలపురం శివారులో దుర్గమ్మ ఆలయం సమీపంలో హైదరాబాద్ నుంచి కలకత్తా వెళ్తున్న ఉల్లిపాయల లోడు లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలు అవ్వడంతో గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

బాధిత కుటుంబానికి సాయం

పోలవరం, న్యూస్‌టుడే: ఇటీవల చిలకలూరులో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన గురుగుంట్ల గంగిరెడ్డి కుటుంబాన్ని బుధవారం ఎస్టీ కమిషన్ సభ్యురాలు కాకి లక్ష్మి పరామర్శించి నిత్యావసరాలు అందజేశారు. చింతపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యురాలితోపాటు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ వెళ్లి 25 కిలోల బియ్యంతోపాటు కొంత ఆర్థిక సహాయం అందజేశారు. గెడ్డపల్లి పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల ప్రజలు అక్కడకు వచ్చి తాగునీరు, రోడ్డు సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఆమె వెంట ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ జగన్నాథరావు, సర్పంచి కె.శారద, డిప్యూటీ ఎంపీడీవో రవికుమార్ తదితరులున్నారు. అనంతరం డీడీ గ్రామంలోని పాఠశాలతోపాటు అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లల చదువులు గురించి ఆరా తీశారు.

పుల్లలు తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: పాములవారిగూడెం- దిబ్బగూడెం గ్రామాల మధ్య మారుజాతికి చెందిన అటవీ పుల్లలు తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను బుధవారం తెల్లవారుజామున దాడి చేసి పట్టుకున్నట్లు అటవీశాఖ ములగలంపల్లి సెక్షన్ అధికారి కుర్సం రాంబాబు తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని జంగారెడ్డిగూడెం రెంజ్ కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు.

పూరిల్లు దగ్ధం

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని మేడేపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. మేడేపల్లికి చెందిన సురేశ్ డాబా ఇంటికి ఆనుకుని ఉన్న పాకకు ఎవరూ లేని సమయంలో మంటలు అంటుకున్నాయి. దీంతో ఇంట్లోని సామగ్రి, 40 వేల నగదు అగ్నికి ఆహుతయ్యింది. సుమారు రూ.లక్ష వస్తువులు పాడయ్యాయని బాధితులు తెలిపారు. బాధితులకు మేడేపల్లి తెదేపా నాయకులు రూ.4 వేలు, 25 కేజీల బియ్యం, ఇతర సామగ్రి అందించారు.

కర్షకులకు కడగండ్లు..!

ఇసుక కాలువ కుడిగట్టుకు పడిన గండి

పోలవరం, న్యూస్‌టుడే: కొండవాగులు విరుచుకుపడి పోలవరం సమీపంలోని ఇసుక కాలువ కుడికాలువకు గండ్లు పడ్డాయి. దీంతో ఏటా జరుగుతున్న పంట నష్టంపై వైకాపా అయిదేళ్ల పాలనలో అధికారులు, నాయకులకు ఎన్ని వినతులు ఇచ్చినా ఫలితం లేకపోయింది. గట్టును అనుకుని గండ్లు ఉన్న భూముల్లో ఇసుకతోపాటు రాళ్లు వచ్చి మేటలు వేయడం, ప్రవాహం దిశ పొలాలు మీదుగా మారడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. దాదాపు నలుగు వందల ఎకరాలు ఏటా వరదల సమయంలో దెబ్బతింటుందని తక్షణం అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. ఈ పరిస్థితిపై జలవనరుల శాఖ డీఈ కె.వరప్రసాద్ మాట్లాడుతూ శాశ్వత మరమ్మతులకు రూ. 53 లక్షలతో ప్రతిపాదనలు తయారు చేసి పంపామని చెప్పారు.



(c) eenadu

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

ఏకాగ్రతతో చదివితే విజయం తథ్యం: డీఈవో

ముసునూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే పరీక్షల్లో విజయం సాధిస్తారని డీఈవో వెంకట లక్ష్మమ్మ అన్నారు. బుధవారం ముసునూరు బాలికల గురుకుల పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాల, మండల ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. వంటశాల, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. బోధనపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పదో తరగతి విద్యార్థుల 100 రోజుల ప్రణాళిక అమలు, రోజు వారి ప్రత్యేక తరగతుల నిర్వహణపై సమీక్షించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులకు సూచనలు చేశారు. పదో తరగతి విద్యార్థులు ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆమెతో డిప్యూటీ ఈవో సుధాకర్, ఎంఈవో సుబ్బారావు ఉన్నారు.

ఎట్టకేలకు కోడూరు రహదారి పనులు ప్రారంభం

5.6 కిలోమీటర్లకు రూ.3 కోట్లు మంజూరు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: కోడూరు రహదారికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. సుమారు పదేళ్లుగా ఈ రహదారి నిర్మాణానికి నోచుకోలేదు. రహదారి నిర్మాణం, లేదా కనీసం మరమ్మతులైనా నిర్వహించాలని గ్రామస్థులు అనేక విన్నపాలు అందించారు. పెద్దపెద్ద గుంతలు ఏర్పడి తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురయ్యేవారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు వానాకాలం ఈ దారిలో జారిపడి ఉద్యోగాలకు రావాలంటేనే భయపడ్డారు. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. జాతీయరహదారి నెం.165 నుంచి కోడూరు శివారు గుడివాడ రూరల్ మండలం చౌటపల్లి వరకు 5.6 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ.3కోట్లు మంజూరు చేశారు. యుద్ధ ప్రాతిపదికన పనులు నిర్వహిస్తున్నారు. తమ ప్రయాణ కష్టాలు తీరుతాయని గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

నూజివీడు: 80085 74698	ఆగిరిపల్లి: 9121229090
ముసునూరు: 93983 81268	చాట్రాయి: 8008574700
కైకలూరు: 73060 88555	మండవల్లి: 8106099008
కలిదిండి: 90594 84862	ముదినేపల్లి: 8008574693

కలిదిండి, న్యూస్‌టుడే: ? రక్షిత మంచినీటి చెరువు నుంచి సరఫరా చేస్తున్న తాగునీరు కలుషితమై తాగడానికి పనికి రాని విధంగా ఉన్నాయి. - **నారాయణ, కోరుకొల్లు**

✔ శుద్ధి చేసిన మంచి నీటినే సరఫరా చేస్తున్నాం. మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటాం. - **రాఘవేంద్రరావు, పంచాయతీ కార్యదర్శి**

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ? మండల కేంద్రమైన ముదినేపల్లిలోని ఎన్‌హెచ్‌పై ఉన్న వీధి దీపాలు వెలగడం లేదు. పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న దీపాలు వెలగడం లేదు. రాత్రిపూట వెళ్లాలంటే చీకటిలో భయమేస్తోంది. - **విలియం, ముదినేపల్లి**

✔ ఎన్‌హెచ్ విస్తరణ పనుల వల్ల లైట్లు తొలగించారు. వాటికి మరమ్మతులు చేయగానే వీధి దీపాలు వెలిగేలా చర్యలు చేపడతాం. - **జి.రమేష్, పంచాయతీ కార్యదర్శి**

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు 4వ వార్డులో చెత్త సేకరణ సక్రమంగా చేయక వ్యర్థాలు దుర్వాసన వస్తుంది. దీనిపై స్థానికుడు శ్రీనివాస్ 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ ఈవో పణిరాజకుమారి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆమె చెత్త తొలగింపజేసి సమస్యను పరిష్కరించారు.

లక్ష్యాలు సాధించాలి: జడ్పీ సీఈవో

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: గ్రామాల్లో కార్యదర్శులు సచివాలయ సిబ్బంది పన్నుల వసూళ్లలో జాప్యం చేస్తే సహించేది లేదని ఏలూరు జడ్పీ సీఈవో శ్రీహరి స్పష్టం చేశారు. బుధవారం నూజివీడు ఎంపీడీవో కార్యాలయంలో అందుబాటులో ఉన్న సచివాలయ సిబ్బంది, ఎంపీడీవో, కార్యాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వేగంగా పన్నులు వసూలు చేయాలని సూచించారు. గ్రామ వారీగా సమీక్షలు నిర్వహించి లక్ష్యాలను సాధించాలని ఎంపీడీవో చెన్నా రాఘవేంద్రనాథ్‌ను ఆదేశించారు. గ్రామీణ ప్రజలు, పరిశ్రమ యజమానులు విధిగా పన్నులు చెల్లించి గ్రామాల అభివృద్ధికి భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తాలు!

పసిపాప ఆరోగ్యానికి బాసటగా నిలుస్తున్న కైకలూరు యువత

కలిదిండి, కైకలూరు న్యూస్‌టుడే: 'మన ఊరు కాదు.. మన వాడ కాదు. మనకెందుకులే అనుకోలేదు. ఏ ఊరు అయితేనేమి..? ఏ వాడ అయితేనేమి..? మనలో మానవత్వం ఉంటే చాలు.. కష్టంలో ఉన్న వాళ్లను ఆదుకునే మంచి మనసుంటే చాలు' అని నిరూపించారు కైకలూరు నియోజకవర్గంలోని యువత. కర్నూలులోని వెల్దుర్తి గ్రామానికి చెందిన సురేశ్‌కుమార్, పుష్పవతి దంపతుల ఏడు నెలల కుమార్తె పునర్వికకు అకస్మాత్తుగా వ్యాధి సోకింది. పుట్టినప్పుడు ఆరోగ్యంగా ఉన్న ఆ చిన్నారి మూడు నెలల తరవాత శరీరంలోని కొన్ని భాగాల్లో కదలిక ఆగిపోయింది. కోట్లలో ఒకరికి సోకే 'స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ' (ఎస్ఎంఏ) వ్యాధి సోకినట్లు వైద్యులు నిర్ధారించారు. చికిత్సకు రూ.16 కోట్ల వరకు ఖర్చవుతుందని, తమ పాప ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి దాతల సాయం కోరుతున్నట్లు తల్లిదండ్రులు సామాజిక మాధ్యమాల ద్వారా చేసిన ప్రచారం కైకలూరు నియోజకవర్గంలోని యువత దృష్టికి వచ్చింది.

ఊరూ వాడా తిరిగి..

పాపకు సాయం చేయడానికి కైకలూరుకు చెందిన రుద్రరాజు శివరామరాజు, మొద్దపు జగదీశ్ ముందడుగు వేశారు. శివరామరాజు తన చేతికి ఉన్న బంగారు కడియం అమ్మి రూ.5 లక్షలు అందించారు. ఈ స్ఫూర్తితో స్పందించే హృదయాలు అన్నీ ఓ చోట చేరాయి. పది రోజులుగా ఉద్ధరాజు సుభాషిణి, జల్లా ధర్మరాజు, పృథ్వీరాజ్, జుద్దు సుబ్రహ్మణ్యం, మారెళ్ళయిన రాకేశ్, శివాజీ, వంశీ తదితరులతో కలిసి పది రోజులుగా వీధి.. వీధి తిరిగారు. కనిపించిన ప్రతి ఒక్కరినీ సాయం అర్థించారు. నియోజకవర్గ పరిధిలో బుధవారం ఉదయానికి రూ.23,67,212 సేకరించారు. చికిత్స ప్రారంభించే వరకూ రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలోని అన్ని ప్రాంతాల్లోనూ తిరిగి విరాళాలు సేకరించి పునర్విక చికిత్సకు అందిస్తామని తెలిపారు. బుధవారం కైకలూరు వచ్చిన సురేశ్‌కుమార్, పుష్పవతి దంపతులను యువత స్వయంగా కలిసి పాప ఆరోగ్యంపై ఆరా తీశారు. పునర్విక కోలుకుంటుందని ప్రేమతో సాకారు. పాప తల్లిదండ్రులకు ధైర్యం చెప్పి పంపించారు.

చిన్నారి పునర్వికతో శివరామరాజు, జగదీశ్

జోరుగా జీవనోపాధుల సర్వే

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి స్వయం సహాయక సంఘాలలోని సభ్యుల ఉపాధి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు జోరుగా జీవనోపాధుల సర్వేను వెలుగు అధికారులు నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల్లోని సభ్యులతో ఏపీఎం రాజేశ్వరి, సూపర్‌వైజర్లు, ఈ వారేల, సీఆర్‌పీలు పాల్గొని కుటుంబ ప్రస్తుత స్థితిని లైవ్‌యాప్‌లో నమోదు చేస్తున్నారు. సర్వే పూర్తయిన వారం రోజుల్లో వృత్తులను బట్టి వ్యవసాయం, వ్యవసాయేతర సభ్యులుగా విభజించి వారికి మెరుగైన ఉపాధి అవకాశమైన చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని వివరించారు.

అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు డివిజన్‌ను అభివృద్ధి పథంలో ముందున నిలిపేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టరు వెట్రిసెల్వి నూజివీడు సబ్‌కలెక్టరు బొల్లిపల్లి వినూత్నకు సూచించారు. బుధవారం నూజివీడు, ముసునూరు మండలాల్లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం సబ్‌కలెక్టరు కార్యాలయంలో పలు అంశాలపై చర్చించారు. విద్య, వైద్యం, సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి స్థాయిలో అమలయ్యేలా పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వ నిధులతో చేపట్టిన నిర్మాణ పనులు, పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు, వసతి గృహాల నిర్వహణ తదితర సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఉద్యోగుల్లో జవాబుదారీతనం పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు.

హుండీల ఆదాయం లెక్కింపు

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం బలివే రామలింగేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉత్సవాల అధికారి అసూరద వర్మ పర్యవేక్షణలో గ్రామస్థుల సమక్షంలో హుండీ ఆదాయం లెక్కించినట్లు ఆలయ ఈవో పామర్తి సీతారామయ్య తెలిపారు. హుండీలు, వివిధ సేవా టిక్కెట్లు, కొబ్బరి చెక్కలు, అభిషేకాలు, లడ్డూలు, షాపు స్థలాల ద్వారా ఆలయానికి రూ.46,40,495 ఆదాయం లభించినట్లు తెలిపారు. గతేడాది కంటే ఈ ఏడాది రూ.5 లక్షలు ఆదాయం పెరిగిందని వివరించారు. ధర్మకర్త బొమ్మకంటి శ్యామలరావు పాల్గొన్నారు.

ఉపేంద్ర కుటుంబానికి పరామర్శ

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ముర్సపూడి గ్రామ తెదేపా సీనియర్ నాయకుడు ఎన్.ఉపేంద్ర మృతి చెందడం బాధాకరమని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. బుధవారం ఉపేంద్ర ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అన్ని విధాల అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

పెద్దింట్లమ్మ ఖ్యాతిని పెంచేలా పనులు

కైకలూరు, న్యూస్‌టుడే: 'పెద్దింట్లమ్మ అమ్మవారి దేవస్థాన ఖ్యాతిని పెంచేలా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. పెద్దింట్లమ్మ జాతర సందర్భంగా బుధవారం ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, మాజీ ఎమ్మెల్యే కమ్మిలి విఠల్‌రావుతో కలిసి బుధవారం సాయంత్రం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ధర్మకర్తల మండలి ఛైర్మన్ జల్లూరి వెంకన్న, ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వీరికి పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. అమ్మవారికి తీర్థ ప్రసాదాలు అందించి శేష వస్త్రాలతో ఘనంగా సత్కరించారు.

అభివృద్ధి పనుల ప్రారంభం.. కొల్లేటికోట పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రూ.1.75 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లు ప్రారంభించి.. ఆది దంపతులు పార్వతీ, పరమేశ్వరుడి విగ్రహాలను ఆవిష్కరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భారీగా కూటమి నాయకులు, కొల్లేరు ప్రజలు పాల్గొన్నారు.

పార్వతీదేవి, పరమేశ్వరుడి విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కామినేని, ఎమ్మెల్సీ జయమంగళ

అత్యవసర వైద్యానికి అన్ని వేళలా సహాయం

చాట్రాయి, న్యూస్‌టుడే: అత్యవసర సమయాల్లో వైద్యాన్ని పొందలేని వారికి కూటమి ప్రభుత్వం ఆపన్నహస్తాన్ని అందిస్తోందని, ముఖ్యమంత్రి సహాయనిధిని పేదల కోసమే ఖర్చు చేస్తున్నామని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. పోలవరం గ్రామానికి చెందిన వి.సుబాషిణికి అత్యవసర వైద్యం కోసం ఇబ్బంది పడుతున్న సమాచారం కార్యకర్తల ద్వారా తెలిసిన వెంటనే మంత్రి స్పందించి రూ.2.40 లక్షల ఎల్వోసీని బుధవారం కుటుంబ సభ్యులకు అందించారు.

ఎల్‌వోసీ అందిస్తున్న పార్థసారథి

లంచం అడిగితే కఠిన చర్యలు: మంత్రి..

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యానికి లంచం అడిగితే కఠిన చర్యలు తీసుకుంటానని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పని తీరు పై ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన నివేదిక పైన ఆస్పత్రి సూపరింటెండెంట్, ఆర్‌ఎంవోతో బుధవారం విజయవాడలోని మంత్రి కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సేవలకు లంచం అడగటం, వసతులు, శానిటేషన్, ఆహార మెనూ పాటించకపోవడం, మరుగుదొడ్లు ఇతర వసతుల విషయంలో పనితీరు బాగోలేదని సర్వేలో 63 శాతం మంది చెప్పారన్నారు. దీంతో ఆయన అధికారులను నిలదీశారు. జిల్లాలోని ఇతర నియోజకవర్గాల్లో 70 నుంచి 80శాతం మెరుగ్గా ఉంటే ఇక్కడ దారుణమైన పరిస్థితులపై సూపరింటెండెంట్ పద్మజారాణి, ఆర్ఎంవో శ్రీనివాసులను నిలదీశారు. పని తీరు మెరుగు పరచుకోకపోతే సస్పెన్షన్‌కు వెనుకాడేది లేదని హెచ్చరించారు. వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. సౌకర్యాలు కొరత ఉంటే తన దృష్టికి తీసుకుని రావాలని తెలిపారు. సీసీ కెమెరాలను గేటు వద్ద నుంచి ఆస్పత్రిలోని అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు.

ఆస్తి పన్ను వసూలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: కలెక్టరు

ముసునూరు, న్యూస్‌టుడే: ఆస్తి పన్ను వసూలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టరు వెట్రిసెల్వి అధికారులను హెచ్చరించారు. బుధవారం ముసునూరు ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆస్తి పన్ను, పారిశుద్ధ్యం, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేపై కార్యదర్శులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ.. ముసునూరు మండలంలో ఆస్తి పన్ను 17 శాతం మాత్రమే వసూలు చేశారన్నారు. వసూళ్లలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని కార్యదర్శులు, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్చి 31లోగా నూరు శాతం వసూలు చేయాలని ఆదేశించారు. పీ4 కార్యక్రమంలో గుర్తించిన బంగారు కుటుంబాలను మార్గదర్శులతో అనుసంధానం చేయాలన్నారు. ప్రజల నుంచి అందిన అర్జీలను సమయంలోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. జడ్పీ సీఈవో శ్రీహరి, డీపీవో అనురాధ, సబ్ కలెక్టర్ వినూత్న, ఎంపీడీవో ఏసుబాబు పాల్గొన్నారు.



ముసునూరు ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న వెట్రిసెల్వి

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి.. నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో బాలికలు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టరు వెట్రిసెల్వి ఆదేశించారు. బుధవారం నూజివీడులోని బాలికోన్నత పాఠశాల, డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ఆమె సబ్‌కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, డీఈవో వెంకటలక్ష్మమ్మ, డీవైఈవో సుధాకర్ తదితరులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆయా పాఠశాలల్లో బాలికలతో మాట్లాడారు. ఏ,బీ,సీ గ్రేడుల్లో ఉన్న విద్యార్థుల వివరాలను ఆరా తీశారు. బి, సి గ్రేడుల్లో ఉన్న వారిని ఏ గ్రేడుకు తీసుకురావాలని సూచించారు. విద్యార్థులకు అందించే మెనూలో నాణ్యత లోపిస్తే వంట ఏజెన్సీపై చర్యలు ఉంటాయన్నారు. బాలికల పటిష్ఠ భద్రతకు చర్యలు తీసుకోవాలన్నారు. మరుగుదొడ్లను, పరిసరాలను పరిశీలించిన ఆమె ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు ఇచ్చారు. డీఈవో వెంకట లక్ష్మమ్మ, డీవైఈవో సుధాకర్, నూజివీడు తహసీల్దారు భద్రు, ఎంఈవో 1 దేవ వరప్రసాద్, ఎంఈవో 2 జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలకు మార్గదర్శకులను గుర్తించండి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: గ్రామాల్లో గుర్తించిన బంగారు కుటుంబాల అభివృద్ధికి మార్గదర్శకులను గుర్తించాలని నూజివీడు నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళిక కార్యాలయం ఉద్యోగులకు ఎంపీడీవో చెన్నా రాఘవేంద్రనాథ్ సూచనలు ఇచ్చారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో యంగ్ ప్రొఫెషనల్, ఇతర ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఎంపీడీవో మాట్లాడుతూ నియోజకవర్గంలో 11,753 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు చెప్పారు. వీరిలో 7,644 మందిని దత్తత తీసుకున్నారు. ఆగిరిపల్లి మండలంలో 1208 మంది, చాట్రాయిలో 1666, ముసునూరులో 426, నూజివీడు అర్బన్‌లో 2,762, నూజివీడు రూరల్‌లో 1582 మంది ఉన్నారన్నారు. ఇంకా సచివాలయ సిబ్బంది 5,153 మంది సర్వే పూర్తి చేశారన్నారు. మిగిలిన వారిని దత్తత తీసుకోవాల్సి ఉందన్నారు. వీరందరికి చేయూత అందించేందుకు ఆయా గ్రామాల్లో పారిశ్రామికవేత్తలను, ఇతర మార్గదర్శకులను ఎంపిక చేసి, వారితో మాట్లాడి ఈ కార్యక్రమానికి సహకరించేలా చూడాలని పేర్కొన్నారు.

ఉద్యోగులకు సూచనలిస్తున్న రాఘవేంద్రనాథ్

వేసవి రాకుండానే అడుగంటిన చెరువు

కలిదిండి, న్యూస్‌టుడే : వేసవి రాక ముందే చెరువులు అడుగంటుతున్నాయి. తాగు నీరు రోజూ ఇవ్వలేమంటూ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, అధికారులు చేతులెత్తేస్తున్నారు. మండల కేంద్రమైన కలిదిండిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మంచినీటి చెరువు 80 శాతం అడుగంటింది. 'చెరువులో నీళ్లు తక్కువగా ఉన్నందున రోజు విడిచి రోజు తాగునీరు సరఫరా చేస్తామంటూ' వాట్సాప్ గ్రూపుల్లో పంచాయతీ అధికారుల పేరుతో పోస్టులు హల్‌చల్ చేస్తుండటం గ్రామస్థుల్లో ఆందోళన రేపుతోంది. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కృష్ణారావు, జల వనరుల శాఖ ఏఈ ఫణికుమార్ మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. వీలైనంత త్వరగా క్యాంబెల్ కాలువకు నీరు విడుదల చేసి.. చెరువులు పూర్తి స్థాయిలో నింపే విధంగా చర్యలు తీసుకుంటామని వివరించారు.

తమ్మిలేరు వంతెనకు గండి ముప్పు!

చాట్రాయి, న్యూస్‌టుడే: తమ్మిలేరు జలాశయం వద్ద నిర్మించిన వంతెనకు గండి ముప్పు పొంచి ఉంది. విస్సన్నపేట-వెలగలపల్లి రహదారిలో జలాశయం లాకుల వద్ద నిర్మించిన ఈ వంతెనకు ఏళ్ల తరబడిగా నిర్వహణ చేపట్టని ఫలితంగా ఇలా మారింది. రహదారి పక్కనే వర్షాల సమయంలో వృథా నీరు ఉద్ధృతిగా తమ్మిలేరులోకి చేరుతోంది. వంతెన పక్క నుంచి నీరు పోవడంతో మట్టి జారి పోయింది. ఇక్కడ వంతెన.. రోడ్డు అనుసంధానమైన చోట నీరు జారడంతో ఇరవై అడుగుల మేర గొయ్యి ఏర్పడింది. మూడేళ్లుగా భారీ వర్షాలతో మరింత విస్తరించింది. భారీ వర్షాల సమయంలో ఇక్కడ గతంలో రాకపోకలను సైతం నిలిపివేశారు. తాత్కాలికంగా మట్టి పోసి గండి పూడ్చుతున్నా వర్షాల సమయంలో సమస్య పునరావృతమవుతోంది. ఈ రహదారిలో నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాలు ప్రయాణిస్తున్నాయి. వంతెన కోతకు గురైన చోట రిటైనింగ్ వాల్ నిర్మించాల్సి ఉంది. ఈ విషయమై ర.భ.శాఖ నూజివీడు డీఈ బాబూరావును వివరణ కోరగా తాత్కాలిక పనుల చేస్తున్నామని, రహదారి విస్తరణ పనుల్లో శాశ్వత పనులకు అంచనాలు వేస్తామని తెలిపారు.

కోతకు గురవుతూ ఇలా..

నమూనా చెక్కు అందిస్తున్న తపాలా శాఖ అధికారులు

రూ.10 లక్షల బీమా పరిహారం చెల్లింపు

మండవల్లి, న్యూస్‌టుడే: ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యులకు మండవల్లి తపాలా కార్యాలయం ఆధ్వర్యంలో రూ.10 లక్షల బీమా పరిహారాన్ని అందించారు. మండలంలోని పెరికెగూడేనికి చెందిన గుంటూరి దుర్గారావు సంవత్సరం క్రితం మండవల్లి తపాలా కార్యాయలంలో రూ.520తో ప్రమాద బీమా చేయించుకున్నారు. ఇటీవల ఆయన మృతి చెందడంతో కుటుంబ సభ్యులకు గుడివాడ పోస్టల్ సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, సహాయ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, కైకలూరు, మండవల్లి పోస్టల్ అధికారులు సురేశ్, గణేశ్‌లు ప్రమాద బీమా పరిహారాన్ని అందించారు. తపాలా బీమా సదుపాయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యలపై స్పందించకుంటే నిరవధిక దీక్ష

ముదినేపల్లి న్యూస్‌టుడే: తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించి పరిష్కరించకపోతే నిరవధిక దీక్షకు సైతం సిద్ధమేనని సహకార సంఘాల ఉద్యోగులు అన్నారు. సహకార సంఘాల యూనియన్‌లు ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా బుధవారం స్థానిక కేడీసీసీ బ్యాంక్ వద్ద ఆందోళన నిర్వహించారు. బ్యాంక్ మేనేజరు పి.సురేశ్ బాబు, సూపర్‌వైజరు ఎం.నాగభూషణం ఆందోళనలో పాల్గొని మద్దతు తెలిపారు. ఇందులో సీఈవోలు అల్లాడి దుర్గారావు, ప్రసాద్, మునీశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కేడీసీసీ బ్యాంక్ వద్ద ఆందోళన చేస్తున్న సీఈవోలు

సమన్వయంతో పని చేయండి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పార్టీలో నాయకులు కార్యకర్తలు సమన్వయంతో పని చేసి గ్రామాభివృద్ధిలో పోటీ పడాలని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. దిగవల్లి సొసైటీ ఛైర్‌పర్సన్‌గా నియమితులైన యలమంచిలి నాగేంద్రప్రసాద్, కమిటీ సభ్యులు మొలుగుమాటి రాజేశ్, కెత్తే హరి కిశోర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు వేమూరి సత్యనారాయణ, ఇతర కమిటీల సభ్యులు బుధవారం విజయవాడలోని మంత్రి కార్యాలయంలో కలిసి సొసైటీ పదవిని కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో చేయాల్సిన అభివృద్ధి పనులు తదితరాలు చర్చించారు. మురుగు కాల్వల నిర్మాణం, దిగవల్లి నుంచి మిట్టగూడెం వెళ్లే రహదారి నిర్మాణానికి కృషి చేయాలని కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. జిల్లా పరిషత్తు నుంచి నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటానన్నారు.

అటు చదువు.. ఇటు సేవ!

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: పాఠశాల స్థాయి నుంచే చదువుతో పాటు సేవ కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులకు సమాజ పరిస్థితులపై అవగాహన ఏర్పడుతుందని ఎంఈవో కె.ఆనంద్ కుమార్ తెలిపారు. ఆగిరిపల్లి మండలంలోని 8 ప్రభుత్వ, 7 ప్రైవేటు పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లను ప్రారంభించినట్లు తెలిపారు. ఆ పాఠశాలలకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ టీచర్లకు ఆగిరిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రమశిక్షణ, సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించాలని, విద్యార్థుల జట్టు కృషి, సమన్వయ నిర్వహణ, నాయకత్వం, చొరవ, ప్రణాళిక, స్వీయ ప్రేరణ, సాంస్కృతిక అవగాహన, నిబద్ధత, కమ్యూనికేషన్ వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయిని బీవీఎస్ లక్ష్మి, రిసోర్స్ పర్సన్లు శ్రీహరి రావు, సురేశ్‌బాబు, మౌనికలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఈవో ఆనంద్ కుమార్

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న నాయకులు

రజక ఆత్మీయ సభ విజయవంతానికి పిలుపు

ముసునూరు, న్యూస్‌టుడే: నూజివీడులో ఈ నెల 22న జరగనున్న రజక ఆత్మీయ బహిరంగ సభను విజయవంతం చేయాలని తెదేపా రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి, రాష్ట్ర రజక సంఘం నాయకుడు మానురాజు సురేశ్, సభ నిర్వాహకుడు పగడాల సాంబశివరావు పిలుపునిచ్చారు. బుధవారం ముసునూరు మండలం చెక్కపల్లిలో రజక సంఘం నాయకులతో కలిసి గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ.. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, ప్రభుత్వం ఇచ్చిన జీవోను అమలు చేయాలన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 50 శాతం రుణాలు, రక్షణ తదితర చట్టాలు అమలు చేయాలన్నారు. రజక సంఘం వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కంచర్ల వేంకటేశ్వరరావు, రాంబాబు, నాగేంద్ర, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం

ముసునూరు, న్యూస్‌టుడే: భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించాలని ఏవో చాముండేశ్వరి అన్నారు. బుధవారం ముసునూరు మండలం బలివే, వేల్పుచర్ల గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్న పంటలను పరిశీలించి రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. విశిష్ట సంఖ్య ద్వారా భవిష్యత్తులో పీఎం కిసాన్, పెట్టుబడి రాయితీ, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ యంత్రాలు రాయితీపై లభిస్తాయన్నారు.

వేల్పుచర్లలో అవగాహన కల్పిస్తున్న ఏవో

తెగుళ్ల నివారణతోనే అధిక దిగుబడులు

మండవల్లి, న్యూస్‌టుడే: తెగుళ్ల నివారణతోనే సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు వీలుంటుందని శాస్త్రవేత్త ఫణి పేర్కొన్నారు. మండలంలోని పెరికెగూడెంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా తెగుళ్లపై నిఘా ఏర్పాటు చేశారు. మినుము పంటలో బూడిదరంగు తెగులును గుర్తించినట్లు వివరించారు. సుడోమోనాస్, వేపనూనె పిచికారీ చేయడం వల్ల ప్రయోజనం ఉంటుందని తెలిపారు. రైతులకు తెగుళ్లపై అవగాహన ఎంతో అవసరమని.. వ్యవసాయాధికారుల సలహాలు సూచనలు తప్పక పాటించాలని కోరారు. ఇందులో ఏడీఏ వెంకటమణి, ఏవో శ్రీనివాసరావు పెద్దఎత్తున రైతులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా మహిళ సంచారం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: వడాలిలో బుధవారం ఓ మహిళ అనుమానాస్పదంగా సంచరించడం కలకలం రేపింది. ఇటీవల శ్రీహరిపురానికి చెందిన రెండున్నరేళ్ల మోక్షిత్ అదృశ్యమైన నేపథ్యంలో పిల్లలను ఎత్తుకెళ్లేవారు తిరుగుతున్నారనే వదంతులు జోరుగా సాగుతున్నాయి. ఈ సమయంలో వడాలిలో మహిళ సంచరించడం.. స్థానిక యువకులు ఏమిటని ప్రశ్నిస్తే ఆకలి వేస్తోందని, అందుకే వచ్చానని, తాను వెళ్లిపోతానని.. పొంతలేని మాటలు చెప్పడటం వారి అనుమానానికి మరింత బలం చేకూర్చింది. దీంతో ఆ మహిళను ఫోన్లో చిత్రీకరించడంతో అక్కడ నుంచి ఆటోలో వెళ్లిపోయింది. ఆ అమ్మాయితో అందరూ అప్రమత్తంగా ఉండాలని, పిల్లలను బయటకు వదలవద్దని వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. పలు గ్రామాల్లో ఇదే విషయంపై చర్చలు కొనసాగుతున్నాయి.

దాతల సహకారం అభినందనీయం

ఆగిరిపలి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలకు దాతల సహకారం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు జలసూత్రం వెంకటేశ్వరరావు తెలిపారు. ఆగిరిపల్లి మండలం నూగొండపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన తెదేపా గ్రామ అధ్యక్షుడు మట్టా వేణు బుధవారం పాఠశాలకు 20 కుర్చీలను వితరణగా ఇచ్చారు. దాతను ఉపాధ్యాయులు అభినందించారు.

భస్మ బుధవారం ప్రార్థనలు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: స్థానిక ఆర్సీఎం చర్చిలో బుధవారం క్రైస్తవులు భస్మ బుధవారాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఫాదర్ కమతం మరియదాసు ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. శ్రమ దినాలు ప్రారంభం సందర్భంగా సుమారు వంద మంది తెల్లదుస్తులు ధరించి, తపస్సు కాలాన్ని స్వీకరించారు. 40 రోజుల పాటు తపస్సు కాలాన్ని నిష్ఠగా భక్తిశ్రద్ధలతో ఆచరించాలని క్రైస్తవ పెద్దలు సూచించారు.

తపస్సుకాల దీక్ష స్వీకరిస్తున్న విశ్వాసులు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: క్రైస్తవ లోకానికి అత్యంత పవిత్రమైన కాలం లెంట్ అని పాస్టర్లు రెవ.ఎస్.విజయకుమార్, రెవ.కె.దైవ నిరీక్షణ కుమార్, రెవ.ఫాదర్ అల్లం ప్రతాప రెడ్డి, రెవ.ఫాదర్.కె.ప్రశాంత్ తెలిపారు. నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల్లో క్రైస్తవుల ఉపవాస దీక్షలు బుధవారం భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. అన్ని సీఎస్ఐ, ఆర్సీఎం, జీసస్ లివింగ్ మినిస్ట్రీస్, గాడ్ ఆఫ్ గాడ్ మినిస్ట్రీస్ సంఘాల చర్చిల్లో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ.. లెంటులోని ప్రారంభ దినం బుధవారం నుంచి ఈస్టర్ ముందు రోజు వరకు 40 రోజుల మండల కాలంలో క్రైస్తవులు ఉపవాసం ఉండే రోజులని తెలిపారు. క్రీస్తు లోక రక్షణార్థమై శ్రమ పొందిన ఈ దినాల్లో ప్రభువు సిలువ శ్రమలను ఉపవాసం ఉండి ధ్యానించడం మంచిదని వారు పేర్కొన్నారు.

అలరించిన చింతపాడు పాఠశాల వార్షికోత్సవం

మండవల్లి, న్యూస్‌టుడే: జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటికోసం నిత్యం కృషి చేయాలని చింతపాడు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. పాఠశాల వార్షికోత్సవం, పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మంచిగా చదివి తల్లిదండ్రులకు కళాశాలకు మంచి పేరును తీసుకురావాలన్నారు. భవిష్యత్తు ఉన్నతంగా ఉండాలనుకునే వారు వ్యసనాలకు దూరంగా, క్రమశిక్షణకు దగ్గరగా ఉంటారని, విద్యార్థులంతా క్రమశిక్షణతో మెలగాలన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు దుమ్ము రేపేలా చిందేశారు. విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో విద్యార్థులు

ట్రిపుల్ ఐటీలో ఉద్యోగుల క్రికెట్

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఉద్యోగులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. బుధవారం ఈ పోటీలను ఏవో లక్ష్మణరావు ప్రారంభించారు. ఉద్యోగులు ఒత్తిడి నుంచి బయట పడేందుకు ఈ క్రీడలు దోహదం చేస్తాయన్నారు. ఈ నెల 21వ తేదీ వరకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పోటీలు ప్రారంభిస్తున్న ఏవో లక్ష్మణరావు

(c) eenadu

తెప్పోత్సవం.. భక్తజన పరవశం

సామర్లకోట, న్యూస్‌టుడే: పంచారామ క్షేత్రమైన సామర్లకోట చాళుక్య కుమారారామా భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం భీమేశ్వరస్వామి, బాలాత్రిపురసుందరి అమ్మవార్ల తెప్పోత్సవం కనులపండువగా జరిగింది. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ ఈవో నీలకంఠం, ఛైర్మన్ జగదీష్‌మోహన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. తొలుత స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకిపై ఆలయ కోనేరు వద్దకు తీసుకువచ్చి.. హంస వాహనంపై మూడు సార్లు ఊరేగించారు.

సామర్లకోటలో హంసవాహనంపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరి సమేత ఉమా కుక్కుటేశ్వరస్వామి వార్ల కల్యాణోత్సవాలు ముగిశాయి. బుధవారం రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో పుష్కరిణిలో నిర్వహించిన తెప్పోత్సవం కనుల పండువగా సాగింది. ఈ కార్యక్రమాన్ని తిలకించిన భక్తజనం పులకించిపోయారు. శ్రీపుష్పోత్సవం, ఏకాంత సేవా గానం దేవస్థానం అర్చకులు కోట వీర వెంకట సత్యనారాయణమూర్తి, దత్తాత్రేయ శర్మ, కైతేపల్లి రాజ్‌కుమార్ శర్మ, కుక్కుటేశ్వర శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈవో కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్, ఉత్సవాల ప్రత్యేక అధికారి సురేష్ నాయుడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పాదగయ పుష్కరిణిలో..

నేటి నుంచి రంజాన్ మాసం

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: ముస్లింలకు అతి పవిత్రమైన రంజాన్ మాసం గురువారం నుంచి ప్రారంభం కానుంది. నెల వంక కనపడగానే బుధవారం రాత్రి మసీదుల్లో తరావీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గురువారం ఉదయం 5.07 నిమిషాలకు మొదటి సహరీతో ఉపవాసాలు ప్రారంభించనున్నారు. ఈ నెలరోజులపాటు ముస్లింలు కఠిన ఉపవాసాలు ఉంటారు. ప్రతి రోజు రాత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు.

విద్యుద్దీపాలతో అలంకరించిన జె.రామారావుపేట మక్కా మసీదు

రంజాన్ నెల ప్రారంభం సందర్భంగా కాకినాడ నగరంలోని మసీదులకు రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. మెయిన్‌రోడ్డులోని జామియా మసీదు(పెద్ద మసీదు), కొత్తపేట నగీనా మసీదు, కొత్తగర మదీనా మసీదు, జగన్నాథపురం జె. రామారావుపేట మక్కా మసీదు, జగన్నాథపురం మజీద్ ఆ ఆజాం, సాంబమూర్తినగర్ హబీబియా మసీదు, రమణయ్యపేట మస్జిద్ ఏ ఖుబా తదితర మసీదులను విద్యుద్దీపాలతో అలంకరించారు.

ముస్తాబైన మసీదులు

సామూహిక ప్రార్థనలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆయా మసీదు కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు మద్రాసా ఇస్లామియా అహ్మదియా హాస్టల్ ప్రిన్సిపల్, ప్రముఖ ఖ్వాజా ఎస్‌కే గౌస్ మొహిద్దీన్ హాబీబ్ తెలిపారు.

కరెంటు దొంగలు
యథేచ్ఛగా విద్యుత్తు చౌర్యం

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

జిల్లాలో అక్రమ విద్యుత్తు వినియోగం యథేచ్ఛగా సాగుతోంది. ఎన్ని చర్యలు చేపట్టినా అక్రమార్కులకు అడ్డుకట్ట పడటం లేదు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 15 వరకు విద్యుత్తు అక్రమ వినియోగానికి సంబంధించిన కేసులను పరిశీలిస్తే విస్తుపోవాల్సిందే. సామాన్యుడు బిల్లు కట్టకపోతే వెంటనే కనెక్షన్ కట్ చేసే అధికారులు. . చౌర్యం చేసే వారికి మాత్రం జరిమానా విధించి ఊరుకుంటున్నారు. అది చెల్లించడానికి గడువూ ఇస్తున్నారు. దీంతో అక్రమార్కులు నాయకులతో సిఫార్సులు చేయిస్తూ పబ్బం గడుపుతున్నారు.

డివిజన్	లైన్ల నుంచి చౌర్యం	మీటరు నుంచి	అదనపు లోడు	అనధికార వినియోగం	షార్ట్ బిల్లింగ్	జరిమానా (రూ.కోట్లలో)
జగ్గంపేట	254	156	148	73	94	2.82
కాకినాడ	84	47	249	49	178	2.08
పెద్దాపురం	21	16	82	8	55	0.92

పెదపూడి మండలం రామేశ్వరంలో మీటరు నుంచి విద్యుత్తు చౌర్యం ఇలా..

అయిదు రకాలుగా అక్రమం

ఏఈపీడీసీఎల్‌కు చెందిన విజిలెన్స్, ఆపరేషన్స్ విభాగాలు ఎక్కడికక్కడ తనిఖీలు చేపట్టినా.. చౌర్యానికి అడ్డుఅదుపూ లేకుండా పోతోంది. అయిదు రకాలుగా అక్రమ వినియోగానికి పాల్పడుతున్నట్లు గుర్తించారు. ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాల నుంచి అక్రమంగా విద్యుత్తు వినియోగం, మీటరు నుంచి చౌర్యం, ఒక కేటగిరీ కింద కనెక్షన్ తీసుకుని అదనపు లోడ్ వినియోగించడం, వ్యవసాయ కనెక్షన్ తీసుకుని చెరువులు వంటి వాటికి వినియోగించడం, మీటరు పనిచేయకుండా చేయడం వంటి చర్యలతో విద్యుత్తు శాఖకు నష్టం చేకూరుస్తున్నారు. వీటికి సంబంధించి కాకినాడ, పెద్దాపురం, జగ్గంపేట డివిజన్లలో 9 నెలల 15 రోజుల కాలంలో 1,514 కేసులు నమోదు చేశారు. రూ. 5.82 కోట్ల మేర జరిమానా విధించారు.

వేసవి నేపథ్యంలో నిఘా

జిల్లాలోని జగ్గంపేట, కాకినాడ డివిజన్ల పరిధిలో ఎక్కువగా విద్యుత్తు చౌర్యం జరుగుతున్నట్లు గుర్తించారు. మొత్తం కేసుల్లో ఈ రెండింటిలోనే 1,333 ఉన్నాయి. జగ్గంపేట డివిజన్‌లోని జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో ఎక్కువగా అక్రమ విద్యుత్తు వినియోగం జరుగుతోంది. కాకినాడ డివిజన్‌కు సంబంధించి కరప సబ్‌డివిజన్‌లోని పెదపూడి, కరప మండలాలు, పెద్దాపురం డివిజన్‌కు సంబంధించి పెద్దాపురం, సామర్లకోట గ్రామీణ ప్రాంతాల్లో ఈ చౌర్యం ఎక్కువగా జరుగుతోంది. వేసవి నేపథ్యంలో అక్రమార్కులు మరింత రెచ్చిపోయే అవకాశముంది. గత అనుభవాల నేపథ్యంలో పెదపూడి, కరప, జగ్గంపేట, గండేపల్లి మండలాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

అక్రమ విద్యుత్తు వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు చేపడతాం. ఈ విషయంలో ఎవరినీ వదలం. నిరంతరం నిఘా కొనసాగిస్తాం. కేసులు నమోదైన వాటికి జరిమానా చెల్లించకపోతే కనెక్షన్లు నిలిపివేస్తాం.

- జి.ప్రసాద్, ఎస్‌ఈ, ఏపీఈపీడీసీఎల్, కాకినాడ సర్కిల్

కోర్టుకు బాంబు బెదిరింపులు
రాజమహేంద్రవరంలో ముమ్మర తనిఖీలు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలోని జిల్లా కోర్టుకు బుధవారం బాంబు బెదిరింపులు రావడంతో అంతా ఉలిక్కిపడ్డారు. కోర్టు అధికారిక ఈ-మెయిల్‌కు బెదిరింపులతో కూడిన మెయిల్ రావడంతో అధికారులు పోలీసులకు సమాచారమిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ పర్యవేక్షణలో వెంటనే డాగ్, బాంబు స్క్వాడ్ బృందాలు రంగంలోకి దిగాయి. కోర్టులో న్యాయవాదులు, కక్షిదారులను బయటికి పంపించి సాయంత్రం వరకు ముమ్మర తనిఖీలు చేపట్టారు. బాంబుకు సంబంధించి ఎలాంటి ఆనవాళ్లు కనిపించకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఇది ఆకతాయిల పనిగా పోలీసులు భావిస్తున్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు.

కోర్సు పూర్తిచెయ్.. కొలువు కొట్టేయ్..
జేఎన్టీయూకేలో అవాంటెల్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ప్రత్యేకత

ఈనాడు, కాకినాడ; న్యూస్‌టుడే, గాంధీనగర్: పరిశ్రమ డిమాండ్లను తీర్చగలిగే పాఠ్యాంశాలు (కరిక్యులమ్) రూపొందించినపుడే విద్యార్థులు త్వరితగతిన కొలువులు సాధించొచ్చు. ఇటీవల కాకినాడ జేఎన్టీయూకే వచ్చిన విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఇదే అంశమై మాట్లాడుతూ కంపెనీలు తమ పరిశోధనలకు విశ్వవిద్యాలయాలకు సహాయ దారిని సూచించారు. సిగ్నల్, కమ్యూనికేషన్ రంగంలో ప్రస్తుతిగాంచిన అవాంటెల్ లిమిటెడ్ కంపెనీ.. తాజాగా తమకు అవసరమైన మానవ వనరులను తయారుచేసుకునేందుకు జేఎన్టీయూలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుచేసింది. ఇందులో సీటు పొంది కోర్సు పూర్తిచేసినవారికి కొలువుగా ఇవ్వనుంది. ఈ సెంటర్ స్ఫూర్తితో జేఎన్టీయూకేలో క్వాంటమ్, ఏఐ సబ్జెక్టులకు సంబంధించి సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ల ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి.

జేఎన్టీయూకేలో ఏర్పాటుచేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ల్యాబ్

నాడు ఇక్కడ చదువుకుని..

అవాంటెల్ కంపెనీ భారతీయ రక్షణ, నౌకా, విమానయాన, అంతరిక్ష రంగాల్లో కమ్యూనికేషన్ పరికరాలు, సాంకేతిక సేవలందిస్తుంది. ఈ కంపెనీ సీఎండీ ఎ. విద్యాసాగర్ జేఎన్టీయూ పూర్వ విద్యార్థి. తాను చదువుకున్న విద్యాసంస్థలోనే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేశారు. సిగ్నల్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్ కోర్సులో ఎంటెక్ ప్రోగ్రాం తెచ్చారు. ల్యాబ్‌కు అత్యాధునిక కమ్యూనికేషన్ పరికరాలు, నెట్‌వర్క్ ఎనలైజర్లు, కంప్యూటర్లు, సాంకేతిక సిబ్బంది, ఫ్యాకల్టీ మొత్తాన్ని ఆ కంపెనీయే సమకూర్చింది.

25 సీట్లతో..

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చేరడానికి ఈసీఈ విద్యార్థులు అర్హులు. బీటెక్ అనంతరం ఎంటెక్‌లో ప్రవేశానికి గేట్ రాసి అర్హత సాధించినవారు సిగ్నల్ ప్రాసెసింగ్, కమ్యూనికేషన్‌లో చేరడానికి మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి. మౌఖిక పరీక్షల ద్వారా ఎంపికచేస్తారు. ముందుగా నోటిఫికేషన్ ఇస్తారు. ప్రస్తుతం 25 సీట్లు ఉన్నాయి. ఏడాదికి రూ. 50 వేల ఫీజు.. మొదటి ఏడాది ఇక్కడి ఎక్సలెన్స్‌లో చదువుకుంటారు. రెండో ఏడాది హైదరాబాద్ కేంద్రం అవాంటెల్ కంపెనీలో ఇంటర్న్‌షిప్ చేయాలి. అప్పుడు నెలకు రూ.25 వేలు ఉపకారవేతనం ఇస్తారు.

ప్రయోగాత్మకంగా ప్రారంభం

లీలాకుమారి

కోర్సు పూర్తిచేసినవారిలో ప్రతిభావంతులకు ఏడాదికి రూ.9 లక్షల ప్యాకేజీతో అవాంటెల్ కంపెనీ ఉద్యోగాలు ఇస్తుందని జేఎన్టీయూకే ఈసీఈ విభాగం హెచ్‌వోడీ లీలాకుమారి చెప్పారు. ఈ ఏడాది ప్రయోగాత్మకంగా కోర్సు ప్రారంభించామని, రానున్న విద్యా సంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో ప్రవేశాలు ఉంటాయన్నారు.

పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో వచ్చేనెల 16 నుంచి నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డీఆర్వో టి.సీతారామమూర్తి సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. పరీక్షా కేంద్రాలు, ప్రశ్నపత్రాల భద్రత, పోలీసు బందోబస్తు, వైద్య శిబిరాలు, ఆర్టీసీ సర్వీసుల ఏర్పాటు, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. పదో తరగతి రెగ్యులర్ పరీక్షలు మార్చి 16 నుంచి ఏప్రిల్ ఒకటి వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. మార్చి 2 నుంచి 13 వరకు ఓపెన్ ఇంటర్మీడియట్, మార్చి 16 నుంచి 28 వరకు ఓపెన్ పది పరీక్షలు ఉదయం పూట జరుగుతాయన్నారు. వేసవి ప్రభావ వాతావరణంలో విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. సకాలంలో ప్రశ్నపత్రాలను ఆయా కేంద్రాలకు చేర్చడం, తిరిగి జవాబు పత్రాలను తపాలా శాఖకు చేర్చే వరకు గట్టి భద్రతా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అన్ని కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్తు సదుపాయాలు కల్పించాలన్నారు. డీఈవో రమేశ్, డీటీసీ శ్రీధర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో చలమయ్య, డీఎస్పీ సత్యనారాయణ, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ రమామణి తదితరులు పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న డీఆర్వో సీతారామమూర్తి, హాజరైన విద్యాధికారులు

పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య 28,921

మొత్తం కేంద్రాలు 145

ప్రశ్నపత్రాల స్టోరేజ్ పాయింట్లు 25

జాతీయ రహదారులపై ప్రయాణం సులువై సాఫీగా సాగుతున్నాయి. రహదారిపై రోజూ ప్రజా, సరకు, భారీ యంత్రాలు రవాణా అవుతున్నాయి. నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ఉచిత సేవలను అందిస్తోంది. రహదారిపై ప్రయాణించేవారు 1033 నంబర్‌కు ఫోన్ చేస్తే అవసరమైన సేవలతో పాటుగా, సాయం సత్వరమే పొందవచ్చు. - న్యూస్‌టుడే, గండేపల్లి

హైవేపై సమస్యలా.. 1033 ఉందిగా..!
వాహనదారుల సేవలో..

మురారి జాతీయ రహదారిపై 1033 సూచిక బోర్డు

ఉమ్మడి జిల్లా మీదుగా ఉన్న కోల్‌కత్తా నుంచి చెన్నై వరకు సుమారు 1700 కి.మీ ఎన్‌హెచ్-16 ఉంది. రోజూ ఈ రహదారిపై 20 వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఏదైనా సమస్య తలెత్తినా, ప్రమాదం జరిగినా, అవసరం ఉన్నా 1033 నంబరును వినియోగించుకోవచ్చని అధికారులు తెలియజేస్తున్నారు.

కోల్‌కత్తా నుంచి చెన్నై వరకు ఎన్‌హెచ్-16 ఇలా..

వాహనాలు మరమ్మతులకు గురైతే..

ఎన్‌హెచ్‌పై వాహనాలు మరమ్మతులకు గురై నిలిచిపోయినా, ప్రమాదకరంగా వాహనాలు ఆపినా నంబరుకు ఫోన్ చేస్తే మరమ్మతులు చేసే మెకానిక్‌లను తీసుకురావడం లేదంటే వాహనాన్ని క్రేన్ సాయంతో తీసుకెళ్లడం, ఇతర ప్రాంతాలకు తరలించే చర్యలు చేపడతారు.

1033 ద్వారా ఉపయోగాలివీ..

హైవే పరిధిలో ఎక్కడైనా ప్రమాదం జరిగినా, గాయపడినా, ఇబ్బందులెదురైనా 1033కి ఫోన్ చేయాలి. ఇలా చేస్తే హైవే అంబులెన్స్‌తో పాటు, పెట్రోలింగ్ మొబైల్ వాహనం సంఘటన స్థలానికి చేరుకుంటాయి. బాధితులకు ప్రాథమిక చికిత్స అందిస్తూనే ఆసుపత్రికి తరలిస్తారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీసుల సాయంతో రక్షణ చర్యలు తీసుకుంటారు.

ఫిర్యాదులు చేయొచ్చు

టోల్‌ప్లాజా వద్ద తాగునీరు, మరుగుదొడ్లు లేకున్నా, సిబ్బంది సక్రమంగా వ్యవహరించకపోయినా ఫిర్యాదు చేయొచ్చు. రహదారిపై మరమ్మతులు ఉన్నా, హోర్డింగులు, చెట్లు వంటివి ప్రమాదకరంగా కనిపించినా ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. రహదారిపై రోజూ పెట్రోలింగ్, అంబులెన్స్‌లు 45 కి.మీ పరిధిలో సేవలు అందిస్తుంటాయి.

వాహనం నిలిచిపోతే..

ఇంధనం లేక ప్రయాణిస్తున్న వాహనం నిలిచిపోతే ఈ నంబరుకు ఫోన్ చేస్తే అవసరమైన ఇంధనాన్ని తెచ్చి ఇస్తారు. ఇలా తీసుకొచ్చినందుకు ఇంధన రుసుము మాత్రం చెల్లిస్తే చాలు.

అనధికార లేఅవుట్‌కు జగనన్న సర్వే రాళ్లు

గ్రామాల్లో స్థిరాస్తి వ్యాపారులు చేసే పనులకు అడ్డూఅదుపు లేకుండా పోతుంది. సామర్లకోట మండలంలోని పవరలో ప్రభుత్వ సర్వే రాళ్లతో అనధికార లేఅవుట్లకు సరిహద్దులు వేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో జగనన్న రీసర్వే పేరుతో జగన్ చిత్రంతో వేసిన సర్వే రాళ్లను ప్రతి గ్రామంలోనూ ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సర్వే రాళ్లపై ఉన్న జగన్ బొమ్మను గ్రైండింగ్ చేయించి భద్రపరిచారు. అయితే పవర గ్రామంలో నాన్‌లేఅవుట్‌కు ఈ రాళ్లతో లేఅవుట్ల స్థలాలకు సరిహద్దులు ఏర్పాటు చేశారు. ఇంత జరిగినా చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. ఈ విషయమై గ్రామ వీఆర్వో భవానిని వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, సామర్లకోట గ్రామీణం

వాన లేదు.. వరదొచ్చింది!

ఈ చిత్రం చూశారా.. వరదొచ్చి ఓ వీధి మునిగినట్లు లేదూ..! వాన ఎక్కడా పడలేదు కదా అనుకుంటున్నారా... కాకినాడ 43వ డివిజన్, ప్రతాప్‌నగర్‌లోని ఓవర్‌హెడ్ ట్యాంకు ప్రధాన వాల్వ్ పగిలిపోయి బుధవారం రాత్రి ఇక్కడి వీధులన్నీ జలమయమయ్యాయి. లక్షల లీటర్ల తాగునీరు వృథాగా పోయింది. దీంతో బుధవారం సాయంత్రం ప్రతాప్‌నగర్, ట్రెజరీ కాలనీ, ఎస్. అచ్యుతాపురం, నరసన్ననగర్, అశోక్‌నగర్, మధురానగర్, విద్యుత్తు నగర్ ప్రజలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్వహణ లోపంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రతాప్‌నగర్‌లో వీధులతో పాటు ఉద్యానం నీటితో నిండిపోయింది. మాజీ కార్పొరేటర్ జేడీ పవన్‌కుమార్ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వాల్వు పగిలిపోయిన నేపథ్యంలో ట్యాంకులో నీరంతా కిందకు వదిలాల్సిందేనని, కొత్త వాల్వు వేసి, గురువారం నుంచి యథావిధిగా తాగునీటిని సరఫరా చేస్తామని డీఈఈ లక్ష్మీనారాయణ తెలిపారు. - న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

సూచనలిస్తున్న జేసీ అపూర్వభరత్, చిత్రంలో సర్వేశాఖ ఏడీ శ్రీనివాస్

అవకతవకలు లేకుండా భూముల రీసర్వే

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో చేపట్టిన నాలుగో విడత భూముల రీసర్వేలో ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని సంయుక్త కలెక్టర్ అపూర్వభరత్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన రీసర్వే ఉప తహసీల్దార్లు, మండల, గ్రామ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జిల్లాలో 11 మండలాల్లోని 24 గ్రామాల్లో భూముల రీసర్వే చేపట్టామని, పది గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియ పూర్తయిందన్నారు. మిగతా గ్రామాల్లోనూ త్వరగా దీన్ని పూర్తి చేసి, తదుపరి ప్రక్రియ చేపట్టాలని చెప్పారు. జాయింట్ ఎల్‌పీఎంలు జారీ చేసిన ఖాతాలపై రీసర్వే చేసి త్వరగా వ్యక్తిగత ఎల్‌పీఎంలు తయారు చేయాలని ఆదేశించారు. సంబంధిత రైతులు కచ్చితంగా హాజరయ్యేలా చూడాలన్నారు. రెవెన్యూ క్లినిక్‌కు సర్వే నంబర్లకు సంబంధించిన సమస్యలతో ఫిర్యాదులు రాకుండా క్షేత్రస్థాయిలో పరిష్కరించాలని ఆదేశించారు. సర్వేశాఖ సహాయ సంచాలకుడు కట్టా శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

గోదావరి వరదలపై ఇస్రో శాస్త్రవేత్తల అధ్యయనం
బొబ్బర్లంక, తోకలంక ప్రాంతాల్లో పర్యటన

రావులపాలెం పట్టణం, ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఏటా గోదావరి వరదల సమయంలో ప్రజలు, పశువులు, ఆస్తులకు సంభవిస్తున్న నష్ట ప్రభావాన్ని తగ్గించేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటే బాగుంటుందో అధ్యయనం చేసేందుకు శాస్త్రవేత్తలు బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక, రావులపాలెం మండలం ఊబలంక శివారు తోకలంక ప్రాంతాల్లో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) శాస్త్రవేత్తలు ఎస్. వి. శివప్రసాద్‌శర్మ, అమన్‌ప్రీత్‌సింగ్ బృందం పర్యటించింది. తహసీల్దార్లు ముక్తేశ్వరరావు, రాంబాబు ఆయా ప్రాంతాల్లో వరద వచ్చిన సమయంలో పరిస్థితిని వారికి మ్యాప్‌లు చూపించి వివరించారు. మొదటి ప్రమాద హెచ్చరిక సమయంలో ఏ ప్రాంతం వరకు వరద వస్తుంది.. రెండు, మూడు, నాలుగు హెచ్చరికలు వస్తే పరిస్థితి ఏమిటి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. వరదల సమయంలో ఆస్తినష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేయనున్నారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తోకలంకలో మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలు

సిబ్బంది కావలెను

శ్రీలలిత ఎంటర్‌ప్రైజెస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్,పెద్దాపురం వారికి ఈక్రింది సిబ్బంది కావలెను.

1) రైస్ మిల్ సూపర్‌వైజర్స్
2) హైడ్రా ఆపరేటర్స్
3) అకౌంటెంట్స్

తగిన అనుభవము అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ వివరములతో ఈక్రింది చిరునామా నందు స్వయముగా సంప్రదించవలెను.

లలిత ఎంటర్‌ప్రైజెస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, వాలుతిమ్మాపురం రోడ్, పెద్దాపురం,సెల్:99499 56942

ప్రగతి చక్రం.. పల్లెకు దూరం
చాలీచాలనీ బస్సులతో ప్రయాణికుల ఇక్కట్లు

న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)

రద్దీకి సరిపడా ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలకు సర్వీసులు లేకపోవడం.. ఉన్నా సమయపాలన పాటించకపోవడంతో ప్రజలు ఆటోలు, వ్యాన్లను ఆశ్రయించాల్సి వస్తోంది. 2024లో జిల్లాకు 25 కొత్త బస్సులను కేటాయించారు. మళ్లీ ఇప్పటివరకు కొత్త వాటి ఊసేలేదు. విద్యుత్తు బస్సులు వస్తాయంటూ.. గత రెండేళ్లుగా ఊరిస్తున్నా.. అవి కూడా కనుచూపు మేర కానరావడం లేదు. జిల్లాలో కాకినాడ, తుని, ఏలేశ్వరం మూడు డిపోల పరిధిలో మొత్తం 321 బస్సులు ఉన్నాయి. రోజువారీ సుమారు లక్ష మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఇందులో 160కు పైగా పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సులు పట్టణాలతోపాటు పల్లెలకు రాకపోకలు సాగిస్తున్నాయి.

ఈ గ్రామాలకు వెళ్లాలంటే కష్టమే..

- కాకినాడ-జి.మామిడాడకు గత కొన్నేళ్లుగా బస్సు సౌకర్యం లేదు. ఈ మార్గంలో ప్రయాణికులతోపాటు ఉద్యోగులు, విద్యార్థులు ఎక్కువ. వీరితోపాటు కొవ్వాడ, రామేశ్వరం, జి. మామిడాడ, పెదపూడి తదితర ప్రాంతాల ప్రజలు ఆటోలు, ఇతర వాహనాలపై రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది.
- పెద్దాపురం, సామర్లకోట మండలాల్లో 41 గ్రామాలకుగాను 13 ఊళ్లకు బస్సులు వెళ్లడం లేదు. ఆయా ప్రాంతాల వారు తుని, రావులపాలెం, అమలాపురం, రామచంద్రపురం తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే సామర్లకోట, కాకినాడ, పిఠాపురం వెళ్లి బస్సు ఎక్కాల్సిన పరిస్థితి.
- కృష్ణాపురం, కోదాడ, పీఈ చిన్నాయిపాలెం తదితర గ్రామాలకు బస్సులు లేవు. ఇక ప్రధాన మార్గం అయిన ఒంటిమామిడి నుంచి తొండంగి మీదుగా అన్నవరానికి గత 20 సంవత్సరాలుగా బస్సు సర్వీసు వేయలేదు. ఈ ప్రాంతాల ప్రయాణికులు విశాఖపట్నం, రాజమహేంద్రవరం తదితర చోట్లకు వెళ్లాలంటే ఆటోల ద్వారా అన్నవరం చేరుకోవాల్సి వస్తోంది.
- తుని నుంచి కత్తిపూడి, వజ్రకూటం వరకు పల్లెవెలుగు బస్సు సౌకర్యం లేదు. దీంతో ఆయా ప్రాంత ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. తుని, బలరామపురం, రౌతులపూడి గ్రామాలకు గతంలో పల్లెవెలుగు బస్సు తిరిగేది. ఈ సర్వీసులో ప్రయాణించే వారిలో విద్యార్థులు ఎక్కువ. సర్వీసు పునరుద్ధరించకపోవడంతో అవస్థలు తప్పట్లేదు.

కాకినాడ డిపోలో సాయంత్రం వేళ రద్దీ

అరకొర బస్సులతో రద్దీ..

ఇక కాకినాడ డిపో నుంచి రావులపాలెం, అమలాపురం, తుని రూట్లలో ఉదయం, సాయంత్రం వేళల్లో అత్యంత రద్దీగా ఉంటోంది. ఈ సమయాల్లో సాధారణ ప్రయాణికులతోపాటు వేలాది మంది విద్యార్థులు కళాశాలలకు రాకపోకలు సాగిస్తుండటంతో వేలాడుతూ కిక్కిరిసిన ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంటోంది. రద్దీ సమయాల్లో అదనపు బస్సులను తిప్పాలని కొత్త మార్గాల్లో సర్వీసులు ఏర్పాటుపై అధికారులు దృష్టిసారించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి

Cell: 80085 97607

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80082 34669

థైరాయిడ్ సమస్యతో బాధ పడుతున్నారా?

అధునాతన రోబోటిక్ సర్జరీతో మీ థైరాయిడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం

ప్రయోజనాలు: తక్కువ నొప్పి | తక్కువ రక్తస్రావం | త్వరితంగా కోలుకోవడం

APEX HOSPITALS

ప్రకాష్ నగర్, రాజమండ్రి

Dr. Nitin Rimmalapudi, M.S. Robotic Surgeon

అపాయింట్‌మెంట్ కొరకు సంప్రదించండి

93 922 922 00

సోమవారం నుండి శనివారం

(c) eenadu

వైభవంగా ఉమారామలింగేశ్వర శ్రీపుష్పయాగం

గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో శ్రీ ఉమారామలింగేశ్వర స్వామివారి శ్రీపుష్పయాగం బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. కల్యాణ ఉత్సవాల్లో భాగంగా రామలింగేశ్వరస్వామివారిని, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో మహాగణపతి పూజ, పుణ్యాహావాచన పూజలు చేసి దంపతీ తాంబూలాలు ఇచ్చారు. అధికసంఖ్యలో మహిళలు పాల్గొని స్వీట్లు, పళ్లు సమర్పించారు. వీటితో ప్రత్యేకంగా అలంకరించారు. - న్యూస్‌టుడే, గొల్లప్రోలు

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

పంచారామ క్షేత్రమైన సామర్లకోట చాళుక్య కుమారారామా భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో బుధవారం తెప్పోత్సవం నిర్వహించారు. వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈమేరకు భీమేశ్వరాలయాన్ని మిరుమిట్లుగొల్పే రంగురంగుల విద్యుత్తు అలంకరణతో తీర్చిదిద్దారు. - న్యూస్‌టుడే, సామర్లకోట

ఎవరెస్ట్ బేస్ క్యాంపునకు విద్యార్థుల ఎంపిక

భరద్వాజ

రూపసాయిశ్రీ

సర్పవరం: కాకినాడ జిల్లా నుంచి ప్రత్యేక అవసరాలు కేటగిరికి చెందిన దివ్యాంగ విద్యార్థులు రెడ్డి భరద్వాజ, పితాని రూపసాయిశ్రీ ఎవరెస్ట్ శిఖరం అధిరోహించడానికి శిక్షణ కోసం ఎంపికయ్యారని కాకినాడ సమగ్రశిక్ష కోఆర్డినేటర్ పి.గిరిప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ గ్రామీణం వలసపాకల భవిత కేంద్రంలో శిక్షణ పొందుతున్న రెడ్డి భరద్వాజ ప్రస్తుతం కాకినాడ గ్రామీణం తిమ్మాపురంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి, రూపసాయిశ్రీ కాజులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. వీరికి కోచ్‌గా కాకినాడకు చెందిన ఎంజే ప్రకాష్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. రాష్ట్రం నుంచి 25 మంది ఎంపిక కాగా ఈనెల 23 నుంచి మార్చి 6వ తేదీ వరకు లద్దాఖ్‌లో శిక్షణ ఇచ్చి అనంతరం ఎవరెస్ట్ ఎక్కించడానికి సిద్ధం చేస్తారు.

దిల్లీ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో 'స్పార్క్'

• టాప్ 20 గ్లోబల్ ఫైనలిస్ట్‌లో ఒకటిగా ఎంపిక

ఈనాడు, కాకినాడ: దేశ రాజధాని దిల్లీ కేంద్రంగా జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో కాకినాడ జిల్లా ఏలేశ్వరానికి చెందిన స్పార్క్ సంస్థ యువత పాల్గొని ప్రతిభ చూపారు. యువ ఏఐ కార్యక్రమం కింద ప్రపంచ వ్యాప్తంగా 38 దేశాల నుంచి 2,500 మందికి పైగా పాల్గొన్న బృందాల్లో స్పార్క్ సంస్థ టాప్ 20 గ్లోబల్ ఫైనలిస్ట్‌ల జాబితాలోకి ఎంపికైనట్లు ఆ సంస్థ సీఈవో సాయి ప్రదీప్ తెలిపారు. అడవులు, వన్యప్రాణులు, గ్రామీణ సముదాయాల సంరక్షణ కోసం తాము రూపొందించిన ఏఐ ఆధారిత వైల్డ్ ట్రాక్ ప్రాజెక్టుతో ఈ గుర్తింపు వచ్చిందన్నారు. ప్రాజెక్టును సాయి ప్రదీప్‌తో పాటు ఆ సంస్థ డైరెక్టర్ రమ్యశ్రీ అభివృద్ధి చేశారు. ఈ ఎంపిక భారత యువత ఆధ్వర్యంలో సాగుతున్న ఆవిష్కరణలకు ప్రపంచ స్థాయిలో లభించిన గౌరవంగా భావిస్తున్నట్లు స్పార్క్ ఛైర్మన్ సాయి సందీప్ పేర్కొన్నారు.

సమ్మిట్‌లో తమ ప్రాజెక్టు గురించి వివరిస్తున్న స్పార్క్ సంస్థ సీఈవో సాయి ప్రదీప్, డైరెక్టర్ రమ్యశ్రీ

గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రాజశేఖర్, జిల్లా కార్యదర్శి అప్పారెడ్డి తదితరులు

23, 24 తేదీల్లో రైతు దీక్షలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: కౌలు రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం నూతన చట్టం చేయకుండా రెండు సంవత్సరాల నుంచి దగా చేస్తుందని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రాజశేఖర్ విమర్శించారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో నూతన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 23, 24 తేదీల్లో కలెక్టరేట్ వద్ద నిర్వహించే రైతు దీక్షల పోస్టర్లను సుందరయ్యభవన్‌లో బుధవారం ఆవిష్కరించారు. రాజశేఖర్, జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబులు మాట్లాడుతూ కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ డబ్బులు రూ.20 వేలను రెండు దఫాలుగా వేస్తామని చెప్పి నేటికీ పైసా జమచేయలేదని ఆరోపించారు. జిల్లాలో కౌలు వ్యవసాయం 80శాతం పైన సాగవుతుందని, వారికి బ్యాంకుల ద్వారా పంట రుణ ప్రణాళికలో ప్రతిపాదించిన రూ.4వేల కోట్ల రూపాయలకు కేవలం రూ.150 కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. దీక్షలకు రైతులు, కౌలురైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి అప్పారెడ్డి, చంద్రరావు, కృష్ణారావు, ఎస్.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

'ఉప్పాడ' కోతపై ఉన్నతాధికారులతో సమావేశం నేడు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ దిల్లీలో కీలక సమావేశంలో పాల్గొనేందుకు బుధవారం కాకినాడ నుంచి బయలుదేరి వెళ్లారు. గురువారం కేంద్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఉన్నతాధికారులతో కాకినాడ-ఉప్పాడ మధ్య సముద్ర కోత నివారణకు ప్రతిపాదించిన ప్రాజెక్టుపై చర్చించనున్నట్లు కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. ఈ ప్రాజెక్టుకు రూ.300కోట్లకు పైగా నిధులు మంజూరు చేసే అవకాశం ఉందని పేర్కొన్నాయి. కలెక్టర్ దిల్లీలో సమావేశం ముగించుకుని విజయవాడ చేరుకుంటారు. శుక్రవారం జనగణనపై రాష్ట్రస్థాయిలో జరిగే శిక్షణా కార్యక్రమానికి హాజరవుతారు. దీనికి జిల్లా నుంచి డీఆర్వో తిప్పేనాయక్, కాకినాడ మున్సిపల్ కమిషనర్ ఎన్‌వీవీ సత్యనారాయణ వెళ్లనున్నారు.

పెన్షనర్లూ.. పత్రం సమర్పించండి

పెద్దాపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ సర్వీస్, ఫ్యామిలీ పింఛన్‌దారులు తమ జీవన ప్రమాణ పత్రాలు(లైఫ్ సర్టిఫికెట్లు) సమర్పించేందుకు గడువు దగ్గర పడుతుంది. ఈనెల 28వ తేదీ వరకు జీవన ప్రమాణ పోర్టల్‌లో లేదా ఖజానా శాఖ కార్యాలయాల్లో సమర్పించాల్సి ఉంటుంది. గతేడాది నవంబరు, డిసెంబరు నెలల్లో సమర్పించినవి చెల్లుబాటు కావు. తాజాగా ఇవ్వకుంటే ఏప్రిల్ 1న ఇచ్చే మార్చి నెల పింఛన్ నిలిపివేస్తారు. పెన్షనర్లు తమ పత్రాలు సమర్పించేందుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పెద్దాపురం, తుని, జగ్గంపేట, ప్రత్తిపాడు, కాకినాడ, పిఠాపురం, రాజమహేంద్రవరం, కోరుకొండ, అనపర్తి, అమలాపురం, కొత్తపేట, రాజోలు, రామచంద్రపురంలోని ఆయా ఉప ఖజానా కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. అనారోగ్యంతో నడవలేని పింఛనుదారులు తమ దృష్టికి తీసుకొస్తే ఖజానా శాఖ సిబ్బంది ఇంటి వద్దకు పంపిస్తామని జిల్లా ఖజానాశాఖ అధికారి ఏ.గణేష్ తెలిపారు.

జిల్లా	పత్రాలు సమర్పించినవి	ఇంకా ఇవ్వాల్సినవి
కోనసీమ	5,600	1,400
కాకినాడ	15,993	3,185
తూర్పుగోదావరి	9,246	1,506

పర్యాటక బోటుకు తప్పిన ముప్పు

• పంకా రెక్కలకు వల చుట్టేసి నిలిచిపోయిన వైనం

తాళ్లరేవు, న్యూస్‌టుడే: కోరంగి అభయారణ్యంలోని పర్యాటక కేంద్రం నుంచి సముద్ర ముఖ ద్వారం వరకు పర్యాటకులు ప్రయాణించే బోటుకు ప్రమాదం తప్పింది. ముమ్మిడివరానికి చెందిన తొమ్మిది మంది న్యాయవాదులు బుధవారం బోటులో షికారుకు వెళ్లారు. మొగ వరకు వెళ్లి తిరిగి వస్తుండగా గోదావరిలో మత్స్యకారులు చేపల వేటకు ఉపయోగించే వల బోటు కింద ఉండే పంకా రెక్కలకు చుట్టేయడంతో నీటిలో నిలిచిపోయింది. బోటు డ్రైవర్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్.ఎస్.ఆర్. వరప్రసాద్‌కు సమాచారం అందించారు. ఆయన సిబ్బందిని అప్రమత్తం చేసి రెండు స్పీడ్ బోట్లను ఆ ప్రాంతానికి పంపించారు. బోటు డ్రైవర్లు, పర్యాటకులను క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు.

వీఆర్వోల సమస్యల పరిష్కారానికి చర్యలు: డీఆర్వో

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీఆర్వో టి.తిప్పేనాయక్ హామీ ఇచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లో వీఆర్వో సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. గొల్లప్రోలు వీఆర్వో కామేశ్వరరావు ఆత్మహత్యాయత్నం ఘటనపై ఆయన ఆరా తీశారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని సంఘ ప్రతినిధులు వివరించారు. సమస్యలు ఉంటే నేరుగా తన వద్దకు రావాలని, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీఆర్వో చెప్పారు. గొల్లప్రోలు తహసీల్దారును కలెక్టరేట్‌కు పిలిచి మాట్లాడామని, భవిష్యత్తులో వీఆర్వోలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై ప్రత్యేక దృష్టిసారించాలని, పనిఒత్తిడి లేకుండా ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. కలెక్టరేట్ పరిపాలనాధికారి సాధనాల రామ్మోహన్, వీఆర్వో సంఘ ప్రతినిధులు కేవీ సత్యనారాయణ, సూరిబాబు, చిన్నా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వో సంఘ ప్రతినిధులతో చర్చిస్తున్న డీఆర్వో తిప్పేనాయక్

సీ-కేవైసీతో బహుళ ప్రయోజనాలు

న్యూస్‌టుడే - తుని

మీ కోసం

బ్యాంకు ఖాతాదారుల కోసం రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మరో కొత్త విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. కేవైసీ చేయించక, ఖాతాలను వినియోగించకపోవడంతో ఆయా బ్యాంకుల్లో ఖాతాదారులకు రోజూ పలు రకాల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిపై దృష్టిసారించిన ఆర్బీఐ కొత్తగా 14 అంకెల సీ-కేవైసీ ఐడీని జారీ చేస్తుంది. ఇది సులువైన, సురక్షితమైనదని బ్యాంకు అధికారులు పేర్కొంటున్నారు.

ఐడీ ఎలా పనిచేస్తుందంటే...

ఖాతాదారుడు బ్యాంకుకు వెళ్లి కేవైసీ వివరాలు సమర్పించాలి. అనంతరం ఆ వివరాలు సెంట్రల్ కేవైసీ రికార్డుల్లో రిజిస్ట్రీలో అప్‌లోడ్ చేస్తారు. తర్వాత ఆటోమెటిక్‌గా 14 అంకెల సీ-కేవైసీ నంబరు జనరేట్ అవుతుంది. ఈ ఐడీని అన్ని బ్యాంకులు, ఆర్థిక సంస్థల లావాదేవీల్లో వాడొచ్చు.

ఉపయోగాలివీ...

బ్యాంకుల్లో ఖాతాలు సులువుగా తెరవచ్చు. కేవైసీ అప్‌డేషన్ ఖాతాలు ఉన్న మిగిలిన బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లోను ఆటోమేటిక్‌గా అప్‌డేట్ అవుతాయి. సాధారణంగా బ్యాంకులో కేవైసీ వివరాలు నమోదు అంటే సదరు ఖాతాదారుడి ఆధార్, ఫోన్, పాన్ నంబర్లు, చిరునామా, ఈమెయిల్ ఐడీని తీసుకుంటారు. తాజా సీ-కేవైసీ విధానంలోనూ ఈ వివరాలే ఉన్నా, సెంట్రల్ కేవైసీ రికార్డుల్లో ఎప్పటికప్పుడు రిజిస్ట్రీ చేయడంతో కొత్త ఐడీ నెంబరు వస్తుంది. భవిష్యత్తులో దీని ఉపయోగం ఎంతో ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

24న జిల్లాస్థాయి సైక్లింగ్ ఎంపికలు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: నెలవారీ శాప్ లీగ్ క్రీడా పోటీల్లో భాగంగా ఈనెల 24న డీఎస్‌ఏ మైదానంలో జిల్లాస్థాయి సైక్లింగ్ క్రీడా ఎంపికలు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీవో వి.సతీష్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్ల వయస్సు లోపు బాలబాలికలు హాజరుకావాలని ఎంపికైన క్రీడాకారులు ఈనెల 28 నుంచి వచ్చేనెల 1 వరకూ ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడతారన్నారు. పాల్గొనే వారు తమ ఆధార్ కార్డు, వయస్సు, విద్యా ధ్రువపత్రాలు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుని కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో ఉదయం 8గంటలకు హాజరుకావాలన్నారు. తమ పేర్లను శాప్ క్రీడా యాప్‌లో 23 లోపు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94400 31601 నంబరులో సంప్రదించాలని చెప్పారు.

ఎన్టీఆర్ వైద్యసేవ పేరుతో ప్రైవేటులో అదనపు వసూళ్లు

• మాజీ ఎమ్మెల్యే వర్మ ఆరోపణ

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ వైద్య సేవ పేరుతో ప్రైవేటు ఆసుపత్రుల్లో అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్‌ఎన్ వర్మ ఆరోపించారు. దీనిపై బుధవారం అమరావతిలోని ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాలను స్థానిక విలేకరులకు తెలిపారు. పేద ప్రజలకు ఉచిత వైద్య సేవల కోసం సీఎం చంద్రబాబు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ కింద రూ.4,200 కోట్లు నిధులను కేటాయించారని గుర్తు చేశారు. కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు పేదల నుంచి అదనపు వసూళ్లు సాగిస్తున్నాయని ఆరోపించారు. దీంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు, వైద్య మంత్రికి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. పేదలకు ఉచితంగా అందించే వైద్యం విషయంలో ఎవరు తప్పిదాలకు పాల్పడినా ప్రభుత్వం ఉపేక్షించదని ఆయన హెచ్చరించారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు అదనపు వసూళ్లకు అలవాటుపడ్డాయని, ఇప్పటికీ ఆ వాసనలు పోలేదని వర్మ మండిపడ్డారు. కాకినాడలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఇలాగే సాగిస్తున్నారని ఆరోపించారు. దీంతో పిఠాపురం నియోజకవర్గంలో అనేక మంది నష్టపోయారని చెప్పారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని వర్మ డిమాండ్ చేశారు. లేని రోగాన్ని కూడా చేర్చి ప్రభుత్వం నుంచి సొమ్ములు లాగేస్తున్నారన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు ప్రత్యేక కోర్టు ఏర్పాటుచేయాలి

మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు, తదితరులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవచూపి వెంటనే విజయవాడలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, సీపీఐ కేంద్ర కమిటీ సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కాకినాడలో బుధవారం అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలంటూ మార్చి 2 నుంచి విజయవాడ ధర్నా చౌక్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేపడతామని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనలను ఉద్ధృతం చేస్తామన్నారు. అగ్రిగోల్డ్ సంస్థను మూసేసి ఈ ఏడాది జనవరి నాటికి 12 సంవత్సరాలైందని, ఇప్పటికే సమస్య అలాగే కొనసాగుతుండటంతో 8 రాష్ట్రాల్లో 32 లక్షల మంది వినియోగదారులు, ఏపీలో 19 లక్షలకు పైగా బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి అగ్రిగోల్డ్ యాజమాన్యం తమ బినామీల పేర పెట్టిన వేల కోట్ల రూపాయల ఆస్తులను స్వాధీనం చేసుకుని వాటిని వేలం వేసి బాధితులకు సొమ్ములు చెల్లించాలని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో తెదేపా మేనిఫెస్టోలో అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెంటనే సమస్య పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాసు, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు అర్జునరావు, నారాయణరావు, బాధితులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము- దేవదాయ ధర్మదాయ శాఖ
"ఇ" ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
కాకినాడ జిల్లా, ఇంజరం గ్రామం, తాళ్లరేవు మండలంలో యున్న శ్రీ పరదేశమ్మ అమ్మవారి దేవస్థానం వారు దేవాలయ పునర్నిర్మాణం కొరకు టెండర్లు పిలవబడుచున్నవి.

1.	Reconstruction of Temple	టెండర్ Notice No S/COE/1670/2025	Rs.60.00Lakhs

బిడ్ డాక్యుమెంట్ తేది. 19.02.2026 ఉదయం గం. 10:00ల నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. టెండరు దాఖలు చేయుటకు ఆఖరి తేది.05.03.2026 సాయంత్రం గం.04:00ల వరకు, మిగిలిన వివరముల కొరకు https://tender.apeprocurement.gov.in లో చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్
శ్రీ పరదేశమ్మ అమ్మవారి దేవస్థానం
తేది. 19.02.2026 ఫోన్: 9966977771 & 7799614333

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
RASMECC (05255), డి.నెం.11-4-7, నూకాలమ్మ టెంపుల్ స్ట్రీట్, రామారావుపేట, కాకినాడ, ఎ.పి.-533004.
ఇ-వేలం ద్వారా వాహనములు అమ్మకం
ఈ దిగువ ఉదహరించిన ఖాతాదారుడు మా బ్యాంక్ నుండి వాహనములు కొనుగోలు నిమిత్తం లోను సౌకర్యంను పొంది వున్నారు. బ్యాంకునకు చెల్లించవలసిన వాయిదాలను సక్రమముగా చెల్లించనందున బ్యాంకు వారు స్వాధీనము చేసుకొనిన వాహనములను "యధాతథ స్థితిలో" ఈ వేలం ద్వారా తేది.05-03-2026న అమ్ముటకు నిర్ణయించినారు. వాహనముల లోను తాలుకా అసలు బకాయి సొమ్ము మరియు ఇతర ఖర్చులు రాబట్టుకొనుటకై ఈ క్రింది తెలిపిన వాహనములను ఇ-వేలమునకు బిడ్స్ ఆహ్వానించడమైనది.

ఋణగ్రహీత పేరు, ఖాతా నెంబరు, ఆక్షన్ ఐడి & ప్రోపర్టీ ఐడి	వాహనము & మోడల్	వాహనము నెం. & కలర్	రిజర్వుధర & ధరావత్తు
శ్రీమతి గంటి సత్యనారాయణమ్మ & శ్రీ గంటి కిరణ్ అకౌంట్ నెం.: 41138335050 ఆక్షన్ ఐడి : 257838 ప్రోపర్టీ ఐడి : SBIN871986562100	MARUTI SUZUKI BALENO PETROL MODEL: 2022	AP 39 NL 7818 కలర్: GREY	రూ.4,50,000/- రూ.45,000/-

ఇ-వేలం తేదీ మరియు సమయం: ది.05.03.2026, ఉ.గం. 11.00 నుండి సా.గం. 04.00 ల వరకు (అపరిమిత పొడిగింపులతో) వాహనము తనిఖీ కొరకు బ్యాంక్ పని దినములలో సంప్రదించగలరు. బిడ్స్ సమర్పించు కొనుటకు ఆఖరు తేది మరియు సమయం ది.04.03.2026న మ. 5.00 గంటలలోపు. ఆ తరువాత వచ్చిన బిడ్స్/రిసిప్ట్స్ అంగీకరించబడవు.
కనీస బిడ్ పెంపుదల మొత్తం రూ.5,000/- లేదా మల్టిపుల్స్‌తో
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, RASMECC (05255), ఇ.యం.డి అమౌంట్ డిపాజిట్ చేయుటకు ఖాతా నెం.4897932052558 (IFSC: SBIN005255).
గమనిక : ధరావత్తు సొమ్మును RTGS/ NEFT ద్వారా చెల్లించిన పాటదారులు సాంకేతిక సమస్యలు తలెత్తినచో బ్యాంకు వారు బాధ్యత వహించరు.
నియమ నిబంధనలు: (1) రిజర్వ్ ధర కన్నా తక్కువ ధరకు వాహనములు అమ్మబడవు. (2) విజయవంతమైన పాటదారుడు అంగీకరించిన అమ్మకం ధరల్లో కనీసం 25% (10+15%) తక్షణమే చెల్లించవలెను. మిగిలిన సొమ్ము 7 రోజులలోపు చెల్లించని పక్షంలో ఎటువంటి నోటీసులు లేకుండా అప్పటి వరకు చెల్లించిన సొమ్మును కోల్పోవుదురు. (3) వేలం వాయిదా వేయుటకు, రద్దుపరుచుటకు బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. (4) వాహనములను బ్యాంక్ పనిదినములలో తనిఖీ చేసుకోగలరు. వాహనముల తనిఖీ కొరకు సంప్రదించవలసిన వారు, అధీకృత అధికారి, మొబైల్ నెం. 9912603678 మరియు రికవరీ ఏజెంట్, జి.నవీన్, మొబైల్ నెం. 9885885881. (5) వాహనముల రిజిస్ట్రేషన్ (FRC) బాధ్యత విజయవంతమైన బిడ్డర్ మాత్రమే. (6) మరిన్ని వివరాలకొరకు ఛీఫ్ మేనేజర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రామచంద్రాపురం బ్రాంచ్, రామచంద్రాపురం వారిని సంప్రదించగలరు. (7) ఇ-వేలం కొరకు వెబ్ పోర్టల్ https://ebkray.in నందు సంప్రదించగలరు.
గమనిక: గ్యారేజ్ అద్దెను మరియు ఇతర ఖర్చులను విజయవంతమైన బిడ్డరు చెల్లించవలెను.
తేది: 19-02-2026 సం/- ఛీఫ్ మేనేజర్,
ప్రదేశం: కాకినాడ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ట్రంప్ తీరుతో భారత్‌కు తీరని నష్టం

• సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ నారాయణ

గాంధీనగర్, న్యూస్‌టుడే: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న విధానాలతో భారతదేశంలో వ్యవసాయ, చేనేత రంగాలు తీవ్రంగా నష్టపోతాయని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ కె.నారాయణ అన్నారు. కాకినాడలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు హాజరైన ఆయన బుధవారం మాట్లాడుతూ మోదీ అమెరికాకు సాగిలపడి దేశం పరువు తీశారని ఆరోపించారు. కేంద్రప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ కోట్లాది రూపాయలను రుణమాఫీ చేస్తుందని, అటవీ చట్టాన్ని మార్పుచేసి సహజ సంపదను వారికే కట్టబెట్టి నక్సల్స్ పేరుతో గిరిజనులను చంపేస్తున్నారని విమర్శించారు. బిల్‌గేట్స్‌ను తీసుకొచ్చి అరటి తోటలను చూపించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్రంలో వ్యవసాయ రంగానికి మోసం జరుగుతున్నా మోదీని ప్రశ్నించడానికి భయపడుతున్నారన్నారు.

మాట్లాడుతున్న నారాయణ, పక్కన తాటిపాక మధు

అధికారులూ.. పాలకులకు బానిసలుగా మారొద్దు

రాష్ట్రంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నాయకులకు, పాలకులకు బానిసలుగా ఉండొద్దని సూచించారు. అలా నాయకుల మాట విని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించబట్టే ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి నేటికీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తిరుమల కల్తీ నెయ్యి విషయంలో బాధ్యులను శిక్షించి, కోట్లాది రూపాయలు చేతులు మార్చిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పుదుచ్చేరి రాష్ట్రానికి చెందిన యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్ భాజపా పంచన చేరి అవినీతిపరుడిగా మారాడని ఆరోపించారు. అప్పటి ఎన్నికల్లో ఆయన తరఫున తాను ప్రచారం చేశానని, ఈ సారి పోటీ చేస్తే అతని ఓటమికి ప్రచారం చేస్తానని చెప్పారు. సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు పాల్గొన్నారు.

సైకిల్ మెకానిక్‌పై పెట్రోలు పోసి నిప్పు

• పరికరాలు ఇవ్వడంలేదనే కోపంతో బైక్ మెకానిక్ దుశ్చర్య

గాయపడిన నానాజీ

తుని, న్యూస్‌టుడే: పంక్చర్లు వేసే సామగ్రిని సకాలంలో తిరిగి ఇవ్వలేదనే కోపంతో ఓ బైక్ మెకానిక్, పక్కనే ఉన్న సైకిల్ మెకానిక్‌పై పెట్రోలు పోసి నిప్పు అంటించిన ఘటన బుధవారం తుని పట్టణంలో చోటుచేసుకుంది. శ్రీరామా థియేటర్ సమీపంలో కె.నానాజీ సైకిల్ మరమ్మతులు చేసే దుకాణం ఉంది. దీనిపక్కనే బి.రాజు ద్విచక్ర వాహనాల రిపేరు దుకాణం ఉంది. తరచూ నానాజీకి కొన్ని రకాల పరికరాలు రాజు నుంచి తీసుకువెళ్లి తిరిగి ఇవ్వకపోవడంతో వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో బుధవారం వివాదం చెలరేగగా కోపోద్రిక్తుడైన రాజు అక్కడున్న పెట్రోలును నానాజీపై వేసి నిప్పు పెట్టాడు. దీంతో దుస్తులకు నిప్పు అంటుకుని 50 శాతం కాలింది. వెంటనే స్థానికులు అతడ్ని తుని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై జె.విజయబాబు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్షతగాత్రుడికి చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించాలని కుటుంబసభ్యులకు సూచించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తీవ్రంగా గాయపడ్డ నానాజీ అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం శ్రీరాంపురానికి చెందినవాడు కాగా, రాజు పక్క గ్రామం రామభద్రపురానికి చెందినవాడు. వీరిద్దరూ తునిలోనే దుకాణాలు నడుపుతున్నారు.

తల్లిదండ్రులను చూసేందుకు వచ్చి తిరిగిరాని లోకాలకు..

• కల్వర్టును ఢీకొని యువకుడి మృతి..

జగ్గంపేట గ్రామీణం, సామర్లకోట, న్యూస్‌టుడే: కొంతకాలంగా నాటుకోళ్ల మకాంలో కూలీపనులు చేస్తున్న తల్లిదండ్రులను చూసేందుకు వచ్చిన ఆ యువకుడు మంగళవారం రాత్రి ప్రమాదానికి గురై మృత్యుఒడికి చేరాడు. వివరాలివీ.. సామర్లకోట బ్రౌన్‌పేటకు చెందిన మర్రి సత్యనారాయణ (26) జగ్గంపేట మండలం గొల్లలగుంటలో తల్లిదండ్రులను చూసేందుకు వచ్చి కల్వర్టును ఢీకొని మృతిచెందాడు. సామర్లకోటలో చేపల వ్యాపారి వద్ద కూలిపనులు చేసుకునే సత్యనారాయణ మంగళవారం ఉదయం తల్లిదండ్రుల వద్దకు వచ్చి రోజంతా వారితో గడిపాడు. సాయంత్రం తిరుగు ప్రయాణమై వెళుతుండగా తండ్రి శ్రీనివాస్ కోరిన పెరుగు, దోమలచక్రం కొని తీసుకెళుతుండగా మోటారు సైకిల్ అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రగాయాలతో కొట్టుమిట్టాడుతుండగా స్థానికులు 108కు సమాచారం అందించగా జగ్గంపేటలో సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహానికి బుధవారం శవపంచనమా నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. తండ్రి ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మర్రి సత్యనారాయణ (పాత చిత్రం)

బ్రౌన్‌పేటలో విషాద ఛాయలు

యానాదుల కాలనీకి చెందిన సత్యనారాయణకు బిక్కవోలుకు చెందిన దేవితో వివాహమైంది. వీరికి మూడు నెలల చిన్నారి ఉంది. బాలింతగా ఉన్న దేవికి భర్త మృతిచెందిన విషయం తెలియడంతో బోరున విలపించారు. సత్యనారాయణ మృతితో బ్రౌన్‌పేటలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ధరవరులు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాలు)	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యికి)	18,000
పాతకాయ: గండేరా	30,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	30,000
గటగట	29,000
నీటి కాయ (వెయ్యికి) పాత	18,000-20,000
కొత్త	15,000-17,000
కొబ్బరి నూనె 15 కిలోల టిన్	5,000
కిలో	350

వెన్‌కాబ్ చికెన్ ధర (కిలో రూ.ల్లో)

ఫారం కోడి	120-00
రిటైల్ లైవ్	147-00
డ్రెస్డ్	213-00
స్కిన్‌లెస్	243-00

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉపోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వు నేను	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds
BUSINESS SERVICES
బంగారం బ్యాంకులో/ ప్రైవేటు సంస్థలో తాకట్టులో ఉన్నవి విడిపించి అధిక ధరకు కొంటాం. Ph: 81422 92071.
FINANCIAL SERVICES
అన్నిరకాల లోన్స్ No CIBIL, స్థలాలు, పొలాలు, ఇతర ప్రాపర్టీలపై & రిటైల్ ఫైనాన్స్ ఇప్పిస్తాం. 7671885932
REAL ESTATE
LAND FOR SALE
JAGGAMPETA
రాజమండ్రి 30 కి.మీ. దూరంలో మురారి, గండేపల్లి మండలం NH16 దగ్గర 60 సెంట్లు అమ్మకానికి. (నోబ్రోకర్స్) 9032368265
KAKINADA CITY
Properties Bazar's Kakinada Touch Your Luck, Buy Plot & Win Plot, Free Lucky Draw with Guaranteed Prizes. Cell: 9154184236
JOBS
Wanted Marketing Executives in Rajahmundry, Kakinada Areas. Salary 18,000 to 20,000. Lakshmi Sanjani Garments. Send resume to whatsapp Cell: 95050 66887.
లామినేషన్ కంపెనీకి ఎలక్ట్రీషియన్, Fresh/Exp., సూపర్‌వైజర్ - Exp.(MBA), ఆఫీస్‌బాయ్, గార్డెనర్ కావలెను. 70328 76262.
WANTED we are Hiring Front Office Staff (Female) - 02 no's Salary - 12 k 08 Hours Duty SprintOn, JN Road Rajamahendravaram 99663 57897
దేవరపల్లి, శ్రీనిధి లాడ్జిలో పనిచేయుటకు సర్వీస్ బాయ్స్ కావలెను. 7508027999, 9696226226
కాకినాడలోని ఫ్యాక్టరీలో పనిచేయుటకు పురుషులు కావలెను. - 15,000/-/4 W/o. + RSI + EPFO. 9885295999.
రామాంజనేయ సెక్యూరిటీకి సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 8099 19 19 19
EENADU for Advertisement Contact 8008597607
గమనిక

కాకినాడ

రైతుబజార్‌లో కూరగాయల ధరలు(కిలోకు)

గాంధీనగర్, న్యూస్‌టుడే: టమాట- 10, 13, వంకాయలు- 24, 34, 36, బెండకాయలు- 32, పచ్చిమిర్చి- 58, 64, కాకరకాయ- 50, బీర- 34, 38, క్యాలీఫ్లవర్- 15, 20, క్యాబేజీ- 18, క్యారెట్- 26, 30, దొండకాయలు- 46, 50, బంగాళాదుంపలు- 16, 20, ఉల్లి- 20, 26, దోసకాయలు- 30, చిక్కుళ్లు- 22, చేమదుంపలు- 30, బీట్‌రూట్- 26, కీరదోస- 36, బీన్స్‌కాయలు- 70, అల్లం- 70, క్యాప్సికం- 60, బొబ్బర్లు- 20, చిలకడదుంపలు- 36, బీర బొప్పాయి ఆనపకాయ- 15, 20, పొట్లకాయ- 20, 25, అరటికాయ- 6, 8, మునగకాడ- 12, 15, మామిడికాయ- 15, 20, నిమ్మకాయలు(డజన్) - 30, 42.

నగరంలో సినిమాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆనంద్ సినిమాస్ 4స్క్రీన్స్- లవ్‌స్టోరీ, కపుల్ ఫ్రెండ్లీ, విత్‌లవ్, మన శంకరవరప్రసాద్ గారు, దేవీ మల్టీప్లెక్స్ 4స్క్రీన్స్- కపుల్ ఫ్రెండ్లీ, ఛాథాపచ్చ, విత్ లవ్, లక్ష్మి- ఫంకీ, సత్యగౌరి - కపుల్ ఫ్రెండ్లీ, తిరుమల- మన శంకరవరప్రసాద్ గారు, సీలండ్స్1- ఫంకీ, సీలండ్స్ 2- నారీ నడుమ మురారి, శ్రీప్రియ - అనగనగా ఒకరాజు, పద్మప్రియ- ఫంకీ, సూర్య1(వాకలపూడి) - ఫంకీ, సూర్య 2.- సీతాపయనం.

ఖైదీ మృతిపై మేజిస్టీరియల్ విచారణ

విచారణ చేస్తున్న ఆర్డీవో మల్లిబాబు, అసిస్టెంట్ కలెక్టర్ మనీషా

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఖైదీ మృతిపై కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు ఆధ్వర్యంలో కార్యాలయంలో బుధవారం మెజిస్టీరియల్ విచారణ నిర్వహించారు. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో జీవిత ఖైదు అనుభవిస్తున్న మెట్టు భాస్కరరెడ్డి అనారోగ్యంతో చికిత్స నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌లో చేరి, గతేడాది నవంబరు 25న మృతి చెందారు. దీనిపై మెజిస్టీరియల్ విచారణ నిర్వహించి, నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఖైదీ బంధువులు, సాక్షులు, పోలీసులు, వైద్యుల నుంచి వాంగ్మూలాలు స్వీకరించారు. ఈ విచారణలో ఆర్డీవోతో పాటు అసిస్టెంట్ కలెక్టర్ మనీషా తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధులపై వివక్ష తగదు

మాట్లాడుతున్న ఉప సంచాలకుడు ఏవై శ్రీనివాస్

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: వయోవృద్ధుల పట్ల వివక్ష చూపకూడదని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఉప సంచాలకుడు ఏవై శ్రీనివాస్ సూచించారు. బుధవారం ఈ శాఖ ఆధ్వర్యంలో స్థానిక శశిపేట బాలికల ఉన్నత పాఠశాల, ఆనందభారతి ఉన్నత పాఠశాలల్లో కళాజాత బృందం ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వయోవృద్ధులపై ప్రేమ, వాత్సల్యం చూపించాలన్నారు. వీరికి ప్రభుత్వం అందిస్తున్న సామాజిక భద్రత పింఛన్లు, ఉచితరాయితీలు, వృద్ధాశ్రమాల్లో సౌకర్యాలపై వివరించారు. వయోవృద్ధులను వారి పిల్లల నుంచి ఆస్తిరక్షణకు గురైతే ట్రైబ్యునల్ ద్వారా రెవెన్యూ డివిజనల్ అధికారిని ఆశ్రయించవచ్చని చెప్పారు. తద్వారా నెలవారి భరణం చెల్లించే విధంగా ప్రభుత్వం చట్టాన్ని రూపొందించిందన్నారు. వీర్ల కృష్ణ, ఉమాశంకర్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, కాలువలు ఆక్రమిస్తే చర్యలు

కాలువలపై ఆక్రమణలు పరిశీలిస్తున్న కమిషనర్ సత్యనారాయణ

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: నగర పరిధిలో రోడ్లు, కాలువలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ ఎన్‌వీవీ సత్యనారాయణ హెచ్చరించారు. బుధవారం ఆయన ఆర్టీసీ కాంప్లెక్స్ పరిధిలోని పలు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. అక్కడ కాలువలను ఆక్రమించి దుకాణాలు నిర్మించడాన్ని ఆయన గుర్తించారు. వెంటనే వాటిని తొలగించేందుకు ఆదేశాలిచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ కాలువలపై అనధికారికంగా దుకాణాలను ఏర్పాటు చేయడంతో పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఇటువంటి ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే దుకాణాల లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎస్ఈ వెంకట్రావు, ఈఈ మత్స్యరాజు, ఎంహెచ్‌వో పృథ్వీచరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఎత్తుకు పైఎత్తు.. ప్రత్యర్థి చిత్తు

చదరంగంలో రాణిస్తున్న విద్యార్థులు

న్యూస్‌టుడే, మసీదుసెంటర్

చదరంగంలో ఎత్తుకు పై ఎత్తు వేస్తూ ప్రత్యర్థులను చిత్తు చేస్తూ పతకాలు సాధిస్తున్నారు కాకినాడకి చెందిన బాలబాలికలు. ఓ పక్క చదువులో మార్కులు సాధిస్తూ.. మరో పక్క పోటీల్లోనూ సత్తా చాటుతున్నారు. అనేక జిల్లా, రాష్ట్ర స్థాయి, ఫిడే రేటింగ్ టోర్నమెంట్‌లలో పాల్గొని విజేతలుగా నిలుస్తున్నారు. ఇటీవల శాప్ లీగ్ క్రీడా పోటీల్లో భాగంగా స్థానిక డీఎస్ఏ మైదానంలో జిల్లాస్థాయి చదరంగం పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

లక్ష్యం.. గ్రాండ్‌మాస్టర్

గతంలో ట్యాబ్‌లో చెస్ ఆడేవాడిని. ఆటపై మక్కువ పెరిగి గత రెండేళ్ల నుంచి చెస్‌లో శిక్షణ పొందుతున్నా. ప్రతిరోజూ సాధన చేస్తా. టోర్నమెంట్‌లో పాల్గొన్న ప్రతిసారి కొత్త ఎత్తుగడలు నేర్చుకుంటా. నాన్న విదేశాల్లో ఉండటంతో అమ్మ లక్ష్మి నన్ను ప్రోత్సహిస్తూ, ప్రతి టోర్నమెంట్‌కు తీసుకెళుతున్నారు. ఇప్పటివరకూ అనేక జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించా. ఇప్పుడు నా ఫిడే రేటింగ్ 1594. ఇటీవల డీఎస్ఏలో జరిగిన జిల్లాస్థాయి చదరంగం పోటీల్లో అండర్-15 విభాగంలో పాల్గొని మొదటిస్థానంలో నిలిచా. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ సత్తాచాటుతూ.. గ్రాండ్‌మాస్టర్ అవ్వాలనేది నా లక్ష్యం. -సాత్విక్, తొమ్మిదో తరగతి

ఆన్‌లైన్‌లో సాధన చేస్తూ..

అమ్మానాన్న ప్రోత్సాహంతో మూడో తరగతి నుంచి కోచ్ అమరనాథ్ వద్ద చెస్ నేర్చుకుంటున్నా. ప్రతి రోజూ ఆన్‌లైన్‌లో సాధన చేస్తా. అనేక జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించా. ఎస్‌జీఎఫ్ చెస్ పోటీల్లో పాల్గొన్నా. పలు ఫిడే రేటింగ్ టోర్నమెంట్లు ఆడాను. నా ఫిడే రేటింగ్ 1418. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నా. చదరంగంలో రాణించడంతో పాటు సివిల్స్ సాధించాలనేది నా కల. -ఉషా తన్మయిశ్రీ

అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతా

చిన్నతనంలో అక్క ఆడడం చూసి చెస్‌పై మక్కువ పెరిగింది. గత తొమ్మిదేళ్ల నుంచి కోచ్ మల్లికార్జునరావు వద్ద నేర్చుకుంటున్నా. అనేక జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించా. పలు ఫిడే రేటింగ్ టోర్నమెంట్లు ఆడాను. నా ఫిడే రేటింగ్ 1783. ఇటీవల జిల్లాస్థాయి చదరంగం పోటీల్లో అండర్-19 విభాగంలో పాల్గొని మొదటిస్థానంలో నిలిచా. చదరంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి కృషిచేస్తున్నా. -సూర్య కుమార శ్రీదత్తా, కాకినాడ

జిల్లాకు 1,250 టన్నుల యూరియా

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రబీ అవసరాల నిమిత్తం బుధవారం 1,250 టన్నుల యూరియాను జిల్లాకు చేరిందని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయకుమార్ గురువారం తెలిపారు. మరో 500 టన్నుల యూరియా రానుందని తెలిపారు. ఈ సరకును అవసరమైన మండలాల్లోని పీఏసీఎస్‌లు, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు డీలర్లకు సరఫరా చేస్తామని చెప్పారు. ఇప్పటికే జిల్లాలో 4,924 టన్నుల యూరియా నిల్వ ఉందని, 207 లీటర్ల నానో యూరియా రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉందని, దీనిని వినియోగించుకోవాలని రైతులకు సూచించారు.

పన్ను బకాయిదారులపై కఠిన చర్యలు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: నగర పరిధిలో ఆస్తి, నీటి, ఖాళీ స్థలాలకు సంబంధించి పన్ను బకాయిలను తక్షణం చెల్లించాలని నగరపాలక సంస్థ ఉప కమిషనర్ కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో బుధవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, బిల్లు కలెక్టర్లు, సచివాలయ ఉద్యోగులతో ఉప కమిషనర్ సమీక్షించారు. ప్రతి వార్డులోనూ పన్ను బకాయిదారుల వివరాలను సేకరించాలన్నారు. రానున్న 10 రోజుల్లో వసూళ్లలో ప్రగతి సాధించాలని సూచించారు. ప్రభుత్వ శాఖల భవనాల ఆస్తి పన్ను బకాయిలపైనా దృష్టి పెట్టాలని కోరారు.

రేపు, ఎల్లుండి మంచినీటి సరఫరా నిలుపుదల

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: అరట్లకట్ట నుంచి విశ్వేశ్వరయ్య వాటర్ వర్క్స్ ఫిల్టరేషన్ ప్లాంట్‌కు వచ్చే పైపులైను లీకులకు మరమ్మతులు చేపట్టనున్నట్లు నగరపాలక సంస్థ ఎస్ఈ పి.వెంకట్రావు తెలిపారు. అందులో భాగంగా ఈనెల 20న సాయంత్రం, 21న ఉదయం మంచినీటి సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు చెప్పారు. 5, 6, 16, 49 డివిజన్ పరిధిలో నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడుతుందని, ఆయా ప్రాంతాల ప్రజలు గమనించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

హోప్ ఐలాండ్‌లో జీవవైవిధ్యాన్ని దెబ్బతీయొద్దు

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సామాజిక కార్యకర్తలు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడకు రక్షణ కవచంగా ఉన్న హోప్ ఐలాండ్‌లో జీవవైవిధ్యం, పర్యావరణ వ్యవస్థను పరిరక్షించాలని బుధవారం కలెక్టరేట్ వద్ద సామాజిక కార్యకర్త రంబాల సతీశ్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా పారిశ్రామిక కాలుష్యంతో హోప్ ఐలాండ్ జీవవైవిధ్యం దెబ్బతింటూ వస్తుందని, ఇప్పుడు రాకెట్ ప్రయోగ కేంద్రం ఏర్పాటుకు యత్నించడం తగదన్నారు. అది నెలకొల్పితే వృక్షాలు, విహంగాలు? అక్కడి సముద్ర పర్యావరణాన్ని నాశనం చేస్తాయని పేర్కొన్నారు. అనంతరం జేసీ అపూర్వభరత్‌కు వినతి పత్రం అందజేశారు.

మాస్టర్స్ క్రీడాకారులకు అభినందనలు

మాస్టర్స్ క్రీడాకారులను సత్కరించిన టౌన్ హాల్ అసోసియేషన్ ప్రతినిధులు

మసీదుసెంటర్, గాంధీనగర్, న్యూస్‌టుడే: అబుదాబిలో ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకూ జరిగిన మాస్టర్స్ ఓపెన్ గేమ్స్-2026లో కాకినాడ టౌన్ హాల్ సభ్యులు సత్తా చాటారు. బసవ ప్రసాద్, విల్ల ప్రకాశ్ జోడీ 45 ప్లస్ విభాగంలో టెన్నిస్ డబుల్స్‌లో రజతం, మంగం సత్యప్రసాద్ 50 ప్లస్ విభాగంలో స్క్వాష్‌లో కాంస్యపతకం సాధించారు. వారిని టౌన్‌హాల్‌లో బుధవారం సత్కరించి అభినందించారు. టౌన్ హాల్ అధ్యక్ష, కార్యదర్శులు వి.ఆనంద్, వి.వి.సుబ్బ హ్యస్యశ్వరరావు? మాట్లాడుతూ వారి విజయం కాకినాడకు గర్వకారణమన్నారు. విజేతలు మాట్లాడుతూ వచ్చే ఏడాది జపాన్‌లో జరిగే అంతర్జాతీయ పోటీల్లో బంగారు పతకం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. డీవీఎస్‌రాజు, నెక్కంటి శ్రీనివాస్, పసుపులేటి శ్రీనివాస్, బచ్చు శేఖర్, డా.ఆదిత్య, సత్యనారాయణ, అప్పాజీ, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ నగరానికి సహకరించండి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: స్వచ్ఛ నగరానికి ప్రజలు, కాలనీ సంఘాలు సహకరించాలని నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ సత్యనారాయణ కోరారు. బుధవారం ఆయన 8వ డివిజన్ పరిధి రాజారామ్మోహనరాయ్ నగర్‌లో కంపర రమేష్ స్మారక పార్కులో ఆర్‌ఆర్‌నగర్ కాలనీ సంఘ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ ఏడాది స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో నగరాన్ని ఉత్తమ స్థాయిలో నిలుపుదామన్నారు. చెత్తను రోడ్లు, కాలువల్లో వేయరాదని సూచించారు. సంఘ అధ్యక్షుడు మోహన్, తదితరులు పాల్గొన్నారు.

వేగం తగ్గిస్తే ప్రమాదాలకు అడ్డుకట్ట

ముఖం కడుగుతున్న వాహనదారులు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: వేగం తగ్గించి వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చని కాకినాడ ట్రాఫిక్-1 సీఐ ఎన్.రమేష్ అన్నారు. మంగళవారం అర్ధరాత్రి, బుధవారం తెల్లవారుజామున జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు కృష్ణవరం టోల్ ప్లాజా వద్ద ట్రాఫిక్-1 సీఐ ఎన్.రమేష్, రౌతులపూడి ఎస్సై వెంకటేశ్వరరావు, సిబ్బందితో కలిసి రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనే ఉద్దేశంతో రాత్రి సమయంలో వాహన తనిఖీలు, డ్రంక్ అండ్‌డ్రైవ్, స్టాప్ వాష్ అండ్ గో కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ రాత్రిపూట, తెల్లవారుజామున డ్రైవింగ్ చేసే వాహనదారులు అలసట, నిద్రమత్తుతో ప్రమాదాలకు గురికాకుండా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. చిన్నపాటి దూరమే కదా అని వన్‌వేలో వాహనాలు నడపొద్దని చెప్పారు. డ్రైవింగ్ ప్రారంభించే ముందు తగిన విశ్రాంతి తీసుకోవాలన్నారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: బాల్య వివాహరహిత దేశంగా భారతదేశాన్ని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బాలల పరిరక్షణ విభాగం జిల్లా కోఆర్డినేటర్ దుర్గారాణి తెలిపారు. గొల్లప్రోలు మండలం జడ్పీ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. అక్రమ రవాణా, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. దీనికి సంబంధించి చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కి ఫోన్‌చేసి సమాచారం అందించాలన్నారు.

ఫ్యూజు పెట్టెకు మూత ఏర్పాటుచేయరూ

కాకినాడ సాంబమూర్తి నగర్ ఫ్లైఓవర్ దిగువ నుంచి వెంకటేశ్వరనగర్ వెళ్లే ప్రధాన రహదారిలో ఓ విద్యుత్తు స్తంభంపై ఉన్న ఫ్యూజు బాక్సుకు మూత లేక ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. చేతికి అందేంత తక్కువ ఎత్తులో ఉండటంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బాక్సుకు మూత ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. –న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

పైపులైనుకు లీకులు.. ఇక్కట్లు

నగరంలోని పళ్లంరాజునగర్ ప్రధాన రహదారి రోడ్డునెం.3 ఎదురుగా రహదారిపై మంచినీటి పైపులైను పగిలిపోవడంతో నీరంతా వృథాగా పోతోంది. గతకొద్ది రోజులుగా ఈ పరిస్థితి నెలకొని ఉందని స్థానికులు వాపోతున్నారు. వేసవికాలం వస్తున్న నేపథ్యంలో నీటి ఎద్దడి లేకుండా ముందుగానే లీకులకు మరమ్మతులు చేపట్టాలని నగరవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. – న్యూస్‌టుడే, మసీదు సెంటర్

కుంగిన కల్వర్టుతో కలత

నిత్యం రద్దీగా ఉండే శ్రీనగర్ ప్రాంతంలో ప్రధాన రహదారిపై కల్వర్టు కుంగిపోయింది. ఇక్కడ మున్సిపల్ ఉన్నత పాఠశాల, ఆసుపత్రులు, ప్రైవేటు విద్యా సంస్థలు ఉన్నాయి. ఆర్టీసీ సర్వీసులు ఈ మార్గంలోనే వెళుతున్నాయి. ఇలాంటి రహదారిలో కల్వర్టు కుంగిపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రాత్రిపూట వీధి దీపాలు వెలగక ప్రమాదాలు జరుగుతున్నాయి. కల్వర్టును బాగు చేసి కష్టాలు తప్పించాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

వ్యర్థాలు తొలగించరూ..

కాకినాడ పళ్లంరాజు నగర్ ప్రధాన రహదారి నుంచి శాంతినగర్‌కు వెళ్లే మూడు రోడ్ల కూడలి వద్ద ఖాళీ స్థలంలో చెత్తాచెదారంతోపాటు ప్లాస్టిక్ వ్యర్థాలు భారీగా పేరుకుపోయాయి. దుర్వాసనతోపాటు సాయంత్రం దోమలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక అధికారులు స్పందించి శుభ్రతా చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు. –న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

వెలగని వీధిదీపాలు

నగరంలోని వెంకట్ నగర్ ప్రధాన రహదారిపై పలు వీధిదీపాలు వెలగకపోవడంతో అంధకారం అలముకొంటోంది. ప్రధాన రహదారి కావడంతో రద్దీ ఎక్కువగా ఉంటుంది. దాంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని సూచిస్తున్నారు. – న్యూస్‌టుడే, మసీదు సెంటర్

వాహనాల వేలంతో రూ.18.55 లక్షల ఆదాయం

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ రవాణా శాఖ కార్యాలయం వద్ద ఉన్న సీజర్ యార్డులో జప్తు చేసిన 23 వాహనాలకు బుధవారం వేలం వేయగా రూ.18,55,500 ఆదాయం ప్రభుత్వ ఖజానాకు సమకూరిందని ఉప రవాణా కమిషనర్ కె.శ్రీధర్ తెలిపారు. గూడ్స్ క్యారియర్ 6, ఆటోలు 3, బస్సులు 3, మ్యాక్సీ క్యాబ్ 1, ద్విచక్ర వాహనాలు 10 వేలం వేసిన వాటిలో ఉన్నాయని చెప్పారు. ప్రాంతీయ రవాణా అధికారి బీవీ మురళీకృష్ణ, వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, ఏవో పాల్గొన్నారు.

వేలం వేస్తున్న రవాణా శాఖ అధికారులు

పీఆర్ జూనియర్ కళాశాల సిబ్బంది, విద్యార్థులతో జేసీ అపూర్వభరత్

పోటీ పరీక్షలపై అవగాహన అవసరం

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: కళాశాల స్థాయి నుంచే వివిధ పోటీ పరీక్షల పట్ల అవగాహన పెంచుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ (జేసీ) అపూర్వ భరత్ అన్నారు. స్థానిక పీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను బుధవారం జేసీ ప్రారంభించారు. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, అభయం ఫౌండేషన్ (ఫైడా ఛారిటబుల్ ట్రస్ట్), ఎస్ఆర్ఎంటీ సంస్థల సహకారంతో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. జేసీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటే నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ప్రిన్సిపల్ రాంబాబు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి దాతలందిస్తోన్న సహకారం మరువలేదన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేహదారుఢ్య పోటీల్లో ప్రతిభ

విజేతలను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ ఆంజనేయులు తదితరులు

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: ఆదికవి నన్నయ్య యూనివర్శిటీలో జరిగిన అంతర కళాశాలల దేహదారుఢ్య పోటీల్లో కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు 7 పతకాలు గెలుచుకోవడంతో పాటు, టీం ఛాంపియన్‌షిప్ సాధించారని కళాశాల ప్రిన్సిపల్ డా.కందుల ఆంజనేయులు తెలిపారు. బుధవారం పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ వి.సూర్యప్రకాష్(బంగారు), పీవీ చాముండేశ్వర్(బంగారు), దుర్గాప్రసాద్(కాంస్య), డి.అరుణకుమార్(కాంస్య), బి.సాయి ప్రసాంత్(రజత), కె.పవన్‌కుమార్(బంగారు), బి.మహేష్(రజత) పతకాలు సాధించారని చెప్పారు. వీరు త్వరలో అంతర వర్సిటీ పోటీల్లో పాల్గొంటారన్నారు. పీడీలు డా.వర్మ, డా.రమణ, దుర్గారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు ప్రచారపత్రాల ఆవిష్కరణ

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఐటీఐల్లో 2026 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు సంబంధించిన ప్రచారపత్రాలను బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఐటీఐ కోర్సుల శిక్షణ, ఉన్నత విద్య అవకాశాలు, ఉద్యోగావకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే ఈ ప్రచార ముఖ్యోద్దేశమన్నారు. కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ ఎం.వేణుగోపాల వర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

వికసిత్ భారత్ అంటే ఇదేనా?

గాంధీనగర్, న్యూస్‌టుడే: కాకినాడ మెయిన్‌రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన లిక్కర్ మాల్‌ను సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ కె.నారాయణ బుధవారం సందర్శించి వికసిత్ భారత్ అంటే ఇదేనా అంటూ ఎద్దేవా చేశారు. నగరంలో పబ్ కల్చర్‌కు ఇటువంటివి దోహదపడతాయని, దీనివల్ల యువత పెడదోవ పడతారని ఆరోపించారు. నిర్వాహకులు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే తాము వ్యవహరిస్తామని పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మధు, జిల్లా సహకార్యదర్శి తోకల ప్రసాద్, అన్నవరం, మహిళా నేతలు తదితరులు పాల్గొన్నారు.

మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

రంజాన్ మాసం గురువారం ఉదయం నుంచి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి కాకినాడ మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. – న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

మసీదు సెంటర్, న్యూస్‌టుడే: మైనర్లు వాహనాలు నడపకుండా కట్టడి చేయడానికి ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని కాకినాడ ట్రాఫిక్-2 సీఐ డి.రామారావు తెలిపారు. నగరంలో బుధవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. మైనర్ డ్రైవింగ్‌కు పాల్పడిన 15 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, మైనర్లు, వారి తల్లిదండ్రులను పిలిపించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించి చలానాలు విధించారు. మరోసారి వారి పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని, ఇస్తే బైక్‌లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ శిరస్త్రాణం ధరించాలి

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాలు నడిపే ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలని కాకినాడ ట్రాఫిక్-1 సీఐ ఎన్.రమేష్ అన్నారు. బుధవారం స్థానిక టౌన్‌హాల్ కూడలి వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రమాద సమయంలో శిరస్త్రాణంతో ప్రాణనష్టం నివారించవచ్చన్నారు. ట్రిపుల్‌రైడింగ్, బైక్ స్టంట్స్, అధిక వేగం వల్ల జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. స్కూల్‌పిల్లలను ఆటోల్లో అధికంగా తరలించారన్నారు. ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్-I సీఐ రమేష్

రహదారులా.. డంపింగ్ యార్డులా?

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: ఆకర్షణీయ నగరంలోని పలు రహదారులు డంపింగ్ యార్డుల్లా మారుతున్నాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. కాకినాడ గొడారిగుంట నుంచి దుమ్ములపేట బైపాస్ రోడ్డు మార్గం నగరంలోని పలుప్రాంతాలను కలిపే ప్రధాన రహదారిగా మారింది. ఇక్కడ తాగేసిన కొబ్బరి బొండాలు, మట్టిగుట్టలు, ఎండిన చెట్టుకొమ్మలు, ఇతర పలు రకాల వ్యర్థాలు, చెత్తాచెదారాలను పడేస్తున్నారు. అవి గుట్టలుగా పేర్కొని దుర్వాసన వెదజల్లుతోంది. గొడారిగుంట ప్రధాన రహదారిలోనూ వ్యర్థాలు గుట్టలుగా ఉన్నాయి. ఆయా రహదారులపై ఇసుక, మట్టి, చెత్తాచెదారం చేరడంతో గాలికి పైకి లేచి వాహనదారులు, పాదచారుల కళ్లలో పడడంతో ఇబ్బందులు తప్పడం లేదు. దుమ్ములపేట బైపాస్ రోడ్డులో ఓ ప్రైవేటు పాఠశాల ఉండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉదయం, సాయంత్రం ఆ రహదారి గుండా రాకపోకలు సాగిస్తుంటారు. చెత్తతో దుర్వాసన వెదజల్లుతోందని, దోమల వ్యాప్తి చెంది రోగాలబారిన పడుతున్నారని వాపోతున్నారు. చెత్తకు సైతం నిత్యం నిప్పంటించడంతో పొగ వ్యాప్తించి ఇబ్బందులకు గురవుతున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

దుమ్ములపేట బైపాస్ రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

కళలో దుమ్ము పడుతోంది..

దుమ్ములపేట బైపాస్ రోడ్డులో రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులకు గురవుతున్నాం. ఇరువైపులా చెత్తాచెదారం, వ్యర్థాలు వేయడంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు దుమ్ము కళ్లల్లో పడటంతో ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు చర్యలు తీసుకోవాలి.
- మోహన్, నగరవాసి

రోడ్డుప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: కాకినాడ వెంకట్‌నగర్‌కి చెందిన ఎస్.బాలకృష్ణారావు ఈనెల 14న భార్య, కుమారుడితో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా స్థానిక వైఎస్ఆర్ వంతెన సమీపంలో ఓ ద్విచక్రవాహనదారుడు వేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొట్టాడు. బాలకృష్ణారావుకు తీవ్రగాయాలు, మిగిలిన ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాకినాడ రెండో పట్టణ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు.

(c) eenadu

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

వత్సవాయి వైభవం పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాజాసూరిబాబురాజు

పెద్దాపురం: రచయిత రామిశెట్టి శ్రీకాంత్ రచించిన వత్సవాయి వైభవం పుస్తకాన్ని బుధవారం పురపాలక మాజీ అధ్యక్షుడు రాజాసూరిబాబు రాజు ఆవిష్కరించారు. కృష్ణా జిల్లా వత్సవాయి గ్రామం నుంచి చారిత్రక పెద్దాపురం వరకూ సాగిన వత్సవాయి వంశస్థుల ప్రస్థానాన్ని రచించిన శ్రీకాంత్‌ను సత్కరించి అభినందించారు. జోశ్యుల కృష్ణ బాబు, వంగలపూడి శివకృష్ణ, తాడిగడప సుబ్బారావు, తాతాజీ కామేశ్వరరావు, దేవత రాజేష్ పాల్గొన్నారు.

హుండీ ఆదాయాలు రూ.6.13 లక్షలు

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం పట్టణ విశ్వేశ్వర చంద్రశేఖరస్వామి(శివాలయం), వెంకటేశ్వరస్వామి హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించారు. విశ్వేశ్వర చంద్రశేఖరస్వామి హుండీ ఆదాయం రూ.2 లక్షల 26 వేల 216, వెంకటేశ్వరస్వామి దేవాలయం హుండీ రూ.2 లక్షల 45వేల 973 వెరసి రూ. 4 లక్షల 72 వేల 189 ఆదాయం వచ్చిందని (గ్రూప్ టెంపుల్స్) ఈవో జగదీష్ పేర్కొన్నారు.

సామర్లకోట, న్యూస్‌టుడే: సామర్లకోట - కాకినాడ రోడ్డులోని ముత్యాలమ్మ ఆలయానికి హుండీల ద్వారా రూ.1,41,713లు ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో, ట్రస్ట్ బీవీఆర్ చౌదరి అన్నారు.

రీసర్వేలో తప్పుల సవరణకు చర్యలు

రీసర్వే లోపాల సవరణకు దరఖాస్తులు స్వీకరిస్తున్న వీర్వోలు

గొల్లప్రోలు: రీసర్వేలో వచ్చిన తప్పులను సరిచేసి కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు జారీచేసేందుకు చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ రామ్‌కుమార్ తెలిపారు. చెందుర్తిలో రెండో విడత రీసర్వేలో వచ్చిన పొరపాట్లను సవరించేందుకు రైతుల నుంచి వివరాలు సేకరించే కార్యక్రమాన్ని చెందుర్తిలో బుధవారం ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. రైతులు చేసిన ఫిర్యాదు మేరకు దస్త్రాలను పరిశీలించి సరిచేయాలని చర్యలు చేపట్టారు. ఆర్ఐ బాలకృష్ణ, వీర్వోలు, గ్రామసర్వేయర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

తాటిపర్తి ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ దుర్గారాణి

గొల్లప్రోలు, కరప, న్యూస్‌టుడే: బాల్య వివాహరహిత దేశంగా భారతదేశాన్ని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బాలల పరిరక్షణ విభాగం జిల్లా కోఆర్డినేటర్ దుర్గారాణి తెలిపారు. గొల్లప్రోలు మండలం జడ్పీ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. అక్రమ రవాణా, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. దీనికి సంబంధించి చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కి ఫోన్‌చేసి సమాచారం అందించాలన్నారు. ● జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్‌వర్కర్ సువర్ణ చినబాబు ఆధ్వర్యంలో పెనుగుదురులో బుధవారం ఆయన 'బాల్య వివాహ్ ముక్త్ భారత్' కార్యక్రమం నిర్వహించారు.

పేదలను ఆదుకోవాలి

బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందజేస్తున్న సేవా సంస్థ ప్రతినిధులు

కరప: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని ఆదుకోవడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని సామాజిక సేవాకర్త పోలిశెట్టి నారాయణ కోరారు. కరప శివారు ఆరెకీ నగర్‌లో దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న మోటూరి శ్రీనుకు ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు సమకూర్చిన నగదు, నిత్యావసరాలను బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు. ఎంఏ అలీమ్, కామేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

హోప్ ఐలాండ్ జీవవైవిధ్యాన్ని దెబ్బతీయొద్దు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడకు రక్షణ కవచంగా ఉన్న హోప్ ఐలాండ్‌లో జీవవైవిధ్యం, పర్యావరణాన్ని పరిరక్షించాలని బుధవారం కలెక్టరేట్ వద్ద సామాజిక కార్యకర్త రంబాల సతీశ్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా పారిశ్రామిక కాలుష్యంతో హోప్ ఐలాండ్ జీవవైవిధ్యం దెబ్బతింటూ వస్తుందని, ఇప్పుడు రాకెట్ ప్రయోగ కేంద్రం ఏర్పాటుకు యత్నించడం తగదన్నారు.

పురపాలికల్లో మొదలైన ఎన్నికల హడావుడి

నెలరోజుల్లో ప్రత్యేకాధికారుల పాలన

పిఠాపురం, న్యూస్‌టుడే: పురపాలక సంఘాల కౌన్సిల్ సభ్యులు పదవీ కాలం నెలరోజుల్లో ముగియనుంది. తరువాత ప్రత్యేకాధికారుల పాలన రాబోతుంది. ఇప్పటికే పట్టణాల్లో ఓటర్ల జాబితాపై కసరత్తు జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆశావాహులు ఇప్పటికే వార్డుల్లో పట్టు సాధించేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట పురపాలికలతోపాటు, గొల్లప్రోలు నగర పంచాయతీల్లో వైకాపా హవానే కొనసాగింది. దీంతో ఈసారి కూటమి నేతలు ఈ మున్సిపాల్టీలను కైవసం చేసుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఆయా వార్డుల్లో సమస్యలు, అభివృద్ధి పనుల పర్యవేక్షణలో పాల్గొంటున్నారు.

వార్డులు పెరిగే అవకాశం..

పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట పురపాలికలతో పాటు, గొల్లప్రోలు నగర పంచాయతీల ఎన్నికల ఫలితాలు 2021 మార్చి 14 ఫలితాలు వెలువడ్డాయి. మార్చి 17న కౌన్సిల్ ఏర్పాటై అధికారం చేపట్టారు. వీరి అయిదేళ్ల పాలన వచ్చే నెలతో ముగియనుంది. అనంతరం మార్చి 18 నుంచి పురపాలికల్లో ప్రత్యేకాధికారుల పాలన మొదలుకానుంది. ఈ నేపథ్యంలో ఇటీవల రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రచురణకు కార్యాచరణ ప్రారంభించింది. ప్రస్తుత జనాభా ప్రకారం ప్రతి పట్టణంలో రెండు నుంచి 5 వార్డులు పెరిగే అవకాశముందని పలువురు చెబుతున్నారు.

ఇంకా స్పష్టత రాలేదు..

ప్రస్తుతం కౌన్సిల్ సభ్యుల పదవీకాలం నెలరోజులు మాత్రమే ఉంది. కాని ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎన్నికల ప్రక్రియపై ఎటువంటి ప్రకటన రాలేదు. సమయానికి ఎన్నికలు జరుగుతాయో లేదో స్పష్టత కొరవడింది. దీంతో నాయకుల్లో ఉత్కంఠ నెలకొంది. ఆయా వార్డుల రిజర్వేషన్, కూటమి ప్రభుత్వం సీట్లు పంపకాల ప్రకారం ఎవరికి కౌన్సిలర్‌గా పోటీ చేసేందుకు అవకాశం వస్తుందో తెలియని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రస్తుత ఓటర్ల జాబితా ఇలా..

పట్టణం	వార్డులు	ఓటర్లు	బూత్‌లు
పిఠాపురం	30	43,253	43
గొల్లప్రోలు	20	20,825	18
పెద్దాపురం	29	41,514	37
సామర్లకోట	31	43,851	37

కొత్త ఓటర్లకు అవకాశం

ప్రస్తుతం కొత్త ఓటర్ల దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఎన్నికల సంఘం నుంచి ఇప్పటి వరకు జాబితా ప్రచురణపై ఎటువంటి ఆదేశాలు లేవు. మార్చి 17తో ప్రస్తుతం కౌన్సిల్ సభ్యులు పదవీ కాలం ముగుస్తుంది. తరువాత ఏం చేయాలనేది ప్రభుత్వం తీసుకోవలసిన నిర్ణయం. -ఎన్.కనకారావు, కమిషనర్, పిఠాపురం పురపాలక సంఘం.

వైభవంగా శ్రీపుష్పయాగోత్సవం

సామర్లకోటలో భీమేశ్వరస్వామివారు

దుర్గాడ శివాలయంలో ఉమారామలింగేశ్వరస్వామి

గొల్లప్రోలు, సామర్లకోట, న్యూస్‌టుడే: దుర్గాడ శివాలయంలో శ్రీ ఉమారామలింగేశ్వర స్వామివారి శ్రీపుష్పయాగం బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. కల్యాణ ఉత్సవాల్లో భాగంగా రామలింగేశ్వరస్వామివారిని, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మండపంలో మహాగణపతిపూజ, పుణ్యహవాచన పూజలు చేసి దంపతీ తాంబూలాలు ఇచ్చారు. ● పంచారామ క్షేత్రమైన సామర్లకోట కుమారారామా భీమేశ్వరాలయంలో బుధవారం రాత్రి ఆలయ ఈవో నీలకంఠం, ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ జగదీష్ మోహన్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

జయవంతంగా ముగిసిన కల్యాణోత్సవాలు

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం పాదగయ క్షేత్రంలోని రాజరాజేశ్వరి సమేత ఉమా కుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు బుధవారం రాత్రితో ముగిశాయి. వివిధ శాఖల సమన్వయంతో ఈవో జగన్ శ్రీనివాస్ ఈ ఉత్సవాలను విజయవంతం చేశారు.

కుక్కుటేశ్వరస్వామి ఉత్సవాల అలంకరణ

విగ్రహప్రతిష్ఠ మహోత్సవం

సంప్రోక్షణ చేస్తున్న వేద పండితులు, గ్రామస్థులు

తాళ్లరేవు, న్యూస్‌టుడే: పిల్లంక బ్రహ్మపురిలో సరిహద్దు ప్రాంతంలో కనకదుర్గమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా తొలి రోజు బుధవారం సంప్రోక్షణ పూజలు నిర్వహించారు.

కేశవస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ పూజలు

పెదపూడి: పెదపూడి మండలం కైవారం కేశవస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి.

వీరభద్రుడి సంబరం

తాళ్లరేవు: సీతారామపురంలో వీరభద్రుడి సంబరం వైభవంగా జరిగింది. స్వామివారిని సీతారామపురం నుంచి తాళ్లరేవు రోడ్ల వారిపేటలో ఉన్న గద్దె వరకు మేళతాళాలతో ఊరేగించారు.

తాళ్లరేవులో వీరభద్రుడి ఊరేగింపు

నగర సంకీర్తన ముగింపు

గొల్లప్రోలులో గ్రామోత్సవంలో భక్తులు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలు కంటంగారితోట రామాలయం భజన సమాజం ఆధ్వర్యంలో నెలరోజులుగా నిర్వహించిన మహామాస నగర సంకీర్తన ముగింపు సందర్భంగా స్వామివారి గ్రామోత్సవం బుధవారం నిర్వహించారు.

దుర్గాడలో ఉపాధి పథకం గ్రామసభ

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలోని పనులపై సామాజిక తనిఖీ గ్రామసభ దుర్గాడలో బుధవారం నిర్వహించారు. ఏడాదికాలంలో జరిగిన పనులను తనిఖీచేసి బహిరంగ చేసిన నగదు చెల్లింపులను తెలిపారు. ఎంపీడీవో రాజు, డీఆర్పీలు, ఉపాధి పథకం సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రజావేదిక

గొల్లప్రోలు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2024- 25 సంవత్సరంలో జరిగిన పనులకు సామాజిక తనిఖీ ప్రజావేదిక గురువారం మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో సలాజ్ రాజు, ఏపీవో గంగా భవాని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జరుగుతుందన్నారు.

ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధం

తాళ్లరేవు, న్యూస్‌టుడే: ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించకుంటే ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమని తాళ్లరేవు సహకార సంఘాల ఉద్యోగులు రామన్న, బోసం గౌరీ శంకర్ పేర్కొన్నారు. తాళ్లరేవు డీసీసీబీ బ్రాంచి కార్యాలయం ఎదుట ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘం ఉద్యోగుల యూనియన్ ఐక్య వేదిక (జేఏసీ) ఆధ్వర్యంలో ఉద్యోగులంతా బుధవారం నిరసన తెలిపారు.

21న మండల పరిషత్ సమావేశం

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 21న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనారాయణ తెలిపారు. ఎంపీపీ పెంకే సత్యవతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి విధిగా ఎంపీటీసీ, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

రహదారులు, డ్రెయిన్ నిర్మాణానికి శ్రీకారం

తాళ్లరేవు: స్థానిక పటవల వద్ద నుంచి 216వ జాతీయ ప్రధాన రహదారి వరకు ఉపాధి హామీ నిధులు రూ.45 లక్షలతో చేపట్టే సీసీ రోడ్లు, డ్రెయిన్ నిర్మాణ పనులకు సంబంధిత అధికారులు బుధవారం శ్రీకారం చుట్టారు. ఏళ్ల తరబడి డ్రెయిన్ సమస్యకు కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో మోక్షం కలగడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పన్ను బకాయిదారులపై కఠిన చర్యలు

కాకినాడ నగరం: నగర పరిధిలో ఆస్తి, నీటి, ఖాళీ స్థలాలకు సంబంధించి పన్ను బకాయిలు చెల్లించకుంటే నగరపాలక సంస్థ ఉప కమిషనర్ శ్రీవాస్ కోరారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో బుధవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, బిల్లు కలెక్టర్లు, సచివాలయ ఉద్యోగులతో ఉప కమిషనర్ సమీక్షించారు.

వ్యర్థాలకు నిప్పు కలగదా కనువిప్పు

కరపమండలం గొర్రిపూడిలోని మంచినీటి ట్యాంకు సమీపంలో చెత్త, వ్యర్థాలకు నిప్పు అంటిస్తున్నారు. దీని వల్ల పొగతోకూడిన విషవాయువులతో అనారోగ్యాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. దీనిపై డిప్యూటీ ఎంపీడీవో ఎస్‌వీ శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా వ్యర్థాలను ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కరప

చెరువు.. నిర్వహణ కరవు

గొల్లప్రోలు ఈబీసీకాలనీలో ప్రజలకు వాడకం నీటి కోసం ఏర్పాటుచేసిన చెరువు నిర్వహణ లేక పూడుకుపోయింది. గుర్రపుడెక్కతో చెరువు గర్భం మూసుకుపోవడంతో ప్రజల అవసరాలకు నీటిని అందించడంలేదు. పదేళ్లుగా చెరువులో పూడిక, గుర్రపుడెక్క తొలగించే పనులు చేపట్టక ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు రూపొందిస్తామని ఏఈ అలీషా తెలిపారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

అధ్వానంగా లాకులు

తాళ్లరేవు మండలం పిల్లంక కాలువ గట్టు నుంచి ఇంజరం వెళ్లే మార్గంలో ఉప్పంగల పంట కాలువపై లాకుల తలుపులు ధ్వంసమయ్యాయి. దీంతో నీరంతా దిగువకు వెళ్తోంది. పంట కాలువలో నీరు అధికంగా ప్రవహించడంతో గట్లను తాకుతోంది. సంబంధిత అధికారులు స్పందించి లాకుల తలుపులకు మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, తాళ్లరేవు

నిధుల కొరతతో నిలిచిన ఈత కొలను

పెద్దాపురం నుంచి జగ్గంపేట వెళ్లే రహదారిలో విద్యుత్తు సబ్‌స్టేషన్ ఎదురుగా చేపట్టిన ఈత కొలను నిధుల కొరతతో పునాదుల వరకు వచ్చి నిలిచిపోయింది. దీనిని 2016లో అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.కోటితో నిర్మాణం చేపట్టింది. పునాదుల వరకు వచ్చింది. తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నిర్మాణం ఆగిపోయింది. స్పోర్ట్స్ అథారిటీ అధికారి సతీష్‌ను అడగ్గా నిధులు మంజూరుకై చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, పెద్దాపురం

రోడ్డు ఛిద్రం.. వంతెన ప్రమాదకరం

పిఠాపురం మండలం మాధవపురం సమీపంలో డంపింగ్ యార్డు ప్రదేశం వద్ద ర.భ.శాఖ రోడ్డు ఛిద్రమైంది. అక్కడే వంతెన రక్షణ గోడలు ధ్వంసమై ఉన్నాయి. దీంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వేగంగా వచ్చే వాహనాలు అదుపుతప్పుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. జేఈ లోవరాజుకు చెప్పగా పరిశీలించి చర్యలు చేపడతామన్నారు. –న్యూస్‌టుడే, పిఠాపురం

సభ్యత్వ నమోదుపై అవగాహన

పిఠాపురం, న్యూస్‌టుడే: జనసేన పార్టీ సిద్ధాంతాల కోసం అందరం పని చేద్దామని, సభ్యత్వ నమోదు బాధ్యతను నెరవేరుద్దామని ఆపార్టీ నియోజకవర్గ క్రియాశీలక సభ్యురాలు డా.బుర్రా దివ్యరాజ్ పిలుపునిచ్చారు. బుధవారం పిఠాపురం మండలం కుమారపురంలో సభ్యత్వ నమోదు అవగాహన కార్యక్రమం ప్రారంభించారు. దివ్యరాజ్ మాట్లాడుతూ పార్టీ సభ్యులను ఉద్యమి, సాధకుడు, ప్రధాత అనే మూడు విభాగాలుగా విభజించి రాజకీయాల్లో కొత్త విధానం ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీసుకొచ్చారన్నారు. అధినేతే స్వయంగా ప్రధాత సభ్యుడిగా చేరి రూ. 2కోట్లు విరాళం ఇచ్చారని, ప్రజాసేవకు ఆయన ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. పిఠాపురం నుంచి మొదలైన ఈ కార్యక్రమం త్వరలో రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ మెంబర్షిప్ డ్రైవ్‌గా విస్తరిస్తామన్నారు. సభ్యత్వం ఉంటే రూ.5 లక్షల బీమా సదుపాయం ఉంటుందన్నారు. జనసేన మండలాధ్యక్షుడు వెన్నా జగదీష్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే జగదీష్, తోలేటి శిరీష పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బుర్రా దివ్యరాజ్

ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలుచేయాలి

పెద్దాపురం, కాజులూరు, పిఠాపురం, న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం స్థానిక జిల్లా కేంద్ర సహకార బ్యాంకు బ్రాంచి వద్ద నిరసన తెలిపారు. అనంతరం బ్రాంచి మేనేజర్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ● సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని ఆ సంఘ కాకినాడ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.సూర్యనారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పిఠాపురం డీసీసీ బ్యాంకు వద్ద ఉద్యోగులు నిరసన తెలిపి, శాఖాధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. సమస్యలు సకాలంలో పరిష్కరించకుంటే ఫిబ్రవరి 16 నుంచి ఉద్యోగులంతా సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ● ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గొల్లపాలెం శాఖ బ్యాంకు వద్ద సహకార సంఘం ఉద్యోగులు బుధవారం ధర్నా నిర్వహించారు.

మేనేజర్ జ్యోతికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

అక్షర ఆంధ్రలో మినహాయింపు ఇవ్వాలి

పెద్దాపురం, పిఠాపురం, న్యూస్‌టుడే: జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న క్షేత్ర సహాయకులకు పని భారం తగ్గించాలని కోరుతూ వారంతా బుధవారం ఎంపీడీవో, ఉపాధి హామీ పథకం ఏపీవోలకు వినతులు అందజేశారు. జిల్లా అధ్యక్షుడు కడమటి శ్రీనివాసు మాట్లాడుతూ అక్షర ఆంధ్ర, ఉల్లాస్ కార్యక్రమం నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. ● ప్రభుత్వ తలపెట్టిన అక్షర ఆంధ్ర కార్యక్రమంలో ఉపాధి క్షేత్ర సహాయకులకు మినహాయింపు ఇవ్వాలని ఆ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం పిఠాపురం ఎంపీడీవో స్వప్నకు వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ ఉపాధి పనులు చేయించడం, శ్రామికులను సమీకరణ, సమావేశాల నిర్వహణ, మొబైల్ ద్వారా కూలీల వివరాల ఆన్‌లైన్ వంటి పని ఒత్తిడి ఉందన్నారు.

పెద్దాపురంలో వినతిపత్రం అందజేస్తున్న క్షేత్ర సహాయకులు

గ్యాస్ లీకై.. అగ్ని ప్రమాదం

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురంలోని పప్పులవీధిలో గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సీ. సూర్యకుమారి అద్దెకు ఉంటున్న ఇంట్లో మధ్యాహ్నం సమయంలో గ్యాస్‌స్టవ్‌పై వంట చేస్తుండగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో ఆమె బయటకు పరిగెత్తారు. వంట సామగ్రి, ఇతర ఉపకరణాలు కాలిపోవడంతో మొత్తంగా రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది.

గొల్లప్రోలులో నిరసన తెలుపుతున్న వీర్వోలు

వీఆర్వోల నిరసన

గొల్లప్రోలు, తాళ్లరేవు, కరప, పిఠాపురం, పెద్దాపురం: తమపై పనిభారాన్ని తగ్గించాలని కోరుతూ వీఆర్వోలు, వీఆర్ఏలు కాకినాడ గ్రామీణం, పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లోని ఆయా మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయ, వార్డు సచివాలయాల్లోని పనులు తమకు అప్పగించవద్దంటూ నినాదాలు పలికారు.

డాక్యుమెంట్ పోయినది

బర్రె రాములు, S/o.వెంకటేశులు (లేటు), డోర్ నెం.2-1, ఇంద్ర కాలనీ, పెనుమర్తి గ్రామం, కాకినాడ రూరల్ మండలం అను నా పేరిట గల డాక్యుమెంట్ నెంబర్:9175/1985 గలది ది.11-02-2026 న పెనుమర్తి గ్రామం నుండి అచ్చంపేట జంక్షన్‌లో గల జెరాక్స్ షాపునకు జెరాక్స్ నిమిత్తం వెళ్ళుచుండగా మార్గమధ్యలో జారి పడిపోయినది. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది నెంబర్‌కు తెలియజేయగలరు.

బర్రె రాములు, S/o.వెంకటేశులు (లేటు), సెల్: 99637 44401

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325 పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

సమస్య: చేబ్రోలు పట్టు పరిశ్రమ కేంద్రం రోడ్డు పక్కన చెత్త పేరుకుపోయి సమీప ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. - స్థానికులు

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కు తెలుపగా సిబ్బందితో చెత్తను తొలగింపజేశారు. - న్యూస్‌టుడే, గొల్లప్రోలు

సమస్య: ఇంద్రపాలెం గ్రామంలో శివాజీ అపార్ట్‌మెంట్ దగ్గర మురుగు కాలువ దగ్గర కల్వర్టు సగం తెరిచి ఉంచారు. - కిరణ్ పాఠకుడు

సమాధానం:వెంటనే పరిశీలించి తొలగిస్తాం జగజ్జీవన్‌బాబు ఈవో

సమస్య: చీడిగ గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది - దుర్గాప్రసాద్ పాఠకుడు

సమాధానం: సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. - వరలక్ష్మి ఈవో - న్యూస్‌టుడే, సర్పవరం

సమస్య: పిఠాపురంలోని పాదగయ పరిసర ప్రాంతాల్లో చెత్తకుప్పలు వల్ల దుర్వాసన వస్తోంది. -కుమార్

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ప్రభాకర్‌కు చెప్పగా ఆయా ప్రాంతాల్లో శుభ్రత చర్యలు చేపట్టారు. -న్యూస్‌టుడే, పిఠాపురం

అధికారుల కొరత.. ప్రగతికి కలత

గొల్లప్రోలు, పిఠాపురం, పెద్దాపురం: పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో అధికారులు, సిబ్బంది కొరతగా ఉండడంతో సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర జాప్యం అనివార్యమవుతోంది. దీంతో పాటు పట్టణాల్లో అభివృద్ధికి విఘాతం కలుగుతోంది. గొల్లప్రోలు నగర పంచాయతీ, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట పురపాలక సంఘాల్లో అధిక స్థానాల్లో అధికారులు, సిబ్బంది లేకపోవడంతో ఇన్‌ఛార్జిల పర్వం కొనసాగుతూ సమస్య నెలకొంటోంది. సచివాలయాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని ప్రజలు చెబుతున్నారు.

ఎక్కడెక్కడ ఖాళీగా ఉన్నాయంటే..

✦ గొల్లప్రోలు నగర పంచాయతీలో మేనేజరు డిప్యూటేషన్‌పై వెళ్లడంతో దీర్ఘకాలంగా సీనియర్ అసిస్టెంట్ ఇన్‌ఛార్జిగా కొనసాగారు. ఆయన సైతం పదోన్నతిపై వెళ్లారు. ఎన్విరాన్‌మెంట్ ఏఈ, నాలుగు సీనియర్ అసిస్టెంట్లు, ఒక జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అకౌంటెంట్, టీపీఎస్, టీపీబీవో పోస్టులను భర్తీచేయాల్సి ఉంది. ✦ పిఠాపురం పురపాలక సంఘంలో ఎన్విరాన్‌మెంట్ ఏఈ స్థానం దీర్ఘకాలంగా ఖాళీగా ఉండగా.. టీపీఎస్ స్థానాలు రెండు పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. సీనియర్ అసిస్టెంట్లలో ఒకరు మెడికల్ లీవ్‌లో ఉండగా, మరొకరు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఒకరు పదోన్నతిపై వెళ్లారు. జూనియర్ అసిస్టెంట్ స్థానాలు మూడు, ఒక హెల్త్ అసిస్టెంట్ ఖాళీగా ఉన్నాయి. ✦ పెద్దాపురం పురపాలక సంఘంలో జేఏవో, టీపీఎస్ స్థానాలు ఖాళీగా ఉండగా, టీపీబీవో పోస్టులు రెండు భర్తీ చేయాల్సి ఉంది. సీనియర్ అకౌంటెంట్, ఎన్విరాన్‌మెంట్ ఏఈని దీర్ఘకాలంగా నియమించలేదు. ✦ సామర్లకోట పురపాలక సంఘంలో సీనియర్ అసిస్టెంట్ స్థానాలు రెండు, ఒక జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

సిబ్బంది కొరతపై ఉన్నతాధికారులకు నివేదించాం. డిప్యూటేషన్‌పై వెళ్లిన ఇద్దరు సిబ్బందిని ఇటీవల వెనక్కి పంపారు. ఇంకా ఖాళీగా ఉన్న స్థానాలు భర్తీ చేయాలని కోరాం. – శ్రీనివాసులు, కమిషనర్, గొల్లప్రోలు

శ్రీ శృంగార వల్లభ స్వామివారి దేవస్థానం

దేవదాయ ధర్మాదాయ శాఖ, తొలి తిరుపతి గ్రామం, పెద్దాపురం మండలం, కాకినాడ జిల్లా.

3వ సారి టెండరు-కం-బహిరంగ వేలం కొరకు ప్రకటన

కాకినాడ జిల్లా, పెద్దాపురం మండలం, తొలి తిరుపతి గ్రామంలో వేంచేసియున్న శ్రీ శృంగార వల్లభ స్వామివారి దేవస్థానంనకు 2026-2027 సంవత్సరమునకు అనగా ది.01-04-2026 నుండి ది.31-03-2027 వరకు (12నెలలకు దేవస్థానం మరియు అన్నప్రసాదం నిమిత్తం 3వ సారి ఈ క్రింది వివరించిన అంశములు సప్లయి చేయుటకు ది.02-03-2026 సోమవారం ఉదయం 10:00 గంటల వరకు సీల్డు టెండర్లు స్వీకరించబడుచున్నవి. సీలు వేసిన టెండర్లు అదే రోజు ఉదయం 11:00 గంటలకు దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షములో తెరువబడును.

వ. నెం.	వివరం	సీల్ టెండర్-కం-బహిరంగ వేలం	కాలపరిమితి	ధరావత్తు	టె.షె.ఖరీదు
1	వంట చెరుకు సప్లయి చేయుటకు	సీల్డ్ టెండర్	1-4-2026 నుండి 31-3-2027 వరకు (12 నెలలకు)	రూ.10,000	రూ.300
2.	పూలదండలు, ఫ్లవర్ డెకరేషన్ సప్లయి చేయుటకు	సీల్డ్ టెండర్		రూ.10,000	రూ.300
3.	తలనీలాలు ప్రోగుచేసుకుని తీసుకొనివెళ్ళే హక్కునకు	సీల్డ్ టెండర్-కం-బహిరంగ వేలం		రూ.50,000	రూ.300

ముఖ్య షరతులు: 1. టెండరు షెడ్యూలు ది.27-02-2026 ఉ.10:00 గంటల నుండి ది.01-03-2026 సాయంత్రం 5:00 గంటల వరకు దేవస్థానం వద్ద విక్రయించబడును.
2. సీల్డు టెండరు ఫారములు ది.02-03-2026 ఉదయం 10:00 గంటలలోపు దేవస్థానం వద్ద ఉంచబడిన టెండరు బాక్సులో వేయవలెను. అదేరోజు ఉదయం 11:00 గంటలకు హాజరైన టెండరుదారుల సమక్షములో తెరువబడును.
3. ఇతర టెండరు షరతులు మరియు వివరముల కొరకు దేవస్థానం పనివేళలయందు తెలుసుకొనవచ్చును.

తొలి తిరుపతి, తేది 19-02-2026.

శ్రీమతి మొయిళ్ళ సంధ్య కృష్ణమూర్తి, ఛైర్మన్ మరియు ధర్మకర్తల మండలి

వడ్డి శ్రీనివాసరావు, కార్యనిర్వహణాధికారి, గ్రేడ్-I

(c) eenadu

తుని

• తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

ఉన్నత చదువులతో రాణించాలి

'పది' విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

రౌతులపూడి, న్యూస్‌టుడే: మండలంలోని ములగపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం సాయంత్రం 'పది' విద్యార్థులకు వీడ్కోలు వేడుక నిర్వహించారు. విద్యార్థులు అందరూ ఉన్నత చదువులు చదివి మంచి భవిష్యత్తు పొందాలని హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

రెండు జిల్లాల రోడ్డును నాణ్యతతో నిర్మించాలి

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: రమణయ్యపేట-జె.అన్నవరం రోడ్డు నిర్మాణ పనులను అధికారులు, నాయకులు బుధవారం పరిశీలించారు. రెండు జిల్లాలను కలిపే ఈ రోడ్డును పూర్తినాణ్యతతో నిర్మించాలన్నారు. దీర్ఘకాలం మన్నేలా రోడ్డును వేయాలన్నారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు ఇజనగిరి ప్రసాద్, నాగేశ్వరరావు పనులు పరిశీలించారు.

రోడ్డు పనులు పరిశీలిస్తున్న నేతలు

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066
ఉ. 10 - మ. 1

కదలని మురుగు

సమస్య: కత్తిపూడి పాత కొత్తూరులో కాలువల్లో ఉన్న మురుగు కదలక దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. – రమణ, స్థానికుడు.

సమాధానం: సిబ్బందిని పంపించి కాలువలు శుభ్రం చేయిస్తాం. – మధుశేఖర్, కార్యదర్శి, కత్తిపూడి

న్యూస్‌టుడే, శంఖవరం

నీటి వృథాను అరికట్టారు

ఈనాడు కథనానికి స్పందన

కోటనందూరు, అల్లిపూడి గ్రామంలో కొళాయి వద్ద నీరు వృథా విషయమై ఈనాడులో ప్రచురితమైన వార్తకు పంచాయతీ కార్యదర్శి జి.పద్మ స్పందించారు. సిబ్బందిని పంపి మరమ్మతులు చేపట్టారు.

చక్కదిద్దాలి..సాగనివ్వాలి!

న్యూస్‌టుడే-ప్రత్తిపాడు

నియోజకవర్గంలో సాగునీటి వనరులకు ఢోకా లేదు. ఏలేరు రిజర్వాయర్ నుంచి మధ్యతరహా తాగునీటి ప్రాజెక్టులు సుబ్బారెడ్డి సాగర్, పంపా, చంద్రబాబుసాగర్‌లతో పాటు పుష్కర ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. ఇవన్నీ చివరి ఎకరాకు నీరు ఇస్తే అంతా మాగాణిగా మారుతుంది. వీటి కింద 48 వేల ఎకరాలు పండాలి. నీటిపారుదల అడ్డంకుల వల్ల 30 నుంచి 40 శాతం ఆయకట్టు మాత్రమే దైవాదీనంగా సాగవుతోంది. తిమ్మరాజు చెరువు అభివృద్ధికి నోచుకోవడం లేదు. సుబ్బారెడ్డిసాగర్ పునర్నిర్మాణం కూటమి ప్రభుత్వం వచ్చాక సంఘాలతో పనులు చేయించినా నీటి పారుదల సమస్యలు పరిష్కారం కాలేదు. ఖరీఫ్‌లో 10 వేల ఎకరాలు పంట గగనమవుతోంది. ఇదే సాగర్ ప్రాజెక్టు గేట్లకు సైతం మరమ్మతులు చేయాల్సిఉంది. శంఖవరం మండలంలోని 7 వేల ఎకరాల ఆయకట్టు

పూడికతోనే చెరువులు... పెదశంకర్లపూడిలో

ఉన్న పెదబాపన్నదొర చెరువు నిర్మాణాలు పురాతనమైనవి. ఈ చెరువుపై నిర్లక్ష్యమే కొనసాగుతోంది. ఏలూరు వెంకటపతిరాజు చెరువు రౌతులపూడి మండలంలోని రాఘవరాజు చెరువు, ఇలా ప్రధానమైన చిన్న నీటివనరులు 15 వరకూ అభివృద్ధికి ఎదురుచూస్తున్నాయి.

లిఫ్ట్‌ను గాడిలో పెట్టాలి..

మరో పక్క ప్రత్తిపాడు మండలంలోని పోతులూరు సమీపంలోని కొడవలి వద్ద

● చెరువుల మరమ్మతులకు వేళాయె..

ఉన్న పుష్కర స్టేజ్-2 ఎత్తిపోతలు నిర్మించిన నాటి నుంచి ఏనాడూ వినియోగంలో లేదు. ఇక్కడ నాలుగు పంపు హౌస్‌ల ద్వారా 22 వేల ఎకరాలకు నీరు అందాల్సి ఉంది. ఏటా ఇక్కడ పంపుహౌస్ పనిచేయని పరిస్థితే. ఇక్కడ పంపుహౌస్‌కు ఉన్న ప్రధాన సమస్య విద్యుత్తు వ్యవస్థను చక్కదిద్దకపోవడం. అక్కడ ఉన్న నాలుగు నియంత్రికలు పనిచేయాలి. పంపుహౌసు నిర్వహణపైనా దృష్టి సారించాలి. దీని పరిధిలో పలుచోట్ల కాలువలు పూర్తిచేయాలి.

ముఖ్యమంత్రి దృష్టికి..

ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఇటీవల ముఖ్యమంత్రికి చంద్రబాబుకు నియోజకవర్గంలోని సాగునీటి సమస్యలను నివేదించారు. నిధులు విడుదలై వేసవిలో పనులు పూర్తయితే వచ్చే ఖరీఫ్ పూర్తిగా సానుకూలం అవుతుంది.

పని ఒత్తిడి తగ్గించాలని వీఆర్వోల ఆందోళన

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: జాబ్‌చార్టు ప్రకారం పనిచేయడంతో పాటు అన్ని వేళలా అందుబాటులో ఉంటున్న తమకు పని ఒత్తిడి తగ్గించాలని వీఆర్వోలు డిమాండ్ చేశారు. వీఆర్వోల సంఘ నాయకులు ఎ.కిశోర్, కె.సత్యారావు, ఆర్.శ్రీను, రాంబాబు తదితరులు తహసీల్దార్ కార్యాలయం ముందు బుధవారం ధర్నా చేశారు. ఆర్‌ఐ పొన్నాలుకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

ఆర్‌ఐకి వినతిపత్రం ఇస్తున్న వీఆర్వోలు

సమస్యల పరిష్కారం కోరుతూ సహకార ఉద్యోగుల సమ్మె

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని నాలుగు సహకార ఉద్యోగులు సమ్మె చేపట్టారు. ప్రత్తిపాడు డీసీసీబీ కార్యాలయం ముందు శిబిరాన్ని ఏర్పాటు చేసి బుధవారం ధర్నా చేశారు. జీవో నెం. 36 వెంటనే అమలు చేసి 2019 నుంచి 2024 వరకు పెండింగులో ఉన్న వేతన సవరణలు చేయాలని తదితర డిమాండ్లు నెరవేర్చాలన్నారు. 2019 తర్వాత సొసైటీల్లో చేరిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. డిమాండ్లు నెరవేరేవరకు సమ్మె కొనసాగిస్తామన్నారు.

ప్రత్తిపాడు: సహకార ఉద్యోగుల ఆందోళన

పశువైద్యానికి పరీక్ష..!

సౌకర్యాలు కల్పించాలని వేడుకోలు

కోటనందూరు, రౌతులపూడి, న్యూస్‌టుడే: తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో ప్రజలు వ్యవసాయం, పాడి ముఖ్య జీవనాధారం. కోటనందూరు, రౌతులపూడి మండలాల్లో పశు సంపద అధికం. పశువులకు సుస్తీ చేస్తే వైద్యం చేసేందుకు వసతుల కొరత వేధిస్తోంది. పశువైద్యానికి కూటమి ప్రభుత్వం భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది.

కోటనందూరులో పెచ్చులూడుతున్న ఆసుపత్రి స్లాబు

శిథిలావస్థలో భవనం

పి.కొత్తూరు, కోటనందూరుల్లో వైద్యశాలలు ఉన్నాయి. కోటనందూరులో ఆసుపత్రి భవన స్లాబు పెచ్చులూడి ప్రమాదకరంగా ఉంది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. ఆసుపత్రిని పునర్నిర్మించి, ప్రహరీ ఏర్పాటుచేయాల్సి ఉంది. సిబ్బంది కొరత, శస్త్ర చికిత్సలకు అవసరమైన సామగ్రి అందుబాటులో లేదు. గ్రామాల్లో ట్రైవిస్ (పశువులకు చికిత్స అందించే సమయంలో ఉంచే బోనులు) కొరత ఉండటంతో ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ సమయంలో సేవలందించేందుకు అవస్థలు తప్పడం లేదు. రైతు సేవా కేంద్రాలకు అనుబంధంగా పశుసంవర్ధక సహాయకుల నియామకం జరగాలి. అల్లిపూడి, బొద్దవరం, ఎస్ ఆర్‌పేట, కేపీమల్లవరం గ్రామాల్లో ఇన్‌ఛార్జిల సాయంతోనే సేవలు అందించాల్సి వస్తోంది.

ములగపూడిలో శిథిలమై..

రౌతులపూడి మండలం ములగపూడి, రౌతులపూడి గ్రామాల్లో పశువైద్యశాలలు కొనసాగుతున్నాయి. ములగపూడిలో భవనం శిథిలస్థితికి చేరుకోవడంతో ఎక్కడ కూలుతుందోనని ఆందోళన చెందుతున్నారు. నూతన భవన నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. స్థానిక రైతు సేవా కేంద్ర భవనంలో సేవలు అందించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆసుపత్రిలో వైద్యులున్నా.. సహాయక సిబ్బంది లేరు. ఆర్.వెంకటాపురం గ్రామంలో ట్రావిస్ ఏర్పాటుచేయాలని పశుపోషకులు కోరుతున్నారు. రౌతులపూడి ఆసుపత్రికి గేటు, ప్రహరీ అవసరం. కేంద్రాలకు మందుల సరఫరా లేకపోవడంతో గ్రామాల్లోనూ ఇబ్బందే. సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించామని వైద్యాధికారులు రామ్మోహన్, ఇందు ప్రియ అన్నారు.

నూకాలమ్మ ఆలయ వార్షికోత్సవం

తుని గ్రామీణం: ఎస్.అన్నవరంలో నూకాలమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం పాత గోనేసింపుల వర్గక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ముడుపులు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు.

లోవ అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు

తలుపులమ్మను దర్శించుకున్న ఎంపీ

● తలుపులమ్మ లోవ దేవస్థానాన్ని కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ బుధవారం దర్శించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు దేవస్థానం డిప్యూటీ కమిషనర్ విశ్వనాథరాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేదపండితులు ఆయనకు ఆశీర్వచనాలు చేసి ప్రసాదం, అమ్మవారి చిత్రపటాన్ని అందించారు.

ఘనంగా కొండరాజులబాబు పండగ

కిర్లంపూడి: జగపతినగరం బాలరాజుపేట పొలాల్లో కొండరాజులబాబు పండగను బుధవారం రైతులు నిర్వహించారు. జగ్గంపేట నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు. కొండరాజులబాబుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు గంధం ప్రభాకర్, దాడి చిన్నబుజ్జి రైతులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

అన్నవరం: అన్నవరం దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి విశాఖపట్నం దినుగుపల్లికి చెందిన ఎస్.రాజాచంద్ర రూ. లక్ష విరాళాన్ని బుధవారం అందజేశారు. దాతకు ఈవో వి.త్రినాథరావు సత్యదేవుని ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

చోరీల నియంత్రణకు చర్యలు

శంఖవరం, న్యూస్‌టుడే: దొంగతనాల నివారణ లక్ష్యంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్నవరం పోలీసులు బుధవారం ప్రత్యేక చర్యలు చేపట్టారు. అన్నవరం, కత్తిపూడి బస్టాండుల వద్ద మైక్ పెట్టి దొంగతనాలపై నిత్యం ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఎస్సై శ్రీహరిబాబు తెలిపారు.

కత్తిపూడి బస్టాండులో అవగాహన

జగ్గంపేటలో ట్రామా సెంటర్ నెలకొల్పాలి

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: జగ్గంపేట నియోజకవర్గ కేంద్రంలో యుద్ధప్రాతిపదికన ట్రామా సెంటర్‌ను నెలకొల్పాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ బుధవారం శాసనసభలో వైద్యఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్‌ను కోరారు. ఈ మేరకు సభలో మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో 75 కి.మీ. జాతీయ రహదారి ఉందని, దీనిపై రోజూ ప్రమాదాలు చోటుచేసుకుంటూ అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. జడ్.రాగంపేట ఆసుపత్రిలో పడకల సంఖ్యను పెంచాలని కోరారు.

పశువుల దూడలకు పోటీలు

తొండంగి: పశుపోషణను ప్రోత్సహించడంలో భాగంగా బుధవారం ఎ.కొత్తపల్లిలో పశువుల దూడలకు అందాల పోటీలు పశుపోషకుల సమక్షంలో నిర్వహించారు. చైతన్య, సహజ ఆధ్వర్యంలో నిర్వహించారు. అన్ని గ్రామాల పాడి రైతులు తమ దూడలను తీసుకొచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతగా పశు వైద్యాధికారి ఏవీ కాంతారావు వ్యవహరించారు. ప్రథమ బహుమతి కొల్లి బుల్లిఅప్పారావు, ద్వితీయ బహుమతి అచ్చా గంగారావు, తృతీయ బహుమతి యడ్ల సుబ్బారావు గెలుచుకున్నారు. పశువుల దూడలకు అందాల పోటీలు నిర్వహించడం ఇదే మొదటిసారి కావడంతో జనం ఆసక్తిగా తిలకించారు.

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల విధుల బహిష్కరణ

● ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

తుని పట్టణం, న్యూస్‌టుడే: తునిలో ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు విధులు బహిష్కరించారు. తమకు బస్సుల యాజమాన్యం ఇస్తున్న వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ కొద్ది రోజులుగా విధులకు హాజరుకావడం లేదు. దీంతో ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. తమకు ప్రస్తుతం ఇస్తున్న రోజువారీ వేతనం రూ.1,200 నుంచి రూ.1,600కు పెంచాలని డిమాండ్ చేస్తూ ఏపీఎస్ఆర్టీసీ హైర్ బస్సు డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డ్రైవర్లు నిరసన తెలుపుతున్నారు. అధికారులు బస్సుల యజమానులు, డ్రైవర్లతో చర్చించినా ఫలించలేదు. డిపో పరిధిలో 65 బస్సులు వివిధ ప్రాంతాలకు తిరుగుతుండగా ఇందులో 28 అద్దె బస్సులు ఉన్నాయి. డ్రైవర్లు విధులకు హాజరుకాకపోవడంతో ఆర్టీసీ డ్రైవర్లతో కొన్ని బస్సులు నడుపుతున్నారు. కాకినాడ, రాజవొమ్మంగి, అమలాపురం, రాజమహేంద్రవరం డిపోల నుంచి అదనపు బస్సులను తుని నుంచి కాకినాడ, రాజమహేంద్రవరం నడుపుతున్నారు. డిపోలో స్పేర్ బస్సులను వినియోగించామని, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టామని డిపో మేనేజర్ రమణ తెలిపారు.

నిబంధనలు పట్టవా..?

గండేపల్లి నుంచి మల్లేపల్లి వైపు కూలీలతో ప్రమాదకరంగా వెళ్తున్న ఆటో ఇది. కొందరు ఆటోవాలాలు పరిమితికి మించి కూలీలను ఎక్కించుకుని హైవేలపై వెళ్తూ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. ఆటో ముందు భాగం, వెనుక భాగం, ఇరువైపులా క్యారెజ్ బ్యాగులతో ప్రమాదకరంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇటువంటి వాహనాలపై అధికారులు కొరడా ఝుళిపిస్తే తప్ప నిబంధనలు అమలుకావని ప్రజలు పేర్కొంటున్నారు. – న్యూస్‌టుడే, గండేపల్లి

సైకిళ్లకు నీడ కరవాయె..!

తుని గ్రామీణ మండలం హంసవరం ఆదర్శ పాఠశాలలోని విద్యార్థుల సైకిళ్లకు నీడ సౌకర్యం కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఈ పాఠశాలకు సమీపంలోని వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు సైకిళ్లపై వస్తుంటారు. వేసవిలో సైకిళ్ల ఎండలో ఉండటంతో టైర్లలోని గాలిపోయి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఆ దిశగా అధికారులు, పాఠశాల యాజమాన్యం చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తుని గ్రామీణం

ప్రమాదం అంచున ప్రయాణం

వీరవరం గ్రామంలో ర.భ.రోడ్డులో ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. రెండు వైపులా రైలింగ్ ధ్వంసం కావడంతో వాహనదారులు వంతెనపైకి వెళ్లాలంటే ఆందోళన చెందుతున్నారు. ర.భ.శాఖ అధికారులు వంతెనకు కనీస రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ఈమార్గం ప్రమాదం అంచున ప్రయాణంలా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వంతెనకు రక్షణ రైలింగ్ ఏర్పాటుచేసి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కిర్లంపూడి

ఇలా వదిలేస్తే ఎలా...?

విరిగిన, వంగిన విద్యుత్తు స్తంభాలను తొలగించిన ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా ఎక్కడపడితే అక్కడ వదిలేస్తున్నారు. రెడ్‌కాన్వెంట్ వీధి, ఎస్‌పీరోడ్డు, ఏరియా ఆసుపత్రి - మార్కెట్‌యార్డు మధ్య రోడ్డులో ఇలా పలు ప్రాంతాల్లో ఇనుము, సిమెంటు స్తంభాలు వదిలేశారు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తుని

పాఠశాలకు పరదానే ప్రహరీ

జగ్గంపేట గ్రామీణం మండలంలోని కాట్రావులపల్లిలో మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలకు రక్షణ గోడగా పరదాను ఏర్పాటు చేశారు. సచివాలయం-2 సమీపంలో ఉన్న ఈ ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు చేయకపోవడంతో చీకటిపడితే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతుంది. రక్షణ గోడ లేకపోవడంతో ఉపాధ్యాయులే పరదాను చుట్టి అసాంఘిక శక్తుల నుంచి కాపాడుతున్నారు. – న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం

ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

తుని, న్యూస్‌టుడే: పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం కావడంతో ముస్లింలు బుధవారం రాత్రి నుంచి ప్రత్యేక తరావీ నమాజు ప్రార్థనలు ప్రారంభించారు. తొలుత ఆకాశంలో నెలవంకను చూసి ఒకరినొకరు రంజాన్ ముబారక్ చెప్పుకొన్నారు. ఇమామ్ కబీరుద్దీన్ మాట్లాడుతూ.. ప్రవక్త మహమ్మద్ సూచించిన విధంగా నియమాలు పాటించాలన్నారు.

14వ వార్డులో దువా చేస్తున్న ముస్లింలు

జీవనాధారంపై హక్కు కల్పించాలి

కిర్లంపూడి, న్యూస్‌టుడే: నాలుగు తరాలవారు జీయర్ మఠం భూములను సాగుచేసుకుంటూ జీవనాధారం సాగిస్తున్నామని ఇప్పుడు దానిపై విచారణ పేరుతో సాగుదారులను ఆందోళనకు గురిచేయడం అన్యాయమని బాధిత రైతులు బుధవారం ఆందోళన చేపట్టారు. భూములపై దేవాదాయశాఖ అధికారులు నోటీసులు ఇచ్చి విచారణ పేరుతో తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని సాగుదారులు ఆందోళనకు దిగారు. వీరికి రైతుకూలీసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంఘీభావం ప్రకటించి రైతులతో కలిసి నిరసనకు దిగారు. కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడారు. సాగుదారులపై దౌర్జన్యంకు దిగడాన్ని రైతుకూలీ సంఘం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తోట వెంకన్న, బాలుకుల సుబ్బారావు, కర్రి అగ్గిరాముడు, అడపా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బూరుగుపూడిలో ఆందోళన చేస్తున్న రైతులు

జనగణనపై ముందస్తు సమావేశం

కోటనందూరు, న్యూస్‌టుడే: మండలంలో జనగణన (సెన్సెస్) ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలని ఎమ్మార్వో సత్యనారాయణ అన్నారు. కోటనందూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏవో బి.చిన్నారెడ్డి, ఎఎస్‌వో యూనీస్లక్ష్మిలతో కలిసి బుధవారం ముందస్తు సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామాల్లో కుటుంబ సభ్యుల సమాచారం, గృహాల వివరాలు పక్కాగా సేకరించాలని సూచించారు. ఆర్ఐ గీత, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

స్త్రీనిధి అవకతవకలపై విచారణ : ఎంపీపీ

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: గ్రామీణ మండలంలో స్త్రీనిధి పథకంలో జరిగిన అవకతవకలపై విచారణ చేయాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ఆదేశించారు. ఏలేశ్వరం మండల సర్వసభ్య సమావేశం ఆయన అధ్యక్షతన బుధవారం జరిగింది. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామంలో విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఏడాదయిందని ఇప్పటికీ పరిష్కారం లేదని తూర్పులక్ష్మీపురం ఎంపీటీసీ ఇజనగిరి ప్రసాద్ సమావేశంలో ప్రస్తావించారు. నేలస్వభావం, డిమాండుకు అనుగుణంగా పంటలు పండించాలని, మండలంలో మొక్కజొన్న విస్తీర్ణం పెరిగిందని వ్యవసాయాధికారి ఏవీ రాజేష్ చెప్పారు. తిరుమాలి గ్రామానికి బస్సు వేయాలని సర్పంచి సూతి కృష్ణ కోరారు. మండలంలో అనుమతి లేని చేపల చెరువులపై చర్యలకు పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. ఎంపీడీఓ రవికుమార్ వర్మ, తహసీల్దారు కుశరాజు, వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మి, ఏపీఎమ్ శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన నిర్మాణానికి స్థలం సమకూర్చాలి

జగ్గంపేట గ్రామీణం: రాజ్యాంగ నిర్మాత డా.అంబేడ్కర్ భవన నిర్మాణానికి స్థలం సమకూర్చాలని బహుజన సమాజ్‌పార్టీ ఇన్‌ఛార్జి జుత్తక నాగేశ్వరరావు కోరారు. నియోజకవర్గంలో సుమారు 10వేల మంది దళితులు ఉండగా శుభకార్యాలు చేసుకునేందుకు భవనం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి జగ్గంపేటలో అంబేడ్కర్ భవనం నిర్మించాలని కోరారు.

'అభివృద్ధిని చూసి ఓర్వలేక అసత్య ఆరోపణలు'

మాట్లాడుతున్న తెదేపా రాష్ట్ర, జిల్లా నాయకులు

గండేపల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో జగ్గంపేట నియోజకవర్గం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు కందుల చిట్టిబాబు, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు అన్నారు. తాళ్లూరులో తెదేపా నాయకులు పత్రికా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సీసీ రోడ్లు, కల్వర్టులు, వంతెనలు ప్రతి శాఖలో అభివృద్ధి, సంక్షేమం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని అన్నారు. అసత్య ఆరోపణలు తగవని మాజీ సర్పంచి సూర్యచంద్రకు సూచించారు. నాయకులు కోర్పు సాయితేజ, అడబాల భాస్కరరావు, జాస్తీ వసంత్ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులు సరే.. పునాది రాళ్లు పడలేదు

పరిశీలన

న్యూస్‌టుడే, తొండంగి:

● గ్రామాలకు దూరంగా జాగాలు..

అర్హులందరికీ సొంతింటి కల నెరవేర్చుతాం. ఇళ్లు కాదు ఊళ్లే నిర్మిస్తాం.. అంటూ గత వైకాపా హయాంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ మాటలు నీటిమీద రాతలుగానే మిగిలాయి. క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. తొండంగి మండలం పలు గ్రామాల్లో అప్పుడు వేసిన సరిహద్దు రాళ్లే ఉన్నాయి. నేటికీ ఒక ఇల్లు కాదు కదా పునాది రాయి సైతం పడలేదు. 2021-22లో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇచ్చి రిజిస్ట్రేషన్లు చేశారు. నాలుగు కి.మీ. దూరంలో ఉన్న ఒంటిమామిడిలో 9 ఎకరాలు కొనుగోలు చేసి 513 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. తొండంగికి చెందిన 363 మందికి, కృష్ణాపురానికి చెందిన 150 మందికి ఇచ్చారు. పీఈచిన్నాయిపాలెంకు చెందిన 190 మందికి 4 ఎకరాలు కొనుగోలు చేసి గ్రామానికి శివారు రావికంపాడు వెళ్లే మార్గంలో ఉన్న పొలాల్లో ఇచ్చారు. గ్రామాలకు దూరంగా ఈ ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో లబ్ధిదారులు ఎవరూ ఇల్లు నిర్మించుకోలేదు. దీంతో ఆ స్థలాల్లో పిచ్చి మొక్కలు మొలిచి నిరుపయోగంగా ఉన్నాయి.

ఒంటిమామిడిలో ఇచ్చిన ఇళ్ల స్థలాలు

మౌలిక సదుపాయాలు లేక..

లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవాలంటే ఆ లేఅవుట్ల వద్ద మౌలిక సదుపాయాలు సమకూర్చాలి. ఇళ్ల స్థలాలు ఇచ్చి అక్కడ సదుపాయాలేవీ ఏర్పాటు చేయలేదు. తాగునీరు, రోడ్డు, విద్యుత్తు సదుపాయం లేదు. ఇదీ జగనన్న కాలనీల్లో దుస్థితి. దీంతో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకు రాలేదు. లే అవుట్‌లకు వెళ్లేందుకు అధ్వానంగా రోడ్లు ఉండేవి. కనీస వసతులు ఏర్పాటు చేయాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకోలేదు. ఎకరానికి రూ.35 లక్షల నుంచి రూ.45 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ఈ భూములు నేటికీ నిరుపయోగంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఇలాంటి స్థలాలపై దృష్టి సారించి గ్రామాలకు దూరంలో ఉన్న ఇళ్ల స్థలాలను రద్దు చేసి గ్రామాలకు దగ్గరగా ఉండే ఇళ్ల స్థలాలు ఇస్తే సొంత గూడు నిర్మించుకునేందుకు అవకాశం ఉంటుందని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఇంటర్ విద్యార్థులకు వీడ్కోలు వేడుక

శంఖవరం, న్యూస్‌టుడే: కత్తిపూడిలో ఉన్న సీతారామ కళాశాల వద్ద బుధవారం ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు వేడుక ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఈ దశ చాలా కీలకమని ప్రిన్సిపల్ వీరబాబు పేర్కొన్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి, నత్యాలు చేస్తూ సందడిగా గడిపారు.

పక్కాగా ఓటరు జాబితా సవరణ

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ఓటరు జాబితా సవరణకు సంబంధించి ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని ఈఆర్వో, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఎస్ఐఆర్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్వోలకు తహసీల్దార్ కార్యాలయంలో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. సవరణ ప్రక్రియ పారదర్శకంగా లోపరహితంగా జరిగేలా అన్ని పార్టీల నాయకులు సహకరించాలన్నారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటరు వివరాలను సరిచూసి ఆధార్‌ను అనుసంధానించాలన్నారు. తహసీల్దార్ సూర్యప్రభ వివిధ పార్టీల నాయకులు సింగిలిదేవి సత్తిరాజు, ధరణాలకోట శ్రీను, టి.కామేశ్, శేరు కృష్ణ, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

శంఖవరం: కత్తిపూడి జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వెన్నా తమ్మయ్యదొర (36) మృతి చెందారు. వివరాలివీ.. రాపర్తికి చెందిన తమ్మయ్యదొర ఓ దుకాణంలో గుమాస్తాగా పనిచేస్తూ కత్తిపూడిలో నివసిస్తున్నారు. పెట్రోల్ బంకు సమీపంలో ద్విచక్రవాహనంపై రోడ్డు దాటుతుండగా రాజమహేంద్రవరం వైపు నుంచి తుని వైపు వెళుతున్న వాహనం ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. 108లో కాకినాడ ఆసుపత్రికి తరలించేలోపే మార్గమధ్యలో మృతిచెందారు. తమ్మయ్యదొరకు భార్య నాగలక్ష్మి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కూరగాయలు తీసుకురావడానికి వెళ్లిన భర్త కొద్ది నిమిషాల్లోనే ప్రమాదానికి గురై మృతిచెందడంతో తమకు దిక్కెవరంటూ కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.

తనిఖీలకు వెళ్తుండగా హెడ్‌కానిస్టేబుల్‌కు గాయాలు

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: సహోద్యోగులతో విధి నిర్వహణకు వెళుతున్న ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలై అపస్మారక స్థితికి చేరుకున్న ఘటన జగ్గంపేటలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. పెద్దాపురం ఎక్సైజ్‌శాఖలో హెచ్‌సీగా పనిచేస్తున్న అల్లుమిల్లి వీరవెంకటసత్యనారాయణ తోటి ఉద్యోగులతో కలిసి జగ్గంపేట మండలం మామిడాడలో తనిఖీకి నిమిత్తం మోటారు సైకిళ్లపై వెళుతున్నారు. జగ్గంపేట సర్వీసు రోడ్డులో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా విద్యుత్తుశాఖ కార్యాలయం వద్దకు వచ్చేసరికి వెనుక వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టి ఈడ్చుకుంటూ వెళ్లడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. గాయాలైన హెచ్‌సీని మెరుగైన చికిత్సకోసం రాజమహేంద్రవరంలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించామని పరిస్థితి విషమంగా ఉందని ఎక్సైజ్ సీఐ తెలిపారు.

(c) eenadu

హస్తభూషణాలు

కన్నడ పుస్తక ప్రాధికార ప్రచురించిన డజనుకు పైగా పుస్తకాల విడుదల కార్యక్రమం బెంగళూరు నయన కళామందిరంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆచార్య హంపా నాగరాజయ్య చేతుల మీదుగా వాటిని ఆవిష్కరిస్తున్న దృశ్యమిది. చిత్రంలో ఆచార్య బసవరాజ కల్గుడి, ఆచార్య టి.మంజునాథ్, ఆచార్య వినయ్ చిదానందమూర్తి, ఆచార్య సీఆర్ చంద్రశేఖర్ తదితరులనూ చూడొచ్చు. - న్యూస్‌టుడే, బెంగళూరు

జైన దీక్షా కంకణం

చిక్కమగళూరుకు చెందిన యువతి జైన దీక్షకు సిద్ధమైంది. ఉన్నత వ్యాపార కుటుంబంలో పుట్టిన ఆమె సకల వైభోగాలను త్యజించి.. దీక్షాధారిగా మారడానికి కదిలివెళ్లిన వేళ.. పట్టణ వీధుల్లో కొనసాగిన భక్తి ఊరేగింపు. ఏదీ శాశ్వతం కాదు.. అన్నీ వదిలి భక్తిబాటలో పయనించాల్సిందేనంటూ ఆమె ఉద్బోధించారు. - న్యూస్‌టుడే, చిక్కమగళూరు

ఈనాడు కర్ణాటక

గురువారం ఫిబ్రవరి 19, 2026

అధికారికి చేదు అనుభవం

శివమొగ్గ, న్యూస్‌టుడే : లంచం తీసుకున్న ఆరోపణలపై కారాగారం చేరిన జాతీయ రహదారి ప్రత్యేక భూస్వాధీన అధికారి సిద్ధలింగరెడ్డికి బాధిత రైతు విశుకుమార్ బ్రెడ్, అరటి పండ్లు, మస్కిటో కాయిల్ తెచ్చి ఇచ్చారు. శ్రీగంధం సాగు చేస్తున్న రైతు విశుకుమార్ భూమికి పరిహారం ఇచ్చేందుకు లంచం తీసుకుంటూ సిద్ధలింగరెడ్డి లోకాయుక్త అధికారులకు దొరికిపోయారు. సోగానె కేంద్ర కారాగారంలో ఉన్న ఆయనను విశుకుమార్ పరామర్శించి, తనతో తెచ్చిన వాటిని కారాగారంలో ఉన్న అధికారికి ఇచ్చి వెళ్లారు.

అన్నదాతలకు భారీ వంచన

యాదగిరి, న్యూస్‌టుడే : హుణసగి తాలూకాలో 34 మంది రైతుల నుంచి 10,603 మూటల వడ్లు కొనుగోలు చేసి, ఐదుగురు వ్యాపారులు వంచనకు పాల్పడ్డారు. శ్రీనివాసరెడ్డి, ప్రసాద్, టీసీ కొండయ్య, త్రిమూర్తి, ప్రేమకుమార్ అనే వ్యాపారులు తమకు రూ.1.34 కోట్ల నగదు ఇవ్వకుండా వంచించి పరారయ్యారని కెంభావి ఠాణాలో రైతు ప్రకాశ సణ్ణ భీమప్ప ఫిర్యాదు చేశారు. తమ వద్ద కొనుగోలు చేసుకున్న వడ్ల ధర రూ.1.73 కోట్లు కాగా, వ్యాపారులకు తమకు రూ.39.50 లక్షల బయానా ఇచ్చి, మిగిలిన సొత్తు ఇవ్వకుండా పరారయ్యారని తమ ఫిర్యాదులో ఆరోపించారు.

బడిలోనే కొట్టుకున్నారు

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే : బసవనగుడిలోని ఒక పాఠశాల ప్రిన్సిపల్ ఉమ్మియ కులసుం, ఉపాధ్యాయురాలు రేష్మ మధ్య గొడవ తలెత్తింది. రేష్మ పనితీరును మెచ్చుకుంటూ పాలక మండలి ఆమెకు పదోన్నతి, ప్రశంసాపత్రాన్ని అందించింది. నువ్వు పని చేయకపోయినా పదోన్నతి ఇచ్చారంటూ ఉమ్మియ కులసుం చేసిన వ్యాఖ్యలతో వారిద్దరి మధ్య గొడవ ప్రారంభమైంది. విద్యార్థుల సమక్షంలోనే ఒకరిపై మరొకరు దాడులు చేసుకున్నారు. ఈ వీడియో ఇప్పుడు స్థానికంగా వైరల్‌గా మారింది. ఒకరిపై మరొకరు బసవనగుడి ఠాణాలో ఫిర్యాదు చేసుకున్నారు.

మిగులు బడ్జెట్ సాధ్యమేనా?

- తగ్గిన జీఎస్టీ వసూళ్లు
- సర్కారుకు నిత్యం తిప్పలు
- ఖర్చులే ఖజానాకు భారం

అల్పసంఖ్యాక నేతలు, మంత్రులతో బుధవారం విధానసౌధలో సమావేశమైన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

ఈనాడు, బెంగళూరు : ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన 17వ రాష్ట్ర బడ్జెట్ విధానసభలో ప్రవేశపెట్టేందుకు మరో రెండువారాల సమయమే ఉంది. ముఖ్యమంత్రిగా ఇప్పుడే రికార్డు అధిగమించిన సిద్ధరామయ్య.. ఇదే ఉత్సాహంతో మరో రికార్డు స్థాయి బడ్జెట్‌ను కూడా తయారు చేస్తున్నారు. రాజకీయపరంగా సిద్ధరామయ్యకు పోటీ ఉన్నా బడ్జెట్ తీర్చిదిద్దటంలో ఆయనకు ఆయనే సాటి. రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సిద్ధరామయ్య గతంలో ఎన్నడూ లేనంతగా వరుసగా మూడు సార్లు లోటు బడ్జెట్‌ను ప్రతిపాదించటం తీవ్ర విమర్శలకు అవకాశం కల్పిస్తోంది. గ్యారంటీలు, కీలక శాఖల్లో తగ్గిన వసూళ్లతో పాటు పన్నేతర వ్యయాలు సిద్ధు సర్కారుకు భారంగా మారాయి. బడ్జెట్‌లో వేసిన అంచనాకంటే కాస్త ఎక్కువ వసూళ్లు సాధించినా అది ఖజానాకు అంత లబ్ధి చేకూర్చలేదన్న వాదన వినిపిస్తోంది.

ఏడాది బడ్జెట్ మొత్తం రెవెన్యూలోటుతో సమానమవుతోంది. ఓ ఏడాదిలో రెవెన్యూ వసూళ్లను ఈ స్థాయిలో రికవరీ చేయటం అంత సులువు కాదని ఆర్థిక నిపుణులు కూడా అంచనా వేస్తున్నారు. ఇందుకు కారణం గత రెండేళ్ల బడ్జెట్‌లో చూపిన రెవెన్యూ లోటు ఆయా ఆర్థిక సంవత్సరాల చివరి నాటికి చేసిన రికవరీ ఏటేటా తగ్గుతోంది. తొలి ఏడాదిలో అంచనా వేసిన రెవెన్యూ లోటులో రూ.4వేల కోట్లు, ఆపై ఏడాది రూ.7వేల కోట్ల దూరంలోనే రికవరీ ఆగిపోయింది. ఇందుకు కారణం ప్రధానంగా జీఎస్టీ వసూళ్లన్నది స్పష్టమవుతోంది. మరీ ముఖ్యంగా ఈసారి బడ్జెట్ మొత్తం కూడా ఈ వసూళ్లపైనే ఆధారపడి ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. ఫిబ్రవరి 15 నాటికి అందిన సమాచారం ప్రకారం ఈసారి కనీసం రూ.10 వేల కోట్ల లోటు బడ్జెట్ తయారవటం తప్పదని తెలుస్తోంది.

ఆర్థిక సవాళ్లు

ఏడాది	రెవెన్యూ లోటు	రికవరీ(రూ.ల్లో)
2023-24	12,523	8,000
2024-25	27,354	20,000
2025-26	19,262	(అంచనా వేయలేదు)



మిగులు బడ్జెట్ తయారీలో ముఖ్యమంత్రి

జీఎస్టీ వసూళ్లే శాపమై..

గతేడాది సర్కారు రూ.4.09 లక్షల కోట్ల బడ్జెట్ మొత్తాన్ని ప్రతిపాదించింది. ఈసారి ఈ మొత్తాన్ని కనీసం రూ.4.50 లక్షల కోట్లకు పెంచే అవకాశముంది. ఈ మొత్తంలో రెవెన్యూ లోటు గత రెండేళ్ల బడ్జెట్‌తో పోలిస్తే ఎక్కువగా ఉందన్న వాదన వినిపిస్తోంది. ఇందుకు కారణం ఏడాదిగా జీఎస్టీ వసూళ్ల ప్రమాణం తగ్గటమే. ఈ ఏడాది నాలుగో ఆర్థిక త్రైమాసికంలో రూ.16 వేల కోట్ల జీఎస్టీ వసూళ్లు తగ్గాయని ఆర్థికశాఖ నివేదికలు చెబుతున్నాయి. ఈ మొత్తం ఓ

సెస్‌లు చాలలేదు..

ఈ ఏడాది కీలకమైన శాఖలు రాష్ట్రానికి కాసులు కురిపించటంలో వెనకబడ్డాయి. రెవెన్యూశాఖలోని రిజిస్ట్రేషన్, ముద్రణకు కావేరి 2.0సాఫ్ట్‌వేర్, సవరించిన విధానాలు ఆదాయానికి గండి కొట్టాయి. వాణిజ్య పన్నులు, మోటారు వాహనశాఖలు మాత్రమే ఆశించిన స్థాయిలో రాబడి తెచ్చిపెట్టాయి. ఇక అబ్కారిలోనూ కొన్ని ఆరోపణలు రాబడిని తగ్గించాయి. మొత్తంగా నాలుగు శాఖల నుంచి సర్కారు అంచనా వేసిన పన్నుల ప్రమాణంలో ఇంకా 30 శాతం వసూళ్లు సాధించాలి. మార్చిలోగా ఈ మొత్తాన్ని సాధించగలమని సర్కారు ధీమాగా ఉంది. రెవెన్యూశాఖలో కావేరి సాఫ్ట్‌వేర్ 2.0 పూర్తి స్థాయిలో అందుబాటులోనికి వస్తే పెంచిన రిజిస్ట్రేషన్ ఫీజులు అమలవుతాయి. ఆపై సెస్‌లు, వాడకం ఫీజులు కూడా పెంచినా వాటి ప్రభావం వసూళ్లలో కనిపించలేదు.

మోయలేని భారమిదే..

రాష్ట్ర ప్రభుత్వానికి ఏటేటా ఐదు గ్యారంటీల కారణంగా రూ.50 వేల కోట్లను అనివార్యంగా వ్యయం చేయాల్సి వస్తోంది. మరో వైపు పన్నేతర వ్యయాలు పెరిగిపోతున్నాయి. బహిరంగ మార్కెట్ నుంచి ఎక్కువ వడ్డీకి రుణాలు తెచ్చి పన్నేతర వ్యయానికి వినియోగిస్తున్నారు. ఇలా ఈ ఏడాదికి రూ.70 వేల కోట్ల వరకు పన్నేతర వ్యయాల వసూళ్లు మందగించినట్లు ఆర్థికశాఖకు చెందిన ఓ అధికారి వెల్లడించారు. ఇక విపక్షాలు ఆరోపిస్తున్న ప్రకారం ఈ సర్కారు ఎన్నడూ లేనంతగా 90 మందికి కేబినెట్ హోదా కట్టబెట్టడం కూడా రాష్ట్రానికి మోయలేని భారంగా మారుతోంది. ప్రస్తుతం 31 మంది మంత్రులు, మరో 43 మంది వివిధ కార్పొరేషన్ల అధ్యక్షులుగా కేబినెట్ హోదాలో ఉండటం, మరో 53 మంది కార్యకర్తలు కూడా వివిధ హోదాల్లో కేబినెట్ సదుపాయాన్ని పొందుతున్నారు. వీరికి వసతి, వాహనాలు, భద్రతా వ్యవస్థలతో పాటు భత్యాల కోసం సర్కారు ఏడాదిలో రూ.1000 కోట్లు వ్యయం చేసినట్లు విపక్ష నేత ఆర్.అశోక్ ఆరోపించారు.

ఇల్లాలిని హతమార్చి పెరట్లో పూడ్చిపెట్టి..

ఓ భర్త ఘాతుక చర్య

విజయపుర, న్యూస్‌టుడే : విలాసాలకు, ఇంటి నిర్వహణకు అప్పులు చేయవద్దని చెప్పిన సరోజిని (45) అనే గృహిణిని ఆమె భర్త ప్రభు రత్నాకర్ (48) జనవరి 24న హత్య చేశాడని దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఆమెను కడతేర్చాక.. ఇంటి పెరట్లో గుంత తీసి మృతదేహాన్ని పూడ్చి పెట్టిన ఘటన దేవరహిప్పరగిలో చోటు చేసుకుంది. అనంతరం పోలీసు ఠాణాకు వెళ్లి తన భార్య కనిపించకుండా పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. 'సవదత్తి దేవాలయంలో పూజలు చేయించుకుందాం అనుకున్నాం. దేవరహిప్పరగిలో కిరాణా దుకాణానికి వెళ్లి పూజా సామగ్రి కొనుక్కుని వస్తానని చెప్పి వెళ్లింది. వెనక్కు మళ్లీ తిరిగి రాలేదు' అని దృశ్యం సినిమా శైలిలో కథ చెప్పాడు. బంధువులు, తెలిసిన వారిళ్లలోనూ వెతికాను. ఆమె కనిపించలేదని కన్నీరుమున్నీరయ్యాడు. తన కుమార్తె అదృశ్యం వెనుక అల్లుడి హస్తం ఉండి ఉంటుందని కమలవ్వ మేలిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తమదైన శైలిలో ప్రభు రత్నాకర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేయగా, ఇంటి పెరట్లోనే భార్యను పూడ్చి పెట్టానని చెప్పారు. తహసీల్దారు, వైద్యాధికారుల సమక్షంలో మృతదేహాన్ని వెలికి తీసి, పంచనామా నిర్వహించారు.

డ్రైవర్‌తో మాట్లాడిందని భార్యను నరికేశాడు

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే : భార్య ప్రవర్తనను అనుమానించిన కుమార్ (65) అనే వృద్ధుడు దారుణానికి తెగించాడు. భార్య దేవిక (55)పై మచ్చుకత్తితో దాడి చేసి హత్య చేశాడు. హత్య అనంతరం ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఆ అలికిడికి అతని కుమారులు అక్కడకు వచ్చి తండ్రి ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. నిందితుడిని గోవిందరాజనగర ఠాణా పోలీసులు బుధవారం ఉదయం అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఇటీవల తన కుమారులతో కలిసి కుమార్ శబరిమలకు వెళ్లి వచ్చాడు. ఇంటికి తిరిగి వచ్చేసరికి ఒక డ్రైవరుతో ఆమె మాట్లాడుతూ ఉండటాన్ని కుమార్ గమనించాడు. అప్పటి నుంచి ఆమె శీలాన్ని శంకిస్తూ గొడవపడుతూ వచ్చాడు. ఇదే క్రమంలో మంగళవారం రాత్రి ఆమెను హత్య చేశాడని పోలీసులు తెలిపారు.

అనుమానం.. హత్య

కోలారు, న్యూస్‌టుడే : మాలూరు తాలూకా మిటగానహళ్లికి చెందిన నయాజ్ ఖాన్ (38) అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. నిందితుడు శాహిద్ ఖాన్ (33)ను పోలీసులు అరెస్టు చేశారు. షాహిద్‌కు నయాజ్ స్వయంగా మేనమామ. తన భార్యతో అతనికి వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతోనే దాడి చేసి హత్య చేశాడని ప్రాథమిక విచారణలో పోలీసులు గుర్తించారు.

తెలివి.. తెల్లారింది!

జితేంద్ర ముఖం చూస్తే గుండె తరుక్కుపోయేలా ఉంది. పాపం.. రాజస్థాన్ నుంచి వచ్చి కుటుంబ పోషణ కోసం మండ్యకు చేరువలోని క్యాతనహళ్లిలో ఓ చిరు నగల దుకాణం నిర్వహిస్తున్న ఆయనకు పెద్ద కష్టమే వచ్చింది. సరిగ్గా వారం రోజుల కిందట ఆయన నడుపుతున్న 'మహాలక్ష్మీ నగల దుకాణం' తలుపుతట్టిన ముగ్గురు దుండగులు కలకలం రేపారట. నగలు కావాలంటూ దుకాణంలోకి ప్రవేశించి.. ఒక్కసారిగా యాసిడ్ పోయడంతో జితేంద్ర పరిస్థితి అరణ్యరోదనగా మారింది. ఆయనను ఆదుకోవడానికి ఆ సమయంలో ఎవరూ రాకపోవడంతో దుండగులు అక్కడ దొరికిన 170 గ్రాముల బంగారు ఆభరణాలు, ఎనిమిది కిలోల వెండి మూటగట్టుకుని పారిపోయారు. యాసిడ్ దాడలో గాయపడిన జితేంద్రను స్థానికంగా ఓ ఆసుపత్రిలో చేర్పించి.. వైద్యం చేయించడం ప్రారంభించారు. నిజానికి దొంగలు మూటగట్టుకుపోయిన నగలన్నీ అప్పటికి రెండు రోజుల కిందట మైసూరులోని ఓ టోకు నగల వర్తకుడి వద్ద అరువుగా తీసుకొచ్చినవే. వాటిని విక్రయించాక.. లాభాలు మిగుల్చుకుని సొమ్ము చెల్లించాలనేది ఒప్పందం. అసలుకే మోసం వచ్చి.. సొత్తు దొంగలపాలు కావడంతో అరువు ఇచ్చిన వ్యక్తి మిన్నకుండిపోయాడు. వారం రోజుల్లో జితేంద్ర ఆరోగ్యం కుదుట పడుతోందని తెలిసి.. పోలీసులు విచారణకు రంగంలోకి దిగేసరికి 'దొంగ' వ్యవహారాల తెర తొలగిపోయింది.

- 'అదేమిటి జితేంద్ర గారూ.. దుండగులు యాసిడ్ పోస్తే చెంపల మీద మాత్రమే పడింది. కన్ను, ముక్కు, నోటికి ఏమీకాలేదు.. ఎందుకు?' అంటూ పోలీసులు సంధించిన తొలి ప్రశ్నకే గుక్కతిప్పుకోలేక నీళ్లు నమిలాడు. 'మీకింకా నయంకాకనే.. రాజస్థాన్‌కు టికెట్లు సిద్ధం చేసుకున్నారు ఎందుకు?' అనే రెండో ప్రశ్నకు సమాధానం వెదుక్కోలేక చేతులెత్తేశాడు.
- 'నిజమే సార్.. నేనే యాసిడ్ పోసుకున్నా. అరువుగా తెచ్చుకున్న నగలు తీసుకుని మా రాజస్థాన్‌కు వెళ్లిపోయి గుట్టుగా.. హాయిగా బతుకుదామని తప్పు చేశా. పొరపాటైంది..' అంటూ దండం పెడుతుంటే ఆశ్చర్యపోవడం పోలీసుల వంతైంది.
- పాండవపుర తాలూకా క్యాతనహళ్లిలో రాజస్థాన్‌కు చెందిన జితేంద్రసింగ్ 'మహాలక్ష్మి జ్యువెలరీ షాప్'లో నగల వ్యాపారంతో పాటు బంగారాన్ని తాకట్టు పెట్టుకుని రుణాలు ఇచ్చేవాడు. బయట నుంచి తక్కువ మొత్తానికి నగదు అప్పుగా తెచ్చుకునేవాడు. తాను దుకాణంలో ఉన్నప్పుడు కొందరు దుండగులు యాసిడ్ పోసి పైన పేర్కొన్న సొత్తు దోచుకుని పరారైనట్లు ఆరోపించాడు. ఆసుపత్రిలో చికిత్స తరువాత కొనసాగిన విచారణలో ఆయనకు చుక్కలు కనిపించాయి. చక్కగా నగల దుకాణంలో కూర్చోవాల్సిన జితేంద్రుడు.. ఊచలు లెక్కించడంలో మునిగిపోయాడు. -న్యూస్‌టుడే, మండ్య

ఆదిలోనే అక్షరానికి సంకెళ్లు

విధానసౌధలో నిబంధనలు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : విధానసౌధకు వెళ్లి వార్తలు సేకరించే విలేకరులపై రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు విధించే ప్రయత్నాలు చేపట్టింది. దానిపై మాధ్యమ సంస్థలతో పాటు పాత్రికేయ సంఘాలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నాయి. భద్రత కారణంగా ఆంక్షలు విధించక తప్పడం లేదని సిబ్బంది పరిపాలన శాఖ అధికారులు తెలిపారు. మాధ్యమ ప్రతినిధులు విధానసౌధలో గుర్తించిన ప్రదేశంలో మాత్రమే ఉండి మంత్రులు, శాసనసభ్యులు, అధికారులు తదితరుల నుంచి వార్తలు సేకరించాలని సూచించారు. ఎప్పటిలాగే ఇష్టమొచ్చినట్లు నడవాలో తిరగడానికి అనుమతించబోరు. నగరాభివృద్ధిశాఖ మంత్రి భైరతి సురేష్ కార్యాలయంలో ఇటీవల కొంత నగదు, బంగారు నగలు మాయమైన విషయం తెల్సిందే. ఆ సంఘటనను సాకుగా తీసుకుని మాధ్యమాలపై ఆంక్షలు విధించడం మొదలు పెట్టారు. వాటిని దొంగిలించిన ఆ కార్యాలయ ఉద్యోగిని ఇప్పటికే విధానసౌధ ఠాణా పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. భద్రత పేరుతో మాధ్యమ ప్రతినిధులు విధానసౌధలో సంచరించకుండా ఒక ప్రదేశానికే పరిమితం చేసే ప్రయత్నాలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తీర్పును అంగీకరిస్తున్నా: సుబ్బారెడ్డి ప్రతిస్పందన

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే : తన ఎన్నికను రద్దు చేస్తూ ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నానని బాగేపల్లి ఎమ్మెల్యే (పదవి రద్దైన) ఎస్ఎన్ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. భాజపా ద్వేష రాజకీయాలతోనే ఇలా జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ ద్వేషాలు ఇలాగే కొనసాగితే, భవిష్యత్తులో ప్రతి నేతా ఇబ్బంది పడవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో తనకు 82,128 ఓట్లు రాగా, భాజపా అభ్యర్థి సి.మునిరాజుకు 62,949 ఓట్లు వచ్చాయని గుర్తు చేశారు. పార్టీ నేతలు, న్యాయకోవిదులతో చర్చించి, తదుపరి నిర్ణయాన్ని తీసుకుంటానని చెప్పారు.

టిప్పర్ ఢీకొని.. కుటుంబమే విషాదాంతం

బెళగావి, న్యూస్‌టుడే : రాయబాగ తాలూకా అలఖనూరు గ్రామం వద్ద బుధవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మరణించారు. గిరెప్పా కుంద్రాళి (30), ఆయన భార్య మంజుల (27), వీరి కుమార్తె ఆరాధ్య (7)ను మృతులుగా గుర్తించారు. మీరజ్ నుంచి బైకుపై జమఖండికి వెళుతున్న సమయంలో ఎదురుగా వచ్చిన టిప్పర్ లారీ ఢీకొనడంతో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించేలోగా కన్నుమూశారు. హారోగేరి ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

స్నేహమయికి తాయిలాలు?

మైసూరు, న్యూస్‌టుడే : మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా)లో అక్రమాలకు సంబంధించి పోరాటం చేస్తున్న తనకు తాయిలాలు ఇచ్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని సహ కార్యకర్త స్నేహమయి కృష్ణ ఆరోపించారు. తాను పెట్టిన కేసుల నుంచి వెనక్కు తగ్గితే, పెద్ద మొత్తంలో నగదు ఇస్తామని కొందరు ఫోన్ చేసి చెబుతున్నారని బుధవారం ఇక్కడ వివరించారు. తనకు ఫోన్లు చేసిన వారి వివరాలు, కాల్ రికార్డింగ్‌ల వివరాలను లోకాయుక్తకు అందిస్తానని చెప్పారు.

మాదప్ప సన్నిధిలో రథ వైభవం

చామరాజనగర, న్యూస్‌టుడే : మలెమహదేశ్వర బెట్టపై మహాశివరాత్రి ఉత్సవాలకు బుధవారం తెరపడింది. బెట్టపై బుధవారం నిర్వహించిన రథోత్సవంలో తమిళనాడు, కర్ణాటకలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు పాల్గొన్నారు. రథంపై పండ్లు, ధాన్యాలను విసురుతూ తమ కోర్కెలను తీర్చాలని మాదప్పను భక్తులు కోరుకున్నారు. ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాలకు సుమారుగా 10 లక్షల మంది భక్తులు హాజరయ్యారని మహదేశ్వర బెట్ట అభివృద్ధి ప్రాధికార కార్యదర్శి ఏఈ రఘు తెలిపారు. ఐదు రోజుల్లో 6.5 లక్షల లడ్డూలను విక్రయించామన్నారు. ఆలయం ప్రధాన ద్వారం నుంచి స్వామివారి ఉత్సవ మూర్తి కోసం గొడుగు, చామరలు, నందిధ్వజాన్ని మంగళవాద్యాలతో తీసుకువచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి రెండు లక్షలకు పైగా భక్తులు కాలి నడకనే ఈ ఏడాది మాదప్పన బెట్టకు వచ్చారు. ఈ ఐదు రోజుల ఉత్సవం కైలాసమే మాదప్పన బెట్టకు వచ్చిన రీతిలో భక్తులు పూజలు, ప్రార్థనలు చేసుకున్నారు.

కొండపై ఆలయం ముంగిట రథవీధిలో ఊరేగుతున్న మాదప్ప

బాలుడి జీవితాన్ని చిదిమేసిన బస్సు

యాదగిరి, న్యూస్‌టుడే : గురుమఠకల్ తాలూకా గాజరకోట్ గ్రామంలో పాఠశాల వ్యాను చక్రం కింద చిక్కుకుని పునీత్ (4) అనే బాలుడు మరణించాడు. గ్రామంలోని ప్రైవేటు పాఠశాలలో నర్సరీ చదువుతున్న పునీత్ నిత్యం వ్యానులో బడికి వెళ్లి వచ్చేవాడు. బుధవారం మధ్యాహ్నం అతణ్ని ఇంటి వద్ద డ్రైవరు దించాడు. బాలుడు బస్సు వెనకకు వచ్చినట్లు గుర్తించకుండా వ్యానును వెనక్కు తీస్తున్న సమయంలో చక్రం కింద నలిగి బాలుడు మరణించాడు. గురమఠకల్ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కాలిపోయిన మినీ బస్సు

బస్సు లోపలి భాగం మాడిమసై పోయింది

పూర్తిగా కాలిపోయిన మినీ బస్సు

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే : రాజధాని శివార్లలో చంద్రా లేఅవుట్ బీఎంటీసీ బస్ డిపో సమీపాన నిలిపి ఉంచిన విలాసవంత మినీ బస్సు ఒకటి బుధవారం ఉదయం మంటల్లో కాలిపోయింది. స్థానికుల ఫిర్యాదుతో అగ్నిమాపకదళ సిబ్బంది అక్కడకు వచ్చి మంటల్ని ఆర్పేలోగా బస్సు బుగ్గిగా మారింది. ప్రమాద సమయంలో బస్సులో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. యంత్రంలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తోనే మంటలు చెలరేగాయని అనుమానిస్తున్నారు. చంద్రాలేఅవుట్ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సూర్యకు బాధ ఎందుకో?

వ్యంగ్యాస్త్రాలు సంధించిన కాంగ్రెస్

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే : బెంగళూరు దక్షిణ లోక్‌సభ సభ్యుడు తేజస్వి సూర్య ఏడుస్తున్నట్లు కృత్రిమ మేధస్సుతో రూపొందించిన వీడియోను కర్ణాటక కాంగ్రెస్ తమ సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసింది. మెట్రో రైలు ప్రయాణ ధరల విషయంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్-సూర్య మధ్య కొద్ది రోజులుగా వాగ్యుద్ధం కొనసాగుతోంది. మెట్రో సాధనలను కేంద్ర ప్రభుత్వం ఖాతాలో వేసుకుంటున్న సూర్య.. ధరల పెంపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని దుయ్యబడుతున్నారని కాంగ్రెస్ కార్యకర్త దీపక్ గౌడ ఆరోపించారు. ఆరోపణలు, వ్యాఖ్యలు చేసే సమయంలో హోదాను మరిచి పోవద్దని హితవు పలుకుతూ అతను చేసిన వీడియో వైరల్‌గా మారింది. ఇదివరకే భాజపా సంధించిన వ్యంగ్యాస్త్రాలపై కాంగ్రెస్ మండిపడటం తెలిసిందే.

ఆర్థికాభివృద్ధిలో కృత్రిమ మేధస్సు కీలకపాత్ర

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే : దేశ ఆర్థికాభివృద్ధికి కృత్రిమ మేధస్సు, సెమీ కండక్టర్లు, కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలు ఉత్ప్రేరకాలుగా పని చేస్తాయని ఇండియా ఎనర్జీ స్టోరేజ్ అసోసియేషన్ ఇన్ ఇండియా (ఐఈఎస్ఏ), సెమీకండక్టర్ పరిశ్రమల సంఘం అధ్యక్షుడు అశోక్ చాండక్ పేర్కొన్నారు. సెమీకండక్టర్ల తయారీ, కృత్రిమ మేధస్సు, ఎలక్ట్రానిక్స్ సామర్థ్యాలకు కర్ణాటక తన వంతు పాత్రను పోషిస్తోందని చెప్పారు. దిల్లీలో నిర్వహిస్తున్న ఏఐ ఇంపాక్ట్ సదస్సులో కర్ణాటక నుంచి తమ సంఘాల నుంచి 50కుపైగా ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. 'క్రియేట్ ఇన్ ఇండియా' నినాదంతో అమెరికా, యూరోపియన్ యూనియన్ భాగస్వాములతో కలిసి డిజిటల్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

తేనెవల విసురుతూ.. అడ్డగోలు సంపాదన

హాసన, న్యూస్‌టుడే : హొళెనరసీపురలోని ఓ కళాశాలలో నాగలక్ష్మి ఒప్పంద విధానంలో అధ్యాపకురాలు. ఆమె భర్త ధర్మరాజు అలియాస్ ఫణి ప్రైవేట్ ల్యాబ్‌లో టెక్నీషియన్. శ్రీమంతులుగా మారవచ్చని యువతులను నమ్మించి, వారితో హనీట్రాప్‌లు చేయిస్తున్న ఆరోపణలపై వారిద్దరినీ, వారికి సహకారం అందిస్తున్న మరో ఇద్దరిని హొళెనరసీపుర ఠాణా పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఒక యువతితో హనీట్రాప్ చేయించి, ఆమెతో సన్నిహితంగా ఉన్న ఒక శ్రీమంతుడి ఫొటో తీయించి, బెదిరింపులకు పాల్పడ్డారు. నగదు ఇవ్వనని ఆ శ్రీమంతుడు మొండికేయడంతో అత్యాచారం కేసు నమోదు చేస్తారని బెదిరించి, నగదు గుంజారు. దానిలో వాటాను ఆ యువతికి ఇవ్వకపోవడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కార్యాచరణ చేపట్టి నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు విచారణను తీవ్రం చేశారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 9121167525

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 9945050116

(c) eenadu

ఎగువ భద్రా పథకానికి రూ.300 కోట్లు ఇవ్వండి

ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జిల్లా బాధ్యమంత్రి సుధాకర్, ఎమ్మెల్యేలు టి.రఘుమూర్తి, బి.జి. గోవిందప్ప

చెళ్ళకెర (చిత్రదుర్గ), న్యూస్‌టుడే: ఎగువ భద్రా సాగునీటి పథకం కింద చేపట్టిన 114 కి.మీ. చిత్రదుర్గం కాలువ పనులు అంతిమ దశకు చేరుకున్నాయని, కాలువలో ప్రయోగాత్మకంగా నదీ జలాలను సరవరా చేయడానికి అవసరమైన రూ.300 కోట్ల నిధులను విడుదల చేయాలని జిల్లా బాధ్యమంత్రి డి.సుధాకర్ కోరారు. బుధవారం చెళ్ళకెర ఎమ్మెల్యే టి.రఘుమూర్తి, హొసదుర్గ ఎమ్మెల్యే బి.జి. గోవిందప్పతో కలిసి రాష్ట్ర జలవనరుల శాఖ, ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్‌ను బెంగళూరులో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.21,167 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ పథకానికి ఇంత వరకు సుమారు రూ.11,409 కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేశారన్నారు. ఈ పథకం పూర్తి కావడానికి మరో రూ.10 వేల కోట్ల అవసరముందన్నారు. ఈ పథకం కింద చిత్రదుర్గ, తుమకూరు, చిక్కమగళూరు, దావణగెరె జిల్లాలో 367 చెరువులకు సాగునీరు నింపితే సుమారు 6 లక్షల ఎకరాల బీడు భూములకు సాగు నీరు అందుతుందని పేర్కొన్నారు.

నెల రోజుల్లో ఖాళీ స్థానాల భర్తీ

ప్రగతి సమీక్ష సమావేశంలో అధికారులకు సూచనలిస్తున్న మంత్రి రహీమ్‌ఖాన్

హొసపేటె, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను నెల రోజుల్లోగా భర్తీ చేస్తామని మున్సిపల్ శాఖ మంత్రి రహీమ్‌ఖాన్ వెల్లడించారు. బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన జిల్లా ప్రగతి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల్లో చాలా పోస్టులు ఖాళీగా ఉండటంతో పనులు వేగంగా జరగడంలేదు, ప్రజలకు ఉత్తమ సేవలందించేందుకు ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. హొసపేటె నగరసభలో మొత్తం 540 పోస్టులుండగా, 240 ఖాళీగా ఉన్నాయి. వాటిని కూడా వెంటనే భర్తీ చేస్తామని తెలిపారు. 15వ ఆర్థిక నిధుల కింద 6 తాలూకాల్లో 1,520 అభివృద్ధి పనులు చేపట్టారు. వాటిలో 1,386 పూర్తయ్యాయని వివరించారు. రాజీవ్ రోజ్‌గార్ అభివృద్ధి పనుల్లో వందశాతం ప్రగతి సాధించాలని ఆయన అధికారులను సూచించారు. వేసవి సమీపిస్తోంది. పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బంది కలగకుండా ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలన్నారు. నిరుపేదలను ఆదుకుంటున్న ఇందిరా క్యాంటీన్‌లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఎమ్మెల్యేలు గవియప్ప, డాక్టర్ శ్రీనివాస్, లతా మల్లికార్జున, జిల్లా పాలనాధికారి కవితా మన్నికేరి, హుడా అధ్యక్షుడు మొహ్మద్ ఇమామ్ నియాజి పాల్గొన్నారు.

ముగిసిన ఎన్జీవో క్రీడాపోటీలు

పరుగులో పోటీ పడుతున్న ఉద్యోగులు

బళ్లారి, న్యూస్‌టుడే: జిల్లా క్రీడామైదానంలో జిల్లా స్థాయి ఎన్జీవో క్రీడాపోటీలు బుధవారం సాయంత్రం ముగిశాయి. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు సంఘం బాధ్య అధ్యక్షుడు డా.సదానంద నెల్లుట్ల ప్రమాణ పత్రాలు, స్మరణికలను అందజేశారు. ఈ సందర్భంగా నిత్యం విధి నిర్వహణలో తీరికలేకుండా ఉండే ఉద్యోగులు రెండు రోజులపాటు ఉత్సాహంగా క్రీడాపోటీలు, సాంస్కృతిక పోటీల్లో పాల్గొన్నారన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో గెలుపొంది బళ్లారికి కీర్తిప్రతిష్ఠలు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి తిప్పారెడ్డి, రాష్ట్ర పరిషత్ సభ్యుడు సురేశ్‌కుమార్, కోశాధికారి హనుమంతరాయ, సభ్యులు రామకృష్ణ, శరణబసవ, రాజశేఖర్, జె.ఎస్. ఆంజనేయులు, బాష్యరెడ్డి, హరికృష్ణ, అనిల్, మాజీ అధ్యక్షుడు మల్లేశ్, శివకుమార్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

విజేతలు: రెండు రోజులపాటు జరిగిన క్రీడాపోటీల్లో 100 మీటర్ల పరుగు పందెంలో నిజాముద్దీన్ (ప్రథమ), శివరాజ్ (ద్వితీయ), ఆనంద్‌కుమార్ (తృతీయ) 200 మీటర్ల పరుగులో అంజిబాబు (ప్రథమ), గిరీశ్ (ద్వితీయ), పాల్కాక్ష (తృతీయ), 400 మీటర్ల పరుగులో శివపుత్ర (ప్రథమ), పరుశురామ్ (ద్వితీయ), శివ (తృతీయ), 100 మీటర్ల పరుగులో సురేశ్‌రెడ్డి (ప్రథమ), మౌనేశ్ (ద్వితీయ), శివరాజ్ (తృతీయ) 1500 మీటర్ల పరుగులో శివపుత్ర (ప్రథమ) బాబర్‌బాషా (ద్వితీయ), వెంకారెడ్డి (తృతీయ) పతకాలు పొందారు. హైజంప్‌లో సిద్ధారూఢ (ప్రథమ), శ్రీశైల (ద్వితీయ), చంద్రశేఖర్ (తృతీయ), జావెలిన్ త్రోలో చంద్రశేఖర్ (ప్రథమ), పీరసాబ్ (ద్వితీయ), రమేష్ (తృతీయ), డిస్కస్ త్రోలో అణ్ణ సోలప్ప (ప్రథమ), రవినాయక్ (ద్వితీయ), ఆనంద (తృతీయ), షాట్‌పుట్‌లో స్వామి (ప్రథమ), సిద్ధారూఢ (ద్వితీయ) నిజాముద్దీన్ (తృతీయ) బహుమతులు అందుకున్నారు.

హర్డిల్స్‌లో పోటీ

విజేతగా నిలిచిన క్రీడాకారులకు ప్రమాణ పత్రాలు, జ్ఞాపికను అందజేస్తున్న అధ్యక్షుడు, మాజీ అధ్యక్షుడు, సభ్యులు

ఘనంగా రాఘవేంద్రస్వామి సప్తాహ ఉత్సవాలు

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: మంత్రాలయం గురురాఘవేంద్రుల సప్తాహ ఉత్సవాలు బుధవారం సత్యనారాయణ పేట రాఘవేంద్రస్వామి మఠంలో వైభవంగా ప్రారంభించారు. స్వామివారి బృందావనానికి పంచామృతాభిషేకం, అష్టోత్తరార్చనలు, అలంకార సేవలు చేశారు. పుష్పాలు, వస్త్రాలతో స్వామిని అలంకరించారు. పండితులు రామచంద్ర ఆచార్యులు ప్రవచనం చేశారు. భక్తులందరికీ మఠం ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు. తేరువీధి రామవరాయడికి మఠం, రాయల్ కాలనీ సంజీవరాయ మఠం, యంత్రోద్ధారక మఠంలో సప్తాహ ఉత్సవాలు ఆరంభించారు. కార్యక్రమంలో వ్యవస్థాపకుడు ప్రసన్నాచార్, కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ పేట రాఘవరాయుడికి విశేష అలంకరణ

బాల్య వివాహాలతో అనారోగ్యకర సమాజం

మాట్లాడుతున్న వైద్యురాలు ప్రభావతి, పాల్గొన్న విద్యార్థినులు

సిరుగుప్ప, న్యూస్‌టుడే: బాల్య వివాహాలతో అనారోగ్యకర జీవనం, అనారోగ్యకర సమాజం ఏర్పడుతుందని స్త్రీ వ్యాధుల వైద్యురాలు ప్రభావతి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం కన్నడ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో డా.గంగమ్మ దత్తి ఉపన్యాస కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలు- భవిష్యత్తు అనే కార్యక్రమంపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు బాలికలకు వివాహాలు చేస్తే శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. ఈ వయస్సులో గర్భం దాల్చితే తల్లీ, బిడ్డలు అనారోగ్యం పాలవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యురాలు గంగమ్మ మాట్లాడుతూ ఇలాంటి అవగాహన కార్యక్రమాలను బాలికల్లో ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసం నింపేందుకు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థినులు విషయాలు గురించి తెలుసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కసాప అధ్యక్షుడు డా.మధుసూదన కారిగనూరు, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్ యాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'హొరనాడు' అన్నపూర్ణేశ్వరి వేడుకలకు వేళాయె

అన్నపూర్ణేశ్వరి అమ్మవారు

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : సుందర ప్రకృతి ధామం.. పశ్చిమ కనుమల్లో అగస్త్య మహర్షి ప్రతిష్ఠించిన అన్నపూర్ణేశ్వరి మాత.. నేడు భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. చిక్కమగళూరు జిల్లా కలస తాలూకా హరనాడులో వెలసిన ఈ మాత 'హొరనాడు అన్నపూర్ణేశ్వరి'గా విఖ్యాతి చెందడం ప్రస్తావనార్హం. ఈ అమ్మవారి మహా రథోత్సవ ప్రత్యేక పూజలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు వేడుకలు కొనసాగిస్తామని నిర్వాహకులు ప్రకటించారు. తొలిగా మహాగణపతి హోమం భక్తి ప్రపత్తులతో చేపట్టారు. 19న ఉదయకాల పూజలు, ధ్వజారోహణ, పుష్ప పల్లకీ సేవలుంటాయి. 20న బ్రహ్మ రథోత్సవం, మహారథోత్సవాలు వరుసగా నిర్వహిస్తారు. 21న కుంకుమోత్సవం, ప్రత్యేక అర్చనలు, 22న సంప్రోక్షణలతో వేడుకలను ముగిస్తామని ఆలయ ధర్మాధికారి జి.భీమేశ్వర జోషి వివరించారు. వేడుకలకు విచ్చేసే భక్తులకు అవసరమైన వసతులు కల్పిస్తామని చెప్పారు.

రాచనగరిలో గంజాయి ఘాటు

మైసూరు: రాచనగరిలో మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న ఆరోపణలపై ఆన్ ప్రమోద్ (27), ఎం. వికాస్ (23) అనే యువకులను మేటగళ్లి ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. వీరిద్దరూ బెంగళూరులోని నందిని లేఅవుట్ నివాసులు. వీరి నుంచి రూ.5.10 లక్షల విలువైన ఎండీఎంఏ, రూ.1.25 లక్షల గంజాయి జప్తు చేసుకున్నారు. బెంగళూరు నుంచి మైసూరుకు మాదక ద్రవ్యాలతో వచ్చి, యువతకు వాటిని విక్రయించుకుని సొమ్ము చేసుకుని వెళ్లేవారని సీసీబీ ఏసీపీ మహ్మద్ షరీఫ్ తెలిపారు. నిందితుల నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు విచారణను తీవ్రం చేశారు.

రంకెలేసిన వీర కంబళ

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : తుళు, కన్నడ భాషల్లో తెరకెక్కించిన 'వీర కంబళ' చిత్రాన్ని ఈ నెల 27న విడుదల చేస్తున్నామని సీనియరు దర్శకుడు రాజేంద్రసింగ్ బాబు ప్రకటించారు. ధర్మస్థల ధర్మాధికారి వీరేంద్ర హెగడే ప్రత్యేక పాత్రలో నటించిన ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్, టీజర్‌లను సంగీత దర్శకుడు హంసలేఖ, నటీ నటులు, సాంకేతిక వర్గం ప్రతినిధులతో కలిసి బుధవారం ఇక్కడ విడుదల చేసి మాట్లాడారు. తుళునాడు ప్రజల జీవన విధానాలు, ఆచారాలు, చరిత్ర, వీరత్వాన్ని ఇతివృత్తంగా తీసుకుని తెరకెక్కించామని తెలిపారు. కంబళకు అనుబంధంగా, ముంబయిలోని అండర్‌వరల్డ్‌కు సంబంధించిన అంశాలను ఈ చిత్రంలో పొందుపరచామని వివరించారు. బాబాస్ బ్లెస్సింగ్స్ ఫిలిమ్స్ బ్యానర్‌పై డాక్టర్ వినిత విజయ్ కుమార్‌రెడ్డి, అరుణ్ రై తొడార్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆదిత్య, ప్రకాశ్ రాజ్, రవిశంకర్, రాధికా నారాయణ్ ప్రధాన పాత్రల్లో నటించారు. తుళు నాటకరంగంలో ప్రముఖ దర్శకుడు విజయ్ కుమార్ కోడియాల్‌బైల్, చరిత్రకారుడు గుణపాల్ కడంబ, సంగీత దర్శకుడు మణికాంత్ కద్రి, సాంకేతిక నిపుణులు శ్రీనివాస్, ఆర్ గిరి, చంద్రశేఖర్ సువర్ణ ముల్కి, భాషా తదితరులు ట్రైలర్ విడుదల కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాటలు, టీజర్ విడుదల కార్యక్రమంలో దర్శకుడు రాజేంద్రసింగ్ బాబు, సంగీత దర్శకుడు హంసలేఖ, నటీనటులు, సాంకేతిక వర్గం

వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, కార్పొరేటర్లు, కళాశాల అభివృద్ధి సమితి సభ్యులు

ప్రతిభావంత విద్యార్థులకు పురస్కారాల ప్రదానం

సామాజిక మాధ్యమాలతో జాగ్రత్త

బళ్లారి, న్యూస్‌టుడే: విద్యార్థులు, యువత సామాజిక మాధ్యమాల వ్యామోహంలో పడకుండా చదువుపై దృష్టి పెట్టి, తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి సూచించారు. బుధవారం ప్రభుత్వ బాలికల పదవీ పూర్వ కళాశాల వార్షికోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. సామాజిక మాధ్యమాల్లో మంచి, చెడు రెండు ఉంటాయి. జ్ఞానాన్ని సంపాదించడానికి దాన్ని ఉపయోగించుకోండి. చదువుకుని ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని చేరుకునే ఈ వయస్సులో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మార్గదర్శనంలో ముందుకు వెళ్లాలన్నారు. ఉన్నత చదువులకు ఇతర జిల్లాలకు వెళ్లినప్పుడు మిమ్మల్ని చూసి అక్కడి విద్యార్థులు గర్వపడాలి. నేను మీ అందరి ఆశీర్వాదంతో ఎమ్మెల్యే అయ్యాను. నగరాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. బళ్లారి నగరంలో తాగునీటి ఎద్దడి నివారణకు రూ.1200 కోట్లు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. నగరంలో ప్రాథమిక మౌలిక సౌకర్యాలు కల్పించడానికి శ్రమిస్తున్నట్లు వివరించారు. నగరంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల అభివృద్ధికి తాను పూర్తిగా కట్టుబడి ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. కళాశాలలో రూ.1.24 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఆర్వో తాగునీటి కేంద్రాన్ని ప్రారంభించారు. కార్పొరేటర్ రామాంజనేయులు, మించి శ్రీనివాస్, జబ్బర్, కుబేర, ప్రధాన ఆచార్యులు సులేఖ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టిననాడే మృత్యువాత

బెంగళూరు (మహాలక్ష్మి లేఅవుట్), న్యూస్‌టుడే : స్నేహితులతో కలిసి పుట్టిన రోజు వేడుకలు ఆచరించుకుని ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో పవన్‌కుమార్ (24) అనే విద్యార్థి కన్నుమూశాడు. తోటదగుడ్డదహళ్లికి చెందిన బాధితుడు ఇంజినీరింగ్ చదువుకుంటూనే పార్ట్‌టైమ్ ఉద్యోగాన్ని చేసేవాడు. తన పుట్టిన రోజు వేడుకలను స్నేహితులతో కలిసి మంగళవారం మధ్యాహ్నం నిర్వహించుకున్నాడు. సాయంత్రం 5.30కు బైకుపై కాకోళు డెయిరీ ఫారం నుంచి ఐఐహెచ్‌ఆర్ వైపు వస్తుండగా, వేగంగా వచ్చిన గూడ్సు వాహనం ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. ప్రమాద తీవ్రతకు పవన్ కుమార్ అక్కడికక్కడే మరణించాడు. ప్రమాదానికి కారకుడైన డ్రైవరు వాహనాన్ని అక్కడే వదిలి పరారయ్యాడు. చిక్కబాణవార ట్రాఫిక్ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

హిండలగలో తనిఖీలు

బెళగావి, న్యూస్‌టుడే : బెళగావిలోని హిండలగ జిల్లా కారాగారంలో 5జీ జామర్ ఉన్నప్పటికీ మొబైల్ కాల్స్ వస్తున్నాయని గుర్తించామని కారాగారాల శాఖ డీజీపీ అలోక్ కుమార్ తెలిపారు. దీనికి సంబంధించి సాంకేతిక నిపుణులతో కలిసి హిండలగ కారాగారంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నూరేళ్ల చరిత్ర ఉన్న ఈ కారాగారంలోకి కొందరు నిందితులు బయట నుంచి మాదక ద్రవ్యాలు, సిమ్ కార్డులను విసిరి వేస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఖైదీలకు కౌశల్యాన్ని పెంచే పనుల్లోనూ శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

హక్కులను కాపాడాలని వాల్మీకుల ధర్నా

శాసనసభ్యుడు నాగరాజు ఇంటి ముందు ధర్నా చేస్తున్న వాల్మీకి సంఘం ప్రతినిధులు, సభ్యులు

సిరుగుప్ప, న్యూస్‌టుడే: వాల్మీకి సమాజం వారి హక్కులను కాపాడి, సౌకర్యాలు కల్పించాలని శాసనసభ్యుడు బి.ఎం. నాగరాజు ఇంటి ఎదుట బుధవారం నిర్వహించారు. ఉత్తర కర్ణాటక వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో సంఘం ప్రతినిధి మారెప్ప నాయక్ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా తమ సమాజానికి దక్కాల్సిన హక్కులు, సౌకర్యాలను ఇతర సమాజం వారికి ఇవ్వడం తగదన్నారు. వారికి వాల్మీకులుగా ప్రమాణపత్రాలు అందిస్తున్నారు. తమ సమాజం వారిపై దౌర్జన్యాలు జరుగుతున్నాయి, అణచివేతకు గురిచేస్తున్నారని వాపోయారు. ప్రతినిధులు శ్రవణ్‌కుమార్, నరేంద్రసింహ, నరసింహనాయక్, ధరప్ప నాయక్, హొన్నప్ప, మణికంఠ పాల్గొన్నారు.

లాభాల పట్టుగొమ్మ!

సిద్ధరామయ్యకు చెక్కు అందిస్తున్న మంత్రి వెంకటేశ్, మండలి అధ్యక్షురాలు ఖానీజ్‌ఫాతిమా

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కర్ణాటక పట్టు పరిశ్రమ అభివృద్ధి మండలి లాభాల బాటలో పయనించడం ఆశావహ పరిణామమని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రశంసించారు. రానున్న బడ్జెట్లో సంస్థ ఉన్నతికి అవసరమైన నిర్ణయాలు తీసుకోవడానికి ప్రయత్నిస్తామని భరోసా ఇచ్చారు. సంస్థ లాభాల్లో రూ. 30.34 కోట్ల డివిడెంట్‌తో కూడిన చెక్కును బుధవారం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అందుకున్నారు. ఆ లాభాల్లో రూ.2 కోట్లు సీఎం సహాయ నిధికి ప్రత్యేకించారు. ఈసందర్భంగా మంత్రి వెంకటేశ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శాలిని రజనీశ్, పట్టు పరిశ్రమ అభివృద్ధి మండలి అధ్యక్షురాలు ఖానీజ్‌ఫాతీమా తదితరులు హాజరయ్యారు.

ప్రతిభావంత విద్యార్థులకు సత్కారం

బళ్లారి, న్యూస్‌టుడే: 2026 జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తొలి విడతలో మంచి పర్సంటైల్ సాధించిన విద్యార్థులను బళ్లారి న్యూ శ్రీ చైతన్య పదవీ పూర్వ కళాశాల అధ్యక్షుడు పయ్యావుల విష్ణు, సతీమణి బుధవారం అభినందించారు. అత్యధిక పర్సంటైల్ సాధించి కళాశాల టాపర్‌గా నిలిచిన విద్యార్థి రోహిత్‌కుమార్‌కు మిఠాయి తినిపించి సన్మానించారు.

అత్యధిక పర్సంటైల్ సాధించిన విద్యార్థులకు సత్కారం

EENADU
e Classifieds
JOBS

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం జీ:18-20K ✆ 96404 68899, 96402 58899

ఎన్ఎండీసీ కంపెనీపై కేసు నమోదు

బళ్లారి: జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థకు చెందిన కుమారస్వామి ఇనుప గనులు (నం: 1111) నుంచి ముడి ఇనుప ఖనిజాన్ని అక్రమంగా రవాణా చేసిన కేసులో అటవీశాఖ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ఎన్ఎండీసీ కంపెనీని మొదటి నిందితుడిగా, ఆ కంపెనీ చీఫ్ ఇంజినీర్‌ను రెండో నిందితుడిగా చేర్చారు. అదనంగా ఖనిజాన్ని అక్రమంగా సేకరించిన గని ఇంజినీర్, లారీ చోదకుడు, కర్మాగారాలు, ఆంధ్రప్రదేశ్‌లోని నేమకల్ సాయి బాలాజీ స్పాంజ్, ఐరన్ ఇండియా ప్రై.లి, బళ్లారి నోబుల్ ఇస్పాత్ కంపెనీలను ఆరోపితులుగా జాబితాలో చేర్చారు. జనవరి 16న వెలుగులోకి వచ్చిన ఈ కేసుకు సంబంధించి పోలీసు శాఖ ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. గనులు, ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ) చట్టం, బీఎన్ఎస్‌లోని సెక్షన్లను మాత్రమే ఇందులో చేర్చారు. అటవీ శాఖ తన ఎఫ్ఐఆర్‌లో ఎన్ఎండీసీ 1111 గని అటవీశాఖ ప్రాంతం, ఖనిజాన్ని అక్రమంగా రవాణా చేయడం ద్వారా కర్ణాటక అటవీ నియమాల ఉల్లంఘన అని పేర్కొంది.

110 కిలోల శ్రీగంధం చెక్కలు స్వాధీనం

ఇద్దరు అరెస్టు, ఏడుగురిపై కేసు నమోదు

సండూరు(బళ్లారి), న్యూస్‌టుడే: సండూరు తాలూకాలోని అటవీ ప్రాంతంలో అక్రమంగా శ్రీగంధం చెక్కలను తరలిస్తున్న ఆరోపితులను తాలూకా అటవీశాఖాధికారులు అదుపులోకి తీసుకుని, వారి నుంచి 110 కిలోల శ్రీగంధం చెక్కలను స్వాధీనం చేసుకున్నారు. డీఎఫ్‌వో డా. బసవరాజు తెలిపిన వివరాల మేరకు.. సండూరు తాలూకా అటవీ ప్రాంతం తోరణగల్లు సమీపంలోని కూడ్లిగి వరకు విస్తరించింది. ఇక్కడ శ్రీగంధం చెట్లు ఎక్కువగా ఉన్నాయి. సండూరు అటవీ ప్రాంతం నుంచి వాహనంలో అక్రమంగా శ్రీగంధం చెక్కలు తరలిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. తాలూకా అటవీశాఖాధికారులు శరణ్‌కుమార్, మంజునాథ్, సయ్యద్ దాదా ఖలందర్, తిప్పేస్వామి, మహేశ్, హొన్నూరస్వామి, శ్రీధర్, రాఘవేంద్ర తదితర సిబ్బంది కాపుగాసి సుశీల్‌నగర్ వద్ద వాహనం పరిశీలించారన్నారు. వాహనంలో శ్రీగంధం చెక్కలు ఉన్నట్లు గుర్తించి లోకేష్ నాయక్, కిరణ్‌కుమార్ అనే వ్యక్తులను అరెస్టు చేసి విచారణ చేయగా శ్రీగంధం చెక్కలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీసత్యసాయి జిల్లా రొళ్ల గ్రామంలో ఉన్న పరిశ్రమకు తరలిస్తున్నట్లు తెలిసిందన్నారు. 110 కిలోల చెక్కలతో పాటు, అటవీశాఖాధికారులు రొళ్ల గ్రామంలోని పరిశ్రమలో పరిశీలించగా మరో 179 కిలోల శ్రీగంధం చెక్కలున్నట్లు గుర్తించి వాటినీ స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను న్యాయమూర్తి ముందు హాజరుపరిచి కేంద్ర కారాగారానికి తరలించారు. మొత్తం ఏడుగురుపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

శ్రీగంధం చెక్కలు స్వాధీనం చేసుకున్న అటవీశాఖాధికారులు, సిబ్బంది

రొళ్ల గ్రామంలోని పరిశ్రమంలో నిల్వ చేసిన శ్రీగంధం చెక్కలు స్వాధీనం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.
బళ్ళారి : 9121167525
బెంగుళూరు : 9121167527
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

బళ్లారిలో మంగళముఖి, ప్రేమికుడి ఆత్మహత్య

బ్రూస్‌పేటె పోలీసుల దర్యాప్తు

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మంగళముఖి సుహాసిని, శేఖర్ (పాతచిత్రాలు)

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారిలో మంగళముఖి, ఆమె ప్రియుడు అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. ఆత్మహత్య చేసుకున్న వారిలో సుహాసిని (29) అలియాస్ దేవరాజ్, ప్రేమికుడు శేఖర్ అలియాస్ మణి (30)గా గుర్తించారు. బుధవారం బ్రూస్‌పేటె పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బళ్లారి తాలూకా చాగనూరు గ్రామానికి చెందిన మంగళముఖి సుహాసిని ఆరేళ్లుగా విజయనగర జిల్లా హొసపేటె తాలూకా మలపనగుడి గ్రామానికి చెందిన శేఖర్‌తో స్నేహంగా ఉంటోంది. ఇద్దరూ హొసపేటెలో సహజీవనం సాగిస్తున్నారు. సుహాసిని భిక్షాటన చేసి వచ్చిన సొమ్ముతో శేఖర్‌కు ఆటో కొనుగోలు చేసి ఇచ్చింది. ప్రతి మంగళవారం ఇద్దరూ బళ్లారిలో కనక దుర్గమ్మను దర్శనం చేసుకునేవారు. హంపీ ఉత్సవాల సందర్భంగా అక్కడ భిక్షాటన చేసి సోమవారం మధ్యాహ్నం బళ్లారికి చేరుకున్నారు. కొన్ని రోజులుగా డబ్బు పంపకాల విషయంలో వారి మధ్య చిన్నపాటి ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శేఖర్‌కు కుటుంబ సభ్యులు పెళ్లిచూపులు చూస్తున్నారు. ప్రతి వారం మాదిరిగా మంగళవారం బళ్లారి కనక దుర్గమ్మ ఆలయానికి వెళ్లి ఇద్దరూ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఇందిరానగర సమీపంలోని ఎం.కె.నగరలో అద్దెకు తీసుకున్న ఇంటికి వెళ్లారు. అక్కడా ఇద్దరి మధ్య మరోసారి ఘర్షణ జరిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో శేఖర్ కిటికీకి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోగా సుహాసిని అక్కడే కింద పడుకున్న స్థితిలో మృతిచెందినట్లు పోలీసులు గుర్తించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. బ్రూస్‌పేటె పోలీసులు, కుటుంబ సభ్యులను వెంటబెట్టుకుని అక్కడికి చేరుకుని మృతదేహాలను పరిశీలించి బళ్లారి వైద్య కళాశాల, పరిశోధన కేంద్రానికి తరలించారు. మొదట సుహాసినిని చీరతో గొంతు బిగించి హత్య చేసిన శేఖర్ తర్వాత తాను కూడా కిటికీకి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బ్రూస్‌పేటె పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

(c) eenadu

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

సమ్మేళన అధ్యక్షుడికి ఆహ్వానం

సమ్మేళన అధ్యక్షుడు డాక్టర్ చెన్నబసప్ప చిలకరాగిని సత్కరించిన మంత్రి తంగడగి, కసాప నాయకులు

కారటగి: కారటగి తాలూకా మూడో కన్నడ సాహిత్య సమ్మేళన అధ్యక్షుడు డాక్టర్ చెన్నబసప్ప చిలకరాగిని ఆయన నివాసంలో స్థానిక ఎమ్మెల్యే, జిల్లా బాధ్య మంత్రి శివరాజ్ తంగడగి, కన్నడ సాహిత్య పరిషత్ నాయకులు మంగళవారం రాత్రి సత్కరించి సమ్మేళనానికి ఆహ్వానించారు. మంత్రి శివరాజ్ తంగడగి మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజం ఆంగ్ల భాష మోజులో మాతృభాష కన్నడను విస్మరిస్తోందన్నారు. సమ్మేళన అధ్యక్షుడు డాక్టర్ చెన్నబసప్ప ,కసాప జిల్లా అధ్యక్షుడు శరణేగౌడ మాలిపాటిల్, తాలూకా అధ్యక్షుడు శరణప్ప కోట్యాళ, రమేశ్ కులకర్ణి, మంజునాథ చికేనకొప్ప, చెన్నబసప్ప వక్కళద పాల్గొన్నారు.

25న జిల్లా స్థాయి దిశ కమిటీ సమావేశం

బళ్లారి, న్యూస్‌టుడే: జిల్లా అభివృద్ధి సమన్వయ స్టీరింగ్ కమిటీ 'దిశ' కమిటీ మూడో త్రైమాసిక సమావేశం ఫిబ్రవరి 25న ఉదయం 11 గంటలకు జిల్లా పంచాయతీ నజీర్ సభాభవనంలో నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో మహమ్మద్ హ్యారీస్ సుమైర్ తెలిపారు. దిశ కమిటీ సమావేశానికి లోక్‌సభ సభ్యుడు ఇ.తుకారామ్ అధ్యక్షత వహిస్తారు. సంబంధిత శాఖాధికారులు పూర్తి సమాచారంతో నిర్దిష్ట సమయంలోపు హాజరు కావాలని కోరారు. దిశ కమిటీ సమావేశం ముందు జిల్లా పంచాయతీ నజీర్ సభాభవనంలో కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులపై స్థానిక ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

బెలూన్‌లను తొలగించండి సారూ..

కంప్లి, న్యూసటుడే: కంప్లి ఉత్సవ సందర్భంగా ప్రచారం కోసం ఏర్పాటు చేసిన గ్యాస్ బెలూన్‌లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. పట్టణంలోని మధ్య మసీదు, సోమప్ప చెరువు ఆవరణలో గ్యాస్ బెలూన్‌లు ఏర్పాటు చేశారు. వాటిలో గ్యాస్ తగ్గడం వల్ల బెలూన్‌లు గాలికి అనుగుణంగా ఊగుతున్నాయి. బెలూన్‌లు కరెంటు తీగలకు తగిలితే ప్రమాదం వాటిల్లుతుంది. ఉత్సవం ముగిసి ఆరు రోజులైంది. బెలూన్‌లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

కంప్లిలో ఏర్పాటు చేసిన బెలూన్

కొబ్బరి నీరా..రాబడి భళిరా!

● అప్పాజీ ఆలోచనలు అద్భుతం ● 25 ఎకరాల్లో పంట సాగు

బళ్లారి, న్యూస్‌టుడే: ఒక్క ఆలోచన అప్పాజీ జీవితాన్ని మార్చి వేసింది. వ్యవసాయం అంటే పాత విధానాలే కాదు.. ఆలోచన, శాస్త్రీయ పద్ధతిలో సాగు చేస్తే లాభాలు వస్తాయని ఎస్.సి.వీరభద్రప్ప (అప్పాజీ) నిరూపించారు. చిత్రదుర్గం జిల్లా బి.జి.కెరె గ్రామానికి చెందిన వీరభద్రప్పను అందరూ అప్పాజీ (84) అని పిలుస్తారు. ఉన్నత చదువులు చదివారు. వ్యవసాయంపై మక్కువతో బళ్లారి-బెంగళూరు ప్రధాన రహదారి పక్కనే 92 ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేశారు. ఈ తోటల్లో ప్రధానంగా 25 ఎకరాల్లో కొబ్బరి చెట్లను సాగు చేశారు. మొదటి కొబ్బరి కాయలకు నూలి తెగులతో పైభాగంలో చీడ పట్టి మార్కెట్‌లో డిమాండ్ తగ్గింది. మార్కెట్‌లో డిమాండ్ తగ్గిందని వెనకడుగు వేయలేదు. కొబ్బరి చెట్లను నరికివేయలేదు. వినూత్న ఆలోచనతో కేరళలో నీరా తీయడంపై ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. కొబ్బరి గెల నుంచి నీరా తీయడం ప్రారంభించారు. ఒక్కొక్క కొబ్బరి చెట్టు నుంచి రోజుకు సరాసరి రెండు లీటర్ల నీరా తీస్తున్నారు. మార్కెట్‌కు అనుగుణంగా 60 చెట్ల నుంచి నీరా తీస్తున్నారు.

కొబ్బరి చెట్టు నుంచి తీసిన నీరా కొబ్బరి చెట్టుపై కట్టిన థర్మాకోల్ పెట్టె

సాంకేతికత వినియోగం

కొబ్బరి చెట్టు నుంచి వచ్చే నీరాకు కొద్దిగా ఎండ తగిలితే కల్లు అవుతుంది. 24 గంటల పాటు నీరాగానే ఉండేలా సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. ప్రత్యేకంగా తయారు చేసిన గొట్టం చుట్టూ థర్మాకోల్ వేసి దానికి ప్లాస్టిక్ సంచి ఉండే విధంగా పెట్టెను తయారు చేశారు. ఇందులో మంచు ముక్కలు వేసి మధ్యలో ప్లాస్టిక్ కవర్ పెట్టి అందులోకి నీరా వచ్చే విధంగా సిద్ధం చేశారు. ఉదయం సాయంత్రం రెండు సార్లు నీరా తీసి ఫ్రిజ్‌లో నిల్వ చేస్తున్నారు. 200 మిల్లీలీటర్ల పరిమాణంలో గల నీరాను రూ.50లకు విక్రయిస్తున్నారు. లీటరు రూ.250లకు విక్రయిస్తున్నారు. తీసిన నీరా 30 నుంచి 40 రోజుల వరకు నిల్వ చేస్తారు. నెల రోజుల్లో విక్రయించి మిగిలిన నీరాతో శాస్త్రీయ పద్ధతిలో బెల్లం తయారు చేసి కిలో రూ.800లకు విక్రయిస్తున్నారు. ఎకరాలో ఎనిమిది నెలల్లో రూ.4.40లక్షలు, మిగిలిన నాలుగు నెలల్లో కొబ్బరి కాయలను తీసి ఒక్కొక్క చెట్టు నుంచి రూ.800 నుంచి రూ.1000 సంపాదిస్తున్నారు.

సీసాలో పోసిన నీరా

అప్పాజీ సాగుచేసిన కొబ్బరి తోట

కల్పామృతంలో పోషకాలు మెండు

కొబ్బరి చెట్టుకు కల్పవృక్షం అంటారు. ఈ వృక్షం నుంచి నీరా రావడంతో దీనికి కల్పామృతం అని పేరు పెట్టారు. పీచు, గ్లూకోజ్ ప్రకృతి సిద్ధమైన ఆరోగ్య పోషకాలు ఉంటున్నాయి. గ్యాస్, టి.బి.వ్యాధులతో బాధపడేవారు నిత్యం నీరా తీసుకుంటే ఉపశమనం కలుగుతుంది. ఆరోగ్యకరమైన ఉత్పత్తులు సమాజానికి అందిస్తున్నందుకు తృప్తిగా ఉంది.

-డా.వీరభద్రప్ప, ఆదర్శ రైతు, బీజీ కెరె

రిమ్స్ అధికారులపై చర్యలకు ఒత్తిడి

భాస్కర్‌బాబు

రాయచూరు, న్యూస్‌టుడే: మురుగు నీటి కాల్వలకు సంబంధించిన పనులను యంత్రంతో కాకుండా మనుషులతో చేయించిన రిమ్స్ అధికారులపై చర్యలు తీసుకోవాలని జాతీయ సఫాయి కర్మచారి సముదాయం ప్రముఖుడు భాస్కర్‌బాబు ఒత్తిడి తెచ్చారు. ఆయన బుధవారం పత్రికా భవన్‌లో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఆధారాలను జిల్లా యంత్రాంగానికి అందచేసినా ఇంతవరకూ ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. గురువారం రాయచూరుకు విచ్చేస్తున్న సఫాయి కర్మచారి కమిషన్ అధ్యక్షుడు రఘును కలిసి వివరిస్తామన్నారు. బహుజన దళిత సంఘర్షణ సమితి ముఖ్యుడు ప్రసాద్ భండారి మాట్లాడుతూ మనుషులతో స్వచ్ఛతా పనులను చేయించకుండా 2013లో సర్వోన్నత న్యాయస్థానం నిషేధించినట్లు వెల్లడించారు. న్యాయాలయం ఆదేశాలను ఉల్లంఘించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఇది వరకే కర్మచారి కమిషన్ కార్యాలయానికి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

కలబురగి బెంచ్‌లోనే అప్పీళ్ల స్వీకరణ

బళ్లారి, న్యూస్‌టుడే: కల్యాణ కర్ణాటక ప్రాంతంలోని ఏడు జిల్లాలపై సమాచార హక్కు చట్టం-2005లోని సెక్షన్19 (3) కింద అధికార పరిధి కలిగిన కర్ణాటక సమాచార కమిషన్‌లోని కలబురగి బెంచ్‌లో దాఖలు చేసిన రెండో అప్పీల్ పిటిషన్లను ఇకపై కలబురగి బెంచ్‌లోనే స్వీకరించనున్నట్లు కమిషన్ తెలిపింది. గతంలో కలబురగి, బీదర్, రాయచూరు, బళ్లారి, కొప్పళ, విజయనగర, యాదగిరి జిల్లాల అధికార పరిధిలో దాఖలు చేసిన రెండో అప్పీళ్లను కర్ణాటక సమాచార కమిషన్ బెంగళూరులో దాఖలు చేయాల్సి ఉంది. ప్రజలకు సౌకర్యాలు కల్పించడానికి, కేసును త్వరగా పరిష్కరించడానికి కల్యాణ కర్ణాటకలోని ఏడు జిల్లాల్లో అధికార పరిధి కిందకు వచ్చే దరఖాస్తులు సమాచార హక్కు చట్టం 2005లోని సెక్షన్ 19(3) కింద తమ రెండో అప్పీళ్లను కర్ణాటక సమాచార కమిషన్ కలబురగి బెంచ్‌లో దాఖలు చేయాలని కోరారు.

సహాయధనం కోసం దరఖాస్తుల ఆహ్వానం

బళ్లారి, న్యూస్‌టుడే: జిల్లా డి.దేవరాజ అరసు వెనుకబడిన వర్గాల అభివృద్ధి మండలి 2025-26 ఏడాది ఆహార వాహిని పథకం ఆన్‌లైన్ సేవాసింధు సాంకేతికత ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆహార వాహిని పథకం కింద రూ.3 లక్షల వరకు సహాయధనం అందజేస్తున్నట్లు సంబంధిత అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను మార్చి 3వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో పంపాలన్నారు.

రేపు ముందస్తు సమావేశం

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, కన్నడ సంస్కృతి శాఖ సంయుక్తంగా మార్చి 1న రేణకాచార్య జయంతి, మార్చి 3న యోగినారాయణ యతీంద్ర జయంతుల నిర్వహణపై ఈ నెల 20న సాయంత్రం 4.30 గంటలకు జిల్లా పాలనాధికారి కార్యాలయంలో ముందస్తు సమావేశం నిర్వహిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఏడీసీ మహమ్మద్ ఝుబేర అధ్యక్షత వహిస్తారని, సమాచారంతో హాజరు కావాలని వారు పేర్కొన్నారు.

బాలుడు అదృశ్యంపై ఫిర్యాదు


ప్రవీణ్‌కుమార్ (పాతచిత్రం)

బళ్లారి: బళ్లారి నగరం గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బి.ప్రవీణ్‌కుమార్ (16) అనే బాలుడు అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలుడు తిరిగి రాలేదు. పలు చోట్ల గాలించిన ఆచూకీ తెలియరాలేదు. వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

నేడు జిల్లా విపత్తు నిర్వహణ సమావేశం

బళ్లారి, న్యూస్‌టుడే: వేసవిలో వేడికి అగ్నిప్రమాదాలు, ఇతర విపత్తులను ఎదుర్కొనేందుకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంపై ఈ నెల 19న మధ్యాహ్నం 3.30 గంటలకు జిల్లా పాలనాధికారి కార్యాలయంలో ముందస్తు సమావేశం నిర్వహిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జిల్లా పాలనాధికారి కె.నాగేంద్రప్రసాద్ అధ్యక్షత వహిస్తారు. సబంధిత శాఖాధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

నీటి ఎద్దడి రాకుండా పటిష్ఠ చర్యలు

అధికారులకు సూచనలిస్తున్న మంత్రి బోసురాజు

మాన్వి,న్యూస్‌టుడే: మాన్వి, సిరివార ఉభయ తాలూకాల్లో ఎక్కడా నీటి సమస్య తలెత్తటానికి వీలు లేదని, ఇబ్బందులుంటే ఇప్పుడే పరిష్కరించుకోవాలని రాష్ట్ర చిన్ననీటిపారుదల, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి ఎన్.ఎస్.బోసురాజు అధికారులకు ఆదేశాలిచ్చారు. బుధవారం సిరివార, మాన్వి తాలూకా అధికారులతో నిర్వహించిన అత్యవసర సమావేశాల్లో ఆయన ఈ మేరకు అధికారులు, సిబ్బందికి సూచనలిచ్చారు. పనిచేయని పంపుసెట్లు, బోరుబావులను తక్షణం మరమ్మతు చేయించాలని, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడా ట్యాంకర్లతో నీరు సరఫరా చేసే పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. 393 బోరు బావులు పనిచేస్తున్నాయని, 124 జలశుద్ధికేంద్రాలు అందుబాటులో ఉన్నాయని, 61 చెరువుల్లో నీరు నింపామని మార్చి చివరి వరకు నీరు సరిపోతుందని, కల్లూరు, అత్తనూరు, హిరేహణగి గ్రామాల్లో నీటి సమస్య అధికంగా ఏర్పడుతుందని అధికారులు సభలో మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

విగ్రహాలను యథాస్థానంలో ప్రతిష్ఠించాలి

మాన్వి: రాయచూరు సమీపంలో సాత్‌మైల్ నుంచి సింధనూరు పీడబ్ల్యూడీ క్యాంపు వరకు చేపట్టిన నాలుగు వరుసల ముఖ్య రహదారి నిర్మాణ పనులు నిబంధనలకు వ్యతిరేకంగా, ఇష్టానుసారంగా జరుగుతున్నాయని వివిధ దళిత సంఘాల ప్రముఖులు, సంచాలకులు ఆరోపించారు. బుధవారం వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. హిరేకొట్నేకల్, అమరేశ్వరక్యాంపుల వద్ద రోడ్డు పనుల్లో భాగంగా అంబేడ్కర్ నామఫలకాలు, విగ్రహాన్ని తొలగించారని, రోడ్డు పనులు పూర్తైన తర్వాత యథాస్థానంలో నెలకొల్పుతామని తహసీల్దార్, రోడ్డు పనులు చేస్తున్న గుత్తేదారు అధికారులు నమ్మించి ఇప్పుడు తమకు సంబంధమే లేనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల లోపు వాటిని యథాస్థానంలో నెలకొల్పకుంటే దళిత సంఘాల ఆధ్వర్యంలో రోడ్డు పనుల్ని అడ్డుకోవటమే కాకుండా రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు.

పరీక్షల నిర్వహణపై సన్నాహక సమావేశం

రాయచూరు, న్యూస్‌టుడే: ఈ నెల 28 నుంచి మార్చి 17 వరకు జరగనున్న ద్వితీయ పీయూసీ పరీక్షల నిర్వహణపై చర్చించేందుకు 21న సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా పాలనాధికారి సభా భవనంలో ఉదయం 11 గంటలకు సమావేశం మొదలవుతుంది. జిల్లా పాలనాధికారి నీతిశ్ అధ్యక్ష వహిస్తారు. సంబంధిత అధికారులు తప్పక హాజరుకావాలని డీసీ కార్యాలయాధికారులు కోరారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

18-02-2026 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1602.03	1611.45
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	000	000
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	429	9,110
నీటి నిల్వ (టి.ఎం.సి)	24.255	40.512

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

దేవదాసీలపై మళ్లీ సర్వే చేయాలి

మాట్లాడుతున్న సంఘం గౌరవ అధ్యక్షుడు యు.బసవరాజ, చిత్రంలో జిల్లా అధ్యక్షురాలు, సభ్యులు

బళ్లారి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సర్వే పరిధిలో దేవదాసీ మహిళలందరినీ సర్వేలోకి తీసుకోవాలని కర్ణాటక దేవదాసీ మహిళల విమోచన సంఘం సభ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పత్రికాభవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు యు.బసవరాజ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మాజీ దేవదాసీ మహిళలు, మూడు తరాల కుటుంబసభ్యులను సర్వేలోకి తీసుకోవడం వల్ల సర్వే అసంపూర్తిగా నిర్వహించారని ఆరోపించారు. 1982లో నిర్వహించిన సర్వేతో పాటు అనంతరం నిర్వహించిన సర్వేలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. 2025లో నిర్వహించిన సర్వే సైతం అసంపూర్తిగా ఉందని దుయ్యబట్టారు. కేవలం 23,385 మందిని మాత్రమే గుర్తించారు. నిబంధనల ప్రకారం నిర్వహించలేదని ఆరోపించారు. మరోసారి సర్వే నిర్వహించి దేవదాసీ మహిళలకు ప్రభుత్వ పథకాలు అందే విధంగా చూడాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు ఈరమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి మాళమ్మ, జిల్లా కార్యదర్శి ఎ.స్వామి, కురుగోడు విభాగం అధ్యక్షుడు వీరేష్ పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకమైన బోధనలు అవసరం

ప్రసంగిస్తున్న శిక్షకుడు మహేశ్

రాయచూరు: 'ఆదర్శవంతమైన గురువుగా మారాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. స్ఫూర్తిదాయక బోధనలు చేయాలి. సేవా మనోభావాన్ని నేర్పించాలని' ధారవాడ కార్పొరేటర్ ట్రైనర్ మహేశ్ మసాళ ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా, తాలూకా కసాప, ప్రైవేటు విద్యా సంస్థల ఒక్కూట సంయుక్తంగా బీఈడీ విద్యార్థులకు బుధవారం స్థానిక ఎస్‌ఆర్‌కే విద్యాలయంలో 'వర్తమానంలో ఉపాధ్యాయుడి పాత్ర' అనే అంశంపై సదస్సును ఏర్పాటు చేసింది..దీన్ని ప్రారంభించిన మహేశ్ ఉపన్యసిస్తూ ప్రేరణ కల్గించేందుకు పాఠ్యాతేర విషయాలను బోధించాలని కోరారు. విద్యా సంస్థల ఒక్కూట కోశాధ్యక్షుడు దరూరు బసవరాజ పాటిల్ ప్రసంగిస్తూ గతంలో కార్యక్రమానికి ముందు గురువుల సలహాలు తీసుకునే వారని, మార్గదర్శకంలో నడిచేవారని తెలిపారు. తాలూకా కసాప అధ్యక్షుడు విజయ రాఘవేంద్ర మాట్లాడుతూ కన్నడ సాహిత్య కార్యకలాపాల విస్తరణతో సహ విద్యా సంబంధమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు.

పట్టణంలో 140 నిఘా కెమెరాలు

సాయినగర్ వద్ద ఏర్పాటు చేసిన నిఘా కెమెరా

సింధనూరు, న్యూస్‌టుడే: పట్టణంలో రోజురోజుకీ పెరగుతున్న రద్దీ, ప్రమాదాలు, నేరాల సంఖ్య తగ్గించడమే లక్ష్యంగా ప్రజాసౌకర్యం కోసం సింధనూరు పోలీసులు కేకేఆర్‌డీబీ నుంచి మంజూరైన 140 నిఘా కెమెరాలను వివిధ రద్దీ కూడళ్లు, ప్రధాన వీధుల్లో ఏర్పాటు చేశారు. వీటి కంట్రోల్ కేంద్రం స్థానిక టౌన్ పోలీసు స్టేషనులో పెట్టారు. ఇవి 24 గంటలూ పనిచేసే విధంగా అమర్చారు. ఎటువంటి చిన్నపాటి నేర సంఘటన అయినా ఇట్టే పసిగట్టేలా చర్యలు తీసుకునే భాగంలో వీటిని ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ చంద్రశేఖర్ వెల్లడించారు. ఇటీవల ఈ కంట్రోల్ గదిని ఎమ్మెల్యే బాదర్లి హంపనగౌడ పరిశీలించారు. స్థానిక గాంధీకూడలి, ప్రయాణ ప్రాంగణం తదితర పూర్తి రద్దీ ప్రాంతాల్లో మరో రెండేసి నిఘా కెమెరాలు అమర్చే ఉద్దేశంలో ఉన్నట్లు పోలీసు అధికారులు స్పష్టం చేశారు.

స్టేషను దారి పనులు పునఃప్రారంభం

పాత పనులు అక్కడికే ఆపేసి.. స్టేషను వైపు నుంచి ప్రారంభమైన పనులు

నీటిపారుదల అధికారులు, స్థానికులతో సమావేశమైన ఎమ్మెల్సీ బసనగౌడ బాదర్లి

సింధనూరు, న్యూస్‌టుడే: వివిధ అభ్యంతరాలతో నిలిచిన రైల్వే స్టేషను మార్గం సీసీ రహదారి, మురుగుకాలువ నిర్మాణ పనులు బుధవారం తిరిగి ప్రారంభమయ్యాయి. పట్టణ పరిధిలో ఉన్న నీటిపారుదల శాఖ వారి 40వ కాలువ గట్టు కుడివైపు 66 అడుగులు, ఎడమవైపు 30 అడుగుల దారి ఉండగా తొలుత గుత్తేదారులు తమకు అందిన సూచనలతో 66 అడుగుల దారిలో కేవలం 36 అడుగుల మేరకే నిర్మించేందుకు సిద్ధమయ్యారు. దీనిపై ఆ మార్గంలోని ప్రజలు, మాజీ ఎంపీ అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ఎమ్మెల్యే సూచనలతో తాత్కాలికంగా పనులు నిలిపారు. ఇదే అంశంపై విధాన పరిషత్ సభ్యుడు బసనగౌడ బాదర్లి బుధవారం నీటిపారుదల అధికారుల సమావేశం జరిపి స్టేషను రహదారి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. సమావేశంలో తుంగభద్ర ఎడమకాలువ ఈఈ సత్యనారాయణ శెట్టి పాల్గొన్నారు. కాలువకు ఇరువైపులా గట్లలో.. ఎడమవైపు 30 అడుగులు, కుడివైపున 66 అడుగుల వెడల్పుతో సీసీ రోడ్లు నిర్మించరని సూచించారు. ప్రస్తుతం ఉన్న నిధులు చాలకుంటే అదనపు నిధులు మంజూరు చేయిస్తానని నీటి పారుదల అధికారులకు ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. వాణిజ్య కేంద్రంగా పెరుగుతున్న సింధనూరుకు భవిష్యత్తులో ఈ దారులు విశాలంగా ఉండాల్సిన అవసరం చాలా ముఖ్యమని అన్నారు. ఆగిపోయిన పనులు తిరిగి ప్రారంభం కాగా పరిశీలించారు. వారం పాటు నిర్మించిన మురుగుకాలువ పనులను గుత్తేదారులు అక్కడికే నిలిపేసి ఈసారి స్టేషను వైపు నుంచి మొదలుపెట్టారు.

ఉచితంగా గర్భకోశ క్యాన్సర్ పరీక్షలు

గర్భకోశ క్యాన్సర్‌పై అవగాహన

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగరం సిరి డయాగ్నోస్టిక్స్ ల్యాబ్ ఆధ్వర్యంలో బళ్లారి, విజయనగర, కొప్పళ జిల్లాల్లో బుధవారం ఉచితంగా గర్భకోశ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 537 మందికి పరీక్షలు నిర్వహించగా వారిలో 11 మందికి వ్యాధి నిర్ధరణ అయినట్లు ల్యాబ్ డాక్టర్ ప్రభుకుమార్ తెలిపారు. భారతదేశంలో మహిళల్లో కనిపించే క్యాన్సర్‌లో గర్భకోశ క్యాన్సర్ రెండో స్థానంలో ఉందన్నారు. ఏటా కొత్త కేసులు వెలుగులోకి వస్తున్నాయని చెప్పారు. క్యాన్సర్‌పై నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. 2026 ఫిబ్రవరి 4న విశ్వ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా 45 రోజులపాటు ఉచితంగా మహిళలకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

శోభిల్లుతున్న కోదండరామాలయం

నుగడోణి హోసూరు క్యాంపులోని ఆలయం

మాన్వి,న్యూస్‌టుడే: తాలూకాలోని నుగడోణి హోసూరు క్యాంపులో భక్తులు కోదండరామాలయం నిర్మించారు. ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమానికి సంబంధించి ఘనంగా ఏర్పాట్లు చేశారు. శుక్రవారం రాష్ట్ర చిన్ననీటిపారుదల శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి ఎన్.ఎస్.బోసురాజు, లోక్‌సభ సభ్యుడు జి.కుమార్‌నాయక్, ఎమ్మెల్యే హంపయ్యనాయక్ తదితరులు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొంటారు. జిల్లాలోని వివిధ క్యాంపుల్లోని ప్రముఖులు, బంధుమిత్రులకు శ్రీరామ సేవా సమితి సభ్యులు ఆహ్వాన పత్రికల్ని అందించారు. గురువారం విగ్రహ ప్రతిష్ఠకు ముందు పూజలు, ధార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు భక్తులు తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

లింగత్వ అల్ప సంఖ్యాకులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంజమ్మ జోగతి, మహేశ్ పాటిల్

హొసపేటె, న్యూస్‌టుడే: లింగత్వ అల్ప సంఖ్యాకుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు శూన్యమని లింగత్వ అల్పసంఖ్యాకుల సంఘటన ప్రముఖులు మంజమ్మ జోగతి, మహేశ్ పాటిల్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అధికారంలోకి రాక ముందు కాంగ్రెస్ నాయకులు ప్రతి బడ్జెట్‌లో లింగత్వ అల్పసంఖ్యాకులకు రూ.200 కోట్లు కేటాయిస్తామని చెప్పారు. రెండున్నరేళ్లయినా ఒక్క రూపాయి మాకోసం కేటాయించలేదని దుయ్యబట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10 వేల మంది లింగత్వ అల్పసంఖ్యాకులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని ఆవేదన వెలిబుచ్చారు. వారికి నెలకి ఇస్తున్న రూ.1,500 పింఛను మొత్తం దేనికీ సరిపోవడంలేదని విచారం వ్యక్తం చేశారు. రాబోయే బడ్జెట్‌లో లింగత్వ అల్పసంఖ్యాకులకు రూ.200 కోట్లు కేటాయించాలి, వారి సంక్షేమానికి ప్రత్యేక మండలిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫాతీమా, శైనాజ్ పాల్గొన్నారు.

హోటల్లోకి దూసుకెళ్లిన కారు.. పలువురికి గాయాలు

లింగసుగూరు,(మాన్వి): పట్టణ శివారులో బుధవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వివరాలు.దేవదుర్గ వైపు నుంచి లింగసుగూరుకి వస్తున్న సఫారి కారు రోడ్డు పక్కనున్న హోటల్లోకి దూసుకుపోయి బోల్తా కొట్టింది. దేవదుర్గ ఏపీఎంసీ అధ్యక్షుడు ఆదనగౌడకు చెందిన కారుగా గుర్తించారు. అతివేగంగా నడపటం అదుపు తప్పి బోల్తాకొట్టిందని పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగినప్పుడు ఖానావళి మూసి ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. వాహనంలో ప్రయాణిస్తున్న చంద్రు, మల్లికార్జున, సోమనాథ్, చంద్ర అనే వారికి స్వల్ప గాయాలయ్యాయి. హోటల్ ముందు భాగం ప్రమాదం ధాటికి కూలిపోగా, కారు పాక్షింగా దెబ్బతింది.

వశిష్ట కళాశాల విద్యార్థుల ఘనత

మరద భరణి | నిశాంత్ కక్కుప్పి | రఘురామ్ | సంజయ్ సింహ | అనంశుమాన్ యోగానందరెడ్డి | తేజస్ | శిశిర్ రాజీమ్ హేమాద్రి

బళ్లారి, న్యూస్‌టుడే: మెయిన్ జేఈఈ తొలి విడత ఫలితాల్లో బళ్లారి వశిష్ట పదవీ పూర్వ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. నిశాంత్ కక్కుప్పి 99.89 పర్సంటైల్ సాధించి కళాశాల టాపర్‌గా నిలిచినట్లు ప్రధాన ఆచార్యులు రమేష్ రెడ్డి తెలిపారు. రఘురామ్ 99.55, సంజయ్ సింహ 98.96, అనంశుమాన్ యోగానందరెడ్డి 98.91, తేజస్ 98.88, శిశిర్ రాజీమ్ హేమాద్రి 96.98, జి.రాహుల్ 96.34. జి.ఐసిరి 95.86, తనీశి గుజర్ 95.80, టి.సాయి సకేత్ విరాజ్ 95.63, ఎం.కార్తీక్ 95.34, బి.ఆర్.చిరాంతన్ గౌడ 92.22, నేహ చందన 92.22, ఉదయ 91.30, మరద భరణి 91.06 పర్సంటైల్ సాధించారు. అత్యధిక పర్సంటైల్ సాధించిన విద్యార్థులను డైరెక్టర్ ప్రభాకర్‌నాయుడు, సురేష్, సునిల్, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలిపారు.

నేహ చందన | జి.రాహుల్ | జి.ఐసిరి | తనీశి గుజర్ | టి.సాయి సకేత్ విరాజ్, | ఎం.కార్తీక్ | బి.ఆర్.చిరాంతన్ గౌడ

(c) eenadu

రక్షకుడి చెత్తపని

చివరికి.. కటకటాలపాలు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : తమ కార్యాలయం గోడపై మూత్ర విసర్జన చేయొద్దన్నందుకు న్యాయవాది ఆదర్శ్ గంగల్ (50)పై దాడి చేసిన ఆరోపణలపై కోరమంగల ఠాణా హెడ్ కానిస్టేబుల్ సతీశ్‌ను కబ్బన్ పార్కు ఠాణా పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితుల కోసం గాలింపు తీవ్రం చేశారు. చర్చిస్ట్రీట్‌లోని తన కార్యాలయం గోడపై ముగ్గురు వ్యక్తులు మూత్రవిసర్జన చేస్తున్నట్లు ఆదర్శ్ గుర్తించి, వారికి హితవు చెప్పారు. వారిలో ఇద్దరు అక్కడే మద్యం కూడా తాగుతున్నారు. వారిపై ఫిర్యాదు చేసేందుకు పోలీసులకు ఫోన్ చేస్తుండగా.. దాడి చేసి పరారయ్యారు. తన చరవాణితో దాడి చేసిన వారి వీడియోను కూడా బాధితుడు తీశాడు. ఆయన ఫిర్యాదుతో కార్యాచరణ చేపట్టి సతీశ్‌ను అదుపులోనికి తీసుకున్నామని పోలీసులు తెలిపారు.

విచారణకు హాజరైన నటుడు సూర్య ప్రఖ్యాత్

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే : 'జేసి ది యూనివర్సిటీ' చిత్రంలో కథానాయకుడు సూర్య ప్రఖ్యాత్ గోవిందరాజనగర ఠాణాలో విచారణకు హాజరయ్యారు. ఇటీవల వీరేశ్ థియేటర్‌లో తన సినిమా ప్రదర్శనకు ఆయన హాజరయ్యారు. థియేటర్ నుంచి బయటకు వస్తున్న సమయంలో కొందరు అభిమానులు ఆయన చేతికి తల్వార్ ఇచ్చారు. ఆయన దాన్ని ప్రదర్శిస్తూ హంగామా సృష్టించారు. ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పోలీసులు స్వయంప్రేరితంగా కేసు నమోదు చేసుకుని నోటీసులు జారీ చేశారు. అది నిజమైన తల్వార్ కాదని, చెక్కతో చేసిన కత్తి అని సూర్య ప్రఖ్యాత్ స్పష్టం చేశారు. నాడు ప్రదర్శించిన కత్తిని కూడా పోలీసులకు అప్పగించారు. బహిరంగంగా భవిష్యత్తులో ఇలా చేయవద్దని ఆయనకు సూచించి పోలీసులు పంపించారు.

వీరుల గడ్డ.. పర్యాటక అడ్డా

మరఫిరంగులు ఎక్కుపెట్టి, వీరయోధులను చెరబట్టిన ఆంగ్లేయుల దాష్టీకాలు అక్కడ కళ్లకు కట్టినట్లు చూపారు. తొలితరం స్వాతంత్య్ర సమరయోధుడు సంగొళ్లి రాయణ్ణ వీరమరణ ఘట్టాన్ని సచిత్రంగా చూపే ప్రయత్నం విజయవంతంగా చేపట్టారు. చరిత్రను చక్కగా అధ్యయనం చేయడానికి ఉపకరించే ఈ పర్యాటక క్షేత్రం మీరూ చూడాలంటే బెళగావి జిల్లాకు వెళ్లాల్సిందే.

సంగొళ్లి రాయణ్ణను బ్రిటిష్ పాలకులు బంధించిన దోరిహళ్ల ప్రాంతమిదీ

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : స్వాతంత్య్ర సమరయోధుడు క్రాంతివీర సంగొళ్లి రాయణ్ణ ఆయన అనుచరులను ఉరితీసిన ప్రదేశాన్ని రాష్ట్ర ప్రభుత్వం చారిత్రక పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసింది. బెళగావి జిల్లా ఖానాపుర తాలూకా నందగడ గ్రామంలోని పది ఎకరాల విస్తీర్ణంలో 'వీరభూమి'గా తీర్చిదిద్దారు. అలనాడు బ్రిటిష్ పాలకులు చెలరేగి పోరాటయోధుడు సంగొళ్లి రాయణ్ణతో పాటు ఆరుగురు యువకులను ఆ గ్రామంలో 1831 జనవరిలో బహిరంగంగా ఉరితీయడం ఓ చారిత్రక ఘట్టం. ఆయనను ఉరితీసిన మర్రిచెట్టు నేటికీ చూడొచ్చు. ఈ ఘటన 195 సంవత్సరాల కిందట చోటుచేసుకున్నా.. రాయణ్ణ వీరమణాన్ని ఎవరూ మరచిపోలేరు. ఆయన జీవిత చరిత్రను ప్రతిబింబించేలా వీరభూమిని సిద్ధం చేశారు. సంగొళ్లి రాయణ్ణ బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా చేపట్టిన గెరిల్లా యుద్ధం నమూనాలను బొమ్మలతో సిద్ధం చేశారు. యుద్ధ శిక్షణ, ఆయుధాల తయారీ, రహస్య ప్రదేశాల రక్షణ, సైనికులకు భోజనం అందించే దేశప్రజలు, వేషభూషణాలు, ఆశ్రయం ఇచ్చిన హండి బడగనాథ్ మఠం, రాయణ్ణను బంధించిన దోరిహళ్ల ప్రాంతం వివరాలు చాటే చిత్తరువులు, నమూనాలు ఆవిష్కరించారు. అప్పట్లో రాయణ్ణను విచారించిన ధార్వాడ కలెక్టరేట్ భవనం, సంపగాని అమల్దార్ కార్యాలయం నమూనాలూ చూడొచ్చు. మరోవైపు నాటి కిత్తూరు రాణి చెన్నమ్మ ఆంగ్లేయులకు బందీగా మారి, కారాగారంలోనే మరణించడం మరో ఘట్టం. బైలహొంగల సమీపాన ఆమెకు అంత్యక్రియలు నిర్వహించారు. రాయణ్ణ తన అనుచరులతో కలిసి మారువేషంలో వెళ్లి రాజమాతకు నివాళులర్పించారు. ఆ దృశ్యాలను వీరభూమి గోడలపై చిత్రించారు. పర్యాటకుల సందర్శనకు వీలుగా ఆ ప్రదేశాన్ని చక్కగా మార్చామని కన్నడ సాంస్కృతిక శాఖ అధికారులు తెలిపారు. అహ్మదాబాద్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్‌లో శిక్షణ పొందిన సూర్యప్రకాశ్ ఈ వీరభూమి విన్యాస రూపకర్త. చరిత్ర పరిశోధకులు ఆచార్య జ్యోతి హొసూరు, బసవరాజ కామత్ సూచనలతో మలిచారు.



సంగొళ్లి రాయణ్ణ కాలం నాటి నిఘా స్తంభాన్ని పోలిన నిర్మాణం

స్వాతంత్య్ర సాధనకు సహచరులతో పథక రచన ఘట్టం

రాజధానిలో జలవిహారం!



మడివాళ చెరువులో పడవ సంచారం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాజధాని నగరానికి మరిందరు పర్యాటకులను ఆకర్షించడానికి సర్కారు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఉద్యాననగరిలోని ప్రధానమైన చెరువుల్లో చిరు పడవల విహారానికి అనుమతించింది. తొలి విడతలో పది చెరువులను ఈ పథకం కోసం పర్యాటక శాఖ గుర్తించింది. అందులో ఐదింట పడవ విహారాన్ని చేపట్టి, ప్రజల స్పందన గమనించాక తదుపరి అడుగులు వేయాలని అధికారులు తీర్మానించారు. గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ), పర్యాటక శాఖ సంయుక్తంగా బోటింగ్ వ్యవస్థను అమలులోకి తెస్తారు. ఇలా సమకూరే ఆదాయాన్ని చెరువుల నిర్వహణకే ఉపయోగిస్తారు. ఐదు నగర పాలికెల పరిధిలోని తలా రెండు చెరువులను గుర్తించారు. వాటిలో మాత్రమే విహారానికి చర్యలు తీసుకుంటారు. బెంగళూరు నగరానికి వచ్చే దేశ, విదేశీ పర్యాటకులను ఆకట్టుకునేలా కొత్త వ్యవస్థ సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శాలిని రజనీశ్ ఇటీవల జీబీఏ చీఫ్ కమిషనర్ మహేశ్వరరావుకు లేఖ రాసిన విషయం తెలిసిందే. బెంగళూరు కేంద్ర నగర పాలికె పరిధిలోని హలసూరు, కగ్గదాసపుర, పడమటి నగర పాలికె పరిధిలో నాయండనహళ్లి, శాంకి, ఉత్తర నగర పాలికె విభాగంలో యలహంక, రాచేనహళ్లి, తూర్పు వైపు వెంగయ్యన చెరువు, రాంపుర తటాకాలను ఎంచుకున్నారు. దక్షిణ నగర పాలికె పరిధిలో బేగూరు, మడివాళ చెరువుల్లో పడవల విహారానికి అనువైన ఏర్పాట్లు చేస్తారు. కర్ణాటక రాష్ట్ర పర్యాటక అభివృద్ధి మండలి అవసరమైన నిధులు ప్రాథమికంగా సమకూరుస్తుంది. ఒక్కో పర్యాటకుడి నుంచి వసూలు చేసే రుసుం వివరాలు త్వరలో ప్రకటిస్తామని, ఆ సొమ్మును చెరువుల రక్షణకే వెచ్చిస్తామని చీఫ్ కమిషనర్ మహేశ్వరరావు తెలిపారు.

'హొరనాడు' అన్నపూర్ణేశ్వరి వేడుకలకు వేళాయె

అన్నపూర్ణేశ్వరి అమ్మవారు

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : సుందర ప్రకృతి ధామం.. పశ్చిమ కనుమల్లో అగస్త్య మహర్షి ప్రతిష్ఠించిన అన్నపూర్ణేశ్వరి మాత.. నేడు భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. చిక్కమగళూరు జిల్లా కలస తాలూకా హొరనాడులో వెలసిన ఈ మాత 'హొరనాడు అన్నపూర్ణేశ్వరి'గా విఖ్యాతి చెందడం ప్రస్తావనార్హం. ఈ అమ్మవారి మహారథోత్సవ ప్రత్యేక పూజలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు వేడుకలు కొనసాగిస్తామని నిర్వాహకులు ప్రకటించారు. తొలిగా మహాగణపతి హోమం భక్తి ప్రపత్తులతో చేపట్టారు. 19న ఉదయకాల పూజలు, ధ్వజారోహణ, పుష్ప పల్లకీ సేవలుంటాయి. 20న బ్రహ్మ రథోత్సవం, మహారథోత్సవాలు వరుసగా నిర్వహిస్తారు. 21న కుంకుమోత్సవం, ప్రత్యేక అర్చనలు, 22న సంప్రోక్షణలతో వేడుకలను ముగిస్తామని ఆలయ ధర్మాధికారి జి. భీమేశ్వర జోషి వివరించారు. వేడుకలకు విచ్చేసే భక్తులకు అవసరమైన వసతులు కల్పిస్తామని చెప్పారు.

రాచనగరిలో గంజాయి ఘాటు

మైసూరు, న్యూస్‌టుడే : రాచనగరిలో మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న ఆరోపణలపై ఆన్ ప్రమోద్ (27), ఎం. వికాస్ (23) అనే యువకులను మేటగళ్లి ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. వీరిద్దరూ బెంగళూరులోని నందిని లేఅవుట్ నివాసులు. వీరి నుంచి రూ.5.10 లక్షల విలువైన ఎండీఎంఏ, రూ.1.25 లక్షల గంజాయి జప్తు చేసుకున్నారు. బెంగళూరు నుంచి మైసూరుకు మాదక ద్రవ్యాలతో వచ్చి, యువతకు వాటిని విక్రయించుకుని సొమ్ము చేసుకుని వెళ్లేవారని సీసీబీ ఏసీపీ మహ్మద్ షరీఫ్ తెలిపారు. నిందితుల నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు విచారణను తీవ్రం చేశారు.

పుట్టిననాడే మృత్యువాత

బెంగళూరు (మహాలక్ష్మి లేఅవుట్), న్యూస్‌టుడే : స్నేహితులతో కలిసి పుట్టిన రోజు వేడుకలు ఆచరించుకుని ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో పవన్ కుమార్ (24) అనే విద్యార్థి కన్నుమూశాడు. తోటదగుడ్డదహళ్లికి చెందిన బాధితుడు ఇంజినీరింగ్ చదువుకుంటూనే పార్ట్‌టైమ్ ఉద్యోగాన్ని చేసేవాడు. తన పుట్టిన రోజు వేడుకలను స్నేహితులతో కలిసి మంగళవారం మధ్యాహ్నం నిర్వహించుకున్నాడు. సాయంత్రం 5.30కు బైకుపై కాకోళు డెయిరీ ఫారం నుంచి ఐఐహెచ్‌ఆర్ వైపు వస్తుండగా, వేగంగా వచ్చిన గూడ్సు వాహనం ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. ప్రమాద తీవ్రతకు పవన్ కుమార్ అక్కడికక్కడే మరణించాడు. ప్రమాదానికి కారకుడైన డ్రైవరు వాహనాన్ని అక్కడే వదిలి పరారయ్యాడు.

పాక్‌కు రహస్యాల చేరవేత

ఉడుపి, న్యూస్‌టుడే : భారతీయ నౌకాదళానికి సంబంధించిన సమాచారాన్ని పాకిస్థాన్‌కు అందిస్తున్న ఆరోపణలపై పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఆలిఫ్ ఇస్లాం (21) అనే యువకుడిని ఉడుపి నగర ఠాణా పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. దీంతో ఈ కేసులో ఇప్పటి వరకు అరెస్టయిన నిందితుల సంఖ్య నాలుగుకు చేరుకుంది. కేరళలోని ఇడుక్కి జిల్లా మరాయు గ్రామంలో ఉంటున్న నిందితుడ్ని బంగ్లా జాతీయుడని అనుమానిస్తున్నారు. గత ఏడాది నవంబరు, డిసెంబరుల్లో గుజరాత్‌కు చెందిన హిరేంద్ర కుమార్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన రోహిత్, సంత్రి అనే వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. నౌకాదళానికి చెందిన పనులను ఒప్పంద పద్ధతిలో చేసే కొచ్చిన షిప్ యార్డ్‌లో కార్మికులుగా ఉన్న వీరు సామాజిక మాధ్యమాల ద్వారా గోప్యంగా ఉంచవలసిన సమాచారాన్ని పాకిస్థాన్‌కు పంపించేవారని తేలింది.

దర్శన్ బెయిలు పిటిషన్

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో కారాగారం చేరిన నటుడు దర్శన్ తనకు బెయిలు ఇవ్వాలని కోరుతూ 57వ సెషన్స్ న్యాయస్థానంలో అర్జీ వేసుకున్నారు. సర్వోన్నత న్యాయస్థానం బెయిలు రద్దు చేయడంతో మరోసారి కారాగారం చేరి ఆరు నెలలు దాటింది. సాక్షుల విచారణలో జాప్యం లేకుండా చూడాలని కోరుతూ అర్జీలో విన్నపం చేసుకున్నారు. దీనిపై ఆక్షేపణలు వ్యక్తం చేసేందుకు సిట్ అధికారులకు న్యాయమూర్తి అవకాశం కల్పించి, విచారణను వాయిదా వేశారు.

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

బీన్స్-	55
క్యారెట్-	55
బీరకాయలు-	55
క్యాబేజి-	35
క్యాలీఫ్లవర్(ఒక్కోటి)-	30
సొరకాయ-	55
దొండకాయలు-	45
పొట్లకాయ-	45
పచ్చి మిరపకాయలు-	115
కాకర కాయలు-	55
టమాటా(నాటు)-	35
టమాటా(సాధారణ)-	25
గుమ్మడి-	30
ఆలుగడ్డ-	35
ఉల్లి(మేలురకం)-	35
ఉల్లి(సాధారణ)-	25
వెల్లుల్లి-	160
సాంబారు ఉల్లి-	165
బీట్‌రూట్-	55
వంకాయలు-	55
బెండకాయలు-	55
ముల్లంగి-	55
నిమ్మకాయ-	210

పండ్లు, ఫలాల ధరలు

వాషింగ్టన్ ఆపిల్-	395
సిమ్లా ఆపిల్-	285
గ్రీన్ ఆపిల్-	345
అరటి కాయలు-	35
సపోటా-	45
పైనాపిల్-	65
బొప్పాయి-	35
ఆరంజి-	95
బత్తాయి-	55

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

EENADU Classifieds
JOBS
హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం జీ:18-20K © 96404 68899, 96402 58899

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.
బళ్ళారి : 9121167525
బెంగుళూరు : 9121167527
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

మండలి అధిపతులకు మంత్రి స్థాయి ఎందుకో?

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : ఎమ్మెల్యేలకు క్యాబినెట్ ర్యాంకు కల్పిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను ప్రశ్నిస్తూ దాఖలైన ఓ అర్జీని జస్టిస్ విభు బఖ్రు, జస్టిస్ సీఎం పూణచ్చ పీఠం విచారణకు స్వీకరించింది. మండలి, కార్పొరేషన్లకు 34 మంది ఎమ్మెల్యేలను అధ్యక్షులుగా నియమించి, క్యాబినెట్ హోదా కల్పించడం సరికాదని నగరవాసి సూరి పాయల ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై బదులిచ్చేందుకు ప్రభుత్వానికి అవకాశం కల్పించి, తదుపరి విచారణను మార్చి నాలుగో తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది.

వీసా గడువు పెంచాలని వినతి

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే : తన వీసా అవధిని విస్తరించాలని కోరుతూ సుడాన్ జాతీయుడు అవాబ్ ఆదిల్ అహ్మద్ మహ్మద్ వేసుకున్న అర్జీని కర్ణాటక ఉన్నత న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. దీనిపై స్పందించాలని సూచిస్తూ కేంద్ర ప్రభుత్వానికి తాఖీదులు జారీ చేసింది. అతనిపై ఒక క్రిమినల్ కేసు ఉందని, వీసా అవధి ముగిసిన రెండేళ్ల అనంతరం గత ఏడాది సెప్టెంబరు 11న అర్జీ వేసుకున్నాడని కేంద్రం తరఫు న్యాయవాదులు వాదనలను వినిపించారు. వీసా విస్తరణకు సంబంధించి తమకు గడువు కావాలని కోరడంతో తదుపరి విచారణను మార్చి 6కు జస్టిస్ బీఎం శ్యామ్ ప్రసాద్ వాయిదా వేశారు.

న్యాయాలయ భూమిపై వ్యాజ్యం

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే : కోలారు జిల్లా శ్రీనివాసపుర న్యాయస్థానం భవంతులు ఉన్న భూమి అటవీశాఖకు చెందినట్లు దాఖలైన వ్యాజ్యాన్ని జస్టిస్ విభు బఖ్రు, జస్టిస్ సీఎం పూణచ్చ పీఠం విచారణకు స్వీకరించింది. దీనిపై దర్యాప్తు చేపట్టి సమగ్ర నివేదిక ఇవ్వాలని ప్రభుత్వానికి తాఖీదులు జారీ చేసింది. శ్రీనివాసపురం తాలూకా పాతపల్లికి చెందిన సి.శ్రీనివాస రెడ్డి ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. తదుపరి విచారణను మార్చి 24కు ధర్మాసనం వాయిదా వేసింది.

హిండలగలో తనిఖీలు

బెళగావి, న్యూస్‌టుడే : బెళగావిలోని హిండలగ జిల్లా కారాగారంలో 5జీ జామర్ ఉన్నప్పటికీ మొబైల్ కాల్స్ వస్తున్నాయని గుర్తించామని కారాగారాల శాఖ డీజీపీ అలోక్ కుమార్ తెలిపారు. దీనికి సంబంధించి సాంకేతిక నిపుణులతో కలిసి హిండలగ కారాగారంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నూరేళ్ల చరిత్ర ఉన్న ఈ కారాగారంలోకి కొందరు నిందితులు బయట నుంచి మాదక ద్రవ్యాలు, సిమ్ కార్డులను విసిరి వేస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఖైదీలకు కౌశల్యాన్ని పెంచే పనుల్లోనూ శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

రంకెలేసిన వీర కంబళ

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : తుళు, కన్నడ భాషల్లో తెరకెక్కించిన 'వీర కంబళ' చిత్రాన్ని ఈ నెల 27న విడుదల చేస్తున్నామని సీనియరు దర్శకుడు రాజేంద్రసింగ్ బాబు ప్రకటించారు. ధర్మస్థల ధర్మాధికారి వీరేంద్ర హెగడే ప్రత్యేక పాత్రలో నటించిన ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్, టీజర్‌లను సంగీత దర్శకుడు హంసలేఖ, నటీ నటులు, సాంకేతిక వర్గం ప్రతినిధులతో కలిసి బుధవారం ఇక్కడ విడుదల చేసి మాట్లాడారు. తుళునాడు ప్రజల జీవన విధానాలు, ఆచారాలు, చరిత్ర, వీరత్వాన్ని ఇతివృత్తంగా తీసుకుని తెరకెక్కించామని తెలిపారు. కంబళకు అనుబంధంగా, ముంబయిలోని అండర్‌వరల్డ్‌కు సంబంధించిన అంశాలను ఈ చిత్రంలో పొందుపరచామని వివరించారు. బాబాస్ బ్లెస్సింగ్స్ ఫిలిమ్స్ బ్యానర్‌పై డాక్టర్ వినిత విజయ్ కుమార్‌రెడ్డి, అరుణ్ రై తొడార్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆదిత్య, ప్రకాశ్ రాజ్, రవిశంకర్, రాధికా నారాయణ్ ప్రధాన పాత్రల్లో నటించారు. తుళు నాటకరంగంలో ప్రముఖ దర్శకుడు విజయ్ కుమార్ కోడియాల్‌బైల్, చరిత్రకారుడు గుణపాల్ కడంబ, సంగీత దర్శకుడు మణికాంత్ కద్రి, సాంకేతిక నిపుణులు శ్రీనివాస్, ఆర్ గిరి, చంద్రశేఖర్ సువర్ణ ముల్కి, భాషా తదితరులు ట్రైలర్ విడుదల కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాటలు, టీజర్ విడుదల కార్యక్రమంలో దర్శకుడు రాజేంద్రసింగ్ బాబు, సంగీత దర్శకుడు హంసలేఖ, నటీనటులు, సాంకేతిక వర్గం

ఎగువ భద్రా పథకానికి నిధులు ఇవ్వండి

చెళ్లకెర(చిత్రదుర్గ),న్యూస్‌టుడే: ఎగువ భద్రా సాగునీటి పథకం కింద చేపట్టిన 114 కి.మీ. చిత్రదుర్గం కాలువ పనులు అంతిమ దశకు చేరుకొన్నాయని, కాలువలో ప్రయోగాత్మకంగా నదీ జలాలను సరఫరా చేయడానికి అవసరమైన రూ.300 కోట్ల నిధులను విడుదల చేయాలని జిల్లా బాధ్యమంత్రి డి.సుధాకర్ కోరారు. బుధవారం చెళ్లకెర ఎమ్మెల్యే టి. రఘుమూర్తి, హొసదుర్గ ఎమ్మెల్యే బి.జి. గోవిందప్పతో కలిసి రాష్ట్ర జలవనరుల శాఖ, ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్‌ను బెంగళూరులో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.21,167 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ పథకానికి ఇంత వరకు సుమారు రూ.11,409 కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేశారన్నారు. ఈ పథకం పూర్తి కావడానికి మరో రూ.10 వేల కోట్లు అవసరం ఉందన్నారు. ఈ పథకం కింద చిత్రదుర్గ, తుమకూరు, చిక్కమగళూరు, దావణగెర జిల్లాల్లోని 367 చెరువులకు సాగునీరు నింపితే సుమారు 6 లక్షల ఎకరాల బీడు భూములకు సాగు నీరు అందుతుందని పేర్కొన్నారు.

లాభాల పట్టుగొమ్మ!



సిద్ధరామయ్యకు చెక్కు అందిస్తున్న మంత్రి వెంకటేశ్, మండలి అధ్యక్షురాలు ఖానీజ్‌ఫాతిమా

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కర్ణాటక పట్టు పరిశ్రమ అభివృద్ధి మండలి లాభాల బాటలో పయనించడం ఆశావహ పరిణామమని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రశంసించారు. రానున్న బడ్జెట్లో సంస్థ ఉన్నతికి అవసరమైన నిర్ణయాలు తీసుకోవడానికి ప్రయత్నిస్తామని భరోసా ఇచ్చారు. సంస్థ లాభాల్లో రూ. 30.34 కోట్ల డివిడెంట్‌తో కూడిన చెక్కును బుధవారం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అందుకున్నారు. ఆ లాభాల్లో రూ.2 కోట్లు సీఎం సహాయ నిధికి ప్రత్యేకించారు. ఈసందర్భంగా మంత్రి వెంకటేశ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శాలిని రజనీశ్, పట్టు పరిశ్రమ అభివృద్ధి మండలి అధ్యక్షురాలు ఖానీజ్‌ఫాతిమా తదితరులు హాజరయ్యారు.

డీకేతో జయమాల చర్చలు

ఉపముఖ్యమంత్రి శివకుమార్‌తో డాక్టర్ జయమాల తదితరులు

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : కర్ణాటక చలన చిత్ర వాణిజ్య మండలి నూతన అధ్యక్షురాలు డాక్టర్ జయమాల ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో బుధవారం సదాశివనగరలోని ఆయన నివాసంలో ప్రత్యేకంగా చర్చలు జరిపారు. ఇటీవలే ఆమె అధ్యక్షురాలిగా ఎన్నిక కావడంతో డీకే ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల మండలి అధ్యక్ష స్థానానికి ఎన్నికలు జరగగా ఆమె ఎన్నికయ్యారు. చలన చిత్రవాణిజ్య మండలిలో డీకే శివకుమార్ కూడా సభ్యుడే. నూతనంగా ఎన్నికైన పదాధికారులతోనూ ఆయన చర్చలు జరిపారు. మండలి కార్యకలాపాల విస్తరణపై సమాలోచనలు సాగించారు. సంస్థ కార్యకలాపాలు ఉన్నతంగా సాగాలని, సర్కారు అన్ని విధాలా సహాయ, సహకారాలు అందించడానికి సిద్ధమని డీకే హామీనిచ్చారు.

న్యాయస్థానం మెట్లెక్కిన 'ఆంథ్రోపిక్'

మహ్మద్ అయాజ్ ముల్లా

బెళగావి, న్యూస్‌టుడే : ఐటీ రంగంలో కృత్రిమ మేధ సంస్థ 'ఆంథ్రోపిక్' సృష్టించిన అలజడి ఇంకా తగ్గలేదు. టెక్ కంపెనీలు, ఉద్యోగులను భయపెట్టిన ఈ అమెరికా అంకుర పరిశ్రమకు ఇప్పుడు బెళగావిలో న్యాయపరమైన చిక్కులు ప్రారంభమయ్యాయి. అమెరికా ఏఐ కంపెనీ ట్రేడ్‌మార్కు నిబంధనలు ఉల్లంఘిస్తోందంటూ బెళగావిలోని ఆంథ్రోపిక్ సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ అయాజ్ ముల్లా ఆరోపించారు. ఈ అంశంపై తాజాగా బెళగావి కమర్షియల్ డివిజన్ అండ్ డిస్ట్రిక్ట్ న్యాయస్థానంలో ఫిర్యాదు చేశారు. గత సోమవారం నాటి విచారణకు అమెరికాలోని ఆంథ్రోపిక్ సంస్థ ప్రతినిధులు గైర్హాజరయ్యారు. తదుపరి విచారణను మార్చి 9కి వాయిదా వేసిన న్యాయస్థానం అమెరికా సంస్థ ప్రతినిధి ఇరినా ఘోష్‌కు సమన్లు జారీ చేసింది. 'తమ సంస్థ చిన్నదే అయినా, బ్రాండ్ పేరును 2017 నుంచి వినియోగిస్తున్నాం. విద్య, అనుసంధానం, సురక్షత తదితర రంగాల్లో డిజిటల్ ప్లాట్‌ఫారాలను అభివృద్ధి చేశాం. ఆంథ్రోపిక్.ఇన్ పేరిట కార్యకలాపాలు సాగిస్తున్నాం. అమెరికాకు చెందిన ఆంథ్రోపిక్ 2021లో ప్రారంభమైంది. మా పేరును వినియోగించి వారు అంకుర పరిశ్రమను ప్రారంభించారు. సామాజిక మాధ్యమంలోనూ అదే పేరును వినియోగిస్తున్నారు. మా వ్యాపారంపై తీవ్ర ప్రభావం పడి, నష్టపోవలసి వస్తోంది' అని మహ్మద్ అయాజ్ ముల్లా ఆందోళన వ్యక్తం చేశారు.

బెళగావిలోని ఆంథ్రోపిక్ కార్యాలయం

భారీగా శ్రీగంధం చెక్కల స్వాధీనం

సండూరు(బళ్లారి), న్యూస్‌టుడే: సండూరు తాలూకాలోని అటవీ ప్రాంతంలో అక్రమంగా శ్రీగంధం చెక్కలను తరలిస్తున్న నిందితులను తాలూకా అటవీశాఖాధికారులు అదుపులోకి తీసుకుని, వారి నుంచి 110 కిలోల శ్రీగంధం చెక్కలను స్వాధీనం చేసుకున్నారు. డీఎఫ్‌వో డా. బసవరాజు తెలిపిన వివరాల మేరకు.. సండూరు తాలూకా అటవీ ప్రాంతం తోరణగల్లు సమీపంలోని కూడ్లిగి వరకు విస్తరించింది. ఇక్కడ శ్రీగంధం చెట్లు ఎక్కువగా ఉన్నాయి. సండూరు అటవీ ప్రాంతం నుంచి వాహనంలో అక్రమంగా శ్రీగంధం చెక్కలు తరలిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. తాలూకా అటవీశాఖాధికారులు శరణ్‌కుమార్, మంజునాథ్, సయ్యద్ దాదా ఖలందర్, తిప్పేస్వామి, మహేశ్, హొన్నూరస్వామి, శ్రీధర్, రాఘవేంద్ర తదితర సిబ్బంది కాపుగాసి సుశీల్‌నగర్ వద్ద వాహనం పరిశీలించారన్నారు. వాహనంలో శ్రీగంధం చెక్కలు ఉన్నట్లు గుర్తించి లోకేష్ నాయక్, కిరణ్‌కుమార్ అనే వ్యక్తులను అరెస్టు చేసి విచారణ చేయగా శ్రీగంధం చెక్కలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీసత్యసాయి జిల్లా రొళ్ల గ్రామంలో ఉన్న పరిశ్రమకు తరలిస్తున్నట్లు తెలిసిందన్నారు. 110 కిలోల చెక్కలతో పాటు, అటవీశాఖాధికారులు రొళ్ల గ్రామంలోని పరిశ్రమలో పరిశీలించగా మరో 179 కిలోల శ్రీగంధం చెక్కలున్నట్లు గుర్తించి వాటినీ స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను న్యాయమూర్తి ముందు హాజరుపరిచి కేంద్ర కారాగారానికి తరలించారు. మొత్తం ఏడుగురుపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

బళ్లారిలో మంగళముఖి, ప్రేమికుడి ఆత్మహత్య

బ్రూస్‌పేటె పోలీసుల దర్యాప్తు



మంగళముఖి సుహాసిని (పాతచిత్రం)



శేఖర్ (పాతచిత్రం)

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారిలో మంగళముఖి, ఆమె ప్రియుడు అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. ఆత్మహత్య చేసుకున్న వారిలో సుహాసిని (29) అలియాస్ దేవరాజ్, ప్రేమికుడు శేఖర్ అలియాస్ మణి (30)గా గుర్తించారు. బుధవారం బ్రూస్‌పేటె పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బళ్లారి తాలూకా చాగనూరు గ్రామానికి చెందిన మంగళముఖి సుహాసిని ఆరేళ్లుగా విజయనగర జిల్లా హొసపేటె తాలూకా మలపనగుడి గ్రామానికి చెందిన శేఖర్‌తో స్నేహంగా ఉంటోంది. ఇద్దరూ హొసపేటెలో సహ జీవనం సాగిస్తున్నారు. సుహాసిని భిక్షాటన చేసి వచ్చిన సొమ్ముతో శేఖర్‌కు ఆటో కొనుగోలు చేసి ఇచ్చింది. ప్రతి మంగళవారం ఇద్దరూ బళ్లారిలో కనక దుర్గమ్మను దర్శనం చేసుకునేవారు. హంపీ ఉత్సవాల సందర్భంగా అక్కడ భిక్షాటన చేసి సోమవారం మధ్యాహ్నం బళ్లారికి చేరుకున్నారు. కొన్ని రోజులుగా డబ్బు పంపకాల విషయంలో వారి మధ్య చిన్నపాటి ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శేఖర్‌కు కుటుంబ సభ్యులు పెళ్లిచూపులు చూస్తున్నారు. ప్రతి వారం మాదిరిగా మంగళవారం బళ్లారి కనక దుర్గమ్మ ఆలయానికి వెళ్లి ఇద్దరూ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఇందిరానగర సమీపంలోని ఎం.కె.నగరలో అద్దెకు తీసుకున్న ఇంటికి వెళ్లారు. అక్కడా ఇద్దరి మధ్య మరోసారి ఘర్షణ జరిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో శేఖర్ కిటికీకి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోగా సుహాసిని అక్కడే కింద పడుకున్న స్థితిలో మృతిచెందినట్లు పోలీసులు గుర్తించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. బ్రూస్‌పేటె పోలీసులు, కుటుంబ సభ్యులను వెంటబెట్టుకుని అక్కడికి చేరుకుని మృతదేహాలను పరిశీలించి బళ్లారి వైద్య కళాశాల, పరిశోధన కేంద్రానికి తరలించారు. మొదట సుహాసినిని చీరతో గొంతు బిగించి హత్య చేసిన శేఖర్ తర్వాత తాను కూడా కిటికీకి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బ్రూస్‌పేటె పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

(c) eenadu

బెంగళూరు

● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

సెంట్రల్ కళాశాల్లో జాతీయ సమైక్యతా శిబిరం

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే: డాక్టర్ మన్మోహన్‌సింగ్ బెంగళూరు నగర విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో జాతీయ సమైక్యతా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వర్సిటీ వర్గాలు బుధవారం వెల్లడించాయి. ఈనెల 20 నుంచి సెంట్రల్ కళాశాల ఆవరణలోని జ్ఞానజ్యోతి సభాంగణంలో వారం రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రారంభం రోజున సాయంత్రం 4 గంటలకు ఉన్నత విద్యాశాఖ మంత్రి ఎం.సి.సుధాకర్ ఈ శిబిరాన్ని ప్రారంభించనున్నారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ. బి.రమేశ్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో యువ సబలీకరణ క్రీడాశాఖ సీఎస్ నవీన్‌రాజ్‌సింగ్, కమిషనర్ చేతన్, రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారులు ప్రతాప్‌లింగయ్య, గిరిధర్ ఉపాధ్యాయ తదితరులు పాల్గొనున్నారు.

ఈవీరేడీ వాహనాల ప్రదర్శన

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: నగరంలో ఈనెల 21,22,23 తేదీల్లో ఈవీరేడీ విద్యుత్తు ఆధారిత వాహనాల ఈవీ ఎక్స్‌పో ప్రదర్శన జరగనుంది. రాజప్రాసాదం మైదానంలోని త్రిపుర వాహినిలో ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. ప్రదర్శనకు కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ సహకారాలను అందిస్తుంది. విద్యుత్తు ఆధారిత వాహనాలపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామని, అశోక్‌లేల్యాండ్, స్విచ్‌మొబిలిటీ, కియా ఇండియా, ఆథర్, టీవీఎస్ మోటార్స్ తదితర కంపెనీలు పాల్గొంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ద్విచక్రవాహనాలు, మూడు నాలుగు చక్రాల విద్యుత్తు ఆధారిత వాహనాల్ని ప్రదర్శిస్తారు. కర్ణాటక ప్రభుత్వం విద్యుత్తు ఆధారిత వాహనాలకు అన్ని ప్రోత్సాహకాలను అందిస్తున్నట్లు తెలిపారు.

హోసూరు కబుర్లు

టీవీకేలోకి భారీగా చేరికలు

మధు సమక్షంలో సభ్యత్వం పొందిన కార్యకర్తలు

హోసూరు,న్యూస్ టుడే: ప్రముఖ తమిళ నటుడు విజయ్ ప్రారంభించిన టి.వి.కె.(తమిళగ వెట్రి కజగం)లో సభ్యత్వం పొందడానికి వేపనహళ్లి అసెంబ్లీ స్థానం నుంచి పెద్ద సంఖ్యలో యువకులు ఆసక్తి చూపుతున్నారు. ఈ సందర్భంగా శూలగిరి ప్రాంత ప్రముఖులు పంచాయతీ యూనియను ఛైర్మన్ ఎ.వి.ఎం.మధు సమక్షంలో ఆయన కార్యాలయంలో టి.వి.కె. సభ్యత్వం పొందారు. డి.ఎం.కె. పనిచేసిన మీద విసుగు చెందిన 60 మంది బి.పార్థసారధి నేతృత్వంలో టీవీకేలో చేరారు. ఈ సందర్భంగా మధుకు నిలువెత్తు పూలమాల వేసి ఆశీస్సులు పొందారు. టి.వి.కె. సభ్యత్వం స్వీకరించిన యువకులు కప్పు మధు సత్కరించారు.

ప్రతి ఇంటికీ కావేరి నీరు అందిస్తాం

పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మునిరాజు తదితరులు

బెంగళూరు(పీణ్యాదాసరహళ్లి),న్యూస్ టుడే: దాసరహళ్లి నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ కావేరి నీటిని అందించి నీటిఎద్దడి లేకుండా చర్యలు చేపడుతున్నట్లు స్థానిక ఎమ్మెల్యే ఎస్.మునిరాజు పేర్కొన్నారు. కమ్మగుండనహళ్లిలోని రామచేంద్ర లేఅవుట్‌లో బుధవారం కావేరి నీటి పైపుల నిర్మాణ పనులను పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావేరి నీరు సరఫరా చేసే పైపులు నాణ్యమైనవి వేయాలి, పనుల్లో నాణ్యత లోపించకుండా పూర్తి చేయాలని ఇంజినీర్లకు సూచించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రతి ఇంటికీ నీరు సరఫరా అయ్యేలా చూడాలని గుత్తేదారులకు సూచించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గాల్ని ఏర్పాటు చేయాలని అధికారులను సూచించారు. ఎక్కడా పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట భాజపా కార్యదర్శి శబరి మంజునాథ్, స్థానిక భాజపా నాయకులు, కె. భాస్కర్ సంపతి సుబ్బారెడ్డి, దక్షిణమూర్తి, బీబీఎంపీ అధికారులు ఉన్నారు.

నీటి ఎద్దడి.. కట్టడి

చిత్రదుర్గ,న్యూస్‌టుడే: జిల్లాలో తాగునీటి సమస్యలు నెలకొన్న జనావాస ప్రాంతాలు, గ్రామాల్ని గుర్తించి అక్కడకు వెంటనే ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా పాలనాధికారి వెంకటేశ్ అధికారులకు సూచించారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా విపత్తు నిర్వహణ సమితి సభకు అధ్యక్షత వహించి మాట్లాడారు. రానున్న వేసవి దృష్ట్యా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు.

దక్షిణలో దోమలపై దండయాత్ర

విజయబ్యాంకు కాలనీలోని ఉద్యానవనంలో పొగ వదులుతున్న సిబ్బంది

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌ టుడే: నగరంలోని వివిధ ప్రాంతాల్లో దోమల నిర్మూలన చర్యలు చేపట్టారు. ప్రధానంగా బెంగళూరు దక్షిణ ప్రాంతంలో దోమల బెడద ఎక్కువగా ఉన్నట్లు జీబీఏ అధికారులు గుర్తించారు. పగలూరాత్రి అనే తేడా లేకుండా దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. విజయబ్యాంకు కాలనీ, బసవనగుడి, యడియూరు, జయనగర, జేపీనగర, సారక్కి తదితర ప్రాంతాల్లో దోమల బెడద ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ఉద్యానవనాలు, ఖాళీ ప్రదేశాలు, నివాస ప్రాంతాల్లో రసాయనిక మందులను పిచికారీ చేయడం ప్రారంభించారు. రసాయనిక మందులతో కూడిన పొగ విడిచిపెడుతున్నారు. దోమల వల్ల విషజ్వరాలు వ్యాపిస్తాయి. ప్రజలు నుంచి వస్తున్న ఫిర్యాదుల దృష్ట్యా ఫాగింగ్ ముమ్మరంగా చేపడుతున్నారు. వాతావరణంలో మార్పులు రావడంతో విషజ్వరాలు వ్యాపిస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీబీఏ వైద్యాధికారులు సూచించారు.

డీఎంకేకు వ్యతిరేకంగా భాజపా మిత్రపక్షాల నిరసన

ప్రదర్శనలో మాట్లాడుతున్న భాజపా మండలాధ్యక్షుడు బాలకృష్ణ

హోసూరు,న్యూస్‌టుడే: స్థానిక బి.డి.ఒ. కార్యాలయం ఎదురుగా భాజపా మిత్రపక్షాల కార్యకర్తలు, నాయకులు నేతృత్వంలో డి.ఎం.కె. ప్రభుత్వ పనితీరును వ్యతిరేకిస్తూ బుధవారం ప్రదర్శన నిర్వహించారు. దళితులను డీఎంకే సర్కారు నిర్లక్ష్యం చేస్తోందని వారు నినాదాలు చేశారు. కార్యక్రమానికి భాజపా నాయకుడు బాలకృష్ణ సారథ్యం వహించారు. భాజపా జిల్లా మాజీ అధ్యక్షుడు ఎం.నాగరాజన్, పి.ఎం.కె. జిల్లా అధ్యక్షుడు గోవిందరాజు, దళిత నాయకుడు సురేశ్, కస్తూరి తదితరులు కార్యక్రమంలో ప్రసంగించారు. ఆందోళనలో అధిక సంఖ్యలో మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు. డి.ఎం.కె.లో దళితులకు గౌరవం లేదని, వారి సంక్షేమ నిధుల్ని దుర్వినియోగం చేసినట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ ఆందోళన నేపథ్యంలో వాహనాల రాకపోకలు స్తంభించాయి.

సీకే నాయుడు ట్రోఫీ రాష్ట్ర జట్టు సారథిగా అనీశ్వర్

బెంగళూరు (క్రీడలు), న్యూస్ టుడే: కల్నల్ సీకే.నాయుడు ట్రోఫీ కోసం ఈనెల 21 నుంచి ముంబయిలో జరగనున్న క్వార్టర్ ఫైనల్లో పాల్గొంటున్న కర్ణాటక జట్టుకు అనీశ్వర్‌గౌతమ్ కెప్టెన్, ధ్రువప్రభాకర్ వైస్‌కెప్టెన్‌గా పాల్గొంటున్నారు. ముంబయితో జరిగే ఈ పోటీలో కర్ణాటక జట్టులో పాల్గొంటున్న ఇతర ఆటగాళ్ల జాబితాను రాష్ట్ర క్రికెట్ సంఘం బుధవారం ప్రకటించింది. జట్టు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రభాకర్ చతుర్వేది, ఫైజన్‌ఖాన్, కె.పి.కార్తికేయ-వికెట్ కీపర్, హర్షిల్ ధమనీ, హార్దిక్‌రాజ్, యశోవర్ధన్ ప్రతాప్, మవ్వత్‌కుమార్, ధనుశ్‌గౌడ, సమిత్ ద్రావిడ్, ఎస్.యు.కార్తిక్, కె.శశికుమార్, సంజయ్ అశ్విన్-వికెట్‌కీపర్, మోనీశ్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

ఫైనల్స్‌లో తలపడనున్న మత్తికెరె, నేషనల్ జట్లు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: కర్ణాటక క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో జేబీ. మాల్లారాధ్య షీల్డ్ కోసం జరిగిన తొలి గ్రూపు ఐదో డివిజన్ లీగ్ కమ్ నాకౌట్ క్రికెట్ పోటీలో మత్తికెరె క్రికెట్, నేషనల్ క్రికెటర్స్ జట్లు ఫైనల్స్‌కు దూసుకెళ్లాయి. బుధవారం సీఎంఆర్ విశ్వవిద్యాలయం మైదానంలో జరిగిన తొలి సెమీఫైనల్ పోటీలో మత్తికెరె క్రికెట్ జట్టు 98 పరుగుల తేడాతో కార్వాన్ క్రికెటర్స్‌పై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన మత్తికెరె జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 220 పరుగులు సాధించింది. రోహన్‌షా 60, నిశ్చల్ 27, సంజయ్ 23 పరుగులు సాధించగా, రాహుల్‌మీనన్ 27 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ప్రత్యర్థి జట్టు బౌలర్లు అద్వైత్‌గౌడ మూడు వికెట్లు, కె.సి.కారియప్ప, పీయూష్ వి.గాంధీ, చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. విజయానికి 221 పరుగుల కావాల్సి ఉండగా కార్వాన్ జట్టు 34.3 ఓవర్లలోనే 122 పరుగులు మాత్రమే సాధించి ఆలౌటయి ఓటమి చవిచూసింది. విజయం కోసం ఒంటరి పోరాటం చేసి దర్శన్ (55) సాధించిన అర్ధ సెంచరీ వృథా అయింది. ప్రత్యర్థి జట్టు బౌలర్లు రాహుల్ శెట్టి మూడు వికెట్లు, చంద్రు పియ్యణ్ణ, నాగరాజ్ హెగ్డే చెరో రెండు వికెట్లు తీసి కార్వాన్ జట్టును కట్టడి చేశారు. బీఈఎస్ మైదానంలో జరిగిన మరొక సెమీస్ పోటీలో నేషనల్ క్రికెటర్స్ జట్టు ఆరు వికెట్లతో యంగ్ క్రికెటర్స్ (1) జట్టు పై గెలుపొందింది. స్కోర్- యంగ్ క్రికెటర్స్ జట్టు 25.2 ఓవర్లలో 76 పరుగులకు ఆలౌట్; నేషనల్ జట్టు 17.2 ఓవర్లలో 4-78 పరుగులు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చాటిన ఆళ్వాస్ విద్యార్థులు

పీయూష్

సృజన్

ప్రణవ్‌పండిత్

క్షమాఅశోక్

బెంగళూరు(క్రీడలు), న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్స్-2026 సెషన్-1 పరీక్షల ఫలితాల్లో ఆళ్వాస్ పీయూ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చారని ఆళ్వాస్ శిక్షణ ప్రతిష్ఠాన అధ్యక్షుడు డాక్టర్ ఎం.మోహన్‌ఆళ్వా తెలిపారు. ఆళ్వాస్ తరఫున ఎనిమిది మంది విద్యార్థులు 98.5 పర్సంటైల్ కన్నా అధిక స్కోర్‌ను సాధించారు. 22 మంది విద్యార్థులు 97 పర్సంటైల్, 38 మంది విద్యార్థులు 96 పర్సెంటైల్‌ను సాధించారు. వీరిలో అత్యధికంగా హెచ్. పీయూష్ 99.45 పర్సెంటైల్ సాధించగా, శశాంక్ బోర్కర్ 98.96, వి.సృజన్ 98,73, మెల్రోయ్ కాస్టోలినో 98.64, ప్రణవ్ ఎన్.పండిత్ 98.56, క్షమాఅశోక్ హకటీ 98.51, క్లారెన్స్ డిసౌజా 98.48 పర్సెంటైల్ సాధించి ప్రతిభను చాటారు. ఘనత సాధించిన విద్యార్థుల్ని మోహన్‌ఆళ్వా అభినందించారు.

చిరుధాన్యాల ప్రదర్శనకు విశేష స్పందన

ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టరు దినేష్‌కుమార్

హోసూరు, న్యూస్ టుడే: శూలగిరి కల్యాణ మంటపంలో వ్యవసాయశాఖ ఏర్పాటు చేసిన చిరుధాన్యాల ప్రదర్శనను జిల్లా కలెక్టరు దినేష్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించిన అనంతరం ప్రసంగించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండడానికి చిరుధాన్యాలతో తయారైన ఆహారం తీసుకుంటే మేలన్నారు. ఈ ప్రదర్శనలో వ్యవసాయశాఖకు సంబంధించిన ఉపకరణాలను ఉంచారు. ఈ ప్రదర్శన ప్రజల్ని విశేషంగా ఆకట్టుకుంటోంది. జిల్లాలో వరి సాగు తర్వాత రాగి, సజ్జలు, సాములు ఎక్కువగా పండిస్తున్నారు. విటమిన్లు, ప్రోటీన్లులతో కూడిన చిరుధాన్యాలు పౌష్టికాహారమని ఆయన వివరించారు. ఈ సందర్భంగా నలుగురు రైతులకు రూ.59 వేల విలువ చేసే ఉపకరణాలను ఉచితంగా అందించారు. జిల్లాలో ఉత్పత్తవుతున్న రాగులకు రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధరను నిర్ణయించడమే కాకుండా రైతుల నుంచి పంటను సైతం సేకరిస్తోందన్నారు. మొత్తం 8 ప్రాంతాల్లో రాగుల సేకరణ కేంద్రాలను ప్రారంభించినట్లు జిల్లా కలెక్టరు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖాధికారి కాళిముత్తు, శ్రీమతి కళా, జిల్లా కలెక్టరు కార్యదర్శి ఏంజెలిన్, పౌన్‌రాణి, శూలగిరి బి.డి.ఒ. శ్రీమతి విజయ, కళా, తహసీల్దారు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోహిత్ వేముల చట్టాన్ని తేవాలి

ప్రత్యేక అభియాన్ చేపట్టిన దళిత సంఘాల నేతలు

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: విశ్వవిద్యాలయాల్లో కుల వేధింపులు నియంత్రించేందుకు రోహిత్ వేముల చట్టాన్ని అమలులోకి తేవాలని కర్ణాటక దళిత సంఘర్షసమితి సంచాలకుడు మావళ్లి శంకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఇక్కడ బెంగళూరు ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో రోహిత్ వేముల చట్టాన్ని తెస్తామని హామీ ఇచ్చారని, ప్రస్తుత బడ్జెట్‌లో ఆ చట్టాన్ని అమలులోకి తేస్తామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించాలని కోరారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ కూడా కర్ణాటకలో రోహిత్ వేముల చట్టాన్ని తీసుకొస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. రోహిత్ వేముల చట్టం అమలు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక అభియాన్ చేపడుతున్నట్లు తెలిపారు.

చెత్త తరలింపు సమస్యకు త్వరలో పరిష్కారం

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: నగర శివార్లలోని బెళ్లళ్లి క్వారీలో చెత్త తరలింపును స్థానికులు వ్యతిరేకిస్తుండగా సమస్యను త్వరలో పరిష్కారిస్తామని గ్రేటర్ బెంగళూరు ప్రాధికార(జీబీఏ) చీఫ్‌కమిషనర్ మహేశ్వరరావు తెలిపారు. బుధవారం ఇక్కడ ఆయన విలేకర్లతో మాట్లాడుతూ స్థానికులతో చర్చించి రెండు మూడ్రోజుల్లో సమస్య పరిష్కారిస్తామన్నారు. ఇప్పటికే ఉన్నతాధికారులు ఆప్రాంతానికి వెళ్లి స్థానికులతో చర్చిస్తున్నారని, ఆప్రాంత అభివృద్ధికి సంబంధించి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారని, అభివృద్ధి పనుల కోసం నిధులు విడుదల చేసేందుకు అన్ని విధాల చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. చెత్త తరలింపు నిలుపుదల వల్ల నెలకొన్న సమస్య గుర్తించిన అధికారులు అక్కడికి వెళ్లి గ్రామ పెద్దలతో చర్చించి నచ్చచెప్పే ప్రయత్నాలు ప్రారంభించారన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి దేవాలయ అభివృద్ధి ఈఓగా ప్రసాద్

పావగడ,న్యూస్‌టుడే: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో గ్రేడ్-2 తహసీల్దారుగా విధులు నిర్వర్తిస్తున్న పి.ఎస్.ఆర్.ప్రసాద్ నాగలమడక అంత్య సుబ్రహ్మణ్య స్వామి దేవాలయ అభివృద్ధి సమితి కార్యనిర్వాహణాధికారిగా నియమితులయ్యారు. ప్రాచీన కాలం నాటి అంత్య సుబ్రహ్మణ్యస్వామి దేవాలయ జీర్ణోద్ధరణకు సిద్ధమవుతున్న వేళ ఈఓగా ప్రసాద్‌ను నియమించడం ప్రాధాన్యాన్ని సంతరించుకొంది.

ప్రసాద్‌కు నియామక పత్రాలను అందచేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

మెరిసిన ఆదర్శ

ప్రతిభ చాటిన విద్యార్థుల పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఆకాశ్ విద్యాసంస్థ నిర్వహకులు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: ఆకాశ్ విద్యాసంస్థ విద్యార్థులు జేఈఈ అర్హతపరీక్షలో సత్తా చాటారు. విద్యార్థి ఆదర్శ కుమార్ బెహరా 99.99 శాతం మార్కులు సాధించి అగ్రస్థానంలో ఉన్నట్లు సంస్థ ఉన్నతాధికారి ధీరజ్‌కుమార్ మిశ్రా తెలిపారు. బుధవారం ఇక్కడ నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన జేఈఈ అర్హత పరీక్షలో ర్యాంకులు సాధించిన విద్యార్థుల వివరాలను వెల్లడించారు. ఇందిరానగర శాఖలో ఆదర్శ కుమార్ బెహరా శిక్షణ పొందుతున్నారని తెలిపారు. ఆయుష్ ఎస్.కూలేకర్(99.98శాతం), ప్రనిల్ సింఘ్వి(99.96), ఆదర్శ దాస్(99.89), గోకుల్ హరికృష్ణన్(99.88),నమన్ అగర్వాల్(99.85) తదితర 16మంది విద్యార్థులు మొదట ర్యాంకులు సాధించారని వివరించారు.

చరవాణి వద్దన్నారని.. విద్యార్థి బలవన్మరం

రామనగర, న్యూస్‌టుడే: మైసూరు రోడ్డులోని ఆదిత్య కళాశాలలో సైన్సు గ్రూపు విద్యార్థి శ్రీనివాస్ అయిదో అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధితుడ్ని తక్షణమే హారోహళ్లిలోని ఆసుపత్రిలో చేర్పించారు. కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడిన బాధితుడు చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మరణించాడు. చరవాణి, స్నేహితులను విడిచి తల్లిదండ్రులు చదువుకోమన్నందుకు అతను ఆత్మహత్య చేసుకున్నాడని హారోహళ్లి ఠాణా పోలీసులు అనుమానిస్తున్నారు.

పోక్సో కేసు నిందితుడికి 20 ఏళ్ల జైలు

ముళబాగిలు, న్యూస్‌టుడే: బాలికను అపహరించి అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి కోలారు పోక్సో కోర్టు శిక్ష విధించింది. ముళబాగిలు తాలూకా కృష్ణగిరి గ్రామానికి చెందిన 26 ఏళ్ల బాలకృష్ణ అలియాస్ బాలు 16 సంవత్సరాల బాలికను అపహరించి అత్యాచారం చేశాడని కోలారు మహిళా పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఆరోపణలు రుజువైన తర్వాత న్యాయమూర్తి కె.బి.ప్రసాద్ బుధవారం తీర్పు వెలువరించారు. నిందితుడికి 20 ఏళ్ల కారాగార శిక్ష, రూ.30 వేల జరిమానా విధిస్తూ బాధిత బాలికకు పరిహారంగా రూ.4 లక్షలు ఇవ్వాలని ఆదేశించారు.

విద్యార్థులకు ఆరోగ్య అవగాహన శిబిరం

కళాశాలలో శిక్షణ ఇస్తున్న శిక్షకులు

డెంకణీకోట న్యూస్ టుడే: స్థానిక పాలిటెక్నిక్ కళాశాల్లో చదివే విద్యార్థులకు బుధవారం ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జీవన విద్య, ఎయిడ్స్‌పై అవగాహన శిబిరం నిర్వహించారు. బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శరీరంలో చోటుచేసుకొనే మార్పులు, మత్తు పదార్థాల వాడుక, నిషేధం, పొగాకు, మత్తు వల్ల కల్గుతున్న హాని తదితర విషయాలపై అవగాహన, శిక్షణ ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపల్ రాజా అధ్యక్షతన ఏర్పాటైన కార్యక్రమంలో ఆరోగ్య కౌన్సిలర్ జయ, గోవిందరాజు, రాజ్‌కుమార్, కుమరన్, లెక్చరర్ తన్వీర్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి లక్ష్మీనరసింహుణ్ని దర్శించుకున్న మంత్రి

కదిరి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీసతు జిల్లా కదిరిలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని కర్ణాటక పౌరసరఫరాల శాఖ మంత్రి కేహెచ్ మునియప్ప కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. బుధవారం బెంగుళూరు నుంచి ప్రత్యేక కాన్వాయ్‌లో కదిరి చేరుకున్నారు. ఆలయంలో ఆయనకు ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరెడ్డి, అర్చకులు, రెవెన్యూ అధికారులు స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం వేదపండితులు లక్ష్మీనరసింహస్వామి చిత్రపటాన్ని మంత్రికి అందజేశారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగిని మృతి

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే: విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో కాజల్జా (25) అనే యువతి మరణించింది. ఒడిశాకు చెందిన ఆమె నోబ్రోకర్.కామ్‌లో ఉద్యోగిని. విధులు ముగించుకుని సహోద్యోగి బైకుపై వెళ్తుండగా వేగంగా వచ్చిన టెంపో ట్రావెలర్ ఢీకొంది. ఘటనలో బైకుపై ఉన్న ఇద్దరూ చెరో వైపునకు పడిపోయారు. కాజల్జా పైనుంచి వాహనం దూసుకెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. మైక్రోలేఅవుట్ ట్రాఫిక్ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు..

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: దొడ్డబళ్లాపుర సమీపంలోని గుండనగరె సమీపంలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో రాజ కుమార్ (25) అనే యువకుడు కన్నుమూశాడు. అతని బైకును ఎదురుగా వచ్చిన కేఎస్ఆర్టీసీ బైకు ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. కారకుడైన డ్రైవరును అరెస్టు చేసిన దొడ్డబళ్లాపుర గ్రామీణ ఠాణా పోలీసులు బస్సును స్వాధీనం చేసుకున్నారు.

జాతరలో బండి నుంచి పడి..

మైసూరు, న్యూస్‌టుడే: టి నరసీపుర తాలూకా తలకాడులో గ్రామ దేవత బండరసమ్మన ఉత్సవాల్లో ఎడ్ల బండి నడుపుతూ కింద పడి గాయపడిన ప్రవీణ్ (22) అనే యువకుడు చికిత్స పొందుతూ కన్నుమూశాడు. బండిని వేగంగా నడిపే సమయంలో నియంత్రణ కోల్పోయి కింద పడిన అతణ్ని తలకాడు ఆసుపత్రిలో చేర్పించి, ప్రథమ చికిత్స అందించి, మెరుగైన చికిత్సకు మైసూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం అతను మరణించాడు. తలకాడు ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పరిహారం ఇవ్వడం లేదని అర్జీ

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే: కరోనా మహమ్మారి సమయంలో 323 మంది మరణిస్తే, వారిలో ఏడుగురి కుటుంబాలకు మాత్రమే పరిహారం ఇచ్చారంటూ ఆరోపిస్తూ దావణగెరెకు చెందిన తాహిర్ హుసేన్ అనే వ్యక్తి ప్రజా హిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. అన్ని రవాణా కార్పొరేషన్లు, మండళ్లు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నాయని, సిబ్బందికి వేతనం ఇవ్వడం కూడా కష్టమైందని రవాణా శాఖ తరపు న్యాయవాదులు ఉన్నత న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లారు. శక్తి పథకాన్ని జారీ చేయడంతో నష్టాలు తీవ్రం అయ్యాయని వివరించారు. శక్తి పథకం కింద ప్రభుత్వం నుంచి రావలసిన బకాయిల వివరాలను తమకు అందించాలని ఆదేశించిన న్యాయస్థానం తదుపరి విచారణను వాయిదా వేసింది.

హత్య చేసి, మృతదేహాన్ని కాల్చేశారు

హాసన, న్యూస్‌టుడే: ఆలూరు తాలూకా రాజనహళ్లి సమీపంలోని నిర్జన ప్రదేశంలో ఆర్‌బి వీరణ్ణ (58) అనే ఆర్టీసీ డ్రైవరు హత్యకు గురయ్యాడు. హంతకులు అతణ్ని హత్య చేసి, ఒంటిపై పెట్రోలు పోసి పరారయ్యారు. పూర్తిగా కాలిన స్థితిలో అతని మృతదేహాన్ని గురించారు. వీరణ్ణకు, అతని సోదరుని కుటుంబానికి సుమారు ఎనిమిది ఎకరాల భూ వివాదాలు ఉన్నాయి. ఘటనా స్థలాన్ని ఎస్పీ శుభన్విత భేటీ అయ్యారు. ఆలూరు ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అపహరణ: ముగ్గురి అరెస్టు

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే: బేగూరు అక్షయ నగరలో పని చేస్తున్న బిహారు వాసి అతీశ్ ఝా అనే యువకుణ్ని అపహరించిన మంజునాథ్, ప్రజ్వల్, అక్షయ్ అనే నిందితులను ఎలక్ట్రానిక్ సిటీ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. స్పా నుంచి తన మేనేజరు మనుకుమార్‌తో బైకులో ఇంటికి వెళ్తున్న అతణ్ని బెట్టదాసనపుర వద్ద దుండగులు అడ్డగించారు. అతీశ్ కాలిపై మచ్చుకత్తితో కొట్టి అడ్డగించి, తమతో కారులో తీసుకువెళ్లారు. మనుకుమార్ వారి నుంచి తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమకు రూ.2 లక్షల నగదు ఇస్తేనే అతీశ్‌ను విడిచి పెడతామని స్పా యజమాని ప్రకాశ్ మండల్‌కు ఫోన్ చేసి బెదిరించారు. కాల్ రికార్డింగ్ ఆధారంగా పోలీసులు కార్యాచరణ నిర్వహించి నిందితులను అరెస్టు చేశారు. దాడిలో గాయపడిన బాధితుడ్ని చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించారు.

జీవ వైవిధ్యానికి భంగం కలిగించ లేదు

మడికేరి: కొడగు జిల్లాలో జీవ వైవిధ్యానికి భంగం కల్గకుండా గత రెండేళ్లలో ఒక్క చెట్టును కూడా కొట్టకుండా రిసార్టును నిర్వహిస్తున్నామని తాజ్ సంస్థ ప్రకటించింది. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని 180 ఎకరాల్లో నిర్మించిన తాజ్ మడికేరి రిసార్టులో కేవలం 30 ఎకరాలను మాత్రమే నిర్మాణానికి వినియోగించుకోవడంతో తమకు ఎర్త్ చెక్ సంస్థ నుంచి గోల్డ్ ప్రమాణీకరణ పురస్కారానికి ఎంపికయ్యామని టాటా సంస్థ ప్రతినిధులు తెలిపారు. సహజమైన వెలుగును, సంస్కరించిన నీటితో ఫ్లషింగ్, మొక్కల పెంపకానికి వినియోగించుకుంటున్నారు. తమ రిసార్టు పరిధిలో 310 జాతుల పక్షులు, 62 జాతుల సీతాకోకచిలుకలు, 79 జాతుల క్షీరదాలు, 32 జాతుల కప్పలు ఉన్నాయి. వాయు, శబ్ద కాలుష్యం లేకుండా సముద్ర మట్టానికి 1200 మీటర్ల ఎత్తులో నిర్మించిన రిసార్టుకు లభించిన గోల్డ్ ప్రామాణీకరణ పురస్కారంతో మా బాధ్యతలు మరింత పెరిగాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

కాలిపోయిన ఆభరణాలు, నగదు

డెంకణీకోట న్యూస్‌టుడే: అంచెట్టి శివారు వన్నాత్తిపట్టిలో ఆకస్మికంగా ఇంటికి నిప్పంటుకొని కాలిబూడిదయింది. ఈ ప్రమాదంలో పిల్లలు సురక్షితంగా ఇంటి నుంచి బయటకు వచ్చి ప్రాణాలు కాపాడుకొన్నారు. ఈ దుర్ఘటనలో ఇంట్లో ఉన్న 8 గ్రాముల బంగారు ఆభరణాలు, డబ్బు రూ. 40000 కాలిపోయాయి. భవన నిర్మాణాల మేస్త్రి మాదేశ్(32) అతని భార్య వరలక్ష్మి(27) దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. పగలు ఇద్దరూ పనికి వెళ్తారు. మంగళవారం భార్యా భర్తలిద్దరూ పనికి వెళ్లిపోయారు. ఇంట్లో పిల్లలిద్దరే ఉండగా సాయంత్రం హఠాత్తుగా ఇంటికి నిప్పంటుకొంది.

21న నగరంలో అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం

ఆశాజ్యోతి

మనుబళిగార్

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే: నగరంలోని కేంద్రసాహిత్య అకాడమి (దక్షిణ ప్రాంత) ఈనెల 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో ఉపన్యాస కార్యక్రమాలు నిర్వహించనుంది. జ్ఞానజ్యోతినగర కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ప్రముఖ రచయిత, సాహిత్య అకాడమి సలహామండలి సభ్యుడు డాక్టర్ మనుబళిగార్ అధ్యక్షత వహిస్తారు. బెంగుళూరు విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ముఖ్యులు డాక్టర్ కొలకలూరి ఆశాజ్యోతి తెలుగులో ఉపన్యసిస్తారు. మహేశ్ కుమార్ (కన్నడ), ఎల్.రామమూర్తి (తమిళం), సుధాకరన్ రామంతళి (మలయాళం) తమ ప్రసంగాల్లో మాతృభాషల వైశిష్ట్యాన్ని వివరించనున్నారు. ఈ సందర్భంగా అకాడమి వివిధ భాషలకు చెందిన పుస్తకాల ప్రదర్శనను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పుస్తకాభిమానులు డిస్కౌంటు ధరలో కొనుగోలు చేయవచ్చు.

జిల్లా కొత్త దళపతి నింగప్ప

జేడీఎస్ జిల్లా కార్యాలయంలో నూతన జిల్లా అధ్యక్షుడు నింగప్పకు పార్టీ జెండాను అప్పగిస్తున్న అంజినప్ప

తుమకూరు, న్యూస్‌టుడే: జిల్లాలోని జేడీఎస్ బలోపేతానికి 11విధానసభా నియోజకవర్గ కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు కలసికట్టుగా కృషి చేయాలని జిల్లా జెడిఎస్ నూతన అధ్యక్షుడు హెచ్.నింగప్ప పిలుపు నిచ్చారు. 2028 విధానసభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు అధికస్థానాలు కైవశం చేసుకోవడం ద్వారా పార్టీకి పూర్వ వైభవం వస్తుందన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భాజపా, జేడీఎస్ మళ్లీ కూటమిగా గెలుపు వైపు దూసుకొని పోవడం ఖాయమన్నారు. ఈ సందర్భంగా మాజీ అధ్యక్షుడు ఆర్. సి.అంజినప్ప పార్టీ జెండాను నూతన అధ్యక్షుడు నింగప్పకు అప్పగించారు. కార్యక్రమంలో దళ్ ప్రతినిధులు ఉగ్రేశ్, ఎస్.ఆర్‌గౌడ, ముదిమడు రంగస్వామి, నాగరాజు, మహిళా ప్రతినిధులు మాజీ మంత్రి నాగరాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం వాహనం బోల్తా

పావగడ,న్యూస్‌టుడే: తాలూకాలోని దొమ్మతమర్రి సమీపంలో ఏటీఎం వ్యాను బోల్తా పడిన దుర్ఘటనలో అందులో ప్రయాణిస్తున్న ఉద్యోగి చందన్(40) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గుబ్బి తాలూకా కల్లర్దుగెరె గ్రామానికి చెందిన గురులింగప్ప కుమారుడు చందన్ ఇండియా వన్‌లో క్యాష్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. చందన్, అల్తాఫ్, గిరీశ్, సెక్యూరిటీ గార్డుతో కలిపి నలుగురు మంగళవారం దొమ్మతమర్రి గ్రామంలో ఏటీఎంలో నగదు నింపి మధుగిరికి తిరుగు ప్రయాణంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ప్రమాదం పాలయ్యారు.



(c) eenadu

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

తొలగించిన చోటే విగ్రహాలు ఏర్పాటు చేయాలి

మాన్వి, న్యూస్‌టుడే: రాయచూరు సమీపంలో సాత్‌మైల్ నుంచి సింధనూరు పీడబ్ల్యూడీ క్యాంపు వరకు చేపట్టిన నాలుగు వరుసల ముఖ్య రహదారి నిర్మాణ పనులు నిబంధనలకు వ్యతిరేకంగా, ఇష్టానుసారంగా జరుగుతున్నాయని వివిధ దళిత సంఘాల ప్రముఖులు, సంచాలకులు ఆరోపించారు. బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. హిరేకొట్నేకల్, అమరేశ్వరక్యాంపుల వద్ద రోడ్డు పనుల్లో భాగంగా అంబేడ్కర్ నామఫలకాలు, విగ్రహాన్ని తొలగించారు, రోడ్డు పనులు పూర్తైన తర్వాత యథాస్థానంలో నెలకొల్పుతామని తహసీల్దార్, రోడ్డు పనులు చేస్తున్న గుత్తేదారు అధికారులు నమ్మించి ఇప్పుడు తమకు సంబంధమే లేనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల లోపు వాటిని యథాస్థానంలో నెలకొల్పకుంటే దళిత సంఘాల ఆధ్వర్యంలో రోడ్డు పనుల్ని అడ్డుకోవటమే కాకుండా రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు.

పరీక్షల నిర్వహణపై సన్నాహక సమావేశం

రాయచూరు, న్యూస్‌టుడే: ఈ నెల 28 నుంచి మార్చి 17 వరకు జరుగనున్న ద్వితీయ పీయూసీ పరీక్షల నిర్వహణపై చర్చించేందుకు 21న సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా పాలనాధికారి సభా భవనంలో ఉదయం 11 గంటలకు సమావేశం మొదలవుతుంది. జిల్లా పాలనాధికారి నీతీశ్ అధ్యక్ష వహిస్తారు. సంబంధిత అధికారులు తప్పక హాజరుకావాలని డీసీ కార్యాలయాధికారులు కోరారు.

25న జిల్లా స్థాయి దిశ కమిటీ భేటీ

బళ్లారి, న్యూస్‌టుడే: జిల్లా అభివృద్ధి సమన్వయ స్టీరింగ్ కమిటీ 'దిశ' కమిటీ మూడో త్రైమాసిక సమావేశం ఫిబ్రవరి 25న ఉదయం 11 గంటలకు జిల్లా పంచాయతీ నజీర్ సభాభవనంలో నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో మహమ్మద్ హ్యారీస్ సుమైర్ తెలిపారు. దిశ కమిటీ సమావేశానికి లోక్‌సభ సభ్యుడు ఇ.తుకారామ్ అధ్యక్షత వహిస్తారు.

కమిషనర్‌ను సన్మానిస్తున్న క్రైస్తవ పెద్దలు

విద్య, వైద్య సేవలందించిన మిషనరీలు

రాయచూరు, న్యూస్‌టుడే: స్వాతంత్ర్యానికి ముందు, తర్వాత గ్రామాల్లోని పేదలకు క్రైస్తవ మిషనరీలు మెరుగైన విద్య, వైద్యం అందించాయని కలబురగి విభాగ సమాచార కమిషనర్ వెంకట సింగ్ ప్రశంసించారు. ఆయన దేవదుర్గ తాలూకా బొమ్మనాళ గ్రామంలో చర్చి ప్రధాన ద్వారాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ 50 ఏళ్ల క్రితం నిర్మించిన చర్చిని పునరుద్ధరిస్తుండటం సంతోషదాయకమని చెబుతూ తనకు తన కుటుంబానికి ఇక్కడి క్రైస్తవులతో మూడు తరాలుగా అవినాభావ సంబంధముందని తెలిపారు. ఈ గ్రామంలోని తమ ఇంట్లో ప్రార్థనలు చేసుకునేందుకు గతంలోనే అవకాశం కల్పించామని, అదే గృహంలో సముదాయ భవనాన్ని కట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సిరివార మెథడిస్టు చర్చి పర్యవేక్షకుడు సుందర్‌లాల్ శామ్యూల్ మాట్లాడుతూ బొమ్మనాళలో భవ్యమైన ప్రార్థనా మందిరాన్ని త్వరగా నిర్మిస్తామని వెల్లడించారు. కమిషనర్‌ను క్రైస్తవ ముఖ్యులు జాన్, దేవప్ప, సురేశ్, ఆనంద్, శాంతరాజు, రాజు, ఏసప్ప తదితరులు సన్మానించారు.

పట్టణంలో 140 నిఘా కెమెరాలు

సింధనూరు, న్యూస్‌టుడే: పట్టణంలో రోజు రోజుకీ పెరుగుతున్న రద్దీ, అంతేస్థాయిలో రోడ్డు ప్రమాదాలు, నేరాల సంఖ్య క్రమబద్ధీకరించి ప్రజాసౌకర్యం కోసం సింధనూరు పోలీసులు కేకేఆర్‌డీబీ నుంచి మంజూరైన 140 నిఘా కెమెరాలను వివిధ రద్దీ కూడళ్లు, ప్రధాన వీధుల్లో ఏర్పాటు చేశారు. వీటి కంట్రోల్ కేంద్రం స్థానిక టౌన్ పోలీసు స్టేషనులో పెట్టారు. ఇవి 24 గంటలూ పనిచేసే విధంగా అమర్చారు. ఎటువంటి చిన్నపాటి నేర సంఘటన అయినా ఇట్టే పసిగట్టేలా చర్యలు తీసుకునే భాగంలో వీటిని ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ చంద్రశేఖర్ వెల్లడించారు. ఇటీవల ఈ కంట్రోల్ గదిని ఎమ్మెల్యే బాదర్లి హంపనగౌడ పరిశీలించారు. స్థానిక గాంధీకూడలి, ప్రయాణ ప్రాంగణం తదితర పూర్తి రద్దీ ప్రాంతాల్లో మరో రెండేసి నిఘా కెమెరాలు అమర్చే ఉద్దేశంలో ఉన్నట్లు పోలీసు అధికారులు స్పష్టం చేశారు.

ఏర్పాటు చేసిన ఓ నిఘా కెమెరా

కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే పాటిల్

విద్యార్థులకు పథకాలు అందితేనే సార్థకత

రాయచూరు, న్యూస్‌టుడే: విద్యాభివృద్ధికి ప్రవేశపెట్టిన పథకాలు విద్యార్థులకు అందినప్పుడే ప్రభుత్వ ఉద్దేశం నెరవేరుతుందని, యోజనలకు సార్థకత చేకూరుతుందని రాయచూరు శాసనసభ్యుడు శివరాజ్ పాటిల్ పేర్కొన్నారు. ఆయన బుధవారం నగరంలోని ప్రభుత్వ బాలికల పీయూసీ కళాశాల్లో నూతన తరగతి గదులను ప్రారంభించారు. అనంతరం వార్షికోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. కళాశాల పాలక మండలి అధ్యక్షుడు రవీంద్ర జల్దార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే గత 12 ఏళ్లల్లో 34 గదుల నిర్మాణానికి నిధులు కేటాయించారని వివరించారు. పీయూసీ విభాగం బాధ్య ఉప నిర్దేశకుడు సోమశేఖరప్ప, అధ్యాపకులు నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆదిలోనే అక్షరానికి సంకెళ్లు

విధానసౌధలో నిబంధనలు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : విధానసౌధకు వెళ్లి వార్తలు సేకరించే విలేకరులపై రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు విధించే ప్రయత్నాలు చేపట్టింది. దానిపై మాధ్యమ సంస్థలతో పాటు పాత్రికేయ సంఘాలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నాయి. భద్రత కారణంగా ఆంక్షలు విధించక తప్పడం లేదని సిబ్బంది పరిపాలన శాఖ అధికారులు తెలిపారు. మాధ్యమ ప్రతినిధులు విధానసౌధలో గుర్తించిన ప్రదేశంలో మాత్రమే ఉండి మంత్రులు, శాసనసభ్యులు, అధికారులు తదితరుల నుంచి వార్తలు సేకరించాలని సూచించారు. ఎప్పటిలాగే ఇష్టమొచ్చినట్లు నడవాలో తిరగడానికి అనుమతించబోరు. నగరాభివృద్ధిశాఖ మంత్రి భైరతి సురేష్ కార్యాలయంలో ఇటీవల కొంత నగదు, బంగారు నగలు మాయమైన విషయం తెల్సిందే. ఆ సంఘటనను సాకుగా తీసుకుని మాధ్యమాలపై ఆంక్షలు విధించడం మొదలు పెట్టారు. వాటిని దొంగిలించిన ఆ కార్యాలయ ఉద్యోగిని ఇప్పటికే విధానసౌధ ఠాణా పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. భద్రత పేరుతో మాధ్యమ ప్రతినిధులు విధానసౌధలో సంచరించకుండా ఒక ప్రదేశానికే పరిమితం చేసే ప్రయత్నాలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పుట్టిననాడే మృత్యువాత

బెంగళూరు (మహాలక్ష్మి లేఅవుట్): స్నేహితులతో కలిసి పుట్టిన రోజు వేడుకలు ఆచరించుకుని ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో పవన్‌కుమార్ (24) అనే విద్యార్థి కన్నుమూశాడు. తోటదగుడ్డదహళ్లికి చెందిన బాధితుడు ఇంజినీరింగ్ చదువుకుంటూనే పార్ట్‌టైమ్ ఉద్యోగాన్ని చేసేవాడు. తన పుట్టిన రోజు వేడుకలను స్నేహితులతో కలిసి మంగళవారం మధ్యాహ్నం నిర్వహించుకున్నాడు. సాయంత్రం 5.30కు బైకులో కాకోళు డైరీ ఫారం నుంచి ఐఐహెచ్‌ఆర్ వైపు వస్తుండగా, వేగంగా వచ్చిన గూడ్సు వాహనం ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. ప్రమాద తీవ్రతకు పవన్ కుమార్ అక్కడికక్కడే మరణించాడు. ప్రమాదానికి కారకుడైన డ్రైవరు వాహనాన్ని అక్కడే వదిలి పరారయ్యాడు. చిక్కబాణవార ట్రాఫిక్ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

18-02-2026 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1602.03	1611.45
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	000	000
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	429	9,110
నీటి నిల్వ (టి.ఎం.సి)	24.255	40.512

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

నీటి ఎద్దడి రాకుండా పటిష్ఠ చర్యలు

మాన్వి,న్యూస్‌టుడే: మాన్వి, సిరివార ఉభయ తాలూకాల్లో ఎక్కడా నీటి సమస్య తలెత్తడానికి వీలులేదని, ఏమైనా సమస్యలు ఇబ్బందులుంటే ఇప్పుడే పరిష్కరించుకోవాలని రాష్ట్ర చిన్ననీటిపారుదల, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి ఎన్.ఎస్. బోసురాజు అధికారులకు ఆదేశాలిచ్చారు. బుధవారం సిరివార, మాన్వి తాలూకా అధికారులతో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఆయన ఈ మేరకు అధికారులు, సిబ్బందికి సూచనలిచ్చారు. పనిచేయని పంపుసెట్లు, బోరుబావులను తక్షణం మరమ్మతు చేయించాలని, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడా ట్యాంకర్లతో నీరు సరఫరా చేసే పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. 393 బోరుబావులు పనిచేస్తున్నాయని,

అధికారులకు సూచనలిస్తున్న మంత్రి బోసురాజు

124 జలశుద్ధికేంద్రాలు అందుబాటులో ఉన్నాయని, 61 చెరువుల్లో నీరు నింపామని మార్చి చివరి వరకు నీరు సరిపోతుందని, కల్లూరు, అత్తనూరు, హిరేహణగి గ్రామాల్లో నీటి సమస్య అధికంగా ఏర్పడుతుందని అధికారులు సభలో మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అమృత-2 యోజన నిధుల్లో కోత విధించరాదని దీంతో పట్టణంలోని కొన్ని వార్డుల్లో పనులు చేయటానికి వీలు కావటం లేదన్నారు. పట్టణంలో కొత్తగా 8చోట్ల నీటి తొట్టెలు నిర్మించే పనులు కొనసాగుతున్నాయన్నారు. అమృత, జె.జె.ఎమ్ పనులు పూర్తైతే పట్టణానికి 12ఎంఎల్‌డీ నీరు అందుబాటులోకి వస్తుందన్నారు. కృష్ణా, తుంగభద్ర నదుల నుంచి నీటి సరఫరా చేసే పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే హంపయ్యనాయక్, అమరేశప్ప, గఫూర్‌సాబ్, తహసీల్దార్లు భీమరాయ రామసంద్ర, అశోక్‌పవార్, ముఖ్యాధికారులు పరశురామ దేవమానే, శశిధర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ అధికారులపై చర్యలకు ఒత్తిడి

రాయచూరు, న్యూస్‌టుడే: మురుగునీటి కాల్వలకు సంబంధించిన పనులను యంత్రంతో కాకుండా మనుషులతో చేయించిన రిమ్స్ అధికారులపై చర్యలు తీసుకోవాలని జాతీయ సఫాయి కర్మచారి సముదాయం ప్రముఖుడు భాస్కర్‌బాబు ఒత్తిడి తెచ్చారు. ఆయన బుధవారం పత్రికా భవన్‌లో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఆధారాలను జిల్లా యంత్రాంగానికి అందచేసినా ఇంతవరకూ ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. గురువారం రాయచూరుకు విచ్చేస్తున్న సఫాయి కర్మచారి కమిషన్ అధ్యక్షుడు రఘును కలిసి వివరిస్తామన్నారు.

సమావేశంలో వివరిస్తున్న భాస్కర్‌బాబు

బహుజన దళిత సంఘర్షణ సమితి ముఖ్యుడు ప్రసాద్ భండారి మాట్లాడుతూ మనుషులతో స్వచ్ఛతా పనులను చేయించకుండా 2013లో సర్వోన్నత న్యాయస్థానం నిషేధించినట్లు వెల్లడించారు. న్యాయాలయం ఆదేశాలను ఉల్లంఘించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఇది వరకే కర్మచారి కమిషన్ కార్యాలయానికి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. సమావేశంలో ప్రతినిధులు నరసింహ, వీరేశ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు కేసులు ఎత్తివేయండి

రాయచూరు, న్యూస్‌టుడే: నగర దళ్(ఎస్) అధ్యక్షుడు బి.తిమ్మారెడ్డి, అతడి కుమారుడిపై పెట్టిన తప్పుడు కేసులను ఎత్తి వేయాలి. పోలీసు ఠాణాలకు వెళ్లేలా ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్ నాయకుడు జి. తిమ్మారెడ్డిపై చర్యలు తీసుకోవాలి. కేసులకు కారణమైన యువజన కాంగ్రెస్ నాయకుడిపై శాంతి భద్రతల ఉల్లంఘన కేసు నమోదు చేయాలని' దళపతులు ఎస్పీ అరుణాంగ్షు గిరికి విజ్ఞప్తి చేశారు. అకారణంగా కేసులు పెట్టారని ఆరోపిస్తూ జిల్లాధ్యక్షుడు విరూపాక్షి నాయకత్వంలో బుధవారం గంజ్ కూడలి నుంచి ఎస్పీ కార్యాలయం వరకు పాదయాత్ర చేపట్టారు. ఎస్పీకి వినతిపత్రాన్ని అందజేసి జరిగిన ఘటనలను వివరించారు. ఆరునెలల్లో జరగనున్న రాయచూరు కార్పొరేషన్ ఎన్నికల్లో దళ్ తరపున పోటీ చేయకుండా ఉండేందుకే కేసులు పెట్టిస్తున్నారని ఫిర్యాదు చేశారు. గత 10 ఏళ్లలో పార్టీలు పరస్పరం ఘర్షణపడ్డా, విద్వేషాలు రగిలినా, ఠాణా మెట్లు ఎక్కిన సందర్భాలు లేవని వివరించారు. కాంగ్రెస్ ఏడాదిగా కొత్త సంస్కృతికి తెరతీసిందని, దళితులు, నిరుద్యోగులను తమ స్వార్థం కోసం ఉపయోగించుకొంటోందని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్పనాయక్, జిల్లా కార్యాధ్యక్షుడు శివశంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహంతేశ్ పాటిల్, నాయకులు సణ్ణ నరసింహనాయక్, ఈరణ్ణ యాదవ్, రామకృష్ణ, ఆదిరాజ్ తదితరులు హాజరయ్యారు.

ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న దళపతులు

హోటల్లోకి దూసుకెళ్లిన కారు పలువురికి గాయాలు

లింగసుగూరు,(మాన్వి): పట్టణ శివారులో బుధవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వివరాలు. దేవదుర్గ వైపు నుంచి లింగసుగూరుకి వస్తున్న సఫారి కారు రోడ్డు పక్కనున్న హోటల్లోకి దూసుకుపోయి బోల్తా కొట్టింది. దేవదుర్గ ఏపీఎంసీ అధ్యక్షుడు ఆదనగౌడకు చెందిన కారుగా గుర్తించారు. కారు అతివేగంగా నడపటం అదుపు తప్పి బోల్తాకొట్టిందని పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగినపుడు ఖానావళి మూసి ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. వాహనంలో ప్రయాణిస్తున్న చంద్రు, మల్లికార్జున, సోమనాథ్, చంద్ర అనే వారికి స్వల్ప గాయాలయ్యాయి. హోటల్ ముందు భాగం ప్రమాదం ధాటికి కూలిపోగా, కారు పాక్షింగా దెబ్బతింది. పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించారు.

సర్వజ్ఞ జయంతిని ఘనంగా నిర్వహిస్తాం

రాయచూరు, న్యూస్‌టుడే: జిల్లా యంత్రాంగం సహకారంతో ఈ నెల 20న త్రిపది కవి సర్వజ్ఞ జయంతిని ఘనంగా ఆచరిస్తామని జిల్లా కుంబారుల సంఘం గౌరవాధ్యక్షుడు సురేంద్రబాబు వెల్లడించారు. ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నగరంలో చిత్రపటంతో నిర్వహించే ఊరేగింపు కార్యక్రమం, రంగమందిరంలో జరిగే జయంత్యుత్సవంలో ఏడు తాలూకాలకు చెందిన కుంబార సామాజిక వర్గం ప్రజలు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి, పీయూసీలో అత్యధిక మార్కులు సాధించిన కుంబార విద్యార్థులకు ప్రతిభా ప్రోత్సాహకాలను ప్రదానం చేస్తామని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులను ఆహ్వానించామన్నారు. సమావేశంలో జిల్లాధ్యక్షుడు శివరాజ్, ప్రతినిధులు లక్ష్మిరెడ్డి, నరసింహులు, భీమణ్ణ ఉన్నారు.

సురేంద్రబాబు

ఉప కాల్వలపై నిషేధాజ్ఞలు

రాయచూరు, న్యూస్‌టుడే: దేవదుర్గ తాలూకాలోని గణేకల్ జలాశయం నుంచి రాయచూరులోని రాంపూర్ చెరువుకు నీటి సేకరణకు తుంగభద్ర ఎడమకాల్వ ఉపకాల్వల చుట్టూ నిషేధాన్ని విధించారు. 95, 96, 98, 98 ఏ, 99 ఏ, 99, 100 ఉప కాల్వల పరిధిలో ఈ నెల 17వ తేదీ అర్ధరాత్రి మొదలైన ఆజ్ఞలు ఫిబ్రవరి 21వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు కొనసాగుతాయి. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ఉండేందుకు 100 మీటర్ల పరిధిలో విధించినట్లు జిల్లా పాలనాధికారి నీతిశ్ వెల్లడించారు. నగరంలోని 40 శాతం ప్రాంతానికి రాంపూరు చెరువు ద్వారా, మిగిలిన ప్రదేశాలకు కృష్ణా నీటిని సరఫరా చేస్తారు.

ప్రసంగిస్తున్న శిక్షకుడు మహేశ్

స్ఫూర్తిదాయకమైన బోధనలు అవసరం

రాయచూరు, న్యూస్‌టుడే: 'ఆదర్శవంతమైన గురువుగా మారాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. స్ఫూర్తిదాయక బోధనలు చేయాలి. సేవా మనోభావాన్ని నేర్పించాలని' ధారవాడ కార్పొరేటర్ ట్రైనర్ మహేశ్ ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా, తాలూకా కసాప, ప్రైవేటు విద్యా సంస్థల ఒక్కూట సంయుక్తంగా బీఈడీ విద్యార్థులకు బుధవారం స్థానిక ఎస్ఆర్‌కే విద్యాలయంలో 'వర్తమానంలో ఉపాధ్యాయుడి పాత్ర' అనే అంశంపై సదస్సును ఏర్పాటు చేసింది..దీన్ని ప్రారంభించిన మహేశ్ ఉపన్యసిస్తూ ప్రేరణ కల్గించేందుకు పాఠ్యాతేర విషయాలను బోధించాలని కోరారు. విద్యా సంస్థల ఒక్కూట కోశాధ్యక్షుడు దరూరు బసవరాజ పాటిల్ ప్రసంగిస్తూ గతంలో కార్యక్రమానికి ముందు గురువుల సలహాలు తీసుకునే వారని, మార్గదర్శకంలో నడిచేవారని తెలిపారు. తాలూకా కసాప అధ్యక్షుడు విజయ రాఘవేంద్ర మాట్లాడుతూ కన్నడ సాహిత్య కార్యకలాపాల విస్తరణతో సహా విద్యా సంబంధమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు.

లాభాల పట్టుగొమ్మ!



సిద్ధరామయ్యకు చెక్కు అందిస్తున్న మంత్రి వెంకటేశ్, మండలి అధ్యక్షురాలు ఖానీజ్‌ఫాతిమా

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కర్ణాటక పట్టు పరిశ్రమ అభివృద్ధి మండలి లాభాల బాటలో పయనించడం ఆశావహ పరిణామమని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రశంసించారు. రానున్న బడ్జెట్లో సంస్థ ఉన్నతికి అవసరమైన నిర్ణయాలు తీసుకోవడానికి ప్రయత్నిస్తామని భరోసా ఇచ్చారు. సంస్థ లాభాల్లో రూ.30.34 కోట్ల డివిడెంట్‌తో కూడిన చెక్కును బుధవారం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అందుకున్నారు. ఆ లాభాల్లో రూ.2 కోట్లు సీఎం సహాయ నిధికి ప్రత్యేకించారు. ఈసందర్భంగా మంత్రి వెంకటేశ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శాలిని రజనీశ్, పట్టు పరిశ్రమ అభివృద్ధి మండలి అధ్యక్షురాలు ఖానీజ్‌ఫాతీమా తదితరులు హాజరయ్యారు.

శోభిల్లుతున్న కోదండరామాలయం

మాన్వి,న్యూస్‌టుడే: తాలూకాలోని నుగడోణి హోసూరు క్యాంపులో భక్తులు కోదండరామాలయం నిర్మించారు. ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమానికి సంబంధించి ఘనంగా ఏర్పాట్లు చేశారు. శుక్రవారం రాష్ట్ర చిన్ననీటిపారుదల శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి ఎన్.ఎస్.బోసురాజు, లోక్‌సభ సభ్యుడు జి.కుమార్‌నాయక్, ఎమ్మెల్యే హంపయ్యనాయక్ తదితరులు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొనున్నారు. జిల్లాలోని వివిధ క్యాంపుల్లోని ప్రముఖులు, బంధుమిత్రులకు శ్రీరామ సేవా సమితి సభ్యులు ఆహ్వాన పత్రికల్ని అందించారు. గురువారం విగ్రహ ప్రతిష్ఠకు ముందు పూజలు, ధార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు భక్తులు తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

నుగడోణి హోసూరు క్యాంపులోని ఆలయం

న్యాయస్థానం మెట్లెక్కిన 'ఆంథ్రోపిక్'

బెళగావి, న్యూస్‌టుడే : ఐటీ రంగంలో కృత్రిమ మేధ సంస్థ 'ఆంథ్రోపిక్' సృష్టించిన అలజడి ఇంకా తగ్గలేదు. టెక్ కంపెనీలు, ఉద్యోగులను భయపెట్టిన ఈ అమెరికా అంకుర పరిశ్రమకు ఇప్పుడు బెళగావిలో న్యాయపరమైన చిక్కులు ప్రారంభమయ్యాయి. అమెరికా ఏఐ కంపెనీ ట్రేడ్‌మార్కు నిబంధనలు ఉల్లంఘిస్తోందంటూ బెళగావిలోని ఆంథ్రోపిక్ సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ అయాజ్ ముల్లా ఆరోపించారు. ఈ అంశంపై తాజాగా బెళగావి కమర్షియల్ డివిజన్ అండ్ డిస్ట్రిక్ట్ న్యాయస్థానంలో ఫిర్యాదు చేశారు. గత సోమవారం నాటి విచారణకు అమెరికాలోని ఆంథ్రోపిక్ సంస్థ ప్రతినిధులు గైర్హాజరయ్యారు. తదుపరి విచారణను మార్చి 9కి వాయిదా వేసిన న్యాయస్థానం అమెరికా సంస్థ ప్రతినిధి ఇరినా ఘోష్‌కు సమన్లు జారీ చేసింది. 'తమ సంస్థ చిన్నదే అయినా, బ్రాండ్ పేరును 2017 నుంచి వినియోగిస్తున్నాం. విద్య, అనుసంధానం, సురక్షత తదితర రంగాల్లో డిజిటల్ ప్లాట్‌ఫారాలను అభివృద్ధి చేశాం. ఆంథ్రోపిక్.ఇన్ పేరిట కార్యకలాపాలు సాగిస్తున్నాం. అమెరికాకు చెందిన ఆంథ్రోపిక్ 2021లో ప్రారంభమైంది. మా పేరును వినియోగించి వారు అంకుర పరిశ్రమను ప్రారంభించారు. సామాజిక మాధ్యమంలోనూ అదే పేరును వినియోగిస్తున్నారు. మా వ్యాపారంపై తీవ్ర ప్రభావం పడి, నష్టపోవలసి వస్తోంది' అని మహ్మద్ అయాజ్ ముల్లా ఆందోళన వ్యక్తం చేశారు.

మహ్మద్ అయాజ్ ముల్లా

బెళగావిలోని ఆంథ్రోపిక్ కార్యాలయం

స్టేషను దారి పనులు పునఃప్రారంభం

నీటిపారుదల అధికారులు, స్థానికులతో సమావేశమైన ఎమ్మెల్సీ బసనగౌడ బాదర్లి

సింధనూరు, న్యూస్‌టుడే: వివిధ అభ్యంతరాలతో నిలిచిన రైల్వే స్టేషను మార్గం సీసీ రహదారి, మురుగుకాలువ నిర్మాణ పనులు బుధవారం తిరిగి ప్రారంభమయ్యాయి. పట్టణ పరిధిలో ఉన్న నీటిపారుదల శాఖ వారి 40వ కాలువ గట్టు కుడివైపు 66 అడుగులు, ఎడమ వైపు 30 అడుగుల దారి ఉండగా తొలుత గుత్తేదారులు తమకు అందిన సూచనలతో 66 అడుగుల దారిలో కేవలం 36 అడుగుల మేరకే దారిని నిర్మించేందుకు సిద్ధమయ్యారు. దీనిపై ఆ మార్గంలోని ప్రజలు, మాజీ ఎంపీ అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ఎమ్మెల్యే సూచనలతో తాత్కాలికంగా పనులు నిలిపారు. ఇదే అంశంపై విధాన పరిషత్ సభ్యుడు బసనగౌడ బాదర్లి బుధవారం నీటిపారుదల అధికారుల సమావేశం జరిపి స్టేషను రహదారి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. సమావేశంలో తుంగభద్ర ఎడమ కాలువ ఈఈ సత్యనారాయణ శెట్టి పాల్గొన్నారు. కాలువకు ఇరువైపులా గల గట్లలో..ఎడమవైపు 30 అడుగులు, కుడి వైపున 66 అడుగుల వెడల్పుతో సీసీ రోడ్లు నిర్మించమని సూచించారు. ప్రస్తుతం ఉన్న నిధులు చాలకుంటే అదనపు నిధులు మంజూరు చేయిస్తానని నీటి పారుదల అధికారులకు ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. వాణిజ్య కేంద్రంగా పెరుగుతున్న సింధనూరుకు భవిష్యత్తులో ఈ దారులు విశాలంగా ఉండాల్సిన అవసరం చాలా ముఖ్యమని అన్నారు. ఆగిపోయిన పనులు తిరిగి ప్రారంభం కాగా పరిశీలించారు. వారం పాటు నిర్మించిన మురుగు కాలువ పనులను గుత్తేదారులు అక్కడికే నిలిపేసి ఈసారి స్టేషను వైపు నుంచి మొదలుపెట్టారు.

పాత పనులు అక్కడికే ఆపేసి..స్టేషను వైపు నుంచి ప్రారంభమైన పనులు

రాజధానిలో జలవిహారం!

మడివాళ చెరువులో పడవ సంచారం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాజధాని నగరానికి మరిందరు పర్యాటకులను ఆకర్షించడానికి సర్కారు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఉద్యాననగరిలోని ప్రధానమైన చెరువుల్లో చిరు పడవల విహారానికి అనుమతించింది. తొలి విడతలో పది చెరువులను ఈ పథకం కోసం పర్యాటక శాఖ గుర్తించింది. అందులో ఐదింట పడవ విహారాన్ని చేపట్టి, ప్రజల స్పందన గమనించాక తదుపరి అడుగులు వేయాలని అధికారులు తీర్మానించారు. గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ), పర్యాటక శాఖ సంయుక్తంగా బోటింగ్ వ్యవస్థను అమలులోకి తెస్తారు. ఇలా సమకూరే ఆదాయాన్ని చెరువుల నిర్వహణకే ఉపయోగిస్తారు. ఐదు నగర పాలికెల పరిధిలోని తలా రెండు చెరువులను గుర్తించారు. వాటిలో మాత్రమే విహారానికి చర్యలు తీసుకుంటారు. బెంగళూరు నగరానికి వచ్చే దేశ, విదేశీ పర్యాటకులను ఆకట్టుకునేలా కొత్త వ్యవస్థ సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శాలిని రజనీశ్ ఇటీవల జీబీఏ చీఫ్ కమిషనర్ మహేశ్వరరావుకు లేఖ రాసిన విషయం తెలిసిందే. బెంగళూరు కేంద్ర నగర పాలికె పరిధిలోని హలసూరు, కగ్గదాసపుర, పడమటి నగర పాలికె పరిధిలో నాయండనహళ్లి, శాంకి, ఉత్తర నగర పాలికె విభాగంలో యలహంక, రాచేనహళ్లి, తూర్పు వైపు వెంగయ్యన చెరువు, రాంపుర తటాకాలను ఎంచుకున్నారు. దక్షిణ నగర పాలికె పరిధిలో బేగూరు, మడివాళ చెరువుల్లో పడవల విహారానికి అనువైన ఏర్పాట్లు చేస్తారు. కర్ణాటక రాష్ట్ర పర్యాటక అభివృద్ధి మండలి అవసరమైన నిధులు ప్రాథమికంగా సమకూరుస్తుంది. ఒక్కో పర్యాటకుడి నుంచి వసూలు చేసే రుసుం వివరాలు త్వరలో ప్రకటిస్తామని, ఆ సొమ్మును చెరువుల రక్షణకే వెచ్చిస్తామని చీఫ్ కమిషనర్ మహేశ్వరరావు తెలిపారు.

abhivrudhi
సిల్క్ ఇండియా® 2026
దేశవ్యాప్తంగా పట్టు చీరలు & పట్టు ఉత్పత్తుల ప్రదర్శన మరియు అమ్మకం
బీహార్: సేంద్రీయ టస్సర్ సిల్క్ చీరలు, డ్రెస్సులు మరియు స్టోల్స్ కర్ణాటక: క్రేప్ సిల్క్, జార్జెట్ సిల్క్, ఆరణి సిల్క్ మరియు ప్రింటెడ్ చీరలు తమిళనాడు: కాంజీపురం సిల్క్ చీరలు మరియు డిజైనర్ ఫాన్సీ చీరలు ఆంధ్ర ప్రదేశ్: ధర్మవరం, ఉప్పాడ, గద్వాల్, మంగళగిరి మరియు పోచంపల్లి చీరలు ఉత్తర ప్రదేశ్: లక్నవీ చికన్, పుల్కారీ సిల్క్, జప్వాని, జమావార్ సిల్క్ మరియు షిఫాన్ సిల్క్ మహారాష్ట్ర: డిజైనర్ డ్రెస్ మెటీరియల్స్ పంజాబ్: పటియాలా డ్రెస్ మెటీరియల్స్ ఒరిస్సా: సంబల్‌పూరి, ఇక్కాట్, బొమ్మాయ్ చీరలు, చేనేత సిల్క్ కటన్ ఛత్తీస్‌గఢ్: ప్రత్యేక రా సిల్క్ చీరలు, కోసా సిల్క్, టస్సర్ డ్రెస్సులు మరియు దుపట్టాలు మధ్యప్రదేశ్: మహేశ్వరీ, చందేరి సిల్క్ చీరలు మరియు డ్రెస్ మెటీరియల్స్ పశ్చిమ బెంగాల్: బలుచారి, ఢాకా మస్లిన్, గిచ చీరలు, బొటీక్ చీరలు, కాంతా చీరలు, జర్దోసి అస్సాం: ముగా మరియు ఇరి సిల్క్ చీరలు జమ్మూ & కాశ్మీర్: షివాన్ సిల్క్, టాబి సిల్క్ ప్రింటెడ్ చీరలు, పష్మీనా షాల్స్ మరియు డ్రెస్ మెటీరియల్స్ రాజస్థాన్: కోటా సిల్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింట్ డ్రెస్ మెటీరియల్స్ మరియు చీరలు గుజరాత్: బాంధనీ డ్రెస్ మెటీరియల్స్ మరియు కుర్తాలు ఇంకా మరెన్నో...
ON THE OCCASION OF WEDDING



Pure Silk Products Across the Country
EXHIBITION cum SALE
Last 4 Days
HOTEL ROYAL FORT
NEW TRUNK ROAD, BALLARI
13 to 22 FEBRUARY 2026
Time : 10.30 am - 8.30 pm
Abhivrudhi Silk India | Silkindia_mysore_since2011 | Entry Free | Contact : 63641 65152, 98977 09954 |

(c) eenadu

కోర్టు ఉద్యోగాల భర్తీకి 20న మౌఖిక పరీక్ష

ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్, ఫ్రంట్ ఆఫీస్ కోఆర్డినేటర్ ఉద్యోగాల భర్తీకి సంబంధించిన రాత పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ది పర్యవేక్షణలో స్థానిక సంకల్‌బాగ్‌లోని ప్రసూన లా కళాశాలలో పరీక్షలు నిర్వహించారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ది, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

- ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల జాబితాను సాయంత్రం 4 గంటలకు విడుదల చేసి ఆన్‌లైన్‌లో ఉంచారు. రికార్డు అసిస్టెంట్ పరీక్షలో ఎం.లక్ష్మీనరసింహశర్మ, పి. ఉరుకుంద, కె.నందిని, ఎం.సోమశేఖర్ నాయక్‌లు ఉత్తీర్ణత సాధించారు. ఫ్రంట్ ఆఫీస్ కోఆర్డినేటర్ పరీక్షలో వి.బాలవెంకట కిషోర్, ఎన్.ఆబిరున్నీసాబేగం, ఆర్.లలిత్, ఎం.మురళీధర్, డి.సురేంద్ర, ఎం.షేక్ ఫైజులుల్లా, బి.భావన ఉత్తీర్ణులైనట్లు వెల్లడించారు.
- సదరు అభ్యర్థులు ఈనెల 20న మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో నిర్వహించే మౌఖిక పరీక్షకు హాజరుకావాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి, ప్రసూన లా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శివాజీరావు, సీఐ నాగరాజారావు పరీక్షలను పర్యవేక్షించారు.

– న్యూస్‌టుడే, కర్నూలు గాయత్రీ ఎస్టేట్

గురువైభవోత్సవం



విద్యుత్తు కాంతులతో విరాజిల్లుతున్న మఠం ప్రాంగణం

రాఘవేంద్ర స్వామి గురువైభవోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామి బృందావనానికి జలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించి బంగారు ఆభరణాలు, విశేషపుష్పాలతో అలంకరించారు. మూలరాములకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు పూజలు చేసిన అనంతరం బృందావనానికి హారతి ఇచ్చారు. మఠం ముందు భాగం, కారిడార్ విద్యుద్దీపాలంకరణలతో విరాజిల్లుతోంది. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గురువారం రాఘవేంద్ర స్వామి పట్టాభిషేక మహోత్సవం నిర్వహించనున్నారు.

– న్యూస్‌టుడే, మంత్రాలయం గ్రామీణం

పార్కు జాగాలో పాగా

ఏకంగా రిజిస్ట్రేషన్ చేశారు ● విలువ రూ.200 కోట్లపైనే ● పట్టించుకోని కేఎంసీ అధికారులు

ఈనాడు, కర్నూలు: నగరంలో పార్కు స్థలాలు యథేచ్ఛగా కబ్జా అవుతున్నాయి.. కబ్జాదారుల చెర నుంచి విముక్తిచేసి అభివృద్ధి చేయాలని కాలనీ వాసులు ఆందోళనలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఆక్రమణదారులు ఏకంగా అంతర్గత రహదారులు, విద్యుత్తు స్తంభాలు, ప్రభుత్వ కుళాయిలు వేసి బేరం పెడుతున్నారు. ఐటీసీ కొందరు మంత్రి నారాయణను కలిసి కబ్జాల తీరుపై ఫిర్యాదు చేశారు.

5.67 ఎకరాలు ఆరగించారు

నగరంలో 80 ఎకరాల్లో నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీని అభివృద్ధి చేశారు. అక్కడ పార్కుల నిర్మాణానికి 7.50 ఎకరాలు వదిలేశారు. కర్నూలు కార్పొరేషన్ అధికారులు స్వాధీనం చేసుకొని మొదట హద్దులు పాతి కంచెలు నిర్మించాలి. తర్వాత పార్కులను అభివృద్ధి చేయాలి. పట్టించుకోకపోవడంతో పలువురు ఆక్రమించుకొని ఇళ్లు నిర్మించుకొన్నారు. ఆ స్థలం విలువ ప్రస్తుతం రూ. వంద కోట్లకు పైగానే ఉంటుంది. 5.67 ఎకరాల రిజర్వు ఓపెన్ స్పేస్ ఉండగా అందులో 365 అక్రమ నిర్మాణాలు ఉన్నాయని నిగ్గుతేల్చారు.

ఏకంగా రిజిస్ట్రేషన్ చేశారు

వీకర్ సెక్షన్ కాలనీకి సమీపంలోని రేణుకానగరంలోని పార్కు స్థలంలో కొంతభాగాన్ని కొందరు విక్రయించేశారు. రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు రిజిస్ట్రేషన్ చేశారు. కొనుగోలుదారులు దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు. ఎల్.పి. నెంబరు 453/86 లేఅవుట్‌లోని 20 సెంట్ల రిజర్వ్ ఓపెన్ స్పేస్ కార్పొరేషన్ పరిధిలో ఉన్నా సంరక్షించడంలో అధికారులు అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఇక్కడి భూమి విలువ రూ.5 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

నాలుగోతరగతి ఉద్యోగుల కాలనీలోని పార్కు స్థలంలో వెలసిన నిర్మాణాలు

విక్రయానికి యత్నం

నందనపల్లి పంచాయతీ పరిధిలో 27 ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్‌ను అభివృద్ధి చేశారు. పలువురు అక్కడ ఇళ్లు నిర్మించుకున్నారు. 27 ఎకరాలకు గాను 2.7 ఎకరాలను సామాజిక అవసరాల కోసం వదలాల్సి ఉన్నా ప్రస్తుతం 50 సెంట్లలో పార్కు కోసం వదిలారు. వాస్తవానికి అక్కడ పెద్ద గుంత ఉందని బాధితులు ఆరోపిస్తున్నారు. మరోచోట 82 సెంట్లు, ఇంకోచోట 15 సెంట్లు చూపించారు. పంచాయతీకి అప్పగించకుండా విక్రయించడానికి ప్రయత్నిస్తున్నారు.

పాముల ముసుగులో

ఆర్.కె.రాయలసీమ క్రికెట్ అకాడమీకి ఎదురుగా 24 సెంట్ల పార్కు స్థలం ఉంది. విష్ణుటౌన్‌షిప్ లేఅవుట్ వాళ్లు సామాజిక అవసరాల నిమిత్తం కార్పొరేషన్‌కు అప్పగించారు. ఎల్.పి. నంబరు 68/99E చెందిన ఆ భూమిలో పార్కును అభివృద్ధి చేయాల్సి ఉంది. గత రెండున్నర దశాబ్దాలుగా పట్టించుకోకపోవడంతో ఆక్రమణదారులు కొందరు కొంతభాగాన్ని చదును చేసి ఆక్రమించుకొనే ప్రయత్నంచేశారు. కాలనీవాసులు ప్రశ్నించగా పాములు వస్తున్నాయి.. అందుకే చదును చేస్తున్నామని సమాధానం ఇచ్చారు. ఆక్రమించిన స్థలం విలువ ప్రస్తుతం రూ. 10 కోట్ల వరకు ఉంటుంది.

యాప్‌లో నీటి తడులు

చరవాణితోనే సమస్త పనులు చేసుకునే సౌలభ్యం ఉందిపుడు. యాప్ ద్వారా రైతులు పొలానికి వెళ్లకుండానే అవసరమైన నీటిని, ఎరువులను ఎక్కడి నుంచైనా నియంత్రించుకోవచ్చు. కూటమి ప్రభుత్వం మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టులో భాగంగా సెన్సార్లు, మొబైల్ యాప్ ఆధారిత ఆటోమేషన్ వ్యవస్థను రైతుల ప్రయోజనార్థం అందుబాటులోకి తెచ్చింది.

– న్యూస్‌టుడే, డోన్

పొలంలో ఏర్పాటు చేయనున్న ఆటోమేషన్ పరికరాలు

- సూక్ష్మ సేద్యానికి మరింత ప్రోత్సాహం కల్పించాలన్న ఉద్దేశంతో 'కూటమి' ప్రభుత్వం వైర్‌లెస్ ఇరిగేషన్, ఫెర్టిగేషన్ ఆటోమేషన్ పద్ధతిని తీసుకొచ్చింది.
- స్మార్ట్ కంట్రోల్, సెన్సార్లు, వాల్వ్ కంట్రోల్ యూనిట్లు, మొబైల్ యాప్ తదితరాలన్నీ కలిసి ఆటోమేషన్ వ్యవస్థగా పనిచేస్తాయి.
- రైతు తన మొబైల్ యాప్‌తో పొలంలో ఉండే మోటారు ఆన్, ఆఫ్ చేయొచ్చు. ఏ వాల్వ్ ఎప్పుడు తెరవాలి, ఎప్పుడు మూసేయాలి అనేది షెడ్యూల్ చేసుకోవచ్చు. ఎంత సేపు నీరివ్వాలనేది ముందే ఏర్పాటు చేసుకోవచ్చు.
- "ఉమ్మడి జిల్లాలో 10 కంపెనీ సంస్థల ప్రతినిధులు యాప్ ఇన్‌స్టలేషన్ చేసి, ఆపరేటింగ్ వివరాలపై రైతులకు అవగాహన కల్పిస్తారు. పూర్తి వివరాలను సూక్ష్మ నీటి పారుదలశాఖ అధికారులను సంప్రదించాలని" ఏపీఎంఐపీ పీడీ విజయలక్ష్మి తెలిపారు.
- ఈ పద్ధతిలో హెక్టారుకు రూ.40 వేల వరకు ఖర్చు అవుతుంది. చిన్న, సన్నకారు రైతులకు 55 శాతం, ఇతర రైతులకు 45 శాతం రాయితీ ఇస్తారు. గరిష్ఠంగా ఒక రైతు 5 హెక్టార్ల వరకు రాయితీ కల్పిస్తారు.
- ఈ పద్ధతిలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 వేల హెక్టార్లలో చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించుకొన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటి వరకు 26 మంది రైతులు దరఖాస్తు చేసుకొన్నారు.
- ఈ విధానంలో పంట ఉత్పాదకతను పెంచొచ్చు. సకాలంలో ఎరువులు, నీరు అందించి అధిక దిగుబడిని సాధించొచ్చు. రిమోట్ ద్వారా నీటి పారుదల వ్యవస్థను నియంత్రించటం వల్ల నీటిని పొదుపుగా వాడుకోవడానికి వీలుంటుంది. 50 శాతానికి పైగా నీటి వృథాకు అడ్డుకట్ట వేయొచ్చు.

కమీషన్ల క్రమబద్ధీకరణ

చేయి తడపకపోతే కొర్రీలు ● పురపాలికల్లో ఎల్‌టీపీల దందా

మధ్యతరగతి, పేదల ప్రయోజన నిమిత్తం కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఎల్‌ఆర్‌ఎస్, బీపీఎస్ పథకాలు లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ల (ఎల్‌టీపీ)కు కాసులు కురిపిస్తున్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీకి చెందిన పలువురు అక్రమ వెంచర్లు వేశారు. తక్కువ ధరకు స్థలాలు దక్కడంతో పలువురు కొనుగోలు చేశారు. అనుమతులు లేకపోవడంతో ఇంటి నిర్మాణానికి అవస్థలు పడుతున్నారు. దీన్ని గమనించిన 'కూటమి' ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేసుకోవడానికి వీలు కల్పించింది.

– న్యూస్‌టుడే, ఆదోని, నంద్యాల, కర్నూలు, ఎమ్మిగనూరు పురపాలికలు

దరఖాస్తులు

పురపాలిక	ఎల్‌ఆర్‌ఎస్	బీపీఎస్
కర్నూలు	2,497	887
నంద్యాల	613	381
ఆదోని	280	76
ఎమ్మిగనూరు	226	765

సేవా రుసుము పెంచారు

- ఎల్‌ఆర్‌ఎస్, బీపీఎస్ దరఖాస్తులు అప్‌లోడ్ చేసేందుకు గతంలో రూ.5 వేల వరకు సేవా రుసుములు వసూలు చేసేవారు. ఇప్పుడు దాన్ని ఎల్‌టీపీలు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు పెంచేశారు.
- పురపాలక నిర్దిష్టంగా రుసుముల్ని నిర్ణయించకపోవడం ఎల్‌టీపీలకు మరింత కలిసి వస్తోంది. స్థలం విలువ ఆధారంగా దరఖాస్తులు అప్‌లోడ్ చేసేందుకు ఎల్‌టీపీలు రుసుములు నిర్ణయిస్తున్నారు. గజం విలువ తక్కువ ఉన్న ప్రాంతాల్లో రూ.10 వేలు, ధర ఎక్కువ ఉంటే రూ.20 వేల వరకు లాగేస్తున్నారు. కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు పురపాలికల్లో ఈ దోపిడీ ఎక్కువగా ఉంది.

ఆన్‌లైన్ సేవలు కప్పిపుచ్చి..

- లేఅవుట్ రెగ్యులరైజేషన్ (ఎల్‌ఆర్‌ఎస్), బిల్డింగ్ పీనలైజేషన్ (బీపీఎస్) పథకాల్లో అక్రమాలు జరగకూడదన్న ఉద్దేశంతో ఆన్‌లైన్ సేవలు తీసుకొచ్చారు. ఇందుకు ఏపీబీపీఎస్, ఏపీడీటీసీపీఎల్‌ఆర్‌ఎస్ వెబ్‌సైట్లోకి వెళ్లాలి.. సిటిజన్ లాగిన్ ఐచ్ఛికం క్లిక్ చేసి పేరు నమోదు చేసి పాస్‌వర్డ్ రూపొందించుకోవాలి.
- ఆధార్, ఇంటి, స్థలం వివరాల, లింక్ పత్రాలు, మార్కెట్ విలువ తదితర అంశాలు నమోదు చేసి వాటికి సంబంధించిన పత్రాలు అప్‌లోడ్ చేయాలి. బ్లూ ప్రింట్‌ను ప్రైవేటు వ్యక్తుల ద్వారా తయారు చేసుకొని అప్‌లోడ్ చేసే వెసులుబాటు కల్పించారు. ఆన్‌లైన్లో నమోదు అంశంపై పుర అధికారులు ప్రచారం కల్పించలేదు. దీన్ని ఆసరాగా చేసుకుని లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్లు(ఎల్‌టీపీ) దండుకుంటున్నారు.

ప్లానింగ్ కార్యదర్శుల ఆగడాలు

- ఎల్‌ఆర్‌ఎస్, బీపీఎస్ దరఖాస్తులను స్వర్ణ వార్డు కార్యాలయాల్లో అప్‌లోడ్ చేయకుండా ప్లానింగ్ కార్యదర్శులు కొందరు అడ్డదార్లు తొక్కుతున్నారు. ఎల్టీపీలతో ముందస్తు ఒప్పందం చేసుకొని వారి వద్దకే వెళ్లేలా చూస్తున్నారు.
- దరఖాస్తు చేసుకున్న వాటిలో చాలా వరకు పాత తేదీలు వేసి అనుమతులకు సిఫార్సు చేస్తున్నారు. తక్కువ కొలతలు వేసి పుర ఆదాయానికి గండికొడుతున్నారు. నిర్దిష్టంగా వదలాల్సిన సెట్ బ్యాక్ స్థలాల విషయంలో చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఒక్కో అనుమతికి రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు.
- ఎల్‌టీపీలు, ప్లానింగ్ కార్యదర్శుల ఆగడాలు భరించలేక యజమానులు ముందుకురావడం లేదు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియకు పలుమార్లు గడువు పెంచారు. ఈ ఏడాది ఏప్రిల్ 23వ తేదీ గడువుగా నిర్దేశించారు.

నేత్రశోభితంగా ఆదిదంపతుల పుష్పోత్సవం

● శ్రీశైలంలో ముగిసిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

శ్రీశైల మహాక్షేత్రంలో అంగరంగ వైభవంగా జరిగిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. చివరి రోజు బుధవారం రాత్రి 7 గంటలకు శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి వార్లు భక్తులకు అశ్వవాహనంపై దర్శనమిచ్చారు. పుష్పాలతో అలంకరించి అశ్వవాహనంపై అధిష్ఠింపజేశారు. మంగళవాయిద్యాల మధ్య ఉత్సవమూర్తులను మండపం నుంచి తీసుకువచ్చి ఆలయ ప్రాంగణంలో ఉత్సవం జరిపారు. పిల్లనగ్రోవితో కళాకారుడు శివభక్తి గీతాలు ఆలపించి ఆకట్టుకున్నారు. 21 రకాల పుష్పాలు, పలు రకాల ఫలాలను సమర్పించారు. తర్వాత ఆలయ అధికారులు, భక్తులు స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను అద్దాల మండపంలోకి చేర్చి, శయనోత్సవం, ఏకాంత సేవ నిర్వహించారు. ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు.

– న్యూస్‌టుడే, శ్రీశైలం ఆలయం


అశ్వవాహనంపై స్వామిఅమ్మవార్లు

వృథా ఖాతాలో రూ. 12.56 కోట్లు

వివిధ పథకాల నిర్వహణకు.. అభివృద్ధి పనుల అమలుకు ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేస్తోంది. ఆ మొత్తాన్ని అధికారులు వేర్వేరు బ్యాంకుల ఖాతాల్లో నిల్వ ఉంచుతారు. ఆ అధికారులు బదిలీపై వెళ్లిన తర్వాత ఆయా ఖాతాలను నిర్వహించే వారు కరవవుతున్నారు. లావాదేవీల్లేని కారణంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 6,650 ఖాతాలు మరుగున పడిపోయాయి. వాటిలో రూ.12.56 కోట్ల నిధులు నిల్వ ఉన్నాయి. వీటిని పునర్వినియోగంలోకి తీసుకొస్తే ఆ నిధులు అక్కరకొచ్చే అవకాశం ఉంది. దీంతో ఆయా ఖాతాలు ఏ అధికారి పేరున ఉంటే వారితో ఈ-కేవైసీ చేయించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ దిశగా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్, రెవెన్యూ, ఖజానాశాఖల అధికారులు కసరత్తు చేపట్టారు.

- మొత్తం ఖాతాల్లో ప్రభుత్వ, స్థానిక సంస్థలకు సంబంధించినవి, వ్యక్తిగత ఖాతాలు ఉన్నాయి. వీటిలో డూప్లికేట్ ఖాతాలు, ప్రభుత్వ ఖాతాలు, వ్యక్తిగత ఖాతాలున్నాయి. మొత్తం మీద కర్నూల్‌లో 3,074 ఖాతాలు, నంద్యాలలో 3,261 ఖాతాలను అధికారులు గుర్తించారు. ఇందులో కర్నూలులో 295, నంద్యాలలో 180 ఖాతాలకు మాత్రమే డీడీవోల ద్వారా ఈకేవైసీ పూర్తి చేయించారు.
- ఈ లెక్కన కర్నూలు జిల్లాలో సుమారు రూ.5 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.3 కోట్లు కలిపి ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.8 కోట్ల వరకు బ్యాంకుల్లో ఖర్చు చేయకుండా మిగిలిపోయిన నిధులున్నాయని అంచనా.. ఆయా నిధులకు సంబంధించి జిల్లా పాలనాధికారులు ప్రత్యేకంగా ఒక బ్యాంకు ఖాతాను ఏర్పాటు చేసి.. అందులో ఈ నిధులను నిల్వ ఉంచాలని.. జిల్లా అభివృద్ధి కోసం నిధులు వినియోగించుకునేందుకు కలెక్టర్లకు అధికారాలు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం.

జిల్లా	మొత్తం ఖాతాలు	నిధులు (రూ.కోట్లలో)	ఈకేవైసీ చేసిన ఖాతాలు	వీటిలోని నిధులు (రూ.కోట్లలో)
కర్నూలు	3,318	8.19	309	2.20
నంద్యాల	3,332	4.37	247	0.90

– న్యూస్‌టుడే, కర్నూలు కలెక్టరేట్

వృద్ధులకు ఆదాయ భద్రత

పేద, సామాన్య ప్రజలకు వృద్ధాప్యంలో ఆదాయ భద్రత కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం అటల్ పెన్షన్ యోజన పథకాన్ని అమలు చేస్తోంది. కేంద్ర మంత్రివర్గం ఈ పథకాన్ని 2031 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. దీన్ని పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ నిర్వహిస్తోంది. 60 ఏళ్ల తర్వాత నెలకు రూ.వెయ్యి నుంచి రూ.5 వేల వరకు పింఛన్ పొందొచ్చు. ఎంచుకున్న పథకం, వయసు బట్టి నెల, మూడు, ఆరు నెలలకోసారి డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది.

పింఛను (రూ.)	బీమా (రూ.లక్షలు)
1,000	1.7
2,000	3.4
3,000	5.1
4,000	6.8
5,000	8.5

- 18-40 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలి తపాలా శాఖ, బ్యాంకుల్లో ఖాతా ఉండాలి. ఆదాయపు పన్ను చెల్లింపుదారులు కాకుండా ఉండాలి.
- ఈ పథకంలో పింఛను తీసుకొనే వారికి బీమా సదుపాయం ఉంది. పథకంలో చేరిన వ్యక్తి మృతి చెందితే నెలకు తీసుకొనే పింఛన్ ఆధారంగా కుటుంబానికి బీమా చెల్లిస్తారు.
- భర్త మరణిస్తే భార్య ఉన్నంత కాలం ఆమెకు పింఛన్ వస్తుంది. ఇద్దరూ మరణిస్తే అప్పటి వరకు జమ అయిన మొత్తం డబ్బును నామినికి ఇస్తారు. సమీపంలోని బ్యాంకు, తపాలా కార్యాలయాల్లో సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చు.

– న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

నైపుణ్య ప్రాంగణం.. అతివలకు వరం

● కూటమి ప్రభుత్వం చొరవతో పూర్వవైభవం

మహిళల స్వయం ఉపాధికి బాటలు వేస్తేనే.. పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కుతాయని నాటి పాలకులు భావించారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణలో మహిళా ప్రాంగణం ఏర్పాటు చేశారు. నాటి నుంచి నేటివరకు వేలాదిమంది మహిళలు ఈ ప్రాంగణంలో వివిధ శిక్షణ తీసుకుని స్వయం ఉపాధి పొందారు. గత వైకాపా ప్రభుత్వ పాలనలో ఈ ప్రాంగణాన్ని పట్టించుకోకపోవడందో ఆదరణ కోల్పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీ ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఏడాదికి 3- 4 కోర్సులు, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రెండు కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించారు.

– న్యూస్‌టుడే, కర్నూలు కలెక్టరేట్

అర్హులు వీరే..

- పాఠశాల స్థాయిలోనే చదువు మానేసిన వారు, పదో తరగతి వరకు చదువుకున్న, 18 ఏళ్లు పైబడిన మహిళలు ప్రాంగణంలో ఇచ్చే ఉచిత శిక్షణలకు అర్హులు. ఆధార్, చరవాణి ఉండాలి. ఇక్కడ శిక్షణలో చేరేవారు రోజూ తమ చరవాణి ద్వారా ముఖహాజరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

ప్రస్తుతం ఇస్తున్న శిక్షణ

- నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా జనరల్ డ్యూటీ అసిస్టెంట్ కోర్సులో 30 మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. జనవరి 2న ప్రారంభమైన ఈ కార్యక్రమం ఏప్రిల్ 2తో ముగియనుంది. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్నారు. ఈ స్వల్పకాలిక శిక్షణతో ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందే అవకాశం ఉంది.

శిక్షణ పొందుతున్న మహిళలు

ఇవి నేర్పితే మేలు..

- కంప్యూటర్ బేసిక్స్, జీ-మెయిల్ క్రియేషన్, ఏఐ టూల్స్ వినియోగించడం, జీడీఏ కోర్సుల్లో బేసిక్ నర్సింగ్‌లో శిక్షణ, కిచెన్, టెర్రస్ గార్డెన్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, శారీ రోలింగ్, పెయింటింగ్ తదితర కోర్సులు నేర్పిస్తే ప్రయోజనం ఉంటుందని మహిళలు అభిప్రాయపడుతున్నారు.

సామగ్రి.. భోజన భత్యం ఇస్తూ

- రెండు జిల్లాల పరిధిలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల మహిళలకు ఈ ప్రాంగణంలో ఉచిత శిక్షణ ఇస్తారు. ఏపీ ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా నిధులు సమకూరుతాయి. దీంతో పాటు నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా కూడా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శిక్షణ పొందేందుకు అవసరమైన సామగ్రి కూడా అందిస్తారు. ఇంటికి వెళ్లకుండా ప్రాంగణంలోనే ఉంటూ కోర్సులు నేర్చుకునే మహిళలకు భోజన ఖర్చుల కింద రోజుకు రూ.120 మంజూరు చేస్తారు.
- మహిళా ప్రాంగణంలోనే స్త్రీ, శిశు సంక్షేమ శాఖ వారి శక్తి సదన్ కేంద్రం ఉంది. వివిధ సమస్యలతో ఇక్కడ ఆశ్రయం పొందుతున్న మహిళలకు కూడా వివిధ స్వయం ఉపాధి శిక్షణలు ఇస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

వచ్చే నెలలో బ్యూటీషియన్, టైలరింగ్‌తో పాటు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణలు ఇచ్చేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. 18 ఏళ్ల వయసు పైబడిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వివరాలకు 8333921350 నంబరుకు సంప్రదించాలి.

– ఎ.అంజనీభూషణ్, జిల్లా మేనేజర్, మహిళా ప్రాంగణం, కర్నూలు

ప్రకృతి వ్యవసాయంతో ఆదాయం.. ఆరోగ్యం

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : ప్రకృతి వ్యవసాయం ద్వారా ప్రజలకు ఆరోగ్యంతో పాటు రైతులకు ఆదాయం చేకూరుతుందని కలెక్టర్ డా.ఎ.సిరి పేర్కొన్నారు. కల్లూరు మండలం బస్తిపాడు గ్రామ రైతులు సాగుచేస్తున్న శనగ, మొక్కజొన్న, కూరగాయలు, పూల తోటలను బుధవారం ఆమె పరిశీలించారు. అనంతరం బస్తిపాడు గ్రామంలో స్వయం సహాయ సంఘాల మండల సమాఖ్య సమావేశంలో ఆమె పాల్గొన్నారు. చిన్నటేకూరు గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు.

రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ డా. సిరి

గృహ నిర్మాణంలో సమస్యలా ఫోన్ చేయండి

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 19న ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా హౌసింగ్ పీడీ టి.చిరంజీవి తెలిపారు.

● గృహ నిర్మాణ సామగ్రి సిమెంటు, స్టీలు, పెండింగ్ బిల్లుల సమస్యలు, పీఎంఏవై 2.0 అర్బన్ గృహాలకు సంబంధించి ఎలాంటి సందేహాలున్నా గురువారం ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య 08518- 257481 నంబరుకు ఫోన్‌చేసి చెప్పాలని కోరారు.

డిగ్రీ పరీక్షల్లో 9 మంది డిబార్

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : రాయలసీమ విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలల్లో బుధవారం జరిగిన డిగ్రీ ఒకటో సెమిస్టర్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన తొమ్మిదిమంది విద్యార్థులను డిబార్ చేసినట్లు వీసీ వెంకట బసవరావు తెలిపారు. 10,649 మందికి గాను 9,811 మంది పరీక్షలు రాసినట్లు వెల్లడించారు.

సద్గుణాల ద్వారం.. రంజాన్ మాసం

● నేటి నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభం ● ఊరూరా ఆధ్యాత్మిక వాతావరణం

సద్గుణాల ద్వారం.. పుణ్యాల సాగరం.. వరాల వసంతమైన రంజాన్ మాసం అరుదెంచింది. బుధవారం సాయంత్రం నెలవంక దర్శనంతో పవిత్ర మాసం ప్రారంభమైంది. ఈ నెల 19వ తేదీ నుంచి ఉపవాస దీక్షలు మొదలు కానున్నాయి. ఏటా రంజాన్ పండగ వచ్చిందంటే 30 రోజుల పాటు చిన్న, పెద్ద తేడా లేకుండా ఉపవాస దీక్ష పాటిస్తారు.

– న్యూస్‌టుడే, కర్నూలు పాతబస్తీ

సహరీతో మొదలు.. ఇఫ్తార్‌తో ముగింపు

రంజాన్ మాసంలో ప్రతిరోజూ తెల్లవారుజామున సహరీ పేరుతో ఆహారాన్ని స్వీకరిస్తారు. పగలంతా నీటి చుక్క కూడా తీసుకోకుండా కఠోర ఉపవాస దీక్ష పాటిస్తారు. సాయంత్రం 6.30 గంటల తరువాత ఇఫ్తార్ విందుతో ఉపవాస దీక్షను విరమిస్తారు. రోజూ ఐదుపూటలా నమాజ్ చేస్తారు.

దానధర్మాలకు ప్రాధాన్యం

- రంజాన్ మాసంలో ఒక రూపాయి దానం చేస్తే రూ.70 పుణ్యఫలం లభిస్తుందన్న మహమ్మద్ ప్రవక్త బోధనలను అనుసరించి ముస్లింలు పెద్దఎత్తున దానధర్మాలు చేస్తారు.
- తమ స్థిర చరాస్తులు, ఏడాది సంపాదనలో 2.5 శాతం మొత్తాన్ని జకాత్ పేరుతో పేదలకు దానం చేస్తారు. ప్రతిఒక్కరు పండగ నమాజ్‌కు ముందే ఫిత్రా దానం చేయాలి.
- రంజాన్ మాసంలో ఉపవాసం ఉండటం ద్వారా మనిషికి ఓర్పు, సహనం, సేవాగుణం అలవడతాయి. పేదల కష్టాలు, ఆకలి బాధలు తెలుస్తాయి. తద్వారా తోటి మానవులను ఆదుకోవాలన్న సేవా గుణం పెంపొందుతుంది.

ప్రత్యేక ప్రార్థనలతో మసీదులు కళకళ

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఐదు లక్షలకు మందికిపైగా ముస్లింలు ఉన్నారు. వీరిలో సుమారు 70 శాతం మంది రంజాన్ నెలలో కఠోర ఉపవాస దీక్ష పాటిస్తారు. తెల్లవారుజామున సహరీ భుజించి రోజా ప్రారంభిస్తారు. సాయంత్రం ఇఫ్తార్ విందుతో రోజా విరమిస్తారు.
- అనంతరం మసీదుల్లో సామూహిక తరావీ నమాజులు (ప్రత్యేక ప్రార్థనలు) చేస్తారు. ప్రత్యేక ప్రార్థనలతో మసీదులు కళకళలాడుతుంటాయి. రంజాన్ మాసంలోని ఆఖరి పది రోజుల్లో వచ్చే బేసి రాత్రుల్లో జాగారం చేస్తారు.
- ఐదు రాత్రుల్లో లైలతుల్ ఖద్ర్ (పెద్ద రాత్రి) కోసం అన్వేషిస్తారు. పూర్తిగా అల్లాహ్ నామస్మరణలో గడుపుతారు. ప్రత్యేక నమాజ్‌లు, ఖురాన్ పారాయణం, దువాలు చేస్తారు.

ఆకలి బాధను తెలియజేస్తుంది

రంజాన్ మాసంలో పాటించే ఉపవాస దీక్ష మనిషిలో భక్తిభావాన్ని పెంపొందిస్తుంది. ఆకలిబాధను తెలియజేస్తుంది. ధనికులు, పేదవారు అన్న తేడా లేకుండా ప్రతిఒక్కరు సమానంగా ఈదుల్ ఫితర్ నమాజ్ ఆచరిస్తారు. పండగ నమాజ్‌కు ముందే ఆర్థిక స్థోమత ఉన్న ప్రతి ఒక్కరూ రూ.2.50 కిలోల నాణ్యమైన గోధుమలు లేదా వాటి ధరకు సమానమైన డబ్బును పేదలకు దానం చేయాలి.

– సయ్యద్ ముబషిర్ పాషా ఖాద్రీ, జామియా ఖమరుల్ ఖుదా వ్యవస్థాపకుడు

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి
ఈనాడు క్లాసిఫైడ్స్
లీగల్ ప్రకటనలు
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
జన్మదిన శుభాకాంక్షలు
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు 99899 97628

(c) eenadu

విజయ ధీర.. మృదుల

◆ ఇస్రో శాస్త్రవేత్తగా, క్రీడాకారిణిగా రాణిస్తున్న శిరివెళ్ల యువతి

ఆళ్లగడ్డ, శిరివెళ్ల, న్యూస్‌టుడే: కష్టాలు ఓర్చుకున్నారు.. అనునిత్యం జపించి.. అహర్నిశలు శ్రమించి అనుకున్న లక్ష్యం సాధించారు.. శిరివెళ్లకు చెందిన సూగూరు మృదుల. ఇస్రోలో శాస్త్రవేత్తగా కొలువు సాధించడమే గాక ఆటల్లోనూ రాణిస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో ప్రాథమిక విద్యనభ్యసించి ఐఐటీలో ఎంటెక్ పూర్తి చేసి ఇస్రో శాస్త్రవేత్తగా విధులు నిర్వహిస్తున్నారు. ఇస్రో నిర్వహిస్తున్న అంతరిక్ష ప్రయోగాల్లోనూ భాగస్వామి కావడం విశేషం. నంద్యాల, కర్నూలులో పాఠశాల విద్యను, తిరుపతిలో ఇంటర్, తిరుపతి ఎస్వీ విశ్వవిద్యాలయంలో బీటెక్(కెమికల్ ఇంజినీరింగ్) చదివారు. మెరుగైన గేట్ ర్యాంకుతో హైదరాబాదు ఐఐటీలో ఎంటెక్ ఉత్తీర్ణులయ్యారు. అనంతరం 2023లో ఇస్రో నియామక పరీక్షల్లో ప్రతిభ చాటి శ్రీహరికోటలోని షార్(సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం)లో శాస్త్రవేత్తగా విధులు నిర్వహిస్తున్నారు. మృదుల చిన్న తనం నుంచే క్రీడలంటే ఆసక్తి. ఏడో తరగతిలోనే రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్నారు. షటిల్ బ్యాడ్మింటన్‌లోనూ సత్తా చాటారు. దేశ వ్యాప్తంగా ఇస్రో శాస్త్రవేత్తలకు ఆటల పోటీలను గత డిసెంబరులో బెంగళూరులో నిర్వహించారు. మృదుల షటిల్ బ్యాడ్మింటన్ జట్టుకు నాయకత్వం వహించడమేకాక జట్టు ప్రథమ స్థానంలో నిలవడంలో కీలక పాత్ర పోషించారు. అంతరిక్ష రంగంలో భారత్ ముందుండాలని, రాబోయే రోజుల్లో ఇస్రో చేపట్టే భారీ ప్రాజెక్టులు విజయవంతం చేయడంలో తనకు అప్పగించిన బాధ్యతలను నెరవేర్చడమే లక్ష్యమని మృదుల చెబుతున్నారు.

సూగూరు మృదుల

కమనీయం మహానందీశుని తెప్పోత్సవం

మహానంది రుద్రగుండం పుష్కరిణిలో తెప్పోత్సవం

మహానంది, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రంలో గంగాకామేశ్వరీ దేవి సహిత మహానందీశుని తెప్పోత్సవం కనులపండువగా జరిగింది. బుధవారం రాత్రి రుద్రగుండం పుష్కరిణిలో నూతన దంపతులైన కామేశ్వరీదేవి, మహానందీశ్వరుల జలవిహారం భక్తులను ఆకట్టుకుంది. మహానంది పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని చివరి రోజు రాత్రి ఘనంగా తెప్పోత్సవాన్ని చేపట్టారు. నంద్యాలకు చెందిన దాత అవ్వారు గౌరీనాథ్, సరస్వతీ దంపతులు ఆర్థికంగా సహకరించారు.

స్వామి రూపం.. దివ్యతేజం

రుద్రవరం, న్యూస్‌టుడే: అహోబిల నృసింహ స్వామి పార్వేట ఉత్సవాలు బుధవారం రాత్రి స్థానిక అటవీ కార్యాలయంలో ఘనంగా ముగిశాయి. ముగింపు సందర్భంగా డీఎఫ్‌వో అనురాగ్ మీనా తమ సిబ్బందితో పార్వేట పల్లకిలో కొలువుదీరిన ప్రహ్లాదవరద, జ్వాలానృసింహ స్వాములకు పూజలు చేశారు. అనంతరం అర్చకులు కల్యాణ శాస్త్రి మాట్లాడుతూ.. ఉత్సవం జనవరి 16న బాచేపల్లె గ్రామంలో ప్రారంభమై 34 రోజుల పాటు కొనసాగి రుద్రవరం గ్రామంలో ముగిసిందన్నారు. మూడు మండలాలు.. 32 గ్రామాల్లో ఉత్సవాలు ఘనంగా జరిగిందన్నారు. ఈనెల 20వ తేదీ నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

క్రికెట్‌లో ఆదోని- ఎ జట్టు విజయం

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఆదర్శ విద్యా మందిరం మైదానంలో జరుగుతున్న ఎం.ఎ.ఇస్మాన్ మెమోరియల్ అండర్-14 క్రికెట్ పోటీల్లో ఆదోని-ఎ జట్టు కర్నూలు- ఎపై విజయం సాధించింది. రెండోరోజు కర్నూలు- ఎ జట్టు క్రీడాకారులు తక్కువ స్కోర్‌కే వెనుదిరిగారు. ఆదోని జట్టు 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ టోర్నీలో తొమ్మిది వికెట్లు తీసిన వై.మేఘనరెడ్డి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంది. 37 పరుగులు చేసిన వంశిక బెస్ట్ బ్యాటర్ అవార్డు, 6 వికెట్లు తీసిన గౌతమ్‌కృష్ణ బెస్ట్ బౌలర్‌గా ఎంపికయ్యారు. జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు శేఖర్, రెడ్డిపోగు ప్రకాశ్, బజారన్న, అంజిబాబు వీరికి ట్రోఫీలు అందించారు.

ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్న మేఘనరెడ్డి

జిల్లా రిజిస్ట్రారుగా వై.బజారి

❍ నంద్యాలకు అశోక్ నియామకం

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కర్నూలు జిల్లా రిజిస్ట్రారుగా వై.బజారి నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 మంది సబ్ రిజిస్ట్రార్లకు జిల్లా రిజిస్ట్రార్లుగా పదోన్నతి కల్పించడంతో పాటు కొలువులు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కోసిగి సబ్‌రిజిస్ట్రారుగా పనిచేస్తున్న వై.బజారిని పదోన్నతిపై కర్నూలు జిల్లా రిజిస్ట్రార్‌గా నియమించారు. గుంటూరు జిల్లా పొన్నూరు సబ్‌రిజిస్ట్రారు ఎస్‌కే పర్వీన్‌ను పదోన్నతిపై మార్కెట్ విలువలు, ఆడిట్ విభాగం కర్నూలు జిల్లా రిజిస్ట్రారుగా, గుంటూరు జిల్లాలో సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న అశోక్‌ను పదోన్నతిపై నంద్యాల జిల్లా రిజిస్ట్రారుగా నియమించారు.

వై.బజారి

నృసింహుని వైభవం.. తిలకిద్దాం రండి

◆ రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 20వ తేదీ నుంచి ఆరంభం కానున్నాయి. పది రోజుల పాటు ఎగువ, దిగువ ఆలయాల్లో జరిగే ఈ ఉత్సవాలకు భక్తులు లక్షలాదిగా తరలిరానున్నారు. ఉత్సవాల్లో స్వామి పరిణయాన్ని కనులారా వీక్షించనున్నారు. మార్చి 1వ తేదీ నుంచి 4 వరకు దిగువలో భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో భక్తుల సౌకర్యం కోసం ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేపడుతున్నారు.

ఆలయ ఆవరణలో ఏర్పాటైన పందిరి

కార్యక్రమాలు ఇలా..

ఎగువలో ఫిబ్రవరి 20వ తేదీ సెల్వర్ కూత్తు ఉత్సవం, 21న సాయంత్రం ఉత్సవాలకు అంకురార్పణ, 22న ధ్వజారోహణం, సింహవాహనసేవ, దిగువలో సాయంత్రం అంకురార్పణ, 23న ఎగువలో హంసవాహన, సూర్యప్రభ వాహనసేవ, దిగువలో ధ్వజారోహణం, సింహవాహన సేవ, 24న ఎగువలో ఉత్సవం, హనుమంతవాహనం, దిగువలో హంసవాహనం, సూర్యప్రభ, 25వ తేదీ ఎగువలో శేషవాహన, చంద్రప్రభ వాహన సేవ, దిగువలో యోగానృసింహ గరుడ విమానం, హనుమంత వాహన, 26న ఎగువలో ఉత్సవం, శరభవాహన, దిగువలో శేషవాహన, చంద్రప్రభ వాహన సేవలు ఉంటాయి.

మార్చి 1న కల్యాణం

ఎగువలో 27న ఉత్సవం, పొన్నచెట్టువాహన, దిగువలో మోహినీ అలంకారం, శరభవాహన సేవ, 28 ఎగువలో తిరుమంజనం, గజవాహన సేవలు, రాత్రి కల్యాణోత్సవం, దిగువలో వేణుగోపాలస్వామి అలంకారం, పొన్నచెట్టువాహన, మార్చి 1న ఎగువలో తొట్టి తిరుమంజనం, అశ్వవాహన, దిగువలో అభిషేకం, గజవాహనం, రాత్రి కల్యాణోత్సవం, 2న ఎగువలో రథోత్సవం, దిగువలో కాళింగనర్తనోత్సవం, తొట్టి తిరుమంజనం, అశ్వవాహన, 3న ఎగువలో ఉత్సవం, రాత్రి గరుడోత్సవం, ధ్వజారోహణం, దిగువలో రథోత్సవం, 4న దిగువలో ఉత్సవం, రాత్రి గరుడోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నాం

- రామానుజన్, ఆలయ సీఏవో

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే ఆలయ కోనేర్లు శుభ్రత, చలువ పందిళ్లు, విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశాం. పార్కింగ్, బస్టాండ్ స్థలాలను శుభ్రం చేసి సిద్ధం చేస్తున్నాం. వివిధ ప్రభుత్వ శాఖల సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేయనున్నాం.

హృదయ పరివర్తన చెంది జీవించాలి

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: పాపాన్ని విడనాడి పరివర్తన చెంది జీవించాలని బిషప్ గోరంట్ల జ్వాన్నెస్, బిషప్ సంతోష్ ప్రసన్న రావు, ఆరోగ్య మాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ గురు జోసఫ్ పేర్కొన్నారు. నంద్యాల పట్టణంలోని పలు చర్చిల్లో క్రైస్తవులు విభూది బుధవారాన్ని ప్రారంభించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హోలిక్రాస్ క్రెథడల్ చర్చిలో బిషప్ సంతోష్ ప్రసన్నరావు, ఆరోగ్యమాత చర్చిలో బిషప్ గోరంట్ల జ్వాన్నెస్ భక్తులకు సందేశాన్నిచ్చారు. నుదిటిన విభూదితో సిలువ గుర్తు వేశారు. వారు మాట్లాడుతూ.. పవిత్రంగా జీవించడానికి, ఆధ్యాత్మికంగా ఎదగడానికి ప్రయత్నించాలన్నారు.

ఆరోగ్యమాత చర్చిలో సందేశమిస్తున్న బిషప్ గోరంట్ల జ్వాన్నెస్

సందేశమిస్తున్న బిషప్ సంతోష్ ప్రసన్నరావు

గాజులపల్లి-చలమ మార్గంలో సొరంగం సిద్ధం

● డబ్లింగ్ పనుల్లో కీలక ముందడుగు

ఈనాడు, కర్నూలు, మహానంది, న్యూస్‌టుడే: గుంటూరు-గుంతకల్లు రైలు మార్గం డబ్లింగ్ పనుల్లో భాగంగా నిర్మిస్తున్న గాజులపల్లి-చలమ స్టేషన్ల మధ్య చేపట్టిన సొరంగం పనులను దక్షిణ మధ్య రైల్వే అధికారులు విజయవంతంగా పూర్తిచేశారు. దట్టమైన అడవిలో కొండమార్గంలో చేపట్టిన సొరంగం నిర్మాణం ఆయా పనుల్లో అత్యంత కీలకమైనది. దానికి సమీపంలోనే ప్రస్తుతం మరో సొరంగం ఉండడంతో దానికి ఎలాంటి సమస్య రాకుండా మరో సొరంగాన్ని నిర్మించడాన్ని అధికారులు సవాలుగా తీసుకుని ఆయా పనులను పూర్తి చేశారు. గాజులపల్లి, చలమ స్టేషన్ల మధ్య సుమారు 320 మీటర్ల దూరంపాటు రైలు మార్గం నిర్మాణానికి అనుగుణంగా సొరంగాన్ని తవ్వారు. చలమ-దిగువమెట్ట ప్రాంతాల మధ్య 1.53 కి.మీ.ల పొడవునా మరో సొరంగం నిర్మాణం కూడా జరుగుతుంది. దాని నిర్మాణం కూడా పూర్తైతే నంద్యాల నుంచి గిద్దలూరు వైపు డబ్లింగ్ పనులు చేయడానికి ఉన్న అన్ని ఆటంకాలు కూడా తొలగినట్లవుతుంది.

గాజులపల్లి-చలమ మార్గంలో నిర్మించిన సొరంగం

తుదిదశకు చేరుకున్న పనులు

గుంటూరు-గుంతకల్లు మధ్య 401.47 కి.మీ.ల దూరంపాటు డబ్లింగ్ పనులను రూ.3,631 కోట్ల పనులతో చేపట్టారు. అందులో నంద్యాల నుంచి దిగువమెట్ట వరకు పనులు మాత్రం పూర్తికాలేదు. ఈ మార్గంలో నంద్యాల నుంచి గాజులపల్లి వరకు 14.6 కి.మీ.ల దూరంపాటు డబ్లింగ్ పనులు తుది దశకు చేరుకున్నాయి. గాజులపల్లి నుంచి దిగువమెట్ట వరకు 27.49 కి.మీ.ల మార్గం దట్టమైన అడవిలో ఉండడంతో ఆయా పనులు పూర్తిచేయడానికి పలు సవాళ్లు ఎదురవుతున్నాయి. కీలకమైన ఒక సొరంగ మార్గం నిర్మాణం పూర్తికావడంతో మరో సొరంగం నిర్మాణ పనులు కూడా ముమ్మరం చేశారు. ఆ ఆర్థిక సంవత్సరంలో ఆయా పనులను కూడా ఎట్టిపరిస్థితుల్లో పూర్తిచేయాలన్న లక్ష్యంతో పనులు చేయిస్తున్నారు.

రహదారి విస్తరణలో భాగంగానే చెట్ల తొలగింపు

❍ అసెంబ్లీలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లి, న్యూస్‌టుడే: రహదారి విస్తరణలో భాగంగానే చెట్లను తొలగిస్తున్నామని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం అసెంబ్లీలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అడిగిన ప్రశ్నకు ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సమాధానమిచ్చారు. గత వైకాపా ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క రోజు మీటింగ్‌కు వస్తే వందల ఏళ్లనాటి చెట్లను నరికివేసే సంస్కృతి కూటమి ప్రభుత్వానికి లేదని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచనల మేరకే తప్పనిసరి పరిస్థితుల్లో చెట్లను తొలగిస్తున్నామన్నారు. జాతీయ రహదారులు పచ్చదనం కోసం సివిల్ పనుల ఖర్చులో ఒక శాతం హైవేల వెంట మొక్కల పెంపకం కోసం నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ఈ మార్గదర్శకాల ప్రకారం రహదారికి మధ్య భాగంలో రెండు వైపులా అవెన్యూ మొక్కలు నాటడం వంటి పనులు చేపడతామని వెల్లడించారు. ఆయా మార్గాల్లో అడ్డుగా ఉన్న భారీ వృక్షాలను వేళ్లతో పెకిలించి (ట్రాన్స్‌లొకేషన్) ఇతర ప్రాంతాల్లో పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎలమంచిలి నియోజకవర్గంలోనే ఇలా 18 చెట్లను నాటామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం వన సంరక్షణ వంటి కార్యక్రమాలకు ద్వారా పర్యావరణం, పచ్చదనానికి ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి బీసీ వివరించారు.

అసెంబ్లీలో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయాలి

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీజీ), రైతు ఉత్పత్తిదారుల సంస్థలను (ఎఫ్‌పీవో) బలోపేతం చేయాలని డీఆర్డీఏ పీడీ రమణారెడ్డి ఆదేశించారు. బి.తాండ్రపాడు సమీపంలోని టీటీడీసీ సమావేశ భవనంలో బుధవారం 17 మండలాల ఏపీఎంలు, అకౌంటెంట్లు, ఎఫ్‌పీవో డైరెక్టర్లు, సెర్ప్ గుర్తించిన హైపర్, గ్రీన్ డిజిటల్ ఎన్జీవో సంస్థల సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇన్‌పుట్, అవుట్‌పుట్ వ్యాపారాలు, మార్కెటింగ్, ఎఫ్‌పీవో యాప్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ డీడీ రంగనాథ్‌బాబు, ఉద్యానశాఖ ఏడీ రాజాకృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి స్వర్ణయుగం కాంగ్రెస్‌తోనే సాధ్యం

యాత్రలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

శిరివెళ్ల, న్యూస్‌టుడే: ఏపీకి స్వర్ణయుగం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని ఆ రాష్ట్ర పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల పేర్కొన్నారు. నంద్యాల జిల్లా శిరివెళ్ల మండల కేంద్రంలో బుధవారం జరిగిన ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర కార్యక్రమంలో షర్మిల మాట్లాడుతూ.. దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని, అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందించారన్నారు. ముస్లింలకు రిజర్వేషన్ ఇచ్చిన ఘనత ఒక్క వైఎస్ రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామాల్లో పేదలు, కూలీలు వలసలు పోకుండా ఉండేందుకు స్థానికంగానే పని చేసుకోవాలనే ఉద్దేశంతోనే ఉపాధి హామీ పథకాన్ని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ప్రపంచంలోనే ఇలాంటి పథకం ఎక్కడా అమలులో లేదని అప్పట్లోనే ఇతర దేశాలు కీర్తించాయన్నారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఆ పథకానికి తూట్లు పొడిచిందన్నారు. పథకానికి సంబంధించి మహాత్మా గాంధీ పేరును తొలగించడం అన్యాయమన్నారు. ప్రస్తుతం ఏపీలో అన్ని పార్టీలు భాజపాకు తొత్తుగా మారారని, కేంద్రం విధానాలను విమర్శించే వారే కరవయ్యారన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా 11 ఏళ్లక్రితం రావాల్సి ఉందని.. అయితే భాజపాయే దాన్ని అడ్డుకుందన్నారు. రాష్ట్ర రాజధాని నిర్మాణ విషయంలో కేంద్రం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందన్నారు. దీనిపై కూటమి నాయకులు అడిగే పరిస్థితులు లేవన్నారు. ప్రతి ఒక్కరికీ స్వార్థ రాజకీయాలు ఎక్కువయ్యాయన్నారు.

రైలు కిందపడి వృద్ధుడి బలవన్మరణం

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలోని ఆదోని-ఇస్వీ రైల్వే స్టేషన్ల మధ్యలో గుర్తుతెలియని రైలు కిందపడి మాల మల్లప్ప(69) ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ శివరామయ్య తెలిపారు. చాగి గ్రామానికి చెందిన మల్లప్ప కొంత కాలంగా కడుపునొప్పితో పడుతున్నాడని.. ఈ ఆదోని, కర్నూలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా.. నయం కాకపోవడంతో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అవహేళన చేశాడని స్నేహితుడి హత్య

వెల్దుర్తి, న్యూస్‌టుడే: జాతీయ రహదారి-44 సమీపంలోని మదార్‌పురం గ్రామంలో ఈ నెల 12న కోళ్లఫారంలో డోన్‌కు చెందిన సురేష్(25) అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. విచారణ అనంతరం సీసీ కెమెరా ఆధారంగా హత్యగా నిర్ధారించి, ఇద్దరు నిందితుల అరెస్టు చేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో వెల్దుర్తి సీఐ యుగంధర్, ఎస్సై నరేష్ మాట్లాడుతూ.. డోన్ పట్టణానికి చెందిన సురేష్, అల్లాబకాష్, అమ్రేష్ నాయక్ ముగ్గురు స్నేహితులు. అల్లాబకాష్ సోదరుడు నూర్‌బాషా, శేఖర్ నెల రోజుల కిందట ఘర్షణ పడ్డారు. పెద్దల సమక్షంలో ఇరువురు రాజీ అయ్యారు. ఈ క్రమంలో ఒకరికొకరు కాళ్లు పట్టుకున్న విషయాన్ని సురేష్ పలువురితో చెబుతూ అవహేళన చేశాడు. వీటితో పాటు ఓ మిత్రుడి భార్య పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఇవన్నీ మనసులో పెట్టుకొని సురేష్‌ను హతమార్చాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 12న రాత్రి మదార్‌పురం సమీపంలోని కోళ్లఫారంలో ఉన్న స్నేహితుల వద్దకు సురేష్ మద్యం తాగి వెళ్లాడు. అక్కడే ఉన్న అల్లాబకాష్, అమ్రేష్‌నాయక్ సైతం మద్యం తాగారు. గతంలో జరిగిన ఘటనలపై ఆగ్రహంతో ఉన్న వారు సురేష్‌ను కర్రలతో కొట్టి హతమార్చారు. మృతదేహం బరువుగా ఉండటంతో తరలించేందుకు సాధ్యంకాలేదు. సురేష్ నిద్రపోయి.. లేవడంలేదని ఈ నెల 13న ఉదయం కోళ్లఫారం లీజుదారుడు షేక్షావలికి సమాచారం అందించారు. దీంతో 108 అంబులెన్సుకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పరిశీలించి మృతి చెందిన్నట్లుగా తెలిపారు. దీంతో అల్లాబకాష్, అమ్రేష్‌నాయక్ వెల్దుర్తి పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. మృతిడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా కోళ్లఫారంలోని సీసీ కెమెరా పుటేజీ, పోస్టుమార్టం నివేదిక ఆధారంగా హత్యగా నిర్ధారించారు. అనంతరం అల్లాబకాష్, అమ్రేష్ నాయక్‌ను విచారించడంతో జరిగిన విషయాన్ని తెలిపారు. దీంతో వీరిరువురిపై హత్య కేసు నమోదు చేసినట్లుగా పోలీసులు పేర్కొన్నారు.

వేగంగా స్పందించి.. ఆభరణాలు అప్పగించి

బాధితురాలు కామాక్షికి బంగారు నగలు అప్పగిస్తున్న సీఐ చంద్రశేఖర్

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులో మరచిపోయిన బంగారు ఆభరణాల బ్యాగును పోలీసులు వేగంగా స్పందించి సంబంధిత మహిళకు అప్పగించిన సంఘటన బుధవారం ఆదోని పట్టణంలో జరిగింది. ఒకటో పట్టణ సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు.. కౌతాళం మండలం బంటకుంట గ్రామానికి చెందిన కామాక్షి, కుమార్తె రాధ్యతో కలిసి అనంతపురం జిల్లా గుంతకల్లులో జరిగే ఓ శుభకార్యక్రమానికి బయల్దేరారు. ఆదోని పట్టణానికి ఆర్టీసీ బస్సులో చేరుకొని, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వద్ద బస్సు దిగారు. కామాక్షి తన వెంట తెచ్చుకున్న బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగును బస్సులోనే మరచిపోయారు. ఇంతలోనే బస్సు అక్కడి నుంచి ముందుకెళ్లిపోయింది. తర్వాత కంగారుపడిన కామాక్షి వెంటనే స్థానిక ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. వెంటనే సిబ్బందిని బస్సు ఆచూకీ కోసం పంపించారు. ఆర్టీసీ అధికారులతో మాట్లాడి ఆ కండక్టర్ ఫోన్ నెంబరు తీసుకొని సంప్రదించారు. బ్యాగు బస్సులోనే ఉండడంతో కండక్టర్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు బస్సు వద్దకు వెళ్లి బ్యాగు తీసుకొన్నారు. నాలుగు తులాల బంగారు నెక్లెస్, తాళి గొలుసు ఉన్నట్లు గుర్తించారు. ఆ తర్వాత బాధితురాలు కామాక్షికి సీఐ చంద్రశేఖర్ ఆ బంగారు ఆభరణాలు అందించారు.

బియ్యం వ్యాపారులకు జరిమానా

దుకాణాల్లో తూకాలను పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : సోనా మసూరి ధరలు నెల రోజుల్లో క్వింటాపై రూ.600- 1000 పెరిగిన వైనంపై 'మిల్లర్ల కనుసన్నల్లో దందా' శీర్షికన బుధవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. విజిలెన్స్ విభాగం, తూనికలు, కొలతల శాఖ అధికారులు సంయుక్తంగా కర్నూలు నగరంలో తనిఖీలు చేపట్టారు. మద్దూర్ నగర్‌లోని శ్రీరామ, సాయి ఈశ్వర్, వెంకటేశ్వర, వినాయక జనరల్ స్టోర్స్, సాయినాథ్ ట్రేడర్స్ తదితర దుకాణాల్లో తనిఖీలు చేశారు. బియ్యం తూకాల్లో మోసాలు, సిగరెట్లను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించి సుమారు రూ.లక్ష జరిమానా విధించారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్షణికావేశంతో.. యువకుడి ఆత్మహత్య

మహేశ్ (పాత చిత్రం)

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రేమ పెళ్లి వద్దన్నందుకు క్షణికావేశంలో మహేశ్(20) అనే యువకుడు ఇంట్లో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఆదోని పట్టణంలో జరిగింది. మూడో పట్టణ ఎస్సై రామస్వామి తెలిపిన వివరాల మేరకు.. ఆదోని పట్టణం అరుణ్‌జ్యోతినగర్‌లో నివాసం ఉంటున్న నర్సప్ప, శకుంతలమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. చిన్నకుమారుడు మహేశ్ బేల్దారు పనులకు వెళ్తూ.. కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. తాను ఓ యువతిని ప్రేమించానని, ఆమెనే పెళ్లి చేసుకుంటానని సోమవారం రాత్రి మహేశ్ కుటుంబ సభ్యులతో చెప్పాడు. ఈ విషయంపై ఇంట్లో గొడవ జరిగింది. కొద్దిసేపటికి క్షణికావేశానికి లోనై ఇంటి మేడపై ఉన్న గదిలోకి వెళ్లి ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

EENADU eClassifieds

BUSINESS SERVICES

Rize Academy లో జాబ్ కర్నూలులో చేయుటకు టెలీకాలర్స్ కావలెను. అర్హత, అనుభవానికి జీతం ఉండును. సంప్ర: 88864 44720, 79818 86828.

ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు లేడి టెలికాలర్స్ కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 13 వేలు to 15 వేలు, లిమిటెడ్ వేకెన్సీస్. సంప్ర: 09177 132168.

BUSINESS OFFER

బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం. ✆73821 14647.

JOBS

Wanted PRO Qualification any Inter/ Degree. Vani Multi Speciality Hospitals, Dhone. ✆ 95155 59593.

HKMCFAP కర్నూలు పుల్లూరు స్టేజ్ (అన్నా క్యాంటీన్) ఆఫీసులో పనిచేయుటకు ఎగ్జిక్యూటివ్స్ (డిగ్రీ) & అనుభవం కల్గిన వంట మనిషి కావలెను. ✆ 81214 57873.

Team Leadersగా కర్నూలు, నంద్యాల ఏరియాలలో on role / off role లో M/F కావలెను. PF+ జీతం, Q: డిగ్రీ / MBA, MCA ✆ 94403 51657.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ: 18-20K ✆ 96404 68899, 96402 58899.

EENADU THE EC WAY CLASSIFIEDS
అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కూలీ ఇవ్వలేదని పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో జరిగిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో పారిశుద్ధ్య పనులు చేసిన కార్మికులు బుధవారం రాత్రి ఆందోళనకు దిగారు. కూలీ డబ్బులు తక్షణమే చెల్లించాలని సుమారు 50 మంది కార్మికులు ఈవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో పారిశుద్ధ్య పనులు చేసేందుకు దేవస్థానం అధికారులు పద్మావతి ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించారు. విడతల వారీగా 1,000 మంది పారిశుద్ధ్య కార్మికులతో పని చేయించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో సదరు ఏజెన్సీ రూ.10లక్షలు అడ్వాన్స్ చెల్లించి మేస్త్రీల ద్వారా పలు ప్రాంతాల నుంచి కూలీలను శ్రీశైలానికి రప్పించారు. పనులు ముగిసిన తర్వాత 700 మంది కార్మికులు స్వస్థలాలకు వెళ్లిపోయారు. కర్నూలు ప్రాంతానికి చెందిన 50 మంది కార్మికులు కూలీ సొమ్ము మొత్తం ఒకేసారి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఏజెన్సీ ప్రతినిధి వివరణ కోరగా. .కొంత అడ్వాన్స్ చెల్లించి మేస్త్రీల ద్వారా పారిశుద్ధ్య కార్మికులను నియమించుకున్నామని తెలిపారు. దేవస్థానానికి కార్మికుల హాజరు నివేదిక, బిల్లులు సమర్పించిన తర్వాత పూర్తిస్థాయి బిల్లు వస్తుందన్నారు. ఈలోపు యాజమాన్యం మేస్త్రీలతో చేసుకున్న ఒప్పందం ప్రకారం కార్మికులకు కూలీ నగదు చెల్లింపు జరుగుతుందన్నారు.

ఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టిన పాఠశాల బస్సు

● విద్యార్థులకు తప్పిన పెను ప్రమాదం

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్లలో విద్యుత్తు స్తంభాన్ని ఓ పాఠశాల బస్సు బుధవారం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. పట్టణంలోని జమ్మలమడుగు రోడ్డులో ఉన్న జ్యోతి విద్యానికేతన్ పాఠశాల బస్సు స్థానిక ఇందిరమ్మ కాలనీలో విద్యార్థులను ఎక్కించుకొని కాలనీ నుంచి మార్కెట్ యార్డు వెనుక ఉన్న మార్గం గుండా పాఠశాలకు వెళ్తోంది. ఈ క్రమంలో ఎదురుగా ద్విచక్రవాహనం రావడంతో తప్పించబోయి దారి మధ్యలో ఉన్న 33 కేవీ లైన్ విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టింది. స్తంభం విరిగి బస్సు మీద వాలింది. బస్సులో సుమారు 25 మంది విద్యార్థులు ఉండగా ఎవ్వరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. పొరపాటున విద్యుత్తు తీగలు బస్సును తగిలి ఉంటే విద్యార్థుల ప్రాణాలకు ముప్పు కలిగేది. స్థానికులు విద్యార్థులను వెంటనే అత్యవసరం ద్వారం నుంచి కిందకు దింపారు. మార్కెట్ యార్డు వెనక దారి మధ్యలోనే ఉన్న విద్యుత్తు స్తంభం తొలగించాలని జనవరి 4న 'ఈనాడు'లో 'దారి మధ్యలో విద్యుత్తు స్తంభం' శీర్షికన చిత్ర కథనం ప్రచురించింది. అప్పుడే అధికారులు స్పందించి ఉంటే ఇప్పుడీ ప్రమాదం జరిగేది ఉండేది కాదు.

స్తంభాన్ని ఢీకొట్టిన పాఠశాల బస్సు

(c) eenadu

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

వాహనాల వేలంతో రూ.3.92 లక్షల ఆదాయం

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్ ఆవరణలో బుధవారం అక్రమ మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలం పాట నిర్వహించారు. ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, ఆదోని సీఐ సైదుల్ ఆధ్వర్యంలో 28 వాహనాలకు వేలం నిర్వహించారు. జీఎస్టీతో కలిపి ప్రభుత్వానికి రూ.3.92 లక్షలు ఆదాయం చేకూరిందని సీఐ సైదుల్ తెలిపారు.

కొత్త వంతెన నిర్మించండి

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని పాతబస్టాండు వద్ద ఉన్న ఆకాశవంతెన శిథిలావస్థకు చేరిందని, అధికారులు స్పందించి ఈ వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించాలని సీపీఐ నాయకులు డిమాండు చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో పట్టణ కార్యదర్శి వీరేశ్, సహాయ కార్యదర్శి నారాయణ, నాయకులు రమేశ్‌కుమార్, విజయ్‌కుమార్, అంజిగౌడు, పుష్పరాజ్, ఈరన్న తదితరులు బుధవారం వంతెనను పరిశీలించారు.

పరిమితికి మించి ప్రయాణించొద్దు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే.. కఠిన చర్యలు తప్పవని పత్తికొండ సీఐ జయన్న హెచ్చరించారు. అధిక సంఖ్యలో ప్రయాణికులతో తీసుకెళ్తున్న ఆటో చోదకులకు, ప్రయాణికులకు బుధవారం ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు. మహిళలపై జరిగే నేరాలనూ ప్రయాణికులకు వివరించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 80085 73622

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని ప్రభుత్వ మాతా, శిశు ఆస్పత్రి వెనుక భాగంలోని రహదారిలో మురుగు కాల్వ కోళ్ల వ్యర్థాలతో నిండి దుర్వాసన వస్తోంది. - లక్ష్మణ, ఆదోని ✔: ప్రజారోగ్య విభాగం ద్వారా సమస్య పరిష్కరిస్తాం. - నయీమ్ అహ్మద్, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం

చిప్పగిరి, న్యూస్‌టుడే: ?: చిప్పగిరిలో విద్యుత్తు లోఓల్టేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కరించాలి. - రఘు, చిప్పగిరి ✔: విద్యుత్తు సరఫరాను పరిశీలించి, సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం. - జంబన్న, ఏఈ చిప్పగిరి

మద్దికెర, న్యూస్‌టుడే: ?: ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు సిమెంటు రోడ్డు తవ్వేసి అలాగే వదిలేశారు. - ఎల్లారెడ్డి, మద్దికెర ✔: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - మయూర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, మద్దికెర

వెల్దుర్తి, న్యూస్‌టుడే: ?: ఎస్.వెంకటాపురం నుంచి జాతీయ రహదారికి, లద్దగిరి మధ్య రహదారి లేక ఇబ్బందులు పడుతున్నాం. - టి.ఎస్.చౌదరి, ఎస్.వెంకటాపురం ✔: ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపి, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం. - మున్నయ్య, ఏఈ

చికిత్స పొందుతూ వివాహిత మృతి

మారెల్ల(తుగ్గలి), న్యూస్‌టుడే: మారెల్ల గ్రామానికి చెందిన వివాహిత అరుణకుమారి(45) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తుగ్గలి ఎస్సై నరేష్ బుధవారం తెలిపారు. అదే గ్రామానికి చెందిన రామ్మూర్తి నాలుగు రోజుల కిందట రోకలి బండతో మహిళ కడుపుపై కొట్టడంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. రెండు కుటుంబాల మధ్య పాత గొడవల నేపథ్యంలో దాడి జరిగిందన్నారు. మృతురాలి భర్త మధు ఫిర్యాదు మేరకు రామ్మూర్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతురాలికి భర్త, నలుగురు సంతానం ఉన్నారు.

దేవనకొండలో చోరీ

దేవనకొండ, న్యూస్‌టుడే: దేవనకొండ బీసీ కొట్టాల కాలనీలో ఉదయం 11 గంటల సమయంలో తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. బంగారు నగలు, రూ.25 వేలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు పూల హమీదు తెలిపారు. వ్యవసాయం పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నారు. చోరీతో ఆవేదనకు గురవుతున్నారు.

అందని నిధులు.. ఆగిన నిర్మాణాలు

◆ భవనాలు కూల్చేసి.. ఆపై వదిలేసి ◆ నాడు- నేడు పనులకు ఆటంకం

పరిశీలన

పత్తికొండ, మద్దికెర, న్యూస్‌టుడే: విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించి, విద్య అందిస్తామని చెప్పిన గత వైకాపా సర్కారు నిధుల మంజూరులో మాత్రం చేతులెత్తేసింది. పలు గ్రామాల్లోని పాఠశాలల అభివృద్ధి మాట దేవుడెరుగు అసంపూర్తి పనులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తవి నిర్మిస్తామని ఉన్న భవనాలు, ప్రహరీలను కూల్చేసిన అధికారులు ఆపై వాటిని నిర్మించకుండా అలాగే వదిలేశారు. పత్తికొండ నియోజకవర్గంలోని మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తికాని పనుల వల్ల ఇబ్బందులు తప్పడం లేదు.

పిల్లర్లతోనే సరిపెట్టారు

ఐదేళ్ల కిందట మండలంలోని పెరవలి శిలారమ్మ కోట వీధిలోని ప్రాథమిక పాఠశాల భవనం ఇది. ఇక్కడ 36 మంది విద్యార్థులు చదువుతున్నారు. నాడు- నేడు... మన బడి కార్యక్రమంలో భాగంగా ఈ భవనాన్ని కూల్చారు. కొత్తది నిర్మించాలని పిల్లర్లు వేసి వదిలేశారు. రూ.13 లక్షలతో ఇక్కడ కొత్త భవనం నిర్మించాలని పాత గదులు తొలగించి ఏళ్లు గడుస్తోంది. నిధులు విడుదల కాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

మండలం	మొత్తం పాఠశాలలు	పనులు జరిగినవి	అసంపూర్తిగా ఉన్నవి
మద్దికెర	26	17	9
పత్తికొండ	46	41	5
కృష్ణగిరి	49	49	49
తుగ్గలి	65	45	20
వెల్దుర్తి	61	50	11

నిధులు లేక.. పనులు పూర్తికాక

మండలం: వెల్దుర్తి, పాఠశాల: జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల
విద్యార్థులు: 600 మంది, కావాల్సిన నిధులు: రూ. 4లక్షలు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: ఇక్కడ గదుల నిర్మాణం పూర్తిచేశారు. కేవలం వాటికి రంగులు వేయడం, చిన్నపాటి పనులకు నిధులు మంజూరు చేస్తే.. గదులను వినియోగించుకోవచ్చు. దీంతో పాఠశాలలోని సుమారు 600 మంది విద్యార్థులకు అదనంగా ఆరు గదులు అందుబాటులోకి వస్తాయి.

తప్పని అవస్థలు

మండలం: పత్తికొండ, పాఠశాల: దూదేకొండ జడ్పీ ఉన్నత పాఠశాల, మొత్తం విద్యార్థులు: 481, కావాల్సిన నిధులు: రూ.13 లక్షలు

పత్తికొండ గ్రామీణం న్యూస్‌టుడే: మండలంలోని దూదేకొండ, నలకదొడ్డి, పులికొండ, అటికెలగుండు, జూటూరు తదితర గ్రామాల్లో అసంపూర్తి పనులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దూదేకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం ఏడు గదులు ఉన్నాయి. మూడు అదనపు గదులు మంజూరయ్యాయి. రెండు నిర్మాణంలో ఉన్నాయి. నిర్మాణాలు పూర్తిచేసి విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలని ఆయా గ్రామాల్లోని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

వైకాపా పాలనలో పరిశ్రమలు వెనుదిరిగాయి

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో గత వైకాపా పాలనలో పరిశ్రమలు రాష్ట్రం వదిలివెళ్లిపోయాయని.. నేడు కూటమి ప్రభుత్వంలో పెట్టుబడులు ఊపందుకున్నాయని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. బుధవారం అసెంబ్లీ సమావేశంలో మాట్లాడారు. పరిశ్రమలతో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. వైకాపా సభ్యులు రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్నారన్నారు.

పల్లె కబుర్లు

పెద్దపెండేకల్ (ఆదోని గ్రామీణం), న్యూస్‌టుడే: గ్రామంలో హాజీ మలంగ్ షా బాబా ఉరుసు గురువారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 19వ తేదీన ఉరుసు, 20న జియారత్ ఉంటుందన్నారు. బుధవారం గంధం వేడుకలు నిర్వహించారు, అన్నదానం చేశారు.

రాతన (తుగ్గలి), న్యూస్‌టుడే: కుటుంబ సర్వే కోసం ఇళ్ల దగ్గరకు వచ్చే గ్రామ సచివాలయ ఉద్యోగులకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో విశ్వమోహన్ తెలిపారు. రాతనలో సర్వే జరుగుతున్న తీరును బుధవారం పరిశీలించారు.

గజ్జహళ్లి (హొళగుంద), న్యూస్‌టుడే: గజ్జహళ్లి గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయ ధ్వజస్తంభ పున: ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ధ్వజారోహణ కార్యక్రమం వేద పండితులు, ఆలయ నిర్మాణ దాత హనుమంత రెడ్డి, తిమ్మారెడ్డి కుటుంబ సభ్యుల సమక్షంలో నిర్వహించారు. మూడు రోజులు పాటు అన్నదానం ఉంటుందని ఆంజనేయ ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

హొళగుంద, న్యూస్‌టుడే: గజ్జహళ్లి గ్రామ దేవత, దేవమ్మ దేవి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. హోమాలు నిర్వహించి, నూతన విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. గురువారం గణపతి, పరమేశ్వర అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, హోమాలు, శుక్రవారం దేవమ్మ విగ్రహ ప్రతిష్ఠ చేపట్టనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. మూడు రోజుల పాటు అన్నదానం చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

చిత్తశుద్ధి లేదు.. చెత్త తొలగించరు

ఆదోని పట్టణంలోని గుల్‌హుసేని దర్గా కూడలిలో చెత్తంతా రహదారిపైకి చేరింది. వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలు దాటినా.. ఈ ప్రాంతంలో చెత్త తొలగించలేదు. కూడలి కావడంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అసలే ఇరుకు దారి, ఆపై చెత్తాచెదారం చెల్లాచెదురుగా పడింది. స్థానిక దుకాణదారులు, నివాస గృహాల వారు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. - న్యూస్‌టుడే, ఆదోని పురపాలకం

ప్రమాదాల దారిలో ఇసుక రవాణా

వేదవతి నదిలో ఇసుకకు వెళ్లిన ట్రాక్టర్లు ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణం సాగిస్తున్నాయి. మార్లమడి గ్రామం అంచున వేదవతికి వెళ్లే మార్గం గుంతలు పడి, అధ్వానంగా మారింది. హగరిని నుంచి ఇసుకను తరలించే క్రమంలో బుధవారం ట్రాక్టర్ వేదవతి నదిలో ఇరుక్కుపోయింది. తాడుకట్టి మరో ట్రాక్టర్‌తో బయటకు లాగే ప్రయత్నం చేస్తున్నారు. ఇంజిన్‌పై ప్రమాదకరంగా కూర్చొని ప్రమాదకరంగా బయటకు లాగుతున్నారు. ఏమాత్రం అటూఇటూ అయినా.. ప్రాణాపాయం తప్పదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, హొళగుంద

లక్షలు వ్యయం.. లక్ష్యం దూరం

రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన ప్రభుత్వ భవనాలు ప్రారంభానికి నోచుకోవడం లేదు. చిప్పగిరి మండలం రామదుర్గంలో వైకాపా పాలనలో రూ.40 లక్షల వ్యయంతో చేపట్టిన గ్రామ సచివాలయ భవన నిర్మాణం పూర్తయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని సౌకర్యాలతో నిర్మించిన భవనంలోకి సచివాలయం ఉద్యోగులు రాకపోవడంతో నిరుపయోగంగా మారింది. కొత్త భవనంలో సేవలందించాలని రామదుర్గం గ్రామస్థులు కోరుతున్నారు. దేగులపాడ్, బెల్దోణ, గుమ్మనూరు గ్రామ సచివాలయ భవనాల నిర్మాణం ఏళ్లు గడిచినా.. అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. - న్యూస్‌టుడే, చిప్పగిరి

మద్యం.. ధ్వంసం

ఆదోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో అక్రమ రవాణా, క్రయవిక్రయాల కేసుల్లో పట్టుబడిన మద్యాన్ని బుధవారం ఎక్సైజ్ పోలీసు అధికారులు ధ్వంసం చేశారు. సీఐ సైదుల్ తెలిపిన వివరాల మేరకు.. ఆదోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో 170 కేసుల్లో పట్టుబడిన రూ.12.70 లక్షలు విలువ చేసే కర్ణాటక మద్యం, నాటుసారా, ఆంధ్ర మద్యంను ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో వాహనంతో ధ్వంసం చేయించారు. మద్యం అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచి దాడులు చేస్తున్నామన్నారు. - న్యూస్‌టుడే, ఆదోని నేరవార్తలు

సంక్షిప్త సమాచారం

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: మార్కెట్ యార్డులో బుధవారం పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్ విచారణ చేపట్టారు. యార్డు ఛైర్‌పర్సన్ శారద స్థానంలో ఆమె భర్త యార్డులో మొత్తం పెత్తనం చేస్తున్నారని పాలకవర్గంలోని ఓ సభ్యురాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి దొంగతనం చేసిన వారిని గుర్తించి, చర్యలు తీసుకోవాలని బాధిత వ్యాపారి జిందే లక్ష్మణ బుధవారం యార్డు ఛైర్‌పర్సన్ జిందే శారదకు వినతిపత్రం అందించారు. పట్టణ పోలీసులతో పాటు యార్డులోని కమీషన్ ఏజెంట్ల సంఘం నాయకులకు సైతం ఫిర్యాదు చేశానని ఆయన తెలిపారు.

మద్దికెర, న్యూస్‌టుడే: ధరల పతనంలో ఆందోళన చెందకుండా వెంటనే సీఎం యాప్‌లో శనగ రైతులు తమ వివరాలు నమోదు చేసుకుంటే త్వరలోనే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు చేపడతారని వ్యవసాయ అధికారి రవి పేర్కొన్నారు. మద్దికెర వ్యవసాయ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు.

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పీఎం కిసాన్ పథకం వర్తించాలంటే ప్రతి రైతుకు విశిష్ట సంఖ్య తప్పనిసరిగా ఉండాలని మండల వ్యవసాయాధికారి వెంకటరాముడు అన్నారు. మండల వ్యాప్తంగా ఇంకా 2,143 మంది రైతులు విశిష్ట సంఖ్య రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉందన్నారు.

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెరలోని రామనగర్ కాలనీలో నీరే అందడం లేదని, ఇంటింటికి కుళాయిలు ఉన్నా చుక్క నీరు రావడం లేదని కాలనీవాసులు బుధవారం పంచాయతీ కార్యాలయానికి వచ్చి సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అనంతరం కార్యాలయం ముందు నిరసన చేపట్టారు.

హొళగుంద, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక ఇస్తున్నట్లు ప్రకటించినా.. స్థానికంగా రూ.500లు ఎందుకు వసూలు చేస్తున్నారని, ఆ సొమ్ము ఎవరికి చేరుతుందని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి ప్రశ్నించారు. మార్లమడికి వేదవతి నదిని పరిశీలించారు.

ఉన్నత చదువులు చదవాలి

ఆలూరు, న్యూస్‌టుడే: బాలికలు పదో తరగతితోనే చదువుకు స్వస్తి పలకకుండా ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని స్టేట్‌బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజరు హేమ, రీజనల్ మేనేజర్ తేజోమూర్తుల శ్రీనివాస్, ఆలూరు బ్రాంచి మేనేజర్ అప్పారావు అన్నారు. ఎస్బీఐ ఆధ్వర్యంలో ఆలూరు ఉర్దూ, జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలలకు చెందిన పది మంది పేద విద్యార్థినులకు బుధవారం సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారులు కోమలాదేవి, చిరంజీవిరెడ్డి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సావిత్రి, సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు అందజేసిన అధికారులు

ఉపాధి పనుల్లో రూ.76 వేల అవినీతి

హాలహర్వి, న్యూస్‌టుడే: హాలహర్వి మండలంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై నెల రోజుల పాటు సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో డ్వామా పీడీ మాధవీలత ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. మండలంలో ఉపాధి హామీ పథకం, పంచాయతీ రాజ్ శాఖలకు సంబంధించి 1219 పనులకు గాను రూ.12.66కోట్లతో పనులు చేపట్టారు. 15 పంచాయతీల్లో జనవరి 2 నుంచి ఈ నెల 17వ తేదీ వరకు తనిఖీలు నిర్వహించి ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. మండలం మొత్తంగా రూ.76,542 అవినీతి జరిగినట్లు తేల్చారు. విధుల పట్ల నిర్లక్ష్యం కారణంగా సిబ్బందిపై రూ.57,500 జరిమానా విధించారు. పీడీ మాట్లాడుతూ అవినీతి జరిగిన నగదును వెంటనే రికవరీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారిణి షకీలా బేగం, పత్తికొండ డివిజన్ ఏపీడీ లక్ష్మన్న, ఏడీవీఐ ఆదినారాయణ, ఎస్ఆర్పీ కాంతయ్య, ఎంపీడీవో వరలక్ష్మీ, పీఆర్ జెఈ సోమప్ప, ఏపీవోలు చక్రవర్తి, హేమసుందర్ ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న తనిఖీ బృందం సభ్యులు

ఈ-పంట నమోదుతోనే ప్రయోజనాలు

ఆస్పరి, న్యూస్‌టుడే: రైతులు పొలంలో సాగు చేసిన పంట వివరాలను సక్రమంగా నమోదు చేయాలని పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్ అన్నారు. మండలంలోని చిరుమాన్‌దొడ్డి గ్రామ సమీపంలో క్షేత్రస్థాయిలో ఎల్‌పీ నంబర్ 516,613 పొలాలను పరిశీలించి అక్కడ వేసిన పంటలను పరిశీలించారు. వివరాలు తప్పుగా నమోదు చేస్తే రైతులకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు భీమేష్, వీఆర్వో మాబు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిరుమాన్‌దొడ్డి గ్రామంలో పంట నమోదును పరిశీలిస్తున్న ఆర్డీవో భరత్‌నాయక్, తహసీల్దారు రామేశ్వరరెడ్డి

సైబర్ నేరాల విషయంలో జాగ్రత్త

ఆస్పరి, న్యూస్‌టుడే: సైబర్ నేరాల విషయంలో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య అన్నారు. స్థానిక జిల్లా పరిషత్తు పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని విజయకుమారి ఆధ్వర్యంలో విద్యార్థినులకు బ్యాడ్‌టచ్, గుడ్‌టచ్, సైబర్ నేరాలపై జాగ్రత్తలు.. తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాల వల్ల నష్టపోయినప్పుడు ముందుగా 1930కి ఫోన్ చేసి, సమాచారం అందించాలన్నారు. బాలికలు భయపడకుండా జరిగిన ఘటనలను తల్లిదండ్రులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఆస్పరి సీఐ గంగాధర్, ఎస్సై ఉపాధ్యాయులు వెంకటరమణ, ఇందిర, పరమేష్, మహేశ్వరి, నీలోఫర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి: స్థానిక జిల్లా పరిషత్తు పాఠశాలలో మాట్లాడుతున్న పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీఐ రవిశంకర్‌రెడ్డి, ఎస్సై మన్మథ విజయ్ అన్నారు. ఆలూరులోని చైతన్య ఆంగ్ల పాఠశాలలో బుధవారం సైబర్ మోసాలు, బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ నాగలక్ష్మి, ఏవో రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆగని భూ కబ్జాలు

● వైకాపా నాయకుల హస్తం ● పది ఎకరాల స్థలంలో వెంచర్

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: పట్టణంలో మరో భూ కబ్జా బాగోతం వెలుగు చూసింది. పట్టణ శివారులోని ఇస్వీ బైపాస్ రహదారిలో శుక్రవారంపేట మారెమ్మవ్వ ఆలయం ముందు భాగంలోని సర్వే నంబరు 314లో 10.50 ఎకరాల పోరంబోకు స్థలం కబ్జాకు గురైంది. ఈ భూమిలో గతంలో నిరుపేదలకు డీ-పట్టాలు జారీ చేశారు. గత వైకాపా ప్రభుత్వంలో ఫ్రీ హోల్డ్ చేసిన సమయంలో ఈ సర్వే నంబరులోని భూమిని స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నాడు వీఆర్వోగా ఉన్న ఓ వ్యక్తిని పలుకుబడి ఉపయోగించి డిప్యుటేషన్‌పై స్థానికంగానే ఆర్ఐగా ఉండేలా చేసి, వైకాపా నాయకులు ఈ భూమిని తమ పేర్లపై మార్చుకున్నారని తెలుస్తోంది. పట్టణంలో జనాభాతో నివాసాల సంఖ్య పెరగడంతో స్థలాలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో ఈ ప్రాంతంలో సెంటు భూమి రూ.4 లక్షలకు పైగా పలుకుతోంది. అందులోనూ రహదారికి ఆనుకొని ఉండటం, ఏళ్లుగా ఈ మైదాన భూమిలో యువకులు క్రీడలు ఆడేవారు. కొందరు మేకలు నిలుపుకొనేవారు. సంచార జాతుల వారు గుడిసెలు వేసుకొని నివాసముండేవారు. ప్రస్తుతం ఇవేవీ కనిపించకుండా చేసి, వెంచర్ వేశారు. అంతర్గత గరసు దారులు వేసి, కాల్వల నిర్మాణాలు చేపట్టారు.

వెంచర్ వేసిన భూమి

● గత వారం ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ప్రజాదర్బార్‌లో భూ కబ్జాపై ఫిర్యాదు వచ్చిందని భాజపా నాయకులు విజయ్‌కృష్ణ, మహదేవ్, సురేష్ తదితరులు తెలిపారు. దళితులకు కేటాయించిన భూమిని మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్న కుమారుడు ప్రదీప్‌రెడ్డితో పాటు స్థానికంగా వైకాపా నాయకుడు రామకృష్ణారెడ్డి కబ్జా చేసి వెంచర్ వేశారని ఆరోపించారు. వెంచర్ వేసిన భూమిని భాజపా నాయకులు పోలీసుల రక్షణలో పరిశీలన చేశారు. భూమిని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ అవసరాలకు వినియోగించకోవడంతో పాటు, కబ్జాదారులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో వైకాపా నాయకుడు రామకృష్ణారెడ్డి సైతం ఆ ప్రాంతంలో తచ్చాడుతూ తిరిగారు.

● వెంచర్‌కు కుడా గాని, పురపాలక సంఘం కానీ వెంచర్ ఏర్పాటుకు ఎలాంటి అనుమతులివ్వలేదని పురపాలక పట్టణ ప్రణాళిక విభాగాధికారులు పేర్కొన్నారు. ఎలాంటి ఫిర్యాదు తమకు అందలేదని, దీనిపై విచారణ చేస్తామని ఆదోని మండల తహసీల్దారు శేషఫణి తెలిపారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

ఆస్పరి, న్యూస్‌టుడే: బిణిగేర గ్రామంలోని శ్రీగిరి క్షేత్రంలోని పంచలింగేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అంతర్ రాష్ట్ర బండలాగుడు పోటీల్లో విజేతగా కోడుమూరు మండలం కొత్తపల్లి దుబ్బన్నకు చెందిన వృషభాలు ప్రథమ స్థానంలో నిలిచాయి. ఈ పోటీలను బుధవారం తెదేపా ఆలూరు నియోజకవర్గ బాధ్యురాలు వైకుంఠం జ్యోతి, శ్రీగిరిక్షేత్రం ఆశ్రమ గురువు శ్రీనివాస నాయన, ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ బిల్లేకల్లు వెంకటేశ్వరు, మాజీ ఎంపీటీసీ సభ్యులు కృష్ణయాదవ్ ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆలూరు ఎమ్మెల్యే తనయుడు చంద్రశేఖర్, పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, ఆస్పరి సీఐ గంగాధర్, పారిశ్రామిక వేత్త విట్టారమేష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు గోవిందు, వెంకటేష్, సంజన్న, రాఘవేంద్ర, నారాయణ పాల్గొన్నారు.

పోటీలు ప్రారంభిస్తున్న వైకుంఠం జ్యోతి, ఆశ్రమ గురువు శ్రీనివాస నాయన, బిల్లేకల్లు వెంకటేశ్వర్లు, తదితరులు

ముగిసిన బ్రహ్మేశ్వరస్వామి ఉత్సవాలు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా వెల్దుర్తి సమీపంలోని బ్రహ్మగుండక్షేత్రంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ఉత్సవాలు బుధవారం వసంతోత్సవంతో ముగిశాయి. బ్రహ్మేశ్వర స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఎడ్ల బండిపై గ్రామంలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు.

వేసవి సమస్యకు ముందస్తు పరిష్కారం

● రూ.80లక్షలతో తాగునీటి పైపులైన్ పనులు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టారు. పెండింగ్ పైపులైన్ పనులు పూర్తిచేసి, తాగునీరు అందించేందుకు గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేశారు. లీకేజీలు, పైపులైన్ మరమ్మతులు చేపడుతున్నారు.

ఎక్కడెక్కడంటే..

ఆదోని మండలం పెద్దహరివాణం, సంతేకుడ్లూరు గ్రామాల్లో ఏటా వేసవిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంటుంది. 2024 మేలో ఎన్‌ఆర్‌డీడబ్ల్యూపీ (నేషనల్ రూరల్ డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు) కింద రూ.ఆరు కోట్లతో మదిరె తాగునీటి పథకం నిర్మించారు. పైపులైన్ వేయకపోవడంతో పెద్దహరివాణం, సంతేకుడ్లూరు గ్రామాలకు తాగునీటి సరఫరా చేయలేకపోయారు. దీనిపై 'ఈనాడు'లో పలుసార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. ఇందుకు కూటమి ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసింది. ఆదోని మండలం మదిరె తాగునీటి పథకం నుంచి సంతేకుడ్లూరు మీదుగా పెద్దహరివాణం గ్రామానికి పైపులైన్ పనులు జోరుగా సాగుతున్నాయి. తాగునీటి నిర్వహణ పొదుపు నిధుల కింద రూ.80లక్షలతో నాలుగు పనులు మంజూరయ్యాయి. ఒక్కో పనికి రూ.20లక్షలు కేటాయించారు. మొత్తం 8.7 కి.మీ. పైపులైన్ వేయాల్సి ఉంది. పనులు పూర్తి చేసి, తాగునీరు అందించడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు.

మదిరె గ్రామం నుంచి పెద్దహరివాణం వరకు తవ్విన పైపులైన్

త్వరలో గ్రామాలకు నీరు

- మధుసూదన్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, ఆదోని

మదిరె తాగునీటి పథకం నుంచి పెద్దహరివాణం గ్రామానికి మరో 15 రోజుల్లో తాగునీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పైపులైన్ పనులు జరుగుతున్నాయి. మోటార్లు ఏర్పాటు చేసి, నీటిని పంపింగ్ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తాం. ఈ ఏడాది వేసవిలో గ్రామీణ ప్రజలకు తాగునీటి కష్టాలు లేకుండా చూస్తాం.

మహారాజశ్రీ రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో: కర్నూలు అట్ ఆదోని
G.W.O.P. No: 06/2026
మధ్య:
శ్రీమతి కె.నజీయా, భర్త: దివంగత కె.షేక్షావలి, ముస్లిం, వయస్సు సుమారు 29 సంవత్సరాలు, గృహిణి, నివాసం: ఇల్లు నెం. 6-102, ఓ.సి. కాలనీ, పెద్దహరివాణం మండలం, కర్నూలు జిల్లా, మొబైల్ నెం: 9100200266, ఆధార్ కార్డు నెం. 2676 8797 3190 - అర్జీదారు
V/s
సాధారణ ప్రజానీకం - ఉత్తరవాది
జనరల్ నోటీసు టు పబ్లిక్
తెలియజేయడము ఏమనగా పై తెలిపిన పిటిషనర్ అయిన శ్రీమతి కె.నజీయా, భర్త: దివంగత కె.షేక్షావలి, ముస్లిం, వయస్సు సుమారు 29 సంవత్సరాలు, గృహిణి, నివాసం: ఇల్లు నెం. 6-102, ఓ.సి.కాలనీ, పెద్దహరివాణం మండలం, తన పిల్లలు మరియు అత్త మామ ఆమె సంరక్షణలో ఉన్నారు. తన మైనర్ పిల్లలు విద్యా ఖర్చులు, తదితర సంక్షేమము కొరకు షెడ్యూల్ పేర్కొన్న ఆస్తిని కేటాయించడానికి/ అమ్మేందుకు గౌరవనీయమైన కోర్టు అనుమతి కోరుతూ ఒక పిటిషన్‌ను దాఖలు చేశారు.
కావున, ఇందు విషయమును ఎవ్వరికైనా ఎటువంటి ఆక్షేపణలు గాని అభ్యంతరములుగాని ఉన్న యెడల విక్రయించడంపై అభ్యంతరాలు ఉన్న వ్యక్తులు 09.03.2026 ఉదయం 10.30 గంటలకు గౌరవ న్యాయస్థానం ముందు వ్యక్తిగతంగా లేదా న్యాయవాది ద్వారా తమ అభ్యంతరాలు ఏవైనా ఉంటే తెలియజేయడానికి తప్పకుండా హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఎవ్వరూ రానీ యెడల పై కోర్టు వారు కేసును పిటిషన్ పరముగా తీర్మానం చేయడం జరుగుతుంది.
అనుసూచి:
కర్నూలు రిజిస్ట్రేషన్ జిల్లా, ఆదోని సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలో, హొళగుంద మండలం, పెద్దహరివాణం గ్రామ పరిధిలో ఉన్న సర్వే నెం. 148-బిలో గల మొత్తం విస్తీర్ణం Ac. 182.38 చదరపు గజాలు కలిగిన, డోర్ నెం. 6-159/25/6 గల ఇల్లు మరియు దాని స్థలం.
హద్దులు: తూర్పు: అదే సర్వే నెంబరులో పిటిషనర్లకు మిగిలిన భూమి, పడమర: రోడ్డు, ఉత్తరం: హల్మనాయ అయ్యన్న భూమి, దక్షిణం: అదే సర్వే నెంబరులో పిటిషనర్లకు మిగిలిన భూమి.
(కోర్టు వారి ఉత్తర్వులు మేరకు)
వాయిదా తేదీ: 09.03.2026
సం/- T.Madhu Sudhan, అడ్వకేట్ ఫర్ పిటిషనర్, ఆదోని. Cell: 99663 90700.

ఎమ్మిగనూరు
• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

ఆన్‌లైన్‌లో పన్నులు చెల్లించవచ్చు

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా ఇంటిపన్నులు చెల్లింపులు జరగాలని ఆదోని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి బాలకృష్ణారెడ్డి మంత్రాలయం మండల గ్రామపంచాయతీ అధికారులకు సూచించారు. బుధవారం మంత్రాలయంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి పన్నుల తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి పన్నుల వసూలు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణ, రామాంజనేయులు, పీడీవో ఉపేంద్ర రెడ్డి, బిల్ కలెక్టర్ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్‌లో ప్రతిభ

సి.బెళగల్, న్యూస్‌టుడే: సి.బెళగల్‌లోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు జేఈఈ మెయిన్ ఫలితాల్లో ప్రతిభ చాటారని ప్రిన్సిపల్ చింతయ్య తెలిపారు. మెయిన్‌లో సీనియర్ ఇంటర్ ఎంపీసీ చదువుతున్న సంజీవరాజ్ 74.61, చాణిక్ 66.19, జీవరత్నం 64.78, విక్టర్ 63.89, చిన్న 62.13 పర్సంటైల్ సాధించినట్లు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఎమ్మిగనూరు 8008573824 కోడుమూరు 9885988357 కౌతాళం 8008574913

సి.బెళగల్, న్యూస్‌టుడే: ?: కంబదహాల్ గ్రామంలో ఉన్నత పాఠశాలలో భద్రత కోసం ప్రహరీ నిర్మాణం చేపట్టాలి - స్వామిదాసు, కంబదహాల్ ✔: సర్వశిక్ష అభియాన్ ఏఈ శివకుమార్ దృష్టికి తీసుకెళ్లి ప్రహరీ నిర్మాణంపై చర్యలు తీసుకుంటాం. -ఎంఈవో రామన్న, సి.బెళగల్
కంబదహాల్: ?: గ్రామంలో ప్రాథమిక పాఠశాలలోని గదిలో పైకప్పు పెచ్చులు ఊడిపోవడంతో శిథిలావస్థకు చేరింది. - కుమార్, కంబదహాల్ ✔: భవనం విషయాన్ని మండల ఏఈ వెంకటప్రకాష్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం. - ఎంఈవో, రామన్న, సి.బెళగల్.

తాగునీటి ఎద్దడి

వేసవి ప్రారంభం కాక ముందే పల్లెల్లో తాగునీటి ఎద్దడి మొదలైంది. కర్నూలు జిల్లా పెద్దకడబూరు మండలం చిన్నతుంబళం గ్రామంలో తీవ్ర తాగునీటి సమస్య తలెత్తింది. నీటి కోసం పక్క [illegible] తుంబళం గ్రామంలో సుమారు 1200 కుటుంబాలు, 5 వేల మంది జనాభా నివసిస్తున్నారు. ఊరి పక్కనే రాయల చెరువు ఉన్నా గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి వేధిస్తోంది. గుక్కెడు నీటి కోసం పక్క గ్రామానికి వెళ్లాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పెద్దకడబూరు

ఉద్యానం.. కానరాని ఆహ్లాదం

★ ఏడేళ్లుగా నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం ★ అభివృద్ధికి వీడని గ్రహణం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పట్టణ వాసులకు ఆహ్లాదం కరవైంది. ఏడేళ్లుగా పార్కుల అభివృద్ధికి పైసా నిధులు కేటాయించలేదు. పన్నుల రూపంలో ముక్కు పిండి వసూళ్లు చేస్తున్నా.. ఉద్యానాల అభివృద్ధిని ప్రజాప్రతినిధులు పూర్తిగా విస్మరించారు. వైకాపా హయాంలో ఒక్క పార్కును అభివృద్ధి చేయకపోగా విరిగిన పరికరాలకు కనీస మరమ్మతులు చేపట్టలేదు. కూటమి సర్కారులోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

పార్కులో ఊయల విరిగిపోగా మిగిలిన స్తంభాలు

విరిగిపోయిన పరికరాలు

పట్టణంలోని వీవర్స్ కాలనీలో మాచాని సోమప్ప పెద్దపార్కు దాదాపు మూడు ఎకరాలకు పైగా విస్తరించి ఉంది. పార్కులో పిల్లల ఆట వస్తువుల కోసం 2017లో రూ.12 లక్షలు వెచ్చించి ఊయల, జారుడుబల్ల, చక్రాలు, బెంచీలు, ఇతర పరికరాలు కలిపి దాదాపు 23 రకాలు ఏర్పాటు చేశారు. రోజూ ఐదులో 300 నుంచి 600 మంది దాకా చిన్నారులు, పెద్దలు 400కు పైగా వస్తారు. కాగా ఆట వస్తువులు విరిగిపోవడంతో చిన్నారులకు ఆహ్లాదం కరవైంది. జారుడుబల్ల రేకులు పూర్తిగా విరిగిపోయి ప్రమాదకరంగా మారింది. రెండు ఊయలల గొలుసులు తెగిపోయాయి. రంగులరాట్నం విరిగి కడ్డీ మిగిలింది. ఏడు ఆట వస్తువులు పూర్తిగా దెబ్బతిన్నాయి. అధికారులు వీటికి కనీసం మరమ్మతులు చేపట్టలేదు.

నిర్వహణ గాలికి..

ఉద్యానవనంలో నీళ్లు ఉన్నా కొత్త మొక్కలు పెంపకం చేపట్టలేదు. గతంలో ఉన్న చెట్లు తప్ప మిగతా అంతా ఖాళీ స్థలం కనిపిస్తోంది. ఈశ్వరుడి విగ్రహం ఏర్పాటుకు వేసిన ఫౌండేషన్ పూర్తిగా దెబ్బతింది. ముందు భాగంలో ఏర్పాటు చేసిన వివిధ బొమ్మలన్నీ రంగులేని కళావిహీనంగా మారాయి. పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ఆహ్లాదం కోసం వచ్చే వారికి మరుగుదొడ్డి, తాగునీటి వసతి లేక ఇబ్బంది పడుతున్నారు.

నిధులు మంజూరు చేశాం

- గంగిరెడ్డి, పురపాలక కమిషనర్, ఎమ్మిగనూరు

పట్టణంలో ఉద్యాన వనాల అభివృద్ధి కోసం రూ.2 కోట్లు మంజూరు చేశాం. వీటితో కొత్తగా పార్కు ఏర్పాటుతో పాటు గతంలో ఉన్న పార్కును అభివృద్ధి చేస్తాం. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు చేపడతాం.

మార్కెట్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు

స్పందనకు వందనం

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌లో సీసీ కెమెరాలు లేకపోవడంపై గత నెల 24న 'ఈనాడు'లో రక్షణ కరవు అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై మార్కెటింగ్ శాఖ అధికారులు స్పందించారు. మార్కెట్‌లో రూ.10.90 లక్షలతో 54 సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు బుధవారం ప్రత్యేకశ్రేణి కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. ఇప్పటికే సీసీ కెమెరాల కోసం ధరల వివరాలు ఆహ్వానించామని, వాటిలోంచి ఎంపిక ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటును త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో రోజా దర్గా ఉరుసు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: నగరంలోని ప్రకాష్‌నగర్‌లో ఉన్న రోజా దర్గా ఉరుసు బుధవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. పీఠాధిపతి సయ్యద్ దాదాబాషా సాహెబ్ ఇంటి నుంచి గంధోత్సవం ప్రారంభమైంది. గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు తీసుకొచ్చారు. ఏటా రంజాన్ నెల ప్రారంభం రోజున ఉరుసు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉరుసును తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల కోసం సహ్రీ ఏర్పాట్లు చేసినట్లు పీఠాధిపతి తెలిపారు. కార్యక్రమంలో ఖలీలుల్లా ఖాద్రీ, ఆజామ్ తదితరులు పాల్గొన్నారు.

వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.9,670

మార్కెట్‌కు అమ్మకానికి తెచ్చిన వేరుసెనగ ఉత్పత్తులు

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.9,670 మధ్యస్థ ధర రూ.8,700, కనిష్ఠ ధర రూ.3,961కు వ్యాపారులు కొన్నారు. మార్కెట్‌కు 116 మంది రైతులు 3,767 వేరుసెనగ బస్తాలు అమ్మకానికి తెచ్చారు. ఆముదాలు క్వింటా గరిష్ఠ ధర రూ.5,990, మధ్యస్థ ధర రూ.5,973, కనిష్ఠ ధర రూ.5,521 పలికింది. కందులు క్వింటా గరిష్ఠ, మధ్యస్థ ధర రూ.6,750, కనిష్ఠ ధర రూ.6,010కు కొన్నారు. శనగలు గరిష్ఠ, మధ్యస్థ ధర రూ.4,901, కనిష్ఠ ధర రూ.3,070 పలికింది.

దిశ తప్పింది.. తికమక తప్పకుంది

కోడుమూరు మీదుగా కర్ణాటక, తెలంగాణ, ఇతర ప్రాంతాలకు వెళ్లే సూచికల బోర్డులు సరిగా లేకపోవటంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. బైపాస్ జంక్షన్‌లో వివిధ ప్రాంతాలకెళ్లే బోర్డులను ఏర్పాటు చేసి దశాబ్దాలు దాటింది. బళ్లారి వైపు గుర్తు చెరిగిపోయింది. మరోపక్క మంత్రాలయం, ఆదోని దిశ కర్నూలు వైపు చూపిస్తోంది. అధికారులు స్పందించి సరైన దిశలను సూచించే పెద్ద బోర్డులను ఏర్పాటు చేయాలని జనం కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కోడుమూరు గ్రామీణం

పొంచి ఉన్న ప్రమాదం

పట్టణంలో గాంధీనగర్ కాలనీలో విద్యుత్తు నియంత్రికకు కంచె లేక ప్రమాదకరంగా మారింది. ప్రధాన దారి కావడంతో పక్కన ఉన్న విద్యుత్తు నియంత్రికతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. వీవర్స్ కాలనీ, గాంధీనగర్ కాలనీవాసులు రాకపోకలు సాగిస్తున్నారు. ద్విచక్రవాహనాలు, ఆటోల్లో వెళ్లాలంటే ఎదురుగా వచ్చే వాహనాలతో అవస్థలు పడుతున్నారు. అధికారులు చొరవ తీసుకొని రక్షణ వలయం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

స్తంభం ఒరిగి..ప్రమాదం పొంచి



మండలంలోని గుడేకల్‌లో చెరువు కట్ట వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభాలు రెండు పక్కకు ఒరిగి ప్రమాదకరంగా ఉన్నాయి. ఈదులు గాలులకు కిందపడిపోయే ప్రమాదం ఉందని స్తంభాలు సరి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విన్నవిస్తున్నారు. - న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు గ్రామీణం

కాల్వగట్టు శిథిలం.. చర్యలు శూన్యం

ఎమ్మిగనూరు గుండా ప్రవహించే ఎల్లెల్సీ కాల్వ గట్టు పలు చోట్ల శిథిలావస్థకు చేరింది. ప్రధాన కాల్వ గట్టు బలహీనపడటంతో కాల్వలో నీరు సామర్థ్యం మేర ప్రవహిస్తే తెగె ప్రమాదం ఉందని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో కాల్వ గట్టు బలహీన పడి తెగిపోయినట్లు రైతులు తెలియజేశారు. వేసవిలో శిథిలమైన కాల్వ గట్లను మరమ్మతు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయకట్టుదారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు గ్రామీణం

సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: సీఎం సహాయ నిధి నిరుపేద రోగులకు వరం లాంటిదని తెదేపా రైతు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి రమాకాంతరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చిన్నకడబూరు గ్రామంలో అనారోగ్యంతో బాధ పడుతున్న కంపాడు పెద్ద హనుమంతుకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.32714 విలువ చేసే సీఎం సహాయ నిధి చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం అదే గ్రామంలో అనారోగ్యంతో బాధ పడుతున్న తెదేపా సీనియర్ నాయకుడు మల్దమ్మగారి రామాంజినేయులును రమాకాంతరెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు ఎంజీ నర్సన్న, నల్లారెడ్డి, బుసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు

సంగాల(సి.బెళగల్) న్యూస్‌టుడే: మండలంలోని సంగాల గ్రామంలో మారెమ్మ సుంకులాపరమేశ్వరీదేవి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవానికి నూతన రాతికట్టకం ఆలయాలు నిర్మించారు. ఈనెల 20న మారెమ్మ, సుంకులాపరమేశ్వరీ విగ్రహాల ప్రతిష్ఠ ఉత్సవ అంకురార్పణ పూజలకోసం భీమయ్యస్వామి బృందం శ్రీకారం చుట్టింది. పురోహిత బృందం ఆధ్వర్యంలో యాగశాలలో హోమం, గణపతి, అమ్మవారి విగ్రహాలకు పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

పూజలు చేస్తున్న వేద పండితులు

ఆంజనేయస్వామి దేవాలయం ప్రారంభోత్సవం

గోనెగండ్ల,న్యూస్‌టుడే: గోనెగండ్లలోని గంజహళ్లి రోడ్డులో నిర్మించిన నూతన పంచముఖిస్వామి ఆలయం ప్రారంభోత్సవ సందర్భంగా వేదపండితులతో ప్రత్యేక పూజలు బుధవారం నిర్వహించారు. ఈనెల 19, 20వ తేదీలలో ఆలయంలో పూజా కార్యక్రమాలు జరుగుతున్నట్లు ఆలయకమిటీ సభ్యులు చెప్పారు. 20వ తేదీ ఆలయంలో పంచముఖి ఆంజనేయ స్వామి, గణపతి, ధ్వజస్తంభం, నాగదేవత తదితర విగ్రహాలను ప్రతిష్ఠ చేస్తారన్నారు. కార్యక్రమాలకు భక్తులు హాజరవ్వాలని కోరారు.

నూతన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

చేనేతలకు నిధులు కేటాయించాలి

చేనేత సంఘం సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత రంగానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించాలని చేనేత సంఘం కార్మిక సంఘం తాలుకా అధ్యక్షులు కృష్ణ అన్నారు. ఎమ్మిగనూరు పట్టణంలో చేనేత సంఘం సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. కృష్ణ మాట్లాడుతూ చేనేత కార్మికుల పనులు లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వ సాయం అందించడం లేదన్నారు. చేనేత కార్మికులకు 50 ఏళ్లకు పింఛన్, బ్యాంకు రుణాలు, కేటాయిస్తామని హామీ ఇచ్చి తూతూ మంత్రంగా చేపట్టి వదిలేశారన్నారు. ఎమ్మిగనూరు పట్టణంలో చేనేత కార్మికుడు యువరాజు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారని వెంటనే రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్షులు గోవిందు, రాముడు, బడేసా, బసవరాజు, వీరేష్, వెంకటేశు, బుగిడే వెంకటేశు, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ దుకాణాల అసోసియేషన్ ఎన్నిక

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గూడూరు మండలం మెడికల్ దుకాణాల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షులుగా ముల్లా హఫీజ్, ఉపాధ్యక్షులుగా తరుణ్, కార్యదర్శిగా రమణ తదితరులను ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికైన వారికి పూలమాల శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో రాఘవేంద్రులు, నాగేశ్వరరెడ్డి, నాగభూషణం, రవి, రఘు, అబ్జర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత వెలికితీతే లక్ష్యం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఫేర్ ఉపయోగపడుతుందని నారాయణ పాఠశాల ప్రిన్సిపల్ సురేష్‌కుమార్ అన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనను బుధవారం పాఠశాలలో ప్రారంభించారు. ఏజీఎం రమేష్‌కుమార్, ఏవో జాకీర్ హుసేన్, డీన్ గిరిప్రసాద్, వైస్‌ప్రిన్సిపల్ లావణ్య, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం సేవలు సద్వినియోగం చేసుకోండి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఖాతాదారులు, వినియోగదారులు, విద్యార్థుల కోసం ప్రత్యేకంగా సేవలు అందిస్తున్నామని వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ కర్నూలు డిప్యూటీ జనరల్ మేనేజరు హేమ పేర్కొన్నారు. ఎర్రకోట సెయింట్‌జాన్స్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో బుధవారం ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్, ఎస్‌బీఐ ఏజీఎం శ్రీనివాస్, చీఫ్ మేనేజర్ రవికలదర్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన

రొడూరులో గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ అశోక్‌కుమార్

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: కౌతాళం మండలంలోని రౌడూరు గ్రామంలో బుధవారం గ్రామస్థులకు సీఐ అశోక్‌కుమార్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. చిన్నారుల చేతికి ఎక్కువగా ఫోన్లను ఇవ్వవద్దని, ఫోన్లలో వచ్చే సందేశాలను, లింకులను ఓపెన్ చేస్తే ఖాతాలో నగదు మొత్తం ఖాళీ అవుతుందన్నారు. అలాగే పోలీసుల సేవల గురించి కాల్స్ వస్తాయని దానికి అందరూ స్పందించి తమ అభిప్రాయాలను పంచుకోవాలన్నారు.

మద్దతు ధరతో శనగ కొనుగోలు

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రబీ సీజన్‌లో పండించిన శనగ పంటను మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తారని ఏవో దస్తగిరి రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని బూడిదపాడు, కె.నాగలాపురం గ్రామాలలో పోలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలోని రైతుసేవా కేంద్రంలో రైతులకు గుర్తింపు సంఖ్యపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ భరత్ కుమార్, ఎంపీఈవో ఫర్హానాభాను, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతదేహం లభ్యం

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై స్వామి తెలిపారు. హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ మల్లేపల్లి పంపింగ్ స్టేషన్ 3లో బుధవారం నీటిలో మృతదేహం తేలి ఉండటాన్ని గుర్తించిన పోలీసులు విచారణ చేపట్టారు. పూర్తి సమాచారం కోసం ఆరా తీస్తున్నారు. తెలిసిన వ్యక్తులు ఠాణాలో సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

మిద్దె పైనుంచి కింద పడి వ్యక్తి మృతి

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: ఇంటి మిద్దె పైనుంచి కింద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మంత్రాలయంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చాకలి వీరేష్, తన ఇంటి మిద్దెమీద ఉన్న డ్రమ్ముకు నీళ్లు పడుతుండగా ప్రమాదవశాత్తు కిందకు పడ్డారు. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకోగా చికిత్స నిమిత్తం, ఆదోని, తర్వాత కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. అతనికి భార్య కమలమ్మ, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. వారం రోజుల వ్యవధిలో ఇంట్లో కుమార్తె వివాహం ఉంది. కనులారా కన్న కూతురి వివాహాన్ని చూద్దామనుకున్న ఆయన ఆశలు తీరకముందే అనంతలోకానికి వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. దీనిపై మంత్రాలయం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అమ్మా.. ఆరోగ్యం జాగ్రత్త

★ రక్తహీనతతో గర్భిణులకు ముప్పు

లబ్ధిదారులకు బాల సంజీవని కిట్లు పంపిణీ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కోసిగి, న్యూస్‌టుడే: గర్భం దాల్చిన క్షణం నుంచి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడంతో పాటు అనేక జాగ్రత్తలు పాటించాల్సిందే. గర్భిణిగా, బాలింతగా అమ్మ ఎంత పదిలంగా ఉంటే బిడ్డ ఆరోగ్యం అంత భద్రంగా ఉంటుంది. అజాగ్రత్త, అవగాహన లేమితో పలువురు గర్భిణులు, బాలింతలు రక్తహీనతతో బాధపడుతున్నారు. మంత్రాలయం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 2,913 మంది గర్భిణులు, 2,440 మంది బాలింతలు ఉన్నారు. కొందరి నిర్లక్ష్యం నవజాత శిశువులపై పడుతోంది.

మండలం	గర్భిణులు	బాలింతలు
కోసిగి	917	732
మంత్రాలయం	584	542
కౌతాళం	805	655
పెద్దకడుబూరు	607	511
మొత్తం	2,913	2,440

● కొద్ది నెలల క్రితం ఓ గర్భిణికి నెలలు నిండకుండానే నొప్పులు వచ్చాయి. ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి రక్తం కేవలం 4 శాతం మాత్రమే ఉందని తెలిపారు. ఆమెకు అత్యవసరంగా రక్తం ఎక్కించాల్సి వచ్చింది. దాంతోపాటు కాన్పు కష్టతరమైందని ఆశా కార్యకర్తలు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో ఎంతో మంది గర్భిణులకు ఇదే పరిస్థితి ఎదురవుతోంది.

బాల సంజీవని.. బలప్రదాయిని

అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన లబ్ధిదారులకు బాల సంజీవని కిట్లు అందిస్తున్నారు. వీటిలో పిండి, బెల్లం, ఎండు ఖర్జూరంతో పాటు నెలకు 25 కోడిగుడ్లు, 5 లీటర్ల పాలు విటమిన్లతో కూడిన బియ్యం అందిస్తున్నారు. వాటిని ఆహారంలో భాగం చేసుకుంటే రక్తహీనత బారిన పడకుండా ఉండొచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

పిల్లలపై ప్రభావం

గర్భిణులకు రక్తహీనత అధికంగా ఉంటే ప్రసవ సమయంలో రక్తం ఎక్కించాల్సి వస్తుంది. పిల్లల్లో చురుకుదనం తగ్గడంతో పాటు మెదడు, వెన్నెముక సమస్యలు ఏర్పడతాయి. ఎదుగుదల లోపంతో పాటు అనేక రుగ్మతులు తలెత్తే ఆస్కారం ఉంది.

అవగాహన కల్పిస్తున్నాం

- రాజేశ్వరి, సీడీపీవో, ఐసీడీఎస్ మంత్రాలయం ప్రాజెక్టు

మహిళల్లో హిమోగ్లోబిన్ 12 శాతం ఉండాలి. బాల సంజీవనితో పాటు ఆహారంలో ఆకుకూరలు, పప్పుదినుసులు ఉండే విధంగా చూసుకోవాలి. రాగిజావలో బెల్లం కలుపుకొని తాగడం మంచిది. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో రక్తహీనతపై నిరంతరం అవగాహన కల్పిస్తున్నాం.

కందిపోయిన ఆశలు

◆ నష్టపోతున్న అన్నదాతలు

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు ఉప విభాగంలో క్వింటా కందులు కొనలేదు. బహిరంగ మార్కెట్‌లో ధర పడిపోయింది. రూ.8 వేల మద్దతు ధరకు కొనేందుకు ఎమ్మిగనూరు మార్కెట్‌లో జనవరి 13న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటి వరకు ఒక క్వింటా కందులు కొనుగోలు లేదు. దీంతో రైతులు బయట మద్దతు ధర కంటే వెయ్యి రూపాయల నుంచి రూ.500 తక్కువ ధరకు అమ్మి నష్టపోతున్నారు. బుధవారం ఎమ్మిగనూరు మార్కెట్‌లో కందుల క్వింటా గరిష్ఠ ధర రూ.6,750 లకు వ్యాపారులు కొన్నారు.

1.65 లక్షల ఎకరాల్లో కంది సాగు

★ జిల్లాలో ఈ ఏడాది 1.65 లక్షల ఎకరాల్లో కంది సాగైంది. దిగుబడి ఎకరానికి 5 నుంచి 6 క్వింటా వచ్చింది.

★ బహిరంగ మార్కెట్‌లో కందుల ధర పడిపోయింది. రైతులకు ఆదుకునేందుకు జిల్లాలో మార్క్‌ఫెడ్ ద్వారా 25 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 46 వేల క్వింటాలు (4,600టన్నుల క్వింటాళ్లు) కొన్నట్లు మార్క్‌ఫెడ్ మేనేజర్ రాజు తెలిపారు. కల్లూరు, హోళగుంద, ఎమ్మిగనూరు కొనుగోలు కేంద్రాల ద్వారా కిలో కందులు కొనలేదు. ఈ ప్రాంతంలో కందుల సాగు, దిగుబడి లేదంటే సాగు, దిగుబడి పెరిగింది. బయట రైతులు తక్కువ ధరకే కందులు విక్రయించి నష్టపోతున్నారు.

★ ఎకరానికి ఈసారి 5 క్వింటాళ్లు నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్లు అధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఎకరానికి 4 క్వింటాళ్ల దిగుబడి లెక్క కట్టిన 1.65 లక్షల ఎకరాలకు 6.60 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. మార్క్‌ఫెడ్ ద్వారా కొన్నది కేవలం 46 వేల క్వింటాళ్లు. 6 లక్షల క్వింటాళ్లు బయట రైతులకు అమ్ముకున్నా క్వింటాకు రూ.500లు తగ్గినా ఈ లెక్కన రైతులు రూ.30 కోట్ల రుపాయలు నష్టపోయారు. సంబంధిత అధికారులు బహిరంగ మార్కెట్‌లో అధిక ధర ఉన్నందున కొనుగోలు కేంద్రంలో అమ్ముకుండా బయట అమ్ముకుంటున్నట్లు చెప్పడం గమనార్హం.

నాడితప్పిన ఆరోగ్య కేంద్రాలు

నందవరం, న్యూస్‌టుడే: పల్లెల్లో ఆరోగ్య కేంద్రాల నిర్మాణం ఆగిపోయింది. గత వైకాపా ప్రభుత్వం ఆర్భాటంగా విలేజ్ క్లినిక్‌లను ప్రారంభించింది. అందులో ఒక డాక్టర్, ఒక స్టాఫ్‌నర్సు సిబ్బందిని ఏర్పాటు చేసి గ్రామీణులకు మెరుగైన వైద్యం అందిస్తామని ఆర్భాటం చేశారు.

కనకవీడు గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న విలేజ్ క్లినిక్

● నందవరం మండలానికి 19 విలేజ్ క్లినిక్‌లను మంజూరు చేసింది. ఐదేళ్ల కిందట నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఒకటి పెద్దకొత్తిలి గ్రామంలో మాత్రమే విలేజ్ క్లినిక్ ప్రారంభించారు.

● మండలంలోని 14 మంది ఎంఎల్‌హెచ్‌పీలను ప్రభుత్వం నియమించారు. 13 మంది ఎంఎల్‌హెచ్‌పీలు గ్రామాల్లోనే అద్దె భవనంలో విధులు నిర్వహిస్తున్నారు.

● నందవరం మండలం ముగతి గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్ కేంద్రం నిర్మాణం మూడేళ్ల క్రితం రూ.21 లక్షలతో మొదలు పెట్టారు. పునాదులకే పరిమితమైంది.

● మూడేళ్ల కిందట వచ్చిన పరికరాలు అద్దె భవనంలోనే ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం సేవలు అంతంత మాత్రమే అందుతున్నాయి.

బిల్లులు చెల్లించకపోవడమే కారణం

సోమనాథ్ యాదవ్, ముగతి గ్రామం

గత వైకాపా ప్రభుత్వ హయాంలో నూతన భవనాలు మంజూరు చేశారు. వీటి నిర్మాణ బాధ్యతలు చేపట్టిన గుత్తేదారులకు సకాలంలో బిల్లులు మంజూరు చేయలేదు. గతంలో పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది. ఆర్థిక భారంగా భావించి ఎక్కడ పనులు అక్కడ వదిలేశారు. దీంతో వివిధ దశల్లో నిర్మాణాలు నిలిచిపోయాయి. కట్టిన వరకైనా నాణ్యత లేకపోవడంతో బీటలు వారుతున్నాయి. చాలా చోట్ల అసలు పనులే ప్రారంభం కాలేదు. కూటమి ప్రభుత్వం స్పందించి పనులు పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బాల్య వివాహం అడ్డగింత

కోసిగి, న్యూస్‌టుడే: కోసిగి మండలంలో సమాచారం అందుకున్న ఐసీడీఎస్ అధికారులు బుధవారం పోలీసు సిబ్బంది సహాయంతో ఓ బాల్యవివాహాన్ని అడ్డుకున్నారు. అనంతరం ఇరు కుటుంబాల పెద్దలకు అవగాహన కల్పించారు.

గుంటూరు మార్కెట్‌కు మిర్చి లారీలు

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వరుస సెలవులతో మిర్చి మార్కెట్ బంద్ అయింది. బుధవారం జిల్లా పశ్చిమ ప్రాంతం నుంచి ఎమ్మిగనూరు గుండా సుమారు 30కి పైగా బొలొరో వాహనాల్లో మిరప సంచులను రైతులు గుంటూరు మార్కెట్‌కు అమ్మకానికి తీసుకెళ్లారు.

ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలి

నందవరం, న్యూస్‌టుడే: నందవరం మండలంలోని ముగతి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మహేంద్రబాబు డిమాండ్ చేశారు.

(c) eenadu

కర్నూలు

•కర్నూలు •పాణ్యం

జాతీయ సదస్సులో కేఎంసీ విద్యార్థి ప్రతిభ

కార్తీక్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినరసమ్మ

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : చెన్నైలో ఈనెల 13, 14 తేదీల్లో జరిగిన జాతీయస్థాయి వైద్య సదస్సులో కర్నూలు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చివరి ఏడాది చదువుతున్న కార్తీక్ గైనిక్ విభాగంలో పేపర్ ప్రజెంటేషన్‌లో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈసందర్భంగా బుధవారం గైనిక్ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ విజయానంద్ బాబు ఆధ్వర్యంలో కార్తీక్ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినరసమ్మను కలిశారు. ప్రిన్సిపల్ వారిని అభినందించారు. కార్యక్రమంలో గైనిక్ వైద్యులు సుధారాణి, కుముద తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతపై అవగాహన సదస్సులు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : మదనపల్లెలో చిన్నారి హత్యకు గురైన నేపథ్యంలో ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాల మేరకు డీఎస్పీ, సీఐలు, ఎస్సైలు తమ పరిధిలో బుధవారం మహిళల భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఎమర్జెన్సీ ఈవ్‌టీజింగ్, వేధింపులకు పాల్పడితే డయల్ 100, 112తో పాటు శక్తి యాప్ ద్వారా రక్షణ పొందాలని విద్యార్థినులు, యువతులకు సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) కర్నూలు : 80085 52632, కర్నూలు గ్రామీణ: 85010 05408, ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : ?: స్టాంటన్‌పురంలో మురుగు కాలువలను చాలా రోజులుగా శుభ్రం చేయలేదు. వీధిదీపాలు సరిగా వెలగడం లేదు. - వినయ్. ?: ధర్మపేటలో దోమల బెడద తీవ్రంగా ఉంది. ఫాగింగ్ చేయాలి. - నారాయణ. ✓: కాలువలు శుభ్రం చేయిస్తాం. వీధిదీపాలు మరమ్మతులు, ఫాగింగ్ చేపడతాం. - నగరపాలక అధికారులు

నిధులు సాధించడంలో ప్రజాప్రతినిధుల వైఫల్యం

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : వెనుకబడిన కర్నూలు జిల్లా అభివృద్ధి కోసం నిధులు తీసుకురావడంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని ఏపీ రైతు సంఘం కార్యదర్శి కె.జగన్నాథం, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మునెప్ప విమర్శించారు. వేదవతి, గుండ్రేవుల, ఆర్డీఎస్ కుడి కాలువ ప్రాజెక్టుల నిర్మాణానికి నిధుల కోసం కృషి చేయకుండా జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి బీసన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఈనెల 14న

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థి, యువజన, రైతు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లా ప్రాజెక్టులకు నిధులు కేటాయించకున్నా ప్రజాప్రతినిధులు మౌనంగా ఉండటం దారుణమన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో గళం విప్పి జిల్లాకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్, శ్రీరాములు, శ్రీనివాసులు, సోమన్న, అబ్దుల్లా, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

మురుగు నింపేసి.. చెత్త కుక్కేసి

● సాగునీటి కాలువను డ్రైనేజీలా మార్చిన నగరపాలక ● చెత్త, వ్యర్థాలతో పూడిపోయినా చర్యలు కరవు

అశోక్‌నగర్ నుంచి కార్ల్‌మార్క్స్ నగర్, సుంకేసుల రోడ్డువైపు వెళ్లే మార్గంలో వంతెన కింద పేరుకుపోయిన చెత్త దిబ్బలు

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఉమ్మడి కర్నూలు, వైఎస్సార్ కడప జిల్లాలోని లక్షలాది ఎకరాలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించే కేసీ కాలువను నగరపాలక అధికారులు మురుగు కాలువలా మార్చేశారు. నగరపాలక పరిధిలో సుమారు 7 కి.మీ ప్రవహించే ఈ కాలువలోకి పలు ప్రాంతాల్లో డ్రైనేజీ నీటిని మళ్లిస్తున్నారు. దీని కిలోమీ సమీప కాలనీల ప్రజలు సంచులకొద్దీ చెత్త, వ్యర్థాలు పడేస్తూ డంపింగ్‌యార్డులా మార్చేశారు. ప్రవాహం ఉన్న సమయంలో ఈ దారుణాలు కనిపించవు. నీటి సరఫరా ఆపేయగానే ఈ సాగునీటి వనరు మురుగు కూపంగా దర్శనమిస్తుంది. దీని శుభ్రతపై అటు నీటి పారుదలశాఖ అధికారులు గాని ఇటు నగరపాలక సంస్థ యంత్రాంగం గాని దృష్టిపెట్టకపోవడం ప్రజల పాలిట శాపంగా మారింది.

రక్షణ కూలిపోయినా పట్టించుకోరు

సమీప కాలనీల ప్రజలు కాలువలోకి చెత్త వేయకుండా గతంలో ఇరువైపులా రక్షణ కంచె ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అది చాలాచోట్ల కనిపించడం లేదు. కొన్నిచోట్ల దెబ్బతినగా.. మరికొన్నిచోట్ల దొంగలు కత్తిరించుకెళ్లారు. కొన్ని ప్రాంతాల్లో స్థానికులు చెత్త వేసేందుకు అడ్డుగా ఉందని ఉద్దేశపూర్వకంగా కూల్చేశారు. దీంతో ఇందులో టన్నుల కొద్దీ చెత్త పోగవుతోంది. తాగు, సాగునీటి వనరు చెత్త, మురుగుతో నిండిపోయినా అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమని ప్రజలు, రైతులు విమర్శిస్తున్నారు.

నగరం మధ్యన డంపింగ్‌యార్డులా..

స్టాంటన్‌పురం, కొండారెడ్డినగర్, మమతానగర్, ధర్మపేట, అశోక్‌నగర్, బాబు జగ్జీవన్‌రామ్ నగర్, విఠల్‌నగర్, బంగారుపేట, స్వామిరెడ్డినగర్, దేవనగర్, లక్ష్మీనగర్, గణేశ్‌నగర్, జొహరాపురం వరకు కాలువలో అడుగడుగునా చెత్తే కనిపిస్తోంది. ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయాయి. వినాయక ఘాట్ వద్ద డంపింగ్‌యార్డులా మారింది.

● అశోక్‌నగర్‌తో పాటు సుమారు పది కాలనీల నుంచి వచ్చే మురుగునీటిని ధర్మాపేట వద్ద నేరుగా కేసీలోకి వదులుతున్నారు. శ్రీరాంనగర్ నుంచి వచ్చే మురుగునీరు గణేష్‌నగర్ ఈశ్వరాంజనేయ స్వామి ఆలయం సమీపంలో కలుస్తోంది. వర్షాకాలంలో పలు పిల్ల కాలువల నుంచి మురుగు కేసీలోకి చేరుతుంది.

పరిశీలన

ధర్మపేట వద్ద అశోక్‌నగర్ పైభాగంలోని పది కాలనీల నుంచి వచ్చే మురుగును కేసీ కాలువలోకి వదిలేస్తున్నారిలా..

వీధిదీపాలకు మరమ్మతులు

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని వివిధ ప్రాంతాల్లో వీధిదీపాలు వెలగక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై 'దీపాలు వెలగక.. [illegible]' శీర్షికన ఈనెల 14న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన నగరపాలక అధికారులు బుధవారం నగరంలోని కొత్తబస్టాండు సమీపంలో ప్రధాన రహదారిపై వీధిదీపాలను ఎలక్ట్రికల్ విభాగం సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

స్పందనకు వందనం

సమయాన్ని సరిదిద్దారు

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరంలోని గాయత్రీ ఎస్టేట్ కూడలిలో ఉన్న క్లాక్‌టవర్‌లో గడియారాలు మరమ్మతులు చేయించారు. రూ.22 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన క్లాక్‌టవర్‌లో గడియారం పనిచేయకపోవడంపై మంగళవారం 'ఈనాడు'లో 'మరమ్మతులకు సమయం లేదు' శీర్షికతో చిత్రవార్త ప్రచురితమైంది. స్పందించిన నగరపాలక అధికారులు గడియారానికి మరమ్మతులు చేయించారు.

కంకర పరిచారు.. పనులు మరిచారు

జొహరాపురం పరిధిలోని హౌసింగ్‌బోర్డు కాలనీ నుంచి నందికొట్కూరు రోడ్డులోని ఒమేగా ఆసుపత్రికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. ఈ మార్గంలో కొన్నేళ్లుగా మట్టిరోడ్డే ఉండేది. కొంత కాలం కిందట రోడ్డు పనుల్లో భాగంగా కొంతమేర కంకర వేశారు. నెలలు గడుస్తున్నా పనులు మాత్రం చేయలేదు. పెద్ద సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగించే ఈ రహదారిపై ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి సీసీరోడ్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.– న్యూస్‌టుడే, కల్లూరు గ్రామీణ

జడ్పీ కార్యాలయం.. శుభ్రత దూరం

సొంత ఆదాయ వనరులను ఏమాత్రం పట్టించుకోని జిల్లా పరిషత్ పరిశుభ్రతను కూడా గాలికొదిలేసింది. జడ్పీ కార్యాలయం లోపల గదులు, బయట ఆవరణ అపరిశుభ్రంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదు. పాడైన కంప్యూటర్లు, ఇతర సామగ్రిని ఒక గదిలో నిల్వ చేయకుండా కార్యాలయంలో ఎక్కడపడితే అక్కడ పడేశారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రలో భాగంగా ప్రతి మూడో శనివారం కార్యాలయాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇక్కడ మాత్రం ఆ దాఖలాలే కనిపించడం లేదు. – న్యూస్‌టుడే, జడ్పీ

రహదారి.. అధ్వానంగా మారి

బి.క్యాంపు శివారులోని టీజీ లక్ష్మి కల్యాణ మండపం ఎదురుగా ఉన్న జిల్లా ఖజానా కార్యాలయానికి వెళ్లేందుకు రెండు దారులు ఉన్నాయి. రెండో రోడ్డు నిర్వహణను అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా రోడ్డు ఆనవాళ్లు కోల్పోయింది. ఇరువైపులా కంపచెట్లు పెరిగాయి. దారంతా మట్టి, రాళ్లతో అధ్వానంగా మారింది. అధికారులు స్పందించి కంపచెట్లు తొలగించి రోడ్డును బాగుచేస్తే స్థానికులు, కార్యాలయానికి వచ్చే వారికి ఉపయోగపడుతుందని ఉద్యోగులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, కర్నూలు బి.క్యాంపు

దాతలు ఇచ్చారు.. వీరు మూలకుచేర్చారు

హిందుస్థాన్ కోకాకోలా బేవరేజెస్ సంస్థ వారు సీఎస్ఆర్ నిధుల కింద నగరపాలక సంస్థకు చెత్త సేకరణ ఆటోను అందజేశారు. దానిని ఉపయోగించకుండా కొంతకాలంగా కొత్తపేట రైతుబజార్ పక్కన వదిలారు. దాని చుట్టూ చెత్తా చెదారం పేరుకుపోయింది. వాహనాన్ని ఇలాగే వదిలేస్తే తుప్పుపట్టి పనికిరాకుండా పోతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నగరపాలక అధికారులు దీనిని వినియోగించి చెత్తను సక్రమంగా సేకరించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు మార్కెట్

ఏమరపాటుగా వెళ్తే ఊచకోతే

కల్లూరు 41 వార్డు వీకర్‌సెక్షన్ కాలనీలో కల్వర్టు దెబ్బతిని ఊచలు కనిపిస్తున్నాయి. ప్రమాదకరంగా మారిన ఈ కల్వర్టు మీదుగా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీని పక్కనుంచే స్థానికులు రాకపోకలు సాగిస్తుంటారు. ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడితే ప్రాణాలకే ప్రమాదం. ఈ దారిలో వెళ్లే పిల్లలు, వృద్ధులు ఎక్కడ ప్రమాదాల బారినపడతారోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని విన్నవిస్తున్నారు.
– ఈనాడు, కర్నూలు

సంక్షిప్త సమాచారం

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణిపై కొందరు చేసిన అవినీతి ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఏపీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు చెప్పారు. తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ బుధవారం డీఆర్వో వెంకటనారాయణమ్మకు వినతి పత్రం ఇచ్చారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : సర్వజన వైద్యశాలలో డైట్‌కు నిర్వహించిన టెండర్ల టెక్నికల్ బిడ్లను బుధవారం ఆసుపత్రి పర్యవేక్షకుడు డా.వెంకటేశ్వర్లు తెరిచారు. మొత్తం 11 మంది టెండర్లు వేశారు. సాంకేతిక అంశాలను పరిశీలించి అర్హుల జాబితాను తయారు చేయనున్నారు. వచ్చే వారంలో ఫైనాన్షియల్ బిడ్లను పరిశీలించనున్నారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : వైద్యం ముసుగులో రోగులను దోచుకుంటున్న ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ నగర అధ్యక్షుడు ఇమ్రాన్, కార్యదర్శి హుస్సేన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, వాహనమిత్ర పథకం కింద ఏటా రూ.30 వేల ఆర్థిక సాయం అందించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, నగర అధ్యక్షుడు నగేష్, ఆటో కార్మికుల సంఘం నగర అధ్యక్షుడు హుస్సేన్ డిమాండ్ చేశారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ : ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు కాకినాడలో జరిగిన సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల సందర్భంగా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన జగన్నాథంను కర్నూలుకు చెందిన పలువురు నాయకులు బుధవారం అభినందించారు.

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : ప్రతిఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని సయ్యద్ రసూల్ ట్రస్టు సెక్రెటరీ సయ్యద్‌షా షఫీ పాషాఖాద్రీ పిలుపునిచ్చారు. పాతబస్తీలో ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం పలువురు ముస్లింలకు రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు షేక్ అబ్దుల్లా బాషా, కోశాధికారి మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రోజా దర్గా ఉరుసు

దర్గాలో పూల చాదర్ సమర్పిస్తున్న మతపెద్దలు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : నగరంలోని ప్రకాష్‌నగర్‌లో ఉన్న రోజా దర్గా ఉరుసు బుధవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. పీఠాధిపతి సయ్యద్ దాదాబాషా సాహెబ్ ఇంటి నుంచి గంధోత్సవం ప్రారంభమైంది. గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు తీసుకొచ్చారు. ఏటా రంజాన్ నెల ప్రారంభం రోజున ఉరుసు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉరుసును తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల కోసం సహరీ ఏర్పాట్లు చేసినట్లు పీఠాధిపతి తెలిపారు. కార్యక్రమంలో ఖలీలుల్లా ఖాద్రీ, ఆజామ్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : బుగ్గ రామేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కాల్వబుగ్గలో బుధవారం దాతల సహకారంతో నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. తితిదే పాలకమండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్ పోటీలను ప్రారంభించారు. బుడ్డారెడ్డిపల్లెకు చెందిన చిన్నశివన్న వృషభాలు రూ.లక్ష ప్రథమ బహుమతి గెలుపొందాయి. కోడుమూరు మండలం వెంకటగిరికి చెందిన బీఎల్‌కే బుల్స్ రూ.80 వేల ద్వితీయ బహుమతి, ధర్మవరం రైతు చంద్రన్న ఎద్దులు రూ.60 వేల తృతీయ, కొల్లాపూర్‌కు చెందిన నరేష్ ఎద్దులు రూ.40 వేల నాలుగో బహుమతి సాధించాయి. వాటి యజమానులకు దాతలు నగదు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ నారాయణ, ఈవో మద్దిలేటి, మాజీ ఛైర్మన్లు చంద్రపెద్దస్వామి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో సమస్యలు పరిష్కరించుకోండి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : కర్నూలులోని ఫోర్‌వీలర్స్ టాక్సీ అసోసియేషన్ నాయకులు ఐక్యంగా ఉంటూ సమస్యలను పరిష్కరించుకోవాలని మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ సూచించారు. నగరంలోని సి.క్యాంపు రైతుబజార్ వద్ద ఉన్న కేఎంసీ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన కర్నూలు జిల్లా ఫోర్‌వీలర్స్ టాక్సీ అసోసియేషన్ కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి శేఖర్, ఉపాధ్యక్షుడు ఖలీల్ పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో పతకాలు సాధించాలి

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రాణించిన క్రీడాకారులు జాతీయస్థాయిలో పతకాలు సాధించాలని ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ దీపికాపాటిల్ ఆకాంక్షించారు.

క్రీడాకారులను అభినందిస్తున్న కమాండెంట్ దీపికాపాటిల్

ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో మహిళల విభాగంలో ఓవరాల్ ఛాంపియన్ ట్రోఫీ, పురుషుల విభాగంలో విజేతగా నిలిచిన క్రీడాకారులను స్థానిక బెటాలియన్‌లో బుధవారం ఆమె అభినందించారు. కార్యక్రమంలో పవర్‌లిఫ్టింగ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు షణ్ముఖ, కార్యదర్శి లోకేశ్ పాల్గొన్నారు.

భాజపా బలోపేతానికి కృషి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : భాజపా నాయకులు, కార్యకర్తలు ప్రజా సమస్యలు పరిష్కారానికి ప్రయత్నిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ సీనియర్ నాయకుడు పొలంకి రామస్వామి సూచించారు. బుధవారపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం కార్పొరేషన్ పరిధిలోని ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకురాలు గీతామాధురి పాల్గొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సేవకులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి.అంజిబాబు డిమాండ్ చేశారు. గ్రామ సేవలకు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం స్థానిక కలెక్టరేట్ సమీపంలోని గాంధీ

ధర్నా చేస్తున్న గ్రామ సేవకులు

విగ్రహం వద్ద ధర్నా చేశారు. గ్రామ సేవకుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ తమకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనరల్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రఘుబాబు, గ్రామ సేవకుల సంఘం నాయకులు శాంతరాజు, రంగన్న పాల్గొన్నారు.

టీజీవీ మైనారిటీ కళాక్షేత్రం ప్రారంభం

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : పాతబస్తీలోని మైనారిటీ కళాక్షేత్రంలో నిరంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా చూస్తామని మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ చెప్పారు. స్థానిక ఉస్మానియా కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన టీజీవీ మైనారిటీ కళాక్షేత్రాన్ని బుధవారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా

మైనారిటీ కళాక్షేత్రంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేష్

టీజీ మాట్లాడుతూ.. నగరంలోని ముస్లింలు ఈ కళాక్షేత్రాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, సభ్యులు ఇనాయతుల్లా, మహ్మద్‌మియ్యా, గంగాధరరెడ్డి, బాలవెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గాయకులు ఇబ్రహీం, హబీబ్ హిందీ గీతాలు ఆలపించారు.

అమరజీవి స్మృతివనం నిర్మాణానికి సహకరించండి

కర్నూలు కలెక్టరేట్ : అమరావతిలో ప్రభుత్వం అమరజీవి పొట్టిశ్రీరాములు స్మృతివనం, 58 అడుగుల విగ్రహం ఏర్పాటు చేస్తోందని, ఆర్యవైశ్యులు, ప్రజలంతా సహకరించాలని కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు కోరారు. నగరంలో బుధవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేశ్ ప్రత్యేక చొరవతో నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఆర్యవైశ్యులు విరాళాలు అందించి అమరజీవికి నివాళి అర్పించాలని కోరారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్‌కు సన్మానం

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని తెదేపా జిల్లా కార్యాలయానికి విచ్చేసిన రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేశ్‌ను తెదేపా నాయకులు, ఆర్యవైశ్యులు బుధవారం సన్మానించారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగేంద్ర, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు సోమిశెట్టి నవీన్, పార్టీ లీగల్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్వీ ప్రసాద్ పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ వెన్నంటి ఉండి పార్టీ అభివృద్ధికి కృషి చేసిన రాకేశ్ సేవలను ముఖ్యమంత్రి తగిన న్యాయం చేశారని నాగేంద్ర పేర్కొన్నారు. తెలుగు యువత ఉపాధ్యక్షుడు పి.రాజు, నాయకులు నాగార్జునచౌదరి, జగదీష్, ఉపేంద్ర పాల్గొన్నారు.

డూండీ రాకేశ్‌ను సన్మానిస్తున్న నాగేంద్ర, తెదేపా నేతలు

కాల్ చేసుకొని ఇస్తానని.. చరవాణి చోరీ

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : కర్నూలు సర్వజన ఆసుపత్రిలో దొంగల బెడద ఎక్కువైంది. పెద్దకడుబూరు మండలం మేకడోనకు చెందిన గిడ్డయ్య ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కుటుంబ సభ్యున్ని చూసేందుకు వచ్చారు. బుధవారం ఆసుపత్రి ఆవరణలో ఉన్న ఆయన వద్దకు ఓ గుర్తుతెలియని వ్యక్తి సెల్‌ఫోన్ ఇస్తే ఒక కాల్ మాట్లాడి ఇస్తానని కోరాడు. దుండగుడి మాటలు నమ్మిన గిడ్డయ్య ఫోన్ ఇచ్చారు. చరవాణి చేతిలో పడగానే దుండగుడు అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితుడు కేకలు వేసినా లాభం లేకపోయింది.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా Union Bank of India
నరసింగరావు పేట (08841) కర్నూలు
డో.నెం. 43/134, నరసింగరావు పేట, కర్నూలు - 518004
ఇమెయిల్ ఐడి: ubin0808849@unionbankofindia.bank.in, ఫోన్ నెం. 93249 88363

స్థిరాస్తులు అమ్మకం

2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలలోని నిబంధన 8(6)లోని అంశాలుతో చదువుకొనేలా 2002 సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం క్రింద స్థిరాస్తులు అమ్మకానికి ఇవ్వబడ్డ ఇ-వేలం అమ్మకం నోటీసు. [illegible]

27-03-2026 [illegible]

తేదీ : 16-02-2026
స్థలం : కర్నూలు
అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

క్రీడల్లో వీరికి తిరుగులేదు

☛ అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న ఆర్‌యూ విద్యార్థినులు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : రాయలసీమ విశ్వవిద్యాలయం విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపుతున్నారు. ఇష్టమైన క్రీడల్లో శిక్షణ తీసుకుని పోటీల్లో సత్తా చాటుతూ విజయ పథంలో సాగుతున్నారు. మహితేశ్వరి ఖోఖోలో, చదరంగం, అథ్లెటిక్స్‌లో, సోనియా బాక్సింగ్, కబడ్డీ, బ్యాడ్మింటన్ క్రీడల్లో రాణిస్తున్నారు. 2025- 26 ఆర్‌యూ అనుబంధ కళాశాలల మహిళల పోటీల్లో సత్తా చాటారు. ఆర్‌యూకు అథ్లెటిక్స్‌లో పతకాలు, ఖోఖో ట్రోఫీ అందించడంలో వీరు కీలకపాత్ర పోషించి ప్రశంసలు అందుకుంటున్నారు.

మహితేశ్వరి.. పతకాలపై గురి

ఆర్‌యూలో బీటెక్ ఈసీఈ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మహితేశ్వరి ఖోఖో, చదరంగంతో పాటు అథ్లెటిక్స్‌లో సత్తా చాటుతున్నారు. ● 2024 జనవరిలో విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఆర్‌యూ జట్టును సెమీ ఫైనల్స్ వరకు తీసుకెళ్లారు. ● 2023 డిసెంబరులో ఎస్వీయూవీఆర్, ఎస్ఆర్‌జీపీడబ్ల్యూ కళాశాలల్లో జరిగిన చదరంగం పోటీలో రన్నర్స్ ట్రోఫీ అందుకున్నారు. ● 2025 డిసెంబరు 27న నంద్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన ఆర్‌యూ అనుబంధ కళాశాలల అథ్లెటిక్స్ పోటీల్లో 4100 రిలే పరుగులో రజతం, డిస్కస్ త్రోలో కాంస్య పతకాలు సాధించారు. ● 2026 ఫిబ్రవరి 14న నగరంలోని సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాలలో జరిగిన ఆర్‌యూ అనుబంధ కళాశాలల ఖోఖో పోటీల్లో ప్రతిభ చూపి జట్టును ఆర్‌యూ జట్టును విజేతగా నిలిపి ట్రోఫీ అందించారు.

శభాష్ సోనియా

ఆర్‌యూలో ఎమ్మెస్సీ బోటనీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సోనియా బాక్సింగ్, బ్యాడ్మింటన్, కబడ్డీ, అథ్లెటిక్స్‌లో రాణిస్తున్నారు. ● 2022 ఫిబ్రవరిలో సిల్వర్‌జూబ్లీ కళాశాలలో జరిగిన ఆర్‌యూ అనుబంధ కళాశాలల బ్యాడ్మింటన్ పోటీల్లో నందికొట్కూరు బసిరెడ్డి కళాశాల తరపున ఆడి రన్నర్‌గా నిలిచింది. ● 2022 డిసెంబరులో చెన్నైలో జరిగిన దక్షిణ మండలం అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడల్లో కబడ్డీలో ఆర్‌యూ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. ● 2025 ఆగస్టులో శ్రీసాయి కృష్ణ డిగ్రీ కళాశాలలో జరిగిన ఆర్‌యూ అనుబంధ కళాశాలల కబడ్డీ పోటీల్లో రాణించి తమ జట్టును సెమీఫైనల్స్‌కు తీసుకెళ్లారు. ● 2025 అక్టోబరులో నంద్యాలలో నిర్వహించిన ఆర్‌యూ అనుబంధ కళాశాలల షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో రన్నర్స్ ట్రోఫీ అందుకున్నారు. ● 2025 డిసెంబరులో నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన ఆర్‌యూ అనుబంధ కళాశాల అథ్లెటిక్స్ పోటీల్లో లాంగ్‌జంప్‌లో స్వర్ణం, 4100 రిలే పరుగులో రజత పతకాలు సాధించారు. ● ఈనెల 14వ తేదీన నగరంలోని సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాలలో జరిగిన ఆర్‌యూ అనుబంధ కళాశాలల ఖోఖో పోటీల్లో సత్తాచాటి వర్సిటీ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.

జనావాసాల్లో పందుల పెంపకానికి అనుమతి లేదు

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : జనావాసాల్లో పందుల పెంపకానికి అనుమతి లేదని, వాటిని శివారు ప్రాంతాలకు తరలించాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. వెంకటరమణ కాలనీలోని నగరపాలక తాత్కాలిక కార్యాలయంలో బుధవారం యూఎల్‌బీ స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. పందుల పెంపకానికి భూమి కేటాయించే విషయాన్ని పరిశీలించి నివేదికగా సమర్పించాలని రెవెన్యూ శాఖ అధికారులకు సూచించారు.

బడ్జెట్‌లో వ్యవసాయానికి మొండిచేయి

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ప్రభుత్వం మొండిచేయి చూపిందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం విమర్శించారు. స్థానిక సీఆర్ భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగానికి గతేడాదితో పోలిస్తే కేటాయింపులు తగ్గాయన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈనెల 23న అన్ని మండల కేంద్రాల్లో నిర్వహించే ధర్నాల్లో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బాలాజీ విల్లాస్‌లో చోరీ

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు సమీపంలో బాలాజీ విల్లాస్ కాలనీలో చోరీ జరిగింది. బీఎస్ఎన్ఎల్‌లో పనిచేసే నాగభూషణంశర్మ కాలనీలోని 118వ ప్లాట్‌లో ఉంటున్నారు. మూడు రోజుల కిందట కుటుంబ సభ్యులతో కలిసి బెంగళూరుకు వెళ్లారు. మంగళవారం తిరిగొచ్చిన చూడగా ఇంట్లో చోరీ జరిగిన విషయం వెల్లడైంది. 14 తులాల వెండి వస్తువులు, టీవీని దొంగలు ఎత్తుకెళ్లినట్లు తాలూకా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

(c) eenadu

రావణబ్రహ్మ వాహనంపై నటరాజు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రం మార్కాపురం పట్టణంలోని శ్రీజగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం రాత్రి రావణబ్రహ్మ వాహనంపై నటరాజు అలంకరణలో మార్కండేయస్వామి వారు పురవీధుల్లో విహరించారు. నగరోత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, మార్కాపురం గ్రామీణం

22న జిల్లా ప్రజాప్రతినిధులతో సీఎం చంద్రబాబు భేటీ

ఈనాడు, ఒంగోలు: అమరావతిలో ఈ నెల 22వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో సమావేశం కానున్నారు. సమావేశానికి మంత్రులు డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, ఇన్‌ఛార్జి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, తెదేపా జిల్లా అధ్యక్షుడు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. నియోజక వర్గాల వారీగా పనుల ప్రగతిపై చర్చించనున్నారు.

ఇదో రోగాలిచ్చే ట్యాంకు!

గిద్దలూరు పురపాలక సంఘం పరిధిలోని కొత్తపల్లె గ్రామంలోని తిమ్మాపురం బీసీ కాలనీకి వెళ్లే రహదారిలో గ్రౌండ్ లెవల్ వాటర్ ట్యాంకు చుట్టూ అపారిశుద్ధ్యం తాండవిస్తోంది. పలుచోట్ల ట్యాంకు పగిలిపోవడంతో నీటి విడుదల సమయంలో కారిపోతోంది. ట్యాంకు చుట్టూ భారీ ఎత్తున పాచి పేరుకుపోవడం, చుట్టూ వాడుకనీరు నిలిచిపోయి మురుగుగా మారడంతో తాగునీటిని పట్టుకుంటున్న ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ట్యాంకు నీటిని పట్టుకునేందుకు వెళ్లే స్థానికులు జారిపడుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. తక్షణమే పురపాలక సంఘం అధికారులు చర్యలు తీసుకోవాలని, నూతన ట్యాంకు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం

పేదలకు ఖాళీ స్థలాలు పంచండి

మార్కాపురం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల్లోని ఖాళీ స్థలాలను పేదలకు ఇవ్వాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అసెంబ్లీలో కోరారు. మార్కాపురం నియోజకవర్గంలో నాలుగు మండలాలతోపాటు రెండు మున్సిపల్ కేంద్రాలున్నాయని, వాటిల్లో 14,280 ప్లాట్లు ఇచ్చారన్నారు. అప్పట్లో 6,400 మంది లబ్ధిదారులకు మాత్రమే ఇచ్చారని, మిగిలిన 7,870 ప్లాట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఖాళీగా ఉన్న ప్లాట్లు రద్దు చేసి కొత్తగా అర్హత ఉన్న లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఆయన కోరారు.

మార్కాపురంలో తొలి అడుగు!

- 25న వెలిగొండ ఫీడరు కాలువ శంకుస్థాపనకు సీఎం చంద్రబాబు రాక
- బహిరంగ సభ ఏర్పాటు చేసే ఆలోచనలో జిల్లా అధికార యంత్రాంగం

ఫీడరు కాలువను పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ రాజాబాబు, జేసీ శ్రీనివాసులు, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు, అధికారులు

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కొత్త జిల్లాగా మార్కాపురం ప్రకటించారు.. వెలిగొండ ప్రాజెక్టు వచ్చే జూన్ నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. క్షేత్రస్థాయిలో పనులు మరింత వేగవంతం చేసి అభివృద్ధి పరుగులు పెట్టించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లా పర్యటనకు శ్రీకారం చుట్టారు. సీఎం రాకతో కొత్త జిల్లాపై వరాల జల్లు కురిపిస్తారని ఇక్కడి ప్రజలు భావిస్తున్నారు.

-ఈనాడు, ఒంగోలు, పెద్దదోర్నాల

వెలిగొండ ప్రాజెక్టు సొరంగం నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సొరంగాల నుంచి నల్లమల సాగర్ జలాశయానికి నీటిని తీసుకెళ్లే ఫీడరు కాలువ పనులకు ఈ నెల 25వ తేదీన శంకుస్థాపన చేసేందుకు సీఎం చంద్రబాబు రానున్నారు. సొరంగాల వద్ద పనితీరు పరిశీలించి గంటావానిపల్లెలో శిలాఫలకం ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. హెలీకాప్టర్‌లో ఫీడరు కాలువ వద్దకు చేరుకుని శంకుస్థాపన చేసి అక్కడే బహిరంగ సభ నిర్వహించే అవకాశాలు పరిశీలిస్తున్నారు. శంకుస్థాపనకు ఎంపిక చేసిన ప్రదేశం దోర్నాల-ఆత్మకూరు రహదారికి కిలోమీటరున్నర దూరంలో ఉంటుంది. అక్కడే బహిరంగ సభ నిర్వహిస్తే ఇబ్బందులు ఉండవనే ఆలోచనలో జిల్లా అధికార యంత్రాంగం ఉంది.

కొత్త జిల్లాలో ఇదే తొలి పర్యటన...

మార్కాపురం జిల్లా ఆవిర్భావం అనంతరం సీఎం చంద్రబాబు పర్యటనకు రప్పించేందుకు పలు సందర్భాల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజాప్రతినిధులు ప్రయత్నించారు. సీఎం వేర్వేరు పర్యటనల్లో బిజీగా ఉండడం, అసెంబ్లీ నిర్వహణ నేపథ్యంలో సాధ్యం కాలేదు. ప్రాజెక్టుల పర్యటన చేపడుతున్నందున వెలిగొండ పర్యటనకు వచ్చినప్పుడు బహిరంగ సభ నిర్వహించాలనే ఆలోచనలో తెదేపా నాయకులు భావిస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కొత్త జిల్లా ప్రకటించిన విషయాన్ని మననం చేసుకుంటున్నారు. కొత్త జిల్లా అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి పలు హామీలు పొందాలని జిల్లా నాయకులు ఆశిస్తున్నారు.

పర్యటన ప్రదేశాల పరిశీలన

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన నేపథ్యంలో దోర్నాల మండలం గంటవానిపల్లె సమీపంలోని ఫీడరు కాలువను బుధవారం ఇన్‌ఛార్జి కలెక్టర్ రాజాబాబు పరిశీలించారు. కాలువ లైనింగ్ పనులకు ముఖ్యమంత్రి భూమిపూజ చేయనుండటంతో ఆ ప్రాంతంలో చేపట్టాల్సిన చర్యలపై వెలిగొండ ప్రాజెక్టు ఎస్‌ఈ అబూతలీంతో చర్చించారు. సొరంగాల సమీపంలో ఉన్న హెలీప్యాడ్ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ముఖ్యమంత్రి అక్కడ నుంచి కొత్తూరు, గంటవానిపల్లె గ్రామాల మీదుగా ఫీడరు కాలువకు చేరుకుంటారని, రహదారి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పర్యటనపై మరోసారి ఎస్పీతో వచ్చి పరిశీలించి అవసరమైన ఏర్పాట్లపై చర్చిస్తామన్నారు. ఆయనవెంట జేసీ పి.శ్రీనివాసులు, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, డీఎస్పీ నాగరాజు, ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి తదితరులున్నారు.

నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

పొదిలి, న్యూస్‌టుడే: రంజాన్ నెల ప్రారంభమైంది. బుధవారం నెలవంక కనిపించడంతో రంజాన్ మాసం ప్రారంభమైనట్లు అన్ని మసీదుల్లో మతపెద్దలు ప్రకటించారు. దీంతో గురువారం నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభించేందుకు ముస్లిం సోదరులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పొదిలి పట్టణంలో 11 మసీదులుండగా, ఆయా మసీదుల్లో బుధవారం రాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. మసీదులను సుందరంగా తీర్చిదిద్దారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: గురువారం సా.6-21

సహరీ: శుక్రవారం ఉ.5-12

పేద పిల్లలకు కార్పొరేట్ విద్య!

- ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

న్యూస్‌టుడే, సీఎస్‌పురం

విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు ఉచితంగా కార్పొరేట్ విద్య పొందవచ్చు. విద్యాసంస్థల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు కేటాయిస్తారు. 2026-27 విద్యాసంవత్సరానికి ఒకటో తరగతిలో ప్రవేశాలకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. అయిదేళ్లు నిండిన బలహీన వర్గాల పిల్లలు ఒకటో తరగతిలో ప్రవేశించడానికి దరఖాస్తు చేసుకోవచ్చు. జిల్లాలో వారి నివాస సమీప ప్రాంతంలో నున్న ఏ ప్రైవేటు పాఠశాలనైనా ఎంచుకునే అవకాశం కల్పించారు.

అర్హులు ఎవరు?..దరఖాస్తు ఎలా?: వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షలు ఉన్న తల్లిదండ్రుల పిల్లలు అర్హులు. * స్టేట్ సిలబస్ పాఠశాలలో చేరే విద్యార్థి 2, జూన్ 2020 నుంచి 31, మే 2021 మధ్య, సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ సిలబస్ పాఠశాలలో చేరే విద్యార్థి 2, ఏప్రిల్, 2020 నుంచి 31, మార్చి 2021 మధ్య జన్మించి ఉండాలి. అయిదేళ్లు నిండి ఉండాలి. • www.cse.ap.gov.in వెబ్‌సైట్‌లో లేదా స్వగ్రామ, వార్డు సచివాలయాలు, ఎంఈవో కార్యాలయం, మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

జత చేయాల్సిన పత్రాలు: విద్యార్థి జనన, కుల, వార్షిక ఆదాయం ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. తల్లిదండ్రుల ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, తెల్ల రేషన్ కార్డు, భూహక్కు పత్రం, పాస్‌పోర్టు, ఉపాధిహామీ పథకం జాబ్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, విద్యుత్తు బిల్లు, గ్యాస్ కనెక్షన్, అద్దె ఒప్పంద పత్రాన్ని చిరునామా ధ్రువీకరణకు పరిగణనలోకి తీసుకుంటారు. ఈ నెల 20 నుంచి మార్చి 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. మార్చి 25న లాటరీ తీసి విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఏప్రిల్ 13వ నుంచి 23 వరకు ప్రవేశాల నిర్ధారణ ఉంటుంది. వివరాల కోసం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 18004258599 టోల్‌ఫ్రీ నంబరులో సంప్రదించవచ్చు.

టోల్ బాదుడేనా... బాధ్యత లేదా?

- జాతీయ రహదారి-565పై సౌకర్యాలు విస్మరించిన అధికారులు
- గత కొన్నేళ్లుగా వెలగని దీపాలతో రాకపోకలకు ఇబ్బందులు

తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రారంభమయ్యే జాతీయ రహదారి-565 జిల్లా మీదుగా చెన్నై వరకు వెళ్తుంది. రహదారిపై గత కొన్నేళ్లుగా ప్రభుత్వం టోల్‌ప్లాజాలు నిర్వహిస్తూ ప్రజల నుంచి పన్నుల రూపంలో నెలకు రూ.లక్షలు వసూలవుతోంది. పన్నుల రూపంలో డబ్బులు తీసుకుంటున్నా జాతీయ రహదారిపై ఏళ్లతరబడి వెలగని దీపాలను పట్టించుకున్న పాపాన పోలేదు. సుదూర ప్రయాణం సాగించే వాహనదారులు నిద్రకు ఇబ్బందులు పడతారనే ఉద్దేశంతో కొన్నిచోట్ల విశ్రాంతి గదులతో పాటు వ్యక్తిగత మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. గదులు, మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

-న్యూస్‌టుడే, మార్కాపురం

జాతీయ రహదారి-565 తెలంగాణ రాష్ట్రంలోని నాగార్జున సాగర్ నుంచి ప్రారంభమై దావులపల్లి వరకు సుమారు 95 కిలోమీటర్ల వరకు ఉంటుంది. తెలంగాణ రాష్ట్రం నాగార్జున సాగర్ నుంచి నకిరేకల్లు మీదుగా ప్రారంభమై నల్గొండ, రాష్ట్రంలోని పల్నాడు జిల్లా మాచర్ల, జిల్లాలోని యర్రగొండపాలెం, మార్కాపురం, చినారికట్ల, కనిగిరి మీదుగా రాపూర్, వెంకటగిరి మీదుగా వెళ్లి జాతీయ రహదారి-71కు కలుస్తుంది. ప్రయాణికుల సౌకర్యార్థం మార్గమధ్యలో ఏర్పాటు చేసిన విశ్రాంతి, మరుగుదొడ్లు గత ఎనిమిదేళ్లుగా పూర్తిగా వినియోగంలో లేక అధ్వానంగా తయారయ్యాయి. • జాతీయ రహదారి-565పై జిల్లాలోని తర్లుపాడు మండలం కలుజువ్వలపాడు పంచాయతీలోని మేకలవారిపల్లె వద్ద టోల్‌ప్లాజా ఉంది. అనంతరం రావిగుంటపాడు, దావులపల్లి వద్ద మరో రెండు టోల్‌ప్లాజాలను ఏర్పాటు చేశారు. టోల్‌ప్లాజాల మీదుగా రోజుకు సగటున 700 వరకు కార్లు, లారీలు, బస్సులు ఇలా నాలుగు చక్రాల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నెలకు ఒక్కొక్క టోల్‌ప్లాజా నుంచి 20 వేల వరకు వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి.

మర్రిపాలెం వద్ద జాతీయ రహదారిపై వినియోగంలో లేని విశ్రాంతి గదులు

ప్రతి వాహనానికి టోల్‌ప్లాజా

వాహనాన్ని బట్టి రూ.50 నుంచి అత్యధికంగా రూ.475 వరకు వసూలు చేస్తున్నారు. పాస్ అయితే వాహనాన్ని బట్టి రూ.1,630 నుండి రూ.10,530 వరకు వసూలు చేస్తున్నారు. జాతీయ రహదారిపై మార్కాపురం, రాయవరం, కొనకనమిట్ల, కనిగిరి, యర్రగొండపాలెం, మాచర్ల, రాపూర్, వెంకటగిరి తదితర ప్రాంతాల్లోని కూడళ్లలో దీపాలు మరమ్మతులకు గురైనా పట్టించుకోవడంలేదని వాహనచోదకులు, స్థానికులు వాపోతున్నారు. కొనకనమిట్ల మండలం మర్రిపాలెం, వగ్గంపల్లికి సమీపంలో రెండు విశ్రాంత గదులు నిరుపయోగంగా మారిపోయాయి. జాతీయ రహదారి పొడవునా పట్టణాలు, గ్రామాలున్నచోట నిర్మించిన బస్సు షెల్టర్లు సైతం నిరుపయోగంగా మారాయి.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఆంజనేయులు అధికారులను ఆదేశించారు. ఈ నెల 23వ తేదీ నుంచి పరీక్షల నిర్వహణపై స్థానిక ఆంధ్ర కేసరి విద్యాకేంద్రంలో బుధవారం ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, కస్టోడియన్లతో సమావేశం నిర్వహించారు. రెండు జిల్లాల్లో 67 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయనుండగా మొత్తం 42,759 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు వివరించారు. రవాణాకు ఇబ్బంది లేకుండా సకాలంలో కేంద్రాలకు చేరేందుకు 30 రూట్లలో ఆర్టీసీ బస్సు నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పారదర్శకంగా పరీక్షలు నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. తొలుత తాడేపల్లిలోని ఇంటర్మీడియట్ విద్యామండలి ప్రధాన కార్యాలయం నుంచి కార్యదర్శి రంజిత్‌బాషా వీక్షణ సమావేశం ద్వారా పలు సూచనలు చేశారు. సమావేశంలో పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, రమణారెడ్డి, కోటేశ్వరరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నిలిచిన మ్యుటేషన్లు

మార్కాపురం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో భూముల మ్యుటేషన్ల ప్రక్రియ నిలిచిపోయింది. గత నెల రోజులుగా వెబ్‌ల్యాండ్‌లో ప్రక్రియ నిలిచిపోయినట్లు రెవెన్యూశాఖాధికారులు చెబుతున్నారు. మార్కాపురం కేంద్రం జిల్లా ఆవిర్భావంతో జరుగుతున్న సవరణలతో సర్వర్ సమస్య తలెత్తినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 21 మండలాల నుంచి గత నెల రోజులుగా 722 మ్యుటేషన్ల దరఖాస్తులు రాగా, 717 పెండింగ్ ఉన్నాయి. జిల్లాలో అత్యధికంగా గిద్దలూరు మండలం నుంచి 118 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, వెలిగండ్లలో 69, పెద్దారవీడులో 61, మార్కాపురంలో 53, పామూరులో 47, కనిగిరిలో 43, హనుమంతునిపాడులో 39, కంభంలో 34, త్రిపురాంతకంలో 32, పొదిలిలో 32, కొమరోలులో 29, అర్ధవీడులో 27, బేస్తవారపేటలో 25, పెద్దచెర్లోపల్లిలో 22, కొనకనమిట్లలో 21, తర్లుపాడులో 16, చంద్రశేఖరపురంలో 16, యర్రగొండపాలెంలో 14, రాచర్లలో 10, పుల్లలచెరువులో 8, దోర్నాలలో 6 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

పలకలను కత్తిరిస్తూ..

రాతి పలక ముక్కలను వివిధ డిజైన్లలో పేర్చుతూ..

పలకరించిన ఉపాధి!

మార్కాపురం రాతి పలకలకు ప్రపంచవ్యాప్తంగా మంచి గిరాకీ ఉంది. కుటీర పరిశ్రమగా ప్రారంభమై పెద్ద పరిశ్రమగా రూపాంతరం చెంది శతాబ్ద కాలానికి పైగా దేశ, విదేశాలకు పలకలు ఎగుమతయ్యాయి. 2010లో వచ్చిన ఆర్థిక మాంద్యంతోపాటు రేకు, అట్ట, ఎనామిల్ పలకల వినియోగం బాగా పెరగడంతో వ్యాపారులు తమ మనుగడకు పలకల స్వరూపాన్ని మార్చేశారు. రాతి పలకలు తయారు చేసే కార్మికులు ఇళ్లకు అందాన్నిచ్చే డిజైన్ పలకలను తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. నిత్యం వేలాది కార్మికులు రకరకాల డిజైన్ పలకలను తయారు చేస్తున్నారు. వీటిని భవన నిర్మాణాల్లో టైల్స్‌కు బదులు వాడేందుకు వీలుగా వివిధ ఆకృతుల్లో తయారు చేస్తున్నారు. మార్కాపురం పలకలతో తయారైన డిజైన్ పలకలను ఇళ్లలోపల, బయట గోడలపై నిర్మాణ దారులు విరివిగా వినియోగిస్తున్నారు. - ఈనాడు, మార్కాపురం

కూలీల ప్రాణాలు.. గాలిలో దీపాలు!

- ప్రమాదకరంగా ట్రాక్టర్లపై ప్రయాణం
- కనీస చర్యలు చేపట్టని రవాణా శాఖ

పచ్చాకు ట్రాక్టర్లు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. కూలీల ప్రాణాలు బలి తీసుకుంటున్నాయి. నాలుగు రోజుల వ్యవధిలో జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. మరొకరు ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. అనుభవం లేని డ్రైవర్లు, కాలం చెల్లిన వాహనాలు, బీమా సైతం లేని పరిస్థితి వెరసి నిరుపేద ఇళ్లల్లో హాహాకారాలు, ఆర్తనాదాలు. కేవలం పచ్చాకు ట్రాక్టర్లు మాత్రమే కాదు ఇటీవల కాలంలో ఇతర ట్రాక్టర్లతోనూ ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇంత జరుగుతున్నా రవాణా శాఖ, పోలీసు యంత్రాంగం సీరియస్‌గా దృష్టి సారించడం లేదు.

-న్యూస్‌టుడే, ఒంగోలు నేరవిభాగం

లింగసముద్రం మండలం గంగపాలెం పొలాల్లో ఈ నెల 14వ తేదీన పచ్చాకు కూలీల ట్రాక్టరు బోల్తా పడింది. పొలంలోని డొంకదారి నుంచి ట్రాక్టర్ బయటకు వస్తున్న సమయంలో అదుపుతప్పి పక్కకు పడిపోయింది. పొగాకు మీద పడిపోవటంతో ఇద్దరు మహిళా కూలీలు మృతిచెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. పలువురు గాయాలపాలయ్యారు.

● ఒంగోలు నగర శివారు త్రోవగుంట వద్ద మంగళవారం చేకూరపాడుకు చెందిన రైతు పొలం నుంచి పచ్చాకు తీసుకెళ్లే క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. పచ్చాకు కూలీలపై పడటంతో ఒక మహిళ మృతి చెందగా, మరో మహిళ పరిస్థితి విషమంగా ఉంది. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో ట్రాక్టర్‌పై 16 మంది ప్రయాణిస్తున్నారు. ట్రాక్టరుపై పరిమితికి మించి రెండింతలు పచ్చాకు లోడ్ చేయడంతో ప్రమాదం చోటుచేసుకుంది.

త్రోవగుంట వద్ద మంగళవారం బోల్తా పడిన పచ్చాకు ట్రాక్టరు

అనుభవం లేని చోదకులు..

రెండు ప్రమాదాలకు కారణం ట్రాక్టరు చోదకులేనని స్పష్టమవుతోంది. పొలాల్లోని ఎగుడు దిగుడు మార్గాల నుంచి ప్రధాన రహదారిలోకి వచ్చే క్రమంలో అదుపు తప్పి బోల్తాపడ్డాయి. తక్కువ వేతనం, అనుభవం లేని చోదకులతో ట్రాక్టర్లను నడిపిస్తున్న ఉదంతాలు కోకొల్లలు. అత్యధికులకు కనీసం డ్రైవింగ్ లైసెన్సు లేకపోగా, అధిక శాతం ట్రాక్టర్లకు బీమా సైతం లేదు. ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణాపాయం జరిగితే బాధితులకు పరిహారం దక్కే అవకాశం కూడా లేకుండాపోతోంది. ఈ విషయమై ఉప రవాణాశాఖ కమిషనర్ సుశీల మాట్లాడుతూ రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు.

కలెక్టరేట్ పనులు త్వరితగతిన పూర్తి చేయండి

అధికారులతో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ రాజాబాబు

మార్కాపురం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం మార్కాపురం కలెక్టర్ కార్యాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం వహించకుండా తక్షణమే పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో జరుగుతున్న పనులను బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని, కలెక్టరేట్ నుంచి పరిపాలన ప్రారంభించాలని సూచించారు. విద్యుత్తు దీపాలు, ఫర్నీచర్ తదితర సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనవెంట జేసీ శ్రీనివాసులు, సబ్‌కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, తహసీల్దారు చిరంజీవి తదితరులున్నారు.

వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణ పరిమితిని పెంచాలి

జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణ ఆర్థిక పరపతిని పెంచి రైతులను ప్రోత్సహించాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఆయన బ్యాంకర్లు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని రైతులందరికీ బ్యాంకర్లు విరివిగా రుణాలివ్వాలన్నారు. ఉద్యానవన పంటలను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త రకాల పంటలను సాగు చేసే విధంగా రైతులకు శిక్షణ కల్పించాలని సూచించారు. సమావేశంలో ఇన్‌ఛార్జి డీఏవో బాలాజీనాయక్, ఉద్యానశాఖాధికారి ఆదిరెడ్డి, ఏపీఎంఐపీ పీడీ జెన్నమ్మ, ప్రకృతి వ్యవసాయం డీపీఎం సుభాషిని, పీడీసీసీబీ జీఎం ప్రకాష్ పాల్గొన్నారు.

వేసవి విద్యుత్తు వెతలకు చెక్!

- అంతరాయాల్లేని సరఫరాకు చర్యలు
- వేసవి ప్రణాళికలో జిల్లాయంత్రాంగం

ఏటా వేసవి దృష్ట్యా పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువయ్యే కొద్దీ మార్చి నుంచి జులై వరకు విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరుగుతోంది. దీంతో అధిక లోడు కారణంగా విద్యుత్తు ఉప కేంద్రాలపై తీవ్రమైన ఒత్తిడి ఉంటుంది. తద్వారా తరచుగా సాంకేతిక సమస్యలు తలెత్తి సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతుంటాయి. వీటిని అధిగమించేందుకు సంబంధిత శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. మార్చి నెలాఖరుకల్లా ఉప కేంద్రాలతోపాటు పరివర్తకాలను పూరిస్థాయిలో సిద్ధం చేసేందుకు మరమ్మతులు చేయిస్తున్నారు. - న్యూస్‌టుడే, కలెక్టరేట్

సింగిల్ ఫేజ్‌పై దృష్టి...

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 274 విద్యుత్తు ఉపకేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 98,898 పరివర్తకాలు ఉండగా, అందులో 12,907 సింగిల్ ఫేజ్ పరివర్తకాలు ఉన్నాయి. వేసవిలో ఎండల తీవ్రత పెరిగే కొద్దీ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శీతల యంత్రాలు, పంకాల వాడకం పెరుగుతోంది. తద్వారా విద్యుత్తు వినియోగం పెరగనుంది. గ్రామాలకు సైతం 24 గంటల పాటు నిరంతర సరఫరా చేయాలన్న ఉద్దేశంతో జిల్లా వ్యాప్తంగా ఆర్డీఎస్ఎస్ కింద ముమ్మరంగా పనులు జరుగుతున్నాయి. ఇప్పటివరకు ఒకే ఫీడరు కింద గృహాలకు, వ్యవసాయానికి విద్యుత్తు సరఫరా జరుగుతోంది. నష్ట నివారణ చర్యల్లో భాగంగా వ్యవసాయానికి ప్రత్యేక ఫీడర్లను ఏర్పాటు చేస్తున్నారు. అధిక లోడు కారణంగా అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా పరివర్తకాలు అమర్చుతున్నారు. రానున్న వేసవి దృష్ట్యా ఇప్పటికే వినియోగదారుల నుంచి ఫిర్యాదులందిన చోట సింగిల్ ఫేజ్‌తో పాటు త్రీఫేజ్ పరివర్తకాలు ఏర్పాటుకు ప్రణాళిక చేశారు. ఆ దిశగా మండల స్థాయిలో ఏఈలు ప్రతిపాదనలు తయారు చేయడంతోపాటు అవసరమైన సామగ్రి సరఫరా నిమిత్తం జిల్లా కార్యాలయానికి నివేదించారు.

ఒంగోలులోని గోదాంలో విద్యుత్తు పరివర్తకాలకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

రోజుకు 10 మి.యూ. వినియోగం

చలి కాలంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా వ్యాప్తంగా రోజుకు సరాసరిన 8.5 మిలియన్ యూనిట్ల విద్యుత్తు వినియోగం ఉండగా, ఎండల తీవ్రత దృష్ట్యా ఏప్రిల్, మే, జూన్‌లలో అత్యధికంగా 10 మి.యూ వినియోగం జరగనుంది. ప్రధానంగా రాత్రి వేళ ఇళ్లల్లో శీతల యంత్రాల వాడకంతో అధిక శాతం గ్రామాల్లో లోఓల్టేజీ సమస్య తలెత్తుతోంది. తద్వారా నాణ్యమైన విద్యుత్తు సరఫరా కావడం లేదు. పైగా సరఫరాలో హెచ్చుతగ్గులతో తరచూ ఇళ్లల్లోని గృహోపకరణాలు కాలిపోతున్నాయి. మరోపక్క వాడకం పెరిగే కొద్దీ పరివర్తకాల వద్ద ఫీజులు పోతున్నాయి. వీటన్నింటినీ అధిగమించేందుకు కార్యాచరణ ప్రణాళిక చేశారు. ఓవర్ లోడ్, లోఓల్టేజీ ఉన్న ప్రాంతాలను గుర్తించి, అదనపు సామర్థ్యంతో పరివర్తకాలను ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్తు సరఫరాకు సన్నద్ధమవుతున్నారు.

ఇళ్ల స్థలాలిచ్చేవరకు ఉద్యమిస్తాం

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం ప్రాంతంలోని మాజీ సైనికులకు ఇంటి స్థలాలు ఇచ్చే వరకు ఉద్యమం ఆగదని, తక్షణమే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మాజీ సైనికుల గృహ సొసైటీ అధ్యక్షుడు ఎం.చిన్నయ్య, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు హరినారాయణ రెడ్డి డిమాండు చేశారు. మాజీ సైనికులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని డిమాండు చేస్తూ స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం సుమారు 200 మంది మాజీ సైనికులు మహా ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కాపురం ప్రాంతంలోని అర్హులైన, ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం మాజీ సైనికులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని ఆదేశాలున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయిదేళ్లుగా ఇళ్ల స్థలాలకు అనేక రూపాల్లో ఆందోళనలు చేస్తున్నా అధికారులు స్పందించడంలేదని వాపోయారు. ఈ మహా ధర్నాకు ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు గాలి వెంకటరామిరెడ్డి, సీఐటీయూ జిల్లా నాయకులు డీకేఎం రఫీ, రూబెన్ సంఘీభావం ప్రకటించారు. ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘం నాయకులు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

ధర్నాలో పాల్గొన్న మాజీ సైనికులు, కుటుంబ సభ్యులు

(c) eenadu

ఉపవాస దీక్షల జేబు కాలమానిని ఆవిష్కరిస్తున్న మంత్రి రవికుమార్

ముస్లింల సంక్షేమానికి పెద్దపీట

మేదరమెట్ల, అద్దంకి: మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ముస్లిం సోదరుల కోసం గొట్టిపాటి యూత్ రూపొందించిన ఉపవాస దీక్షల జేబు కాలమానిని ఆవిష్కరణలో ఆయన మాట్లాడుతూ..దుల్హాన్ పథకం అమలుతోపాటు హజ్ యాత్రకు సాయం అందిస్తున్నామన్నారు. ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనాలు చెల్లిస్తున్నట్లు వెల్లడించారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. ఐటీడీపీ నియోజకవర్గం అధ్యక్షుడు షేక్ కరీముల్లా, మసూద్, బాషా, ఖాదర్ మస్తాన్, మీరావలీ, ముక్తార్, తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు చేసుకోండి

చంద్రపాడులో శనగ విత్తనాలను పరిశీలిస్తున్న సంయుక్త కలెక్టర్ కల్పనా కుమారి

చీమకుర్తి, న్యూస్‌టుడే: రైతులు పంటల వివరాలను ఈ-పంటలో నమోదు చేసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ కల్పనా కుమారి సూచించారు. చీమకుర్తి మండలం చంద్రపాడును బుధవారం ఆమె సందర్శించి పొగాకు, శనగ పంటలను పరిశీలించారు. నూరు శాతం పంట నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని వ్యవసాయ శాఖకి ఆదేశాలు జారీ చేశారు. పొగాకు సాగు, పెట్టుబడి ఖర్చులు, దిగుబడులు, నాణ్యత తదితర విషయాలను రైతుల నుంచి అడిగి తెలుసుకున్నారు. పొగాకు బ్యారన్‌ను సందర్శించి క్యూరింగ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, సహాయ సంచాలకుడు రమేష్, ఈవో విజయ భాస్కర్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జీవో 36ను వెంటనే అమలు చేయాలి

ధర్నాలో పాల్గొన్న ఉద్యోగులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జీవో నం.36 వెంటనే అమలు చేయడంతో పాటు, ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక పీడీసీసీ బ్యాంకు వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.హనుమంతరావు మాట్లాడుతూ.. 2019 నుంచి 2024 వరకు పెండింగ్‌లో ఉన్న వేతన సవరణలు చేయడంతో పాటు, అప్పటివరకు మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2019 తర్వాత సహకార సంఘాల్లో చేరిన ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు మనోజ్‌కుమార్, రామాంజనేయరెడ్డి, శ్రీకాంత్, రాజేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగుల సమ్మెకు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాలం సుబ్బారావు, ఎం.రమేష్ మద్దతు పలికారు.

సిబ్బంది కృషితో గ్రామాభివృద్ధి

పెద్దగుడిపాడులో స్థానికులతో మాట్లాడుతున్న పంచాయతీరాజ్ అధికారి వెంకటేశ్వరరావు

దొనకొండ, న్యూస్‌టుడే: సిబ్బంది పని తీరు మెరుగుపర్చుకుని గ్రామాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన దొనకొండ మండలంలోని గంగదేవిపల్లి గ్రామంలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. వానపాములతో వర్మీ కంపోస్ట్ ఎరువు తయారీ మండలంలో ఎక్కడా జరగకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తడి, పొడి చెత్త ఇళ్ల వద్దే వేరుచేసి వర్మీ కంపోస్టు ఎరువు తయారుచేసి రైతులకు విక్రయించడం ద్వారా ఆదాయం పొందాలని సూచించారు. పెద్దగుడిపాడులో స్థానికులతో మాట్లాడారు. చెత్త తరలిస్తున్నారా, వీధిలైట్లు వెలుగుతున్నాయా అని ఆరా తీశారు. దొనకొండ మండలంలో 46 శాతం మాత్రమే ఇంటి పన్నులు వసూలు చేశారని మార్చి 15లోపు వంద శాతం పూర్తిచేయాలన్నారు. చెత్త తరలింపునకు మూడు ట్రాక్టర్లు మంజూరయ్యాయని, వారంలో పంపిస్తానని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న దండు వీరయ్య మాదిగ, నాయకులు

దళితులపై దాడులు అరికట్టాలి

మార్కాపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో రోజు రోజుకు దళితులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, హత్యలను అరికట్టాలని.. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ అన్నారు. బుధవారం మార్కాపురంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక సప్తగిరి లాడ్జి నుంచి ర్యాలీగా కోర్టు కూడలిలోని సీపీఐ కార్యాలయం వరకు చేరుకున్నారు. ఆయన మాట్లాడుతూ దాడులు చేస్తున్న వారిపై కఠిన చట్టాలను అమలు చేయాలన్నారు. దళిత గిరిజనుల హత్యలపై విశ్రాంత న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాట్ల డేనియల్ మాదిగ, నాయకులు కె.భూషణం, జాన్, అనిల్‌కుమార్, రమేష్, మరియన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల దేవస్థానం
శ్రీశైలం-518101, నంద్యాల జిల్లా.
SRISAILA DEVASTHANAM
ఇ-ప్రొక్యూర్‌మెంట్-కం-బహిరంగవేలం ప్రకటన
ఆర్.సి.నెం.సి2/446969/2026, తేది: 17-02-2026

శ్రీశైల దేవస్థానము హక్కు భుక్తములోని దోర్నాల గ్రామములో శ్రీశైలసదనం నందు నూతనముగా నిర్మించిన 16 షాపులను స్వాధీనపరచిన తేదీ నాటి నుండి మూడు (3) సంవత్సరముల కాలపరిమితికి లీజు హక్కులు మంజూరు కొరకు **తేది: 04-03-2026న ఉదయం గం॥ 11:00ల** నుండి దోర్నాల గ్రామములోని శ్రీశైలసదనం నందు బహిరంగ వేలం నిర్వహించబడును. ఆసక్తి గలవారు ఒక్కొక్క షాపునకు ప్రథమ ధరావత్తుగా డి.డి. రూ. 1,00,000/-లు, మూడు (3) పోస్టు డేటెడ్ చెక్కులు, హెచ్చుపాటగా నిలిచిన మొత్తము ప్రకారము హెచ్చుపాటదారుడు బ్యాంక్ సెక్యూరిటీ (మూడు (3) సంవత్సరముల కాలము) మరియు ఆధార్/ పాన్ కార్డు సమర్పించి పాల్గొనవచ్చును.
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నందు పాల్గొనుటకు వెబ్‌సైట్ **www.apeprocurement.gov.in** ను సందర్శించి పాల్గొనవచ్చును. ఇతర వివరములు కొరకు దేవస్థానం కార్యాలయ పనివేళలలో సెల్ 70320 70215, 94410 96182 & 63000 57600ను సంప్రదించి తెలుసుకొనవచ్చును.
సం/- యం.శ్రీనివాస రావు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ & కార్యనిర్వహణాధికారి

ప్లాస్టిక్ నిషేధం.. వన్య ప్రాణులకు అభయం

నల్లమలలో పటిష్ఠ అమలుకు చర్యలు

న్యూస్‌టుడే, పెద్దదోర్నాల:

ఉమ్మడి ప్రకాశానికి వరం నల్లమల. దీన్లో విభిన్న జీవరాశులున్నాయి. వీటిని జాగ్రత్తగా కాపాడుకోవడం అందరి బాధ్యత. ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతరాలు అడవుల్లో వేయకుండా చూడాలి. తద్వారా వన్యప్రాణులు జీవిస్తాయి. ఇందుకోసమే అటవీ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది.

స్వచ్ఛ సేవకులతో ఏరివేత

నాగార్జునసాగర్- శ్రీశైలం పులుల అభయారణ్యంలో వంద వరకు పులులు ఉన్నట్లు అంచనా.. వాటితో పాటు విభిన్న జీవరాశులు ఉన్నాయి. నల్లమల రహదారుల్లో ప్రయాణికులు వేసే ప్లాస్టిక్ సీసాలు, ఇతర వ్యర్థపదార్థాలను అవి తిని ప్రాణాలు కోల్పోతున్నాయి. వాటి ప్రాణాలకు హాని కలగకుండా ఉండేందుకు అటవీశాఖ అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ నిషేధానికి పటిష్ఠ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా పెద్దదోర్నాలలోని అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేసి ప్రయాణికుల వద్ద ఉన్న ప్లాస్టిక్ సీసాలను తీసి వేస్తున్నారు. అలాగే పెద్దదోర్నాల-శ్రీశైలం రహదారిలో 10 మంది స్వచ్ఛ సేవకులు ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరి పారేస్తున్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 8 నుంచి 18 వరకు శ్రీశైలంలో జరిగిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వెళ్లే వాహనాల నుంచి సేకరించిన ప్లాస్టిక్ సీసాలను పక్కకు పెట్టి, వ్యర్థాలను కాల్చివేశారు.

పెద్దదోర్నాల అటవీశాఖచెక్ పోస్టు వద్ద సేకరించిన ప్లాస్టిక్ సీసాలు

అపరాధ రుసుం విధింపు

నల్లమల రహదారిలో ప్లాస్టిక్ వ్యర్థాలు వేసే వారిపై అటవీశాఖ అపరాధ రుసుం వేస్తోంది. దీంతోపాటు క్రమశిక్షణా చర్యలు తీసుకుంటోంది. పెద్దదోర్నాల - శ్రీశైలం రహదారిలో చెత్తా చెదారాన్ని ఎక్కడంటే అక్కడ వేయకుండా మూడు కి.మీలకు ఒక చెత్తబుట్ట ఉంచారు. ప్రయాణికులు వారి వద్ద ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను వాటిలో వేయాలి. మూడు కి.మీల పరిధిలో ఒక స్వచ్ఛ సేవకుడు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విధులు నిర్వహిస్తున్నారు. వారు చెత్తాచెదారాన్ని సేకరించి చెత్తబుట్టలో వేస్తారు. వ్యర్థపదార్థాలను కాల్చి వేసి ప్లాస్టిక్ సీసాలను ఆటోలతో చెత్త నిల్వ కేంద్రానికి తరలిస్తున్నారు. సేకరించిన సీసాలను హైదరబాద్‌లోని రీసైక్లింగ్ కేంద్రానికి పంపుతున్నారు. అయితే అక్కడికి పంపేందుకు రవాణా ఖర్చు ఎక్కువ అవుతుండటంతో స్థానికంగా రీసైక్లింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచనలో అటవీ అధికారులు ఉన్నారు.

అందరూ ఉత్తీర్ణులయ్యేలా!

❖ పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

న్యూస్‌టుడే - కనిగిరి

పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా చదువులో వెనుకబడిన విద్యార్థులను సి, డి గ్రేడ్‌లుగా గుర్తించి... బాలికలకు కస్తూర్బా విద్యాలయాల్లో, బాలురకు జడ్పీ, ఇతర ఉన్నత పాఠశాలల్లో ఈ నెల 12 నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభించింది. మార్చి 12 వరకు ఇవి కొనసాగనున్నాయి.

విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో శ్రీనివాసరెడ్డి

185 మందికి ప్రత్యేక తరగతులు

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఇంటి వద్ద సరైన వసతి, మార్గదర్శనం చేసేవారు లేకపోవడంతో చదువులో వెనుకబడుతున్నట్లు గుర్తించారు. ఇలా గుర్తించిన 185 మందికి కనిగిరి, దర్శి, మార్కాపురం, కొత్తపట్నం, ఆలకూరపాడు, గిద్దలూరు, పొన్నలూరు, పొదిలి, వెలిగండ్ల తదితర పాఠశాలల్లో ప్రత్యేకంగా బోధన సాగిస్తున్నారు. విద్యార్థులు ఏఏ అంశాల్లో వెనుకబడుతున్నారో చూసి... ఆయా అంశాల్లో ఉపాధ్యాయుల ద్వారా ప్రత్యేకంగా తరగతులు నిర్వహిస్తున్నారు. భోజన సౌకర్యం సైతం కల్పిస్తున్నారు. విద్యార్థులు సైతం పట్టుదలగా చదువుతున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా కార్యాచరణ అమలు చేస్తున్నట్లు మార్కాపురం డిప్యూటీ డీఈవో ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: త్రోవగుంట సమీపంలో పొగాకు కూలీల ట్రాక్టర్ బోల్తా పడి గాయపడిన క్షతగాత్రులను జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ముప్పవరపు సుచిత్ర బుధవారం పరామర్శించారు. ఒంగోలులోని వెంకట రమణ వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చాట్లగడ్డ ఎమేలమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబానికి తెదేపా అండగా నిలిస్తుందన్నారు. కార్యక్రమంలో తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, నాయకులు శ్రీనివాసరావు, సునీల్, సుబ్బానాయుడు, కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నల్ల చెరకు సేద్యం.. లాభదాయకం

❖ ఆసక్తి చూపుతున్న రైతులు

న్యూస్‌టుడే, కొనకనమిట్ల:

వాతవరణంలో వస్తున్న మార్పులు, పెట్టుబడి వ్యయం పెరగడంతో మిరప, పొగాకు పంటల సాగు చేసే రైతుల సంఖ్య క్రమేణా తగ్గుతోంది. కొనకనమిట్ల మండలంలోని నల్లరేగడి భూములు అత్యధికంగా ఉన్న పెదారికట్ల గ్రామంలో రైతులు గతంలో మిరప, పొగాకు పంటలు సాగు చేసేవారు. నేడు వారంతా నల్ల చెరకు (తిరునాళ్ల చెరకు) సాగుకు మొగ్గు చూపుతున్నారు. చెరకు పెట్టుబడి వ్యయం ఎక్కువైనా లాభాలు అధికంగా ఉండటంతో 50 ఎకరాలు విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. గ్రామంలో చెరకు వ్యాపారంతో 50 మంది జీవనం సాధిస్తున్నారు.

నాటేందుకు ప్రత్యేకంగా పెంపకం

నల్లచెరకు సాగు కోసం ముందుగా ఎంచుకున్న పొలంలో దున్నిన దుక్కిలో ట్రాక్టర్ అమర్చిన ప్రత్యేక గొర్రుతో సాళ్లు చేస్తారు. కిందటి ఏడాది పంటలో ఎకరాకు వెయ్యి గడలను కోయకుండా పొలంలో నాటేందుకు అవసరమైన రీతిలో ప్రత్యేకంగా పెంచుతారు. అలా పెరిగిన చెరకు గడలను ముక్కలుగా చేసి సిద్ధం చేసిన భూమిలో సాళ్లకు నీరు పెట్టి నాటుతారు. ఒక వరసలో నాటే ముక్కల మధ్య అడుగు దూరం ఉండేలా చూసుకుంటారు. విత్తిన దగ్గర నుంచి ఏపుగా పెరిగేందుకు చెరకు తోటలో మొక్కల అడుగు భాగంగా ఆకులను తొలగిస్తారు. ఇలా చేయడం వల్ల పెద్ద కణుపులు వచ్చి ఏపుగా పెరిగే అవకాశం ఉంది. పంట చేతికందే దశలో పలువురు సొంతంగా విక్రయించుకుంటారు.

❖ ఎకరాకు రూ.లక్ష దాకా ఆదాయం

రైతులు యాజమాన్య పద్ధతిలో నల్ల చెరకును ఎనిమిది నెలల పాటు పెంచుతారు. ఎకరాకు కనీసం 25వేలు మొక్కలు పెరిగేలా చర్యలు చేపడతారు. వాటిలో ఎకరాకు కనీసం 21 వేల మొక్కలు చేతికందుతాయి. అలా పెంచిన పంటను కూలీలతో నరికించి పది గడల చొప్పున ఒక కట్టగా కడతారు. ట్రాక్టరులో తిరునాళ్ల జరిగే ప్రదేశాలకు తరలించి అమ్మకాలు చేస్తారు. ఇటీవలి తిరునాళ్లలో గడ ఒక్కింటికి రూ.20 చొప్పున అమ్మకాలు చేశారు. ఇలా విక్రయించినా అత్యధికంగా ఎకరాలకు రూ. 4లక్షలు పైగా, అత్యల్పంగా రూ.3లక్షలు ఆదాయం వస్తుందని కొందరు రైతులు తెలిపారు. అన్ని ఖర్చులు పోను ఎకరానికి సగటున సుమారు రూ.లక్ష దాకా ఆదాయం వస్తుందని స్థానిక రైతు వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రభుత్వం ఈ పంట సాగుకు తగిన ప్రోత్సాహకాలు అందించాలని రైతులు కోరుతున్నారు.

పెదారికట్లలో ఏపుగా పెరిగిన చెరకు తోట

9లోపు ఓటర్ల జాబితా సిద్ధం చేయండి

మాట్లాడుతున్న డీపీవో ఎం.వెంకటేశ్వరరావు

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: అసెంబ్లీ ఓటర్ల జాబితా ఆధారంగా మార్చి 9వ తేదీ లోపు గ్రామ పంచాయతీ ఫొటో ఎన్నికల జాబితాలను కచ్చితంగా సిద్ధం చేయాలని డీపీవో ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా తయారీపై స్థానిక ప్రకాశం భవన్‌లో బుధవారం ప్రకాశం, మార్కాపురం జిల్లాలోని డిప్యూటీ ఎంపీడీవో, గ్రామ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో తప్పిదాలకు తావు లేకుండా జాబితాలు పరిశీలించాలన్నారు. జాబితాల తయారీలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలను తప్పకుండా పాటించాలని సూచించారు. ఇంటి నంబరు, కుటుంబం ప్రాతిపదికన తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. డీఎల్‌డీవోలు శ్రీనివాసరెడ్డి, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వీఆర్‌ఏలు

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించడంతోపాటు, కనీస వేతన చట్టం కింద నెలకు రూ.26 వేలు చొప్పున ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తూ ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల జిల్లా సంఘం ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు మాట్లాడుతూ.. తక్కువ జీతాలతో కుటుంబ పోషణ ఎలా గడవాలని ప్రశ్నించారు. వీఆర్‌ఏలు తమ సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పని భారం తగ్గించడంతోపాటు, సీనియారిటీ ప్రాతిపదికన వీఆర్వో, అటెండర్లుగా ఉద్యోగోన్నతి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు స్వాములు, సురేష్, పురుషోత్తం, పున్నారావు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నుడాలో రూ.32.50 కోట్ల పనులకు ప్రతిపాదనలు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నుడా పరిధిలో రూ.32.50 కోట్ల పనులకు ప్రతిపాదనలు వచ్చినట్లు జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం నుడా కార్యాలయంలో ఆ సంస్థ ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని మొదటి స్థానంలో నిలపేందుకు అధికారులంతా సహకరించాలని సూచించారు. నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ కందుకూరు, కావలి ఎంఐజీ లేఅవుట్ల అభివృద్ధికి టెండర్లు పిలిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

'చలో విజయవాడ' జయప్రదానికి పిలుపు

గోడ పత్రాలను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ జిల్లా నాయకులు

ఒంగోలు గ్రామీణం: విద్యార్థుల ఉపకార వేతనాల బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ 27వ తేదీన నిర్వహించనున్న చలో విజయవాడను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక మాదాల నారాయణస్వామి భవన్‌లో బుధవారం గోడ పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థుల ఉపకార వేతనాలకు పెనుశాపంగా మారిన జీవో నం.77ను రద్దు చేయాలని కోరారు. ఫీజుల బకాయిల కారణంగా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సిసింద్రీ, శ్యామ్, కోటి తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 120, రిటైల్ లైవ్ - 142, చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్- 234

వేధింపులపై డీఎస్పీ విచారణ

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: గతంలో ఒంగోలు రూరల్ సీఐగా పనిచేసిన ఎన్.శ్రీకాంత్ బాబు విధుల పేరుతో మహిళా సిబ్బందిని వేధింపులకు గురిచేశాడని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్‌లో మహిళా సిబ్బందిని బుధవారం విచారించారు. వారి వద్ద నుంచి వివరాలు నమోదు చేశారు.

ఉగాదికి పక్కా గృహాలు

లబ్ధిదారుల సమస్యలు తెలుసుకుంటున్న డీఈ చెన్నంరాయుడు, ఎంపీడీవో రాజశేఖర్

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉగాది నాటికి పక్కాగృహాల నిర్మాణ పనులు పూర్తి చేయాలని గృహ నిర్మాణశాఖ ఒంగోలు డీఈ చెన్నంరాయుడు ఆదేశాలు జారీ చేశారు. ఒంగోలు మండలం గుండాయపాలెం గ్రామంలో జరుగుతున్న గృహ నిర్మాణాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉగాది రోజున ఒంగోలు నియోజకవర్గంలో 605 ఇళ్లల్లో సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేస్తున్న అదనపు ఆర్థికసాయం గురించి వివరించారు. మార్చి నెలాఖరులోపు పూర్తి చేసినవారికి తక్షణమే బిల్లులు రానున్నట్లు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖర్, గృహనిర్మాణశాఖ మండల ఏఈ మనోజ్ పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో జైలు శిక్ష

ఒంగోలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే: బాకీ చెల్లించే నిమిత్తం ఇచ్చిన చెక్కు కేసులో నిందితుడు ఒంగోలుకు చెందిన ఎ.శ్రీనివాస్‌కు ఒంగోలు మొబైల్ న్యాయస్థానం న్యాయమూర్తి వి.వెంకటేశ్వరరావు జైలుశిక్ష విధించారు. నిందితుడు తన అవసరాల నిమిత్తం ఒంగోలుకే చెందిన ఎస్కే చాంద్ బాషా దగ్గర రూ.8 లక్షలు అప్పు తీసుకొని ప్రామిసరీ నోట్లు రాసిచ్చాడు.. అప్పు చెల్లించకపోవటంతో బాషా కోర్టులో కేసు దాఖలు చేశారు. ఇరువురు లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్నారు. ఇందులో భాగంగా రూ.10 లక్షలు చెల్లించటానికి శ్రీనివాస్ అంగీకరించి చెక్కులు ఇచ్చాడు. వాటిని నగదుగా మార్చుకునేందుకు ప్రయత్నించగా చెల్లలేదు. విషయాన్ని లాయరు నోటీసు ద్వారా తెలిపినా నిందితుడి నుంచి సరైన స్పందన లేకపోవటంతో ఆయన కోర్టులో ఫిర్యాదు చేశారు. విచారించిన జడ్జి నిందితునిపై నేరం రుజువైనందున ఏడాది జైలుశిక్ష విధించారు. రూ.15 లక్షలు జరిమానా వేశారు.

కత్తితో యువకుడిపై దాడి

కొనకనమిట్ల, న్యూస్‌టుడే: నాయుడుపేటలో బుధవారం మౌలాలి అనే యువకుడిపై చౌటపల్లెకు చెందిన లాజర్ కత్తితో దాడిచేసినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం సాయంత్రం ఇరువురి మధ్య వాగ్వివాదం జరిగి లాజర్ కత్తితో దాడిచేయడంతో మౌలాలికి మెడకు, వీపునకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని పొదిలి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. ఆసుపత్రిలో పోలీసులు క్షతగాత్రుని వద్ద నుంచి సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొనకనమిట్ల స్టేషన్ రైటర్ మురళి తెలిపారు. వివాహేతర సంబంధమే ఈ దాడికి కారణంగా పోలీసులు అనుమానిస్తున్నారు.

విద్యుత్తు చౌర్యంపై కేసులు

మాట్లాడుతున్న విద్యుత్తు అధికారి వెంకటేశ్వర్లు

కొనకనమిట్ల, న్యూస్‌టుడే: కొనకనమిట్ల మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న విద్యుత్తు చౌర్యం, అనధికారిక కనెక్షన్లపై ఆ శాఖ విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. దర్శి డీఈఈ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 33 బృందాలుగా ఏర్పడి అధికారులు విస్తృత తనిఖీలు చేశారు. 50 కేసులు నమోదు చేసి రూ.3,03,000 అపరాధ రుసుం విధించారు. అనంతరం జిల్లా విద్యుత్తు అధికారి వెంకటేశ్వర్లు పాల్గొని సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. దాడులో డీపీఈ హైమావతి, ఏడీ హరిబాబు, ఏఈ బ్రహ్మం, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్న వయసులోనే వినికిడి లోపాలు గుర్తించండి

విద్యార్థులకు వినికిడి పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రభాకరరావు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: వినికిడి లోపాలను చిన్న వయసులోనే గుర్తించడం ద్వారా తక్షణం వైద్యం పొందవచ్చని జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎస్.మాణిక్యరావు సూచించారు. ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈఎన్‌టీ విభాగం ఆధ్వర్యంలో బండ్లమిట్ట బాలికోన్నత పాఠశాల్లో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 100 మంది విద్యార్థులకు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినికిడి సమస్య వచ్చినప్పుడు వైద్యుల సలహా పాటించడం ద్వారా 90 శాతం తగ్గే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ప్రభాకర్‌రావు, పి.రాంబాబు, కవిత, కిరణ్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

EENADU eClassifieds

PERSONAL CLASSIFIEDS

BIRTHDAY GREETINGS

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

BUSINESS OFFER

Running 30Bedded Hospital Lease@ MiryalagudaTown, Nalgonda. For Obstetrics, Urology, Pediatrics, Ortho-Physician. 9848231654

PEOPLE CARE

OLD AGE HOME

డా॥లక్ష్మీప్రియాంక వానప్రస్థ వృద్ధాశ్రమం, సూరారెడ్డిపాలెం, టంగుటూరు (మం), ఒంగోలు. ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన మంచి వాతావరణంలో అందరికి అందుబాటులో నిర్మించబడిన వృద్ధాశ్రమం. బెడ్ పేషెంట్స్‌కు ప్రత్యేక వసతులు కలవు. Cont: 7095870566, 9912147879.

REAL ESTATE

PLOT FOR SALE

ఒంగోలు, మంగమూరు రోడ్డు SKY బాక్స్ క్రికెట్ గ్రౌండ్ దగ్గర 20 గదుల ప్లాట్స్ అమ్మకమునకు కలవు. Cell: 99891 89598.

JOBS

Wanted Hostel Wardens (Male/ Female) & Floor Incharge in SIMS Group of Institutions Hostels, Contact No. 9701666645 & 6304777593.

VEEDOL ENGINE OIL కంపెనీకి ఆథరైజ్డ్ డిస్ట్రిబ్యూటర్స్ ఆఫీసు నందు ఒంగోలులో పనిచేయుటకు ERP TALLYలో అనుభవంకల అకౌంటెంట్ కావలెను. ✆93346 69999

డా॥లక్ష్మీప్రియాంక వానప్రస్థ వృద్ధాశ్రమం, సూరారెడ్డిపాలెం, టంగుటూరు (మం), ఒంగోలు. కంప్యూటర్ ఆపరేటర్స్ మరియు భార్యాభర్త కేర్ టేకర్స్ కావలెను. Cont: 70958 70566, 99121 47879

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్‌ను/ పిల్లలను చూసు కొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ:18-20K ✆ 96404 68899, 96402 58899

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్, హాస్టల్ ఇన్‌చార్జీస్‌గా పనిచేయుటకు స్త్రీలు కావలెను. జీతం: 10000/- నుండి 13000/- వరకు ఇవ్వబడును (ఉచిత భోజన వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సం॥ల పైన ఉండవలెను. వివరాలకు సంప్రదించగలరు. ఫోన్ నెం: 92487 33340.

ప్రముఖ టోల్ ప్లాజా నందు 10th-PG గల కంప్యూటర్ ఆపరేటర్ క్యాషియర్ కావలెను. 8 గం॥ల డ్యూటీ, భోజనం + వసతి ఉచితం. ✆ 63095 36439

ఒంగోలులో షాపింగ్‌మాల్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ (యువతి/యువకులు) హౌస్ కీపింగ్ లేడీస్ కావలెను.జీతం: 12to15వేలు, డ్యూటీ: 12గం॥ ✆ 8179695848

SECURITY GUARDS

Secur Security Services. టంగుటూరు పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీ SO లు మరియు ASO లు కావలెను. ✆ 9959598279

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కనిగిరి

•కనిగిరి •గిద్దలూరు

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

మై టీడీపీ యాప్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తెదేపా నాయకులు

కనిగిరి, న్యూస్‌టుడే: మై టీడీపీ యాప్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని తెదేపా ఒంగోలు పార్లమెంటరీ కమిటీ కార్యాలయ కార్యదర్శి షేక్ షరీఫ్ పేర్కొన్నారు. కనిగిరి అమరావతి మైదానంలో యాప్ పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ అంశాలతో పాటు పెద్ద ఎత్తున చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేయాలన్నారు. వైకాపా తప్పుడు ప్రచారాలను సమర్థంగా తిప్పికొట్టాలని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అంతా సిద్ధంగా ఉండాలన్నారు. పార్టీ నాయకులు షేక్ ఫిరోజ్, జంషీర్, వెంకటరెడ్డి, రవి, తాజుద్దీన్, శ్రీనివాసరెడ్డి, బాలబాబు, గౌస్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

'సత్యసాయి' సభ్యుల సాయంతో అల్పాహారం

బేస్తవారపేట, న్యూస్‌టుడే: బేస్తవారపేట, కంభం సత్యసాయి సేవా సమితి సభ్యులు... గలిజేరుగుళ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు చేయూతనిస్తున్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రోజూ సాయంత్రం విద్యార్థులకు స్లిప్ టెస్టులు, ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారికి ఆకలి ఇబ్బంది లేకుండా అల్పాహారం అందిస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లగా సభ్యులు కొట్టె బ్రహ్మం, కె.సీహెచ్ వెంకటరెడ్డి, సతీష్ తదితరులు స్పందించారు. ప్రత్యేక తరగతులు ముగిసేంత వరకు సరిపడా సరకులు అందజేశారు. వీటితో రోజుకో రకమైన అల్పాహారం అందిస్తున్నారు.

విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న సమితి సభ్యులు

21న వెలిగొండ సమస్యలపై ధర్నా

మార్కాపురం, న్యూస్‌టుడే: వెలిగొండ నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దగ్గుపాటి సోమయ్య, నిర్వాసితుల సంఘం కన్వీనర్ గాలి వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. మార్కాపురం ప్రెస్‌క్లబ్‌లో సంఘం ముఖ్య నాయకులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రాజెక్టు సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. మెరుగైన ప్యాకేజీ చెల్లించాలని కోరారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులందరికీ 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలన్నారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 21న సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద భారీ ఎత్తున నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. నిర్వాసితులంతా పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.20 లక్షలు చెల్లించాలని, పునరావాస కాలనీల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

పది విద్యార్థులకు వైద్య పరీక్షలు

బేస్తవారపేట, న్యూస్‌టుడే: బేస్తవారపేట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు... స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ కావ్య ఆధ్వర్యంలో బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు తెలియజేశారు. ఎంఈవో-1 మధుసూదన్‌రెడ్డి, సీహెచ్‌వో తులసీ ప్రసాదరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దృష్టి సారిస్తేనే పల్లె గొంతులకు జీవజలం

న్యూస్‌టుడే - బేస్తవారపేట

❑ గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆగిన జేజేఎం పనులు

గత వైకాపా ప్రభుత్వ తీరుతో జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పనులకు గ్రహణం పట్టింది. దీంతో ఇంటింటికీ కుళాయిల ద్వారా రక్షిత జలాలు అందించాలన్న లక్ష్యం నీరుగారింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పరిస్థితిలో కొంత మార్పు వచ్చింది. పనుల గమనం సైతం పెరిగింది. యంత్రాంగం చొరవ చూపి నిర్దేశిత సమయంలోగా ప్రాజెక్టును కొలిక్కి తెస్తే... పల్లె గొంతులకు సురక్షిత జలాలు అందనున్నాయి.

బేస్తవారపేట మండలం చిన్న ఓబినేనిపల్లిలో కనెక్షన్ ఇవ్వకుండా రహదారిపై ఏర్పాటు చేసిన పైపులైను

● జేజేఎం కింద గిద్దలూరు నియోజకవర్గానికి మొత్తం రూ.36.14 కోట్ల నిధులు... 218 పనులు మంజూరయ్యాయి. వీటిలో సుమారు 160 పూర్తి కాగా... ఆరు పురోగతిలో ఉన్నాయి. ఒకటి ప్రారంభం కాలేదు. మిగతావి రద్దయ్యాయి.

నాడు బిల్లులు చెల్లించక...

గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ కుళాయిల ద్వారా రక్షిత జలాలు అందించాలన్నది జేజేఎం లక్ష్యం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 2019లో ఈ పథకం అమల్లోకి వచ్చింది. 2024 నాటికి పూర్తి చేయాలి. ఆ మేరకు పనులు ప్రారంభించినా అప్పటి వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం చేయడంతో ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదు. చేసిన వాటికీ బిల్లులు చెల్లించకపోవడంతో చాలా చోట్ల పనులు నిలిచిపోయాయి. ఫలితంగా నిర్దేశిత సమయానికి ప్రాజెక్టు పూర్తికాలేదు. దీంతో గ్రామాల్లో తాగునీటి చిక్కులు కొనసాగుతూనే ఉన్నాయి. తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చొరవ చూపడంతో జేజేఎం పనుల గడువును 2028 వరకు కేంద్రం పొడిగించింది. 24 శాతం కంటే తక్కువగా జరిగిన పనులను ప్రభుత్వం రద్దు చేసింది. నిర్దేశిత గడువులోగా మొత్తం ప్రాజెక్టు పూర్తయ్యేలా గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా కార్యాచరణ రూపొందించింది.

అన్నీ అవకతవకలే...!

జేజేఎం పనుల్లో కేంద్రం వాటా 50 శాతం కాగా... మిగతా 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించాలి. గత వైకాపా ప్రభుత్వం రాష్ట్ర వాటా చెల్లించకపోగా... కేంద్రం నుంచి వచ్చిన నిధులను పక్కదారి పట్టించిందన్న విమర్శలున్నాయి. చేసిన కొద్దిపాటి పనుల్లోనూ అవకతవకలు చోటుచేసుకున్నాయి. పలుచోట్ల పాత కుళాయిలకే కొత్తగా వేసినట్లు చూపారన్న ఆరోపణలున్నాయి. పథకాలు, పైపులైను పనులు సైతం ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వమైనా ప్రత్యేక దృష్టి సారించి వీటిని పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ గిద్దలూరు డీఈ నవకిషోర్ మాట్లాడుతూ ఈ నెలలో నిధులు విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. మార్చి నెలాఖరుకు అసంపూర్తి పనులు పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

కనిగిరి : 8008574114

గిద్దలూరు పట్టణం : 8008574135

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: హనుమంతునిపాడు: వీరరామపురం రహదారి గుంతమయంగా మారి పాదచారులు సైతం ఇబ్బంది పడుతున్నారు. - కె.వెంకటసుబ్బయ్య, మాజీ సర్పంచి

✓: ఆ రోడ్డు అభివృద్ధికి అనుమతులు వచ్చాయి. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. - బ్రహ్మయ్య, పంచాయతీ రాజ్ ఏఈ

?: అర్ధవీడు: అయ్యవారిపల్లి పంచాయతీ భవనం గోడలు నెర్రెలిచ్చి శిథిలావస్థకు చేరింది. ప్రహరీ సైతం ప్రమాదకరంగా ఉంది. - పుల్లయ్య

✓: పరిశీలించి... మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. - కాశింపీరా, ఎంపీడీవో

?: అర్ధవీడు: గన్నెపల్లి మసీదు వీధిలో కాలువలు లేక ఇళ్ల ముందు మురుగు నిలిచి... దోమల సమస్య పెరిగింది. - మౌలాలి

✓: కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. - కాశింపీరా, ఎంపీడీవో

?: కంభం: హజరత్ గూడెం పంచాయతీ శ్రీ సాయినగర్ ఆర్చి సమీపంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. - రమణ

✓: సిబ్బందిని పంపి ఆ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. - ఉమామహేశ్వరి, పంచాయతీ కార్యదర్శి

?: కనిగిరి: పట్టణంలోని పవిత్ర కల్యాణమండపం ప్రాంతంలో నెల రోజులుగా చెత్త తీయడం లేదు. వ్యర్థాలు కుళ్లి దుర్వాసన వెలువడుతోంది. - రామలింగారెడ్డి

✓: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి సమస్య పరిష్కరిస్తాం. - నాయబ్ రసూల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పొగాకు రైతుల కన్నీటి కష్టం

గత ఏడాది అక్టోబరులో కురిసిన వర్షాలతో పొగాకు సాగు చేపట్టిన రైతులు... గత కొన్నాళ్లుగా చినుకు జాడ లేక, తడులు అందించే పరిస్థితీ లేక అల్లాడుతున్నారు. ఎండుతున్న తోటలను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు.

కనిగిరి నుంచి పైపులు తరలిస్తున్న వెలిగండ్ల మండలం పాపిరెడ్డిపల్లె రైతులు

అదనపు భారం...: కనిగిరి వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కనిగిరి, పామూరు, వెలిగండ్ల, హనుమంతునిపాడు, పి.సి.పల్లి, సి.ఎస్.పురం మండలాల్లో దాదాపు 4,200 హెకార్లలో పొగాకు సాగు చేశారు. ఇప్పటి వరకు ఎకరాకు రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టారు. ఆకు రెలుపు సమయానికి వర్షాలు లేకపోవడంతో తోటలు వాడుముఖం పడుతున్నాయి. బెట్టకు వచ్చిన పంటను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. దూరప్రాంతాల్లో ఉన్న కొద్దిపాటి నీటి వనరులను వ్యయప్రయాసలకోర్చి పైపుల ద్వారా తరలిస్తున్నారు. ఒక్కో పైపునకు రోజుకు రూ.15 చొప్పున అద్దెకు చెల్లిస్తున్నారు. కనీసం యభై పైపులు లేనిదే తడులు అందించలేని పరిస్థితి ఉందని.. దీంతో అదనపు భారం తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. ధరలు ఆశాజనకంగా ఉంటేనే తప్ప ఈ ఏడాదీ నష్టాలు తప్పవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, కనిగిరి**

వీడ్కోలు వేడుక... ఆనంద వీచిక

గీతానికి నృత్యం చేస్తున్న కంచర్లవారిపల్లి పాఠశాల బాలికలు

కనిగిరి, న్యూస్‌టుడే: కంచర్లవారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుక బుధవారం ఘనంగా నిర్వహించారు. పి.సి.పల్లి, వెలిగండ్ల ఎంఈవోలు రాచగుండ్ల శ్రీనివాసరావు, దాసు ప్రసాద్ మాట్లాడుతూ అందరూ బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విశ్రాంత ఉపాధ్యాయులు పదిలంబాబు, రమేష్‌బాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. పూర్వ విద్యార్థి వెంకట్రావు గ్రంథాలయానికి రూ.మూడు వేల విలువైన పుస్తకాలు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొమరోలు గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధన దిశగా అడుగులు వేయాలని ఎస్సై జె.నాగరాజు పేర్కొన్నారు. బుధవారం... కొమరోలులోని ప్రగతి జూనియర్ కళాశాల వార్షిక వేడుకలో మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ద్వితీయ సంవత్సర విద్యార్థులకు వీడ్కోలు పలికారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపల్ సందీప్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థినుల సందడి

ఆసుపత్రికి భవనం కేటాయించాలని వినతి

గిద్దలూరు పట్టణం: కాశిరెడ్డికుంటలో స్వాధీనం చేసుకున్న అనధికార నిర్మాణాన్ని మాజీ సైనికుల ఆసుపత్రికి కేటాయించాలని జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి.సి.అంకన్న ఆధ్వర్యంలో కమిషనర్ ఎ.వి.రమణబాబుకు బుధవారం వినతిపత్రం అందించారు. ప్రస్తుతం అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య ఆసుపత్రి భవనం నడుస్తోందని తెలిపారు. కమిషనర్ స్పందిస్తూ ఆ భవనం విషయమై కోర్టులో వివాదం నడుస్తున్నందున... ఎటువంటి చర్యలూ తీసుకోలేమని తెలిపారు. సంఘం ఉపాధ్యక్షుడు ఎం.కోటారెడ్డి, మాజీ సైనికులు పాల్గొన్నారు.

చెత్తకు నిప్పు... పొగతో ముప్పు

గిద్దలూరు - అంబవరం రహదారిలోని పాత డంపింగ్ యార్డులో పారిశుద్ధ్య సిబ్బంది వ్యర్థాలు పారబోస్తున్నారు. వీటికి కొందరు నిప్పు పెడుతుండడంతో పొగ కమ్మేసి అటుగా వెళ్లే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సీఎస్ఐ చర్చి సమీప నివాసితులూ ఇబ్బంది పడుతున్నారు. మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని... ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం**

వంతెన... రక్షణ లేక!

కంభం మండలం హజరత్ గూడెం నుంచి ఎస్సీ కాలనీకి వెళ్లే దారిలో... చీతిరాల కతువపై ఉన్న వంతెన రక్షణ గోడ కూలిపోయింది. చాన్నాళ్లవుతున్నా నేటికీ బాగు చేయించలేదు. దీంతో ఇటుగా రాకపోకలు సాగించేవారు, పొలాలకు వెళ్లే రైతులు... ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి వేళ పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంటోంది. సమస్యపై నీటి పారుదల శాఖ జేఈ శ్రీనునాయక్ స్పందిస్తూ... నిధుల లభ్యతను బట్టి రక్షణ గోడ నిర్మాణం చేపడతామని తెలిపారు. **- న్యూస్‌టుడే, కంభం**

రక్షిత పథకం... ఎవరికీ పట్టక!

కొమరోలు మండలం రాజుపాలెం పంచాయతీ ద్వారకచెర్ల గ్రామ శివారులోని రక్షిత పథకం ట్యాంకు ఇది. నిర్వహణ కొరవడి విద్యుత్తు సరఫరా ఉన్నంత సేపూ మోటారు పనిచేస్తూ నీరు వృథాగా పోతోంది. ఎవరైనా స్థానికులు స్పందించి ఆపితే తప్ప నిత్యం ఇదే పరిస్థితి కొనసాగుతోంది. మరోవైపు ట్యాంకు సైతం పాచి పట్టి అధ్వానంగా తయారైంది. సంబంధిత అధికారులు స్పందించి ట్యాంకు శుభ్రతతో పాటు నిర్వహణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. **- న్యూస్‌టుడే, కొమరోలు గ్రామీణం**

దారిలోనే మురుగు కూపం

కనిగిరి పట్టణం కాశిరెడ్డినగర్‌లో పరిస్థితి ఇది. కాలువలు లేక మురుగంతా రహదారిపై నిలిచిపోయి... అటుగా రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొంటోంది. తీవ్ర దుర్వాసనతో పాటు దోమల సమస్యా పెరిగిందని స్థానికులు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కనిగిరి**

విస్తరణ సరే... పైపులు మూసేస్తే ఎలా?

గిద్దలూరు - రాజుపాలెం రహదారిని విస్తరించి వెట్‌మిక్స్‌తో చదును చేస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా... ఆంజనేయస్వామి ఆలయ సమీప పొలాల నుంచి నీరు బయటకు పోయేలా ఏర్పాటు చేసిన కల్వర్టు పైపులను విస్తరించక పోవడంతో మట్టితో మూసుకుపోతున్నాయి. దీంతో వర్షాల సమయంలో నీరు బయటకు వెళ్లేదారి లేక సమస్య తలెత్తుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. **- న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం**

అవగాహన ప్రదర్శనలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

మత్తుతో జీవితాలు నాశనం

బేస్తవారపేట, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండి చదువుపై శ్రద్ధ వహించాలని ప్రధానోపాధ్యాయిని మన్నం శ్రీదేవి తెలిపారు. బేస్తవారపేట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన నో డ్రగ్స్ కార్యక్రమంలో మాట్లాడారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మత్తుకు అలవాటు పడితే జీవితం నాశనమవుతుందని తెలిపారు. అనంతరం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయినికి సత్కారం

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: హాజీపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని మహిబూన్‌కు నేషనల్ ఇన్నోవేటివ్ శిక్ష రత్న పురస్కారం లభించింది. సవాచారి గతి సమూహ భారత్ (ఛత్తీస్‌గఢ్) వారు దీనిని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యాక్రమంలో ఎంఈవో పెద్దిరాజు, ప్రధానోపాధ్యాయిని మల్లికాబేగం, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు. సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

మహిబూన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎంఈవో పెద్దిరాజు, ఉపాధ్యాయులు

రక్షణ గోడ కూలింది... పట్టించుకోండి!

అర్ధవీడు మండలం మొహిద్దీన్‌పురం జంపలేరు వంతెనపై పరిస్థితి ఇది. రక్షణ గోడ కూలిపోయి ఏడాదవుతున్నా కనీస మరమ్మతులు చేపట్టలేదు. శిథిలాలనూ తొలగించలేదు. దీంతో రాత్రివేళ ఇటుగా ప్రయాణించే వాహనదారులు... ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదాలబారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, అర్ధవీడు**

తమలా మరెవరూ ఇబ్బంది పడకూడదని..!

☛ సొంత నిధులతో శ్మశానవాటిక అభివృద్ధి

సి.ఎస్.పురంలో మాగాణి భూముల్లో ఉన్న దహన శ్మశాన వాటికను గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జంగా వెంకటబాలసుబ్రహ్మణ్యం (బాలు), ఆయన సోదరుడు బెంగళూరులోని తితిదే ఆలయ వేదపండితుడు సతీష్‌శర్మ సొంత నిధులు వెచ్చించి అభివృద్ధి చేశారు. మూడేళ్ల క్రితం వీరి తండ్రి హరినాథ్‌బాబా మృతి చెందారు. అప్పట్లో శ్మశానవాటిక నిండా చిల్లచెట్లు పెరిగి, పరిసరాలు అధ్వానంగా ఉండడంతో దహనసంస్కారాలు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తమలా మరెవరూ అవస్థలు పడకూడదని రుద్రభూమి అభివృద్ధికి సంకల్పించారు. చిల్లచెట్లు, వ్యర్థాలను జేసీబీతో తొలగించి మొత్తం ఆవరణను చదును చేయించారు. చెత్తను ట్రాక్టర్లతో బయటకు తోలించారు. ఫ్లోరింగ్ చేయించి కొంత మేర ప్రహరీ నిర్మించి గేటు, బోర్డు, కూర్చునేందుకు వీలుగా బల్లలు ఏర్పాటు చేశారు. ఇందుకోసం రూ.2 లక్షలకు పైగా మొత్తం వెచ్చించారు. వీరిని గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు. **- న్యూస్‌టుడే, సి.ఎస్.పురం**

విద్యతోనే ఉన్నత శిఖరాలు

రాచర్ల, న్యూస్‌టుడే: ఇంటర్ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని ప్రిన్సిపల్ పి.మురళి పేర్కొన్నారు. ఏపీ మోడల్ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడారు. 23 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నందున ఉన్న సమయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాగా చదువుకుంటేనే మంచి భవిష్యత్తు సొంతమవుతుందన్నారు. పూజలు నిర్వహించి హాల్‌టికెట్లు అందజేశారు. విద్యార్థులు తల్లిదండ్రుల పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం పొందారు. వైస్ ప్రిన్సిపల్ సతీష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుంటున్న విద్యార్థులు

తొట్టెలు నిర్మించారు.. నిర్వహణ మరిచారు!

న్యూస్‌టుడే - కంభం

పాడి రైతులకు మేలు కలిగేలా మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో నీటి తొట్టెలు నిర్మించారు. మేతకు వెళ్లే ప్రాంతాలు, పొలాలు, శివారు ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఒక్కో నిర్మాణానికి రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకు ఖర్చు చేశారు. గిద్దలూరు, కంభం, బేస్తవారపేట, అర్ధవీడు, కొమరోలు, రాచర్ల, తర్లుపాడు మండలాల పరిధిలో ఇప్పటికే 217 నిర్మించారు. వీటికోసం రూ.21 లక్షలు ఖర్చు చేశారు. మరో 252 నిర్మాణ దశలో ఉన్నాయి. నిర్వహణ బాధ్యతను పంచాయతీలకు అప్పగించినా వారు సక్రమంగా పట్టించుకోక అసలు లక్ష్యం నీరుగారుతోంది.

హజరత్‌గూడెంలో నిరుపయోగంగా ఉన్న తొట్టె

పూర్తిగా విస్మరించారు...

కంభం నుంచి చెరువు కట్టకు వెళ్లే దారిలోని నీటి తొట్టె కుళాయి పైపులైను విరిగి రెండు నెలలవుతున్నా పట్టించుకున్న వారు కరవయ్యారు. హజరత్‌గూడెం, తురిమెళ్ల శ్మశానవాటిక, కంభం బోర్డు స్కూల్ సమీపంలోని రైతు సేవా కేంద్రం వద్ద తొట్టెలు నీరు లేక నిరుపయోగంగా మారాయి. చిన్నకంభం సమీపంలో గిద్దలూరు రోడ్డు పక్కన ఉన్న తొట్టె పాచిపట్టి అపరిశుభ్రంగా ఉంది. రాచర్ల మండలం ఆకవీడు, ఇతర గ్రామాల్లోనూ ఇదే దుస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్వాహణ పక్కాగా చేపట్టాలని పశుపోషకులు కోరుతున్నారు. ఈ విషయమై కంభం ఎంపీడీవో వీరభద్రాచారి స్పందిస్తూ తొట్టెల్లో నీరు నింపేందుకు చర్యలు తీసుకుంటామని, అవసరమైన వాటికి మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.

● పట్టించుకోని పంచాయతీల అధికారులు

మద్యం గొలుసు దుకాణం తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

బేస్తవారపేట, న్యూస్‌టుడే: పందిళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీని ఆనుకుని నిర్వహిస్తున్న మద్యం గొలుసు దుకాణాన్ని కంభం ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో తొలగించారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గత కొన్నాళ్లుగా ఇక్కడ గొలుసు దుకాణం నిర్వహిస్తున్నాడు. పక్కనే సిటింగ్ గదిని సైతం ఏర్పాటు చేశాడు. మందుబాబులు తరచూ గొడవలు పడుతుండడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై 'బడి పక్కనే బారు' శీర్షికన 'ఈనాడు'లో బుధవారం ప్రచురితమైన చిత్ర కథనానికి అధికారులు స్పందించి ఈ చర్యలు తీసుకున్నారు.

బాధిత కుటుంబానికి తెదేపా నేతల పరామర్శ

కనిగిరి, న్యూస్‌టుడే: సింగరాయకొండలోని కోచింగ్ సెంటర్‌లో అనుమానాస్పద రీతిలో మృతి చెందిన కనిగిరి పట్టణానికి చెందిన విద్యార్థి తౌషిక్ కుటుంబాన్ని తెదేపా నాయకులు బుధవారం పరామర్శించారు. ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డితో ఫోన్‌లో మాట్లాడించారు. బాలుడి మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. ఘటనపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పరంగానూ ఆదుకుంటామని చెప్పారు.

విద్యార్థి మృతిపై సమగ్ర విచారణకు డిమాండు

పామూరు, న్యూస్‌టుడే: సింగరాయకొండలోని కోచింగ్ సెంటర్‌లో విద్యార్థి తౌషిక్ మృతి ఘటనపై ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకుడు దేవరాజు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పామూరులో బుధవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. ఉన్నతాధికారులతో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పామూరులో ఉచిత వైద్యసేవలు

పామూరు, న్యూస్‌టుడే: వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పామూరులోని డీవీ మనోహర్ అపార్ట్‌మెంట్ సమీపంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ రూబీనా ఆధ్వర్యంలో రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కాలానుగుణ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

(c) eenadu

మార్కాపురం

•మార్కాపురం •యర్రగొండపాలెం

ఈ-పంట నమోదుకు తుది గడువు 20

తర్లుపాడు, న్యూస్‌టుడే: మండలంలోని రబీ పంటలు సాగు చేసిన రైతులు ఈ-పంట నమోదుకు ఈ నెల 20వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారి జ్యోష్నదేవి సూచించారు. మండలంలోని కేతగుడిపి, బుడ్డపల్లి గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఏవో పాల్గొన్నారు. ప్రతి రైతు ఏపీఎఫ్ఆర్ విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని లేదంటే కేంద్రం ఇచ్చే పీఎం కిసాన్ పథకం వర్తించదన్నారు. కాబట్టి ఆర్ఎస్‌కె సిబ్బంది వద్ద ఈ-పంటతోపాటు ఏపీఎఫ్ఆర్ నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో రెండు గ్రామాల రైతులు, వీఏఏ మల్లికార్జున, ఏహెచ్ఏ భార్గవి పాల్గొన్నారు.

విద్యార్థులకు సామాజిక అవగాహన అవసరం

విజేతలతో ఎంఈవో-I రాందాస్‌నాయక్, జేవీవీ ప్రతినిధులు

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: నేటి విద్యార్థులు చదువుతో పాటు సమాజంలో జరుగుతున్న పరిస్థితులపై అవగాహన కలిగి ఉండాలని మార్కాపురం మండల విద్యాశాఖాధికారి రాందాస్‌నాయక్ అన్నారు. పట్టణంలోని స్థానిక బాలికోన్నత పాఠశాలలో బుధవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'వక్త సంబరాలు' లో భాగంగా మండలస్థాయి వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతను పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపకరిస్తాయని తెలిపారు. అనంతరం మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన డి.సాయిగోపిచంద్(గజ్జలకొండ హైస్కూల్), బి.లక్ష్మీదుర్గ (వాసవి విద్యానికేతన్), పి.సంజన(వాసవి విద్యానికేతన్)లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు రేణుక, జేవీవీ జాతీయ ఉపాధ్యక్షులు గయాజ్‌బాష, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సజీవరాజు, పాపారాయుడు, అడ్వకేట్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ట్యాంకు.. అపరిశుభ్రత మెండు

వై.పాలెంలోని మాచర్ల రోడ్డు ఏపీ గిరిజన బాలుర గురుకులంలో సుమారు 350 మంది విద్యార్థులు విద్యను కొనసాగిస్తున్నారు. అక్కడ పాఠశాల, జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులున్నారు. వీరంతా ఒకే చోట తాగు నీరు తాగుతుంటారు. ఆ ట్యాంకు వద్ద ఎలాంటి పారిశుద్ధ్య చర్యలు లేక అపరిశుభ్రత నెలకొని ఉంది. వృథా నీటితో బురదగా మారి ఈగలు, దోమలు వ్యాపిస్తున్నాయి. తాగు నీటి కుళాయిల వద్ద పాచి పట్టింది. దుర్వాసన సైతం వస్తోంది. ఇటువంటి అపరిశుభ్రత వద్ద గత్యంతరం లేని పరిస్థితిలో నీటిని విద్యార్థులు తాగుతున్నారు. ఇక్కడ బోరు నుంచి వచ్చిన నీటిని ట్యాంకులో నింపుతారు. ఆ నీటినే తాగుతున్నారు. వారానికి ఒకసారైనా ట్యాంకును శుభ్రం చేయరని విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యార్థులకు శుద్ధ నీరు అందించాలని, తాగు నీటి ట్యాంకు వద్ద అపరిశుభ్రత లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, యర్రగొండపాలెం పట్టణం

మత్తుతో జీవితాలు నాశనం

బేస్తవారపేట, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండి చదువుపై శ్రద్ధ వహించాలని ప్రధానోపాధ్యాయిని మన్నం శ్రీదేవి తెలిపారు. బేస్తవారపేట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన నో డ్రగ్స్ కార్యక్రమంలో మాట్లాడారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మత్తుకు అలవాటు పడితే జీవితం నాశనమవుతుందని తెలిపారు. అనంతరం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్కాపురంలో షర్మిల బస

మార్కాపురం, న్యూస్‌టుడే: ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల బుధవారం రాత్రి మార్కాపురంలోని పంచాయతీ రాజ్ అతిథి గృహంలో బస చేశారు. కడప జిల్లా నుంచి పల్నాడుకు వెళ్తున్న ఆమె మార్గమధ్యలో రాత్రి కావడంతో మార్కాపురం జిల్లా కేంద్రంలోని పంచాయతీరాజ్ అతిథి గృహం చేరుకున్నారు. ఈ సందర్భంగా మార్కాపురానికి చెందిన నాయకుడు జావిద్ అన్వర్ షర్మిలకు స్వాగతం పలికారు.

అగ్నిమాపక కేంద్రం... పొదిలికి అవసరం

❐ తక్షణ ఏర్పాటు తప్పనిసరి

పొదిలి పట్టణం

న్యూస్‌టుడే, పొదిలి

వేసవి వస్తోందంటే పొదిలి నగర పంచాయతీ ప్రజల్లో ఆందోళన మొదలవుతుంది. ఎందుకంటే ఇక్కడ అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే వచ్చి ఆర్పేందుకు అగ్నిమాపక కేంద్రమే లేదు. దీంతో ఏటా వేసవిలో ఎప్పుడు అగ్ని ప్రమాదం జరుగుతుందో, ఎలాంటి ఆస్తి నష్టం ఏర్పడుతుందోనని ప్రజలు ఆందోళన చెందక తప్పడంలేదు. కనీసం ఈసారైనా వెంటనే ఈ కేంద్రం ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రెండేళ్ల క్రితమే శంకుస్థాపన

నగర పంచాయతీలోని కంభాలపాడు వద్ద అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు శంకుస్థాపన చేసిన అధికారులు ఆ తరువాత దాని విషయమే మరిచిపోయారు. ఈ ప్రాంతంలో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఎక్కువగా ఆస్తినష్టం ఏర్పడుతుంది. నాలుగు రోజులక్రితం పిచ్చిరెడ్డికాలనీలో ప్రమాదవశాత్తు పూరిగుడిసె విద్యుదాఘాతంతో కాలిపోయింది. ఇంట్లో ఉన్న నిత్యావసరాలు, నగదు, సామగ్రి అంతా బూడిదపాలైంది.

ఏటా 30 నుంచి 40 సంఘటనలు

పట్టణంలో సుమారు వందకు పైగా వాణిజ్య, వ్యాపార సముదాయాలు ఉన్నాయి. పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాల్లో సుమారు 2,000కు పైగా పొగాకు బ్యారన్లు ఉన్నాయి. పొగాకు కాల్చేటపుడు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతి ఏడాది కనీసం 30 నుంచి 40 బ్యారన్లు కాలిపోతుంటాయి. ఈ ప్రాంతంలో వేసవిలో తరచూ వరిగడ్డివాములు ప్రమాదవశాత్తు కాలిపోతుంటాయి. దీంతో మూగజీవాలకు మేత కరవవుతోంది. అగ్నిప్రమాదం జరిగినప్పుడు దర్శి, కనిగిరి నుంచి అగ్నిమాపక వాహనం వచ్చేసరికే పరిస్థితి చేజారిపోతోంది. పొదిలిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుచేస్తే ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుంది. పట్టణంలో షార్ట్ సర్క్యూట్‌లు, గ్రామీణ ప్రాంతాల్లో వరిగడ్డి వాములు ప్రమాదవశాత్తు కాలిపోతున్న సందర్భాలు అనేకం ఉన్నాయి.

3 మండలాలకు ప్రయోజనం

పొదిలిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తే మూడు మండలాల్లో 20 కిలోమీటర్ల మేర విస్తీర్ణం లోపల, 20 నిమిషాల్లో సంఘటన స్థలానికి చేరుకునే అవకాశం ఉంది. తద్వారా ఆస్తినష్టాన్ని తగ్గించే అవకాశం ఉంటుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పొదిలిలో అగ్నిమాపక కేంద్రం వెంటనే నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
యర్రగొండపాలెం : 8008552658

కొనకనమిట్ల, న్యూస్‌టుడే:

?:మండలంలోని సిద్ధవరం ఎస్సీ కాలనీలో కాలువలు లేక ఇళ్ల ముందరే నీరంతా నిలిచి తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోంది. వ్యాధులు ప్రబలకుండా వెంటనే చర్యలు తీసుకోగలరు.
– శ్రీను, స్థానికుడు

✓: కాలువలు ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. పారిశుద్ధ్య పనులు చేపట్టి దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకుంటాం.
– శ్రీదేవి, ఈవో, కొనకనమిట్ల.

త్రిపురాంతకం, న్యూస్‌టుడే:

?: గొల్లపల్లి గ్రామానికి నీటి సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంకుకు మెట్లు లేకపోవడం వల్ల శుభ్రం చేయిస్తున్నారో లేదో తెలియడం లేదు. తరచూ నీరు కలుషితమై వస్తోంది. దీని వల్ల వ్యాధులు ప్రబలే వీలుంది. వెంటనే చర్యలు తీసుకోగలరు. – స్థానికులు, గొల్లపల్లి.

✓: ఇన్‌లైన్ ఫ్లోరినేషన్ ద్వారా ట్యాంకును శుభ్రపరుస్తున్నాం. కలుషిత నీరు రాకుండా చూస్తాం. – మహేష్, పంచాయతీ కార్యదర్శి, గొల్లపల్లి.

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే:

?: వై.పాలెం పట్టణంలోని ప్రధాన రహదారి మధ్య డివైడర్‌పై చెత్తా చెదారం నిండిపోతున్నా పట్టించుకునే వారు లేకపోయారు. కొన్ని చోట్ల డివైడర్ గుంతల్లో చెత్త వేస్తున్నారు. గుంటలు లేకుండా చేసి చెత్తను వేయకుండా వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. -ఎస్కే.రఫీ, స్థానికుడు

✓: చెత్తవేయకుండా చర్యలు చేపట్టాం.డివైడర్‌లో గుంతలు లేకుండా చేస్తాం. పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. –రామసుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి

పొగాకు రైతుల కన్నీటి కష్టం

పొదిలి, కనిగిరి న్యూస్‌టుడే: గత ఏడాది అక్టోబరులో కురిసిన వర్షాలతో పొగాకు సాగు చేపట్టిన రైతులు... గత కొన్నాళ్లుగా చినుకు జాడ లేక, తడులు అందించే పరిస్థితి లేక అల్లాడుతున్నారు. ఎండుతున్న తోటలను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. **అదనపు భారం..** పొదిలి, కనిగిరి వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కనిగిరి, పామూరు, వెలిగండ్ల, హనుమంతునిపాడు, పి.సి.పల్లి, సి.ఎస్.పురం మండలాల్లో దాదాపు 4,200 హెక్టార్లలో పొగాకు సాగు చేశారు. ఇప్పటి వరకు ఎకరాకు రూ. లక్షకు పైగా పెట్టుబడి పెట్టారు. ఆకు రెలుపు సమయానికి వర్షాలు లేకపోవడంతో తోటలు వాడుముఖం పడుతున్నాయి. బెట్టకు వచ్చిన పంటను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. దూరప్రాంతాల్లో ఉన్న కొద్దిపాటి నీటి వనరులను వ్యయప్రయాసలకోర్చి పైపుల ద్వారా తరలిస్తున్నారు. ఒక్కో పైపునకు రోజుకు రూ.15 చొప్పున అద్దెకు చెల్లిస్తున్నారు. కనీసం యభై పైపులు లేనిదే తడులు అందించలేని పరిస్థితి ఉందని.. దీంతో అదనపు భారం తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. ధరలు ఆశాజనకంగా ఉంటేనే తప్ప ఈ ఏడాదీ నష్టాలు తప్పవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెలిగొండ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి

మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా నాయకుడు దగ్గుపాటి సోమయ్య

మార్కాపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వం తక్షణమే నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దగ్గుపాటి సోమయ్య, వెలిగొండ నిర్వాసితుల సంఘం కన్వీనర్ గాలి వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వాసితుల సంఘం ముఖ్య నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టు సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. మెరుగైన ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేశారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని చెప్పారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని చెప్పి ఈ నెల 21వ తేదీన నిర్వాసితులతో భారీ స్థాయిలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ధర్నాలో నిర్వాసితులు అధిక సంఖ్యలో పాల్గొన్నాలని పిలుపునిచ్చారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రూ.20 లక్షలు ఇవ్వాలన్నారు. అంతేకాకుండా నిర్వాసితుల కాలనీల్లో తక్షణమే సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రామకృష్ణ, శ్రీనివాసులు, వెంకట సుబ్బయ్య, వెంకట్, సహదేవుడు, రామయ్య, రంగారెడ్డి, బాలనాగయ్య, రఫీ తదితరులు పాల్గొన్నారు.

కాలువ నిర్మాణానికి సూచనలు

క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ శివరామిరెడ్డి, ఎమ్మార్వో చిరంజీవి

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మాల్యవంతునిపాడు గ్రామంలోని మురుగునీరు పారే మార్గం గ్రామస్థులకు సమస్య తెచ్చిపెట్టింది. ఈ విషయంపై ఇటీవల ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో గ్రామస్థులు అర్జీ సమర్పించారు. సమస్యను పరిశీలించేందుకు బుధవారం మార్కాపురం సబ్‌కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, ఎమ్మార్వో చిరంజీవి క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారమార్గాన్ని స్థానికులకు వివరించారు. కాలువ నిర్మించేందుకు పంచాయతీ అధికారికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలచెన్నయ్య, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

శుద్ధ జల యంత్రం.. అలంకారప్రాయం

కొనకనమిట్ల మండలంలోని నాగిరెడ్డిపల్లె మండల ప్రాథమిక పాఠశాల గత ప్రభుత్వం అందించిన శుద్ధ జలం యంత్రం ఏర్పాటు చేయకుండా వదిలేశారు. పాఠశాల విద్యార్థులు తాగునీరు రూ.10 చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. దీన్ని వినియోగంలోకి తీసుకొని వచ్చేందుకు అధికారులు దృష్టి సారించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, కొనకనమిట్ల

బస్టాండు ఎదుటే గుంత... తప్పని చింత

మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న రహదారి పక్కన భారీ గుంతతో ప్రతి బస్సు గుంతలో పడాల్సిందే అన్నట్లుగా పరిస్థితి మారిపోయింది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి బస్టాండ్‌లోకి ఆర్టీసీ బస్సులు వస్తుంటాయి. ఈ క్రమంలో బస్సులు లోపలికి వచ్చే సమయంలో ఎదురుగానే రహదారి పక్కన మూలములుపు వద్ద రెండు అడుగుల మేర గుంత ఉంది. ప్రతి బస్సు గుంతలోకి దిగి మళ్లీ వెళ్లాల్సి వస్తోంది. ఈ పరిస్థితి కొన్ని నెలలుగా ఉన్నా ఒక్క అధికారీ పట్టించుకోలేదు. - న్యూస్‌టుడే, మార్కాపురం

అధ్వాన దారి.. ఆదమరిస్తే పడతారు

పొదిలి-దర్శి మార్గంలో తోళ్లమడుగు వద్ద ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. కొన్ని నెలలుగా చిన్నపాటి గుంతలతోఉన్న తారురోడ్డుపై ప్రస్తుతం పెద్ద గుంతలు పడ్డాయి. అటుగా వెళ్లే వాహనచోదకులు రాత్రివేళల్లో ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదాలు పాలు కాక తప్పదు. ఆటో, ద్విచక్ర వాహన చోదకులు ఈ మార్గంలో తరచూ తిరగడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని ఉడుముల ఆసుపత్రి ముందు, పాత పోస్టాఫీసు వద్ద సైతం ప్రధాన రహదారిపై గుంతలుపడ్డాయి. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పొదిలి

దుకాణ సముదాయం.. ప్రారంభానికి సిద్ధం

పెద్దదోర్నాలలోని శివసదనం ముందు భాగంలో శ్రీశైల దేవస్థానం దుకాణ సముదాయ గదులను నిర్మించింది. వాటి ప్రారంభోత్సవం కోసం వ్యాపారులు ఎదురు చూస్తున్నారు. ఇటీవల సామాజిక ఆరోగ్యకేంద్రం ముందు ప్రహరీ నిర్మాణం కోసం అక్కడ ఉన్న దుకాణాలను తొలగించారు. దీంతో అదే రహదారిలో ఉన్న శివసదన దుకాణ సముదాయ గదుల్లో వ్యాపారం చేసేందుకు వారు ఆసక్తి చూపుతున్నారు. ఆ సముదాయంలో 16 గదులు ఉన్నాయి. శ్రీశైలం దేవస్థానం అధికారులు స్పందించి త్వరగా వాటిని ప్రారంభించాలని వారు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, పెద్దదోర్నాల

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులు, చిన్నారులు, గర్భిణిలకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూడాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు డీఆర్వో ఓబులేష్ సూచించారు. బుధవారం సంతనూతలపాడులో ఒడ్డెరపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాల్లో నూరుశాతం హాజరు ఉండేలా చూడాలన్నారు. కేంద్రాల బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పేర్కొన్నారు. గుడ్లు, పౌష్టికాహారం సక్రమంగా అందుతుందా లేదా అన్న దానిపై తల్లులను అడిగి తెలుసుకున్నారు. పిల్లల బరువు, ఎత్తులను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణరెడ్డి, సీడీపీవో ఇవాంజలీన్, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి చేయూత

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి పిచ్చిరెడ్డికాలనీలో ఇటీవల ప్రమాదవశాత్తు పూరిగుడిసె కాలి సర్వం కోల్పోయిన గురిజాల చెన్నయ్య, అంకమ్మ కుటుంబానికి దాతలు ముందుకొచ్చి చేయూతనిచ్చారు. రోజువారి కూలిపనులు చేసుకుని జీవనం సాగించే ఈ కుటుంబం కట్టుబట్టలతో మిగలడంతో మానవతా దృక్పథంతో దాతలు స్పందించారు. లాల్ ఫౌండేషన్ ప్రతినిధి ఆకిబ్ అహ్మద్, మానవతా సేవాసంస్థ ప్రతినిధులు కె.సుబ్బారెడ్డి, పార్థసారధి, యక్కలి శేషగిరిరావు, వినోదరాజు, తెదేపా నాయకులు వరికూటి అనిల్, షబ్బీర్, ఖాదర్‌బాషాలు వారికి చేయూత నిచ్చేందుకు ముందుకొచ్చారు. బుధవారం వారిని పాతూరు పిలిపించి సుమారు రూ.40 వేల విలువైన సామగ్రిని అందజేశారు.

బాధితులకు దాతలు సమకూర్చిన సామగ్రి

క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి చేరుకోవాలి

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో మస్తాన్‌నాయక్

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎంఈవో బి.మస్తాన్ నాయక్ విద్యార్థులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు పి.శ్యామ్ ప్రసన్నతాంజలి అధ్యక్షతన బుధవారం పాఠశాల వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన వారికి సూచించారు. చదువులో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్ఎంసీ కమిటీ మెంబర్ మదర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరకు కంది కొనుగోలు

రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో జవహర్‌లాల్ నాయక్

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కందిని మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ అన్నారు. ఆయన బుధవారం తిమ్మాపురం, యడవల్లి గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సాగులో ఉన్న అలసంద, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. అనంతరం రైతులకు పంటల సాగు, మద్దతు ధరల గురించి వివరించారు. కార్యక్రమంలో వీఏఏ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి పునఃప్రతిష్ఠకు తొలి అడుగు

బొడ్రాయి వద్ద పరిశీలిస్తున్న పెద్దలు

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలిలో ప్రధాన రహదారి మధ్యలో ఉన్న బొడ్రాయి పునఃప్రతిష్ఠకు పెద్దలందరితో సమావేశమై నిర్ణయం తీసుకోనున్నట్లు పొదిలి శ్రీనిర్మమహేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మన్ ఒగ్గు వెంకట్రావు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ ప్రకటించారు. రెండు రోజుల క్రితం రథోత్సవంలో బొడ్రాయిపై ఉన్న ఇనుపగ్రిల్ దెబ్బతినడంతో ఆ ప్రాంతం ప్రమాదకరంగా మారింది. 'ఈనాడు'లో బుధవారం 'బొడ్రాయి గుంత - రాకపోకలకు చింత' శీర్షికన ప్రచురితమైన వార్తకు గ్రామపెద్దలు స్పందించారు. బుధవారం ఆ ప్రాంతాన్ని సందర్శించారు. బొడ్రాయి రోడ్డు మధ్యలో ఉండటం, దానిపై నుంచే వాహనాలు వెళ్లడం మంచిది కాదన్నారు. మార్చి ఒకటిన వేదపండితులు, కులమతాలకు అతీతంగా గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించి పునఃప్రతిష్ఠకు సంబంధించి చర్చించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పెద్దలు యక్కలి శేషగిరిరావు, మేడా నరసింహారావు, సోమిశెట్టి చిరంజీవి, సామిరాజ, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

మొక్కలు పెంచుతున్నారు.. కూరగాయలు పండిస్తున్నారు

☛ ప్రత్యేక గుర్తింపు పొందిన కంకణాలపల్లి జడ్పీ పాఠశాల

చెట్ల పెంపకంతో పాఠశాల ప్రాంగణం

న్యూస్‌టుడే, త్రిపురాంతకం గ్రామీణం:

త్రిపురాంతకం మండలం కంకణాలపల్లి జడ్పీ పాఠశాల రకరకాల చెట్లతో పచ్చదనం పరుచుకుని ఆహ్లాదం పంచుతోంది. ఆవరణలో పలు రకాల కూరగాయల మొక్కలను పెంచుతున్నారు. 6 నుంచి 10 వరకు 167 మంది విద్యార్థులు ఉండగా 10 మంది ఉపాధ్యాయులతో విద్యను అందిస్తున్నారు. కార్పొరేట్ స్థాయిలో విద్యా బుద్ధులు నేర్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉత్తమ ఫలితాలను సాధిస్తూ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ జరిగిన తక్కువ కాలంలో మంచి పేరు సంపాదించుకుంది.

అంతటా వెల్లి విరిసే పచ్చదనం

పాఠశాల అంతటా చెట్లు, మొక్కలతో పచ్చదనం వెల్లివిరుస్తోంది. రెండేళ్ల క్రితం కొబ్బరి, బాదం, కానుగ, మహాగని, సపోటా, చింత, జామ, నిమ్మ చెట్లతో పాటు మందార, నందివర్ధనం, క్రోటాన్స్ పూల మొక్కలు నాటారు. అవి పెరగడంతో పాఠశాల ప్రాంతమంతా పచ్చగా కళకళలాడుతోంది. జడ్పీ పాఠశాలగా అప్‌గ్రేడ్ చేసినప్పుడు సరిపడా తరగతి గదులు లేకపోవడంతో అందుకు అవసరమైన స్థలాన్ని సేకరించడంలో అప్పటి హెచ్ఎం ఉడుముల శ్రీనివాసరెడ్డి ప్రధాన భూమిక పోషించారు. అప్పట్లో ఆవరణలో మొక్కలు నాటించి మధ్యాహ్న భోజనానికి ఆయన సొంతంగా బీపీటీ బియ్యం సమకూర్చారు. ఈయనతో పాటు అప్‌గ్రేడ్ అయిన ప్పుడు పనిచేసిన హెచ్.ఎం. శ్రీనివాసులు కూడా పాఠశాల అభివృద్ధికి బాటలు వేశారు. ఆ తర్వాత బదిలీపై వచ్చిన ప్రస్తుత హెచ్.ఎం. జి.వెంకాయమ్మ చెట్ల పెంపకంపై మరింత దృష్టి సారించారు.

కాలానుగుణంగా పండిస్తున్నారు

పాఠశాల ప్రాంగణంలో సీజన్ల వారీగా కూరగాయలు, ఆకుకూరలు పెంచుతున్నారు. టమాటా, మిర్చి, వంగ, మునగ, సొర, గుమ్మడి, పొట్ల తదితర కూరగాయలతో పాటు గోంగూర, తోట కూర, మెంతి కూర వంటి ఆకుకూరలను పండిస్తున్నారు. పాఠశాల చుట్టూ ప్రహరీ ఉండటంతో రెండు బోరు బావులకు పైపు లైన్లు వేసి చెట్లు, మొక్కలకు కాలువలు ఏర్పాటు చేశారు.

- ప్రధానోపాధ్యాయురాలు జి.వెంకాయమ్మ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులందరూ సమష్టిగా బాధ్యతలు నిర్వహిస్తూ చెట్లు, మొక్కలకు నీటి తడులను అందిస్తూ పచ్చదనం పెంపకానికి తోడ్పడుతున్నారు.

లక్ష్య సాధన దిశగా అడుగులు వేయండి

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువు ఆవశ్యకతను తెలుసుకుని లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించే దిశగా అడుగులు వేయాలని ఎంఈవో ఆంజనేయులు అన్నారు. బుధవారం స్థానిక గౌతమి జూనియర్ కళాశాల్లో విద్యార్థుల వీడ్కోలు సమావేశం జరిగింది. త్రిపురారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈవో పాల్గొని మాట్లాడారు. చదువుతోనే జీవితాలు మార్చుకోవచ్చునన్నారు. గత ఏడాది విద్యలో మెరిట్ సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వేసిన డ్యాన్స్‌లు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ నాగేంద్రబాబు, ముస్లిమ్ యూత్ సొసైటీ అధ్యక్షుడు షేక్.ఇస్మాయిల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు మూడు కేంద్రాలు

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలిలో ఇంటర్మీడియల్ వార్షిక పరీక్షలకు మూడు కేంద్రాలను కేటాయించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీవీరిశెట్టి జూనియర్ కళాశాల, శ్రీవివేకానంద జూనియర్ కళాశాల కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ నెల 23 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఒక్కొక్క కేంద్రానికి 230 నుంచి 240 మంది విద్యార్థులను కేటాయించారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని ఆయా కేంద్రాల ముఖ్య పర్యవేక్షణాధికారులు తెలిపారు.

(c) eenadu

శనగకు మద్దతు

■ కొనుగోలుకు సర్కారు సిద్ధం
■ ఈ నెల 20 నుంచి ప్రారంభం

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: శనగ రైతులకు 'కూటమి' సర్కారు తీపి కబురు అందించింది. క్వింటాకు రూ.5875 చెల్లించి మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేయాలని నిర్ణయించింది. గత రెండేళ్లుగా వాతావరణం అనుకూలించక తీవ్రంగా నష్టపోయారు. ఈసారి జేజీ11 (ఎర్రశనగ), కాబూలి రకం(తెల్ల శనగ) సాగుచేశారు. సాధారణ సాగు 1,47,356 ఎకరాలు కాగా 1,52,742 ఎకరాల్లో సాగైంది. అత్యధికంగా ఉయ్యాలవాడ మండలంలో 32,035 ఎకరాల్లో సాగు చేశారు. గత 10 రోజుల నుంచి కోతలు ప్రారంభమయ్యాయి. ఎకరాకు 8 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. ప్రస్తుతం మార్కెట్లో క్వింటా రూ.5 వేలు పలుకుతోంది.

ఎకరాకు 10 క్వింటాళ్లు

కొనుగోలుకు సంబంధించి ఇప్పటికే రైతు సేవా కేంద్రాల్లో రైతులు పేర్లు నమోదు చేసుకొన్నారు. వాటి ఆధారంగా జిల్లా వ్యాప్తంగా 28 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు మార్క్‌ఫెడ్ అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఎకరాకు 10 క్వింటాళ్ల వరకు తీసుకుంటారు. . ఇలా జిల్లాలో 15 వేల క్వింటాళ్లు కొనుగోలుకు చేయాలని అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఫిబ్రవరి 20వ తేదీ నుంచి 90 రోజుల పాటు కొనుగోలు చేయనున్నారు. ఇప్పటికే ఆయా కేంద్రాలకు 50 కిలోల గోనె సంచులు పంపించారు. "రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు.. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలి.. శుక్రవారం నంచి జిల్లా వ్యాప్తంగా సేకరిస్తామని" మార్క్‌ఫెడ్ మేనేజర్ హరినాథ్‌రెడ్డి తెలిపారు.

మండలం	సాగు(ఎకరాల్లో)
సంజామల	28,350
కోవెలకుంట్ల	22,031
బనగానపల్లి	11,776
కొలిమిగుండ్ల	10,915
దొర్నిపాడు	8714
నందికొట్కూరు	6870

చిక్కితే.. చిక్కులే

నంద్యాల పట్టణంలోని శ్రీనివాస సెంటర్, పద్మావతి నగర్‌లో ఈనెల 23 నుంచి దాదాపు 10 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నారు. నిమిషం ఆలస్యమైనా అనుమతి ఇవ్వరు. శ్రీనివాస సెంటర్ నుంచి సంజీవనగర్ గేట్ వరకు ఓ వైపు కొత్తగా సిమెంటు రోడ్డు వేస్తున్నారు. దీంతో ఒకే వైపు ఎదురెదురుగా వాహనాలు రావడంతో నిత్యం ట్రాఫిక్ జాం ఏర్పడుతోంది. చుట్టు పక్కల గ్రామాల నుంచి సమయానికి విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవడానికి ఇబ్బందిపడే అవకాశం ఉంది. అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యను తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

మల్లన్న కళ్లకు గంతలు

బ్రహ్మోత్సవాల రెండో రోజున కృష్ణదేవరాయగోపురం వైపు కూలిపోయిన తాత్కాలిక క్యూలైన్

ఘటన తర్వాత మరుసటి రోజు ఏర్పాటు చేసిన ఇనుప చట్రాలు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో కొందరు అధికారుల నిర్లక్ష్యం వల్ల భక్తజనం తీవ్ర ఇబ్బందులు పడింది. బ్రహ్మోత్సవాల రెండో రోజు ఈ నెల 9వ తేదీన తాత్కాలిక క్యూలైన్ మెష్ కుప్పకూలిన అంశంపై ప్రాథమిక విచారణ చేయగా పలు అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇంజినీర్లు మాయ చేసి ఒకటే టెండరులో రెండు పనులు చేర్చి అంచనాలు పెంచడం నాణ్యతకు తిలోదకాలు ఇవ్వడంతో క్యూలైన్లు కుప్పకూలినట్లు అంచనాకు వస్తున్నారు.

▸▸ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లకు రూ.10 కోట్లకు పైగా అంచనాలు వేశారు. 2025 డిసెంబరులో టెండర్లు పిలిచారు. క్యూలైన్లను బలోపేతం చేయడానికి ఫ్రేమ్‌లు, ఐరన్ చెయిన్ లింక్ మెష్ కోసం టెండర్లు పిలిచారు. క్యూలైన్ ఫ్రేమ్‌ల కోసం రూ.43,52,061, చెయిన్ లింక్ మెష్ కోసం రూ.36,18,598లతో సరఫరా చేయడానికి ఒప్పందం చేసుకున్నారు. క్యూలైన్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారుల ఆదేశాలు బుట్టదాఖలయ్యాయి.

▸▸ చంద్రావతి కల్యాణ మండపం నుంచి కృష్ణదేవరాయ గోపురం వరకు క్యూలైన్లను అత్యంత బలహీనంగా ఏర్పాటు చేశారు. కోటగేట్ వద్ద నుంచి కృష్ణదేవరాయగోపురం వరకు కర్రలను పాతి, ఐరన్ చెయిన్ లింక్ మెష్‌తో తాత్కాలిక క్యూలైన్ ఏర్పాటు చేశారు.

▸▸ నిబంధనల ప్రకారం ఇక్కడ ఐరన్ ఫ్రేమ్‌లతో క్యూలైన్‌ను బలోపేతం చేయాల్సిన ఇంజినీర్ల నిర్లక్ష్యం ఫలితంగా పరిస్థితి స్పష్టంగా కనిపించింది. ఉన్నతాధికారులు ఆ వైపు తొంగి చూసిన పాపాన పోలేదు. క్యూలైన్లో ఫ్యాన్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల శివదీక్షా భక్తులు ఉక్కపోతతో అల్లాడిపోయారు.

▸▸ ఘటన జరిగిన తర్వాత 9వ తేదీ అర్ధరాత్రి దేవస్థానం ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఆఘమేఘాల మీద క్యూలైన్ ఐరన్‌మెష్‌కు సపోర్టుగా ఐరన్ బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఇదే పని ముందుగా చేసి ఉంటే భక్తులు అవస్థలు పడేవారు కాదు.

▸▸ సివిల్, ఎలక్ట్రికల్‌తో పాటు అదనపు క్యూలైన్లు, పెండాల్స్, తాగునీటి ఏర్పాట్లు, క్యూలైన్ల లోపల, బయట ఏర్పాట్లు చేయాలని దేవస్థానం ఈఈ నరసింహారెడ్డికి బాధ్యతలు అప్పగిస్తూ ఈనెల 2న ఈవో ఎం.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. కృష్ణదేవరాయగోపురం వద్ద శివదీక్షా భక్తులకు తాగునీరు ఏర్పాటు చేయకపోవడంతో పాటు తాత్కాలిక క్యూలైన్‌ను ఐరన్ ఫ్రేమ్స్‌తో బలోపేతం చేయకుండా నిర్లక్ష్యం ప్రదర్శించారు. బ్రహ్మోత్సవాల ప్రారంభం రోజు కాకుండా మహాశివరాత్రి రోజు బయోడిగ్రేబుల్ వాటర్ బాటిళ్లను ఆలయం వద్ద నిల్వ చేసి భక్తులకు పంపిణీ చేశారు.

యాప్‌లో నీటి తడులు

పొలంలో ఏర్పాటు చేయనున్న ఆటోమేషన్ పరికరాలు

[illegible] యాప్ ద్వారా రైతులు పొలానికి వెళ్లకుండానే అవసరమైన నీటిని, ఎరువులను ఎక్కడి నుంచైనా నియంత్రించుకోవచ్చు. కూటమి ప్రభుత్వం మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో భాగంగా సెన్సార్లు, మొబైల్ యాప్ ఆధారిత ఆటోమేషన్ వ్యవస్థను రైతుల ప్రయోజనార్థం అందుబాటులోకి తెస్తోంది. – న్యూస్‌టుడే, డోన్

- సూక్ష్మ సేద్యానికి మరింత ప్రోత్సాహం కల్పించాలన్న ఉద్దేశంతో 'కూటమి' ప్రభుత్వం వైర్‌లెస్ ఇరిగేషన్, ఫెర్టిగేషన్ ఆటోమేషన్ పద్ధతిని తీసుకొచ్చింది.
- "ఉమ్మడి జిల్లాలో 10 కంపెనీ సంస్థల ప్రతినిధులు యాప్ ఇన్‌స్టలేషన్ చేసి, ఆపరేటింగ్ వివరాలను అవగాహన కల్పిస్తారు. పూర్తి వివరాలను సూక్ష్మ నీటి పారుదలశాఖ అధికారులను సంప్రదించాలి" అని ఏపీఎంఐపీ పీడీ విజయలక్ష్మి తెలిపారు.
- స్మార్ట్ కంట్రోల్, సెన్సార్లు, వాల్వ్ కంట్రోల్ యూనిట్లు, మొబైల్ యాప్ తదితరాలన్నీ కలిసి ఆటోమేషన్ వ్యవస్థగా పనిచేస్తాయి.
- రైతు తన మొబైల్ యాప్‌తో పొలాల్లో ఉండే మోటారు ఆన్, ఆఫ్ చేయొచ్చు. ఏ వాల్వ్ ఎప్పుడు తెరవాలి, ఎప్పుడు మూసివేయాలి అనేది షెడ్యూల్ చేసుకోవచ్చు. ఎంత నీరు ఇవ్వాలనేది ముందే ఏర్పాటు చేసుకోవచ్చు.
- ఈ పద్ధతిలో హెక్టారుకు రూ.40 వేల వరకు ఖర్చు అవుతుంది. చిన్న, సన్నకారు రైతులకు 55 శాతం, ఇతర రైతులకు 45 శాతం రాయితీ ఇస్తారు. గరిష్ఠంగా ఒక రైతు 5 హెక్టార్ల వరకు రాయితీ కల్పిస్తారు.
- ఈ పద్ధతిలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 వేల హెక్టార్లలో చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించుకొన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటి వరకు 26 మంది రైతులు దరఖాస్తు చేసుకొన్నారు.
- ఈ విధానంలో పంట ఉత్పాదకతను పెంచొచ్చు. సకాలంలో ఎరువులు, నీరు అందించి అధిక దిగుబడిని సాధించొచ్చు. రిమోట్ ద్వారా నీటి పారుదల వ్యవస్థను నియంత్రించటం వల్ల నీటిని పొదుపుగా వాడుకోవడానికి వీలుంటుంది. 50 శాతానికి పైగా నీటి వృథాకు అడ్డుకట్ట వేయొచ్చు.

కమీషన్ల క్రమబద్ధీకరణ

చేయి తడపకపోతే కొర్రీలు ● పురపాలికల్లో ఎల్‌టీపీల దందా

మధ్యతరగతి, పేదల ప్రయోజన నిమిత్తం కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఎల్ఆర్ఎస్, బీపీఎస్ పథకాలు లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ల (ఎల్‌టీపీ)కు కాసులు కురిపిస్తున్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీకి చెందిన పలువురు అక్రమ వెంచర్లు వేశారు. తక్కువ ధరకు స్థలాలు దక్కడంతో పలువురు కొనుగోలు చేశారు. అనుమతులు లేకపోవడంతో ఇంటి నిర్మాణానికి అవస్థలు పడుతున్నారు. దీన్ని గమనించిన 'కూటమి' ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేసుకోవడానికి వీలు కల్పించింది.

– న్యూస్‌టుడే, ఆదోని, నంద్యాల, కర్నూలు, ఎమ్మిగనూరు పురపాలికలు

దరఖాస్తులు

పురపాలిక	ఎల్ఆర్ఎస్	బీపీఎస్
కర్నూలు	2,497	887
నంద్యాల	613	381
ఆదోని	280	76
ఎమ్మిగనూరు	226	765

ఆన్‌లైన్ సేవలు కప్పిపుచ్చి..

- లేఅవుట్ రెగ్యులరైజేషన్ (ఎల్ఆర్ఎస్), బిల్డింగ్ పీనలైజేషన్ (బీపీఎస్) పథకాల్లో అక్రమాలు జరగకూడదన్న ఉద్దేశంతో ఆన్‌లైన్ సేవలు తీసుకొచ్చారు. ఇందుకు ఏపీబీపీఎస్, ఏపీడీటీసీపీఎల్ఆర్ఎస్ వెబ్‌సైట్లోకి వెళ్లాలి.. సిటిజన్ లాగిన్ ఐచ్ఛికం క్లిక్ చేసి పేరు నమోదు చేసి పాస్‌వర్డ్ రూపొందించుకోవాలి.
- ఆధార్, ఇంటి, స్థలం వివరాల, లింక్ పత్రాలు, మార్కెట్ విలువ తదితర అంశాలు నమోదు చేసి వాటికి సంబంధించిన పత్రాలు అప్‌లోడ్ చేయాలి. బ్లూ ప్రింట్‌ను ప్రైవేటు వ్యక్తుల ద్వారా తయారు చేసుకొని అప్‌లోడ్ చేసే వెసులుబాటు కల్పించారు. ఆన్‌లైన్లో నమోదు అంశంపై పుర అధికారులు ప్రచారం కల్పించలేదు. దీన్ని ఆసరాగా చేసుకుని లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్లు(ఎల్‌టీపీ) దండుకుంటున్నారు.

సేవా రుసుము పెంచారు

- ఎల్ఆర్ఎస్, బీపీఎస్ దరఖాస్తులు అప్‌లోడ్ చేసేందుకు గతంలో రూ.5 వేల వరకు సేవా రుసుములు వసూలు చేసేవారు. ఇప్పుడు దాన్ని ఎల్‌టీపీలు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు పెంచేశారు.
- పురపాలక నిర్దిష్టంగా రుసుముల్ని నిర్ణయించకపోవడం ఎల్‌టీపీలకు మరింత కలిసి వస్తోంది. స్థలం విలువ ఆధారంగా దరఖాస్తులు అప్‌లోడ్ చేసేందుకు ఎల్‌టీపీలు రుసుములు నిర్ణయిస్తున్నారు. గజం విలువ తక్కువ ఉన్న ప్రాంతాల్లో రూ.10 వేలు, ధర ఎక్కువ ఉంటే రూ.20 వేల వరకు లాగేస్తున్నారు. కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు పురపాలికల్లో ఈ దోపిడీ ఎక్కువగా ఉంది.

ప్లానింగ్ కార్యదర్శుల ఆగడాలు

- ఎల్ఆర్ఎస్, బీపీఎస్ దరఖాస్తులను స్వర్ణ వార్డు కార్యాలయాల్లో అప్‌లోడ్ చేయకుండా ప్లానింగ్ కార్యదర్శులు కొందరు అడ్డదార్లు తొక్కుతున్నారు. ఎల్టీపీలతో ముందస్తు ఒప్పందం చేసుకొని వారి వద్దకే వెళ్లేలా చూస్తున్నారు.
- దరఖాస్తు చేసుకున్న వాటిలో చాలా వరకు పాత తేదీలు వేసి అనుమతులకు సిఫార్సు చేస్తున్నారు. తక్కువ కొలతలు వేసి పుర ఆదాయానికి గండికొడుతున్నారు. నిర్దిష్టంగా వదలాల్సిన సెట్ బ్యాక్ స్థలాల విషయంలో చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఒక్కో అనుమతికి రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు.
- ఎల్‌టీపీలు, ప్లానింగ్ కార్యదర్శుల ఆగడాలు భరించలేక యజమానులు ముందుకురావడం లేదు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియకు పలుమార్లు గడువు పెంచారు. ఈ ఏడాది ఏప్రిల్ 23వ తేదీ గడువుగా నిర్దేశించారు.

నేత్రశోభితంగా
ఆదిదంపతుల పుష్పోత్సవం

- శ్రీశైలంలో ముగిసిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

అశ్వవాహనంపై స్వామిఅమ్మవార్లు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో అంగరంగ వైభవంగా జరిగిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. చివరి రోజు బుధవారం రాత్రి 7 గంటలకు శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లు భక్తులకు అశ్వవాహనంపై దర్శనమిచ్చారు. పుష్పాలతో అలంకరించి అశ్వవాహనంపై అధిష్ఠింపజేశారు. 21 రకాల పుష్పాలు, పలు రకాల ఫలాలను సమర్పించారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులను అద్దాలమండపంలోకి చేర్చి, శయనోత్సవం, ఏకాంతసేవ నిర్వహించారు.

గుట్టపై గునపం



చెక్‌డ్యామ్ గోడకు పగుళ్లు

నందికొట్కూరు, న్యూస్‌టుడే: గోడలకు పగులొస్తున్నాయి. పునాదులు అదురుతున్నాయి. రాత్రిళ్లు నిద్ర పట్టడం లేదు. రాళ్లు ఎప్పుడొచ్చి మీద పడతాయో తెలియని పరిస్థితి.. ఇప్పటికే చెక్ 'ఢాం' అంది. . ఇంకెన్ని చూడాల్సి వస్తుందోనని రెండు గ్రామాల ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. మిడుతూరు మండలం పైపాలెం-నాగలూటి గట్టుపై ఓ కంపెనీ సోలార్ విద్యుత్తు ఉత్పత్తి కర్మాగారాన్ని నిర్మిస్తోంది. ఇందుకు సంబంధించి పైపాలెం, నాగలూటి, మాసపేట గ్రామాల పరిధిలో మూడువేల ఎకరాలు ప్రభుత్వం ఇచ్చింది. ఏడాది కిందట పనులు ప్రారంభించగా విస్తరించుకొంటూ వస్తున్నారు. ఇంతవరకు బాగా ఉంది. నాగలూటి-పైపాలెం మధ్యలో మడ(చెక్‌డ్యామ్) సమీపంలో రాతి గుట్ట ఉంది. అక్కడ సోలార్ ఫలకాలు పెట్టడం కష్టంగా ఉంది.. డ్రిల్లింగ్ చేసినా రాళ్లు పగలడం లేదు.. దీంతో బ్లాస్టింగ్‌కు తెరతీశారు.

గుట్టుచప్పుడు కాకుండా బ్లాస్టింగ్

- నాగలూటి-పైపాలెం శివారులో రాళ్లతో కూడిన గుట్ట ఉంటుంది.. రెండు గ్రామాల్లో 200 వరకు పాడి పశువులు, 1200 వరకు జీవాలు ఉన్నాయి. పశుగ్రాసం కోసం ఏళ్లుగా అక్కడికి రైతులు వెళ్తుంటారు. పశువులు నీళ్లు తాగడానికి వీలుగా 40 ఏళ్ల కిందట చెక్‌డ్యాం నిర్మించారు. గుట్ట చుట్టు పక్కల నాగలూటి గ్రామానికి చెందిన అన్నదాతలు పంటలు సాగు చేశారు.
- గత రెండు రోజులుగా గుట్టపై బ్లాస్టింగ్ చేస్తున్నారు. ఇందు కోసం ఇతర ప్రాంతాల నుంచి పవర్-90 బాక్సులు తెప్పించారు. ముందస్తుగా అనుమతులు తీసుకుని, గ్రామాల్లో దండోరా వేయించి కంట్రోల్ బ్లాస్టింగ్ చేయాలి. ఇందుకు వ్యయం అధికం అవుతుందని మామూలు స్టిక్స్ తీసుకొచ్చి వినియోగిస్తున్నట్లు తెలిసింది. బ్లాస్టింగ్ సమయంలో రాళ్లు ఎగిరి వచ్చి పొలాల్లో పడ్డాయి. ఆ సమయంలో రైతులు పొలాల్లో లేకపోవడంతో ప్రమాదం తప్పింది. చెక్‌డ్యామ్‌కు పగుళ్లు వచ్చాయి.

వృద్ధులకు ఆదాయ భద్రత

పేద, సామాన్య ప్రజలకు వృద్ధాప్యంలో ఆదాయ భద్రత కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం అటల్ పెన్షన్ యోజనను అమలు చేస్తోంది. కేంద్ర మంత్రివర్గం ఈ పథకాన్ని 2031 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. దీన్ని పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ నిర్వహిస్తోంది. 60 ఏళ్ల తర్వాత నెలకు రూ.వెయ్యి నుంచి రూ.5 వేల వరకు పింఛన్ పొందొచ్చు. ఎంచుకున్న పథకం, వయసు బట్టి నెల, మూడు, ఆరు నెలలకోసారి డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది.

పింఛను (రూ.)	బీమా (రూ.లక్షలు)
1,000	1.7
2,000	3.4
3,000	5.1
4,000	6.8
5,000	8.5

- 18-40 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలి తపాలా శాఖ, బ్యాంకుల్లో ఖాతా ఉండాలి. ఆదాయపు పన్ను చెల్లింపుదారులు కాకుండా ఉండాలి.
- ఈ పథకంలో పింఛను తీసుకొనే వారికి బీమా సదుపాయం ఉంది. పథకంలో చేరిన వ్యక్తి మృతి చెందితే నెలకు తీసుకొనే పింఛన్ ఆధారంగా కుటుంబానికి బీమా చెల్లిస్తారు.
- భర్త మరణిస్తే భార్య ఉన్నంత కాలం ఆమెకు పింఛన్ వస్తుంది. ఇద్దరూ మరణిస్తే అప్పటి వరకు జమ అయిన మొత్తం డబ్బును నామినీకి ఇస్తారు. సమీపంలోని బ్యాంకు, తపాలా కార్యాలయాల్లో సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చు.

– న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

గురువైభవోత్సవం

అలంకరణలో రాఘవేంద్ర స్వామి మూల బృందావనం

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: రాఘవేంద్ర స్వామి గురువైభవోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామి బృందావనానికి జలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించి బంగారు ఆభరణాలు, విశేషపుష్పాలతో అలంకరించారు. మూలరాములకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు పూజలు చేసిన అనంతరం బృందావనానికి హారతి ఇచ్చారు. మఠం ముందు భాగం, మధ్వ కారిడార్ విద్యుద్దీపాలంకరణలతో విరాజిల్లుతోంది. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గురువారం రాఘవేంద్ర స్వామి పట్టాధికార మహోత్సవం నిర్వహించనున్నారు.

నైపుణ్య ప్రాంగణం.. అతివలకు వరం

● కూటమి ప్రభుత్వం చొరవతో పూర్వవైభవం

శిక్షణ పొందుతున్న మహిళలు

మహిళల స్వయం ఉపాధికి బాటలు వేస్తేనే.. పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కుతాయని నాటి పాలకులు భావించారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణలో మహిళా ప్రాంగణం ఏర్పాటు చేశారు. నాటి నుంచి నేటివరకు వేలాదిమంది మహిళలు ఈ ప్రాంగణంలో వివిధ శిక్షణ తీసుకుని స్వయం ఉపాధి పొందారు. గత వైకాపా ప్రభుత్వ పాలనలో ఈ ప్రాంగణాన్ని పట్టించుకోకపోవడందో ఆదరణ కోల్పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీ ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఏడాదికి 3- 4 కోర్సులు, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రెండు కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించారు.

– న్యూస్‌టుడే, కర్నూలు కలెక్టరేట్

అర్హులు వీరే..

- పాఠశాల స్థాయిలోనే చదువు మానేసిన వారు, పదో తరగతి వరకు చదువుకున్న, 18 ఏళ్లు పైబడిన మహిళలు ప్రాంగణంలో ఇచ్చే ఉచిత శిక్షణలకు అర్హులు. ఆధార్, చరవాణి ఉండాలి. ఇక్కడ శిక్షణలో చేరేవారు రోజూ తమ చరవాణి ద్వారా ముఖహాజరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

ప్రస్తుతం ఇస్తున్న శిక్షణ

- నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా జనరల్ డ్యూటీ అసిస్టెంట్ కోర్సులో 30 మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. జనవరి 2న ప్రారంభమైన ఈ కార్యక్రమం ఏప్రిల్ 2తో ముగియనుంది. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్నారు. ఈ స్వల్పకాలిక శిక్షణతో ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందే అవకాశం ఉంది.

ఇవి నేర్పితే మేలు..

- కంప్యూటర్ బేసిక్స్, జీ-మెయిల్ క్రియేషన్, ఏఐ టూల్స్ వినియోగించడం, జీడీఏ కోర్సుల్లో బేసిక్ నర్సింగ్‌లో శిక్షణ, కిచెన్, టెర్రస్ గార్డెన్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, శారీ రోలింగ్, పెయింటింగ్ తదితర కోర్సులు నేర్పిస్తే ప్రయోజనం ఉంటుందని మహిళలు అభిప్రాయపడుతున్నారు.

సామగ్రి.. భోజన భత్యం ఇస్తూ

- రెండు జిల్లాల పరిధిలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల మహిళలకు ఈ ప్రాంగణంలో ఉచిత శిక్షణ ఇస్తారు. ఏపీ ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా నిధులు సమకూరుతాయి. దీంతో పాటు నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా కూడా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శిక్షణ పొందేందుకు అవసరమైన సామగ్రి కూడా అందిస్తారు. ఇంటికి వెళ్లకుండా ప్రాంగణంలోనే ఉంటూ కోర్సులు నేర్చుకునే మహిళలకు భోజన ఖర్చుల కింద రోజుకు రూ.120 మంజూరు చేస్తారు.
- మహిళా ప్రాంగణంలోనే స్త్రీ, శిశు సంక్షేమ శాఖ వారి శక్తి సదన్ కేంద్రం ఉంది. వివిధ సమస్యలతో ఇక్కడ ఆశ్రయం పొందుతున్న మహిళలకు కూడా వివిధ స్వయం ఉపాధి శిక్షణలు ఇస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

– ఎ.అంజనీభూషణ్, జిల్లా మేనేజర్, మహిళా ప్రాంగణం, కర్నూలు

వచ్చే నెలలో బ్యూటీషియన్, టైలరింగ్‌తో పాటు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణలు ఇచ్చేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. 18 ఏళ్ల వయసు పైబడిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వివరాలకు 8333921350 నంబరుకు సంప్రదించాలి.

గురుకులాల్లో మిగులు సీట్లకు దరఖాస్తులు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలోని డా.బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఆరో తరగతి నుంచి 10వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈకే సొసైటీ జిల్లా సమన్వయకర్త గీత తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 19 చివరి తేదీ అని వివరించారు.

ఉర్దూ పాఠశాలల పని వేళలు మార్పు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో రంజాన్ మాసం సందర్భంగా ఉపవాసం పాటించే విద్యార్థులు, ఉపాధ్యాయుల కోసం ఉర్దూ మాధ్యమ పాఠశాలల పనివేళలను సవరించినట్లు డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు.

సద్గుణాల ద్వారం.. రంజాన్ మాసం

● నేటి నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభం
● ఊరూరా ఆధ్యాత్మిక వాతావరణం

సద్గుణాల ద్వారం.. పుణ్యాల సాగరం.. వరాల వసంతమైన రంజాన్ మాసం అరుదెంచింది. బుధవారం సాయంత్రం నెలవంక దర్శనంతో పవిత్ర మాసం ప్రారంభమైంది. ఈ నెల 19వ తేదీ నుంచి ఉపవాస దీక్షలు మొదలు కానున్నాయి. ఏటా రంజాన్ పండగ వచ్చిందంటే 30 రోజుల పాటు చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతిఒక్కరూ ఉపవాస దీక్ష పాటిస్తారు. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

సహ్‌రీతో మొదలు.. ఇఫ్తార్‌తో ముగింపు

రంజాన్ మాసంలో ప్రతిరోజూ తెల్లవారుజామున సహ్‌రీ పేరుతో ఆహారాన్ని స్వీకరిస్తారు. పగలంతా నీటి చుక్క కూడా తీసుకోకుండా కఠోర ఉపవాస దీక్ష పాటిస్తారు. సాయంత్రం 6.30 గంటల తరువాత ఇఫ్తార్ విందుతో ఉపవాస దీక్షను విరమిస్తారు. రోజూ ఐదుపూటలా నమాజ్ చేస్తారు.

దానధర్మాలకు ప్రాధాన్యం

▸▸ రంజాన్ మాసంలో ఒక రూపాయి దానం చేస్తే రూ.70 పుణ్యఫలం లభిస్తుందన్న మహమ్మద్ ప్రవక్త బోధనలను అనుసరించి ముస్లింలు పెద్దఎత్తున దానధర్మాలు చేస్తారు.

▸▸ తమ స్థిర చరాస్తులు, ఏడాది సంపాదనలో 2.5 శాతం మొత్తాన్ని జకాత్ పేరుతో పేదలకు దానం చేస్తారు. ప్రతిఒక్కరు పండగ నమాజ్‌కు ముందే ఫిత్రా దానం చేయాలి.

▸▸ రంజాన్ మాసంలో ఉపవాసం ఉండటం ద్వారా మనిషికి ఓర్పు, సహనం, సేవాగుణం అలవడతాయి. పేదల కష్టాలు, ఆకలి బాధలు తెలుస్తాయి. తద్వారా తోటి మానవులను ఆదుకోవాలన్న సేవా గుణం పెంపొందుతుంది.

ప్రత్యేక ప్రార్థనలతో మసీదులు కళకళ

▸▸ ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఐదు లక్షలకు మందికిపైగా ముస్లింలు ఉన్నారు. వీరిలో సుమారు 70 శాతం మంది రంజాన్ నెలలో కఠోర ఉపవాస దీక్ష పాటిస్తారు. తెల్లవారుజామున సహ్‌రీ భుజించి రోజా ప్రారంభిస్తారు. సాయంత్రం ఇఫ్తార్ విందుతో రోజా విరమిస్తారు.

▸▸ అనంతరం మసీదుల్లో సామూహిక తరావీ నమాజులు (ప్రత్యేక ప్రార్థనలు) చేస్తారు. ప్రత్యేక ప్రార్థనలతో మసీదులు కళకళలాడుతుంటాయి. రంజాన్ మాసంలోని ఆఖరి పది రోజుల్లో వచ్చే బేసి రాత్రుల్లో జాగారం చేస్తారు.

▸▸ ఐదు రాత్రుల్లో లైలతుల్ ఖద్ర్ (పెద్ద రాత్రి) కోసం అన్వేషిస్తారు. పూర్తిగా అల్లాహ్ నామస్మరణలో గడుపుతారు. ప్రత్యేక నమాజ్‌లు, ఖురాన్ పారాయణం, దువాలు చేస్తారు.

దేవుడిచ్చిన వరం

–హాజీ మహమ్మద్ సాధిక్, ప్రభుత్వ ఖాజీ, ఆళ్లగడ్డ

మంచి పనులు చేసేందుకు రంజాన్ మాసాన్ని దేవుడు ఇచ్చిన వరంగా భావించాలి. ఈ మాసంలో ఉపవాసి చేసే దువాను తప్పక అల్లాహ్ అనుగ్రహిస్తారు. దానధర్మాలు చేస్తూ అల్లాహ్ కారుణ్యాన్ని పొందాలి. మంచి పనులకు చేరువ కావాలి. ఈ నెలలో పొందిన మంచిజీవితాన్ని జీవితాంతం కొనసాగించాలి. మానవ జీవితాన్ని రుజుమార్గంలోకి తెచ్చేందుకు ఈ మాసాన్ని సోపానంగా చేసుకోవాలి.

(c) eenadu

కల్వర్టు శిథిలం.. రాకపోకలకు కష్టం

ఉయ్యాలవాడ మండలంలోని బీమునిపాడు- ఆర్.జమ్ములదిన్నె ఆర్ అండ్ బీ రహదారి మార్గంలో ముద్దుగుండవాగుపై నిర్మించిన కల్వర్టు పూర్తిగా దెబ్బతింది. రక్షణ గోడలు కూలిపోయాయి. కల్వర్టు వద్ద వాహనాలు అదుపు తప్పితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఈ మార్గంలో ఉయ్యాలవాడ, ఆళ్లగడ్డ, జమ్ములమడుగు పట్టణాలకు వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ప్రమాదాలు జరగకముందే ఆర్అండ్బీ అధికారులు దెబ్బతిన్న కల్వర్టును మరమ్మతులు చేపట్టాలని ఆర్.జమ్ములదిన్నె, బీమునిపాడు గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఆర్.జమ్ములదిన్నె(ఉయ్యాలవాడ)

వేగనియంత్రికలు లేక.. రోడ్డు దాటలేక

రుద్రవరం మండలంలోని నరసాపురం ఎంపీపీ పాఠశాల(మెయిన్) వద్ద ఆళ్లగడ్డ- అహోబిలం రహదారిలో వేగనియంత్రికలు ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. పాఠశాలలో దాదాపుగా 30 మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. నిత్యం వందల వాహనాలు రహదారిపై రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారి దాటేందుకు విద్యార్థులు భయపడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆర్అండ్బీ అధికారి ఈఈ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ వేగనియంత్రికలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, నరసాపురం(రుద్రవరం)

కమనీయం మహానందీశుని తెప్పోత్సవం



మహానంది రుద్రగుండం పుష్కరిణిలో తెప్పోత్సవం

మహానంది, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రంలో గంగాకామేశ్వరీ దేవి సహిత మహానందీశుని తెప్పోత్సవం కనులపండువగా జరిగింది. బుధవారం రాత్రి రుద్రగుండం పుష్కరిణిలో నూతన దంపతులైన కామేశ్వరీదేవి, మహానందీశ్వరుల జలవిహారం భక్తులను ఆకట్టుకుంది. మహానంది పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని చివరి రోజు రాత్రి మనోజ్ఞ తెప్పోత్సవాన్ని చేపట్టారు. నంద్యాలకు చెందిన దాత అవ్వారు గోరినాథ్, సరస్వతి దంపతులు ఆర్థికంగా సహకరించారు.

స్వామి రూపం.. దివ్య తేజం

రుద్రవరం, న్యూస్‌టుడే: అహోబిలం నృసింహ స్వామి పారేట ఉత్సవాలు బుధవారం రాత్రి స్థానిక ఆలయ కార్యాలయంలో ఘనంగా ముగిశాయి. ముగింపు సందర్భంగా డీఎస్పీ అనూజ్ మీనా తమ సిబ్బందితో పారేట పల్లకిలో కొలువుదీరిన ప్రహ్లాదవరద, జ్వాలానృసింహ స్వాములకు పూజలు చేశారు. అనంతరం అర్చకులు కల్యాణ శాస్త్రి మాట్లాడుతూ.. ఉత్సవాలు జనవరి 16న బాచేపల్లె గ్రామంలో ప్రారంభమై 34 రోజుల పాటు కొనసాగి రుద్రవరం గ్రామంలో ముగిసిందన్నారు. మూడు మండలాల్లో 32 గ్రామాల్లో ఉత్సవాలు ఘనంగా జరిగిందన్నారు. ఈనెల 20వ తేదీ నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

విజయ ధీర.. మృదుల

◆ ఇస్రో శాస్త్రవేత్తగా, క్రీడాకారిణిగా రాణిస్తున్న శిరివెళ్ల యువతి

ఆళ్లగడ్డ, శిరివెళ్ల, న్యూస్‌టుడే: కష్టాలు ఓర్చుకున్నారు.. అనునిత్యం జయించారు. అవరోధాలను శ్రమించి అనుకున్న లక్ష్యం సాధించారు.. శిరివెళ్లకు చెందిన సూగూరు మృదుల. ఇస్రోలో శాస్త్రవేత్తగా కొలువు సాధించడమే గాక ఆటల్లోనూ రాణిస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో ప్రాథమిక విద్యనభ్యసించి బీటెక్ ఎంటెక్ పూర్తి చేసి ఇస్రో శాస్త్రవేత్తగా విధులు నిర్వహిస్తున్నారు. ఇస్రో నిర్వహిస్తున్న అంతరిక్ష ప్రయోగాల్లోనూ భాగస్వామి కావడం విశేషం. నంద్యాల, కర్నూలులో పాఠశాల విద్యను, తిరుపతిలో ఇంటర్, తిరుపతి ఎస్వీ విశ్వవిద్యాలయంలో బీటెక్(కెమికల్ ఇంజినీరింగ్) చదివారు. మెరుగైన గేట్ ర్యాంకుతో హైదరాబాదు ఐఐటీలో ఎంటెక్ ఉత్తీర్ణులయ్యారు. అనంతరం 2023లో ఇస్రో నియామక పరీక్షలో ప్రతిభ చాటి శ్రీహరికోటలోని షార్(సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం)లో శాస్త్రవేత్తగా విధులు నిర్వహిస్తున్నారు. మృదుల చిన్న తనం నుంచే క్రీడలంటే ఆసక్తి. ఏడో తరగతిలోనే రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్నారు. షటిల్ బ్యాడ్మింటన్‌లోనూ సత్తా చాటారు. దేశ వ్యాప్తంగా ఇస్రో శాస్త్రవేత్తలకు ఆటల పోటీలను గత డిసెంబరులో బెంగళూరులో నిర్వహించారు. మృదుల షటిల్ బ్యాడ్మింటన్ జట్టుకు నాయకత్వం వహించడమేకాక జట్టు ప్రథమ స్థానంలో నిలవడంలో కీలక పాత్ర పోషించారు. అంతరిక్ష రంగంలో భారత్ ముందుండాలని, రాబోయే రోజుల్లో ఇస్రో చేపట్టే భారీ ప్రాజెక్టులు విజయవంతం చేయడంలో తనకు అప్పగించిన బాధ్యతలను నెరవేర్చడమే లక్ష్యమని మృదుల చెబుతున్నారు.

సూగూరు మృదుల

నృసింహుని వైభవం.. తిలకిద్దాం రండి

ఆళ్లగడ్డ (గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 20వ తేదీ నుంచి ఆరంభం కానున్నాయి. పది రోజుల పాటు ఎగువ, దిగువ ఆలయాల్లో జరిగే ఈ ఉత్సవాల్లో స్వామి వారి దర్శనానికి భక్తులు లక్షల్లో తరలిరానున్నారు. ఉత్సవాల్లో స్వామి పరిణయాన్ని కనులారా వీక్షించనున్నారు. మార్చి 1వ తేదీ నుంచి 4 వరకు దిగువలో భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో భక్తుల సౌకర్యం కోసం ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేపడుతున్నారు.

ఆలయ ఆవరణలో ఏర్పాటైన పందిరి

◆ రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

కార్యక్రమాలు ఇలా..

ఎగువలో ఫిబ్రవరి 20వ తేదీ సెల్వర్ కూత్తు ఉత్సవం, 21న సాయంత్రం ఉత్సవాలకు అంకురార్పణ, 22న ధ్వజారోహణం, సింహవాహనసేవ. దిగువలో సాయంత్రం అంకురార్పణ, 23న ఎగువలో హంసవాహన, సూర్యప్రభ వాహనసేవ, దిగువలో ధ్వజారోహణం, సింహవాహన సేవ, 24న ఎగువలో ఉత్సవం, హనుమంతవాహనం, దిగువలో హంసవాహనం, సూర్యప్రభ, 25వ తేదీ ఎగువలో శేషవాహనం, చంద్రప్రభ వాహన సేవ, దిగువలో యోగానృసింహ గరుడ విమానం, హనుమంత వాహన, 26న ఎగువలో ఉత్సవం, శరభవాహన, దిగువలో శేషవాహన, చంద్రప్రభ వాహన సేవలు ఉంటాయి.

మార్చి 1న కల్యాణం

ఎగువలో 27న ఉత్సవం, పొన్నచెట్టువాహన, దిగువలో మోహినీ అలంకారం, శరభవాహన సేవ, 28 ఎగువలో తిరుమంజనం, గజవాహన సేవలు, రాత్రి కల్యాణోత్సవం, దిగువలో వేణుగోపాలస్వామి అలంకారం, పొన్నచెట్టువాహనం, మార్చి 1న ఎగువ తొట్టితిరుమంజనం, అశ్వవాహన, దిగువలో అభిషేకం, గజవాహనం, రాత్రి కల్యాణోత్సవం, 2న ఎగువలో రథోత్సవం, దిగువలో కాళింగనర్తన ఉత్సవం, తొట్టి తిరుమంజనం, అశ్వవాహనం, 3న ఎగువ ఉత్సవం, రాత్రి గరుడోత్సవం, ధ్వజావరోహణం, దిగువలో రథోత్సవం, 4న దిగువలో ఉత్సవం, రాత్రి గరుడోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నాం

- రామానుజన్, ఆలయ సీఈవో

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే ఆలయ గోపురాలకు శుభ్రత, చలువ పందిళ్లు, విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశాం. పార్కింగ్, బస్టాండ్ స్థలాలను శుభ్రం చేసి సిద్ధం చేస్తున్నాం. వివిధ ప్రభుత్వ శాఖల సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేయనున్నాం.

అరటి అధరగొడుతోంది

అరటి ధర అమాంతం పెరిగింది. పండుగలు, శుభకార్యాలు సమీపిస్తున్న వేళ కదళీ గిరాకీ పెరిగింది. డిసెంబరు నెలలో అరటి ధర టన్ను రూ.10 వేలు నుంచి రూ.12 వేలు ఉంది. ప్రస్తుతం టన్ను ధర రూ.22 వేల నుంచి రూ.23 వేల వరకు పలుకుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 10 వేల ఎకరాల్లో సాగైంది. ప్యాపిలి, డోన్, మహానంది, డోన్ తదితర మండలాల్లో ఎక్కువగా సాగు చేశారు. అరటి ధర పెరగడంతో తమ కష్టానికి ఫలితం దక్కిందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఫ్రూట్ కేర్ యాక్టివిటీ విధానంలో గెలలను కవర్లు ఏర్పాటు చేసి కాయలు నాణ్యంగా రావడానికి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. ఒక గెల 22 నుంచి 25 కిలోల బరువు తూగుతోంది. జీ-9(గ్రాండ్ నైన్), సుగంధాలు, అమృతపాణి ఎక్కువగా పండిస్తారు. తాడిపత్రి, అనంతపురంలోని శీతల గోదాముల్లో భద్రపరిచి, అక్కడి నుంచి జమ్ము కశ్మీర్, మహారాష్ట్ర, పంజాబ్, ఒడిశా తదితర రాష్ట్రాలకు రవాణా చేస్తారు. ఉద్యానవనశాఖ అధికారిణి కల్యాణి మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల్లో అరటి కోతలు పూర్తయ్యాయని, అందువల్ల వ్యాపారులు మన ప్రాంతానికి వచ్చి కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు, దేశాలకు ఎగుమతి చేస్తున్నారన్నారు. దీని వల్ల అరటి ధరలు భారీగా పెరిగాయని, మార్చి నెలాఖరు వరకు ధరలు ఇలానే కొనసాగుతాయని ఉద్యానవనశాఖ అధికారిణి కల్యాణి తెలిపారు. - న్యూస్‌టుడే, ప్యాపిలి

కోతకు వచ్చిన అరటి పంట

హృదయ పరివర్తన చెంది జీవించాలి

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: పాపాన్ని విడనాడి పరివర్తన చెంది జీవించాలని బిషప్ గోరంట్ల జ్వాన్నెస్, బిషప్ సంతోష్ ప్రసన్నరావు, ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ గురు జోసఫ్ పేర్కొన్నారు. నంద్యాల పట్టణంలోని పలు చర్చిల్లో క్రైస్తవులు విభూది బుధవారాన్ని ప్రారంభించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హోలి క్రాస్ క్రెథడల్ చర్చిలో బిషప్ సంతోష్ ప్రసన్నరావు, ఆరోగ్యమాత చర్చిలో బిషప్ గోరంట్ల జ్వాన్నెస్ భక్తులకు సందేశాన్నిచ్చారు. నుదిటిన విభూదితో సిలువ గుర్తు వేశారు. వారు మాట్లాడుతూ.. పవిత్రంగా జీవించడానికి, ఆధ్యాత్మికంగా ఎదగడానికి ప్రయత్నించాలన్నారు.

ఆరోగ్యమాత చర్చిలో సందేశమిస్తున్న బిషప్ గోరంట్ల జ్వాన్నెస్

సందేశమిస్తున్న బిషప్ సంతోష్ ప్రసన్నరావు

ఏపీకి స్వర్ణయుగం కాంగ్రెస్‌తోనే సాధ్యం

శిరివెళ్ల, న్యూస్‌టుడే: ఏపీకి స్వర్ణయుగం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని ఆ రాష్ట్ర పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల పేర్కొన్నారు. నంద్యాల జిల్లా శిరివెళ్ల మండల కేంద్రంలో బుధవారం జరిగిన ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర కార్యక్రమంలో షర్మిల మాట్లాడుతూ.. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని, అర్హులైన ప్రజలందరికి సంక్షేమ పథకాలను అందించారన్నారు. ముస్లింలకు రిజర్వేషన్ ఇచ్చిన ఘనత ఒక్క వైఎస్ రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామాల్లో పేదలు, కూలీలు వలసలు పోకుండా ఉండేందుకు స్థానికంగానే పని చేసుకోవాలనే ఉద్దేశంతోనే ఉపాధి హామీ పథకాన్ని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ప్రపంచంలోనే ఇలాంటి పథకం ఎక్కడా అమలులో లేదని అప్పట్లోనే ఇతర దేశాలు కీర్తించాయన్నారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఆ పథకానికి తూట్లు పొడిచిందన్నారు. పథకానికి సంబంధించి మహాత్మా గాంధీ పేరును తొలగించడం అన్యాయమన్నారు. ప్రస్తుతం ఏపీలో అన్ని పార్టీలు భాజపాకు తొత్తుగా మారారని, కేంద్రం విధానాలను విమర్శించే వారే కరవయ్యారన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా 11 ఏళ్లక్రితం రావాల్సి ఉందని.. అయితే భాజపాయే దాన్ని అడ్డుకుందన్నారు. రాష్ట్ర రాజధాని నిర్మాణ విషయంలో కేంద్రం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందన్నారు. దీనిపై కూటమి నాయకులు అడిగే పరిస్థితులు లేవన్నారు. ప్రతి ఒక్కరికి స్వార్థ రాజకీయాలు ఎక్కువయ్యాయన్నారు.

యాత్రలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

రంజాన్ మాసం పవిత్రమైంది

బనగానపల్లి, న్యూస్‌టుడే: రంజాన్ మాసం ముస్లింలకు వెలుగులు నింపాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆకాంక్షించారు. రంజాన్ మాసం ప్రారంభమైన నేపథ్యంలో బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేమ, ఐక్యత, సేవాభావానికి రంజాన్ మాసం ఓ ప్రతీక అని కొనియాడారు. ముస్లింలు ఎంతో పవిత్రంగా భక్తిశ్రద్ధలతో పండగ వరకు ఉపవాస దీక్షలు చేస్తారని కొనియాడారు.

గాజులపల్లి-చలమ మార్గంలో సొరంగం సిద్ధం

● డబ్లింగ్ పనుల్లో కీలక ముందడుగు

ఈనాడు, కర్నూలు, మహానంది, న్యూస్‌టుడే: గుంటూరు-గుంతకల్లు రైలు మార్గం డబ్లింగ్ పనుల్లో భాగంగా నిర్మిస్తున్న గాజులపల్లి-చలమ స్టేషన్ల మధ్య చేపట్టిన సొరంగం పనులను దక్షిణ మధ్య రైల్వే అధికారులు విజయవంతంగా పూర్తిచేశారు. దట్టమైన అడవిలో కొండమార్గంలో చేపట్టిన సొరంగం నిర్మాణం ఆయా పనుల్లో అత్యంత కీలకమైనది. దానికి సమీపంలోనే ప్రస్తుతం మరో సొరంగం ఉండడంతో దానికి ఎలాంటి సమస్య రాకుండా మరో సొరంగాన్ని నిర్మించడాన్ని అధికారులు సవాలుగా తీసుకుని ఆయా పనులను పూర్తి చేశారు. గాజులపల్లి, చలమ స్టేషన్ల మధ్య సుమారు 320 మీటర్ల దూరంపాటు రైలు మార్గం నిర్మాణానికి అనుగుణంగా సొరంగాన్ని తవ్వారు. చలమ-దిగువమెట్ట ప్రాంతాల మధ్య 1.53 కి.మీ.ల పొడవునా మరో సొరంగం నిర్మాణం కూడా జరుగుతుంది. దాని నిర్మాణం కూడా పూర్తైతే నంద్యాల నుంచి గిద్దలూరు వైపు డబ్లింగ్ పనులు చేయడానికి ఉన్న అన్ని ఆటంకాలు కూడా తొలగినట్లవుతుంది.

గాజులపల్లి-చలమ మార్గంలో నిర్మించిన సొరంగం

తుదిదశకు చేరుకున్న పనులు

గుంటూరు-గుంతకల్లు మధ్య 401.47 కి.మీ.ల దూరంపాటు డబ్లింగ్ పనులను రూ.3,631 కోట్ల పనులతో చేపట్టారు. అందులో నంద్యాల నుంచి దిగువమెట్ట వరకు పనులు మాత్రం పూర్తికాలేదు. ఆ మార్గంలో నంద్యాల నుంచి గాజులపల్లి వరకు 14.6 కి.మీ.ల దూరంపాటు డబ్లింగ్ పనులు తుదిదశకు చేరుకున్నాయి. గాజులపల్లి నుంచి దిగువమెట్ట వరకు 27.49 కి.మీ.ల మార్గం దట్టమైన అడవిలో ఉండటంతో ఆయా పనులు పూర్తిచేయడానికి పలు సవాళ్లు ఎదురవుతున్నాయి. కీలకమైన ఒక సొరంగ మార్గం నిర్మాణం పూర్తికావడంతో మరో సొరంగం నిర్మాణ పనులు కూడా ముమ్మరం చేశారు. ఆ ఆర్థిక సంవత్సరంలో ఆయా పనులను కూడా ఎట్టిపరిస్థితుల్లో పూర్తిచేయాలన్న లక్ష్యంతో పనులు చేయిస్తున్నారు.

అహోబిలంలో టీవీఎస్ ఛైర్మన్ పూజలు

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ మండలంలోని ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయాన్ని టీవీఎస్ కంపెనీ ఛైర్మన్ వేణు శ్రీనివాసన్ సందర్శించారు. ఆలయ సీఈవో రామానుజన్, ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మనియార్ సౌమ్యనారాయణన్ వారిని పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అహోబిలం మఠంలో పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్‌ను కలిసి ఆశీర్వాదం పొందారు. డీఎస్పీ ప్రమోద్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అహోబిలం దర్శనానికి వచ్చిన టీవీఎస్ కంపెనీ ఛైర్మన్ వేణు శ్రీనివాసన్‌ను ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ కలిసి వినతిపత్రం అందించారు. అహోబిలంలో అవుట్‌పోస్ట్ భవనం ఏర్పాటు చేయడానికి సహకారం అందించాలని విన్నవించారు. వేణు శ్రీనివాసన్‌ను ఆళ్లగడ్డ తెదేపా యువనేత భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డి తదితరులు కలిశారు.

వేణు శ్రీనివాసన్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం), ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: అహోబిలం బ్రహ్మోత్సవాలకు రావాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌లను ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆహ్వానించారు. అసెంబ్లీ ప్రాంగణంలో వారిని మర్యాద పూర్వకంగా కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 20వ తేదీ బ్రహ్మోత్సవాలు ఆరంభం కానున్నాయని తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

మంత్రి నారాలోకేశ్‌కు ఆహ్వానపత్రికను అందజేస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

రహదారి విస్తరణలో భాగంగానే చెట్ల తొలగింపు

☛ అసెంబ్లీలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లి, న్యూస్‌టుడే: రహదారి విస్తరణలో భాగంగానే చెట్లను తొలగిస్తున్నామని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం అసెంబ్లీలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అడిగిన ప్రశ్నకు ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సమాధానమిచ్చారు. గత వైకాపా ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క రోజు మీటింగ్‌కు వస్తే వందల ఏళ్లనాటి చెట్లను నరికివేసే సంస్కృతి కూటమి ప్రభుత్వానికి లేదని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచనల మేరకే తప్పనిసరి పరిస్థితుల్లో చెట్లను తొలగిస్తున్నామన్నారు. జాతీయ రహదారులు పచ్చదనం కోసం సివిల్ పనుల ఖర్చులో ఒక శాతం హైవేల వెంట మొక్కల పెంపకం కోసం నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ఈ మార్గదర్శకాల ప్రకారం రహదారికి మధ్య భాగంలో రెండు వైపులా అవెన్యూ మొక్కలు నాటడం వంటి పనులు చేపడతామని వెల్లడించారు. ఆయా మార్గాల్లో అడ్డుగా ఉన్న భారీ వృక్షాలను వేళ్లతో పెకిలించి (ట్రాన్స్‌లొకేషన్) ఇతర ప్రాంతాల్లో పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎలమంచిలి నియోజకవర్గంలోనే ఇలా 18 చెట్లను నాటామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం వన సంరక్షణ వంటి కార్యక్రమాలకు ద్వారా పర్యావరణం, పచ్చదనానికి ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి బీసీ వివరించారు.

అసెంబ్లీలో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

ఆసుపత్రి స్థాయి వంద పడకలకు పెంచాలి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) స్థాయిని 50 పడకల నుంచి 100 పడకలకు పెంచాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అసెంబ్లీలో ప్రస్తావించారు. బుధవారం అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ.. గతంలో 30 పడకల స్థాయి నుంచి 50 పడకల స్థాయి తమ ప్రభుత్వమే పెంచిందని, ఇప్పుడు వంద పడకలకు పెంచి మరింత మెరుగైన వైద్య సేవలు అందేలా చేయాలన్నారు. నియోజకవర్గం పరిధిలో రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్యం అందిచేందుకు ఇక్కడ ట్రామా కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ట్రామా కేంద్రం లేకపోవడంతో నెలకు వంద కేసుల చొప్పున రెఫర్ చేస్తున్నారని, ఈ సమస్యను పరిష్కరించేందుకు ట్రామా కేంద్రం ఆళ్లగడ్డలోనే ఏర్పాటు చేయాలన్నారు. దీనిపై ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ సమాధానమిస్తూ 100 పడకల స్థాయికి పెంపు ప్రతిపాదను పరిశీలిస్తామని, ప్రతి వంద కి.మీ. ఒక ట్రామా కేంద్రం ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు.

వ్యర్థాల ప్లాంట్ నిర్మాణం వేగవంతం చేయాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాలలో నిర్మాణ, ధ్వంస వ్యర్థాల ప్లాంట్ నిర్మాణ పనులు జూన్ 5వ తేదీ నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం నిర్మాణ, ధ్వంస వ్యర్థాల సమర్థ నిర్వహణ కోసం ప్రతిపాదించిన సీ అండ్ డీ ప్లాంట్ స్థాపన, ప్రారంభం, ప్లాంటేషన్ కార్యక్రమాల పురోగతిపై అధికారులతో ఆమె సమీక్షించారు. సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కిశోర్‌రెడ్డి, ఆర్డీవో విశ్వనాథ్, మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ వై.మధుసూదన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా పట్టణ అభివృద్ధిని సమన్వయం చేస్తూ ఈ ప్లాంట్‌ను సమయానికి పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సీ అండ్ డీ వ్యర్థ శాస్త్రీయ నిర్వహణ ద్వారా పట్టణంలో స్వచ్ఛత, పర్యావరణ సమతుల్యత మెరుగుపడుతుందని అన్నారు. ప్లాంట్‌కు సంబంధించిన డీపీఆర్‌ను సిద్ధం చేయాలని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌ను ఆదేశించారు. ప్రాజెక్టులో అవసరమైన సాంకేతిక అంశాలు, వ్యయ అంచనాలు, పర్యావరణ అనుమతులు తదితర అంశాలు స్పష్టంగా ప్రతిబింబించేలా చర్యలు తీసుకోవాలని వివరించారు.

అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని పరిశ్రమలు, కర్మాగారాల్లో సంభవించే అగ్ని ప్రమాదాలు, ఇతర పారిశ్రామిక విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రతి యూనిట్‌లో అత్యవసర సంసిద్ధత తప్పనిసరిగా ఉండాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా విపత్తుల నిర్వహణ సమితి సమావేశాన్ని ఆమె నిర్వహించారు. సమావేశంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, ఆర్డీవో విశ్వనాథ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో, కర్మాగారాల్లో క్రమం తప్పకుండా అత్యవసర మాక్ డ్రిల్స్ నిర్వహించాలని ఆదేశించారు. కార్మికులకు ప్రాథమిక చికిత్స శిక్షణ అందించడంతో పాటు, ప్రమాద సూచికల బోర్డులు స్పష్టంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఉడుములపాడు సమీపంలోని అగ్రిసోల్ ప్రైవేట్ లిమిటెడ్, ఊడుమాల్పురం ప్రాంతంలోని ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ లిమిటెడ్ పరిశ్రమల నుంచి వచ్చే దుర్వాసన కారణంగా అక్కడ నివాసాలు నిర్మించుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారని తెలిపారు.

కూలీ ఇవ్వలేదని పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో జరిగిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో పారిశుద్ధ్య పనులు చేసిన కార్మికులు బుధవారం రాత్రి ఆందోళనకు దిగారు. కూలీ డబ్బులు తక్షణమే చెల్లించాలని సుమారు 50 మంది కార్మికులు ఈవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో పారిశుద్ధ్య పనులు చేసేందుకు దేవస్థానం అధికారులు పద్మావతి ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించారు. విడతల వారీగా 1,000 మంది పారిశుద్ధ్య కార్మికులతో పని చేయించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో సదరు ఏజెన్సీ రూ.10లక్షలు అడ్వాన్స్ చెల్లించి మేస్త్రీల ద్వారా పలు ప్రాంతాల నుంచి కూలీలను శ్రీశైలానికి రప్పించారు. పనులు ముగిసిన తర్వాత 700 మంది కార్మికులు స్వస్థలాలకు వెళ్లిపోయారు. కర్నూలు ప్రాంతానికి చెందిన 50 మంది కార్మికులు కూలీ సొమ్ము మొత్తం ఒకేసారి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఏజెన్సీ ప్రతినిధి వివరణ కోరగా. .కొంత అడ్వాన్స్ చెల్లించి మేస్త్రీల ద్వారా పారిశుద్ధ్య కార్మికులను నియమించుకున్నామని తెలిపారు. దేవస్థానానికి కార్మికుల హాజరు నివేదిక, బిల్లులు సమర్పించిన తర్వాత పూర్తిస్థాయి బిల్లు వస్తుందన్నారు. ఈలోపు యాజమాన్యం మేస్త్రీలతో చేసుకున్న ఒప్పందం ప్రకారం కార్మికులకు కూలీ నగదు చెల్లింపు జరుగుతుందన్నారు.

ఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టిన పాఠశాల బస్సు

● విద్యార్థులకు తప్పిన పెను ప్రమాదం

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్లలో విద్యుత్తు స్తంభాన్ని ఓ పాఠశాల బస్సు బుధవారం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. పట్టణంలోని జమ్మలమడుగు రోడ్డులో ఉన్న జ్యోతి విద్యానికేతన్ పాఠశాల బస్సు స్థానిక ఇందిరమ్మ కాలనీలో విద్యార్థులను ఎక్కించుకొని కాలనీ నుంచి మార్కెట్ యార్డు వెనుక ఉన్న మార్గం గుండా పాఠశాలకు వెళ్తోంది. ఈ క్రమంలో ఎదురుగా ద్విచక్రవాహనం రావడంతో తప్పించబోయి దారి మధ్యలో ఉన్న 33 కేవీ లైన్ విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టింది. స్తంభం విరిగి బస్సు మీద వాలింది. బస్సులో సుమారు 25 మంది విద్యార్థులు ఉండగా ఎవ్వరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. పొరపాటున విద్యుత్తు తీగలు బస్సును తగిలి ఉంటే విద్యార్థుల ప్రాణాలకు ముప్పు కలిగేది. స్థానికులు విద్యార్థులను వెంటనే అత్యవసరం ద్వారం నుంచి కిందకు దింపారు. మార్కెట్ యార్డు వెనక దారి మధ్యలోనే ఉన్న విద్యుత్తు స్తంభం తొలగించాలని జనవరి 4న 'ఈనాడు'లో 'దారి మధ్యలో విద్యుత్తు స్తంభం' శీర్షికన చిత్ర కథనం ప్రచురించింది. అప్పుడే అధికారులు స్పందించి ఉంటే ఇప్పుడీ ప్రమాదం జరిగేది ఉండేది కాదు.

స్తంభాన్ని ఢీకొట్టిన పాఠశాల బస్సు

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం. ✆73821 14647.

JOBS

Wanted PRO Qualification any Inter/ Degree. Vani Multi Speciality Hospitals, Dhone. ✆ 95155 59593.

HKMCFAP కర్నూలు పుల్లూరు స్టేజ్ (అన్నా క్యాంటీన్) ఆఫీసులో పనిచేయుటకు ఎగ్జిక్యూటివ్స్ (డిగ్రీ) & అనుభవం కల్గిన వంట మనిషి కావలెను. ✆ 81214 57873.

Team Leadersగా కర్నూలు, నంద్యాల ఏరియాలలో on role / off role లో M/F కావలెను. PF+ జీతం, Q: డిగ్రీ /MBA, MCA ✆ 94403 51657.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ: 18-20K ✆ 96404 68899, 96402 58899.

Rize Academy లో జాబ్ కర్నూలులో చేయుటకు టెలీకాలర్స్ కావలెను. అర్హత, అనుభవానికి జీతం ఉండును. సంప్ర: 88864 44720, 79818 86828.

ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు లేడి టెలీకాలర్స్ కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 13 వేలు to 15 వేలు, లిమిటెడ్ వేకెన్సీస్. సంప్ర: 09177 132168.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

నంద్యాల

•నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

ఉపాధి చట్టం నీరుగార్చుతున్న కేంద్రం

కానాలపల్లెలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

కానాలపల్లె(గోస్పాడు), న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నీరుగార్చడానికే కేంద్రం వీబీ జీ రామ్ జీ అనే కొత్త చట్టం తెస్తోందని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఉపాధిహామీ పరిరక్షణ యాత్రలో భాగంగా గోస్పాడు మండలం కానాలపల్లెలో నంద్యాల నియోజకవర్గ ఇంఛార్జి చాకలి పుల్లయ్య ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధి పనులు చేస్తున్న ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వంద రోజులకు 52 రోజులు మాత్రమే ఉపాధి పనులు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం వాటా రూ.800 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. ఇప్పటికీ రూ.450 కోట్లు బకాయిల ఉన్నాయని ఆరోపించారు. ప్రధానమంత్రి మోదీకి సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భయపడుతున్నారన్నారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి స్వామీ, కర్నూలు జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహాయాదవ్, అడ్వకేటు సికిందర్ భట్, పలు నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు నాయకులు, ఉపాధి కూలీలు, వందలాది మహిళలు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో పతకాలు

పతకాలు సాధించిన క్రీడాకారులతో ప్రముఖులు

నంద్యాల పాత పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలో ఇటీవల జరిగిన రాయలసీమ తైక్వాండో పోటీల్లో నంద్యాల క్రీడాకారులు 48 బంగారు, 45 రజతం, 61 కాంస్య పతకాలు సాధించినట్లు తైక్వాండో జిల్లా అసోసియేషన్ కార్యదర్శి అబ్దుల్ మజీద్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పతకాలు సాధించిన క్రీడాకారులను ఆయన అభినందించారు.

హుండీ లెక్కింపు

గడివేముల, న్యూస్‌టుడే: శ్రీదుర్గాభోగేశ్వరంలో మహాశివరాత్రి ఉత్సవాలు ముగియడంతో బుధవారం హుండీ లెక్కించారు. మొత్తం రూ.1,58,003 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పర్యవేక్షణాధికారి గోపి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆదాయం పెరగాలి

నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: రైతుల ఆదాయం పెంచేలా, స్థిరమైన వ్యవసాయ విధానాల విస్తరణకు ప్రకృతి వ్యవసాయాన్ని కేంద్రంగా మార్చాలని డీపీఎం శ్రీనివాసులు అన్నారు. నంద్యాలలోని జిల్లా ప్రాజెక్టు నిర్వహణ విభాగం కార్యాలయంలో బీఆర్సీ కేంద్రం యజమానులతో, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. అదనపు డీపీఎం అబ్దుల్‌సలాం పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని లలితనగర్‌లో దోమల బెడద అధికంగా ఉంది. - **రామారావు, స్థానికుడు.** ?: పట్టణంలోని ఎమ్మెస్‌నగర్‌లో కుక్కల, కోతుల బెడద అధికమైంది.- సాయి, స్థానికుడు. ?: పట్టణంలోని మూలసాగరంలో కాల్వలు శుభ్రం చేయడంలేదు. దోమల బెడద అధికమైంది.- **వంశీ, స్థానికుడు.** ✓: త్వరలోనే కోతులను, కుక్కలను పట్టించి సమస్య పరిష్కరిస్తాం. దోమల మందు పిచికారి చేయిస్తాం. - **లక్ష్మీనారాయణ శర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్.**

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: ?: పాణ్యం ఊరి నుంచి బస్టాండ్ వేస్తున్న ఆర్‌అండ్‌బీ రహదారిలో ఆక్రమణలు పూర్తిగా తొలగించాలి. - **రమేష్** ✓: రహదారిలో ఉన్న ఆక్రమణలు తొలగిస్తాం. - **వెంకటేశ్వరరెడ్డి, ఏఈ**

పాట్లు వేసి.. లక్షలు దోచేసి!

● అక్రమ వెంచర్లపై చర్యలు చేపట్టని అధికారులు

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: పురపాలక సంఘానికి ఆర్థిక వనరుగా ఉన్న పట్టణ ప్రణాళికలో కీలకమైన వెంచర్ల అనుమతులు, ఫీజుల వసూళ్లు, ప్రజాప్రయోజనార్థం స్థలం సేకరణపై అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. పట్టణంలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అక్రమ వెంచర్లపై అధికారులు తూతూమంత్రంగా చర్యలు తీసుకోవటంతో యజమానులు పట్టించుకోవటం లేదు. రియల్ ఎస్టేట్‌లో వెంచరు వేసే సమయంలో రహదారులు, ప్రభుత్వానికి స్థలం, భూ బదలాయింపు లేకుండానే ప్లాట్లుగా విభజించి రూ.కోట్లు సంపాదిస్తున్నారు. అనధికార వెంచర్ల నుంచి ప్రభుత్వ ఖజానాకు నిధులు సమకూరడం లేదు. వెంచరు యజమానుల వద్ద మామూళ్లు తీసుకుని అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆరోపణలు వెలువడుతున్నాయి. అక్రమ వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రజలు మోసపోతున్నారు.

వెంచర్ల వివరాలు
పురపాలక సంఘం: ఆత్మకూరు
అక్రమ వెంచర్లు: 52
విస్తీర్ణం: 74 ఎకరాలు
ప్రభుత్వ ఆదాయానికి గండి: రూ.40 లక్షలు

హద్దు రాళ్లు తొలగిస్తున్న కార్మికులు

నిబంధనలు ఇలా

☛ నిబంధనల ప్రకారం ఒక వ్యవసాయ భూమిని వెంచరుగా ఏర్పాటు చేయాలంటే ప్రజా ప్రయోజనార్థం ఎకరాకు పది సెంట్ల స్థలం మినహాయించాలి. ఈ స్థలంలో నీళ్ల ట్యాంకు, పాఠశాల, సమావేశ మందిరం, వ్యాయామశాలలు నిర్మించుకోవచ్చు. అక్రమ వెంచర్లలో ప్రజాప్రయోజనార్థం స్థలం వదలటం లేదు. కొన్ని వెంచర్లలో స్థలం వదిలినా కొద్ది రోజుల తర్వాత ప్లాట్లుగా విభజించి అమ్ముతున్నారు.

☛ వెంచరులో అంతర్గతంగా అడ్డదారులు 30 అడుగులు, నిలువు రహదారులు 40 అడుగుల మేర నిర్మించాలి. కొన్ని వెంచర్లలో 25 అడుగులు మాత్రమే వేస్తున్నారు.

☛ వ్యవసాయ భూమిని కమర్షియల్ ప్లాట్లుగా విభజించడానికి ప్రభుత్వ ఖజానాకు ఎకరాకు రూ.పది లక్షల చలానా చెల్లించాలి. ప్రభుత్వ ఖజానాకు ఒక్క రూపాయి చెల్లించకుండా యథేచ్ఛగా ప్లాట్లు వేస్తున్నారు.

☛ రిజిస్ట్రేషన్ సమయంలో కమర్షియల్ ప్లాట్లుగా చూపించకుండా పొలం మాదిరిగా చూపించటం వల్ల సర్వే నంబరు ఆధారంగా నామమాత్రంగా చలానా చెల్లిస్తుండటంతో ఖజానాకు గండిపడుతోంది.

పట్టించుకోని అధికారులు

పురపాలక సంఘంలో అనుమతుల్లేని వెంచర్లపై పట్టణ ప్రణాళిక, కుడా అధికారులు చర్యలు తీసుకోవటం లేదు. వందల సంఖ్యలో వెంచర్లు ఉన్నా పదుల సంఖ్యలో అనధికార లేఅవుట్లను గుర్తించారు. లేఅవుట్ యజమానులకు నామమాత్రంగా నోటీసులు జారీ చేస్తున్నారు. మూడు పర్యాయాలు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలనే నిబంధన ఉన్నా ఒకటి రెండు పర్యాయాలు నోటీసు అందజేసి మిన్నకుండిపోతున్నారు. అనధికార లేఅవుట్లపై ఉన్నతాధికారుల ఆదేశాలు, ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే కార్మికులతో నంబరు రాళ్ల తొలగిస్తున్నారు. వెంచరు యజమానులు ఇవేమీ పట్టించుకోకుండా తొలగించిన రాళ్ల స్థానంలో కొత్త రాళ్లు పాతుకుంటున్నారు. ఈ విషయం తెలిసినా వెంచర్ల వైపు అధికారులు కన్నెత్తి చూడటం లేదు. అక్రమ వెంచర్లు క్రమబద్ధీకరించుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తున్నా అధికారుల అలసత్వంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు.

మాతాశిశు మరణాల నియంత్రణకు చర్యలు

సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో మాతాశిశు మరణాలను గణనీయంగా తగ్గించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా స్థాయి మాతాశిశు మరణాల నివారణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఇటీవల టంగుటూరు, డబ్ల్యూ.కొత్తపల్లి, జగజ్జనని నగర్, అహోబిలం రోడ్, ఎన్జీవో కాలనీ ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో నమోదైన ఐదు శిశు మరణాలపై కలెక్టర్ సమీక్షించారు. ప్రమాద స్థితిలో ఉన్న గర్భిణులను ముందుగానే గుర్తించి అవసరమైన పరీక్షలు, పోషకాహారం, వైద్య సేవలు అందించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యాన్ని ఏ స్థాయిలోనూ సహించేది లేదన్నారు. సమావేశంలో అదనపు డీఎంహెచ్‌వో డా.శారదాబాయి, ఎంసీహెచ్ నోడల్ అధికారి డా.ప్రసన్నలక్ష్మీ, ప్రోగ్రాం అధికారి డా.ఎస్.ఎస్.శ్రీజ పాల్గొన్నారు.

రక్షణ లేక.. ప్రమాదం అంచున

నంద్యాల పట్టణం నుంచి పెసరవాయి గ్రామానికి వెళ్లే రహదారిలో నంద్యాల శివారులోని మద్దిలేరు వాగు వంతెనపై దాదాపు పది గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు లేవు. ఒకేసారి రెండు వాహనాలు వెళ్తే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. వంతెన వద్ద రాత్రిళ్లు వీధి దీపాలు లేకపోవడంతో ప్రయాణం మరింత ఇబ్బందికరంగా మారింది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

ప్రజారోగ్యానికి పొగ

నంద్యాల పట్టణం ఎన్జీవోస్ కాలనీ ప్రసార భారతి ఎదురుగా ఉన్న కాలనీలో రహదారి పొడవునా చెత్త, వ్యర్థాలకు పురపాలక సిబ్బంది నిప్పంటించి తగలబెట్టారు. చెత్తను కాల్చివేసే సమయంలో పెద్ద ఎత్తున మంటలు, పొగ వ్యాపించాయి. రహదారిపై ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించక పోవటంతో వాహనదారులు, పాఠశాలల నుంచి వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చెత్త, వ్యర్థాలను తగలబెట్టకుండా తరలించే ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

దారి ఛిద్రం.. వాహనదారులు భద్రం

నంద్యాల పట్టణంలో నుంచి పెసరవాయికి వెళ్లే దారిలో పీవీనగర్ వద్ద రెండు చోట్ల సిమెంటు రోడ్డు పగిలిపోయింది. దాదాపు పది గ్రామాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. భీమవరం, యర్రగుంట్ల, కరిమద్దెల, పెసరవాయి తదితర గ్రామాలకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటారు. రద్దీగా ఉండే మార్గంలో సీసీ రోడ్డు ఓవైపు విరిగిపోయింది. రాత్రిళ్లు దీన్ని గుర్తించక తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. –న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

మహానందిలో రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

మహానంది, న్యూస్‌టుడే: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మహానంది క్షేత్రంలో మూడో రోజు బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మొత్తం 23 ఎడ్లజతలు పోటీపడ్డాయి. కార్యక్రమంలో మాలపాటి పుల్లయ్యచౌదరి, మండల తెదేపా అధ్యక్షుడు కంచెర్ల శివశంకరచౌదరి, నేతలు ఉల్లి మధు, నరాల చంద్రమోహన్‌రెడ్డి, పాశం శ్రీనివాసులు, హరిప్రసాదరెడ్డి, భాస్కర రాముడుతో పాటు పలువురు పాల్గొన్నారు.

మహానందిలో బండలాగుతున్న ఎడ్లు

బంగారు కుటుంబాల మ్యాపింగ్ చేయాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: బంగారు కుటుంబాలు-మార్గదర్శుల మ్యాపింగ్ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. జిల్లాలో పేదరిక నిర్మూలన లక్ష్యంగా అమలు చేస్తున్న పీ-4 కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పీ-4 కార్యక్రమ పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో పేదరికంతో బాధపడుతున్న 50,088 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు చెప్పారు. వీరికి అవసరమైన ఆర్థిక, సామాజిక, జీవనోపాధి సహాయాన్ని అందించేందుకు తొలి దశలో 4,311 మార్గదర్శకులను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఇంకా 9,201 కుటుంబాలకు మ్యాపింగ్ పూర్తి కాలేదన్నారు. నెలాఖరు నాటికి పూర్తి స్థాయిలో మ్యాపింగ్ చేయాలన్నారు. సమావేశంలో సీపీవో ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో ఘనంగా త్రిశూల స్నానం

మహానంది రుద్రగుండంలో త్రిశూల, చండీశ్వరస్వామివార్లకు అర్చకులు, పండితులు

మహానంది, న్యూస్‌టుడే: మహానందిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ముగింపును పురస్కరించుకొని పవిత్ర రుద్రగుండం పుష్కరిణిలో త్రిశూల, చండీశ్వర స్నానం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం వేదపండితులు రవిశంకర అవధాని సారథ్యంలో పసుపు, తైలం వేడుకలు అంబరాన్నంటాయి. కోనేటిలోని పంచలింగాల మండపంలో త్రిశూలం, చండీశ్వర స్వామివారికి పంచామృత, క్షీర, జలాభిషేకాలు చేశారు. మహాపూర్ణాహుతి, ధ్వజావరోహణ, రుద్రహోమం వేడుకగా నిర్వహించారు. కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్ల కళ్యాణ అనంతరం నాగనంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, పర్యవేక్షకులు అంబటి శశిధరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారువేటతో ముగిసిన ఉత్సవాలు

గడివేముల, న్యూస్‌టుడే: శ్రీదుర్గాభోగేశ్వరంలో మహాశివరాత్రి ఉత్సవాలు బుధవారం పారువేటతో ముగిశాయి. ఉదయం స్వామివారికి పసుపుకొమ్ముల నిర్వహించారు. అనంతరం స్వామివారికి అవభృథస్నానం కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం పారువేట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, అర్చకులు శ్యాంసుందర్‌శర్మ, సిబ్బంది రమణ, తదితరులు పాల్గొన్నారు.

భోగేశ్వరంలో స్వామివారికి అవభృథ స్నానం చేయిస్తున్న అర్చకులు

ఉగాది ఏర్పాట్లపై సన్నాహక సమావేశం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో వచ్చే నెల 16 నుంచి 20 వరకు జరగనున్న ఉగాది మహోత్సవాలకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై బుధవారం ఈవో ఎం.శ్రీనివాసరావు అధికారులతో సమావేశం అయ్యారు. కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అన్నదానం చేసే దాతలకు దేవస్థానం తరఫున సహాయ సహకారాలు అందించాలన్నారు.

నంద్యాల చేరుకున్న బ్రహ్మనందీశ్వరుడు

నంద్యాలకు వెళ్తున్న గంగాపార్వతీ సమేత బ్రహ్మనందీశ్వరస్వామివార్లు

నంద్యాల గాంధీచౌక్, మహానంది, న్యూస్‌టుడే: మహానందీశుని కల్యాణోత్సవాలకు పెళ్లి పెద్దగా వచ్చిన గంగా పార్వతీ సమేత బ్రహ్మనందీశ్వరస్వామివార్లు నంద్యాలకు చేరుకున్నారు. బుధవారం నూతన వధూవరులైన కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామివార్లతో త్రిశూల స్నానం అనంతరం మహానందిలో విలువైన కానుకలు ఆలయ పర్యవేక్షకులు అంబటి శశిధరరెడ్డి, పండితులు వేదోక్తంగా అందజేశారు. అనంతరం స్వామి అమ్మవార్లు నంద్యాలకు తరలివెళ్లారు.

సంక్షిప్త సమాచారం

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: నంద్యాల మండలంలోని అభాండ తాండాలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన దుమావత్ స్వామి నాయక్ కోరారు.

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: రాయమాల్పురం మోడల్ ప్రాథమిక పాఠశాల పూర్వ విద్యార్థిని నంద్యాల జయమ్మ రెండు కుర్చీలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్ నాయక్‌కు అందజేశారు. తూర్పునాటి హుసేన్ పాఠశాల విద్యాభివృద్ధికి రూ.వెయ్యి విరాళంగా అందజేశారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: నంద్యాలలో నిర్వహిస్తున్న నంది బాలోత్సవం పోటీల్లో పాణ్యం ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపల్ దినేష్‌బాబు తెలిపారు.

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరు పట్టణంలోని అపోలో ఫార్మసీపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకుడు రఘురాంమూర్తి డిమాండ్ చేశారు.

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ఫార్మసీల్లో కాలం చెల్లిన మందులు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండు చేశారు.

వెండి దొంగల అరెస్టు

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలో ఈనెల 12వ తేదీన స్థానిక బంగారు దుకాణంలో వెండి పట్టీలను చోరీ చేసిన ఇద్దరు మహిళలను అరెస్టు చేసి వారి వద్ద ఉన్న 17 తులాల వెండిని స్వాధీనం చేసుకున్నట్లు ఒకటో పట్టణ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిందితుల వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఓ బంగారు దుకాణానికి మదనపల్లి జిల్లా బోయపల్లి గ్రామానికి చెందిన వేముల జ్యోతి, వేముల నరసమ్మ అనే మహిళలు వెండి పట్టీలు కొనేందుకు వచ్చారు. పట్టీలను చూసే క్రమంలో 17 గ్రాముల వెండి పట్టీలను అపహరించుకెళ్లారు. సీసీ కెమెరాలు పరిశీలించి దుకాణం యజమాని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా ఆర్టీసీ బస్టాండ్ దగ్గర అనుమానాస్పదంగా తిరుగుతున్న వేముల జ్యోతి, నరసమ్మలను అదుపులోకి తీసుకోగా వారి వద్ద ఉన్న వెండిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. వీరిపై గతంలో నెల్లూరు, తిరుపతి ప్రాంతాల్లో కేసులు నమోదైనట్లు తెలిపారు. వెంటనే రికవరీ చేసిన సీఐని, సిబ్బందిని ఎస్పీ సునీల్‌షొరాణ్ అభినందించారు.

నిందితులను చూపుతున్న సీఐ సుధాకర్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణం బొగ్గులైన్‌కు చెందిన నూర్జహన్(55) అనే మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ట్రాఫిక్ సీఐ చాన్‌బాషా బుధవారం తెలిపారు. పత్తిమిల్‌లో పనిచేసి ఆటోలో 15 మంది మహిళలు తిరిగి వస్తున్న సమయంలో ఆటోను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. అందులో నూర్జహన్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానిక జీజీహెచ్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అర్థమయ్యేలా బోధన చేయాలి

మాట్లాడుతున్న సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు సమన్వయకర్త నిత్యానంద రాజులు

నంద్యాల విద్య, న్యూస్‌టుడే: ప్రత్యేక అవసరాల పిల్లలకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు సమన్వయకర్త నిత్యానంద రాజులు పేర్కొన్నారు. బుధవారం డిప్యూటీ డీఈవో కార్యాలయంలో ఐడీఎస్ఎస్, స్కూల్ అసిస్టెంట్‌లకు, ఐఈఆర్‌టీహెచ్‌ఐ, ఎమ్మార్‌లకు మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. భవిత కేంద్రాల్లో ఈఐఆర్‌టీలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐడీఎస్ఎస్ స్కూల్ అసిస్టెంట్‌లు దృష్టి ప్రోటల్‌పై శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఉపయోగించి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త జగన్‌మోహన్‌రెడ్డి, రిసోర్స్ పర్సన్ జాస్నా, బ్రీజిత్, ఏపీవో రామ్మోహన్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత పెంపొందించుకోవాలి

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: చదువుతో పాటు విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని శ్రీచైతన్య పాఠశాల ఏజీఎం సురేష్, ఆర్ఐ కోటయ్యచౌదరి, ప్రిన్సిపల్ రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్‌లో(కేఏటీ ఒలింపియాడ్)లో చైతన్య ఎన్-4 పాఠశాలకు చెందిన 131 మంది విద్యార్థులు విజయం సాధించినట్లు తెలిపారు. బుధవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో గోవిందు, ఇబ్రహీం, ఖలీల్,విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

డీఏ బకాయిలు చెల్లించాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఇమ్రాన్ పాషా, గౌరవాధ్యక్షులు అబులైస్ డిమాండు చేశారు. పట్టణంలోని ఆల్ మేవా కార్యాలయంలో బుధవారం సంఘం ,నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై భారాన్ని తగ్గించాలన్నారు. యాప్‌ల ద్వారా నివేదికలు, డేటా అప్‌లోడ్‌ల బాధ్యతలను వెల్ఫేర్ అసిస్టెంట్లకు అప్పగించాలని కోరారు. పీఆర్సీ కమిషన్ నియామకం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫరూక్, మహమ్మద్ గౌస్, మహమ్మద్‌సలీం, మాలిక్ బేగ్, మోమిన్ సైఫుల్లా తదితరులు పాల్గొన్నారు.

రోబో డిజైన్‌పై శిక్షణ

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: ఏఐ రోబో డిజైన్‌పై విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో సీడీసీ, ఈసీఈ విభాగ విద్యార్థులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏఐ వినియోగం, రోబోటిక్స్ అవసరంపై విద్యార్థులకు వివరించినట్లు తెలిపారు. శిక్షకులు సందీప్, విభాగాధిపతి మల్లికార్జునరావు, డీన్ డేవిడ్, సమన్వయకర్త వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక వారసత్వ దేశం మనది

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక వారసత్వ దేశం మనది అని ఆర్ఎస్ఎస్ విభాగ్ సహ సంపర్క్ రామకృష్ణ, రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డా.జి.రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో బుధవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతిని నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర సహ కార్యదర్శి మనేష్, భాగ్ కన్వీనర్ లక్ష్మీ నరసింహ, ప్రిన్సిపల్ సుబ్బయ్య,అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శివాజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న రామకృష్ణారెడ్డి

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

అమ్మవారికి పూజలు చేస్తున్న సభ్యులు

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణం గాంధీచౌక్‌లో ఉన్న కాళికాంబ చంద్రశేఖరస్వామి ఆలయంలో నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం నిర్వహించారు. ఆలయ ఛైర్మన్‌గా సుబ్బలక్ష్మయ్య, సభ్యులుగా వసుంధరదేవి, రాజ్‌పురోహిత్ బాబుసింగ్, వరలక్ష్మి, శారదాబాయ్, సాంబారపు భారతి, విజయభాస్కర్ బాబు, లక్ష్మణ్‌సింగ్, సుబ్రహ్మణ్యం, ఎక్స్ అఫీషియో సభ్యుడు సుబ్రహ్మణ్యశాస్త్రితో ఆలయ ఇన్‌స్పెక్టర్ హరిచంద్రారెడ్డి, ఈవో లక్ష్మీనారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర నాయకులు ఎన్ఎండీ ఫయాజ్, సీవీ చలంబాబు, శ్యాంసుందర్‌లాల్, సురేష్, డా.సహదేవుడు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు ఘన సత్కారం

మహానంది, న్యూస్‌టుడే: పనిలోనే పరమాత్మను చూడటమే మన విధుల్లో భాగమని నంద్యాల డీఎల్‌పీవో రాంబాబు పేర్కొన్నారు. బుధవారం మహానంది గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మండల జనసేన నాయకులు కొండమల చక్రపాణి, జంగం మహేశ్వరయ్య, బొల్లవరం ప్రసాద్, దమాల చందు, పెద్దమురళి, సామాజిక సేవా కార్యకర్త లక్కాకుల పెద్దకాశయ్యల సారథ్యంలో పారిశుద్ధ్య కార్మికులకు అభినందన సభను నిర్వహించి ఘన సత్కరించారు. ఉత్సవాల్లో పరిశుభ్రతకు కృషిచేసిన పంచాయతీ కార్యదర్శులు నాగసంజవరావు, భాస్కర్‌లను సైతం సత్కరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగులు బానుముక్కల లోకేష్, మద్దమ్మతోపాటు పలువురు పాల్గొన్నారు.

ఫార్మసీని సందర్శించిన డీఎంఅండ్‌హెచ్‌వో

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరు పట్టణంలోని అపోలో ఫార్మసీని నంద్యాల డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటరమణ సందర్శించారు. ఫార్మసీలో పిల్లల బలవర్ధక పౌడరులో నల్లటి పురుగులు వచ్చాయన్న విషయం తెలుసుకుని నేరుగా నందికొట్కూరు అపోలో ఫార్మసీకి వచ్చి తనిఖీ చేశారు. కొన్ని నమూనాలు తీసుకెళ్లారు. పౌడరుకు సంబంధించిన కంపెనీపై చర్యలు తీసుకోనున్నట్లు డీఎంఅండ్‌హెచ్‌వో తెలిపారు.

ఆగిన పనులతో అవస్థలు

■ కాల్వల నిర్మాణం పూర్తికాక రాకపోకలకు అంతరాయం

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరు పురపాలికలో చేపట్టిన కాల్వల నిర్మాణ పనుల్లో జాప్యం కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా పూర్తికాకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు తమ పనులు ముగించుకునేందుకు పది అడుగుల దూరాన్ని రెండు కి.మీ మేర చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

☛ పురపాలికలోని తాలూకా కార్యాలయం సమీపాన మురుగు కాల్వ పనులు చేపట్టారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.9లక్షల వ్యయంతో చేపట్టిన పనులు నత్తను తలపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో గుత్తేదారులు ఒక్క అడుగు ముందుకు మూడు అడుగులు వెనక్కి అన్న చందాన పనులు చేస్తున్నారన్న విమర్శలున్నాయి. నిర్మాణం చేపట్టేందుకు కాల్వను తవ్వి మట్టి కుప్పలు వేసి నెల రోజులు అవుతోంది. నేటికీ పనులు పూర్తి కాలేదు. తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ, వ్యవసాయ, ఉపకారాగారం, హౌసింగ్, ఉపాధి పనులు, పీ-4, ఉప ఖజానా, రిజిస్ట్రేషన్, ఐసీడీఎస్, ఆర్అండ్‌బీ, పింఛనర్ల కార్యాలయం, కేసీ, మైనర్ ఇరిగేషన్, హెచ్ఎన్ఎస్ఎస్ కార్యాలయాలకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందల మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి రహదారి పనులు త్వరగా పూర్తి చేయించాల్సిన సిబ్బంది, గుత్తేదారుల నిర్లక్ష్యంతో ఇబ్బందుల పాలవుతున్నారు.

అసంపూర్తిగా నిలిచి నిర్మాణం

☛ మిడుతూరు రహదారిలోని లింగం వీధిలో మురుగు కాల్వ పనులు చేపట్టి పూర్తి చేశారు. మిడుతూరు ప్రధాన రహదారిలో పనులు పూర్తయినా గొయ్యిని మాత్రం పూడ్చడం లేదు. పాత, కొత్త కాల్వలను రెండింటిని కలిపి గోతిని పూడ్చాల్సి ఉండగా. . నెల రోజులుగా పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో స్థానికులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు అందులో పడి గాయాలపాలవుతున్నారు. ఈ గోతి సమీపాన్నే నంద్యాల నుంచి వచ్చే బస్సులు నిలబడటంతో ప్రయాణికులు దిగి ఈ గొయ్యి సమీపం నుంచి వెళుతుంటారు. లింగం వీధి వ్యాపార కూడలి కావడంతో వ్యాపారం కోసం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజల రాకపోకలు సాగిస్తుంటారు. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాన్ని పూర్తి చేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

☛ అసంపూర్తి నిర్మాణాలపై డీఈ నాసీర్‌తో మాట్లాడగా త్వరలో పనులు పూర్తి చేయించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

(c) eenadu

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం

నాగబాబుతో జనసేన సమన్వయకర్త మైలేరి మల్లయ్య

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబును ఆళ్లగడ్డ నియోజకవర్గ సమన్వయకర్త మైలేరి మల్లయ్య బుధవారం కలిశారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి చేపడుతున్న చర్యలు, ప్రస్తుత రాజకీయాలపై ఆయనతో చర్చించామన్నారు. ఆళ్లగడ్డ వ్యవసాయ కమిటీ ఛైర్మన్‌గా మైలేరి సురేఖను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడినా ఇంకా బాధ్యతలు స్వీకరించలేని పరిస్థితులను ఆయన దృష్టికి తీసుకెళ్లానన్నారు. పార్టీ సభ్యత్వ నమోదును లక్ష్యానికి మించి చేసేందుకు నియోజకవర్గంలో తీసుకుంటున్న చర్యలను ఆయనకు వివరించామన్నారు.

రైల్వే లైన్ నిర్మాణానికి భూముల బదలాయింపు

బనగానపల్లి, న్యూస్‌టుడే: కొలిమిగుండ్ల మండలంలోని రామ్‌కో సిమెంట్ పరిశ్రమ రైల్వే లైన్ ఏర్పాటు కోసం అనుమతులు ఇస్తూ బుధవారం ప్రభుత్వం ఎంఎస్ నంబరు 127 జీవోను జారీ చేసింది. రైల్వే లైను ఏర్పాటుకు ఉన్న అడ్డంకులను తొలగించినట్లు తెలిపింది. సంజామల, కోటపాడు, కానాల, గ్రామాల సమీపంలో ఉన్న రామ్‌కో సిమెంట్ పరిశ్రమకు చెందిన 7.99 ఎకరాల భూమిని, ఎండోమెంట్‌కు చెందిన 7.86 ఎకరాల భూమిని ఒకశాఖ నుంచి మరో శాఖకు బదిలీ చేసుకునేందుకు అనుమతులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో రామ్‌కో సిమెంట్ పరిశ్రమ నుంచి సంజామల వరకు ప్రత్యేక రైల్వే లైన్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది.

వ్యాధి నివారణకు టీకా తప్పనిసరి

సంజామల, న్యూస్‌టుడే: పశువులకు సీజనల్ వ్యాధులు సోకకుండా పశువైద్యులు టీకాలు సకాలంలో వేసి వ్యాధుల బారిన పడకుండా చూడాలని పశుసంవర్ధకశాఖ ఏడీ డా.కొండారెడ్డి అన్నారు. స్థానిక పశువైద్యశాలలో బుధవారం పశువైద్యులకు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి పలు విషయాలు వెల్లడించారు. ఈ సందర్భంగా డా.కొండారెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో సిబ్బంది అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు పాడి రైతులకు వైద్య సేవలు అందించాలన్నారు. అలసత్వం వహించకూడదన్నారు. పాడి రైతులు వైద్యుల సూచనల మేరకే మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యులు కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగు నీటిని పొదుపుగా వాడుకోవాలి

బనగానపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థినులు మంచి నీటిని పొదుపుగా వాడుకోవాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ పేర్కొన్నారు. రవ్వలకొండలో ఏపీ మోడల్ స్కూలు బాలికల హాస్టల్‌లో సుమారు రూ.2 లక్షల సొంత నిధులు విరాళంగా ఇచ్చి నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంటును ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థినులు స్వచ్ఛమైన నీరు తాగాలనే ఉద్దేశంతో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సహకారంతో మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశామని అన్నారు.

శుద్ధజల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బీసీ ఇందిరమ్మ

త్వరలో శనగలు, కందుల కొనుగోళ్లు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: త్వరలో శనగలు, కందుల కొనుగోళ్లు ప్రారంభిస్తున్నామని నంద్యాల మార్క్‌ఫెడ్ డీఎం హరినాథరెడ్డి తెలిపారు. కందులు క్వింటా రూ.8 వేలు, శనగలు రూ.5875 చొప్పున కొనుగోలు చేయనున్నామన్నారు. రైతులు ఈ-క్రాపింగ్, కొనుగోలుకు రిజిస్ట్రేషన్ చేయించుకుని ఉండాలని ఆయన తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

బేతంచెర్ల, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు సమయ పాలన, క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఎస్టీయూ జిల్లా కార్యదర్శి ఆజాంబేగ్ ఆర్థిక సహకారంతో పదో తరగతి విద్యార్థులకు పరీక్షల మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు.

ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతాం

?: బీసీ కాలనీలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరీ పక్కనున్న కాలనీలో మురుగు సమస్య ఉంది. కాల్వలు ఎత్తుగా లేక పోవడంతో మురుగు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. – లక్ష్మీదేవి, బీసీ కాలనీ.

?: పెండేకంటి నగర్‌లో సీసీ రహదారులు లేకపోవడంతో ఇబ్బందిగా మారింది. ఖాళీ స్థలాల్లో ముళ్ల కంపలు పెరిగి పోయాయి. రాత్రి వేళల్లో బయటకు వెళ్లేందుకు భయపడాల్సి వస్తోంది. – శ్రీనివాసరెడ్డి, పెండేకంటి నగర్.

రంగరాజుపేటలో సమస్యలు తెలుసుకుంటున్న ఈవో

బనగానపల్లి, న్యూస్‌టుడే: ప్రజలు సహకరిస్తే బనగానపల్లి మేజర్ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఈవో సతీష్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో బుధవారం వాక్‌విత్ ఈవో కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని బీసీ కాలనీ, మంగళవారంపేట, తెలుగుపేట, అర్బన్ కాలనీ, పెండేకంటి నగర్, చెంచుతోట కాలనీల్లో ఆయన పర్యటించారు. ఆయా కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మహిళలతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. ఆయన పర్యటించిన కాలనీల్లో కొన్ని సమస్యలు ఇవే..

?: అర్బన్ కాలనీలో తమ్మడపల్లెకు వెళ్లే రహదారిలో సీసీ రోడ్లు లేక వృథా నీరు రహదారిపై నిలిచి పోతోంది. ఇళ్ల ముందు బురదగా మారి అపరిశుభ్రత నెలకొంది. – రఘురామయ్య, అర్బన్ కాలనీ.

?: కొండపేటలోని జడ్పీ బాలుర పాఠశాల ప్రాంతంలో విద్యుత్తు స్తంభాలకు దీపాలు అమర్చలేదు. – మద్దిలేటి, కొండపేట.

?: రంగరాజుపేటలో మురుగు కాల్వలకు మరమ్మతులు చేపట్టాలి. స్థలం యజమానులు ఇళ్లు కట్టుకోక పోవడంతో పిచ్చిమొక్కలు పెరిగి పోయాయి. – సుబ్రహ్మణ్యం, రంగరాజుపేట.

మంత్రి సహకారంతో పట్టణాభివృద్ధి
- సతీష్ కుమార్‌రెడ్డి, ఈవో

బనగానపల్లి పట్టణాభివృద్ధికి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కృషిచేస్తున్నారు. మంత్రి చొరవతో సుమారు రూ.30 కోట్లతో భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టారు. ఇప్పటి వరకు 90 శాతం పనులు పూర్తయ్యాయి. మార్చి నాటికి మిగిలిన పనులు పూర్తవుతాయి. నిధులు విడుదలైతే రెండో విడత పనులు ప్రారంభిస్తాం. ఇప్పటికే ఖాజీవాడ, పాతబస్టాండు, పెండేకంటి నగర్, గోపాల్‌నగర్, ఈద్గానగర్, కరణం మొహియుద్దీన్ కాలనీ, బీసీ కాలనీలో డ్రైనేజీ పనులు దాదాపు పూర్తయ్యాయి. కాలనీల్లో పరిశీలించినప్పుడు వచ్చిన సమస్యలను పరిష్కరిస్తాం. మరో మూడేళ్లలో భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తవుతాయి. అప్పటిలోగా అవసరమైన చోట సీసీ రోడ్లు, మురుగు కాల్వలు ఏర్పాటు చేస్తాం. కాలనీల్లో సమస్యలు ఉంటే పంచాయతీ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తాం.

నంది బాలోత్సవంలో విద్యార్థుల ప్రతిభ

బహుమతి అందుకుంటున్న విద్యార్థి

ఆళ్లగడ్డ గ్రామీణం, రుద్రవరం, న్యూస్‌టుడే: కోటకందుకూరు ఆదర్శ పాఠశాల విద్యార్థులు కోలాటంలో ప్రతిభ చాటారు. నంద్యాలలో నంది బాలోత్సవం నిర్వహించారు. ఇందులో కోటకందుకూరు ఆదర్శ పాఠశాల విద్యార్థులు కోలాటం ప్రదర్శించి మొదటి బహుమతి గెలుచుకున్నారు. నంది బాలోత్సవంలో రుద్రవరంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రథమ స్థానం, వ్యాసరచన పోటీల్లో ద్వితీయస్థానం సాధించినట్లు ప్రిన్సిపల్ నాగేశ్వర్‌రావు తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నొస్సం (సంజామల), న్యూస్‌టుడే: ఆర్థిక అక్షరాస్యతపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉన్నప్పుడే ఆర్థికంగా అభివృద్ధిని సాధించేందుకు అవకాశం ఉంటుందని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ శివప్రసాద్ చెప్పారు. నొస్సంలో బుధవారం ఏపీజీబీ ఆధ్వర్యంలో కళాజాత బృందం పాటల ద్వారా బీమా, పొదుపు, రాయితీలు, లోన్లు తదితరాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.

జోరుగా రహదారి పనులు

బనగానపల్లి మండల పరిధిలోని బనగానపల్లి-కోవెలకుంట్ల రహదారి పనులు జోరుగా సాగుతున్నాయి. బనగానపల్లి పట్టణం నుంచి 1.3 కి.మీ. మేర నాలుగు వరుసల దారికి రూ.6 కోట్లు, గులాంనబీపేట నుంచి బనగానపల్లి వైపు 5 కి.మీ. మేర రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆరు నెలల కిందట పనులు ప్రారంభమయ్యాయి. వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పనులు చివరి దశకు చేరుకోవడంతో జనం హర్షం వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, బనగానపల్లి గ్రామీణం

వానర దండు.. ప్రయాణికుల బెంబేలు

డోన్ రైల్వేస్టేషన్‌లో వానరాల బెడద ఎక్కువైంది. ఎక్కడ కరుస్తాయోనని ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. పిల్లలు, మహిళలు మరింత ఆందోళన చెందుతున్నారు. దాడి చేసి ఆహార పదార్థాలు లాక్కెళుతున్నాయి. వీటి దాడిలో పలువురు గాయపడి ఆస్పత్రుల పాలవుతున్నారు. రైల్వే అధికారులకు విన్నవించినా చర్యలు తీసుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, డోన్ పట్టణం

రస్తా బాగుకు.. రైతన్నలు కదిలారు

పొలం పనులకు వెళ్లే రస్తా మోకాల్లోతు గుంతలు నిండటంతో అన్నదాతలకు నిత్యం అవస్థలే. దారి బాగు కోసం ప్రభుత్వం కోసం వేచిచూడక తామే ముందుకు కదిలారు. ఆర్.కృష్ణాపురం గ్రామానికి చెందిన రైతులు ఈశ్వరయ్య, కొండయ్య, దస్తగిరి, ఓబులేసు, నాగార్జునలు రూ.10వేలు వెచ్చించి ట్రాక్టర్లలో రాళ్లను తరలించి గుంతలు పూడ్చుతున్నారు. ఒకటి, రెండు ట్రాక్టర్ల రాళ్లు అయితే సరిపోతాయని అనుకున్నామని కాని పది ట్రాక్టర్ల రాళ్లు వేయాల్సి వచ్చిందని అన్నదాతలు తెలిపారు. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణం

షెల్టర్ శిథిలం.. చర్యలు శూన్యం

డోన్ నుంచి కృష్ణగిరి వెళ్లే రహదారిలో వెంకటాపురం వద్ద ఉన్న బస్సు షెల్టర్ పూర్తిగా అధ్వానంగా మారింది. లోపలిభాగంలో కూర్చునేందుకు కూడా వీలు లేని పరిస్థితి నెలకొంది. బస్సులు, ఆటోల కోసం వేచి ఉండేందుకు ఏర్పాటు చేసిన షెల్టర్ ఉండి లాభమేంటని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు విన్నవించినా చర్యలు తీసుకోలేదని వెంకటాపురం గ్రామస్థులు తెలిపారు. – న్యూస్‌టుడే, డోన్

దశాబ్దాల సమస్యకు పరిష్కారం

గత వైకాపా ప్రభుత్వం అభివృద్ధి పనుల్ని అటకెక్కించింది. దశాబ్దాల కాలం నుంచి నెలకొన్న సమస్యకు కూటమి ప్రభుత్వం పరిష్కారం చూపింది. బేతంచెర్ల మండలం రహిమాన్‌పురం నుంచి వచ్చే మురుగు నీరు పారేందుకు ప్రధాన కాలువ లేకపోవడంతో మురుగంతా రైతుల పొలాల్లోకి చేరి వారు ఇబ్బందులు పడే వారు. స్థానికులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో సీసీరోడ్డు, కాలువ నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేయించారు. దశాబ్దాల సమస్యకు పరిష్కారం లభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. – న్యూస్‌టుడే, రహిమాన్‌పురం (బేతంచెర్ల)

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని అల్లాబకాష్ దర్గా వెనుక కాలనీలో సీసీ రహదారిని నిర్మించాలి. **- కాలనీవాసులు.** ✔: గ్రావెల్ రోడ్డు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం. **- మధుతేజారెడ్డి, ఏఈ మున్సిపల్.** ?: శేషారెడ్డి సర్కిల్ సమీపంలో పెద్దకాల్వలో ప్లాస్టిక్ వ్యర్థాలు నిండిపోయాయి. **- శ్రీనివాసులు, బేతంచెర్ల.** ✔: సిబ్బందితో వ్యర్థాలను తొలగించి శుభ్రం చేయిస్తాం. **- మధుకుమార్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్.**

దొర్నిపాడు, న్యూస్‌టుడే: ?: దొర్నిపాడు ఎస్సీ కాలనీలో ప్రధాన మురుగు కాల్వలో చెత్త చేరి అధ్వానంగా మారింది. **- రాముడు, స్థానికుడు.** ✔: సిబ్బందితో చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- నాగార్జున, పంచాయతీ కార్యదర్శి, దొర్నిపాడు.**

సంజామల: ?: ముదిగేడు గ్రామంలోని ప్రధాన రహదారి ప్రాంతంలో మురుగు కాల్వలు నిర్మించాలి. **- వెంకటేశ్వర్లు, ముదిగేడు.** ✔: నిధులు మంజూరైతే కాల్వలు ఏర్పాటు చేస్తాం. **- సాల్మన్, ఎంపీడీవో, సంజామల.**

శిరివెళ్ల: ?: శిరివెళ్లమెట్ట నుంచి యాళ్లూరు బీటీ రహదారికి ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టాలి. **- సుదర్శన్ నాయుడు.** ✔: నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాం. **- లక్ష్మీమనోహర్, పంచాయతీ కార్యదర్శి, కోటపాడు.**

కోవెలకుంట్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని చెత్తాచెదారాన్ని జుర్రేరు వంతెన వద్ద పడేస్తున్నారు. **- దస్తగిరి, స్థానికుడు.** ✔: వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకుంటాం. – ప్రకాష్‌నాయుడు, ఇన్‌ఛార్జి, ఈవో.

ముగిసిన శివరాత్రి ఉత్సవాలు

వసంతోత్సవంలో పాల్గొన్న భక్తులు

యాగంటి (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: యాగంటి ఉమామహేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శివరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు శివమాల దీక్ష విరమణ, పూర్ణాహుతి, తెప్పోత్సవం, నాగవల్లి, వసంతోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. ఉత్సవాల నేపథ్యంలో రైతు సంబరాల్లో భాగంగా వృషభాల బండలాగుడు పోటీలు బుధవారం కొనసాగాయి. పోటీలను తెదేపా నేతలు కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు ఛైర్మన్ మల్లికార్జునరెడ్డిలు ప్రారంభించారు.

జ్ఞాపిక అందజేస్తున్న తెదేపా నేత కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి

ఆలయాభివృద్ధికి రూ.లక్ష విరాళం

నందవరం(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండలం నందవరం గ్రామంలోని చౌడేశ్వరి అమ్మవారి ఆలయాభివృద్ధికి అనంతపురం పట్టణానికి చెందిన లింగం నారాయణ, లక్ష్మీదేవి కుటుంబ సభ్యులు రూ.లక్ష నగదు విరాళాన్ని ఆలయ ఛైర్మన్ పీవీ నాగార్జున రెడ్డికి బుధవారం అందజేశారు.

వైభవంగా వెంకన్న కల్యాణం

మూడురాళ్లపల్లె(చాగలమర్రి), న్యూస్‌టుడే: మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి, సాయినాథ ఆలయాల వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు అనిల్‌కుమార్, ఆలయ నిర్వాహకులు పులి చిన్నఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో వెంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కోలాటం, భజనలు, గ్రామోత్సవం ఆకట్టుకుంది.

కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

ఈ నెల 20 నుంచి కంబగిరిస్వామి మాలధారణ

అవుకు న్యూస్‌టుడే: మండలంలోని ఎర్రమల కొండల్లోని కంబగిరిస్వామి దీక్షకు సంబధించి మాలధారణ తేదీలను ప్రకటించారు. భక్తులు ఏప్రిల్ 1 వరకు మూడు విడతల్లో దీక్షలు చేపట్టడానికి వీలు కల్పించారు. ఈనెల 20న మండల దీక్ష, మార్చి 12న అర్ధ మండల దీక్ష చేపట్టాల్సి ఉంటుందని ఆలయ నిర్వాహకులు ప్రకటించారు.

అహోబిలేశునికి తెలంగాణ రాష్ట్రం మర్యాదలు

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలం లక్ష్మీనృసింహస్వామికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి మర్యాదలు అందాయి. తెలంగాణ రాష్ట్రం తరఫున మహబూబ్‌నగర్ జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ మదన్, జోగులాంబ దేవాలయం ఈవో దీప్తిరెడ్డి పట్టువస్త్రాలను తీసుకువచ్చారు. పట్టువస్త్రాలను ఆలయ సీఏవో రామానుజన్, ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్‌కు అందజేశారు.



పట్టు వస్త్రాలు అందజేస్తున్న తెలంగాణ రాష్ట్ర దేవాదాయశాఖ ఏసీ మదన్, ఈవో దీప్తిరెడ్డి

సంక్షిప్త సమాచారం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: దొర్నిపాడులో నిర్మిస్తున్న మద్దిలేటి నరసింహస్వామి ఆలయ నిర్మాణానికి వైకాపా రాష్ట్ర కార్యదర్శి భూమా కిశోర్‌రెడ్డి రూ.20 వేలు విరాళం ఇచ్చారు. బుధవారం తన నివాసంలో ఆలయ కమిటీ సభ్యులకు ఈ విరాళాన్ని అందించారు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ మండల పర్యవేక్షకురాలు లక్ష్మీదేవి బుధవారం పేర్కొన్నారు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ బాధితులను గుర్తించేందుకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి ముఖేష్ కుమార్ పేర్కొన్నారు.

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఇందిరానగర్‌లో శ్రీనివాస థియేటర్ వెనుక వీధుల్లో కుళాయిలకు సరఫరా అవుతున్న నీరు కలుషితం అవుతున్నట్లు కాలనీ వాసులు ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌కు ఎమ్మెల్యే ఆదేశించారు.

కన్నపకుంట(డోన్), న్యూస్‌టుడే: పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు అందరూ కృషి చేయాలని కన్నపకుంట గ్రామ సర్పంచి కల్యాణి అన్నారు. బుధవారం గ్రామానికి వచ్చిన చెత్తతరలించే తోపుడు బండ్లను ఆమె ప్రారంభించారు.

డోన్, న్యూస్‌టుడే: స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న శుద్ధ జలం కేంద్రంలో నీటిని ప్రజలకు ఉచితంగా అందించేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కౌన్సిలర్ సుంకయ్య కోరారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ సప్తశైలరాజేష్‌కు వినతిపత్రం ఇచ్చారు.

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: కోటపాడు గ్రామంలో నిర్మించిన గోకులం షెడ్డును ఎంపీడీవో దస్తగిరిబాబు బుధవారం ప్రారంభించారు. మండలానికి మొత్తం 5 గోకులం షెడ్లు మంజూరైనట్లు తెలిపారు. తెదేపా నాయకులు శివరామిరెడ్డి, శివారెడ్డి, సూర్యనారాయణ, నాగచౌడయ్య పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: మండలానికి స్వచ్ఛ భారత్ మిషన్ పథకం కింద పారిశుద్ధ్య పనుల నిర్వహణకుగాను 29 ట్రై సైకిళ్లు, 174 డస్ట్ బిన్‌లు మంజూరైనట్లు ఎంపీడీవో దస్తగిరిబాబు తెలిపారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: పెద్దబోధనం గ్రామంలోని సెయింట్ స్టీఫెన్ చర్చిలో ఫాదర్ రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

బనగానపల్లి, న్యూస్‌టుడే: వీఆర్వోలకు పని భారం పెరిగిపోవడంతో అవస్థలు పడుతున్నామని ఆ సంఘం నాయకులు శివరామయ్య, ఈశ్వరరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం వీఆర్వోలు తహసీల్దారు కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు.

బార్‌లో చీప్ లిక్కర్ విక్రయాలు

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో చీప్ లిక్కర్ విక్రయిస్తున్నారని మద్యం దుకాణాల యజమానులు వాపోతున్నారు. డోన్ పరిధిలో రెండు బార్లు, ఎనిమిది మద్యం దుకాణాలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం బార్‌లో చీప్ లిక్కర్ విక్రయించకూడదు, బయటకు ఇవ్వకూడదు. డోన్‌లో ఉన్న ఓ బార్‌లో అన్నీ జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

విధులకు హాజరు.. అస్తవ్యస్తం

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: మండలంలోని హౌసింగ్ అధికారుల పనితీరు అధ్వానంగా మారింది. హౌసింగ్ కార్యాలయ సిబ్బంది లేక పోయినా ఉదయం 10 గంటలకే తలుపులు తెరిచి ఉన్నాయి. ఏఈ నరసింహరావు బుధవారం ఉదయం 11.30 గంటలకు విధులకు హాజరయ్యారు. హాజరు పట్టికలో ఒక రోజు ముందుగా 19వ తేదీన గురువారం విధులకు వచ్చినట్లు సంతకం చేయటం గమనార్హం. ఇదిలా ఉండగా వర్క్ ఇన్‌స్పెక్టర్ చాంద్‌బాషా ఈనెల 9 నుంచి విధులకు హాజరైనట్లు సంతకాలు లేవు. డేటా ఎంట్రీ ఆపరేటర్ సుగంధర్ 16, 17వ తేదీల్లో హాజరు దస్త్రాల్లో సంతకాలు చేయలేదు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయండి

ఎమ్మెల్యే కోట్లకు పుష్పగుచ్ఛం అందిస్తున్న రవికిరణ్

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: డోన్ మున్సిపల్ మేనేజర్‌గా బి.రవికిరణ్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఇది వరకు మేనేజర్‌గా పని చేసిన ఇమాం హుస్సేన్ ఇటీవల పదవీ విరమణ పొందారు. స్థానిక ఎమ్మెల్యే స్వగృహంలో ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డిని రవికిరణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపాలిటీ పరిపాలన నిర్వహణ, అభివృద్ధికి బాధ్యతగా కృషి చేయాలని ఎమ్మెల్యే కోట్ల రవికిరణ్‌కు సూచించారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ ఎం.రాజు ఉన్నారు.

జేఈఈలో మెరిసిన వింధ్యశ్రీ

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్ 2026 ఫలితాల్లో ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన పి.బ్రహ్మానందరెడ్డి, పద్మావతిదేవి దంపతుల కుమార్తె వింధ్యశ్రీ సత్తాచాటారు. ఓసీ కేటగిరీలో 99.1858 పర్సంటైల్ సాధించి భళా అన్పించారు. ఈమె తండ్రి పాఠశాల ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఐఐటీలో సీటు సాధించి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడటమే తన లక్ష్యమని వింధ్యశ్రీ తెలిపారు.

మూడురాళ్లపల్లె(చాగలమర్రి), న్యూస్‌టుడే: మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామానికి చెందిన టి.నరసింహారెడ్డి, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు వినయ్‌కుమార్‌రెడ్డి జేఈఈ మెయిన్ ఫలితాల్లో 99.79 పర్సంటైల్ సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థిని స్నేహితులు, గ్రామస్థులు అభినందించారు.

రహదారి నిబంధనలు పాటించాలి

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: రహదారి పన్నులు చెల్లించకుండా వాహనాలను నడిపితే చర్యలు తప్పవని వాహనదారులకు నంద్యాలకు చెందిన మోటార్ వాహనాల తనిఖీ అధికారి జి.తిమ్మరుసు నాయుడు హెచ్చరించారు. బుధవారం స్థానిక ఆర్టీసీ కొత్త బస్టాండు వద్ద ప్రధాన రహదారిలో వెళ్తున్న వాహనాలను తనిఖీ చేశారు. డోన్ నుంచి ప్యాపిలి వైపు వెళ్తున్న గూడ్స్ వాహనం పన్ను చెల్లించలేదని గుర్తించి రూ.22వేలు జరిమానా విధించారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

దొర్నిపాడు, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా డీఈవో జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం దొర్నిపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలోని సమావేశ వేదిక ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో నడవాలన్నారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించారు. బోధనా విధానంపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో మనోహర్‌రెడ్డి, హెచ్‌ఎం చెన్నకేశ్వరి, ఉపాధ్యాయులు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం ఉద్యోగుల సమ్మె

బనగానపల్లి, కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉద్యోగుల సమ్మె బుధవారం కొనసాగింది. బనగానపల్లి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఎదుట ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల జేఏసీ సంఘం అధ్యక్షుడు అబ్దుల్ మునాఫ్ మాట్లాడుతూ.. ఈ నెల 27న గుంటూరులో సహకార సంఘం కమిషనర్ కార్యాలయం వద్ద వంట వార్పు కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. 2019 తరువాత సంఘాల్లో చేరిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో సీఈవోలు దస్తగిరి, ఘనమద్దిలేటి, ఏఈవోలు జీఎండీ షామీర్, సురేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. కోవెలకుంట్లలో 15 సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేపట్టారు.

భవితకు భరోసా.. ఉపాధికి ఊతం

యర్రగుంట్ల (శిరివెళ్ల), న్యూస్‌టుడే: శిరివెళ్ల మండలంలో యర్రగుంట్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 150 మంది విద్యార్థులు చదువుతున్నారు. స్థానిక కళాశాలలో మూడేళ్ల క్రితం స్కిల్ హబ్ ఏర్పాటు చేశారు. ఇందులో విద్యార్థుల ఆసక్తి, అర్హతను అనుసరించి వివిధ కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటి వరకు స్కిల్‌హబ్‌లో 300 మంది వరకు శిక్షణ పొందగా 115 మంది వరకు విద్యార్థులు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగులుగా స్థిరపడ్డారని కళాశాల ప్రిన్సిపల్ డా.ఇంద్రావతి, స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ మాధవ తెలిపారు.

మూడు నెలల ఉచిత శిక్షణ

- ప్రస్తుతం ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పూర్తయిన విద్యార్థులకు ఎటువంటి ఫీజు లేకుండా స్కిల్‌హబ్‌లో సెక్యూరిటీ అనలిస్ట్ కోర్సులో శిక్షణ పొందవచ్చు. మూడు నెలల పాటు బ్యాచ్‌కి 30 మంది చొప్పున కళాశాలలో శిక్షణ ఇస్తున్నారు. ఇందుకు ప్రత్యేకంగా ఇద్దరు నిపుణులను నియమించారు. సెక్యూరిటీ అనలిస్ట్ కోర్సుతో పాటు కమ్యూనికేషన్, ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాల పెంపుదలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

- ఉద్యోగం సాధనలో కీలకమైన కంప్యూటర్ కోర్సులకు సంబంధించి ఎంఎస్ ఆఫీస్, ఇంటర్‌నెట్, సీ లాంగ్వేజ్ తదితర సాఫ్ట్ స్కిల్ కోర్సులపై శిక్షణ ఇస్తున్నారు. ప్రత్యేక నిపుణులతో వ్యక్తిత్వ వికాస తరగతులు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు కళాశాలలో నిర్వహించే ఉద్యోగ మేళాల్లో కొలువులు పొందుతున్నారు.

కొలువు సాధించా - రాజేశ్వరి, డిగ్రీ అభ్యర్థి

నేను రెండేళ్ల క్రితం డిగ్రీ పూర్తి చేశా. ఈ క్రమంలో డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నా. పలు ప్రాంతాల్లో నిర్వహించిన ఉద్యోగమేళాలకు హాజరయ్యా. కేవలం నెలల వ్యవధిలోని రూ.25 వేల నెల వేతనంతో బెంగళూరులోని ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీకి ఎంపికయ్యా. నాలాంటి వారికి ఎలాంటి రుసుం లేకుండా ఇచ్చే శిక్షణ ఉపయోగపడుతుంది.

సద్వినియోగం చేసుకోండి
- డా.ఇంద్రావతి, ప్రిన్సిపల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పూర్తయి కొలువు కోసం ఎదురుచూసే నిరుద్యోగులకు సెక్యూరిటీ అనలిస్ట్ కోర్సు ఉపయోగపడుతుంది. కంప్యూటర్ పరిజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం తదితరాలపై ఇచ్చే శిక్షణ కొలువుల సాధనకు ఉపయోగంగా ఉంటుంది. నిరుద్యోగుల్లో ఆత్మవిశ్వాసం పెంచి ఉద్యోగం సాధించేలా మా వంతు కృషి చేస్తున్నాం.

HANDS - PU - DHONE
WANTED
ANM Post ఖాళీగా ఉంది. ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోగలరు. స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వబడును.
Qualification: ANM/GNM,
Salary: 12,500/ Month, T.A: 1200
Last date: 21/02/26
Interview date: 23/02/26
Email Id: handsdhone@gmail.com
Cell: 91827 41433, 94944 15084

(c) eenadu

ఈనాడు ఒడిశా
గురువారం ఫిబ్రవరి 19, 2026

మోగిన 'రాజ్యసభ' భేరీ... నాలుగో స్థానంపైనే గురి

ఎవరెవరికి అవకాశం?

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) బుధవారం రాజ్యసభ ఎన్నికల భేరీ మోగించింది. ఒడిశాలో నాలుగు సీట్లకు ఈ ప్రక్రియ జరగనుంది. దీనిపై నేతల్లో ఆసక్తి నెలకొంది. రాష్ట్రంలో దీనిపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

ఇదీ ఎన్నికల షెడ్యూల్ ● రాష్ట్రానికి చెందిన మమతా మహంత, మున్నాఖాన్, సుజిత్‌కుమార్, నిరంజన్ బిశిల ఆరేళ్ల రాజ్యసభ పదవీ కాలం ఏప్రిల్ 2తో ముగియనుంది. దీనికి ముందుగా సీఈసీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది.
● మార్చి 16న రాజ్యసభ ఎన్నికల తేదీ. ● ఈ నెల 26న నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల దాఖలు ప్రారంభం. ● నామినేషన్ల దాఖలుకు మార్చి 5 చివరి తేదీ. ● మార్చి 6న నామినేషన్ల పరిశీలన. ● మార్చి 9న నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు. ● మార్చి 16న ఉదయం 9 గంటల నుంచి 4 గంటల వరకు పోలింగ్, 5 గంటలకు ఓట్ల లెక్కింపు, ఆ తర్వాత ఫలితాలు ప్రకటిస్తారు.

మమతా మహంత

మున్నాఖాన్

సుజిత్‌కుమార్

నిరంజన్ బిశి

శాసనసభలో ప్రధాన రాజకీయ పార్టీలకున్న సంఖ్యాబలం ప్రకారం భాజపాకు రెండు, బిజదకు ఒక సీటు ఖాయంగా కనిపిస్తోంది. ఎవరెవరికి ఈసారి అవకాశం దక్కుతుందన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు నాలుగో సీటు ఎవరి ఖాతాలోకి వస్తుందన్నదిప్పుడు చర్చనీయాంశమైంది. అందరి దృష్టి బిజద అధినేత నవీన్‌పట్నాయక్‌పైనే ఉంది. ఆయన ఈసారి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు, భాజపాకు మద్దతిస్తారా? కాంగ్రెస్ వెంట వెళతారా? అన్నదిప్పుడు ఆసక్తి రేకిస్తోంది. సంఖ్యాబలం లేకపోయినా కాంగ్రెస్ అభ్యర్థిని నిలబెడుతుందని పీసీసీ అధ్యక్షుడు భక్తచరణ్‌దాస్ ఇప్పటికే స్పష్టం చేశారు. బిజద మద్దతు కోరతామని, ఇందుకోసం తాము స్వయంగా నవీన్‌ను కలుస్తామని వివరించారు. ఇదేమాట కాంగ్రెస్ సభాపక్షం నేత రామచంద్ర కదం బుధవారం భువనేశ్వర్‌లో విలేకర్లకు చెప్పారు. మరోవైపు నాలుగో సీటు తమదేనని భాజపా నేతలంటున్నారు. ఆ పార్టీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ విలేకర్లతో మాట్లాడుతూ కేంద్ర నాయకత్వం రాజ్యసభ అభ్యర్థులెవరన్నది త్వరలో ప్రకటిస్తుందని చెప్పారు. నాలుగో స్థానం తామే చేజిక్కించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

భార్యపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు

కరుణాకర్ కబి

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి తన భార్య, అత్తింటివారిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. బాలేశ్వర్‌లో మంగళవారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బలియాపల్ పోలీసుస్టేషన్ పరిధి నారాయణపూర్ గ్రామానికి చెందిన రాజేంద్ర సామంత్రాయ్ కుమార్తెకు కరుణాకర కబి అనే యువకుడితో ఏడేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. కరుణాకర్ పెట్టే చిత్రహింసలను భరించలేక బాధితురాలు నెల రోజుల కిందట పుట్టింటికి వెళ్లిపోయింది. మంగళవారం రాత్రి అక్కడికి వెళ్లిన కబి మరోసారి భార్యతో గొడవపడి, ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. అడ్డుకోబోయిన అత్తింటి వారిపైనా పెట్రోల్ పోయడంతో వారందరికీ తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల అరుపులు విన్న స్థానికులు చేరుకొని, కరుణాకర్‌ను పోలీసులకు అప్పగించారు. క్షతగాత్రులను ప్రతాప్‌పూర్ సీహెచ్‌సీలో చేర్పించి, పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం బాలేశ్వర్ జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు.

మాటల్లో భరోసా... క్షేత్రస్థాయిలో నిరాశ

● అన్నదాతల సమస్యలపై సభలో విపక్షాల ఆందోళన

భువనేశ్వర్, న్యూస్‌టుడే: శాసనసభలో అన్నదాతల ఇబ్బందులపై విపక్షాలు (బిజద, కాంగ్రెస్) ఆందోళన చేపట్టాయి. పోడియం వద్ద నినాదాలతో బుధవారం కార్యక్రమాలు స్తంభించాయి. సభాపతి సురమాపాడి తొలుత 11.30 గంటల వరకు, ఆ తర్వాత సాయంత్రం వరకు వాయిదా వేశారు. 4 నిమిషాలు మాత్రమే అసెంబ్లీ కొలువుదీరింది.

సభకు ధాన్యం కంకులు

సభ కొలువుదీరిన తర్వాత సభాపతి ప్రశ్నోత్తరాలు చేపట్టారు. ఇంతలో బిజద ఎమ్మెల్యే రమాకాంతచరణ్ బిశ్వాల్ ధాన్యం కంకులు తలపై మోసుకొని సభ లోపలికి తీసుకొచ్చి ఒక టేబుల్‌పై ఉంచారు. మరోవైపు ఆ పార్టీ సభ్యులంతా బ్యానర్లతో పోడియం వద్దకొచ్చి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. వారికి మద్దతుగా కాంగ్రెస్ సభ్యులు గొంతు కలిపారు. అన్నదాతల్ని ప్రభుత్వం దారుణంగా మోసగించిందని, మండీల్లో వారు పడుతున్న ఇబ్బందులు తీవ్రంగా ఉన్నాయని, డబుల్ ఇంజిన్ పాలకులు పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. సభాపతి వారించినా విపక్షాల సభ్యులు నిరసనలు కొనసాగించడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో సభను వాయిదా వేశారు.

అంతా ప్రచారమే

కాంగ్రెస్ సభాపక్షం నేత రామచంద్ర కదం విలేకర్లతో మాట్లాడుతూ డబుల్ ఇంజిన్ పాలకులు క్వింటాళ్లకు రూ.800లు రాయితీ ఇస్తున్నామని ప్రచారం చేసుకుంటూ రైతుల నెత్తిన శఠగోపం పెడుతున్నారన్నారు.

దగా చేశారు

బిజద అగ్రనేత అరుణ్‌కుమార్ సాహు సభ వెలుపల విలేకర్లతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు ముందు రైతులకు ఎంతో చేస్తామన్న భాజపా పెద్దలు అధికారంలోకి వచ్చిన తర్వాత వంచించారన్నారు. రూ.800లు ధాన్యం క్వింటాలు అదనంగా (ఇన్‌పుట్ సబ్సిడీ) చెల్లిస్తామని ప్రచారం చేసుకుంటూ మరోవైపు 150 క్వింటాళ్లకు మించి కొనుగోలు చేయొద్దని లక్ష్యం విధించారన్నారు. మండీల్లో కోతలు, తూనికల్లో మోసాలు జరుగుతున్నాయని, టోకెన్లు అందక మరికొందరు రైతులు వేచి చూసే పరిస్థితి నెలకొందని, మిల్లర్లు ఉద్దేశపూర్వకంగా ధాన్యం కొనుగోలు చేయబోమని చెబుతున్నా చర్యలు కరవయ్యాయని, దీనిపై అన్ని జిల్లాల్లో ఆందోళనలు చేస్తున్న బిజద సభ లోపల నిరసనలు చేపట్టిందన్నారు.

పోడియం వద్ద బ్యానరుతో విపక్ష సభ్యుల నినాదాలు

మండీల్లో ఆందోళనలు జరుగుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మంత్రులను పర్యవేక్షకులుగా నియమించామని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి చెప్పుకున్నారని, జిల్లాల్లో వారి జాడ లేదన్నారు. ఏ ఒక్క రైతుకూ సక్రమంగా క్వింటాలుకు రూ.3,100లు చెల్లింపు జరగడం లేదని, దీనికి నిరసించి సభలో కాంగ్రెస్ ప్రతిఘటించిందన్నారు.

కార్యక్రమాలను నీరుగార్చారు

భాజపా అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే బాబూసింగ్ విలేకర్లతో మాట్లాడుతూ అన్నదాతల సమస్యలపై విపక్షాలు సభాపతికి వాయిదా తీర్మానం అందజేసి ఉంటే సమగ్ర చర్చకు అవకాశం ఉండేదన్నారు. ఈ అవకాశం ఉన్నా ఉద్దేశపూర్వకంగా సభా కార్యక్రమాలు స్తంభింపజేశారని, ఇది నిందనీయమన్నారు. ప్రశ్నోత్తరాలు, శూన్యగంట కార్యక్రమాలన్నీ రద్దవడం దురదృష్టకరమని, ప్రజలంతా చూస్తున్నారన్నారు.

రూ.731 ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లిస్తున్నాం

రైతులకు ధాన్యం క్వింటాలుకు కేంద్రం మద్దతు ధర రూ.2,369లు చెల్లిస్తుండగా, రాష్ట్రప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.731 అందిస్తున్నట్లు ఆహార, పౌరసరఫరాల శాఖల మంత్రి కృష్ణచంద్ర పాత్ర్ చెప్పారు. విపక్ష ఉపనేత ప్రసన్న ఆచార్య అడిగిన ప్రశ్నకు బుధవారం లిఖితపూర్వక సమాధానమిచ్చారు. అన్నదాతలకు క్వింటాలుకు రూ. 31,00లు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆచార్య భువనేశ్వర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ క్వింటాళ్లకి రూ.800లు సబ్సిడీ అని చెప్పుకున్న భాజపా పాలకులు క్వింటాలుకు రూ.3,169లు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఉచిత విద్యుత్తు పరిశీలనలో లేదు

విద్యుత్తు వినియోగదారులకు నెలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్తు సరఫరా అంశం ప్రభుత్వ పరిశీలనలో లేదని ఆ శాఖ బాధ్యతలు పర్యవేక్షిస్తున్న ఉప ముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్ చెప్పారు. బుధవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే అరుణ్‌కుమార్ సాహు అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానమిచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భాజపా అధికారంలోకి వస్తే రాష్ట్ర ప్రజలకు ఉచితంగా 300 యూనిట్లు విద్యుత్తు ఇస్తామని హామీ ఇచ్చారు.

కల్తీ పాలు విక్రయిస్తున్నారు

రాష్ట్రంలో చాలాచోట్ల కల్తీ పాలు విక్రయిస్తున్నారని మత్స్య, పశు సంవర్ధకశాఖల మంత్రి గోకులానంద మల్లిక్ బుధవారం శాసనసభ్యుడు బద్రినారాయణ పాత్ర్ అడిగిన ప్రశ్నకు లిఖిత సమాధానంగా తెలిపారు. 2025లో 22 కంపెనీలకు చెందిన 88 పాల నమూనాల పరీక్షలు జరగ్గా 8 శాంపిల్స్ కల్తీవిగా తేలినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతానికి రాష్ట్రంలో 22 కంపెనీలకు చెందిన పాలు విక్రయాలు జరుగుతుండగా, 12 కంపెనీలు ఇతర రాష్ట్రాలకు చెందినవిగా తెలిపారు.

మహిళల కలశయాత్ర

స్థానిక ఉత్కళ సినిమా హాలు రోడ్డులోని పంచదేవాలయం వీధిలోని సుప్రసిద్ధ పాతాలేశ్వరాలయంలో స్వామి వారు, మా విమల, హనుమాన్ మందిరాల జీర్ణోద్ధరణ ప్రతిష్ఠోత్సవాలు బుధవారం కలశయాత్రతో మొదలయ్యాయి. రామలింగం చెరువు వద్ద ప్రత్యేక పూజల అనంతరం వందలాది మంది మహిళలు కలశాలతో పవిత్ర జలాల్ని సేకరించి, నగరంలోని ప్రధాన రహదారుల మీదుగా మధ్యాహ్నం పాతాలేశ్వరాలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం ఉత్సవాలు మొదలయ్యాయి. ఇవి ఈ నెల 22వ తేదీ వరకూ జరుగుతాయని మందిరం నిర్వహణ కమిటీ ప్రతినిధులు తెలిపారు. – న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం

రైతు సమస్యలపై బిజద ఆందోళన

ఆర్డీసీ కార్యాలయం ఆవరణలో బైఠాయించిన బిజద నాయకులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: రైతు సమస్యలపై బిజు జనతాదళ్ (బిజద) గంజాం జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం భారీ ఆందోళన జరిగింది. స్థానిక దక్షిణ మండల ఆర్డీసీ కార్యాలయం బయట జరిగిన ఇందులో వందలాది మంది బిజద నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మండీల్లో ధాన్యం సేకరణ అధ్వానంగా ఉందని, ధాన్యం అక్రమ అమ్మకాలతో రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదని ఆ పార్టీ నాయకులు ఆరోపించారు. జిల్లాలో శాంతిభద్రతల సమస్యలు మరింత పెరిగాయన్నారు. అనంతరం బిజద నాయకులు గవర్నరు పేరిట ఓ వినతిపత్రాన్ని ఆర్డీసీ కార్యాలయం అధికారులకు అందజేశారు. భారీగా తరలివచ్చిన బిజద శ్రేణులు కార్యాలయంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ ఆందోళనలో బిజద రాష్ట్ర నాయకులు భృగు బక్షిపాత్ర్, లెనిన్ మహంతి, మాజీ ఎంపీ చంద్రశేఖర్ సాహు, మాజీ మంత్రి శ్రీకాంత్ సాహు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రమేష్‌చంద్ర చ్యవుపట్నాయక్, జడ్పీ అధ్యక్షురాలు అంజలి స్వాయిన్, బీఈఎంసీ మేయరు సంఘమిత్ర దొళాయి, బిజద జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు పూర్ణచంద్ర స్వాయిన్, భగవాన్ గంతాయత్, మాజీ ఎమ్మెల్యేలు సుభాష్‌చంద్ర బెహర, మంజులా స్వాయిన్, లతికా ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు వారంతా కొమ్మాపల్లి-లంజిపల్లి రైలు పైవంతెన కూడలి నుంచి ఆర్డీసీ కార్యాలయం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఆందోళన నేపథ్యంలో బ్రహ్మపుర పోలీసు జిల్లా యంత్రాంగం భారీ బందోబస్తు చేపట్టింది.

ఎండలు మండుతాయ్.. జాగ్రత్తలు తీసుకోండి

మాట్లాడుతున్న గంజాం పాలనాధికారి కీర్తివాసన్. చిత్రంలో ఇతర అధికారులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లాలో ఈ ఏడు వేసవిలో తీవ్ర ఎండలుంటాయన్న భారత వాతావరణ అధ్యయన కేంద్రం (ఐఎండీ) ముందస్తు సూచనల నేపథ్యంలో అంతా జాగ్రత్తగా ఉండాలని గంజాం పాలనాధికారి వి.కీర్తివాసన్ పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం జిల్లా కేంద్రం ఛత్రపురంలో జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలోని రుషికుల్యా సమావేశ మందిరంలో ఎండల్ని ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యలపై సన్నాహక సమావేశం జరిగింది. దీనికి అధ్యక్షత వహించిన కీర్తివాసన్ మాట్లాడుతూ ఏ ఒక్కరూ వడదెబ్బ బారిన పడి మృతి చెందకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అన్ని ప్రభుత్వాసుపత్రులు ఆరోగ్య కేంద్రాల్లో వడదెబ్బ వార్డులు తెరవాలని చెప్పారు. జిల్లాలో నీటి ఎద్దడి ప్రాంతాల్లో సంచార వాహనాల ద్వారా తాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని సంబంధిత విభాగాల అధికారుల్ని ఆదేశించారు. ముఖ్యంగా భంజనగర్, సున్నాపురం వంటి జల క్లిష్ట ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెలాఖరులోగా దెబ్బతిన్న గొట్టపుబావుల మరమ్మతులు పూర్తి చేయాలి, మూగజీవాలకు నీళ్లు తదితర అంశాలపై ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో అదనపు పాలనాధికారి దేబదత్త పండా, బ్రహ్మపుర సబ్‌కలెక్టరు అవినాష్ కుమార్, జిల్లా ముఖ్య అభివృద్ధి అధికారి, జడ్పీ ఈవో బిజయకుమార్ బెహర, ఛత్రపురం సబ్‌కలెక్టరు శుభాశీష్ బరాల్, భంజనగర్ సబ్‌కలెక్టరు ఉమాశంకర బెహర, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నేలబావిలో పడ్డ గున్న ఏనుగు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: నేలబావిలో ఓ గున్న ఏనుగు పడిపోవడంతో అధికారులు కాపాడిన ఘటన సుందరగఢ్ జిల్లాలో చోటుచేసుకుంది. అటవీశాఖ వర్గాల సమాచారం మేరకు నువాన్ సమితి గొలదారు గ్రామం సమీపాన ఓ నేల బావిలో గున్న ఏనుగు పడిపోయింది. దీనిని గమనించిన గ్రామస్థులు అటవీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని దాన్ని కాపాడారు. జేసీబీ సాయంతో మట్టిని తవ్వి చదును చేయగా కరిరాజు సురక్షితంగా బయటపడింది. గత కొద్ది రోజులుగా గ్రామంలోని పంటలను ఈ ఏనుగు నాశనం చేస్తోందని అటవీ అధికారుల వద్ద గ్రామస్థులు మొరపెట్టుకున్నారు.

బావి నుంచి పైకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్న ఏనుగు

ఆ గ్రామంలో దెయ్యం భయం

● గ్రామానికి చేరుకున్న పంచాయతీ అధికారులు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మర్రిగూడ గ్రామాన్ని గత కొద్ది రోజులుగా దెయ్యం భయం వెంటాడుతోంది. రెండు నెలల వ్యవధిలో గ్రామానికి చెందిన ఐదుగురు చనిపోవడం, గ్రామ శివారులో ఉన్న ఓ మామిడి చెట్టు నుంచి పొగలు రావడంతో ఇది కాస్తా రెట్టింపయింది. దీనికి సంబంధించి వార్తలు సామాజిక మాధ్యమంలో చక్కర్లు కొట్టడం చర్చనీయాంశంగా మారింది. దీంతో పంచాయతీ అధికారులు, వార్డు సభ్యులు గ్రామానికి చేరుకొని గ్రామస్థులతో మాట్లాడారు. బుధవారం ఈ విషయమై 'న్యూస్‌టుడే' మర్రిగూడ చేరుకొని ఆయా అంశాలపై వివరాలు సేకరించింది. బుధవారం సాయంత్రం పంచాయతీ కార్యదర్శి బిజయ్‌కుమార్ నాయక్, వార్డు సభ్యుడు మిన్నారావు తాడంగి తదితరుల బృందం గ్రామానికి చేరుకున్నారు.

● **అసలేం జరిగింది..** గ్రామానికి చెందిన పార్వతి తాడంగి(70), కమల కిలక(38), కట్టి తాడంగి(65), మరో మూడు నెలల శిశువు, మరో వ్యక్తి వివిధ కారణాలతో రెండు నెలల వ్యవధిలో మృతిచెందారు. ఈ నేపథ్యంలో గ్రామంలో దెయ్యం సంచరిస్తోందన్న పుకార్లు రావడంతో గ్రామస్థులు భయపడి గుంపులు గుంపులుగా సంచరిస్తూ పనులు చేసుకుంటున్నారు.

గ్రామస్థులతో మాట్లాడుతున్న బిజయ్‌కుమార్

● **అవన్నీ పుకార్లే...** ఈ విషయమై వార్డు సభ్యుడు మిన్నారావు తాడంగి 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ గ్రామంలో దెయ్యం సంచరిస్తుండటం వాస్తవం కాదని, అవన్నీ పుకార్లని కొట్టిపారేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా కొందరు వార్తలు ప్రసరించడంతో మర్రిగూడపై లేనిపోని అపోహలు నెలకొన్నాయన్నారు. గ్రామస్థులకు నచ్చజెప్పామని, ఇలాంటి వాటిని అసలు నమ్మొద్దని చెప్పామన్నారు.

వేదాంత చొరవతో గ్రామాలకు రక్షిత నీరు

● రాయగడ, కలహండిలో 3 వేలకుపైగా గ్రామాలకు సౌర విద్యుత్తు బోరుబావులు

సౌరవిద్యుత్ బోరుబావి వద్ద ప్రతినిధులు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: వేదాంత అల్యూమినా పరిశ్రమ చొరవతో వేలాది గ్రామాలకు రక్షిత తాగునీరు సమకూరుతోంది. రాయగడ, కలహండి జిల్లాల్లో 3 వేలకు పైగా గ్రామాలకు సౌరవిద్యుత్తుతో నడిచే బోరుబావులను ఏర్పాటు చేశారు. చులబడి, సుంగేర్, ధామస్ ఘాటి, డుమేర్‌పొదర్, సొగబారి, సియాదిమల్ తదితర చోట్ల ఏర్పాటు చేసిన వీటితో ఆయా గ్రామాలకు లబ్ధి చేకూరుతోంది. ఒక్కో బోరుబావిని 1.5 కె.వీ. సౌరవిద్యుత్ యూనిట్‌తో ఏర్పాటు చేయగా, దీనికి 1 హెచ్‌పీ సామర్థ్యం గల మోటార్‌ను అమర్చినట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. గంటకు 500 లీటర్ల చొప్పున నీటిని శుద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నాయి. ఈ విషయమై వేదాంత సీఈఓ రాజీవ్‌కుమార్ మాట్లాడుతూ శుద్ధి తాగునీరు, పరిశుభ్ర వాతావరణ పరిస్థితులు కల్పించడం ద్వారా ఆయా గ్రామాల్లో ఆరోగ్యకర వాతావరణం నెలకొంటుందన్నారు. సుంగేర్ గ్రామ పంచాయతీ సర్పంచి గుణసింగ్‌మాఝి స్పందిస్తూ మా ప్రాంతంలో భూగర్భజలాలు అధిక ఇనుమును కలిగి ఉన్నాయన్నారు. సౌరవిద్యుత్ బోరుబావుల వల్ల రక్షిత తాగునీరు సమకూరుతోందన్నారు.

రవుర్కెలాలో 500 కిలోల గంజాయి స్వాధీనం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: పొరుగు రాష్ట్రాలకు అక్రమంగా రవాణా చేస్తున్న 500 కిలోలకు పైగా గంజాయిని రవుర్కెలా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్లాంట్ సైట్ పోలీసుస్టేషన్ పరిధిలో మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బొండాముండా రహదారిలో అనుమానాస్పదంగా కనిపించిన ఐదు కార్లను ఆపి పోలీసులు తనిఖీ చేశారు. దీంతో ఆ వాహనాల్లో 502 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. కొంధమాల్-బౌద్ధ్ ప్రాంతం నుంచి ఈ సరకును ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌లకు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. ఎస్సై ఎస్.ప్రధాన్ నేతృత్వంలో పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకొని, ఆరుగురి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో గుణానిధి ఘూసి(36), సుకాంత్ ఓరం(37), రాహుల్‌కుమార్ సాహు(25), నిఖిల్ రే(23), కౌశిక్‌కుమార్ పాడి(31), నీరజ్ సొంకర్(24) ఉన్నారు. వీరిలో నీరజ్, నిఖిల్‌పై గతంలో క్రిమినల్ కేసులున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. నిందితుల నుంచి ఐదు కార్లు, 8 చరవాణులు, రూ.2,300 నగదును స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల అదుపులో నిందితులు

మాజీ పీఈఓకు మూడేళ్ల జైలుశిక్ష

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: విజిలెన్స్ కేసులో అరెస్టయిన పంచాయతీ మాజీ కార్యనిర్వాహక అధికారి(పీఈఓ)కి భవానీపట్న ప్రత్యేక విజిలెన్స్ న్యాయస్థానం మూడేళ్ల జైలు శిక్షను విధించింది. కోర్టు వర్గాల సమాచారం మేరకు కలహండి జిల్లా టి.రాంపూర్ సమితి గోపాల్‌పూర పంచాయతీ పీఈఓగా క్షమాప్రసాద్ దురియా గతంలో విధులు నిర్వహించేవారు. ఆ సమయంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) కింద రూ. 20 వేలు బకాయి బిల్లు చెల్లించేందుకు బాధిత లబ్ధిదారుని నుంచి రూ. 6 వేలు లంచం తీసుకుంటూ దురియా విజిలెన్స్ అధికారులకు చిక్కారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం దురియాకు మూడేళ్ల సాధారణ కారాగార శిక్షతో పాటు రూ.50 వేల జరిమాన విధిస్తూ తీర్పునిచ్చింది.

రథయాత్ర మధురస్మృతులు మిగల్చాలి

● సీఎస్ అనూగార్గ్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఈ ఏడాది (2026) విశ్వప్రసిద్ధ పూరీ జగన్నాథుని రథయాత్ర మధురస్మృతులు మిగల్చాలని, అపశ్రుతులకు తావీయొద్దని, భక్తులకు దివ్యానుభూతి మిగల్చాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) అనూగార్గ్ చెప్పారు. మంగళవారం రాత్రి భువనేశ్వర్‌లోని లోక్‌సేవా భవన్‌లో సీఎస్ అధ్యక్షతన రథయాత్ర సమన్వయం సంఘం సమావేశం జరిగింది. కార్యక్రమంలో శ్రీక్షేత్ర పాలనాధికారి అరవిందకుమార్‌పాఢి, డీజీపీ యోగేష్ బహదూర్ ఖురానియా, ఇతర ప్రభుత్వ శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శులు, పూరీ పాలనాధికారి దివ్యజ్యోతి పరిడ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ సిద్ధం

రథయాత్రలో అపశ్రుతులు పునరావృతం కాకుండా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. దీన్ని ప్రభుత్వ శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శులు, డీజీపీ ఎప్పటికప్పుడు సమీక్షించి ఏర్పాట్లు పర్యవేక్షిస్తారు. మంచినీటి సరఫరా, వసతి, రాకపోకలు, పారిశుద్ధ్యం, కల్తీ, ఆహార సామగ్రి, విక్రయాలపై నిఘా, భక్తుల సౌకర్యాలు, భద్రతకు ప్రాధాన్యతిస్తారు. కీలకమైన పురుషోత్తముని సేవలన్నీ నిర్ణీత వేళల్లో జరిగేలా ప్రత్యేక సంఘం ఏర్పాటవుతుంది. 70 చోట్ల ఎల్‌ఈడీ స్క్రీన్ల ద్వారా యాత్ర ప్రసారం చేస్తారు. బొడొదండొలో 50 హైమాస్ట్ దీపాలు అదనంగా ఏర్పాటు చేస్తారు. యాత్రకు ముందుగా శ్రీక్షేత్రం నుంచి గుండిచా ఆలయం వరకు సీసీ కెమెరాలను 'ఒకాక్' సంస్థ ఏర్పాటు చేస్తుంది. ట్రాఫిక్ నియంత్రణకు ఈసారి ప్రత్యేక బలగాలుంటాయి. వాహనాల పార్కింగ్ స్థలాలు ముందస్తుగా సిద్ధం చేస్తారు. రైల్వేస్టేషన్‌లో టికెట్ బుకింగ్ కౌంటర్లు అదనంగా ఏర్పాటు చేయాలని రైల్వేశాఖకు తెలియపరుస్తారు. రథాల కార్డన్ ఈసారి మరింత పటిష్ఠం చేస్తారు. జగన్నాథుని పొహండి, రథాలు లాగే సమయంలో ఆయాచోట్ల ప్రత్యేక సురక్షా వాహినీ జవానులుంటారు. మాస్టర్ ప్లాన్‌లో ఈ అంశాలన్నిటికీ ప్రాధాన్యతిచ్చారు.

తరచూ సమీక్ష

యాత్ర నిర్వహణకు సంబంధించి సీఎస్ ఇక తరచూ అధికారులతో సమీక్షిస్తారు. పూరీ వెళ్లి ఏర్పాట్లు పర్యవేక్షిస్తారు. జులై 12న రథయాత్ర, 24న బహుడా(తిరుగుయాత్ర), 25న సున్నాభెషా, 26న అధరపొణా, 27న నీలాద్రి బిజె వేడుకలు జరుగుతాయి. ఈ వేడుకలన్నీ సవ్యంగా చేపట్టడానికి సిద్ధం చేసిన మాస్టర్‌ప్లాన్ కట్టుదిట్టంగా అమలుపర్చాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. సమావేశానంతరం అనూగార్గ్ విలేకర్లతో మాట్లాడుతూ లోపాలకు తావీయకుండా ఘోషయాత్ర చేపట్టడానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

అధికారులతో మాట్లాడుతున్న సీఎస్ అనూగార్గ్. చిత్రంలో డీజీపీ ఖురానియా

(c) eenadu

విద్యా ప్రమాణాలతో భంజవిహార్ గుబాళించాలి

గోపాలపూర్, న్యూస్‌టుడే: విద్యాప్రమాణాలతో బ్రహ్మపుర విశ్వవిద్యాలయం(భంజవిహార్) గుబాళించాలని, జాతీయస్థాయిలో టాప్ హండ్రెడ్ వర్సిటీల్లో గుర్తింపు పొందాలని వీసీ ఆచార్యిణి గీతాంజలి దాస్ చెప్పారు. భంజవిహార్ స్నాతకోత్తర(పీజీ) విభాగాల వార్షికోత్సవం మంగళవారం రాత్రి ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ మాట్లాడుతూ దక్షిణ ఒడిశా జిల్లాల్లో విజ్ఞాన జ్యోతులు వెలిగించడంలో నిరంతరం శ్రమిస్తున్నామని, ముఖ్యంగా ఆదివాసీ యువతీ యువకుల రాణింపే ధ్యేయంతో వారికి ఉచిత విద్య, ఉపకార వేతనాలు, వసతి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీజీ కౌన్సిల్ అధ్యక్షుడు ఆచార్య సుకాంత్ కుమార్ త్రిపాఠి, విద్యార్థుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆచార్య గణేష్‌సేథి, రిజిస్ట్రార్ సచ్చిదానంద నాయక్, సెక్షన్ అధికారి డాక్టర్ మిహిర్ కుమార్ త్రిపాఠి, జర్నలిజం విభాగాధికారిణి డాక్టర్ చిన్మయి బొహిదార్ తదితర ప్రముఖులు ప్రసంగించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

విద్యార్థుల ఆధునిక నృత్యం

విజేతలుగా కటక్.. కిట్ జట్లు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: కటక్ జిల్లా అథ్లెటిక్ సంఘం, బారాబటి కబడ్డీ క్లబ్ తరఫున మూడు రోజులు నిర్వహించిన డాక్టర్ శరత్ కుమార్ స్మారక 73వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో కటక్, కిట్ జట్లు ఛాంపియన్లుగా నిలిచాయి. జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన పురుషుల విభాగం తుదిపోరులో కటక్ జట్టు 37-12 పాయింట్లతో ఢెంకనాల్ జట్టుపై గెలుపొందింది. మహిళా విభాగంలోని తుది పోరులో కిట్ విశ్వవిద్యాలయం జట్టు 48-10 పాయింట్లతో ఖుర్దాను ఓడించి విజేతగా నిలిచింది. ఆయా మ్యాచుల్లో కరుణాకర్ బెహరా, సౌమ్య దాస్ ఉత్తమ క్రీడాకారులుగా నిలిచారు. అదనపు పాలనాధికారి కమలేశ్ దాస్ తదితరులు అతిథులుగా పాల్గొని, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

పురుషుల ఛాంపియన్ ట్రోఫీతో కటక్ జట్టు క్రీడాకారులు

మహిళా ఛాంపియన్ బహుమతితో కిట్ క్రీడాకారిణులు

మత్స్య ఉత్పత్తులకు కేంద్రం ప్రోత్సాహకాలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: మత్స్య ఉత్పత్తులకు కేంద్రం అన్నివిధాలా ప్రోత్సహిస్తోందని, మత్స్యకారులకు రాయితీలు అందిస్తున్నట్లు కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పారు. మంగళవారం రాత్రి సంబల్‌పూర్‌లో మత్స్య ఉత్పత్తుల మూడురోజుల మేళా ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ధర్మేంద్ర మాట్లాడుతూ ఒడిశాలో సముద్రం, నదులు, రిజర్వాయర్లు, చెరువుల్లో చేపల ఉత్పత్తి జరుగుతోందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కార్యక్రమాలు అమలు చేస్తున్న నేపథ్యంలో మత్స్యకారులు అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి రబినారాయణ నాయక్, సంబల్‌పూర్ జిల్లా పాలనాధికారి సిద్ధేశ్వర్ బలిరామ్ బొండార్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత్స్య ఉత్పత్తుల్లో రాణించిన వారికి వేదికపై సన్మానించారు. ఈ మేళాలో ఫిషరీస్, మెరైన్‌శాఖ నిపుణులు మత్స్యకారులకు సమగ్ర అవగాహన కల్పిస్తున్నారు. గురువారం కూడా కొనసాగుతుంది.

మేళా ప్రారంభిస్తున్న ధర్మేంద్ర. చిత్రంలో అతిథులు, అధికారులు

నేటి నుంచి ఏడీసీఏ టీ 20 ఆసియా కప్ క్రికెట్ టోర్నీ

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: భారత బధిరుల క్రికెట్ సంఘం (ఏడీసీఏ) సౌజన్యంతో ఆసియా బధిరుల క్రికెట్ సంఘం (ఏడీసీఏ) ఆధ్వర్యంలో కటక్‌లో గురువారం నుంచి ఏడీసీఏ టీ 20 ఆసియా కప్-2026 క్రికెట్ టోర్నీ ప్రారంభంకానుంది. ఈ మేరకు బుధవారం సాయంత్రం కటక్ బారాబటి స్టేడియంలో విలేకరుల సమావేశం జరిగింది. ఇందులో ఏడీసీఏ సంచాలకురాలు రోమా బల్వానీ మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 25 వరకు నిర్వహిస్తున్న ఇందులో భారత్, శ్రీలంక, నేపాల్ జట్లు తలపడుతున్నట్లు చెప్పారు. కొద్ది రోజులుగా ఆయా జట్ల క్రీడాకారులు భువనేశ్వర్‌లోని కిట్ క్రికెట్ మైదానంలో ముమ్మర సాధన చేశారన్నారు.

మాట్లాడుతున్న రోమా బల్వానీ. చిత్రంలో జట్ల కెప్టెన్లు తదితరులు

తలపడనున్న భారత్, శ్రీలంక, నేపాల్ జట్లు

పోలీసుల స్వచ్ఛంద రక్తదానం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపుర పోలీసు జిల్లా ఆధ్వర్యంలో బుధవారం నగర శివారు అంబపువాలోని రిజర్వు పోలీసు కార్యాలయ ఆవరణలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం జరిగింది. దక్షిణ మండల ఐజీ నితీ శేఖర్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించి, రక్తదానం చేశారు. దీన్ని పర్యవేక్షించిన బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ ఎం. కూడా పాల్గొని రక్తదానం చేశారు. మొత్తం 60 యూనిట్ల రక్తం సేకరణ జరిగింది. రక్తదాతలకు ఐజీ నితీ శేఖర్, ఎస్పీ శరవణ వివేక్ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

శిబిరంలో రక్తదానం చేస్తున్న దాత. చిత్రంలో దక్షిణ మండల ఐజీ నితీ శేఖర్, బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ తదితరులు

రుషికుల్యా నదిని కాపాడుకోవాలంటూ పాదయాత్ర

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా జీవనదిగా ఖ్యాతిగాంచిన రుషికుల్యాలో అక్రమ ఇసుక తవ్వకాలతో అది బక్కచిక్కిందని, దీన్ని కాపాడుకుందామని, నది ఎగువ ప్రాంతంలో పిపలపంక వద్ద ప్రభుత్వం తలపెట్టిన డ్యామ్ నిర్మాణం వద్దంటూ రుషికుల్యా నది సంరక్షణ క్రియాశీలక కమిటీ కోరింది. కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో రుషికుల్యా నది ప్రవహిస్తున్న ప్రాంతాల్లో కమిటీ ప్రతినిధులు చైతన్య పాదయాత్రలు చేస్తూ ప్రజలతో సమావేశమై వారిని చైతన్యపరుస్తున్నారని కమిటీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.

గ్రామస్థులతో సమావేశమైన కమిటీ ప్రతినిధులు

బీడీవో కార్యాలయంలో రగడ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఖుర్దా జిల్లా బోలగఢ బీడీఓ కార్యాలయంలో బుధవారం రగడ జరిగింది. జడ్పీ సమితి సభ్యులు, సర్పంచులు, వార్డు సభ్యులు కార్యాలయంలోకి చొచ్చుకొచ్చారు. బీడీఓ సుమన్ సుధాలుడు నిరంకుశ వైఖరికి నిరసనగా నినాదాలు చేశారు. పోలీసులు చేరుకొని పరిస్థితి నియంత్రణలోకి తెచ్చారు.

హరిబాబుతో సురేష్ భేటీ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రెవెన్యూ, విపత్తుల నియంత్రణ శాఖల మంత్రి సురేష్ పూజారి బుధవారం భువనేశ్వర్‌లోని లోక్‌సేవా భవన్‌లో గవర్నరు కంభంపాటి హరిబాబును మర్యాదపూర్వకంగా కలుసుకుని, కొద్దిసేపు ముచ్చటించారు.

గవర్నరు హరిబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి సురేష్

మళ్లీ ఎమ్మెసీజీకి మాజీ ఎమ్మెల్యే బిక్రం పండా

ఆసుపత్రిలో పరామర్శించేందుకు వచ్చిన బిజద నాయకులతో మాట్లాడుతున్న బిక్రం పండా

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపుర మండల కారాగారంలో ఉన్న బ్రహ్మపుర మాజీ ఎమ్మెలే బిక్రం కుమార్ పండా మళ్లీ ఎమ్మెసీజీ ఆసుపత్రిలో చికిత్సకు చేరారు. మంగళవారం రాత్రి ఆయన మళ్లీ అస్వస్థతకు గురవడంతో సుమారు 11 గంటల సమయంలో పోలీసులు ఆయనను గట్టి భద్రత మధ్య కారాగారం నుంచి ఎమ్మెసీజీ అత్యవసర విభాగంలో చేర్చారు. పండాకు ఆరోగ్య పరీక్షలు చేసిన వైద్యులు సర్జరీ విభాగం లోపలి వార్డులో చేర్పించారు. బుధవారం ఆయనకు రక్తం, అల్ట్రాసౌండ్ పరీక్షలు నిర్వహించారు. బిజద నాయకులు భృగు బక్షిపాత్ర్, లెనిన్ మహంతి, శ్రీకాంత్ సాహు, తుంబనాథ్ పండా, పూర్ణ చంద్ర స్వయిన్ తదితరులు మధ్యాహ్నం ఆసుపత్రిలో పండాను పరామర్శించి, ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

గజరాజుకు జీపీఎస్ పరికరం అమరిక

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్ పరిధిలోని చందకా, భరత్‌పూర్ అటవీ ప్రాంతంలో ఆందోళన సృష్టిస్తున్న గజరాజు పోలంకను అటవీ సిబ్బంది మంగళవారం రాత్రి మత్తు ఇంజెక్షన్ ఇచ్చి ఏనుగుల సంరక్షణ కేంద్రానికి తరలించారు. దీనికి జీపీఎస్ పరికరం అమర్చుతామని, దీంతో అది ఎక్కడ ఉందో గుర్తించేందుకు అవకాశం ఉంటుందని పీసీసీఎఫ్ కె.మురుగేశన్ బుధవారం భువనేశ్వర్‌లో విలేకర్లకు చెప్పారు.

ట్రాంక్విలైజ్ అయిన గజరాజు పోలంక

ఖేలో ఇండియా కుస్తీలో అజిత్‌కు పతకం

అజిత్‌ను అభినందిస్తున్న సంఘం ప్రతినిధులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: బిలాస్‌పూర్ (ఛత్తీస్‌గఢ్)లోని బీఆర్ యాదవ్ స్పోర్ట్స్ స్టేడియంలో కొనసాగుతున్న ఖేలో ఇండియా ఆదివాసీ క్రీడల్లో రాష్ట్ర క్రీడాకారుడు అజిత్ భుయ్యా సత్తా చాటాడు. ఇందులో మంగళవారం జరిగిన పోటీల్లో 57 కిలోల కేటగిరీలో కుస్తీలో పోటీపడిన అజిత్ విజేతగా నిలిచి పసిడి పతకం గెలుచుకున్నాడు. రాష్ట్ర క్రీడా శాఖ ఆయా వివరాలను 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది.

మహిళా వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం

బ్రహ్మపుర బజారు, న్యూస్‌టుడే: బ్రహ్మపుర మహిళా వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం మంగళవారం రాత్రి జరిగింది. స్థానిక మంగళవారం పేటలో ఏర్పాటైన ఇందులో ముఖ్య అతిథిగా బీఈఎంసీ మేయరు సంఘమిత్ర దొళాయి, గౌరవ అతిథులుగా వైద్యులు ఈపరి పద్మనాభరావు, ఈపరి జయంతి రావు, క్లబ్ జిల్లా అధ్యక్షుడు ఆర్‌కే స్వయిన్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన కార్యవర్గ సభ్యులు. చిత్రంలో మేయరు దొళాయి తదితరులు

భువనేశ్వర్‌లో ఇంజినీర్ల శిక్షణ శిబిరం

వేదికపై మంత్రులు హరిచందన్, రబినారాయణ, ఇంజినీర్ ఇన్ చీఫ్‌లు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని నిర్మాణ భవన్‌లో బుధవారం ఇంజినీర్ల శిక్షణ శిబిరం జరిగింది. కార్యక్రమంలో మంత్రులు పృథ్వీరాజ్ హరిచందన్(ప్రజాపనులు), రబినారాయణ నాయక్(పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి)లు పాల్గొని రాష్ట్ర నిర్మాణంలో ఇంజినీర్లు విశ్వకర్మలు అని, సమృద్ధ ఒడిశా ధ్యేయం నెరవేర్చడానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఇంజినీర్ ఇన్‌చీఫ్‌లు సత్యవ్రత బెహర, ప్రదీప్‌కుమార్ జెనా పాల్గొన్నారు.

ముగిసిన పోలీసు క్రికెట్ పోటీలు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: గౌహతిలోని మాలేగావ్‌లో ఎన్‌ఎఫ్ రైల్వే స్టేడియంలో ఆల్ ఇండియా టీ20 పోలీస్ క్రికెట్ పోటీలు ఇటీవల ముగిశాయి. ఇందులో పశ్చిమ బెంగాల్ పోలీస్ క్రికెట్ జట్టు అద్భుతమైన నైపుణ్యం కనబరిచింది. అస్సాం రైఫిల్స్, మణిపూర్ పోలీస్, ఇంటెలిజెన్స్ బ్యూరో తదితర జట్లు పాల్గొన్నాయి.

నిర్ణీత వ్యవధిలో పనులు పూర్తిచేయాలి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: వికసిత్ ఒడిశాలో ప్రాజెక్టులు, రోడ్ల పనులు కీలకమని, ఇవి నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని, నిధులు సకాలంలో ఖర్చు చేయాలని, నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు తగ్గకుండా చూడాలని ప్రజాపనులు, న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం రాత్రి భువనేశ్వర్‌లోని లోక్‌సేవా భవన్‌లో మంత్రి హరిచందన్ అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. రూ.320 కోట్ల వ్యయంతో చేపట్టిన భువనేశ్వర్‌లోని ఏకామ్ర క్షేత్రం విస్తరణ ప్రాజెక్టు పనులు ఈ సంవత్సరాంతంలోగా పూర్తి చేయాలన్న ధ్యేయం నెరవేర్చడానికి చిత్తశుద్ధి కనపర్చాలన్నారు. పూరీ శ్రీక్షేత్రానికి సంబంధించిన ఒబడా ప్రాజెక్టు, సంబల్‌పూర్ శామలాయి క్షేత్ర విస్తరణ, ఆధునికీకరణ, ఢెంకనాల్ జిల్లా జురొండాలోని మహిమా పీఠం, బాణపూర్ భగవతి అమ్మవారి ఆలయాభివృద్ధి పనులన్నీ డిసెంబరు నాటికి పూర్తి చేయాలని సూచించారు.

పనుల ప్రగతిపై ఇంజినీర్లతో మంత్రి హరిచందన్ సమీక్ష

అడవులను రక్షిద్దాం

జయపురం, న్యూస్‌టుడే: అడవులను అగ్ని ప్రమాదాల నుంచి రక్షిద్దామంటూ అటవీ శాఖ అధికారులు పిలుపునిచ్చారు. జయపురం అటవీ శాఖ కార్యాలయం ప్రాంగణంలో రేంజర్ సుబేందుకుమార్ బెహరా అధ్యక్షతన బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు.

న్యాయవాదుల ఆందోళన

బరగఢ్, న్యూస్‌టుడే: జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తూ బరగఢ్ జిల్లా న్యాయవాదుల సంఘం ప్రతినిధులు బుధవారం సంబంధిత ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేశారు.

కలెక్టర్‌ను కలిసిన పారామెడికల్ ఉద్యోగులు

నవరంగపూర్, న్యూస్‌టుడే: జీతాలు పెంచాలంటూ నవరంగపూర్ పారామెడికల్ ఉద్యోగులు బుధవారం పాలనాధికారి డా. మహేశ్వర్ స్వయిన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర పారామెడికల్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు రాకేష్‌కుమార్ బెహరియా నేతృత్వంలో లేఖను అందజేశారు.

బరగఢ్‌లో సుభద్రశక్తి మేళా ప్రారంభం

బరగఢ్, న్యూస్‌టుడే: బరగఢ్ జిల్లాలో మహిళా సాధికారిత లక్ష్యంగా నిర్వహిస్తున్న సుభద్రశక్తి మేళాను మంగళవారం ప్రారంభించారు. ఈ మేళాను బరగఢ్ ఎంపీ ప్రదీప్ పురోహిత్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బరగఢ్ కలెక్టర్ ఆదిత్య గోయల్, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు మనీనీ బోయి తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మేళా ప్రారంభిస్తున్న బరగఢ్ ఎంపీ ప్రదీప్ పురోహిత్

ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన

రాయగడ, న్యూస్‌టుడే: జేకే పేపర్ మిల్లు యాజమాన్యం సీఎస్ఆర్ కార్యకలాపాల్లో భాగంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరిస్తూ జిల్లాలో 23 పాఠశాలల్లో అవగాహన శిబిరాలు నిర్వహించారు. బుధవారం జరిగిన శిబిరంలో 4,060 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. పరిశ్రమ నాణ్యతా విభాగం మేనేజర్ దిలీప్ త్రిపాఠి, సీఎస్ఆర్ అధికారులు హరిహర ఖమారి, బ్రహ్మానంద మహాపాత్ర్ పాల్గొన్నారు.

హాజరైన విద్యార్థులు, నిర్వాహకులు

వేడుకుంటున్నాం: వసతులు కల్పించండి

కలెక్టరేట్ వద్ద పర్శాలి గ్రామ డొంగిరియా ప్రజలు

రాయగడ, న్యూస్‌టుడే: జిల్లాలోని కే.సింగపూర్ సమితి పర్శాలి పంచాయతీ పరిధి కొదర్, పరాంగ పొదర్, దర్గామతి, గుమ్మ, లాంగ, గ్రామాల ప్రజలు బుధవారం కలెక్టరేట్‌కు చేరుకొని పాలనాధికారి అశుతోష్ కులకర్ణికి వినతిపత్రం అందజేశారు. డొంగిరియా కొంధ ఆదివాసీలు స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా తమ గ్రామాలు విద్యుత్ సౌకర్యానికి నోచుకోక చీకటిలో మగ్గుతున్నాయన్నారు. తాగునీరు తదితర వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.

వృద్ధుల రక్షణ సామాజిక బాధ్యత

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: వృద్ధుల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతను రెవెన్యూ ఏడీఎం మునీంద్రా హన్నగా అన్నారు. బుధవారం పట్టణంలోని గ్రామీణ ఉపాధి శిక్షణ భవనంలో జిల్లా సామాజిక భద్రత శాఖ ఆధ్వర్యంలో అటల్ వాయొ అభ్యుదయ యోజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న హన్నగా మాట్లాడుతూ వయోవృద్ధుల చట్టం-2007పై అందరికి అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను సూచించారు.

మాట్లాడుతున్న రెవెన్యూ ఏడీఎం మునీంద్రా హన్నగ

మద్యం విక్రయాలొద్దు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా టెంటులిఖుంటి సమితి కంగ్రా పంచాయతీలో మద్యం విక్రయాలను పూర్తిస్థాయిలో నిలిపివేసేందుకు మహిళలు నడుం బిగించారు. పంచాయతీలో ఉన్న 15 దుకాణాలను మూసివేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం అదనపు పాలనాధికారి తపన్‌కుమార్ ఖుంటియాకు వినతిపత్రాన్ని అందజేశారు.

అదనపు పాలనాధికారికి వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

స్వచ్ఛ సర్వేక్షన్‌లో రాయగడ నిలవాలి

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: జాతీయ స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షన్ 2026 అవార్డును రాయగడ సొంతం చేసుకోవాలని కలెక్టర్ అశుతోష్ కులకర్ణి ఆకాంక్షించారు.

కాలువ పనులు చేపట్టండి

కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రూపేష్

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆరో వార్డు ప్రాంతంలో ఉన్న కాలువను ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రహి బుధవారం పరిశీలించారు. ముఖ్యంగా పట్టణంలో మురుగునీరు నేరుగా ఈ ప్రాంతానికి చేరుకోవడంతో ఇలా జరుగుతుందని తెలిపారు. చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఎరువుల కొరత...రైతుల నిరసన

బరగఢ్, న్యూస్‌టుడే: జిల్లాలో రబీ సాగు సీజన్లో ఎరువుల కొరత తీవ్రంగా ఉంది. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని రైతులు ఆరోపిస్తు నిరసన చేశారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

పల్లకిలో ఊరేగింపు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణ చత్తిస్‌పాడా శ్రీ ప్రసన్న కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవస్థాన 39వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేకువన పల్లకిలో ఉత్సవ విగ్రహాలు ఉంచి పూజలు నిర్వహించి ఊరేగించారు.

ఖరగ్‌పూర్‌లో ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఖరగ్‌పూర్‌లో మొట్టమొదటసారి నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ మార్చి 20 నుంచి 22 వరకు నిర్వహిస్తామని రాధారాణి ఫిలిమ్స్ మంగళవారం ప్రకటించింది.

పారిశుద్ధ్యం నిర్వహణపై సమీక్ష

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పురపాలక పరిధిలో ప్రస్తుతం ఉన్న పారిశుద్ధ్య వ్యవస్థ నిర్వహణ ఏజెన్సీ టెండర్ నేటితో ముగిసింది. ఈమేరకు బుధవారం కొత్త టెండర్ పిలుపునకు సంబంధించి సబ్‌కలెక్టర్ సస్యరెడ్డి నేతృత్వంలో సమీక్షా సమావేశం జరిగింది.

రక్తదాన శిబిరం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: నారాయణ పట్టణానికి చెందిన విద్యుత్ శాఖ, ఆమో ఒడిశా, సంబద్ దిన పత్రికలు సంయుక్తంగా సమితి కేంద్రంలో మిషన్‌శక్తి భవనంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.

మత్స్య పరిశ్రమ అభివృద్ధికి పెద్దపీట

కొరాపుట్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో స్థానిక నైపుణ్య అభివృద్ధి కేంద్రం వద్ద 5 రోజుల మత్స్య, అటవీ శాఖల ప్రదర్శన అవగాహన శిబిరాన్ని బుధవారం ఛైర్మన్ సుస్మితా మెలక ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. మత్స్య అభివృద్ధికి కృషి చేస్తామని ఆమె అన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: మిడ్నాపూర్-కేస్‌పూర్ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. మరో మహిళ గాయపడిందని పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కేస్‌పూర్ బాలికల పాఠశాల ఉపాధ్యాయిని రూపా ప్రమాణిక్ (44) ముడాల్కా పాఠశాలలో జరుగుతున్న హెచ్ఎస్ పరీక్షలకు ఇన్విజిలేటర్‌గా వెళ్లింది. ఆమెతో పనిచేసే మరో ఉపాధ్యాయిని కంకణా సంత్రా(49) వీరితో ఉన్నారు. వీరు తిరుగు ప్రయాణంలో ఎదురుగా వస్తున్న ట్రక్కు బలంగా వీరి వాహనాన్ని ఢీకొంది. దీంతో రూపా ప్రమాణిక్(44), వ్యాన్ చోదకుడు అబూ నాసిర్ అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు తీవ్రంగా గాయపడ్డ కంకణా సంత్రాకు మిడ్నాపూర్ వైద్య కళాశాల ఆసుపత్రిలో చేర్చారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందు తాగి యువకుడి ఆత్మహత్య

జయపురం, న్యూస్‌టుడే: పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జయపురం సమితిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పంపుణి ప్రాంతానికి చెందిన భగవాన్‌గౌడ్(30) మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. కుటుంబీకులు ఇంటికి వచ్చేసరికి స్పృహ కోల్పోయి ఉన్నాడు. వెంటనే జిల్లా ప్రధానాసుపత్రికి తరలించగా, వైద్యుల సూచన మేరకు కొరాపుట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. పరీక్షల అనంతరం పోలీసులు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పశ్చిమ మిడ్నాపూర్ జిల్లా దాంతన్ పరిధి సూరాయి ప్రాంతంలో ఇసుక లోడుతో వెళుతున్న డంపర్ వాహనం నియంత్రణ కోల్పోవడం వల్ల రోడ్డు పక్కన ఆగి ఉన్న ఒక ట్రక్కును ఢీకొంది. ఈ ఘటనలో ఒకరు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. ముగ్గురు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు.

నదిలో దూకి యువతి ఆత్మహత్య

బరగఢ్, భువనేశ్వర్, న్యూస్‌టుడే: సంబల్పూర్ జిల్లా బుర్లా ప్రాంతంలో ఓ మహిళ మహానది లోకి దూకి ప్రాణాలు కోల్పోయింది. ఆమెను ఆత్మహత్య చేసుకోకుండా ఆపేందుకు స్థానికులు ప్రయత్నించినప్పటికీ ఆమె తీవ్ర రోదనతో నదిలోకి దూకిందని ప్రత్యక్ష సాక్ష్యులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది నదిలో గాలింపు చేపట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతురాలు బుర్లా ప్రాంతానికి చెందిన అంజు కంబార్డ్ అని పోలీసులు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు ప్రాథమిక విచారణ అనంతరం కుటుంబ కలహాలే కారణమని భావిస్తున్నారు.


ఆత్మహత్యకు ముందు

త్రుటిలో తప్పిన ప్రమాదం

జయపురం, న్యూస్‌టుడే: రక్షణ గోడను ఢీకొని కెనాల్‌లో కారు బోల్తాపడిన ఘటన కొరాపుట్ జిల్లా కొట్పాడ్ సమితిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగదల్‌పూర్ నుంచి జయపురానికి వస్తున్న కారు మిరిగూడ వంతెన వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. వాహన చోదకుడు ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఘటనా స్థలానికి చేరుకొని పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

కటక్‌లో యువకుని హత్య

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కటక్ మధుపట్న పరిధిలోని ప్రెస్‌కాలనీలోని ఒక క్లబ్‌లో కొంత మంది యువకులు బుధవారం సాయంత్రం పార్టీ చేసుకుంటున్న సమయంలో గుర్తు తెలియని యువకుడొకడు వచ్చి సౌమ్యరంజన్ జెనా(25)పై పిస్తోలుతో కాల్పులు జరిపి పరారయ్యారు. ఈ హఠాత్పరిణామానికి నిర్ఘాంతపోయిన యువకులు నేలకొరిగిన జెనాను వెంటనే ఎస్సీబీ ఆసుపత్రిలో చేర్పించినా ఫలితం లేకపోయింది. ఆయన మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. ఈ ఘటన గురించి తెలిసిన మధుపట్న ఠాణా పోలీసులు నిందితుని కోసం గాలిస్తున్నారు.

రైలు పట్టాల సమీపాన మహిళ మృతదేహం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: నగర శివారున ఖొడాసింగిలోని రైలు పట్టాల సమీపాన బుధవారం వేకువన ఓ మహిళ మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న బ్రహ్మపుర జీఆర్పీ ఠాణా అధికారులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పరీక్షకు ఎమ్కేసీజీ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు స్థానిక బి.ఎన్.పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో గజపతినగర్ ప్రాంతానికి చెందిన రాజలక్ష్మీ సాహు (48)గా గుర్తించారు. స్థానిక ఎమ్కేసీజీ వైద్య కళాశాల ఆసుపత్రిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగినిగా ఆమె పని చేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. మంగళవారం రాత్రి ఆసుపత్రిలో విధుల్లో ఉన్న ఆమె బయటకు వెళ్లగా, అర్ధ రాత్రి తర్వాత రైలు పట్టాల వద్ద ఆమె మృతదేహం వెలుగు చూసింది. ఈ ఘటనలో ఓ యువకుడు కూడా గాయపడగా, ఆయనను చికిత్సకు ఆసుపత్రిలో చేర్పించారు. ఆ యువకుడు ఎవరు? ఆమె ఖొడాసింగి వరకూ ఎందుకు వెళ్లింది? తదితరాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సీనియర్ జర్నలిస్ట్ కన్నుమూత

బరగఢ్, న్యూస్‌టుడే: పశ్చిమ ఒడిశాలో హిందీ జర్నలిజం రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ శివప్రసాద్ మెహర్ బుధవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మరణం పట్ల జర్నలిజం రంగం తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది.

హత్య సంఘటనలో ఇద్దరి అరెస్టు

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి ఠాణా ఎం.వి.16 గ్రామంలో గత ఫిబ్రవరి 4వ తేదిన ఓ యువకుడి మృతదేహం లభ్యమైన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. మృతుడు, నిందితులు స్నేహితులే అని బాధితుడు భార్య విషయంలో కలహాల వల్ల హత్య జరిగిందని పోలీసులు తెలిపారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: జయపురం విక్రమ్‌దేవ్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన అంతర కళాశాల క్రీడా పోటీల్లో సిమిలిగుడ కళాశాలకు బహుమతుల పంట పండింది. 100 మీటర్ల పరుగు, షాట్‌పుట్ పోటీలో రీనాదాస్ ప్రథమ బహుమతి సాధించింది. లిమాకోసల, లిపి మడింగి, పూర్ణిమ, సుఖంతిఖాన్‌లు వివిధ విభాగాల్లో బహుమతులు గెలుచుకున్నారు.

విజేతలతో ప్రిన్సిపల్ ఝూన్సీ, అధ్యాపకులు

సర్పంచి పదవికి రాజీనామా

రాయగడ, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా గుడారి పంచాయతీ ఎమ్కే రాయి పంచాయతీ సర్పంచి తాయారు గ్రాసీమ్ సబర్ రాజీనామా చేశారు. గుణుపురం సబ్‌కలెక్టర్ అభిషేక్, బీడీవోలకు మంగళవారం తెలియజేశారు.

ఆసుపత్రిలో పరీక్ష

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పశ్చిమ మిడ్నాపూర్ జిల్లా సాల్బోని పరిధిలోగల మాన్కూరి ప్రాంతంలో హెచ్ఎస్ పరీక్ష రాయడానికి ఒక ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ముగ్గురు విద్యార్థులు వాహనం నియంత్రణ కోల్పోవడంతో మంగళవారం గాయపడ్డారని పోలీసులు తెలిపారు. ఇందులో మిథున్‌సింగ్ తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో పరీక్ష రాశాడు. విశాల్ బాగ్, ఉజ్వల్ పాతార్ స్వల్పంగా గాయపడ్డారు. ప్రాథమిక చికిత్స అనంతరం వీరికి పోలీసులు పరీక్షా కేంద్రానికి తరలించారు. వారు అక్కడ పరీక్ష రాశారు.

EENADU Classifieds
JOBS
హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ:18-20K ✆ 96404 68899, 96402 58899
ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

(c) eenadu

సరఫరా ఎప్పుడో మరి..

మందస మండలం మారుమూల సరిహద్దు గిరిజన గ్రామం గోపాలసాయి వద్ద సుజల స్రవంతి పథకం నీటి ట్యాంకు ఇది. ఏడాది కిందట గోపాలసాయితోపాటు డబార్సింగి, కుడుమాసింగి, కొంటాసాయి, కుమ్మరకుట్టి గ్రామాల గిరిజనుల దాహార్తి కోసం దీన్ని నిర్మించారు. నీటి సరఫరా మాత్రం నేటికీ లేదు. పైపులైను పనులు పూర్తవ్వగానే గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తామని సర్పంచి జయలక్ష్మి తెలిపారు. – న్యూస్‌టుడే, మందస

వారి నిర్లక్ష్యం.. అందరికీ అపాయం

ఇచ్ఛాపురం పట్టణ ప్రధాన రహదారి మార్గంతోపాటు రద్దీ రోడ్లలో ఆక్రమణలు, నిర్లక్ష్యపు పనులతో ఇబ్బందులు తప్పడం లేదు. మరమ్మతులు చేపట్టేటప్పుడు రోడ్డుపైనే పనులు చేపడుతున్నారు. దుకాణదారులు రోడ్డును ఆక్రమించడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుర కమిషనర్ రమేష్ వద్ద ప్రస్తావించగా పోలీసులు, సచివాలయ సిబ్బంది సహకారంతో చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

అడ్డదిడ్డంగా చూపుతోంది..

కొళిగాం నుంచి అరకభద్ర వెళ్లేందుకు మధ్యలో ప్రమాదకర మలుపులున్నాయని తెలిపేందుకు ఏర్పాటు చేసిన సూచిక బోర్డు ఇది. చాలా నెలల కిందట నుంచి పక్కకు వాలి ఉంది. సమీపంలోనే మరో రహదారి ఉండటంతో కొత్తగా ఇటు వైపు ప్రయాణం చేసే వాళ్లు ఎలా వెళ్లాలో తెలియక తికమక పడుతున్నారు. ఈ విషయమై పంచాయతీ రాజ్ శాఖ ఏఈ ధనంజయను వివరణ కోరగా బోర్డును సరి చేస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

ఇబ్బందులు పట్టవా..?

కేసరిపడ సచివాలయ భవన నిర్మాణం సగంలోనే నిలిచిపోయింది. దీంతో తమకు ఇబ్బందులు తప్పడం లేదని సిబ్బంది, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రంలోనే విధులు నిర్వహిస్తున్నారు. అధికారులు స్పందించి భవన నిర్మాణం పూర్తిచేయాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని పీఆర్ ఏఈ ప్రవీణ్ వద్ద ప్రస్తావించగా ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే నిర్మాణ పనులు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

వృథాగా నీరు.. ఇదేం తీరు

అక్కుపల్లి శివసాగర పర్యాటక తీరంలో ఏర్పాటు చేసిన మోటారు ట్యాంకు నుంచి తాగునీరు వృథాగా పోతోంది. ట్యాంకు చుట్టూ వేసిన కుళాయిలు పాడవ్వడంతో మోటారు వేయగానే నీరంతా బయటకు పోతోంది. విరిగిన కుళాయి పైపుల్లో కర్రలు అమర్చి నీటిని వాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. నీటి వృథాను అరికట్టేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో రమేష్‌నాయుడు తెలిపారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

భార్య, మామపై దాడి: వ్యక్తి అరెస్టు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా ఉమర్‌కోట్‌లో భార్య, మామపై కత్తితో దాడిచేసిన కేసులో పోలీసులు ఒకరిని అరెస్టు చేశారు. నిందితుడు హరిరామ్ గౌడ్‌గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హరిరామ్ మంగళవారం రాత్రి మద్యం తాగి భార్య కుమారితో గొడవపడ్డాడు. విషయం తెలుసుకున్న ఆమె తండ్రి విద్యాధర్ గౌడ్ ఘటనా స్థలానికి చేరుకోగా, వారిద్దరిపై హరి కత్తితో దాడిచేశాడు. బాధితులు పోలీసులను ఆశ్రయించగా, కేసు నమోదు చేసుకున్న పోలీసులు అతడ్ని అరెస్టు చేశారు.

పోలీసుల అదుపులో నిందితుడు

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

● ఇద్దరికి తీవ్ర గాయాలు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సిమిలిగుడ సమీపంలో బుధవారం ఉదయం ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సిమిలిగుడ ఠాణా అధికారి అందించిన వివరాల ప్రకారం... దుదారి గ్రామానికి చెందిన దివాకర్ కోరా (35), భార్య అవంతి కోరా (29)లు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో భార్యాభర్తలిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు వారిని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

కాల్పుల కేసులో యువకుడి అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నాగరాజ్

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: నిర్మాణ పనుల విషయమై తలెత్తిన వివాదంలో గాల్లోకి కాల్పులు జరిపిన యువకుడిని కలహండి పోలీసులు అరెస్టు చేశారు. కలహండి ఎస్పీ నాగరాజ్ దేవరకొండ మీడియాకు వెల్లడించిన వివరాల మేరకు భవానీపట్నకు చెందిన యశోబంత నాయక్‌ను అక్రమ ఆయుధాల కేసులో అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ఓ గుత్తేదారు నిర్మాణం పనుల విషయమై నాయక్, మరో యువకుడు మధ్య వివాదం చోటు చేసుకుంది. దీంతో ఆగ్రహానికి గురైన నాయక్ తనవద్ద ఉన్న పిస్తోలుతో బాధితుడిని భయపెట్టేందుకు గాల్లోకి కాల్పులు జరిపాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకుని నుంచి 2 పిస్తోళ్లు, 4 లైవ్ రౌండ్లు స్వాధీనం చేసుకున్నారు.

తీరం.. సేద తీరలేం..

నిత్యం సందర్శకులతో కళకళలాడే ప్రధాన బీచ్‌లు పారిశుద్ధ్య లోపంతో దర్శనమిస్తున్నాయి. జిల్లాలో పదుల సంఖ్యలో ఆహ్లాదం పంచే తీరాలున్నా అభివృద్ధికి నోచుకోవట్లేదు. వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వ్యాపిస్తోంది. ఇచ్ఛాపురం, సోంపేట, వజ్రపుకొత్తూరు, శ్రీకాకుళం, ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లోని బీచ్‌లకు పర్యాటకులు నిత్యం వస్తుంటారు. సదుపాయాల్లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇచ్ఛాపురం మండలం డొంకూరు తీరంలో పేరుకుపోయిన వ్యర్థాలను చిత్రంలో చూడొచ్చు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

చికిత్స పొందుతూ పీఈవో కన్నుమూత

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లాలోని చికిటి సమితిలో ఓ మహిళా రెవెన్యూ అధికారిణితో అసభ్యంగా ప్రవర్తించారన్న ఆరోపణల నేపథ్యంలో చికిటి సమితిలోని ఓ పంచాయతీ కార్యనిర్వాణాధికారి (పీఈవో) పి.దొండపాణి పాత్ర్ విష పదార్థం తాగి తీవ్ర అస్వస్థతకు గురై ఎమ్కేసీజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం కన్నుమూశారు. పోలీసులు మృతదేహానికి పరీక్ష జరిపించి కుటుంబ సభ్యులకు అందజేశారు. చికిటి సమితిలో ఈ నెల 3న సున్నాపురం తీర సంబరాల నేపథ్యంలో జరిగిన మినీ మారథాన్ నిర్వహణ విధుల్లో ఉన్న ఓ మహిళా అదనపు తహసీల్దారుతో పీఈవో పాత్ర్ అసభ్యంగా ప్రవర్తించారన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై బాధితురాలు గొళంత్రా ఠాణాలో ఫిర్యాదు చేయగా, పీఈవో పాత్ర్ ఇటీవల విష పదార్థం తాగారు.

రక్షిత భవనం.. భయం..భయం..!

తుపాను వేళ ఆపదొస్తే ఈ భవనాలు రక్షణ కల్పిస్తాయో లేదో చెప్పలేం కాని.. ఏ క్షణాన కూలుతాయోనని బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన దుస్థితి మత్స్యకార గ్రామాల్లో నెలకొంది. దశాబ్దాల కిందట ఇచ్ఛాపురం నుంచి రణస్థలం వరకు తుపాను రక్షిత భవనాలు నిర్మించారు. వీటిలో ఎక్కువ శాతం శిథిలస్థితికి చేరుకున్నాయి. వీటిని కూల్చాలని అధికారులకు ఫిర్యాదులిస్తున్నా స్పందన లేదు. కవిటి మండలం ఇద్దివానిపాలెంలో భవనాన్ని చిత్రంలో చూడొచ్చు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

మెలకువలు పాటిస్తే పుచ్చసాగు బాగు!

తెగులు సోకిన కాయ

న్యూస్‌టుడే, కురుపాం

వేసవిలో పుచ్చ పంటకు ఉండే డిమాండును దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. పంట దశలో ఆశించే చీడపీడల వల్ల దిగుబడితో పాటు నాణ్యత క్షీణించే ప్రమాదం ఉంది. వీటి నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు సకాలంలో పాటిస్తే పుచ్చ సాగులో మేలైన అధిక దిగుబడులు సాధించవచ్చని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త డా.ఎస్.శ్రీనివాసరాజు తెలిపారు.

● **ఆంత్రాక్నోస్ తెగులు..:** ఇది ఆశించిన ఆకులపై చిన్న మచ్చలు ఏర్పడి, పత్రాలు రాలిపోతాయి. దీని నివారణకు లీటరు నీటిలో 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా కార్బండిజమ్ కలిపి పంటపై పిచికారీ చేయాలి.

● **గుమ్మడి పెంకు పురుగు..:** ఇది ఆకులు, పూలను తింటూ పంటకు నష్టం కలిగిస్తుంది. దీన్ని నియంత్రించేందుకు లీటరు నీటికి 3 గ్రా. కార్బరిల్ లేదా 2 మి.లీ. మలాథియాన్ కలిపి పిచికారీచేయాలి.

● **పండు ఈగ..:** తల్లి పురుగులు పిందె అడుగు భాగంలో గుడ్లు పెడతాయి. వీటి నుంచి వెలువడిన పిల్ల పురుగులు కాయను తొలిచి తింటాయి. దీని నివారణకు లీటరు నీటిలో 2 మి.లీ. మలాథియాన్ కలిపి పంటకు వేయాలి.

● **బూజు తెగులు...:** దీంతో ఆకులపై లేత మచ్చలు ఏర్పడతాయి. వీటి ఉద్ధృతి ఎక్కువైతే ఆకుల పైభాగంలో పసుపు రంగు మచ్చలు, అడుగులో ఊదా రంగు మచ్చలు ఏర్పడి బూజులా మారుతుంది. దీని నుంచి కాపాడేందుకు లీటరు నీటికి 3 గ్రా. మాంకోజెబ్ లేదా 2 గ్రా. మెటలాక్సిల్ కలిపి పిచికారీ చేయాలి.

● **వెర్రి తెగులు...:** ఈ తెగులు పేనుబంక పురుగుల వల్ల వ్యాప్తి చెందుతుంది. ముందుగా ఆకులపై చారలు ఏర్పడతాయి. పూత, పిందెల పెరుగుదల ఆగిపోతుంది. దీని నివారణకు తెగులు సోకిన భాగాలను కత్తిరించి కాల్చివేయాలి. పేనుబంక నివారణకు లీటరు నీటికి 2 మి.లీ. డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాన్ కలిపి పైరుపై వేయాలి.

● **బూడిద తెగులు..:** దీంతో ఆకులపై తెలుపు, బూడిద రంగులో మచ్చలు ఏర్పడతాయి. దీని నివారణకు లీటరు నీటిలో ఒక మి.లీ. ట్రైడామార్ఫ్ లేదా ఒక మి.లీ. డైనోకాప్ కలిపి పిచికారీ చేయాలి

హెర్మెటిక్ బ్యాగులతో ధాన్యానికి లాభం

పునర్వినియోగమైన హెర్మెటిక్ బ్యాగుల్లో రైతులు ధాన్యం నిల్వ చేయడం వల్ల నాణ్యతను కాపాడి, వ్యయం తక్కువగా ఉంటూ, గిడ్డంగులు అవసరం లేకుండా సులభంగా భద్రపర్చుకోవచ్చని విజయనగరం పరిశోధనా స్థానం శాస్త్రవేత్త తేజేశ్వరరావు సూచించారు. ★ వీటిలోకి గాలి వెళ్లే అవకాశం ఉండకపోవడంతో ధాన్యం నిల్వ చేస్తే ఎలాంటి పురుగుల బారినా పడదు. పంటను నాణ్యంగా ఉంచుతుంది. ★ ముందుగా ధాన్యాన్ని పూర్తిగా పొడిగా చేసి బ్యాగులో నింపాలి. నింపిన బ్యాగులను గట్టిగా కట్టి చల్లని ప్రదేశంలో ఉంచాలి. ★ పంట నష్టాన్ని 30-50 శాతం తగ్గిస్తుంది. పర్యావరణ హితంగా ఈ బ్యాగులు పనిచేస్తాయి. – న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం

రైతేరాజు

తెలికపాటి తడులతో నువ్వుకు మేలు

అధిక ఉష్ణోగ్రతను తట్టుకుని తేలికపాటి తడులతో అన్నదాతకు సిరులు కురిపించే నువ్వుల సాగుకు వేసవి కాలం అనుకూలం. విత్తనాల నుంచి నూనె తయారీ, వంటకాలు, పశువుల దాణాలో చక్కగా నువ్వులను వినియోగిస్తున్నారు. మార్కెట్లో దీనికి గిరాకీ ఉంది. శ్రమ, కూలీల వ్యయం నామమాత్రం. తక్కువ పెట్టుబడితో సరైన సస్యరక్షణ చేపడితే ఇది లాభదాయకమైన నూనె గింజ పంట అని రస్తాకుంటుబాయి కేవీకే శాస్త్రవేత్త డా.స్రవంతి వివరించారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో దుక్కులు దున్ని సిద్ధం చేసుకోవాలి. నీరు పెట్టి నేల ఆరనిచ్చి తడిపొడి పదునులో విత్తనం వేసుకోవాలి. దేశవాళి వంగడాలైన శారద, గౌరీ రకం విత్తనాలు ఎకరాకు ఒకటిన్నర కిలోల నుంచి రెండు కిలోల వరకు వినియోగించాలి. పంట పూత కొచ్చే సమయానికి మే నెలాఖరులో తుంపర్లతో నీటి తడులు అందిస్తే సరిపోతుంది. తెగుళ్లు, కీటకాలు ఆశించే లక్షణం తక్కువ. ఎరువులు, క్రిమిసంహారక మందుల అవసరం కూడా తక్కువే. 70 నుంచి 80 రోజుల్లో పంట కోతకొస్తుంది. ఎకరాకు గరిష్ఠంగా అయిదారు క్వింటాల దిగుబడి లభిస్తుంది. బహిరంగ మార్కెట్లో క్వింటా ధర రూ.6వేల నుంచి రూ.8వేల వరకు ఉంటుంది. ప్రధానంగా మాగాణి, మెట్ట భూములు అనుకూలం. – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

నువ్వు పంట

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: జీడి, మామిడి, కూరగాయల సాగులో పురుగులు, తెగుళ్ల నివారణకు సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల ఆశించిన దిగుబడులు సొంతం చేసుకోవచ్చని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త **డా.అనంతవిహారి** తెలిపారు. రైతుల ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు.

సంరక్షణతో అధిక దిగుబడులు

? : **ప్రశ్న:** వేసవి మినుముగా వేసుకోవడానికి అనువైన రకాలు చెప్పండి? **- శంకరరావు, బలిజిపేట**

☛ : **సమాధానం:** వేసవి మినుముగా జి.బి.జి-1, ఎల్.బి.జి.-752, పి.యు-31, టి.బి.జి.104 వంటి రకాలు అనువైనవి.

? : జీడి మామిడిలో లేత కొమ్మలు, రెమ్మలు పైన ఎర్రని జిగురు మచ్చలు, నల్లని మచ్చలు ఏర్పడి పూత, పిందే మాడిపోయి రాలిపోతున్నాయి. నివారణ ఎలా? **- గోపాలరావు, నీలకంఠాపురం**

☛ : టీ దోమ జీడి మామిడి లేత కొమ్మలను, పూత రెమ్మలను ఆశించి రసాన్ని పీల్చడం వల్ల పూత, పిందెలు మాడిపోయి రాలిపోతాయి. తీవ్రత ఎక్కువైతే చెట్టంతా మాడినట్లు కనిపిస్తుంది. దీని నివారణకు చిగురు వచ్చే సమయంలో మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ., పూత వచ్చిన తర్వాత లాంబ్డాసహాలోత్రిన్ 0.6 మి.లీ. గింజ బటానీ పరిమాణంలో ఉన్నప్పుడు లీటరు నీటికి మి.లీ. ప్రొఫెనోఫాస్ కలిపి 10 నుంచి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.

? : టమాటాలో ఆకులు, కాండం, కాయలపై మచ్చలు ఏర్పడి క్రమంగా ఎండిపోతున్నాయి. నివారణ తెలపండి? **- ఆర్.కార్తీక్, గుణానపురం**

☛ : ఇవి ఆకుమాడు తెగులు లక్షణాలు. మొక్క దశలో ఎప్పుడైన ఆశించవచ్చు. తేమ, చల్లని వాతావరణంలో ఎక్కువగా సోకుతుంది. నివారణకు మాంకోజెబ్ 3 గ్రా. లేదా క్లోరోథలోనిల్ 2 గ్రా. లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో 3 నుంచి 4 సార్లు పిచికారీ చేయాలి.

ఉన్నత స్థాయికి చేరుకోవాలి

విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుని చదువుకున్న విద్యాలయాలకు మంచి పేరు తీసుకురావాలని వక్తలు ఆకాంక్షించారు. సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండో సంవత్సరం విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపల్ మోహన్‌రావు, అధ్యాపకులు వెంకటరావు, రజినీకుమారి, రామినాయుడు, యుగంధర్, సంధ్యారాణి, కల్పన తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, సోంపేట

విద్యార్థి దశ నుంచే సామాజిక బాధ్యత కలిగి ఉండాలి

సోంపేట: విద్యార్థి దశ నుంచే సామాజిక బాధ్యత కలిగి ఉండాలని రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.పావని సూచించారు. బారువ డిగ్రీ కళాశాలను మంగళవారం సందర్శించి ఉన్నత్ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. వాటి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపల్ రామారావు, వైస్ ప్రిన్సిపల్ రామకృష్ణ, పాల్గొన్నారు.

విశ్రాంత ఏబీసీడబ్ల్యూవో పింఛనులో కోత

పాతశ్రీకాకుళం: జిల్లాకు చెందిన విశ్రాంత ఏబీసీడబ్ల్యూవో పింఛనులో కోత విధిస్తూ బీసీ సంక్షేమ శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. కోటబొమ్మాళిలోని వసతిగృహ సంక్షేమాధికారిగా ఎం.రాఘవేంద్రరావు విధులు నిర్వహిస్తున్న సమయంలో ఏబీసీడబ్ల్యూవో కార్యాలయంలో నిధులు దుర్వినియోగమయ్యాయనే ఆరోపణలు వచ్చాయి. అప్పటి జిల్లా అధికారి కె.శ్రీదేవితో కలిసి పక్కదారి పట్టించారని అనిశా ప్రాథమిక నివేదికలో స్పష్టం చేసింది. ఆ శాఖ అదనపు డైరెక్టర్ ఎం.మహేశ్వర రెడ్డి విచారణ చేయగా సమాధానాలు సంతృప్తికరంగా రాలేదు. విశ్రాంత ఏబీసీడబ్ల్యూవో పింఛనులో కోత విధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే నెల నుంచి మూడేళ్ల పాటు 3 శాతం కోత విధించనుంది.

సైబర్ వలలో చిక్కిన యువకుడు

జయపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని నువాసాహికి చెందిన రూపేష్‌శర్మ సైబర్ వలలో చిక్కాడు. మోసగాళ్లు రూపేష్ ఖాతా నుంచి రూ.95 వేలు దోచుకున్నట్టు గుర్తించి సైబర్, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రూపేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 16న ఆయన ఫోన్ హ్యాంగ్ అయింది. అది రిపేర్ చేయించుకునేందుకు ఆపరేటర్‌కి ఇచ్చి బుధవారం తిరిగి తీసుకునే సరికి తన ఖాతా నుంచి సోనుకుమార్ ఖాతాకు రూ.95 వేలు వెళ్లినట్లు గుర్తించాడు. ఆయనకు కాల్ చేసినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు.

యోగి వేమన విగ్రహావిష్కరణకు విరాళం

ఇచ్ఛాపురం: పూరీ, గంజాం, శ్రీకాకుళం రెడ్డిక మహాజన సంఘ వందేళ్ల ఉత్సవాల్లో భాగంగా రెడ్డికలకు ప్రతీక అయిన యోగివేమన విగ్రహాన్ని నెలకొల్పుతున్నారు. కొజ్జిరియా రెడ్డిక సంఘ భవనం వద్ద ఈ విగ్రహాన్ని 22న ఆవిష్కరించేందుకు ఇచ్ఛాపురం జోన్ రెడ్డిక సంఘం ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు గొల్లవీధిలోని సామాజికవర్గ పెద్దలను ఆహ్వాన కమిటీ ప్రతినిధులు ఆశి చిరంజీవులురెడ్డి, దుర్గాశి పాపారావు, తిప్పన దుర్యోధనరెడ్డి, దక్కత నూకయ్యరెడ్డి మంగళవారం ఆహ్వానించారు. దక్కత లోకనాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి తదితరులు విరాళమందించారు.

దేశ నిర్మాణంలో యువత భాగస్వాములవ్వాలి

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: యువత దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని జిల్లా ఉపాధికల్పనాధికారి కె.సుధ కోరారు. మండలం చిలకపాలెం సమీపంలోని శ్రీ శివాని ఇంజినీరింగ్ కళాశాలలో కేంద్ర యువజన వ్యవహారాల, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్ జిల్లా యువజన మార్పిడి కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ ఐదు రోజులు జరిగే ఈ శిక్షణ కార్యక్రమానికి నెల్లూరు నుంచి యువత హాజరయ్యారని వీరికి జిల్లాలోని చారిత్రక, సాంస్కృతిక ప్రదేశాలను చూపిస్తామన్నారు. సెట్‌శ్రీ సీఈవో వి.వి.అప్పలనాయుడు, జిల్లా పర్యాటకశాఖాధికారి నారాయణరావు, పీడీ టి.బాలాజీరావు పాల్గొన్నారు.

అవగాహనతోనే ఆరోగ్యం

పలాస గ్రామీణం: శిక్షణలో పాల్గొన్న మహిళా సంఘాల సభ్యులు

మందస, పలాస గ్రామీణం, వజ్రపుకొత్తూరు: ఆహార వ్యవహారాలే ఆరోగ్యానికి ముఖ్యమని, ఈ విషయంలో కనీస అవగాహన కలిగి ఉండాలని ఏపీఎంలు పి.కూర్మారావు, జాంబవతి, ప్రసాదరావు అన్నారు. ఆహారం, పోషణ, ఆరోగ్యం, పారిశుద్ధ్యంపై మందస, వజ్రపుకొత్తూరు వెలుగు కార్యాలయంలో మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ✦ పలాస స్త్రీ శక్తి భవనంలో ఈ-నారీ, వీవోఏ, సీఆర్‌పీలకు జీవనోపాధుల సర్వే యాప్‌పై శిక్షణ ఇచ్చారు. లీగల్ సమన్వయకర్త తారకమోహన్, ఎంఎంఎస్ అధ్యక్షులు రమణమ్మ, సరస్వతి, కోశాధికారులు చంద్రకళ, త్రివేణి సీసీలు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులకు పైకం.. నగరానికి మైకం..!

● శ్రీకాకుళం నగరంలోని డచ్ భవనం వద్ద ఆరు నెలల కిందట గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు ఒడిశా వాసులను పోలీసులు పట్టుకున్నారు. వారితో పాటు వినియోగిస్తున్న మరో ఆరుగురిని కూడా అరెస్టు చేశారు.

● గంజాయి తాగుతున్న యువకులను మందలించారనే కోపంతో మొండేటి వీధి వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తున్న హెడ్ కానిస్టేబుల్‌పై దాడి చేశారు. ఘటనలో ఆయన తీవ్ర గాయాలపాలయ్యారు.

కిళ్లీ బడ్డీల్లో యథేచ్ఛగా గంజాయి విక్రయాలు

ఎక్కువగా విక్రయాలు జరుగుతున్న ప్రాంతాలు.. పొట్టిశ్రీరాములు మార్కెట్, కృష్ణా పార్కు, న్యూకాలనీ, పాతశ్రీకాకుళం, బలగ హడ్కోకాలనీ, వాంబేకాలనీ, మహాలక్ష్మీ నగర్, దమ్మల వీధి.

న్యూస్‌టుడే, శ్రీకాకుళం నేరవార్తావిభాగం

కూటమి ప్రభుత్వం గంజాయిపై ఉక్కుపాదం మోపుతోంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వినియోగం, అక్రమ రవాణా కట్టడికి కృషి చేస్తోంది. అభ్యుదయం పేరిట సైకిల్ యాత్ర చేపట్టి ఊరూరా అవగాహన కల్పించారు. కొందరిని అరెస్టు చేసి జైలుకు పంపారు. అయినప్పటికీ చాలా మందిలో మార్పు రావట్లేదు. విక్రేతలు, వినియోగించేవారు కొత్త మార్గాలను ఎంచుకుంటున్నారు. జిల్లా కేంద్రంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది.

● నగరంలో గంజాయి వినియోగం విచ్చలవిడిగా సాగుతోంది. యువకులు గుంపులుగా చేరి మత్తులో జోగుతున్నారు. కొన్ని కిళ్లీ బడ్డీల్లో చిన్న పొట్లాలుగా చేసి విక్రయిస్తున్నారు. ఒక్కో పొట్లాం రూ.10కే దొరుకుతోంది. సిగరెట్‌లో పొగాకు తీసేసి.. రెండు పొట్లాల గంజాయి దట్టించి నిర్భయంగా పీల్చేస్తున్నారు. మత్తెక్కగానే ద్విచక్ర వాహనాలపై చక్కర్లు కొడుతూ గొడవలకు దిగుతున్నారు. కొన్ని బ్యాచ్‌లు మత్తులోనే దాడులకు పాల్పడుతున్నాయి.

కఠిన చర్యలు తప్పవు..

గంజాయి కట్టడికి శత విధాలా ప్రయత్నిస్తున్నాం. అక్రమ రవాణా, విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయండి. ప్రజల సహకారం ఉంటే పూర్తి స్థాయిలో అడ్డుకోగలం. పాత నేరస్థులపై నిఘా ఉంది. కళ్లు గప్పి గంజాయి విక్రయిస్తున్నా.. కొంటున్నా కఠిన చర్యలు తప్పవు. – సీహెచ్ వివేకానంద, డీఎస్పీ, శ్రీకాకుళం

ఇదీ పరిస్థితి...

● నగరంలోని ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో సాయంత్రం వేళ గంజాయి బ్యాచ్‌లు చేస్తున్న ఫీట్లు జనాలను భయపెడుతున్నాయి.

● హౌసింగ్ బోర్డు కాలనీ, పాత శ్రీకాకుళం, పొన్నాడ వంతెన, 80 అడుగుల రోడ్డు, కొత్తపేట ప్రాంతాల్లో చీకటి పడగానే గుంపులుగా చేరిపోతున్నారు.

● ఒడిశా నుంచి రోజూ నగరానికి వచ్చే ప్రైవేటు బస్సులు, కూరగాయలు, ఇతర రవాణా వాహనాలు, ద్విచక్ర వాహనాలపై సరకు ఇక్కడికి తీసుకొస్తున్నారు.

● పాత నేరస్థులు, గతంలో నగరానికి గంజాయి తీసుకొచ్చినవారే ఇప్పటికీ రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది.

జిల్లాలో వివరాలిలా..

ఏడాది	కేసులు	పట్టుబడిన గంజాయి (కిలోల్లో..)
2023-24	19	338.82
2024-25	52	1,333.91
2025-26	142	1,824.20

సాంస్కృతిక ప్రదర్శనలపై చర్చ

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపురలోని ఆంధ్ర భాషాభివర్ధనీ సమాజం, జటాధరేశ్వరస్వామి దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని తెలుగు సంస్థల సహకారంతో వచ్చే మార్చి 19న జరగనున్న 'ఉగాది ఉత్సవాలు-2026'లో సాంస్కృతిక ప్రదర్శనల నిర్వహణపై సమావేశం జరిగింది. మంగళవారం రాత్రి స్థానిక కాపువీధిలోని ఆంధ్ర మహిళా సమాజం ఆవరణలో జరిగిన సమావేశానికి ఉత్సవాల కమిటీ సాంస్కృతిక సమన్వయకర్త మోణింగి కామేశ్వరి అధ్యక్షత వహించారు. సాంస్కృతిక సమన్వయకర్తలు కె.కుసుమ, వి.చంద్రకళ పాల్గొని మాట్లాడారు. ఉత్సవాల్లో సాంస్కృతిక ప్రదర్శనలిచ్చే బృందాల నాయకులు, ప్రతినిధులు హాజరయ్యారు.

సాంస్కృతిక బృందాల ప్రతినిధులతో చర్చిస్తున్న మోణింగి కామేశ్వరి. చిత్రంలో ఇతర ప్రతినిధులు

(c) eenadu

ఈనాడు పల్నాడు

గురువారం ఫిబ్రవరి 19, 2026

ఏసీబీ వలలో ఎనర్జీ అసిస్టెంట్

పట్టుబడిన నాగేంద్రబాబు (టీషర్టు ధరించిన వ్యక్తి)

నకరికల్లు, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖలో ఎనర్జీ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నక్కబోయిన నాగేంద్రబాబు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఓ రైతు నుంచి సొమ్ము తీసుకుంటుండగా అధికారులు మాటువేసి పట్టుకున్నారు. వివరాలిలా.. నకరికల్లు మండలం చేజర్ల గ్రామంలో నాగేంద్రబాబు ఎనర్జీ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన రైతు గుండాల యోహాన్ తన పొలంలోని బోరుకు విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు రూ.70 వేలు లంచం డిమాండు చేశారు. ఆ డబ్బులు ఇవ్వలేని రైతు విజయవాడ ఏసీబీ అధికారులను సంప్రదించగా వారు నిఘా పెట్టారు. ఈ క్రమంలో రైతు బుధవారం మధ్యాహ్నం ఎనర్జీ అసిస్టెంట్‌కు రూ.70 వేలు ఇచ్చేందుకు వెళ్లారు. డబ్బు తన తండ్రికి ఇవ్వాలని అతను కోరగా రైతు అప్పగించారు. అప్పటికే మాటు వేసిన ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేసి పట్టుకున్నారు. దాడిలో ఏసీబీ ఏఎస్పీ మత్తె మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధులొచ్చాయి

నరసరావుపేట, న్యూస్‌టుడే: పట్టణాల్లో అభివృద్ధి పనులకు ఊతమిచ్చేలా 15వ ఆర్థిక సంఘం తొలి విడత నిధుల్ని కూటమి ప్రభుత్వం మున్సిపాలిటీలకు జమ చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి టైడ్, అన్‌టైడ్ నిధుల్ని పురపాలక సంఘాల ఖాతాల్లో వేసింది. వీటితో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణం, శ్మశాన వాటికలు, పార్కుల అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశముంది.

కేటాయింపులు ఇలా.. (రూపాయల్లో)

మున్సిపాలిటీ	టైడ్	అన్‌టైడ్	మొత్తం
చిలకలూరిపేట	3,07,02,823	2,04,68,556	5,11,71,379
మాచర్ల	1,33,24,397	88,82,939	2,22,07,336
సత్తెనపల్లి	1,26,02,340	84,01,568	2,10,03,908
వినుకొండ	1,33,46,339	88,97,567	2,22,43,906
పిడుగురాళ్ల	1,44,18,546	96,12,372	2,40,30,918
దాచేపల్లి	1,04,89,939	69,93,353	1,74,83,292
గురజాల	76,49,862	50,99,968	1,27,49,830

☛ నరసరావుపేట పురపాలక సంఘానికి ఎన్నికలు జరగపోవడంతో నిధులు రాలేదు. 15వ ఆర్థిక సంఘం నిధుల్ని పట్టణాల్లో అభివృద్ధి పనులకు వినియోగిస్తామని మున్సిపల్ కమిషనర్లు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

మృత్యువు ముందుంది.. కాస్త చూసి వెళ్లండి!

తిమ్మాపురం-బోయపాలెం మధ్య ప్రమాదాలు అధికం

■ రెండు నెలల కిందట తిమ్మాపురం కొత్త బైపాస్‌లో ముగ్గురు యువకులు బుల్లెట్‌పై వెళ్తూ అదుపు తప్పి మార్జిన్‌ను ఢీకొట్టారు. ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మద్యం తాగి వాహనం నడపడమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది.

■ గత నెలలో గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపు కారు అతి వేగంగా వెళ్తూ ప్రమాదానికి గురైంది. కారులోని ఐదుగురిలో ఒకరు చనిపోగా.. నలుగురు గాయపడ్డారు.

ఈనాడు, నరసరావుపేట, న్యూస్‌టుడే, యడ్లపాడు

జాతీయ రహదారిలో వెళ్లేవారు తిమ్మాపురం - బోయపాలెం గ్రామాలకు చేరుకోగానే భయాందోళనకు గురవుతున్నారు. రోజు వారీ ప్రయాణం చేసేవారు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని ముందుకు సాగుతున్నారు. గుంటూరు-చిలకలూరిపేట 16వ నంబరు జాతీయ రహదారిపై యడ్లపాడు మండలం తిమ్మాపురం, బోయపాలెం గ్రామాల పరిధిలో ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకోవడం ఇందుకు కారణం.

గుంటూరు-చిలకలూరిపేట మార్గంలో ఇలా..

సం	ప్ర	మృ
2024	20	19
2025	19	16

సం: సంవత్సరం ప్ర: ప్రమాదాలు మృ: మృతులు

జాతీయ రహదారిలోకి వెళ్లేందుకు వంకాయలపాడు వద్ద కంచె తొలగించారు

ఎర్రకొండ వద్ద ఇలా..

ప్రమాదాలకు కారణాలు ఇవీ..

✦ రాత్రిపూట చాలాచోట్ల రహదారి మార్జిన్లలో వాహనాలను నిలిపి ఉంచుతున్నారు. వెనుక నుంచి వచ్చే వాహన చోదకులు వేగంగా వస్తూ ఆ వాహనాల్ని తప్పించే క్రమంలో వాటిని ఢీకొడుతున్నారు.

✦ జాతీయ రహదారికి మధ్యలోని వీధి దీపాలు సరిగా వెలగవు. వేగంగా వెళ్తే వాహన చోదకులు చీకట్లో ప్రమాదాలకు గురవుతున్నారు.

✦ కొందరు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నారు. మత్తులో డివైడర్లను ఢీకొడుతున్నారు.

✦ తిమ్మాపురం, బోయపాలెం గ్రామాల వద్ద జాతీయ రహదారి బైపాస్‌కు ఇరువైపులా ఏర్పాటు చేసిన రక్షణ కంచెను తొలగించి రాకపోకలు సాగిస్తున్నారు. కొన్నిచోట్ల గ్రిల్స్ తొలగించి రోడ్డు దాటుతున్నారు.

✦ కొందరు గ్రామస్థులు అపసవ్య దిశలో ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు.

అతివేగం, మద్యం తాగి వాహనాలు నడపడం, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారు కూడా జాతీయ రహదారి పైకి రావడంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించామని యడ్లపాడు ఎస్సై శివరామకృష్ణ తెలిపారు. జాతీయ రహదారిపై తనిఖీలు చేస్తున్నామన్నారు. రాత్రిపూట దూరప్రాంతాల నుంచి వచ్చే వాహన డ్రైవర్లకు ఫేస్‌వాష్ చేయిస్తున్నామన్నారు. నిబంధనలు విరుద్ధంగా వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తూ జరిమానా విధిస్తున్నామని తెలిపారు.

జనవరి అన్నారు.. ఫిబ్రవరి వచ్చింది

ఈత కొలను అందుబాటులోకి వచ్చేదెప్పుడు?

ఈనాడు, నరసరావుపేట, న్యూస్‌టుడే, నరసరావుపేట వ్యవసాయం

నిర్వహణ లేక అధ్వానంగా ఇలా..

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా ఈత కొలను వ్యవహారం నడుస్తోంది. జిల్లా కేంద్రం నరసరావుపేటలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఈత కొలను ఉన్నా అందుబాటులోకి రావడం లేదు. ఏళ్లుగా మూతపడి ఉంటోంది. అందుబాటులోకి వస్తే క్రీడాకారులు, విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుంది.

వైకాపా హయాంలో మూతపడి.. 2019 ఎన్నికలకు ముందు నాటి శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాదరావు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఈత కొలనును ప్రారంభించారు. తర్వాత ఆరు నెలలకు అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం దానిని చిన్నచూపు చూసింది. నిర్వహణ లేక మరో ఆరు నెలలకు ఈత కొలను గేటుకు తాళం పడింది. ఇక అప్పటినుంచి తెరుచుకోలేదు. తెదేపా ప్రభుత్వ హయాంలో కొలనులో ఈత నేర్చుకునేందుకు నెలకు రూ.వెయ్యి తీసుకునేవారు. అప్పట్లో పని చేసిన ఓ శాప్ అధికారి బయట మరోచోట ఈత కొలను నడిపిస్తుండేవారు. అక్కడ నెలకు రూ.మూడు వేలు ఫీజు తీసుకునేవారు. తక్కువ ఫీజు అని ఎక్కువ మంది ప్రభుత్వ ఆధ్వర్యంలోని కొలనుకు వచ్చేవారు. తను నడిపిస్తున్న దానికి ఆదరణ ఉండటం లేదని స్టేడియంలోని ఈత కొలను నిర్వహణను గాలికొదిలేశారని.. అది మూత పడటానికి ఇదీ ఒక కారణమని తెలుస్తోంది.

కూటమి ప్రభుత్వంపై ఆశలు.. తాము అధికారంలోకి రాగానే స్టేడియం రూపురేఖలు మారుస్తామని, ఈత కొలనును తెరిపించి అందుబాటులోకి తీసుకొస్తామని చదలవాడ అరవిందబాబు చాలా సార్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తోంది. ఇంతవరకు ఆ ఊసే లేదు. గత డిసెంబరు నెలలో 'ఆట స్థలంతో ఆడుకుంటున్నారు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ కృతికా శుక్లా స్పందించారు. స్టేడియానికి వెళ్లి పరిశీలించి, జనవరిలో ఈతకొలనును అందుబాటులోకి తీసుకొస్తామని ప్రకటించారు. ఫిబ్రవరి కూడా వచ్చేసింది కానీ కదలిక లేదని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి వస్తోంది.. ఇప్పటికైనా పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తే ఎంతోమంది క్రీడాకారులకు ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొంటున్నారు.

'ఏడేళ్లు నిరుపయోగంగా ఉండటంతో చాలా వస్తువులు మరమ్మతులకు గురయ్యాయి. రూ.18 లక్షలు వెచ్చిస్తే పునఃప్రారంభించవచ్చని కలెక్టర్‌కు నివేదిక ఇచ్చాం. రూ.10 లక్షలు మంజూరు చేశారు. వాటితో పనులు చేస్తున్నాం. నీటి కోసం బోరు నిర్మాణ పనులు చేపట్టాలి. త్వరలో అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తాం' అని డీఎస్‌డీవో సురేశ్‌రెడ్డి తెలిపారు.

రైతు రిజిస్ట్రేషన్ 50 శాతమే పూర్తి

తుది గడువు 28వ తేదీ

గణపవరం, సాతులూరు (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే: రైతు రిజిస్ట్రేషన్ (ఫార్మర్ ఐడీ) జిల్లాలో 50 శాతమే పూర్తయింది. ఈ నెల 20తో గడువు ముగుస్తుందని ప్రభుత్వం ముందుగా ప్రకటించింది. అయితే ఇంకా 50 శాతం మంది ఐడీ నమోదు చేసుకోవాల్సి ఉన్నందున ప్రభుత్వం గడువును 28వ వరకు పొడిగించింది. కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ పథకాల లబ్ధికి ఫార్మర్ ఐడీ ఎంతో ఉపయోగపడుతుంది. పీఎం కిసాన్ ఆర్థిక సాయం అందాలంటే ఐడీ తప్పనిసరి. బీమా, రాయితీలు, రుణాలు, ప్రభుత్వ పథకాలు పొందే అవకాశముంటుంది. నమోదుకు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకాల వివరాలు, ఆధార్ లింకైన మొబైల్ నంబరు ఉంటే వాటిని తీసుకుని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకుల్ని కలిసి నమోదు చేసుకోవచ్చు. జిల్లాలో ఈ నెల 18వ తేదీ వరకు 42,805 మంది రైతులు ఫార్మర్ ఐడీ నమోదు చేసుకున్నారు. ఇంకా 42,506 మంది నమోదు చేసుకోవాల్సి ఉంది. ఈ నెల 28లోపు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జగ్గారావు సూచించారు.

విక్రయాల జోరు.. ధరలు బేజారు

గుంటూరు, న్యూస్‌టుడే

మిర్చియార్డుకు వచ్చిన సరకు

మిర్చి క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మరోసారి లక్షకు పైగా బస్తాలు మిర్చియార్డుకు రాగా.. అదే స్థాయిలో విక్రయాలు జరిగాయి. ఈ ఏడాది సీజన్ ప్రారంభమయ్యాక లక్షకు పైగా బస్తాలు రావడం, విక్రయాలు జరగడం ఇది మూడోసారి. ఈనెల 10, 11 తేదీల్లోనూ లక్షకు పైగానే టిక్కీలు రైతులు యార్డుకు తరలించారు. మహా శివరాత్రి తిరునాళ్లలో రైతులు నిమగ్నమై ఉండడంతో ఈనెల 12, 13 తేదీల్లో అంత కంటే తక్కువగా యార్డుకు సరకు వచ్చింది. శని, ఆదివారాలు సెలవులు. సోమ, మంగళవారాల్లోనూ ఆ స్థాయిలో బస్తాలు రాలేదు. మహాశివరాత్రి హడావుడి తగ్గడంతో బుధవారం లక్షకు పైగా బస్తాలు వచ్చాయి. ధరలు కొంత మేరకు తగ్గుతుండడం రైతులను కలవరపాటుకు గురి చేస్తుంది. అన్ని రకాల ధరలు తగ్గాయి. కొన్ని రకాల ధరలు రూ.1,000, మరికొన్ని రకాలు రూ.1,500 పైగానే పతనమయ్యాయి. యార్డుకు వచ్చే సరకు పెరుగుతుండగా.. విక్రయాలు సైతం దాదాపు అంతే స్థాయిలో జరుగుతుండడంతో నిల్వలు కూడా 20 వేల బస్తాలకు పైగానే ఉంటున్నాయి. వ్యాపారులు ధరల్లో కోత పెట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతన్నలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సరకు క్రయవిక్రయాలిలా...

తేదీ	బస్తాలు	విక్రయాలు	నిల్వలు
10	1,02,248	98,826	21,721
11	1,09,852	1,05,937	25,636
18	1,06,635	1,02,831	24,592

పక్కా గృహం.. పూర్తికి సన్నద్ధం

రూ.46.54 కోట్లు అవసరమని నివేదిక

రఘురామ్‌నగర్ (సత్తెనపల్లి), న్యూస్‌టుడే: గత తెదేపా ప్రభుత్వ హయాంలో పక్కాగృహాల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిచ్చారు. 2016-19 మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లకు వైకాపా ప్రభుత్వం బిల్లులు నిలుపుదల చేసింది. ఎన్నికలకు ముందు నిధులు మంజూరుచేసి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చి జగన్ ప్రభుత్వం నిలబెట్టుకోలేకపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆగిన బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకుంది. క్షేత్ర స్థాయిలో వివిధ దశల్లో ఉన్న ఇళ్ల లబ్ధిదారులతో గృహ నిర్మాణ సంస్థ ఉద్యోగులు జాబితాలు తయారు చేశారు. జిల్లావ్యాప్తంగా అర్ధంతరంగా ఆగిన ఇళ్లు పూర్తి చేసేందుకు రూ.46.54 కోట్లు అవసరమని ఉన్నతస్థాయికి నివేదించారు. ఎన్టీఆర్ హౌసింగ్ కింద గత ప్రభుత్వంలో ఒక్కో ఇంటి నిర్మాణానికి సాధారణ కేటగిరీలో రూ.2 లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.2.50 లక్షల చొప్పున మంజూరు చేశారు. అప్పట్లో పూర్తయిన ఇళ్లకు సంబంధించి సర్వే గతేడాది చేపట్టారు. సర్వేలో ఆయా నిర్మాణాల వద్దకు వెళ్లి తాజా పరిస్థితిని తెలిపేలా ఫొటో తీసి హౌసింగ్ యాప్‌లో వివరాలు అప్‌లోడ్ చేశారు. నిధులు విడుదలైన వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసి గృహాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని గృహ నిర్మాణ సంస్థ అధికారులు తెలిపారు.

- జిల్లాలో ఎన్టీఆర్ హౌసింగ్ కింద ఇళ్లు మంజూరైన మండలాలు, పట్టణాలు : 35
- గృహ నిర్మాణ సంస్థ ఉద్యోగులు పరిశీలించిన ఇళ్లు : 29,353
- అసలు పనులే ప్రారంభించనివి : 2,837
- స్లాబు వరకు పూర్తయి ఆగినవి : 12,870
- పనులు వివిధ దశల్లో ఉన్నవి : 7,684
- పూర్తయిన పక్కా ఇళ్లు : 5,962

⇝ అన్ని గృహాలకు కలిపి వ్యయం (కేటాయింపు) : రూ.261.36 కోట్లు

⇝ లబ్ధిదారుల ఖాతాలకు ఇప్పటికే జమ చేసింది : రూ.214.82 కోట్లు

⇝ పెండింగ్‌లో ఉన్న బిల్లుల సొమ్ము (రావాల్సినవి) : రూ.46.54 కోట్లు

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణారావు తదితరులు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి వినుకొండ పర్యటన నిమిత్తం అవసరమైనచోట ట్రాఫిక్ మళ్లించి.. ఎలాంటి అవాంతరాలు లేకుండా అదనపు సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని ఎస్పీ కృష్ణారావు అన్నారు. ఈ నెల 21న సీఎం చంద్రబాబు వినుకొండ పర్యటన నేపథ్యంలో బుధవారం ఎస్పీ స్థానిక అధికారులతో కలిసి హెలిప్యాడ్ ఏర్పాటు చేసే జూనియర్ కళాశాల మైదానం, స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించే ప్రభుత్వ వైద్యశాల, ప్రజావేదిక నిర్వహించే ఎన్నెస్పీ కాలనీలో జరుగుతున్న పనుల్ని పరిశీలించారు. హెలిప్యాడ్ వద్ద బారికేడ్లు, కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని పట్టణ సీఐ ప్రభాకర్‌ను ఆదేశించారు. జూనియర్ కళాశాలలోని హెలిప్యాడ్ ఏర్పాటుచేసే మైదానాన్ని డాగ్, బాంబ్ స్క్వాడ్ సిబ్బందితో తనిఖీ చేయించారు. భద్రత, మౌలిక సదుపాయాలు, సభావేదిక ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, తాగునీరు, విద్యుత్తు సరఫరా, వైద్య సేవలు వంటి అంశాలపై సమీక్షించారు. ఆర్డీవో మధులత, రూరల్ సీఐ బ్రహ్మయ్య, తహసీల్దార్ సురేష్ పాల్గొన్నారు.

స్టాళ్లు ఏర్పాటు చేయండి.. నరసరావుపేట అర్బన్: సీఎం చంద్రబాబు జిల్లా పర్యటన సందర్భంగా ఏర్పాట్లు పక్కాగా ఉండాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ప్రజావేదిక వద్ద ప్రభుత్వం చేస్తున్న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన స్టాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. మెప్మా ద్వారా రూ.50 కోట్లు, డీఆర్‌డీఏ ద్వారా రూ.100 కోట్ల రుణాలు సీఎం చేతుల మీదుగా ఇప్పించాలని ఎల్‌డీఎం రామ్‌ప్రసాద్‌కు సూచించారు. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులకు అక్షర జ్ఞానం

పకడ్బందీగా వయోజన విద్య తరగతులు

సత్తెనపల్లి, కారంపూడి-న్యూస్‌టుడే

అందరికీ విద్య.. అందరి బాధ్యత.. ఎప్పటి నుంచో ఆచరణలో ఉన్న నినాదమిది. రాష్ట్రంలోని ప్రతి 100 మందిలో 67 మంది అక్షరాస్యులుగా ఉన్నారు. జిల్లాలో 63 శాతం మందికే అక్షర జ్ఞానం ఉంది. జాతీయ సగటుతో పోల్చుకుంటే అతి తక్కువగా జిల్లాలో మహిళా అక్షరాస్యత శాతం 58గా నమోదైంది. ఇలాంటి పరిస్థితుల్లో అక్షర ఆంధ్రప్రదేశ్‌తో జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యత సాధనపై కలెక్టర్ కృతికా శుక్లా ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. నిరక్షరాస్యులుగా గుర్తించిన అందరికీ అక్షరాలు చేరువ చేస్తున్నారు.

■ అక్షర ఆంధ్రప్రదేశ్‌లో ఎనిమిది పాఠాలున్నాయి. ఒక్కో పాఠానికి నాలుగు వర్క్‌షీట్లు చొప్పున 32 రూపొందించారు. వంద గంటల కార్యక్రమంతో నిరక్షరాస్యులను అక్షరాస్యుల్ని చేయాలన్నది లక్ష్యం. నెల రోజులుగా వయోజన విద్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వచ్చేనెల 29న జాతీయ ఓపెన్‌స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో పబ్లిక్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నెలాఖరులో నమూనా పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రాజుపాలెంలో అక్షరాలు నేర్చుకుంటున్న అతివలు

■ జిల్లాలో 1,27,565 మందిని నిరక్షరాస్యులుగా గుర్తించారు. ప్రతి 10 మంది నిరక్షరాస్యులకు ఒక వాలంటీర్ (డ్వాక్రా మహిళలు, క్షేత్ర సహాయకులు, స్వచ్ఛంద సేవకులు) చొప్పున 12,757 మంది అక్షరాలు నేర్పిస్తున్నారు. నిరక్షరాస్యుల్లో 80 నుంచి 90 వేల మంది రోజూ పాఠాలకు హాజరవుతున్నారు. నిరక్షరాస్యుల్లో పురుషులకు కూడా అక్షరాలు నేర్పిస్తున్నారు. మొత్తం నిరక్షరాస్యుల్లో 90 శాతం మంది మహిళలు ఉన్నారు.

కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ.. జిల్లా కలెక్టర్ ఎప్పటికప్పుడు అక్షర ఆంధ్ర కార్యక్రమ అమలు తీరును పర్యవేక్షిస్తున్నారు. మండల, పట్టణ స్థాయి కమిటీలను ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లతో ఏర్పాటుచేశారు. డీఆర్‌డీఏ పీడీ, మెప్మా పీడీ, డ్వామా పీడీలు రోజూ ఒకచోటకు వెళ్లి తరగతులు సక్రమంగా జరుగుతున్నాయా లేదా అని పరిశీలిస్తున్నారు. లోపాలుంటే దిద్దుబాటుకు చర్యలు తీసుకుంటున్నారు. నిరక్షరాస్యులకు చదవడం, రాయడం నేర్పించి వారిని అక్షరాస్యుల్ని చేసేందుకు ప్రణాళికాయుత చర్యలు తీసుకుంటున్నట్లు ఉల్లాస్ (అక్షర ఆంధ్ర) కార్యక్రమ బాధ్యులు తెలిపారు.

గ్రంథాలయ సంస్థ బడ్జెట్ రూ.53.98 కోట్లు

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ 2026-27 సంవత్సరానికి సంబంధించి రూ.53.98 కోట్ల బడ్జెట్‌కు సర్వసభ్య సమావేశంలో ఆమోదం లభించింది. సంస్థ ఛైర్‌పర్సన్ భీమినేని వందనాదేవి అధ్యక్షతన అరండల్‌పేటలోని గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వందనాదేవి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, దాతల సహకారంతో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. మంచి భవనాలు ఏర్పాటు చేయడంతో పాటు పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థతో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు గ్రంథాలయాల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా సంస్థ పరిధిలోని వాణిజ్య సముదాయాలను అద్దెలకు టెండర్ల ప్రాతిపదికన ఇచ్చేందుకు ఆమోదం తెలిపినట్లు వివరించారు. సమావేశంలో సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ, డీఈవో షేక్ సలీం బాషా, వయోజన విద్యా శాఖ ఉప సంచాలకుడు కె.ఆంజనేయులు, సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకుడు లోచర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ వందనాదేవి

ఇబ్బందిగా సిబ్బంది లేమి

మందకొడిగా రెండో విడత భూసమీకరణ

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - అమరావతి

రాజధాని అమరావతి మహా నగర విస్తరణకు రెండో విడత చేపట్టిన భూసమీకరణ ప్రక్రియకు సిబ్బంది కొరత అడ్డంకిగా మారింది. ఇప్పటికే ఏడు గ్రామాల పరిధిలో 8 సీఆర్డీఏ కాంపిటెంట్ అథారిటీ యూనిట్ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. కర్లపూడి, యండ్రాయి, పెదమద్దూరు, వడ్డమాను గ్రామాల్లో భూసమీకరణ ప్రకటన ఇచ్చిన అధికారులు.. రైతుల నుంచి భూములు సమీకరిస్తున్నారు. వైకుంఠపురం, పెదపరిమి, హరిశ్చంద్రపురం గ్రామాల్లో ప్రకటన ఇవ్వాల్సి ఉంది.

తాజా స్థితి ఇలా..

★ ఒక్కో కాంపిటెంట్ అథారిటీ యూనిట్ కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్ సహా తహసీల్దారు, ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్లు, ఇద్దరు వీఆర్వోలు, ఇద్దరు గ్రామ సర్వేయర్లు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, ఒక ఫెసిలిటేటర్, ఇద్దరు కార్యాలయ సహాయకులు మొత్తం 12 మంది ఉండాలి. ఒక్క చోటా పూర్తిస్థాయిలో లేరు.

★ జనవరి 7న వడ్డమానులో భూసమీకరణ ప్రారంభించి.. ఇప్పటికి 934 ఎకరాలే సమీకరించగలిగారు. కారణం సిబ్బంది లేమి.

★ వైకుంఠపురం, కర్లపూడి, పెదమద్దూరు, యండ్రాయి యూనిట్లకు ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లను కేటాయించారు.

★ పెదమద్దూరులో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్‌తో కార్యాలయాన్ని నడిపిస్తున్నారు.

★ వైకుంఠపురంలో భూసమీకరణ ప్రారంభం కాకపోవడంతో ఇక్కడి విశ్రాంత డిప్యూటీ కలెక్టర్‌ను కర్లపూడి రెవెన్యూ పరిధి లెమల్లెలో ఉపయోగించుకుంటున్నారు.

★ హరిశ్చంద్రపురం, వడ్డమాను, పెదపరిమిలోనూ ఇదే పరిస్థితి.

యండ్రాయి యూనిట్ సీఆర్డీఏ కాంపిటెంట్ అథారిటీ కార్యాలయం

● రెండో దశలో భూసమీకరణ: 20,494 ఎకరాలు

● ఇందులో పట్టా భూమి: 16,562.56 ఎకరాలు

● అసైన్డ్: 104.1 ఎకరాలు

★ 8 మంది డిప్యూటీ కలెక్టర్లకుగాను ముగ్గురు, 8 మంది తహసీల్దార్లకుగాను ముగ్గురు, 16 మంది డిప్యూటీ తహసీల్దార్లకుగాను ఇద్దరే ఉన్నారు. యూనిట్‌కు ఒక్క వీఆర్వోనే ఇచ్చారు.

ఈ నెల 13 వరకు ఇలా...

గ్రామం	రైతులు	ఎకరాల్లో
యండ్రాయి	325	372.5753
కర్లపూడి	195	307.9257
పెదమద్దూరు	155	211.42
వడ్డమాను	42	42.903
మొత్తం	717	934.824

ఊపందుకోని ప్రక్రియ

■ భూసమీకరణపై రైతులకు అవగాహన కలిగించి, వారి సందేహాలు నివృత్తి చేయడానికి డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, రెవెన్యూ యంత్రాంగం చొరవ చూపాలి. వీరు పూర్తిస్థాయిలో లేక ఉన్న అధికారులపై ఒత్తిడి పెరుగుతోంది.

■ రైతులిచ్చిన పత్రాల తనిఖీ తప్పనిసరి. తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు చేయాల్సిన పని డిప్యూటీ కలెక్టర్లు చేయాల్సి వస్తోంది. ఫలితంగా జాప్యం అనివార్యమవుతోంది.

■ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సమయం కేటాయించలేని పరిస్థితి.

■ సీఆర్డీఏ యూనిట్లకు వస్తామని పలువురు రెవెన్యూ అధికారులు సీసీఎల్ఏ కార్యాలయానికి దరఖాస్తు చేసినా.. ఇక్కడి నుంచి ఉత్తర్వులు రాలేదు.

ఫుడ్ బాస్కెట్ కమిటీల ఏర్పాటుకు శ్రీకారం

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలో ఫుడ్ బాస్కెట్ కమిటీల ఏర్పాటుకు శ్రీకారం చుడుతున్నామని డీపీఎం అమలకుమారి తెలిపారు. ప్రకృతి వ్యవసాయం రైతులకు ఆర్థిక భద్రత కల్పించడమే కాకుండా కుటుంబాలకు పౌష్టికాహార భరోసా ఇస్తుందన్నారు. నరసరావుపేటలోని జిల్లా ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో రైతుసాధికార సంస్థ, సెర్ప్ శాఖల సమన్వయంతో ఫుడ్ బాస్కెట్ కమిటీ సభ్యులకు బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఫుడ్ బాస్కెట్ కమిటీలు గ్రామస్థాయిలో చురుగ్గా పనిచేసి ప్రతి ఇంటికీ ఆరోగ్యకర ఆహారం అందించాలన్నారు. వెలుగు పీడీ ఝాన్సీరాణి మాట్లాడుతూ త్వరలోనే సెర్ప్ ఆర్థిక సహకారంతో జిల్లావ్యాప్తంగా ఫుడ్ బాస్కెట్ కార్యక్రమం అమలు చేయనున్నట్లు తెలిపారు. శిక్షణలో భాగంగా కమిటీల విధి విధానాలపై ఎన్ఎఫ్ఎఫ్ జిల్లా యాంకర్ మౌనిక అవగాహన కల్పించారు. వెలుగు డీపీఎం మల్లేశ్వరి, ఏపీఎం ఉషశ్రీ, సీసీలు, వీవోలు, ఫుడ్ బాస్కెట్ కమిటీ సభ్యులు హాజరయ్యారు.

పింఛన్లకూ తప్పని లంచం

కొందరు ఉద్యోగుల చేతివాటం

నరసరావుపేట, న్యూస్‌టుడే : వయోవృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, చేనేత కార్మికులు, డప్పు కళాకారులు, అభాగ్యులకు ఎన్టీఆర్ భరోసా కింద కూటమి ప్రభుత్వం పింఛన్లు అందజేస్తోంది. దివ్యాంగులకు నెలకు రూ.6 వేలు, దీర్ఘకాలిక రోగులకు రూ.10 వేలు, మంచంపై కదల్లేని స్థితిలో ఉన్నవారికి రూ.15 వేలు, వయోవృద్ధులు, వితంతువులు, కార్మికులు, కళాకారులు ఇతరులకు రూ.4 వేల చొప్పున అందిస్తోంది. అయితే పింఛను నగదు ఇచ్చేటప్పుడు కొందరు ఉద్యోగులు లంచం తీసుకుంటున్నారని ఐవీఆర్ఎస్‌లో వెల్లడైంది. పల్నాడు జిల్లాలో జనవరి నెలలో 2,71,112 మందికి పింఛన్ల సొమ్ము పంపిణీ చేశారు.

ఐవీఆర్ఎస్‌లో పింఛనుదారుల మనోగతం ఇలా.. (శాతాల్లో)

అంశం	అవును	లేదు
ఉద్యోగి మీ దగ్గర డబ్బులు వసూలు చేశారా?	8.1	91.9
పింఛను మీ ఇంటి దగ్గరే పంపిణీ జరిగిందా?	92.5	7.5
నగదు ఇచ్చిన ఉద్యోగి ప్రవర్తన బాగుందా?	92.7	7.3

పింఛనుదారుల సంతృప్తిలో రాష్ట్రంలో పల్నాడు జిల్లా 10వ స్థానంలో నిలిచింది. ఐవీఆర్ సర్వేలో 92.4 శాతం మంది పింఛన్ల పంపిణీపై సంతృప్తి వ్యక్తం చేశారు.

రాజధానిలో వన్‌స్టాప్ కేంద్రం మంజూరు

మార్చి 8న ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

జిల్లాపరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే: మహిళలపై లైంగిక దాడుల నివారణ, బాల్య వివాహాల నియంత్రణ, ఆపదలో ఉన్న మహిళలు, బాలికల సంరక్షణ లక్ష్యంగా రాష్ట్ర రాజధాని ప్రాంతం తుళ్లూరులో వన్‌స్టాప్ కేంద్రం (ఓఎస్‌సీ)ను రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంజూరు చేసింది. ఇప్పటికే గుంటూరులోని జిల్లా మహిళా ప్రగతి ప్రాంగణంలో వన్‌స్టాప్ కేంద్రం పని చేస్తుంది. రాజధాని ప్రాంతం సీఆర్‌డీఏని దృష్టిలో ఉంచుకుని అదనంగా మరో కేంద్రాన్ని మంజూరు చేస్తూ రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సంచాలకుడు ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఈ నెల 17న ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దీనిని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. ఆ మేరకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, ఆ శాఖ జిల్లా అధికారులకు జారీ చేసిన ఉత్తర్వుల్లో సూచించారు. ★ కేంద్ర ప్రభుత్వం మిషన్ శక్తి పథకంలో మహిళా సాధికారత, భద్రత అంశాలకు ప్రాధాన్యం ఇస్తుంది. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ కార్యక్రమాలు చేయనున్నారు. తుళ్లూరులో ప్రస్తుతానికి అద్దె భవనంలో వన్‌స్టాప్ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. కనీసం ఐదు గదులు ఉండేలా భవనాన్ని ఎంపిక చేయాలని సూచించారు. ఈ కేంద్రంలో ఉద్యోగులు ఒప్పంద విధానంలో పనిచేసేలా 13 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్, పారా లీగల్ పర్సనల్/న్యాయవాది, పారా మెడికల్ పర్సనల్, సైకో-సోషల్ కౌన్సిలర్, కార్యాలయ సహాయకుడు పోస్టులు ఒకటి చొప్పున.. కేస్ వర్కర్ పోస్టులు-2, మల్టీ పర్పస్ స్టాఫ్, సెక్యూరిటీ గార్డు/నైట్ గార్డ్ పోస్టులు 3 చొప్పున మంజూరయ్యాయి. వీటికి దరఖాస్తులు ఆహ్వానించి అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు.

పల్నాడు జిల్లాలోనూ మరో కేంద్రం

పల్నాడు జిల్లాలో వన్‌స్టాప్ కేంద్రం ఉండగా.. అదనంగా మరో కేంద్రాన్ని మంజూరు చేశారు. దీనిని మాచర్లలో ఏర్పాటు చేయనున్నారు. వెనుకబడిన ప్రాంతం కావడం, అక్షరాస్యత శాతం తక్కువగా ఉండటం, బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతుండటంతో వన్‌స్టాప్ కేంద్రాన్ని కేటాయించారు. ఇక్కడా 13 పోస్టులు మంజూరయ్యాయి. అదనంగా ఏర్పాటు చేయనున్న ఒక్కో వన్‌స్టాప్ కేంద్రానికి ప్రభుత్వం రూ.58 లక్షలు విడుదల చేయనుంది.

(c) eenadu

భక్తి మార్గం.. సేవా పథం

సత్తెనపల్లి, రెంటచింతల, విజయపురిసౌత్, న్యూస్‌టుడే

నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

మానవ సేవకు ప్రేరణనిచ్చే పవిత్ర మాసం రంజాన్. మిగిలిన పండుగలతో పోల్చితే రంజాన్‌కు విశిష్టత ఉంది. ఏడాదిలో ఈ నెల ఎప్పుడు వస్తుందా అని ముస్లిం సోదరులు ఎదురు చూస్తారు. గురువారం నుంచి రంజాన్ మాసం ప్రారంభమవుతుంది. తెల్లవారుజామునే ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలు చేపట్టనున్నారు. రంజాన్‌ను అరబ్బీలో రమ్జ్ అంటారు. రమ్జ్ అంటే కాల్చడం అని అర్థం. నెల రోజుల ఉపవాస దీక్షలో శరీరాన్ని శుష్కింపజేయడం ద్వారా ఆత్మ ప్రక్షాళన అవుతుందని నమ్మిక. రోజులో సుమారు 14.30 గంటలపాటు కనీసం గుక్కెడు నీళ్లు కూడా తాగకుండా నెల రోజులు కఠోర ఉపవాస దీక్ష చేపడతారు.

జకాత్, ఫిత్రా..: దానం చేయదగినస్థితిలో ఉన్న ప్రతి ముస్లిం తన సంపాదనలో 2.5 శాతం పేదవారికి తప్పనిసరిగా పంచడాన్ని జకాత్ అంటారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి పండు వృద్ధుల వరకు ప్రతిఒక్కరూ తమ పేరిట 1,750 గ్రాముల గోధుమలు లేదా దానికి సరిపడా నగదు ఫిత్రాగా దానం చేయాలి. ఉపవాసం ఉన్న వారికి ఒక గ్లాసు మంచినీరు తాగించినా ఎంతో పుణ్యమని మహమ్మద్ ప్రవక్త(సఅస) హదీసుల్లో పేర్కొన్నారు.

సహర్: సూర్యోదయానికి సుమారు ఒకటిన్నర గంటల ముందు తీసుకునే ఆహారాన్ని సహర్ అంటారు.

ఇఫ్తార్: సూర్యాస్తమయం సమయాన ఖర్జూరం, ఎండు ఫలాలు లేదా నీరు తాగి ఉపవాసాన్ని ముగిస్తారు. దీన్నే ఇఫ్తార్‌గా పిలుస్తారు.

వీరికి మినహాయింపు: బాలింతలు, నెలసరి మహిళలు, గర్భిణులు, మానసిక దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడేవారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఉపవాసం నుంచి మినహాయింపు ఉంది.

వహ్వా.. అనాల్సిందే: రంజాన్ అంటేనే ప్రత్యేక వంటకాలు ఉంటాయి. హలీమ్ ఈ మాసం ప్రత్యేకత. అరబ్ దేశాల నుంచి నోరూరించే ఖర్జూర పండ్లు, మిఠాయిలు వస్తాయి. అత్తర్ వాసనల్లోనూ భిన్నమైనవి దొరుకుతాయి. ఫలుదా, సేమియా ఖీర్, బిరియాని వంటి ఎన్నో విభిన్న వంటకాలు నోరూరిస్తాయి.

విద్యుత్తు కాంతుల్లో సత్తెనపల్లిలోని జిలానీ మసీదు

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

మార్టూరు, న్యూస్‌టుడే: పలు చోరీ కేసుల్లో నిందితుడ్ని బుధవారం మార్టూరు పోలీసులు అరెస్టు చేశారు. మార్టూరు పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో బాపట్ల ఇన్‌ఛార్జి డీఎస్పీ జగదీష్ నాయక్ వివరాలు వెల్లడించారు. యద్దనపూడి మండలం చింతపల్లిపాడు గ్రామానికి చెందిన పాలపర్తి నాగరాజు 8వ తరగతి వరకు చదువుకొని లారీ డ్రైవర్, క్లీనర్ పని చేస్తూ వ్యసనాలకు బానిసయ్యాడని తెలిపారు. 2008 నుంచి బైక్‌లు, సెల్‌ఫోన్లు చోరీ చేసి పల్నాడు [illegible] వృత్తిగా మార్చుకున్నాడన్నారు. గతంలోనూ బాపట్ల, యద్దనపూడి, మార్టూరు, అద్దంకి, సంతమాగులూరు, పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట, చిలకలూరిపేట గ్రామీణ, గుంటూరు జిల్లాలోని తుళ్లూరు, మంగళగిరి, విజయవాడ నగరం కృష్ణలంక పోలీస్‌స్టేషన్ల్లో నాగరాజుపై చోరీ కేసులు నమోదయ్యాయన్నారు. 2025లో బైక్, సెల్‌ఫోన్లు దొంగతనం కేసుల్లో యద్దనపూడి పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారని తెలిపారు. అదే ఏడాది డిసెంబర్‌లో జైలు నుంచి వచ్చిన నాగరాజు దొంగతనాలు చేస్తూ మార్టూరు మండలంలోని సూర్యాయపాలెం వద్ద, తాడేపల్లి పట్టణం ఉండవల్లి, విజయవాడలోని ఆటోనగర్ ప్రాంతాల్లో మూడు బైక్‌లు, కొమ్మలపాడు, నరసరావుపేట ప్రాంతాల్లో మూడు సెల్‌ఫోన్లు చోరీ చేశాడని తెలిపారు. మార్టూరు ఎస్సై సైదులు వచ్చిన సమాచారం మేరకు నాగరాజును మార్టూరుపాలెం గ్రామ శివారులో యలవర్తి కోల్డ్ స్టోరేజ్ వద్ద సాయంత్రం అరెస్ట్ చేసి, మూడు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ జగదీష్‌నాయక్ వివరించారు.

ఇలా చదువు.. మార్కులు సులువు

పరీక్షలకు సిద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు

జిల్లాలో ఉన్నత పాఠశాలలు: 520
పదో తరగతి విద్యార్థులు: 26,297 మంది

సత్తెనపల్లి, వినుకొండ, దాచేపల్లి, న్యూస్‌టుడే: ఏం చదవాలి.. ఎలా చదవాలి.. మార్కుల సాధనకు పదో తరగతి విద్యార్థుల మదిలో ఉండే ప్రశ్నలివి. ప్రశ్నపత్రంపై అవగాహన, అభ్యసన, పునశ్చరణ, చక్కని రాతతో సులువుగా మార్కులు సాధించవచ్చని పాఠ్యాంశ నిపుణులు చెబుతున్నారు. ఆ చిట్కాలు ఏంటో తెలుసుకుందామా మరి..

సాంఘికశాస్త్రం

ఈ ఏడాది కొత్తగా పరిణామం, సృష్టి వంటి అంశాలకు 10 మార్కుల చొప్పున మొత్తం 20 మార్కులు కేటాయించారు. వీటికి సొంత మాటలలో రాయడం, బార్‌గ్రాఫ్, చార్ట్ గీయడం వంటివి సాధన చేయాలి. పాఠ్యపుస్తకాన్ని లైన్ బైలైన్ చదవాలి. ఒక మార్కు ప్రశ్నలు వచ్చేవి జియోగ్రఫీలో 1, 6.. చరిత్రలో 1, 3. డెమోక్రటిక్ పాలిటిక్స్‌లో 2, 4, ఎకనమిక్స్‌లో 1, 6 పాఠాలు క్షుణ్ణంగా చదవాలి. వారానికి ఒకసారి మాక్ టెస్ట్ రాయాలి. భారతదేశ పటం, ప్రపంచ పటం రెండూ తప్పనిసరిగా గుర్తించాలి. ఒక మార్కు ప్రశ్నలు బాగా సాధన చేయాలి. – ఎన్.కేశవరెడ్డి

భౌతికశాస్త్రం

ప్రశ్నపత్రంలో 4 విభాగాల్లో 17 ప్రశ్నలుంటాయి. ఎక్కువ మార్కులు వచ్చే రసాయన చర్యలు, సమీకరణాలు, మానవుని కన్ను రంగుల ప్రపంచం, విద్యుత్తు ప్రవాహ, ఆయస్కాంత ప్రభావాలు పాఠ్యాంశాల్లో ముఖ్యమైన ప్రశ్నలను బాగా చదవాలి. ఎలక్ట్రిసిటీ పాఠ్యాంశంలో శ్రేణి సంధానం, సమాంతర సంధానం కొన్ని ప్రాథమిక భావనల నిర్వచనాలు చదవాలి. పాఠ్యపుస్తకం, డయాగ్రామ్స్, ఫార్ములాలు, నిర్వచనాలు, ప్రజెంటేషన్‌తో 50 మార్కులు సాధించవచ్చు.

– ఎన్.భాస్కరరావు

గణితం

14 చాప్టర్లలోని ముఖ్యాంశాలు, సూత్రాలు, నిర్వచనాలు గుర్తుకు వచ్చేలా ప్రతిరోజూ మననం చేసుకోవాలి. సమస్య సాధనలో వాడిన ఫార్ములాను, సమస్య సాధన చివర జవాబు ప్రత్యేకంగా కనిపించే విధంగా బాక్స్‌లో ఉంచాలి. జవాబుకు తగిన యూనిట్స్ పెడితే పూర్తి మార్కులు వస్తాయి. అధిక మార్కులు తెచ్చే స్టాటిస్టిక్స్‌లో మీన్, మోడ్, మీడియన్ మూడు సూత్రాలు అందులో పదాల గురించి రాయమని అడిగే ప్రశ్నకు, ప్రోబాలిటీలో క్రియేట్ ప్రాబ్లమ్స్ ప్రశ్న, పొలానిమియల్స్ నుంచి గ్రాఫ్‌ను చూసి 4 ప్రశ్నలకు సమాధానం రాయడం వంటివి సాధన చేయాలి. రియల్ నంబర్స్‌లో నిరూపణ, కోఆర్డినేట్జామిత్రీ నుంచి ట్రైసెక్షన్ పాయింట్స్, నాలుగు పాయింట్స్ ఇచ్చి రాంబస్ శీర్షాలు అని చూపండి. ప్రోబబిలిటిలో డెక్ఆఫ్ కార్డ్స్ మీద సమస్య, స్టాటిటిక్స్‌లో మీడియన్ మీన్ లెక్కలు, పెయిర్ ఆఫ్ లీనియర్ ఈక్వేషన్స్‌లో గ్రాఫ్ లెక్క నేర్చుకుంటే 40 మార్కులు సులువుగా సాధించవచ్చు.

– టి.సాంబశివరావు

జీవశాస్త్రం

చాప్టర్ వారీ వెయిటేజీ ప్రకారం చదువుకోవాలి. 5 చాప్టర్లలో 22 మార్కులు జీవక్రియలకు, 14 మార్కులు నియంత్రణ, సమన్వయం, 13 మార్కులు ప్రత్యుత్పత్తి, 10 మార్కులు అనువంశిత, 10 మార్కులు పర్యావరణం చాప్టర్‌కు ప్రశ్నపత్రంలో ప్రశ్నలు అడుగుతారు. ఛాయిస్‌తో కలిపి 70 మార్కులకు ఉంటాయి. జీవక్రియలు చాప్టర్‌లో ప్రయోగాలు, శిశువులో లింగ నిర్ధారణ, మెండల్ ఏక సంకరణ, ద్విసంకరణ ప్రయోగాలు, బేధాలు, అవాయు-వాయు శ్వాసక్రియ, లైంగిక-అలైంగిక ప్రత్యుత్పత్తి, ధమనులు-సిరలుదారువు-పోషక కంజాలం చదవాలి. పటాలకు సంబంధించి మానవ విసర్జక వ్యవస్థ, నెఫ్రాన్, పుష్పం నిర్మాణం, పరాగరేణువు అంకురోత్పత్తి, మానవ స్త్రీ ప్రత్యుత్పత్తి వ్యవస్థ, నాడీకణ నిర్మాణం పటాలు బాగా సాధన చేయాలి. – ఎం.శ్రీహరి

విద్యుత్తు చౌర్యం.. రూ.5.46 లక్షల జరిమానా

వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా నరసరావుపేటలో విద్యుత్తు అక్రమ వినియోగానికి పాల్పడిన వారికి రూ.5.46 లక్షల అపరాధ రుసుం విధించామని విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు తెలిపారు. విద్యుత్తు భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా ఆపరేషన్ విభాగ పర్యవేక్షక ఇంజినీరు విజయ కుమార్ ఆధ్వర్యంలో 53 మంది అధికారులు, 159 మంది సిబ్బంది 53 బృందాలుగా విడిపోయి 3,263 సర్వీసులను తనిఖీ చేశారు. అనుమతించిన కేటగిరీకి బదులుగా ఇతర కేటగిరీలో విద్యుత్తు వాడుతున్న ఐదుగురు, అనుమతించిన లోడు కంటే అదనంగా వాడుతున్న 86 మందిపై కేసులు నమోదు చేశారు. భారత విద్యుత్తు చట్టం సెక్షన్ 135 ప్రకారం పని చేయని మీటరు నుంచి విద్యుత్తు వాడుకున్నా.. మీటర్ మార్పిడితో చౌర్యం కింద పరిగణిస్తామని అధికారులు చెప్పారు. విద్యుత్తు అక్రమ వినియోగాన్ని 94408 12262, 86397 41050 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వొచ్చని, లేదా వాట్సప్ ద్వారా తెలియజేయవచ్చని సూచించారు. ప్రసాదరావు, శ్రీనివాసరావు, మల్లికార్జున ప్రసాద్, రవికుమార్, రవి, కోటేశ్వరరావు, శివశంకర్, సతీష్‌కుమార్, దుర్గారావు తదితరులు తనిఖీల్లో పాల్గొన్నారు.

మెప్మాలో రూ.9 కోట్లు మోసం చేశారని ఫిర్యాదు

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట): నరసరావుపేట పట్టణంలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో రూ.9 కోట్ల మోసాలకు పాల్పడ్డారని జిల్లా అర్బన్ సమైక్య అధ్యక్షురాలు షేక్ అఖిల ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. స్థానిక సీసీ ఉమాదేవితో పాటు మరో ఏడుగురు కలిసి రెండు బ్యాంకుల్లో అక్రమాలకు పాల్పడ్డారన్నారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఈ-పంట నమోదును సూపర్ చెక్ చేసిన డీఏవో

మొక్కజొన్న పొలంలో ఈ-పంట నమోదును సూపర్ చెక్ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు

యడ్లపాడు, న్యూస్‌టుడే: రైతులు సాగు చేసిన పంటలను ఈ-పంట యాప్‌లో నమోదు చేసుకోవడం ద్వారా వివిధ సంక్షేమ పథకాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు అన్నారు. ఈ-పంట నమోదు ప్రక్రియలో పారదర్శకతను పరిశీలించటానికి రూపొందించిన సూపర్ చెక్ కార్యక్రమంలో భాగంగా డీఏవో బుధవారం యడ్లపాడు మండలం తుర్లపాడులో పరిశీలించారు. ఈ-పంట నమోదు చేసిన పంట చేలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసి సూపర్ చెక్ నిర్వహించారు. డీఏవో మాట్లాడుతూ రైతులందరూ విధిగా 11 అంకెల విశిష్ట సంఖ్యను కలిగి ఉండాలని, ఆ సంఖ్య ఉన్న వారికే ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తాయని, సంఖ్య లేనివారు సమీప రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆగదు

గుంటూరు: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లోని ఉద్యోగుల సమ్మె కొనసాగుతోంది. ఈ నెల 16 నుంచి సమ్మెలోకి వెళ్లిన ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. గుంటూరు బ్రాడీపేటలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కార్యాలయం వద్ద బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా [illegible] ఉద్యోగుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు [illegible] మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై దృష్టి సారించాలని కోరారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని [illegible] ఆమరణ దీక్ష చేపడతామని పేర్కొన్నారు.

వరికపూడిశెల ప్రాజెక్టుపై సీఎం ప్రకటన చేయాలి

వినుకొండ, న్యూస్‌టుడే: వరికపూడిశెల ప్రాజెక్టుపై 21న వినుకొండ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ప్రకటన చేయాలని వివిధ పక్షాల రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దీనికి వినుకొండ, మాచర్ల ఎమ్మెల్యేలు బాధ్యత తీసుకోవాలన్నారు. ఏనుగుపాలెం రోడ్డులోని సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టు పూర్తి చేస్తే లక్ష ఎకరాలకు సాగు, 100 గ్రామాలకు తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి సానుకూల నిర్ణయం తీసుకోవాలని లేని పక్షంలో ఉద్యమం చేస్తామని తెలిపారు. సమావేశంలో అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు తోట ఆంజనేయులు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి యు.రాము, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశమైన వివిధ రైతు సంఘాల నాయకులు

కల్లాల్లో దొంగలు.. కంగారులో రైతులు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతులకు దొంగల భయంతో కంటిపై కునుకు లేకుండా పోతోంది. ఇప్పటివరకు విద్యుత్తు మోటార్లు, సోలార్ పంపులు చోరీలతో బెంబేలెత్తారు. గతంలో కావూరు, కమ్మవారిపాలెం, మద్దిరాల, యడవల్లి, మురికిపూడి, బొప్పూడి, గోవిందాపురం, పాలెం తదితర గ్రామాల్లో విద్యుత్తు మోటార్లు, సోలార్ పంపుసెట్లకు సంబంధించిన పరికరాలు చోరీకి గురయ్యాయి. ఆ ఘటనలకు సంబంధించి పోలీసులు నిందితుల్ని అదుపులోకి తీసుకున్నారు. తాజాగా పొలాల్లో కల్లాల్లో ఆరబెట్టిన మిర్చిని దొంగలు ఎత్తుకెళ్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మద్దిరాల వద్ద దొంగతనం జరిగిన మిర్చి కల్లాన్ని పరిశీలిస్తున్న పోలీసు సిబ్బంది

ధర పెరగడంతో మిర్చి ఉత్పత్తులపై కన్ను

రైతులు ప్రస్తుతం మిర్చిని ఆరబెట్టి కల్లాల్లో ఉంచుతున్నారు. ఇదే అదనుగా దొంగలు పంట ఉత్పత్తుల్ని చోరీ చేస్తున్నారు. చిలకలూరిపేట మండలం మద్దిరాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచి కేతినేని సుందర రామయ్య ఎనిమిది ఎకరాల్లో మిర్చి పంట వేశారు. ప్రస్తుతం కల్లంలో 11 క్వింటాళ్ల మిర్చిని ఆరబోశారు. కల్లం పక్కనే బస్తాలు కూడా ఉంచారు. రెండు రోజుల కిందట దొంగలు సంచుల్లో 11 క్వింటాళ్ల మిర్చిని నింపుకొని ఎత్తుకెళ్లారు. ఉదయం వెళ్లి చూసిన రైతు సుందర రామయ్య లబోదిబోమన్నాడు. గతంలో యడ్లపాడు మండలం తిమ్మాపురం వద్ద ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. తెలిసిన వారే దొంగతనాలకు పాల్పడి ఉంటారని రైతులు భావిస్తున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు గస్తీ పెంచాలని రైతులు కోరుతున్నారు. [illegible]

BIRTHDAY GREETINGS

పుట్టిన రోజు శుభాకాంక్షలు
మా ఇంటి బంగారం చిరంజీవి
పిట్టముడుసు
డినేష్ కార్తీక్ కు
పుట్టిన రోజు శుభాకాంక్షలు.
ఇటువంటి వేడుకలు
మరెన్నో జరుపుకోవాలని
మనసారా కోరుకుంటూ..
మేనమామ: అత్త
జి.కాటమ రాజు-సుభాషిణి
మరదళ్ళు: బిందుశ్రీ, శరణ్య
అమ్మమ్మ-తాత:
రాములమ్మ-వెంకట నారాయణ
(గుంటూరు)
సెల్ నెం: 9963339230

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

BUSINESS OFFER

Running 30 Bedded Hospital Lease@ MiryalagudaTown, Nalgonda. For Obstetrics, Urology, Pediatrics, Ortho Physician. 9848231654

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

Commercial plot 1373 sq.yds Inner Ring road, Guntur, with 1.25 lakhs Rent and bank loan for immediate sale. Call: 9573454266.

EENADU eClassifieds

TO LET

పాతపట్టాభిపురం 1వ లైనులో ఉన్న కుందన అపార్ట్‌మెంట్స్ 2BHK అపార్ట్‌మెంట్ No: 402 అద్దెకు ఇవ్వబడును. AC, లిఫ్ట్, జనరేటర్, సం॥ 9248494407.

JOBS

Wanted Hostel Wardens (Male / Female) & Floor Incharge in SIMS Group of Institutions Hostels, Contact No. 9701666645 & 6304777593.

We are Hiring - USA Counselor (OR) Tele caller only. Ladies, any Graduation. Contact: 77807 81382. Lakshmipuram, Guntur.

నిడమర్రు, మంగళగిరిటౌన్ ఓపెన్ ప్లాట్స్ సేల్స్ చేయుటకు సీనియర్ మార్కెటింగ్ మేనేజర్స్ కావలెను. మంత్లీ మెయింటైన్స్ & కమీషన్. ✆ 99899 99057.

ప్రముఖ కలెక్షన్ ఏజెన్సీలో పని చేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ మరియు టెలికాలర్స్ అనుభవంగల వారు కావలెను. జీతము: 15k to 20k. కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. DRA సర్టిఫికెట్ ఉన్నారికి ప్రాధాన్యత కలదు. జీతము: 20k, సంప్రదించగలరు. ఫోన్ నెంబర్స్: 89190 80894, 83091 32382.

హరేకృష్ణ హోం కేర్‌లో వృద్ధులను/ పేషంట్స్ను / పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం జీ:18-20K ✆ 96404 68899, 96402 58899

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజీలో ఉద్యోగ ఖాళీలు: Senior బ్యాచ్ ఇన్‌ఛార్జిలు Gender: పురుషులు మాత్రమే. విద్యార్హత: ఇంటర్ నుండి డిగ్రీ వరకు. వయస్సు: 25 సంవత్సరాల నుండి 45 సంవత్సరాల మధ్య ఉండవలెను. నెలకు జీతము: 16,000/- వరకు ఇవ్వబడును. సంప్ర: ఫోన్: 9248722246.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు క్లాసు ఇన్‌ఛార్జిస్ మరియు క్యాంపస్ ఇన్‌ఛార్జిస్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము: 14,000/- నుండి 21,000/- వరకు ఇవ్వబడును. అర్హతలు: ఇంటర్ నుండి పి.జి. వరకు. వయస్సు: 22 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి. సంప్ర: ఫోన్ నెం. 8978480435.

గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పని చేయుటకు విశ్రాంత ఉద్యోగులు, హౌస్‌వైఫ్ 10th పాస్, 50 సం॥పై వయస్సు వారు కావలెను. 7036761665.

బిజినెస్ మేనేజర్స్ / బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రీ ఫ్రెషర్స్, మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్న 30 సం॥ల లోపు వారు రెజ్యూములను kamathamjob@gmail.comకు పంపగలరు.

గుంటూరు సిటీ RTC బస్టాండ్ దగ్గరలో ప్రముఖ బిర్యాని హోటల్ నందు పనిచేయుటకు సప్లయిర్ కావలెను. లోకల్ వారికి ప్రాధాన్యత. ✆ 96668 41537.

ప్రముఖ దంత వైద్యశాల నందు పని చేయుటకు అసిస్టెంట్ మరియు రిసెప్షనిస్ట్ స్టాఫ్ కావలెను. సంప్ర॥ 78420 31133.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు Senior Civil Engineersగా పని చేయుటకు పురుషులు కావలెను. జీతం: 50000/- నుండి 60000/- వరకు ఇవ్వబడును. విద్యార్హతలు: Civil Engineering, వయస్సు: 30 సంవత్సరముల పైన ఉండవలెను. వివరాల కొరకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 89784 80429.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్, హాస్టల్ ఇన్‌ఛార్జిస్‌గా పనిచేయుటకు స్త్రీలు కావలెను. జీతం: 10000/- నుండి 13000/- వరకు ఇవ్వబడును (ఉచిత భోజన వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సం॥ల పైన ఉండవలెను. వివరాలకు సంప్రదించగలరు. ఫోన్ నెం: 92487 33340.

పాలషాప్ నందు పనిచేయుటకు సేల్స్ Boys కావలెను. ఫుల్ టైం జీతం: 12000/-, అడ్రస్: Opp. మెట్రో, కాకాని రోడ్, గుంటూరు. సెల్ 98857 94435.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

హోటళ్లు, టిఫిన్ సెంటర్లపై దాడులు

14 మందిపై కేసులు నమోదు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా సిలిండర్లు వినియోగిస్తున్న 14 మందిపై కేసులు నమోదు చేసినట్లు పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్ తెలిపారు. బుధవారం పట్టణంలోని బస్టాండ్ సెంటర్, సత్తెనపల్లి రోడ్డు, మార్కెట్ సెంటర్ తదితర ప్రాంతాల్లో బిర్యానీ హోటళ్లు, టిఫిన్ హోటళ్లలో పౌరసరఫరాలు, రెవెన్యూ శాఖల అధికారులు దాడులు నిర్వహించారు. గృహాల్లో వినియోగించే సిలిండర్లు హోటల్ నిర్వాహకులు వినియోగిస్తుండటాన్ని గుర్తించి వారి వద్ద నుంచి మొత్తం 35 స్వాధీనం చేసుకున్నారు. సత్తెనపల్లి రోడ్డులో ఓ క్యాటరింగ్ నిర్వాహకుడు 40 కమర్షియల్ సిలిండర్లు కలిగి ఉండటాన్ని గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. డీటీ ప్రభాకర్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దాడులు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా సిలిండర్లు వినియోగిస్తున్న వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కమర్షియల్ సిలిండర్లు 7కన్నా ఎక్కువ వినియోగించకూడదన్న నిబంధన ఉన్నా క్యాటరింగ్ నిర్వాహకుడు ఏకంగా 40 సిలిండర్లు కలిగి ఉన్నాడని, వాటికి లైసెన్సు లేకపోవడంతో స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వివరించారు. దాడుల్లో పట్టణ ఆర్ఐ రమేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి

అమరావతి, న్యూస్‌టుడే: రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో మృతి చెందిన ఘటన మండలంలోని మునగోడు వద్ద చోటుచేసుకుంది. బెల్లంకొండ మండలం వెంకటాయపాలేనికి చెందిన నాగరాజు(36) ఉపాధి నిమిత్తం మునగోడులో ఉంటున్నాడు. బుధవారం గ్రామం వద్ద రోడ్డు దాటుతుండగా గుంటూరు నుంచి క్రోసూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో అతడు బస్సు ముందు టైర్ కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ అచ్చయ్య తెలిపారు.

91.9FM Vijayawada ఈ FM 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

ప్రజావేదిక వద్దే కార్యకర్తల సమావేశం

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి పాల్గొనే ప్రజావేదిక వద్దనే కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ తెలిపారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా 21న సీఎం చంద్రబాబు వినుకొండలో పర్యటించనున్న నేపథ్యంలో జరుగుతున్న ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. హెలిప్యాడ్, స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం జరిగే వైద్యశాల, ఎన్నెస్పీ కాలనీలోని ప్రజావేదిక, కార్యకర్తల సమావేశానికి నిర్ణయించిన స్థలాలను పరిశీలించి అధికారులు, పోలీసులకు సూచనలు చేశారు. సభావేదిక వద్దకు వెళ్లే మార్గాలు, వీఐపీలు వచ్చే దారి, ప్రజావేదిక వద్దకు ప్రజలు రావడానికి దారులు, కార్యకర్తల సమావేశానికి వచ్చే మార్గాలు ఎటువైపు ఉండాలో సూచించారు. అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, అడిషనల్ ఎస్పీ సంతోష్, ఆర్డీవో మధులత, డిప్యూటీ కలెక్టర్ వరద సుబ్బారావు, సీఐలు ప్రభాకర్, బ్రహ్మయ్య, అర్బన్ శ్రీహరి, తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

కోరిక తీర్చకపోతే యాసిడ్ పోస్తానని బెదిరింపు

వదినపై మరిది అత్యాచారయత్నం

ఈనాడు, నరసరావుపేట, న్యూస్‌టుడే, రొంపిచర్ల: వదిన అంటే అమ్మతో సమానం.. కానీ ఆ మరిది కోరిక తీర్చాలంటూ ఆమెను వేధింపులకు గురిచేశాడు. కోరిక తీర్చకపోతే యాసిడ్ పోస్తానంటూ భయాందోళనకు గురి చేశాడు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటన రొంపిచర్ల పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. రొంపిచర్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ(34) భర్త ఏడాదిన్నర కిందట చనిపోయాడు. కూలీ పనులకు వెళ్తూ ముగ్గురు పిల్లలను పోషిస్తోంది. ఆమెపై మరిది శామ్యూల్ కన్నేశాడు. గతంలో ఓసారి అత్యాచారయత్నం చేశాడు. విషయం పెద్దమనుషుల వరకు వెళ్లడంతో ఇకపై అలా ప్రవర్తించనని ఆమె కాళ్లు పట్టుకున్నాడు. అయినా సరే ప్రవర్తన మార్చుకోని శామ్యూల్ ఈ నెల 16న రాత్రి నిద్రిస్తున్న ఆమెపై లైంగిక దాడికి యత్నించాడు. ఎదురుతిరగడంతో వెంట తెచ్చుకున్న యాసిడ్ ఆమెపై పోసే ప్రయత్నం చేయగా తప్పించుకుంది. బుధవారం బంధువులతో కలిసి బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనకు మరిది నుంచి ప్రాణహాని ఉందని రక్షించాలని వేడుకుంది. రొంపిచర్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుడి కోసం గాలిస్తున్నారు.

ఇరవై రోజుల్లో ఆసుపత్రి బ్లాక్ సిద్ధం చేయాలి

పిడుగురాళ్ల, మాచవరం: ఇరవై రోజుల్లో ఆసుపత్రిలో ఒక బ్లాక్‌ను సిద్ధం చేయాలని రాష్ట్ర వైద్య విద్య అదనపు సంచాలకులు డాక్టర్ వెంకటేశ్వరరావు మెగా ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కామేపల్లి సమీపంలో నిర్మాణం జరుగుతున్న వైద్య కళాశాల భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 150 పడకల ఆసుపత్రికి సంబంధించి ఒక బ్లాక్‌లో అన్ని పనులు త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. ఆక్సిజన్, మార్చురీ బ్లాకుల పనులు పూర్తి చేయాలని సూచించారు. 15 రోజుల్లో సిబ్బంది వస్తారని, వారికి కొన్ని గదులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రోగులను చూడటానికి అవసరమైన పరికరాలు కూడా సిద్ధం చేయాలని చెప్పారు. అనంతరం మాచవరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లారు. ఆరోగ్య కేంద్రం భవనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్య విద్య సంయుక్త సంచాలకులు డాక్టర్ రామన్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఊపిరి తీసిన వేగం

కారంపూడి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చిన యువకుడు రోడ్డుపై వెళుతున్న బాలికను ఢీకొని, అనంతరం అదుపుతప్పి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం బొల్లాపల్లి మండలం గుమ్మనంపాడు గ్రామానికి చెందిన షేక్ మన్సూర్ (22) బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై కారంపూడికి బయలుదేరాడు. కుడికాలువ వద్దకు రాగానే రోడ్డు దాటుతున్న బాలిక శిరీషను ఢీకొట్టాడు. అనంతరం వాహనాన్ని అదుపు చేయలేక రోడ్డు పక్కనున్న విద్యుత్తు స్తంభాన్ని బలంగా ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు బాలికను పిడుగురాళ్లలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వాసు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 120, రిటైల్ ధర - 147, చికెన్ విత్‌స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్ - 243.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213 చికెన్ స్కిన్‌లెస్ - 243.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 132, 142 చికెన్ విత్ స్కిన్ - 230 చికెన్ స్కిన్‌లెస్ - 240.

పొక్లెయిన్ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

కేసు నమోదు చేయని పోలీసులు

ఈనాడు, నరసరావుపేట: తిరునాళ్ల చూసేందుకు కడప జిల్లా నుంచి వచ్చిన యువకుడు (22) పొక్లెయిన్ ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. పొక్లెయిన్‌ను నడిపింది మైనర్ కావడం గమనార్హం. వివరాలిలా.. కడప జిల్లా ఖాజీపేటకు చెందిన నవీన్ (22) స్నేహితులతో కలిసి ఈ నెల 15న కోటప్పకొండకు వచ్చాడు. సాయంత్రం ప్రభల వద్దకు వెళ్తుండగా పొలాల్లో మట్టిని సరిచేసే చిన్న పొక్లెయిన్ ఢీకొంది. నాదెండ్ల మండలం కనపర్తికి చెందిన మైనర్ (17) దాన్ని నడుపుతున్నాడు. యజమాని పక్కనే ఉన్నాడు. ప్రమాదంలో గాయపడిన నవీన్‌ను నరసరావుపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. నడుంకు బాగా దెబ్బ తగిలింది.. రెండు నెలల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు నరసరావుపేట గ్రామీణ పోలీసుస్టేషన్‌కు వెళ్తే కేసు నమోదు చేయలేదని బాధితులు వాపోయారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశానికి 20 నుంచి దరఖాస్తులు

శావల్యాపురం, న్యూస్‌టుడే: మండలంలోని ఆరు ప్రైవేటు పాఠశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి పేద విద్యార్థులు ఉచితంగా చదువుకునేందుకు 25 శాతం సీట్లు కల్పించామని ఎంఈవో మల్లికార్జున సాంబశివరావు తెలిపారు. ఈనెల 20 నుంచి దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. బుధవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో మాట్లాడుతూ షెడ్యూల్ కులాలకు 10 శాతం, షెడ్యూల్ తెగలు 4శాతం, బలహీన వర్గాలు, మైనార్టీలు 6శాతం, అనాథలు, దివ్యాంగులు, హెచ్ఐవీ బాధితుల పిల్లలకు 5శాతం ప్రవేశాల్లో రిజర్వేషన్ కల్పించనున్నారు. దరఖాస్తుతో పాటు ఆధార్, కుల, ఆదాయ ధ్రువపత్రం, రేషన్‌కార్డు, పాస్ పోర్ట్ సైజు ఫొటో జతపర్చి స్థానిక సచివాలయం, నెట్ కేంద్రాలు, మండల వనరుల కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

ఇస్సపాలెం (నరసరావుపేటసెంట్రల్), న్యూస్‌టుడే: మండలంలోని ఇస్సపాలెం మహంకాళి అమ్మ ఆలయ పునర్నిర్మాణానికి నరసరావుపేటకు చెందిన వీరాంజనేయ సహిత యోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయ నిర్మాణ ఉపాధ్యక్షుడు కపూరు శివశ్రీనివాసు, సుజాత దంపతులు రూ.1,00,116 విరాళాన్ని ఈవో మాధవీదేవికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ బండ్లమూడి చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఈవోకు విరాళం అందజేస్తున్న దాతలు, వారి కుటుంబ సభ్యులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008146652 వినుకొండ గ్రామీణ : 9440009293

? చిలకలూరిపేట పట్టణం శ్రీనివాస కాలనీ వాటర్ ట్యాంక్ వద్ద పైప్‌లైన్ లీకై నీరు వృథాగా పోతున్నాయి. - **వాసు, స్థానికుడు**
✔ పరిశీలించి నీటి వృథాను అరికడతాం. - **మణికుమార్, పురపాలక సంఘ ఏఈ** - న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

? ప్రకాష్ నగర్‌లోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో మ్యాన్ హోల్ కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. -**కోటేశ్వరరావు**
✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి కొత్త మ్యాన్ హోల్ ఏర్పాటు చేయిస్తాం. -**మున్సిపల్ ఏఈ జ్యోతి** -న్యూస్‌టుడే, నరసరావుపేటసెంట్రల్

? కారంపూడి రోడ్డులో నివాసాలు పెరిగినందున రహదారి విస్తరించాలి - **నారాయణ** ✔ సెంట్రల్ డివైడర్‌తో నాలుగు వరుసల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం - **జి.వెంకటేశ్వరరావు, ఆర్అండ్‌బీ, డీఈఈ, వినుకొండ** -న్యూస్‌టుడే, వినుకొండ

? గంటావారిపాలెం నుంచి వేల్పూరు వెళ్లే రోడ్డులో విద్యుత్తు సబ్ స్టేషన్ సమీపంలో పెద్ద గుంత ఏర్పడింది. రాత్రి పూట ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. - **వెంకటేశ్వర్లు వేల్పూరు**
✔ త్వరలో గుంతను పూడ్చి వేయించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు చేపడతాం. - **మల్లి వెంకటేశ్వర్లు పీయూఆర్ ఏ.ఇ వినుకొండ** -న్యూస్‌టుడే, వినుకొండ

నిలువ నీడలేదు.. అధికారుల మనసు కరగదు

వినుకొండ, న్యూస్‌టుడే: వినుకొండ ఆర్టీసీ బస్టాండ్ పెరిగిన ప్రయాణికుల రద్దీకి ఏమాత్రం చాలడం లేదు. బస్సుల కోసం ఎండలో వేచి ఉండాల్సివస్తోంది. నీడ ఉన్న వైపు గుంటూరు, విజయవాడ వెళ్లే బస్సులు మాత్రమే ఆగుతున్నాయి. మిగిలిన అన్ని వైపులకు నడిచే బస్సులు ఎక్కాలంటే గంటల్లో ఆగాల్సిందే.. ఆరు బయట నిలబడాల్సిందే. వేసవిలో ప్రయాణికులకు మరిన్ని ఇబ్బందులే. ప్లాట్‌ఫాంలు లేక ఏ బస్సు ఎటు ఉంటుందో తెలియక వృద్ధులు, మహిళలు, పిల్లలు తికమక పడుతున్నారు. సుమారు 500 బస్సులు 10 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్న వినుకొండ బస్టాండ్‌ను బాగు చేయాలని ఎవరికీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. 48 సంవత్సరాల క్రితం ఎన్టీఆర్ పాలనలో నిర్మించిన బస్టాండ్ తప్ప ఆ తర్వాత ఎటువంటి అభివృద్ధి జరగలేదు. రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, నెల్లూరు జోన్ ఛైర్మన్ సురేష్ రెడ్డి గత ఏడాది బస్టాండ్‌ను సందర్శించి బాగు చేయడానికి తోడ్పాటునందిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సీఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. బస్టాండ్ అభివృద్ధికి ప్రణాళికలు పంపించామని డిపో మేనేజర్ నాగేశ్వరరావు తెలిపారు.

బస్సు కోసం ఎండలో వేచి ఉన్న ప్రయాణికులు

హైవేపై మూగజీవాలు.. అరికట్టకుంటే ప్రమాదాలు

యడ్లపాడు: పదహారో నంబరు జాతీయ రహదారి మార్జిన్‌లోకి పచ్చిక కోసం వస్తున్న పశువులు, జీవాలతో రోడ్డు ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఆరు వరుసల ఎక్స్‌ప్రెస్ హైవేగా నిర్మించిన రోడ్డులో వాహనాలు అత్యంత వేగంగా వెళ్తుంటాయి. ప్రమాదాల నివారణకు నిర్దేశిత ప్రాంతాల్లో మినహా మిగిలిన చోట్ల రోడ్డు దాటే వీలు లేకుండా ఇరువైపులా రక్షణ కంచె నిర్మించారు. రోడ్డు నిర్మాణం, రహదారి భద్రత నిమిత్తం ఎన్‌హెచ్ఏఐ అధికారులు రోడ్డు భద్రత సిబ్బందిని నియమించారు. కానీ సిబ్బంది మొక్కుబడిగా గస్తీ తిరుగుతున్నారు. యడ్లపాడు మండలం వంకాయలపాడు వద్ద రక్షణ కంచె తొలగించిన మార్గం నుంచి కొందరు పశువులు హైవే మార్జిన్‌లోకి తోలుకువచ్చి పచ్చిక మేపుతున్నారు. నేరుగా పశువులు వాహనాల హారన్‌కు బెదిరి రోడ్డు మధ్యకు వస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. తొలగించిన రక్షణ కంచెకు మరమ్మతులు నిర్వహించి హైవేలో మూగజీవాలు రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై హైవే సూపర్‌వైజర్ ఆర్ఫాన్ వివరణ కోరగా.. హైవేలో ఫెన్సింగ్ తొలగించిన చోట మూసివేస్తామన్నారు.

హైవే మార్జిన్‌లో పచ్చిక మేస్తున్న గేదెలు

పగుళ్లిచ్చి.. అపాయంగా మారి

నూజండ్ల, న్యూస్‌టుడే: ఉప్పలపాడు వద్ద గుండ్లకమ్మ నదిపై ఉన్న వంతెన ప్రమాద భరితంగా మారింది. వంతెన పిల్లర్ జాయింట్ వద్ద పూర్తిగా దెబ్బతినడంతో పెద్ద పెద్ద పగుళ్లు ఏర్పడ్డాయి. వంతెనకు సంబంధించిన పిల్లర్ పిల్లరుకు మధ్య జాయింట్ మొత్తం దెబ్బతింది. ఇనుప కమ్మీలు బయట పడటంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురికావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆటోలు, కార్లు టైర్లు దెబ్బతింటున్నాయని వాహనదారులు తెలుపుతున్నారు. లోడ్ లారీలు బరువుకు జాయింట్ పూర్తిగా విడిపోతున్నాయి. పల్నాడు, ప్రకాశం జిల్లాలను కలిపే ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారి కావడంతో భారీ లోడుతో వచ్చే వాహనాల రద్దీ ఉంటుంది. కనీస మరమ్మతులు చేయకపోతే వంతెన దెబ్బతిని ప్రమాదకరంగా మారుతుందని వాహనదారులు వాపోతున్నారు. సమస్యను ఏఈఈ నవ్య దృష్టికి తీసుకెళ్లగా రోడ్డు మరమ్మతులు జరుగుతున్నాయి. అందులో భాగంగా ఈ జాయింటుకు మరమ్మతులు కూడా చేయిస్తామన్నారు.

ఇనుప కమ్మీలు బయటకు వచ్చి ఇలా..

ఆలయ ప్రతిష్ఠ

వినుకొండ: పట్టణంలోని దక్షిణం బజారులో నూతనంగా నిర్మించిన శ్రీరామ సమేత సత్యనారాయణస్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. తొలిరోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాతలు ఎన్ఆర్‌ఐ జొన్నలగడ్డ పాండురంగారావు, వెంకటచంద్రరమాదేవి దంపతులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక

నరసరావుపేట (క్రీడలు), న్యూస్‌టుడే: చెస్ లీగ్-2026 ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-19 చెస్ పోటీల్లో పట్టణానికి చెందిన కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థిని షేక్ చాందిని ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికయిందని ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. 21, 22 తేదీల్లో తిరుపతిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు పీడీ ఆదిబాబు తెలిపారు. విద్యార్థినిని కళాశాల యాజమాన్యం అభినందించింది.

చాందినిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, పీడీ

మైనార్టీల భవనాలను కేంద్రీయ విద్యాలయానికి అప్పగించొద్దు

నరసరావుపేటసెంట్రల్, నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: మండలంలోని ములకలూరు వద్ద మైనార్టీ విద్యార్థుల కోసం నిర్మించిన కళాశాల, వసతి గృహాల భవనాలను కేంద్రీయ విద్యాలయానికి కేటాయించాలన్న అధికారుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ముస్లిం మైనార్టీ నేతలు బుధవారం ములకలూరు వద్ద సత్తెనపల్లి - నరసరావుపేట రహదారిపై ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ మైనార్టీల కోసం నిర్మించిన భవనాల్లో ఏడాదిపాటు కేంద్రీయ విద్యాలయం కొనసాగించాలన్న నిర్ణయం అన్యాయమని, వెంటనే నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాటిని నిర్మించి ఏళ్లు కావస్తున్నా ఇప్పటికీ ప్రారంభించకపోవడం దారుణమన్నారు. వెంటనే ప్రారంభించాలని కోరారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ వేణుగోపాలరావు అక్కడికి చేరుకుని వారితో మాట్లాడి విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం మైనార్టీ నేతలు కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లాను కలిసి వినతిపత్రం అందజేశారు.

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మైనార్టీ నేతలు

జేఈఈ మెయిన్స్‌లో సత్తా

సుచరిత వెంకట ప్రజ్ఞ

దినేష్

నూజండ్ల, న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో నూజండ్ల మండలం తిమ్మాపురానికి చెందిన ఆళ్ల సుచరిత వెంకట ప్రజ్ఞ 99.89 పర్సంటైల్ సాధించింది. ప్రస్తుతం విజయవాడలోని నారాయణ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. చెన్నై ఐఐటీలో సీటు సాధించడమే తన లక్ష్యమని సుచరిత వెంకట ప్రజ్ఞ తెలిపింది. తల్లిదండ్రులు రాంబాబు, రమాదేవి సాధారణ రైతు కూలీలు కాగా మొదటి నుంచి చదువులో ప్రతిభ కనబరిచేదని గ్రామస్థులు తెలిపారు.

పొట్లూరు (శావల్యాపురం), న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో పొట్లూరు గ్రామానికి చెందిన రైతు కుమారుడు దినేష్ జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 98.94 పర్సంటైల్ సాధించాడు. ప్రస్తుతం విజయవాడలోని ప్రైవేటు విద్యా సంస్థలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. దినేష్ ప్రాథమిక, ఉన్నత విద్య అంతా గ్రామంలోని జడ్పీ పాఠశాలల్లోనే పూర్తిచేశాడు. తమ పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి జేఈఈ ఫలితాల్లో మంచి ప్రతిభ కనబరిచినందుకు ప్రధానోపాధ్యాయిని ఎస్.అన్నపూర్ణమ్మతో పాటు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

వినుకొండ: జేఈఈ మెయిన్స్‌లో అధిక పర్సంటైల్ సాధించిన విద్యార్థులను విశ్వసాయి కళాశాల యాజమాన్యం సన్మానించింది. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తమ విద్యాసంస్థలో చదివిన 25 మంది 70 పర్సంటైల్ పైగా సాధించారని ప్రిన్సిపల్ శ్రీవల్లి పావని తెలిపారు.

వినుకొండలో పారిశుద్ధ్య పనులు

వినుకొండ, న్యూస్‌టుడే: వినుకొండలో ఈనెల 21న సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. నరసరావుపేట రోడ్డులోని ఎన్ఎస్‌పీ కాలనీ స్థలంలో సభ నిర్వహించేందుకు సుమారు మూడు ఎకరాల్లో బుధవారం టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. రెవెన్యూ శాఖ దీనిని పర్యవేక్షిస్తుండగా చుట్టూ చదును చేసే పనిని ఉన్న మట్టికుప్పలను మున్సిపల్ అధికారులు బయటకు తరలించడంతో పాటు పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నారు. వాహనాల పార్కింగ్ కోసం కూరగాయల మార్కెట్ సమీపంలో స్థలం సిద్ధం చేస్తున్నారు. కారంపూడి రోడ్డులోని డివైడర్‌లో తొలగించిన కోనోకార్పస్ చెట్ల స్థానంలో కాగితపు పూల మొక్కలు నాటుతున్నారు. కారంపూడి రోడ్డులో కార్యకర్తల సమావేశానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. స్థలం శుభ్రం చేసి వేదిక ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

కారంపూడి రోడ్డు డివైడర్‌లో నాటుతున్న మొక్కలు

తాడు తెగితే ప్రాణాపాయమే

జిల్లా కేంద్రం నరసరావుపేటలో ప్రధాన రహదారి, అత్యంత రద్దీగా ఉండే మల్లమ్మ సెంటర్లో పలు మినీ వాహనాలు నిబంధనలకు విరుద్ధంగా ప్రమాదకర రీతిలో ప్రయాణం సాగిస్తున్నాయి. ప్లాస్టిక్ నీళ్ల ట్యాంకులు, ఇనుప చువ్వలు, కర్రలు, ఎయిర్ కూలర్లు ఇలా ఓ పద్ధతి లేకుండా వాహనంలో పరిమితికి మించి నింపి తాళ్లతో కట్టి తరలిస్తున్నారు. ప్రయాణ సమయంలో ఏ మాత్రం తాడు తెగినా సామగ్రి కింద పడి వెనుక వచ్చే వారికి ప్రాణాపాయం తప్పదు. ఈ విషయమై ట్రాఫిక్ సీఐ లోకనాథంను వివరణ కోరగా నిబంధనలు ఉల్లంఘించి సామగ్రి తరలించే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. - **న్యూస్‌టుడే, నరసరావుపేట టౌన్**

మ్యాన్‌హోల్‌కు అడ్డుగా రోలే ఆధారం

చిలకలూరిపేట పట్టణం 17వ వార్డు వడ్డెర కాలనీలోని నాగకరుమారెమ్మ, కనకదుర్గమ్మ, అంకమ్మ తల్లి అమ్మవార్ల దేవస్థానం ఎదురు కల్వర్టు పైన ఉన్న మ్యాన్‌హోల్ పాడైపోవడంతో వాహనాలు దానిలో పడి ఇరుక్కుపోయి ప్రమాదకరంగా మారింది. ఎవరూ పట్టించుకోకపోవడంతో చుట్టుపక్కల వారు రోలును అడ్డుగా పెట్టారు. సమస్యను పురపాలక సంఘ ఏఈ మణికుమార్ దృష్టికి తీసుకెళ్లగా రోలు తొలగించి మ్యాన్‌హోల్‌పై మూత ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. - **న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం**

మురుగు నిలిచి.. ముక్కుపుటాలు అదిరి..

చిలకలూరిపేట పట్టణంలో పెదనందిపాడు రోడ్డు నుంచి డీఆర్ఎన్ఎస్ కళాశాల పక్కగా ప్రవహించే ప్రధాన కాలువ మట్టి, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. దీంతో కాలువలో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతుంది. కళామందిర్ సెంటర్, తూర్పుమాలపల్లి, దాసరికాలనీ, గుర్రాలచావిడి తదితర ప్రాంతాల్లో ఇళ్లలో ఉపయోగించే నీరంతా ఈ కాలువలో చేరి పసుమర్రు బ్రిడ్జి వద్ద ఓగేరు వాగులో కలుస్తుంది. కాలువ పూడిపోవడంతో మురుగు కదలక దుర్వాసన, దోమలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. సమస్యను పారిశుద్ధ్య అధికారిణి సునీత దృష్టికి తీసుకెళ్లగా పొక్లెయిన్ సాయంతో పూడిక తీయించి మురుగు నీరు సక్రమంగా వెళ్లేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. - **న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం**

ప్రమాదం.. చేతికందుతోంది

నరసరావుపేట పట్టణంలో బరంపేట మసీదు నుండి సత్తెనపల్లి రోడ్డుకు వెళ్లే ప్రధాన రహదారిలో విద్యుత్తు నియంత్రిక తక్కువ ఎత్తులో ఉండి ప్రమాదకరంగా మారింది. నియంత్రిక అమర్చిన సిమెంట్ దిమ్మె పగుళ్లిచ్చి రాళ్లు కూలేలా ఉన్నాయి. పిల్లలు ఆటలాడుతూ దిమ్మె వద్దకు వెళ్లినా, పశువులు సంచరించే సమయంలో దిమ్మెకు తగిలినా పెను ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. విద్యుత్తు అధికారులు త్వరపడి నిబంధనలకు అనుగుణంగా దిమ్మె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. దీనిపై డీ-1 సెక్షన్ ఏఈ రఫీని అడగ్గా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. - **న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్(నరసరావుపేట)**

ఆదమరిస్తే అంతే

వెల్లటూరు సమీపంలోని దొండపాడు మేజరు కాలువ వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా కాలువకు ఉన్న డ్రాప్ శిథిలావస్థకు చేరింది. ఒక వైపు డ్రాప్ పూర్తిస్థాయిలో కూలిపోయింది. రోడ్డు అంచు వద్ద పెద్ద గుంత కనిపిస్తోంది. అధికారులు ఆ ప్రాంతంలో ప్రమాదాలు జరగకుండా రక్షణ గోడ నిర్మించాల్సి ఉంది. సమస్యను జలవనరుల శాఖ ఏఈ రమేష్ దృష్టికి తీసుకెళ్లగా శిథిలావస్థకు చేరిన డ్రాప్ ప్రాంతంలో బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు. నిధులు మంజూరైతే వంతెన నిర్మిస్తామని చెప్పారు. - **న్యూస్‌టుడే, బొల్లాపల్లి**

అవీ ఇవీ

శనగలో అధిక దిగుబడులకు సూచనలు

సాతులూరు(చిలకలూరిపేట గ్రామీణ): పూత, పిందె దశలో ఉన్న శనగ పంటలో పది రోజుల వ్యవధిలో రెండుసార్లు చొప్పున పొటాషియం నైట్రేట్‌ను లీటర్‌కు 5 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేస్తే గింజ ఊరి దిగుబడులు సాధించవచ్చని నరసరావుపేట వ్యవసాయశాఖ ఏడీఏ కె.వి.శ్రీనివాసరావు సూచించారు. నాదెండ్ల మండలం సాతులూరులో క్షేత్రస్థాయిలో శనగ పంటను ఏడీఏ శ్రీనివాసరావు పరిశీలించి రైతులకు సూచనలు చేశారు.

ఘనంగా 16 రోజుల పండగ

గణపవరం (చిలకలూరిపేట గ్రామీణ): గణపవరంలోని సువర్చల సమేత వీరాంజనేయస్వామి ఆలయంలో బుధవారం 16 రోజుల పండగ ఘనంగా నిర్వహించారు. స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

20లోగా పంట నమోదు చేయించుకోవాలి

నరసరావుపేట సెంట్రల్: రబీలో పంట సాగు చేసిన రైతులు రైతు సేవా కేంద్రంలో ఈ నెల 20లోగా పంట నమోదు చేయించుకోవాలని ఏవో శాంతి బుధవారం తెలిపారు. మీ భూమిలో పొలం ఉన్న ప్రతి రైతు విశిష్ట సంఖ్య పొందాలని, వ్యవసాయ అనుబంధ రంగాల పథకాలు పొందాలంటే రైతు విశిష్ట సంఖ్యను ప్రామాణికంగా తీసుకోవటం జరుగుతుందని, ఈనెల 25 లోపు పొలం ఉన్న ప్రతి రైతు విశిష్ట సంఖ్యను పొందాలని ఆమె సూచించారు.

రోటరీ సేవలు మరింత విస్తృతం చేయాలి

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్‌లో ఎక్కువ మంది సభ్యులు చేరి సేవలను మరింత విస్తృతం చేయాలని రోటరీ జిల్లా 3150 గవర్నర్ డాక్టర్ ఎస్.వి.రామ్‌ప్రసాద్ సూచించారు. చిలకలూరిపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అధికారిక పర్యటనకు వచ్చిన ఆయన నరసరావుపేట రోడ్డులోని క్లబ్ కార్యాలయంలో మాట్లాడారు. కుల, మత, ప్రాంతాలు తేడా లేకుండా క్లబ్ సేవా కార్యక్రమాలను చేస్తుందన్నారు. చిలకలూరిపేట క్లబ్ 1970లో ఏర్పడిందని, ప్రస్తుతం 100 మంది సభ్యులతో అనేక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుందని వివరించారు. అసిస్టెంట్ గవర్నర్ పోలిశెట్టి రాఘవయ్య, చిలకలూరిపేట రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పుటూరి ప్రసాద్, బోడి రామసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వినాయకునికి పూజలు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: బొప్పూడి వినాయకుని గుడిలో ఘనంగా పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో పాటు అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అలంకరణలో స్వామి

నిత్యావసర సరకుల వితరణ

యడ్లపాడు: యేసుతో సహవాసం సంస్థ రెండో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సంస్థ సహకారంతో మండలంలోని జాలాదిలోని ఆరు నిరుపేద కుటుంబాలకు చెందిన వృద్ధులు, వితంతువులకు నెలకు సరిపడా నిత్యావసర సరకులు బుధవారం పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి 25 కిలోల వంతున బియ్యం, 26 రకాల నిత్యావసర సరకులు అందజేశారు.

డ్రైనేజీ పైకప్పు ఏర్పాటు చేయాలని డిమాండ్

వినుకొండ, న్యూస్‌టుడే: మార్కాపురం రోడ్డులో కొత్తగా తీసిన డ్రైనేజీ పైకప్పు వెంటనే వేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి యు.రాము డిమాండ్ చేశారు. ఆ పార్టీ నాయకులతో కలిసి బుధవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఐదు అడుగులు లోతు మూడు అడుగులు వెడల్పు ఉన్న కాల్వ ను దాటి వెళ్లడం ప్రమాదకరమని దీనిని గమనించి ప్రజాశ్రేయస్సు దృష్ట్యా మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు

మార్చి 14న లోక్ అదాలత్

వినుకొండ: జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో మార్చి 14న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు న్యాయాధికారి ఆర్.ఆశీర్వాదం పాల్ తెలిపారు. ఈ మేరకు కోర్టు సిబ్బంది బుధవారం ప్రకటన విడుదల చేశారు. సివిల్ కేసులు రాజీపడదగిన క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చని సూచించారు.

మార్టిన్ లూథర్ వర్ధంతి

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: చిలకలూరిపేట రైతు బజారు వద్ద ఉన్న మార్టిన్ లూథర్ విగ్రహం వద్ద బుధవారం ఆయన వర్ధంతి నిర్వహించారు. రెవరెండ్ పాస్టర్ మరియదాసు మత సంస్కరణోద్యమం పితామహుడు మార్టిన్ గొప్పతనం గురించి వివరించారు.

బస్సు ద్విచక్ర వాహనం ఢీ.. తప్పిన ప్రమాదం

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: వినుకొండలోని మార్కాపురం రోడ్డులో ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనం ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. మార్కాపురం వైపు వెళ్తున్న బస్సును క్రాస్ చేస్తూ ముందుకు వెళ్లే క్రమంలో ఒకదానికొకటి ఢీకొని ద్విచక్ర వాహనం బస్సు కిందపడగా దానిపై ఉన్న వ్యక్తి రెండో వైపు డివైడర్ పక్కన పడ్డాడు. గమనించిన బస్సు డ్రైవర్ అప్రమత్తమై చాకచక్యంగా బస్సును నిలిపేయడంతో ప్రమాదం తప్పింది. స్థానికులు వచ్చి కిందపడిన వ్యక్తిని బయటకు తీయగా స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

కారు బోల్తా.. యువతిని కాపాడిన స్థానికులు

నరసరావుపేటసెంట్రల్, న్యూస్‌టుడే: పట్టణ శివారు గ్రామీణ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో ఓ కారు అదుపు తప్పి పల్టీ కొట్టింది. వివరాలు ఇలా.. ఏపీ 07ఈసీ 4539 నంబరు గల కారు వల్లప్ప చెరువు సమీపంలో వేగంగా వెళుతూ పల్టీ కొట్టడంతో పెద్ద శబ్దం వచ్చింది. స్థానికులు వెంటనే అక్కడికి చేరుకొని కారులో ఉన్న యువతిని బయటకు తీశారు. కారులో యువతితో పాటు ఓ కానిస్టేబుల్ ఉన్నాడని, ప్రమాదం జరిగిన వెంటనే అక్కడి నుంచి పరారైనట్లు తెలిసింది. ఈ విషయమై గ్రామీణ పోలీసులను అడగ్గా ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని చెప్పారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నూజండ్ల, న్యూస్‌టుడే: మహిళలు అన్ని రంగాల్లో రాణించగలరని నిరూపిస్తున్నారని అందులో వెనుకబడిన నూజండ్ల మండలంలోని మహిళలు ఇంకొంచెం ముందుండటం అభినందనీయమని ఏపీ వెటర్నరీ కౌన్సిల్ ఛైర్మన్ పారా లక్ష్మయ్య అన్నారు. ప్రిన్సిపల్ ఉష అధ్యక్షతన స్థానిక కేజీబీ విద్యాలయం వార్షికోత్సవం, 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సివిల్ సర్వీస్ పోటీ పరీక్షలకు బాలికలు 200 మంది, బాలురు 100 మందికి ఉచిత శిక్షణ ఇస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో పలువురు అతిథులు ప్రసంగించారు. జడ్పీటీసీ సుబ్బయ్య, డీఎల్‌డీఏ మాజీ ఛైర్మన్ లగడపాటి వెంకట్రావు, తహసీల్దార్ రమేష్‌కుమార్, ఎంఈవోలు సత్యనారాయణ, రవిచంద్ర, జడ్పీ పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి, గంగినేని ఫౌండేషన్ అధ్యక్షులు రాగవరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లక్ష్మయ్య, వేదికపై నేతలు, అధికారులు

'కోటప్పకొండ తిరునాళ్ల నిర్వహణలో యంత్రాంగం విఫలం'

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: కోటప్పకొండ తిరునాళ్ల నిర్వహణలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని జిల్లా వైకాపా వర్కింగ్ ప్రెసిడెంట్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. మద్యం అమ్మకాలు, చిరు వ్యాపారుల దగ్గర మామూళ్ల అక్రమ దందా ఇలా సంపాదనే ధ్యేయంగా ఎమ్మెల్యే అరవిందబాబు తిరునాళ్లను నిర్వహించారన్నారు. రొంపిచర్ల మండలం విప్పర్లలో క్యాసినో తరహా జూదం ఏర్పాటుచేసి రూ.కోట్ల అక్రమార్జనకు కూటమి నేతలు పాల్పడ్డారని విమర్శించారు. 50-60 సంవత్సరాల కాలంలో స్టాల్స్ లేకుండా తిరునాళ్ల జరగడం ఇదే మొదటి సారని, ప్రైవేటు స్థలంలో ఎమ్మెల్యేకు, అతని అనుచరులకు ఏం పని అని ప్రశ్నించారు. బస్సులు ఎక్కడానికి కిలోమీటరు నడవాల్సిన పరిస్థితి. తాగడానికి మంచినీళ్లు కూటా లేక భక్తులు ఇబ్బందులు పడ్డారన్నారు.

పాఠశాల వార్షికోత్సవం

ఈపూరు, న్యూస్‌టుడే: ఈపూరు మండలం బొగ్గరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తల్లుల పాదాలను శుభ్రం చేసి ఆశీస్సులు తీసుకున్నారు. వినుకొండకు చెందిన గంగినేని ఫౌండేషన్ వారు పదోతరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. దూర ప్రాంతాలనుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థినులకు రోటరీ క్లబ్ వారు సైకిళ్లు సమకూర్చనున్నట్లు ప్రకటించారు.

తల్లుల ఆశీస్సులు తీసుకుంటున్న విద్యార్థినులు

జగన్ అజెండానే వైకాపా సభ్యులకు ముఖ్యం

చిలకలూరిపేట పట్టణం: ప్రజా సమస్యలకంటే జగన్ అజెండానే వైకాపాకు ముఖ్యమైందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. వైకాపా ఎమ్మెల్సీలు మండలికి వస్తోంది ప్రజా సమస్యలపై చర్చకు, రాష్ట్రానికి మేలు చేసే అంశాలపై ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వడానికి కాదని వారి వైఖరిని బట్టే అర్థమవుతుందన్నారు. వైకాపా ఎమ్మెల్సీల ధోరణిపై సొంత పార్టీ శ్రేణులే తలలు పట్టుకుంటున్నారన్నారు. మంత్రి లోకేశ్ సొంత ఖర్చులతో క్రికెట్ మ్యాచ్ చూడటానికి వెళ్లడాన్ని తప్పుపడుతూ అవినీతి మీడియా అవాస్తవాలను ప్రజలపై రుద్దే ప్రయత్నం చేసిందన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

వినుకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని వివిధ ప్రాంతాలకు గురువారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పిచ్చయ్య తెలిపారు. నరసరావుపేట రోడ్డు, ఎన్నెస్పీ కాలనీ, రైల్వేస్టేషన్ రోడ్డు, ఏబీఎం కాంపౌండ్, ఏనుగుపాలెం రోడ్డు, నూజండ్ల రోడ్డు, కీర్తి థియేటర్, స్టేట్ బ్యాంక్ (ఏడీబీ) ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

కార్డ్స్ సేవాసంస్థ కృషి అభినందనీయం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో పేద విద్యార్థుల్ని చేర్పించేందుకు కార్డ్స్ సేవా సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ సత్తెనపల్లి శాఖ బాధ్యుడు పెండెం మణిరావు అన్నారు. స్థానిక ఎన్జీవోస్ హోంలో బుధవారం గురుకుల ప్రవేశాలకు సంబంధించి నమూనా ప్రశ్నపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. గురుకులంలో ఐదో తరగతిలో చేరితే ఇంటర్ వరకు బోధనకు ఇబ్బంది ఉండదని, తల్లిదండ్రులపై ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన విద్య పొందవచ్చన్నారు.

నోటీసు

మహారాజశ్రీ నరసరావుపేట 13వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
ఐ.ఏ.నెం.318/2024 ఇన్ ఏ.యస్.నెం.32/2019
బిట్వీన్:
పఠాన్ పెద్ద సత్తార్(డైడ్) వగైరా
...పిటీషనర్లు/ అప్పిలెంట్లు
మరియు
పఠాన్ అమీనాబీ & ఇతరులు ...రెస్పాండెంట్లు
టు,
ఆర్-1: పఠాన్ అమీనాబీ, భర్త. చిన్న సత్తార్, నెం. 101, 1వ ఫ్లోరు, సాస్త అపార్ట్‌మెంట్, లెక్చరర్ కాలనీ, చిలకలూరిపేట పోస్టు, పల్నాడు జిల్లా.
ఆర్-10: షేక్ ఖాతూన్, భర్త. షరీఫ్, కేరాఫ్: షేక్ మహబూబ్ సుభాని, బరంపేట, నరసరావుపేట, పల్నాడుజిల్లా.
పై నెంబరు ఐ.ఏ. పిటీషనులో రెస్పాండెంట్లు అయిన మీకు నోటీసు నిమిత్తం ది.13-03-2026నకు వాయిదావేసినారు. కావున వాయిదా రోజు ఉ.గం.10-30ని.లకు పై కోర్టు వారియెదుట హాజరై మీకుగల అక్షేపణలు తెలుపుకొనగలరు. (శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
వాయిదా తేది: 13-03-2026
దొడ్డా శ్రీనివాసరావు, శ్రీమతి వల్లంశెట్టి సుజని,
పిటీషనర్లు/ అప్పిలెంట్స్ తరపు అడ్వకేట్స్, గుంటూరు, సెల్: 98491 20408

వేలం ప్రకటన

మహారాజశ్రీ చిలకలూరిపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో...
E.P.87/2024 IN O.S.485/2022
Between : రాఘవరపు వెంకట కోటేశ్వరరావు .... డి.హెచ్.ఆర్.
Vs
జంపని నాగమల్లేశ్వరి .... జె.డి.ఆర్.
పై నెంబరు ఇ.పి.ని ఇందలి డి.హెచ్.ఆర్. తనకు రావలసిన బాకీ వసూలు నిమిత్తము ఇందలి జె.డి.ఆర్. పైన ఇ.పిని దాఖలు చేసుకొని ఈదిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిని పై కోర్టు వారి ఎదుట వేలమునకు తీసుకొని వచ్చినారు. శ్రీ కోర్టువారు ది.09-03-2026న ఉ॥గం॥10-30ల నుండి షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలము వేయుటకు నిర్ణయించినారు. కావున పాటదారులు ది.09-03-2026న ఉ॥ 10-30లకు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై వేలంపాటలో పాల్గొనవలసినదిగా యావన్మందికి తెలియజేయడమైనది.
షెడ్యూలు: పల్నాడు జిల్లా (గుంటూరు జిల్లా) నరసరావుపేట రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్టు, చిలకలూరిపేట సబ్ రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్టు, నాదెండ్ల మండలం, గణపవరం గ్రామ సర్వేడి. నెం. 213 దాఖలా గణపవరం గ్రామ పంచాయతీ డోర్ నెం.3-21-3 రుగాగల 133.19 చ॥గ॥ల ఖాళీస్థలమునకు హద్దులు.
తూర్పు: పెదవల్లి సత్యవతి 86 లింకులు. **దక్షిణం:** బజారు 32 లింకులు. **పడమర:** జంపని నాగమల్లేశ్వరి 86 లింకులు. **ఉత్తరము:** కెల్లంపల్లి రెడ్డియ్య గారి స్థలము హద్దు 32 లింకులు. పై హద్దుల మధ్య 133.19 చ॥గ॥లకు సరియగు 111.346 చ॥మీ॥ల ఖాళీ స్థలము.
డి.హెచ్. ఆర్. విలువ: 12,00,000/-
మొత్తం ఆస్థి మార్కెట్ విలువ: 4,39,527/-
అమీనా విలువ: 13,00,000/-
వేలం వాయిదా: 09-03-2026
(బై ఆర్డర్ ఆఫ్ కోర్టు)
కొండా సాంబశివరావు, యం.సుబ్బారావు,
అడ్వకేట్స్ ఫర్ డి.హెచ్.ఆర్. నరసరావుపేట. సెల్. 9866738537

(c) eenadu

సత్తెనపల్లి

•సత్తెనపల్లి •పెదకూరపాడు •మాచర్ల •గురజాల

అమ్మవారి జాతరకు రండి

ప్రచార పత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి తదితరులు

దుర్గి: నిడానిపాటి అమ్మవారి జాతర మార్చి 8న నిర్వహించనున్నారు. ఈమేరకు ప్రచార పత్రాలను బుధవారం గుంటూరులోని కార్యాలయంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, ఆలయ అధికారులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తుల ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమీక్షలు నిర్వహించి, వసతులు కల్పించాలని సూచించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు, ఈవో, ఏపీ కార్ల ఆదినారాయణ, అమ్మవారి వంశస్థులు యాగంటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ప్రైవేట్‌లో ఉచిత విద్య

కారంపూడి, న్యూస్‌టుడే: పేద విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎంఈవో రవికుమార్ తెలిపారు. బుధవారం స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేదలకు కేటాయించాల్సి ఉంటుందన్నారు. ఈ ఏడాది విద్యార్థులను లాటరీ విధానంలో ఎంపిక చేయనున్నట్లు వివరించారు. 2020 జూన్ 2 నుంచి 2021 మార్చి 31లోపు జన్మించిన వారు అర్హులని, తమ ప్రవేశకం పత్రాలతో సచివాలయాలు, విద్యావనరుల కేంద్రాల్లో మార్చి 10లోపు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మొదటి విడత లాటరీ మార్చి 25న, రెండో విడత లాటరీ ఏప్రిల్ 12న ఉంటుందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
సత్తెనపల్లి: 80085 73171 పిడుగురాళ్ల: 80088 31888
కారంపూడి: 80085 73185 గురజాల: 80085 7 3176

? గురజాలలోని చైతన్య గోదావరి బ్యాంకు పక్కన మురుగు కాలువ నిండా చెత్తచెదారం పేరుకుపోయింది. నీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తోంది. - **ఆదినారాయణ, గురజాల**

✔ ఈ విషయం కమిషనర్ శివన్నారాయణ దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా వెంటనే కార్మికులను పంపించి సమస్యను పరిష్కరించారు. - న్యూస్‌టుడే, గురజాల గ్రామీణ

ఈ-పంట నమోదుకు త్వరపడండి

వివరాలు నమోదులో వ్యవసాయశాఖ సిబ్బంది

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ఈ-పంట నమోదుకు అన్నదాతలు త్వరపడాలి. ఈనెల 20వ తేదీతో నమోదు గడువు ముగియనుంది. రైతుసేవా కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించి రబీలో పండిన పంటల వివరాలు నమోదు చేయించుకోవాలి. సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు ఉంటే ఇంటి నుంచే చరవాణి ద్వారా ఈ-పంట నమోదు చేయొచ్చు. వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం, పంటల బీమా, విపత్తుల సమయంలో నష్టపరిహారం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకాలకు ఈ-పంటలో నమోదైన సాగు వివరాలే ప్రామాణికం. గతంలో తప్పిదాలు జరగడంతో రబీలో పకడ్బందీగా ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. రబీలో అంచనాలకు మించి పంటలు సాగయ్యాయి. ఇలాంటి తరుణంలో రైతులందరూ పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి.

జిల్లాలో రబీ సాధారణ సాగు విస్తీర్ణం	55,310 హెక్టార్లు
ఇప్పటివరకు సాగు	1,03,095 హెక్టార్లు
ఈ-పంట నమోదు చేయాల్సిన ల్యాండ్ పార్సిల్స్ మొత్తం	6,39,920
ఇప్పటివరకు బుక్ చేసిన ల్యాండ్ పార్సిల్స్	5,04,124
ఇంకా నమోదు చేయాల్సినవి	1,35,796

'పులిచింతల' ముంపు పరిహారంపై మళ్లీ ఆశలు

అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రవీణ్ ప్రస్తావన

బెల్లంకొండ, న్యూస్‌టుడే: మండలంలోని పులిచింతల ముంపు గ్రామాల్లో ఒకటైన ఎమ్మాజిగూడెం ప్రజలు 15 ఏళ్లుగా ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉంటూ, పరిహారం అందక అవస్థలు పడుతున్నారు. ఈ అంశాన్ని తాజాగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అసెంబ్లీలో ప్రస్తావించడంతో పరిహారంపై ముంపు బాధితుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. 2004లో పులిచింతల ప్రాజెక్టు ముంపు గ్రామంగా ఎమ్మాజిగూడెంను ప్రకటించారు. 2010లో జీవో నంబరు 27 ద్వారా 129 కుటుంబాలను పరిహారం జాబితాలో చేర్చారు. తొలుత 96 కుటుంబాలకు పరిహారం చెల్లించారు. మిగిలిన కుటుంబాలకు పరిహారం చెల్లించకుండా జాప్యం చేస్తూ వచ్చారు. గత వైకాపా ప్రభుత్వం బాధితుల గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పరిహారం విషయమై ఎమ్మెల్యే దృష్టి పెట్టారు. బాధితుల వివరాలను పలు శాఖలకు పంపారు. వివరాలు ఆర్థికశాఖకు ఆ ఫైల్ చేరింది. ఇదే అంశంపై ఎమ్మెల్యే ప్రవీణ్ అసెంబ్లీలో మాట్లాడుతూ బాధితులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ముంపు బాధితులు జీవనాధారం కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారని, బ్యాక్ వాటర్ పెరిగినా ప్రతిసారి ఇళ్లల్లోకి నీరు చేరుతోందన్నారు. అటు ప్రభుత్వ పథకాలు నోచుకోక, ఇటు పరిహారం అందక 15 ఏళ్లు అవస్థలు పడుతున్నారన్నారు. తమ సమస్యను అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యే చర్చించడంతో ఎమ్మాజిగూడెం ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. తమ కష్టాలు తీరుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారని మండల మాజీ ప్రధాన కార్యదర్శి, యూనిట్ ఇన్‌ఛార్జి తమ్మిశెట్టి రామకృష్ణ తెలిపారు.

గామాలపాడులో అభివృద్ధి పరుగులు

దాచేపల్లి, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చొరవతో గామాలపాడు గ్రామంలో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయని కూటమి నాయకులు పేర్కొన్నారు. తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి రూ.27 లక్షలు, పాఠశాల నిర్మాణానికి రూ.25 లక్షలు, పైపులైన్ల ఏర్పాటుకు రూ.9 లక్షలు విడుదలైనట్లు చెప్పారు. బుధవారం రూ.25 లక్షలతో పలు వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. రెండేళ్లలోనే ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో గ్రామంలో సుమారు రూ.86 లక్షలతో వివిధ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు, గ్రామ అధ్యక్షుడు జానకిరామయ్య, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల డిపో ఆదాయం రూ.8.13 లక్షలు

మాచర్ల పట్టణం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా మాచర్ల డిపోకు రూ.8.13 లక్షల ఆదాయం సమకూరినట్లు మేనేజర్ వీరాస్వామి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శివరాత్రి వేడుకలకు డిపో నుంచి 36 ప్రత్యేక బస్సులు నడిపినట్లు వివరించారు.

విశిష్ట సంఖ్య తప్పనిసరి

మాచవరం, న్యూస్‌టుడే: ప్రతి రైతుకు పదకొండు అంకెల విశిష్ట సంఖ్య తప్పనిసరని ఏవో రామమ్మ స్పష్టం చేశారు. బుధవారం పిల్లుట్ల సొంది కార్యక్రమాన్ని మల్లేవేల, కొత్తగణేశునిపాడు గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర పథకాలు, అన్నదాత సుఖీభవ, రాయితీపై అందించే వ్యవసాయ పరికరాలు, మట్టి పరీక్షలకు విశిష్ట సంఖ్య ఉండాలన్నారు. వెంటనే రైతులు సమీప రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని ఆమె సూచించారు.

మాచర్ల పట్టణం: రైతులందరూ విశిష్ట సంఖ్యకు నమోదు చేసుకోవాలని ఏవో పావని తెలిపారు. బుధవారం ఆ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ విశిష్ట సంఖ్య ఉన్న రైతులకే పథకాలు అందుతాయన్నారు.

కార్యకర్తలకు అండగా తెదేపా

అనుపాలెం(రాజుపాలెం): కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా ఆదుకోవడానికి తెదేపా ఎప్పుడూ ముందుంటుందని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు పవన్‌కుమార్ తెలిపారు. అనుపాలెం చెందిన కార్యకర్త మరియబాబు(36) గుండెపోటుతో మృతి చెందగా, అతని మృతదేహానికి నివాళులర్పించారు. మట్టి ఖర్చుల కోసం రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. గ్రామంలోని కార్యకర్తలు మరో రూ.20 వేలను అందించారు.

చెక్కు అందజేస్తున్న నాయకులు

పల్లెకారులకు చేయూత

దాచేపల్లి, న్యూస్‌టుడే: రామాపురం గ్రామంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా ముగిశాయి. మంగళవారం రాత్రి పెద్దసంఖ్యలో భక్తులు శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళల కోలాటాలు, హాస్య నాటికలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పడవ పోటీల్లో రాష్ట్రస్థాయిలో విజయం సాధించిన పల్లెకారులకు మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ వేముల వినోద్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. భక్తుల అన్నదాన కార్యక్రమానికి ఆంధ్ర సిమెంట్స్(సాగర్ గ్రూప్) రూ.లక్ష విరాళం అందించారు.

మాట్లాడుతున్న పద్మశాలి సంఘం నాయకులు

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: హత్యకు గురైన ఇద్దరి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని పద్మశాలి సంఘం నేతలు డిమాండ్ చేశారు. జంగమహేశ్వరపురానికి చెందిన భవనాసి శ్రీనివాసరావు, పల్లగుమ్మడిపాడుకు చెందిన కాకుమాను భవనారుషి కుటుంబ సభ్యులను నాయకులు బుధవారం పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్రీనివాసరావు మృతదేహం దొరకగా, భవనారుషి ఆచూకీ లేదన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి వారికి న్యాయం చేయాలని కోరారు. నాయకులు చిరంజీవి, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల భవనాలను కేంద్రీయ విద్యాలయానికి అప్పగించొద్దు

నరసరావుపేట: మండలంలోని ములకలూరు వద్ద మైనార్టీ విద్యార్థుల కోసం నిర్మించిన కళాశాల, వసతి గృహాల భవనాలను కేంద్రీయ విద్యాలయానికి కేటాయించాలన్న అధికారుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ముస్లిం మైనార్టీ నాయకులు బుధవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ మైనార్టీల కోసం నిర్మించిన భవనాల్లో ఏవిధమైన కేంద్రీయ విద్యాలయం కొనసాగించాలన్న నిర్ణయం అన్యాయమని, వెంటనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ వేణుగోపాలరావు అక్కడికి చేరుకుని వారితో మాట్లాడి విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం మైనార్టీ నేతలు కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లాను కలిసి వినతిపత్రం అందజేశారు.

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

22న జాతీయ స్థాయి పాటల పోటీలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: స్థానిక చైతన్య కళా స్రవంతి వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 22న పట్టణంలోని సరస్వతి ఉన్నత పాఠశాలలో జాతీయ స్థాయి తెలుగు సినిమా పాటల పోటీలు (ట్రాక్ ఆధారంగా) నిర్వహిస్తున్నట్లు ఆ కళాసంస్థ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, అమర్‌నాథ్ తెలిపారు. పోటీల్లో ముగ్గురు విజేతలతోపాటు మరో 10 మందికి నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేస్తామన్నారు. పేర్లు నమోదు, ఇతర వివరాలకు చరవాణి నంబర్లు 9848948715, 9390132978, 9441290950లో సంప్రదించాలని వారు కోరారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

క్రోసూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: క్రోసూరులోని లూథరన్ చర్చిలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈస్టర్ పండగ సందర్భంగా 40 రోజుల ఉపవాస దీక్షల ప్రారంభం సందర్భంగా ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ రెవ.మాచర్ల సుందరరావు మాట్లాడుతూ విశ్వాసులు తమను తాము తగ్గించుకుని జీవించాలని, పొరుగు వారిని ప్రేమించాలని కోరారు.

దుర్గి: మండలంలోని క్రైస్తవులు బుధవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముటుకూరులో పాస్టర్ కటికల ఏసురత్నం యేసు బోధనలు వివరించారు.

పోటీ పరీక్షలకు పుస్తకాలు సిద్ధం చేస్తాం

వందనాదేవిని సత్కరిస్తున్న గ్రంథాలయ అధికారులు, సిబ్బంది

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువత, విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలను గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తామని ఆ సంస్థ ఉమ్మడి గుంటూరు జిల్లా ఛైర్‌పర్సన్ బీమినేని వందనాదేవి అన్నారు. పట్టణంలోని శాఖ గ్రంథాలయాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా, పుస్తకాలన్నీ ఉన్నాయా, ఎలాంటి సేవలు కోరుకుంటున్నారని పాఠకుల్ని ఆరా తీశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గ్రంథాలయాలు మెరుగ్గా నిర్వహిస్తామన్నారు. ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం ఆమెను గ్రంథాలయ బాధ్యులు, తెదేపా మహిళా విభాగం నాయకురాలు సత్కరించారు.

కన్నెగంటి హనుమంతు చిరస్మరణీయులు

చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రతినిధులు

దుర్గి, న్యూస్‌టుడే: పల్నాడు ఉద్యమ నాయకుడు కన్నెగంటి హనుమంతు చిరస్మరణీయులని పలువురు కొనియాడారు. స్థానిక గ్రంథాలయ ఆవరణలో బుధవారం కన్నెగంటి సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలదండలు వేసి నివాళి అర్పించారు. హనుమంతు జీవిత చరిత్ర గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు కన్నెగంటి ఫౌండేషన్ అధ్యక్షుడు సీనయ్య, గుండాల వెంకటేశ్వర్లు, వెలిదండి గోపాలు, గోళ్ల ఆంజనేయులు, పులిహరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన మురుగు

మాచర్ల మండలం జమ్మలమడక గ్రామంలోని ప్రధాన రహదారిపై నిత్యం మురుగు నీరు ప్రవహిస్తోంది. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో సమస్య నెలకొంది. మురుగులోనే రాకపోకలు సాగించాల్సి వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మాచర్ల పట్టణం**

రోగుల అవస్థలు తీర్చరూ..

మరుగుదొడ్లలోకి వెళ్లకుండా అడ్డు పెట్టారిలా..

పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలకు వచ్చిన రోగులు, వారి బంధువులు ఒకటి.. రెండుకు అవస్థలు పడుతున్నారు. ఓపీ విభాగం వద్ద ఉన్న మరుగుదొడ్లు పది రోజులుగా అందుబాటులో లేవు. పనుల పేరుతో వాటిని మూసేశారు. మరోవైపు వార్డుల్లోని మరుగుదొడ్లు కొన్ని రోగులకు అందుబాటులో లేకుండాపోయాయి. మల మూత్ర విసర్జనకు రోగులు ఇబ్బందులు పడుతున్నారు. **- న్యూస్‌టుడే, సత్తెనపల్లి**

పాచి నీరే గతి

మండలంలోని లేమల్లె ఎస్సీ కాలనీలో తాగునీటి కోసం వీధి ట్యాంకులు ఏర్పాటు చేశారు. వాటి చుట్టూ నీటి లీకుల కారణంగా పాచి పట్టి అపరిశుభ్రంగా తయారైంది. వాటి శుభ్రత గురించి అధికారులు పట్టించుకోవడం లేదు. ఆ నీటినే తాగుతూ వ్యాధుల బారిన పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, అమరావతి**

సిమెంటు దారి ఛిద్రం

పట్టణంలోని ఆశ్రమ బజారులో సిమెంట్ రోడ్డు ధ్వంసమైంది. కాంక్రీటు పగిలి మురుగు కాలువలో పడి పూడిపోయింది. రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మరమ్మతులు చేయించాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు. మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. **- న్యూస్‌టుడే, పిడుగురాళ్ల**

చెబుతారు.. ఆచరించరు!

కార్యాలయ ప్రాంగణంలో అపరిశుభ్రత

స్వచ్ఛత, పరిశుభ్రత గురించి గ్రామీణులకు అవగాహన కల్పించే అధికారులు ఉండే కార్యాలయ ఆవరణలోనే అపరిశుభ్రత తాండవిస్తోంది. మాచర్లలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణ రాత్రివేళ మందు బాబులకు కేంద్రంగా మారుతోంది. అక్కడే తాగి సీసాలు పడేస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఇదే ప్రాంగణంలో మత్స్య, గృహ నిర్మాణ, కార్మిక, ఐటీడీఏ, వ్యవసాయ, డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయాలు ఉన్నాయి. అధికారులు స్పందించి కార్యాలయ పరిసరాలు పరిశుభ్రంగా మార్చాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మాచర్ల పట్టణం**

కార్డ్స్ సేవాసంస్థ కృషి అభినందనీయం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో పేద విద్యార్థుల్ని చేర్పించేందుకు కార్డ్స్ సేవా సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ సత్తెనపల్లి శాఖ బాధ్యుడు పెండెం మణిరావు అన్నారు. స్థానిక ఎన్జీవోస్ హోంలో బుధవారం గురుకుల ప్రవేశాలకు సంబంధించి నమూనా ప్రశ్నపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. గురుకులంలో ఐదో తరగతిలో చేరితే ఇంటర్ వరకు బోధనకు ఇబ్బంది ఉండదని, తల్లిదండ్రులపై ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన విద్య పొందవచ్చన్నారు. కార్డ్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ అమర్‌నాథ్ పాల్గొన్నారు.

మలేరియా నియంత్రణపై దృష్టి

రికార్డులు పరిశీలిస్తున్న భూపతిరావు

మాచర్ల పట్టణం, న్యూస్‌టుడే: మలేరియా నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా మలేరియా అధికారి ఎం.భూపతిరావు అన్నారు. పట్టణంలోని కోర్టు బజారు, జెండాచెట్టు సమీప అర్బన్ హెల్త్ సెంటర్లను ఆయన బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జ్వరం వచ్చిన ప్రతి వ్యక్తిని వెంటనే గుర్తించి మలేరియా పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి ఆదేశించారు. అవసరమైన మందులు అందజేస్తామన్నారు. అనంతరం కేంద్రాల్లో రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ద్రాక్షాయని తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ.. అస్వస్థతకు గురై మృతి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ అస్వస్థతకు గురై ప్రయాణికుడు మృతి చెందిన ఘటన పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. మచిలీపట్నానికి చెందిన లారీ డ్రైవర్ బాలకృష్ణ(40) సొంత పనిపై మాచర్లకు వెళ్లాడు. తిరిగి విజయవాడకు ఆర్టీసీ బస్సులో వెళ్తుండగా పట్టణంలోకి రాగానే అస్వస్థతకు గురయ్యాడు. తోటి ప్రయాణికులు గమనించి బస్సును నిలుపుదల చేయించడంతో డ్రైవర్ వెంటనే 108కి సమాచారం అందించారు. 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించగా బాలకృష్ణ మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు.

వడ్డవల్లిలో వ్యక్తి బలవన్మరణం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యతో ఓ వ్యక్తి బలవన్మరణం చెందిన ఘటన వడ్డవల్లిలో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. దార్ల వీరయ్య(49) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. నొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. అతడి మనవడు పాఠశాల నుంచి వచ్చిన తర్వాత గమనించి కుటుంబ సభ్యులకు తెలిపాడు. వెంటనే ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యుడు నిర్ధారించారు. అతడిపై రౌడీషీట్ ఉందని పోలీసులు తెలిపారు. ప్రమాదస్థలిని పరిశీలించి, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

పట్టణంలో ఆక్రమణల తొలగింపు

పరిశీలిస్తున్న కమిషనర్ వేణుబాబు

మాచర్ల పట్టణం, న్యూస్‌టుడే: రోడ్డు విస్తరణలో భాగంగా మాచర్లలోని రైల్వేట్రాక్ నుంచి పార్కు సెంటర్ వరకు ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ వేణుబాబు ఆధ్వర్యంలో బుధవారం పొక్లెయిన్‌తో ఆక్రమణలు తొలగించారు. కమిషనర్ మాట్లాడుతూ వ్యాపారులు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించాలన్నారు.

తెదేపాతోనే ఎస్సీలకు న్యాయం

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో ఎస్సీలకు పెద్దపీట వేస్తున్నారని మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకయ్య అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీల సంక్షేమానికి, అభివృద్ధికి నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు.

వీరాంజనేయస్వామి తిరునాళ్ల

రెంటచింతల, న్యూస్‌టుడే: మండలంలోని పాలువాయిగేటులో వీరాంజనేయస్వామి తిరునాళ్ల బుధవారం ఘనంగా జరిగింది. స్వామికి ఉదయాన్నే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక రథంపై ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

రెంటచింతల, న్యూస్‌టుడే: అదనపు కట్నం కోసం తనను వేధిస్తున్నారంటూ మండలంలోని పాలువాయికి చెందిన ఓ వివాహిత పోలీసులను ఆశ్రయించింది. తమ్మిశెట్టి ఉమామహేశ్వరికి రెండేళ్ల కిందట గురవయ్యతో వివాహం జరిగింది. అప్పట్లో కట్నం కింద రూ.లక్ష ఇచ్చారు. వీరికి ఓ పాప ఉంది. కొద్ది నెలలుగా అదనంగా కట్నం కావాలని భర్త, అత్త, మామ, ఆడపడుచు వేధిస్తున్నట్లు ఉమామహేశ్వరి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెదకూరపాడు, న్యూస్‌టుడే: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తోన్న భర్త, అతని కుటుంబ సభ్యులపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్సై గిరిబాబు కథనం మేరకు.. ముస్నాపురం గ్రామానికి చెందిన లక్ష్మీ లావణ్యకు కృష్ణా జిల్లా నందిగామకు చెందిన గుంజి శ్రీనివాసరావుతో 2021లో వివాహం జరిగింది. కొన్నాళ్లు వీరి కాపురం సజావుగా సాగింది. అనంతరం అదనపు కట్నం తీసుకురావాలంటూ భర్త, అత్తింటి వారు చేస్తున్న వేధింపులు తాళలేక బాధితురాలు తల్లిదండ్రుల వద్దకు చేరి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆయుర్వేద ఆసుపత్రికి మహర్దశ

కుమ్మరిపాలెం (పిడుగురాళ్ల), న్యూస్‌టుడే

భవన నిర్మాణం

పట్టణంలోని బ్రహ్మానందరెడ్డి కాలనీలో ఆయుర్వేద ఆసుపత్రి భవన నిర్మాణ పనులు శరవేగంతో చేపడుతున్నారు. 1983లో ఆయుర్వేద ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. మొదట్లో స్వర్ణపిచ్చయ్య బజారులో అద్దె భవనంలో నిర్వహించారు. సుమారు రెండు దశాబ్దాలపాటు అద్దె భవనంలోనే కొనసాగింది. 2002లో బ్రహ్మానందరెడ్డి కాలనీలో ప్రభుత్వానికి సంబంధించి చిన్న భవనం ఉండటంతో అక్కడకు మార్చారు. చిన్న గది కావడంతో మందుల నిల్వ, సిబ్బంది కూర్చోవడానికి ఇబ్బందిగా ఉంది. దీంతో భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. ఆయుష్ శాఖ అధికారులు నిధులు మంజూరు చేసినా, గత ప్రభుత్వంలో మున్సిపల్ అధికారులు స్థలం కేటాయించకపోవడంతో వెనక్కి వెళ్లాయి.

కూటమి ప్రభుత్వంలో స్థలం కేటాయింపు: కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయుర్వేద ఆసుపత్రి నిర్మాణానికి బ్రహ్మానందరెడ్డి కాలనీలో మూడు సెంట్ల స్థలాన్ని కేటాయించారు. కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్‌భవ ద్వారా రూ.30 లక్షల నిధులు మంజూరు చేసింది. గత నెల భవన నిర్మాణానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. మార్చి ఆఖరుకు నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మార్చి ఆఖరుకు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

సహకార సేవలకు అంతరాయం

ఉద్యోగుల సమ్మెతో పీఏసీఎస్‌లు మూత

పీఏసీఎస్ కార్యాలయానికి తాళం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: సహకార సంఘాల సేవలు స్తంభించాయి. ఈ నెల 16వ తేదీ నుంచి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్) ఉద్యోగులు సమ్మెలోకి వెళ్లారు. దీంతో పీఏసీఎస్‌ల భవనాలు మూతపడ్డాయి. ఆర్థిక సంవత్సరం చివర్లో రుణాల రికవరీ, నిర్దేశిత రుణ పంపిణీ లక్ష్యాల్ని అందుకోవాల్సిన తరుణంలో ఉద్యోగులు సమ్మెలోకి వెళ్లడం కార్యకలాపాలపై పెను ప్రభావం చూపిస్తోంది. జిల్లాలో 60 పీఏసీఎస్‌లు ఉన్నాయి. ఒక్కో సంఘంలో ఇద్దరు ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఔట్ సోర్సింగ్ పద్ధతిలో మరో 40 మంది వరకు సేవలందిస్తున్నారు. అందరూ సమ్మెలోకి వెళ్లారు. ఉద్యోగ విరమణ వయసు పెంచాలని, పీఆర్సీ అమలు చేయాలని, కొత్తగా నియమితులైన సిబ్బంది తొలగింపు వద్దని కోరుతూ సమ్మె చేస్తున్నారు. కార్యదర్శులు, క్లర్కులు అందుబాటులో లేకపోవడంతో సహకార సంఘ కార్యాలయాల వద్దకు రైతులు వచ్చి వెనుతిరుగుతున్నారు. పంట, దీర్ఘకాలిక రుణాలు, వ్యవసాయేతర రుణాలు, అప్పుల వసూలు ప్రక్రియ ఆగింది. సమ్మెతో పీఏసీఎస్‌ల సేవలు ఆగిపోయాయని జిల్లా సహకార అధికారి నాగరాజు చెప్పారు.

సమస్యల్లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, న్యూస్‌టుడే: ప్రజల వద్దకు ప్రవీణ్ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పర్యటించి, సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. బుధవారం నరుకుళ్లపాడులో ఆయన పర్యటించి, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రధానంగా మురుగునీటి సమస్య ఉందని గ్రామస్థులు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన సాగిస్తుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అనుకూలంగా బడ్జెట్ ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. రాజధాని అమరావతి నిర్మాణం శరవేగంగా జరుగుతోందన్నారు. తెదేపా నాయకులు రాజా, గిరి, వెంకట్రావు, సాంబశివరావు పాల్గొన్నారు.

(c) eenadu

అంతర్జాలం శూన్యం.. అలంకారప్రాయం!

అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలల వినోదం, విజ్ఞానం కోసం ప్రభుత్వం సమకూర్చుతున్న పరికరాలు అలంకారప్రాయంగా మారుతున్నాయి. సీతానగరం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-1 పరిస్థితి ఇది. ఇంటర్నెట్ కనెక్షన్ లేక టీవీ నిరుపయోగంగా మిగిలింది. సిబ్బందికి అందించిన చరవాణి నుంచి అంతర్జాలం అనుసంధానం చేస్తే గంటల వ్యవధిలోనే డేటా అయిపోతోంది. చరవాణికి నెలకు 2 జీబీ అందించడంతో చిత్రాల అప్‌లోడ్‌కే సరిపోవడం లేదని సిబ్బంది చెబుతున్నారు. సాలూరు మండలంలో వైకాపా హయాంలో 13, కూటమి ప్రభుత్వ హయాంలో 2025లో 63 కేంద్రాలకు టెలివిజన్‌లు ఇచ్చారు. అక్కడా ఇదే పరిస్థితి.
– న్యూస్‌టుడే, సీతానగరం, సాలూరు గ్రామీణం

గోవా గవర్నర్ రాక నేడు

ఈనాడు, విజయనగరం: గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు గురువారం విజయనగరం రానున్నారు. 21న సింహాచలం వెళ్తారు. 22న ఉదయం 10 గంటలకు కోటలో జరిగే మాన్సాస్ ట్రస్ట్ పరిధిలోని వివిధ దేవస్థానాల పాలక మండలి సభ్యుల సమావేశంలో పాల్గొంటారు. 25న మధ్యాహ్నం 12 గంటలకు విశాఖ మీదుగా గోవాకు తిరుగుపయనమవుతారు.

కట్టలిచ్చుకో... కావాల్సినట్లు కట్టుకో!

పట్టణంలో పెరిగిపోతున్న అనధికార నిర్మాణాలు

జిల్లా కేంద్రంగా ఆవిర్భవించిన పార్వతీపురం పట్టణంలో భవన నిర్మాణాలు గణనీయంగా పెరిగాయి. కొత్తగా చేపట్టే ప్రతి నిర్మాణానికీ అనుమతులు మంజూరుకు పురపాలక సంఘానికి రుసుము చెల్లించాలి. పట్టణ ప్రణాళిక విభాగం వీటిని పర్యవేక్షించాలి. కానీ అందుకు భిన్నంగా అధికారులు పనిచేస్తున్నారు. అక్రమార్జన కోసం పుర ఆదాయానికి కన్నం వేస్తున్నారు. ఆ మొత్తం మరోరూపంలో పంపకాల ద్వారా కొందరి జేబుల్లోకి వెళ్తోంది. నిర్మాణాలకు రూ.కోట్లు వెచ్చిస్తున్న యజమానులు పట్టణ ప్రణాళిక విభాగం నోటికి నోట్లతో తాళం వేసి.. రూ.లక్షల్లో మిగుల్చుకుంటున్నారు.
– న్యూస్‌టుడే, పార్వతీపురం, పురపాలక

నిబంధనలు గాలికే..

బహుళ అంతస్తుల భవనాలకు అనుమతులు ఇచ్చినప్పుడు చుట్టూ కొంత స్థలం విడిచిపెట్టాలి.. కానీ ఆ విధంగా జరగడం లేదు. జీప్లస్ 2కి అనుమతులు తీసుకుని అదనంగా ఎన్ని అంతస్తులు నిర్మిస్తున్నా యంత్రాంగం పట్టించుకోవడం లేదు. 12 నుంచి 18, 30 మీటర్ల వెడల్పు ఉన్న రహదారిలో బహుళ అంతస్తుల భవనం నిర్మిస్తే ముందువైపు రెండు నుంచి మూడు మీటర్ల వెడల్పు స్థలం ఉంచాలి. ఎక్కడా ఇది అమలు చేయడంలేదు.

జాప్యం దేనికి..?

పట్టణంలో గత అయిదేళ్లలో అనధికార, నిబంధనలు అతిక్రమించిన 298 భవనాలను గుర్తించి నోటీసులు జారీ చేశారు. ఇందులో 28 భవనాలకు సంబంధించి న్యాయస్థానంలో వ్యాజ్యాలు వేశారు. మిగిలిన వాటిపైన కేసులు వేయడానికి మీనమేషాలు లెక్కిస్తూనే ఉన్నారు.

జీ ప్లస్ 2కి అనుమతులు తీసుకుని అయిదు అంతస్తుల భవన నిర్మాణం

అనుమతి అలా.. నిర్మాణం ఇలా..

- పట్టణంలోనే ఖరీదైన ప్రాంతంగా చెప్పుకునే ఎస్ఎన్ఎం నగర్‌లో రెండు బహుళ అంతస్తుల భవనాలు జీప్లస్ 2కు అనుమతులు తీసుకుని అయిదు అంతస్తులు నిర్మిస్తున్నారు.
- ఇదే రహదారిలో వ్యాపార సముదాయం కట్టడానికి జీప్లస్ 1కు అనుమతి తీసుకున్నారు. కానీ మొత్తం మూడు అంతస్తులు కట్టారు. ఈ ప్రాంతంలో పెట్రోల్ బంకు పక్కన, ఓ ఆసుపత్రి వద్ద జరుగుతున్న భవన నిర్మాణాలదీ ఇదే పరిస్థితి.
- బైపాస్ రోడ్డులో ఓ లాడ్జి కోసం మూడు అంతస్తుల నిర్మాణానికి అనుమతులు తీసుకున్నారు. కానీ మరో అంతస్తు అదనంగా నిర్మించారు.

అక్రమాలపై చర్యలు: నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలను పరిశీలిస్తాం. నోటీసులు జారీ చేసిన అనధికార భవన నిర్మాణాలపైన చర్యలు తీసుకుంటాం. **- డి.పావని, పుర కమిషనరు**

రుసుముల వసూలు ఎంతంటే..

- వ్యాపార స్థలం, పరిశ్రమలు, నివాస భూములకు వేర్వేరుగా రుసుము శాతం ఉంటుంది.
- స్థల స్వభావం ఆధారంగా 7 నుంచి 9 శాతం వరకు లైసెన్సు ఫీజు చెల్లించాలి.
- ఇది కాకుండా గృహ నిర్మాణాలకు అయితే చ.మీ.కు రూ.40, వ్యాపార సంస్థల నిర్మాణానికి రూ.60 వసూలు చేయాలి.
- 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు బిల్డింగ్ లైసెన్సు రూపంలో రూ.1.11 కోట్లు వసూలైంది. నిర్మాణాలతో పోల్చితే ఇది బాగా తక్కువ.

తెలుగు సంవత్సరాదికి.. కలల లోగిళ్లలోకి..

టిడ్కో గృహాల ప్రారంభానికి చర్యలు

న్యూస్‌టుడే, సాలూరు

పట్టణ పేదల ఏళ్లనాటి సొంతింటి కల సాకారం కాబోతోంది. ఉగాదికి గృహ ప్రవేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీచేశారు. దీంతో మౌలిక సదుపాయాలు కల్పించి, ముస్తాబు పనులు చేసేపనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. జిల్లాలో సాలూరు, పార్వతీపురం పట్టణాల్లో గృహాల నిర్మాణం జరిగింది. సాలూరులో 1,056 ఇళ్ల అప్పగింతకు సిద్ధంగా ఉన్నాయి.

గృహ సముదాయంలో మురుగునీటి వ్యవస్థ నిర్మాణ పనులు

గత ప్రభుత్వం అయిదేళ్ల పాలనలో నిర్మాణాలు పూర్తిచేయలేదు. మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ఎన్నికల ముందు హడావుడిగా గృహప్రవేశాలు చేయించినా లబ్ధిదారులు సొంతింట్లో అడుగుపెట్టలేని పరిస్థితి. నివాసం లేకున్నా.. విద్యుత్తు వినియోగించకున్నా.. నెలనెలా ఛార్జీల భారం మాత్రం తప్పలేదు. 365 చదరపు అడుగుల ఇళ్ల లబ్ధిదారుల పరిస్థితి మరీ దారుణం. వారిపేరున ప్రభుత్వం బ్యాంకులో రూ.లక్షల రుణాలు తీసుకుని ఇల్లు నిర్మించకుండా అప్పుల భారం మోపింది. చేసిన పనులకు గుత్తేదారులకు బిల్లులు చెల్లించలేదు. దీంతో ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం వచ్చాక బకాయిలు చెల్లించారు.

మారనున్న రంగులు..

టిడ్కో గృహాలకు గత ప్రభుత్వం వైకాపా పార్టీ రంగులను వేసింది. చాలా మంది లబ్ధిదారులకు ఇష్టం లేకున్నా తప్పనిసరి పరిస్థితి. ఇటీవల టిడ్కో గృహాలను సందర్శించిన మంత్రి సంధ్యారాణి రంగులు మార్చాలని అధికారులకు సూచించారు. కొత్త రంగులు వేసి అప్పగిస్తారా.. లేదంటే గృహప్రవేశాలు అనంతరం మారుస్తారా చూడాలి. పనులు పూర్తిచేసి ప్రభుత్వాదేశాల మేరకు లబ్ధిదారులకు ఇళ్లప్పగిస్తామని టిడ్కో డీఈ శశిధర్ తెలిపారు.

జోరుగా పనులు..

ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలోని చంద్రంపేట సమీపంలో నిర్మించిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగించేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. గతంలో నిలిచిపోయిన రోడ్డు, మురుగునీటి వ్యవస్థ పనులు చకచకా సాగుతున్నాయి. గుమడాం వేగావతి నది వద్ద సంపు నిర్మాణం, పైపులైన్ల పనులు చివరి దశకు వచ్చాయి. విద్యుత్తు దీపాల ఏర్పాటు, సామాజిక అవసరాల కోసం వినియోగించిన స్థలాల అభివృద్ధి జరుగుతోంది.

నిందితుల పాలిట ఆదిపరాశక్తి

ఆపద సమయాల్లో అండ

- అత్తింటివారు వేధిస్తున్నారని, దాడి చేస్తున్నారని విజయనగరానికి చెందిన ఓ మహిళ శక్తి యాప్ ద్వారా ఫిర్యాదు చేశారు. తక్షణమే పోలీసులు చేరుకుని, కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇకపై వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.
- విశాఖకు చెందిన మహిళ వ్యక్తిగత పనిమీద విజయనగరం వచ్చారు. రాత్రి 11.30 గంటల సమయంలో ఒంటరిగా ఉన్నట్లు 112కి కాల్ చేశారు. మహిళా పోలీసులు చేరుకుని, జిల్లా కేంద్రంలో ఉన్న వన్‌స్టాప్ కేంద్రానికి పంపించారు. అక్కడ భోజనం పెట్టి వసతి కల్పించారు. మరుసటి రోజు ఉదయం అల్పాహారం అందించి క్షేమంగా ఇంటికి పంపించారు.

ఆపదలో ఉన్న మహిళలకు అండగా నిలుస్తోంది శక్తి యాప్. 2025 మార్చిలో ఈ సేవలు ప్రారంభం కాగా.. ఉమ్మడి జిల్లాలో వేల మంది వినియోగిస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు నవీకరిస్తుండడంతో నిమిషాల వ్యవధిలోనే బాధితులకు న్యాయం జరుగుతోంది. కేవలం అతివలే కాకుండా చిన్నారులు, పురుషులు సైతం సద్వినియోగం చేసుకోవచ్చు. – న్యూస్‌టుడే, అయ్యన్నపేట, పార్వతీపురం పట్టణం

చరవాణిలో యాప్‌ను చూపిస్తున్న విద్యార్థినులు

కదిపితే చాలు..

యాప్ తెరుచుకోగానే నాలుగు విభాగాలు కనిపిస్తాయి. ఎస్‌వోఎస్‌ను తాకగానే.. పది సెకండ్ల ఆడియో, వీడియో రికార్డు అయ్యి కంట్రోల్ రూమ్‌కు వెళ్తాయి. అంతే కాకుండా హ్యాండ్ షేక్ ఆప్షన్ ఆన్ చేసుకుంటే.. ఆపద సమయంలో చరవాణిని షేక్ చేస్తే ఆడియో, వీడియో వెళ్తాయి. లొకేషన్ ఆధారంగా క్షణాల్లోనే కనుగొంటారు.

డౌన్‌లోడ్ ఇలా..

గూగుల్ ప్లేస్టోర్‌కు వెళ్లి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పేరు, చరవాణి నంబరు, కుటుంబ సభ్యుల ఫోన్ నంబరు, జెండర్, వయసు, చిరునామా తదితర వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. మనకు కావాల్సిన భాషను ఎంచుకోవచ్చు. లొకేషన్‌తో పాటు వివిధ రకాల ఆప్షన్లు అందుబాటులో ఉంటాయి.

ఇప్పటివరకు ..

అంశం	విజయనగరం	మన్యం
డౌన్‌లోడ్	19,642	19,878
రిజిస్ట్రేషన్	19296	19782
ఫిర్యాదులు	113	138
కౌన్సెలింగ్	107	111
ఎఫ్ఐఆర్ నమోదు	06	0

సేవలిలా..

- వ్యక్తిగతంగా, సమాజం, కుటుంబ పరంగా ఎలాంటి ఇబ్బందులున్నా చెప్పొచ్చు.
- అసాంఘిక కార్యకలాపాలు, జూదం, గంజాయి రవాణా తదితర వాటిని తెలియజేయొచ్చు.
- అదృశ్యం, దాడులు, వేధింపులు, గృహహింస, ఆర్థిక మోసం, ప్రేమ వ్యవహారాలపై వివరాలు నమోదు చేయొచ్చు.
- ఒంటరిగా ఉంటే భోజనం, వసతి, ఇతర రక్షా సేవలను ఆశ్రయించవచ్చు.
- దూర ప్రాంతాలకు వెళ్లేసమయంలో సేఫ్‌ట్రావెల్ ఆప్షన్ ఆన్ చేసుకుంటే గమ్యస్థానం చేరేవరకు నిరంతరం పర్యవేక్షిస్తామని ఎస్పీ దామోదర్ తెలిపారు. కళాశాలలు, కూడళ్లు, బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లలో అవగాహన కల్పిస్తున్నామని, ప్రత్యేకంగా శక్తి బృందాలను నియమించామని వెల్లడించారు.

జిల్లా రిజిస్ట్రార్‌గా పార్వతి

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మన్యం జిల్లా రిజిస్ట్రార్‌గా ఎం.పార్వతి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు వాణిజ్య పన్నుల శాఖలో విధులు నిర్వర్తిస్తున్న ఆమె.. పదోన్నతిపై ఇక్కడ రానున్నారు.

అనుభవ కేంద్రాలుగా.. ముస్తాబు గ్రామాలు

పార్వతీపురం, న్యూస్‌టుడే: జిల్లాలో ముస్తాబు గ్రామాలుగా తీర్చిదిద్దిన ఊర్లను అనుభవ కేంద్రాలు (ఎక్స్‌పీరియన్స్ సెంటర్స్)గా తీర్చిదిద్దే ప్రణాళికను త్వరలో అమలు చేయనున్నట్లు కలెక్టర్ ప్రభాకరరెడ్డి వెల్లడించారు. బుధవారం అధికారులతో ఆయన దూరదృశ్య శ్రవణ సమావేశాన్ని నిర్వహించారు. పర్యాటక కేంద్రాలుగా వీటిని గుర్తించడం ద్వారా గ్రామాలకు ఆదాయం పెరుగుతుందన్నారు. సబ్‌కలెక్టర్లు సమన్వయ బాధ్యత తీసుకుని క్షేత్రస్థాయిలో అమలుకు సిద్ధం కావాలని పేర్కొన్నారు. ఒక్కో పర్యాటక కేంద్రం నుంచి నెలకు కనీసం రూ.10 లక్షల ఆదాయం వచ్చేలా ప్రణాళికలను తయారు చేయాలని ఆదేశించారు. ఎన్టీఆర్ సాహస పార్కు, ఆదలి వ్యూపాయింటు వద్ద డీఆర్‌డీఏ, జీసీసీ ఉత్పత్తుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లోని ప్రకృతి అందాల ఆస్వాదనకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, సబ్‌కలెక్టర్లు ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అగ్రికల్చరల్ ల్యాండ్ లీజు కొరకు కావలెను
రైతులకు ఫిక్స్‌డ్ ఆదాయ అవకాశం
వ్యవసాయ భూమి 15 సంవత్సరాల లీజు కొరకు కావలెను.
విస్తీర్ణం : 1000 ఎకరాలు
ఏరియా : విజయనగరం జిల్లా & పరిసర ప్రాంతాలు
మండలాలు : గజపతినగరం, బొండపల్లి, గంట్యాడ, దత్తి రాజేరు, మెరకముడిదాం, పాచిపెంట, మక్కువ, సీతానగరం, బలిజిపేట, రామభద్రపురం, మానాపురం, బాడంగి, తెర్లాం, సాలూరు, పార్వతీపురం.
1. గజపతినగరానికి 30 కి.మీ సమీపంలో
2. లోడ్ మోసే ట్రక్కులకు రోడ్డు యాక్సెస్ అవసరం
3. ఆసక్తిగల రైతులు, రియల్ ఎస్టేట్ ఏజెంట్లు మరిన్ని వివరాల కొరకు సంప్రదించగలరు.
63091 25656
72079 04289

పది ఫలితాల్లో ప్రథమ స్థానమే లక్ష్యం

డీఈవో బ్రహ్మాజీరావు

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

జిల్లా వరుసగా మూడేళ్లు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని, నాలుగోసారీ ఆ స్థానంలో నిలిపేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నామని డీఈవో బ్రహ్మాజీరావు చెప్పారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను ప్రత్యేక వసతి గృహాల్లో చేర్పించి ఉపాధ్యాయులతో శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి పరీక్షల సన్నద్ధతను 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో పంచుకున్నారు.

ముఖాముఖి

రోజుకో సబ్జెక్టుపై పరీక్ష

మార్చి 16 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. 68 కేంద్రాల్లో రెగ్యులర్ విద్యార్థులు 10,565 మంది, ప్రైవేటు(గతేడాది పరీక్ష తప్పిన వారు) విద్యార్థులు 79 మంది పరీక్షలు రాయనున్నారు. రోజుకో సబ్జెక్టుపై 20 మార్కులకు పరీక్ష పెడుతున్నాం. 0-11 మార్కులు తెచ్చుకునే వారిని రైజింగ్ స్టార్స్‌గా, 11-20 మార్కులు వచ్చేవారిని షైనింగ్ స్టార్స్‌గా విభజించాం.

200 మందికి ప్రత్యేకంగా..

రోజువారీ పరీక్షల్లో వెనుకబడిన బాలికలను జోగింపేట కేజీబీవీ, బాలురును అంబేడ్కర్ గురుకులం, సీతంపేట గిరిజన పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వసతి గృహాల్లో నిపుణులతో శిక్షణ ఇప్పిస్తున్నాం. ఇలాంటివారు 200 మందికిపైగా ఉన్నారు. సందేహాలు నివృత్తి చేస్తూ పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో వివరిస్తున్నాం.

సౌకర్యాలపై దృష్టి

పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురవకుండా సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకున్నాం. జిల్లాలో పరీక్ష పేపర్లను 17 పోలీసు స్టేషన్లలో భద్రపర్చనున్నాం. ఆరుగురు రూట్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ అధికారులు 136 మంది ఉంటారు. మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్స్ పర్యవేక్షిస్తాయి.

ప్రాథమిక అంశాలపై..

వచ్చే విద్యా సంవత్సరంలో పదో తరగతికి వెళ్లే(ప్రస్తుతం 9వ తరగతి) విద్యార్థులకు వేసవి సెలవుల్లో ప్రాథమిక(బేసిక్స్) అంశాలు నేర్పించేందుకు కార్యాచరణ రూపొందించాం. ఇందులో ఆసక్తి, చొరవ ఉన్న సబ్జెక్టు ఉపాధ్యాయులుంటారు. ఏప్రిల్ 25 నుంచి మే 15వ తేదీ వరకు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ప్రత్యేక శిక్షణ ఉంటుంది. పదో తరగతి పాఠ్యాంశాలపై ముందస్తు అవగాహన కోసం ఉన్నతాధికారుల ఆలోచన అమలు చేయనున్నాం.

రాష్ట్ర ఉత్సవంగా పైడితల్లి జాతర

రూ.50 లక్షల మంజూరు

పోలిపల్లి పైడితల్లి అమ్మవారు

రాజాం, రాజాం గ్రామీణం, న్యూస్‌టుడే: రాజాం పట్టణంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతరను రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం జీవో విడుదల చేసింది. మూడురోజుల పాటు అధికారికంగా ఉత్సవాలు కొనసాగుతాయి. ఇందుకు అవసరమైన రూ.50 లక్షల నిధులను మంజూరు చేసింది. ఉత్తరాంధ్రుల ఇలవేల్పుగా, ఆరాధ్య దైవంగా పోలిపల్లి పైడితల్లి అమ్మవారిని భక్తులు కొలుస్తారు. 1926లో అమ్మవారి ఆలయం నిర్మాణం జరిగింది. వందేళ్ల పండగ కావడంతో రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ప్రభుత్వాన్ని కోరారు. రాజాం పట్టణం మొత్తం కాంతులీనేలా ఇప్పటికే కిలోమీటర్ల మేర బొబ్బిలి, చీపురుపల్లి, శ్రీకాకుళం, పాలకొండ ప్రధాన రహదారుల్లో విద్యుత్తు దీపాలంకరణ పనులు సాగుతున్నాయి. మూడు రోజుల పాటు పౌరాణిక నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు.

సమయం ఇంకా కావాలా..?

నత్తనడకన సామాజిక పారిశుద్ధ్య సముదాయాల నిర్మాణం

పార్వతీపురం, న్యూస్‌టుడే: జిల్లాలోని పంచాయతీల్లో బహిరంగ మలమూత్ర విసర్జనను నివారించేందుకు సామాజిక పారిశుద్ధ్య సముదాయాలను నిర్మించాలని స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో 2024-25లో నిధులు మంజూరు చేశారు. ఒక్కో నిర్మాణానికి రూ.3 లక్షలు కేటాయించారు.

- జిల్లాలో తొలుత 312 సముదాయాలు మంజూరు చేశారు. క్రమంగా 167 చోట్ల పనులు అవసరం లేదని నిర్ణయించి, రద్దు చేశారు.
- మిగిలిన 145 పంచాయతీల్లో స్థలాలను సేకరించి నిర్మాణాలు చేపట్టే బాధ్యతను గ్రామీణ నీటిసరఫరా విభాగానికి అప్పగించారు. ఇందులో ఇప్పటివరకు 51 మాత్రమే పూర్తయ్యాయి.
- కురుపాం నియోజకవర్గంలో మూడుచోట్ల, సాలూరు నియోజకవర్గంలో నాలుగుచోట్ల స్థల సమస్యలు ఉన్నాయి. మరో 17 చోట్ల పనులు ప్రారంభం కాలేదు. మిగిలిన 70 చోట్ల వివిధ దశల్లో ఉన్నాయి.
- మన్యాన్ని స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దాలంటే వీటిని పూర్తి చేసి.. అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని కలెక్టరు ప్రభాకరరెడ్డి అధికారులను ఆదేశించారు. స్థలాలు సమకూర్చలేని పక్షంలో వాటిని వేరేచోటుకు మార్చేలా ప్రతిపాదించి, అనుమతులు పొందాలని సూచించారు.

సంతృప్తిస్థాయి 75 శాతమే!

మధ్యాహ్న భోజనంపై తల్లిదండ్రుల అభిప్రాయం

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, పిల్లలకు పోషకాహార లోపం లేకుండా చూడాలని, మధ్యలో బడి మానేయకూడదనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోంది. మెనూ పక్కాగా అమలు చేయాలని ఆదేశించింది. ఇటీవల మెస్ ఛార్జీలు సైతం పెంచింది. అయితే క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపంతో కొన్నిచోట్ల ఇబ్బంది ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో ప్రజల సంతృప్తిస్థాయి తెలుసుకునేందుకు ప్రభుత్వం అయిదు ప్రశ్నలతో రాష్ట్ర వ్యాప్తంగా 2.27 లక్షల మందిని సంప్రదించగా 24.4 శాతం మంది వ్యతిరేకంగా స్పందించారు. 75.6 శాతం తల్లిదండ్రులు సానుకూలంగా మాట్లాడారు..

మధ్యాహ్న భోజనం

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 1,447 ఉన్నాయి. వీటిలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు 66 వేల మంది వరకు రోజూ నమోదవుతున్నారు. జిల్లాలో ఎక్కువగా అన్నం నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాపంగా చూసుకుంటే.. పథకం అమలులో జిల్లా రెండో స్థానంలో ఉన్నప్పటికీ కొన్ని అంశాల్లో వెనుకబాటు కనిపిస్తోంది. ప్రధానంగా గిరిజన ప్రాంతాల్లో మూడు, నాలుగు అంశాల్లో నాణ్యత పెరగాల్సి ఉంది. ఇక్కడ భోజనంపై అధికారుల పర్యవేక్షణ కొరవడుతోంది. కొండ శిఖర ప్రాంతాలకు వెళ్లిన దాఖలాలు కనిపించడం లేదు. ఆయా చోట్ల భోజనం నాణ్యత బాగుండటం లేదు. అన్నీ పక్కాగా జరిగితే పిల్లలు సంతృప్తిగా తింటారు. తద్వారా పౌష్టికాహార లోపం తీరుతుంది. ప్రభుత్వ ఆశయం నెరవేరుతుంది.

ర్యాంకు ఇలా..

జిల్లాలో భోజనం విషయంలో కొన్నింటికి ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు రాగా.. కొన్నింటికి 4, 6 ర్యాంకులు వచ్చాయి. భోజనం రుచికి ర్యాంకు 1, వేరుశనగ చిక్కీకి 2, భోజనం నాణ్యతకు 3, మెనూ ప్రకారం అమలుకు 4, అన్నం నాణ్యతకు 6వ ర్యాంకులు వచ్చాయి.

అంశం	అవును	లేదు
మెనూ ప్రకారం భోజనం అమలు?	85.90	14.10
రుచి బాగుందా?	82.80	17.20
నాణ్యత ఎలా ఉంది?	75.50	24.50
వేరుసెనగ చిక్కీ నాణ్యత ఎలా ఉంది?	81.50	18.50
అన్నం చక్కగా ఉంటోందా?	74.00	26.00

పర్యవేక్షణ పెంచుతాం: మధ్యాహ్న భోజనం అమలు చేయడంలో జిల్లాకు రెండో ర్యాంకు వచ్చింది. కొన్ని అంశాల్లో కాస్త మెరుగవ్వాల్సి ఉంది. పర్యవేక్షణ పెంచాలని ఎంఈవోలకు చెప్పాం. మరింత నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రత్యేక శ్రద్ధచూపుతాం. - బ్రహ్మాజీరావు, డీఈవో

నిధులున్నాయి.. నిర్మాణంలో కదలికే లేదు!

తోటపల్లి మిగులు పనులు పూర్తయ్యేదెన్నడో?

న్యూస్‌టుడే- బొబ్బిలి

తోటపల్లి జలాశయానికి సంబంధించిన ప్రధాన కాలువ మిగులు పనులు పూర్తిచేయడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారు. బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన ఇటీవల అసెంబ్లీలో ఈ అంశాన్ని ప్రస్తావించారు. పనుల తాజా పురోగతిపై నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం కోరడంతో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. రానున్న ఖరీఫ్‌నకు నీరివ్వాలంటే మిగులు పనులు ప్రారంభించాలి. కానీ ఇంతవరకు అడుగులు పడలేదు.

30 గ్రామాలకు నీరన్నారు..

2022 జనవరి 29న బొబ్బిలి మండలం పిరిడి సమీపంలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ వీటికి భూమిపూజ చేశారు. సుమారు 20 వేల ఎకరాలకు సాగునీరు అదనంగా ఇచ్చేందుకు రూ.59.58 కోట్లతో పనులు తలపెట్టారు. సుమారు 30 గ్రామాల్లోని భూములకు సాగునీరు అందుతుందని చెప్పారు. ఇందులో 22 శాతం పనులు కూడా పూర్తిచేయలేదు.

ప్రతిపాదనలకు మోక్షం దక్కాలి..

తోటపల్లి ప్రధాన కాలువ 110 కి.మీల మేర పూర్తిస్థాయిలో లైనింగు చేపట్టాలి. ఇందుకు రూ.99.62 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. కార్యరూపం దాల్చితే గండ్లు పడకుండా ఉంటుంది. కాలువల్లో పేరుకుపోయిన పూడికతీసి ఖరీఫ్‌నకు నీరు అందించాలంటే రూ.21 కోట్లు కావాలని ప్రతిపాదించారు. వాటికి నిధులు విదిల్చితే కొంతమేర సాగునీరు ఇచ్చేందుకు ఆస్కారం ఉంది.

పూడికతో ప్రధాన కాలువ

చర్యలు తీసుకుంటాం: తోటపల్లి జలాశయం పరిధిలోని పెండింగ్ పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటాం. గుత్తేదారుతో మాట్లాడాం. పూడిక తొలగింపు, ఇతర పనులకు ప్రతిపాదనలు పంపాం. - కుమార్, డీఈ, తోటపల్లి జలాశయం

ఇదీ పరిస్థితి..

హెడ్‌వర్క్స్ వద్ద, సువర్ణముఖి నది సమీపంలో కాలువల గండ్లు, మట్టికట్ట పటిష్ఠం పనులు చేయాలి. దీనిలో భాగంగా 1,500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు చింతాడ వద్ద కాలువ తవ్వారు. అదీ పూర్తికాలేదు.

★ నాగావళి, వేగావతి నదుల్లోకి కాలువల్లోని అదనపు నీటిని మళ్లించేందుకు ఎస్కేప్ ఛానళ్ల నిర్మాణం చేపట్టాలి. కాలువకు 42.2 కిలోమీటరు వద్ద యూటీ నిర్మాణం జరగాలి. ఎల్‌డీపీ-4లో అయిదు కిలోమీటర్ల మేర లైనింగ్ చేపట్టాల్సి ఉండగా రెండున్నర కిలోమీటర్ల మేర పూర్తి చేశారు.

★ ఎల్‌డీపీ-4, 5లో 100 సూపర్ పాసేజ్‌ల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా ఇంతవరకు 30 పూర్తి చేశారు.

★ విపత్తుల నిధులు రూ.59.58 లక్షలతో చేపట్టిన పనులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఎక్కడికక్కడే పూడిక ఉంది.

ప్రధానాంశాలతో ప్రగతి ప్రణాళికలు

ఈనాడు, విజయనగరం: జిల్లాలోని ప్రతి నియోజకవర్గం ప్రగతి దిశగా పయనించేందుకు ప్రధానాంశాలు గుర్తించి, ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి ఆదేశించారు. విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్, రెవెన్యూ, రీసర్వే సహా అభివృద్ధికి ఊతమిచ్చే ఇతర అంశాలపై కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన సమీక్షలో మాట్లాడారు. వివిధ రంగాల్లో జిల్లా అభివృద్ధిపై మార్చి 4న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో సమావేశం ఉంటుందన్నారు. అక్కడ చర్చించేందుకు, ప్రతి నియోజకవర్గంలో ముఖ్యమైన మూడు అంశాలను గుర్తించాలన్నారు. వాటి ఆధారంగా ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. ఆర్థిక, ఆర్థికేతర అంశాలైనా ఎంపిక చేయవచ్చన్నారు. రాజాం, చీపురుపల్లి నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుపై ఆరా తీశారు. అవసరమైన భూములు గుర్తించి ఏపీఐఐసీకి బదిలీ చేయాలన్నారు. ఫుడ్ పార్కులు, రెవెన్యూ సదస్సులు, రీసర్వే, వెబ్‌ల్యాండ్ డేటా లోపాల సవరణ, మ్యుటేషన్లు, జాయింట్ ఎల్పీఎంలు, సబ్ డివిజన్, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీపై సూచనలు చేశారు. జేసీ ఎస్.సేదుమాధవన్, డీఆర్వో ఇ.మురళి, సీపీవో బాలాజీ పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై దృష్టి: రెవెన్యూ సమస్యలను వదిలేస్తే ఎప్పటికీ పరిష్కారం కావని, పూర్తిస్థాయిలో దృష్టిసారించాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. భూ సంబంధిత అర్జీలను ఎక్కువగా తిరస్కరిస్తున్నారని, ఆ సంఖ్య తగ్గాలన్నారు. తొలి మూడు దశల రీసర్వేలో పెండింగ్‌లో ఉన్న గ్రామాల్లో పూర్తి చేయాలని, నాలుగో దశలో ప్రగతి కనిపించాలన్నారు. సర్వే శాఖ ఏడీ ఆర్.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

స్టెప్పు.. అదిరేట్టు

విద్యార్థులు మంచిగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఉపాధ్యాయులు అన్నారు. పాలకొండ సత్యసాయి పాఠశాలలో బుధవారం నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి. సంస్థ ఛైర్మన్ జి.శ్రీనుబాబు, కమిటీ సభ్యులు వెంకటరమణ, లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

– న్యూస్‌టుడే, పాలకొండ

నేత్రపర్వం.. చక్రతీర్థ స్నానం

సాలికిరిలో ఉత్సవ విగ్రహాలతో గ్రామస్థులు

వంశధార నదీ తీరాన వెలసిన శ్రీ ఉమా సహిత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా బుధవారం ఉత్సవ విగ్రహాలకు చక్రతీర్థ స్నానాలు చేయించారు. అంతకుముందు స్వామిని పురవీధుల్లో మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ ఊరేగించారు. బాలేరు తాలాడ, కోసలి, కీసర, ఒడిశా నుంచి భక్తులు వచ్చారు.

– న్యూస్‌టుడే, భామిని

ఈ రోడ్డులో ప్రయాణం..
నరకానికి మార్గం

పాచిపెంట మండలంలోని గొట్టూరు పంచాయతీ కన్నయ్యవలస గ్రామం నుంచి దిగువ గొట్టూరు, చిట్టెలబ, వేపలపాడు మీదుగా సతాబి కూడలి వరకు రూ.5.50కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డు పాడైంది. బీటలు వారి, ఎక్కడికక్కడ రాళ్లు తేలి అధ్వానంగా మారింది. కోతకు గురై రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పలుమార్లు ప్రమాదాలూ చోటు చేసుకున్నాయి. సిమెంటు ర్యాంపులు సైతం శిథిలావస్థకు చేరుకున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో వేదన వర్ణించలేనిది. ఐటీడీఏ డీఈ సంతోష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

– న్యూస్‌టుడే, పాచిపెంట

దివ్యాంగుల దీక్షకు సంఘీభావం

భోగాపురం, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి, సినీ నటుడు నందమూరి తారకరామారావు దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్నకు అర్హులని రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద నెల్లిమర్ల నియోజకవర్గంలోని దివ్యాంగులు మూడు రోజులుగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు ఆయన బుధవారం సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు సిరిపురి మౌళివర్మ, నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిమ్మరసం ఇచ్చి మద్దతు తెలుపుతున్న బంగార్రాజు

నూతన కార్యవర్గం ఎన్నిక

కొత్తగా ఎన్నికైన సభ్యులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఏపీసీపీఎస్ ఈఏ (ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పింఛను పథకం ఉద్యోగుల సంఘం) జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక నగరంలోని కణపాక యువజన వసతిగృహంలో బుధవారం జరిగింది. అధ్యక్షుడిగా సి. హెచ్. వెంకటసతీష్, కార్యదర్శిగా లెంక సత్తిబాబు, సహాధ్యక్షుడిగా కె. కిషోర్, మహిళా అధ్యక్షురాలిగా జి.అనూరాధ, కార్యదర్శిగా ఎస్. రత్నకుమారి నియమితులయ్యారు. సీపీఎస్ ఉద్యమంలో భాగంగా మార్చి 1న తలపెట్టిన సాగరఘోష కార్యక్రమానికి జిల్లా నుంచి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి కరిమ రాజేశ్వరరావు, నాయకుడు ఎం.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మరో అడుగు.. మహిళాభివృద్ధి వైపు

విజయనగరం మయూరి కూడలి, న్యూస్‌టుడే

స్వయం సహాయక సంఘాల మహిళలను ఆర్థికంగా ఆదుకుని, ప్రతి ఇంట్లో అతివలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం వెలుగు ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాలతో చేయూత అందిస్తోంది. ఇప్పుడు మరో అడుగు ముందుకేసింది. మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా స్త్రీనిధి కో-ఆపరేటివ్ సంస్థ ద్వారా ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, కల్యాణలక్ష్మి పథకాలను తీసుకురానుంది. సంబంధిత విధివిధానాలను ఇటీవల విడుదల చేసింది. పిల్లల చదువు (కేజీ నుంచి పీజీ), వివాహాది శుభ కార్యాలకు తక్కువ వడ్డీకే రుణాలు ఇవ్వనుంది. ఏటా 16-20 వేల మంది మహిళలకు లబ్ధి చేకూరనుంది.

స్త్రీనిధి రుణంతో ఏర్పాటు చేసిన యూనిట్

నాలుగు శాతం వడ్డీకే..

స్త్రీనిధి ద్వారా సంఘాల్లో సభ్యులకు చెందిన పిల్లల చదువుకు ఎన్టీఆర్ విద్యాలక్ష్మి పథకం తీసుకొస్తున్నారు. ఒక సభ్యురాలికి చెందిన ఇద్దరు పిల్లల వరకు ఇది వర్తించనుంది. పాఠశాలలో చేరిన ప్రవేశపత్రం, ఫీజు కట్టిన రసీదు తీసుకురావాల్సి ఉంటుంది. నాలుగు శాతం వడ్డీతో రూ.10వేల నుంచి రూ.లక్ష వరకు రుణం వస్తుంది. రుణానికి అనుగుణంగా చెల్లింపు వాయిదాలు ఉంటాయి. గరిష్ఠంగా 48 వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుంది.

కల్యాణలక్ష్మి, విద్యాలక్ష్మి పథకాలు అమలుకు చర్యలు

రూ.లక్ష వరకు రుణం..

కల్యాణలక్ష్మి ద్వారా ఆడపిల్లల పెళ్లికి రూ.లక్ష వరకు రుణం ఇవ్వనున్నారు. దీనికి కూడా నాలుగు శాతం మాత్రమే వడ్డీ. తీసుకున్న రుణం 48 నెలల్లో చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్నప్పుడు అవసరమైన ధ్రువపత్రం, శుభకార్యం నిర్వహణకు సంబంధించిన పత్రం, పెళ్లి ఖర్చు అంచనా వ్యయం తదితరాలు ఇవ్వాల్సి ఉంటుంది. సొమ్ము నేరుగా లబ్ధిదారు ఖాతాలోనే జమవుతుంది. బీమా సౌకర్యం కూడా. సభ్యురాలు ప్రమాదవశాత్తు మరణిస్తే రుణం చెల్లించనవసరం లేదు.

సాంకేతికత వైపుగా..

సెర్ప్ ఉద్యోగులకు మరింత సాంకేతికత జోడించనుంది. గతంలో 2014-19లో తెదేపా హయాంలోనే వెలుగు ఉద్యోగులకు చరవాణులు ఉచితంగా ఇచ్చారు. ప్రస్తుతం జిల్లాలో ఏపీఎం, సీసీ, యానిమేటర్లు (వీవోఏ)కు ల్యాప్‌ట్యాప్, కంప్యూటర్, చరవాణులు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఇటీవల సమావేశంలో చర్చించారని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్ తెలిపారు.

'కార్పొరేట్లకు కట్టబెట్టడానికే భూసేకరణ'

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: రైతుల భూములను కార్పొరేట్లకు కట్టబెట్టడానికే సేకరిస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు విమర్శించారు. విజయనగరంలోని రెవెన్యూహోంలో బుధవారం ఏపీ రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు, సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. అభివృద్ధి పేరుతో అవసరం కన్నా ఎక్కువ భూసేకరణ జరుగుతుందని ఆరోపించారు. రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ ఏపీఐఐసీ ద్వారా సేకరించిన భూముల్లో కనీసం పదిశాతం పరిశ్రమలు ప్రారంభించలేదన్నారు. అనంతరం పోరాట కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా టి.వి. రమణ, కో-కన్వీనర్లుగా పడాల శ్రీనివాసరావు, ఆర్.చంద్రశేఖర్, పి.ఎల్లం నాయుడుతో పాటు మరో 14 మంది సభ్యులున్నారు. ఈ నెల 19 నుంచి 25 వరకు నిరసనలు, వినతిపత్రాల అందజేత, 26 నుంచి మార్చి 1 వరకు తీర్మానాలు, 2న కలెక్టరేట్‌కు ఫిర్యాదు.. తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంఘీభావం తెలుపుతున్న నాయకులు

రైలు ఢీకొని వృద్ధుడి దుర్మరణం

సీతానగరం, న్యూస్‌టుడే: రైలు ఢీకొని వృద్ధుడు మృతిచెందిన ఘటన సీతానగరం మండలంలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. నీలకంఠాపురం గ్రామానికి చెందిన వి.ఆదినారాయణ(50) మరిపివలస సమీపంలోని పొలంలో మినప చేను పనులు చేసేందుకు బుధవారం ఉదయం వచ్చాడు. తాగునీటి కోసం వెళ్లిన ఆయన పట్టాలు దాటుతున్న క్రమంలో విశాఖ వెళ్తున్న వందే భారత్ రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నారు. ఆయనకు భార్య, ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న కుమారుడు, ఇంటర్ చదువుతున్న కుమార్తె ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	135	240	250

ఒక్కొక్కటీ వస్తున్నాయ్..

న్యూస్‌టుడే – బొబ్బిలి

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఔత్సాహికులు ముందుకొస్తుండడంతో ఏపీఐఐసీ భూములను కేటాయిస్తోంది. బొబ్బిలి పారిశ్రామికవాడతో పాటు రామభద్రపురం మండలం కొట్టక్కిలో దరఖాస్తు చేసుకున్నవారికి ఇటీవల స్థలాలు ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలవారు యూనిట్లు పెడితే స్థలం ఖరీదులో 50 శాతం రాయితీలు ఇస్తున్నారు.

యూనిట్ల ఏర్పాటుకు కేటాయించిన స్థలం

● పరిశ్రమల ఏర్పాటుకు అడుగులు

అందుబాటులో 307.20 ఎకరాలు

బొబ్బిలి పారిశ్రామికవాడలో ఇంకా 307.20 ఎకరాలు అందుబాటులో ఉంది. ఔత్సాహికులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఏపీఐఐసీ కల్పించింది. మొత్తం 129 ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి. నిబంధనల మేరకు కేటాయిస్తామని సంస్థ చెబుతోంది. దరఖాస్తు చేసుకున్న వెంటనే అన్ని రకాల అనుమతులు మంజూరు చేస్తున్నామని సంస్థ జోనల్ ఉప ప్రబంధకుడు జయచంద్ర తెలిపారు.

కేటాయింపులు ఇలా..

- బొబ్బిలి పారిశ్రామిక వాడలో సోనీ ఇండస్ట్రియల్ గ్యాస్ తయారీ, సిద్ధి వినాయక ప్రోసెసింగ్ యూనిట్, అమీనా ఇంజినీరింగ్ వర్క్స్, సన్‌రైజ్ కంపెనీ, అను ఇండస్ట్రీస్ తదితర కర్మాగారాలకు 4.35 ఎకరాలు కేటాయించారు. ఇవి ఏర్పాటైతే సుమారు 200 మందికి ఉపాధి దొరుకుతుంది.
- రామభద్రపురం మండలం కొట్టక్కి సమీపంలో రాధిక ఎడిబుల్ ఆయిల్ కర్మాగారానికి 62 ఎకరాలు కేటాయించారు. పరిశ్రమ ఏర్పాటైతే దాదాపు 200 మందికి పని లభిస్తుంది. ఇప్పటికే స్థలాల కేటాయింపులు జరిగిపోయాయి.

లారీ ఢీకొని కూలీ మృతి

రోదిస్తున్న కుటుంబ సభ్యులు

తెర్లాం, న్యూస్‌టుడే: పక్క గ్రామంలో జరిగిన నాటిక ప్రదర్శన చూసొద్దామని వెళ్లిన వ్యక్తి రహదారి ప్రమాదంలో మృత్యువాత పడిన ఘటన తెర్లాం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. జన్నివలస గ్రామానికి చెందిన చప్ప అప్పలస్వామి (56) కూలి చేస్తూ.. కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. మంగళవారం రాత్రి కూనాయవలసలోని కొండల పోలమ్మ ఆలయం వద్ద శివభాగవతం ప్రదర్శించారు. చూసేందుకు స్వగ్రామానికి చెందిన సీతన్నతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్లారు. ఆలయ సమీపంలో ప్రదర్శన జరుగుతున్న వైపు ద్విచక్రవాహనాన్ని మళ్లించేసరికి వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. వెనుక కూర్చున్న అప్పలస్వామి అక్కడికక్కడే మృతి చెందగా.. వాహనం నడుపుతున్న సీతన్నకు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడికి భార్య పార్వతి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడికి వివాహం కాగా.. రెండో కుమారుడు, కుమార్తె డిగ్రీ వరకు చదువుకుని ఉన్నారు. కుమారుడు గంగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.సాగర్‌బాబు తెలిపారు. గాయపడిన వ్యక్తి ప్రస్తుతం బాడంగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు.

అడ్డొచ్చిన కుక్క.. ఆగిన ప్రాణం



శ్రీనివాస్ (పాతచిత్రం)

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపు తప్పి ఒకరు మృతి చెందిన ఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై నవీన్ వివరాల ప్రకారం... రెల్లిగైరమ్మపేటకు చెందిన యేడువాక శ్రీనివాస్ (29) గ్రామానికి సమీపంలో ఉన్న స్టీల్ కర్మాగారంలో ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంపై కొత్తవలస వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా మల్లివీడు రైల్వే స్టేషన్‌కు ఎదురుగా వాహనానికి కుక్క అడ్డు వచ్చింది. దాన్ని తప్పించబోయి రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబీకులు ఎస్.కోట ఆసుపత్రికి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం వేకువజామున మృతి చెందారు. ఆయనకు భార్య రమ్య, రెండేళ్ల కుమారుడు కార్తీక్ ఉన్నారు. శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రేమ పేరిట మోసం..

నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

విజయనగరం అయ్యన్నపేట, భోగాపురం, న్యూస్‌టుడే: ప్రేమ పేరుతో ఓ బాలికను మోసం చేసిన నిందితుడికి జైలు శిక్ష, జరిమానా పడింది. ఎస్పీ దామోదర్ వివరాల ప్రకారం.. భోగాపురం మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి తన కుమార్తె అదృశ్యమైనట్లు గతేడాది మే 22న పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై పి.సూర్యకుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదే గ్రామానికి చెందిన ఆర్.సురేష్(26) పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికను వెంట తీసుకెళ్లినట్లు గుర్తించారు. విశాఖపట్నం, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో తిప్పి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదుతో జులై 7న పోక్సో కేసు పెట్టారు. డీఎస్పీ ఆర్.గోవిందరావు దర్యాప్తు చేపట్టి, నిందితుడిని రిమాండుకు తరలించారు. న్యాయ స్థానంలో అభియోగ పత్రాలు దాఖలు చేయడంతో 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ వెల్లడించారు. బాధితురాలికి పరిహారంగా రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు.

EENADU e Classifieds

REAL ESTATE

HOUSE FOR SALE

167 Sq. Yds East Facing Independent House LIG-150, Babametta, VUDA Layout Ready for immediate Possession in Vizianagaram ✆ 8125120285, 9948353901.

JOBS

Computer Hardware, Networking CCTV Technicians Freshers and Experienced Can Apply ITI, Diploma or and Degree Location Visakhapatnam. Contact Whatsapp 8333868686 email: info@serviceat365.com Date 21-02-2026 10:00 Am to 5:00 Pm.

తెలుగు-డి.టి.పి-పేజ్‌మేకర్-బుక్‌వర్క్, డిజైనింగ్ చేయుటకు కావలెను. తోటపాలెం, విజయనగరం. Cont: 8374315777, 9491601342.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ:18-20K ✆ 96404 68899, 96402 58899

VZM ప్రముఖ హనెస్ట్ హోమ్స్ కంపెనీ నందు పనిచేయుటకు కస్టమర్ కేర్ Tele (5) F, ప్రాజెక్టు ప్రమోటర్స్ (10) M/F, కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజర్ (5) M/F, ప్రాజెక్టు మేనేజర్ (3) M, బిజినెస్ డెవలప్మెంట్ ఆఫీసర్ MBA(2) వంటమనిషి, హెల్పర్, అకౌంటెంట్ M, డ్రైవర్ M, ఉత్సాహవంతులైన M/F కావలెను. ట్రైనింగ్ & సపోర్ట్ ఇవ్వబడును. ✆ 8688796746.

SECURITY GUARDS

వైజాగ్ సిటీ, శ్రీకాకుళం, విజయనగరంలో పనికొరకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. రూమ్, భోజనం కలదు. PF, ESI. జీతం: 20 వేలు, 30 వేలు. 6300071128

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గుండెపోటు దాటేలా.. పచ్చనిగూడు నిలిచేలా..

ప్రభుత్వాసుపత్రుల్లో అత్యవసర ఇంజెక్షన్

హృద్రోగులకు వరం.. స్టెమీ కేంద్రం

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, పాలకొండ

ఛాతిలో నొప్పి అనిపించినప్పుడు తక్షణ వైద్య సాయం అందక ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ పరిస్థితి ఎదురవ్వకూడదన్న ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం ఆసుపత్రుల్లో తక్షణ ప్రాథమిక చికిత్స అందించాలనే లక్ష్యంతో స్టెమీ (ఎస్‌టీ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్‌ఫార్క్షన్) పేరిట వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో అత్యవసర వైద్యం అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలో మూడేళ్లలో 90 మంది వరకు ఈ ఇంజెక్షన్ ద్వారా ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. అవగాహన లేక సకాలంలో ఆసుపత్రికి రాక ప్రాణాలు కోల్పోతున్నవారు లేకపోలేదు.

కొన్నేళ్ల క్రితం ఓ ప్రభుత్వ ఉద్యోగికి గుండెల్లో నొప్పి, ఆయాసం వచ్చాయి. జిల్లా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి గుండెపోటుగా గుర్తించి.. విశాఖ రిఫర్ చేశారు. మార్గమధ్యలో మృతిచెందారు. ఇది నిన్నటి మాట.

పార్వతీపురం మండలం వెంకంపేటకు చెందిన వృద్ధుడికి ఇటీవల గుండెలో నొప్పి వచ్చింది. ప్రైవేటు ఆసుపత్రిలో చూపించారు. వారి సూచన మేరకు జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు గుండెపోటుగా గుర్తించి.. తక్షణం టెనెక్టేప్లేస్ ఇంజెక్షన్ ఇచ్చారు. తర్వాత కుటుంబీకులు విశాఖ తీసుకెళ్లి చికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పింది.. ఇది నేటి పరిస్థితి.

మూడేళ్లలో ఎంత మందికి అంటే..

ఆసుపత్రి	ఇంజెక్షన్ ఇచ్చింది	ప్రాణాలు నిలిచింది
జిల్లా కేంద్ర	42	38
సాలూరు	24	22
పాలకొండ	16	15
సీతంపేట	06	5
చినమేరంగి	02	1
కురుపాం	09	6
భద్రగిరి	03	3

తొలి గంట కీలకం

'గుండెనొప్పికి గురైన వారికి తొలి గంట(గోల్డెన్ అవర్) ఎంతో కీలకం. ఛాతిలో నొప్పి, ఎడమవైపు భుజం లాగడం, గుండె దడ, ఆకస్మిక ఆయాసం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణం ఆసుపత్రికి వెళ్లాలి. గుండెనొప్పిగా నిర్ధారణ అయితే ప్రభుత్వం సరఫరా చేసిన రూ.45 వేలు ఖరీదైన టెనెక్టేప్లేస్ ఇంజెక్షన్ ఉచితంగా వేస్తారు. ఇది రక్తం గడ్డకట్టకుండా చేస్తుంది. రోగిని విశాఖ తరలించి మెరుగైన వైద్యం అందించడానికి తగిన సమయం లభిస్తుంది.' అని పార్వతీపురం జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకురాలు నాగశివజ్యోతి చెప్పారు. జిల్లాలో సాలూరు, పాలకొండ, సీతంపేట ప్రాంతీయాసుపత్రులు, భద్రగిరి, కురుపాం, చినమేరంగి సామాజిక ఆసుపత్రులతోపాటు జిల్లా ఆసుపత్రిలో స్టెమీ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. మూడేళ్లలో మొత్తం 102 మందికి ఇంజెక్షన్ ఇవ్వగా ఇందులో 90 మంది ప్రాణాలు నిలిచాయి.

సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాలో ప్రాంతీయాసుపత్రులు, సీహెచ్‌సీలు, జిల్లా ఆసుపత్రిలో స్టెమి కేంద్రాలున్నాయి. హృద్రోగ సమస్యలు ఉన్నట్లు గుర్తిస్తే ఇంజెక్షన్ ఇస్తున్నాం. తదుపరి వైద్యం అందించేందుకు అవకాశం ఉంటుంది. సకాలంలో వచ్చిన వారి ప్రాణాలకు భరోసా ఉంటుంది. సద్వినియోగం చేసుకోవాలి.

– నాగభూషణరావు, డీసీహెచ్ఎస్

గుత్తేదారుపై ఫిర్యాదు

విజయనగరం అర్బన్: విజయనగరం మండలంలో థర్డ్ ఆప్షన్ కింద మంజూరైన గృహాలు పూర్తిచేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఇళ్లు నిర్మిస్తామని ఒప్పందం చేసుకుని మధ్యలో ఆపేసిన గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలని గృహనిర్మాణశాఖకు 128 మంది ఫిర్యాదు చేశారు. గుంకలాం, కొండకరకాం కాలనీల్లో 5,088 ఇళ్లను నిర్మించేందుకు రాక్రీట్ సంస్థ అప్పట్లో ముందుకొచ్చింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందుకెళతామని గృహనిర్మాణశాఖ పీడీ జి.మురళీమోహన్ తెలిపారు.

నిబంధనలు పాటించాలి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: ఆసుపత్రుల వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి హెచ్చరించారు. ప్రజారోగ్యానికి హాని కలగకుండా శాస్త్రీయ పద్ధతిలో తరలించాలన్నారు. నిబంధనలు పాటించని యాజమాన్యాలకు నోటీసులు ఇవ్వాలని కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సరితకు సూచించారు.

అన్న క్యాంటీన్ సిద్ధం

నిర్మాణం పూర్తయిన అన్న క్యాంటీన్ భవనం

కొత్తవలస, న్యూస్‌టుడే: కొత్తవలసలో అన్న క్యాంటీన్ నిర్మాణం దాదాపు రూ. 60 లక్షల వ్యయం అంచనాతో 95 శాతం పూర్తయింది. శృంగవరపుకోట నియోజకవర్గానికి సంబంధించి గతంలో తెదేపా అధికారంలో ఉన్నప్పుడు దీనిని ప్రారంభించారు. కూడలికి, పంచాయతీ వాణిజ్య సముదాయానికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో దీనిని నిర్వహించారు. వైకాపా అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా వీటిని మూసివేసిన విషయం తెలిసిందే. కూటమి ఏర్పాటయ్యాక అదే స్థలంలో మళ్లీ పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టారు. ఈ భవనం ప్రారంభంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని విజయనగరం పబ్లిక్ హెల్త్ డీఈఈ ఈశ్వర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. చీపురుపల్లిలో క్యాంటీన్ నిర్మాణం పూర్తయిందని, గజపతినగరంలో స్థలం కేటాయించాలని ఆయన తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

వంతెన వచ్చినా.. తప్పని అవస్థలు

బస్సులు చాలక ఇబ్బందులు

పాలకొండ కాంప్లెక్సులో విశాఖ బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: చీపురుపల్లి వద్ద వంతెన నిర్మాణం పూర్తి కావడంతో పాలకొండ నుంచి విశాఖకు గతంలో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సులు నేరుగా తిరుగుతున్నాయి. దీంతో ఈ రూట్లో ప్రయాణానికి ఇబ్బందులు తొలగాయనుకున్నారు. కానీ పూర్తి స్థాయిలో సర్వీసులు కల్పించక ప్రయాణికులకు ప్రయాసలు తప్పడం లేదు.

సర్వీసులు పెరిగినా..

పాలకొండ నుంచి విశాఖకు రాకపోకలు అధికం. పట్టణంతోపాటు వీరఘట్టం, సీతంపేట, శ్రీకాకుళం జిల్లా కొత్తూరు, బూర్జ, విజయనగరం జిల్లా రేగిడి, రాజాంతో పాటు పలు ప్రాంతాల ప్రజలు విశాఖ వెళ్లేందుకు ఈ బస్సులే ఆధారం. 2022కు ముందు 30కుపైగా సర్వీసులు ఉండేవి. వంతెన నిర్మాణం వల్ల చీపురుపల్లి మీదుగా ఆగిపోవడంతో బస్సులు తగ్గించారు. యథావిధిగా పునరుద్ధరించడంతో 12 బస్సులు అదనంగా అవసరం. ఆరు మాత్రమే వేశారు. ఇవి చాలడం లేదు. ఉదయం నాలుగున్నర గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రతి 20 నిమిషాలకు ఒకటి అందుబాటులో ఉంది. తర్వాత గంటకు ఒకటి మాత్రమే నడుస్తోంది. రాత్రి 7 గంటల తర్వాత ఇంద్ర, డీలక్స్ బస్సులు మాత్రమే ఉన్నాయి. ఎక్స్‌ప్రెస్‌లు లేవు. స్త్రీశక్తి పథకం కొనసాగుతుండడంతో ఇబ్బందులు తప్పడంలేదు.

చర్యలు తీసుకుంటాం..

పాలకొండ నుంచి విశాఖకు గతంలో కంటే బస్సుల సంఖ్యను పెంచాం. మరో ఆరు బస్సులు రావాల్సి ఉంది. ప్రస్తుతం ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు సర్వీసులు తిప్పుతున్నాం. – మూర్తి, డిపో మేనేజర్

కల్వర్టుకు రంధ్రం.. ఇక్కడ భద్రం

గరుగుబిల్లి మండలం చినగుడబ, ఉద్దవోలు రోడ్డులో కొండగెడ్డ కాలువ కల్వర్టుకు రంధ్రం పడింది. కింద మట్టి జారి రహదారి కోతకు గురైంది. ఈ మార్గంలో ఆర్టీసీ, ప్రైవేటు స్కూలు బస్సులు, వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. మలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనం తప్పించే సమయంలో ఏమాత్రం పక్కకు వెళ్లినా.. ప్రమాదం జరిగే అవకాశం ఉంది. పరిశీలించి, పూడ్చేందుకు చర్యలు తీసుకుంటామని ర.భ.శాఖ ఏఈఈ రామ్మోహనరావు తెలిపారు. - న్యూస్‌టుడే, గరుగుబిల్లి గ్రామీణం

కాలువలు అధ్వానం

పాలకొండ పట్టణంలోని పలు ప్రాంతాల్లో కాలువలు అధ్వానంగా ఉన్నాయి. మురుగు నీరు నిలిచి ఇబ్బందులు తప్పడం లేదు. వడమ ప్రధాన రహదారిలో ఇదే పరిస్థితి. తరచూ మురుగునీరు రహదారిపైకి చేరుతోంది. దుర్వాసన, దోమలతో స్థానికులు సతమతం చేయాల్సి వస్తోంది. ఈ రహదారిలో వడమ, అన్నవరం, ఆంపిలితోపాటు మరో నాలుగు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. పాలకవర్గంతో చర్చించి పక్కా కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని నగరపంచాయతీ కమిషనర్ రత్నరాజ్ తెలిపారు. న్యూస్‌టుడే, పాలకొండ

తలుపులు లేక దుర్వినియోగం

నర్సిపురం పంచాయతీ కారాడవలసలో అంగన్‌వాడీ కేంద్రం కోసం నాలుగేళ్ల క్రితం భవనం నిర్మించారు. చివర దశలో బిల్లులు రాకపోవడంతో గుత్తేదారు ఇలా వదిలేశారు. తలుపులు లేకపోవడంతో భవనం దుర్వినియోగం అవుతోంది. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. మరోపక్క అంగన్‌వాడీ కేంద్రాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. పెదబొండపల్లి, దిబ్బగుడ్డివలసలోనూ ఇదే పరిస్థితి. పరిశీలించి, సత్వర చర్యలు తీసుకుంటామని సీడీపీవో రేఖారాణి అన్నారు. - న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

మూలకు చేర్చి.. మోడువార్చి

సాలూరు పట్టణంలో పచ్చదనం పెంచి పర్యావరణ పరిరక్షణకు పాటుపడతామంటూ ఊకదంపుడు ప్రచారాలు, మొక్కలు పట్టి మాటలే తప్ప క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా ఉంది. పురపాలిక ప్రాంగణంలో ఎండిపోయిన ఈ మొక్కలే దానికి నిదర్శనం. ఖాళీ స్థలాలు, ఉద్యానాల్లో నాటేందుకు వీటిని తెప్పించారు. కొన్ని మొక్కలు అక్కడక్కడా నాటారు. మరికొన్ని స్థానికులు పట్టుకుని వెళ్లారు. 200 వరకు ఇలా పుర ప్రాంగణంలోనే వానకు తడిచి, ఎండకు ఎండి పాడయ్యాయి. - న్యూస్‌టుడే, సాలూరు

ఒరిగిన స్తంభంతో భయం



మక్కువ మండలంలోని కోన గ్రామంలో విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. గ్రామంలోని సీఆర్‌పీఎఫ్ నుంచి కొత్తవీధికి వెళ్లే విద్యుత్తు లైన్‌లో స్తంభం పక్కకు ఒరిగిపోయింది. పెనుగాలి వీస్తే కూలిపోయేలా ఉంది. ఇక్కడి పొలాలకు నిత్యం రైతులు వెళ్తుంటారు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. వెంటనే సరిచేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై లైన్‌మ్యాన్ ఈశ్వరరావును వివరణ కోరగా.. ఉన్నతాధికారులకు సమస్య తెలియజేస్తామన్నారు. - న్యూస్‌టుడే, మక్కువ

నెలాఖరులోగా లక్ష్యం చేరాలి

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఈనెలాఖరులోగా పంచాయతీల్లో ఇంటిపన్ను శతశాతం వసూలు చేసి.. లక్ష్యాన్ని చేరాలని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి టి.కొండలరావు ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో డీఎల్‌పీవోలు, ఈవోపీఆర్డీలు, కార్యదర్శులతో సమావేశమై మాట్లాడారు. ఇంటి యజమాని పన్నును సరిగా ఆన్‌లైన్‌లో కట్టుకునే అవకాశం కల్పించామని పేర్కొన్నారు. దీనిపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. జిల్లాలో రూ.6.23 కోట్లు వసూలు లక్ష్యం కాగా.. ఇప్పటివరకు రూ.3.60 కోట్లు మాత్రమే అయ్యిందని చెప్పారు. అదేవిధంగా కలెక్టరు ఆదేశాల మేరకు ప్రతి పంచాయతీని ఈనెల 25 నాటికి 'ముస్తాబు' చేయాలన్నారు. వెనుకబడిన మండల, సచివాలయ సిబ్బందిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

సిబ్బందికి సూచనలిస్తున్న కొండలరావు

ఖైదీలపై సానుభూతి చూపండి

బెలగాం, న్యూస్‌టుడే: నేరపూరిత జీవితాన్ని విడిచి మంచి వ్యక్తులుగా మారేందుకు ఖైదీలను ప్రోత్సహించాలని, వారిపట్ల సానుభూతి చూపాలని విజయనగరం జిల్లా లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి, న్యాయమూర్తి ఎ.కృష్ణప్రసాద్ జైలు అధికారులకు సూచించారు. పట్టణంలోని ఉపకారాగారాన్ని సందర్శించి ఖైదీల ప్రవర్తన, వారికి అందుతున్న సేవలు, ఆహారం, వసతి గురించి అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటించాలని, ఖైదీలకు సరైన వైద్య సేవలు అందించాలని చెప్పారు. జైలు సూపరింటెండెంటు జి.రాము, వైద్యాధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జైలు అధికారులతో మాట్లాడుతున్న కృష్ణప్రసాద్

మార్చి 14న జాతీయ లోక్ అదాలత్

బెలగాం, న్యూస్‌టుడే: ప్రజలకు సత్వర న్యాయం అందించడమే జాతీయ లోక్ అదాలత్ లక్ష్యమని రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.దామోదరరావు తెలిపారు. బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో పోలీసులు, అధికారులతో సమావేశమై, మాట్లాడారు. మార్చి 14న లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు చెప్పారు. పెండింగులో ఉన్న సివిల్, క్రిమినల్, బ్యాంకు రుణాలు, భార్యాభర్తల వివాదాలు తదితర కేసులు రాజీ అయ్యేలా చూడాలని సూచించారు. అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సౌమ్య జోస్ఫిన్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతను బలిచేసి.. అస్మదీయులకు ధారపోసి!

– న్యూస్‌టుడే, పార్వతీపురం

పొలంలో వేసిన పచ్చని పంటకు బలం చేకూరి.. దిగుబడి పెరిగేందుకు రైతులు వాడే ఎరువుల విక్రయాల్లోనూ అక్రమాలు జరుగుతున్నాయి. మనోళ్లు.. బంధువులు.. అనుచరులు.. అనే ప్రీతి చూపుతూ కొందరు వ్యక్తులకే నిబంధనలకు విరుద్ధంగా అధిక మొత్తంలో ఎరువులు కట్టబెడుతున్నారు. అన్నదాతను క్షోభకు గురిచేస్తున్నారు. ఓ పక్క గంటలతరబడి నిల్చున్నా ఒక్క బస్తా దొరక్క సాధారణ రైతు కంటతడి పెడుతుంటే... అస్మదీయులకు మాత్రం కావాల్సినన్ని బస్తాలు చేరాయి. రాజకీయ బలంతో అధికారుల నోళ్లు నొక్కి.. ఎరువుల అమ్మకాలు చేపట్టారు.

ఎరువుల విక్రయాల్లో అక్రమాలు

ఎక్కడికి వెళ్లాయి..?

వ్యవసాయశాఖ పీఏసీఎస్‌లు, ఆర్‌ఎస్‌కేల ద్వారా ఖరీఫ్‌కు యూరియాను అందించింది. నిబంధనల ప్రకారం ఒక రైతుకు 10 బస్తాల కంటే ఎక్కువ ఎరువు ఇవ్వకూడదు. కానీ అస్మదీయులకు ఇష్టం వచ్చినన్ని ఇచ్చినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలే చెబుతున్నాయి. ఈ ఎరువులు ఎక్కడికి వెళ్లాయి?, ఏం చేశారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గిరాకీ ఉన్న సమయంలో కచ్చితంగా పక్కదారి పడతాయనేది నగ్నసత్యం. చాలా మంది రైతులు ప్రైవేటుగా అధిక ధరలకు కొనాల్సిన దుస్థితి ఏర్పడింది.

చర్యలు తీసుకుంటున్నాం: రైతుల అవసరాలు తీర్చేలా యూరియాను సర్దుబాటు చేయాల్సిన వారు.. ఒక్క వ్యక్తికే ఎక్కువ పరిమాణంలో ఇవ్వడంపై కలెక్టరు ప్రభాకరరెడ్డి స్పందించారు. చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాథమిక సహకార సంఘాలకు సంబంధించి పదినెలల సస్పెన్షన్‌పై చర్చలు జరుగుతున్నాయి. రైతులకు ఎరువుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని లైసెన్సు విషయంలో పునరాలోచన చేయాలని కోరుతున్నారు. రైతు సేవా కేంద్రాలకు సంబంధించి వీఏఏలకు శ్రీముఖాలు జారీ చేశాం.

- ఆర్. అన్నపూర్ణ, జిల్లా వ్యవసాయాధికారిణి

అన్ని బస్తాలు ఎలా ఇచ్చారు?

◆ గరుగుబిల్లి మండలం రావివలస పీఏసీఎస్‌లో జి.అమ్మడమ్మ అనే రైతుకు ఒకేసారి 50 బస్తాలకు పైగా యూరియాను సొసైటీ విక్రేత ఇచ్చేశారు. ఇది నిబంధనకు విరుద్ధం.

◆ మక్కువ మండలం శంబర పీఏసీఎస్‌లో ఎస్.నవీన్ పేరిట 2.025 మెట్రిక్ టన్నుల యూరియా ఇచ్చినట్లు నమోదైంది.

◆ మక్కువ మండలం చప్పబుచ్చెంపేటలో వి.అప్పలనాయుడు పేరిట 2.025 ఎంటీలు, పాచిపెంట మండలం మాతుమూరులో ఎం.లక్ష్మణరావు పేరిట 2.205 ఎంటీలు, పార్వతీపురం మండలం వెంకంపేటలో ఎం.రామచంద్రరావుకు 2.115 ఎంటీల యూరియా ఇచ్చినట్లు రికార్డుల్లో ఉంది.

◆ సాలూరులో మనగ్రోమోర్ కేంద్రంలో రెండు టన్నులకు పైగా ఒకరికే విక్రయించారు. జె.గౌరీశ్వరి పేరుతో 2.16 ఎంటీలు ఇచ్చారు.

యువతకు ఉపాధి చూపాలి

మాట్లాడుతున్న విజయచంద్ర

పార్వతీపురం, గ్రామీణం, న్యూస్‌టుడే: పార్వతీపురం ప్రాంతాల్లో గ్రామీణ యువతను సన్మార్గంలో నడిపించాలంటే.. నాటుసారాను నిర్మూలించాలని ఎమ్మెల్యే బి.విజయచంద్ర కోరారు. బుధవారం అసెంబ్లీలో మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో నాటుసారా తయారీ, విక్రయాలు, వాడకం ఎక్కువ అయ్యాయని ఆరోపించారు. కొందరి స్వార్థం కోసం ఈ పనిలో చేరిన యువకులు కేసుల్లో చిక్కుకుంటున్నారని చెప్పారు. దీనిపై ప్రభుత్వం స్పందించి ఆ ముఠాను కట్టడిచేసి యువతకు ఉపాధి కల్పించాలని కోరారు.

వేతనాలు పెంచాలని వినతి

కలెక్టరేట్ ప్రాంగణం: అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాలు పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని కోరుతూ ఆ సంఘ నాయకురాలు ఇందిరా ఆధ్వర్యంలో ఐసీడీఎస్ పీడీ కనకదుర్గకు వినతిపత్రం అందజేశారు. గౌరీ, మణి, అలివేలు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ పార్వతీపురం సాధించేలా..

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: 'స్వచ్ఛ పార్వతీపురం' గుర్తింపు పొందడానికి పుర యంత్రాంగం కృషి చేయాలని సబ్‌కలెక్టర్ వైశాలి అన్నారు. బుధవారం కమిషనరు పావనితో కలిసి వార్డుల్లో పర్యటించారు. చెత్త సేకరణ అమలు తీరును తెలుసుకున్నారు. దుకాణాల వద్ద విధిగా చెత్త బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని, రోడ్లపై వ్యర్థాలు వేసేవారిపై కేసులు తప్పవని పేర్కొన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఉత్తమ ర్యాంకు సాధించే విధంగా కార్యాచరణ అమలు చేయాలన్నారు. డీఈ జి.శ్రీనివాసరాజు, పారిశుద్ధ్య అధికారి కె.పకీరురాజు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

వార్డులో పర్యటిస్తున్న వైశాలి, పావని తదితరులు

విధి నిర్వహణలో చిత్తశుద్ధి అవసరం

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికులు విధి నిర్వహణలో చిత్తశుద్ధి చూపాలని, అప్పుడే పరిసరాలు, పట్టణం శుభ్రంగా ఉంటాయని పుర కమిషనరు పావని సూచించారు. బుధవారం పుర కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యంలో ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, పీపీఈ కిట్లు ధరించడం, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రైవేటు సంస్థ జిల్లా సమన్వయకర్త బి.గణపతమ్మ, రిసోర్స్‌పర్సన్ సాయికిరణ్, కార్మికులు పాల్గొన్నారు.

నకిలీ ధ్రువపత్రాలతో పనిచేస్తే కఠిన చర్యలు

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది విద్యార్హతకు సంబంధించిన ధ్రువపత్రాలు నకిలీవని తేలితే కఠినమైన క్రమ శిక్షణా చర్యలు తీసుకుంటామని జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎం. అన్నాదొర అన్నారు. దీనిపై ఐటీడీఏ పీవో తగు ఆదేశాలు జారీ చేశారని బుధవారం తెలిపారు.

అన్ని గ్రామాల్లోనూ 'ముస్తాబు'

సీతంపేట, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని గ్రామాల్లో 'ముస్తాబు' అమలు చేసి.. సుందరీకరించాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి, ప్రత్యేకాధికారి జి.చిన్నబాబు అన్నారు. ఇప్పగూడ గ్రామాన్ని బుధవారం ఆయన సందర్శించారు. అభివృద్ధి పనులను పరిశీలించి సూచనలు చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవోలు శ్రీనివాసరావు, మోహన్‌బాబు, కార్యదర్శి గిరిబాబు ఉన్నారు.

23న కౌలు రైతుల ధర్నా

సీతానగరం, న్యూస్‌టుడే: కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి ఈనెల 23న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి రమణమూర్తి తెలిపారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో గోడపత్రికలను విడుదల చేశారు.

విజయవాడకు ఇంద్ర బస్సు

పాలకొండ గ్రామీణం: పాలకొండ పట్టణం నుంచి విజయవాడకు ప్రతి రోజు రాత్రి ఏడు గంటలకు ఇంద్ర (శీతల) బస్సు నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం మూర్తి, ఉప మేనేజరు రమేష్ బుధవారం తెలిపారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పనులకు శంకుస్థాపన

సీతానగరం, న్యూస్‌టుడే: లచ్చయ్యపేట పంచాయతీ అనుబంధ గ్రామమైన గుమ్మిడివరం రహదారి అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. సర్పంచి సన్యాసినాయుడు ఆధ్వర్యంలో తెదేపా మండలాధ్యక్ష, కార్యదర్శులు సత్యంనాయుడు, వేణుగోపాలనాయుడు చేతులమీదుగా పూజలు నిర్వహించారు. రూ.1.50 కోట్లతో పనులు చేపట్టినట్లు ఏపీవో బాలకృష్ణ తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కొమరాడ, న్యూస్‌టుడే: కొట్టు ఉప విద్యుత్తు కేంద్రం పరిధిలో నిర్వహణ పనుల నేపథ్యంలో గురువారం ఉదయం 8 గంటల నుంచి 2 వరకు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వెంకటరమణ చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వంద పనిదినాలు కల్పించాలి

వీరఘట్టం: మండలంలోని ప్రతి పంచాయతీలో వంద పనిదినాల కల్పన లక్ష్యంగా పనిచేయాలని ఉపాధిహామీ ఏపీవో జి.సత్యంనాయుడు అన్నారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో క్షేత్ర, సాంకేతిక సహాయకులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు 41 రోజులే సమయం ఉందని, నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలన్నారు.

దీక్ష విజయవంతానికి పిలుపు

వీరఘట్టం, పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: విశాఖపట్నంలో ఈనెల 22న నిర్వహించనున్న సాగర సంగ్రామ దీక్ష విజయవంతం చేయాలని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల జేఏసీ బాధ్యులు కోరారు. మండల వనరుల కేంద్రం ఆవరణలో బుధవారం గోడప్రతులు ఆవిష్కరించారు. బాధ్యులు ఆర్.ధనుంజయనాయుడు, వి.అన్నాజీరావు, బి.దుర్గాప్రసాద్, ఎ.సూర్యనారాయణ ఉన్నారు. పాలకొండలో కె.చిన అప్పలనాయుడు తదితరులు గోడప్రతులు ఆవిష్కరించారు.

భవనం శిథిలం.. తప్పక నివాసం

దెబ్బతిన్న స్తంభం

గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరి ఆర్‌ఐటీఐ వసతిగృహం శిథిలావస్థకు చేరుకుంది. గత కొన్నేళ్లుగా దీని నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చి కళాశాలలో ప్రవేశాలు పొందిన కొంత మంది విద్యార్థులు ఇందులోనే నివాసం ఉంటున్నారు. స్వయంగా వంట చేసుకుని తినాల్సిన పరిస్థితి. పైకప్పు పెచ్చులూడి, స్తంభాలు శిథిలమవుతుండడంతో భయాందోళన చెందుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతుండడంతో కొన్ని గదులు అపరిశుభ్రంగా మారాయి. సంబంధిత అధికారులతో మాట్లాడి వసతిగృహం వివరాలు సేకరిస్తామని ఎమ్మెల్యే జగదీశ్వరి తెలిపారు. – న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం

పెచ్చులూడిన పైకప్పు

వీఆర్యేల ఆందోళన

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: గ్రామ సహాయకుల సమస్యలు పరిష్కరించి, ఆర్థిక భరోసా కల్పించాలని ఆ సంఘ జిల్లా కార్యదర్శి జి.కృష్ణ అన్నారు. బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. వీరికి సిటు నాయకులు మద్దతు పలికారు. 8 సంవత్సరాల నుంచి వేతనాలు పెంచడం లేదని, టీఏ, డీఏలు ప్రకటించడం లేదని వాపోయారు. బీవీ రమణ, జి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client **M/S SHRIRAM FINANCE LIMITED, Parvathipuram Branch, Parvathipuram Manyam District,** I issue the following notice to general public. My client intends to grant loan to **Mr. MANDA NARASIMHA MURTHY** S/o Late M Simhachalam by keeping the below mentioned schedule property as security by way of Registered Mortgage. As such if any one have any claims, charges, mortgages Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices. Otherwise, later objections will not bind my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

Erstwhile Vizianagaram District, presently Parvathipuram Manyam District, Parvathipuram Mandalam, Venkampeta Gram panchayat and village accounts covered by S. Nos.30-6 & 30-8A part, Western side of R & B road leading from Parvathipuram to Bondapalli village, BALAJI NAGAR LAYOUT in which **Plot Nos. 243, 244 & 245** measuring East to West 45 feet or 13.72 meters and North to South 50 feet or 15.25 meters totaling 250 Sq. yards or 210 Sq. meters of vacant site is bounded by:

EAST : Plot No.242 site, **SOUTH** : 20 feet wide layout road, **WEST** : Remaining site of vendor, **NORTH** : Plot Nos. 175, 176 & 177 sites.

KODURI SREENIVASA RAO
SMT. SIVA KUMARI JALADI
Advocates,
S-2, Bharat Apartments,
Seethammadhara,
Visakhapatnam-13.
Visakhapatnam
Dt.18.02.2026
Mobile No.9885166648
Mail: sreenivaskoduri@gmail.com

ప్రైవేటు వద్దు.. ప్రభుత్వ బడులే ముద్దు

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాలలు వద్దు.. ప్రభుత్వ బడులే ముద్దు అంటూ మండలంలోని చినమేరంగిలో బుధవారం వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, పోలీసులు అవగాహన కల్పించారు. స్పెషల్ స్కూల్ విద్యార్థులు ఫ్లకార్డులు పట్టుకుని.. నినాదాలు చేశారు. చినబజారు నుంచి బస్టాండు వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. ప్రభుత్వ బడుల్లో పిల్లల్ని చేర్పించాలని స్థానికులను కోరారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల కో-ఆప్షన్ సభ్యుడు శివప్రసాద్ బ్రహ్మ, వైద్యుడు వాసుదేవరావు, సీఐ టీవీ తిరుపతిరావు, ఎస్సై, హెచ్‌సీలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చినమేరంగి బస్టాండులో చిన్నారుల మానవహారం

అభినయం.. అదరహో

పాలకొండ మండలం గోపాలపురం గ్రామంలోని శివాలయం వద్ద చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది. శివరాత్రి సందర్భంగా పట్టణానికి చెందిన శివకేశవ నృత్య నికేతన్ చిన్నారులు శాస్త్రీయ, జానపద పాటలకు నృత్యాలు చేశారు.

– న్యూస్‌టుడే, పాలకొండ

నిరంతరాయంగా ప్రజాధనం వృథా

పాలకొండ పట్టణంలో పట్ట పగలు వెలుగుతున్న వీధి దీపం

పాలకొండ, సాలూరు, న్యూస్‌టుడే: పట్టణాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాలు నిరంతరం వెలుగుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణలోపం కారణంగా విద్యుత్తు వృథా అవుతోంది. రోజుల తరబడి ఇలానే ఉంటున్నా బాగుకు చర్యలు తీసుకోవడం లేదు. గతంలో తెదేపా హయాంలో విద్యుత్తు ఛార్జీలు తగ్గించేందుకు ఎల్‌ఈడీ దీపాలను ఏర్పాటు చేసింది. కానీ అవి నిరంతరం వెలుగుతుండడంతో అధిక ఛార్జీలు తప్పడం లేదు.

రూ.లక్ష వరకు ఛార్జీ..

పాలకొండ నగరపంచాయతీ పరిధిలో 20 వార్డులు ఉన్నాయి. జనాభా 40వేలు. పట్టణంలో 1800 వరకు వీధిదీపాలు ఉన్నాయి. నిర్వహణ లేకపోవడంతో 300 వరకు పగలూ వెలుగుతున్నాయి. ఎప్పటికప్పుడు మరమ్మతులకు గురవుతున్నాయి. వీటికి త్రీఫేజ్ సరఫరా లేకపోవడమే ప్రధాన కారణమని పలువురు చెబుతున్నారు. నగర పంచాయతీకి ప్రతి నెలా రూ.లక్ష వరకు విద్యుత్తు ఛార్జీ చెల్లిస్తున్నారు. ప్రధాన రహదారితోపాటు సత్యసాయినగర్, వడమ రహదారి, గేదెల వారివీధి, సీతంపేట రహదారి, గారమ్మకాలనీ, సంపత్‌సాయినగర్, సాయిదుర్గానగర్, నక్కలపేట, ఆసుపత్రి రహదారి, గారమ్మకాలనీ తదితర పలు ప్రాంతాల్లో ఈపరిస్థితికనిపిస్తోంది. ఏళ్లుగా సమస్య ఉన్నా కనీసం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించకుంటే సమస్య తీవ్రమవుతుందని స్థానికులు అంటున్నారు. ఒక్కో దీపానికి రోజుకు 1.50 యూనిట్లు విద్యుత్తు వృథా ఖర్చవుతోంది. ఈ లెక్కన నెలకు 45 యూనిట్లు, ఏడాదికి 540 యూనిట్లు వృథా అవుతోంది. చర్యలు తీసుకుంటామని నగరపంచాయతీ కమిషనర్‌రత్నరాజ్ తెలిపారు.

రాత్రి, పగలు వెలుగుతున్న విద్యుత్తు దీపాలు

సాలూరులోనూ అంతే..

సాలూరు పట్టణంలో 1,770 వీధి దీపాలు ఉన్నాయి. వీటిలో మల్లిపేట, బంగారమ్మకాలనీ, ఎస్టీ కాలనీ, బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం నుంచి రామాకాలనీ రోడ్డు, శ్రీనివాసకాలనీ తదితర ప్రాంతాల్లో 100 వరకు వీధి దీపాలు నిరంతరం వెలుగుతున్నాయి. త్రీఫేజ్, ఫీజు బాక్సులు లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. నెలకు మున్సిపాలిటీ రూ.రెండు లక్షల మేర విద్యుత్తు ఛార్జీల రూపంలో ఖర్చు చేస్తోంది. వృథా అడ్డుకట్టకు చర్యలు తీసుకుంటామని డీఈ ప్రసాద్ తెలిపారు.

చినమేరంగిలో ఉద్యోగ మేళా

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: జియ్యమ్మవలస మండలంలోని చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం ఉద్యోగ మేళా నిర్వహించారు. జిల్లా ప్లేస్‌మెంటు అధికారి ఎన్.మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో 10 ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులకు మౌఖిక పరీక్షలు నిర్వహించారు. 130 మంది హాజరు కాగా 45 మందిని ఎంపిక చేసినట్లు మనోజ్ కుమార్ తెలిపారు. ఆయా కంపెనీల హెచ్‌ఆర్‌లు పాల్గొన్నారు.

యువకుడికి ప్రక్రియను వివరిస్తున్న మనోజ్ కుమార్

శివపార్వతుల కల్యాణం.. కమనీయం

పాచిపెంట మండలం పెదచీపురువలస సమీప పారమ్మకొండపై మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం శివపార్వతుల కల్యాణం పంచముఖేశ్వర శర్మ ఆధ్వర్యంలో వైభవంగా వేదపండితులు జరిపించారు. జాతర సందర్భంగా కొండపై వెలిగించిన అఖండ జ్యోతి ఉద్వాసన, అమ్మవారి అలంకరణ, మహాపూర్ణాహుతి నిర్వహించారు. – న్యూస్‌టుడే, పాచిపెంట



తల్లికి కుంకుమార్చన

ఫాల్గుణ మాసోత్సవాల్లో భాగంగా పాలకొండ జ్ఞానసరస్వతి ఆలయ ప్రాంగణంలో మహిళలు శ్రీచక్రానికి బుధవారం కుంకుమార్చనలు నిర్వహించారు. శివమానస పూజలు చేసి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

– న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

ఆలయం ప్రారంభం

గరుగుబిల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: గరుగుబిల్లి మండలంలోని సీతారాంపురం గ్రామంలో బుధవారం అభయాంజనేయ స్వామి ఆలయాన్ని ప్రారంభించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో స్వామివారి కీర్తనలు ఆలపించారు. ధర్మకర్త దామోదరరావు ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

PUBLIC NOTICE

Under the instructions of my client **M/S SHRIRAM FINANCE LIMITED, Parvathipuram Branch, Parvathipuram Manyam District,** I issue the following notice to general public. My client intends to grant loan to **Mr. BOTU ANIL KUMAR** S/o Botu Gowri Sankara Narayana by keeping the below mentioned schedule property as security by way of Registered Mortgage. As such if any one have any claims, charges, mortgages Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices. Otherwise, later objections will not bind my client in this regard.

SCHEDULES OF THE PROPERTY

ITEM NO.01: (Property covered under document No.193/2018)

Erstwhile Vizianagaram District, presently Parvathipuram Manyam District, Kurupam Mandalam, Kurupam Sub-District, Kurupam Gram panchayat and village accounts, near Pradeep Nagar colony, Sri Sankar Green City, Block No.8, nearby D. No.8-30, covered by S.No.64-2 part in which **Plot Nos. 93 & 94**, measuring East to West 30 feet and North to South 50 feet totaling 1500 SFT or 167 Sq. yards or 139.63 Sq. meters of vacant site is bounded by: **East:** Road, **South:** Plot No.2 belongs to Meenaka Parvathi, **West:** Plot nos. 103 & 104 belongs to Toyaka Ramanaya, **North:** Plot No.5 belongs to Kondagorri Narayana Rao.

ITEM NO.02: (Property covered under document No.1316/2022)

Parvathipuram Manyam District, Kurupam Mandalam, Kurupam Sub-District, Kurupam Gram panchayat and village accounts, 7th ward, Manthinivalasa area, covered by S. Nos. 27-3 & 24-2 part, in which **Plot Nos. 60 & 61** site measuring East to West 30 feet or 9.15 meters and North to South 56 feet or 17.08 meters totaling 186.66 Sq. yards or 156.79 sq. meters of vacant site is bounded by: **East:** Plot No.59 site, **South:** 19 feet width layout, **West:** Plot No.62 site, **North:** Plot Nos. 42 & 43 sites

KODURI SREENIVASA RAO
SMT. SIVA KUMARI JALADI
Advocates,
S-2, Bharat Apartments, Seethammadhara,
Visakhapatnam-13. **Mobile No.9885166648**
Visakhapatnam
Dt.18.02.2026.
Mail: sreenivaskoduri@gmail.com

(c) eenadu

తగ్గిన ప్రవాహం.. వీడని ముంపు

పోశమ్మగండి వద్ద రహదారి పక్కకు చేరిన నీరు

దేవీపట్నం, న్యూస్‌టుడే: గోదావరిలో వరద స్వల్పంగా తగ్గుముఖం పట్టినా పోశమ్మగండి ప్రాంతం ఇంకా ముంపులోనే ఉంది. గండిపోశమ్మ అమ్మవారి ఆలయం వద్ద బుధవారం మధ్యాహ్నం నుంచి స్వల్పంగా గోదావరి తగ్గుముఖం పట్టడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అమ్మవారి ఆలయంతోపాటు దుకాణాలు వరద ముంపులోనే ఉన్నాయి. వారం రోజులుగా వరద ముంపులో ఉన్న మొక్కజొన్న చేలకు నష్టం తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు. సీతపల్లి వాగుతోపాటు దండంగి వద్ద ఆర్‌అండ్‌బీ రహదారిపై నీటి ప్రవాహం కొనసాగుతోంది. పాపికొండల విహారయాత్ర కొనసాగుతోంది. వరద ముంపు నేపథ్యంలో అమ్మవారి ఆలయం వైపు భక్తులు రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని ఆలయాధికారులు తెలిపారు.

మన్యంలో ఆవరించిన పొగమంచు

శీతాకాలం చివరి దశకు వచ్చినప్పటికీ ఇంకా మంచు తెరలు వీడటంలేదు. రాజవొమ్మంగిలో బుధవారం ఉదయం 8 గంటల వరకు పొగమంచు వీడకపోవడంతో ఎదురెదురు వాహనాలు కనిపించని స్థితిలో నెమ్మదిగా ప్రయాణాలు సాగించారు. జాతీయ రహదారిపై వాహన చోదకులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. విద్యార్థులు, ఉపాధి వేతనదారులు, ప్రయాణికులు, చిన్నారులు అవస్థలు పడ్డారు. ఉదయం చలి, మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. - న్యూస్‌టుడే, రాజవొమ్మంగి

గోదావరి వరదలపై ఇస్రో శాస్త్రవేత్తల అధ్యయనం

బొబ్బర్లంక, తోకలంక ప్రాంతాల్లో పర్యటన

రావులపాలెం పట్టణం, ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఏటా గోదావరి వరదల సమయంలో ప్రజలు, పశువులు, ఆస్తులకు సంభవిస్తున్న నష్ట ప్రభావాన్ని తగ్గించేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటే బాగుంటుందో అధ్యయనం చేసేందుకు శాస్త్రవేత్తలు బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక, రావులపాలెం మండలం ఊబలంక శివారు తోకలంక ప్రాంతాల్లో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) శాస్త్రవేత్తలు ఎస్.వి.శివప్రసాద్‌శర్మ, అమన్‌ప్రీత్‌సింగ్ బృందం పర్యటించింది. తహసీల్దార్లు ముక్తేశ్వరరావు, రాంబాబు ఆయా ప్రాంతాల్లో వరద వచ్చిన సమయంలో పరిస్థితిని వారికి మ్యాప్‌లు చూపించి వివరించారు. మొదటి ప్రమాద హెచ్చరిక సమయంలో ఏ ప్రాంతం వరకు వరద వస్తుంది.. రెండు, మూడు, నాలుగు హెచ్చరికలు వస్తే పరిస్థితి ఏమిటి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. వరదల సమయంలో ఆస్తినష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేయనున్నారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలు

కట్టెల పొయ్యిలే దిక్కు!

పొగచూరుతున్న గదులు
ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల ఇక్కట్లు

న్యూస్‌టుడే - చింతూరు

చిన్నారులుండే అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్యాస్, ఇండక్షన్ పొయ్యిలు వినియోగిస్తున్నా.. మన్యంలోని ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో మాత్రం ఇంకా కట్టెల పొయ్యిలే వినియోగంలో ఉన్నాయి. పలుచోట్ల పొయ్యిలు ఇచ్చినప్పటికీ గ్యాస్ సరఫరా లేకపోవడంతో అవి మూలకు చేరాయి. విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నా.. ఏళ్లతరబడి ఆశ్రమ పాఠశాలల్లో కల్పించాల్సిన వసతులపై దృష్టి సారించడం లేదు. మన్యంలో తేలికగా దొరికే కట్టెలతోనే వంటలు చేయొచ్చన్న భావనతో ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. వర్షాకాలంలో మాత్రం కట్టెలతో వంట చేయడం ఇబ్బందికరంగా మారుతోంది. ఆశ్రమ పాఠశాలల్లో వంట షెడ్లు లేకపోవడంతో ఇక్కట్లు తప్పడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో గ్యాస్ ఏజెన్సీలు లేవంటూ సాకులు చూపిస్తూ నిర్లక్ష్యం వహిస్తున్నారు.

కట్టెలపై వంట చేస్తున్న సిబ్బంది

జిల్లాలో ఇలా..	
ఆశ్రమ పాఠశాలలు	79
విద్యార్థులు	16,238
వసతి గృహాలు	15
విద్యార్థులు	1,281

పొగచూరుతున్న గదులు

కొన్ని ఆశ్రమ పాఠశాలలకు ప్రత్యేకంగా వంట గదులు లేకపోవడంతో డార్మిటరీ, వసతి భవనాల పక్కన వంటలు చేస్తున్నారు. పొగతో విద్యార్థులు ఉక్కిరిబిక్కిరి కావడమేగాక గదులు పొగచూరిపోతున్నాయి. నరసింహపురం బాలికల ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులుంటే గదుల పక్కనే వంట చేస్తుండటంతో ఆ గదుల నుంచి విద్యార్థులను ఖాళీ చేయించారు. పొగతో గదులన్నీ నల్లగా తయారయ్యాయి. అడవుల నుంచి చెట్ల మొద్దులను సరఫరా చేస్తున్నారు. వాటిని కొట్టి వంటచెరకుగా వినియోగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. పర్యావరణ సమతుల్యం కాపాడాలని, అడవులను నాశనం చెయొద్దని ప్రభుత్వం చెబుతున్నా వంట కోసం కట్టెలు సేకరిస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం..

జిల్లాలో 90 ఆశ్రమ పాఠశాలల్లో గ్యాస్ ఏర్పాటు కోసం గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఆమోదం లభించిన వెంటనే ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతాం. - రుక్మాంగదయ్య ఉప సంచాలకుడు, గిరిజన సంక్షేమ శాఖ, రంపచోడవరం

కోర్టుకు బాంబు బెదిరింపులు

● రాజమహేంద్రవరంలో ముమ్మర తనిఖీలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలోని జిల్లా కోర్టుకు బుధవారం బాంబు బెదిరింపులు రావడంతో అంతా ఉలిక్కిపడ్డారు. కోర్టు అధికారిక ఈ-మెయిల్‌కు బెదిరింపులతో కూడిన మెయిల్ రావడంతో అధికారులు పోలీసులకు సమాచారమిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ పర్యవేక్షణలో వెంటనే డాగ్, బాంబు స్క్వాడ్ బృందాలు రంగంలోకి దిగాయి. కోర్టులో న్యాయవాదులు, కక్షిదారులను బయటికి పంపించి సాయంత్రం వరకు ముమ్మర తనిఖీలు చేపట్టారు. బాంబుకు సంబంధించి ఎలాంటి ఆనవాళ్లు కనిపించకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఇది ఆకతాయిల పనిగా పోలీసులు భావిస్తున్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు.

డాగ్ స్క్వాడ్ తనిఖీ

అర్హులైన నిర్వాసితులకు పరిహారం

పోలవరం ప్రాజెక్టు ఏవో అభిషేక్

చింతూరు, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టుతో నిర్వాసితులవుతున్న వారిలో అర్హులను గుర్తించి అందరికీ పరిహారం అందిస్తామని ప్రాజెక్టు పరిపాలన అధికారి అభిషేక్ వెల్లడించారు. బుధవారం చింతూరు ఐటీడీఏలో పోలవరం అధికారులతోపాటు నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సర్వేల ఆధారంగా నిర్వాసిత గ్రామాల్లో 14 వేల మంది ఉండగా, ఇప్పటి వరకు 1000 మంది అర్హులను గుర్తించి ప్రభుత్వ అనుమతి తీసుకున్నామన్నారు. 4000 మందితో రెండో జాబితా ప్రకటిస్తామని తెలిపారు. ఎలాంటి కారణాలు లేకుండా జాబితా నుంచి ఎవరినీ తొలగించరాదని అధికారులను ఆదేశించారు. గిరిజనులకు భూమికి భూమి ఇచ్చేందుకు కుకునూరు, వెలేరుపాడు మండలాల్లో సుమారు రెండు వందల ఎకరాలను కొనుగోలు చేసే ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. గిరిజనేతరులకు ఏలూరు జిల్లా తాడ్వాయిలో కాలనీల నిర్మాణం చేపట్టామని, అక్కడికి వెళ్లడానికి 2,856 మంది సుముఖంగా ఉన్నారన్నారు. ప్రస్తుతం 1,065 ప్లాట్లను సిద్ధం చేశామని తెలిపారు. గిరిజనుల కోసం రంపచోడవరం ప్రాంతంలో భూసేకరణ చేస్తున్నట్లు తెలిపారు. నిర్వాసితులకు నవంబరు నుంచి ఇప్పటివరకు సుమారు రూ.1,100 కోట్ల పరిహారాన్ని ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శుభం నొఖ్వాల్, పోలవరం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

కూనవరంలో సమావేశానికి హాజరైన నిర్వాసితులు

నిర్వాసితుల సమ్మతి మేరకే..

కూనవరం: పోలవరం నిర్వాసితుల సమ్మతి మేరకే పునరావాసం ఉంటుందని ఏవో అభిషేక్ అన్నారు. కూనవరంలో బుధవారం రాత్రి నిర్వహించిన నిర్వాసితుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చి నాటికి మండలంలోని తొమ్మిది గ్రామాల నిర్వాసితులను పునరావాస కేంద్రాలకు తరలిస్తామన్నారు. పునరావాస కేంద్రం తాడ్వాయిలో యువత జీవనోపాధికి ఓ కంపెనీ సిద్ధమవుతోందని, మరొకటి ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. జాబితాలో పేర్లు రాకపోవడానికి కారణాలు, వాటిని తిరిగి చేర్చడానికి ఉన్న అవకాశాలను వివరించారు. వచ్చే పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును ప్రారంభించనున్న నేపథ్యంలో పునరావాస ప్రక్రియ వేగంగా సాగుతోందన్నారు. చింతూరు ఐటీడీఏ పీవో శుభంనొఖ్వాల్, తహసీల్దార్ ధర్మేంద్ర, ఎంపీడీవో, ఎస్‌డీసీలు పాల్గొన్నారు. ఏవో అభిషేక్, పీవో నొఖ్వాల్‌ను తెదేపా మండల అధ్యక్షుడు ఎడవల్లి భాస్కర్‌రావు, ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు సన్మానించారు.

చింతూరులో మాట్లాడుతున్న ప్రాజెక్టు ఏవో అభిషేక్, పీవో నొఖ్వాల్

మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి నిధులు

✦ బడ్జెట్‌లో రూ.22 కోట్ల కేటాయింపు ✦ ఊపందుకోనున్న పనులు

న్యూస్‌టుడే - రంపచోడవరం

పోలవరం జిల్లా ప్రధాన కేంద్రం రంపచోడవరంలో నిర్మిస్తున్న 'మల్టీ స్పెషాలిటీ' ఆసుపత్రికి బడ్జెట్‌లో రూ.22 కోట్లు కేటాయించారు. జిల్లాలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు గత ప్రభుత్వం రూ.49 కోట్లతో 'మల్టీ స్పెషాలిటీ' ఆసుపత్రిని మంజూరు చేసింది. స్థానిక ఏరియా ఆసుపత్రి సమీపంలోని 4.48 ఎకరాల విస్తీర్ణంలో రెండు అంతస్తుల భవన నిర్మాణం ప్రారంభించారు. 22 నెలల్లో నిర్మాణం పూర్తిచేయాలని నిర్దేశించినప్పటికీ నిధుల మంజూరులో జాప్యం కారణంగా పూర్తి కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు కేటాయించడంతో పనులు ప్రారంభించి 80 శాతం పూర్తి చేశారు. ప్రభుత్వం ఇటీవల శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈ ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేసేందుకు అదనంగా రూ.22 కోట్లు కేటాయించడంతో మిగిలిన పనులు ఊపందుకోనున్నాయి.

నిర్మాణంలో ఉన్న ఆసుపత్రి భవనం

అందుబాటులోకి వస్తే..

ఏజెన్సీ ప్రాంత నలుమూలల నుంచి స్థానిక ఏరియా ఆసుపత్రికి నిత్యం వందల సంఖ్యలో రోగులు వచ్చి వెళ్తుంటారు. పరిస్థితి విషమిస్తే మెరుగైన వైద్యం కోసం కాకినాడ, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు. దూరం కావడంతో కొంత మంది ఆయా ఆసుపత్రులకు వెళ్లేలోపే మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు. స్థానికంగానే మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందే అవకాశం ఉంది.

146 పడకలు.. 50 మంది వైద్యులు..

మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో 146 పడకలు ఏర్పాటు చేస్తారు. సుమారు 50 మంది వైద్య నిపుణులు ఉంటారు. ఆర్థోపెడిక్, న్యూరో, కార్డియాలజీ, క్యాన్సర్, ఈఎన్‌టీ తదితర వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. ఎక్స్‌రే, స్కానింగ్, రక్తపరీక్షల విభాగాలకు సంబంధించి ప్రత్యేకంగా ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తారు.

పీజీఆర్‌ఎస్ నోడల్ అధికారిగా శ్రీనివాసవిశ్వనాథ్

రంపచోడవరం: పోలవరం జిల్లా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) నోడల్ అధికారిగా డ్వామా ఏపీడీ తూతిక శ్రీనివాసవిశ్వనాథ్‌ను జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ నియమించారు. విశ్వనాథ్ మాట్లాడుతూ జిల్లాలో పీజీఆర్‌ఎస్ ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్ ఆదేశాల మేరకు ఇప్పటికే పది మంది సిబ్బందితో పీజీఆర్‌ఎస్ ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

విధులు ఒకచోట.. హాజరు మరోచోట!

సచివాలయ సిబ్బందికి నోటీసులు

చింతూరు, న్యూస్‌టుడే: విలీన మండలాల్లోని సచివాలయాలకు చెందిన సుమారు యాభై మంది సిబ్బంది చింతూరు ఐటీడీఏలోని పోలవరం కార్యాలయంలో నిర్వాసితుల పనులకు సంబంధించిన విధులు నిర్వర్తిస్తున్నారు. వాస్తవంగా పనిచేయాల్సిన సచివాలయాల్లో హాజరు నమోదు చేయకపోవడంతో సచివాలయం కమిషనర్ షోకాజ్ నోటీలు జారీ చేశారు. పది రోజుల క్రితం వీరంతా తిరిగి సచివాలయాలకు వెళ్లిపోయారు. వారితోనే పనులు చేయించుకునేందుకు అనుమతి ఇవ్వాలని సచివాలయ కమిషనర్‌కు జిల్లా కలెక్టర్ లేఖ రాశారు. అక్కడి నుంచి సమాధానం రాకుండానే ఐటీడీఏ నుంచి అందిన ఆదేశాలతో సచివాలయం సిబ్బంది మళ్లీ అక్కడికి వెళ్లి విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రామాల్లో ఏకీకృత సర్వే పనులు నత్తనడకన సాగుతుండటంతో సంబంధిత ఎంపీడీవోలను సచివాలయం కమిషనర్ వివరణ కోరారు. ముఖఆధారిత హాజరు లేకుండా గైర్హాజరవుతున్న సిబ్బందిని గుర్తించి ఎటపాక మండలంలో సచివాలయ సిబ్బందికి బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లో లిఖితపూర్వక జవాబు ఇవ్వని పక్షంలో చర్యలు చేపడతామన్నారు. పోలవరం కార్యాయలంలో చేస్తున్న సచివాలయ సిబ్బంది ఏంచేయాలో తెలియక సతమతమవుతున్నారు.

ఏం జరిగిందంటే..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పోలవరం ప్రాజెక్టు పరిధిలో నిర్వాసితులకు పరిహారం, పునరావాసానికి సంబంధించిన పనుల నిర్వహణకు చింతూరు కేంద్రంగా ఎనిమిది కార్యాలయాను ఏర్పాటు చేసింది. సిబ్బందిని నియమించలేదు. పోలవరం పనులు వేగవంతంగా నిర్వహించాలని ప్రభుత్వం ఒత్తిడి తీసుకువస్తుండటంతో అప్పటి అధికారులు తప్పని పరిస్థితిలో విలీన మండలాల్లోని గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న కొంత మంది సిబ్బందిని వినియోగించుకుంటున్నారు. ఈ సిబ్బంది డిప్యుటేషన్ ఉత్తర్వులు లేకుండానే ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు.

ఉద్యోగులను డిప్యుటేషన్‌పై తీసుకొస్తాం

పోలవరం నిర్వాసితుల పనులు నిర్వహించేందుకు సిబ్బంది కొరత ఉంది. ఈ విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేశాం. పనుల్లో జాప్యం జరగకుండా కాకినాడ, రాజమహేంద్రవరం ప్రాంతాల నుంచి కొంత మంది రెవెన్యూ ఉద్యోగులను డిప్యుటేషన్‌పై పంపేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పోలవరం పనుల్లో జాప్యం జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. - అభిషేక్, ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్, ధవళేశ్వరం

విద్యుత్తు సేవలు ఎలా ఉన్నాయి?

☛ ఉమ్మడి జిల్లాలో ప్రజాభిప్రాయ సేకరణ
☛ సగటున 25 శాతం మేర అసంతృప్తి

ఈనాడు, అమలాపురం: ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్తు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వివిధ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం అందుతున్న సేవలపై ప్రజల సంతృప్తి స్థాయిని తెలుసుకునేందుకు ఇటీవల అభిప్రాయాలు సేకరించింది. రాష్ట్ర వ్యాప్తంగా 77.13 లక్షల మంది అభిప్రాయాలు సేకరించగా 77.7 శాతం సంతృప్తి వ్యక్తంచేయగా 22.3 శాతం మంది ప్రతికూలంగా స్పందించారు. మీకు నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా జరుగుతోందా? నాణ్యమైన విద్యుత్తు ఇస్తున్నారా? సిబ్బంది అందుబాటులో ఉన్నారా? తదితర ప్రశ్నలకు సమాధానాలు రాబట్టారు. సేవలకు సంబంధించి రాష్ట్రంలో తూర్పుగోదావరి జిల్లా ఏడో స్థానంలో ఉండగా కాకినాడ 18, కోనసీమ 21వ స్థానంలో ఉన్నాయి. ఈ రెండు జిల్లాల్లో మరింత మెరుగుపరుచుకోవాల్సి ఉందని స్పష్టం చేశారు.

కొన్ని గ్రామాల్లో ఇలా..

● కాకినాడ జిల్లా తాళ్లరేవు సెక్షన్ పరిధిలో పై మూడు రకాల సేవలపై 747 మందితో మాట్లాడగా 29.89 శాతం, తొండంగి సెక్షన్ పరిధిలో 838 మందిని సంప్రదించగా 29.71, పిఠాపురం సెక్షన్ పరిధిలో 678 మందితో మాట్లాడగా 29.53 శాతం సక్రమంగా లేవని స్పష్టం చేశారు.

● కోనసీమ జిల్లా పి.గన్నవరం సెక్షన్ పరిధిలో 781 మందికిగాను 29.40 శాతం, కాట్రేనికోన సెక్షన్ పరిధిలో 660 మందికి 29.35, అయినవిల్లి సెక్షన్‌లో 840 మంది అభిప్రాయాలు సేకరించగా 29.20 శాతం అసంతృప్తి వ్యక్తం చేశారు.

● నిడదవోలు పరిధిలోని అనంతపల్లి సెక్షన్‌లో 946 మంది అభిప్రాయాలు సేకరించగా 19 శాతం మంది అసంతృప్తి వ్యక్తంచేశారు.

ప్రజలు వెల్లడించిన అభిప్రాయాలు పరిశీలిస్తే (శాతాల్లో)

జిల్లా	నిరంతర విద్యుత్తు సరఫరా		నాణ్యమైన విద్యుత్తు		సిబ్బంది అందుబాటులో	
	ఇస్తున్నారు	లేదు	అందుతోంది	లేదు	ఉన్నారు	లేరు
తూర్పుగోదావరి	79.8	20.2	78.4	21.6	75.6	24.4
కాకినాడ	78.7	21.3	72.7	27.3	74.1	25.9
కోనసీమ	77.4	22.6	71.3	28.7	74.1	25.9

బ్యూటీషియన్ శిక్షణకు దరఖాస్తులు

మాట్లాడుతున్న జేసీ స్మరణ్‌రాజ్

రంపచోడవరం: జిల్లాలో గిరిజన మహిళలు 60 మందికి బ్యూటీషియన్ కోర్సులో 45 రోజులపాటు ఉచితంగా శిక్షణ ఇస్తామని జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్ తెలిపారు. బుధవారం స్థానిక ఐటీడీఏ వద్ద ఆయన మాట్లాడుతూ మారేడుమిల్లి యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఉచిత శిక్షణతోపాటు వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. జిల్లాలో గిరిజన యువతులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన యువతులు ఈ నెల 21వ తేదీలోగా ఐటీడీఏలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. వివరాలకు 75690 98197, 94408 44871 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

తెప్పోత్సవం.. పులకించిన భక్తజనం

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరి సమేత ఉమా కుక్కుటేశ్వరస్వామి వార్ల కల్యాణోత్సవాలు ముగిశాయి. బుధవారం రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో పుష్కరిణిలో నిర్వహించిన తెప్పోత్సవం కనుల పండువగా సాగింది. తిలకించిన భక్తజనం పులకించిపోయారు. అర్చకులు కోట వీర వెంకట సత్యనారాయణమూర్తి, దత్తాత్రేయ శర్మ, కైతేపల్లి రాజ్‌కుమార్ శర్మ, కుక్కుటేశ్వర శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

ఉడకని అల్పాహారం పెడుతున్నారు

రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌కు విద్యార్థుల ఫిర్యాదు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: ఆహార పదార్థాల్లో నాణ్యత ఉండడం లేదని, ఉడకని అల్పాహారం, భోజనం పెడుతున్నారని, కోడిమాంసం కూర తక్కువగా వడ్డిస్తున్నారని మారేడుమిల్లి బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డికి ఫిర్యాదు చేశారు. బుధవారం ఆయన మారేడుమిల్లి, బోదులూరులోని గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత మారేడుమిల్లిలో పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడగా మెనూ ప్రకారం పాఠశాలకు సుమారు 45 కిలోల చికెన్ అవసరంకాగా, కేవలం 18 కిలోలే తెస్తున్నారని వాపోయారు. తాగునీటి ప్లాంటు పనిచేయడం లేదని తెలిపారు. ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన విద్యార్థులకు శుచి, రుచికర ఆహారం అందించకుంటే సిబ్బందిపై కఠినచర్యలు తప్పవని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ కచ్చితంగా అమలు చేయాల్సిందేనని బొజ్జిరెడ్డి హెచ్చరించారు. పాఠశాలలో వండుతున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. పాఠశాలకు సక్రమంగా డ్రెయినేజీ సదుపాయం లేకపోవడం, 380 మంది విద్యార్థులున్నా మరుగుదొడ్లు, నీటి సరఫరా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి నుంచే గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్‌శాఖ ఈఈ, డీడీలతో ఫోన్‌లో మాట్లాడి తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బియ్యం, ఇతర సరకుల నాణ్యత, నిల్వలను పరిశీలించారు. బోదులూరు పాఠశాలలోనూ తనిఖీలు నిర్వహించారు.

మారేడుమిల్లి బాలుర ఆశ్రమ పాఠశాలలో డ్రెయినేజీని పరిశీలిస్తున్న ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బొజ్జిరెడ్డి

చదువుతోనే ఉన్నత భవిష్యత్తు

బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకుంటే భవిష్యత్తు మెరుగుపడుతుందని బొజ్జిరెడ్డి విద్యార్థులకు ఉద్బోధించారు. ఆశ్రమ పాఠశాలల విద్యార్థులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఉపాధ్యాయులు పాఠాలు ఎలా బోధిస్తున్నారని, అర్థం అవుతున్నాయా అని ఆరా తీశారు. ప్రతిఒక్కరు విధిగా లక్ష్యాలను నిర్దేశించుకుని కఠోరంగా కృషి చేయాలని కోరారు. త్వరలో జరుగనున్న పదో తరగతి పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. సీఐ గోపీనరేంద్రప్రసాద్, ప్రధానోపాధ్యాయులు విశ్వారెడ్డి, అరుణకుమారి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మన్యం ఎర్రమట్టిపై మాఫియా కన్ను?

న్యూస్‌టుడే - దేవీపట్నం

మన్యంలో ఎర్రమట్టిపై మాఫియా కన్ను పడింది. మైదాన ప్రాంతాలకు రవాణా చేసేందుకు ఇబ్బందిలేని సమీప గిరిజన ప్రాంతంలో ఎర్రమట్టి ఉన్న భూములను సేకరిస్తున్నారు. అమాయక గిరిజనులకు మాయమటలు చెప్పి మట్టి తీయడానికి తక్కువ లీజుకే భూములను తీసుకుంటున్నారు. ఆ భూముల్లో ఉన్న ఎర్రమట్టిని తూర్పుగోదావరి జిల్లా కడియం, పరిసర ప్రాంతాల్లో నర్సరీలకు తరలించడానికి కొందరు దళారులు ఇప్పటికే ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. ఫజుల్లాబాద్, భీంపల్లి పరిసర ప్రాంతాల్లో వేల రూపాయలు ఖరీదు చేసే ఎర్రమట్టిని మైదాన ప్రాంతాలకు తరలించడానికి వారం రోజులుగా మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. గిరిజనుల నుంచి తీసుకుంటున్న భూములను చదును చేసే పేరుతో మట్టి తవ్వకాలు చేసి రాత్రికి రాత్రే భారీ వాహనాల్లో గట్టు చప్పుడు కాకుండా మట్టిని తరలించేస్తుంటారు.

నర్సరీల్లో మొక్కలకు ఉపయోగించే ఎర్రమట్టి

నర్సరీల్లో మొక్కల పెంపకానికి..

మన్యంలో దొరికే ఎర్రమట్టిని నర్సరీల్లో మొక్కలు పెంచడానికి వినియోగిస్తుంటారు. ఒకలారీలో మట్టికి దాదాపు రూ.20 వేల వరకూ ధర పలుకుతుంది. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలంలో అక్రమ ఎర్రమట్టి క్వారీలను గనుల శాఖ అధికారులు నిలిపివేయడంతో దళారుల కన్ను మన్యంపై పడింది. దీనిపై దేవీపట్నం తహసీల్దార్ కె.సత్యనారాయణను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా మన్యంలో మట్టి తవ్వకాలకు ఏవిధమైన అనుమతులు లేవన్నారు. ఇప్పటికే తమ దృష్టికి వచ్చినచోట్ల సిబ్బందితో నిఘా ఏర్పాటు చేశామన్నారు. మట్టి తవ్వకాలు నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

థైరాయిడ్ సమస్యతో బాధ పడుతున్నారా?

అధునాతన రోబోటిక్ సర్జరీతో మీ థైరాయిడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం
ప్రయోజనాలు: తక్కువ నొప్పి | తక్కువ రక్తస్రావం | త్వరితంగా కోలుకోవడం
APEX HOSPITALS
ప్రకాష్ నగర్, రాజమండ్రి
Dr. Nitin Rimmalapudi, M.S. Robotic Surgeon
అపాయింట్‌మెంట్ కొరకు సంప్రదించండి
93 922 922 00

(c) eenadu

బుడతడు.. 35 దేశాల పేర్లు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటకు చెందిన కాసు నాగేంద్ర, గాయత్రి దంపతుల కుమారుడు ఖియాన్ష్ వెంకటరుషికి రెండున్నరేళ్లు. ఈ బుడతడు ఒకటి కాదు.. రెండుకాదు ఏకంగా 35 దేశాల పేర్లు అనర్గళంగా చెప్పేస్తున్నాడు. ఇండియా, పాకిస్థాన్, థాయ్‌లాండ్.. ఇలా మొదలుపెట్టి ఆయా దేశాల పేర్లను జెండాల చిత్రాల ఆధారంగా గుర్తించి చెప్పడంపై అంతా ఆశ్చర్యపోతున్నారు. వివిధ శ్లోకాలు, పద్యాలు సైతం వల్లెవేస్తున్నాడు. పూజ గదిలో తల్లి జపించే శ్లోకాలు, మంత్రాలను విని అదేవిధంగా చెబుతుండటం గమనార్హం. – న్యూస్‌టుడే, అంబాజీపేట

హెవీ డ్రైవింగ్‌లో శిక్షణతో ఉపాధి

అమలాపురం గ్రామీణం: ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ శిక్షణతో ఎంతో మందికి ఉపాధి లభిస్తోందని డీపీటీవో శ్రీనివాసరావు అన్నారు. అమలాపురం ఆర్టీసీ డిపోలో హెవీ డ్రైవింగ్ శిక్షణలో 12వ బ్యాచ్ పూర్తి చేసుకున్న 16 అభ్యర్థులకు బుధవారం ధ్రువ పత్రాలు అందజేశారు. రహదారి భద్రతా నియమాలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణాలు సాగించాలని శ్రీనివాసరావు సూచించారు. త్వరలోనే 13వ బ్యాచ్ శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. డిపో మేనేజర్ డి.ఎల్.ఎన్.శర్మ, రామచంద్రపురం డిపో మేనేజర్ పి.భాస్కరరావు, అసిస్టెంట్ ఇంజనీర్ జి.ఆర్.ఎల్.దేవి, అసిస్టెంట్ మేనేజర్ ప్రతిమాకుమారి, ఓవీఆర్ఎస్ ఇన్‌ఛార్జి ఎస్.వరహాలబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎవరెస్ట్ బేస్ క్యాంపునకు విద్యార్థుల ఎంపిక

భరద్వాజ రూపసాయిశ్రీ

సర్పవరం: కాకినాడ జిల్లా నుంచి ప్రత్యేక అవసరాలు కేటగిరికి చెందిన దివ్యాంగ విద్యార్థులు రెడ్డి భరద్వాజ, పితాని రూపసాయిశ్రీ ఎవరెస్ట్ శిఖరం అధిరోహించడానికి శిక్షణ కోసం ఎంపికయ్యారని కాకినాడ సమగ్రశిక్ష కోఆర్డినేటర్ పి.గిరిప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ గ్రామీణం వలసపాకల భవిత కేంద్రంలో శిక్షణ పొందుతున్న రెడ్డి భరద్వాజ ప్రస్తుతం కాకినాడ గ్రామీణం తిమ్మాపురంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి, రూపసాయిశ్రీ కాజులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. వీరికి కోచ్‌గా కాకినాడకు చెందిన ఎంజే ప్రకాష్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. రాష్ట్రం నుంచి 25 మంది ఎంపిక కాగా ఈనెల 23 నుంచి మార్చి 6వ తేదీ వరకు లద్దాఖ్‌లో శిక్షణ ఇచ్చి అనంతరం ఎవరెస్ట్ ఎక్కించడానికి సిద్ధం చేస్తారు.

పరమాత్ముడు ఒక్కడే: చాగంటి

చాగంటిని సన్మానించిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దంపతులు

కోరుకొండ, న్యూస్‌టుడే: పరమాత్ముడు ఒక్కడే, రూపాలు వేరని ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని జంబూపట్నంలో బుధవారం రాత్రి ప్రవచనాలు నిర్వహించారు. శ్రోతలకు ఆధ్యాత్మికత, శివతత్వం బోధించారు. అనంతరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దంపతులు చాగంటిని సన్మానించారు. కార్యక్రమంలో శ్రీరంగం స్థానాచార్యులు ఎస్పీ లక్ష్మీనృసింహభట్టర్‌స్వామి, విశ్వ హిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు, వైకాపా నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మార్చి 19న జాతీయ స్థాయి నాటిక పోటీలు ప్రారంభం

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: అంతరించిపోతున్న కళలను ప్రోత్సహించడానికి జాతీయస్థాయి నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సీఆర్సీ సేవా సంస్థ అధ్యక్షుడు తాడి నాగమోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి వీరాఘవరెడ్డి తెలిపారు. రావులపాలెం సీఆర్సీ సేవా సంస్థలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఉగాది సందర్భంగా మూడు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. 19న హైదరాబాద్, కాకినాడ ప్రాంతాలకు చెందిన కళాకారులతో అమ్మచెక్కిన బొమ్మ, కన్నీటికి విలువెంత, 20న గుంటూరు, విశాఖపట్నానికి చెందిన సహాన, చిటికెన వేలు, అసత్యం, 21న కాకినాడ, విశాఖపట్నం వారితో ఆచమనం, దొందూ దొందే నాటికలు ప్రదర్శిస్తారన్నారు. మొదటి బహుమతి రూ.లక్ష, రెండవ బహుమతి రూ.75 వేలు, మూడవ బహుమతి రూ.50 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు.

భవిష్యత్తు డిజిటల్ ఆవిష్కరణలదే: మెహర్ రమేష్

మాట్లాడుతున్న సినీ దర్శకుడు మెహర్ రమేష్

దేవీచౌక్: వినోదం, డిజిటల్ మీడియా రంగాల్లో సాంకేతికంగా విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని సినీ దర్శకుడు మెహర్ రమేష్ అన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, ఎక్స్‌టెండెడ్ రియాల్టీ(ఏవీజీసీ-ఎక్స్ఆర్) సమ్మిట్ 2026 పేరుతో రెండురోజుల బూట్ క్యాంప్ బుధవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మెహర్ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు తమ సృజనాత్మకతకు సాంకేతిక నైపుణ్యాలను జోడించి అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. భవిష్యత్తు అంతా డిజిటల్ ఆవిష్కరణలదేనని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్కే మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు యువత భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు దోహదపడతాయన్నారు. ఏఐ శిక్షకుడు అరవింద్ చిత్ర నిర్మాణంలో ఆధునిక ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సాధనాల వినియోగాన్ని విద్యార్థులకు వివరించారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ సహకారంతో నిర్వహించిన కళాశాల ఇన్నోవేషన్ హబ్ సమన్వయకర్త డాక్టర్ బేబి నిర్మల, డాక్టర్ దుర్గాలక్ష్మి, మేఘన, బాలబాలాజీ రుద్ర పాల్గొన్నారు.

పింఛనర్లూ.. పత్రం సమర్పించండి

పెద్దాపురం: రాష్ట్ర ప్రభుత్వ సర్వీస్, ఫ్యామిలీ పింఛన్‌దారులు తమ జీవన ప్రమాణ పత్రాలు(లైఫ్ సర్టిఫికెట్లు) సమర్పించేందుకు గడువు దగ్గర పడుతుంది. ఈనెల 28వ తేదీవరకు జీవన ప్రమాణ పోర్టల్‌లో లేదా ఖజానా శాఖ కార్యాలయాల్లో సమర్పించాల్సి ఉంటుంది. గతేడాది నవంబరు, డిసెంబరు నెలల్లో సమర్పించినవి చెల్లుబాటు కావు. తాజాగా ఇవ్వకుంటే ఏప్రిల్ 1న ఇచ్చే మార్చి నెల పింఛన్ నిలిపివేస్తారు. పెన్షన్‌దారులు తమ పత్రాలు సమర్పించేందుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పెద్దాపురం, తుని, జగ్గంపేట, ప్రత్తిపాడు, కాకినాడ, పిఠాపురం, రాజమహేంద్రవరం, కోరుకొండ, అనపర్తి, అమలాపురం, కొత్తపేట, రాజోలు, రామచంద్రపురంలోని ఆయా ఉప ఖజానా కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. అనారోగ్యంతో నడవలేని పింఛనుదారులు తమ దృష్టికి తీసుకొస్తే ఖజానా శాఖ సిబ్బందిని ఇంటివద్దకు పంపిస్తారని జిల్లా ఖజానాశాఖ అధికారి గణేష్ తెలిపారు.

జిల్లా	పత్రాలు సమర్పించినవి	ఇంకా ఇవ్వాల్సినవి
కోనసీమ	5,600	1,400
కాకినాడ	15,993	3,185
తూర్పుగోదావరి	9,246	1,506

సీ-కేవైసీతో బహుళ ప్రయోజనాలు

మీ కోసం

న్యూస్‌టుడే – తుని

బ్యాంకు ఖాతాదారుల కోసం రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మరో కొత్త విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. కేవైసీ చేయించక, ఖాతాలను వినియోగించకపోవడంతో ఆయా బ్యాంకుల్లో ఖాతాదారులకు రోజూ పలు రకాల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిపై దృష్టిసారించిన ఆర్బీఐ కొత్తగా 14 అంకెల సీ-కేవైసీ ఐడీని జారీ చేస్తుంది. ఇది సులువైన, సురక్షితమైనదని బ్యాంకు అధికారులు పేర్కొంటున్నారు.

ఉపయోగాలివీ..

బ్యాంకుల్లో ఖాతాలు సులువుగా తెరవచ్చు. కేవైసీ అప్‌డేషన్ ఖాతాలు ఉన్న మిగిలిన బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లోను ఆటోమేటిక్‌గా అప్‌డేట్ అవుతాయి. బ్యాంకులో కేవైసీ వివరాలు నమోదు అంటే సదరు ఖాతాదారుడి ఆధార్, ఫోన్, పాన్ నంబర్లు, చిరునామా, ఈమెయిల్ ఐడీని తీసుకుంటారు. తాజా సీ-కేవైసీ విధానంలోనూ ఈ వివరాలే ఉన్నా, సెంట్రల్ కేవైసీ రికార్డుల్లో ఎప్పటికప్పుడు రిజిస్ట్రీ చేయడంతో కొత్త ఐడీ నెంబరు వస్తుంది. భవిష్యత్తులో దీని ఉపయోగం ఎంతో ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

ఐడీ ఎలా పని చేస్తుందంటే..

ఖాతాదారుడు బ్యాంకుకు వెళ్లి కేవైసీ వివరాలు సమర్పించాలి. అనంతరం ఆ వివరాలు సెంట్రల్ కేవైసీ రికార్డుల్లో రిజిస్ట్రీలో అప్‌లోడ్ చేస్తారు. తర్వాత ఆటోమేటిక్‌గా 14 అంకెల సీ-కేవైసీ నంబరు జనరేట్ అవుతుంది. ఈ ఐడీని అన్ని బ్యాంకులు, ఆర్థిక సంస్థల లావాదేవీల్లో వాడొచ్చు.

స్మార్ట్‌మీటర్లతో విద్యుత్తు బిల్లుల భారం తగ్గించుకోవచ్చు

దేవీచౌక్, న్యూస్‌టుడే: పీక్ టైంలో విద్యుత్తు వాడకం వల్ల యూనిట్‌కు ధర ఎక్కువ పడుతుందని ఏపీఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజరు ఎస్.రాజబాబు తెలిపారు. ఉదయం 6 నుంచి 10 సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల మధ్య పీక్ సమయాల్లో స్మార్ట్ మీటర్ వాడకం ద్వారా పీక్ నుంచి ఆఫ్ పీక్, సాధారణ సమయాలకు మార్చడం ద్వారా వినియోగదారులు తమ బిల్లులను గణనీయంగా తగ్గించుకోవచ్చున్నారు. ఎనర్జీ కాస్ట్ సేవింగ్స్, డిమాండ్ రెస్పాన్స్‌పై ఐఐటీ మద్రాస్ అంకుర సంస్థ ఎలిమెంట్స్ ఎనర్జీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం సర్కిల్ కార్యాలయంలో వాణిజ్య, పరిశ్రమల వినియోగదారులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీజీఎం మాట్లాడుతూ వినియోగదారుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ కార్యక్రమం ద్వారా విద్యుత్తు వినియోగాన్ని నిర్ణీత సమయానికి అనుగుణంగా నియంత్రించే అవకాశం ఉంటుందన్నారు. ఎలిమెంట్స్ ఎనర్జీ వ్యవస్థాపకుడు అన్షుల్ సాండో వినియోగదారులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ రియల్ టైం వాడకం తెలిసేలా వెబ్‌సైట్ లాగిన్ ఇస్తూనే చరవాణి ద్వారా సలహాలు సూచనలు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్తు శాఖ అధికారులు, వాణిజ్య, పరిశ్రమల వినియోగదారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏపీఈపీడీసీఎల్ సీజీఎం రాజబాబు. చిత్రంలో ఎస్ఈ తిలక్‌కుమార్ తదితరులు

గింజలు కొనుగోలు చేస్తేనే రైతుకు మనుగడ

• తక్కువ ధర కల్పించడంతో కోకో పంట సాగుదారుల ఆవేదన

– న్యూస్‌టుడే, అంబాజీపేట

కోనసీమలోని కోకోపంట

డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కోకోపంటను సాగు చేస్తున్న కర్షకుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. అంతర్జాతీయ మార్కెట్లో కోకో గింజలకు మంచి డిమాండు ఉన్నప్పటికీ తమ నుంచి కొనుగోలు సంస్థలు గింజలను కొనుగోలు చేయటంలేదని వారు ఆరోపిస్తున్నారు. ధర విషయంలో ఉద్యోగులను రైతులు ప్రశ్నిస్తే నాణ్యమైన గింజలు ఉత్పత్తి చేయటంలేదని చెప్తున్నారని వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 2,405 ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు. ప్రతి ఏటా వెయ్యి ఎకరాలను అదనంగా సాగు చేసేలా ఇప్పటికే ప్రణాళిక తయారు చేయించారు. 400 మంది రైతులు ఈ సాగుపై ఆధారపడ్డారు.

నాణ్యత లేవంటున్నారు..



గింజల కొనుగోలు చేసే సంస్థల ప్రతినిధులు కుంటిసాకులతో రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో కోకో గింజలు రూ.450 పలుకుతున్నాయి. కానీ సంస్థల ప్రతినిధులు రూ.330కే కొనుగోలు చేస్తున్నారు. కారణం అడిగితే గింజలు నాణ్యత లేవంటున్నారు. కోకో రైతులకు న్యాయం చేయాలి.
- అయ్యగారి శ్రీనివాసరావు, కోకోరైతు, వ్యాఘ్రేశ్వరం

ఈ సమస్య రాలేదు

గతంలో ధర విషయంలో సంస్థ ప్రతినిధులకు, రైతులకు ఎలాంటి సమస్య తలెత్తలేదు. గింజల నాణ్యత అంశం కూడా రాలేదు. ఇప్పుడు నాణ్యత విషయం చెప్పటంతో ఆశ్చర్యంగా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో కోకో గింజల ధర పతనమైతే.. వెంటనే ఆ మార్కెట్‌కు అనుగుణంగా రైతుల నుంచి కొనుగోలు చేస్తామని ఆ సంస్థలు చెప్పటం విడ్డూరంగా ఉంది.
- కొప్పిశెట్టి ఆనంద వెంకట ప్రసాద్, ఏపీ కోకోరైతు సంఘం సహాయకార్యదర్శి

సాంకేతికతతో నేరాల నియంత్రణ

మండపేట, అంగర పోలీస్ స్టేషన్లలో ఎస్పీ తనిఖీలు

మండపేట, అంగర, న్యూస్‌టుడే: జిల్లాలో నేరాల నియంత్రణకు పూర్తిస్థాయిలో సాంకేతిక విధానాన్ని అమలు చేస్తున్నామని ఎస్పీ డి.నరసింహ కిషోర్ తెలిపారు. బుధవారం ఆయన మండపేట నియోజకవర్గంలోని పోలీస్‌స్టేషన్లు తనిఖీ చేశారు. జిల్లాలో 5000 సర్వేలెన్స్ కెమెరాలు ఉన్నాయని, వీటి ద్వారా నేరస్థులను గుర్తించేందుకు అవకాశం ఉందన్నారు. సుమారు 20 డ్రోన్‌లతో నిఘా కొనసాగుతోందని, ప్రతి పోలీస్‌స్టేషన్‌కి ఒక డ్రోన్ కేటాయించి తోటల్లో జూదాలు, కళాశాలల్లో ర్యాగింగ్ నియంత్రణ, ఇతరత్రా నేరాల అదుపునకు ఉపయోగిస్తామన్నారు. బాలికలు, మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మండపేటలో 90 కెమెరాలు ఉన్నాయని, వీటి సంఖ్యను 150కి పెంచాలన్నారు. టిడ్కో గృహాల వద్ద ఔట్ పోస్టు ఏర్పాటుచేస్తామని, కపిలేశ్వరపురం పరిధిలోని లంక గ్రామాల్లో ఎస్సై, ముగ్గురు కానిస్టేబుళ్ల విధులు నిర్వహించేలా చూస్తామన్నారు. రంజాన్ మాసం సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిషోర్

సబ్ డివిజన్ ఏర్పాటుకు చర్యలు..

మండపేట, అనపర్తి నియోజకవర్గాలను కలిపి పోలీసు సబ్ డివిజన్ ఏర్పాటుచేసేలా కృషి చేస్తున్నట్లు ఎస్పీ వివరించారు. డీఎస్పీ వారానికి మూడు రోజులు మండపేటలో, మరో మూడు రోజులు అనపర్తిలో అందుబాటులో ఉంటారని చెప్పారు. రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి విద్యతో కలిసి మండపేట, అంగర పోలీసు స్టేషన్లలో రికార్డులు పరిశీలించారు. పట్టణ సీఐ డి.సురేష్, రూరల్ సీఐ దొరరాజు, పట్టణ ఎస్సై రాము, అంగర ఎస్సై హరీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆపదమిత్ర శిక్షణకు వివరాల నమోదు

రాయవరం, న్యూస్‌టుడే: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ఆపదమిత్ర శిక్షణ పొందడానికి ఆసక్తిగలవారు వివరాలు నమోదు చేసుకోవాలని స్కౌట్స్ అండ్ గైడ్స్ డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి పి.రాంబాబు విద్యార్థులకు సూచించారు. బుధవారం రాయవరంలోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో ఆపదమిత్ర కార్యక్రమంపై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కనీసం 18 ఏళ్ల నుంచి 45 సంవత్సరాల వయసున్న వారు శిక్షణకు అర్హులన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికి ఏడు రోజుల పాటు భూకంపాలు, వరదలు తదితర ప్రకృతి వైపరీత్యాలు, విపత్తుల సమయాల్లో ఎలా అత్యవసర సేవలందించాలో శిక్షణ ఇస్తామన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ విధి విధానాలపై అవగాహన కల్పిస్తామన్నారు. శిక్షణానంతరం ధ్రువీకరణ పత్రం, రూ.10 వేల విలువైన కిట్ అందిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు గూగుల్ లింక్ ద్వారా ఈనెల 23వ తదేఈలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. సమావేశంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి)	18,000
పాతకాయ: గండేరా	30,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	30,000
గటగట	29,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	18,000-20,000
కొత్త (పచ్చి) కాయ	15,000-17,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లలో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	147-00
డ్రెస్డ్	213-00
స్కిన్‌లెస్	243-00

92.7 FM Rajamahendravaram

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

వీఆర్వోల సమస్యల పరిష్కారానికి చర్యలు: డీఆర్వో

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీఆర్వో టి.తిప్పేనాయక్ హామీ ఇచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లో వీఆర్వో సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. గొల్లప్రోలు వీఆర్వో కామేశ్వరరావు ఆత్మహత్యాయత్నం ఘటనపై ఆయన ఆరా తీశారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని సంఘ ప్రతినిధులు వివరించారు. సమస్యలు ఉంటే నేరుగా తన వద్దకు రావాలని, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీఆర్వో చెప్పారు. గొల్లప్రోలు తహసీల్దారును కలెక్టరేట్‌కు పిలిచి మాట్లాడామని, భవిష్యత్తులో వీఆర్వోలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై ప్రత్యేక దృష్టిసారించాలని, పనిఒత్తిడి లేకుండా ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. కలెక్టరేట్ పరిపాలనాధికారి సాధనాల రామ్మోహన్, వీఆర్వో సంఘ ప్రతినిధులు కేవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

వీఆర్వో సంఘ ప్రతినిధులతో చర్చిస్తున్న డీఆర్వో తిప్పేనాయక్

పర్యాటక బోటుకు తప్పిన ముప్పు

● పంకా రెక్కలకు వల చుట్టేసి నిలిచిపోయిన వైనం

తాళ్లరేవు, న్యూస్‌టుడే: కోరింగ అభయారణ్యంలోని చొల్లంగి పర్యాటక కేంద్రం నుంచి సముద్ర మొగ వరకు పర్యాటకులు ప్రయాణించే బోటుకు ప్రమాదం తప్పింది. ముమ్మిడివరానికి చెందిన తొమ్మిది మంది న్యాయవాదులు బుధవారం బోటుపై షికారుకు వెళ్లారు. మొగ వరకు వెళ్లి తిరిగి వస్తుండగా గోదావరిలో మత్స్యకారులు చేపల వేటకు ఉపయోగించే వల బోటు కింద ఉండే పంకా రెక్కలకు చుట్టేయడంతో నీటిలో నిలిచిపోయింది. బోటు డ్రైవర్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్.ఎస్.ఆర్. వరప్రసాద్‌కు సమాచారం అందించారు. ఆయన సిబ్బందిని అప్రమత్తం చేసి రెండు స్పీడ్ బోట్లను ఆ ప్రాంతానికి పంపించారు. బోటు డ్రైవర్లు, పర్యాటకులను క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు.

21న వయోవృద్ధుల కోసం వివిధ కార్యక్రమాలు

కలెక్టరేట్: తూర్పుగోదావరి జిల్లా పరిధిలో వయోవృద్ధుల ఉత్పాదక వృద్ధాప్యం కోసం జాతీయ కార్యాచరణ ప్రణాళిక(ఎన్ఏపీఎస్ఆర్సీ), రాష్ట్ర కార్యాచరణ ప్రణాళిక(ఎస్ఏపీఎస్ఆర్సీ) పథకాల అమలులో భాగంగా వివిధ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, కార్యశాలలు(వర్క్‌షాపులు), వైద్యశిబిరాలు నిర్వహించనున్నటు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 21న స్థానిక గేదెల నూకరాజు కల్యాణ మండపంలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరోజు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు వైద్యశిబిరం, 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే క్రాఫ్ట్ తయారీ, కుండల తయారీ తదితర కార్యకలాపాలపై వర్క్‌షాపులు, పెయింటింగ్, డ్రాయింగ్, సంగీతం, పాటలు, చిన్న కథల రచన, క్యారమ్స్, వాకింగ్ వంటి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటిలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు తమ పేర్లను ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు 95501 60167, 94411 74636 ఫోన్ నంబర్లకు తెలియజేసి నమోదు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు వై.శ్రీనివాస్ తెలిపారు. ఆ రోజు కార్యక్రమాలకు హాజరయ్యే వారు తప్పని సరిగా వయసు నిర్ధారణ గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలని ఆయన తెలిపారు.

23, 24 తేదీల్లో రైతు దీక్షలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: కౌలు రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం నూతన చట్టం చేయకుండా రెండు సంవత్సరాల నుంచి దగా చేస్తుందని కౌలు రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.రాజశేఖర్ విమర్శించారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనైనా నూతన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 23, 24 తేదీల్లో కలెక్టరేట్ వద్ద నిర్వహించే రైతు దీక్షల పోస్టర్లను సుందరయ్యభవన్‌లో బుధవారం ఆవిష్కరించారు. రాజశేఖర్, జిల్లా కార్యదర్శి వళ్ల రాజబాబులు మాట్లాడుతూ కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ డబ్బులు రూ.20 వేలను రెండు దఫాలుగా వేస్తామని చెప్పి నేటికి పైసా జమచేయలేదని ఆరోపించారు.

'ఉప్పాడ' కోతపై ఉన్నతాధికారులతో సమావేశం నేడు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ దిల్లీలో కీలక సమావేశంలో పాల్గొనేందుకు బుధవారం కాకినాడ నుంచి బయలుదేరి వెళ్లారు. గురువారం కేంద్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఉన్నతాధికారులతో కాకినాడ-ఉప్పాడ మధ్య సముద్ర కోత నివారణకు ప్రతిపాదించిన ప్రాజెక్టుపై చర్చించనున్నట్లు కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. ఈ ప్రాజెక్టుకు రూ.300కోట్లకు పైగా నిధులు మంజూరు చేసే అవకాశం ఉందని పేర్కొన్నాయి. కలెక్టర్ దిల్లీలో సమావేశం ముగించుకుని విజయవాడ చేరుకుంటారు. శుక్రవారం జనగణనపై రాష్ట్రస్థాయిలో జరిగే శిక్షణా కార్యక్రమానికి హాజరవుతారు.

క్రీడాకారులతో ఎంపీ హరీష్‌మాథుర్, తదితరులు

క్రీడాభివృద్ధికి కృషి చేస్తా..

● వాలీబాల్ పోటీల్లో ఎంపీ హరీష్‌మాథుర్

ఉప్పలగుప్తం: జిల్లాలో క్రీడల అభివృద్ధికి మరింత కృషి చేస్తానని అమలాపురం ఎంపీ హరీష్‌మాథుర్ అన్నారు. గొల్లవిల్లిలో జరుగుతున్న జాతీయస్థాయి వాలీబాల్ పోటీలను ఆయన బుధవారం వీక్షించారు. ఏపీ, కేరళ జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. టోర్నీ నిర్వాహక కమిటీ అధ్యక్షుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు. కూటమి నాయకులు నల్లా శ్రీధర్, యాళ్ల దొరబాబు, కల్వకొలను తాతాజీ, ఏడిద శ్రీను, ఆర్డీస్ ప్రసాద్ తదితరులు మ్యాచ్‌లను వీక్షించారు.

ఉత్కంఠగా పోటీలు..: గొల్లవిల్లి జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో అరిగెల రంగయ్య జాతీయస్థాయి వాలీబాల్ పోటీలు నాలుగో రోజు హోరాహోరీగా సాగాయి. పురుషుల విభాగంలో జీఎస్టీ (ముంబయి) జట్టుపై 3-0 స్కోరుతో ఐఓబీ (చెన్నై) విజయం సాధించింది. అనంతరం ఆంధ్రప్రదేశ్, ఎస్ఏఐ (కేరళ) మధ్య మ్యాచ్‌లో 3-0 స్కోరుతో ఆంధ్రప్రదేశ్ విజయం సాధించింది. అనంతరం ఆంధ్రప్రదేశ్, ఇండియన్ బ్యాంక్ జట్లు, మహిళ విభాగంలో సౌత్ సెంట్రల్ రెల్వే, ఎస్ఆర్ఎం జట్లు తలపడ్డాయి. అర్ధరాత్రి వరకు పోటీలు సాగాయి.

మార్చి 8న రాజానగరంలో షర్మిల సభ

రాజానగరం: మార్చి 8న పీసీసీ అధ్యక్షురాలు వై.యస్.షర్మిల రాజానగరం రానున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, జిల్లా అధికార ప్రతినిధి డా.వై.ఎ.వడయార్ తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పేరు మార్పు, విధి విధానాలకు సంబంధించి రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తారని నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ శ్రీనివాస్, పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు టి.కె.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో రాజానగరంలో సమావేశం నిర్వహించారు. నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలేపల్లి మురళీ, జిల్లా అధికార ప్రతినిధి అడుసుమిల్లి రమేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశమైన కాంగ్రెస్ పార్టీ నాయకులు

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులో/ ప్రైవేటు సంస్థలలో తాకట్టు ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

FINANCIAL SERVICES

అన్నిరకాల లోన్స్ ★No CIBIL, CIBIL కరెక్షన్ చేయబడును. ఇళ్లు, స్థలాలు, పొలాలు, బిజినెస్ & రిటైల్ లోన్స్‌కు... ఫైనాన్స్ ... 7871885982

REAL ESTATE

LAND FOR SALE

JAGGAMPETA

రాజమండ్రి 30 కి.మీ. దూరంలో మురారి, గండేపల్లి మధ్య NH6 చెర్వు 100 అ॥ల దగ్గర ... 60 సెంటులు అమ్మబడును. (నోబ్రోకర్స్) ☏ 9032988265

KAKINADA CITY

Properties Bazar's @ Kakinada Tour Your Luck, Buy Plot & Win Plot, Free Lucky Draw with Guaranteed Prizes. Cell: 9154184236

JOBS

Wanted Marketing Executives in Rajahmundry, Kakinada Areas. Salary 18,000 to 20,000. Lakshmi Sanjani Garments. Send resume to whatsapp Cell: 95050 66887.

రాజమండ్రి కంపెనీకి అర్హులైన... Fresh/Exp., హెచ్ఆర్ మేనేజర్ Exp.(MBA), అకౌంటెంట్ ... 70328 76262.

WANTED we are Hiring Front Office Staff (Female) - 02 no's Salary - 12 k 08 Hours Duty SprintOn, JN Road Rajamahendravaram ☏ 99663 57897

దేవరపల్లి, శ్రీకృష్ణ ... 7509027999, 9696226226

కాకినాడలోని భానుగుడి జంక్షన్ నందు బట్టల షాపులో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. శాలరీ - 15,000/-/ 4 W/o. + ESI +EPFO. సెల్: 9885295999.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్/ పిల్లలను చూసుకొనుటకు ... 96404 68899, 96402 59899

రాజమండ్రిలో ప్రముఖ కన్స్ట్రక్షన్ ... ★ రిసెప్షనిస్ట్ (FEMALE) ★ ... ☏ 8099 19 19 19

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర ★ For the Information of Trade & Industry ★ తూర్పుగోదావరి జోన్ ఫ్యాక్టరీ ట్రేడ్ సరుకు ... 5-15 పై ... 08857-226908

EENADU for Advertisement Contact 8008597607

గమనిక ...

సంపద కేంద్రం తనిఖీ

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: శరభవరంలోని చెత్త నుంచి సంపద కేంద్రాన్ని బుధవారం ఎంపీడీవో యాదగిరీశ్వరరావు తనిఖీ చేశారు. తడి, పొడి, హానికర వ్యర్థాలను వేరు చేసేందుకు పంచాయతీలకు అందజేసిన రిక్షా, చెత్త బుట్టలను వినియోగించాలని సిబ్బందికి సూచించారు. కేంద్రం ద్వారా పంచాయతీలకు ఆదాయం వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేసుకొని ముందుకు వెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచి ఎల్.రాజ్యలక్ష్మి, ఎపీపీ వైస్ చైర్మన్ ఎల్.లక్ష్మణరావు పాల్గొన్నారు.

సర్పంచితో కలిసి తనిఖీ చేస్తున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

అగ్నిప్రమాదాల నియంత్రణపై అవగాహన

రంపచోడవరం, న్యూస్‌టుడే: అగ్నిప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రంపచోడవరం అగ్నిమాపక కేంద్రం ఇన్‌ఛార్జి అధికారి కృష్ణదొర పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక జీవీకే అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటిలో గ్యాస్ లీకై మంటలు వ్యాపిస్తే ఏవిధంగా నివారించాలో చూపించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, అగ్నిమాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పనుల్లో పురోగతి ఉండాలి

అడ్డతీగల, న్యూస్‌టుడే: వీబీజీ-రాజీ పనుల్లో పురోగతి ఉండేలా టెక్నికల్ అసిస్టెంట్లు కృషి చేయాలని అడ్డతీగల ఎంపీడీవో ఏవీవీ కుమార్ అన్నారు. బుధవారం ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బందితో వారాంతపు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూలీలకు 100-150 పనిదినాలు కల్పించాలని, లేబర్ బడ్జెట్ పూర్తి చేయాలన్నారు. ప్రతి పంచాయతీలో జరుగుతున్న పనులు 20కు మించి ఉండకూడదని, ప్రస్తుతం 12 గ్రామ పంచాయతీలు నివేదిక ఇచ్చినట్లు తెలిపారు. మిగిలిన పంచాయతీల్లో సిబ్బంది వెంటనే పనుల వివరాలు ఇవ్వాలని సూచించారు.

'నెల రోజుల్లో రహదారికి పూర్వ వైభవం'

చింతూరు, న్యూస్‌టుడే: ఏడుగురాళ్లపల్లి నుంచి అల్లిగూడెం వెళ్లే రహదారికి నెల రోజుల్లో పూర్వ వైభవం తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శుభం నొఖ్వాల్ ఆందోళనకారులకు తెలియజేశారు. పేగ పంచాయతీ పరిధిలో పలు గ్రామాల వాసులు బుధవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. రహదారి అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే పనులు ప్రారంభించే సమయంలో అటవీ శాఖ అభ్యంతరాలు చెప్పడంతో మూడేళ్లుగా నిర్మాణానికి నోచుకోకపోవడంతో ఏడుగురాళ్లపల్లి నుంచి అల్లిగూడెం వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్య పరిష్కారం కోసం పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు ఆందోళన చేపట్టారు. పీవో మాట్లాడుతూ అటవీశాఖ అనుమతుల మంజూరుకు కావల్సిన ప్రక్రియ చేపట్టాలని ఉన్నతాధికారులకు లేఖ పంపించామని, నెల రోజుల్లో రహదారి అభివృద్ధి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆందోళనకారులతో మాట్లాడుతున్న పీవో

మేమున్నాం.. మీకు తోడుగా

రంపచోడవరం 9490877172 | అడ్డతీగల 9491575045
ఉ 10 - మ 1 | దేవీపట్నం 7673936638 | గంగవరం 9493541083

సమస్య: మారేడుమిల్లి మండలం దేవరపల్లి ఆశ్రమ పాఠశాల వసతి గృహంలో విద్యార్థులు నిద్రించే గదులకు కనీసం మెస్‌లు కూడా లేవు, ఫలితంగా దోమలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. - కానెం విజయలక్ష్మి, మాజీ ఎంపీటీసీ, దేవరపల్లి

పరిష్కారం: పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతున్నాం. - శంభుడు, ఏటీడబ్ల్యూవో - న్యూస్‌టుడే, మారేడుమిల్లి

చెత్తను తొలగించారు

రంపచోడవరం, న్యూస్‌టుడే: స్థానికంగా ఉన్న దేశ నాయకుల విగ్రహాల పరిసర ప్రాంతాన్ని పంచాయతీ అధికారులు శుభ్రం చేయించారు. ఈనెల 15న 'అధ్వానంగా విగ్రహాల పరిసరాలు' శీర్షికతో ఈనాడులో వెలువడిన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ఆ ప్రాంతంలో ఉన్న తుప్పలను, పేరుకుపోయిన చెత్తను తొలగించారు.

పరీక్షల మధ్య విరామం.. సాధనకు అనుకూలం

విద్యార్థులకు చక్కటి అవకాశం

న్యూస్‌టుడే – రాజవొమ్మంగి

విద్యార్థి జీవితంలో పదో తరగతి పరీక్షలు ఎంతో కీలకం. ఒత్తిడికి గురికాకుండా ప్రణాళికాయుతంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించొచ్చు. పదో తరగతి వార్షిక పరీక్షలు మార్చి 16 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ ఏడాది ప్రతి పరీక్షకు కనీసం ఒకరోజు విరామం ఉండటం విద్యార్థులకు మేలు కలగనుంది. తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం సబ్జెక్టులన్నింటికీ మధ్యలో తగిన విరామం ఉండేలా షెడ్యూలు రూపొందించారు. పరీక్ష రాసిన విద్యార్థులు తదుపరి సబ్జెక్టుపై దృష్టి సారించేందుకు సమయం ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. గణితం, సైన్స్ సబ్జెక్టుల పునశ్చరణకు ఈ విరామం ఎంతో ఉపయుక్తమని అంటున్నారు. విద్యార్థులు బాగా సన్నద్ధమై మంచి మార్కులు సాధించడానికి అవకాశం ఉంది.

రాజవొమ్మంగి జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతిలో విద్యార్థులు

పరీక్షల తేదీలు.. మార్చి 16న తెలుగు, 18న హిందీ, 21న ఆంగ్లం, 23న గణితం, 25న భౌతిక శాస్త్రం, 28న జీవశాస్త్రం, 30న సాంఘికశాస్త్రం పరీక్షలు నిర్వహించనున్నారు.

జిల్లాలో పదో తరగతి విద్యార్థుల వివరాలు..
పాఠశాలలు: 105 విద్యార్థులు: 4,158 మంది

ఉత్తమ ఫలితాలు సాధించాలి

పాఠశాలల్లో వంద రోజుల శిక్షణ ప్రణాళిక పక్కాగా అమలు చేసేలా చర్యలు చేపట్టాం. విద్యార్థులు వార్షిక పరీక్షల మధ్య వచ్చిన సెలవులను సద్వినియోగం చేసుకోవాలి. పౌష్టికాహారాన్ని తీసుకుంటూ ఆరోగ్యంపై దృష్టి సారించాలి. ఒత్తిడికి గురికాకుండా ప్రణాళికాయుతంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి.

- డాక్టర్ రామకృష్ణారావు, డీఈవో, ఉమ్మడి అల్లూరి జిల్లా

కేవీకేలో సిబ్బంది కొరతపై వీసీ దృష్టికి

రంపచోడవరం, న్యూస్‌టుడే: మండలంలోని పందిరిమామిడిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో మత్స్య శాస్త్రవేత్త ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లడం వల్ల సిబ్బంది కొరత ఏర్పడిందని కేవీకే అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రాజేంద్రప్రసాద్ బుధవారం తెలిపారు. 'వ్యవసాయంలో సవరించిన కృషి' శీర్షికన బుధవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. చదువులకు వెళ్లిన వారు తిరిగి వచ్చి ఇక్కడే విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. ఇతర ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ఇప్పటికే డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె.దమయంతిరావు దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో భర్తీ చేస్తామని ఆయన చెప్పారని తెలిపారు. సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఉన్నప్పటికీ వ్యవసాయ అనుబంధ విభాగాలతో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రాజేంద్రప్రసాద్ వివరించారు.

విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ

అడ్డతీగల : విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ కనబరచాలని అడ్డతీగల ఎంఈవో శ్రీనివాసరావు అన్నారు. జాతీయ అంధత్వ నివారణ దినోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక బాలుర ఆశ్రమోన్నత ప్రాథమిక పాఠశాలలో దృష్టి లోపం కలిగిన విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. అధికారి యేసుపాదం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనందబాబు పాల్గొన్నారు.

రిటైనింగ్‌వాల్ పనులకు భూమి పూజ

కూనవరం, న్యూస్‌టుడే: ముల్లూరు ప్రధాన రహదారికి రిటైనింగ్ వాల్ లేకపోవడంతో వరదలు, వర్షాల వల్ల రోడ్డు దెబ్బతినడంతో గ్రామస్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. విషయం తెలుసుకున్న సర్పంచి వెంకమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు అమ్మాజీ తమ నిధులతో రహదారికి రిటైనింగ్ వాల్ నిర్మించడానికి నిధులు కేటాయించారు. ఈ పనులకు బుధవారం వారు భూమి పూజ చేశారు. మేకల నాగేశ్వరరావు, కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో భాజపా రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు

పోలవరం జిల్లా భాజపా అధ్యక్షుడి ఎన్నికకు నామినేషన్లు

రంపచోడవరం : పోలవరం జిల్లాలో భారతీయ జనతాపార్టీ బలోపేతానికి చర్యలు చేపడుతున్నట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా భాజపా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి తెలిపారు. రంపచోడవరం మండలం పెదగెద్దాడ శివారులోని ఓ ప్రైవేటు రిసార్ట్స్‌లో బుధవారం పోలవరం జిల్లా అధ్యక్షుడి ఎన్నికపై పార్టీ సమావేశం జరిగింది. త్రిసభ్య కమిటీ సభ్యులు, భాజపా రాష్ట్ర కార్యదర్శులు బొమ్మల దత్తు, మట్టా ప్రసాద్, గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పాంగి రాజారావు నామినేషన్ ప్రక్రియను ప్రారంభించారు. జిల్లా అధ్యక్షులుగా మాజీ ఎమ్మెల్యే కోసూరి సత్యనారాయణరెడ్డి, భాజపా రాష్ట్ర కార్యదర్శి స్వప్నకుమారి, నియోజకవర్గ మాజీ కన్వీనర్ బుల్లికొండలుదొర, గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాయం వెంకయ్య, కిసాన్ మోర్చా రాష్ట్ర మాజీ కార్యదర్శి నోముల రామారావు, రాష్ట్ర నాయకులు సత్యనారాయణమ్మ, కుండ్ల కృష్ణారెడ్డి, బట్ట సుప్రజ, తుర్రం బాబూరావు నామినేషన్లు వేశారు. మండల, జిల్లా స్థాయి నాయకుల అభిప్రాయ సేకరణ అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ దృష్టికి తీసుకెళ్లి ఎంపిక చేస్తామని శాంతకుమారి తెలిపారు. భాజపా రాష్ట్ర గిరిజన మోర్చా కార్యదర్శి కారం సీతారామన్నదొర, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ రేలంగి శ్రీదేవి, నాయకులు రామకృష్ణ, అచ్యుత్, సుబ్బారావు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు

రంపచోడవరం, అడ్డతీగల, కూనవరం, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని రంపచోడవరం సీఐ సన్యాసినాయుడు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ అన్నారు. బుధవారం పందిరిమామిడి కూడలి వద్ద వాహన చోదకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై వెంకటరావు, పోలీసు సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు. ●సీతపల్లి కూడలి వద్ద అడ్డతీగల ఎస్సై వినోద్‌కుమార్ వాహన తనిఖీలు నిర్వహించి, సరైన దస్త్రాలు లేని పలువురు చోదకులకు అపరాధ రుసుము విధించారు. ●కూనవరం స్థానిక పోలీస్ మైదానంలో గ్రామస్థులతో నిర్వహించిన సమావేశంలో ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ పిల్లలకు వాహనాలు ఇచ్చిన వారికి అపరాధ రుసుము విధిస్తామని తెలిపారు.

కూనవరంలో మాట్లాడుతున్న ఎస్సై రామకృష్ణ

రంపచోడవరంలో ర్యాలీలో సీఐ, ఎస్సై, ఎంవీఐ

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

మారేడుమిల్లి : గిరిజనులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, అపరిచిత వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని ఎస్సై రాజ్‌కోటి కోరారు. గుర్తేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని పాతకోట, పులిమెట్ల గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. గంజాయి పండించడం, విక్రయించడం, తరలించడం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. గిరిజన యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. పోలీసు, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం

ఎటపాక, న్యూస్‌టుడే: మండలంలోని నెల్లిపాక గ్రామంలో కొలువై ఉన్న గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాన్ని ఆలయ నిర్వాహకులు పుట్టి రమేష్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు చేశారు. మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి భక్తులను అలరించారు. గ్రామస్థులతో పాటు పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

అభ్యుదయ భావాలతో యువత కదలాలి

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: యువత అభ్యుదయ భావాలతో ప్రజల్లో చైతన్యం పెంచాలని యూటీఎఫ్ నాయకులు సున్నం రాజులు, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు పులి సంతోశ్ దిశానిర్దేశం చేశారు. అడవి వెంకన్నగూడెంలో బుధవారం నిర్వహించిన ప్రజా నాట్యమండలి ప్రథమ మహాసభలో వారు మాట్లాడారు. గ్రామస్థాయి నుంచి కళాకారులను గుర్తించి, అంతరించిపోతున్న జానపద కళలకు ప్రాణం పోయాలన్నారు. సమాజం, సమస్యలు, వాటి పరిష్కారాలను కళా ప్రదర్శనలో చూపుతూ, ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఐవీ వెంకటేశ్వర్లు, ఎంపీపీ కారం లక్ష్మి, సుబ్బారావు, ఐద్వా సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాజులు

కొత్త వ్యక్తుల సంచారంపై నిఘా ఉంచండి

గంగవరం, న్యూస్‌టుడే: కొంతకాలంగా గ్రామాల్లో దొంగతనాలు అధికమవుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని, కొత్త వ్యక్తుల సంచారంపై ప్రత్యేక నిఘా ఉంచాలని గంగవరం ఎస్సై ఎస్.వెంకయ్యను కూటమి నాయకులు కోరారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐను బుధవారం కలిసి మండలంలో పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. మండల తెదేపా అధ్యక్షుడు పల్లాల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరెడ్డి, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి కనిగిరి రాంబాబు, గంగవరం సర్పంచి కలుముల అక్కమ్మ, ఆముదాలబంధ ఎంపీటీసీ సభ్యుడు పండా ఆదినారాయణ, మొల్లేరు సొసైటీ ఛైర్మన్ పాము అర్జున్, భాజపా మహిళా కార్యదర్శి కుంజం సత్యనారాయణమ్మ, భాజపా మండల అధ్యక్షురాలు నీలాలమ్మ, జనసేన మండల అధ్యక్షుడు కుంజం సిద్ధు, తెదేపా మండల ప్రధాన కార్యదర్శి సుభాష్, మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ తదితరులు పాల్గొన్నారు.

గంగవరం పోలీసు స్టేషన్ వద్ద కూటమి నాయకులు

ఆర్వో ప్లాంట్లు ఉన్నా.. నిరుపయోగమే

చర్యలు చేపట్టని గిరిజన సంక్షేమశాఖ

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మన్యంలోని ప్రధాన కేంద్రాల్లో ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో కనీసం విద్యార్థులకు రక్షిత తాగునీరు అందించలేని స్థితి నెలకొంది. మారేడుమిల్లిలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో సుమారు 380 మంది విద్యార్థులు, బోదులూరులోని బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో సుమారు 220 విద్యార్థినులు చదువుతున్నారు. గతంలో ఈ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు పని చేయకుండా మరమ్మతులకు గురై అలంకార ప్రాయంగా మిగిలాయి. దీంతో వారికి కాచి చల్లార్చిన నీటిని అందిస్తున్నామని పాఠశాలల సిబ్బంది చెబుతున్నప్పటికీ, అది కూడా ఆచరణలో కనిపించడం లేదని తెలుస్తోంది. ఫలితంగా గిరిజన విద్యార్థులకు అవస్థలు, అనారోగ్యాలు తప్పడం లేదు. ఇటీవల దేవరపల్లి బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో అల్పాహారం వికటించి, సుమారు 108 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురవడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అయినప్పటికీ అధికార యంత్రాంగంలో ఎటువంటి స్పందన కనిపించకపోవడం గమనార్హం. సంఘటన జరిగిన సమయంలో హడావిడి చేయడం, అనంతరం గాలికి వదిలేయడం పరిపాటిగా మారింది. బుధవారం ఆయా పాఠశాలల్లోని ఆర్వో ప్లాంట్లను రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి పరిశీలించి, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

బోదులూరు ఆశ్రమ పాఠశాలలో నిరుపయోగంగా ఆర్వో ప్లాంటు

పునరావాస కాలనీకి శ్మశానవాటిక

దేవీపట్నం, న్యూస్‌టుడే: నిర్వాసితుల పునరావాస కాలనీకి శ్మశానవాటిక స్థలాన్ని బుధవారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. పోలవరం ప్రాజెక్టు ద్వారా ముంపునకు గురైన దామనపల్లి గ్రామానికి వెలగపల్లి సమీపంలో ప్రభుత్వం పునరావాస కాలనీ నిర్మాణ పనులు చేపడుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కాలనీ నిర్వాసితులకు అంత్యక్రియలు నిర్వహించుకోవడానికి 64 సెంట్లలో శ్మశానవాటిక స్థలాన్ని తహసీల్దార్ సత్యనారాయణ పరిశీలించి నిర్వాసితులతో మాట్లాడారు. అధికారులు కేటాయించిన శ్మశానవాటిక స్థలానికి గ్రామస్థులు ఆమోదం తెలపడంతో అధికారులు వారి ఆధ్వర్యంలో తీర్మానం చేశారు. కార్యక్రమంలో కోండ్ల చినకొండారెడ్డి, కె.సత్యం రాజు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

గంగవరం, న్యూస్‌టుడే: బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రతి ఒక్కరు తమ వంతు కృషిచేయాలని గంగవరం జడ్పీటీసీ సభ్యురాలు అచ్చుత బేబిరత్నం, సీడీపీవో సుచరిత ఆదిలక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని బర్రిమామిడిలో బాల్యవివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దాం అంటూ గ్రామంలోని పురవీధుల్లో ర్యాలీలు, మానవహారం నిర్వహించారు. ఎంపీపీ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులతో సంయుక్తంగా ప్రతిజ్ఞ చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారి, సర్పంచి కె.తమ్మన్నదొర, ఉపాధ్యాయులు రామలక్ష్మి, నరసమ్మ, అంగన్‌వాడీలు దేవి, వరలక్ష్మి ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్, ఆశా, అంగన్‌వాడీలు, జడ్పీటీసీ

పోషకాహారంతో ఆరోగ్యం

జడేరు(గంగవరం) : విధిగా పోషకాహారం తీసుకోవడంతో మంచి ఆరోగ్యం పొందవచ్చని గంగవరం ఏపీఎం అప్పలకొండ, సీడీపీవో సుచరిత ఆదిలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని జడేరులో సెర్ప్, ఆర్వైఎస్ఎస్ శాఖల సమన్వయం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆహారం, ఆరోగ్యం, కార్యచరణ అమలు, సామర్థ్యాల పెంపు అనే కార్యక్రమంపై ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. వారు మాట్లాడుతూ పోషకాహారంతో రోగనిరోధక శక్తి పెరిగి మంచి ఆరోగ్యం పొందవచ్చన్నారు. అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న పోషక ఆహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్, గంగవరం ప్రాజెక్టు లీడర్ కె.రాణి, ఐసీడీయస్, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా

ఎటపాక : జిల్లాలోని రెవెన్యూ కార్యాలయాల పరిధిలో పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకుల(వీఆర్ఏ) సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం పోలవరం జిల్లా కేంద్రం రంపచోడవరంలో కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించి ఐటీడీఏ ఏవోకు వినతి పత్రం అందజేశారు. అనంతరం సంఘం నాయకులు డేగల వెంకట్ మాట్లాడుతూ వీఆర్ఏలకు పేస్కేలుతో జీతాలు అమలు చేయాలని, అర్హులైన వారికి వీఆర్వోలుగా ప్రమోషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. చేసేది పార్ట్‌టైం ఉద్యోగం అయినా నిబంధనలకు విరుద్ధంగా రాత్రి డ్యూటీలు, అటెండర్ డ్యూటీలు వేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. గ్రామ రెవెన్యూ సహాయకుల కుటుంబాలను ఆకలి బాధల నుంచి ఆదుకోవాలని, తక్షణమే ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్ఏలు అనిత, ప్రమీల, భాను, ప్రసాద్, వెంకటేశ్వర్లు, ప్రసాద్ పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో ఏవోకు వినతి అందజేస్తున్న వీఆర్ఏలు

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి ప్రణాళిక ప్రకారం చదివితే లక్ష్యాన్ని సులువుగా సాధించవచ్చని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.సత్యవేణి అన్నారు. పాఠశాల ప్రాంగణంలో బుధవారం పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం ఎంతో ఉత్సాహంగా జరిగింది. ప్రిన్సిపల్ మాట్లాడుతూ పరీక్షలకు కొద్ది రోజులే సమయం ఉన్నందున అన్ని సబ్జెక్టుల్లోను పునశ్చరణ చేసుకోవాలన్నారు. గురుకుల కళాశాల, ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయం ప్రధానోపాధ్యాయులు షీలా, వెంకట కృష్ణారావు, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రామారావు పదోతరగతి విద్యార్థినులు ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల నిరీక్షణ

చింతూరు, న్యూస్‌టుడే: ఉన్నతధికారులకు తమ సమస్యలు చెప్పుకొనేందుకు నిర్వాసితులు గంటలకొద్దీ నిరీక్షించారు. పోలవరం ప్రాజెక్టు పరిపాలనాధికారి అభిషేక్ వస్తున్నారన్న సమాచారంతో విలీన మండలాల్లోని నిర్వాసితులు ఉదయమే చింతూరు ఐటీడీఏ వద్దకు చేరుకున్నారు. పోలవరం నిర్వాసితులకు చెల్లించాల్సిన పరిహారం, పునరావాసం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లింపులు, ఇతర పనులపై అధికారులతో సమీక్షించేందుకు బుధవారం ఆయన చింతూరు ఐటీడీఏకి వచ్చారు. అధికారులకు దిశానిర్దేశం చేయడంలో కాలాతీతం కావడంతో నిర్వాసితులు అప్పటివరకు పడిగాపులు కాశారు. ఉన్నతాధికారులు వచ్చినప్పుడల్లా నిర్వాసితులు రావడం గోడు వెళ్లబోసుకుని వెళ్లడం పరిపాటిగా మారింది.

ఐటీడీఏ వద్ద నిరీక్షిస్తున్న నిర్వాసితులు

వంద రోజుల పని కల్పించాలి

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: ఉపాధిహామీ పనుల్లో భాగంగా ప్రతి కుటుంబానికి వంద రోజుల పని కల్పించాలని ఎంపీడీవో యాదగిరీశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించి, వేసవి నేపథ్యంలో పశువుల నీటి తొట్టెల్లో నీటిని నింపే ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలుడి మృతదేహం లభ్యం

మోతుగూడెం, న్యూస్‌టుడే: చింతూరు మండలం చదలవాడలో ఐదు రోజుల కిందట అదృశ్యమైన సోడె కార్తీక్(8)బుధవారం సాయంత్రం మృతదేహంగా లభ్యమయ్యాడని మోతుగూడెం ఇన్‌ఛార్జి ఎస్సై చరణ్ నాయక్ తెలిపారు. వివరాలివీ.. చదలవాడ గ్రామానికి రెండు కి.మీ దూరంలో ఉన్న చెరువులో మృతదేహన్ని చూసిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి చేరుకుని వారు బయటకు తీశారు. కుమారుడు విగత జీవిగా కనిపించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఎస్సై చింతూరు ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

జెన్‌కో శిథిల భవనాలకు మోక్షమెప్పుడో?

మోతుగూడెం, న్యూస్‌టుడే: లోయరు సీలేరు ప్రాజెక్టు మోతుగూడెం జెన్‌కో కాలనీలో పలు భవనాలు శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారుతున్నాయి. 25 ఏళ్ల క్రితం జెన్‌కో సంస్థ ఉన్నత పాఠశాల నిర్వహణకు స్వస్తి చెప్పి, డీఏవీ(దయానంద ఆంగ్లో వేదిక్)ప్రైవేట్ పాఠశాలకు టెండర్ ద్వారా బాధ్యతలను అప్పగించింది. పాఠశాల నిర్వహణకు ఏపీ జెన్‌కో సంస్థ నూతన భవనాలను నిర్మించింది. నాటి నుంచి పాఠశాల భవనాలు మొండి గోడలతో, చుట్టూ తుప్పలు పెరిగిపోయి అలాగే ఉన్నాయి. ఈ స్థలాన్ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి కేటాయించాలని నాలుగేళ్ల క్రితం చింతూరు ఐటీడీఏ పీవో స్థానిక జెన్‌కో యాజమాన్యంతో ఉత్తరప్రత్యుత్తరాలు చేసినా నేటికి ఎలాంటి అనుమతి ఇవ్వలేదు. ఇదే కాలనీలో సంస్థలోని ఉద్యోగులకు నూతన గృహ సముదాయాలను నిర్మించడంతో 25 వరకు సిబ్బంది గృహాలు శిథిలావస్థకు చేరాయి. ఈ భవనాల్లో కొన్ని పశువులకు ఆవాసాలుగా, మరికొన్ని అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. దీంతో కాలనీలో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ఇప్పటికైనా జెన్‌కో సంస్థ ఈ క్వార్టర్లకు మరమ్మతులు జరిపించి అద్దె ప్రతిపాదికన ప్రైవేటు వ్యక్తులకు కేటాయిస్తే సంస్థకు ఆదాయం సమకూరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. దీనిపై 'న్యూస్‌టుడే' మోతుగూడెం క్యాంపు సివిల్ ఇన్‌ఛార్జి ఈఈ డి.కొండబాబును వివరణ కోరగా.. ఈ నెల 17(మంగళవారం) సీలేరు కాంప్లెక్స్ ముఖ్య ఇంజినీరు కేవీ రాజారావు జెన్‌కో కాలనీలోని గృహాలకు తనిఖీ నిర్వహించి శిథిలావస్థలో ఉన్న గృహాలను తొలగించాలని సూచించారన్నారు. త్వరలోనే చర్యలు చేపడతామన్నారు.

మూడవ రహదారిలో శిథిలమైన భవనాలు

తునికాకు ప్రూనింగ్ పనులు ప్రారంభించాలి

చింతూరు : తునికాకు ప్రూనింగ్ పనులు తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం డీఎఫ్‌వో కార్యాలయాన్ని ముట్టడించారు. తునికాకు సీజన్ వచ్చినప్పటికీ సంబంధించిన ప్రక్రియను అటవీ శాఖ చేపట్టలేదని విమర్శించారు. ఏటా గిరిజనులను వేసవిలో ఆర్థికంగా ఆదుకునే తునికాకు సేకరణ పనులు తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్మికులకు బోనస్‌ను చెల్లించాలని పేర్కొన్నారు. కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. నాయకులు సురేశ్, సున్నం రాజులు పాల్గొన్నారు.

డీఎఫ్‌వో కార్యాలయాన్ని ముట్టడించిన సీపీఎం నాయకులు

జెన్‌కో ఉద్యోగులకు బీమాపై అవగాహన

మోతుగూడెం, న్యూస్‌టుడే: లోయరు సీలేరు ప్రాజెక్టు డొంకరాయి జలవిద్యుత్కేంద్రంలోని ఉద్యోగులకు బుధవారం సాయంత్రం ఏపీ జెన్‌కో కల్యాణ మండపంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ మెట్ లైఫ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్, రాజమహేంద్రవరం బ్రాంచ్ సీనియర్ మేనేజర్ శ్రీనివాసరావు, డిస్ట్రిబ్యూషన్ మేనేజర్ మౌనిక పొదుపు, పెన్షన్, స్వల్పకాలిక పెట్టుబడి ప్రణాళికలు, జీవిత బీమా కవర్‌పై ప్రజెంటేషన్ నిర్వహించారు. కార్యక్రమంలో సివిల్ ఈఈ ఎం.శ్రీనివాసరావు, ఏడీఈలు కాళ్ల శివశంకర్, చంద్రమోహన్, సీనియర్ అసిస్టెంట్ వేమగిరి కిరణ్, ఉద్యోగులు, గుత్తేదారు కార్మికులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ రత్నాబాయి మృతికి నివాళి

అడ్డతీగల, న్యూస్‌టుడే: మాజీ ఎంపీ రత్నాబాయి మృతికి అడ్డతీగల గాంధీబొమ్మ సెంటర్‌లో రాష్ట్ర పీసీసీ కార్యదర్శి దంగేటి సత్తిబాబు ఆధ్వర్యంలో బుధవారం నివాళి అర్పించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి సంతాపం వ్యక్తం చేశారు. రత్నాబాయి పలు పదవులు చేపట్టి గిరిజన ప్రాంతంలో సేవలు అందించారని కొనియాడారు. ఆమె మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

(c) eenadu

రైతులపై ఎరువుల భారం

● నాలుగు నెలల్లో రెండు సార్లు పెరుగుదలపై ఆవేదన

న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం

రసాయన మిశ్రమ ఎరువుల ధరలను నాలుగు నెలల కాలంలో రెండు సార్లు పెంచడంతో రైతులపై పెట్టుబడి భారం అధికమైంది. యూరియా, డీఏపీ మినహా మిగిలినవి 50 కిలోల బస్తాకు రూ. 200 నుంచి రూ.400ల వరకు పెరిగింది. కందుకూరు డివిజన్‌లో వలేటివారిపాలెం, గుడ్లూరు, లింగసముద్రం, ఉలవపాడు, కందుకూరు మండలాల్లో సుమారు 38 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. వరి 4,500, పత్తి 5,800, పొగాకు 16 వేల ఎకరాల్లో ఉన్నాయి. కొనుగోలుకు వెళ్లే వరకు ఎరువుల ధరలు పెరిగాయనే విషయం తమకు తెలియడంలేదని కర్షకులు వాపోతున్నారు.

● పొగాకులో అధికంగా వినియోగించే 14-35-14 బస్తా ధర గత అక్టోబరులో రూ.1,750కు విక్రయించగా.. ఆ తర్వాత రూ.1900, ప్రస్తుతం రూ. 2,150కి అమ్ముతున్నారు. బస్తాకి రూ.400 పెరగడంతో సాగుదారులు లబోదిబోమంటున్నారు. వరి, పత్తిలో వేసే 20-20-0-13 బస్తాకి రూ.200 పెరిగింది. ఈ కారణంగా ఎకరాకు సుమారు రూ.800 నుంచి రూ.1,200ల వరకు పెట్టుబడి పెరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిశ్రమ ఎరువుల తయారీకి అవసరమైన ముడి సరకు విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి ఉందని, అంతర్జాతీయ మార్కెట్లో వీటి ధరలు పెరగడంతో ధరలు పెంచినట్లు కంపెనీల డీలర్లు చెబుతున్నారు. అధికారులు మాత్రం మోతాదుకు మించి ఎరువులు వేయకుండా సూచనల మేరకు వేసుకుని పెట్టుబడి వ్యయం తగ్గించుకోవాలని సూచిస్తున్నారు. మరోపక్క ఎరువుల ధరలు పెరుగుదలపై రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

22న జిల్లా ప్రజాప్రతినిధులతో సీఎం చంద్రబాబు భేటీ

ఈనాడు, ఒంగోలు: అమరావతిలో ఈ నెల 22వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో సమావేశం కానున్నారు. సమావేశానికి మంత్రులు డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, ఇన్‌ఛార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, తెదేపా జిల్లా అధ్యక్షుడు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. నియోజక వర్గాల వారీగా పనుల ప్రగతిపై చర్చించనున్నారు.

రావణబ్రహ్మ వాహనంపై నటరాజు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రం మార్కాపురం పట్టణంలోని శ్రీజగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం రాత్రి రావణబ్రహ్మ వాహనంపై నటరాజు అలంకరణలో మార్కండేయస్వామివారు పురవీధుల్లో విహరించారు. నగరోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, మార్కాపురం గ్రామీణం

ప్లాట్లు... తప్పేనా పాట్లు!

◆ 25 ఏళ్లుగా మూలకు చేరిన ఐడీఎస్ఎంటీ స్థలాలు

◆ విక్రయాలతో రూ.30 కోట్లకు పైగా ఆదాయం

ఒంగోలు నగరంలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న మామిడిపాలెం ప్రాంతంలో మధ్యతరగతి కుటుంబాలకు కోసం లేఅవుట్ వేసి సుమారు పాతికేళ్లవుతోంది. అప్పట్లో ఆ ప్లాట్లకు డిమాండు లేకపోవడం, కోర్టు వివాదాలతో నగరపాలక సంస్థకు చెందిన ప్లాట్లు ఖాళీగా ఉండిపోయాయి. ప్రస్తుతం ఆ ప్లాట్ల విక్రయంపై దృష్టిసారిస్తే నగరపాలక సంస్థకు ఆదాయం సమకూరడమే కాకుండా అభివృద్ధి పనులకు ఆసరాగా నిలుస్తాయి. - ఈనాడు, ఒంగోలు

ఒంగోలు నగర సమీపంలోని మామిడిపాలెంలో లేఅవుట్

సుమారు 25 ఏళ్ల కిందట మామిడిపాలెం ప్రాంతంలో జనావాసాలు అంతంతమాత్రంగా ఉండేవి. రైతుల నుంచి పొలాలు సేకరించి మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు మొత్తం 417 ప్లాట్లతో లేఅవుట్ వేశారు. అప్పట్లో ఊరికి దూరంగా ఉండడం, ఆ ప్రాంతంలో అభివృద్ధి అంతంత మాత్రం కావడంతో అప్పట్లో వేలానికి స్పందన అంతంత మాత్రంగా వచ్చింది. అనంతరం భూయజమానులు, వేలం పాటలో ప్లాట్లు దక్కించుకున్నవారు కోర్టును ఆశ్రయించడంతో ఏళ్ల తరబడి కోర్టులో కేసు నడిచింది. 2004లో నిర్వహించిన వేలంలో 211 ప్లాట్లు విక్రయించగా, కోర్టు వివాదాల తరువాత 2007లో మరో 132 ప్లాట్లు విక్రయించారు. షెడ్యూల్ కులాలకు కొన్ని ప్లాట్లు కేటాయించాలని డిమాండు సైతం వచ్చింది. మొత్తం మీద 74 ప్లాట్లు ఏళ్లుగా ఖాళీగా ఉండిపోయాయి. 25 ఏళ్ల కిందట ఈ లే అవుట్‌ను చిన్న, మధ్య తరహా పట్టణాల సమగ్ర అభివృద్ధి (ఐడీఎస్ఎంటీ) పథకం కింద నిర్మించగా, ప్రస్తుతం పథకం పేరు సైతం ప్రభుత్వాలు మార్చేశాయి.

కోర్టు వివాదాలతోనే...

ప్రధాన రహదారి పక్కన ఆనుకుని ఉన్న ప్లాట్లను తక్కువ ధరకే బదలాయింపులో నగర పాలక సంస్థ ఆదాయం కోల్పోయిందని, దీనిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఒకరు కోర్టును ఆశ్రయించడంతో ఏళ్లుగా కేసు నడిచింది. కోర్టు కేసుల నేపథ్యంలో ప్లాట్లకు సంబంధించి ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్లు వేలం వేసే ప్రక్రియ చేపట్టేందుకు సాహసించలేదు. రెండు రోజుల కిందట పురపాలకశాఖ మంత్రి నారాయణ ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులతో సమీక్ష నిర్వహించినప్పుడు ఆ ప్లాట్లు వేలం వేస్తే ఆదాయం వస్తుందని, దీంతో అభివృద్ధి పనులు చేపట్టవచ్చునే చర్చ వచ్చింది. దీంతో అధికారులు లే అవుట్‌కు సంబంధించి దస్త్రాల దుమ్ము దులిపారు. వాస్తవానికి లేఅవుట్ ఉన్న ప్రాంతంలో ఒక గది స్థలం ధర రూ.2 లక్షలపైనే పలుకుతోంది. ప్లాట్లు విక్రయిస్తే దాదాపు రూ.30 కోట్ల మేర ఆదాయం సమకూరుతుంది.

వేలానికి చర్యలు తీసుకుంటాం

ఐడీఎస్ఎంటీ ప్లాట్లకు సంబంధించి కోర్టు వివాదాలు పరిష్కారమైన నేపథ్యంలో వేలం వేసేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకుంటున్నాం. త్వరలో నిర్వహించే వేలానికి ఎవరైనా ధరావత్తు చెల్లించి పాల్గొనవచ్చు. ప్రభుత్వం ధర ప్రకారం ఒక్కో ప్లాటుకు ధర నిర్ణయిస్తాం. వేలంలో ఎవరైతే ధర ఎక్కువ పెడతారో వారికి నిబంధనల ప్రకారం విక్రయిస్తాం.

- వెంకటేశ్వరరావు, కమిషనర్

నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

పొదిలి, న్యూస్‌టుడే: రంజాన్ నెల ప్రారంభమైంది. బుధవారం నెలవంక కనిపించడంతో రంజాన్ మాసం ప్రారంభమైనట్లు అన్ని మసీదుల్లో మతపెద్దలు ప్రకటించారు. దీంతో గురువారం నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభించేందుకు ముస్లిం సోదరులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పొదిలి పట్టణంలో 11 మసీదులుండగా, ఆయా మసీదుల్లో బుధవారం రాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. మసీదులను సుందరంగా తీర్చిదిద్దారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : గురువారం సా.6-21

సహరీ : శుక్రవారం ఉ.5-12

పేద పిల్లలకు కార్పొరేట్ విద్య

◆ ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

న్యూస్‌టుడే, సీఎస్‌పురం

విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు ఉచితంగా కార్పొరేట్ విద్య పొందవచ్చు. విద్యాసంస్థల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు కేటాయిస్తారు. 2026-27 విద్యాసంవత్సరానికి ఒకటో తరగతిలో ప్రవేశాలకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. అయిదేళ్లు నిండిన బలహీన వర్గాల పిల్లలు ఒకటో తరగతిలో ప్రవేశించడానికి దరఖాస్తు చేసుకోవచ్చు. జిల్లాలో వారి నివాస సమీప ప్రాంతంలో నున్న ఏ ప్రైవేటు పాఠశాలనైనా ఎంచుకునే అవకాశం కల్పించారు.

అర్హులు ఎవరు?..దరఖాస్తు ఎలా?: వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షలు ఉన్న తల్లిదండ్రుల పిల్లలు అర్హులు. * స్టేట్ సిలబస్ పాఠశాలలో చేరే విద్యార్థి 2, జూన్ 2020 నుంచి 31, మే 2021 మధ్య, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సిలబస్ పాఠశాలలో చేరే విద్యార్థి 2, ఏప్రిల్, 2020 నుంచి 31, మార్చి 2021 మధ్య జన్మించి ఉండాలి. అయిదేళ్లు నిండి ఉండాలి.

● www.cse.ap.gov.in వెబ్‌సైట్‌లో లేదా స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాలు, ఎంఈవో కార్యాలయం, మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

జత చేయాల్సిన పత్రాలు: విద్యార్థి జనన, కుల, వార్షిక ఆదాయం ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. తల్లిదండ్రుల ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, తెల్ల రేషన్ కార్డు, భూహక్కు పత్రం, పాస్‌పోర్టు, ఉపాధిహామీ పథకం జాబ్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, విద్యుత్తు బిల్లు, గ్యాస్ కనెక్షన్, అద్దె ఒప్పంద పత్రాన్ని చిరునామా ధ్రువీకరణకు పరిగణనలోకి తీసుకుంటారు. ఈ నెల 20 నుంచి మార్చి 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. మార్చి 25న లాటరీ తీసి విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఏప్రిల్ 13వ నుంచి 23 వరకు ప్రవేశాల నిర్ధారణ ఉంటుంది. వివరాల కోసం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 18004258599 టోల్‌ఫ్రీ నంబరులో సంప్రదించవచ్చు.

టోల్ బాదుడేనా... బాధ్యత లేదా?

● జాతీయ రహదారి-565పై సౌకర్యాలు విస్మరించిన అధికారులు

● గత కొన్నేళ్లుగా వెలగని దీపాలతో రాకపోకలకు ఇబ్బందులు

తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రారంభమయ్యే జాతీయ రహదారి-565 జిల్లా మీదుగా చెన్నై వరకు వెళ్తుంది. రహదారిపై గత కొన్నేళ్లుగా ప్రభుత్వం టోల్‌ప్లాజాలు నిర్వహిస్తూ ప్రజల నుంచి పన్నుల రూపంలో నెలకు రూ.లక్షలు వసూలవుతోంది. పన్నుల రూపంలో డబ్బులు తీసుకుంటున్నా జాతీయ రహదారిపై ఏళ్లతరబడి వెలగని దీపాలను పట్టించుకున్న పాపాన పోలేదు. సుదూర ప్రయాణం సాగించే వాహనదారులు నిద్రకు ఇబ్బందులు పడతారనే ఉద్దేశంతో కొన్నిచోట్ల విశ్రాంతి గదులతో పాటు వ్యక్తిగత మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. గదులు, మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

-న్యూస్‌టుడే, మార్కాపురం

జాతీయ రహదారి-565 తెలంగాణ రాష్ట్రంలోని నాగార్జున సాగర్ నుంచి ప్రారంభమై దావులపల్లి వరకు సుమారు 95 కిలోమీటర్ల వరకు ఉంటుంది. తెలంగాణ రాష్ట్రం నాగార్జున సాగర్ నుంచి నకిరేకల్లు మీదుగా ప్రారంభమై నల్గొండ, రాష్ట్రంలోని పల్నాడు జిల్లా మాచర్ల, జిల్లాలోని యర్రగొండపాలెం, మార్కాపురం, చినారికట్ల, కనిగిరి మీదుగా రాపూర్, వెంకటగిరి మీదుగా వెళ్లి జాతీయ రహదారి-71కు కలుస్తుంది. ప్రయాణికుల సౌకర్యార్థం మార్గమధ్యలో ఏర్పాటు చేసిన విశ్రాంతి, మరుగుదొడ్లు గత ఎనిమిదేళ్లుగా పూర్తిగా వినియోగంలో లేక అధ్వానంగా తయారయ్యాయి. ● జాతీయ రహదారి-565పై జిల్లాలోని తర్లుపాడు మండలం కలుజువ్వలపాడు పంచాయతీలోని మేకలవారిపల్లె వద్ద టోల్‌ప్లాజా ఉంది. అనంతరం రావిగుంటపాడు, దావులపల్లి వద్ద మరో రెండు టోల్‌ప్లాజాలను ఏర్పాటు చేశారు. టోల్‌ప్లాజాల మీదుగా రోజుకు సగటున 700 వరకు కార్లు, లారీలు, బస్సులు ఇలా నాలుగు చక్రాల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నెలకు ఒక్కొక్క టోల్‌ప్లాజా నుంచి 20 వేల వరకు వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి.

మర్రిపాలెం వద్ద జాతీయ రహదారిపై వినియోగంలో లేని విశ్రాంతి గదులు

ప్రతి వాహనానికి టోల్‌ప్లాజా

వాహనాన్ని బట్టి రూ.50 నుంచి అత్యధికంగా రూ. 475 వరకు వసూలు చేస్తున్నారు. పాస్ అయితే వాహనాన్ని బట్టి రూ.1,630 నుండి రూ.10,530 వరకు వసూలు చేస్తున్నారు. జాతీయ రహదారిపై మార్కాపురం, రాయవరం, కొనకనమిట్ల, కనిగిరి, యర్రగొండపాలెం, మాచర్ల, రాపూర్, వెంకటగిరి తదితర ప్రాంతాల్లోని కూడళ్లలో దీపాలు మరమ్మతులకు గురైనా పట్టించుకోవడంలేదని వాహనచోదకులు, స్థానికులు వాపోతున్నారు. కొనకనమిట్ల మండలం మర్రిపాలెం, వగ్గంపల్లికి సమీపంలో రెండు విశ్రాంత గదులు నిరుపయోగంగా మారిపోయాయి. జాతీయ రహదారి పొడవునా పట్టణాలు, గ్రామాలున్నచోట నిర్మించిన బస్సు షెల్టర్లు సైతం నిరుపయోగంగా మారాయి.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఆంజనేయులు అధికారులను ఆదేశించారు. ఈ నెల 23వ తేదీ నుంచి పరీక్షల నిర్వహణపై స్థానిక ఆంధ్ర కేసరి విద్యాకేంద్రంలో బుధవారం ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, కస్టోడియన్లతో సమావేశం నిర్వహించారు. రెండు జిల్లాల్లో 67 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయనుండగా మొత్తం 42,759 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు వివరించారు. రవాణాకు ఇబ్బంది లేకుండా సకాలంలో కేంద్రాలకు చేరేందుకు 30 రూట్లలో ఆర్టీసీ బస్సు నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పారదర్శకంగా పరీక్షలు నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. తొలుత తాడేపల్లిలోని ఇంటర్మీడియట్ విద్యామండలి ప్రధాన కార్యాలయం నుంచి కార్యదర్శి రంజిత్‌బాషా వీక్షణ సమావేశం ద్వారా పలు సూచనలు చేశారు. సమావేశంలో పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, రమణారెడ్డి, కోటేశ్వరరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చెరువుల నుంచి వచ్చే వ్యర్థాలను సముద్రంలోకి మళ్లించేందుకు ఏర్పాటు చేసిన పైపులు

అడిగేదెవరు.. అడ్డుకునేదెవరు..?

● సముద్ర తీరంలో యథేచ్ఛగా రొయ్యల అక్రమ సాగు

న్యూస్‌టుడే, సింగరాయకొండ గ్రామీణం, టంగుటూరు

జిల్లాలో అక్రమార్కుల బరితెగింపు తీరం దాటి మరీ సాగుతోంది. సాగరుడి చెంతనే యథేచ్ఛగా బోర్లు వేయడంతో పాటు కొద్ది దూరంలోని సర్కారు భూముల్లో చెరువులు తవ్వి అక్రమంగా రొయ్యల సాగు చేస్తూ సీఆర్‌జడ్ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. ఆక్వా ఉత్పత్తులు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించడాన్ని సాకుగా చూపుతూ రెచ్చిపోతున్నారు. సముద్రానికి సుమారు 30 అడుగుల దూరంలో రొయ్యల సాగు చేపట్టారు. మరికొందరు తీరంలోనే బోర్లు వేసి ఉప్పునీటిని మళ్లిస్తున్నారు. సింగరాయకొండ మండలం ఊళ్లపాలెం, బింగినపల్లి, టంగుటూరు మండలం పసుపుకుదురు, తేటుపురం, అనంతవరం, రాళ్లపాలెం, కేసుపాలెం, ఆలకూరపాడులో ఈ పరిస్థితి కనిపిస్తోంది. సింగరాయకొండ, టంగుటూరు మండలాల్లోని సముద్ర తీరంలో రొయ్యల సాగు చేస్తున్నట్లు రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు రెండేళ్ల కిందటే గుర్తించారు. అప్పట్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి కొన్ని చెరువులను ధ్వంసం చేశారు. దీంతో అప్పట్లో మిన్నకుండిపోయిన అక్రమార్కులు ప్రస్తుతం బరితెగించారు. ఏకంగా సర్కారుకు చెందిన సుమారు 3 వేల ఎకరాల్లో చెరువులు తవ్వి సాగు చేపడుతున్నారు. ఈ విషయమై జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ చెరువులు తవ్వినవారికి గతంలో నోటీసులిచ్చామని, క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. సింగరాయకొండ తహసీల్దార్ రాజేష్ మాట్లాడుతూ. చెరువుల తవ్వకాలకు అనుమతులివ్వలేదన్నారు.

కూలీల ప్రాణాలు.. గాలిలో దీపాలు

◆ ప్రమాదకరంగా ట్రాక్టర్లపై ప్రయాణం

◆ కనీస చర్యలు చేపట్టని రవాణా శాఖ

పచ్చాకు ట్రాక్టర్లు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. కూలీల ప్రాణాలు బలి తీసుకుంటున్నాయి. నాలుగు రోజుల వ్యవధిలో జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. మరొకరు ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. అనుభవం లేని డ్రైవర్లు, కాలం చెల్లిన వాహనాలు, బీమా సైతం లేని పరిస్థితి వెరసి నిరుపేద ఇళ్లల్లో హాహాకారాలు, ఆర్తనాదాలు. కేవలం పచ్చాకు ట్రాక్టర్లు మాత్రమే కాదు ఇటీవల కాలంలో ఇతర ట్రాక్టర్లతోనూ ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇంత జరుగుతున్నా రవాణా శాఖ, పోలీసు యంత్రాంగం సీరియస్‌గా దృష్టి సారించడం లేదు.

-న్యూస్‌టుడే, ఒంగోలు నేరవిభాగం

లింగసముద్రం మండలం గంగపాలెం పొలాల్లో ఈ నెల 14వ తేదీన పచ్చాకు కూలీల ట్రాక్టరు బోల్తా పడింది. పొలంలోని డొంక దారి నుంచి ట్రాక్టర్ బయటకు వస్తున్న సమయంలో అదుపుతప్పి పక్కకు పడిపోయింది. పొగాకు మీద పడిపోవటంతో ఇద్దరు మహిళా కూలీలు మృతిచెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. పలువురు గాయాలపాలయ్యారు.

● ఒంగోలు నగర శివారు త్రోవగుంట వద్ద మంగళవారం చేకూరపాడుకు చెందిన రైతు పొలం నుంచి పచ్చాకు తీసుకెళ్లే క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. పచ్చాకు కూలీలపై పడటంతో ఒక మహిళ మృతి చెందగా, మరో మహిళ పరిస్థితి విషమంగా ఉంది. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో ట్రాక్టర్‌పై 16 మంది ప్రయాణిస్తున్నారు. ట్రాక్టరుపై పరిమితికి మించి రెండింతలు పచ్చాకు లోడ్ చేయడంతో ప్రమాదం చోటుచేసుకుంది.

త్రోవగుంట వద్ద మంగళవారం బోల్తా పడిన పచ్చాకు ట్రాక్టరు

అనుభవం లేని చోదకులు..

రెండు ప్రమాదాలకు కారణం ట్రాక్టరు చోదకులేనని స్పష్టమవుతోంది. పొలాల్లోని ఎగుడు దిగుడు మార్గాల నుంచి ప్రధాన రహదారిలోకి వచ్చే క్రమంలో అదుపు తప్పి బోల్తాపడ్డాయి. తక్కువ వేతనం, అనుభవం లేని చోదకులతో ట్రాక్టర్లను నడిపిస్తున్న ఉదంతాలు కోకొల్లలు. అత్యధికులకు కనీసం డ్రైవింగ్ లైసెన్సు లేకపోగా, అధిక శాతం ట్రాక్టర్లకు బీమా సైతం లేదు. ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణాపాయం జరిగితే బాధితులకు పరిహారం దక్కే అవకాశం కూడా లేకుండాపోతోంది. ఈ విషయమై ఉప రవాణాశాఖ కమిషనర్ సుశీల మాట్లాడుతూ రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఇళ్ల స్థలాలిచ్చేవరకు ఉద్యమిస్తాం

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురంలోని మాజీ సైనికులకు ఇంటి స్థలాలు ఇచ్చే వరకు ఉద్యమం ఆగదని మాజీ సైనికుల గృహ సొసైటీ అధ్యక్షుడు ఎం.చిన్నయ్య, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు హరినారాయణ రెడ్డి డిమాండు చేశారు. ఇంటి స్థలాలు మంజూరు చేయాలని స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం 200 మంది మాజీ సైనికులు మహాధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు.

మార్కాపురంలో తొలి అడుగు!

● 25న వెలిగొండ ఫీడరు కాలువ శంకుస్థాపనకు సీఎం చంద్రబాబు రాక

● బహిరంగ సభ ఏర్పాటు చేసే ఆలోచనలో జిల్లా అధికార యంత్రాంగం

ఫీడరు కాలువను పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ రాజాబాబు, జేసీ శ్రీనివాసులు, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు, అధికారులు

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కొత్త జిల్లాగా మార్కాపురం ప్రకటించారు.. వెలిగొండ ప్రాజెక్టు వచ్చే జూన్ నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. క్షేత్రస్థాయిలో పనులు మరింత వేగవంతం చేసి అభివృద్ధి పరుగులు పెట్టించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లా పర్యటనకు శ్రీకారం చుట్టారు. సీఎం రాకతో కొత్త జిల్లాపై వరాల జల్లు కురిపిస్తారని ఇక్కడి ప్రజలు భావిస్తున్నారు.

-ఈనాడు, ఒంగోలు, పెద్దదోర్నాల

వెలిగొండ ప్రాజెక్టు సొరంగం నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సొరంగాల నుంచి నల్లమల సాగర్ జలాశయానికి నీటిని తీసుకెళ్లే ఫీడరు కాలువ పనులకు ఈ నెల 25వ తేదీన శంకుస్థాపన చేసేందుకు సీఎం చంద్రబాబు రానున్నారు. సొరంగాల వద్ద పనితీరు పరిశీలించి గంటావానిపల్లెలో శిలాఫలకం ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. హెలీకాప్టర్‌లో ఫీడరు కాలువ వద్దకు చేరుకుని శంకుస్థాపన చేసి అక్కడే బహిరంగ సభ నిర్వహించే అవకాశాలు పరిశీలిస్తున్నారు. శంకుస్థాపనకు ఎంపిక చేసిన ప్రదేశం దోర్నాల-ఆత్మకూరు రహదారికి కిలోమీటరున్నర దూరంలో ఉంటుంది. అక్కడే బహిరంగ సభ నిర్వహిస్తే ఇబ్బందులు ఉండవనే ఆలోచనలో జిల్లా అధికార యంత్రాంగం ఉంది.

కొత్త జిల్లాలో ఇదే తొలి పర్యటన...

మార్కాపురం జిల్లా ఆవిర్భావం అనంతరం సీఎం చంద్రబాబును మార్కాపురం పర్యటనకు తీసుకొచ్చేందుకు పలు సందర్భాల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజాప్రతినిధులు ప్రయత్నించారు. సీఎం వేర్వేరు పర్యటనల్లో బిజీగా ఉండడం, అసెంబ్లీ నిర్వహణ నేపథ్యంలో సాధ్యం కాలేదు. ప్రాజెక్టుల పర్యటన చేపడుతున్నందున వెలిగొండ పర్యటనకు వచ్చినప్పుడు బహిరంగ సభ నిర్వహించాలనే ఆలోచనలో తెదేపా నాయకులు భావిస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కొత్త జిల్లా ప్రకటించిన విషయాన్ని ఘనంగా చాటాలనుకుంటున్నారు.

పర్యటన ప్రదేశాల పరిశీలన

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన నేపథ్యంలో దోర్నాల మండలం గంటవానిపల్లె సమీపంలోని ఫీడరు కాలువను బుధవారం ఇన్‌ఛార్జి కలెక్టర్ రాజాబాబు పరిశీలించారు. కాలువ లైనింగ్ పనులకు ముఖ్యమంత్రి భూమిపూజ చేయనుండటంతో ఆ ప్రాంతంలో చేపట్టాల్సిన చర్యలపై వెలిగొండ ప్రాజెక్టు ఎస్ఈ అబూతలీంతో చర్చించారు. సొరంగాల సమీపంలో ఉన్న హెలీప్యాడ్ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ముఖ్యమంత్రి అక్కడ నుంచి కొత్తూరు, గంటవానిపల్లె గ్రామాల మీదుగా ఫీడరు కాలువకు చేరుకుంటారని, రహదారి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయనవెంట జేసీ పి.శ్రీనివాసులు, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తదితరులున్నారు.

వేసవి విద్యుత్తు వెతలకు చెక్!

● అంతరాయాల్లేని సరఫరాకు చర్యలు

● వేసవి ప్రణాళికలో జిల్లాయంత్రాంగం

ఏటా వేసవి దృష్ట్యా పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువయ్యే కొద్దీ మార్చి నుంచి జులై వరకు విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరుగుతోంది. దీంతో అధిక లోడు కారణంగా విద్యుత్తు ఉప కేంద్రాలపై తీవ్రమైన ఒత్తిడి ఉంటుంది. తద్వారా తరుచుగా సాంకేతిక సమస్యలు తలెత్తి సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతుంటాయి. వీటిని అధిగమించేందుకు సంబంధిత శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. మార్చి నెలాఖరుకల్లా ఉప కేంద్రాలతోపాటు పరివర్తకాలను పూరిస్థాయిలో సిద్ధం చేసేందుకు మరమ్మతులు చేయిస్తున్నారు. - న్యూస్‌టుడే, కలెక్టరేట్

సింగిల్ ఫేజ్‌పై దృష్టి...

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 274 విద్యుత్తు ఉపకేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 98,898 పరివర్తకాలు ఉండగా, అందులో 12,907 సింగిల్ ఫేజ్ పరివర్తకాలు ఉన్నాయి. వేసవిలో ఎండల తీవ్రత పెరిగే కొద్దీ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శీతల యంత్రాలు, పంకాల వాడకం పెరుగుతోంది. తద్వారా విద్యుత్తు వినియోగం పెరగనుంది. గ్రామాలకు సైతం 24 గంటల పాటు నిరంతర సరఫరా చేయాలన్న ఉద్దేశంతో జిల్లా వ్యాప్తంగా ఆర్డీఎస్ఎస్ కింద ముమ్మరంగా పనులు జరుగుతున్నాయి. ఇప్పటివరకు ఒకే ఫీడరు కింద గృహాలకు, వ్యవసాయానికి విద్యుత్తు సరఫరా జరుగుతోంది. నష్ట నివారణ చర్యల్లో భాగంగా వ్యవసాయానికి ప్రత్యేక ఫీడర్లను ఏర్పాటు చేస్తున్నారు. అధిక లోడు కారణంగా అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా పరివర్తకాలు అమర్చుతున్నారు. రానున్న వేసవి దృష్ట్యా ఇప్పటికే వినియోగదారుల నుంచి ఫిర్యాదులందిన చోట సింగిల్ ఫేజ్‌తో పాటు త్రీఫేజ్ పరివర్తకాలు ఏర్పాటుకు ప్రణాళిక చేశారు. ఆ దిశగా మండల స్థాయిలో ఏఈలు ప్రతిపాదనలు తయారు చేయడంతోపాటు అవసరమైన సామగ్రి సరఫరా నిమిత్తం జిల్లా కార్యాలయానికి నివేదించారు.

ఒంగోలులోని గోదాంలో విద్యుత్తు పరివర్తకాలకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

రోజుకు 10 మి.యూ. వినియోగం

చలి కాలంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా వ్యాప్తంగా రోజుకు సరాసరిన 8.5 మిలియన్ యూనిట్ల విద్యుత్తు వినియోగం ఉండగా, ఎండల తీవ్రత దృష్ట్యా ఏప్రిల్, మే, జూన్‌లలో అత్యధికంగా 10 మి.యూ వినియోగం జరగనుంది. ప్రధానంగా రాత్రి వేళ ఇళ్లల్లో శీతల యంత్రాల వాడకంతో అధిక శాతం గ్రామాల్లో లోఓల్టేజీ సమస్య తలెత్తుతోంది. తద్వారా నాణ్యమైన విద్యుత్తు సరఫరా కావడం లేదు. పైగా సరఫరాలో హెచ్చుతగ్గులతో తరచూ ఇళ్లల్లోని గృహోపకరణాలు కాలిపోతున్నాయి. మరోపక్క వాడకం పెరిగే కొద్దీ పరివర్తకాల వద్ద ఫీజులు పోతున్నాయి. వీటన్నింటినీ అధిగమించేందుకు కార్యాచరణ ప్రణాళిక చేశారు. ఓవర్ లోడ్, లోఓల్టేజీ ఉన్న ప్రాంతాలను గుర్తించి, అదనపు సామర్థ్యంతో పరివర్తకాలను ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్తు సరఫరాకు సన్నద్ధమవుతున్నారు.

(c) eenadu

ఉపవాస దీక్షల జేబు కాలమానిని ఆవిష్కరిస్తున్న మంత్రి రవికుమార్

ముస్లింల సంక్షేమానికి పెద్దపీట

మేదరమెట్ల, అద్దంకి: మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ముస్లిం సోదరుల కోసం గొట్టిపాటి యూత్ రూపొందించిన ఉపవాస దీక్షల జేబు కాలమానిని ఆవిష్కరణలో ఆయన మాట్లాడుతూ..దుల్హాన్ పథకం అమలుతోపాటు హజ్ యాత్రకు సాయం అందిస్తున్నామన్నారు. ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనాలు చెల్లిస్తున్నట్లు వెల్లడించారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. ఐటీడీపీ నియోజకవర్గం అధ్యక్షుడు షేక్ కరీముల్లా, మసూద్, బాషా, ఖాదర్ మస్తాన్, మీరావలీ, ముక్తార్, తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు చేసుకోండి

చంద్రపాడులో శనగ విత్తనాలను పరిశీలిస్తున్న సంయుక్త కలెక్టర్ కల్పనా కుమారి

చీమకుర్తి, న్యూస్‌టుడే: రైతులు పంటల వివరాలను ఈ-పంటలో నమోదు చేసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ కల్పనా కుమారి సూచించారు. చీమకుర్తి మండలం చంద్రపాడును బుధవారం ఆమె సందర్శించి పొగాకు, శనగ పంటలను పరిశీలించారు. నూరు శాతం పంట నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని వ్యవసాయ శాఖకి ఆదేశాలు జారీ చేశారు. పొగాకు సాగు, పెట్టుబడి ఖర్చులు, దిగుబడులు, నాణ్యత తదితర విషయాలను రైతుల నుంచి అడిగి తెలుసుకున్నారు. పొగాకు బ్యారన్‌ను సందర్శించి క్యూరింగ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, సహాయ సంచాలకుడు రమేష్, ఈవో విజయ భాస్కర్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జీవో 36ను వెంటనే అమలు చేయాలి

ధర్నాలో పాల్గొన్న ఉద్యోగులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జీవో నం. 36 వెంటనే అమలు చేయడంతో పాటు, ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కారించాలని కోరుతూ ఏపీ వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక పీడీసీసీ బ్యాంకు వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.హనుమంతరావు మాట్లాడుతూ, 2019 నుంచి 2024 వరకు పెండింగ్‌లో ఉన్న వేతన సవరణలు చేయడంతో పాటు, అప్పటివరకు మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2019 తర్వాత సహకార సంఘాల్లో చేరిన ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు మనోజ్‌కుమార్, రామాంజనేయరెడ్డి, శ్రీకాంత్, రాజేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగుల సమ్మెకు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాలం సుబ్బారావు, ఎం.రమేష్ మద్దతు పలికారు.

సిబ్బంది కృషితో గ్రామాభివృద్ధి

పెద్దగుడిపాడులో స్థానికులతో మాట్లాడుతున్న పంచాయతీరాజ్ అధికారి వెంకటేశ్వరరావు

దొనకొండ, న్యూస్‌టుడే: సిబ్బంది పని తీరు మెరుగుపరుచుకుని గ్రామాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన దొనకొండ మండలంలోని గంగదేవిపల్లి గ్రామంలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. వానపాములతో వర్మీ కంపోస్ట్ ఎరువు తయారీ మండలంలో ఎక్కడా జరగకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తడి, పొడి చెత్త ఇళ్ల వద్దే వేరుచేసి వర్మీ కంపోస్టు ఎరువు తయారుచేసి రైతులకు విక్రయించడం ద్వారా ఆదాయం పొందాలని సూచించారు. పెద్దగుడిపాడులో స్థానికులతో మాట్లాడారు. చెత్త తరలిస్తున్నారా, వీధిలైట్లు వెలుగుతున్నాయా అని ఆరా తీశారు. దొనకొండ మండలంలో 46 శాతం మాత్రమే ఇంటి పన్నులు వసూలు చేశారని మార్చి 15లోపు వంద శాతం పూర్తిచేయాలన్నారు. చెత్త తరలింపునకు మూడు ట్రాక్టర్లు మంజూరయ్యాయని, వారంలో పంపిస్తానని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న దండు వీరయ్య మాదిగ, నాయకులు

దళితులపై దాడులు అరికట్టాలి

మార్కాపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో రోజు రోజుకు దళితులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, హత్యలను అరికట్టాలని.. ఆయా ఘటనల వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ అన్నారు. బుధవారం మార్కాపురంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక సప్తగిరి లాడ్జి నుంచి ర్యాలీగా కోర్టు కూడలిలోని సీపీఐ కార్యాలయం వరకు చేరుకున్నారు. ఆయన మాట్లాడుతూ దాడులు చేస్తున్న వారిపై కఠిన చట్టాలను అమలు చేయాలన్నారు. దళిత గిరిజన హత్యలపై విశ్రాంత న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాట్ల డేనియల్ మాదిగ, నాయకులు కె.భూషణం, జాన్, అనిల్‌కుమార్, రమేష్, మరియన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల దేవస్థానం
శ్రీశైలం-518101, నంద్యాల జిల్లా.

ఇ-ప్రొక్యూర్‌మెంట్-కం-బహిరంగవేలం ప్రకటన

ఆర్.సి.నెం.ఇ2/446969/2026, తేది: 17-02-2026

[illegible] తేది: 04-03-2026 [illegible]

[illegible] www.apeprocurement.gov.in [illegible]

సం/- యం.శ్రీనివాస రావు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ & కార్యనిర్వహణాధికారి

ప్లాస్టిక్ నిషేధం.. వన్య ప్రాణులకు అభయం

న్యూస్‌టుడే, పెద్దదోర్నాల:

నల్లమలలో పటిష్ఠ అమలుకు చర్యలు

ఉమ్మడి ప్రకాశానికి వరం నల్లమల. దీన్లో విభిన్న జీవరాశులున్నాయి. వీటిని జాగ్రత్తగా కాపాడుకోవడం అందరి బాధ్యత. ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతరాలు అడవుల్లో వేయకుండా చూడాలి. తద్వారా వన్యప్రాణులు జీవిస్తాయి. ఇందుకోసమే అటవీ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది.

పెద్దదోర్నాల అటవీశాఖచెక్ పోస్టు వద్ద సేకరించిన ప్లాస్టిక్ సీసాలు

స్వచ్ఛ సేవకులతో ఏరివేత

నాగార్జునసాగర్- శ్రీశైలం పులుల అభయారణ్యంలో వంద వరకు పులులు ఉన్నట్లు అంచనా.. వాటితో పాటు విభిన్న జీవరాశులు ఉన్నాయి. నల్లమల రహదారుల్లో ప్రయాణికులు వేసే ప్లాస్టిక్ సీసాలు, ఇతర వ్యర్థపదార్థాలను అవి తిని ప్రాణాలు కోల్పోతున్నాయి. వాటి ప్రాణాలకు హాని కలగకుండా ఉండేందుకు అటవీశాఖ అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ నిషేధానికి పటిష్ఠ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా పెద్దదోర్నాలలోని అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేసి ప్రయాణికుల వద్ద ఉన్న ప్లాస్టిక్ సీసాలను తీసి వేస్తున్నారు. అలాగే పెద్దదోర్నాల-శ్రీశైలం రహదారిలో 10 మంది స్వచ్ఛ సేవకులు ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరి పారేస్తున్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 8 నుంచి 18 వరకు శ్రీశైలంలో జరిగిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వెళ్లే వాహనాల నుంచి సేకరించిన ప్లాస్టిక్ సీసాలను పక్కకు పెట్టి, వ్యర్థాలను కాల్చివేశారు.

అపరాధ రుసుం విధింపు

నల్లమల రహదారిలో ప్లాస్టిక్ వ్యర్థాలు వేసే వారిపై అటవీశాఖ అపరాధ రుసుం వేస్తోంది. దీంతోపాటు క్రమశిక్షణా చర్యలు తీసుకుంటోంది. పెద్దదోర్నాల - శ్రీశైలం రహదారిలో చెత్తా చెదారాన్ని ఎక్కడంటే అక్కడ వేయకుండా మూడు కి.మీలకు ఒక చెత్తబుట్ట ఉంచారు. ప్రయాణికులు వారి వద్ద ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను వాటిలో వేయాలి. మూడు కి.మీల పరిధిలో ఒక స్వచ్ఛ సేవకుడు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విధులు నిర్వహిస్తున్నారు. వారు చెత్తాచెదారాన్ని సేకరించి చెత్తబుట్టలో వేస్తారు. వ్యర్థపదార్థాలను కాల్చి వేసి ప్లాస్టిక్ సీసాలను ఆటోలతో చెత్త నిల్వ కేంద్రానికి తరలిస్తున్నారు. సేకరించిన సీసాలను హైదరబాద్‌లోని రీసైక్లింగ్ కేంద్రానికి పంపుతున్నారు. అయితే అక్కడికి పంపేందుకు రవాణా ఖర్చు ఎక్కువ అవుతుండటంతో స్థానికంగా రీసైక్లింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచనలో అటవీ అధికారులు ఉన్నారు.

అందరూ ఉత్తీర్ణులయ్యేలా!

❖ పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

న్యూస్‌టుడే - కనిగిరి

పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా చదువులో వెనుకబడిన విద్యార్థులను సి, డి గ్రేడ్‌లుగా గుర్తించి... బాలికలకు కస్తూర్బా విద్యాలయాల్లో, బాలురకు జడ్పీ, ఇతర ఉన్నత పాఠశాలల్లో ఈ నెల 12 నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభించింది. మార్చి 12 వరకు ఇవి కొనసాగనున్నాయి.

విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో శ్రీనివాసరెడ్డి

185 మందికి ప్రత్యేక తరగతులు

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఇంటి వద్ద సరైన వసతి, మార్గదర్శనం చేసేవారు లేకపోవడంతో చదువులో వెనుకబడుతున్నట్లు గుర్తించారు. ఇలా గుర్తించిన 185 మందికి కనిగిరి, దర్శి, మార్కాపురం, కొత్తపట్నం, ఆలకూరపాడు, గిద్దలూరు, పొన్నలూరు, పొదిలి, వెలిగండ్ల తదితర పాఠశాలల్లో ప్రత్యేకంగా బోధన సాగిస్తున్నారు. విద్యార్థులు ఏ ఏ అంశాల్లో వెనుకబడుతున్నారో చూసి... ఆయా అంశాల్లో ఉపాధ్యాయుల ద్వారా ప్రత్యేకంగా తరగతులు నిర్వహిస్తున్నారు. భోజన సౌకర్యం సైతం కల్పిస్తున్నారు. విద్యార్థులు సైతం పట్టుదలగా చదువుతున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా కార్యాచరణ అమలు చేస్తున్నట్లు మార్కాపురం డిప్యూటీ డీఈవో ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: త్రోవగుంట సమీపంలో పొగాకు కూలీల ట్రాక్టర్ బోల్తా పడి గాయపడిన క్షతగాత్రులను జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ముప్పవరపు సుచిత్ర బుధవారం పరామర్శించారు. ఒంగోలులోని వెంకట రమణ వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చాట్లగడ్డ ఎమేలమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబానికి తెదేపా అండగా నిలిస్తుందన్నారు. కార్యక్రమంలో తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, నాయకులు శ్రీనివాసరావు, సునీల్, సుబ్బానాయుడు, కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నల్ల చెరకు సేద్యం.. లాభదాయకం

న్యూస్‌టుడే, కొనకనమిట్ల:

❖ ఆసక్తి చూపుతున్న రైతులు

వాతవరణంలో వస్తున్న మార్పులు, పెట్టుబడి వ్యయం పెరగడంతో మిరప, పొగాకు పంటల సాగు చేసే రైతుల సంఖ్య క్రమేణా తగ్గుతోంది. కొనకనమిట్ల మండలంలోని నల్లరేగడి భూములు అత్యధికంగా ఉన్న పెదారికట్ల గ్రామంలో రైతులు గతంలో మిరప, పొగాకు పంటలు సాగు చేసేవారు. నేడు వారంతా నల్ల చెరకు (తిరునాళ్ల చెరకు) సాగుకు మొగ్గు చూపుతున్నారు. చెరకు పెట్టుబడి వ్యయం ఎక్కువైనా లాభాలు అధికంగా ఉండటంతో 50 ఎకరాలు విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. గ్రామంలో చెరకు వ్యాపారంతో 50 మంది జీవనం సాధిస్తున్నారు.

నాటేందుకు ప్రత్యేకంగా పెంపకం

నల్లచెరకు సాగు కోసం ముందుగా ఎంచుకున్న పొలంలో దున్నిన దుక్కిలో ట్రాక్టర్ అమర్చిన ప్రత్యేక గొర్రుతో సాళ్లు చేస్తారు. కిందటి ఏడాది పంటలో ఎకరాకు వెయ్యి గడలను కోయకుండా పొలంలో నాటేందుకు అవసరమైన రీతిలో ప్రత్యేకంగా పెంచుతారు. అలా పెరిగిన చెరకు గడలను ముక్కలుగా చేసి సిద్ధం చేసిన భూమిలో సాళ్లకు నీరు పెట్టి నాటుతారు. ఒక వరసలో నాటే ముక్కల మధ్య అడుగు దూరం ఉండేలా చూసుకుంటారు. విత్తిన దగ్గర నుంచి ఏపుగా పెరిగేందుకు చెరకు తోటలో మొక్కల అడుగు భాగంగా ఆకులను తొలగిస్తారు. ఇలా చేయడం వల్ల పెద్ద కణుపులు వచ్చి ఏపుగా పెరిగే అవకాశం ఉంది. పంట చేతికందే దశలో పలువురు సొంతంగా విక్రయించుకుంటారు.

❖ ఎకరాకు రూ.లక్ష దాకా ఆదాయం

రైతులు యాజమాన్య పద్ధతిలో నల్ల చెరకును ఎనిమిది నెలల పాటు పెంచుతారు. ఎకరాకు కనీసం 25వేలు మొక్కలు పెరిగేలా చర్యలు చేపడతారు. వాటిలో ఎకరాకు కనీసం 21 వేల మొక్కలు చేతికందుతాయి. అలా పెంచిన పంటను కూలీలతో నరికించి పది గడల చొప్పున ఒక కట్టగా కడతారు. ట్రాక్టరులో తిరునాళ్లు జరిగే ప్రదేశాలకు తరలించి అమ్మకాలు చేస్తారు. ఇటీవలి తిరునాళ్లలో గడ ఒక్కింటికి రూ.20 చొప్పున అమ్మకాలు చేశారు. ఇలా విక్రయించినా అత్యధికంగా ఎకరాలకు రూ.4లక్షలు పైగా, అత్యల్పంగా రూ.3లక్షలు ఆదాయం వస్తుందని కొందరు రైతులు తెలిపారు. అన్ని ఖర్చులు పోను ఎకరానికి సగటున సుమారు రూ.లక్ష దాకా ఆదాయం వస్తుందని స్థానిక రైతు వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రభుత్వం ఈ పంట సాగుకు తగిన ప్రోత్సాహకాలు అందించాలని రైతులు కోరుతున్నారు.

పెదారికట్లలో ఏపుగా పెరిగిన చెరకు తోట

వేధింపులపై డీఎస్పీ విచారణ

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: గతంలో ఒంగోలు రూరల్ సీఐగా పనిచేసిన ఎన్.శ్రీకాంత్ బాబు విధుల పేరుతో మహిళా సిబ్బందిని వేధింపులకు గురిచేశాడని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్‌లో మహిళా సిబ్బందిని బుధవారం విచారించారు. వారి వద్ద నుంచి వివరాలు నమోదు చేశారు.

ఉగాదికి పక్కా గృహాలు

లబ్ధిదారుల సమస్యలు తెలుసుకుంటున్న డీఈ చెన్నంరాయుడు, ఎంపీడీవో రాజశేఖర్

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉగాది నాటికి పక్కాగృహాల నిర్మాణ పనులు పూర్తి చేయాలని గృహ నిర్మాణశాఖ ఒంగోలు డీఈ చెన్నంరాయుడు ఆదేశాలు జారీ చేశారు. ఒంగోలు మండలం గుండాయపాలెం గ్రామంలో జరుగుతున్న గృహ నిర్మాణాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉగాది రోజున ఒంగోలు నియోజకవర్గంలో 605 ఇళ్లల్లో సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేస్తున్న అదనపు ఆర్థికసాయం గురించి వివరించారు. మార్చి నెలాఖరులోపు పూర్తి చేసినవారికి తక్షణమే బిల్లులు రానున్నట్లు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖర్, గృహనిర్మాణశాఖ మండల ఏఈ మనోజ్ పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో జైలు శిక్ష

ఒంగోలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే: బాకీ చెల్లించే నిమిత్తం ఇచ్చిన చెక్కు కేసులో నిందితుడు ఒంగోలుకు చెందిన ఎ.శ్రీనివాస్‌కు ఒంగోలు మొబైల్ న్యాయస్థానం న్యాయమూర్తి వి.వెంకటేశ్వరరావు జైలుశిక్ష విధించారు. నిందితుడు తన అవసరాల నిమిత్తం ఒంగోలుకే చెందిన ఎస్కే చాంద్ బాషా దగ్గర రూ.8 లక్షలు అప్పు తీసుకొని ప్రామిసరీ నోట్లు రాసిచ్చాడు.. అప్పు చెల్లించకపోవటంతో బాషా కోర్టులో కేసు దాఖలు చేశారు. ఇరువురు లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్నారు. ఇందులో భాగంగా రూ.10 లక్షలు చెల్లించటానికి శ్రీనివాస్ అంగీకరించి చెక్కులు ఇచ్చాడు. వాటిని నగదుగా మార్చుకునేందుకు ప్రయత్నించగా చెల్లలేదు. విషయాన్ని లాయరు నోటీసు ద్వారా తెలిపినా నిందితుడి నుంచి సరైన స్పందన లేకపోవటంతో ఆయన కోర్టులో ఫిర్యాదు చేశారు. విచారించిన జడ్జి నిందితునిపై నేరం రుజువైనందున ఏడాది జైలుశిక్ష విధించారు. రూ.15 లక్షలు జరిమానా వేశారు.

విద్యుత్తు చౌర్యంపై కేసులు

మాట్లాడుతున్న విద్యుత్తు అధికారి వెంకటేశ్వర్లు

కొనకనమిట్ల, న్యూస్‌టుడే: కొనకనమిట్ల మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న విద్యుత్తు చౌర్యం, అనధికారిక కనెక్షన్లపై ఆ శాఖ విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. దర్శి డీఈఈ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 33 బృందాలుగా ఏర్పడి అధికారులు విస్తృత తనిఖీలు చేశారు. 50 కేసులు నమోదు చేసి రూ.3,03,000 అపరాధ రుసుం విధించారు. అనంతరం జిల్లా విద్యుత్తు అధికారి వెంకటేశ్వర్లు పాల్గొని సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. దాడులో డీపీఈ హైమావతి, ఏడీ హరిబాబు, ఏఈ బ్రహ్మం, సిబ్బంది పాల్గొన్నారు.

కత్తితో యువకుడిపై దాడి

కొనకనమిట్ల, న్యూస్‌టుడే: నాయుడుపేటలో బుధవారం మౌలాలి అనే యువకుడిపై చౌటపల్లెకు చెందిన లాజర్ కత్తితో దాడిచేసినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం సాయంత్రం ఇరువురి మధ్య వాగ్వివాదం జరిగి లాజర్ కత్తితో దాడిచేయడంతో మౌలాలికి మెడకు, వీపునకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని పొదిలి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. ఆసుపత్రిలో పోలీసులు క్షతగాత్రుని వద్ద నుంచి సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొనకనమిట్ల స్టేషన్ రైటర్ మురళి తెలిపారు. వివాహేతర సంబంధమే ఈ దాడికి కారణంగా పోలీసులు అనుమానిస్తున్నారు.

చిన్న వయసులోనే వినికిడి లోపాలు గుర్తించండి

విద్యార్థులకు వినికిడి పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రభాకరరావు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: వినికిడి లోపాలను చిన్న వయసులోనే గుర్తించడం ద్వారా తక్షణం వైద్యం పొందవచ్చని జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎస్.మాణిక్యరావు సూచించారు. ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈఎన్‌టీ విభాగం ఆధ్వర్యంలో బండ్లమిట్ట బాలికోన్నత పాఠశాల్లో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 100 మంది విద్యార్థులకు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినికిడి సమస్య వచ్చినప్పుడు వైద్యుల సలహా పాటించడం ద్వారా 90 శాతం తగ్గే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ప్రభాకర్‌రావు, పి.రాంబాబు, కవిత, కిరణ్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

9లోపు ఓటర్ల జాబితా సిద్ధం చేయండి

మాట్లాడుతున్న డీపీవో ఎం.వెంకటేశ్వరరావు

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: అసెంబ్లీ ఓటర్ల జాబితా ఆధారంగా మార్చి 9వ తేదీ లోపు గ్రామ పంచాయతీ ఫొటో ఎన్నికల జాబితాలను కచ్చితంగా సిద్ధం చేయాలని డీపీవో ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా తయారీపై స్థానిక ప్రకాశం భవన్‌లో బుధవారం ప్రకాశం, మార్కాపురం జిల్లాలోని డిప్యూటీ ఎంపీడీవో, గ్రామ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో తప్పిదాలకు తావు లేకుండా జాబితాలు పరిశీలించాలన్నారు. జాబితాల తయారీలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలను తప్పకుండా పాటించాలని సూచించారు. ఇంటి నంబరు, కుటుంబం ప్రాతిపదికన తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. డీఎల్‌డీవోలు శ్రీనివాసరెడ్డి, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వీఆర్‌ఏలు

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించడంతోపాటు, కనీస వేతన చట్టం కింద నెలకు రూ.26 వేలు చొప్పున ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తూ ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల జిల్లా సంఘం ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు మాట్లాడుతూ.. తక్కువ జీతాలతో కుటుంబ పోషణ ఎలా గడవాలని ప్రశ్నించారు. వీఆర్‌ఏలు తమ సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పని భారం తగ్గించడంతోపాటు, సీనియారిటీ ప్రాతిపదికన వీఆర్వో, అటెండర్లుగా ఉద్యోగోన్నతి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు స్వాములు, సురేష్, పురుషోత్తం, పున్నారావు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నుడాలో రూ.32.50 కోట్ల పనులకు ప్రతిపాదనలు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నుడా పరిధిలో రూ.32.50 కోట్ల పనులకు ప్రతిపాదనలు వచ్చినట్లు జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం నుడా కార్యాలయంలో ఆ సంస్థ ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని మొదటి స్థానంలో నిలపేందుకు అధికారులంతా సహకరించాలని సూచించారు. నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ కందుకూరు, కావలి ఎంఐజీ లేఅవుట్ల అభివృద్ధికి టెండర్లు పిలిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

‘చలో విజయవాడ’ జయప్రదానికి పిలుపు

గోడ పత్రాలను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ జిల్లా నాయకులు

ఒంగోలు గ్రామీణం: విద్యార్థుల ఉపకార వేతనాల బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ 27వ తేదీన నిర్వహించనున్న చలో విజయవాడను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక మాదాల నారాయణస్వామి భవన్‌లో బుధవారం గోడ పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థుల ఉపకార వేతనాలకు పెనుశాపంగా మారిన జీవో నం.77ను రద్దు చేయాలని కోరారు. ఫీజుల బకాయిల కారణంగా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సిసింద్రీ, శ్యామ్, కోటి తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 120, రిటైల్ లైవ్ - 142, చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్- 234

EENADU Classifieds

PERSONAL CLASSIFIEDS

BIRTHDAY GREETINGS

పుట్టిన రోజు శుభాకాంక్షలు
మా ఇంటి బంగారం చిరంజీవి
పిట్టముడుసు
డినేష్ కార్తీక్ కు
పుట్టిన రోజు శుభాకాంక్షలు.
ఇటువంటి వేడుకలు
మరెన్నో జరుపుకోవాలని
మనసారా కోరుకుంటూ..
అమ్మ-నాన్న:
రాజ్యలక్ష్మి-రవితేజ
అక్క: హిమవర్షిణి
నాయనమ్మ-తాత:
రామలక్ష్మి-అంకారావు
(సంతమాగులూరు, ప్రకాశం)
సెల్ నెం: 9966 936 111

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

BUSINESS OFFER

Running 30Bedded Hospital Lease@ MiryalagudaTown, Nalgonda. For Obstetrics, Urology, Pediatrics, Ortho-Physician. 9848231654

PEOPLE CARE

OLD AGE HOME

డా॥లక్ష్మీప్రియాంక వానప్రస్థ వృద్ధాశ్రమం, సూరారెడ్డిపాలెం, టంగుటూరు (మం), ఒంగోలు. ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన మంచి వాతావరణంలో అందరికి అందుబాటులో నిర్మించబడిన వృద్ధాశ్రమం. బెడ్ పేషెంట్స్‌కు ప్రత్యేక వసతులు కలవు. Cont: 7095870566, 9912147879.

REAL ESTATE

PLOT FOR SALE

ఒంగోలు, మంగమూరు రోడ్డు SKY బాక్స్ క్రికెట్ గ్రౌండ్ దగ్గర 20 గదుల ప్లాట్స్ అమ్మకమునకు కలవు. Cell: 99891 89598.

JOBS

Wanted Hostel Wardens (Male/ Female) & Floor Incharge in SIMS Group of Institutions Hostels, Contact No. 9701666645 & 6304777593.

VEEDOL ENGINE OIL కంపెనీకి ఆథరైజ్డ్ డిస్ట్రిబ్యూటర్స్ ఆఫీసు నందు ఒంగోలులో పనిచేయుటకు ERP TALLYలో అనుభవంకల అకౌంటెంట్ కావలెను. ✆93346 69999

డా॥లక్ష్మీప్రియాంక వానప్రస్థ వృద్ధాశ్రమం, సూరారెడ్డిపాలెం, టంగుటూరు (మం), ఒంగోలు. కంప్యూటర్ ఆపరేటర్స్ మరియు భార్యాభర్త కేర్ టేకర్స్ కావలెను. Cont: 70958 70566, 99121 47879

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసు కొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ:18-20K ✆ 96404 68899, 96402 58899

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్, హాస్టల్ ఇన్‌ఛార్జీస్‌గా పనిచేయుటకు స్త్రీలు కావలెను. జీతం: 10000/- నుండి 13000/- వరకు ఇవ్వబడును (ఉచిత భోజన వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సం||ల పైన ఉండవలెను. వివరాలకు సంప్రదించగలరు. ఫోన్ నెం: 92487 33340.

ప్రముఖ టోల్ ప్లాజా నందు 10th-PG గల కంప్యూటర్ ఆపరేటర్ క్యాషియర్ కావలెను. 8 గం||ల డ్యూటీ, భోజనం + వసతి ఉచితం. ✆ 63095 36439

ఒంగోలులో షాపింగ్‌మాల్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ (యువతి/ యువకులు) హౌస్ కీపింగ్ లేడీస్ కావలెను. జీతం: 12to15వేలు, డ్యూటీ: 12గం|| ✆ 8179695848

SECURITY GUARDS

Secur Security Services. టంగుటూరు పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీ SO లు మరియు ASO లు కావలెను. ✆ 9959598279

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు చెబుతున్న లేదా చేసు కుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కందుకూరు

• కందుకూరు • కొండపి

రూ.లక్షల ఖర్చు.. ఏం సాధించినట్టు?

వలేటివారిపాలెం, న్యూస్‌టుడే: మండలంలో 21 పంచాయతీలుండగా 16 చోట్ల గతంలో సంపద సృష్టి కేంద్రాలు ఏర్పాటు చేశారు. బడేవారిపాలెం, శ్రీమీరపాలెం(?), అంకభూపాలపురం వంటి చోట్ల స్థల సమస్యతో వాటి పనులు నిలిచిపోగా.. కొండారెడ్డిపాలెం, అయ్యవారిపల్లెల్లో పిల్లర్ల దశలో ఆగిపోయాయి. డంపింగ్ యార్డుల్లో మౌలిక వసతులకు ఆర్థిక సంఘం నిధులు వెచ్చించేందుకు కూటమి ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో రూ.లక్షలు ఖర్చు చేశారు. అయితే ఆయా గ్రామాల్లో క్లాప్ మిత్రలు ఇంటింటికి తిరిగి తడి, పొడి వ్యర్థాలను సేకరిస్తున్నారు. అయితే వాటిని కేంద్రాలకు తరలించకుండా రహదారుల పక్కనే పడేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● అమ్ముపాలెం పంచాయతీలో నిధులు ఖర్చు చేసినా ప్రయోజనం శూన్యమని స్థానికులు అంటున్నారు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన సంపద సృష్టి కేంద్రాన్ని నిరుపయోగంగా వదిలేశారంటున్నారు. దీనికి సంబంధించి 2025 జూన్‌లో మూడు దఫాలుగా గుత్తేదారుడికి రూ.2,90,497 చెల్లించారు. ఆ నిధులతో కేంద్రానికి ఇనుప గేటు, మట్టి ముగ్గు(?) కంచె ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి చెత్త నుంచి ఒక్క కిలో వర్మీకంపోస్టు తయారు చేయలేదు. క్లాప్ మిత్రలు ఇద్దరికి రూ.12 వేలు వేతనం కింద చెల్లిస్తున్నారు. అయితే వారు సేకరించిన వ్యర్థాలను కేంద్రానికి సమీపంలోనే దహనం చేస్తున్నారు.

అమ్ముపాలెంలోని సంపద సృష్టి కేంద్రం

వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు

సంపద సృష్టి కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పలుచోట్ల నాడెప్ తొట్టెలు లేకపోవడంతో సేకరించిన వ్యర్థాలను క్లాప్ మిత్రలు గ్రామ శివారుల్లో వేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. అన్నిచోట్ల వాటిని నిర్మించి వ్యర్థాలు వాటిల్లో వేసేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఇప్పటికే ఆదేశించా.
-శంకరరావు, ఎంపీడీవో

అర్జీల పరిష్కారానికి పకడ్బందీ వ్యవస్థ

ముఖాముఖి

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే:

రెవెన్యూ సమస్యలపై ప్రతి సోమవారం డివిజనల్ కార్యాలయానికి అందే అర్జీల వివరాలను ఆన్‌లైన్ చేసే వ్యవస్థను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు సబ్ కలెక్టర్ డి.హిమవంశీ తెలిపారు. తద్వారా ఒక వ్యక్తి ఒకే సమస్యపై ఎన్నిసార్లు కార్యాలయానికి వచ్చారనే సమాచారం తెలుస్తుంది. అందుకు అనుగుణంగా సంబంధిత అధికారితో మాట్లాడి పరిష్కరించేందుకు వీలుంటుంది. ప్రజలను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పదేపదే తిప్పుకోకూడదన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం రూపొందించినట్లు చెప్పారు. డివిజన్ పరిధిలో అమలవుతున్న పలు కార్యక్రమాల గురించి 'న్యూస్‌టుడే'తో ఆయన బుధవారం ప్రత్యేకంగా మాట్లాడారు.

సబ్ కలెక్టర్ హిమవంశీ

త్వరలోనే ఓడరేవు పనుల పూర్తి

జిల్లా అభివృద్ధిలో కీలకమైన రామాయపట్నం ఓడరేవు పనుల్లో భాగంగా ప్రస్తుతం బెర్త్‌ల నిర్మాణం, డ్రెడ్జింగ్ వంటివి జరుగుతున్నాయి. మరో 6 నెలల్లో పనులు పూర్తవుతాయి. ఓడరేవు కోసం భూములు ఇచ్చిన ఆవులవారిపాలెం, మొండివారిపాలెం గ్రామాలకు చెందిన 200 కుటుంబాలకు పునరావాస కాలనీలు ఏర్పాటు చేశాం. కర్లపాలెం, సాలిపేట గ్రామాలకు చెందిన మరో 450 కుటుంబాలకు సంబంధించిన పనులు పురోగతిలో ఉన్నాయి. 2021 ఫిబ్రవరి నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం అందజేస్తాం.

పరిశ్రమల హబ్‌కు భూసేకరణ

ఓడరేవుకు అనుబంధంగా పరిశ్రమలు రానున్నాయి. ఇప్పటికే ఇండోసోల్, బీపీసీఎల్, కార్గో టెర్మినల్ వంటి పరిశ్రమల ఏర్పాటుకు ఆమోదం లభించింది. బీపీసీఎల్‌కు 6వేల ఎకరాలు అవసరం కాగా గుడ్లూరు మండలం చేవూరు పరిధిలో 2300, రావూరులో 1350 ఎకరాలు సేకరించాం. ఇండోసోల్‌కు ఉలవపాడు మండలం కరేడు ప్రాంతంలో 4830 ఎకరాలకు నోటిఫికేషన్ ఇచ్చాం. రైతుల నుంచి ఇప్పటికే 1200 ఎకరాలు సేకరించి పరిహారం కూడా చెల్లించాం. ఇంకా ఎవరైనా భూములిచ్చేందుకు ముందుకొస్తే వెంటనే నగదు చెల్లిస్తాం. వలేటివారిపాలెం మండలంలో ఎంఎస్ఎంఈ పార్కు కోసం భూములు సిద్ధం చేస్తున్నాం.

రీసర్వే సమస్యలకు పరిష్కారం

డివిజన్ పరిధిలోని 7 మండలాల్లో 55 గ్రామాల్లో రీసర్వే పూర్తయింది. 14 గ్రామాల్లో జరుగుతోంది. రీసర్వే పూర్తైన చోట విస్తీర్ణాలు తగ్గాయని రైతుల నుంచి అర్జీలు అందుతున్నాయి. వాటిని పరిష్కరిస్తున్నాం. డివిజన్‌లో ఎక్కువగా సర్వే, ఆక్రమణలు, 22ఏ తొలగింపుపై సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులొస్తున్నాయి.

రాళ్లపాడు నీటి మట్టం 15.5 అడుగులు

లింగసముద్రం, న్యూస్‌టుడే: రాళ్లపాడు జలాశయం నీటి మట్టం 15.5 అడుగులకు తగ్గింది. కుడి, ఎడమ కాలువల పరిధిలో ఆయకట్టులో సాగుచేసిన పంటలకు 100, 15 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. 116 గ్రామాల తాగునీటి అవసరాల నిమిత్తం 7 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

విద్యార్థి మృతిపై సమగ్ర విచారణకు డిమాండ్

పామూరు: సింగరాయకొండలోని కోచింగ్ సెంటర్‌లో విద్యార్థి తౌషిక్(?) మృతి ఘటనపై ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకుడు దేవరాజు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పామూరులో బుధవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. ఉన్నతాధికారులతో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కోన్స్‌తో సరిపెట్టారు

సింగరాయకొండ-టంగుటూరు మార్గంలో ఇలా..

టంగుటూరు, న్యూస్‌టుడే: సింగరాయకొండ నుంచి టంగుటూరు వచ్చే మార్గంలో 16వ నంబరు జాతీయ రహదారిపై అండర్‌పాస్ వద్ద గుంతలు పడటంతో గతేడాదిగా రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ మార్గంలో నెల్లూరు, కావలి, తిరుపతి, కందుకూరు, పామూరు, కడప, ఒంగోలు ప్రాంతాలకు నిత్యం వేల సంఖ్యలో వాహనాలు వెళుతుంటాయి. భారీ గుంతను చోదకులు గుర్తించకపోవడంతో కుదుపునకు గురవుతున్నారు. దీంతో ఒళ్లు హూనమవడమే కాకుండా వాహనాలు సైతం దెబ్బతింటున్నాయి. రాత్రి వేళ పరిస్థితి మరీ ప్రమాదకరంగా ఉంటోందని వాపోతున్నారు. దీంతో ఆ ప్రాంతంలో జాతీయ రహదారి సిబ్బంది రెండు కోన్స్‌ను హెచ్చరికగా ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

చిన్న కేసులను సైతం ఒంగోలు పంపొద్దు

సిబ్బందితో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ లక్ష్మీకుమారి, నోడల్ అధికారి సూరిబాబు

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని డీసీహెచ్ఎస్ లక్ష్మీకుమారి తెలిపారు. కొండపి సీహెచ్‌సీని బుధవారం ఆమె తనిఖీ చేశారు. ముందుగా వైద్యశాల ఆవరణలో జరుగుతున్న పనులను పరిశీలించారు. వార్డులను తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆసుపత్రికి వచ్చిన రోగులకు ధైర్యం చెప్పాలన్నారు. స్వల్ప అస్వస్థతో వచ్చిన వారిని ఒంగోలు పంపడం సరికాదన్నారు. వైద్యుడికి కేటాయించిన సమయంలో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలన్నారు. అత్యవసర సమయంలో వినియోగించేందుకు వీలుగా సీహెచ్‌సీలో రక్తం భద్రపరిచేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో డయాలసిస్ కేంద్రం కూడా మంజూరు కానుందన్నారు. గుండె సెక్షన్(?) వేరే ఒంగోలు పంపాలని సీహెచ్‌సీ వైద్యాధికారిణి నాగమణికి సూచించారు. అదే విధంగా వైద్యశాల గేట్ వద్ద నుంచి మార్చురీ గది వరకు సీసీ రోడ్డు నిర్మాణం, ప్రహరీ ఎత్తుపెంచేలా మంత్రి బాల వీరాంజనేయస్వామి నివేదిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి సూరిబాబు, కొండపి సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేత సంతోష్‌నగర్ డైనమిక్స్

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: కందుకూరు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఆరంభ(?) సీజన్ విజేతగా సంతోష్‌నగర్ డైనమిక్స్ జట్టు నిలిచింది. పట్టణంలోని ఏఎంసీ మైదానంలో జనవరిలో ప్రారంభమైన టోర్నమెంట్ ఫైనల్ సంతోష్‌నగర్, ఎస్ఎస్ఆర్ జట్ల మధ్య బుధవారం హోరాహోరీగా జరిగింది. విజేతకు రూ.లక్ష, ద్వితీయ స్థానంలో నిలిచిన ఎస్ఎస్ఆర్‌కు రూ.60వేలు నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు కె.చిరంజీవి, జలీల్, మస్తాన్‌వలి, నాయబ్‌రసూల్, నాగరాజు, తహసీన్ పాల్గొన్నారు.

విజేతగా నిలిచిన జట్టు

స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించాలి

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరాయకొండ ప్రధాన రహదారిని ఆక్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చట్టపరమైన చర్యలు చేపడతామని ఎస్సై మహేంద్ర హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్ వద్ద బుధవారం సాయంత్రం చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రధాన రహదారి విస్తరణ పనులు చేపట్టిన నేపథ్యంలో ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలని సూచించారు.

చిరు వ్యాపారులను హెచ్చరిస్తున్న ఎస్సై మహేంద్ర

పంచాయితీల్లో ఏకీకృత సర్వే తీరుపై ఆరా

వలేటివారిపాలెం, న్యూస్‌టుడే: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు చేరువ చేసే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఏకీకృత కుటుంబ సర్వేను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీవో వై.శంకరరావు అన్నారు. బుధవారం మండలంలోని బడేవారిపాలెం, నేకునాంపురం స్వర్ణ గ్రామ కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా గ్రామాల్లో సర్వే తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత సమయానికి పూర్తిచేయాలని ఆదేశించారు. ఇంటి పన్నుల వసూలు, పారిశుద్ధ్య పనులు తదితర అంశాలపై ఆరా తీసి, పలు సూచనలు చేశారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో రాంబాబు ఉన్నారు.

బాల్య వివాహాల నిరోధంపై అవగాహన

పొన్నలూరు, న్యూస్‌టుడే: స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ రిజ్వానా ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిరోధంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు.. పిల్లల చదువు, ఆరోగ్యం, శారీరక-మానసిక ఎదుగుదలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయన్నారు. బాలికల తల్లిదండ్రులు చట్టాలను గౌరవించి పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు 'గుడ్ టచ్-బ్యాడ్‌టచ్'పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వై.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

గుడ్లూరు, న్యూస్‌టుడే: ప్రజలకు అందించిన సేవలతోనే మంచి గుర్తింపు లభిస్తుందని గుడ్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి రమ్య అన్నారు. మండల వైద్యాధికారిణిగా పనిచేసిన సాయి ప్రియాంక బదిలీపై నెల్లూరు వెళ్తుండటంతో బుధవారం ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా రమ్య మాట్లాడుతూ మూడేళ్లుగా మండలంలోని ప్రజలకు ఆసుపత్రి ద్వారా సాయి ప్రియాంక ఉత్తమ సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సుబ్బారావు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యాధికారిణి సాయి ప్రియాంకను సన్మానించిన సిబ్బంది

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

కందుకూరు: 70939 81624
కొండపి: 96424 56296

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

పొన్నలూరు, న్యూస్‌టుడే

?:పొన్నలూరు ఎస్టీ కాలనీలో విద్యుత్తు దీపాలు సరిగా వెలగడం లేదు. దీంతో రాత్రి సమయంలో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. -అంకయ్య, స్థానికుడు

✓: మరమ్మతులు చేయించి.. సమస్య పరిష్కరిస్తాం. -ఎం.నారాయణ, పంచాయతీ కార్యదర్శి

జరుగుమల్లి, న్యూస్‌టుడే:

?: జరుగుమల్లి సచివాలయానికి పక్క వీధిలో మురుగు కాలువలు లేకపోవడంతో వాడకం నీరు రోడ్డుపైకి వస్తోంది. -వెంకట్రావు, స్థానికుడు

✓:కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. -విద్యులత, పంచాయతీ కార్యదర్శి

లింగసముద్రం, న్యూస్‌టుడే

?: లింగసముద్రంలో మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. -మురళి, స్థానికుడు

✓:త్వరలో సిబ్బందిని నియమించి, చెత్త తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. -శ్రీనివాసులు, ఈవోపీఆర్డీ

వలేటివారిపాలెం, న్యూస్‌టుడే

?: మండలంలోని బొంతవారిపాలేనికి 15 రోజులుగా సీసీ ప్రాజెక్టు నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. -నాగరాజు, స్థానికుడు

✓: గుత్తేదారుడితో మాట్లాడి తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటాం. -రాజశేఖర్, ఇన్‌ఛార్జి జేఈ, ఆర్‌డబ్ల్యూఎస్

మర్రిపూడి, న్యూస్‌టుడే

?: కాకర్ల పంచాయతీ శివరాయునిపేట బీసీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి పూట చీకట్లో తిరగాల్సి వస్తోంది. -కోటయ్య, స్థానికుడు

✓: పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి వీధి దీపాలు బాగు చేయిస్తాం.-నాగూర్‌వలీ, ఎంపీడీవో

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే

?: పట్టణంలోని ఏఎంసీ కార్యాలయం పక్కన విప్పగుంటరోడ్డులో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. -ప్రేమ్‌కుమార్, స్థానికుడు

✓: కుక్కల బెడద తొలగింపునకు చర్యలు తీసుకుంటాం.- కె.అనూష, మున్సిపల్ కమిషనర్

గుడ్లూరు, న్యూస్‌టుడే

?: మండలంలోని స్వర్ణాజిపురం చర్చి వీధిలో సిమెంట్ రహదారిపై మురుగు ప్రవహిస్తోంది. -యశ్వంత్

✓: పారిశుద్ధ్య కార్మికులకు తెలిపి సమస్య పరిష్కరిస్తాం. -చిన్నయ్య, పంచాయతీ కార్యదర్శి

పూడిక తీయక.. మురుగు పారక!

జరుగుమల్లి, న్యూస్‌టుడే: మండలంలోని బిట్రగుంటలో కొంత కాలంగా పారిశుద్ధ్యం పడకేసింది. కాలువలను సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త పేరుకుపోయాయి. తద్వారా మురుగు నిలుస్తోంది. ఈ కారణంగా దుర్వాసనతో పాటు దోమలు వృద్ధి చెంది.. అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను అధికారులకు పలుమార్లు విన్నవించినా.. పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

తాగునీరు కాలువ పాలు!

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది పుణ్యమా అని ఎంతో విలువైన తాగునీరు వృథాగా కాలువ పాలవుతోంది. ఏఎంసీ కార్యాలయ ఆవరణలో ఉన్న ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిండిన వెంటనే మోటార్లు ఆపకపోవడంతో భారీగా వృథా అయి కాలువ ద్వారా చాకలికుంటకు చేరుతోంది. దీంతో కుంట నిత్యం నిండుకుండలా మారుతోంది. ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పనితీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బండిపై నినాదాం.. నిండా నిర్లక్ష్యం!

సింగరాయకొండ గ్రామీణం: సింగరాయకొండలో కందుకూరు రోడ్డు సమీపంలోని ప్రార్థనా మందిరం వద్ద చెత్తాచెదారంతో నిండిన వాహనం గత నెల రోజులుగా దర్శనమిస్తోంది. పారిశుద్ధ్య కార్మికులు సేకరించిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి సంపద కేంద్రానికి తరలించాలని అధికారులు సమావేశాల్లో చెప్పే మాటలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. వాహనాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో దుర్వాసన వస్తోందని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. మురుగు కాలువలు సైతం నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో పిచ్చి మొక్కలు పెరిగిపోయి రాత్రి సమయంలో పాములు, కీటకాలు సంచరిస్తూ నివాసాల్లో వస్తున్నాయి. దీంతో అటుగా వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఈవోపీఆర్డీ రమేష్‌బాబును మాట్లాడుతూ చెత్త తొలగించి కాలువలు శుభ్రం చేయిస్తామని చెప్పారు.

తీరం.. శనగపచ్చ హారం!

ఉలవపాడు, న్యూస్‌టుడే: ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో తీర ప్రాంత ఇసుక నేలల్లో సాగు చేసిన వేరుశనగ పచ్చని తివాచీని తలపిస్తూ పర్యాటకులను కనువిందు చేస్తోంది. సుమారు నాలుగు కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉన్న తీరంలో.. పలు గ్రామాల పరిధిలో 1200 ఎకరాల్లో వేరుశనగ సాగవుతోంది. సేద తీరేందుకు అలగాయపాలెం బీచ్‌కు వచ్చే వారికి చల్లటి గాలి, ఆహ్లాదం పంచుతోంది.

బాలిక వైద్య చికిత్సకు సాయం

గుడ్లూరు, న్యూస్‌టుడే: గత శనివారం జరిగిన రహదారి ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్వర్ణాజిపురం గ్రామానికి చెందిన బాలిక అవంతికకు పలువురు దాతలు సాయం చేస్తున్నారు. కావలి పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ ఎన్.కిశోర్ తన మిత్రుల ద్వారా సేకరించిన రూ.30,000ను అభ్యుదయ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కలగారెడ్డికి బుధవారం అందజేశారు. అలాగే గుడ్లూరుకు చెందిన కాపులూరి మధు కుటుంబసభ్యులు రూ.5000 ఇచ్చారు.

ప్రధానోపాధ్యాయుడు కలగారెడ్డికి నగదు అందజేస్తున్న కిశోర్

మృతుల కుటుంబాలను ఆదుకోవాలని వినతి

లింగసముద్రం, న్యూస్‌టుడే: ఇటీవల మండలంలోని గంగపాలెంలో పచ్చాకు ట్రాక్టర్ ట్రక్కు బోల్తాపడి మృతిచెందిన సులోమి, రత్నమ్మల కుటుంబాలను ఆదుకోవాలని రైతు కూలీ సంఘం నాయకుడు జి.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలను పలువురు సంఘ నాయకులతో కలిసి బుధవారం పరామర్శించారు. ప్రమాదంలో గాయాలతో బయటపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎం.సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

గుడ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని చినలాటరపి ఉన్నత పాఠశాల విద్యార్థులకు పెదలాటరపికి చెందిన మేకల మాల్యాద్రి బుధవారం క్రీడా పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు దామోదర్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న గ్రామస్థులకు అభినందనలు తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో రాణించాలని మాల్యాద్రి ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీ మురళీమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ రాకెట్లు అందజేస్తున్న దాత మాల్యాద్రి

ట్రాలీలు లేక.. లక్ష్యం వైపు అడుగులు పడక!

టంగుటూరు, న్యూస్‌టుడే:

స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా కూటమి ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లు మంజూరు చేసింది. గ్రామాల్లో సేకరించిన చెత్తను తరలించేందుకు వీటిని వినియోగించాల్సి ఉంది. 2 వేల జనాభా ఉన్న ప్రతీ పంచాయతీకి ఒకటి చొప్పున కేటాయించగా... ట్రాలీలు లేక అవి కాస్త మూలకు చేరాయి. రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన వాహనాలు నిరుపయోగంగా మారడంతో గ్రామాల్లో చెత్తను తరలించేందుకు వీలుకావడం లేదు. తద్వారా లక్ష్యం నీరుగారుతోంది.

వీటి కోసం వినియోగించాలి

చెత్త సేకరణ, పేరుకుపోయిన వ్యర్థాలను డంపింగ్ యార్డు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలింపు, హరితహారం కార్యక్రమాలు, గ్రామాల్లో నీటి కొరత ఏర్పడిన సమయంలో తాగునీరు సరఫరా, అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర బహుళ ప్రయోజనాలకు వినియోగించాలి. ట్రాలీలు మంజూరుకాకపోవడంతో ఏడాది కాలంగా వినియోగించక ఎక్కడివక్కడే పంచాయతీ కార్యాలయాల్లో మూలకు చేరాయి. ఎండకు, వానకు తడిసి మట్టికొట్టుకుపోతున్నాయి. తద్వారా మరమ్మతులకు గురయ్యే అవకాశం ఉంది. కొన్ని చోట్ల దాతలు ట్రాలీలు సమకూర్చడంతో వినియోగంలో ఉన్నాయి. మరి కొన్ని చోట్ల అద్దె ప్రాతిపదికన తీసుకుని వినియోగిస్తున్నారు.

కొండపి మండలం పెట్లూరు గ్రామ పంచాయతీలో ఉంచిన ట్రాక్టర్

నియోజకవర్గానికి తొలి విడతగా 17

కొండపి నియోజకవర్గంలో తొలివిడతగా 17 ట్రాక్టర్లు కేటాయించారు. వీటిలో కొండపి 3, మర్రిపూడి 2, పొన్నలూరు1, జరుగుమల్లి 2, టంగుటూరు 6, సింగరాయకొండ 3 చొప్పున అందజేశారు. వీటిని కొండపిలో అధికారులు, ప్రజాప్రతినిధులు లాంఛనంగా ప్రారంభించారు.

త్వరలో మంజూరవుతాయి

గ్రామ పంచాయతీలకు మొదటి విడతగా అందించిన ట్రాక్టర్లకు ట్రాలీలు త్వరలో ఇవ్వనున్నారు. ప్రభుత్వం నుంచి మంజూరు కాగానే ఆయా గ్రామాలకు అందజేస్తాం. వాటితో పాటు మూడు చక్రాల రిక్షాలు కూడా ఇవ్వనున్నట్లు తెలిసింది. -రామసుబ్బారావు, డిప్యూటీ ఎంపీడీవో టంగుటూరు

విద్యార్థులకు ఉన్నత విలువలు ముఖ్యం

సమావేశంలో మాట్లాడుతున్న గజల్ శ్రీనివాస్

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉన్నత విలువలు కలిగి ఉండాలని ప్రముఖ గజల్ గాయకుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ అన్నారు. విశ్వ సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం 'నవయువ కవి సమ్మేళనం' నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ.. తల్లిదండ్రుల కష్టాన్ని అర్థం చేసుకోవడంతో పాటు అధ్యాపకుల మార్గనిర్దేశకత్వాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. కళావేదిక ప్రతినిధులు కె.మురళీధర్‌రెడ్డి, కోగంటి శ్రీకాంత్ మాట్లాడుతూ త్వరలో ఒంగోలులో ప్రపంచ బాలల తెలుగు మహాసభలు నిర్వహిస్తామని, ఆ కార్యక్రమంలో టీఆర్ఆర్ కళాశాల విద్యార్థులు రాసిన కవితలు వినిపించే అవకాశం కల్పిస్తామని చెప్పారు. కళా వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు కె.రమాదేవి మాట్లాడుతూ తెలుగు భాషను విశ్వవ్యాప్తం చేసేందుకు నిరంతరం కృషిచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో 25 మంది విద్యార్థులు రచించిన కవితలను వినిపించారు. వాటిని పుస్తక రూపంలో తీసుకొస్తామని కళాశాల ప్రిన్సిపల్ రవికుమార్ వెల్లడించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.సుజాత, సీహెచ్ అలేఖ్య, డాక్టర్ రంగిశెట్టి రమేష్, బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి
•అద్దంకి • దర్శి

శింగరకొండ తిరునాళ్లకు విస్తృత ఏర్పాట్లు

మాట్లాడుతున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న, చిత్రంలో అధికారులు

శింగరకొండ (అద్దంకి), న్యూస్‌టుడే: శింగరకొండ వార్షిక తిరునాళ్లకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్డీవో లక్ష్మీప్రసన్న తెలిపారు. బుధవారం నిర్వహించిన తిరునాళ్ల సమన్వయ కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 28, మార్చి, 1, 2 తేదీల్లో జరిగే వార్షిక తిరునాళ్లకు అన్నిప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. రెండు రోజుల క్రితం పాకల బీచ్ వద్ద జరిగిన ఫెస్ట్ మాదిరి పక్కా నిర్వహించాలన్నారు. రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, మండల పరిషత్, ఎక్సైజ్, వైద్య, అగ్నిమాపక తదితర ప్రభుత్వ శాఖల అధికారులు తాము చేసే పనుల గురించి వివరించారు. సుమారు రూ.15 లక్షలు వెచ్చించి ఏర్పాటుచేసే విద్యుత్తు ప్రభ వద్ద సాంస్కృతిక కార్యక్రమాలను అర్ధరాత్రి రెండు గంటలకే నిలిపివేస్తారని రాఘవ రంగయ్య, సందిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పీడీసీసీ బ్యాంక్ పూర్వపు సంచాలకులు సందిరెడ్డి రమేష్ వినతిపత్రం అందించారు. ప్రజాసంఘాల తరఫున డాక్టర్ కాపూరి రఘువంద్, మన్నం త్రిమూర్తులు, చాగంటి శేషిరెడ్డి ఆర్డీవోను కలిసి తమ అభిప్రాయాలు తెలిపారు. క్యూలైన్లలో భక్తులకు మంచినీరు, మజ్జిగ, చంటి పిల్లలకు పాలు అందించనున్నట్లు సహాయ కమిషనర్ తిమ్మానాయుడు వెల్లడించారు. సీఐ సుబ్బారావు, ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన చైర్మన్లు మందారి మురళీసుధాకర్‌రావు, గుంజి శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీవరణ్, ఎంపీడీవో వరదని, విద్యుత్తు ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లింలకు రంజాన్ కానుకలు

తోఫా అందజేస్తున్న సీఐ రామారావు

తాళ్లూరు, న్యూస్‌టుడే: ముస్లిం సోదరులు రంజాన్ ఉపవాసాలు సంతోషంగా జరుపుకోవాలని దర్శి సీఐ రామారావు ఆకాంక్షించారు. తూర్పుగంగవరానికి చెందిన దివంగత 'షేక్ జానీబా' కుమారుడు డెక్కన్‌టెక్ చైర్మన్ షేక్ మస్తాన్‌వలీ సొంత నగదు రూ.లక్షన్నర వెచ్చించి కొనుగోలు చేసిన రంజాన్ తోఫాను 300 మంది ముస్లింలకు అందజేశారు. బుధవారం తూర్పుగంగవరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సొంతూరు వారిని మర్చిపోకుండా తోడ్పడి విరివిగా సాయం అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా తూర్పుగంగవరం, రామభద్రాపురం, సోమవరప్పాడులోని ముస్లిం కుటుంబీకులకు సీఐతోపాటు ఎస్సై మల్లికార్జునరావు కానుకలు పంపిణీ చేశారు. దాత మస్తాన్‌వలీ మాట్లాడుతూ ఉచితంగా జానిమాజ్, టోపీ, నమాజ్ పుస్తకం, ఉపవాస వివరాల కార్డులు, ఇతర వస్తువులు కానుకలో పొందుపర్చామన్నారు. కులమతాలకతీతంగా సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ పండుగల వేళ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు.

వ్యవసాయంపై అవగాహన అవసరం

దర్శి (తాళ్లూరు), న్యూస్‌టుడే: వ్యవసాయ రంగంపై కూడా విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని దర్శి వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సంధ్యారాణి అభిలషించారు. దర్శి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిది, పది తరగతులకు చెందిన ఒకేషనల్ విద్యార్థుల బృందం బుధవారం ఆ కేంద్రాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా వ్యవసాయంలో మెళకువలు, ప్రధాన పద్ధతుల గురించి ఆమె వారికి వివరించారు. భూసార పరీక్షలు, భూమిలో ఉండే పోషక పదార్థాల గురించి శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్.వరప్రసాద్ తెలిపారు. మరో శాస్త్రవేత్త డాక్టర్ సుమన్ పప్పుజాతి పంటల సాగు విధానాలను వివరించారు.

దర్శి వ్యవసాయ పరిశోధనా స్థానంలో శాస్త్రవేత్తలతో విద్యార్థి బృందం

పాఠశాలలో వీడ్కోలు సందడి

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మేదరమెట్ల, న్యూస్‌టుడే: కొరిశపాడు మండలం మేదరమెట్లలోని శ్రీనాగార్జున స్కూల్‌లో బుధవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాలు సందడిగా సాగాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఏవీ సుబ్బారావు మాట్లాడుతూ..విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగరాజు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రాచబాటలో ఇక రయ్.. రయ్

❖ నామ్ విస్తరణకు తొలగిన అడ్డంకులు

న్యూస్‌టుడే, అద్దంకి, సంతమాగులూరు:

నామ్ రహదారి విస్తరణకు ఆటంకాలు ఒక్కొక్కటిగా తొలగుతున్నాయి. గోపాలపురం, చక్రాయపాలెం, కలవకూరు, ఏల్చూరు రెవెన్యూ పరిధిలో భూములు కోల్పోయిన లబ్ధిదారులకు పరిహారం రెండు రోజుల్లో చెల్లించనున్నారు. దీంతో విస్తరణ పనులు మళ్లీ మొదలుకానున్నాయి.

నామ్ రహదారి విస్తరణలో భూములు నష్టపోతున్న వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో దాదాపు పదిహేనేళ్ల నుంచి పనులు నిలిచిపోయాయి. ప్రత్యేకించి అద్దంకి మండలం గోపాలపురం, సంతమాగులూరు మండలం ఏల్చూరులోనే ఈ ఇబ్బంది తలెత్తింది. ఈ రెండు ప్రదేశాల్లో కలిపి సుమారు రెండు కి.మీ మేర విస్తరణ, అభివృద్ధి చేయాల్సి ఉంది. భూములు కోల్పోయిన వారికి పరిహారం చెల్లింపులో కూటమి ప్రభుత్వం చొరవ చూపింది. మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృషితో ప్రభుత్వం పరిహారానికి సంబంధించిన నిధులు మంజూరు చేయడంతో విస్తరణకు మార్గం సుగమమైంది.

గోపాలపురం వద్ద ఇరుకుదారిలో వెళుతున్న వాహనాలు

కి.మీకు రూ.కోటితో ..

2008లో నామ్ (నార్కట్‌పల్లి - అద్దంకి - మేదరమెట్ల) రహదారి విస్తరణకు నాంది పలికారు. 212 కిమీ రోడ్డుకు అప్పట్లో రూ. 212 కోట్లతో పనులు చేపట్టారు. దాదాపు 208 కిమీ మేర పూర్తవ్వగా, కేవలం నాలుగు కి.మీ పరిధిలో ఆగిపోయాయి. అద్దంకి పట్టణం, గోపాలపురం, ఏల్చూరుల్లో విస్తరణ ఆగిపోవడంతో ప్రయాణికులకు కష్టాలు మొదలయ్యాయి. అద్దంకి పట్టణవాసులు తమ వ్యాపారాలకు ఆటంకం కలుగుతుందనే ఉద్దేశ్యంతో వేర్వేరు అంశాలను సాకుగా చూపి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. చక్రాయపాలెం, కలవకూరు రెవెన్యూ పరిధిలో పనులు జరిగినా సర్వీసురోడ్డును సమకూర్చలేదు.

అక్కడే ప్రమాదాలెక్కువ..

రహదారి విస్తరించని గోపాలపురం, ఏల్చూరు, అద్దంకి ప్రాంతాల్లో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ప్రతి ఏటా ఏడెనిమిది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. భారీ వాహనాలు అదుపుతప్పడం వల్లే ఈ దుర్ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ప్రస్తుతం అడ్డంకులన్నీ తొలగిపోవడంతో పనులు చేపట్టనున్నారు. జీబ్రా గీతలు, ప్రమాదాలు జరిగే ప్రదేశాల వద్ద సూచికలు ఏర్పాటుచేస్తూ పనులు సత్వరం మొదలుపెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మద్దతు ధరకు శనగల కొనుగోలు

అద్దంకి, న్యూస్‌టుడే: శనగలను రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని ఏపీ కార్పొరేట్ వెంకట కృష్ణ అన్నారు. అద్దంకిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ఆయన రైతులతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పండించిన శనగలను అమ్ముకోవాలన్నారు. క్వింటా శనగలకు రూ.5,875కు కొనుగోలు చేస్తున్నామన్నారు. తక్కువ ధరకు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సిన అవసరం లేదన్నారు. రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించినట్లయితే ఈ-పంట నమోదు తోపాటు ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేస్తారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి కోటేశ్వరరావు, రేణుక తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ డీఈఈగా కోటేశ్వరరావు

దర్శి(తాళ్లూరు), న్యూస్‌టుడే: దర్శి డివిజన్ గృహనిర్మాణ శాఖ డీఈఈగా బి.కోటేశ్వరరావు బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. నంద్యాల జిల్లాలో పనిచేస్తున్న ఆయన్ను ఇక్కడకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకూ మార్కాపురం జిల్లా యర్రగొండపాలెం డీఈఈ సురేష్ ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. కార్యాలయంలో డివిజన్ పరిధిలోని ఏఈలు హనుమంతరావు, షాకీర్‌బాషా, వెంకటేశ్వరరెడ్డి, కొండయ్య, హనుమంతరావు, తదితరులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

పశుపోషణతో రైతులకు ఆదాయం

దర్శి (తాళ్లూరు), న్యూస్‌టుడే: కలుషితమైన మేత, నీరు, అపరిశుభ్రమైన షెడ్ల వల్ల పరాన్నజీవులు పశువులను ఆశిస్తాయని దర్శి పశు వైద్యాధికారి డాక్టర్ ఎం.బసవయ్య అన్నారు. దీనివల్ల ఆకలి మందగించడం, రక్తహీనత, బరువు తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతాయని వివరించారు. దర్శిలోని కృషి విజ్ఞానకేంద్రంలో బుధవారం పాడి రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పరాన్న జీవులను సమూలంగా నిర్మూలించేందుకు పాటించాల్సిన పద్ధతులు, పరిస్థితుల గురించి విపులంగా వివరించారు. పశు పోషణ వల్ల రైతులకు మంచి ఆదాయం వస్తుందన్నారు. జాగ్రత్తల గురించి కేవీకే శాస్త్రవేత్తలు డాక్టరు టి.మానస, డాక్టరు టి.వెంకటేశ్వరరెడ్డి వివరించారు. సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

పని భారం తగ్గించాలి

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: వీఆర్వోలపై పనిభారం తగ్గించాలని అన్ని మండల తహసీల్దార్ కార్యాలయాల వద్ద బుధవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. పంచాయతీరాజ్‌తో పాటు, ఇతర శాఖలకు చెందిన పనులను వీఆర్వోలకు అప్పచెప్పడం ఏమిటని ప్రశ్నించారు. రెవెన్యూకు సంబంధించిన విధులు మాత్రమే వీఆర్వోలకు అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాసరెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

అద్దంకి: 94409 15704,
దర్శి: 9848 671678
మేదరమెట్ల: 79933 00506

మేదరమెట్ల, న్యూస్‌టుడే:

? పమిడిపాడు నుంచి రాచపూడి గ్రామం వెళ్లే దారిలో విద్యుత్తు స్తంభాలు వేసే సమయంలో తాగునీటి పైపులు పగిలిపోయాయి. మరమ్మతులు చేయించాలి. – స్థానికులు, రాచపూడి

✓: ఇప్పటికే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడాం. త్వరలోనే పైపులకు మరమ్మతులు చేయిస్తాం. –నరేంద్ర, పంచాయతీ కార్యదర్శి, రాచపూడి

అద్దంకి, న్యూస్‌టుడే:

? ఉత్తర అద్దంకి 19వ వార్డులో మంచినీటి మరమ్మతుల కోసం తవ్విన గుంత మూడు నెలలుగా అలాగే వదిలేశారు.

ఎవరూ పట్టించుకునే వారు లేకపోవటంతో ప్రమాదం పొంచి ఉంది. తక్షణం గుంత పూడ్చాలి. – స్థానిక మహిళలు

✓: వెంటనే గుంత పూడుస్తాం.
– జి.లోకేశ్, ఏఈ, అద్దంకి పురపాలక సంఘం

ఏల్చూరు (సంతమాగులూరు), న్యూస్‌టుడే:

? స్థానిక బీసీ కాలనీలో రెండుచోట్ల వీధి దీపాలు వెలగటం లేదు. పంచాయతీ అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలి. – స్థానికులు, ఏల్చూరు

✓: తక్షణం పరిశీలిస్తాం. వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెస్తాం.
–పూర్ణచంద్, పంచాయతీ కార్యదర్శి, ఏల్చూరు

ముండ్లమూరు, న్యూస్‌టుడే:

? మారెళ్ల గ్రామం నుంచి జమ్మలమడకకు వెళ్లే దారిలో గుంతలు పడి రాకపోకల సమయంలో చోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు పూడ్చి సమస్యను పరిష్కరించాలి. – సైదులు, జమ్మలమడక

✓: గుంతలు పూడ్పించి సమస్యను పరిష్కరిస్తాం. – రఫీ, ర.భ డీఈ, దర్శి

బల్లికురవ న్యూస్‌టుడే:

? బల్లికురవ నాలుగు రోడ్ల కూడలిలో దుకాణాల నుంచి వచ్చే వ్యర్థ జలాలు ప్రధాన రహదారి పైకి వస్తున్నాయి. దుర్వాసనతో పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. – స్థానికులు

✓: సమస్య మా దృష్టికి వచ్చింది, వెంటనే చర్యలు తీసుకుంటాం.
– సుబ్రహ్మణ్యం ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి

ముండ్లమూరు, న్యూస్‌టుడే:

? మండలంలోని మారెళ్ల గ్రామంలో ప్రభుత్వ ఆసుపత్రి వెనుక బజారులో సైడు కాలువలు లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. ఆ మురుగులోనే నడిచి వెళ్లాల్సి వస్తోంది. సమస్య పరిష్కరించగలరు.
– శ్రీనివాసరావు, స్థానికుడు

✓: పంచాయతీ కార్యదర్శికి తెలియజేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
– జనార్దన్, డిప్యూటీ ఎంపీడీవో

రోడ్డంతా మురుగు..వెళ్లాలంటే బేజారు

కురిచేడు మండలంలోని పడమర వీరాయపాలెం పంచాయతీలోని వెంగాయపాలెంలోని ప్రధాన వీధిలో నివాసాల నుంచి వచ్చే వ్యర్థజలాలు రోడ్డుపైనే ప్రవహిస్తున్నాయి. దీంతో పాదచారులు మురుగులోంచే నడిచి వెళ్లాల్సి వస్తోంది. ఓ వ్యక్తి తన ఇంటి వద్ద డ్రైనేజీని పూడ్చివేయడంతో ఈ దుస్థితి దాపురించింది. చిన్నారులు, వృద్ధులు ఆ మార్గంలో వెళ్లేటప్పుడు జారి పడుతున్నారు. దీనిపై ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి బాషాను వివరణ కోరగా..పరిశీలించి సమస్య పరిష్కరిస్తామన్నారు.
–న్యూస్‌టుడే, కురిచేడు

ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకున్నా పట్టదా ?

అద్దంకి పట్టణంలోని సాయిబాబా మందిరం వద్ద ప్రధాన మురుగు కాలువలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. గతంలో పారిశుద్ధ్య సిబ్బంది తొలగించేవారు. అయితే గత కొంతకాలంగా వారు ముఖం చాటేయడంతో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోందని స్థానికులు వాపోతున్నారు. దోమల బెడద కూడా ఎక్కువైందని వారు వాపోతున్నారు. –న్యూస్‌టుడే, అద్దంకి

విద్యుత్తుకాంతుల్లో మసీదులు

ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే రంజాన్ మాసం ప్రారంభమైంది. బుధవారం నెలవంక కన్పించడంతో గురువారం నుంచి ఉపవాసాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనుండటంతో అద్దంకి, దర్శి, బల్లికురవ తదితర ప్రాంతాల్లోని మసీదులను విద్యుద్దీపాలతో అలంకరించారు. సహరీ, ఇఫ్తార్‌ల అనంతరం ప్రార్థనలు నిర్వహించేందుకు సౌకర్యాలు కల్పిస్తున్నారు. రాత్రివేళ తరావీ నమాజ్‌లు ఉంటాయని మత పెద్దలు చెప్పారు. –న్యూస్‌టుడే, బల్లికురవ

చందలూరు విద్యార్థినుల ప్రతిభ

దర్శి మండలం చందలూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి శాప్‌లీగ్ చదరంగం పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.గురుప్రసాద్ తెలిపారు. అండర్-15 విభాగంలో కె.రాజవైష్ణవి ప్రథమ, అండర్-17 విభాగంలో జి.నవ జయంతి తృతీయ స్థానంలో నిలిచారు. ఒంగోలు పట్టణంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యాన జరిగిన పోటీల్లో వారు రాణించారన్నారు. వారు ఈ నెల 21న తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో వారిని ఉపాధ్యాయ బృందం అభినందించింది.
–న్యూస్‌టుడే, దర్శి (తాళ్లూరు)

విద్యార్థినుల వృత్తిపూర్వక సందర్శన

ప్రయోగశాల వద్ద విద్యార్థినులు

శింగరకొండ (అద్దంకి), న్యూస్‌టుడే: సాంఘిక సంక్షేమ గురుకులం విద్యార్థినులు బుధవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించారు. వృత్తిపూర్వక సందర్శనలో భాగంగా 6 నుంచి 9 తరగతి చదువుకునే విద్యార్థినులు సుమారు 75 మంది ప్రదర్శనగా కళాశాలకు వెళ్లారు. పదో తరగతి చదివిన అనంతరం సాంకేతిక విద్య పట్ల ఆసక్తి ఉన్నవున్న వారు ప్రవేశపరీక్ష రాసి, ర్యాంక్ సాధించిన అనంతరం రెండేళ్లపాటు పాలిటెక్నిక్‌లో చదివేందుకు అర్హత లభిస్తుందని గురుకులం ప్రధానాచార్యురాలు చాముండేశ్వరి వెల్లడించారు. కళాశాలలో విద్యార్థుల ప్రయోగశాలలు, కంప్యూటర్ విభాగాలు, ఉపయోగించే పరికరాలను ప్రధానాచార్యులు లాజరస్‌బాబు విద్యార్థినులకు వివరించారు. సాంకేతిక విద్యాలయాలను బలోపేతం చేసేందుకు గాను ఇలాంటి కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తుందని వారు వెల్లడించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు

పోషకాహార ప్యాకెట్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో అజిత

తాళ్లూరు, న్యూస్‌టుడే: పిల్లలతోపాటు గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో అజిత కోరారు. విఠలాపురంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా దస్త్రాలు పరిశీలించారు. పోషకాహార పదార్థాల ప్యాకెట్ల నాణ్యతను గమనించారు. అనంతరం సచివాలయానికి వెళ్లి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు.

14 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి నియోజకవర్గంలో మొత్తం 14 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తామని చీరాల ఉపవిద్యాధికారి డి.గంగాధరరావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన బుధవారం ఉదయం తనిఖీ చేశారు. మొత్తం 50మంది విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు గానూ తొమ్మిదిమంది గైర్హాజరు కావడంపై ఉపవిద్యాధికారిని ప్రశ్నించారు. అనంతరం తరగతి గదిలోని విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేశారు. చదువులో వెనుకంజలో ఉన్న వారికి 30 రోజులు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. నియోజకవర్గంలో మొత్తం 3008 మంది పది పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. 'సి' కేంద్రాలుగా ఉన్న రావినూతల, వైదన, ఏల్చూరు, వలపర్లలో నిఘా కెమెరాలు బిగిస్తున్నట్లు చెప్పారు. జంబ్లింగ్ విధానంలో పరీక్షలు జరుగుతున్నట్లు చెప్పారు.



బాలుర ఉన్నత పాఠశాలలో విచారిస్తున్న చీరాల ఉపవిద్యాధికారి గంగాధరరావు

సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఎం పవన్

భవన నిర్మాణ అనుమతులపై సమీక్ష

దర్శి (తాళ్లూరు), న్యూస్‌టుడే : భవన నిర్మాణ అనుమతుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలని గుంటూరు ఏడీఎం పవన్ సూచించారు. దర్శి నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం భవన నిర్మాణ అనుమతులపై లైసెన్స్‌డ్ సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. బీపీఎస్, ఎల్‌ఆర్‌ఎస్ గడువు తీరే లోపు గరిష్ఠ సంఖ్యలో దరఖాస్తులు తీసుకోవాలన్నారు. ప్రజలకు అవగాహన కలిగేందుకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. సిబ్బంది శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

తనిఖీ చేస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారి కె.నాగేశ్వరరావు

మేదరమెట్ల, న్యూస్‌టుడే: సిగరెట్లు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతల శాఖ అధికారి కె.నాగేశ్వరరావు అన్నారు. కొరిశపాడు మండలం మేదరమెట్లలోని దుకాణాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండు దుకాణాల్లో ఎంఆర్‌పీ కన్నా ఎక్కువ ధరకు సిగరెట్లు విక్రయిస్తున్నట్లు గుర్తించి వారికి జరిమానాలు విధించారు. ఈ విషయం తెలుసుకున్న మిగిలిన వారు తమ దుకాణాలు అప్పటికప్పుడు మూసివేశారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ.. తనిఖీలు నిరంతరాయంగా జరుగుతాయన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా

జె.పంగులూరు,న్యూస్‌టుడే: ఇంటి పన్ను చెల్లించి పంచాయతీల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎంపీడీవో స్వరూపరాణి అన్నారు. మండలంలోని చందలూరులో ఇంటి పన్ను వసూలును ఎంపీడీవో బుధవారం పరిశీలించారు. అనంతరం చందలూరు పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనం నాణ్యతపై విద్యార్థుల నుంచి ఆరా తీశారు. పంచాయతీ కార్యదర్శి కల్యాణి, నాయకులు మురకొండ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దశమారని సాగర్ కాలువలు

పరిశీలన

న్యూస్‌టుడే, దొనకొండ:

సాగర్ ద్వారా పంటలకు నీరు విడుదల చేస్తున్నా కాలువలు పూడిపోవడంతో రైతులు నానా కష్టాలు పడుతున్నారు. పిచ్చిచెట్లు, నాచుతో నిండిపోవడంతో సరఫరా నిలిచిపోతోంది. దర్శి, కురిచేడు, దొనకొండ మండలాల్లో కాలువ కింద 15 మేజర్లు ఉండగా 7800 ఎకరాల్లో పంటలు సాగుచేశారు. మేజర్లు పూడిపోవడం..గట్లకు గండి పడటంతో అసలు లక్ష్యం నెరవేరడం లేదు. అధికారులు కాలువలను మెరుగుపర్చకపోవడంతో చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. ఈ ప్రాంతంలో వరి, పిల్లిపెసర, బొబ్బర్లు, మొక్కజొన్న, జొన్న, మినుము సాగు చేస్తున్నారు. తమ పొలాలకు నీరందడంలేదని అక్కడి రైతులు వాపోతున్నారు. గత్యంతరం లేక డీప్ బోర్లు ఏర్పాటు చేసుకుంటున్నామన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సాగర్ కాలువల మరమ్మతులకు నిధులు మంజూరు చేసి పనులు చేయించాలని వారు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

మేజర్లు బాగు చేసేందుకు రూ.3.50 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపించామని ఎన్నెస్పీ డీఈ అక్బర్‌బాషా తెలిపారు. గతంలో రూ.6 లక్షలు వెచ్చించి చిల్లచెట్లు తొలగించామన్నారు.

పిచ్చి చెట్లు, నాచుతో బట్టెపాడు మేజర్

విశిష్ట గుర్తింపుతోనే పథకాల లబ్ధి

కురిచేడు, న్యూస్‌టుడే: రైతులందరూ ప్రభుత్వం నుంచి పథకాలు పొందాలంటే తప్పనిసరిగా విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలని దర్శి వ్యవసాయ సంచాలకులు బాలాజీ నాయక్ అన్నారు. బుధవారం ఆవులమంద, కల్లూరు గ్రామాల్లో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వరి, పత్తి పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my clients M/s Shriram Finance Ltd., Addanki Branch, Prakasam District issue the following notice to the general public.
My client intends to grant loan to the applicant **Sri. Pandi Peda Venkateswarlu,** S/o Peda Venkatappa, R/o D.No. 1-122B, Vemula Village, Mundlamuru Mandal, Prakasam District, Andhra Pradesh submitted the documents to create the same as security for the Trade Finance. On careful scrutiny of the documents i have submitted my legal opinion as follows for the property as security by way of registered mortgage. As such if anyone have any claims, charges, mortgages, sale agreements, court attachements, court disputes, etc., shall be informed to the below address within 7 days from the date of this notice. Otherwise later objection will not bind my client in this regard.
SCHEDULE: Prakasam District Registration, Darsi Sub-Registration, Mundlamuru Mandal, Vemula Panchayat and Village survey No. 255/1, out of an extent of Ac.0-94 cents in it Ac. 0-82 cents out of that the vendor haveing right over the extent of Ac. 0-06 cents or 290.4 Sq.yards of site bounded by **East:** Cement Road, **South:** Passage, **West:** Site of Shaik Khasim, **North:** Site of Shaik Mulla Masthan.
Sd/- M.S.S. PRASAD,
Advocate & Legal Advisor, AP/3706/2023

(c) eenadu

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

రండి... పుస్తకం చదవండి!

మినీ లైబ్రరీలో ఉంచిన పుస్తకాలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: రోజువారీ విధులతో ఒత్తిడితో ఉండే ఉద్యోగులతోపాటు, వ్యక్తిగత పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఖాళీ సమయంలో పుస్తక పఠనం అలవర్చుకునేలా ఒంగోలు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మినీ లైబ్రరీ ఏర్పాటు చేశారు. ఎంపీడీవో రాజశేఖర్ తనకు వచ్చిన ఆలోచనతో 'పుస్తకాన్ని తీసుకొండి...పుస్తకాన్ని ఉంచండి..' రీడా ఇక్కడే చదవండి. వినాదంతో పలు రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచారు.

అన్న క్యాంటీన్‌లో వేడి నీటి యంత్రం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: కలెక్టర్ ఆదేశాల మేరకు ఒంగోలు నగరంలోని అన్న క్యాంటీన్లలో పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలన్న ఉద్దేశంతో వేడి నీటి యంత్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా తొలివిడతగా స్థానిక కొత్తపట్నం బస్టాండ్‌లోని అన్న క్యాంటీన్‌లో యంత్రాన్ని ఏర్పాటు చేశారు. భోజనం చేసే ముందు ప్లేట్లను వేడి నీటిలో ముంచటానికి ఏర్పాటు చేశారు.

వేడి నీటి యంత్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఓటర్ల జాబితాల సవరణకు సహకరించండి

చీమకుర్తి, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితాల సవరణకు అందరూ సహకరించాలని సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి కె.మాధురి ఆదేశించారు. బుధవారం చీమకుర్తి రెవెన్యూ కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2026లోని ఓటర్ల జాబితాల ఓటర్ల పేర్లను మ్యాపింగ్ చేసే ప్రక్రియను ప్రతి పోలింగ్ కేంద్ర స్థాయి అధికారిపూర్తి చేయాలన్నారు. ప్రస్తుత ఓటర్ల జాబితాల్లో ఓటరు పేరు, పుట్టిన తేదీ, చరవాణి నెంబరు, ఇంటినెంబరు తదితర వివరాలు తప్పుగా ఉంటే ఫారం 8 దాఖలు చేసేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. చీమకుర్తి, సంతనూతలపాడు తహసీల్దార్లు ఆర్.బ్రహ్మయ్య, ఎస్.నారాయణ రెడ్డి, ఆయా మండలాల అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు చలమయ్య, శేషయ్య, శ్రీనివాసరెడ్డి, గొట్టిపాటి రాఘవరావు, కల్యాణ్ రెడ్డి, సురేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఓటరు నమోదు అధికారి మాధురి

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలు నగరంలోని అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని నగర కమిషనర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోతురాజు, నల్ల కాలువ వంటి పెద్ద మురుగునీటి కాలువలపై డ్రోన్‌తో పిచికారీ చేయాలన్నారు. నగరంలోని ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చి, ఆ స్థలాన్ని యజమానులే పరిశుభ్రం చేయించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై జరిమానాలు విధించాలన్నారు. వ్యాపారులందరూ 28వ తేదీ లోపు 100 శాతం ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించే విధంగా చూడాలని ఆదేశించారు. సమావేశంలో అధికారులు వైష్ణవి, పిచ్చయ్య, బాబ్జీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమీక్ష నిర్వహిస్తున్న నగర కమిషనర్ వెంకటేశ్వరరావు

నూరు శాతం సర్వే పూర్తికి చర్యలు

మంగమూరు(సంతనూతలపాడు), న్యూస్‌టుడే: మండలంలో జరుగుతున్న యూఏపీఎస్ సర్వేను నూరుశాతం పూర్తి చేయాలని ఎంపీడీవో సురేష్‌బాబు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మంగమూరులో సర్వేను, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22వ తేదీ సాయంత్రంకు సర్వేను పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులు, గర్భిణులు, చిన్నారులకు అందించాల్సిన ఆహారాన్ని సకాలంలో అందించాలని ఆదేశించారు. చిన్నారుల్లో ఐరన్ లోపం లేకుండా చూసుకోవాలన్నారు.. గ్రామంలో జరుగుతున్న సామాజిక తనిఖీ, గ్రామ సభను పరిశీలించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీవో సురేష్‌బాబు

బాల్యం బలహీనం!

● అంగన్‌వాడీ కేంద్రాల్లో తగిన ఎత్తు, బరువు లేని పిల్లల గుర్తింపు

న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

వయసుకు తగ్గ బరువు, ఎత్తు పిల్లల ఎదుగుదలకు ప్రామాణికం. అవి ఉన్నప్పుడే బిడ్డ భవిష్యత్తులో శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారు. వ్యాధులను సైతం దరిచేరవు. చిన్నారులు పోషకాహార లోపం, రక్తహీనత బారిన పడకుండా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నాయి. కోడిగుడ్లు, బాలామృతం, పాలు వంటి పోషకాహారానికి రూ.కోట్లు ఖర్చు చేస్తున్నాయి. అతి తీవ్రత పోషకాహార లోపంతో కొంతమంది పిల్లలు బాధపడుతున్నట్లు వివిధ సర్వేల్లో వెల్లడవుతోంది. రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ ఆదేశాల మేరకు పిల్లల ఎదుగుదలను పరిశీలించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇటీవల ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో 0-6 ఏళ్లలోపు వయసు గల పిల్లలు ఎంత మేర బరువు ఉన్నారు? ఎంత ఎత్తు ఉన్నారన్న వివరాలను ఆయా కేంద్రాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు సేకరించారు.

ఒంగోలు ఐసీడీఎస్ ప్రాజెక్టులోని అంగన్‌వాడీ కేంద్రాలు, పిల్లల నమోదు
అంగన్‌వాడీ కేంద్రాలు: 274
ఆరేళ్లలోపు పిల్లలు : 11,733 మంది
బరువు, ఎత్తు కొలతలు తీసినవారు: 11,671
వయసుకు తగ్గ బరువు లేనివారు : 49
ఎత్తుకు తగిన బరువు లేనివారు : 56
వయసుకు తగిన ఎత్తులేని వారు : 108

లోపు పిల్లలందరి ఎత్తు, బరువు తీసి పోషణ్ ట్రాకర్ యాప్‌లో పూర్తి వివరాలను కార్యకర్తలు నమోదు చేశారు. పక్కా వివరాల ద్వారా పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించారు. పిల్లల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రత్యేక డ్రైవ్‌లో వెల్లడైన అంశాల ఆధారంగా భవిష్యత్తులో వాటిని సరిచేసే దిశగా అవసరమైన పోషకాహారం పంపిణీకి అధికార యంత్రాంగం ప్రణాళిక రూపొందించింది. పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారిని సీడీపీవోలు, ఐసీడీఎస్ పర్యవేక్షకులు అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు వారి సంరక్షణలో భాగంగా దత్తత తీసుకున్నారు. ప్రతి వారం వారి పెరుగుదలను గమనిస్తూ గృహ సందర్శనల ద్వారా ఆరోగ్యపరమైన సలహాలు, సూచనలివ్వాలని ఇప్పటికే నిర్ణయించారు. పిల్లల్లో పోషకాహార లోపాలు, తీవ్ర లోపాలతోపాటు సాధారణంగా ఉన్నవారిని మూడు విభాగాలుగా విభజించి కేంద్రాల్లో పిల్లల తల్లులకు అవగాహన కల్పిస్తున్నారు. వీరిని ఆరు నెలలపాటు పరిశీలించాక అప్పటికీ మార్పు రాకుంటే ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని పోషకాహార పునరావస కేంద్రానికి తరలించనున్నారు.

తల్లులకు అవగాహన

అప్పుడే జన్మించిన శిశువు దగ్గర నుంచి ఆరేళ్ల

ఒంగోలులోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల బరువును పరిశీలిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కొత్తపట్నం, న్యూస్‌టుడే: విద్యుత్తు 132కేవీ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా కొత్తపట్నం మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్తు అంతరాయం ఏర్పడుతుంది. ఆదేవిధంగా తేటుపురం, మడనూరు గ్రామాల్లో ఆక్వా విద్యుత్తు కూడా గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంతరాయం ఏర్పడుతుందని మండల విద్యుత్తు ఏఈ చంద్రకాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కోన్స్‌తో సరిపెట్టారు

టంగుటూరు: సింగరాయకొండ నుంచి టంగుటూరు వచ్చే మార్గంలో 16వ నంబరు జాతీయ రహదారిపై అండర్‌పాస్ వద్ద గుంతలు పడటంతో గతేడాదిగా రాకపోకలకు తీవ్ర అవరోధం కలుగుతోంది. ఈ మార్గంలో నెల్లూరు, కావలి, తిరుపతి, కందుకూరు, పామూరు, కడప, ఒంగోలు ప్రాంతాలకు నిత్యం వేల సంఖ్యలో వాహనాలు వెళుతుంటాయి. భారీ గుంతను పోడలకు గుర్తించకపోవడంతో కుదుపునకు గురవుతున్నారు. దీంతో ఒళ్లు హూనమవడమే కాకుండా వాహనాలు సైతం దెబ్బతింటున్నాయి. రాత్రి వేళ పరిస్థితి మరీ ప్రమాదకరంగా ఉంటోందని వాపోతున్నారు. దీంతో ఆ ప్రాంతంలో జాతీయ రహదారి సిబ్బంది రెండు కోన్స్‌ను హెచ్చరికగా ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my clients M/s Shriram Finance Ltd., Ongole-1 Branch, Prakasam District issue the following notice to the general public.

My client intends to grant loan to the applicant **Smt. Gajjakonda Venkata Lakshmi**, W/o Narayana, R/o. D.No. 8-231/A, Sujatha Nagar 3rd Lane, VIP Road, Near NH-5, Ongole, Prakasam District, Andhra Pradesh submitted the documents to create the same as security for the Trade Finance. On careful scrutiny of the documents i have submitted my legal opinion as follows for the property as security by way of registered mortgage. As such if anyone have any claims, charges, mortgages, sale agreements, court attachements, court disputes, etc., shall be informed to the below address within 7 days from the date of this notice. Otherwise later objection will not bind my client in this regard.

SCHEDULE: Guntur District Registration, Guntur Sub - Registration, Guntur Municipal Area, Guntur Taluq, D.No. 1203/1, minjumale Plots, Plot Nos. 137, 138 in an extent of 196 sq.yards out and in it Plot No. 137 an extent of 98 sq.yards or 81.93 sq.mts of vacant site bounded by **East:** Plot No. 136 site - 40 feet, **South:** Plot No. 123 site -22 feet, **West:** Plot No. 138 belonging to Khasim Khan Kamal Basha Khan - 40 feet, **North:** 20 ft wide Road - 22 feet.

Within these boundaries an extent of 98 Sq.yards or equal to 81.93 Sq.mts of vacant site with all easementary rights appurtenant there to.

Sd/- **M.S.S. PRASAD,**
Advocate & Legal Advisor, AP/3706/2023

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులు, చిన్నారులు, గర్భిణిలకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూడాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు డీఆర్వో ఓబులేసు సూచించారు. బుధవారం సంతనూతలపాడులో ఒడ్డెరపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాల్లో నూరుశాతం హాజరు ఉండేలా చూడాలన్నారు. కేంద్రాల బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పేర్కొన్నారు. గుడ్లు, పౌష్టికాహారం సక్రమంగా అందుతుందా లేదా అన్న దానిపై తల్లులను అడిగి తెలుసుకున్నారు. పిల్లల బరువు, ఎత్తులను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణరెడ్డి, సీడీపీవో ఇవాంజలీన్, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్వో ఓబులేసు

పని భారం తగ్గించాలని వీఆర్వోల నిరసన

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: వీఆర్వోలకు పనిభారం తగ్గించాలని విజ్ఞప్తి చేస్తూ జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మండల తహసీల్దార్ల కార్యాలయాల వద్ద బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. పంచాయతీరాజ్‌తోపాటు, ఇతర శాఖలకు చెందిన పనులను వీఆర్వోలకు అప్పచెప్పడం ఏమిటని ప్రశ్నించారు. రెవెన్యూకు సంబంధించిన విధులు మాత్రమే వీఆర్వోలకు అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాసరెడ్డి, సురేష్, సాయి, రాజు, అరుణ తదితరులు పాల్గొన్నారు.

● సంతనూతలపాడు: వీఆర్వోలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రెండో రోజు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం నల్ల రిబ్బన్లు ధరించి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై పని భారాలను తగ్గించాలని, ఒత్తిడులను ఆపాలని డిమాండ్ చేశారు. వర్క్ టు రూల్‌ను అమలు చేయాలని కోరారు. మండలంలోని సర్వేయర్లు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు ఆదిరెడ్డి, వెంకటస్వామి, వినీల, జాలయ్య, సంజీవరావు, మౌలాలీ, మధు, సర్వేయర్ ప్రవీణ్‌కుమార్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఒంగోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న వీఆర్వోలు

MEMORIES ARE FOR EVER

This self cannot be cut burned, wetted or died, eternal, all pervasive, stable immovable and ever lasting is it,
Bhagawadgita - Chapter II

Born: 19-2-1969

Died: 18-8-1988

Nanduri Sridevi

Daughter of C.A. Saibaburao Nanduri

Inserted by:

Family Members & Friends

212, Mahatma Gandhi Housing Colony, Chirala - 523 155.

Ph:9848152025

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
కొత్తపట్నం : 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

?: మద్దిపాడు మండల పరిధిలో 16వ నెంబరు జాతీయ రహదారిలో నూతనంగా లేయర్ నిర్మించారు. ద్విచక్ర వాహనదారులు రహదారి ఎక్కడానికి సుమారు ఆడుగు ఎత్తున ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు.
– వేల్పుల నాగరాజు, వాహనదారుడు.

✓: పరిశీలించి రహదారిలో అవసరమైన చోట అంచులు నిర్మిస్తాం.
– సురేష్, జాతీయ రహదారి సైట్ ఇంఛార్జి

?: మల్లవరం ఎస్సీ కాలనీలో మురుగు కాలువలు అధ్వానంగా ఉన్నాయి. దీని వల్ల దుర్వాసన వస్తోంది. – రామారావు, గ్రామ వాసి.

✓: పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి కాలువలు శుభ్రం చేయిస్తాం.
– నీలిమ, పంచాయతీ కార్యదర్శి

?: నగరంలోని శ్రీనివాసకాలనీ సాయిబాబా గుడి రోడ్డులోని ఖాళీ స్థలంలో చిల్లచెట్లు ఎక్కువ ఉండటంతో విషకీటకాలకు ఆవాసాలుగా మారాయి. దీనికి తోడు అక్కడ వ్యర్థాలు వేయటంతో దుర్వాసన వస్తోంది.
– బ్రహ్మయ్య, స్థానికుడు.

✓: స్థలం యాజమానులకు నోటీసులు ఇచ్చి శుభ్రం చేసుకొనేలా చేస్తాం.
–యన్ పిచ్చయ్య, శానిటరీ సూపర్‌వైజర్

న్యూస్‌టుడే, మద్దిపాడు, ఒంగోలు అంజయ్యరోడ్డు

రోడ్డుపై గొయ్యి.. చూసి అడుగెయ్యి

నగరంలోని వీఐపీ రోడ్డుకు వెళ్లే కూడలిలో రోడ్డుకి మధ్యలో పెద్ద గొయ్యి ఏర్పడింది. గుంత ఉండటంతో రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారుల చక్రం అందులోకి దిగి ప్రమాదాలకు గురి అవుతున్నారు. కాలనీవాసులు సమస్యను పరిష్కరించకపోవటంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గుంతను పూడ్చివేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

న్యూస్‌టుడే, ఒంగోలు అంజయ్యరోడ్డు

సాంకేతిక విద్యపై ఆసక్తి అవసరం

శింగరకొండ (అద్దంకి), న్యూస్‌టుడే: సాంఘిక సంక్షేమ గురుకులం విద్యార్థినులు బుధవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించారు. వృత్తిపూర్వక సందర్శనలో భాగంగా 6 నుంచి 9 తరగతి చదువుకునే విద్యార్థినులు సుమారు 75 మంది ప్రదర్శనగా కళాశాలకు వెళ్లారు. పదో తరగతి చదివిన అనంతరం సాంకేతిక విద్య పట్ల ఆసక్తి ఉన్నవున్న వారు ప్రవేశపరీక్ష రాసి, ర్యాంక్ సాధించిన అనంతరం రెండేళ్లపాటు పాలిటెక్నిక్‌లో చదివేందుకు అర్హత లభిస్తుందని గురుకులం ప్రధానాచార్యురాలు చాముండేశ్వరి వెల్లడించారు. కళాశాలలో విద్యార్థుల ప్రయోగశాలలు, కంప్యూటర్ విభాగాలు, ఉపయోగించే పరికరాలను ప్రధానాచార్యులు లాజరస్ బాబు విద్యార్థినులకు వివరించారు. సాంకేతిక విద్యాలయాలను బలోపేతం చేసేందుకు గాను ఇలాంటి కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తుందని వారు వెల్లడించారు.

ప్రయోగశాల వద్ద విద్యార్థినులు

వైద్య సేవల మెరుగుకు కసరత్తు

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని డీసీహెచ్ఎస్ లక్ష్మీకుమారి తెలిపారు. కొండపి సీహెచ్‌సీని బుధవారం ఆమె తనిఖీ చేశారు. ముందుగా వైద్యశాల ఆవరణలో జరుగుతున్న పనులను పరిశీలించారు. దస్త్రాలను తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చిన రోగులకు ధైర్యం చెప్పాలన్నారు. స్వల్ప అస్వస్థతో వచ్చిన వారిని ఒంగోలు పంపడం సరి కాదన్నారు. వైద్యుడికి కేటాయించిన సమయంలో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలన్నారు. అత్యవసర సమయంలో వినియోగించేందుకు వీలుగా సీహెచ్‌సీలో రక్తం భద్రపరిచేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో డయాలసిస్ కేంద్రం కూడా మంజూరు కానుందన్నారు. గుండె నొప్పితో వచ్చిన రోగికి ముందుగా స్టెమీ ఇంజెక్షన్ చేశాకే ఒంగోలు పంపాలని సీహెచ్‌సీ వైద్యాధికారిణి నాగమణికి సూచించారు. అదే విధంగా వైద్యశాల గేట్ వద్ద నుంచి మార్చురీ గది వరకు సీసీ రోడ్డు నిర్మాణం, ప్రహరీ ఎత్తుపెంచేలా మంత్రి బాల వీరాంజనేయస్వామికి నివేదిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి సూరిబాబు, కొండపి సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ లక్ష్మీకుమారి, నోడల్ అధికారి సూరిబాబు

విద్యార్థులకు ఉన్నత విలువలు ముఖ్యం

కందుకూరు పట్టణం: విద్యార్థులు ఉన్నత విలువలు కలిగి ఉండాలని ప్రముఖ గజల్ గాయకుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ అన్నారు. విశ్వ సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం 'నవయువ కవి సమ్మేళనం' నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ.. తల్లిదండ్రుల కష్టాన్ని అర్థం చేసుకోవడంతో పాటు అధ్యాపకుల మార్గనిర్దేశకత్వాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. కళావేదిక ప్రతినిధులు కె.మురళీధర్‌రెడ్డి, కోగంటి శ్రీకాంత్ మాట్లాడుతూ త్వరలో ఒంగోలులో ప్రపంచ బాలల తెలుగు మహాసభలు నిర్వహిస్తామని, ఆ కార్యక్రమంలో టీఆర్ఆర్ కళాశాల విద్యార్థులు రాసిన కవితలు వినిపించే అవకాశం కల్పిస్తామని చెప్పారు. కళా వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు కె.రమాదేవి మాట్లాడుతూ తెలుగు భాషను విశ్వవ్యాప్తం చేసేందుకు నిరంతరం కృషిచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో 25 మంది విద్యార్థులు రచించిన కవితలను వినిపించారు. వాటిని పుస్తక రూపంలో తీసుకొస్తామని కళాశాల ప్రిన్సిపల్ రవికుమార్ వెల్లడించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.సుజాత, సీహెచ్ అలేఖ్య, డాక్టర్ రంగిశెట్టి రమేష్, బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గజల్ శ్రీనివాస్

బహిరంగ ప్రకటన

ప్రకాశం జిల్లా, ఒంగోలు టౌన్, అన్నవరప్పాడు, 2వ లైను, డో.నెం.37-1-4-53, నివాసి **రెడ్డిబోయిన పేరయ్య గారి కుమారుడు సురేష్ బాబు** ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా..

ఈ క్రింది షెడ్యూలు ఆస్థిని నా క్లంట్ ఐన సదరు రెడ్డిబోయిన పేరయ్య గారి కుమారుడు సురేష్ బాబు తన భార్య ఐన రెడ్డిబోయిన విజయలక్ష్మి ద్వారా తన పేరటికి తేది.10-12-2025న సెటిల్మెంట్ పత్రము వ్రాయించుకొని స్వాధీనము పొంది హక్కు కలిగి ఉన్నారు. సదరు సెటిల్మెంట్ పత్రమునకు లింకు డాక్యుమెంట్ ఐన ఒరిజినల్ వీలునామా డాక్యుమెంట్ నెం.48/BK 3/1128 తేది.26-04-1989 డాక్యుమెంట్‌ను కూడా స్వాధీనము పొందియున్నారు. దరిమిలా తేది.18-02-2026న నా క్లంట్ ఉదయం 11.00 గంటల సమయములో అన్నవరప్పాడులోని తన ఇంటిలో చూసుకొనగా, సదరు డాక్యుమెంట్ నెం.48/BK 3/1128 పోయినట్లుగా గమనించియున్నారు. కావున పై వివరముగల డాక్యుమెంట్ / లింకు డాక్యుమెంట్ ఎవరికైనను దొరికిన యెడల లేక దానిపై ఎటువంటి ఆదుమానములు లేక అగ్రిమెంట్లు, ఇతర లావాదేవీలు షెడ్యూలు దాఖలా ఆస్థిపై జరిపినసూ నా క్లయింట్లను బద్ధపరచజాలవనియు మరియు అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొనబడుననియు మరియు ఎవరికైనను దొరికిన యెడల లేక అభ్యంతరములు ఉన్నయెడల ఈ క్రింది అడ్రసు వారికి ఈ నోటీసు తేది నుండి 7 రోజుల లోపల తెలియజేయగలరు. లేని యెడల సదరు టైటిల్ డీడ్ నెం.3253/2025, మరియు దాని లింక్ డాక్యుమెంటు ఐన డాక్యుమెంట్ నెం. 48/BK 3/1128 ఒరిజినల్‌కు బదులుగా నకలు కాపీని, M/s Vasthu Housing Finance Corporation Limited, Ongole Branch, డిపాజిట్ చేసి లోను మంజూరు చేయించుకోగలరని యావన్మందికి తెలిజయేయడమైనది.

షెడ్యూలు: ప్రకాశం జిల్లా, ఒంగోలు సబ్.రి. యిలాకా, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన, అన్నవరప్పాడు గ్రామ సర్వే నెం.57 రు తదుపరి సదరు మండల సర్వేయరు గారు యిచ్చిన సర్వే రిపోర్టు ప్రకారం సబ్ డివిజన్ కాబడిన సర్వే నెం.50/3రులో ప్లాను దాఖలా ప్లాటు నెం.44రులో డోరు నెం.37-1-4(52)రు, అసెస్మెంట్ నెం.1035017899రు. నీటి కుళాయి అసెస్మెంట్ నెం.1035023445రు, యస్.సి.నెం.4353309108405, 4353309108406ర్లు గల ఆర్‌సిసి బిల్డింగునకు హద్దులు: **తూర్పు:** మున్సిపల్ బజారు ఈ దిశ 27 అ॥లు, **దక్షిణం:** గుమ్మడి శ్రీనివాసరావు గారి తాలూకు ఆర్‌సిసి డాబా ఈ దిశ 40అ॥లు, **పడమర:** ఆత్మకూరి వెంకటేశ్వర్లు గారి తాలూకు ఆర్‌సిసి డాబాఈ దిశ 27అ॥లు, **ఉత్తరం:** నీ తాలూకు రేకుల యిల్లు ఈ దిశ 40అ॥లు

సం/- **దండూరి వెంకటేశ్వర్లు, యం.ఎస్.ఎస్.ప్రసాద్**
అడ్వకేట్స్, ఒంగోలు. సెల్: 9397865123

గుళికలు తిని మేకలు మృతి

కామేపల్లివారిపాలెం (సంతనూతలపాడు), న్యూస్‌టుడే: మండలంలోని కామేపల్లివారిపాలెం చెరువు సమీపంలో గుళికలు తిని మేకలు మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు స్థానిక ఎండ్లూరుడొంక సమీపంలోని కల్వర్ కాలనీకి చెందిన కోటేశ్వరరావు మేకలు మేపుకుంటూ జీవనం సాగిస్తుంటారు. రోజులాగానే మేకలను మేతకు తీసుకెళ్లడంతో కామేపల్లివారిపాలెం సమీపంలో జామాయిల్ తోటలో గుళికలు పెట్టడంతో అవి తిని సుమారు 10కి పైగా మేకల వరకు చనిపోయాయి. సుమారు రూ.2లక్షల వరకు నష్టపోయినట్లు బాధితుడు వెల్లడించారు. కుటుంబానికి ఇదే ఆధారమని ఇప్పుడు వీటిని కోల్పోవడంతో కుంగిపోతున్నామని అన్నారు. ఆర్థికంగా ప్రభుత్వం చేయూతనివ్వాలన్నారు. దీనిపై పెంపకందారుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వెంటాడుతున్న శునకాలు..
భయపెడుతున్న వానరాలు!

– న్యూస్‌టుడే, మద్దిపాడు

గుండ్లాపల్లి సచివాలయ ప్రాంగణంలో శునకాల గుంపు

● ఇటీవల మల్లవరంలోని బొడ్రాయి కూడలిలో కుక్కలు దాడి చేయడంతో వృద్ధురాలు పోతినేని రాజ్యంను తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆమెను ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ● దొడ్డవరంలో పాఠశాలకు వెళ్లే దారిలో ముగ్గురు చిన్నారులను కుక్కలు కరవడంతో మద్దిపాడు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందారు. ● మద్దిపాడులోని బస్టాండు కూడలిలో ఓ వృద్ధుడిని కుక్క కరవడంతో ఒంగోలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ● ఘడియాపూడి పునరావాస కాలనీలో కుక్కల దాడిలో గాయపడినవారు వంద మందికి పైగా ఉన్నారు. ● గుండ్లాపల్లిలోని దాక్షాయణి ఇంట్లోకి కోతుల గుంపు చొరబడి భయాందోళనకు గురిచేశాయి. ● మద్దిపాడు ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో నర్సింగ్ విద్యార్థులపై కోతులు దాడి చేయడంతో భయంతో పరుగులు తీశారు. ● మద్దిపాడు మండల పరిధిలోని గ్రామాల్లో కుక్కలు, కోతులు స్వైరవిహారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎక్కడ, ఎప్పుడు , ఎవరిపై దాడి చేస్తాయోనని భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, వృద్ధులపై దాడులకు దిగుతూ గాయపరుస్తున్నాయి. పాఠశాలలకు వెళ్లిన తమ పిల్లలు క్షేమంగా ఇళ్లకు చేరుకునేవరకు తల్లిదండ్రులు భయంభయంగా గడుపుతున్నారు. వీటి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలను **మద్దిపాడు పశుసంవర్ధకశాఖ ఏడీ కిషోర్‌కుమార్** వివరించారు.

కోతుల నుంచి రక్షణ ఇలా : సాధారణంగా కోతులు ఆహారం కోసమే మనుషులపైకి వస్తుంటాయి. వీటికి ఆహారపదార్థాలు అందించే అలవాటు చేయకూడదు. ఇళ్ల కిటికీలు, బాల్కనీలకు మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలి. పండ్లు వంటివి కనిపించేలా ఉంచకూడదు. వెంబడించే కోతులకు ఖాళీ చేతులు చూపడం ద్వారా వాటిని వదిలించు కోవచ్చు. వాటి కళ్లల్లోకి నేరుగా చూస్తే అవి సవాలు చేస్తున్నట్లు భావించి దాడులకు తెగపడతాయి.

శునకాల బారిన పడకుండా: కుక్కలు తమ ఆధిపత్యం లేదా భయంతో ముందుకు ఉరుకుతాయి. కవ్వింపు చర్యలకు పాల్పడడం, రాళ్లు విసరడం, కర్రలతో బెదిరించడం, పెద్దగా కేకలు వేయడం మంచిది కాదు. కుక్కలు అరుస్తూ మన వైపునకు వస్తుంటే పరిగెత్తకూడదు. చేతులు కట్టుకుని చెట్టులా, నిశ్చలంగా నిలబడాలి. వాటి కళ్లల్లోకి నేరుగా చూడకూడదు. చిన్న పిల్లలను ఒంటరిగా వీధుల్లోకి పంపకూడదు. పిల్లలు భయంతో కేకలు వేస్తే కుక్కలు దాడి చేసే అవకాశం ఉంది. ఆహార వ్యర్థాలు రోడ్డుపై వేస్తే కుక్కలు గుంపులుగా వాటి వద్దకు వస్తాయి. చెత్త డబ్బాలకు మూతలు వేయాలి.

నిర్లక్ష్యం తగదు : కుక్కలు, కోతులు కరచినపుడు నిర్లక్ష్యం తగదు. అవి కరిచిన వెంటనే ఆ భాగాన్ని 15 నిమిషాలపాటు నీటి ధార కింద ఉంచి సబ్బుతో బాగా శుభ్రం చేయాలి. అనంతరం సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి యాంటీ రేబీస్ ఇంజెక్షన్ తీసుకోవాలి. గాయంపై కారం, సున్నం లేదా నూనె రాయకూడదు. నాటు వైద్యం జోలికి పోకపోవడమే మంచిది.

జనరల్ నోటీసు

ప్రకాశం జిల్లా, చీమకుర్తి నివాసి **కూనంనేని తిరుపతిస్వామి S/o వెంకటేశ్వర్లు** గారి సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా...

షెడ్యూలు దాఖలా ఆస్థి మా క్లయింటు అయిన **కూనంనేని తిరుపతిస్వామి** గారిదై యుండి వారి స్వాధీనానుభవములోయున్నది. సదరు ఆస్థిని హామీగా కళానికేతన్ డైరెక్టరు గారైన **వేములూరి నాగభూషణం** అనువారికి రిజిస్టరు చేసి వారివద్ద రూ 1,40,00,000/-లు అప్పు తీసుకొని యున్నారు. సదరు అప్పు తీర్చిన మీదట మరలా మా క్లయింటుకు తిరిగి రిజిస్టరు చేయులాగున **వేములూరి నాగభూషణం** గారు విక్రయంరోజే ఒక అగ్రిమెంటు చేసియున్నారు. సదరు నాగభూషణం గారికి మా క్లయింటు తిరుపతిస్వామిగారు అప్పు చెల్లించుటకు సంప్రదించగా వేమూలూరి నాగభూషణం గారు నిరాకరించినారు. అంతేకాక తన పేరుతో ఉన్న విక్రయ పత్రం ఆధారంగా 2025లో పన్ను మార్పుదల చేయించుకున్న నేపథ్యంలో, మా క్లయింటు తన వద్ద ఉన్న అగ్రిమెంటు ప్రకారం తిరిగి రిజిష్టరు చేయమని కోరుతూ ఒంగోలు జిల్లాకోర్టులో O.S. 8/2026 నెంబరున దావా వేసి యుండగా సదరు ఆస్థికి సంబంధించిన వ్యవహారము కోర్టులోఉన్నది. అయితే **వేములూరి నాగభూషణం** షెడ్యులు ఆస్థిని ఇతరులకు విక్రయించదలచినట్లు తెలియుచున్నది. సదరు షెడ్యూలు ఆస్థి నా క్లయింటు స్వాధీన అనుభవంలో ఉండి, సదరు ఆస్థిగురించి ఒంగోలు కోర్టులో దావా నిల్వలో ఉన్నందున ఎవ్వరైననూ ఎట్టి విక్రయాలు చేసిననూ అవి చెల్లనేరవు కనుక తెలియజేయడమైనది.

షెడ్యూలు: ప్రకాశం జిల్లా చీమకుర్తి S.No.245/1-Old D.No.1-211/9, ప్రస్తుత D.No.1-463,464,- విస్తీర్ణం - Ac. 0.50 సెం లేదా 300 గదులు లేదా 2420 చ.గజముల నివాస స్థలము- అందులోని RCC మరియు ACC నిర్మాణాలకు **హద్దులు:- తూర్పు:** మేదరమెట్ల వెంకటేశ్వర్లు వగైరాలు, **దక్షిణం:** ఒంగోలు-కర్నూలు మెయిన్‌రోడ్, **పడమర:** వేల్పూరి వెంకటేశ్వర్లు మరియు పంటకాలువ, **ఉత్తరం:** మేదరమెట్ల వెంకటేశ్వర్లు మరి ఇతరులు.

ఇట్లు: యన్.శ్రీనివాసప్రసాద్, బి.ఎస్సీ బి.యల్ **బి.లక్ష్మీనారాయణ,** బి.ఎ.ఎం.ఎల్.,
అడ్వకేట్స్, పి.వి.ఆర్ గరల్స్ స్కూల్ పక్కన, కోర్టు సెంటర్, ఒంగోలు.

(c) eenadu



నెల్లూరు జెండా వీధిలో శుభాకాంక్షలు తెలుపుకొంటున్న ముస్లిం సోదరులు

ఆ నెలవంక.. ఇలవంక

నెలవంక దర్శనంతో రంజాన్ నెల ప్రారంభం కాగా- జిల్లా వ్యాప్తంగా ముస్లిం సోదరులు బాణసంచా కాల్చుతూ.. మిఠాయిలు తినిపించుకుంటూ.. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం అట్టహాసంగా వేడుకలు ప్రారంభించారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలక సంస్థ)

పలు మెము రైళ్లు రద్దు

బిట్రగుంట, న్యూస్‌టుడే: సూళ్లూరుపేట- నెల్లూరు మధ్య నడిచే పలు మెము రైళ్లను ఈ నెల 21, 22 తేదీల్లో రద్దు చేస్తున్నట్లు విజయవాడ రైల్వే డివిజనల్ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైలు మార్గాల నిర్వహణ పనుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈనెల 21న 66041 (సూళ్లూరుపేట-నెల్లూరు), 66037 (సూళ్లూరుపేట-నెల్లూరు), 66038 (నెల్లూరు - సూళ్లూరుపేట), 66040 (నెల్లూరు-సూళ్లూరుపేట) మెము రైళ్లను రద్దుచేశారు. 22వ తేది, 66035 (సూళ్లూరుపేట - నెల్లూరు)ను రద్దుచేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

మాయదారి.. నిర్లక్ష్యమే ప్రమాదకారి!

హైవేపై యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన
ప్రాణాలు పోతున్నా.. అవగాహన అంతంతే

ఈనాడు, నెల్లూరు: నిత్యం జరిగే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం నిర్లక్ష్యమే. నిబంధనలపై అవగాహన లేకపోవడం.. ఇష్టానుసారం వాహనాలు నడపడం.. అపసవ్య దిశలో వెళ్లడం.. మద్యం మత్తుకు తోడు అతివేగం.. ఇలా అన్నీ.. జిల్లా పరిధిలోని సుమారు 135 కి.మీ. పొడవున్న కోల్‌కతా- చెన్నై జాతీయ రహదారిపై చోటు చేసుకుంటున్న ప్రమాదాలకు కారకాలుగా నిలుస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు అడ్డదిడ్డంగా జాతీయ రహదారిపైకి వచ్చేయడం, ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలపడం సమస్యను జటిలం చేస్తోంది. పోలీసు, రవాణా, ఎన్‌హెచ్ అధికారులు సంయుక్తంగా వీటిపై దృష్టిసారిస్తేనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుంది.

చింతారెడ్డిపాళెం కూడలిలో హైవేపై అస్తవ్యస్తంగా రాకపోకలు

జాతీయ రహదారులపై..

సంవత్సరం	ప్రమాదాలు	మరణాలు	క్షతగాత్రులు
2024	413	249	487
2025	393	266	407

● కావలి పరిధిలోని గౌరవరం దగ్గర రోడ్డుపైనే వాహనాలు ఆపడం సమస్యగా మారింది. రహదారికి ఇరువైపులా దాబాలు ఉండటంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. డ్రైవర్లు, క్లీనర్లు రోడ్డు దాటే క్రమంలో తరచూ మృత్యువాత పడుతున్నారు.

● చింతారెడ్డిపాళెం కూడలి దగ్గర జాతీయ రహదారి పక్కనే మద్యం దుకాణం, బార్ ఉన్నాయి. దీంతో వాహనదారులు రోడ్డుపైనే వాహనాలు ఆపుతున్నారు. ద్విచక్ర వాహనదారులు, కార్లు సుమారు వంద మీటర్లు అపసవ్య దిశలో మద్యం దుకాణం దగ్గరకు వెళుతున్నాయి.

● గొలగమూడి క్రాస్ రోడ్డు దగ్గర.. ఆటోనగర్‌కు వెళ్లే వాహనాలన్నీ సుమారు 100 మీటర్లు రాంగ్ రూట్‌లో వెళుతున్నాయి. నెల్లూరు నగరం నుంచి దొంతాలికి చెత్తను తీసుకువెళ్లే వాహనాలు అటుగానే వెళుతున్నాయి. వెంకటాచలం జంక్షన్ నుంచి ముసునూరు వైపు వెళ్లే వాహనాలదీ అదే పరిస్థితి.

ఎన్‌హెచ్-16పై.. (కావలి-గూడూరు వైపు)

● అల్లూరు రోడ్డు స్టేషన్ సమీపంలో రైల్వే వంతెన ఇరుకుగా మారింది. రాత్రిళ్లు దగ్గరకు వచ్చే వరకు అక్కడ డైవర్షన్ కనిపించడం లేదు. దీంతో ఈ ప్రాంతంలో ప్రతి రెండు, మూడు రోజులకు ఒక దుర్ఘటన జరుగుతోంది.

● మనుబోలు మండలం వీరంపల్లి క్రాస్‌రోడ్డు సమీపం, మనుబోలు జంక్షన్‌లో పైవంతెన ప్రారంభంలో జాతీయ రహదారి దాటేందుకు ఇచ్చిన కటింగ్ వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా... నియంత్రించే చర్యలు కొరవడ్డాయి.

● జాతీయ రహదారి నుంచి గూడూరులోకి వెళ్లేటప్పుడు.. నాయుడుపేట వైపు నుంచి వాహనాలు ఢీకొంటున్నాయి. అక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసినా ప్రమాదాలు ఆగడం లేదు. వరగలి అడ్డ రోడ్డు సమీపంలో పైవంతెన నిర్మిస్తుండటంతో.. గూడూరు వైపు వచ్చే వాహనాలు జాతీయ రహదారిపై అపసవ్య దిశలో వస్తున్నాయి.

● నార్త్ రాజుపాళెం కూడలిలో.. నెల్లూరు నుంచి కొడవలూరు, విడవలూరు, అల్లూరు మండలాలకు వెళ్లే బస్సులు జాతీయ రహదారిపై మలుపు తిరిగి వెళ్లాలి. ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలకైతే లెక్కేలేదు. ఈ క్రమంలో కావలి వైపు నుంచి వచ్చే వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి.

అవగాహన కల్పిస్తున్నాం

రోడ్డు ప్రమాదాల నివారణకు ముఖ్య కూడళ్లు, హైవేలు, బ్లాక్ స్పాట్లు, పాఠశాలలు, కళాశాలలు, ఇతర రద్దీ ప్రాంతాల్లో రోడ్డు సేఫ్టీ వారియర్లతో అవగాహన కల్పిస్తున్నాం. హెల్మెట్ ఉపయోగం, ట్రాఫిక్ ఉల్లంఘనలను వివరిస్తున్నాం. జాతీయ రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రయాణికులు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి.

– డాక్టర్ అజిత వేజెండ్ల, ఎస్పీ

తొమ్మిది మండలాల్లో.. సెనగ కొనుగోలు కేంద్రాలు

దుత్తలూరు, న్యూస్‌టుడే: జిల్లాలోని తొమ్మిది మండలాల్లో సెనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు మార్క్‌ఫెడ్ మేనేజరు పవన్‌కుమార్ తెలిపారు. గత ఏడాది సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం.. గోదాములు అందుబాటులో లేక.. ఇళ్లలలో నిల్వలు ఉంచుకోలేక రైతులు పంటను దళారులకు అమ్ముకోవాల్సి వచ్చింది. ఆ విషయాలను గుర్తు చేస్తూ. . ఈ ఏడాదైనా సకాలంలో ఏర్పాటు చేస్తే మంచిదని సూచిస్తూ.. ఈ నెల 14న 'సెనగ రైతు.. ఎదురు చూపు' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లగా.. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆ మేరకు దుత్తలూరు, వరికుంటపాడు, కలిగిరి, వింజమూరు, కొండాపురం, చేజర్ల, కలువాయి, ఆత్మకూరు, అనంతసాగరం మండలాల్లో ఏర్పాటు చేయనున్నట్లు, అవసరమైతే అదనంగా పెడతామని మార్క్‌ఫెడ్ మేనేజరు తెలిపారు. రైతులు తప్పనిసరిగా ఈ-పంట, సీఎం యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

వెదర్.. నోటిఫికర్!

జిల్లాలో తొమ్మిది ఆటోమేటిక్ స్టేషన్ల ఏర్పాటు

ఈనాడు, నెల్లూరు: ప్రాణ, ఆస్తి నష్టాలు తగ్గించేందుకు ముందస్తు వాతావరణ వివరాలు అవసరమని గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాయి. ఆ క్రమంలో జిల్లాలో కొత్తగా తొమ్మిది ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు(ఏడబ్ల్యూఎస్) ఏర్పాటయ్యాయి. భారత వాతావరణ పరిశోధన సంస్థ (ఐఎండీ) సౌజన్యంతో నెల్లూరు సీపీఓ(జిల్లా ప్లానింగ్) కార్యాలయంతో పాటు కోవూరు, ఇందుకూరుపేట మండలం కొరుటూరు, ముత్తుకూరు మండలం పొట్టెంపాడు, సీతారామపురం, కావలి, ఉలవపాడు మండలం కరేడులో 33/11కేవీ సబ్‌స్టేషన్లో, గుడ్లూరు తహసీల్దారు కార్యాలయం, వలేటివారిపాలెం ప్రభుత్వ ఆసుపత్రిలో కొలువుదీర్చారు. వీటి ద్వారా రానున్న అయిదు రోజుల్లో వాతావరణం ఎలా ఉండబోతుందన్నది శాటిలైట్ ద్వారా తెలుసుకుని.. రైతులకు చేరవేస్తారు.

కొరుటూరులో ఏర్పాటు చేసిన ఏడబ్ల్యూఎస్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

రైతులకు ఉపయుక్తం

ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లో వర్షపాతం నమోదుతో పాటు భూమిపై పడిన వర్షపు నీరు ఎంత శాతం ఆవిరి మారుతున్నదీ కొలిచే సాధనం ఉంది. గాలి దిశ, వేగం కొలిచే సాధనం ద్వారా గంటకు ఎన్ని కి.మీ. వేగంతో వీస్తున్నదీ తెలుస్తుంది. అత్యధిక, అత్యల్ప ఉష్ణోగ్రతలు తెలుసుకుంటారు. రోజులో ఎన్ని గంటలు సూర్యరశ్మి ఉంటున్నదీ తెలుసుకునే మరో సాధనం, గాలిలో తేమశాతం లెక్కగట్టే పరికరాలు ఉన్నాయి. రోజూ ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో నమోదు చేస్తారు. వీటి వివరాల ద్వారా రైతులు వాతావరణం అంచనా ఆధారంగా పంట సాగు, ఎరువుల వినియోగం, ఇతర వ్యవసాయ కార్యకలాపాలు సమర్థంగా నిర్వహించుకునే అవకాశం ఉందని కలెక్టర్ హిమాన్షుశుక్లా తెలిపారు. తుపాన్లు, భారీ వర్షాల సమయంలో ముందస్తు హెచ్చరికలు చేసేందుకూ ఈ డేటా ఉపయోగపడుతుందన్నారు.

"గతంలో వర్షపాతం కొలిచేందుకు రెయిన్ గేజ్(వర్ష మాపకం) ఉపయోగించారు. గత ప్రభుత్వంలో నిర్వహణను విస్మరించడంతో చాలా చోట్ల నిరుపయోగంగా మారాయి. కొన్ని మరమ్మతులకు గురయ్యాయి. తిరిగి వీటిని గాడిలో పెట్టే చర్యలు మొదలయ్యాయి. ఇప్పటి వరకు ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు, రెయిన్ గేజ్‌ల నిర్వహణను విపత్తుల నిర్వహణశాఖ చూడగా.. ఇటీవల ఈ బాధ్యతను ప్రణాళికశాఖకు అప్పగించారు."

పల్లెకు సౌరభం

జిల్లాలో ఆరు మోడల్ గ్రామాల ఎంపిక

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: సౌర విద్యుత్తు వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరిన్ని చర్యలు తీసుకుంటున్నాయి. అందులో భాగంగానే పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద జిల్లాలోని ఆరు గ్రామాలను మోడల్ సోలార్ గ్రామాలుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ అంశంపై కలెక్టర్ హిమాన్షు శుక్లా బుధవారం జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డిప్యూటీ సీఈవో మోహన్‌రావు, విద్యుత్తుశాఖ ఎస్‌ఈ రామచంద్ర, ఈఈ బాలచంద్ర తదితరులతో సమీక్షించారు.

ఆ గ్రామాలు ఇవే..

గ్రామీణ ప్రాంతాల్లో సౌర విద్యుత్తు వినియోగాన్ని, సౌర రూఫ్‌టాప్ వ్యవస్థను ప్రోత్సహించేందుకు జిల్లాలో అయిదు వేల మందికిపైగా జనాభా ఉన్న ఆరు గ్రామాలను తొలి విడత మోడల్‌గా ఎంపిక చేశారు. లేగుంటపాడు, బిట్రగుంట, మహిమలూరు, కలివెలపాలెం, మనుబోలు, కాకుపల్లి గ్రామాలు ఈ జాబితాలో ఉన్నాయి. ఈ గ్రామాల్లోని ప్రతి ఇంటికి సౌర ఆధారిత దీపాలు, నీటి సరఫరా వ్యవస్థలు, వ్యవసాయ అవసరాలకు సౌర పంపులు, గ్రామ రహదారులపై సౌర వీధి దీపాలు ఏర్పాటు చేస్తారు.

ఉత్తమ గ్రామానికి రూ. కోటి

జిల్లాలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ఓ గ్రామాన్ని మోడల్‌గా ఎంపిక చేస్తారు. దీనికి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకంగా రూ. కోటి మంజూరు చేస్తుంది. ఆ మొత్తాన్ని గ్రామాభివృద్ధికి వినియోగిస్తారు. ఈ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ఎవరడిగినా... నేను చూసుకుంటా!

కోడూరుపాడులో ఇసుకాసురులకు చోటా నాయకుడి అభయం

కోడూరుపాడు సమీప పెన్నా నదిలో యంత్రంతో ఇసుక అక్రమ తవ్వకాలు

'స్థానిక అవసరాలకు ఇసుక అవసరమైతే.. సమీప వాగులు, వంకల్లోకి వెళ్లి ఎడ్ల బండ్లు, ట్రాక్టర్ల ద్వారా ఉచితంగా తెచ్చుకోవచ్చు. విక్రయించకూడదు. వాణిజ్య అవసరాలకు కావాలంటే.. అనుమతి ఉన్న రీచ్‌ల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరకు తీసుకోవాలి.' – ఇదీ ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తెస్తూ.. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల సారాంశం.

ఈనాడు, నెల్లూరు

నెల్లూరు రూరల్ పరిధిలోని ఓ చోటా నాయకుడికి మాత్రం ఇవేవీ పట్టడం లేదు. అన్నింటికీ అతీతమన్నట్లు వైకాపా అధికారంలో ఉన్నప్పుడు రెచ్చిపోయిన ఆయనే.. ఇప్పుడూ అదే దందా కొనసాగిస్తున్నారు. ఎన్నికల ముందు తెదేపాలోకి వచ్చిన సదరు నాయకుడు.. తర్వాత సమీపంలోని మరో నియోజకవర్గంలోని నాయకుల చెంతకు చేరారు. ఇప్పుడు ఆ ఇద్దరు ప్రజాప్రతినిధుల పేర్లు చెబుతూ.. అనుమతులు లేని ప్రాంతాల్లో తవ్వకాలు జరుపుతూ.. దోపిడీకి తెరతీశారు. ఎవరైనా ప్రశ్నిస్తే.. బెదిరించడం, భయపెట్టడం షరామామూలైంది. అధికారులు అడ్డుకుంటే.. 'నా పేరు చెప్పండి.. ఎవరడిగినా నేను చూసుకుంటా' అనే వరకు వ్యవహారం వెళ్లింది. మొత్తంగా ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది.

దందా.. దర్జాగా..

నెల్లూరు నగరం, రూరల్ పరిధిలోని స్థిరాస్తి వ్యాపారులు, ఇతరులతో ముందస్తు ఒప్పందాలు చేసుకుని.. ఆ మేరకు నదిని గుల్ల చేస్తున్నారు. గతంలో రాత్రిళ్లు మాత్రమే తవ్వకాలు జరిగేవి. ఇప్పుడు పట్టపగలే చొరబడుతున్నారు. మూడు రోజులుగా భారీ యంత్రంతో.. వందల ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నారు. ఒక్క అధికారి.. అటువైపు చూసేందుకు సాహసించడం లేదు.

● దీనిపై జిల్లా భూగర్భ గనులశాఖ అధికారి శ్రీనివాసరావు వివరణ కోరగా.. 'అనుమతి లేని ప్రాంతంలో యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేయడం నేరం. కోడూరుపాడులో అనుమతి ఇవ్వలేదు. యంత్రంతో తవ్వకాలు చేస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. పరిశీలించి.. చర్యలు తీసుకుంటా'మన్నారు.

దూరాన్ని బట్టి ధర

నగరంలో దూరాన్ని బట్టి ట్రాక్టర్ ఇసుక రూ.2వేల నుంచి రూ.3వేల వరకు పలుకుతుండగా.. కోడూరుపాడు నుంచి రోజుకు 100 నుంచి 120 ట్రిప్పుల తరలిస్తున్నారు. ఈ లెక్కన రోజుకు రూ. 3 లక్షలు, నెలకు రూ.90 లక్షల మేర దోచుకుంటున్నారు. కోవూరు మండలం జమ్మిపాళెం, నెల్లూరు రూరల్‌లో పొట్టేపాళెం, నగరంలోని భగత్‌సింగ్‌కాలనీ, బుచ్చిరెడ్డిపాళెం సమీపంలో జొన్నవాడ, మినగల్లు దగ్గర కూడా యథేచ్ఛగా ఈ తరహా దందా సాగుతోంది.

9న ఓటరు జాబితాల ప్రదర్శన

ఓటరు తుది జాబితా ప్రచురించేందుకు అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. వచ్చే నెల తొమ్మిదో తేదీ జిల్లాలోని 700 గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో వీటిని ప్రదర్శించేందుకు సిద్ధం చేస్తున్నారు. ఏప్రిల్ తొలి వారానికి సర్పంచుల పదవీ కాలం ముగియనుంది. దీంతో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఓటర్ల జాబితాలు తయారుచేస్తున్నారు. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నాటికి చేరిన వారితో పంచాయతీల వారీగా జాబితా రూపొందిస్తున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు (జడ్పీ)

ఉపాధికి కదళి నారలా!

అరటినారతో తయారుచేసిన పూల బుట్టలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: అరటి నార ఉత్పత్తులతో మహిళల ఆర్థికాభివృద్ధికి బాటలు పడుతున్నాయి. ఇప్పటికే ఇందుకూరుపేటలో ఈ దిశగా అడుగులు విజయవంతం కాగా- తాజాగా ఆత్మకూరు మండలం మహిమలూరులోనూ శిక్షణ ప్రారంభించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నాబార్డు ఆర్థిక సహకారంతో పొదుపు మహిళలకు బుట్టలు, సంచులు, టేబుల్ మ్యాట్‌లు, గృహ అలంకరణ సామగ్రి, నీళ్ల సీసాలు ఉంచుకునే సంచులు తదితరాల తయారీపై తర్ఫీదు ఇస్తున్నారు. మొదటి విడతగా 30 మందిని ఇందుకు ఎంపిక చేశారు. 20 రోజుల శిక్షణ అనంతరం.. వీరి వస్తువులకు మార్కెటింగ్ సౌకర్యం సైతం అందుబాటులోకి తీసుకురానున్నారు.

శిక్షణలో నిమగ్నమైన మహిళలు

భవిష్యత్తు ఉన్నతికి...

శిక్షణ బాగుంది. సద్వినియోగం చేసుకుంటాం. దీంతో పాటు ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే ఆర్థిక ఉన్నతికి బాటలు వేసుకుంటాం. అప్పుడే ప్రయోజనకరంగా నిలుస్తుంది.

– పి.హైమావతి

శిక్షణతో మేలు..

గ్రామీణ ప్రాంత మహిళలకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరం. తయారు చేస్తున్న వస్తువులు సైతం చాలా బాగున్నాయి. మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే.. మంచి ఫలితాలు సాధిస్తాం.

– టి.నాగసుజిత

అవుట్ పోస్ట్ కాస్తా.. పంపుహౌస్ ఆయే!

నగరంలోని వెంకటేశ్వరపురం జనార్దన్‌రెడ్డి కాలనీలో అవుట్ పోస్టు ఏర్పాటుచేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకు రూ.8 లక్షలు కేటాయించారు. ఏర్పాట్లు చేసినా ప్రారంభించలేదు. బోర్డుతో సరిపెట్టారు. ప్రస్తుతం ఇందులో తాగునీటి పంపు హౌస్ ఏర్పాటుచేశారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు (నేర విభాగం)

అందని యంత్రం... అద్దె భారం

న్యూస్‌టుడే, దుత్తలూరు: వ్యవసాయంలో విత్తనం మొదలు పంట నూర్పిడి వరకు ప్రతి దశలో కూలీల కొరత వేధిస్తోంది. సమస్యను అధిగమించాలంటే సాగు యంత్రాలు, పరికరాలు తప్పనిసరి. కానీ, ఖరీఫ్ పూర్తయి.. రబీ సీజన్ నడుస్తున్నా. . ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు వీటి పంపిణీపై స్పష్టత లేదు. దాంతో అన్నదాతలు అద్దెకు తెచ్చుకోవాల్సి వస్తోంది.

గత ఏడాది ఇలా..

గత ఏడాది మార్చిలో యాంత్రీకరణ పథకం కింద జిల్లాకు రూ. 2.8 కోట్లు మంజూరయ్యాయి. వీటితో రైతులకు అవసరమైన డ్రోన్లు, బ్యాటరీలు, పవర్ స్ప్రేయర్లు, రోటోవేటర్లు, బ్రష్ కట్టర్లు, పవర్ టిల్లర్లు, ట్రాక్టర్‌తో నడిచే యంత్రాలను 50 శాతం రాయితీపై అందించాల్సి ఉంది. ప్రతి మండలానికి రెండు నుంచి మూడు డ్రోన్లను.. మరికొన్ని పరికరాలను అందజేశారు. కాకుంటే.. 1,452 మందికి యంత్ర పరికరాలు అందించాల్సి ఉండగా.. 796 మందికే పంపిణీ చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. కాగా.. ఈ ఏడాది ఇంకా ఇందుకు సంబంధించిన చర్యలు మొదలు కాలేదు. 45 రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తుందని.. పరికరాలు పంపిణీ చేస్తే బాగుంటుందని కోరుతున్నారు.

● ఈ విషయమై జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి సత్యవాణి వివరణ కోరగా.. ఈ ఏడాది ఇంకా ఎలాంటి మార్గదర్శకాలు విడుదల కాలేదన్నారు. పథకం కింద నిధులు కేటాయించలేదన్నారు.

మొక్కుబడిగా నమోదు

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఎఫ్‌ఎం(ఫాం మెకనైజేషన్) యాప్‌లో.. గ్రామాల్లో రైతుల వద్ద ఏయే వ్యవసాయ పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఇంకా ఏమేమి కావాలనే సమాచారం పొందుపరుస్తున్నారు. జిల్లాలో ఈ ప్రక్రియ మొక్కుబడిగా సాగుతోంది. మరోవైపు గత్యంతరం లేని పరిస్థితుల్లో చిన్న, సన్నకారు రైతులు అద్దెకు తెచ్చుకుని వినియోగించుకుంటున్నారు. ఇది కాస్త వారికి భారంగా పరిణమిస్తోంది.

విరామం.. ఓ ఉపశమనం

న్యూస్‌టుడే, దుత్తలూరు : పదో తరగతి పరీక్షల విధానంలో ప్రభుత్వం మార్పులు తెచ్చింది. గతానికి భిన్నంగా రోజు మార్చి రోజు నిర్వహించనుంది. దీంతో బాలలపై ఒత్తిడి తగ్గనుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిల్లాలో ఈ ఏడాది 174 కేంద్రాల్లో 27,931 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు. మార్చి 16 నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు జరగనున్నాయి. విరామంతో తదుపరి సబ్జెక్టుపై దృష్టి సారించేందుకు సమయం ఉంటుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ప్రధానంగా గణితం, ఆంగ్లం, సైన్స్ సబ్జెక్టుల పునశ్చరణకు ఉపయుక్తమంటున్నారు. మానసిక ఒత్తిడి, అలసట తగ్గుతుందని నిపుణుల మాట.

సరైన ప్రణాళికతో..

ముఖ్యమైన పాఠ్యాంశాల పునశ్చరణ, నమూనా ప్రశ్నలకు జవాబుల అభ్యాసం ద్వారా ఆత్మవిశ్వాసం పెరిగి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు దోహదపడుతుందని, తల్లిదండ్రులు ఒత్తిడి పెట్టకుండా వారి చదువు ప్రణాళికకు అనుగుణంగా సహకరించాలని సూచిస్తున్నారు.

ఫలితాల మెరుగుకే..

మెరుగైన ఫలితాలు రావాలని పరీక్షల మధ్య విరామం ఉండేలా ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది. సమయం ఉండడంతో ఒత్తిడి లేకుండా ప్రతి పరీక్ష బాగా రాస్తారు. బాలాజీరావు, జిల్లా విద్యాశాఖాధికారి

(c) eenadu

పరిమితికి మించి కుక్కేశారు

నలుగురు ఎక్కాల్సిన ఆటోలో ఇరవై మందికి పైగా విద్యార్థులను కుక్కేశారు. సరకుల బస్తాలు వేసినట్లు ఒకరిపై ఒకరు కూర్చొని ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. సైదాపురం మండలంలోని మర్లపూడి ఉన్నత పాఠశాలకు ప్రతిరోజూ పోతేగుంట నుంచి విద్యార్థులు ఆటోలో వెళుతున్నారు. ఎంవీఐ అధికారులు, పోలీసులు తనిఖీ చేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సైదాపురం

శిథిలమైనా తొలగించరేం..!

వెంకటాచలం మండలం తిక్కవరప్పాడు పంచాయతీ మల్లుగుంట సంఘంలో మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన అంగన్‌వాడీ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం మరొక భవనంలో నిర్వహిస్తున్నారు. ఇళ్ల మధ్యలో ఉన్న అంగన్‌వాడీ భవనాన్ని అలాగే వదిలేయడంతో కూలేలా ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి దీనిని తొలగించి.. నూతన భవనం నిర్మించాలని స్థానికులు విన్నవిస్తున్నారు. - న్యూస్‌టుడే, వెంకటాచలం

గరుడవాహనంపై కల్యాణ వేంకటేశ్వరుడు

బుచ్చిరెడ్డిపాళెంలోని రామకృష్ణానగర్‌లో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడ వాహనంపై రామచంద్రమూర్తి అలంకారంలో బుధవారం దర్శనమిచ్చారు. గ్రామోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.
- న్యూస్‌టుడే, బుచ్చిరెడ్డిపాళెం

పాఠశాలలో వసతి లేక.. అవస్థలు తప్పక

కోవూరు పట్టణంలోని జడ్పీ బాలిక ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులు లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. సమారు 600 మందికి పైగా విద్యార్థినులు చదువుతున్న పాఠశాలలో భోజనశాల లేకపోవడంతో మధ్యాహ్న భోజనం వరండాల్లో, సైకిల్ స్టాండ్ సమీపంలో కూర్చొని తింటున్నారు. కనీసం విద్యార్థినులు భోజనం తినే పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. - న్యూస్‌టుడే, కోవూరు

నుడాలో రూ.32.50 కోట్ల పనులకు ప్రతిపాదనలు : జేసీ

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నుడా పరిధిలో రూ.32.50 కోట్ల పనులకు ప్రతిపాదనలు వచ్చినట్లు జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం నుడా కార్యాలయంలో ఆ సంస్థ చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మొదటి స్థానంలో నిలిచేందుకు అధికారులంతా సహకరించాలని సూచించారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ కందుకూరు, కావలి ఎంఐజీ లేఅవుట్ల అభివృద్ధికి టెండర్లు పిలిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న జేసీ వెంకటేశ్వర్లు, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

వారొచ్చి పట్టుకుంటే.. వీరేం చేస్తున్నట్టు..!

అడవుల్లో ఎర్ర స్మగ్లర్ల కదలికలపై నిఘా ఏదీ

- జనవరి 29న రాపూరు అటవీ ప్రాంతంలో అరుదైన వన్యప్రాణి అలుగు (పాంగోలియన్)ను కొందరు పట్టుకొని విక్రయించేందుకు తీసుకెళుతున్నారు. నిఘా విభాగాల సమాచారంతో స్థానిక అధికారులు ఏడుగురిని వలపన్ని పట్టుకున్నారు.

- జనవరి 18న ఉదయగిరి మండలం అర్లపడియ సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి తరలిస్తున్న 30 ఎర్ర చందనం దుంగలతో పాటు వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.20 లక్షల వరకు ఉంటుందని తేల్చారు.

- జనవరి 22న ఏపీ టాస్క్‌ఫోర్స్ బలగాలు పక్కా సమాచారంతో వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద కారులో అక్రమంగా తరలిస్తున్న 28 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకొని నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. నిందితులు నెల్లూరు, తిరుపతి జిల్లాలకు చెందిన వారుగా గుర్తించారు.

న్యూస్‌టుడే, అనంతసాగరం

వెలిగొండ అడవుల్లోని ప్రకృతి సంపదైన ఎర్ర చందనం నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం, కడప జిల్లాలో విస్తరించింది. స్మగ్లర్లు తమిళనాడుకు చెందిన కూలీల సహాయంతో వివిధ ప్రాంతాలకు గుట్టుగా తరలిస్తున్నారు. రాపూరు, కలువాయి, చేజర్ల, అనంతసాగరం, ఉదయగిరి తదితర ప్రాంతంలో స్థానికుల సాయంతో ఇదంతా జరుగుతోందని సమాచారం. వీటిని పరిరక్షించాల్సిన అటవీ శాఖ అధికారులు గత వైకాపా పాలనలో పూర్తిగా వదిలేయడంతో అక్రమార్కులకు అడ్డులేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రారంభంలో పూర్తిస్థాయిలో కట్టడి చేసినా ఇటీవల కార్లలో ఎవరికీ అనుమానం రాకుండా వివిధ మార్గాల్లో తరలిస్తున్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్స్ అధికారులు జిల్లాకు వచ్చి పక్కా సమాచారంతో పలు ప్రాంతాల్లో నిఘా ఉంచి పట్టుకున్నారు.

చెక్‌పోస్టులు ఉన్నట్లా.. లేనట్లా..!

వివిధ ప్రాంతాల్లో కూలీల సాయంతో ఎర్ర చందనం చెట్లను నరికి, వస్తువులను పట్టుకొని ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటే అధికారులకు తెలియకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది..! వివిధ ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఉన్నా ఎక్కడా తనిఖీలు చేస్తున్న దాఖలాలు లేవు. క్షేత్రస్థాయిలో కూంబింగ్, పర్యవేక్షణ కొరవడిందన్న విమర్శలున్నాయి. గతంలో అటవీశాఖ సిబ్బంది చురుగ్గా పనిచేయడంతో ఎక్కడికక్కడ నిరోధించారు. నూతనంగా రిక్రూట్‌మెంట్ లేకపోవడం, జిల్లాలో ప్రతి రేంజి పరిధిలో 50 శాతం సిబ్బంది కొరత వేధిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో నిఘా పెట్టి ఎర్రచందనం తరలిస్తున్న అక్రమార్కుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు విన్నవిస్తున్నారు.

అవకతవకలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు: ఆర్ఐవో

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : పరీక్షల్లో అవకతవకలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఆర్ఐవో, జిల్లా కన్వీనర్ టి.వరప్రసాదరావు హెచ్చరించారు. నగరంలోని డీకే ప్రభుత్వ కళాశాలలో పరీక్షల నిర్వహణ అధికారులు, సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా సీఎస్‌లు, డీవోలు, నిర్వహణ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రాల్లో వెలుతురు, తాగునీరు, గాలి సమృద్ధిగా ఉండేలా చూడాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సదుపాయం అందేలా చూడాలన్నారు. పోలీస్, రవాణా, రెవెన్యూ తదితర శాఖల సమన్వయంతో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని నిర్దేశించారు. కార్యక్రమంలో డీఈసీ సభ్యులు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్ఐవో వరప్రసాదరావు

ఎంపిక చేసిన పాఠశాలల్లో తనిఖీలు

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న వసతులపై సోషల్ ఆడిట్ జరిగిందని సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ డి.వెంకటసుబ్బయ్య తెలిపారు. బుధవారం నగరంలోని దర్గామిట్ట ఉన్నత పాఠశాలలో సీఆర్ఎంటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల్లో నిధుల వినియోగం, విద్యా ప్రమాణాలు, వసతుల కల్పన, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు తదితర అంశాలను పరిశీలించామన్నారు. గుర్తించిన లోపాలను సరిచేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి, సీఎంవో గోగుల రమణయ్య, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏపీసీ వెంకటసుబ్బయ్య

పారిశ్రామిక విద్యుత్తు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం: సీఎండీ

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: పారిశ్రామిక వినియోగదారులు ఎదుర్కొంటున్న విద్యుత్తు సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ లోతేటి చెప్పారు. తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో బుధవారం పారిశ్రామిక విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి మాట్లాడారు. నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి 26 మంది హాజరై పలు సమస్యలు తెలిపినట్లు చెప్పారు. వోల్టేజీలో హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయని, సోలార్ విద్యుత్తు బిల్లింగ్, ట్రూ-అప్, ఎఫ్‌పీపీసీఏలకు సంబంధించి వినతులను అందజేశారని తెలిపారు. వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రతి నెలా మొదటి బుధవారం ఉదయం 10:30 నుంచి 11:30 గంటల వరకు జిల్లాల్లోని సూపరింటెండెంట్ ఇంజినీర్ కార్యాలయాల్లో, మూడో బుధవారం తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో ఈ వేదికలు నిర్వహిస్తున్నామని పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలని కోరారు. సంస్థ డైరెక్టర్లు అయూబ్ ఖాన్, గురవయ్య, రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు రమణాదేవి, పద్మ, ఆదిశేషయ్య, ఉమాపతి, కృష్ణారెడ్డి, రామచంద్రరావు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తతో మాట్లాడుతున్న సీఎండీ శివశంకర్ లోతేటి

సామాజిక తనిఖీ సభలో పాల్గొన్న డ్వామా పీడీ గంగాభవాని

ఉపాధి హామీ పనుల్లో పారదర్శకత పాటించాలి

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: ఉపాధిహామీ పనుల్లో పారదర్శకత, వేగం పెరగాలని డ్వామా పీడీ గంగాభవాని అన్నారు. ఏఎస్‌పేట మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని 19గ్రామ పంచాయతీల్లో మొత్తం రూ.6 కోట్ల పనులు జరిగాయన్నారు. రికార్డుల పరిశీలన అనంతరం రూ. 49,431 రికవరీకి ఆదేశించామన్నారు. ఉపాధిహామీ పథకం పేరు వీబీ జీ రాంజీ పథకంగా పేరు మారిందని ఇకపై 125 రోజులు పని దినాలు ఉంటాయన్నారు. ఎంపీపీ పద్మజారెడ్డి, ఏపీడీ ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీవో ప్రసన్నకుమారి, జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఏఈ ఖాదర్‌మస్తాన్, ఏపీవో సునీల్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

పొదలకూరు: గోవాలో జరిగిన జాతీయ స్థాయి ఫుట్‌బాల్ క్రీడా పోటీల్లో మహ్మదాపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు స్వర్ణ పతకాలు సాధించారు. ఈనెల 10 నుంచి 12 వరకు గోవాలో జరిగిన 22వ స్లమ్ సాకర్ నేషనల్ ఇన్‌క్లూజన్ కప్-2026లో ఫుట్‌బాల్ జాతీయ స్థాయి పోటీల్లో 11 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో అక్షిత, సంధ్య, రీతికలకు స్థానం దక్కిందని వ్యాయామ ఉపాధ్యాయుడు తెలిపారు. జాతీయ స్థాయిలో సత్తాచాటి కప్‌తో పాటు ప్రతి ఒక్కరూ స్వర్ణ పతకాలు సాధించారని పేర్కొన్నారు. బుధవారం పాఠశాలలో ముగ్గురు క్రీడాకారిణులను ప్రధానోపాధ్యాయులు గిరీష్, ఉపాధ్యాయులు, సుబ్బానాయుడు, రామ్మూర్తి అభినందించారు.

మహ్మదాపురంలో క్రీడాకారిణులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వక్ఫ్ స్థలం స్వాధీనం

నెల్లూరు (కలెక్టరేట్, నెల్లూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: నెల్లూరు గ్రామీణ మండలంలోని పొట్టేపాలెంలో సర్వే నంబరు 387/1లో ఉన్న 2.15 ఎకరాల అత్తరా మసీదుకు చెందిన వక్ఫ్ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఇన్‌స్పెక్టర్ ఖుదావన్ తెలిపారు. బుధవారం ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఇందులో పొదలను పొక్లెయిన్‌తో తొలగించారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ విషయంలో రాజీపడబోమని ఖుదావన్ ప్రకటించారు. ఆక్రమించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కెనరా బ్యాంక్ Canara Bank
భారత ప్రభుత్వ రంగ సంస్థ A Government of India Undertaking

స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎమ్. బ్రాంచ్
కెవిసి ఆర్కేడ్, 3వ అంతస్తు, 13-1 ఆర్‌సి రోడ్డు, వాణి నగర్, అలిపిరి, తిరుపతి-517501. ✆ 7901626759

స్థిరాస్తులు అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్, స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎమ్. బ్రాంచ్, తిరుపతి (మునుపు స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎమ్ బ్రాంచ్, కడప) వారికి ఋణగ్రహీతలు & హామీదారులు: (1) M/s రెడ్డి రా రైస్ మిల్లు (ఋణగ్రహీత), సర్వే నెం.1199-1, జలదంకి గ్రామం & మండలం, ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు జిల్లా-524223. (2) శ్రీ మారం రాఘవరెడ్డి (హామీదారు), తండ్రి: ఎం. పెద్ద రాఘవరెడ్డి, డి. నెం. 11-33-970c, 11వ వార్డు, వెంగళరావు నగర్, కావలి, ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు జిల్లా-524201. (3) శ్రీ మారం చిన్న రాఘవ రెడ్డి (హామీదారు), తండ్రి: ఎం. పెద్ద రాఘవరెడ్డి, డి. నెం. 11-33-970c, 11వ వార్డు, వెంగళరావు నగర్, కావలి, ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు జిల్లా-524201. (4) శ్రీమతి మారం పద్మ (హామీదారు), భర్త: మారం రాఘవ రెడ్డి, డి. నెం. 11-33-970c, 11వ వార్డు, వెంగళరావు నగర్, కావలి, ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు జిల్లా-524201. (5) శ్రీమతి మారం గీతా కుమారి (హామీదారు), భర్త: ఎం. చిన్న రాఘవ రెడ్డి, డి. నెం. 11-33-970c, 11వ వార్డు, వెంగళరావు నగర్, కావలి, ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు జిల్లా-524201.(6) శ్రీ మారం రాకేష్ కుమార్ రెడ్డి (హామీదారు), తండ్రి: మారం రాఘవరెడ్డి, డి. నెం. 11-33-970c, 11వ వార్డు, వెంగళరావు నగర్, కావలి, ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు జిల్లా-524201 వారు తేది. 31.01.2026 నాటికి చెల్లించవలసిన బకాయి రూ. 9,72,36,931.62 + తేది 01.02.2026 నుండి వర్తించు వడ్డీ, ఛార్జీలు మరియు ఖర్చులను కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ఛార్జ్‌చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది 10.03.2026 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా పైన తెలిపిన ఋణగ్రహీత మరియు హామీదారులకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది: 10.03.2026, ఉ॥ 10.30 గం.ల నుండి ఉ॥ 11.30 గం.ల వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ధరావత్తును RTGS/NEFT ద్వారా చలాన్‌లోని ఖాతా వివరములకు తేది: 09.03.2026, సా॥ 4.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

బ్యాంకుకు తెలిసిన సమాచారం ప్రకారం ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్‌లు లేని స్థిరాస్తి వివరములు :

ఆస్తి నెం.1: ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా, కావలి మున్సిపాలిటీ, కావలి, వెంగళరావు నగర్, బిసి హాస్టల్ దగ్గర, 11వ వార్డు, అసెస్‌మెంట్ నెం.1030006910, డి.నెం. 11-33-970సి, మారం చిన్న రాఘవ రెడ్డి & మారం రాఘవ రెడ్డి పేరున గల మూడు అంతస్తుల రెసిడెన్షియల్ బిల్డింగ్. హద్దులు: తూర్పు: కట్టా శ్రీనివాసరావు ఇల్లు, దక్షిణం: మున్సిపల్ రోడ్డు, పశ్చిమం: ఉన్నం శేషాచలం ఇల్లు, ఉత్తరం: నారపరెడ్డి ఇల్లు. పైన పేర్కొన్న సరిహద్దులలో మొత్తం విస్తీర్ణం 34 1/2 అంకణములు లేదా 276 చ॥గ॥ స్థలం.
రిజర్వు ధర: రూ. 1,22,00,000/- ధరావత్తు సొమ్ము: రూ. 12,20,000/-

ఆస్తి నెం.2: ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా, కావలి సబ్-రిజిస్ట్రేషన్, జలదంకి మండలం, జలదంకి గ్రామ పంచాయితీ, జలదంకి గ్రామం, సర్వే నెం.1199-1 లోని మారం పద్మ & మారం గీతా కుమారి పేరున గల ఎ. 1.68 సెంట్లు లేదా 0.680 హెక్టార్లు భూమి. హద్దులు: ఉత్తరం: పంట కాలువ, దక్షిణం: రోడ్డు, తూర్పు: తన్నీరు మాలకొండయ్య భూమి, పశ్చిమం: పోలిశెట్టి మాలకొండయ్య భూమి. ఈ సరిహద్దులలో మొత్తం 1016.4 అంకణములు లేదా 8131.2 చ॥గ॥ లేదా ఎ. 1.68 సెంట్లు విస్తీర్ణంలోని రైస్ మిల్ బిల్డింగ్.
రిజర్వు ధర: రూ. 1,34,53,000/- ధరావత్తు సొమ్ము: రూ. 13,45,300/-

ఆస్తి నెం.3: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కావలి సబ్-రిజిస్ట్రేషన్, కావలి మండలం, బుడమగుంట గ్రామ పంచాయితీ, బుడమగుంట గ్రామం, పట్టా నెం. 168, సర్వే నెం. 838లోని మొత్తం ఎ. 8.62 సెంట్లు భూమిని పంచాయితీ వారు అప్రూవ్ లే-అవుట్ ప్లాన్ ప్రకారం ప్లాట్లుగా విభజించిన తరువాత ప్లాట్ నెం.98 లోని మారం చిన్న రాఘవ రెడ్డి & మారం రాఘవ రెడ్డి పేరున గల 33 1/3 అంకణములు లేదా 266.66 చ॥గ॥ లేదా 223.33 చ॥మీ॥ ఖాళీ స్థలం. హద్దులు: తూర్పు: రోడ్డు, దక్షిణం: ప్లాట్ నెం. 99లోని స్థలం, పశ్చిమం: రోడ్డు, ఉత్తరం: ప్లాట్ నెం. 97 లోని స్థలం. ఈ సరిహద్దులలో మొత్తం 33 1/3 అంకణములు లేదా 266.64 చ॥గ॥ లేదా 223.33 చ॥మీ॥ ఖాళీ స్థలం అన్ని సౌకర్యాలు, ఈజ్‌మెంటరీ హక్కులతో.
రిజర్వు ధర: రూ. 9,10,000/- ధరావత్తు సొమ్ము: రూ. 91,000/-

ఆస్తి నెం.4: ఐటమ్ నెం.1: ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా, కావలి సబ్-రిజిస్ట్రేషన్, జలదంకి మండలం, జమ్ములపాలెం పంచాయితీ, జమ్ములపాలెం గ్రామం, NUDA పరిధి, సర్వే నెం 305/2, ఎ. 3.94 సెంట్లలోని ఎమ్.కె. గ్రీన్ సిటీ లే-అవుట్, ప్లాట్ నెం.66 లోని 26 ½ అంకణములలో దక్షిణంవైపు భాగం 13 అంకణములు 9 చ॥గ॥ లేదా 105 చ॥గ॥లు ఖాళీ స్థలం. రాకపోకలకు మరియు అన్ని ఈజ్‌మెంటరీ హక్కులతో సహా యావత్తు. హద్దులు: తూర్పు: ప్లాట్ నెం.83 స్థలము, దక్షిణం: ప్లాట్ నెం.67 స్థలము, పడమర: 20 అడుగుల వెడల్పు రోడ్డు, ఉత్తరం: కె బాబు నాయుడు గారు మారం గీతకు అమ్మిన ప్లాట్ నెం. 66 లోని మిగతా స్థలం. ఐటమ్ నెం.2: ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు రిజిస్ట్రేషన్ జిల్లా, కావలి సబ్ రిజిస్ట్రేషన్, జలదంకి మండలం, జమ్ములపాలెం పంచాయితీ, జమ్ములపాలెం గ్రామం. NUDA పరిధి, సర్వే నెం.305/2 లోని ఎ॥3.94 సెంట్లలో వేసిన ఎమ్.కె. గ్రీన్ సిటీ లే-అవుట్, ప్లాట్ నెం. 69 లోని 22 ½ అంకణములు స్థలం, రాకపోకలకు మరియు అన్ని ఈజ్‌మెంటరీ హక్కులతో సహా యావత్తు. హద్దులు: తూర్పు: ప్లాట్ నెం. 80 స్థలము, దక్షిణం: ప్లాట్ నెం.70 స్థలము, పడమర: 20' అడుగుల వెడల్పు రోడ్డు, ఉత్తరం: ప్లాట్ నెం.68 స్థలము. ఐటమ్ నెం.3: ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు రిజిస్ట్రేషన్ జిల్లా, కావలి సబ్ రిజిస్ట్రేషన్, జలదంకి మండలం, జమ్ములపాలెం పంచాయితీ, జమ్ములపాలెం గ్రామం. NUDA పరిధి, సర్వే నెం.305/2 లోని ఎ॥3.94 సెంట్లలో వేసిన ఎమ్.కె. గ్రీన్ సిటీ లే-అవుట్, ప్లాట్ నెం. 78 లోని 20 అంకణములు స్థలం, రాకపోకలకు మరియు అన్ని ఈజ్‌మెంటరీ హక్కులతో సహా యావత్తు. హద్దులు: తూర్పు: 15' అడుగుల వెడల్పు రోడ్డు, దక్షిణం: 25' అడుగుల వెడల్పు రోడు, పడమర: ప్లాట్ నెం.71 స్థలము, ఉత్తరం: ప్లాట్ నెం. 79 స్థలము. ఈ ఆస్తులు మారం రాకేష్ కుమార్ రెడ్డి పేరున గలదు.
రిజర్వు ధర: రూ. 14,37,000/- ధరావత్తు సొమ్ము: రూ. 1,43,700/-

ఆస్తి నెం.5: ఐటమ్ నెం.1: ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు రిజిస్ట్రేషన్ జిల్లా, కావలి సబ్ రిజిస్ట్రేషన్, జలదంకి మండలం, జమ్ములపాలెం పంచాయితీ, జమ్ములపాలెం గ్రామం. NUDA పరిధి, సర్వే నెం.305/2 లోని ఎ॥ 3.94 సెంట్లలో వేసిన ఎమ్.కె. గ్రీన్ సిటీ లే-అవుట్, ప్లాట్ నెం. 66 లోని 26 ½ అంకణములలో ఉత్తర భాగం 13 అంకణముల 9 చ॥గ॥ లేదా 105 చ॥గ॥ ఖాళీ స్థలం, రాకపోకలకు అన్ని ఈజ్‌మెంటరీ హక్కులతో సహా యావత్తు. హద్దులు: తూర్పు: ప్లాట్ నెం. 83 స్థలము, దక్షిణం: మారం రాకేష్‌కు అమ్మిన ప్లాట్ నెం.66 మిగతా స్థలము, పడమర: 20' అడుగుల వెడల్పు రోడ్డు, ఉత్తరం: లే అవుట్ స్థలము. ఐటమ్ నెం.2: ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు రిజిస్ట్రేషన్ జిల్లా, కావలి సబ్ రిజిస్ట్రేషన్, జలదంకి మండలం, జమ్ములపాలెం పంచాయితీ, జమ్ములపాలెం గ్రామం. NUDA పరిధి, సర్వే నెం.305/2 లోని ఎ॥3.94 సెంట్లలో వేసిన ఎమ్.కె. గ్రీన్ సిటీ లే-అవుట్, ప్లాట్ నెం. 70 లోని 22 ½ అంకణములు మరియు ప్లాట్ నెం.71 లోని 22 ½ అంకణములు కలిపి మొత్తం 45 అంకణములు ఖాళీ స్థలం, రాకపోకలకు అన్ని ఈజ్‌మెంటరీ హక్కులతో సహా యావత్తు. హద్దులు: తూర్పు: ప్లాట్ నెం. 78 స్థలము, దక్షిణం: 25' అడుగుల వెడల్పు రోడ్డు, పడమర: 20' అడుగుల వెడల్పు రోడ్డు, ఉత్తరం: ప్లాట్ నెం.69 స్థలము. ఈ ఆస్తులు మారం గీతా కుమారి పేరున గలదు.
రిజర్వు ధర: రూ. 15,00,000/- ధరావత్తు సొమ్ము: రూ.1,50,000/-

గమనిక: బ్యాంకుకు తెలిసి/తెలియని బకాయిలు/ట్యాక్సులు ఏవైనా ఉన్నచో వేలం కొనుగోలుదారు మాత్రమే వాటిని భరించవలెను మరియు చివరి మొత్తం బిడ్డు సొమ్ముకు అదే అదనం.
అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింకును రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, తిరుపతి స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎమ్ బ్రాంచ్, అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 7901626759, 9901574353.
ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (BAANKNET), వెబ్‌పోర్టల్ https://www.baanknet.com/ ఫోన్ నెం: 7046612345 / 6354910172 / 8291220220 / 9892219848 / 8160205051, ఇ-మెయిల్: support.BAANKNET@psballiance.com
తేది: 17.02.2026, ప్రదేశం: తిరుపతి సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

ఇంజినీరింగ్ కుర్రోడు @ ఛాంపియన్ రైతు

మెట్టప్రాంతంలో వినూత్న సాగుతో లాభాల గుబాళింపు

చదువు, సాంకేతికత, పట్టుదల కలిస్తే వ్యవసాయంలో లాభాలు సాధ్యమని యువ రైతు నిరూపించారు.. మెట్టప్రాంతంలోని మారుమూల గ్రామంలో షేడ్‌నెట్ కింద పూల సాగు చేస్తూ లాభాలు సాధిస్తూ గ్రామీణ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.. స్థానిక అధికారుల సూచనతో కలెక్టర్ గుర్తించి ఛాంపియన్ రైతుగా ప్రకటించారు.

న్యూస్‌టుడే, పొదలకూరు

పొదలకూరు మండలం ఇనుకుర్తి పంచాయతీ ముదిగేడుకు చెందిన చిరంజీవి అనే యువకుడు 2013లో ఇంజినీరింగ్ విద్యను పూర్తి చేశారు. పలు నగరాల్లో ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు చేసి జన్మభూమిపై మక్కువతో స్వగ్రామానికి వచ్చేశారు. వ్యవసాయంలో వస్తున్న మార్పులను గమనిస్తూ ఉద్యాన సాగుపై దృష్టిపెట్టారు. మార్కెట్‌లో ఏడాది పొడవునా డిమాండు ఉండే పూల సాగు చేయాలని నిర్ణయించారు. తనకున్న ఎకరా పొలంలో రూ.25 లక్షలతో షేడ్ నెట్ నిర్మించారు. భూమి సాగు, ఎరువులు, సాగునీరు తదితర వసతులతో సిద్ధం చేసి పునె నుంచి (తిరుంగళ్) అనే రకం మొక్క ఒకటి రూ.3.50 వంతున 60,000 చామంతి మొక్కలను కొనుగోలు చేశారు. సాగు ఖర్చులు కలిపి రూ.9 లక్షలు వెచ్చించి గతేడాది నవంబరులో సాగు చేపట్టారు. జనవరి నుంచి పూలు కోతకు వస్తున్నాయి. మార్కెట్లో కిలో రూ.100 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు. వివాహాలు, తిరునాళ్లు, వివిధ పండగల సమయాల్లో ఆలయాల్లో పూజలకు వీటి డిమాండ్ ఎక్కువగా ఉంది. ప్రస్తుతం రోజుకు 50 కేజీల పూలు వస్తుండగా నెల్లూరు, పొదలకూరు తదితర ప్రాంతాల్లో విక్రయిస్తూ రోజుకు రూ.5000కు పైగా సంపాదిస్తున్నారు.



షేడ్ నెట్ కింద సాగుచేసిన చామంతి పూలసాగు

యువ రైతు చిరంజీవి మాట్లాడుతూ..

ఉద్యానశాఖలో వివిధ పంటల సాగుకు ప్రభుత్వం రాయితీలు ఇస్తోందన్నారు. షేడ్ నెట్‌కు రూ.25 లక్షలు కాగా అందులో 50 శాతం, పూల మొక్కల పెంపకానికి రూ.9 లక్షలకు 50 శాతం వరకు రాయితీ ఇచ్చారన్నారు. పూల సాగు లాభదాయకంగా ఉందని, మూడునెలల వరకు దిగుబడులు వస్తాయన్నారు. సీజన్ ముగియగానే ప్రత్యామ్నాయంగా మరో సాగుకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టరు ఆదేశాలతో ఛాంపియన్ రైతుగా తనకు గుర్తింపు లభించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

జీవనోపాధుల సర్వే పూర్తిచేయండి

కొడవలూరు, న్యూస్‌టుడే: జీవనోపాధుల సర్వే త్వరితగతిన పూర్తిచేయాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి తెలిపారు. యల్లాయపాళెం, మానేగుంటపాడులో బుధవారం సర్వే చేస్తున్న తీరును పరిశీలించారు. పొదుపుమహిళలతో సమావేశం ఏర్పాటు చేసి డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాల గురించి వివరించారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర:	రూ. 14,559
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 1,16,472
వెండి గ్రాము :	రూ. 253.30

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	126
లేయర్	90
బ్రాయిలర్స్	226
బ్రాయిలర్ స్కిన్‌లెస్	252
లేయర్ మాంసం	153

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

సైదాపురం, న్యూస్‌టుడే: సవకతోట సమీపంలోని వాగు వద్ద అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందిన ఘటన బుధవారం ఆదూరుపల్లిలో జరిగింది.. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సైదాపురం మండలం ఆదూరుపల్లిలోని సవకతోటల సమీపంలో ఉన్న వాగులో సుబ్రహ్మణ్యం (22) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. తిరుపతి జిల్లా నాయుడుపేట సమీపంలోని యాకసిరికి చెందిన సుబ్రహ్మణ్యం మూడేళ్ల క్రితం సైదాపురం మండలం గిద్దలూరుకు చెందిన లక్ష్మమ్మను వివాహం చేసుకున్నారు. అప్పటినుంచి పరిసర ప్రాంతాల తోటల్లో కాపలాగా ఉంటున్నారు. వారం రోజుల క్రితం దంపతుల మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకుంది. అప్పటి నుంచి కనిపించడం లేదని భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాపలాగా ఉన్న తోటకు సమీప వాగులో మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఘటనా స్థలాన్ని రాపూరు సీఐ సత్యనారాయణ పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కాంతికుమార్ తెలిపారు.

వేధింపులకు గురి చేస్తే ఫిర్యాదు చేయండి

కోవూరు, న్యూస్‌టుడే: మహిళా రక్షణ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ అన్నారు. కోవూరులోని ఐసీడీఎస్ కార్యాలయంలో పీవోఎస్‌హెచ్ యాక్ట్‌పై అవగాహన కార్యక్రమం బుధవారం జరిగింది. ఆమె మాట్లాడుతూ మహిళలు పనిచేసే చోట లైంగిక వేధింపులకు గురైతే ఫిర్యాదు చేయడానికి ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఏర్పాటు చేశామని, వారికి ఫిర్యాదు చేయాలని సూచించారు. సఖి వన్ సెంటర్ అడ్మిన్ షహనాజ్, కోవూరు, బుచ్చిరెడ్డిపాలెం మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆసుపత్రుల నిర్మాణాలు మార్చి నాటికి పూర్తి చేయండి

ఆయుష్ ఆర్‌డీటీ డాక్టర్ రాజశేఖర్

పొదలకూరు, న్యూస్‌టుడే: ఆయుష్ పరిధిలోని ఆయుర్వేద, హోమియో, యునాని ఆసుపత్రులకు మంజూరైన భవనాలు మార్చి చివరి కల్లా పూర్తి చేయాలని ఆశాఖ ప్రాంతీయ ఉప సంచాలకులు డాక్టరు రాజశేఖర్ అన్నారు. బుధవారం విరువూరులో రూ.30 లక్షలతో నిర్మిస్తున్న ఆయుర్వేద ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, పరిధిలో 40 ఆసుపత్రుల నూతన భవనాలకు నిధులు మంజూరు చేశామన్నారు. పీహెచ్‌సీ స్థాయిలో ఒక్కో భవనానికి రూ.30 లక్షలు, బీహెచ్‌సీ రూ.20 లక్షలు, సీహెచ్‌సీ స్థాయిలో రూ.50 లక్షల వంతున నిధులు కేటాయించామని వివరించారు. అధికంగా నెల్లూరు జిల్లాకు రూ. 3.36 కోట్లు కేటాయించామన్నారు. 2025 బడ్జెట్‌లో కేటాయించిన నిధులు కావడంతో త్వరగా పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. విరువూరు ఆసుపత్రి వైద్యులు డాక్టరు వినోద్‌బాబు, సర్పంచి జగన్ మోహన్‌రావు తదితరులు కలిసి కొన్నేళ్లుగా ఎదురు చూస్తున్న నూతన భవనానికి నిధులు కేటాయించడంతో అభినందించారు.

జొన్నవాడలో పెరిగిన వేలం ఆదాయం

బుచ్చిరెడ్డిపాళెం: 2026-27 ఆర్థిక సంవత్సరానికి లైసెన్సు హక్కులు పొందేందుకు జొన్నవాడ ఆలయంలో బహిరంగ వేలం బుధవారం నిర్వహించారు. గతేడాది కంటే రూ.16 లక్షలకు పైగా ఆదాయం వచ్చిందని ఆలయ ఛైర్మన్ అశోక్‌రెడ్డి తెలిపారు. తలనీలాలకు రూ.17.16 లక్షలు కొబ్బరి చిప్పలకు రూ.31 లక్షలు, వస్త్రాల సేకరణకు రూ.32.30 లక్షలు, చాపలు, పీటలు, ఇతర అద్దెలకు రూ.85,500, గోశాలలో ఎరువుల అమ్మకానికి ట్రక్కుకు రూ.1700 లభించినట్లు పేర్కొన్నారు.

పంట కాలువల పునరుద్ధరణ

కావలి, న్యూస్‌టుడే: ఆముదాలదిన్నె గ్రామం వద్ద స్థిరాస్తి వ్యాపారులు పంటకాలువలను ఆక్రమించి అక్రమంగా లేఅవుట్ల వేయడంపై జలవనరుల, రెవెన్యూశాఖ చర్యలు ప్రారంభించింది. బుధవారం 'ఈనాడు'లో 'పుల్లలే హద్దులు.. అక్రమార్కుల ఎత్తులు' అనే శీర్షికతో కథనం ప్రచురితం కాగా సంబంధిత అధికారులు స్పందించారు. అక్రమ లేఅవుట్‌లో మార్కింగ్ వేసి పంటకాలువల పునరుద్ధరణకు జేసీబీతో తవ్వకాలు ప్రారంభించారు. పూర్తిస్థాయి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పరిహారం చెల్లిస్తాం

కావలి, దగదర్తి: దగదర్తి మండలం దుండిగం గ్రామంలో ఓఎన్జీసీ తవ్వకాలతో రైతులు నష్టపోతున్న తీరుపై బుధవారం ఈనాడులో 'పంటపొలాల్లో ఓఎన్జీసీ తవ్వకాలు' శీర్షికతో వార్త రావడంతో ఆ సంస్థ ప్రాంతీయప్రతినిధి సుధీర్ స్పందించారు. ఆర్డీవో వంశీకృష్ణతో చర్చించారు. ఇందన పరిశోధనల్లో భాగంగా పంటసాగులో ఉన్న భూముల్లో తవ్వకాలు చేస్తే తప్పకుండా రైతులకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు.

EENADU Classifieds

REAL ESTATE

PLOT FOR SALE

కావలి టౌన్ రామమూర్తిపేట ట్రెండ్స్ షోరూం ప్రక్క వీధిలో MRO ఆఫీస్‌కి ఎదురుగా 220 అంకణముల స్థలం అమ్మకంనకు కలదు. ✆ 92987 52705.

JOBS

Sri Vishnu Ready Mix Concrete
Sri Vishnu Ready Mix concrete is Leading Suppliers of Ready Mix Concrete Products to the Constructions. We are Seeking a Professionally Qualified and Experience.
SALES EXECUTIVES
Applicants should have relevant sales experience gained with in the Ready Mix Concrete industry attractive benefits as well excellent development opportunities with in the Company Interested applicant Should forward their full CV to mail srivishnurmc@gmail.com
Opp: Cherukuramma Temple Pedha Cherukuru, Nellore Rural.
Ph.No.9676532001, 89777 16852

మా ఆఫీస్‌నందు పనిచేయుటకు B.Sc. కెమిస్ట్రీ కల్గిన 30 సం॥లోపు M/F ఫ్రెషర్/Exp. కావలెను. టైమింగ్స్: 10 AM to 9 PM. ✆ 9030313333

నెల్లూరు ఫత్తేఖాన్‌పేటలోని ఎవర్‌గ్రీన్ సోలార్ సిస్టమ్స్ కంపెనీలో పనిచేయుటకు ITI టెక్నీషియన్లు మరియు సేల్స్ ఎగ్జిక్యూటివ్ కావలెను. Cont: 9110712220

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ:18-20K ✆ 96404 68899, 96402 58899

FACULTY/ TEACHERS

Ratnam High School, Lakshmipuram, Nellore. Wanted Teachers in all subjects for 6th, 7th, 8th, 9th Classes. for Details Plesae Contact: 77020 00050, 91825 81092

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు... వివరాలకు..
B/w 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
నెల్లూరు 80080 01790
మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి. B&W : రూ. 600 Colour : రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

కావలి

•కావలి •ఉదయగిరి •ఆత్మకూరు

రైతులకు అవగాహన కల్పిస్తున్న జేడీ పి సత్యవాణి

గుర్తింపు సంఖ్య తప్పనిసరి

మర్రిపాడు, న్యూస్‌టుడే : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాల ఫలాలు అందుకోవాలంటే ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి అన్నారు. బుధవారం మండలంలోని రామానాయుడుపల్లిలో విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ప్రతి రైతు ఆలస్యం చేయకుండా రైతు భరోసా కేంద్రంలోని వ్యవసాయ సహాయకుల వద్ద వెళ్లి విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేసుకోవాలని సూచించారు.

జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మండలంలో గురువారం ఆంధ్ర ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించే మెగా జాబ్‌మేళా విజయవంతం చేయాలని కమిషనర్ గంగాప్రసాద్, ఎంపీడీవో రఫీఖాన్ అన్నారు. మండలంలోని 21పంచాయతీలలో ఉండే ఐటీఐ, పాలిటెక్నిక్, బీటెక్ చదివిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా కృషి చేయాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పురపాలకం, రూరల్ మండల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)

కావలి : 80080 51666, 91548 46698

ఉదయగిరి : 80085 73944 ఆత్మకూరు: 8008573949

సమస్య: కావలి బుడమగుంట కాలనీల్లో నిత్యం రాత్రివేళల్లో కొందరు మద్యం మత్తులో బైకులపై వేగంగా వెళ్తూ స్థానికుల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. - రమణ, స్థానికుడు

సమాధానం: పరిశీలించిన వెంటనే చర్యలు చేపడతాం. - రాజేశ్వరరావు, సీఐ, కావలి

? సంగం మండలం జండాదిబ్బ గ్రామ సమీపంలోని కోవూరు కాలువ నుంచి తొలగించిన పూడిక మట్టిని ప్రధాన రహదారి పక్కనే వేయడంతో రాకపోకలకు అసౌకర్యంగా ఉంది. -సుధీర్

✓ తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. - శ్రీనివాసులు, జలవనరుల శాఖ ఏ.ఈ

? మర్రిపాడు మండలం, పెద్దమాచనూరులో పలు వీధుల్లో సీసీ రోడ్లు లేకపోవడంతో ఇబ్బందిగా మారింది. - వెంకటయ్య

✓ నిధులు మంజూరైతే సీసీ రోడ్లు నిర్మిస్తాం. - శ్రీవాసు, పీఆర్ ఏఈ

? అనంతసాగరం నుంచి బెడుసుపల్లికి వెళ్లాలంటే మట్టి రోడ్డే దిక్కు. వర్షాలు కురిసినప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. -కుమార్

✓ రోడ్డు నిర్మాణానికి గతంలో ప్రతిపాదనలు పంపాం. -రమణరావు, పంచాయతీ కార్యదర్శి

? కొండాపురం మండలం కొమ్మి గ్రామంలో ఎస్సీ కాలనీలోని రామాలయానికి తూర్పున ఉన్న అంతర్గత రోడ్డు అధ్వానంగా ఉంది. - చెన్నయ్య, గ్రామస్థుడు

✓ సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. - పృథ్వీరాజ్,పంచాయతీ కార్యదర్శి

రంజాన్ మాసం ప్రారంభం

దర్గా మసీదుకు విద్యుత్తు అలంకరణ.

అనుమసముద్రంపేట, దుత్తలూరు: ముస్లిం సోదరుల పవిత్ర రంజాన్ మాసం బుధవారం సాయంత్రం నెలవంకదర్శనంతో ప్రారంభమైంది. ఏఎస్‌పేట హజరత్‌ఖాజానాయబ్‌రసూల్ దర్గా వద్ద ఉపవాసాలకు, ప్రత్యేక నమాజుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు దర్గా ఈవో మహ్మద్ హుస్సేన్ తెలిపారు. దుత్తలూరు మండలం నందిపాడులోని మసీదును విద్యుత్తు దీపాలతో అలంకరించారు.

భక్తి శ్రద్ధలతో గంధోత్సవం

గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు తీసుకువెళుతున్న సజ్జాద

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: ఏఎస్‌పేటలోని తిప్పపైనున్న హజరత్ ఫిరోమర్షిద్ సయ్యద్ ఖ్వాజా ఖిజర్‌అబ్దుల్ సలాం సాహిబ్ షా ఖాద్రి స్వాముల 31వ గంధోత్సవం బుధవారం రాత్రి భక్తి శ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా గంధాన్ని తలపై ఉంచుకుని సజ్జాద నాయబ్‌రసూల్ ఊరేగింపుగా దర్గాకు తీసుకెళ్లారు. పూల చద్దర్లు ఉంచి ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు గంధాన్ని పంచి పెట్టారు.

ఇసుక బస్తాలే.. కాసుల మూటలు

గత ప్రభుత్వంలో పనులు చేయకుండానే బిల్లుల స్వాహా

జలవనరులశాఖపై విచారణకు ఆదేశం

2019లో సంగం ఆనకట్టపై వేసిన ఇసుక బస్తాలు

న్యూస్‌టుడే, సంగం

కంచే చేను మేసిన చందాన గత వైకాపా ప్రభుత్వంలో సంగం సెక్షన్ పరిధిలోని జలవనరులశాఖ అధికారులు వ్యవహరించిన తీరుపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. పనుల పేరుతో నిధులు స్వాహా చేశారన్న ఆరోపణల నేపథ్యంలో దర్యాప్తు చేసేందుకు ఉన్నతాధికారిని నియమించింది. 2019-24 మధ్య కాలంలో మండలంలో జలవనరుల శాఖాధికారులు గుత్తేదారులుగా మారి కాగితాల మీదనే పనులు కానిచ్చి భారీగా సొమ్ములు దిగమింగారు. అప్పట్లో ఈ అక్రమాలను ఈనాడు వెలుగులోకి తెచ్చినా వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వారి చర్యలకు అడ్డూ అదుపులేకుండా పోయింది.

ఉన్నవాటినే చూపి

కనుపూరు, బెజవాడ పాపిరెడ్డి కాలువలకు నీరు వెళ్లేందుకు వీలుగా.. సంగం ఆనకట్ట వద్ద నీటిమట్టం పెంచేందుకు సుమారు లక్ష ఇసుక బస్తాలు వేసేవారు. 1995 నుంచి 2021 వరకు ఇలానే జరగగా.. గుత్తేదారులు ఆ పనులు చేసేవారు. వైకాపా ప్రభుత్వం వచ్చాక జలవనరుల శాఖాధికారులు నెల్లూరు గ్రామీణ నియోజకవర్గానికి చెందిన ఒక గుత్తేదారుడిని తమకు బినామీగా చేసుకుని పనులు చేయడం ప్రారంభించారు. 2019లో ఒక దఫా పనులు చేశారు. నాడు ఇసుక బస్తాలు రెండేళ్లపాటు ఉన్నా.. వాటినే తొలి పంటకో సారి, ఎడగారు సాగుకు మరోసారి వేసినట్లుగా అందుకు ఎఫ్‌డీఆర్(వరద నష్ట మరమ్మతులు), ఓఅండ్‌ఎం నిధులు ఖర్చు చేసినట్లుగా రికార్డుల్లో నమోదు చేశారు. ఇలా సుమారు రూ.50 లక్షల వరకు నిధులు స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

కాలువలు బాగానే ఉన్నా..

● 2019లో అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.80లక్షల వ్యయంతో మండల పరిధిలోని పంటకాలువల పనులు సంపూర్ణంగా చేశారు. అయితే వాటికే 2020లో తిరిగి రూ.34.5లక్షల వ్యయంతో పనులు చేసినట్లుగా బిల్లులు చేసి నిధులు కాజేసినట్లు ఆరోపణలున్నాయి.

● గోగులబాడవ రహదారి మరమ్మతుల కోసం 2020లో రూ.30లక్షల నిధులు మంజూరైతే నామమాత్రంగా పనులు చేశారు. అక్టోబరులో వర్షాలు రావడంతో డొల్లతనం బయటపడింది. అయినా ఖాతరు చేయని అధికారులు. గోగులబాడవ డ్రెయిన్‌లో పూడిక తొలగించినట్లుగా కొలతల పుస్తకంలో నమోదు చేసి ప్రజాధనం సొంతం చేసుకున్నారు. ఇప్పటికైనా నిధుల పక్కదారిపై ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి వాస్తవాలు నిగ్గు తేల్చాలని ప్రజలు కోరుతున్నారు.

గురుకుల పాఠశాలకు క్రీడా మైదానం

బాస్కెట్‌బాల్ మైదానంలో కాంక్రీటు పనులు

సంగం, న్యూస్‌టుడే: సంగంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో రూ.అయిదు లక్షల వ్యయంతో బాస్కెట్‌బాల్ మైదానం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ పాఠశాల పీఎం శ్రీ పథకంలో ఎంపికవడంతో ఇందుకు నిధులు మంజూరు చేశారు. త్వరలో స్తంభాల నిర్మాణం పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకువస్తామని సమగ్రశిక్ష ఏఈ శ్రీనివాసులు తెలిపారు. మండలంలో తొలిసారిగా ఇక్కడే ఈ మైదానం ఏర్పాటవుతుండటం విశేషం.

27 మంది బైండోవర్

కలిగిరి: తూర్పుగుడ్లదొన ఎస్సీ కాలనీలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇరువర్గాలకు చెందిన 27 మందిని తహసీల్దారు ఎదుట బుధవారం బైండోవర్ చేసినట్లు ఎస్సై ఉమాశంకర్ తెలిపారు. గ్రామంలో వారం రోజుల క్రితం వంగల్లు ధనమ్మ, బుట్టి చిన్నయ్యల మధ్య వివాదం చోటుచేసుకుంది. ఇది కాస్త రెండు వర్గాల మధ్య ఘర్షణకు తెరతీయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల తిరిగి మరోసారి వాదనలు దిగడంతో సమాచారం అందుకున్న పోలీసులు ఇరువర్గాలకు చెందిన 27 మందిని అదుపులోకి తీసుకున్నారు. తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

వెట్టిచాకిరి చేయిస్తే చర్యలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: వెట్టి చాకిరి చేయిస్తే వెట్టిచాకిరి నిర్మూలన చట్టం ద్వారా కఠిన చర్యలు తప్పవని ఆర్డీవో పావని అన్నారు. చట్టం వచ్చి 50 ఏళ్లు అయిన సందర్భంగా బుధవారం స్వర్ణోత్సవాల గోడపత్రికలను ఆవిష్కరించారు. డివిజన్‌లో సర్వేక్షణలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యువ భారత్ నెల్లూరు జిల్లా యువజన అధికారి మహేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఆర్డీవో పావని

పీఎంశ్రీ అమలుపై సమీక్ష

అల్లూరు: అల్లూరు మండలంలోని ఇస్కపల్లి ఉన్నత పాఠశాలను బుధవారం డీఈవో బాలాజీరావు సందర్శించారు. పీఎంశ్రీ అమలుపై ఉపాధ్యాయులతో చర్చించారు. పాఠశాలలో ల్యాబ్, లైబ్రరీని పరిశీలించారు. అనంతరం రోట్‌ప్లస్ పిల్లల ఆశ్రమంలో స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు.

ఉపాధి వేట.. ప్రమాదాల బాట

దుత్తలూరు, ఉదయగిరి, కలిగిరి, వరికుంటపాడు, కొండాపురం మండలాల్లో వ్యవసాయ పనులకు వెళ్లే మహిళా కూలీలు ఆటోల్లో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ఆటో చోదకులు 15 నుంచి 20 మందిని తరలిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరగక ముందే ఇలాంటి ప్రయాణాలను నిషేధించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. - న్యూస్‌టుడే, దుత్తలూరు

చెరువు నీళ్లు వదిలేశారు

చివరి ఆయకట్టు పొలాలకు నీరు చేరడం లేదంటూ బుధవారం కొందరు కావలి పెద్ద చెరువు పట్టపుపాలెం ఒక్కసారిగా పది అడుగుల వరకు ఎత్తడంతో నీరు పొర్లి పొలాలు మునకకు గురయ్యాయి. మద్దూరుపాడు వద్ద కొన్ని వీధుల్లోకి కూడా నీరు చేరింది. ఈ సమాచారం తెలియగానే ఏఈ జంపాని కిరణ్ చర్యలు తీసుకుని వృథాను అరికట్టారు.

- న్యూస్‌టుడే, కావలి

సారూ.. నియంత్రిక తొలగించరూ..

లింగంగుంట బీసీ కాలనీలో రోడ్డుపై ఉన్న విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. నాలుగేళ్ల క్రితం గ్రామంలో ఉన్న త్రీఫేజ్ నియంత్రికలను తొలగించి పొలాల వద్ద ఏర్పాటు చేశారు. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల ఇక్కడ తొలగించలేదు. దీంతో అధిక విద్యుత్తు లోడు, ఈదురు గాలులు వచ్చినప్పుడు తీగలు ఒకదానికొకటి తగలడంతో పెద్ద శబ్దంతో నిప్పులు చెలరేగి ఇళ్ల మీద పడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. - న్యూస్‌టుడే, అనంతసాగరం

ఏ దారెటో.. తెలిసేదెలా?

చేజర్ల మండలంలోని ఆదూరుపల్లి- సంగం రహదారిలో మైపాటివారికండ్రిగ సమీపంలో రెండు దారులను కలిపే కూడలి ఉంది. ఒక దారి ఓబులాయపల్లి మీదుగా ఆత్మకూరు, సంగం మార్గాలకు వెళుతుంది. మరొకటి నాగులవెల్లటూరు మీదుగా పొదలకూరు, నెల్లూరుకు వెళుతోంది. కొత్తగా ఈ మార్గంలో వచ్చిన వారు సూచికలేని కారణంగా ఒక మార్గానికి బదులు మరొక దారిన వెళుతున్నారు. సూచికలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, చేజర్ల

ఇలాగైతే రోగాలు రావా..?

మండలంలోని వెన్నూరులో చేతిపంపు వద్ద నీరు వెళ్లే మార్గం లేకపోవడంతో రోజులతరబడి అక్కడే నిల్వ ఉంటోంది. దీంతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నీరు నిల్వ చేరకుండా చూడాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో వెంకటేశ్వర్లును వివరణ కోరగా సిబ్బందితో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, దగదర్తి

కావలిలో కార్డన్ సెర్చ్.. వాహనాల స్వాధీనం

స్థానికుల నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ శ్రీధర్

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని బాలకృష్ణారెడ్డినగర్‌లో బుధవారం రాత్రి కావలి డీఎస్పీ పి. శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. స్థానిక ఒడిశా కాలనీలో ఆకస్మిక తనిఖీ చేపట్టి పత్రాలు లేని 17 ద్విచక్ర వాహనాలు, 1 ఆటోను స్వాధీనం చేసుకున్నారు. స్థానికులను పలు విషయాలపై ఆరా తీశారు. గంజాయి విక్రయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎస్సైలు బాజీబాబు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో కల్తీ డీజిల్

కల్తీ డీజిల్

కలిగిరి, న్యూస్‌టుడే: కలిగిరిలోని వింజమూరు మార్గంలో జాతీయ రహదారికి పక్కనే ఉన్న పెట్రోలు బంకులో బుధవారం డీజిల్ పట్టించిన వాహనాలు మొరాయించాయి. మూడు ఆటోలు, ఒక ట్రాక్టరు అక్కడి నుంచి ఎంతకీ కదలకపోవడంతో వాహనదారులు.. వాహనాల నుంచి డీజిల్‌ను బయటకు తీయగా అందులో దుమ్ము, నీరుతో కలిసి ఉండడాన్ని గమనించారు. వారంతా కల్తీ ఇంధనం విక్రయించారంటూ బంకు యాజమాన్యాన్ని ప్రశ్నించగా.. మరమ్మతులకు అయ్యే ఖర్చులు భరిస్తామని అంగీకరించడంతో వివాదం సర్దుమనిగింది. జాతీయ రహదారి పనులు జరుగుతున్న నేపథ్యంలో ఎక్కడో సమస్య ఏర్పడి బంకులోని డీజిల్ ట్యాంకులోకి నీరు వచ్చి ఉండొచ్చని బంకు సిబ్బంది తెలిపారు.

మెరుగైన సేవలతో ఉత్తమ ఫలితాలు

సూచనలు చేస్తున్న సీటీఎం, మేనేజర్

ఉదయగిరి, న్యూస్‌టుడే: ప్రయాణికుల పట్ల డ్రైవర్లు, కండక్టర్లు మర్యాదపూర్వకంగా మెలగాలని డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కె.రమేష్ అన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపోను సందర్శించారు. అన్ని విభాగాలను తనిఖీ చేశారు. అనంతరం ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. అందరూ సమష్టిగా మెరుగైన సేవలందిస్తూ డిపోకు మంచి లాభాలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ రమేష్‌కుమార్, సీఐ నాగభూషణం, ఏడీసీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణ నుంచి భూములు విడిపించాలి

అనంతసాగరం: ఆక్రమణకు గురైన భూమిని విడిపించాలని బాధితులతో కలిసి ఆత్మకూరు జనసేన నాయకులు బుధవారం తహసీల్దార్ జయవర్ధన్‌కు వినతి పత్రం అందజేశారు. సంజీవ నగరం గ్రామంలో శ్రీహరి, నరసింహులు తదితరులకు ఏడు ఎకరాల భూమి వారసత్వంగా సంక్రమించిందన్నారు. కొందరు ఆక్రమించుకొని ఇబ్బంది పెడుతున్నారన్నారు.

కళుగోళమ్మ హుండీ లెక్కింపు

కావలి, న్యూస్‌టుడే: గ్రామదేవత కళుగోళశాంభవి అమ్మవారి ఆలయంలో బుధవారం హుండీ లెక్కింపు చేపట్టారు. గత నెలకుగాను రూ.8,29,766 ఆదాయం సమకూరినట్లు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ నాగమల్లేశ్వరరాజు, కావలి గ్రూప్ దేవాలయాల ఈవో రాధాకృష్ణ తెలిపారు.

దామవరంలో ఉచిత వైద్య శిబిరం

దగదర్తి: దామవరంలో సర్పంచి ప్రసాద్, ప్రభు దయాళ్ నాగరాజు ఆధ్వర్యంలో నారాయణ వైద్యశాల బృందం బుధవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు కంటి, కీళ్లు, ఎముకలు, చర్మ వ్యాధిగ్రస్థులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు.

దారి సమస్యపై విచారణ వాయిదా

చేజర్ల: తిరుపతినాయుడుపల్లి పొలాలకు వెళ్లే దారి సమస్యపై తహసీల్దారు మస్తానయ్య రెవెన్యూ కోర్టు నిర్వహించారు. ఈ వివాదంలో ఓ వర్గానికి చెందిన కక్షిదారులే హాజరు కావటంతో మరొక వారానికి వాయిదా వేశారు.

సెంట్రల్ దీపాల ఏర్పాటుకు సర్వే

అల్లూరు : అల్లూరులో సెంట్రల్ దీపాల పనులకు అధికారులు బుధవారం సర్వే నిర్వహించారు. రూ.90 లక్షలు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ఉదయగిరి, న్యూస్‌టుడే: పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని ఉదయగిరి, సీతారామపురం ఎంఈవోలు వెంకటేశ్వర్లు, మస్తాన్‌వలి పేర్కొన్నారు. బుధవారం స్థానిక పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరైయ్యారు. మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థులు పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు.

వేడి నీళ్లు పడి బాలుడికి గాయాలు.. చికిత్స పొందుతూ మృతి

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆత్మకూరు రుషివర్ధన్(8) అనే బాలుడి శరీరంపై వేడి నీరు పడటంతో గాయాలపాలవగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. వివరాల మేరకు.. ఈ నెల14న బాలుడు ఇంటిలో నీళ్ల పైపుతో ఆడుకుంటుండగా, అక్కడ పక్కనే పొయ్యిపై కాస్తున్న వేడినీటి పాత్రపై అతనిపై పడింది. దాంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికంగా ప్రాథమిక చికిత్స అనంతరం చెన్నైకు తీసుకెళ్లగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈమేరకు కావలి రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై దాడి

కావలి: అసభ్య వ్యాఖ్యలు చేస్తున్న వ్యక్తిని నిలదీయడంతో దాడికి పాల్పడిన వైనమిది. వివరాల మేరకు కావలి వైకుంఠపురంలో ఉన్న సిమెంట్ దుకాణ యజమాని నాగరాజు.. ఓ మహిళ కుటుంబం గురించి అసభ్య వ్యాఖ్యలు చేశారు. సదరు మహిళ, ఆమె కుమారుడు నిలదీయడంతో ఇనుపరాడ్డుతో దాడికి పాల్పడ్డారు. బాధిత మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

అదుపుతప్పి ట్రక్కు బోల్తా

సంగం), న్యూస్‌టుడే: దువ్వూరు సమీపంలో మంగళవారం అర్ధరాత్రి నెల్లూరు ముంబయి జాతీయరహదారి మీద వెళుతున్న ట్రక్కు అదుపుతప్పి పక్కనే ఉన్న దువ్వూరు డ్రెయిన్‌లో పడింది. కడప జిల్లా పొద్దుటూరు నుంచి టమోటాలు నెల్లూరుకి తీసుకువస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వారిని 108 వాహనం ద్వారా బుచ్చిరెడ్డిపాళెంకి వైద్యచికిత్సకు తరలించారు.

దగదర్తి:మరమ్మతులకు గురైన స్కూలు వ్యానును తీసుకువెళుతున్న ట్రక్కు వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటన అల్లూరు రోడ్డు వద్ద జరిగింది.

నిర్వహణ కరవై.. మనుగడ ప్రశ్నార్థకమై

న్యూస్‌టుడే, అనంతసాగరం

సోమశిల జలాశయం ఆప్రాన్ వద్ద ఎడమ వైపు ఉన్న రక్షణ గోడ బీటలు బారాయి. రాళ్లు ఊడి పడుతుండటంతో పెద్ద రంధ్రాలతో దర్శనమిస్తోంది.

రాళ్లు ఊడి పడడంతో కనిపిస్తున్న రంధ్రాలు

నేపథ్యం ఇలా..

1979-80లో కోర్ వాల్‌గా పిలవబడే రక్షణ గోడ సుమారు 100 మీటర్ల పొడవు, 40 అడుగుల ఎత్తుతో రిటైనింగ్ వాల్ తరహాలో మట్టి కట్టకు సపోర్టుగా నిర్మించారు. నాలుగు దశాబ్దాలకు పైబడి ఎన్నో వరదలు, తుపాన్లు, గాలులకు తట్టుకుని నిలబడింది. 1996లో ఆ పక్కనే ఉన్న ఫ్లడ్ బ్యాంక్ ఆనకట్టగా గేబియాన్ నిర్మాణ శైలిలో(రాళ్లు,మట్టి జారకుండా) సుమారు 300 మీటర్ల పొడవున రాతి కట్టడం నిర్మించారు. 2020-21లో సోమశిలకు వచ్చిన భారీ వరద ఉప్పెనలకు ఆ నిర్మాణం కొట్టుకుపోయింది. ప్రస్తుతం రక్షణ గోడ సైతం స్వల్పంగా ఒరిగినట్లు కనిపిస్తుంది.

ప్రతిపాదనలతో సరి

గత వరదలను చవిచూసిన నేపథ్యంలో రక్షణగోడ కొనసాగింపుగా ఒక కిలో మీటరు వరకు నిర్మించే విషయమై గత వైకాపా ప్రభుత్వంలో అధికారులు ప్రతిపాదనలు చేశారు. అందుకు సుమారు రూ.100 కోట్లు నుంచి రూ.110 కోట్ల వరకు వ్యయం అవుతుందని ఇంజినీరింగ్ నిపుణులు అంచనా వేశారు. నిధుల లేమితో కాగితాలకే పరిమితమైంది. గతంలో ఆప్రాన్ పునర్నిర్మాణ పనులు జరిగే సమయంలో గుత్తేదారు బ్లాస్టింగ్ చేపట్టగా.. కిలో మీటరు దూరంలో ఉన్న గృహాలు సైతం అదిరాయి. ఈ క్రమంలో గోడల్లో బీటలు ఏర్పడి ఉండవచ్చని పలువురు భావిస్తున్నారు. ఆప్రాన్‌కు కాంక్రీట్ వేసేందుకు వాల్‌కు మించి ఇసుకను డంప్ చేయడంతో వర్షాలకు ఇసుక తడిచి గోడ దెబ్బ తిందనే వాదనలు వచ్చాయి. ఏది ఏమైనా అధికారులు పరిస్థితిని పరిశీలించి వాస్తవాలను సమీక్షించి మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

- రవీంద్ర ప్రసాద్, డీఈఈ, సోమశిల ప్రాజెక్టు

సమస్యపై మా ఇంజినీర్లు దృష్టి సారించారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులు తెలియజేయనున్నాం. వీలైనంత త్వరగా రక్షణ గోడకు మరమ్మతులు చేస్తాం. మార్చి బడ్జెట్ అనంతరం ప్రాజెక్టు నిర్వహణ, మరమ్మతుల అంచనా వ్యయాన్ని తయారు చేసి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతాం.

ఉత్సాహంగా ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి మహా శివరాత్రి తిరునాళ్లను పురస్కరించుకుని బుధవారం రాత్రి తెలుగు రాష్ట్రాల స్థాయి జూనియర్ విభాగం ఎడ్ల పూటీలాగు పోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీలను జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ప్రారంభించారు. పోటీల్లో 13 జతల ఎడ్లు పాల్గొనగా అల్లూరు మండలం తూర్పుగోగులపల్లి గ్రామానికి చెందిన పల్లెబోయిన రాజారెడ్డి ఎడ్లజత 4921 అడుగుల దూరం లాగి ప్రథమ, అదే గ్రామానికి చెందిన పల్లెబోయిన కృష్ణతేజరెడ్డి ఎడ్ల జత 4327 అడుగుల దూరం లాగి తృతీయ స్థానం, గుంటూరు జిల్లా కాకుమాను మండలం గార్లపాడుకు చెందిన రామినేని శ్రీనివాసరావు ఎడ్ల జత 4521 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచాయి. నిర్వాహకులు విజేతలకు వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు వంతున నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపికలను అందజేశారు.

తూర్పుగోగులపల్లి ఎడ్లజత

ఐటీడీఏ, రెవెన్యూ అధికారుల విచారణ

దగదర్తి, న్యూస్‌టుడే: ఉలవపాళ్లలో గుంజి కమలాకర్ అనే వ్యక్తిపై వచ్చిన ఫిర్యాదు మేరకు ఐటీడీఏ, రెవెన్యూ అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. గుంజి అనే ఇంటి పేరుతో ఎరుకల కులస్థులు ఎవరూ లేరని ఎస్టీ కులం పేరుతో ప్రభుత్వ టీచర్ ఉద్యోగం పొందినట్లు ఫిర్యాదు చేయడంతో అధికారులు విచారణ చేపట్టారు. ఐటీడీఏ పీవో సుజాత, ఐటీడీఏ తహసీల్దార్ నిరంజన్, దగదర్తి తహసీల్దార్ లాజరస్ తదితరులు పాల్గొన్నారు.

దస్త్రాల నిర్వహణపై అసంతృప్తి

కలిగిరి, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో వివిధ దస్త్రాల నిర్వహణ తీరుపై జడ్పీ సీఈవో ఎల్. శ్రీధర్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం కార్యాలయానికి వచ్చిన ఆయన వివిధ విషయాలపై సిబ్బందితో మాట్లాడారు. దస్త్రాలు పరిశీలించారు. గ్రామాల్లో జరుగుతున్న యూఎఫ్ఎస్‌పై స్వర్ణ కార్యాలయాల వారీగా సమీక్ష నిర్వహించారు. మండల పరిషత్తు కార్యాలయం దుస్థితిని గదులన్నీ తిరిగి పరిశీలించారు.

సిబ్బందితో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో శ్రీధర్‌రెడ్డి

యూరియా పంపిణీకి క్యూలైన్లు

సీతారామపురం, న్యూస్‌టుడే: సీతారామపురంలోని మారంరెడ్డిపల్లి సొసైటీలో బుధవారం యూరియా పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో రైతులు వచ్చారు. దీంతో గత అనుభవాల దృష్ట్యా ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున ముందుగానే టోకెన్లు అందజేశారు. పురుషులకు, మహిళలకు వేర్వేరుగా లైన్లు ఏర్పాటు చేసి యూరియా పంపిణీ చేశామని సొసైటీ అధ్యక్షుడు సోమనబోయిన రాజశేఖర్ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ మస్తానయ్యను పరామర్శించారు. ఆయన తండ్రి ఇటీవల మృతి చెందడంతో చిత్రపటానికి నివాళులర్పించారు. అనుమసముద్రంపేట: చిరమనకు చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు కాటూరు జనార్దనరెడ్డి ఇటీవల మృతి చెందారు. ఆయన ఉత్తరక్రియలు బుధవారం నిర్వహించగా మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, మాజీ జడ్పీ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి కార్యక్రమానికి హాజరయ్యారు.

చెత్తకు నిప్పు.. పర్యావరణానికి ముప్పు

మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

వింజమూరు, న్యూస్‌టుడే: వింజమూరు-గుండెమడకల రోడ్డులో మోటచింతలపాలెం విద్యుత్తు సబ్‌స్టేషన్ వద్దనున్న డంపింగ్ యార్డుకు బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో మంటలు చెలరేగి చుట్టుపక్కల పూర్తిగా పొగ అలుముకుంది. దీంతో ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న ఫైర్‌స్టేషన్ సిబ్బంది మంటలను అదుపు చేశారు.

మూలకు చేర్చారు.. మరమ్మతులు మరిచారు

న్యూస్‌టుడే, దుత్తలూరు

గ్రామాల్లో చెత్త సేకరించేందుకు అందుబాటులోకి తెచ్చిన రిక్షాలు మూలకు చేరాయి. ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోవటంలేదు. దీంతో ఇంటింటికి తిరిగి చెత్తను తరలించాలంటే పారిశుద్ధ్య కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో మొత్తం ఎనిమిది మండలాలుండగా 143 పంచాయతీలున్నాయి. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గత తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రతి పంచాయతీకి కుటుంబాలు, జనాభా ఆధారంగా ఒక్కో పంచాయతీకి మూడు నుంచి ఐదు రిక్షాల వరకు మంజూరు చేసింది. అప్పట్లో చెత్త సేకరణ సజావుగా సాగింది. సంపద కేంద్రాలు కూడా వినియోగంలో ఉండేవి.

దుత్తలూరు-2 సచివాలయం వద్ద మరమ్మతులకు గురైన రిక్షా

● ఈ విషయమై కావలి డీఎల్పీవో వెంకటరమణను వివరణ కోరగా రిక్షాలకు మరమ్మతులు చేయించేలా పంచాయతీ సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తామన్నారు. చెత్త సేకరణ నిత్యం జరిగేలా పర్యవేక్షిస్తామన్నారు.

వైకాపా ప్రభుత్వం వచ్చాక చెత్త సేకరణను గాలికి వదిలేయడంతో రిక్షాలు కూడా మూలకు చేరాయి.

కూటమి ప్రభుత్వం రావడంతో

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారులు, పంచాయతీ సిబ్బంది మండల కేంద్రాల్లో నిరుపయోగంగా ఉన్న రిక్షాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. మిగిలిన పంచాయతీల్లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురాలేదు. చాలా చోట్ల రిక్షాలకు చైన్లు, రిమ్ములు, టైర్లు తదితర పరికరాలు దెబ్బతిన్నాయి. పలు చోట్ల చోరీలకు గురయ్యాయి. కొన్ని చోట్ల ట్రాక్టర్ల ద్వారా కార్మికులతో చెత్త సేకరిస్తున్నారు.

(c) eenadu

గూడూరు

•గూడూరు •కోవూరు •సర్వేపల్లి

తాటిపర్తిలో గ్రామీణ డీఎస్పీ విచారణ

పొదలకూరు, న్యూస్‌టుడే: పొదలకూరు మండలం తాటిపర్తి గ్రామంలో బుధవారం నెల్లూరు గ్రామీణ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారించారు. రమణయ్యకు చెందిన ద్విచ క్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోలు పోసి దహనం చేయడం, ఇంటి తలుపు గడియకు విద్యుత్తు తీగలతో అమర్చడం వంటి ఘటనలపై బుధవారం ఆయన విచారించి పట్టుకుంటామని తెలిపారు. డీఎస్పీ వెంట పొదలకూరు ఎస్సై హనీఫ్ తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో త్రిశూల స్నానం

కొడవలూరు, న్యూస్‌టుడే: కొడవలూరు మండలం గండవరంలో వెలసిన గంగా పార్వతీసమేత ఉదయకోటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం త్రిశూల స్నానం, వసంతోత్సవం, పారువేట, అశ్వవాహన సేవలు జరిగాయి. ఆలయ ఛైర్మన్ మాలకొండయ్య, ఈవో ఉమామహేశ్వర్రావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

'కొండను తవ్వేస్తున్నారు'

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: జిల్లాలోని సైదాపురం మండలంలోని మొలకలపూండ్లలో తవ్వకాలు చేస్తున్నారని అదే గ్రామానికి చెందిన ఆదూరు బద్రీనాథ్ ఆరోపించారు. నగరంలోని జర్నలిస్ట్ భవన్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొండను అక్రమార్కులు సిద్ధేశ్వర స్వామి సంపదను దోచుకుంటున్నారని తవ్వకాల చిత్రాలను చూపించారు.

కోవూరు సీహెచ్‌సీని వంద పడకల ఆసుపత్రి చేయండి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

విడవలూరు కోవూరు, న్యూస్‌టుడే: కోవూరు సీహెచ్‌సీని వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బుధవారం అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. కోవూరుతో పాటు విడవలూరు, కొడవలూరు మండలాలకు చెందిన దాదాపు లక్షల మంది ప్రజలకు ప్రధాన వైద్య కేంద్రంగా ఉందన్నారు. కోవూరులో ముంబయి జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని క్షతగాత్రులను నెల్లూరుకు తరలించాల్సి (ట్రాఫిక్ కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. వంద పడకల ఆసుపత్రి ఉంటే అత్యవసర సేవలందించవచ్చని సభకు వివరించారు. డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కోవూరుకు చెందిన సురేంద్ర బాబు న్యూమోనియాతో బాధపడుతుండగా సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.2.13 లక్షల చెక్కును మంగళగిరిలోని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి నివాసంలో అందజేశారు.

మంత్రుల దృష్టికి గూడూరు నియోజకవర్గ సమస్యలు

మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: అమరావతిలో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ బుధవారం పలువురు మంత్రులను కలిసి వినతిపత్రం అందజేసి నియోజకవర్గంలో సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడును కలిసి గూడూరు, వాకాడు ఏఎంసీ పరిధిలో రైతుల పొలాలకు రోడ్ల ఏర్పాటు, భవనాల మరమ్మతులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను కలిసి గూడూరు ప్రాంతీయ వైద్యశాలలో పిండ నిర్ధారణ పరీక్ష యంత్రం, ఎంఆర్ఐ స్కాన్, ఆసుపత్రిలో సిబ్బందిని, నియోజకవర్గంలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో వసతులు కల్పించాలని కోరారు. మంత్రి సవితను కలిసి బీసీ బాలికల గురుకుల పాఠశాల శాశ్వత భవనం మంజూరు, వసతిగృహాల మరమ్మతులకు నిధులు, గాంధీనగర్‌లో నాయీబ్రాహ్మణులకు కమ్యూనిటీహాల్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు.

రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోండి

రామతీర్థంలో నమోదు ప్రక్రియ పరిశీలిస్తున్న ఏడీఏ అనిత

విడవలూరు, మనుబోలు, ముత్తుకూరు, న్యూస్‌టుడే: రైతన్నతం వెల్ఫేర్‌లో రైతు విశిష్ట సంఖ్య సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో ప్రక్రియను రిగా నమోదు చేసుకోవాలని కోవూరు ఏడీఏ అనిత రైతులకు సూచించారు. విడవలూరు మండల పరిధిలోని ఊటుకూరు, రామతీర్థం గ్రామాల్లో రైతు విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియ బుధవారం పరిశీలించారు. ప్రభుత్వ రైతు సంబంధిత పథకాలన్నీ పొందాలంటే రైతు విశిష్ట సంఖ్య ఆధారంగానే అమలవుతాయని తెలిపారు. కార్యక్రమంలో వీడీకే శ్యామల, కిరణ్‌కుమార్, ఏవో లక్ష్మీ, రైతులు తదితరులు పాల్గొన్నారు. ● కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అన్ని సంక్షేమ పథకాలకు విశిష్ట గుర్తింపు కార్డు కీలకమని ఏవో వెంకటకృష్ణయ్య అన్నారు. మనుబోలు మండలంలోని జట్లకొండూరు పంచాయతీ కుడితిపల్లిలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. సాగులో తీసుకోవాల్సిన మెళకువలపై వివరించారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీదేవి, రైతులు పాల్గొన్నారు. ● ముత్తుకూరు మండల పరిధిలోని నేలటూరు, పంటపాళెం, కృష్ణపట్నం, బ్రహ్మదేవం గ్రామాల్లో వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నిధులు ఘనం.. పారిశుద్ధ్య చర్యలు కనం..!

గ్రామాల్లో అధికారుల పర్యవేక్షణ లేక దోమల దండయాత్ర

న్యూస్‌టుడే, కోట, చిల్లకూరు, గూడూరు పట్టణం

గూడూరు, కోట, చిల్లకూరు మండలాల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు అధ్వానంగా ఉన్నాయి.. రూ.లక్షల రూపాయలు వెచ్చిస్తున్నప్పటికీ అధికారుల పర్యవేక్షణ లేక ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఎక్కడ చూసినా దెబ్బతిన్న మురుగు కాలువలు, చెత్త కుప్పలు, రోడ్ల పక్కనే ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు డంపింగ్ చేయడంతో పాటు సక్రమంగా అధికారుల పర్యవేక్షణ లేక దోమల బెడద తీవ్రంగా ఉంది. ఇంటి నుంచి తడి, పొడి చెత్త సేకరిస్తున్నా చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించడం లేదు. రోడ్ల పక్కన, కాలువలు, చెరువుల పరిసరాల్లో డంపింగ్ చేస్తున్నారు. అధికారులేమో ఉప న్యాసాలిచ్చి మమ అనిపిస్తున్నారు.

● గూడూరు మండల పరిధిలోని 19 పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.82 కోట్ల వరకు వచ్చాయి. రూ.40 లక్షల వరకు పారిశుద్ధ్య పనులకు ఖర్చు చేస్తున్నట్లు దస్త్రాల్లో చూపుతున్నారు. పది పంచాయతీల్లో కాలువలు అధ్వానంగా ఉన్నాయి. వ్యర్థాలను రోడ్ల పక్కనే వేస్తుండగా దోమలకు నిలయంగా మారాయి.

కోట మండలం చిట్టేడులో మురుగు కాలువ దుస్థితి

డీపీవో వాణిరెడ్డి మాట్లాడుతూ.. గూడూరు నియోజకవర్గంలోని కోట, గూడూరు మండలాల్లో నిత్యం తడి, పొడి చెత్తనే సేకరిస్తున్నామని, ఫాగింగ్ చేయిస్తున్నామన్నారు. ఎక్కడైనా ఫిర్యాదులొస్తే చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

● కోట మండలంలోని 21 పంచాయతీలున్నాయి.. 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.1.77 కోట్ల వరకు వచ్చాయి. అందులో రూ.30 లక్షల వరకు పారిశుద్ధ్యం కోసం వెచ్చిస్తున్నారు. 15 పంచాయతీల్లో ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయింది. స్థానికులు జ్వరాల బారిన పడి అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో విస్తృతంగా పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సిన అవసరముంది.

ఉపాధ్యాయుల రక్తదానం

విడవలూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్, మన సేవాసంస్థ ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలు బుధవారం నిర్వహించారు. అనంతరం వారికి గ్రూప్ నిర్ధారణ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలువురు ఉపాధ్యాయులు రక్తదానం చేశారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మన సేవాసంస్థ నిర్వాహకులు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి, రెడ్‌క్రాస్ సిబ్బంది సుందరరాజు, సాయిరాం, ఎంఈవో వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ పరీక్షలు చేస్తున్న సిబ్బంది

బుచ్చిలో అక్రమ కొళాయిల దందా..!

న్యూస్‌టుడే, బుచ్చిరెడ్డిపాళెం

బుచ్చి పురపాలక పరిధిలో అక్రమ కొళాయి కనెక్షన్లు ఎక్కువగా ఉన్నాయి. అమృత్ 2.0 ద్వారా సంగం నుంచి బుచ్చికి రూ.85 కోట్లతో నిర్మిస్తున్న మంచినీటి పథకం పనులు కొనసాగుతున్నాయి. రోజూ ఎక్కడో ఒకచోట మోటార్లు విపలమవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నీరు వదిలే సమయం పెంచాలని, కౌన్సిల్ సమావేశంలో పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. పురపాలక పరిధిలో నిధుల కొరత తీవ్రంగా ఉంది.

● మొత్తం 9,632 గృహాలుండగా 4,201 కొళాయి కనెక్షన్లు ఉన్నాయి. ఎక్కువ మంది అనధికార కనెక్షన్లు వినియోగిస్తున్నారు. సుమారు వందకుపైగా బోర్ల ద్వారా గృహాలకు నీరు సరఫరా చేస్తున్నారు. వీటికి నెలకు రూ.18 లక్షల వరకు విద్యుత్తు బిల్లు వస్తోంది. ప్రత్యేక మంచినీటి పథకం ఎప్పటికి పూర్తవుతాయోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

● అధికారుల సర్వేలో అనధికార కనెక్షన్లు సుమారు 700కు పైగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇంటి కొళాయిల ద్వారా రూ.30 లక్షల పన్ను రావాల్సి ఉండగా రూ.24 లక్షలు దాటడం లేదు.

● పురపాలక కమిషనర్ బాలకృష్ణ మాట్లాడుతూ.. చాలా వరకూ అక్రమ కొళాయి కనెక్షన్లు తొలగించామన్నారు. ఇంకా ఉన్నాయని ప్రత్యేక డ్రైవ్‌లో గుర్తించామని, వాటిని క్రమబద్ధీకరించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

చేనేత గర్జన మహాసభను జయప్రదం చేయండి

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: మంగళగిరిలో ఈనెల 22న రాష్ట్ర వ్యాప్తంగా చేనేత కార్మిక సంఘాలు, సహకార సంఘాల ఆధ్వర్యంలో జరగబోయే చేనేత గర్జన మహాసభను జయప్రదం చేయాలని చేనేత సీనియర్ నాయకులు సుబ్బారావు పిలుపునిచ్చారు. బుచ్చిలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో గ్రామ చేనేత మాస్టర్ వీవర్స్ అండ్ కార్మికుల సమావేశం బుధవారం జరిగింది. ఉచిత గృహ, యాభై ఏళ్లు నిండిన ప్రతి చేనేత కార్మికుడికి పింఛన్ ఇవ్వాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) గూడూరు: 85002 02046
కోవూరు :79950 67034, సర్వేపల్లి : 80085 73980

సమస్య: తోటపల్లిగూడూరు మండలం చింతోపు నుంచి పేదూరు గ్రామానికి వెళ్లే మార్గంలో కోడూరు కాలువపై వంతెన నిర్మాణం అసంపూర్తిగా ఉంది.-చంద్రశేఖర్
సమాధానం : త్వరలోనే నిర్మాణం పూర్తి చేస్తాం. - అలీ, నీటిపారుదలశాఖ ఏఈ

? తోటపల్లిగూడూరు మండలం పాతకోడూరు నుంచి కొత్తపట్టపుపాలెంకు వెళ్లే రోడ్డు గుంతల మయంగా మారింది. దీంతో ద్విచక్ర వాహనాలు వెళ్లాలన్నా అవస్థలు తప్పడం లేదు. - రామలింగయ్య, స్థానికుడు
✓ నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేపడతాం. - రమేష్, పంచాయతీరాజ్ ఏఈ

? కోట మండలం వీరారెడ్డిసత్రం సమీపంలోని ప్రాథమిక పాఠశాల ర.భ రోడ్డు పక్కనే ఉంది. సత్వరం వేగ నియంత్రికలు ఏర్పాటు చేయాలి - రాజేశ్వరి, స్థానికురాలు
✓ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. -మల్లికార్జునరావు, ఇన్‌ఛార్జి ర.భ ఏఈ

? పొదలకూరు మండలం డేగపూడి-రాజుపాలెం సమీపంలో కల్వర్టు దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. తాత్కాలిక మరమ్మతులు చేశారు. ఎదురు వాహనాలు వచ్చినప్పుడు ఇబ్బందిగా ఉంది.- శివరాం, స్థానికుడు
✓ పనులకు నిధులు మంజూరవగానే నిర్మిస్తాం. - శ్రీనివాసులు, ర.భ, ఏఈ

? పొదలకూరు రూరల్ పరిధిలో శ్రీహరి కాలనీలో సైడు కాలువలు అధ్వానంగా ఉన్నాయి. - రాకేశ్, స్థానికుడు
✓ సిబ్బందికి చెప్పి శుభ్రం చేయిస్తాం. - యశ్వంత్ సింగ్, పంచాయతీ కార్యదర్శి

? గూడూరులోని కమ్మరిపాలెంలో వీధి దీపాలు సక్రమంగా వెలగకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పుర అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలి. - మోహన్, గూడూరు
✓ వెంటనే ఏర్పాటు చేస్తాం. - వెంకటేశ్వర్లు, కమిషనర్, గూడూరు

? వెంకటాచలం మండలం సర్వేపల్లి బీసీ కాలనీలో మురుగునీటి కాలువలు పూడిపోయాయి. నీరు రోడ్డుపైకి చేరి దుర్వాసన వస్తోంది. అధికారులు స్పందించి పూడికతీత చర్యలు చేపట్టాలి. - సురేష్, సర్వేపల్లి
✓ పూడిక తీయిస్తాం.-వాసు, ఈవో

? వెంకటాచలం మండలం కసుమూరులో ప్రధాన రహదారి పక్కన కోనేరు అపరిశుభ్రంగా ఉంది. కోనేరు బాగుకు చర్యలు తీసుకోవాలి. - వెంకటేశ్వర్లు, కసుమూరు
✓ పంచాయతీ కార్యదర్శిని పంపి సమస్య పరిశీలించి కోనేరు శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటాం. - ముషీధర్, ఈవోపీఆర్డీ

? వెంకటాచలం మండలం కంటేపల్లి పంచాయతీ పరిధిలో రెండు బోర్లు మరమ్మతులకు గురయ్యాయి. - కోటయ్య, కంటేపల్లి
✓ సిబ్బందితో మరమ్మతులు చేయిస్తాం. - హరజరత్నయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

ప్లాస్టిక్ వ్యర్థాలతో కలుషితమయం

తోటపల్లిగూడూరు మండలం నరుకూరు కూడలిలో రోడ్డు పక్కనే చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి అధ్వానంగా మారింది. కొన్ని రోజులుగా చెత్తను తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు వాహనదారులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించాలని విన్నవిస్తున్నారు.
- న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు

బిల్లులు రాక.. గదులు పూర్తికాక

మరుపూరు ప్రధాన రహదారి పక్కన ఉన్న ఎస్సీ ప్రాథమిక పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్లు నాలుగేళ్లుగా అసంపూర్తిగా ఉన్నాయి. గత వైకాపా పాలనలో గుత్తేదారుకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిపివేశారు. కూటమి ప్రభుత్వంలోనైనా స్పందించి వినియోగంలోకి తేవాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విన్నవిస్తున్నారు.- న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

కొళాయి లేక అవస్థలు

కోవూరు పంచాయతీ సుండిగుంట అంగన్‌వాడీ కేంద్రానికి పంచాయతీ సిబ్బంది ఏర్పాటు చేసిన కొళాయి మూడేళ్లుగా మరమ్మతులకు గురైంది. నీటి ట్యాంకు అధ్వానంగా ఉంది. సిబ్బంది బయట నుంచి డబ్బా నీరు తీసుకొచ్చి పెడుతున్నారు. కొన్నేళ్లుగా సమస్య ఎవరూ పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు.
- న్యూస్‌టుడే, కోవూరు

కాలువ ఇలా.. నీటి పారుదల ఎలా?

కాలువలు బాగుంటే నీటి పారుదలకు అడ్డంకులు తొలగుతాయి. క్షేత్రస్థాయిలో అలాంటి పరిస్థితులు లేవు. తోటపల్లిగూడూరు మండలంలోని ప్రధాన పారుదల కాలువ వ్యర్థాలతో నిండిపోయింది. అధికారులు స్పందించి కాలువల పూడికతీత పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.-న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు

ఆర్‌బీకే పునాదులకే పరిమితం

గత వైకాపా పాలనలో ప్రచార ఆర్భాటాలు తప్ప అభివృద్ధి పనులు ఆచరణకు నోచుకోలేదు. ఆర్‌బీకే నిర్మాణం పునాదులకే పరిమితమయ్యాయి. మడమనూరు పంచాయతీలో 2020లో పనులు అసంపూర్తిగా ఉన్నాయి. కూటమి పాలనలో నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, మనుబోలు

పనిభారం తగ్గించాలని నిరసన

తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వీఆర్వో అసోసియేషన్ నాయకులు

వీఆర్వో అసోసియేషన్ నాయకులు తెలిపారు. గూడూరు పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ రెవెన్యూ, జీఎస్‌డబ్ల్యూఎస్ పనులు చేయాలని వీఆర్వోలపై పని భారం కల్పిస్తుండటంతో ఒత్తిడి తట్టుకోలేక ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నామని వాపోయారు. ప్రభుత్వం వీఆర్వోలకు న్యాయం చేయాలని కోరారు. నాయకులు రాధాకృష్ణయ్య, చంద్రశేఖర్, చెంచయ్య, తస్లీమ్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: సర్వేల పేరుతో వీఆర్వోలపై పని ఒత్తిడి తగ్గించాలని, సర్వేలు చేసేందుకు తగిన సమయం ఇవ్వాలని

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

రాపూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని శానాయపాలెం ఎస్సీ కాలనీలో ఉపాధి హామీ పథకంలో రూ.5 లక్షలతో కొత్తగా ఏర్పాటు చేసిన మూడు సిమెంట్ రోడ్లను తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ వాణిజ్య విభాగం తెదేపా కార్యదర్శి ప్రసాద్ నాయుడు ప్రారంభించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. పంచాయతీలో మౌలిక వసతుల కల్పనే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేత్ర వైద్యశిబిరం సద్వినియోగం చేసుకోవాలి

తోటపల్లిగూడూరు, న్యూస్‌టుడే : ఆధునిక వైద్య సదుపాయాలతో నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు సుధీర్, ఎంపీడీవో వెంకటేశ్వర్రావులు మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇస్కపాలెంలో గ్రామంలో శాంతా బయోటెక్ సౌజన్యంతో శాంతా-శంకర ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ వైద్యశాల కంటి వైద్యనిపుణులు నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని బుధవారం మండల అధికారులు సందర్శించారు. తహసీల్దారు కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 21 తేదీ వరకు వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సలు చేస్తారని తెలిపారు. తెదేపా నాయకుడు రామసుబ్బారెడ్డి, ముత్యాల శ్రీనివాసులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

నీటి తొట్టెలు వినియోగంలోకి వచ్చేనా?

న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

కొన్ని రోజుల్లో వేసవి సమీపించనుంది. గ్రామాల్లోని రైతులు పశువులను మేత కోసం బీడు భూముల్లోకి తీసుకెళుతుంటారు. వాటికి మేత లభించినా నీటి వసతి ఉండదు.. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా తొట్టెల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో వీటి నిర్వహణ బాగానే ఉన్నా.. క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కోవూరు, సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాల్లోని నీటి తొట్టెలు అధ్వానంగా మారాయి.

ఆల్తుర్తి గ్రామంలో వ్యర్థాలతో నిండిన నీటి తొట్టె

నిర్మించారు. గ్రామ పొలిమేరల్లో, పశువుల ప్రాంతాలకు వెళ్లే దారిలో ఏర్పాటు చేశారు. కానీ నీటిని నింపలేదు. ప్రస్తుతం అవి పగుళ్లిచ్చి శిథిలావస్థకు చేరాయి. తొట్టెల్లో నీటిని నింపే బాధ్యతను

ఎన్ని నిర్మించారంటే ..

సర్వేపల్లి నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో 74 తొట్టెలకు గాను కేవలం 40 మాత్రమే పూర్తయ్యాయి. వీటిలో ఒకటి అయినా నీటిని నింపాకున్నారు. పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి తొట్టెలను బాగు చేసి నీటితో నింపాలని పాడి రైతులు కోరుతున్నారు.

పశువుల సంఖ్యకు అనుగుణంగా...

ప్రతి పంచాయతీలో పశువుల సంఖ్యకు అనుగుణంగా నీటి తొట్టెలు ఆయా పంచాయతీలు తీసుకోవాలని మొదట నిర్ణయం తీసుకున్నారు. తరువాత ఆర్‌డబ్ల్యూఎస్ విభాగానికి అప్పగించారు. క్రమంగా వాటిని విస్మరించారు.

నిర్వహణ బాధ్యత ఎవరిది..

ఉపాధి హామీ పథకం ద్వారా ఒక తొట్టెను రూ.18 వేలు వెచ్చించి అప్పట్లో నిర్మించారు. నాణ్యత లేకపోవడం, నీటిని నింపకపోవడంతో బీటలు వచ్చి నిరుపయోగంగా మారింది. వీటి బాధ్యత ఎవరిదో తెలియని విషయంలో ఇప్పటికే విషయంలో కొనసాగుతున్నాయి.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు పట్టణ సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న బస్ షెల్టర్‌లో గుర్తు తెలియని వ్యక్తి(50) మృతి చెందడంతో స్థానికులు గుర్తించి గ్రామీణ పోలీసులకు బుధవారం సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు ఆరా తీయగా మృతుడు అనారోగ్యంతో మృతి చెందాడని, భిక్షాటన చేసుకుంటూ బస్ షెల్టర్‌లో నిద్రించేవాడని గుర్తించారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటిలో పడి ఒడిశా వాసి దుర్మరణం

చిల్లకూరు, న్యూస్‌టుడే: మద్యం మత్తులో నీటిలో పడి ఒడిశా వాసి మృతి చెందిన ఘటన పున్నపురెడ్డిపాళెం సమీపాన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రానికి చెందిన దయాకర్‌నాయక్(36) తన సోదరితో కలిసి ఆరు నెలల క్రితం స్థానికంగా ఉన్న ఆక్వా పరిశ్రమలో కూలీ పనులు నిమిత్తం వచ్చారు. ఈ నెల 15న మిత్రులతో కలసి మద్యం తాగారు. రోడ్డుపై ఏర్పాటు చేసిన కల్వర్టు గోడపై కూర్చుని నీటిలో పడి మృతిచెందారు. స్థానికుల సమాచారంతో బుధవారం మృతదేహాన్ని వెలికితీసి పంచనామా నిమిత్తం గూడూరులోని ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు.

విద్యార్థుల భయాందోళన..!

న్యూస్‌టుడే, కోట

కోట మండలం బిట్రగుంటలోని ప్రాథమిక పాఠశాల పాత భవనం శిథిలావస్థలో ప్రమాదకరంగా ఉంది. ఈ క్రమంలోనే విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో ప్రాథమిక పాఠశాలలో మూడు భవనాలున్నాయి. 70 మందికి పైగా విద్యార్థులు ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఉన్నారు. 3, 4, 5 తరగతులు విలీనం కారణంగా ప్రస్తుతం 20 మంది విద్యార్థులున్నారు. మరో భవనం మాత్రం పూర్తిగా దెబ్బతిని కూలేలా ఉంది. సమీపంలోనే విద్యార్థులు తిరుగుతున్నారు, ఏ క్షణంలో ప్రమాదం జరుగుతుందోనని తల్లిదం

చిట్టేడు: శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం

డ్రులు వాపోతున్నారు. భవనాన్ని తొలగించాలని విన్నవిస్తున్నా పట్టించుకునేవారు లేరు. మరికొంతరు దీనిని ఆక్రమించి వినియోగిస్తున్నారు.

అనుమతులు కొన్ని.. అనధికారమే అన్నీ..!

న్యూస్‌టుడే, రాపూరు

గత వైకాపా పాలనలో నాయకులు అనుమతి లేకుండా ప్రభుత్వ భూముల్లో లేఅవుట్లు వేశారు. ఇష్టారాజ్యంగా లేఅవుట్లు వేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నిబంధనలకు విరుద్ధంగా వేసిన వాటికి ఎల్ఆర్ఎస్‌కు అవకాశమిచ్చింది. రాపూరు, గోనుపల్లి, తెగచెర్లలో పది లేఅవుట్లు ఉండగా రెండింటికి మాత్రమే అనుమతులున్నాయి. రాజకీయ పలుకుబడితో కొందరు అన్ని సక్రమంగా ఉన్నాయని ప్లాట్లను విక్రయించారు. కొనుగోలు చేసిన వారు విషయం తెలుసుకుని లబోదిబోమంటున్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన కనీస రుసుములు చెల్లించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

● తహసీల్దారు లక్ష్మీనరసింహం మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో లేఅవుట్లు వేయకుండా నిఘా పెట్టామని చేశామన్నారు. అనుమతి లేని లేఅవుట్ యజమానులు నుడా అధికారులను సంప్రదించి ఎల్ఆర్ఎస్ చేయించుకోవాలని పేర్కొన్నారు.

అనుమతి లేకుండా వేసిన లేఅవుట్

● రాపూరు మండల పరిధిలో అనుమతి లేనివాటికి అధికారులు నోటీసులిచ్చారు. వీరంతా ఎల్ఆర్ఎస్ చేసుకుంటే పంచాయతీకి రూ.4 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా. మధ్యవర్తులు మాత్రం లేఅవుట్లకు అనుమతులు రద్దు చేసి ప్రభుత్వ భూములను కాపాడేలా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు వెనకడుగు వేస్తున్నారు.

అసైన్డ్ భూముల ఆక్రమించి స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నా కొందరు పంచాయతీ, రెవెన్యూ అధికారులకు ముడుపులిచ్చి ఎవరూ అభ్యంతరం తెలపకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కొన్ని చోట్ల సాగునీటి చెరువు కాలువలను ఆక్రమించి లేఅవుట్లు వేసినా పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ.లక్షలు వెచ్చించారు.. వదిలేశారు

లక్షల రూపాయలు వెచ్చించి చెత్త సంపద కేంద్రాలను ఏర్పాటు చేశారు. గత వైకాపా పాలనలో వీటి నిర్వహణ పట్టించుకోలేదు. పొదలకూరు మండలం బిరదవోలులో నిర్మించిన చెత్త సంపద కేంద్రంలో విద్యుత్తు సరఫరా లేక నేటికీ వినియోగంలోకి రాలేదు. రాత్రి సమయాల్లో మందుబాబులకు అడ్డాగా మారింది. అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

చేజర్ల జన్మదిన వేడుకలు

కోవూరు: కోవూరు పట్టణంలో నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ తెదేపా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో కేక్ కోసి సంబరాలు చేశారు. పలువురు నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

డాక్యుమెంట్ పోయినది

శ్రీనివాసులు కొండపల్లి S/o. నాగయ్య కొండపల్లి D.No. 101-A, సరస్వతీనగర్, మహాలక్ష్మి గుడి దగ్గర, చిన్నచెరుకూరు, నెల్లూరు, SPSR నెల్లూరు జిల్లా - 524003. A.P. వారికి సంబంధించిన సేల్‌డీడ్ డాక్యుమెంట్ నెం. 1426/2004, తేదీ: 10.2.2026న గూడూరు నుండి కోవూరు వెళ్తుండగా మార్గమధ్యంలో పోయినది. దొరికిన వారు ఈ క్రింది ఫోన్ నెంబరుకు తెలియజేయగలరు.

94403 42434

(c) eenadu

నెల్లూరు

•నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

విద్యార్థులకు సూచనలిస్తున్న పోలీసులు

శక్తి యాప్‌పై అవగాహన

నెల్లూరు (వేదాయపాలెం), న్యూస్‌టుడే: శక్తి యాప్‌పై విద్యా సంస్థలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, షాపింగ్ మాళ్లలో పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. శక్తి బృందాలు బుధవారం పలు ప్రాంతాల్లో ఈ యాప్‌తో కలిగే ఉపయోగాలపై మహిళలకు వివరించారు.

క్షతగాత్రురాలికి రూ.25 వేలు అందజేత

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన నగరంలోని పడారుపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అరవ ఉషకు ఆ శాఖ ఉద్యోగులు చేయూత అందించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను బుధవారం హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు, పడారుపల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చక్రవర్తి, పరిమళ, ముజహర్, మురళీకృష్ణ, సాయితేజ పరామర్శించారు. చికిత్స నిమిత్తం రూ.25 వేలు నగదు అందజేశారు.

భగత్‌సింగ్ కాలనీలో పోలీసుల సోదా

నెల్లూరు (వేదాయపాలెం), న్యూస్‌టుడే: నగరంలోని వెంకటేశ్వరపురం భగత్‌సింగ్ కాలనీలో బుధవారం రాత్రి నగర ఏఎస్పీ దీక్ష ఆధ్వర్యంలో నవాబుపేట ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి ప్రతి ఇంటినీ సోదా చేశారు. పత్రాలు సరిగా లేని 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: కోటమిట్ట హబీబుల్లా వీధి, ఖతీజా మసీదు వీధి, బిలాల్ మసీదు, వీపీఎస్ కల్యాణ మండపం, మెక్లిన్స్ రోడ్డు ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. – అబ్దుల్ సలామ్

సమాధానం: కుక్కలను పట్టేందుకు చర్యలు చేపడతాం. – డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

? చంద్రమౌళినగర్‌లో కాలువలు శుభ్రం చేయడం లేదు. మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. ఇళ్లలో ఉండలేకున్నాం. – షణ్ముగం

✓ కాలువలను శుభ్రం చేయిస్తాం. – డాక్టర్ దినేష్, వెటర్నరీ అధికారి

– న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)

జీతాలు పెంచాలని వీఆర్‌ఏల ఆందోళన

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: పేస్కేలు ప్రకారం జీతాలు పెంచాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హత ఉన్న వీఆర్‌ఏలకు వన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా వీఆర్వోలుగా ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. ఏళ్ల తరబడి నామినీలుగా పని చేస్తున్న వారిని వీఆర్‌ఏలుగా నియమించాలని కోరారు. వీఆర్వో, అటెండర్, నైట్ వాచ్‌మెన్ ప్రమోషన్ కోటాను 20 నుంచి 70 శాతానికి పెంచాలని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వస్తే జీతాలు పెరుగుతాయని, ప్రమోషన్లు అమలు చేస్తారని ఆశించామని, అధికారంలోకి వచ్చి 19 నెలలైనా పెంచలేదని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ బందగీ సాహెబ్, కె.ఉమామహేశ్వరరావు, కోశాధికారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాచేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు

వామ్మో.. ఎంత ప్లాస్టికో!

రోజుకు లక్ష కిలోల వ్యర్థాలు

నగరంలో రోజుకు ఒక మనిషి 100 గ్రాముల ప్లాస్టిక్ వ్యర్థాలను చెత్తలో వేస్తున్నారు. ఈలెక్క ప్రకారం నగరంలో ఉన్న 10 లక్షల మంది ద్వారా రోజుకు లక్ష కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలు వెలువడుతున్నాయి. ఈమేరకు పర్యావరణానికి హాని జరుగుతోంది. ప్రజారోగ్యం కూడా దెబ్బతింటుంది. ప్రభుత్వం నిషేధం విధించినా.. పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నా దీని విక్రయాలు, వినియోగం అగడం లేదు. విక్రయదారులకు జరిమానాలు విధిస్తున్నా ఖాతరు చేయడం లేదు.

అధికారులు స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్

నెల్లూరు (నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే

నెల్లూరునగరంలో 10 లక్షల మంది వరకు నివసిస్తున్నారు. ప్రజారోగ్య విభాగం అంచనా ప్రకారం ఒక మనిషి తన దైనందిన కార్యకలాపాల్లో అర కిలో చెత్తను ఉత్పత్తి చేస్తారని అంచనా. ఇందులో 100 గ్రాముల దాకా ప్లాస్టిక్ ఉంటోంది. అంటే పది మందికి కలిపితే కిలో, 100 మందికి పది కిలోలు, ఇదే లక్ష మందికి 10 వేల కిలోలు.. ఈ లెక్కన రోజుకు లక్ష కిలోల ప్లాస్టిక్‌ను బయటపడేస్తున్నారన్న మాట. ఈమేరకు ప్రజారోగ్యానికి హాని జరుగుతుంది. దీంతో ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధి ప్రబలుతుందని వైద్యులు చెబుతున్నారు. భావి తరాల మనుగడను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని నియంత్రించాయి. చేతి సంచులు, గ్లాసులు, ప్లేట్లు, ఇతర ఉత్పత్తులపై నిషేధం విధించింది. 125 మైక్రాన్ల లోపు ఉన్నవి వాడడానికి వీల్లేదని స్పష్టం చేసింది. పక్కాగా అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు సైతం జారీ అయ్యాయి. వాటి స్థానంలో జనప, గోగునార, కాగితపు సంచులను ప్రోత్సహించాలని ప్రభుత్వం సూచించింది.

నిబంధనలు ఇవీ..

ప్రతి ప్లాస్టిక్ సంచీపై కంపెనీ పేరు, రిజిస్ట్రేషన్ సంఖ్య, ఎన్ని మైక్రాన్లు ఉందనే వివరాలను ఆయా ప్రాంతీయ భాషల్లో ముద్రించాలి. రీసైక్లింగ్ చేసిన వాటిని పునరుత్పత్తి చేశారని ముద్రించాలి. ప్లాస్టిక్ తయారు చేసే పరిశ్రమలు నిబంధనలు ఉల్లంఘిస్తే.. మొదటిసారిగా రూ.50 వేల జరిమానా, అనంతరం లైసెన్స్ రద్దు చేయాలి. టోకు, చిల్లర వ్యాపార దుకాణదారుడికైతే రూ.2,500 నుంచి రూ.5 వేల వరకు జరిమానా, అనంతరం లైసెన్స్ రద్దు. అదే పౌరులు బహిరంగంగా ఈ సంచులు పడేస్తే రూ.200ల నుంచి రూ.500ల వరకు జరిమానా విధించాలని చట్టం చెబుతోంది. ప్లాస్టిక్ నియంత్రణకు కమిటీలు వేశారు. కమిషనర్, పారిశ్రామిక శాఖ ముఖ్య అధికారి, ఎన్జీవో సభ్యుడు, ప్లాస్టిక్ తయారీ పరిశ్రమ సభ్యుడు, కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ అధికారి ఇలా అయిదుగురితో కూడిన కమిటీ వేశారు. ఇది నిబంధనలు అమలయ్యేలా చూడాలి.

ప్రజలు సహకరించాలి

ప్లాస్టిక్ సంచుల విక్రయాలపై దాడులు చేసి జరిమానాలు విధిస్తున్నాం. ప్రజల సహకారం అవసరం. నిరంతరం దాడులు చేస్తాం. – డాక్టర్ దినేష్, ఆరోగ్యాధికారి

రోడ్డు మూత.. ప్రజలకు అవస్థ

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే

నగరంలోని గాంధీ బొమ్మ సెంటర్ సమీపంలోని గాంధీ పార్కు ముందు ఉన్న రోడ్డు ఆరు నెలలుగా మూసేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ పార్కుకు ఆనుకుని ఉన్న స్థలంలో విద్యుత్తు శాఖ ఆధ్వర్యంలో కంట్రోల్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు దక్కించుకున్న గుత్తేదారు సంస్థ ఈప్రాంతంలో నిర్మాణ సామగ్రి నిల్వ చేసింది. సాధారణంగా నగర పరిధిలో పెద్ద నిర్మాణాలు చేసే గుత్తేదారు సంస్థలు కంకర, ఇసుక, సిమెంట్ తదితర సామగ్రిని అనుకూలమైన చోట నిల్వ చేస్తారు. అక్కడే కాంక్రీట్ మిశ్రమాన్ని కలుపుకొని నిర్మాణ ప్రాంతానికి తీసుకొస్తాయి. కానీ అందుకు విరుద్ధంగా చేస్తున్నారు. ఇందుకోసం రోడ్డును వాడుకుంటున్నారు. దీన్ని మూసేసి నిర్మాణ సామగ్రి నిల్వ చేసి పనులు చేస్తున్నారు. దీంతో ఆరు నెలలుగా రోడ్డును ఇరువైపులా మూసేయడంతో ప్రజలు పడరానిపాట్లు పడుతున్నారు. ఈప్రాంతంలో ఉన్న ఆసుపత్రులు, సండే మార్కెట్ దుకాణాలకు నిత్యం వేలాది మంది వస్తుంటారు. రోడ్డు మూసేయడంతో వీటికి వచ్చే వారు చుట్టూ తిరిగి రావాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ విషయమై విద్యుత్తు శాఖ నిర్మాణ విభాగం డీఈ పరంధామయ్యను 'న్యూస్‌టుడే' అడగ్గా స్థానికంగా వాటర్ ట్యాంకు, పాత మున్సిపల్ బిల్డింగ్ ఉండడంతో పనులు నిదానంగా జరుగుతున్నాయన్నారు. దీంతో ప్రధాన రోడ్డుపై పనులు చేయాల్సి వస్తుందని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు.

అడ్డుగా పెట్టిన ట్రాఫిక్ బారికేడ్లు

పులి వాహనంపై ఆదిదంపతుల విహారం

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: నగరంలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం చప్పర ఉత్సవంపై ఆదిదంపతులు ఊరేగారు. రాత్రి పులివాహనంపై దర్శనమిచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో పులివాహనంపై ఊరేగారు.

జనసైనికుడికి చేయూత

నెల్లూరు (మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధ పడుతున్న జనసైనికుడు మోహన్‌కు ఆ పార్టీ నాయకులు చేయూత అందించారు. నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో బుధవారం రూ.1.35 లక్షలు అందజేశారు. కపాటిపాలేనికి చెందిన జనసేన నాయకుడు సనత్‌కుమార్ రూ.లక్ష, పార్టీ తరపున రూ.35 వేలు ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు నూనె మల్లికార్జునయాదవ్, కాశీరావు పాల్గొన్నారు.

పూడిక తీశారు.. గుట్టలుగా పోశారు

నగరంలోని పలు ప్రాంతాల్లో మురుగుకాలువల్లో పూడిక తీసి రోడ్డు అంచున వరుసగా గుట్టలుగా పోస్తున్నారు. ఎండిపోయినా వారాల తరబడి తొలగించకపోవడంతో మళ్లీ కాలువల్లోకే చేరుతోంది. ఇలాగే సుజాతమ్మ కాలనీలోని కాలువలో వారం రోజుల క్రితం తీసినా ఇంకా తొలగించలేదు. – న్యూస్‌టుడే, నెల్లూరు (టౌన్)

రోడ్లు ఛిద్రం.. ప్రజలకు కష్టం

రోడ్లపై పొక్లెయిన్లను నిర్లక్ష్యంగా నడుపుతుండడంతో గుంతలు పడి రాళ్లు తేలుతున్నాయి. కొండాయపాలెం గేటు రోడ్డులో పొక్లెయిన్‌ను నడిపించారు. ఇనుప చైన్ కావడంతో రోడ్డు ఛిద్రంగా మారింది. అధికారులు అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు (టౌన్)

నగరంలో సీసీ కెమెరాల నిఘా

నగరంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలు, పార్కులతో పాటు గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల వద్ద పర్యవేక్షణ కోసం సీసీ కెమెరాలను బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ నందన్ మాట్లాడుతూ హడ్కో, సీఎస్సార్ నిధులతో అత్యాధునిక కెమెరాలను ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ

పారిశుద్ధ్యం అధ్వానం.. వ్యాధుల భయం

నెల్లూరుగ్రామీణం, న్యూస్‌టుడే: ఆహ్లాదకర వాతావరణంతో ఉండాల్సిన పచ్చని పల్లెలు అపరిశుభ్రతకు నెలవులుగా మారుతున్నాయి. దోమలతో ప్రజలు వ్యాధులకు గురవుతున్నారు. నెల్లూరు రూరల్ మండల పరిధిలో గొల్లకందుకూరు, సజ్జాపురం, కొత్తవెల్లంటి, కందమూరు, పాత వెల్లంటి, ఉప్పుటూరు, సౌత్‌మోపూరు, ములుమూడి, దేవరపాళెం, కొండ్లపూడి, కొమ్మరపూడి, ఆమంచర్ల, దొంతాలి, పొట్టేపాళెం, కాకుపల్లి, కలివెలపాళెం, మెనుబర్తి, మాదరాజుగూడూరు తదితర 18 పంచాయతీలున్నాయి. 45 వేల మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. ప్రజలకు సేవలందించేందుకు 11 సచివాలయాలు ఉన్నాయి.

శుభ్రత మరిచిన పాలకులు

రహదారి పక్కన తగలబెడుతున్న చెత్త

రూరల్ పరిధిలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ లోపించి స్థానిక ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల వెంబడి చెత్తచెదారాలు పేరుకుపోతున్నాయి. కాలువల నిర్మాణాలు జరగలేదు. కొన్ని గ్రామాలకు సంబంధించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు లేవు. అంతర్గత రోడ్లను చిమ్మే పనులు ఎప్పుడో అన్నట్లుగా జరుగుతుండడంతో అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. సౌత్‌మోపూరుకు వెళ్లే రోడ్డు, ములుమూడి కలుజు సమీపంలో రోడ్డు పక్కనే చెత్తచెదారాలు పోస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో సైడు కాలువల నిర్మాణాలు చేయాల్సి ఉంది. పూడిక సక్రమంగా తీయడం లేదని ఆరోపణలున్నాయి. దీంతో దోమల ఉత్పత్తి కేంద్రంగా మారుతూ ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. మాదరాజు గూడూరు వెళ్లే ప్రధాన మార్గం కంకర లేచి గుంతలు పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వ్యక్తిపై ఇద్దరి దాడి

నెల్లూరు (వేదాయపాలెం), న్యూస్‌టుడే: ఓ వ్యక్తిపై ఇద్దరు దాడి చేసిన ఘటన ఇది. పోలీసుల కథనం మేరకు.. ఇందిరానగర్‌కు చెందిన తిరుపతి అయ్యప్ప గుడి వద్ద ఓ బార్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. బుధవారం విధుల్లో ఉండగా ఇద్దరు యువకులు శీతలపానీయ బాటిల్‌ను అతనిపై విసరగా ప్రశ్నించారు. దీంతో ఆగ్రహంతో వారు అతనిపై దాడి చేసి పరారయ్యారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తెరపై ఈనాడు

పార్వీ సినిమాస్ (ఎం.I) షెడ్యూల్: స్క్రీన్.1. మనసంతా నువ్వే (తెలుగు), ఆరంజ్ (తెలుగు), స్క్రీన్ 2.. ఫంకీ (తెలుగు), స్క్రీన్.3.. కపుల్ ఫ్రెండ్లీ (తెలుగు), **పార్వీ సినిమాస్ (స్పైస్):** స్క్రీన్.1.. కపుల్ ఫ్రెండ్లీ (తెలుగు), స్క్రీన్ 2. సీతా పయనం (తెలుగు), క్రైమ్ 101 (ఇంగ్లిష్), స్క్రీన్ 3. ఓ రోమియో (హిందీ), స్క్రీన్ 4. 3 తెలుగు, లవ్ స్టోరీ (తెలుగు), విత్‌లవ్ (తెలుగు), స్క్రీన్.5.. ఫంకీ (తెలుగు), **రైన్ సినిమా షెడ్యూల్:** స్క్రీన్.1. ఫంకీ (తెలుగు) , స్క్రీన్ 2. కపుల్ ఫ్రెండ్లీ (తెలుగు), స్క్రీన్ 3. సీతా పయనం (తెలుగు), ఎర్రచీర (తెలుగు) నిలవే (తెలుగు)

వేధింపుల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం

సదస్సులో మాట్లాడుతున్న ధనలక్ష్మి

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : మహిళలపై లైంగిక వేధింపులను నివారించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని శ్రామిక మహిళా సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి ఆరోపించారు. బుధవారం నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో మున్సిపల్ ఫెడరేషన్ శ్రామిక మహిళా విభాగం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒంటరి మహిళలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగాయని, చిన్నారులపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నా ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, హోంమంత్రి ప్రకటనలకే పరిమితమవుతున్నారని మండిపడ్డారు. మహిళలు, పురుషులు కలిసి పనిచేసే సంస్థలు, ప్రదేశాల్లో ఫిర్యాదుల కమిటీలను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా ప్రభుత్వాలు అమలు చేయడం లేదన్నారు. అనంతరం శ్రామిక మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్‌గా విజయలక్ష్మిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్షురాలు విజయమ్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు సునీల్, పెంచల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు పశువుల తరలింపు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నగరంలో వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తూ రోడ్లపై సంచరించే పశువులను గోశాలకు తరలిస్తున్నామని నగరపాలకసంస్థ వెటర్నరీ అధికారి డాక్టర్ మదన్‌మోహన్ తెలిపారు. బుధవారం నగరంలో వీటికోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాకర్స్ రోడ్డు, గుప్తా పార్కు, మినీబైపాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో సంచరించే పశువులను కల్లూరుపల్లి గోశాలకు తరలించినట్లు తెలిపారు. జెండా వీధి, కిసాన్‌నగర్, బాలాజీనగర్, చేపల మార్కెట్ ప్రాంతాల్లో 12 శునకాలను పాత మున్సిపల్ కార్యాలయంలోని ఏబీసీ కేంద్రానికి తరలించినట్లు వివరించారు.

ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తున్నామని తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని సజ్జాపురంలో రూ.15 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి అప్పకూటి నారాయణ, నాయకులు పముజుల ప్రదీప్, బూడిద విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితురాలికి ఇల్లు అప్పగింత

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నగరంలోని 44వ డివిజన్‌లో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో నిరాశ్రయులైన తెలుగుదేశం పార్టీ మహిళా కార్యకర్త షాహీనా కుటుంబానికి మంత్రి నారాయణ అండగా నిలిచారు. ఆమె ఇంటిని ఎన్‌సీసీ గ్రూప్ ద్వారా మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈమేరకు బాగు చేయించి బుధవారం బాధితురాలికి అప్పగించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు దర్శి హరికృష్ణ, రమణ, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులతో తెదేపా నాయకులు

నేడు శివాజీ జయంతి

నెల్లూరు(సాంస్కృతికం),న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలను నగరంలో గురువారం నిర్వహిస్తున్నట్లు శివాజీ సేన, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు కాకు మురళీరెడ్డి, పలువురు సభ్యులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సాయంత్రం నాలుగు గంటలకు వీఆర్‌సీ మైదానం నుంచి గాంధీబొమ్మ, ఏసీ కూడలి, కొత్తహాలు, సండేమార్కెట్ మీదుగా సాగుతుందన్నారు. కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ సంస్థ, శివాజీ సేన సభ్యులు పాల్గొన్నారు.

నోటీస్

ఇన్ ది కోర్టు ఆఫ్ ది ఏజెంట్ టు గవర్నమెంట్ (డిస్ట్రిక్ట్ కలెక్టర్) కొత్తగూడెం కోర్టు వారి ఆదేశానుసారం

HMOP No. 63/2025

పంజాగల భారతి @ కటారి భారతి ...పిటీషనర్

మరియు

పంజాగల రాజు, S/o. (లేటు) పంజాగల సాంబశివరావు, H.No. 16-4-914-3, శ్రామికనగర్, అపోలో సెంటర్, హరినాథపురం, నెల్లూరు గ్రామం & మండలం, నెల్లూరు జిల్లా, A.P. ...రెస్పాండెంట్

పిటీషనర్ మీపై HMOP No. 63/2025 విడాకుల కేసు దావా వేసింది. అట్టి వాయిదా ది. 07-03-2026న కలదు. మీరు 10.30 ని॥లకు పైన తెలిపిన కోర్టుకు హాజరు కావలెనని లేని యెడల మా క్లయింట్‌కి అనుకూలంగా ఆర్డర్ వస్తుంది.

సం/- టి.లలిత MA,LLM

న్యాయవాది & నోటరీ, భద్రాచలం (V&M)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, T.S., 9908915027

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియ జేయడమేమనగా నా క్లయింటు మహమ్మద్ సుమయ్యా ఉరఫ్ ఇమ్రానా భర్త మహమ్మద్ గౌస్ మొహిద్దీన్, డోర్ నెం. 20-7-64, మెక్లిన్స్ రోడ్డు, కోటమిట్ట, నెల్లూరు. ఒరిజినల్ రిజిస్టర్డు డాక్యుమెంటు నెం. 3995/2013కు సంబంధించిన ఒరిజినల్ రిజిస్టరు లింకు డాక్యుమెంట్ నెం. 1212/1989ను తేది: 5-2-2026న నా క్లయింటు కనక మహల్ సెంటర్ దగ్గర జెరాక్స్ తీసుకొని మోటార్ బైకులో సంతపేటకు పోవుచుండగా మార్గమధ్యలో పోయినది. ఈ ఒరిజినల్ రిజిస్టరు లింక్ డాక్యుమెంటు ఎవ్వరికైన దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సుకు తెలుపవలసినది.

Sk. Fuhaid Ahmad B.Com., LL.B., Advocate, Meclines Road, Kotamitta, Nellore. 99080 54415.

24న జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు

నెల్లూరు (క్రీడా విభాగం), న్యూస్‌టుడే: శాప్ లీగ్ పోటీల్లో భాగంగా ఈ నెల 24న జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎం.పాండురంగారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో పాల్గొనే క్రీడాకారులు శాప్ వెబ్‌సైట్ లేదా క్రీడా యాప్‌లో ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వీటిలో ప్రతిభ కనబరిచిన వారు ఫిబ్రవరి 28 నుంచి మార్చి ఒకటో తేదీ వరకు ఎన్టీఆర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 88862 28444, 95813 72472 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మార్గదర్శకాల ప్రకారమే నిర్మాణాలు: కమిషనర్

సిబ్బందికి సూచనలిస్తున్న నందన్

నెల్లూరు (నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: మార్గదర్శకాల ప్రకారమే నిర్మాణాలు చేయాలని నగరపాలకసంస్థ కమిషనర్ వైవో నందన్ స్పష్టంచేశారు. బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. రెండో డివిజన్ పెద్దచెరుకూరు ప్రాంతంలో నిర్మిస్తున్న రోడ్లు, కాలువలను తనిఖీ చేశారు. పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. స్థానికంగా ఉన్న లేఅవుట్ నిర్మాణం అనుమతులను పరిశీలించారు. మిక్స్‌డ్ కాలనీలో రోడ్లు, కాలువలు, తాగునీటి సరఫరా తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. నగరంలో రోడ్లపై చెత్త కనిపించకుండా పనిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటరులో ప్రజారోగ్య విభాగం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలువల్లో ఎప్పటికప్పుడు పూడిక తీత పనులు చేపట్టాలని ఆదేశించారు. ట్రేడ్ లైసెన్సులు ఇంకా రూ.1.95 లక్షలు బకాయిలు ఉన్నాయని, వారం రోజుల్లోపు వసూలు చేయాలన్నారు. సమావేశంలో ఆరోగ్యాధికారి డాక్టర్ దినేష్, వెటర్నరీ అధికారి డాక్టర్ మదన్‌మోహన్, మలేరియా అధికారి జిజియా, టీపీఆర్‌వో వాసుబాబు తదితరులు పాల్గొన్నారు నగరపాలకసంస్థకు చెందిన జేవీఆర్, సుబేదారుపేట, ఎన్‌సీ బిల్డింగ్స్, ప్రకాశం పంతులు, ఏసీ బిల్డింగ్స్ షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో 51 దుకాణాలకు అద్దెకిచ్చేందుకు కమాండ్ కంట్రోల్ సెంటరులో వేలం పాట నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, టీపీఆర్‌వో వాసుబాబు, రెవెన్యూ అధికారులు సమద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆ కాలనీలో అన్నీ సమస్యలే!

న్యూస్‌టుడే,నెల్లూరు(పద్మావతిసెంటర్)

నెల్లూరు వైయస్ఆర్ నగర్‌లో 20 వీధులు ఉన్నాయి. ఇందులో ఐదు చోట్ల మాత్రమే రోడ్లు వేశారు. కొన్ని చోట్ల కల్వర్టులు వేయకుండా వదిలేయడంతో వాహనదారులు రాత్రి సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు. డ్రైనేజీ కాలువలు లేక ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు వీధుల్లోకి పారి దుర్వాసన వ్యాపిస్తోంది. దీనికి తోడు దోమలబెడదతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నామన్నారు. దోమల నివారణకు అసలు దోమల మందును పిచికారి చేయడంలేదని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. నెల్లూరు నగరపాలక సంస్థ వారు ఇప్పటి వరకు వైయస్ఆర్ నగర్‌లో తాగు నీటి పైపు లైను కూడా వేయలేదు. నెల్లూరు కార్పొరేషన్ వారు ట్యాంకర్లను రెండు రోజులకు ఒకసారి పంపిస్తుండటంతో కుటుంబ అవసరాలకు సరిపడ నీరులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. కుక్కల బెడదతో రాత్రి సమయంలో రోడ్డుపైకి రావాలంటేనే హడలిపోతున్నారు. ప్రజలు ఇన్ని సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. నెల్లూరు నగర పాలక సంస్థ అధికారులు వెంటనే ప్రజలు పడుతున్న వివిధ సమస్యలపై దృష్టి సారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



వైయస్ఆర్ నగర్ 13వ వీధిలో ఇదీ పరిస్థితి

పశువుల కాపరిపై దౌర్జన్యం

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: పశువుల కాపరిపై ఇద్దరు దాడి చేసిన ఘటనపై బుధవారం నెల్లూరుగ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. మూడో మైలులోని సాదా వారిపాలెంలో వెంకటేశ్వర్లు, సుబ్బయ్య ఉంటున్నారు. వీరి ఇంటికి సమీపంలో పశువుల కాపరి వెంకటేశ్వర్లు ఉంటున్నారు. ప్రతి రోజూ గేదెలను మేతకు తోలుకెళుతుంటారు. మంగళవారం వెంకటేశ్వర్లు, సుబ్బయ్య దుస్తులు బయట ఆరేయగా.. వెంకటేశ్వర్లు తోలుకెళుతున్న గేదెలు తగలడంతో పాడయ్యాయి. దీంతో అతనిపై కర్రతో వెంకటేశ్వర్లు, సుబ్బయ్య దాడి చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్తరక్రియలు

జననం 10-10-1951

మరణం 4-2-2026

మా ఆత్మీయ శ్రేయోభిలాషి, శ్రీ వేగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఛైర్మన్

ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డి తండ్రి గారైన

శ్రీ ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి గారు

(శ్రీ వేగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం మాజీ ఛైర్మన్ - నరసింహకొండ, మాజీ సర్పంచ్, టిడిపి సీనియర్ నాయకులు మరియు సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు - పొట్టెపాలెం)

వారి పవిత్ర ఆత్మకి శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ... వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ...

మీ..

డి.వెంకటేష్

కె.రమేష్

పి.చంద్రశేఖర్

ఉత్తరక్రియలు : పెద్దకర్మ తేది 19-02-2026 గురువారం

పొట్టెపాలెం (గ్రామం, నెల్లూరు రూరల్

(c) eenadu

ఆనందాలు నిండుగా..

ఈనాడు, అనంతపురం: సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా మంత్రి లోకేశ్ ఉమ్మడి అనంతపురం ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, వారి కుటుంబ సభ్యులతో భేటీ అయ్యారు. బుధవారం ఉండవల్లిలోని నివాసంలో జరిగిన విందుకు మంత్రి లోకేశ్ స్వయంగా ప్రతి ఒక్కరికి ఆహ్వానం పలికారు. ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యుల్లో ఒకరిలా కలిసిపోయారు. ప్రతి ఒక్కరిని ఆత్మీయంగా పలుకరించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. పిల్లలతో మమేకమై సరదాగా గడిపారు. మహిళలకు మంగళగిరి పట్టుచీరలను బహుమతిగా అందించారు. ప్రజాప్రతినిధులు గతంలో అందించిన అర్జీల్లో ఎన్ని పరిష్కారం అయ్యాయి? ఎన్ని కాలేదు? అనే వివరాలతో కూడిన నివేదికను అందించి బాధ్యతను చాటుకున్నారు. మంత్రులు పయ్యావుల కేశవ్, సవిత, సత్యకుమార్, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, పార్థసారథి, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత, గుమ్మనూరు జయరాం, జేసీ అస్మిత్‌రెడ్డి, బండారు శ్రావణి, దగ్గుపాటి ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, పల్లె సింధూరరెడ్డి, ఎంఎస్‌రాజు, కందికుంట వెంకటప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ హాజరయ్యారు

న్యాయస్థానాలకు బాంబు బెదిరింపు

ధర్మవరం,అనంతపురం (మూడోరోడ్డు): ఉమ్మడి జిల్లాలోని పలు కోర్టులకు మళ్లీ బాంబు బెదిరింపు లేఖలు వచ్చాయి. గతంలో ఇలాంటి బెదిరింపు లేఖలు రాష్ట్రంలోని పలు కోర్టులకు వచ్చిన విషయం విదితమే. తాజాగా బుధవారం రెండోసారి బాంబులు పెట్టినట్లు బెదిరింపు లేఖలు వచ్చాయి. కోర్టు సిబ్బంది సమాచారాన్ని పోలీసులకు చేరవేశారు. పోలీసులు కోర్టుకు చేరుకొని తనిఖీలు చేశారు. జిల్లా కేంద్రంలోని 16 కోర్టులను పరిశీలించారు. లేఖలు జిల్లా కోర్టు ఈ-మెయిల్‌కు వచ్చాయి. జిల్లా కోర్టు పరిపాలనాధికారిణి పోలీసులకు సమాచారం అందజేశారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని అన్ని కోర్టుల్లోనూ తనిఖీలు చేశారు. ఉరవకొండ, ధర్మవరం, గుత్తి, గుంతకల్లు, కదిరి, పుట్టపర్తి, మడకశిర, హిందూపురంలలో పరిశీలించారు. ఇలాంటి బాంబు బెదిరింపు లేఖలు గతంలో రావడంతో కోర్టులో రాత్రి వేళల్లో పార్క్ చేస్తున్న కార్లను తొలగించాలని న్యాయమూర్తి తెలిపారు.

ధర్మవరం కోర్టులో తనిఖీలు చేస్తున్న బాంబ్‌స్క్వాడ్

కాసుక్కూచున్నారు

■ రెవెన్యూ కార్యాలయాల్లో ప్రైవేట్ వ్యక్తుల వసూళ్లు

ఈనాడు, పుట్టపర్తి, న్యూస్‌టుడే, ముదిగుబ్బ: శ్రీసత్యసాయి జిల్లాలోని రెవెన్యూ కార్యాలయాల్లో ప్రైవేట్ వ్యక్తుల హవా కొనసాగుతోంది. వివిధ సమస్యలపై కార్యాలయాలకు వచ్చే ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి కొందరు అధికారులకు ఇస్తున్నారు. మరికొందరు భూ సంబంధిత సమస్యలపై పంచాయితీలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు కంప్యూటర్ ఆపరేటర్లు తప్పుడు వివరాలు నమోదు చేస్తున్నారు. ప్రస్తుతం రెవెన్యూ క్లినిక్‌ల పేరుతో భూ సమస్యల పరిష్కారంపై కలెక్టర్ ప్రత్యేక దృష్టిసారించిన నేపథ్యంలో దళారుల జోక్యం లేకుండా నేరుగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

● ముదిగుబ్బ తహసీల్దార్ కార్యాలయంలో ముదిగుబ్బ, జొన్నలకొత్తపల్లి, సానేవారిపల్లికి చెందిన ముగ్గురు వ్యక్తులు తిష్ట వేశారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామంటూ ప్రజల నుంచి వసూళ్లు చేస్తున్నారు. 2019లో పాసుపుస్తకాల జారీలో అవకతవకల నేపథ్యంలో ఏసీబీ దాడులు జరిగాయి. 2020లోనూ అదే తహసీల్దార్ డబ్బులు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. అధికారులు మారినా.. అక్కడుండే దళారులు మాత్రం మారడం లేదు.

● పెనుకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఓ తహసీల్దార్ కార్యాలయం అవినీతికి నిలయంగా మారింది. సదరు తహసీల్దారు ఏ పని చేయాలన్నా.. దళారుల చేయి తడపాల్సిందేనని ఆయన పని చేసిన రెండు మండలాల ప్రజలు పలుమార్లు బహిరంగంగానే ఆరోపించారు. ఇన్‌ఛార్జిగా పని చేసిన మండలానికే ఆయనను ఇటీవల బదిలీ చేశారు.

● పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయ పరిధిలో ముగ్గురు ప్రైవేట్ వ్యక్తులు నిత్యం అక్కడే ఉంటూ పంచాయితీలు చేస్తున్నారు. గతంలో ఇక్కడ పని చేసిన ఓ అధికారికి ప్రజల నుంచి వసూళ్లు చేసి ఇచ్చారు. ఆయన ప్రస్తుతం బదిలీపై మరో మండలానికి వెళ్లారు. కానీ, తాము డబ్బులు ఇచ్చినా.. సమస్య పరిష్కారం కాలేదని కొందరు బాధితులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

జిల్లా:	శ్రీసత్యసాయి
మండలాలు:	32
రెగ్యులర్ తహసీల్దార్లు:	10
ఇన్‌ఛార్జి తహసీల్దార్లు:	32
రెవెన్యూ గ్రామాలు:	461
భూవిస్తీర్ణం:	8925.65 చ.కి.మీ.

● వ్యవసాయ ఆధారిత జిల్లా కావడంతో భూ సంబంధిత సమస్యలే అధికంగా వస్తున్నాయి. దీనికితోడు వీటిని పరిష్కరించేందుకు తహసీల్దార్ల కొరత ఉంది. దళారులు, కంప్యూటర్ ఆపరేటర్లు ఇదే అవకాశంగా తీసుకుని హవా నడిపిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో వీఆర్‌ఓలు సైతం అనధికారికంగా సహాయకులను నియమించుకున్నారు. రెగ్యులర్ తహసీల్దార్లు 10 మంది ఉండగా.. మిగిలినచోట్ల డిప్యూటీ తహసీల్దార్లకు బాధ్యతలు అప్పగించారు.

హెచ్చరికలు జారీ చేశాం

- సూర్యనారాయణరెడ్డి, డీఆర్‌ఓ

ఇటీవల మీసేవ, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల కంప్యూటర్ ఆపరేటర్లతో కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించాం. రెవెన్యూ సిబ్బంది, మధ్యవర్తులు ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసినా.. తప్పుడు సమాచారం నమోదు చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించాం.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సా॥)	సహర్ (ఉ॥)
హిందూపురం	6.29	5.26
కదిరి	6.27	5.24
ధర్మవరం	6.31	5.22

అత్యాధునిక వైద్య పరికరాల మంజూరు

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ రూ.98,71,475 విలువైన అత్యాధునిక వైద్య పరికరాలు మంజూరు చేయించారు. ఈ పరికరాలు బుధవారం ఆసుపత్రికి చేరాయి. సూపరింటెండెంట్ డా.తిప్పేంద్రనాయక్, మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు వాటిని పరిశీలించారు. పరికరాల్లో ఫుల్లీ ఆటోమేటిక్ బయోకెమిస్ట్రీ అనలైజర్, యూఎస్‌జీ స్కానర్, కలర్ డాప్లర్, అల్ట్రాసౌండ్ సిస్టమ్, బ్రెయిన్ స్టెమ్ ఎవోక్డ్ రెస్పాన్స్ ఆడియోమెట్రీ, డబుల్ పంచ్ ల్యాప్రోస్కోపి యంత్రాలు ఉన్నట్లు వారు పేర్కొన్నారు. త్వరలో మంత్రి చేతుల మీదుగా యంత్రాలను ప్రారంభించనున్నామని తెలిపారు.

'ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించం'

కొత్తచెరువు, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు ఈ నెల 23వ తేదీ నుంచి నిర్వహించడానికి 42 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు డీఐఈవో చెన్నకేశవ ప్రసాద్ తెలిపారు. కొత్తచెరువులోని శ్రీసత్యసాయి ప్రభుత్వ కళాశాల ఆవరణలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, కస్టోడియన్ అధికారులకు ఇంటర్ పరీక్షల నిర్వహణలో నియమ నిబంధనలపై పరీక్షల మండలి సభ్యులు రామరాజు, ప్రశాంతి, భీముడునాయక్, ప్రశాంత్‌తో కలిసి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఐఈవో మాట్లాడుతూ ప్రథమ ఇంటర్ 11,737 మంది, ద్వితీయ ఇంటర్ 12,112 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఉదయం 9 గంటల తరువాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష రాయడానికి అనుమతించమన్నారు. కేంద్రాల్లో తాగునీరు, వైద్యం, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించామని తెలిపారు. దూరప్రాంతాల నుంచి పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు చేరుకునేలా ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతుందని పేర్కొన్నారు.

సౌకర్యాలు కల్పిస్తారా.. మమ అనిపిస్తారా?

● వారం రోజుల్లో కదిరి బ్రహ్మోత్సవాలు

కదిరి, న్యూస్‌టుడే: ఖాద్రీశుని బ్రహ్మోత్సవాలు మరో వారం రోజుల్లో అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. పక్షం రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలకు లక్షల్లో భక్తులు తరలివస్తారు. రద్దీకి అనుగుణంగా అధికారులు మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు బస చేసేందుకు గదులు, అత్యవసరాలు తీర్చుకునేందుకు తగిన సౌకర్యాలు ఎంతో ముఖ్యం. తాత్కాలిక ఏర్పాట్లతో మమ అనిపించకుండా, సకల సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఏటా తాత్కాలిక పనులతోనే సరి..

ఖాద్రీశుని బ్రహ్మోత్సవాల్లో పట్టణం, శివారు ప్రాంతాలు జనంతో సందడిగా మారుతాయి. ఆ సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు కష్టంగా ఉంటుంది. ప్రధానంగా మహిళలు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. అందుబాటులో శౌచాలయాల్లేక అతికష్టంపై ఆపుకోవాల్సిన దుస్థితి. ఏటా రథోత్సవానికి ఒకట్రెండు రోజుల ముందు శౌచాలయాలు ఏర్పాటు చేస్తారు. అవీ కూడా 15-20 లోపే పెడతారు. లక్షల్లో వచ్చే భక్తులకు ఇవి ఏమాత్రం చాలటం లేదు.

గుక్కెడు నీటికి అవస్థలే..

ఉత్సవాల్లో భక్తుల దాహార్తికి ఇబ్బందులు తప్పటం లేదు. ఆలయంలో తాగునీటి సదుపాయం అరకొరగానే ఉంది. బయట ఎక్కడా ఉచిత తాగునీరు దొరకదు. మున్సిపల్ అధికారులు చలివేంద్రాలు ఏర్పాటు చేసినా.. కుండల్లో నీరు శుభ్రత లేక ఎక్కువ మంది తాగేందుకు ఇష్టపడటం లేదు. తిరువీధుల్లోని నాలుగు కూడళ్లలో శుద్ధజలం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

వసతి.. దుర్గతి

నరసింహస్వామి ఆలయానికి మూడు చోట్ల 71 బస గదులు ఉన్నాయి. ఇందులో 60 గదులు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. దీంతో కొందరికీ మాత్రమే వసతి లభిస్తుంది. మిగిలిన భక్తులు రాత్రి ఎక్కడపడితే అక్కడ బస చేయాల్సి వస్తుంది. ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తే సదుపాయంగా ఉంటుంది.

★ ఆలయం లోపల మహిళలు దుస్తులు మార్చుకోవటం, పాలిచ్చే తల్లులకు ప్రత్యేక వసతి కల్పించారు. అయితే ఉత్సవాల్లో రద్దీకి తగినంత వసతి లేక అవస్థలు తప్పడం లేదు. భక్తులు ఖరీదు పెట్టి గదులు పొందలేక, ఉచిత సదుపాయం లేక సర్దుకుపోవాల్సిన పరిస్థితి.

సదుపాయాల కల్పనకు కృషి

- శ్రీనివాసరెడ్డి, ఆలయ ఈవో

శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతాం. తాత్కాలిక మొబైల్ టాయిలెట్లను ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేస్తాం. శుద్ధజలం అందుబాటులో ఉండేలా చూస్తాం. అన్ని విషయాలు సమన్వయ సమావేశంలో చర్చించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని విధాలా సదుపాయాలు కల్పిస్తాం.

కుడికాలువపై 16 తూములే సమస్యాత్మకం

■ రంగంలోకి అనంత, ధర్మవరం ఆర్డీఓలు

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: పీఏబీఆర్ కుడి కాలువ నీటి ప్రవాహం తీరుపై అనంత, శ్రీసత్యసాయి జిల్లాల అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఎలాంటి సమస్య తలెత్తకుండా నిత్యం పర్యవేక్షణ చేపట్టాలని నిర్ణయించారు. ఇదే అంశంపై రెండు జిల్లాల కలెక్టర్లు, అనంత ఎస్పీ, హెచ్చెల్సీ ఎస్‌ఈ, అనంతపురం, ధర్మవరం ఆర్డీఓలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో పర్యవేక్షణ బాధ్యతలను అనంత, ధర్మవరం ఆర్డీఓలకు అప్పగించారు. సత్వరమే ఆయా ప్రాంతాల పరిధిలో పోలీసులకు సమాచారం పంపారు. ఎక్కడైనా నీటి చౌర్యానికి పాల్పడినా, గండ్లు పెట్టినా, అక్రమంగా తూములు ఎత్తినా కేసులు నమోదు చేసేలా కలెక్టర్ల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

40 చెరువులే లక్ష్యం: అనంతపురం జిల్లా పరిధిలో ఉరవకొండ, శింగనమల, అనంత అర్బన్, రాప్తాడు, శ్రీసత్యసాయి జిల్లాలోని ధర్మవరం నియోజకవర్గం పరిధిలో కుడికాలువ పొడవు 112 కి.మీ. ఉంది. 78 కి.మీ వద్ద ధర్మవరం ఉప కాలువ, 98 కి.మీ వద్ద బి.పప్పూరు ఉప కాలువ వెళ్తాయి. ఈ మూడింట కింద 40 చెరువులు ఉన్నాయి. వీటన్నింటిని నీటితో భర్తీ చేయాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇప్పటికే హంద్రీనీవా జలాలతో తొమ్మిది చెరువులను నింపారు. కుడి కాలువకు 1.5 టీఎంసీలకుపైగా నీరు ఇచ్చినా ఆశించిన మేర చెరువులకు ఇవ్వలేదు. ఇప్పటి నుంచైనా ప్రణాళిక ప్రకారం నీరు ఇవ్వాలని సంకల్పించారు.

నిరంతరం నిఘా

కుడి కాలువ పరిధిలో 16 సమస్యాత్మక తూములు ఉన్నట్లు గుర్తించారు. గడిచిన 50 రోజుల్లో ఈ ప్రాంతాల్లోనే తరచూ నీటి చౌర్యం తెలుస్తోంది. ఇప్పటికే మన్నీల, అరవకూరు వద్ద గట్లకే గండ్లు పెట్టారు. దీంతో కేసులు కూడా నమోదు అయ్యాయి. తాజాగా సమస్యాత్మక తూములపై నిరంతర నిఘా ఉంచారు. వాటి పరిధిలో కూడేరు మండలం మరుట్ల, పొట్టిచెరువు, అరవకూరు, గార్లదిన్నె మండలం పెనకచెర్ల, ముకుందాపురం, రాప్తాడు మండలం డీబీసీ రెగ్యులేటర్, హంపాపురం, అనంత గ్రామీణ మండలం మన్నీల, కందుకూరు, జంగాలపల్లి, చింతపల్లి, నార్పల మండలం దుర్గం, బత్తలపల్లి మండలం సంజీవపురం, బత్తలపల్లి, మాల్యవంతం, తాడిమర్రి మండలం పుల్లంపల్లి చెరువులు ఉన్నాయి.

బ్రహ్మోత్సవం.. బ్రహ్మాండం

లేపాక్షి, న్యూస్‌టుడే: లేపాక్షిలో ఐదు రోజులపాటు ఘనంగా నిర్వహించిన శివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిసినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందన్, కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి తెలిపారు. చివరిరోజు ఆలయంలో అభిషేకార్చనలు, పూజలు జరిపారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా పూర్ణాహుతి, అనంతరం వసంతోత్సవం, ధ్వజ అవరోహణం, శయనోత్సవం నిర్వహించారు. ఉత్సవాలు విజయవంతం చేయడంలో సహకరించిన అన్ని శాఖల అధికారులకు, సహకరించిన దాతలకు కమిటీ ఛైర్మన్, ఈవో కృతజ్ఞతలు తెలిపారు.

వసంతోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

మూగజీవాల దాహం తీరేదెలా?

■ గ్రామాల్లో పూర్తికాని నీటితొట్టెల నిర్మాణం

ఓబుళంపల్లిలో ఇలా..

కొత్తచెరువు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయం తరువాత పాడి పోషణే రైతులకు జీవనాధారం. వేసవిలో పశువులకు గ్రాసంతో పాటు తాగునీటి వసతి ప్రధానం. ఇది గుర్తించిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన మొదటి ఏడాదిలోనే గ్రామీణ ప్రాంతాల్లో పశువుల దాహార్తి తీర్చడానికి గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద తాగునీటి తొట్టెల నిర్మాణం చేపట్టింది. 2025-26 పల్లె పండుగ పేరుతో ప్రతి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో నీటి వసతి ఉన్న ప్రదేశాల్లో తొట్టెలు నిర్మించ తలపెట్టింది. ఒక్కో నిర్మాణానికి అవసరమైన కూలీలు, సామగ్రి కోసం రూ. 37 వేలు కేటాయించింది. జిల్లాలోని 468 గ్రామ పంచాయతీల్లో 2018 తొట్టెలు మంజూరు చేశారు. గత పది నెలల్లో 1034 నిర్మాణాలు అంటే 50 శాతం మాత్రమే పూర్తి చేయగా 1257 నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. తొట్టెల నిర్మాణాలు పూర్తి చేసి నీటి వసతి కల్పించిన గ్రామాల్లో మూగజీవాల దాహం తీర్చడానికి ఉపయోగ పడుతున్నాయి. అయితే ఈఏడు ఫిబ్రవరి నెలలోనే ఎండలు మండుతున్నాయి. మిగిలిన వాటిని వేసవిలోపు పూర్తి చేస్తే పశువుల దాహార్తి తీరుతుందని పాడి రైతులు అంటున్నారు.

- ● జిల్లాలో పంచాయతీలు: 468
- ● పశువుల తాగునీటి తొట్టెలు మంజూరు: 2,018
- ● కేటాయించిన నిధులు: రూ.7.46 కోట్లు
- ● పనులు జరుగుతున్నవి: 1,257
- ● నిర్మాణాలు పూర్తి చేసినవి: 1,034

వేసవిలోపు పూర్తి చేసేలా చర్యలు

- విజయేంద్రప్రసాద్, డ్వామా పీడీ

గ్రామాల్లో నీటి వసతి ఉన్న ప్రదేశాల్లోనే తొట్టెలు నిర్మిస్తాం. స్థానిక కారణాలతో కొన్ని చోట్ల జాప్యం జరుగుతోంది. ఈఏడు 300 మంజూరు చేశాం. అందులో 157 పూర్తి చేశారు. వేసవిలోపు వివిధ దశల్లో ఉన్న తొట్టెల నిర్మాణాలు పూర్తి చేసి పశువుల దాహార్తి తీర్చేలా సౌకర్యం కల్పిస్తాం.

క్రీడల్లో రాణించినట్లే.. విద్యార్థులను తీర్చిదిద్దండి

పుట్టపర్తి, ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉపాధ్యాయులు క్రీడల్లో ఎలా రాణించారో.. విద్యార్థులను కూడా అదే విధంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన లీప్ క్రికెట్ టోర్నమెంట్‌లో శ్రీసత్యసాయి జిల్లా ఉపాధ్యాయుల జట్టు విజేతగా నిలిచింది. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో అభినందన సభ ఏర్పాటు చేసి జట్టు సభ్యులను కలెక్టర్ శాలువాలతో సన్మానించి పతకాలను అందజేశారు. డీఈఓ క్రిష్ణప్ప మాట్లాడుతూ ఉపాధ్యాయులు విజేతలుగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీవైఈవో జాన్‌రెడ్డప్ప, ధర్మవరం ఎంఈఓ గోపాల్‌నాయక్, ఎస్‌జీటీఎఫ్ జిల్లా సెక్రటరీలు లక్ష్మీనారాయణ, సుహాసిని, సిబ్బంది చంద్రమోహన్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

విజేత జట్టును సన్మానిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఎమ్మెల్యే బాలకృష్ణ రెండు రోజుల పర్యటన

హిందూపురం, లేపాక్షి, న్యూస్‌టుడే: హిందూపురం శాసనసభ్యులు బాలకృష్ణ గురు, శుక్రవారాల్లో నియోజకవర్గంలో పర్యటిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా రూ.15 కోట్లు విలువ చేసే బీటీరోడ్లు, సిమెంట్ రహదారుల ఏర్పాటుకు భూమిపూజ, పులమతి చెరువు వద్ద జలహారతి, ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నూతన పట్టుగూళ్ల మార్కెట్‌కు భూమి పూజ చేస్తారన్నారు.

పదోన్నతుల తర్వాతే బదిలీలు

■ ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా సిద్ధం

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల పదోన్నతులకు విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టం (టిస్)లో ఉపాధ్యాయులు అప్‌లోడ్ చేసిన వివరాల ఆధారంగా సీనియారిటీ జాబితా సిద్ధం చేస్తున్నారు. పాఠశాల విద్య సంచాలకులు ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాపై సర్క్యులర్ జారీ చేశారు. సీనియారిటీ రూపొందించడానికి జిల్లాస్థాయి కమిటీ నియమించారు. ఈ కమిటీ డీఈవో ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఏడీ కన్వీనర్‌గా, శ్రీసత్యసాయి జిల్లా ఏడీ, పర్యవేక్షకులు సభ్యులుగా ఉన్నారు. ఏఎస్‌ఓ, ఏపీఓ సహాయకులుగా వ్యవహరిస్తున్నారు. ఈనెల 25న ప్రాథమిక సీనియారిటీ జాబితా విడుదల చేస్తారు. అభ్యంతరాలు స్వీకరించిన తరువాత 5న రెండోసారి జాబితా వెల్లడిస్తారు. రెండో జాబితాపై కూడా అభ్యంతరాలు స్వీకరించి మార్చి 15న మూడో జాబితా ప్రచురిస్తారు. తుది సీనియారిటీ జాబితా మార్చి 30న వెల్లడిస్తారు. ఆ తరువాత కౌన్సెలింగ్ నిర్వహించి పదోన్నతులు కల్పిస్తారు. ఉమ్మడి అనంత జిల్లా సీనియారిటీ ప్రాతిపదికన పదోన్నతులు కల్పిస్తారు

ఖాళీల గుర్తింపు : 1,001

పదోన్నతుల ద్వారా భర్తీ : 70 శాతం

డీఎస్సీ ద్వారా : 30 శాతం

● గ్రేడ్-2 హెచ్.ఎం పోస్టులు 28, పీఎస్ హెచ్‌ఎం కన్నడ 1, పీఎస్ హెచ్‌ఎం తెలుగు 68, పీఎస్ హెచ్‌ఎం ఉర్దూ 6 పోస్టులు పదోన్నతుల ప్రకారం భర్తీ చేయాలని నిర్ణయించారు. పదోన్నతుల ప్రక్రియ ముగిసిన వెంటనే ఉపాధ్యాయుల బదిలీలు కూడా నిర్వహిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. బదిలీలకు అధికారికంగా ఉత్తర్వులు రావాల్సి ఉంది.

షెడ్యూల్ ఇచ్చారు

- ప్రసాద్‌బాబు, డీఈవో, అనంతపురం

ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా రూపొందించాలని ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు షెడ్యూల్ జారీ చేశారు. జాబితా నిర్ణీత తేదీల్లో విడుదల చేస్తాం. తదుపరి ఆదేశాల ప్రకారం పదోన్నతులు నిర్వహిస్తాం.

ధనాపురం క్రాస్.. దడ దడ!

■ జాతీయ రహదారిలో తరచూ ప్రమాదాలు ■ ఆందోళనలో వాహనదారులు

ప్రమాదకరంగా మారిన ధనాపురం క్రాస్

కొడిగెనహళ్లి (పరిగి), న్యూస్‌టుడే: కొడికొండ నుంచి శిర వరకు వెళ్లే జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. ప్రధానంగా ధనాపురం క్రాస్‌తోపాటు యర్రగుంట, చిన్నపల్లి, నేతులపల్లి క్రాస్‌ల వద్ద దుర్ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. గడిచిన 8 నెలల వ్యవధిలో 10 మంది మృత్యువాత పడగా పలువురు గాయాలపాలు కావడం గమనార్హం.

కొన్ని దుర్ఘటనలు..

★ పరిగి మండల పరిధిలోని ధనాపురం క్రాస్ వద్ద మంగళవారం ఉదయం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆదినారాయణ అక్కడికక్కడే మృతి చెందాగా మరో ఉపాధ్యాయుడు తుమ్మలప్ప తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు.

★ ఇటీవల నేతులపల్లి సమీపంలో బెంగళూరుకు చెందిన వాహనచోదకుడు అదుపు తప్పి మృత్యువాత పడ్డాడు.

★ గత నెలలో చిన్నపల్లి క్రాస్ వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో రొద్దం మండలానికి చెందిన వ్యక్తి మృతి చెందగా భార్య తీవ్రంగా గాయపడింది.

★ ఐదు నెలల క్రితం హిందూపురం మండలం కొటిపి ముత్యాలమ్మ దర్శనాంతరం ఆటోలో స్వగ్రామానికి తరలి వెళుతుండగా పరిగి చెరువు కట్ట కింద వెనుకవైపు నుంచి లారీ ఆటో ఢీకొంది. రొద్దం మండలానికి చెందిన నలుగురు మృత్యువాత పడగా మరో ముగ్గురికి తీవ్రగాయాలు అయ్యాయి.

ఏమి చేయాలంటే..!

కొడికొండ- శిర జాతీయ రహదారి దాటే ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. రహదారికి అటు ఇటు వేగ నియంత్రికలు ఉండాలని స్థానికులు కోరుతున్నారు. ఆయా శాఖల అధికారులు, పోలీసులు సమన్వయంతో పర్యవేక్షణ పెంచి.. ప్రమాదాలకు అడ్డుకట్టపడేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.

తగిన చర్యలు తీసుకుంటాం

- గిడ్డయ్య, డీఈ, ఎన్‌హెచ్‌ఐ

కొడికొండ- శిర జాతీయ రహదారిపై తరుచూ జరుగుతున్న ప్రమాదాలను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటాం, ధనాపురం, చిన్నపల్లి, యర్రగుంట, నేతులపల్లి, హొన్నంపల్లి క్రాస్‌ల వద్ద రహదారిపై రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయిస్తాం. జాతీయ రహదారి దాటే ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు పెడతాం.

మహోన్నతమూర్తికి 7వ వర్ధంతి

జన్మజన్మలకు మరుపురాని మహోన్నతమైన వ్యక్తిత్వంతో మా అందరి హృదయాలలో చెరగని ముద్రవేసి ఆకస్మికంగా మమ్ములను వీడి దైవసన్నిధికి చేరి నేటికి 7 సంవత్సరాలు గడిచినను అనునిత్యం మీ ఆత్మీయతా, అనుబంధాలనే స్మరించుకుంటూ.. మీ

కీ॥శే॥ శ్రీ గుత్తా వెంకటనాయుడు గారు (పులి నాయుడు)
Ex- జడ్పీటీసీ, T.కొత్తపల్లి గ్రామం, యాడికి (మం॥)
మరణం: 19-02-2019

భార్య: కీ॥శే॥ శ్రీమతి గుత్తా శేషమ్మ
కుమారులు - కోడళ్ళు
గుత్తా అమరనాథ్ USA - సుష్మా
Dr. గుత్తా శ్రీనాథ్ M.D - తేజస్విని
GVN Star Infra Services, Anantapur
కూతురు: వేలూరు సరిత
అల్లుడు: వేలూరు సురేంద్ర
మనుమళ్లు: గుత్తా అమరేష్, గుత్తా వెంకట కార్తికేయ
మనుమరాళ్లు: గుత్తా సంయుక్త, వేలూరు అవంతి, వేలూరు ఆద్య
మరియు సమస్త బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, T.కొత్తపల్లి, యాడికి (మం॥), అనంతపురము (జిల్లా)

అంత్యక్రియలు, నిర్యాణం, వర్ధంతి, జయంతి

మీ ఉన్నతికై శ్రమించిన, మీ కుటుంబ సభ్యుల/ఆత్మీయుల అంత్యక్రియలు, నిర్యాణం, వర్ధంతి, జయంతి ప్రకటనలు ఈనాడులో తక్కువ ఖర్చుతో ప్రకటనలు ప్రచురణ కొరకు

పూర్తి వివరములకు: 8008709784

EENADU Classifieds

PERSONAL CLASSIFIEDS

BIRTHDAY GREETINGS

P.THRIAKSH PREMADITHYA

First Model Colony, Hindupur

P.THRIAKSH PREMADITHYA

First Model Colony, Hindupur

BUSINESS SERVICES

BUSINESS OFFER

బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి విడిపించి కొనబడును. గోల్డెన్ ట్రేడింగ్ కం. ✆ 7382114647.

JOBS

Job Vacancy: We Hiring Open Positions Himayat Grand Luxury Hotel in Anantapur Contact: 6300123535. Requirements : 1-2 Years Experience in Hotel Industry Good Communication Skills Excellent Computer Skill.

ఎలక్ట్రీషియన్ & ఎలక్ట్రానిక్స్‌లో ... Office Boys ... సంప్రదించండి: 9440294666.

... ✆ 96404 68899, 96402 58899

... Q: 10 to డిగ్రీ జీతం 9K to 25K. ✆: 9491555724

... ✆: 6302606646.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రత్యేకించి సంస్థ ఎలాంటి బాధ్యత వహించదు. ప్రకటనదారుల విషయంలో పాఠకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచన.

5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

వివరాలకు : 8008709784

నేటి నుంచి కోర్టు ఉద్యోగాలకు రాత పరీక్షలు

అనంతపురం(మూడోరోడ్డు), న్యూస్‌టుడే: కోర్టు ఉద్యోగాల కోసం నేటి నుంచి రాత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ. భీమారావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) పరిధిలోని ఈ ఉద్యోగాలకు రుద్రంపేట సమీపంలోని పీవీకేకే కళాశాలలో ఈనెల 19న పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్లు తీసుకొని గంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఫ్రంటు ఆఫీసు సమన్వయకర్త పరీక్ష కోసం 12.30 గంటల నుంచి రాత పరీక్ష మొదలవుతుందని చెప్పారు. రికార్డు అసిస్టెంట్ రాత పరీక్ష 3.30 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు.

కదిరి ఆలయ సమాచారం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం నేటి (గురువారం) ఉదయం 6 నుంచి 6.45 గంటల వరకు ఉంటుంది. ఖాద్రీశునికి 7 నుంచి 9 గంటల మధ్య అభిషేక, స్వర్ణ కవచ సేవలు. తర్వాత 9 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, తిరిగి సాయంత్రం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు భక్తులకు స్వామివారి సర్వదర్శనం ఉంటుంది. రాత్రి 7.30 గంటలకు స్వామివారికి వెండి రథ ప్రాకారోత్సవం ఉంటుంది.

రక్షణ వాహనం సిద్ధం

అటవీశాఖ రక్షణ వాహనం

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: గ్రామాలు, పొలాల్లోకి వచ్చే వన్యప్రాణులను సురక్షితంగా రక్షించి, తిరిగి అడవిలోకి వదలడంతోపాటు పులులు, చిరుతలు, ఏనుగులు, వంటి పెద్ద జంతువులకు గన్‌తో మత్తు సూది వేసి పట్టుకోవడం, గాయపడిన జంతువులకు చికిత్సలు అందించడం, గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని, వేగవంతమైన సహాయక/రక్షణ వాహనం ప్రధాన ఉద్దేశం. అటవీశాఖ అనంతపురం సర్కిల్ పరిధిలోని అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు జిల్లాలకు ఒక్కో వాహనం చొప్పున కేటాయించారని ఇటీవల జరిగిన సర్కిల్ సమావేశంలో సీసీఎఫ్ యశోదబాయి తెలిపారు. ఈ వాహనం అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ పరిధిలో ఉంటుంది. ఐదుగురితో కూడిన బృందం ఉంటుంది. వాహనంలో పరికరాలు, చికిత్సలకు మందులు వంటివి సిద్ధంగా ఉంటాయి. ఇటీవల అనంతపురం సర్కిల్ పరిధి వాలంటీర్లకు, అటవీ శాఖ అధికారులకు శిక్షణ కూడా ఇచ్చారు.

వాహనంలో అటవీ జంతువుల సంరక్షణకు తుపాకీ, వలలు, బోన్లు, మందులు

బృందాల విధులిలా..

- **వన్యప్రాణుల రక్షణ :** జనవాసాల్లోకి వచ్చిన పులులు, చిరుతలు, ఏనుగులు, పాములు వంటి వాటిని సురక్షితంగా బంధించి అడవిలో వదలడం.
- **ప్రమాదాల నివారణ :** అటవీ ప్రాంతాలు, పంట పొలాల్లో గుంతల్లో పడిపోయిన, గాయపడిన, కంపల్లో చిక్కుకున్న జంతువులను రక్షించి చికిత్స చేయడం.
- **అత్యవసర చర్యలు:** ఘటనా స్థలానికి వేగవంతంగా చేరుకోవడం, పరిస్థితిని అంచనా వేయడం, ఆపరేషన్ చేపట్టడం.
- **మానవ-వన్యప్రాణి సంఘర్షణ నివారణ :** ప్రజలు ఆస్తులు, పంట పొలాలకు నష్టం ప్రాణాలను కాపాడుకునేందుకు అడవి జంతువులను నియంత్రించడం, ఆవాసాల వద్ద భయాందోళనలు తగ్గించడం. పంట, ఇతర నష్టాలు జరిగితే పరిహారం అంచనా వేయడం.
- **అవగాహన :** వన్యప్రాణుల రక్షణ, పర్యావరణ పరిరక్షణ, జంతువుల కనిపిస్తే జాగ్రత్తలపై ప్రజలకు తెలియజెప్పటం.

అశ్వవాహనంపై బుగ్గ రామలింగేశ్వరుడు

ఊరేగుతున్న స్వామి వారు

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలోని పెన్నానది ఒడ్డున ఉన్న బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం యథావిధిగా సాగాయి. స్వామి, రాజరాజేశ్వరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం బుగ్గరామలింగేశ్వరుడిని అశ్వవాహనంపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఫారిన్ లాంగ్వేజెస్ పరీక్ష ఫలితాలు విడుదల

ఫలితాలు విడుదల చేస్తున్న ఎస్కేయూ ఇన్‌ఛార్జి ఉపకులపతి అనిత తదితరులు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు సంయుక్తంగా నిర్వహించిన పోస్టు గ్రాడ్యుయేట్ ఇన్ ఫారిన్ లాంగ్వేజెస్-2025 పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఎస్కేయూలోని పరిపాలన భవనంలో ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య అనిత ఫలితాలు విడుదల చేశారు. ఫ్రెంచ్ భాషలో 23 మంది, జర్మన్‌లో 45, పోర్చుగీసులో 23 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ లోకేష్, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య జీవీ రమణ, పరీక్షల నియంత్రణ అధికారి శ్రీరాములునాయక్, ఆర్డీటీ ప్రిన్సిపల్ గీతాంజలి, పర్యవేక్షకులు గీతాంజలి, లక్ష్మణరావు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు హోంమంత్రి సత్కారం

తపోవనం (అనంత గ్రామీణం): మాజీ సైనికుల సంక్షేమం కోసం విశిష్ట సేవలు అందించిన జిల్లా మాజీ సైనికులకు హోంమంత్రి వంగలపూడి అనిత సన్మానించారు. రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో మాజీ సైనికులను సత్కరించారు. భారత సైన్యంలో పనిచేసి 75 ఏళ్లు నిండిన మాజీ సైనికులను హోంమంత్రి అభినందించారు. జిల్లా మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కెప్టెన్ డి.షేకన్న, ప్రధాన కార్యదర్శి పట్నం ఉమామహేశ్వరరావు, కోశాధికారి తిమ్మారెడ్డి, కెప్టెన్ నంజిరెడ్డి, గంగన్న, వెంకటరంగారెడ్డిలను సత్కరించారు.

జ్ఞాపికలు అందుకున్న మాజీ సైనికులు

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ వెంకటరమణ నాయక్

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆర్ఐవో, పరీక్షల నిర్వహణ కన్వీనర్ వెంకటరమణ నాయక్ ఆదేశించారు. పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులకు శిక్షణ కార్యక్రమం స్థానిక ఒకేషనల్ జూనియర్ కళాశాలలో బుధవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణ ప్రమాణాలు, నిబంధనల ప్రకారం జరగాలన్నారు. కేంద్రాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. ప్రధాన పర్యవేక్షకులు, శాఖాధికారులతో సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రతి కేంద్రం వద్ద కళాశాల పేరు, పరీక్ష కేంద్రం నంబరు కనిపించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. నో సెల్‌ఫోన్ జోన్ అని విద్యార్థులకు అర్థమయ్యేలా బోర్డు ఉండాలని చెప్పారు. ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి రంజిత్‌బాషా వర్చువల్ విధానంలో మాట్లాడారు. కార్యక్రమంలో డీవీఈవో గురవయ్యశెట్టి, కమిటీ సభ్యులు నాగరత్న, కృష్ణమూర్తి, వెంకటస్వామి పాల్గొన్నారు.

పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో తిరుపతిలో ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను డీఎస్‌డీఓ ఎస్ఎం మంజుల ప్రకటించారు. ఈ నెల 17న డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో చూపిన ప్రతిభ ఆధారంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జిల్లాస్థాయి పోటీల్లో మొత్తం 124 మంది క్రీడాకారులు పాల్గొనగా అందులో 12 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారి వివరాలు ఇలా మొత్తం మూడు విభాగాల్లో క్రీడాకారులను ఎంపిక చేపట్టారు. చెస్ పోటీలకు బాలికల విభాగంలో జి.షారన్ బ్లెస్సీ, ఎ.యశస్విని, ఎం.దీక్షిత, వై.లాలిత్య, కె.భువకృతిలు, బాలుర విభాగంలో డి.రిషిక్, ఎం.ఫణికుమార్ సహృద్, ఎస్.శామ్యూల్ స్టీఫెన్ నోబుల్, కె.వెంకట శ్రీచేతనరెడ్డి, ఎస్.వెంకటకృష్ణ సుధీంద్ర, మొయిన్ అహ్మద్, కె.భరత్ భూషణ్‌లు ఎంపికయ్యారు.

ఉపాధి కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో అప్లికేషన్ డెవలపర్(వెబ్, మొబైల్), కస్టమర్ ఎక్స్‌క్యూటివ్(వాయిస్, నాన్ వాయిస్) కోర్సులను ఉచితంగా నేర్పిస్తున్నట్లు ప్రిన్సిపల్ సురేష్‌బాబు తెలిపారు. అర్హులైన వారు ఫిబ్రవరి 27లోపు దరఖాస్తు చేసుకున్న వారికి మార్చి 2నుంచి కోర్సులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కళాశాల్లో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన, ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9182288465 చరవాణి నంబరును సంప్రదించాలన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థుల డిబార్

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఎస్కేయూ పరిధిలో డిగ్రీ ప్రథమ సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. నగరంలోని శ్రీనివాస్ డిగ్రీ కళాశాలలో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు విద్యార్థులను డిబార్ చేసినట్లు పరీక్షల విభాగం సంచాలకులు జీవీ రమణ తెలిపారు.

సెంట్రల్ వర్సిటీలో వక్తృత్వ పోటీలు

విజేతలకు బహుమతులు ఇస్తున్న ఆచార్య గురజాడ

బుక్కరాయసముద్రం: గొప్ప వ్యక్తులను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని వర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు గరికపాటి గురజాడ తెలిపారు. బుధవారం ప్రముఖ రచయిత పద్మశ్రీ ఆశావాది ప్రకాశ్‌రావు వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన శ్రేయ, లహరి, అలేఖ్యకు బహుమతులు అందించారు. ఆచార్యులు రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

'రంజాన్'లో గంట సడలింపు ఇవ్వండి

కలెక్టర్ ఆనంద్‌ను సత్కరిస్తున్న ముస్లిం ఉద్యోగులు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 'రంజాన్' మాసంలో విధి నిర్వహణలో ఉండే ప్రభుత్వ, పొరుగు, ఒప్పంద ఉద్యోగులకు నమాజ్ చేసుకోవడానికి ఒక గంట సడలింపు ఇవ్వాలని ముస్లిం మైనార్టీ ఉద్యోగుల సంఘం (ఆల్ మేవా) నాయకులు కోరారు. బుధవారం ఆ సంఘం అధ్యక్షుడు షేక్షావలి, రాష్ట్ర సహాధ్యక్షుడు ఫక్రుద్దీన్, ప్రచార కార్యదర్శి అక్రమ్, ఆర్థిక కార్యదర్శి దౌలా, సలహాదారుడు మహబూబ్‌బాషా, జిలాన్, దూద్‌పీర్, తదితరులు కలెక్టర్ ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్ష, నమాజు ప్రార్థన చేయడానికి గంట సడలింపు ఇచ్చేలా అన్ని శాఖల అధికారులకు తగిన ఉత్తర్వు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తప్పక అవకాశం కల్పిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టర్‌ను వారు శాలువాతో సత్కరించారు.

జడ్పీ సీఈఓలుగా పలువురికి పదోన్నతులు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: పంచాయతీరాజ్‌లో పదోన్నతుల పరంపర కొనసాగుతోంది. తాజాగా జడ్పీ సీఈఓలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో డీపీఓ నాగరాజునాయుడు, కళ్యాణదుర్గం, గుంతకల్లు డీడీఓలు నాగేశ్వరరావు, విజయలక్ష్మి, శ్రీ సత్యసాయి జిల్లా డీడీఓలు శ్రీలక్ష్మి, సుధాకర్‌రెడ్డి, డ్వామాలో పనిచేస్తున్న సుధాకర్‌రెడ్డిలకు పదోన్నతులు పొందారు. పదోన్నతులతో నాగరాజునాయుడు, జడ్పీ సీఈఓ శివశంకర్‌లకు స్థానచలనం కలగనుంది. అలాగే జడ్పీ సీఈఓ పోస్టుకు విజయలక్ష్మి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. త్వరలో వీరికి జిల్లాలు కేటాయించనున్నారు. బుధవారం రాత్రి ప్రభుత్వం పదోన్నతుల ఉత్తర్వులు జారీ చేసింది. జడ్పీ సీఈఓలు, డ్వామా పీడీలు, డీఆర్‌డీఏ పీడీలుగా వీరు బాధ్యతలు స్వీకరిస్తారు.

సీమ ప్రయోజనాలు కాపాడేందుకు ఉద్యమం: వైకాపా

అనంత నగరపాలక: రాయలసీమ ఎత్తిపోతల పథకం పూర్తి చేయడం, హంద్రీనీవా సామర్థ్యం పెంచితేనే రాయలసీమకు ప్రయోజనాలు ఒనగూరుతాయని వైకాపా జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వైకాపా జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పలు నియోజకవర్గాల సమన్వయకర్తలతో కలిసి ఆయన మాట్లాడారు. రాయలసీమ ప్రయోజనాలు కాపాడేందుకు ఉద్యమానికి శ్రీకారం చుట్టబోతున్నట్లు ప్రకటించారు. రాయలసీమలోని ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెచ్చి సీమ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

జంతుజాలాన్ని కాపాడుకుందాం

సావనీర్లను ఆవిష్కరిస్తున్న ఆచార్యులు తదితరులు

గుంతకల్లు, న్యూస్‌టుడే : మానవుని వికృత చేష్టలతో ఎన్నో జంతువులు, జీవరాసులు కనుమరుగయ్యాయని ఎస్కే యూనివర్సిటీ వృక్షశాస్త్ర ప్రొఫెసర్ రవిప్రకాశ్‌రావ్ అన్నారు. స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం రెండు రోజులపాటు జరిగే జీవవైవిధ్య పరిరక్షణ సదస్సు ప్రారంభమయింది. సదస్సులో అతనితోపాటు ఉన్నత విద్యా ప్రాంతీయ సంచాలకుడు జ్ఞానేశ్వర్, ఎస్వీ యూనివర్సిటీ జంతుశాస్త్రం ప్రొఫెసర్ రాజశేఖర్, ధార్వాడ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కోట్రేశ్, కళాశాల ప్రధానాచార్యుడు లక్ష్మయ్య మాట్లాడారు. జీవవైవిధ్యం గురించి పెద్దఎత్తున చర్చ జరగాలన్నారు. ప్రకృతిలోని జీవరాసులు అంతరించిపోతే తరువాత మానవుడి వంతు వస్తుందని హెచ్చరించారు. అనంతరం సదస్సుకు చెందిన సావనీర్లను ఆవిష్కరించారు. అధ్యాపకులు రవిశంకర్ శర్మ, ఎల్.ఎన్. ప్రసాద్, భీమలింగయ్య, జమీలాబీబీ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అపహరణ.. అత్యాచారం

వైకాపా కార్యకర్తపై పోక్సో కేసు నమోదు

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం గ్రామీణ మండలానికి చెందిన వైకాపా కార్యకర్త గోవర్ధన్‌పై పోక్సో కేసు నమోదైంది. గ్రామీణ సీఐ ఆంజనేయులు తెలిపిన మేరకు మూడు రోజుల క్రితం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(14)ను గోవర్ధన్ అపహరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. తన కుమార్తె కనిపించకపోవటంతో ఆందోళనకు గురైన తల్లి ఫిర్యాదు చేసిందన్నారు. నిందితుడి కోసం గాలించగా గ్రామ సమీపంలో ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నాం.. విచారించి పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

వేళకు బస్సులు నడపాలని విద్యార్థుల ధర్నా

కణేకల్లు, న్యూస్‌టుడే: పాఠశాల సమయానికి బస్సు నడపకుంటే రాయదుర్గం ఆర్టీసీ డిపోను ముట్టడించి ఆందోళన ఉద్ధృతం చేస్తామని నాగేపల్లి విద్యార్థులు, తల్లిదండ్రులు హెచ్చరించారు. ఆరు నెలలుగా విన్నవిస్తున్నా.. సమయానుకూలంగా బస్సు సర్వీసులు నడపని డిపో మేనేజరు తీరును నిరసిస్తూ బుధవారం విద్యార్థులతోపాటు పలువురు రోడ్డుపై బైఠాయించారు. డిపో అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థులు 12 కి.మీ. కాలినడకన రాకపోకలు సాగించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

ధర్మవరం న్యూస్‌టుడే: పునరావృత నేరాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారిని గుర్తించి బైండోవర్ చేయించాలని ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్ సీఐ, ఎస్ఐలను ఆదేశించారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో ధర్మవరం పోలీసు సబ్ డివిజన్‌లోని సీఐలు, ఎస్ఐలతో సమావేశం నిర్వహించారు. నేరస్థుల్లో మార్పు రాకపోతే వారిపై పీడీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచి, ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

సీఐలు, ఎస్ఐలతో మాట్లాడుతున్న డీఎస్పీ హేమంత్ కుమార్

బైపాస్ రోడ్డు.. పట్టించుకునే దిక్కులేదు!

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలోకి భారీ వాహనాలు వస్తే ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని గతంలో పెన్నానది మీదుగా అవుటర్ బైపాస్ రోడ్డు ఏర్పాటు చేశారు. అప్పట్లో సుమారు రూ.3కోట్లతో మూడు కి.మీ.ల మేర దారి వేశారు. గత వైకాపా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడంతో గుంతలు పడ్డాయి. ఈకారణంగా భారీ వాహనాలు పట్టణం మీదుగా వెళ్తున్నాయి. బైపాస్ మార్గం గుండా బుగ్గ, కడప, నంద్యాల వైపు నుంచి వచ్చే సిమెంట్, నాపరాళ్లు, గ్రానైట్ లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. అనంతపురం వైపు నుంచి కూడా నిత్యం వందల వాహనాలు వెళ్తుంటాయి. అయితే నంద్యాల రోడ్డు నుంచి బైపాస్ వైపు తిరిగే మలుపులో భారీగా గుంతలు పడ్డాయి. పలుమార్లు ద్విచక్రవాహనదారులు ప్రమాదానికి గురై గాయాలపాలయ్యారు. అధికారులు స్పందించి దారిని బాగు చేయాల్సిన అవసరం ఉంది.

ప్రమాదకరంగా బైపాస్ రోడ్డు మలుపు

ఇబ్బంది లేకుండా చూస్తాం

పెన్నానది అవుటర్ బైపాస్‌లో ఉన్న గుంతలను పూడుస్తున్నాం. ప్రస్తుతం వాహనదారులకు ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకుంటాం. రహదారి సమస్యపై ఇదివరకే ఉన్నతాధికారులకు కూడా తెలియజేశాం. వారి ఆదేశాల మేరకు రోడ్డు వేసి శాశ్వత పరిష్కారం చూపుతాం. **-తేజ, మున్సిపల్ ఏఈ తాడిపత్రి**

హత్యకేసు నిందితుల అరెస్టు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలోని కోవూరునగర్‌లో సోమవారం రాత్రి జరిగిన గౌసియా బేగం హత్యకేసును నాలుగో పట్టణ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నిందితులైన ఫక్రున్నీసా బేగం, మహమ్మద్ రఫీ, ఇంతియాజ్, మహమ్మద్ గౌస్, షేక్షావలి, రెహానాలను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు మల్కి జాఫర్ పరారీలో ఉండగా అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ మీడియాకు వెల్లడించారు. ప్రధాన నిందితుడు మల్కిజాఫర్ తన భార్యతో హత్యకు గురైన గౌసియా బేగం కుమారుడు ఇమ్రాన్‌ఖాన్ సన్నిహితంగా ఉన్నాడనే అనుమానంతో కుట్ర పన్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 16న రాత్రి తన బంధువులను బాధితురాలి ఇంటికి పంపించాడు. నిందితులు ఇమ్రాన్‌ను కట్టెలతో కొట్టి హత్య చేయాలనే ఉద్దేశంతో దాడి చేశారు. అదే సమయంలో అడ్డుగా వచ్చిన గౌసియా బేగంను కూడా కట్టెలతో కొట్టి, కాలితో తన్నడంతో ఆమె స్పృహ కోల్పోయింది. వెంటనే ఆమెను నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనలో మృతురాలి కోడలు కూడా గాయపడ్డారు. వారిచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన నాలుగో పట్టణ పోలీసులు బుధవారం స్థానిక బళ్లారి బైపాస్ రోడ్డులోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు.

మైనింగ్ పనులతో.. రైతులకు నష్టాలు

గాండ్లపెంట, న్యూస్‌టుడే : కుమ్మరవాండ్లపల్లి సమీపంలో 1005 సర్వేనంబర్‌లో మెస్సర్స్, వరసిద్ధి వినాయక మినరల్స్‌కు అనుమతించడంపై జిల్లా పర్యావరణశాఖ ఈఈ శశికళ, ఆర్డీవో వీవీఎస్ శర్మ, తహసీల్దార్ బాబురావు బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. 8.69 ఎకరాల్లో ఒకటి, 10 ఎకరాల్లో మరో ప్రాజెక్టు పనులకు సంబంధించి రైతులు, గ్రామస్థులను అభిప్రాయాలను అడగ్గా.. మైనింగ్ పనులతో చిన్న సన్నకారు రైతులకు ఇబ్బందులు తప్పవని, పంటలు నష్టపోతామని పలువురు రైతులు తెలిపారు. పర్యావరణానికి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్జీవోలు సూచించారు. గ్రామానికి ఆర్వో ప్లాంట్, వైద్య సదుపాయాలతో పాటు యువకులకు ఉద్యోగ, ఉపాధి కల్పించాలని కోరారు. అనంతరం ప్రజల నుంచి సంతకాలు సేకరించిన నివేదికలను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఆర్డీవో తెలిపారు. ప్రజాభిప్రాయం మేరకే అనుమతులు మంజూరు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

అధికారులకు తమ సమస్యను తెలుపుతున్న రైతు

హుండీలు ఎత్తుకెళ్లి.. నగదు దోచుకెళ్లి

పగలగొట్టిన హుండీని పరిశీలిస్తున్న డీఎస్పీ నరసింగప్ప తదితరులు

రొద్దం: మండలంలోని కలిపి పంచాయతీ శేషారపు గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి ఆలయాల్లో దొంగలు హల్‌చల్ చేశారు. గ్రామంలో పక్కపక్కనే ఉన్న ఆదినారాయణస్వామి, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాల తలుపులు పగలగొట్టి, హుండీలను సమీప చెరువు వద్దకు తీసుకెళ్లి... ధ్వంసం చేసి బీభత్సం సృష్టించారు. వాటిలో దాదాపు రూ.50 వేల వరకు నగదును ఎత్తుకెళ్లారని ఆలయ కమిటీ సభ్యులు వాపోయారు. బుధవారం సమాచారం అందుకున్న పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప, సీఐ రాఘవన్ గ్రామానికి చేరుకుని ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్థులతో ఆరా తీశారు. చోరీకి గురైన ఆలయాలను పరిశీలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు రొద్దం ఎస్సై వీరాంజనేయులు తెలిపారు.

గుట్కా అక్రమ రవాణాపై అపరాధ రుసుం వసూలు

అరవిందనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: గుట్కా పొట్లాలను ఈ-వేబిల్లు లేకుండా అక్రమంగా రవాణా, విక్రయిస్తున్న శ్రీ ఈశ్వర్ ఎంటర్‌ప్రైజెస్ (స్థానిక గుత్తిరోడ్డు) డీలరు నుంచి రూ.4.21 లక్షల అపరాధ రుసుము వసూలు చేసినట్లు వాణిజ్య పన్నుల శాఖ గుంతకల్లు సర్కిల్ డీసీటీఓ సంజీవరెడ్డి తెలిపారు. ఈ నెల 5న గుత్తిరోడ్డులో వాహన తనిఖీ చేస్తున్న సమయంలో వేబిల్లు లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్న గుట్కా సంచులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దీని విలువ రూ.5.27 లక్షలు కాగా అపరాధ రుసుము రూ.4.21 లక్షలు డీలరు నుంచి వసూలు చేశారు.

హిందూపురం

• హిందూపురం • పెనుకొండ • మడకశిర

శివపార్వతుల పల్లకీసేవ

పల్లకీలో శివుడు, పార్వతి, దుర్గాదేవి

లేపాక్షి, న్యూస్‌టుడే: లేపాక్షిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గోరోజు మంగళవారం రాత్రి శివ, పార్వతి, దుర్గాదేవి అమ్మవార్లను పూల పల్లకీలో ఊరేగించారు. ఉదయం నుంచి ఆలయంలో అభిషేకార్చనలు, చండీహోమం నిర్వహించారు. రాత్రి 12 గంటలకు ప్రారంభమైన పల్లకీసేవ తెల్లవారుజాము 5.30 గంటల వరకు సాగింది. కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన కళాకారులు నిర్వహించిన కీలుగుర్రాలాట ఆకట్టుకుంది.

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 91548 46650
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య: చౌళూరు పంచాయతీలోని హస్నాబాద్‌లో డ్రైనేజీలు లేపోవడంతో మురుగు ఇళ్ల ముందు చేరి అపరిశుభ్రంగా మారింది. **- సుహానా, స్థానికురాలు**

సమాధానం: పంచాయతీ సిబ్బందిని పంపించి నిల్వ ఉన్న మురుగును తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- శివకుమార్, ఉప తహసీల్దార్**

- న్యూస్‌టుడే, హిందూపురం గ్రామీణం

సమస్య: కేతేపళ్యం ఊరి మధ్యన కంపచెట్లు ఏపుగా పెరిగాయి. **- నరసప్ప, స్థానికుడు**

సమాధానం: తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. **- అమరేశ్, పంచాయతీ కార్యదర్శి, ముతుకూరు**

సమస్య: బీడీపల్లి ఇందిరమ్మకాలనీలో వీధిదీపాలు లేక అంధకారం నెలకొంది. **- రాజప్ప, స్థానికుడు**

సమాధానం: వెంటనే ఏర్పాటు చేస్తాం.

- రంగస్వామి, సర్పంచి, తాళికెర

– న్యూస్‌టుడే, గుడిబండ

రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు ఎంపిక

హిందూపురం, న్యూస్‌టుడే: ధర్మవరంలో మంగళవారం శాప్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో హిందూపురానికి చెందిన స్పర్టన్ చెస్ అకాడమీకి చెందిన ఆరుగురు క్రీడాకారులు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ అరిపుల్లా తెలిపారు. వివిధ విభాగాల్లో రుషిత, నిఖిలేంద్ర, కె.భవ్య, మహాన్‌పెద్దన్న, వేణు మొదటి స్థానంలో, మిథున్‌పెద్దన్న ద్వితీయస్థానంలో ప్రతిభ కనబరిచారన్నారు. వీరు ఈ నెల 21, 22 తేదీల్లో తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

పంచాయతీల్లో నిధులున్నా... నిరుపయోగం

బూదిలివాండ్లపల్లిలో నిధులులేక మరమ్మతు చేయకుండా వదిలేసిన నీటిపథకం బోరు

గోరంట్ల, న్యూస్‌టుడే: దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వని చందంగా మారింది పంచాయతీల పరిస్థితి. ప్రభుత్వం పంచాయతీలకు నిధులు విడుదల చేసి నెలలు గడుస్తున్నా, అధికారులు జాప్యం చేస్తుండటంతో గోరంట్ల మండలంలోని అన్ని పంచాయతీల్లో అభివృద్ధి ఎక్కడికక్కడ ఆగిపోయింది. కనీసం వీధిదీపాలు, మురుగుకాలువలు, తాగునీటి పథకాల మోటార్లను మరమ్మతులు చేయించలేని పరిస్థితి కొనసాగుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్పంచులు నిస్సహాయ స్థితిలో చేతులెత్తేస్తున్నారు. ఒక్కో పంచాయతీ ఖాతాలో రూ. లక్షల్లో నిధులు మూలుగుతున్నాయి. సుమారు అయిదారు నెలలకు పైగా పైసా కూడా విడుదల చేయకపోవడంతో సొంత నిధులతో పనులు చేయడానికి పదవీకాలం పూర్తి కానున్న నేపథ్యంలో సర్పంచులు అయిష్టత వ్యక్తం చేస్తున్నారు. చేసిన పనులకు అధికారులు బిల్లులు చేయలేదని ఇటీవల గోరంట్ల ఎంపీడీవో కార్యాలయం ఎదుట సర్పంచులు ధర్నా చేశారు.

ఇదీ పరిస్థితి

పంచాయతీలు	: 20
చివరి విడతలో విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులు	: రూ.80లక్షలు

40 శాతం ఇచ్చాం

పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం కింద మంజూరైన నిధుల్లో 40శాతం ఇచ్చాం. ప్రస్తుతం తాగునీరు, పారిశుద్ధ్యం ప్రాతిపదికన నిధులు వెచ్చించాలని కమిషనర్ నుంచి ఆదేశాలు వచ్చాయి. గోరంట్ల మండల డిప్యూటీ ఎంపీడీవో లేకపోవడం కూడా సమస్యకు కారణం. మరోవైపు సర్పంచుల నుంచి జమకావాల్సిన రికవరీలు పరిశీలించాల్సి ఉంది. **- కమలాబాయి, ఎంపీడీవో, గోరంట్ల**

సమస్యలు ఎక్కడంటే..

● మలసముద్రం పంచాయతీ పరిధిలో బూదిలి వాండ్లపల్లిలో బోరు మోటారు కాలిపోయింది. నెల రోజులు గడుస్తున్నా మరమ్మతు చేయించడానికి నిధులు విడుదల అవుతాయోలేదోనని వదిలేశారు. ఏకంగా సర్పంచి సువర్ణ, గ్రామస్థులు వచ్చి కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ● కమ్మవారిపల్లి పంచాయతీ ఎముకలగుట్టపల్లిలో మురుగుకాలువ నిర్మించాల్సి ఉంది. బిల్లు ఇస్తారో లేదో అని ఆపేసినట్లు సర్పంచి మణి ఆవేదన వ్యక్తం చేశారు. ● బూదిలి పంచాయతీలో నిధుల కొరతతో ఏకంగా తనే మురుగుకాలువల్లో దిగి మరమ్మతులు చేసినట్లు సర్పంచి రామాంజనేయులు వివరించారు. ● పాలసముద్రం పంచాయతీ ఖాతాలో రూ.18లక్షల వరకు నిధులు ఉన్నాయని, ఒకపైసా కూడా విడుదల చేయకపోవడంతో వీధిదీపాలు, మోటార్లు కాలిపోయినా చేసేదిలేక వదిలేసినట్లు సర్పంచి గంగప్ప ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా సిడిమాను ఉత్సవం

సిడిమానుపై ఎక్కి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

అమరాపురం: మండలంలోని హేమావతి సిద్ధేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సిడిమాను ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయం ముందు భాగంలో ఏర్పాటు చేసిన సిడిమానుకు ఉత్సవకమిటీ అధ్యక్షులు కరేగౌడ్, ఆలయ అధికారులు, గ్రామపెద్దలు పూజలు చేశారు. పూర్వం నుంచి వస్తున్న ఆచరణలో భాగంగా సిడిమానుపై ప్రథమంగా దళితులను కూర్చోబెట్టి ప్రదక్షిణ చేశారు. అనంతరం చిన్న పిల్లలకు రోగాలు రాకుండా వారిని సిడిమానుపై కూర్చోబెట్టి మూడు ప్రదక్షిణలు చేయించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ రాజ్‌కుమార్, ఎస్సై వలీబాషా, ఏఎస్సై రామాంజనేయులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యుత్తు సమస్యలపై మంత్రికి వినతి

విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు సమస్యలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు

మడకశిర: మడకశిర నియోజకవర్గంలో నెలకొన్న లో వోల్టేజీ విద్యుత్తు సమస్యలను అధిగమించేందుకు 20 విద్యుత్తు ఉపకేంద్రాలు మంజూరు చేయాలని విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కోరినట్లు తెదేపా జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు తెలిపారు. బుధవారం ఉదయం రాష్ట్ర సచివాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ ప్రాంతంలోని 1200 విద్యుత్తు నియంత్రికలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్తు ఉపకేంద్రాల నిర్మాణానికి త్వరితగతిన ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తాయని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

వసతిగృహంలో చేరి ఉత్తమ ఫలితాలు సాధించండి

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో గంగప్ప

హిందూపురం గ్రామీణం: పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న వందరోజుల కార్యక్రమంలో వెనుకబడి డీ గ్రేడ్‌లో ఉన్న వారు లేపాక్షి నుంచి కంచిసముద్రం వెళ్లే రోడ్డులో ఉన్న బీసీ బాలుర వసతి గృహంలో చేరాలని మండల విద్యాశాఖాధికారి ఏహెచ్ గంగప్ప వెల్లడించారు. ముద్దిరెడ్డిపల్లిలోని దండురోడ్డులో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సుధామణి అధ్యక్షతన బుధవారం పది విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరీక్షలకు ప్రణాళికతో చదవడం, డీ గ్రేడ్ విద్యార్థులు ఉత్తీర్ణులు కావడం, ఉత్తమ ఫలితాలు ఎలా సాధించాలనేది అనుభవమున్న ఉపాధ్యాయులు ప్రత్యేకంగా తరగతుల ద్వారా బోధిస్తారన్నారు. కష్టపడి చదివితే వందశాతం ఫలితాలు సాధించే అవకాశముంటుందని ఉపాధ్యాయులు అన్నారు.

వైద్య సేవలు మెరుగుపరచండి

గోరంట్ల: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు సరైన వైద్య సేవలందడం లేదని, చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో సీఎస్‌డీటీ శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. పేదలు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి చికిత్సలు చేయించుకోలేని పరిస్థితుల్లో ఉన్నారని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ట్యాంకు పక్కనే చెత్త దిబ్బలు

పరిగిలోని పైడేటి సమీపంలో ఉన్న జామియా మసీదు వద్ద నీటి ట్యాంకు పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీ పక్కన చెత్త పేరుకుపోయింది. దీంతో అక్కడ తీవ్ర అపరిశుభ్రత నెలకొంది. చెత్తను పూర్తిగా తొలగించకుండా పారిశుద్ధ్య కార్మికులు తరుచూ నిప్పుపెడుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి అరుణ దృష్టికి తీసుకెళ్లగా చెత్తను తొలగించి పారిశుద్ధ్యపనులు చేయిస్తామని ఆమె తెలిపారు. – న్యూస్‌టుడే, పరిగి

రహదారిపై స్తంభం.. ప్రమాదకరం

పట్టణంలోని హిందూపురం నుంచి కర్ణాటక రాష్ట్రం శిరాకి వెళ్లే జాతీయ రహదారి పైనే విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా ఉంది. నిత్యం ఈ రోడ్డుపై వందలాది వాహనాలు వెళుతుంటాయి. ఈ స్తంభం నల్లగా ఉండటంతో రాత్రి వేళల్లో పూర్తిగా కనిపించదు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. గతంలో ఓ ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బొలెరో వాహనం కూడా ఢీకొంది. సంబంధిత అధికారులు వెంటనే ఈ స్తంభాన్ని తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మడకశిర

ఎంత చెప్పినా తీరు మార్చుకోరా?

చిలమత్తూరు బీసీకాలనీ విద్యుత్తు కార్యాలయం సమీపంలో కొంత మంది చెత్త తీసుకొచ్చి ఓచోట వేస్తున్నారు. గతంలో 'ఈనాడు' పత్రికలో పలు మార్లు దీనిపై వార్తలు ప్రచురించారు. అప్పుడు అధికారులు స్పందించి పంచాయతీ సిబ్బందిని పంపించి శుభ్రం చేయించారు. అయినా కొందరు తీరు మార్చుకోకుండా మళ్లీ అక్కడే వేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి సావిత్రిని వివరణ కోరగా శుభ్రం చేయించి, అవగాహన కల్పిస్తామన్నారు. – న్యూస్‌టుడే, చిలమత్తూరు

ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ

మోటువారిపల్లిలో భూమిపూజ చేస్తున్న కూటమి నాయకులు

పెనుకొండ, న్యూస్‌టుడే: మండలంలోని మునిమడుగు గ్రామపంచాయతీ పరిధిలోని మోటువారిపల్లి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కూటమి నాయకులు రూ.30లక్షలతో 40వేల లీటర్ల సామర్థ్యంతో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం తెదేపా సభ్యత్వం కలిగిన ప్రతి ఒక్కరూ బూత్ వారీగా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ గోడపత్రికలను ప్రదర్శించారు. కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ ఈశ్వర్‌ప్రసాద్, పట్టణ కన్వీనర్ శ్రీరాములు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, సింగిల్‌విండో అధ్యక్షుడు పోతిరెడ్డి, కూటమిశ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైలు కిందపడి వృద్ధుడి ఆత్మహత్య

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం గ్రామీణ మండలం కొట్నూరు రైల్వే వంతెన సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి(68) బుధవారం పుట్టపర్తికి వెళ్లే డెమో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకొన్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపారు. మృతుడికి సంబంధించి ఎలాంటి ఆధారాలు ఘటనా స్థలంలో లభించలేదని తెలిపారు. ఎవరికైనా తెలిస్తే తమకు తెలియజేయాలని అన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

గంధపు చెక్కలు స్వాధీనం

సెంట్ ఫ్యాక్టరీలో సోదాలకు వచ్చిన అధికారులు

రొళ్ల, న్యూస్‌టుడే: మండలంలోని రొళ్ల చెరువు వెనకాలు ఉన్న సెంట్ ఫ్యాక్టరీలో ఫారెస్ట్ అధికారులు సోదాలు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన 173 కేజీల గంధపు చెక్కలను సీజ్ చేసినట్లు అటవీశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కిరణ్‌కుమార్, లోకేశ్‌నాయక్‌లు ఇటీవల కర్ణాటక ప్రాంతం బళ్లారి జిల్లా సండూరు అటవీ ప్రాంతంలో దాదాపు రూ.2.50 లక్షలు విలువ చేసే 105 కిలోల గంధపు చెక్కలను చోరీ చేసి ఇక్కడ విక్రయించినట్లు గుర్తించారు. వారిని దావణగెరె టోల్‌ప్లాజా వద్ద అదుపులోకి తీసుకుని విచారించారు. సండూరు నార్త్ అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ మంజునాథ్ సిబ్బందితో కలిసి పెనుకొండ రేంజ్ ఆఫీసర్, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎస్సై గౌతమి ఆధ్వర్యంలో బుధవారం సోదాలు నిర్వహించారు. ఫ్యాక్టరీలో 173 కిలోల గంధపు చెక్కలను సీజ్ చేశారు.

ఆర్టీసీ డిపోకు రూ.4.58 లక్షల ఆదాయం

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రసిద్ధిగాంచిన హేమావతి హెంజేరు సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం జరిగిన అగ్ని గుండ మహోత్సవానికి భక్తుల కోసం మడకశిర ఆర్టీసీ డిపో నుంచి 18 ప్రత్యేక బస్సులను నడిపినట్లు డిపో మేనేజరు రంగభాస్యం తెలిపారు. బస్సులు 5140 కిలోమీటర్లు తిరిగాయన్నారు. దీంతో రూ.4.58 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

రొద్దం, న్యూస్‌టుడే: విశిష్ట గుర్తింపు సంఖ్య లేని అన్నదాతలకు రైతు సేవా కేంద్రల్లో రిజిస్ట్రీ పోర్టల్ ద్వారా పొందాలని వ్యవసాయాధికారి రాజేశ్ వెల్లడించారు. ఈనెల ఆఖరిలోగా ఏపీ ఎఫ్ఆర్ రిజిస్ట్రీ పోర్టల్ యాప్ ద్వారా ఐడీను పొందాలని ఆయన తెలిపారు. విశిష్ట గుర్తింపు సంఖ్య లేని వారికి రాబోయే రోజుల్లో ప్రభుత్వం అందించే రాయితీ పథకాల్లో భాగంగా వ్యవసాయ పరికరాలు, యూరియా తీసుకోవడానికి ఇబ్బందులు తప్పవన్నారు.

వెబ్, మొబైల్ అప్లికేషన్ కోర్సులకు ఉచిత శిక్షణ

పెనుకొండ, న్యూస్‌టుడే: పదోతరగతి ఆపై చదివిన యువతీ యువకులకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వెబ్, మొబైల్ అప్లికేషన్ డెవలపర్ కోర్సు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పీఎస్‌జీడీ కళాశాల ప్రిన్సిపల్ జయప్ప, ఏపీఎస్ఎస్‌డీసీ అధికారి బి.హరికృష్ణ బుధవారం వెల్లడించారు. అర్హత కల్గిన వారు ఆధార్ అనుసంధానమైన ఫోన్ నంబరు, ఆధార్ కార్డుతో ఈనెల 23వ తేదీ లోపు నమోదు చేసుకోవాలన్నారు. నాలుగు నెలల్లో కోర్సు పూర్తయ్యాక పొందే సర్టిఫికెట్ ద్వారా ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని, సొంత వ్యాపారాలు చేసుకోవాడానికి బ్యాంకు రుణసౌకర్యం కల్పిస్తామని వివరించారు.

'చేనేత గర్జనకు తరలిరండి'

సోమందేపల్లి, న్యూస్‌టుడే: సంక్షోభంలో కూరుకుపోతున్న చేనేత పరిశ్రమను, నేతన్నల హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును సాధించుకోవాలనే లక్ష్యంతో ఈనెల 22న తలపెట్టిన చలో మంగళగిరి రాష్ట్ర చేనేత గర్జనను విజయవంతం చేయాలని కార్మిక సంఘం జిల్లా సభ్యుడు నారాయణస్వామి తెలిపారు. పెద్దఎత్తున చేనేతలు, మరమగ్గాల కార్మికులు తరలిరావాలన్నారు. బుధవారం ఆయన సోమందేపల్లిలో కార్మికుల ఇంటింటా తిరిగి కరపత్రాలను అందజేశారు. పార్టీలకు అతీతంగా కార్మికులు, మహిళలు కలిసికట్టుగా ముందుకువచ్చి పోరాడితేనే చేనేత పరిశ్రమను కాపాడుకోవచ్చని ఆయన పిలుపునిచ్చారు.

'వ్యవసాయ పరికరాలు కొంటే కఠినచర్యలు'

సోమందేపల్లి: రైతుల వ్యవసాయ బోరుబావులకు సంబంధించిన కేబుల్ వైర్లు, స్టార్టర్ పెట్టెలను ఎవరూ కొనుగోలు చేయరాదని ఎస్సై రమేశ్‌బాబు బుధవారం గుజిరీ వ్యాపారులను హెచ్చరించారు. మండలంలోని గుడిపల్లిలో 15 మందికి పైగా రైతుల బోరుబావుల మోటార్లకు అమర్చిన కేబుల్ వైర్లను దుండగులు చోరీ చేశారు. ఈ విషయంపై బుధవారం 'ఈనాడు'లో కథనం ప్రచురితం కావడంతో ఎస్సై తీవ్రంగా స్పందించి, సోమందేపల్లిలోని గుజిరీ వ్యాపారులను స్టేషన్‌కు రప్పించి అవగాహన కలిగించారు. చిల్లర దొంగలు గ్రామాల్లో కేబుల్ తీగలు, స్టార్టర్ పెట్టెలు, బిందుసేద్యం పైపులు చోరీకి పాల్పడి విక్రయించేందుకు వస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని చెప్పారు.

శివాజీ సేవా ట్రస్ట్ సభ్యులకు చెక్కు అందిస్తున్న దాత

శివాజీ విగ్రహం ఏర్పాటుకు విరాళం

హిందూపురం, హిందూపురం సాంస్కృతికం: పట్టణంలో త్వరలో ఏర్పాటు చేసే ఛత్రపతి శివాజీ విగ్రహానికి గుత్తేదారు వైసీ చంద్రశేఖర్ రూ.1.25లక్షలు విరాళం బుధవారం అందించినట్లు ఛత్రపతి శివాజీ సేవా ట్రస్ట్ ప్రతినిధి చలపతి తెలిపారు. ఈ సందర్భంగా దాతకు సేవా ట్రస్ట్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

సోమందేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని పందిపర్తి, నడింపల్లి గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులపై బుధవారం డీఆర్‌పీలు నరసింహమూర్తి, సురేంద్రరెడ్డి సామాజిక తనిఖీ చేశారు. ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పరిశీలించి వివరాలను సరిచూశారు. మండలంలో జరిగిన పనులకు సంబంధించి మొత్తం రూ.4 కోట్ల నిధుల వ్యయంపై తనిఖీలు చేపట్టారు.

ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా వెంకటలక్ష్మి

పెనుకొండ: స్థానిక ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న నరేశ్‌కృష్ణ డిప్యుటేషన్‌పై పుట్టపర్తి డీపీవో కార్యాలయానికి బదిలీకాగా, బుధవారం సోమందేపల్లి ఎంపీడీవో వెంకటలక్ష్మి పెనుకొండ ఇన్‌ఛార్జ్ ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. బదిలీపై వెళ్లిన నరేశ్‌కృష్ణకు సిబ్బంది వీడ్కోలు పలికారు.

సహకార సంఘాల ఉద్యోగుల సమ్మె

గోరంట్ల: డీసీసీబీ మేనేజర్‌కు సమ్మెనోటీసు ఇస్తున్న సంఘం నాయకులు

గోరంట్ల, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా బుధవారం గోరంట్ల జిల్లా సహకార బ్యాంక్ మేనేజర్ రాజేంద్రప్రసాద్‌కు సమ్మె నోటీసు అందజేశారు. జిల్లా యూనియన్ నాయకులు ఉదయం గోరంట్లకు చేరుకుని స్థానిక సిబ్బందితో కలిసి కొంతసేపు ఆందోళన చేశారు. అనంతరం మేనేజర్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రతాప్‌రెడ్డి, దామోదర్, శ్రీధర్, సురేష్‌కుమార్, రవిశంకర్‌రెడ్డి, బొజ్జప్ప, జగన్మోహన్‌రెడ్డి, సందీప్, సాయిరాం, సిబ్బంది పాల్గొన్నారు.

గుడిబండ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘం ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక పిలుపు మేరకు గుడిబండలో సహకార సంఘం ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టారు. జీఓనం.35ను వెంటనే అమలు పరచి ఉద్యోగులందరికి ప్రొసీడింగ్స్ ఇచ్చి డీఎల్ఎస్ఎఫ్ ఏర్పాటుతో జీతభత్యాలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

మడకశిర గ్రామీణం: పత్తికుంట, టీడీపల్లి తండా, డి.అచ్చంపల్లి గ్రామాలలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. బుధవారం ఈనాడులో 'వేసవి రాక ముందే తాగునీటి ఎద్దడి' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ విజయ్‌కుమార్, పంచాయతీకార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డిలు టీడీపల్లి తండా గ్రామంలో చర్యలు చేపట్టారు. వైబీహళ్లి పంచాయతీ పత్తికుంట గ్రామంలో కొత్త బోరు తవ్వించారు. డి.అచ్చంపల్లిలో బోరుకు అదనపు పైపులు అమర్చనున్నట్లు తెలిపారు.

కొలిక్కి వచ్చిన రైల్వే రోడ్డు విస్తరణ

జోరుగా సాగుతున్న రైల్వే రోడ్డు నిర్మాణం

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: హిందూపురం పట్టణంలో 50 ఏళ్ల క్రితం ఏర్పాటైన రహదారులు విస్తరణకు నోచుకోలేదు. అయితే జనాభా, వాహనాలు అధికమై ట్రాఫిక్ ఇబ్బందులు పెరిగిపోయాయి. రైల్వే రోడ్డు విస్తరణకు 2014-19లో అప్పటి తెదేపా మున్సిపల్ ఛైర్మన్ దృష్టి సారించి, సమగ్ర ప్రాజెక్టు నివేదిక తయారు చేయడం, న్యాయపరమైన అడ్డంకులు తొలిగేలా చర్యలు చేపట్టారు. అయితే కొన్ని కారాణాల రీత్యా నిలిచిపోయింది. ఆ తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం పనులు కొనసాగించలేదు. మళ్లీ తెదేపా అధికారంలోకి రాగానే రైల్వే రోడ్డు విస్తరణకు ఎదురవుతున్న అన్ని అడ్డంకులు తొలగించాలని ఎమ్మెల్యే బాలకృష్ణ తన వ్యక్తిగత కార్యదర్శులను, మున్సిపల్ ఛైర్మన్, కమిషనర్‌లను ఆదేశించారు. 70 అడుగులతో పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి అంబేడ్కర్ భవన్ వరకు కిలోమీటర్ రహదారిని రూ.10 కోట్లతో నిర్మాణ పనులు శరవేగంగా చేయిస్తున్నారు. మార్చి నాటికి నిర్మాణ పనులు పూర్తికానున్నాయి.

మిగిలిన రెండు రోడ్లు

తీవ్రంగా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్న రెండు రహదారుల విస్తరణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

● పట్టణంలోని బెంగళూరు రోడ్డు ముఖ్యమైనది. కర్ణాటకలోని అనేక ప్రాంతాలకు, తూమకుంట పారిశ్రామిక వాడకు, పలు గ్రామాలకు దీని మీదుగానే ప్రయాణించాలి. ఈ రహదారి చిన్న మార్కెట్ నుంచి వాల్మీకి సర్కిల్ వరకు వెడల్పు కేవలం 20 అడుగులు మాత్రమే ఉంది. దీనిని 100 అడుగులు విస్తరించాలని నిర్ణయించారు. అవసరమైన అన్ని అనుమతులు తీసుకొన్నారు. అడ్డుగా ఉన్న భవనాలను గుర్తించి, వాటి యజమానులకు నష్ట పరిహారం చెల్లించడానికి చర్యలు చేపట్టారు.

● పట్టణంలో ముద్దిరెడ్డిపల్లి పట్టు చీరల తయారీతో పాటు మార్కెటింగ్‌కు అతి ముఖ్యమైన ప్రాంతం. దీంతో ఇక్కడికి నిత్యం వేలాది మంది కార్మికులు, కొనుగోలుదారులు రాకపోకలు సాగిస్తుంటారు. పట్టణంలోని మేళాపురం సర్కిల్ నుంచి ముద్దిరెడ్డిపల్లికి వెళ్లే ప్రధాన రహదారి వెడల్పు 20-30 అడుగులు మాత్రమే ఉంది. 80 అడుగులకు విస్తరించాలని నిర్ణయించారు. స్థలాలు కోల్పోతున్న యజమానుల నుంచి వ్యతిరేకత వస్తుండటంతో కనీసం 60 అడుగులకైనా విస్తరించాలని ప్రయత్నిస్తున్నారు.

పకడ్బందీగా రీసర్వే

సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్డీవో

హిందూపురం: రీసర్వే పారదర్శకంగా నిబంధనల మేరకు నిర్వహించాలని పెనుకొండ ఆర్డీవో ఆనంద్‌కుమార్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. బుధవారం హిందూపురం గ్రామీణ మండలం కొటిపిలో నాలగో దశలో చేపట్టిన రీసర్వే గ్రౌండ్ ట్రూతింగ్(జీటీ) కార్యక్రమాలను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సర్వే చేపట్టే ముందు రైతులకు తప్పని సరిగా ఒక రోజు ముందే సమాచారం ఇవ్వాలన్నారు. రీసర్వే గురించి రైతులకు స్పష్టంగా వివరించాలన్నారు. అనంతరం రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

దేమకేతేపల్లి (చిలమత్తూరు): మండలంలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పెనుకొండ ఆర్డీవో ఆనంద్‌కుమార్ తహసీల్దార్ మనోజ్‌కుమార్‌కు సూచించారు. దేమకేతేపల్లి గ్రామంలో బుధవారం నిర్వహిస్తున్న రీసర్వే జాయింట్ ఎల్పీఎం ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి పని పురోగతిపై చర్చించారు. గడువులోగా నివేదిక సమర్పించాలని తెలియజేశారు.

(c) eenadu

పుట్టపర్తి
•పుట్టపర్తి •ధర్మవరం •కదిరి •రాప్తాడు

లక్ష్మీనరసింహస్వామి సేవలో కర్ణాటక మంత్రి

మంత్రికి స్వామి చిత్రపటం బహూకరిస్తున్న వేదపండితులు

కదిరి, న్యూస్‌టుడే: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని కర్ణాటక పౌరసరఫరాల శాఖ మంత్రి కేహెచ్ మునియప్ప కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. బుధవారం బెంగుళూరు నుంచి ప్రత్యేక కాన్వాయ్‌లో కదిరి చేరుకున్నారు. ఆలయంలో ఆయనను ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరెడ్డి, అర్చకులు, రెవిన్యూ అధికారులు స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం వేదపండితులు లక్ష్మీనరసింహస్వామి చిత్రపటాన్ని ఆయనకు అందజేశారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

బత్తలపల్లి న్యూస్‌టుడే: మండలంలోని పోట్లమర్రిలో సీతారామాంజనేయస్వామి ఆలయ 10వ వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామి, వినాయకుడికి అర్చకులు మారుతి ప్రసాద్, సాయికృష్ణలు ప్రత్యేక అలంకరణ చేసి, పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అలంకరణలో ఆంజనేయస్వామి

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు జట్ల ఎంపిక

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయిలో చెస్ పోటీల్లో అండర్-13, 14 విభాగంలో బాలుర, బాలికల జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా క్రీడాభివృద్ధి శాఖాధికారి కిషోర్ తెలిపారు. రెండు రోజులుగా పట్టణంలోని కళాజ్యోతి ఇండోర్ స్టేడియంలో బాలబాలికల చెస్ ఎంపికల పోటీలు జరిగాయి. చెస్ జిల్లా బాలుర జట్టు: నితిన్, మిథున్ పెద్దన్న, నిఖిలేంద్ర, శ్రీధర్, కేదారనాథ్ గుప్తా, వేణుతేజ, మోహన్ పెద్దన్న. బాలికల జట్టు: తేజస్విని, భవ్య సహస్ర, రిషిత, వైష్ణవిలు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని క్రీడాశాఖాధికారులు తెలిపారు. మదన్ మోహన్, నారాయణప్ప రామకృష్ణ, రామకృష్ణుడు, లక్ష్మీనారాయణ, కోచ్‌లు హసేన్, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చెస్‌లో పోటీ పడుతున్న బాలికలు

సామాజిక తనిఖీ సహకరించాలి

నల్లచెరువు, న్యూస్‌టుడే : మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకంలో 2024-25 ఏడాదిలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ సమన్వయ సమావేశాన్ని బుధవారం ఎంపీడీవో ఆశోక్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని 13 పంచాయతీలలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై సోషియల్ ఆడిట్ నిర్వహిస్తామన్నారు. ప్రతి గ్రామంలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఆడిట్ చేస్తామన్నారు. అన్ని శాఖల అధికారులు సోషియల్ ఆడిట్ సిబ్బందికి సహకరించాలన్నారు. ఏపీ వో మంజునాథ్, ఈసీ సుబ్బారెడ్డి, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ఎర్రమట్టి.. కొల్లగొట్టి

కనుమరుగవుతున్న గుట్టలు

ముదిగుబ్బ, తాడిమర్రి : ధర్మవరం నియోజకవర్గంలో ఎర్రమట్టి దందా జోరుగా సాగుతోంది. అక్రమార్కులు కొండగుట్టలు, చెరువులు, కుంటలను తవ్వి యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఫలితంగా పర్యావరణం, ప్రకృతి సంపద తీవ్రంగా దెబ్బతింటోంది. నియోజకవర్గ వ్యాప్తంగా గత కొన్నేళ్లుగా ఎటువంటి అనుమతులు లేకుండానే తవ్వకాలు కొనసాగుతున్నాయి. ప్రధానంగా ముదిగుబ్బ మండలంలో బైపాస్ చుట్టుపక్కల పెద్ద గుట్టలను సైతం తవ్వేశారు. జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న కొండలను గతంలో రోడ్డుపనులకు మట్టి తరలించారు. ఇప్పుడు కూడా ట్రాక్టర్లలో మట్టి తరలిపోతోంది. తాడిమర్రి మండలంలోని దాడితోట, చిల్లవారిపల్లి, తాడిమర్రి, సరిహద్దులోని గ్రామాల్లో ఎర్రమట్టి తవ్వకాలు జరుగుతున్నాయి.

జరిమానా విధించినా...

ఎర్రమట్టి తరలించే సమయంలో రెవెన్యూ, మైనింగ్ శాఖాధికారులు దాడులు నిర్వహిస్తే అక్కడి నుంచి పారిపోతున్నారు. దొరికిన పొక్లెయిన్, ట్రాక్టర్లకు జరిమానా విధించినా మళ్లీ కొనసాగిస్తున్నారు. ఇటీవల బత్తలపల్లిలోని అప్రాచెరువులో తహసీల్దార్, మైనింగ్ అధికారులు, ముదిగుబ్బ బైపాస్ దగ్గర ఆర్డీవో తనిఖీ చేసి యంత్రాలను పట్టుకొని రూ. లక్షల్లో జరిమానా విధించారు. అయినా అక్రమార్కుల తీరు మారడం లేదు. మరొకచోట చెరువులు, కుంటల్లో యంత్రాలతో తవ్వి తరలిస్తున్నారు. రోడ్డు పక్కన పల్లపు ప్రాంతాలు, లేఅవుట్లుకు మట్టి తరలిస్తున్నారు. ట్రాక్టరు వెయ్యి, దూరమైతే రూ.1500 చొప్పున విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

● నియోజకవర్గంలో ఎర్రమట్టి గుట్టలు విస్తరించి ఉండటంతో అక్రమార్కులు మట్టి దోపిడీకి తెర లేపారు. గత ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎక్కడ చూసినా మట్టి తవ్వకాలు జరపడంతో కొండ, గుట్టలు రోజురోజుకూ కరిగిపోతున్నాయి. ఇలానే కొనసాగితే భవిష్యత్తులో నామరూపాల్లేకుండాపోయే ప్రమాదం ఉందని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 42వ జాతీయ రహదారికిరువైపులా ఉన్న కొండల్లో నిత్యం మట్టితవ్వకాలు కొనసాగుతున్నాయి.

ముదిగుబ్బ బైపాస్ దగ్గర తవ్విన గుట్ట

కఠిన చర్యలు తీసుకుంటాం

- అమీర్‌బాషా, మైనింగ్ ఏడీ

మట్టి తరలించాలంటే కచ్చితంగా అనుమతి తీసుకోవాలి. అనుమతిలేని వాటిని గుర్తించి దాడులు చేసి జరిమానా విధిస్తున్నాం. మట్టి అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

మేమున్నాం.. మీకు తోడుగా

పుట్టపర్తి: 80085 73039
కదిరి : 80085 73033
ధర్మవరం: 99596 98222

సమస్య : భానుకోటలో అసంపూర్తిగా నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని పూర్తి చేయాలి. **- అంజినప్ప**

సమాధానం : నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం. **- అరుణమ్మ, ఎంఈఓ**

సమస్య : చంద్రచార్లలో ఇళ్లలోని నీరు రోడ్లపైకి వదలడంతో రాకపోకలు సాగించడానికి గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. **- నారాయణస్వామి**

సమాధానం : రోడ్లపై నీటిని వదలకుండా చర్యలు చేపడతాం. **-వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి**

–న్యూస్‌టుడే, కనగానపల్లి

సమస్య: కనగానపల్లి మండలం భానుకోటలో అసంపూర్తిగా నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని పూర్తి చేయాలి.

- అంజినప్ప, స్థానికుడు.

సమాధానం: నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం. **- అరుణమ్మ, ఎంఈఓ**

సమస్య: చంద్రచార్లలో నివాసాల్లో వాడిన వ్యర్థ నీటిని రోడ్లపైకి వదలడంతో రాకపోకలు సాగించడానికి గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. **- నారాయణస్వామి, స్థానికుడు.**

సమాధానం: రోడ్లపై నీటిని వదలకుండా చర్యలు చేపడతాం. **- వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి**

– న్యూస్‌టుడే, కనగానపల్లి

మాదకద్రవ్యాలు వద్దు బ్రో

నల్లమాడ, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలపై ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ రెడ్డి నేతృత్వంలో బస్టాండు సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నల్లమాడ ఎస్సై సతీష్‌కుమార్ హాజరయ్యారు. మత్తు పదార్థాలు వాడిన, విక్రయించిన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అనంతరం విద్యార్థులకు డ్రగ్స్ వద్దు బ్రో జీవితం బాగుండాలి అని నినాదించారు.

విద్యార్థుల ర్యాలీలో పాల్గొన్న ఎస్సై, ప్రధానోపాధ్యాయుడు

ఏకాగ్రత.. యోగాతోనే సాధ్యం

నల్లమాడ, న్యూస్‌టుడే: పరీక్షల ఒత్తిడిని అధిగమించడానికి వీలుగా జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్నత పాఠశాలలో యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. బుధవారం స్థానిక గిరిజన ఆశ్రమపాఠశాలలో శ్రీభగవాన్ సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో కస్తూర్బా, గిరిజన, జడ్పీ ఉన్నత పాఠశాల, అంబేద్కర్ గురుకుల పాఠశాల వాటిల్లో యోగా తరగతులు బోధించారు. ఎంఈఓ కె.వేమనారాయణ మాట్లాడుతూ యోగాతోనే ఏకాగ్రత సాధ్యం అవుతుందన్నారు. నారాయణరెడ్డి, సతీష్, ప్రమీల, వార్డెన్ సత్యనారాయణ, పీఈటీ ధరణి, సిబ్బంది పాల్గొన్నారు.

మాతా, శిశుమరణాలు వందశాతం తగ్గించాలి

పుట్టపర్తి: మాతా, శిశు మరణాలను వందశాతం తగ్గించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లో వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మాతృ మరణాలకు దారి తీసిన కారణాలను తెలుసుకున్నారు. హైరిస్క్ గర్భిణులను ముందస్తుగా గుర్తించి, నిరంతరం పర్యవేక్షణలో ఉంచాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో మైరోజాబేగం, డీసీహెచ్‌వో మధుసూదన్, డీఐవో సురేశ్‌బాబు, వైద్యులు పాల్గొన్నారు.

భాజపా బలోపేతానికి కృషి

ధర్మవరం న్యూస్‌టుడే: భాజపా బలోపేతానికి బూత్ కమిటీలు ఏర్పాటు చేసి ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని భాజపా జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ అన్నారు. బుధవారం పట్టణంలోని భాజపా కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు జింకా చంద్రశేఖర్ అధ్యక్షతన సమావేశంలో శేఖర్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి సత్యకుమార్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు.

శ్రోత్రీయ భూములకు శాశ్వత పరిష్కారం చూపండి

పుట్టపర్తి, న్యూస్‌టుడే: పుట్టపర్తిలోని ఓడీసీ మండలం తంగేడుకుంట రెవిన్యూ పరిధిలోని 9990 ఎకరాల శ్రోత్రీయ భూముల్లో సాగుచేస్తున్న రైతులకు శాశ్వత పరిష్కారం కల్పించి, పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. బుధవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆమె మాట్లాడుతూ దాదాపు 150 సంవత్సరాల నుంచి ఈ భూముల్లో రైతులు వ్యవసాయం చేస్తున్నారన్నారు. వీటికి పట్టాలు లేనందున ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, పంట రుణాలు, పంట బీమా తదితరాలు అందకుండా పోతున్నాయన్నారు. జిల్లా రెవెన్యూ అధికారులతో పరిశీలించి, శాశ్వత పరిష్కారం చూపుతామని మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు.

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

రైతులకు యూనిక్ ఐడీ తప్పనిసరి

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలు రైతులకు శతశాతం లబ్ధిచేకూరేలా 11 అంకెల యూనిక్ ఐడీ తప్పనిసరిగా నమోదు చేయాలని భాజపా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ప్రకాష్‌నాయుడు తెలిపారు. బుధవారం ఏవో రవీంద్రను ఆయన కార్యాలయంలో కలిసి అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. మండలంలోని 27 రెవెన్యూ గ్రామాల్లో 20వేల మంది రైతులకు గాను 18వేల మందికి ఇప్పటికి నమోదయ్యాయన్నారు. మిగిలిన వారికి త్వరలో పూర్తి చేస్తామన్నారు. భాజపా నాయకులు వెంకటేష్, నారాయణ, గంగులప్ప, శివకుమార్ పాల్గొన్నారు.

వైద్యాధికారి, సీహెచ్‌ఓ మధ్య వాగ్వాదం

నంబులపూలకుంట, న్యూస్‌టుడే : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది పనితీరుపై మండల వైద్యాధికారి ఆనంద్‌వర్ధన్, సామాజిక ఆరోగ్య అధికారి(సీహెచ్‌వో) నాగలక్ష్మి మధ్య బుధవారం వాగ్వాదం చోటుచేసుకుంది. ఓపీ సేవలకు జీఎన్ఎం ట్రైనింగ్ పొందిన ఏఎన్ఎంలను వినియోగిస్తున్నామని డాక్టర్ వివరించగా సీహెచ్‌ఓ 'వారు అవసరం లేదు వారికి కేటాయించిన స్థానాలకు వారిని పంపించేయాలి' అని వైద్యాధికారితో గొడవ పడ్డారు. మండలంలో పల్స్‌పోలియో విధులను నిర్వహించిన ఆశా కార్యకర్త నరసమ్మ తనకు డబ్బులు ఇవ్వలేదని అధికారికి తెలిపారు. వాగ్వాదంపై డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో నాగేంద్రనాయక్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వివరించారు.

పిచ్చి మొక్కలు తొలగించరూ..

కుమ్మరవాండ్లపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన వర్షపాత నమోదు కేంద్రంలో గడ్డి పెరిగి దర్శనమిస్తోంది. ఈ ప్రాంతంలో వర్షపాతాన్ని నమోదు చేయడానికి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ముళ్లకంపలు, పిచ్చిగడ్డి పెరిగి వృథాగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, గాండ్లపెంట

నిర్లక్ష్యం.. కాలిన చెట్లే సాక్ష్యం

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: ముదిగుబ్బ నుంచి బత్తలపల్లికి వెళ్లే 42వ జాతీయ రహదారిపై గుత్తేదారుడి బాధ్యతారాహిత్యం పచ్చని ప్రకృతికి శాపంగా మారింది. రాళ్ల అనంతపురం దగ్గర డివైడర్ మధ్యలో పెంచిన పచ్చనిచెట్లు మంటల్లో కాలిబూడిదయ్యాయి. ఎండుగడ్డిని సకాలంలో తొలగించకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. గుర్తుతెలియని వ్యక్తులు దానికి నిప్పుపెట్టడంతో చెట్లన్నీ కాలిపోయాయి. వేసవి రావడంతో ప్రకృతికి నష్టం జరగకుండా నిత్యం పర్యవేక్షించాలని పలువురు కోరుతున్నారు.

రాళ్ల అనంతపురం దగ్గర అగ్నికి ఆహుతైన పచ్చనిచెట్లు

శివపార్వతుల పల్లకీసేవ

లేపాక్షి, న్యూస్‌టుడే: లేపాక్షిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గో రోజు మంగళవారం రాత్రి శివ, పార్వతి, దుర్గాదేవి అమ్మవార్లను పూల పల్లకీలో ఊరేగించారు. ఉదయం నుంచి ఆలయంలో అభిషేకార్చనలు, చండీహోమం నిర్వహించారు. రాత్రి 12 గంటలకు ప్రారంభమైన పల్లకీసేవ తెల్లవారుజాము 5.30 గంటల వరకు సాగింది. కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన కళాకారులు నిర్వహించిన కీలుగుర్రాలాట ఆకట్టుకుంది.



పల్లకీలో శివుడు, పార్వతి, దుర్గాదేవి

22న ఉచిత కంటి వైద్యశిబిరం

ధర్మవరం న్యూస్‌టుడే: లయన్స్ క్లబ్, లయన్స్ కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఈనెల 22న పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని నాగేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరానికి బండి ఆంజినేయులు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు బండివేణుగోపాల్ క్యాంపు దాతగా వ్యవహరిస్తున్నారన్నారు. కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ధర్మవరం ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

ఉత్తమ అధికారికి సన్మానం

తాడిమర్రి, న్యూస్‌టుడే: పన్నుల వసూలు కార్యక్రమంలో ఉత్తమ పనితీరు కనబరచడంతో రాష్ట్రస్థాయి అవార్డును రాష్ట్ర డిప్యూటీ కమిషనర్ చేతుల మీదుగా డిప్యూటీ ఎంపీడీవో విజయ్‌శేఖర్‌నాయుడు అందుకున్నారు. బుధవారం ఆయన్ని తోటి ఉద్యోగులు ఎంపీడీవో కార్యాలయంలో సన్మానించారు. డివిజన్ పంచాయతీల అభివృద్ధి అధికారి(డీడీవో) జనార్దన్‌రావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ప్రశంసలు గుర్తింపునిస్తాయన్నారు. ఎంపీడీఓ వెంకటరంగారావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపవాస దీక్షలు.. ఆధ్యాత్మికతకు మార్గం

ధర్మవరం న్యూస్‌టుడే: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు చేసే ఉపవాస దీక్షలు ఆధ్యాత్మిక చైతన్యానికి మార్గమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మవరం నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీ సోదర, సోదరీమణులు రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నానని మంత్రి పేర్కొన్నారు. రంజాన్ మాసం సందర్భంగా అందరూ ఆధ్యాత్మిక చింతనతో, పరస్పర ప్రేమతో, సేవాభావంతో జీవించాలని మంత్రి పిలుపునిచ్చారు.

క్షయ వ్యాధిగ్రస్థులకు పోషకాహార కిట్ల పంపిణీ

బత్తలపల్లి న్యూస్‌టుడే: పోషకాహారంతో పాటు మందులు క్రమపద్ధతిగా వాడటంతో క్షయ వ్యాధిని తగ్గించుకోవచ్చు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు అరుణ్‌కుమార్ వ్యాధిగ్రస్థులకు సూచించారు. బుధవారం ఆరోగ్య కేంద్రంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించి, వారికి ఉచితంగా మందులు, పోషకాహార కిట్లు అందజేశారు. కమ్యూనిటీ హెల్త్ అధికారి రాజశేఖర్, సూపర్‌వైజర్ అశ్వర్థనారాయణ, గౌరమ్మ, సరస్వతి, ఎరికలప్ప, బాషా తదితరులు పాల్గొన్నారు.

దాహార్తి తీర్చిన దాతలు

ఓబుళదేవరచెరువు: మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్ జడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు స్థానికులు ఎం.శ్రీనాథ్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, హరికృష్ణ, రామకృష్ణ, వీరయ్య తాగునీటిని అందించేందుకు ఆర్వోప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. బుధవారం దాతలు, ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో కొబ్బరికాయ కొట్టి ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం దాతలను ఉపాధ్యాయులు శాలువ, పూలమాలలతో సన్మానించారు.

వాషింగ్ మిషన్ల పంపిణీ

తలుపుల, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం సరఫరా చేసిన వాషింగ్ మిషన్లను కూటమి నాయకులు తలుపుల ఏటిగంగమ్మ ధోబీ ఘాట్ వద్ద బుధవారం రజక సంఘాల మహిళలకు పంపిణీ చేశారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద మండలంలో 167 వాషింగ్ మిషన్లు మంజూరు కాగా 164 మందికి అందజేసినట్లు తెలిపారు. అనంతరం రజకసంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. తెదేపా మండల కన్వీనర్ మేడా శంకర, రజకసంఘం మండల అధ్యక్షుడు జీవి రమణ, నాయకులు కొమ్మెర కిష్ట, భార్గవ్‌రెడ్డి, జయచంద్ర, రామ్మోహన్, రాజారెడ్డి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

రీ సర్వేను పరిశీలించిన తహసీల్దార్

నంబులపూలకుంట: మర్రికొమ్మదిన్నె పంచాయతీ జవుకల గ్రామంలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను మండల తహసీల్దార్ దేవేంద్రనాయక్ పరిశీలించారు. రీ సర్వే సమయంలో రైతులు భూమి కొలతలను సరిచూసుకోవచ్చని తెలిపారు. పొలం సరిహద్దులను గుర్తించి రికార్డుల్లో నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్వేయర్లు, తదితరుల పాల్గొన్నారు.

నిర్మాణాల క్రమబద్ధీకరణకు సువర్ణ అవకాశం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: అనధికార లేఅవుట్లు, ప్లాట్లు, నిర్మాణాలను క్రమబద్ధీకరణకు ఇది సువర్ణావకాశం అని జేసీ మౌర్యభరద్వాజ్ బుధవారం

అ వీ.. ఇ వీ.. అ న్నీ..

ఓ ప్రకటనలో తెలియజేశారు. పుట్టపర్తి పట్టణాభివృద్ధి సంస్థ(పుడా) పరిధిలోని యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గడువులోపు చేయించుకోని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

గ్రామసభలో అవగాహన

బుక్కపట్నం, న్యూస్‌టుడే: రైతులు క్లైమ్ చేయని భూములను క్రమబద్ధీకరించుకోవాలని తహసీల్దార్ నరసింహులు తెలిపారు. బుధవారం గూనిపల్లిలో రెవెన్యూ గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ఇందులో ఇతర మిగులు భూములపై అవగాహన కల్పించారు. హక్కు కలిగి ఉండి రికార్డుల్లో యజమాని పేరు లేని భూమికి సంబంధించిన సమస్యలను ఆయన వివరించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

కార్యాలయానికి దూరం తగ్గేనా?

నల్లమాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం అసౌకర్యంగా ఉందని గ్రామస్థులు తెలిపారు. ఇప్పుడున్న ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలు ఒకే చోట ఉండేవి. తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో రెండేళ్ల క్రితం దాని కుటాలపల్లి రోడ్డులోని ఖాళీగా ఉన్న ఎస్సీ హాస్టల్ భవనంలోకి తరలించారు. దీంతో బస్టాండ్ నుంచి దూరంగా ఉండటంతో ఆటోకి రూ. 50 ఇచ్చి వస్తున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

52 మంది శస్త్రచికిత్సలకు ఎంపిక

రామగిరి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పేరూరులో బెంగళూరుకు చెందిన శంకర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 52 మంది శస్త్రచికిత్సకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం పేరూరులో కోడి రామ్మూర్తి సహకారంతో ఏర్పాటుచేసిన కంటి వైద్యశిబిరంలో వివిధ గ్రామాలకు చెందిన 80 మందికి పరీక్షలు నిర్వహించి వీరిలో 52 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. వీరందరినీ బెంగళూరులోని శంకర్ కంటి ఆస్పత్రికి తరలించి, అక్కడ ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించి, మందులు, కళ్ల అద్దాలు అందించనున్నట్లు వారు తెలిపారు.

పశుగ్రాసం దగ్ధం

నంబులపూలకుంట, న్యూస్‌టుడే : పోరెడ్డివారిపల్లి గ్రామంలో రైతు చిన్నరెడ్డికి చెందిన వరి గడ్డి వాముకు మంటలు వ్యాపించి పూర్తిగా కాలిపోయింది. సుమారు.15 వేల వరకు నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.

విజేతలకు అభినందనలు

బత్తలపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఈ నెల 14, 15న ధర్మవరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలలో మాల్యవంతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, బాలికల విభాగంలో సి.వైష్ణవి, భవ్య, ఎస్.వైష్ణవి బాలుర విభాగంలో గౌతమ్, అరవింద్, సాయి, కార్తీక్, ముద్దుకృష్ణ, పునీత్‌లు విజేతలుగా నిలిచారు. ప్రధానోపాధ్యాయులు చెన్నకృష్ణారెడ్డి ఉపాధ్యాయులు జయరాం, ఉమాదేవి, శైలజ, పార్వతి, అరుణ, వెంటరాముడులు ప్రశంసించారు.

విద్యార్థులతో ఉపాధ్యాయులు

వరి పైరుకు తెగులు.. అన్నదాతకు దిగాలు

తెగులు సోకడంతో దెబ్బతిన్న వరిపంట

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: రబీ సీజన్‌లో సాగు చేసిన వరి పంటకు తెగుళ్లు రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. అష్టకష్టాలు పడి పండించిన పంటకు చీడపీడలు కర్షకులను బెంబెలెత్తిస్తున్నాయి. ఓ వైపు ఎర్రదోమ, మరో వైపు పచ్చపురుగు, పేను బంక చేరి పంటను నాశనం చేస్తున్నాయి. దీంతో నివారణకు పిచికారీ చేస్తున్న ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ప్రస్తుతం వరి పైరు పొట్ట దశ నుంచి కంకి దశకు చేరుకుంటోంది. ఈ సమయంలో తెగుళ్లు సోకితే పంట నాశనమై దిగుబడి తగ్గుతుందని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క గొట్లూరు చెరువు కిందే 350 ఎకరాల్లో వరి సాగులో ఉంది. ఈ సీజన్‌లో సాగుచేస్తున్న సన్నరకాల అధికంగా తెగుళ్లు రావడంతో పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితులు లేవని అన్నదాత దిగాలు చెందుతున్నారు.

ఇప్పటికే మూడుసార్లు మందుల పిచికారీ

బోరుబావులు, చెరువుల్లో నీళ్లు పుష్కలంగా ఉంటే వరి సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతారు. మూడునాలుగేళ్లుగా చెరువుల్లో నీళ్లు లేకపోవడంతో సాగు చేయలేకపోయారు. గతేడాది జిల్లాలో కురిసిన వర్షాలకు పలు చెరువులు, కుంటలు పొంగిపొర్లాయి. ఖరీఫ్ సీజన్‌లో దిగుబడి రావడంతో రబీ సీజన్‌లో పంట వేశారు. వరి పైరుకు తెగుళ్లు వ్యాపించడంతో పంట చేతికందేలా లేదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెలన్నర అయిన పంటకు చీడపీడల నివారణకు ఖరీదైన రసాయనిక మందుల పిచికారీ చేశామన్నారు. ఎకరానికి రూ.20వేలకు పైగానే పెట్టుబడి పెట్టినట్లు వ్యవసాయదారులు వాపోతున్నారు. వ్యవసాయాధికారులు స్పందించి దీనిపై అవగాహన కల్పించాలని వారు కోరుతున్నారు.

తెగుళ్ల నివారణకు మందులు

కొన్నిచోట్ల వరి పైరుకు తెగుళ్లు సోకాయి. నివారణకు జింకు సల్ఫేట్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పచ్చపురుగు నివారణకు రెండు ఎంఎల్ ప్రోఫినోఫాస్ లీటర్ నీటికి కలిపి ఎకరాకు 200 లీటర్ల ద్రావకాణ్ని తయారు చేసి పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

- ముస్తాఫా, మండల వ్యవసాయాధికారి, ధర్మవరం

సంస్కృతికి లీడర్‌షిప్ అవార్డు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ఎంటర్‌ప్రైజెస్ ఇండియా, ఈవై సంస్థల ఆధ్వర్యంలో చెన్నైలో 2026 సంవత్సరానికి నిర్వహించిన లీడర్‌షిప్ అవార్డును సంస్కృతి విద్యాసంస్థల ఛైర్మన్ విజయభాస్కర్ రెడ్డి స్థానంలో ప్రిన్సిపల్ హేమచంద్రారెడ్డి అందుకున్నారు. ఏటా ప్రతిభ కలిగిన నిరుపేద విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు నిర్వహించి, ఎంపికైన వారికి నాలుగేళ్ల పాటు ఉచిత విద్య, వసతి సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆర్‌బీటీ ప్రోగ్రాం ద్వారా ఎంపికైన వారికి యూరప్ దేశాలకు పంపిస్తూ అంతర్జాతీయ అకడమిక్ అనుభవం కల్పిస్తున్నారు.

అవార్డును అందుకుంటున్న సంస్కృతి విద్యాసంస్థ ప్రిన్సిపల్ హేమచంద్రారెడ్డి

గిట్టుబాటు ధర కల్పిస్తాం

తనకల్లు: టమాట రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని పరాకువాండ్లపల్లి మార్కెట్‌యార్డు కార్యదర్శి జగదీష్‌బాబు అన్నారు. బుధవారం 'టమాటరాక.. గిట్టుబాటు కాక' అనే శీర్షికతో 'ఈనాడు'లో టమాట సాగు రైతుల ఇబ్బందులపై కథనం ప్రచురితమైంది. స్పందించిన మార్కెట్‌యార్డు అధికారులు అన్నమయ్య జిల్లా ములకలచెరువు, మదనపల్లి మార్కెట్‌ల వ్యాపారులతో చర్చించి రైతులకు సరసమైన ధరలు కల్పించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్

జూదరుల అరెస్టు

కదిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని గజ్జలరెడ్డిపల్లి కాలనీలోని జూదస్థావరంపై దాడి చేసి తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ శివనారాయణ స్వామి తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు అర్బన్ సీఐ నారాయణరెడ్డి, ఎస్సై భువనేశ్వరి, సిబ్బంది మంగళవారం అర్ధరాత్రి తర్వాత దాడులు చేశారన్నారు. జూదరుల నుంచి తొమ్మిది సెల్‌ఫోన్లు, రూ.1.85 లక్షల నగదు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

గాండ్లపెంట: మండలంలోని కటకంవారిపల్లి శివారు ప్రాంతాల్లో జూద స్థావరాలపై బుధవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి 8 ఫోన్లు, రూ.64,340 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుమతి తెలిపారు.

20 మంది బైండోవర్

కొత్తచెరువు, న్యూస్‌టుడే: బండ్లపల్లి గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో నిర్వహించే నామాల పండుగ విషయంలో ఇరు వర్గాల వివాదం కారణంగా 20 మందిని తహసీల్దార్ బాలాంజినేయులు ఎదుట బైండోవర్ చేసినట్లు యూపీఎస్ సీఐ మారుతి శంకర్ తెలిపారు. కదిరి పున్నమి సందర్భంగా నామాలు పెట్టుకునే విషయంలో ఇరు వర్గాల మధ్య భేదాభిప్రాయాలు ఏర్పడ్డాయి. దీంతో ముందస్తు చర్యల్లో భాగంగా ఒక్కొక్కరికి రూ.5లక్షల పూచీకత్తుతో విడుదల చేసినట్లు సీఐ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: ముదిగుబ్బలోని అనంతపురం రోడ్డులో పెట్రోలుబంకు దగ్గర బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ముక్తాపురానికి చెందిన చంద్రానాయక్, అతని తండ్రి మూర్తి పెట్రోలు బంకు నుంచి మెయిన్ రోడ్డులోకి వస్తున్నారు. అనంతపురం వైపు వెళ్తున్న గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో మూర్తికి గాయాలు కాగా చంద్రానాయక్‌కు చేయి విరిగింది. క్షతగాత్రులను బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించినట్లు సిబ్బంది తెలిపారు.

నంబులపూలకుంట: మండలంలోని పాత సొసైటీ భవనం సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్న జమాల్ బాషను బైక్‌పై వస్తున్న పి.కొత్తపల్లికి చెందిన వెంకటరమణారెడ్డి, వేమన్న ఢీ కొట్టారు. ప్రమాదంలో గాయపడిన జమాల్‌బాష, వెంకటరమణారెడ్డిలను స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

(c) eenadu

ముక్కంటి సన్నిధిలో.. భక్తులతో కిటకిటలాడుతున్న నది తీరం

భక్తజనధార..

శ్రీముఖలింగేశ్వరస్వామి లింగాభరణం

ఆలయం వద్ద ఉత్సవమూర్తులతో అర్చకులు, అధికారులు

భక్తిశ్రద్ధలతో శ్రీముఖలింగేశ్వరుని చక్రతీర్థ స్నానం

వంశధార.. జన ధార అయ్యింది. ఆ ముక్కంటి స్వరూపంలో భక్తి ప్రవాహంగా పారింది.. స్వామి సేవలో భక్తులంతా తడిసి ముద్దయింది. ఇసుక తిన్నెలపై శివ నామం మారుమోగింది.. దక్షిణ కాశీగా పేరొందిన శ్రీముఖలింగంలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. చివరిరోజు బుధవారం స్వామి చక్రతీర్థ స్నాన ఘట్టం వైభవోపేతంగా సాగింది. లక్షలాది జనులు వెంట రాగా ఆ పార్వతీ పరమేశ్వరులు నంది వాహనంపై వంశధార నదికి చేరుకున్నారు. ఉత్తర ముఖంగా పయనించిన ఉత్సవమూర్తులకు మిరియాపల్లి గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. అక్కడ ఏర్పాటు చేసిన పచ్చని కొబ్బరి ఆకుల పందిరిలో సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శాస్త్రోక్తంగా క్రతువు నిర్వహించారు.

దారులన్నీ అటువైపే..

చక్రతీర్థస్నాన ఘట్టం తిలకించేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. దారులన్నీ శ్రీముఖలింగం వైపే సాగాయి. ఉదయం 11.40 గంటల సమయంలో పార్వతీపరమేశ్వరుల ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలు, వేద మంత్రాలతో ప్రధాన ఆలయం నుంచి అర్చకులు బయటకు తీసుకొచ్చారు. ఆర్డీవో కె.సాయిప్రత్యూష, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్, డీఎస్పీ లక్ష్మణరావు కొబ్బరి కాయలు కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ప్రధాన మార్గం కిక్కిరిసిపోవడంతో పొలాలకు వెళ్లే దారి నుంచి వస్తున్న భక్తులు

– న్యూస్‌టుడే, జలుమూరు, నరసన్నపేట, సారవకోట, ఎల్‌ఎన్‌పేట, పాతపట్నం

20న ఉద్యోగ మేళా

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలో మేరా యువ భారత్ (నెహ్రూ యువ కేంద్రం) వేదికగా ఈ నెల 20న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.సుధ తెలిపారు. 85 ఖాళీల భర్తీకి ఇంటర్ ఆపై విద్యార్హత, 30 ఏళ్లలోపు వయసు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. www.ncs.gov.in లో వివరాలు నమోదు చేసుకుని.. శుక్రవారం ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు.

రంజాన్ కళ

ముస్లిం సోదరులు నెలవంక కనిపించడంతో పవిత్ర పుణ్య మాసంగా భావించే రంజాన్ ఉపవాస దీక్షలకు సమయం ఆసన్నమైంది. గురువారం నుంచి నెల రోజుల పాటు కొనసాగిస్తారు. రోజూ వేకువ జామున 4 గంటల్లోపు (సహరీ) భోజన కార్యక్రమాలు పూర్తి చేస్తారు. మళ్లీ సాయంత్రం 6.30 గంటల(ఇఫ్తార్) వరకు ఆహారం, నీరు తీసుకోకుండా ఉపవాసం చేస్తారు. బుధవారం మసీదుల్లో నమాజ్‌లు, సామూహిక ప్రార్థనలు చేశారు. శ్రీకాకుళం నగరంలో విద్యుద్దీపాలతో అలంకరించిన జామియా మసీదును చిత్రంలో చూడొచ్చు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

కాసులందక.. కన్నీళ్లు ఆప్కోలేక..!

చేనేత కార్మికులకు అందని బకాయిలు

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్

మగ్గాలపై నేసిన వస్త్రాన్ని మార్కెట్‌లో విక్రయించేందుకు చేనేత కార్మికులు ప్రభుత్వ రంగ సంస్థ ఆప్కోను ఆశ్రయిస్తారు. ఇతర ప్రాంతాల్లో అక్కడి ప్రజల అభిరుచికి తగినట్లుగా ఉత్పత్తులను విక్రయించేందుకు వీలుగా నిల్వలను కార్మికులు అందజేస్తారు. సంస్థ నుంచి సకాలంలో బకాయిలు విడుదల కాకపోవడంతో నేతన్నల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. జిల్లాలో చేనేత రంగం సంక్షోభంలో కూరుకుపోతోంది.

జిల్లాలోని 16 చేనేత సంఘాల నుంచి ఆప్కో సంస్థకు వస్త్రాలు ఇస్తున్నారు. చేనేత చీరలు, పంచె, ధోవతి, చొక్కాలు, లుంగీ, తువ్వాళ్లు, చేతి రుమాళ్లు వంటివి ఉత్పత్తి చేస్తున్నారు. ప్రాంతాలవారీగా గిరాకీని దృష్టిలో ఉంచుకుని ఆప్కో సంస్థ వాటిని కొనుగోలు చేసి.. విక్రయిస్తున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతి గృహాల్లో పిల్లలకు అవసరమైన దుప్పట్లు, పాఠశాలల్లో ఏకరూప దుస్తులకు అవసరమైన వస్త్రాలను ప్రభుత్వమే ఏటా ఆప్కో నుంచి కొనుగోలు చేస్తుంది. ఆ మొత్తాలను ప్రభుత్వం ఆప్కో సంస్థకు చెల్లించడంలో జాప్యం చేస్తోంది.

తప్పని నిరీక్షణ..

2018లో తెదేపా ప్రభుత్వం ఆప్కోకు బకాయిలు చెల్లించింది. ఆ తర్వాత వైకాపా అధికారంలోకి వచ్చాక చెల్లింపులు నిలిపివేసింది. ఇప్పటి వరకు ఆప్కో నుంచి జిల్లాలోని చేనేత సంఘాలకు రూ.3.15 కోట్లు రావాల్సి ఉండగా.. కూటమి ప్రభుత్వం రూ.69 లక్షలు విడుదల చేసింది. మిగిలిన రూ.2.56 కోట్ల కోసం నేత కార్మికులు నిరీక్షిస్తున్నారు. డబ్బులు రాకపోవడంతో చేనేత సంఘాలు నిద్రావస్థకు చేరుతున్నాయి. యార్న్‌కు చెల్లించాల్సిన మొత్తాలను ఇవ్వలేక.. కొత్తగా అప్పులు చేసి యార్న్ కొనుగోలు చేయలేక వస్త్రాల తయారీని నిలిపేస్తున్నారు.

జిల్లాలో వివరాలిలా..

చేనేత సంఘాలు: 36 | ఆప్కో సంస్థకు వస్త్రాలిచ్చేవి: 16

రావాల్సిన బకాయిలు: రూ.2.56 కోట్లు

ప్రభుత్వానికి నివేదించాం..

గత ఏడేళ్లుగా ఆప్కో నుంచి చేనేత సంఘాలకు బకాయిలు విడుదల కాలేదు. ఇటీవల రూ.69 లక్షలు ఇచ్చింది. సమస్యను ప్రభుత్వానికి నివేదించాం. మిగిలిన డబ్బులు సైతం అందించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

– టి.జనార్దనరావు, మార్కెటింగ్ మేనేజర్(ఇన్‌ఛార్జి), ఆప్కో

– న్యూస్‌టుడే, టెక్కలి

ప్రపంచ వాణిజ్య చిత్రపటంలో జిల్లాకు గుర్తింపు తీసుకొచ్చింది నీలి గ్రానైట్.. అగ్రశ్రేణి నాణ్యతను సొంతం చేసుకున్న ఆ గ్రానైట్ ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో వ్యాపారులకు కాసులు కురిపిస్తోంది.. గతేడాది ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి వరకు రూపాయితో డాలరు మారకపు విలువ రూ.6కు పైగా పెరగడం ఎగుమతిదారులకు లాభాలు చూపిస్తోంది. డిమాండ్ పెరగకపోయినా అంతర్జాతీయంగా జరిగిన పరిణామాలు కలిసొస్తున్నాయి.

కలిసొచ్చే కాలం.. కోరుతోంది ఊతం

కాసులు కురిపిస్తున్న గ్రానైట్

జిల్లాలోని నీలి గ్రానైట్‌కు కొన్ని దేశాల్లో డిమాండ్ ఉంది. ప్రధానంగా చైనా, యూరప్ దేశాల్లో శవపేటికల కోసం నీలి గ్రానైట్‌ను ఎక్కువగా వినియోగిస్తారు. గతంలో ఎన్ని డాలర్లకు వెళ్లేదో.. ప్రస్తుతం అన్నే డాలర్లకు ఎగుమతి అవుతోంది. నాణ్యత విషయంలో గతంతో పోల్చుకుంటే ఆంక్షలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.

ప్రోత్సాహం లేక ఇక్కట్లు..

★ 20 ఏళ్లుగా ఉత్పత్తి తగ్గిపోయింది. నిర్వహణ ఖర్చు భారీగా పెరిగిపోయింది. ప్రభుత్వం ఇవ్వాల్సిన రాయితీలు ఇవ్వట్లేదు.

★ ఆర్థికంగా ప్రోత్సాహకాల్లేక ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై నిర్ణయం తీసుకోవాలని వ్యాపారవర్గాలు కోరుతున్నాయి.

★ జిల్లా నుంచి ఏటా లక్ష క్యూబిక్ మీటర్ల మేర గ్రానైట్ ఉత్పత్తి అవుతోంది. ఇందులో 30 వేల క్యూబిక్ మీటర్ల వరకు ఎగుమతి అవుతోంది. దీని నుంచే ప్రధానంగా వ్యాపార వర్గాలకు లాభాలు కనిపిస్తున్నాయి.

భిన్నమైన పరిస్థితులు..

ఎగుమతులు, వాటి లాభాలు నాణేనికి ఒకవైపు. రెండోవైపు ఇందుకు విరుద్ధంగా ఉంది. ఎగుమతులు మినహాయిస్తే మిగిలిన గ్రానైట్‌ను జిల్లాలో పరిశ్రమలు కొనుగోలు చేస్తుంటాయి. ప్రభుత్వ పన్నుల విధానం, పెరిగిన నిర్వహణ ఖర్చుతో గ్రానైట్ పరిశ్రమలకు గిట్టుబాటు కాని పరిస్థితి నెలకొంటోంది. ఇప్పటికే జిల్లాలో 200 పరిశ్రమల్లో దాదాపు 40 వరకు మూతపడ్డాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఆదుకోకుంటే గ్రానైట్ రంగం పెద్దముప్పునే ఎదుర్కోవాల్సి వస్తుందని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

తరిమే ఆపదను తలచుకోరేం..!

– ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఆగట్లేదు. వరుస ఘటనలతో పాటు మరణాల రేటు పెరుగుతోంది. బాధితుల్లో ద్విచక్ర వాహనదారులే ఎక్కువగా ఉండటం గమనార్హం. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం, శిరస్త్రాణం ధరించకపోవడంతో తీవ్రంగా గాయపడి.. మృత్యువాత పడుతున్నారు. అయినా చాలా మంది వాహనదారుల్లో మాత్రం మార్పు రావట్లేదు. అడుగడుగునా నిర్లక్ష్యం కనిపిస్తోంది. ప్రతి పది మందిలో 9 మంది శిరస్త్రాణం లేకుండానే ప్రయాణం చేస్తున్నారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

శ్రీకాకుళం నగరంలో శిరస్త్రాణం లేకుండా చరవాణిలో మాట్లాడుతూ వెళ్తున్న యువకుడు

శిరస్త్రాణం ధరించక ద్విచక్ర వాహన ప్రమాదాలు

● మెళియాపుట్టి మండలం జోడూరుకు చెందిన భార్గవ్(20) ఈ నెల 15న బండిపై వెళ్తూ చెట్టును ఢీకొట్టాడు. ఆ సమయంలో శిరస్త్రాణం ధరించలేదు. సోమవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. చేతికొచ్చిన కుమారుడు అనంతలోకాలకు వెళ్లడంతో కన్నోళ్లకు కడుపుకోత మిగిలింది.

● ఇటీవల శ్రీకాకుళం నగరానికి చెందిన ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై వెళ్తూ రామలక్ష్మణ కూడలి వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని దాటబోయి అదుపుతప్పి కింద పడ్డాడు. శిరస్త్రాణం ధరించకపోవడంతో తలకు తీవ్రగాయమైంది. రూ.లక్షల్లో ఖర్చు చేసి చికిత్స చేయించారు.

★ జిల్లాలో గతేడాది 699 రోడ్డు ప్రమాదాల్లో అత్యధికంగా 316 ద్విచక్ర వాహనాల ప్రమాదాలే ఉన్నాయి. ఇందులో 115 మంది మృతిచెందగా, 201 మంది తీవ్ర గాయాలయ్యాయి. ఆయా ఘటనల్లో అధికశాతం మంది శిరస్త్రాణాలు ధరించకే తీవ్రత పెరిగింది.

★ ట్రాఫిక్ నిబంధనలకు తూట్లు పొడుస్తూ శిరస్త్రాణం ధరించలేదని 2025లో 43 వేల మందికిపైగా పోలీసు అధికారులు జరిమానా విధించారు.

★ మద్యం తాగి వాహనం నడుతున్న 6,338 మందిపై కేసులు నమోదు చేశారు. 62 మంది డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేశారు.

చర్యలేవీ..?

శిరస్త్రాణం లేకుండా వాహనాలు నడుతున్న వారిపై పోలీసు అధికారులు తనిఖీలు తగ్గించేశారు. పట్టణ ప్రాంతాల్లో నామమాత్రంగా ప్రక్రియ జరుగుతోంది. అవగాహన కార్యక్రమాలు చేపట్టడం లేదు. గ్రామీణ, మండల ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. గతేడాది జరిగిన మొత్తం రోడ్డు ప్రమాదాల్లో 241 గ్రామీణ ప్రాంతాల్లోనే జరిగాయి.

తనిఖీలు పటిష్ఠం చేస్తాం..

ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించి వాహనాలు నడపాలి. నిర్లక్ష్యం వహిస్తే వారిపై జైలు శిక్ష, జరిమానాలు, లైసెన్సులు రద్దు వంటి కఠిన చర్యలు తీసుకుంటున్నాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిని విడిచిపెట్టం. – కె.వి.మహేశ్వరరెడ్డి, ఎస్పీ

సదస్సుకు హాజరైన రైతులు

అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రాజశేఖర్

అంతర పంటలతో అదనపు ఆదాయం

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: కొబ్బరి, జీడి, మామిడి తోటల్లో అంతర పంటలు సాగు చేయడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం చేకూరుతుందని పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. కవిటిలో బుధవారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కొబ్బరి, జీడి మామిడి సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రైతులకు అంతర పంటలతో కలిగే ఉపయోగాలు వివరించారు. భువనేశ్వర్‌కు చెందిన ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కొబ్బరిలో అంతర పంటగా దుంప జాతి కాయగూరలు సాగు చేస్తే మేలన్నారు. పెద్దపేట ప్లాంట్ పేథాలజీ డాక్టర్ రాజశేఖర్, ఆమదాలవలస వ్యవసాయ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నీలవేణి, సీతంపేట వ్యవసాయ పరిశోధన స్థానం డాక్టర్ వెంకటరావు మేలైన పద్ధతులపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు రైతులు తప్పక పాటించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ వీడియో ద్వారా సూచించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి రత్నాల వరప్రసాద్, ఏడీలు సీహెచ్.చంద్రశేఖర్, పూడి లక్ష్మణరావు, కవిటి ఉద్యానాధికారి మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

తెలుస్తారా.. తెలుసుకోవడమేనా..?

● ట్రిపుల్ ఐటీలో వేధింపుల ఫిర్యాదుపై మరోసారి విచారణ

– న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో విద్యార్థినుల వేధింపుల ఫిర్యాదులపై మరోసారి విచారణ జరిగింది. రెండు నెలల కిందట ఉన్నతాధికారులు హడావుడి చేయడంతో బాధ్యులపై చర్యలు తీసుకుంటారని విద్యార్థులు ఆశించినా అలా జరగలేదు. జరిగిందంతా వాస్తవమని తేలినా.. తాత్సారం చేస్తుండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఏం జరిగిందంటే..

కొందరు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది తమపై వేధింపులకు పాల్పడుతూ.. అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని పలువురు విద్యార్థినులు గతేడాది డిసెంబరు మొదటి వారంలో కులపతి, ఉపకులపతి, రిజిస్ట్రార్, డైరెక్టర్లకు మెయిల్స్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఈ విషయమై క్యాంపస్‌లో తీవ్ర దుమారం రేగడంతో అదే నెల 16న 'శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ విద్యార్థినులకు వేధింపులు' శీర్షికతో 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దానిపై రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ, ఆర్జీయూకేటీ కులపతి డా.ఎల్.మధుమూర్తి స్పందిస్తూ క్యాంపస్‌ను సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడి భరోసా కల్పించారు. అప్పుడే వర్సిటీ అధికారులు ఫిర్యాదులపై విచారణకు ఐసీసీ(అంతర్గత ఫిర్యాదుల కమిటీ) నియమించారు. ఆ మేరకు కమిటీ సభ్యులు నూజివీడు క్యాంపస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రావణి కనకకుమారి, న్యాయవాది పద్మజ, హెచ్‌సీ టి.సరిత రాతపూర్వకంగా ఫిర్యాదులు స్వీకరించారు. ఆధారాలు సేకరించారు. ఫిర్యాదులు వచ్చిన అధ్యాపకులు బీటెక్ చివరి సంవత్సరం బోధనకు వెళ్లకూడదని ఐసీసీ సూచించింది.

ఎందుకీ తాత్సారం..

వేధింపులపై కఠిన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కావడంతో పాటు విద్యార్థినుల చదువులపై తీవ్ర ప్రభావం పడుతుందని తల్లిదండ్రులు భావిస్తున్నారు. తమను వేధిస్తున్నారని పేర్లతో సహా ఫిర్యాదు చేసినా వర్సిటీ అధికారులు చర్యలు తీసుకునేందుకు ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.

● విద్యార్థినులపై వేధింపులు వాస్తవమని తేలినా.. అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పేర్లు, ఆధారాలతో సహా రెండు నెలల కిందట ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

● విద్యార్థినుల ఫిర్యాదు చేసిన అధ్యాపకులు, బోధనేతర సిబ్బందికి వర్సిటీ అధికారులు రెండు రోజుల కిందట సమాచారం అందించారు. కమిటీ ముందు వివరణ ఇవ్వాలని నోటీసులిచ్చారు.

రెండు నెలల తర్వాత..

● ఆ మేరకు బుధవారం నూజివీడు క్యాంపస్‌కు చెందిన కమిటీ సభ్యులు అసిస్టెంట్ ప్రొఫెసర్లు శ్రావణి కనకకుమారి, నాగార్జునదేవి, కాంట్రాక్ట్ బోధన సిబ్బంది దుర్గాభవాని, సురేష్ బాబు, రాజేష్, వేణుగోపాల్ విచారించారు.

● సుమారు 14 మందిపై ఫిర్యాదు చేయడంతో బుధవారం కొందరి నుంచి వివరాలు రాబట్టారు. మిగిలిన వారిని గురువారం విచారించనున్నారు.

ఏదీ చెత్తశుద్ధి..

జిల్లాలో నీటి వనరుల పరిసరాలు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. ఏ చెరువు గట్టున చూసినా, కాలువ పరిశీలించినా, నది వైపు వెళ్లినా చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. ఆయా వనరుల్లో నీరు కలుషితమవుతోంది. అధికారులు పట్టించుకోకుండా వదిలేస్తున్నారు. ప్రస్తుతం ఆయా వనరుల్లో నీరు అడుగంటడంతో వ్యర్థాలు కనిపిస్తున్నాయి. ఇచ్ఛాపురం మండలం అరకభద్ర సమీపంలో బాహుదా నది వంతెన దిగువ భాగాన పేరుకుపోయిన చెత్తను చిత్రంలో చూడొచ్చు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

ప్రతి రైతుకు 14 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో పారదర్శకతకు ప్రతి రైతుకు 14 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి అని జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి బుధవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 2,78,859 మంది రైతులు వివరాలను నమోదు చేసుకున్నారని చెప్పారు. మిగిలినవారు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, చరవాణితో రైతు సేవా కేంద్రాలకు వెళ్లి నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి చేయించుకోవాలన్నారు. అందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

– న్యూస్‌టుడే కలెక్టరేట్(శ్రీకాకుళం)

'కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల(కేజీబీవీ) బలోపేతమే లక్ష్యంగా కృషి చేస్తున్నాం. జిల్లాలోని కేజీబీవీలను ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దేందుకు సమూల మార్పులు చేస్తున్నాం. విద్యార్థినుల భద్రతతో పాటు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రణాళిక రూపొందించాం' అని సమగ్ర శిక్షా అదనపు పథక సమన్వయకర్త(ఏపీసీ) పప్పల వేణుగోపాలరావు పేర్కొన్నారు. కేజీబీవీల్లో నిర్వహణకు తీసుకుంటున్న చర్యలను 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో ఆయన వివరించారు.

అక్రమాలు అరికడతాం.. ఆదర్శంగా తీర్చిదిద్దుతాం..!

● కేజీబీవీల బలోపేతమే లక్ష్యంగా సమూల మార్పులు

● సమగ్ర శిక్షా ఏపీసీ పి.వేణుగోపాలరావు

ముఖాముఖి

విద్యార్థుల భాగస్వామ్యంతో నిఘా..

సరకుల పంపిణీలో అక్రమాలు జరుగుతున్నాయని తెలిసింది. దానికి అడ్డుకట్ట వేసేందుకు కొన్ని సంస్కరణలు ప్రవేశపెట్టాం. నిఘా కెమెరాలు ఏర్పాటు చేశాం. నెలవారీ అవసరాలకు మించి సరకులు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. విద్యార్థినులను కూడా భాగస్వామ్యం చేసి స్టోర్ రూంపై నిఘా ఉంచుతున్నాం. నిల్వల పరిశీలన, పంపిణీలో లోపాలుంటే సంబంధిత ప్రత్యేకాధికారులను బాధ్యుల్ని చేస్తాం.

వృత్తి విద్య కోర్సులపై సమీక్ష: కొన్ని కేజీబీవీల్లో ఇంటర్ ఒకేషనల్ కోర్సులున్నాయి. వాటిలో అడ్మిషన్లు పూర్తి స్థాయిలో జరగట్లేదు. తక్కువ ప్రవేశాలున్న కోర్సులపై సమీక్ష నిర్వహిస్తాం. పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఉపాధి అవకాశాలుండే కోర్సులను మారుస్తాం.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ..: కేవలం విద్యా బోధనకే పరిమితం కాకుండా ఆరోగ్యంపైనా ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాం. ఎప్పటికప్పుడు విద్యార్థినులు, సిబ్బందికి వైద్య పరీక్షలు చేయిస్తున్నాం. వారికి ఉచితంగా మందులు సరఫరా చేస్తున్నాం. వారానికోసారి నీళ్ల ట్యాంకుల శుభ్రం, 16 రోజులకోసారి నీటి పరీక్షలు చేయిస్తున్నాం.

రాజీపడకుండా పోషకాహారం..

జిల్లాలోని 25 కేజీబీవీల్లో మెనూ అమలుపై నిఘా పెంచాం. సరకుల దుర్వినియోగం, మెనూ అమలుపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి. విద్యార్థినులకు పోషకాహారం అందించడంలో రాజీ పడకుండా మల్టీ లెవల్ మానిటరింగ్ వ్యవస్థను తీసుకొచ్చాం. రోజూ వినియోగించే పాలు, గుడ్లు, చికెన్ వంటివి వీడియో తీసి వాట్సప్ గ్రూప్‌లో అప్‌లోడ్ చేయిస్తున్నాం. పిల్లల హాజరుతో సరిపోలుస్తూ.. సరకుల వినియోగాన్ని లెక్కిస్తున్నాం. ఎలాంటి వ్యత్యాసం గుర్తించినా చర్యలు తీసుకుంటాం.

అభ్యసన సామర్థ్యం ఆధారంగా బోధన..

అన్ని చోట్లా అత్యాధునిక సాంకేతికతతో నాణ్యమైన విద్యనందిస్తున్నాం. పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్(పాల్) ల్యాబ్‌లు, ట్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా విద్యార్థి అభ్యసన సామర్థ్యం ఆధారంగా పాఠాలు బోధిస్తున్నాం. విద్యార్థులు ఎంత వరకు నేర్చుకున్నారో తెలిపే వివరణాత్మక పనితీరు నివేదికల ద్వారా ఉపాధ్యాయులు వెనకబడినవారిని గుర్తిస్తున్నారు. వారిపై మరింత శ్రద్ధ తీసుకుని చదివిస్తున్నారు.

(c) eenadu

జీజీహెచ్‌లో పునుగుపిల్లి ప్రత్యక్షం

శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ సర్వజనా సుపత్రి బీరువాలో బుధవారం పునుగుపిల్లి దర్శనమిచ్చింది. ఆసుపత్రి అధికారులు తెలిపిన వివరాల మేరకు పవర్ రూం సమీపంలోని స్టోర్ రూం బీరువాలో తలదాచుకుంది. బీరువా తెరిచిన సిబ్బంది పునుగుపిల్లిగా గుర్తించారు. జేడీ బి.రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ శేషాచలం అడవుల్లో సంచరించే అరుదైన జాతికి చెందిన పునుగుపిల్లి ఇక్కడ ప్రత్యక్షం కావడం ఆశ్చర్యానికి గురి చేసింది. అటవీ శాఖ అధికారులకు సమాచారమిచ్చి అప్పగిస్తామని తెలిపారు. బీరువాలోకి ఎలా చేరిందనే విషయం చర్చనీయాంశంగా మారింది. – న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం)

ఎచ్చెర్లలో అంధకారం

ఎచ్చెర్లలో 20 రోజుల నుంచి అంధకారం అలముకుంది. 3 నెలల కిందట పాత జాతీయ రహదారి నుంచి మండల కేంద్రం వరకు విద్యుత్తు స్తంభాలు, వీధి దీపాలు ఏర్పాటు చేశారు. కొన్ని రోజుల కిందట బాట్లింగ్ యూనిట్‌కు వస్తున్న లారీ విద్యుత్తు స్తంభాన్ని ఢీకొనడంతో అది విరిగిపోయి 18 వీధి దీపాలు మరమ్మతులకు గురయ్యాయి. లారీ యజమానిపై మండల స్థాయి అధికారులు కేసు పెట్టి రూ.25 వేలు డీడీ తీసి కొత్త స్తంభం వేయించారు. వీధి దీపాలు అమర్చకపోవడంపై ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయమై ఎచ్చెర్ల పంచాయతీ కార్యదర్శి రుప్ప విజయసాగర్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా విద్యుత్తు దీపాల నిర్వహణను ఏ పంచాయతీ చూడాలనేది స్పష్టత లేదని.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.– న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

సముద్రంలో మునిగిన ఇంజిన్ బోటు

ఇసకలపాలెం సముద్ర తీరంలో లంగరు వేసిన సుమారు రూ.18 లక్షల విలువైన ఇంజిన్ బోటు ప్రమాదవశాత్తు మునిగిపోయింది. దాన్ని స్థానిక మత్స్యకారులు చాకచక్యంగా ఒడ్డుకు చేర్చారు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మత్స్యకారులు సవడల డిల్లేశ్, బైపల్లి కామరాజు మంగళవారం చేపల వేట ముగిసిన అనంతరం ఇంజిన్ బోటుకు ఎప్పటి లాగే సముద్రం లోపల లంగరు వేశారు. బుధవారం తెల్లవారుజామున యథావిధిగా వేటకు తీరానికి వెళ్లి చూడగా బోటు కనిపించలేదు. బాధితులతోపాటు తోటి మత్స్యకారులు బోట్లు, తెప్పలతో చాలా సేపు వెతికి నీటిలో మునిగిన బోటును గుర్తించారు. గ్రామంలోని యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొని తాడు సాయంతో దాన్ని లాగి ఒడ్డుకు చేర్చారు. విషయం తెలుసుకున్న వైకాపా ఇచ్ఛాపురం ఇన్‌ఛార్జి శ్యాంప్రసాదరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్రకుమార్ యాదవ్, తిరుపతి, జోగారావు ఘటన స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు.– న్యూస్‌టుడే, సోంపేట

జనసంద్రమైన శ్రీముఖలింగం

ప్రశాంతంగా ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు

భక్తులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

జలుమూరు, న్యూస్‌టుడే: శ్రీముఖలింగంలో నాలుగు రోజుల పాటు జరిగిన మహాశివరాత్రి ఉత్సవాలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు చక్రతీర్థ ఘట్టం తిలకించేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి ముందస్తుగా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణ తాగునీటి విభాగం, విద్యుత్తు శాఖలు, వంశధార అధికారులు సమన్వయంతో పనిచేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా దాదాపు 500 మంది పోలీసులతో భద్రతా చర్యలు తీసుకున్నారు. ఉత్సవం జరిగే ప్రాంతంలో 57 సీసీ కెమెరాలు, 8 డ్రోన్ కెమెరాలు వినియోగించారు. వేడుకల్లో ఈవో ఏడుకొండలు, పాలకమండలి అధ్యక్షుడు శివప్రసాద్ పాఢి, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు తర్ర బలరాం, ఎంపీటీసీ సభ్యుడు కరుకోల హరిప్రసాద్, ఎంపీడీవో బి.చిన్నమ్మడు, తహసీల్దారు జె.రామారావు, సీఐ శ్రీనివాసరావు, ఎస్సై అశోక్‌బాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పోలియో నిర్మూలనకు సైకిల్ యాత్ర

ప్రపంచ వ్యాప్తంగా పోలియో మహమ్మారిపై పోరు సాగిస్తున్న రోటరీ క్లబ్, అదే దిశగా జన చైతన్య కార్యక్రమాలను చేపడుతోందని రోటరీ జిల్లా 3020 గవర్నర్ కల్యాణ్‌చక్రవర్తి అన్నారు. స్థానిక రోటరీక్లబ్ ఆవరణలో ఇచ్ఛాపురం నుంచి విజయవాడ వరకు పోలియో నిర్మూలన, జనచైతన్యానికి నిధుల సేకరణ కోసం చేపడుతున్న సైకిల్ యాత్రను బుధవారం ప్రారంభించారు. తొలుత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, అనంతరం రోటేరియన్లు, యాత్రికులతో కలిసి జాతీయ రహదారికి చేరుకున్నారు. ఆంధ్ర సరిహద్దు కేంద్రం వద్ద నుంచి ఫేజ్1 యాత్రగా విశాఖపట్నం వరకు చేపడుతున్న సైకిలు యాత్రలో పాల్గొంటున్న కాకినాడకు చెందిన సీనియర్ రొటేరియన్లు గోపాల్‌రాజు, మల్లికార్జునరావు సేవలను గుర్తించి సన్మానించారు. రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు డా.టీఎం వెంకటేశ్, కాదా రామ్‌కోటి, చార్టర్ అధ్యక్షుడు డా.దక్కత త్రినాథరెడ్డి, పల్స్‌పోలియో ప్రాంతీయ అధ్యక్షుడు దక్కత కృష్ణమూర్తిరెడ్డి, రోటరీ జిల్లా 3020 అధ్యక్షుడు పార్థసారథి తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో సీట్లు



అభిచంద్రకార్తీక్

బలగ (శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో పాతపట్నం మండలం సీది గంగుపేటకు చెందిన యువకుడు ఒకేసారి సీట్లు సాధించి సత్తా చాటాడు. జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త కల్యాణ్‌బాబు, చరిత దంపతులు పెద్ద కుమారుడు అభిచంద్రకార్తీక్ ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ఎంఫిల్ డెవలప్‌మెంట్ స్టడీస్ (ఎకనామిక్స్), లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ఎమ్మెస్సీ అప్లయిడ్ ఎకనామిక్స్‌లో ప్రవేశానికి అర్హత సాధించాడు. అతను శ్రీకాకుళం నగరంలోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసి పాలిటిక్స్ అండ్ ఎకనామిక్స్‌లో పట్టా (ప్రథమ శ్రేణి) పొందాడు. లండన్‌లోని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం-కింగ్స్ కాలేజ్ సంయుక్తంగా నిర్వహించిన ఎంగెల్స్ బర్గ్ ఆఫ్ అప్లయిడ్ హిస్టరీ ఫెలోషిప్‌కు ఎంపికయ్యాడు.

పీఏసీఎస్ ఉద్యోగుల వేతనాలు సవరించాల్సిందే

మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో (పీఏసీఎస్) పని చేస్తున్న ఉద్యోగులకు వేతన సవరణ (2019, 2024) వెంటనే చేపట్టాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయం ఎదుట బుధవారం పీఏసీఎస్ ఉద్యోగుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపసంఘాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. జీవో 36 రద్దు చేయాలని.. పీఆర్సీ నియామకంలో, తాత్కాలికంగా 50 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.2 లక్షల సీలింగ్ రద్దు చేసి చట్టాన్ని అనుసరించి గ్రాట్యుటీ ఇవ్వాలని కోరారు. ఉద్యోగ విరమణ వయసు పరిమితి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా 62 ఏళ్లకు పెంచాలన్నారు. 2019 తర్వాత విధుల్లో చేరిన వారిని క్రమబద్ధీకరించాలని.. లాభ నష్టాలతో సంబంధం లేకుండా ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. పీఏసీఎస్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంగనాథ్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పాపినాయుడు, ఎం.సత్యనారాయణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సాగులో ఒదిగి.. లాభాలతో ఎదిగి!

ప్రతికూల పరిస్థితుల్లోనూ ఆదర్శంగా మహిళల వ్యవసాయం

న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

వజ్రపుకొత్తూరు మండలం పూడిలంక చుట్టూ ఉప్పుటేరు ఉండటంతో ప్రమాదకరంగా పడవలో ప్రయాణం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇక్కడి పంటలను బయటకు తరలించలేక.. సకాలంలో సరైన ధరలకు విక్రయించలేక నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ.4 కోట్ల అంచనాతో వంతెన, రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోగా పనులు సాగుతున్నాయి. త్వరలోనే వారి ప్రయాణ కష్టాలు గట్టెక్కే అవకాశం ఉండటంతో జీవనోపాధులపై మరింత ఆశలు పెరిగాయి. ఈక్రమంలో ఇక్కడి మహిళలు ప్రత్యేక శ్రద్ధతో అన్ని రకాల కూరగాయలు, ఆకు కూరలు పండిస్తున్నారు. మంచి లాభాలు ఆర్జిస్తూ ఆదర్శంగా ముందుకు సాగుతున్నారు.

టమాటా సాగు చేస్తున్న పొలం

ఆదాయం బాగు

రబీలో చోడి, పెసర, మినుములు, జినుగులు సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్నారు. టమాటా, వంకాయ, బెండకాయ, ముల్లంగి, మిరప, ఉల్లి, తెల్లదుంప, ఎర్రదుంప, బీర, ఆనప, చిక్కుడు రకాలు, బంతిపూలు, గులాబి, చామంతి పూల జాతులు తోటకూర, గోంగూర, పాలకూర, కొత్తిమీర, పుదీనా తదితర ఆకుకూరలు ఎక్కువగా పండిస్తున్నారు. ● ఉన్న పొలంలో సగం కంటే పైగా విస్తీర్ణంలో కాలానుగుణంగా కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. ఇంటికి రోజువారీ సరిపడే ఆదాయం వచ్చేలా శ్రమిస్తున్నారు. తక్కువ పెట్టుబడులతో ఎక్కువ లాభాలు ఆర్జిస్తున్నారు. నెలకు రూ.20 వేలకు పైగా ఆదాయం పొందుతున్నారు. జీవన ప్రమాణాలు మెరుగుపరుచుకుంటున్నారు.

ఇదీ పరిస్థితి

● వజ్రపుకొత్తూరు మండలం పూడిజగన్నాథపురం పంచాయతీ పరిధి పూడిలంకలో సుమారు 60 ఇళ్లుంటాయి. 200 మంది నివసిస్తున్నారు. ఇక్కడ 100 ఎకరాల వరకు పంట భూములున్నాయి.

● ఉప్పుటేరు మధ్యలో గ్రామం ఉండటంతో సాగునీటి వనరులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉప్పునీరు కారణంగా వ్యవసాయం చేయలేని పరిస్థితి నెలకొంది. ● చెరువును అభివృద్ధి చేసి వర్షం, ట్యాంకు నుంచి బయటకొస్తున్న వృథా నీటిని మళ్లిస్తూ నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి కొందరు మోటార్ల ద్వారా పొలాలకు నీరందేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ● చాలా మంది మహిళలు బిందెలతో నీరు మోసి తడులు అందిస్తున్నారు. ఖరీఫ్‌లో వరి సాగు చేస్తున్నారు. ఎక్కువగా అన్ని రకాల కూరగాయలు పండిస్తున్నారు. ఆదాయాన్ని పెంపొందించుకుంటూ కుటుంబ ఆర్థిక ఉన్నతికి కృషి చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులు అధిగమిస్తున్నాం..

మొన్నటి వరకు సరైన రహదారి లేక అవస్థలు పడ్డాం. ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని పరిస్థితి ఉండేది. కూటమి ప్రభుతం రోడ్డు నిర్మించడంతో రాకపోకలకు కొంతమేర ఇబ్బందులు తప్పాయి. ఖాళీగా ఉన్న పొలాలన్నీ పచ్చగా మారాయి. కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నాం. మార్కెట్‌లో మంచి ధరలకు విక్రయిస్తున్నాం. ఆర్థిక ఇబ్బందులు అధగమిస్తున్నాం. – బచ్చల పోలమ్మ, రైతు, పూడిలంక

ఇంజినీరింగ్ ఫలితాలు విడుదల

ఫలితాలు విడుదల చేస్తున్న ప్రధానాచార్యులు శ్రీనివాసరావు, యాజమాన్య సభ్యులు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: చిలకపాలెం సమీపంలోని శ్రీ శివాని ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ విద్యార్థుల మొదటి సెమిస్టర్ ఫలితాలను బుధవారం కళాశాలలో విడుదల చేశారు. జేఎన్టీయూ, జీవీ పరీక్ష ఫలితాల కమిటీ సభ్యుల సమీక్ష అనంతరం ఫలితాలు విడుదల చేశామని కళాశాల ప్రధానాచార్యులు డా. వై.శ్రీనివాసరావు తెలిపారు. 350 మంది విద్యార్థులు హాజరుకాగా, వీరిలో 192 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. శ్రీ శివాని కళాశాల 2025-26 విద్యాసంవత్సరంలో అటానమస్ గుర్తింపు పొందడంతో తొలిసారిగా కళాశాలలో సెమిస్టర్ ఫలితాలు విడుదల చేసినట్లు యాజమాన్య సభ్యులు తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ జి.టి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వీఆర్ఏలకు పేస్కేల్ అమలు చేయండి

ప్రదర్శనగా వెళ్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు

కలెక్టరేట్(శ్రీకాకుళం),న్యూస్‌టుడే: గ్రామ రెవెన్యూ సహాయకులకు (వీఆర్ఏ) పేస్కేల్ అమలు చేయాలని.. అర్హులకు వీఆర్వో, అటెండర్లుగా ఉద్యోగోన్నతి కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, వీఆర్ఏల సంఘ ప్రధాన కార్యదర్శి కె.రమణమూర్తి డిమాండు చేశారు. శ్రీకాకుళం నగరంలో బుధవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెలంగాణ మాదిరిగా రాష్ట్రంలోనూ వీఆర్ఏలకు పేస్కేల్ అమలు చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న వీఆర్వో, అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, డ్రైవర్ తదితర పోస్టులను అర్హులైన వీఆర్ఏలతో భర్తీ చేయాలన్నారు. నామినీలను వీఆర్ఏలుగా గుర్తించాలన్నారు. వైకాపా పాలనలో వీఆర్ఏలు విజయవాడలో ధర్నా చేస్తే ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు స్వయంగా పాల్గొన్నారని.. అధికారంలోకి రాగానే రూ.15 వేలు పెంచుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ విషయమై అనేక సార్లు వినతిపత్రాలు ఇచ్చామని.. వేతనాలు పెంచాలని కోరారు. సీఐటీయూ నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, సంఘ నేతలు డి.అప్పారావు, సుజాత, మీనాక్షి, ఈశ్వరరావు, వెంకటరమణ, రామారావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ధ్రువపత్రాలతో చేరిన ఇద్దరు సీఆర్టీలపై వేటు

కొత్తూరు, న్యూస్‌టుడే: నకిలీ ధ్రువపత్రాలతో కొత్తూరు మండలం కారిగూడ మినీ గురుకుల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సీఆర్టీలను తొలగిస్తూ ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఐటీడీఏ సీతంపేట పరిధిలో ఉన్న వసతిగృహంలో హిందీ, తెలుగు సీఆర్టీలుగా నిమ్మల దులేంద్రిని, నిమ్మల శ్రీలక్ష్మిలపై గతంలో వచ్చిన ఫిర్యాదులపై విచారణకు ఆదేశించారు. వీరిద్దరూ ఉత్తర్‌ప్రదేశ్ ఝాన్సీలోని బుందేల్‌ఖండ్ విశ్వవిద్యాలయం నుంచి పొందిన బీఈడీ ధ్రువపత్రాలు నకిలీవని విశ్వవిద్యాలయం నుంచి వచ్చిన అధికారిక ధ్రువీకరణతో చర్యలు చేపట్టారు. నకిలీ బీఈడీ ధ్రువపత్రాలతో సీఆర్టీలుగా చేరిన వీరిద్దరినీ ఒప్పంద ఉద్యోగ విధుల నుంచి తొలగించినట్లు పీవో ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని ఎవరైనా ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది నకిలీ విద్యార్హత ధ్రువపత్రాలతో ఉద్యోగాల్లో చేరినట్లు తేలితే క్రమశిక్షణ చర్యలతోపాటు, చట్టపరమైన చర్యలుంటాయని పేర్కొన్నారు.

యువకుడిపై బీరు సీసాలతో దాడి

వివరాలు తెలుసుకుంటున్న సీఐ ప్రసాద్, ఎస్సై వెంకటేశ్

కొత్తూరు, న్యూస్‌టుడే: పాతకక్షల నేపథ్యంలో ఇంట్లో నిద్రిస్తున్న యువకుడిపై బీరు సీసాలతో దాడి చేసిన ఘటన కొత్తూరులోని బ్రాహ్మణ వీధిలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. బ్రాహ్మణ వీధికి చెందిన కడగల సాయికుమార్‌తో మండల కేంద్రానికి చెందిన టి.వినయ్, కె.యువరాజు, ఎస్.దాస్, సిరుసువాడకు చెందిన కొన్ని తరుణ్‌లకు గతంలో పాత కక్షలున్నాయి. ఈ నేపథ్యంలో బాధితుడు కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో నిద్రిస్తుండగా నలుగురు ప్రవేశించి బీరు సీసాలతో తల, ఇతర శరీర భాగాలపై దాడి చేసి గాయపరిచారు. సాయి తల్లిదండ్రులు అడ్డుకుని పెద్దగా కేకలు వేయడంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ సంఘటనపై బాధితుడు పోలీసులకు సమాచారంతో ఇవ్వడంతో కొత్తూరు సీఐ చింతాడ ప్రసాద్, ఎస్సై వెంకటేశ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. దాడికి గల కారణాలను ఆరా తీశారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. దర్యాప్తు అనంతరం చర్యలుంటాయన్నారు.

మద్యం దుకాణంలో చోరీ

చోరీ చేయడానికి రాడ్డు పట్టుకుని వెళ్తున్న యువకుడు (సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన దృశ్యం)

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగర పరిధి ఫాజుల్‌బాగ్‌పేట పరిధి కిమ్స్ ఆసుపత్రి రోడ్డులోని లక్కీ వైన్స్ దుకాణంలో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. మంగళవారం రాత్రి పని వేళలు ముగిసిన తర్వాత ముగ్గురు సిబ్బంది తాళాలు వేసి వెళ్లారు. బుధవారం ఉదయం 9 గంటల సమయంలో తెరవడానికి రాగా ముందు భాగంలో షట్టర్ల తాళాలు పగలగొట్టినట్లు గుర్తించి యజమాని మీసాల రామారావుకు సమాచారమిచ్చారు. ఆయన రాగానే లోపలికి వెళ్లి చూస్తే కౌంటర్‌లో ఉంచిన రూ.2.60 లక్షలు, మద్యం సీసాలు, సెల్‌ఫోన్ గుర్తు తెలియని వ్యక్తులు కాజేశారని కనుగొన్నారు. ఈమేరకు యజమాని రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు తెలిపారు. సీసీ ఫుటేజీ ఆధారంగా ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి చోరీకి పాల్పడినట్లు గుర్తించిన పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు.

సచివాలయ కార్యదర్శి ఇంట్లో దొంగతనం

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగర పరిధి సీపన్నాయుడిపేటలో నివాసం ఉంటున్న సచివాలయ కార్యదర్శి కొత్తకోట సుజాత ఇంట్లో చోరీ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఆమె భర్త స్వామిబాబు, కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 14న రాజమహేంద్రవరం వెళ్లారు. 15న తిరిగి వచ్చారు. పడక గదిలోని మంచం లాకర్‌లో భద్రపరిచిన చేతి గొలుసు, నల్లపూసలు, చెవి పోగుల కోసం మంగళవారం ఆమె తెరిచే సరికి కనిపించలేదు. పర్సుతో ఉన్న నగలు మాయమైనట్లు బుధవారం రెండో పట్టణ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. సీఐ ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చోరీకి గురైన ఆభరణాల బరువు సుమారు 5 తులాలు ఉంటుందని అంచనా.

మల్లన్నకు చక్రతీర్థ స్నానం

టెక్కలి రావివలసలోని ఎండల మల్లికార్జున స్వామి శివక్షేత్రంలో నాలుగు రోజులుగా జరుగుతున్న మహాశివరాత్రి మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఉత్సవ విగ్రహాలతో తిరువీధి కార్యక్రమం నిర్వహించారు. దారిపొడవునా కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం సీతపుష్కరిణిలో చక్రతీర్థస్నానాలు చేశారు. దేవాదాయశాఖ ఈవో జి.గురునాథరావు, ఎల్ఎల్‌నాయుడు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పెరిగిన ఆదాయం

మహాశివరాత్రి సందర్భంగా ఈ సంవత్సరం స్వామివారికి రూ.13,39,352 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. గతేడాది రూ.9,23,332 ఆదాయం సమకూరగా, ఈసారి అదనంగా రూ.4,16,020 ఆదాయం వచ్చిందన్నారు. – న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	150	255	275

EENADU eClassifieds

TO LET

COMMERCIAL

శ్రీకాకుళం టౌన్ RTC కాంప్లెక్స్ SSR డిగ్రీకాలేజ్ దరి 15,500 & 5500 SFTతో 2G+3 బిల్డింగ్స్ విద్యాసంస్థలు హాస్పిటల్స్ బ్యాంక్స్ అద్దెకు ✆ 9703779230, 9398873241.

JOBS

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ:18-20K ✆ 96404 68899, 96402 58899

S.A.T బైక్‌బజార్ పెద్దపాడు రోడ్ శ్రీకాకుళంలో పనిచేయుటకు అనుభవంగల కలక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 9010408813, 9553754134.

శ్రీరామ్ లైఫ్‌ఇన్సూరెన్స్ శ్రీకాకుళంలో ఎగ్జిక్యూటివ్స్‌గా పనిచేయుటకు డిగ్రీ అర్హత కలిగి 28-35 ఏజ్ గల వారు కావలెను. జీతం 18000/- TA-DA ఇన్సెంటివ్ ఇవ్వబడును. 8500590187

SECURITY GUARDS

వైజాగ్ సిటీ, శ్రీకాకుళం, విజయనగరంలో పనికొరకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. రూమ్, భోజనం కలదు. PF, ESI. జీతం: 20 వేలు, 30 వేలు. 6300071128

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

బంగారు పతకం అందుకుంటున్న నళినీ సుధాకర్

జాతీయ స్థాయి మాస్టర్స్ రేస్‌వాక్ పోటీల్లో సత్తా

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి మాస్టర్స్ రేస్‌వాక్ పోటీల్లో జిల్లాకు చెందిన ఎస్.నళినీ సుధాకర్ స్వర్ణ పతకం అందుకున్నారు. 45వ జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు మధ్యప్రదేశ్‌లో ఈ నెల 13 నుంచి 15 వరకు నిర్వహించారు. జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో 60+ వయో విభాగం 5 కిలోమీటర్లలో పోటీ పడి పతకం సాధించారు. అసోసియేషన్ కార్యదర్శి మంగా వరప్రసాద్ నుంచి అందుకున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

ఆక్సిజన్ లీకేజీపై అప్రమత్తత అవసరం

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ఆక్సిజన్ లీకేజీపై అప్రమత్తత అవసరమని ప్లాంట్ నిర్వాహక సంస్థ సాంకేతిక సిబ్బంది స్పష్టం చేశారు. శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో బుధవారం తొలిసారి ఆక్సిజన్ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆక్సిజన్ తయారీ, నిల్వకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఆక్సిజన్ సరఫరాలో లీకేజీని అడ్డుకట్ట వేయడం.. సమస్యలను గుర్తించి.. అత్యవసర సమయాల్లో స్పందించాల్సిన తీరుపై ప్రజంటేషన్ ఇచ్చారు. అత్యవసర విభాగాలు, ఆర్థో వార్డులు, ఆపరేషన్ థియేటర్లు తదితర విభాగాల్లో ఆక్సిజన్ వినియోగం.. ప్రమాద ఘటనల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఆక్సిజన్ ప్లాంట్ సాంకేతిక, నర్సింగ్ సిబ్బందికి, సెక్యూరిటీ గార్డులకు అవగాహన కల్పించారు. నెలకోసారి ఆక్సిజన్ ప్లాంట్ నిర్వహణ చేపట్టాలని సూచించారు. ఆసుపత్రి జేడీ బి.రాజశేఖర్‌రెడ్డి, అత్యవసర విభాగాధిపతి ప్రొ.కె.శ్రీనివాసరావు, ప్రసూతి విభాగాధిపతి ప్రొ.డి.పార్వతి, డిప్యూటీ ఆర్ఎంవో డా.రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు జరిమానా నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

కలెక్టరేట్(శ్రీకాకుళం),న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకనంలో మార్కుల వ్యత్యాసం గుర్తిస్తే సంబంధిత ఉపాధ్యాయులకు జరిమానా విధించడం, సర్వీసు పాయింట్ల కోత సరైన విధానం కాదని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.రవి, బుక్కూరు వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. విద్యా శాఖ నిర్ణయాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. మూల్యాంకనంలో ప్రవేశపెట్టిన రెండంచెల, మాన్యువల్ విధానాన్ని స్వాగతిస్తున్నప్పటికీ తక్కువ వ్యవధిలో పూర్తి చేయాలని ఒత్తిడి తీసుకురావడం తగదని పేర్కొన్నారు. రోజుకు 40 పేపర్లకు బదులు 30 ఇవ్వాలని.. మూల్యాంకన ధరలు పెంచాలని డిమాండు చేశారు.

బక్కచిక్కిన బాహుదా..!

ఇసుక అక్రమ తవ్వకాలతో రూపు కోల్పోయిన నది

న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

వైకాపా పాలనలో బాహుదా నదిని నిర్లక్ష్యం చేయడంతో రైతులు వ్యవసాయానికి, ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. 11 ఓపెన్ హెడ్ ఛానళ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించినా అమలుకు నోచుకోలేదు. మరోవైపు నదిలో ఎక్కడ చూసినా ఇసుకకు బదులు ఎర్ర, బురద మట్టి, పనికి రాని మొక్కలు కనిపిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో పొక్లెయిన్లతో ఇసుకను అక్రమంగా తవ్వేస్తుండటంతో వేసవిలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉండే అవకాశం ఉంది.

జలకళ లేని బాహుదా నది

పిల్ల కాలువను తలపిస్తోంది..

జగనన్న కాలనీలు, నాడు-నేడు పనుల పేరిట నదిలో ఇసుక తవ్వకాలు ప్రారంభమయ్యాక.. అనుమతులతో సంబంధం లేకుండా ఇతర ప్రాంతాలకు జోరుగా తరలిస్తున్నారు. తవ్వకాలు యథేచ్ఛగా సాగుతుండటంతో మరింత చిక్కిపోతోంది. నదిలో అక్రమంగా తవ్వేసిన ఇసుకను కొందరు సరిహద్దులోని ఒడిశా గ్రామాలు, తోటల్లో నిల్వ చేస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. గతేడాది అక్టోబరులో భారీ వర్షాలకు నిండుగా ప్రవహించింది. అదే ప్రాంతం ఇప్పుడు రాళ్లు, రప్పలతో నిండిపోయి పిల్ల కాలువను తలపిస్తోంది. ఫిబ్రవరిలోనే ఈ పరిస్థితి ఉంటే ఏప్రిల్, మేలో మరింత తీవ్రంగా ఉంటుందని పట్టణ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాం..

బాహుదా నది పరిరక్షణకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం. ఇప్పటికే ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాం. ఒడిశాతోనూ చర్చలు జరిగాయి. ఇసుక తవ్వకాలను అడ్డుకునేలా అధికారులకు సూచనలు చేస్తున్నాం. ఇచ్ఛాపురం పురపాలక సంఘ పరిధిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా గతేడాది వంశధార జలాలను అనుసంధానం చేశాం. గ్రామాల్లోనూ సమస్య ఉత్పన్నం కాకుండా అధికారులను అప్రమత్తం చేస్తాం. – బెందాళం అశోక్, ప్రభుత్వ విప్

(c) eenadu

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

తెరపై ఈనాడు

పలాసలో.. ఎస్వీ మ్యాక్స్: మన శంకర వరప్రసాద్‌గారు హరిశంకర్: ఫంకీ ఇచ్ఛాపురంలో.. మణికంఠ ఎల్ మ్యాక్స్: ఫంకీ, పూర్ణ: మన శంకర వరప్రసాద్‌గారు సోంపేటలో.. ఎస్ఎస్‌మ్యాక్స్: మన శంకర వరప్రసాద్‌గారు, శివ: ఫంకీ మందసలో.. మహేంద్ర: పాంచాలి – న్యూస్‌టుడే, పలాస, ఇచ్ఛాపురం, సోంపేట, మందస

దారి కనిపించడం లేదా.. గోడు వినిపించడం లేదా!

రెయ్యిపాడు సమీపంలో ప్రధాన మలుపు వద్ద రోడ్డు అధ్వానంగా మారింది. గడిచిన రెండు వారాల్లో ఈ రహదారిపై నాలుగు ద్విచక్ర వాహన ప్రమాదాలు చోటు చేసుకున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు అభివృద్ధికి రూ.80 లక్షలు మంజూరై ఏళ్లు కావస్తున్నా మెటల్ వేసి వదిలేస్తున్నారు తప్ప పనులు పూర్తి చేయలేదు. దీనిపై ఆర్అండ్‌బీ జేఈ జగదీష్‌ను వివరణ కోరగా రహదారి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

పాఠశాల పేరు మార్పునకు ఆమోదం

మాట్లాడుతున్న పురాధ్యక్షురాలు రాజలక్ష్మి, చిత్రంలో కమిషనర్ రమేష్

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం పట్టణాసుపత్రి మార్గంలోని పుర బాలికోన్నత పాఠశాల పేరును దాత పేరుతో మార్పు చేసేందుకు కౌన్సిల్ ఆమోదించింది. ఈ మేరకు దాత వంశీకుడు డా.కాదా వెంకట మన్మథకుమార్ వినతిపై తీర్మానం చేస్తూ, పాఠశాలకు కాదా లక్ష్మీకాంతమ్మ పేరును, వాణిజ్య సముదాయానికి కాదా మన్మథరావు పేరును ఆమోదించారు. పురాధ్యక్షురాలు పిలక రాజలక్ష్మి అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సాధారణ, వార్షిక బడ్జెట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. బడ్జెట్‌లో పేర్కొన్న అంశాలపై సభ్యులు ఆమోదం తెలపగా, పుర ఉపాధ్యక్షురాలు లాబాల స్వర్ణమణి కొన్ని అంశాలపై అభ్యంతరం తెలుపుతూ, తప్పులు సవరించాలని కోరారు. పురాభివృద్ధికి కీలకమైన ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుల విషయంలో అధికారుల గణాంకాలను తప్పు పట్టారు. రియల్ ఎస్టేట్ విస్తరణ జరుగుతోందని, అక్కడ ఖాళీ స్థలాల యజమానులను గుర్తించాలని, గతంలో పూరిల్లుకు పన్ను మినహాయింపు ఇవ్వగా, అదే స్థలంలో పక్కా ఇంటిని నిర్మించుకున్నా, పన్ను వేయకపోవడంతో పురాదాయానికి గండిపడుతోందన్నారు. ఈ విషయాలు పరిగణనలోకి తీసుకుని, బడ్జెట్‌ను సరిచేయాలని స్వర్ణమణి కోరారు. పుర కార్యాలయ భవన సుందరీకరణ పనులకు ఇప్పటికే రూ. 12.95 లక్షల ప్రణాళికేతర నిధులు వెచ్చిస్తున్నారు. అవి సరిపోకపోవడంతో అదనంగా సాధారణ నిధుల నుంచి రూ.4 లక్షలు కేటాయిస్తూ తీర్మానించారు. ఈ సమావేశంలో పురాధ్యక్షురాలు ఉలాల భారతీదివ్య, కమిషనర్ నల్లి రమేష్, మేనేజర్ అప్పలస్వామి, ఏఈ కిశోర్, జానకీరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చర్చల్లో పాల్గొన్న పుర ఉపాధ్యక్షులు భారతీదివ్య, స్వర్ణమణి

ఇంటి పన్ను.. గ్రామాభివృద్ధికి దన్ను

డివిజన్‌లో రూ. 3.25 కోట్లు వసూలు

– న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

పల్లెల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే నిధులు ఒక ఎత్తయితే.. ఇంటి పన్నులు మరో ఎత్తు. ఈ మేరకు ఈ ఏడాది పంచాయతీ అధికారులు పన్నుల సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టారు. నూరు శాతం వసూలు చేయడానికి డీఎల్‌పీవోలు, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు సైతం గ్రామాల్లో తిరుగుతూ పర్యవేక్షిస్తున్నారు. పలాస డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లో ఇప్పటివరకు 57 శాతం పన్నులు సేకరించగా.. దాదాపు రూ. 3.25 కోట్లు వసూలైంది.

పలాస మండలం కొత్తపూరులో ఇంటి పన్ను సేకరిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో వైకుంఠరావు

✸ పల్లెల్లో ఇంటి పన్ను సక్రమంగా వసూలు చేస్తే అది గ్రామాభివృద్ధికి ముఖ్యమైన వనరుగా మారుతుంది. వాటిని ప్రణాళికతో వినియోగిస్తే గ్రామాల్లో రహదారులు, కాలువల నిర్మాణం, శుభ్రపరచడం, వీధి దీపాల ఏర్పాటుతోపాటు నిర్వహణ, తాగునీటి సరఫరా మెరుగుదల, చెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణ, దోమల నివారణకు చర్యలు తదితర కార్యక్రమాలు చేపట్టవచ్చు. ప్రభుత్వంపై పూర్తిగా ఆధారపడకుండా స్వయంగా చిన్న చిన్న అభివృద్ధి పనులు చేసుకోవచ్చు.

నియోజకవర్గాల వివరాలు

మండలం	పంచాయతీలు	మొత్తం ఇళ్లు	సేకరించింది (రూ. లక్షల్లో)	సేకరించాల్సింది (రూ. లక్షల్లో)
పలాస	19	12,646	33.67	15.76
వజ్రపుకొత్తూరు	37	22,040	56.16	29.68
మందస	41	23,418	51.69	50.16
సోంపేట	23	24,621	101.58	93.41
కంచిలి	31	18,163	31.2	14.4
కవిటి	23	21,253	35.26	28.54
ఇచ్ఛాపురం	21	12,462	15.66	9.93

నెలాఖరులోగా పూర్తి

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో ఇంటి పన్ను ముమ్మరంగా వసూలు చేస్తున్నాం. నిర్ణీత గడువులోగా లక్ష్యం పూర్తి చేస్తాం. ఈ నెలాఖరులోగా నూరు శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. సిబ్బందికి ప్రజలందరూ సహకరించాలి.

– ఇప్పిలి వెంకటరమణ, డీఎల్‌పీవో, పలాస

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 8008574279 9063144707

సమస్య: కస్పాగౌడవీధి నుంచి పెద్దవీధికి వెళ్లే మార్గం ఇబ్బందికరంగా ఉంది.- **పి.నారాయణ రెడ్డి, ఇచ్ఛాపురం** **సమాధానం:** నిధుల మేరకు రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదించి, పనులు చేపడతాం. – **నల్లి రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం**

సమస్య: ప్రధాన రహదారి నుంచి ఎల్లమ్మ గుడి వీధికి వెళ్లే మార్గంలో ఉన్న కల్వర్టును మూసేసి, మట్టితో పూర్తిస్థాయిలో పూడ్చకపోవడంతో ప్రమాదకరంగా మారింది.- **స్థానికులు** **సమాధానం:** స్లాబు కల్వర్టు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేస్తాం. - **డి.విక్రమ్, ఆర్అండ్‌బీ శాఖ ఏఈ, ఇచ్ఛాపురం** – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

పొదల తొలగింపు

కొళిగాం నుంచి అరకభద్ర వెళ్లే ప్రధాన రహదారిపై ముళ్ల పొదలు ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పలేదు. ఈ విషయమై ఈనెల 17న 'ముళ్ల కంపలు..వాహనదారులకు తిప్పలు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి ఏవో కె.రామారావు స్పందించి సిబ్బందిలో కంపలు తొలగించారు.

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

నీరు నింపారు

స్పందనకు వందనం

కత్తివరంలో పశువుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటి తొట్టెలో నీరు లేకపోవడంపై ఈ నెల 5న 'నీరుండదు... దాహం తీరదు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి పంచాయతీ కార్యదర్శి పవన్ కుమార్ బుధవారం స్పందించారు. సిబ్బందితో తొట్టెలో నీరు నింపారు.

– న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

చెక్‌డ్యాం.. లీకులమయం

సింగుపురం వద్ద సునాముధి కాలువపై రాజుల కాలంలో నిర్మించి చెక్‌డ్యాం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీని ద్వారా 500 ఎకరాలకు సాగునీరు అందుతుంది. ప్రస్తుతం మరమ్మతులకు గురవడంతో సాగునీరు వృథాగా పోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఏటా శ్రమదానంతో ఇసుక బస్తాలతో నీటి వృథాను అరికడుతున్నారు. వేసవిలో పూర్తిస్థాయిలో బాగు చేస్తామని జలవనరులశాఖ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. – న్యూస్‌టుడే, మందస

అంతిమ యాత్రకు అష్టకష్టాలు

జగతిలో శ్మశానానికి వెళ్లే రహదారి చుట్టూ ముళ్ల పొదలతో మూసుకుపోయింది. దీంతోపాటు ఇసుక రోడ్డు కావడంతో పలు చోట్ల గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. మృతదేహాన్ని శ్మశానానికి తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇన్‌ఛార్జి కార్యదర్శి రమేష్ బెహరాను వివరణ కోరగా సర్పంచి, ఉపాధి సిబ్బందితో మాట్లాడి పొదలు తొలగించి, రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

నిత్య వెలుగులు.. లేకుంటే చిమ్మ చీకట్లు

సున్నాడలోని మధ్య వీధిలో రెండు, శివాలయం దగ్గర ఒకటి, సున్నాడ కూడలి వద్ద మూడు మొత్తం ఆరు వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి పూట రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని గ్రామస్థులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండి వీధిలో రెండు వీధి దీపాలు నిరంతరం వెలుగుతున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దీనిపై డిప్యూటీ ఎంపీడీవో మెట్ట వైకుంఠరావు దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

కప్పు పాడైంది.. ముప్పు పొంచి ఉంది..

కర్లి వద్ద రహదారికి ఆనుకుని ఉన్న మంచినీటి సరఫరా నియంత్రణకు ఏర్పాటు చేసిన వాల్వ్ కుండీ పైకప్పు పాడైంది. రహదారిపై స్పీడ్ బ్రేకర్‌ను తప్పించే క్రమంలో అదుపు తప్పి ప్రమాదం సంభవించొచ్చని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి ఎన్.మన్మథరావు వద్ద ప్రస్తావించగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

పార్కింగ్ స్థలం కాదు..

గోర్జీవీధిలోని ఇరుకు మార్గంలో రోడ్డుపైనే వాహనాలు నిలపడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ వీధిలో ఒక బ్యాంకుతోపాటు ఆరు ఆసుపత్రులు, రెండు ప్రైవేటు వసతిగృహాలు, 8 వ్యాపార సంస్థలు, రెండు గోదాములు ఉన్నాయి. తరచూ పోలీసు వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నా, వారూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై దృష్టిసారించి, పరిష్కార చర్యలు తీసుకుంటామని సీఐ ఎం. చిన్నంనాయుడు తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

సోలార్ ఎల్ఈడీ దీపాల పరిశీలన

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలంలోని పలు సముద్ర తీరాల్లో ఏర్పాటు చేసిన సోలార్ ఎల్ఈడీ దీపాలను నెడ్ క్యాప్ డీవో సతీష్ బుధవారం పరిశీలించారు. డోకులపాడు, నువ్వలరేవు, వజ్రపుకొత్తూరు, అక్కుపల్లి, మంచినీళ్లపేట తదితర తీర ప్రాంతాలను సందర్శించి దీపాలు తనిఖీ చేశారు. మత్స్యకారులు సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే సమాచారమివ్వాలని కోరారు. ఆయనతోపాటు సంస్థ ప్రతినిధి ఢిల్లీరావు, నాయకులు శ్రీనివాసరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

డోకులపాడు తీరంలో దీపాలు పరిశీలిస్తున్న డీవో సతీష్

ఆర్థిక సాయం

బూర్జపాడు గ్రామానికి చెందిన బుంగ యోగేశ్వరరావు చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. నిరుపేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులకు ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన రాధాకృష్ణ యువజన సంఘ ప్రతినిధులు బుధవారం బాధిత కుటుంబానికి రూ.65,137 ఆర్థిక సాయం అందజేశారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

డోలోత్సవాలు ప్రారంభం

బెజ్జిపుట్టుగలో చక్రధర పెరుమాళ్ స్వామి డోలోత్సవాలు, చతుర్థ బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం ధర్మకర్త పొందల కృష్ణారావు ఆధ్వర్యంలో స్వామికి సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయగా. సాయంత్రం ఏర్పాటు చేసిన హరికథా గానం అందరినీ ఆకట్టుకుంది.

– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

దాతల సహకారం అభినందనీయం

మందస, న్యూస్‌టుడే: పాఠశాల అభివృద్ధికి దాతలు ఆర్థికంగా సహకరించడం అభినందనీయమని ఎంఈవో ఎం.లక్ష్మణరావు అన్నారు. పొత్తంగి-సిరిపురం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం గతంలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన రాజారావు రూ.70 వేలు, ఎస్ఎంసీ సభ్యులు రూ.1.50 లక్షలతో నిర్మించిన స్టోర్ గదిని ఎంఈవో ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు ఎన్.తారకేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్య ప్రదర్శన

ఒత్తిడికి గురికావద్దు

క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, విలువలతో కూడిన విద్యను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి.విలియమ్స్ అన్నారు. గోవిందపురం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు హరిబాబు నేతృత్వంలో పాఠశాల వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండాలని హితవు పలికారు. అనంతరం పాఠశాలకు రూ.70 వేలతో గ్రిల్స్ ఏర్పాటు చేసిన 2005-06 బ్యాచ్ విద్యార్థులను సత్కరించారు. జిల్లాస్థాయి క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఎంఈవో దాశరథి, వ్యాయామోపాధ్యాయుల జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు తవిటయ్య, ఉపాధ్యాయులు లక్ష్మణరావు, శ్రీరామ్మూర్తి, సీతమ్మ పాల్గొన్నారు.

కూటమితోనే అభివృద్ధి సాధ్యం

మాట్లాడుతున్న జనసేన నియోజకవర్గ సమన్వయకర్త దాసరి రాజు

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త దాసరి రాజు అన్నారు. రాజపురం, కమలాయిపుట్టుగ, బలరాంపురం, లండారిపుట్టుగ, ఇనేసుపేట రహదారి రాళ్లు తేలి ఉండటంతో విద్యార్థులు గాయాల పాలవుతున్నారని సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో బుధవారం బాధితులను పరామర్శించారు. అనంతరం గ్రామ పెద్దలు, కూటమి నాయకులతో సమావేశమై కొత్త రోడ్డు వేసేందుకు ఇప్పటికే ఎమ్మెల్యే అశోక్ ద్వారా ప్రభుత్వానికి తెలియజేశామని త్వరలోనే రోడ్డు నిర్మిస్తామని తెలిపారు. తిప్పన దుర్యోధన, భాస్కర్ పాల్గొన్నారు.

పింఛను మంజూరుకు వినతి

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఈదుపురానికి చెందిన సుధామ బెహరాకు 89 శాతం శారీరక వైకల్యం ఉందని సదరం ధ్రువపత్రం ఉన్నా దివ్యాంగ పింఛను అందడం లేదని కుటుంబ సభ్యులు వాపోయారు. ఈ మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి దృష్టికి బుధవారం సమస్యను తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు. వైకల్యం కారణంగా ఉపాధిలేక ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు చర్యలు తీసుకొని పింఛను మంజూరు చేయాలని కోరారు.

ఉల్లాసంగా క్రికెట్ పోటీలు

కవిటి, న్యూస్‌టుడే: కవిటి మండలం పాత కొజ్జిరియాలో స్థానిక యువత ఆధ్వర్యంలో ఎల్‌వీఎస్ మెమోరియల్ మెగా క్రికెట్ పోటీలు ఉల్లాసభరితంగా సాగుతున్నాయి. బుధవారం బ్రహ్మపుర, ముచ్చింద్ర జట్లు తలపడగా ముచ్చింద్ర జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. అనంతరం నెలవంక, బెల్లుపడ జట్ల మధ్య సాగిన పోటీలో నెలవంక గెలుపొందింది.

నందికేశ్వర చక్రతీర్థ ఉత్సవం

బెండిలో కొలువైన నందికేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శివస్వామి మాలధారణ భక్తులు చక్రతీర్థ స్నానోత్సవం నిర్వహించారు. ఆలయం దరిన ఉన్న మహేంద్రగిరి నదిపాయలో పుణ్యస్నానాలు ఆచరించి అభిషేక పూజలు చేశారు. ఊరేగింపు నిర్వహించారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

కరపత్రాల ఆవిష్కరణ

కవిటి గ్రామీణం: కొండిపుట్టుగ ప్రాథమిక పాఠశాలలో ఈనెల 28న సైన్స్ డేను పురస్కరించుకుని ఉత్తరాంధ్ర ప్రాథమిక స్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నారు. బుధవారం వాటికి సంబంధించిన కరపత్రాలను ఎంఈవోలు ధనంజయ, రామకృష్ణ ఆవిష్కరించారు.

ప్రింటర్ వితరణ.. మందస: కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో గతంలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేసిన నగిరి లీలారాణి పాఠశాలకు ఎలక్ట్రానిక్ ప్రింటర్ వితరణ చేశారు. దాన్ని భర్త జగదీశ్వరరావుతో కలిసి బుధవారం పాఠశాలకు అప్పగించారు.

సరెండర్ లీవ్ బిల్లులు విడుదల చేయండి

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ బిల్లులు వెంటనే చెల్లించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.చందనరావు డిమాండ్ చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా గోవిందపురం, అమలపాడు, పీఎంపురం, పాతటెక్కలి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 2003 డీఎస్సీ వారికి పాత పింఛను విధానం అమలు, స్టాండింగ్ కమిటీలో ఆమోదం పొందిన మెడికల్ బిల్లులకు నిధులు విడుదల చేయాలని కోరారు. సతీశ్‌కుమార్, శివప్రసాద్, గున్నయ్య, నాగభూషణం, తులసీదాసు పాల్గొన్నారు.

పర్యవేక్షణ కరవాయె.. క్లోరినేషన్ లేదాయె..

పల్లె ప్రజలకు అందని శుద్ధజలం..

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

ప్రజలకు సురక్షిత జలం అందించేందుకు ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యమిస్తున్నా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కరవై లక్ష్యం నీరుగారుతోంది. గ్రామాల్లో ఉన్న ట్యాంకులను 15 రోజులకోసారి క్లోరినేషన్ చేయాలన్న నిబంధన ఉన్నా.. ఎక్కడా అమలు కావడం లేదు.

✪ చాలా చోట్ల రక్షిత తాగునీటి సరఫరా పథకాల మెట్లు శిథిలావస్థకు చేరాయి. మరికొన్ని చోట్ల మరమ్మతులకు గురయ్యాయి. పలు ప్రాంతాల్లో చాలా ఏళ్ల కిందట నిర్మించిన ట్యాంకులు పెచ్చులూడుతున్నాయి. ఈ క్రమంలో పైకి వెళ్లేందుకు వీలు కాకపోవడంతో ఆయా చోట్ల క్లోరినేషన్ చేయడం లేదు.

✪ దీనికి తోడు బోర్ల పైపులు దెబ్బతిని కలుషిత నీరు వస్తున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. ఎక్కడా నీటి పరీక్షలు నిర్వహించకపోవడంతో ప్రజలకు శుద్ధజలం అందడం లేదు. ✪ మరమ్మతులకు గురైన పైపులు, శిథిలమైన మెట్లు, అక్కడక్కడ పడిన లీకులకు సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో ప్రజలు శుద్ధజలానికి దూరమవుతున్నారు. నియోజకవర్గంలో ఈదుపురం, తేలుకుంచి, జగన్నాథపురం, బెనుగానిపేట, మండపల్లి, ధర్మపురం, పి.శాసనం, బొడ్డబడ, కీర్తిపురం తదితర ప్రాంతాల్లో లీకులతోపాటు మెట్లు శిథిలావస్థకు చేరాయి.

ధర్మపురంలో మంచి నీటి పథకం ట్యాంకు మెట్ల దుస్థితి

నియోజకవర్గంలో మంచినీటి పథకాల వివరాలు..

మండలం	పంచాయతీలు	బోర్లు	పాడైనవి	ఎన్టీఆర్ సుజల	పనిచేయనివి
ఇచ్ఛాపురం	21	323	18	11	6
కవిటి	23	659	29	38	35
కంచిలి	31	600	21	19	14
సోంపేట	23	483	23	16	6

ఓవర్ హెడ్ ట్యాంకులు ఇచ్ఛాపురం: 22, కవిటి: 19, కంచిలి: 52, సోంపేట: 20, ఇందులో సగానికి సగం శిథిలావస్థకు చేరాయి.

త్వరలో పరిష్కరిస్తాం

నియోజకవర్గ పరిధిలో నూతన మంచి నీటి పథకాల ఏర్పాటుకు సంబంధించి రూ.106 కోట్లు మంజూరయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. ప్రస్తుతం వేసవిలో పల్లెల్లో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. – ఏవీ మురళీ మోహన్, డీఈ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, ఇచ్ఛాపురం

ఈ నెల రోజులే కీలకం

గొనపపుట్టుగ పాఠశాలలో విద్యార్థిని సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో ధనంజయ

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులకు ఈ నెల రోజులు కీలకమని, ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో ధనంజయ మజ్జి అన్నారు. బుధవారం గొనపపుట్టుగ ఉన్నత పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థుల 100 రోజుల ప్రణాళికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రధానోపాధ్యాయుడు వీరభద్రరావు, ఉపాధ్యాయులు బాబూరావు, ప్రసాద్‌బాబు, శ్రీనివాస్, మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనకు చర్యలు

దస్త్రాలు పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి

కంచిలి, సోంపేట, న్యూస్‌టుడే: కంచిలి, సోంపేట, మందస మండలాల్లో నాటు సారా నిర్మూలనకు మరిన్ని చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ జిల్లా డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. బుధవారం కంచిలి, సోంపేట ఎక్సైజ్ కార్యాలయాలను సందర్శించి గతంలో జరిగిన కేసులు, వాటి వివరాలు పరిశీలించారు. నాటుసారా నిర్మూలనకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. సీఐ జీవీ రమణ, ఎస్సైలు జగన్నాథం, ప్రసాద్, సిబ్బంది మార్కారావు, భాను, అరుణ్, ఉమాపతి పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు సద్వినియోగపరుచుకోండి

పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సోంపేట సహాయ సంచాలకుడు డాక్టర్ కె.అప్పలస్వామి తెలిపారు. మండపల్లిలో పశువైద్యాధికారిణి శిరీష ఆధ్వర్యంలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. గర్భకోశ వ్యాధులకు చికిత్స నిర్వహించి, ఏలికపాములు, ఇతర మందులు అందజేశారు. ధనంజయ, రమణ, కృష్ణారావు, మన్మథరావు, దామోదర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కంచిలి

ఓటర్ల జాబితా సిద్ధం చేయండి

పలాస గ్రామీణం: ప్రతి పంచాయతీలోనూ ఓటర్ల జాబితాలు వార్డుల వారీగా సిద్ధం చేయాలని డిప్యూటీ ఎంపీడీవో మెట్ట వైకుంఠరావు ఆదేశించారు. పలాస ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాల్లో తప్పుల్లేకుండా సరిచూసుకోవాలని సూచించారు. డిప్యూటీ ఎంపీడీవో(జీఎస్‌డబ్ల్యూఎస్) ఉమాపతి పాల్గొన్నారు.

కాశీబుగ్గలో చోరీకి యత్నం

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: కాశీబుగ్గలోని ఓ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయంలో బుధవారం తెల్లవారుజామున కొంతమంది చోరీకి యత్నించారు. 3 గంటలప్పుడు కార్యాలయ తాళాలు తీసేందుకు కొందరు ప్రయత్నిస్తుండగా.. అదే సమయంలో అటుగా వచ్చిన వాహనాలను చూసి పరారయ్యారు. ఈ మేరకు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

పని ఒత్తిడి తగ్గించండి

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: అధిక పని భారంతో ఒత్తిడికి గురవుతున్నామని మండల వీఆర్వో సంఘం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్వోలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. రెవెన్యూ రహిత సర్వే పనుల నుంచి తమకు ఉపశమనం కలిగించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. సంఘం ప్రతినిధులు వెంకటరావు, వసంతరావు, శ్రీధర్, రామకృష్ణ, ఇందిర ప్రియదర్శిని పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న వీఆర్వోలు

అదనపు గృహ నిర్మాణ సాయం వినియోగించుకోవాలి

సోంపేట: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న గృహ నిర్మాణం అదనపు సాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని గృహ నిర్మాణ శాఖ పీడీ రమాకాంతారావు అన్నారు. బుధవారం డీఈఈ సత్యారావుతో కలిసి జింకిభద్రలో లేఅవుట్‌ను పరిశీలించారు. మార్చి నెలాఖరుకు నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు అదనంగా రూ.50 వేలు, రూ.75 వేలు అందించనున్నట్లు చెప్పారు. ఏఈలు రవికాంత్, దిలీప్ పాల్గొన్నారు.

900 మందికి ఆల్బెండజోల్ మాత్రలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం జ్ఞానభారతి విద్యాసంస్థలోని 900 మంది విద్యార్థులకు బుధవారం ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. అర్బన్ పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి జోహర్‌ఖాన్, హెచ్‌ఎం రషీదా సుల్తానా, ప్రిన్సిపల్ ఐబీ పండా, ట్రస్టీ సభ్యులు వజ్రపు రమణమూర్తి పాల్గొన్నారు.

(c) eenadu

టెక్కలి

● టెక్కలి ● నరసన్నపేట ● పాతపట్నం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజాసమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యులదృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

ప్రశ్న: నందిగాం మండలం ఉయ్యాలపేట కూడలి నుంచి గ్రామం వరకు రహదారి గోతుల మయంగా ఏర్పడటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. - శ్రీనివాసరెడ్డి, ఉయ్యాలపేట

సమాధానం: ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైతే బీటీ రహదారి ఏర్పాటు చేస్తాం. - మోహన్, ఏఈ, పీఐయూ శాఖ, నందిగాం

– న్యూస్‌టుడే, నందిగాం

శ్రీముఖలింగం ఆలయం వద్ద ఉత్సవమూర్తుల ఊరేగింపు

పాతపట్నం: మహేంద్రతనయ నదిలో నీలకంఠేశ్వర స్వామి చక్రతీర్థ స్నానంలో భక్తులు

చక్రతీర్థస్నానం.. పరవశించే భక్తజనం

జలుమూరు, నరసన్నపేట, ఎల్‌ఎన్‌పేట, పాతపట్నం, సారవకోట, న్యూస్‌టుడే: నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల వ్యాప్తంగా చక్రతీర్థస్నానాలు బుధవారం వైభవంగా జరిగాయి. వంశధార, మహేంద్రతనయ నదుల సమీపంలో ఉన్న శివాలయాల్లో ఉత్సవమూర్తులను మేళతాళాలతో ఊరేగింపుగా నదికి తీసుకొచ్చిన జలాలతో పుణ్యస్నానం ఆచరించారు. సైకత శివలింగాలు నిర్మించి పూజలు చేశారు.

శ్రీముఖలింగేశ్వర స్వామి దర్శనం కోసం క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు

ఆలయం ముందు తీన్మార్ వాయిద్యాకారుల సందడి

వంశధార నది నుంచి కరకట్టపైకి వస్తున్న భక్తులు

ముఖ్యాంశాలు.. ● గ్రామీణ తాగునీటి విభాగం ఆధ్వర్యంలో వంశధార నది వద్ద 2 లక్షలు తాగునీటి ప్యాకెట్లు అందించారు. ● లక్ష్మీపురానికి చెందిన కరణం జ్యోత్స్న అస్వస్థతకు గురయ్యారు. ఆలయం ముందు భక్తులు కొబ్బరి కాయలు విసరడంతో మాకివలసకు చెందిన పైల నారాయణరావు గాయపడ్డారు. వీరిద్దరికి వైద్య సిబ్బంది చికిత్స చేశారు. ● పోలీసులు నిబంధనలు అమలు చేసినప్పటికీ నగిరికటకం వద్ద కొద్ది సమయం ట్రాఫిక్ నిలిచింది. ● మహిళలు దుస్తులు మార్చుకునేందుకు గుడారాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశాలు ఎక్కడ కానరాలేదు. ● వంశధార నదిలో తగిన నీరు లేకపోవడంతో ఇసుక తిన్నెలపైనే భక్తులు స్నానాలు చేశారు. ● నగరికటకం, శ్రీముఖలింగం, కరకవలస తదితర ప్రాంతాల వద్ద దాతలు అన్నదానం, మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు.

ఖాళీలుంటే.. కీలకపాత్ర పోషించేదెలా..?

గ్రామ సర్వేయర్ల పోస్టులు భర్తీ కాక ప్రజలకు తప్పని పాట్లు

– న్యూస్‌టుడే, కొత్తూరు

పల్లెల్లో భూసర్వేతో పాటు ఇతర సమస్యల పరిష్కారంలో ముఖ్య భూమిక పోషించి పాలనలో ముందడుగు వేసేందుకు కీలకంగా ఉన్న గ్రామ సర్వేయర్ పోస్టులు చాలా వరకు ఖాళీగా ఉన్నాయి. ఇవి భర్తీకి నోచుకోక, ప్రభుత్వ సేవలకు ప్రజలు నానా పాట్లు పడుతున్నారు. గతంలో నియామకమైన అధికారుల్లో కొంతమంది డిప్యూటేషన్‌పై, మరికొందరు ఇతర ఉద్యోగాలకు వెళ్లిపోవడమే ఇందుకు కారణం. ముఖ్యంగా పాతపట్నం నియోజకవర్గంలోని రీసర్వే చేయాల్సిన పలు గ్రామాల్లో రైతులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు.

◆ గ్రామస్థాయిలో ప్రభుత్వ భూములను పరిరక్షించడంలో సర్వేయర్ల పాత్ర కీలకం. పటాల ఆధారంగా సర్వే చేసి వాటికి హద్దులు కేటాయించాల్సి వీరే. భూములు కొనుగోలు, అమ్మకాల ప్రక్రియలో సర్వేయర్ల నివేదికే కీలకం. దీంతో ప్రజలు సచివాలయాలకు వెళ్లి వారి పనులు జరగక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కొత్తూరు మండలంలో భూసర్వే చేస్తున్న ఉద్యోగులు

అధికారుల చర్యలేవి..?

◆ కొత్తూరు మండలంలోని సిరుసువాడ, నివగాం, కురిగాం, గూనభద్ర, బమ్మిడి, సోమరాజపురం, మెట్టూరు బిట్-2, ఓంద్రుజోల, మదనాపురం, కొత్తూరు-2, నేరడి సచివాలయాల్లో సర్వేయర్లు లేరు. హిరమండలం మండలంలోని కిట్టాలపాడు, హిరమండలం-1, అంబాళ్లి, పిండ్రువాడ సచివాలయాల్లో సర్వేయర్ల పోస్టులు గత కొన్ని నెలలుగా ఖాళీగా ఉన్నాయి.

◆ మెళియాపుట్టి మండలంలో ఏకంగా 12 గ్రామ సచివాలయాల్లో పోస్టులు ఖాళీగా ఉండటంతో పక్క సచివాలయాల నుంచి ఇన్‌ఛార్జిలతో కాలం వెల్లదీస్తున్నారు. ఎల్‌ఎన్‌పేట, పాతపట్నం మండలాల్లో వివిధ చోట్ల సర్వేయర్లను నియమించాల్సి ఉంది.

పాతపట్నం నియోజకవర్గ వివరాలు

మండలం	పంచాయతీలు	సచివాలయాలు	ఉన్నవారు	ఖాళీలు
కొత్తూరు	43	27	16	11
హిరమండలం	23	13	9	04
మెళియాపుట్టి	37	21	9	12
ఎల్ఎన్‌పేట	22	12	9	3
పాతపట్నం	34	18	15	03

త్వరలోనే భర్తీ చేస్తాం..: పాతపట్నం నియోజకవర్గంలో గ్రామ సర్వేయర్ల పోస్టు భర్తీకి చర్యలు తీసుకుంటాం. సర్వేయర్లతో పాటు సచివాలయ ఉద్యోగుల పోస్టులపైనా కలెక్టర్‌కు నివేదించాం. త్వరలోనే సమస్యను కొలిక్కి తీసుకొస్తాం.

- మామిడి గోవిందరావు, ఎమ్మెల్యే, పాతపట్నం

కరకట్టలు ఆధునికీకరించాలి

– ఎమ్మెల్యే రమణమూర్తి

నరసన్నపేట, న్యూస్‌టుడే: వంశధార ఎడమ కాలువ ఆధునికీకరణ, కరకట్టల నిర్మాణాలు చేపట్టాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రభుత్వానికి కోరారు. రాష్ట్రశాసనసభలో బుధవారం ఆయన శూన్య గంటలో మాట్లాడారు. నరసన్నపేట, టెక్కలి, పలాస నియోజకవర్గాల్లోని సాగు భూములకు నీరందించాలన్నారు. వంశధార వరదల సమయంలో ముప్పు వాటిల్లకుండా కరకట్టల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

వంతెనల నిర్మాణం చేపట్టండి

– ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో పాతపట్నం, బూరగాం, జిల్లేడుపేట గ్రామాల వద్ద మహేంద్రతనయ, వంశధార నదులపై వంతెనలు నిర్మించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. రాష్ట్ర శాసనసభలో శూన్య గంటలో ఎమ్మెల్యే మాట్లాడారు. వెనకబడిన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేయాలన్నారు.

బోర్డు కనుమరుగు..

కొత్తూరు మండలంలోని ప్రధాన పీహెచ్ రహదారిలో కొత్తూరు నుంచి ఒడిశాలోని హడ్డుబంగి వెళ్లే అంతర్రాష్ట్ర రహదారిలో మహర్తాపురం గ్రామాన్ని సూచించే బోర్డు చుట్టూ పనికిరాని మొక్కలు ఏపుగా పెరగడంతో కొందరు అయోమయానికి గురవుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారు ఇది ఏ ఊరో స్థానికులను అడుగుతున్న పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి, చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఆర్‌అండ్‌బీ ఏఈ గోపాలరావు మాట్లాడుతూ బోర్డును సరిచేసి, ఇబ్బందులను తీరుస్తామన్నారు. - న్యూస్‌టుడే, కొత్తూరు

కాలే వరకు కాంతులే..

నరసన్నపేట మండలం ముసిడి గట్టులో విద్యుత్తు దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. దీంతో విద్యుత్తు వృథాతో పాటు దీపాలు మరమ్మతులకు గురవుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి సింధూరి వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

మందుబాబులకు అడ్డా.. భవితకేంద్రం

కోటబొమ్మాళి మేజర్ పంచాయతీ కార్యాలయం పక్కనే ఉన్న సహిత విద్యాకేంద్రం మందుబాబులకు అడ్డాగా మారింది. రోజూ రాత్రి సమయంలో కొంత మంది మద్యం తాగి సీసాలను ఇక్కడే పడేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. దివ్యాంగ చిన్నారులకు చెందిన ఈ కేంద్రం నిర్వహణను అధికారులు పట్టించుకోలేదని, ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. చర్యలు తీసుకుంటానని ఎంపీడీవో కుప్పిలి ఫణీంద్రకుమార్ స్పష్టం చేశారు. – న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

రక్షణ లేకుంటే ప్రమాదమే!

నందిగాం మండలం కాపుతెంబూరు గ్రామానికి వెళ్లే దారిలో కోనేరుకు ఎదురుగా ఉన్న దారిలో విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. చేతి కందేఎత్తులో ఉండటంతో రక్షణ కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ దారిలో పలు వాహనాలతో పాటు విద్యార్థులు, చిన్నారులు రాకపోకలు సాగిస్తారని, ఎలాంటి ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించాలని అధికారులు కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి కంచె ఏర్పాటు చేస్తామని జేఈఈ నేతాజీ పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, నందిగాం

మలుపులో ముప్పు..

నరసన్నపేట మండలం కొత్తపోలవలస ప్రాథమిక పాఠశాల వద్ద మలుపులో పనికిరాని మొక్కలు రహదారికిరువైపులా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని వాహనచోదకులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వాటిని తొలగించి ప్రమాదాలు నివారించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని రహదారులు, భవనాలశాఖ ఏఈ శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు చేపడతామని తెలిపారు.

– న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

పిచికారీ సరే.. జాగ్రత్తలేవి మరి!

రైతుల ఆరోగ్య రక్షణకు వ్యవసాయాధికారుల సూచనలు

గొనపపేటలో పురుగు మందులు పిచికారీ చేస్తున్న రైతు

– న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

ప్రస్తుతం రబీ వరి పిలక దశలో ఉండటంతో ఈ సమయంలో ఆశించే తెగుళ్ల నుంచి పంటను రక్షించుకోవడానికి పురుగు మందులు పిచికారీ చేయాల్సి ఉంటుంది. వివిధ రకాల పురుగులు, వీటివల్ల నివారణకు ఈ ప్రక్రియ తప్పనిసరి. పిచికారీ సమయంలో అన్నదాతలు తగిన జాగ్రత్తలు పాటించకుంటే పలు అనారోగ్య సమస్యలు వస్తాయని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు.

◆ పొలాల్లో మందులు పిచికారీ చేసే రైతులు, కూలీలు ఎలాంటి రక్షణ లేకుండా పని చేస్తుంటారు. ఇలాంటి సందర్భాల్లో గాలివాలుకు ఎదురుగా మందులు పిచికారీ సమయాల్లో వాసన పీల్చడం, శరీరంపై పడటం తదితర కారణాలతో ఆరోగ్యం దెబ్బతింటుంది. ◆ పొలం పిలుస్తోంది, రైతు సదస్సు కార్యక్రమాల్లో రక్షణ విధానాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నా పట్టించుకోవడం లేదని వ్యవసాయ అధికారులు అంటున్నారు. ఈ వ్యత్యాసం చేస్తున్నారు. రసాయన, పురుగు మందులు అప్పటికప్పుడు ప్రభావం చూపకపోయినా కొంత కాలం తర్వాత అనారోగ్య సమస్యలకు కారణమవుతాయి. రక్షణగా చేతికి, శరీరానికి వేసుకునే మాస్కులు, గ్లౌజులు బయట దుకాణాల్లో ఒకసారి కొనుగోలు చేస్తే చాలా కాలం రక్షణగా ఉపయోగపడతాయి.

◆ నరసన్నపేట నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 25 వేల మంది రైతులు సుమారు 35 వేల ఎకరాల్లో వరి సాగుచేస్తున్నారు.

ఇవి పాటించండి..

★ పిచికారీ సమయంలో ముఖానికి మాస్క్, చెప్పులు వేసుకోవాలి. ★ చేతులు పూర్తిగా కప్పేలా గ్లౌజులు వేసుకోవాలి. ★ కళ్లకు రక్షణగా కళ్లద్దాలు ధరించాలి. ★ గాలివాలుకు ఎదురుగా పిచికారీ చేయకూడదు. ★ గుళికలు జల్లే సమయంలో ఎగిరే దుమ్ము పీల్చితే ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ★ పిచికారీ చేసిన తరువాత సబ్బుతో శుభ్రంగా స్నానం చేయాలి.

అప్రమత్తంగా ఉండండి..: రసాయన మందులు పిచికారీ సమయంలో కచ్చితంగా రక్షణ చర్యలు పాటించాలి. ప్రస్తుతం మార్కెట్లో లభించే మందులు అత్యంత శక్తిమంతమైనవి. వాటిని పీల్చడం, శరీరంపై పడటంతో ఊపిరితిత్తులు చెడిపోవడం, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తాయి.

- ఎల్.వి మధు, సహాయ సంచాలకుడు, వ్యవసాయశాఖ

దుకాణాలు తొలగించండి

టెక్కలి, న్యూస్‌టుడే: స్థానిక పాతజాతీయ రహదారిలో ఆర్టీసీ కాంప్లెక్స్ ముందుభాగంలో ఉన్న దుకాణాలన్నీ త్వరితగతిన ఖాళీ చేయాలని అధికారులు ఆదేశించారు. ఇప్పటికే పలుమార్లు చెప్పామని ఇంకా గడువుకోరే ఆలోచన మానుకోవాలన్నారు. తహసీల్దార్ సత్యం, ఎంపీడీవో రేణుక, ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది దుకాణ యజమానులతో మాట్లాడారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌ను దీర్ఘకాలిక లీజుకు అప్పగించడంతో వీటి తొలగింపు తప్పనిసరి అని స్పష్టంచేశారు. ఇతర ప్రాంతాల్లో ఏర్పాటుకు సహకారం అందిస్తామన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట దుకాణదారులతో మాట్లాడుతున్న అధికారులు

అపాయం వీడింది..

స్పందనకు వందనం

కోటబొమ్మాళి మేజర్ పంచాయతీ ప్రకాశ్‌నగర్ కాలనీ భవానీ సన్నిధానం వీధిలో విద్యుత్తుస్తంభం, తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. దీనిపై 'ప్రమాదం జరిగితే స్పందిస్తారా' శీర్షికతో ఈనాడులో ఈనెల 17న వచ్చిన వార్తకు ఏఈ కోటేశ్వరరావు, స్పందించి చర్యలు తీసుకున్నారు. – న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

జ్ఞానసాయికి అభినందన

చాపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి జ్ఞానసాయి పారా ఒలింపిక్ అథ్లెటిక్స్‌లో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందుకు ప్రధానోపాధ్యాయురాలు సలాన వ్యాసగీత, వ్యాయామోపాధ్యాయుడు జె.కృష్ణ అభినందించారు. బుధవారం పాఠశాల ఆవరణలో జ్ఞానసాయిని విద్యార్థుల మధ్య ప్రశంసించారు. ఎవరెస్ట్ పర్వతారోహణ బేస్ క్యాంప్‌లో భాగంగా లద్దాఖ్ శిక్షణకు ఎంపిక కావడంపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. – న్యూస్‌టుడే, మెళియాపుట్టి

విశ్రాంత సైనికాధికారికి సేవాపురస్కారం

మాజీ సైనికాధికారి సదాశివుని గణపతి పట్నాయక్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవాపురస్కారంతో గౌరవించింది. వెటరన్స్‌డే సందర్భంగా ఆయనకు విజయవాడలో హోంమంత్రి వంగలపూడి అనిత జ్ఞాపికతో మంగళవారం సత్కరించారు.

– న్యూస్‌టుడే, టెక్కలి

నేడు సత్యసాయి మందిరంలో లలితా సహస్రనామ పారాయణం

హిరమండలం, న్యూస్‌టుడే: స్థానిక సత్యసాయి మందిరంలో లలితా సహస్రనామ పారాయణం గురువారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. రాయ్‌పూర్‌కు చెందిన శ్రీ విద్యా ఉపాసకురాలు, ఆధ్యాత్మికవేత్త పి.అరుణ ప్రవచనం వినిపిస్తారన్నారు. ఉదయం 9.30 గంటలకు జగన్నాథస్వామి ఆలయం నుంచి సత్యసాయి మందిరం వరకు ర్యాలీ ఉంటుందన్నారు. పెద్ద ఎత్తున ప్రజలు హాజరు కావాలన్నారు.

పెద్దకేదారి సమస్యలు పరిష్కరించాలి

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: పెద్దకేదారి గ్రామంలో తాగునీటి కష్టాలు, పక్కా రహదారి సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవో నర్సింహ ప్రసాద్‌ను గ్రామస్థులు కోరారు. బుధవారం గ్రామాన్ని సందర్శించిన ఆయన దృష్టికి పలు సమస్యలను స్థానికులు తీసుకెళ్లారు. అనంతరం స్థానిక పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంఈవో- 2 ఎం.పద్మనాభరావు, ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మి, జ్యోత్స్న, గ్రామస్థులు పాల్గొన్నారు.

తాగునీటి కుళాయి పరిశీలిస్తున్న ఎంపీడీవో నర్సింహ ప్రసాద్

కళ్లద్దాల పంపిణీ

విద్యార్థులు ప్రతి రోజూ కంటి అద్దాలను విధిగా ఉపయోగించాలని వైద్యాధికారులు ఎన్.వరుణ్, జి.గురుమూర్తి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అంధత్వనివారణ సంస్థ నేతృత్వంలో బుధవారం కురుడు, కొత్తపల్లి ఉన్నతపాఠశాలల్లో 68 మంది విద్యార్థులకు కంటి అద్దాలను అందజేశారు. ప్రిన్సిపల్స్ కృష్ణారావు, శాంతకుమారి, ఆప్తాల్మిక్ సహాయకులు ఎన్ఆర్కే దాస్, వైద్య ఆరోగ్య సిబ్బంది గగనకుమారి, లలిత, దేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.- న్యూస్‌టుడే, ఎత్తురాళ్లపాడు (కోటబొమ్మాళి)

KVB Karur Vysya Bank Smart way to bank | ది కరూర్ వైశ్యాబ్యాంకు లిమిటెడ్

OPP: Police Station రోడ్ & వాటర్ ట్యాంకు, పాత బస్టాండ్ ఏరియా దగ్గరలో మెయిన్ రోడ్, నరసన్నపేట-532 421. Phone: 8008 29 33 55

బంగారు నగల వేలం ప్రకటన

ఈ క్రింది తెలుపబడిన ఖాతాదారులు బంగారు నగలపై మా శాఖలో అప్పు తీసుకొని సకాలంలో తమ బకాయి చెల్లించని కారణంగా బ్యాంకు నిబంధనలు ప్రకారం తేది: 06.03.2026 అనగా శుక్రవారం మధ్యాహ్నం గం॥ 3.00 లకు మా బ్రాంచి ఆవరణలో వేలం వేసి బాకీలు వసూలు చేసుకుందుమని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

షరతులు-నిబంధనలు: (1) వేలంలో పాల్గొనదలచినవారు రూ. 10,000/- ధరావత్తు కట్టి వేలంలో పాల్గొనవలెను. (2) హెచ్చు పాటదారుడు మొత్తం సొమ్ము అదే రోజు చెల్లించి వస్తువులను పొందవలెను. (3) నగల బరువుకు, నాణ్యతకు బ్యాంకువారి పూచీ ఏ మాత్రం లేదు. (4) ఏ విధమైన కారణం చూపకనే వేలం షరతులు మార్చుకొనుటకు గాని, వాయిదా వేయుటకు గాని, వేలం ఆపుటకు గాని రద్దు చేయుటకు గాని, బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు (5) అడ్రస్ నిర్ధారించిన ఆధార్ కార్డు కాపీని గాని, పాన్ కార్డు కాపీని గాని జత చేయవలెను. (6) ఈ ఖాతాదారుల్లో ఎవరైనను మరణించిన యెడల వారి వారసులకు ఈ ప్రకటన పూర్వకముగా తెలియపరిచినట్లుగా భావించవలెను. (7) అప్పు వసూలు నోటీసులు అందని వారు మరియు నోటీసులు తిరస్కరించిన వారు ఈ ప్రకటనను తుది నోటీసుగా భావించి వేలం తేదీలోగా సొమ్ము చెల్లించవలెను. (8) పాట దారుడు GST చెల్లించవలెను.

ఖాతా నెం॥	ఋణగ్రస్తుల పేర్లు మరియు చిరునామా	బకాయి మొత్తం	బంగారం బరువు గ్రా॥లలో
48219530000 27696	ధర్మాన కల్యాణకుమారి, డో.నెం. 1-223, ధర్మాన వీధి, మబగాం, పోలాకి మండలం, శ్రీకాకుళం జిల్లా-532 421	రూ. 3,58,451/-	85.1 గ్రాములు

తేది: 18-02-2026, ప్రదేశం: నరసన్నపేట. బ్రాంచి మేనేజరు, ది కరూర్ వైశ్యా బ్యాంకు, నరసన్నపేట

యువకుడికి గాయాలు

ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి),న్యూస్‌టుడే: జాతీయరహదారిపై కోటబొమ్మాళి మండలం కన్నేవలస వద్ద ఆగి ఉన్న లారీని ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో యువకుడు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. చీపుర్లపాడు పంచాయతీ ఊడికలపాడుకు చెందిన నేతింటి కుసుమకుమార్ ద్విచక్రవాహనంపై బుధవారం కోటబొమ్మాళి నుంచి స్వగ్రామం వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. యువకుడు తలకు తీవ్రగాయాలయ్యాయి స్థానికులు వెంటనే టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై విచారణ నిర్వహిస్తున్నట్లు ఎస్సై వంగపండు సత్యనారాయణ పేర్కొన్నారు.

అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం

పాతపట్నం, సారవకోట: పాతపట్నం ఆల్ఆంధ్ర రహదారి పక్కన నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు ఈ క్రతువు నిర్వహించారు. అనంతరం విగ్రహమూర్తులతో తిరువీధి చేపట్టారు. ◆ సారవకోట మండలం తర్లిలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా ప్రారంభమైంది.

జేఈఈ మెయిన్‌లో ప్రతిభ

సారవకోట, న్యూస్‌టుడే: ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్ ఫలితాల్లో సారవకోట కేజీబీవీ విద్యార్థిని దువ్వారపు మల్లేశ్వరి 75.37 శాతం సాధించడంతో ఎంఈవో ఎం.వెంకటరమణ బుధవారం అభినందించారు. ఎస్‌వో పార్వతి, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్య తప్పనిసరి

పోలాకి, న్యూస్‌టుడే: ప్రతి రైతు డిజిటల్ గుర్తింపు సంఖ్య కలిగి ఉండాలని మండల వ్యవసాయాధారి పి.చిరంజీవి సూచించారు. బుధవారం కార్యాలయంలో మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు డిజిటల్ సంఖ్యపై సంబంధిత సిబ్బంది అవగాహన కల్పిస్తారన్నారు. మండలంలో 10,907 మంది ఉండగా అందులో 9,930 ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు.

రేపు విద్యుత్తు సరఫరా నిలిపివేత

నరసన్నపేట, న్యూస్‌టుడే: నరసన్నపేట విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలోని నిర్వహణ పనుల నిమిత్తం బొరిగివలస ఫీడర్ దిగువ గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు టెక్కలి ఈఈ నర్సింహకుమార్ తెలిపారు. ఈనెల 20న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

వైభవంగా రామ మందిర ప్రారంభం

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: యారబాబు గ్రామంలో బుధవారం రామ మందిరం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రత్యేక పూజలు అనంతరం ఉత్సవమూర్తులతో తిరువీధి కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, తెదేపా నియోజకవర్గ కన్వీనరు బగ్గు అర్చన, పోలాకి జడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణ చైతన్య, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ఆంగ్ల పుస్తకావిష్కరణ

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఆంగ్ల పుస్తకావిష్కరణ ప్రిన్సిపల్ కె.చక్రపతి అధ్యక్షతన జరిగింది. బి.ఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీకి సంబంధించిన ఎంఏ ఇంగ్లీష్ సెమిస్టర్ 1 పుస్తకాన్ని రచించిన రచయిత, ఆంగ్ల విభాగాధిపతి జి.శ్రీనివాసరావు సమక్షంలో విడుదల చేశారు. భౌతిక శాస్త్ర విభాగాధిపతి పి.కామేశ్వరరావు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడండి

కొత్తూరు, న్యూస్‌టుడే: సనాతన ధర్మాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని భాజపా జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు కోరారు. కొత్తూరు మండలంలోని వెంకటాపురం గ్రామంలో అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాల్లో బుధవారం ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. మండల అధ్యక్షుడు భాస్కరరావు, నాయకులు నరసింహమూర్తి, ఇల్లంనాయుడు, కనకరాజు తదితరులున్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న భాజపా జిల్లా అధ్యక్షుడు తేజేశ్వరరావు

ఆయుష్ ఆసుపత్రితో మేలు

టెక్కలి, టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: టెక్కలికి ఆయుష్ ఆసుపత్రి మంజూరు చేయడంతో ప్రజలకు ఎనలేని మేలు జరుగుతుందని ఏఎంసీ ఛైర్మన్ బగాది శేషగిరిరావు అన్నారు. బుధవారం టెక్కలిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ★ కూటమి ప్రభుత్వంతోనే పేదలకు మెరుగైన వైద్యం లభిస్తోందని భాజపా మండలాధ్యక్షుడు జర్జాన రాంజీ పేర్కొన్నారు. నాడు టెక్కలికి జిల్లా ఆసుపత్రి తీసుకొచ్చి నేడు ఆయుష్ ఆసుపత్రి ఏర్పాటుకు కృషిచేసిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న తెదేపా శ్రేణులు

ప్రథమ వర్ధంతి

జననం 1-1-1944 మరణం 1-3-2025

కీ॥శే॥ సదాశివుని రమణమ్మ గారు W/o లేటు రామారావు మాష్టారు అంపలాం గ్రామం, పోలాకి మం॥

అమ్మా! మీ రూపం మా కళ్ళ ఎదుటనే ఉంది. మీ మాటలు ఇంకా వినిపిస్తునే ఉన్నాయి. అమ్మా మీ చిరునవ్వు కనిపిస్తూనే ఉంది. మీరు మమ్ములను వీడి సంవత్సర కాలం గడిచినను మీ మధుర స్మృతులు మా మదిలో మెదులుతునే ఉన్నాయి. అమ్మా.. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ.. మీ..

అన్నదమ్ముడు: బలివాడ సింహగిరి పట్నాయిక్, మరదలు: మణి, మేనకోడలు: కళ్లేపల్లి సూర్యకుమారి

కుమారులు - కోడళ్లు: కీ॥శే॥ ఎస్.వి. నారాయణపట్నాయిక్ - లక్ష్మి; ఎస్.వి. అప్పారావు - రమాకుమారి; ఎస్. ఆదినారాయణ పట్నాయిక్ - వనజాక్షి

కుమార్తెలు: సదాశివుని అప్పలనర్సమ్మ (మీనా), కరకవలస రాజ్యలక్ష్మి

మనుమలు: ఎస్.రోహిణికుమార్, రేవతి, ఎస్.రామోజీరావు, ఎస్.వెంకటరమణ; మనుమరాళ్ళు: ఎస్.కిరణ్మయి, లాస్యశ్రీ

సంవత్సరీకం: తే 19.02.2026దిన గురువారం శ్రీకూర్మంలో జరుపబడును. తామెల్లరూ అచ్చటకు వచ్చి కార్యక్రమంనకు హాజరు కాగలరు అని మనవి. సెల్: 9440361116, 8106656429, 9912326761

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

చేతి స్పర్శలో వ్యత్యాసాన్ని తెలుసుకోండి

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: చేతి స్పర్శలో మంచి, చెడుల వ్యత్యాసం తెలుసుకోవాలని జిల్లా న్యాయాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. 'బాలల స్నేహపూర్వక న్యాయసేవలు' అనే అంశంపై శ్రీకాకుళం నగరంలోని సన్‌షైన్ పాఠశాలలో బుధవారం 8, 9 తరగతుల విద్యార్థులతో సదస్సు నిర్వహించారు. ఇతరుల చేతి స్పర్శలో తేడాలను గమనించాలంటూ అవగాహన కల్పించారు. సమస్యలు తలెత్తినప్పుడు 1098, 100, 15100కు ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలన్నారు. సీనియర్ న్యాయవాది ఇందిరాప్రసాద్, ప్రిన్సిపల్ కె.ప్రదీప్ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి హరిబాబు

తెరపై ఈనాడు

★ సరస్వతి: పంతీ ★ ఎస్వీసీ(రామలక్ష్మణ): మన శంకరవరప్రసాద్ గారు ★ సన్‌మ్యాక్స్: సీతా పయనం ★ మారుతి: నారీ నారీ నడుమ మురారి ★ కిన్నెర: విత్ లవ్ ★ కీర్తన: భర్త మహాశయులకు విజ్ఞప్తి ★ సూర్య: కపుల్ ఫ్రెండ్లీ
– న్యూస్‌టుడే, పాతబస్టాండ్

రేపు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల, ఉపకేంద్ర నిర్వహణ వంటి మరమ్మతులు చేయడానికి కింతలి, లోలుగు, పొందూరు ఉపకేంద్రాల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పైడి యోగేశ్వరరావు కోరారు.

దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం నియోజకవర్గంలో పలు దేవాలయాల అభివృద్ధి, జీర్ణోద్ధరణ పనులకు నిధులు కేటాయించాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. అమరావతిలో బుధవారం ఆయన్ను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. బెండివానిపేటలో శ్రీరామమందిర పునర్నిర్మాణానికి తితిదే నుంచి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. శ్రీకాకుళం గ్రామీణ మండలం కళ్లేపల్లిలో మణినాగేశ్వరస్వామి గర్భాలయ నిర్మాణానికి రూ.35 లక్షలు మంజూరు చేయాలని కోరారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ అంచనాలు రూపొందించి నివేదిక పంపారని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ధూప దీప నైవేద్యాలకు నోచుకోని ఆలయాలకు దేవాదాయ శాఖ తరపున ఆర్థిక సహకారం అందించాలని కోరారు.


మంత్రి రామనారాయణరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఆదిత్యుని సేవలో ఐటీ శాఖ ముఖ్య కమిషనర్

అరసవల్లిలో కొలువైన సూర్యనారాయణస్వామిని బుధవారం ఆదాయ పన్ను శాఖ ముఖ్య కమిషనర్ (విశాఖపట్నం) ఎస్.శ్రీనివాస్ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం అనివెట్టి మండపంలో ఆలయ ప్రధానార్చకుడు ఇప్పిలి శంకరశర్మ వేదాశీర్వచనం పలికి ప్రసాదాలు అందజేశారు.
– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

సమస్యలు పరిష్కరించరూ..

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరపాలక సంస్థలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం తదితరులు కోరారు. కమిషనర్‌ను బుధవారం ఆయన కార్యాలయంలో కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. పారిశుద్ధ్య కార్మికుల నియామకాల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయని.. ఈ అంశంపై విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో సమాఖ్య నాయకులు ఆర్.ప్రకాశరావు, ఎ.రాము, ఎ.మోహన్ తదితరులు ఉన్నారు.

కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పుర కార్మికుల సంఘ నాయకులు

సెపక్ తక్రా ఆటలో.. అమ్మాయిలు భళా

– న్యూస్‌టుడే, పాతబస్టాండ్

చిన్నపాటి పరిమాణంలో ఉండే రత్తన్ బంతితో ఆడేది సెపక్‌తక్రా. ప్రపంచవ్యాప్తంగా 80 దేశాల్లో ఈ క్రీడలో ఆటగాళ్లు సాధన చేస్తుంటారు. తమ భుజాలు, మోకాళ్లు, పాదాలు, ఛాతి, తలతో బంతిని కొడుతూ ప్రత్యర్థులతో పోటీ పడాలి. ఈ పోటీల్లో జాతీయ స్థాయిలో మన జిల్లా క్రీడాకారిణులు రాణిస్తున్నారు. పట్టుదలతో సాధన చేస్తూ ఎన్నో పతకాలు సాధిస్తూ.. కొలువులు అందుకునేందుకు కృషి చేస్తున్నారు. శ్రీకాకుళం ఎన్టీఆర్ నగరపాలక సంస్థ పాఠశాల క్రీడా మైదానంలో డీఎస్ఏ కోచ్ అర్జున్‌రావురెడ్డి శిక్షణలో జిల్లా సెపక్‌తక్రా అసోసియేషన్ సహకారంతో సాధన చేస్తూ.. విజయాలను అందుకుంటున్న వారిపై 'న్యూస్‌టుడే' కథనం.

పోటీలతో పాటు..

రాగోలు పంచాయతీ బావాజీ పేటకు చెందిన **బంటుపల్లి ఝాన్సీ** జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో పతకాలు సాధిస్తోంది. తండ్రి తులసీరావు పెయింటింగ్ పనులు చేస్తుండగా, అమ్మ శాంతి గృహిణి. విజయవాడ, హిమాచల్‌ప్రదేశ్, దిల్లీలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ఈ క్రీడాకారిణి ప్రతిభ చూపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారు. బీకాం డిగ్రీ పూర్తిచేసిన ఈమె పోటీ పరీక్షలకు చదువుతూ.. మరోవైపు సెపక్ తక్రాలో ఉత్తమంగా రాణిస్తున్నారు.

రాష్ట్రస్థాయిలో..

రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆరు పతకాలు సాధించి రెండు సార్లు జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించింది **పెంటిమని కల్యాణి.** శ్రీకాకుళంలోని రాగోలుకు చెందిన ఈమె తల్లిదండ్రులు రమణమ్మ, యర్రయ్యలది వ్యవసాయాధారిత జీవనం. ప్రస్తుతం బీపీఈడీ పూర్తిచేసిన ఈ క్రీడాకారిణి విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు కళాశాలలో వ్యాయామ శిక్షకులుగా పనిచేస్తున్నారు. 2026లో ఖేలో ఇండియా పోటీల్లో, వరంగల్‌లో జరిగిన సీనియర్ జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చూపింది.

ఆట ఆడుతున్న విద్యార్థులు

జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారిణులు

ఉద్యోగాలు పొందుతున్నారు

పదేళ్ల నుంచి సెపక్‌తక్రాలో బాలికలు మంచి ఫలితాలు అందుకుంటున్నారు. పతకాలతో పాటు ఉద్యోగాలను క్రీడ కోటాలో పొందుతున్నారు. ప్రతి ఏడాది రాష్ట్ర స్థాయిలో ఉత్తమంగా ప్రతిభ చూపుతున్నారు. అంతర్జాతీయ పోటీల్లో రాణించాలంటే పాఠశాల స్థాయి నుంచి సాధన చేయాల్సి ఉంటుంది.
- అర్జునరావురెడ్డి, డీఎస్ఏ శిక్షకుడు

సాధారణ నేపథ్యంతో..

జాతీయ స్థాయిలో రెండు బంగారు పతకాలు, రాష్ట్ర స్థాయిలో 6 పతకాలు సాధించిన **నురవరపు ప్రేమశ్రీ** నాన్న సూర్యనారాయణ మెకానిక్, తల్లి గృహిణి. శ్రీకాకుళం మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఈ క్రీడాకారిణి జాతీయ స్థాయిలో ఆరు, రాష్ట్ర స్థాయిలో 15 పోటీల్లో పాల్గొంది. క్రీడ కోటాలో ఉద్యోగం సాధించడం తన లక్ష్యం అని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9502198883 8008552704

మీ ప్రాంతంలో ఏ ప్రజాసమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: బోరవానిపేట పంచాయతీ పరిధిలో గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే రెండు మోటార్లలో ఒకటి తరచూ మొరాయిస్తుండటంతో ఇబ్బంది పడుతున్నాం. - **సానికుడు, బోరవానిపేట** ✦ మోటారు అమర్చడానికి చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరిస్తాం. - **సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీఓ, గార** – న్యూస్‌టుడే, గార

?: బొడ్డేపల్లిపేట స్మశానంలో ముళ్ల పొదలు పెరిగి ఇబ్బందులు పడుతున్నాం. - **శంకర్, ఆమదాలవలస** ✦ పరిశీలించి, పొదలు తొలగించే ఏర్పాట్లు చేస్తాం. - **జన్నస్, మున్సిపల్ ఏఈ, ఆమదాలవలస**

?: పట్టణంలోని [illegible] దుకాణాల్లో యూరియా లేదని వ్యాపారులు చెబుతున్నారు. - **హరి, స్థానికుడు** ✦ అన్ని షాపుల్లో యూరియా అందుబాటులో ఉంది. - **మెట్ట మోహనరావు, మండల వ్యవసాయ అధికారి, ఆమదాలవలస** – న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

పందులు.. తప్పని పాట్లు

శ్రీకాకుళం నగరంలో పందుల పెంపకందారులు బహిరంగ ప్రదేశాల్లో వదిలేస్తున్నారు. అవి వీధుల్లో సంచరిస్తూ ఇళ్ల ఆవరణలో పరిసరాలను అపరిశుభ్రంగా చేస్తున్నాయని, ద్విచక్రవాహనాల కిందకు రావడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.కూర్మారావు మాట్లాడుతూ పందులను ఊరికి దూరంగా పెంచుకోవాలని ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొన్నారు.
– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

రాళ్ల దారి.. మారదా మరి

ఆమదాలవలస మండలం రామచంద్రాపురం గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉండటంతో బాటసారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో చెవ్వాకులపేట ఇసుక ర్యాంపు కారణంగా రహదారి మొత్తం ధ్వంసమైందని రాకపోకలు చేసేవారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ రహదారి నిర్మిస్తామని తెలిపారు.
– న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

కాలువ ఇలా.. మురుగు వెళ్లేదెలా ?

పొందూరు మండలం కింతలి నుంచి కనిమెట్ట వెళ్లే ప్రధాన మార్గంలో ఉన్న మురుగు కాలువ వ్యర్థాలతో నిండిపోయింది. మురుగు నిలిచి దుర్వాసనతో పాటు దోమల బెడద ఎక్కువైందని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. వీటివల్ల తరచూ రోగాల బారిన పడుతున్నామని, వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు చేపడతామని తెలిపారు.
– న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

కనిపించడం లేదా.. నీటి వృథా

జి.సిగడాం మండలం ఆనందపురం పంచాయతీ ఆబోతులపేట గ్రామంలో వీధి కుళాయిలకు ట్యాపులు లేకపోవడంతో తాగునీరు వృథా అవుతుందని గ్రామస్థులు వాపోతున్నారు. పలు చోట్ల కుళాయిలు మురుగు కాలువ పక్కనే ఉండటంతో నీరు కలుషితమై రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. సమస్యను ఎంపీడీవో రామకృష్ణ వద్ద ప్రస్తావించగా పరిష్కరిస్తామన్నారు.
– న్యూస్‌టుడే, జి.సిగడాం

అధ్వానం.. వినియోగానికి దూరం

శ్రీకాకుళం గ్రామీణ మండలం సింగుపురంలో సామాజిక మరుగుదొడ్లు అధ్వాన స్థితికి చేరాయి. కొన్ని తలుపులు తుప్పు పట్టి ఉన్నాయి. మరికొన్ని ఊడిపోయి వినియోగానికి అనువుగా లేకపోవడంతో గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి ముదిలవలస శ్యామ్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.
– న్యూస్‌టుడే, సింగుపురం(శ్రీకాకుళం గ్రామీణం)

పని ఒత్తిడి తగ్గించాలని వినతి

గార, న్యూస్‌టుడే: రెవెన్యూ శాఖకు సంబంధం లేని పనులు అప్పగిస్తుండటంతో ఒత్తిడి పెరుగుతోందని.. జాబ్ ఛార్ట్ ప్రకారం పని అప్పగించాలంటూ వీఆర్వోలు డిమాండ్ చేశారు. గార తహసీల్దారు కార్యాలయం వద్ద బుధవారం నిరసన తెలిపారు. పని దినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే విధులు అప్పగించాలని కోరుతూ తహసీల్దారుకు వినతిపత్రం అందజేశామని తెలిపారు.

నిరసన తెలుపుతున్న వీఆర్వోలు

కళ్లద్దాల పంపిణీ

బూర్జ, న్యూస్‌టుడే: అంధత్వ నివారణలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు చేసి, కళ్లద్దాలను అందిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం కొల్లివలస కేజీబీవీ ఎస్వో కె.గాయత్రి ఆధ్వర్యంలో విద్యార్థినులకు కళ్లద్దాలను గుత్తావిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సతీష్ అందజేశారు. సిబ్బంది పాల్గొన్నారు.

కొల్లివలస కేజీబీవీలో కళ్లద్దాలు అందుకున్న విద్యార్థినులతో వైద్య సిబ్బంది

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

శ్రీకాకుళం నగరం పాలకొండ రోడ్డులో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటారు. క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా పర్యావరణ ఛైర్మన్ పొన్నాడ రవికుమార్ ఆధ్వర్యంలో ఆదాయ పన్ను శాఖ ముఖ్య కమిషనర్ బొట్ట శ్రీనివాస్ (విశాఖపట్నం) పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సూచించారు. లయన్స్ క్లబ్ హర్షవల్లి వ్యవస్థాపకుడు హారికా ప్రసాద్, కె.రవిశంకర్, ఆర్ ఎస్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

పీఏసీఎస్‌లో తనిఖీలు

బూర్జ, న్యూస్‌టుడే: బూర్జ పీఏసీఎస్‌లో అవకతవకలు చోటు చేసుకున్నాయని పలుమార్లు రైతులంతా పీయూసీ ఛైర్మన్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో విజయనగరం జిల్లా సొసైటీ ఆడిటర్ బి.సన్యాసినాయుడు, సభ్యులు బుధవారం స్థానిక పీఏసీఎస్‌లో దస్త్రాలను తనిఖీ చేశారు. ఇందులో ఎలాంటి విషయాలు వెల్లడించలేదు.

దస్త్రాలు పరిశీలిస్తున్న ప్రత్యేక బృందం

కుమారుడికి తలకొరివి పెట్టిన తల్లి

అనారోగ్యంతో మృతి చెందిన కుమారుడికి తల్లి అంత్యక్రియలు నిర్వహించిన విషాద ఘటన శ్రీకాకుళం నగరంలో చోటు చేసుకుంది. శ్రీకాకుళం గ్రామీణ మండలం సానివాడకు చెందిన చెల్లుబోయిన అప్పారావు, రాజేశ్వరి దంపతుల పెద్ద కుమారుడు రాజు (40) అనారోగ్యంతో శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. బుధవారం తల్లి అతని చితికి నిప్పంటించారు. కొన్ని నెలల కిందట రెండో కుమారుడు అనారోగ్య సమస్యలతో కన్నుమూయగా తండ్రి అంత్యక్రియలు పూర్తి చేశారు. వరుసగా ఇద్దరు కుమారులను కోల్పోవడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు కన్నీరుమున్నీరయ్యారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం గ్రామీణం

ఘనంగా చక్రతీర్థ స్నానాలు

సరుబుజ్జిలి, ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: పురుషోత్తపురం వద్ద వంశధార నదిలో బుధవారం చక్రతీర్థ స్నానాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉమాకామేశ్వర స్వామి ఆలయం నుంచి పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో తీసుకెళ్లి నదిలో చక్రతీర్థ స్నానాలు చేయించారు. అనంతరం రథంపై పురవీధుల్లో ఊరేగించారు.

వంశధార నది వద్ద ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న పురోహితులు, మహిళలు

కూరగాయల ధరలు

శ్రీకాకుళం రైతుబజారులో కూరగాయల నిన్నటి ధరలు (కిలో రూపాయల్లో) ● టమాటాలు 12 ● వంకాయలు 26/36 ● బెండ 44 ● పచ్చిమిర్చి 68 ● కాకర 46 ● బీర 44 ● కాలీఫ్లవర్ 15/20 ● క్యాబేజీ బుట్ట 20 ● క్యారెట్ 30 ● దొండ 36 ● బంగాళదుంపలు 18 ● ఉల్లిపాయలు 20/24 ● గోరుచిక్కుడు 40 ● ఆనప 16 ● అరటికాయ(జత) 16 ● గోల్కొండ చిక్కుడు 26 ● అల్లం 80 ● వెల్లుల్లి 130 ● బీట్రూట్ 30 ● క్యాప్సికమ్ 66 ● కీరదోస 46 ● పప్పుదోస 30 ● బఠానికాయలు 40 ● ముల్లంగి 20
– న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

వైభవంగా గణపతి హోమం

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: లోలుగు కేజీబీవీలో బుధవారం గణపతి హోమం ఘనంగా జరిగింది. ఈ ఏడాది ఇంటర్, పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలనే సంకల్పంతో వారితో ఈ హోమం నిర్వహించారు. ప్రిన్సిపల్ లలితకుమారి పాల్గొన్నారు.

విద్యార్థినులతో గణపతికి క్షీరాభిషేకం చేయిస్తున్న పురోహితులు

ఆంగ్లంపై పట్టు సాధించాలి

పొందూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించాలని మండల విద్యాశాఖాధికారిణి వాగ్దేవి సూచించారు. పొందూరు ఉన్నత పాఠశాలలో బుధవారం ఆంగ్లభాషా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మాతృభాషతోపాటు ఆంగ్లం, హిందీ మాధ్యమాలను నేర్చుకోవాలన్నారు.

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నగరపాలక సంస్థ కమిషనర్ పర్యటన

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: కాలనీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని నగరపాలక సంస్థ అధికారులను కమిషనర్ హెచ్.కూర్మారావు ఆదేశించారు. తిలక్‌నగర్, భవానీనగర్ ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

కాలువలు శుభ్రం

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు మండలం లక్ష్మీపేట గ్రామంలో ప్రధాన రహదారి సమీపంలో మురుగు కాలువలో పనికిరాని మొక్కలు, వ్యర్థాలు నిండిపోవడంతో దుర్వాసన, దోమల బెడద ఎక్కువైందని గ్రామస్థులు తెలియజేశారు. దీంతో ఈనెల 17న 'దుర్వాసన.. దోమలు' అనే శీర్షికతో ఈనాడులో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి బుధవారం శుభ్రం చేశారు.

జేఆర్‌పురంలో అగ్నిప్రమాదం

రణస్థలం, న్యూస్‌టుడే: జేఆర్‌పురంలోని అక్షయ లాడ్జి పక్కన వడ్డాది జగదీశ్వరరావు ఇంట్లో బుధవారం మధ్యాహ్నం విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో ఇంట్లో సామగ్రి కాలిపోయింది. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలు అదుపు చేశారు.

చదరంగంలో ప్రథమ స్థానం


మెట్ట ప్రణీత

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: తాడివలస పాఠశాలలో 9 వతరగతి చదువుతున్న మెట్ట ప్రణీత చదరంగంలో అండర్-15 బాలికల విభాగంలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. జిల్లా కేంద్రంలోని శాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ పోటీల్లో ప్రణీత గెలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమెకు, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు పెంటయ్యకు పాఠశాల సిబ్బందితోపాటు సర్పంచి మణెమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు దివ్య, గ్రామస్థులు తదితరులు అభినందనలు తెలిపారు.

రాకపోకలకు ఇబ్బందులు

శ్రీకాకుళం నగర పరిధి పాత టీపీఎంహెచ్ పాఠశాల వద్ద సీబీ రహదారి నుంచి హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డు మధ్యలో కాలువపై పలకలు విరిగిపోయి శిథిలావస్థకు చేరాయి. ఈ మార్గంలో రాకపోకలకు స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.కూర్మారావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

తప్పని అవస్థలు..!

జి.సిగడాం మండలం పాలకండ్యాం కూడలి వద్ద దుకాణాల ఎదుట విద్యార్థులు బస్సుల కోసం వేచి చూడాల్సిన దుస్థితి. ఇక్కడ బస్టాప్ ఉన్నప్పటికీ నిర్వహణ కొరవడటంతో బయటే నిలబడాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి బస్టాప్‌ను వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో రామకృష్ణతో ప్రస్తావించగా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, జి.సిగడాం

నిర్వహణ గాలికి.. పరికరాలు మూలకు..!

– న్యూస్‌టుడే, లావేరు

వైకాపా ప్రభుత్వ హయాంలో స్థానికంగా సేవలందిస్తామని చెప్పి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అప్పట్లో సచివాలయాలకు అందించిన సాంకేతిక పరికరాలు ప్రస్తుతం మొరాయిస్తున్నాయి. నిర్వహణ లోపంతో చాలా చోట్ల అవి మూలకు చేరాయి. దీంతో కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇన్వర్టర్లు, ఇంటర్‌నెట్ తదితర పరికరాలు పనిచేయక సేవల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రతి పంచాయతీ కార్యాలయానికి ఏపీ ఫైబర్ నెట్ ద్వారా అంతర్జాలం అందుబాటులోకి తెస్తామని రూ.లక్షల వ్యయంతో పరికరాలు కొనుగోలు చేసి, వాటిని అమర్చి నిర్వహణను గాలికొదిలేయడంతో అవన్నీ దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి.

ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఇలా...

మండలం	పంచాయతీలు	సచివాలయాలు
లావేరు	33	23
రణస్థలం	34	28
ఎచ్చెర్ల	26	26
జి.సిగడాం	31	21

ఇదీ పరిస్థితి..

అప్పట్లో ప్రతి సచివాలయానికి రెండు కంప్యూటర్లు, యూపీఎస్, ప్రింటర్, ఇన్వర్టర్ తదితరాలను అందించారు. కొన్ని చోట్ల పని చేస్తుండగా మరికొన్ని సచివాలయాల్లో మొరాయించాయి. మీసేవలో అందించే సేవలన్నీ సచివాలయాల్లో అమలు చేస్తున్నారు. కుల, ఆదాయ, నివాస తదితర ధ్రువపత్రాలు, రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఇంటింటి సర్వే వివరాలు నమోదు వంటి పనుల నిమిత్తం అందరూ వస్తుంటారు. కంప్యూటర్లు పనిచేయకపోవడంతో కొందరు సిబ్బంది సొంత పరికరాలు ఉపయోగిస్తున్నారు. సచివాలయాల్లో పరికరాల నిర్వహణ ఖర్చులు ఏ శాఖ పర్యవేక్షించాలో స్పష్టత లేదు.


పెద్దకొత్తపల్లి సచివాలయంలో పనిచేయని కంప్యూటర్

హాట్‌స్పాట్ ద్వారా సేవలు

సచివాలయాల్లో మొరాయించిన కంప్యూటర్లు, ఇతర సామగ్రికి సంబంధించిన మరమ్మతులు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తమ డబ్బులతో చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో అత్యవసర సమయంలో చరవాణుల్లో అంతర్జాల సౌకర్యాన్ని హాట్‌స్పాట్ ద్వారా అనుసంధానం చేసి సేవలందించాల్సి వస్తోందని పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు వాపోతున్నారు.

పంచాయతీ నిధులతో మరమ్మతులు...

సాంకేతిక పరికరాలు మరమ్మతులకు గురైతే పంచాయతీ నిధులతో బాగు చేయించుకోవాలని కార్యదర్శులకు తెలియజేశాం. ఇప్పటికే పలు చోట్ల మరమ్మతులు చేయించాం. ప్రభుత్వం నుంచి కొత్త కంప్యూటర్లు తదితర సామగ్రి వచ్చిన వెంటనే అందజేస్తాం. – వెంకటరాజు, హరిహరరావు, రామకృష్ణ, లావేరు, ఎచ్చెర్ల, జి.సిగడాం మండలాల ఎంపీడీవోలు

CHANGE OF NAME

I, SHEK LAGADAPATI BIBI ASHA (Old Name) W/o SHEK LAGADAPATI MAHABU SUBHANI resident of D.No. 1321, Baliji Veedhi, G.Sigadam (Vill & Mandalam), Srikakulam Dist in A.P-532148. Change my name from **SHEK LAGADAPATI BIBI ASHA** (Old Name) to **SHEK LAGADAPATI BEEBI ASHA** (New Name) hence forth I am being called as **SHEK LAGADAPATI BEEBI ASHA** (New Name) W/o SHEK LAGADAPATI MAHABU SUBHANI for all purposes.

CHANGE OF NAME

I hereby declares that my old Name " **DANDASI DINESH DATTA**" S/o.Venkata Suryanarayana R/o.7-14-12, New Colony, Srikakulam (A.P.State) India. declares that I have changed my name as **" DANDASI DINESH KUMAR"** Instead of my old name **"DANDASI DINESH DATTA"** Here after my name known as **"DANDASI DINESH KUMAR"** only for all purposes. The above statements are true and correct.
Deponent
D. DINESH KUMAR

తిరుచ్చి మహానాడుతో రాజకీయ మార్పు

విలేకరులతో మాట్లాడుతున్న సీమాన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తిరుచ్చి ఎన్టీకే మహానాడు రాష్ట్ర రాజకీయాల్లో మార్పు తీసుకొస్తుందని ఆ పార్టీ సమన్వయకర్త సీమాన్ అన్నారు. బుధవారం తిరుచ్చిలో విలేకరులతో మాట్లాడారు. ఈ మహానాడులో అభ్యర్థులను పరిచయం చేస్తామన్నారు. రాష్ట్రంలో రుణభారం రూ.10లక్షల కోట్లకుపైగానే ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు, రైతులు, చేనేత కార్మికులు వీధుల్లోకి వచ్చి డిమాండ్ల సాధనకు పోరాటాలు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో భూగర్భజలం అడుగంటిందని, కొన్ని ప్రాంతాల్లో తాగునీరు యురేనియంతో కలుషితమైనట్లు నివేదికలు కూడా ఉన్నాయన్నారు. ఫలితంగా పిల్లలు ఆరోగ్య సమస్యలతో జన్మిస్తున్నారని పేర్కొన్నారు.

డీఎంకే కూటమిలో సమస్య లేదు
తిరుమావళవన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: డీఎంకే కూటమిలో సమస్య లేదని వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ తెలిపారు. బుధవారం తిరుచ్చి విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ.. తిరుచ్చి-తంజావూర్ రోడ్డులోని తువక్కుడి వద్ద సర్వీస్ రోడ్డు నిర్మించాలని వివిధ రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయని చెప్పారు. ఇందుకు సంబంధించిన కేసులో హైకోర్టు కూడా అనుకూలంగానే స్పందించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సర్వీస్ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మద్యం, మాదకద్రవ్యాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలందరూ కోరుకుంటున్నారన్నారు. డీఎంకే కూటమిలోనే కాంగ్రెస్ ఉందని చెప్పారు. అధికారంలో భాగస్వామ్యం కోరడం తప్పేమీకాదన్నారు.

దిల్లీ వెళ్లిన గవర్నర్

చెన్నై, న్యూస్‌టుడే: గవర్నర్ ఆర్.ఎన్.రవి దిల్లీకి ఆకస్మిక పర్యటన చేపట్టారు. శాసనసభ ఎన్నికలు సమీపించి రాష్ట్ర రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్న నేపథ్యంలో మంగళవారం మూడు రోజుల పర్యటనగా ఆయన దిల్లీ వెళ్లారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తదితరులను కలిసి రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై మాట్లాడనున్నట్లు సమాచారం. గురువారం చెన్నై తిరిగి రానున్నారు.

చెన్నైలో 20 ప్రాంతాల్లో స్మార్ట్ పార్కింగ్

☛ జీసీసీ 2026-27 బడ్జెట్‌లో ప్రకటన

బడ్జెట్ ప్రతుల బ్యాగుతో మేయర్ ప్రియ

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నై మహానగర పాలక సంస్థ(జీసీసీ) 2026-27వ ఆర్థిక ఏడాది బడ్జెట్‌లో 90 ప్రకటనలు చేశారు. బడ్జెట్‌ను బుధవారం కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో మేయర్ ప్రియ సమర్పించారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం కల్పించారు. వేసవికాలంలో పర్మినెంట్, తాత్కాలిక శుభ్రతా కార్మికులకు మజ్జిగ అందించే పథకం, జీసీసీకి చెందిన 50 క్రీడా మైదానాలను రూ.20 కోట్లతో అభివృద్ధి చేయడం, మెరీనా, బెసెంట్ నగర్, వాషర్మెన్‌పేట్ల తదితర 20 ముఖ్యమైన ప్రాంతాల్లో స్మార్ట్ పార్కింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమలు చేయడం, మెరీనాలో లైట్ హౌస్ నుంచి అన్నా స్మారకం వరకు రోప్‌వే కారు మార్గాన్ని ఏర్పాటు చేయడం, చెన్నై కార్పొరేషన్‌లోని పార్కుల్లో ఉన్న చెట్ల ద్వారా ప్రాణ వాయువు తయారు చేసేందుకు అనువుగా గ్రీన్ చెన్నై ప్రాజెక్టు తదితర ప్రకటనలు ఉన్నాయి. గత బడ్జెట్‌లో 62 ప్రకటనలు చోటుచేసుకోవడం గమనార్హం.

ఒకే రకమైన చీరలు ధరించి వచ్చిన మహిళా కౌన్సిలర్లు

25వ తేదీ అర్ధరాత్రి నుంచి రాష్ట్రంలో లారీల నిరవధిక సమ్మె

విల్లివాక్కం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 25వ తేదీ అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు తమిళనాడు లారీ యజమానుల సమాఖ్య అధ్యక్షుడు ధన్‌రాజ్ తెలిపారు. బుధవారం నామక్కల్‌లో సమాఖ్య సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ.850 ఉన్న వాహన ఫిట్‌నెట్ రుసుమును కేంద్ర ప్రభుత్వం రూ.28,200కు పెంచిందన్నారు. దీన్ని అమలుపరచడం, నిలిపివేయడం రాష్ట్ర ప్రభుత్వ అధికారపరిధిలో ఉందని చెప్పారు. పలుమార్లు ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోకపోవడంతో లక్ష లారీలు ఎఫ్‌సీ పొందలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. తమ జీవనాధారానికి గండిపడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యకు వెలుగు.. ప్రగతికి అడుగు

☛ కీలక కార్యక్రమాలతో విద్యార్థులకు కొత్త ఉత్సాహం

☛ తాజా బడ్జెట్‌లో భారీ కేటాయింపులు

ఈనాడు-చెన్నై

బడ్జెట్‌లో ఇతర రంగాల కేటాయింపులతో పోల్చితే విద్యకు అగ్రస్థానం ఇచ్చింది ప్రభుత్వం. పాఠశాల విద్యకు రూ.48,534 కోట్లు, ఉన్నత విద్యకు రూ.8,505 కోట్లు.. మొత్తంగా రూ.57,039 కోట్లను ప్రకటించింది. మొత్తం బడ్జెట్‌లో ఇది 12.20 శాతం.

ల్యాబ్‌లు.. లైబ్రరీలు

'పేరాసిరియర్ అన్బళగన్ పాఠశాల అభివృద్ధి పథకం' కింద రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో మార్పులు చోటు చేసుకోనున్నాయి. తరగతులు, ల్యాబొరేటరీలు, మరుగుదొడ్లులాంటి కనీస వసతుల వృద్ధికి పెద్దపీట వేస్తున్నారు. ఇలా 3,771 తరగతి గదులు, 107 గ్రంథాలయాలు, బాలుర, బాలికలకు వేర్వేరుగా నాలుగేసి వసతిగృహాలు ఇప్పటిదాకా సిద్ధమయ్యాయి. మరిన్నింటికోసం రూ.2,009 కోట్లు కేటాయించారు.

హక్కుల సాధనకు..

పిల్లల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు 'మగిళ్ ముట్రం' కార్యక్రమాన్ని తెస్తున్నారు. ఇందులో భాగంగా 5రకాల శిక్షణలు ఇవ్వనున్నారు. మహిళా హక్కుల రక్షణకు 'కొడై కొండాట్టం' పేరుతో విద్యార్థినులకు ప్రత్యేక వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నారు. పనిచేయడానికి అనువైన వాతావరణం, నాయకత్వ లక్షణాలు, మానవహక్కులు, సామాజిక న్యాయం, మహిళలకు ప్రత్యేక హక్కులపై విద్యార్థినులను చైతన్యపరచనున్నారు.

గురువుల ఆరోగ్యానికి..

పాఠాలు అర్థమయ్యేలా చెప్పాలంటే ఉపాధ్యాయులూ ఆరోగ్యంగా ఉండాలి. ఇందుకోసం ప్రత్యేకంగా ఆరోగ్యపరీక్షల కార్యక్రమాన్ని తెస్తున్నారు. విద్యలో ఉల్లాసంగా ఉండేందుకు అటు ఉపాధ్యాయులకు, ఇటు పిల్లలకు కలిపి విజ్ఞాన విహారయాత్రలు నిర్వహించనున్నారు. ఇతర రాష్ట్రాల్లోనే కాక, విదేశాల్లోని పలు ప్రాంతాలు ఎంపిక చేసేలా చర్యలు తీసుకోనున్నారు.

అత్యున్నతంగా సాంకేతిక విద్య

గత 4ఏళ్లలో రూ.909కోట్లతో రాష్ట్రంలోని సైన్స్, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీల్లో వసతుల్ని బాగా పెంచినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇప్పుడు అత్యాధునిక సాంకేతికత కోర్సుల్ని బోధించేందుకు ముందుకొచ్చింది. 8 కొత్త కోర్సుల్ని తీసుకొస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించింది. ఇందులో కృత్రిమ మేధ, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్ లాంటివాటిని 11 ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీల్లో తీసుకొచ్చినట్లు తెలిపింది. తాజా బడ్జెట్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్‌లను సైతం ప్రకటించారు. సేలం, కోయంబత్తూర్, తిరునెల్వేలిలో వాటిని తీసుకురానున్నట్లు తెలిపారు.

భారీగా సీట్లు.. పాఠశాల స్థాయిలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచి వారిని కాలేజీలో చేరేలా చేయాలనే లక్ష్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకుంది. ఈసారి ఆర్ట్స్, సైన్స్ కాలేజీల్లో ఏకంగా 10,563 సీట్లను పెంచుతున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు. గత 4ఏళ్లలో రాష్ట్రంలో 38 కొత్త ఆర్ట్స్ సైన్స్ కాలేజీల్ని తెచ్చినట్లు, 18,760మంది విద్యార్థులు లబ్ధిపొందినట్లు వివరించారు.

ప్రముఖ యూనివర్సిటీల్లో

చెన్నైలో స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్స్‌తో పాటు 38 జిల్లాల్లోనూ ఆదర్శ పాఠశాలల్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది. పేద విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో అవకాశాలు కల్పించేలా తీర్చిదిద్దేందుకు వాటిని తెచ్చారు. ఇలా 2,358 మంది విద్యార్థులు 93 ప్రముఖ విద్యాసంస్థల్లో ఉన్నత విద్యనభ్యసిస్తున్నారు. గతేడాది 41మంది ఐఐటీల్లో స్థానం సాధించారు. ఇంకో 17మంది జపాన్, తైవాన్, మలేషియాలాంటి దేశాల్లో ఉపకారవేతనాలతో అక్కడి యూనివర్సిటీల్లో కోర్సులు చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేలా నిధులు కేటాయించారు.

ల్యాప్‌టాప్‌తో మార్పు

కాలేజీ విద్యార్థులకు అందిస్తున్న ల్యాప్‌టాప్‌ల పథకం రాష్ట్రంలో మంచి మార్పు తెస్తోందని ప్రభుత్వం చెబుతోంది. ఇందుకోసం రూ.2,172 కోట్లు ఖర్చుచేస్తున్నారు. 10 లక్షల మంది విద్యార్థులు ల్యాప్‌టాప్‌లతో లబ్ధిపొందుతున్నారు. ఇప్పటిదాకా 6.75లక్షల మందికి పంపిణీ చేసినట్లు బడ్జెట్‌లో వెల్లడించారు.

రాష్ట్ర కష్టాలకు ఏకైక ఔషధం స్వయంప్రతిపత్తి

☛ రాజ్యాంగ సవరణతోనే దానిని సాధించగలం ☛ ముఖ్యమంత్రి స్టాలిన్

శాసనసభలో ప్రసంగిస్తున్న స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: రాష్ట్రం కష్టాల నుంచి బయటపడేందుకు ఏకైక ఔషధం స్వయంప్రతిపత్తి అని, దానిని రాజ్యాంగ సవరణతోనే సాధించగలమని ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. శాసనసభలో బుధవారం కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ సంబంధాలపై ఉన్నతస్థాయి కమిటీ నివేదిక తొలి భాగాన్ని ముఖ్యమంత్రి సమర్పించి ప్రసంగించారు. ప్రజల కలలను పూర్తిగా నెరవేర్చే స్థాయిలో అధికారాలు రాష్ట్రం వద్ద లేవన్నారు. రాష్ట్ర హక్కులను అందించే కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు కాకపోవడమే దానికి కారణమని తెలిపారు. నిధులు, ఇతర పలు డిమాండ్ల కోసం పోరాడాల్సిన పరిస్థితి కొనసాగుతోందన్నారు. ఇంకెన్నాళ్లు వారు ఇచ్చే స్థానంలో, మనం తీసుకునే స్థానంలో ఉంటామని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాలను అధ్యయనం చేసేందుకు 1969లో కరుణానిధి ఏర్పాటు చేసిన జస్టిస్ రాజమన్నార్ కమిటీ 1971లో సమర్పించిన నివేదికలోని ప్రతిపాదనలను నాడు శాసనసభలో నెరవేర్చినట్లు తెలిపారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య సంబంధాలను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం తరపున 1983, 2000, 2004లో ఏర్పాటు చేసిన కమిషన్లు వేలాది పుటల నివేదికలు సమర్పించినా ఎలాంటి పురోభివృద్ధి లేకుండా నిరాశే కొనసాగుతోందని పేర్కొన్నారు. అన్ని అధికారాలను కేంద్రంలోని భాజపా ప్రభుత్వం హస్తగతం చేసుకునే, గవర్నర్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలను పనిచేయకుండా అడ్డుకునే పరిస్థితుల్లో, హిందీని బలవంతంగా రుద్దడం, ఆర్థిక ఎమర్జెన్సీ, నియోజకవర్గాల పునర్విభజన కుట్ర, జీఎస్టీ వంటివాటితో రాష్ట్రం అనుభవిస్తున్న కష్టాల నుంచి రాష్ట్రం బయటపడేందుకు ఏకైక ఔషధం స్వయంప్రతిపత్తి అని ఉద్ఘాటించారు. కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రాలు పోటీదారులు కాదని, ఇద్దరూ ఓ వ్యవస్థలో ఉమ్మడి భాగస్వాములని, నిజమైన సమాఖ్యపాలన భావజాలాన్ని బలోపేతం చేసేలా భవిష్యత్తును నిర్మించుకోవాల్సిన సమయం ఇదేనన్నారు. రాజ్యాంగ సవరణను తాము కాకుంటే చేయడానికి ఎవరూ లేరన్నారు. ఇది చరిత్ర అందించే అవకాశమని పేర్కొన్నారు.

ఊటీలో మల్టీ లెవల్ కారు పార్కింగ్

సభ్యుల ప్రశ్నకు మంత్రి కె.ఎన్.నెహ్రూ స్పందిస్తూ... చెన్నై, కోయంబత్తూర్‌లో మల్టీ లెవల్ కారు పార్కింగ్ ఏర్పాటు చేసినా ఫలితం లేదన్నారు. ఊటీ, కొడైకెనాల్‌కు ఈ పార్కింగ్ అవసరం ఉన్నా స్థలం ధరలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. అవసరం దృష్ట్యా ఊటీలో మల్టీ లెవల్ కారు పార్కింగ్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. సభలో ముందుగా మాజీ ఎమ్మెల్యేల మృతికి సంతాపం ప్రకటించగా మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్, సీనియర్ విద్యావేత్త రాజగోపాలన్ మృతికి సంతాప తీర్మానాలు చేశారు.

7.5శాతం రిజర్వేషన్‌పై వాగ్వాదం

శాసనసభలో బుధవారం 2026-27వ ఏడాది ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై చర్చ సందర్భంగా వైద్యకళాశాలల్లో 7.5శాతం రిజర్వేషన్ అంశంపై అన్నాడీఎంకే, డీఎంకే సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కె.పి.మునుసామి మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు వైద్య కళాశాలల్లో చేరేందుకు 7.5శాతం రిజర్వేషన్‌ను ఎడప్పాడి పళనిసామి తీసుకొచ్చారని తెలిపారు. దానికి మంత్రి మా.సుబ్రమణియన్ స్పందిస్తూ... నాడు ప్రతిపక్షంగా ఉన్న డీఎంకే లోక్‌భవన్ ఎదుట ఆందోళన చేయడంతోనే ఆ రిజర్వేషన్ చట్టంగా మారిందన్నారు. ఇందుకు నిరసన వ్యక్తం చేస్తూ దళవాయ్ సుందరం, విజయభాస్కర్ తమ సీట్లు నుంచి ముందుకు రాగా వారిని సీట్లలో వెళ్లి కూర్చోవాలంటూ సభాపతి హెచ్చరించారు. వాస్తవ విరుద్ధమైన సమాచారం ఇస్తున్నారంటూ అన్నాడీఎంకే సభ్యులు తెలిపారు. 7.5శాతం రిజర్వేషన్‌పై డీఎంకే మాట్లాడినందుకు ఆధారాలు చూపించాలని ఎడప్పాడి పళనిసామి డిమాండ్ చేశారు. నీట్ వ్యవహారంలో డీఎంకే ప్రభుత్వం ఏం సాధించిందని ప్రశ్నించారు.

సభ నుంచి బయటికొస్తున్న ఎడప్పాడి

క్యాన్సర్ బాధితులకు సంరక్షణ కేంద్రం

కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మా.సుబ్రమణియన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: మద్రాస్ వైద్యకళాశాల తరపున తాంబరం ప్రాంతంలో క్యాన్సర్ బాధితులకు రూ.30.16 కోట్లతో ప్రభుత్వం సంరక్షణ కేంద్రాన్ని బుధవారం మంత్రి మా.సుబ్రమణియన్ ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొవిడ్ సమయంలో విదేశాల నుంచి విమానాల్లో వచ్చేవారిని ఐసోలేషన్‌లో ఉంచేందుకు తాంబరంలో ఆస్పత్రిని నిర్మించినట్లు తెలిపారు. ప్రస్తుతం కొవిడ్ వెళ్లిపోయినందున ఈ భవనాన్ని 180 పడకల సౌకర్యంతో క్యాన్సర్ సంరక్షణ కేంద్రంగా మార్చామని చెప్పారు. ఇక్కడ ఏటా 400మంది క్యాన్సర్ బాధితులకు వైద్యం అందించేందుకు సౌకర్యాలు ఉన్నాయన్నారు.

రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల

రాష్ట్రంలో ఖాళీ కానున్న ఆరు స్థానాలు

చెన్నై, న్యూస్‌టుడే: రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో 10 రాష్ట్రాల్లోని 37 మంది రాజ్యసభ సభ్యుల పదవీకాలం పూర్తికానుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసింది. 26న నోటిఫికేషన్ విడుదల కానుండగా మార్చి 5న నామినేషన్ల దాఖలుకు, మార్చి 9న ఉపసంహరణకు గడువు. మార్చి 16న ఉదయం 9 గంటలు నుంచి సాయంత్రం 4 గంటలు వరకు పోలింగ్ జరగనుండగా అదే రోజు ఫలితాలు వెల్లడించనున్నారు. తమిళనాడు నుంచి ఆరు రాజ్యసభ స్థానాలు ఖాళీ కానున్నాయి. డీఎంకే నుంచి ఎన్.ఆర్. ఇళంగో, కనిమొళి సోము, తిరుచ్చి శివ, అందియూర్ సెల్వరాజ్, అన్నాడీఎంకే నుంచి తంబిదురై, జీకే వాసన్(టీఎంసీ)ల సభ్యత్వకాలం ముగియనుంది. ఆ స్థానాలకూ ఎన్నికలు జరగనున్నాయి.

ఉపాధ్యాయులకు అర్హత పరీక్ష

ఏప్రిల్ 10 వరకు దరఖాస్తుకు అవకాశం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ, ప్రభుత్వ సాయం పొందే పాఠశాలలు, అనుమతిపొందిన ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అర్హత పరీక్ష రాసేందుకు బుధవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఏప్రిల్ 10 వరకు trb.tn.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. జనరల్ కేటగిరికి రూ.600, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.300 రుసుము చెల్లించాలి. సెకండరీ గ్రేడ్ టీచర్ల అర్హత పరీక్ష జులై 4న, గ్రాడ్యుయేట్ టీచర్లకు జులై 5న నిర్వహించనున్నారు.

దివ్యాంగుల అరెస్టు సరికాదు: ఈపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: దివ్యాంగులపై అణచివేత ధోరణి మానుకోవాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో.. సహాయ నిధి పెంచాలని ఆందోళన చేస్తున్న దివ్యాంగులను పోలీసులు అర్ధరాత్రి అరెస్టు చేయటం ఖండించదగినదని తెలిపారు. వారిని చెన్నై వ్యాప్తంగా తిప్పి, హింసించినట్లు వస్తున్న వార్తలు దిగ్భ్రాంతి కలిగించాయన్నారు. దివ్యాంగుల సంఘ అధ్యక్షుడు బాలకృష్ణన్ గాయపడి ఆస్పత్రిలో చేరినట్లు తెలిసిందన్నారు. పేర్కొన్నారు.

విలేకర్లతో మాట్లాడుతున్న కేఏ పాల్ తదితరులు

చెన్నై గ్లోబల్ పీస్ ఫెస్టివల్‌కు అనుమతి మంజూరు చేయండి

టీనగర్: చెన్నై నందనంలోని వైఎంసీఏ మైదానంలో 22న నిర్వహించతలపెట్టిన 'గ్లోబల్ పీస్ ఫెస్టివల్'కు పోలీసులు అనుమతి మంజూరు చేయడంలో జాప్యంపై గ్లోబల్ పీస్ ఇనిషియేటివ్ అధ్యక్షుడు డా.కేఏ పాల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. మంగళవారం చెన్నైలో విలేకరులతో మాట్లాడారు. నెల రోజుల ముందే దరఖాస్తు చేసుకున్నామని, అవసరమైన అన్ని పత్రాలు, రుసుము సమర్పించామన్నారు. కార్యక్రమ తేదీ దగ్గర పడుతున్నా తుది అనుమతి ఇవ్వకపోవడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ వెంటనే స్పందించి సభకు ఆటంకాలు కలగకుండా చూడాలని కోరారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పలు యుద్ధాలను ఆపాలని, ఐక్యతను చాటడమే ఈ సభ ఉద్దేశమని వివరించారు.

తమిళనాట టీవీకేతో ఎన్నార్ కాంగ్రెస్ కూటమి?

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరికి ప్రధాని రాక, సీట్ల పంపకంపై ముఖ్యమంత్రి రంగసామితో బుధవారం తిలాసుపేట్టైలోని ఆయన నివాసంలో భాజపా అధిష్ఠాన ఇన్‌ఛార్జ్ నిర్మల్‌కుమార్ సురానా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కూటమిపై చర్చలు జరిగినట్లు తెలిసింది. పుదుచ్చేరిలో ఎన్డీయే కూటమిలో ఎన్నార్ కాంగ్రెస్ ఉంటుందని తమిళనాడులో నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం(టీవీకే)తో జట్టు పెట్టుకోనున్నట్లు సమాచారం. ఇది భాజపా వర్గాలను షాక్‌కు గురిచేసినట్లు తెలిసింది.

20 నుంచి ఏప్రిల్ 5 వరకు
సబర్బన్ సేవల్లో మార్పులు

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై ఎగ్మోర్ స్టేషనులో పునరాభివృద్ధి పనుల కారణంగా 10, 11 ప్లాట్‌ఫామ్‌ల మీద ఆగే సబర్బన్ రైళ్లు ఈనెల 20వ తేదీ అర్ధరాత్రి నుంచి ఏప్రిల్ 5వ తేదీ అర్ధరాత్రి వరకు(45 రోజులు) 5, 6 నెంబరు ప్లాట్‌ఫామ్‌లపై ఆగుతాయని దక్షిణ రైల్వే ప్రకటన విడుదల చేసింది.

- చెన్నై బీచ్ నుంచి తాంబరం, చెంగల్పట్టు, కాంచీపురం, అరక్కోణం వైపునకు వెళ్లే రైళ్లు ఫిబ్రవరి 20 నుంచి ఏప్రిల్ 5వరకు 6వ నెంబరు ప్లాట్‌ఫామ్‌పై ఆగుతాయి.
- అరక్కోణం, కాంచీపురం, చెంగల్పట్టు, తాంబరం నుంచి చెన్నై బీచ్ వైపునకు వెళ్లే రైళ్లు ఐదో నెంబరు మీద నిలుస్తాయి. పైన తెలిపిన తేదీల్లో చెన్నై బీచ్-తాంబరం- చెంగల్పట్టు సెక్షనులో నడిచే రైళ్లకు ఆదివారం అంటూ ప్రత్యేక మార్పులేమీ లేవు.

2030లోపు 30శాతం ఈ-బస్సులు

☛ మరిన్ని ప్రాంతాల్లో స్పాంజ్ పార్కులు

చెన్నై, న్యూస్‌టుడే: రాష్ట్ర రవాణా సంస్థల కింద కొనసాగే బస్సుల్లో 30 శాతాన్ని 2030లోపు ఈ-బస్సులుగా ఉంచాలన్నది లక్ష్యమని ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. చెన్నై ఏర్పాటు చేసిన రెండు రోజుల 'తమిళనాడు క్లైమేట్ సమ్మిట్ 4.0'ను ముఖ్యమంత్రి మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. తమిళనాడు సముద్రతీర సంపదలను స్థిరీకరించేలా వినియోగించడం, టీఎన్-షోర్ ప్రాజెక్టును ప్రారంభించి దాని కింద 34 మాంగ్రోవ్ భద్రతా కమిటీలకు రివాల్వింగ్ ఫండ్, సూక్ష్మ రుణాలు కింద రూ.5లక్షలు చొప్పున రూ.1.70 కోట్లు అందించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ... కర్బన ఉద్గారాలను సమాంతరం చేసేలా కృష్ణగిరి జిల్లాలో 1,100 మొక్కలను అటవీశాఖ నాటిందన్నారు. మిగతా ప్రభుత్వ శాఖలూ ఈ పద్ధతి పాటిస్తే సేంద్రియ నిల్వ లక్ష్యమైన 30-35 మిలియన్ టన్నులను త్వరగా చేరుకోవచ్చని, అది నెట్ జీరో లక్ష్యానికి మైలురాయిగా ఉంటుందని తెలిపారు. రవాణా ద్వారా ఏర్పడే కర్బన ఉద్గారాలను నియంత్రించడానికి ఇ-బస్ వినియోగాన్ని పెంచుతున్నామని, ప్రస్తుతం 380 ఈ-బస్సులు చెన్నైలో నడుస్తున్నాయని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో పర్యావరణానికి అనువైన 7,738 బస్సులను వాడకంలోకి తీసుకొచ్చామని గుర్తు చేశారు. చెన్నైలో వరద ప్రభావాన్ని అడ్డుకోవడానికి ఏర్పాటు చేసిన స్పాంజ్ పార్కులు భూగర్భ జలాలను పెంచుతున్నాయని, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు వాటిని విస్తరించనున్నట్లు తెలిపారు. నీలగిరి, కోయంబత్తూర్, విరుదునగర్, రామనాథపురం వంటి జిల్లాలను కర్బన సమతాస్థితి కేంద్రాలుగా మార్చే ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

- భవిష్యత్తులో అన్ని శాఖల పథకాలను క్లైమేట్ చేంజ్ చర్యలతో కలిపి అమలు చేసేలా బడ్జెట్‌ను రూపొందించనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా నాటేందుకు 5లక్షల గంధపు మొక్కలను అందించనున్నట్లు తెలిపారు.

టీఎన్-షోర్‌ను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

సింగారవేలర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సింగారవేలర్‌కు ప్రభుత్వ నివాళి

చెన్నై, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరయోధుడు, దక్షిణ భారతదేశ తొలి కమ్యూనిస్ట్, ప్రముఖ ట్రేడ్ యూనియన్ నాయకుడు, హేతువాది సింగారవేలర్ జయంతి సందర్భంగా ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున నివాళులర్పించారు. చెన్నై కలెక్టరు కార్యాలయం ప్రాంగణంలోని ఆయన నిలువెత్తు విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన చిత్రపటానికి బుధవారం మంత్రి స్వామినాథన్, తమిళనాడు తాటి చెట్ల కార్మికుల సంక్షేమ బోర్డు అధ్యక్షుడు ఎర్ణావూర్ నారాయణన్, తమిళ అభివృద్ధి, సమాచార శాఖ కార్యదర్శి రాజారామన్, సమాచార ప్రజా సంబంధాల శాఖ సంచాలకులు వైద్యనాథన్, సంయుక్త సంచాలకులు(స్మారకాలు) తమిళ్ సెల్వరాజన్, చెన్నై కలెక్టరు రష్మి సిద్ధార్థ్ జగడే, సమాచారశాఖ అదనపు సంచాలకులు భాస్కరన్ తదితరులు పుష్పాంజలి ఘటించారు.

రాబోయే తరాలకు పాఠంగా..

చెన్నై: సింగారవేలర్ గురించి రాబోయే తరాలకు పాఠంగా బోధించాలని ముఖ్యమంత్రి స్టాలిన్ పిలుపునిచ్చారు. సింగారవేలర్ జయంతి సందర్భంగా ఆయన తన 'ఎక్స్' పేజీలో... దేశంలో తొలిసారి మే1న ఎర్రజెండాను ఎగరవేసి కార్మిక దినోత్సవాన్ని జరుపుకొని, కార్మికుల సంక్షేమానికి తన జీవితాన్ని సింగారవేలర్ అంకితం చేశారన్నారు.

ప్రధాని రాకతో మంచి జరిగితే స్వాగతిద్దాం

చెన్నై, న్యూస్‌టుడే: ఎన్నికల సమయాల్లో రాష్ట్రానికి ప్రధాని రాకతో మంచి జరిగితే దానిని స్వాగతిద్దామని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత తెలిపారు. చెన్నై విమానాశ్రయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ రాష్ట్రానికి, ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. అధికారంలో భాగస్వామ్యం వస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు.

మీడియా ప్రతినిధులతో మాట్లాడుతున్న ప్రేమలత

ఉత్తీర్ణత పెరుగుదలలో గురువుల పాత్ర కీలకం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకొని ద్రావిడ మోడల్ ప్రభుత్వం రాజకీయం చేయడం లేదని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తెలిపారు. చెన్నై కోట్టూర్‌పురంలోని అన్నా సెంటినరీ లైబ్రరీలో పోస్ట్ గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయులకు బుధవారం శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. మంత్రి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి ఉద్యోగం కాదని, దాతృత్వం అన్నారు. రాష్ట్ర ఆర్థికవృద్ధి 11.19శాతం పెరిగిందని, ఇందుకు ప్రధాన కారణం ముఖ్యమంత్రి స్టాలిన్ పాలనా విధానాలే అన్నారు. 1996లో దేశంలోనే తొలిసారిగా ఐటీ విధానాన్ని ప్రవేశపెట్టినది కరుణానిధి హయాంలోనేనని గుర్తు చేశారు. అల్పాహారం నుంచి కళాశాల విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించడం వరకు అన్ని పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఏటా ఉత్తీర్ణతశాతం పెరుగుదలలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.

ప్రసంగిస్తున్న మంత్రి అన్బిల్ మహేష్

(c) eenadu

దుబాయ్‌లో ఐఐటీఎం 'ఏఐ' కేంద్రం

ఒప్పంద కార్యక్రమంలో ఇరు సంస్థల ఉన్నత ప్రతినిధులు

వడపళని, న్యూస్‌టుడే: ఐఐటీ మద్రాస్ గ్లోబల్ రీసెర్చ్ ఫౌండేషన్ మొదటి అప్లైడ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) కేంద్రాన్ని దుబాయ్ కామర్సిటీలో ఏర్పాటు చేయనుంది. ఈ కేంద్రంతో అప్లైడ్ ఏఐ అభివృద్ధి రంగాలు వేగవంతం చేయడానికి, టెక్నాలజీ ఆధారిత ఆర్థిక వృద్ధికి ఉపయోగకరంగా ఉండగలదని ఐఐటీఎం బుధవారం ప్రకటన విడుదల చేసింది. దుబాయ్‌లోని ఎంపీఐ గల్ఫ్‌తో ఐఐటీఎం గ్లోబల్ చేతులు కలిపిన ఈ కేంద్రం అనువర్తిత ఏఐ ఆవిష్కరణల కోసం దుబాయ్‌ని ప్రాంతీయ, ప్రపంచ లాంచ్ ప్యాడ్‌గా ఉంచాలనే లక్ష్యంగా పెట్టుకుంది. ఫిబ్రవరి 12 నుంచి 14 వరకు జరిగిన 'వరల్డ్ దుబాయ్ 2026'లో ఒప్పందం జరిగాయి. దుబాయ్‌లో అప్లైడ్ ఏఐ ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభించడం ఐఐటీఎం పరిశోధనలను ప్రపంచీకరించడంలో కీలకమైన అడుగు అని డీన్, ఆచార్యులు రమనాథన్ రంగస్వామి పేర్కొన్నారు. ఇరు సంస్థల మధ్య కుదిరిన ఒప్పందంతో భారత్‌-యూఏఈ టెక్నాలజీ కారిడార్‌ను అమలు చేయడంతో పాటు దుబాయ్‌లో హై వెలాసిటీ ఎకోసిస్టమ్ ఏర్పాటు, స్టార్టప్‌లకు మార్కెట్ యాక్సెస్‌ను వేగవంతం చేయగలదని తెలిపారు.

డెమాంటియా ఇండియాతో ఆరోగ్యశాఖ ఒప్పందం

ఒప్పందపత్రాలు చూపుతున్న మంత్రి మా.సుబ్రమణియన్ తదితరులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: చెన్నై సచివాలయంలో ఆరోగ్యశాఖ మంత్రి మా.సుబ్రమణియన్ సమక్షంలో ఆరోగ్యశాఖ, స్వచ్ఛంద సంస్థ డెమాంటియా ఇండియా అలయన్స్ సంయుక్తంగా 60ఏళ్ల పైబడినవారిలో మతిమరుపు (అమ్నెసియా)ను ముందస్తుగా గుర్తించి చికిత్స అందించడానికి బుధవారం ఒప్పందం చేసుకున్నారు. మతిమరుపు నివారణ చర్యలు, బాధితుల సంరక్షణకు శిక్షణ, సంరక్షణ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి అవగాహన కుదిరింది. నేషనల్ జెరియాట్రిక్స్ సెంటర్ సమన్వయ కేంద్రంగా పనిచేస్తుందని అధికారులు తెలిపారు. ఆరోగ్యశాఖ కార్యదర్శి సెంథిల్‌కుమార్, డెమాంటియా ఇండియా అలయన్స్ ఛైర్మన్ శ్రీరాధా మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కూటమిలో ఓపీఎస్ చేరికపై ఈపీఎస్‌దే నిర్ణయం

మాట్లాడుతున్న అమర్ ప్రసాద్‌రెడ్డి

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: ఎన్డీయే కూటమిలో ఒ.పన్నీర్‌సెల్వం చేరికపై అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి నిర్ణయం తీసుకోవాలని భాజపా రాష్ట్ర కార్యదర్శి అమర్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ విషయంపై చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. తేని జిల్లా భాజపా కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్డీయే కూటమిలోకి ఇంకా చాలా పార్టీలు రానున్నాయన్నారు. రామదాస్ నేతృత్వంలోని పీఎంకే కూడా కూటమిలో చేరే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రజల కోసం టీవీకే ఎలాంటి పోరాటం చేసిందని ప్రశ్నించారు. నటుడిని చూసేందుకు పెద్దసంఖ్యలో జనం వస్తారని వారందరూ ఆయనకు ఓటు వేయరని చెప్పారు. టీవీకే తరఫున పోటీకి 234 నియోజకవర్గాల్లోనూ అభ్యర్థులు ఉన్నారా అని ప్రశ్నించారు.

కోయంబేడు- చెన్నై ట్రేడ్‌సెంటర్ మార్గంలో

మెట్రో పనులు 67శాతం పూర్తి

వడపళని, న్యూస్‌టుడే: మెట్రో రైలు రెండోదశ పనులు మూడు వేర్వేరు మార్గాల్లో వేగంగా జరుగుతున్నాయి. మహానగరంలోని కోయంబేడు నుంచి ట్రేడ్‌సెంటర్ వరకు పనులు దాదాపు 67శాతం మేర పూర్తయ్యాయి. ఈ ప్రాంతంలో సేవలు ప్రారంభం కాగానే మెట్రో ప్రయాణికులకు కనెక్టివిటీ మరింత పెరగనుంది.

మరో రెండు వారాల్లో

రెండో దశ నాలుగో మార్గంలోని పూందమల్లి నుంచి లైట్‌హౌస్ వరకు జరుగుతున్న పనుల్లో భాగంగా పూందమల్లి నుంచి వడపళని వరకు రెండు వారాల్లో ప్రారంభం కానుందని అంటున్నారు. వడపళని వద్ద మెట్రో మొదటి, రెండో దశ నెట్‌వర్క్‌కు ఇంటర్‌చేంజ్‌గా మారనుంది. ఈ మార్గంలోనే కోయంబేడు నుంచి చెన్నై ట్రేడ్ సెంటర్ వరకు మార్గం రానుంది. పూందమల్లి-వడపళని మార్గంలోని ఆలపాక్కం, సాలిగ్రామం వరకు స్టేషన్ల పనులు ఇంకా పూర్తి కాలేదు. ముగియగానే జూన్‌లో సేవలు అందుబాటులోకి రానున్నాయి.

చెన్నై ట్రేడ్‌సెంటర్ మార్గంలో కొనసాగుతున్న పనులు

మార్చి చివరికి..

- కోయంబేడు నుంచి చెన్నై ట్రేడ్ సెంటర్ మధ్య వయాడక్ట్ పనులు మార్చి చివరికల్లా పూర్తవుతాయని సీఎంఆర్ఎల్ అధికారులు పేర్కొన్నారు. వయాడక్ట్ పూర్తయిన ప్రాంతాల్లో ట్రాక్ పనులు మొదలుపెట్టామని, ఇప్పటివరకు కోయంబేడు, చెన్నై ట్రేడ్ సెంటర్ మధ్య రానున్న 12 కి.మీలలో మొగలివాక్కం, రామాపురం, చెన్నై ట్రేడ్ సెంటర్ డబుల్ డెక్కర్ మార్గంలో కొన్ని ప్రాంతాల్లో దాదాపు 2 కి.మీ వరకు పూర్తయ్యాయని ఉన్నతాధికారి ఒకరు అన్నారు.
- నాలుగు నెలల్లో ఆలపాక్కం, ఆళ్వార్ తిరునగర్ మధ్య డబుల్‌డెక్కర్ మార్గం పూర్తయితే ఆలపాక్కం, కారంబాక్కం, వలసరవాక్కం, ఆళ్వార్‌తిరునగర్ స్టేషన్లలో 4, 5 మార్గాల్లో ప్రయాణికులు మారే వీలు కలుగుతుంది.
- జూన్‌లో చెన్నై ట్రేడ్ సెంటర్ దాటి ఆలందూర్ వరకు కనెక్టివిటీ అందించాలనుకుంటున్నట్లు సీఎంఆర్ఎల్ పేర్కొంది. ఇందులో కొన్ని సమస్యలున్నాయని పేర్కొంది. ట్రేడ్ సెంటర్ దాటి భట్‌రోడ్డు, ఆలందూర్ రెండు స్టేషన్ల నిర్మాణం జరగాల్సి ఉంది. ఆలందూర్ స్టేషను నిర్మాణం కొనసాగుతుండగా, జూన్ గడువుకు ముందే భట్ రోడ్డు స్టేషను నిర్మాణం పూర్తి చేయడానికి సవాళ్లు ఉన్నాయని తెలిపింది. పాల్ వెల్స్ రోడ్డు వెంబడి నిర్మాణం చేపట్టడానికి ట్రాఫిక్ విభాగం నుంచి సరైన అనుమతి రాలేదని, ఆ ప్రాంతంలో స్తంభాల పనులు కూడా ప్రారంభం కాలేదని పేర్కొంది. త్వరలోనే పనులు వేగవంతం చేస్తామని అధికారి ఒకరన్నారు.

ప్రముఖుల పేర్లతో వీధి, రోడ్లకు నామఫలకాలు

నామఫలకాలు ఆవిష్కరిస్తున్న స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: తమిళ సినీరంగ సీనియర్ నేపథ్య గాయకుడు తిరుచ్చి లోకనాథన్ సేవలను కొనియాడేలా మందవెల్లిపాక్కంలోని నార్టన్ 8వ వీధికి ఆయన పేరు పెట్టారు. తమిళ సంప్రదాయ సంగీతం, సినీ సంగీతం వ్యాప్తికి కృషి చేసిన సంగీత మేధావి, తమిళ గాయకుడు పద్మశ్రీ సీర్కాళి గోవిందరాజన్ స్మారకంగా మందవెల్లిపాక్కంలోని ఈస్ట్ రింగ్‌రోడ్డుకు ఆయన పేరు పెట్టారు. ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఎం.ఎస్.విశ్వనాథన్ సేవలను కొనియాడేలా డిమాంటి రోడ్డుకు ఆయన పేరు పెట్టారు. ఆ వీధి, రోడ్ల నామఫలకాలను సచివాలయం నుంచి వర్చువల్‌గా బుధవారం ముఖ్యమంత్రి స్టాలిన్ ఆవిష్కరించారు. మంత్రి కె.ఎన్.నెహ్రూ, మేయర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేశ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఆయనకు పుస్తకాలే లోకం..

ప్రదర్శన ఆహ్వానపత్రికలో కనిపించని పేరు

దివాన్

టీనగర్, న్యూస్‌టుడే: తిరునెల్వేలి కార్పొరేషన్ ట్రేడ్‌సెంటర్‌లో ఇటీవల ప్రారంభమైన తొమ్మిదో పొరునై పుస్తక ప్రదర్శన ఆహ్వానపత్రికలో ప్రముఖ రచయిత దివాన్ పేరు లేకపోవడం చర్చకు దారితీసింది. ఈ విషయమై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆహ్వానపత్రికలో సుమారు 243 మంది పేర్లు ఉన్నా దివాన్ పేరు ఎక్కడా కనిపించలేదు. పుస్తక ప్రదర్శన ఇన్‌ఛార్జి, తహసీల్దార్ మారిరాజ్ స్పందిస్తూ.. ఇది పొరపాటున జరిగిందని చెప్పారు. భవిష్యత్తులో ఓ ముఖ్య కార్యక్రమంలో ఆయన్ను ప్రత్యేకించి గౌరవిస్తామని పేర్కొన్నారు. పాళయంగోట్టయ్‌కి చెందిన దివాన్ పుస్తకాలపై మక్కువతో ఇంటినే గ్రంథాలయంగా మార్చేశారు. ఇంట్లో సుమారు లక్షకు పైగా పుస్తకాలు ఉన్నాయి. పడుకోవడానికి కొద్దిపాటి స్థలం మినహా, ఇల్లంతా పుస్తకాలతో నిండిపోయి ఉంటుంది. 190 పుస్తకాలను రచించారు. 2022లో తమిళనాడు ప్రభుత్వం ఆయన పుస్తకాలను జాతీయం చేసింది.

ఎన్నికల సన్నాహాలపై సమీక్ష

సమీక్ష నిర్వహిస్తున్న కుమరగురుభరన్

చెన్నై, న్యూస్‌టుడే: ఎన్నికల సన్నాహాలపై జిల్లా రిటర్నింగ్ అధికారి, చెన్నై మహానగర పాలక సంస్థ కమిషనరు కుమరగురుభరన్ అధ్యక్షతన రిప్పన్ బిల్డింగ్‌లో రిటర్నింగ్ అధికారులు, పోలీసుశాఖ అధికారులతో సమాలోచన జరిగింది. ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన సన్నాహాలపై చర్చించారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూర్ జిల్లా మీంజూరు పట్టణ పంచాయతీలో రూ.1.85 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. జిల్లా కలెక్టర్ ప్రతాప్ బుధవారం పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారుడిని ఆదేశించారు.

డీఎంకే కార్యకర్తల సమావేశం

ప్రసంగిస్తున్న ఎంపీ రాజా

పొన్నేరి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండిలో డీఎంకే కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి రమేష్‌రాజ్ అధ్యక్షత వహించారు. ఎంపీ, డీఎంకే రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రాజా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ ఐదేళ్లలో ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఎన్నికల్లో విజయం సాధించేలా కృషిచేయాలని సూచించారు. ఎమ్మెల్యే గోవిందరాజన్, యూనియన్ కార్యదర్శులు ఆనందన్, మణిబాల, మూర్తి, శక్తివేల్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎంసీ-గుమ్మిడిపూండి సబర్బన్ సర్వీసు పాక్షికంగా రద్దు

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై సెంట్రల్-గూడూరు సెక్షనులోని మీంజూర్, పొన్నేరి స్టేషన్ల మధ్య సాంకేతిక పనుల కారణంగా మూర్ మార్కెట్ కాంప్లెక్స్(ఎంఎంసీ)- గుమ్మిడిపూండి సబర్బన్ సర్వీసులు పాక్షికంగా రద్దు చేసినట్టు దక్షిణ రైల్వే బుధవారం ప్రకటన విడుదల చేసింది. ● ఎంఎంసీ-గుమ్మిడిపూండి 23.20 రైలు 20, 21 తేదీల్లో మీంజూర్ వరకు నడుస్తుంది. ● గుమ్మిడిపూండి-ఎంఎంసీ 03.50 రైలు 19, 21, 22 తేదీల్లో మీంజూరు నుంచి బయలుదేరుతుంది.

ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు తాత్కాలికంగా

రద్దు చేయడం కుదరదు: హైకోర్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: రాజకీయ పార్టీల గుర్తింపుపై ఎన్నికల కమిషన్ ఉత్తర్వులను తాత్కాలికంగా రద్దు చేయడం కుదరదని మద్రాసు హైకోర్టు తెలిపింది. శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా ఆరేళ్లు పోటీ చేయని, రాబడి, ఖర్చుల ఖాతాలను దాఖలు చేయకపోవడం తదితర నిబంధనలు ఉల్లంఘించినందుకు 42 పార్టీల గుర్తింపును ఎన్నికల కమిషన్ రద్దు చేసింది. అందులో కొంగునాడు మక్కల్ దేశీయ కట్చి, మనిదనేయ మక్కల్ కట్చి, తమిళగ మక్కల్ మున్నేట్ర కళగం, మనిదనేయ జననాయగ కట్చి తదితర పార్టీలు ఉన్నాయి ఎన్నికల కమిషన్ ఉత్తర్వులను సవాలు చేస్తూ మద్రాసు హైకోర్టులో పిటిషన్లు దాఖలు అయ్యాయి. ఈ పిటిషన్లు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీవాస్తవ, జస్టిస్ అరుళ్‌మురుగన్ ధర్మాసనం విచారణ జరిపింది. అన్ని తరపు వాదనలు విన్న న్యాయమూర్తులు ఎన్నికల కమిషన్ పార్టీల గుర్తింపుని రద్దు చేసిన ఉత్తర్వులను తాత్కాలికంగా రద్దు చేయడం కుదరదని వ్యాఖ్యానించారు. ఈ విచారణ మార్చికి వాయిదా వేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

హత్య కేసులో తొమ్మిది మంది విడుదల ఉత్తర్వులు రద్దు

ప్యారిస్, న్యూస్‌టుడే: హత్య కేసులో తొమ్మిది మందిని విడుదల చేస్తూ తిరువణ్ణామలై కోర్టు జారీచేసిన ఉత్తర్వులను మద్రాసు హైకోర్టు రద్దు చేసింది. తిరువణ్ణామలైకి చెందిన ఏళుమలై 2011లో హత్యకు గురయ్యాడు. ఈ కేసులో రవిచంద్రన్, దేవదాస్, అంబురోస్, రంజన్, వెంకటేశన్, మంజునాథన్, కరుణానిధి, సూర్య ప్రకాష్, రామన్‌లను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసును విచారించిన తిరువణ్ణామలై కోర్టు ఆధారాల్లేవని తొమ్మిది మందిని విడుదల చేస్తూ 2019లో తీర్పు ఇచ్చింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ పోలీసుల తరఫున మద్రాసు హైకోర్టులో అప్పీల్ దాఖలైంది. ఈ పిటిషన్ బుధవారం విచారణకు వచ్చింది. సాక్షులు, విచారణ ఆధారంగా నేరం రుజువైందని, జిల్లా కోర్టు జారీ చేసిన తీర్పును కొట్టివేస్తూ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. తొమ్మిది మందికి జీవితఖైదు, తలా రూ.1000 జరిమానా విధిస్తూ ఉత్తర్వులు ఇచ్చి, వారు అప్పీల్ చేసుకునేందుకు వీలుగా 90 రోజులు గడువు ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

పోలీసు కమిషనర్‌కు 19 వినతులు

కమిషనర్ అరుణ్‌కు సమస్యలు విన్నవిస్తున్న బాధితులు

గిండి, న్యూస్‌టుడే: వివిధ నేర సంబంధ విషయాలకు సంబంధించి నగరవాసులు చెన్నై కమిషనర్ కార్యాలయంలో బుధవారం జరిగిన గ్రీవెన్స్‌డేలో నగర పోలీస్ కమిషనర్ ఎ.అరుణ్‌కు 19 వినతులు అందజేశారు. వీటిపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులకు ఆయన ఆదేశాలు జారీచేశారు.

అల్పాహారం తిన్న విద్యార్థులకు అస్వస్థత

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: పొళ్లాచ్చి వద్ద పాఠశాలలో ఆహారం తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసుల కథనం మేరకు... కోయంబత్తూరు జిల్లా పొళ్లాచ్చి వద్ద దాసనాయకన్‌పాళైయం ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి వరకు ఉంది. వంద మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. బుధవారం ఉదయం పాఠశాలలో అల్పాహారం అందించారు. తిన్న కొందరు అకస్మాత్తుగా స్పృహకోల్పోగా మరికొందరు కడుపునొప్పితో బాధపడ్డారు. సమాచారం మేరకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పొళ్లాచ్చి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. పిల్లల ఆరోగ్యం గురించి ఉపాధ్యాయులు తెలియజేయలేదని తల్లిదండ్రులు వాగ్వివాదానికి దిగారు. సమాచారం మేరకు నెగమం పోలీసులు అక్కడికి చేరుకుని విద్యార్థులను విచారిస్తున్నారు.

తీర ప్రాంతాల అభివృద్ధికి ప్రతిపాదనలు: మంత్రి ఈవీ వేలు

టీనగర్, న్యూస్‌టుడే: తమిళనాడులోని తీర ప్రాంత జిల్లాల సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 'సాగర మాల 2.0' పథకం కింద రూ.18 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రతిపాదించినట్లు మంత్రి ఈవీ వేలు వెల్లడించారు. చెన్నై సచివాలయంలో మంగళవారం తమిళనాడు మారిటైమ్ బోర్డు సమావేశం జరిగింది. 40 ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న కడలూరు ఓడరేవును ప్రైవేటు భాగస్వామ్యంతో తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. రామేశ్వరం నుంచి శ్రీలంకలోని తలైమన్నార్‌కు ప్రయాణ సేవలను ప్రారంభించేందుకు వీలుగా రామేశ్వరంలో అంతర్జాతీయ ప్యాసింజర్ టెర్మినల్, జెట్టీ నిర్మాణానికి కేంద్ర ఆర్థిక సహాయం కోరుతూ ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు.

EENADU Classifieds JOBS
హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం జీ: 18-20K ✆ 96404 68899, 96402 58899

పన్రుట్టి రామచంద్రన్ కొత్త పార్టీ?

సైదాపేట, న్యూస్‌టుడే: సీనియర్ రాజకీయ నేత పన్రుట్టి రామచంద్రన్ కొత్త పార్టీ ప్రకటించనున్నట్లు తెలిసింది.ఆయన నేతృత్వంలో 'ఎంజీఆర్ అన్నాడీఎంకే' అనే కొత్త పార్టీని కాంచీపురం జిల్లా కార్యదర్శి రంజిత్‌కుమార్ ప్రారంభించనున్నట్లు, ఈ కార్యక్రమం గురువారం చెన్నైలో జరగనున్నట్లు సమాచారం వెలువడింది. ఇందుకు సంబంధించి పన్రుట్టి రామచంద్రన్ అధికారికంగా ప్రకటించనున్నట్లు తెలిసింది. 23న కాంచీపురంలో పార్టీ జెండా ఆవిష్కరించి, సిద్ధాంతాలు ప్రకటించనున్నట్లు తెలిసింది. పన్రుట్టి రామచంద్రన్ తన రాజకీయ ప్రస్థానాన్ని డీఎంకేలో ప్రారంభించారు. 1967, 1971లో డీఎంకే తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం 1977లో ఎంజీఆర్ సమక్షంలో అన్నాడీఎంకేలో చేరారు. 1977, 1980, 1984లో అన్నాడీఎంకే తరఫున ఎమ్మెల్యేగా గెలిచారు. తర్వాత జయలలితతో విబేధించి పీఎంకేలో చేరారు. 1991లో పీఎంకే తరఫున ఎమ్మెల్యే అయ్యారు. తర్వాత డీఎండీకేకు మారారు. 2013న డీఎండీకే నుంచి వైదొలిగి 2014లో అన్నాడీఎంకే గూటికి చేరారు. ఈపీఎస్, ఓపీఎస్‌లు విడిపోయినప్పుడు ఓపీఎస్ వైపు నిలిచారు. ప్రస్తుతం ఓపీఎస్ వర్గం నుంచి వైదొలిగి కొత్త పార్టీ ప్రకటించనుండటం గమనార్హం.

ఘనంగా సంగీత నృత్యోత్సవం

నృత్య ప్రదర్శనలో హరిణి సుకుమార్, తనుశ్రీ, నైనిక వెంకటాచలం

టీనగర్, న్యూస్‌టుడే: చెన్నై మైలాపూర్‌లో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని 'రసా' సంస్థ ఆధ్వర్యంలో సంగీత నృత్యోత్సవం వైభవంగా జరిగింది. స్థానిక అరుళ్మిగు అప్పర్ స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన భరతనాట్య ప్రదర్శన భక్తులు, కళాభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రముఖ భరతనాట్యం గురువు కలైమామణి పార్వతీ రవి ఘంటసాల నేతృత్వంలోని 'కళాప్రదర్శిని' శిష్య బృందం ప్రదర్శన ఇచ్చింది. యువ కళాకారిణులు హరిణి సుకుమార్, తనుశ్రీ, నైనిక వెంకటాచలం తమ అద్భుత అభినయంతో శివతత్వాన్ని నృత్య రూపంలో ఆవిష్కరించారు. మరో నృత్య కార్యక్రమంలో కళాసింధూర్ స్కూల్ ఆఫ్ పెర్ఫామింగ్ ఆఫ్ ఆర్ట్స్ గురువు సింధు శ్యామ్ నేతృత్వంలో విద్యార్థినులు రాగిని విద్యాశంకర్, శివాని రమేశ్‌లు నృత్యం ప్రదర్శించారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండోత్సవం

అగ్నిగుండంలో దిగి మొక్కు చెల్లించుకుంటున్న భక్తురాలు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కరూర్ అన్నకామాక్షియమ్మన్ ఆలయంలో మంగళవారం అగ్నిగుండోత్సవంలో భక్తిశ్రద్ధలతో జరిగింది. భక్తులు గుండంలో దిగి మొక్కు చెల్లించుకున్నారు. మంగళవారం వేకువజామున అమ్మవారికి ప్రత్యేక ఆరాధన నిర్వహించారు. బుధవారం ఉదయం మామిడి ఆకుల పూజ జరిపి కరగాన్ని నదికి తరలించారు.

వైభవంగా వీరరాఘవుని తెప్పోత్సవం

తెప్పపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరులోని శ్రీదేవి, భూదేవి సమేత వీరరాఘవ పెరుమాళ్ ఆలయంలో మాసి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి అలంకరించిన తెప్పంలో వీరరాఘవుని కొలువు తీర్చి తెప్పోత్సవం నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



సంపత్‌గిరిపై ఉన్న ఆలయం

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై జిల్లా పోలూరు సంపత్‌గిరిపై శ్రీలక్ష్మీ నరసింహ స్వామి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు నిర్వహించారు.

జాలర్లను విడిపించండి

కేంద్రానికి పుదుచ్చేరి సీఎం లేఖ

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసిన 25 మంది జాలర్లను విడిపించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగసామి కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్‌కు లేఖ రాశారు. కొడియకరై సమీపంలో చేపలు పడుతున్న 25 మంది తమిళనాడు మత్స్యకారులను శ్రీలంక నావికాదళం అరెస్టు చేసిందని పేర్కొన్నారు. వారిలో 10 మంది కారైక్కాల్ ప్రాంతానికి చెందినవారని చెప్పారు. మత్స్యకారులను, పడవలను విడిపించేందుకు కేంద్ర ప్రభుత్వం త్వరగా చర్యలు తీసుకోవాలని కోరారు.

జీసీటీతో దక్షిణ రైల్వేకు ఆదాయం

వడపళని, న్యూస్‌టుడే: గతి శక్తి కార్గో టెర్మినల్స్(జీసీటీ) ద్వారా సరకు రవాణాతో దక్షిణ రైల్వే ఆదాయాన్ని గడించిందని బుధవారం ప్రకటన విడుదల చేసింది. మనలిలో 2023 జులైలో ప్రారంభమైనప్పటి నుంచి 0.559 మిల్లియన్ల టన్నుల సరకు రవాణాతో రూ.54.70 కోట్లు గడించినట్లు తెలిపింది.

చెరకు సాగు పరిశీలన

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై జిల్లా తండరాంపట్టు తాలూకా కీల్‌సిరుపాక్కం పంచాయతీలో సాగవుతున్న చెరకు పంటను బుధవారం జిల్లా కలెక్టరు తర్పగరాజ్ పరిశీలించారు. సాగు గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ సంయుక్త డైరెక్టర్ కన్నగి, సహాయ డైరెక్టర్ ప్రభు, తహసీల్దార్ దురైరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కోవైలో 22న నిర్వాహకులతో ఉదయనిధి సమావేశం

చెన్నై, న్యూస్‌టుడే: డీఎంకే యువజన విభాగం పశ్చిమ జోన్ నిర్వాహకులతో ఆ విభాగం రాష్ట్ర కార్యదర్శి, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కోయంబత్తూర్‌లో 22న సమావేశం కానున్నారు. ఆ రోజు సాయంత్రం 3 గంటలకు కోయంబత్తూర్ కరుమత్తంపట్టిలోని కణియూర్ టోల్‌గేట్ వద్ద సమావేశం కానున్నారు.

సీట్ల సర్దుబాటుకు కమిటీ ఏర్పాటు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: శాసనసభ ఎన్నికల్లో డీఎంకేతో పొత్తు ద్వారా పోటీ చేస్తామని ఐయూఎంఎల్ ఇటీవల ప్రకటించింది. ఏ ఏ నియోజకవర్గాల్లో పోటీ చేయాలనే అంశానికి సంబంధించి డీఎంకేతో చర్చించేందుకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్ మొహిద్దీన్ నేతృత్వంలో బుధవారం కమిటీ ఏర్పడింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ అబూబక్కర్, కోశాధికారి షాజహాన్, మాజీ ఎంపీ అబ్దుల్‌రెహ్మాన్, ఎంపీ నవాజ్‌గని కమిటీలో ఉన్నారు.

పుస్తకాలు ఆవిష్కరించిన స్టాలిన్

ఆవిష్కరించిన పుస్తకాలతో ముఖ్యమంత్రి తదితరులు

చెన్నై, న్యూస్‌టుడే: ద్రావిడ కళంజియం పథకం కింద రూపొందించిన 7 పుస్తకాలను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. తమిళనాడు టెక్స్ట్‌బుక్, ఎడ్యుకేషనల్ సర్వీసెస్ కార్పొరేషన్ తరఫున ద్రావిడ కళంజియం పథకం కింద జస్టిస్ పార్టీ చరిత్ర, తందై పెరియార్ తాత్విక సంకలనం, అన్నాదురై తాత్విక సంకలనం, ద్రావిడ ఉద్యమం మహిళా తత్వవేత్తల సంకలనం, ద్రావిడ ఉద్యమం-సామాజిక సంస్కృతి ఆర్థిక మార్పులు, ద్రావిడ ఉద్యమం కథానికలు, ద్రావిడ ఉద్యమం కవితలు అనే పుస్తకాలను రూపొందించారు. వాటిని సచివాలయంలో బుధవారం ముఖ్యమంత్రి స్టాలిన్ ఆవిష్కరించారు. వాటిని మంత్రులు, అధికారులు, రచయితలు స్వీకరించారు.

ముఖ్యమంత్రికి శ్రీలంక తమిళుల కృతజ్ఞతలు

చెన్నై, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రికి రాష్ట్రంలోని పునరావాస కేంద్రాల్లో నివసిస్తున్న శ్రీలంక తమిళులు కృతజ్ఞతలు తెలిపారు. సచివాలయంలో బుధవారం స్టాలిన్‌ను రాష్ట్రంలోని పలు పునరావాస శిబిరాల్లో నివసిస్తున్న శ్రీలంక తమిళుల ప్రతినిధుల బృందం కలిసింది. శిబిరాల్లోని శ్రీలంక తమిళుల కోసం పథకాలు అమలు చేస్తున్నందుకు, సంక్షేమ పథకాలు అందిస్తున్నందుకు, జీవనహక్కుల కోసం శాశ్వత చట్టపరమైన పరిష్కారం పొందేందుకు ప్రధానికి లేఖ రాసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వెంట మంత్రి నాజర్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి మురుగానందం తదితరులు ఉన్నారు. రాష్ట్రంలోని శ్రీలంక తమిళులకు పౌరసత్వం కల్పించాలని, వీసా ఆంక్షలు తొలగించాలంటూ ఇటీవల ప్రధానికి స్టాలిన్ లేఖ రాయడం గమనార్హం.

ఉచిత ల్యాప్‌టాప్ కోరుతూ ఆందోళన

కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై ప్రభుత్వ కళాశాల విద్యార్థులు తమకు ఉచిత ల్యాప్‌టాప్ ఇవ్వాలని కోరుతూ బుధవారం తరగతులు బహిష్కరించి గేటు వద్ద ఆందోళన నిర్వహించారు. తమ చదువులకు ల్యాప్‌టాప్‌లు అత్యవసరమని, వెంటనే ఇవ్వాలని నినాదాలు చేశారు. విద్యార్థుల డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని కళాశాల నిర్వాహకులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

విద్యార్థినులకు ధ్రువపత్రాలు పంపిణీ

ధ్రువపత్రాలు అందుకున్న విద్యార్థినులతో మంత్రి అన్బరసన్, అధికారులు

సైదాపేట, న్యూస్‌టుడే: ఐఆర్ఐఎస్ పోటీలో విజయం సాధించిన విద్యార్థినులకు ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి అన్బరసన్ ధ్రువపత్రాలు అందజేశారు. జాతీయస్థాయి పోటీల్లో కాంస్య పతకం సాధించిన నామక్కల్ జిల్లా కొల్లిమలై నాత్తుక్కులిపట్టి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులను మంత్రి అన్బరసన్ బుధవారం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

అరుణాచలేశ్వర సన్నిధిలో శివకార్తికేయన్

ఆలయంలో నటుడు శివ కార్తికేయన్ దంపతులు

తిరువణ్ణామలై: ప్రముఖ సినీ నటుడు శివకార్తికేయన్ తన భార్యతో కలిసి మంగళవారం తిరువణ్ణామలై వచ్చారు. అరుణాచలేశ్వర స్వామి సన్నిధి, ఉన్నాములై సన్నిధి, నవగ్రహాలను దర్శించుకున్నారు. పండితులు ప్రసాదాలు అందించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను నటించి ఇటీవల విడుదలైన పరాశక్తి సినిమా విజయవంతంగా ప్రదర్శితమవుతోందన్నారు. ప్రస్తుతం సేయోన్ అనే చిత్రంలో నటిస్తున్నట్లు తెలిపారు.

జీవన్మృతుడి అవయవాలు దానం

ప్యారిస్: జీవన్మృతుడి అవయవాల దానానికి కుటుంబీకులు ముందుకొచ్చారు. తిరునెల్వేలికి చెందిన మహేష్(23) కన్నియాకుమరికి చెందిన యువతిని 8 నెలల కిందట ప్రేమ వివాహం చేసుకున్నాడు. 16వ తేదీ మధ్యాహ్నం మహేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఆసారిప్పళ్లం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అతను జీవన్మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో అతని భార్య మహేష్ అవయవాలను దానంగా ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. బుధవారం అతని కిడ్నీ, కళ్లు, కాలేయం తదితర అవయవాలను శస్త్ర చికిత్స ద్వారా తొలగించారు. ఒక కిడ్నీ తిరుచ్చి ఆస్పత్రికి, మరో కిడ్నీ కారైక్కుడి ఆస్పత్రికి, కాలేయం తిరుచ్చి, కళ్లు నాగర్‌కోవిల్‌లో ఉన్న ఆస్పత్రులకు తరలించారు.

(c) eenadu

రాష్ట్రంలో దృఢంగా భాజపా కూటమి

మాట్లాడుతున్న తమిళిసై సౌందరరాజన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎన్డీయే కూటమి దృఢంగా ఉందని భాజపా నేత తమిళిసై సౌందరరాజన్ అన్నారు. తంజావూర్ జిల్లా పట్టుకోట్టైలో పార్టీ రైతుల విభాగం తరపున బుధవారం అభిప్రాయ సేకరణ సమావేశం జరిగింది. తమిళిసై సౌందరరాజన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పాస్ మార్కులు పొందింది ఒక్క టాస్మాక్‌లో మాత్రమేనని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఎన్డీయే కూటమి కచ్చితంగా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

పాకెట్ నావల్ చిత్రీకరణ ప్రారంభం

మాళవిక మోహనన్, విజయ్ సేతుపతి

చెన్నై, న్యూస్‌టుడే: త్యాగరాజన్ కుమారరాజా దర్శకత్వంలో విజయ్ సేతుపతి, మాళవిక మోహనన్ జంటగా నటిస్తున్న చిత్రం 'పాకెట్ నావల్'. ఫస్ట్‌లుక్ పోస్టరును ఇప్పటికే విడుదల చేసిన చిత్రబృందం ప్రస్తుతం చిత్రీకరణను ప్రారంభించింది. అందుకు సంబంధించిన ఫొటోలు అంతర్జాలంలో వైరలవుతున్నాయి. ఇళయరాజా సంగీతంలో రూపొందుతున్న చిత్రాన్ని ఈ ఏడాది ఆఖరులో విడుదల చేయాలని చిత్రబృందం నిర్ణయించింది. త్యాగరాజన్ కుమారరాజా, విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో ఇది రెండో సినిమా కావడం గమనార్హం.

లవ్ ఓహ్ లవ్ చిత్రానికి ఫాక్సెన్ ద్వయం సంగీతం

ప్రదీప్, వేన్ పేవి

చెన్నై, న్యూస్‌టుడే: మహేశ్ రాజేంద్రన్ దర్శకత్వంలో పవిశ్ నారాయణన్, నాగదుర్గ ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్న చిత్రం 'లవ్ ఓహ్ లవ్'. సినిమా మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్ నిర్మాణం, క్రియేటివ్ ఎంటర్‌టైనర్స్ అండ్ డిస్ట్రిబ్యూటర్స్ డి.ధనుంజయన్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రేమ, వినోదాత్మక అంశాలతో రూపొందుతోంది. చెన్నైలోని పలు ప్రాంతాల్లో చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. కీలకమైన పాత్రలో దర్శకుడు సెల్వరాఘవన్ నటిస్తుండగా ఇతర ముఖ్యమైన పాత్రల్లో దర్శకుడు కె.ఎస్.రవికుమార్, వనితా విజయకుమార్ తదితరులు కనిపించనున్నారు. ఉత్తర చెన్నైలోని ఫాక్సెన్ వీధిలో పుట్టిపెరిగిన చిన్ననాటి మిత్రులైన ప్రదీప్ పి.జె, వేన్ పేవి ద్వయం ఈ చిత్రం ద్వారా పూర్తిస్థాయి సంగీత దర్శకులుగా పరిచయమవుతున్నారు.

సినిమాలతో సామాజిక మార్పు సంతోషకరం

వేదికపై శశికుమార్, రాజు మురుగన్ తదితరులు

చెన్నై, న్యూస్‌టుడే: శశికుమార్, చైత్ర ఆచార్ జంటగా నటించి ఇటీవల విడుదలైన 'మై లార్డ్' విజయవంతంగా ప్రదర్శితమవుతున్న నేపథ్యంలో చిత్ర బృందం కృతజ్ఞతలు తెలిపే కార్యక్రమాన్ని సాలిగ్రామంలో నిర్వహించింది. నటుడు శశికుమార్ మాట్లాడుతూ... తాను నటించిన చిత్రం 'అయోధ్య' తర్వాత మృతదేహాలను తరలించడానికి ప్రభుత్వం రూ.2లక్షల రాయితీ అందించేందుకు ప్రకటన చేసిందన్నారు. 'నందన్' తర్వాత పలుచోట్ల దళితులు జాతీయ జెండాను ఎగురవేసే ఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపారు. 'మై లార్డ్' సినిమా ద్వారా కిడ్నీ రాకెట్‌కు సంబంధించిన అవగాహన ప్రజల్లో ఏర్పడిందన్నారు. తాను నటించిన చిత్రాలు సామాజిక మార్పులను కలిగించడం సంతోషంగా ఉందన్నారు. సంగీత దర్శకుడు షాన్ రోల్డన్, దర్శకుడు రాజు మురుగన్ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో మరిన్ని చెక్‌పోస్టులు

సమావేశంలో కోవై కలెక్టర్ పవన్‌కుమార్ తదితర అధికారులు

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు భద్రత, సరిహద్దు ప్రాంతాలలో తీసుకోవాల్సిన చర్యలపై కోయంబత్తూరు జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం సమావేశం జరిగింది. కలెక్టర్ పవన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేరళలోని పాలక్కాడు, ఎర్నాకుళం, ఇడుక్కి, త్రిస్సూర్ జిల్లాల కలెక్టర్లు, ఉన్నత పోలీసు అధికారులు పాల్గొన్నారు. సరిహద్దు వెంబడి చట్టవిరుద్ధ కార్యకలాపాలను నిరోధించడంపై ప్రధానంగా చర్చించారు. కోయంబత్తూరు- కేరళ సరిహద్దుల్లో చెక్‌పోస్టుల సంఖ్యను పెంచాలని, కఠిన నిఘా ఉంచాలని నిర్ణయించారు.

తుది దశకు మధురాంతకం బస్టాండు పనులు

నిర్మాణంలో ఉన్న మధురాంతకం బస్టాండు

మామల్లపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా మధురాంతకంలో సుమారు 30ఏళ్ల క్రితం 2.10 ఎకరాల విస్తీర్ణంలో అన్నాదురై పేరిట బస్టాండ్ నిర్మించారు. ఇక్కడి నుంచి చెంగల్పట్టు, తాంబరం, చెన్నై, కాంచీపురం, విళుప్పురం తదితర ప్రాంతాలకు నిత్యం సుమారు 5వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు. బస్టాండు శిథిలావస్థకు చేరడం, ప్రయాణికుల సంఖ్యకు తగ్గట్లు వసతులు లేకపోవడంతో భవనాలను కూల్చివేసి అక్కడే కలైజ్ఞర్ పట్టణాభివృద్ధి పథకం కింద కొత్తగా బస్టాండు నిర్మించడానికి పురపాలక సంఘం రూ.2.28 కోట్ల మేర నిధులను కేటాయించింది. 2024లో పనులు ప్రారంభమయ్యాయి. మొదట కేటాయించిన నిధులు చాలవని అధికారులు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖకు, జిల్లా యంత్రాంగానికి నివేదికలు సమర్పించడంతో మరో రూ.1.25 కోట్లను కేటాయించారు. ప్రస్తుతం బస్టాండు నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. దీని గురించి మున్సిపల్ ఇంజినీర్ మాట్లాడుతూ.. ఈనెలాఖరులో బస్టాండు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

నెడుంజెళియన్‌కు స్మారక మందిరం నిర్మించాలి

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూర్ జిల్లా పొన్నేరిలో ముదలియార్ కులస్థుల సంఘ రాష్ట్ర నిర్వాహకుల సమావేశం మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కార్తికేయన్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. పొన్నేరిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 64 ఎకరాల స్థలాన్ని దానంగా ఇచ్చిన ఉలగనాథ ముదలియార్‌కు విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర శాసనసభ ఏర్పాటు చేసినప్పటి నుంచి రిజర్వుడ్ నియోజకవర్గంగా ఉన్న పొన్నేరిని జనరల్ నియోజకవర్గంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని డిమాండు చేశారు. మాజీ మంత్రి నావలర్ నెడుంజెళియన్‌కు స్మారక మందిరం ఏర్పాటు చేయాలని, ఆయన సతీమణి, రాష్ట్ర ఆరోగ్యశాఖ తొలి డైరెక్టర్ విశాలాక్షి పేరును చెన్నైలోని డీఎంఎస్ ప్రాంగణానికి పెట్టాలని కోరారు.

ఊరిలో విద్యుత్తు లేదు.. బతుకుల్లో వెలుగు లేదు

తీర్థక్కాడు గ్రామస్థుల అవస్థ

న్యూస్‌టుడే, ప్యారిస్

కొవ్వొత్తి వెలుగులో భోజనం చేస్తున్న ఓ కుటుంబం

శాస్త్ర, సాంకేతికత అభివృద్ధి చెందిన ఈ ఆధునిక యుగంలోనూ 300కు పైగా కుటుంబాలు చీకటిలోనే కాలం వెళ్లదీస్తున్నాయి. గ్రామంలో విద్యుత్తు సౌకర్యం, కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సెల్‌ఫోన్‌లకు ఛార్జింగ్ పెట్టుకునేందుకు పక్కనున్న ప్రాంతానికి వెళ్లి రూ.5 ఇచ్చి ఛార్జింగ్ పెట్టుకునే స్థితిలో ఉన్నారు మదురై జిల్లాలోని తీర్థక్కాడు గ్రామ ప్రజలు.

900 మంది ఓటర్లు.. తీర్థక్కాడులో సుమారు 900 మంది ఓటర్లున్నారు. చుట్టుపక్కల ప్రాంతాలైన సౌరాష్ట్రిపురం, వండియూర్ ప్రాంతాల ప్రజలు అన్ని సౌకర్యాలతో ఉండగా ఈ ప్రాంతం మాత్రం చీకటిలో మగ్గిపోతోంది. ఈ ఊర్లో ఒక్కచోట కూడా సిమెంటు లేదా తారు రోడ్డు లేదు. కొన్ని ఇళ్లలోనే తమ సొంత ఖర్చులతో సౌర పలకలు ఏర్పాటు చేసుకున్నారు. కొవ్వొత్తుల వెలుగులోనే అన్ని పనులు చేసుకుంటున్నారు. రోజూ కొవ్వొత్తులకే రూ.12 ఖర్చు చేస్తున్నారు. విద్యుత్తు సౌకర్యం కల్పించకున్నా కనీసం కొవ్వొత్తులైనా ఉచితంగా ఇవ్వాలని ఆ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికలు బహిష్కరిస్తాం.. గ్రామస్థులు మాట్లాడుతూ... విద్యుత్తు దీపాలు లేకుండా తాము చదువుకున్నట్లే తమ పిల్లలు కూడా చదువుకోవాలా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. గ్రామంలో తారునీరు, మరుగుదొడ్లు, రోడ్లు తదితర మౌలిక వసతులు లేకుండా జీవిస్తున్నామని, తాగునీటినే కాకుండా అవసరాలకు వినియోగించే నీటిని సైతం కొనుక్కుంటున్నామని, తమ కష్టాలు తెలిసి కూడా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదని వాపోతున్నారు. తమ సమస్యలను పరిష్కరిస్తేనే ఎన్నికల్లో ఓట్లు వేస్తామని, లేదంటే బహిష్కరిస్తారని చెప్పారు.

సమస్యల పరిష్కారానికి కమిటీ.. ఇందుకు సంబంధించి మదురై మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు మాట్లాడుతూ... తీర్థక్కాడులో నివసిస్తున్న ఆదిద్రావిడర్ ప్రజలు ఉంటున్న ప్రాంతం ఆది ద్రావిడర్ సంక్షేమశాఖకు చెందినదని, ఆ స్థలాన్ని పూర్తిగా మదురై కార్పొరేషన్‌కి బదిలీ చేయాలని, అలా చేస్తేనే అక్కడ కనీస వసతులు కల్పించడం కుదురుతుందని తెలిపారు. ప్రస్తుతం ఆదిద్రావిడర్ సంక్షేమ శాఖ, తాము కలిసి అవసరమైన చర్యలు చేపట్టేందుకు వీలుగా ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని, త్వరలో సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు.

ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ఎళిలన్

డీఎంకే పథకాలు ప్రజలకు వివరించండి

సైదాపేట, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి స్టాలిన్ సూచనల మేరకు ద్రావిడ మోడల్ ప్రభుత్వ సాధనలు ప్రజలకు వివరించేందుకు డీఎంకే తరపున 'తమిళనాడు తలవంచదు' పేరిట సమావేశాలు జరుగుతున్నాయి. మంగళవారం సాయంత్రం కాంచీపురం నియోజకవర్గంలో సమావేశం జరిగింది. పార్టీ నేతలు, ప్రజలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఎళిలన్ పాల్గొని ప్రసంగించారు. కేంద్ర భాజపా ప్రభుత్వం తమిళనాడు ప్రజలకు చేస్తున్న వంచనను వివరించారు.

80 కిలోల వెండి వస్తువుల దోపిడీ

వేలూరు, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లాలో వెండి వస్తువుల దోపిడీ జరిగింది. ఆర్కాడు ప్రాంతానికి చెందిన వ్యాపారి దీపక్ వెండి వస్తువులను హోల్‌సేల్ పద్ధతిలో జ్యువెలరీ దుకాణాలకు సరఫరా చేస్తుంటాడు. మంగళవారం రాత్రి 80 కిలోల వెండి వస్తువులతో ఆర్కాడు నుంచి కారులో వాణియంబాడిలోని జ్యువెలరీ బజారుకు వెళ్లారు. శ్మశానకొల్లై కారణంగా బజారు వీధి రద్దీగా ఉంది. ఆ సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో బెదిరించి రూ.2.30 కోట్లు విలువచేసే 80 కిలోల వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. ఈ విషయమై స్థానిక జ్యువెలరీ సంఘం తరపున పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

రెండో పెళ్లి చేసుకున్న భర్తపై దాడి

వేలూరు, న్యూస్‌టుడే: తిరుపత్తూరు సమీపంలోని వాణియంబాడి పెరియపేట ప్రాంతానికి చెందిన తౌసిఫ్, షాజియా దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నాడు. తౌసిఫ్ ఎనిమిదేళ్ల కిందట కుటుంబసభ్యులను కృష్ణగిరికి మార్చాడు. నెలకు ఒకసారి మాత్రం భార్య పిల్లల వద్దకు వచ్చి వెళ్లేవాడు. తౌసిఫ్ మాథుర్ ప్రాంతానికి చెందిన నాషియా అనే మహిళను రెండో వివాహం చేసుకున్నట్లు మొదటి భార్య షాజియాకు తెలిసింది. ఆమె తన తల్లిదండ్రులు, తమ్ముళ్లతో కలిసి బుధవారం వాణియంబాడిలోని పెరియపేటకు చేరుకుని రెండో పెళ్లిపై భర్త తౌసిఫ్ నిలదీసింది. అతను భార్యకు సమాధానం చెప్పకుండా కారులో తప్పించుకుని పోతుండగా వెంబడించి గోవిందపురం వద్ద అడ్డగించి షాజియా సోదరుడు సల్మాన్ తౌసిఫ్‌పై దాడి చేశాడు. విషయం తెలుసుకున్న వాణియంబాడి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి గాయపడిన తౌసిఫ్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కారు ఢీకొని దంపతులు మృతి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: అంత్యక్రియలకు వెళ్లి తిరిగొస్తుండగా కారు ఢీకొని దంపతులు మృతి చెందిన ఘటన తంజావూర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తంజావూర్ వల్లం వెల్లార్ ప్రాంతానికి చెందిన మహాలింగం(67), భార్య మహాలక్ష్మి(62) ఇద్దరు మంగళవారం స్కూటీపై చెల్లప్పన్‌పేట్టైలోని బంధువు అంత్యక్రియలకు వెళ్లారు. తిరిగి రాత్రి ఇంటికి బయలుదేరారు. వల్లం జంక్షన్ రోడ్డులో మలుపు వద్ద కేరళ నుంచి తంజావూర్ వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు.

అనుమానాస్పద స్థితిలో మహిళా న్యాయవాది..

ప్యారిస్: చెన్నై తేనాంపేటలో ఉన్న స్టార్ హోటల్‌లో ఓ యువతి తన స్నేహితుడితో కలిసి ఈనెల 15వ తేదీ రూమ్ తీసుకుని రాత్రి మద్యం తాగినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆ వ్యక్తి సోమవారం బయటకు వెళ్లి తిరిగి హోటల్‌కు వచ్చి గది తలుపు తట్టినా తెరవకపోవడంతో సిబ్బంది సహకారంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని తలుపు తెరిచి చూడగా బాత్రూంలోని బాత్ టబ్‌లో యువతి మృతిచెంది కనిపించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి యువకుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. మృతి చెందిన మహిళ పేరు రోజా(32) అని, తిరువణ్ణామలైకి చెందిన ఆమె చెన్నైలో ఉంటూ లాయరుగా పని చేస్తున్నట్లు, ఆమె స్నేహితుడు పేరు యశ్వంత్ కుమార్ అని తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు ఉద్యోగి..

రెడ్‌హిల్స్: తిరువళ్లూర్ జిల్లా కడంబత్తూరు సమీపం కమ్మవారుపాళ్యం ఎంఎస్‌కేనగర్‌కు చెందిన ప్రేంకుమార్(35) ప్రైవేటు సంస్థ ఉద్యోగి. ఈయన బుధవారం విధులకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. వాహనం నుంచి అదుపుతప్పి కిందపడడంతో తీవ్రంగా గాయపడడంతో తిరువళ్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మనవాళనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘర్షణలో ఏనుగు..

ట్రిప్లికేన్: కోయంబత్తూరు జిల్లా బిల్లూరు ఆనకట్ట ప్రాంతంలో వారం రోజులుగా తిరుగుతున్న రెండు మగ ఏనుగుల మధ్య సోమవారం రాత్రి ఘర్షణ జరిగింది. దాదాపు 40 ఏళ్ల మగ ఏనుగు తీవ్రగాయాలతో ప్రాణాలు కోల్పోయింది. సమాచారం మేరకు మంగళవారం మేట్టుపాళైయం అటవీ వార్డెన్ శశికుమార్ నేతృత్వంలోని అటవీ శాఖ అధికారులు, ఆనమలై టైగర్ రిజర్వు అటవీ వెటర్నరీ వైద్యుడు విజయరాఘవన్ వైద్యం బృందం ఘటనాస్థలికి చేరుకుని ఏనుగు కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఏనుగు దంతం బలంగా గుచ్చుకోవడంతో మరో ఏనుగుకు తీవ్ర రక్తస్రావమై మరణించినట్లు గుర్తించారు. ఏనుగు కళేబరాన్ని ఆ ప్రాంతంలోనే ఖననం చేశారు.

ఉపాధ్యాయిని ఆత్మహత్య

టీనగర్: ప్రేమ పేరుతో యువకుడు చేసిన వేధింపులు తాళలేక ఓ ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయురాలు ఉరి వేసుకుని మంగళవారం ఆత్మహత్య చేసుకున్న సంఘటన సేలం కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు... సేలం జిల్లా ఇలంపిళ్లై సమీపంలోని అళగనూర్ ఆచారి పట్టరైకి చెందిన షణ్ముగప్రియ(22) ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తుంది. నామక్కల్ జిల్లాలోని జ్ఞానమణి కళాశాలలో చదువుతున్న సమయంలో అమరకుంది ప్రాంతానికి చెందిన గౌతమ్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. అది కాస్త ప్రేమకు దారి తీసింది. కొద్దినెలల తర్వాత గౌతమ్ ప్రవర్తన నచ్చక పోవడంతో షణ్ముగప్రియ అతడికి దూరంగా ఉండాలని నిర్ణయించుకుంది. అతను వేధింపులు ఆపకపోగా గతంలో దిగిన ఫోటోలను సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్ట్ చేస్తానని బెదిరించినట్లు తెలుస్తోంది. మనస్తాపానికి గురైన షణ్ముగప్రియ ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మగుడంచావడి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని సంగగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. షణ్ముగప్రియ రాసిన ఆత్మహత్య లేఖలో తనను వేధింపులకు గురి చేసిన గౌతమ్‌ను అరెస్టు చేయాలని సూచించింది. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పనిభారంతో ఉద్యోగి...

రెడ్‌హిల్స్: తిరువళ్లూర్ జిల్లా కడంబత్తూరు సమీప తిరుమేనికుప్పం పెద్ద వీధికి చెందిన బాలాజీ(25) ప్రైవేటు సంస్థలో ఉద్యోగి. పని భారం కారణంగా కొద్ది రోజులుగా దిగాలుగా కనిపించిన అతను మంగళవారం రాత్రి ఇంటి పడక గదిలో ఫ్యానుకు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మప్పేడు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అలిగి పుట్టింటికి వెళ్లిన భార్య: మనస్తాపంతో భర్త బలవన్మరణం

ప్యారిస్, న్యూస్‌టుడే: ప్రభుత్వం బ్యాంకు ఖాతాలో జమ చేసిన రూ.5 వేలు నగదును భర్త ఖర్చు పెట్టాడని భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన విరుదునగర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... విరుదునగర్ జిల్లా వత్తిరాయిరుప్పు ప్రాంతానికి చెందిన ఈశ్వరన్(32). అతని భార్య రాము. ఆమె బ్యాంకు ఖాతాలో మగళిర్ ఉరిమై పథకం కింద రూ.5 వేలు ప్రభుత్వం జమ చేసింది. ఈ నగదును భార్యకు తెలియకుండా ఈశ్వరన్ ఏటీఎం నుంచి తీసుకుని ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయం తెలిసిన భార్య గొడవపడి అలిగి పుట్టింటికి వెళ్లింది. మనస్తాపం చెందిన ఈశ్వరన్ బుధవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం కార్నర్

హత్య కేసులో 21 మందికి జీవితఖైదు

ప్యారిస్, న్యూస్‌టుడే: విళుపురం జిల్లా కిళియనూర్‌కి చెందిన పంచాయతీ మాజీ అధ్యక్షురాలు కృష్ణవేణి, విల్వమణి మధ్య ఎన్నికల కక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో విల్వమణికి మద్దతు పలికిన భాస్కర్‌ను కృష్ణవేణి, ఆమె కుమారులు మదన్‌రాజ్, మదన్‌కుమార్, బంధువులు కాత్తముత్తు, పార్దిబన్, రాణి, మూర్తి సహా 23 మంది భాస్కర్‌ను హత్య చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు కృష్ణవేణితో సహా 23 మందిని అరెస్టు చేశారు. ఈ కేసు విచారించిన దిండివనం కోర్టు 23 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. దీనిని సవాలు చేస్తూ మద్రాసు హైకోర్టులో అప్పీల్ దాఖలైంది. విచారణ జరిపిన న్యాయమూర్తులు దిండివనం కోర్టు ఉత్తర్వులను రద్దు చేసి వారిని నేరస్థులుగా నిర్ధారించింది. ఈ కేసులో నిందితులైన కుమార్, జ్ఞానశేఖరన్ మృతి చెందడంతో కృష్ణవేణి, ఆమె కుమారులు సహా 21 మందికి జీవితఖైదు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

బాలుడిని వివస్త్రను చేసి చిత్రహింసలు

టీనగర్, న్యూస్‌టుడే: తిరునెల్వేలి జిల్లాలో అమానవీయ ఘటన వెలుగు చూసింది. మామిడి పండ్ల కోసం ఓ చిన్నారిని వివస్త్రను చేసి యజమాని దారుణంగా కొట్టిన ఉదంతం స్థానికంగా కలకలం రేపుతోంది. పాతపేట సమీపంలోని కృష్ణపేరి ప్రాంతానికి చెందిన పదేళ్ల పదేళ్ల బాలుడు స్థానికంగా ఓ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం స్నేహితులతో కలిసి ఇంటి సమీపంలోని ఓ తోటలో మామిడి పండ్లు కోయడానికి వెళ్లాడు. గమనించిన యజమాని వారిని వెంటాడగా పదేళ్ల బాలుడు దొరకగా మిగిలిన వారు పరారయ్యారు. అతనిపై తోట యజమాని దాడి చేశాడు. బాలుడి దుస్తులు విప్పి నగ్నంగా రోడ్డుపై నడిపిస్తూ చిత్రహింసలకు గురిచేసినట్లు తెలిసింది. స్థానికులు రక్షించి వైద్య చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాలుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

స్నేహితుడిని హత్య చేసిన వ్యక్తి అరెస్టు

జయంతన్

గిండి, న్యూస్‌టుడే: చెన్నై తిరువొట్రియూర్‌కు చెందిన వినోద్‌కుమార్‌ను అతని స్నేహితుడు జయంతన్ ద్విచక్రవాహనంపై బయటికి తీసుకెళ్లాడు. రాజాకడై సమీపంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి జయంతన్ కత్తితో వినోద్‌కుమార్‌పై దాడిచేసి పారిపోయాడు. గాయాలతో ఉన్న వినోద్‌కుమార్ అక్కడి ప్రజలు స్టాన్లీ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి తండ్రి వెంకటేశన్ ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. చికిత్స పొందుతూ వినోద్‌కుమార్ మృతి చెందడంతో హత్య కేసుగా మార్పు చేశారు. నిందితుడు జయంత్‌ను మంగళవారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరు...

కుమార్ | దేశింగురాజ్

గిండి: బస్సులో ప్రయాణిస్తున్న మహిళపై అసభ్యంగా ప్రవర్తించి, కండక్టర్‌పై దాడికి దిగిన ఘటన ఎన్నూర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తీవుతిడల్ నుంచి ఎన్నూర్‌కు వెళ్తున్న బస్సులో టికెట్ అడిగిన కండక్టర్ మణిమారన్‌తో కుమార్, దేశింగురాజ్ గొడవకు దిగారు. ఆ తర్వాత ఓ ప్రయాణికురాలితో అసభ్యంగా ప్రవర్తించారు. వారిని ఫిషింగ్ హార్బర్ దగ్గర దిగమని బస్సు ఆపగా కండక్టర్‌ను తీవ్రంగా కొట్టడంతో ఆయన స్పృహ కోల్పోయాడు. వెంటనే ఆయన్ని స్టాన్లీ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ ప్రదీప్‌కుమార్, ప్రయాణికురాలి ఫిర్యాదుతో పోలీసులు నిందితులను అరెస్టు చేసి కోర్టు ఆదేశాలతో జైలుకు పంపారు.

దాడులకు పాల్పడిన రౌడీలు...

గిండి: చెన్నై వన్నార్‌పేటలో పలువురు రౌడీలు హల్‌చేసి దాడులకు పాల్పడ్డారు. ఈనెల 16న శంకర్ అనే ఆటో డ్రైవర్‌పై ఐదుగురు రౌడీలు బీరు సీసాతో దాడి చేశారు. అదే ప్రాంతంలో పటేల్‌నగర్ 3వ వీధిలోని ఓ ఇంటికి అమర్చిన సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆర్కేనగర్ పోలీసులు విచారణ చేపట్టి తండయార్‌పేట్టైకు చెందిన శణ్ముగనాథన్, గుణశేఖర్, అరిదాస్, అబ్దుల్ వకాబ్, రాజా ముహమ్మద్‌లను అరెస్టు చేసి జైలుకు పంపారు. వీరిలో నలుగురిపై ఇదివరకే పలు కేసులు ఉన్నాయి.

యువతిపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తి...

మణిమారన్

గిండి: చెన్నై అన్నానగర్‌లోని ఓ ప్రైవేటు కంప్యూటర్ కోచింగ్ కేంద్రంలో ఓ యువతిని అక్కడి శిక్షకుడే లైంగికంగా వేధించారు. డిగ్రీ చదువుతున్న 19 ఏళ్ల అమ్మాయి ఈ కేంద్రంలో పది రోజులుగా శిక్షణ పొందుతోంది. శిక్షణ ఇస్తున్న మణిమారన్ ఆమె పక్కనే కూర్చుని అసభ్యంగా ప్రవర్తించి, లైంగిక వేధింపులు చేసినట్లు అన్నానగర్ పోలీసులు బుధవారం తెలిపారు. యువతి ఫిర్యాదుతో మణిమారన్‌ను మంగళవారం అరెస్టు చేసి కోర్టు ఆదేశాలతో రిమాండుకు పంపారు.

దుకాణంలో చోరీ చేసిన సిబ్బంది...

నిందితుడు సెల్వ తిరుమణికణ్ణన్

గిండి: తాము పనిచేసే నగల మార్పిడి దుకాణంలోనే చోరీకి పాల్పడిన నిందితులు దొరికిపోయిన ఘటన చెన్నైలో చోటుచేసుకుంది. పోలీసులు వివరాలను బుధవారం వెల్లడించారు. చెన్నై టీనగర్‌లోని ఓ పాత నగల మార్పిడి కంపెనీకి పలు బ్రాంచ్‌లు ఉన్నాయి. ప్రధాని బ్రాంచ్‌లో మేనేజర్‌గా ఉన్న కార్తిక్ శ్రీరామచంద్రన్ కంపెనీ ఖాతాలను పరిశీలించగా నగరంలోని ఓ బ్రాంచిలో 10 సవర్ల బంగారం చోరీ అయినట్లు గుర్తించారు. ఈ విషయమై పాండిబజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆధారాలను పరిశీలించిన పోలీసులు చోరీలో బ్రాంచి మేనేజర్ ప్రవీణ్‌కుమార్, క్యాషియర్ యువరాజ్‌కు సంబంధం ఉందని తేలడంతో ఈనెల 8న వారిని అరెస్టు చేశారు. వీరి నుంచి 22 గ్రాముల బంగారం, రూ.58 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో సెల్వ తిరుమణికణ్ణన్ అనే వ్యక్తికి సంబంధం ఉందని తెలియడంతో తాజాగా అతన్ని అరెస్టు చేసి 60 గ్రాముల బంగారు, రూ.9.72 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని కోర్టులో హాజరు పరిచి జైలుకు పంపారు.

మట్టి చోరీ కేసులో ఐదుగురు...

విల్లివాక్కం: ఊటీలో వెండి రేణువులు కలిసిన మట్టి చోరీ చేసిన ఐదుగురిని మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఊటీలోని హిందూస్థాన్ ఫొటో ఫిలిం కర్మాగారాన్ని కొన్నేళ్ల క్రితం మూసేశారు. ఫిలిం తయారు చేయడానికి ఉపయోగించిన వెండి రేణువులు మట్టిలో కలిసి ఉన్నాయి. మూసిన కర్మాగారంలోకి వెళ్లి మట్టి చోరీ ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఫోటో ఫిలిం కర్మాగారంలో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తున్నట్లు పుదుమంద పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు అందింది. ఇన్‌స్పెక్టర్ బాలమురుగన్, ఎస్సై హరిహరన్ నేతృత్వంలోని పోలీసులు అక్కడికి చేరుకొని తనిఖీ చేశారు. మట్టిని చోరీ చేస్తున్న తలైకుందాకు చెందిన రాజన్, సుభాష్, కుమార్, సంతోష్, మోహన్‌రాజ్‌ను అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొగాకు ఉత్పత్తులు తరలిస్తున్న ఇద్దరు...



స్వాధీనం చేసుకున్న పొగాకు ఉత్పత్తులు, కారు

విల్లివాక్కం: కరూర్ జిల్లా తవిట్టుపాలయం చెక్‌పోస్టులో మంగళవారం వేలాయుధపాళయం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ మార్గంలో వచ్చిన కారును ఆపి తనిఖీ చేసి నిషేధిత పొగాకు వస్తువులను గుర్తించారు. దీంతో కారులో ఉన్న రాజస్థాన్‌కు చెందిన సురేందర్, రవీంద్రపాల్ సింగ్‌ను అరెస్ట్ చేసి రూ.1,67,856 విలువైన 401 కిలోల పొగాకు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వారి నుంచి కారు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొన్నారు. నిందితులను కరూర్ క్రిమినల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచి జైలుకు తరలించారు.

గంజాయి తరలిస్తున్న మరో ఇద్దరు...

ఊత్తుకోట: తిరువళ్లూరు జిల్లా ఊత్తుకోట సమీప పాలవాక్కంలో సీఐ దేవరాజ్ నేతృత్వంలో పోలీసులు బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతి నుంచి చెన్నై వైపు రెండు ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు చెన్నై వ్యాసర్‌పాడికి చెందిన సయ్యద్ ముషారఫ్, సుకుమార్‌గా తేలింది. అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచి రిమాండుకు తరలించారు.

దంపతులపై దాడి చేసి నగల దోపిడీ

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: వృద్ధ దంపతులపై అర్ధరాత్రి దాడి చేసిన దుండగులు నగలు దోచుకెళ్లిన ఘటన తిరుప్పూర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... తిరుప్పూర్ జిల్లా మంతియాపురానికి చెందిన గోవిందసామి, భార్య బాలామణితో కలిసి నివసిస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఇంటి తలుపులు తట్టిన దుండగులు తాగడానికి నీళ్లు అడుగగా గోవిందసామి తలుపులు తెరిచాడు. అప్పుడు ముసుగులు వేసుకున్న దుండగులు ఆయుధాలతో ఇంట్లోకి చొరబడ్డారు. అడ్డుకోబోయిన వృద్ధ దంపతులపై తీవ్రంగా దాడి చేశారు. బాలామణి ధరించి ఉన్న నగలు, ఇంట్లో ఉన్న ఏడు సవర్ల నగలు, నగదు దోచుకొని పారిపోయారు. తీవ్రంగా గాయపడిన దంపతులను స్థానికులు చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

80 సవర్ల బంగారు ఆభరణాలు చోరీ

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఈరోడ్‌లో పట్టపగలు తాళాలు వేసిన ఇంట్లో 80 సవర్ల బంగారు నగలు కాజేసిన దుండగుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈరోడ్ ఇందిరానగర్ సమీపంలోని లక్ష్మీనారాయణన్ నగర్ బహుళ అంతస్తుల గృహ సముదాయం మొదటి అంతస్తులో నివసిస్తున్న రాజన్ భార్య నిర్మలాదేవి ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తోంది. రాజన్ తిరుప్పూర్ జిల్లా పల్లడంలోని ప్రైవేట్ సంస్థలో ఆడిటర్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. రాజన్‌తో సహా కుటుంబీకులు అందరు ప్రతిరోజు ఉదయం పనులకు వెళ్తూ తాళం చెవిని ఇంటి మెట్ల కింద పెడుతుంటారు. సాయంత్రం పని పూర్తి చేసుకొని ఇంటికి వచ్చిన నిర్మలాదేవి తలుపు తెరచి ఉండడం చూసి దిగ్భ్రాంతి చెందారు. లోపలికి వెళ్లి చూడగా 80 సవర్ల నగలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఫిర్యాదు మేరకు ఈరోడ్ కరుంగల్‌పాలయం పోలీసులు, టౌన్ డీఎస్పీ ముత్తుకుమరన్ ఘటనా స్థలికి చేరుకొని దర్యాప్తు చేశారు. వేలిముద్రలు సేకరించి, సీసీ కెమెరా పుటేజీలను సేకరించారు. కేసు నమోదు చేసుకొని దుండగుల కోసం గాలిస్తున్నారు.

పాక్ ఉగ్రవాదులకు సహాయం

ముగ్గురికి జైలు శిక్ష

ప్యారిస్, న్యూస్‌టుడే: పాకిస్థాన్ ఉగ్రవాదులకు సహాయపడిన ముగ్గురికి జైలు శిక్ష విధిస్తూ రామనాథపురం కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. రామనాథపురం జిల్లా ఉచ్చిప్పుళికి చెందిన సిద్ధి సులైహా అక్క భర్త అబ్దుల్‌రషీద్. మలేసియా పౌరసత్వం పొందిన అబ్దుల్ రషీద్ అక్కడే హోటల్ నడుపుతున్నాడు. శ్రీలంకకు చెందిన ముహమ్మద్ యాసిర్, ఆయన భార్య బారికా రిస్మియాలు అబ్దుల్ రషీద్ హోటల్‌లో 2015లో పని చేశారు. అనంతరం అతని సహాయంతో భారతదేశానికి వచ్చిన సిద్ధి సులైహా ఇంట్లో ఉన్నారు. అప్పుడు వారు తప్పుడు వివరాలు ఇచ్చి ఆధార్ కార్డు పొందారు. సిద్ధి సులైహా ఇంటి రేషన్ కార్డులో పేరు చేర్చుకున్నారు. అనంతరం ఆధార్ కార్డు ఉపయోగించి సిమ్ కార్డులు తీసుకున్న ముహమ్మద్ యాసిర్ వాటిని పాక్‌కు చెందిన, ఐఎస్ఐఎస్‌తో సంబంధం ఉన్న ముహమ్మద్ మిబ్లాల్ మౌలవికి ఇచ్చాడు. అతను సిమ్ కార్డుల ద్వారా 2021లో భారత సైన్యానికి చెందిన ఆర్మీ పబ్లిక్ స్కూల్ పేరుతో వాట్సాప్ ఖాతా ప్రారంభించి, దాని ద్వారా ఆర్మీ రహస్యాలు తెలుసుకునేందుకు యత్నించాడు. ఈ విషయం తెలిసిన క్యూ బ్రాంచ్ పోలీసులు 2021లో ముహమ్మద్ యాసిర్, బారికా రిస్మియా, అబ్దుల్ రషీద్, సిద్ధి సులైహాలను అరెస్టు చేశారు. ముహమ్మద్ యాసిర్, బారికా రిస్మియాలు తిరుచ్చిలో ఉన్న శ్రీలంక శరణార్థుల శిబిరంలో ఉంచారు. మిగిలిన ఇద్దరిని బెయిల్‌పై విడుదల చేశారు. ఈ కేసుని విచారిస్తున్న రామనాథపురం కోర్టు మంగళవారం తీర్పు ఇచ్చింది. అందులో ముహమ్మద్ యాసిర్, బారికా రిస్మియాలు నకిలీ పత్రాలతో ఆధార్ కార్డు, రేషన్ కార్డు తీసుకున్నట్లు నిర్ధారణ కావడంతో రెండేళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా, అదేవిధంగా నకిలీ పత్రాలు పొందేందుకు సాయపడినందుకు, మలేసియా పౌరసత్వం ఉండి అక్రమంగా భారతదేశానికి వచ్చి వెళ్లినందుకు అబ్దుల్ రషీద్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.15 వేలు జరిమానా విధిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. సిద్ధి సులైహాపై నేరం రుజువు కాకపోవడంతో విడుదల చేస్తూ తీర్పు ఇచ్చింది.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

ఈనాడు
తిరుపతి
గురువారం ఫిబ్రవరి 19, 2026

అమ్మో ట్యాంకు

పెళ్లకూరు మండలం చిల్లకూరు సమీపంలో 71వ నంబరు జాతీయ రహదారి పక్కనే సర్వీసు రోడ్డుకు ఆనుకొని తాగునీటి పథకం ఇది. ప్రమాదకరంగా ఉన్నా దాన్ని తొలగించడం లేదు. రహదారి నిర్మాణ సమయంలోనే దీనికి ప్రత్యామ్నాయంగా నీటి పథకం పనులు ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారు. దీంతో పాత పథకాన్నే వినియోగిస్తున్నారు. ఈ ట్యాంకు మాత్రం పాలకుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా.. ఇలా ప్రమాదకరంగా నిలబడి ఉంది. – న్యూస్‌టుడే, పెళ్లకూరు

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్ఐవో జి.రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 23 నుంచి మార్చి 24 వరకు జిల్లావ్యాప్తంగా 84 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని ఆయన వివరించారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 30,319 మంది, ద్వితీయలో 30,696 మంది పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. హాల్‌టికెట్లు చేరకుంటే ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. హాల్‌టికెట్లపై కళాశాల ప్రిన్సిపల్ సంతకం అవసరం లేదన్నారు. ప్రైవేట్ కళాశాలల్లో ఫీజులు పేరుతో విద్యార్థులను ఇబ్బంది పెడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే.. విద్యార్థులతో పాటు పరీక్ష కేంద్రాలు, సీఎస్, డీఓలపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

కోర్టులో పోస్టుల భర్తీకి రేపు రాత పరీక్ష

చిత్తూరు(న్యాయవిభాగం), న్యూస్‌టుడే: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో ఖాళీగా ఉన్న మూడు పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీకి గత నెలలో కోర్టు అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. పోస్టుల భర్తీకి శుక్రవారం స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక తెలిపారు. రికార్డు అసిస్టెంట్ పోస్టుకు ఉదయం 9 నుంచి 10.30 వరకు.. ఫ్రంట్ ఆఫీస్ కో-ఆర్డినేటర్ పోస్టుకు మధ్యాహ్నం 12 నుంచి 1.30 వరకు పరీక్ష ఉంటుందన్నారు. హైకోర్టు ఆదేశాలతో డేటా ఎంట్రీ ఆపరేటర్ రాత పరీక్ష వాయిదా వేశామని తెలిపారు.

28న తితిదే పాలక మండలి సమావేశం

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తితిదే పాలకమండలి సమావేశం ఈనెల 28వ తేదీన జరగనుంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే పాలకమండలి ఛైర్మన్, సభ్యులు ఎక్స్ అఫిషియో సభ్యులకు అధికారులు సమాచారం చేరవేశారు. వాస్తవానికి ఫిబ్రవరి 3వ తేదీనే పాలకమండలి సమావేశం తిరుమలలో జరగాల్సి ఉంది. అప్పటి ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ఆకస్మికంగా బదిలీ కావడంతో ఈ సమావేశం వాయిదా పడింది.

నూతన ఈవో కసరత్తు: సమావేశంలో నూతన ఈవో ముద్దాడ రవిచంద్ర పాల్గొననున్నారు. ఆయన ప్రస్తుత, గత పాలకమండళ్లు చర్చించిన అంశాలు, తీర్మానాలపై కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. వాటిపై సమావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలన్న అంశంపై నలుగురు తితిదే ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా మాట్లాడినట్లు సమాచారం. సీఎం ఆదేశానుసారం తితిదేని అన్ని విధాలుగా ఉన్నతంగా నిలపాలని, భక్తుల సేవ, మార్కెటింగ్ కొనుగోళ్లు, ఇంజనీరింగ్, ధర్మ ప్రచార పరిషత్, ఇతర విభాగాల బలోపేతంపై ఆయన దృష్టి సారించనున్నారు.

కీచకులున్నారు జాగ్రత్త!

- పోలీసు శాఖపైనే భద్రత బాధ్యత
- నాడు మహమ్మద్ రఫీ, నేడు కులవర్ధన్

ఏమీ ఎరుగని కలువల్లారా.. అయిదారేడుల పాపల్లారా.. దారుణ ముళ్లున్నట్లే.. కబళించే కబ్జాలుంటాయ్!
ఎదురింట్లో.. పక్కింట్లో.. వీధి చివర.. బడి పరిసరాల్లో.. ఎక్కడికెళ్లినా.. ఏం చేస్తున్నా.. మృగాళ్లుంటారు జాగ్రత్త
మాటలు చెబుతారు.. మాయలు చేస్తారు.. మిఠాయిలిస్తారు.. మొగ్గ దశలోనే చిదిమేస్తారు కీచకులున్నారు పారా హుషార్

మహమ్మద్ రఫీ (పాత చిత్రం)

కులవర్ధన్ (పాత చిత్రం)

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : జిల్లాలో చిన్నారులకు రక్షణ లేకుండా పోయింది. ఓ ఘటన మరిచిపోక ముందే మరో దుర్ఘటన చోటు చేసుకోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చిన్న బిడ్డ అన్న ఆలోచన కూడా లేకుండా హత్యాచారాలకు తెగబడుతున్నారు. కళ్లముందే కన్నబిడ్డలు విగత జీవులవడం చూసి తల్లిదండ్రులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఆడబిడ్డలను ఎలా కాపాడుకోవాలో దిక్కుతోచని స్థితిలో తల్లడిల్లిపోతున్నారు. అల్లారుముద్దుగా పెంచుకున్న అభం శుభం తెలియని చిన్నారులు కామాంధుల కబంధ హస్తాలకు చిక్కి బలైపోతున్నారు. ఓ వైపు శిక్షలు పడుతున్నా.. మద్యం, గంజాయి మత్తు యువతను పెడదారి పట్టిస్తోంది. ఇటీవల కాలంలో చిన్నారులపై జరిగిన లైంగిక దాడులు.. ఆపై హత్య సంఘటనలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి.

ఉలిక్కిపడిన అంగళ్లు

2019 నవంబరులో బి.కొత్తకోట మండలంలోని ఓ గ్రామానికి చెందిన కుటుంబం తమ అయిదేళ్ల కుమార్తెతో కలిసి కురబలకోట మండలం చేనేత కాలనీలో ఓ కల్యాణ మండపంలో జరుగుతున్న వివాహానికి వచ్చారు. రాత్రి పెళ్లిలో ఆడుకుంటున్న చిన్నారి ఒక్కసారిగా మాయమైంది. ఆచూకీ దొరక్క ముదివేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉదయాన్నే అయిదేళ్ల చిన్నారి మృతదేహం కల్యాణమండపం గోడ పక్కన గుర్తించారు. చిన్నారిపై అత్యాచారం చేసి చంపినట్లు నిర్ధారణ అయింది. పోలీసులు సీసీ కెమెరాను పరిశీలించి అంగళ్లకు చెందిన లారీ క్లీనర్ మహమ్మద్ రఫీనే నిందితుడని గుర్తించి అరెస్టు చేశారు. ఇతనికి చిత్తూరు కోర్టు మరణ శిక్ష విధించింది. హైకోర్టులో అప్పీల్ చేయడంతో మరణశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా సవరించింది. ఇతను ఇప్పటికి జైలులో ఉన్నాడు.

నాటి ఘటన మరవక ముందే

అంగళ్లలో జరిగిన ఘటన మరవక ముందే మదనపల్లెలో మరో చిన్నారిపై ఎదురింట్లో ఉండే కులవర్ధన్ (30) అత్యాచారానికి పాల్పడ్డాడు.. ఆపై ఇంట్లోనే ఉన్న నీటి డ్రమ్ములో ముంచి చంపేయడం అంతటా ఆందోళనలు రేకెత్తించింది. పోలీసులు అనుమానంతో రాత్రి అతని ఇంటి పరిశీలనకు వచ్చినా నిద్రిస్తున్నాడని వెళ్లిపోయారు. రాత్రి పోలీసులు తలుపులు తీయించి తనిఖీ చేసి ఉంటే చిన్నారి విషయం ముందుగానే వెలుగులోకి వచ్చేది. గతంలో కూడా నాలుగు ఘటనలు జరిగితే పోలీసులు అతనిపై చిన్న దాడి కేసు నమోదు చేసి వదిలేయడంతో చిన్నారిని హత్య చేసే వరకు తెగించాడు. ● జిల్లాలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు మరింత అప్రమత్తంగా వ్యవహరించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదు చేయాల్సిన నంబర్లు : 112, 1098

కల్యాణం.. కడు రమణీయం

కల్యాణోత్సవ వైభవాన్ని పురస్కరించుకుని యాగపూజలు నిర్వహిస్తున్న అర్చకులు

స్వామివారికి యజ్ఞోపవీతాన్ని అలంకరిస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: జగద్రక్షకుడైన కైలాసవాసి కల్యాణం ఆద్యంతం రమణీయంగా సాగింది. మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో స్కంద రాత్రిని పురస్కరించుకుని మంగళవారం అర్ధరాత్రి, బుధవారం వేకువజామున కల్యాణోత్సవ క్రతువును ఆగమోక్తంగా జరిపారు. ఈ విశేషోత్సవాన్ని పురస్కరించుకుని సోమస్కందమూర్తి గజవాహనాన్ని, జ్ఞానాంబిక సింహ వాహనాన్ని అధిరోహించారు. ఉత్సవర్లను ఊరేగింపుగా వివాహ వేదిక వద్దకు తీసుకువచ్చారు.

గజ, సింహ వాహనాలపై ఆలయానికి వెళ్తున్న సోమస్కందమూర్తి, జ్ఞానాంబిక అమ్మవారు

సప్తపది.. ఆనందించే మది

చతుర్వేద పారాయణం పూర్తయ్యాక ఆలయ అనువంశిక ప్రధాన దీక్షా గురుకుల్ స్వామినాథన్, వరద, నిరంజన్‌తో పాటు ఆలయ ప్రధాన అర్చకులు సంబంధం, కరుణ నేతృత్వంలో యాగకలశాన్ని ఏర్పాటు చేసి సంకల్ప పూజలు, గౌరీపూజ చేశారు. స్కంద జననం కోసం జరిపే ఈ వివాహ మహోత్సవంలో చండీకేశ్వర రాయబార ఘట్టం ఆకట్టుకుంది.

ఒక్కటైన వధూవరులు

కల్యాణోత్సవ క్రతువులో భాగంగా వధూవరులైన సోమస్కందమూర్తికి, జ్ఞానాంబిక అమ్మవార్లకు రక్షాబంధనం, యజ్ఞోపవీతధారణ కార్యక్రమాన్ని జరిపారు. బుధవారం వేకువజామున 4.53 గంటలకు అమ్మవారికి మాంగల్యధారణ చేశారు. ధూప, దీప, నివేదనలు పూర్తయ్యాక ఉత్సవర్లను ఆలయానికి తీసుకెళ్లారు. ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ కొట్టేసాయిప్రసాద్, ఈవో బాపిరెడ్డి, భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల, తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు, రూ.300 ఎస్ఈడీ టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. మంగళవారం శ్రీవారిని 70,509 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.4.20 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

● తిరుపతిలో శ్రీవారి దర్శనానికి సంబంధించి శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద బుధవారం భక్తులకు 12 వేల సర్వ దర్శన టోకెన్లు జారీ చేశారు. వీరికి గురువారం వేకువ జామున మూడు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం కానుంది. శ్రీవారి మెట్టు నడక దారి భక్తులకు మరో 2 వేల టోకెన్లు ఇచ్చారు.

శ్రద్ధాంజలి

జననం: 15.06.1960
మరణం: 18.02.2026
శ్రీ బత్యాల నంద గోపాల్ గారు
Retd., Regional Inspector of Probation, Vijayawada,
Juvenile Welfare Correctional Services & Welfare of Sreet Children (JWCS & WSC)
ఆప్యాయత అనురాగాలతో, మంచితనానికి మారుపేరుగా నిలిచి, ఏ సమస్య వచ్చినా నేనున్నాను అంటూ...
కొండంత బరోసా కల్పించి, మీరు భౌతికంగా దూరమైనా మా హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించిన
శ్రీ బత్యాల నంద గోపాల్ గారు తేది. 18.02.2026 తేది బుధవారం ఉ॥ 11 గంటలకు స్వర్గస్తులైనారు.
దహనక్రియలు: తేది 19.02.2026 గురువారం ఉదయం 10.00 గంటలకు
తిరుపతి, గోవింద ధామం నందు జరుగునని తెలియజేయడమైనది.
భార్య : శ్రీమతి పి.ఉషారాణి, రిటైర్డ్ డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్
కుమార్తె : సాయి బిందు బత్యాల, B.E., MBA, LL.M., (Constitutional Law)
Advocate, Supreme Court of India & High Courts
కుమారుడు : సాయి కుమార్ బత్యాల, B.Tech., MBA, Architect
కోడలు : శ్రీమతి శ్రీరమ్య, B.Tech, MBA, Software Engineer

గంజాయి.. వయా తిరుపతి!

ఒడిశా నుంచి చిత్తూరు, మదనపల్లెకు ఇక్కడి నుంచే

ఈనాడు– చిత్తూరు, తిరుపతి: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కొంతమంది యువత గంజాయి మత్తులో జోగుతున్నారు. ఈక్రమంలోనే ఉన్మాదులుగా మారి దోపిడీలు, అత్యాచారాలు, హత్యలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లెలో గంజాయి మత్తులో ఉన్న కులవర్ధన్ (30) ఏడేళ్ల బాలికపై అత్యాచారం చేసి ఆపై హత్య చేశాడు. ఈ నేపథ్యంలో గంజాయికి అడ్డుకట్ట వేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. మొత్తంగా మత్తులో తూగేవారు, విక్రయదారుల్లో 70- 80 శాతం 15 ఏళ్లు- 35 ఏళ్లలోపు వారే ఉంటున్నారు.

నంబరు ప్లేట్లు లేకుండా..

తిరుపతి నుంచి మదనపల్లెకు ఆటోలో పెద్దఎత్తున గంజాయి వస్తోంది. మధ్యలో మూడు చెక్‌పోస్టులు ఉన్నా దీన్ని అడ్డుకోలేదు. నంబరు ప్లేటు లేకుండా జాతీయ రహదారిలోనే నేరుగా మదనపల్లెకు సరఫరా చేశారు. తాలూకా స్టేషన్ పరిధిలో తనిఖీ చేయగా రూ.44 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

ఉదాసీనంగా రైల్వేశాఖ

ప్రస్తుతం రాష్ట్రంలో పెద్దగా గంజాయి సాగు లేదు. విశాఖ ఏజెన్సీ ప్రాంతంలోని రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లారు. పొరుగునే ఉన్న ఒడిశాలోనే ఎక్కువగా దీన్ని పండిస్తున్నారు. అక్కడి నుంచి రైళ్ల ద్వారా తిరుపతికి వస్తోంది. మరికొందరు రేణిగుంట, గూడూరు స్టేషన్లలో దిగుతున్నారు. రైల్వే శాఖ అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేస్తుండటం సరఫరాదారులకు కలిసి వస్తోంది. తిరుపతి నుంచి బెంగళూరుకు కూడా తరలుతోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పీలేరు, మదనపల్లెకూ ఇక్కడి నుంచే రవాణా చేస్తున్నారు. పూతలపట్టు మండలంలోని ఓ గ్రామంలోనైతే కొందరు ఇదే వృత్తిగా పెట్టుకున్నారు.

నాయకుడి కుమారుడిపై ఆరోపణలు

మదనపల్లెలో విచ్చలవిడిగా గంజాయి సరఫరా, అమ్మకాలు సాగడం వెనుక ఓ నాయకుడి కుమారుడి హస్తం ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అతని అండతోనే విక్రయదారులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వం సైతం ఈవిషయంలో కఠినంగా ఉన్నందున పోలీసులు ఉపేక్షించకుండా పకడ్బందీగా విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

స్వామిని దర్శించుకున్న విదేశీ భక్తులు. చిత్రంలో ఛైర్మన్ మణినాయుడు, ఆలయాధికారులు

గణనాథుడి సేవలో విదేశీ భక్తులు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీవరసిద్ధి వినాయకస్వామిని వివిధ దేశాలకు చెందిన 170 విదేశీ భక్తులు బుధవారం రాత్రి దర్శించుకున్నారు. జర్మనీ దేశానికి చెందిన శ్రీ పీఠనిలయ భక్తిమార్గ్ కేంద్రం నిర్వాహకుడు శ్రీ పరమహంస విశ్వానాథ గురూజీతో పాటు జర్మనీ, రష్యా, ఫ్రాన్స్ దేశాలకు చెందిన బృందం స్వామి దర్శనం చేసుకున్నారు. ఆలయ పాలకమండలి ఛైర్మన్ వి.మణినాయుడు, ఈవో పెంచల కిశోర్ వారికి రాజగోపురం వద్ద వారికి స్వాగతం పలికారు. మూలమూర్తి దర్శన అనంతరం విదేశీ భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ రవి, కాణిపాకం ఎస్సై నరసింహులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక నగరికి సౌర వెలుగులు

6 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టుకు పచ్చజెండా

ఈనాడు డిజిటల్, తిరుపతి. తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ పరిధిలో ప్రతిపాదించిన 6 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు పనులను 'మెసర్స్ వైశాఖ సోలార్ ఎనర్జీ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్'కు అప్పగిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ బుధవారం జీవో జారీ చేసింది. ఈ ప్రాజెక్టు పునరుద్ధరణ, అభివృద్ధి, ఆపరేషన్, నిర్వహణ (ఓ అండ్ ఎం) తదితర పనులకు సంబంధించి సదరు సంస్థకు 'వర్క్ ఆర్డర్' ఇవ్వాల్సిందిగా తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ (టీఎస్ఎస్‌సీఎల్) సీఈవో, ఎండీకి ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది.

ముఖ్యాంశాలు ఇవే..

- తిరుపతిలోని తూకివాకం గ్రామంలో 6 మెగావాట్ల గ్రిడ్-కనెక్టెడ్ గ్రౌండ్ మౌంటెడ్ సోలార్ ఫొటోవోల్టాయిక్ పవర్ ప్రాజెక్ట్.
- పీపీపీ విధానంలో 25 ఏళ్ల పాటు ప్రాజెక్టు ఆపరేషన్, మెయింటెనెన్స్ బాధ్యతలు.
- మెసర్స్ వైశాఖ సోలార్ ఎనర్జీ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పనులు దక్కించుకున్న సంస్థ.

కఠిన నిబంధనలు

ఈ ప్రాజెక్టు అమలులో ప్రభుత్వ ఖజానాపై ఎలాంటి అదనపు ఆర్థిక భారం పడకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. నిర్ణీత గడువులోగా ప్రాజెక్టును పూర్తి చేసి, ప్రారంభించాలని, ఆదాయ పంపకాలు (రెవెన్యూ షేరింగ్), లీజు నిబంధనలు, నిర్వహణ బాధ్యతలను కచ్చితంగా పాటించాలని, చట్టపరంగా అవసరమైన అన్ని అనుమతులు, గ్రిడ్ కనెక్టివిటీకి సంబంధించిన పర్మిషన్లు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించింది.

విరబూత.. ఆశల కలబోత

బంగారుపాళ్యం నుంచి పలమనేరు వెళ్లే మార్గంలో కనుచూపు మేర ఉన్న మామిడి తోటలు ఇలా పూతతో నిండిపోయాయి. ఆకుపచ్చని రంగులో ఉన్న చెట్లు కాస్త పసుపురంగుతో దర్శనమిస్తున్నాయి. జిల్లాలో 53 వేల హెక్టార్లలో మామిడి సాగవుతుండగా.. ఈ పూతతో పంటపై రైతుల్లో ఆశలు పెరుగుతున్నాయి.

–ఈనాడు, చిత్తూరు

104 FM Tirupati
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి : 80085 13290

తృతీయ వర్ధంతి

కీ॥శే॥ శ్రీ కొర్రపాటి సుబ్బరాయుడు గారు
ఆత్మకూరు
మరణం: 20-2-2023
అనురాగం, ఆప్యాయత, అనుబంధాలతో గుండెనిండా మమతానురాగాలు నింపుకొని
కుటుంబ శ్రేయస్సుకు ఎంతో శ్రమించి మా ఉన్నతికి కారకులైన మా ఇంటి దైవం,
మా తండ్రిగారైన కీ॥శే॥ శ్రీ కొర్రపాటి సుబ్బరాయుడు గారు భౌతికంగా
మా నుండి దూరమై నేటికి 3 సం॥ కాలం గడిచిననూ మీ మధుర స్మృతులు మరువలేకున్నాము.
మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
ఇట్లు కుమారులు : కొర్రపాటి రమేష్, కొర్రపాటి సురేష్
తృతీయ వర్ధంతి: తేది: 20-2-2026 శుక్రవారం నాడు నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం,
ఆత్మకూరు టౌన్, L.R. పల్లిలోని మా స్వగృహము నందు ఉ॥ 11.00 గం॥ల నుంచి జరుగును.
కావున బంధుమిత్రులకు పత్రికా ముఖంగా తెలియజేయడమైనది.
సెల్: 99491 60748, 80086 37710

(c) eenadu

పుష్కరిణి.. ప్రాభవంతో ప్రసిద్ధి

ముక్కంటి ఆలయానికి మూడు పుష్కరిణులు అనుబంధంగా

కైలాసగిరి పర్వత శ్రేణుల్లో ఉన్న భరద్వాజతీర్థం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పంచభూత లింగాల్లో వాయులింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తిలో పురాణ ప్రాభవానికి సంబంధించి ఎన్నో ఆనవాళ్లు కన్పిస్తుంటాయి. అందులో భాగంగా ఇక్కడి క్షేత్రానికి అనుసంధానంగా పురాతన కాలం నుంచి పవిత్ర పుష్కరిణులు నేడు ఆధ్యాత్మిక ప్రాభవానికి చిహ్నంగా విరాజిల్లుతున్నాయి. **భరద్వాజపుష్కరిణి:** కైలాసగిరుల్లో సహజ సిద్ధంగా ఏర్పాటైన పుష్కరిణి. దీన్నే దేవతా పుష్కరిణి అని కూడా పిలుస్తుంటారు. శ్రీకాళహస్తి క్షేత్ర ప్రాభవాన్ని రోమశ మహర్షి ద్వారా తెలుసుకున్న భరద్వాజుడు ఇక్కడి కైలాసగిరుల్లో శివలింగాన్ని ప్రతిష్ఠించాడు. ఇక్కడ ఉన్న నీటితో లింగానికి అభిషేకాలు చేశాడు. దేవతాభిషేకాలకు ఏర్పాటు చేసిన పుష్కరిణి కావడంతో ఇది భరద్వాజ పుష్కరిణిగా ఖ్యాతి గడిస్తోంది. తైలామావాస్య సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి ఉత్సవమూర్తులను ఇక్కడకు తీసుకువచ్చి విశేష అభిషేకాలు చేపట్టి మళ్లీ ఆలయానికి తీసుకెళ్లడం సంప్రదాయంగా సాగుతోంది.

నారద పుష్కరిణి..: ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాభవాన్ని పొందిన పుష్కరిణి ఇది. పట్టణ నడిబొడ్డున బాబుల్లగూడారం వద్ద ఉంది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో సోమస్కందమూర్తి, జ్ఞానప్రసూనాంబికలు ఇక్కడ తెప్పోత్సవం జరుపుతుంటారు. ఆడికృత్తిక వార్షిక బ్రహ్మోత్సవాల్లో శ్రీవళ్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి తెప్పోత్సవం నిర్వహిస్తుంటారు.

వైష్ణవ పుష్కరిణి..: శివ, కేశవులకు మధ్య భేదం లేదన్న భావంతో ఇక్కడి జయరామారావు వీధిలో వైష్ణవ పుష్కరిణిని ఏర్పాటు చేశారు. తైలమావాస్య రోజున సోమస్కందమూర్తి, జ్ఞానాంబికలు భరద్వాజతీర్థం వద్దకు వెళ్లి పూజలందుకుంటే.. ముక్కంటి ఆలయానికి అనుసంధానంగా ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వరదరాజస్వామికి ఈ పుష్కరిణిలో తెప్పోత్సవం జరపడం సంప్రదాయంగా వస్తోంది. శ్రీదేవి సమేత ధర్మరాజుల స్వామి వార్షికోత్సవాల్లో కంకణధారులైన భక్తులు ఇక్కడి పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేసి అగ్నిగుండ మహోత్సవంలో పాల్గొంటారు.

నేడు కైలాసగిరి ప్రదక్షిణోత్సవం



మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన పరివార దేవతా సమూహం, యక్షులు, కిన్నెరులు, కింపురుషులతో పాటు కైలాసగిరుల్లో తపస్సు చేసుకునే రుషిపుంగవులకు వీడ్కోలు పలికేందుకు నవదంపతులైన శ్రీసోమస్కందమూర్తి, జ్ఞానప్రసూనాంబికా అమ్మవార్లు కైలాసగిరి ప్రదక్షిణోత్సవానికి బయలుదేరుతున్నారు. దాదాపు 23 కిలోమీటర్ల పొడవున ఈ విశేషోత్సవం జరగనుంది.

ఉభయదాతలు: బియ్యపు కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి **రాత్రి:** స్వామివారు అశ్వవాహనంపైన, జ్ఞానాంబిక సింహవాహనంపై ఊరేగనున్నారు.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

'అభిషేకం'.. ఆదిదేవునికి ప్రీతిపాత్రం

శివుడు అభిషేక ప్రియుడు. అందుకే శివాలయాల్లో అభిషేకాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. శ్రీకాళహస్తీశ్వరాలయంలో శ్రీజ్ఞానప్రసూనాంబికా సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి నిత్యం నిర్వహించే అభిషేకాలు ఎంతో ప్రాభవాన్ని పొందాయి. ప్రతి రోజూ నాలుగు సమయాల్లో అభిషేకాలు జరుపుతుంటారు. అందులో మూడు ఉదయం జరిగితే సాయంత్రం ప్రదోష కాల సమయంలో మరో అభిషేకం జరుగుతుంది. ఉదయం నిర్వహించే అభిషేకాలను రుద్రాభిషేకాలుగా, సాయంత్రం నిర్వహించే అభిషేకాన్ని మహన్యాస పూర్వక రుద్రాభిషేకంగా పిలుస్తారు. ఇందులో పాల్గొనే భక్తులు పంచామృతంతో పాటు ప్రసాదాలు అందజేస్తారు.

ముక్కంటి ఆలయంలోని సహస్రలింగేశ్వరునివద్ద మహన్యాస అభిషేక నిర్వహణకు సంకల్పపూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పూజలు.. ఫలాలు

అభిషేకం: రుద్రాభిషేకం, **టికెట్:** 1000 **ప్రవేశం:** ఇద్దరికి **నిర్వహణ:** ఉదయం 5, 6, 9 గంటలకు **ఫలం:** ఆరోగ్యసిద్ధి, కోర్కెలు ఫలించడం, మానసిక ఆనందం, కుటుంబ శ్రేయస్సు, వ్యాపారాభివృద్ధి

అభిషేకం: మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం **టికెట్:** 1500, **ప్రవేశం:** ఇద్దరికి **నిర్వహణ:** సాయంత్రం 4 గంటలకు **ఫలం:** కాలసర్పదోషం నివృత్తి, ఉద్యోగోన్నతులు, వివాహాది శుభ కార్యక్రమాలకు అడ్డంకులు తొలగడం, ఆరోగ్యసిద్ధి **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

శ్రీవారి ప్రసాదాలు ప్రస్తుతం చాలా శ్రేష్ఠం

తిరుమల: శ్రీవారి ప్రసాదాలు ప్రస్తుతం చాలా శ్రేష్ఠంగా, రుచికరంగా ఉన్నాయని భాజపా ఎంపీ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో శ్రీవారి మూలమూర్తిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. 'శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో గతంలో కల్తీ జరిగిందని నిరూపితమైంది. భగవంతుడి దగ్గర ఎవరూ తప్పించుకోలేరు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుమల క్షేత్ర పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. గత తప్పిదాలు పునరావృతం కాకుండా తితిదే జాగ్రత్తలు చేపట్టాలి' అని కోరారు. దేశహితం కోసం ప్రధాని మోదీ చేస్తున్న ప్రతి కార్యక్రమం సఫలీకృతం కావాలని, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని శ్రీవారిని ప్రార్థించినట్లు తెలిపారు. తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

శ్రీవారి ఆలయం ఎదుట భాజపా ఎంపీ కె.లక్ష్మణ్ కుటుంబం, తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి

వేదనారాయణుడి ఆలయంలో పరిమళాల జల్లులు

నాగలాపురం: వేదనారాయణుని ఆలయ మహాసంప్రోక్షణలో భాగంగా బుధవారం దివ్యమైన మిశ్రమాన్ని అర్చకులు నిర్మించారు. ఆలయంలోని మూలవిరాట్‌తో పాటు పరివార దేవతాల విగ్రహాలకు పూసేందుకు సంప్రదాయంగా పట్టించే సుగంధపరిమళభరిత ద్రవ్యాలతో మిశ్రమాన్ని తయారుచేశారు. సుక్కాదళ్, కరుంకుంకుల్యం, కొంబరక్కు, కాశీకట్టి, కలిపాక్కు, తాన్నిక్కై, కడుంగాయ్, నెల్లిపరుప్పుపొడి, పూంగావిలను అర్చకులు ఆలయ మహామండపంలో రోకలిలో దంచారు. ఈ మిశ్రమాన్ని జల్లించి ఆవువెన్నతో కలిపి ముద్దలా సిద్ధం చేశారు.

ఆలయ ప్రదక్షిణలో అర్చకులు

'రవాణా' ఫీజుల అధిక వసూళ్లపై చర్యలు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: రవాణా శాఖ నిర్దేశించిన ఫీజుల కన్నా అధికంగా వసూలు చేస్తే చర్యలు తప్పవని డీటీవో మురళీమోహన్ హెచ్చరించారు. బుధవారం డీటీవో కార్యాలయంలో తిరుపతిలోని డ్రైవింగ్ స్కూళ్ల యాజమాన్యాలతో సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వ రియల్ టైం గవర్నెన్స్ (ఆర్టీజీఎస్)లో రవాణా శాఖ సేవలను పర్యవేక్షిస్తుందని గుర్తు చేశారు.

డ్రైవింగ్ స్కూళ్ల యాజమాన్యాలతో సమావేశమైన డీటీవో, ఎంవీఐలు

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: రుయా ప్రభుత్వ ఆస్పత్రిలోని ఆల్కాహాల్ డీఅడిక్షన్ సెంటర్‌లో 8 ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఎస్ డాక్టర్ రాధ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు చిత్తూరు, తిరుపతి వెబ్‌సైట్లు పరిశీలించాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

22న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

తిరుపతి (గ్రామీణం): కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ సహకారంతో మై భారత్, తిరుపతి ఆధ్వర్యంలో ఈనెల 22న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు యూత్ హాస్టల్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన అధికారి ప్రదీప్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు 15-29 వయసు ఉండాలన్నారు. రిజిస్ట్రేషన్ కోసం చరవాణి సంఖ్య 94403 97160లో సంప్రదించాలని కోరారు. ఈ నెల 21వ తేదీ లోపు తెలియజేయాలన్నారు.

WALK-IN-INTERVIEW TVS

TVS ఎలక్ట్రికల్ మరియు CNG ఆటోషోరూం నందు పనిచేయుటకు ఉత్సాహవంతులైన చక్కటి వాక్‌చాతుర్యం కలిగిన అభ్యర్థులు కావలెను.

1) లొకేషన్స్ : తిరుపతి, చిత్తూరు, మదనపల్లి
2) సేల్స్ మేనేజర్స్ : 3 Posts (మంచి అనుభవం, ఆటో మరియు రియల్ ఎస్టేట్ రంగంలో అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత)
3) సేల్స్ ఎగ్జిక్యూటివ్స్: 6 Posts (అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత)
4) టెక్నీషియన్స్ : 4 Posts (ఎలక్ట్రికల్ ఆటో వర్క్ నందు అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత)

సమయం: ఉదయం : 9.00 AM to 5.00 PM

విజయ ప్రసన్న టీవీఎస్ / పూలవానిగుంట, రేణిగుంట రోడ్, తిరుపతి సెల్: 83095 07239, 99855 52979.

17వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
17 Years Anniversary
సాయినారాయణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్
మా అభివృద్ధికి సహకరించిన మిత్రులకు, శ్రేయోభిలాషులకు, మా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు
డా॥ కె.నిరంజన్ బాబు M.D., (Med), D.M.(Neuro) మెదడు & నరాల వైద్యనిపుణులు
24/7 EMERGENCY SERVICE
డా॥ జి.అన్నపూర్ణ M.S, (OBG), స్త్రీల వైద్య నిపుణులు
అందుబాటులోని సేవలు
* న్యూరాలజీ * న్యూరోసర్జరీ
* గైనకాలజీ * జనరల్ మెడిసిన్
* ఆర్థోపెడిక్స్ * జనరల్ సర్జరీ
* డయాబెటాలజీ * ఐ.సి.యు కేర్
* క్రిటికల్ కేర్ & ఎమర్జెన్సీ
* సర్జికల్ & ఎమర్జెన్సీ కేర్
* డెంగ్యూ, మలేరియా, విషజ్వరాలకు చికిత్స
డిబిఆర్ హాస్పిటల్ వెనుక, కొర్లగుంట, మారుతీనగర్, తిరుపతి,
0877-2225550, 9494403825

స్థానిక ఎన్నికల్లో ఈ-సేవలు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: మరి కొన్ని నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈసారి ఎన్నికల సంఘం ఈ-సేవ ద్వారా ఎన్నికల ప్రక్రియను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తుంది. తిరుపతి నగరం, నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి, పుత్తూరు పురపాలిక సంఘాలతోపాటు, 704 గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీ కాలం త్వరలో ముగియనున్నదంతో రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టి సారించింది. మొదటి దశగా ఈనెల 8వ తేది నుంచి పురపాలిక, మండల పరిషత్, పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాల రూపకల్పనకు ఈఆర్ఎంఎస్ పేరుతో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపకల్పన చేశారు.

ఐదు పోర్టల్స్ రూపకల్పన.. ఈ-సేవ ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఈసారి ఐదు వరకు ఈ-పోర్టల్ మాడ్యూళ్లను రూపొందించనుంది. పోలింగ్ స్టేషన్ల వివరాలు, పోల్ ఓటు స్లిప్ డౌన్‌లోడ్, పోటీ చేయనున్న అభ్యర్థుల వివరాలు, రాజకీయ పార్టీల అభ్యర్థుల పేర్లు పోర్టల్‌లో ఉంటుంది. విధుల్లో ఉండే ఎన్నికల అధికారులు, ఉద్యోగులు, ఇతర వర్గాల పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకునే విధంగాను, ఎన్నికల పరిశీలకుల వివరాల నమోదుకు, ఎప్పటి కప్పుడు నివేదికలు ఇవ్వడానికి, ఎన్నికల నిర్వహణకు ఫిర్యాదులు ఇవ్వడానికి, ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడానికి వేర్వేరు ఈ-పోర్టల్ సేవలను వినియోగించనున్నారు.

ప్రత్యర్థులు అడ్డుకునే అవకాశం లేదు.. స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారు నామినేషన్ దాఖలు చేయడానికి ఎన్నికల అధికారి కార్యాలయానికి రాకుండానే ఎన్నికల సంఘం రూపకల్పన చేసిన సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ ద్వారా ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించే అవకాశం ఉంది. దీని వలన అభ్యర్థులను ప్రత్యర్థులు అడ్డుకునే అవకాశం ఉండదు. భౌతిక దాడులు దౌర్జన్యాలకు అవకాశం లేకుండా ఉంటుంది. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జరిగిన దౌర్జన్యాలు, ఘర్షణలను దృష్టిలో ఉంచుకుని ఈ-సేవ ద్వారా ప్రక్రియ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

మహిళా పారిశ్రామిక వేత్తలు పెరగాలి

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: మహిళా పారిశ్రామిక వేత్తల సంఖ్య పెరగాలని శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ వీసీ ఆచార్య ఉమ పేర్కొన్నారు. వర్సిటీ ఎస్ఎస్ఐఈ-టీబీఐ ఆధ్వర్యంలో బుధవారం మైటీ-జెనెసిస్ ప్రోగ్రాం కింద 'ఐడియా టు ఐకాన్-స్టార్టప్ గ్రోత్ స్ట్రాటజీస్' అంశంపై సదస్సు నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ యువత వ్యాపార రంగంవైపు ఆసక్తి చూపాలన్నారు. రిజిస్ట్రార్ ఉష మాట్లాడుతూ స్టార్టప్‌లు దేశ భవిష్యత్తును రూపుదిద్దే శక్తివంతమైన సాధనాలని చెప్పారు. న్యూహైట్ ఫార్మా టెక్నాలజీస్ సంస్థ ప్రతినిధి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ లీడ్ ల్యాబ్ నివేదిక ప్రకారం ఆలోచన, సహకారం, సమయపాలన, నగదు లేకపోవడం స్టార్టప్ వైఫల్యాలకు కారణమన్నారు. ఐఐటీ తిరుపతి స్టార్టప్ మేనేజర్ అవినాష్, హైదరాబాద్ ఇన్వెస్ట్‌మెంట్ సంచాలకులు రత్నాకర్ మాట్లాడారు.

పాల్గొన్న అతిథులు, అధ్యాపకులు

భూసేకరణ వేగంగా పూర్తి చేయాలి: కలెక్టర్

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లా పరిధిలోని పలు అభివృద్ధి పనుల భూసేకరణ వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం ఆయన సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్షించారు. శ్రీసిటీ ఫేజ్-2, ఎల్‌జీ ఫేజ్-2, స్పేస్ సిటీ ఫేజ్‌లు- 1, 2, 3, 4, నాయుడుపేట ఫేజ్-2, వానెల్లూరు, పాగలి, జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు, వైజాగ్ చెన్నై కారిడార్ పైపులైన్, ఏడీబీ రోడ్లు, దుగరాజపట్నం, రైల్వే ప్రాజెక్టుల భూ సంబంధిత పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. జేసీ గోవిందరావు, డీఆర్వో నరసింహులు పాల్గొన్నారు. తిరుపతి, నెల్లూరు, చెన్నై నేషనల్ హైవేల పీడీలు, సదరన్ రైల్వే ప్రాజెక్టు అధికారులు రాధాకృష్ణ, ప్రభాకర్, తిమ్మయ్య, తిరుపతి, నెల్లూరు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎల్.శివకుమార్ వర్చువల్‌లో హాజరయ్యారు. ■ పీజీఆర్ఎస్‌లో వచ్చే సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులతో వర్చువల్‌గా సమీక్షించారు. ■ శాప్ స్పోర్ట్స్ లీగ్ -2026 క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

కలెక్టరేట్‌లో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

పారిశ్రామిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం: సీఎండీ

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: పారిశ్రామిక వినియోగదారులు ఎదుర్కొంటున్న విద్యుత్తు సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ లోతేటి చెప్పారు. తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో బుధవారం పారిశ్రామిక విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి మాట్లాడారు. నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి 26 మంది హాజరై పలు సమస్యలు తెలిపినట్లు చెప్పారు. వోల్టేజీలో హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయని, సోలార్ విద్యుత్తు బిల్లింగ్, ట్రూ-అప్, ఎఫ్‌పీపీసీఏలకు సంబంధించి వినతులను అందజేశారని తెలిపారు. వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రతి నెలా మొదటి బుధవారం ఉదయం 10:30 నుంచి 11:30 గంటల వరకు జిల్లాల్లోని సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయాల్లో, మూడో బుధవారం తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో ఈ వేదికలు నిర్వహిస్తున్నామని పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలని కోరారు. సంస్థ డైరెక్టర్లు అయూబ్ ఖాన్, గురవయ్య, రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు రమణాదేవి, పద్మ, ఆదిశేషయ్య, ఉమాపతి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తతో మాట్లాడుతున్న సీఎండీ శివశంకర్ లోతేటి

అయినవారికే నెయ్యి టెండర్లు: భూమన

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: తితిదేలో సీఎం చంద్రబాబుకు కావలసినవారికే నెయ్యి టెండర్లు దక్కుతున్నాయని మాజీ టీటీడీ ఛైర్మన్, వైకాపా జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. నెయ్యి టెండర్ల విషయంలో తెదేపాను ప్రశ్నిస్తే తితిదే సమాధానమిస్తోందని ఎద్దేవా చేశారు. తితిదే ఓ ప్రకటన ఇచ్చిందని.. అది వెబ్‌సైట్‌లో కనిపించడం లేదని, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు మాత్రం తన ఎక్స్‌లో ఉంచారని తెలిపారు. తెదేపాకి తితిదే అనుబంధ సంస్థలా వ్యవహరిస్తోందని విమర్శలు గుప్పించారు. ఇటీవల కాలంలో నెయ్యి టెండర్లలో పాల్గొన్న కర్ణాటక మిల్క్ ఫెడరేషన్, ఇందాపూర్ సంస్థలు నిబంధనలను పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయన్నారు. సిట్ తన నివేదికలో నిందితులుగా ప్రకటించిన విజయభాస్కర్‌రెడ్డి, సురేంద్రనాథ్ ఎక్స్‌పర్ట్ కమిటీలో సభ్యులుగా ఉన్నారన్నారు. ఇందాపూర్ డెయిరీ కోసం నిబంధనలు పక్కన పెట్టారని, ఈ సంస్థ హెరిటేజ్‌కు మ్యానుఫ్యాక్చరింగ్ సంస్థగా ఉందన్నారు.

మాట్లాడుతున్న కరుణాకర్‌రెడ్డి

లిఫ్ట్ అడిగి.. మెడలో గొలుసు కాజేసి..

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనదారుడిని లిఫ్ట్ అడిగి బంగారు గొలుసు కాజేసిన ఘటన తిరుపతి రూరల్‌లో చోటుచేసుకుంది. సీఐ చిన్నగోవిందు కథనం మేరకు.. 'పేరూరు గ్రామానికి చెందిన రఘునాథరెడ్డి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. బుధవారం సాయంత్రం 4 గంటలకు ద్విచక్ర వాహనంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీవారి అపార్ట్‌మెంట్ వైపు వెళ్తున్నారు. అక్కడి మద్యం దుకాణం వద్ద ఉన్న వ్యక్తి జూపార్క్ వరకు వస్తానని లిఫ్ట్ అడిగి ఎక్కారు. జూపార్క్ సమీపంలో టాయిలెట్‌కు వెళ్లాలని ద్విచక్ర వాహనాన్ని ఆపించారు. తిరిగి వాహనం ఎక్కే సమయంలో రఘునాథరెడ్డి మెడలోని 18 గ్రాముల బంగారు గొలుసు లాక్కొని రిక్షాకాలనీ వైపు పారిపోయారు. ద్విచక్ర వాహనంతో వెంబడించినా గుర్తించలేకపోయారు. తర్వాత పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: సూళ్లూరుపేట పట్టణ పరిధిలోని జాతీయ రహదారిపై సాయినగర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. బుధవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. బిహార్‌కు చెందిన శర్వాన్‌సింగ్(65) ఏడేళ్లుగా నగదు తరలించే మేనేజ్‌మెంట్ సర్వీసులో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నారు. చెన్నైలో కంపెనీ ఇచ్చిన గదిలో ఉంటున్నారు. చెన్నై బీవీసీ కార్యాలయం నుంచి బంగారం పార్శిల్ తీసుకొచ్చి నెల్లూరులోని బీవీసీ కార్యాలయానికి చేర్చి చెన్నై వెళుతున్నారు. ఈ క్రమంలో సూళ్లూరుపేట వద్ద ఆగి ఉన్న లారీని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బ్రహ్మానాయుడు తెలిపారు. ఇతనికి ఆరుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

శర్వాన్‌సింగ్ (పాత చిత్రం)

ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలన

తిరుచానూరు, న్యూస్‌టుడే: వేమూరులోని అయ్యప్పనాయుడుకు చెందిన ప్రకృతి వ్యవసాయ పంటలను బుధవారం తమిళనాడు అరియలూరు జిల్లాకు చెందిన రైతు బృందం పరిశీలించింది. వినూత్న పద్ధతుల్లో సాగవుతున్న చెరకు, ఆర్డీఎస్ పంటల గురించి రైతులకు అయ్యప్పనాయుడు వివరించారు. రాస్ ప్రధాన శాస్త్రవేత్త డా.శ్రీనివాసులు, జిల్లా మేనేజర్ షణ్ముగం, తమిళనాడుకు చెందిన శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పశువైద్య వర్సిటీ ఉద్యోగికి రెండేళ్ల జైలు

తిరుపతి (లీగల్), న్యూస్‌టుడే: నిధులు దుర్వినియోగం చేసిన శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయ ఉద్యోగికి రెండేళ్ల జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తిరుపతి పదో అదనపు జిల్లా సెషన్సు జడ్జి టి.రామచంద్రుడు బుధవారం తీర్పు వెలువరించినట్లు ఏపీపీ గాలి శ్రీనివాసులు తెలిపారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. తిరుపతి, విద్యానగర్ నార్త్‌కి చెందిన వి.రామమోహన్ తిరుపతి పశువైద్య విశ్వవిద్యాలయంలో రీజనల్ అకౌంట్స్ కార్యాలయంలో సహాయ కంట్రోలర్. తన బయోమెట్రిక్ ద్వారా బిల్లులు పాస్ చేస్తూ ఉండేవారు. అధికార దుర్వినియోగంతో 2018, 2019లో రూ.12,20,671 నగదును ఆయన ఖాతాతో పాటు కుమార్తె ఖాతాకి బదిలీ చేసుకున్నారు. అప్పటి రిజిస్ట్రార్ డి.శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్ స్టేషన్ సీఐ కె.చంద్రశేఖర్ కేసు నమోదు చేసి ఛార్జిషీటు దాఖలు చేశారు. కేసు సాక్ష్యాధారాలతో నిరూపితమైంది. గతంలో కేసు విచారించిన మొదటి అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి సీకేవీ సత్యకాంత్ కుమార్ రెండేళ్ల జైలు, రూ.10వేల జరిమానా విధించారు. నేరస్థుడు అప్పీలు చేసుకున్నారు. ఇక్కడ కూడా కేసు నిరూపితం కావడంతో శిక్ష ఖరారు చేస్తూ అప్పీలు కొట్టివేశారు.

వరకట్న వేధింపులు.. డాక్టర్‌కి ఆరునెలలు...

తిరుపతి (లీగల్), న్యూస్‌టుడే: తిరుపతి మహిళా పోలీసుస్టేషన్‌లో నమోదైన వరకట్న వేధింపుల కేసులో భర్తకి ఆరునెలల జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తిరుపతి నాల్గో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు వెలువరించినట్లు ఏపీపీ సుజాత, కోర్టు లైజన్ అధికారులు తెలిపారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా, మదనపల్లి అవెన్యూవీధికి చెందిన ఫిజియోథెరపీ డాక్టర్ ఎంఎస్ఎం.ఇంతియాజ్ బాషాకి.. తిరుపతి ఎల్ఎస్ నగర్‌కి చెందిన దంత వైద్యురాలు షేక్ హసీనాతాజ్‌తో 2013 మే 26న వివాహం జరిగింది. వివాహానంతరం వేధింపులు పెరగటంతో బాధితురాలు 2018లో తిరుపతి మహిళా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి ఛార్జిషీటు దాఖలు చేశారు. భర్తపై కేసు సాక్ష్యాధారాలతో నిరూపితమైంది. న్యాయమూర్తి భర్తకి జైలుశిక్ష, జరిమానా విధించారు.

తమిళనాడులో రూ.75 కోట్ల ఆస్తుల స్వాధీనం

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తిరుపతి హథీరాంజీ మఠానికి ఆస్తులు, భూములు తమిళనాడులోనూ ఉన్నాయి. అందులోని కొందరి చెరలో ఉన్న విలువైన ఆస్తులను బుధవారం మఠం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కడలూరు జిల్లా విరుదాచలంలో దాదాపు రూ.75 కోట్ల విలువైన 71 సెంట్ల స్థలాన్ని సంబంధిత సూపరింటెండెంట్ కేశవులు, సిబ్బంది 1975 ఏడాది నుంచి బైరాగిమఠం పేరుతో ఆస్తులు అనుభవిస్తున్న వారి చెర నుంచి విడిపించి మఠం పరం చేశారు. అదే విధంగా కడలూరు- చిదంబరం జాతీయ రహదారి పక్కనే ఉన్న ఆరు ఎకరాల భూమిని న్యాయస్థానం ఆదేశాలతో స్వాధీనం చేసుకుని లీజుకు ఇచ్చారు. చెన్నైలోని అతి విలువైన భూములు, భవనాల నుంచి అద్దెలు రాబట్టేందుకు పోరాడుతున్నారు. కూటమి ప్రభుత్వం.. మఠం ఆస్తులు స్వాధీనం చేసుకోవడానికి సహకరిస్తుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. అలాగే తిరుపతి నగరంలోని ఆక్రమణలను స్వాధీనం చేసుకోవాలని బావాజీ భక్తులు కోరుతున్నారు.

మున్సిపల్ మేనేజరుపై కలెక్టర్ ఆగ్రహం

పుత్తూరు: తిరుపతి జిల్లాలో జరుగుతున్న ఏకీకృత కుటుంబ సర్వేకు సంబంధించి బుధవారం కలెక్టర్ వెంకటేశ్వర్ అన్ని వార్డు, గ్రామ సచివాలయాల అడ్మిన్లు, సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో తిరుపతి గ్రామీణ మండలం, రైల్వేకోడూరు, వరదయ్యపాళెంలలో ఏకీకృత కుటుంబ సర్వే నత్తనడకన సాగుతోందని, వేగం పెంచాలని ఆదేశించారు. ఇదే సమయంలో పుత్తూరు పురపాలిక పరిధిలోని నందిమంగళం సచివాలయం బాగా వెనకబడి ఉందని, అక్కడ అడ్మిన్ ఏం చేస్తున్నారని కలెక్టర్ ప్రశ్నించారు. సచివాలయంలో తగినంత సిబ్బంది లేరని, ఒకరు సెలవుపై వెళ్లారని, ఈ రోజే విధులకు వచ్చారని, వేగం పెంచుతామని చెప్పారు. దీంతో కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ ఇలాంటివి ఏవైనా ఉంటే పరిశీలించాలని, పక్క సచివాలయం సిబ్బందిని పంపి సర్వే పూర్తి చేయించాలని ఆదేశించారు. పుత్తూరు మున్సిపల్ మేనేజరు బాలాజీ కలుగజేసుకుని రోజూ సాయంత్రం కూడా నువ్వు వీడియో కాన్ఫరెన్సు నిర్వహిస్తే పురోగతి బాగుంటుందని కలెక్టర్‌ను అన్నారు. పదే పదే నువ్వు అనే సరికి కలెక్టర్ సీరియస్ అయ్యారు. అసలు మీరెవరు? ఈ కాన్ఫరెన్స్‌లో ఎందుకు ఉన్నారని కలెక్టర్ అడిగారు. తాను పుత్తూరు మున్సిపల్ మేనేజరు బాలాజీ అని ఏకవచనంతో సమాధానం ఇచ్చారు. దీంతో కలెక్టర్ మరోసారి ఇలా జరిగితే సహించేదిలేదని, వెంటనే ఆయన్ను సమావేశ మందిరం నుంచి బయటకు వెళ్లమని చెప్పండని మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావును ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ డీఎంఏ అధికారులు ఆయనను పుత్తూరు మున్సిపాలిటీకి కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారని, అతనికి జీతానికి సంబంధించి సీఎఫ్ఎంఎస్ ఐడీ కూడా క్రియేట్ కాలేదని, మానసిక స్థితి కూడా సరిగా లేదని, ఆయనకు ఎలాంటి విధులు కూడా అప్పగించలేదని కలెక్టర్ దృష్టికి తేవడంతో ఆయన శాంతించారు.

సర్వేలో పాల్గొనని సిబ్బందిపై...

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: సమగ్ర కుటుంబ సర్వేలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో జిల్లాలో మండలం వెనుకబడిందని కలెక్టరు వెంకటేశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయా మండలాల అధికారులతో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. కుటుంబ సర్వేలో పాల్గొనాలని కలెక్టరే ఆదేశించినా, విద్యుత్తు శాఖలో పనిచేస్తున్న సచివాలయ సాంకేతిక సహాయకులు పాల్గొనకపోవడంతో ఏఈ రవిపై మండిపడ్డారు.

సాంకేతిక మరమ్మతులపై శిక్షణ

మెకానిక్‌లతో సీఎంఈ బాలాజీ, బస్సుల కంపెనీ ప్రతినిధులు

తిరుపతి(ఆర్టీసీ): జిల్లాలోని ఆర్టీసీ డిపోల మెకానిక్‌లకు సాంకేతిక మరమ్మతులపై శిక్షణ జరిగింది. తిరుపతి డీపీటీవో కార్యాలయంలో బుధవారం అశోక్ లేలాండ్ సంస్థ ప్రతినిధి వడివేలు, ఫ్లీట్‌గార్డ్ ప్రతినిధి ఖాళి కుమార్ వారికి మెలకువలు నేర్పించారు. జిల్లా డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ (సీఎంఈ) బాలాజీ, మెకానిక్ సిబ్బంది, సహాయకులు పాల్గొన్నారు.

EENADU Classifieds

REAL ESTATE
FLAT FOR SALE
GENERAL

తిరుపతి, గ్రీన్‌లైన్ హోటల్‌కి ఆనుకొని మాస్టర్ ప్లాన్ 80 feet రోడ్డు ప్రక్కన AB AAVAS Phoenix Tower Smart Homesలో 2, 3 BHK Flats సేల్స్‌కు కలవు. RERA Project. 9505502346

JOBS

తిరుపతిలోని ప్రముఖ కంపెనీకి బిజినెస్ పర్సన్స్, రిటైర్డ్ పర్సన్స్, వివాహితులు కావలెను. Age: 30 to 65, Qua: Inter- PG పాన్‌కార్డు తప్పనిసరి ✆ 76750 95860.

మార్కెటింగ్ Reps/Officers (తిరుపతి టౌన్‌లో పనిచేయుటకు) కావలెను. Qly: MBA/B.Com/ B.Sc, గూడ్స్ ఆటో డ్రైవర్-1 అనుభవం, లైసెన్స్, బ్యాడ్జి కలిగి ఉండవలెను. ✆9703402722

తిరుపతి, NGO's కాలనీ, D.No: 6-8-1113లోని కల్పవృక్ష లగ్జరీ హోమ్‌స్టే నందు పనిచేయుటకు రిసెప్షన్ కమ్ సూపర్‌వైజర్, స్వీపర్లు కావలెను. Cont: గాయత్రి హాస్పిటల్స్, వి.వి.మహల్ రోడ్డు, లలిత జ్యూవెలరీ ప్రక్కన, తిరుపతి. ✆ 98497 55595.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం జీ: 18-20K ✆ 96404 68899, 96402 58899

THE EENADU WAY CLASSIFIEDS
B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/- Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే
తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు... 80085 13290
మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600 Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తిరుపతి

•తిరుపతి •చంద్రగిరి

ఆచార్య హేమకు జాతీయ అవార్డు

ఆచార్య హేమ

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ వృక్షశాస్త్ర విభాగంలోని ప్లాంట్ వైరాలజిస్ట్ ఆచార్య ఎం.హేమ జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. మొక్కల సంరక్షణ శాస్త్ర రంగంలో అత్యుత్తమ కృషికి గుర్తింపుగా 'ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (పీపీఏఐ) 2023-25 కాలానికి ఇచ్చే డొడ్డ రామిరెడ్డి మెమోరియల్ అవార్డుకు ఎంపికయ్యారు. రూ. 3 లక్షల నగదు బహుమతి అందజేస్తారు. అవార్డును హైదరాబాద్‌లోని ఎన్ఐపీహెచ్ఎంలో ఫిబ్రవరి 26,27,28 తేదీల్లో జరగనున్న జాతీయ సమావేశంలో ప్రదానం చేస్తారు. ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య నరసింగరావు, రెక్టార్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఆమెకు అభినందనలు తెలిపారు.

కిచెన్ గార్డెన్‌తో మహిళలకు ఉపాధి

ప్రసంగిస్తున్న గంగాధర్

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: కిచెన్ గార్డెన్‌తో మహిళలకు ఉపాధి మెండుగా ఉంటుందని భూలక్ష్మి ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గానిక్ స్టేషన్ (బీఎఫ్‌పీవో) సీఈవో గంగాధర్ పేర్కొన్నారు. మహిళా ప్రాంగణంలో 10 రోజుల పాటు కిచెన్, టెర్రస్ గార్డెన్‌పై మహిళల శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. సీఈవో ప్రసంగిస్తూ మహిళలు, మహిళా రైతులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం మహిళా ప్రాంగణం మేనేజర్ పద్మావతి మాట్లాడారు. పద్మావతీపురం సర్పంచి జ్యోతి, మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఆర్టీసీ బస్టాండ్ నిర్మించండి: ఎమ్మెల్యే

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి (బైరాగిపట్టెడ, న్యూస్‌టుడే: తిరుపతిలో నూతనంగా నిర్మించ తలపెట్టిన ఇంటర్ మోడల్ బస్సు టర్మినల్ నిర్మాణాన్ని త్వరగా ప్రారంభించాలని అసెంబ్లీలో బుధవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుత బస్టాండు పాతది కావడంతో స్లాబు దెబ్బతిన్నదని తెలిపారు. 2018లో సీఎం చంద్రబాబు నూతన బస్టాండు నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, దీన్ని వైకాపా ఐదేళ్ల కాలంలో పట్టించుకోలేదని ఆరణి విమర్శించారు. రూ. 500 కోట్లతో రోజుకు లక్షన్నర మంది యాత్రికులు వచ్చినా తట్టుకునేలా ఆధునిక హంగులతో బస్టాండ్ అవసరమని ఎమ్మెల్యే చెప్పారు. డిప్యూటీ స్పీకర్ బస్టాండ్ నిర్మాణానికి ఐదు వందల కోట్లా అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేయగా, ఆ సంఖ్య నిజమేనని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్పష్టం చేశారు.

గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఘనంగా పాఠశాల వార్షిక క్రీడా దినోత్సవం

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: స్థానిక బైరాగిపట్టెడలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల వార్షిక క్రీడా దినోత్సవం ఘనంగా జరిగింది. జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ సౌజన్యంతో నిర్వహించిన వార్షిక క్రీడా పోటీల్లో పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు వివిధ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన జేసీఐ అధ్యక్షురాలు జయలక్ష్మి తేజ, గోల్డ్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.వి.సత్యనారాయణ, ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.కృష్ణారెడ్డి, తితిదే పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

అధికారులతో సమీక్షిస్తున్న నగరపాలక కమిషనర్ ఎన్. మౌర్య

నగరపాలిక కమిషనర్ సమీక్షలు

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య బుధవారం అధికారులు, ప్రకటన బోర్డుల పన్ను బకాయిదారులతో వరుస సమీక్షలు నిర్వహించారు. నగరపాలిక ఇంజినీరింగ్, స్మార్ట్‌సిటీ అధికారులతో సీసీ కెమెరాలపై ఎస్ఈసీఎస్ ప్రాజెక్టుపై సమీక్షించారు. నగరంలో సీసీ కెమెరాలు, ఐవోటీ పరికరాలు ఏర్పాటుపై ఆమె అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రకటన బోర్డుల యజమానులతో సమావేశమై మార్చి 31 లోపు బకాయిలు చెల్లించాలన్నారు.

మేమే రాజులం.. మేమే రాణులం

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: మేధస్సు, ఓర్పు, వ్యూహాలకు ప్రతీకగా నిలిచే చదరంగంలో తిరుపతికి చెందిన చిన్నారులు రాణిస్తున్నారు. ఎత్తుకు పైఎత్తులు వేస్తూ ప్రత్యర్థులను చిత్తు చేస్తున్నారు. ఓ వైపు చదువులో రాణిస్తూ.. మరోవైపు చదరంగంలో అద్భుత ప్రతిభ కనబరచి రికార్డుల మోత మోగిస్తున్నారు. చదరంగం శిక్షకుడు ఇంజం శివకేశవులు పర్యవేక్షణలో జిల్లా, రాష్ట్ర స్థాయి నుంచి ఎదుగుతూ జాతీయ, అంతర్జాతీయ (ఫిడే) టోర్నీల్లో సత్తా చాటుతున్నారు.

❖ చదరంగంలో రాణిస్తున్న చిన్నారులు ❖ ఫిడేలో అద్భుత రేటింగ్

చదరంగం ఆడుతున్న క్రీడాకారులు

గెలుపే లక్ష్యం..

పోటీలో నిలిస్తే కచ్చితంగా గెలువు రావాల్సిందే. నా పేరు అద్విక్. రెండేళ్ల నుంచి సాధన చేస్తున్నా. గతేడాది చెన్నై వేదికగా ఫిడే ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని ప్రతిభ చూపా. ప్రస్తుతం క్లాసిక్‌లో 1512 రేటింగ్ ఉంది.

ఆటపై మక్కువతో..

నా పేరు ఆర్.గిరిచందన్. ఏడో తరగతి చదువుతున్నా. చదరంగంపై మక్కువతో తల్లిదండ్రులను ఒప్పించి నాలుగేళ్ల వయసు నుంచే సాధన ప్రారంభించా. మూడుసార్లు చెన్నై, బెంగళూరు, విజయవాడ వేదికగా జరిగిన ఫిడే ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్నా. ప్రస్తుతం ర్యాపిడ్‌లో 1505 రేటింగ్‌తో కొనసాగుతున్నా.

అమ్మ ప్రోత్సాహం..

నా పేరు బి. జయశ్రీ. ఏడో తరగతి చదువుతున్నా. అమ్మ ధనకోటేశ్వరి ప్రోత్సాహంతో నాలుగేళ్ల వయసు నుంచే చదరంగం సాధన ప్రారంభించా. ప్రస్తుతం జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్నా. విజయవాడ, మహారాష్ట్ర, మైసూర్, హైదరాబాద్ వేదికగా జరిగిన ఫిడే ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్నా. ప్రస్తుతం ర్యాపిడ్‌లో 1506 రేటింగ్‌తో రాణిస్తుంది.

ఎత్తులతో.. చిత్తు

ఈ బుడతడి పేరు జైజన్. మూడో తరగతి చదువుతున్నాడు. శిక్షకుడు వెన్ను తట్టడంతో నాలుగేళ్ల వయసు నుంచే చదరంగం సాధన చేస్తున్నాడు. జిల్లా స్థాయి పోటీల్లో ఎత్తులతో ప్రత్యర్థులను చిత్తు చేస్తూ భళా అనిపించుకుంటున్నాడు. గతేడాది మదనపల్లె వేదికగా జరిగిన స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో 1497 రేటింగ్‌తో మెరిశాడు.

ఇంటర్నేషనల్ మాస్టర్ అవుతా..

ఈ పేరు పి.కార్తికేయ. ఆరో తరగతి చదువుతున్నా. మూడేళ్ల వయసు నుంచి సాధన చేస్తున్నా. హైదరాబాద్, బెంగళూరు, నెల్లూరు వేదికగా జరిగిన ఫిడే ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని ప్రతిభ చూపా. ర్యాపిడ్‌లో 1440 రేటింగ్‌తో కొనసాగుతున్నా. ఇంటర్నేషనల్ మాస్టర్ కావాలనే లక్ష్యంతో సాగుతున్నా.

మొక్కలతో తిరునామాలు

స్థానిక స్విమ్స్ నర్సింగ్ కళాశాల గార్డెన్‌లో మొక్కలతో తిరునామాలు వేసి సిబ్బంది సంరక్షిస్తున్నారు. ఆస్పత్రికి వచ్చే జనాల్లో భక్తిభావం పెంపొందించాలని ఇలా చేసినట్టు సిబ్బంది తెలిపారు. వివిధ సమస్యలతో వచ్చే రోగులు, రోగుల సహాయకులు ఇది చూసి గోవిందనామస్మరణ చేస్తున్నారు. ఆసక్తిగా తిలకిస్తున్నారు. - ఈనాడు, తిరుపతి

గుంత.. చింత

తిరుపతి ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి వద్ద ఉన్న కూడలిలో రహదారి గుంతమయమై అధ్వానంగా మారింది. నిత్యం ఈ మార్గంలో గర్భిణులు, బాలింతలు, ప్రసవ సమస్యలతో మహిళలు రాకపోకలు సాగిస్తుంటారు. నెలల తరబడి సమస్య వేధిస్తున్నా.. మరమ్మతులు చేయడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు. -ఈనాడు, తిరుపతి

ప్రమాదానికి నోరు తెరచి

తిరుపతి నుంచి కరకంబాడికి వెళ్లే మార్గంలో భూపాల్ హౌసింగ్ కాలనీ వద్ద రహదారి పక్కన లీకేజీ వాల్వ్ మ్యాన్‌హోల్ అస్తవ్యస్తంగా మారింది. పైభాగం పడిపోవడంతో ప్రమాదం పొంచిఉంది. సంబంధిత అధికారులు మరమ్మతులు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు. - ఈనాడు, తిరుపతి

సమగ్ర యాజమాన్యంతో అధిక దిగుబడి

మహిళా రైతుకు జీవన ఎరువులు అందిస్తున్న రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం

తిరుపతి (గ్రామీణం),న్యూస్‌టుడే: మామిడిలో సమగ్ర యాజమాన్యంతో అధిక దిగుబడి సాధించవచ్చని రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, కేవీకే హెడ్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక రాస్ ప్రధాన కార్యాలయంలో బుధవారం కోకో కోలా ఫౌండేషన్, న్యూట్రీ సహకారంతో నాలుగు మండలాల రైతులకు రైతు సదస్సు నిర్వహించారు. కేవీకే శాస్త్రవేత్తలు సుధాకర్, అనిల్ అవగాహన కల్పించారు. రైతులకు జీవన ఎరువులు, మ్యాంగో స్పెషల్ సూక్ష్మ పోషక మిశ్రమాన్ని అందించారు.

ఘనంగా జయంతి వేడుకలు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: స్థానిక ఇస్కాన్ రోడ్డులోని రామకృష్ణ మిషన్ ఆశ్రమంలో భగవాన్ శ్రీ రామకృష్ణ పరమహంస జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానంద మాట్లాడారు. ఆయన బోధనలు మేరకే స్వామి వివేకానంద ఎదిగారని, ఈ జాతి జ్యోతిని నలుదిశలా చాటారని అన్నారు.

ఆర్టీసీ ఆస్తుల జోలికొస్తే ప్రజా ఉద్యమమే: చింతా మోహన్

అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న చింతామోహన్, కాంగ్రెస్ నాయకులు

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: రూ. కోట్ల విలువైన ఆర్టీసీ ఆస్తులు అమ్మాలని కూటమి ప్రభుత్వం యత్నిస్తోందని, వాటి జోలికొస్తే ప్రజా ఉద్యమం చేపడతామని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ హెచ్చరించారు. ఆర్టీసీ ఆస్తులు, రేణిగుంట విమానాశ్రయం ప్రైవేటీకరణ అన్యాయం అంటూ, స్థానిక ఆర్టీసీ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. వైకాపా, కూటమి పాలనలో జగన్, చంద్రబాబు ఆస్తులు పెరిగాయని విమర్శించారు. తిరుపతిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు కాంగ్రెస్ హయాంలో పునాది పడిందని గుర్తుచేశారు. బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు నిధులు కేటాయించడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. రవి, రాజేశ్, సమీవుల్లా, తేజోవతి పాల్గొన్నారు.

కవర్లతో మామిడి పండ్ల సంరక్షణ

చిన్నగొట్టిగల్లు, న్యూస్‌టుడే: మామిడికి నాణ్యత, అధిక ధరే లక్ష్యంగా రెండు మండలాల రైతులకు 33 లక్షల కవర్లు రాయితీతో పంపిణీ చేస్తామని ఉద్యాన శాఖ అధికారిణి ఆయేషా బుధవారం తెలిపారు. కాయలు పెద్ద నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు కవర్లు తొడిగితే పండు ఈగ, కాయతొలుచు పురుగులు, తెగుళ్లు ఆశించకుండా, వర్షం, గాలి, పక్షుల నుంచి రక్షణ ఉంటుందన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సాధనతోనే సంగీతంలో పట్టు

తిరుపతి(మహిళా వర్సిటీ): సాధన ద్వారా సంగీతంలో పట్టు సాధించవచ్చని ఎస్వీ సంగీత, నృత్య కళాశాల వయొలిన్ విభాగాధిపతి వెంకటకృష్ణ పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ సంగీత, నృత్య, లలిత కళల విభాగంలో బుధవారం పీఎం ఉష యాక్టివిటీ-29లో భాగంగా సంగీతంపై కార్యశాల నిర్వహించారు. తాను, స్వరకల్పన సాధన చేసే మెళకువలను తెలియచేశారు. పీఎం ఉష కో-ఆర్డినేటర్, డీన్ వాణి, సంగీత విభాగాధిపతి శైలేశ్వరి, అధ్యాపకులు భువనేశ్వరి, విద్యార్థినులు పాల్గొన్నారు.

'నిరాధార ఆరోపణలు తగవు'

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: వైకాపా ఎమ్మెల్సీలు శాసనమండలిలో 'హెరిటేజ్' నుంచి తిరుమలకు నెయ్యి సరఫరా చేస్తున్నారంటూ నిరాధార ఆరోపణలు చేయడం సిగ్గుచేటు అని తితిదే పాలకమండలి మాజీ సభ్యుడు ఓవీ రమణ విమర్శించారు. బుధవారం నగరంలోని తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసేలా వైకాపా సభ్యులు ఒక అబద్ధాన్ని పదేపదే చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు.

స్వదేశీ వస్తువులను ప్రోత్సహించాలి

జ్యోతి వెలిగిస్తున్న తితిదే పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: స్వదేశీ వస్తువులను ప్రోత్సహించాలని, దేశీయంగా ఉత్పత్తి చేయడాన్ని ప్రధాని మోదీ పిలుపును ప్రతిఒక్కరూ ఆదరించాలని తితిదే పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎస్‌జీఎస్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాల వెనుక ఏర్పాటు చేసిన క్రాఫ్ట్ బజార్‌లో చేనేత వస్త్ర హస్తకళా ప్రదర్శన, అమ్మకాలను భానుప్రకాష్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. శ్రీనివాసులు మాట్లాడుతూ వరంగల్ టవల్స్, రాజస్థాన్ గాజులు, కలంకారీ చీరలు, డ్రస్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

నగరపాలిక: 80080 20003, తిరుపతి (విద్య, తితిదే): 93936 28003
తిరుచానూరు: 80082 30008, మంగళం-జీవకోన: 80080 40005
తిరుపతి (గ్రామీణ): 80085 74564, చంద్రగిరి: 80085 74561

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: **సమస్య:** పద్మావతి యూనివర్సిటీ ఎదురుగా ఉన్న పద్మావతినగర్‌లో కుక్కల బెడద ఎక్కువైంది. రాత్రి పూట అరుస్తూ, ఏడుస్తూ కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అక్కడి హాస్టళ్లు, క్యాటరింగ్ నిర్వాహకులు వేసే ఆహార వ్యర్థాల కోసం తిరుగుతూ అక్కడే ఉంటున్నాయి. చిన్నపిల్లలు తిరిగేందుకు ఇబ్బంది పడుతున్నారు.
- రఘురామ్, పద్మావతి నగర్

సమాధానం: వెంటనే పరిశీలించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. - డా. గుణశేఖర్, పశువైద్యాధికారి, నగరపాలిక.

సమస్య: అక్కారంపల్లి రోడ్డులో ఖాళీ స్థలాల్లో చెత్త పడేస్తున్నారు. పాములు వస్తున్నాయి. ప్రైవేట్ స్థలాలను నగరపాలిక సిబ్బంది శుభ్రం చేయడం లేదు. - చిన్నప్ప, అక్కారం పల్లె

సమాధానం: ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చి శుభ్రం చేయిస్తాం. - డా. యువ అన్వేష్, వైద్యాధికారి నగరపాలిక.

సమస్య: రామచంద్ర పుష్కరిణి వద్ద తోపుడు బండ్లతో చాలా ఇబ్బంది గా ఉంది. ట్రాఫిక్ అధ్వానంగా ఉంది. సాయంత్రం రాకపోకలకు కష్టమైంది. - భార్గవ, పరసాల వీధి

సమాధానం: పరిశీలించి తోపుడు బండ్లతో సమస్య రాకుండా చూస్తాం. - ఖాన్, డి. సి. పి. నగరపాలిక

మూగజీవాల సంచారం.. వాహనదారులకు సంకటం

తిరుపతి సెంట్రల్ పార్క్- ఇందిరా ప్రియదర్శిని మార్కెట్ ప్రధాన మార్గంలో రోడ్డుపైనే ఆవులు, వాహనదారుల అవస్థలు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తిరుపతి నగరంలో గోవులు రోడ్లపై ఎక్కువకావడంతో ఆయా వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం తిరుపతి ప్రధాన రహదారులు జనాలతో కిక్కిరిసి ఉంటాయి. ఉదయం నుంచి రాత్రి వరకు వాహనాల రద్దీ ఉంటుంది. పలు ప్రాంతాల్లో మూగజీవాలు రహదారులపై సంచరిస్తున్నాయి. అక్కడే పడుకుంటున్నాయి. గోవుల యజమానులు వాటి నుంచి పాలు సేకరించి ఆటు తర్వాత ఆహార నిమిత్తం రోడ్లపైకి వదిలేస్తున్నారు. తిరిగి మళ్లీ సాయంత్రానికి ఆయా యజమానుల దగ్గరకు ఆ గోవులు చేరుకుంటాయి. సాయంత్రం వేళ కూడా పాలు సేకరిస్తున్నారు. ఫలితంగా యజమానులకు గోవుల ఆదాయ వనరులుగా మారిపోతున్నాయి. వాటి ఆలనా పాలనా పట్టించుకోవడం లేదు. నగరపాలిక అధికారులు దీనిపై స్పందించాలని పలువురు కోరుతున్నారు. యజమానులకు అప్పగించాలని, లేదంటే.. వాటిని గోశాల తరలించాలని చెబుతున్నారు.

ఎస్వీయూ బోధనేతర సిబ్బందికి శిక్షణ

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: ఎస్వీ యూనివర్సిటీ బోధనేతర సిబ్బందికి పాలనాపర విధులు నిర్వహణపై వర్సిటీ సెనేట్ హాల్‌లో శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమం జనవరి 20వ తేదీన ప్రారంభమై.. ఈనెల 21న ముగియనుంది. రూసా 2.0లో భాగంగా బోధనేతర సిబ్బందికి నైపుణ్యాభివృద్ధి నిపుణులతో తరగతులు నిర్వహిస్తున్నారు. నోట్‌ఫైల్స్, డ్రాఫ్ట్ లెటర్స్, పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, మార్కుల జాబితా రూపకల్పన, తదితర అంశాలతో పాటు ప్రభుత్వ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నారు. బోధనేతర సిబ్బంది సంఘం అధ్యక్షుడు గుర్రంకొండ శ్రీధర్, కార్యదర్శి నెల్లూరు సుబ్రమణ్యం పాల్గొన్నారు.

రుయాకు అధునాతన స్ట్రెచర్ వితరణ

స్ట్రెచర్ అందజేస్తున్న దాత బండ్ల లక్ష్మీపతి తదితరులు

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: రుయా ప్రభుత్వ ఆస్పత్రికి అధునాతన స్ట్రెచర్ వితరణగా అందింది. రుయా హాస్పిటల్ అభివృద్ధి కమిటీ (హెచ్‌డీఎస్) సభ్యులు బండ్ల లక్ష్మీపతి అందజేశారు. బుధవారం రుయా ఎంఎస్ డాక్టర్ రాధ, అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ హరికృష్ణకు ఇచ్చారు. రోగుల తరలింపునకు వినియోగించాలని కోరారు.

వీఆర్‌ఏలకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

తిరుపతి(కలెక్టరేట్) న్యూస్‌టుడే: వీఆర్‌ఏలకు ప్రభుత్వం పదోన్నతి కల్పించి, తెలంగాణ తరహాలో పే స్కేలు జీతాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టరేట్ వద్ద బుధవారం వీఆర్‌ఏలు పెద్ద సంఖ్యలో ధర్నా చేశారు. అనంతరం అధికారులకు వినతి పత్రాన్ని ఇచ్చారు. వీఆర్‌ఏ సంఘం గౌరవ అధ్యక్షులు పుల్లయ్య, నాయకులు సుధాకర్, సీఐటీయూ నాయకులు జయచంద్ర, బాలసుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్ పాల్గొన్నారు. **చిన్నగొట్టిగల్లు:** వీఆర్‌ఏలు భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. తహసీల్దారుకు వినతి అందించారు.

నియామకం

చంద్రగిరి: కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా చంద్రగిరికి చెందిన రవిచంద్రనాయుడు నరసింహ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు భాజపా అధిష్ఠానం బుధవారం ఉత్తర్వులను జారీచేసినట్లు ఆయన తెలిపారు. నియామకంపై కూటమి నాయకులు అభినందించారు.

విజయవంతం చేద్దాం

రామచంద్రాపురం: సి.రామాపురంలో ఈనెల 21వ తేదీన జరగనున్న భాజపా జిల్లా స్థాయి కార్యశాలను విజయవంతం చేద్దామని పార్టీ మండల అధ్యక్షుడు జనార్దన్ నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం రాయలచెరువు కట్ట సమీపంలో విలేకర్లతో మాట్లాడారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నరేష్, కార్పొరేషన్ డైరక్టర్లు బాలాజీ, వరప్రసాద్ పాల్గొన్నారు.

సత్కారం

రామచంద్రాపురం: ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గురువారెడ్డిని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల డైరెక్టర్ చినబాబు కలిసి అభినందించారు. గురువారెడ్డి స్వగ్రామంలో ఈ కార్యక్రమం బుధవారం జరిగింది. సురేష్, మురగయ్య, బీగాలు రమేష్, గోపి పాల్గొన్నారు.

రాష్ట్రానికి స్వర్ణయుగం తథ్యం

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఆంధ్రప్రదేశ్‌కు స్వర్ణయుగం తథ్యమని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి జి.భాను మధుసూదన్ స్పష్టం చేశారు. సంపద సృష్టి, అభివృద్ధి, సంక్షేమం అనే మూడు సూత్రాల ఆధారంగా 2026- 27 ఆర్థిక వార్షిక బడ్జెట్ రాష్ట్రాభివృద్ధికి మైలురాయిగా నిలుస్తుందన్నారు.

తితిదే బీసీ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ

డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి ఎస్. సవిత, చిత్రంలో గంగా రాజ్ కుమార్ యాదవ్, వాసు తదితరులు

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తితిదే బీసీ ఉద్యోగుల సంఘం నూతన డైరీని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత బుధవారం అమరావతిలో ఆవిష్కరించారు. ఆ సంఘం ప్రధాన కార్యదర్శి గంగా రాజ్ కుమార్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తితిదే స్థానంలో ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహించాలని, శ్రీవారి విశిష్టతను కాపాడుతూ, భక్తుల సేవలో తరించాలని సూచించినట్లు తెలిపారు. వాసు, కామరాజు, వెంకటరమణ పాల్గొన్నారు.

చెత్త శుభ్రం చేస్తున్న వాలంటీర్లు

ప్లాస్టిక్‌ను సమూలంగా నిర్మూలించాలి

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: ప్లాస్టిక్ వినియోగాన్ని సమూలంగా నిర్మూలించాలని హైదరాబాద్‌లోని ఎన్ఎస్ఎస్ ప్రాంతీయ సంచాలకులు సైదా పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్ -1, 20 యూనిట్ల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం బాలాజీ లింక్ బస్టాండు, అలిపిరి డిపోలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కో-ఆర్డినేటర్ లలితకుమారి, అలిపిరి డిపో మేనేజర్ హరిబాబు, వాలంటీర్లు పాల్గొన్నారు.

బీసీలందరూ ఐక్యంగా పోరాడుదాం

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: బీసీల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు బీసీలందరూ ఐక్యంగా పోరాటం చేయాలని బీసీ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ ఛైర్మన్, రాజ్యాధికార పార్టీ జాతీయ అధ్యక్షుడు వీజీఆర్ నారగోని పిలుపునిచ్చారు. బీసీ ఐక్య సంఘర్షణ సమితి నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం స్థానిక యూత్ హాస్టల్‌లో జరిగింది. నారగోని ముఖ్య అతిథిగా విచ్చేసి.. నూతనంగా ఎన్నికైన బీసీ ఐక్య సంఘర్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎం.ప్రతాప్ (బీడీ), జయచంద్రగౌడ్, నాయకులు గురుస్వామి, రమేష్, నాగులయ్య, నాగరాజు, రాజశేఖర్, సుబ్రహ్మణ్యంలతోపాటు జిల్లాస్థాయి నాయకులు ఉమాలక్ష్మి, గౌతమ్, రవి, విజయ్‌చే ప్రమాణస్వీకారం చేయించారు.


వీజీఆర్ నారగోనిని సన్మానిస్తున్న బీసీ సంఘం నాయకులు

రాష్ట్రంలో పెరుగుతున్న గంజాయి వినియోగం

మాట్లాడుతున్న పెనుమల్లి మధు, చిత్రంలో వందవాసి నాగరాజు, కందారపు మురళి

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి వినియోగం పెరుగుతోందని.. విద్యా సంస్థల వద్ద సైతం లభిస్తోందని ఆమ్మకాలు సాగుతున్నాయని.. మదనపల్లిలో చిన్నారి దారుణ హత్యకు పాల్పడిన వ్యక్తి కూడా గంజాయి సేవించినట్టు తెలుస్తోందని.. వీటి అరికట్టడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని సీపీఎం అగ్రనేత పెనుమల్లి మధు అన్నారు. పార్టీ పతిలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ పరికరాలకు నిప్పు.. మంటలు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: నగరం లక్ష్మీపురం కూడలిలో బుధవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది. అక్కడి శ్మశాన వాటిక పక్కన నగరపాలక సంస్థ కాంట్రాక్టర్ వేణుగోపాల్ రెడ్డి పనికి రాని ప్లాస్టిక్ పైపులు వేశారు. గుర్తు తెలియని వ్యక్తులు వాటికి నిప్పు పెట్టడంతో మంటలు, పొగ దట్టంగా అలుముకుంది. మంటలు భారీగా ఎగసిపడటంతో స్థానికులు, వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

మంగళంలో మహిళ మృతి

తిరుపతి(మంగళం), న్యూస్‌టుడే: తిరుపతి అర్బన్ మండలం మంగళం పరిధిలోని బాలకృష్ణాపురం బస్టాప్ వద్ద బుధవారం సునీత (42) అనే మహిళ మృతి చెందింది. తిరుచానూరు ఎస్సై సుధాకర్ వివరాల మేరకు.. అన్నమయ్య జిల్లా బిటకీకి చెందిన సంగీత ఆనారోగ్య సమస్యలతో చికిత్స నిమిత్తం తిరుపతికి వచ్చినట్లు చెప్పారు. మహిళ మృతి చెందిన ఆధారాల ప్రకారం అక్కడి పోలీసుల సహాయంతో ఆమె కుటుంబ సభ్యులకు సంప్రదించామని చెప్పారు. మృతురాలి భర్త సురేంద్రకు సమాచారం అందించామని, కేసు దర్యాప్తు జరుగుతోందని తెలిపారు.

CHANGE OF SURNAME

I, K.SIRI CHANDANA (Advocate) D/o K.RAJESH and W/o P.ROHIT residing at Flat No.101, Sarathy Towers, Balaji Colony, Tirupati (AP) My Full Maiden Name is Kamisetty Siri Chandana. I got married to Shri Pasupurthi Rohit S/o P.Jaya Prakash on 20-10-2024 at GRC Convention, Kurnool (AP) in Accordance with Hindu rites and customs.
After Marriage I have changed my Surname from Kamisetty to Pasupurthy and shall hereafter be known as **Pasupurthy Siri Chandana.** For all purposes, records and proceedings from hereon.

శ్రీకాళహస్తి
•శ్రీకాళహస్తి • సత్యవేడు • రైల్వేకోడూరు

సింహ వాహనంపై శ్రీనివాసుడు

శ్రీకాళహస్తి గ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే: మండలంలోని తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం వేదపండితుల మంత్రోచ్చారణలతో స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించి శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని ఉత్సవమూర్తిగా తీర్చిదిద్ది సింహవాహనంపై అధిరోహించి గ్రామోత్సవం చేపట్టారు.

సహకార సంఘ బలోపేతమే లక్ష్యం

వరదయ్యపాళెం: ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని జాతీయ సహకార అభివృద్ధి కార్పొరేషన్ సంస్థ యంగ్ ప్రొఫెషనల్ అధికారి సంజీవ్ అన్నారు. స్థానిక వరదయ్య రైతు, ఉత్పత్తిదారుల సహకార సంఘాన్ని బుధవారం సందర్శించారు. సంఘ కార్యకలాపాలు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. సెర్ప్ సంస్థ అధికారి ఈఎస్ నాగరాజు, సంఘ ఛైర్మన్ నీలావతి, మాజీ సర్పంచి చిన్నా, డైరక్టర్లు పాల్గొన్నారు.

గిరిజన గురుకుల విద్యాలయ సందర్శన

రేణిగుంట: రేణిగుంటలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సలహా మండలి సభ్యుడు సుబ్బయ్య సందర్శించారు. బుధవారం ఆయన పాఠశాలలో వసతులు, విద్యార్థుల విద్యా ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల రికార్డులు, వంటశాల, తరగతి గదులను పరిశీలించారు.

▸ మాంగల్యం చూపుతున్న ఆలయ ప్రధాన అర్చకులు ▸ పుష్పమాలికలతో వేడుకలు జరుపుతున్న అర్చకులు ▸ కల్యాణోత్సవం వీక్షించేందుకు వచ్చిన భక్తులు ▸ నూతన వధూవరులకు తాళిబొట్లు, వస్త్రాలు అందజేస్తున్న అధికారులు, ట్రస్టుబోర్డు సభ్యులు

బ్రహ్మోత్సవం.. ఆధ్యాత్మిక ఆనందం

నటరాజస్వామికి చందనంతో అభిషేకం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆనందరాత్రిని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించిన శివకామసుందరి సమేత నటరాజస్వామి కల్యాణోత్సవ వైభవం ఆద్యంతం రమణీయంగా సాగింది. అనువంశిక ప్రధాన దీక్షా గురుకుల్ స్వామినాథన్ సంకల్ప పూజలు ప్రారంభించారు. ఆగమోక్తంగా వివాహక్రతువు జరిపారు. అర్చకస్వాములు శ్రీశివకామ సుందరి సమేత నటరాజస్వామికి విశేష పూజా ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం విశేష స్వర్ణాభరణాలతో ఉత్సవమూర్తులను అలంకరించారు. అనంతరం చతుర్మాడ వీధుల్లో ఊరేగించారు.

సతీ.. అదిగో.. అరుంధతీ

సోమస్కందమూర్తి, జ్ఞానాంబిక కల్యాణోత్సవ సమయంలో ఒక్కటైన నూతన వధూవరులు వివాహం పూర్తయ్యాక వారి సహధర్మచారిణికి ఆకాశం వైపు చూపించి అరుంధతీ నక్షత్రాన్ని చూపించడం వధూవరుల బంధువర్గీయులు, స్నేహితుల మధ్య సందడి వాతావరణంలో జరిగింది.

వధూవరులకు తాళి కానుక

బ్రహ్మోత్సవాల్లో భాగంగా నూతన 59 మంది వధూవరులకు బంగారు తాళిబొట్లను శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున కానుకగా అందజేశారు. ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్, ఈవో బాపిరెడ్డి, డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డి, భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, ట్రస్టుబోర్డు సభ్యులు పాల్గొన్నారు. ■ బ్రహ్మోత్సవాల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు అభినందనీయమని ఎస్పీ సుబ్బరాయుడు, ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్ అన్నారు.

'ప్రదక్షిణం'.. వసతులు అవశ్యం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా కైలాసగిరి ప్రదక్షిణోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ముక్కంటి ఆలయం నుంచి గురువారం ఉదయం సోమస్కందమూర్తి, జ్ఞానాంబిక అమ్మవార్లు ఈ విశేషోత్సవానికి బయలుదేరనున్నారు. అయితే స్వామి, అమ్మవార్లతో పాటు భారీగా భక్తులు తరలివచ్చే అవకాశముంది. ■ ఎండ తీవ్రత కారణంగా తాగునీరు అందుబాటులో ఉంచాలి. ప్రసాద వితరణ దాతలు అంజూరు మండపం పరిసరాల్లో పంపిణీ చేయడం వల్ల చాలా వరకు అన్నప్రసాదాలు వృథా అవుతున్నాయి. గిరి ప్రదక్షిణ మార్గంలో వేర్వేరు చోట్ల పంపిణీ చేయాలి. ■ ఏటా వేయిలింగాల కోన దాటే వరకు పలు చోట్ల మంచినీరు, మజ్జిగ, శీతలపానీయ కేంద్రాలుంటాయి. ఆ తరువాత ఎక్కడ కన్పించవు. అలాంటి ప్రదేశాల్లో ఆలయం తరపున తాత్కాలిక కౌంటర్లు ఏర్పాటు చేసి తాగునీరు అందుబాటులో ఉంచాల్సి ఉంది. ■ ద్విచక్ర వాహన చోదకులు వేగంగా వెళ్లడం, భక్తులను భయాందోళనలకు గురిచేసే విధంగా వ్యవహరించే వాళ్ల విషయంలో పోలీసులు నిఘా ఉంచాలి.

అలంకార కవచం.. సర్వపాప సంహారం

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి చిత్రం

శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చే భక్తులు ఎక్కువ మంది స్వామి వారిని అలంకార కవచంతో దర్శనం చేసుకునేందుకు ఇష్టపడుతుంటారు. ఎందుకంటే ఆ కవచం ఎంతో మహిమాన్వితమైంది. సూర్యచంద్రాగ్ని లోచనుడిగా పూజలందుకునే వాయులింగేశ్వరుని ముందు అమర్చిన కవచంలో సూర్యుడు, చంద్రుడు, అగ్నితో పాటు నవగ్రహాలు, 27 నక్షత్రాలు నిక్షిప్తమై ఉంటాయి. ఒక్కో అధునీత ఒక్కో గ్రహానికి నిదర్శనమైతే.. వాటిపై నక్షత్రాల కన్పించేవి ఆయా గ్రహాలకు సంబంధించిన నక్షత్రాలు. గ్రహస్థితి ఆధారంగా ప్రతికూల పరిస్థితుల నుంచి ఉపశమనం పొందేందుకు అలంకార కవచంతో స్వామి వారిని దర్శించుకోవాలని ఇక్కడి అర్చకులు చెప్తుంటారు. - న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

ప్రణాళికతో చదువు.. మంచి మార్కులు సాధించు

విద్యార్థులతో మాట్లాడుతున్న ఏపీసీ గౌరీశంకర్

పెనగలూరు, పుల్లంపేట, న్యూస్‌టుడే: విద్యార్థులు ప్రణాళికతో చదివి పదిలో మంచి మార్కులు సాధించాలని ఏపీసీ గౌరీశంకర్ అన్నారు. బుధవారం పుల్లంపేట, పెనగలూరు మండలాలలోని కేజీబీవీ, ఎమ్మార్సీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సురేష్, ఎంఈవోలు చక్రధర్‌రాజు, నాగతిరుమలరావు, గిరివరదయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

సరకులు పంపిణీ చేస్తున్న షేక్ మస్తాన్ తదితరులు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని జామియా మసీదు వద్ద కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం 50 కుటుంబాలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు షేక్ మస్తాన్ మాట్లాడుతూ రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా పేదలకు సరకులు అందజేస్తున్నట్లు వివరించారు. మసీదు కమిటీ అధ్యక్షుడు ముజీబ్, పఠాన్ మౌలా, షాకీర్, ఇమామ్ పాల్గొన్నారు.

లక్ష్యం కోసం.. నిరంతర కృషి

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: విద్యార్థులు నిరంతరం లక్ష్యం కోసం చదవాలని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ గౌరీశంకర్, జీసీడీవో పుష్పలత అన్నారు. మండల పరిధిలోని చిన్నఓరంపాడులో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం వీడ్కోలు సభ నిర్వహించారు. విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిత ఉంటుందన్నారు. మారుమూల పల్లెల్లో పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలే ఉన్నత స్థాయిలో రాణిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సునీత, ఎంఈవోలు రాజేంద్రప్రసాద్, రెడ్డయ్య, ఉపాధ్యాయురాలు శ్రావణ గౌరి, భారతి, దీప, కృష్ణవేణి పాల్గొన్నారు.

రహదారి నిర్మించండి

నాగలాపురం, న్యూస్‌టుడే: కారణి నుంచి దాసుకుప్పం వరకు రహదారి నిర్మించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. శాసనసభలో ఆయన బుధవారం ప్రసంగిస్తూ.. గతంలో రూ.26 కోట్లు మంజూరు చేసినా నిర్మాణానికి నోచుకోలేదన్నారు. సత్యవేడు సీహెచ్‌సీలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయటంతో పాటు అనస్తీషియా వైద్యుడిని నియమించాలని అడిగారు.

శాసనసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

చేనేత గర్జనను విజయవంతం చేయండి

నారాయణవనం, న్యూస్‌టుడే: స్థానిక గాంధీ మండపం వద్ద ఈ నెల 22న మంగళగిరిలో జరగనున్న ఛలో చేనేత గర్జన కార్యక్రమ కరపత్రాలను చేనేత కార్మిక యూనియన్ నాయకులు బుధవారం ఆవిష్కరించారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కేవీ కుప్పయ్యశెట్టి మాట్లాడుతూ చేనేతల డిమాండ్ల సాధన కోసం జరిగే ఈ మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల వాసు నేతలు షణ్ముగవర్మ, బాలాజీ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

'జీఎఫ్ఎల్ఎన్'ను పకడ్బందీగా అమలు చేయాలి

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: పాఠశాలల్లో అమలవుతున్న జీఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా సెక్టోరియల్ అధికారి సారథి అన్నారు. మండలంలోని నీర్పాకోట ఎస్టీకాలనీలో ఉపాధ్యాయులకు గ్యారంటీ ఫౌండేషన్ లిటరసీ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అనంతరం జీఎఫ్ఎల్ఎన్ కిట్లను పంపిణీ చేశారు. ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు కిట్లు పంపిణీ చేస్తున్న డీఎస్‌వో

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: ముక్కావారిపల్లె తెదేపా కార్యాలయంలో బుధవారం అయిదు మందికి రూ.5.80లక్షల చెక్కులను పంపిణీ చేశారు. తెదేపా నియోజకవర్గ బాధ్యులు ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మి రాజకీయాలకు అతీతంగా సీఎం సహాయనిధిని ఇస్తున్నట్లు చెప్పారు.

ఆక్రమణలపై విచారణ చేపట్టాలి

ఏర్పేడు: మండలంలోని వికృతమాల రెవెన్యూలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గురవయ్య కోరారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలు పెద్దఎత్తున చోటుచేసుకున్నాయని బుధవారం అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మణి, శివకుమార్, చారులత, మురళి పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

రేణిగుంట, న్యూస్‌టుడే: ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో 132 కేవీ లైన్ పనులు జరుగుతుండటంతో గురువారం రామకృష్ణాపురం, బీసీ కాలనీలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉపాధి పనుల తనిఖీ

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకంలో కూలీలకు పనులను కల్పించడంతోపాటు సామాజిక ఆస్తులను పెంపొందించుకోవాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని కొత్తపాళెంలో ఉపాధి పథకం ద్వారా జరుగుతున్న సీసీరోడ్డు పనులను పరిశీలించారు. ఏపీడీ సరిత, మండల అధికారులు పాల్గొన్నారు.

వీఆర్వోల నిరసన

రేణిగుంట, న్యూస్‌టుడే: పని ఒత్తిడి తగ్గించాలని వీఆర్వోలు బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వీఆర్వోల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి హేమంత్, శ్రీకాళహస్తి డివిజన్ అధ్యక్షుడు శంకరయ్య వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆర్టీసీకి రూ.56.18 లక్షల రాబడి

తొట్టంబేడు, న్యూస్‌టుడే: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీకాళహస్తి ఆర్టీసీ రూ.56.18లక్షల రాబడి సాధించినట్లు డీఎం రేవతి బుధవారం తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా మెరుగైన రవాణా వసతి కల్పించామని చెప్పారు. సమన్వయంతో పని చేసి డిపోకు ఆదాయం సమకూర్చిన కండక్టర్లు, డ్రైవర్లను అభినందించారు.

కళాశాల వార్షికోత్సవం

సత్యవేడు, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి పట్టుదలతో చదవాలని ఎస్సై సాయినాథ్ చౌదరి చెప్పారు. బుధవారం స్థానిక బాబు జూనియర్ కళాశాల కరస్పాండెంట్ పరంధాం ఆధ్వర్యంలో జరిగిన 16వ వార్షికోత్సవానికి ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ మస్తాన్ పాల్గొన్నారు.

నీటి శుద్ధి యంత్రం వితరణ

పుల్లంపేట, న్యూస్‌టుడే: మండల పరిధిలోని అనంతంపల్లె ప్రాథమిక పాఠశాలకు గోసేవ సంఘం సభ్యులు నీటి శుద్ధియంత్రాన్ని వితరణగా అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజు, సంఘ సభ్యులు మనోహర్‌రెడ్డి, శ్రీనివాసులు, తిమ్మారెడ్డి, చంద్ర పాల్గొన్నారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ నియామకం

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: చిట్వేలి మండలానికి సంబంధించిన లాయర్ బాలాజీ రాజంపేట కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియామకమయ్యారు. ఆయనను పలువురు అభినందించారు.

ఎలుగుబంటి సంచారం.. భయాందోళనలో ప్రజలు

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో ఎలుగుబంటి సంచరిస్తోంది. ఈనెల 12న వైకోట గ్రామంలో పొలంలో పని చేసుకుంటున్న రైతు బీగాల కుమార్‌పై దాడి చేసింది. మరుసటి రోజు బాలిరెడ్డిపల్లెలో అరటి తోటలో ఉన్న రైతు అమర్‌నాథ్‌రెడ్డిపై దాడి చేసిన తీవ్రంగా గాయపరిచింది. మంగళవారం గోవిందంపల్లె పంట పొలాల్లో పట్టపగలే ఎలుగుబంటి తిరిగింది. దీంతో రైతులు రాత్రి సమయంలో పొలాల్లోకి వెళ్లేందుకు జంకుతున్నారు. ఎప్పుడు దాడి చేస్తుందోనని భయాందోళనకు గురవుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి దాన్ని అటవీ ప్రాంతంలోకి తరలించాలని కోరుతున్నారు.

పొలాల్లో తిరుగుతున్న ఎలుగుబంటి

దాడి నుంచి రక్షణ ఇలా

వీటి దాడుల నుంచి తప్పించుకోవాలంటే నిప్పు ఒక్కటే మార్గమని పలువురు సూచిస్తున్నారు. నిప్పు చూస్తే అవి దూరంగా పారిపోతాయి. చాలా మంది ఎలుగుబంట్లను చూసి చెట్లు ఎక్కుతున్నారు. కానీ అవి కూడా చెట్లు ఎక్కుతాయని తెలుసుకోవాలి.

నీటి కోసం వచ్చి..

వేసవి కాలం కావడంతో అటవీలో ఎలుగుబంటి నీటి కోసం పంట పొలాల్లోకి వచ్చి ఉంటుంది. ప్రజలకు కనిపించినపుడు దానితో ఎలా ప్రవర్తించాలనే విషయంపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం.
- జగన్నాతసింగ్, ఐఎఫ్ఎస్ అధికారి

భవనాలు.. పూర్తయ్యేదెప్పుడో!

రైల్వేకోడూరు నియోజకవర్గంలోని 22 రైతుసేవా కేంద్రాల నిర్మాణాలు అసంపూర్తిగా ఉండిపోతున్నాయి. ఓబులవారిపల్లె, చిన్నఓరంపాడు ఇతర పంచాయతీల్లో ఇదే పరిస్థితి. కొన్ని చోట్ల భవనాలు లేకపోవడంతో రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచలేదని అధికారులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, ఓబులవారిపల్లె

దారిలా.. వెళ్లేదెలా

రైల్వేకోడూరు మండలం రాఘవరాజపురం వద్ద తాగునీటి పైపు లీకవుతోంది. దీంతో జాతీయ రహదారిపై నీరు ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని, లీకేజీని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. సమస్యపై సర్పంచి ఆర్.నాగలక్ష్మి మాట్లాడుతూ మరమ్మతులు చేస్తామని చెప్పారు. **- న్యూస్‌టుడే, రైల్వేకోడూరు**

ఏ క్షణాన ఏం జరుగునో!

ఓబులవారిపల్లె మండలం కటికంవారిపల్లెలో ప్రాథమిక పాఠశాల భవనాలు పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ భవనాలు సుమారు 30 ఏళ్ల క్రితం నిర్మించడంతో మరమ్మతులకు గురయ్యాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి కొత్త భవనాలు మంజూరు చేయాలని కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, ఓబులవారిపల్లె

వివాహిత ఆత్మహత్య

తొట్టంబేడు, న్యూస్‌టుడే: కడుపునొప్పి తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని బసవన్నగుంట ఎస్టీ కాలనీలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కాలనీకి చెందిన మారయ్య భార్య చిలకమ్మ (37) కొన్నాళ్లుగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఇంటి వద్ద ఎలుకల మందు తిన్నారు. గుర్తించిన స్థానికులు ఆమెను శ్రీకాళహస్తి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాల చోరీ నిందితుడి అరెస్టు

ఏర్పేడు, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాల చోరీ కేసులో నిందితుణ్ని ఏర్పేడు పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి వివరాల ప్రకారం.. ద్విచక్ర వాహనాల చోరీ కేసులో నిందితుడైన సయ్యద్ రఫీని బుధవారం రేణిగుంట-నాయుడుపేట ప్రధాన రహదారిపై మేర్లపాక టోల్‌ప్లాజా వద్ద అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. అతణ్ని శ్రీకాళహస్తి న్యాయస్థానంలో హాజరు పరచడంతో 14రోజుల రిమాండ్ విధించారని ఎస్సై పేర్కొన్నారు.

కత్తితో దాడి చేసుకున్న యువకుడు

రేణిగుంట, న్యూస్‌టుడే: కత్తి పట్టుకొని యువకుడు తిరగడంతో రేణిగుంట ప్రజలు ఉలిక్కిపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. అసోం రాష్ట్రానికి చెందిన గాలిబొరు అనే యువకుడికి మతిస్థిమితం లేదు. కోయంబత్తూరులో కూలిపనుల నిమిత్తం బయలుదేరిన యువకుడు బుధవారం ఉదయం రేణిగుంట రైల్వేస్టేషన్‌లో దిగాడు. స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద దుకాణంలో నుంచి కత్తిని తీసుకొని మెడపై దాడి చేసుకున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అతణ్ని తిరుపతి రుయా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే కాసేపు అక్కడే ఉన్న అతడు తప్పించుకొని వెళ్లాడు.

అగ్నికి ఇల్లు దగ్ధం.. సత్యవేడు: కట్టెల పొయ్యి నుంచి నిప్పు రవ్వ ఎగిరిపడి ఇల్లు కాలిపోయింది. ఈ ఘటన బుధవారం మండలంలోని పేరడంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అంకయ్య భార్య ఉదయం నీరు కాచుతున్న క్రమంలో గాలి ఎక్కువగా వీచడంతో నిప్పు ఇంటిపై పూర్తిగా కాలిపోయింది.

విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి

పెనగలూరు(పుల్లంపేట), న్యూస్‌టుడే: స్థానిక ఆదర్శ పాఠశాల వసతిగృహంలో మతిస్థిమితంలేని విద్యార్థిపై జరిగిన దాడిపై విచారణ జరిపి కారకులైన వారిని శిక్షించాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ సంఘం నాయకుడు ప్రశాంత్ కోరారు. బుధవారం పెనగలూరు మండలానికి వచ్చిన విచారణాధికారి నాగయ్యకు వినతి పత్రం అందజేశారు.

విద్యుత్తు సమస్యలపై వినతులు

సత్యవేడు, న్యూస్‌టుడే: విద్యుత్తు సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని రిటైర్డ్ న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయమూర్తి ఉన్నతాధికారులను కోరారు. బుధవారం స్థానిక బేరిశెట్టి కల్యాణ మండపంలో జరిగిన ప్రత్యేక విద్యుత్తు అదాలత్‌లో సమస్యలపై 23 వినతులు అందాయి. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్, ఏఈ వాసుదేవయ్య, పుత్తూరు ఈఈ దేవా ఆశీర్వాదం, మధుకుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రంజాన్ ప్రారంభ శుభాకాంక్షలు
ముస్లిం సోదర, సోదరీమణులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు మరియు ప్రజలకు రంజాన్ ప్రారంభ శుభాకాంక్షలు.
షేక్ అన్వర్‌బాషా
టీడీపీ సీనియర్ నాయకులు
శెట్టిగుంట, రైల్వేకోడూరు (మం).

చెరువులు... నేడు మురికి కూపాలు!

రేణిగుంట, న్యూస్‌టుడే: గతంలో స్వచ్ఛమైన నీటితో ఉండే చెరువులన్నీ నేడు మురుగునీటితో నిండిపోతున్నాయి. చెరువులను బాగు చేయాలని కోరినా ఇరిగేషన్ అధికారులు కన్నెత్తి చూడటం లేదు. నీరు కలుషితమవుతుండటంతో ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి నుంచి రేణిగుంట మండలంలోకి వచ్చే నీటి కాలువల్లో నగరపాలక సంస్థ వ్యర్థాలను వదులుతున్నారు. దీంతో చెరువులన్నీ వ్యర్థాలతో దర్శనమిస్తున్నాయి.

వెంకటాపురం చెరువు

చేపలపై ప్రభావం

తిరుపతి మురుగునీరు కారణంగా వెంకటాపురం, అన్నస్వామిపల్లె, కరకంబాడి, తిమ్మయ్యగుంత చెరువులు దెబ్బతిన్నాయి. ఈ చెరువుల కింద సుమారు 500 ఎకరాల ఆయకట్టు ఉంది. దీంతో పొలల్లోకి మురుగు చేరుతోందని రైతులు అంటున్నారు. ఈ చెరువుల్లో చేపలు కొనడానికి కూడా వ్యాపారాలు ముందుకు రావడంలేదు.

పట్టించుకోని ప్రభుత్వాలు

25 ఏళ్ల క్రితం తిరుపతి నగరపాలక సంస్థ నుంచి వచ్చే మురుగు, వ్యర్థాలతో కూడిన నీటిని శుద్ధి చేసే ప్లాంటును తూకివాకం పంచాయతీలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దీని నిర్వహణ సరిగ్గాలేదనే విమర్శలు వస్తున్నాయి. తిరుపతి నగరం ఊహించని విధంగా పెరగడంతో చెన్నయ్యగుంత వద్ద మరో శుద్ధి చేసే ప్లాంటు నిర్మిస్తామని 2015లో అప్పటి ప్రభుత్వ పెద్దలు చెప్పారు. దీని పనులు ప్రారంభించిన కొన్నాళ్లకు వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వారు దీన్ని పూర్తిగా పక్కకు పెట్టడంతో పనులు ఎక్కడికక్కడే చెరువుల్లోకి చేరే నీటి శుద్ధి ఆగిపోయింది.

పలుమార్లు విన్నవించినా..

ఈ సమస్యను పరిష్కరించాలని, చెరువులను కాపాడాలని పలుమార్లు రైతులు నీటిపారుదల శాఖ అధికారులకు విన్నవించిన కనీసం స్పందించలేదు. మండలంలో వీరు రైతులకు అందుబాటులో ఉండటం లేదనే విమర్శలు ఉన్నాయి. రెండేళ్ల క్రితమే చెరువుల చెడిపోతున్నాయని, వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పి ఇంత వరకు కన్నెత్తి చూడలేదు. ఈ అంశంపై సంబంధిత అధికారులను వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

ప్రథమ వర్ధంతి
మాకు ఎల్లవేళలా తోడు, నీడగా ...
కలకాలం అండగా ఉంటావనుకున్న
నీవు అకస్మికంగా మా నుండి దూరమై
ఏడాది గడిచిన సందర్భంగా నీ
జ్ఞాపకాలను స్మరించుకుంటూ...
నీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని
దేవుని ప్రార్థిస్తున్నాం.
కుటుంబ సభ్యులు
గమనిక : ప్రథమ వర్ధంతి కార్యక్రమం 19.2.2026వ తేదీ గురువారం రాఘవరాజపురం - యస్.వి.నగర్‌లోని మా స్వగృహము నందు జరుపబడును. కావున అందరికీ తెలపడమైనది.
కీ॥శే॥ బత్తిన శశికుమార్‌రెడ్డి గారు
BSR కన్‌స్ట్రక్షన్స్ అధినేత,
యస్.వి.నగర్, రైల్వేకోడూరు.
మరణం: 07.04.2025

(c) eenadu

సూళ్లూరుపేట

• సూళ్లూరుపేట • వెంకటగిరి

అలంకార కవచం.. సర్వపాప సంహారం

శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చే భక్తులు ఎక్కువ మంది స్వామి వారిని అలంకార కవచంతో దర్శనం చేసుకునేందుకు ఇష్టపడుతుంటారు. ఎందుకంటే ఆ కవచం ఎంతో మహిమాన్వితమైంది. సూర్యచంద్రాగ్ని లోచనుడిగా పూజలందుకునే వాయులింగేశ్వరుని ముందు అమర్చిన కవచంపై సూర్యుడు, చంద్రుడు, అగ్నితో పాటు నవగ్రహాలు, 27 నక్షత్రాలు నిక్షిప్తమై ఉంటాయి. ఒక్కో అద్దగీత ఒక్కో గ్రహానికి నిదర్శనమైతే.. వాటిపై నక్షత్రాల్లా కన్పించేవి ఆయా గ్రహాలకు సంబంధించిన నక్షత్రాలు. గ్రహస్థితి ఆధారంగా ప్రతికూల పరిస్థితుల నుంచి ఉపశమనం పొందేందుకు అలంకార కవచంతో స్వామి వారిని దర్శించుకోవాలని ఇక్కడి అర్చకులు చెప్తుంటారు. - **న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

సింహ వాహనంపై శ్రీనివాసుడు

శ్రీకాళహస్తి గ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే: మండలంలోని తొండమాన్పురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం వేదపండితుల మంత్రోచ్చారణలతో స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించి శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని ఉత్సవమూర్తిగా తీర్చిదిద్ది సింహవాహనంపై అధిరోహించి గ్రామోత్సవం చేపట్టారు.

తెలుగుగంగ కాలువ పనులు పూర్తిచేయాలి

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న తెలుగు గంగ బ్రాంచి కాలువల నిర్మాణాలను పూర్తి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ కోరారు. మంగళవారం అసెంబ్లీ జీరో అవర్‌లో ఈవిషయాన్ని ప్రస్తావించారు. స్వర్గీయ ఎన్టీ రామారావు చొరవతో నాడు తెలుగుగంగ పథకానికి రూపకల్పన చేశారన్నారు. వీరి కృషి ఫలితంగానే చెన్నై నగరానికి తాగునీరు, తిరుపతి, నెల్లూరు జిల్లాల రైతులకు సాగునీటి సరఫరా జరుగుతుందన్నారు. వైకాపా ప్రభుత్వంలో గంగ కాలువల నిర్వహణ పనులు పట్టించుకోలేదన్నారు. నేడు పూడికతో సరఫరా సక్రమంగా జరగడంలేదన్నారు. పెళ్లకూరు, దొరవారిసత్రం, నాయుడుపేట మండలాల్లో ఏడో బ్రాంచి కాలువ లైనింగ్ పనులకు రూ.71.8 కోట్లు మంజూరు చేయాలని, దొరవారిసత్రం మండల పరిధిలో అసంపూర్తిగా ఉన్న 14ఆర్ మేజర్ కాలువ పనులు పూర్తి చేస్తే 21,236 ఎకరాలు సాగులోకి వస్తుందన్నారు. ఇందుకు రూ.8.20 కోట్లు మంజూరు చేయాలన్నారు. 8వ బ్రాంచి కాలువ నిర్మాణం పూర్తి చేస్తే 11,300 ఎకరాలు సాగులోకి వస్తుందన్నారు.

పేరుకున్న బకాయిలు.. అభివృద్ధికి ఆటంకాలు

నాయుడుపేట పట్టణం, సూళ్లూరుపేట పట్టణం, వెంకటగిరి, న్యూస్‌టుడే: పురపాలక సంఘాల్లో ఇంటి పన్నుల వసూళ్లు నత్తనడకన చేస్తున్నారు. పాలకులు, అధికారులు పాత బకాయిలపై దృష్టి సారించడం లేదు. వనరుల్ని సద్వినియోగం చేసుకుని లాభాల బాటలోకి పురాలు వచ్చేలా ప్రయత్నాలు చేయడం లేదు. పన్నుల వసూళ్లలో ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందాన మారింది.

పురపాలిక	అసెస్‌మెంట్లు	పన్ను డిమాండ్ రూ.కోట్లలో	బకాయిలు రూ.కోట్లలో	వసూలు రూ.కోట్లలో
నాయుడుపేట	12363	6.40	2.60	4.50
సూళ్లూరుపేట	13000	5.83	3.64	4.34
వెంకటగిరి	7876	3.00	2.10	1.90

గడవు సమీపిస్తున్నా స్పందన కరవు

నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి పురపాలక సంఘాల్లో పాత బకాయిలు పేరుకుంటున్నాయి. ఒక్కో పురపాలక సంఘం పరిధిలో నాలుగైదు ఏళ్లుగా పన్నులు చెల్లించలేదు. మార్చి సమీపిస్తున్నా పాలకులు, అధికారులు పన్నుల వసూలుపై చర్యలు తీసుకోలేదు. కొందరు రాజకీయ నాయకుల అండదండలతో పన్నులు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారు. వైకాపా కాలంలో నాయకుల అండతో పన్నులు చెల్లించక పోవడంతో పేరుకున్నాయి.

బకాయిలు తోసేస్తారని

పురపాలక సంఘాల్లో కొన్నేళ్లు పేరుకు పోయిన బకాయిల్ని, దుకాణాల అద్దెలు, ఇతర వేలం పాటలకు సంబంధించిన నగదు వసూలు కాకపోతే వాటిని కొన్నేళ్ల పాటు చూసి కాలం చెల్లిన బకాయిల్ని తొలగిస్తారు. ఆ లెక్కన పన్నులు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారు. ప్రధాన పార్టీల రాజకీయ నాయకులూ తమను అడగరనే ఉద్దేశంతో పన్నుల రాబడికి గండి కొడుతున్నారు.

గతంలో పన్నుల చెల్లింపులో ముందంజ

నాయుడుపేట పురపాలక సంఘం పన్నుల చెల్లింపులో ముందంజలో ఉండేది. రాష్ట్రంలోనే మొదటి మూడు స్థానాల్లో ఉండే వాటిల్లో నాయుడుపేట పురపాలిక పోటీ పడేది. ప్రస్తుతం రూ.2.60కోట్లు పాత బకాయిలు ఉన్నాయి.

● ఈ విషయమై కమిషనర్ ఎస్‌కే.ఫజులుల్లాను వివరణ కోరగా మొండి బకాయిలపై దృష్టి సారిస్తాం. పన్నులు వసూలుచేసి అభివృద్ధి పనులు చేస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 88979 08890
వెంకటగిరి: 80085 73966
సమయం 10 AM TO 1 PM

ఓజిలి, న్యూస్‌టుడే: సమస్య: దొడ్లమిట్టలో తాగునీటి పథకం మోటార్ మరమ్మతుకు గురికావడంతో నాలుగు రోజుల నుంచి తాగునీటికి అవస్థలు పడుతున్నాం. - సునీల్

సమాధానం: దొడ్లమిట్టలో తాగునీటి మోటార్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీటిని సరఫరా చేస్తాం. **- సురేష్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్**

బాలాయపల్లి, న్యూస్‌టుడే: సమస్య: బాలాయపల్లి గ్రంథాలయానికి ఎగువన రభ రహదారికి ఆనుకుని తాగునీటి పైపులీకై రోడ్డు బురదగా మారుతోంది. **- రమేష్ నాయుడు**

సమాధానం: సమస్యను గ్రామ కార్యదర్శికి తెలిపి పరిష్కరిస్తాం. **- రామకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో**

బాలాయపల్లి, న్యూస్‌టుడే: సమస్య: కడగుంట గిరిజన కాలనీ ఓవర్ హెడ్‌ట్యాంక్ నుంచి వచ్చే పైపు రెండు చోట్ల లీకై నీరు కలుషితమవుతోంది. **- మహేశ్**

సమాధానం: ఈ సమస్యను చక్కబెట్టేలా చర్యలు తీసుకుంటాం. **- రామకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో**

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: సమస్య: సూళ్లూరుపేట పట్టణంలోని షార్ బస్టాండ్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో మురుగు కాలువ వ్యర్థాలతో పేరుకు పోయింది. మురుగు రోడ్డుపైకి చేరుతోంది. **- సుబ్రహ్మణ్యం**

సమాధానం: పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. **- కె.చిన్నయ్య, పురపాలక సంఘ కమిషనర్**

సూళ్లూరుపేట పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పాండురంగ వీధిలో విద్యుత్తు స్తంభాలకు వీధి దీపాలు వెలగడం లేదు. **- శేఖర్**

సమాధానం: వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- చిన్నయ్య, కమిషనర్**

సూళ్లూరుపేట పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని షార్ బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారి పక్కన, మురుగు దుర్వాసన వెదజల్లుతోంది. **- సుభాష్**

సమాధానం: మురుగును సిబ్బందితో వెంటనే తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **-చిన్నయ్య, కమిషనర్**

తడ, న్యూస్‌టుడే: సమస్య: తడ పంచాయతీ సున్నపుబట్టీ వీధిలో డ్రైనేజీ కాల్వ గోడ కొంత మేర కూలింది. దీంతో రోడ్డు ఇరుకు ప్రమాదకరంగా మారింది. పట్టుతప్పితే వాహనదారులు కాల్వలో పడిపోయే ప్రమాదం ఉంది. **-సుధీర్**

సమాధానం: కూలిన గోడను త్వరలోనే నిర్మిస్తాం. **- కె.అర్కుగం, సర్పంచి, తడ**

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: సమస్య: సూళ్లూరుపేట మండలంలోని కోనేపల్లి గ్రామంలో రాత్రి వెలగాల్సిన విద్యుత్తు దీపాలు నిత్యం వెలుగుతున్నాయి. **- కిషోర్**

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- శేఖర్‌బాబు, ఏఈ, విద్యుత్‌శాఖ**

వెంకటగిరి, న్యూస్‌టుడే: సమస్య: కైవల్యనది సమీపంలో కొబ్బరి బొండాలు పడేస్తున్నారు. వీటిలో దోమలు పెరుగుతున్నాయి. **- రంగనాథం**

సమాధానం: వ్యాపారులకు తగు సూచనలు చేస్తాం. కైవల్యనది వద్ద పడేయకుండా చర్యలు తీసుకుంటాం. **- రామారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

నీలకంఠేశ్వరుడికి త్రిశూలస్నానం

నీలకంఠేశ్వరుడిని త్రిశూలస్నానానికి తెచ్చిన భక్తులు

నాయుడుపేట, న్యూస్‌టుడే: పట్టణంలో స్వర్ణముఖి తీరాన శ్రీప్రసూనాంబ నీలకంఠేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం స్వర్ణముఖినదిలో స్వామివారి త్రిశూలస్నానాన్ని నిర్వహించారు. ఉదయం అభిషేకాల అనంతరం శివపార్వతుల ఉత్సవ మూర్తులను నదీ తీరానికి తీసుకెళ్లి వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం పల్లకీసేవలో ఊరేగించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం రథంపై పార్వతీపరమేశ్వర్లు పురవీధుల్లో ఊరేగారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ గూడూరు సుధీర్‌రెడ్డి, తెదేపా నాయకులు సుధీర్, అంకయ్య, పండితులు సురేష్‌స్వామి పాల్గొన్నారు. తుమ్మూరు గంగాభవానీ నీలకంఠేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా త్రిశూలస్నానం నిర్వహించారు.

శంకరమఠంలో చండీ హోమం

పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

వెంకటగిరి, న్యూస్‌టుడే: కర్ణకమ్మవీధిలోని శంకరమఠంలో బుధవారం చండీహోమం నిర్వహించారు. శంకర మఠం స్థాపించి 114 సంవత్సరాలు కావడంతో మఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల సమక్షంలో గణపతి, నవగ్రహ పూజ, శ్రీచక్రానికి అభిషేకాలు చేశారు. అనంతరం చండీ హోమ పూజను ఘనంగా నిర్వహించారు. శంకరాచార్యులకు ప్రత్యేకాలంకరణ, పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

మనవాలి రోడ్డుకు మోక్షం

రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

ఓజిలి, న్యూస్‌టుడే: మండలంలోని మనవాలి రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. అధ్వాన రోడ్డుపై ప్రయాణం చేయాలంటే నరకాన్ని తలపించేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామీణ రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించి నిధులు మంజూరు చేసింది. ఈక్రమంలో మనవాలి మీదగా నెమళ్లపూడి ర.భ రోడ్డు వరకు పంచాయతీరాజ్ రోడ్డుకు రూ.1.4 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న గుత్తేదారుడు పనులు చేపట్టారు. ఈరోడ్డు పనులు పూర్తి అయితే మేనకూరు నుంచి మనవాలి మీదగా నెమళ్లపూడికి కారొపోలకు ఇబ్బందులు తొలగనుండటంతో గ్రామీణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్వీయూ బోధనేతర సిబ్బందికి శిక్షణ

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: ఎస్వీ యూనివర్సిటీ బోధనేతర సిబ్బందికి పాలనాపర విధులు నిర్వహణపై వర్సిటీ సెనెట్ హాల్‌లో శిక్షణ సాగుతుంది. ఈ కార్యక్రమం జనవరి 29వ తేదీన ప్రారంభమై.. ఈనెల 21న ముగియనుంది. రూసా 2.0లో భాగంగా బోధనేతర సిబ్బందికి నైపుణ్యాభివృద్ధి నిపుణులతో తరగతులు నిర్వహిస్తున్నారు. నోట్‌ఫైల్స్, డ్రాఫ్ట్ లెటర్స్, పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, మార్కుల జాబితా రూపకల్పన, తదితర అంశాలతో పాటు ప్రభుత్వ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నారు. బోధనేతర సిబ్బంది సంఘం అధ్యక్షుడు గుర్రంకొండ శ్రీధర్, కార్యదర్శి నెల్లూరు సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

పశువైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఏడీ గోవర్దన్‌రెడ్డి

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నెల్లూరు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డీడీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. నాయుడుపేట మండలం తిమ్మాజీ కండ్రిగలో మంగళవారం లేగ దూడల అభివృద్ధి ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. నాయుడుపేట సహాయ సంచాలకులు గోవర్దన్‌రెడ్డి మాట్లాడుతూ పెయ్య దూడల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పాడి రైతులకు మినరల్ మిక్చర్, మినరల్ బ్లాక్‌లను పంపిణీ చేశారు. పాడి రైతులకు బహుమతులు అందించారు.

ప్రభుత్వ భూముల్లో చెట్లు నరికితే చర్యలు

చిట్టమూరు, న్యూస్‌టుడే: మండలంలోని కుమ్మరపాలెం రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 254లో చెరువు పోరంబోకు భూమిలో అక్రమంగా చెట్లు నరికితే చర్యలు తప్పవని తహసీల్దార్ రామయ్య, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగు రోజులుగా ఇక్కడ కొందరు అక్రమంగా చెట్లు నరకడం పై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా అతిక్రమించి నరికేందుకు ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సై నాగరాజుకు సూచించారు.

కిచెన్ గార్డెన్‌తో మహిళలకు ఉపాధి

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: కిచెన్ గార్డెన్‌తో మహిళలకు ఉపాధి మెండుగా ఉంటుందని బూట్స్ ఫార్మర్ ప్రొడక్షన్ ఆర్గానిక్ స్టేషన్ (బీఎఫ్‌పీవో) సీఈవో గంగాధర్ పేర్కొన్నారు. మహిళా ప్రాంగణంలో 10 రోజుల పాటు కిచెన్, టెర్రస్ గార్డెన్‌పై మహిళల శిక్షణా కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. సీఈవో ప్రసంగిస్తూ మహిళలు, మహిళా రైతులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలన్నారు.

కూడలిలో వెలగని సౌర దీపం

కొండూరు మాంబట్టు సెజ్ రోడ్డు కూడలిలో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సౌర దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రిళ్లు చిమ్మ చీకటి నెలకొంది. పరిశ్రమలకు రాకపోకలు సాగించే కార్మికులు, సమీప గ్రామాల ప్రజలు ఇక్కడ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పలువురు కార్మికులు ఇక్కడ రహదారి దాటే క్రమంలో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. జాతీయ రహదారి నిర్వహణ సంస్థ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. - **న్యూస్‌టుడే, తడ**

గుంతలు.. రాకపోకలకు చిక్కులు

మండలంలోని పెద్దపడవ గ్రామంలోకి వెళ్లే దారిలో గుంతలు ఏర్పడడంతో రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో రాక పోకలకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాలకు గుంతలు పెద్దవి కావడంతో ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, సూళ్లూరుపేట పట్టణం

ఆదమరిస్తే అంతే సంగతి

వెంకటగిరి పట్టణంలోని కాశీపేట నుంచి కుర్జాగుంట గ్రామానికి వెళ్లే మార్గంలోని ఆనందపురం వద్ద ర.భ రోడ్డుకు ఇరువైపులా సైడు కాలువలు దెబ్బతిన్నాయి. ఫలితంగా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పలు గ్రామాలకు వెళ్లే ఈ రోడ్డు కుంచించుకు పోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. రోడ్డు కోసుకు పోవడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. అధికారులు, నాయకులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. - **న్యూస్‌టుడే, వెంకటగిరి**

బాగుచేస్తే దప్పిక తీరుతుంది

ఓజిలి మండల పరిషత్ కార్యాలయ సమీపంలో రోడ్డు పక్కన తాగునీటి బోరు మరమ్మతులకు గురైంది. ఈ బోరు చుట్టూ అపరిశుభ్రత నెలకొంది. గ్రామాల నుంచి కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఇది ఉపయోగపడుతుంది. మరమ్మతులకు గురికావడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించాల్సి ఉంటుంది. - **న్యూస్‌టుడే, ఓజిలి**

పట్టుతప్పితే ప్రమాదం

నాయుడుపేట రాజగోపాలపురం వీధి మలుపులో రోడ్డు, సైడు కాల్వ దెబ్బ తినడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మలుపులో రంధ్ర పడటంతో పొరపాటున కాలు పడితే ప్రమాదం జరిగే అవకాశముంది. సాయంత్రం వేళల్లో చిన్నారులు, మహిళలు తిరిగేందుకు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు రోడ్డు, కాల్వను మరమ్మతులు చేయాల్సి ఉంది.

- న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం

భాజపా జిల్లా ఓబీసీ కార్యదర్శిగా సూరిబాబు

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: తిరుపతి జిల్లా భాజపా ఓబీసీ మోర్చా కార్యదర్శిగా సూళ్లూరుపేట పట్టణ పరిధిలోని మన్నారుపోలూరుకు చెందిన సూరిబాబు నియమితులయ్యారు. గతంలో జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శిగా, సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షుడిగా పని చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

జిల్లా కమిటీలో చోటు

చంద్రశేఖర్‌గౌడ్

వాకాడు, న్యూస్‌టుడే: భాజపా కిసాన్‌మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడిగా బొట్టికాయల చంద్రశేఖర్‌గౌడ్ నియమితులయ్యారు. ఈయన గతంలో మండల భాజపా కన్వీనర్‌గా పని చేశారు. నేతలు, కార్యకర్తలు ఆయనకు అభినందనలు తెలిపారు.

జిల్లా అనుబంధ సంఘాల్లో పదవులు

బాలాయపల్లి, డక్కిలి, న్యూస్‌టుడే: భాజపా జిల్లా కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శిగా బాలాయపల్లి మండలం నిండలి సీనియర్ నేత కొండూరు వెంకటసుధాకర్‌రాజు నియమితులయ్యారు. కార్యదర్శిగా డక్కిలి మండలం కమ్మపల్లికి చెందిన నర్రావుల వెంకటకృష్ణయ్య, కార్యనిర్వాహక సభ్యుడిగా వెంకటగిరి మండలానికి చెందిన పనుగోటి శివకుమార్‌ను నియమిస్తూ జిల్లా కార్యవర్గం పేర్కొంది. ఓబీసీ మోర్చా జిల్లా కోశాధికారిగా వెంకటగిరి మండలం పెట్లూరుకు చెందిన లాలాపేట పెరుమాళ్‌ను నియమించారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

వాణికి చెక్కును అందజేస్తున్న సంజీవ్‌కుమార్

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలో పరమేశ్వరీనగర్‌కు చెందిన మల్లి హరికృష్ణ డిసెంబర్ 25వ తేదీ సూళ్లూరుపేట పరిధిలో జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం ఢీకొని మృతి చెందాడు. ఇటీవల బ్యాంకులో విచారించగా పీఎంఎస్‌బీవై వర్తిస్తుందని కెనరా బ్యాంకు మేనేజర్ గుర్తించారు. బుధవారం కెనరా బ్యాంక్ ఏజీఎం సంజీవ్‌కుమార్ చేతుల మీదగా మృతుడి భార్య మల్లి వాణికి రూ.2లక్షల చెక్కు అందజేశారు. బ్రాంచ్ చీఫ్ మేనేజర్ కరుణానిధి, మేనేజర్ శివప్రసాద్, ప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు

బ్రహ్మోత్సవం.. ఆధ్యాత్మిక ఆనందం

మాంగల్యధారణ నిర్వహిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆనందరాత్రిని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించిన శివకామసుందరి సమేత నటరాజస్వామి కల్యాణోత్సవ వైభవం ఆద్యంతం రమణీయంగా సాగింది. అనువంశిక ప్రధాన దీక్షా గురుకుల్ స్వామినాథన్ సంకల్ప పూజలు ప్రారంభించారు. ఆగమోక్తంగా వివాహక్రతువు జరిపారు. అర్చక స్వాములు శ్రీశివకామ సుందరి సమేత నటరాజ స్వామికి విశేష పూజా ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం విశేష స్వర్ణాభరణాలతో ఉత్సవమూర్తులను అలంకరించారు. అనంతరం చతుర్మాడ వీధుల్లో ఊరేగించారు.

సతీ.. అదిగో.. అరుంధతీ.. సోమస్కందమూర్తి, జ్ఞానాంబిక కల్యాణోత్సవ సమయంలో ఒక్కటైన నూతన వధూవరులు వివాహం పూర్తయ్యాక వారి సహధర్మచారిణికి ఆకాశం వైపు చూపించి అరుంధతీ నక్షత్రాన్ని చూపించడం వధూవరుల బంధువర్గీయులు, స్నేహితుల మధ్య సందడి వాతావరణంలో జరిగింది.

వధూవరులకు తాళి కానుక.. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నూతన 59 మంది వధూవరులకు బంగారు తాళిబొట్లను శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున కానుకగా అందజేశారు. ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్, ఈవో బాపిరెడ్డి, డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డి, భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, ట్రస్టుబోర్డు సభ్యులు పాల్గొన్నారు. *బ్రహ్మోత్సవాల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు అభినందనీయమని ఎస్పీ సుబ్బరాయుడు, ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్ అన్నారు.

'ప్రదక్షిణం'.. వసతులు అవశ్యం.. బ్రహ్మోత్సవాల్లో భాగంగా కైలాసగిరి ప్రదక్షిణోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ముక్కంటి ఆలయం నుంచి గురువారం ఉదయం సోమస్కందమూర్తి, జ్ఞానాంబిక అమ్మవార్లు ఈ విశేషోత్సవానికి బయలుదేరనున్నారు. అయితే స్వామి, అమ్మవార్లతో పాటు భారీగా భక్తులు తరలివచ్చే అవకాశముంది. ప్రసాద వితరణ దాతలు అంజూరు మండపం పరిసరాల్లో పంపిణీ చేయడం వల్ల చాలా వరకు అన్నప్రసాదాలు వృథా అవుతున్నాయి.

అడుగడుగునా అవస్థలు

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: సూళ్లూరుపేట నియోజకవర్గ పరిధిలో పలు పల్లె దారులు అధ్వానంగా మారాయి. ఈ మార్గాల్లో ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అదుపుతప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రైతులు వరి కోతలు కోస్తున్నారు. దీంతో ట్రాక్టర్ల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గ్రామాల్లో రహదారులు ఇలా

సూళ్లూరుపేట నుంచి కోటపోలూరు వెళ్లే రోడ్డు గుంతలమయమైంది. ఈ మార్గంలో వందల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సామంతమల్లం, ఆబాక, మీజూరు గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. సూళ్లూరుపేట నుంచి కోటపోలూరు వరకు 4కి.మీ. అధ్వానంగా మారింది.

అధ్వానంగా దొరవారిసత్రం-పూలతోట రహదారి

తడ మండలంలో: వెండ్లురుపాడు గ్రామం నుంచి గుర్రాలమిట్ట వెళ్లే రోడు దెబ్బతింది. కాదలూరు నుంచి కట్టవకు వెళ్లే రోడు, అకంపేట నుంచి అండగుండాలకు మార్గం అధ్వానంగా మారింది.

దొరవారిసత్రం: దొరవారిసత్రం నుంచి పూలతోటకు వెళ్లే 9 కి.మీ., జాతీయ రహదారి నుంచి వెనుంబాక వెళ్లే రోడ్డు 4కి.మీ, నెల్లూరుపల్లి నుంచి కొత్తపల్లి మార్గాల్లో ప్రయాణం నరకయాతనగా మారింది. వెనుంబాకం వెళ్లే రోడ్డులో అత్యవసర సమయాల్లో గర్భిణులు, వృద్ధులు ఆసుపత్రికి వెళ్లాలన్నా ఇబ్బందులు పడుతున్నారు.

ఓజిలి: అతివరం నుంచి కుందాం, ఇనుగుంట వెళ్లే రోడ్డు 15 కిలోమీటర్ల రోడ్డులో ప్రయాణం ఇబ్బందిగా మారింది. ఈ మార్గంలో ప్రైవేటు కర్మాగారాలకు వెళ్లే బస్సులు, స్కూలు బస్సులు, ఆటోలు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నాయి.

● పూలతోట రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి. కోటపోలూరు రోడ్డుకు మరమ్మతులకు నిధులు వచ్చాయి. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. మిగిలిన రహదారుల పరిస్థితిని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం నిధులు విడుదలైతే మరమ్మతులు చేస్తాం.

- చెన్నరాయుడు, ఏఈ, ఆర్‌అండ్‌బీ

ప్లాస్టిక్‌ను సమూలంగా నిర్మూలించాలి

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: ప్లాస్టిక్ వినియోగాన్ని సమూలంగా నిర్మూలించాలని హైదరాబాద్‌లోని ఎన్ఎస్ఎస్ ప్రాంతీయ సంచాలకులు సైదా పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్-1, 20 యూనిట్ల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం డిపోలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు.

50రోజులు.. 14 కేసులు.. వాకాడు.. మండలంలో 50రోజులుగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై 14కేసులు నమోదు చేసినట్లు ఎస్సై నిఖిల్ బాబు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.

ఆలయ అర్చకుడి మృతికి సంతాపం.. డక్కిలి: దేవునివెలంపల్లి ఆలయ ప్రధాన అర్చకులు గూడలి ప్రభాకర్‌శర్మ(80) బుధవారం కన్నుమూశారు. వెంబులూరులోని ఆయన నివాసానికి చేరుకుని మృతదేహానికి మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్రయ్యానాయుడు, నాయకులు నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు.

రైతు చేతిలోనే 'ఈ-పంట'

సూళ్లూరుపేట పట్టణం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాతకు అందించే పెట్టుబడి సాయం నుంచి రాయితీ ఎరువులు పొందేందుకు, పండిన ధాన్యాన్ని విక్రయించుకునేందుకు 'ఈ-పంట' నమోదు తప్పనిసరి. ప్రతి ఏటా ఈ ప్రక్రియ వ్యవసాయశాఖ ద్వారా ప్రభుత్వమే నిర్వహిస్తోంది. సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి రైతుల సమక్షంలోనే నమోదు చేస్తున్నారు. అయినప్పటికీ వివిధ కారణాలతో చాలా మంది రైతులు చేయించుకోలేకపోతున్నారు. ఫలితంగా పలు ప్రయోజనాలకు దూరమవుతున్నారు. ఈ పరిస్థితి రాకూడదని రైతులే తమ చరవాణిలో 'ఈ-క్రాప్' నమోదుకు అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. దీనికి ఈ నెల 20వ తేదీ వరకు గడవు ఇచ్చింది. ఈ అవకాశం చాల మంది రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది.

నమోదు ఎలా అంటే.. ● రైతులు తమ మొబైల్ ఫోన్‌లో గూగూల్ ప్లేస్టోర్ నుంచి apa.2.0 మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ● ఆధార్ నంబరు ద్వారా రిజిస్ట్రేషన్ చేసి mpinసెట్ చేసుకోవాలి. ● ఆధార్ నంబరు ఆధారంగా వెబ్‌ల్యాండ్‌తో అనుసంధానమైన రైతుకు చెందిన అన్ని కమతాల భూములు కనిపిస్తాయి. ● ఇప్పటి వరకు రైతు సేవా కేంద్రం సహాయకుడు నమోదు చేయని వాటికి సంబంధించి రైతే స్వయంగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవచ్చు. ● ఈ సమయంలో రైతు పొలంలోనే ఉండి 20 మీటర్ల జియో రిఫరెన్సు హద్దులతో కూడిన ఫొటో తీసుకోవాలి. ● ఈ యాప్ సహకారంతోనే ఇప్పటికే నమోదు చేసిన పంట వివరాల్లో తప్పులుంటే వాటిపై ఫిర్యాదులుచేయొచ్చు. ● 'ఈ-పంట' నమోదుకు రైతులకే అవకాశం కల్పించడం మంచి పరిణామం. ఇప్పటి వరకు చేయని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. **-ఎస్.ప్రసాద్ రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, తిరుపతి**

సూళ్లూరుపేట నియోజకవర్గంలో వివరాలు(ఎకరాల్లో)

మండలం	సాగు విస్తీర్ణం	నమోదు	చేయాల్సింది
సూళ్లూరుపేట	11397	11397	0
నాయుడుపేట	11090	11090	0
పెళ్లకూరు	13625	13071	554
దొరవారిసత్రం	13282	12184	1098
తడ	7676	7676	0
ఓజిలి	7065	6792	273

(c) eenadu

ఆలోచనలు విరియాలి.. ఆవిష్కరణలు మెరవాలి..!

ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. పాఠశాల స్థాయిలోనే సృజనాత్మకత వెలికితీసేందుకు 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' నిర్వహిస్తోంది. వినూత్న ఆలోచనలతో ప్రయోగాలు చేసేలా ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా 'డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మెమోరియల్ స్పోర్ట్స్ హాల్, బుల్లయ్య కాలేజీ పక్కన, రామా టాకీస్ దరి, విశాఖపట్నం'లో ఫిబ్రవరి 24వ తేదీన మెగా సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తోంది.

GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P.

ఈనాడు

నమోదు కొరకు: 8639814432

సమయం: ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గం॥ల వరకు..

నిబంధనలు.. ● 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు మాత్రమే. ● ప్రాజెక్టును ముందుగా నమోదు చేసుకోవాలి. ● ఒక ప్రాజెక్టుకి ఇద్దరు విద్యార్థులకు అనుమతి. ● పాఠశాల/ బ్రాంచ్‌కి ఒక ప్రాజెక్టుకు మాత్రమే అనుమతి. ● మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులు ఉంటాయి. ● పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం. రిజిస్ట్రేషన్ చివరి తేదీ : ఫిబ్రవరి 20

జూలో బ్యాటరీ సైకిళ్లపై సవారీ

ఎండాడ, న్యూస్‌టుడే: విశాఖ జంతు ప్రదర్శనశాలలో బ్యాటరీ సైకిళ్లకు విశేష ఆదరణ లభిస్తోంది. జూ విస్తీర్ణం నాలుగైదు కి.మీ. ఉంటుంది. నడుస్తూ సందర్శించడం కొంత కష్టం. దీంతో పలువురు సైకిళ్లను అద్దెకు తీసుకుని జూలో పర్యటిస్తున్నారు. ఒక్కో దానికి రూ.50 అద్దె వసూలు చేస్తున్నారు. మొత్తం 26 సైకిళ్లు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు.

నౌకల పండగ.. అంబరాన్నంటగా..!

నౌకల నుంచి అబ్బురపరిచిన లేజర్ షో

ఈనాడు, విశాఖపట్నం : విశాఖ తీరంలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ యుద్ధ నౌకల సమీక్ష (ఐఎఫ్‌ఆర్) నావికాదళం సత్తా చాటింది. 66 భారత యుద్ధ నౌకలు, 19 విదేశీ నౌకలు..60కిపైగా విమానాలు.. 3 జలాంతర్గాములు.. మొత్తం 74 దేశాలు భాగస్వామ్యమయ్యాయి. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఐఎన్ఎస్ సుమేధలో ప్రయాణిస్తూ యుద్ధ నౌకల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. సుమారు మూడు గంటల పాటు సాగిన ఈ కార్యక్రమం ఆద్యంతం విశేషంగా ఆకట్టుకుంది. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి ప్రయాణించే నౌక ముందు వెనుక హెలికాప్టర్ల విన్యాసాలు

విన్యాసాలను తిలకిస్తున్న నౌకాదళ అధికారులు, కుటుంబ సభ్యులు

రాష్ట్రపతికి జ్ఞాపిక అందిస్తున్న నౌకాదళ ప్రధానాధికారి అడ్మిరల్ దినేష్ కుమార్ త్రిపాఠి. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు

ఫ్లీట్ రివ్యూలో సతీసమేతంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

కనువిందు చేసిన జలాంతర్గామి

ఆకట్టుకున్న కళాకారుల నృత్య ప్రదర్శన

★ ఐఎన్ఎస్ సుమేధలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సమీక్ష

★ మూడు గంటల పాటు సాగిన ఐఎఫ్‌ఆర్

★ హాజరైన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

అంతర్జాతీయ యుద్ధ సమీక్షలో భాగంగా రాష్ట్రపతి ప్రయాణిస్తున్న ఐఎన్ఎస్ సుమేధ నౌక

కట్టిపడేసిన విన్యాసాలు...

ఆర్కే బీచ్‌లో అలరించిన తుది రిహార్సల్స్

ఈనాడు, విశాఖపట్నం: ఐఎఫ్‌ఆర్‌లో భాగంగా బుధవారం ఆర్కే బీచ్‌లో ఫైనల్ రిహార్సల్స్ అంగరంగ వైభవంగా నిర్వహించారు. మార్కోస్ (అత్యున్నత శిక్షణ పొందిన మెరైన్ కమాండోలు) హెలికాప్టర్ల నుంచి సముద్రంలోకి దిగడం తదితర విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఆయిల్ రిగ్ పేల్చివేత, యుద్ధ విమానాల నుంచి శత్రువులపైకి బాంబులు జారవిడిచే ప్రదర్శనలు వీక్షకులను కట్టిపడేశాయి. యుద్ధనౌకల నుంచి హెలికాప్టర్లు, ఫైటర్ జెట్లు ఎగరడం, కచ్చితంగా ల్యాండ్ అవ్వడం వంటివి 'హెలో ల్యాండింగ్ డెమో' పేరుతో నిర్వహించారు. తీరంలో మోహరించిన యుద్ధ నౌకలు, 19 విదేశీ నౌకలు విద్యుత్తు దీపాల వెలుగులు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ★ సిటీ పరేడ్ రిహార్సల్స్‌లో భాగంగా వివిధ దేశాల నావికా దళ సిబ్బంది వారి సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా బ్యాండ్లతో బీచ్ రోడ్డులో కవాతు నిర్వహించారు. ప్రధాన వేదిక వద్ద రైఫిల్స్‌తో కంటిన్యూటీ డ్రిల్, ఎన్‌సీసీ క్యాడెట్లు నృత్యం ప్రదర్శించారు. అనంతరం మిరుమిట్లు గొలిపే బాణసంచా పేలుళ్లు, లేజర్, డ్రోన్ షోలు తీరాన్ని వర్ణరంజితం చేశాయి.

సమీక్షలో యుద్ధ నౌకల బారులు

పరేడ్‌లో 150ఏళ్ల వందేమాతరం శకటం

తుపాకులతో కవాతు ప్రదర్శన

డ్రోన్లతో భారతదేశ ఆకృతి

తీరంలో బాణసంచా వెలుగుజిలుగులు

విశాఖ చరిత్రలో నిలిచిపోయే ఘట్టం ఐఎఫ్‌ఆర్: అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ విశాఖ నగర చరిత్రలో చిరస్మరణీయ ఘట్టంగా నిలిచిపోతుంది. దేశ సముద్ర శక్తి, వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పే ఈ వేడుక మనందరికీ గర్వకారణం. ప్రపంచ దేశాలతో మైత్రి, వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేస్తూనే స్వదేశీ పరిజ్ఞానంతో అధునాతన రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేసుకుంటున్న భారత దేశం తన ప్రత్యేకతను ప్రపంచానికి చాటి చెబుతోంది. –శ్రీభరత్, విశాఖ ఎంపీ

భారత నౌకాదళం గ్లోబల్ స్థాయిలో ఎదుగుతోంది: 'యునైటెడ్ త్రూ ఓషన్స్' అనే థీమ్‌తో జరిగిన ఐఎఫ్‌ఆర్ భారత్ సముద్ర శక్తి పెరుగుదలను, ప్రపంచ దేశాలతో బలపడుతున్న భాగస్వామ్యాలను ప్రతిబింబిస్తుంది. అంతర్జాతీయ నావికాదళాల భాగస్వామ్యం ఇండో-పసిఫిక్ అంతటా సముద్ర భద్రత, సహకారంపై సమష్టి సంకల్పాన్ని ప్రదర్శిస్తుంది. భారత నౌకాదళం గ్లోబల్ స్థాయిలో ఎదుగుతోంది. అందుకు ఐఎఫ్‌ఆర్ నిదర్శనం. – రామ్మోహన్ నాయుడు, కేంద్ర మంత్రి

ఆకాశంలో యుద్ధ హెలికాప్టర్లు విన్యాసాలు ప్రదర్శిస్తుండగా తీరంలో విహరిస్తున్న గద్దలు

20న నీటి సరఫరాకు అంతరాయం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగర పాలక సంస్థ మధురవాడ జోన్ పరిధి 6, 7 వార్డుల్లో 20వ తేదీన నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని జీవీఎంసీ మంచినీటి సరఫరా కార్యనిర్వాహక ఇంజినీర్ సుధాకర్ తెలిపారు. ఆయా వార్డులకు నీటిని సరఫరా చేసే ప్రధాన పైపులైన్‌కు గంభీరం వద్ద లీకు ఏర్పడిందని, మరమ్మతుల దృష్ట్యా సరఫరా నిలిపేస్తామన్నారు. శనివారం యథావిధిగా నీటి సరఫరా ఉంటుందన్నారు. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

గూగుల్ డేటా సెంటర్‌కు మార్గం సుగమం!

పూర్తిస్థాయిలో భూములిచ్చిన రైతులు

వచ్చే నెలలో శంకుస్థాపనకు సన్నాహాలు

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు అంగీకార పత్రం ఇస్తున్న రైతు గణేశ్

ఈనాడు, విశాఖపట్నం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఐటీలో అతి పెద్ద పెట్టుబడిగా గూగుల్ డేటా సెంటర్ నిలిచింది. గూగుల్ ప్రకటించినప్పటి నుంచి వైకాపా నాయకులు భూసేకరణ జరగకుండా పన్నాగాలు పన్నుతూనే ఉన్నారు. అవాంతరాలన్నింటినీ అధిగమించి రైతులను ఒప్పించి పరిహారం జమ చేశారు. ఈ ప్రక్రియలో మిగిలిన ఆఖరి రైతు సైతం భూమి ఇచ్చేందుకు ముందుకు రావడంతో డేటా సెంటర్‌కు మార్గం సుగమమైంది. వచ్చే నెలలో శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అవాంతరాలు ఇలా..

★ భూసేకరణకు వ్యతిరేకంగా తర్లువాడ రైతుల పేరుతో కొందరు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఇందులో ఒక చనిపోయిన రైతు పేరు ఉండటం గమనార్హం. 'మా సంతకాలు ఫోర్జరీ చేసి కోర్టులో పిటిషన్ వేశారు' అంటూ కొందరు రైతులు ఆనందపురం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఆర్డీవో విచారణ చేసి నివేదిక ఇచ్చారు.

★ వైకాపా బినామీలు రైతులను పలు విధాలుగా ప్రలోభ పెట్టారు. భూములను తమకు విక్రయిస్తే రూ.55 లక్షల నగదు, అభివృద్ధి చేసిన 27.50సెంట్ల స్థలం ఇస్తామంటూ నమ్మబలికారు. అంగీకరిస్తే క్షణాల్లో 50శాతం నగదు ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు.

సీఎం దృష్టికి తీసుకెళ్లి.. పరిహారం పెంచి..: వైకాపా నాయకుల కుట్రలను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇటీవల సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎకరాకు రూ.17 లక్షల పరిహారాన్ని రూ.40లక్షలకు పెంచడంతోపాటు, 20 సెంట్ల స్థలం ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రికార్డుల్లోకి ఎక్కని శివాయ్ జమేదార్ భూముల్లో ఉన్న రైతులకు ఎకరాకు రూ.10లక్షల పరిహారం పెంచుతూ జీవో ఇచ్చారు. అలాగే ఇంటికో ఉద్యోగం, ఉపాధి కోసం షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒక దుకాణం, బంజరు భూముల అభివృద్ధి పథకం కింద 520 మంది రైతులకు 3సెంట్ల నివాస స్థలాలు ఇస్తామని చెప్పడంతో రైతులు భూసేకరణకు ఒప్పుకొన్నారు.

తర్లువాడలో అవసరమైన భూములు:	308 ఎకరాలు
డీ పట్టా..:	200 ఎకరాలు
శివాయ్ జమేదార్..:	108 ఎకరాలు

మిగిలిన ఒక్క రైతు అంగీకారం: ఇప్పటి వరకు భూసేకరణకు నిరాకరించిన రైతు గణేశ్ సైతం భూమి ఇచ్చేందుకు ముందుకొచ్చారు. మంగళవారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కలిసి 1.94 ఎకరాల అసైన్డ్ భూమి ఇస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు మండల రెవెన్యూ అధికారులను కలిసి అంగీకార పత్రాలను సమర్పించినట్లు రైతు వెల్లడించారు.

విజయవాడకు ఆర్టీసీ ఏసీ స్లీపర్ బస్సు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : విశాఖ నుంచి విజయవాడకు ప్రతిరోజు రాత్రి 9.30 గంటలకు ఆర్టీసీ ఏసీ స్లీపర్ బస్సు అందుబాటులో ఉంటుందని ఆర్ఎం అప్పలనాయుడు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం బుధవారం నుంచి సీట్ కమ్ స్లీపర్ బస్సును ప్రారంభించినట్లు వెల్లడించారు. అలాగే ప్రస్తుతం విజయవాడకు నడుస్తున్న ఏసీ బస్సుల సమయాల్లో మార్పులు చేశామన్నారు. కొత్త సమయాలు ఉదయం 6, 8, 11, మధ్యాహ్నం 12.30, రాత్రి 9.30 గంటలుగా నిర్ణయించామన్నారు.

WALK-IN INERVIEW
We are Looking Dynamic
SALES OFFICERS
to join our Team Categories :
AC's, LED TVS, DC, FF, FA, WM'S Etc.
Qlf : Intermediate / Graduation
Job Location : Visakhapatnam, Vizianagaram & Srikakulam
#30-9-5, Ground Floor Sarada Street, Dabagardens, Visakhapatnam-20
Contact : 7989856794

ఉక్కు ఉత్పత్తి మళ్లీ మొదటికి..!

ఈనాడు–విశాఖపట్నం, ఉక్కునగరం(స్టీల్ సెక్టారు–3), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కర్మాగారంలో మళ్లీ ఉత్పత్తికి ఆటంకం ఏర్పడుతోంది. ఈ ఏడాది జనవరిలో రూ.54కోట్ల లాభాలు రాగా, మరింత ప్రణాళికతో ముందుకు వెళ్లాల్సిన సమయంలో అడుగులు తడబడుతున్నాయి. కోక్, ముడి సరకు కొరతే దీనికి కారణమని చెబుతున్నారు.

కోకోవెన్ విభాగంలో తయారవుతున్న కోక్

దెబ్బతిన్న కోకోవెన్ బ్యాటరీలు: విశాఖ ఉక్కులో ఐదు కోకోవెన్‌లు ఉన్నాయి. ఇందులోని మూడు బ్యాటరీలు 30ఏళ్లు దాటగా, ఒక బ్యాటరీ 25ఏళ్ల నాటిది. ఒక్కో బ్యాటరీకి 67 ఓవెన్‌లుంటాయి. అన్ని కోకోవెన్‌లు కండిషన్‌లో ఉంటే ఒక్క పుష్షింగ్‌కు 25 టన్నుల కోక్ తీయగల్గుతారు. ప్రతిరోజూ 425 పుష్షింగ్‌లు చేస్తేనే 10వేల టన్నుల కోక్ అందుబాటులోకి వస్తుంది. బ్యాటరీలు దెబ్బతిన్న కారణంగా సరాసరిన 300లోపు పుష్షింగ్‌లు మాత్రమే తీస్తున్నారు. మూడు ఫర్నేస్‌ల నుంచి పూర్తిస్థాయిలో 7.2 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి తీయాలంటే కోకోవెన్‌లో మరో బ్యాటరీ (6వది) స్టాండ్‌బైగా ఉండాలి.

గ్యాస్ లేక ఇబ్బందులు: కోకోవెన్‌లో కోక్‌తోపాటు గ్యాస్ కూడా ఉత్పత్తి అవుతుంది. ఈ గ్యాస్‌ను బ్యాటరీల్లో బర్న్ చేయడానికి, రోలింగ్ మిల్స్ నడపడానికి, ఎస్ఎంఎస్‌లోనూ ఉపయోగిస్తారు. రోజుకు 16,600 టన్నుల లిక్విడ్ ఐరన్ తీసినప్పటికీ, గ్యాస్ లేక రోలింగ్ మిల్స్‌లో 11,347 టన్నుల ఫినిష్డ్ స్టీల్ మాత్రమే తయారు చేస్తున్న పరిస్థితి నెలకొంది.

లక్ష్యానికి దూరంగా...	
నిత్యం హాట్‌మెటల్ ఉత్పత్తి లక్ష్యం: 20వేల టన్నులు	500 కేజీల కోక్: టన్ను హాట్ మెటల్ తయారీకి అవసరం
డిసెంబరు, జనవరిలో ఉత్పత్తి: 19,700–19.800 టన్నులు (రోజుకు)	అందుబాటులో ఉంటున్న కోక్: 7,500 టన్నులు
ప్రస్తుత తయారీ: 16,600 టన్నులు	కోక్ కొరత: 2500 టన్నులు

పడిపోయిన హాట్ మెటల్ తయారీ

కోక్ కొరతే ప్రధాన కారణం

అన్నీ బయట కొని.. ఉత్పత్తి ధర పెంచేసి..: కోక్ కొరత కారణంగా ఆస్ట్రేలియా, చైనా, ఇండోనేషియా నుంచి దిగుమతి చేసుకోవాలని అధికారులు నిర్ణయించారు. దిగుమతులపై యాంటీ డంపింగ్ డ్యూటీ 80-140 డాలర్ల వరకు చెల్లించాల్సి వస్తోంది. దానికి మినహాయింపు ఇవ్వాలని కోరినా ఆర్థిక మంత్రిత్వశాఖ ఒప్పుకోలేదు. దీంతో టన్నుకు అదనంగా రూ.5-6వేలు ఖర్చు పెట్టి బయట మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నారు. అదే విధంగా ఎల్‌జీ గ్యాస్ బయట నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఎన్ఎండీసీ నుంచి ఇనుప ఖనిజం సరఫరా తగ్గడంతో ఐరన్ ఓర్‌కు బదులు పెల్లెట్స్‌ను బయట మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా టన్ను స్టీలు ఉత్పత్తికి రూ.10-12వేలు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది.

సంకల్ప కళాగ్రామానికి స్వాగతం..

20వ తేదీన ఐఎఫ్‌ఆర్ అతిథుల సందర్శన

ముస్తాబైన సంకల్ప కళాగ్రామం

పెందుర్తి, న్యూస్‌టుడే: విశాఖ వేదికగా జరుగుతున్న అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ నగరానికి తలమానికంగా నిలవగా పెందుర్తి మండలానికి కూడా కీలక పాత్ర దక్కింది. ఈ నెల 20వ తేదీన సుమారు 50 దేశాలకు చెందిన వంద మంది నేవీ డెలిగేట్ల బృందం పెందుర్తి మండలం పెదగాడి సమీప సంకల్ప కళాగ్రామాన్ని సందర్శించనుంది. ఆ రోజు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరిగే కార్యక్రమంలో దేశ విదేశాలకు చెందిన నేవీ అధికారులు, సిబ్బంది వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని కళాగ్రామం నిర్వాహకులు ఆకుల చలపతిరావు తెలిపారు. ఈ మేరకు కళాగ్రామాన్ని ముస్తాబు చేస్తున్నారు.

కార్యక్రమాలివీ..: నేవీ బృందం కళాగ్రామం సమీప పొలంలో కూరగాయల పెంపకం, కొయ్య బొమ్మల తయారీ, నూలు వస్త్రాల నేత ప్రక్రియ, పూలకుండీల తయారీని పరిశీలిస్తారు. ఎకోఫ్రెండ్లీ నర్సరీలో కలియ తిరుగుతారు. చెక్క గానుగతో నూనె తయారీ ప్రక్రియ, ప్రకృతి సిద్ధమైన ఉత్పత్తులను తిలకిస్తారు. సహజ సిద్ధ రంగుల తయారీ, రంగుల అద్దకంపై జరిగే కార్యశాలలో పాల్గొంటారు.

90వ జయంతి ఉత్సవాలు



రక్తదానం చేయండి.. నిండు ప్రాణాన్ని కాపాడండి

మన అభిమాన నాయకులు, మన అందరికీ మార్గదర్శి, ప్రజల హృదయాలలో సుస్థిర స్థానం పొందిన ప్రజానేత కీ॥శే॥ పెతకంశెట్టి అప్పల నరసింహం Ex. MP గారి ఆత్మీయులు, శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా మనవి.

తేది & సమయం : 19-02-2026 (గురువారం) ఉ.గం. 7.30 ని॥లకు
వేదిక : డైమండ్ పార్క్‌లోని కీ॥శే॥ అప్పలనరసింహం గారి కాంస్య విగ్రహం వద్ద నివాళులు అర్పించుట.

తేది. 19-02-2026 (గురువారం) ఉ.గం. 9.00 ని॥లకు
గౌ॥ శ్రీ పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) ప్రభుత్వ విప్ & పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు మెయిన్ రోడ్, గోపాలపట్నం వారి ఇంటి వద్ద కాంస్య విగ్రహానికి నివాళులు అర్పించుట.
రక్తదాన శిబిరం ఉ॥ 7.00 నుంచి సా॥ 6.00 గం॥ల వరకు జరుగును.

మరియు అనకాపల్లి, మునగపాక మండలం, నాగులాపల్లి గ్రామం వద్ద ఉదయం 9:30 గం॥లకు వారి విగ్రహానికి నివాళులు అర్పించుట.

ఇట్లు... ఆహ్వాన సంఘం

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి

80087 09638

గడువు దాటితే అ'ధనం' చెల్లించాల్సిందే..!

21 రోజుల్లోగా జనన, మరణాలు నమోదు చేసుకోవాలి

అమలులోకి కొత్త నిబంధనలు

ఈనాడు, విశాఖపట్నం: పాఠశాలల్లో ప్రవేశాలు, పాస్‌పోర్టు, ఓటరు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తదితరాలు పొందేందుకు జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. ఆస్తి వ్యవహారాలు, బ్యాంకు ఖాతాల్లోని నిధుల బదలాయింపు, ఇతర పనులకు మరణ ధ్రువీకరణ పత్రాలు కీలకంగా మారుతున్నాయి. చాలా మంది వీటి నమోదులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో జనన, మరణాల నమోదుకు ప్రభుత్వం కొత్త నిబంధనలు అమల్లోకి తెచ్చింది. జనన, మరణాలు సంభవిస్తే తప్పనిసరిగా 21 రోజుల్లో నమోదు చేసుకోవాలని సూచించింది. ఈ నిబంధనలు మంగళవారం నుంచే అమల్లోకి వచ్చాయి.

ఆలస్యమైతే అపరాధ రుసుము..

★ జననం లేదా మరణించిన తేదీ తర్వాత 21 నుంచి 30 రోజుల్లోపు నమోదు చేస్తే రూ.25 అపరాధ రుసుము చెల్లించాలి. ★ 30 రోజుల తర్వాత నుంచి ఏడాది లోపు నమోదు చేయాలంటే జిల్లా రిజిస్ట్రార్ (జనన, మరణాలు) రాతపూర్వక వినతితోపాటు రూ.250 అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ★ ఏడాది దాటితే కలెక్టర్ (జిల్లా మేజిస్ట్రేట్) లేదా ఆర్డీవో (సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్) అనుమతితోపాటు అపరాధ రుసుము కింద రూ.500 చెల్లించాలి. దీంతోపాటు ఫారం-14 ద్వారా అఫిడవిట్ సమర్పించాలి. ★ బిడ్డ పుట్టిన వెంటనే కొందరు జనన ధ్రువపత్రంలో పేర్లు నమోదు చేయడం లేదు. అలాంటివారు 12 నెలల లోపు ఉచితంగా పేర్లు నమోదు చేసుకోవచ్చు. 12 నెలల నుంచి 15 ఏళ్లలోపు పేరు చేర్చాలనుకుంటే రూ.250 అపరాధ రుసుము చెల్లించాలి.

జీవీఎంసీ పరిధిలో గతేడాది ఇలా..

జననాలు:	13,809
మరణాలు:	14,022

వారిదే బాధ్యత..: జననం లేదా మరణం ఆసుపత్రిలో జరిగితే.. ఆ సంస్థ తాలుకూ బాధ్యులే నిర్ణీత ఫార్మాట్‌లో సమాచారాన్ని రిజిస్ట్రార్‌కు పంపిస్తారు. ఇంట్లో జరిగితే ఇంటి యజమాని లేదా కుటుంబ పెద్ద ఆ సమాచారాన్ని అందించే బాధ్యత తీసుకోవాలి. కేజీహెచ్‌లో పుట్టినా, చనిపోయినా ఆసుపత్రి సిబ్బందే ధ్రువపత్రాలు ఇస్తారు.

శ్రద్ధాంజలి

మంచికి మారుపేరు, సహనశీలి, మానవత్వం, మంచితనం మూర్తీభవించిన మహోన్నత వ్యక్తిగా, ఎందరో జీవితాలలో వెలుగులు నింపిన వ్యక్తిగా, చిరునవ్వుల పలకరింపులతో, అందరి హృదయాలలో సుస్థిరస్థానం పొందిన మీరు మా నుండి దూరమైనా మీ మధురస్మృతులు మా మదిలో ప్రతిక్షణం మెదులుతూనే ఉంటాయి

భార్య: డాక్టర్ సామ్రాజ్యలక్ష్మి

కుమారులు - కోడళ్ళు

మల్లిఖార్జున్ - డాక్టర్ తేజశ్రీ

వరుణ్ కార్తీక్ - కీర్తి

కుమార్తె: డాక్టర్ శిల్ప మనుమడు: పురజిత్

డాక్టర్ కీ॥శే॥ బాణావతు సాంబు నాయక్ గారు

Retd Civil Surgeon, MD General Medicine

జననం: 24-03-1953 మరణం: 09-02-2026

పెద్దకర్మ: తేది: 19-02-2026 (గురువారం) మధ్యాహ్నం 12.00 గంటలకు దర్శిని హాల్, దసపల్ల హోటల్, 4వ అంతస్తు, విశాఖపట్నం నందు జరుగును.

హలో రాకీ... హౌ ఆర్ యూ?

ఎయిర్‌పోర్టులో పోలీసు జాగిలం రాకీతో కరచాలనం చేస్తున్న రామ్మోహన్‌నాయుడు

కరాస, న్యూస్‌టుడే : విశాఖపట్నం విమానాశ్రయంలో బుధవారం ఆసక్తికర దృశ్యం చోటు చేసుకుంది. ఐఎఫ్ఆర్ కార్యక్రమం ముగించుకొని దిల్లీకి తిరుగు ప్రయాణమైన కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడుకి అక్కడే విధులు నిర్వర్తిస్తున్న పోలీసు జాగిలం రాకీ కంట పడింది. ఆయన రాకీని చూసి దగ్గరకు వెళ్లి కరచాలనం చేశారు. జంతుప్రేమికుడైన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు శ్రీకాకుళంలో ఉన్న తన ఇంట్లో గోశాల నిర్వహిస్తూ... దిల్లీలో సైతం నాలుగు జాగిలాలను పెంచుతున్నారు.

44 ఏళ్ల ఉక్కు యాత్ర

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే

విశాఖ ఉక్కు 44 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో ఆటుపోట్లు, కర్మాగారం కేవలం ఉక్కు మాత్రమే ఉత్పత్తి చేయలేదు. ఒక నగరానికి కొత్త గుర్తింపునిచ్చింది. ఒక రాష్ట్రానికి ఆర్థిక బలం అందించింది. ఒక దేశానికి ఆత్మవిశ్వాసం నింపింది. సాదాసీదాగా ప్రారంభమైన ఈ ప్రయాణం ఈనాడు జాతీయంగా గర్వకారణంగా నిలిచింది.

విశాఖ ఉక్కును వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించింది. ఉక్కునగరం అనే ఆదర్శ నివాస కాలనీ నిర్మించి విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధికి తోడ్పడింది. అంతర్జాతీయంగా విశాఖకు గుర్తింపు తీసుకువచ్చింది. రాష్ట్రానికి ప్రధాన వనరుగా నిలిచింది. అనుబంధ పరిశ్రమల అభివృద్ధికి ప్రోత్సాహం అందించింది. పోర్టు, రవాణా, లాజిస్టిక్స్ రంగాల ఎదుగుదలకు బాటలు వేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామిక గుర్తింపును బలపరిచింది.

రైల్వేలు, రక్షణ, నిర్మాణ రంగాలకు నాణ్యమైన ఉక్కును అందించింది. ఆత్మనిర్భర్ భారత్ సంకల్పానికి బలం చేకూర్చింది. ప్రజాసంస్థల ప్రతిష్టను నిలబెట్టిన మహా సంస్థగా నిలిచింది. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదం ఒక పోరాట చరిత్రను, ప్రజాస్వరం శక్తిని నేటికీ ప్రతిధ్వనిస్తుంది. ప్రతి సైరన్ శబ్దం దేశ సేవ ప్రతిధ్వని, ప్రతి షిఫ్టు కష్టం జాతి నిర్మాణానికి అంకితం. ఉక్కు ఉద్యోగులు ఉక్కును మాత్రమే కాదు నమ్మకాన్ని మలిచారు. సంబంధాలను బలపరిచారు. తీరాలకు నిలిచే వారసత్వాన్ని నిర్మించారు. 'సేవలో ఉన్నా.. విరమణలో ఉన్నా ఈ అనుబంధం చెరిగేది కాదు. ఉద్యోగుల గుండెల్లో ఎప్పటికీ వెలిగే జ్యోతి విశాఖ ఉక్కు. రాబోయే సంవత్సరాల్లో మరింత పునరుజ్జీవంతో, మరింత శక్తితో, మరింత జాతీయ కీర్తితో విశాఖ ఉక్కు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉద్యోగులు గర్వంగా ఆకాంక్షిస్తున్నారు.

కర్మాగారంలోని బ్లాస్ట్‌ఫర్నేస్

అప్పన్న హుండీ ఆదాయం రూ. 1.49 కోట్లు

హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, సేవా కార్యకర్తలు

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామి వారి హుండీ ఆదాయం లెక్కింపు బుధవారం సింహగిరిపై పరకామణి కేంద్రంలో జరిగింది. ఈవో జె.వెంకటరావు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది హుండీలు తెరచి లెక్కించారు. భక్తులు కానుకల రూపంలో సమర్పించిన నగదు రూ.1.49 కోట్ల పైచిలుకు సమకూరినట్లు ఈవో వెంకటరావు తెలిపారు. దీంతో పాటు 187.180 గ్రాముల బంగారం, 5.775 కిలోల వెండి, 13 దేశాలకు చెందిన విదేశీ నగదు లభ్యమైనట్లు వివరించారు. ఈ మొత్తం ఆదాయం 21 రోజులకు సంబంధించినదిగా తెలియజేశారు.

జాయింట్ సబ్‌రిజిస్ట్రార్‌కు పదోన్నతి

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాతనగరం సూపర్‌బజార్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జాయింట్ సబ్‌రిజిస్ట్రార్(జేఎస్ఆర్-1)గా పని చేస్తున్న **మోహన్‌రావు**కు జిల్లా రిజిస్ట్రార్‌గా పదోన్నతి లభించింది. రెండేళ్ల నుంచి విశాఖలో సేవలు అందిస్తున్న ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతి కల్పించి, విజయనగరం జిల్లా రిజిస్ట్రార్‌గా బదిలీ చేసింది. బుధవారం ఆయన రిలీవ్ అయ్యారు. ఇన్‌ఛార్జి జేఎస్ఆర్-1గా జేఎస్ఆర్-2 కనకరత్నం వ్యవహరించనున్నారు.

హిందూ ధర్మ పరిరక్షణలో అర్చకులది కీలకపాత్ర

సదస్సులో మాట్లాడుతున్న హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాసులు

సింహాచలం, న్యూస్‌టుడే: హిందూ ధర్మ పరిరక్షణలో అర్చకుల పాత్ర ఎంతో కీలకమని హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. అనంతరం సింహగిరిపై అర్చక సమాఖ్య సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన అర్చకులను ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీ ద్వారా నమోదు చేయించి ఉపాధి కల్పిస్తామన్నారు. అర్చకులు వృత్తిపర నైపుణ్యాలను పెంచుకోవడానికి ప్రత్యేక అకాడమీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయాల భూములు అన్యాక్రాంతం కాకుండా అర్చకులు అడ్డుగోడలా ఉండాలన్నారు. గత ఆరేళ్లుగా రాష్ట్రంలో నిలిచిపోయిన హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ ఆధ్వర్యంలో ధర్మప్రచార కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సింహాచలం ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, అర్చక సమాఖ్య కన్వీనర్ కె.జగన్‌మోహన్ రెడ్డి, పరిరక్షణ ట్రస్ట్ జిల్లా కో-ఆర్డినేటర్ కాళ్ల నాగభూషణరావు, అర్చక సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగరాచార్యులు, పులిఖడ్గం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

వన్‌టౌన్, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ చందా పింఛను పథకం ఉద్యోగుల సంఘం (ఏపీసీపీఎస్ఈఏ) నర్సుల విభాగం అధ్యక్షురాలిగా కేజీహెచ్ గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ సీహెచ్.పద్మావతి ఎన్నికయ్యారు. ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్షులు సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం కేజీహెచ్‌లో ఎన్నికలు జరిగాయి. సహ అధ్యక్షురాలిగా కల్యాణి, కార్యదర్శిగా పుష్ప, కోశాధికారిగా బి.విజయలక్ష్మి ఎన్నికయ్యారు. ఇతర పోస్టులకు అనిత, అనూష, గీతాలక్ష్మి, పార్వతి, గంగాధర్, ఎలీజా, మమతా రాణి, సుహాసిని, అమర్, గ్రేసి, పద్మ, త్రివేణి, రాణమ్మ ఎన్నికయ్యారు. ఎన్నిక ప్రక్రియను ఏపీ నర్సుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భవానీ, వరలక్ష్మి, కోశాధికారి వంశీ, ఈసీ సభ్యురాలు గౌరి పర్యవేక్షించారు. అనంతరం విశాఖ జిల్లా ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.రవిశంకర్, నగర అధ్యక్షుడు నారాయణరావు, ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు సతీష్‌కుమార్‌ను నర్సుల సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు.

సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న వివిధ సంఘాల సభ్యులు

THE DISTRICT CO-OPERATIVE CENTRAL BANK LTD., VISAKHAPATNAM

Invites sealed Tenders from eligible registered Contractors for Construction of south side Compound Wall at its Head Office (HO) premises.

ESTIMATED COST	: Rs. 4.70 Lakhs
COMPLETION PERIOD	: 30 DAYS
CLASS OF CONTRACTOR ELIGIBLE	: CLASS III & Above
LAST DATE	: 27.02.2026 (3:00 PM)

Details available at: www.visakhapatnamdccb.bank.in

Cont: 9963607778

సమన్వయంతో భద్రతకు పెద్దపీట

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : విశాఖ సాగర తీరంలో తలపెట్టిన మిలన్, ఐఎఫ్‌ఆర్ కార్యక్రమాల దృష్ట్యా ట్రాఫిక్, పోలీసు అధికారులు, సిబ్బంది ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ భద్రతకు పెద్దపీట వేయాలని సీపీ శంఖబ్రతబాగ్చీ సూచించారు. గురువారం సిటీ పరేడ్ నిర్వహించే పార్క్ హోటల్ - నేవల్ కోస్టల్ బ్యాటరీ ప్రధాన రహదారిని బుధవారం ఆయన పరిశీలించారు. విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. అనంతరం కమాండ్ కంట్రోల్ రూమ్‌ను, సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను పరిశీలించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నగర పౌరులకు సూచించారు.



కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చీ

21న జిల్లా స్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీలు

విశాఖక్రీడలు, న్యూస్‌టుడే : జిల్లాస్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీలు ఈనెల 21న ఏయూలో జరుగుతాయని సంఘం గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ శీతల తెలిపారు. ప్రతిభ చూపిన క్రీడాకారులు ఈ నెలాఖరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి గల వారు 20వ తేదీలోపు 96524 58901 నంబరుకు ఫోన్ చేసి, వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

ఏయూలో విద్యార్థుల నిరసనలు

ఏయూ పరిపాలన భవనం వద్ద నిరసన తెలుపుతున్న ఏబీవీపీ విద్యార్థులు, ఆర్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : జీవీఎల ఏయూలో పోటాపోటీగా జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆర్.ఎస్.ఎస్. వాలంటీర్లు, ఏబీవీపీ విద్యార్థులు బుధవారం ఏయూ పరిపాలన భవనం వద్ద నిరసన చేపట్టారు. ఆర్‌ఎస్‌ఎస్ విభాగ కార్యకర్తలు శాఖ కార్యక్రమాలు చేపడుతుండగా దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఉపకులపతి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏసీపీ లక్ష్మణమూర్తి, నరసింహమూర్తి, అప్పలరాజు తమ సిబ్బందితో హుటాహుటిన చేరుకొని నిరసన చేస్తున్న వారిని బయటకు పంపే ప్రయత్నం చేశారు. అదే సమయంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థులు వీసీని కలిసేందుకు వచ్చారు. ఈ క్రమంలో ఏబీవీపీ విద్యార్థులు, ఆర్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు భారత మాతాకీ జై అంటూ నినాదాలు చేయగా... పోలీసులు వారిని బలవంతంగా బయటకు పంపించారు. ఏబీవీపీ విద్యార్థులు బయటకు వెళుతూనే తమపై సిల్లీ సీసాలు విసిరారని ఎస్ఎఫ్ఐ విద్యార్థులు ఆరోపించారు. ★ మరోవైపు ఎస్.ఎఫ్.ఐ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం ఏయూ రెక్టార్ ఆచార్య పి.కింగ్, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య హరనాథ్‌లతో చర్చలు జరిపారు. మంగళవారం చోటు చేసుకున్న ఘటనకు కారకులైన వారిని అరెస్టు చేయాలని, వర్సిటీలోకి ఇతరులకు ప్రవేశం కల్పించరాదని, మతపరమైన జెండాలు ఎగురవేయరాదని కోరారు. ★ ఈ నేపథ్యంలో బయటకు ఏయూలో ప్రవేశం లేదని రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు ఓ ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయ ప్రాంగణం, మైదానంలో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నా ముందుగా అనుమతి పొందాలని స్పష్టం చేశారు. వర్సిటీ ప్రశాంతతకు, విద్యా సంబంధ వాతావరణానికి భంగం కలిగించే చర్యలు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా చర్యలు తప్పవన్నారు. ఈ క్రమంలో నాన్ బోర్డర్లు ఎవరైనా వర్సిటీలో ఆశ్రయం కల్పిస్తే సంబంధిత విద్యార్థుల వసతి సదుపాయాన్ని రద్దు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

నిరసనకారులను బలవంతంగా బయటకు పంపిస్తున్న పోలీసులు

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రీయల్ ఎస్టేట్, గిండి, చెన్నై - 600032

జోనల్ కార్యాలయం : సరస్వతీ కాంప్లెక్స్ 1వ అంతస్తు, ఎస్.వి.సి.థియేటర్ ప్రక్కన, రామలక్ష్మణ జంక్షన్, శ్రీకాకుళం.

డిమాండ్ నోటీసు

ది సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్"గా పిలువబడేది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్ కలిసింది మరియు ఎన్.సి.ఎల్.టి. బెంచ్-2 చెన్నై తేది: 09-11-2022 ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్ గా మారింది). ఆ తరువాత శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరు మార్పుకు అనుమతిని పొందింది. (కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వ శాఖ లేఖ తేది: 30-11-2022) కంపెనీల చట్టం 2013 క్రింద నమోదు అయిన కంపెనీ మరియు నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బిజినెస్ చేసేందుకు ఆర్.బి.ఐ. వద్ద కూడా నమోదు అయిఉండి, శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 మరియు విజయనగరం-II నమోదిత కార్యాలయాన్ని కలిగి ఉంది. దిగువ తెలిపిన రుణగ్రహీతలు/ సహ రుణగ్రహీతలు/ గ్యారంటార్లు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి రుణ సహాయాన్ని వినియోగించుకున్నారు. రుణసహాయాన్ని వినియోగించుకోవడమే కాక, రుణగ్రహీతలు/గ్యారంటార్లు గడువు తేదిల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలు తిరిగి చెల్లించుటలో పలుమార్లు విఫలమైనారు. సదరు ఖాతా నిరర్థక ఆస్తిగా వర్గీకరించ బడినందున, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకొని శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి నోటీసులు అందిన తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులలో తెలిపిన మొత్తంపై అంగీకరించిన రేటు వంతున తదుపరి వడ్డీ మరియు చెల్లింపు తేదీ వరకు అనుషంగిక ఖర్చులు, వ్యయం, చార్జీలు మొదలగు వాటితో పాటు నోటీసులలో తెలిపిన మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా దిగువ తెలిపిన రుణగ్రహీతలు / గ్యారంటర్లు / తనఖా పెట్టిన వ్యక్తులను కోరుతూ SARFAESI చట్టం, 2002లోని సెక్షన్ 13(2) క్రింద దిగువ తెలిపిన సంబంధిత తేదీలనాడు డిమాండ్ నోటీసులు జారీచేసారు. చివరగా తెలిసిన వారి చిరునామాలకు నోటీసులు జారీ చేయగా అందజేయబడకుండా తిరిగి వచ్చినవి. అందువలన దాని గురించి బహిరంగ ప్రకటన ద్వారా వారికి ఇందుమూలంగా తెలియజేయడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించే సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతలను కోరడమైనది.

వ.నెం.	ఋణగ్రహీతలు/ సహ ఋణగ్రహీతలు	NPA తేది : 08-04-2024 లోను మొత్తం
1.	లోన్ అకౌంట్ నెం.: VZGRMTF2307300005 బ్రాంచ్ : విజయనగరం-II	రూ.18,00,000/- (పద్దెనిమిది లక్షలు రూపాయలు మాత్రమే) తిరిగి చెల్లించవలసిన మొత్తం రూ.33,78,329/- 60 నెలవారీ వాయిదాలలో రూ.56,308/- - రుణ ఒప్పందం షెడ్యూల్‌లో పేర్కొన్న విధంగా మొదటి విడత 10/09/2023న చెల్లించాలి, చివరి విడత 10/08/2028న చెల్లించాలి.
		డిమాండ్ నోటీసు బకాయి మొత్తం తేది : 19.11.2025
		రూ.30,68,273/- (అక్షరాలలో ముప్పై లక్షల అరవై ఎనిమిది వేల రెండు వందల డెబ్బై మూడు రూపాయలు మాత్రమే)

1. భూపతి మురళీకృష్ణ, S/O భూపతి రాజా గోపాలరావు లేట్, ఇంటి నెంబర్ :21-9/1, మీసరవుపేట పురం, చీపురుపల్లి, విజయనగరం రూరల్, విజయనగరం జిల్లా-535040. ఫోన్:8790950050. (రుణగ్రహీత)
2. భూపతి శ్రీనివాస్ కుమార్ S/O భూపతి మురళీకృష్ణ, ఇంటి నెంబర్: 21-9/1, మీసరవుపేట పురం, చీపురుపల్లి, విజయనగరం రూరల్, విజయనగరం జిల్లా-535040. ఫోన్:8688992725.(సహ రుణగ్రహీత)
3. GS.సత్యనారాయణ S/O సత్యనారాయణ [illegible] H.NO.25-27/1, సనపతోట, పోలినాయుడుపేట, మధురవాడ, విశాఖపట్నం రూరల్, విశాఖపట్నం జిల్లా-531041. ఫోన్:9160448343.(హామీదారు)

అనుబంధం-II

డాక్యుమెంట్ నెంబర్ 218/2019 ప్రకారంగా

భూపతి మురళి కృష్ణ పేరు న తనఖా ఉన్నస్థిరాస్త వివరాలు

అనకాపల్లి జిల్లా, ఎలమంచిలి ఉపజిల్లా,అచ్యుతాపురంమండలం, ఇరువాడ గ్రామం మరియు గ్రామపంచాయతీ లో గల సర్వే నెంబర్స్ :27,28,29,30/2 మరియు 33 లో గల లే-అవుట్‌లోని ప్లాట్ నెం. 46 లో ఉన్న 487.25 చదరపు గజాలు లేదా 407.404 విస్తీర్ణం భూమి సరిహద్దులు : **తూర్పు:** 33 అడుగుల రహదారి 69.2 అడుగులు లేదా 21.10 మీటర్లు, **దక్షిణం:** ప్లాట్ నెం.47 సైట్ 66.0 అడుగులు లేదా 20.11 మీటర్లు, **పడమర:** జి. గురు ప్రసాద్ మరియు హనుమంతు బుచ్చి రాజు 63.8 అడుగులు లేదా 19.43 మీటర్లు గల భూమి, **ఉత్తరం:** భూమి జి.గురు ప్రసాద్ మరియు హనుమంతు బుచ్చి రాజు 66.3 అడుగులు లేదా 20.19 మీటర్లు.

స్థలం : శ్రీకాకుళం సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రక్షణ గర్జన.. చూసొద్దాం రండి..!

నేడు అంతర్జాతీయ సిటీ పరేడ్

ఇసుకతిన్నెలపై సాధారణ ప్రజలకు ఏర్పాటు చేసిన ఎన్‌క్లోజర్లు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : అంతర్జాతీయ యుద్ధనౌకల పండగను పురస్కరించుకుని గురువారం సాయంత్రం ఆర్కే బీచ్ కేంద్రంగా నిర్వహించే అంతర్జాతీయ సిటీ పరేడ్ సర్వం సిద్ధమైంది. సాయంత్రం 5 గంటల నుంచి 7.20 గంటల వరకు కార్యక్రమం జరగనుంది. మధ్యాహ్నం 3 గంటల నుంచే సందర్శకులను అనుమతిస్తారు.

ఎన్‌క్లోజర్లు - వేదికలు: ★ బీచ్‌లో ఇసుకతిన్నెల పైనుంచి విన్యాసాలు వీక్షించే సందర్శకులకు 40 ఎన్‌క్లోజర్లు ఏర్పాటు చేశారు. పాస్‌లు ఉన్న వారికి, ఇతర అతిథులకు ఆర్కేబీచ్ నుంచి సబ్‌మెరైన్ మ్యూజియం వరకు 28, గోకుల్ పార్క్ నుంచి ఆర్కేబీచ్ వరకు 12 వేదికలను సిద్ధం చేశారు. ఆయా చోట్ల ఇనుప బారికేడ్లను ఉంచి, సందర్శకుల రాకపోకలకు వీలుగా ఏర్పాట్లు చేశారు. జిల్లా నలుమూలల నుంచి 1.50 లక్షల నుంచి 2 లక్షల మంది వస్తారని అధికార యంత్రాంగం అంచనా వేస్తోంది. ★ ప్రత్యేక అతిథుల కోసం ఆర్కేబీచ్ నుంచి సబ్‌మెరైన్ మ్యూజియం వరకు పది వేదికలు సిద్ధం చేశారు. వాటిల్లో నౌకాదళ అధికారులు, విశ్రాంత అధికారులు, వారి కుటుంబీకులు, ఇతర ప్రముఖులకు అవకాశం ఉంటుంది.

బాధ్యతలు అప్పగింత: జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆధ్వర్యంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది మొత్తం 600 మంది పర్యవేక్షిస్తున్నారు. సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన ప్రతి ఎన్‌క్లోజర్ వద్ద ఓ అధికారిని ఇన్‌ఛార్జిగా నియమించారు. జనాభా రద్దీని నియంత్రించి, అవసరమైన సదుపాయాలు కల్పించే బాధ్యతలు అప్పగించారు. ★ పోలీసు యంత్రాంగం పటిష్ఠమైన భద్రత ఏర్పాట్లు చేసింది. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్ల తదితరాలను జీవీఎంసీ పర్యవేక్షిస్తోంది. ★ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆరు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆయా శిబిరాల్లో అత్యవసర ఔషధాలతో పాటు ఓ వైద్యుడు, నర్సులు, ఇతర సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. ఎవరైనా తీవ్ర అస్వస్థతకు గురైతే ప్రాథమిక వైద్యం అందించి, వెంటనే ఆసుపత్రికి తరలించేందుకు వీలుగా అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచారు.

అతిథుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

సీఎం షెడ్యూల్ రద్దు: ★ ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరవుతారని భావించగా, ఆయన షెడ్యూల్ రద్దయింది. బుధవారం నౌకాదళ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలకు ముఖ్యమంత్రి హాజరయ్యారు. ★ గురువారం సిటీ పరేడ్, నౌకాదళ విన్యాసాలు, ఇతర కార్యక్రమాలకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ★ పార్క్‌హోటల్ కూడలి నుంచి కోస్టల్ బ్యాటరీ వరకు సాగే అంతర్జాతీయ సిటీ పరేడ్‌లో వివిధ దేశాలకు చెందిన సాంస్కృతిక బృందాలు, రాష్ట్రానికి చెందిన కళాకారులు, త్రివిధ దళాల సిబ్బంది, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ప్రదర్శనలు ఉంటాయి.

భక్తిశ్రద్ధలతో 'విభూది బుధవారం'

జ్ఞానాపురం, న్యూస్‌టుడే : జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయంలో 'విభూది బుధవారం' పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. విచారణకర్త ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్రీస్తు తపస్సుకాలంలో ప్రతి విశ్వాసి ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు. మట్టి నుంచి పుట్టిన శరీరం, తిరిగి మట్టిలోనే కలుస్తుందన్న క్రీస్తు బోధనల ప్రకారం విభూది బుధవారాన్ని ప్రధాన వ్రతంగా నిర్వహిస్తున్నారు. అనంతరం విశ్వాసుల నుదిటిన విభూది రాశారు. 40 రోజుల దీక్ష చేసుకునే వారికి శుద్ధ జపమాల అందజేశారు.

విశ్వాసులకు విభూది రాస్తున్న ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్

EENADU eClassifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

FINANCIAL SERVICES

Govt. **ఉద్యోగస్తులకు,** రిటైర్డ్ పెన్షనర్లకు EMI వాయిదా పద్ధతిలో పర్సనల్ ఫైనాన్స్, అన్నితరగతుల వారికి స్థిరాస్తులపై ఫైనాన్స్ ఇవ్వబడును. Cell: 73862 01191.

HEALTH & CARE

మద్యపానం మానేయడం ఎలా? బరువు పెరుగుట, జాయింట్‌పెయిన్స్‌కు విశాఖపట్నం: హోటల్ దాక్షాయణి, రైల్వేస్టేషన్ రోడ్, చావులమదుం జంక్షన్, ప్రతీనెల 5,19 తేదీల్లో మందులు

PILES

పైల్స్, భగందరం, ఫిషర్ స్పెషలిస్ట్: Dr.Prem Kumar, Mrs.Deepti వైజాగ్: సింగ్ హోటల్ జంక్షన్, జడ్జికోర్ట్ దగ్గర & గాజువాక: శ్రీహరిపురం చర్చ్‌డౌన్. సంప్రదించండి: 8309200608, 9866070593.

REAL ESTATE

LAND FOR SALE

BHOGAPURAM

భోగాపురం ఎయిర్‌పోర్ట్ దగ్గర సవరవిల్లి జంక్షన్ 1 KM దూరంలో 60 సెంట్ల Land అమ్మకమునకు కలదు. Cont: 9440643206, 9966546635

GENERAL

పూసపాటిరేగ 'మం' గోవిందాపురం రోడ్డు హైవేకి 1/2KM తారురోడ్డు ఫేసింగ్ 9&4 ఎకరాలు కొబ్బరితోట అమ్మకం & హోటల్ లీజుకు కలదు. ✆ 9440255187.

PLOT FOR SALE

KOTHAVALASA

కొత్తవలసలో రాయ్‌పూర్ హైవేను అనుకొని ల్యాండ్ కన్వర్షన్‌తో రెడీగా ఇళ్లు కట్టుకునేందుకు వీలుగా ఇండ్ల స్థలాలు అమ్మకంనకు కలవు. ✆ 9391996295.

LEASE/ RENT

GENERAL

NAD Kotha Road Rent/ Lease 3&4th Floor for Corporate Offices/ Clinics Above SBI 1750Sft Each ✆9985374007, 7989886046.

JOBS

Computer Hardware, Networking CCTV Technicians Freshers and Experienced Can Apply ITI, Diploma or and Degree Location Visakhapatnam. Contact Whatsapp 8333868686 email: info@serviceat365.com Date 21-02-2026 10:00 Am to 5:00 Pm.

@**@ ISO Co. Needs for Vizag Branch. 1. Office Manager (Rtd. / Gulf Return) 2. Admn. Manager: 5 Yrs exp. Good Package. Ph: 9848551846.

Wanted Lady Maths Teacher for Classes VII to IX Part Time/Full Time Cont: M.S.M School. Ph: 2711649, 93915 88015

Wanted Telecaller (F) for a Reputed company. Fluency in English, Telugu is must. Attractive Salary. ✆ 9700570451

Wanted హెల్పర్స్ : వర్క్‌షాప్‌లో పనిచేయుటకు కార్పెంటర్స్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ హెల్పర్స్ కావలెను. చదువుతో ప్రమేయం లేదు @మద్దిలపాలెం. ✆ 8886655592/ 8886655538.

ప్రముఖ కార్పొరేట్ సంస్థకు మేనేజర్స్ కావలెను. M/F హౌస్‌వైవ్స్, Rtd, VRS టీచర్స్ కావలెను. F/P టైం శాలరీ & ఇన్సెంటివ్స్ కలవు. ✆ 9701719746.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ:18-20K ✆ 96404 68899, 96402 58899

హౌస్‌కీపింగ్స్ కావలెను. జీతం: 10,000/-+4 రోజులు = 11,300/- ASN PVR Inox చిత్రాలయ మాల్, సూర్యాభాగ్, వైజాగ్. ✆ 8978281938, 9440802456

వాచ్‌మెన్ ఫ్యామిలీతో సహా కావలెను. జీతం 23,000/- + ఉచిత వసతి, ఆశానివాస్ 5వ లైన్, ద్వారకానగర్, విశాఖపట్నం. ✆ 9440802452, 9348802456.

కుక్స్- cook for home with kerala food cusines- కేరళ ఆహార వంటకాల అనుభవంతో వంటవారు. కాల్: 8333840153

స్కూల్స్, హాస్పిటల్స్, బ్యాంక్స్ అన్ని అవుట్ సోర్సింగ్ పద్ధతిలో వర్క్‌కి సూపర్‌వైజర్స్, కం॥ ఆపరేటర్స్, సెక్యూరిటీ, ఫీల్డ్ & సేఫ్టీ హెల్పర్స్, అటెండర్స్, హౌస్‌కీపింగ్, 10th- డిగ్రీ. జీ: 18K-28K. 9121044796, 9573635594.

SECURITY GUARDS

వైజాగ్ సిటీలో అన్ని ఏరియాల్లో పనికి సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, గార్డ్స్, హౌస్‌కీపింగ్ స్టాఫ్, ఆఫీస్ బాయ్స్, లేడీస్ & జెంట్స్, రూమ్, భోజనం కలదు. జీతం: 18 వేలు, 36 వేలు. ✆ 6300071128

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రాణం తీసిన చక్రం

ఊడిపోయిన చక్రం

ప్రమాద దృశ్యం

దాసరి ఎల్లమ్మాజీ (పాతచిత్రం)

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే : కార్ల చక్రాలు ఊడిపోయి ప్రమాదాలు జరగడం చూస్తుంటాం. కానీ ద్విచక్ర వాహనం చక్రం ఊడి ఓ మహిళ మృతిచెందిన సంఘటన షీలానగర్ పోర్టు రోడ్డులో జరిగింది. దీనికి సంబంధించి గాజువాక పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని ఏవీఎన్ కళాశాల సమీప ప్రాంతానికి చెందిన దాసరి ఎల్లమ్మాజీ(34) స్కూటీపై బుధవారం ఉదయం షీలానగర్ వచ్చారు. తన తమ్ముడిని ఐయాన్ డిజిటల్ పరీక్షా కేంద్రంలో దించి ఆమె తిరిగి ద్విచక్ర వాహనంపై పోర్టు రోడ్డులో వెళ్తుండగా.. శిక్షణ కానిస్టేబుల్ గంటా గౌరీనాయుడు (31) షీలానగర్ వద్ద ఆమెను లిఫ్ట్ అడిగారు. వీరి వాహనం షీలానగర్ టోల్‌గేటు సమీపంలోకి వచ్చేసరికి వెనుక చక్రం ఊడిపోయింది. ఇద్దరూ ఒక్కసారిగా కిందపడిపోయారు. ఈ సంఘటనలో ఆమె తల రోడ్డుకి తగలడంతో తీవ్ర రక్తస్రావమై సంఘటన స్థలంలోనే మృతిచెందారు. గౌరీనాయుడు స్వల్పగాయాలతో బయటపడ్డారు. సమాచారం తెలుసుకున్న గాజువాక ట్రాఫిక్ పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆమెను కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం

కూర్మన్నపాలెం (దువ్వాడ), న్యూస్‌టుడే : దువ్వాడ రైల్వేస్టేషన్‌కు కిలోమీటరు దూరంలో పట్టాలపై ఓ వ్యక్తి మృతదేహం దువ్వాడ జీఆర్పీ పోలీసులు గుర్తించారు. రైలు ఢీకొని మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. వయసు 30-35 మధ్య ఉంటుందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లిలోని ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. జీఆర్పీ ఎస్సై కేటీఆర్ లక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 73820 58996 నెంబరుకు సంప్రదించాలన్నారు.

ఆకట్టుకున్న ఫ్లీట్ రివ్యూ వ్యాఖ్యానం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ నౌకాదళ సమీక్షపై ఆకాశవాణి కేంద్రం చేసిన ప్రత్యక్ష వ్యాఖ్యానం ఆద్యంతం అలరించింది. విశాఖ వేదికగా బంగాళాఖాతంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము త్రివిధ దళాల అధిపతి హోదాలో బుధవారం అంతర్జాతీయ నౌకాదళ సమీక్ష నిర్వహించారు. దీనికి ఆకాశవాణి ప్రత్యక్ష వ్యాఖ్యానం, దూరదర్శన్ ప్రత్యక్ష ప్రసారం అందించాయి. ఉదయం 9.50 నుంచి మధ్యాహ్నం 12.58 గంటల వరకు అంతర్జాతీయ ఫ్లీట్‌రివ్యూకి ప్రత్యక్ష వ్యాఖ్యానం చేసింది. దిల్లీ, విజయవాడ నుంచి వచ్చిన ఆకాశవాణి సిబ్బంది, స్థానిక ఆకాశవాణి సిబ్బంది సమన్వయంతో హిందీలో నీలం మల్కాని, ఆంగ్లంలో కౌశిక్ రాయ్ చక్కటి కంఠస్వరంతో వినిపించి విజయవంతం చేశారు. ఆకాశవాణి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆర్.హర్షలత, విభాగాధిపతి పి.వి.రామ్‌గోపాల్ తెలిపారు.

'వందేభారత్' రైళ్ల సమయాల మార్పు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : సికింద్రాబాద్- విశాఖ, దుర్గ్-విశాఖ వందేభారత్ రైళ్ల సమయాల్లో స్వల్ప మార్పులు జరిగాయని వాల్తేర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. ఈనెల 20 నుంచి సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 1.50 గంటలకు, దుర్గ్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 1.55 గంటలకు విశాఖ చేరుకుంటాయన్నారు.

ఆదిత్యుని సేవలో ఐటీ శాఖ ముఖ్య కమిషనర్

శ్రీకాకుళం జిల్లా అరసవల్లిలో కొలువైన సూర్యనారాయణస్వామిని బుధవారం ఆదాయ పన్ను శాఖ ముఖ్య కమిషనర్ (విశాఖపట్నం) ఎస్.శ్రీనివాస్ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు అనంతరం అనివెట్టి మండపంలో ఆలయ ప్రధానార్చకుడు ఇప్పిలి శంకరశర్మ వేదాశీర్వచనం పలికి ప్రసాదాలు అందజేశారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

సత్వర వైద్యసేవలకు ప్రాధాన్యం

వన్‌టౌన్, న్యూస్‌టుడే : అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) సందర్భంగా ఆర్కేబీచ్ వేదికగా జరిగే సిటీ పరేడ్‌కు సంబంధించి వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలను బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు పరిశీలించారు. శిబిరాల్లో సేవలు, మందుల నిల్వలు, ఇతర సదుపాయాలపై వైద్యాధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అత్యవసర స్థితిలో వచ్చే వారికి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు.

వైద్యులు, సిబ్బందితో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జగదీశ్వరరావు

ఇంటర్ పరీక్షలు సక్రమంగా నిర్వహించాలి

మాట్లాడుతున్న ఆర్ఐఓ మురళీధర్, పాల్గొన్న సీఎస్‌లు, డీఓలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ విద్యార్థులకు ఈనెల 23 నుంచి మార్చి 24 వరకు నిర్వహించనున్న పరీక్షలు సక్రమంగా జరిగేలా చూడాలని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షకులు(ఆర్ఐఓ) పి.మురళీధర్ తెలిపారు. బుల్లయ్య కళాశాలలో బుధవారం పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల పక్కాగా జరిగేలా సీఎస్‌లు, డీఓలు చూడాలన్నారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేలా ముందుగానే సంబంధిత కళాశాలల యాజమాన్యాలు ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులు జె.వివేకానందరావు, ఎ.శ్రీనివాసరావు, పి.దుర్గా ప్రసాదరావు, రాంప్రసాద్, పవన్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	120	115
లైవ్	147	135
డ్రెస్డ్	213	240
స్కిన్‌లెస్	243	250

పెందుర్తి

తెరపై ఈనాడు
లక్ష్మీకాంత్ స్క్రీన్-1: వంశీ
స్క్రీన్-2: మన శంకర వరప్రసాద్ గారు

21న ఆలయ వార్షికోత్సవం

లంకెలపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: పరవాడ మండలం కన్నూరు పంచాయతీ మడకపాలెంలో ఈనెల 21వ తేదీన శ్రీజువ్వమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆరోజు ఉదయం నుంచి అమ్మవారి దర్శనాలు, ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయని అన్నారు. భక్తులకు ప్రసాదం, మజ్జిగ పంపిణీ చేస్తామని, సాయంత్రం పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని అన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ముత్యాలమ్మపాలెం జెట్టీ నిర్మాణంలో ముందడుగు

మత్స్యకారుల్లో చిగురించిన ఆశలు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం తీరం పరిధిలోని మత్స్యకారులకు మంచి రోజులు రానున్నాయి. ఈ తీరం వద్ద జెట్టీ నిర్మాణానికి అడుగులు పడుతుండటంతో గంగ పుత్రుల ఆశలు చిగురించాయి. ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెంతో పాటు శివారు గ్రామాలైన జిల్లపాలెం, జాలరిపేట తదితర గ్రామాలకు చెందిన మత్స్యకారులు చేపలవేట నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ జెట్టీ నిర్మాణం జరగక కొన్నేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వీరి అవస్థలను ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో సర్వత్రా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

■ గత వైకాపా ప్రభుత్వం జెట్టీ నిర్మిస్తామని.. పదేపదే హామీలు గుప్పించినా అమలుకు నోచుకోలేదు. తీరంలో జెట్టీ లేకపోవడంతో వేటకు వెళ్లి, తిరిగి వచ్చే సమయంలో బోటును కర్రలతో భుజాలపై మోసుకొని వస్తోంది. తుపాను సమయంలో బోట్లు, వలలు కొట్టుకుపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు.

బోటును కర్రలతో భుజాలపై మోసుకొస్తున్న మత్స్యకారులు

■ ఈ పరిస్థితిలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఈ విషయం శాసనసభ దృష్టికి తీసుకెళ్లారు. ఏడాదిన్నర క్రితం ఇక్కడ జెట్టీ నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం చేసినా కార్యరూపం దాల్చలేదని, వెంటనే దానిని ఆమోదించి త్వరితగతిన జెట్టీ నిర్మాణం జరిగేలా చూడాలని కోరారు. దానికి మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టమైన అనుకూల ప్రకటన చేయడంతో మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

■ కూటమి ప్రభుత్వంలో జెట్టీ నిర్మాణానికి అడుగులు పడడం సంతోషకరం. గత వైకాపా ప్రభుత్వం ముత్యాలమ్మపాలెం తీరంలో జెట్టీ నిర్మిస్తామని హామీ ఇచ్చినా అమలు కాలేదు. ఇటీవల ఎమ్మెల్యే రమేశ్‌బాబు ఈ విషయం అసెంబ్లీలో ప్రస్తావించడంతో మత్స్యకారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం వేట నిషేధ పరిహారాన్ని రూ.10వేల నుంచి రూ.20వేలకు పెంచి మత్స్యకారులకు అండగా నిలిచింది. అలాగే ఇక్కడ జెట్టీ నిర్మాణం జరిగితే ఎంతో మేలు జరుగుతుంది. -చింతకాయల సుజాత, సర్పంచి, ముత్యాలమ్మపాలెం

వేంకటాద్రిపై ఫాల్గుణ పక్షోత్సవాలకు శ్రీకారం

పెందుర్తి, న్యూస్‌టుడే: మహాలక్ష్మీ అమ్మవారి తిరునక్షత్రం వేడుకల సందర్భంగా వేంకటాద్రిపై శ్రీనివాసుడి సన్నిధిలో ఫాల్గుణ పక్షోత్సవాలకు అర్చకులు బుధవారం సంప్రదాయబద్ధంగా శ్రీకారం చుట్టారు. ఆలయ ప్రధానార్చకులు మహర్షి రామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు ఆలయ ప్రాంగణంలోని మహాలక్ష్మీ అమ్మవారిని పట్టు పీతాంబరాలతో అలంకరించారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం పూజలు చేశారు. శ్రీవారికి పూజలు చేసి ఉత్సవాంగీకారం తీసుకున్నారు. శ్రీసూక్త సహితంగా సాగర తీర విశిష్ట కుంకుమార్చన జరిపారు. భక్తులు పాల్గొని అమ్మవారి సన్నిధిలో అష్టలక్ష్మీ స్తోత్ర పారాయణం చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

మహాలక్ష్మీ అమ్మవారు

విశాఖ డెయిరీ పాల ధరలు తగ్గించాలి

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: లాభాల్లో నడుస్తున్న విశాఖ డెయిరీ.. పాల ఉత్పత్తుల ధరలు పెంచడం అన్యాయమని సీపీఎం గోపాలపట్నం జోన్ నాయకులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం సుజాతనగర్ కూడలి వద్ద నిరసన చేపట్టారు. గోపాలపట్నం జోన్ కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ పెంచిన ధరలు వినియోగదారులకు భారం కానున్నాయని తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కూటమి నేతలు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యులు బి.రమణి, నాయకులు శంకర్, అప్పలనాయుడు, ప్రభుదేవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుజాతనగర్ కూడలిలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: 94వ వార్డు కృష్ణరాయపురం ఎస్టీ కాలనీలోని 3/52/4 వీధిదీపం నెల రోజులుగా వెలగడం లేదు. -వెంకటేశ్వరరావు, రామారావు, స్థానికులు
✓: వెలగని వీధిదీపానికి వెంటనే మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తాం. -శ్రావణ్‌రాజు, ఏఈ, వీధిదీపాల నిర్వహణ విభాగం

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ మండలం గొరివానిపాలెంలో కుక్కల బెడద అధికంగా ఉంది. -శ్రీను, పరవాడ
✓: మీ ప్రాంతంలో కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. -మల్లికార్జునరావు, డిప్యూటీ ఎంపీడీవో, పరవాడ

సబ్బవరం న్యూస్‌టుడే: ?: సబ్బవరం గంగిరెడ్డి కాలనీకి వెళ్లే దారిలో వ్యర్థాలు పేరుకుపోయాయి. -బి.రాంబాబు, సబ్బవరం
✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. -పి. ఆనందరావు, గ్రామ కార్యదర్శి, సబ్బవరం

?: సబ్బవరం జోడుగుళ్లు వద్ద వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. -ఎం.కనకరాజు, జోడుగుళ్లు
✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. -డి.ప్రసాదరావు, సర్పంచి, సబ్బవరం

స్పందనకు వందనం

ఎట్టకేలకు వ్యర్థాల తొలగింపు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం ప్రాథమిక పాఠశాల వద్ద వ్యర్థాలు పేరుకుపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో వెలువడిన వార్తాంశానికి పంచాయతీ అధికారులు స్పందించి బుధవారం పారిశుద్ధ్య సిబ్బందితో వ్యర్థాలు తీయించి సమస్య పరిష్కరించారు.

22 నుంచి పరదేశమ్మ ఉత్సవాలు

తానాం(పరవాడ), న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన తానాం ప్రజల ఆరాధ్య దేవత శ్రీపరదేశమ్మ వేడుకలను ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పురవీధులతో పాటు ప్రధాన రహదారుల వెంబడి ప్రత్యేక విద్యుత్తు దీపాలంకరణ చేస్తున్నారు. ఈనెల 22న రాత్రి 8 గంటల నుంచి గ్రామ ప్రధాన కూడళ్లలో 7 భారీ వేదికలపై వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. 24వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 4 గంటల నుంచి అమ్మవారి దర్శనాలు, ప్రత్యేకపూజలు ప్రారంభమవుతాయి. ఆలయం వద్ద భక్తులకు ప్రసాదాలు, మజ్జిగ వితరణ ఉంటుంది. ప్రజలు ఈ వేడుకలను విజయవంతం చేయాలని సర్పంచి కన్నూరు దేవి కోరారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం పరదేశమ్మ పండగ ఈనెల 24వ తేదీన జరుగుతుందని నిర్వాహకులు బోకం శ్రీనివాస్ తదితరులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాల కోసం 91219 22902, 76800 27147 నంబర్లకు ఫోనులో సంప్రదించాలని కోరారు. ఈ వేడుకల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, భారీ బాణసంచా కాల్పులు ఉంటాయన్నారు.

సెక్యూరిటీ ఎనలిస్ట్ కోర్సులో శిక్షణకు ఆహ్వానం

భీమునిపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో సెక్యూరిటీ ఎనలిస్ట్ కోర్సులో మూడు నెలల ఉచిత శిక్షణకు ఈ నెల 24 నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. 18-35 ఏళ్ల వయసున్న వారు అర్హులు. డిగ్రీ లేక డిప్లొమా కోర్సుల్లో ఉత్తీర్ణులై ఉండాలి. ఆసక్తి గల అభ్యర్థులు 9014758949 నంబర్‌లో సంప్రదించాలని పాలిటెక్నిక్ కళాశాల ప్రధానాచార్యులు డా.సి.హెచ్.మురళీకృష్ణ సూచించారు.

ఘనంగా పది విద్యార్థుల వీడ్కోలు వేడుక

ఇస్లాంపేట(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డు పరిధి ఇస్లాంపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలోని పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం ప్రమీల మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థులంతా పరీక్షలు బాగా రాసి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ సందర్భంగా గొన్నా కళాశాల కార్యదర్శి హేమచంద్రనాయుడు రూ.12వేలు, పార్వతి నిర్మాణ సంస్థ నాయకుడు తరుణ్ రూ.5వేలు వెచ్చించి పాఠశాలకు బెంచీలు అందించారు. పదోతరగతి విద్యార్థులు రూ.25వేలు వెచ్చించి 40 కుర్చీలు సమకూర్చారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి సహకరించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. పీఎంసీ ప్రతినిధులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీలు అందజేసిన పదోతరగతి విద్యార్థుల బృందం

రామాయణంపై ప్రవచనం

నాయుడుతోట (వేపగుంట), న్యూస్‌టుడే: నాయుడుతోట సమీప రవినగర్‌లోని బాలత్రిపురేశ్వరి పీఠంలో 41రోజులపాటు జరిగే శ్రీమద్రామాయణ ప్రవచన కార్యక్రమాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు బ్రహ్మశ్రీ వీణలపాటి రమణమూర్తి ప్రవచనం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రసంగిస్తున్న రమణమూర్తి

శతాబ్ది ఉత్సవాల నిర్వహణపై ప్రత్యేక సమావేశం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలు ఎలా నిర్వహించాలన్న విషయమై బోధనా సిబ్బందితో బుధవారం వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో సమావేశం జరిగింది. ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ సిబ్బంది అభిప్రాయాలు తెలుసుకున్నారు.

రూ.50 లక్షలతో నీటి సరఫరా పనులకు శ్రీకారం

వీరానగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ శానాపతి వసంత, తదితరులు

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు పరిధిలోని వీరానగర్, ఎంఈఎస్ లేఅవుట్, చంద్రన్ననగర్ కాలనీల్లో నీటి సరఫరా పనులకు వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కాలనీల్లో రూ.50లక్షలతో తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకరరావు, కిశోర్, చక్రి, వెంకటరమణమూర్తి, శ్రీనివాసరావు, మధుసూదనరావు, తిరుపతిరావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాధారం నేలపాలు

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్ సీ-2 జోన్‌లో పది రోజులుగా మంచి నీరు వృథాగా పోతోందని కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీలోని వార్డు సచివాలయం పరిధి తూర్పు రోడ్డులోని జీవీఎంసీ పైపులైనుకు లీకులు ఏర్పడి ప్రతిరోజు పెద్దఎత్తున నీరంతా రోడ్డు పాలవుతోందని ఆవేదన చెందుతున్నారు. సిబ్బందికి ఫిర్యాదు చేసినా ఫలితం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి నీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

సుజాతనగర్ సీ-2 జోన్‌లో..

పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలి

మాట్లాడుతున్న సబ్బవరం ఎంపీడీవో పద్మజ

సబ్బవరం, న్యూస్‌టుడే: పంచాయతీలలో పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని సబ్బవరం ఎంపీడీవో పి.పద్మజ అన్నారు. మండల స్థాయి అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామ సచివాలయ కార్యదర్శులతో కూడా మాట్లాడారు. కుటుంబ సర్వే వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఏవో త్రినాథ్, మండల వార్డు, సచివాలయాధికారి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వితరణ

పరవాడ, సబ్బవరం, న్యూస్‌టుడే: అనకాపల్లి పార్లమెంట్ సభ్యుడు సీఎం రమేశ్ పుట్టినరోజు సందర్భంగా భాజపా నాయకుడు కూండ్రపు సోము నాయుడు ఆధ్వర్యంలో బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పరవాడ సీహెచ్‌సీలోని 75 మంది రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కొండకర్ల ఇచ్ఛా ఫౌండేషన్‌లోని దివ్యాంగులకు మధ్యాహ్న భోజనం సమకూర్చారు. ఈకార్యక్రమంలో బండారు రాజశేఖర్, రాజు, అజయ్, గోపి, రాజేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

★ ఈ మేరకు భాజపా నాయకులు చొక్కాకుల వెంకట్రావు తదితరుల ఆధ్వర్యంలో బుధవారం సబ్బవరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గొంప నర్సింగరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర నేత కామినేని సురేంద్రమోహన్, ఈర్లె శ్రీరామమూర్తి మాట్లాడారు. అనకాపల్లి అభివృద్ధికి ఎంపీ సీఎం రమేష్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ద్వారంపూడి పరమేశ్వరరావు, పీవీఎస్ఎన్ రాజు, శరగడం శంకరరావు, గొర్లె రామునాయుడు తదితరులు కూడా మాట్లాడారు. అనంతరం పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. గొట్టివాడ సామ్రాట కుమార్, ముమ్మన దేముడు, ఇందల రమణ, చొక్కాకుల గోవింద్, కర్రి కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న భాజపా నాయకులు

దుప్పట్లు పంపిణీ చేస్తున్న గొర్లె రామునాయుడు, తదితరులు

లయోలా వృద్ధాశ్రమంలో..

పెందుర్తి, న్యూస్‌టుడే: భాజపా పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో స్థానిక లయోలా వృద్ధాశ్రమంలో నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం తాండ్ర పాపారాయుడు కల్యాణ మండపంలో కేకు కోసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎం రమేశ్ కార్యాలయం ఇన్‌ఛార్జి విజయ్, నాయకులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, రెడ్డి నారాయణరావు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు. పెందుర్తి తెదేపా కార్యాలయంలో వంశీదీప్ ఆధ్వర్యంలో ఎంపీ పుట్టినరోజు వేడుకలు జరిగాయి.

23న ప్రాంగణ ఎంపికలు

పెందుర్తి, న్యూస్‌టుడే: ఈ నెల 23వ తేదీన స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఎన్.ఈ.ఫ్లోరా ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9.30 గంటల నుంచి కళాశాల ఆవరణలో జరిగే మేళాలో వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొని ప్రాంగణ ఎంపికలు చేపడతారన్నారు. 2015 నుంచి 2026 మధ్య డిగ్రీ చేసిన, ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న డిగ్రీ, బీటెక్ అభ్యర్థులు పాల్గొనవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం 93917 52833 నంబరుకు ఫోనులో సంప్రదించాలని సూచించారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

ప్రహ్లాదపురం(వేపగుంట), న్యూస్‌టుడే: ప్రహ్లాదపురం శిరిడి సాయిబాబా ఆలయ ప్రాంగణంలో సాయిశివాలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఈనెల 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు మూడురోజులపాటు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది. 20న మహాగణపతి పూజతో వేడుకలు ప్రారంభమై యాగాలు, మండపారాధనలు, అగ్నిప్రతిష్ఠాపనలు, సాయంత్రం 5 గంటల నుంచి తిరువీధి, 21న ప్రత్యేక హోమాలు, 22న శ్రీసాయి ఈశ్వరాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన, మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన ఉంటుందని కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.

విద్యార్థులకు నైపుణ్య శిక్షణ తరగతులు

నరవ(వేపగుంట), న్యూస్‌టుడే: నరవ బెహరా ఇంజినీరింగు కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈఎస్‌డీపీ, ఎంఎస్ఎంఈ, విజయనగరం జేఎన్‌టీయూ గురజాడ సంస్థల సంయుక్త సారథ్యంలో ఈ తరగతులు ప్రారంభమయ్యాయి. 20 రోజులపాటు జరిగే ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులకు ఉపాధి అవకాశాలు చూపడంలో సంబంధిత సంస్థలు సహకరిస్తాయని ప్రిన్సిపల్ శ్రీధర్ పట్నాయక్ తెలిపారు. సాయి తేజ, నారాయణ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి ప్రాంతానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపారు. ఆ వివరాలిలా.. పెందుర్తి కూడలి సమీప పెద్దిరెడ్డి కాలనీకి చెందిన ఆడారి రామకృష్ణ ఒడిశాకు చెందిన మధుస్మిత శెట్టి(25)ని ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం సాయంత్రం ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చరవాణి వదిలి వెళ్లిపోవడంతో పలుచోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

రాష్ట్రపతి పర్యటన సాగిందిలా..

సింధియా, న్యూస్‌టుడే:
★ ఉదయం 9.55 గంటలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చోళా బస కేంద్రం నుంచి బయల్దేరారు.
★ ఉదయం 9.57కు గౌరవ వందనం స్వీకరించి పరేడ్‌ను పరిశీలించారు. ★ ఉదయం 10.04కి నేవల్ జెట్టీలో ప్రత్యేకించి ఏర్పాటు చేసిన ఐఎన్ఎస్ సుమేధ నౌకపై ఎక్కారు. ★ 10.08కు గౌరవ వందనం స్వీకరించారు.
★ 10.12కు నౌకలో ప్రయాణించారు
★ 10.33 నుంచి 10.52 వరకు నౌకపై నుంచే సముద్రంలో నౌకలను సమీక్షించారు ★ 10.53 నుంచి 10.57 వరకు యుద్ధనౌకల సెయిలింగ్ పరేడ్‌ను వీక్షించారు.
★ 11.19 నుంచి 11.24 వరకు నమూనా ప్రదర్శనలను తిలకించారు.
★ 11.45 నుంచి 11.48 వరకు ప్రత్యేక దళాలు తమ విన్యాసాలను ప్రదర్శించాయి. ★ 11.54 నుంచి 12.06 వరకు వాయుసేన విమానాల విన్యాసాలు జరిగాయి.
★ 12.07 నుంచి జలాంతర్గాముల గౌరవ వందనం స్వీకరించారు.
★ 12.09కి రాష్ట్రపతికి జ్ఞాపికను అందజేశారు. ★ 12.10 నుంచి రాష్ట్రపతి ప్రసంగించారు. ★ 12.36కి తిరిగి గౌరవ వందనం స్వీకరించారు. ★ 12.41కు సుమేధ నౌక తిరిగి జెట్టీవైపు బయల్దేరింది.
★ 12.50కు రాష్ట్రపతి జెట్టీ దిగి ప్రత్యేక వాహనంలో బయల్దేరారు.

కనులపండువగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి నిత్య కల్యాణోత్సవం బుధవారం సింహగిరిపై కనులపండువగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు జరిపారు. దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయ వేడుకను జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

స్వామి, అమ్మవార్లు, నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు

నేనూ అడివివరంలోనే చదువుకున్నా..

ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: 'నేనూ మీలాగే అడివివరం పాఠశాలలోనే తెలుగు మాధ్యమంలో చదువుకుని ఈ స్థాయికి ఎదిగాను. సాధించాలనే పట్టుదల, లక్ష్యంపై చిత్తశుద్ధి ఉంటే ఉన్నత స్థాయికి తప్పక ఎదుగుతార'ని ఆంధ్రా విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ అన్నారు. ఆయన బుధవారం అడివివరం జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఇష్టంతో కష్టపడి చదివితే భవిష్యత్తు బాగుంటుందన్నారు. అందుబాటులో ఉన్న సాంకేతికతను కొత్త విషయాలు తెలుసుకోవడానికి ఉపయోగించాలన్నారు. స్వయం పోర్టల్ ద్వారా ఐఐటీ ఆచార్యులు ప్రాథమిక స్థాయి తరగతులకు కూడా పాఠాలు బోధిస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్ మాట్లాడుతూ అడివివరం పాఠశాలలో చదివి ఏయూ వీసీగా రాజశేఖర్ ఎదిగిన తీరును విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీసీని ఘనంగా సత్కరించారు.

విద్యార్థులకు సూచనలిస్తున్న వీసీ రాజశేఖర్

యుద్ధప్రాతిపదికన తారురోడ్డు నిర్మాణం

పెందుర్తి, న్యూస్‌టుడే: అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ నేపథ్యంలో వివిధ దేశాలకు చెందిన నేవీ అధికారుల బృందం పెందుర్తి మండలం పెదగాడి సమీప సంకల్ప కళాగ్రామాన్ని సందర్శించనున్న నేపథ్యంలో జీవీఎంసీ అధికారులు యుద్ధప్రాతిపదికన రహదారి నిర్మాణం పనులు చేపట్టారు. వేపగుంట-పినగాడి రోడ్డులోని చింతలగ్రహారం మేహాద్రి వంతెనపై తారురోడ్డు నిర్మించారు. వంతెన పైనుంచి కళాగ్రామానికి వెళ్లే వరకు నూతన బీటీ రహదారి నిర్మించారు. లక్ష్మీపురం రైలు వంతెన నుంచి చింతలగ్రహారం వంతెన వరకు రహదారిలో పరిశుభ్రత పనులు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు, తుప్పలు తొలగించి పారిశుద్ధ్యం మెరుగుపరిచారు. సంబంధిత మార్గంలో పలుచోట్ల గుంతలు పూడ్చే పనులు చేపట్టారు. వాటిని పెందుర్తి జోనల్ కమిషనర్ శంకరరావు బుధవారం పరిశీలించారు.

కళాగ్రామం రహదారి సిద్ధం చేశారిలా..

డిజిటల్ యుగంలో సోషల్ మీడియా కీలకం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: డిజిటల్ కమ్యూనికేషన్ యుగంలో సోషల్ మీడియా కీలకపాత్ర పోషిస్తోందని విశాఖ పోస్టుమాస్టర్ జనరల్ వి.ఎస్.జయశంకర్ అన్నారు. ఎంవీపీ కాలనీ పోస్టల్ శాఖలో బుధవారం సోషల్ మీడియా కార్యశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమకాలీన డిజిటల్ కమ్యూనికేషన్ నైపుణ్యాలు పోస్టల్ అధికారులకు అందించడం, ప్రజలతో అనుసంధానం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. సాఫ్ట్ స్కిల్స్ నిపుణుడు చల్లా కృష్ణవీర్ అభిషేక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రభుత్వం తమ సేవలను సమర్థవంతంగా చేరవేయాలంటే కథనం, విజువల్ కంటెంట్ విలువ ఆధారిత వినియోగం ఎంతో ముఖ్యమన్నారు. పోస్టల్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్లు కె.వి.డి.సాగర్, ఆర్.నవీన్‌కుమార్, సోషల్ మీడియా ప్రతినిధి సుష్మిత, పోస్టల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో పోస్టుమాస్టర్ జనరల్ వి.ఎస్.జయశంకర్, సాఫ్ట్‌స్కిల్స్ నిపుణుడు చల్లా కృష్ణవీర్ అభిషేక్

సాహిత్య సేవలో 'సహృదయ సాహితి'

సీతంపేట, న్యూస్‌టుడే: సహృదయ సాహితి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో బుధవారం సాహిత్య సభ నిర్వహించారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ సహృదయ సాహితి 46వ వార్షికోత్సవం ఈనెల 20న సాయంత్రం 6 గంటలకు విశాఖ పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్నామన్నారు. ఇప్పటివరకు 3543 సదస్సులు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సీహెచ్ చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణమూర్తి, అయ్యల సోమయాజుల ప్రసాద్, పరమేశ్వరరావు, కొత్తూరు రమణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

ప్రత్యేక రైళ్ల గడువు పొడిగింపు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పలు ప్రత్యేక రైళ్ల గడువు పొడిగించనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. ★ మార్చి 2 నుంచి 30 వరకు చర్లపల్లి- భువనేశ్వర్ న్యూ(07165), మార్చి 3 నుంచి మార్చి 31 వరకు భువనేశ్వర్ న్యూ- చర్లపల్లి(07166), ఈనెల 28 నుంచి మార్చి 14 వరకు ప్రతి శనివారం చెన్నై ఎగ్మోర్- సంత్రాగచ్చి (06077), మార్చి 2 నుంచి 16 వరకు ప్రతి సోమవారం సంత్రాగచ్చి- చెన్నై ఎగ్మోర్ (06078), ఈనెల 22 నుంచి మార్చి 8 వరకు ఎంజీఆర్ చెన్నై సెంట్రల్- బరౌని (06039), ఈనెల 25 నుంచి మార్చి 11 వరకు బరౌని- ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (06040), ఈనెల 27న సికింద్రాబాద్-నెహర్లగన్ (07046), మార్చి 2న నెహర్లగన్- సికింద్రాబాద్ (07046) ప్రత్యేక రైళ్లు అందుబాటులో ఉంటాయన్నారు.

ఐసీఏఐ నూతన కార్యవర్గం ఎన్నిక

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) విశాఖపట్నం బ్రాంచి 2026-27 సంబంధించి నూతన కార్యవర్గాన్ని బుధవారం పితాపురంకాలనీలో ఐసీఏఐ భవన్‌లో ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా పట్నాల లోకేశ్, వైస్‌ఛైర్మన్‌గా నెమ్మది రాము నాయుడు, కార్యదర్శిగా ఎంఎల్‌డీ ఉజ్వల, కోశాధికారిగా మొగలపల్లి పి. గురుమూర్తి, విద్యార్థుల సమాఖ్య అధ్యక్షుడిగా కె. రాంబాబు, సంపాదకుడిగా డి.లీలావరప్రసాద్, కార్యవర్గ సభ్యుడిగా శ్రీధర్ అందవరపు, ఎక్స్‌అఫిషియో కార్యవర్గ సభ్యుడిగా డి.ప్రసన్నకుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ సంతోష్ మాట్లాడుతూ సీఏల వృత్తి అభివృద్ధి కోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు పలువురు సీఏలు పాల్గొని అభినందనలు తెలిపారు.

నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

పేదల ఇళ్ల నిర్మాణాలకు అనుమతించాలి

వేపగుంట, న్యూస్‌టుడే: రెవెన్యూ స్థలాల్లో పేదలకు మంజూరైన ఇళ్ల నిర్మాణాలకు దేవస్థానం అధికారులు సహకరించాలని కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు కోరారు. వెంకటసాయినగర్, అప్పలనర్సయ్యకాలనీ మధ్య క్వారీ స్థలంలో పేదలకు ఇళ్లు మంజూరయ్యాయి. ఆ మేరకు లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు సిద్ధమవుతుండగా ఎస్‌డీసీ గీతాంజలి, ఏఈవో పిల్లా శ్రీను నిలుపుదల చేశారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్... సంబంధిత స్థలం రెవెన్యూకు చెందినదని గతంలో అధికారులు సర్వే చేసి అప్పగించారని వివరించారు. దీనిపై మరోసారి సర్వే చేపడతామని అంతవరకు పనులు నిలపాలని ఎస్డీసీ చెప్పడంతో ఆమేరకు లబ్ధిదారులు పనులు నిలిపివేశారు.

NOTICE
IN THE COURT OF SUBORDINATE JUDGE AT ALANDUR
H.M.O.P.No. 891 of 2024
Mrs. Archana ....Petitioner
Vs
Mr. Mani kumar Yerupalli ....Respondent
To:
Mr. Manikumar Yerupalli, S/o Baburao Yerupalli, 7-41, Savitri Nagar, Visakhapatnam., Andhra Pradesh - 531 173
Sir, Kindly take notice that the petitioner above named filed an application for Divorce in HMOP No.891 of 2024 as against you, the case is stand posted for your appearance. Hence be present on 12.03.2026 at 10.00 am before the above court either in person or through your advocate, failing which the matter will be decided in your absence.
M.Sushma B.C.S., LL.M, Advocate MS 219/2017
Counsel for Petitioner,
Plot No.5, Rathi Street, Ganga Kaveri Cross Street, Ramakrishna Nagar Extn. Porur, Chennai - 600 116. M- 98844 50091

(c) eenadu

భీమిలి

సినిమాలు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్ - మన శంకర వరప్రసాద్ గారు
రామమ్మ - భర్త మహాశయులకు విజ్ఞప్తి
తారా - సీతా పయనం
సప్తగిరి - ఫంకీ

సెక్యూరిటీ ఎనలిస్ట్ కోర్సులో శిక్షణకు ఆహ్వానం

భీమునిపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో సెక్యూరిటీ ఎనలిస్ట్ కోర్సులో మూడు నెలల ఉచిత శిక్షణకు స్త్రీ పురుషుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. 18-35 ఏళ్ల వయసున్న వారు అర్హులు. డిగ్రీ లేక డిప్లొమా కోర్సుల్లో ఉత్తీర్ణులై ఉండాలి. ఆసక్తి గల అభ్యర్థులు 9014758949 నంబరులో సంప్రదించాలని పాలిటెక్నిక్ కళాశాల ప్రధానాచార్యులు డా.సి.హెచ్.మురళీకృష్ణ సూచించారు.

26 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిలోని సాగర తీరమున క్షేత్రంపై వెలసిన కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 26 నుంచి మార్చి 2 వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 26న యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 27న శ్రీవారి కళ్యాణోత్సవం, గరుడ ప్రసాదం వితరణ చేస్తారు. 28న సామూహిక వేంకటేశ్వర వ్రతాలు, మార్చి 1న సుదర్శన హోమం, 2న అన్న కూటోత్సవం, శ్రీపుష్పయాగం జరుగుతుందని దేవాలయ సంక్షేమ సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

99122 22447 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే: ?: ఎంజాల్ లగ్జరీ అపార్ట్‌మెంట్ (రుషికొండ)లో 10 రోజులుగా చెత్త సేకరించ లేదు. - కళావతి
✓: ఎప్పటికప్పుడు చెత్తను పరిశీలించి సేకరిస్తాం. - రవి, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

?: ఎండాడ బీసీ కాలనీ రోడ్డులో అంగన్‌వాడీ కేంద్రం వద్ద చెత్త పేరుకుపోయింది. - అప్పలరాజు ✓: పరిసరాల శుభ్రతకు చర్యలు తీసుకుంటాం. - రవి,వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

?: పీఎంపాలెం సాంకేతిక కళాశాల వెళ్లే దారిలోని కాలువలో ఉన్న వ్యర్థాలు రోడ్డుపైకి వస్తున్నాయి. - స్థానికులు ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - అయ్యప్పనాయుడు, జేఈ

?: పీఎంపాలెం క్రికెట్ మైదానం ఎదురుగా ఉన్న లేఅవుట్‌లో పందుల బెడద తీవ్రంగా ఉంది. - రాజేష్ ✓: మంజీనిటీ హైజిన్‌కు మరమ్మతులు చేపడతాం. - రాజా రవికుమార్

?: గాయత్రీనగర్ (పీఎంపాలెం) పార్కు అభివృద్ధికి నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. - గాయత్రీనగర్ వాసులు ✓: త్వరలో సంబంధిత పనులు ప్రారంభిస్తాం. - కేమిరి, వార్డు ఏఈ

?: అన్నపూర్ణా నగర్ (కొమ్మాది)లో రోడ్డు గతుకులమయంగా ఉన్నాయి. - శ్రీకాంత్ ✓: త్వరలో తారురోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకుంటాం. - శ్రీనివాస్, ఏఈ

?: 5వ వార్డు పరిధి కొత్తపాలెంలో రహదారులు గుంతలమయంగా ఉన్నాయి. - కొత్తపాలెం వాసులు ✓: త్వరలో రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం - అయ్యప్పనాయుడు, జేఈ

?: గాయత్రీనగర్ (పీఎంపాలెం)లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. - కాలనీవాసి ✓: వీధి కుక్కల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడతాం. - రాజా రవికుమార్, ఆరోగ్య అధికారి

చేయూత అందించి.. ఉపాధి కల్పించి

ఆనందపురం, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి ఎన్నో చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఉపాధి కల్పించేందుకు ఎగ్‌కార్ట్‌లను అందిస్తోంది. ఇప్పటికే వీటిని ఆయా ప్రాంతాలకు తరలించి పంపిణీకి సిద్ధం చేశారు.

★ ఐదుకు ముందు గ్రామాల ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారి రద్దీ ప్రాంతాల్లో మహిళలకు ఎగ్ మార్టులు ఏర్పాటు చేయించారు. ఇవి విజయవంతం కావడంతో రెండో దశలో మరికొంత మందికి అందించాలని నిర్ణయించారు. ఇందుకు ప్రభుత్వం నెక్ సంస్థతో ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు వెలుగు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. డ్వాక్రా మహిళల్లో కొంత మందిని లబ్ధిదారులుగా గుర్తించి రూ.50 వేలు విలువ చేసే ఎగ్‌కార్ట్ (బండి), అందులో ఉపకరణాలను ఉచితంగా అందిస్తారు.

ఆనందపురం మహిళామార్టులో సిద్ధంగా ఉంచిన ఎగ్‌కార్టులు

★ బహుళ ప్రయోజనం: ఒకవైపు ప్రజలకు ఆరోగ్యకర అల్పాహారం అందించడంతో పాటు మహిళలకు ఆర్థిక ప్రగతి లభించడం, గుడ్ల వినియోగంతో పోషకాలు పెంచడం వంటి బహుళ ప్రయోజనాలు చేకూరనున్నాయి.

★ భీమిలి నియోజకవర్గంలో గత ఆగస్టులో ఆనందపురం, బోయపాలెం, కొంరాం, బి.తాళ్లవలస, రెడ్డిపల్లి, పెద్దనాగమయ్యపాలెం, సీటినగరం, లక్ష్మీపురం గ్రామాల్లో మహిళలకు అందజేశారు. తాజాగా మరో 12 మందికి ఇచ్చేందుకు దరఖాస్తులు స్వీకరించి లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ జరుగుతోందని వెలుగు అధికారులు చెబుతున్నారు.

★ ఎంపిక ఇలా: వ్యాపార అనుభవం, ఔత్సాహిక మహిళల నుంచి స్వీయ ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్, విద్యార్హత వంటివి ముందుగా అధికారులు పరిశీలిస్తారు. ఎగ్ కార్టు నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించే దమ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతకు కొలమానంగా తీసుకుంటారు. ప్రధానంగా ఒంటరి మహిళలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

విద్యార్థులకు సామగ్రి వితరణ

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: నాంది ఫౌండేషన్ చిట్టివలస సంతోపేట అంబేడ్కర్ జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వివిధ రకాల సామగ్రిని బుధవారం వితరణగా అందించింది. స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, పెన్నులు, టీ షర్టులు, తదితర వస్తువులతో కూడిన కిట్లను ప్రధానోపాధ్యాయులు వై.జగన్నాథస్వామి 105 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. క్రీడలు, సాంస్కృతిక, విద్యా సంబంధిత అంశాల్లో ప్రతిభ చూపిన కొప్పల తేజస్విని, ఆర్.మహేశ్వరి, పల్లి, కోమలి, ఆరాధ్య, పోర్లమేకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రాజెక్టు అధికారి సత్యవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి కిట్లతో అంబేడ్కర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

శతాబ్ది ఉత్సవాల నిర్వహణపై ప్రత్యేక సమావేశం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలు ఎలా నిర్వహించాలన్న విషయమై బోధనా సిబ్బందితో బుధవారం వైస్‌ఛాన్స్ మూర్తి ఆడిటోరియంలో సమావేశం జరిగింది. ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ సిబ్బంది అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఏప్రిల్ 26న శతాబ్ది ఉత్సవాల ముగింపు సదస్సు నిర్వహించాల్సి ఉంది. ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్రమోదీని పిలవాలని గత ప్రభుత్వంలో ఆలోచించగా ప్రధాని మంత్రి కార్యాలయానికి లేఖ రాశారు. ఈ విషయమై పలువురు వీసీ వద్ద ప్రస్తావించగా ఇంకా దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పినట్లు తెలిసింది. ఈ సమావేశానికి తమను దూరం చేయడమేమిటని బోధనేతర సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ఆనందపురం, సాగర్‌నగర్, న్యూస్‌టుడే: గీతం డీమ్డ్ వర్సిటీ బయోటెక్నాలజీ విభాగం జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) విద్యార్థుల ఆధ్వర్యంలో ఆనందపురం మండలంలోని గంభీరం, కలిపినాపాలెం ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం 'సంపూర్ణ ఆరోగ్యం-పరిసరాల పరిశుభ్రత'పై అవగాహన కల్పించారు. బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ శరత్‌బాబు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆర్.గోపీనాథ్ పర్యవేక్షణలో విద్యార్థులకు ఆరోగ్యం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, డిజిటల్ టెక్నాలజీ, కంప్యూటర్ విద్య ప్రాధాన్యత వంటి అంశాలను వివరించారు. ఎంపీటీసీ సభ్యురాలు అప్పయ్యమ్మ, ఆక్స్‌ఫర్డ్ కొండాజీ, ఎల్.అరుణకుమారి తదితర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఎన్‌ఎస్‌ఎస్ అధికారి గోపీనాథ్, విద్యార్థులు

భూమి పూజ చేస్తున్న కూటమి నాయకులు

సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ఆనందపురం, న్యూస్‌టుడే: మండలంలోని బంటుబిల్లి వారి కల్లాలు పంచాయతీ పరిధిలో రూ.10 లక్షల జాతీయ ఉపాధి హామీ పథకం, జిల్లా పరిషత్ సంయుక్త నిధులతో మీసాల వారి కల్లాలు సిమెంట్ రోడ్డు, మురుగునీటి కాలువ నిర్మాణానికి కూటమి నాయకులు భూమి పూజ చేశారు. కోరాడ సాధు అచ్యుత రాంబాబు, వేములవలస పీఏసీఎస్ ఛైర్మన్ రౌతు నాగరాజు, బంటుబిల్లి గోవిందరావు, కోన శ్రీనివాసరావు, మీసాల శంకరరావు, చందక అప్పలరాజు, వెన్ని అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి పర్యటన సాగిందిలా..

సింధియా, న్యూస్‌టుడే: ★ ఉదయం 9.55 గంటలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బోట్ ఐన కేంద్రం నుంచి బయల్దేరారు. ★ ఉదయం 9.57కు గౌరవ వందనం స్వీకరించి పరేడ్‌ను పరిశీలించారు. ★ ఉదయం 10.04కి నేవల్ జెట్టీలో ప్రత్యేకించి ఏర్పాటు చేసిన ఐఎన్‌ఎస్ సుమేధ నౌకపైకి ఎక్కారు. ★ 10.08కు గౌరవ వందనం స్వీకరించారు. ★ 10.12కు రాష్ట్రపతి నౌకలో ప్రయాణించారు ★ 10.33 నుంచి 10.52 వరకు నౌకపై నుంచే సముద్రంలో నౌకలను సమీక్షించారు. ★ 10.53 నుంచి 10.57 వరకు యుద్ధనౌకల సెయిలింగ్ పరేడ్‌ను వీక్షించారు. ★ 11.19 నుంచి 11.24 వరకు నమూనా ప్రదర్శనలు జరిగాయి. ★ 11.45 నుంచి 11.48 వరకు ప్రత్యేక దళాలు తమ విన్యాసాలను ప్రదర్శించాయి. ★ 11.54 నుంచి 12.06 వరకు వాయుసేన విమానాల విన్యాసాలు జరిగాయి. ★ 12.07 నుంచి జలాంతర్గాముల నుంచి రాష్ట్రపతి గౌరవ వందనం తీసుకున్నారు. ★ 12.09కి రాష్ట్రపతికి జ్ఞాపికను అందజేశారు. ★ 12.10 నుంచి రాష్ట్రపతి ప్రసంగించారు. ★ 12.36కి తిరిగి గౌరవ వందనం స్వీకరించారు. ★ 12.41కు రాష్ట్రపతి పర్యటించిన నౌక సుమేధ తిరిగి జెట్టీవైపు బయల్దేరింది. ★ 12.50కు రాష్ట్రపతి జెట్టీ దిగి ప్రత్యేక వాహనంలో బయల్దేరారు.

సందర్శకుల పుస్తకంలో సంతకం చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, చిత్రంలో సీఎం చంద్రబాబు

భూగర్భ జలాల నిర్వహణపై శిక్షణ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: భూగర్భ జలాల స్థిరత్వం, నిర్వహణ, విశాఖ ఆధ్వర్యంలో ఆక్విఫర్ మ్యాపింగ్ 2.0కు ప్రత్యేక ప్రాధాన్యత అనే అంశంపై ఏయూలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు దీన్ని ప్రారంభించి ప్రసంగించారు. కేంద్ర భూగర్భ జలమండలి ఆంధ్రప్రదేశ్ యూనిట్ ఈ కార్యక్రమం నిర్వహించింది. ఆచార్య కె.సత్యనారాయణ రెడ్డి, ఆచార్య ఈ.ఎన్.ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

గణిత శాస్త్ర విభాగంలో సెమినార్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జార్జియా వైద్య కళాశాలలోని 'లేబొరేటరీ ఫర్ థియర్ అండ్ మ్యాథమెటికల్ మోడలింగ్' డైరెక్టర్ ప్రొఫెసర్ అర్ని ఎస్.ఆర్.శ్రీనివాసరావు అతిథిగా విచ్చేసి వివిధ అంశాలపై ప్రసంగించారు. ప్రముఖ గణాంక శాస్త్రవేత్త సి.ఆర్.రావుతో కలిసి చేసిన తన పరిశోధనలను ఆయన గుర్తు చేసుకున్నారు.

బీమా చెక్కు అందజేత

పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభం గ్రామీణ వికాస బ్యాంకులో ఖాతా కలిగి ఇటీవల మరణించిన వ్యక్తి కుటుంబ సభ్యులకు బుధవారం బీమా చెక్కును అందజేశారు. కృష్ణాపురం గ్రామానికి చెందిన గాదు అప్పన్న బ్యాంకులో ఖాతా కలిగి ఉండగా ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన కింద రూ.436 చెల్లించారు. ఇటీవల ఆయన సహజ మరణం పొందారు. ఈ నేపథ్యంలో బుధవారం బ్యాంకు మేనేజర్ జె.రామ్‌కుమార్ చేతులమీదుగా అప్పన్న భార్య లక్ష్మికి రూ.2 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది గురుశేఖర్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి భార్య లక్ష్మికి చెక్కు అందజేస్తున్న బ్యాంకు మేనేజర్ రామ్‌కుమార్

చురుగ్గా అభివృద్ధి పనులు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే

రుషికొండ, సాగర్‌నగర్, తాటిచెట్లపాలెం ప్రాంతాల్లో జీవీఎంసీ, టూరిజం ఇంజినీరింగ్ విభాగాధికారుల పర్యవేక్షణలో చురుగ్గా అభివృద్ధి పనులు సాగుతున్నాయి. ప్రజావసరాలకు అనువుగా కూటమి ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తోంది. అతి త్వరలో సదరు సదుపాయాలు వినియోగంలోకి వచ్చేలా త్వరితగతిన పనులు పూర్తి చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు. ★ స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా రుషికొండ బీచ్‌లో పర్యాటకుల ప్రయోజనార్థం సుమారు రూ.55 లక్షలతో 22 మరుగుదొడ్లు, స్నానాల గదులు తదితర వాటిని నిర్మిస్తున్నారు. ★ సాగర్‌నగర్‌లోని కళావేదిక, బాస్కెట్‌బాల్ మైదానం ప్రాంగణంలో రూ.18 లక్షలతో విశ్రాంతి గదుల నిర్మాణ పనులు చేపడుతున్నారు. క్రీడాకారులు, వేదికకు వచ్చే ప్రజల సౌకర్యార్థం ఈ చర్యలు చేపడుతున్నారు. ★ తాటిచెట్లపాలెం శ్మశానవాటికలో లక్షలాది రూపాయల వ్యయంతో సదుపాయాలు కల్పిస్తున్నారు.

రుషికొండ బీచ్‌లో స్నానాల గదుల నిర్మాణం

★ రాడిసన్ బ్లూ రిసార్ట్ నుంచి గుడ్లవానిపాలెం వరకు బీచ్‌రోడ్డు వెంబడి తీరం వైపు సైక్లింగ్ చేయడానికి, వ్యాయామంలో భాగంగా నడిచేందుకు వీలుగా ప్రత్యేక రహదారి నిర్మాణ పనులకు ఇటీవల శ్రీకారం చుట్టారు. దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో ఆహ్లాదకర రీతిలో ఈ మార్గాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు సంకల్పించారు.

దివీస్‌లో మాక్‌డ్రిల్

చిప్పాడ (తగరపువలస), న్యూస్‌టుడే: చిప్పాడ దివీస్ ఫార్మా కంపెనీ భద్రతా విభాగం ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాల నివారణపై బుధవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. కర్మాగారాల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ వి.సురేశ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సిబ్బంది చేపట్టిన నమూనా విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో దివీస్ ఉపాధ్యక్షుడు ఎల్వీ రమణ, భద్రతాధికారి చంద్రశేఖర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు ప్రసాద్, శ్రీనివాస్, చంద్రశేఖర్, కేశవరావు, గోపికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నమూనా విన్యాసాలను ప్రదర్శిస్తున్న దివీస్ సిబ్బంది

పాల ధరల పెంపుపై ఆందోళన

తగరపువలస ప్రధాన రోడ్డులో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

చిట్టివలస (తగరపువలస),న్యూస్‌టుడే: విశాఖ డైరీ యాజమాన్యం పాల ధరలను పెంచడాన్ని నిరసిస్తూ సీపీఎం భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో తగరపువలసలో బుధవారం ఆందోళన చేపట్టారు. జోన్ కార్యదర్శి రెడ్డి సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ 9 నెలల వ్యవధిలో రెండు సార్లు పాల ధరలను పెంచడం అన్యాయమన్నారు. లాభాల్లో ఉన్నా ప్రజలపై భారం వేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.అప్పలనాయుడు, పంపాన సూర్యనారాయణ, సాడి సూరిబాబు, నర్సింగరావు, చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మహా నారాయణ యజ్ఞం

ఎంవీపీకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: రుషి పీఠం, సత్సంగ శాఖ విశాఖపట్నం ఆధ్వర్యంలో గురువారం నుంచి మార్చి 4వ తేదీ వరకు ఎంవీపీకాలనీ సెక్టార్-6లో ఎంవీ భద్రం సామాజిక భవనంలో భాగవత ప్రవచన మహాయజ్ఞం, చతుర్వేద పారాయణ సహిత మహా నారాయణ యజ్ఞం బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మచే జరపనున్నట్లు నిర్వాహకులు కె.అరుణ గాయత్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు యజ్ఞం జరుగుతుందన్నారు. ఆసక్తిగల వారు సంప్రదాయ దుస్తులతో హాజరుకావాలని తెలిపారు.

ప్రత్యేక రైళ్ల గడువు పొడిగింపు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పలు ప్రత్యేక రైళ్ల గడువు పొడిగించనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. ★ మార్చి 2 నుంచి 30 వరకు చర్లపల్లి- భువనేశ్వర్ న్యూ(07165), మార్చి 3 నుంచి మార్చి 31 వరకు భువనేశ్వర్ న్యూ- చర్లపల్లి(07166), ఈనెల 28 నుంచి మార్చి 14 వరకు ప్రతి శనివారం చెన్నై ఎగ్మోర్- సంత్రాగచ్చి (06077), మార్చి 2 నుంచి 16 వరకు ప్రతి సోమవారం సంత్రాగచ్చి- చెన్నై ఎగ్మోర్ (06078), ఈనెల 22 నుంచి మార్చి 8 వరకు ఎంజీఆర్ చెన్నై సెంట్రల్- బరౌని (06039), ఈనెల 25 నుంచి మార్చి 11 వరకు బరౌని- ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (06040), ఈనెల 27న సికింద్రాబాద్-నెహర్లగన్ (07046), మార్చి 2న నెహర్లగన్- సికింద్రాబాద్ (07046) ప్రత్యేక రైళ్లు అందుబాటులో ఉంటాయన్నారు.

వన్యప్రాణులు వచ్చేస్తున్నాయ్..!

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : కంబాలకొండ అటవీ ప్రాంతంలో స్వేచ్ఛగా తిరిగే జింకలు, కొండగొర్రెలు తరచూ విశాఖ వ్యాలీ పాఠశాల సమీప రహదారిపైకి, విశాలాక్షినగర్ కొండ చివర, ఇందిరానగర్ జనావాసాల్లో వస్తున్నాయి. కొన్నిసార్లు అవి రోడ్డు దాటేటప్పుడు వాహనాలు ఢీకొట్టడంతో ప్రమాదాల బారిన పడుతున్నాయి. బుధవారం ఓ కొండగొర్రె ప్రధాన రహదారిపైకి వచ్చేసింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. రక్షణ కంచె ఏర్పాటు చేయడంతో పాటు, జీవులకు అవసరమైన తాగునీటి సదుపాయం కల్పించాలని వన్యప్రాణి ప్రేమికులు కోరుతున్నారు.

రేపు విద్యుత్తు సరఫరా నిలిపివేత

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: చిట్టివలస విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ విద్యుత్తు సరఫరాను నిలిపి వేయనున్నట్లు జోన్-3 ఈఈ సింహాచలంనాయుడు చెప్పారు. టి.నగరపాలెం, కనకలపేట, మజ్జివలస, లక్ష్మీపురం, సింగనబంద, విజయరామపురం, కృష్ణంరాజుపేట, డొకరుపేట, మద్దిపేట, నారాయణరాజుపేట, అవంతి కళాశాల ప్రాంతం, ఓక్రిడ్జ్ పాఠశాల పరిసరాల్లో విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

కనులపండువగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి నిత్య కల్యాణోత్సవం బుధవారం సింహగిరిపై కనులపండువగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొల్పి ప్రాతఃకాల పూజలు జరిపారు. దేవేరుల సమేతుడైన గోవిందరాజస్వామిని అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయ వేడుకను జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

స్వామి, అమ్మవార్లు, నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు

నేనూ అడివివరంలోనే చదువుకున్నా..

ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: 'నేనూ మీలాగే అడివివరం పాఠశాలలోనే తెలుగు మాధ్యమంలో చదువుకుని ఈ స్థాయికి ఎదిగాను. సాధించాలనే పట్టుదల, లక్ష్యంపై చిత్తశుద్ధి ఉంటే ఉన్నత స్థాయికి తప్పక ఎదుగుతార'ని ఆంధ్రా విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ అన్నారు. ఆయన బుధవారం అడివివరం జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఇష్టంతో కష్టపడి చదివితే భవిష్యత్తు బాగుంటుందన్నారు. అందుబాటులో ఉన్న సాంకేతికతను కొత్త విషయాలను తెలుసుకోవడానికి ఉపయోగించాలన్నారు. స్వయం పోర్టల్ ద్వారా ఐఐటీ ఆచార్యులు ప్రాథమిక స్థాయి తరగతులకు కూడా పాఠాలు బోధిస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్ మాట్లాడుతూ అడివివరం పాఠశాలలో చదివి దేశంలోనే అగ్రగామిగా ఉన్న ఏయూ వీసీగా రాజశేఖర్ ఎదిగిన తీరును విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీసీని సత్కరించారు.

విద్యార్థులకు సూచనలిస్తున్న ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్

ఆదమరిస్తే ప్రమాదమే..

ఎండాడ, న్యూస్‌టుడే

జాతీయ రహదారి నుంచి వివేకానందనగర్ (ఎండాడ), సాగర్‌నగర్ తదితర ప్రాంతాలకు వెళ్లే మార్గంలో ఓ మలుపు భయభ్రాంతులకు గురి చేస్తోంది. దీనికి తోడు అక్కడే ఓ కాలువ అంచు ప్రమాదకరంగా ఉంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళ అక్కడ విద్యుత్ వెలుగులు అంతంత మాత్రంగానే ఉండటంతో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. ఇప్పటికైనా ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

స్వచ్ఛతకు విఘాతం

కొమ్మాది, న్యూస్‌టుడే

వేగంగా అభివృద్ధి చెందుతున్న మధురవాడ పరిధి ప్రాంతాల్లో ఎక్కడికక్కడ చెత్త దర్శనమిస్తోంది. ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరగకపోవడం, క్లాప్ వాహనాలతో వచ్చే కార్మికులు చెత్తను సేకరించకపోవడంతో అపార్టుమెంట్‌ల్లో ఉన్న వారంతా చెత్తను రోడ్లపై వేస్తున్నారు. అంతేగాక చెత్తకుండీల్లో పేరుకుపోతున్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించకపోవడం, ఖాళీ స్థలాల్లో వాడుక నీరు నిలిచిపోయి దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. ఆయ సమస్యలపై ఎప్పటికప్పుడు స్థానిక సచివాలయం, జోనల్ కార్యాలయంలో పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదులు చేసినా సంబంధిత పారిశుద్ధ్య అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు చెబుతున్నారు.

జీసీసీ లే-అవుట్‌లో రోడ్డు పక్కన పడేస్తున్న చెత్త

పైపులైన్ కోసం తవ్వి విడిచి పెట్టిన గుంత

తవ్వారు.. వదిలేశారు

ఆనందపురం, న్యూస్‌టుడే

ఆనందపురం మండలం బంటుబిల్లి వారి కల్లాలు పంచాయతీ పరిధిలో ఆనందపురం కూడలి నుంచి పల్లిపేట వెళ్లే మార్గంలో కోనవారి కల్లాలులో ఇళ్ల ముందు తవ్విన కాలువ ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పక్కనే వేగనియంత్రిక ఉండటంతో గుంత నుంచి ఆపైకి వెళ్లే సమయంలో వాహనదారులు, వస్తు సామగ్రి రోడ్డుపై పడుతున్నాయని వాపోతున్నారు. పంచాయతీరాజ్, గ్రామ పంచాయతీ అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సాహిత్య సేవలో సహృదయ సాహితి

సీతంపేట, న్యూస్‌టుడే: సహృదయ సాహితి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో బుధవారం సాహిత్య సభ నిర్వహించారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖర మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ సహృదయ సాహితి 46వ వార్షికోత్సవం ఈనెల 20న సాయంత్రం 6 గంటలకు విశాఖ పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్నామన్నారు.

ఐసీఏఐ నూతన కార్యవర్గం ఎన్నిక

నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) విశాఖపట్నం బ్రాంచి 2026-27 సంబంధించి నూతన కార్యవర్గాన్ని బుధవారం పిఠాపురంకాలనీలో ఐసీఏఐ భవన్‌లో ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా పట్నాల లోకేశ్, వైస్‌ఛైర్మన్‌గా నెమ్మది రామునాయుడు, కార్యదర్శిగా ఎంఎల్‌డీ ఉజ్వల, కోశాధికారిగా మొగలపల్లి పి.గురుమూర్తి, విద్యార్థుల సమాఖ్య అధ్యక్షుడిగా కె.రాంబాబు, సంపాదకుడిగా డి.లీలావరప్రసాద్, కార్యవర్గ సభ్యుడిగా శ్రీధర్ అందవరపు, ఎక్స్‌అఫీషియో కార్యవర్గ సభ్యుడిగా డి.ప్రసన్నకుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ సంతోష్ మాట్లాడుతూ సీఏల వృత్తి అభివృద్ధి కోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు పలువురు సీఏలు పాల్గొని అభినందనలు తెలిపారు.

ఇద్దరు యువతుల అదృశ్యం

గ్రామీణభీమిలి, తగరపువలస, న్యూస్‌టుడే: భీమిలి పోలీసుస్టేషన్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు యువతులు అదృశ్యమైనట్లు సీఐ తిరుమలరావు తెలిపారు. బీచ్‌రోడ్డులోని నిడిగట్టు పరిధి రామయోగి అగ్రహారం గ్రామానికి చెందిన యువతి (24), చిట్టివలస సమీప చిల్లపేట యువతి (26) అదృశ్యమైనట్లు వారి కుటుంబీకులు ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

పత్రికా ప్రకటన

నా క్లయింట్లు విశాఖపట్నం సిటీ, డోర్ నెం. 2-152/8, LIG-A-1112, మిథిలాపురి ఉడా కాలనీ, మధురవాడ కాపురస్తులు నాతెచ్చిన భోగట్టా ప్రకారం. విశాఖపట్నం సిటీ, చినగదిలి మండలం, మధురవాడ సబ్.రి., మధురవాడ గ్రామ రెవిన్యూ పరిధిలో గల సర్వే నెంబరు: 90/4లో 267 చ.గజాలు లేక 223.246 చ.మీ॥ విస్తీర్ణం గల ప్లాట్ నెంబర్ 79, ఉడా L.P.నెంబర్ : 11/93, ఖాళీ స్థలము ప్రస్తుతం D.No.45-55-4/3/1, ఆబిడ్‌నగర్, శాదీఖాన కళ్యాణమండపం, అక్కయ్యపాలెం, విశాఖపట్నం సిటీలో నివాసం వున్న శ్రీ కుడుపూడి జగదీశ్వర్ S/o. కుడుపూడి మోహనరావుకు, రిజిష్టర్డు GPA కమ్ సేల్ అగ్రిమెంట్ తేది.18-09-2004, దస్తావేజు నెం.1003/2004, మూలముగా శ్రీ కోను సూర్యప్రకాష్ గారి వలన దఖలుపడిన ఖాళీ స్థలమును నా క్లయింట్ తే.31-12-2025 దీన నాడు సేల్-అగ్రిమెంట్ చేసుకొనియున్నారు.

హద్దులు : తూర్పు : ప్లాట్ నెంబర్ 79 లో మిగిలివున్న స్థలం, పశ్చిమం : ప్లాట్ నెంబర్ 80, ఉత్తరం: ప్లాట్ నెంబర్ 79 లో మిగిలివున్న స్థలం, దక్షిణం : 30 అడుగుల రోడ్డు, హద్దుల మధ్య గల 267 చ.గజాలు అడుగుల ఖాళీ స్థలముపై ఎటువంటి లావాదేవీలు గాని, హక్కులు గాని, కోర్టు వివాదాలుగాని, మరియు బ్యాంకు అప్పులు గాని వున్న ఎడల ఈ ప్రకటన వెలువడిన 7 దినములలోగా అభ్యంతరములు నేరుగా గాని, న్యాయవాది ద్వారా గాని, తగు ఆధారాలతో తెలియజేయగలరని, లేనియెడల ఈ ఖాళీ స్థలం పై అమ్మకందారునికి పూర్తి హక్కులు కలవని భావించి నా క్లయింట్ రిజిస్ట్రీ చేయించుకొనబడునని ఈ ప్రకటన ద్వారా తెలియపరచడమైనది.

శ్రీ గొరజాన కృష్ణమూర్తినాయుడు
అడ్వకేట్ - నోటరీ పబ్లిక్,
మధురవాడ - విశాఖపట్నం,
సెల్: 9440419145.

PUBLIC NOTICE

Under the instructions of my client **M/S SHRIRAM FINANCE LIMITED, Maharani Peta Branch, Visakhapatnam,** I issue the following notice to general public. My client intends to grant loan to **SMT. BATTINA DURGA** D/o Appa Rao W/o David Paladi by keeping the below mentioned schedule property as security by way of Registered Mortgage. As such if any one have any claims, charges, mortgages Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices. Otherwise, later objections will not bind my client in this regard.

SCHEDULE OF THE IMMOVABLE PROPERTY

All that piece and parcel of vacant site measuring an extent of 733 Sq. yards or 615.72 Sq. meters in **AKSHAYA NAGAR** bearing Plot No.54, layout approved by VUDA vide LP No.61/2006, covered by S. nos. 68/2, 69, 70/1, & 72/1 of Tallavalasa Village and Panchayat, Bheemunipatnam Mandalam, Anandapuram Sub-District, Visakhapatnam district is measured and bounded by: **EAST:** Plot No.55; **SOUTH:** Others land; **WEST:** 40' wide road; **NORTH :** 40' wide road
Measurements: East to West on Northern side : 60 feet or 18.30 meters; **East to West on Southern side:** 65 feet or 19.825 meters; **North to South :**105.5 feet or 32.025 meters

KODURI SREENIVASA RAO
SMT. SIVA KUMARI JALADI
Advocates,
S-2, Bharat Apartments, Behind Rythu Bazar
Seethammadhara, Visakhapatnam-13.
Visakhapatnam Dt18.02.2026 **Mobile No.9885166648**
Mail: sreenivaskoduri@gmail.com

విశాఖ తూర్పు

26 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిలోని సాగర తిరుమల క్షేత్రంపై వెలసిన కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 26 నుంచి మార్చి 2 వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 26న యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 27న శ్రీవారి కల్యాణోత్సవం, గరుడ ప్రసాదం వితరణ చేస్తారు. 28న సామూహిక వేంకటేశ్వర వ్రతాలు, మార్చి 1న సుదర్శన హోమం, 2న అన్న కూటోత్సవం, శ్రీపుష్పయాగం జరుగుతుందని దేవాలయ సంక్షేమ సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.

నేటి నుంచి మహా నారాయణ యజ్ఞం

ఎంవీపీకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: రుషి పీఠం, సత్సంగ శాఖ విశాఖపట్నం ఆధ్వర్యంలో గురువారం నుంచి మార్చి 4వ తేదీ వరకు ఎంవీపీకాలనీ సెక్టార్-6లో ఎంవీ భద్రం సామాజిక భవనంలో భాగవత ప్రవచన మహాయజ్ఞం, చతుర్వేద పారాయణ సహిత మహా నారాయణ యజ్ఞం బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మచే జరపనున్నట్లు నిర్వాహకులు కె.అరుణ గాయత్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు యజ్ఞం జరుగుతుందన్నారు. ఆసక్తిగల వారు సంప్రదాయ దుస్తులతో హాజరుకావాలని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

పెదవాల్తేరు, ఎంవీపీ కాలనీ: 8008574769

మద్దిలపాలెం: 9912120229

న్యూస్‌టుడే, హనుమంతువాక(విశాలాక్షినగర్) ?: విశాలాక్షినగర్ కైలాసగిరి కూడలి నుంచి హనుమంతువాక వరకు పశువుల సంచారం ఎక్కువగా ఉంటుంది. రాత్రివేళల్లో పలువురు ద్విచక్ర వాహనచోదకులు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు.–కె.చిన్నారావు, విశాలాక్షినగర్. ✓: సిబ్బందిని పంపి ప్రత్యేక వాహనాల్లో పశువుల్ని తరలిస్తాం. యజమానులకు జరిమానాలు విధిస్తాం.–డాక్టర్ రాజారవికుమార్, చీఫ్ వెటర్నరీ అధికారి.

ఆరిలోవ, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 12వ వార్డు టీఐసీ పాయింట్, అంబేడ్కర్‌నగర్‌లోని మురుగు కాలువల్లో పూడికలు పేరుకుపోయి మురుగు నీరు స్తంభిస్తుంది. తీవ్ర దుర్వాసన, దోమల బెడద ఎక్కువైంది. –రాజ్యలక్ష్మి, టీఐసీ పాయింట్. ✓: సిబ్బందిని పంపి పూడికలు తీయిస్తాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. –అబ్దుల్ మీరా, పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్.

కెఆర్‌ఎంకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: ?: మద్దిలపాలెం శివాలయం సమీపంలోని కాలువలో పూడికలు తొలగించడం లేదు. దోమలు వృద్ధి చెందుతున్నాయి. – బాలు ✓: సిబ్బందిని పంపించి పూడికలు తొలగిస్తాం. – సూరిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్.

హెచ్‌బీకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురం కాలనీలో గతకొన్ని రోజుల నుంచి వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి పూట ఆకతాయిలతో ఇబ్బందులు పడుతున్నాం. – గోపి. ✓: పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. – అశ, వీధి దీపాల నిర్వహణ వర్క్ ఇన్‌స్పెక్టర్.

స్పందనకు వందనం

ఎట్టకేలకు దీపాలు వెలిగాయ్..!

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: విశాలాక్షినగర్ రామాలయం వీధిలో వీధి దీపాలు వెలగడం లేదన్న సమస్యపై 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు వీధి దీపాల నిర్వహణ అధికారి రామ్‌శంకర్ స్పందించారు. తమ సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 20వ వార్డు రామలక్ష్మి అపార్టుమెంట్ ప్రాంతంలో రహదారిపై వ్యర్థాలు తరలించడం లేదని బుధవారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్ స్పందించారు. సిబ్బందితో వ్యర్థాలు తీయించి పరిసరాలను శుభ్రం చేయించారు.

ఆటలకు చోటిచ్చేలా..!

ఇండోర్ స్టేడియం నిర్మాణానికి అడుగులు

టీఐసీపాయింట్(ఆరిలోవ), న్యూస్‌టుడే : ఆరిలోవ హెల్త్‌సిటీ సమీప క్రీడా మైదానంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో... ఖేల్ ఇండియా పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే నిధులతో నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇదే అంశంపై ఎంపీ శ్రీభరత్ ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి విన్నవించి, ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ.14 కోట్లు మంజూరు చేయాలని కోరారు.



ఆరిలోవలో స్టేడియం నిర్మించనున్న మైదానం

ఇదీ పరిస్థితి...!

■ ఆరిలోవ ప్రాంత క్రీడాకారులకు అనువైన మైదానం ఉండాలనే ఉద్దేశంతో... ఏపీఐఐసీ ద్వారా హెల్త్‌సిటీకి కేటాయించిన వంద ఎకరాల స్థలంలో శివాజీనగర్‌కు సమీపంలో ఉన్న మూడు ఎకరాల స్థలాన్ని ఎంపిక చేశారు.

■ రాష్ట్ర ప్రభుత్వం శాప్ ద్వారా క్రీడా మైదానం నిర్మాణానికి 2016లో రూ.2 కోట్లు కేటాయించింది. అయితే ఆ నిధులు ఎటూ సరిపోవని నిర్ణయించి, పనులు చేపట్టలేదు.

■ 2017-18 కాలంలో నాటి జీవీఎంసీ కమిషనర్ క్రీడా మైదానం స్థలాన్ని జీవీఎంసీకి అప్పగిస్తే, రూ.10 కోట్లతో స్టేడియం నిర్మిస్తామని జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపారు. ఆ మేరకు క్రీడా మైదానం స్థలం జీవీఎంసీకి బదలాయింపు జరిగింది. 2019లో నిర్మాణ పనులు చేపట్టే సమయంలో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి.

■ ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం స్టేడియం నిర్మాణానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. మైదానం చుట్టూ రక్షణ కంచె నిర్మాణానికి 2022లో జీవీఎంసీ మేయర్ శంకుస్థాపన చేసినా.. ఆ పనులు చేపట్టలేదు.

ఎట్టకేలకు కదలిక.. ■ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్రీడా మైదానం నిర్మాణానికి రూ.14 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. సకల హంగులతో, ఆధునిక సౌకర్యాలతో నిర్మాణ పనులు చేపడతామని తూర్పు ఎమ్మెల్యే రామకృష్ణబాబు తెలిపారు.

నడకమార్గంలో ఆక్రమణలు

చినగదిలి(ఆరిలోవ), న్యూస్‌టుడే : చినగదిలి కూడలి సమీప సేవా రహదారిలోని నడకమార్గం ఆక్రమణలతో నిండిపోయింది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ఎక్కడికక్కడ ఆక్రమించి.. దుకాణాలు ఏర్పాటు చేయడంతో రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ అంశంపై పలుమార్లు ఫిర్యాదు చేసినా.. అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

చినగదిలి కూడలిలో...

శిథిలం.. ప్రమాదకరం..!

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : ఎంవీపీకాలనీ గిరిజన్‌భవన్ కూడలి నుంచి వెంకోజీపాలెం పెట్రోల్‌బంకుకు వెళ్లే ప్రధాన మార్గంలో నడకదారులు శిథిలమై ప్రమాదకరంగా మారాయి. దీంతో చాలామంది పాదచారులు ప్రధాన రహదారిలోనే రాకపోకలు సాగిస్తూ.. ప్రమాదాల బారిన పడుతున్నారు. మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు విన్నవించినా.. అధికారులు పట్టించుకోవడం లేదని నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పునరుద్ధరణ పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఐసీఏఐ నూతన కార్యవర్గం ఎన్నిక

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) విశాఖపట్నం బ్రాంచి 2026-27 సంబంధించి నూతన కార్యవర్గాన్ని బుధవారం పిఠాపురంకాలనీలో ఐసీఏఐ భవన్‌లో ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా పట్నాల లోకేశ్, వైస్‌ఛైర్మన్‌గా నెమ్మది రామునాయుడు, కార్యదర్శిగా ఎంఎల్‌డీ ఉజ్వల, కోశాధికారిగా మొగలపల్లి పి.గురుమూర్తి, విద్యార్థుల సమాఖ్య అధ్యక్షుడిగా కె.రాంబాబు, సంఘం కమిటీ సభ్యుడిగా డి.లీలావరప్రసాద్, కార్యవర్గ సభ్యుడిగా శ్రీధర్ అందవరపు, ఎక్స్‌అఫిషియో కార్యవర్గ సభ్యుడిగా డి.ప్రసన్నకుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ సంతోష్ మాట్లాడుతూ సీఏల వృత్తి అభివృద్ధి కోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు పలువురు సీఏలు పాల్గొని అభినందనలు తెలిపారు.

నూతనంగా ఎన్నికైన కార్యవర్గం సభ్యులు

వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించండి

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: వాహనాలు నడిపే ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కృష్ణా డిగ్రీ కళాశాల విద్యార్థులు బుధవారం మద్దిలపాలెం కూడలి వద్ద బ్యానర్ పట్టుకుని చోదకులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించాలని, కారు నడిపే వారు సీటుబెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఐ.విజయబాబు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.జయ, రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ టి.రామకృష్ణ, రెడ్‌క్రాస్ వాలంటీర్లు, ఎంవీపీ స్టేషన్ ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణా డిగ్రీ కళాశాల విద్యార్థులు

రహదారిపై వంటావార్పుతో నిరసన

హెచ్‌బీకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: శ్మశానవాటిక అభివృద్ధిని దేవాదాయ శాఖ, రెవెన్యూ అధికారులు అడ్డుకోవద్దని కొత్తవెంకోజీపాలెం గ్రామసేవా సంఘం, పాతవెంకోజీపాలెం గ్రామస్థులు, శ్రీ సీతారామా సంఘం సభ్యులు మూడో రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. శ్మశాన వాటికకు వెళ్లే మార్గం వద్ద ఆయా సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు బుధవారం నల్లరిబ్బన్లు ధరించి, వంటావార్పు చేసి నిరసన తెలిపారు. మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు ఆడారి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పీలా ప్రేమ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలుపుతున్న గ్రామ సంఘం సేవా కమిటీల సభ్యులు

పోలీసులకు స్టాపర్ల అందజేత

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్‌ఆర్) జరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం మెడికవర్ సెంటర్ హెడ్ డాక్టర్ అరుణ్‌కుమార్ 30 స్టాపర్లను మూడో పట్టణ సీఐ అమ్మినాయుడుకు అందజేశారు. మిలన్-2026 సందర్భంగా ఇటీవల బీచ్ రోడ్‌లో ట్రాఫిక్ సమస్యలు అధికం కావడంతో వీటిని అందజేసినట్లు తెలిపారు.

స్టాపర్లతో మూడో పట్టణ సీఐ అమ్మినాయుడు, డాక్టర్ అరుణ్‌కుమార్

డిజిటల్ యుగంలో సోషల్ మీడియా పాత్ర కీలకం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: డిజిటల్ యుగంలో సోషల్ మీడియా కీలకపాత్ర పోషిస్తోందని విశాఖ పోస్టుమాస్టర్ జనరల్ వి.ఎస్.జయశంకర్ అన్నారు. ఎంవీపీ కాలనీ పోస్టల్ శాఖలో బుధవారం సోషల్ మీడియా కార్యశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమకాలీన డిజిటల్ కమ్యూనికేషన్ నైపుణ్యాలు పోస్టల్ అధికారులకు అందించడం, ప్రజలతో అనుసంధానం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. సాఫ్ట్ స్కిల్స్ నిపుణుడు చల్లా కృష్ణవీర్ అభిషేక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రభుత్వం తమ సేవలను సమర్థవంతంగా చేరవేయాలంటే కథనం, విజువల్ కంటెంట్ విలువ ఆధారిత వినియోగం ఎంతో ముఖ్యమన్నారు. పోస్టల్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్లు కె.వి.డి.సాగర్, ఆర్.నవీన్‌కుమార్, సోషల్ మీడియా ప్రతినిధి సుష్మిత, పోస్టల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో పోస్టుమాస్టర్ జనరల్ వి.ఎస్.జయశంకర్, సాఫ్ట్‌స్కిల్స్ నిపుణుడు చల్లా కృష్ణవీర్ అభిషేక్

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : మహిళలు స్వీయ ఆరోగ్యంతో పాటు, కుటుంబ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్త్రీల వైద్యనిపుణులు ఆళ్ల లీలావతి అన్నారు. బుధవారం జగదాంబకూడలి సమీప సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ఆవరణలో లీ ఫార్మ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ లీలావతి పర్యవేక్షణలో స్థానిక షాపింగ్ మాల్స్, దుకాణాల్లో పని చేస్తున్న మహిళలకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, నిర్వాహకులు రాధిక, సరోజిని, జయలక్ష్మి, మాధురి, క్రాంతి, భాగ్యలత, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనలో పాల్గొన్న వైద్యురాలు లీలావతి, తదితరులు

జనావాసాల్లోకి వన్యప్రాణులు...!

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : కంబాలకొండ అటవీ ప్రాంతంలో స్వేచ్ఛగా తిరిగే జింకలు, కొండగొర్రెలు తరచూ విశాఖ వ్యాలీ పాఠశాల సమీప రహదారిపైకి, విశాలాక్షినగర్ కొండ చివర, ఇందిరానగర్ జనావాసాల్లో వస్తున్నాయి. కొన్నిసార్లు అవి రోడ్డు దాటేటప్పుడు వాహనాలు ఢీకొట్టడంతో ప్రమాదాల బారిన పడుతున్నాయి. బుధవారం ఓ కొండగొర్రె ప్రధాన రహదారిపైకి వచ్చేసింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. రక్షణ కంచె ఏర్పాటు చేయడంతో పాటు, జీవులకు అవసరమైన తాగునీటి సదుపాయం కల్పించాలని వన్యప్రాణి ప్రేమికులు కోరుతున్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ఆరిలోవ, న్యూస్‌టుడే : ఆరిలోవ సబ్‌స్టేషన్ పరిధి 11 కేవీ కృష్ణాపురం ఫీడర్ (హెల్త్ సిటీ) నిర్వహణ, మరమ్మతుల నేపథ్యంలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని జోన్-3 ఈఈ బి.సింహాచలంనాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. హెల్త్‌సిటీతో పాటు పరిసర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

ఎం.ఎం.టి.సి.కాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: వుడా లక్ష్మీనగర్ 11కేవీ విద్యుత్తు ఫీడర్‌లో మరమ్మతులు చేపట్టనున్నందున గురువారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-1 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. అంబేడ్కర్‌కాలనీ, రామాలయం వీధి, టీఎస్సాఆర్ అపార్ట్‌మెంట్స్, శివాలయం ప్రాంతం, దుర్గాదేవి ఆలయం, ఇసుకతోట ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

ప్రత్యేక రైళ్ల గడువు పొడిగింపు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పలు ప్రత్యేక రైళ్ల గడువు పొడిగించనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. ✦ మార్చి 2 నుంచి 30 వరకు చర్లపల్లి- భువనేశ్వర్ న్యూ(07165), మార్చి 3 నుంచి మార్చి 31 వరకు భువనేశ్వర్ న్యూ- చర్లపల్లి(07166), ఈనెల 28 నుంచి మార్చి 14 వరకు ప్రతి శనివారం చెన్నై ఎగ్మోర్- సంత్రాగచ్చి (06077), మార్చి 2 నుంచి 16 వరకు ప్రతి సోమవారం సంత్రాగచ్చి- చెన్నై ఎగ్మోర్ (06078), ఈనెల 22 నుంచి మార్చి 8 వరకు ఎంజీఆర్ చెన్నై సెంట్రల్- బరౌని (06039), ఈనెల 25 నుంచి మార్చి 11 వరకు బరౌని- ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (06040), ఈనెల 27న సికింద్రాబాద్-నెహర్లగన్ (07046), మార్చి 2న నెహర్లగన్- సికింద్రాబాద్ (07046) ప్రత్యేక రైళ్లు అందుబాటులో ఉంటాయన్నారు.

సెక్యూరిటీ ఎనలిస్ట్ కోర్సుకు ఆహ్వానం

భీమునిపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో సెక్యూరిటీ ఎనలిస్ట్ కోర్సులో మూడు నెలల ఉచిత శిక్షణకు స్త్రీ పురుషుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. 18-35 ఏళ్ల వయసున్న వారు అర్హులు. డిగ్రీ లేక డిప్లొమా కోర్సుల్లో ఉత్తీర్ణులై ఉండాలి. ఆసక్తి గల అభ్యర్థులు 9014758949 నంబర్‌లో సంప్రదించాలని పాలిటెక్నిక్ కళాశాల ప్రధానాచార్యులు డా.సి.హెచ్.మురళీకృష్ణ సూచించారు.

దివీస్‌లో మాక్‌డ్రిల్

చిప్పాడ (తగరపువలస), న్యూస్‌టుడే: చిప్పాడ దివీస్ ఫార్మా కంపెనీ భద్రతా విభాగం ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాల నివారణపై బుధవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. కర్మాగారాల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ వి.సురేశ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సిబ్బంది చేపట్టిన నమూనా విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

రాష్ట్రపతి పర్యటన సాగిందిలా..

సింధియా, న్యూస్‌టుడే: విశాఖ తీరంలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ యుద్ధ నౌకల సమీక్ష (ఐఎఫ్‌ఆర్) పాల్గొన్న భారత రాష్ట్రపతి పర్యటన వివరాలివి.. ★ ఉదయం 9.55 గంటలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చోళా బస కేంద్రం నుంచి బయల్దేరారు. ★ 9.57కు గౌరవ వందనం స్వీకరించి పరేడ్‌ను పరిశీలించారు. ★ 10.04కి నేవల్ జెట్టీలో ఐఎన్ఎస్ సుమేధ నౌకపై ఎక్కారు. ★ 10.08కు గౌరవ వందనం స్వీకరించారు. ★ 10.12కు నౌక బయలుదేరింది. ★ 10.33 నుంచి 10.52 వరకు నౌకపై నుంచే సముద్రంలో నౌకల విన్యాసాలు సమీక్షించారు. ★ 10.53 నుంచి 10.57 వరకు యుద్ధనౌకల సెయిలింగ్ పరేడ్‌ను వీక్షించారు. ★ 11.19 నుంచి 11.24 వరకు నమూనా ప్రదర్శనలను వీక్షించారు. ★ 11.45 నుంచి 11.48 వరకు ప్రత్యేక దళాలు తమ విన్యాసాలను ప్రదర్శించాయి. ★ 11.54 నుంచి 12.06 వరకు వాయుసేన విమానాల విన్యాసాలు జరిగాయి. ★ మధ్యాహ్నం 12.07 నుంచి జలాంతర్గాముల నుంచి రాష్ట్రపతి గౌరవ వందనం తీసుకున్నారు. ★ 12.09కి రాష్ట్రపతికి జ్ఞాపిక అందజేశారు. ★ 12.10 నుంచి రాష్ట్రపతి ప్రసంగించారు. ★ 12.36కి తిరిగి గౌరవ వందనం స్వీకరించారు. ★ 12.41కు రాష్ట్రపతి పర్యటించిన నౌక సుమేధ తిరిగి జెట్టీవైపు బయల్దేరింది. ★ 12.50కు రాష్ట్రపతి జెట్టీ దిగి ప్రత్యేక వాహనంలో బయల్దేరారు. ★1.00కి ఆమె నేవల్ ఎయిర్ స్టేషన్ నుంచి తిరుగుపయనమయ్యారు. ★ సీఎం చంద్రబాబు 1.30 గంటలకు విజయవాడ బయలుదేరి వెళ్లారు.

సందర్శకుల పుస్తకంలో సంతకం చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, చిత్రంలో సీఎం చంద్రబాబు

కనులపండువగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి నిత్య కల్యాణోత్సవం బుధవారం సింహగిరిపై కనులపండువగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొల్పి ప్రాతఃకాల పూజలు జరిపారు. దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయ వేడుకను జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

స్వామి, అమ్మవార్లు, నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు

అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : మధ్యప్రదేశ్‌లో జరిగిన 45వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్-2026 పోటీల్లో నగరానికి చెందిన ఆళ్ల నాగ వెంకట రామలక్ష్మి ప్రతిభ చూపారు. ఫిబ్రవరి 13 నుంచి 15 వరకు జరిగిన పోటీల్లో దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల నుంచి సుమారు 3 వేలకు పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. నాగవెంకట రామలక్ష్మి జావెలిన్ త్రో విభాగంలో రజత, షాట్‌పుట్‌లో కాంస్యం, 100 మీటర్ల పరుగు పోటీలో రజత పతకాలు సొంతం చేసుకున్నారు. బుధవారం నగరానికి వచ్చిన ఆమెను పలువురు క్రీడాకారులు, కోచ్‌లు అభినందించారు.

నేనూ అడివివరంలోనే చదువుకున్నా..

ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: 'నేనూ మీలాగే అడివివరం పాఠశాలలోనే తెలుగు మాధ్యమంలో చదువుకుని ఈ స్థాయికి ఎదిగాను. సాధించాలనే పట్టుదల, లక్ష్యంపై చిత్తశుద్ధి ఉంటే ఉన్నత స్థాయికి తప్పక ఎదుగుతారని ఆంధ్రా విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ అన్నారు. ఆయన బుధవారం అడివివరం జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఇష్టంతో కష్టపడి చదివితే భవిష్యత్తు బాగుంటుందన్నారు. అందుబాటులో ఉన్న సాంకేతికతను కొత్త విషయాలను తెలుసుకోవడానికి ఉపయోగించాలన్నారు. స్వయం పోర్టల్ ద్వారా ఐఐటీ ఆచార్యులు ప్రాథమిక స్థాయి తరగతులకు కూడా పాఠాలు బోధిస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్ మాట్లాడుతూ అడివివరం పాఠశాలలో చదివి దేశంలోనే అగ్రగామిగా ఉన్న ఏయూ వీసీగా రాజశేఖర్ ఎదిగిన తీరును విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీసీని సత్కరించారు.

విద్యార్థులకు సూచనలిస్తున్న ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్

20 నుంచి ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం మైదానంలో ఈనెల 20 నుంచి ఆర్‌ఎస్‌ఎస్ శాఖా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు భాజపా నేత కేతినేని సురేంద్రమోహన్ తెలిపారు. ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ఇటీవల కొందరు ఆర్‌ఎస్‌ఎస్ వాలంటీర్లపై దాడికి పాల్పడడం.. ఐఎఫ్‌ఆర్ కార్యక్రమం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకేనని వ్యాఖ్యానించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలు కొత్త కాదని, ఇక్కడి నుంచి ఆర్‌ఎస్‌ఎస్‌లో పనిచేసిన వారెందరో జాతీయ స్థాయికి ఎదిగారన్నారు. నగరంలో ఐఎఫ్‌ఆర్ జరుగుతున్న నేపథ్యంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలు తాత్కాలికంగా నిలిపివేశామని, ఈ నెల 20వ తేదీ నుంచి యథాతథంగా కొనసాగుతాయన్నారు.

ఏయూ సమాచారం

గణిత శాస్త్ర విభాగంలో సెమినార్

మాట్లాడుతున్న ఆచార్య శ్రీనివాసరావు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జార్జియా వైద్య కళాశాలలోని 'లేబొరేటరీ ఫర్ థియరీ అండ్ మ్యాథమెటికల్ మోడలింగ్' డైరెక్టర్ ప్రొఫెసర్ అర్ని ఎస్.ఆర్.శ్రీనివాసరావు అతిథిగా విచ్చేసి వివిధ అంశాలపై ప్రసంగించారు. ప్రముఖ గణాంక శాస్త్రవేత్త సి.ఆర్.రావుతో కలిసి చేసిన తన పరిశోధనలను ఆయన గుర్తు చేసుకున్నారు. అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల నిర్వహణపై శిక్షణ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: భూగర్భ జలాల స్థిరత్వం, నిర్వహణ, విశాఖ అధ్యయనాలలో అక్విఫర్ మ్యాపింగ్ 2.0కు ప్రత్యేక ప్రాధాన్యత అనే అంశంపై ఏయూలో బుధవారం శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.వి.ఆర్.రామరాజు దీన్ని ప్రారంభించి ప్రసంగించారు. కేంద్ర భూగర్భ జల మండలి ఆంధ్రప్రదేశ్ యూనిట్ ఈ కార్యక్రమం నిర్వహించింది. ఆచార్య కె.సత్యనారాయణ రెడ్డి, ఆచార్య ఈ.ఎన్.ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆచార్య ఎం.వి.ఆర్.రాజు

టీటీఏలకు హాజరు అవసరం లేదా..!

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అతిథి అధ్యాపకులకు(టీటీఏ) కొన్ని రోజులుగా హాజరు పుస్తకం (అటెండెన్స్ రిజిస్టర్) అందుబాటులో ఉంచడం లేదని తెలిసింది. ఒప్పంద సహాయ ఆచార్యులకు సంబంధించిన హాజరు పుస్తకం ప్రతి రోజు ఉదయం 10.30 గంటలకు వీసీ పరిశీలనకు పంపిస్తున్నట్లు తెలిసింది. తాము సంతకం చేయడానికి సంబంధిత రిజిస్టర్‌ను అందుబాటులో ఉంచడం లేదని అతిథి అధ్యాపకులు అంటున్నారు. రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు వద్ద ఈ విషయం ప్రస్తావించగా టీటీఏలకు హాజరు పట్టిక అవసరం లేదన్నారు. వారు సెమిస్టర్ వారీగా తమకు కేటాయించిన తరగతులు బోధించి వెళ్లాల్సి ఉంటుందన్నారు. వారు తరగతులు బోధిస్తున్నారా, లేదా అనేది సంబంధిత విభాగాధిపతులు పర్యవేక్షిస్తుంటారన్నారు.

శతాబ్ది ఉత్సవాల నిర్వహణపై ప్రత్యేక సమావేశం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలు ఎలా నిర్వహించాలన్న విషయమై బోధనా సిబ్బందితో బుధవారం వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో సమావేశం జరిగింది. ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ సిబ్బంది అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఏప్రిల్ 26న శతాబ్ది ఉత్సవాల ముగింపు సదస్సు నిర్వహించాల్సి ఉంది. ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్రమోదీని పిలవాలని గత ప్రభుత్వంలో అప్పటి వీసీ ప్రధాన మంత్రి కార్యాలయానికి లేఖ రాశారు. ఈ విషయమై పలువురు వీసీ వద్ద ప్రస్తావించగా ఇంకా దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పినట్లు తెలిసింది. ఈ సమావేశానికి తమను దూరం చేయడమేమిటని బోధనేతర సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఏయూ పరిణామాలపై నేతల స్పందన

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆర్‌ఎస్‌ఎస్ ఎదుగుదలను సహించలేనివారు ఇటీవల దాడికి పాల్పడ్డారని ఆర్‌ఎస్‌ఎస్ మహానగర్ సంఘ చాలక్ పీవీ నారాయణరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలన్నీ చట్టానికి లోబడే ఉంటాయని పేర్కొన్నారు. ఎలాంటి హింసకు ఆర్‌ఎస్‌ఎస్ అవకాశం ఇవ్వబోదని ఆయన మరోమారు స్పష్టం చేశారు. ✦ కొందరు ముందస్తు ప్రణాళికతోనే ఈ దాడికి పాల్పడ్డారని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకట్‌గోపి ఓ ప్రకటనలో ఆరోపించారు. 'భారత మాతాకీ జై' అనడం దేశభక్తికి నిదర్శనమే తప్ప మతపరమైన చర్య కాదన్నారు. దాడికి పాల్పడిన వారిని శిక్షించాలన్నారు.

'మతోన్మాదశక్తులపై కఠినంగా వ్యవహరించాలి'

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: దాడిని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఎస్.ఎఫ్.ఐ.డబ్ల్యూ, డి.హెచ్.పి.ఎస్, ఏఐటీయూసీ తదితర సంఘాల నాయకులు ఓ ప్రకటనలో ఖండించారు. వీసీ మతోన్మాదశక్తుల పట్ల కఠినంగా వ్యవహరించకుంటే ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ✦ మూడు రోజులుగా ఏయూలో వివిధ పరిణామాలు చోటుచేసుకున్నాయని, దీనిపై ఏయూ యాజమాన్యం స్పందించి చర్యలు చేపట్టాలని ఎస్.ఎఫ్.ఐ. ఏయూ కమిటీ అధ్యక్షుడు డి.వెంకటరమణ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికారులతో చర్చలకు వెళ్లిన విద్యార్థులపై రౌడీ మూకలు దాడికి దిగాయని ఆరోపించారు.

PUBLIC NOTICE

Under the instructions of my client **M/S SHRIRAM FINANCE LIMITED, Maharani Peta Branch, Visakhapatnam,** I issue the following notice to general public. My client intends to grant loan to **SMT. BATTINA DURGA** D/o Appa Rao W/o David Paladi by keeping the below mentioned schedule property as security by way of Registered Mortgage. As such if any one have any claims, charges, mortgages Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices. Otherwise, later objections will not bind my client in this regard.

SCHEDULE OF THE IMMOVABLE PROPERTY

All that piece and parcel of vacant site measuring an extent of 733 Sq. yards or 615.72 Sq. meters in **AKSHAYA NAGAR** bearing Plot No.54, layout approved by VUDA vide LP No.61/2006, covered by S. nos. 68/2, 69, 70/1, & 72/1 of Tallavalasa Village and Panchayat, Bheemunipatnam Mandalam, Anandapuram Sub-District, Visakhapatnam district is measured and bounded by: **EAST:** Plot No.55; **SOUTH:** Others land; **WEST:** 40' wide road; **NORTH :** 40' wide road **Measurements: East to West on Northern side :** 60 feet or 18.30 meters; **East to West on Southern side:** 65 feet or 19.825 meters; **North to South :**105.5 feet or 32.025 meters

KODURI SREENIVASA RAO
SMT. SIVA KUMARI JALADI
Advocates,
S-2, Bharat Apartments, Behind Rythu Bazar
Seethammadhara, Visakhapatnam-13.
Visakhapatnam Dt18.02.2026
Mobile No.9885166648
Mail: sreenivaskoduri@gmail.com

(c) eenadu

విశాఖ ఉత్తరం

• విశాఖ ఉత్తరం • విశాఖ దక్షిణం

ప్రత్యేక రైళ్ల గడువు పొడిగింపు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పలు ప్రత్యేక రైళ్ల గడువు పొడిగించనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. ★ మార్చి 2 నుంచి 30 వరకు చర్లపల్లి- భువనేశ్వర్ న్యూ(07165), మార్చి 3 నుంచి మార్చి 31 వరకు భువనేశ్వర్ న్యూ- చర్లపల్లి(07166), ఈనెల 28 నుంచి మార్చి 14 వరకు ప్రతి శనివారం చెన్నై ఎగ్మోర్- సంత్రాగచ్చి (06077), మార్చి 2 నుంచి 16 వరకు ప్రతి సోమవారం సంత్రాగచ్చి- చెన్నై ఎగ్మోర్ (06078), ఈనెల 22 నుంచి మార్చి 8 వరకు ఎంజీఆర్ చెన్నై సెంట్రల్- బరౌని (06039), ఈనెల 25 నుంచి మార్చి 11 వరకు బరౌని- ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (06040), ఈనెల 27న సికింద్రాబాద్-నెహర్లగన్ (07046), మార్చి 2న నెహర్లగన్- సికింద్రాబాద్ (07046) ప్రత్యేక రైళ్లు అందుబాటులో ఉంటాయన్నారు.

శతాబ్ది ఉత్సవాల నిర్వహణపై ప్రత్యేక సమావేశం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలు ఎలా నిర్వహించాలన్న విషయమై బోధనా సిబ్బందితో బుధవారం వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో సమావేశం జరిగింది. ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ సిబ్బంది అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఏప్రిల్ 26న శతాబ్ది ఉత్సవాల ముగింపు సదస్సు నిర్వహించాల్సి ఉంది. ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్రమోదీని పిలవాలని గత ప్రభుత్వంలో అప్పటి వీసీ ప్రధాన మంత్రి కార్యాలయానికి లేఖ రాశారు. ఈ విషయమై పలువురు వీసీ వద్ద ప్రస్తావించగా ఇంకా దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పినట్లు తెలిసింది. ఈ సమావేశానికి తమను దూరం చేయడమేమిటని బోధనేతర సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

విశాఖ ఉత్తరం: 8008574796

విశాఖ దక్షిణం: 8008574977

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : ?: జీవీఎంసీ 30వ వార్డు జాలారిపేట రామాలయం వద్ద పేరుకుపోతున్న వ్యర్థాలను వారం రోజుల నుంచి తొలగించడం లేదు. తీవ్ర దుర్వాసనతో పాటు, దోమల బెడద ఎక్కువైంది. –దానమ్మ, స్థానిక మహిళ. ✓: సిబ్బందిని పంపి, శుభ్రత పనులు చేయిస్తాం. –శ్రీనివాసరావు, వార్డు పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్.

మాధవధార, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 50వ వార్డు అశోక్‌నగర్, విద్యానగర్‌లోని కాలువలు వ్యర్థాలతో నిండిపోయి మురుగు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. తీవ్ర దుర్వాసన వస్తోంది. – పి.రవికిరణ్ ✓: సిబ్బందిని పంపించి కాలువలను శుభ్రం చేయిస్తాం. – బి.సుధాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

నిర్వహణ కొరవడి... భవనాలు శిథిలమై..!

అధ్వానంగా అంగన్‌వాడీ కేంద్రాలు

అల్లిపురం, న్యూస్‌టుడే

విశాఖ దక్షిణం పరిధిలోని బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు వివిధ సేవలు అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల భవనాలకు సరైన నిర్వహణ లేక అధ్వానంగా మారాయి. కొన్ని శిథిలావస్థకు చేరుకోగా, మరికొన్ని అద్దె భవనాల్లోని ఇరుకిరుకు గదుల్లో కొనసాగుతున్నాయి. దీంతో సిబ్బంది, పూర్వ ప్రాథమిక విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఈ సమస్యపై పలు మార్లు ఫిర్యాదు చేసినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భూపేష్‌నగర్‌లో కొనసాగుతున్న కేంద్రం

ఇదీ పరిస్థితి...: » జీవీఎంసీ 34వ వార్డు జెండాచెట్టు సమీప భూపేష్‌నగర్‌లో అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతున్న అద్దె భవనం పైకప్పు పెచ్చులూడుతోంది. వర్షం కురిసినప్పుడల్లా నీరు లీకవుతోంది.

» నియోజకవర్గంలోని దాదాపు 15 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. లబ్ధిదారులు ఎక్కువ మంది వస్తుండడంతో... ఆయా భవనాల యజమానులు కొద్ది నెలలకే ఖాళీ చేయిస్తున్నారని అంగన్‌వాడీ కార్యకర్తలు వాపోతున్నారు. మిగిలిన కేంద్రాలు ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయి.

» జీవీఎంసీ 33, 29వ వార్డుల్లో సామాజిక భవనాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను ఖాళీ చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు ఒత్తిడి చేయడంతో.. నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు.

» కేంద్రాల నిర్వహణ అధ్వానంగా ఉండడంతో పాటు, సరిపడా సిబ్బంది లేక సకాలంలో సేవలు అందడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. ఆయా సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

» విశాఖ దక్షిణం పరిధిలో మొత్తం 71 కేంద్రాలు ఉన్నాయి. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు మొత్తం 9,766 మంది లబ్ధి పొందుతున్నారు.

» **అభివృద్ధి పనులపై దృష్టి:** ప్రభుత్వ, కార్పొరేట్ సంస్థల సీఎస్ఆర్ నిధులతో అవసరమైన అంగన్‌వాడీ కేంద్రాల్లో అభివృద్ధి పనులు చేయిస్తాం. ఎంపీ నిధులతో అంగడిదిబ్బ ప్రాంతంలోని కేంద్రాన్ని పునరుద్ధరించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అద్దె భవనాలకు సకాలంలోనే అద్దె రుసుము చెల్లిస్తున్నాం. వాటికి సొంత భవనాలు నిర్మించాలని ప్రభుత్వానికి నివేదించాం. –నీలిమ, సీడీపీఓ

ఐసీఏఐ నూతన కార్యవర్గం ఎన్నిక

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) విశాఖపట్నం బ్రాంచి 2026-27 సంబంధించి నూతన కార్యవర్గాన్ని బుధవారం పిఠాపురంకాలనీలో ఐసీఏఐ భవన్‌లో ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా పట్నాల లోకేశ్, వైస్‌ఛైర్మన్‌గా నెమ్మది రాము నాయుడు, కార్యదర్శిగా ఎంఎల్‌డీ ఉజ్వల, కోశాధికారిగా మొగలపల్లి పి. గురుమూర్తి, విద్యార్థుల సమాఖ్య అధ్యక్షుడిగా కె.రాంబాబు, సంపాదకుడిగా డి. లీలావరప్రసాద్, కార్యవర్గ సభ్యుడిగా శ్రీధర్ అందవరపు, ఎక్స్‌అఫిషియో కార్యవర్గ సభ్యుడిగా డి.ప్రసన్నకుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ సంతోష్ మాట్లాడుతూ సీఏల వృత్తి అభివృద్ధి కోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు పలువురు సీఏలు పాల్గొని అభినందనలు తెలిపారు.

నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

● జిల్లా వెయింట్ లిఫ్టింగ్ సంఘం మాజీ అధ్యక్షుడి కన్నుమూత

కంచరపాలెం, న్యూస్‌టుడే : జిల్లా వెయిట్ లిఫ్టింగ్ సంఘం మాజీ అధ్యక్షుడు మళ్ల ఈశ్వరరావు (75) బుధవారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఈ సందర్భంగా వెయిట్ లిఫ్టింగ్ సంఘం ప్రతినిధులు కె.సూర్యనారాయణ, ఎస్. కేశవ, పి. వెంకటేశ్వరరావు, ఎన్.జి.నాయుడు, రత్నాకర్, కె.వి.రమణ తదితరులు సంతాపం ప్రకటించారు.

● తపాలా కార్యాలయం పని వేళల్లో మార్పు

మురళీనగర్: జీవీఎంసీ 50వ వార్డు మాధవధార మాధవ యువజన సమాజం సమీపంలోని మురళీనగర్ తపాలా కార్యాలయం పని వేళల్లో స్వల్ప మార్పులు చేశారు. ఉదయం 9 గంటలకు బదులుగా 10 గంటలకు పనివేళలు ప్రారంభం కానున్నాయి. మధ్యాహ్నం 2 గంటల వరకు సేవింగ్స్ ఖాతాల నగదు, చెక్కులు, సాయంత్రం 3.30 వరకు రిజిస్టర్ పోస్టులు స్వీకరిస్తారు.

రైతుబజార్‌లో ఆగని ప్లాస్టిక్ సంచుల వినియోగం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: పర్యావరణానికి హానికరమైన ప్లాస్టిక్ సంచుల వినియోగం నరసింహనగర్‌లోని రైతుబజార్‌లో విచ్చలవిడిగా సాగుతోంది. రైతుబజార్లలో ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రభుత్వం నిషేధించింది. దీనిపై బజార్ ఏఈ, సిబ్బంది కనీసం కన్నెత్తి కూడా చూడకపోవడం గమనార్హం. రైతులు, పువ్వులు విక్రయించేవారు, డ్వాక్రా దుకాణాల వ్యాపారులు అందరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సంచుల్ని అధికంగా వినియోగిస్తున్నారు. బజార్‌లో మొత్తం 152 దుకాణాలు ఉన్నాయి. వీరంతా ప్లాస్టిక్ సంచులు వినియోగిస్తే అధికమొత్తంలో ప్లాస్టిక్ వ్యర్థాలు వెలువడే అవకాశముందని కొంతమంది వినియోగదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి వీటిని అరికట్టాలని కోరుతున్నారు.

పువ్వులను ప్లాస్టిక్ సంచుల్లో ఉంచి విక్రయిస్తున్న దృశ్యం

ఎరుకుమాంబకు జలాభిషేకం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: దొండపర్తి సమీపంలోని ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పరిసర ప్రాంతాల్లోని భక్తులు పసుపు కుంకుమ కలిపిన జలాలతో 1 నుంచి 116, 516 బిందెలతో వారి మొక్కుల మేరకు అమ్మవారికి అభిషేకం చేశారు. ఆలయం ప్రధాన అర్చకులు శ్రీనివాస్‌శర్మ మంత్రోచ్ఛారణ నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ఈవో సురేష్ బాబా దగ్గరుండి పర్యవేక్షించారు.

అమ్మవారికి అభిషేకం చేస్తున్న భక్తులు

ఆలయాల నూతన కమిటీ ఎన్నిక

కొత్తగా ఎంపికైన ఆలయ కమిటీ ప్రతినిధులతో జనసేన ఇన్‌ఛార్జి పసుపులేటి ఉషాకిరణ్, భాజపా నాయకురాలు శ్యామలాదీపిక తదితరులు

కంచరపాలెం, న్యూస్‌టుడే: జాతీయ రహదారి ఊర్వశికూడలి సమీపంలోని సంతోషిమాత, సాయిబాబా ఆలయాలకు నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ ఛైర్మన్‌గా వి.మాధవరావు, సభ్యులుగా ఎం.లక్ష్మి, ఎన్.పవన్‌కుమార్, జి.కనకమహాలక్ష్మి, పి.వసంతరాజు, ఎం.శ్రీనివాసరావు, డి.భాగ్యలక్ష్మి, డి.ఆదిలక్ష్మి, కె.సీతారాం ఎన్నికయ్యారు. వీరంతా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఉత్తరం జనసేన ఇన్‌ఛార్జి పసుపులేటి ఉషాకిరణ్, భాజపా నాయకురాలు శ్యామలాదీపిక, ఈఓ మూర్తి, 54వ వార్డు తెదేపా, జనసేన, భాజపా అధ్యక్షులు కుట్టా కార్తిక్, భాస్కర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : మహిళలు స్వీయ ఆరోగ్యంతో పాటు, కుటుంబ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్త్రీల వైద్యనిపుణులు ఆళ్ల లీలావతి అన్నారు. బుధవారం జగదాంబకూడలి సమీప సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ఆవరణలో లీ ఫార్మ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ లీలావతి పర్యవేక్షణలో స్థానిక షాపింగ్ మాల్స్, దుకాణాల్లో పని చేస్తున్న మహిళలకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, నిర్వాహకులు రాధిక, సరోజిని, జయలక్ష్మి, మాధురి, క్రాంతి, భాగ్యలత, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనలో పాల్గొన్న వైద్యురాలు లీలావతి, తదితరులు

రాష్ట్రపతి పర్యటన సాగిందిలా..

సందర్శకుల పుస్తకంలో సంతకం చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, చిత్రంలో సీఎం చంద్రబాబు

సింధియా, న్యూస్‌టుడే: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బోట్ హౌస్ బస కేంద్రం నుంచి ఉదయం 9.55 గంటలకు బయల్దేరారు. ఉదయం 9.57కు గౌరవ వందనం స్వీకరించి పరేడ్‌ను పరిశీలించారు. ఉదయం 10.04కి నేవల్ జెట్టీలో ప్రత్యేకించి ఏర్పాటు చేసిన ఐఎన్ఎస్ సుమేధ నౌకపైకి వెళ్లారు. 10.33 నుంచి 10.52 వరకు నౌకపై నుంచే సముద్రంలో నౌకలను సమీక్షించారు. 10.53 నుంచి 10.57 వరకు యుద్ధనౌకల సెయిలింగ్ పరేడ్‌ను వీక్షించారు. 11.19 నుంచి 11.24 వరకు నమూనా ప్రదర్శనలను వీక్షించారు. 12.07 నుంచి జలాంతర్గాముల నుంచి రాష్ట్రపతి గౌరవ వందనం తీసుకున్నారు. 12.10 నుంచి రాష్ట్రపతి ప్రసంగించారు. 12.50కు రాష్ట్రపతి జెట్టీ దిగి ప్రత్యేక వాహనంలో నేవల్ ఎయిర్‌స్టేషన్‌కు బయల్దేరారు.

ఘనంగా వీడ్కోలు: ఫ్లీట్ రివ్యూ అనంతరం నేవల్ ఎయిర్ స్టేషన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు మధ్యాహ్నం 1 గంటకు ఘనంగా వీడ్కోలు పలికారు. వీడ్కోలు పలికిన వారిలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, కలెక్టర్ హరేందిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు విజయవాడ బయలుదేరి వెళ్లారు. విశాఖ విమానాశ్రయంలో సీఎంకు అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు.

నేనూ అడివివరంలోనే చదువుకున్నా..

ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: 'నేను మీలాగే అడివివరం పాఠశాలలోనే తెలుగు మాధ్యమంలో చదువుకుని ఈ స్థాయికి ఎదిగాను. సాధించాలనే పట్టుదల, లక్ష్యంపై దృష్టి ఉంటే ఉన్నత స్థాయికి తప్పక ఎదుగుతారని' ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ అన్నారు. ఆయన బుధవారం అడివివరం జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఇష్టంతో కష్టపడి చదివితే భవిష్యత్తు బాగుంటుందన్నారు. అందుబాటులో ఉన్న సాంకేతికతను కొత్త విషయాలను తెలుసుకోవడానికి ఉపయోగించాలన్నారు. స్వయం పోర్టల్ ద్వారా ఐఐటీ ఆచార్యులు ప్రాథమిక స్థాయి తరగతులకు కూడా పాఠాలు బోధిస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమకుమార్ మాట్లాడుతూ అడివివరం పాఠశాల పూర్వ విద్యార్థి దేశంలోనే అగ్రగామిగా ఉన్న ఏయూ వీసీగా రాజశేఖర్ ఎదిగిన తీరును విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీసీని సత్కరించారు.

విద్యార్థులకు సూచనలిస్తున్న ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్

కనులపండువగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి నిత్య కల్యాణోత్సవం బుధవారం సింహగిరిపై కనులపండువగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొల్పి ప్రాతఃకాల పూజలు జరిపారు. దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆసీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయ వేడుకను జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

స్వామి, అమ్మవార్లు, నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు

గణిత శాస్త్ర విభాగంలో సెమినార్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జార్జియా వైద్య కళాశాలలోని 'లేబొరేటరీ ఫర్ థియర్ అండ్ మ్యాథమెటికల్ మోడలింగ్' డైరెక్టర్ ప్రొఫెసర్ అర్ని ఎస్.ఆర్.శ్రీనివాసరావు అతిథిగా విచ్చేసి వివిధ అంశాలపై ప్రసంగించారు. ప్రముఖ గణాంక శాస్త్రవేత్త సి.ఆర్.రావుతో కలిసి చేసిన తన పరిశోధనలను ఆయన గుర్తు చేసుకున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

సీతంపేట, న్యూస్‌టుడే: సీతమ్మధార గాంధీనగర్‌లో డాక్టర్ రహమతుల్లా క్లినిక్ వద్ద బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 180 మంది వైద్య సేవలు పొందారు. మధుమేహం, థైరాయిడ్, యూరిక్ యాసిడ్, ఈసీజీతో పాటు అరుదైన బీఎండీ, హెచ్‌బీ ఏ1 సీ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ రహమతుల్లా, ఎన్. లక్ష్మణరావు, జె. మురళీకృష్ణ, శ్రీరామమూర్తి, ఎస్. శివప్రసాద్, జి.ఎస్. కుమారి, విశ్వనాథం తదితరులు సహకారం అందించారు.

శిబిరానికి హాజరైన ప్రజలు

● పైపులైన్ పగిలే.. నీరంతా పోయే..!

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : జీవీఎంసీ 31వ వార్డు లక్ష్మీస్ట్రీట్ డీఎల్ఎన్‌రాజు ప్లాజా అపార్ట్‌మెంట్ ఎదురుగా ఉన్న తాగునీటి పైపులైన్ పగిలిపోయి నీరంతా వృథాగా పోతోంది. వారం రోజుల కిందట భూగర్భ విద్యుత్తు తీగల ఏర్పాటుకు తవ్వకాలు జరిపారు. ఆ సమయంలో పైపులైన్ పగిలిపోయి, నీరంతా నేలపాలవుతోంది. దీంతో స్థానిక నివాసాలకు పూర్తిస్థాయిలో సరఫరా జరగడం లేదు. ఈ సమస్యపై ఫిర్యాదు చేసినా... ఎవరూ పట్టించుకోవడం లేదని నివాసితులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి... సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

● వీధి కుక్కల స్వైర విహారం

మాధవధార, న్యూస్‌టుడే: జీవీఎంసీ 49, 50వ వార్డుల్లోని మురళీనగర్, వర్మా కాంప్లెక్స్, ఎన్‌జీజీఓఎస్ కాలనీల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రహదారులపై గుంపులుగా సంచరిస్తూ వాకర్స్, వాహన చోదకులపై దాడులకు దిగుతున్నాయి. ఇళ్లల్లో నుంచి బయటకు రావాలంటే కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. వాహన చోదకులు, చిన్నారులు, మహిళలు, వృద్ధులపై నిత్యం దాడికి పాల్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకి వీటి సంతతి విపరీతంగా పెరిగిపోతోందని, తక్షణమే జీవీఎంసీ వెటర్నరీ విభాగం అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మురళీనగర్‌లో సంచరిస్తున్న వీధి కుక్కలు

రంజాన్ మాసం.. సద్గుణాల ధామం..

మాధవధార, న్యూస్‌టుడే: ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్ నెల గురువారం నుంచి ప్రారంభం కానున్నది. బుధవారం రాత్రి నెలవంక కనపడటంతో ప్రత్యేక నమాజ్‌లు చేసి అనంతరం ఉపవాస దీక్షలు ప్రారంభించనున్నట్లు ముస్లిం పెద్దలు చెబుతున్నారు. ఆధ్యాత్మిక భావన నింపే మాసంగా రంజాన్ నెలను భావిస్తారు. శాంతి, సౌభ్రాతృత్వాన్ని లోకానికి చాటడం ఈ మాసం ప్రత్యేకం. ఉత్తరం నియోజకవర్గంలోని మర్రిపాలెం, మురళీనగర్, ముస్లిం తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం పరిసర ప్రాంతాల్లో అత్యధిక ముస్లింలు ఉన్న ప్రాంతాల్లోని మసీదులను ముస్తాబు చేసి, నమాజ్‌లకు సిద్ధమయ్యారు.

విద్యుత్తు అలంకరణలో మర్రిపాలెంలోని మసీదు

» **పండగ వాతావరణం:** ఇస్లాం మత పంచసూత్రాలైన ఇమాన్, నమాజ్ ఉపవాస దీక్ష, జకాత్, హజ్‌లలో చాలా వాటిని ఆచరణాత్మకంగా నిరూపించుకొనే అవకాశం ఈ మాసంలో లభిస్తుంది. ఖురాన్ సూచించిన విధంగా నెల రోజులు పాటు ఉపవాస దీక్ష చేస్తారు. మొదటి పది రోజులు దేవుని కృప కోసం, తర్వాత పది రోజులు పాపాల క్షమాపణకు, చివరి పది రోజులు విముక్తి కోసం ప్రార్థనలు, ఉపవాస దీక్షలు చేస్తారు. రంజాన్ నెలలో ముస్లింలంతా దైవ చింతనతో, పవిత్ర ఖురాన్ గ్రంథ పఠనంతో గడుపుతారు. పగలంతా ఉపవాస దీక్షలు చేయడం, రాత్రుళ్లు ప్రత్యేక నమాజ్‌లలో పాల్గొంటారు. వేకువజామున సహర్, సాయంత్ర ఇఫ్తార్ నిర్వహిస్తారు. ప్రతి రోజూ ఐదుసార్లు నమాజ్‌తో పాటు అదనంగా రంజాన్‌లో తరావీ ప్రత్యేకంగా ఆచరిస్తారు.

» **జకాత్ పేరుతో:** ఈ మాసంలో ఒక మంచి కార్యం చేస్తే 70 రెట్లు పుణ్యఫలం లభిస్తుందన్న ప్రవక్త మహమ్మద్ బోధనలను అనుసరించి ముస్లింలు పెద్దఎత్తున దానధర్మాలు చేస్తారు. తమ స్థిర, చరాస్తులు, సంపాదనలో 2.5 శాతం మొత్తాన్ని జకాత్ పేరుతో పేదలకు పంచిపెడతారు. దానం పాప పరిహారమని, పాప విముక్తికి మార్గమంటారు. ఆర్థిక స్థోమత ఉన్న ప్రతి ఒక్కరూ నమాజ్ ముందు రెండున్నర కిలోల గోధుమల ధరను ఫిత్రాగా అందిస్తారు.

డిజిటల్ యుగంలో సోషల్ మీడియా వాడకం కీలకం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: డిజిటల్ కమ్యూనికేషన్ యుగంలో సోషల్ మీడియా వినియోగం కీలక పాత్ర పోషిస్తోందని విశాఖ పోస్టుమాస్టర్ జనరల్ వి.ఎస్. జయశంకర్ అన్నారు. ఎంవీపీ కాలనీ పోస్టల్ శాఖలో బుధవారం సోషల్ మీడియా కార్యశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమకాలీన డిజిటల్ కమ్యూనికేషన్ నైపుణ్యాలు పోస్టల్ అధికారులకు అందించడం, ప్రజలతో అనుసంధానం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. సాఫ్ట్ స్కిల్స్ నిపుణుడు చల్లా కృష్ణవీర్ అభిషేక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రభుత్వం తమ సేవలను సమర్థవంతంగా చేరవేయాలంటే కథనం, విజువల్ కంటెంట్ విలువ ఆధారిత వినియోగం ఎంతో ముఖ్యమన్నారు. పోస్టల్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్లు కె.వి.డి.సాగర్, ఆర్.నవీన్‌కుమార్, సోషల్ మీడియా ప్రతినిధి సుష్మిత, పోస్టల్ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో పోస్టుమాస్టర్ జనరల్ వి.ఎస్.జయశంకర్, సాఫ్ట్‌స్కిల్స్ నిపుణుడు చల్లా కృష్ణవీర్ అభిషేక్

జనావాసాల్లోకి వన్యప్రాణులు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : కంబాలకొండ అటవీ ప్రాంతంలో స్వేచ్ఛగా తిరిగే జింకలు, కొండగొర్రెలు తరచూ విశాఖ వ్యాలీ పాఠశాల సమీప రహదారిపైకి, విశాలాక్షినగర్ కొండ చివర, ఇందిరానగర్ జనావాసాల్లో వస్తున్నాయి. కొన్నిసార్లు అవి రోడ్డు దాటేటప్పుడు వాహనాలు ఢీకొట్టడంతో ప్రమాదాల బారిన పడుతున్నాయి. బుధవారం ఓ కొండగొర్రె ప్రధాన రహదారిపైకి వచ్చేసింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. రక్షణ కంచె ఏర్పాటు చేయడంతో పాటు, జీవులకు అవసరమైన తాగునీటి సదుపాయం కల్పించాలని వన్యప్రాణి ప్రేమికులు కోరుతున్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

నాగవెంకట రామలక్ష్మి

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : మధ్యప్రదేశ్‌లో జరిగిన 45వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్-2026 పోటీల్లో నగరానికి చెందిన ఆళ్ల నాగవెంకట రామలక్ష్మి ప్రతిభ చూపారు. ఫిబ్రవరి 13 నుంచి 15 వరకు జరిగిన పోటీల్లో దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల నుంచి సుమారు 3 వేలకు పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. నాగవెంకట రామలక్ష్మి జావెలిన్ త్రో విభాగంలో రజత, షాట్‌పుట్‌లో కాంస్యం, 100 మీటర్ల పరుగు పోటీలో రజత పతకాలు సొంతం చేసుకున్నారు. బుధవారం నగరానికి వచ్చిన ఆమెను పలువురు క్రీడాకారులు, కోచ్‌లు అభినందించారు.

ఒరిజినల్ డాక్యుమెంట్స్ పోయినవి

గంగమ్మ పనిగ్రహి, W/o. గోపీనాథ్ పనిగ్రహి (లేటు) డోర్ నెం. 33-19-19, కల్రివారివీధి, అల్లిపురం, విశాఖపట్నం-530004 నందు నివాసం వుంటున్నాను. నా యొక్క ఇంటి ఒరిజినల్ డాక్యుమెంట్స్ 721/1984 మరియు 391/1938, తేది9-2-2026న మా ఇంటి వద్ద నుండి Xerox Shopకి నడుచుకొని వెళ్లుచుండగా బ్యాగ్ జారిపోయినది. ఎవ్వరికైనా దొరికినచో ఈ నెంబర్లకు సంప్రదించగలరు.

8919793954, 8125229407

● సాహిత్య సేవలో సహృదయ సాహితి

సీతంపేట, న్యూస్‌టుడే: సహృదయ సాహితి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో బుధవారం సాహిత్య సభ నిర్వహించారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ సహృదయ సాహితి 46వ వార్షికోత్సవం ఈనెల 20న సాయంత్రం 6 గంటలకు విశాఖ పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్నామన్నారు. ఇప్పటివరకు 3543 సదస్సులు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సీహెచ్ చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణ మూర్తి, అయ్యల సోమయాజుల ప్రసాద్, పరమేశ్వరరావు, కొత్తూరు రమణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

సెక్యూరిటీ ఎనలిస్ట్ కోర్సులో శిక్షణకు ఆహ్వానం

భీమునిపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో భీమిలి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో సెక్యూరిటీ ఎనలిస్ట్ కోర్సులో మూడు నెలల ఉచిత శిక్షణకు స్త్రీ పురుషుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. 18-35 ఏళ్ల వయసున్న వారు అర్హులు. డిగ్రీ లేక డిప్లొమా కోర్సుల్లో ఉత్తీర్ణులై ఉండాలి. ఆసక్తి గల అభ్యర్థులు 9014758949 నంబర్‌లో సంప్రదించాలని పాలిటెక్నిక్ కళాశాల ప్రధానాచార్యులు డా.సి.హెచ్.మురళీకృష్ణ సూచించారు.

20 నుంచి ఆర్ఎస్ఎస్ కార్యక్రమాలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం మైదానంలో ఈనెల 20 నుంచి ఆర్ఎస్ఎస్ శాఖా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు భాజపా నేత కేతినేని సురేంద్రమోహన్ తెలిపారు. ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ఇటీవల కొందరు ఆర్ఎస్ఎస్ వాలంటీర్లపై దాడికి పాల్పడడం.. ఐఎఫ్ఆర్ కార్యక్రమం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకేనని వ్యాఖ్యానించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఆర్ఎస్ఎస్ కార్యక్రమాలు కొత్త కాదని, ఇక్కడి నుంచి ఆర్ఎస్ఎస్‌లో పనిచేసిన వారెందరో జాతీయ స్థాయికి ఎదిగారన్నారు. నగరంలో ఐఎఫ్ఆర్ జరుగుతున్న నేపథ్యంలో ఆర్ఎస్ఎస్ కార్యక్రమాలు తాత్కాలికంగా నిలిపివేశామని, ఈ నెల 20వ తేదీ నుంచి యథాతథంగా కొనసాగుతాయన్నారు.

శ్రద్ధాంజలి

శ్రీ మళ్ళ ఈశ్వరరావు గారు

తేది: 18-02-2026 మధ్యాహ్నం 12.30 ని॥లకు స్వర్గస్తులైనారని తెలియజేయుటకు చింతిస్తున్నాము.

ఇట్లు

భార్య: మళ్ళ ఈశ్వరమ్మ మరియు కుటుంబ సభ్యులు

కీ॥శే॥ మళ్ళ ఈశ్వరరావు గారు

Ex-President: District Weight Lifting
Ex. Ambedkar Boxing Club President
Ex. City Congress General Secretary

జననం: 2-5-1947 మరణం: 18-02-2026

అంత్యక్రియలు: తేది: 19-02-2026 గురువారం ఉ॥ 10.00 గం॥లకు మా స్వగృహము నుండి అంతిమయాత్ర బయలుదేరును. కంచరపాలెం, బర్మాకాలనీ, బరియల్ గ్రౌండ్ నందు.

సెల్: 8978281093, 9848266463

గాజువాక

• గాజువాక • విశాఖ పశ్చిమం

పాఠశాల ఉపాధ్యాయులకు చెక్కును అందజేస్తున్న సీకే జాంగ్

పాఠశాల అభివృద్ధికి సాయం

కరాస, న్యూస్‌టుడే : ఎల్.జీ ఇండియా సీఎస్ఆర్ ఫౌండేషన్‌లో డైరెక్టర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా సీకే జాంగ్ ప్రభుత్వ పాఠశాలకు తనవంతు బాధ్యతగా ఆర్థికంగా సాయం చేసి తన సేవాభావాన్ని చాటుకున్నారు. బుధవారం వెంకటాపురంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను సందర్శించి ప్రధానోపాధ్యాయులకు రూ.50 వేల చెక్కును విరాళంగా అందజేశారు.

భిన్నత్వంలో ఏకత్వమే భారత్ ప్రత్యేకత

సింధియా, న్యూస్‌టుడే: భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశం ప్రత్యేకత అని సెయింట్ ఆన్స్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ సిస్టర్ ప్రేమకుమారి అన్నారు. సేలం పెరియార్ యూనివర్సిటీలో జరిగిన జాతీయ సమగ్రత శిబిరంలో జరిగిన పోటీల్లో రాష్ట్ర సాంస్కృతిక అంశాలపై డిగ్రీ ఎన్ఎస్ఎస్ వాలంటీరు కొండా ఎస్తేరు రాణి పాల్గొని ప్రతిభ చూపినందుకు అభినందించారు. జిల్లా జాతీయ సేవా పథకం నోడల్ అధికారిణి ఈపీఎస్ భాగ్యలక్ష్మి, కాలేజీ పీవో అనసూయాదేవి పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన వాలంటీరు కొండా ఎస్తేరు రాణికి ప్రశంసాపత్రం ఇస్తున్న ప్రిన్సిపల్ ప్రేమకుమారి

సంఘాల నిర్వహణ.. పథకాలపై అవగాహన

డ్వాక్రా మహిళలకు ప్రత్యేక శిక్షణ

గాజువాక, న్యూస్‌టుడే : వార్డుల వారీగా మహిళా స్వయం సహాయక బృందాలను బలోపేతం చేయడానికి మహావిశాఖ నగరపాలక సంస్థ(జీవీఎంసీ) పట్టణ సామాజికాభివృద్ధి విభాగం (యూసీడీ) నడుంబిగించింది. ఇప్పటికే అక్షరాంధ్ర కార్యక్రమం పేరుతో వార్డుల్లో రిసోర్సు పర్సన్లు, హెచ్ఆర్‌పీలు నిరక్షరాస్యులైన మహిళలకు చదువు నేర్పిస్తుండగా.. ఇప్పుడు సంఘాల నిర్వహణ, బ్యాంకు లింకేజీ రుణాల వినియోగం, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలపై అవగాహన కలిగిస్తున్నారు. మెప్మా, డీఆర్‌డీఏ, యూసీడీ అధికారులు బృందాలుగా వీడి మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. దీనివల్ల మహిళల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు వీలుంటుందని చెబుతున్నారు.

మహిళలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఒక్కో అడుగు ముందుకు: ఇరవై వార్డులతో విస్తరించి ఉన్న గాజువాకలో స్వయం సహాయక బృందాలు(డ్వాక్రా) 8257 వరకూ ఉన్నాయి. మొత్తం సభ్యులు 84,162 మంది ఉండగా, స్లమ్ లెవల్ ఫెడరేషన్లు 247, రిసోర్సు పర్సన్లు 247 మంది ఉన్నారు. వీరు మహిళా సంక్షేమ కార్యక్రమాలు, యూసీడీ కార్యకలాపాల్లో పాలుపంచుకుంటున్నారు. ప్రతి గ్రూపులోనూ 12 నుంచి 15 మంది సభ్యులు ఉంటారు. అయితే సంఘాల నిర్వహణ, అజెండా రూపకల్పన, సమావేశాల ఏర్పాట్లతో అనేకమంది మహిళలు నేటికీ పరిణితి చెందలేకపోతున్నట్లు గుర్తించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి గ్రూపునకు అవగాహన కలిగిస్తూ ప్రోత్సహిస్తున్నారు.

★ నేటికీ బ్యాంకు లింకేజీ రుణాలు పొందడం, పొదుపు ఖాతాల పక్కా నిర్వహణలో అనేకమంది వెనుకబడటంతో వారికోసం ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. గాజువాక జోనల్ కార్యాలయం, వార్డుల్లోని సామాజిక భవనాలు, కల్యాణ మండపాలను ఇందుకోసం వినియోగించుకుంటున్నారు. మహిళలకు ఉపయోగపడే పావలా వడ్డీకి రుణాలు, స్వయం ఉపాధి యూనిట్లకు సబ్సిడీతో కూడిన రుణాల విధివిధానాలను తెలియజేస్తున్నారు.

★ ఇప్పటికే పీఎం స్వానిధి పథకానికి 1213 మందిని ఎంపిక చేశారు. అలాగే తల్లికి వందనం పథకానికి 87వేల మందిని అర్హులుగా గుర్తించారు. మిగిలిన వారిని ఈ పథకంలో చేర్చడానికి, పథకం విశిష్టతను గ్రూపు సభ్యులకు అధికారులు తెలియజేస్తున్నారు. ఇవే కాకుండా అక్షరాంధ్ర కార్యక్రమంలో 1130 మందిని అక్షరాస్యులుగా చేయడంలో గ్రూపు లీడర్లు ముందు వరుసలో నిలిచారు. మరొకరిపై ఆధారపడకుండా ఎవరి గ్రూపు వారే పటిష్ట పర్చుకోవడానికి ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని యూసీడీ జోనల్ అధికారులు తెలిపారు. మహిళలు శిక్షణ తరగతులకు ఉత్సాహం చూపుతున్నారని, అనేక సంఘాలు క్రమశిక్షణతో కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

యువత ప్రతిభను పెంచుకోవాలి

ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నీలాపు విజయానందరెడ్డిని సత్కరిస్తున్న ప్రిన్సిపల్ సుధాకర్, అధ్యాపకులు

కూర్మన్నపాలెం (దువ్వాడ), న్యూస్‌టుడే : యువత ప్రతిభను అందిపుచ్చుకోవడంలో కీలక పాత్ర పోషించాలని ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నీలాపు విజయానందరెడ్డి అన్నారు. బుధవారం విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో 'ఇండస్ట్రీ ఇంటరాక్షన్ మీట్' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నైపుణ్యంతో కూడిన శిక్షణ ఇచ్చి ఉపాధి సాధించేలా యువతను తయారు చేయాలని సూచించారు. గురువారం కళాశాలలోనే మెగా జాబ్ మేళా జరగనున్నందున ఈ అంశంపై చర్చించారు. ఈ ఎంపిక ద్వారా 4,650 ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. బోర్డ్ ఆఫ్ అప్రెంటిస్‌షిప్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.రాజమణి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు, పలు పరిశ్రమల ప్రతినిధులు, కళాశాల ప్రిన్సిపల్ జె.సుధాకర్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా కాలభైరవస్వామి ఉత్సవం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : వాంబేకాలనీ వెంకటేశ్వర స్వామి ఆలయ సన్నిధిలో బుధవారం కాల భైరవస్వామి వారికి మహాభిషేకం, శాంతి హోమాలు ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ ధర్మకర్త మంజుల, ఛైర్మన్ డి.రమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కరాస, న్యూస్‌టుడే : జీవీఎంసీ 92వ వార్డు ఎస్సీ, బీసీ కాలనీలో కాలువల నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ పనులకు జీవీఎంసీ నుంచి రూ. 17 లక్షలు వినియోగిస్తున్నామని వార్డు సమన్వయకర్త దాడి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా వార్డు అధ్యక్షుడు అనంద్, సోములు, వర్మ, శ్రీను, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెంలో పలు అభివృద్ధి పనులకు బుధవారం భూమి పూజ జరిగింది. వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి కొబ్బరి కాయలు కొట్టి భూమిపూజ చేశారు. గ్రామంలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక నాయకులు, సచివాలయం సిబ్బందితో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గాజువాక, పెదగంట్యాడ

సమస్య : కణితిరోడ్డు కృష్ణానగర్, గోపాలరెడ్డినగర్‌లో కాలువలు అధ్వానంగా ఉన్నాయి. పూడిక నిండిన కాలువలను శుభ్రం చేయాలి. –అచ్యుతరావు, గోపాలరెడ్డినగర్, సనత్‌కుమార్, కణితిరోడ్డు

సమాధానం: సిబ్బందిని పంపి చర్యలు తీసుకుంటాం. –కిరణ్‌కుమార్, ఏఎంఓహెచ్

శివారులో దీపాలు వెలిగే..

స్పందనకు వందనం

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే: గాజువాక శివారులో పడకేసిన వీధి దీపాలను ఎట్టకేలకు జీవీఎంసీ సిబ్బంది పునరుద్ధరించారు. చినగంట్యాడ, వుడాకాలనీ, గొంతెనవానిపాలెంలో ఎల్ఈడీ దీపాలను మార్చారు.

సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి విరాళం

దాతకు నిత్యాన్నదాన పత్రాన్ని అందిస్తున్న ఈవో

అన్నవరం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు రూ.లక్ష విరాళాన్ని బుధవారం అందజేశారు. విశాఖపట్నం చినగంట్యాడకు చెందిన ఎస్.రాజాచంద్ర ఈ విరాళాన్ని ఇచ్చారు. దాతకు ఈవో వి.త్రినాథరావు నిత్యాన్నదాన పత్రాన్ని అందించి సత్యదేవుని ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

మల్కాపురం, న్యూస్‌టుడే: విద్యార్థులంతా చదువుతో పాటు ఆసక్తి ఉన్న రంగాల్లో ఉన్నతస్థాయిలో రాణించాలని నాంది ఫౌండేషన్ ప్రతినిధి ఉరుకూటి భారతి అన్నారు. యారాడ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న 71 మంది విద్యార్థులకు.. నాంది ఫౌండేషన్ సభ్యులు ఏకరూప దుస్తులు, క్రీడా కిట్లు, విద్యా సామగ్రి అందించారు. ప్రధానోపాధ్యాయులు నట్టి అప్పారావు, ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయుల బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులతో నాంది ఫౌండేషన్ సభ్యులు

ఉత్తమ క్రమశిక్షణతోనే రాణింపు

శ్రామికనగర్(గాజువాక), న్యూస్‌టుడే : విద్యార్థులు చదువుతోపాటు ఉత్తమ క్రమశిక్షణ అలవర్చుకుంటే భవిష్యత్తులో రాణించగలుగుతారని సెంచూరియన్ విశ్వ విద్యాలయం ఛాన్సలర్ జీఎస్ఎన్ రాజు అన్నారు. నడుపూరు రామచంద్రనగర్‌లోని ఎంవీఆర్ పీజీ కళాశాల వార్షికోత్సవం బుధవారం జరిగింది. జీఎస్ఎన్ రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. హెచ్‌పీసీఎల్ సీజీఎం పసుపులేటి హరిబాబు, ఫార్మా డైరెక్టర్ జె.సుబ్బారావు, నర్సింహం, కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ వి.రామారావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.బాలకృష్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వై.ఈశ్వరరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వేడుకను ప్రారంభిస్తున్న సెంచూరియన్ విశ్వ విద్యాలయం ఛాన్సలర్ రాజు, హెచ్‌పీసీఎల్ సీజీఎం హరిబాబు, తదితరులు

ఆలయ వార్షికోత్సవానికి ఏర్పాట్లు

అగనంపూడి: అగనంపూడి పరిధి డొంకాడ కాలనీవాసుల ఆరాధ్య దేవత శ్రీ దుర్గమాంబ ఆలయ 25వ వార్షికోత్సవం గురువారం జరగనుంది. ఈ మేరకు విస్తృత ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ ప్రతినిధులు దాసరి త్రినాథరావు, సన్యాసిరావులు తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశామని తెలిపారు.

రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: పెదగంట్యాడ పరిధి గాంధీనగర్, వినాయకనగర్ ఫీడర్ల నిర్వహణ పనుల కారణంగా ఈనెల 20న పలు చోట్ల విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-2 ఇ.ఇ. బీకే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటవరకూ చినదపూరు, సీతానగరం, బాలచెర్వు, వుడాకాలనీ, అయ్యప్పటెంపుల్ రోడ్డులో సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రత్యేక రైళ్ల గడువు పొడిగింపు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పలు ప్రత్యేక రైళ్ల గడువు పొడిగించనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. ★ మార్చి 2 నుంచి 30 వరకు చర్లపల్లి- భువనేశ్వర్ న్యూ(07165), మార్చి 3 నుంచి మార్చి 31 వరకు భువనేశ్వర్ న్యూ- చర్లపల్లి(07166), ఈనెల 28 నుంచి మార్చి 14 వరకు ప్రతి శనివారం చెన్నై ఎగ్మోర్- సంత్రాగచ్చి (06077), మార్చి 2 నుంచి 16 వరకు ప్రతి సోమవారం సంత్రాగచ్చి- చెన్నై ఎగ్మోర్ (06078), ఈనెల 22 నుంచి మార్చి 8 వరకు ఎంజీఆర్ చెన్నై సెంట్రల్- బరౌని (06039), ఈనెల 25 నుంచి మార్చి 11 వరకు బరౌని- ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (06040), ఈనెల 27న సికింద్రాబాద్- నెహర్లగన్ (07046), మార్చి 2న నెహర్లగన్- సికింద్రాబాద్ (07046) ప్రత్యేక రైళ్లు అందుబాటులో ఉంటాయన్నారు.

సామూహిక నృత్య ప్రదర్శన

గాజువాక, న్యూస్‌టుడే : కడప జిల్లా రాజంపేట తాళ్లపాకలో రెండురోజులుగా నిర్వహిస్తున్న నృత్య వేడుకలో గాజువాక కళారాధన డ్యాన్స్ మ్యూజిక్ అకాడమీ చిన్నారులు పాల్గొని అలరించారు. తాళ్లపాక అన్నమాచార్యుల కీర్తన 'ఒక పరి ఒకపరి' నృత్యాన్ని 333 మంది కళాకారులు ప్రదర్శించగా తమ అకాడమీ నుంచి 15 మంది బాలలు పాల్గొన్నారని నాట్యాచార్యుడు తాళ్లపాక సందీప్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిరాకిల్ వరల్డ్ రికార్డు, తెలుగు బుక్ రికార్డుల్లో చోటుదక్కించుకున్నారని కొనియాడారు. సర్టిఫికెట్లు పొందిన బాలలను ఆయన అభినందించారు.

పతకాలు సాధించిన బాలలు

సీపీఎం మహా ధర్నా

ధర్నాలో పాల్గొన్న సీపీఎం సభ్యులు

గాజువాక, న్యూస్‌టుడే: విశాఖ డెయిరీ పాలధరలకు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం జోన్ కమిటీ ఆధ్వర్యంలో పాతగాజువాక కూడలిలో ఆదివారం కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. డెయిరీ యాజమాన్యం తీరుకు వ్యతిరేకంగా నినదించారు. జోన్ కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ.. పాల ధరలను తరచూ పెంచుతూ పేదవర్గంపై భారం మోపడం మంచిపద్ధతి కాదన్నారు. నాయకులు రాజేంద్రప్రసాద్, బంగారునాయుడు, జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, రామారావు, కిరీటం, త్రినాథస్వామి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా అప్పన్న నిత్య కల్యాణం

స్వామి, అమ్మవార్లు

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి నిత్య కల్యాణోత్సవం బుధవారం సింహగిరిపై కనుల పండువగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొల్పి ప్రాతఃకాల పూజలు జరిపారు. దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయ వేడుకను జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కుక్కలు... పిక్కలు పీకేస్తున్నాయ్!

దర్పణం

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి పరిధి పెదమడక, ఫార్మాసిటీ పునరావాస కాలనీల్లో ఇటీవల కుక్కల బెడద అధికమైంది. గుంపులుగా తిరుగుతూ స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో రహదారులపై రాకపోకలు సాగించడానికి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ అధికారులు తక్షణం స్పందించి కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు.

రెయిలింగ్ ధ్వంసం

ఫోకస్

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే : షీలానగర్ నుంచి గాజువాక వచ్చే మార్గంలో షీలానగర్ వద్ద సేవామార్గంలో రెయిలింగ్ ధ్వంసమై ఓ వైపు ఊగుతోంది. అటుగా ప్రయాణించేవారు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా రెయిలింగ్ తగిలే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి రెయిలింగ్‌ను సరి చేయడమో, తొలగించడమో చేయాలని వాహనదారులు కోరుతున్నారు. ప్రమాదాలు జరగక ముందే చర్యలు చేపడితే మంచిదని స్థానికులు పేర్కొన్నారు.

తుప్పుపట్టిన కుర్చీలు...

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో రైల్వే అధికారులు విఫలమవుతున్నారు. దువ్వాడ రైల్వే స్టేషన్ మొదటి ప్లాట్‌ఫాంపైనున్న విశ్రాంత గదుల్లో ఏర్పాటు చేసిన కుర్చీలు తుప్పుపట్టి కూర్చోలేని విధంగా తయారైంది. ప్రయాణికులు విశ్రాంతి తీసుకునేందుకు ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఇనుప కుర్చీలు అధ్వానంగా ఉన్నా.. పట్టించుకునే వారే కరవయ్యారు. అధికారులు స్పందించి కుర్చీలు మార్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చెత్త కుప్ప తరలించేదెప్పుడో?

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 87వ వార్డు నిర్వాసిత లక్ష్మీపురం కాలనీకి వెళ్లే మార్గంలోని కల్వర్టు వద్ద పరిసర ప్రాంతాల నుంచి సేకరించిన చెత్త తెచ్చి గుట్టలుగా వేస్తున్నారు. ఆ చెత్తను పందులు, కుక్కలు చిందరవందర చేస్తున్నాయి. దీనివల్ల ఆ ప్రాంతమంతా దుర్గంధంగా మారుతోంది. పారిశుద్ధ్య సిబ్బంది స్పందించి చెత్తను తొలగించాల్సిన అవసరం ఉంది.

గెడ్డ సరే.. రహదారి చూడరే..?

గాజువాక, న్యూస్‌టుడే : గాజువాక 76వ వార్డు గోపాలరెడ్డినగర్ - గాంధీనగర్‌లో ప్రధాన గెడ్డ ఆధునికీకరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇంతవరకూ బాగానే ఉన్నా గెడ్డను ఆనుకుని ఉన్న రహదారులు లోతట్టున మిగిలిపోవడంతో వర్షం వస్తే రహదారిపైనే నీరు చేరుకుంటుందని, పాతరోడ్డును ఎత్తుపెంచితే ముంపు సమస్య ఉండదంటూ ఆయా నివాసితులు అభిప్రాయపడుతున్నారు. ఇటీవల వర్షానికి రోడ్లపైనే నీరు నిలిచిపోయిన దృష్ట్యా గెడ్డలోకి రోడ్డు నీరే ప్రవహించేలా చర్యలు చేపట్టాలని వీరంతా కోరుతున్నారు.

పిక్క తీసి మొక్కను బతికించే..

ఈనాడు కథనానికి స్పందన

సింధియా, న్యూస్‌టుడే: పారిశ్రామిక ప్రాంతం రిఫైనరీ ప్రహరీ వెంట నడకమార్గంపై మొక్కలు చుట్టూరా కొందరు నల్ల పిక్కను పోశారు. దీంతో మొక్కలకు నీరందక ఎండిపోయాయి. దీనిపై ఇటీవల 'ఈనాడు'లో వచ్చిన వార్తకు స్పందించి పిక్క మొత్తం తొలగించారు. మొక్క బతికించేందుకు ఆస్కారం కలిగించారు.

రాష్ట్రపతి పర్యటన సాగిందిలా..

సందర్శకుల పుస్తకంలో సంతకం చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, చిత్రంలో సీఎం చంద్రబాబు

సింధియా, న్యూస్‌టుడే: తీరంలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ యుద్ధ నౌకల సమీక్ష (ఐఎఫ్ఆర్) పాల్గొన్న రాష్ట్రపతి పర్యటన వివరాలివి.. ★ ఉదయం 9.55 గంటలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చోళా బస కేంద్రం నుంచి బయల్దేరారు. ★ 9.57కు గౌరవ వందనం స్వీకరించి పరేడ్‌ను పరిశీలించారు. ★ 10.04కి నేవల్ జెట్టీలో ఐఎన్ఎస్ సుమేధ నౌకపై ఎక్కారు. ★ 10.08కు గౌరవ వందనం స్వీకరించారు. ★ 10.12కు నౌక బయలుదేరింది. ★ 10.33నుంచి 10.52వరకు నౌకపై నుంచే సముద్రంలో నౌకల విన్యాసాలు సమీక్షించారు. ★ 10.53 నుంచి 10.57 వరకు యుద్ధనౌకల సెయిలింగ్ పరేడ్‌ను వీక్షించారు. ★ 11.19 నుంచి 11.24 వరకు నమూనా ప్రదర్శనలను వీక్షించారు. ★ 11.45 నుంచి 11.48 వరకు ప్రత్యేక దళాలు తమ విన్యాసాలను ప్రదర్శించాయి. ★ 11.54 నుంచి 12.06 వరకు వాయుసేన విమానాల విన్యాసాలు జరిగాయి. ★ మధ్యాహ్నం 12.07 నుంచి జలాంతర్గాముల నుంచి రాష్ట్రపతి గౌరవ వందనం తీసుకున్నారు. ★ 12.09కి రాష్ట్రపతికి జ్ఞాపిక అందజేశారు. ★ 12.10 నుంచి రాష్ట్రపతి ప్రసంగించారు. ★ 12.36కి తిరిగి గౌరవ వందనం స్వీకరించారు. ★ 12.41కు రాష్ట్రపతి పర్యటించిన నౌక సుమేధ తిరిగి జెట్టీవైపు బయల్దేరింది. ★ 12.50కు రాష్ట్రపతి జెట్టీ దిగి ప్రత్యేక వాహనంలో బయల్దేరారు. ★ 1.00కి ఆమె నేవల్ ఎయిర్ స్టేషన్ నుంచి తిరుగుపయనమయ్యారు.

ఘనంగా వీడ్కోలు: ఫ్లీట్ రివ్యూ అనంతరం నేవల్ ఎయిర్ స్టేషన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు ఘనంగా వీడ్కోలు పలికారు. వీడ్కోలు పలికిన వారిలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, విశాఖ కలెక్టర్ హరేందిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ ఉన్నారు. ★ ఐఎఫ్ఆర్‌లో పాల్గొన్న అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు విజయవాడ బయలుదేరి వెళ్లారు.

ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ

కళ్లజోళ్లతో విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సుమారు 28 మంది పిల్లలకు ఉచితంగా కళ్లజోడు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఆయూష్ భారత్ ఆధ్వర్యంలో గతంలో విద్యార్థులకు కంటి పరీక్షలు జరిపారని.. అవసరమైన వారికి బుధవారం ఉచితంగా కళ్లజోడు పంపిణీ చేశామని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. హెచ్ఎం కాంతం చేతుల మీదుగా పిల్లలకు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు అనూష, గ్రామ ప్రతినిధులు ఎస్.నూకరాజు, అంజి, ఎస్.అనంతలక్ష్మి, బీవీ రమణ, సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.

వన్యప్రాణులు జనావాసాల్లోకి..

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: కంబాలకొండ అటవీ ప్రాంతంలో స్వేచ్ఛగా తిరిగే జింకలు, కొండగొర్రెలు తరచూ విశాఖ వ్యాలీ పాఠశాల సమీప రహదారిపైకి, విశాలాక్షినగర్ కొండ చివర, ఇందిరానగర్ జనావాసాల్లో వస్తున్నాయి. కొన్నిసార్లు అవి రోడ్డు దాటేటప్పుడు వాహనాలు ఢీకొట్టడంతో ప్రమాదాల బారిన పడుతున్నాయి. బుధవారం ఓ కొండగొర్రె ప్రధాన రహదారిపైకి వచ్చేసింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. రక్షణ కంచె ఏర్పాటు చేయడంతో పాటు, జీవులకు అవసరమైన తాగునీటి సదుపాయం కల్పించాలని వన్యప్రాణి ప్రేమికులు కోరుతున్నారు.

సంజీవరెడ్డికి సత్కారం

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు–3), న్యూస్‌టుడే: ఇంటక్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ జి.సంజీవరెడ్డి పుట్టినరోజు వేడుకలు హైదరాబాదు, విశాఖలో ఘనంగా నిర్వహించారు. హైదరాబాదులోని ఆయన స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో విశాఖ ఉక్కు నాయకులు నీరుకొండ రామచంద్రరావు తదితరులు సంజీవరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఉక్కునగరం ఇంటక్ కార్యాలయంలో జరిగిన పుట్టినరోజు వేడుకల్లో నాయకులు కేకు కోసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఇంటక్ అధ్యక్షులు పి.వి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అభినందన: గాజువాక, న్యూస్‌టుడే: జాతీయ ఇంటక్ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి జన్మదినం సందర్భంగా పీసీసీ అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు నేతృత్వంలో ఇంటక్ సభ్యులు బుధవారం హైదరాబాద్‌లో అభినందించారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సంజీవరెడ్డిని సత్కరిస్తున్న విశాఖ ఉక్కు ఇంటక్ నాయకులు

22న బీఎంఎస్ రాష్ట్ర సదస్సు

గాజువాక, న్యూస్‌టుడే : రాష్ట్రస్థాయి బీఎంఎస్ సమావేశాలు ఈనెల 22న షీలానగర్‌లోని బీవీకే పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి లోవారెడ్డి తెలిపారు. బుధవారం పాతకర్నవానిపాలెం భాజపా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యూనియన్ క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి రాష్ట్ర సమావేశాల్లో కీలక నిర్ణయాలు తీసుకుంటామన్నారు. భాజపా కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు మాట్లాడుతూ.. దేశంలోనే అతి పెద్ద కార్మిక సంఘం బీఎంఎస్ రాష్ట్ర సమావేశాలు ఇక్కడ జరగడం అభినందనీయమన్నారు. యూనియన్ సభ్యుడు మధునాయుడు తదితరులు పాల్గొన్నారు.

తుక్కు వాహనాలు ఎవరివో..?

మున్సిపల్‌రోడ్డులో తుక్కు వాహనాలు

గాజువాక, న్యూస్‌టుడే : రహదారి విశాలంగా ఉందని ఎక్కడెక్కడి నుంచో కాలం చెల్లిన వాహనాలను తెచ్చి మున్సిపల్ రోడ్డులో పార్కు చేస్తున్నారు. ఒకటికాదు, రెండుకాదు.. మూడేళ్లకు పైగా ఎవరికీ పట్టనట్లుగా రోడ్డుపక్కన పార్కు చేశారు. చినగంట్యాడ జగ్గుసెంటర్ నుంచి గోపాలరెడ్డినగర్ వెళ్లే దారి, అటు జోనల్ కార్యాలయం మీదుగా పోలీసుస్టేషన్‌కు వెళ్లేదారిలో ఎక్కడ చూసినా తుక్కు వాహనాలే కనిపిస్తున్నాయి. అమరావతి పార్కు ముందర, చినగంట్యాడ దారిలోనూ దుమ్ము, ధూళి పట్టిన వాహనాలు గుట్టలుగా పడున్నాయి. తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

దారిలోనే పార్కు చేసి..

(c) eenadu

ఈనాడు విజయనగరం

గురువారం ఫిబ్రవరి 19, 2026

నగరంలో విగ్రహం ఊరేగింపు, మహిళల కోలాటం

బాలరామా.. వేడుక చూడతరమా

అయోధ్య బాలక్ రామమందిర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయనగరంలోని పూల్‌బాగ్‌కాలనీ సరస్వతి శిశు మందిర్ ప్రాంగణంలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం ప్రతిష్ఠ సంకల్పం, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశన, అగ్ని ప్రతిష్ఠ తదితర క్రతువులు నిర్వహించారు. సాయంత్రం విగ్రహాలను మూడులాంతర్ల సమీపంలోని పైడితల్లి దేవస్థానం నుంచి పూల్‌బాగ్ వరకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విగ్రహ దాత తోట సత్యనారాయణ, ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు కుసుమంచి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.
- న్యూస్‌టుడే, విజయనగరం కంటోన్మెంట్

గోవా గవర్నర్ రాక నేడు

ఈనాడు, విజయనగరం: గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు గురువారం మధ్యాహ్నం విజయనగరం రానున్నారు. 20న కుటుంబ సభ్యుల శుభకార్యానికి ఆయన హాజరవుతారు. 21న ఉదయం 11 గంటలకు సింహాచలం వెళ్తారు. సాయంత్రం విజయనగరం మండలం జొన్నవలసలో పర్యటిస్తారు. 22న ఉదయం 10 గంటలకు కోటలో జరిగే మాన్సాస్ ట్రస్ట్ పరిధిలోని వివిధ దేవస్థానాల పాలక మండలి సభ్యుల సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం మోతీమహల్ ఆడిటోరియంలో మాన్సాస్ విద్యాసంస్థల విభాగాధిపతులతో సమావేశమవుతారు. 23న ఉదయం విజ్జీ స్టేడియంలో క్రీడా పాఠశాల నిర్మాణ పనులు పరిశీలిస్తారు. 24న బీసెంట్ స్కూల్ విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొంటారు. 25న మధ్యాహ్నం 12 గంటలకు విశాఖ మీదుగా గోవాకు తిరుగుపయనమవుతారు.

20న మెగా ఉద్యోగ మేళా

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 20న మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ప్రధానాచార్యుడు పి.మల్లేశ్వరరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్, ప్లేస్‌మెంట్ అధికారి భాస్కర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎంతమందికి అవకాశం: ప్రముఖ కంపెనీలు మొత్తం 490 ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తాయి.

అర్హత: పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్, పీజీ అర్హతలు కలిగి, 18 నుంచి 35 ఏళ్ల మధ్యలో ఉన్న నిరుద్యోగులు హాజరవ్వచ్చు.

దరఖాస్తులిలా: ఆసక్తి గలవారు https://naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి.

ఇవి తీసుకెళ్లాలి: ఆధార్ కార్డుతో పాటు రెజ్యూమ్, ఆధార్, విద్యార్హత ధ్రువపత్రాల నకలు తీసుకుని, ఆ రోజు ఉదయం 9 గంటలకు హాజరవ్వాలి.

మరిన్ని వివరాలకు: 81069 23623, 79898 26953, 99888 53335 నంబర్లను సంప్రదించాలి.

వైకాపా నేత.. భూ మేత

న్యూస్‌టుడే, గుర్ల, గరివిడి



రహదారిని తవ్వేశారిలా..

అవి అసైన్డ్ భూములు.. విక్రయానికి వీలుపడని వాటిపై ఓ వైకాపా నాయకుడి కన్ను పడింది. పేదల నుంచి అనధికారికంగా కొనుగోలుచేశారు. అంతటితో ఆగలే. అక్రమంగా మరికొంత ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు రహదారినే యంత్రాలు పెట్టి తవ్వించేశారు. అడిగేదెవరు అన్నట్లుగా అధికారుల ఆదేశాలను సైతం పట్టించుకోకుండా చెలరేగి పోతున్నారు.

● గుర్ల మండలం దేవునికణపాక పరిధిలో సర్వే నంబరు 49లో సుమారు 40 ఎకరాల వరకు ప్రభుత్వ భూములున్నాయి. ఇందులో 15 ఎకరాల వరకు అసైన్డ్ చేసి, భూమిలేని నిరుపేదలకు డీ పట్టాలు ఇచ్చారు. ఇందులో వ్యవసాయం చేసుకుని లబ్ధిదారులు జీవనం సాగించేందుకు అన్ని విధాలా హక్కులుంటాయి. వాటిని విక్రయించే అధికారం పట్టాదారుకు ఉండదని అసైన్డ్ చట్టం స్పష్టం చేస్తోంది. కానీ ఈ భూములపై వైకాపా నేత ఒకరు కన్నేశారు. కొంత మంది పట్టాదారుల నుంచి అనధికారికంగా సదరు నేత భూములు కొనుగోలు చేసినట్లు సమాచారం.

● డీ పట్టా జాగా కొనుగోలు

● ఆపై రహదారి ఆక్రమణకు యత్నం

అధికారులకు ఫిర్యాదు

ప్రస్తుతం ఈ భూములను పొక్లెయిన్‌తో చదునుచేసే పనులు చేస్తున్నారు. డీపట్టా భూముల పక్కన ప్రభుత్వ భూమిలో ఉన్న మట్టి రోడ్డును సైతం పొక్లెయిన్‌తో దర్జాగా తవ్వేస్తున్నారు. ఆ మట్టిని చదును చేసి రోడ్డు స్థలం ఆక్రమణకు పాల్పడుతున్నారు. దీన్ని అడ్డుకోవాలని దేవునికణపాక గ్రామస్థులు ఇటీవల రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదులు చేశారు. రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోడ్డును తవ్వేసినట్లు గుర్తించారు. పనులు ఆపాలని ఆదేశించినా పట్టించుకోకుండా కొనసాగిస్తున్నారని గ్రామస్థులు వాపోతున్నారు.

రైతుల కోసం నిర్మిస్తే..

దేవునికణపాక నుంచి పతివాడపేటకు వెళ్లే తారురోడ్డును ఆనుకుని ఈ డీపట్టా భూములున్నాయి. ఎకరా ధర రూ.20 లక్షలు వరకు ఉంది. దీంతో అనధికారికంగా కొనుగోలు చేసి, పక్కనే ఉన్న మట్టిరోడ్డును కలిపేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. పశువులు, వ్యవసాయ ఉత్పత్తుల రాకపోకల కోసం ఈ రహదారిని నిర్మించాలని గ్రామస్థులు కోరగా ఒక క్వారీ నిర్వాహకుడు సామాజిక బాధ్యతగా రూ.6 లక్షలు వెచ్చించి మార్గాన్ని ఏర్పాటు చేశారు.

చర్యలు తీసుకుంటాం.. ప్రభుత్వభూమిలో రోడ్డును తవ్వేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ సిబ్బందిని క్షేత్రస్థాయి పరిశీలనకు పంపించాం. రహదారితో పాటు ప్రభుత్వ భూముల ఆక్రమణ ఏ మేరకు జరిగిందన్న దానిపై విచారణ జరిపి నివేదిక అందించాలని ఆదేశించాం. ఆక్రమణ రుజువైతే చర్యలు తీసుకుంటాం.
- ఆదిలక్ష్మి, తహసీల్దారు, గుర్ల

హాల్‌టికెట్లలో తప్పులకు జరిమానా

● ఇంటర్ విద్యాధికారి తవిటినాయుడు

ముఖాముఖి

విజయనగరం విద్యావిభాగం, ఉడాకాలనీ, న్యూస్‌టుడే

అభ్యర్థుల హాల్‌టికెట్లలో తప్పులకు కళాశాలల యాజమాన్యాలే బాధ్యత వహించాలని ఇంటర్మీడియట్ విద్యాధికారి శివ్వాల తవిటినాయుడు పేర్కొన్నారు. ఈనెల 15 నుంచి జారీ అయిన హాల్‌టికెట్లలో ఫొటోలు సరిగా పడకపోవడం, సంతకం లేకపోవడం, జెండర్, సబ్జెక్టు, మాధ్యమం మార్పు అంశాల్లో కొందరికి తప్పులు దొర్లినట్లు తెలిపారు. నిర్దేశించిన జరిమానా చెల్లించి సరిదిద్దుకోవాలన్నారు. ఈ విషయంలో విద్యార్థుల నుంచి నగదు వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సంబంధిత అంశాలపై బుధవారం 'ఈనాడు'తో మాట్లాడారు.

ఆన్‌లైన్‌లోనే నగదు బదిలీ.. తప్పులు సరిచేసుకోవాలని గతంలో చెక్‌లిస్ట్ ఇచ్చినప్పటికీ కొన్ని కళాశాలలు శ్రద్ధ పెట్టలేదు. అందువల్లే ఈ సమస్య వచ్చింది. జరిమానా మొత్తాన్ని ఆన్‌లైన్‌లో బదిలీ చేయాలి. తప్పుకో విధంగా ఇంటర్‌బోర్డు రుసుమును నిర్దేశించింది.

15 నిమిషాల ముందుగానే..

● అభ్యర్థులు ఉదయం 8.45 గంటలకే కేంద్రాల వద్ద ఉండాలి. ప్రశ్నపత్రం అదే సమయానికి తెరుస్తారు. 9 గంటలకు వస్తే స్పష్టమైన కారణం ఉంటేనే అనుమతిస్తారు. పరీక్ష పూర్తయ్యేవరకు కేంద్రాల్లోనే ఉండాలి.

● విద్యార్థులతో పాటు ఇన్విజిలేటర్లు, ముఖ్య పర్యవేక్షకులు, డిపార్ట్‌మెంట్ అధికారులు చరవాణులతో రావొద్దు. సీఎస్‌లకు మాత్రమే అత్యవసరం నిమిత్తం 66 కేంద్రాలకు చరవాణులు అందజేశాం.

వారికి 32 పేజీల బుక్‌లెట్..

ఈనెల 23 నుంచి మార్చి 24 వరకు పరీక్షలు జరుగుతాయి. మొదటి సంవత్సరం విద్యార్థులకు గణితం, భౌతికశాస్త్రం, రసాయన, చరిత్ర, ఆర్థిక, రాజనీతి, వాణిజ్యశాస్త్రం సబ్జెక్టులకు 32 పేజీలతో కూడిన బుక్‌లెట్(సమాధానపత్రం) అందజేస్తాం. ద్వితీయ సంవత్సరం వారికి గతంలో మాదిరిగా 24 పేజీల బుక్‌లెట్ అందుతుంది.

జిల్లాలో ఇలా..

పరీక్ష కేంద్రాలు	66
విద్యార్థులు	39037, జోన్లు: 18
స్టోరేజీ పాయింట్లు	20
కస్టోడియన్లు	16
చీఫ్ సూపరింటెండెంట్లు	66
డిపార్ట్‌మెంట్ అధికారులు	66
ఫ్లైయింగ్ స్క్వాడ్	03
సిట్టింగ్ స్క్వాడ్	03
ఇన్విజిలేటర్లు	1,000

రుసుములు ఇలా..(రూ.లలో) ●ఫొటో సరిగా పడకపోవడం: 1000 ●సబ్జెక్టు మార్పు: 800 ●మాధ్యమం మార్పు: 600 ●జెండర్ మార్పు: 100

జిల్లా రిజిస్ట్రార్‌గా మోహన్‌రావు

మోహన్‌రావు

విశాఖపట్నం(వన్‌టౌన్), న్యూస్‌టుడే : విశాఖలోని పాతనగరం సూపర్‌బజార్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జాయింట్ సబ్‌రిజిస్ట్రార్(జేఎస్ఆర్-1)గా పని చేస్తున్న మోహన్‌రావుకు జిల్లా రిజిస్ట్రార్‌గా పదోన్నతి లభించింది. రెండేళ్ల నుంచి విశాఖలో సేవలు అందిస్తున్న ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతి కల్పించి, విజయనగరం జిల్లా రిజిస్ట్రార్‌గా బదిలీ చేసింది. బుధవారం ఆయన రిలీవ్ అయ్యారు.

మీతోనే మీలోనే శక్తి..

● ఆపద సమయాల్లో అండ

● అత్తింటివారు వేధింపులకు గురిచేస్తున్నారని, దాడికి పాల్పడుతున్నారని విజయనగరానికి చెందిన ఓ మహిళ శక్తి యాప్ ద్వారా ఫిర్యాదు చేశారు. తక్షణమే పోలీసులు చేరుకుని, కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇకపై వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

● గుర్తుతెలియని వ్యక్తి తరచూ ఫోన్ చేస్తున్నాడని, అసభ్యకర సందేశాలు పంపిస్తున్నాడని నగరానికి చెందిన యువతి వివరాలు నమోదు చేశారు. సైబర్ క్రైం, పోలీస్ కంట్రోల్ రూమ్ సిబ్బంది అప్రమత్తమై క్షణాల వ్యవధిలోనే సదరు నంబరును బ్లాక్ చేశారు. నిందితుడిని గుర్తించి, కేసు నమోదు చేశారు.

న్యూస్‌టుడే, విజయనగరం అయ్యన్నపేట

ఆపదలో ఉండే మహిళలకు అండగా నిలుస్తోంది శక్తి యాప్. 2025 మార్చిలో ఈ సేవలు ప్రారంభం కాగా.. ఉమ్మడి జిల్లాలో వేల మంది వినియోగిస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు నవీకరిస్తుండడంతో నిమిషాల వ్యవధిలోనే బాధితులకు న్యాయం జరుగుతోంది. కేవలం ఆడవారే కాకుండా చిన్నారులు, పురుషులు సైతం సద్వినియోగం చేసుకుంటున్నారు.

కదిపితే చాలు.. యాప్ తెరచుకోగానే నాలుగు విభాగాలు కనిపిస్తాయి. ఎస్‌వోఎస్‌ను తాకగానే.. పది సెకండ్ల ఆడియో, వీడియో రికార్డు అయ్యి కంట్రోల్ రూమ్‌కు వెళ్తాయి. అంతే కాకుండా హ్యాండ్ షేక్ ఆప్షన్ ఆన్ చేసుకుంటే.. ఆపద సమయంలో చరవాణిని షేక్ చేస్తే ఆడియో, వీడియో వెళ్తాయి. లొకేషన్ ఆధారంగా క్షణాల్లోనే కనుగొంటారు.

చరవాణిలో యాప్‌ను చూపిస్తున్న విద్యార్థినులు

డౌన్‌లోడ్ ఇలా..

గూగుల్ ప్లేస్టోర్‌కు వెళ్లి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పేరు, చరవాణి నంబరు, కుటుంబ సభ్యుల ఫోన్ నంబరు, జెండర్, వయసు, చిరునామా తదితర వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. మనకు కావాల్సిన భాషను ఎంచుకోవాలి. లొకేషన్‌తో పాటు వివిధ రకాల ఆప్షన్లు అందుబాటులో ఉంటాయి.

ఇప్పటివరకు ఇలా..

అంశం	విజయనగరం	మన్యం
డౌన్‌లోడ్	19,642	19,878
రిజిస్ట్రేషన్	19296	19782
ఫిర్యాదులు	113	138
కౌన్సెలింగ్	107	111
ఎఫ్ఐఆర్ నమోదు	06	0

సేవలిలా..

● వ్యక్తిగతంగా, సమాజం, కుటుంబ పరంగా ఎలాంటి ఇబ్బందులున్నా చెప్పొచ్చు.

● అసాంఘిక కార్యకలాపాలు, జూదం, గంజాయి రవాణా తదితర వాటిని తెలియజేయొచ్చు.

● అత్యాచారం, దాడులు, వేధింపులు, గృహహింస, ఆర్థిక మోసం, ప్రేమ వ్యవహారాలపై వివరాలు నమోదు చేయొచ్చు.

● ఒంటరిగా ఉంటే భోజనం, వసతి, ఇతర రక్షణ సేవలను అభ్యర్థించవచ్చు.

● దూర ప్రాంతాలకు వెళ్లేసమయంలో సేఫ్టీ వెల్ ఆప్షన్ ఆన్ చేసుకుంటే గమ్యస్థానం చేరేవరకు నిరంతరం పర్యవేక్షిస్తామని ఎస్పీ దామోదర్ తెలిపారు. కళాశాలలు, కూడళ్లు, బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లలో అవగాహన కల్పిస్తున్నామని, ప్రత్యేకంగా శక్తి బృందాలను నియమించామని వెల్లడించారు.

22న సంతోషాల ఆదివారం

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో జనవరి ప్రతినెలలో రెండు, నాలుగు ఆదివారాల్లో 'హ్యాపీ సండే' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ కె.బాలస్వామి తెలిపారు. బుధవారం తన ఛాంబర్‌లో ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఒక్కోవారం ఒక్కో ప్రాంతంలో నిర్వహిస్తామన్నారు. ఈనెల 22న కోట వద్ద జరగనుందని చెప్పారు. సాంస్కృతిక, జానపద, పౌరాణిక, సంప్రదాయ కళాకారులను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఈమేరకు ప్రత్యేక అధికారులను నియమించామన్నారు.

బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

విజయనగరం బాబామెట్ట, న్యూస్‌టుడే: పారా బ్యాడ్మింటన్ (దివ్యాంగుల) క్రీడాకారుల జిల్లా జట్ల ఎంపికలు ఈనెల 22న తేదీన నిర్వహించనున్నట్లు పారా స్పోర్ట్స్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు కె.దయానంద్ తెలిపారు. సంబంధిత క్రీడా సామగ్రితో ఉదయం 10 గంటలకు రాజీవ్ క్రీడా మైదానానికి రావాలని, ఇతర వివరాలకు 98493 77577ను సంప్రదించాలని సూచించారు.

అంగన్‌వాడీలకు కాదు.. ఆసుపత్రులకు వెళ్తున్నారు!

సమస్యలు ఇలా.. ●ఎదుగుదల లోపం: 99 ●దివ్యాంగులు: 104 ●పుట్టుకతో సమస్య: 06 ●వివిధ రకాల వ్యాధులు: 433

● చిన్నారులను వెంటాడుతున్న అనారోగ్య సమస్యలు

న్యూస్‌టుడే, విజయనగరం అయ్యన్నపేట

అంగన్‌వాడీ కేంద్రంలో బాలలకు వైద్య పరీక్షలు

మారిన ఆహారపు అలవాట్లు.. జీవనశైలితో బాల్యంలోనే పలువురు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీలకు వెళ్లే బాలలు, పాఠశాల విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాయి. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం(ఆర్బీఎస్‌కే), రాష్ట్రీయ కిశోర్ స్వాస్థ్య కార్యక్రమాలను(ఆర్కేఎస్‌కే) అమలు చేస్తున్నాయి. గతేడాది నుంచి చేపట్టిన వైద్య పరీక్షల్లో దాదాపు దిలో లోపాలు బయటపడ్డాయి.

8,400 మందిలో రక్తహీనత

10 నుంచి 19 ఏళ్ల లోపు వారికి వైద్య తనిఖీలు జరుగుతున్నాయి. గత ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 70 వేల మందిని పరీక్షించగా వారిలో 8,400 మందిలో రక్తహీనత ఉన్నట్లు గుర్తించారు.

ఆర్బీఎస్‌కేలో ఇలా..

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరేళ్లలోపు చిన్నారులకు, పాఠశాలల్లో ఒకటి నుంచి 12వ తరగతి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు రెండుచోట్లా 2,44,661 మందిని వైద్యులు పరిశీలించగా.. 2484 మంది వివిధ రకాల వ్యాధులకు గురైనట్లు గుర్తించారు.

ప్రత్యేక శిబిరాలు..

అన్ని ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి గురువారం, శుక్రవారం మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు అడాల్‌సెంట్ ఫ్రెండ్లీ హెల్త్ క్లినిక్‌లు(ఏఎఫ్‌హెచ్‌సీ) నిర్వహిస్తున్నారు. బాల బాలికలకు ఐరన్ మాత్రలు, పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్నారు. గతేడాది నుంచి నేటి వరకు సుమారు 1,70,000 మందికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు..

ఆర్బీఎస్‌కే, ఆర్కేఎస్‌కే కార్యక్రమాల్లో భాగంగా చిన్నారుల్లో రక్తహీనత, ఎత్తు, బరువు, చూపు, వినికిడి, మానసిక రుగ్మతలు, ఇతర అనారోగ్య సమస్యలను గుర్తిస్తున్నాం. వారి కోసం ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. ఎప్పటికప్పుడు అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా అందిస్తున్నాం. శస్త్రచికిత్సలు సైతం చేస్తున్నాం. ఎదుగుదలలో లోపాలున్న వారిని గుర్తించి కేజీహెచ్‌లోని ఎర్లీ ఇంటర్‌వెన్‌సన్ సెంటర్‌కు తరలిస్తున్నారు.
- వీవీబీ.సుబ్రహ్మణ్యం, ఆర్బీఎస్‌కే ప్రోగ్రామ్ అధికారి

ఏడుగురికి శస్త్ర చికిత్సలు

పుట్టుకతో రోగాలున్న చిన్నారులను గుర్తించి వివిధ ఆసుపత్రుల్లో ఉచితంగా శస్త్ర చికిత్సలు అందిస్తున్నారు. ఈ ఏడాదిలో ఏడుగురిని విశాఖలోని కేజీహెచ్, సెవెన్‌హిల్స్ ఆసుపత్రి, పుష్పగిరి కంటి ఆసుపత్రులకు తరలించారు.

రాష్ట్ర ఉత్సవంగా పైడితల్లి జాతర

● రూ.50 లక్షల మంజూరు

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పట్టణంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతరను రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం జీవో విడుదల చేసింది. మూడురోజుల పాటు అధికారికంగా ఉత్సవాలు కొనసాగుతాయి. ఇందుకు అవసరమైన రూ.50 లక్షల నిధులను మంజూరు చేసింది.

ఉత్తరాంధ్రుల ఇలవేల్పుగా, ఆరాధ్యదైవంగా పోలిపల్లి పైడితల్లి అమ్మవారిని భక్తులు కొలుస్తారు. 1926లో అమ్మవారి ఆలయం నిర్మాణం జరిగింది. వందేళ్ల పండగ కావడంతో రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై దేవాదాయశాఖ సానుకూలంగా స్పందించింది. రాజాం పట్టణం మొత్తం కాంతులీనేలా ఇప్పటికే కిలోమీటర్ల మేర బొబ్బిలి, చీపురుపల్లి, శ్రీకాకుళం, పాలకొండ ప్రధాన రహదారుల్లో విద్యుత్తు దీపాలంకరణ పనులు సాగుతున్నాయి. మూడు రోజుల పాటు పౌరాణిక నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. సినీ, బుల్లితెర నటులతో వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద క్యూలైన్లు, ఇతర ఏర్పాట్లు తుదిదశకు చేరుకున్నాయి.

రహదారి విస్తరణ.. ఆలయం నుంచి కొండంపేట కూడలి వరకూ రాజాం-బొబ్బిలి రహదారిని 80 అడుగుల మేర ఖాళీ చేయించారు. రాజాం రహదారుల విస్తరణ కొద్ది భాగాన్ని అప్పట్లో వదిలేశారు. జాతరకు భారీగా జనం తరలి రానున్న నేపథ్యంలో వారికి ఇబ్బందులు తలెత్తకుండా 70- 80 అడుగుల పరిధిలోని నిర్మాణాలను బుధవారం పురపాలిక పట్టణ విభాగం అధికారుల పర్యవేక్షణలో తొలగించారు.

మన్యం ముస్తాబు

పార్వతీపురం, న్యూస్‌టుడే: జిల్లాలో ముస్తాబు గ్రామాలుగా తీర్చిదిద్దిన ఊర్లను అనుభవ కేంద్రాలు (ఎక్స్‌పీరియన్స్ సెంటర్)గా తీర్చిదిద్దే ప్రణాళికను త్వరలో అమలు చేయనున్నట్లు మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకరరెడ్డి వెల్లడించారు. బుధవారం అధికారులతో ఆయన దూరదృశ్య శ్రవణ సమావేశాన్ని నిర్వహించారు. పర్యాటక కేంద్రాలుగా వీటిని గుర్తించడం ద్వారా గ్రామాలకు ఆదాయం పెరుగుతుందన్నారు. ఒక్కో పర్యాటక కేంద్రం నుంచి నెలకు కనీసం రూ.10 లక్షల ఆదాయం వచ్చేలా ప్రణాళికలను తయారు చేయాలని ఆదేశించారు.

అగ్రికల్చరల్ ల్యాండ్ లీజు కొరకు కావలెను

రైతులకు ఫిక్స్‌డ్ ఆదాయ అవకాశం
వ్యవసాయ భూమి 15 సంవత్సరాల లీజు కొరకు కావలెను.

విస్తీర్ణం : 1000 ఎకరాలు
ఏరియా : విజయనగరం జిల్లా & పరిసర ప్రాంతాలు
మండలాలు : గజపతినగరం, బొండపల్లి, గంట్యాడ, దత్తి రాజేరు, మెరకముడిదాం, పాచిపెంట, మక్కువ, సీతానగరం, బలిజిపేట, రామభద్రపురం, మానాపురం, బాడంగి, తెర్లాం, సాలూరు, పార్వతీపురం.

1. గజపతినగరానికి 30 కి.మీ సమీపంలో
2. లోడ్ మోసే ట్రక్కులకు రోడ్డు యాక్సెస్ అవసరం
3. ఆసక్తిగల రైతులు, రియల్ ఎస్టేట్ ఏజెంట్లు మరిన్ని వివరాల కొరకు సంప్రదించగలరు.

63091 25656
72079 04289

నిధులున్నాయి.. నిర్మాణంలో కదలికే లేదు!

న్యూస్‌టుడే - బొబ్బిలి

పూడికతో ప్రధాన కాలువ

● తోటపల్లి మిగులు పనులు పూర్తయ్యేదెన్నడో?

తోటపల్లి జలాశయానికి సంబంధించిన ప్రధాన కాలువ మిగులు పనులు పూర్తిచేయడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారు. బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన ఇటీవల అసెంబ్లీలో ఈ అంశాన్ని ప్రస్తావించారు. పనుల తాజా పురోగతిపై నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం కోరడంతో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. రానున్న ఖరీఫ్‌నకు నీరివ్వాలంటే మిగులు పనులు ప్రారంభించాలి. కానీ ఇంతవరకు అడుగులు పడలేదు.

30 గ్రామాలకు నీరన్నారు..

2022 జనవరి 29న బొబ్బిలి మండలం పిరిడి సమీపంలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ వీటికి భూమిపూజ చేశారు. సుమారు 20 వేల ఎకరాలకు సాగునీరు అదనంగా ఇచ్చేందుకు రూ.59.58 కోట్లతో పనులు తలపెట్టారు. సుమారు 30 గ్రామాల్లోని భూములకు సాగునీరు అందుతుందని చెప్పారు. ఇందులో 22 శాతం కూడా చేయలేదు.

ప్రతిపాదనలకు మోక్షం దక్కాలి..

తోటపల్లి ప్రధాన కాలువ 110 కి.మీల మేర పూర్తిస్థాయిలో లైనింగు చేపట్టాలి. ఇందుకు రూ.99.62 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. వాటికి కార్యరూపం దాల్చితే గండ్లు పడకుండా ఉంటుంది. కాలువల్లో పేరుకుపోయిన పూడికతీసి ఖరీఫ్‌నకు నీరు అందించాలంటే రూ.21 కోట్లు కావాలని ప్రతిపాదించారు. వాటికి నిధులు విదిల్చితే కొంత మేర సాగునీరు ఇచ్చేందుకు ఆస్కారం ఉంటుంది.

ఇదీ పరిస్థితి..

హెడ్‌వర్క్స్ వద్ద, సువర్ణముఖి నది సమీపంలో కాలువల గండ్లు, మట్టికట్ట పనులు పటిష్ఠం చేయాలి. దీనిలో భాగంగా 1,500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు చింతాడ వద్ద కాలువ తవ్వారు. అదీ పూర్తికాలేదు.

● నాగావళి, వేగావతి నదుల్లోకి కాలువల్లోని అదనపు నీటిని మళ్లించేందుకు ఎస్కేప్ ఛానళ్ల నిర్మాణం చేపట్టాలి. కాలువకు 42.2 కిలోమీటరు వద్ద యూటీ నిర్మాణం జరగాలి. ఎల్‌డీపీ-4లో అయిదు కిలోమీటర్ల మేర లైనింగ్ చేపట్టాల్సి ఉండగా రెండున్నర కిలోమీటర్ల మేర పూర్తి చేశారు.

● ఎల్‌డీపీ-4, 5లో 100 సూపర్ పాసేజ్‌ల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా ఇంతవరకు 30 పూర్తి చేశారు.

● విపత్తుల నిధులు రూ.59.58 లక్షలతో చేపట్టిన పనులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఎక్కడికక్కడే పూడిక ఉంది.

చర్యలు తీసుకుంటాం.. తోటపల్లి జలాశయం పరిధిలోని పెండింగ్ పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటాం. గుత్తేదారుతో మాట్లాడాం. పూడిక తొలగింపు, ఇతర పనులకు ప్రతిపాదనలు పంపాం.
- కుమార్, డీఈ, తోటపల్లి జలాశయం

ఆట.. అందలం

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో విజేతలు, నిర్వాహకులు

మేళ్లచెరువు(సూర్యాపేట): మహా శివరాత్రి జాతర సందర్భంగా తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా మేళ్లచెరువులో రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ టీంల మహిళా విభాగం కబడ్డీ పోటీలు బుధవారం ముగిశాయి. ఫైనల్‌లో విజయనగరం జట్టు ప్రథమ స్థానం పొంది రూ.లక్ష బహుమతిని అందుకుంది.

నమ్మండి.. ఇది పాఠశాలే!

చీపురుపల్లి మండలం విశ్వనాథపురం ప్రాథమిక పాఠశాల ఇది. కనీసం ఆ రూపు లేదనే కదా మీ సందేహం. విషయమేమిటంటే.. ఈ విద్యాలయం భవనం శిథిలావస్థకు చేరడంతో 2023లో కూలదోశారు. కొత్త నిర్మాణానికి జడ్పీ నిధులు రూ.10 లక్షలు కేటాయించారు. 2024 నాటికే పూర్తి చేయాల్సి ఉన్నా ఇప్పటికీ పిల్లర్ల స్థాయిలోనే ఉంది. దీంతో వేరేదారి లేక ఊళ్లో ఓ ఇంటిని పాఠశాలగా మార్చారు. వచ్చే మార్చి నాటికి పనులు పూర్తిచేసి అందుబాటులోకి తెస్తామని పీఆర్ జేఈఈ పి.చంద్రశేఖర్ చెప్పారు.
- న్యూస్‌టుడే, చీపురుపల్లి గ్రామీణం

(c) eenadu

ప్రధానాంశాలతో ప్రగతి ప్రణాళికలు

ఈనాడు, విజయనగరం: జిల్లాలోని ప్రతి నియోజకవర్గం ప్రగతి దిశగా పయనించేందుకు ప్రధానాంశాలు గుర్తించి, ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి ఆదేశించారు. విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్, రెవెన్యూ, రీసర్వే సహా అభివృద్ధికి ఊతమిచ్చే ఇతర అంశాలపై కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన సమీక్షలో మాట్లాడారు. వివిధ రంగాల్లో జిల్లా అభివృద్ధిపై మార్చి 4న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో సమావేశం ఉంటుందన్నారు. అక్కడ చర్చించేందుకు, ప్రతి నియోజకవర్గంలో ముఖ్యమైన మూడు అంశాలను గుర్తించాలన్నారు. వాటి ఆధారంగా ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. ఆర్థిక, ఆర్థికేతర అంశాలైనా ఎంపిక చేయవచ్చన్నారు. రాజాం, చీపురుపల్లి నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుపై ఆరాతీశారు. అవసరమైన భూములు గుర్తించి ఏపీఐఐసీకి బదిలీ చేయాలన్నారు. ఫుడ్ పార్కులు, రెవెన్యూ సదస్సులు, రీసర్వే, వెబ్‌ల్యాండ్ డేటా లోపాల సవరణ, మ్యుటేషన్లు, జాయింట్ ఎల్‌పీఎంలు, సబ్ డివిజన్, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీపై సూచనలు చేశారు. జేసీ ఎస్.సేధుమాధవన్, డీఆర్వో ఇ.మురళి, సీపీవో బాలాజీ పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై దృష్టి: రెవెన్యూ సమస్యలను వదిలేస్తే ఎప్పటికీ పరిష్కారం కావని, పూర్తిస్థాయిలో దృష్టిసారించాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. భూ సంబంధిత అర్జీలను ఎక్కువగా తిరస్కరిస్తున్నారని, ఆ సంఖ్య తగ్గాలన్నారు. తొలి మూడు దశల రీసర్వేలో పెండింగ్‌లో ఉన్న గ్రామాల్లో పూర్తి చేయాలని, నాలుగో దశలో ప్రగతి కనిపించాలన్నారు. సర్వే శాఖ ఏడీ ఆర్.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

స్టెప్పు.. అదిరేట్టు

విద్యార్థులు మంచిగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఉపాధ్యాయులు అన్నారు. పాలకొండ సత్య సాయి పాఠశాలలో బుధవారం నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి. సంస్థ ఛైర్మన్ జి.శ్రీనుబాబు, కమిటీ సభ్యులు వెంకటరమణ, లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు ఉన్నారు.
– న్యూస్‌టుడే, పాలకొండ

నేత్రపర్వం.. చక్రతీర్థ స్నానం

సాలికిరిలో ఉత్సవ విగ్రహాలతో గ్రామస్థులు

వంశధార నది తీరాన వెలసిన శ్రీ ఉమా సహిత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా బుధవారం ఉత్సవ విగ్రహాలకు చక్రతీర్థ స్నానాలు చేయించారు. అంతకు ముందు స్వామిని పురవీధుల్లో మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ ఊరేగించారు. బాలేరు తాలాడ, కోసలి, కీసర, ఒడిశా నుంచి భక్తులు వచ్చారు.
– న్యూస్‌టుడే, భామిని

ఈ రోడ్డులో ప్రయాణం..
నరకానికి మార్గం

పాచిపెంట మండలంలోని గొట్టూరు పంచాయతీ కన్నయ్యవలస గ్రామం నుంచి దిగువ గొట్టూరు, చిట్టెలబ, వేపలపాడు మీదుగా సతాబి కూడలి వరకు రూ.5.50కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డు పాడైంది. బీటలు వారి, ఎక్కడికక్కడ రాళ్లు తేలి అధ్వానంగా మారింది. కోతకు గురై రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పలుమార్లు ప్రమాదాలూ చోటు చేసుకున్నాయి. సిమెంటు ర్యాంపులు సైతం శిథిలావస్థకు చేరుకున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో వేదన వర్ణించలేనిది. ఐటీడీఏ డీఈ సంతోష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.
– న్యూస్‌టుడే, పాచిపెంట

దివ్యాంగుల దీక్షకు సంఘీభావం

దివ్యాంగులకు నిమ్మరసం ఇచ్చి మద్దతు తెలుపుతున్న బంగార్రాజు

భోగాపురం, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి, సినీ నటుడు నందమూరి తారకరామారావు దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్నకు అర్హులని రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద నెల్లిమర్ల నియోజకవర్గంలోని దివ్యాంగులు మూడు రోజులుగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు ఆయన బుధవారం సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు సిరిపురి మౌళివర్మ, నాయకులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కొత్తగా ఎన్నికైన సభ్యులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఏపీసీపీఎస్ఈఏ (ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పింఛను పథకం ఉద్యోగుల సంఘం) జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక నగరంలోని కణపాక యువజన వసతిగృహంలో బుధవారం జరిగింది. అధ్యక్షుడిగా సి.హెచ్.వెంకటసతీష్, కార్యదర్శిగా లెంక సత్తిబాబు, సహాధ్యక్షుడిగా కె.కిషోర్, మహిళా అధ్యక్షురాలిగా జి.అనూరాధ, కార్యదర్శిగా ఎస్.రత్నకుమారి నియమితులయ్యారు. సీపీఎస్ ఉద్యమంలో భాగంగా మార్చి 1న తలపెట్టిన సాగరఘోష కార్యక్రమానికి జిల్లా నుంచి ఉద్యోగులు పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి కరిమ రాజేశ్వరరావు, నాయకుడు ఎం.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	135	240	250

మరో అడుగు.. మహిళాభివృద్ధి వైపు

స్త్రీనిధి రుణంతో ఏర్పాటు చేసిన యూనిట్

కల్యాణలక్ష్మి, విద్యాలక్ష్మి పథకాల అమలుకు చర్యలు

విజయనగరం మయూరి కూడలి, న్యూస్‌టుడే

స్వయం సహాయక సంఘాల మహిళలను ఆర్థికంగా ఆదుకుని, ప్రతి ఇంట్లో అతివలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం వెలుగు ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాలతో చేయూత అందిస్తోంది. ఇప్పుడు మరో అడుగు ముందుకేసింది. మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా స్త్రీనిధి కో-ఆపరేటివ్ సంస్థ ద్వారా ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, కల్యాణలక్ష్మి పథకాలను తీసుకురానుంది. సంబంధిత విధివిధానాలను ఇటీవల విడుదల చేసింది. పిల్లల చదువు (కేజీ నుంచి పీజీ), వివాహాది శుభ కార్యాలకు తక్కువ వడ్డీకే రుణాలు ఇవ్వనుంది. ఏటా 16-20 వేల మంది మహిళలకు లబ్ధి చేకూరనుంది.

రూ.లక్ష వరకు రుణం..

కల్యాణలక్ష్మి ద్వారా ఆడపిల్లల పెళ్లికి రూ.లక్ష వరకు రుణం ఇవ్వనున్నారు. దీనికి కూడా నాలుగు శాతం మాత్రమే వడ్డీ. తీసుకున్న రుణం 48 నెలల్లో చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్నప్పుడు అవసరమైన లగ్నపత్రిక, శుభకార్యం నిర్వహణకు సంబంధించిన పత్రం, పెళ్లి ఖర్చు అంచనా వ్యయం తదితరాలు ఇవ్వాల్సి ఉంటుంది. సొమ్ము నేరుగా లబ్ధిదారు ఖాతాలోనే జమవుతుంది. బీమా సౌకర్యం కలదు. సభ్యురాలు ప్రమాదవశాత్తు మరణిస్తే రుణం చెల్లించనవసరం లేదు.

నాలుగు శాతం వడ్డీకే..

స్త్రీనిధి ద్వారా సంఘాల్లో సభ్యులకు చెందిన పిల్లల చదువుకు ఎన్టీఆర్ విద్యాలక్ష్మి పథకం తీసుకొస్తున్నారు. ఒక సభ్యురాలికి చెందిన ఇద్దరు పిల్లల వరకు ఇది వర్తించనుంది. పాఠశాలలో చేరిన ప్రవేశపత్రం, ఫీజు కట్టిన రసీదు తీసుకురావాల్సి ఉంటుంది. నాలుగు శాతం వడ్డీతో రూ.10వేల నుంచి రూ.లక్ష వరకు రుణం వస్తుంది. రుణానికి అనుగుణంగా చెల్లింపు వాయిదాలు ఉంటాయి. గరిష్ఠంగా 48 వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుంది.

సాంకేతికత దిశగా..

సెర్ప్ ఉద్యోగులకు మరింత సాంకేతికత జోడించనుంది. గతంలో 2014-19లో తెదేపా హయాంలోనే వెలుగు ఉద్యోగులకు చరవాణులు ఉచితంగా ఇచ్చారు. ప్రస్తుతం జిల్లాలో ఏపీఎం, సీసీ, యానిమేటర్లు (వీవోఏ)కు ల్యాప్‌ట్యాప్, కంప్యూటర్, చరవాణులు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఇటీవల సమావేశంలో చర్చించారని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్ తెలిపారు.

'కార్పొరేట్లకు కట్టబెట్టడానికే భూసేకరణ'

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: రైతుల భూములను కార్పొరేట్లకు కట్టబెట్టడానికే సేకరిస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు విమర్శించారు. విజయనగరంలోని రెవెన్యూహోంలో బుధవారం ఏపీ రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు, సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. అభివృద్ధి పేరుతో అవసరం కన్నా ఎక్కువ భూసేకరణ జరుగుతోందని ఆరోపించారు. రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ ఏపీఐఐసీ ద్వారా సేకరించిన భూముల్లో కనీసం పదిశాతం పరిశ్రమలు ప్రారంభించలేదన్నారు. అనంతరం పోరాట కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా టి.వి.రమణ, కో-కన్వీనర్లుగా పడాల శ్రీనివాసరావు, ఆర్.చంద్రశేఖర్, పి.ఎల్లం నాయుడుతో పాటు మరో 14 మంది సభ్యులున్నారు. ఈ నెల 19 నుంచి 25 వరకు నిరసనలు, వినతిపత్రాల అందజేత, 26 నుంచి మార్చి 1 వరకు తీర్మానాలు, 2న కలెక్టర్‌కు ఫిర్యాదు.. తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంఘీభావం తెలుపుతున్న నాయకులు

PUBLIC NOTICE

Under the instructions of my client **M/S SHRIRAM FINANCE LIMITED, MVP Colony Branch, Visakhapatnam,** I issue the following notice to general public. My client intends to grant loan to **Mr. BEHARA SRINIVASA RAO** S/o B Sanyasi Rao by keeping the below mentioned schedule property of **SMT. BEHARA SAVITHRI** W/o B Srinivasa Rao as security by way of Registered Mortgage. As such if any one have any claims, charges, mortgages Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices. Otherwise, later objections will not bind my client in this regard.

SCHEDULE OF THE IMMOVABLE PROPERTY

Vizianagaram District, Kothavalasa Sub-District, Kothavalasa Mandalam, Kothavalasa Gram panchayat, Cheepuruvalasa village accounts covered by S. No.161-1-A in which **Plot No.79** an extent of 140 Sq. yards or 117.04 Sq. Meters of vacant site is measured and bounded by:
EAST : SS Promoters VUDA layout - 36 feet or 10.98 meters ; **SOUTH :** Plot no.80 site - 35.4 feet or 10.79 meters ; **WEST :** 30 feet wide road - 36 feet or 10.98 meters ; **NORTH :** Plot No.78 site - 34.6 feet or 10.55 meters.

KODURI SREENIVASA RAO
SMT. SIVA KUMARI JALADI
Advocates,
S-2, Bharat Apartments, Seethammadhara, Visakhapatnam-13.
Visakhapatnam Dt.18.02.2026
Mobile No.9885166648
Mail: sreenivaskoduri@gmail.com

ఒక్కొక్కటీ వస్తున్నాయ్..

న్యూస్‌టుడే – బొబ్బిలి

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఔత్సాహికులు ముందుకొస్తుండడంతో ఏపీఐఐసీ భూములను కేటాయిస్తోంది. బొబ్బిలి పారిశ్రామికవాడతో పాటు రామభద్రపురం మండలం కొట్టక్కిలో దరఖాస్తు చేసుకున్నవారికి ఇటీవల స్థలాలు ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలవారు యూనిట్లు పెడితే స్థలం ఖరీదులో 50 శాతం రాయితీలు ఇస్తున్నారు.

యూనిట్ల ఏర్పాటుకు కేటాయించిన స్థలం

- పరిశ్రమల ఏర్పాటుకు అడుగులు

అందుబాటులో 307.20 ఎకరాలు

బొబ్బిలి పారిశ్రామికవాడలో ఇంకా 307.20 ఎకరాలు అందుబాటులో ఉంది. ఔత్సాహికులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఏపీఐఐసీ కల్పించింది. మొత్తం 129 ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి. నిబంధనల మేరకు కేటాయిస్తామని సంస్థ చెబుతోంది. దరఖాస్తు చేసుకున్న వెంటనే అన్ని రకాల అనుమతులు మంజూరు చేస్తున్నామని సంస్థ జోనల్ ఉప ప్రబంధకుడు జయచంద్ర తెలిపారు.

కేటాయింపులు ఇలా..

- బొబ్బిలి పారిశ్రామిక వాడలో సోనీ ఇండస్ట్రియల్ గ్యాస్ తయారీ, సిద్ధి వినాయక ప్రోసెసింగ్ యూనిట్, అమీనా ఇంజినీరింగ్ వర్క్స్, సన్‌రైజ్ కంపెనీ, అను ఇండస్ట్రీస్ తదితర కర్మాగారాలకు 4.35 ఎకరాలు కేటాయించారు. ఇవి ఏర్పాటైతే సుమారు 200 మందికి ఉపాధి దొరుకుతుంది.
- రామభద్రపురం మండలం కొట్టక్కి సమీపంలో రాధిక ఎడిబుల్ ఆయిల్ కర్మాగారానికి 62 ఎకరాలు కేటాయించారు. పరిశ్రమ ఏర్పాటైతే దాదాపు 200 మందికి పని లభిస్తుంది. ఇప్పటికే స్థలాల కేటాయింపులు జరిగిపోయాయి.

లారీ ఢీకొని కూలీ మృతి

రోదిస్తున్న కుటుంబ సభ్యులు

తెర్లాం, న్యూస్‌టుడే: పక్క గ్రామంలో జరిగిన నాటిక ప్రదర్శన చూసొద్దామని వెళ్లిన వ్యక్తి రహదారి ప్రమాదంలో మృత్యువాత పడిన ఘటన తెర్లాం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. జన్నివలస గ్రామానికి చెందిన చప్ప అప్పలస్వామి (56) కూలి చేస్తూ.. కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. మంగళవారం రాత్రి కూనాయవలసలోని కొండల పోలమ్మ ఆలయం వద్ద శివభాగవతం ప్రదర్శించారు. చూసేందుకు స్వగ్రామానికి చెందిన సీతన్నతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్లారు. ఆలయ సమీపంలో ప్రదర్శన జరుగుతున్న వైపు ద్విచక్రవాహనాన్ని మళ్లించేసరికి వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. వెనుక కూర్చున్న అప్పలస్వామి అక్కడికక్కడే మృతి చెందగా.. వాహనం నడుపుతున్న సీతన్నకు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడికి భార్య పార్వతి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడికి వివాహం కాగా.. రెండో కుమారుడు, కుమార్తె డిగ్రీ వరకు చదువుకుని ఉన్నారు. కుమారుడు గంగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.సాగర్‌బాబు తెలిపారు. గాయపడిన వ్యక్తి ప్రస్తుతం బాడంగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు.

అడ్డొచ్చిన కుక్క.. ఆగిన ప్రాణం

శ్రీనివాస్ (పాతచిత్రం)

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపు తప్పి ఒకరు మృతి చెందిన ఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై నవీన్ వివరాల ప్రకారం... రెల్లిగైరమ్మపేటకు చెందిన యేడువాక శ్రీనివాస్ (29) గ్రామానికి సమీపంలో ఉన్న స్టీల్ కర్మాగారంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంపై కొత్తవలస వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా మల్లివీడు రైల్వే స్టేషన్‌కు ఎదురుగా వాహనానికి కుక్క అడ్డు వచ్చింది. దాన్ని తప్పించబోయి రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబీకులు ఎస్.కోట ఆసుపత్రికి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం వేకువజామున మృతి చెందారు. ఆయనకు భార్య రమ్య, రెండేళ్ల కుమారుడు కార్తీక్ ఉన్నారు. శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రేమ పేరిట మోసం..

నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

విజయనగరం అయ్యన్నపేట, భోగాపురం, న్యూస్‌టుడే: ప్రేమ పేరుతో ఓ బాలికను మోసం చేసిన నిందితుడికి జైలు శిక్ష, జరిమానా పడింది. ఎస్పీ దామోదర్ వివరాల ప్రకారం.. భోగాపురం మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి తన కుమార్తె అదృశ్యమైనట్లు గతేడాది మే 22న పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై పి.సూర్యకుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదే గ్రామానికి చెందిన ఆర్.సురేష్(26) పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికను వెంట తీసుకెళ్లినట్లు గుర్తించారు. విశాఖపట్నం, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో తిప్పి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదుతో జులై 7న పోక్సో కేసు పెట్టారు. డీఎస్పీ ఆర్.గోవిందరావు దర్యాప్తు చేపట్టి, నిందితుడిని రిమాండుకు తరలించారు. న్యాయ స్థానంలో అభియోగ పత్రాలు దాఖలు చేయడంతో 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ వెల్లడించారు. బాధితురాలికి పరిహారంగా రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు.

గుండెపోటు దాటేలా.. పచ్చనిగూడు నిలిచేలా..

ప్రభుత్వాసుపత్రుల్లో అత్యవసర ఇంజెక్షన్

హృద్రోగులకు వరం.. స్టెమీ కేంద్రం

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, పాలకొండ

ఛాతిలో నొప్పి అనిపించినప్పుడు తక్షణ వైద్య సాయం అందక ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ పరిస్థితి ఎదురవ్వకూడదన్న ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం ఆసుపత్రుల్లో తక్షణ ప్రాథమిక చికిత్స అందించాలనే లక్ష్యంతో స్టెమీ (ఎస్టీ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్‌ఫార్క్షన్) పేరిట వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో అత్యవసర వైద్యం అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలో మూడేళ్లలో 90 మంది వరకు ఈ ఇంజెక్షన్ ద్వారా ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. అవగాహన లేక సకాలంలో ఆసుపత్రికి రాక ప్రాణాలు కోల్పోతున్నవారు లేకపోలేదు.

కొన్నేళ్ల క్రితం ఓ ప్రభుత్వ ఉద్యోగికి గుండెల్లో నొప్పి, ఆయాసం వచ్చాయి. జిల్లా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి గుండెపోటుగా గుర్తించి.. విశాఖ రిఫర్ చేశారు. మార్గమధ్యలో మృతిచెందారు. ఇది నిన్నటి మాట.

పార్వతీపురం మండలం వెంకంపేటకు చెందిన వృద్ధుడికి ఇటీవల గుండెలో నొప్పి వచ్చింది. ప్రైవేటు ఆసుపత్రిలో చూపించారు. వారి సూచన మేరకు జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు గుండెపోటుగా గుర్తించి.. తక్షణం టెనెక్టేప్లేస్ ఇంజెక్షన్ ఇచ్చారు. తర్వాత కుటుంబీకులు విశాఖ తీసుకెళ్లి చికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పింది.. ఇది నేటి పరిస్థితి.

తొలి గంట కీలకం

'గుండెనొప్పికి గురైన వారికి తొలి గంట(గోల్డెన్ అవర్) ఎంతో కీలకం. ఛాతిలో నొప్పి, ఎడమవైపు భుజం లాగడం, గుండె దడ, ఆకస్మిక ఆయాసం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణం ఆసుపత్రికి వెళ్లాలి. గుండెనొప్పిగా నిర్ధారణ అయితే ప్రభుత్వం సరఫరా చేసిన రూ.45 వేలు ఖరీదైన టెనెక్టేప్లేస్ ఇంజెక్షన్ ఉచితంగా వేస్తారు. ఇది రక్తం గడ్డకట్టకుండా చేస్తుంది. రోగిని విశాఖ తరలించి మెరుగైన వైద్యం అందించడానికి తగిన సమయం లభిస్తుంది.'

మూడేళ్లలో ఎంత మందికి అంటే..

ఆసుపత్రి	ఇంజెక్షన్ ఇచ్చింది	ప్రాణాలు నిలిచింది
జిల్లా కేంద్ర	42	38
సాలూరు	24	22
పాలకొండ	16	15
సీతంపేట	06	5
చినమేరంగి	02	1
కురుపాం	09	6
భద్రగిరి	03	3



అని పార్వతీపురం జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకురాలు నాగశివజ్యోతి చెప్పారు. జిల్లాలో సాలూరు, పాలకొండ, సీతంపేట ప్రాంతీయాసుపత్రులు, భద్రగిరి, కురుపాం, చినమేరంగి సామాజిక ఆసుపత్రులతోపాటు జిల్లా ఆసుపత్రిలో స్టెమీ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. మూడేళ్లలో మొత్తం 102 మందికి ఇంజెక్షన్ ఇవ్వగా ఇందులో 90 మంది ప్రాణాలు నిలిచాయి.

సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాలో ప్రాంతీయాసుపత్రులు, సీహెచ్‌సీలు, జిల్లా ఆసుపత్రిలో స్టెమి కేంద్రాలున్నాయి. హృద్రోగ సమస్యలు ఉన్నట్లు గుర్తిస్తే ఇంజెక్షన్ ఇస్తున్నాం. తదుపరి వైద్యం అందించేందుకు అవకాశం ఉంటుంది. సకాలంలో వచ్చిన వారి ప్రాణాలకు భరోసా ఉంటుంది. సద్వినియోగం చేసుకోవాలి.
– నాగభూషణరావు, డీసీహెచ్ఎస్

గుత్తేదారుపై ఫిర్యాదు

విజయనగరం అర్బన్: విజయనగరం మండలంలో థర్డ్ ఆప్షన్ కింద మంజూరైన గృహాలు పూర్తిచేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఇళ్లు నిర్మిస్తామని ఒప్పందం చేసుకుని మధ్యలో ఆపేసిన గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలని గృహనిర్మాణశాఖకు 128 మంది ఫిర్యాదు చేశారు. గుంకలాం, కొండకరకాం కాలనీల్లో 5,088 ఇళ్లను నిర్మించేందుకు రాక్రీట్ సంస్థ అప్పట్లో ముందుకొచ్చింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందుకెళతామని గృహనిర్మాణశాఖ పీడీ జి.మురళీమోహన్ తెలిపారు.

నిబంధనలు పాటించాలి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: ఆసుపత్రుల వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి హెచ్చరించారు. ప్రజారోగ్యానికి హాని కలగకుండా శాస్త్రీయ పద్ధతిలో తరలించాలన్నారు. నిబంధనలు పాటించని యాజమాన్యాలకు నోటీసులు ఇవ్వాలని కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సరితకు సూచించారు.

అన్న క్యాంటీన్ సిద్ధం

నిర్మాణం పూర్తయిన అన్న క్యాంటీన్ భవనం

కొత్తవలస, న్యూస్‌టుడే: కొత్తవలసలో అన్న క్యాంటీన్ నిర్మాణం దాదాపు రూ. 60 లక్షల వ్యయం అంచనాతో 95 శాతం పూర్తయింది. శృంగవరపుకోట నియోజకవర్గానికి సంబంధించి గతంలో తెదేపా అధికారంలో ఉన్నప్పుడు దీనిని ప్రారంభించారు. కూడలికి, పంచాయతీ వాణిజ్య సముదాయానికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో దీనిని నిర్వహించారు. వైకాపా అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా వీటిని మూసివేసిన విషయం తెలిసిందే. కూటమి ఏర్పాటయ్యాక అదే స్థలంలో మళ్లీ పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టారు. ఈ భవనం ప్రారంభంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని విజయనగరం పబ్లిక్ హెల్త్ డీఈఈ ఈశ్వర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. చీపురుపల్లిలో క్యాంటీన్ నిర్మాణం పూర్తయిందని, గజపతినగరంలో స్థలం కేటాయించాలని ఆయన తెలిపారు.

వంతెన వచ్చినా.. తప్పని అవస్థలు

బస్సులు చాలక ఇబ్బందులు

పాలకొండ కాంప్లెక్సులో విశాఖ బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: చీపురుపల్లి వద్ద వంతెన నిర్మాణం పూర్తి కావడంతో పాలకొండ నుంచి విశాఖకు గతంలో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సులు నేరుగా తిరుగుతున్నాయి. దీంతో ఈ రూట్లో ప్రయాణానికి ఇబ్బందులు తొలగాయనుకున్నారు. కానీ పూర్తి స్థాయిలో సర్వీసులు కల్పించక ప్రయాణికులకు ప్రయాసలు తప్పడం లేదు.

సర్వీసులు పెరిగినా..

పాలకొండ నుంచి విశాఖకు రాకపోకలు అధికం. పట్టణంతోపాటు వీరఘట్టం, సీతంపేట, శ్రీకాకుళం జిల్లా కొత్తూరు, బూర్జ, విజయనగరం జిల్లా రేగిడి, రాజాంతో పాటు పలు ప్రాంతాల ప్రజలు విశాఖ వెళ్లేందుకు ఈ బస్సులే ఆధారం. 2022కు ముందు 30కు పైగా సర్వీసులు ఉండేవి. వంతెన నిర్మాణం వల్ల చీపురుపల్లి మీదుగా ఆగిపోవడంతో బస్సులు తగ్గించారు. యథావిధిగా పునరుద్ధరించడంతో 12 బస్సులు అదనంగా అవసరం. ఆరు మాత్రమే వేశారు. ఇవి చాలడం లేదు. ఉదయం నాలుగున్నర గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రతి 20 నిమిషాలకు ఒకటి అందుబాటులో ఉంది. తర్వాత గంటకు ఒకటి మాత్రమే నడుస్తోంది. రాత్రి 7 గంటల తర్వాత ఇంద్ర, డీలక్స్ బస్సులు మాత్రమే ఉన్నాయి. ఎక్స్‌ప్రెస్‌లు లేవు. స్త్రీశక్తి పథకం కొనసాగుతుండడంతో ఇబ్బందులు తప్పడంలేదు.

చర్యలు తీసుకుంటాం..

పాలకొండ నుంచి విశాఖకు గతంలో కంటే బస్సుల సంఖ్యను పెంచాం. మరో ఆరు బస్సులు రావాల్సి ఉంది. ప్రస్తుతం ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు సర్వీసులు తిప్పుతున్నాం. – మూర్తి, డిపో మేనేజర్

EENADU Classifieds

REAL ESTATE

HOUSE FOR SALE

167 Sq. Yds East Facing Independent House LIG-150, Babametta, VUDA Layout Ready for immediate Possession in Vizianagaram 8125120285, 9948353901.

JOBS

Computer Hardware, Networking CCTV Technicians Freshers and Experienced Can Apply ITI, Diploma or and Degree Location Visakhapatnam. Contact Whatsapp 6333866866 email: info@servicezt365.com Date 21-02-2026 10:30 Am to 5:00 Pm.

SECURITY GUARDS

ప్రకటన చిన్నదైనా స్పందన అమోఘం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

బొబ్బిలి

● బొబ్బిలి ● రాజాం ● గజపతినగరం ● చీపురుపల్లి

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

బొబ్బిలి	80085 74367
గజపతినగరం	80085 74332
రాజాం	80085 74308
గరివిడి	80085 74348

? రామభద్రపురం మేజర్ పంచాయతీలో ప్రధాన రహదారికి ఇరువైపులా కాలువలు పాడైపోయాయి. మురుగునీరు పారుతుండటంతో దుర్వాసన వస్తోంది. ఇబ్బంది పడుతున్నాం. - **స్థానికులు** ✦ నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం. ఇబ్బంది తీరుస్తాం. - **ప్రణయ, ఏఈ** – న్యూస్‌టుడే, రామభద్రపురం

? కిర్తుబర్తి కూడలిలో దారి దిశ చూపించే సూచిక బోర్డు పాడైంది. - **స్థానికులు** ✦ కొత్త బోర్డు ఏర్పాటు చేస్తాం. - **రమణమూర్తి, ఎంపీడీవో** – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

? మానాపురం- జక్కువ రహదారి నిర్మాణం మధ్యలో నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. - **అప్పలనాయుడు, పెదమేడపల్లి** ✦ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. - **అజయ్‌భార్గవ్, ఏఈ** – న్యూస్‌టుడే, మెంటాడ

? సత్యనారాయణపురం వార్డు పరిధిలో ప్రైవేటు మహిళా హాస్టల్ సమీపంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. కాలువలు మురుగుతో నిండాయి. దోమల బెడద అధికంగా ఉంది. - **స్థానికులు** ✦ వ్యర్థాలు తొలగింపజేస్తాం. - **ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్** – రాజాం పట్టణం

నీటి ఇక్కట్లు తీరాయ్

స్పందనకు వందనం

చీపురుపల్లి: చీపురుపల్లి ఉన్నత పాఠశాలలో బోరు పాడై మధ్యాహ్న భోజనం చేశాక కంచం కడిగేందుకు విద్యార్థులు ఇబ్బంది పడేవారు. దీనిపై ఈనెల 18న వార్త ప్రచురితమైంది. అధికారులు స్పందించి బోరు బాగు చేశారు. విద్యార్థుల ఇక్కట్లు తీరాయి.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

బొబ్బిలి, న్యూస్‌టుడే: బాల్య వివాహాలను అంతం చేసేందుకు తమవంతు కృషి చేస్తామని కిశోరబాలికలు, ఐసీడీఎస్ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. బుధవారం బొబ్బిలి ఐటీఐ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. పర్యవేక్షకురాలు రమణకుమారి పాల్గొన్నారు. ● **వంగర:** బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని పర్యవేక్షకురాలు టి.మేరీ అన్నారు. వంగర, అరసాడ గ్రామాల్లో అవగాహన కల్పించారు.

కూరగాయల ధరలు

రాజాం రైతుబజారులో బుధవారం కూరగాయల ధరలు (కి.లో రూ.లలో).. ● టమాటా: 15 ● వంకాయలు: 30 ● దొండ: 60 ● బీర: 50 ● బెండ: 50 ● కాకర: 50 ● చిక్కుడు: 40 ● ఆనపకాయ (ఒకటి): 26 ● అరటి (జత): 20 ● మునగ: 80 ● ఉల్లి: 25 ● బంగాళదుంపలు: 20 ● అల్లం: 80 ● వెల్లుల్లి: 120 ● పచ్చిమిర్చి: 80 ● క్యాబేజీ: 20 ● క్యారెట్: 42 – న్యూస్‌టుడే, రాజాం

తెరపై ఈనాడు

✦ ఎస్‌వీసీ సీతారామా: **ఫంకీ** ✦ ఎస్‌వీసీ సీతారామా: **కపుల్‌ఫ్రెండ్లీ** ✦ ఎస్‌వీసీ అప్సర: **మన శంకరవరప్రసాద్‌గారు** – న్యూస్‌టుడే, రాజాం ✦ లక్ష్మీ థియేటర్: **కపుల్ ఫ్రెండ్లీ** ✦ వాసవి: **ఫంకీ** ✦ టీబీఆర్ స్క్రీన్-1: **మన శంకరవరప్రసాద్‌గారు** ✦ టీబీఆర్ స్క్రీన్-2: **మన సంతా నువ్వే** – న్యూస్‌టుడే, బొబ్బిలి

తాగునీటి కిట్టు.. అంతా కనికట్టు

✦ నెలల తరబడి పరీక్షలు చేయని వైనం ✦ నీటి నాణ్యత ప్రశ్నార్థకం

న్యూస్‌టుడే- సంతకవిటి, రాజాం గ్రామీణం

గ్రామాల్లో తాగునీటి నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. ఎప్పటికప్పుడు నాణ్యత పరీక్షించి, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు ఇవ్వాలని ప్రభుత్వం అందజేసిన కిట్లు మూలన భద్రంగా ఉంచారు. పల్లెల్లో తాగునీటి పథకాల నిర్వహణ అంతంతే. వేసవి వచ్చేసింది. ఏ మాత్రం నీరు కలుషితమైనా తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉంది. ప్రజారోగ్యంపై ప్రభావం చూపే తాగునీటిపై నిర్లక్ష్యం చేయడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

సంతకవిటి: గరికిపాడు సచివాలయంలో అట్టపెట్టెలో భద్రంగా ఉంచిన తాగునీటి పరీక్షల కిట్టు

మండలం	పంచాయతీలు	సచివాలయాలు	పథకాల ద్వారా నీరు అందే గ్రామాలు
సంతకవిటి	34	24	112
రాజాం	21	17	113
రేగిడి	39	19	141
వంగర	29	25	97

సంతకవిటి మండలం గరికిపాడు సచివాలయానికి అందించిన తాగునీటి కిట్టు బీరువాపై ఓ మూలన ఉన్నాయి. తమకు అందించిన కిట్టు గడువు తేదీ అయిపోయిందని, మూడు నెలలుగా తాగునీటిని రాజాంలోని ల్యాబ్‌కు తీసుకెళ్లి పరీక్షిస్తున్నామని సిబ్బంది చెప్పారు. తీరా కిట్టు తీసి చూస్తే ఈనెలాఖరు వరకు వాటి గడువు ఉంది. దీని బట్టి ఈ సచివాలయం పరిధిలోని నాలుగు గ్రామాల్లో తాగునీటి పరీక్షల తీరు అర్థం చేసుకోవచ్చు.

● రాజాం మండలం కంచరాం, సంతకవిటి మండలం బొద్దూరు సచివాలయాల్లో నెలలో రెండు, మూడుసార్లు పరీక్షలు చేస్తున్నట్లు దస్త్రాలో నమోదు చేశారు. అది కూడా అన్ని నెలల్లో ఒకేలా ఫలితాలు ఉండడం విశేషం.

● సంతకవిటి మండలంలోని జంట గ్రామాలైన ఎం.ఆర్.అగ్రహారం, ఎస్.ఆర్.అగ్రహారంలో రెండేళ్ల కిందట విషజ్వరాలతో వందలాది మంది మంచం పట్టారు. నలుగురు మృత్యువాత పడ్డారు. అధికారులు అప్రమత్తమైనా పరిస్థితి అదుపులోకి వచ్చేసరికి నెల రోజులు పట్టింది. తాగునీటి కలుషితమే కారణమని తేల్చారు. ముందుగానే పరీక్షల్లో తేల్చుంటే నష్టం జరగకపోయేది.



రాజాం: రాజయ్యపేటలో 2025 మే 20న చివరిగా పరీక్షలు చేశారు. ఆ తర్వాత చేసినట్లు రికార్డులో లేదు.

చర్యలు తీసుకుంటాం..

గ్రామాల్లోని తాగునీటి పథకాలు, బోరుబావుల నీటిలో ఏ ఏ లవణాలు ఎంత మోతాదులో ఉన్నాయి.. కాల్షియం, ఫ్లోరైడ్ ఎంత శాతం ఉందో నెలలో ఒకసారి తప్పనిసరిగా పరీక్షించాలి. దస్త్రాలో నమోదు చేసి, సచివాలయంలో భద్రపర్చాలి. తాగునీటిలో తేడాలు వస్తే ప్రజలను అప్రమత్తం చేయాలి. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రతినెలా ఈ పని చేయాలి. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటాం. – **కె.రాజేష్,** గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం డీఈఈ, రాజాం

పనులు కావాలంటే ఎదురుచూడాల్సిందేనా

సిబ్బంది కోసం వేచి చూస్తున్న ప్రజలు

రాజాం గ్రామీణం, న్యూస్‌టుడే: రాజాం మండలం రాజయ్యపేట గ్రామ సచివాలయానికి బుధవారం ఉదయం పలు పనులపై వచ్చిన ప్రజలు సిబ్బంది కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఎదురైంది. 11 గంటల తర్వాత సిబ్బంది కార్యాలయానికి వచ్చారు. అప్పటివరకూ ఒక్కరూ రాలేదు. నిత్యం ఇదే తీరని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. విషయాన్ని పంచాయతీ కార్యదర్శి తిరుపతిరావు వద్ద ప్రస్తావించగా.. తాను ఓటర్ల జాబితాల కోసం రాజాం ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లినట్లు చెప్పారు. డిజిటల్ అసిస్టెంట్, మహిళా పోలీసు సెలవులో ఉన్నారని, మిగతా సిబ్బంది వివిధ సర్వేల్లో ఉన్నారని తెలిపారు.

అయిదుగురు క్షేత్రసహాయకులకు మెమోలు

బాడంగి, న్యూస్‌టుడే: విధినిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో రామకృష్ణ హెచ్చరించారు. బుధవారం బాడంగి మండల పరిషత్తు కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వేతనదారులకు ఉపాధిహామీ పనుల కల్పనలో అలసత్వం వహించిన గజరాయునివలస, ఆకులకట్ట, పినపెంకి, కోటిపల్లి, పెద్దపల్లి క్షేత్రసహాయకులకు మెమోలు జారీ చేశారు. వెనుకబడిన గ్రామాల్లో ఈ వారంలో పనులు కల్పించాలని సూచించారు. ఏపీవో సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ ప్రదేశం.. వ్యర్థాలమయం

రాజాం పట్టణంలోని మాధవబజార్‌లో మొండివీధి ఎదురుగా కోర్టు గేటు లోపల వ్యర్థాలతో నిండిపోయింది. మార్కెట్‌లోని పనికిరాని వస్తువులు ఇక్కడ పారబోస్తున్నారు. దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యర్థాలు పారబోయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విషయం కమిషనర్ ఆకారపు రామచంద్రరావు వద్ద ప్రస్తావించగా.. వ్యర్థాలను తొలగింపజేస్తామన్నారు. – న్యూస్‌టుడే, రాజాం పట్టణం

మలుపు.. ప్రమాదానికి పిలుపు

గుర్ల మండలంలోని పలుచోట్ల మలుపులు ప్రమాదకరంగా తయారయ్యాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గరికివలస వెళ్లే రహదారిలో కోటగండ్రేడు శివాలయం వద్ద పెద్ద మలుపు ఉంది. వాహనదారులు వేగంగా వచ్చే సమయంలో దగ్గరకు వచ్చే వరకు కనిపించరు. జమ్ము రహదారిలో శేషపుపేట రోడ్డు కూడలి వద్ద, నాగళ్లవలస వెళ్లే రహదారిలో గ్రామ సమీపంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాద సూచికలు లేవు. సూచికలు ఏర్పాటు చేస్తామని ర.భ.శాఖ డీఈఈ ప్రభు తెలిపారు. – న్యూస్‌టుడే, గుర్ల

రెయిలింగ్‌కు మరమ్మతులు చేపట్టరూ

మెంటాడ మండలం కొత్తరోడ్డు నుంచి చల్లపేటకు వెళ్లే మార్గంలోని గోపీనాథ్ పట్నాయక్ చెరువుపై వంతెనకు ఇరువైపులా ఉన్న రెయిలింగ్ పాడైంది. మూడు దశాబ్దాల కింద నిర్మించినది కావడంతో మరమ్మతులకు గురైంది. ఇటువైపు నుంచి సుమారు 20కి పైగా గ్రామాల ప్రజలు రాకపోకలు చేస్తుంటారు. ఆదమరిస్తే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. బాగు చేయాలని కోరుతున్నారు. విషయం ఏఈ అజయ్‌భార్గవ్ వద్ద ప్రస్తావించగా.. మండలంలో ఎనిమిది రోడ్ల నిర్వహణకు రూ.8.50 లక్షలు మంజూరయ్యాయని, వాటితో రెయిలింగ్‌కు మరమ్మతులు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, మెంటాడ

భవనం అసంపూర్ణం

గజపతినగరం మండలం సీతారాంపురం గ్రామ సచివాలయ భవనం పైఅంతస్తు నిర్మాణం దాదాపు పూర్తయినా.. తలుపులు, కిటికీలు, ద్వారాలు, గచ్చులు, విద్యుత్తు వంటి వసతులు కల్పించకపోవడంతో వినియోగానికి దూరంగా ఉంది. దీంతో సచివాలయ సిబ్బంది దిగువన ఉన్న రెండు ఇరుకు గదుల్లో ఇబ్బంది పడుతున్నారు. సమస్యను పంచాయతీరాజ్ ఏఈ అప్పలనాయుడు వద్ద ప్రస్తావించగా.. ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని, చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, గజపతినగరం

దారిలా.. అంత్యక్రియలు ఎలా

రాజాం పట్టణంలోని కొత్తవలస శ్మశానవాటికకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇరువైపులా పనికిరాని మొక్కలు, తుప్పలతో నిండి అధ్వానంగా ఉంది. దీంతో నానా అవస్థలు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. విషయం కమిషనర్ రామచంద్రరావు వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి, సమస్య పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, రాజాం పట్టణం

కళాశాలలు ఏర్పాటు చేయాలి

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి ప్రాంతంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు లేవని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. ఈ మేరకు అసెంబ్లీలో మాట్లాడారు. గతంలో రాజా కళాశాల ఎయిడెడ్‌గా నడిచేదని, గత ప్రభుత్వం అదీ లేకుండా చేసిందన్నారు. చెరకు పండించే రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. నాట్లు వేయడం, కోత కోసే యంత్రాలు ఖరీదైనవి కావడంతో ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు అందించాలని కోరారు. ఇందుకు నామమాత్రపు రుసుములు వసూలు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

యువత అదరగొట్టారు.. ఆకట్టుకున్నారు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం బుధవారం సందడిగా జరిగింది. విద్యార్థులు జీవిత లక్ష్యాలు నిర్దేశించుకుని కష్టపడాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రధానాచార్యుడు పి.మల్లేశ్వరరావు సూచించారు. కష్టపడే తత్వాన్ని అలవరుచుకోవాలన్నారు. జీవితాలను ఉన్నతంగా తయారు చేసుకోవాలన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కేరింతలతో సందడి చేశారు.

జనసేన బలోపేతానికి కృషి

మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి అప్పలస్వామి

బొబ్బిలి, న్యూస్‌టుడే: జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈనెల 26 నుంచి ప్రారంభం కానున్నట్లు బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పార్టీ బలోపేతానికి జన సైనికులు, వీర మహిళలు కృషి చేయాలన్నారు. సభ్యత్వం తీసుకున్న వారికి పార్టీ అన్ని రకాలుగా ఆదుకుంటుందన్నారు. గతేడాది బొబ్బిలి నియోజకవర్గం సభ్యత్వాల నమోదులో రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చుకుందన్నారు. ఈ ఏడాది కూడా అదే స్థాయిలో ఉండాలన్నారు. జనసైనికులు సంచాన గంగాధర్, పి.హరి, రేవళ్ల కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం నేడు.. చీపురుపల్లి: పట్టణ పరిధిలోని వంగపల్లిపేటలో మానవీయత స్వచ్ఛందసేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు బీవీ గోవిందరాజులు బుధవారం తెలిపారు. ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

రూ.9.38 లక్షలతో రక్షణ గోడ

రేగిడి: రేగిడి మండలం బొడ్డవలస మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలకు రూ.9.38 లక్షలతో రక్షణగోడ నిర్మించనున్నారు. సమగ్రశిక్షా నిధులు మంజూరు చేసింది. బుధవారం సర్పంచి పట్టాభి, తెదేపా నాయకుడు జి.కృష్ణ, మాజీ నీటిసంఘం అధ్యక్షుడు సాంబమూర్తి పనులు ప్రారంభించారు.

చట్టాలపై అవగాహన

బొబ్బిలి: జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్ బొబ్బిలి ఉప కారాగారాన్ని సందర్శించారు. ఖైదీలకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. వంట గదిలోని నిత్యావసరాలను పరిశీలించారు. నాణ్యత ఎలా ఉందో తెలుసుకున్నారు. న్యాయ క్లినిక్‌ల పనితీరు తెలుసుకున్నారు. ఖైదీలపై వివక్ష చూపకూడదని సూచించారు. చట్టాలపై అవగాహన కల్పించారు.

అధిక బరువుతో వెళ్తే చర్యలు

రేగిడి: అధిక బరువులతో వెళ్లే వాహనదారులపై చర్యలు తప్పవని రేగిడి ఎస్సై బాలకృష్ణ హెచ్చరించారు. బుధవారం రేగిడిలో వాహనదారులతో సమావేశమయ్యారు. ట్రాక్టర్లు, లారీలు, ఇతర వాహనాలు పరిమితికి మించి బరువు తీసుకెళ్తూ.. దొరికితే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఎంపీటీసీ సభ్యుడి మృతికి నివాళి

రామభద్రపురం: రామభద్రపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు గొర్లి అప్పలనాయుడు బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక నాయకులు, పెద్దలు సంతాపం తెలిపారు. కుమారుడి వివాహం ఈనెల 20న జరగాల్సి ఉండగా.. ఇంతలోనే ఇలా జరగడంపై విచారం వ్యక్తం చేశారు.

సీఎం సహాయనిధి అందజేత

గుర్ల, న్యూస్‌టుడే: పెదబంటుపల్లికి చెందిన కుషాల్ నందన్‌కు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.1,18,013ల చెక్కును తెదేపా రాష్ట్ర కార్యదర్శి రామ్‌మల్లిక్ నాయుడు బుధవారం అందించారు. ఆనందపురానికి చెందిన చిట్టి సత్యంకు రూ.58,550 అందించారు. నాయకులు టి.కిరణ్‌కుమార్, సన్యాసినాయుడు, మహేశ్వరరావు, పిల్లా అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చక్రతీర్థ స్నానం

రేగిడి: రేగిడి మండలం చిన్నయ్యపేట గ్రామంలోని శివశక్తి అఖిలాండేశ్వరి అమ్మవారి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పలు కార్యక్రమాలు చేపట్టారు. సంకిలి నాగావళి నదిలో అమ్మవారితో పాటు ఉత్సవమూర్తులకు చక్రతీర్థ స్నానాలు నిర్వహించారు. అనంతరం అభిషేకాలు, పూజలు జరిగాయి. పార్వతీపరమేశ్వరుల కల్యాణం చేశారు. ✦ **సంతకవిటి:** సంతకవిటి శివాలయంలో శివరాత్రి సందర్భంగా బుధవారం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు చక్రతీర్థ స్నానం నిర్వహించారు.

పని ఒత్తిడి తగ్గించాలి

రాజాం గ్రామీణ, న్యూస్‌టుడే: వీఆర్వోలపై పని ఒత్తిడి తగ్గించాలని ఆ సంఘ అధ్యక్షుడు జి.అనంతరావు, కార్యదర్శి కె.రాము డిమాండు చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. పని ఒత్తిడితో చాలామంది అనారోగ్యాల బారినపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ రాజశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

మంత్రికి విన్నవిస్తున్న బేబినాయన

బొబ్బిలి, న్యూస్‌టుడే: తెర్లాం మండల పరిషత్తు కార్యాలయం జీర్ణావస్థకు చేరుకుందని, కొత్త భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. బుధవారం అమరావతిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ కృష్ణతేజను కలిశారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. బొబ్బిలి మండలం కోమటపల్లి గురుకుల పాఠశాలను జూనియర్ కళాశాలగా మార్చాలని వెనుకబడిన తరగతులు, జౌళి చేనేత సంక్షేమ శాఖామంత్రి మంత్రి సవితకు వినతిపత్రం ఇచ్చారు. బొబ్బిలి ఏఎంసీ అధ్యక్షుడు నర్సుపల్లి వెంకటనాయుడు, అల్లాడ భాస్కరరావు పాల్గొన్నారు.

అపరాల రైతుకు అష్టకష్టాలు

న్యూస్‌టుడే- గంట్యాడ గ్రామీణం (పెదమజ్జిపాలెం)

కొండతామరాపల్లి వద్ద అపరాల పంట

ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు

కష్టపడి పండించిన అపరాల పంటలకు సరైన గిట్టుబాటు ధర లేక రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. వరిపంట అనంతరం సాగుచేసే పెసర, మినుము పంటలకు మద్దతు ధర లభించడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులు తక్కువ ధరకు అడుగుతున్నారని, పెట్టుబడి కూడా రావడంలేదని వాపోతున్నారు.

గంట్యాడ మండలంలో 8 వేల ఎకరాల్లో మినుము, పెసర పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకున్నారు. దిగుబడి వచ్చినా గిట్టుబాటు ధర లేదు. పెసర క్వింటా రూ.6,800.. మినుములు క్వింటా రూ.6,500 లకు మించి వ్యాపారులు కొనుగోలు చేయడంలేదని రైతులు చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉందని గంట్యాడ మండల వ్యవసాయాధికారి శ్యామ్‌కుమార్ తెలిపారు.

పెట్టుబడి రావడంలేదు..

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదు. దీంతో చేతికందిన పంటను నిల్వ చేసుకోలేక వ్యాపారులు చెప్పిన ధరకే విక్రయిస్తున్నాం.

- నీలాతి లక్ష్మణ, రైతు, బుడతనాపల్లి

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

రామభద్రపురంలో మాట్లాడుతున్న అధికారి

వంగర, రాజాం గ్రామీణం, న్యూస్‌టుడే: స్వయం శక్తి సంఘాల్లోని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని డీఆర్‌డీఏ సంస్థాగత నిర్మాణం డీపీఎం ఏ.చిరంజీవి అన్నారు. బుధవారం వంగర మండల పరిషత్తు కార్యాలయంలో సీఆర్పీలు, ఈనారీలకు ఇన్‌కమ్ ప్రొఫైల్ సర్వేపై శిక్షణ నిర్వహించారు. స్త్రీనిధి మేనేజర్ సుధాకర్, ఏపీఎం మంగమ్మ తదితరులు పాల్గొన్నారు. రాజాం వెలుగు కార్యాలయంలో చిరంజీవి మాట్లాడారు. ఏపీఎం భవాని పాల్గొన్నారు. ● **రేగిడి:** మండల పరిషత్తు సమావేశ మందిరంలో శిక్షణ నిర్వహించారు. ఏపీఎం గోవిందరావు పాల్గొన్నారు. ● **రామభద్రపురం:** ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను మహిళలు సక్రమంగా వినియోగించుకోవాలని ఏపీఎం శేషగిరిరావు అన్నారు. రామభద్రపురంలో శిక్షణ నిర్వహించారు. ● **చీపురుపల్లి, గ్రామీణం:** వెలుగు ప్రత్యేకాధికారి జి.సీతారామయ్య చీపురుపల్లిలో మాట్లాడారు. ఏపీఎం ఎన్.అప్పలనాయుడు పాల్గొన్నారు.

వేసవి ప్రణాళికలు సిద్ధం చేయాలి

గరివిడి, న్యూస్‌టుడే: వేసవిలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని చీపురుపల్లి డివిజన్ అభివృద్ధి అధికారి హేమసుందర్ అన్నారు. ఈ మేరకు గరివిడి మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. మరమ్మతులకు గురైన రక్షిత మంచినీటి పథకాలు, చేతిపంపులను పరిశీలించి బాగుచేయించాలన్నారు. స్వచ్ఛ రథం, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే తదితర అంశాలపై ఆరా తీశారు. ఎంపీడీవో సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

అన్నీ విన్నాం.. పరిష్కారం చూపుతాం

ఈనాడు ఫోన్ ఇన్ కార్యక్రమం

న్యూస్‌టుడే- బొబ్బిలి

బొబ్బిలి పట్టణంలోని వార్డుల్లో తిష్ఠ వేసిన సమస్యల పరిష్కారానికి 'ఈనాడు' ఆధ్వర్యంలో కమిషనర్ రామలక్ష్మితో ఫోన్‌ఇన్ జరిగింది. పట్టణవాసులు తాము ఎదుర్కొంటున్న సమస్యలు నేరుగా కమిషనర్‌కు తెలిపారు. పరిష్కారం చూపాలని కోరారు. పుర విభాగాధిపతులంతా హాజరై ఆయా శాఖలకు సంబంధించిన సమస్యలను నమోదు చేసుకున్నారు. పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కమిషనర్ పురపాలిక అధికారులకు ఆదేశించారు.

ఫోన్‌లో సమస్యలు వింటున్న పుర కమిషనర్ రామలక్ష్మి

? 17వ వార్డుతో పాటు పలువీధుల్లో కుళాయిల నుంచి నీరు తక్కువ సమయం ఇస్తున్నారు. ఇబ్బంది పడుతున్నాం. **- టి.వాసుదేవరావు** ● తాగునీటి సరఫరా విభాగం సిబ్బందితో మాట్లాడి, ఇబ్బంది లేకుండా చూస్తాం.

? పట్టణంలోని తారకరామకాలనీలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రాత్రి పూట రాకపోకలకు భయంగా ఉంటోంది. **- టి.వెంకట్, జె.త్రినాథ, టీఆర్‌కాలనీ** ● వీధి కుక్కల నియంత్రణకు ఇప్పటికే చర్యలు చేపట్టాం. శస్త్ర చికిత్సలు ప్రారంభిస్తాం.

? పాఠశాలల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వేగ నియంత్రికలు ఏర్పాటు చేస్తే ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంది. **- నరేష్‌కుమార్** ● పోలీసు సిబ్బందితో మాట్లాడతాం. సాంకేతిక ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా తెలుసుకుని, చర్యలు తీసుకుంటాం.

? విద్యుత్తుశాఖ కార్యాలయం నుంచి కోటి చెరువు మీదుగా రైల్వే ట్రాకు వరకు వీధి దీపాలు లేవు. కాలనీలో అంతర్గత రహదారులు వేయాలి. **- శివకృష్ణ, ఇందిరమ్మ కాలనీ** ● వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. నిధుల లభ్యత మేరకు దశలవారీగా పనులు చేపడతాం.

ప్రభుత్వ భూమి పేదలకు పంచాలి

బొబ్బిలి గ్రామీణం: బొబ్బిలి లక్ష్మీ శ్రీనివాస జూట్ మిల్లు వివాదస్పద స్థలంలో నిర్మాణాలకు భూమిపూజ చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండు చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దారు శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. గతంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు తొలగించిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. అందులో ఉన్న ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని కోరారు. నాయకులు కోట అప్పన్న, శ్రీనివాసరావు, కృష్ణ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు వసూలు చేయాలి

తెర్లాం, న్యూస్‌టుడే: ఇంటి పన్నులు వంద శాతం వసూలు చేయాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో వెంకటరమణ, డిప్యూటీ ఎంపీడీవో ఆర్.నీలిమ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పూనువలస పంచాయతీలో వందశాతం పన్నులు వసూలయ్యాయన్నారు. మార్చి నెలాఖరులోగా మిగతావి పూర్తి చేయాలన్నారు.

ప్రకృతి సేద్యంతో మేలు

మెంటాడ: సంపూర్ణ ఆరోగ్యానికి ప్రకృతి సాగు ద్వారా పండించిన పంటలు అవసరమని ఆ శాఖ నార్త్ కోస్టల్ రీజనల్ టీమేటిక్ లీడ్ ప్రకాష్ అన్నారు. బుధవారం ఇద్దనవలస, అమరాయవలస, తమ్మిరాజుపేట ఆర్ఎస్‌కేల పరిధిలో క్షేత్రపర్యటన చేశారు. మట్టినమూనాలు సేకరించారు. పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో ఆయుర్వేద సేవలు

మెరకముడిదాం, న్యూస్‌టుడే: గర్భాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయుర్వేద మందులు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వినియోగించుకోవాలని వైద్యాధికారిణి షారోన్‌గ్రేస్ అన్నారు. బుధవారం ఆసుపత్రిలో మాట్లాడారు. గతంలో రోగులు పడిన ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించి, అన్ని సదుపాయాలు సమకూర్చిందన్నారు. మందులు అందుబాటులో ఉన్నాయని ఎటువంటి సమస్యలు ఉన్నా సంప్రదించాలన్నారు.

వైద్య శిబిరాలతో ఊరట

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: ఉచిత వైద్యశిబిరాలతో రోగులకు ఊరట కలుగుతుందని నేచర్ స్వచ్ఛంద సంస్థ సభ్యుడు వికాస్ బాలరాజు అన్నారు. బుధవారం మండలంలోని జగ్గాపురం గ్రామంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి, రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గంట్యాడ వైద్యాధికారి హేమలత తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

విజయనగరం

●విజయనగరం ●నెల్లిమర్ల ● ఎస్.కోట

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

విజయనగరంలోని బుంగవీధిలో బుధవారం సీతారామ లక్ష్మణుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరి గింది. ఉదయం స్వామి, అమ్మవార్లకు వివిధ రకాల పూజలు చేపట్టారు. అనంతరం ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల కోలాటం ఆకట్టుకుంది.

– న్యూస్‌టుడే, విజయనగరం కంటోన్మెంట్

చందులూరులో అశ్వాల జోరు

అలంకరణలో అమ్మవారు

లక్కవరపుకోట మండలం చందులూరులో కొలువై ఉన్న శ్రీదేవి తల్లి తీర్థం బుధవారం ప్రారంభమైంది. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పసుపు, కుంకుమలు సమర్పించి, మొక్కులు చెల్లించుకు న్నారు. ఈ సందర్భంగా జరిగిన భజనలు, కోలాటం ఆకట్టుకు న్నాయి. సాయంత్రం నిర్వహించిన గుర్రాల పోటీల్లో చోడమాండిక విక్రమ్(ప్రథమ), దేవరాపల్లికి చెందిన నవీన్-చిన్ని(ద్వితీయ), తలారి గ్రామానికి చెందిన శక్తి గుర్రం(తృతీయ) సత్తా చాటాయి. 8 మందికి నగదు బహుమతులు అందించినట్లు నిర్వా హకులు తెలిపారు.

– న్యూస్‌టుడే, లక్కవరపుకోట

మహిళల జీవనోపాధులు మెరుగు

పొదుపు సభ్యులు, సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డీఆర్డీఏ అధికారి విశ్వేశ్వరరావు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల జీవనోపాధులను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం వివిధ పథకాలు అమలు చేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఏ అధి కారి వి.విశ్వేశ్వరరావు సూచించారు. నెల్లిమర్లలోని మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే వారి ఆదాయ వనరులను పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు. ఏపీఎం సురేష్‌కుమార్, సీసీలు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

బాలల్లో విద్యా సామర్థ్యం పెరగాలి

భోగాపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో వినూత్న బోధన అవసరమని ఎంపీడీవో స్వరూపారాణి అన్నారు. ఎంపీపీ ఉప్పాడ అనూషరెడ్డితో కలిసి బుధవారం గాబువానిపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. స్థానికంగా అమ లవుతున్న గ్యారంటెడ్ ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్య క్రమాన్ని పరిశీలించారు. బాలల్లో విద్యా సామర్థ్యాలను పెంచేందుకు కార్యాచరణ రూపొందించాలని ఉపాధ్యాయు లకు సూచించారు. ఎంఈవో రమణమూర్తి పాల్గొన్నారు.

వ్యర్థాల సేకరణ కేంద్రాల ఏర్పాటుకు పచ్చజెండా

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

మాట్లాడుతున్న కమిషనరు కె.బాలస్వామి, చిత్రంలో మేయరు విజయలక్ష్మి, స్టాండింగ్ కమిటీ సభ్యులు, అధికారులు

● రాత్రి పారిశుద్ధ్య పనులకు రూ.83.89 లక్షలు

● కౌన్సిల్‌లో 20 అంశాలకు ఆమోదం

నగరంలో భవన నిర్మాణ వ్యర్థాలను ఇష్టానుసా రంగా వేయకుండా.. రెండు సేకరణ కేంద్రాల ఏర్పాటు, నిబంధనలు ఉల్లంఘించే వారిపై అపరాధ రుసుము విధింపునకు స్టాండింగ్ కమిటీ ఆమోద ముద్ర వేసింది. బుధవారం మేయరు వెంపడాపు విజయ లక్ష్మి అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. అజెం డాలో పొందుపరిచిన 18 అంశాలు, టేబుల్ అజెం డాగా తీసుకొచ్చిన మరో రెండింటికి సభ్యులు ఏకగ్రీ వంగా ఆమోదం తెలిపారు. ధర్మపురి, కేఎల్‌పురంలో యూనిట్లు ప్రారంభిస్తామని, ఇప్పటికే స్థలాలు కేటా యించామని కమిషనరు కె.బాలస్వామి తెలిపారు. ఇప్ప టివరకు రహదారులు, ఖాళీ స్థలాల్లో వేయడంతో ఇబ్బందులు వస్తున్నాయన్నారు. సుందరీకరణకు విఘాతం కలుగుతోందని చెప్పారు. ఇకనుంచి ఆ పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు. మూడు యూనిట్ల ట్రక్కుకు రూ.500 చొప్పున నిర్ణయించి భవన యజమానుల నుంచే వసూలు చేస్తామన్నారు. విరుద్ధంగా వ్యవహరిస్తే తొలిసారి రూ.25 వేలు, రెండో సారి రూ.50 వేల చొప్పున జరిమానా విధిస్తామన్నారు. దీనిపై ప్రచారం కల్పించాలని ఫ్లోర్ లీడరు ఎస్‌వీవీ.రాజేష్ కోరారు.

కేటాయింపుల్లో కొన్ని..(రూ.లక్షల్లో)

- వీధి కుక్కలకు శస్త్ర చికిత్సలు నిర్వహించిన సంస్థకు: 18.76
- స్టేడియం పేట, ప్రశాంతినగర్‌లో యూపీహెచ్‌సీల నిర్మాణం: 36.59
- రాత్రి వేళ జరిగే పారిశుద్ధ్య పనుల నిర్వహణకు: 83.89
- 17వ డివిజన్‌లో స్మార్ట్ వాటర్ డ్రైన్, ప్రహరీ నిర్మాణం: 13.38
- 15 మంది అన్‌స్కిల్డ్ కార్మికులకు చెల్లింపులు: 2.78
- పాలాసుపత్రి అభివృద్ధికి: 13.40
- 50 డివిజన్ల పరిధిలోని పాత కల్వర్టులకు మరమ్మతులు: 9.60

కుక్కల నియంత్రణకు చర్యలు..

నగరపాలిక పరిధిలో కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఫ్లోర్ లీడరు రాజేష్ విన్నవించారు. డాగ్ సెంటర్ ●తన డివిజన్ పరిధిలోనే ఉందని, అయినప్పటికీ శునకాల సంచారం ఎక్కువ కావడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నట్లు చెప్పారు. కొందరు సభ్యులు మాట్లాడుతూ.. పురపాలక శాఖ నుంచి మంజూరయ్యే నిధులను సకాలంలో ఖర్చు చేయాలన్నారు. ఆదాయ వనరులపై దృష్టిసారించాలని కోరారు. అవినీతికి పాల్పడుతున్న హెల్త్ సహాయకులను తొలగించాలని, అధికారులను బెదిరిస్తున్న గుత్తేదారులను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని డిమాండు చేశారు. పన్నుల వసూళ్లకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. కుక్కలకు సకాలంలో శస్త్రచికిత్సలు జరిగేలా చూస్తామన్నారు. బొగ్గులదిబ్బలో రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని, యూపీహెచ్‌సీలను మెరుగుపరచాలని సభ్యుడు సుంకరి బాబు విజ్ఞప్తి చేశారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా.. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మేయరు విజయలక్ష్మి అన్నారు. సమావేశం అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడారు. అభివృద్ధి పనులను సకాలంలో నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. పాలకవర్గ సభ్యులు, ప్రజల సహకారంతో నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. సహాయ కమిషనరు కె.అప్పలరాజు, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు రూపాదేవి, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

ఎన్సీఎస్: పంకీ ● శ్రీకృష్ణ: కపుల్ ఫ్రెండ్లీ ● ఆదిత్య: నిలవే ● లీలామహల్: మనసంతా నువ్వే ● రంజనీ స్క్రీన్-1: కపుల్ ఫ్రెండ్లీ, పంకీ ● శివరంజనీ స్క్రీన్-2: మనసంతా నువ్వే, మన శంకరవరప్రసాద్‌గారు ● హిమగిరి: మన శంకరవరప్రసాద్‌గారు ● సప్తగిరి: సీతా పయనం, విత్ లవ్– న్యూస్‌టుడే, కంటోన్మెంట్

చోదకులకు అవగాహన

అయ్యన్నపేట: వాహనదారులందరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సీఐ లక్ష్మణరావు పిలుపుని చ్చారు. వైకుడలిలో తనిఖీలు నిర్వహించి, అవగాహన కల్పించారు. 25 మందిపై కేసులు నమోదు చేశామని, 15 పాత కేసులకు సంబంధించి అపరాధ రుసుము వసూలు చేశామన్నారు. ● నగరంలోని వల్లీ సిల్క్స్ యాజమాన్యం పది స్టాపర్లను అందించినట్లు రెండో పట్టణ సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

విజయనగరం పట్టణం	-80089 02900
విజయనగరం గ్రామీణం	-80085 74317
ఎస్.కోట	-80085 74326
భోగాపురం	-70959 54646

? దుప్పాడ నుంచి జొన్నవలస వెళ్లే మార్గంలో వీధి దీపాలు వేయాలి. – స్థానికులు ● పరిశీలించి, కొత్తవి బిగిస్తాం. – శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ

– న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

? కణపాకలోని మహంతివీధిలో కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. మురుగు కదలడం లేదు.- స్థానికులు ● కార్మికులను పంపించి, శుభ్రం చేయిస్తాం.

– కె.సాంబమూర్తి, ప్రజారోగ్య అధికారి, నగరపాలిక

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

మురుగునీటికి అడ్డుకట్ట

విజయనగరం పట్టణం: విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలోని అంబటిసత్రం, కొట్లమాదపువీధిలో కుళాయిల నుంచి మురుగునీరు వస్తోందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్యను డీఈఈ నరసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సరిచేయించి, పరిస్థితికి అడ్డుకట్ట వేశారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

భోగాపురం, విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: నిర్వహణ పనుల్లో భాగంగా భోగాపురం మండలంలోని భోగాపురం, కొల్లిపేట, సిమ్మపేట, సుందరపేట తదితర గ్రామాల్లో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్తు సరఫరా ఉండదని ఏఈ పలి తెలిపారు. ● విజయనగరంలోని పాలిటెక్నిక్ కళాశాల, సిద్ధి వినాయకనగర్, నందిగుడ్డి కాలనీ, అయ్యప్పనగర్, ఆఫీసర్ల లేఅవుట్, ఈటీఫ్ర్ డ్వెల్ కాలనీ, జైట్ కాలనీల్లో ఈనెల 20న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్తు సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ విజయనగరం టౌన్ సర్కిల్ ఈఈ పి.త్రినాథరావు తెలిపారు.

భవన నిర్మాణానికి వినతి

వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

కొత్తవలస, న్యూస్‌టుడే: కొత్తవలసలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్త భవనం నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని న్యాయశాఖ ప్రభుత్వ కార్యదర్శి జి.ప్రతిభ దేవిని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కోరారు. వెలగపూడిలోని కార్యాలయంలో బుధవారం వినతి పత్రం అందించారు. నూతనంగా సింగిల్ కోర్టు భవన నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ శాఖ విజయనగరం పర్యవేక్షక ఇంజినీరు రూ.4.68 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

పక్కాగా ఆదాయ సర్వే

కొత్తవలస, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాలకు చెందిన కుటుంబ సభ్యుల వ్యక్తిగత వివరాలను కచ్చితంగా ఎస్‌హెచ్‌జీ ఆదాయ ప్రొఫైల్ సర్వే మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని డీపీఎం ఎస్.రాజ్‌కుమార్ ఆదేశించారు. కొత్తవలసలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. మండలంలోని 1,633 సంఘాలకు పుస్తకాల నిర్వహణ, జీవనోపాధుల కల్పనకు ఈ-నాలెడ్జ్, సీఐఎఫ్‌లు అవగాహన కల్పిస్తున్నారు. మండల ప్రత్యేకాధికారి డా.బి.వి.వి.ఎస్.ఎస్.మూర్తి, సమాఖ్య అధ్యక్షురాలు ప్రసన్న, సీసీలు అప్పలస్వామి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల సమయంలో అప్రమత్తత అవసరం

అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఎల్.కోట, న్యూస్‌టుడే: రంగరాయపురం సమీపంలో బుధవారం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీఎల్) యాజమాన్యం మాక్ డ్రిల్ నిర్వహించింది. విపత్తుల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజరు టి.సాయి కిషోర్ సూచించారు. 108, అగ్నిమాపక వాహనాల పనితీరును ప్రయోగాత్మకంగా వివరించారు. పైప్‌లైన్ లీకేజీ కావడం, సమాచారం తెలుసుకోవడం, లీకేజీ అయిన చోట చేయాల్సిన పనులు, ఉండాల్సిన సామగ్రి గురించి తెలియజేశారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టరు కె.సూర్యనారాయణ, వైద్యులు అనిల్‌కుమార్, ప్రవీణ్, ఆర్‌ఐ సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

19 సిలిండర్ల స్వాధీనం

విజయనగరం అర్బన్: నగరంలోని పలు హోటళ్లు, దాబాలు, అల్పాహార కేంద్రాలు, రెస్టారెంట్లపై పౌరసరఫరాల అధికారులు దాడులు చేపట్టారు. వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న 19 గృహ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురిపై 6ఏ కేసులు నమోదు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి జి.మురళీనాథ్ తెలిపారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో చోరీ

అయ్యన్నపేట: విజయనగరంలోని సిటీ ఐస్‌ఫ్లాంట్ సమీపంలో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. గేట్లకు తాళం వేసి ఉండటంతో లోపలికి వెళ్లి హుండీని ఎత్తుకెళ్లారు. రూ.10 వేలు ఎత్తుకెళ్లినట్లు అర్చకుడు గాయత్రిశర్మ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేంద్రనాయుడు తెలిపారు.

కిరాక్ ఆర్పీపై ఫిర్యాదు

అయ్యన్నపేట: శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణపై అసభ్య వ్యాఖ్యలు చేసిన కిరాక్ ఆర్పీపై చర్యలు తీసుకోవాలని వైకాపా నాయకులు కోరారు. విజయనగరం ఒకటో పట్టణ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

భవనం ప్రారంభం

జామి: మండలంలోని కలగాడ పంచాయతీ మామిడిపల్లి గ్రామంలో జడ్పీ నిధులు రూ.25 లక్షలతో చేపట్టిన సామాజిక భవనాన్ని జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభివృద్ధి కార్యక్రమాల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

సంక్షిప్త సమాచారం

ఎస్‌ఎఫ్‌ఐ నిరసన

విద్యాభాగం: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులపై దాడి చేయడం దారుణమని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.చిన్నబాబు, డి.రామ పేర్కొన్నారు. ఘటనకు నిరసనగా నగరంలో ఆందోళన చేపట్టారు.

ఆలయానికి గేట్ల వితరణ

జామి, న్యూస్‌టుడే: జాతర సందర్భంగా రెడ్డి ధర్మాన్న జామి యల్లారమ్మ ఆలయానికి రూ. 35 వేల విలువైన స్టీలు గేట్లను గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు వాసా లక్ష్మణ శ్రీనివాస్ వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అందజేసినట్లు ఆలయ ఈవో ప్రసాదరావు బుధవారం తెలిపారు.

గణితంపై పట్టు అవసరం

జరజాపుపేట(నెల్లిమర్ల): ప్రతి విద్యార్థి గణితంపై పట్టు సాధించడం వల్ల మంచి ఫలితాలు సాధిస్తారని హెచ్‌ఎం కామేశ్వరి, గణిత ఉపాధ్యాయుడు ఎస్.బంగారయ్య అన్నారు. జరజాపుపేట ఉన్నత పాఠశాలలో జరిగిన గణిత పోటీల విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

బాల్య వివాహాలతో ముప్పు

వేపాడ: బాల్య వివాహాలతో ముప్పు తప్పదని పలువురు వక్తలు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వెళితే రెండేళ్ల కారాగార శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా ఉంటుందని హెచ్చరించారు. స్థానిక విక్టరీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పాఠశాల సందర్శన

వేపాడ: బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాలను ఎంఈవో ఎస్.నాగభూషణరావు సందర్శించారు. పదో తరగతి విద్యార్థులు వంద రోజుల ప్రణాళికను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా పట్టణంలోని పుణ్యగిరి దేవస్థానం హుండీ ఆదాయాన్ని దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టరు వై.వి.రమణి ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. రూ.7,85,086 వచ్చినట్లు ఈవో నాగేంద్ర తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు, సేవకులు పాల్గొన్నారు.

ఎడారిలా చంపావతి

డెంకాడ, నెల్లిమర్ల తదితర మండలాల మీదుగా వెళ్లే చంపావతి నది నీరు లేక ఎడారిలా మారింది. నాతవలస జాతీయ రహదారి వంతెన వద్ద ఇలా ఎండిపోయి దర్శనమిస్తోంది. దీంతో రాబోయే వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని చుట్టుపక్కల గ్రామాలవారు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ప్రవాహం లేకపోవడంతో ఇసుక అక్రమార్కులు అడ్డగోలుగా తవ్వకాలు మొదలు పెట్టారు. ఇష్టానుసారంగా తోడేస్తుండటంతో భారీ గుంతలు కనిపిస్తున్నాయి. పరిశీలిస్తామని స్థానిక రెవెన్యూ అధికారులు తెలిపారు. – న్యూస్‌టుడే, డెంకాడ

మైదానం కాదు చెరువే

ఈ చిత్రాన్ని చూసి ఇదేదో పచ్చని మైదానం అనుకుంటే పొరబడినట్లే.. డెంకాడ మండలం కొండ్రాజుపేట గ్రామ సమీపంలోని చెరువిది. గుర్రపు డెక్క, నాచు చేరడంతో ఇలా రూపు కోల్పోయింది. ఆదమరిస్తే ప్రమాదం తప్పదు. పశువులు పడిపోతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, డెంకాడ

PUBLIC NOTICE

Under the instructions of my client **M/S SHRIRAM FINANCE LIMITED, Maharani Peta Branch, Visakhapatnam**, I issue the following notice to general public. My client intends to grant loan to **Mr. KOTTAPALLI VENU GOPAL GOWRI SHANKAR** S/o Late K Venkata Ramana Rao by keeping the below mentioned schedule property as security by way of Registered Mortgage. As such if any one have any claims, charges, mortgages Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices. Otherwise, later objections will not bind my client in this regard.

SCHEDULE OF THE IMMOVABLE PROPERTY

Vizianagaram District, Vizianagaram West Sub-District, Vizianagaram Municipal Corporation area, Kanapaka Madhura Ayyannapeta area, SANTHOSHI MATHA NEW COLONY layout covered by S. No.118-17 part, Plot No.61 measuring East to West 28 feet or 8.53 meters and North to South 60 feet or 18.30 meters totaling 187 Sq. yards or 156.33 Sq. meters of vacant site is bounded by: **EAST:** House in Plot No.62; **SOUTH** :Plot No.65 vacant site; **WEST** :Others site; **NORTH** :30 feet wide layout road

KODURI SREENIVASA RAO
SMT. SIVA KUMARI JALADI
Advocates,
S-2, Bharat Apartments, Seethammadhara, Visakhapatnam-13. Mobile No.9885166648
Visakhapatnam Dt.18.02.2026 Mail: sreenivasakoduri@gmail.com

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మంది ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా క్లైంట్ అయిన శ్రీకాకుళం జిల్లా, శ్రీకాకుళం టౌన్ కాపురస్తులైన శ్రీ PSVS గోవిందరావ్, S/o PV శ్యామసుందరరావు గారు ఈ క్రింది షెడ్యూల్ ఆస్తిని విజయనగరం జిల్లా, భోగాపురం మండలం, కంచేరు రెవెన్యూ గ్రామంలో సర్వే నెం: 113/9Aలో ఎ. 0-20 సెంట్లు భూమిని మగటపల్లి అప్పారావు S/o మగటపల్లి లేటు వెంకటరమణమూర్తి గారి వద్ద నుండి కొనుగోలు చేయదలచుకొన్నారు. కావున ఈ దిగువ తెల్పిన షెడ్యూల్ ఆస్థిపై ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన రోజు నుండి వారం దినములు (7 రోజులు)లోగా క్రింది చిరునామాకు స్వయంగా గాని లేదా ఫోన్ ద్వారా గాని సంబంధిత డాక్యుమెంట్స్‌తో తెలియజేయవలసిందిగా కోరుచున్నాము. సదరు గడువులోగా ఎటువంటి అభ్యంతరములు తెలియజేయని యెడల ఈ షెడ్యూల్ ఆస్థిపై ఎటువంటి అభ్యంతరములు లేవని భావించి క్రయ దస్తావేజు రిజిష్టర్ చేయించుకొందురు.

షెడ్యూల్ ఆస్థి వివరములు: విజయనగరం జిల్లా, భోగాపురం మండలం, కంచేరు రెవెన్యూ గ్రామంలో సర్వే నెం: 113/9Aలో ఎ. 0-20 సెంట్లు భూమికి గల **హద్దులు:**
తూర్పు: రోడ్డు, దక్షిణ: జె.బంగారమ్మ గారికి సంబంధించిన మెట్ట భూమి, పడమర: రస్తా, ఉత్తర: బైరెడ్డి ప్రభాకరరెడ్డి గారికి సంబంధించిన మెట్ట భూమి. ఇట్లు

శ్రీకాకుళం,
తేది: 18-02-2026.
NOOKA SRIRAMA MURTHY
Advocate, Srikakulam
Cell: 9989616835

మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇవ్వాలి

సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు రాములమ్మ

వేపాడ, న్యూస్‌టుడే: వేపాడ మండలంలోని బొద్దాం- కొండగంగుబూడి రోడ్డులో రైల్వే గేటు వద్ద పైవంతెన నిర్మాణానికి భూసేకరణ విషయమై బుధవారం స్థానిక సచివాలయంలో తహసీల్దారు జె. రాములమ్మ ఆధ్వర్యంలో గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా రైల్వేశాఖ ఏఈఎన్(కనస్ట్రక్షన్) డి.ప్రకాశరావు మాట్లాడుతూ.. నిర్మాణానికి రెండు ప్రతిపాదనలు చేస్తున్నట్లు తెలిపారు. అన్నదాతలకు పరిహారంగా ప్రభుత్వ ధరకు 4 రెట్లు చెల్లిస్తామన్నారు. ప్రభుత్వ ధరకు భూములు విక్రయిస్తే తాము నష్టపోతామని పలువురు రైతులు వాపోయారు. కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పిస్తేనే ముందుకొస్తామని ప్రకటించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దారు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచి రామసత్యవతి, ఎంపీటీసీ సభ్యురాలు పిల్లా లక్ష్మి, ఉప తహసీల్దారు రామకృష్ణ, రైల్వేశాఖ సీనియర్ ఇంజినీరు కె.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

● కొత్తవలస: కొత్తవలస- విజయనగరం మధ్య ప్రతిపాదించిన నాలుగో రైలు మార్గంతో పాటు గతంలో మూడో రైలు మార్గానికి సేకరించిన భూములు, భవనాలకు ప్రస్తుత మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం చెల్లించాలని నిర్వాసితులు డిమాండు చేశారు. నాలుగో రైలు మార్గం నిర్మాణంలో భాగంగా కొత్తవలసలోని 12 వార్డులో గతంలో స్థలాలు కోల్పోయినవారికి బుధవారం నోటీసులు ఇచ్చారు. 2011లో మూడో రైలు మార్గానికి తమ భూములను ఇచ్చామని, తమకు న్యాయం చేయాలని విన్నవించారు. రీ సర్వే చేయాలని కోరారు. కలెక్టర్ స్పందించి నిర్వాసితులకు న్యాయం చేయాలని ఎంపీటీసీ సభ్యుడు బాబీ విజ్ఞప్తి చేశారు.

ఆభరణాలతో బయటకు వెళ్లొద్దు

వేపాడ, న్యూస్‌టుడే: ఎక్కువగా ఆభరణాలు ధరించి మహిళలు ఒంటరిగా బయటకు వెళ్లొద్దని, అత్యవసర సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాలని శృంగవరపుకోట గ్రామీణ సీఐ అప్పలనాయుడు కోరారు. మండలంలోని బొద్దాంలో సర్పంచి రామసత్యవతి, ఎంపీటీసీ సభ్యురాలు పిల్లా లక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన గ్రామసభలో మాట్లాడారు. ఇళ్లల్లో పెద్దమొత్తంలో నగదు, బంగారం పెట్టుకోవద్దని సూచించారు. బ్యాంకు లాకర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామస్థులంతా సీఐ, ఎస్సై సుదర్శన్‌తో పాటు కానిస్టేబుళ్లు సంతోష్, సురేష్, శంకర్‌ను సత్కరించారు. గ్రామ పెద్దలు సన్యాసిరావు, మహేశ్వరరావు, ఉప సర్పంచి ఎస్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సీఐ అప్పలనాయుడు, ఎస్సై సుదర్శన్‌ను సత్కరిస్తున్న సర్పంచి తదితరులు

పరుగు తీస్తే పతకమే

– న్యూస్‌టుడే, విజయనగరం బాబామెట్ట

చిన్నతనంలో ఆటలాడాలనే ఆసక్తి ఉన్నా పరిస్థితులు అనుకూలించక కొంతమంది.. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే రాణిస్తున్నవారు మరికొందరు.. ఇలా ఒక్కొక్కరూ ఒక్కో విధంగా తమ లక్ష్యాలను చేరుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. పోటీ ఎక్కడైనా.. ప్రాంతం ఏదైనా పతకాల సాధనే ధ్యేయంగా ముందుకెళుతున్నారు. ఇటీవల మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్‌లో జరిగిన జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ప్రతిభ చూపారు. వారిపై ప్రత్యేక కథనం.

సాఫ్ట్‌వేర్ నుంచి..

నేను వృత్తి రీత్యా సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నా క్రీడలపై ఇష్టంతో అథ్లెటిక్స్ వైపు వచ్చాను. ఈ ఏడాది జనవరిలో గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 100, 200 మీటర్ల పరుగు, 4×100 రిలేలో పాల్గొని మూడు బంగారు పతకాలు సాధించా. మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన జాతీయస్థాయి మీట్‌లో రాష్ట్రం తరఫున హాజరై 100, 200 మీటర్ల పరుగులో బంగారు పతకాలు, 400 మీ., 4×100మీ. లో రజతాలు, 4×100 మీ. మిక్స్డ్ రిలేలో కాంస్యం దక్కించుకున్నా. **- రంజిత్‌కుమార్, రింగురోడ్డు**

నడకకు వెళ్తూ..

చిన్నప్పటి నుంచి అథ్లెటిక్స్ అంటే ఇష్టం. విద్యాభ్యాసం తరువాత 2007లో నేవీ చేరా. 15 ఏళ్ల పాటు సర్వీసు అనంతరం 2023లో విరమణ పొందా. ఈక్రమంలో అప్పుడప్పుడూ స్నేహితులతో కలిసి మైదానానికి వెళ్లేవాడ్ని. ఈక్రమంలో కొందరు యువకులు శిక్షణ పొందడం చూశా. అలా మళ్లీ ఆసక్తి పెరిగింది. ఇప్పటివరకు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటా. గత రెండేళ్లుగా 35 ఏళ్ల వయసు విభాగంలో బరిలోకి దిగుతున్నా. గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి మీట్‌లో 100, 200, 400, 800 మీటర్ల పరుగులో బంగారు పతకాలు సాధించా. జబల్‌పుర్‌లో నిర్వహించిన పోటీల్లో 200, 400, 800 మీటర్ల విభాగాల్లో మరో మూడు స్వర్ణాలు వచ్చాయి. పోలీసుశాఖలో ఎస్సై కావాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నా. **- శ్రీనివాసరావు, ఉడాకాలనీ, విజయనగరం**

జాతీయస్థాయికి..

గతంలో ఆర్మీలో పనిచేశా. ఉద్యోగ విరమణ అనంతరం చీపురుపల్లిలో అగ్నిమాపక శాఖలో ఫైర్ కానిస్టేబుల్‌గా చేరా. కొన్నేళ్లుగా 45 ఏళ్ల విభాగంలో పోటీల్లో తలపడుతున్నారు. ఆర్మీలో ఉన్న సమయంలో 1500 మీటర్ల పరుగు, 4×100 మీటర్ల రిలే పలు పతకాలు దక్కాయి. గత నెలలో గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి వెటరన్ అథ్లెటిక్స్‌లో 400, 1500 మీటర్లు, 5 కిలోమీటర్ల పరుగు, 4×100 మీటర్ల రిలేలో నాలుగు స్వర్ణాలు దక్కాయి. మధ్యప్రదేశ్ మీట్‌లో ఒక కాంస్యం, ఒక రజతం, రాజస్థాన్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో మరో రజతం పొందా. **- హరికృష్ణ, ఆనందకాలనీ, జమ్ము**

జాతీయ రహదారిని కమ్మేసిన పొగమంచు

జామిలో కొన్ని రోజులుగా పొగమంచు దట్టంగా కురుస్తోంది. బుధవారం ఉదయం 8 గంటల వరకు ఉండడంతో స్థానిక జాతీయ రహదారి మీదుగా వెళ్లే చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

– న్యూస్‌టుడే, జామి

(c) eenadu

ఈనాడు
పశ్చిమగోదావరి

గురువారం ఫిబ్రవరి 19, 2026

ఓపిక పట్టాల్సిందే!
ఈ-హాస్పిటల్ నమోదుకు సాంకేతిక ఇబ్బందులు

పెనుగొండ సీహెచ్‌సీలో వేచి ఉన్న రోగులు

భీమవరం పట్టణం, పెనుగొండ, పాలకొల్లు గ్రామీణ, ఆకివీడు, నరసాపురం, న్యూస్‌టుడే: పాలకొల్లుకు చెందిన రంగబాబు అనే వృద్ధుడు ఆయాసంతో బాధపడుతూ భీమవరం ప్రాంతీయ ఆసుపత్రికి వచ్చారు. నిల్చునే ఓపిక లేక తన మనవడిని క్యూలో నిలబెట్టారు. చరవాణిలో అభా(ఆయుష్మాన్ భారత్)యాప్ డౌన్‌లోడ్ చేసి క్యూఆర్ కోడ్ స్కాన్ చేయించి ఓపీ ఇచ్చారు. ఈ ప్రక్రియ అంతా పూర్తవడానికి చాలా సమయం పట్టింది. చికిత్స కోసం వచ్చిన వృద్ధుడు డీలా ఆయాసపడుతూ నీరసించారు.

☛ పాలకొల్లుకు చెందిన మహిళ కడుపునొప్పితో బాధపడుతూ ఆసుపత్రికి వచ్చారు. ఓపీ నమోదుకు యాప్‌కు సాంకేతిక ఇబ్బందులు తలెత్తాయి. అలాగని చీటీ రాసి ఇచ్చే వరకు వైద్యులు చూడరు. నొప్పి భరించలేక ఆ మహిళ తీవ్ర ఇబ్బంది పడ్డారు.

నమోదు ఎంతో ముఖ్యం.. రోగి వివరాలను ఆయుష్మాన్ భారత్ యాప్‌లో నమోదు చేస్తారు. చరవాణి, ఆధార్ నంబరు ఏదో ఒకటి ఇస్తే రోగి వివరాలన్నీ అప్‌లోడ్ చేస్తారు. ఇలా చేయడంతో చికిత్స కోసం వేరొక ఆసుపత్రికి వెళ్లినప్పుడు యాప్‌ను పరిశీలిస్తే గతంలో ఎప్పుడు, ఏ ఆరోగ్య సమస్యకు ఎలాంటి చికిత్స పొందారో వివరాలు ఉంటాయి. దాంతో అతని ఆరోగ్య పరిస్థితికి తగ్గట్టుగా చికిత్స చేయొచ్చు.

అయితే.. సాంకేతిక సమస్యతో.. ఉదయం 10 గంటల నుంచి ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతుంటాయి. ఆ సమయంలో సాంకేతిక ఇబ్బందులతో నమోదు ప్రక్రియ ఆలస్యమవుతుంది. అత్యవసర చికిత్స కోసం వచ్చిన వారు, వృద్ధులు నిల్చొనే ఓపిక లేనివారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చీటీ రాయించుకుని వెళ్లే సరికి వైద్యులు ఉండరని, చికిత్స నిమిత్తం రక్త, మూత్ర, ఎక్స్‌రే పరీక్షలు చేయించుకునేందుకు ఆలస్యమైపోతుందంటున్నారు. ఓపీ నమోదు ప్రక్రియను 'న్యూస్‌టుడే' బుధవారం పరిశీలించింది. చీటీ కోసం నిలబడి ఉండలేకపోతున్నామని, అదనంగా కంప్యూటర్లు ఏర్పాటు చేసి త్వరగా నమోదు చేయించాలని కోరారు. మధ్యాహ్నం, సాయంత్రమైతే యాప్ నమోదుకు సాంకేతిక అడ్డంకులతో క్యూఆర్‌లో వివరాలు రాసుకున్నారు. యాప్‌లో వివరాలు నమోదు తప్పనిసరి అని డీసీహెచ్‌ఎస్ పి.సూర్యనారాయణ తెలిపారు. యాప్ డౌన్‌లోడ్ సమయంలో సాంకేతిక ఇబ్బందులుంటే వెంటనే అధిగమిస్తున్నామన్నారు.

ప్రాంతీయ ఆసుపత్రులు- 4 సామాజిక ఆరోగ్య కేంద్రాలు- 3	పరీక్షలకు వచ్చే రోగులు రోజుకు- దాదాపు 1450 మంది

అభయారణ్యంలోకి పులి!

పోలవరం, న్యూస్‌టుడే: మూడు వారాలపాటు అభయారణ్యం నుంచి జనారణ్యంలోకి వచ్చి అటవీశాఖ అధికారులు, రైతులు, గ్రామస్థులను పరుగులు పెట్టించిన పెద్ద పులి తిరిగి పాపికొండల అభయారణ్యంలోకి చేరుకుంది. కుర్చాపురం వద్ద పట్టుకున్న పెద్ద పులిని విశాఖ జూ పార్కుకు తరలించి వైద్యుల పర్యవేక్షణలో కొద్ది రోజులు అక్కడే ఉంచారు. పులి ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు నిర్ధారించడంతో అటవీశాఖాధికారులు తిరిగి పాపికొండల అభయారణ్యంలోకి తీసుకొచ్చి విడిచిపెట్టారు. జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా పులి కదలికలు నిరంతరం పరిశీలించేందుకు వీలుగా రేడియో కాలర్ ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఎప్పటికప్పుడు అటవీశాఖ కార్యాలయం నుంచి పరిశీలించడంతోపాటు క్షేత్ర స్థాయిలో రక్షణ కల్పించడం కోసం అభయారణ్యంలోని సిబ్బందితో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. అభయారణ్యంలోని గ్రామాల ప్రజలు పులికి హాని తలపెట్టకూడదని అటవీశాఖాధికారులు సూచించారు.

తడికెలు..ఇసుకబస్తాలతో ఎలాగండి!

ఎర్రకాలువ వరద ఉద్ధృతికి గండ్లు పడి ఏళ్లు గడుస్తున్నా నేటికీ మరమ్మతులు చేపట్టలేదు. తాడేపల్లిగూడెం మండలం మాధవరం, నిడదవోలు మండలం కంసాలిపాలెం సమీపంలోని నాడు వందలాది ఎకరాల్లో పొలాలు నీటమునిగి రైతులు నష్టాలను చవిచూశారు. కంసాలిపాలెం వైపు గండ్లు పడిన చోట తాత్కాలికంగా తడికెలు, ఇసుకబస్తాలను వేశారు. మాధవరం వైపు ఉన్న గండ్లకు కనీసం మరమ్మతులు చేపట్టకపోవడంతో నాడెలా ఉన్నాయో నేడూ అలాగే ఉన్నాయి. - **ఈనాడు, తాడేపల్లిగూడెం.**

పేరుకు వర్గోన్నతి.. వసతుల్లో దుర్గతి!
కొత్త ఉన్నత పాఠశాలల్లో తప్పని ఇక్కట్లు

పెనుగొండ మండలం చినమల్లం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో అసంపూర్తి భవనం ఇది. వర్గోన్నతి పొందిన ఈ పాఠశాలలో 9వ తరగతి వరకు 74 మంది విద్యార్థులున్నారు. 'నాడు-నేడు'లో చేపట్టిన భవనం నిర్మాణం పూర్తి కాలేదు. ఈ భవనం దిగువ భాగంలో నాలుగు గదులుండగా వాటిలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. పై అంతస్తులో గదులు అందుబాటులోకి రాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని విద్యార్థులు వాపోతున్నారు.

పాలకొల్లు, పోడూరు, ఆకివీడు, పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రతి మండలం నుంచి ఒకటి, రెండు ప్రాథమికోన్నత పాఠశాలలను వర్గోన్నతి కల్పించారు. వాటిలో ఉన్నత పాఠశాలల స్థాయికి తగ్గట్టుగా వసతులు కల్పించలేదు. పోవడంతో ఉపాధ్యాయుల కొరత నుంచి తరగతి గదులు, మరుగుదొడ్లు, మైదానాలు, సైకిల్ షెడ్ల వంటి వసతులు లేక విద్యార్థులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో ఈ ఏడాది వర్గోన్నతి పొందిన ప్రతి పాఠశాలలోనూ ఇలాంటి సమస్యలు ఉన్నాయి.

జిల్లాలో పాఠశాలల వివరాలు ఇలా..
- ప్రాథమిక -1,059
- ప్రాథమికోన్నత- 80,
- ఉన్నత- 127
- వర్గోన్నతి పొందినవి- 27

ఆకివీడు మండలం దుంపగడప ఉన్నత పాఠశాలలో ఒకే గదిలో ఇలా రెండు తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రాథమికోన్నత నుంచి ఉన్నత పాఠశాలగా వర్గోన్నతి పొందిన ఈ బడిలో 261 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం 1 నుంచి 9వ తరగతి వరకు కొనసాగుతుండగా అయిదు గదులే అందుబాటులో ఉన్నాయి. వాటిలో ఒక గదిని ఉపాధ్యాయులకు కేటాయించారు. మిగిలిన నాలుగు గదుల్లో రెండేసి తరగతులు నిర్వహిస్తున్నారు.

పోడూరు మండలం తూర్పుపాలెంలో ఉన్నత పాఠశాలగా మార్చిన బడిలో ప్రస్తుతం 97 మంది విద్యార్థులున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చే ఏడాది మరో 45 మంది విద్యార్థులు చేరే అవకాశం ఉందని ఉపాధ్యాయులు గుర్తించారు. ఈ నేపథ్యంలో మరో 4 గదులు అవసరం ఉంది. కానీ నేటికీ ప్రతిపాదనల్లేవు. మరుగుదొడ్లు విద్యార్థులు, ఉపాధ్యాయులకు కలిపి మూడు మాత్రమే ఉన్నాయి.

పరిశీలన

☛ సైన్సు ప్రయోగశాలలు, గ్రంథాలయాలకు ఎక్కడా ప్రత్యేకంగా గదులు లేవు. చాలా చోట్ల మైదానాలు, సామగ్రి అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు.

పాలకొల్లు మండలం ఆగర్రులో ఇదే పరిస్థితి. గదులు సరిపడక షెడ్లలో కొన్ని తరగతులను నిర్వహిస్తున్నారు. ఆకివీడు మండలం కుప్పనపూడిలో తరగతి గదులు, మరుగుదొడ్లు తగినన్ని లేక విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి
ఈ అంశంపై 'నాడు - నేడు' పనులతో పాటు వర్గోన్నతి పొందిన పాఠశాలలను పర్యవేక్షిస్తున్న జిల్లా సమన్వయాధికారి మధు స్పందిస్తూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

నాలుగు వరుసలుగా రహదారుల అభివృద్ధి

మాట్లాడుతున్న శ్రీనివాసవర్మ, పక్కన నాయకర్

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం ప్రజల చిరకాల కోరిక ఎన్.హెచ్-216 బైపాస్‌రోడ్డు నిర్మాణానికి న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. భీమవరంలోని భాజపా కార్యాలయంలో నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు వరుసలుగా ఉన్న ఎన్‌హెచ్ 216ను నాలుగు లైన్లుగా అభివృద్ధి చేయడానికి డీపీఆర్ సిద్ధం చేయడానికి నిధులు విడుదలయ్యాయన్నారు. ఎన్‌హెచ్ 165 దిగమర్రు ఆకివీడు నాలుగులైన్ల రహదారి పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. నరసాపురం బైపాస్‌రోడ్డు, వశిష్ఠ వారధి నిర్మాణం పూర్తయితే నరసాపురం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే నాయకర్ అన్నారు.

హమ్మయ్య మరో రెండు ఫ్రీజర్లొచ్చాయి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం ప్రాంతీయ ఆసుపత్రికి మరో రెండు ఫ్రీజర్లు సమకూరాయి. ఎన్‌టీఆర్ వైద్య సేవలో రూ.2.60 లక్షలతో వీటిని కొనుగోలు చేశామని డీసీహెచ్‌ఎస్ పి.సూర్యనారాయణ తెలిపారు. ఇప్పటి వరకు ఒక్కటే ఫ్రీజరు ఉండటంతో మృతదేహాలు ఒకేసారి మూడు నాలుగు వస్తే ఎదురవుతున్న ఇబ్బందులపై 'కుళ్లిపోతున్నాయ్.. కుమిలిపోతున్నాయ్' శీర్షికన 'ఈనాడు'లో ఈ నెల 17న కథనం ప్రచురితమైంది. కొత్తగా ఏర్పాటు చేసినవాటితో పాటు గతంలో ఉన్న ఫ్రీజరు వినియోగంలో ఉంటాయని అధికారులు తెలిపారు.

తెదేపా అనుబంధ కమిటీల ఏర్పాటుపై కసరత్తు

నాయకులతో చర్చిస్తున్న మంత్రి నిమ్మల తదితరులు

భీమవరం అర్బన్, మొగల్తూరు, న్యూస్‌టుడే: తెదేపా అనుబంధ కమిటీల ఏర్పాటుపై ఆ పార్టీ అధిష్ఠానం కసరత్తు ప్రారంభించింది. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, మంత్రి రామానాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, ఆచంట, తణుకు ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, ఆరిమిల్లి రాధాకృష్ణ, ఏపీ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంస్థ ఛైర్మన్ వలవల బాబ్జి, నరసాపురం ఇన్‌ఛార్జి పొత్తూరి రామాంజనేయరాజు ఆధ్వర్యంలో బుధవారం సమావేశమయ్యారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు, కులాలకు, మహిళలకు చోటు కల్పించాలనేదానిపై చర్చించినట్లు తెదేపా జిల్లా కార్యాలయ వర్గాలు తెలిపాయి.

పెద్దింట్లమ్మా.. పాహిమాం
వైభవంగా ప్రారంభమైన జాతర

కైకలూరు, న్యూస్‌టుడే: భక్తుల కోర్కెలు తీర్చే పెద్దమ్మగా విరాజిల్లుతోన్న కొల్లేటి కోట పెద్దింట్లమ్మ జాతర బుధవారం ప్రారంభమైంది. వేకువ జామునుంచి పండితుల వేద ఘోషతో మంగళ వాయిద్యాలు, సన్నాయి మేళాల నడుమ విఘ్నేశ్వర పూజ, జల దుర్గా సమేత పెద్దింట్లమ్మకు పంచామృతాభిషేకం, శ్రీచక్రార్చన, నూతన వస్త్రాలంకరణ, బాలభోగం, ధూపసేవ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం ఛైర్మన్ జల్లూరి వెంకన్నబాబు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఈవో కె.శ్రీనివాస్, రాష్ట్ర వడ్డి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఘంటసాల వెంకటలక్ష్మి, గ్రామస్థులతో కలిసి ఉదయం 8.54 గంటలకు జాతర ప్రారంభించారు. సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి పంచహారతుల కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలపాడు గ్రామ ప్రారంభం వద్ద దాత వానపల్లి బాబూరావు ఆర్థిక సహకారంతో రూ.35 లక్షలతో నిర్మించే అమ్మవారి ముఖ ద్వారం పనులకు ఎమ్మెల్సీ జయమంగళ, దాతతో కలిసి ఎమ్మెల్యే కామినేని భూమి పూజ నిర్వహించారు.

కరెంటు ఇబ్బంది ఉందా.. సిబ్బంది వస్తున్నారా?
ఐవీఆర్‌ఎస్ కాల్స్‌తో అభిప్రాయ సేకరణ
సంతృప్తి స్థాయిలో జిల్లాకు 9వ ర్యాంకు

ఈనాడు-ఏలూరు: ప్రజలకు నిరంతరం విద్యుత్తు సరఫరా ఉంటుందా? ఇంటికి నాణ్యమైన విద్యుత్తు అందుతుందా? శాఖ సిబ్బంది మీకు అందుబాటులో ఉంటున్నారా అని ప్రభుత్వం ఐవీఆర్‌ఎస్ కాల్స్ చేసి ప్రజల స్పందన తెలుసుకుంది. ఈ సర్వే ఏడాది మొత్తానికి, ఆర్నెల్ల కాలానికి, గత జనవరి నెలకు సంబంధించి మొత్తం మూడు విడతలుగా సాగింది. నేరుగా ప్రభుత్వమే వినియోగదారులకు ఫోన్లు చేసి వారి సంతృప్తి స్థాయిలను తెలుసుకుంది. ఏలూరు జిల్లాలో కుక్కునూరు, కొయ్యలగూడెం, ఏలూరు నగరం, పశ్చిమగోదావరి జిల్లాలో తాడేపల్లిగూడెం, తేతలి, పాలకొల్లు, పెనుగొండ పరిధిలోని వినియోగదారులు అభిప్రాయాలు తెలియజేశారు. సంతృప్తి స్థాయిలో ఏలూరుకు 13, పశ్చిమకు 9వ ర్యాంకులు దక్కాయి..

వినియోగదారులను అడిగిన ప్రశ్నలు ఇవీ..

ప్రశ్న	అవును	లేదు
1 మీకు నిరంతరాయంగా సరఫరా జరుగుతుందా?	80.3	19.7
2 మీ ఇంటికి నాణ్యమైన విద్యుత్తు అందుతుందా?	74.3	25.7
3 సిబ్బంది మీకు అందుబాటులో ఉన్నారా?	76.3	23.7

సేవలపై సానుకూలత 78.0 శాతం

132 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు : కలెక్టర్

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో పదో తరగతి పరీక్షలు పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. సంబంధిత అధికారులతో ఆమె బుధవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ మేరకు పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు. మార్చి 16 నుంచి ఏప్రిల్ ఒకటి వరకు జరిగే పరీక్షల కోసం జిల్లాలో 132 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రెగ్యులర్, ప్రైవేటు కలిపి మొత్తం 24,166 మంది పరీక్షలు రాయనున్నట్లు ఆమె వెల్లడించారు. ఎస్ఎస్‌సీ సార్వత్రిక పాఠశాల పరీక్షలు మార్చి 16 నుంచి 28 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలను 680 మంది రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు రాయనున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద మౌలిక వసతులు పూర్తిగా ఏర్పాటు చేయడంతోపాటు 144 సెక్షన్ విధించాలని ఆదేశించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు.

భోజనం ఎలాగుంది?

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: మధ్యాహ్న భోజన పథకం అమలుపై భీమవరంలోని ఏఆర్‌కేఆర్ పురపాలక పాఠశాలను జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులు ఇష్టంగా చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు.

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
(పూర్వపు) శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)
రిజిస్టర్డ్ కార్యాలయం : డి.నెం. 14-ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్ : డి.నెం. 22బి-13-8, 2వ అంతస్తు, వెంకటరామ పవర్‌ప్రెస్ రోడ్డు, సెంట్రల్ బ్యాంక్ ఎదురుగా, పవర్‌పేట, ఏలూరు - 534002

డిమాండ్ ప్రకటన
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్' గా పిలువబడేది, గౌరవ ఎన్‌సిఎల్‌టి-బెంచ్ 2, చెన్నై, తేది : 9-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పోరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్ కంపెనీ అయి ఉన్నాము. మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద రిజిస్టర్డ్ ఆఫీస్ కలిగియున్నది మరియు **బ్రాంచి ఆఫీస్ పాలకొల్లు** లో నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బ్యాంకింగ్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. (ఇక నుండి మమ్మల్ని కంపెనీ / ఋణదాతగా సూచిస్తారు) ఇందుమూలంగా ఈ క్రింది నోటీసు జారీచేస్తున్నాము.
ఋణగ్రహీతలు / సహ ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 3తో చదువబడు సెక్షన్ 13 (2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్టువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసీ చట్టం 2002 లోని సెక్షన్ 13 (2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.
చివరిగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందచేయబడక తిరిగి వచ్చినందున సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

క్ర సం.	ఋణగ్రహీత (లు) / సహ-ఋణగ్రహీత (లు) / హామీదారు (లు) పేరు	NPA తేది / ఋణ మొత్తం	డిమాండ్ నోటీసు తేది / బకాయి మొత్తం
1	1) **విజయలక్ష్మి యాతం,** భర్త : శ్రీనివాసరావు, డి.నెం. 26-3-44/1, ముచ్చర్లవారి తోట, కొండలమ్మ దేవాలయ వీధి, పాలకొల్లు పశ్చిమ గోదావరి జిల్లా-534260, ఆంధ్రప్రదేశ్. 2) **యాతం శ్రీనివాసరావు,** తండ్రి : స్వామి, డి.నెం. 26-3-44/1, ముచ్చర్లవారి తోట, కొండలమ్మ దేవాలయ వీధి, పాలకొల్లు పశ్చిమ గోదావరి జిల్లా-534260, ఆంధ్రప్రదేశ్. 3) **బుద్ధిరెడ్డి మాలిక,** భర్త : రాజశేఖర్, డి.నెం. 8-1-96/ఎ, మెయిన్ రోడ్, అమలాపురం మండలం, అమలాపురం, తూర్పు గోదావరి జిల్లా - 533201, ఆంధ్రప్రదేశ్.	31-12-2019 Rs. 6,00,000/-	20-11-2025 ది. 20-11-2025 నాటికి మొత్తం రూ. 23,85,065/- (అక్షరాలా ఇరవై మూడు లక్షల ఎనభై ఐదు వేల అరవై ఐదు రూపాయలు మాత్రమే)
	ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం. **PALKLTF1901310001**		
	షెడ్యూల్ ఆస్తి వివరాలు : తూర్పు గోదావరి జిల్లా, మల్కిపురం సబ్ డిస్ట్రిక్ట్, సఖినేటిపల్లి మండలం, మోరిపోడు గ్రామ పంచాయతీ మోరి గ్రామ అకౌంట్స్, జిరాయితీ డ్రై భూమికి చెందిన ఆర్.ఎస్.నెం. 220 నందు ఎకరా 3.79 సెంట్లు సబ్ డివైడెడ్ ఆర్.ఎస్. నెం. 220/1 వద్ద ఎకరా 1.00 సెంట్లు అందలి 4387 లింకులు లేదా 212.3 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము దానికి సమీప డి.నెం. 1-37. **సరిహద్దులు : తూర్పు :** 15 అ॥ వెడల్పు కామన్ దారి - 40 అ॥లు, **దక్షిణం:** అడ్డాల సత్యనారాయణ గారి భూమి 46.6 అ॥లు, **పడమర :** బల్ల రాము గారి భూమి - 40.3 అ॥లు, **ఉత్తరం:** విక్రేత యొక్క మిగిలిన భూమి.		

పైన చెప్పబడిన పరిస్థితుల దృష్ట్యా, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతోపాటు పైన తెలిపిన విధంగా బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు మరియు /లేదా వారి హామీదారుల (వర్తించినచోట) కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా ఋణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీనత చేపట్టడంతో కలుపుకొని సెక్యూర్డ్ అసెట్స్ మీద ఈ నోటీసు తేది నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును.
సదరు చట్టంలోని సెక్షన్ 13 (13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు, వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన అతని సెక్యూర్డ్ అస్సెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని రూపంలో ఏ ఋణగ్రహీత బదిలీ చేయరాదని గమనించగలరు.
ప్రదేశం : పాలకొల్లు — అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
(పూర్వపు) శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)
రిజిస్టర్డ్ కార్యాలయం : డి.నెం. 14-ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్ : డి.నెం. 22బి-13-8, 2వ అంతస్తు, వెంకటరామ పవర్‌ప్రెస్ రోడ్డు, సెంట్రల్ బ్యాంక్ ఎదురుగా, పవర్‌పేట, ఏలూరు - 534002

డిమాండ్ ప్రకటన
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్' గా పిలువబడేది, గౌరవ ఎన్‌సిఎల్‌టి-బెంచ్ 2, చెన్నై, తేది : 9-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పోరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్ కంపెనీ అయి ఉన్నాము. మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద రిజిస్టర్డ్ ఆఫీస్ కలిగియున్నది మరియు **బ్రాంచి ఆఫీస్ భీమవరం** లో నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బ్యాంకింగ్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. (ఇక నుండి మమ్మల్ని కంపెనీ / ఋణదాతగా సూచిస్తారు) ఇందుమూలంగా ఈ క్రింది నోటీసు జారీచేస్తున్నాము.
ఋణగ్రహీతలు / సహ ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 3తో చదువబడు సెక్షన్ 13 (2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్టువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసీ చట్టం 2002 లోని సెక్షన్ 13 (2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.
చివరిగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందచేయబడక తిరిగి వచ్చినందున సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

క్ర సం.	ఋణగ్రహీత (లు) / సహ-ఋణగ్రహీత (లు) / హామీదారు (లు) పేరు	NPA తేది / ఋణ మొత్తం	డిమాండ్ నోటీసు తేది / బకాయి మొత్తం
1	1) **బోనం ఎన్.వి.పి. మధుకుమార్,** తండ్రి : బోనం సత్యనారాయణ, డి.నెం:4-63/1, నూకాలమ్మ దేవాలయం దగ్గర, యలమంచిలి మండలం, బూరుగుపల్లె, పశ్చిమ గోదావరి జిల్లా-534266. 2) **బోనం భ్రమరాంబిక,** తండ్రి : చేగొండి శ్రీనివాసరావు, డి.నెం: 4-63/1, నూకాలమ్మ దేవాలయం దగ్గర, యలమంచిలి మండలం, బూరుగుపల్లె, పశ్చిమ గోదావరి జిల్లా-534266. 3) **బోనం భాగ్యవతి,** భర్త : బోనం సత్యనారాయణ, డి.నెం :4-63/1, నూకాలమ్మ దేవాలయం దగ్గర, యలమంచిలి మండలం, బూరుగుపల్లె, పశ్చిమ గోదావరి జిల్లా-534266. 4) **ముదునూరి సరిత,** భర్త : ముదునూరి కిషోర్‌కుమార్, డి.నెం:7-7-11, సర్పయ్య అగ్రహారం, భీమవరం మండలం, ఆంజనేయ స్వామి దేవాలయం దగ్గర, పశ్చిమ గోదావరి జిల్లా-534201	09-03-2022 Rs. 15,00,000/-	20-11-2025 ది. 20-11-2025 నాటికి మొత్తం రూ. 32,20,893/- (అక్షరాలా ముప్పై రెండు లక్షల ఇరవై వేల ఎనిమిది వందల తొంభై మూడు రూపాయలు మాత్రమే)
	ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం. **BMVR2TF2010150001**		
	షెడ్యూల్ ఆస్తి వివరాలు : ఐటమ్ నెం.01 (డాక్యుమెంట్ నెం.1545/1990 పేరిట ఉన్న ఆస్తి) : పశ్చిమ గోదావరి జిల్లా, యలమంచిలి మండలం, పాలకొల్లు సబ్ డిస్ట్రిక్ట్, బూరుగుపల్లి గ్రామ పంచాయతీ మరియు గ్రామ అకౌంట్స్ జిరాయితీ డ్రై భూమి క్రింద ఎస్.నెం. 104/9 వద్ద ఎకరా 0.28 సెంట్లు అందలి ఎకరా 0.03 1/2 సెంట్లు లేదా 170 చ॥గ॥లు లేదా 141.64 చ॥మీ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము. **హద్దులు : తూర్పు:** దేవరపు మల్లేశ్వరరావు గారి భూమి; **దక్షిణం:** కడలి జానికమ్మ గారి భూమి; **పడమర :** కడలి జానికమ్మ గారి భూమి; **ఉత్తరం:** బోనం భాగ్యవతి గారు కొనుగోలు చేసిన ఆస్తి. **ఐటమ్ నెం.02** (డాక్యుమెంట్ నెం.3118/1991 పేరిట ఉన్న ఆస్తి) : పశ్చిమ గోదావరి జిల్లా, యలమంచిలి మండలం, పాలకొల్లు సబ్ డిస్ట్రిక్ట్, బూరుగుపల్లి గ్రామ పంచాయతీ మరియు గ్రామ అకౌంట్స్ జిరాయితీ డ్రై భూమి క్రింద ఎస్.నెం. 104/9 వద్ద ఎకరా 0.28 సెంట్లు అందలి ఎకరా 0.05 సెంట్లు లేదా 242 చ॥గ॥లు లేదా 202.4 చ॥మీ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము. **హద్దులు : తూర్పు:** దేవరపు మల్లేశ్వరరావు గారి భూమి; **దక్షిణం:** దారి, **పడమర :** కడలి సూర్యనారాయణ గారి భూమి; **ఉత్తరం:** బోనం భాగ్యవతి గారు కొనుగోలు చేసిన ఆస్తి.		

పైన చెప్పబడిన పరిస్థితుల దృష్ట్యా, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతోపాటు పైన తెలిపిన విధంగా బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు మరియు /లేదా వారి హామీదారుల (వర్తించినచోట) కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా ఋణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీనత చేపట్టడంతో కలుపుకొని సెక్యూర్డ్ అసెట్స్ మీద ఈ నోటీసు తేది నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును.
సదరు చట్టంలోని సెక్షన్ 13 (13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు, వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన అతని సెక్యూర్డ్ అస్సెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని రూపంలో ఏ ఋణగ్రహీత బదిలీ చేయరాదని గమనించగలరు.
ప్రదేశం : భీమవరం — అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
(పూర్వపు) శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)
రిజిస్టర్డ్ కార్యాలయం : డి.నెం. 14-ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్ : డి.నెం. 22బి-13-8, 2వ అంతస్తు, వెంకటరామ పవర్‌ప్రెస్ రోడ్డు, సెంట్రల్ బ్యాంక్ ఎదురుగా, పవర్‌పేట, ఏలూరు - 534002

డిమాండ్ ప్రకటన
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్' గా పిలువబడేది, గౌరవ ఎన్‌సిఎల్‌టి-బెంచ్ 2, చెన్నై, తేది : 9-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పోరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్ కంపెనీ అయి ఉన్నాము. మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద రిజిస్టర్డ్ ఆఫీస్ కలిగియున్నది మరియు **బ్రాంచి ఆఫీస్ పాలకొల్లు** లో నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బ్యాంకింగ్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. (ఇక నుండి మమ్మల్ని కంపెనీ / ఋణదాతగా సూచిస్తారు) ఇందుమూలంగా ఈ క్రింది నోటీసు జారీచేస్తున్నాము.
ఋణగ్రహీతలు / సహ ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 3తో చదువబడు సెక్షన్ 13 (2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్టువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసీ చట్టం 2002 లోని సెక్షన్ 13 (2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.
చివరిగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందచేయబడక తిరిగి వచ్చినందున సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

క్ర సం.	ఋణగ్రహీత (లు) / సహ-ఋణగ్రహీత (లు) / హామీదారు (లు) పేరు	NPA తేది / ఋణ మొత్తం	డిమాండ్ నోటీసు తేది / బకాయి మొత్తం
1	1) **కాంతామణి దంపనబోయిన,** తండ్రి : దంపనబోయిన స్వామి డి.నెం. 28-209, బర్రెమ్మ దేవాలయం వీధి, పెనుగొండ మండలం, చెరుకువాడ, పశ్చిమ గోదావరి జిల్లా-534320. 2) **పెచ్చెట్టి అంబికా అనిల్ కుమారి,** భర్త : బాలాజీ, డి.నెం. 28-209, బర్రెమ్మ దేవాలయం వీధి, పెనుగొండ మండలం, చెరుకువాడ, పశ్చిమ గోదావరి జిల్లా-534320. 3) **రెడ్డి శ్రీనివాసరావు,** తండ్రి : రెడ్డి వీరభద్రుడు, డి.నెం. 70-3-34/1, వైద్య నగర్, రోడ్ నెం-1, రమణయ్యపేట, కాకినాడ (అర్బన్), ఇంజినీరింగ్ కళాశాల, తూర్పు గోదావరి జిల్లా-533003, ఆంధ్రప్రదేశ్. 4) **దంపనబోయిన ఎం మహాంతి,** తండ్రి : పీర్లస్వామి దంపనబోయిన డి.నెం. : 28-209, బర్రెమ్మ దేవాలయం వీధి, పెనుగొండ మండలం, చెరుకువాడ, పశ్చిమ గోదావరి జిల్లా-534320.	31-07-2018 Rs. 6,00,000/-	20-11-2025 ది. 20-11-2025 నాటికి మొత్తం రూ. 27,21,937/- (అక్షరాలా ఇరవై ఏడు లక్షల ఇరవై ఒక్క వేయి తొమ్మిది వందల ముప్పై ఏడు రూపాయలు మాత్రమే)
	ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం. **PALKLTF1707310004**		
	షెడ్యూల్ ఆస్తి వివరాలు : ఐటమ్ నెం. 01 : (శ్రీమతి దంపనబోయిన కాంతామణి, తండ్రి : పీర్లస్వామి గారి పేరిట గల డాక్యుమెంట్ నెం. 3765/2015 కింద ఉన్న ఆస్తి) పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం జిల్లా రిజిస్టర్ ఏరియా, పెనుగొండ మండలం, పెనుగొండ సబ్ డిస్ట్రిక్ట్, ఆర్.ఎస్.నెం. 138/1 వద్ద ఎకరా 1.28 సెంట్ల భూమిని ఇంటి ప్లాట్లుగా అభివృద్ధి చేయగా అందలి ప్లాట్ నెం. 8 కి దక్షిణ భాగాన 120.5 చ॥గ॥లు ఆస్తికి దక్షిణం వైపు 60.25 చ॥గ॥లు లేదా 50.61 చ॥మీ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము దానికి సమీప డి.నెం. 33-61. **హద్దులు : తూర్పు:** 16వ వెడల్పు రోడ్డు - 17.00 అ॥లు, **దక్షిణం:** ప్లాట్ నెం. 2 కి చెందిన స్థలం - 31.11 అ॥లు, **పడమర :** గోలగాని కృష్ణగారి స్థలం - 17.00 అ॥లు, **ఉత్తరం:** పి. అంబికా అనిల్ కుమారి గారికి బహుమతిగా ఇచ్చిన ఆస్తి. **ఐటమ్ నెం. 02 :** (శ్రీమతి పెచ్చెట్టి అంబికా అనిల్ కుమారి బాలాజీ గారి ఆస్తికి చెందిన డాక్యుమెంట్ నెం. 3764/2015) పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం జిల్లా రిజిస్టర్ ఏరియా, పెనుగొండ మండలం, పెనుగొండ సబ్ డిస్ట్రిక్ట్, ఆర్.ఎస్.నెం. 138/1 వద్ద ఎకరా 1.28 సెంట్ల భూమిని ఇంటి ప్లాట్లుగా అభివృద్ధి చేయగా అందలి ప్లాట్ నెం. 8 కి దక్షిణ భాగాన 120.5 చ॥గ॥లు ఆస్తికి దక్షిణం వైపు 60.25 చ॥గ॥లు లేదా 50.61 చ॥మీ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము దానికి సమీప డి.నెం. 33-61. **హద్దులు : తూర్పు :** 16వ వెడల్పు రోడ్డు - 17.00 అ॥లు, **దక్షిణం:** ప్లాట్ నెం. 2కి చెందిన సైట్ - 31.11 అ॥లు, **పడమర :** డి. కాంతామణి గారి స్థలం - 17.00 అ॥లు, **ఉత్తరం:** 22 అ॥ల వెడల్పు రోడ్డు - 31.11 అ॥లు.		

పైన చెప్పబడిన పరిస్థితుల దృష్ట్యా, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతోపాటు పైన తెలిపిన విధంగా బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు మరియు /లేదా వారి హామీదారుల (వర్తించినచోట) కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా ఋణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీనత చేపట్టడంతో కలుపుకొని సెక్యూర్డ్ అసెట్స్ మీద ఈ నోటీసు తేది నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును.
సదరు చట్టంలోని సెక్షన్ 13 (13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు, వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన అతని సెక్యూర్డ్ అస్సెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని రూపంలో ఏ ఋణగ్రహీత బదిలీ చేయరాదని గమనించగలరు.
ప్రదేశం : పాలకొల్లు — అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.

కలత తీరేలా.. కలల ఇల్లు కట్టేలా! 6లో
నమ్మించి.. నిలువునా ముంచేసి
సమ్మె బాటలో సహకార ఉద్యోగులు 8లో

(c) eenadu

కలత తీరేలా.. కలల ఇల్లు కట్టేలా!

యూనిట్ విలువ రూ.2.39 లక్షలకు పెంపు

తాడేపల్లిగూడెం పట్టణం- న్యూస్‌టుడే: తిండి తిన్నా.. తిన్నకున్నా.. మంచి వస్త్రం కట్టినా.. కట్టకున్నా.. తల దాచుకునేందుకు గూడు ఉండాలన్నది సగటు పేద, మధ్య తరగతి ప్రజల కల. అల్పాదాయ వర్గాలకు ఇల్లు అందని ద్రాక్షవుతోంది. ఈ క్రమంలో పేదల కలలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ముందడుగు వేసింది. సొంత స్థలమున్న వారికి పీఎం ఆవాస్ యోజన 2.0 (గ్రామీణ్) పథకం ద్వారా నిర్మించే ఇళ్లకు రూ.1.80 లక్షల నుంచి రూ.2.39 లక్షలకు ఆర్థిక సాయాన్ని పెంచింది. ఐదేళ్ల నిర్మాణానికి మంత్రివర్గ సమావేశంలో ఆమోద ముద్ర వేసింది. ఈ నిర్ణయంతో 16,773 మంది లబ్ధి పొందనున్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న గృహ నిర్మాణ సంస్థ అధికారులు

అదనపు సాయం రూ.6.48 కోట్లు..

పశ్చిమలో పీఎంఏవై 2.0(బీఎల్‌సీ) కింద తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం, నరసాపురం, పాలకొల్లు పురపాలక సంఘాలు, ఆకివీడు నగర పంచాయతీలో 595 మందికి ఇళ్లు మంజూరు చేశారు. గత ప్రభుత్వ హయాంలో పీఎంఏవై-1.0 కింద పశ్చిమలో 47,362 ఇళ్లు మంజూరవ్వగా.. 9,912 మాత్రమే పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అదనపు సాయంగా రూ.6.48 కోట్లు కేటాయించడంతో పనులు పూర్తి చేశారు.

రుణంపై రాయితీ.. తాజాగా కూటమి ప్రభుత్వం యూనిట్ విలువ రూ.2.39 లక్షలకు పెంచింది. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.95,400, రాష్ట్ర ప్రభుత్వం రూ.63,600, వీబీ జీ రామ్‌జీ ద్వారా రూ.27 వేలు, స్వచ్ఛ భారత్ మిషన్ కింద రూ.12 వేలు కేటాయిస్తోంది. దీనికి అదనంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకైతే రుణంపై వడ్డీని ప్రభుత్వమే రాయితీగా చెల్లించనుంది. పెంచిన యూనిట్ విలువ ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సి ఉందని జిల్లా గృహ నిర్మాణ సంస్థ పీడీ పిచ్చియ్య తెలిపారు.

రంజాన్ మాసం.. సద్గుణాల ధామం

నేటి నుంచి ఉపవాసాలు, పవిత్ర ప్రార్థనలకు ఏర్పాట్లు

నూజివీడు, నరసాపురం, అత్తిలి (గ్రామీణ), న్యూస్‌టుడే: ముస్లిం సోదరులు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ నెల వచ్చేసింది. హృదయాలలో పవిత్రతను, ఆధ్యాత్మిక భావనను నింపే మాసంగా ఈ నెలను భావిస్తారు. శాంతి, సౌభ్రాతృత్వాన్ని లోకానికి చాటడం ఈ మాసం ప్రత్యేకత.

కఠోర ఉపవాస వ్రతం.. ఈ 30 రోజుల పాటు కఠోర ఉపవాస వ్రతం పాటిస్తారు. ఖురాన్ పారాయణానికి అధిక ప్రాధాన్యం ఇస్తారు. తెల్లవారుజామున సహరీ, సాయంత్రం ఇఫ్తార్ కార్యక్రమాలతో మసీదుల్లో సందడి వాతావరణం నెలకొంటుంది. రంజాన్ అనేది అరబిక్ పదం. అరబిక్‌లో రంజాన్ అంటే దహించి వేయడం అని అర్థం. ఏడాదిలోని 11 నెలల్లో తెలిసో తెలియకో చేసే తప్పులను రంజాన్ నెలలోని ఉపవాస దీక్షల పుణ్యంతో అల్లా దహించి వేస్తాడని మత పెద్దలు చెబుతారు.

ముస్తాబైన మసీదులు.. ఉమ్మడి పశ్చిమ గోదావరిలో అన్ని మసీదులు ఉపవాస దీక్షలు పాటించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నెలవంకతో ప్రారంభం.. ఇస్లామిక్ క్యాలెండర్ మాసాల్లో తొమ్మిదో నెల రంజాన్. నెలవంక చూసినప్పటి నుంచి తరువాతి నెలవంక దర్శనం వరకు ఉపవాస దీక్షలు పాటిస్తారు. సూర్యోదయానికి ముందే లేచి భోజనం ఆరగిస్తారు. దీన్ని ఇస్లామిక్ పరిభాషలో సహరీ అంటారు. సూర్యాస్తమయం వరకు మంచినీళ్లు కూడా ముట్టరు. సూర్యాస్తమయం కాగానే నమాజ్ చేసి ప్రత్యేక ప్రార్థనలతో ఉపవాస దీక్షను విరమిస్తారు.

ఓర్పు, సహనం అలవడతాయి..

రంజాన్ మాసంలో పాటించే ఉపవాస దీక్ష వల్ల జీవితంలో ఎదురయ్యే కష్టాలను తట్టుకునే ఓర్పు, సహనం అలవడతాయి. ముస్లిం తప్పనిసరిగా ఉపవాస దీక్షతో పాటు పేద సాదలకు సాయం చేయాలి. అల్లా ఆదేశాలను పాటించాలి. - మౌలానా ముఖ్రమ్ హుస్సేన్, అత్తిలి

పురపాలక సంఘ కార్యాలయము, భీమవరం

ఆర్.ఓ.సి.నెం. 6962/01/2026/జి2/ఎ1 ది. 18-02-2026

వేలం నోటీసు

భీమవరం పురపాలక సంఘ పరిధిలోని 17వ వార్డు వెహికల్ షెడ్డు ఆవరణలో గల పాడైపోయి ఉపయోగములో లేని వివిధ వాహనములు, పుష్ కార్టులు, ఐరన్ గ్రిల్స్, ఐరన్ ట్రిప్పర్ మొదలగు మెటీరియల్ ఐరన్ స్క్రాప్‌గా ఆమోదము పొందిన లోకల్ కొటేషన్ విలువ కేజీ ఒక్కింటికి రూ. 25/-గా నిర్ణయించినందున పైన తెలిపిన పాడైపోయి ఉపయోగములో లేని ఐటమ్‌లను సంబంధిత DE మరియు AE వారి సమక్షములో బహిరంగ వేలము ప్రకారము తరలించుటకు ది. 26-02-2026వ తేదీన ఉదయం గం. 11.00లకు భీమవరం పురపాలక సంఘ కార్యాలయములో శ్రీయుత కమిషనరు వారిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలము నిర్వహించబడును. సదరు వేలములో పాల్గొనదలచిన వారు రూ. 50,000/-లను డిపాజిట్‌గా చెల్లించి వేలము పాటలో పాల్గొనవలెను.

పూర్తి వివరములను భీమవరం పురపాలక సంఘ కార్యాలయములో సంప్రదించి తెలుసుకొనవలెను.

సం/- **కమిషనరు,** భీమవరం పురపాలక సంఘం

నేడు కేవీకేలో పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

ఉద్యాన విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 19న శాస్త్రీయ పద్ధతుల్లో పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ఇవ్వనున్నట్లు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డా.పి.విజయలక్ష్మి తెలిపారు. ఆసక్తి గల వారు కేవీకేలో గురువారం రూ.500 చెల్లించి తమ పేరును రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం 94905 05926, 73826 33692 నంబర్లను సంప్రదించాలని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఓటర్ల మ్యాపింగ్ త్వరగా పూర్తి చేయండి : కలెక్టర్

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను జిల్లాలో వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులతో ఆమె బుధవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. యువ ఓటర్ల నమోదుకు కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఓటర్ల జాబితాను, బీఎల్‌ఓల జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించాలన్నారు. కేఆర్‌ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్‌ను పాలకొల్లు నియోజకవర్గానికి, తాడేపల్లిగూడెం ఆర్డీవోను ఆ నియోజకవర్గానికి ఈఆర్‌ఓలుగా ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపినట్లు కలెక్టర్ వెల్లడించారు. ★ కొల్లేరులో సహజసిద్ధమైన చేపల పెంపకం, వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ సూచించారు. ఆయన రాష్ట్ర సచివాలయం నుంచి బుధవారం నిర్వహించిన వీసీలో కలెక్టర్ నాగరాణి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. జిల్లా పరిధిలోని పది కొల్లేరు గ్రామాల్లో అటవీ, రెవెన్యూ, సర్వే శాఖలు సంయుక్తంగా పరిశీలన చేసి డి-మార్కేషన్ పూర్తి చేసినట్లు కలెక్టర్ నాగరాణి ఆయనకు వివరించారు.

ఒడిశా పర్యటనకు ఎంపీడీవోలు

మొగల్తూరు, న్యూస్‌టుడే: జిల్లాకు చెందిన పలువురు ఎంపీడీవోలు క్షేత్ర పరిశీలన, శిక్షణ నిమిత్తం ఒడిశా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ వెళ్లారు. రాష్ట్రం నుంచి 30 మంది ఎంపీడీవోలను ప్రభుత్వం పంపించింది. జిల్లా నుంచి త్రిశూలపాణి (మొగల్తూరు), టీఎస్ఎన్ మూర్తి (వాసవి పెనుగొండ), నాగరాజు (నరసాపురం) తదితరులు అక్కడకు వెళ్లారు. ఈ నెల 21 వరకు అక్కడ శిక్షణ కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

వర్క్ టు రూల్ అమలు చేస్తాం: వీఆర్వోలు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు వర్క్ టు రూల్ అమలు చేస్తామని రెవెన్యూ ఉద్యోగుల ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు స్పష్టం చేశారు. భీమవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్వోలు, సర్వేయర్లు, వీఆర్ఏలు బుధవారం నిర్వహించిన నిరసనలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారులు ఇబ్బందులకు గురిచేసే ప్రత్యక్ష ఆదేశాలు చేస్తున్నారని ఆరోపించారు. మా సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని కోరారు. సంఘం ప్రతినిధులు సంధ్యారాణి, ఉత్తరయ్య తదితరులు పాల్గొన్నారు.

చెట్లు దూసుకెళ్తున్నాయ్!

పర్యావరణంపై ప్రతి ఒక్కరూ దృష్టిసారిస్తున్నారు. గృహాలంకరణ, పార్కులు, ఎస్టేటుల్లో భూ అలంకరణ కోసం అందమైన మొక్కలు, చెట్లను విదేశాల నుంచి తెప్పిస్తున్నారు. అదేవిధంగా కడియం నర్సరీల్లో పెంచుతున్న వివిధ రకాల మొక్కలను ఇతర ప్రాంతాలకు ట్రాలీ లారీలపై ఎగుమతి చేస్తున్నారు. తాడేపల్లిగూడెం జాతీయ రహదారిపై రయ్ రయ్ మంటూ ట్రాలీ లారీల్లో దూసుకుపోతున్న దృశ్యమిది. - ఈనాడు, తాడేపల్లిగూడెం

నమ్మించి.. నిలువునా ముంచేసి..

రైల్వే ఉద్యోగాల పేరుతో రూ.లక్షల్లో దోపిడీ

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే: ఉద్యోగాల పేరుతో దాదాపు రెండేళ్లుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సాగుతున్న దందాలో చిక్కుకున్న బాధితుల పరిస్థితి నేడు అగమ్యగోచరంగా మారింది. మోసాన్ని గుర్తించి ప్రశ్నించిన వారిపైనే ఎదురు కేసులు పెడుతున్న నేపథ్యంలో తమకు ఆత్మహత్యలే శరణ్యమంటూ బాధితులు వాపోతున్నారు.

రైల్వేలో చిరుద్యోగిగా పనిచేస్తున్న ఎం.కిషోర్.. మచిలీపట్నం రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. సహచరులు కరీముల్లా, షఫి, అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకుడు చిన్నా తదితరుల సహకారంతో పలువురితో పరిచయాలు పెంచుకున్నారు. ఈ క్రమంలో కిషోర్.. రైల్వేలో టీసీ, క్లర్క్ తదితర పోస్టుల పేరుతో కనిష్ఠంగా రూ.5 లక్షల చొప్పున పలువురి వద్ద నుంచి నగదు, ఖాళీ చెక్కులు వసూలు చేశాడు. అనంతరం వారికి పీఎఫ్ ఖాతా నంబర్లు, రైల్వే స్టాంపులతో కూడిన ఫేక్ నియామక పత్రాలు, ఐడీ కార్డులు పంపుతూ సాంకేతిక కారణాల వల్ల ఉద్యోగంలో చేరేందుకు కాస్త ఆలస్యం అవుతుందంటూ నమ్మబలికాడు. ఆలస్యంపై ఎవరైనా నిలదీస్తే విజయవాడ, ఇతర ప్రాంతాలకు మాట్లాడదామంటూ పిలిచి యూనియన్ నాయకుల పేరుతో కొందరిని పరిచయం చేసి త్వరలోనే ఉద్యోగం వస్తుందని ఆశలు కల్పించేవాడు. ఇదే తరహాలో మచిలీపట్నం పరిసర ప్రాంతాలకు చెందిన పలువురి వద్ద నుంచి నగదు దోచేసి వారిని మభ్యపెడుతూ వస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం జక్కరం గ్రామానికి చెందిన నాగపద్మ తనకు వచ్చిన నియామక పత్రాన్ని రైల్వే ఉద్యోగులకు చూపించి అది నకిలీదని నిర్ధారించుకోవడంతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది.

అడిగినందుకు ఎదురు కేసు.. బాధితురాలు నాగపద్మతో పాటు మచిలీపట్టణానికి చెందిన గంగాభవాని ఈ నెల 7న మచిలీపట్నంలోని కిషోర్ నివాసానికి వచ్చారు. కిషోర్, అతనికి అండగా నిలిచిన చిన్నా కలిసి 'అల్లరి చేసుకోవద్దు.. మీకు ఉద్యోగాలు ఖాయం.. రేపు రండంటూ వారిని పంపేశారు. మరుసటి రోజు కిషోర్ ఇంటికి వెళ్లగా ఎవరూ ఆచూకీ లేకపోవడంతో బాధితులు చిలకలపూడి స్టేషన్‌కు వెళ్లి జరిగిన మోసాన్ని పోలీసులకు వివరించారు. అనంతరం బాధితులు తిరిగి కిషోర్ ఇంటికి వెళ్లి అతని కోసం నిరీక్షించారు. ఈలోగా పోలీసులు అక్కడకు వచ్చి రాత్రి మీరే కిషోర్‌పై దాడి చేశారంటూ అతడు ఫిర్యాదు ఇచ్చాడని, ఈ కేసులో నిందితులుగా ఉన్నారంటూ నాగపద్మ, గంగాభవానిలను స్టేషన్‌కు తీసుకువెళ్లడం గమనార్హం. ఇదిలా ఉండగా.. ఈ నెల 14న కాళ్ల పోలీస్ స్టేషన్‌లో ఇదే అంశంపై తాను ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకుండా తనను వెనక్కి పంపేశారని నాగపద్మ వాపోతోంది.

తపాలా పొదుపు సొమ్ము స్వాహా

రూ.15 లక్షలు కాజేసిన పోస్టుమాస్టర్

కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగిన ఖాతాదారులు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నరసాపురం మండలం పసలదీవి తపాలా కార్యాలయం పరిధిలో ఖాతాదారుల పొదుపు సొమ్ము పక్కదారి పట్టిన ఉదంతం బుధవారం వెలుగు చూసింది. ఈ కార్యాలయ పోస్టుమాస్టర్ ఆర్ఎన్‌డీవీ ప్రసాద్ ఖాతాదారుల సొమ్ము రూ.15 లక్షల వరకు స్వాహా చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అతడు వందలాది పాసు పుస్తకాలను చాలా కాలం ఉంచి తన వద్దే ఉంచుకున్నాడు. ఖాతాదారులు పొదుపు, ఫిక్స్‌డ్ డిపాజిట్, సుకన్య సమృద్ధి యోజన కోసం చెల్లించిన సొమ్మును జమ చేయకుండా, తపాలా శాఖ రికార్డుల్లో నమోదు చేయకుండా కాజేశాడు. అతడు రెండు రోజులుగా విధులకు గైర్హాజరు కావడంతో అనుమానం వచ్చిన బాధితులు బుధవారం తపాలా కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. తమ సొమ్ము తిరిగి ఇప్పించాలంటూ నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న ఆ శాఖ ఉన్నతాధికారులు ఇక్కడి కార్యాలయానికి వచ్చి రికార్డులను తనిఖీ చేశారు. బాధితుల పాసు పుస్తకాలను సేకరించి ఆన్‌లైన్లో ఉన్న వివరాలతో సరిచూస్తున్నారు. ఈ ఘటనపై విచారణ చేపట్టామని.. బాధ్యుడైన పోస్టుమాస్టర్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని శాఖ అధికారులు ఖాతాదారులకు హామీ ఇచ్చారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పేలిన ఫ్రిజ్

దగ్ధమైన ఇతర గృహోపకరణాలు

ధ్వంసమైన గది

మొగల్తూరు, న్యూస్‌టుడే: విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ ప్రభావంతో ఇంట్లో ఫ్రిజ్ పేలిపోగా గది ధ్వంసమైంది. ఇతర గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మొగల్తూరు పంచాయతీ పరిధి కొండావారిపాలేనికి చెందిన బొడ్డుపల్లి రమేశ్‌బాబు ఇంట్లో బుధవారం షార్ట్‌సర్క్యూట్ జరిగి ఫ్రిజ్ భారీ శబ్దంతో పేలింది. ఆ ధాటికి గదిలో శ్లాబు, బయట సన్‌షేడ్ బీటలు తీసి పెచ్చులూడి పడ్డాయి. ఆ గదిలో టీవీ, టేబుల్ ఫ్యాను కాలి బుగ్గయ్యాయి. దట్టంగా పొగలు వ్యాపించడంతో ఆ ఇంట్లో నివాసితులు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరయ్యారు. వారు కేకలు వేయడంతో సమీపంలో ఉన్న యువకులు అక్కడికి వచ్చి విద్యుత్తు సరఫరా నిలిపివేయించారు.

తప్పిన ముప్పు.. ప్రమాదం జరిగిన గదిలో తన మావయ్య సుధాకర్ ఉంటారని.. ఘటనకు కొద్ది నిమిషాల ముందు ఆయన బయటకు రావడంతో పెద్ద ముప్పు తప్పిందని రమేశ్‌బాబు భార్య రత్నకుమారి తెలిపారు.

SHRIRAM Finance **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**

(పూర్వపు) శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)

రిజిస్టర్డ్ కార్యాలయం : డి.నెం. 14-ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.

జోనల్ ఆఫీస్ : డి.నెం. 22బి-13-8, 2వ అంతస్తు, వెంకటరామ పవర్‌ప్రెస్ రోడ్డు, సెంట్రల్ బ్యాంక్ ఎదురుగా, పవర్‌పేట, ఏలూరు - 534002

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్' గా పిలువబడేది, గౌరవ ఎన్‌సిఎల్‌టి-బెంచ్ 2, చెన్నై, తేది : 9-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్ కంపెనీ అయి ఉన్నాము. మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద రిజిస్టర్డ్ ఆఫీస్ కలిగియున్నది మరియు **బ్రాంచి ఆఫీస్ నర్సాపురం** లో నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బ్యాంకింగ్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. (ఇక నుండి మమ్మల్ని కంపెనీ / ఋణదాతగా సూచిస్తారు) ఇందుమూలంగా ఈ క్రింది నోటీసు జారీచేస్తున్నాము.

ఋణగ్రహీతలు / సహ ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 3తో చదువబడు సెక్షన్ 13 (2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసీ చట్టం 2002 లోని సెక్షన్ 13 (2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.

చివరిగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందచేయబడక తిరిగి వచ్చినందున సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

క్ర సం.	ఋణగ్రహీత (లు) / సహ-ఋణగ్రహీత (లు) / హామీదారు (లు) పేరు	NPA తేది / ఋణ మొత్తం	డిమాండ్ నోటీసు తేది / బకాయి మొత్తం
1	1) **రాము సిలారి,** తండ్రి : నాగేశ్వరరావు, డి.నెం : 1-195, కందుల పాటివారి మెరక, కుమ్మరపురుగు పాలెం, మొగల్తూరు, పశ్చిమ గోదావరి జిల్లా-534280. 2) **బొక్కా రామస్వామి,** తండ్రి : సుబ్బారావు, డి.నెం : 3-198, చామకూరిపాలెం, లింగబోయినచర్ల, పశ్చిమ గోదావరి జిల్లా-534275.	31-10-2017 / Rs. 10,00,000/-	20-11-2025 / ది. 20-11-2025 నాటికి మొత్తం రూ. 23,01,370/- (అక్షరాలా ఇరవై మూడు లక్షల ఒక వేయి మూడు వందల డెబ్భై రూపాయలు మాత్రమే)
	ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం. **NRSPRTF1511240001**		
	షెడ్యూల్ ఆస్తి వివరాలు : పశ్చిమ గోదావరి జిల్లా, మొగల్తూరు మండలం, మొగల్తూరు సబ్ డిస్ట్రిక్ట్, కుమ్మరపురుగుపాలెం ఉత్తర గ్రామ పంచాయతీ ప్రాంతం, కుమ్మరపురుగుపాలెం రెవెన్యూ గ్రామం అకౌంట్స్ జిరాయితీ డ్రై భూమి కి చెందిన ఆర్.ఎస్.నెం. 118/2 వద్ద ఎకరా 1.28 1/2 సెంట్లు దానికి సమీప డి.నెం. 1-183 వద్ద ఎకరా 0.04 1/2 సెంట్లు లేదా 218 చ॥గ॥లు లేదా 182 చ॥మీ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము. **హద్దులు : తూర్పు:** జవ్వాడి సుబ్బారావు గారి స్థలం; **దక్షిణం:** పాటిబళ్ల నరసింహారావు గారి స్థలం; **పడమర :** గ్రామ పంచాయతీ రహదారి; **ఉత్తరం:** నాయుడు నాగేశ్వరరావు గారి స్థలం.		

పైన చెప్పబడిన పరిస్థితుల దృష్ట్యా, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతోపాటు పైన తెలిపిన విధంగా బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు మరియు /లేదా వారి హామీదారుల (వర్తించినచోట) కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా ఋణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీనత చేపట్టడంతో కలుపుకొని సెక్యూర్డ్ అసెట్స్ మీద ఈ నోటీసు తేది నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును.

సదరు చట్టంలోని సెక్షన్ 13 (13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు, వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన అతని సెక్యూర్డ్ అస్సెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని రూపంలో ఏ ఋణగ్రహీత బదిలీ చేయరాదని గమనించగలరు.

ప్రదేశం : నర్సాపురం — అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.

SHRIRAM Finance **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**

(పూర్వపు) శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)

రిజిస్టర్డ్ కార్యాలయం : డి.నెం. 14-ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.

జోనల్ ఆఫీస్ : డి.నెం. 22బి-13-8, 2వ అంతస్తు, వెంకటరామ పవర్‌ప్రెస్ రోడ్డు, సెంట్రల్ బ్యాంక్ ఎదురుగా, పవర్‌పేట, ఏలూరు - 534002

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్' గా పిలువబడేది, గౌరవ ఎన్‌సిఎల్‌టి-బెంచ్ 2, చెన్నై, తేది : 9-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్ కంపెనీ అయి ఉన్నాము. మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద రిజిస్టర్డ్ ఆఫీస్ కలిగియున్నది మరియు **బ్రాంచి ఆఫీస్ భీమవరం** లో నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బ్యాంకింగ్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. (ఇక నుండి మమ్మల్ని కంపెనీ / ఋణదాతగా సూచిస్తారు) ఇందుమూలంగా ఈ క్రింది నోటీసు జారీచేస్తున్నాము.

ఋణగ్రహీతలు / సహ ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 3తో చదువబడు సెక్షన్ 13 (2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసీ చట్టం 2002 లోని సెక్షన్ 13 (2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.

చివరిగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందచేయబడక తిరిగి వచ్చినందున సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

క్ర సం.	ఋణగ్రహీత (లు) / సహ-ఋణగ్రహీత (లు) / హామీదారు (లు) పేరు	NPA తేది / ఋణ మొత్తం	డిమాండ్ నోటీసు తేది / బకాయి మొత్తం
1	1) **చందన సతీష్ కుమార్,** తండ్రి : శ్రీరాములు, ప్లాట్ నెం. 202, డి.ఎస్.ఆర్. కళాశాల, భీమవరం, వార్డు-15, గరువు వీధి, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా-534202. 2) **సి.హెచ్. సుజాత,** భర్త : సతీష్ కుమార్, ఫ్లాట్ నెం. 202, డి.ఎస్.ఆర్. కళాశాల, భీమవరం, వార్డు-15, గరువు వీధి, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా-534202. 3) **ఎన్. గంగారావు,** తండ్రి : తాతారావు, ఫ్లాట్ నెం. 101, డి.ఎస్.ఆర్. కళాశాల, భీమవరం, వార్డ్-15, గరువు వీధి, B.C కాలనీ, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా-534202.	31-08-2016 / Rs. 8,00,000/-	20-11-2025 / ది. 13-11-2025 నాటికి మొత్తం రూ. 26,56,831/- (అక్షరాలా ఇరవై ఆరు లక్షల యాభై ఆరు వేల ఎనిమిది వందల ముప్పై ఒక్క రూపాయి మాత్రమే)
	ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం. **BMVR2TF1506280003**		
	షెడ్యూల్ ఆస్తి శ్రీ చందన సతీష్ కుమార్ గారికి చెందినది : పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మండలం, భీమవరం సబ్ డిస్ట్రిక్ట్, నరసింహపురం గ్రామ పంచాయతీ మరియు గ్రామ అకౌంట్స్ తడి భూమికి చెందిన ఆర్.ఎస్.నెం. 93 నందు ఎకరా 8.63 సెంట్లు, ఆర్.ఎస్.నెం. 94/1 వద్ద ఎకరా 6.07 సెంట్లు మొత్తం కలిపి ఎకరా 14.70 సెంట్లు విస్తీర్ణంలోని ఆస్తి డిటిసిపి హైదరాబాద్, ఎల్‌పి నెం. 123/1994 ప్రకారం ఆమోదించి ఇంటి ప్లాట్‌లుగా అభివృద్ధి చేయబడ్డాయి. దీనిలో ప్లాట్ నెం. 81కి చెందిన 201 2/3 చ॥గ॥లు లేదా 168 చ॥మీ॥ల విస్తీర్ణంలోని ఖాళీగా ఉన్న స్థలము దానికి సమీప డి.నెం. 4-1. **హద్దులు : తూర్పు :** ప్లాట్ నెం. 89 కింద ఉన్న స్థలం - 33 అ॥లు, **దక్షిణం:** ప్లాట్ నెం. 89 కింద ఉన్న స్థలం - 55 అ॥లు, **పడమర :** 33 అ॥ వెడల్పు లేఅవుట్ రోడ్డు - 33 అ॥లు, **ఉత్తరం:** ప్లాట్ నెం. 80 కింద ఉన్న స్థలం - 55 అ॥లు.		

పైన చెప్పబడిన పరిస్థితుల దృష్ట్యా, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతోపాటు పైన తెలిపిన విధంగా బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు మరియు /లేదా వారి హామీదారుల (వర్తించినచోట) కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా ఋణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీనత చేపట్టడంతో కలుపుకొని సెక్యూర్డ్ అసెట్స్ మీద ఈ నోటీసు తేది నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును.

సదరు చట్టంలోని సెక్షన్ 13 (13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు, వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన అతని సెక్యూర్డ్ అస్సెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని రూపంలో ఏ ఋణగ్రహీత బదిలీ చేయరాదని గమనించగలరు.

ప్రదేశం : భీమవరం — అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.

SHRIRAM Finance **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**

(పూర్వపు) శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)

రిజిస్టర్డ్ కార్యాలయం : డి.నెం. 14-ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.

జోనల్ ఆఫీస్ : డి.నెం. 22బి-13-8, 2వ అంతస్తు, వెంకటరామ పవర్‌ప్రెస్ రోడ్డు, సెంట్రల్ బ్యాంక్ ఎదురుగా, పవర్‌పేట, ఏలూరు - 534002

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్' గా పిలువబడేది, గౌరవ ఎన్‌సిఎల్‌టి-బెంచ్ 2, చెన్నై, తేది : 9-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్ కంపెనీ అయి ఉన్నాము. మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద రిజిస్టర్డ్ ఆఫీస్ కలిగియున్నది మరియు **బ్రాంచి ఆఫీస్ నర్సాపురం** లో నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బ్యాంకింగ్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. (ఇక నుండి మమ్మల్ని కంపెనీ / ఋణదాతగా సూచిస్తారు) ఇందుమూలంగా ఈ క్రింది నోటీసు జారీచేస్తున్నాము.

ఋణగ్రహీతలు / సహ ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 3తో చదువబడు సెక్షన్ 13 (2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసీ చట్టం 2002 లోని సెక్షన్ 13 (2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.

చివరిగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందచేయబడక తిరిగి వచ్చినందున సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

క్ర సం.	ఋణగ్రహీత (లు) / సహ-ఋణగ్రహీత (లు) / హామీదారు (లు) పేరు	NPA తేది / ఋణ మొత్తం	డిమాండ్ నోటీసు తేది / బకాయి మొత్తం
1	1) **కరిచర్ల వెంకటేశ్వరరావు,** తండ్రి : నరసింహ మూర్తి, డి.నెం. :14-4-67/2, కరిచర్లవారి వీధి, రామాలయం దగ్గర, నర్సాపురం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా-534275. 2) **కరిచర్ల లక్ష్మిఅమ్మని,** భర్త ం వెంకటేశ్వరరావు, డి.నెం : 14-4-67/2, కరిచర్లవారి వీధి, రామాలయం దగ్గర, నర్సాపురం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా-534275. 3) **కరిచర్ల మాధవస్వామి,** తండ్రి : త్రినాధరావు, డి.నెం : 11-4-44, పెచ్చుపాలెం, భారత్ గ్యాస్ గోడౌన్ వెనుక, నర్సాపురం, పశ్చిమగోదావరి జిల్లా-534275.	31-10-2018 / Rs. 6,00,000/-	20-11-2025 / ది. 20-11-2025 నాటికి మొత్తం రూ. 26,66,962/- (అక్షరాలా ఇరవై ఆరు లక్షల అరవై ఆరు వేల తొమ్మిది వందల అరవై రెండు రూపాయలు మాత్రమే)
	ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం. **NRSPRTF1711280001**		
	షెడ్యూల్ ఆస్తి వివరాలు : (శ్రీ కరిచెర్ల వెంకటేశ్వరరావు తండ్రి : లేటు నారాయణ మూర్తి గారి పేరు మీద గల డాక్యుమెంట్ నెం. 1869/2010 షెడ్యూల్ నెం. ఇ, ఐటెమ్ నెం. 01 కింద కవర్ చేయబడిన ఆస్తి) పశ్చిమ గోదావరి జిల్లా, నర్సాపురం మండలం, నర్సాపురం సబ్ డిస్ట్రిక్ట్, నర్సాపురం మున్సిపల్ ఏరియా, 21వ వార్డు, పీచుపాలెం సమీపంలోని డి.నెం. 11-4-67 కి ఉత్తరం వైపు ఈశాన్య మూలలో 113 చ॥గ॥లు లేదా 93 చ॥మీ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలం. దీనికి **సరిహద్దులు : తూర్పు:** కరిచెర్ల నాగమణి గారి స్థలం; **దక్షిణం:** కరిచర్ల సురేష్ గారి ఆస్తి; **పడమర :** రోడ్డు; **ఉత్తరం:** రోడ్డు		

పైన చెప్పబడిన పరిస్థితుల దృష్ట్యా, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతోపాటు పైన తెలిపిన విధంగా బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు మరియు /లేదా వారి హామీదారుల (వర్తించినచోట) కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా ఋణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీనత చేపట్టడంతో కలుపుకొని సెక్యూర్డ్ అసెట్స్ మీద ఈ నోటీసు తేది నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును.

సదరు చట్టంలోని సెక్షన్ 13 (13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు, వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన అతని సెక్యూర్డ్ అస్సెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని రూపంలో ఏ ఋణగ్రహీత బదిలీ చేయరాదని గమనించగలరు.

ప్రదేశం : నర్సాపురం — అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.

SHRIRAM Finance **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**

(పూర్వపు) శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)

రిజిస్టర్డ్ కార్యాలయం : డి.నెం. 14-ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.

జోనల్ ఆఫీస్ : డి.నెం. 22బి-13-8, 2వ అంతస్తు, వెంకటరామ పవర్‌ప్రెస్ రోడ్డు, సెంట్రల్ బ్యాంక్ ఎదురుగా, పవర్‌పేట, ఏలూరు - 534002

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్' గా పిలువబడేది, గౌరవ ఎన్‌సిఎల్‌టి-బెంచ్ 2, చెన్నై, తేది : 9-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్ కంపెనీ అయి ఉన్నాము. మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద రిజిస్టర్డ్ ఆఫీస్ కలిగియున్నది మరియు **బ్రాంచి ఆఫీస్ భీమవరం** లో నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బ్యాంకింగ్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. (ఇక నుండి మమ్మల్ని కంపెనీ / ఋణదాతగా సూచిస్తారు) ఇందుమూలంగా ఈ క్రింది నోటీసు జారీచేస్తున్నాము.

ఋణగ్రహీతలు / సహ ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 3తో చదువబడు సెక్షన్ 13 (2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసీ చట్టం 2002 లోని సెక్షన్ 13 (2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.

చివరిగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందచేయబడక తిరిగి వచ్చినందున సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

క్ర సం.	ఋణగ్రహీత (లు) / సహ-ఋణగ్రహీత (లు) / హామీదారు (లు) పేరు	NPA తేది / ఋణ మొత్తం	డిమాండ్ నోటీసు తేది / బకాయి మొత్తం
1	1 **నాగ వెంకట బ్రహ్మగణేష్ పలపల,** తండ్రి : సత్యనారాయణ, ఓసిసి : వసుంధర రెస్టారెంట్, డి.నెం. 19-22-5, బ్యాంక్ కాలనీ, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా-534201. 2) **పలపల నాగ వెంకట సత్య శిరీష,** భర్త : ఎన్.వి.బి. గణేష్, డి.నెం:19-22-5, బ్యాంక్ కాలనీ, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా-534201. 3) **మాదాసు సత్యనారాయణ,** తండ్రి : శ్రీరాములు, డి. నెం:2-115, వేణుగోపాలస్వామి దేవాలయం వీధి, సీతారాంపురం, పశ్చిమ గోదావరి జిల్లా-534280.	31-03-2018 / Rs. 15,00,000/-	20-11-2025 / ది. 13-11-2025 నాటికి మొత్తం రూ. 46,19,039/- (అక్షరాలా నలభై ఆరు లక్షల పందొమ్మిది వేల ముప్పై తొమ్మిది రూపాయలు మాత్రమే)
	ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం. **BMVR2TF1705130001**		
	షెడ్యూల్ ఆస్తి వివరాలు : పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మండలం, భీమవరం సబ్ డిస్ట్రిక్ట్, భీమవరం మున్సిపాలిటీ ప్రాంతం గునుపూడి గ్రామం, ఆర్.ఎస్.నెం. 582/1లో ఎకరా 0.43 సెంట్లు విస్తీర్ణం మరియు ఆర్.ఎస్.నెం. 582/2లో ఎకరా 1.28 విస్తీర్ణంలో ఉన్న భూమిని మొత్తం కలుపగా ఎకరా 1.71 విస్తీర్ణంలో గల ఆస్తికి మధ్యలో గల 252 64 సెంట్లు లేదా 211.25 చ॥మీ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలం. **హద్దులు : తూర్పు:** ఈ సర్వే నంబర్‌లోని భూమి ఎమ్మనేని అన్నపూర్ణ గారికి చెందినది - 60 లింకులు; **దక్షిణం:** ఈ సర్వే నంబర్‌లోని భూమి మద్దాల గంటారావు గారికి చెందినది - 87 లింకులు; **పడమర :** 30 అ॥ల వెడల్పు సాధారణ దారి - 60 లింకులు; **ఉత్తరం:** ఈ సర్వే నంబర్‌లోని భూమి కొప్పర్తి సత్యనారాయణ స్వామి గారికి చెందినది - 87 లింకులు.		

పైన చెప్పబడిన పరిస్థితుల దృష్ట్యా, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతోపాటు పైన తెలిపిన విధంగా బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు మరియు /లేదా వారి హామీదారుల (వర్తించినచోట) కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా ఋణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీనత చేపట్టడంతో కలుపుకొని సెక్యూర్డ్ అసెట్స్ మీద ఈ నోటీసు తేది నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును.

సదరు చట్టంలోని సెక్షన్ 13 (13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు, వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన అతని సెక్యూర్డ్ అస్సెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని రూపంలో ఏ ఋణగ్రహీత బదిలీ చేయరాదని గమనించగలరు.

ప్రదేశం : భీమవరం — అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.

నవవధువుపై నోట్ల వాన

ఇంటర్నెట్ డెస్క్: పంజాబ్‌లోని తరన్ తారన్ జిల్లాలో జరిగిన ఓ వివాహ వేడుకలో నవవధువుపై నోట్ల వర్షం కురిపించారు. వధువు వేదిక వద్ద నిలబడి ఉండగా.. పంజాబీ పాటల హోరులో కుటుంబసభ్యులు ఆమెపై కరెన్సీ నోట్లను వెదజల్లుతున్న దృశ్యాలు వైరల్‌గా మారాయి. మొత్తం రూ.8.5 కోట్ల విలువైన కరెన్సీ నోట్లను వెదజల్లినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. దీనికి తగ్గట్టే వీడియోలో నేలంతా నోట్లు పరుచుకొని కనిపిస్తున్నాయి. "అబ్బే సరదాగా రూ.2 లక్షలు మాత్రమే వెదజల్లాం" అని వరుడి సోదరుడు సికందర్ సింగ్ తెలిపారు. తప్పుడు ప్రచారాలు చేస్తున్న సోషల్ మీడియా ఖాతాలపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేశామన్నారు. మరోవైపు.. వధువుపై వెదజల్లడానికి రూ.4 లక్షల విలువైన కరెన్సీ నోట్లను వినియోగించినట్లు ఈ వివాహ కార్యక్రమాన్ని నిర్వహించిన ఈవెంట్ మేనేజరు చెప్పడం గమనార్హం.

థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ.. ఉద్యోగులకు రూ.20 కోట్ల కార్లు

ఇంటర్నెట్ డెస్క్: కేరళలోని హైలైట్ గ్రూపు సంస్థ 30 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఉద్యోగులకు ఖరీదైన కార్లను బహుమతిగా ఇచ్చింది. రిటైల్ స్పేస్ రంగానికి చెందిన ఈ సంస్థ కోళికోడ్‌లో నిర్వహించిన ప్రత్యేక వేడుకలో రూ.20 కోట్ల విలువైన కానుకలను అందజేసింది. సంస్థ ప్రారంభం నుంచి సేవలందిస్తున్న 47 మందికి వివిధ మోడళ్ల కార్లు ఇచ్చారు. 2030 నాటికి తమ సంస్థను మరింత విస్తరించి రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని యాజమాన్యం ప్రకటించింది. ఈ కంపెనీకి త్రిశ్శూర్, కోళికోడ్‌లలో లగ్జరీ మాల్స్ ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మరో 10 మాల్స్ అభివృద్ధి దశలో ఉన్నాయి. మొత్తం 10 వేల మంది ఉద్యోగులు సంస్థలో పనిచేస్తున్నారు. 680 మిలియన్ డాలర్ల వ్యయంతో త్వరలో భారీ ట్రేడ్ సెంటర్ ప్రాజెక్టు ఏర్పాటుకు సిద్ధమవుతోంది.

బామ్మగారు.. బంగారం

78 ఏళ్ల వయసులో గోల్డ్ మెడల్‌తో పీజీ

ఈటీవీ భారత్: సీనియర్ సిటిజన్లు పదవీ విరమణ తర్వాత కూడా జీవితాన్ని గొప్పగా ఆస్వాదించవచ్చనే సందేశాన్ని 78 ఏళ్ల సుష్మా మోఘే సమాజానికి చాటారు. ఈ వయసులో మరాఠీ సాహిత్యంలో పీజీ చేసిన సుష్మా మొదటి ర్యాంకుతో ఉత్తీర్ణురాలు కాగా.. మధ్యప్రదేశ్ గవర్నర్ మంగూభాయ్ పటేల్, వీసీ రాకేశ్ సింఘాయ్

ఆమెకు గోల్డ్ మెడల్ అందజేశారు. ఇందౌర్ నగరానికి చెందిన సుష్మా తొలుత మ్యూజిక్ కోర్సులో డిగ్రీ చదివారు. కేంద్ర ప్రభుత్వ పాఠశాలలో సంగీత ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం చేస్తూనే కెమిస్ట్రీలో పీజీ చేశారు. దాదాపు నాలుగు దశాబ్దాల ఉద్యోగ జీవితం నుంచి రిటైరయ్యాక, పలు పుస్తకాలను హిందీ నుంచి మరాఠీలోకి అనువదించారు. సొంతంగా డజను పుస్తకాలు రాసి ప్రచురించారు. తాజాగా ఇందౌర్‌లోని దేవీ అహిల్యా విశ్వవిద్యాలయం నుంచి పీజీ చేసి మంగళవారం జరిగిన స్నాతకోత్సవంలో మనవడు రేయాంశ్ సమక్షంలో బంగారు పతకం అందుకున్నారు.

బృందమంటే వ్యక్తులు కలిసి పనిచేయడమే కాదు

కార్యక్షేత్రంలో బృందమంటే కొందరు వ్యక్తులు కలిసిపనిచేయడమే కాదు. సంరక్షణ, గౌరవం, నమ్మకాలపై ఏర్పడిన ఓ బంధం. గొప్ప బృందాల్లో సభ్యులు ఫలితాలపై మాత్రమే దృష్టిని కేంద్రీకరించరు.. తోటి సభ్యుల అభ్యున్నతినీ పట్టించుకుంటారు.

– అనుష్క సోహం, అంత్రప్రెన్యూర్

ఛాతీ భాగాన్ని ఉద్దేశపూర్వకంగా తాకడం అత్యాచార యత్నమే

- స్పష్టం చేసిన సుప్రీంకోర్టు
- అలహాబాద్ హైకోర్టు వివాదాస్పద ఉత్తర్వుల కొట్టివేత

దిల్లీ: మహిళల ఛాతీ భాగాన్ని ఉద్దేశపూర్వకంగా తాకడం, పైజామా నాడాను లాగడం అత్యాచారం యత్నం కిందకు రాదంటూ ఓ కేసులో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన వివాదాస్పద ఉత్తర్వులను సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. హైకోర్టు అమానవీయంగా వ్యవహరించిందని, స్పష్టంగా ఉన్న నేర న్యాయ సూత్రాలను కూడా తప్పుగా అన్వయించిందని పేర్కొంది. ఐపీసీలోని సెక్షన్ 376 కింద, పోక్సో చట్టంలోని సెక్షన్ 18 కింద స్పెషల్ జడ్జి జారీ చేసిన సమన్లను పునరుద్ధరించింది. మూడో పక్షం వ్యక్తులు జోక్యం చేసుకోవడంతోనే నిందితులు అత్యాచారానికి పాల్పడలేదని పేర్కొంది. నిందితుల చర్యలు నేరం చేయడానికి సిద్ధమవ్వడం కిందకు రావని, అత్యాచారయత్నం కిందకే వస్తాయని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ ఎన్.వి.అంజారియాల ధర్మాసనం స్పష్టంచేసింది. ఐపీసీలో నేర ప్రయత్నానికి ఎక్కువ శిక్ష ఉంటుంది. సిద్ధమవ్వడానికి(ప్రిపరేషన్) తక్కువ శిక్ష ఉంటుంది. ఈ కేసులో ఇద్దరు వ్యక్తులు 11 ఏళ్ల బాలిక ఛాతీ భాగాన్ని పట్టుకున్నారు. పైజామా నాడాను లాగారు. బాలిక అరుపులు విని ఆ మార్గంలో వెళుతున్న వ్యక్తులు జోక్యం చేసుకున్నారు. దీనిపై కాస్‌గంజ్ పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి.. నిందితులకు సమన్లు జారీ చేశారు. అలహాబాద్ హైకోర్టు మాత్రం అభియోగాల తీవ్రతను తగ్గించింది. నిందితుల ప్రవర్తన అత్యాచార యత్నం కిందకు రాదని పేర్కొంది. వారు కేవలం బాలిక దుస్తులు తీసి నగ్నంగా నిలబెట్టేందుకు మాత్రమే ప్రయత్నించారని అభిప్రాయపడింది. దీన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. బాలిక అరుపులు విని జనం రావడంతోనే అత్యాచార ప్రయత్నం విఫలమైందని.. నిందితులకు నేరం చేసే ఉద్దేశం ఉందని స్పష్టం చేసింది.

■ ఈ కేసులో మరో కీలకమైన ఆదేశం కూడా సుప్రీంకోర్టు జారీ చేసింది. లైంగిక నేరాల వంటి సున్నితమైన కేసుల్లో న్యాయమూర్తులు అనుసరించాల్సిన విధానాలపై మార్గదర్శకాలను రూపొందించాలని భోపాల్‌లోని జాతీయ జ్యుడీషియల్ కమిటీని ఆదేశించింది. ఈ అంశంపై గతంలో రాజ్యాంగ ధర్మాసనాలు పలు ఆదేశాలు జారీచేశాయని.. కానీ అవి ఫలితాలను ఇవ్వలేదని, అందుకే సమగ్రమైన విధి విధానాలను రూపొందించాలని పేర్కొంది.



కులం, మతం, ప్రాంతీయ వివక్షతో వ్యక్తులపై దాడులు తిరోగామి చర్యలే

- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం వ్యాఖ్య

దిల్లీ: జాతి, మతం, కులం, ప్రాంతం ఆధారంగా వ్యక్తులను గుర్తించి వివక్ష చూపడం, హింసాత్మక దాడులకు పాల్పడడం తిరోగామి చర్యలేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటిన తర్వాత కూడా ఇలాంటి వివక్ష కొనసాగడం శోచనీయమని తెలిపింది. ఈ నేరాల పట్ల కఠినంగా వ్యవహరించి వాటిని నిరోధించాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలీ ధర్మాసనం పేర్కొంది. ఈశాన్య ప్రాంత ప్రజలపై దేశంలోని వివిధ చోట్ల జరుగుతున్న వివక్షాపూరితమైన హింసను నిరోధించాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని తోసిపుచ్చుతూ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. అయితే, పిటిషన్‌లోని అంశాలను పరిశీలించి సంబంధిత ప్రభుత్వ విభాగానికి పంపించి చర్యలు తీసుకునేలా చూడాలని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణిని ఆదేశించింది. త్రిపురకు చెందిన 24 ఏళ్ల ఎంబీఏ విద్యార్థి దేహ్రాదూన్‌లో దారుణ హత్యకు గురైన నేపథ్యంలో గత ఏడాది డిసెంబరు 28న ఈ వ్యాజ్యం దాఖలైంది.

విద్యార్థుల వీసా ప్రక్రియను సులభతరం చేస్తాం

ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ వెల్లడి

దిల్లీ: భారతీయ విద్యార్థుల కోసం వీసా, ప్రవేశాల ప్రక్రియలను సరళీకరిస్తామని, ఫ్రాన్స్‌లో ఆంగ్ల మాధ్యమంలో బోధించే కోర్సులను పెంచుతామని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ హామీ ఇచ్చారు. 2030 నాటికి భారతీయ విద్యార్థుల సంఖ్యను ఏడాదికి 30,000కు పెంచడమే లక్ష్యంగా ప్రధాని మోదీతో కలిసి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. భారత్ పర్యటనలో భాగంగా బుధవారం దిల్లీలోని ఎయిమ్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

మహారాష్ట్రలో 5 శాతం ముస్లిం రిజర్వేషన్ల రద్దు

ప్రభుత్వంపై ప్రతిపక్షాల ధ్వజం

ముంబయి: విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో ముస్లింలకున్న 5 శాతం రిజర్వేషన్లను మహారాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. దీనికి సంబంధించిన ప్రభుత్వ తీర్మానాన్ని విడుదల చేసింది. మరాఠాలకు 16శాతం, ముస్లింలకు 5శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ.. కాంగ్రెస్-ఎన్సీపీ నేతృత్వంలోని గత ప్రభుత్వం 2014లో ఆర్డినెన్సు తీసుకొచ్చింది. తాజాగా మహాయుతి కూటమి ప్రభుత్వం దీన్ని తొలగించింది. ఈ నిర్ణయాన్ని ప్రతిపక్ష పార్టీలు ఖండించాయి. భాజపా నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ వైఖరి మైనారిటీలకు వ్యతిరేకమని పేర్కొన్నాయి.

ప్రజాస్వామ్యానికి హానికరం: ముస్లిం కోటా తొలగించడం ప్రజాస్వామ్యానికి హానికరమని, ఇది మైనారిటీ ప్రజలను అభివృద్ధి నుంచి దూరం చేస్తుందని ముంబయి నగర కాంగ్రెస్ అధ్యక్షురాలు వర్షా గైక్వాడ్ వ్యాఖ్యానించారు. ఈ నిర్ణయంతో ముస్లింలకు అన్యాయం జరుగుతుందని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ మాజీ సభ్యుడు నసీమ్ ఖాన్ ఆరోపించారు. ముస్లిం నేతలను భాజపా గౌరవించదని, ఆ పార్టీతో ముస్లింలకు న్యాయం జరగదని ఎన్సీపీ(ఎస్పీ) పేర్కొంది. మరోవైపు, ముస్లింలు ఐఏఎస్, ఐపీఎస్‌లు అవడం ప్రభుత్వానికి ఇష్టం లేదని ఏఐఎంఐఎం నేత, మాజీ ఎంపీ ఇంతియాజ్ జలీల్ ఆరోపించారు.

ఏఐ ఎక్స్‌పోలో చైనా రోబో వివాదం

- వెంటనే స్టాల్‌ను ఖాళీ చేయించిన ప్రభుత్వం
- దేశ ప్రతిష్ఠను దెబ్బతీశారన్న రాహుల్ గాంధీ



దిల్లీ: దేశ రాజధానిలో జరుగుతున్న అంతర్జాతీయ ఏఐ ఎక్స్‌పోలో ఓ ప్రైవేటు విశ్వవిద్యాలయం చేసిన తప్పిదం తీవ్ర వివాదానికి దారి తీసింది. చైనాలో తయారైన ఓ రోబో డాగ్‌ను తామే తయారు చేశామని ఆ విశ్వవిద్యాలయ ప్రతినిధి ప్రకటించడం వివాదానికి కారణమైంది. వెంటనే స్పందించిన కేంద్ర ప్రభుత్వం ఎక్స్‌పో నుంచి ఆ విశ్వవిద్యాలయ స్టాల్‌ను తొలగించింది.

నొయిడాకు చెందిన గల్గోటియాస్ వర్సిటీ ఏఐ ఎక్స్‌పోలో ఒక స్టాల్‌ను ఏర్పాటు చేసింది. అందులో ఒక రోబో డాగ్‌ను ప్రదర్శించింది. దీనిపై ఆ వర్సిటీ కమ్యూనికేషన్స్ ప్రొఫెసర్ నేహా సింగ్ డీడీ న్యూస్‌తో మంగళవారం మాట్లాడారు. ఆ రోబోను తమ వర్సిటీకి చెందిన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ తయారు చేసిందని వివరించారు. ఈ వీడియో వైరల్ కావడంతో సోషల్ మీడియాలో ఆ రోబో అసలు విషయాన్ని బయటపెట్టారు. అది యూనిట్రీ గో-2 రోబో అని, చైనాలోని యూనిట్రీ తయారు చేసిందని వెల్లడించారు. దీంతో వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని ఆ వర్సిటీ స్టాల్‌ను ఖాళీ చేయించింది. మరోవైపు వర్సిటీ యాజమాన్యం క్షమాపణలు చెప్పింది. ఆ రోబో డాగ్ సాంకేతిక మూలాల గురించి తమ ప్రతినిధికి తెలియదని, కెమెరా ముందు అత్యుత్సాహంతో తప్పుడు సమాచారాన్ని అందించారని ఓ ప్రకటనలో తెలిపింది.

■ ఏఐ సమిట్‌లో చైనా వస్తువులను ప్రదర్శించి దేశ ప్రతిష్ఠను దెబ్బతీశారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ విమర్శించారు. అస్తవ్యస్తంగా ఏర్పాటు చేసిన ఒక ప్రచార ఆర్భాటంగా ఏఐ సదస్సును ఆయన అభివర్ణించారు.

విమానాల్లో అనుచిత ప్రవర్తనపై ఉక్కుపాదం

- ముసాయిదా నిబంధనలు తీసుకొచ్చిన డీజీసీఏ

దిల్లీ: విమానాల్లో అనుచితంగా ప్రవర్తించే ప్రయాణికులపై ఉక్కుపాదం మోపాలని పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) నిర్ణయించింది. ఈ మేరకు కొత్త ముసాయిదా నిబంధనలు రూపొందించింది. ఇవి అమల్లోకి వస్తే అనుచితంగా ప్రవర్తించే ప్రయాణికులను 30 రోజుల వరకు నిషేధించే హక్కు ఎయిర్‌లైన్స్ సంస్థలకు లభించనుంది. గతంలో స్వతంత్ర దర్యాప్తు కమిటీ నిర్ధారిస్తేనే శిక్ష పడేది. కొత్త ప్రతిపాదనల ప్రకారం, స్వతంత్ర సంస్థకు విమానయాన సంస్థలు నివేదించనక్కర్లేదు. నేరుగా చర్య తీసుకోవచ్చు. అనుచిత ప్రవర్తన పరిధిలోకి విమానంలో పొగ తాగడం, అనుమతి లేకుండా సురక్షిత పరికరాలను వినియోగించడం, ఆందోళనలు నిర్వహించడం, నినాదాలు చేయడం కూడా తీసుకొచ్చారు. చెక్-ఇన్, విశ్రాంతి ప్రదేశాలు, బోర్డింగ్ ప్రవేశాల దగ్గర అనుచితంగా ప్రవర్తించే ప్రయాణికులపై కూడా ఇక నుంచి ఎయిర్‌లైన్స్ సంస్థలు నిఘా ఉంచనున్నాయి. ప్రతిపాదిత నిబంధనల ప్రకారం.. సైగలతో, మాటలతో వేధింపులకు గురి చేస్తే లెవెల్-1 నేరంగా పరిగణిస్తారు. మూడు నెలల వరకు వేటు పడుతుంది. భౌతిక దాడులు, లైంగిక వేధింపులు లెవెల్-2 కిందకు వస్తాయి. ఆరు నెలల వరకు నిషేధం ఉంటుంది. ఇతరుల ప్రాణాలకు హాని కలిగించేలా ప్రవర్తిస్తే లెవెల్-3 కింద కనిష్ఠంగా రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం నిషేధం విధించవచ్చు. విమాన సిబ్బంది ఉన్న ప్రదేశంలోకి చొరబడితే లెవల్ 4 నేరమవుతుంది. దీనికి కూడా రెండేళ్లు అంతకంటే ఎక్కువ నిషేధం వర్తిస్తుంది. జాతీయ భద్రతకు ప్రమాదం కలిగించే వ్యక్తులపైనా నిషేధం విధించే వెసులుబాటును కొత్త నిబంధనలు కల్పించనున్నాయి. ఈ ముసాయిదా నిబంధనలపై ప్రజలు, సంబంధిత భాగస్వాములు తమ సూచనలు, అభ్యంతరాలను వచ్చే నెల 16 లోపు పంపాలని డీజీసీఏ పేర్కొంది.

అనవసరంగా మాట్లాడితే సహించను : కేంద్ర మంత్రి వర్మ

ఈనాడు డిజిటల్, భీమవరం: 'అనవసరంగా మాట్లాడను. నా దగ్గర అరుపులు.. కేకలుండవు.. ఎవరైనా అనవసరంగా మాట్లాడితే మాత్రం అవతలి వారికి నొప్పి తెలియకుండా పొడిచేయగలం' అంటూ కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. భీమవరంలోని భాజపా కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేను తిరుపతి లడ్డూ కోసం మాట్లాడితే వారికి ఈరోజు తణుకులో గోవధ గుర్తుకొచ్చిందా? వారికి బాధ్యత లేదా? గోమాతను రక్షించడం మనందరి బాధ్యత. డెయిరీ లేని భోలేబాబాకు లక్షల టన్నుల నెయ్యి ఆర్డర్లు కట్టబెట్టారు. ఎక్కడైనా సేకరించి చేస్తున్నారా అంటే అదీ లేదు. కల్తీ జరిగిందనేది నేను, చంద్రబాబు చెప్పింది కాదు...నేషనల్ డెయిరీ డవలప్‌మెంట్ బోర్డ్(ఎన్‌డీడీబీ) నిర్ధారించింది. అప్పటి తితిదే ఛైర్మన్ సుబ్బారెడ్డి సైతం కల్తీ లేదని చెప్పారా? జంతు కొవ్వు కాదని, మరో రకమైన కల్తీ జరిగిందంటున్నారు' అని అన్నారు. ఇటీవల భీమవరం వచ్చిన వైకాపా మాజీ మంత్రి కారుమూరి తణుకులో గోవులకు రక్షణ లేకుండా పోయిందని, శ్రీనివాసవర్మకు బాధ్యత లేదంటూ చేసిన విమర్శలను మంత్రి వద్ద విలేకర్లు ప్రస్తావించగా పైవిధంగా స్పందించారు.

సమ్మె బాటలో సహకార ఉద్యోగులు

భీమవరం డీసీసీబీ బ్రాంచ్ వద్ద నినాదాలు చేస్తూ...

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: సహకార ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని సహకార ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఐకాస సభ్యుడు నందమూరి సుబ్బారావు అన్నారు. డిమాండ్ల పరిష్కారం కోసం సహకార ఉద్యోగులు మరోమారు సమ్మెబాట పట్టారు. ఈ మేరకు బుధవారం భీమవరం డీసీసీబీ బ్రాంచ్ కార్యాలయం వద్ద సమ్మెల్లో పాల్గొన్నారు. డిసెంబరు మొదటి వారం నుంచి దశలవారీగా ఆందోళనలు నిర్వహించినా ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో సొసైటీ ఉద్యోగులమంతా సమ్మెకు దిగామని నాయకులు పేర్కొన్నారు. డిమాండ్లు పరిష్కారమయ్యే వరకూ నిరవధిక సమ్మెలో పాల్గొంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా సహకార ఉద్యోగులకు ఉద్యోగ విరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని, గ్రాట్యుటీ చెల్లింపులు, జీవో 36 ప్రకారం వేతనాల చెల్లింపులు, 2019 తరువాత నియామకాలు పొందిన వారిని క్రమబద్ధీకరించాలని కోరారు. సంఘం జిల్లా కన్వీనర్ నర్సింహరాజు, మేళం గోపి, సుంకర విజయకుమార్, శ్రీనివాసరాజు, రాట్నాల సుబ్బారాయుడు పాల్గొన్నారు.

★ వీరవాసరం డీసీసీబీ బ్రాంచ్ కార్యాలయం వద్ద సహకార ఉద్యోగులు బుధవారం సమ్మెలో పాల్గొన్నారు. లింగం శ్రీనివాసరావు, యాళ్లబండి శ్రీనివాసరావు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

23, 24 తేదీల్లో నిరవధిక దీక్షలు

వీరవాసరం, న్యూస్‌టుడే: రైతులు, కౌలు రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వ విధానాలనే రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తూ వారి నోట్లో మట్టి కొడుతోందని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు విమర్శించారు. ఏపీ రైతు, కౌలు రైతు సంఘాల జిల్లా సంయుక్త సమావేశాన్ని వీరవాసరం యూటీఎఫ్ కార్యాలయంలో కేతా గోపాలన్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. హరిబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించకపోవడంతో వారికి పీఎం కిసాన్ పథకాన్ని వర్తింపజేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కౌలు రైతుల ప్రస్తావన లేకపోవడం దారుణమన్నారు. రైతు, కౌలు రైతు సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆకుల హరేరాం, మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ మొంథా తుపాను కారణంగా జిల్లాలో నష్టపోయిన కౌలు రైతులకు పరిహారం ఇవ్వలేదన్నారు. కౌలు రైతులకు మొంథా తుపాను పరిహారం, అన్నదాత సుఖీభవ సాయం అందజేయాలంటూ ఈనెల 23, 24 తేదీల్లో కలెక్టరేట్ వద్ద నిరవధిక దీక్ష చేయనున్నట్లు తెలిపారు. సీపీఎం నాయకులు పుల్లారెడ్డి, శ్రీనివాసరావు, బాలం విజయ్‌కుమార్, పి.కామేశ్వరరావు, కె.సత్యనారాయణ, సుబ్బరాజు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213 చికెన్ స్కిన్‌లెస్ - 243.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 244 చికెన్ స్కిన్‌లెస్ - 254.

92.7 FM Rajamahendravaram

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

పీజీసెట్ ఉచిత సహాయ కేంద్రం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఐసెట్-2026, పీజీ సెట్‌కు ఉచిత సహాయ కేంద్రాన్ని భీమవరం డీఎన్నార్ కళాశాలలో ఏర్పాటు చేశామని కళాశాల అధ్యక్షుడు జీవీ నరసింహరాజు తెలిపారు. పీజీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

ప్రశాంతంగా టీసీసీ పరీక్ష

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(టీసీసీ) పరీక్షలు భీమవరంలోని పీఎస్ఎం బాలికోన్నత పాఠశాలలో బుధవారం కొనసాగాయి. టైలరింగ్, ఎంబ్రాయిడరీ, చిత్రలేఖనం విభాగాల్లో జరిగిన పరీక్షలకు అభ్యర్థులు హాజరయ్యారు. కుట్టు మిషన్లను సంబంధిత అభ్యర్థులే తెచ్చుకోవాలి. దీంతో పాఠశాల ఆవరణ కుట్టు శిక్షణ కేంద్రాన్ని తలపించింది.

24న సైకిల్ స్లో పోటీలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: శాప్ లీగ్ పోటీల్లో భాగంగా ఈ నెల 24న సైకిల్ స్లో పోటీలు నిర్వహిస్తామని డీఎస్‌డీవో ఎన్.మోహన్‌దాస్ తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచినవారు క్రీడా యాప్‌లో తప్పకుండా నమోదు కావాలన్నారు.

★ 17న జరిగిన చదరంగం పోటీల్లో శశాంకవర్మ, యశ్వంత్ వర్మ, శశాంక్, జోగెందర్, ఎస్.అంజలి, ఎస్.కీర్తన, ఎన్.కుశ్వంత్ పూజిత, ఎ.పూజిత, కేఎస్‌వీఎస్ సాయి మణికంఠ, వీరమల్లు హేమంత్ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు డీఎస్‌డీవో బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

(పూర్వపు) శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)

రిజిస్టర్డ్ కార్యాలయం : డి.నెం. 14-ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.

జోనల్ ఆఫీస్ : డి.నెం. 22బి-13-8, 2వ అంతస్తు, వెంకటరామ పవర్‌ప్రెస్ రోడ్డు, సెంట్రల్ బ్యాంక్ ఎదురుగా, పవర్‌పేట, ఏలూరు - 534002

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

[illegible]

క్ర.సం.	ఋణగ్రహీత (లు) / సహ-ఋణగ్రహీత (లు) / హామీదారు (లు) పేరు	NPA తేది / ఋణ మొత్తం	డిమాండ్ నోటీసు తేది / బకాయి మొత్తం
1	1) మంచే వెంకట శేషారావ్ ప్రసాద్, తండ్రి: చక్రధరరావు, డి.నెం: 5-74, కొంతేరు, యలమంచిలి మండలం, పశ్చిమ గోదావరి జిల్లా-534260. 2) మంచే వెంకట నాగమణి, భర్త: వెంకట శేషారావ్ ప్రసాద్, డి.నెం: 5-74, కొంతేరు, యలమంచిలి మండలం, పశ్చిమ గోదావరి జిల్లా-534260. 3) మంచే చక్రధరరావు, తండ్రి: [illegible] డి.నెం: 5-74, కొంతేరు, యలమంచిలి మండలం, పశ్చిమ గోదావరి జిల్లా-534260. 4) [illegible] బల్లబ్బాయి, తండ్రి: వెంకన్న, డి.నెం: 7-13, ఉం.ఓ.ఓ.ఓ. ఆఫీస్ రోడ్, పలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా - 533251.	30-04-2021 / Rs. 15,00,000/-	20-11-2025 / డి. 20-11-2025 నాటికి మొత్తం రూ. 28,60,077/- [illegible]

ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం. PALKLTF1812280002

[illegible]

ప్రదేశం : పాలకొల్లు అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

అస్సెట్ రికవరీ మేనేజ్‌మెంట్ బ్రాంచ్, # 48-14-111, శ్రీ నిత్య కాంప్లెక్స్, విశాఖపట్నం - 530013. ఫోన్: 0891-2567546, Email id: iob2579@iob.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ - వేలం బహిరంగ ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6) & 9(1)లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

[illegible]

https://baanknet.com

రిజర్వు ధర: రూ.3,23,94,000/- ధరావత్తు ధర: రూ.32,39,400/- బిడ్ పెంపుదల మొత్తం: రూ.1,00,000/-

వేలం తేదీ మరియు సమయం: తేది.09-03-2026, ఉ. 10.30 గంల నుండి మ. 12.30 గంల

[illegible]

ధరావత్తు చెల్లించుటకు చివరి తేది.08-03-2026

ఆస్తిని తనిఖీ చేయుటకు తేది. 19.02.2026 నుండి 07.03.2026 వరకు

ఆన్‌లైన్ ద్వారా ధరావత్తుతో కూడిన బిడ్ దాఖలు చేయు తేది. 19.02.2026 నుండి

* చట్టబద్ధ బకాయిలు ఉన్నా బ్యాంక్ బకాయిలకు ప్రాధాన్యత ఉంటుంది.

[illegible] https://baanknet.com [illegible] www.iob.in [illegible] ARMB [illegible] Email id: iob2579@iob.in [illegible] M/s. Bank Asset Auction Network (BAANKNET) [illegible] email: support.BAANKNET@psballiance.com [illegible]

తేది : 12-02-2026, ప్రదేశం : విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

JOBS

ఏలూరులోని ఫైర్ స్టేషన్ దగ్గరలోని క్లినిక్‌లో పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్స్ కావలెను. శాలరీ 14,000+esi+epfo. సెల్: 98852 95999, 9581251999.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ:18-20K 96404 68899, 96402 58899

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం CLASSIFIEDS

FACULTY/ TEACHERS

Wanted faculty Urgently Required Maths Faculty for IPE & JEE Mains. Contact: 86390 45758.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎటి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.15 పైII

తణుకు ఆఫీసు: 08819-224254

భీమవరం

•భీమవరం •ఉండి

బడ్జెట్ ఆమోదం

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం 2026-27కు సంబంధించి బడ్జెట్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వైస్‌ఛైర్‌పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో 2025-26 సంవత్సరానికి సవరించిన బడ్జెట్‌లో రూ.1,60,24,908 ప్రారంభ నిల్వగా చూపించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.22,69,52,472 ఆదాయం, రూ.21,79,97,149 వ్యయం కాగా రూ.2,49,80,231 మిగులుగా సవరణ బడ్జెట్ తయారు చేశారు. 2026-27 సంవత్సరానికి రూ.30,79,23,100 ఆదాయం వస్తుందని, రూ.25,70,85,000 వ్యయం కావచ్చని అంచనాలు తయారు చేశారు. సమావేశంలో బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా కమిషనర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టే విధంగా బడ్జెట్ రూపొందించినట్లు చెప్పారు. మేనేజర్ వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామి సన్నిధిలో అన్నదానం

పాలకోడేరు, న్యూస్‌టుడే: మహాశివరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం మోగల్లు భద్రకాళీ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అన్నసమారాధన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పెదాయికోడు తవ్వకం పనుల పరిశీలన

ఉండి, న్యూస్‌టుడే: ఉండి మార్కెట్ ప్రాంతంలో ఆక్రమణల చెరలో చిక్కిన పెదాయికోడులో మట్టి, పూడికతీత పనులను డీసీ చైర్మన్ తోట పాపారావు, వైస్ చైర్మన్ కంతేటి సాయిలక్ష్మణరావు బుధవారం పరిశీలించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి తెల్లికోడు వరకు సుమారు 4 కిలోమీటర్ల పరిధిలో ఈ డ్రెయిన్‌లో మట్టి, ఇతర వ్యర్థాలు పూడిపోవడంతో వర్షాకాలంలో అధిక ప్రాంతాలు ముంపు బారిన పడుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు పూడికతీత పనులు చేపట్టినట్లు డీసీ ప్రతినిధులు తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: లోసరిలో కొత్తగా నిర్మిస్తున్న విద్యుత్తు ఉప కేంద్రానికి లైన్ల ఏర్పాటు పనులు చేపడుతున్నట్లు ఆ శాఖ ఈఈ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లోసరి, దెయ్యాలతిప్ప, నాగేంద్రపురం, తోకతిప్ప, బర్రివానిపేట, గరువుదిబ్బ గ్రామాలతోపాటు ఆక్వా చెరువులకు సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

భీమవరం పట్టణం: 80085 74471	గునుపూడి: 80085 74474
భీమవరం గ్రామీణం: 80085 74533	నరసాపురం: 80085 74475
పాలకోడేరు: 80085 74467	ఉండి: 80085 74526
ఆకివీడు: 80085 74525	కాళ్ల: 94401 04042

వీరవాసరం, న్యూస్‌టుడే: ? పంజావేమవరం పంట కాలువలో వ్యర్థాలు పేరుకుపోవడంతో తోకలపూడి, తోకలపూడిపాలెం గ్రామాలకు సాగునీరు అందడం లేదు. - నారాయణరావు

✔ వ్యర్థాలు తొలగింపజేస్తాం - ఉదయనారాయణ, జలవనరుల శాఖ ఏఈ, వీరవాసరం

పాలకోడేరు, న్యూస్‌టుడే: ? పాలకోడేరు ప్రభుత్వ ఆసుపత్రి వెనుక మంచినీటి చెరువు వీధిలో చెత్త పేరుకుపోయి దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. - ఎం.రామారావు, పాలకోడేరు

✔ చెత్త తొలగింపజేస్తాం - బి.గోపి, కార్యదర్శి, పాలకోడేరు

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: ? 13వ వార్డులో బేతనపేట, నల్లం వారి తోట, పరిసర ప్రాంతాల్లో దోమల బెడద ఎక్కువగా ఉంది. - కె.అప్పారావు, స్థానికుడు

? 14వ వార్డులో పలు వీధుల్లో, 24వ వార్డు దిగు అప్పారావుతోట పరిసర ప్రాంతాల్లో దోమల కారణంగా పలువురు అనారోగ్యాలతో బాధ పడుతున్నారు. - ఎ.నాగరాజు, స్థానికుడు

✔ దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం. - ఆర్.సోమశేఖర్, పురపాలక ప్రజారోగ్య అధికారి

ఆకివీడు, న్యూస్‌టుడే: ? ఆకివీడులోని సంతమార్కెట్ ప్రాంతంలో డ్రెయినేజీల్లో ఆటంకాలు ఉండటంతో మురుగు పారుదలకు అవరోధంగా ఉంది. - సత్యనారాయణ, స్థానికుడు

✔ డ్రెయినేజీల్లో ఆటంకాలను తొలగించి సమస్య పరిష్కరిస్తాం - సాకేత్‌బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఆకివీడు

రంధ్రాల తలుపులతో తిప్పలు
వేసవికైనా బాగు పడేనా

విస్సాకోడేరు(పాలకోడేరు), ఉండి, భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం పంట కాలువలు, స్లూయిస్‌ల నిర్వహణ గాలికి వదిలేయడంతో నేడు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటి సంఘాలను పూర్తిగా నిర్వీర్యం చేయడం, నిధులు విడుదల నిలిపివేయడంతో నేడు అధ్వాన పరిస్థితికి చేరాయి. ఉండి, భీమవరం నియోజకవర్గాల పరిధిలో శివారు ప్రాంతాలకు సాగునీటిని సరఫరా అయ్యే ఉపకాలువలపై నిర్మించిన స్లూయిస్‌లు దాదాపు శిథిలావస్థకు చేరాయి. ఫలితంగా రబీలో నీటి వృథా, ఖరీఫ్‌లో ముంపు సమస్యలను స్థానిక రైతులు ఎదుర్కొంటున్నారు. రానున్న వేసవిలోనైనా వీటిని మరమ్మతులు చేయిస్తే కొంత వరకైనా ఊరట లభిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిన్న స్లూయిస్‌ల మరమ్మతులకు ప్రతిపాదనలు చేసినట్లు జలవనరుల అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు.

➡ పాలకోడేరు మండలం వేండ్ర కెనాల్ నుంచి విస్సాకోడేరు సబ్‌కెనాల్ పై సుమారు 30 ఏళ్ల కిందట నిర్మించిన స్లూయిస్ ఇది. తలుపు తుప్పుపట్టి పూర్తిగా దెబ్బతింది. దీంతో వర్షాకాలంలో నీటి ప్రవాహానికి అడ్డు కోవడం సాధ్యం కావడం లేదు. ఫలితంగా పంట పొలాలు ముంపు బారిన పడుతున్నాయి.

పాలకోడేరు మండలం... మోగల్లు, మైప, విస్సాకోడేరు, గొరగనమూడి, శృంగవృక్షం, పెన్నాడ పంట కాలువ సబ్‌కాలువలకు సంబంధించిన పలు స్లూయిస్‌ల తలుపులు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. తలుపులు పూర్తిగా దెబ్బతిని భారీ రంధ్రాలు ఏర్పడ్డాయి. వేసవిలో ఎగువ భూములకు నీటి ఎద్దడి, వర్షాకాలంలో దిగువ పంట పొలాలు ముంపు బారిన పడుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వంతుల వారీ విధానంలో తలుపులను మూసినా, ఎత్తినా నీటి ప్రవాహంలో ఎటువంటి మార్పు ఉండటం లేదని పలువురు రైతులు వాపోతున్నారు.

ఉండిలో... పంట కాలువపై ఉండ గండి, మహదేవపట్నం, ఉండి, కలిసిపూడిలో స్లూయిస్‌లు బలహీనపడ్డాయి. నిర్వహణ లేకపోవడంతో చాలా చోట్ల తలుపులు పనిచేయడం లేదు. ఫలితంగా దిగువ ఆయకట్టు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

లోసరి-గుట్టపాడు పరిధిలో.. భీమవరం మండలం లోసరి-గుట్టపాడు ప్రధాన కాలువపై ఉన్న షట్టరు మరమ్మతులకు గురై చాలా కాలమైంది. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానిక రైతులు వాపోతున్నారు. దిగువ ఆయకట్టు పొలాలకు సాగునీటి సరఫరా పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

తెలుగు భాషను గౌరవించాలి

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: తెలుగు భాషను అందరూ గౌరవించాలని కరూర్ వైశ్య బ్యాంకు సహాయ మేనేజర్ లక్ష్మీప్రియ అన్నారు. బుధవారం బీవీరాజు పార్కులోని తెలుగు తల్లి విగ్రహం వద్ద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మాతృ భాషా దినోత్సవ ప్రోత్సాహ అవిష్కరించి ఆమె మాట్లాడారు. ప్రపంచ భాషల్లో తెలుగుకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. వేదిక రంగాసాయి మాట్లాడుతూ ఈనెల 21 వరకు మాతృభాషా దినోత్సవంపై పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి ముగింపు వేడుకలో బహుమతులు అందజేస్తామని తెలిపారు. తెలుగు భాషా సంఘ సభ్యులు గోపాలకృష్ణ, సత్యనారాయణరాజు, పీవీఎస్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు, నిర్వాహకుల ప్రదర్శన

బాలల హక్కులు కాపాడుదాం..

రాయకుదురు (వీరవాసరం), న్యూస్‌టుడే: బాల్య వివాహాలు నిర్మూలించి బాలల హక్కులను కాపాడుకుందామని ఐసీడీఎస్ సీడీపీవో టీకేవీ.లక్ష్మీకాంతం అన్నారు. బుధవారం రాయకుదురు జడ్పీ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై తల్లిదండ్రులు, బాలికలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల కారణంగా బాలికల ఆరోగ్యం ప్రమాదంలో పడుతుందని, చట్టపరంగా నేరమన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం తల్లిదండ్రులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రధానోపాధ్యాయుడు కానుకొలను శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజిని, డీసీపీవో యూనిట్ అధికారి నెహెమ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు, విద్యార్థుల ప్రతిజ్ఞ

డ్రెయిన్‌లో పూడిక తొలగింపు

స్పందనకు వందనం

ఉండి, న్యూస్‌టుడే: ఉండి రాజులపేట నుంచి రైల్వే స్టేషన్ ప్రాంతంలో మురుగునీటి పారుదల వ్యవస్థ మెరుగుపరిచే పనులు బుధవారం చేపట్టారు. 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షిక 'ఈనాడు'లో బుధవారం ప్రచురితమైన వార్తకు పంచాయతీ అభివృద్ధి అధికారి అనిల్‌కుమార్ స్పందించి డ్రెయిన్‌లో పూడిపోయిన మట్టిని కూలీలతో తొలగించారు.

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా.. వీరవాసరం, న్యూస్‌టుడే: వడ్డిగూడెం రహదారిలోని హోటళ్లు, దుకాణాల వద్ద వాహనాలు నిలిపి ఉంచడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందంటూ 'ఈనాడు'లో 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికలో ప్రచురితమైన వార్తకు ఎస్సై ఎం.రాణికుమార్ స్పందించి వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకున్నారు.

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: కొవ్వాడ పంచాయతీ పుంతరోడ్డులో డ్రెయినేజీ అధ్వానంగా ఉందంటూ ఫిబ్రవరి 8న 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు స్పందించి పంచాయతీ కార్యదర్శి శ్యాం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ✦ గొల్లవానితిప్పలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందంటూ ఫిబ్రవరి 12న ప్రచురితమైన వార్తకు పంచాయతీ విస్తరణాధికారి రామాంజనేయప్రసాద్ స్పందించి సిబ్బందితో పలు చోట్ల చెత్తను తొలగింపజేశారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు : మంతెన

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: ఉండి మండలం తెదేపా నాయకుడు పోత్తూరి వెంకటేశ్వరరాజు పార్టీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు అన్నారు. భీమవరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆయన వ్యవహరించడం దారుణమన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎమ్మెల్యేలను, పార్టీ నాయకులను అగౌరవపరుస్తూ పత్రికలు, మీడియా, సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న అసత్య ప్రచారాలను ఖండిస్తున్నట్లు చెప్పారు. తెదేపా క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, గ్రామం నుంచి రాష్ట్రస్థాయి వరకు ఎవరైనా దారితప్పకూడదన్నారు. తక్షణం ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకుంటే పార్టీ అధిష్ఠానం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

మాట్లాడుతున్న మంతెన రామరాజు

కాళ్లకూరు(కాళ్ల), న్యూస్‌టుడే: రఘురామకృష్ణరాజుపై అనుచిత వ్యాఖ్యలు సరికాదని దాట్ల శ్రీదేవి ట్రస్ట్ ఛైర్మన్ వెంకటరామరాజు అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రహదారుల విస్తరణ, గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీటికి మైక్రో ఫిల్టర్ ప్లాంట్లు స్వార్థం కోసం చేసినవి కాదని తెలుసుకుని అభివృద్ధికి ఆటంకం కలిగించొద్దని కోరారు.

ఉండి, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో తన మార్కు అభివృద్ధి పనులు చేయిస్తున్న ఉపసభాపతి రఘురామకృష్ణరాజుపై అసత్య వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఏఎంసీ వైస్ ఛైర్మన్ కలిదిండి శ్రీనివాస రాజు తీవ్రంగా ఖండించారు. ఏఎంసీలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కన్నతల్లి లాంటి పార్టీకి ద్రోహం చేసే చర్యలు విడనాడాలని హితవు పలికారు. ఏఎంసీ వైస్ ఛైర్మన్ ఉయ్యూరి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ఉండిలో కూటమిలో ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాలు విరమించుకోవాలన్నారు.

ఆకివీడు, న్యూస్‌టుడే: రఘురామకృష్ణరాజుపై వెంకటేశ్వరరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని కూటమి నాయకులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక తెదేపా కార్యాలయంలో తెదేపా, జనసేన నాయకులు మోటుపల్లి రామవరప్రసాద్, కోపల్లి సాయిబాబు, అల్లాడి బాలాజీ, గంధం ఉమా తదితర నాయకులు మాట్లాడారు.

న్యాయవాదుల సంక్షేమానికి నిధులు కేటాయించాలి

తణుకు, న్యూస్‌టుడే: న్యాయవాదుల సంక్షేమానికి రూ.200కోట్లు బడ్జెట్లో కేటాయించాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి డిమాండ్ చేశారు. న్యాయవాదులకు బడ్జెట్‌లో నిధుల కేటాయించాలంటూ బుధవారం స్థానిక బార్ అసోసియేషన్ వద్ద ఐలు ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించి మాట్లాడారు. మూడు సంవత్సరాల లోపు ఉన్న జూనియర్ న్యాయవాదులకు న్యాయమిత్ర ద్వారా రూ.10వేలు ఇవ్వాలన్నారు. అర్హత కలిగిన న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు కేటాయించి, నిర్మాణానికి నిధులు కేటాయించాలన్నారు.

ఐఎంఏ స్టాండింగ్ కమిటీకి ఎంపిక

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పట్టణానికి చెందిన గైనకాలజిస్టు మాదిరెడ్డి స్వరాజ్యలక్ష్మి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర స్టాండింగ్ కమిటీకి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమెను ఐఎంఏ ప్రతినిధులు పలువురు అభినందించారు. భీమవరం ఐఎంఏ కార్యదర్శిగా గతంలో పనిచేసిన ఆమె ఉత్తమ మహిళా కార్యదర్శిగా రాష్ట్ర ఐఎంఏ నుంచి పురస్కారం అందుకున్నారు.

స్వరాజ్యలక్ష్మి

వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేయాలి

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: తెలంగాణ ఇస్తున్నట్లు మన రాష్ట్రంలోనూ గ్రామ రెవెన్యూ సహాయకులకు పేస్కేల్ అమలు చేయాలని సీఐటీయూ నాయకుడు, వీఆర్‌ఏల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ఆంజనేయులు కోరారు. ఈ మేరకు ఆ సంఘం ప్రతినిధులు బుధవారం కలెక్టర్ నాగరాణికి వినతిపత్రం అందజేశారు. కనీస వేతనం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీఆర్‌ఏల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆంజనేయులు తదితరులు

పని భారం తగ్గించండి

ఉండి, న్యూస్‌టుడే: పనిభారాన్ని తక్షణమే తగ్గించాలని వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడు ఎస్.చిన్నారావు ప్రభుత్వాన్ని కోరారు. ఉండి మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట బుధవారం మధ్యాహ్నం నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణరాజుకు అందజేశారు.

ప్రక్షాళనకు నోచుకోని మంచినీటి చెరువులు

ఉండి, న్యూస్‌టుడే: నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన ఉండి గ్రామంలోని రెండు ప్రధాన మంచినీటి చెరువు గట్లపై పిచ్చిమొక్కలు, పచ్చగడ్డి ఇతర వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. చెరువు అంచుల్లోనూ తూడు అక్కడక్కడా కన్పిస్తోంది. కృష్ణమ్మ, మహంకాళమ్మ మంచినీటి చెరువుల వద్ద చెత్త ప్రక్షాళన చర్యలు అధికారులు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తిచేస్తున్నారు. ఈఅంశంపై ఉండి గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి అనిల్‌కుమార్ స్పందిస్తూ పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

షట్టర్లకు తుప్పు.. పొంచి ఉన్న ముప్పు..?

కాళ్ల మండలం ఎల్ఎన్‌పురం వద్ద బొండాడ పంటకాలువపై ఉన్న షట్టర్లు తుప్పుపట్టి పాడైపోయాయి. దీంతో నీటి ప్రవాహానికి అడ్డులేకుండా పోయింది. ఉప సభాపతి రఘురామకృష్ణరాజు ఇటీవలే కాలువ ప్రక్షాళన పనులు చేయించే పనులు చేపట్టారు. అయినా ఉపయోగం ఏముందని రైతులు, గ్రామస్థులు వాపోతున్నారు. రానున్న వేసవిలో నీటి సమస్య తలెత్తకముందే తక్షణమే నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. షట్టర్ల ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపినట్లు ఏఈ ఫణిశంకర్ తెలిపారు.

- న్యూస్‌టుడే, ఎల్ఎన్‌పురం(కాళ్ల)

అక్విడక్ట్ నడకమార్గం.. ప్రమాదకరం

ఉండి అక్విడక్ట్ రెయిలింగ్స్ కొన్నిచోట్ల ఊడిపోయాయి. బొండాడ డ్రెయిన్ వైపు ఉన్న నడకమార్గం కొంతమేర దెబ్బతింది. డ్రెయిన్‌లో అల్లుకుపోయిన తూడు, గుర్రపుడెక్క తొలగింపు సమయాల్లో భారీ యంత్రాల వినియోగంతో అక్విడక్ట్ బలహీనంగా తయారవుతోందని రైతులు వాపోతున్నారు. అధికారులు తక్షణం స్పందించి అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. దీని మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపామని మురుగునీటి శాఖ అధికారులు తెలిపారు. - న్యూస్‌టుడే, ఉండి

ఆదమరిస్తే అంతే సంగతులు

కాళ్ల సినిమాహాల్ కూడలిలో జాతీయ రహదారి పక్కన మ్యాన్ హోల్ ప్రమాదకరంగా మారింది. ఇతర జిల్లాల నుంచి ఈ మార్గం ద్వారానే భీమవరం పట్టణానికి చేరుకోవాలి. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదానికి గురికావాల్సిందే. సంబంధిత అధికారులు స్పందించి దీన్ని సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కాళ్ల

స్ఫూర్తిప్రదాత ఛత్రపతి శివాజీ

నరసాపురం పట్టణం, గ్రామీణ, న్యూస్‌టుడే: పోరాట పటిమలో, దేశభక్తిలో ఛత్రపతి శివాజీ స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ సభ్యులు పేర్కొన్నారు. శివాజీ జయంతి సందర్భంగా నరసాపురం మండలం, పట్టణ పరిధిలో బుధవారం శోభా యాత్ర నిర్వహించారు. నరసాపురం మండలం స్వర్ణాంధ్ర కళాశాల నుంచి ప్రారంభమైన యాత్ర పట్టణంలో చర్చి రోడ్డు, పంజా కూడలి, స్టీమర్ రోడ్డు మీదుగా కొనసాగింది. కళాశాలల విద్యార్థులు దేశభక్తి నినాదాలు చేశారు.

శోభాయాత్రలో పాల్గొన్న వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ సభ్యులు

IN THE COURT OF THE HON'BLE II ADDL JUNIOR CIVIL JUDGE, MEDCHAL, MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT MEDCHAL

O.S.No. 117 of 2020

BETWEEN:
Korparthi Bala Krishna, ...Plaintiff
AND
Smt Vankayalapati Geeta and others ...Defendants

NOTICE

To
1. Indukuri Vijaya Lakshmi, W/o I.V. Subba Raju, Aged about 78 years, Occ: Housewife, R/o Kopalle Village, Kalle Mandal, West Godavari District-534237
2. Indukuri Nirmala Devi, W/o Rajender Mohan, Aged about 58 years, Occ: Employee, R/o Kopalle Village, Kalle Mandal, West Godavari District-534237

...Defendant No. 3 & 4

Please take notice that the above-named Plaintiff has filed a suit for perpetual injunction against the Defendants. The said suit is posted for hearing on 31-03-2026 at 10:30 AM for your appearance and any answers, if any.

Therefore, I hereby request you to appear in the above-mentioned suit proceedings in O.S. No. 117 of 2020, either in person or through an advocate, on 31-03-2026 at 10:30 AM, before the Hon'ble Court. In case of failure to appear, the matter will be decided in your absence as per the law.

// BY ORDER OF HON'BLE COURT //

Sd/- PUSHADAPU SUBBA RAO ADVOCATE, R/o.H.No.5-270/02, CHANDRA NAGAR, CHINTAL, HYDERABAD-500 054
PH: 9440346561
Counsel to the plaintiff

స్థానిక నాయకులతో నాగరాజు

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: గ్రంథాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఉమ్మడి జిల్లా గ్రంథాలయాల సంస్థ ఛైర్మన్ జుత్తిగ నాగరాజు అన్నారు. బుధవారం బీవీరాజు పార్కు సమీపాన ఉన్న వైఎస్ఆర్ ప్రథమ శ్రేణి గ్రంథాలయాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. భవనంలో మౌలిక సదుపాయాలు పరిశీలించి పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలు, వివిధ రకాల పుస్తకాలకు సంబంధించి దస్త్రాలను ఆయన పరిశీలించారు. దాతల సహకారంతో గ్రంథాలయాలకు కావాల్సిన సామగ్రి, పుస్తకాలు పొందేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు మాగాపు ప్రసాద్, వానపల్లి సూర్యప్రకాశరావు, పలువురు జనసేన ప్రతినిధులు పాల్గొన్నారు.

వీరవాసరం, న్యూస్‌టుడే: జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ జుత్తుగ నాగరాజు బుధవారం వీరవాసరం శాఖ గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు కూటమి నాయకులు స్వాగతం పలికి సత్కరించారు. ఆయన వెంట గ్రంథ పాలకుడు బత్తుల హనుమంతరావు, సొసైటీ ఛైర్మన్ వీరవల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు గుల్లిపల్లి విజయలక్ష్మి, యాళ్లబండి ఇందిర, మండల భాజపా అధ్యక్షుడు వేండ్ర దివాకర్, దేవస్థానం ఛైర్మన్ మద్దాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పాలకోడేరు, న్యూస్‌టుడే: విస్సాకోడేరు జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి గాయపడ్డారు. స్కూటీపై వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా రోడ్డుపై పడిపోవడంతో స్పృహ తప్పినట్లు స్థానికులు తెలిపారు. భీమవరం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ఈ ప్రమాదంపై ఎటువంటి సమాచారం రాలేదని పోలీసులు తెలిపారు.

మురుగు కోడు.. పట్టదు గోడు

ప్రక్షాళన చేపడతారా..?

గొల్లలకోడేరు(పాలకోడేరు), న్యూస్‌టుడే: వర్షాకాలం వచ్చిందంటే మురుగు కోడు గొల్లలకోడేరు గ్రామానికి దుఃఖదాయినిగా మారుతోంది. ఒకటో వార్డు నుంచి విష్ణు ఇంజినీరింగ్ కళాశాల వరకు విస్తరించిన మురుగు కోడు ఆక్రమణలతో బక్కచిక్కిపోయింది. మరో పక్క నిర్వహణ లేకపోవడంతో గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలు పెరిగిపోయి చిట్టడవిని తలపిస్తోంది. ఫలితంగా వర్షాకాలంలో ఎగువ నుంచి వచ్చే నీరు, మురుగు ఏకమై స్థానికంగా పల్లంగా ఉన్న ప్రాంతాలను ముంచెత్తుతోంది. ముఖ్యంగా ఒకటో వార్డులోని పలు వీధులు ముంపు బారిన పడుతున్నాయి. రోజుల తరబడి నీరు నిలిచిపోవడంతో తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈ వార్డు పరిధిలో పలుచోట్ల డ్రెయినేజీని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం, మరికొన్నిచోట్ల పూర్తిగా పూడ్చివేయడంతో ముంపు సమస్య మరింత తీవ్రరూపం దాలుస్తోంది. ఆక్రమణలు తొలగించి డ్రెయినేజీని ప్రక్షాళన చేయాలని దశాబ్దం నుంచి గ్రామస్థులు కోరుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు.

గుర్రపుడెక్క, గడ్డి పెరిగిపోయి అధ్వానంగా తయారైందిలా..

తీర్మానాలు చేసినా.. గత ఏడాదిలో సుమారు రూ.5 లక్షలతో ప్రక్షాళన చేపట్టాలని పంచాయతీలో తీర్మానం చేసినా పనులు మాత్రం పట్టాలెక్క లేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం కూటమి నాయకుల ఆధ్వర్యంలో పలు చోట్ల కొంత మేరకు ఆక్రమణలు తొలగించి పూడిక తీత పనులు చేయగలిగారు. కానీ ఇటీవల పరిస్థితి మళ్లీ యథాస్థితికి చేరింది. వచ్చే వేసవిలోనైనా ప్రక్షాళన పనులు చేపడితే వర్షాకాలంలో ముంపు ముప్పు తప్పుతుందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ మురుగుకోడు ప్రక్షాళనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

150 మందికి వైద్య పరీక్షలు

పాలకోడేరు, న్యూస్‌టుడే: పెన్నాడ బైట్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో బుధవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడ ఆంధ్ర ఆసుపత్రికి చెందిన వైద్యులు, సిబ్బంది సేవలు అందించారు. సుమారు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.సురేశ్ తెలిపారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త మనోహర్, డీన్ కురెళ్ల భాస్కరరావు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే సత్ఫలితాలు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదివితే సత్ఫలితాలు సాధించవచ్చని ఆర్డీవో దాసి రాజు అన్నారు. తూర్పుతాళ్లు జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసించి మంచి ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాలలో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు.

దుంపగడప: ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న సాయిశ్రీనివాస్

చలో విజయవాడ విజయవంతానికి పిలుపు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఫ్యాప్టో ఛైర్మన్ లంకలపల్లి సాయిశ్రీనివాస్ కోరారు. బుధవారం ఆయన ఆకివీడు, దుంపగడప, పెదకాపవరం, సిద్ధాపురం, చెరుకుమిల్లి, అయిభీమవరం గ్రామాల్లోని ఉన్నత పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. 12వ పీఆర్సీని నియమించాలని తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 25న నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయులను కోరారు.

వెంటాడుతున్న అవరోధాలు
ఆకివీడులో నత్తనడకన సర్వే

ఆకివీడు, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో నిర్వహించిన హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో తప్పిదాలతో ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి పొందేందుకు అర్హత ఉన్నా అనేక మంది అనర్హులుగా మిగిలిపోయారు. అర్హులకు అన్యాయం జరగకూడదనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వ 'ఏకీకృత కుటుంబ సర్వే'ను ప్రక్రియ పూర్తిచేయాలని మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ సర్వే ద్వారా కుటుంబంలో ఎవరు ఏ పథకానికి అర్హులో తెలుస్తుంది. జిల్లాలో గత ఏడాది డిసెంబర్‌లో ప్రారంభమైన ఈ సర్వే నత్తనడకగా సాగడంతో పలు సార్లు గడువు పెంచారు. ఈ నెల 28వ తేదీ నాటిని నూరుశాతం పూర్తిచేయాలని లక్ష్యం విధించారు. అయితే జిల్లా అంతటా సర్వే ప్రక్రియగా కొంచెం పురోగతి కనిపిస్తున్నా ఆకివీడులో మాత్రం నత్తకు పోటీపడుతున్నట్లు కొనసాగుతోంది.

అతి తక్కువగా.. ఆకివీడు నగర పంచాయతీ పరిధిలో మొత్తం 10,483 కుటుంబాల వివరాలు నమోదు చేయాల్సి ఉంది. ఇంతవరకూ కేవలం 958 కుటుంబాల వివరాలు నమోదు చేశారు. ఆకివీడు మండలం పరిధిలో 14,272కి 4,278 కుటుంబాల వివరాలు నమోదు చేశారు. ఉండి మండలం పరిధిలో 23,168కి 9,480 కుటుంబాల వివరాలు నమోదు చేశారు. గ్రామ వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఒక్కో ఉద్యోగి 200 నుంచి 250 కుటుంబాలను సర్వే చేయాల్సి ఉంది. వ్యక్తుల పేర్లు, ఆధార్, ఫోన్ నెంబర్లు, విద్యార్హతలు, స్థానికంగా ఎన్నేళ్లుగా నివసిస్తున్నారు. వంటి వివరాలు యాప్‌లో నమోదు చేయాలి. సాంకేతిక, సర్వర్ సమస్యతో పాటు పలు చోట్ల సిబ్బంది కొరతతో నమోదులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

సిబ్బంది కొరతతో ఇబ్బంది.. ఆకివీడులో సిబ్బంది కొరతతో సర్వే ప్రక్రియ చాలా నెమ్మదిగా ఉంది. 'అదనపు సిబ్బందిని నియమించి వేగవంతం చేస్తాం. సాంకేతిక తదితర ఇబ్బందులను అధిగమిస్తూ అనుకున్న వ్యవధిలోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం' అని గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా అధికారి వై.దోసిరెడ్డి తెలిపారు.

ఖండన ప్రకటన

నా క్లయింట్ భీమవరం గ్రామ కాపురస్తులు లేటు రాచమడుగు వెంకట సుధాకర్ భార్య రాచమడుగు లక్ష్మి గారు నాకు ఇచ్చిన సంజాయిషీని బట్టి మీ అందరికీ తెలియజేయునది ఏమనగా....

ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థి నా క్లయింట్ భర్త అయిన రాచమడుగు వెంకట సుధాకర్ 2002వ సం॥రము లో క్రయం ద్వారా సంపాదించినారు. నా క్లయింట్ భర్త అనారోగ్యం ఆసరాగా తీసుకొని నా క్లయింట్ మరిది అయిన రాచమడుగు వెంకటేశ్వరరావు దురుద్దేశ్యంతో ఈ దిగువ షెడ్యూల్ ఆస్థిని కాజేయాలని, ఎవరికీ తెలియకుండా ది.05-06-2012 సం॥ తేదీన నా క్లయింట్ మరిది పిల్లలు పేరున దాన సెటిల్‌మెంట్ దస్తావేజు సృష్టించి వ్రాయించుకున్నారు.

నా క్లయింట్ భర్త ఆరోగ్యం కుదుటపడిన దరిమిలా ఈ విషయం తెలిసి పెద్దమనుషులలో పెట్టినారు. అంతట పెద్ద మనుషులు నా క్లయింట్ మరిదిని మందలించగా నా క్లయింట్ మరిది తప్పు ఒప్పుకుని పెద్ద మనుషుల సమక్షములో ది.05-06-2012 సం॥ తేదీన నా క్లయింట్ మరిది పిల్లలు పేరున వ్రాయించిన దాన సెటిల్‌మెంట్ దస్తావేజును ది.04-08-2014న రద్దు పరచినారు. దరిమిలా నా క్లయింట్ భర్త ఈ దిగువ షెడ్యూల్ ఆస్థిని 2016 సం॥రము లో శ్రీ కనక మహాలక్ష్మి బ్యాంక్ నందు కుదువ పెట్టి అప్పు తీసుకొనియున్నారు. తరువాత నా క్లయింట్ భర్త ది.12-09-2021 వ సం॥రము లో మరణించారు. అప్పటి నుండి ఈ దిగువ షెడ్యూలు ఆస్థిలో నా క్లయింట్ ఉంటూ సర్కార్ వారికి పన్నులు చెల్లించుకుంటూ నివసించుచున్నారు. ఈ దిగువ షెడ్యూల్ ఆస్థికి ఆయన భార్యగా నా క్లయింట్‌కు సర్వ హక్కులు ఉన్నాయని, నా క్లయింట్ హక్కులకు ఏ విధంగానైనా, ఎవరూ భంగపరచలేరని, మీ అందరికీ మరియు యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమైనది.

షెడ్యూలు:

పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మండలం, గునుపూడి సబ్ డివిజన్‌లో చేరిన భీమవరం మున్సిపల్ ఏరియాలోని భీమవరం గ్రామం తాలూకు పాత 13వ వార్డు కొత్త 3వ వార్డు, డోర్ నెం.16-2-92రు గల ఆర్.సి.సి. డాబాను జిరాయితీ మెరక గ్రౌండ్‌రెంట్‌గా మారిన ఆర్.ఎస్.నెం.385/22రు లో య.0.06 సెంట్లులో చ॥గ॥ 49 లు స్థలమునకు హద్దులు:

తూర్పు: కొండవీటి వెంకటలక్ష్మి గారి కొట్టు గోడ మరియు ఉమ్మడి మార్గం 39-11 అం॥ దక్షిణం: పి.పి. రోడ్ 11.2 అం॥ పడమర: మోటుమర్రి వెంకట్రావు గారి గోడ మరియు ఉమ్మడి మార్గం 30-11 అం॥ ఉత్తరం: ఈ ఆస్థి వగైరాలలోని ఉమ్మడి సందు మార్గం 11.2 అం॥.

ఈ హద్దుల మధ్య చ॥గ॥ 49 లేక చ॥మీ॥ 40.5 ర్లు స్థలమున్ను యిందలి మున్సిపల్ అసెస్‌మెంట్ నెం.1074002741 మరియు డోర్ నెం.16-2-92 గల ఆర్.సి.సి. డాబాన్ను.

భీమవరం
ది.18-02-2026

కావూరి అజయ్‌ఘోష్, అడ్వకేట్,
భీమవరం, సెల్: 98483 76387

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

స్వర్ణ ధనుస్సుకు పూజలు

పోడూరు, న్యూస్‌టుడే: అయోధ్యలో సరయూ నదీ తీరాన నిర్మించే ఆలయంలో శ్రీరామ చంద్రమూర్తికి అలంకరించే స్వర్ణ ధనుస్సు పాదుకలను భక్తుల దర్శనార్థం పోడూరులో శ్రీమహాలక్ష్మీశ్వర, రాజేశ్వర, కేశవస్వామి ఆలయంలో బుధవారం ఉంచారు. దేశంలోని 52 శక్తి పీఠాల్లో వీటిని ఉంచి పూజలు నిర్వహించినట్లు ఆలయంలోని రామాలయం అర్చకస్వామి శ్రీనివాస శర్మ తెలిపారు.

ముగిసిన ప్రభ సంబరం

వాసవీ పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: సిద్ధాంతంలోని సాలిపేటలో కొలువైన భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి శివరాత్రి ప్రభ సంబరం ముగింపు సందర్భంగా ఆలయం వద్ద బుధవారం సాయంత్రం అన్నసమారాధన నిర్వహించారు. ఉదయం నుంచి స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా ప్రతిష్ఠాపనోత్సవాలు

గరగలు తీసుకెళ్తున్న భక్తులు

యలమంచిలి, న్యూస్‌టుడే: యలమంచిలి గ్రామ దేవత మాలక్ష్మేశ్వరదేవి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద పండితులు యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజలు చేశారు. స్థానిక కనకదుర్గమ్మ ఆలయంలో ఉంచిన నూతన గరగలను భక్తులు వేదిక వద్దకు మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చారు. సాయంత్రం అగ్ని ప్రతిష్ఠాపన చేసి మూల మంత్ర హోమం నిర్వహించారు. నిర్వహణ కమిటీ సభ్యులు తాళ్లూరి శ్రీనివాస్ బుజ్జి, బొల్లింపల్లి ఏసు, బొప్పన శివ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా పుష్పయాగోత్సవం

వాసవీ పెనుగొండ, న్యూస్‌టుడే: మహాశివ రాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక నగరేశ్వర, మహిషాసురమర్దని, వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో బుధవారం రాత్రి శ్రీపుష్పయాగోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

రాజగోపాల స్వామికి అభిషేకాలు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలోని దక్షిణ సత్యవారం స్వామి రాజగోపాలస్వామి ఆలయంలో బుధవారం పంచామృతాభిషేకాలు, తోమాల సేవ, సహస్ర నామార్చనలు చేశారు. అష్ట బుధవార దీక్ష చేపట్టిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి అటుకులు, బెల్లం, తులసి మాల సమర్పించారు.

కోవెల.. వస్తుందా పుష్కర కళ!

ఆచంట, న్యూస్‌టుడే: వశిష్ట గోదావరి తీరం వెంబడి ఉన్న పలు గ్రామాల్లో దశాబ్దాల కిందట నిర్మించిన ఆలయాలు జీర్ణావస్థకు చేరాయి. కొన్ని పైకి బాగానే కనిపిస్తున్నా.. వర్షం పడితే నీరు గర్భగుడిలోకి ప్రవేశిస్తోంది. పైకప్పులు దెబ్బతిని తరచూ పెచ్చులూడి పడుతున్నాయి. సిద్ధాంతం నుంచి నరసాపురం వరకు నదికి 5 కిలోమీటర్ల దూరంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధీనంలో 50 వరకు ఆలయాలు ఉన్నాయి. వీటితో పాటు భక్తుల ఆధ్వర్యంలో నిర్మించిన వందలాది ఆలయాలు నిర్వహణ లేక వెలవెలబోతున్నాయి.

నిధుల మంజూరుపై త్వరలో స్పష్టత

ఆచంట మండలం పెదమల్లం గ్రామంలో పేటగట్టు, పుష్కరాల రేవుకు సమీపాన ఉన్న పల్లాలమ్మ, కొట్టమ్మ, మారెమ్మ, పోతురాజు ఆలయం ఇది. 150 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ఆలయం శిథిలావస్థకు చేరింది. వర్షాకాలంలో గర్భాలయంలోకి నీరు చేరుతోంది.

తొలి దశలో రెండింటికే అవకాశం

గోదావరి ఏటిగట్టు వెంబడి పుష్కర రేవుల సమీపాన 15 వరకు ఆలయాలు ఉన్నాయి. వీటితో పాటు 81 ఆలయాల అభివృద్ధికి ఇక్కడ కరారు ప్రతిపాదనలు పంపారు. సిద్ధాంతం, నడిపూడి ఆలయాల వద్ద చేపట్టే పనులకు మాత్రమే తొలి దశలో టెండర్లు పిలిచారు. మిగిలిన ఆలయాలకు పుష్కర నిధుల కేటాయింపుపై త్వరలో రాజమహేంద్రవరంలో జరిగే సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటారని అధికారులు చెబుతున్నారు.

ప్రత్యేక నిధులు కేటాయిస్తేనే..

ఆచంటలో ముత్యాలమ్మ ఆలయంతో పాటు, పలు గ్రామాల్లో మరికొన్ని ఆలయాల అభివృద్ధికి భక్తులు విరాళాలు సేకరించి ప్రభుత్వం నుంచి మ్యాచింగ్ గ్రాంటు కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తే గానీ ఆలయాల్లో అభివృద్ధి పనులు చేపట్టడం సాధ్యం కాదు. దీనిపై దేవాదాయశాఖ జిల్లా అధికారి హరి సూర్యప్రకాశ్‌ను సంప్రదించగా ఈనెలాఖరు నాటికి తమ శాఖ ద్వారా చేపట్టే పుష్కర పనులపై స్పష్టత వస్తుందని చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసాపురం : 80085 74504	ఆచంట: 90631 44737
పాలకొల్లు : 80085 74510	వాసవీ పెనుగొండ: 80085 74469
పోడూరు : 90631 44741	పెనుమంట్ర: 91212 29087

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? గుడా వారి వీధిలో మురుగు నిలిచిపోతోంది. - శేషారావు, నరసాపురం

✔ డ్రెయిన్లను శుభ్రం చేయిస్తాం. - పాత్రుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

మొగల్తూరు, న్యూస్‌టుడే: ? అంగజాలపాలెంలో విద్యుత్తు స్తంభానికి పొదలు అల్లుకున్నాయి. దీంతో తరచూ సరఫరా నిలిచిపోతోంది. - రాంబాబు, పేరుపాలెంనార్తు

✔ పొదలు తొలగింపు పనులు చేయిస్తాం. - ప్రసాదరావు, ఏఈ

నరసాపురం, న్యూస్‌టుడే: ? సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సమీపాన తాగునీటి పైపులైను దెబ్బతిని శుద్ధి జలాలు వృథాగా పోతున్నాయి. - బాబూరావు, నరసాపురం

✔ మరమ్మతులు చేయిస్తాం. - ఆర్.గంగావరప్రసాద్, పురపాలక డీఈ

డ్రెయిన్లో వ్యర్థాల తొలగింపు.. వాసవీ పెనుగొండ, న్యూస్‌టుడే: సామాజిక ఆరోగ్య కేంద్రం సమీపాన మురుగు కాలువపై ఈ నెల 8న 'ఈనాడు మేమున్నాం..మీకు తోడుగా'లో ప్రచురితమైన వార్తకు సర్పంచి శ్యామలాసోని, పంచాయతీ కార్యదర్శి టి.కృష్ణమూర్తి స్పందించారు. ఆ ప్రాంతంలో డ్రెయిన్లో పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు పనులు బుధవారం చేయించారు.

స్తంభాలు, తీగలు సరిజేత

ఈనాడు స్పందన

పోడూరు, న్యూస్‌టుడే: జగన్నాథపురంలో రామేశ్వరస్వామి ఆలయ సమీపాన కాలువ గట్టు మార్గం వెంబడి విద్యుత్తు స్తంభాలు ప్రమాదకరంగా ఉన్న తీరుపై 'స్తంభాలు ఒరిగి.. తీగలు సాగి' శీర్షికతో సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఆ శాఖ ఏఈ సత్యనారాయణ స్పందించారు. ఆ ప్రాంతాన్ని బుధవారం పరిశీలించి స్తంభాలు, తీగలను సరిజేశారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

నరసాపురం, న్యూస్‌టుడే: ఫీడర్ల అనుసంధానం నిమిత్తం నరసాపురం పట్టణంలో పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ కె.మధుకుమార్ తెలిపారు. మొగల్తూరు రోడ్డు, ట్యాక్సీస్టాండు, బస్టాండు, జె సికిలె స్కూలు ఏరియా, దేవులతిప్ప, సబ్ కలెక్టర్ బంగ్లా ఏరియా, పురపాలక కార్యాలయం రోడ్డు, క్రిస్టియన్‌పేట ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

20న సుమతీ శతక పద్యాల పోటీ

పాలకొల్లు సాంస్కృతికం, న్యూస్‌టుడే: పాలకొల్లులోని రసధుని సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 20న ఎంఎంకేఏన్ పాఠశాలలో సుమతీ శతక పద్యాల రాత పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సభ్యుడు యర్రంశెట్టి వెంకటరత్నం బుధవారం తెలిపారు. పట్టణ స్థాయిలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు.

పశు పోషణతో ఆర్థిక భరోసా

రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పశు సంపద వృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. పాలకొల్లు మండలం అగర్తిపాలెం సొసైటీ వద్ద పశు వైద్య శిబిరాన్ని ఆమె బుధవారం ప్రారంభించారు. తొలుత ఆమె గోమాతకు పూజలు చేసి నమస్కరించారు. అనంతరం మాట్లాడుతూ పాడి పశువుల పోషణతో రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. పశువైద్యులు ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకునేలా శిక్షణ అందించాలని ఆ శాఖ జిల్లా అధికారికి సూచించారు. అనంతరం దూడల అందాల పోటీ, వైద్య పరీక్షలు కోసం ఏర్పాటు చేసిన శిబిరాలను ఆమె పరిశీలించారు.

సామాజిక సేవ విద్యార్థుల కర్తవ్యం

భీమవరంలో అల్లూరి కాంస్య విగ్రహం వద్ద స్కౌట్ విద్యార్థులు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: విద్యార్థులు బాల్యం నుంచి సేవాభావంతో మెలగాలనే లక్ష్యంతో ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించినట్లు ఎంఈవోలు గుమ్మళ్ల వీరాస్వామి, గంగాధరరావు పేర్కొన్నారు. పాలకొల్లు బీఆర్ఎంవీ పురపాలక ఉన్నత పాఠశాలకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు మూడు రోజుల పాటు పలు అంశాలపై ప్రత్యేక శిక్షణ పొందారు. ఈ శిబిరం డీఈవో నారాయణ, సమగ్ర శిక్షా అధికారి శ్యామ్‌సుందర్, స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు పర్యవేక్షణలో విజయవంతంగా ముగిసిందని పాఠశాల హెచ్ఎం రూబీ లక్ష్మీబాయి తెలిపారు. శిక్షణలో భాగంగా విద్యార్థులు భీమవరంలో అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహాన్ని సందర్శించినట్లు తెలిపారు.

జాతీయ రహదారి విస్తరణతో ప్రగతి

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: జాతీయ రహదారి 216 విస్తరణకు న్యాయస్థానం తీర్పు ద్వారా అడ్డంకులు తొలగడం జిల్లా ప్రగతికి దోహదపడుతుందని భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు పులపర్తి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి సారించిన కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ జాతీయ రహదారి విస్తరణకు ఉన్న అడ్డంకులను అధిగమించేలా కృషి చేశారన్నారు.

21న మండల పరిషత్తు సమావేశం

పెనుమంట్ర, న్యూస్‌టుడే: పెనుమంట్ర మండల పరిషత్తు సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కృష్ణమూర్తి తెలిపారు. ఎంపీపీ కర్రి వెంకట నారాయణ రెడ్డి(వాసు) అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సభ్యులతో పాటు ఆయా శాఖల అధికారులంతా హాజరు కావాలని కోరారు.

ఎండిన చెట్టు.. కుప్ప కూలేట్టు!

విద్యుత్తు తీగల తాకిడితో సగం వరకు కాలిపోయిన కాండం

వాసవీ పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: సిద్ధాంతం- ఆచంట ప్రధాన రహదారిలో గుడిపాడు సమీపాన ఎండిన కొబ్బరి చెట్టు ప్రమాదకరంగా ఉంది. ఈ మార్గంలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఎండిపోయిన చెట్టు కాండం విద్యుత్తు తీగల తాకిడికి సగం కాలిపోయి బలహీనంగా కూలిపోయే స్థితికి చేరింది. ఈ అంశంపై పంచాయతీ కార్యదర్శి కిశోర్‌బాబు స్పందిస్తూ పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

అంగన్‌వాడీ చెంత.. వ్యర్థాలతో చింత!

పోడూరు, న్యూస్‌టుడే: తూర్పుపాలెంలో అంగన్‌వాడీ కేంద్రానికి ఎదురుగా ఉన్న డ్రెయిన్‌లో వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు నిలిచిపోతోంది. దీంతో దుర్వాసన, దోమలతో చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. పారిశుద్ధ్య కార్మికులను పంపి డ్రెయిన్‌ను శుభ్రం చేయిస్తామని పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు.

కల్వర్టు కుంగి.. అంచులు జారి

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నరసాపురం- మత్స్యపురి- భీమవరం రహదారిలో కె.బేతపూడి గ్రామ పరిధిలో డ్రెయిన్‌పై కల్వర్టు శిథిలస్థితికి చేరగా.. ఆ ప్రాంతంలో రహదారి అంచులు కుంగిపోయి ప్రమాదకరంగా మారాయి. ఇక్కడ కొత్త కల్వర్టు నిర్మించాలని సుమారు 15 గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్యపై ఆర్‌అండ్‌బీ డీఈ జీవీఎస్ కిరణ్‌కుమార్ స్పందిస్తూ నూతన కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు.

మురుగు చేరి.. దారి మారి!

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణ పరిధి మాలెం వారి వీధిలో డ్రెయిన్లు లేకపోవడంతో మురుగు ఇలా రహదారిపైకి చేరుతోంది. స్థానికులు మురుగులోంచే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పట్టణంలో మునసుబు వారి వీధి, రైతు బజారు రోడ్డు, మాధవాయిపాలెం, శివాలయం వీధి ప్రాంతాల్లోనూ డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. పరిశీలించి డ్రెయిన్ల సమస్యను పరిష్కరిస్తామని పురపాలక శానిటరీ ఇన్‌స్పెక్టర్ పాత్రుడు తెలిపారు.

పట్టణ పరిధిలోనే వారధి నిర్మించాలి

నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నరసాపురం, న్యూస్‌టుడే: వశిష్ఠ గోదావరిపై వారధి నిర్మాణాన్ని నరసాపురం పట్టణ పరిధిలోనే చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంకెం సీతారామ్ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోలిశెట్టి బాబ్జి ఆధ్వర్యంలో పంటురేవు వద్ద బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2004లో ఈ ప్రాంతంలో వంతెన నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి భూమిపూజ చేశారన్నారు. పట్టణ పరిధిలో వంతెన నిర్మాణం చేస్తే ప్రయోజనం ఉంటుందనిన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గాదిరెడ్డి వనమయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత ఛత్రపతి శివాజీ

శోభాయాత్రలో పాల్గొన్న వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ సభ్యులు

నరసాపురం పట్టణం, గ్రామీణ, న్యూస్‌టుడే: పోరాట పటిమలో, దేశభక్తిలో ఛత్రపతి శివాజీ స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ సభ్యులు పేర్కొన్నారు. శివాజీ జయంతి సందర్భంగా నరసాపురం మండలం, పట్టణ పరిధిలో బుధవారం శోభాయాత్ర నిర్వహించారు. నరసాపురం మండలం స్వర్ణాంధ్ర కళాశాల నుంచి ప్రారంభమైన యాత్ర పట్టణంలో చర్చి రోడ్డు. పంజా కూడలి, స్టీమర్ రోడ్డు మీదుగా కొనసాగింది. కళాశాలల విద్యార్థులు పాల్గొని దేశభక్తి నినాదాలు చేశారు.

సహకార సిబ్బంది ఆందోళన

మొగల్తూరు: శిబిరంలో ఉద్యోగులు

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: డిమాండ్ల పరిష్కారం కోరుతూ సహకార సంఘాల ఉద్యోగులు విధులు బహిష్కరించి ఆందోళన బాట పట్టారు. నరసాపురం పట్టణం, మొగల్తూరులలోని డీసీసీబీ కార్యాలయాల ఏర్పాటు చేసిన శిబిరాల్లో బుధవారం నిరసన తెలిపారు.

కొనసాగిన నిరసన

ఆచంట: నినాదాలు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఆచంట, న్యూస్‌టుడే: పగలు, రాత్రి అనే తేడా లేకుండా సెలవు రోజుల్లో కూడా పని చేయాలంటూ అధికారులు ఒత్తిడి పెంచుతున్నారని వీఆర్వోలు, వీఆర్ఏలు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఐకాస ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా వారు బుధవారం ఆచంటలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. తమ సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్ని సార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని పేర్కొన్నారు. వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడు ఎం.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

'దళిత ఉద్యోగులపై వివక్ష తగదు'

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: దళిత ఉద్యోగులపై వివక్ష చూపడం సరికాదని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేశ్ అన్నారు. పాలకొల్లులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వీరవాసరంలో ఏపీఎంగా పనిచేస్తున్న కుంచె జ్యోతిరాణిని ఆ మండలంలో పనిచేస్తున్న వీవోఏలు వేధిస్తూ జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం తగదన్నారు.

ప్రకృతి సేద్యంతో అధిక ఆదాయం

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రకృతి సేద్యంతో ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులతో పాటు అధిక ఆదాయం పొందవచ్చని ఆ విభాగం జిల్లా సమన్వయకర్త ఎం.అరుణ కుమారి పేర్కొన్నారు. స్థానిక మండల సమాఖ్య భవనంలో బుధవారం నిర్వహించి కన్వర్జెన్సీ సమావేశంలో ఆమె మాట్లాడారు. పురుగు మందుల వాడకాన్ని తగ్గించి నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఏడీఏ ప్రసాద్, ఏవో జ్యోషిల పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాలులో బుధవారం లయన్స్ డిస్ట్రిక్ట్ ఉమెన్స్ సింపోజియంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆభరణాల బ్యాగు అప్పగింత

విజయవాడ, న్యూస్‌టుడే: రైలు ప్రయాణంలో పోగొట్టుకున్న ఆభరణాల బ్యాగును విజయవాడ రైల్వే పోలీసులు ప్రయాణికురాలికి అప్పగించిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసాపురానికి చెందిన జయలక్ష్మి భర్తతో కలిసి బుధవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడకు చేరుకుని లగేజీని 6వ నంబరు ప్లాట్‌ఫాంపై ఉంచారు. ఈ క్రమంలో హ్యాండ్ బ్యాగు మరిచిపోయి బయటకు వెళ్లిపోయారు. తరువాత జీఆర్పీ సీఐ జె.వి.రమణ, సిబ్బంది 6వ నంబరు ప్లాట్‌ఫాంపై తనిఖీలు చేస్తుండగా ఆ హ్యాండ్ బ్యాగు లభించింది. అందులో ఉన్న ఆధార్ కార్డు, ఫోన్ నంబరు ఆధారంగా బాధితురాలికి ఫోన్ చేసి సమాచారం అందించారు. వారు వెంటనే విజయవాడ జీఆర్పీ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. హ్యాండ్ బ్యాగును సీఐ రమణ ప్రయాణికురాలికి అప్పగించారు. అందులో రూ.26 వేల నగదు, రూ.10 లక్షల విలువ చేసే 65 గ్రాముల బంగారు నగలు ఉన్నాయి.

శ్రమదానంతో మరుభూమికి కొత్త రూపు

పొదలు తొలగిస్తున్న సభ్యులు

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పాలకొల్లు మండలం పూలపల్లి వద్ద రాజుల శ్మశాన వాటికనుపూలపల్లి క్షత్రియ సంక్షేమ పరిషత్తు సభ్యులు శ్రమదానంతో శుభ్రం చేశారు. ప్రాంగణంలో పెరిగిన పొదలు, పిచ్చిమొక్కలు తొలగించడంతో పాటు వ్యర్థాలను తొలగించారు. ★ పూలపల్లి గ్రామానికి చెందిన రిక్షా కార్మికుడు లక్ష్మీనారాయణకు గాంధీ మెగా ఫౌండేషన్ సభ్యుడు గాంధీ భగవాన్‌రాజు బుధవారం కొత్త రిక్షాను అందించారు.

ప్రణాళికతో చదివితే సత్ఫలితాలు

తూర్పుతాళ్లు: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఆర్డీవో

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదివితే సత్ఫలితాలు సాధించవచ్చని ఆర్డీవో దాసి రాజు అన్నారు. తూర్పుతాళ్లు జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసించి మంచి ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాలలో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు.

వాసవీ పెనుగొండ, గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యలో రాణిస్తేనే ఉజ్వల భవిత సొంతమవుతుందని.. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానికి అనుగుణంగా కృషి చేస్తే మంచి ఫలితాలు వస్తాయని వాసవీ పెనుగొండ తహసీల్దారు జి.అనితాకుమారి పేర్కొన్నారు. చెరుకువాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆమె బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహారం వడ్డిస్తున్నారా లేదా అని విద్యార్థులను ఆరా తీశారు. అనంతరం ఆమె విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ★ మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఉప తహసీల్దారు డి.రాజేశ్, ఏఎస్‌వో దుర్గాసాయి బుధవారం పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

పాఠశాలకు ప్రింటర్ అందజేత

వాసవీ పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: నడిపూడిలో జడ్పీ పాఠశాలకు గ్రామానికి చెందిన వీరవల్లి నాగవేణి బుధవారం ప్రింటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రామలింగేశ్వర రావు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి దాతలు అందిస్తున్న చేయూత అభినందనీయమన్నారు.

భాజపా యువ మోర్చా సమావేశం

పాలకొల్లు సాంస్కృతిక న్యూస్‌టుడే: భాజపా యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు పత్స గోపాలకృష్ణ బుధవారం పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాలలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో సమావేశమయ్యారు. మోర్చా కార్యకలాపాల విస్తరణలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ★ యువ మోర్చా పట్టణ అధ్యక్షుడిగా పులఖండం కీర్తి చంద్, ప్రధాన కార్యదర్శులుగా పి.సతీశ్, రౌతు దుర్గా సాయి కుమార్, మండల అధ్యక్షుడిగా చల్లా వీర వెంకట అర్జున్‌లను నియమించారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పాలకొల్లు కొత్తపేటలో ఉన్న భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో మహాశివరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. విజేతలకు భాజపా నాయకురాలు అల్లూరి పద్మవర్మ, వైద్యురాలు మల్లులు జ్ఞానేశ్వరి బహుమతులు అందించారు.

ఢీకొట్టుకున్న వాహనాలు

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పాలకొల్లు- భీమవరం ప్రధాన రహదారిలో దగ్గులూరు శివాలయం వద్ద బుధవారం రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. ఈ ఘటనలో వాహనాల ముందు భాగాలు దెబ్బతిన్నాయి. ఆ సమయంలో రహదారిపై ఇతర వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు.

ద్విచక్ర వాహన చోరుల గుర్తింపు..

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంటలో రామేశ్వరస్వామి ఆలయం వద్ద మహాశివ రాత్రి ఉత్సవాల్లో బైకు చోరీలకు పాల్పడిన వారిని సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా పోలీసులు గుర్తించారు. ఇక్కడ జరిగిన శివరాత్రి తిరునాళ్లలో ఆరు మోటారు సైకిళ్లు చోరీకి గురయ్యాయి. సీసీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు పోడూరు మండలం పండతవిల్లూరు ప్రాంతానికి చెందిన యువకులు ఈ చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. విచారణ పురోగతిలో ఉందని ఆచంట ఎస్సై కె.వెంకటరమణ తెలిపారు.

బాలిక అదృశ్యం..

మొగల్తూరు, న్యూస్‌టుడే: సీతారామపురానికి చెందిన బాలిక(17) మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీనిపై ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మామపై అల్లుడి దాడి

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: మామపై దాడికి పాల్పడిన అల్లుడిపై కేసు నమోదైంది. పట్టణ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో గ్రేస్ నగర్‌కు చెందిన తోట రాంబాబు కుటుంబ కలహాల నేపథ్యంలో తన మామ కొల్లాబత్తుల ఏసుపై దాడి చేసి గాయపరిచాడు. దీంతో ఆయన చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. దీనిపై ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అత్యవసర సేవకులకు అండగా!

108 సిబ్బంది జీతాల పెంపు


పెనుమంట్రలో 'థాంక్యూ సీఎం సర్' ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సిబ్బంది

మార్టేరు, న్యూస్‌టుడే: ఎవరైనా ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు సమాచారం అందితే చాలు.. క్షణాల్లో అక్కడికి వెళ్లి బాధితులను శరవేగంగా ఆసుపత్రులకు చేరవేస్తున్న 108 అంబులెన్స్ సిబ్బందికి జీతాలు పెంచుతున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించింది. గతంలో ఇచ్చిన హామీ మేరకు వేతన శ్లాబు పెంచడంపై సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 'థాంక్యూ సీఎం సార్' అని రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శిస్తూ కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నారు.

మార్పులు ఇలా.. పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో 108 అంబులెన్స్‌నులు 21 ఉండగా 102 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. వీరిలో 68 మందికి ప్రభుత్వ నిర్ణయం ద్వారా లబ్ధి చేకూరనుంది. 15, 20 ఏళ్ల సర్వీసు దాటిన వారికి సైతం త్వరలోనే వేతనాల శ్లాబు పెరిగే అవకాశం ఉంది.

ప్రస్తుతం అయిదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఈఎంటీలు, పైలెట్లు, 10 ఏళ్ల పూర్తి చేసుకున్న వారికి వేతన శ్లాబులు వేర్వేరుగా ఉంటాయి. దీని ప్రకారం జీతాలను రూ.2 వేల చొప్పున ప్రభుత్వం పెంచింది. అయిదేళ్ల లోపు శ్లాబులో ఉన్న ఈఎంటీకి రూ.22 వేలు, పైలెట్‌కు రూ.20 వేలు, 5 నుంచి 10 ఏళ్ల శ్లాబ్‌లో ఉన్న ఈఎంటీకి రూ.28 వేలు, చోదకుడికి రూ.26 వేలు, 10 ఏళ్లు దాటిన ఈఎంటీకీ రూ.32 వేలు, చోదకుడికి రూ.30 వేల వరకు వేతనం అందుతుంది.

విస్మరించిన గత ప్రభుత్వం

కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు అందించిన 108 సిబ్బందిని గత వైకాపా ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. కనీసం జీతాల శ్లాబులు పెంచాలని వేడుకున్నా పట్టించుకోలేదు. దీంతో చాలీచాలని జీతాలతో వారు నెట్టుకొచ్చారు.



శ్రద్ధాంజలి

ఆప్యాయతానురాగాలతో మమ్ములను పెంచి మా ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన మా తండ్రి గారి మరణం మాకు తీరని లోటు. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ..

శ్రీ గాదె శేషగిరి రావు గారు

జననం: 03-06-1949 మరణం: 09-02-2026

మార్టేరు (పెద్ద వీధి)

భార్య: గాదె నిర్మల

కుమారులు: గాదె సరోజ్‌కుమార్, గాదె ప్రసాద్ — కోడళ్ళు: సునీత, లీల

కుమార్తె: కంకటాల కనక సంగీత — అల్లుడు: బుచ్చిరామయ్య

తమ్ముళ్ళు: గాదె వెంకటేశ్వరరావు, గాదె బాబ్జి (లేటు) — మరదళ్ళు: రమాదేవి, మీన

చెల్లెళ్ళు: కొల్లూరి కాత్యాయని, తుమ్మలపల్లి శాంత, గ్రంధి లలిత

మేనల్లుళ్ళు: కొల్లూరి సుధాకర్, ప్రసాద్, సునీల్, సరోజ్‌కుమార్

మనుమలు: నల్లూరి సృజన-రవిచంద్ర, పెనుగొండ సురేఖ-వెంకటేష్, కంకటాల భార్గవి నాగశేషసిరి, గాదె హర్షిత, ప్రియ, ఆకర్ష్, హాసిని

మునిమనుమడు: నల్లూరి అద్వైత్ గుప్త

కంకటాల రాంబాబు-లక్ష్మీ, జయలక్ష్మీ, పేరూరి రాజకుమారి, తుమ్మలపల్లి రమాదేవి, పేరూరి సూర్యనారాయణ-సూర్యలక్ష్మీ, పేరూరి రామ్మోహన్‌రావు-మాధురి, గాదె శేషయ్య-సునీతరాణి

(c) eenadu

తాడేపల్లిగూడెం

• తాడేపల్లిగూడెం • తణుకు

26న మండల పరిషత్తు ఉపాధ్యక్షుడి ఎన్నిక

ఇరగవరం, న్యూస్‌టుడే: ఇరగవరం మండల ప్రజా పరిషత్తు ఉపాధ్యక్షుడి ఎన్నిక ఈ నెల 26న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎ.శ్రీనివాసు బుధవారం తెలిపారు. దీనికి సంబంధించి 26న మండల ప్రజా పరిషత్తు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఉపాధ్యక్షుడిగా పనిచేసిన కత్తవపాడు-పొదలాడ ఎంపీటీసీ సభ్యుడు మల్లిడి సత్యనారాయణ ఇటీవల పదవికి రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. 19మంది ఎంపీటీసీ సభ్యులున్న మండల పరిషత్తులో 17మంది వైకాపా, ఇద్దరు జనసేనకు చెందిన వారు ఉన్నారు. ఈనెల 22లోగా సభ్యులందరికీ నోటీసుల ద్వారా ఎన్నిక సమాచారాన్ని తెలియజేస్తామని ఆయన తెలిపారు.

అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత

తణుకు, న్యూస్‌టుడే: మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యతని ప్రజ్వల సంస్థ రిసోర్స్ పర్సన్ భూపాల్ పేర్కొన్నారు. మానవ అక్రమ రవాణాపై బుధవారం స్థానిక రాజీవ్ గాంధీ పురపాలక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. పిల్లలకు ఏదైనా ప్రమాదం ఉందని గమనిస్తే వెంటనే 1098, 100, 181, 1930 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా చట్టాలు, సైబర్ నేరాలు, చరవాణి వాడకం, సామాజిక మాధ్యమాల ప్రభావం తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	99488 53114
తణుకు	85558 50851
తణుకు గ్రామీణం	63005 79402
అత్తిలి	91548 46774

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ? పాతూరు పశువుల ఆసుపత్రి ఎదురుగా రోడ్డు ముురుగు బోదె పూడిక తీసి రహదారిలో వదిలేయడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. **- రమేష్, స్థానికుడు**

✔ పూడిక వ్యర్థాలను తొలగించేలా చర్యలు చేపడతాం **- సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

? హౌసింగ్‌బోర్డు కాలనీలో కుక్కల సంచారంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. **- సతీష్, స్థానికుడు**

✔ కుక్కల వృద్ధి నివారణకు చర్యలు చేపడతాం **- ఎం. ఏసుబాబు, పురపాలక కమిషనర్**

తూకం తప్పుతోంది

మోసాలకు పాల్పడుతున్న వ్యాపారులు

తణుకు, న్యూస్‌టుడే: పట్టణంలో పలువురు వ్యాపారులు తప్పుడు తూకాలతో ప్రజల జేబులకు చిల్లు పెడుతున్నారు. రోజువారీ వస్తువులు కొనుగోలు చేసే వారిని దోచుకుంటున్నారు. కొనుగోలు చేసే ప్రతి వస్తువులో తూకం, కొలతల్లో వ్యత్యాసాలతో ప్రజలను నిలువునా ముంచుతున్నారు. వీటిని అరికట్టాల్సిన తూనికలు, కొలతలు శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఏదో ఫిర్యాదు వస్తే మమ అనిపించి వెళ్లిపోవడంతో తప్ప నిత్యం పర్యవేక్షణ, తనిఖీలు మాత్రం ఉండటం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

5కిలోలకు 725గ్రాములు అధికంగా చూపుతున్న కాటా

తనిఖీ చేసిన ప్రతి చోట..

తూనికలు, కొలతల శాఖాధికారులు తనిఖీ చేసిన ప్రతి దుకాణంలో ఏదొక మోసం గుర్తిస్తున్నారు. మంగళవారం తణుకులో నిర్వహించిన దాడుల్లో ప్రతి చోటా మోసాన్ని గుర్తించారంటే ఏ స్థాయిలో అక్రమాలకు తెరలేపుతున్నారో అర్థం చేసుకోవచ్చు. తరచూ తనిఖీలు నిర్వహించి బాధ్యులపై చర్యలు చేపట్టాల్సిన అధికారులు మిన్నకుండటంతో వ్యాపారుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది.

ఎలక్ట్రానిక్ తూకాల్లో..

ఒకప్పుడు ఎలక్ట్రానిక్ తూకాలు అంటే కచ్చితమైనవని నమ్మేవారు. కానీ వాటిని సైతం వారికి నచ్చినట్టు మార్పులు చేస్తూ తప్పుడు తూకాలు తూస్తున్నారు. ఇటీవల అధికారులు నిర్వహించిన దాడుల్లో పలు చోట్ల కేజీకు 100 గ్రాముల వ్యత్యాసం రాగా, మరో చోట 5కేజీలకు 725 గ్రాముల వ్యత్యాసం వచ్చింది. ఇందులో ఏ ఒక్క తూకానికి సీళ్లు లేకపోవడం గమనార్హం.

ఇవి తప్పనిసరి..

☛ అన్ని తూనికలు, కొలతలు, డిజిటల్ యంత్రాలు ఆ శాఖ నుంచి వార్షిక ధ్రువీకరణ ముద్రను పొందాలి. ☛ పరికరాలు ఏటా క్రమాంకం (కాలిబ్రేషన్) చేయించి, నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. ☛ ఎలక్ట్రానిక్ మీటర్ల టాంపరింగ్, అనధికారిక అదనపు బరువులు ఉపయోగించడం చట్టరీత్యా నేరం. ☛ ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాలు బరువు స్పష్టంగా కనిపించేలా ఉంచాలి.

చర్యలు తీసుకుంటాం

కచ్చితమైన కొలతలు లేని యంత్రాలను వాడటం చట్టరీత్యా నేరం, ఇది వినియోగదారుల హక్కులకు భంగం కలిగించడమే. ఇలా చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవు.
- టి.రాంబాబు, తూనికలు,కొలతలు అధికారి

చెత్త సమస్యకు పరిష్కారం.. సంపద సృష్టికి శ్రీకారం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలో చెత్త సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. రోజూ వెలువడే వ్యర్థాలను పునరుత్పాదన చేసే విధంగా అడుగులు వేస్తున్నారు. పట్టణంలో రోజూ సేకరించే చెత్తను వర్మీ కంపోస్టుగా మార్చడానికి ఒక సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒప్పందం కుదుర్చుకున్న సంస్థకు రోజూ 30 టన్నుల తడిచెత్తను సేకరించి ఇవ్వాల్సి ఉంటుంది. పెదతాడేపల్లి గ్రామంలో ఉన్న సంస్థకు వ్యర్థాలను చేర్చాలి.

వర్మీ కంపోస్టు

సేకరించిన చెత్త నుంచి రెండు రకాలైన ఎరువులను తయారు చేస్తారు. ఒకటి వర్మీ కంపోస్టు, రెండోది సూపర్ కంపోస్టు. ముందుగా సేకరించిన వంటింటి వ్యర్థాలను చిన్న ముక్కలుగా చేసి, దానిని బాయిలర్‌లో వేసి 70 డిగ్రీల నుంచి 100 డిగ్రీల వరకు ఆవిరి మీద ఉడికించి మూడు రోజుల పాటు ఆరుబయట ఆరబెడతారు. దానిలో పశువుల పేడ, ఏలిక పాములను, కొబ్బరి పొట్టును కలిపి ముందుగా సిద్ధం చేసుకున్న బెడ్లలో ఈ మిశ్రమాన్ని పోసి, పైన గోనెసంచులు కప్పి రెండు రోజులకోసారి నీటిని పిచికారీ చేస్తుంటారు. 45 రోజుల అనంతరం ఈ చెత్తంతా సేంద్రియ ఎరువుగా మారుతుంది.

వర్మీ కంపోస్టు తయారు చేసే బెడ్లు

సూపర్ ఎరువు..

ఈ విధానంలో సేకరించిన చెత్తను చిన్నచిన్న ముక్కలుగా చేసి ఆవిరిపై ఉడికించి అనంతరం పశువుల వ్యర్థాలు, ట్రైకోడెర్మా విరిడి, సూడోమోనాస్, అజితో బ్యాక్టీరియా, అమూల్య, జీవామృతం, కొబ్బరిపొట్టు, ఇతర వృక్షాల నుంచి వచ్చే కొమ్మలను పొట్టుగా మార్చి సమపాళ్లలో కలిపి నిలువ చేస్తారు. సూపర్ కంపోస్టు తయారు కావడానికి రెండు నెలలు సమయం పడుతుంది. దీనిని నేరుగా పంటపొలాలు, తోటల్లో విరివిగా వాడుతుంటారు. చెత్త సేకరణతో పాటు దాని నుంచి సంపద తయారీ చేస్తుండటంతో పరిశుభ్రతతో పాటు ఆదాయం కూడా సమకూరుతోంది.

క్రీడలతో మానసిక ఉల్లాసం

కొబ్బరితోట, పెదతాడేపల్లి(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ఏపీ భవన నిర్మాణ, ఇతర కార్మికుల సంక్షేమ బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జీ అన్నారు. విద్యార్థి దశలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో శ్రీ చైతన్య పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్ స్పోర్ట్స్ మీట్ 2025-26 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్రీడలను జ్యోతిని వెలిగించి ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరు క్రీడలపై దృష్టి సారించాలన్నారు.

ఖాళీ స్థలాలు నిర్వహించుకునేలా నిర్ణయం తీసుకోవాలి: ఆరిమిల్లి

తణుకు, న్యూస్‌టుడే: ఖాళీ స్థలాల పన్నులు పురపాలక సంఘాలు వినియోగించుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. పురపాలక సంఘాల్లో ఖాళీ స్థలాలను నిర్వహించుకునేందుకు వీలుగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని సూచించారు. పురపాలక శాఖ మంత్రి నారాయణ శాసనసభలో ప్రవేశపెట్టిన ఖాళీ స్థలాల పన్ను సవరణ బిల్లుపై లఘు చర్చలో పాల్గొని బిల్లుకు మద్దతుగా రాధాకృష్ణ పలు సూచనలు చేశారు. రాష్ట్రంలోని అన్ని పురపాలక సంఘాల్లో జరుగుతున్న పట్టణీకరణలో భాగంగా రాబోయే రోజుల్లో రాష్ట్రంలో నిర్మాణ రంగానికి, స్థిరాస్తి రంగానికి ఊతమిచ్చే విధంగా బిల్లు ఉందని చెప్పారు. కేవలం నిర్మాణం పేరుతో భూమి ఖాళీగా ఉంచి 50శాతం రాయితీ పొందే విధంగా కాకుండా కాల పరిమితి దాటితే అదనపు రుసుం లేదా వడ్డీ చెల్లించాల్సిన విధానం అమల్లోకి తీసుకురావాలని కోరారు. మధ్యలో నిర్మాణం నిలిచిపోతే రాయితీ వచ్చిన 50శాతం రికవరీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనుమతి పొందిన భవన నిర్మాణానికి సంబంధించి అక్రమ నిర్మాణం చేపడితే తీసుకోవాల్సిన చర్యలను ఆయన ప్రస్తావించారు. ఖాళీ స్థలాల పన్ను కేవలం 40శాతం మాత్రమే వసూలు అవుతుందని అన్నారు. జియో ట్యాగింగ్ విధానంలో యజమానులను గుర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

మాజీ ఎమ్మెల్యే కుటుంబానికి పరామర్శ

కొబ్బరితోట, పెదతాడేపల్లి(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: ఇటీవల మృతి చెందిన మాజీ ఎమ్మెల్యే ఈలి వరలక్ష్మి కుటుంబాన్ని వలవల బాబ్జీ బుధవారం పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెదతాడేపల్లి సర్పంచ్ పోతుల అన్నవరం, ఏపీ టైలర్స్ ఫెడరేషన్ అభివృద్ధి సహకార ఛైర్మన్ ఆకాశపు స్వామి, తెదేపా మండలాధ్యక్షుడు పరిమి రవికుమార్, పట్టణ అధ్యక్షుడు పట్నాల రాంపండు, ఏపీ బ్రాహ్మణ, వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్లు సబ్బినీసు కృష్ణమోహన్, పద్మనాభుని మురళి, ఎంపీటీసీలు గోవిందు, పసుమర్తి సత్యనారాయణ, సొసైటీ ఛైర్మన్ పరిమి సురేష్, చింతకాయల సత్యనారాయణ, కల్యాణం రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మి చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న బాబ్జీ

దానేశ్వరి విగ్రహ పునఃప్రతిష్ఠ

తణుకు గ్రామీణం,న్యూస్‌టుడే: తణుకు మండలం దువ్వ గ్రామంలోని దానేశ్వరి అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలలో భాగంగా బుధవారం యాగశాల ప్రదక్షిణ, అఖండ దీపారాధన, గణపతి పూజ, పంచగవ్య మండపారాధన, అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందేలా చూడండి

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రస్తుతం అమలవుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అందరికీ అందేలా కృషి చేయాలని మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు రుద్ర ధనరాజు అన్నారు. బుధవారం తణుకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ప్రజా పరిషత్తు అధ్యక్షుడు రుద్ర ధనరాజు అధ్యక్షతన జరిగిన సర్వ సభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ కార్యదర్శులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు ముళ్లపూడి అన్నపూర్ణాదేవి, మండల ఉపాధ్యక్షులు, మండల ఎంపీటీసీ సభ్యులు, ఎంపీడీవో, ఏవో, మండల స్థాయి అధికారులు, మండల పంచాయతీ కార్యదర్శులు, మండల ప్రజా పరిషత్ సిబ్బంది హాజరయ్యారు.

మాట్లాడుతున్న లోహిత్ సాగర్

స్వర్ణాంధ్ర దిశగా రాష్ట్ర బడ్జెట్

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర దిశగా రాష్ట్ర బడ్జెట్ రూపొందించడం ప్రశంసనీయమని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన శాసనసభ సమావేశాల్లో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కృషితో 2026-27 బడ్జెట్ రూపొందించడం విశేషమన్నారు. దూర దృష్టికి కలిగిన నాయకత్వానికి బడ్జెట్ నిదర్శనమన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 దిశగా బలమైన అడుగు పడిందన్నారు. కూటమి ప్రభుత్వం 24 గంటల్లో ధాన్యం సొమ్ములు వారి ఖాతాలో పడేలా కృషి చేసిందన్నారు. పంచాయతీ వ్యవస్థను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపిన ఘనత ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు దక్కుతుందన్నారు. ★ గుడ్ల అమ్మకాల్లో దళారులు ఒక్కటై.. రైతులను ఇబ్బంది పెడుతున్నారు. దీనివల్ల గుడ్డు ధర పడిపోయి రైతులు నష్టపోతున్నారు. పౌల్ట్రీ రైతులకు తగిన న్యాయం చేయాలి.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

యాగశాలలో దేవతామూర్తులకు పూజలు

దండగర్ర(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: మండలంలోని దండగర్రలో ఈ నెల 20 విగ్రహప్రతిష్ఠ చేయనున్న కోదండ రామాలయ ప్రాంగణంలోని యాగశాలలో బుధవారం పూజా కార్యక్రమాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. వేద పండితులు, దంపతులు, దేవతా మూర్తులకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ క్రతువులో గ్రామస్థులు పాల్గొన్నారు.

పశు పోషణతో ఆర్థిక భరోసా

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పశు సంపద వృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. పాలకొల్లు మండలం అగర్తిపాలెం సొసైటీ వద్ద ఏర్పాటు చేసి పశు వైద్య శిబిరాన్ని ఆమె బుధవారం ప్రారంభించారు. తొలుత ఆమె గోమాతకు పూజలు చేసి నమస్కరించారు. అనంతరం మాట్లాడుతూ పాడి పశువుల పోషణతో రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. పశువైద్యులు ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకునేలా శిక్షణ అందించాలని ఆ శాఖ జిల్లా అధికారికి సూచించారు. అనంతరం దూడల అందాల పోటీ, వైద్య పరీక్షలు కోసం ఏర్పాటు చేసిన శిబిరాలను ఆమె పరిశీలించారు.

20న సుమతీ శతక పద్యాల పోటీ

పాలకొల్లు సాంస్కృతికం, న్యూస్‌టుడే: పాలకొల్లులోని రసధుని సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 20న ఎంఎంకేఎన్ పాఠశాలలో సుమతీ శతక పద్యాల రాత పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సభ్యుడు యర్రంశెట్టి వెంకటరత్నం బుధవారం తెలిపారు. పట్టణ స్థాయిలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు.

స్ఫూర్తిప్రదాత ఛత్రపతి శివాజీ

నరసాపురం పట్టణం, గ్రామీణ, న్యూస్‌టుడే: పోరాట పటిమలో, దేశభక్తిలో ఛత్రపతి శివాజీ స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ సభ్యులు పేర్కొన్నారు. శివాజీ జయంతి సందర్భంగా నరసాపురం మండలం, పట్టణ పరిధిలో బుధవారం శోభాయాత్ర నిర్వహించారు.

అనారోగ్యంతో సర్పంచి మృతి

చినతాడేపల్లి(తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: మండలంలోని చినతాడేపల్లి గ్రామ సర్పంచి పిచ్చికల రాజారావు(71) బుధవారం మృతి చెందారు. గత సంవత్సరం డిసెంబరు 5 నుంచి విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. 2006 నుంచి 2011 వరకు సర్పంచిగా పదవి నిర్వహిస్తూ సర్పంచుల ఛాంబర్ అధ్యక్షుడిగా పనిచేశారు. 2021 నుంచి గ్రామ సర్పంచిగా సేవలు అందిస్తున్నారు. ఆయనకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈయన మృతికి పలువురు నాయకులు, బంధువులు సంతాపం తెలియజేశారు. గురువారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు.

రాజారావు

పైపు లైను శిథిలం.. వృథా పదిలం

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: తణుకు మండలంలో దశాబ్దాల క్రితం నిర్మించిన పైపు లైన్లు తుప్పు పట్టి శిథిలావస్థకు చేరడం కలవరపెడుతోంది. తణుకు మండలం దువ్వ గ్రామం ఎల్లరమ్మ ఆలయ సమీపంలో ఉన్న మంచి నీటి పైపు లైను తుప్పు పట్టి ధ్వంసమైంది. ఫలితంగా సుమారు పది రోజుల పై నుంచి నీరు లీకయ్యి కాలువలో పడి నీరు వృథా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై గ్రామ పంచాయతీ కార్యదర్శి శేఖర్ బాబును వివరణ కోరగా పైపు లైన్ల మరమ్మతులకు చర్యలు చేపడతామని తెలిపారు.

తవ్వేశారు.. వదిలేశారు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: పట్టణంలో పురపాలక కుళాయి పైపులైన్లు తరచు మరమ్మతుల కోసం తవ్విన గోతులను రోజుల తరబడి అలాగే వదిలేస్తున్నారు. తవ్వకాలు చేపడుతున్నారు. ఆయా మార్గాల్లో రాక పోకలు సాగించే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సత్యవతి నగర్, పీఅండ్‌టీ కాలనీ, ఎస్సీ, బీసీ కాలనీ, గొల్లగూడెం, యాగర్లపల్లి తదితర ప్రాంతాల్లో ఈ సమస్య ఉంది. వీలైనంత త్వరలో గుంతలు పూడ్చి సమస్య పరిష్కరిస్తామని పురపాలక కమిషనర్ ఎం.ఏసుబాబు అన్నారు.

న్యాయవాదుల సంక్షేమానికి నిధులు కేటాయించాలి

తణుకు, న్యూస్‌టుడే: న్యాయవాదుల సంక్షేమానికి రూ.200కోట్లు బడ్జెట్లో కేటాయించాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి డిమాండ్ చేశారు. న్యాయవాదులకు బడ్జెట్‌లో నిధుల కేటాయించాలంటూ బుధవారం స్థానిక బార్ అసోసియేషన్ వద్ద ఐలు ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించి మాట్లాడారు. మూడు సంవత్సరాల లోపు ఉన్న జూనియర్ న్యాయవాదులకు న్యాయమిత్ర ద్వారా రూ.10వేలు ఇవ్వాలన్నారు. అర్హత కలిగిన న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు కేటాయించి, నిర్మాణానికి నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చోడే గోపీకృష్ణ, న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, అంబేడ్కర్, విక్టర్‌బాబు, దుర్గాభవాని, లాజర్, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను కూటమి నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా భాజపా మండల అధ్యక్షుడు మామిడిశెట్టి నాగబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అభివృద్ధి కుంటుపడితే, కూటమి ప్రభుత్వంలో పరుగులు పెడుతోందన్నారు. మండలంలో డ్రెయినేజీలు, వాటర్ ట్యాంకులు, రహదారుల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు.

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

తణుకు, న్యూస్‌టుడే: బీపీఎస్, ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టైన్, కంట్రీ ప్లానింగ్ జి.సుబ్బారావు కోరారు. తణుకు పురపాలక సంఘం పరిధిలోని బీపీఎస్, ఎల్ఆర్ఎస్ పథకాలపై స్థానిక అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం బీపీఎస్, ఎల్ఆర్ఎస్ ద్వారా అనధికార భవనాలు, లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించిందన్నారు. ఈ ప్రక్రియ సక్రమ మార్గంలో జరిగేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ఎల్ఆర్ఎస్‌కు 218, బీపీఎస్‌కు 235 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా పట్టణ పరిధిలోని బీపీఎస్‌కు మార్చి 22లోపు, ఎల్ఆర్ఎస్‌కు ఏప్రిల్ 22 లోపు దరఖాస్తు చేసుకొని క్రమబద్ధీకరించుకోవాలని పురపాలక కమిషనర్ టి.రామ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో టీపీవో వై.శ్రీనివాసు, టీపీబీవో ఓ.హేమలత, డబ్ల్యూపీఆర్ఎస్‌లు, ఎల్‌టీపీలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుబ్బారావు

మధ్యాహ్న భోజన నిర్వహణపై ఆకస్మిక తనిఖీ

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలో ఉన్న అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను వివిధ శాఖల అధికారులు తనిఖీ చేశారు. పురపాలక కమిషనర్ ఎం.ఏసుబాబు స్థానిక సుబ్బారావుపేటలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తహసీల్దారు టి.రాజరాజేశ్వరి, ఆర్డీవో. కె.కౌసర్ బాను తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం తిని సంతృప్తి వ్యక్తం చేశారు.

ఇరగవరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో అమలుచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తీరును మండలంలోని 56 పాఠశాలల్లో మండల స్థాయి అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏలేటిపాడు ఉన్నత పాఠశాలలో తహసీల్దారు ఎం. సుందర రాజు, ఇరగవరం, రేలంగి ఉన్నత పాఠశాలల్లో ఎంఈవో శ్రీనివాసరావు, గోటేరు ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో ఎ.శ్రీనివాసు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఉన్నత పాఠశాలల ప్రత్యేకాధికారులు బుధవారం మధ్యాహ్న భోజన పథకం అమలును ఆకస్మిక తనిఖీ చేశారు. అత్తిలి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రత్యేకాధికారి, తహసీల్దార్ దశిక వంశీ, కొమ్మర జడ్పీ ఉన్నత పాఠశాల ప్రత్యేకాధికారి, ఎంపీడీవో శామ్యూల్ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారమే భోజన పథకం అమలు చేయాలని నిర్వాహకులకు ఆదేశించారు.

పెంటపాడు (తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: మండలంలోని ముదునూరులోని జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం జిల్లా డీపీవో ఎం.రామనాథరెడ్డి వంద రోజుల ప్రణాళిక అమలు తీరును పరిశీలించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి, డ్వామా ఏపీడీ జీవీకే మల్లికార్జునరావు పెంటపాడు మోడల్ స్కూల్‌ను విద్యాధికారి-1 శ్రీనివాస్‌తో కలిసి మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు.

తాడేపల్లిగూడెం: భోజనం రుచి చూస్తున్న కమిషనర్ ఏసుబాబు

నన్నయ వర్సిటీ అధ్యాపకుడికి పురస్కారం

కడకట్ల (తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: పట్టణంలోని నన్నయ వర్సిటీలోని ఫార్మసీ విభాగానికి చెందిన హీరాబట్టుకి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం దక్కిందని ప్రధానాచార్యులు టి.అశోక్ బుధవారం తెలిపారు. ఇటీవల బెంగుళూరులో దేవ్‌లెట్ టెక్నాలజీస్ సంస్థ బోధనా పురస్కారాల్లో భాగంగా 2026కు హీరాబట్టుకి అందించారని వివరించారు. పలువురు అధ్యాపకులు, సిబ్బంది ఆయనను అభినందించారు.

బహుమతిని అందిస్తున్న అశోక్

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

తణుకు, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై అవగాహన అవసరమని, వీటిపై అవగాహన లేక ఎంతో మంది జీవితాలు నాశనమవుతున్నాయని పట్టణ ఎస్సై శ్రీనివాసు పేర్కొన్నారు. పాన్, బీడి వర్తక సంఘం భవనంలో అధ్యక్షుడు పైబోయిన ఏసుబాబు అధ్యక్షతన నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త రకం మోసానికి తెరలేపుతున్నారని, ఎప్పటికప్పుడు వాటిని గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ మేనేజర్ లలిత కిరణ్, జోగయ్య, గమ్మళ్ల హనుమంతరావు, బోయిడి అన్నవరం, సుంకర వెంకటేశ్వరరావు, కొమ్మన రాంబాబు, సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

భాగ్యలక్ష్మిపేట (తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: వేదిక్ మాథ్ రాష్ట్రీయ పోటీల్లో తాడేపల్లిగూడెనికి చెందిన సన్‌షైన్ పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.ప్రసాద్ బుధవారం తెలిపారు. వేదిక్ మ్యాథ్‌వాల్యూమ్-5లో పి.పవన్ ద్వితీయ స్థానం పొంది జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. వాల్యూమ్-5లో ఐ.యోజితలు రాష్ట్ర స్థాయిలో 3వ స్థానం, ఎన్‌కేఎల్ చైతన్య వాల్యూమ్-4లో రాష్ట్ర 3వ స్థానం, టి. శ్రీవేణు, అబాకస్ సీనియర్ లెవల్-2లో రాష్ట్ర జీనియస్ కన్సలేషన్ బహుమతి సాధించాడని వివరించారు. గెలుపొందిన విద్యార్థులు బహుమతులు అందుకున్నారని తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ జీవీ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

వీఆర్వోల గోడు వినాలి

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని, వెంటనే సమస్యలు పరిష్కరించాలంటూ గ్రామ రెవెన్యూ అధికారుల ఆందోళన చేశారు. మండలంలో బుధవారం వీఆర్వోలు చేపట్టిన నిరసన మూడో రోజుకి చేరింది. నల్ల బ్యాడ్జీలతో అత్తిలి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అత్తిలి మండల వీఆర్వోలు, సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సామగ్రి ధ్వంసంపై కేసు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రాథమికోన్నత పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు కార్యాలయ గది తలుపులు పగలగొట్టి రికార్డులు, కంప్యూటర్ ధ్వంసం చేసిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అత్తిలి మండలం స్కిన్నెరపురంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో గుర్తుతెలియని వ్యక్తులు గది తలుపులు పగలకొట్టి రూ.2500నగదును అపహరించి, కార్యాలయ గదిలోని రికార్డులు, కంప్యూటర్‌ను ధ్వంసం చేశారు. ప్రధానోపాధ్యాయురాలు కొవ్వాడ కెంపురత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైటర్ బి.శ్రీనివాస్ తెలిపారు.

ప్రజల ఇబ్బందులు గుర్తించాలి

ఇరగవరం, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రజా సమస్యలు గుర్తించి అవి పరిష్కారం అయ్యే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని తెదేపా మండల ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి శ్రీనివాసు అన్నారు. మండల పార్టీ సమావేశం స్థానిక కేశవ స్వామి ఆలయంలో బుధవారం మండల అధ్యక్షుడు బొంతు శ్రీను అధ్యక్షతన నిర్వహించి మాట్లాడారు. కార్యకర్తలంతా పార్టీ అభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. ప్రతి నెలా 9వ తేదీన గ్రామాల్లో సమావేశం ఏర్పాటు చేసుకుని ప్రజా సమస్యలపై చర్చించాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు గోపిశెట్టి రామకృష్ణ, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కునుకు జనార్దన్ 21 గ్రామాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

తణుకు, న్యూస్‌టుడే: సహకార సంఘం ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. బుధవారం తణుకు డీసీసీబీ బ్రాంచి పరిధిలోని 18 సంఘాల ఉద్యోగులు తణుకులో సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా జీవో 36 వెంటనే అమలు చేయాలని, 2019, 2014 వేతన సవరణ చేయాలని, గ్రాట్యుటీ యాక్ట్ ప్రకారం అమలు చేయాలని, 2019 తర్వాత చేరిన ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా యూనియన్ ట్రెజరర్ ఏలూరి నాగపెద్దిరాజు, తూర్పుగోదావరి జిల్లా యూనియన్ కార్యదర్శి సీహెచ్.శ్రీనివాసు, 18సంఘాల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

తణుకు: నినాదాలు చేస్తూ....

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: సహకార సంఘాల్లో దీర్ఘకాలంగా ఇబ్బందులు పడుతున్న ఉద్యోగుల సమస్యలు వెంటనే తీర్చాలని, జీవో నంబరు 36ను అమలు చేయాలని బుధవారం అత్తిలి డీసీసీబీ బ్యాంకు పరిధిలోని 14 సహకార సంఘాల ఉద్యోగులు నిరసన బాట పట్టారు. కార్యక్రమంలో సహకార సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రామారావుపేట (తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: సహకార సంఘ ఉద్యోగుల పదవీ కాలం 60 నుంచి 62 పెంచాలని, వారి న్యాయమైన కోరికలు తీర్చాలని కోరుతూ బుధవారం తాడేపల్లిగూడెం డీసీసీబీ బ్యాంకు వద్ద నియోజకవర్గ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘాల జిల్లా కార్యదర్శి దండు మూర్తి, గూడెం సొసైటీ కార్యదర్శి ఇంటి సునీల్, ముదునూరు సొసైటీ కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION), TANUKU
E.P. No. 35/2024 in O.S. 98/2016

Between:
Koripalli Ramachandra Rao ... Decree-Holder
And
Nukavalli Satyanarayana (died) and others ... J D Rs
3. Nukavalli Jagalakshmi, D/o. Late Nukavalli Satyanarayana
4. Nukavalli Jagadeswari, D/o. Late Nukavalli Satyanarayana
Both are residents of D.No. 20-59, Krishna Nagar, Near Panchayat Office, Velpuru, Tanuku Mandal, Tanuku JCJC

పిటీషనర్ తరఫున వేయించిన ప్రకటన

ఇందుమూలముగా 3, 4వ రెస్పాండెంట్లకు పై నెంబరు పిటీషన్‌లో కోర్టు వారి ద్వారా మీకు వేలము నోటీసు పంపిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు నోటీసు పేపరు ప్రకటన ద్వారా ఆర్డరు వేసినారు. కావున మీరు ది. 02-03-2026 తేదీన ఉదయం 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, లాయరు ద్వారా గానీ హాజరు అయి అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షములో పిటీషన్ విచారణచేసి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

తణుకు సం/- **గుడిమెట్ల వీరెడ్డి**
తేది: 18-02-2026 పిటీషనరు తరఫు న్యాయవాది, సెల్: 94406 07793

(c) eenadu

రంజాన్ వేళలు	ఇఫ్తార్ గురువారం (సా)	సహర్ శుక్రవారం (ఉ)
కడప	6.27	5.21
ప్రొద్దుటూరు	6.41	5.40

నెలవంక దర్శనం.. రంజాన్ ప్రారంభం

ముస్లిం సోదరులు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ మాసం గురువారం నుంచి ప్రారంభమైంది. బుధవారం రాత్రి నెలవంక దర్శనంతో ముస్లిం సోదరుల ఉపవాసాలు మొదలయ్యాయి. రంజాన్‌ను పురస్కరించుకుని మసీదులను విద్యుత్తు దీపాలతో సుందరంగా అలంకరించారు. సుమారు 31 ఏళ్ల తర్వాత ఫిబ్రవరి నెలలో రంజాన్ ప్రారంభం కావడం విశేషమని ముఫ్తీ సయ్యద్ అబ్దుల్ రహీమ్ తెలిపారు. - న్యూస్‌టుడే, బిల్టప్(కడప)

కనిపిస్తున్నది.. అక్రమానికి సాక్ష్యం కాదా!



రాజంపేట మండలం బాలరాజుపల్లి, మదన గోపాలపురం, మందరం, నందలూరు మండలం టంగుటూరు పరిధిలోని చెయ్యేరు నదిలో ఇసుకాసురులు యంత్రాలతో తవ్వేస్తున్నారు. ట్రాక్టర్లు, టిప్పర్లతో ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇష్టారీతిన తవ్వకాలతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. భూగర్భ జలాలు ఇంకిపోయి పంటలు ఎండిపోయే పరిస్థితి తలెత్తుతుందని రైతులు... మేతకు వెళ్లిన పశువులు ఇసుక ఊబిలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోతాయేమోనని పోషకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ అడ్డుకట్ట వేసే దిశగా అధికారులు పట్టించుకోవడం లేదు. - న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ

డీఎస్ఏ

ఆడించడం మాని విమర్శల పర్వం

కడప క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ(డీఎస్ఏ) వారంతా ఆడించాల్సినవాళ్లు.. అటువంటి వాళ్లు క్రీడాకారులను తీర్చిదిద్ది జిల్లా పేరు నిలపడంపై కాకుండా పరస్పర విమర్శల పర్వానికి తెర లేపారు. డీఎస్‌డీవోను బదిలీ చేసి శిక్షకుల్లో ఒకర్ని నియమించాలంటూ కొందరు పైరవీలు సాగిస్తుండగా.. విధులను సక్రమంగా నిర్వహించాలని చెబుతుండడంతో తనపై కక్షగట్టి రాజకీయ నాయకులను ఆశ్రయిస్తున్నారంటూ ఇంకొకరు వాపోతున్నారు. ఈ తీరుతో క్రీడాకారులు నష్టపోతున్నారు.

● ఇదీ వివాదానికి కారణం: గణతంత్ర వేడుకల్లో ఇచ్చే ప్రశంసా పత్రాలకు ఈ ఏడాది శిక్షకుల పేర్లను డీఎస్‌డీవో గౌస్ బాషా ప్రతిపాదించలేదు. దీంతో డీఎస్ఏ శిక్షకుల్లో ఒక వర్గం ఆయనపై గుర్రుగా ఉన్నారు. అయితే తాను డీఎస్‌డీవో గౌస్‌బాషా మాత్రం ఎప్పుడూ శిక్షకులే కాకుండా.. పనిచేసే ఇతర సిబ్బందికీ ప్రశంసాపత్రాలు అందించాలనే ఉద్దేశంతో ఇలా వ్యవహరించినట్లు చెబుతున్నారు. ఈ విషయం వివాదానికి కారణంగా మారింది.

● ఎడమొఖం.. పెడమొఖం: శిక్షకుల్లో ఒక వర్గం ఇటీవల మంత్రితో పాటు ఒకరిద్దరు ఎమ్మెల్యేలను కలిశారు. డీఎస్‌డీవోను బదిలీ చేసి.. ఆ స్థానంలో శిక్షకుల్లో ఒకరిని నియమించాలని కోరుతూ సిఫార్సు లేఖలు తెచ్చుకున్నారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్)కూ పంపారు. శాప్ లీగ్‌కు సంబంధించి డీఎస్ఏ ఆధ్వర్యంలో చేపట్టిన జిల్లాస్థాయి ఎంపికల్లోనూ ఎడమొఖం పెడమొఖంగా వ్యవహరించారు. ఒకరిపై ఒకరు ఆధిపత్యం చలాయించేలా ప్రవర్తిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇరు వర్గాలతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. లేకుంటే జిల్లాలో అంతంతమాత్రంగానే కొనసాగుతున్న క్రీడలు, క్రీడాభివృద్ధి మరింత వెనుకబడే ప్రమాదముంది.

ప్రైవేట్ ఆస్తులతో దోబూచులాట

కడప నగరపాలక, న్యూస్‌టుడే

● కడప నగరం చిన్నచౌకు పరిధి వార్డు నంబర్ 38, డోర్ నంబర్ 38-328- 0-0-0(చివరి అంకెలు మార్పు)తో ఒక మహిళకు ఆస్తి ఉంది. ఇంతకాలం ఆమె పేరునే కేఎంసీ పన్ను నోటీసులు జారీ చేస్తూ వచ్చింది. ఉన్నట్లుండి సదరు ఆస్తి మరో వ్యక్తి పేరుకు మారి పన్ను నోటీసులు జారీ కావడంతో ఆమె కంగుతింది. విషయం తెలుసుకుని ఫిర్యాదు చేయడంతో బోగస్ పన్ను రసీదు రద్దైంది.

● కడపలోని చిన్నచౌకు ప్రాంతానికి చెందిన ఒక వృద్ధ మహిళదీ అదే పరిస్థితి. దీనిపై ఆమె కుటుంబీకులు కమిషనర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు.

● భగత్‌సింగ్ నగర్‌లో ఒక చిన్న ఇల్లుంది. అతని ప్రమేయం లేకుండానే ఓ మహిళ పేరుపై మారిపోయింది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో పలువురి ఆస్తులు అనధికారికంగా ఇతరులకు మార్చినట్లు అధికారులు సైతం గుర్తించారు.

కడప నగరంలోని నిర్మాణాలు

కడప సచివాలయాల్లో కంత్రీలు

ఇష్టారీతిన యజమానుల పేర్ల మార్పు

రూ.కోట్ల కుంభకోణానికి పునాదులు!

యజమానికి తెలికుండా ఆస్తిని గుట్టుచప్పుడు కాకుండా మూడో వ్యక్తి పేరుతో మార్చుకుని కొందరు ప్రయోజనం పొందుతున్నారు. అసలు యజమానుల్ని బెదిరించి డబ్బులు వసూలు చేయడం, ఆస్తిపన్ను పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించి న్యాయవివాదాలు సృష్టించడం, తప్పుడు పత్రాలతో ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు, బ్యాంకులు, చిట్‌ఫండ్ కంపెనీల వద్ద హామీలుగా చూపి రుణాలు తీసుకోవడం చేస్తున్నారు. ఇలా రూ.కోట్ల కుంభకోణానికి పాల్పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని రకాల కేసుల్లో జైలుకెళ్లాను కోర్టుకు ఇచ్చే హామీ పత్రాలుగానూ వీటిని వినియోగిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఇలా చేయాలి మార్పు

ఒక వ్యక్తి ఆస్తిని ఇతరుల పేరుతో మార్చాలంటే డాక్యుమెంట్, లింకు డాక్యుమెంట్లు, ఈసీ, మార్కెట్ విలువ, అఫిడవిట్ సమర్పించి విలువ ప్రకారం మ్యుటేషన్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ఆస్తి గల వారు మరణిస్తే వారసుల పేరుతో పన్ను పత్రాలు మారుస్తారు. ఇందుకు మరణ ధ్రువీకరణపత్రం, రెవెన్యూ అధికారుల నుంచి కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం అందజేయాలి. అధికారులు పరిశీలించి సక్రమంగా ఉంటే పన్ను పత్రాల్లో పేరు మారుస్తారు. కడపలో మాత్రం ఇవేవీ లేకుండానే ఆస్తులను ఇతరుల పేర్లతో మార్చేస్తున్నారు.

సిబ్బంది ప్రమేయంపై అనుమానాలు

కేఎంసీలో కమిషనర్, ఇతర ఉన్నతాధికారుల ప్రమేయం లేకుండా కొందరు కంత్రీ సిబ్బంది ఆస్తి పన్ను పత్రాల్లో పేరు మారుస్తున్నట్లు తెలుస్తోంది. సచివాలయ పరిధిలోని అధికారుల లాగిన్ వివరాలు తెలిసిన వారు ఈ ప్రక్రియ సాగిస్తున్నట్లు సమాచారం. పన్ను పేరు మార్చడానికి అవసరమైన కోడింగ్ డీకోడింగ్ అంశాల్లో నిపుణులైన వారే ఈ పని చేయగలరని పలువురు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ విషయమై లోతుగా విచారణ చేపట్టాల్సి ఉంది. లేకుంటే అసలు వ్యక్తుల ఆస్తులు ఎసరు వాటిల్లే ప్రమాదముంది.

పేదల ఇంట్లో రాయితీ వెలుగులు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే

గతేడాది ప్రారంభించిన దీపం 2.0లో నాలుగు నెలలకు ఒకసారి ఉచితంగా గ్యాస్ సిలిండర్ అందిస్తున్నారు. రాయితీ సొమ్మును లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తోంది. జిల్లాలో ఈ ఏడాది ఫిబ్రవరి 16వ తేదీ వరకు నాలుగు విడతల్లో సుమారు 14.39 లక్షల గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయగా 94.36 శాతం మందికి రాయితీ అందింది.

● జమ కాకుంటే.. సిలిండరు ఏ కంపెనీకి చెందిందో ఆ ఏజెన్సీ కార్యాలయంలో ఈకేవైసీ చేయించుకోవాలి. తర్వాత లబ్ధిదారులు తమ ఖాతా ఉన్న బ్యాంకుకు వెళ్లి ఎన్‌పీసీఐ మ్యాపింగ్ చేస్తారు. ఈ ప్రక్రియ మొత్తం పూర్తి చేసుకున్న వారికి వెంటనే రాయితీ నగదు ఖాతాల్లో జమ అవుతుంది. అదంతా పూర్తి చేసుకున్నా కాలేదంటే 1967 టోల్‌ఫ్రీ నంబరును సంప్రదించొచ్చు.

● విడత	● లబ్ధిదారులు	● రాయితీ(రూ. కోట్లల్లో)
మొదటి	3,84,087	29.87
రెండో	3,62,336	29.62
మూడో	3,72,880	30.80
నాలుగో	3,20,193	21.15

కల్యాణ ఉత్సవం.. కనులపండువగా నిర్వహిద్దాం

కల్యాణ వేదిక ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేఈవో వీరబ్రహ్మం. పక్కన సీఈ సత్యనారాయణమూర్తి, ఎస్‌ఈ మనోహరం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయంలో శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేలా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తితిదే సంయుక్త కార్యనిర్వహణాధికారి వల్లూరు వీరబ్రహ్మం తెలిపారు. నిత్యాన్నదానం కేంద్రం, పుష్కరిణి, కల్యాణ వేదికను బుధవారం పరిశీలించారు. విభాగాల వారీగా సమీక్షించారు. ఇవీ ఆ వివరాలు.

● జిల్లా అధికారులతో కలిసి తితిదే యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలి. ● సామాన్యుల నుంచి ప్రముఖుల వరకు అందరి మది మురిసేలా, సంతృప్తి చెందేలా మెరుగైన సేవలు దిద్దాం. ● ఏర్పాట్లలో రాజీపడొద్దు. ● వేసవి తాపం నుంచి ఉపశమనానికి చలువ పందిళ్లు వేయాలి. ● తాగునీరు, మజ్జిగ, ప్రసాదాల వితరణ, అన్నదానంలో కొరత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ● ఉత్సవాల నేపథ్యం, ప్రత్యేకతలపై విస్తృత ప్రచారం చేపట్టాలి. ● ఉత్సవాల్లో ఎలాంటి తోపులాటలు, తొక్కిసలాటలకు తావు లేకుండా ఏర్పాట్లు పటిష్ఠంగా ఉండాలి.

నందలూరు.. బరితెగించిన వైకాపా నేతలు

ఈనాడు, కడప: నందలూరులో కొందరు భూ బకాసురుల అవతారమెత్తారు. వైకాపా అధికారంలో ఉండగా ఇష్టారీతిన వ్యవహరించారు. ప్రభుత్వ, అటవీ భూముల్లో పాగా వేశారు. యజమాన్య హక్కులేని లొసుగులను అడ్డుపెట్టుకుని అతి ఖరీదైన భూములను గుటుక్కుమనిపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వారి ఆగడాలు మాత్రం ఆగడం లేదు. పోలీసు, రెవెన్యూ అధికారులు ఇంకా వత్తాసు పలుకుతూనే ఉన్నారు. దీంతో సామాన్యులు బిక్కుబిక్కుమంటూ బతకాల్సిన దుస్థితి తలెత్తింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● లేబాక గ్రామం నుంచి ఓ మామిడి తోటకు రూ.కోటి ప్రజాధనాన్ని వెచ్చించి సిమెంట్ రోడ్డు నిర్మించారు. వైకాపా కుటుంబానికి చెందిన ఓ వ్యక్తికి మాత్రమే ఉపయోగపడే ఈ రహదారికి.. అన్నమయ్య జిల్లాలో ఉండగా నిధులు కేటాయించారు.

● ఆ పేదరాలి పేరు నీలమ్మ. తెదేపా సానుభూతిపరురాలు. నందలూరు మండలం కొత్త తిమ్మరాజుపల్లెలోని రెండు సెంట్ల విస్తీర్ణంలో ఇంటి నిర్మాణం చేపట్టింది. ఇంకా మిగిలిన 1.57 ఎకరాలపై వైకాపా నేతల కన్నుపడింది. ఇంటి నిర్మాణం చేపడితే ఆటంకంగా ఉంటుందనే కారణంతో యంత్రంతో కూల్చేశారు. బాధితురాలు ఫిర్యాదు చేయగా పోలీసులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సదరు పోలీసు అధికారి సెలవు పెట్టి వెళ్లిపోవడం గమనార్హం.

● నల్లతిమ్మయ్యపల్లె రెవెన్యూ గ్రామంలోని ప్రభుత్వ భూములను వైకాపా నేతలు కొందరు ఆక్రమించుకుని కాజేశారు. ఫోర్జరీ పత్రాలు, అక్రమ మ్యుటేషన్లు, నిబంధనలకు వ్యతిరేకంగా ఫ్రీహోల్డ్ చేయించుకున్నారు. ఆక్రమించుకోవడంతో పాటు అమ్మకాలు సైతం చేపట్టారు.

● నందలూరు మండలంలో ఓ కీలక ప్రజాప్రతినిధి, మాజీ ప్రజాప్రతినిధి చేతిలో వందల ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. అన్నమయ్య జిల్లాలో ఆ మండలం ఉండగా అప్పటి కలెక్టర్ అక్రమార్కులకు నోటీసులు జారీ చేశారు. ఆ తర్వాత ఈ వ్యవహారం మరుగున పడింది.

ఉల్లాస్.. ఆమెకు బతుకు పాఠాల్!

ప్రొద్దుటూరు పట్టణ మహిళలకు అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న మెప్మా సంచాలకులు మహాలక్ష్మి, వయోజన విద్యా ఉప సంచాలకుడు వెంకట సుబ్బారెడ్డి

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ స్వయం సహాయక సంఘాల్లోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి కేంద్ర సహకారంతో కూటమి ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. మహిళలకు అవగాహనతో పాటు చదువు ద్వారా ఓ గుర్తింపునివ్వడమే లక్ష్యంగా నిర్ణయించింది. అందుకు అనుగుణంగానే జిల్లా యంత్రాంగం కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని ముందుకు సాగుతోంది.

ఇవీ నేర్పే అంశాలు: సంతకాలకే పరిమితం కాకుండా బ్యాంకు లావాదేవీల సమయంలో ధ్రువీకరణ పత్రం చదవడం, డబ్బులు తీసుకునేందుకు దరఖాస్తులను రాయడం, చెక్‌బుక్కును నింపడంపై శిక్షణ ఇస్తారు. ● బస్సులపై ఉన్న ఊర్ల పేరు చదవడం నేర్పుతారు. ● కూడికలు, తీసివేతలు, భాగాహారాలు, తెలుగులో చదవడం, రాయడం వంటి అంశాలను సాధన చేయిస్తారు.

బద్వేలు	జమ్మలమడుగు	కడప	కమలాపురం	మైదుకూరు	ప్రొద్దుటూరు	పులివెందుల	రాజంపేట
1,433	1,072	9,355	447	1,137	4,183	853	3,236

శనగకు కనీస మద్దతు ధర రూ. 5,875

ఈనాడు, కడప: జిల్లాలో మార్క్‌ఫెడ్ ద్వారా శనగల కొనుగోలును గురువారం నుంచి చేపట్టనున్నట్లు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. కడప కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో జేసీ నిధి మీనాతో కలిసి ఆయన మాట్లాడారు. ఇవీ ఆ విశేషాలు... ● జిల్లాలో ఎన్నడూలేనంతగా 80,103 హెక్టార్లలో శనగను ఈ సారి రైతులు సాగు చేశారు. ● వాతావరణం అనుకూలించడంతో దిగుబడి బాగా పెరిగింది. ●తొలుత పులివెందుల, తొండూరు, ముద్దనూరు, ప్రొద్దుటూరు, కమలాపురంలో కొనుగోలు కేంద్రాలు తెరుస్తాం. క్వింటాలుకు రూ. 5,875 చెల్లిస్తాం. ● రైతులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ● పంట తీసుకురావాల్సిన సమాచారాన్ని చరవాణులకు సంక్షిప్త/ వాట్సప్ సందేశం ద్వారా అందిస్తాం. ● కొనుగోలు చేసిన 15 రోజుల్లో నగదు చెల్లిస్తాం. ● తేమశాతం 14% లోపు ఉండేలా ఆరబెట్టాలి. సొంత గోనె సంచుల్లో పంట తీసుకురావాలి. ● సరఫరా, లోడింగ్ వ్యయాన్ని రైతులే భరించాలి.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జేసీ నిధి మీనా

మార్చి 11న వైవీయూ స్నాతకోత్సవం

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: కడప యోగి వేమన విశ్వవిద్యాలయ(వైవీయూ) స్నాతకోత్సవం మార్చి 11న నిర్వహించేందుకు గవర్నర్ కార్యాలయం నుంచి అనుమతి లభించిందని వీసీ ఆచార్య బెల్లం కొండ రాజశేఖర్ తెలిపారు. వైవీయూలో కోర్ కమిటీ సభ్యులతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ఒకే వేదికపై 11, 12, 13, 14వ స్నాతకోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 13,399 మంది విద్యార్థులకు పట్టాలు, ప్రతిభావంతులకు బంగారు పతకాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు స్నాతకోత్సవ పనులను వేగవంతం చేయాలని కమిటీ సభ్యులైన కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కేఎస్‌వీ. కృష్ణారావు, ప్రొఫెసర్లు జయచంద్రారెడ్డి, రఘునాథ్ రెడ్డి, దాము, నజీర్ అహ్మద్, విజయలక్ష్మిలకు సూచించారు.

ఆర్టీసీకి మహా ఆదాయం

కిక్కిరిసిన ప్రయాణికులు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: మహా శివరాత్రిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఈ నెల 15, 16 తేదీల్లో మొత్తం 317 ప్రత్యేక బస్సులను అధికారులు నడిపారు. పొలతల, నిత్య పూజకోనతో పాటు పలు శైవక్షేత్రాలకు వీటిని ఏర్పాటు చేశారు. ఏడు డిపోల పరిధిలో నడిపిన ప్రత్యేక బస్సు సర్వీసులతో ఆర్టీసీకి రూ. 1,11,31,086 ఆదాయం వచ్చినట్లు ప్రాంతీయ అధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. రెండు రోజుల పాటు 1,46,077 కిలో మీటర్లు తిప్పగా.. కిలో మీటరుకు రూ. 76.20 వచ్చిందని, 131 ఓఆర్ వచ్చిందని వివరించారు. అత్యధికంగా కడప డిపో పరిధిలో 107 బస్సులను నడపడంతో రూ. 41,92,902, జమ్మలమడుగు డిపో పరిధిలో కేవలం 10 బస్సులనే తిప్పడంతో రూ.1,19,990 ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

డిపో	బస్సులు	ఆదాయం (రూ.లక్షల్లో)
కడప	107	41,92,902
బద్వేలు	47	17,03,345
పులివెందుల	35	10,65,963
ప్రొద్దుటూరు	44	12,29,462
మైదుకూరు	32	13,06,780
జమ్మలమడుగు	10	1,19,990
రాజంపేట	42	15,12,644

గంగమ్మ అనుగ్రహానికి తరలిన భక్తజనం

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా అనంతపురం గంగమ్మ జాతర భక్తజన సంద్రంగా మారింది. బుధవారం నాటి నిండు జాతరకు పెద్దఎత్తున భక్తులు తరలి వచ్చారు. అమ్మవారి అనుగ్రహం, మాతృత్వాన్ని ప్రసాదించాలని పలువురు వరపడి ప్రార్థించారు. బోనాలు సమర్పించారు. గంగమ్మా.. అనుగ్రహించమ్మా అంటూ వేడుకున్నారు. తొలుత అమ్మవారిని పుట్టినిల్లయిన లక్కిరెడ్డిపల్లె మండల కుర్నూతల పంచాయతీ చాగలగుట్టపల్లె నుంచి తోడ్కొని వచ్చారు. వీరబల్లి, వేంపల్లె, చక్రాయపేట, వేముల, సుండుపల్లె, సంబేపల్లె తదితర మండలాల నుంచి చాందినీ బండ్లు జాతరకు పెద్దఎత్తున చేరుకున్నాయి.

పుట్టకుండానే చిదిమేస్తున్నారమ్మా!

కాసులకు కక్కుర్తి పడుతున్న ఆసుపత్రులు

జిల్లాలో యథేచ్ఛగా లింగ నిర్ధారణ పరీక్షలు

● మైలవరం మండలానికి చెందిన ఓ వ్యక్తికి ఇద్దరు ఆడపిల్లలు. మూడోసారి ఆయన భార్య గర్భం దాల్చడంతో స్కానింగ్ చేయించాడు. ఆడపిల్లనడంతో గర్భవిచ్ఛిత్తికి పాల్పడ్డాడు.

● జమ్మలమడుగుకు చెందిన దంపతులు ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి లింగ నిర్ధారణ చేయించుకున్నారు. మగ పిల్లవాడని చెప్పి తమ ఆసుపత్రిలోనే కాన్పు చేయించుకోవాలని వైద్యులు ఒత్తిడి తెచ్చారు.

● ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో రూ.5 వేలు తీసుకుని లింగ నిర్ధారణ పరీక్ష చేస్తున్నారు. ఆడపిల్ల అయితే లక్ష్మీదేవి, మగపిల్లాడైతే వేంకటేశ్వర స్వామి చిత్రపటాల వైపు చూస్తూ సైగల ద్వారా ఆ దంపతులకు కలిగేది ఎవరో సూచిస్తున్నారు.

జమ్మలమడుగు, న్యూస్‌టుడే

లింగ నిర్ధారణ పరీక్ష చేయడం చట్టరీత్యా నేరం. స్కానింగ్ చేసినట్లు నిర్ధారణ అయితే రూ. 50 వేల జరిమానాతో పాటు ఆసుపత్రినీ సీజ్ చేస్తారు. జమ్మలమడుగు, ప్రొద్దుటూరుతో పాటు జిల్లాలో పలు చోట్ల లింగ నిర్ధారణ పరీక్షలు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. ఆడపిల్ల అని తెలియగానే తల్లి గర్భంలోనే చిదిమేస్తున్నారు. కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో కాసుల కోసం కక్కుర్తి పడి ఈ అమానుషానికి పాల్పడుతున్నారు. ఆడ శిశువును అమ్మ కడుపులోనే అంతం చేస్తే శిశువుల లింగ నిష్పత్తి దారుణంగా పడిపోయే ప్రమాదం ఉందని వైద్యాధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా.. గర్భస్రావం చేయించుకుంటే తిరిగి గర్భం దాల్చే అవకాశాలు తక్కువగా ఉంటాయని వైద్యులు హెచ్చరిస్తున్నా పట్టించుకోకపోవడం విచారకరం.

లింగ నిర్ధారణ పరీక్షల కట్టడిపై వైద్యులకు సూచనలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత

ఆధారాలతో పట్టుకుంటాం: లింగ నిర్ధారణ చేయడం నేరం. చేసినట్లు తేలితే జరిమానాతో పాటు జప్తు చేస్తాం. ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లకు వెళ్లి తనిఖీలు చేస్తున్నాం. జమ్మలమడుగు, ప్రొద్దుటూరులో కొన్ని ఆసుపత్రుల్లో లింగనిర్ధారణ చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. పూర్తిస్థాయి ఆధారాలతో పట్టుకుని సీజ్ చేస్తాం.
- డాక్టర్ గీత, డిప్యూటీ డీఎంహెచ్‌వో, జమ్మలమడుగు

25 కొత్త పంచాయతీలకు ప్రతిపాదనలు

గోపవరం, న్యూస్‌టుడే: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం దిశగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది. కొత్త పంచాయతీలు ఏర్పాటు చేసి గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందించాలని నిర్ణయించింది. ఏళ్లుగా ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులను దృష్టిలో పెట్టుకుని ఏర్పాటుకు ప్రతిపాదనలు కోరింది. ఈ మేరకు ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేయడంతో జిల్లా నుంచి 25 వరకు ప్రతిపాదనలు వెళ్లాయి. ● పంచాయతీ కేంద్రాలకు దూరంగా ఉన్న గ్రామాల ప్రజల నుంచి పంచాయతీల డిమాండ్ ఎక్కువగా వినిపించింది. ● దశాబ్దాలుగా అభివృద్ధికి నోచక, మౌలిక వసతులు సమకూరక తాము ఇబ్బందులు పడుతున్నామని అక్కడి వాసులు వినతుల్లో పేర్కొన్నారు. తమ పల్లెలను కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేసి నిధులు కేటాయిస్తే సమస్యలు పరిష్కారమవుతాయని విన్నవించారు.

నియోజకవర్గం	కడప	పులివెందుల	ప్రొద్దుటూరు	మైదుకూరు	జమ్మలమడుగు
సంఖ్య	03	06	04	02	10

మా ఆత్మవిశ్వాసం.. శిఖర సమానం

గండికోటలో సాహస కృత్యాల శిక్షణ

జమ్మలమడుగు, జమ్మలమడుగు గ్రామీణ: గండికోట సాహస కృత్యాలకు వేదికగా మారింది. ఇక్కడి లోయలో తెలంగాణకు చెందిన విద్యార్థులు అయిదు రోజులపాటు శిక్షణ పొందుతున్నారు. నేల, నీరు, ఆకాశంలో చేసే సాహస కృత్యాలను తెలుసుకుంటున్నారు. వీరికి పదమూడేళ్ల వయసులోనే ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన పూర్ణ మలావత్ ముఖ్య అతిథిగా హాజరై మెలకువలు నేర్పించారు. పెన్నా లోయలో హైరోప్, రాపెల్లింగ్, ట్రెక్కింగ్, జిప్‌లైన్ వంటి అంశాలపై వివరించారు.

జిప్‌లైన్‌పై శిక్షణ ఇస్తున్న పర్వతారోహకురాలు పూర్ణ

భవిష్యత్తుకు ఉపయోగం: గండికోట గురించి చాలాసార్లు విన్నాం. ఇప్పుడు సాహస క్రీడల కోసం ఇక్కడికే రావడం ఆనందంగా ఉంది. అయిదు రోజుల శిక్షణలో రాపెల్లింగ్, ట్రెక్కింగ్ వంటి సాహస కృత్యాలు చేశాం. క్రీడలతో పాటు లీడర్‌షిప్, టీం స్పిరిట్ గురించి ఎవరెస్టు అధిరోహకురాలు పూర్ణ చక్కగా వివరించారు. ఇవన్నీ భవిష్యత్తులో ఉపయోగపడేవే. - రమ్య

శారీరకంగా, మానసికంగా బలం: చదువుకుంటేనే ఉద్యోగాలు వస్తాయని తెలుసు. అయితే సాహస క్రీడలతోనూ మంచి ఉద్యోగాలు పొందొచ్చని ఇక్కడికి వచ్చిన తర్వాతే తెలిసింది. ఇక్కడి శిక్షణ శారీరకంగా, మానసికంగా బలంగా మార్చింది అడ్వెంచర్ కార్యకలాపాల ద్వారా నాయకత్వం, నిర్ణయాలు తీసుకోవడం ఆత్మవిశ్వాసాన్ని నేర్చుకున్నాం. - అక్షర

నీటిలో సాహస విన్యాసాలు ఇష్టం: నాకు నీటిలో సాహస విన్యాసాలు చేయడం అంటే ఇష్టం. ఇక్కడి పెన్నాలోయ మమ్మల్ని కట్టిపడేసింది. నీటిలో చేసే స్కూబా డైవింగ్ వల్ల జలచరాల గురించి తెలుసుకోవచ్చు. అయిదు రోజుల శిక్షణ ద్వారా ఉద్యోగ అవకాశాలు ఎలా పొందాలో తెలుసుకున్నాం. - వినయ్

శిక్షణతో నాయకత్వ లక్షణం : అయిదు రోజుల శిక్షణ మాకు రాక్ క్లైంబింగ్, ట్రెక్కింగ్‌తో పాటు ఔట్‌డోర్ నాయకత్వం గురించి అడ్వెంచర్స్ స్పోర్ట్స్ అకాడమీ మాకు నేర్పింది. ట్రైనర్లు... సాహస క్రీడలను ప్రొఫెషనల్ కెరీర్‌గా ఎలా మార్చుకోవచ్చో వివరించారు. నాకు పర్వతాలు ఎక్కడం అంటే ఆసక్తి, అటువైపే నేను ఎక్కువగా మెలకువలు నేర్చుకుంటున్నాను. - జీవన్

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి : 99899 97626

(c) eenadu

మాతృ మరణాల బాధ్యులపై చర్యలు

జిల్లా సచివాలయం: గర్భిణుల ప్రసవ సమయంలో వారి ఆరోగ్య పరిస్థితులపై వైద్యులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం కడప కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖాధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుఖ ప్రసవాలయ్యేందుకు వైద్యులు నిత్యం గర్భిణుల ఆరోగ్యాన్ని పర్యవేక్షణ చేయాలన్నారు. మాతృ మరణాలపై పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం ప్రైవేటు ఆసుపత్రుల్లో సుఖ ప్రసవాలకంటే సిజేరియన్ ఆపరేషన్లు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. సిజేరియన్ ఆపరేషన్లు, మాతృ మరణాలపై కారణాలను సమీక్షించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో నాగరాజు, డీఐవో ఉమామహేశ్వరరావు, జీజీహెచ్ పర్యవేక్షకులు వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ హిమదేవి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, చిత్రంలో డీఎంహెచ్‌వో నాగరాజు, అధికారులు

కలుషిత ఆహారం కట్టడికి విస్తృత తనిఖీలు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలో కలుషిత ఆహారం నుంచి ప్రజలను రక్షించేందుకు ఫుడ్ సేఫ్టీ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ శ్రీధర్ ఆదేశించారు. బుధవారం కడప కలెక్టరేట్‌లో ఆయన జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు వసతి గృహాలు, హోటళ్లు, స్ట్రీట్ ఫుడ్ సెంటర్లలో తనిఖీలు చేపట్టి ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, డీఎంహెచ్‌వో నాగరాజు, అన్ని మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ● పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లోని వీసీహెచ్ఎస్ భవనంలో పరిశ్రమల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆన్‌సైట్, ఆఫ్‌సైట్‌లో అలారం వ్యవస్థను ఏర్పాటు చేయాలని, పరిశ్రమలోనే కాకుండా పరిశ్రమల బయట కూడా ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. పరిశ్రమల్లో రక్షణ, భద్రత, అత్యవసర వ్యవస్థ, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన అంశాలపై కాలుష్య నియంత్రణ, పరిశ్రమల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిష్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032. వెబ్‌సైట్: www.shriramfinance.me.
బ్రాంచ్ కార్యాలయము : డి.నెం.42/107-1, ఓబుల్ రెడ్డి కాంప్లెక్స్, అప్సర సర్కిల్, జయనగర్ కాలనీ,కడప

డిమాండ్ నోటీసు

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా ఉండి శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ లిమిటెడ్‌తో విలీనమైన తరువాత ఎన్‌సిఎల్‌టి బెంచ్-2 చెన్నై తేది: 09.11.2022వారి ఆదేశాలతో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా రూపాంతరం చెందిన తర్వాత కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వ శాఖ లేఖ తేది: 30.11.2022 ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరు మార్పునకు ఆమోదము లభించినది) ఈ కంపెనీ కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిష్టరు కాబడినది మరియు ఆర్‌బిఐ నందు కూడా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుటకు రిజిష్టరు కాబడి వారి **రిజిష్టరు కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 నందు సమోదు కాబడినదని తెలియజేయడమైనది. బ్రాంచ్ కార్యాలయము: కడప-2 (ఇకపై కంపెనీ / లెండర్‌గా వ్యవహరించబడతారు)**

ఈక్రింద పేర్కొన్న రుణగ్రహీత /సహరుణగ్రహీతలు / గ్యారంటీదారులు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎల్) వారి వద్ద రుణ సౌకర్యము పొంది ఉన్నారు. రుణ సౌకర్యము పొందిన తర్వాత సదరు రుణగ్రహీతలు/ గ్యారంటీదారులు రుణము మరియు దానిపై వడ్డీని తిరిగి చెల్లించుటలో పలుమార్లు విఫలమైనారు.కావున సదరు అకౌంట్ రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నియమ నిబంధనలు అనుసరించి నిరర్థక ఆస్తులుగా వర్గీకరించబడినది. తదుపరి శ్రీరామ్‌ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎల్) యొక్క అధీకృత అధికారి గారు సెక్యూరిటీ మరియు ఆర్థిక ఆస్తుల పునర్నిర్మాణం మరియు భద్రతా చట్టం, 2002 నిబంధన క్రింద సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (సదరు యాక్ట్) మరియు దాని ద్వారా ఆపాదించబడిన అధికారాలను బట్టి రూలు 3తో చదువబడిన సెక్షన్ 13(2) ప్రకారం సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నియమాల (పేర్కొన్న నియమాలు) ను అనుసరించి ఋణగ్రహీత / గ్యారంటీదారులు /తనఖాదారులకు డిమాండ్ నోటీసును మరియు దానిపై అంగీకరింపబడిన వడ్డీ రేటుతో పాటు ఉత్పన్నమగు ఖర్చులు, ఇతర ఛార్జీలను నోటీసు అందుకున్న 60 రోజులలోపు చెల్లించవలసినదిగా కోరి వున్నారు.

వారు చివరగా తెలిపిన అడ్రసుకు జారీ చేసిన సదరు నోటీసు వారికి చేరక రిటర్న్ అయినది. కావున ఇందుమూలముగా పబ్లిక్ నోటీసు ద్వారా వారికి సదరు విషయము తెలియజేయడమైనది. సదరు చట్టములో సెక్షన్ 13 యొక్క సబ్‌సెక్షన్(8) ద్వారా రుణగ్రహీతకు తెలియజేయడమేమనగా సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు గల అవకాశమును వారి దృష్టికి తీసుకురావడమైనది.

రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు, గ్యారంటీదారుల పేర్లు మరియు చిరునామా

1) **జగన్‌మోహన్‌రెడ్డి మేకల** తండ్రి ఓబుల్‌రెడ్డి, డి.నెం.2/693, భాకరాపేట, ప్రకాష్‌నగర్, ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516360, సెల్: 8074388400, 9441155848
2) **చదిపిరాళ్ళ శివనారాయణరెడ్డి,** తండ్రి శివశంకర్, డి.నెం.2/60, దేవగుడి, జమ్మలమడుగు, కడప జిల్లా - 516434, ఫోన్: 9849952792
3) **మల్లిరెడ్డి మధుసూదన్‌రెడ్డి,** తండ్రి వీరసుబ్బారెడ్డి, డి.నెం.3/125, పుల్లారెడ్డి పేట, తప్పెట్ల వల్లూరు, కడప జిల్లా - 516293, ఫోన్: 77022 22006
4) **గొడుగు వెంకట సుధాకర్,** తండ్రి గొడుగునాగప్ప, డి.నెం.3/610 మిద్దెపైన, వై.ఎం.ఆర్. కాలనీ, ప్రొద్దుటూరు, కడప- 516361, ఫోన్: 98496 52419

ఎన్‌పిఏ తేది: 08.07.2025 **డిమాండ్ నోటీసు తేది: 14.01.2026**
ఋణ మొత్తం రూ.95,00,000 (తొంభై ఐదు లక్షల రూపాయలు మాత్రమే)
రుణఅగ్రిమెంట్ నెం. CUDP4TF2101300004
బకాయి అమౌంట్: రూ.36,97,066/- (ముప్పై ఆరు లక్షల తొంభై ఏడు వేల అరవై ఆరు రూపాయలు మాత్రమే)

స్థిరాస్తి వివరములు

వైయస్.ఆర్.కడపజిల్లా, ప్రొద్దుటూరు రిజిస్ట్రేషన్ జిల్లా, కమలాపురం సబ్ జిల్లా, యర్రగుంట్ల మండలం, యర్రగుంట్ల నగర పంచాయతీ, యర్రగుంట్ల గ్రామలెక్కదాఖలా, వార్డునెం.2, డి.నెం.2-1-474-2, మహేశ్వర నగర్ ఇంటీరియర్ ఏరియా, సర్కారు మెట్ట డి.నెం.662 లో ఎ.3.57 సెంట్లు ఇందున ఎ.0.70 సెంట్లలో ఎ.0.39సెంట్లు లేదా 1887.6 చ.గ. స్థలం మరియు ఇందున నిర్మించిన డి.నెం.2-1-474-2 గల ఏసిసి షెడ్డు. హద్దులు: తూర్పు:గడిసె మోహన్‌రెడ్డి మరియు ఇతరుల స్థలం, పడమర: సిమెంటు రోడ్డు, ఉత్తరం: శైలజ మరియు ఉపేంద్ర స్థలం, దక్షిణ: రోడ్డు. ఈ హద్దుల మధ్య తూర్పు నుండి పడమర: 72.6 అ. లేదా 22.1మీ, ఉత్తరం నుండి దక్షిణం: 215 అ. లేదా 65.6మీ. వెరశి ఎ.0.35 3/4 సెంట్లు గల చతుర్భుజాకారంలో వున్న స్థలం మరియు ఇందుకు దక్షిణం వైపు స్థలానికి కొలతలు: తూర్పు వైపు 39అ. లేదా 11.9 మీ. పడమర వైపు 0అ., ఉత్తరం వైపు: 72.6అ. లేదా 22.1 మీ. మరియు దక్షిణం వైపు: 83అ. లేదా 25.3మీ. వెరశి ఎ.0.03 1/4 సెంట్లు గల త్రిభుజాకారంలోని స్థలం పై రెండు స్థలాల యొక్క పూర్తి విస్తీర్ణం ఎ.0.39 సెంట్లు, ఏసిసిషెడ్డు, దారిహక్కు మరియు అన్ని ఈజ్‌మెంటరీ హక్కులతో సహా.

ఈ పరిస్థితులలో రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు మరియు గ్యారంటీదారులకు తెలియజేయడమేనగా ఈ పత్రికా ప్రకటన వెలువడిన రోజు నుండి 60 రోజులలోపు పైన పేర్కొన్న ఋణ మొత్తము భవిష్యత్ వడ్డీతోపాటు మరియు ఇతర ఖర్చులను చెల్లించవలెను. 60 రోజుల వ్యవధి దాటిన తర్వాత సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 యొక్క సెక్షన్ 13(4)ను అనుసరించి రుణగ్రహీత, తనఖాదారుకు చెందిన సెక్యూర్డ్ ఆస్తులను స్వాధీన పరచుకొనుటకు చర్యలు చేపట్టబడునని తెలియజేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్13(13)ను అనుసరించి రుణగ్రహీతకు చెందిన సెక్యూర్డ్ ఆస్తులపై మా సంస్థ ముందస్తు అనుమతి లేకుండా ఇతరులకు బదలాయించుట, అమ్మకము మరియు లీజుకు ఇవ్వడం ఇంకా ఏ ఇతర లావాదేవీలు చేయరాదని తెలియజేయడమైనది.

ప్రదేశం: కడప **సం/- అధీకృత అధికారి,**
తేది: 16.02.2026 శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఆర్.ఓ.సి. నెం. 70/2025/A1

బద్వేలు పురపాలక సంఘము
తేదీ : 18.02.2026

బహిరంగపు వేలపు ప్రకటన

బద్వేలు పురపాలక సంఘమునకు చెందిన కూరగాయల మార్కెట్టు గేటు, మాంసం, చేపల మార్కెట్టు మరియు మేకలు మరియు పొట్టేల సంత 2026-27 సంవత్సరమునకు అనగా 01.04.2026 నుండి 31.03.2027 తేదీ అర్ధరాత్రి వరకు గౌరవ జిల్లా కలెక్టర్ వారి గజిట్ నెం:48/2026, తేదీ: 13.02.2026 ప్రకారము ఫీజులు వసూలు చేసుకొనే గుత్త హక్కులను తేదీ: 26.02.2026 గురువారం ఉదయము 11.00 గం॥లకు మునిసిపల్ ఆఫీసు ఆవరణలో కమిషనరు వారిచే గానీ, అధికారము పొందిన వారిచే గానీ బహిరంగవేలము వేయబడును. అవసరమగుచో తదుపరి దినములలో కూడా వేలము వేయబడును. ఈ వేలము 1965 సంవత్సరపు ఆంధ్రప్రదేశ్ మునిసిపాలిటీల చట్టము మరియు విధులు వేలపు ప్రకటనలోని షరతులు మరియు ఆస్తుల షెడ్యూలుకు లోబడి యుండవలెను. గుత్తల వేలము విడివిడిగా వేయబడును. ధరావతు బ్యాంకు డి.డి./ నగదు డిపాజిట్ రూపములో చెల్లించి, వేలములో పాల్గొనవలెను. వేలములో పాల్గొను వారు ఈ ప్రకటన షరతులకు లోబడి వేలములో పాల్గొనవలెను. వేలమునకు పాల్గొనువారు వేలమునకు ముందు వేలపు షరతులు పూర్తిగా అంగీకరించినట్లు వ్రాతమూలకముగా కమిషనరు గారికి తెలుపవలెను. వేలము వేయబడు గుత్తలు వేలమునకు ముందుగా ఈ క్రింద తెలిపిన మొత్తము వేలము డిపాజిట్లు చెల్లించి వేలంపాటలో పాల్గొనవలెను.

వ. నెం.	గుత్త వివరములు	గుత్త కాలము	వేలమునకు ముందు కట్టవలసిన ధరావతు (డి.డి./నగదు)	కమిషనరు/మండల రెవిన్యూ అధికారి గారిచే జారీ చేయబడిన సాల్వెన్సీ పత్రము/ బ్యాంకు గ్యారంటీ	కేంద్ర ప్రభుత్వ సేవా పన్ను ప్రభుత్వము వారి ఉత్తర్వుల మేరకు అప్పటికి అమలులో ఉన్న పర్సంటేజి ప్రకారము
1	కూరగాయల మార్కెట్టు మరియు గేటు	01.04.2026 నుండి 31.03.2027 వరకు	15,00,000/-	10,00,000/-	18% (హెచ్చుపాటపై)
2	మాంసం, చేపల మార్కెట్		1,00,000/-	3,00,000/-	18% (హెచ్చుపాటపై)

సదరు వేలంలో పాల్గొనువారు తేదీ: 25-02-2026 సాయంత్రం 5:00 గం.ల లోపు సాల్వెన్సీ సర్టిఫికేట్‌తో పాటు **"కమిషనరు, బద్వేలు మునిసిపాలిటీ"** పేరు మీద డిమాండు డ్రాఫ్ట్(DD) చెల్లించి, చెల్లించిన ధరావతు మేరకు పాటలో పాల్గొనవచ్చును. ఇతర వివరముల కొరకు మునిసిపల్ ఆఫీసులోని రెవిన్యూ విభాగము నందు A1 గుమస్తా / రెవిన్యూ ఇన్‌స్పెక్టర్‌ను సంప్రదించవలెను.

సం/- **కమిషనర్,** బద్వేలు పురపాలక సంఘము.

గమనిక: బహిరంగ వేలములో పాల్గొనే వారు పురపాలక సంఘమునకు ఎటువంటి బకాయిలు అనగా ఇంటిపన్ను, నీటి పన్ను, అంగళ్ళ పన్నుల బాకీ వుండరాదు. వేలము పాటలో పాల్గొనదలచిన పూర్వపు గుత్తదారులు పురపాలక సంఘమునకు పూర్తి బకాయిని చెల్లించి వేలము పాటలో పాల్గొనవచ్చును.

మంచుకొస్తున్న గడువు తేదీ
కనిపించని పురోగతి

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో రూ.300 కోట్ల వ్యయంతో గ్రామాల్లో చేపట్టిన త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా పనులలో పురోగతి కనిపించడంలేదు. ఆర్డీఎస్ఎస్ పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో 24 గంటల పాటు విద్యుత్తుకు 11 కేవీ, ఎల్టీ లైన్లు, స్తంభాలు, నియంత్రికల ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు ఈ ఏడాది మార్చి చివరి వరకు గడువు విధించారు.

స్తంభాలకు ఏర్పాటు కాని త్రీఫేజ్ విద్యుత్తు తీగలు

★ జిల్లాలో 2023 నుంచి టర్న్ కీ పద్ధతిలో ఆర్డీఎస్ఎస్ పనులను గుత్తేదారు సంస్థ చేపట్టింది. అప్పట్లో అరకొరగా తీగలు, నియంత్రికలు, బ్రేకర్లు, స్తంభాలను ఏర్పాటు చేశారు. ఫలితంగా గ్రామాల్లో విస్తరణ పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం, బలోపేతం ద్వారా స్థానికులకు సుస్థిర ఉపాధి కల్పించాలన్న లక్ష్యం నీరుగారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జమ్మలమడుగు, మైదుకూరు, పులివెందుల, బద్వేలు, కమలాపురం, కడప నియోజకవర్గాల్లో ఆర్డీఎస్ఎస్ పనులు ఊపందుకున్నాయి. కానీ ఏడాదిన్నర తర్వాత ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల పరిధిలో ఆశించిన స్థాయిలో పనులను చేపట్టారు. ★ ఈ విషయమై ఎస్పీడీసీఎల్ జిల్లా ఎస్ఈ రమణ మాట్లాడుతూ వచ్చే నెలలోపు ఆర్డీఎస్ఎస్ పనులు పూర్తయ్యే విధంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

మొత్తం డివిజన్లు	ఆర్డీఎస్ఎస్ ఫీడర్లు	ఇప్పటివరకు పూర్తయినవి	పురోగతిలో ఉన్నవి	ప్రారంభం కానివి
ప్రొద్దుటూరు	84	47	31	06
కడప	66	52	05	09
పులివెందుల	94	81	07	06
మైదుకూరు	148	105	28	15
రాజంపేట	136	99	29	08
రాయచోటి	96	37	36	23

ప్రొద్దుటూరు మండలం చెన్నమరాజుపల్లెలో స్తంభాలకు ఏర్పాటు కాని త్రీ ఫేజ్ విద్యుత్తు తీగలు

మే నెలలో ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి సీఎం భూమి పూజ

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: జిల్లాలోని జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె సమీపాన కన్యతీర్థం వద్ద ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి మేలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భూమి పూజ చేస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు భూపేష్‌రెడ్డి ప్రకటించారు. ఉక్కు కర్మాగారానికి మౌలిక వసతులు కల్పించేందుకు ఈ బడ్జెట్‌లో రూ.25 కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. బుధవారం కడపలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ భారీ బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. రాయలసీమ అభివృద్ధికి సీఎం ప్రత్యేక దృష్టి సారించారని, అందులో భాగంగా హార్టికల్చర్ హబ్‌కు రూ.30 వేల కోట్లు కేటాయించారని, ఇది గ్లోబల్ స్థాయిలో గుర్తింపు పొందుతుందన్నారు. ప్రొద్దుటూరులో యునాని కళాశాల ఏర్పాటుకు రూ.75 కోట్లు కేటాయించారన్నారు. ప్రస్తుతం రాయలసీమలోని అన్ని ప్రాజెక్టుల నిర్మాణం పూర్తికి తెదేపా చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ నెల 22వ తేదీన కడపలో తెలుగుదేశం పార్టీ కార్యాలయ భవనానికి భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత, జోన్-5 బాధ్యులు బీద రవిచంద్ర హాజరవుతున్నారన్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులు విధిగా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్‌రెడ్డి, జీవీవల్లు, జగ్గాడ్, మన్మూరు అక్బర్, చరణ్, నజీముద్దీన్, జయసుబ్బారెడ్డి, యల్లారెడ్డి, సంపత్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు భూపేష్‌రెడ్డి

త్రేతేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

రాజంపేట గ్రామీణ : మండలంలోని హస్తవరం త్రేతేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి రూ.18.72 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో సురేష్‌కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. హుండీ నుంచి రూ. 4,51,284, ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.4,42,000, టెంకాయల వేలం ద్వారా రూ.8,30,000 కల్యాణోత్సవం ద్వారా రూ.1,48,830. మొత్తం రూ. 18.72 లక్షల ఆదాయం వచ్చింది. నిర్వహణ ఖర్చులు మినహాయించి మిగిలిన మొత్తాన్ని బ్యాంకులో ఎఫ్‌డీలు చేస్తామని వెల్లడించారు. ఛైర్మన్ నాగమణి, మాజీ ఛైర్మన్లు నరసింహులు, సుబ్రహ్మణ్యం, పోలీసు, రెవెన్యూ పంచాయతీరాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

జింకలతో రైతులు నష్టపోతున్నారు : పుత్తా

కమలాపురం, న్యూస్‌టుడే : కమలాపురం నియోజకవర్గంలో జింకల బెడద ఎక్కువగా ఉందని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి బుధవారం జరిగిన అసెంబ్లీలో ప్రస్తావించారు. పంటలు వేసిన రైతులు నష్టపోతున్నారు. వాటిని రిలొకేట్ చేసి, సంబంధిత అధికారులు సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

కోడిగుడ్డు బరువు 35 గ్రాములే

● విజిలెన్స్ తనిఖీల్లో వెల్లడి

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే : కడప నగరంలోని ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేసే కోడిగుడ్ల సైజు తగ్గాయని విజిలెన్స్ అధికారి గీతావాణి తెలిపారు. ఒక్కో గుడ్డు 50 గ్రాములుండాలి. కానీ వాటిలో అధికంగా 35 గ్రాముల మాత్రమే ఉన్నట్లు గుర్తించామని ఆమె చెప్పారు. కడప నగరంలోని ప్రధాన ఉన్నత పాఠశాలల్లో బుధవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. పాఠశాల ఆవరణలో ఉన్న స్టోర్ కిచెన్‌ను పరిశీలించారు. అక్కడున్న కోడిగుడ్ల బరువును పరిశీలించారు. ప్రధాన పాఠశాల నుంచి నగరంలోని 13 పాఠశాలలకు మధ్యాహ్న భోజనం సరఫరా అవుతుందన్నారు. అలానే ఆయా వేల గుడ్లు కూడా సరఫరా అవుతాయని, అయితే వాటి గుడ్లు 35 గ్రాములు మాత్రమే ఉన్నాయని వివరించారు. సంబంధిత కాంట్రాక్టరు దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. పిల్లలు తినే గుడ్లలో ఎవరైనా చేతివాటం ప్రదర్శిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ శివన్న, ఏవో లక్ష్మణ్ సిబ్బంది పాల్గొన్నారు.

నగరపాలక ప్రధాన ఉన్నత పాఠశాలలో కోడిగుడ్లను పరిశీలిస్తున్న అధికారులు

అక్షరాస్యత కోసం మరో 'వికాసం'

కమలాపురం : వయోజనులు వంద శాతం అక్షరాస్యత సాధించాలని జిల్లా వయోజన విద్య ఉప సంచాలకులు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో 'ఉల్లాస్- అక్షర ఆంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ..2029 నాటికి రాష్ట్రంలో వయోజనులందరినీ అక్షరాస్యులుగా మార్చడమే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. 15 ఏళ్ళ, అంతకంటే ఎక్కువ వయసు ఉన్న నిరక్షరాస్యులకు ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత, జీవన నైపుణ్యాలను నేర్పిస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాధవీలత, ఏపీవో రమాదేవి, ఎంపీడీవో కిజియా, ఉపాధి ఏపీవో పార్థసారథి, వెలుగు ఏపీఎం గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న జిల్లా వయోజన విద్య ఉప సంచాలకులు వెంకటసుబ్బారెడ్డి, అధికారులు

పూజలందుకున్న గంగమ్మ దేవత

గంగమ్మ.. కరుణించమ్మా

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : కడప నగర శివారులోని సీకేదిన్నె మండలం బుగ్గలేటిపల్లె సమీపాన గంగమ్మ జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. తెల్లవారుజాము నుంచి వేదపండితులచే అమ్మ వారికి అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి గంగమ్మకు బోనాలు, పూలమాలలు, నిమ్మకాయ మాలలు, చీరలు, గాజులు కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు తమ వాహనాలకు వేప కొమ్మలు కట్టుకొని జైజై గంగమ్మ తల్లి అంటూ ఆలయానికి చేరుకున్నారు.

కల్యాణం.. కమనీయం

ఆలయ ఆవరణలో గంగమ్మ దేవత ప్రతిరూపం ఆయన కత్తికి శివుడికి బుధవారం అర్ధరాత్రి తరువాత కల్యాణం నిర్వహించారు. కల్యాణం తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చారు. రాత్రి ఇక్కడే బసచేశారు. వేదపండితులచే కల్యాణం నిర్వహించారు. గురువారం కూడా జాతర జరుగుతుందని ఈవో కృష్ణనాయక్ ఛైర్మన్ మాధవరెడ్డి తెలిపారు. ఉగాది వరకు వచ్చే ఆదివారాల్లో వారాల జాతర జరుగుతుందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు.

రంజాన్ మాసంలో పని వేళల సవరణ

కడప విద్య, న్యూస్‌టుడే : రంజాన్ మాసంలో ఉపవాసం పాటించే విద్యార్థులు, ఉపాధ్యాయుల సౌకర్యార్థం జిల్లాలోని ఉర్దూ మాధ్యమ పాఠశాలల పనివేళలను సవరించినట్లు డీఈవో షంషుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉర్దూ మాధ్యమ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. సవరించిన పని వేళలు రంజాన్ మాసానికి మాత్రమే వర్తిస్తాయన్నారు. రంజాన్ ముగిసిన తరువాత పాఠశాలలు యథావిధిగా సాధారణ వేళల ప్రకారం నిర్వహించాలన్నారు. పదోతరగతి యాక్షన్ ప్లాన్ అమలుకు సంబంధించి ఇబ్బంది కలిగితే తదుపరి వివరాలు తెలియజేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో ఇస్లాం మతాన్ని ఆచరించే ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు రంజాన్ మాసం కాలంలో ప్రతి పనిదినంలో సాధారణ ముగింపు సమయానికి ఒక గంట ముందుగా కార్యాలయాలు, పాఠశాలల నుంచి వెళ్లేందుకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. ఉప, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వ ఆదేశాలను సంబంధిత పాఠశాలల్లో కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.

మార్చి 16 నుంచి పది పరీక్షలు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: మార్చి 16వ తేదీ నుంచి జరిగే పది తరగతి పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా, పక్కాగా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఆదేశించారు. బుధవారం కడప కలెక్టరేట్‌లో పది తరగతి పరీక్షలపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష చేపట్టారు. మార్చి 16వ తేదీ నుంచి ఏప్రిల్ 1 వరకు జరిగే పబ్లిక్ పరీక్షలకు సంబంధించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అంతేకాకుండా మార్చి 2 నుంచి జరిగే ఓపెన్ స్కూల్ పరీక్షలు జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో విద్యా, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుంగిన రహదారి
జాగ్రత్త బాటసారీ

ప్రొద్దుటూరు ఆర్టీసీ బస్టాండు సమీపంలో మైదుకూరు రోడ్డు గుంతలతో అధ్వానంగా మారింది. అధిక లోడు వాహనాల రాకపోకలతో రోడ్డు ధ్వంసమై గుంతలు పడ్డాయి. అప్రమత్తంగా లేకపోతే ప్రమాదం జరిగే అవకాశం ఉందని చోదకులు వాపోతున్నారు.
- ఈనాడు కడప, న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పనుల అడ్డగింత

చాపాడు, న్యూస్‌టుడే: కేతవరం నుంచి పొలాల మీదుగా అల్లాడుపల్లె దేవాలయం వెళ్లే రహదారిలో పెద్ద వంతెన నిర్మించకుండా పనులు చేస్తున్నారని గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం భాజపా మండలశాఖ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, తెదేపా నాయకుడు నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో విజయవాడ-బెంగళూరు రోడ్డు పనులు అడ్డుకుని నిరసన తెలిపారు. ఉన్నతాధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అందరికీ సౌలభ్యంగా ఉండేలా పెద్ద వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు.

నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

అవయవ దానం.. నలుగురి జీవితాల్లో వెలుగులు

వీరపునాయునిపల్లె, న్యూస్‌టుడే: పాయసంపల్లెకు చెందిన రాజశేఖర్‌రెడ్డి దంపతుల కుమార్తె సంగీత (22) అవయవాలను బుధవారం దానం చేశారు. ఈ నెల 15న ప్రమాదవశాత్తు సంగీత జారి కిందపడి మెదడుకు రక్తప్రసరణ ఆగిపోవడంతో బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. యువతి బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు గుర్తించారు. అవయవదానం చేసి తమ బిడ్డను నలుగురిలో చూసుకోవచ్చని తల్లిదండ్రులు గుప్పెడు దుఃఖంలో కుమార్తె కిడ్నీలు, గుండె, కళ్లు, ఊపిరితిత్తులు దానం చేశారు.

సంగీత (పాత చిత్రం)

చిన్నారికి కన్నీటి వీడ్కోలు

వీరబల్లి, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా మదనపల్లెలో జరిగిన హత్యాచార ఘటనలో మృతి చెందిన చిన్నారి అంత్యక్రియలు తల్లిదండ్రులు, బంధువుల రోదనల మధ్య బుధవారం మండలంలోని వారి స్వగ్రామంలో జరిగాయి. బాలిక మృతదేహాన్ని తెదేపా రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం చిన్నారి తల్లిదండ్రులను పరామర్శించారు. ఇలాంటి దుస్థితి మరొకరికి రాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని బాలిక తల్లిదండ్రులు వారిని కోరారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉండి ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రాజంపేట, న్యూస్‌టుడే: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన పట్టణంలోని ఛత్రపతిశివాజీ నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అదే ప్రాంతానికి చెందని నిర్మల ఈ నెల 14న పుల్లంపేటకు వెళ్లారు. బుధవారం ఇంటికి తిరిగొచ్చే సరికి తలుపులు ధ్వంసం చేసి బీరువాలో దాచిన 45 గ్రాముల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారన్నారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని పోలీసులు వివరించారు.

పారిశ్రామిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

తిరుపతి (జీవకోన), న్యూస్‌టుడే: పారిశ్రామిక వినియోగదారులు ఎదుర్కొంటున్న విద్యుత్తు సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ లోతేటి చెప్పారు. తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో బుధవారం పారిశ్రామిక విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి మాట్లాడారు. నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి 26 మంది హాజరై పలు సమస్యలు తెలిపినట్లు చెప్పారు. వోల్టేజీలో హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయని, సోలార్ విద్యుత్తు బిల్లింగ్, ట్రూ-అప్, ఎఫ్‌పీపీసీఏలకు సంబంధించి వినతులను అందజేశారని తెలిపారు. వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రతి నెలా మొదటి బుధవారం ఉదయం 10:30 నుంచి 11:30 గంటల వరకు జిల్లాల్లోని సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయాల్లో, మూడో బుధవారం తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో ఈ వేదికలు నిర్వహిస్తున్నామని పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలని కోరారు. సంస్థ డైరెక్టర్లు అయూబ్ ఖాన్, గురవయ్య, రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు రమణాదేవి, పద్మ, ఆదిశేషయ్య, ఉమాపతి, కృష్ణారెడ్డి, రామచంద్రరావు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తతో మాట్లాడుతున్న సీఎండీ శివశంకర్ లోతేటి

పవర్ లిఫ్టింగ్‌లో ఉపాధ్యాయుడికి రజత పతకం

చక్రాయపేట (వేంపల్లె), న్యూస్‌టుడే : వేంపల్లెలోని శ్రీనివాస పాఠశాలలో భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న బాబురావుకు పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో రజిత పతకాన్ని సాధించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ కేశవులు బుధవారం తెలిపారు. ఈ నెల 14న రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో 59 కిలోల పురుషుల విభాగంలో బాబురావు పాల్గొన్నారు. అనంతరం 180 కిలోల స్క్వాట్, 82.5 కిలోల బెంచ్‌ప్రెస్, 190 కిలోల డెడ్‌లిఫ్ట్ విభాగాలలో పాల్గొని రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని గెలిపొందారు. కడప జిల్లాకు ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని కల్పించిన ట్రిపుల్ ఐటీ ప్రొఫెసర్, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలగోవింద్ తివారీకి కృతజ్ఞతలు తెలిపారు.

బాబురావుతో కరస్పాండెంట్ కేశవులు

ముమ్మాటికీ అవి హత్యలే!
- మందకృష్ణ మాదిగ

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే : 'కడప జిల్లా బి.మఠం మండలంలో ఈ నెల 5వ తేదీ ఇద్దరు యువకులు మృతి చెందారు. ఇవి ముమ్మాటికీ హత్యలే.. తమ వద్ద స్పష్టమైన ఆధారాలున్నాయి. ఈ కేసు విచారణ సమయంలో సంబంధిత ఎస్ఐ, సీఐలను పక్కన పెట్టాలి. ఇద్దరు యువకుల మరణాన్ని ఎస్ఐ ప్రమాదవశాత్తు అని ఫిర్యాదులో పేర్కొని మృతుల బంధువుల నుంచి సంతకాలు తీసుకున్నారు. ఆ ఎస్ఐను సస్పెండ్ చేయాలి' అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగ డిమాండు చేశారు. బుధవారం మందకృష్ణమాదిగ బాధితులతో కలిసి కడపలో ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 20 ఏళ్ల వయసు కలిగిన సతీష్, ఓబులేశులు మోకాలి లోతు నీరు ప్రవహిస్తున్న కాలువలో పడి ప్రమాదవశాత్తు మృతి చెందారని పోలీసులు కేసు నమోదు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇద్దరు వేర్వేరు ప్రాంతాల్లో మృతి చెందడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఓబులేశు, సతీష్‌ల మరణానికి ప్రేమ వ్యవహారమే కారణమని తెలిపారు. వీరి మరణాల వెనకాల ఉన్న మిస్టరీని పోలీసులు ఛేదించాలని డిమాండు చేశారు. ఇద్దరి మరణాల కేసును తానే స్వయంగా పర్యవేక్షిస్తానని ఎస్పీ భరోసా ఇచ్చారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు నాగరాజు, ఎంఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు వై.కె.విశ్వనాథ్, నాయకులు నరేంద్రబాబు, సురేశ్, ఈశ్వరయ్య, శివయ్య, రాజు, వెంకటేశ్, బాబు, స్వామలన్, చిన్నసుబ్బయ్యయాదవ్ పాల్గొన్నారు.

ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న మందకృష్ణ మాదిగ, నాయకులు

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. (రిటైర్డ్ పోలీస్‌డిపార్ట్మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం. ✆7382114647.

JOBS

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్ / పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ:18-20K ✆96404 68899, 96402 58899

SECURITY GUARDS

Secur Security Services. టంగుటూరు పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీ SO లు మరియు ASO లు కావలెను. ✆ 9959598279

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఏట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చటపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ॥ 330/- మాత్రమే

Contact : KDP: 9989997626 8008514248 PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

రాజంపేట
•రాజంపేట • బద్వేలు

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు

ఒంటిమిట్ట, నందలూరు, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట, నందలూరు మండలాల్లోని ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం విద్యార్థులకు ఉచితం ప్రవేశం కల్పిస్తామని ఎంఈవోలు లావణ్య, బ్రహ్మయ్య, నందలూరు ఎంఈవోలు నాగయ్య, అనంతకృష్ణలు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. అనాథ పిల్లలు, హెచ్‌ఐవీ బాధితులు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీలు, ఆర్థికంగా వెనుకబడిన మైనార్టీలు, బీసీలు, ఓసీలు అర్హులని తెలిపారు. ఈ నెల 20 నుంచి మార్చి 10వ తేదీ వరకు మీ సేవ కేంద్రాలు, సచివాలయాలు, విద్యాశాఖ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక జరుగుతుందని తెలిపారు. వివరాలకు టోల్ ఫ్రీ నంబర్ 18004258599 సంప్రదించాలని పేర్కొన్నారు.

వాహనదారులకు శిరస్త్రాణమే రక్షణ కవచం

కలసపాడు, న్యూస్‌టుడే: వాహనదారులు శిరస్త్రాణం ధరించడంవల్ల ప్రాణాలను కాపాడుకోవచ్చని ఎస్సై సుభాన్ తెలిపారు. మండలంలోని పోరుమామిళ్ల ప్రధాన రహదారి ఓబులాపురం క్రాస్‌రోడ్డు వద్ద బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. రికార్డులు సరిగా లేని పలువురికి జరిమానా విధించారు. అనంతరం రహదారి భద్రత పై అవగాహన కల్పించారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్సై సుభాన్

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)
రాజంపేట : 9441872651
బద్వేలు గ్రామీణ : 8008573493

?: సుండుపల్లి కేబీ వీధిలోని కాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోయి మురుగు ముందుకు కదలడం లేదు. - **స్థానికులు**

✓: పూడిక తీయించి మురుగు వెళ్లేలా చర్యలు తీసుకుంటాం. - **లక్ష్మీకుమారి, బాధ్య పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, సుండుపల్లి**

చిన్నారులు.. తైక్వాండో వీరులు

తైక్వాండోలో తలపడుతున్న విద్యార్థులు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు. ఆట మీద ఉన్న మక్కువతో సరైన సదుపాయాలు లేక పోయిన నిత్యం సాధనతో తైక్వాండో క్రీడల్లో రాణిస్తున్నారు. అటు చదువుల్లో ప్రతిభ చూపుతూనే.. ఇటు క్రీడల్లో జాతీయ, రాష్ట్ర స్థాయికి ఎంపికవుతున్నారు. ఆ చిన్నారుల మనోగతం వారి మాటల్లోనే..

దేశం తరఫున ఆడుతా

నాకు క్రీడలంటే చాలా ఇష్టం. మా తల్లిదండ్రుల సహకారంతో తైక్వాండో నేర్చుకునేందుకు రాజంపేటలోని ఓ ప్రైవేట్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నా. ఇటీవల కడపలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని అండర్-14 విభాగంలో స్వర్ణ పతకం సాధించా. భవిష్యత్తులో దేశం తరఫున ఆడి బంగారు పతకం సాధించాలనేదే లక్ష్యం. **- రామ్ నరసింహా రితేష్, 8వ తరగతి, రాజంపేట**

పోలీసు ఉద్యోగం సాధిస్తా

ఆత్మరక్షణ, మానసిక స్థైర్యం కోసం తైక్వాండోలో శిక్షణ తీసుకుంటున్నాను. మా పీడీ సునీల్ సహకారంతో మెలకువలు నేర్చుకున్నా. 2023లో ప్రొద్దుటూరులో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించా. క్రీడలతో పాటు చదువులో రాణించి భవిష్యత్తులో పోలీసు కొలువును సాధించాలన్నదే ధ్యేయం. **- వెంకట వినయ్ కుమార్, 8వ తరగతి, రాజంపేట**

ఇసుక అక్రమ రవాణా కట్టడికి చర్యలు

సిద్దవటం, న్యూస్‌టుడే: మండలంలోని సిద్దవటం, లింగంపల్లె, ఉక్కాయపల్లె, కడపాయపల్లె, డేగనవాండ్లపల్లె, మాచుపల్లె మరికొన్ని గ్రామాల్లోని పెన్నానది నుంచి ఇసుక అక్రమంగా రవాణా జరగకుండా బుధవారం సిద్దవటం రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారు. తహసీల్దారు తిరుమలబాబు, ఆర్ఐ ప్రసాద్ గ్రామాల నుంచి పెన్నానదిలోకి వెళ్లే దారుల్లో యంత్రంతో గోతులు తీయించి వాహనాలు వెళ్లకుండా చేశారు. గోతులను పూడ్చి అక్రమ రవాణాకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేస్తామని తహసీల్దారు హెచ్చరించారు.

వాహనాలు వెళ్లకుండా గుంత తీయిస్తున్న దృశ్యం

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: మండలంలోని కోనరాజుపల్లె ఎస్సీ కాలనీలోని పదో తరగతి విద్యార్థులకు మాజీ శాసనమండలి సభ్యుడు, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెంగల్రాయుడు సైకిళ్లను నాయకులతో కలిసి బుధవారం పంపిణీ చేశారు. గ్రామం నుంచి మంటపంపల్లె పంచాయతీ రామచంద్రాపురంలోని ఉన్నత పాఠశాలకు ఆరు కి.మీ దూరం ఉందని.. ఈ సైకిళ్లు వారికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. నాయకులు రామచంద్రయ్య, భగవాన్‌రెడ్డి, కిరణ్‌కుమార్, విజయ్, చాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు

రంజాన్ ప్రారంభ శుభాకాంక్షలు
రంజాన్ మాస ప్రారంభ శుభ సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు మరియు ప్రజలకు రంజాన్ ప్రారంభ శుభాకాంక్షలు.
సయ్యద్ నాసరుద్దీన్ B.A., B.L.,
అడ్వకేట్, రాజంపేట.

ప్రత్యామ్నాయ రహదారికి ఏర్పాట్లు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట రామాలయంలో జరగనున్న స్వామి కల్యాణానికి వచ్చే భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యామ్నాయ మార్గాన్ని తితిదే సీఈ సత్యనారాయణ బుధవారం పరిశీలించారు. సిద్దవటం మండలం సాయినగర్ నుంచి ముమ్మడిగుంటపల్లి, మోహిద్దీన్‌సాహెబ్‌పల్లి, బాపనపల్లి మీదుగా ఒంటిమిట్ట మండలం గంగపేరూరు, పెన్నపేరూరు వరకు చూశారు. రాజంపేట నుంచి వచ్చే వాహనాలను ఒంటిమిట్ట చెరువు కట్ట నుంచి సాలాబాదు, రాచపల్లె మీదుగా, కడప నుంచి వచ్చే వాటిని సాయినగర్ నుంచి మళ్లించాలని నిర్ణయించారు. అందుకు అనుగుణంగా రోడ్లను బాగు చేయాలని సూచించారు. ఎస్ఈలు మనోహరం, వెంకటేశ్వర్లు, ఈఈ సుమతి, ఏఈ అమరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

ఒంటిమిట్ట, అటూరు, న్యూస్‌టుడే: రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ యాప్‌లో తప్పనిసరిగా పేర్లు నమోదు చేసుకోవాలని ఏవో మంజులరాణి అన్నారు. మండలంలోని గంగపేరూరులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్, కూటమి సర్కారు అన్నదాత సుఖీభవ సాయం రాదని తెలిపారు. అట్లూరు మండలంలోని 1056 మంది రైతులు ఇంకా నమోదు చేసుకోలేదని అన్నారు. రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ఆక్రమిస్తే కఠిన చర్యలు

సుండుపల్లి, న్యూస్‌టుడే: రహదారిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని రహదారుల శాఖ రాయచోటి డీఈ గోవర్దన్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో జరుగుతున్న ఆక్రమణ తొలగింపు పనులను బుధవారం పరిశీలించారు. సుండుపల్లి-రాయవరం రోడ్డులో హద్దులు నిర్ణయించారు. వీఆర్వో బసయ్య, రహదారులశాఖ ఏఈ కుమార్‌బాబు, తెదేపా మండల అధ్యక్షులు రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

సిద్దవటం, న్యూస్‌టుడే: మండలంలోని అంగన్‌వాడీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని పలువురు ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో మండల అధ్యక్షురాలు జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సిద్దవటం ఎంపీటీసీ సభ్యురాలు మంజుల జగనన్న కాలనీల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. మాధవరం-1, నేకనాపురంలోని అంగన్‌వాడీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ నూర్, ఎంపీడీవో ఫణిరాజకుమారి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరయ్యారు.

పారదర్శకతకు ఏకీకృత కుటుంబ సర్వే

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఏకీకృత కుటుంబ సర్వేకి ప్రజలు సహకరించాలని ఎంపీడీవో సుజాతమ్మ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. సిబ్బంది అడిగిన పత్రాలను అందజేసి వివరాలు వెల్లడించాలని తెలిపారు. ఇంటి, నీటి పన్ను, విద్యుత్తు బిల్లు, ఆధార్ తదితర ధ్రువీకరణ పత్రాల నకళ్లను అందజేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకతకు సర్వే నిర్వహిస్తున్నామని వివరించారు.

20 నుంచి చుండుపల్లెమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

సుండుపల్లి, న్యూస్‌టుడే: స్థానిక పంచాయతీలోని చుండుపల్లెమ్మ(యల్లమ్మ) ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. శుక్రవారం ఉదయం సంప్రదాయ పూజలు, కలశస్థాపన, గణపతిపూజ, జలాధివాసం, శనివారం హోమం, అమ్మవారి గ్రామోత్సవం ఆదివారం యంత్రస్థాపన అభిషేకం, పూర్ణాహుతి, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

పారా సిట్టింగ్ వాలీబాల్ రాష్ట్ర జట్టుకు ఎంపిక

నందలూరు, న్యూస్‌టుడే: మండలంలోని అరవపల్లెకు చెందిన అలుసూరి శివకోటి రాష్ట్ర పారా సిట్టింగ్ వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర పారా సిట్టింగ్ వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు బోడపాటి శివదత్ నుంచి ఆదేశాలు అందినట్లు బుధవారం ఆయన తెలిపారు. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు విశాఖపట్టణం వేదికగా నిర్వహించిన పోటీల్లో కడప జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహించి రాష్ట్ర జట్టుకు ఎంపిక అయినట్లు వివరించారు. ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

శివ దత్‌తో ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న శివకోటి

లేబర్ కోడ్‌లతో కార్మికులకు అన్యాయం

మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మస్తాన్

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేబర్ కోడ్‌లను సవరించి కార్మికులకు తీవ్ర అన్యాయం చేశాయని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మస్తాన్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవనంలో బుధవారం ఏఐటీయూసీ మండల సమావేశం నిర్వహించారు. కార్మికులంతా ఏకమై ప్రభుత్వాలు చేస్తున్న అన్యాయాలను ప్రజలకు వివరించాలని అన్నారు. ఉద్యమాలకు కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కడప పట్టణంలో నిర్వహించనున్న జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు రవికుమార్, కేశవ, సఫా, సుబ్బయ్య, గురప్ప పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రమోహన్, అధికారులు

రెవెన్యూ భూమి పరిశీలన

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: మండలంలోని ముసల్‌రెడ్డిపల్లి అటవీ ప్రాంతంలో ఆర్డీవో చంద్రమోహన్, ప్రొద్దుటూరు సబ్ డీఎఫ్‌వో సునీల్ సాకేత్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అల్లూరిసీతారామరాజు జిల్లాలో జాతీయ రహదారి నిర్మాణానికి అటవీ భూమి పోతోందని అందుకు పరిహారంగా ముసల్‌రెడ్డిపల్లిలోని రెవెన్యూభూమిలో 38 హెక్టార్లు ఇచ్చేందుకు భూమిని పరిశీలించామన్నారు. వారి వెంట డివిజనల్ సర్వే అధికారి రఘురామయ్య, పోరుమామిళ్ల తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, రేంజర్ రఘునాథ్‌రెడ్డి, అధికారులు ఉన్నారు.

స్మార్ట్ మీటర్లపై అవగాహన

గోపవరం న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ స్మార్ట్ మీటర్‌ను వాడి విద్యుత్తును ఆదా చేయాలని కన్‌స్ట్రక్షన్ డీఈఈ శివకుమార్ అన్నారు. మండలంలో విద్యుత్తు సిబ్బందితో కలిసి ఆయన బుధవారం స్మార్ట్ మీటర్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికి సౌర పలకను ఏర్పాటు చేసుకోవడంతో విద్యుత్తు బిల్లులను ఆదా చేసుకోచ్చునన్నారు. కార్యక్రమంలో బద్వేల్ డీఈఈ కుళాయప్ప విద్యుత్తు సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న విద్యుత్తు సిబ్బంది

డీసీసీ బ్యాంక్ ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డిని సన్మానిస్తున్న భాజపా జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డి

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని భాజపా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డి అన్నారు. బద్వేలులో కడప డీసీసీ బ్యాంక్ ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డిని బుధవారం ఆయన మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు జిల్లాలోని రైతుల సమస్యలపై చర్చించారు. అవసరమైన రైతులకు పంట రుణాలు అందిస్తామన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

నుండుపల్లి, న్యూస్‌టుడే: విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థి జీవితంలో పదో తరగతి, ఇంటర్ కీలకమని హెచ్ఎం షకీరా బేగం అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఇంటర్, పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వెంకటసిద్దయ్య విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి.

రక్షణ కల్పించాలని వేడుకోలు

సిద్దవటం, న్యూస్‌టుడే: కుమారుడి నుంచి కుటుంబానికి హాని ఉందని, కాపాడాలని మండలంలోని వెంకటేశ్వరపురానికి చెందిన పార్వతమ్మ డీఆర్వో విశ్వేశ్వర నాయుడును కోరారు. ఈ మేరకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు తిరుమలబాబు, ఎస్ఐ హారిక, సీడీపీవో శోభారాణి, న్యాయవాది పర్వీన్ సమక్షంలో డీఆర్వో బుధవారం విచారణ చేపట్టారు. వివరాల మేరకు.. పార్వతమ్మకు కుమారుడు బాలాజీ, కోడలు ఉన్నారు. కోడలు ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్తూ పార్వతమ్మ వద్ద ఉన్న బంగారు నగలు బ్యాంకులో జమ చేయించారు. కొంత కాలం తర్వాత మద్యానికి బానిసైన కుమారుడు ఆ నగల కోసం తల్లి పార్వతమ్మను, ఆమె కుమార్తె లక్ష్మీను వేధించసాగాడు. అతనిపై గతంలో కేసు నమోదు చేసినా మార్పు రాలేదు. తిరిగి వేధింపులకు గురి చేస్తుండటంతో ఆమె అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన వారు అతనిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

బుక్ హౌస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పట్టణ సీఐ నాగార్జున

రాజంపేట, న్యూస్‌టుడే: పుస్తక పఠనంతోనే విజ్ఞానం లభిస్తుందని, దానిని అందిపుచ్చుకుంటే విజయం కలుగుతుందని పట్టణ సీఐ నాగార్జున అన్నారు. పట్టణంలోని అన్న క్యాంటీన్ సమీపంలో ఏర్పాటు చేసిన విశాలాంధ్ర మొబైల్ వ్యాన్ బుక్ హౌస్ కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. పోటీ పరీక్షలు, విజ్ఞానం, వినోదానికి సంబంధించిన అనేక పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వీటిని విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భూసార పరీక్షలతో మేలు

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: రైతులంతా భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని డిప్యూటీ తహసీల్దారు కెజియా అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ శ్యామ్యూల్ డేవిడ్ రాజు ఆధ్వర్యంలో సాయిల్ టెస్టింగ్ అండ్ అనాలసిస్ వర్క్‌షాపును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూసార ఫలితాలను బట్టి ఎరువులను వినియోగించాలన్నారు. విద్యార్థులంతా ఇక్కడ తెలుసుకున్న విషయాలను గ్రామాల్లోని రైతులకు వివరించాలని కోరారు. వైస్ ప్రిన్సిపల్ ప్రకాష్‌రావు, అధ్యాపకులు డాక్టర్ సులోచన, శోభన్‌బాబు, సబిత, పర్వీన్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న డిప్యూటీ తహసీల్దారు కెజియా, పక్కన అధికారులు

విద్యుదాఘాతంతో రెండు ఎద్దులు మృతి

కాశినాయన, న్యూస్‌టుడే: పంటకు రక్షణగా ఏర్పాటు చేసిన విద్యుత్తు కంచె తగిలి రెండు ఎద్దులు బుధవారం మృత్యువాత పడినట్లు ఎస్సై యోగేంద్ర తెలిపారు. ఆయన వివరాల మేరకు మండలంలోని బాలయపల్లికి చెందిన రైతు పుల్లారెడ్డి తన ఎద్దులను పొలం వద్దకు తీసుకెళ్తుండగా.. మార్గం మధ్యలో విద్యుత్తు కంచె తగిలి ఘటనా స్థలంలోనే మృతి చెందాయి. వీటి విలువ 1.50 లక్షలు ఉంటుందని రైతు తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. పశువైద్యుడు రామారావు ఆధ్వర్యంలో ఎద్దులకు శవపంచనామా చేశారు.

ప్రసంగిస్తున్న రీజియన్ కన్వీనర్ కృష్ణారెడ్డి

చలో విజయవాడ విజయవంతానికి వినతి

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 25న చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రీజియన్ కన్వీనర్ కృష్ణారెడ్డి కోరారు. పోరుమామిళ్ల రీజియన్ కార్యాలయంలో బుధవారం ఎస్టీయూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.... ఇచ్చిన హామీలను విస్మరించడం నేటి పాలకులకు పరిపాటిగా మారిందన్నారు. 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని కోరారు. 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు రమణ, శ్రీనివాసులు, చంద్రహాస్‌రెడ్డి, పుల్లయ్య, వెంకటరెడ్డి, బాలరాజు, నారాయణ, జయరామిరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వీరబల్లి, న్యూస్‌టుడే: రాయచోటి-వీరబల్లి మార్గం మట్లితొగటిపల్లి సమీపంలో ఆర్టీసీబస్సు-ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఒకరు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు మట్లితొగటపల్లెకు చెందిన నాగేంద్ర పని నిమిత్తం వీరబల్లికి వెళ్తుండగా.. గడికోట నుంచి రాయచోటికి వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఎలకచెట్టుపల్లె సమీపంలో ఢీకొట్టారు. ప్రమాదంలో నాగేంద్రకు తీవ్ర గాయాలవగా.. స్థానికులు రాయచోటి ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నిండుగా జలం.. కాలువలు లేక నిష్ఫలం

సుండుపల్లి, న్యూస్‌టుడే: ఝరికోన జలాశయం నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా.. సాగునీటి కాలువల నిర్మాణానికి మాత్రం అడుగులు పడటం లేదు. దాంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి .. బాహుదానదిపై ఝరికోన జలాశయ కట్ట నిర్మాణాన్ని 1990లో పూర్తి చేశారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోక పోవడంతో ఇప్పటికీ సమస్య కొనసాగుతోంది. అధికారం మారినపుడల్లా నాయకులు హామీలు ఇస్తున్నారే తప్ప పనులు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కాలువ పనులకు రూ. 55కోట్లు మంజూరు చేస్తూ చర్యలు తీసుకున్నా.. ఉత్తర్వులు రావడంలో జాప్యం జరగడంతో శిలాఫలక ముహూర్తం వాయిదా పడింది. అనంతరం రాష్ట్ర విభజన తదితర కారణాలతో కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా కాలువల నిర్మాణానికి మోక్షం కల్పిస్తుందని ఆశిస్తున్నారు. జలాశయ గేటు కడ్డీ విరిగిపోయి ఏడు ఏళ్లు కావస్తున్నా.. ఇప్పటికీ మరమ్మతు చర్యలు లేవు. కాలువల నిర్మాణ విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఝరికోన జలాశయం

ప్రతిపాదనలు పంపాం: జలాశయ కాలువల నిర్మాణానికి సుమారు రూ. 135 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. పరిపాలనా, ఆర్థిక అనుమతులు రావాల్సి ఉంది. **- చెంగల్రాయుడు, డీఈఈ, బాధ్య ఈఈ, జలవనరుల శాఖ, కడప**



అమృతమూర్తికి అశ్రునివాళులు..
మా ఆప్తమిత్రులు, స్నేహశీలి, మృదు భాషి, పుణ్యశీలి, సహనశీలి, మా శ్రేయోభిలాషి, అందరినీ చిరునవ్వు, ప్రేమ, ఆప్యాయతలతో పలకరించే మనస్తత్వం కలిగిన మా ప్రాణమిత్రుడు భువి నుండి దివికేగిన
కీ॥శే॥ చేపూరి జయరామయ్య గారి
మధుర స్మృతులను సదా స్మరించుకుంటూ, వారి పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ..
శోకతప్త హృదయాలతో, అశ్రునయనాలతో నివాళులు సమర్పించుకుంటూ మీ ఆప్త మిత్రులు..
డా॥ బోడగల జయరామయ్య, బోడా రామయ్య, శ్రీరాందాసు సాంబయ్య, మేధవి ఎరికలయ్య, వాకాటి లక్ష్మీనర్సయ్య, బోడగల అనంతరామయ్య, గోళ్ళ సుబ్బరాయుడు, పుత్తా సుబ్బరాయుడు, వై.కామేశ్వరరావు, ఎస్.రాఘవేంద్ర
కీ॥శే॥ చేపూరి జయరామయ్య
రిటైర్డ్ సీనియర్ హిందీ పండిట్, జడ్పీ హైస్కూల్, మన్నూరు, రాజంపేట.
జననం : 02.02.1950 మరణం : 09.02.2026

1 ప్రథమ వార్షికోత్సవ శుభాకాంక్షలు
మా పేషంట్లకు, రాజంపేట పట్టణ మరియు పరిసర ప్రాంత ప్రజలకు ప్రథమ వార్షికోత్సవ శుభాకాంక్షలు.
భరత్ హార్ట్ & జనరల్ హాస్పిటల్
ఆంజనేయ స్వామి గుడి ఎదురుగా, మెయిన్ రోడ్, రాజంపేట.
సెల్: 6303140176, 9392742820
గుండె సమస్యలకు ECG, 2D ECHO (గుండె స్కానింగ్), TMT పరీక్షలు చేయబడును.

నల్లబోతుల ఈశ్వరయ్య
రిటైర్డ్ జిల్లా రెవెన్యూ అధికారి, రాజంపేట.
డా॥ భరత్ తేజ్
MBBS, P.G.D.C.C.
(క్లినికల్ కార్డియాలజీ), రాజంపేట.

రంజాన్ ప్రారంభ శుభాకాంక్షలు
ఆధ్య స్కంద
స్కానింగ్ & డయాగ్నోస్టిక్స్
మన్నూరు మెయిన్‌రోడ్, రాజంపేట.
మా వద్ద గల అత్యాధునిక టెక్నాలజీ మెషిన్‌లు
❖ మల్టీ స్లైస్ CT & ECG & 2D ECHO
❖ డిజిటల్ X-Ray ❖ 4D అల్ట్రాసౌండ్
❖ ఆధునిక రక్తపరీక్షలు, థైరాయిడ్, హార్మోన్‌ల పరికరాలు
Fully Automated Hormone Machine

CLIA-181
AUTOMATIC CHEMILUMINESCENCE IMMUNOASSAY ANALYZER

Erba Chem7
రాజంపేటలోనే మొట్టమొదటిసారిగా పూర్తి ఆటోమెటిక్ హార్మోన్ పరికరం ద్వారా అతి తక్కువ ధరలకు చేయు హార్మోన్ పరీక్షలు
షుగర్ తినకముందు రూ. 25/- తిన్న తరువాత రూ. 25/- 50/- లకే కేవలం
Hb1ac - 249/- లకే
థైరాయిడ్ ప్రొఫైల్ (T3, T4 & TSH) - 350/- లకే
షుగర్ + Hb1ac - 275/- లకే
విటమిన్ B12 + విటమిన్ D - 1499/- లకే
Home Blood Sample Collection
మీ ఇంటి దగ్గరకే వచ్చి రక్త నమూనాలను సేకరించబడును.
Contact: 73967 82455
CONT : 8019885991, 8179982291

(c) eenadu

ప్రొద్దుటూరు

● ప్రొద్దుటూరు ● జమ్మలమడుగు ● మైదుకూరు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ఓబన్నపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో కొండమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది

కొండాపురం, న్యూస్‌టుడే: బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని ఐసీడీఎస్ సీడీపీవో కొండమ్మ పేర్కొన్నారు. బుధవారం ఓబన్నపేట-2 తాతయ్యగుట్ట అంగన్‌వాడీ కేంద్రాల్లో బాల్య వివాహాలపై కలిగే నష్టాలను తెలియజేశారు.

ఎర్రగుంట్ల: బాల్యవివాహాలు చట్ట రీత్యా నేరమని చిలమకూరు పీహెచ్‌సీ హెచ్ఈ నాగమునిరెడ్డి తెలిపారు. బుధవారం కలమల్లలో బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు.

ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో బుధవారం వసంతోత్సవం, పూర్ణాహుతితో మహాశివరాత్రి మహోత్సవాలు ముగిసినట్లు మఠాధిపతి వెంకటాద్రిస్వామి తెలిపారు. స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

పూజల్లో పాల్గొన్న మహిళలు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
ప్రొద్దుటూరు : 9966349431
జమ్మలమడుగు : 9494294241
మైదుకూరు : 8008573447

? : యాపరాలపల్లెలో తాగునీటి పైపులైన్ లీకేజీతో తాగునీరు కలుషితమవుతోంది. చర్యలు తీసుకోవాలి. - చెంద్రాయుడు, యాపరాలపల్లె

☑ : పైపులైను లీకేజీ నివారణ చర్యలు తీసుకుంటాం. - నిరంజన్‌రెడ్డి, ఏఈ, పురపాలక సంఘం - న్యూస్‌టుడే, మైదుకూరు

స్పందించారు.. పరిష్కరించారు

● మైదుకూరు పురపాలక పరిధిలో రాయప్పగారిపల్లె సమీపంలో జాతీయ రహదారి సర్వీసురోడ్డు పునరుద్ధరణ పనులను ప్రారంభించారు. దీనిపై ఈ నెల 10న 'రహదారి ఛిద్రం.. చోదకులకు భయం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు మరమ్మతు చేయించారు.

● చాపాడు మండలం విశ్వనాథపురం వద్ద హుబ్లీ-కృష్ణపట్నం జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు పక్కన ప్రమాదకరంగా మారిన ఇనుప గొట్టాలను సిబ్బంది తొలగించారు. దీనిపై ఈ నెల 16న 'ఇనుప గొట్టాలతో ముప్పు' శీర్షికతో చిత్రకథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు చర్యలు తీసుకున్నారు. - న్యూస్‌టుడే, మైదుకూరు

● వేల్పుచర్ల సమీపంలో రహదారికి ఇరువైపులా కంపచెట్లు పెరిగాయని ఈ నెల 16న మేమున్నాం.. మీకు తోడుగాలో భాగంగా ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి ఇంద్రకేశవరెడ్డి చర్యలు తీసుకున్నారు.

● ముద్దనూరు మండలం వేల్పుచర్లలో కాలనీలో వీధి దీపాలు వెలగ లేదని ఈ నెల 16న మేమున్నాం.. మీకు తోడుగాలో భాగంగా ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి ఇంద్రకేశవరెడ్డి చర్యలు తీసుకున్నారు. - న్యూస్‌టుడే, ముద్దనూరు

● చిన్నముడియం ఎస్సీ కాలనీలో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్నాయని ఈ నెల 18న 'మేమున్నాం..మీకు తోడుగా' లో భాగంగా సమస్య ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్తుశాఖ ఏఈ రామకృష్ణ చర్యలు తీసుకున్నారు. - న్యూస్‌టుడే, పెద్దముడియం

బక్కచిక్కిన గుడ్లు

● పంపిణీలో కొరవడిన పర్యవేక్షణ
● అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిస్థితి

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకు 25 రోజులు, పాఠశాలల్లో వారానికి అయిదు రోజులు చొప్పున కోడిగుడ్లు అందించేలా ప్రభుత్వం మెనూ రూపొందించింది. పంపిణీలో పర్యవేక్షణ లేకపోవడంతో గోళీల్లాంటి, పగలిన, బరువు తక్కువగా ఉన్న గుడ్లు సరఫరా చేస్తున్నారు. ఈ నెల 7వ తేదీ రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ చిత్తా విజయ ప్రతాప్‌రెడ్డి జమ్మలమడుగు మండల పరిధిలోని గూడెంచెరువు అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించగా చిన్న గుడ్లను చూసి విస్తుపోయారు.

● జమ్మలమడుగు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో జమ్మలమడుగు, పెద్దముడియం, మైలవరం మండలాలున్నాయి. మొత్తం 143 కేంద్రాలు ఉండగా సొంత భవనాలు 85 ఉండగా, ఉచిత భవనాలు 36, అద్దె భవనాలు 22 ఉన్నాయి. చిన్నారులు 8,155, గర్భిణులు

కలర్ కోడింగ్ లేకుండా సరఫరా చేస్తున్న గుడ్లు

871, బాలింతలు 748 మంది లబ్ధి పొందుతున్నారు. చిన్నారులకు అందించే కోడిగుడ్డు బరువు 45 నుంచి 55 గ్రాములుండాలి. కొన్ని 40 నుంచి 45 గ్రాములే ఉంటున్నాయి. 30 గుడ్లు ఉన్న అట్ట 1.50 కిలోల బరువు ఉండాలి. కొన్ని చోట్ల 1.20 కిలోలే ఉంటోంది. బయట మార్కెట్లో విక్రయిస్తున్న గుడ్డు 70 నుంచి 75 గ్రాముల బరువు ఉంటుంది. బరువున్న వాటిని మార్కెట్లో విక్రయించి పరిమాణం తక్కువగా ఉన్నవాటిని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్నట్లు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. నిబంధనల ప్రకారం కలర్ కోడింగ్ ఉన్న గుడ్లను సరఫరా చేయాలి. కొన్ని కేంద్రాల్లో ముద్రలు లేకుండా పంపిణీ చేస్తున్నారు.

● ఈ విషయమై జమ్మలమడుగు ఐసీడీఎస్ సీడీపీవో జయమ్మ మాట్లాడుతూ గుడ్లను కేంద్రాలకు సరఫరా చేసినప్పుడు పరిశీలించి తీసుకోవాలని కార్యకర్తలకు చెప్పామని వివరించారు. పరిమాణం తక్కువగా ఉన్నా, కలర్ కోడింగ్ లేకున్నా తీసుకోవద్దని సూచించామని స్పష్టం చేశారు.

డిమాండ్ల సాధనకు చేనేత గర్జన 22న

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: చేనేత కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తలపెట్టిన చేనేత గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 22న మంగళగిరిలోని నేతన్న సర్కిల్ వద్ద చేనేత సమస్యలను పరిష్కరించాలని నిరసన చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో శివనారాయణ, లక్ష్మీనారాయణ, రామదాసు, నాగేంద్ర, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

8వ వర్ధంతి

మా తమ్ముడు, మిత్రుడు కీ॥శే॥ తూగూట్ల గంగాధర్ గారు
మా నుండి దూరమై నేటికి 8 సం॥లు గడిచిననూ
వారి జ్ఞాపకాలు మా మదిలో ఎల్లవేళలా
స్మరించుకుంటూ... వారి ఆత్మకు శాంతి కలగాలని
భగవంతుని కోరుకుంటూ...

కీ॥శే॥ తూగూట్ల గంగాధర్
అడ్వకేట్
సాయినాథపురం, మైదుకూరు.

MRF సుబ్బయ్య
మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు, మైదుకూరు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాల క్రయ విక్రయాల గురించి తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని జమ్మలమడుగు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ సరితారెడ్డి సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ప్రిన్సిపల్ సంజీవరెడ్డి, అధ్యాపకులు నాగేంద్ర, షఫీ, బాలు, శివ, శ్రీను, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల: వ్యక్తిగత వివరాలు, ఓటీపీలను ఇతరులతో పంచుకోవద్దని ఎర్రగుంట్ల సీఐ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై ఎర్రగుంట్ల ప్రకాశ్ నగర్‌లో సీఐ ఆధ్వర్యంలో బుధవారం కళాజాత ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగంతో వ్యక్తిగతం, కుటుంబపరంగా, సమాజానికి తీవ్రనష్టం కలిగే అవకాశం ఉందన్నారు. సీఐ గోవిందరెడ్డి, ఎస్సై నాగమురళి, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ సరితారెడ్డి, విద్యార్థులు

రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్‌కు సత్కారం

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: రాష్ట్ర షేక్ సంక్షేమ, అభివృద్ధి సొసైటీ ఛైర్మన్ ముక్తియార్‌ను ప్రొద్దుటూరు స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ప్రొద్దుటూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా అభినందించారు. సంఘం నాయకులు బుశెట్టి రామమోహన్‌రావు, కొప్పర్తి మధుసూదన్, ఇలియాస్, బాలదేవయ్య, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

ముక్తియార్‌ను సన్మానిస్తున్న స్వర్ణకారుల సంఘం సభ్యులు

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

పెద్దముడియం, న్యూస్‌టుడే: పరిశుభ్రతను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వచ్ఛ రథం కార్యక్రమం ఈ నెల 21 నుంచి ప్రారంభమవుతుందని ఎంపీడీవో శంషాద్‌బాను తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ప్రభుత్వ పథకాల అర్హులకు చేరాలంటే యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే తప్పనిసరి అని స్పష్టం చేశారు.

పదో తరగతి పరీక్ష సన్నద్ధతపై ఆరా

రాజుపాళెం, న్యూస్‌టుడే: మండలంలోని వెల్లాల గురుకుల బాలికల పాఠశాలను బుధవారం డీఈవో షంషుద్దీన్ పరిశీలించారు. ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. పదో తరగతి విద్యార్థుల పరీక్ష సన్నద్ధతపై ఆరా తీశారు. ఎంఈవోలు ప్రసాదు, రామస్వామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలని వినతి

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: సర్వేల పేరుతో పంచాయతీ సిబ్బందిని ఒత్తిడికి గురిచేస్తున్నారని వీడీవోలు వాపోయారు. ఈ మేరకు బుధవారం స్థానిక డివిజనల్ అభివృద్ధి కార్యాలయంలో డీడీవో రామాంజనేయులుకు వీడీవోలు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

ముద్దనూరు: తమపై పనిఒత్తిడి తగ్గించాలని డీటీ వరదకిశోర్‌రెడ్డికి వీఆర్వోలు బుధవారం అర్జీ సమర్పించారు. రీసర్వేలో పాల్గొంటున్న తమకు స్వగ్రామంలో జరుగుతున్న సర్వేల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు.

ముద్దనూరు డీటీ వరదకిశోర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న వీఆర్వోలు

సామర్థ్యాల పెంపుపై శిక్షణ

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: పురపాలక ప్రజల్లో మార్పు రావాలంటే మన ప్రవర్తన మారాలని రిసోర్సు పర్సన్ శ్రీనివాస్ చెప్పారు. బుధవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో స్వర్ణ వార్డు కార్యదర్శులు, మెప్మా ఆర్పీలకు సామర్థ్యాల పెంపుపై శిక్షణ ఇచ్చారు. మున్సిపల్ కమిషనరు వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఘన వ్యర్థాల నిర్వహణ పురపాలక సంఘంలో ఎంతో కీలకమైందన్నారు. డీఈ సురేంద్రబాబు, స్వర్ణ కార్యదర్శులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

కొండాపురం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని తాళ్లప్రొద్దుటూరు ఠాణాలో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రాయపాటి బాసు ఎస్సైగా ఉద్యోగోన్నతి పొంది తిరుపతి జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం ఆయన్ను సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఎస్సై మంజునాథ మాట్లాడుతూ అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు లభిస్తుందని కొనియాడారు

ఉద్యోగోన్నతి పొందిన బాసును సన్మానిస్తున్న ఎస్సై మంజునాథ, సిబ్బంది

శనగ, కందుల కొనుగోలుకు అవకాశం

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: శనగ, కందుల కొనుగోలుకు అవకాశం కల్పించిన ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడికి జమ్మలమడుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నాగేశ్వరరెడ్డి, వైస్ ఛైర్మన్ మల్లికార్జున కృతజ్ఞతలు తెలియజేశారు. బుధవారం స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో మాట్లాడారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, తెదేపా కడప పార్లమెంట్ అధ్యక్షుడు భూపేష్‌రెడ్డి సహకారంతో రాష్ట్రంలోని రైతులందరితోపాటు నియోజకవర్గంలోని శనగ రైతులకు తీపికబురు అందించామన్నారు. క్వింటా శనగలకు రూ. 5,875, కందులకు రూ.8 వేలు గిట్టుబాటు ధర ప్రభుత్వం కల్పించినట్లు చెప్పారు. మార్కెట్ కమిటీ కార్యదర్శి నాగిరెడ్డి పాల్గొన్నారు.

SHRIRAM Finance
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్. గిండి, చెన్నై- 600032, వెబ్‌సైట్: www.shriramfinance.me
బ్రాంచ్ కార్యాలయము : డి.నెం.4/620. 1వ అంతస్తు, గాంధీరోడ్డు, ప్రొద్దుటూరు- 516360. కడపజిల్లా

రూల్-8(3) స్వాధీనతా ప్రకటన

గమనిక: ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీ ఎన్.సి.ఎల్.టి. చెన్నై వారి ఆదేశాల మేరకు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌తో విలీనమైనది. అనంతరం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" తేది: 30.11.2022 నాటి సర్టిఫికెట్ ఆఫ్ ఇన్‌కార్పొరేషన్ కు అనుగుణంగా "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్"గా తేది: 30.11.2022 నుండి మార్చబడినది.

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002(యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారం శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్(యస్‌యఫ్‌యల్) యొక్క అధీకృత అధికారి సదరు చట్టంలోని 13(12)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 నందలి రూలు 3 ప్రకారం సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ ఋణగ్రహీత ఈ క్రింది తెలిపిన ప్రకారం బకాయి సొమ్ము మొత్తంను చెల్లించ వలసినదిగా క్రింద ఉదహరించినబడిన తేదీన డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.

బకాయి సొమ్ము చెల్లించడంలో ఋణగ్రహీతలు విఫలమైనందున సదరు చట్టంలోని సెక్షన్ 14తో ప్రకారం సంక్రమించిన అధికారములను దిగువ సంతకం దారు అయిన ఎస్ఎఫ్ఎల్ అధీకృత అధికారి వారు వినియోగిస్తూ దిగువ పేర్కొన్న ఆస్తిని **మహారాజశ్రీ ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి, కడప వారి** ఆదేశాల మేరకు **డి.17.02.2026న** లాంఛనంగా స్వాధీనం చేసుకోవడమైనదని ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేడమైనది.

ఋణగ్రహీత పేరు మరియు చిరునామా:
1) **అక్కిదాసరి ప్రభాకర్,** తండ్రి అక్కిదాసరి యేసుదాసు, డి.నెం.16/125, కాల్వకట్ట వీధి, ప్రొద్దుటూరు, కడప- 516360
2) **అక్కిదాసరి ప్రమీల** భర్త అక్కిదాసరి ప్రభాకర్ డి.నెం.16/125, కాల్వకట్ట వీధి, ప్రొద్దుటూరు, కడప- 516360
3) **అక్కిదాసరి రాజేష్** తండ్రి ఎ.ప్రభాకర్, డి.నెం.16/125, కాల్వకట్ట వీధి, ప్రొద్దుటూరు, కడప- 516360
4) **సంగటి ఇజ్రాయిల్** తండ్రి సంగటి క్రీస్తుదారి డి.నెం.6-2-101, సుమిత్ర నగర్, బద్వేల్, ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా, బద్వేల్- 516227

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి సొమ్ము: రూ.65,10,374/- (అరవై ఐదు లక్షల పది వేల మూడు వందల డెబ్బై నాలుగు రూపాయలు మాత్రమే) మరియు తదుపరి వడ్డీ, కాంట్రాక్టువల్ ఛార్జీలు, పెనాల్టీలు లతో సహా.
ఋణ ఖాతా నెంబరు:PRDTRTF2406170002
డిమాండ్ నోటీసు తేది: 21.08.2025

స్థిరాస్తుల వివరములు:-
వైయస్ఆర్ కడప జిల్లా, ప్రొద్దుటూరు రిజిస్ట్రేషన్ జిల్లా, ప్రొద్దుటూరు సబ్ జిల్లా, ప్రొద్దుటూరు మండలం, ప్రొద్దుటూరు గ్రామఫీల్డ్స్, సర్వేనెం.262/2 పైకిలో ఎ.0.03 సెంట్ల భూమిని మరలా కొలతలు వేసినఅనంతరం ఎ.0.02 సెంట్ల 883 చ.లింకులు లేదా 0.011 హెక్టార్ల ఖాళీ స్థలం. హద్దులు: తూర్పు: నాదిండ్ల బాబయ్య విక్రయించిన భూమి, పడమర: విక్రయదారుల భూమి, ఉత్తరం: 30చ.లింకుల వెడల్పు గల రోడ్డు, దక్షిణం: ఎ.నరసింహులుకు చెందిన ఖాళీ స్థలం.ఈ హద్దుల మధ్య తూర్పు నుండి పడమర: 18 3/4చ.అ. లేదా 5.718 చ.మీ. మరియు ఉత్తరం నుండి దక్షిణం: ఉత్తరం వైపు: ఉత్తరం వైపు రాస్తాలో సగభాగం 67చ.అ. లేదా 20.435 చ.మీ. వెరశి మొత్తం విస్తీర్ణం ఎ.0.02 సెంట్ల 883 చ.లింకులు లేదా 139 3/4 చ.గ. ఖాళీ స్థలం మరియు ఇందున నిర్మించిన డి.నెం.16/125 గల ఆర్.సి.సి. బిల్డింగ్, వాటికి అమర్చియుండు ఫిట్టింగ్‌లు, ఫిక్చర్లు, అన్ని ఈజ్‌మెంటరీ హక్కులతో సహా అనుబంధ స్థలం.

సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా (SFL) అధీకృత అధికారి పైన పేర్కొబడిన స్థిరాస్తులను ఋణగ్రహీతల నుండి లాంఛనముగా స్వాధీనత తీసుకొనడమైనది. ఈ నోటీసు తర్వాత ఏ వ్యక్తికి విక్రయించుట గాని, ట్రాన్స్‌ఫర్ చేయుట గానీ, లీజు లేదా తనఖా ఆస్తులను దారి మళ్ళించుటకు గానీ యస్‌యఫ్‌యల్ వారి లిఖితపూర్వక అనుమతి లేకుండా చేయరాదు.

ప్రదేశం: ప్రొద్దుటూరు
తేది: 17.02.2026
సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఎంవోయూలతో విద్యార్థులకు మేలు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: తమిళనాడు రాష్ట్రంలోని హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌తో వివిధ అంశాలకు సంబంధించి ఎంవోయూ కుదుర్చుకున్నట్లు ఎస్ఆర్ఐటీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టరు పాండురంగన్ రవి బుధవారం తెలిపారు. దీంతో తమ కళాశాల విద్యార్థులకు సర్టిఫైడ్ కోర్సులు, ఇంటర్న్‌షిప్, ఉద్యోగ అవకాశాలు, ప్రాజెక్టులు, ప్రాంగణ కొలువులు, అకాడమీ ప్రోగ్రాం, తదితర ప్రయోజనాలు ఉంటాయని వివరించారు. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ కంపెనీ ప్రతినిధులు ఎస్ఎంటీ శివశంకర్, వినోద్, ఎస్ఆర్ఐటీ విద్యాసంస్థల కరస్పాండెంట్ బసిరెడ్డి వీరకల్యాణ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్‌రెడ్డి మధ్య ఒప్పందం జరిగింది. దీనిపై కళాశాల అధ్యక్షుడు బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు వీరకుమార్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.



ఒప్పందపత్రాలను చూపుతున్న హెచ్‌సీఎల్, ఎస్ఆర్ఐటీ ప్రతినిధులు

చెత్త.. తొలగించక అవస్థ

ప్రొద్దుటూరు పట్టణం కోనేటికాల్వ వీధిలోని అర్చన థియేటర్ వద్ద చెత్త కుప్పలు పేరుకుపోయాయి. దీంతో దుర్వాసన, దోమల బెడద ఎక్కువైంది. జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతంలో వ్యర్థాలను సక్రమంగా తొలగించడం లేదు. ఈ విషయమై వార్డు సచివాలయ పారిశుద్ధ్య కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

రైతు అంగడి పరిశీలన

ఖాజీపేట, న్యూస్‌టుడే: ఖాజీపేట మండలంలో రైతు అంగడిని బుధవారం జిల్లా మార్కెటింగ్, సర్టిఫికేషన్ ఇన్‌ఛార్జి శ్రీనాథ్‌రెడ్డి పరిశీలించారు. ఇందులో రైతులు తాము పండించిన పంటలను విక్రయించేలా అవకాశం ఆయన కల్పించారు.

పేదలకు అన్నదానం

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: అనకాపల్లి ఎంపీ రమేష్ పుట్టిన రోజు వేడుకలను తెదేపా నాయకుడు సారథినాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక టీబీ రోడ్డులోని అన్న క్యాంటీన్‌లో 750 మందికి మూడు వేళలా ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు. వృద్ధాశ్రమాల్లో అన్నదానం చేపట్టారు.

విద్యుత్తు సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం

ఖాజీపేట, న్యూస్‌టుడే: విద్యుత్తు సిబ్బంది నిర్లక్ష్యంపై మండల పరిధిలోని ఏటూరు గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సూరారెడ్డికి చెందిన గేదె గ్రామ సమీపంలోని పొలాల్లో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద భద్రతా చర్యలు లేకపోవడంతో ప్రమాదం జరిగిందని గ్రామస్థులు ఆరోపించారు.

ఆలయ కట్టడాలను పునఃనిర్మించాలి

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: అటవీ స్థలంలో ఏర్పాటు చేసిన వారాహీ ఆలయ కట్టడాలు కూల్చివేతలో దెబ్బతిన్న నవగ్రహాల మండపాన్ని పునఃనిర్మించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇర్ఫాన్ బాషా డిమాండు చేశారు. సంఘటనా స్థలాన్ని బుధవారం ఆయన పరిశీలించారు.

బంగారు గొలుసు చోరీ

చాపాడు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీకి చెందిన వృద్ధురాలి సరోజ మెడలో గొలుసు చోరీకి గురైందని చాపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 8న ఆర్టీసీ బస్సులో వృద్ధురాలు ప్రయాణిస్తుండగా 15 గ్రాముల బంగారు గొలుసు చోరీకి గురైంది. చాపాడు వద్ద ముగ్గురు మహిళలు బస్సు దిగారని, వారిపై అనుమానం వ్యక్తం చేస్తూ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కళాశాలలో విద్యార్థుల రక్తదానం

చాపాడు, న్యూస్‌టుడే: సీబీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో 150 మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రక్తదానం చేశారు. బుధవారం ప్రొద్దుటూరు రోటరీక్లబ్ జిల్లా ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన కార్యక్రమాన్ని డాక్టర్ కవిత పర్యవేక్షించారు. మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, రోటరీక్లబ్ ప్రెసిడెంటు గజ్జల వెంకటేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి షేక్ బాబా, కళాశాల ఛైర్మన్ జయచంద్రారెడ్డి, సీఈవో లోహిత్‌రెడ్డి, డైరెక్టర్ అడ్మిన్, ప్రిన్సిపల్ శృతి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు గ్రామీణ: స్థానిక ప్రభుత్వ పశువైద్య కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కడప రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదానం కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు. అధ్యాపకులు, సిబ్బంది నుంచి రక్తం సేకరించారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ శ్రీనివాస ప్రసాదు, ఎన్ఎస్ఎస్ అధికారిణి ఇందిరా, అధ్యాపకులు జాన్, వంశీ, సిబ్బంది పాల్గొన్నారు.

చాపాడు: శిబిరంలో డీఎస్పీ రాజేంద్రప్రసాద్, రోటరీ క్లబ్ ప్రతినిధులు

SHRIRAM Finance
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032. వెబ్‌సైట్: www.shriramfinance.me.
బ్రాంచ్ కార్యాలయము :డి.నెం.4/620, 1వ అంతస్తు, గాంధీరోడ్డు, ప్రొద్దుటూరు - 516360, కడప జిల్లా

లాంఛనంగా స్వాధీనతా ప్రకటన

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా ఉండి శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌తో విలీనమైన తరువాత ఎన్‌సిఎల్‌టి బెంచ్-2 చెన్నై తేది: 09.11.2022 వారి ఆదేశాలతో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా రూపాంతరం చెందిన తర్వాత కార్పోరేట్ ఫైనాన్స్ మంత్రిత్వ శాఖ లేఖ తేది: 30.11.2022 ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరు మార్పునకు ఆమోదము లభించినది) ఈ కంపెనీ కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టరు కాబడినది మరియు ఆర్‌బిఐ నందు కూడా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించు టకు రిజిస్టరు కాబడి వారి **రిజిస్టరు కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032** నందు నమోదు కాబడినదని తెలియజేయడ మైనది మరియు **శాఖ కార్యాలయం ప్రొద్దుటూరు** (ఇకపై కంపెనీ/లెండర్‌గా వ్యవహరించబడును)

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002(యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారం శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ (SCUF) యొక్క అధీకృత అధికారి సదరు చట్టంలోని 13(12)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్ మెంట్) రూల్స్ 2002 నందలి రూలు 3 ప్రకారం సంక్రమించిన అదికారములను వినియోగిస్తూ ఋణగ్రహీత ఈ క్రింది తెలిపిన ప్రకారం బకాయి సొమ్ము మొత్తంను చెల్లించ వలసినదిగా క్రింద ఉదహరించినబడిన తేదీన డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.

బకాయి సొమ్ము చెల్లించడంలో ఋణగ్రహీతలు విఫలమైనందున సదరు చట్టంలోని సెక్షన్ 13(4)తో అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూలు8 ప్రకారం సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ పేర్కొన్న ఆస్తిని **డి.17.02.2026 న** లాంఛనంగా స్వాధీనం చేసుకోవడమైనదని ఋణగ్రహీతలకు మరియు సాదారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఋణగ్రహీత పేరు మరియు చిరునామా:
1) **వేంపల్లి రాంభూపాల్‌రెడ్డి,** తండ్రి వి.ప్రభాకర్‌రెడ్డి, డి.నెం.17/106, సుబ్బిరెడ్డిగారి వీధి, ప్రొద్దుటూరు, కడప జిల్లా
2) **వేంపల్లి శ్రీకాంత్‌రెడ్డి,** తండ్రి వి.విజయ్‌కుమార్, డి.నెం.15/488, మైదుకూరు రోడ్డు, ప్రొద్దుటూరు,కడప జిల్లా

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి సొమ్ము: రూ.60,31,289/- (అరవై లక్షల ముప్పై ఒక్క వేల రెండు వందల ఎనభై తొమ్మిది రూపాయలు మాత్రమే)
ఋణ ఖాతా నెంబరు : PRDTRTF1211260001
డిమాండ్ నోటీసు తేది: 20.11.2025

స్థిరాస్తుల వివరములు:-
వైయస్ఆర్. కడప జిల్లా, ప్రొద్దుటూరు రిజిస్ట్రేషన్ జిల్లా, ప్రొద్దుటూరు సబ్ జిల్లా, ప్రొద్దుటూరు మండలం, కొత్తపల్లి గ్రామ పంచాయతీ, వార్డునెం.10, జేమ్స్‌పేట ఏరియా, మోడంమీదపల్లి గ్రామ ఫీల్డ్స్ సర్వేనెం.221లో ఎ.0.06 1/4 సెంట్లు లేదా 0.025 హెక్టార్ల స్థలం, హద్దులు: తూర్పు: కె.క్రిష్ణయ్య స్థలం, పడమర: సి.తిప్పన్న స్థలం, ఉత్తరం: ఎ.వీరరాఘవయ్య, స్థలం, దక్షిణం: 30 లింకుల వెడల్పు గల రోడ్డు. దక్షిణం వైపునున్న రాస్తాలో సగ భాగంతో సహా స్థలం

సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా (SFL) అధీకృత అధికారి పైన పేర్కొబడిన స్థిరాస్తులను ఋణగ్రహీతల నుండి లాంఛనముగా స్వాధీనత తీసుకొనడమైనది. ఈ నోటీసు తర్వాత ఏ వ్యక్తికి విక్రయించుట గాని, ట్రాన్స్‌ఫర్ చేయుట గానీ, లీజు లేదా తనఖా ఆస్తులను దారి మళ్ళించుటకు గానీ SFL వారి లిఖితపూర్వక అనుమతి లేకుండా చేయరాదు.

ప్రదేశం: కడప/ జోనల్ కార్యాలయం
తేది: 17.02.2026
సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032. వెబ్‌సైట్: www.shriramfinance.me.
బ్రాంచ్ కార్యాలయము :డి.నెం.4/620, 1వ అంతస్తు, గాంధీరోడ్డు, ప్రొద్దుటూరు - 516360, కడప జిల్లా

లాంఛనంగా స్వాధీనతా ప్రకటన

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా ఉండి శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌తో విలీనమైన తరువాత ఎన్‌సిఎల్‌టి బెంచ్-2 చెన్నై తేది: 09.11.2022 వారి ఆదేశాలతో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా రూపాంతరం చెందిన తర్వాత కార్పోరేట్ ఫైనాన్స్ మంత్రిత్వ శాఖ లేఖ తేది: 30.11.2022 ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరు మార్పునకు ఆమోదము లభించినది) ఈ కంపెనీ కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టరు కాబడినది మరియు ఆర్‌బిఐ నందు కూడా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించు టకు రిజిస్టరు కాబడి వారి **రిజిస్టరు కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032** నందు నమోదు కాబడినదని తెలియజేయడ మైనది మరియు **శాఖ కార్యాలయం ప్రొద్దుటూరు** (ఇకపై కంపెనీ/లెండర్‌గా వ్యవహరించబడును)

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002(యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారం శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ (SCUF) యొక్క అధీకృత అధికారి సదరు చట్టంలోని 13(12)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్ మెంట్) రూల్స్ 2002 నందలి రూలు 3 ప్రకారం సంక్రమించిన అదికారములను వినియోగిస్తూ ఋణగ్రహీత ఈ క్రింది తెలిపిన ప్రకారం బకాయి సొమ్ము మొత్తంను చెల్లించ వలసినదిగా క్రింద ఉదహరించినబడిన తేదీన డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.

బకాయి సొమ్ము చెల్లించడంలో ఋణగ్రహీతలు విఫలమైనందున సదరు చట్టంలోని సెక్షన్ 13(4)తో అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూలు8 ప్రకారం సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ పేర్కొన్న ఆస్తిని **డి.17.02.2026 న** లాంఛనంగా స్వాధీనం చేసుకోవడమైనదని ఋణగ్రహీతలకు మరియు సాదారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఋణగ్రహీత పేరు మరియు చిరునామా:
1) కె.వెంకటేశ్వర్లరెడ్డి, తండ్రి కె.రామకృష్ణారెడ్డి, డి.నెం.1/39, లింగాల గ్రామం, పులివెందుల, కడప జిల్లా
2) ఎన్.శివశంకర్, తండ్రి ఎన్.శివకుమార్, డి.నెం.7/3012-బి ఫైన, ఎ.కె.రోడ్డు, ప్రొద్దుటూరు, కడప జిల్లా

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి సొమ్ము: రూ.82,41,360/- (ఎనభై రెండు లక్షల నలభై ఒక్క వేల మూడు వందల అరవై రూపాయలు మాత్రమే)
ఋణ ఖాతా నెంబరు: PRDTRTF1305220003 డిమాండ్ నోటీసు తేది: 20.11.2025

స్థిరాస్తుల వివరములు:-
కడప జిల్లా, ప్రొద్దుటూరు రిజిస్ట్రేషన్ జిల్లా, ప్రొద్దుటూరు సబ్ జిల్లా, ప్రొద్దుటూరు మండలం, కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధి, వార్డు నెం.1, మీనాపురం ఏరియా, శ్రీ సాయికృప కాలనీ-2, సర్వేనెం.177, సబ్ డివిజన్ అనంతరం సర్వే నెం.177/2, 177/3లో ప్లాటు నెం.148 ఖాళీ స్థలము 149 భాగం, కొలతలు: తూర్పు నుండి పడమర: 60అ. లేదా 18.288 మీ. ఉత్తరం నుండి దక్షిణం: 72 1/2 అ. లేదా 22.098 మీ. వెరశి 484 చ.గ. లేదా 0.10 సెంట్ల స్థలం, హద్దులు: తూర్పు: 30అ వెడల్పు గల రోడ్డు, పడమర: ప్లాటు నెం.172 & 173 లోని స్థలం, ఉత్తరం: ప్లాటు నెం.147 స్థలం, దక్షిణం: ప్లాటు నెం.150 స్థలం.

సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా (SFL) అధీకృత అధికారి పైన పేర్కొబడిన స్థిరాస్తులను ఋణగ్రహీతల నుండి లాంఛనముగా స్వాధీనత తీసుకొనడమైనది. ఈ నోటీసు తర్వాత ఏ వ్యక్తికి విక్రయించుట గాని, ట్రాన్స్‌ఫర్ చేయుట గానీ, లీజు లేదా తనఖా ఆస్తులను దారి మళ్ళించుటకు గానీ SFL వారి లిఖితపూర్వక అనుమతి లేకుండా చేయరాదు.

ప్రదేశం: కడప/ జోనల్ కార్యాలయం
తేది: 17.02.2026
సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

మాతృ మరణాల బాధ్యులపై చర్యలు

జిల్లా సచివాలయం : గర్భిణుల ప్రసవ సమయంలో వారి ఆరోగ్య పరిస్థితులపై వైద్యులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం కడప కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖాధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుఖ ప్రసవాలయ్యేందుకు వైద్యులు నిత్యం గర్భిణుల ఆరోగ్యాన్ని పర్యవేక్షణ చేయాలన్నారు. మాతృ మరణాలపై పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేశారు. ప్రస్తుతం ప్రైవేటు ఆసుపత్రుల్లో సుఖ ప్రసవాలకంటే సిజేరియన్ ఆపరేషన్లు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. సిజేరియన్ ఆపరేషన్లు, మాతృ మరణాలపై కారణాలను సమీక్షించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో నాగరాజు, డీఐవో ఉమామహేశ్వరరావు, జీజీహెచ్ పర్యవేక్షకులు వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ హిమదేవి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, చిత్రంలో డీఎంహెచ్‌వో నాగరాజు, అధికారులు

కలుషిత ఆహారం కట్టడికి విస్తృత తనిఖీలు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : జిల్లాలో కలుషిత ఆహారం నుంచి ప్రజలను రక్షించేందుకు ఫుడ్ సేఫ్టీ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ శ్రీధర్ ఆదేశించారు. బుధవారం కడప కలెక్టరేట్‌లో ఆయన జిల్లా టాస్క్‌ఫోర్సు సమావేశంలో నిర్వహించి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు వసతిగృహాలు, హోటల్స్ స్ట్రీట్ ఫుడ్ సెంటర్లలో తనిఖీలు చేపట్టి ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, డీఎంహెచ్‌వో నాగరాజు, అన్ని మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ●పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ భవనంలో పరిశ్రమల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆన్‌సైట్, ఆఫ్‌సైట్‌లో అలారం వ్యవస్థను ఏర్పాటు చేయాలని, పరిశ్రమలోనే కాకుండా పరిశ్రమల బయట కూడా ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. పరిశ్రమల్లో రక్షణ, భద్రత, అత్యవసర వ్యవస్థ, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన అంశాలపై కాలుష్య నియంత్రణ, పరిశ్రమల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

SHRIRAM Finance
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిష్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032, వెబ్‌సైట్: www.shriramfinance.me.
బ్రాంచ్ కార్యాలయము : డి.నెం.42/107-1, ఓబుల్ రెడ్డి కాంప్లెక్స్, అప్సర సర్కిల్, జయనగర్ కాలనీ,కడప

డిమాండ్ నోటీసు
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా ఉండి శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ లిమిటెడ్‌తో విలీనమైన తరువాత ఎన్‌సిఎల్‌టి బెంచ్-2 చెన్నై తేది: 09.11.2022వారి ఆదేశాలతో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా రూపాంతరం చెందిన తర్వాత కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వ శాఖ లేఖ తేది: 30.11.2022 ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరు మార్పునకు ఆమోదము లభించినది) ఈ కంపెనీ కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిష్టరు కాబడినది మరియు ఆర్‌బిఐ నందు కూడా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుటకు రిజిష్టరు కాబడి వారి **రిజిష్టరు కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 నందు సమోదు కాబడినదని తెలియజేయడమైనది. బ్రాంచ్ కార్యాలయము: కడప-2 (ఇకపై కంపెనీ / లెండర్‌గా వ్యవహరించబడతారు)**

ఈక్రింద పేర్కొన్న రుణగ్రహీత /సహరుణగ్రహీతలు / గ్యారంటీదారులు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎల్) వారి వద్ద రుణ సౌకర్యము పొంది ఉన్నారు. రుణ సౌకర్యము పొందిన తర్వాత సదరు రుణగ్రహీతలు/ గ్యారంటీదారులు రుణము మరియు దానిపై వడ్డీని తిరిగి చెల్లించుటలో పలుమార్లు విఫలమైనారు.కావున సదరు అకౌంట్ రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నియమ నిబంధనలు అనుసరించి నిరర్ధక ఆస్తులుగా వర్గీకరించబడినది. తదుపరి శ్రీరామ్‌ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎల్) యొక్క అధీకృత అధికారి గారు సెక్యూరిటీ మరియు ఆర్థిక ఆస్తుల పునర్నిర్మాణం మరియు భద్రతా చట్టం, 2002 నిబంధన క్రింద సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (సదరు యాక్ట్) మరియు దాని ద్వారా ఆపాదించబడిన అధికారాలను బట్టి రూలు 3తో చదువబడిన సెక్షన్ 13(2) ప్రకారం సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నియమాల (పేర్కొన్న నియమాలు) ను అనుసరించి ఋణగ్రహీత / గ్యారంటీదారులు /తనఖాదారులకు డిమాండ్ నోటీసును మరియు దానిపై అంగీకరింపబడిన వడ్డీ రేటుతో పాటు ఉత్పన్నమగు ఖర్చులు, ఇతర ఛార్జీలను నోటీసు అందుకున్న 60 రోజులలోపు చెల్లించవలసినదిగా కోరి వున్నారు.

వారు చివరగా తెలిపిన అడ్రసుకు జారీ చేసిన సదరు నోటీసు వారికి చేరక రిటర్న్ అయినది. కావున ఇందుమూలముగా పబ్లిక్ నోటీసు ద్వారా వారికి సదరు విషయము తెలియజేయడమైనది. సదరు చట్టములో సెక్షన్ 13 యొక్క సబ్‌సెక్షన్(8) ద్వారా రుణగ్రహీతకు తెలియజేయడమేమనగా సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు గల అవకాశమును వారి దృష్టికి తీసుకురావడమైనది.

రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు, గ్యారంటీదారుల పేర్లు మరియు చిరునామా
1) **జగన్‌మోహన్‌రెడ్డి మేకల** తండ్రి ఓబుల్‌రెడ్డి, డి.నెం.2/693, భాకరాపేట, ప్రకాష్‌నగర్, ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516360, సెల్: 8074388400, 9441155848
2) **చదిపిరాళ్ళ శివనారాయణరెడ్డి,** తండ్రి శివశంకర్, డి.నెం.2/60, దేవగుడి, జమ్మలమడుగు, కడప జిల్లా - 516434, ఫోన్: 9849952792
3) **మల్లిరెడ్డి మధుసూదన్‌రెడ్డి,** తండ్రి వీరసుబ్బారెడ్డి, డి.నెం.3/125, పుల్లారెడ్డి పేట, తప్పెట్ల వల్లూరు, కడప జిల్లా - 516293, ఫోన్: 77022 22006
4) **గౌనుకు వెంకట సుధాకర్,** తండ్రి గోవిందయ్య, డి.నెం.3/610 మిట్టపల్లె, ప్రొద్దుటూరు, కడప- 516361, ఫోన్: 98496 52419

ఎన్‌పీఏ తేది: 08.07.2025 డిమాండ్ నోటీసు తేది: 14.01.2026
ఋణ మొత్తం: రూ.95,00,000/- (తొంభై ఐదు లక్షల రూపాయలు మాత్రమే)
ఋణఅగ్రిమెంట్ నెం. CUDP4TF2101300004
బకాయి అమౌంట్: రూ.36,97,066/- (ముప్పై ఆరు లక్షల తొంభై ఏడు వేల అరవై ఆరు రూపాయలు మాత్రమే)

స్థిరాస్తి వివరములు
[illegible]

ప్రదేశం: కడప సం/- అధీకృత అధికారి,
తేది: 16.02.2026 శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఆర్.ఓ.సి. నెం. 70/2025/A1
బద్వేలు పురపాలక సంఘము
తేదీ : 18.02.2026

బహిరంగపు వేలపు ప్రకటన

బద్వేలు పురపాలక సంఘమునకు చెందిన కూరగాయల మార్కెట్టు గేటు, మాంసం, చేపల మార్కెట్టు మరియు మేకలు మరియు పొట్టేల సంత 2026-27 సంవత్సరమునకు అనగా 01.04.2026 నుండి 31.03.2027 తేదీ అర్ధరాత్రి వరకు గౌరవ జిల్లా కలెక్టర్ వారి [illegible] గుత్త హక్కులను తేదీ: 26.02.2026 గురువారం [illegible] అధికారము పొందిన వారిచే గానీ బహిరంగవేలము [illegible]. ఈ వేలము 1965 సంవత్సరపు ఆంధ్రప్రదేశ్ [illegible] షెడ్యూలుకు లోబడి యుండవలెను. గుత్తల [illegible] చెల్లించి, వేలములో పాల్గొనవలెను. వేలములో [illegible] పాల్గొనువారు వేలమునకు ముందు వేలపు [illegible] వేలము వేయబడు గుత్తలు వేలమునకు [illegible] పాల్గొనవలెను.

క్ర. సం.	గుత్త వివరములు	గుత్త కాలము	వేలముకు ముందు కట్టవలసిన ధరావత్తు (డి.డి./నగదు)	కమిషనరు/మండల రెవిన్యూ అధికారి గారిచే జారీ చేయబడిన సాల్వెన్సీ పత్రము/ బ్యాంకు గ్యారంటీ	కేంద్ర ప్రభుత్వ సేవా పన్ను ప్రభుత్వము వారి ఉత్తర్వుల మేరకు చెల్లించవలసిన పన్ను
1	కూరగాయల మార్కెట్టు మరియు గేటు	01.04.2026 నుండి	15,00,000/-	10,00,000/-	18 %
2	మాంసం, చేపల మార్కెట్టు	31.03.2027 వరకు	1,00,000/-	3,00,000/-	18 %

[illegible]

సం/- కమిషనర్, బద్వేలు పురపాలక సంఘము.

గమనిక: [illegible]

ముంచుకొస్తున్న గడువు తేదీ
కనిపించని పురోగతి

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో రూ.300 కోట్ల వ్యయంతో గ్రామాల్లో చేపట్టిన త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా పనులలో పురోగతి కనిపించలేదు. ఆర్డీఎస్ఎస్ పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో 24 గంటల పాటు విద్యుత్తుకు 11 కేవీ, ఎల్టీ లైన్లు, స్తంభాలు, నియంత్రికల ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు ఈ ఏడాది మార్చి చివరి వరకు గడువు విధించారు.

స్తంభాలకు ఏర్పాటు కాని త్రీఫేజ్ విద్యుత్తు తీగలు

మొత్తం డివిజన్లు	ఆర్డీఎస్ఎస్ ఫీడర్లు	ఇప్పటివరకు పూర్తయినవి	పురోగతిలో ఉన్నవి	ప్రారంభం కానివి
ప్రొద్దుటూరు	84	47	31	06
కడప	66	52	05	09
పులివెందుల	94	81	07	06
మైదుకూరు	148	105	28	15
రాజంపేట	136	99	29	08
రాయచోటి	96	37	36	23

✶ జిల్లాలో 2023 నుంచి టర్న్ కీ పద్ధతిలో ఆర్డీఎస్ఎస్ పనులను గుత్తేదారు సంస్థ చేపట్టింది. అప్పట్లో అరకొరగా తీగలు, నియంత్రికలు, బ్రేకర్లు, స్తంభాలను ఏర్పాటు చేశారు. ఫలితంగా గ్రామాల్లో చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం, బలోపేతం ద్వారా స్థానికులకు సుస్థిర ఉపాధి కల్పించాలన్న లక్ష్యం నీరుగారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జమ్మలమడుగు, మైదుకూరు, పులివెందుల, బద్వేలు, కమలాపురం, కడప నియోజకవర్గాల్లో ఆర్డీఎస్ఎస్ పనులు ఊపందుకున్నాయి. కానీ ఏడాదిన్నర తర్వాత ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల పరిధిలో ఆలస్యంగా పనులను చేపట్టారు. ✶ ఈ విషయమై ఎస్పీడీసీఎల్ జిల్లా ఎస్ఈ రమణ మాట్లాడుతూ వచ్చే నెలలోపు ఆర్డీఎస్ఎస్ పనులు పూర్తయ్యే విధంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

ప్రొద్దుటూరు మండలం చెన్నమరాజుపల్లెలో స్తంభాలకు ఏర్పాటు కాని త్రీ ఫేజ్ విద్యుత్తు తీగలు

కోడిగుడ్డు బరువు 35 గ్రాములే
● విజిలెన్స్ తనిఖీల్లో వెల్లడి

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే : కడప నగరంలోని ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేసే కోడిగుడ్ల సైజు తగ్గాయని విజిలెన్స్ అధికారి గీతావాణి తెలిపారు. ఒక్కో గుడ్డు 50 గ్రాములుండాలి.. కానీ వాటిలో అధికంగా 35 గ్రాములు మాత్రమే ఉన్నట్లు గుర్తించామని ఆమె చెప్పారు. కడప నగరపాలక ప్రధాన ఉన్నత పాఠశాలలో బుధవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. పాఠశాల ఆవరణలో ఉన్న స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అక్కడున్న కోడిగుడ్ల బరువును పరిశీలించారు. ప్రధాన పాఠశాల నుంచి నగరంలోని 13 పాఠశాలలకు మధ్యాహ్న భోజనం సరఫరా అవుతుందన్నారు. అలానే అయిదు వేల గుడ్లు కూడా సరఫరా అవుతాయని, అయితే చాలా గుడ్లు 35 గ్రాములు మాత్రమే ఉన్నాయని వివరించారు. సంబంధిత కాంట్రాక్టరు దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. పిల్లలు తినే గుడ్లలో ఎవరైనా చేతివాటం ప్రదర్శిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ శివప్ప, ఏవో లక్ష్మణ్ సిబ్బంది పాల్గొన్నారు.

నగరపాలక ప్రధాన ఉన్నత పాఠశాలలో కోడిగుడ్లను పరిశీలిస్తున్న అధికారులు

అక్షరాస్యత కోసం మరో 'వికాసం'

కమలాపురం : వయోజనులు వంద శాతం అక్షరాస్యత సాధించాలని జిల్లా వయోజన విద్య ఉప సంచాలకులు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆవరణంలో 'ఉల్లాస్- అక్షర ఆంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గోడపత్రికను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. 2029 నాటికి రాష్ట్రంలో వయోజనులందరిని అక్షరాస్యులుగా మార్చడమే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. 15 ఏళ్ల, అంతకంటే ఎక్కువ వయసు ఉన్న నిరక్షరాస్యులకు ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత, జీవిత నైపుణ్యాలను నేర్పిస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాధవీలత, ఏపీవో రమాదేవి, ఎంపీడీవో జిజయా, ఉపాధి ఏపీవో పార్థసారథి, వెలుగు ఏపీఎం గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న జిల్లా వయోజన విద్య ఉప సంచాలకులు వెంకటసుబ్బారెడ్డి, అధికారులు

గంగమ్మ.. కరుణించమ్మా

అలంకరణలో గంగమ్మ దేవత

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : కడప నగర శివారులోని సీకేదిన్నె మండలం బుగ్గలేటిపల్లె సమీపంలోని గంగమ్మ జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. తెల్లవారుజాము నుంచి వేదపండితులచే అమ్మ వారికి అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి గంగమ్మకు బోనాలు, పూలమాలలు, నిమ్మకాయ మాలలు, చీరలు, గాజులు కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు తమ వాహనాలకు వేప కొమ్మలు కట్టుకొని జైజై గంగమ్మ తల్లి అంటూ ఆలయానికి చేరుకున్నారు.

కల్యాణం.. కమనీయం

ఆలయ ఆవరణలో గంగమ్మ దేవత ప్రతిరూపం ఆయన కత్తికి శివుడికి బుధవారం అర్థరాత్రి తరువాత కల్యాణం నిర్వహించారు. కల్యాణం తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చారు. రాత్రి జిల్లెడ బసవేశ్వర్ వేదపండితులచే కల్యాణం నిర్వహించారు. గురువారం కూడా జాతర జరుగుతుందని ఈవో కృష్ణనాయక్ ఛైర్మన్ మాధవరెడ్డి తెలిపారు. ఉగాది వరకు ప్రతి ఆదివారాల్లో వారాల జాతర జరుగుతుందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు.

రంజాన్ మాసంలో పని వేళల సవరణ

కడప విద్య, న్యూస్‌టుడే : రంజాన్ మాసంలో ఉపవాసం పాటించే విద్యార్థులు, ఉపాధ్యాయుల సౌకర్యార్థం జిల్లాలోని ఉర్దూ మాధ్యమ పాఠశాలల పనివేళలు సవరించినట్లు డీఈవో షంషుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉర్దూ మాధ్యమ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. సవరించిన పని వేళలు రంజాన్ మాసానికి మాత్రమే వర్తిస్తాయన్నారు. రంజాన్ ముగిసిన తరువాత పాఠశాలలు యథావిధిగా సాధారణ వేళల ప్రకారం నిర్వహించాలన్నారు. [illegible] ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో [illegible] ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు రంజాన్ మాసం కాలంలో ప్రతి పనిదినంలో సాధారణ ముగింపు సమయానికి ఒక గంట ముందుగా కార్యాలయాలు, పాఠశాలల నుంచి వెళ్లేందుకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. [illegible] మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వ సంబంధిత పాఠశాలల్లో కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.

అవయవ దానం.. నలుగురి జీవితాల్లో వెలుగులు

వీరపునాయునిపల్లె, న్యూస్‌టుడే: పాయసంపల్లెకు చెందిన రాజశేఖర్‌రెడ్డి దంపతుల కుమార్తె సంగీత (22) అవయవాలను బుధవారం దానం చేశారు. ఈ నెల 15న ప్రమాదవశాత్తు సంగీత జారి కిందపడి మెదడుకు రక్తస్రావం అయి పోవడంతో బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. యువతి బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు గుర్తించారు. అవయవదానం చేసి తమ బిడ్డను నలుగురిలో చూసుకోవచ్చని తల్లిదండ్రులు గుప్పెడు దుఃఖంలో కూడా కుమార్తె కిడ్నీలు, గుండె, కళ్లు, ఊపిరితిత్తులు దానం చేశారు.

సంగీత (పాత చిత్రం)

పారిశ్రామిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

తిరుపతి (జీకేసన), న్యూస్‌టుడే: పారిశ్రామిక వినియోగదారుల ఎదుర్కొంటున్న విద్యుత్తు సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ లోతేటి చెప్పారు. తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో బుధవారం పారిశ్రామిక విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి మాట్లాడారు. నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి 26 మంది హాజరై పలు సమస్యలు తెలిపినట్లు చెప్పారు. వోల్టేజీలో హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయని, సోలార్ విద్యుత్తు బిల్లింగ్, ట్రూ-అప్, ఎఫ్‌పీపీసీఏలకు సంబంధించి వినతులను అందజేశారని తెలిపారు. వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రతి నెలా మొదటి బుధవారం ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు జిల్లాలోని సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయాల్లో, మూడో బుధవారం తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో ఈ వేదికలు నిర్వహిస్తున్నామని పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలని కోరారు. సంస్థ డైరెక్టర్లు అయూబ్ ఖాన్, గురవయ్య, రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు రమణాదేవి, పద్మ, ఆదిశేషయ్య, ఉమాపతి, కృష్ణారెడ్డి, రామచంద్రరావు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తతో మాట్లాడుతున్న సీఎండీ శివశంకర్ లోతేటి

మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఏపీ మున్సిపల్ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు డిమాండు చేశారు. ఏపీ మున్సిపల్ కార్మికుల సంఘం ఐదో జిల్లా మహాసభలు బుధవారం కడపలోని బీసీ భవన్‌లో ప్రారంభమయ్యాయి. మహాసభలను పురస్కరించుకుని ముందుగా కార్మికులు నగరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో సుబ్బరాయుడు మాట్లాడుతూ కార్మికులను ఆప్కాస్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ మొత్తాలను క్రమం తప్పకుండా కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, నాగసుబ్బారెడ్డి మాట్లాడారు.

వృత్తి నైపుణ్యాలతో ఉపాధి అవకాశాలు

కడప విద్య : విద్యార్థులు వృత్తి నైపుణ్యాలు సాధించడం ద్వారా ఉపాధి అవకాశాలు పొందొచ్చని కడప కోటిరెడ్డి (ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్) ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సలీంబాషా అన్నారు. బుధవారం స్థానిక కళాశాల సెమినార్ హాల్‌లో వేంపల్లి డిగ్రీ కళాశాలతో సంయుక్తంగా నిర్వహించిన స్కిల్ ట్రైనింగ్ ఆన్ టైలరింగ్ సర్టిఫికెట్ కోర్సు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడారు. అనంతరం విద్యార్థినులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ప్రిన్సిపల్ నాగేంద్ర, కోఆర్డినేటర్ సతీష్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కృష్ణవేణి పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో ఉపాధ్యాయుడికి రజత పతకం

చక్రాయపేట (వేంపల్లె), న్యూస్‌టుడే : వేంపల్లెలోని శ్రీనివాస పాఠశాలలో భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న బాబురావుకు పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో రజత పతకాన్ని సాధించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ కేశవులు బుధవారం తెలిపారు. ఈ నెల 14న రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో 59 కిలోల పురుషుల విభాగంలో బాబురావు పాల్గొన్నారు. అనంతరం 180 కిలోల స్క్వాట్, 82.5 కిలోల బెంచ్‌ప్రెస్, 190 కిలోల డెడ్‌లిఫ్ట్ విభాగాలలో పాల్గొని రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని గెలిపొందారు. కడప జిల్లాకు ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని కల్పించిన ట్రిపుల్ ఐటీ ప్రొఫెసర్, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలగోవింద్ తివారీకి కృతజ్ఞతలు తెలిపారు.

బాబురావుతో కరస్పాండెంట్ కేశవులు

ముమ్మాటికీ అవి హత్యలే!
- మందకృష్ణ మాదిగ

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే : 'కడప జిల్లా బి.మఠం మండలంలో ఈ నెల 5వ తేదీ ఇద్దరు యువకులు మృతి చెందారు. ఇవి ముమ్మాటికీ హత్యలే.. తమ వద్ద స్పష్టమైన ఆధారాలున్నాయి. ఈ కేసు విచారణ సమయంలో సంబంధిత ఎస్ఐ, సీఐలను పక్కన పెట్టాలి. ఇద్దరు యువకుల మరణాన్ని ఎస్ఐ ప్రమాదవశాత్తు అని ఫిర్యాదులో పేర్కొని మృతుల బంధువుల నుంచి సంతకాలు తీసుకున్నారు. ఆ ఎస్ఐను సస్పెండ్ చేయాలి' అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగ డిమాండు చేశారు. బుధవారం మందకృష్ణమాదిగ బాధితులతో కలిసి కడపలో ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 20 ఏళ్ల వయసు కలిగిన సతీష్, ఓబులేశులు మోకాలి లోతు నీరు ప్రవహిస్తున్న కాలువలో పడి ప్రమాదవశాత్తు మృతి చెందారని పోలీసులు కేసు నమోదు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇద్దరు వేర్వేరు ప్రాంతాల్లో మృతి చెందడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఓబులేశు, సతీష్‌ల మరణానికి ప్రేమ వ్యవహారమే కారణమని తెలిపారు. వీరి మరణాల వెనకాల ఉన్న మిస్టరీని పోలీసులు ఛేదించాలని డిమాండు చేశారు. ఇద్దరి మరణాల కేసును తానే స్వయంగా పర్యవేక్షిస్తానని ఎస్పీ భరోసా ఇచ్చారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు నాగరాజు, ఎంఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు వై.కె.విశ్వనాథ్, నాయకులు నరేంద్రబాబు, సురేశ్, ఈశ్వరయ్య, శివయ్య, రాజు, వెంకటేశ్, బాబు, స్మాలన్, చిన్నసుబ్బయ్యయాదవ్ పాల్గొన్నారు.

ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న మందకృష్ణ మాదిగ, నాయకులు

మే నెలలో ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి సీఎం భూమి పూజ

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : జిల్లాలోని జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె సమీపాన కన్యతీర్థం వద్ద ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి మేలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భూమి పూజ చేస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు భూపేష్‌రెడ్డి ప్రకటించారు. ఉక్కు కర్మాగారానికి మౌలిక వసతులు కల్పించేందుకు ఈ బడ్జెట్‌లో రూ.25 కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. బుధవారం కడపలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ భారీ బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. రాయలసీమ అభివృద్ధికి సీఎం ప్రత్యేక దృష్టి సారించారని, అందులో భాగంగా హార్టీకల్చర్ హబ్‌కు రూ.30 వేల కోట్లు కేటాయించారని, ఇది గ్లోబల్ స్థాయిలో గుర్తింపు పొందుతుందన్నారు. ప్రొద్దుటూరులో యునాని వైద్య కళాశాల ఏర్పాటుకు రూ.75 కోట్లు కేటాయించారన్నారు. ప్రస్తుతం రాయలసీమలోని అన్ని ప్రాజెక్టుల నిర్మాణం పూర్తికి తెదేపా చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ నెల 22వ తేదీన కడపలో తెలుగుదేశం పార్టీ కార్యాలయ భవనానికి భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత, జోన్-5 బాధ్యులు బీద రవిచంద్ర హాజరవుతారన్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులు విధిగా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్‌రెడ్డి, జబీవుల్లా, జనార్దన్, మన్సూరు అక్బర్, చరణ్, నజీముద్దీన్, జయసుబ్బారెడ్డి, యల్లారెడ్డి, సంపత్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు భూపేష్‌రెడ్డి

జింకలతో రైతులు నష్టపోతున్నారు : పుత్తా

కమలాపురం, న్యూస్‌టుడే : కమలాపురం నియోజకవర్గంలో జింకల బెడద ఎక్కువగా ఉందని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి బుధవారం జరిగిన అసెంబ్లీలో ప్రస్తావించారు. పంటలు వేసిన రైతులు నష్టపోతున్నారు. వాటిని రీలొకేట్ చేసి, సంబంధిత అధికారులు సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

గ్రామ సేవకుల సమస్యలు పరిష్కరించాలి

జిల్లా సచివాలయం : గ్రామసేవకుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు మనోహర్ డిమాండు చేశారు. బుధవారం కడప కలెక్టరేట్ ఎదుట రెవెన్యూ గ్రామ సేవకులు ధర్నా చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన మనోహర్ మాట్లాడుతూ పే స్కేలు పెంచాలని, అర్హత కల్గిన వారికి వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలని, నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా గుర్తించాలన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటపతి, నాగేశ్వరరావు, నాగేంద్ర, వెంకటరమణ, గురుమోహన్, మునెయ్య, నారాయణ, శాంతి, రమాదేవి, గురులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మార్చి 16 నుంచి పది పరీక్షలు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : మార్చి 16వ తేదీ నుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు పకడ్బందీగా, పక్కాగా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఆదేశించారు. బుధవారం కడప కలెక్టరేట్‌లో పదో తరగతి పరీక్షలపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష చేపట్టారు. మార్చి 16వ తేదీ నుంచి ఏప్రిల్ 1 వరకు జరిగే పబ్లిక్ పరీక్షలకు సంబంధించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అంతేకాకుండా మార్చి 2 నుంచి జరిగే ఓపెన్ స్కూల్ పరీక్షలు జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో విద్యా, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుంగిన రహదారి
జాగ్రత్త బాటసారీ

ప్రొద్దుటూరు ఆర్టీసీ బస్టాండు సమీపంలో మైదుకూరు రోడ్డు గుంతలతో అధ్వానంగా మారింది. అధిక లోడు వాహనాల రాకపోకలతో రోడ్డు ధ్వంసమై గుంతలు పడ్డాయి. అప్రమత్తంగా లేకపోతే ప్రమాదం జరిగే అవకాశం ఉందని చోదకులు వాపోతున్నారు.

- ఈనాడు కడప, న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు

విద్యార్థుల మౌన ప్రదర్శన

కడప చిన్నచౌకు : పాఠశాలకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ విద్యార్థులు నిరసన తెలిపారు. బుధవారం కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు, తల్లిదండ్రులు కడప ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం ఎదుట మౌనప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ పీవో ధనలక్ష్మికి వినతి పత్రాన్ని అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. ఈ నెల 14 నుంచి కేంద్రీయ విద్యాలయానికి బస్సులు నిలిపేశారన్నారు. 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న కేంద్రీయ విద్యాలయానికి పిల్లలను తీసుకెళ్లాలంటే ఇబ్బందిగా ఉందన్నారు. గురువారం నుంచి యథావిధిగా బస్సులు నడుపుతామని పీవో చెప్పారు.

ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం ఎదుట కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు, తల్లిదండ్రులు

EENADU Classifieds
BUSINESS SERVICES
SECURITY GUARDS
Secur Security Services.
BUSINESS OFFER
బంగారం, వెండి, డైమండ్స్ [illegible]
JOBS
హరేకృష్ణ [illegible]
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
రూ॥ 330/- మాత్రమే
Contact :
KDP: 9989997626
8008514248
PDTR: 8008597620

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

అనధికారిక లేఅవుట్‌లలో స్థలాలు కొనుగోలు చేయొద్దు

పులివెందుల, న్యూస్‌టుడే: అనధికారిక లేఅవుట్‌లో ఇళ్ల స్థలాలను కొనుగోలు చేయవద్దని పులివెందుల పురపాలక కమిషనర్ మునికుమార్ సూచించారు. బుధవారం పురపాలక కార్యాలయంలో కార్యాలయ, సచివాలయ, పట్టణ ప్రణాళిక సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ..పురపాలక పరిధిలో అక్రమ లే అవుట్లు అధికమయ్యాయన్నారు. తక్కువ ధరలకు స్థలాలు అమ్ముతూ ప్రజలను మోసం చేస్తున్నారని చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలకు చేరవేయాలని సిబ్బందికి తెలియజేశారు. గతేడాది జూన్ 30లోపు అక్రమంగా వేసిన లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 23వ తేదీలోపు క్రమబద్ధీకరిస్తే 14శాతం ఓపెన్ స్పేస్ స్థలాలకు 50శాతం రాయితీ అవకాశం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక అధికారి అజయ్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర కారాగారంలో ముస్లిం సోదరులకు మినహాయింపు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కేంద్ర కారాగారాల్లోని ముస్లిం సోదరులకు రంజాన్ మాసం సందర్భంగా ప్రభుత్వం మినహాయింపు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కడప కేంద్ర కారాగారంలోని ముస్లింలకు కూడా మినహాయింపు ఇచ్చారు. తెల్లవారుజామున ప్రార్థనలు చేసిన అనంతరం భోజనం చేసి ఉపవాసం ఉంటారు. సాయంత్రం ప్రార్థనలు చేసిన అనంతరం ఇఫ్తార్ విందు చేస్తారు. ఈ మేరకు జైల్లో తెల్లవారుజామున భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇఫ్తార్ విందుకు కావాల్సిన ఫలహారాలు అందజేస్తారు. జైల్లో ఖైదీలకు చికెన్, మటన్ బిర్యానీ కావాలంటే వాటికి సరిపడా సామగ్రిని అందజేస్తారు. కేంద్ర కారాగారంలోని ముస్లింలు రంజాన్ మాసం పాటిస్తారు.

రుణభారంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానం

చక్రాయపేట (వేంపల్లె), న్యూస్‌టుడే : రైతుల రుణభారంలో జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని మాజీ ఎంపీ, రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి తెలిపారు. అటు వైకాపా ఇటు కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులు ఊబిలోకి నెట్టాయని విమర్శించారు. బుధవారం వేంపల్లెలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వం శక్తికి మించి అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసిందని కూటమి పార్టీలు విమర్శించాయి. అదే పని ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కూడా వైకాపా ప్రభుత్వానికి మించి అప్పులు చేస్తోందని మండిపడ్డారు. అప్పులు తేవడం, వడ్డీలు చెల్లించడం ఇదే ప్రభుత్వం పని అన్నట్లుగా ఉందన్నారు.

ఉత్సాహభరితంగా వైవీయూలో క్రికెట్ పోటీలు

కడప క్రీడలు, న్యూస్‌టుడే : వైవీయూ 21వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం విద్యార్థుల మధ్య వైవీయూలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో లైఫ్ సైన్సెస్-2 జట్టుపై మ్యాథమాటిక్స్ - కంప్యూటర్ సైన్స్ జట్టు విద్యార్థులు విజయం సాధించారు. అలాగే నాన్ టీచింగ్ పురుషుల విభాగంలో గ్రీన్ కింగ్స్ ఎలెవల్ జట్టుపై వేమన వారియర్స్ జట్టు ఘన విజయం సాధించింది. గెలుపొందిన జట్లకు వైవీయూ ఉపకులపతి ఆచార్య రాజశేఖర్, కులసచివులు ఆచార్య పుత్తా పద్మ, కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య శ్రీనివాస్, వ్యాయామ విద్య క్రీడా శాస్త్రాల విభాగాధిపతి డా. కె.రామసుబ్బారెడ్డి అభినందించారు.

డ్రగ్స్ అరికట్టాలని డిమాండ్

కడప విద్య, న్యూస్‌టుడే : మదనపల్లిలోని నీరుగట్టువారిపల్లిలో ఏడేళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేయడం పాశవిక చర్య అని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేశు యాదవ్ అన్నారు. బుధవారం స్థానిక ఆర్ఎస్ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి మత్తులో నిందితుడు ఈ దుర్ఘటనకు పాల్పడ్డాడని ఆరోపించారు. డ్రగ్స్ రవాణా, అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వంశీ తదితరులు పాల్గొన్నారు.

బోధనా రుసుము బకాయిలు ఇవ్వాలి

కడప ఏడురోడ్లు : రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలు త్వరగా పరిష్కరించాలని అంబేడ్కర్ స్టూడెంట్ యూత్ ఫెడరేషన్ (ఏఎస్‌వైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఓబయ్య డిమాండు చేశారు. బుధవారం నగరంలోని ప్రకాష్‌నగర్‌లోని ఏఎస్‌వైఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు రూ.7000 కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్ (బోధనా రుసుము) విడుదల చేయాల్సి ఉండగా.. కేవలం రూ.1200 కోట్లు మాత్రమే విడుదల చేయడం దారుణమన్నారు. జీవో నెం.77ను రద్దు చేసి పీజీ చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపచేయాలని డిమాండు చేశారు. సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచాలని కోరారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పురిటినొప్పులు

◆ పట్టి పీడిస్తున్న వైద్యుల కొరత

పులివెందుల గ్రామీణ, న్యూస్‌టుడే: పులివెందుల నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆధునిక వైద్య పరికరాలు.. కావాల్సినమేర మందులు అందుబాటులో ఉన్నా వైద్య సేవలందడం లేదు. ఫలితంగా జబ్బు పడిన వారంతా పట్టణాల్లో ఉండే ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి.. రూ.వేలకు వేలు ఖర్చు చేస్తున్నారు. సరైన వైద్యులు లేక అరకొర వైద్య సేవలతో గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి నెలకొంది.

నల్లపురెడ్డిపల్లె పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న మహిళ

పీహెచ్‌సీ కేంద్రాలే ఆధారం

ఈ ప్రాంత ప్రజలకు నియోజకవర్గంలోని పీహెచ్‌సీ లే ఆధారం. పులివెందుల, వేంపల్లె, లింగాల, వేముల, సింహాద్రిపురం, తొండూరు, చక్రాయపేట తదితర మండలాల పరిధిలో 11 పీహెచ్‌సీ కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాలల్లో 22 మందికి గాను 16 మంది వైద్యులే ఉన్నారు. దీంతో వైద్యం అందని పరిస్థితి నెలకొంది. ఈ కారణంగానే ప్రాథమిక కేంద్రాలకు వచ్చే రోగుల సంఖ్య తక్కువగా నమోదవుతోంది.

ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసవాలు

ఒక్కో పీహెచ్‌సీలో నెలకు 10 ప్రసవాల నమోదు కావాలి. ఈ లెక్కన నియోజకవర్గంలోని 11 పీహెచ్‌సీల్లో నెలకు 110 ప్రసవాలు జరగాలి. అయితే ప్రస్తుతం 25 నుంచి 30 ప్రసవాల మాత్రమే నమోదవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే గర్భిణులు కడప, అనంతపురం, పులివెందుల తదితర ప్రాంతాల్లో ఉండే ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారు. రూ.50వేల నుంచి రూ.70వేలు వైద్య ఖర్చు చేసుకుంటున్నారు. వైద్యుల కొరత ఉన్న కేంద్రాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించి నియామకాలపై చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం .. పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంపునకు చర్యలు తీసుకుంటాం. వైద్యుల కొరత ఉన్న ఆసుపత్రుల్లో నియామకాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తాం. **- ఖాజామొహిద్దీన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో**

మేమున్నాం.. మీకు తోడుగా..
కడప: 8008573428, 8074174832
పులివెందుల : 9885193208
కమలాపురం : 8008573475

?: కర్ణపాపాయపల్లె సమీపంలోని రెండు వరుసల రోడ్డులో పైప్‌లైన్ కోసం గోతులు తవ్వి వదిలేశారు. వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గుంతలు పూడ్చాలి. **- రాము, కర్ణపాపాయపల్లె**

✓: సమస్య మా దృష్టికి వచ్చింది. గోతులు పూడ్చి ఇబ్బందులు లేకుండా చేస్తాం. **- మహమ్మద్, ఆర్అండ్‌బీ ఏఈ** - న్యూస్‌టుడే, లింగాల

?: స్థానిక తాళం వీధిలో చెత్త కుండీ నిండి వ్యర్థాలన్నీ చెల్లా చెదురుగా పడి ఉండటంతో పందులు పొర్లాడుతూ పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నాయి. **- సాధిక్, స్థానికుడు**

?: స్థానిక గిడ్డంగి వీధిలో కాలువలు పూడికతో నిండటంతో మురుగు ముందుకు పారడం లేదు. దోమల బెడదతో పాటు పరిసరాలు దుర్వాసన వస్తున్నాయి. **- మహేశ్, స్థానికుడు**

✓: వెంటనే కార్మికులను పంపి తాళం, గిడ్డంగి వీధుల్లో పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. **- మధుకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, కమలాపురం - న్యూస్‌టుడే, కమలాపురం**

శక్తి యాప్‌పై కార్యశాల

పులివెందుల, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు బుధవారం మహిళా శక్తి, భద్రతపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పులివెందుల ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపల్ బాలనారాయణ, వర్క్‌షాప్ కోఆర్డినేటర్ తెలుగు విభాగాధిపతి విజయలక్ష్మీ, కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

శిశు గృహం తనిఖీ

చిన్నారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి బాబా ఫకృద్దీన్

కడప న్యాయవిభాగం, న్యూస్‌టుడే : కడప నగరంలోని కొండాయపల్లెలో ఉన్న శిశు గృహాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ న్యాయమూర్తి ఎస్.బాబా ఫకృద్దీన్ బుధవారం పరిశీలించారు. పిల్లల వివరాలతో పాటు వారికి అందుతున్న సదుపాయాల గురించి న్యాయమూర్తి అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఆరోగ్య విషయంపై ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాలల సంరక్షణ కోసం స్నేహ పూర్వక న్యాయ సేవల పథకం అమలులో ఉందన్నారు. శిశు గృహ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే: సీకేదిన్నె మండల పరిధి కడప-రాయచోటి రహదారిపై బుధవారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. హైవే పోలీసుల వివరాల మేరకు జమ్మలమడుగుకు చెందిన శ్రీహరి, రమేష్ ఇద్దరు పనినిమిత్తం జమ్మలమడుగు నుంచి రాయచోటి వెళ్తుండగా.. జమాల్‌పల్లె వద్ద రాయచోటి వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. దాంతో బైక్‌పై ఉన్న ఇద్దరు గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వారిని రిమ్స్‌కు తరలించారు.

జీవాల్లో వచ్చే కాలిపుండు వ్యాధిని నివారించవచ్చు

జీవాల కాపరికి మందులు కిట్ అందిస్తున్న ప్రొఫెసర్ ఆనంద్‌కుమార్, డీఏహెచ్‌వో, వైద్యులు తదితరులు

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే : గొర్రెలు, మేకల్లో వచ్చే కాలిపుండు వ్యాధిని సరైన సమయంలో గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ గన్నవరం ప్రొఫెసర్ ఆనంద్ కుమార్ అన్నారు. బుధవారం తుమ్మలూరు గ్రామంలో వేంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం వెటర్నరీ మైక్రోబయాలజీ విభాగం, ఎన్టీఆర్ కాలేజీ ఆఫ్ వెటర్నరీ సైన్స్ గన్నవరం ఆధ్వర్యంలో ఐసీఏఆర్- ఎఐఎన్‌పీ-సీఈడీఈ ప్రాజెక్టు కింద గొర్రెలు, మేకల్లో కాలిపుండు వ్యాధి నివారణపై గొర్రెల కాపరులు, రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలు, పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చింతకొమ్మదిన్నె ఏడీ డా.శ్రీధర్‌లింగారెడ్డి, పశువైద్యులు రాంబాబు, సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కీలక అంశాలపై ప్రత్యేక కమిటీల ఏర్పాటు

కడప నగరపాలక, న్యూస్‌టుడే : నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశం అజెండాలోని కీలక అంశాలపై పూర్తి స్థాయిలో చర్చించడానికి కార్పొరేటర్లు, అధికారులతో మూడు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు. ఎంఎస్ఎంఈ సరఫరాదారులకు డిజిటల్ విధానంలో బిల్లులు చెల్లించే అంశంపై చర్చించడానికి కార్పొరేటర్లు శివకోటిరెడ్డి, సుజాత, నాగమణిలతో కమిటీ వేశారు. కమిటీ సభ్యులు లీడ్ బ్యాంకు మేనేజర్, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్లతో సమావేశం నిర్వహించాలి. బధవారం జరిగిన కమిటీ సమావేశంలో ఎంఎస్ఎంఈలకు చెల్లించే బిల్లులపై వడ్డీ అంశంపై స్పష్టత లేకపోవడంతో దీన్ని వాయిదా వేశారు. నగరపాలక సంస్థలో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుపై డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, కార్పొరేటర్లు మక్బుల్‌బాషా, మల్లికార్జున, షంషీర్, చెన్నయ్యలతో కమిటీని ఏర్పాటు చేశారు. నగరపాలక సంస్థ ఎస్ఈ, ఈఈలతో సమావేశం నిర్వహించగా సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో మెజార్టీ సభ్యుల సమ్మతిని పరిగణలోకి తీసుకోవాలని నిర్ణయించారు. స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ల ఏర్పాటుపై డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగం, కార్పొరేటర్లు శిరీష, బాలస్వామిరెడ్డి, కె.బాబు, షఫీలతో కమిటీ వేశారు. ఈ అంశంపై జరిగిన సమావేశంలో 84 స్టాళ్లకు బదులు ప్రాథమికంగా 10 స్టాళ్ల చొప్పున ఏర్పాటు చేసి ఫలితాలను బేరీజు వేసుకున్న అనంతరం తగిన మార్పులతో పూర్తి స్థాయి నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించరూ..

రిలే దీక్షలో సీఐటీయూ నాయకులు, పారిశుద్ధ్య కార్మికులు

బిల్టప్ కడప, న్యూస్‌టుడే : పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కంచుపాటి తిరుపాల్ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు స్పందించి పారిశుద్ధ్య కార్మికులు సమస్యలు పరిష్కంచాలని కోరారు. నగర అధ్యక్షుడు రవి, నాయకులు శ్రీరాములు, ప్రకాష్, ధరణి, రమాదేవి, పాల్గొన్నారు.

ప్రాపర్టీ అమ్మకంనకు కలదు
కడప, శంకరాపురం నందు 10 సెంట్ల స్థలములో ఉన్న బిల్డింగ్‌తో సుమారు 3 కోట్ల రూపాయల పైగా విలువైన ఆస్తి అమ్మకమునకు కలదు. కొనదలిచినవారు గాని, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు గాని సంప్రదించవలసిన నెంబర్స్
9346122611, 9849690186

రంజాన్ ప్రారంభ శుభాకాంక్షలు
గోల్డ్ లోన్స్
గోల్డ్ టేక్ ఓవర్
గోల్డ్ (కానిబడుసు, అమ్మబడుసు)
మార్టిగేజ్ లోన్
కన్‌స్ట్రక్షన్ లోన్
శాలరీ లోన్
డాక్టర్ లోన్
పర్సనల్ లోన్
బిజినెస్ లోన్
ఎడ్యుకేషనల్ లోన్

నిత్య గిరి
ఎస్.ఎల్.వి అసోసియేట్స్
డోర్ నెం. 42/1197, కెనరా బ్యాంక్ ఎదురుగా, హెచ్.డి.బి. బ్యాంక్, 1వ ఫ్లోర్, వై-జంక్షన్, కడప.
Cell: 8639017467, 9502332621, 8309763949, 7815841294, 7013232778.

ద్వితీయ వార్షికోత్సవ శుభాకాంక్షలు
జిల్లా ప్రజలందరి ఆదరాభిమానాలతో హౌసింగ్ బోర్డు కాలనీలోని సొంత భవనము నందు ప్రారంభించిన
సురేష్ ఐ హాస్పిటల్
డి.నెం. 1/399-2-2, హౌసింగ్ బోర్డు కాలనీ, రాజీవ్‌పార్క్ రోడ్, కడప.

నేడు ద్వితీయ వార్షికోత్సవం జరుపుకుంటున్న శుభ సందర్భంగా మాకు వెన్నంటి ఉండి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న ప్రతి ఒక్కరికీ పేరుపేరున ధన్యవాదములు.

డా॥ ఎ.సురేష్ బాబు MBBS., D.O.,
ఎ.లక్ష్మి

చింతకొమ్మదిన్నె "గంగమ్మ దేవత" జాతర మహోత్సవ శుభాకాంక్షల స్పెషల్ ఫీచర్
Advt. Special Feature

గంగమ్మకు అభిషేకాలు

పులివెందుల, న్యూస్‌టుడే : పులివెందులలోని కదిరి రోడ్డులోని వెంకటాపురంవద్ద వెలిసిన శ్రీదిన్నెపాటి గంగమ్మ తిరునాల బుధవారం ఘనంగా జరిగింది. ఆలయ నిర్వాహకులు అమ్మవారికి తెల్లవారుజామున ప్రత్యేక అభిషేకాలునిర్వహించిన అనంతరం పూలమాలలతో, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి గంగమ్మను దర్శించుకున్నారు. ఉదయం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బండలాగుడు ప్రదర్శనను ఎంపీ ప్రారంభించారు. 7 జతల కాడెద్దులు పాల్గొనగా..ప్రొద్దుటూరు చౌడూరు గ్రామానికి చెందిన సురేంద్రబాబు ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచాయి. రూ.లక్ష బహుమతిని ఎంపీ అందజేశారు. ద్వితీయ బహుమతి ప్రొద్దుటూరుకు చెందిన డి.గురువురెడ్డి, పాతకోట తేజేశ్వరరెడ్డిలు గెలుపొందారు. వీరికి రూ.80వేలు అందజేశారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

వేముల, న్యూస్‌టుడే: పెర్నపాడులో రామాలయ ద్వితీయ వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. సీతారాములకు పూజారులు ప్రత్యేక పూజలు చేసి హోమం చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సీతారాములను గ్రామ వీధుల్లో ఊరేగించారు.

మొక్కులు తీర్చుకున్న భక్తులు

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : సీకేదిన్నె మండలం బుగ్గలేటిపల్లె సమీపాన గంగమ్మ జాతర సందర్భంగా గంగమ్మకు దర్శించుకుని మొక్కులు తీర్చుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఆలయ ఈవో కృష్ణనాయక్ ఛైర్మన్ మాధవరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తాగునీటి సౌకర్యం, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. సీకేదిన్నె సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి పోలీసు బందోబస్తు నిర్వహించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దాతలు భక్తులకు పానకం, మజ్జిగ, నీరు అందించారు.

ఆలయ ఆవరణంలో బండలాగుడు ప్రదర్శన

- జాతర సందర్భంగా ఎద్దులచే బండలాగుడు ప్రదర్శన నిర్వహించారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు నగదు బహుమతి అందించారు.
- గంగమ్మ ఆలయంతోపాటు ముందు ఉన్న ఆర్చీ, కడప - రాయచోటి రహదారిలో, మూలవంక వద్ద ఉన్న ఆర్చీలను విద్యుత్తు దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎండ తగలకుండా ఆలయ ఆవరణంలో చలువ పందిర్లు ఏర్పాటు చేశారు.

బండలాగుడు ప్రదర్శన విజేత ఓబులంపల్లి ఎడ్లు

విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లి, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి మండలంలోని అనంతపురం గంగమ్మ జాతర సందర్భంగా బుధవారం బండలాగుడు ప్రదర్శన నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల నుంచి 13 జతల ఎడ్లు ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయి. వైఎస్ఆర్ కడప జిల్లా చెన్నూరు మండలం ఓబులంపల్లికు చెందిన సతీష్‌కుమార్‌రెడ్డి ఎద్దులు మొదటి స్థానంలో నిలిచాయి. రెండో స్థానాన్ని పెండ్లిమర్రి మండలం బాలయ్యగారిపల్లెకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి ఎడ్లు దక్కించుకున్నాయి. ఏడో స్థానం వరకు విజేతలుగా నిలిచిన వారికి రాయచోటి నియోజకవర్గ తెదేపా నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి నగదు బహుమతులు అందజేశారు.

బీమా సంకల్ప్ లక్ష్యాన్ని అధిగమించాలి

కడప ఏడురోడ్లు : బీమా సంకల్ప్ 3.0 అమలులో కడప పోస్టల్ డివిజన్‌కు నిర్దేశించిన రూ.2.5 కోట్ల లక్ష్యాన్ని ఈ నెల 20లోపు అధిగమించాలని కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్ అన్నారు. బీమా సంకల్ప్ 3.0 డ్రైవ్‌లో భాగంగా బుధవారం రవీంద్రనగర్, కలెక్టరేట్, శంకరాపురంలోని సబ్ పోస్టాఫీసులను ఆయన తనిఖీ చేశారు. లక్ష్యాన్ని అధిగమించి.. కడప పోస్టల్ డివిజన్‌కు పేరు తీసుకురావాలన్నారు.

వృద్ధులకు అన్నదానం

వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న హరిప్రసాద్ తదితరులు

చక్రాయపేట (వేంపల్లె), న్యూస్‌టుడే : అనకాపల్లి భాజపా ఎంపీ, రైల్వే స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ సీఎం రమేష్ నాయుడు జన్మదినాన్ని భాజపా నాయకులు ఘనంగా నిర్వహించారు. భాజపా జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం వేంపల్లెలోని రాజీవ్‌నగర్ కాలనీలో అమ్మ అనాథ ఆశ్రమంలో అన్నదానం చేశారు. వృద్ధుల మధ్య కేకు కోసి సంతోషం పంచుకున్నారు.

శ్రీశ్రీశ్రీ గంగమ్మదేవత జాతర మహోత్సవ శుభాకాంక్షలు
కొత్తపేట గ్రామం, చింతకొమ్మదిన్నె (మం.), వై.యస్.ఆర్. కడప జిల్లా.

అత్యంత వైభవంగా జరుగు గంగమ్మ జాతరకు విచ్చేయు భక్తులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు మరియు కడప పరిసర ప్రాంత ప్రజలందరికీ మా భారత్ కాలేజీ తరఫున మా హృదయపూర్వక శుభాకాంక్షలు.
భారత్ మహిళా పాలిటెక్నిక్ కళాశాల
బుగ్గలేటిపల్లె, రాయచోటి రోడ్డు, కడప
1.CME: Computer Engineering
2.ECE: Electronics and Communication Engineering
3.EEE: Electrical and Electronic Engineering
College Code BCTW
Contact : 9618313437, 9908045334.

శ్రీశ్రీశ్రీ గంగమ్మ దేవత జాతర మహోత్సవ శుభాకాంక్షలు
కొత్తపేట గ్రామం, చింతకొమ్మదిన్నె (మం.), వై.ఎస్.ఆర్. కడప జిల్లా.
DRM HOSPITAL
దాసరి రమణయ్య మెమోరియల్ హాస్పిటల్
7/98, మూలవంక, రాయచోటి రోడ్డు, చింతకొమ్మదిన్నె (మం), కడప జిల్లా - 3, ఆంధ్రప్రదేశ్, సెల్ - 9849773108.
Dr. MILI, MBBS., Fellowship in Diabetology (RLA, UK) Consultant of Diabetology.
Dr. D.KARTHIK VISHWANATH, MBBS., Fellowship in Family Medicine (RLA, UK) Family Physician.

శ్రీశ్రీశ్రీ గంగమ్మ దేవత జాతర మహోత్సవ శుభాకాంక్షలు
కొత్తపేట గ్రామం, చింతకొమ్మదిన్నె (మం), వై.ఎస్.ఆర్. కడప జిల్లా.
శ్రీ గువ్వల శ్రీనివాసులురెడ్డి

శ్రీశ్రీశ్రీ గంగమ్మ దేవత జాతర మహోత్సవ శుభాకాంక్షలు
కొత్తపేట గ్రామం, చింతకొమ్మదిన్నె (మం), వైయస్ఆర్ కడప జిల్లా.
ఇ.శివశంకర్‌రెడ్డి
కంది మహేశ్వర్‌రెడ్డి

శ్రీశ్రీశ్రీ గంగమ్మ దేవత జాతర మహోత్సవ శుభాకాంక్షలు
కొత్తపల్లె రాజశేఖర్‌రెడ్డి

శ్రీశ్రీశ్రీ గంగమ్మ దేవత జాతర మహోత్సవ ఆహ్వానం
కొత్తపేట గ్రామం, చింతకొమ్మదిన్నె (మం), వై.ఎస్.ఆర్. కడప జిల్లా.

18-2-26 తేదీ బుధవారం నుండి 19-2-26 తేదీ
ఆలయ అర్చకులు
మరియు సోమల మాధవరెడ్డి
సెల్: 9618655061